MNS0101307

విజ్ఞాన సర్వస్వం

సంపుటం - 8

నాటక విజ్ఞాన సర్వస్వం

ప్రాచీన రంగస్థలి నాగార్జున కొండ (భారతీయ పురాతత్వ సర్వేక్షణ వారి సౌజన్యంతో)

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు - 500 004

MNS 07 ౮౨౦౯

విజ్ఞాన సర్వస్వం

సంపుటం - 8

నాటక విజ్ఞాన సర్వస్వం

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
విజ్ఞాన సర్వస్వ కేంద్రం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు - 500 004

BLANK PAGE

విజ్ఞాన సర్వస్వం

ఎనిమిదవ సంపుటం

నాటక విజ్ఞాన సర్వస్వం

నిర్వాహక సంపాదకులు
ఆచార్య కె. ఆనందన్

సంపాదకులు
కీ.శే॥ డా॥ పి. వి. రమణ
డా॥ జి. ఎస్. ప్రసాద రెడ్డి

సంగ్రాహక సంపాదకులు
శ్రీ గండవరం సుబ్బరామి రెడ్డి

సహాయ సంపాదకులు
డా॥ డి. నల్లన్న

సమన్వయ సంపాదకులు
ఆచార్య జి. చెన్నకేశవ రెడ్డి

2008

VIJNAANA SARVASWAM (VOL. VIII)- NATAKA VIJNAANA SARVASWAM

(Encyclopaedia on Drama & Theatre (Vol.VIII)

Editors : **Late Dr. P.V. Ramana**
Dr. G.S. Prasada Reddy

Compiling Editor : **Sri Gandavaram Subbarame Reddy**

Assistant Editor : **Dr. D. Nallanna**

Excutive Editor : **Prof K. Anandan**

Co-ordinating Editor : **Prof.G. Chenna Keshava Reddy**

Artist : **G.V. Amareshwara Rao**

Cover Disign : **R. Murali**

Published by :

© **Potti Sreeramulu Telugu University, Nampally, Hyderabad - 500 004.**

Publication No:

Copies : **1000**

For Copies : **Director**

Publication Division

Potti Sreeramulu Telugu University
Public Gardenc, Hyderabad - 500 004.

Price : **Rs. 250/-**

Laser Set at : **Komarraju Venkata Lakshmana Rao**
Vijnaana Sarvasva Kendram

Off set Print at : **Venu Graphics,**
2-1-392/1/6, Opp. Fever Hospital,
Nallakunta, Hyderabad - 500 044

అంకితం



కీ.శే. శ్రీనివాస చక్రవర్తికి

(చక్రవర్తుల వేంకట శ్రీనివాస రంగ రాఘవాచార్యులు)

(13.3.1911 - 27.7.1976)

నాటక రంగ వికాసమే తన జీవిత పరమావధిగా భావించి, విస్తృత పరిశోధనలతో,
విలువైన గ్రంథాలను వెలువరించి నాటక రంగాన్ని సుసంపన్నం చేసిన
బహుముఖ ప్రజ్ఞానిధికి కృతజ్ఞతాపూర్వకంగా ....

BLANK PAGE

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004

డా॥ ఆవుల మంజులత
ఉపాధ్యక్షులు

ప్రవేశిక

విజ్ఞాన సర్వస్వ నిర్మాణ ప్రక్రియకు శ్రీ కొమర్రాజు వెంకట లక్ష్మణరావు (1876-1923) శ్రీకారం చుట్టారు. ఆయన మూడు సంపుటాలు వెలువరించిన తరువాత కన్నుమూశారు. ఈ సంపుటాలను పరివర్ధితం చేసి పునర్ముద్రించడానికి తరువాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు (1862-1938)కంకణం కట్టుకున్నారు. ఆయన 1938లో మరణించడంతో ఈ ప్రయత్నం కూడా కొనసాగలేదు.

అయితే తెలుగులో విజ్ఞాన సర్వస్వాల రచనకు, ప్రచురణకుగాను మద్రాసులో 'తెలుగు భాషా సమితి' అనే సంస్థను 1947లో అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరచింది. ఈ సమితి 1956 వరకు మద్రాసులో పనిచేసింది. ఆ తరువాత హైదరాబాదుకు మారింది. 40 సంవత్సరాలలో 14 సంపుటాలను ప్రచురించింది. తెలుగు భాషా సమితి 1986లో తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనం అయింది. విజ్ఞాన సర్వస్వం తయారీకి తెలుగు భాషా సమితి ఒరవడి పెట్టింది. విశ్వవిద్యాలయ విజ్ఞాన సర్వస్వ కేంద్రం ఆ ప్రణాళికను విస్తృతపరచి 36 సంపుటాలుగా వెలువరించడానికి ప్రణాళిక తయారుచేసింది. ఈ తయారీ ఒక సుదీర్ఘకాల పరిశ్రమ పర్యవసానం.

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురిస్తున్న విజ్ఞాన సర్వస్వ సంపుటాలలో ఇది ఎనిమిదవది. నాటక రంగంలో వివిధ శాఖల గురించిన విజ్ఞాన సముదాయాన్ని ఒక్కచోట సమీకరించి, అటు పరిశోధకులకు తోడ్పడే పరామర్శ గ్రంథంగాను, ఇటు నాటకాభిమానులైన సామాన్య పాఠకులకు కరదీపికగాను ఉపయుక్తంగా ఉండే రీతిలో ఈ నాటక విజ్ఞాన సర్వస్వాన్ని రూపొందించారు. ఈ సంపుటంలో ప్రధానంగా రెండు భాగాలున్నాయి. మొదటి భాగం సమీక్షా వ్యాస సమన్వితం. రెండవది అకారాది వ్యాసాల వివరణ. వివిధ దేశాలలో నాటక రంగ ఆవిర్భావ వికాస దశల గురించి వివరించే వ్యాసాలతో పాటు, రంగస్థల సేవకు అంకితమైన కళాకారుల, కళాపోషకుల జీవిత విశేషాలను కూడా ఈ సంపుటంలో పొందుపరచారు.

ఈ సంపుటం వ్యాసరచనలో సుమారు ఎనభై మంది రచయితలు పాలుపంచుకున్నారు. సంపాదక మండలితో పాటు వీరందరికీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతాభినందనలు అందజేస్తున్నాను. సంపుటం తయారీకి కృషి చేసిన సంపాదకులకు, సంగ్రాహక సంపాదకులకు, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం ఉద్యోగులకు పేరుపేరునా అభినందనలు.

నాటక విజ్ఞాన సర్వస్వ సంపుటం వెలువరించడానికి చేసిన కృషిని సహృదయ పాఠక లోకం హర్షిస్తుందని ఆశిస్తున్నాను. నిర్మాణాత్మక సూచనలను అందించే విజ్ఞులకు నా స్వాగతం.

ప్రాచ్య-పాశ్చాత్య నాటక సాహిత్యంమీద, రంగస్థల పరిణామ దశల మీద కూలంకషంగా పరిశోధన చేసి పట్టు సాధించి తెలుగులో అనేక గ్రంథాలు, పరిశోధక వ్యాసాలు వెలువరించి నాటక రంగాన్ని సుసంపన్నం చేసిన సుప్రసిద్ధ పరిశోధకులు, ప్రస్తుత నాటక విజ్ఞాన సర్వస్వ సంపుటానికి మౌలిక రూపాన్నిచ్చిన కీ.శే. శ్రీనివాస చక్రవర్తి (1911-1976) గారికి ఈ సంపుటం అంకితం ఇవ్వడం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అదృష్టంగా భావిస్తుంది.

హైదరాబాద్
16.4.2008

(డా॥ ఆవుల మంజులత)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

విజ్ఞప్తి

విజ్ఞాన సర్వస్వ సంపుటాల నిర్మాణంలో పూర్వపు తెలుగు భాషా సమితి అనుసరించిన విధానం ప్రయోజనకరంగా ఉందని భావించి దానినే కొనసాగించడం జరుగుతున్నది. ఏదైనా ఒక విజ్ఞాన రంగాన్ని, కొన్ని సందర్భాలలో దానికి సన్నిహితంగా ఉన్న మరికొన్ని విజ్ఞాన రంగాలను ఒక క్షేత్రంగా గ్రహించి, దానికి సంబంధించి ఒక సంపుటంగా గానీ లేదా ఎక్కువ సంపుటాలుగా గానీ వెలువరించాలన్నది ఈ విధానం.

నాటక రంగానికి పరిమితమైన ప్రస్తుత సంపుటాన్ని నాటక విజ్ఞాన సర్వస్వం పేరుతో మౌలికంగా తయారుచేసిన వారు కీ.శే. శ్రీనివాస చక్రవర్తిగారు. ఆధునిక నాటక రంగంలో విప్లవాత్మకమైన మార్పులెన్నో జరిగిన దృష్ట్యా సమకాలీన పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకొని ఎన్నో మార్పులు చేర్పులు చేయవలసిన అవసరం ఏర్పడింది. విజ్ఞాన సర్వస్వాన్ని విస్తృతపరచి సర్వ సమగ్రంగా రూపొందించాలనే సంకల్పంతో సంపాదక మండలిని ఏర్పరచి దానికి ఆ బాధ్యతలను అప్పగించడం జరిగింది. డా॥పి.వి. రమణ, డా॥ జి. ఎస్. ప్రసాదరెడ్డిగార్లు సంపాదకులుగా, శ్రీ గండవరం సుబ్బరామిరెడ్డి సంగ్రాహక సంపాదకులుగా, డా॥ దాసరి నల్లన్న సహాయ సంపాదకులుగాను వ్యవహరించి ఈ సంపుటాన్ని పరిష్కరించి ఇచ్చారు. ఇందుకు సంపాదక మండలికి వ్యాసకర్తలకు విజ్ఞాన సర్వస్వ కేంద్రం కృతజ్ఞతాభివందనాలు అర్పిస్తున్నది. ఈ కృషిలో మాకు చేదోడు వాదోడుగా ఉంటూ మాకు సహకారం అందించిన డా॥పి.చంద్రశేఖర్, శ్రీ టి. నాగరాజ శెట్టి, శ్రీమతి రమాంజనీ కుమారిగార్లకు, సంపుటానికి అవసరమైన విషయ సేకరణలో తోడ్పడిన శ్రీ పి. రంగారావుగారికీ; అవసరమైన ఫోటోలను సేకరించడంలో తోడ్పడిన శ్రీ జి.వి. అమరేశ్వరరావుగారికి, ఫోటోలను ముద్రణకు అనుకూలంగా చక్కగా రూపొందించి ఇచ్చిన శ్రీ ఆర్. మురళిగార్లకూ మా కృతజ్ఞతలు.

విజ్ఞాన సర్వస్వ కేంద్రం ప్రకటించే ప్రచురణలన్నీ ఆధునిక తెలుగు భాషలో ఉండాలనే విధాన నిర్ణయానికి అనుగుణంగా ఈ సంపుటంలోని వ్యాసాల శైలిని వీలైనంతవరకు సంస్కరించడం జరిగింది. విజ్ఞాన సర్వస్వ కేంద్రం గతంలో విశ్వసాహితి, భారత భారతి సంపుటాలను తెలుగులోను, హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ఆంధ్రాస్ గ్రంథాన్ని ఆంగ్లంలోనూ వెలువరించాం. ప్రస్తుతం ఎనిమిదవ సంపుటంగా నాటక విజ్ఞాన సర్వస్వాన్ని ప్రచురించగలుగుతున్నందుకు సంతోషంగా ఉంది. మరో తొమ్మిది విజ్ఞాన సర్వస్వ సంపుటాలు (తెలుగు సంస్కృతి - దేశము, చరిత్ర; సిరిసంపదలు, రసాయన శాస్త్రం, భౌతికశాస్త్రం, ఆయుర్విజ్ఞానం, జ్యోతిషశాస్త్రం, సాహిత్యదర్శనం, జానపద విజ్ఞానం, ఆయుర్వేద విజ్ఞానం) సిద్ధమవుతున్నాయి. మా కృషిలో ఆయా విజ్ఞాన రంగాలలో నిష్ణాతులైన వారి సహకారం ఎంతో ఆవశ్యం. అటువంటి సహకారం మాకు లభించడం మా అదృష్టం. అయితే కృషికి పట్టే కాలవ్యవధిలో మాత్రం అంతో ఇంతో జాప్యం కావడం అనివార్యమవుతున్నది.

ఈ సంపుటం తయారీలో తమ అండదండలు అందించిన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎన్. గోపి, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం, డా॥ ఆవుల మంజులతగార్లకు, రిజిస్ట్రార్లు కీ.శే.ఆచార్య ఎన్. శివరామమూర్తి, ఆచార్య టి. గౌరీశంకర్, ఆచార్య ఎ. గురుమూర్తి, ఆచార్య ఎన్. భక్తవత్సలరెడ్డి గార్లకు కృతజ్ఞతలు.

ఈ సంపుటం మా కేంద్రంలోని కంప్యూటర్ మీదనే లేజర్ సెట్టింగ్ చేసిన శ్రీ జి. నరసింహా రావు, శ్రీమతి ఎస్. జీవన జ్యోతి, శ్రీ కొమ్మూరి ప్రసాద్, శ్రీమతి చేరాల పుష్పలత గార్లకు కృతజ్ఞతలు.

ఈ సంపుటం తయారీలో సహకరించిన వారందరికీ పేరు పేరున కృతజ్ఞతలు.

ఆచార్య కె. ఆనందన్
డైరెక్టర్ ఇన్‌ఛార్జి

సంపాదకీయం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని విజ్ఞాన సర్వస్వకేంద్రం వివిధ విషయాలకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వాలను తెలుగులో తయారుచేసి ప్రచురించడం లక్ష్యంగా పెట్టుకొంది. ఆ ప్రణాళికలో భాగంగా రూపుదిద్దుకొన్నదే నాటక విజ్ఞాన సర్వస్వం. శ్రీ శ్రీనివాస చక్రవర్తిగారు తనదైన ప్రణాళికతో 1960 నాటికి నాటక విజ్ఞాన సర్వస్వాన్ని పూర్తి చేశారు. కాని దురదృష్టవశాత్తు ముద్రణకు నోచుకోలేదు. 2001లో అప్పటి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎన్. గోపిగారు విశ్వవిద్యాలయం పక్షాన ఆ సంపుటాన్ని ప్రచురణకు స్వీకరించారు.

అయితే, ఆ గ్రంథం విజ్ఞాన సర్వస్వ ప్రణాళికకు అనుగుణంగాలేని కారణంగా దానిలో ఎన్నో మార్పులు, చేర్పులు చేయవలసిన అగత్యం ఏర్పడింది. శ్రీనివాస చక్రవర్తిగారు తెలుగు నాటక రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ, భారతీయ, ప్రపంచ నాటక రంగాలను స్పృశించి వదలివేశారు. నాటక విజ్ఞాన సర్వస్వాన్ని సర్వసమగ్రంగా తీర్చిదిద్దే క్రమంలో మేము 1960 నుంచి 2006 వరకు సమకాలీన నాటకరంగాన్ని విజ్ఞాన సర్వస్వ పరిధిలో చేర్చుకొనడం జరిగింది. మారుతున్న కాలానికి, అభిరుచులకు, అవసరాలకు అనుగుణంగా, సమకాలీన నాటక రంగంలోని ప్రముఖ వ్యక్తులను, సమాజాలను, నాటకరచనా విధానం, ప్రదర్శనా పద్ధతుల్లో చోటుచేసుకొన్న మార్పులను ప్రయోగాలను దృష్టిలో ఉంచుకొని విజ్ఞాన సర్వస్వంలో ఎన్నో కొత్త అంశాలను చేర్చడం జరిగింది. భారతీయ భాషల్లో నాటకరంగాలకు, ప్రపంచ నాటక రంగానికి ఈ సంపుటంలో సముచితస్థానం ఇవ్వడం జరిగింది. నాటకరంగంలో నోబెల్ పురస్కార గ్రహీతలు, నంది అవార్డు గ్రహీతలు, ఎన్.టి. ఆర్ రంగస్థల పురస్కార గ్రహీతల పేర్లను అనుబంధంలో చేర్చాం.

విజ్ఞాన సర్వస్వ సంపుటం సమీక్ష, అకారాద్యను క్రమణిక అని రెండు భాగాలుగా విభాజితమైంది. వివిధ దేశాలలో నాటకరంగ పరిణామక్రమాన్ని మొదటి (సమీక్ష) భాగంలో వివరించడమైంది. ముఖ్యమైన, వివరణ అవసరమైన అంశాలను అకారాది క్రమంలో రెండవ భాగంలో పొందుపరచడం జరిగింది. ఈ భాగంలో పారిభాషిక పదాలు, ప్రసిద్ధ రంగస్థల నటీనటుల సంక్షిప్త జీవిత చరిత్రలు, కళాపోషకులు, నాటక రచయితలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, ప్రసిద్ధ నాటక సమాజాలు, నాటక విజ్ఞానం అందించే గ్రంథాలు మొదలైన పెక్కు అంశాల గురించి సాధికారికమైన, ప్రామాణికమైన వివరాలు పొందుపరచడం జరిగింది. భారతీయ నాటక రంగంలోని, ప్రపంచ నాటక రంగంలోని ప్రముఖుల గురించి, ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత రాయించిన వ్యాసాలు విలువైన విషయాలను వెల్లడిస్తాయి.

ఈ సంపుటాన్ని సిద్ధం చేయటంలో అనేక సమస్యల్ని ఎదుర్కోవలసి వచ్చింది. నాటక రంగంలో విశేష కృషి చేసిన కొంత మంది ప్రసిద్ధ కళాకారుల, నాటక కర్తల జీవిత విశేషాలు గతంలో ఎక్కడా గ్రంథస్థం కానందువల్ల కాలగర్భంలో కలసి పోయాయి. అయినప్పటికీ మా ప్రయత్నలోపం లేకుండా, ఆనాడు వారితో నటించిన సహ నటుల ద్వారాను, బంధుమిత్రుల ద్వారాను కొన్ని వివరాలు సేకరించి ఈ సంపుటంలో చేర్చటం జరిగింది. జననమరణ తేదీలు, తల్లిదండ్రులపేర్లు, స్వస్థలం మొదలైన వివరాలు మార్గాంతరం లేక లభించిన వివరాలతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది.

మరొక విషయం సమకాలీన తెలుగు నాటక రంగంలో విశేష కృషి చేసి నాటక వికాసానికి తోడ్పడిన కళాకారులపేర్లను విజ్ఞాన సర్వస్వంలో పొందుపరచే విషయంలో సంపాదకమండలి కొన్ని నియమాలను పాటించింది. నాటక రంగంలో 20, 25 సంవత్సరాలకు పైబడి ఏదో ఒక విభాగంలో సేవలు అందించిన కళామూర్తులను ఈ సంపుటంలో చేర్చటం జరిగింది. అంతేకాక, ప్రభుత్వపరంగా లేదా విశ్వవిద్యాలయాల ద్వారా పురస్కారాలు అందుకొన్న ప్రతిభామూర్తులను కూడా ఇందులో పొందుపరచడం జరిగింది. సంగీతం, విద్యుద్దీపనం, ఆహార్యం వంటి సాంకేతిక విభాగాల్లో నిష్ణాతులకు కూడా ఈ సంపుటంలో సముచిత స్థానం లభించింది.

నాటక రంగంలో ఎంతో కృషిచేసిన నటీనటులు, దర్శకులు, రచయితలు, సాంకేతిక నిపుణులు ఇంకా ఎందరో ఉండవచ్చు. వారి గురించి కచ్చితమైన వివరాలు లభించక పోవడం వల్ల ఈ సంపుటంలో చేర్చలేకపోయాం. మలిముద్రణలో వారి గురించిన వివరాలు విజ్ఞాన సర్వస్వంలో చేర్చగలమని మనవి చేస్తున్నాం.

కోరినంతనే వివిధాంశాల మీద వ్యాసాలు రాసి సకాలంలో అందజేసి ఈ విజ్ఞాన సర్వస్వ నిర్మాణానికి యథాశక్తిగా తోడ్పడిన వ్యాసరచయిత(త్రు)లకు మా కృతజ్ఞతలు.

నాటక విజ్ఞాన సర్వస్వ సంపుటం తయారీ, ముద్రణ, తదితర కార్యక్రమాలు సాగిన కాలంలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల బాధ్యతలు నిర్వహించి సంపూర్ణ సహకారం అందించిన ఆచార్య ఎన్.గోపి, కీ.శే॥ ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం, డా॥ ఆవుల మంజులతగార్లకు కృతజ్ఞతలు. విజ్ఞాన సర్వస్వ కేంద్రం కేంద్రాధిపతిగా సహకారం అందించిన ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి గారికి, ప్రస్తుత ఇన్‌చార్జ్ కేంద్రాధిపతి ఆచార్య కె. ఆనందన్ గారికి కృతజ్ఞతలు.

ముఖ్యంగా సంగ్రాహక సంపాదకునికి చేదోడుగా ఉండి అత్యంత శ్రద్ధతో, సంయమనంతో, కార్యభారాన్ని మోసి సహకరించిన సహాయ సంపాదకులు డా॥ దాసరి నల్లన్నగారికి, విజ్ఞాన సర్వస్వ కేంద్రంలోని ఉద్యోగ బృందానికీ మా కృతజ్ఞతలు.

ఈ సంపుటానికి సంపాదక బాధ్యతవహించే సదవకాశం కల్పించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులకు, మాతో సహకరించిన విజ్ఞాన సర్వస్వ కేంద్రాధిపతులకూ మా కృతజ్ఞతలు.

పరిమితమైన సౌకర్యాలతో, విజ్ఞాన సర్వస్వం వంటి ఒక బృహత్ సంపుటాన్ని పూర్తిగా నిర్దుష్టంగానూ, సమగ్రంగానూ తయారు చేయడం కష్టసాధ్యమైన పని. దీనిలో మా కనుదప్పిన పొరపాట్లను పెద్దమనస్సుతో పాఠకులు మాకు తెలియజేయగలరని ఆశిస్తూ, మలిముద్రణలో వాటిని సవరించగలమని మనవి చేస్తున్నాం.

సంపాదకమండలి

హైదరాబాదు

16.04.2008

సంపాదక మండలి

నిర్వాహక సంపాదకులు
ఆచార్య కె. ఆనందన్
డైరెక్టర్ ఇన్‌చార్జ్
కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వకేంద్రం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 004

సంపాదకులు
కీ.శే॥ డా॥ పి.వి. రమణ
ఇ.నెం. 7-1-65/బి, ప్లాట్ నెం. 103,
లుంబిని అపార్ట్‌మెంట్స్, దరమ్‌కరమ్ రోడ్, అమీర్‌పేట
హైదరాబాదు - 500 016

డా॥ జి. ఎస్. ప్రసాదరెడ్డి
అసోసియేట్ ప్రొఫెసర్
శాఖాధిపతి, రంగస్థల కళలశాఖ,
నిజాంకాలేజి (ఓ. యూ) బషీర్ బాగ్,
హైదరాబాదు -500 029

సంగ్రాహక సంపాదకులు
గండవరం సుబ్బరామిరెడ్డి
12-11-1457/1, బౌద్ధనగర్
వారాసిగూడా
సికింద్రాబాద్ - 500 061

సహాయ సంపాదకులు
డా॥ డి. నల్లన్న
కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వకేంద్రం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 004

సమన్వయ సంపాదకులు
ఆచార్య జి. చెన్నకేశవ రెడ్డి
విశ్రాంత డైరెక్టర్
కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వకేంద్రం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్- 500 004

BLANK PAGE

శ్రీ

వ్యాస రచయితల వివరాలు

అడబాల	**అడబాల** టి. ఆర్, 26-123/1, శారదానగర్, సఫిల్‌గూడ, హైదరాబాద్ - 500 047,
అన్నప్ప	**అన్నప్ప** ఎ.సి. ప్లాట్ నం. 187, రోడ్ నం. 10, వెంకట్రావునగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
అయ్యదేవర	**పురుషోత్తమరావు, అయ్యదేవర** మెగాసిటి, రోడ్‌నెం. 1, అల్కాపురి, హైదరాబాద్ - 500 035.
ఆనందన్	**ఆనందన్, కొళ్ళాగుంట,** కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ - 500 004.
ఇం.వెం.	**వెంకటేశ్వరరావు, ఇంటూరి.** మద్రాసు - 24.
ఇ.నా.	**నాగేశ్వరరావు, ఇ.** 2-2-18/16/బి, అహోబిలమఠం ఎదురుగా, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.
ఉమారాణి	**ఉమారాణి, కె.** ఇ.నెం. 12-1-39, మొహిన్‌పురా, సిద్ధిపేట, మెదక్‌జిల్లా.
ఎన్. టి. ఆర్.	**తారక రామారావు, నెమలికంటి** 1-592, హనుమాన్ గుడి దగ్గర, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్, హైదరాబాద్ - 500 018.
ఎన్.ప.శ.	**పరమేశ్వరశర్మ, నేతి.** సరోజిని నాయుడు వీధి, కొత్తపేట, తెనాలి - 522 201, గుంటూరు జిల్లా.
ఎం. ఆర్. శాస్త్రి	**రామశాస్త్రి మహీధర ,** సి-80, సెక్టార్ -6, రూర్కెలా -2, ఒరిస్సా.

ఎం. ఎస్సీ	**సత్యనారాయణ బాబు, ఎం.ఎస్సీ.** 17/143 ఎ,8, మందపాడు, గుడివాడ - 521 301, కృష్ణాజిల్లా.
ఎమ్. గు. రా.	**గురుప్రసాదరావు, ఎమ్.** జువాలజీ లెక్చరర్, గవర్నమెంట్ జూనియర్ కాలేజి, షాద్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా.
ఎస్. కె.	**కీ. శే. ఆంజనేయులు, ఎస్. కె.** 11-4-209, చిలకలగూడ, సికింద్రాబాద్ - 500 061.
కందిమళ్ల	**సాంబశివరావు, కందిమళ్ల .** తెలుగు ఉపన్యాసకుడు, డి. ఆర్. ఎన్. ఎస్. సి. వి. ఎస్. కళాశాల, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.
క. మ. రా.	**కీ. శే. మల్లికార్జునరావు, కప్పగంతుల,** 104, కళ్యాణనగర్, హైదరాబాద్ - 500 018.
కాంతలక్ష్మి	**కాంతలక్ష్మి , ఐ. వి.** తెలుగు ఉపన్యాసకులు, 3-4-886, బర్కత్‌పుర, హైదరాబాద్ .
కృష్ణ	**కీ. శే. కృష్ణ, జి.** సీనియర్ జర్నలిస్ట్, 1-9-285/4/2, రాంనగర్, హైదరాబాద్ .
కె. జి. మూర్తి	**గోపాలకృష్ణమూర్తి, కె.** 3-4-15/11, డా. భూమన్నవీధి, కాచిగూడ, హైదరాబాద్ - 500 027.
కె. బి. రాజు	**బంగారరాజు, కొత్తపల్లి,** ఎం. ఐ. జి. 2 ఎ, 287, వుడాకాలనీ, వినాయకనగర్, పెదగంట్యాడ, విశాఖపట్నం - 530 044.
గం. శ్రీ	**శ్రీరామమూర్తి, గంటి,** శారదానగర్, అనకాపల్లి.

గం.సు.రె.	**సుబ్బరామిరెడ్డి, గండవరం** 12-11-1457/1, బౌద్ధనగర్, వారాశిగూడ, సికింద్రాబాద్ - 500 061.
గంగప్ప	**గంగప్ప, ఎస్.,** ఇ. నెం. సి - 73, ఎస్. ఎన్. కాలనీ, గుంటూరు.
గద్దె.శ్రీ.	**శ్రీనివాసరావు, గద్దె,** 6-1-181/1, ఓల్డ్ సిబిఐ క్వార్టర్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.
చంద్ర	**చంద్రశేఖర్, పగడాల,** కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ - 500 004.
చ.తి.	**తిరుపతిరావు, చన్నాప్రగడ,** 221, 9వ మెయిన్‌రోడ్, 2వ క్రాస్ రోడ్, న్యూ మైక్ లే అవుట్ క్వార్టర్స్, అరకెరే, బెంగుళూరు - 560 076,
చాట్ల	**శ్రీరాములు, చాట్ల,** 1-147/2, బోరబండరోడ్, హైదరాబాద్ - 500 018.
చె.కే.రె.	**చెన్నకేశవరెడ్డి, జి.** నం. 502, హెచ్.వి.ఎస్. అపార్ట్‌మెంట్స్, బర్కత్‌పుర, హైదరాబాద్.
జయలక్ష్మి	**జయలక్ష్మి సి.** 221, 9వ మెయిన్, 2వ క్రాస్, అరకెరే, బెంగుళూరు - 560 076.
జి.అ.నా.	**అశ్వత్థ నారాయణ, జి.** 53, నేతాజీ రోడ్, 2 బ్లాక్, టి.ఆర్. నగర్, బెంగుళూరు - 560 028.
జి.ఎస్.ఎన్.	**శాస్త్రి, జి.ఎస్.ఎన్.** రాజధాని రెసిడెన్షియల్ స్కూల్ దగ్గర, నిజాంపేట, కూకట్‌పల్లి, హైదరాబాద్.

జె.ము.ర.	**మునిరత్నం. జె.** విశ్రాంత ఆచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతి - 517 502.
జొ.వే. శాస్త్రి	**వేంకటేశ్వరశాస్త్రి, జొన్నలగడ్డ,** విశ్రాంత ఆచార్యులు, భాషాశాస్త్ర శాఖ, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాద్.
జోగారావు	**కీ శే జోగారావు, ఎస్వీ,** ఆంధ్ర విశ్వ విద్యాలయం, విశాఖపట్నం.
డి.ఎస్.ఎన్.	**మూర్తి, డి. ఎస్. ఎన్.** 408, దేవినిలయం, మారుతీనగర్ ఎక్స్‌రోడ్ దగ్గర, కొత్తపేట, హైదరాబాద్ - 500 072.
డి.ల.రా.	**లక్ష్మణరావు, డి.,** ఆంధ్ర విశ్వ విద్యాలయం పి.జి. ఎక్స్టెన్షన్ సెంటర్, కాకినాడ - 533 001.
డి.వి.	**పాండురంగారావు, డి.వి.** 1-7-1002/31/1, రాంనగర్, హైదరాబాద్ - 500 048.
దాసరి. ఎన్.	**నల్లన్న, దాసరి,** కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ - 500 004.
దుగ్గిరాల	**సోమేశ్వరరావు, దుగ్గిరాల,** ప్లాట్ నెం. 45, దుర్గానగర్ కాలనీ, పంజగుట్ట, హైదరాబాద్ - 500 082.
నాగరాజ్	**నాగరాజ శెట్టి, టి.** కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ - 500 004.

నాగిరెడ్డి	**నాగిరెడ్డి, బి.** 12-11-1473/1/1/ఎ, బౌద్ధనగర్, సికింద్రాబాద్ - 500 061.
పప్పు	**వేణు గోపాలరావు, పప్పు,** రీజినల్ డైరెక్టర్, అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్, 15, 4వ క్రాస్, సి.ఐ.టి. కాలనీ, మౌ బ్రేస్ రోడ్, చెన్నై - 600 004.
పా.వి.	**విశ్వనాథం, పాలగుమ్మి,** లలిత సంగీతశాఖ, ఆకాశవాణి, హైదరాబాద్ - 500 004.
పి.ఎస్.జి.	**గోపాలకృష్ణ, పి.ఎస్.,** డైరెక్టర్, ప్రసారభారతి హైదరాబాద్ - 500 004.
పి.జె.ఎస్.	**సుధాకర్, పి.జె.,** డైరెక్టర్, న్యూస్ ఎడిటింగ్, దూరదర్శన్ కేంద్రం, రామంతపూర్, హైదరాబాద్.
పి.ల.నా.	**లక్ష్మీనారాయణ, పగడాల,** విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు, ఎస్. ఎ. పి. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వికారాబాద్ - 501 101.
పి.వి.ఆర్.	**విజయరాఘవ రెడ్డి, పోలి,** 3-13-1/10, శ్రీనివాసపురం, రామంతపూర్, హైదరాబాద్.
పో.శ్రీ.అ.	**కీ. శే. అప్పారావు, పోణంగి శ్రీరామ.** ప్లాట్‌నం. 205, బ్లాక్ సి, పూర్ణిమా అపార్ట్‌మెంట్స్, గన్‌ఫౌండ్రి, అబిడ్స్, హైదరాబాద్ - 500 001.
పో.సూ.రా.	కీ. శే. **సూర్య ప్రకాశరావు, పోలవరపు,** ఎఫ్ - 2, శాయి అపార్ట్‌మెంట్స్, రామచంద్ర నగర్, విజయవాడ - 008.

ప్రభావతి	**ప్రభావతి, డివిలి,** 2-2-19/1, దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ కాలనీ, హైదరాబాద్.
ప్ర. రె.	**ప్రసాదరెడ్డి, జి.ఎస్.** శాఖాధిపతి రంగస్థల కళల శాఖ, నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 500 001.
బూ. రా.	**కీ. శే. బూదరాజు రాధాకృష్ణ,** డిప్యూటీ డైరెక్టర్, తెలుగు అకాడమీ, హైదరాబాద్.
బిట్టు	**వేంకటేశ్వర్లు, బిట్టు,** శాఖాధిపతి, రంగస్థల కళలశాఖ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 500 004.
బేగ్	**ఈసాన్ బేగ్,** ప్రొఫెసర్, ఉర్దూ విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 500 007.
బొ. శ్రీ.	**కీ శే. శ్రీనివాసాచార్యులు, బొమ్మకంటి,** 1-9, 34/5/1, రాంనగర్, హైదరాబాద్ - 500 048.
బోయిన	**వేంకటేశ్వరరావు, బోయిన,** 23-247-12, బచ్చుపేట, బందరు - 521 001. కృష్ణాజిల్లా
భరద్వాజ	**భరద్వాజ, జి.** 18-6-796-సి. లాల్ దర్వాజ, హైదరాబాద్ - 500 053.
భారతి	**ముక్తేవి భారతి.** 6-1-107/2, పద్మారావునగర్, సికింద్రాబాద్ - 500 025
భార్గవి	**భార్గవీరావ్, పి.** 70, ఎం.ఐ.జి.హెచ్, న్యూ సంతోష్‌నగర్ కాలనీ, హైదరాబాద్ - 500 059.

మంజుశ్రీ	**రమాపతి రావు, అక్కిరాజు,** 140/బి, సంతోష్‌నగర్ కాలనీ, హైదరాబాద్ - 500 059.
మన్నె.శ్రీ.	**శ్రీనివాసరావు, మన్నె,** తేజ హాస్పిటల్, ఆంధ్రా బ్యాంక్ వెనుక, రేపల్లె - 522 265 గుంటూరు జిల్లా.
మల్లేశం	**మల్లేశం,** ఆంగ్లోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్ధిపేట, మెదక్ జిల్లా.
మిక్కిలినేని	**రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని,** 32-9-2/1, మధువన్ అపార్ట్‌మెంట్స్, మొగల్‌రాజపురం, విజయవాడ - 500 010.
ముదిగంటి	**సుజాతా రెడ్డి, ముదిగంటి,** 2-2-1105/21, రోహిణమ్, తిలక్‌నగర్, హైదరాబాద్ - 500 044.
రమణ	**కే. శే. రమణ. పి.వి.,** 7-1-65/బి, ప్లాట్ నం. 104, లుంబిని అపార్ట్‌మెంట్స్, . దరమ్ కరన్ రోడ్, అమీర్‌పేట, హైదరాబాద్ - 500 059.
రమాంజనీ	**రమాంజనీ కుమారి, వి.** కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ - 500 004.
రవీంద్ర	**రవీంద్రారెడ్డి, ఎన్,** ప్లాట్ నం. 405, 3-6-484, సెట్టిపల్లె అపార్ట్‌మెంట్స్, 6వ వీధి, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
వాసన్	**వాసన్,** రోహిణినిలయం, 13-3-344/12 ఎ, జబ్బార్ లే అవుట్, తిరుపతి - 517 501.
వె.ని.రా.	**నిత్యానందరావు, వెల్లండ,** తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాద్ - 500 007.

శేఖర్	**శేఖర్‌బాబు, జి.** రంగస్థల కళల శాఖ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 500 004.
శే. వెం. న.	**నరసింహాచార్యులు, శేషం వెంకట,** ఇ.నెం. 9-97, శాంతినగర్, దిల్‌సుక్‌నగర్, హైదరాబాద్ - 660.
శోభాదేశ్	**శోభాదేశ్‌ముఖ్,** అసోసియేట్ ప్రొఫెసర్, మరాఠీ విభాగం, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాద్ - 500 007.
శ్రీ. చ.	**కీ. శే. శ్రీనివాస చక్రవర్తి,** మాజీ సంపాదకులు, నాట్యకళ, హైదరాబాద్.
శ్రీ. ల.	**లక్ష్మణమూర్తి, ఎస్ శ్రీపెరుంబుదూరి,** ఆంగ్లశాఖాచార్యులు, నం. ఎస్. 8, స్టాఫ్ క్వార్టర్స్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు - 506 009.
శ్రీవిరంచి	**రామానుజాచారి, ఎన్.సి.** 8, శ్రీరాంకాలనీ, థియోసాఫికల్ సొసైటీ, అడయార్, చెన్నై - 600 020.
సరోజ	**సరోజా నిర్మల, వై. ఆర్.** ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్, ప్రసార భారతి, హైదరాబాద్ - 500 004.
సి. వి. కె.	**రావు, సి. వి. కె.** చర్ల గ్రామం, ఖమ్మం జిల్లా.
సి. ఎస్. నా.	**కీ. శే. నారాయణ, సి. ఎస్.** ఇ. నెం. 23/400, రామానాయుడుపేట, బందరు - 521 001.
సుధాదేవి	**సుధాదేవి, తెన్నేటి,** 2-1-527-5-1, నల్లకుంట, హైదరాబాద్ - 500 044.

విషయానుక్రమణిక

అంకితం iii
ప్రవేశిక v
విజ్ఞప్తి vi
సంపాదకీయం vii
సంపాదక మండలి iX
వ్యాసరచయితల వివరాలు Xi
విషయానుక్రమణిక XiX

భారతీయ నాటక రంగం I
సంస్కృత నాటకరంగం 1
జానపద నాటక రంగం 6
తెలుగు నాటక ఆవిర్భావం- పూర్వరంగం 18
అస్సామీ నాటక రంగం 72
ఉర్దూ నాటక రంగం 74
ఒరియా నాటక రంగం 77
కన్నడ నాటకరంగం 83
కాశ్మీరీ నాటక రంగం 88
గుజరాతీ నాటక రంగం 91
తమిళ నాటక రంగం 94
పంజాబీ నాటక రంగం 99
పార్శీ నాటకరంగం 102
బెంగాలీ నాటకరంగం 105
మరాఠీ నాటకరంగం 112
మలయాళ నాటకరంగం 118
హిందీ నాటక రంగం 122
ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) 125

ప్రపంచ నాటక రంగం II
గ్రీకు నాటకరంగం 129
రోమన్ నాటకరంగం 133
ఫ్రెంచి నాటకరంగం 136
జర్మన్ నాటకరంగం 141
అమెరికా నాటకరంగం 147

బ్రిటన్ నాటక రంగం	152
చైనా నాటక రంగం	157
జపాన్ నాటకరంగం	161
రష్యా నాటకరంగం	164
పోలాండ్ నాటకరంగం	169
ఐర్లాండ్ నాటకరంగం	175
అకారాది వ్యాసాలు	179-693
అనుబంధం	694-724
పదసూచి	725

సమీక్ష

BLANK PAGE

భారతీయ నాటక రంగం

సంస్కృత నాటకరంగం

భారత దేశంలో వేదకాలానికి ముందే నాటకరంగం ఆవిర్భవించి, క్రమంగాపెంపొంది పరాకాష్ఠకు చేరుకొన్నదనడానికి ఆధారాలు కనిపిస్తున్నాయి. భరతముని నాట్య శాస్త్రం రచించాడని చరిత్రకారులు విశ్వసిస్తున్నా దానిని తనకు బ్రహ్మ ప్రసాదించినట్లు భరతముని చెప్పుకొన్నాడు.

భరతముని సిద్ధాంతం : ఋగ్వేదం నుంచి వాచికం, సామవేదం నుంచి సంగీతం, యజుర్వేదం నుంచి అభినయం, అధర్వణ వేదం నుంచి రసం తీసుకొని నాలుగింటినీ మేళవించి పంచమ వేదంగా నాట్య శాస్త్రాన్ని సృష్టించి బ్రహ్మ భరతమునికి ప్రసాదించాడు. భరతముని దాన్ని తన పుత్ర (శిష్య) శతానికి సాకల్యంగా ఉపదేశించి ప్రయోగ విధానం నేర్పాడు. అయితే భరతముని పుత్రులకు తోడుగా బ్రహ్మ 24 మంది అప్సరసలను సృష్టించి ఇచ్చాడు. ఈ విధంగా ప్రయోగ విధానం తెలిపే శాస్త్ర గ్రంథం, నటీ నటులు లభించడంతో భరతముని ఆచార్యత్వంలో ప్రప్రథమ నాటక బృందం ఏర్పడింది. ఈ బృందం భరతముని సారథ్యంలో మహేంద్ర ధ్వజోత్సవ సమయంలో అసుర పరాజయమనే రూపకం ఆరుబయట ప్రదర్శించారు. దీని ఇతివృత్తం రాక్షస నాశనం. ఇదే ప్రప్రథమ సంస్కృత నాటకం, నాటక ప్రయోగం. ఈ ప్రదర్శన సమయంలో రాక్షసులు అల్లరి చేయగా భరతముని వేడుకోలు మీద బ్రహ్మ విశ్వకర్మ నాట్య వేశ్మం(నాటకశాల)ను నిర్మింపచేశాడు. దానితో రంగస్థలం, పరిమిత ప్రేక్షకాగారం లభించాయి.

తరువాత భరతముని బృందం బ్రహ్మ రచించిన అమృత మథన మనే సమవకారం ప్రదర్శించి మెప్పుపొందింది. ఆ తరువాత శివుని సమక్షంలో అమృత మథనం, త్రిపురదాహం ప్రదర్శించారు. ప్రదర్శనం ఇంకా శోభిల్లడానికి ఆవశ్యకమయిన అంగహారాదులను శివుని ఆజ్ఞ మీద తండువు భరతమునికి నేర్పాడు. అపుడే పార్వతి లలితమయిన లాస్యం బోధించింది.

నహుషుడనే భూలోక రాజు ఇంద్రపదవిని అలంకరించినపుడు ఈ రూపక ప్రదర్శనలను భూలోకంలో వ్యాపింపచేయవలసిందిగా భరతమునిని కోరాడు. భరతముని తన పుత్రులను భూలోకానికి పంపాడు. అక్కడ ఈ భరత పుత్రులు మనుష్య స్త్రీలతో కలిసి ప్రదర్శనలిస్తూ వారివల్ల సంతానం పొందారు. ఆ విధంగా నాట్యకళ భూలోకంలో వ్యాప్తిచెందింది. నాట్య శాస్త్రంలో నృత్య, సంగీత విషయాలను వివరంగా చెప్పడాన్ని బట్టి ఆ నాటి రూపకాలు సంగీత నృత్యరూపకాలని భావించవచ్చు.

శారదా తనయు సిద్ధాంతం : శారదా తనయుడనే సంస్కృత లాక్షణికుడు భావ ప్రకాశనంలో రూపకోత్పత్తిని గురించి ఇంకో రకమయిన కథ వివరించాడు.

సదా శివుడు కల్పాంతంలో సర్వలోకాలను భస్మంచేసి ఆనంద తాండవమాడాడు. ఆ తరువాత సంకల్ప మాత్రాన విష్ణు, బ్రహ్మ సర్వలోకాలను సృజించి మహా దేవుని పునరావృత్తాన్ని ప్రత్యక్షంగా చూడదలిచారు. అపుడు నంది కేశ్వరుడు బ్రహ్మకు నాట్య వేదం ప్రయోగ విధానంతో సహా బోధించాడు. తరువాత బ్రహ్మ త్రిపుర దాహమనే రూపకం రచించి ప్రయోగింప చేశాడు. దానిని తిలకిస్తున్న బ్రహ్మ నాలుగు ముఖాల నుంచి నాలుగు వృత్తులు, నాలుగు ప్రధాన రసాలు పుట్టాయి. దీన్నిబట్టి నందికేశ్వరుడు నాట్యశాస్త్రం రచించాడని, బ్రహ్మ ప్రప్రథమ రూపక కర్త, ప్రయోక్త అని తెలుస్తున్నది.

ఆ తరువాత బ్రహ్మ మనువు ప్రార్థన మీద భరతులను భూలోకంలో రూపక ప్రదర్శనలను వ్యాపింప చేయమని చెప్పగా వారు మొదట అయోధ్య రాజును, ఆ తరువాత తక్కిన దేశ రాజులను తమ ప్రదర్శనలతో ఆనందింప చేశారు. ఈ విధంగా రూపక ప్రదర్శనం భూలోకంలో వ్యాప్తి చెందింది.

వేద సంవాద సిద్ధాంతం : క్రియాత్మక సంభాషణా రూపకమే రూపకం. కేవలం సంభాషణల ద్వారానే రూపక కథ నడుస్తుంది. రూపకాన్ని తక్కిన సాహిత్య ప్రక్రియల నుంచి వేరు చేసేది ఈ సంభాషణాత్మకమే. అంటే రూపకానికి సంభాషణ ప్రాతిపదిక.

ప్రపంచంలోనే ప్రప్రథమ గ్రంథంగా పరిగణనలో ఉన్న ఋగ్వేదంలో సంవాదాలనే పేరిట 15 సంవాద సూక్తాలున్నాయి. వీటిలో కొన్ని ఇద్దరి మధ్య, కొన్ని అంతకంటే ఎక్కువమంది మధ్య ఉన్నాయి. యమ–యమి సంవాదం (10–10), పురూరవ – ఊర్వశీ సంవాదం (10–95), ఇద్దరి మధ్య సంవాదానికి మచ్చుతునకలు. ఇక ముగ్గురి మధ్య సంవాదానికి అగస్త్య–లోపాముద్ర, వారి కుమారుడు మధ్య సంవాదం (1–79), ఇంద్ర–వసుకార, అతని భార్య మధ్య సంవాదం (10–28) ఇంద్ర, అదితి, హేతుదేవుల మధ్య సంవాదం (4–18) మచ్చుతునకలు.

ఈ సంవాద సూత్రాలలో వ్యక్తులే గాక, సమూహాలు కూడా పాల్గనే సంఘటనలున్నాయి. గోవులను తోలుకొని పోయిన రాక్షసులతో ఇంద్ర దూత సంవాదం (10–108), దేవతలు అగ్నిని ప్రార్థించే సూక్తంలో దేవతా సమూహం– అగ్ని

పొల్గనడమే గాక ఇద్దరూ పఠించడానికి వీలుగా సూక్తం రెండుగా విభజించడం కానవస్తుంది.

ఈ సంవాద సూత్రాలను యజ్ఞయాగాదులతో ఋత్విక్కులు రెండు మూడు బృందాలుగాచేరి, ఒక్కొక్క బృందం ఒక్కొక్కపాత్ర పాఠాన్ని పఠిస్తూ నటించే వారని తెలుస్తోంది.

ఋగ్వేదంలో బహుపాత్ర సూక్తాలేగాక ఏక పాత్ర సూక్తాలు కూడా కానవస్తున్నాయి. ఋగ్వేదం (10-119)లో ఇంద్రుడు సోమపానం చేసి మత్తిల్లి, సోమపాన ప్రాశస్త్యాన్ని ప్రస్తుతించే సూక్తం ఉంది. యాగానంతరం ఋత్విక్కు, ఇంద్ర వేషం ధరించి తూలుతూ వచ్చి ఈ సూక్తం పఠించే వాడట.

మండూక కరాళాలు ధరించి ఋత్విక్కులు మండూక సూక్తం పఠిస్తూ మండూక నృత్యం చేసే వారట. ఋగ్వేదంలోని సువర్ణాధ్యాయం సంపూర్ణ నాటక లక్షణాలతో విలసిల్లుతున్నదని హెర్టెల్ అభిప్రాయపడ్డాడు.

కేవలం సంవాదాలే గాక క్రియాత్మకమైన రూపికలు కూడా వేదాలలో కనిపిస్తున్నాయి. సోమరస విక్రయగాథ దీనికి ఉదాహరణ. సోమరస విక్రేత దగ్గర సోమరసం కొని ఖరీదివ్వకుండా అతనిని రాళ్ళతో రువ్విన గాథ ఇది. ఇందులో నాటకీయత తొణికిసలాడుతుంటుంది. ఇలాంటిదే మహావ్రతం. యజుర్వేదంలోని పశుమేధ విభాగంలో నరబలి ఇవ్వకుండా ఇచ్చినట్టు నటించే వారట. యజ్ఞయాగాదులలో ఋత్విక్కులు, ఇంద్రాది దేవతల వేషాలు ధరించి పూజలందుకొనేవారట.

సంవాద సూక్తాలను అనుసంధించే వచన భాగాలు కూడా ఉండేవని, అవి కాలక్రమేణ అంతరించి పోయాయని పండితాభిప్రాయం. యజుర్వేదంలో నటునికి పర్యాయ పదమయిన శైలూష పదం ఉండడం గమనార్హం. ఈ సంవాదాల రూపంలో సంస్కృత నాటక బీజాలు వేదాలలో విలసిల్లాయని, అవి క్రమంగా ఉద్బుద్ధమయి పెరిగి, ప్రపూర్ణమయినాయని కొందరి విమర్శకుల అభిప్రాయం.

జాగీర్దార్ సిద్ధాంతం : ధార్వార్‌లోని కర్ణాటక కళాశాల ఆచార్యులు జాగీర్దార్ సంస్కృత రూపకోత్పత్తిని గురించిన కొత్త సిద్ధాంతాన్నొకదానిని తమ సంస్కృత సాహిత్యంలో రూపకంఅనే గ్రంథంలో ప్రతిపాదించాడు. పురాణాల నుంచి సంస్కృత నాటక సాహిత్యం ఆవిర్భవించిందనేదే ఈ కొత్త సిద్ధాంత సారాంశం. పురాణాలలోని సూతుడే సంస్కృత నాటకంలోని సూత్రధారుడుగా రూపొందాడని ఈయన అభిప్రాయం.

మహాభారతం సంభాషణారూపం. ఇందులో పాత్ర భాషణం ముందు భీష్మ ఉవాచ, భీమ ఉవాచ, కృష్ణఉవాచ, సూత ఉవాచ అంటూ వస్తుంది. తరువాత ఆ పాత్ర భాషణంతో గ్రంథమంతా సాగుతుంది. ఇందులోని భీష్మ, భీమ, కృష్ణులు భారత పాత్రలు, కాని సూతుడు భారత పాత్రకాదు. మధ్య మధ్య సూతుడు ప్రవేశించి పాత్రను పరిచయం చేసి, స్థల కాలాదులను తెలిపి, ఆయా సంభాషణల ముందు వెనుక ఏమి జరిగిందో చెప్పి, రంగం నుంచి నిష్క్రమిస్తాడు. సంభాషణ ముగిసిన తరువాత ప్రవేశించి, తరువాత మాట్లాడే పాత్ర పరిచయాదులు చేసి, తిరిగి నిష్క్రమిస్తాడు. సంస్కృత రూపకాలలోని సూత్రధార పాత్ర క్రియ కూడా అదే. నాటకారంభంలో సూత్రధారుడు ప్రవేశించి నాటకాదులను పరిచయంచేసి నిష్క్రమించి, నాటకాంతాన భరతవాక్యం పలకడానికి ప్రవేశిస్తాడు. ప్రస్తావన, భరత వాక్యం నాటక కథా భాగాలు కావు. పురాణాలలో సూతుని పనిని నాటకాలలో ప్రస్తావనా, విష్కంభ ప్రవేశకాలు నెరవుతున్నాయి.

భరతముని నాట్య శాస్త్రం 18వ అధ్యాయంలో సర్వ కార్యాలకు మాతృకలు వృత్తులని సిద్ధాంతీకరించాడు. వృత్తి అనగా వ్యాపారం లేదా వ్యాపకం. ఈ వృత్తులు నాలుగు. నాలుగు వృత్తులు నాలుగు విధాలయిన అభినయాలు. భారతీ వృత్తి అంటే వాచికాభినయం. సాత్త్వతీ వృత్తి అంటే సాత్త్వికాభినయం. ఆంగికాభినయం ఆరభటీ వృత్తి. కైశికీ వృత్తి శోభ. ఈ నాలుగు వృత్తులు సూతుడు సూత్రధారుడుగా రూపొందడంలోని నాలుగు దశలకూ సరిపోతాయి.

మొదటిదశ – సూతుని కథా కథనం – భారతీ వృత్తి, వాచికాభినయం; రెండవ దశ – సూతుడు ఇతరులతో కలిసి కథా గానం చేయడం – కుశలవుల రామాయణగానం – సాత్త్వికాభినయం; మూడవ దశ – వేషం వేసుకొని నటి మారీషాదులతో కలిసి సంభాషణా పూర్వకంగా కథ చెప్పడం – ఆహార్యాభినయం; నాలుగవ దశ – గాన నృత్యాలతో అంకరంగ విభజన – ఆంగికాభినయం.

ఇలా రూపకానికి కావలసిన చతుర్విధాభినయాలు ఈ నాలుగు దశలకు సరిపోవడం వల్ల సూతుడే సూత్రధారుడుగా రూపొందాడని, పురాణాలే రూపకాలుగా రూపొందాయని జాగీర్దార్ సిద్ధాంతీకరించాడు.

తోలు బమ్మలాట సిద్ధాంతం : తోలు బమ్మలనాడించే వారు బమ్మల 'దారం' పట్టుకొని ఆడిస్తారు కాబట్టే ఆ ఆడించే వ్యక్తికి సూత్రధారి అని పేరు వచ్చింది. అయితే సంస్కృత రూపకాలలో సూత్రధారుడు నాటక ప్రదర్శనను ప్రారంభిస్తున్నాడు. అందుకని పెస్కెల్ వంటి పాశ్చాత్య విమర్శకులు తోలుబమ్మలాట నుంచి సంస్కృత రూపకం పరిణతి చెందిందని అభిప్రాయపడ్డారు. సూత్రధార పదాన్ని ముక్కస్య ముక్కార్థంలో గాక సామాన్యార్థంలో తీసుకుంటే ఆడించే వాడు అని దాని కర్థం.

పురాణ కాలక్షేప సిద్ధాంతం : మన దేశంలో పురాణ కాలక్షేపం ప్రజాకళగా పరిఢవిల్లింది. పట్టణాలలో, గ్రామాలలో ఈ కాలక్షేపం రాత్రులందు జరుగుతుంటుంది. దీని ప్రధానోద్దేశం

నిరక్షరాస్యులకు విజ్ఞానం కలిగించడం. విరాట పర్వం, సుందరకాండ పురాణ కాలక్షేపం వల్ల వర్షాలు కురుస్తాయని, దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్మకం.

ఈ పురాణ కాలక్షేప ప్రక్రియలో ఒకరు లేదా ఇద్దరు పాల్గొనేవారు. పురాణం చెప్పేది ఒకరే అయితే ఒకటి రెండు శ్లోకాలు చదివి ఆపి, తానే ఆ శ్లోకాలలోని భావాన్ని విపులీకరించి చెపుతాడు. ఇద్దరయితే ఒకరు శ్లోకాలు చదివి ఆపితే, మరొకవ్యక్తి విపులీకరిస్తాడు. ఇది పురాణకాలక్షేప విధానం. పురాణం పఠించే వారిని పాఠకులని, వ్యాఖ్యానించే వారిని ధారకులని అంటారు.

విపులీకరించడంలో ఏదో పాఠం చెప్పినట్టుగా గాక, అర్థానికి అనుగుణమయిన హావభావ చేష్టాదులతో, చతుర్విధాభినయాలతో పురాణం చెపుతూ, వ్యాఖ్యానిస్తూ, శ్రోతల హృదయాలలో ఆ అర్థం హత్తుకునేటట్టు చేస్తారు. ఆయా రసాలను పౌరాణికులు ఆవిష్కరిస్తుంటే శ్రోతలు కూడా ఆయా రసాలలో మునిగి వాటికి ప్రతిచలనం చూపుతారు. కరుణ రస ఘట్టంలో కన్నీరు పెడతారు. ఆనంద ఘట్టంలో ఆనందిస్తారు. ఇలా రస ప్రపంచంలో శ్రోతలను ముంచెత్తిన పౌరాణికుడు నానారసాభినేత, మహానటుడు. పురాణమే నాటక సాహిత్యం అంటే ఒకే వ్యక్తి నానా పాత్రలు అభినయిస్తున్నాడు. దీని నుంచే ఒక్కొక్క పాత్రను ఒక్కొక్క వ్యక్తి నటించడం వ్యవహారంలోకి వచ్చిందని భావించవచ్చు.

ఆదికావ్యమైన వాల్మీకి రామాయణంలో నట, నర్తక ప్రసక్తేగాక నాటక బృందాలను గురించిన ప్రసక్తి కూడా ఉంది. రామాయణం ఉత్తర కాండలో కుశలవులు రామాయణాన్ని గానం చేయడం గమనార్హం. మహాభారతంలో కూడా నట నర్తక సూత్రధార శబ్దాలున్నాయి. మహాభారతానికి అనుబంధ కావ్య మయిన హరివంశం లో నటులు రామలక్ష్మణ, భరతశత్రుఘ్న, ఋష్యశృంగ, శాంత పాత్రలు ధరించి, ఋష్యశృంగ గాధను నటించినట్టు చిత్రితమైంది. గౌతమ బుద్ధుని కాలంలో ఆయన శిష్యులైన ఉపతిష్యమౌద్గయాయనులు సౌగంధి కాపహరణ నాటకం ప్రదర్శించారట. సంస్కృత నాటకం పరిణతి చెందిందని పాణిని నట సూత్రాలను బట్టి పేర్కొన్నాడు. క్రీ.పూ. 150 ప్రాంతంలో జీవించిన పతంజలి తన మహాభాష్యంలో కంసవధ, *బలిబంధనం* అనే రెండు నాటకాలను పేర్కొన్నాడు. పతంజలి కాలంలో నాటక ప్రదర్శనలు మూడు విధాలుగా సాగుతున్నాయని అతని రచనల వల్ల తెలుస్తోంది. మొదటిది – శోభనికులు ప్రదర్శించే నాటకాలు. రెండవది చిత్ర ప్రదర్శనం– రంగు బమ్మలతో కథను ప్రదర్శించడం. మూడవది గ్రంథికుల ప్రదర్శనం – బుఱ్ఱకథలను పోలింది.

దక్షిణ బీహార్ (మగధ)లోని రామఘర్ కొండలలోని సీతాబెంగా,జ్యోతీమీర గుహలలోని శిలాశాసనాలను బట్టి క్రీ.పూ. 3వ శతాబ్దికే సంస్కృత భాషలో నాటకం పరాకాష్ఠకు చేరిందని చెప్పవచ్చు. సీతాబెంగా గుహలో తొలచిన నాటక శాల నేటికీ కాన వస్తున్నది.

చారిత్రక దృష్టితో చూస్తే, మొట్టమొదటి శాస్త్రకర్తేగాక మొట్ట మొదటి నాటక కర్త కూడా భరతమునే. అసుర విజయం,అమృత మధనం, త్రిపుర దాహం, లక్ష్మీ పరిణయం భరతముని రచనలే. ఆ తరవాత పతంజలి రచించిన కంసవధ, *బలి బంధనం* ఇత్యాదుల పేర్లే కాని అవి లభ్యం కావడం లేదు.

అలాగే వరరుచి (క్రీ.పూ.450) రచించిన ఉభయాభిసారిక భాణం తరవాత వచ్చిన భాణాలకు లక్ష్య ప్రాయమయినా, ఆ ప్రతి ఇప్పటికీ లభ్యం కావడం లేదు. ఈశ్వరదత్తు రచించిన ధూర్త విట సంవాద భాణం లో నాంది లేదు. స్థాపన మాత్రం కొద్దిగా ఉంది. సూత్రధారుడు ఆకాశ భాషితంలో నటితో సంభాషిస్తాడు. ఇతని కుమారుడు శ్యామిలికుడు వ్రాసిన పాద తాడితమనే భాణంలో అయిదు శ్లోకాలతో ఆశీర్వాద రూపంలో నాంది పఠింప చేసి ఋతువర్ణన చేయిస్తాడు. దీనిలో మామూలు సంస్కృత నాటకాలలో లాగా గాక భరత వాక్యం లేదు.

మనకు లభ్యమవుతున్న వాటిలో ప్రాచీనమైన అశ్వఘోషుని మూడు రూపకాలు. బౌద్ధ గాథలు. ఇందులో ఒకటి సారిపుత్ర ప్రకరణం. ఇదే ప్రథమ సంస్కృత ప్రకరణంగా భావించవచ్చు. అయితే లక్షణకారులు చెప్పినట్టు 10 అంకాలు గాక 9 అంకాలే ఇందులో ఉన్నాయి. రెండవది అన్యాప దేశ రూపకం. ఇందులో బుద్ధి, కీర్తి, ధృతి మొదలయిన అరూపాలు పాత్రలు. మూడవది ధర్మ ప్రబోధక రూపకం, ఈ మూడూ లభ్యం కావడం లేదు. ప్రకరణ, అన్యాప దేశ రూపకాలకు మార్గం ఏర్పడింది. ప్రబోధ చంద్రోదయం, సూర్యోదయాది నాటకాలకు అశ్వఘోషుని రూపకమే మేలుబంతిగా పరిణమించిందని పండితాభిప్రాయం.

అశ్వఘోషుని తరువాత మనకు తారసిల్లే ప్రముఖ నాటకకర్త భాసుడు (12వ శతాబ్ది). ఈయన భరతముని నాట్య శాస్త్ర సూత్రాలను, విధి నిషేధాలను గట్టిగా పాటించ కుండా రంగస్థలం మీద మృతిని, యుద్ధాలను చూపాడు. ఒక విధంగా చూస్తే 'ఊరుభంగం' విషాదాంత నాటకమే. భరతముని సూత్రాలను ఉల్లంఘించింది భాసుడు ఒక్కడే. ఆ తరువాత నాటకకర్త లెవరూ అందుకు ధైర్యం చేయలేదు. 1909లో దొరికిన తాళపత్ర గ్రంథాలను పండిత టి.గణపతి శాస్త్రి 1912లో ప్రచురించే వరకు భాస నాటకాల సంగతి నామ మాత్రమే గాని ప్రతులు దొరకలేదు. భాసుడు రచించిన విశేషాంక నాటకాలు 8, ఏకాంకికలు 5. మొత్తం 13. తరువాత బయలుపడిన 'యజ్ఞ ఫలనాటకం' కూడా భాసునిదేనని పండితాభిప్రాయం.

ఈ 13 రూపకాలలో భారత రూపకాలు 5, రామాయణ నాటకాలు 3, భాగవత రూపకం 1, కథా సరిత్సాగర కథలు 3, కల్పితం 1. ఈ 13 రూపకాలను కలిసి 'భాస నాటక చక్రం' అంటారు. వీటిలో నాటకీయత ఉరకలు పెడుతూ ఉంటుంది. వీటిలో ప్రస్తావన బదులు స్థాపన ఉంటుంది. ఈ స్థాపనలో ఎక్కువగా సూత్రధారుడే ప్రస్తావనాంగాలన్నీ నిర్వహిస్తాడు. నటీ, మారీషాదులు ప్రవేశించి సూత్రధారునితో ప్రసంగించే నాటకాలు తక్కువ. ఈ నాటకాలన్నింటిలో రాజసింహః, ప్రశాస్తునః అని ఉంటుంది. రచయిత పేరు స్థాపనలో గాని, అంకాంతంలో గాని కనిపించదు. కవిత్వశైలి మనోహరం. అతి ప్రాచీనం. పాణినీయ వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు కనిపిస్తాయి.

భాసుని తరువాత చెప్పుకోదగ్గ నాటకకర్త శూద్రకుడు. ఇతని 'మృచ్ఛ కటిక' ప్రకరణం సర్వలక్షణ లక్షితమయి, తరువాతి ప్రకరణాలకు ఆదర్శమయింది. సంస్కృత నాటకాలలో మృచ్ఛకటికం లేనంతగా వాస్తవికత, సజ్జానిర్మాణం, ఉపకథలు, మానవత, నాటకీయత, రాజకీయాలు ఇందులో ఎక్కువగా గోచరిస్తాయి. ఇందులో సంవాహకులు, జూదరులు, దొంగలు మొదలు రాజు, కులీనుల వరకు అనేకరకాల పాత్రలు మనకు తారసిల్లుతాయి. ఈ ప్రకరణంలోని పరాకాష్ఠలో వచ్చే మట్టిబండిని బట్టి దీనికి మృచ్ఛ కటిక అని పేరు వచ్చింది. ఇది ప్రపంచ మహా నాటకాలలో ఒకటిగా పరిగణమవుతోంది.

శూద్రకుని తరువాత ప్రసిద్ధికెక్కిన సంస్కృత నాటక కర్త కాళిదాసు. ఈయన రచించిన నాటకాలు మూడు. మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞాన శాకుంతలం. మాళవిక నాటిక, విక్రమోర్వశీయం త్రోటకం, శాకుంతలం నాటకం. ఈ మూడు రూపకాలలో నాటకీయత, కవిత, సమపాళ్ళలో నడుస్తాయి. ప్రదర్శనీయతను పొదువుకొని నేటికీ ప్రదర్శిత మవుతున్నాయి. మూల కథను పాత్రలను మలచుకొనే విధానానికి ఈ మూడూ మచ్చుతునకలు. కాళిదాసు యుగం సంస్కృత నాటక చరిత్రలో స్వర్ణ యుగం.

పిదప నాటకకర్తలుగా కీర్తి గాంచిన వారు వరుసగా విశాఖదత్తుడు, శ్రీహర్షుడు, భవభూతి. విశాఖదత్తునితో సంస్కృత నాటక సాహిత్య చరిత్రలో ఒక నూతన ఘట్టం ప్రారంభమయింది. రాజకీయ నాటకాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఇతని 'ముద్రారాక్షస' నాటకం విశ్వవిఖ్యాతి గాంచింది. తరువాత వచ్చిన శ్రీహర్షుని రత్నావళి, ప్రియ దర్శిక, నాగానందం రూపకాలు మూడు ఆణిముత్యాలు. కథా సంవిధానానికి ఎంతగానో పేరు పొందాయి. శృంగార, దాన, వీర రసాలకు ఇవి ఆటపట్టులు. లాక్షణికులు ఎక్కువగా ఈ మూడు నాటకాల నుంచే ఉదాహరణ లిస్తుంటారు. భవభూతి ప్రపంచ ఖ్యాతి గాంచిన మహా నాటకకర్త. ఇతని రచనలు కూడా మూడే. మహావీర చరిత, మాలతీ మాధవం, ఉత్తరరామచరిత నాటకాలలో నాటకీయతను త్రోసి రాజని కవిత ముందుకు నడుస్తుంది. అందుకే ఈ రూపకాలలో ప్రయోగ సౌలభ్యం క్షీణించింది. వీటితో సంస్కృత నాటకాలలో క్షీణతా బీజాలు నెలకొన్నాయి.

భవభూతి తరువాత యుగం జీర్ణయుగం. ఈ యుగ ప్రధాన లక్షణం శ్రవ్య రూపక సృష్టి. ఈ యుగంలోని సంస్కృత నాటకకర్తలకు ప్రదర్శనా దృష్టి లేదు. పాండిత్య ప్రకర్షం మీద, శిల్పం మీద దృష్టి ఎక్కువ. పాత్రోన్మీలనం మీద, నాటకీయత మీద దృష్టి లేదనే చెప్పాలి. రాజ దర్బారులలో ఎక్కువగా ప్రదర్శితమవుతూండడం వల్ల, కఠినశైలి అవలంబించడంవల్ల సామాన్య ప్రజానీకానికి, నాటక రంగానికి సంబంధం తెగిపోయింది. సంస్కృత రూపక లక్షణాలను తప్పకుండా అనుసరించాలనే మహాయత్నం ఈ నాటకాలలో గోచరిస్తుంది. మురారి 'అనర్ఘ రాఘవం', జయదేవుని 'ప్రసన్న రాఘవం', రాజశేఖరుని 'బాలరామాయణం' ఈ శ్రవ్య రూపకాలకు మంచి ఉదాహరణలు. వీటిలో నాటకీయత తగ్గి, వర్ణనలకు, శ్లోకాలకు, కవితా శైలికి ప్రాధాన్యం హెచ్చింది. ఈ కాలంలో వెలువడిన రూపకాలు ఎక్కువగా పౌరాణికాలే. గుణం తగ్గినా, రాశి హెచ్చు. సంస్కృత నాటక సాహిత్య చరిత్రలో ఏ యుగంలోను లేనన్ని 600 రూపకాలు ఈ యుగంలో వచ్చాయి. ఇవి పౌరాణికాలయినా వస్తువైవిధ్యం హెచ్చు. కృష్ణ నాటకాలు, చారిత్రక నాటకాలు, కల్పితాలు ఎక్కువ.

ఈ యుగంలో వచ్చిన నాటకాలలో విశిష్టతను పొదువుకున్నవి రెండు – శక్తి భద్రుని ఆశ్చర్య చూడామణి , భట్ట నారాయణుని 'వేణీ సంహారం'. భోజుడు శృంగార రసానికి, భవభూతి కరుణ రసానికి పట్టం కట్టితే, శక్తి భద్రుడు అద్భుత రసానికి పట్టం కట్టాడు. రామకథను ఆశ్చర్య చూడామణి అనే నాటకంగా రచించి నూతన రీతి నాటకాలకు ఒరవడి పెట్టాడు. వేణీ సంహారం నాటకీయతతో తొణికిసలాడే నాటకం. కురు పాండవుల యుద్ధగాథ. లాక్షణికులు నాటక లక్షణాలకు ఉదాహరణలు ఎక్కువగా దీని నుంచి ఉటంకిస్తుంటారు.

ఈ క్షీణ యుగంలో వ్యాప్తిలోకి వచ్చిన ఇంకొక రీతి నాటకాలు అన్యాపదేశ నాటకాలు. ఈ నాటకాలలోని పాత్రలు బుద్ధి, మోహం, వివేకం వంటి అరూప పాత్రలు. అశ్వఘోషుని మూడవ నాటకం ఇలాంటి అన్యాపదేశ నాటకమయినా ఇవి వ్యాప్తిలోకి వచ్చింది, పరాకోటికి చేరింది ఈ యుగంలోనే. కృష్ణ మిశ్రుని ప్రబోధచంద్రోదయం, వేదాంత దేశికుని సంకల్ప సూర్యోదయం అన్యాపదేశ నాటకాలకు మచ్చు తునకలు. ఈ అన్యాపదేశ నాటకాలతో పాటు సాంఘిక రూపకాలు కూడా

శాకుంతలంలోని సన్నివేశం

ఈ కాలంలో వెలువడ్డాయి. ఈ నాటకాలలో అవహేళన తీవ్రరూపంలో గోచరిస్తుంది. మహేంద్ర వర్మ మత్త విలాసం, భగవదజ్జుగం, లటక మేళం ఈ రీతి ప్రహసనాలకు మంచి ఉదాహరణలు.

దశ రూపకాలలో ఒకటయిన బాణాన్ని కూడా నాటి నాటకకర్తలు అవహేళనకు ఎక్కువగా ఉపయోగించుకున్నారు. చతుర్భాణి (ఉభయాభిసారిక, పద్మ ప్రాభృతకం, ధూర్త విట సంవాదం, పాద తాడితం) ఇందుకు చక్కని ఉదాహరణలు.

అయితే పూర్వులతోనే సంస్కృత నాటకరచన ఆగిపోలేదు. సంస్కృతం రాజభాషగా స్థానం కోల్పోయినా భారతదేశంలో అనేకులు అభ్యసించి, పాండిత్యం సంపాదిస్తూనే ఉన్నారు. నేటికీ శ్రీరాఘవన్ వంటి సంస్కృత పండితులు ఏకాంకికలు, విశేషాంకికలు రచించి ప్రచురిస్తూనే ఉన్నారు.

ప్రయోగం: భరతముని నాట్యశాస్త్రం, కాళిదాసుని విక్రమోర్వ శీయంలో లక్ష్మీ పరిణయ నాటక ప్రయోగ ప్రసక్తులను బట్టి పూర్వం సంగీత నృత్య రూపకాలే వర్థిల్లుతున్నాయని భావించ వచ్చు. నృత్యాన్ని, ఆ తరవాత సంగీతాన్ని తొలగించి కేవలం వచనం, శ్లోకాలతో నాటకాలు వెలువడసాగాయి. అయినా రాగ తాళ బద్ధమయిన గేయాలు అక్కడక్కడా మనకు తారసిల్లుతాయి. విక్రమోర్వశీయ చతుర్థాంకం గేయమయం. శ్లోకాలను చదివే వారేగాని, రాగయుక్తంగా పాడే వారు గాదు.

నాటకం అంకాలుగా విభాజితమయ్యేది. ప్రత్యేక రంగాల సూచన లేదు. నీరస విషయాలను విష్కంభ ప్రవేశాదుల ద్వారా వెల్లడించే వారే గాని దృశ్యమానం చేసే వారుగాదు. సుఖాంతాలే గాని దుఃఖాంత నాటకాలు లేవనే చెప్పాలి. సామాజిక పరిస్థితులు, సభ్యత, రంగస్థల పరిమితులు దృష్టిలో పెట్టుకొని, సంస్కృత నాటక లాక్షణికులు యుద్ధం, వధ, చుంబనం మొదలైన వాటిని రంగస్థలం మీద చూపెట్టరాదని నిషేధించారు.

భరతముని నాటక ప్రయోగానికి వికృష్ట, చతురస్ర, త్ర్యశ్ర అనే మూడు రకాల నాటకశాలలను పేర్కొన్నాడు. బహుశా ఆ కాలంలో ఈ మూడు రకాల నాటక శాలలు వాడుకలో ఉండి ఉండవచ్చు. ఈ నాటక మందిరాలలోని రంగస్థలం రెండంతస్తుల మేడ. పై భాగం దివ్య వ్యాపారానికి, క్రింది భాగం భూలోక వ్యాపారానికి ఉపయోగించేవారు. రంగస్థలానికి వెనక తెరగానీ, ముందు తెరగానీ ఉన్నట్టు తోచదు. అందుకే అంకాంతాన పాత్రలన్నీ నిష్క్రమించాలనే నియమం విధించారు. నేపథ్యంలో వైతాళికుడో, పరిజనమో కాలవర్ణన చేయగా, ఆ కాల వర్ణనను అస్కారంచేసుకొని, కాలకృత్య నిర్వహణకు పాత్రలు నిష్క్ర

మించడం పరిపాటి. ఆదిలో నాందీ ప్రస్తావనలు జరిగేవి. అందులో ఆశీర్వాదంతోపాటు, కవినీ, నాటకాన్నీ పరిచయం చేయడంద్వారా ప్రేక్షకులను నాటకోన్ముఖులను చేసి, సూత్రధారుడు నిష్క్రమించిన తరవాత అసలు నాటకం ప్రారంభమవుతుంది.

కథ నడిచే ఆయా స్థలాలను అలంకరణ ద్వారా దృశ్యమానం చేయడం అలవాటులేదు. ఆయా స్థలాలను ప్రేక్షకుల మనోనేత్రాలకు కట్టేటట్టు వర్ణింపచేసే వారు. వాలే తెర లేనందున పాత్రలు ఒక స్థలం నుంచి ఇంకో స్థలానికి వెళ్ళినట్టు తెలియచేయడానికి పరిక్రమణమనే విధానం అవలంబించేవారు. పరిక్రమణ మనగా నడవడం. పాత్రలు రంగస్థలంలోని ఒక కక్ష్య నుంచి బయలుదేరి ఇంకో కక్ష్యలోకిచేరి, ఆ ప్రదేశం పేరు చెప్పడం ద్వారా వారాప్రదేశానికిచేరినట్లు ప్రేక్షకులు భావించుకునేటట్లు చేసేవారు.

అవసరమైన పరికరాలను రంగ స్థలం మీదికి తీసుకు రావడం సంస్కృత నాటక రంగంలో లేదు. ప్రక్రియలు నటన ద్వారా తెలియజేయడమే సంప్రదాయం. మొక్కలకు నీళ్ళు **పోయడమనే ప్రక్రియలో మొక్కలు ఉండవు. నీటి కుండలుండవు. మొక్కలకు నీళ్లుపోస్తున్న భ్రమను** కలుగజేస్తారు. తుమ్మెదలు కుట్టిన ప్రక్రియను ప్రేక్షకులు భావించేలాగా చూపేవారు. రథాలను, ఏనుగులను చూపెట్టే వారు కాదు. వాటిని ఎక్కడం, దిగడం నటించే వారు. లేడి లాంటి చిన్న మృగాలకు బదులు వాటి గుడ్డబొమ్మలను చూపెట్టేవారు. కొన్నింటిని సూత్రధారునితో గాని, ఇతర పాత్రలతో గాని చెప్పించేవారు. ఈ విషయా లలో వాస్తవికతకు సంస్కృత నాటకరంగంలో ప్రాధాన్యం లేదనే చెప్పాలి. ఇక వేష భాషలు ఆయా పాత్రల అంతస్తులకు, అవస్థలకు అనుగుణంగా ఉండేవి. ప్రధాన పాత్రలు సంస్కృతంలోను, స్త్రీ పాత్రలు ప్రాకృతంలోను మాట్లాడేవి.

అభినయం చతుర్విధాలైన – ఆహార్యాభినయం, వాచికాభినయం, ఆంగికాభినయం, సాత్వికాభినయంలో సిద్ధాంత రీత్యా సాత్త్వికాభినయం, ఆచరణలో ఆంగికాభినయమే ఎక్కువ ప్రాధాన్యం వహించేది. కాంతి ప్రసరణ బదులు ఆంగికాభినయం ద్వారానే చీకటి వెలుగులు చూపేవారు. తడుము కుంటున్నట్టు నటిస్తే చీకటి అన్న మాట. ఇలాగే ఆరోహణ, అవరోహణలను పాద విన్యాసంతో సూచించేవారు.

ఈవిధంగా ప్రయోగం సాగిసాగి, ఫలసిద్ధి పొందిన తరువాత సామాన్యంగా ప్రధాన పాత్రగాని, సూత్రధారుడు గాని 'ఇలా జరుగుగాక' అని శుభం ఆకాంక్షిస్తూ భరత వాక్యం పఠిస్తాడు.

ప్రధాన సూత్రధారుడు పఠించే నాందితో ప్రారంభమై, భరత వాక్యంతో సంస్కృత నాటక ప్రయోగం ముగుస్తుంది.

శ్రీ.చ.

జానపద నాటక రంగం

వీధినాటకాలు పురాణకాలం నుంచి ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయి. ముఖ్యంగా దేశీ నాటక సంప్రదాయాలు చాలా వరకు శివ కవుల ఆధ్వర్యంలోనే వర్ధిల్లాయి. కారణం శైవమతం వర్ధిల్లిన రోజుల్లో శైవ మత సంప్రదాయాలను, ప్రజాసామాన్యానికి విశదపరచటానికి అనేక విధాలైన ప్రచార సాధనాలను ఉపయోగించారు. శివకవులే అటువంటి రూపకాలను రాయటం, వారే వాటిని వ్యాప్తిలోకి తేవటం వల్ల, దేశీ సంప్రదాయ నాటకాలన్నీ శైవమతస్థుల సొమ్మని చెప్పవచ్చు.

'నటులు పంక్తి బాహ్యులు'. ఆనాడు ఆర్య సంప్రదాయం ప్రకారం నటులను పంక్తి బాహ్యులుగా పరిగణించేవారు. అటువంటి వారికి సంఘంలో గౌరవ మర్యాదలు శూన్యం. కాని శైవమతాన్ని అవలంబించిన వారు గానీ, వివిధమైన జాతి మత విచక్షణ లేని జంగాలుగాని, ఇటువంటి విధి నిషేధాలను పాటించలేదు. అంతేకాక శైవ మతాన్ని అవలంబించిన అగ్రవర్ణాలైన బ్రాహ్మణులకు కూడ ఏవిధమైన పట్టింపులు లేకపోవటం వల్ల అగ్రజాతుల వారందరూ దేశి నాటకాలను ప్రదర్శించారు. శైవభక్తులైన జంగాలు మొదలైన వారు శివ సంబంధమైన నాటకాలను ప్రదర్శించారు. నాటకాలను ఆడటంలో జంగాలు ముఖ్యులు.

వీధి ప్రాముఖ్యం : ఆనాడు వినోద ప్రదర్శనలన్నీ, వీధుల్లోనే జరిగేవి. ఆనాడు వీధికి అంత ప్రాముఖ్యముండేది. మహాభారతం, భాగవతం, రామాయణం, *గరుడ* పురాణం, బసవ పురాణం మొదలైన పురాణ గాథలు చదవటం, ప్రేక్షకులకు అర్థమయ్యేశైలిలో అర్థం చెప్పడం, ఆచారంగా ఉండేది. గ్రామాలలో పండితులు, బ్రాహ్మణులు మొదలైన వారు వాటిని నిర్వహించేవారు. ఆ విధంగా జానపద నాటక రంగం అభివృద్ధి చెందింది.

క్రీస్తుశకం 16వ శతాబ్ది నుంచి ఆంధ్ర దేశంలో ఎక్కువగా యక్షగానాలు రచించబడ్డాయి. ఆనాటి దోరసముద్రపు నటులు, కూచిపూడి భాగవతులు, జంగాలు మొదలైన వారందరూ వీధి నాటకాలను, తెరనాటకాలను, బయలాటలను ప్రతి ఊరిలోనూ ప్రదర్శించారు.



వీధి నాటకంలో ఒక దృశ్యం (కుప్పం సాంప్రదాయం)

తంజావూరు రాజులు : 17వ శతాబ్దంలో ఆంధ్ర దేశంలో యక్షగానానికి కూచిపూడి కలాపంతో సంబంధం కలిగిన నాటి నుంచీ, యక్షగానాలలో వివిధ ప్రక్రియలను ప్రవేశపెట్టారు. 18వ శతాబ్దం నాటికి ఆంధ్రప్రదేశపు యక్షగానాల మీద కొన్నింటి పైన మార్గ నాటకాల ప్రభావం కూడా గోచరిస్తుంది. 17వ శతాబ్దంలో తంజావూరు యక్షగానాలకు రాజాశ్రయం లభించింది. రఘునాథ నాయకుడు, విజయ రాఘవ నాయకులు స్వయంగా యక్షగానాలనే రచించారు. విజయరాఘవుని పూతనా పహరణం, ప్రహ్లాద చరిత్ర మొదలైన వాటిలో రంగ ప్రయోగ సూచనలు అనేకం ఉన్నాయి. ప్రహ్లాద నాటకంలో నాటకాలను గురించి, విదూషక ప్రశంసలూ ఉన్నాయి. దీనిని బట్టి యక్షగానాలు, రంగస్థలమెక్కి వీధి నాటక పైఖరులను అందంగా సంతరించుకున్నాయని చెప్పుకోవచ్చు.

సామాన్య ప్రజలకు వీధి నాటకాలు, బహురూపాలు మొదలైన తెరనాటకాలు ప్రదర్శించినట్లు పాల్కురికి సోమ నాథుడు పండితారాధ్య చరిత్రలో ఉదహరించాడు. జంగాలు తెర నాటకాలాడినట్లు బైచరాజు వేంకటనాథకవి పంచతంత్రం. లోనూ, నారాయణ కవి హంసవింశతి లోనూ ఉదహరించారు. వీధిని గురించి భరతుడు నాట్యశాస్త్రంలో దేశి రూపకాల వర్ణనలో కథ కల్పిత మనీ, రెండు మూడు పాత్రలు కలిగిన ఏకాంక మనీ, నటునికి శృంగార రసం ప్రధానమనీ, గీత నృత్యాదులతో కూడిన ప్రశంసలు ఉండవచ్చనీ వ్యాఖ్యానించాడు.

16వ శతాబ్దంలో తాయికొండ నాటక సమాజంలో, ఒకటే పాత్రను స్త్రీ ధరించినట్లు తెలుస్తూ వుంది. తాయికొండ నాటక సమాజం వీధి నాటకం అయి ఉంటుందనీ యస్వీ జోగారావు తన యక్షగాన వాఙ్మయంలో తెలియజేశాడు. తురగా రామ కవి ఒక చాటువులో బాగోతుల బుచ్చిగానిని స్త్రీ పాత్రధారిగా పేర్కొనడాన్ని బట్టి నాటి నుంచి నేటి వరకు స్త్రీ పాత్రల్ని పురుషులే ధరిస్తున్నారు. నటుల్ని సంబోధించడంలో భామవేషగాడనీ, ఆడ వేషగాడనీ పిలుస్తూ ఉండేవారు.

కూచిపూడి మేళాల్లో ఆనాడు ప్రసిద్ధమైనది సిద్ధేంద్రయోగి మేళం. అంతకు పూర్వం రాయలసీమ, లేపాక్షి, వేములపల్లి, తాడిపత్రి మేళాలు, 19-20 శతాబ్దాల మధ్య నెల్లూరు మండలంలో పడకండ్ల రామకృష్ణయ్య దళం, విశాఖ పట్నం, నరసింగపల్లి, కళ్ళేపల్లి, కందాళ చిదంబరం మేళాలు, పల్నాటిసీమ మేళాలు, గ్రామీణ జానపద నాటక రంగంలో ప్రసిద్ధి చెందాయి.

నాటి నుంచీ నేటి వరకు వీధి నాటకాలు వీధుల్లో ప్రదర్శింప బడుతున్నాయి. ఆ నాడు రంగస్థలాలు లేవు. ఎత్తైన స్థలం రంగస్థలం. ప్రదర్శన నాలుగు పక్కలకూ కనిపించేటట్లు

పందిరి నిర్మించేవారు. కేవలం నూనె కాగడాలు, ఇలాయి కర్రల దీపాల మీద ఆధార పడేవారు. రెండు ప్రక్కలా కంచు కాగడాలు వెలిగించేవారు. పాత్రల ప్రవేశంలో ఇంత గుగ్గిలాన్ని ఆ కాగడాల పై గుప్పించడంతో ఆ సమయంలో గొప్ప కాంతితో గుప్పున మెరిసేవి. ఆ మెరుపులో పాత్రలు ప్రవేశించేవి.

రాత్రి పది గంటలకు ప్రదర్శన ప్రారంభమయ్యేది. భాగవతులందరూ గ్రామంలో వున్న ఇండ్లలో ఇంటి కొకరు భోజనం చేసేవారు. రంగస్థలం పక్క నుండే ఇండ్లలో వేషాలు వేసుకునేవారు. ప్రేక్షకులందరూ వచ్చేవరకూ, సూత్రధారులు వాద్య విశేషాలతో వివిధ రకాలైన పాటలను పాడుతూ, గణపతి, సరస్వతి, లక్ష్మీదేవి ప్రార్థనలు చేసేవారు. ప్రేక్షకులందరూ ఆసీనులై ఉండేవారు. గ్రామ పెద్దలందరూ వచ్చి ముందువరసలో కూర్చునేవారు. ప్రదర్శనానికి తోడ్పడిన వారందరినీ, పేరుపేరునా గొప్పగా స్తుతించేవారు.

ప్రదర్శనలో పాత్రధారులందరూ మూడు పక్కలకూ తిరిగి అభినయించేవారు. అందరికీ అర్థమయ్యేటట్లు, అందరికీ వినిపించేటట్లు బిగ్గరగా సంభాషణలు పలికేవారు. పాత్రల అభినయం దగ్గరవారికి తప్ప దూరాన ఉన్న వారికి కనిపించేది కాదు. అందువల్ల ఆంగికాభినయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. నోటితో పాటలు పాడుతూ నృత్యం చేసేవారు. ప్రదర్శనలో ఏ మాత్రం విసుగు లేకుండా మధ్య మధ్య హాస్య పాత్రలైన మాధవి, చోపుదారు ద్వారా విచిత్రమైన లోక ధర్మాలను, సాంఘిక ఆచారాలను ప్రవేశ పెట్టి, కడుపుబ్బ నవ్వించే వారు. ప్రదర్శనను రాత్రి పది గంటలకు ప్రారంభిస్తే ఉదయం ఆరు గంటల వరకూ జరిగేది. ఈ విధంగా ఆ నాటి జానపద నాటక రంగం రంగ రంగవైభోగంగా నడిచి పల్లె ప్రజల విజ్ఞాన వినోదాలకు తోడ్పడింది.

కొరవంజి కళారూపం : తెలుగు వారి మొట్టమొదటి కళారూపం కొరవంజి అయినా, ఇది ఒక్క తెలుగు దేశంలోనే కాదు దక్షిణ దేశమంతటా ప్రాముఖ్యం వహించింది. ఇది ఒక జానపద దృశ్య కావ్యం. కొరవంజి అంటే ఎరుకలసాని. పూర్వం ఈ ఎరుకలసాని సంఘంలో ఎక్కువ పలుకుబడి సంపాదించుకుంది. ఆనాడు విజయనగర రాజుల కాలంలో ఎరుకలసాని ఎంతో ప్రాముఖ్యం వహించింది. ఈ కళారూపానికి ముందు మరో కళారూపం ఉందనేందుకు చారిత్రక ఆధారాలు మనకు లేవు. దక్షిణాదిలో బహుముఖ వ్యాప్తిలోకి వచ్చింది ఈ కళారూపమే.

కొరవంజి అంటే నృత్య విశేషంతో కూడిన అడుగు. అడవులలో నివసించే కురవ తెగ వారి అడుగు కాబట్టి దానిని కురవంజ లేక కొరవంజ అని కూడ పిలుస్తూ వచ్చారు. గంతులు, చిందులు, గొండ్లి, అంజీ, అంగ అనేవి నృత్య విశేషానికి సంబంధించిన పర్యాయపదాలు.

అసలు కొరవంజి కళారూపం ఆటవికులది. మానవులు అడవుల్లో నివసించే కాలంలో ప్రచారంలో కొచ్చిందీ కళారూపం. మనకు పుణ్య క్షేత్రాలుగా వున్న సింహాచలం, మంగళగిరి, విజయవాడ, శ్రీశైలం, తిరుపతి కొండ మీద యాత్రా ఉత్సవాలు జరుగుతుండేవి. ఆ ఉత్సవాలకు దేశం నాలుగు పక్కల నుండి వేలాది భక్తులు స్వామి దర్శనార్థం వచ్చి పోతూవుండేవారు. వచ్చిన యాత్రికుల వినోదార్థం కురవలు వినోద ప్రదర్శనలు ఇస్తూ వుండేవారు. కురవంజులు వేషధారణలో అడవి జంతువుల చర్మాలు, నెమలి ఈకలూ, పందిముళ్ళు, పులిగోళ్ళు, ఎలుగు బంటి బచ్చూ మొదలైన వాటిని ధరించి నోటికి వచ్చిన పాటలు పాడి, కాలికి వచ్చిన చిందులు తొక్కినా, క్రమేపీ ఒక విశిష్ట రూపాన్ని పొందింది 'కొరవంజి'.

అలా అడవుల నుంచి పుణ్యక్షేత్రాలకూ, అక్కడి నుంచి ప్రజాసామాన్యంలోకి ప్రచారం పొంది, చివరికి రాజసభల్లోనూ ప్రాపకం పొంది ప్రదర్శింపబడింది. ఈ కళారూపాన్ని తరువాత అభివృద్ధిలోకి తెచ్చినవారు జక్కులవారు. వీరు నృత్యం కంటే గేయానికి, గానానికీ, వచనానికీ ప్రాముఖ్యం ఇవ్వటం వల్ల అవి యక్షగాన రూపంలో అభివృద్ధి చెందాయి.

ప్రాథమిక దశలో క్రమం లేకుండా ప్రదర్శించారు. కథలో వచ్చే అన్ని పాత్రలకూ ఒక్కడే నిర్వచనం ఇచ్చినా రాను రాను నాటకాల్లోని నాందీ ప్రస్తావన, సూత్రధారుడు, నటి, నర్తకి, నటుడు, విదూషకుడు, చేటకుడు, సింగి, సింగడూ వచ్చారు. పురుష పాత్రలకు సింగడు, స్త్రీ పాత్రలకు సింగి, ప్రాతినిధ్యం వహించారు. ఈ పాత్రల మధ్య ప్రేక్షకులను నవ్వించేందుకు తోలుబమ్మలాటలో జుట్టుపోలిగాడి మాదిరి కొంటెకోణంగి ఒకడు ప్రవేశించినట్లు తెలుస్తోంది.

ఏ క్షేత్రంలో వారి కార్యక్రమం ఉంటుందో ఆ యాత్రాస్థలం పవిత్ర కథల్ని ఆశువుగా చెప్పి, యాత్రికుల్ని ముగ్ధుల్ని చేసేవారు. ఇలా పరిణామం పొందిన కొరవంజి కళారూపం ఈనాడు మచ్చుకు కూడా కనిపించటం లేదు. కాని దక్షిణ దేశంలో ఈ నాటికీ కుట్రాల కురవంజి అనేది ప్రదర్శింపబడుతూనేవుంది. ప్రాంతీయ భేదాలను బట్టి తమిళనాడులో అత్తి పాట్టు, మళయాళంలో కొఅత్త యాట్టమ్, కన్నడ దేశంలో కొరవంజి, తెలుగు దేశంలో కొరవంజి ఎరుకలసాని అని ప్రచారం పొందింది. ఆంధ్రదేశంలో జీవ కొరవంజి, జ్ఞాన కొరవంజి, సత్యభామ కొరవంజి, ఎఱుకల కొరవంజి, రామమోహన కొరవంజి అనే నాటకాలు ప్రచారంలో ఉన్నాయి.

కొరవంజి నాటకాలలో ఎరుకల వారిని గురించి ఎంతో మంది ఆనాటి కవులు ఎన్నో విధాలుగా వర్ణించారు. ఈనాడు ఆంధ్ర దేశంలో ఏ ఒక్క కొరవంజి నాటకమూ ప్రదర్శింపబడటం

లేదు. కాని ఎఱుకల సాని మాత్రం ఏక పాత్రగా 'సోదెమ్మ సోదో' అంటూ గ్రామాల్లో కనిపిస్తూవుంది.

కూచిపూడి వీధి నాటకాలు : కూచిపూడి భాగవతుల పేరు వినని వారుండరు. ఆంధ్ర దేశంలో ప్రతి మారుమూల ప్రాంతంలోనూ, వారి ప్రదర్శనలు ప్రదర్శింపబడ్డాయి. పెద్ద పెద్ద రాజాస్థానాలలోనూ, దేవుళ్ళ కళ్యాణ ఉత్సవాలలోనూ కూచిపూడి భాగవతుల ప్రదర్శనలు తప్పనిసరిగా ఉండేవి. కొన్ని శతాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యంగా విశాలాంధ్రలో విశేషంగా ప్రదర్శనలిచ్చి వేనోళ్ళ ప్రశంసింపబడ్డ కళారూపం కూచిపూడి వీధినాటకం.

కూచిపూడి గ్రామం కృష్ణాజిల్లాలో శాతవాహన చక్రవర్తుల ముఖ్యపట్టణమైన శ్రీకాకుళానికి చేరువలో ఉంది. మువ్వగోపాల పదాలతో దక్షిణ దేశాన్నంతా ఉర్రూతలూగించిన క్షేత్రయ్య స్వగ్రామం, ఆ గ్రామానికి అతి సమీపంలోనే ఉంది. కూచిపూడి కళాక్షేత్రం ఒక బ్రాహ్మణ అగ్రహారం. దీనిని కుచేలపురమని కూడా పిలుస్తూ వుండేవారు. దాదాపు అయిదు వందల సంవత్సరాలకు పూర్వమే ఇక్కడ నాట్య కళకు అంకురార్పణ చేశారని చరిత్రకారుల వల్ల తెలుస్తూంది. కూచిపూడి భాగవతుల ప్రదర్శనానికి మూల పురుషుడు సిద్ధేంద్రయోగి . ఈయన కూచిపూడి గ్రామస్థుడే అని కొందరూ, యాత్రలు చేస్తూ కూచిపూడి చేరిన పరదేశస్థుడని కొందరి అభిప్రాయం.

కూచిపూడి భాగవతులు 15వ శతాబ్దం నాటికే కళా ప్రదర్శనలు ప్రదర్శించటంలో ప్రఖ్యాతి వహించారు. ఇందుకు ఆధారం 1502 నాటి మచ్చుపల్లి కైఫియతే. వీరు16వ శతాబ్దం చివరి భాగం నుండి ఈనాటి వరకూ పారిజాతాపహరణాన్ని ప్రదర్శిస్తూ ప్రశంసల్ని అందుకుంటున్నారు. ఆనాటి జానపద నాటకరంగంలో పారిజాతాపహరణం వీధి నాటకం ప్రముఖ పాత్ర వహించింది. రుక్మిణి పట్ల కనబరిచిన అనురాగం తన పట్ల చూపలేదని, సత్యభామ శ్రీకృష్ణునితో కయ్యమాడి విడిగా ఉండిపోయి, ఆ వియోగాన్ని భరించలేక దూతికతో రాయబారం పంపడం, దూతిక సత్యభామ విరహ వేదనను ఉపశమింప చేయడం ఇందులో కథ. దీనిని సిద్ధేంద్రుడే రాసినట్లు తెలుస్తుంది. భామాకలాపం కథలో సందర్భాన్ని బట్టి వచనం నడుస్తూ వుంటుంది. సత్యభామ ఒక్కతే పాత్రధారి. పక్కనున్న విదూషకుడు తానొక్కడే అవసరాన్ని బట్టి పురుషహాస్య పాత్రను, మాధవి అనే స్త్రీ పాత్రను నిర్వహిస్తాడు.

భామాకలాపాన్ని కూచిపూడి వారు ఒక గొప్పకావ్యంగా తీర్చిదిద్దారు. దీని తరువాత వారి ప్రదర్శనాల్లో ముఖ్యమైనది గొల్లకలాపం. గొల్లకలాపంలో నాయిక గోపకన్య. ఆమె బ్రాహ్మణ, గోపజన్మల్లో ఏది ఉత్తమమైంది? బాపడు గొప్పవాడా? గోపుడు గొప్పవాడా? అని బ్రాహ్మణునితో వాదోపవాదాలు జరుపుతుంది. ఈ గొల్ల కలాపాన్ని భాగవతుల రామశాస్త్రి రచించారని ప్రతీతి.



భామాకలాపంలోని సన్నివేశం

గొల్ల భామవేషం ధరించి వీధిలో చల్ల అమ్మినట్టు అభినయిస్తూ వుండగా, శిష్టాచారంగలిగిన బ్రాహ్మణుడు చల్ల కొనాలని గొల్ల భామను పిలుస్తాడు. ఇరువురూ ఏ కులం గొప్పదో అని వాదోపవాదాలు జరుపుతారు. మానవ సమాజమంతా సమానంగానే సృష్టించబడిందని, బ్రాహ్మణులు అధికం కారని వాదిస్తుంది. భాగవతంలో వర్ణించిన విషయాలననుసరించి వేదాంత చర్చ జరుగుతుంది. గొల్ల కలాపంలో పేరు ప్రఖ్యాతి గడించిన వారు వెంపటి వెంకట నారాయణ.

కూచిపూడి వారి ప్రఖ్యాత వీధి నాటకాలు : కూచిపూడి వీధి భాగవతులు భారత, భాగవత, రామాయణాల నుండి కథలను తీసుకొని యక్షగాన, వీధి నాటక రూపంలో భరతుడి నాట్యశాస్త్ర సంప్రదాయాలననుసరించి ప్రదర్శనలనిచ్చారు. వీరు ప్రదర్శించిన యక్షగానాల్లో *గిరిజా కళ్యాణం, కీచక వధ, హరిశ్చంద్ర, కిరాతార్జునీయం, కాళీయ మర్దనం, శశిరేఖా పరిణయం, ఉషాపరిణయం, రామ నాటకం, రుక్మాంగద, లవకుశ* ముఖ్యమైనవి.

కూచిపూడి కళాకారుల వీధి నాటకాలు, నృత్య ప్రదర్శనలు వీధుల్లోనే ప్రదర్శింపబడ్డాయి. నాలుగు వీధుల కూడలిలో గాని, ఊరి మధ్య పెద్ద బజారులో గాని, ఊరి వెలుపల బయలు ప్రదేశంలో గాని ప్రదర్శనలు జరిగేవి.

కూచిపూడి కళాకారులు జయదేవుని అష్టపదులు, త్యాగరాయ కృతులు, మువ్వగోపాల పదాలు, భద్రాచల రామదాసు కీర్తనలు, తుంగకుర్తి కృష్ణదాసు కృష్ణలీలలు,

అన్నమాచార్యుడు, ప్రహ్లాదుడు, హరిశ్చంద్రుడు, రామనాటకం, ఉషాపరిణయం, గొల్లకలాపం, మండూకశబ్దం, ప్రహ్లాద పట్టాభిషేకం, బాల గోపాల తరంగం, 'దాదినమ్మా నేదాదినమ్మా' ఏక పాత్రాభినయం మొదలైనవి ప్రదర్శించేవారు.

కూచిపూడి కళాకారులు ఒక్క యక్షగాన వీధి నాటక రంగాల్లోనే కాక, నాట్య సంగీతాల్లోనూ, అలంకార నాటకాల్లోనూ, ప్రజ్ఞా నైపుణ్యం గలవారు. వారిలో వేదాంతం వారనీ, భాగవతుల వారనీ, వెంపటి వారనీ, ఇంగువ వారనీ, బుక్కా వారనీ ప్రసిద్ధ కుటుంబాల వారు 19వ శతాబ్దపు ప్రారంభం నుండి అఖండమైన కీర్తి నార్జించారు. వారిలో చింతా వెంకట రామయ్య, చింతా రత్తయ్య, వెంపటి వెంకట నారాయణ, వెంపటి పరదేశి, వేదాంతం లక్ష్మీ నారాయణ, చింతా కృష్ణమూర్తి, భాగవతుల రామయ్య, భాగవతుల విస్సయ్య, మహంకాళి గంగయ్య, చింతా కృష్ణమూర్తి, జోస్యుల నారాయణ మూర్తి, వేదాంతం రామకృష్ణయ్య, వేదాంతం రాఘవయ్య, వేదాంతం ప్రహ్లాద శర్మ, వేదాంతం సత్యనారాయణ, వెంపటి పెదసత్యం, వెంపటి చినసత్యం, మహంకాళి సత్యనారాయణ, వేదాంతం పార్వతీశం, ప్రహ్లాద శర్మ, భాగవతుల రామకోటయ్య, జోస్యుల సీతారామ శాస్త్రి ప్రసిద్ధులు.

ఈ తరం నటుల్లో పేర్కొనదగిన కళాకారుడు వేదాంతం సత్యనారాయణ శర్మ. భామ వేషంలో అందెవేసిన చెయ్యి. పద్మశ్రీ అవార్డు గ్రహీత. కూచిపూడి కళాకారులలో వేదాంతం రాఘవయ్య నృత్య దర్శకుడు గాను, చిత్రదర్శకుడు గాను వెలుగొందాడు. వెంపటి పెద సత్యం, చిన సత్యం, జగన్నాథశర్మ, శేషు మొదలైన వారు సినిమా నృత్య దర్శకులుగా పేరుపొందారు.

లీలావతి విజయ గాథను వీధి భాగవతంగా 'దాదినమ్మ నేదాదినమ్మా' ప్రదర్శనగా కూచిపూడి వీధి భాగవతులు నాలుగు దశాబ్దాల క్రితం వరకూ, ఆంధ్ర దేశ మంతటా దిగ్విజయంగా ప్రదర్శించారు. కూచిపూడి భాగవత కళాకారుల ప్రదర్శనలలో ప్రతి పాత్రకూ ప్రత్యేక వేషధారణనూ, ప్రాచీన సంప్రదాయాలతో ఆభరణాలను ప్రవేశపెట్టారు. పురుషపాత్రల్లో ముఖ్యంగా రాజు కిరీటాన్ని, శంఖచక్ర గదాదండాన్ని, భుజకీర్తుల్ని, గండభేరుండ పతకాలు, కండువాలు, నల్లకోటు, షర్వాలు, చొక్కాలు, అంగరకాలు ధరించేవారు. నరసింహస్వామి, శక్తి, రావణుడు, హిరణ్యా కశిపుడు మొదలైన భీకర పాత్రలకు కరాళాలు, ముఖాలకు ముసుగులను వాడేవారు.

స్త్రీ పాత్రలకు ముఖ్యంగా భామవేషానికి ఎన్నో ప్రాచీన ఆభరణాలను ఉపయోగించే వారు. పెద్దజడ, చిన్నజడ, రాగిరేకులు, మొగిలి రేకులు, గారిడి, చంద్రవంక, కమ్మలు, జూకాలు, పాపిట తలరాయి, పాపిడి పించరాయి, కడియాలు, పట్టెడ, బిళ్ళల మొలతాడు, బులాకి, ముక్కుపుల్ల, కాసులపేరు, ముత్యాల వడ్డాణం, జడ కుప్పెలు మొదలైనవి.

తానీషా భూరి విరాళం : కూచి పూడి కళాకారుల ప్రతిభకు ముగ్ధుడైన అబ్దుల్ హసన్ తానీషా 1887లో కూచిపూడి గ్రామాన్ని అగ్రహారంగా దానమిచ్చాడు. బ్రాహ్మణ కుటుంబాల కళాకారులందరూ, తర తరాలుగా దీనిని అనుభవిస్తున్నారు. కూచిపూడి వీధి భాగవతులు, హైదరాబాదు, విజయ నగరం, తంజావూరు మొదలైన సంస్థానాలన్నింటిని సందర్శించారు. వారి మన్ననలు పొందారు. పారితోషికాలందుకున్నారు. పురుషులు స్త్రీ పాత్రలు ధరిస్తూ, స్త్రీలను దూరంగా వుంచారు. కేవలం పౌరాణిక గాథలను తప్ప, చారిత్రక, సామాజిక సాంఘిక ప్రదర్శనలను తయారు చేయలేక పోయారు. కాలంతో పాటు ముందుకు పోలేక పోయారు. అవి ప్రేక్షకులకు కొంత విసుగు పుట్టించాయి. 1880–1930 మధ్య కాలంలో కూచిపూడి వారు ఏటికి ఎదురీదలేక తమ ప్రదర్శనలలో కొన్ని మార్పులు తీసుకు వచ్చారు. భాగవత సంప్రదాయాలలో కొన్ని మార్పులు చేసి తెరలు, హార్మోనియం, పద్యాలు, పాటలు, చెమ్కీ దుస్తులు పెట్టి ప్రదర్శనలను సాగించారు.

కూచిపూడి నాట్యం జానపద నాట్యమే కాని, అది శాస్త్ర బద్ధం కాదని కొందరు వక్ర భాష్యాలు చెప్పారు. అయితే కూచిపూడి నృత్యానికి శాస్త్రీయ నృత్యంగా గుర్తింపు తీసుకు రావడానికి బందా కనకలింగేశ్వరరావు, నటరాజ రామకృష్ణ, చింతా కృష్ణమూర్తి మొదలైనవారు సంగీత నాటక అకాడమీ ద్వారా కృషి చేసి శాస్త్రీయ నృత్యంగా స్థిరపరిచారు.

ఈనాడు అనేక మంది కూచిపూడి నృత్యానికి ప్రాముఖ్యం ఇస్తూ, నాటి జానపద యక్షగాన, వీధి నాటక సంప్రదాయాన్ని పూర్తిగా వదిలేశారు.

తూర్పు వీధిభాగవతం : ఆంధ్ర ప్రదేశ్‌లో జానపద నాటకారంగాన్ని పోషించిన వారెందరో ఉన్నారు. ఉత్తరాంధ్ర దేశంలో విశాఖ పట్టణం, శ్రీకాకుళం, గంజాం, కోరాపుట్టి మొదలైన ప్రాంతాల్లో తూర్పు భాగవతమనే భాగవతం ప్రచారంలో ఉంది. అది ఒక నర్తన రీతి గానూ, సంగీత సంప్రదాయంగానూ, మృదంగ బాణీగానూ, ఈ నాటకం పోషింపబడుతూంది. ఈ తూర్పు వీధి భాగవతం, పండితులైన ఆది భట్ల నారాయణదాసు, ఆనంద గజపతి రాజు లాంటి కళాపోషకుల ఆదరాభిమానాల్ని చూరగొంది. భాగవతమంటే కృష్ణ సంబంధమైన కథలను కేళిక చేయటమే. ఇందులో కృష్ణుడు, సత్యభామల ప్రణయ కలహమే ముఖ్యమైనది. దీనినే కృష్ణ పారిజాతమనీ, భామాకలాపమని వ్యవహరిస్తారు. అయితే కూచిపూడి సిద్ధేంద్రుల పారిజాతాపహరణానికీ, తూర్పు వారు ప్రదర్శించే భాగవతానికీ వ్యత్యాసం ఉంది.

తూర్పు వారు ప్రదర్శించే *పారిజాతాపహరణం* ఆ ప్రాంతానికి చెందిన బలరామభుక్త రాసింది. కథ ఒకటే అయినా పాటలకు సంబంధించిన బాణీ, దరువులూ, నడిపే విధానం, మృదంగ వాయిద్య రీతుల్లో కూచిపూడి బాణీకీ, తూర్పు వీధి భాగవత బాణీకి చాలా తేడా వుంది. ఈ కథను తొమ్మిది రాత్రులు ప్రదర్శించే వారు. అయితే ఈనాడు ఈ కథను ఒకే రాత్రి ప్రదర్శిస్తున్నారు. భామాకలాపం తరువాత వీరు గొల్ల కలాపం కూడా జనరంజకంగా ప్రదర్శిస్తారు.

ఈ భాగవత ప్రదర్శనంలో దరువులూ, ద్విపదలూ, కంద పద్యాలూ, వృత్తాలూ, అర్ధ చంద్రికలూ, ఏల పదాలూ, చూర్ణికలూ మొదలైన దేశీ సంగీత రచనలు వాడుతూ వుంటారు. రాగాలూ తాళాలూ, కర్ణాట సంగీతానికి చెందినవైనా, ప్రాచీన సంప్రదాయ పద్ధతులను అనుసరించేలా ఉన్నాయి.

తూర్పువీధి భాగవతంలో మృదంగం, అధిక ప్రాముఖ్యాన్ని వహిస్తుంది. ఎందరో ప్రముఖ కళాకారులు ప్రఖ్యాతి వహించారు. బంతలకోటి జగన్నాథం, దూడల శంకరయ్య, బంతల కోటి రామమూర్తి, దుర్వాసుల మాణిక్యం, బురక గురవయ్య, గిరజాల సత్య నారాయణ, కుందుం సాంబమూర్తి, పేరూరు వరహాలు మొదలైన ఎందరెందరో సుప్రసిద్ధ కళాకారులు తూర్పు వీధి భాగవత కళను ఆరాధించారు.

మామూలుగా తూర్పు బాణీలో వున్న ప్రత్యేకత ఏమంటే ఒకే రాగంలో దరువు ప్రారంభించి గతులనూ, సంగతులనూ మారుస్తూ గంటల తరబడి గానం చేస్తారు. ఇంతకు ముందు ఆటా పాటా సమపాళ్ళలో నడిపించినా, ఇటీవల కాలంలో భామ పాత్రాభినయానికి ప్రాముఖ్యం పెరగటం వల్ల ఆటకు సంబంధించిన నృత్యాభినయం తగ్గిపోయి, పాటకు ప్రాముఖ్యం పెరిగిందంటారు. అందువల్ల భాగవతాల్లో కళాకారుడు దీర్ఘగానాలు ప్రవేశ పెట్టి ప్రేక్షకులను ఆనందపరుస్తారట.

ఒకప్పుడు విజయనగరం, బబ్బిలి, మాడుగుల, కశింకోట, మందసా, చాకటికోట, దారాకోట, సాలూరు, పార్వతీపురం మొదలైన సంస్థానాల జమీందారులూ, ధనవంతులూ ఈ కళను పోషించారు. ప్రజలు ఆదరించి, ప్రోత్సహించారు.

చిందు భాగవతం : తెలుగు జాతికి గర్వ కారణమైన అన్య ప్రాంతీయులకు కూడా ఆదర్శమైన, శాస్త్రీయ సంప్రదాయ జానపద నృత్యరీతులను రూపొందించి ప్రచారంలోకి తీసుకువచ్చారు. ప్రాచీనాంధ్ర నృత్య శాస్త్ర వేత్తలు, పూర్వం తెలుగు నాడును, యక్షభూమి అని పిలిచేవారు. యక్షులనే వారు ఆడిపాడిన భూమి కనుక వారి నృత్యశైలే యక్షగానంగా వర్ధిల్లిందంటారు. ఈ కళారూపాన్ని అనుసరించి నృత్యకేళి చేసేవారే చిందు భాగవతులు.

ఈ నృత్యం సుమారు రెండు వేల సంవత్సరాల నాటిదంటారు. నేటి వరకు ఒక ప్రత్యేకతను సంతరించుకొని పండితుల్నీ, పామరుల్నీ తమ కళారూప నైపుణ్యంతో కళాకారులు మెప్పించి సెభాష్ అనిపించుకున్నారు. కాని ఈ కళాకారులు ఆశించేది పట్టెడు అన్నం, పాత వస్త్రాలు మాత్రమే.

చిందు మాదిగలు : మన దేశంలో అతి బీదవారై, అందరికంటే ఆఖరు జాతి వారిగా చూడబడే మాదిగ వారిపై ఆధారపడి జీవించే కళాకారులు గనుక చిందు మాదిగలు అని పిలుస్తూ వచ్చారు. ఈ చిందు జోగితలు ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలోని నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో నివసిస్తున్నారు. వీరు రామాయణ, భారత, భాగవత కథల్ని నృత్య నాటకాలుగా ఆడతారు. వీధుల్లో మన పగటి వేషధారులు పగటి పూట ఎలా ప్రదర్శిస్తారో, వారు కూడా అదే మాదిరి పగటి పూటే ప్రదర్శనలనిస్తారు. స్త్రీలు, పురుషులు ప్రదర్శనాల్లో పాల్గంటారు. ప్రతి గ్రామంలోనూ వారు ప్రదర్శించే సమయంలో ఎల్లమ్మ ఆట ఆడటం, వారి ప్రత్యేకత. తమ జీవితాలు మోడు వారి పోయినా, గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలనీ కోరుతూ తన్మయత్వంతో ఆడతారు. ఆ ఆట వల్ల కరువు కాటకాలు రావని నమ్మే ప్రజలు ఈ నాటికీ నిజామాబాద్ జిల్లాల్లో అనేక గ్రామాల్లో ఉన్నారు.

ప్రదర్శించిన నాటకాలు: సమాజంలో అట్టడుగు వర్గానికి చెందిన ఈ కళాకారులు ప్రదర్శించే నాటకాలలో ముఖ్యమైనవి మోహినీ *రుక్మాంగద, సారంగధర, చెంచులక్ష్మి, వీరాభిమన్యు, సుందరకాండ, సతీ సావిత్రి, మైరావణ*. చిందు భాగవతాన్ని ప్రదర్శించే సుమారు ఏభై దళాలు నిజామాబాద్ జిల్లాలో ఉన్నాయి. వంశపారంపర్యంగా తమ పెద్దల కళనభ్యసించి ప్రజలకు వినోదాన్ని కూర్చే ఆచారాన్ని ఆ తెగ పాటిస్తూ వుంది.

ఆర్మూరుచిందు భాగవతులు : ఆర్మూరు చిందు భాగవతులు తెలంగాణా జిల్లాలలో గొప్ప పేరు సంపాదించారు. ఆర్మూరు నిజామాబాదు జిల్లాలో వుంది. వీరు సారంగధర నాటకాన్ని రసవత్తరంగా ప్రదర్శిస్తారు.

తెలగ దాసరుల గంటె భాగవతాలు : జీవనోపాధిగా ఈ కళను నమ్ముకుని జీవన యాత్ర సాగిస్తున్న సంచార తెగ పేరు తెలగ దాసరులు. తెలంగాణాలోని నల్లగొండ, ఖమ్మం, వరంగల్, హైదరాబాదు జిల్లాలలో ఎక్కువగా నివసిస్తున్నారు. వీరిని గంటె భాగవతులని కూడా పిలుస్తారు. పెట్రో మాక్సు లైట్లు, ఎలెక్ట్రికల్ లైట్లు లేని ఆ రోజుల్లో పెద్ద పెద్ద గరిటెల్లో (గంటెల్లో) ఆముదం పోసి అందులో వత్తుల్ని నానబెట్టి వెలిగించి ఆ వెలుగులో వీధి నాటకాలను ప్రదర్శించేవారు అందుకే వీరికి గంటె భాగవతులని పేరు వచ్చింది. గంటె భాగవతులు రామనాటకం, సావిత్రి, *గయోపాఖ్యానం, శశిరేఖా పరిణయం, గరుడాచలం, ప్రహ్లాద,*

జయంత జయపాల, సిరియాళ, గజగౌరి మొదలైన పౌరాణిక జానపద యక్షగానాలను ప్రదర్శిస్తారు.

తమ్మారపు వెంకటస్వామి వీధి నాటకాలు : కూచిపూడి భాగవతులు వీధి నాటక ప్రదర్శనలతో జైత్ర యాత్ర సాగిస్తున్న రోజుల్లో, ఉత్తమంగా, వీధి నాటకాలు ప్రదర్శించి మెప్పు పొందిన వ్యక్తి తమ్మారపు వెంకటస్వామి, స్వగ్రామం ఒంగోలు జిల్లాలోని తమ్మవరం. ప్రాథమిక విద్యాభ్యాసంతో పాటు సంస్కృతం నేర్చుకున్నాడు. తరువాత పగటి వేషాలను అద్భుతంగా ప్రదర్శించడంతోపాటు, కట్టుదిట్టమైన వీధి నాటక సమాజాన్ని నడిపాడు. వెంకటస్వామి 60 సంవత్సరాలు సేవ చేసి ఎనభైయ్యవ ఏట తమ్మవరంలో మరణించాడు.

మాల భాగవతాలు : కూచిపూడి వీధి భాగవతులు భాగవత విద్యను ఎవరికీ చెప్పని రోజుల్లో ఆయా కులాల వారు కూడా నాటకాలను రాసుకుని వీధి నాటకాలను ప్రద్శిస్తూ వుండేవారు. అలా యానాదులు, గొల్లలు, చెంచులు, నాటకాలను ప్రదర్శిస్తూ ఉండేవారు. అలాగే మాలవారు కూడా వీధి నాటకాలను చాలా ప్రదర్శించారు.

యానాదుల భాగవతాలు : యానాదులు ఆంధ్ర దేశమంతటా ఉన్నారని చెప్పలేం. యానాదులు ఎక్కువగా, నెల్లూరు, గుంటూరు, చిత్తూరు జిల్లాలలో వున్నారు. యానాదుల్లో కుటుంబమంతా భాగవతాల్లో పాత్రలు ధరించేవారు. వారి భాగవతాల్లో స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించటం వల్ల ప్రేక్షకుల్ని అధికంగా ఆకర్షించేవారు. వీరు ప్రతి పాత్రకూ నృత్యం చేసే వారు. చిందులు ఉధృతంగా తొక్కేవారు.

ఒక రాత్రి ప్రదర్శనానికి రాత్రి పూట అందరికీ భోజనాలు పెట్టి పది రూపాయలిస్తేచాలు. ప్రదర్శన తెల్లవార్లూ జరిగి పోతుంది. వీరి ప్రదర్శనలు శాస్త్రయుక్తంగా లేకపోయినా ముఖ్యంగా యవ్వనంలోవున్న స్త్రీ పాత్రల అభినయమూ, శ్రావ్యమైన సంగీతమూ ప్రేక్షకుల్ని అమితంగా ఆకర్షించాయి. వీరు ప్రదర్శించే భాగవతాలు ఉషాపరిణయం, కృష్ణలీలలు, సావిత్రి, శశిరేఖా పరిణయం మొదలైనవి ప్రచారంపొందాయి. వీరి వాయిద్యాలు మద్దెల, తాళాలు, హార్మోనియం. వీరి ముఖానికి రంగులు అర్దళం, గంగ సింధూరం, కాటుక, దుస్తులు, పూసల కోట్లు మొదలైనవి. ఈమధ్య వీరి భాగవతాల ప్రదర్శనలు తగ్గిపోయాయి.

రాయలసీమ జానపద నాటకరంగం : రాయలసీమలో యక్షగానాల తరువాత బయలు నాటకాలు ఆడేవారు. వీటిని మాలపల్లెలలో వున్న దాసరులనేవారు ప్రదర్శిస్తూవుండేవారు. వీరు హరిజనుల్లో ఒక తెగ. వీరు ప్రదర్శించే నాటకాలు అన్నీ రాత ప్రతులుగానో లేక తాటి ఆకుల గ్రంథాల్లోనూ నిక్షిప్తమై ఉంటాయి. ప్రతి ముఖ్య నాయకునికీ నాటకాలు కంఠస్థమై వుంటాయి. వారిలో ఎవరు చనిపోయినా వారితో ఆ సాహిత్యం అంతమయ్యేది.

ఆ నాటి మేటి నాటకాలు : దొడ్డకవి రాసిన సుగ్రీవ విజయం, కుమ్మరి బాలయ్య రాసిన *సారంగధర*, రుద్రకవి రాసిన *శశిరేఖా పరిణయం*, చెడుదూరు రంగాచార్యుల *హరిశ్చంద్ర*, వేముల పల్లి విరాట పర్వం, చుక్కలూరు రామ నాటకం, యాదవదాసు *గరుడాచల యక్షగానం* మొదలైనవి. అన్నీ పల్లెప్రజలకు అర్థమయ్యే శైలిలో రాసినవే. అంతేగాక ప్రదర్శనా క్రమంలో ప్రతి మాట అర్థమయ్యేటట్లు విడమర్చి చెప్పేవారు.

బళ్ళారి బయలాటలు : పూర్వం నుంచే బళ్ళారి ప్రాంతంలో బయలాట అనే జానపదకళారూపం వుండేది. వీధి నాటక ప్రదర్శనానికీ, ఈ బయలాట ప్రదర్శనానికి ఎంతో సన్నిహిత సంబంధముంది. ఒకప్పుడు బళ్ళారిలో జనలీ ఘాట్, మేఘాట్ అనే రెండు పెద్ద బయలాట కంపెనీలను గరుడ చేడు హనుమంతప్ప, సామ సాగరం వెంకన్న, కురుగోడు దొడ్డకవి మొదలైనవారు నడుపుతుండేవారు.

ధర్మరాజు గుళ్ళు, భారత నాటకాలు : ధర్మరాజు గుళ్ళు పేరుతో చిత్తూరు జిల్లాలో, నూటికి పైగా గుళ్ళు ఉన్నాయి. వీటిని గుళ్ళు అనటం కన్నా సాంస్కృతిక ప్రదర్శనా కేంద్రాలుగా పిలువవచ్చు. ప్రతి సంవత్సరం 18 రోజులు మహాభారతంలోని 18 పర్వాలన్నిటినీ వీధి నాటకరంగంలో ధర్మరాజు గుళ్ళముందు ప్రదర్శిస్తారు. వేసవిలోనే జాతరలూ, వీధి నాటకాలు, ఆంధ్ర దేశంలో ఇతర చోట్ల ప్రదర్శింపబడినా నూటికి పైగా ప్రదర్శింపబడటం చిత్తూరు జిల్లా విశేషం.

మిక్కిలినేని

యక్షగానం

తెలుగుదనపు పరిమళం గుబాళించిన మన జానపద సాహిత్య ప్రక్రియలన్నిటిలో మకుటాయ మానమైన ప్రక్రియ యక్షగానం. యక్షగాన రచనలు ప్రారంభమైనప్పటి నుండి పరంపరగా పరశ్శతంగా వెలుస్తూ వచ్చాయి. తెలుగులో యక్షగానం విశిష్టమైన సువిశాల సారస్వత శాఖగా వర్ధిల్లుతూ వచ్చింది. అయితే అది వట్టి సాహిత్య ప్రక్రియ మాత్రం కాదు సంగీతాభినయ కళలకు కాణాచియై, సమాహారకళా స్వరూపమై మన దేశి సంస్కృతి కొక నిధి నిక్షేపమై విరాజిల్లింది.

మన వాఙ్మయంలో మొట్టమొదటగా యక్షగానాది నేపథ్యాలతో పాటు ఆ పాటల ప్రసక్తి పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో ఉంది. క్రీ.శ 1430 ప్రాంతంలో వెలసిన శ్రీనాథుని భీమఖండంలో కీర్తింతు రెద్దాని *కీర్తి గంధర్వులు గాంధర్వమున* యక్షగాన సరణి అని ప్రశంసింప

బడిన సందర్భంలో మొట్టమొదటగా యక్షగాన మనే సమస్త పదం ఒక విశిష్టానికి గంధర్వులది పెట్టినది పేరు. మరి గంధర్వులే యక్షగానసరణి పాడారంటే అది ప్రత్యేకమైన ఒక గాన శైలి అయివుంటుందని స్ఫురిస్తోంది.

మార్వారులో గంధర్వ నృత్య ప్రదర్శన వృత్తిగా స్వీకరించిన వారికి గంధర్వులని పేరు వచ్చినట్లే పాల్కురికి చెప్పిన యక్షాది నేపథ్యములు ప్రదర్శించిన వారికే యక్షులని పేరు వచ్చి వుండవచ్చు. యక్ష శబ్దం జక్కశబ్దంగా మారడం భాషా శాస్త్ర సమ్మతం. నేటికీ గుంటూరు, గోదావరీ మండలాలలో అక్కడక్కడ జక్కులవారున్నారట. వీరు కళావంతుల కోవకు చెందిన వారని, అభినయ కళానుబంధం గలవారని తెలుస్తోంది. క్రీ.శ.15వ శతాబ్ది ప్రథమ పాదంలో వెలసిన క్రీడాభిరామంలో జక్కుల పురంధ్రి గానకళాప్రావీణ్యం విశేషంగా ప్రశంసింపబడింది. అందులోనే ఆ వెంటనే భంగ్యంతరంగా యక్షకన్యల అంటే జక్కుల పడుచుల నృత్యం గూడ ప్రసక్తమైంది. జక్కుల రేకులు అనే పదాలు, జక్కిణి అనే నృత్య ప్రబంధ విశేషం వీరి పేరనే ప్రసిద్ధిలోకి వచ్చి వుంటాయి. క్రీ.శ.15వ శతాబ్ది ఉత్తరార్ధంలో ప్రోలుగంటి చెన్నశౌరి చెప్పినాడన్న సౌభరి చరితం అనే జక్కులకథ క్రీడాభిరామంలో జక్కుల పురంధ్రిగానం చేసిన కామవల్లి కథలాగ జక్కుల వారు చేసే గానరూప కథాఖ్యాన ఫక్కికి ఒరవడిగా రచింపబడి వుంటుంది. క్రీ.శ.16వ శతాబ్ది నాటి చిత్ర భారతంలో యక్షకామినుల నాట్యము, యక్షవనితల పాట అని రెండు ప్రత్యేకంగా పేర్కొనబడ్డాయి. యక్షగాన ఆవిర్భావానికి వారి ఆటపాటలే కారణమై వుంటాయి.

రాయలసీమలో జక్కులవారి పేర అనేక గ్రామాలు వారి కులవేల్పులైన అక్కదేవతల కొండ ఉండడం బట్టి అదే యక్షగానం జన్మభూమి అని ఊహించవచ్చు. అక్కడ నుండే అది అటు తమిళ, కన్నడ, దేశాలకు, ఇటు తెలంగాణా సాగర తీరాంధ్ర ప్రాంతాలకు వ్యాపించి వుంటుంది.

జక్కుల జాతి ప్రసక్తి, వారి గాన కళాప్రసక్తి మన వాఙ్మయంలో క్రీ.శ. 15వ శతాబ్ది ప్రారంభం నుండే కన్పిస్తుంది. అందుచేత యక్షగానానికి పేరు సార్థకం గల రూపం క్రీ.శ.14వ శతాబ్ది ఉత్తరార్ధంలో ఏర్పడిఉంటుంది. భీమ ఖండోదాహరణాన్ని బట్టి గానరూపమైన స్తోత్రపాఠం, క్రీడాభిరామోదాహరణాన్ని బట్టి గానరూపమైన కథాఖ్యానం యక్షగానం ప్రాథమిక స్వరూపమని ఊహించవచ్చు. 15వ శతాబ్ది నాటి తాళ్లపాక అన్నమాచార్యుడు, 'సముచితానేక విధతాళ సంగతులను, నవరసాలంక్రియా సవర్ణంబు లగుచు యక్షగాన, పదములుండేవని' చెప్పినట్లు సంకీర్తన లక్షణ గ్రంథం తెలుపుతూ ఉంది. ఆ పదాలు మొదట జక్కుల పురంధ్రులచే జంత్రగాత్రాలతో పాద విన్యాసంతో పదకేళికలా, ప్రయోగింపబడుతూ ఉండి ఉంటాయి. కాలక్రమాన యక్షగానానికి యక్షవేషాలతోను, జక్కులతోను సంబంధం సడలిపోయింది. ఆ జక్కులపాటల రచనకు శిష్ట కవులే పూనుకున్నారు. తదుపరి అవి రూపకకళ రూపురేఖలు దిద్దుకొన్నాయి. జక్కులే కాదు ఇతర జాతుల వారు గూడ వాటిని ప్రదర్శిస్తూ వచ్చారు.

యక్షగానాన్ని దేశి సరళికి చెందిన రూపకంగా పండితులు పరిగణిస్తున్నారు. అసలు జనపదం దాని పాదు. మార్గ (సంస్కృత) సరణికి భిన్నమైనది దేశి. ఆ సంస్కృత రూపక లక్షణాల కంటె విలక్షణంగా వుండడమే యక్షగానం. ఉపరూపకాలు ఉన్నయంటే అవి కూడా యక్షగానం వలే గీత, నృత్య ప్రధానాలు కాబట్టి నిశిత పరిశీలనం చేసి చూస్తే శారదా తనయుడు చెప్పిన ఇరవై నాలుగు ఉపరూపకాలలో, దేనితోనో ఒక దానితో యక్షగానానికే కొంత సామ్యం కన్పించవచ్చు. కాని వానికి జన్యజనక సంబంధం మృగ్యం. అసలా ఉప రూపకాలన్నీ దేశంలోని వివిధ ప్రాంతాల జానపద కళాకారుల ఉపజ్ఞాఫలితాలే. అంటే అవీ దేశి ప్రక్రియలే. ప్రాచీన యక్షగాన గ్రంథాల్లో ఎక్కడా సంస్కృత రూపకాలలో లాగ నాందీ ప్రస్తావనలు, అంకవిభాగం, సంధి నియమాలు మొదలైన లక్షణాలు కానరావు. వాటిలో సామాన్యంగా కన్పించే ప్రధాన రచనాంగాలు మూడు.

1) రగడ వికారము, తాళ ప్రధానమూ అయిన రేకు, 2) ద్విపద 3). ఏలలు. అర్థచంద్రికలు, ధవళ శోభనములు, అల్లనేరేళ్లు మొదలైన పదాలు. ఈ మూడు దేశిచ్ఛంద ప్రక్రియలే.

పరిణామం : యక్షగానానికి పుట్టినిల్లు ఆంధ్ర దేశం, అటు తమిళ, కన్నడ, ఇటు తెలంగాణా ప్రాంతాలు దానికి విహార భూములయ్యాయి. ఒక్కొక్క చోట దాని పరిణామం ప్రత్యేకంగా పరిశీలించదగినది.

మన వాఙ్మయంలో అప్పటికి తెలియ వచ్చినంతలో చెన్న శౌరి సౌభరి చరితమే మొదటి యక్షగాన రచన. అది క్రీ.శ. 15వ శతాబ్ది ఉత్తరార్థం నాటిది. ఆ గ్రంథం అలభ్యం. మొట్టమొదటిగా యక్షగాన లక్షణ ప్రసక్తి క్రీ.శ.1550 నాటి చిత్రకవి పెద్దన్న లక్షణ సార సంగ్రహంలో కొంత వచ్చింది. కాని మనకు నేడు దొరికిన యక్షగాన కృతులలో కవి కాలం తేలినంతలో కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయమే మొదటిదిగా పరిశీలకులు పరిగణిస్తున్నారు. ఈయన తన సుగ్రీవ విజయాన్ని యక్షగానమని పేర్కొన్నాడు. పెద్దన యక్షగానాలలో వచ్చే రగడ, ప్రభేదాలనుదహరిస్తూ, ఏ రగడకే తాళం సరిపడుతుందో అది మాత్రమే చెప్పాడు. కాని సుగ్రీవ విజయంలో అటువంటి తాళప్రభేద విశిష్టాలైన రగడ బంధాలే (రేకులే) కాక, ద్విపదలు, ఏలలు, అర్ధచంద్రికలు, ధవళ శోభనాలు, పద్యాలు, సంధివచన ప్రాయాలైన చిన్నచిన్న వచనాలు కనిపిస్తాయి. క్రీ.శ. 1600 ప్రాంతపు చక్రపురి రాఘవార్యుని విప్రనారాయణ చరిత్ర, బాలపాపాంబ రచించిన అక్కమహాదేవి

చరిత్ర మొదలైన యక్షగాన రచనా ప్రక్రియ అలాగే ఉంది. ఆంధ్రప్రాంతంలో యక్షగాన రచన సుమారు రెండు శతాబ్దుల దాక ఇంచుమించు అలాగే కొనసాగింది. ఎలాంటి ఛందో బంధాన్నైనా తనలో ఇముడ్చుకోగలది యక్షగానం. కాని బహుగ్రంథ పరిశీలనం వలన తేలిన విషయం యక్షగానంలో రేకు లేక దరువు, ద్విపద, గద్యపద్యాలు ముఖ్యమైన రచనాంగాలు.

సుగ్రీవవిజయాన్ని చూస్తే అది ప్రదర్శన సౌలభ్యంగల రచన అనే తోస్తుంది. ఇది 'పలువురుచే పాడబడుటయు, వీధి యాటగా నాడబడుటయు గలదని' వేటూరి ప్రభాకర శాస్త్రి, ఇది కవి కాలంలోనే ప్రదర్శింపబడి ఉంటుందని నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయం. అంటే 16వ శతాబ్ది నాటికే యక్షగానం ఆంధ్రదేశంలో ప్రదర్శన కెక్కినుంటుందని చెప్పవచ్చు. ఆనాటి యక్షగానాలెలా ప్రదర్శింపబడేవో కాని, అప్పటికే వీధి నాటక ప్రదర్శనలలో అతిమాత్ర ప్రసిద్ధులు, భరత విద్యా దురంధరులు అయిన కూచిపూడి భాగవతుల వల్ల యక్షగాన ప్రదర్శనల కొక నూతన చైతన్యమూ, ప్రచారమూ వచ్చాయి. నాటి కూచిపూడి కులపతి సిద్ధేంద్రయోగి అపూర్వ సృష్టి కలాపం ప్రభావం అర్వాచీన యక్షగానాల మీద పడింది కూడాను. కూచిపూడి కళాకారులు తెలుగు నేల నాలుగు చెరగులా ప్రదర్శనలిచ్చిన కారణంగా ఆయా వూళ్లలో వెలసిన కత్తును ఎవరి ఓపిక కొద్ది వారనుకరించారు. ఏనాదులు, గొల్లలు మొదలైనవారు యక్షగాన ప్రదర్శనలకు పూనుకున్నారు.

యక్షగానం ప్రదర్శన పాత్రమైన చాలా కాలందాక దాని శ్రవ్య ప్రయోజనం కూడా పక్కపక్కల సాగుతూనే వుంది. క్రీ.శ. 18వ శతాబ్దినాటి రాయదుర్గ దళవాయి తిమ్మప్ప రచించిన ప్రసన్న వేంకటేశ్వర విలాసం, గోగులపాటి కూర్మనాథకవి మృత్యంజయ విలాసం మొదలైన యక్షగానాలే ఇందుకు తార్కాణాలు. అవి గ్రంథకర్తల ఉభయ ప్రయోజనాలకూ ఉద్దిష్టములయ్యాయి.

క్రీ.శ.19వ శతాబ్దంలో ఆంధ్రప్రాంతంలో యక్షగానాలు కోకొల్లలుగా వెలిశాయి. ఇంచుమించు అన్నీ నాటక నామంతో ప్రదర్శనల కెక్కినవే. దేశంలో యక్షగాన మేళాలు కూడా చాల నెలకొల్పబడ్డాయి. యక్షగాన రచనలో, ప్రదర్శనలో స్త్రీలు పాల్గన్నారు. బమ్మలాటలకు గూడ ఉపయుక్తమయ్యే తీరులో యక్షగానాలు రచింపబడ్డాయి. ఉదా. గుజ్జువాడ లక్ష్మణ మూర్ఛ, సంతవేలూరు కుశలవ, పాత పట్టణం బాణాసురనాటకం మొదలైనవి. బాగేపల్లి అనంత రామచార్యులు, ఆదిభట్ల నారాయణ దాసు మొదలైనవారు హరిదాసులు తమ హరికథలను యక్షగానాలని వ్యవహరించారు. 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో ఆంధ్రలో యక్షగానం పై అంక, రంగ విభాగాది విషయాల్లో ఆధునిక రంగస్థల నాటక ప్రభావం పడింది. దీనికి ప్రబలమైన ఉదాహరణ కేశిరాజు వెంకట సుబ్బరాయ కవి రామదాసు నాటకం.

ఆంధ్ర ప్రాంతపు యక్షగానాలలో ముక్కాలు మువ్వీసం పౌరాణికేతివృత్తాలే. బసవేశ్వర భద్రాచల రామదాసాది ప్రసిద్ధ పురుషుల జీవితోదంతాలు కూడ యక్షగాన వస్తువులయ్యాయి. ముందుగా పారిజాతాపహరణ, కళాపూర్ణోదయాది ప్రసిద్ధ ప్రబంధాలు కొన్ని యక్షగానాలుగా పరివర్తింపబడ్డాయి. అంతేకాదు రచనా ప్రక్రియలో కూడా యక్షగానాలపై ప్రబంధపు పలుకుబడి అతిమాత్రంగా వుంది. కొన్ని యక్షగానాలు ప్రబంధాలని కూడా వ్యవహృతమే.

యక్షగాన రంగ ప్రయోగ విషయంలో అప్పటికప్పుడే, ఏ గుడి ముంగిటనో నిర్మింపబడిన పందిరి కింది రాతినేలే రంగస్థలం. చుట్టూ కనుచూపు మేర అంతా ప్రేక్షకాగారమే. కూచిపూడి నట్టువోజులు భరత విద్యాధురంధరులైనా దేశ దిమ్మరి ప్రదర్శనలు కావడంచేత రంగస్థల విషయంలో శ్రద్ధవహించలేదు. రెండుపక్కల ఇద్దరు నిలబడి పట్టుకొన్న తెల్లని దుప్పటే తెర, తెరకు అటు ఇటు నూనె దివిటీలు. తెర వెనుక హంగుదారులు వంత పాటకులు, హంగుతిత్తి, మద్దెల,తాళపు చిప్పలు, తెర ముందు సూత్రధారుడు. ఈయనే ప్రదర్శన ప్రవర్తకుడు. ప్రార్థనాదికం, కథాసందర్భ వివరణ పాత్ర ప్రవేశ సూచన, పాత్రలను పలకరించడం, పాత్రధారులకు, వంతపాటకులకు పాటల పల్లవులందించడం, పాత్ర ధారుల అభినయానికి అనుకూలంగా తాళం వేయడం, సంధి వచనం చదవడం, అప్పుడప్పుడు హాస్య ప్రసంగాలు చేయడం ఈయన పనులు. సాధారణంగా ప్రదర్శనలు జాముురాత్రికి ప్రారంభమై తెల్లవార్లు వుంటాయి. కొన్ని కొన్ని కథలు అయిదారు రాత్రులు ప్రదర్శింపబడటం గూడ కద్దు. ఆంధ్రదేశ యక్షగాన ప్రదర్శనల సామాన్య పద్ధతే ఇది. ఆహార్య విషయంలో కూచిపూడి వారి గణియాలు, సరంజామా పేరుపడ్డవి. ఆంధ్ర దేశంలో వారి ప్రదర్శన పద్ధతుల లగువు బిగువులు మరెక్కడా కానరావు.

ఒకనాడు విజయనగర ధ్వజం కింద విర్రవీగిన ఆంధ్ర సామ్రాజ్య కళాసరస్వతి తమిళనాడు నడిబడ్డున ఉన్న తంజావూరుకు తరలి పోవలసి వచ్చింది. తంజావూరులో యక్షగానానికి రాజభోగం పట్టింది. రాజకవి రఘునాథరాయలే యక్షగాన రచన చేపట్టేడుగాని అతని కొడుకైన విజయ రాఘవుని రాజ్యకాలంలో (క్రీ.శ.1633-73) దాని ప్రతిష్ఠ మిన్ను ముట్టింది. అతని కాలంలో యక్షగానాని కాపేరు పోయి నాటక నామం ధ్రువపడింది. నాటి కవులనేకులనేక యక్షగాన నాటకాలను రచించారు. అవన్నీ నాటి కొలువు నట్టువ మేళం వారు ప్రదర్శించడానికి రచింప బడ్డాయి. అందులో తాళ ప్రాధాన్యత తగ్గిరాగ ప్రాధాన్యం హెచ్చింది. మధుర కవితారీతుల

ప్రాచుర్యం కొంత తగ్గి క్షేత్రయ పదసదృశములు, కతిపయ జానపద గేయాలు చేరాయి. పద్యం కంటే గద్యానికి ప్రాముఖ్యం వచ్చింది. సంధి వచనాల సంఖ్య తగ్గి పాత్రల ముఖాముఖీ వచన సంవాదాలు ఎక్కువయ్యాయి. అక్కడక్కడా రంగ ప్రయోగ సూచనలు కూడ వున్నాయి. సంస్కృత రూపక సంప్రదాయానుకరణం కాస్త తొంగిచూసింది. భరతవాక్యం గ్రహింపబడింది. తాత్కాలిక విషయాలు గూడ ఇతి వృత్తాలయ్యాయి. వాటిలో నాయక రాజుల వివాహ శృంగార విహారాదులు, ఆస్థాన వైభవం మొదలైన రాజోదంతాలు ప్రధాన విషయాలు. ఆనుషంగికంగా ప్రజా జీవిత విశేషాలు గూడ ప్రసక్తమయ్యాయి. విజయరాఘవుని రఘునాథాభ్యుదయం మొదలు ప్రభునాయ కాలైన అనేక దక్షిణాంధ్ర యక్షగానాలలో తమిళ 'ఉలా' ప్రబంధపు పోకడలు ప్రస్ఫుటమయ్యాయి.

విజయరాఘవునితో తంజావూరులో నాయక రాజ్యమంతరించింది. మహారాష్ట్రులు ప్రభువులయ్యారు. వారు మన తెలుగు యక్షగాన నాటకాలను అధికంగా ఆదరించడం మిక్కిలి ముదావహం. వారిలో శహాజీ అపర విజయ రాఘవుడు. ఈయన స్వయంగా ఇరవై యక్షగాన కృతులకు కర్త. అందులో కొన్ని నాటకాలు, కొన్ని ప్రబంధాలు అని పేర్కొనబడ్డాయి. అన్నీ ప్రదర్శనార్హములే. శహాజీ గ్రంథారంభంలో ద్విపదలో కథాసంగ్రహం చెబుతాడు. గణపతి ప్రార్థనతో పాటకు ఒక పాత్ర ప్రవేశ పెడతాడు. కటికవాని వాలకం ఒక సాంప్రదాయిక హాస్యపాత్రగా రూపొందించాడు. అడుగడుగున పాత్రప్రవేశ సూచన, కథాను సంధాయకాలు అయిన సూత్రధార ప్రసంగాలు, అక్కడక్కడ భాగవతుల పాత్రలను పలకరించడాలు మొదలైన విశేషాలు ఈయన కృతులలో కనబడుతాయి. ఈతని త్యాగవినోద చిత్ర ప్రబంధ నాటకంలో అంక విభాగం కూడా ఉంది. ఈతని ఆస్థానాంధ్ర యక్షగాన కవులలో దర్భాగిరిరాజు అగ్రగణ్యుడు. ఈయన ఆరు యక్షగానాలు రచించాడు. అన్నీ రాజసంబంధేతి వృత్తాలు. ఈతని కృతులలో రాజమోహన కొరవంజి విశిష్టమైనది. ఇది యక్షగాన ప్రాయరచన. కొరవంజి ప్రాచీన తమిళశబ్దం, ఎఱుకత అని అర్థం. కొరవంజి ఒక నృత్య విశేషంగా ప్రాచీన తమిళ వాఙ్మయంలో ముఖ్యంగా శిలప్పదిగారంలో ప్రసక్తమైంది. విజయ రాఘవుని యక్షగానాలలో కొన్నింట మొదటిగా కొరవంజి పాత్ర కనిపిస్తోంది.

శహాజీ (1683-1712) నాటి నుండి చిట్టచివరి శహాజీ (1833-1855) నాటి వరకు తంజావూరు ప్రాంతంలో యక్షగాన రచనలు ప్రదర్శనలు అవిచ్ఛిన్నంగా కొనసాగాయి. విజయరాఘవుని నాటి భరత వాక్యం, శహాజీ నాటి అంక విభాగం మొదలైన విశేషాల ద్వారా వికీర్ణంగా పొడసూపిన మార్గ రూపక ప్రభావం తమిళరాజు (1728-36) రచనలలో నాందీ ప్రస్తావనల ద్వారా విస్తరిల్లి శహాజీ రచన అన్నపూర్ణా పరిణయంలో పరిపూర్ణత సంతరించుకుంది. యక్షగానం పుట్టుకలో దేశి అయినా పరిణామంలో మార్గి అయినదనవచ్చు.

తంజావూరులో రాజాశ్రితులుగాని యక్షగాన కవులును కొందరున్నారు. వారిలో ముఖ్యులు నారాయణతీర్థులు, మేలట్టూరు వెంకటరామశాస్త్రి, త్యాగరాజు. ఈ వెంకట రామశాస్త్రి కృతులనే మేలత్తూరు భాగవతమేళ నాటకాలంటారు. అది రచనా ప్రక్రియలో తంజావూరు యక్షగానాల వంటివే. కాని ప్రదర్శన ప్రక్రియ, సంప్రదాయ కథకళి, కూచిపూడి వలె విశిష్టమైనవి. వీటికి నృత్యనాటకాలని పేరు. ఇవి బ్రాహ్మణ భాగవత మేళా వారు మాత్రమే ప్రదర్శిస్తారు. నేటికీ తంజావూరులో ప్రదర్శన ప్రతిష్ఠలు మిగిలింది వీటికే.

క్రీ.శ. 18వ శతాబ్దిలో మధుర, పుదుక్కోట, మైసూరు రాజస్థానాలలోను, కన్నడ, తమిళ ప్రాంతాలలోను కొద్దిగానైనా వెలిశాయి తెలుగు యక్షగానాలు. మైసూరు ప్రభువు కంఠీరవరాజు స్వయంగా తెలుగులో కొన్ని కైశికీ వృత్తి విశిష్టాలు నృత్య ప్రయోగోద్దిష్టాలూ అయిన యక్షగానప్రాయ రచనలు చేసివుండడం విశేషం.

దక్షిణ దేశపు యక్షగానాలలో పౌరాణికేతి వృత్తాలే గాక తాత్కాలిక రాజసంబంధేతి వృత్తాలు కూడ అనేకం వెలిశాయి. సాంకేతిక చిత్రణతో తత్వవిషయానికి సంబంధించిన ప్రబోధ చంద్రోదయ మానసపుత్రికలు వివేక విజయం మొదలైనవి కొన్ని పురుడు పోసుకొన్నాయి. దక్షిణ దేశంలో యక్షగాన ప్రదర్శనలు రాజాస్థాన రంగభోగంతో భరత విద్యా పద్ధతిలో ఇంచుమించు మార్గ రూపక ప్రదర్శనల స్థాయిలో జరిగినట్లు తెలుస్తోంది. అవి నాడు కోటలోని రాచవారికీ , పేటలోని ప్రజలకూ సమానంగా ప్రీతి పాత్రములయ్యాయి.

తెలంగాణలో యక్షగానాలు వందకు పైచిలుకు కనబడుతున్నాయి. యక్షగాన రచన క్రీ.శ. 18వ శతాబ్దిలో విరివిగా ప్రారంభమైంది. ఇక్కడ యక్షగానాలు మొదట్లో ప్రదర్శనలలో కంటె పారాయణాలలోనే ఎక్కువ ప్రచారం పొందాయి. క్రీ.శ. 1780 నాటి శేషాచల కవి ధర్మపురి రామాయణం, క్రీ.శ.1824 నాటి ముద్దయకవి మంథెన రామాయణం మొదలైనవి అలాంటివే. అందులో ధర్మ పురి రామాయణం ప్రతిష్ఠ చాళుక్య సీమలోను వ్యాపించింది. తెలంగాణలో 19వ శతాబ్ది ఉత్తరార్థం నుంచి ప్రదర్శనోద్దిష్టాలైన

రచనలు సాగాయి. ఆత్మకూరు సంస్థానాధీశుడైన ముక్కర సీతారామ భూపాలుని కాశ్రితుడైన రామదాసు అనే కవి తారాశశాంకం, భీమసేన విలాసం అనే యక్షగానాలు రచించాడు. అక్కడ ఒక గొల్లకలాపం (గోవర్ధనం నరసింహాచార్యులది), ఒక కొరవంజి (రూప్ఖానుపేట రత్నమ్మగారిది) కూడ వెలిశాయి.

క్రీ.శ. 20వ శతాబ్దంలో గూడ తెలంగాణలో యక్షగాన రచన, ప్రదర్శన సజీవంగా వుంది. ప్రసిద్ధ పురాణకథలూ, జానపద గాథలూ అయిన కాంభోజరాజు కథ, బాల నాగమ్మ కథ, ఆరెమరాటీల కథ, పెదబబ్బిలి రాజు కథ మొదలైనవి అక్కడ యక్షగాన వస్తువులయ్యాయి. ఇలాంటి రచనలకు జీవత్కావి చెర్విరాల భాగయ పెట్టింది పేరు. ఈయన యక్షగానకృతులు ముప్పైరెండు. ఇన్ని యక్షగానాలు రచించిన కవి మరొకడు లేడు. ఈయన తరువాత తెలంగాణ యక్షగాన కవులలో ప్రసిద్ధులు బూరుగుపల్లి సోదరులు. తెలంగాణలో వీధి నాటక, వీధి భాగవత నామాలతో కొన్ని కనపడినా అవి యక్షగానపు తోబుట్టువులే. అన్నీ ప్రదర్శనోద్దిష్టాలే. వాటిపై ఆధునిక నాటక ప్రభావం, యుగ ప్రభావమూ బాగా పడ్డాయి. నటీ సూత్రధారుల ప్రస్తావనలు, వచనాల కంటే పాత్రల ముఖాముఖీ సంభాషణలు తరచు కనిపిస్తాయి. కాలానుగుణంగా కల్పిత కథలూ ఇతివృత్తాలయ్యాయి. ఉదా. పట్లోరి వీరప్ప క్రోధాపురి రైతు విజయం అనే వీధి నాటకం. ఒక విధమైన నేటి సామ్యవాద సిద్ధాంతాన్ని సమర్థించేటటువంటి ఇతివృత్తం కలది. తెలంగాణాలో యక్షగాన రచన ఆలస్యంగా ప్రారంభమైనా ఆధునిక యుగంలో చకచక సాగి విషయ వైవిధ్యాన్ని ప్రదర్శించి ప్రదర్శన ప్రతిష్ఠలందుకొంది. ఆ రచనలంత నిర్దుష్టాలు గాక పోయినా ప్రజామోదాన్ని చూరగొన్నాయి.

యక్షగాన ప్రయోగ ప్రాథమిక స్వరూపం గానరూప కథాఖ్యానం అనే విషయం పూర్వోక్తం. ఆ పద్ధతి తరువాత కాలంలో కూడ సాగుతూనే వచ్చింది. తంజావూరు విజయ రాఘవ రాయల ఆస్థానకవి చెంగల్వ కాళకవి తన రాజగోపాల విలాసం లో యక్షగానం అంగనాజన ప్రవర్తితమైన సంగీతగోష్ఠిగా కూడ వుండేదని సూచించినాడు. కన్నడ దేశంలో ఈనాడు యక్షగానం తాళమద్దళ అనే పేరుతో హరికథలా వ్యాఖ్యానింపబడుతూ వుంది. మన హరిదాసులు కొందరు తామురచించిన హరికథలను యక్షగానాలని పేర్కొన్నారు. పరమానందయతి, కంఠీరవ రాజుల కృతులను బట్టి అది ఒక్కొక్కప్పుడు పదకేళికగా ప్రదర్శింప బడుతూవుండేదని తెలుస్తోంది. 19వ శతాబ్ది నుండి యక్షగానాలు కొన్ని బమ్మలాటలకు వెనుకపాటగా వినియోగించినట్లు తెలుస్తోంది.

క్రీ.శ.16వ శతాబ్దం నుండి ఆంధ్రదేశంలో యక్షగాన రచన ఎక్కువగా సాగుతూవచ్చింది. అప్పటికే దోర సముద్రపు నటులు,కూచిపూడి భాగవతులు, జంగం మేళాలవారు వివిధ వీధి నాటకాలు ఊరూర ప్రదర్శించడంలో ప్రసిద్ధికెక్కారు. అలా దేశి నాటకకళకు విశేష ప్రచారం కలిగిన రోజులలో వెలసిన యక్షగానాలలోను నాటకోచితమైన రచన సాగింది. అందుకు నాటి సుగ్రీవ విజయాదులే తార్కాణాలు. 17వ శతాబ్దిలో యక్షగానానికి, కూచిపూడి వారి కలాపంతో సంపర్కం కలిగింది. ఆ కలాపం ఆత్మాశ్రయ ఫక్కితో నృత్య ప్రధానమూ అయిన ఉపరూపప్రాయమైన దృశ్యప్రక్రియ. పారిజాతాలనే పేర వెలసిన అనేక యక్షగానాలందుకు పరమోదాహరణాలు. 18వ శతాబ్దిలో మార్గనాటక ప్రభావం కొంత పొడసూపి 19వ శతాబ్దిలో ఉత్తరభాగంలో చిక్కపడి, అంతట ఆధునిక రంగస్థల నాటక ప్రభావంకూడ పడి యక్షగానంలో నాటకీయత సంతరించుకుంది.

ఇక్కడ యక్షగానంలో స్త్రీ పాత్ర నిర్వహణ గురించి ఒక్కమాట. 16వ శతాబ్ది మొదట్లో తప్పిదారి తాయికొండ నాటకం అనే ఒక వీధి నాటకంలో మాత్రం స్త్రీ పాత్ర స్త్రీ నిర్వహించింది. కాని 18వ శతాబ్ది చివరిదాకా ఆంధ్రదేశంలో స్త్రీ పాత్రలను పురుషులే నిర్వహిస్తూ వుండినట్లు తెలుస్తోంది. వెనుకటి కూచిపూడి మేళాలలో సిద్ధేంద్రయోగి మేళం, భాగవతుల దశరథ రామయ్య మేళం, వేదాంతం, చింతా, వెంపటి వారల మేళాలు ప్రసిద్ధాలు. 18వ శతాబ్ది భాగోతుల బుచ్చిగాని మేళం 19వ శతాబ్ది రాయలసీమలో లేపాక్షి, వేములపల్లి, తాడిపత్రి మేళాలు, 19-20 శతాబ్దాల సంధి కాలంలో నెల్లూరు మండలంలో పడకండ్లస్వామి రాయకవి, త్వరకవి రామకృష్ణయ మేళాలు, విశాఖ మండలంలో నరసింగపల్లి కళ్ళేపల్లి కందాళ చిదంబర కవి మేళాలు ప్రసిద్ధాలు. భామ వేషానికి మంథా కామప్ప, కాలుగుంటి వెంకటస్వామి మున్నగు మహానటుల నేర్పరితనంతో వాసికెక్కారు.

దక్షిణ దేశపు యక్షగానాలలో మేలత్తూరు భాగవత మేళ నాటక ప్రదర్శనలదే గొప్ప ప్రత్యేకత. రాక్షస వినాయకాది విలక్షణ పాత్రలకు కరాళాలు ఉపయోగించారు. వారి ముఖ్యమైన జంత్రపు హంగు మృదంగ, తిత్తి, ముఖవీణ, సూత్రధారుని చేతి తాళపు చిప్పలు. వారి పూర్వరంగ నిర్వహణ పకడ్బందిగా ఉంటుంది. అందులో తోడై మంగళం అనేపేర తాళ్లపాక చిన్నన్న

కీర్తన పంచకం పఠింపబడటం విశేషం. నట్టువాంగం జరిపే భాగవతులిద్దరు, ముగ్గురు పాటగాండ్రు, జతగాండ్రు, గ్రాంథికుడు లేక ప్రసంగి (సంధి వచనాదులు చదివేవాడు) హంగుదారులు. వీరి ప్రదర్శనలలో సంగీత నాట్యాలకు శాస్త్ర ప్రతిపత్తి ఉంటుంది. కీర్తనలనేకం. ముందు జతి,శబ్దం, కౌస్తుభం పఠింపబడతాయి. ప్రతి పాత్ర ప్రావేశిక ధ్రువానుగుణమైన నృత్యంతో రంగం మీద ప్రవేశించాలి. కూచిపూడి ప్రదర్శనలలో లాగ నాయిక పాత్రధారి ముందుగా తన నర్తన కళా కౌశలాన్ని విశేషంగా ప్రదర్శించాలి. అందుకొక అల్లారిప్పు (అలరింపు = శుద్ధనృత్తము), మెయ్ (తారస్థాయి షడ్జస్వరం, ఆదితాళాలలో తాళజతి ప్రధానమైన సంగీత ప్రక్రియ), తిల్లాన, శౌక్క, వర్ణం అభినయించి తీర్మానం చేయాలి. సామాన్యంగా ప్రతిపాత్రధారికి భరత పద్ధతి వలెనే స్త్రీ పాత్రలు పురుషులే నిర్వహించాలనే నియమం వీరికీ వుంది. నటుల మూకాభినయంలో కథకళి ఫక్కి వీరి ప్రదర్శనలలో కనిపిస్తుంది. ఈ నాటకాలలో వధాదులను ప్రదర్శింపరాదనేటటువంటి భరతుడి నియమాలు పాటింప బడతాయి. మేలత్తూరు భాగవతులకు మూల విరాట్టు వెంకట రామశాస్త్రి. ఈయన కృతులు పన్నెండు. వీటికి మేలత్తూరు భాగవత మేళ నాటకాలని పేరు. వీటిని శూల మంగళం, ఊత్తుక్కాడు, శాలియ మంగళం, నల్లూరు మొదలైన గ్రామాలలో కూడా కూచిపూడిలోలాగా బ్రాహ్మణ మేళాల వారే ప్రదర్శిస్తారు. శూలమంగళం వారు తమ ప్రదర్శనలలో కొఱవన్, కొఱత్తి (ఎఱుకడు, ఎఱుకత), కరకం (గ్రామదేవత ఘటం ధరించే వాడు), కుడు హుడుప్పండి (శకునపక్షి), కప్పల్, గంజిన్ (తురక వేషపు హాస్యగాండ్రు) మున్నగు పాత్రలు కొన్నింటిని జనరంజనార్థం సంప్రదాయకంగా రూపొందించారు. నల్లూరు భాగవతం నాట్య విద్యకు ప్రమాణ గ్రంథాలు అభినయ దర్పణం, భావప్రకాశనం, రసమంజరి.

గోల్కొండ తానీషా మంత్రులైన అక్కన్న, మాదన్న కొలువులో ఒక భాగవత మేళ ముండేది. తానీషా కొలువులో కూచిపూడి సిద్ధేంద్రయోగి మేళం సన్మానింపబడింది. తెలంగాణలో ఇటీవల వెలసిన మేళాలలో చిరుతల నాట్యమండలి కొంత పేరుపొందింది.

ఇతివృత్త విషయంలో, రచనా ప్రక్రియలో, ప్రయోజనంలో బహుముఖ వైవిధ్యాన్ని ప్రదర్శించిన యక్షగాన లక్షణం ఇదమిత్థంగా వివరించడం కష్టం. చిత్రకవి పెద్దన, అప్పకవి ప్రభృతులు చెప్పిన లక్షణం అసమగ్రం. సమగ్ర యక్షగాన లక్షణం చెప్పటం వారి పూనికగాదనీ, యక్షగాన ప్రధాన రచనాంగమైన రగడ రేకుల తాళ నిర్దేశాదికమే వారి లక్ష్యమని తోస్తుంది.

యక్షగానంలో ఇతివృత్తమేదైనా కావచ్చు. రచనా ప్రక్రియ శ్రవ్య ప్రయోజనాత్మకం లేదా, దృశ్య ప్రయోజనాత్మకం గాని కావచ్చు. ఏ ప్రక్రియ లోనైనా నీతి, ధర్మం విహితం. అందు రాగతాళాలలో ఒక దానికి గాని, రెండింటికి గాని తగు ప్రాధాన్యం గల రచనా విశేషాలు అంటే రేకు, దరువు, పదము, కీర్తన, మొదలైనవి. **ద్విపద, మంజరి, పద్యాలు (జాత్యుపజాతివృత్తాలు, అర్థపద్యాలు, అంటే కందార్థాదులు సంస్కృత శ్లోకాలు)**, వచనం (సంధి ప్రయోజనాత్మకం గాని, సంవాదాత్మకంగాని, వర్ణనాత్మకంగాని కాదగును. చూర్ణికలు, విన్నపాలు మొదలైనవి గద్య ప్రభేదాలు) ఉండదగును. ఏలాది గీత ప్రబంధ విశేషాల ప్రయోగమైచ్ఛికం.

దక్షిణ భారతదేశంలో తెలుగు భాష వ్యవహరింపబడే ప్రతిచోటా వెలసింది యక్షగానం. వివిధ కాలాలలో, వివిధ ప్రాంతాలలో, వివిధ జాతుల వివిధాలైన అంతస్తుల ప్రజల భాషాఫక్కీలకు నిలయం యక్షగానం. పౌరాణికాలు, చారిత్రకాలు, సాంఘికాలు, జానపదాలు, తత్త్వవిషయాలు అయిన కథలు గాథలు ఇతివృత్తాలై ఏ యితర సాహిత్య ప్రక్రియ ప్రదర్శించనంత అతిమాత్ర వస్తువైవిధ్యాన్ని ప్రదర్శించింది యక్షగానం. వాఙ్మయ స్థితి త్రితయమైన పద్యం, గద్యం, గేయం వేయగల వాలకములన్నీ వేసింది. యక్షగానం పండితోపజ్ఞమే కాక పామరోపజ్ఞమై, వివిధ జాతుల భాగవతులతో ప్రదర్శితమై పల్లె పట్టులేగాక పట్టణాలు, రచ్చసావిడులే కాక రాచలోగిళ్లును రంగస్థలాలై నగరి లోని రాజుకు నడివీధి బడుగు మానిసికి రసభోగం చూరలిచ్చి రాణించినది యక్షగానం. సంగీతం, సాహిత్యం, నాట్యం మున్నగు కళలకు కాణాచియై సర్వోపభోగ్యమైన సమాహారకళగా విరాజిల్లింది యక్షగానం. మన సర్వ సాహిత్య ప్రక్రియల స్వరూపంలోను, అంతోయింతో అనుబంధం పెంపొందించుకొన్న బృహదాంధ్ర సారస్వతశాఖ యక్షగానం. ఇతర సాహిత్య ప్రక్రియలవలె దిగుమతి చేసుకొన్నట్టిది కాక మన వాఙ్మయంలో స్వతంత్రమైన తెలుగుదనముట్టిపడునట్టి, మన వాఙ్మయ వ్యక్తిత్వాన్ని పట్టి యిచ్చునట్టి ప్రక్రియ యక్షగానం. తమిళ, కన్నడ యక్షగానాలకాద్య ప్రకృతియై ఈ సాహిత్య ప్రక్రియ విషయంలోనైనా తెలుగువారు మరొకరి కాద్యులు కాగలిగిరన్న ప్రతిష్ఠ కధిష్ఠానం యక్షగానం. యావదాంధ్ర వాఙ్మయంలో బహుముఖ వైవిధ్యం వైశిష్ట్యం కలిగి విశాల సాహిత్య శాఖగా విలసిల్లిన ప్రక్రియ యక్షగాన మొక్కటే.

జోగారావు

తెలుగు నాటక ఆవిర్భావం- పూర్వరంగం

తెలుగులో మొట్టమొదట నన్నయ మహాభారత గ్రంథ రచనకు **ఉపక్రమించే నాటికే కవులు** సంస్కృతంలో ఎన్నో నాటకాలు రచించారు. **అభిజ్ఞాన శాకుంతలం**, మృచ్ఛకటికం, ముద్రారాక్షసం, వేణీసంహారం, ఉత్తర రామచరితం వంటివి గొప్ప నాటకాలుగా పేరు పొందాయి. 'నాటకాంతం హి సాహిత్యం, కావ్యేషు నాటకం రమ్యం' అని సాహిత్యంలో నాటకానికి పెద్దపీట వేశారు. అయినా నన్నయాది తెలుగు కవులు సంస్కృత నాటకాలను అనువదించడంగాని, తెలుగులో స్వతంత్రంగా నాటకాలు రచించడంగాని జరుగలేదు. వినుకొండ వల్లభరాయుని క్రీడాభిరామం (15శ॥) తప్ప 19వ శతాబ్దం ద్వితీయార్థం వరకు తెలుగులో నాటకం వెలువడలేదు. నాటకాలు రాయనంత మాత్రాన పూర్వాంధ్ర కవి పండితులు నాటకాన్ని గురించిన అవగాహన లేనివారు కారు. నాటకం పట్ల అనాసక్తులు కారు. నాటక రచన పట్ల ఆకర్షణకు లోనుగాక పోలేదు. తెలుగువారికి, అందులో కవులకు, పండితులకు నాటక కళ పట్ల గల ఆసక్తిని, అభినివేశాన్ని పట్టి చూపే సందర్భాలు ఎన్నో కనిపిస్తాయి.

భరతుని నాట్యశాస్త్రంలో సుస్థిర నాట్య వ్యవస్థ నెలకొన్న రాష్ట్రాల్లో ఆంధ్రదేశం కూడా ఒకటిగా పేర్కొనబడింది. ఇక్ష్వాకుల కాలం నాటిదిగా పేర్కొనబడుతున్న నాగార్జునకొండలోని చతురస్ర నాట్యమండపం ఆంధ్రదేశంలోని నాట్య విలసనాన్ని తెలుపుతుంది. చాళుక్యుల కాలంలో కుమార శ్రీకంఠుడు అనే నటుడు ఆర్యక్రీడ నాటకం ప్రదర్శించి ఘనసన్మానం పొందినట్లుగా 10వ శతాబ్ది శాసనం వల్ల తెలుస్తున్నది. నాట్యశాలల పోషణకై భూవసతులేర్పాటు చేయబడినట్లు, ఆనాడు ఆంధ్ర, కర్ణాటక సీమల్లో పెక్కు దేవాలయాల్లో నాట్యమండపాలు నిర్మించబడినట్లు రాజరాజ కులోత్తుంగుని శాసనం వల్ల తెలుస్తున్నది.

రెండవ ప్రతాపరుద్రుని కాలంలో (1290-1323) విద్యానాథుడు ప్రతాపరుద్ర యశోభూషణ మనే లక్షణ గ్రంథం రాశాడు. నాటక లక్షణం ప్రథమంగా చెప్పిన ఆంధ్రుడితడే. అంతేగాక దీనికి లక్ష్యంగా ప్రతాప కల్యాణ మనే నాటకం కూడా రచించాడు. ప్రతాపరుద్ర యశోభూషణ కృతిభర్త రెండవ ప్రతాపరుద్రుడు *ఉషారాగోదయం* అనే నాటిక, *యయాతి చరితము* (7 అం.) అనే నాటకం సంస్కృతంలో రాశాడు. ప్రతాపరుద్రుని కాలంలో వీరభల్లాట దేశికుడు రచించిన నాట్యశేఖరము అనే లక్షణ గ్రంథం అలభ్యం. అగస్త్య విద్యానాథుని మేనల్లుడు *గంగాధరుడు* మహాభారత నాటకం, చంద్రవిలాసం, రాఘవాభ్యుదయం అనే రూపకాలు రచించాడు. *గంగాధరుని* ఒక కుమారుడు నరసింహుడు కాదంబరీ కల్యాణం అనే (8 అం.) నాటకం, రెండవ కుమారుడు విశ్వనాథుడు *సౌగంధికాహరణ వ్యాయోగం* రచించారు. రావిపాటి త్రిపురాంతకుడు ప్రేమాభిరామం అనే రూపకం సంస్కృతంలో రచించాడు. కాని అది లభ్యం కావడం లేదు. రెండవ సింగభూపాలుని తండ్రి అనపోత భూపతి రచించిన అభినవ రాఘవం అనే రూపకం కూడా అలభ్యం. అతని ఆస్థానంలోని విశ్వేశ్వర పండితుడు వీరభద్ర విజృంభణం అనే డిమం రాశాడు. పెదకోమటి వేమారెడ్డి ఆస్థానకవి వామన భట్టబాణుడు శృంగారభూషణం అనే భాణం రచించాడు. సంస్కృతంలో *ఉషా పరిణయం, కనకలేఖా కల్యాణ* మనే నాటకాలు కూడా రాశాడు. రెండవ హరిహరరాయల పుత్రుడు విరూపాక్షుడు నారాయణ విలాస మనే ఐదు అంకాల నాటకం, ఉన్మత్తరాఘవ మనే ఏకాంక నాటకం రాశాడు. ప్రౌఢదేవరాయల ఆస్థానంలోని అరుణగిరినాథుడు (డిండిమభట్టు) సోమవల్లీ యోగానంద మనే ప్రహసనం రాశాడు. ప్రౌఢదేవరాయల పుత్రుడైన మల్లికార్జునరాయల ఆస్థాన నటుడు *గంగాదాస విలాస* నాటకం ప్రదర్శించాడు. వీర నరసింహరాయల ఆస్థానంలోని కుమార డిండిముడు వీరభద్ర విజయ మనే డిమం రాశాడు. కుమార డిండిముని అల్లుడు స్ఫులింగ కవి సత్యభామా పరిణయమనే ఐదంకాల నాటకం రాశాడు. శ్రీకృష్ణదేవ రాయలు జాంబవతీ పరిణయం, ఉషా పరిణయం అనే నాటకాలు రచించాడు. పింగళి సూరన, ముఖాదులగు సంధులు సాంగత బెంపు మీర *గంగావతారాది* నాటక ములాడెనని రాసినా ఆ *గంగావతార* మనే నాటకం దొరకడం లేదు. చెవ్వప్ప నాయకుని ఆశ్రయించిన రత్నఖేట శ్రీనివాస దీక్షితుడు 18 రూపకాలు రచించాడు. ఇతని కుమారుడు రాజ చూడామణి దీక్షితుడు *శృంగార సర్వస్వ* మనే భాణం, *కమలినీ కలహంస* మనే నాటిక రాశాడు. రఘునాథ నాయకుని శిష్యుడు యజ్ఞనారాయణ దీక్షితుడు *రఘునాథ విలాసం* అనే అయిదు అంకాల నాటకం రచించాడు. పేరిసూరి వసు చరిత్ర ప్రబంధాన్ని వసు మంగళ నాటకంగా సంస్కృతంలోకి అనువదించాడు. కృష్ణాధ్వరి కల్యాణ కౌముదీ కందర్ప నాటకం రచించాడు. చేమకూర వేంకట కవి '*కళాభాగ్యములా, బహుదానలీలలా, నాటకశాలలా* అని రఘునాథ భూపాలుని ప్రస్తుతించాడు. ఎలకూచి బాల సరస్వతి తన బాల సరస్వతీయంలో కౌముదీ నాటక కావ్య కవినని పేర్కొన్నాడు. ఆ నాటకమేదీ లభించలేదు. కుందుర్తి వేంకటాచల కవి తన కార్తీక

మాహాత్మ్యంలో చాటు కృతులను బహువిధ నాటకవము రచించానని చెప్పుకున్నాడు. కాని ఆ నాటకాలేవీ దొరకలేదు.

నాటక లక్షణాలు తెలిపిన లాక్షణికులు, సంస్కృత నాటక వ్యాఖ్యాతలు కూడా తెలుగువారిలో ఉన్నారు. అమృతానంద యోగి (1350) రచించిన అలంకార సంగ్రహం లో 7, 8, 9, 10 పరిచ్ఛేదాలు రూపక లక్షణాలకే నిర్దేశితమయ్యాయి. రెండవ సింగభూపాలుడు రాసిన రసార్ణవ సుధాకరం లో నాటక లక్షణాలు చెప్పబడ్డాయి. ఆయనే రాసిన నాటక పరిభాష అనే గ్రంథం లభించలేదు. చిత్రకవి పెద్దన తెలుగులో ప్రప్రథమంగా లక్షణసార సంగ్రహం (1550) అనే రూపక లక్షణగ్రంథాన్ని రచించాడు. ఇందులో రూపక లక్షణాలు మూడవ ఆశ్వాసంలో **49** గద్య పద్యాల్లో తెల్పడం జరిగింది. అనంతామాత్యుని (1435) రసాభరణం లక్షణ గ్రంథంలో రస, భావ, నాయక, నాయికా వివరణ ఉంది. కాటయవేముడు కాళిదాసు నాటక త్రయానికి (మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞాన శాకుంతలం) వ్యాఖ్యానం రచించాడు. నాదెండ్ల గోప మంత్రి ప్రబోధ చంద్రోదయ నాటకానికి ఉత్తమమైన వ్యాఖ్య రచించాడు. ప్రతాపరుద్ర యశోభూషణం అనే అలంకార శాస్త్ర గ్రంథంలో నాటక లక్షణాలు చెప్పిన విద్యానాథుడు ఆంధ్రుడే. సంస్కృతంలో సుప్రసిద్ధ నాటకకర్తలైన భవభూతి, మురారి, భట్టనారాయణుడు ఆంధ్రులే. వీరేగాక సంస్కృతంలో ఉన్మత్తరాఘవం, మదన విలాసభాణం, నరకాసుర విజయ వ్యాయోగం, రత్న పాంచాలిక రాసిన భాస్కరుడు, పశుపతి నాగనాథుడు, ధర్మసూరి, సింగభూపాలుడు అచ్చంగా ఆంధ్రులే.

ఈ విధంగా ఆంధ్రులు నాటక లక్షణ గ్రంథాలు, సంస్కృత రూపకాలు, సంస్కృత నాటకాలకు వ్యాఖ్యానాలు రాయడం తెలుగువారికి ఉన్న నాటక పరిజ్ఞానాన్ని, నాటకాల పట్ల గల ఆసక్తిని తెలియజేస్తుంది. అందుకే తెలుగు కావ్యాలు రాస్తున్నప్పుడు కూడా కొంతమంది కవులు నాటకం పోకడలను, పారిభాషిక పదాలను తమ కావ్యాల్లో ఉపయోగించుకున్నారు. తెలుగులో ఆదికవి నన్నయ, భారత అవతారిక నాంది ప్రస్తావనల పద్ధతిని సాగడం నాటకరీతిని తలపింపచేస్తుంది. ఆయన రాసిన సభాపర్వమందలి రాజసూయ సందర్భంలోని శిశుపాల వధ ఘట్టం రచన నాటకంలా సాగడం గమనార్హం. నాచన సోముని ఉత్తర హరివంశమందలి ఊర్వశీ నరకాసుర సంవాదం, హంస డింభకోపాఖ్యానంలోని రాయబార ఘట్టం నాటకాన్ని స్ఫురింపజేస్తాయి. తిక్కన విరాటపర్వం, ఉద్యోగపర్వంలోని శ్రీకృష్ణరాయబారం నాటకీయతతో ఒప్పారుతున్నాయి. తిక్కన భారత రచనలో ప్రధానంగా నాటకీయత చోటుచేసుకున్నదని సాహిత్యజ్ఞులు భావిస్తారు. పింగళి సూరన ప్రభావతీప్రద్యుమ్నంలో నాటకీయత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దీనిలో నాటక ప్రయోగ విధానం కూడా విపులంగా వర్ణించబడింది.

కొందరు తెలుగు కవులు నాటక సంబంధ పారిభాషిక పదాలను కూడా ఆయా సందర్భాలలో ఉపయోగించారు. నన్నయ అవతారికలో "విమలమతింబురాణముల వింటి" అనే పద్యంలో 'ఉదాత్త రసాన్విత కావ్య నాటక క్రమములు పెక్కు చూచితి' అని చెప్పడంలో ఆనాటి నాటక వ్యాప్తి తెలుస్తుంది. ఆయనే గరుడోపాఖ్యానంలో సముద్ర వర్ణన చేస్తూ "నాటక ప్రయోగంబునుంబోలె ఘన రస పాత్ర శోభిత రంగ రమ్యంబైన దాని" అని రచించడంలో రసము, పాత్ర, రంగం వంటి నాటక సంబంధమైన పారిభాషిక పదాలను ప్రయోగించడం నన్నయకు గల నాటకాభినివేశాన్ని తెలుపుతుంది. నన్నెచోడుడు తన కుమారసంభవం లో 'దాన మొదలి సూత్రధారుడై నాట్యాభినయము లెసంగనాడె నారదుండు' అని చెప్పడంలో మొదలి సూత్రధారుడు, నాట్యాభినయాలు అనే పారిభాషిక పదాలు నన్నెచోడుని నాటకావగాహనను పట్టి చూపుతున్నాయి. ఆయనే తన గ్రంథంలో 'నెఱయగైసేసి జవనిక తెఱచివచ్చు చెలువుతో వచ్చి రతిమ్రోలనిలిచె మరుడు' అని చెప్పడం పాత్ర ప్రవేశాన్ని తెలుపుతున్నది. పాల్కురికి సోమనాథుడు తన బసవపురాణంలో కరమర్థి నూరూర శిరియాలు చరిత పాటలుగాగట్టి పాడెడు వారు అటుగాక సాంగ భాషాంగ క్రియాంగ – పటు నాటకంబుల నటియించువారు' అని పలకడం నాటక ప్రదర్శనా బాహుళ్యాన్ని తెలియజేస్తుంది. తిక్కన 'సంగీత ప్రవర్తక సంఘంబులు విరిసి చనిన రిత్తమైయున్న రంగస్థలంబు చందంబున' అనడం పాత్రల నిష్క్రమణాన్ని తెలుపుతుంది. క్రీడాభిరామంలో వినుకొండ వల్లభరాయుడు – 'లెస్సగాగ యీ లేమ చరిత మాడుదురు నాటకంబుగ నవనిలోన' అని చెప్పడంలో కవికి గల నాటక ప్రదర్శనాన్ని గురించిన అవగాహనను సూచిస్తుంది. ఈయనే క్రీడాభిరామంలో చెప్పిన "నటులది దోరసముద్రము, విటులది యోర్గల్లు, కవిది వినుకొండ" అని చెబుతూ మోపూరు తిరునాళ్ళలో ప్రదర్శన ఇవ్వడానికి వచ్చారనడాన్ని బట్టి నటులు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రదర్శనలు ఇవ్వడానికి వెళ్ళేవారని తెలుస్తున్నది.

ఈవిధంగా కొందరు ఆంధ్ర కవి పండితులు నాటకాలు, నాటక లక్షణాలను తెలిపే గ్రంథాలు రచించగా, మరికొందరు నాటక పారిభాషిక పదాలను, ప్రదర్శనలను గురించి పేర్కొన్నారు. మరికొందరు ఆంధ్రకవులు ఆయా సంస్కృత నాటకాలను నాటకాలుగా కాకుండా కావ్యాలుగా అనువదించి ఆ నాటకాల పట్ల తమకున్న మక్కువను చాటుకున్నారు. రాజశేఖరుని విద్ధసాలభంజిక అనే సంస్కృత నాటకాన్ని వంచన (1350) కేయూరబాహు చరిత్రం అనే కావ్యంగా అనువదించారు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం నాటకాన్ని అనుసరించి పిల్లలమర్రి

పినవీరభద్రుడు (1450) శృంగార శాకుంతలమనే కావ్యంగా రాశాడు. కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయ మనే నాటకాన్ని నంది మల్లయ ఘంటసింగనలు (1480) అదే పేరుతో కావ్యంగా అనువాదం చేశారు. జయదేవుని ప్రసన్నరాఘవం అనే సంస్కృత నాటకాన్ని ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధంగా బడ్డుచర్ల తిమ్మయ అనువదించాడు. వీటిలో ప్రసన్నరాఘవ నాట్య ప్రబంధం మాత్రం పూర్తిగా కావ్య వాసన వీడని నాటకంగా పేర్కొనవచ్చు. అనగా ఇది నాటక లక్షణాలనూ, ఇటు కావ్యలక్షణాలను కలగలుపుకొని నాటకానికీ కావ్యానికి మధ్యే మార్గంగా సాగిన రచన. తెలుగు నాటక పరిణామంలో ఇదొక వినూత్న ఘట్టంగా భావించవచ్చు. ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధంలో కావ్యాల్లో వలె ఆశ్వాస విభజన కాక అంకవిభజనే ఉంది. మూలంలో వలె నాట్య ప్రబంధంలో కూడా నాందీ ప్రస్తావనలు ప్రవేశ విష్కంభాది అర్థోపక్షేపాలు, పాత్ర ప్రవేశ నిష్క్రమణలు, స్వగతాలు, ఆకాశభాషితాలు, ప్రకాశాలు, నేపథ్యాలు, ఆయా పాత్రల సాత్త్విక భావ సూచనలు ఉన్నవి ఉన్నట్లుగా నిరూపితాలైనాయి. కాని మూలంలోని వచన సంభాషణలు చాలావరకు పద్యాలుగా రూపొందాయి. అనిన, నావుడు, అనవుడు, ఇట్లనియె వంటి కవి వచనాలు లేకున్న చక్కని నాటకానువాదంలా ఉండేది. కవి సూచనలు, సంధి కావ్యాలు కుండలీకరణాల్లో ఉంచి, పాత్రల పేర్లు వారి సంభాషణలకు ఎదురుగా ఉంచితే చక్కటి పద్య నాటకమయ్యేది.

ఈవిధంగా ఆంధ్రదేశానికి చెందిన విద్వాంసులు సంస్కృతంలో నాటకాలు రాశారేగాని తెలుగులో రాయలేక పోయారు. బడ్డుచర్ల తిమ్మయలాంటి కవి 'ప్రసన్న రాఘవ నాట్యప్రబంధం'లో అలాంటి ప్రయత్నం చేయబోతూ పూర్తిగా సాహసించలేక నాటకానికి కావ్యపు ముసుగు తొడిగాడు. బహుశా తెలుగులో నాటక రచన చేయడానికి దేశకాల పరిస్థితులు అనుకూలంగా ఉండకపోవచ్చు. 19వ శతాబ్దం ఉత్తరార్థం వరకు తెలుగులో నాటకం రచింపబడక పోవడానికి విమర్శకులు కొన్ని కారణాలు చెప్పారు.

1. నటులు పంక్తి బాహ్యులుగా పరిగణింపబడేవారు. కాబట్టి ప్రదర్శనలు లేకుండా నాటకాలు రాయడమెందుకని కవులు తెలుగు నాటకాలు రాయడానికి పూనుకోలేదు, 2. తెలుగులో నాట్యశాస్త్రం వంటి నాటక లక్షణగ్రంథం లేకపోవడంవల్ల కవులు తెలుగులో నాటక రచనకు పూనుకోలేదు, 3. సరియైన నాటక ప్రదర్శనశాలలు, రంగ పరికరాలు లేనందువల్ల ప్రదర్శనావకాశం లేక తెలుగులో కవులు నాటక రచన చేయలేదు, 4. సంస్కృతంలో లాగా తెలుగులో పాత్రోచిత భాషాప్రయోగ సౌకర్యం లేదు కాబట్టి కవులు తెలుగు నాటకాలు రాయలేదు.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆధునిక తెలుగు నాటకం వెలువడే నాటికి కూడా ఇవేవీ మారలేదు. అయినా తెలుగు నాటకం పుట్టింది. అనగా పై కారణాలేవీ సరియైనవి కావని చెప్పవచ్చు.

పైన పేర్కొన్న కారణాలు కాక ఇతరమైన కారణాలు కూడా కొన్ని ఉన్నట్లు మనం భావించవచ్చు. 1. కవి పండిత పోషకులైన నాటి రాజులు తెలుగులో నాటక రచనకు ప్రోత్సాహం కల్పించకపోవడం, 2. తెలుగులో పద్య కవులు మాత్రమే గౌరవించబడుతుండడంతో వచనం కూడా అవసరమైన నాటకాలు రాసే ప్రయత్నం చేసి ఉండకపోవచ్చు, 3. వర్ణనలకు, ఆలంకారిక రచనకు, పాండితీ ప్రకర్షకు అంతగా అవకాశం లేకపోవడం కూడా తెలుగులో నాటక రచనకు ప్రతిబంధకంగా తోచి ఉండవచ్చు, 4. అంతేగాక నన్నయాది కవుల రచనల్లో, ముఖ్యంగా ప్రబంధాల్లో వస్త్వైక్యత, సంవాదాత్మకత వంటి నాటకీయ లక్షణాలు చోటు చేసుకోవడం తెలుగులో ప్రత్యేకంగా నాటకాలు రచించే అవసరం లేకుండా చేసినట్లు భావించవచ్చు, 5. అన్నిటికన్న ముఖ్యంగా సంస్కృత నాటకం రాజసభలకు పరిమితం కాగా నిరక్షరాస్యత హెచ్చుగా ఉన్న ఆనాటి సామాన్య జనం సంప్రదాయ నాటకాన్ని ఆస్వాదించే స్థితిలో లేకపోవడం తెలుగులో నాటక రచన చేయక పోవడానికి కారణమై ఉండవచ్చు.

ఆనాడు కురవంజి, యక్షగానం, జంగం కథలు, వీథి నాటకాలు, పగటి వేషాలు, హరికథలు, బుర్రకథలు మొదలైన జానపద కళారూపాలు సామాన్యజనానికి వినోదం పంచాయనడంలో సందేహం లేదు.

నాగిరెడ్డి

పౌరాణిక (పద్య) నాటకరంగం

పద్య నాటక రంగ పరిధిలోకి పౌరాణిక చారిత్రక, కాల్పనిక నాటకాలు చేరుతాయి. 140సంవత్సరాల చరిత్ర పద్య నాటకరంగానికి ఉంది. నన్నయ భారత రచనలో ప్రౌఢ సాహిత్యం క్రీ.శ.11వ శతాబ్దిలో ప్రారంభమైనా, నాటక రచన మాత్రం 1860 లోనే ప్రారంభమైనట్లు నాటక విమర్శకులు, చరిత్రకారుల అభిప్రాయం. కోరాడ రామ చంద్ర శాస్త్రి మంజరీ మధుకరీయం (1860) నాటకంతోనే తొలి నాటక రచన జరిగినట్లు తెలుస్తున్నది. తెలుగులో నాటక రచన, ప్రదర్శనలకు శ్రీకారం చుట్టింది పాఠశాలల్లోని, కళాశాలల్లోని ఉపాధ్యాయులు ముఖ్యంగా తెలుగు పండితులే. తెలుగు నాటక రచనకు ఆద్యులు కోరాడ రామచంద్ర శాస్త్రి, కొక్కొండ వేంకటరత్నం పంతులు, పరవస్తు వేంకటరంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి, కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడు.

మంజరీ మధుకరీయం ప్రబంధ శైలిలో ఉంది. తొలి తెలుగు నాటకరచనగా చెప్పుకున్నా ప్రదర్శనకు మాత్రం

నోచుకోలేదు. 1860-1870 మధ్య కాలంలో నాటక రచనకు పూనుకున్నవారు లేరు. కొక్కొండ వేంకటరత్నం పంతులు 1871లో వారణాసి ధర్మసూరి సంస్కృతంలో రచించిన నరకాసుర విజయ వ్యాయోగం తెలుగులోకి అనువదించాడు.

సంస్కృత విద్యా సర్వస్వం అని ప్రసిద్ధికెక్కిన పరవస్తు వేంకట రంగాచార్యులు, కాళిదాసు మహాకవి సంస్కృతంలో రచించిన అభిజ్ఞాన శాకున్తలమ్ నాటకాన్ని 1872 ప్రాంతంలో అనువదించాడు.

నాటక రచనలు సాగుతున్నా 1880 వరకు నాటక ప్రదర్శనలు జరగలేదు. 1880 -81లో ధార్వాడ నాటక సమాజం రాజమహేంద్రవరం పట్టణంలో పెద్దపాక వేసి హిందీలో నాటకాలను ప్రదర్శించింది. ఆ స్ఫూర్తితో కందుకూరి వీరేశలింగం పంతులు హర్షుని 'రత్నావళి' సంస్కృత నాటకాన్ని తెలుగులోకి అనువదించి తమ విద్యార్థులతో ప్రదర్శింపచేశాడు.

ధార్వాడ నాటక సమాజం (అలటేకర్ హిందూ డ్రమెటిక్ కంపెని) ప్రదర్శనల స్ఫూర్తితో గుంటూరు మిషన్ హైస్కూలులో నాడు ఆంధ్రోపాధ్యాయుడుగా పనిచేస్తున్న కొండుభట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి నాటకాలను రచించి, విద్యార్థులతో పరిసర ప్రదేశాల్లో ప్రదర్శింప జేశాడు. ఈయన 31 నాటకాలను రచించాడు. అన్నీ వచన నాటకాలే. ఆ నాటకాలన్నీ అముద్రితాలు.

పద్యనాటక రచన జరుగుతున్నా, నాటక ప్రదర్శనలో పద్య పఠనాన్ని ప్రవేశపెట్టిన ఘనత వడ్డాది సుబ్బారాయుడుకే చెందుతుంది. వ.సు.రాయకవి 1888లో రాజమండ్రిలో హిందూనాటకోజ్జీవక సమాజాన్ని స్థాపించడమే కాక భట్ట నారాయణుని వేణీ సంహారం సంస్కృత నాటకాన్ని తెలుగులో అనువదించి ప్రదర్శించాడు. ఈ నాటకంలో ధర్మరాజు, అశ్వత్థామ పాత్రలలో నటించాడు.

1883లో కందుకూరి వీరేశలింగం *అభిజ్ఞాన శాకుంతలం*, వేణీసంహారం ఆంధ్రీకరణ నాటకాలు అర్థ శతాబ్దంపాటు ఆంధ్రదేశంలో విరివిగా ప్రదర్శితమయ్యాయి. అంతేకాక, కందుకూరి వీరేశలింగం పంతులు 1885లో కాళిదాసు మాళవికాగ్నిమిత్రం అనువదించాడు. ఈ సంవత్సరంలోనే ప్రహ్లాద స్వతంత్ర నాటకాన్నీ, కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయం నాటకాన్ని ఆంధ్రీకరించడం ప్రారంభించి 1891లో పూర్తి చేశాడు.

1884-85 మధ్యకాలంలో నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలను, తెలుగు హరిశ్చంద్ర*(1888)*, చంద్రహాస చరిత్ర నాటకాన్ని రచించాడు. నాదెళ్ళ పురుషోత్తమ కవి నాటకాలలో మహారాష్ట్ర హరికథకులు పాడే టప్పాల వంటి పాటలను ప్రవేశ పెట్టాడు. నాదెళ్ళ స్ఫూర్తితో కొందరు నాటకకర్తలు తమ నాటకాలలో పాటలకు స్థానం కల్పించారు.

ధర్మవరం రామ కృష్ణమాచార్యులు అవధాన ప్రక్రియలోను, తెలుగు, కన్నడ, సంస్కృత భాషలలో కూడా నైపుణ్యం గడించాడు. ఆచార్యులు దాదాపు 30 నాటకాలు రచించినా ముద్రణకు నోచుకున్నవి 14 మాత్రమే. అజామిళతప్ప తక్కినవన్నీ గద్య, పద్య గేయాత్మకాలు.

గయోపాఖ్యానంలోని దృశ్యము

ధర్మవరం రచించిన నాటకాల్లో చిత్రనళీయం, విషాద సారంగధర విశేషంగా ప్రదర్శించారు. తెలుగులో ప్రప్రథమంగా విషాదాంత నాటకం రచించిన ఘనత ఈయనదే. పాశ్చాత్య నాటక రచనా విధానం క్షుణ్ణంగా అవగాహన చేసుకొని కృష్ణమాచార్యులు నాటక రచనకు పూనుకొన్నాడు. ఆచార్యులు నాటకకర్త, నటుడు కూడా. తన నాటకాలలో తానే ప్రధాన పాత్రలలో నటించాడు. చిలకమర్తి లక్ష్మీ నరసింహం 1889లో కీచక వధ అనే వచన నాటకంతో రచనకు శ్రీకారం చుట్టాడు. 1889లో *ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీ రామ జననం*, 1890లో *పారిజాతాపహరణం, నలనాటకం,* సీతాకల్యాణం, పార్వతీ పరిణయం (అనువాదం) నాటకాలను రచించాడు. 1905-1906 మధ్యకాలంలో ప్రసన్న యాదవం (శ్రీకృష్ణ నరకాసుర యుద్ధం), 1927 సంవత్సరంలో ప్రహ్లాద *చరిత్ర, చతుర చంద్రహాస* నాటకాలను రచించాడు.

భాసచక్రంలోని నాటకాలను కూడా అనువదించాడు. చిలకమర్తి నాటకాలలో నాటి నుంచి, నేటి వరకు ప్రదర్శింప బడుతున్న నాటకం *గయోపాఖ్యానం*. ఈ నాటకాన్ని ముందు వచనంలో రచించి, 1909లో పద్యాలు ప్రవేశపెట్టాడు. గయోపాఖ్యానం నాటక ప్రతులు ఆ రోజులలోనే లక్షకు పైచిలుకు అమ్ముడుపోయినవి.

ఈ కాలంలోనే వేదం వేంకటరాయశాస్త్రి నాటక రచనకు ఉపక్రమించి పది నాటకాలను రచించాడు. వాటిలో మూడు స్వతంత్ర నాటకాలు, తక్కినవి సంస్కృతానువాదాలు. వేదం వేంకటరాయశాస్త్రి తొలి నాటకం *నాగానందం* 1891లో రచించాడు. తన అనువాదంలో సంస్కృత భాషకు సలక్షణ గ్రాంథికం, ప్రాకృత భాషకు గ్రామ్య భేదాలను ఉపయోగించాడు. దీనిని పాత్రోచిత ప్రయోగముని తెలిపాడు. 1896లో అభిజ్ఞాన శాకుంతలం (అనువాదం), 1897లో ప్రియదర్శిక, 1916లో బబ్బిలి యుద్ధం (స్వతంత్ర నాటకం), 1919లో మాళవికాగ్నిమిత్రం (అనువాదం) 1920లో విక్రమోర్వశీయం (అనువాదం), 1921లో రత్నావళి (అనువాదం) రచించాడు. వేదం వేంకటరాయ శాస్త్రి నాటకాలలో మిక్కిలి ప్రసిద్ధి పొందిన నాటకం ప్రతాప రుద్రీయం. సాయెబులు, మంగళ్ళు, చాకళ్ళు, పామరులు, విద్యావంతులు, బాలురు, స్త్రీలు, తమిళులు మొదలైన వారి భాషా భేదాలను, అలవాట్లను, ఆచారాలను శ్రద్ధగా గమనించి సాధ్యమైనంత వరకు పాత్రోచిత భాష ఈ నాటకంలో వాడాడు. పేరిగాడు మొదలైన పాత్రల గ్రామ్యభాష , సుల్తాను మొదలైన మహమ్మదీయ పాత్రలకు దక్కనీ ఉర్దూను తెలుగుతో కలిపి వాడాడు. స్వారశ్వపుతాడు *(సారా చెంబుతాడు)* మొదలైన ప్రయోగాలు చాకళ్ళు, మంగళ్ళు మాట్లాడే పద్ధతిని పాత్ర అవసరం మేరకు ప్రవేశపెట్టాడు. ప్రతాపరుద్రీయం తరువాతి తరం వారికి నాటక రచనలో పాత్రోచిత భాషా ప్రయోగానికి మార్గం చూపించింది.

సాంఖ్యాయన శర్మ మనోరమ అనే స్వతంత్ర సాంఘిక రూపకాన్ని 1895లో ప్రకటించాడు. ఈ నాటకంలో ప్రధాన విషయం స్త్రీ విద్యావశ్యకత. ఈ నాటకంలో కూడా కొన్ని పద్యాలు ఉన్నాయి.

కోలాచలం శ్రీనివాసరావు తొలి నాటకం సునందినీ పరిణయం 1891–95 మధ్యకాలంలో ప్రకటితమయింది. కోలాచలం 30 నాటకాలు రచించాడు. కొన్ని చారిత్రకాలు, కొన్ని పౌరాణికాలు. కోలాచలం నాటకాలలో *'సుల్తాన్ చాంద్ బీబి'*, *'రామరాజు చరిత్రం'*, *'శిలాదిత్య ప్రతాపాగ్రరీయం'*, *'సునందినీ పరిణయం'*, *'లంకాదహనం'*, *'కీచకవధ'* సుప్రసిద్ధాలు. కోలాచలం నాటకాలలో పద్యాలు, పాటలు విరివిగా వాడాడు. ఈ నాటకాలనే బళ్ళారి రాఘవాచార్యులు ఎక్కువగా ప్రదర్శించాడు. ఒక విధంగా రాఘవాచార్యులు ద్వారానే కోలాచలం నాటకాలు ప్రసిద్ధిలోకి వచ్చాయి. శ్రీనివాసరావు నాటక రంగానికి చేసిన మహోపకారం *ప్రపంచ నాటక చరిత్ర* **(Dramatic History of the World)** రచించడం.

పానుగంటి లక్ష్మీనరసింహారావు 1900లో నర్మదా పురుకుత్సీయం నాటకంతో రచన ప్రారంభించాడు. పాశ్చాత్య నాటక కర్త షేక్స్పియర్ పానుగంటి లక్ష్మీనరసింహారావుకు ఆదర్శం. సుమారు ముప్ఫై నాటకాలను ఈయన రచించాడు. పానుగంటి నాటకాలలో *నర్మదా పురుకుత్సీయం, రాధాకృష్ణ, విప్రనారాయణ, పాదుక, కంఠాభరణం* విరివిగా ప్రదర్శితమై నాటకకర్తకు ఖ్యాతిని ఆర్జించి పెట్టాయి. పానుగంటి నాటకాలలో పాటలు ఉండవు. ఇక పద్యాల విషయానికి వస్తే ఆటవెలది, గీతం, సీసం అనే మూడు ఛందస్సులనే వాడాడు. వచన రచన సరళ గ్రాంథికం.

రాజా విక్రమదేవ వర్మ 1899లో *శ్రీనివాస కల్యాణం*, 1901లో *మానవతీ చరిత్ర* నాటకాలను రచించాడు. ఈ నాటకాలలో పద్యాలు, పాటలు కూడా ఉన్నాయి. షెరిడాన్ కవి రచించిన స్కూల్ ఫర్ స్కాండల్స్‌ను *అపవాద తరంగిణి* అనే పేరుతో 1901లో పోలవరం జమీందారు కొచ్చర్లకోట రామచంద్ర వేంకట కృష్ణారావు వచనానువాదం చేశాడు.

గంపలగూడెం జమీందారు కోటగిరి వేంకటకృష్ణారావు శ్రీ కృష్ణరాయ నాటకావళి పేరుతో *అభినవ పాండవీయం, పాదుషా పరాభవం, బెబ్బులి, ప్రణయాదర్శం* నాటకాలను రచించాడు. ఇతర దేశభాషల నుంచి మాచిరాజు దుర్గా శంకరామాత్యులు బెంగాలీ, మరాఠీ భాషల నుండి *శివలీల, శంభాజీ నిర్యాణం, అపోహావేశం* పేర్లతో నాటకానువాదం చేశాడు.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి 1908లో *బబ్బిలి యుద్ధం* నాటకాన్ని రచించాడు. ఇతివృత్తం బబ్బిలి రాజవంశానికి చెందింది. సరళమైన పద్యాలు, పాత్రోచితభాషను పొందుపరచిన నాటకం. 1916లో శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రి బబ్బిలి యుద్ధం నాటక పోటీలను రాజమండ్రిలో స్వయంగా నిర్వహించాడు. నాటి నుండి నేటి వరకు ఎన్నో సమాజాలు ఈ నాటకాన్ని ప్రదరిస్తూనే ఉన్నాయి. శ్రీపాద తిలకమహారాజు నాటకం కూడా ప్రసిద్ధిగాంచింది. 1922లో తిరుపతి వేంకటకవులు మూడు చారిత్రాత్మక, పది పౌరాణిక నాటకాలు, రెండు ప్రహసనాలు రచించారు.

తిరుపతి కవుల నాటకాలలో పాండవ విజయం, పాండవోద్యోగ విజయం నాటి నుంచి నేటి వరకు వివిధ సమాజాలు ప్రదర్శిస్తూ వస్తున్నవి. ఈ నాటకాలు రంగ ప్రయోగాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకున్నవి కాక సాహితీ గౌరవాన్ని కూడా సంపాదించుకున్నవి. ఈ నాటకాలలోని పద్యాలు కనీసం నాలుగైదు అయినా నోటికి రాని తెలుగు వారు ఉండరు.

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, దేశికుడు, సంగీతజ్ఞుడు, నటుడు, నాటక రచయిత. 1912లో *సత్యహరిశ్చంద్రీయం* నాటకాన్ని రచించాడు. అంతకు ముందే ధర్మవరం రామకృష్ణ మాచార్యులు, కందుకూరి వీరేశలింగం పంతులు ఇంకా కొంత మంది హరిశ్చంద్ర నాటకాన్ని రాసినా, బలిజేపల్లి నాటకానికే ఖ్యాతి వచ్చింది. కారణాలు ముఖ్యంగా ఈ నాటకాన్ని గుంటూరు ఫస్ట్ కంపెనీ ప్రదర్శించడం (ఈ కంపెనీలో హరి ప్రసాద రావు, కొంపల్లి హనుమంత రావు, బలిజేపల్లి ప్రసిద్ధ నటులు), సత్యహరిశ్చంద్ర నాటక పోటీలకు బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటకాన్నే ఎన్నుకోవడం, ఈ నాటకంలోని పద్య రచన విశిష్టత కావచ్చు.

బలిజేపల్లి *బుద్ధిమతీ విలాసం(1905)*, *ఉత్తర రాఘవం (1910)*, *సాత్రాజితీయం* అనే నాటకాలను రచించినా ఒక్క సత్య హరిశ్చంద్రీయం నాటకం మాత్రమే తెలుగు నేల అంతటా నాటి నుంచి నేటి వరకు ప్రదర్శింపబడుతున్నది.

ధర్మవరం గోపాలాచార్యులు (ధర్మవరం రామకృష్ణ మాచార్యుల సోదరులు) మొత్తం 12 నాటకాలు రాసినట్లు తెలుస్తున్నది. కాని ఈయన *రామదాసు, రాంకబీరు, సుభద్రా పరిణయం, ప్రేమచంద్ర యోగి, రుక్మిణీకృష్ణీయం*, నాటకాలు మాత్రమే ముద్రింపబడ్డాయి.

నాటక రచనలో కొంత వైవిధ్యం, కొత్త పోకడలను కాళ్ళకూరి నారాయణ రావు ప్రవేశపెట్టాడు. ఈయన నాటక రచన మూడు విధాలుగా సాగింది. పౌరాణికాలు, సాంఘికాలు, ప్రహసనాలు. ఈయన నాటకాలలో అధిక ప్రచారం పొందినవి సాంఘిక నాటకాలే. కాళ్ళకూరి 1909లో *చిత్రాభ్యుదయం* అనే నాటకాన్ని సారంగధర కథను ఇతివృత్తంగా తీసుకొని, పెక్కు మార్పులు చేశాడు. 1919లో *పద్మవ్యూహం*, 1921లో *చింతామణి*, 1922లో *వరవిక్రయం*, 1926లో *మధుసేవ* నాటకాలను రచించాడు. చింతామణి నాటకంలో కృష్ణ కర్ణామృత కర్త లీలాశుకుని నాయకునిగా చేసి, చమత్కారం చేసి, దాదాపు చారిత్రాత్మక నాటకమేమోయని భ్రాంతిని కలుగజేశాడు. మధుసేవలో మద్యపానం వల్ల కలిగే కష్టనష్టాలను చిత్రించాడు. ఈయన నాటకాలన్నింటిలో పద్యాలున్నాయి, పాత్రోచిత భాష, పాత్రోచిత పద్యరచన, ప్రయోగ సౌలభ్యం కలిగి ఉన్నాయి. చింతామణి, వర విక్రయం నాటకాలు నాటి నుంచి నేటికీ ప్రదర్శింపబడుతున్నాయి.

స్వరాజ్యోద్యమ ప్రభావంతో రసపుత్ర విజయం అనే చారిత్రక నాటకాన్ని 1910లో ఇచ్చాపురపు యజ్ఞ నారాయణ రచించాడు. ఆ రోజులలో ఈ నాటకాన్ని ప్రదర్శించని సమాజమే లేదు. ఇప్పుడు ఈ నాటకం మరుగున పడిపోయింది.

శ్రీ రాముల సచ్చిదానంద శాస్త్రి 1915 ప్రాంతాన సావిత్రి నాటకాన్ని రచించిగా, మైలవరం కంపెనీ ప్రసిద్ధిలోకి తెచ్చింది. మల్లాది అచ్యుతరామ శాస్త్రి రాసిన ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకాన్ని కూడా మైలవరం కంపెనీ ప్రసిద్ధిలోకి తెచ్చింది. ఇక ముత్తరాజు సుబ్బారావు నాటకాలలో మిక్కిలి ప్రసిద్ధి గాంచిన నాటకం శ్రీ కృష్ణతులాభారం 1920లో రచించాడు. రెండవ నాటకం కచదేవయాని (1939), మూడవనాటకం భక్త మార్కండేయ (1940). శ్రీకృష్ణ తులాభారం తప్ప తక్కిన నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు కనబడదు.

చందాల కేశవదాసు ప్రసిద్ధ నాటకం *కనకతార*(1911). ఈయనే పరబ్రహ్మ పరమేశ్వరపాటను రచించాడు. ఈ గీతాన్నే నాటి నుంచి నేటి వరకు అన్ని నాటక సమాజాలు ప్రార్థనాగీతంగా పాడుతున్నాయి.

బందరు నాటక సమాజానికి, గున్నేశ్వరరావు కంపెనీకి ద్రోణంరాజు సీతారామారావు నాటకాలు రాసి ఇచ్చాడు. వీటిలో *విజయ బబ్బిలి (1912)*, *పీష్వా నారాయణ రావు (1912)*, చతుర చంద్రహాస, సారంగధర నాటకాలు ప్రసిద్ధాలు. *శ్రీ రామ జననం*, *శ్రీరామ ప్రవాసం (1914)*, *శ్రీ రామోద్యోగం*, *శ్రీరామ విజయం*, *శ్రీ రామాశ్వమేధం* అనే అయిదు నాటకాలను కూడా రచించాడు.

సోమరాజు రామానుజరావు *ధరణికోట*, కాళిదాసు, సక్కుబాయి, దాన వీర *కర్ణ, రంగూన్ రౌడీ, తాజ్ మహల్, ప్రతాపరుద్రీయం'* మొదలైన నాటకాలను రచించాడు.

ఇక 1920-1940 మధ్యకాలంలో రచించబడిన నాటకాలలో నూతన ప్రయోగాలు జరిగాయి. ఈ ప్రయోగాలను మూడు విధాలుగా విభజించవచ్చు. మొదటిది భావ వైవిధ్యం, రెండవది రచనా వైవిధ్యం, మూడవది ప్రదర్శనా వైవిధ్యం. 1920-25 మధ్య కాలంలో దేశభక్తి పూరితాలు, సంఘ సంస్కరణాత్మక నాటకాలు రచించి ప్రదర్శించారు. 1925-30 మధ్య కాలంలో ప్రయోగాత్మకాలు, సంఘుతిరస్కారాలు, 1935-40 మధ్య కాలంలో ఆంధ్ర సంస్కృతీ నిరూపణాత్మకమైన నాటకాలు వెలుగుచూశాయి.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో కొందరు దేశభక్తి పూరితమైన నాటకాలు రచించారు. దామరాజు పుండరీకాక్షుడు *గాంధీమహోదయం, గాంధీవిజయం, పాంచాల పరాభవం* (1921-22) రచించాడు. తెలుగులో రాజకీయ నాటకాలు లేని కొరతను ఈ రచనలు కొంత వరకు తీర్చాయి.

శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి తిలక మహారాజు (1921), గాంధీ విజయ ధ్వజ నాటకం (1924) రచించాడు. డి. సీతారామయ్య స్వరాజ్యరథం (1921), జంధ్యాల అయ్యవారి శాస్త్రి అలీ ప్రభృతుల నిర్బంధం (1921) అనే రాజకీయ నాటకాలు రాశారు. కేవలం సాహిత్య దృష్టితో రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, చింతాదీక్షితులు, అబ్బూరి, తల్లావఝుల, నోరి మొదలైన వారు నాటక రచన చేశారు. సీతావనవాసం (పౌరాణికం), కుంభరాణా (చారిత్రాత్మకం), మాధవ విజయం (మిశ్రమం) అనే నాటకాలను 1935లో దువ్వూరి రామిరెడ్డి రచించాడు. కుంభరాణా బహుళ ప్రదర్శనలకు నోచుకుంది. విశ్వనాథ సత్యనారాయణ నర్తనశాల,వేనరాజు, త్రిశూలం, అనార్కలి మొదలైన నాటకాలను రచించాడు.

సంఘ తిరస్కారవాదులలో ప్రథముడు త్రిపురనేని రామస్వామి చౌదరి. భారత, రామాయణ, భాగవతాలకు సంబంధించిన మూడింటిపైన కురుక్షేత్ర సంగ్రామం, శంబుకవధ, ఖూనీ అనే మూడు నాటకాలు రచించాడు.

1940 తరువాత నాటక రచయితల దృష్టి వచన నాటకాల వైపు మళ్ళి పద్య నాటక రచనకు క్షీణ దశ ప్రారంభమైందని చెప్పవచ్చు. 1940 తరువాత పద్య నాటక రచన అంతగా జరగలేదు. 1946లో వావిలాల సోమయాజులు నాయకురాలు, తాంధ్ర సుబ్రహ్మణ్యం శ్రీ రామాంజనేయ యుద్ధం (1948), 1949లో వసంత సేన, కణ్వశ్రీ బాలనాగమ్మ (1950) ప్రకటింపబడినది.

కొప్పరపు సుబ్బారావు తారాశశాంకం, సూరిబాబు రాజేశ్వరి, బేతా వేంకటరావు శ్రీ రామాంజనేయ యుద్ధాన్ని, పూర్ణిమ 'నాయకురాలు' నాటకాన్ని ప్రసిద్ధిలోకి తెచ్చారు. 1950-60 మధ్య కాలంలో కొంత మంది రచయితలు పద్య నాటకాలను రచించినా అంతగా ప్రసిద్ధిలోకి రాలేదు.

1960 నుంచి ఇప్పటివరకూ రచింపబడిన పద్య నాటకాలు బహుస్వల్పం పి.వి.భద్రం తులసీ జలంధర, నర్తన శాల, పెమ్మ రాజగోపాల కృష్ణమూర్తి మహారథికర్ణ, నర్తనశాల, పంచ నాదం, మోహినీ భస్మాసుర, రామ భక్త హనుమాన్, కాళిదాసు, వేమన యోగి, గంగిశెట్టి లక్ష్మీనారాయణ శ్రీ వేమన, అన్నపర్తి సీతా రామాంజనేయులు బలరామ విజయం'ధర్మవరం, బండ్ల సుబ్రహ్మణ్యం ప్రహ్లాద, బుద్ధ చరిత్ర మొదలైన నాటకాలను రచించారు. పల్లేటి లక్ష్మీ కులశేఖర్, కొలకలూరి ఇనాక్, మీగడ రామలింగస్వామి మొదలైనవారు కూడా నాటక రచన చేస్తున్నారు. అయితే పోటీలను దృష్టిలో పెట్టుకొని రచనలు చేస్తున్నారు.

ఇక ప్రదర్శనల విషయానికొస్తే తెలుగుదేశంలో నాటక ప్రదర్శనలకు స్ఫూర్తి నిచ్చింది ధార్వాడ నాటక సమాజం. ఈ ప్రదర్శనలు చూసిన కందుకూరి వీరేశలింగం ప్రప్రథమంగా, విద్యార్థులతో నాటక సమాజాన్ని స్థాపించి, ధార్వాడ వారు ప్రదర్శనలు నిర్వహించిన పాకలోనే రత్నావళి, చమత్కార రత్నావళి నాటకాలను ప్రదర్శింప చేశాడు.

ధార్వాడ ప్రదర్శనల స్ఫూర్తితోనే గుంటూరులో 1880-81 మధ్య కాలంలో కొండుభట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, తోలేటి అప్పారావు, పాతూరి శ్రీరాములు, పోలూరి హనుమంత రావులతో గుంటూరు హిందూ నాటక సమాజాన్ని స్థాపించారు. పాకలు వేయడం, తెరలు సిద్ధం చేయడం, నాటక రంగంలోని పాత్రలకు కావలసిన దుస్తులు, సామాగ్రి సమకూర్చే బాధ్యతను పొత్తూరు కృష్ణయ్య నిర్వహించే వాడు. భువనగిరి హనుమద్దీక్షితులు, భాగవతుల రాఘవయ్య, భాగవతుల చెన్న కృష్ణయ్య సమాజాన్ని శ్రద్ధగా నడిపేవారు. ఈ సమాజంలోనే మల్లాది సోమయాజులు, ఇవటూరి వియ్యన్న విదూషక పాత్రలను, చెన్నూరి సూర్యప్రకాశరావు, భువనగిరి సూర్యనారాయణ స్త్రీ పాత్రలు ధరించేవారు. దేశ భక్త కొండా వెంకటప్పయ్య ఈ సమాజంలో కొంత కాలం స్త్రీ పాత్రలలో నటించాడు. ఈ సమాజానికే తదుపరి గుంటూరు ఫస్ట్ కంపెనీగా పేరులోకి వచ్చింది.

1880-82ప్రాంతంలో బందరులో జువెనైల్ హిందూ థియెటర్ పేరుతో దేవరసు వెంకట శివరావు బాలకృష్ణయ్యల ప్రోత్సాహంతో స్థాపింపబడింది. ఈ సమాజం మొదట తెలుగు నాటకాలే ప్రదర్శించినా ఆ తదుపరి హిందీ నాటకాలు కూడా ప్రదర్శించింది. ఈ సమాజం నాదెళ్ళ పురుషోత్తమ కవి రచించిన 32 హిందీ నాటకాలను ప్రదర్శించింది. ఈమని లక్ష్మణ స్వామి ఈ సమాజ నాటకాలలో పాత్రలు ధరించి ప్రసిద్ధిపొందాడు. ఈ సమాజం 1900 నుంచి తెలుగు నాటకాలు కూడా ప్రదర్శించడం ఆరంభించింది. వెంపటి వేంకటేశ్వర్లు, వంగల ఆంజనేయులు, గుర్తి రామమూర్తి, తాడేపల్లి వెంకట కృష్ణయ్య ఈ కంపెనీలోని ఆ నాటి ప్రసిద్ధ నటులు.

1882 లో రాజా అంకితం జగ్గారావు విశాఖ పట్టణంలో జగన్మిత్ర సమాజాన్ని స్థాపించాడు. మొదట్లో షేక్స్పియర్ నాటకాలను తరువాత కొన్ని సంస్కృత నాటకాలను ప్రదర్శించినట్లు తెలుస్తున్నది. 1890లో మొసలికంటి సూర్యనారాయణ పంతులు ప్రోత్సాహంతో ఈ సమాజం ఉన్నత స్థితికి వచ్చింది. తెన్నేటి జగన్నాధరావు, గోటేటి

కామేశ్వరరావు (స్త్రీ పాత్రలు), కాదంబరి జగన్నాధరావు, సెట్టి లక్ష్మీనరసింహం, నీలమణి పాణిగ్రాహి మున్నగువారు ప్రసిద్ధ నటులు.

1884లో రాజమండ్రిలో వడ్డాది సుబ్బారాయుడు (వ.సు.రాయకవి) హిందూ నాటకోజ్జీవక సమాజాన్ని స్థాపించాడు. ఈ సమాజం వేణీ సంహారం నాటకాన్ని ప్రదర్శించేది. కనుపర్తి శ్రీరాములు అశ్వత్థామగాను, వసురాయకవి ధర్మరాజుగాను, సుసర్ల శ్రీనివాసరావు ద్రౌపదిగాను, సుసర్ల అనంతరావు దుర్యోధన పాత్రలలో నటించాడు.

1884లో బందరులో హిందూ థియేటరు స్థాపించబడింది. ఈ సమాజం హిందీ నాటకాలతో పాటు తెలుగు నాటకాలు కూడా ప్రదర్శించింది. ఈ సమాజ సభ్యులందరూ విద్యావంతులు, ఉద్యోగస్థులు. ప్రాచీన నాట్య లక్షణాలు చక్కగా పాటించేవారు. ఇవటూరి నాగభూషణం హరిశ్చంద్ర పాత్రను గండి కోట నరసింగరావు అర్జునుడు, అశ్వత్థామ, కృష్ణుడు పాత్రలను సమర్థవంతంగా నిర్వహించి ప్రేక్షకుల మెప్పు పొందారు. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు విద్యార్థిదశలో ఈ సమాజంలో స్త్రీ పాత్రలలో నటించేవాడట.

1885లో కాకినాడలో దినవహి హనుమంత రావు హిందూ నాటక సమాజం స్థాపించాడు. ఈ సమాజంలో జయంతి భావన్నారాయణ(కవి) కూడా సభ్యుడే. ఈ సమాజానికి సింగితపు అబ్బాయి మేనేజరు. పైజర్సు అప్పారావు, అనేపాలు భీమసేనరావు, కంచి ఆనందరావు, వల్లూరి సూర్యప్రకాశం, కోపల్లె రమణరావు, రాయవరపు హనుమంత రావు మొదలైనవారు వివిధ పాత్రలు ధరించే వారని చిలకమర్తి లక్ష్మీనరసింహం స్వీయ చరిత్రలో ఉంది. ఈ సమాజపు రెండవ దశలో దినవహి కృష్ణమూర్తి, ఆలమూరు పట్టాభిరామయ్య, వెదురుమూడి శేషగిరి రావు, ముప్పిడి జగ్గరాజు నటులుగా ప్రసిద్ధికెక్కారు.

ధార్వాడ నాటక సమాజం స్ఫూర్తితో నెల్లూరులో రెండు నాటక సమాజాలు నెలకొన్నాయి. ఒకటి లక్ష్మీ విలాస నాటక సభ రెండవది గూడూరు కంపెనీ. లక్ష్మీ విలాస నాటక సభ లో గడ్డం శేషయ్య, న్యావతి కృష్ణస్వామి రావు, న్యావతి వాసుదేవ రావు, మధ్యపతి సత్యసంధరావు ప్రముఖ నటులు. గూడూరు కంపెనీలో శీనయ్య, పురుషోత్తములు ప్రముఖులు.

ధార్వాడ సమాజం రెండవసారి ఆంధ్రదేశంలో ప్రదర్శన నిర్వహించిన సమయంలో వారు ప్రదర్శించిన పీష్వానారాయణ రావు వధ, ఉషా పరిణయం, కీచకవధ మొదలైన నాటకాలను చూసి టంగుటూరి ప్రకాశంపంతులు, ఉండవల్లీ సాహెబు అనే ఉర్దూ పండితుడు, ఇమ్మానేని హనుమంతరావు నాయుడు ఉత్తేజం పొందారు. ప్రకాశం పంతులు స్త్రీ భూమికలనే కాక పీష్వానారాయణ రావు మొదలైన భూమికలను కూడా నటించాడు. ఉండవల్లీ సాహెబు ఉర్దూలో నాటకాలను రచించగా వీరందరూ తెలుగు లిపిలో తమ సంభాషణలను రాసుకొని కంఠస్థం చేసేవారట. ఈ సమాజం **1886** వరకు నడిచింది. ఈ సంవత్సరంలోనే హనుమంతరావు నాయుడు, ప్రకాశం పంతులు రాజమండ్రికి వచ్చారు.

1886-1912 మధ్య కాలంలో నాటక సమాజాలు మహోజ్వలంగా ప్రకాశించాయి. ప్రతి సమాజం నుంచి ఎందరెందరో మహానటులుగా తీర్చి దిద్దబడి, తెలుగు నాటక కళామతల్లిని అర్చించారు. ఆ కాలాన్ని వికాస యుగం అని పిలవవచ్చు.

వివిధ కాలాల్లో నాటక రంగ వికాసం కోసం ఆంధ్ర దేశంలో అనేక నాటక సమాజాలు అవిరళ కృషి చేశాయి. వాటిలో సరస వినోదినీసభ (బళ్ళారి), హిందూ నాటక సమాజం (రాజమహేంద్రవరం), సుగుణవిలాస సభ (మద్రాసు), గుంటూరు ఫస్టు కంపెనీ, కళాభిలాష నాటక సమాజం (విశాఖపట్నం), గుంటూరు సెకండ్ కంపెనీ, ఆంధ్ర భాషాభిమాని సమాజం(నెల్లూరు), సుమనోరమసభ (బళ్ళారి), హిందూ థియేట్రికల్ సొసైటీ(పిఠాపురం), సంగీత మానినీ సమాజం (విశాఖ పట్టణం), రమావిలాస్ అమెచ్యూర్స్ (శ్రీకాకుళం), అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ (పర్లాకిమిడి), మైలవరం కంపెనీ(బెజవాడ), విజయ రామ డ్రమెటిక్ అకాడమీ (విజయనగరం), మోతేవారి కంపెనీ (ఏలూరు), రామ విలాస సభ (చిత్తూరు), శ్రీ కృష్ణహిందూ థియేటర్(తెనాలి),శ్రీ రామ విలాస సభ(తెనాలి), జగన్నాధ విలాసినీ సభ (బరంపురం), ఆంధ్ర ప్రచారక సంఘం(టెక్కలి), హిందూ థియేట్రికల్ క్లబ్ (ఛత్రపురం), వాణీ విలాస సభ(విజయనగరం), హితోపకారిణీ సమాజం (విశాఖ పట్టణం), యంగ్ మెన్స్ హేపీ క్లబ్(కాకినాడ), ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ(బందరు) మొదలైన నాటక సంస్థలు ప్రసిద్ధి చెందాయి.

జి.ఎస్.ఎన్

చారిత్రక నాటకాలు

చారిత్రక నాటకం అనే ముద్రతో కాకపోయినా కొన్ని శతాబ్దాల క్రితమే మన సంస్కృత కవులు చారిత్రకాంశాలతో నాటకాలు రాశారు. కాళిదాసు మాళవికాగ్ని మిత్రం, విశాఖదత్తుని ముద్రారాక్షసం ఈ కోవకు చెందినవే.

తెలుగులో చారిత్రక నాటక రచన పందొమ్మిదో శతాబ్దం చివరి పాదంలో ప్రారంభమైంది. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో చారిత్రక నాటకాలు విరివిగా వెలువడి, ఉద్యమానికి బాసటగా నిలిచాయి. స్వాతంత్ర్యానంతరం కూడా కొన్ని నాటకాలు కాంతులు వెదజల్లాయి. వాటి వైభవం నేడు అంతరించినా వాటి విశిష్టత చెక్కుచెదరకుండా ఉంది.

గతకాలపు పునాదిరాళ్ళపై నిలిచి సమకాలీన సమాజానికి స్ఫూర్తి నిచ్చే చారిత్రక నాటకాలు భారత జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించాయి. సగటు మనిషిలో దేశభక్తిని, జాతీయభావాన్ని ప్రోదిచెయ్యడంలో అప్పటి నాటకాలు నిర్వహించిన పాత్ర అనుపమానం. స్వాతంత్ర్యాభిలాషకు ప్రాణవాయువులూదే క్రమంలో 1920-30 సంవత్సరాల మధ్య విరివిగా చారిత్రక నాటకాలు వెలుగుచూశాయి. స్వాతంత్ర్యానికి పూర్వమే కాక స్వాతంత్ర్యానంతరం కూడా కొన్ని నాటకాలు రాకపోలేదు. చరిత్ర మడతల్లో నలిగి, జ్ఞాపకాల పొరల్లో దాగిన త్యాగధనులైన వీర పుత్రుల సాహస గాథలను తవ్వి మన కవులు నాటకాలుగా రూపొందించారు. చంద్రగుప్త, అశోక రాజ్యం వంటి మౌర్య రాజుల నాటకాలు, నాయకురాలు, పల్నాటి వీర చరిత్ర, బబ్బిలి యుద్ధం, వంటి ఆంధ్రవీరుల నాటకాలు, పృధ్వీ సంయుక్త, రసపుత్ర కదనం, రాణాప్రతాప సింహ వంటి రసపుత్ర వీరుల నాటకాలు, శివాజీ, శంభాజీ, పీష్వానారాయణరావు వధ వంటి మరాటీ వీరుల నాటకాలు స్వాతంత్ర్యోద్యమానికి దోహదం చేశాయి. ఇదే నేపథ్యంలో రాసిన *గాంధీ విజయ ధ్వజం*, తిలకు రాయబారం వంటివి కూడా చారిత్రక నాటక పంక్తిలో చేరినవే.

తెలుగులో వచ్చిన మొట్టమొదటి చారిత్రక నాటకం వేదం వేంకటరాయ శాస్త్రి ప్రతాపరుద్రీయం (1897). ఆ తరువాత చారిత్రక నాటక వాఙ్మయంలో సుమారు 200 నాటకాలు చోటు చేసుకొన్నాయి. వీటిలో 130 పద్య నాటకాలు కాగా, 40 వచన నాటకాలు, 30 నాటికలు. పద్య నాటకాలు రాసిన వారిలో వేదం వేంకటరాయ శాస్త్రి, శ్రీ పాద కామేశ్వరరావు, గుండిమెడ వెంకట సుబ్బారావు, సోమరాజు రామానుజ రావు తదితరులు ముఖ్యులు. ఆచార్య ఆత్రేయ, కొండముది గోపాల రాయశర్మ కొడాలి గోపాల రావు, నార్ల చిరంజీవి, కోడూరి శ్రీరామశర్మ మొదలైన వారు వచన నాటకాలను రచించారు. వచన నాటికలు రాసిన వారిలో ఆమంచర్ల గోపాలరావు, బుచ్చిబాబు, ముదిగొండ శివప్రసాద్. సి.నారాయణ రెడ్డి, మన్నె శ్రీనివాస రావు ప్రభృతులు ముఖ్యులు.

వేదం వేంకటరాయ శాస్త్రి (1853-1929) ప్రతాపం రుద్రీయం చారిత్రక నాటకం 1897లో వెలువడింది. కాకతీయ రాజుల కథ. నాటక సాహిత్యంలో గుర్తింపు పొందిన మొట్టమొదటి చారిత్రక నాటకం కావడం ఒక ప్రత్యేకత అయితే, ఈ నాటకంలో పాత్రోచిత భాషా ప్రయోగం రెండవ ప్రత్యేకత. పద్య నాటకాల్లో సున్నిత హాస్యం ప్రవేశ పెట్టిన తొలి రచయిత వేదం వేంకటరాయ శాస్త్రి.

ఈ నాటకంలో చారిత్రకాంశాల కంటె కల్పన పాలెక్కువ. తన తండ్రి చెప్పిన కాకతీయ రాజుల కాలం నాటి ఒక ఐతిహ్యాన్ని ఆధారం చేసుకొని స్వకపోల కల్పనతో ఇతి వృత్త నిర్మాణం చేసి వేదం ప్రతాపరుద్రీయం నాటకాన్ని రచించాడు. ప్రతాపరుద్రుణ్ని ఢిల్లీ సుల్తాన్ సేనలు బంధించి ఢిల్లీకి తీసుకుపోవడం, మార్గమధ్యంలో నర్మదానదీ తీరాన ప్రతాపదుద్రుడు ఆత్మహత్య చేసుకొని మరణించటం అనే అంశాన్ని మాత్రమే చరిత్ర ధృవపరుస్తోంది. యుగంధర మంత్రి తమ రాజును విడిపించడం అనేది కల్పితమే. పది అంకాలుగా విభజింపబడిన ఈ నాటకం పద్యాలు, శ్లోకాలు, పాటలతో కూర్చబడి రెండు రాత్రుల ప్రదర్శనకు సరిపోయేలా ఉంటుంది. అయితే పూర్తి నాటకాన్ని ఏ సమాజమూ ప్రదర్శించ లేదు, కుదించు కొని ప్రదర్శించేవారు.

ప్రతాపరుద్రీయం నాటకాన్ని అనేకసార్లు ప్రదర్శించిన నెల్లూరు ఆంధ్రభాషాభిమాని సమాజం ఆ నాటకానికి అజరామరమైన కీర్తిని ఆర్జించిపెట్టింది. ఈ నాటకానికి వేదం వారే దర్శకత్వ బాధ్యత వహించాడు. ఈ నాటకంలో కొన్ని పాత్రలకు తురక తెలుగు, గ్రామ్య భాషవాడటం ఆనాటి పండిత గణానికి కోపం తెప్పించింది. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు ప్రతాప రుద్రీయం నాటకాన్ని తీవ్రంగా విమర్శించారు. ఏది ఏమైనా ప్రతాప రుద్రీయం చాలాసార్లు ప్రదర్శించబడి బహుళ జనాదరణ పొందిన విషయం కాదనలేని సత్యం. వేదం సృష్టించిన యుగంధరుడు, పేరిగాడు, కల్పిత పాత్రలే అయినా నేటికీ అవి సజీవ పాత్రలుగా నాటక సాహిత్యంలో స్థిరపడ్డాయి. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో అపశ్రుతులు వినిపించిన సందర్భాల్లో పేరిగాడి రాజ్యాన్ని తలంపుకు తెచ్చుకోవడం పరిపాటి అయింది. ప్రతాపరుద్రీయం తొమ్మిది సార్లు పునర్ముద్రణం పొందడం ఆ నాటకానికి గల ప్రాశస్త్యాన్ని, ప్రాచుర్యాన్ని ప్రస్ఫుటం చేస్తుంది.

తెలుగులో నాటక రచన ***1860***లో ప్రారంభమైనా ***1900*** వరకూ మందకొడిగా సాగింది. అట్లే చారిత్రక నాటక రచన కూడా పందొమ్మిదో శతాబ్దం చివరి వరకూ చెప్పుకో తగినంతగా పురోగమించలేదు. పనప్పాకం శ్రీనివాసాచార్యులు రచించిన శివాజి (1897), హెచ్.కృష్ణమూర్తి రాసిన పెనుగొండ దుర్గం (1897), కాశీ భట్టబ్రహ్మయ్య శాస్త్రి రచించిన 'విక్టోరియా విలాసం' (1898), కాళ్ళకూరి సాంబశివరావు రాసిన *రంగ రాయకదన సమవకారం (1899)* అనే చారిత్రక నాటకాలు వెలువడ్డాయి. ఇవి విరివిగా ప్రదర్శనకు నోచుకొన్న నాటకాలుగా కనబడవు. శ్రవ్య నాటక పంక్తిలోనే వీటికి గుర్తింపు.

పలనాటి యుద్ధంలోని దృశ్యం

ప్రారంభ దశలో నాటకాలు చారిత్రక దృష్టితో కాక అంత వరకు వస్తున్న పౌరాణిక ఇతి వృత్తాలకు భిన్నంగా ఉండాలన్న భావనతో నాటకకర్తలు చారిత్రక నాటక రచన చేపట్టినట్టు స్ఫురిస్తుంది. ఒక స్వల్పమైన చారిత్రక సంఘటనను తీసుకొని దానికి అధిక భాగం కల్పన జోడించి, సమంజసమైన చారిత్రక నేపథ్యం లేకుండానే నాటకాలు రాయడం అనేక చారిత్రక నాటకాలలో ద్యోతక మౌతున్న లోపమే.

1900 సంవత్సరం తర్వాత చారిత్రక నాటక రచనలో అనుకోని మార్పొచ్చింది. స్వాతంత్ర్యోద్యమం ఒక కొత్త మలుపు తిరగడమే దానికి కారణం. దాదాభాయి నౌరోజీ అధ్యక్షతన 1906 డిసెంబరులో కలకత్తాలో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలలో స్వరాజ్య తీర్మానం ఆమోదించబడటంతో దేశ ప్రజల్లో స్వాతంత్రేచ్ఛ, జాతీయ భావం పెల్లుబికింది. దేశ భక్తి భావాన్ని పెంపొందించే దిశలో చరిత్ర పుటల్లో దాగిన వీరుల కథలను నాటకాలుగా రూపొందించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగాయి. తత్ఫలితంగా 1900-1919 మధ్యకాలంలో సుమారు 50 చారిత్రక నాటకాలు వెలుగుచూశాయి. అప్పటికే పౌరాణిక పద్య నాటకాలు విజృంభించి వీర విహారం చేస్తూ ప్రజాహృదయాలను ఆకర్షిస్తున్న కారణంగా, చారిత్రక నాటకాల్లో పద్యాలు ఉంచడం అనివార్యమైంది. కొన్ని నాటకాల్లో పాటలు కూడా అధిక సంఖ్యలో చోటుచేసుకున్నాయి.

1884 ప్రాంతాలలో నాదెళ్ళ పురుషోత్తమకవి శ్రీరామ దాస చరిత్రం అనేపేరుతో రాసిన నాటకం రామదాసు నాటకాలలో మొదటిది.1904లో పానుగంటి లక్ష్మీనరసింహారావు రాసిన ప్రచండ చాణక్యం ఆ తరువాతి కవులకు స్ఫూర్తినిచ్చింది. అలాగే బాలాంత్రపు వెంకటరావు, చాగంటి శేషయ్యలు రచించిన సతీ సంయుక్త నాటకం అదే చారిత్రకాంశంపై వచ్చిన రచనలకు వేగు చుక్క అయింది. గోల్కొండ నవాబు కాలం నాటి రామదాసు చరిత్ర, కోలాచలం శ్రీనివాసరావు రామదాసు చరిత్ర (1907) వెలువడింది.

ధర్మవరం రామకృష్ణమాచార్యుల సమకాలికుడైన కోలాచలం శ్రీనివాస రావు (1854-1919) 30 నాటకాలు రాశాడు. వాటిలో పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలున్నాయి. కాని కోలాచలం కీర్తి స్తంభం రామరాజు చరిత్రం అనే చారిత్రక నాటకం మీదనే ఆధారపడి ఉందని చెప్పవచ్చు. శ్రీనివాసరావు ఆరు చారిత్రక నాటకాలను రచించాడు. అవి. సుల్తానా చాంద్ బీ (1907), రామరాజు చరిత్రం (1907), మైసూరు రాజ్యాం (1910), శిలాదిత్య (1915), చంద్రగిర్యభ్యుదయం (1915) ప్రతాపాగ్బరీయం. ధర్మవరం వలె కోలాచలంది ప్రబంధశైలి.

సైనికుని పాత్రకైనా జటిల గ్రాంధిక భాషనే ప్రయుక్తం చేశాడు. వ్యావహారిక భాషను కావ్యభాషగా అంగీకరించని మనస్తత్వం ఈయనది. ఈయన రాసిన **Dramatic History of the World** (ప్రపంచ నాటక చరిత్ర) ప్రామాణిక గ్రంథంగా ప్రసిద్ధిచెంది కోలాచలం కీర్తిని ఇనుమడింపజేసింది. కోలాచలం నాటకాలను సుమనోరమ సభ బళ్ళారి ప్రాంతంలోనే కాక ఆంధ్రప్రదేశంలో పలుతావుల్లో ప్రదర్శించి నాటక కర్తగా కోలాచలం పేరును శాశ్వతం చేసింది. ధర్మవరంకి ఆంధ్ర నాటక పితామహుడు అన్న బిరుదు దక్కినట్లే కోలాచలంను ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడు అన్న బిరుదు వరించింది.

తళ్ళికోట యుద్ధంలో ఓటమిపాలై విజయనగర సామ్రాజ్యం పతనం కావడం రామరాజు చరిత్రం నాటకంలో ప్రధాన ఇతివృత్తం. ఆ యుద్ధంలో రామరాజు శిరస్సు ఖండించిన వాడు అతని సేనాధిపతులలోని ఒక మహమ్మదీయుడని ఒక చరిత్రకారుడు రాసిన అంశాన్ని ఆధారం చేసుకొని కోలాచలం పఠాన్‌రుస్తుం అనే పాత్రను, అతనికి తోడుగా ఆషాబీ పాత్రను సృష్టించాడు. తాను రామరాజుకు పుట్టిన అక్రమ సంతానం అనే ద్వేషాన్ని పెంచుకొని రామరాజు పతనాన్ని కాంక్షించే పగబట్టిన పాము పఠాన్ రుస్తుం. నాటకంలో ఇతనే ప్రధాన పాత్ర. కోలాచలం నాటకాల్లో నాయక పాత్రపోషించి ఆ నాటకాలకు చిరయశస్సు తెచ్చిపెట్టిన మహానటుడు బళ్ళారి రాఘవ. పఠాన్ పాత్రను అత్యంత ఆకర్షణీయంగా పోషించి ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాడు. అయితే ఆ పాత్ర సృష్టిపై ఆ రోజుల్లో అనేక విమర్శలు వచ్చాయి. పురాణం సూరిశాస్త్రి తన నాట్యంబుజం లో పఠాన్ పాత్ర అనౌచిత్యాన్ని ప్రస్తావిస్తూ ఈ విధంగా పేర్కొన్నాడు. ''పఠాన్ ఉదార స్వభావుడు కాడు, మాతాపితరుల యందాదరణ గలవాడు కాడు, శృంగార నియమముల నెరింగిన వాడు కాడు నీచ కార్యము నెదిరించు నీతి గుణోపేతుడు కాడు. క్షాత్ర ధర్మమునెదుర్కొని వృద్ధునైనను పోరాడవాడు కాడు. ద్రోహి, కృతఘ్నుడు, విశ్వసఘాతకుడు, కుట్రమారి, దొంగపోటులవాడు, నీచుడు అట్టి వానిని నాయకుడ్నిగా చేసి ప్రాధాన్యతను కట్టబెట్టడంలోని ఔచిత్యాన్ని'' ప్రశ్నించారు. ఏది ఏమైనప్పటికీ బళ్ళారి రాఘవ అద్భుత నటనావైదుష్యంతో రామరాజు చరిత్రం నాటకం జనరంజకమై ప్రఖ్యాతిపొందింది. అయితే ఈ నాటకం హిందూ-ముస్లీం ఐక్యతకు భంగకరంగా ఉందనే సాకుతో 1918లో ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధాజ్ఞ విధించింది.

1908లో శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి రాసిన *బబ్బిలి యుద్ధం* ప్రదర్శనకు అన్ని విధాలా సౌలభ్యం గల విషాదాంత నాటకం. కృష్ణమూర్తి శాస్త్రి రచించిన 32 నాటకాలలో ఇదే ఆయనను నాటక కర్తగా నిలబెట్టిన నాటకం. *బబ్బిలి యుద్ధం* ఇతివృత్తంతో వివిధ కాలాల్లో మరికొన్ని నాటకాలు వెలువడినాయి. వేదం వేంకటరాయ శాస్త్రి *బబ్బిలి యుద్ధం* (1916), సోమరాజు రామానుజరావు *ప్రచండ బబ్బిలి* (1918), బి.శేషగిరిరావు *బబ్బిలి ముట్టడి* (1942) మొదలైనవి. ఈ నాటకాలన్నింట్లోనూ శ్రీ పాద కృష్ణమూర్తి నాటకానికే అత్యంత ప్రాచుర్యం లభించింది. నేటికీ ఆ నాటకమే ప్రజాదరణ పొందుతూ వుంది.

1920లో ధర్మవరం గోపాలచార్యులు రాసిన రామదాసు నాటకానికి మాత్రమే అత్యంత ప్రజాదరణ లభించింది. నేటికీ ప్రదర్శింపబడుతూనే ఉన్న సజీవ నాటకం అది. బళ్ళారి రాఘవ రామదాసు పాత్రను అద్భుతంగా పోషించి ఆ నాటకాన్ని శిఖరాగ్రానికి చేర్చారని విమర్శకుల అభిప్రాయం. అలాగే ఆ నాటకానికి సర్కారు జిల్లాలలో పేరు ప్రఖ్యాతులు ఆర్జించి పెట్టింది నెల్లూరు జిల్లా అల్లూరు నివాసి పర్వత రెడ్డి రామచంద్రారెడ్డి. శ్రీకృష్ణవిలాస్ సభద్వారా రామదాసు నాటకాన్ని రసస్ఫోరకంగా ప్రదర్శించాడు. ఆ నాటకంతో *కబీర్ రామచంద్రారెడ్డి* అన్న పేరు ప్రజల్లో స్థిరపడిపోయింది. ఆధునిక కాలంలో రామదాసు నాటకం *శ్రీ రామకృష్ణ నాట్య మండలి* (నెల్లూరు) పక్షాన పొన్నాల రామసుబ్బారెడ్డి సారథ్యంలో జనరంజకంగా ప్రదర్శింపబడుతోంది.

దేశ భక్తులు స్వతంత్ర శంఖారావం పూరించిన ఆ కాలంలో రసపుత్రవీరుల గురించి తెలుగులో వెలువడిన నాటకం రసపుత్ర విజయం (1910) రచయిత ఇచ్ఛాపురపు యజ్ఞ నారాయణ. ఉదయపుర రాణా రాజసింహునికి ఔరంగజేబుకు మధ్య సమరం, ఓడిపోయిన ఔరంగజేబు రాజసింహునితో సంధి చేసుకోవడం దీనిలోని ప్రధాన ఇతివృత్తంకాగా, రాజ సింహునికి రూపనగరాధీశ్వరుని రెండవ కుమార్తె విమల మధ్య ప్రణయానుబంధం, ప్రాసంగిక ఇతివృత్తం. రసపుత్ర విజయం ప్రదర్శనాపరంగా ఆంధ్రదేశంలో జైత్రయాత్ర చేసి ప్రజాభిమానాన్ని దోచుకున్న నాటకం. 1900-19 మధ్యకాలంలో వెలువడిన మరికొన్ని చారిత్రక నాటకాలలో పసుమర్తి యజ్ఞనారాయణ *నందనార్ చరిత్ర* (1913), గుండు చంద్ర మౌళి *దేశింగు రాజు చరిత్ర* (1913), ఆకెళ్ళ సత్యనారాయణ *పీష్వా నారాయణ రావు వధ* (1912) ప్రధానంగా పేర్కొనదగినవి. యజ్ఞ నారాయణ *రాజపుత్ర తేజః పుంజం* (1925) పేరుతో రాణా ప్రతాప సింగ్ కథను నాటకీకరించాడు. భారతమాత అనే నాటకం కూడా ఈయన కలం నుంచి వెలువడింది.

ఆంధ్రవీరుల కథల్లో పల్నాటి వీరుల కథ సుప్రసిద్ధమైంది. పన్నెండవ శతాబ్ది పూర్వార్థంలో జరిగిన పల్నాటి యుద్ధాన్ని గురించి శ్రీనాథుడు పదిహేనవ శతాబ్దంలో ద్విపద కావ్యంగా రచించాడు. అప్పటి నుంచి వివిధ ప్రక్రియల్లోనూ పల్నాటి

వీరగాథ చోటుచేసుకొంది. 20 శతాబ్దం రెండో పాదం నుంచీ ఇప్పటి వరకూ సుమారు పది నాటకాలు వెలుగు చూశాయి. పల్నాటి వీర చరిత్రపై వచ్చిన నాటకాలలో ద్రోణంరాజు సీతారామారావు *పల్నాటి వీర చరిత్ర* (1915) మొదటిది కాగా కొర్లపాటి శ్రీరామమూర్తి *పలనాటి వీర చరిత్ర* (1973) చివరిదిగా కనిపిస్తుంది. మహాభారతంలో ధర్మరాజు జూదం, శకుని కౌటిల్యం కురుక్షేత్ర యుద్ధానికి దారితీస్తే, పల్నాటి వీర కథలో కోడిపందెం, నాగమ్మ కుటిల రాజకీయం పల్నాటి యుద్ధానికి దారితీశాయి. రెండు యుద్ధాలలోను అపార జననష్టం, రక్తపుకూడు, స్మశాన రాజ్యాలే మిగిలాయి. రెండు యుద్ధాలలోనూ మహావీరుల నడుమ అటు అభిమన్యుడు, ఇటు బాలచంద్రుడు విషాద మరణంతో వీరస్వర్గం అలంకరించి చిర యశస్సు నార్జించడం విశేషం.మదిర సూర్య నారాయణ మూర్తి *ఆంధ్రశ్రీ* (1914), ఉన్నవ లక్ష్మీనారాయణ నాయకురాలు (1926), ప్రభులింగాచార్యులు *పలనాటి వీర చరిత్ర* (1928), వావిలాల సోమయాజులు నాయకురాలు(1946), కొర్ల పాటి శ్రీ రామమూర్తి *పల్నాటి వీర చరిత్ర*(1973), బసవలింగ దేవర పల్నాటి యుద్ధం, గుర్రం చెన్నా రెడ్డి బ్రహ్మనాయుడు పలనాటి వీరుల గురించి వెలువడిన నాటకాలలో పేర్కొనదగినవి. కొన్ని నాటకాలలో నాగమ్మ రాజనీతి ధురంధరురాలు గాను, దేశ సమైక్యతకు, సమగ్రతకు పాటుపడ్డ వ్యక్తిగా చిత్రించడం జరిగింది. (ఉదా. ఉన్నవ నాయకురాలు, కొర్లపాటి పల్నాటి వీర చరిత్ర నాటకాలు). మరికొన్ని నాటకాలలో బ్రహ్మనాయుని వ్యక్తిత్వాన్ని శిఖరాగ్రానికి చేరుస్తూ అతనిని పరశురామ అవతారంగా సంభావిస్తూ, బ్రహ్మనాయునికి మహిమలు అంటగట్టి, యుద్ధంలో మరణించిన వీరులకు స్వర్గ ప్రాప్తి కల్గించే మహిమాన్వితుడుగా వర్ణించే వరకు రచన సాగింది (ఉదా. ప్రభులింగాచార్యుల *పలనాటి వీర చరిత్ర*).

1920 నుంచి భారత స్వాతంత్ర్య సిద్ధి వరకూ చారిత్రక నాటకాలు అధిక సంఖ్యలో 140 వరకూ వెలువడ్డాయి. స్వాతంత్ర్యకాంక్షను ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్దీపింపచేసే నాటకాలు రెండు విధాలుగా వచ్చాయి. అంతే కాక ఈ కాలంలో ఇతర భాషల నుంచి ముఖ్యంగా మరాఠీ, గుజరాతి, హిందీ, బెంగాలి, ఒరియా, తమిళం, పంజాబీ మొదలైన భాషల నుంచి అనేక చారిత్రక నాటకాలు అనువాద రూపంలో మన నాటక శ్రేణిలో వచ్చి చేరాయి. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీపాద కామేశ్వరరావు, సోమరాజు రామానుజరావు, గుండి మెడ వెంకట సుబ్బారావు, సురవరం ప్రతాపరెడ్డి, ముత్తరాజు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, దామరాజు పుండరీకాక్షుడు, దువ్వూరి రామిరెడ్డి, యడ్లపల్లి కోటయ్య ప్రభృతులు రచించిన చారిత్రక నాటకాలు ప్రజాదరణ పొందాయి.

స్వాతంత్ర్యోద్యమంలో ఆనాటి రాజకీయ నాయకుల దేశభక్తినీ, త్యాగనిరతిని, ఉద్యమ స్వరూపాన్ని అభివర్ణించే నాటకాలకు నాంది పలికింది తెలుగు రచయితలే కావడం భారతీయ నాటకరంగం గర్వించదగిన విషయం. దేశీయ భాషల్లో మరే భాషలోనూ ఈ తరహా నాటకాలు రాలేదని తెలుస్తోంది. దామరాజు పుండరీకాక్షుడు రచించిన *గాంధీ విజయం* (1921) విస్తృతంగా ప్రదర్శింపబడి బహుళ ప్రచారం పొందిన నాటకం. మహాత్మాగాంధీ మూర్తి మత్వాన్ని వర్ణిస్తూ దామరాజు రాసిన "కత్తులు లేవు, శూలమును *గాండీవమున్* మొదలే హుళక్కి" అనే పద్యం రాష్ట్రం నలుమూలలా ప్రతిధ్వనించింది. ప్రతి సభలోనూ ఆ పద్యం నిత్యపారాయణమైంది. దువ్వూరి రామిరెడ్డి కుంభరాణా (1921)ను విషాద నాటకంగా రూపొందించాడు. మీరాబాయి కథపై వచ్చిన నాటకాలలో ఈ నాటకం తలమానికమైంది. అనేక సమాజాలు ఈ నాటకాన్ని జనరంజకంగా ప్రదర్శించాయి.

కవుల జీవిత చరిత్రను ఇతివృత్తంగా చేసుకొని కొన్ని నాటకాలు వచ్చాయి. వాటిలో సోమరాజు రామానుజరావు భోజకాళిదాసు (1932), ఎల్. రాఘవరెడ్డి వేమన (1936), విద్వాన్ చెలమచర్ల రంగాచార్యులు హాలికుడు, సి. సోమసుందర జోస్యులు తెనాలి రామకృష్ణ (1934), అయ్యగారి విశ్వేశ్వరరావు భక్త పోతన (1947) ముఖ్యమైన నాటకాలు.

దామరాజు రచించిన *పాంచాల పరాభవం* (1921) నాటకం కూడా అత్యంత ప్రజాదరణ పొందింది. శ్రీ పాద కృష్ణ మూర్తి శాస్త్రి *గాంధీజీ విజయ ధ్వజ నాటకం(1921)*, యడ్లపల్లి కోటయ్య *గాంధేయ విజయాలు* విరివిగా ప్రదర్శితమై ఉద్యమానికి బాసటగా నిలిచాయి. అలాగే శ్రీపాద తిలకురాయబారం (1921) ప్రజాభిమానాన్ని దోచుకున్న నాటకం. గుండిమెడ వెంకట సుబ్బారావు రచించిన ఖిల్జీ రాజ్య పతనం (1931) ఆంధ్రదేశాన్ని ఉర్రూత లూగించిన చారిత్రక నాటకం. ఆనాడు ఈ నాటకాన్ని ప్రదర్శించని నాటక సమాజమే లేదనడం అతిశయోక్తి కాదు. ఇది ఎస్.కె.బోస్ నాటకానికి అనుసరణ. గుండిమెడ వేంకట సుబ్బారావు, మేవాడుపతనం (1935), సురవరం ప్రతాపరెడ్డి ఉచ్ఛల విషాదం (1933), భక్తతుకారామ్ ప్రదర్శనలో జనరంజకమైన నాటకాలు. మేవాడు పతనం డి.ఎల్. రాయ్ నాటకానికి అనువాదం.

బెంగాలీ భాషలో ద్విజేంద్రలాల్ రాయ్ రాసిన చారిత్రక నాటకాలను శ్రీపాద కామేశ్వర రావు, గుండిమెడ వేంకట సుబ్బారావు, జన్నల గడ్డ సత్యనారాయణ తెలుగులోకి అనువదించారు. శ్రీపాద కామేశ్వరరావు చంద్రగుప్త *(1922)*,

భారతరమణి (1925), రాణా ప్రతాప సింహ (1926), గుండిమెడ రాణా ప్రతాప్ (1927), జన్నలగడ్డ సత్యనారాయణ నూర్జహాన్ (1925), షాజహాన్ (1926) నాటకాలు అనువాదకోవకు చెందిన నాటకాలే. చంద్రగుప్త, రాణాప్రతాప్ నాటకాలకు విశేష ప్రజాదరణ లభించింది.

మహారాష్ట్ర వీరుడు శివాజీ విశిష్ట వ్యక్తిత్వాన్ని చిత్రిస్తూ తెలుగులో ఏడెనిమిది నాటకాలచ్చాయి. వాటిలో కొప్పరపు సుబ్బారావు రాసిన రోషనార సుప్రసిద్ధమైంది. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు చెల్లెలు రోషనార మహారాష్ట్రవీరుడైన శివాజీని వలచి విఫలురాలై, వలపును ద్వేషంగా మార్చుకొని అతనితో యుద్ధం చేసి విషాద మరణం పొందడం ఈ నాటకంలోని ఇతివృత్తం. హిందూ ధర్మ రక్షకుడుగా, పరస్త్రీలను మాతృ సమానంగా మన్నించే సంస్కృతీపరుడుగా, ధీరోదాత్తుడైన నాయకుడుగా శివాజీ పాత్ర అద్భుతంగా మలచబడిందీ నాటకంలో. ప్రేమైక జీవిగా, వీరాంగనగా, ఉత్తమ సంస్కారంగల స్త్రీ మూర్తిగా రోషనార పాత్ర ప్రేక్షక హృదయాలను ఆకట్టుకొంటుంది. ఆగ్రా జైలులో బంధింపబడిన శివాజీని రోషనార రహస్యంగా కలుసుకొని, ఆ వీరుడిని వలలో వేసుకోవాలని సాగించిన సరస సంభాషణలో ఒక భాగంగా నాటక కర్త రాసిన "మంత్రినై మొగలు సామ్రాజ్యము నెల్ల గ్రహించి నీ కిపుడె యర్పించుదాన" అనే పద్యం నాటక పిపాసువుల హృదయాల మీద చెరగని ముద్ర వేసింది. రోషనార నాటకం ఆంధ్రదేశంలో అపూర్వ సంచలనం కలిగించింది. తెనాలి శ్రీరామ విలాస సభ ఈ నాటకాన్ని విస్తృతంగా ప్రదర్శించింది. మాధవపెద్ది వేంకటరామయ్య శివాజీగా, పిల్లల మర్రి సుందర రామయ్య రామసింహుడుగా, స్థానం నరసింహారావు రోషనారగా నటించి ఈ నాటకాన్ని బహుళ ప్రచారంలోకి తెచ్చారు. రోషనారను ఔరంగజేబు చెల్లెలుగా కల్పించి రాయడం ముస్లిం సోదరులకు ఆగ్రహం కలిగించిందనే సాకుతో బ్రిటీష్ ప్రభుత్వం ఆ నాటకాన్ని నిషేధించింది. రోషనార పేరును జహ్వారీబాయిగా మార్చి అక్కడక్కడా ప్రదర్శించినట్లు స్థానం నరసింహారావు తన ఆత్మకథలో చెప్పుకున్నాడు. శివాజీ చరిత్రపై వచ్చిన నాటకాలలో కేతవరపు రామకృష్ణశాస్త్రి శివాజీ విజయం (1921), ఊటుకూరి సత్యనారాయణ ఛత్రపతి శివాజీ (1943) పేర్కొనదగినది.

విశ్వనాథ సత్యనారాయణ త్రిశూలం (1937) సాహిత్య దృష్ట్యా మంచి నాటకం. వీరశైవ మతానికి ఆదిపురుషుడైన బసవేశ్వరుడు కళ్యాణి నగరాన్ని పరిపాలించే కాలచూరి వంశస్థుడైన బిజ్జలుని (జైన మతాభిమాని) దగ్గర మంత్రిగా వుంటూ, వీరశైవ మత ప్రచారానికి ప్రభుత్వధనాన్ని వెచ్చిస్తాడు. అతని చేష్టలకు ఆగ్రహించి బసవేశ్వరుని శిక్షించ పూనుకుంటాడు బిజ్జలుడు. కాని వీరశైవులు మతావేశంతో బిజ్జలుని సంహరించి కళ్యాణి నగరాన్ని పీనుగుల పెంట చేస్తారు. అన్యమత ద్వేషం, వమూఢ భక్తి జాతి పతనానికి, సంఘ వినాశానికి ఎలా దారితీస్తాయో ఆనాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను చక్కగా విశ్వనాథ త్రిశూలం నాటకంలో తెలియచేశాడు.

అశోకుని చరిత్ర ఆధారం చేసుకొని కొన్ని నాటకాలు, నాటికలు కూడా వచ్చాయి. వేలూరి చంద్రశేఖరం రచించిన కాంచనవమాల (1939) అశోకుని నాటకాలకు నాంది పలికిందనవచ్చు. అశోక చక్రవర్తి భార్య తిష్యరక్షిత తన సవతి కొడుకు పై మరులు చూపి తిరస్కరింప బడుతుంది. సారంగధర – చిత్రాంగి కథను పోలిన ఈ వృత్తాంతం సంభావ్యత ను గూర్చి నాటక పండితుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. బుచ్చిబాబు తిష్యరక్షిత (1943) నాటికగా వెలువరించాడు. ఈ నాటికలో అశోకుడు విచారణ జరిపి తిష్యరక్షితకు మరణ దండన విధిస్తాడు. మరణ దండన అమలు పరచక ముందే తిష్యరక్షిత ఆత్మహత్మ చేసుకొని మరణించడం ఈ నాటికలో ముగింపు. వయోవృద్ధులు యువతులను పెండ్లాడితే, కోరికలు చల్లారక స్త్రీలు అనుభవించే మానసిక వ్యధ, విషయ వాంఛలు తీరక వారు పడే తపన ఈ నాటికలో చిత్రితమైంది. కోర్కెలు ఈడేరనప్పుడు కట్టుబాట్లను తెంచుకొని, వావి వరసలు మరచి నైతిక ధర్మాన్ని ఎలా విస్మరిస్తారో, ఎలాంటి తెగువ చూపిస్తారో, సాంఘిక ధర్మాల మీద ఎలా తిరుగుబాటు చేస్తారో తిష్యరక్షిత పాత్ర ద్వారా విశదం చేశాడు రచయిత. తిష్యరక్షిత తన ప్రవర్తనను సమర్థించుకొంటున్న సన్నివేశాలలో బౌద్ధమతంలోని లసుగులను తర్కబద్ధంగా ఆ పాత్రతో చెప్పించాడు. తిష్యరక్షిత వ్యక్తిత్వాన్ని అపురూపంగా ఆవిష్కరించాడు. శ్రవ్యరూపకంగా ఉన్న తిష్యరక్షితను 1956లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జనరంజకంగా ప్రదర్శించి ఈ నాటికకు దృశ్య నాటికగా నిలబడగల చేవ ఉన్నదని ఆనాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె.వి.గోపాలస్వామి నిరూపించాడు

ఆచార్య ఆత్రేయ 1944లో అశోక సామ్రాట్ వచన నాటకం రాశాడు. అశోకుని చరిత్రను కొత్తకోణం నుంచి దర్శించి, రచించిన నాటకం. అశోకుని రాజ్య విస్తరణ కాంక్షకు బలియై పోతున్న వేలాది అమాయక సైనికుల, ప్రజల నిస్సహాయతను మానవతాదృష్టితో చూసి పరిష్కార మార్గాన్ని అన్వేషించిన నాటకం. యుద్ధ మేఘాలు మోహరించి ఉన్న తరుణంలో అశోక సమ్రాట్ వంటి శాంతి ప్రబోధక నాటకాన్ని రాయడంలో ఆత్రేయలో ఉన్న సామాజిక స్పృహ ద్యోతకమవుతుంది. పురాణ కథల్లో, ఇతి హాసాల్లో రాజులకు యుద్ధం చేయడం క్షత్రియ ధర్మంగా నొక్కిపలకడం జరిగింది. ప్రజల సంక్షేమం ద్వితీయ కర్తవ్యంగా ధ్వనిస్తుంది. కాని ఆత్రేయ ఈ నాటకంలో రాజుల మొదటి కర్తవ్యం ప్రజా సంక్షేమమే గాని యుద్ధం చేయడంకాదు.

రాజు ధర్మం రాజ్యాలు జయించడం కాదు. ప్రజలను పాలించడం, వారిని సుఖపెట్టడం అని ఒక పాత్ర ద్వారా స్పష్టం చేశాడు.

స్వాతంత్ర్యానంతరం చారిత్రక నాటక రచన తగ్గుముఖం చూపింది. *బొబ్బిలి యుద్ధం* వంటి పాత నాటకాలే ప్రదర్శించబడుతున్నాయి. గబ్బిట వేంకటరావు రచించిన అల్లూరి సీతారామరాజు (1954) ఆకుల సుబ్రహ్మణ్యం అదేపేరుతో 1960లో వెలువరించిన నాటకం విశేషప్రజాదరణ పొందాయి. నార్ల చిరంజీవి *భాగ్యనగరం* (1960) అద్భుత దృశ్య కావ్యంగా పండిత పామరుల ప్రశంసలందుకొంది. పోణంగి శ్రీరామ అప్పారావు *తిమ్మరుసు* (1948), *తాజ్‌మహల్* సాహిత్య విలువలతో పరిమళించే రూపకాలు.కొడాలి గోపాలరావు రచించిన *విశ్వనాథ విజయం* (1960), ఎస్. మునిసుందరం *ఏ వెలుగులకీ ప్రస్థానం?*, పి.వి. కృష్ణమూర్తి *సమ్రాట్ అశోక*, స్వామి వివేకానంద, నేతాజీ నాటకాలు జనాదరణకు పాత్రమయ్యాయి. మన్నె శ్రీనివాసరావు రచించిన *సమ్రాట్‌అశోక*(2000) నాటికలో కూడ చండ అశోకుడు సాధు అశోకుడుగా పరివర్తన చెందిన వైనం ఇతి వృత్తం. ఇందులోని సందేశం అన్ని కాలాలకూ, అన్ని సమాజాలకు వర్తిస్తుంది. స్వార్థంతో, ద్వేషంతో, వైషమ్యంతో, దౌర్జన్యంతో కొట్టుమిట్టాడుతున్న వర్తమాన ప్రపంచంలో అహింస, సమత్వం, శాంతి అనే మౌలిక ధర్మ వ్యాపనం ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆ దృష్టితో చూచినప్పుడు ఈ నాటిక నేటి సామాజిక ప్రయోజనాన్ని కూడ పరోక్షంగా నిర్వర్తిస్తుందని కొంగర జగ్గయ్య ప్రశంసించాడు. అశోకుడు ఆత్మాశ్రయ దృష్టి నుంచి వస్త్వాశ్రయ దృష్టికి చేసిన మనోయానమీ నాటిక అన్నాడు కాకరాల. టంగుటూరి ప్రకాశంపంతులు జీవితంపై మొదలి నాగభూషణశర్మ రచించిన ప్రజానాయకుడు నాటకం అనేక చోట్ల ప్రదర్శితం కావడమేకాక తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్ని కూడా అందుకొంది. త్యాగధనులైన మహాపురుషుల జీవితాల వైశిష్ట్యాన్ని, వైభవాన్ని చిరస్మరణీయం చేస్తూ ముందు తరాల వారికి అందించే మహత్కార్యాన్ని ఎందరో ప్రతిభావంతులైన నాటక కర్తలు దృశ్య కావ్యాలుగా రచించి మానవాళికి మహోపకారం చేశారు, చేస్తున్నారు. చారిత్రక నాటకాలన్నింటినీ ఇక్కడ ప్రస్తావించే అవకాశం లేనందు వల్ల కొన్నింటినే పేర్కొనడం జరిగింది. ఇంకా ఎన్నో మంచి నాటకాలు ముద్రణ భాగ్యానికి నోచుకోక కాలగర్భంలో కలిసి పోయినవి ఉన్నాయి.

గం.సు.రె.

జాతీయోద్యమ నాటకాలు

ప్రజలు తమ దేశాన్ని, జాతిని, సంస్కృతిని నిల్పుకొని స్వతంత్రంగా జీవించడం కోసం, వాటిపై ప్రేమాభిమానాలతో దృఢమైన పూనిక వహించడమే జాతీయోద్యమం అని భావించవచ్చు. ఈ జాతీయోద్యమం సఫలీకృతం కావాలంటే కులమత వర్గ భేదాలు నశించి ప్రజలంతా సమభావంతో సమైక్యంగా వర్తించాలి. అంతేగాక సంఘంలో వేశ్యాసంపర్కం, మద్యపానం, మూఢ విశ్వాసాలు, అంటరాని తనం వంటి దురాచారాలు అంతరించాలి. ఇటువంటి ప్రబోధంతోనే జాతీయోద్యమ ప్రభావం గల సాహిత్యం వెలసింది.

1885లో జాతీయకాంగ్రెసు స్థాపించబడిన పిమ్మట కొందరు రాజకీయవేత్తలు, మేధావులు, జాతి జాగృతికై చేసిన ఉపన్యాసాలు, రచనలు దేశ ప్రజల్లో కొంత రాజకీయ చైతన్యం కలిగించాయి. దానితో సంఘసంస్కరణ ప్రాతిపదికగా ప్రారంభమైన సాంస్కృతిక పునరుజ్జీవనం, నెమ్మదిగా రాజకీయ స్పృహను మేళవించుకొని జాతీయోద్యమంగా ఎదిగి, ఉధృత రూపం దాల్చి స్వాతంత్ర్యోద్యమంగా రూపొందింది.

ఆంధ్రదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి ఊతమిచ్చిన వారిలో ఆద్యుడు కందుకూరి వీరేశలింగం పంతులు. సంఘసంస్కరణ దృష్టితో రచనా వ్యాసంగం కొనసాగించిన దారిలోనే వీరేశలింగం పంతులు నాటకాలు కూడా సాగాయి. బాల్య వివాహ నిరసనం, విధవా వివాహ ప్రోత్సాహం, కులమత వర్ణ భేదాల ఖండన, మూఢవిశ్వాసాల ఖండన మొదలైన దురాచారాలను ఏకరువు పెడుతూ బ్రాహ్మవివాహం, *వ్యవహార ధర్మబోధిని రాగమంజరి*, *తిర్యగ్విద్వన్మహాసభ*, *మహారణ్య పురాధిపత్యం*, *విచిత్ర వివాహం*, *కలిపురుష శనైశ్చ విలాసం*, *వేశ్యాప్రియ*, *కౌతుకవర్ధిని*, *వినోద తరంగిణి* మొదలైన రూపకాలు రచించాడు. వావిలాల వాసుదేవ శాస్త్రి నందకరాజ్యమునే సాంఘిక నాటకంలో బ్రాహ్మణుల్లో గల వైదిక నియోగి వైషమ్యాలు, అధికారుల దౌర్జన్యాలు వివరించాడు

చిలకమర్తి లక్ష్మీనరసింహం వ్యభిచారం, కన్యాశుల్కం, వరకట్నం, బాల్యవృద్ధవివాహాలు, వ్యసనాలవంటి సంఘ దురాచారాలను నిరసిస్తూ ఎన్నో ప్రహసనాలు రచించాడు. కైలాస *యాత్ర*, అపూర్వయాచకుడు, పిశాచవిలాసం, శామాలమ్మ దర్బారు, ముష్టి ప్రహసనాల్లో మూఢ విశ్వాసాల నిరసనం, దొంగసన్యాసిలో దొంగ సన్యాసులు చేసే మోసాలు, కొండూరి జానకిరామయ్య పెండ్లి ప్రహసనంలో బాల్య వృద్ధ వివాహాల నిరసనం, కవి గీత, తుంబుర నారద ప్రహసనాల్లో దుర్నీతి కాలుష్యం, కలియుగ యక్ష ప్రశ్నలు, ఓట్ల ప్రహసనాల్లో కుల వైషమ్యాలు, అపూర్వ స్వయంవరంలో ఆడపిల్లల అమ్మకం, వరదక్షిణ, పెళ్ళి కొడుకుల ధరలు ప్రహసనాల్లో వరకట్నం వంటి దురాచారాలు నిరసింపబడ్డాయి.

ఆంధ్ర నాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు పౌరాణిక, చారిత్రక నాటకాల్లో సమకాలికమ్మైన సాంఘికాంశాలను చొప్పించాడు. పాంచాలీ స్వయంవరంలో బాల్య వివాహాల నిరసన, యువతీ వివాహ ప్రశంస, బహుభార్యాత్వ ఖండన ప్రస్తావించాడు. ప్రమీలార్జునీయంలో స్త్రీ విద్యా ప్రశంస చేయడంతో పాటు స్త్రీలు పురుషులకేమీ తక్కువకాదని నిరూపించాడు. అజామిళలో రజస్వలా వివాహాలను సమర్థిస్తూ, మద్యపానాన్ని నిరసించాడు.

కోలాచలం శ్రీనివాసరావు సంఘసంస్కరణ భావాలను తన నాటకాల్లోనూ, ప్రహసనాల్లోనూ, ప్రస్తావించాడు. ఈయన నాటకాల్లో బాల్య వివాహాలు, వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, వరకట్నం, సతీసహగమనం నిరసించి పునర్వివాహాలను సమర్థించాడు. *రామరాజు చరిత్రం, అన్యాయ ధర్మపురీ మహిమ*లో వృద్ధ వివాహాలను, మైసూరు రాజ్యాభివృద్ధి, అన్యాయ ధర్మపురీ మహిమల్లో కన్యాశుల్కాన్ని నిరసించాడు. రామరాజు చరిత్ర, ప్రతాపాగ్బరీయాల్లో సతీసహగమనాన్ని నిరసించి విధవా వివాహాలను సమర్థించాడు. *బభ్రువాహన, శిలాదిత్య*, ప్రతాపాగ్బరీయాల్లో స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ విద్యల ప్రతిపాదన జరిగింది. మైసూరు రాజ్యాభివృద్ధి, మదాలస, శిరోమణి, సుల్తానా చాందుబీ నాటకాల్లో సర్వమత సహనం ప్రబోధించాడు. నాచిపార్టి ప్రహసనంలో వేశ్యావృత్తి నిరసనం, సుల్తానా చాందుబీ, అన్యాయధర్మపురీ మహిమల్లో మద్యపాన నిషేధం ప్రస్తావించడం జరిగింది.

గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం (1897)లో కన్యాశుల్కం, బాల్య వృద్ధ వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వితంతువుల దుస్థితి, వేశ్యావృత్తిలోని చాంచల్యం, మూఢాచారాలు, మోసాలు మొదలైన సామాజికాంశాలు చోటు చేసుకున్నాయి.

పానుగంటి లక్ష్మీ నరసింహరావు కాల్పనిక సాంఘిక నాటకాల్లో సంఘసంస్కరణ దృక్పథం కనిపిస్తుంది. *కంఠాభరణం*లో (1917) విలాస పురుషుల హాస్యాస్పద జీవితం, వ్యక్తుల్లోని చాదస్తం, పిసినారితనం మొదలైన దుర్నయాలు నిరసింపబడ్డాయి. *వీరమతి* (1923)లో భార్యాభర్తలు విద్యాబుద్ధులు సరిసమానంగా కలిగి ఉండాలని బోధించాడు. *చూడామణి* (1928)లో స్త్రీ స్వాతంత్ర్యం, రాతి స్తంభం (1930)లో వ్యసనం వల్ల కుటుంబం ఏ విధంగా పతనమౌతుందో వివరించాడు. *విచిత్ర వివాహం* (1913)లో బాల్య వివాహ నిరసనను ప్రస్తావించాడు. ధర్మవరం గోపాలాచార్యుల సుభద్రాపరిణయం (1908)లో యువతీ వివాహమే మంచిదని ప్రబోధించాడు.

కాళ్ళకూరి నారాయణరావు పద్మవ్యూహం (1919)లో శ్రీకృష్ణుడు అర్జునునికి చేసిన గీతోపదేశంలో దేశభక్తి కనిపిస్తుంది. "......పూర్వుల విఖ్యాతి బూదిగల్పుట కంటె.... ఆత్మగౌరవముపై నాస్థవీడుట కంటె - హైందవులకు మానహాని గలదే" అనడంలోనూ- "రాజ్యమెల్లను పరుల కర్పణము చేసి ... దాస్యమొనర్చు కంటె మన జాతికిక కళంకము కలదె" అనడంలో జాతి స్వాతంత్ర్య భావం ప్రస్ఫుటంగా ఉంది.

తిరుపతి వేంకట కవుల సుకన్య సాంఘిక సంస్కరణోద్దిష్ట పౌరాణిక నాటకం. వ్యసన విజయం లో జూదం వల్ల కలిగే నష్టాలు వివరించారు. *పాండవ జననం* లో బాల్యవివాహాలను, వృద్ధ వివాహాలను, జారత్వాన్ని నిరసించారు. కాళ్ళకూరి నారాయణరావు చింతామణి (1921)లో వ్యభిచార సమస్యను, వరవిక్రయం (1924)లో వరకట్న సమస్యను, మధుసేవ (1926)లో మద్యపాన సమస్యను వివరించారు. ఇటువంటి సంఘ సంస్కరణోద్యమ నాటకాలే జాతీయోద్యమ నాటక రచనకు ప్రేరణనిచ్చాయి. పౌరాణిక నాటకాల్లో జాతీయోద్యమ భావాలు మొట్టమొదటగా ప్రవేశ పెట్టింది ధర్మవరం రామకృష్ణమాచార్యులే. చంద్రహాస నాటకంలో ఉప్పు పై పన్నును నిరసించడం. పాంచాలీ స్వయంవరం నాటకంలో స్వదేశీ వస్తు వినియోగాన్ని ప్రతిపాదించడం జాతీయోద్యమ స్పృహకు నిదర్శనం.

కొందరు నాటక కర్తలు పౌరాణిక నాటకాల ద్వారా పరోక్షంగా జాతీయోద్యమ స్ఫూర్తి కలిగించడానికి యత్నించారు. బుద్ధవరపు పట్టాభి రామయ్య మాతృదాస్య విమోచన (1924) నాటకం రచించి వ్యంగ్యంగా దేశభక్తిని ప్రబోధించాడు. ఈ నాటకంలో వినత భారతమాతగా, సర్పాలు తెల్లవారుగా కనిపిస్తారు. మనదేశాన్ని సంరక్షించుకోవాలన్న ఆంతర్యంతోనే ధర్మప్రతిష్ఠాపన పరమార్థంగా గల మహాభారత నాటకాలు ఇరవయ్యవ శతాబ్దంలో విరివిగా వెలువడ్డాయి.

కె.సుబ్రహ్మణ్యశాస్త్రి సంపూర్ణ మహాభారతం (1926)లో ఆంగ్లేయుల పాలనలో మగ్గుతున్న భారతీయుల హీనస్థితిని చిత్రించాడు.

"అకట! వంచక బీరుజనాళి – భారతావని రక్షింప భంగపడితె? నిలువ నీడయులేక నీ కెట్టి పాటు – కలిగెనో శౌర్యలక్ష్మి నీ కక్కటకట".

సోమరాజు రామానుజరావు పద్మవ్యూహం (1930)లో భరతమాత కడుపున పుట్టిన వాడు స్వాతంత్ర్యేచ్ఛ కలిగి ఉండాలనే భావం నాటకారంభంలోనే వినిపిస్తుంది. పద్మవ్యూహంలో అభిమన్యుడి శౌర్య పరాక్రమాలు ప్రదర్శించి నేలకొరిగిన సందర్భంలో భారతమాతకు ఇటువంటి వీరపుత్రులు పుట్టాలని అతని రథ సారథి సుమిత్రుడు అనడం దేశభక్తి సూచకం.

దౌల్తాబాద గోపాల కృష్ణారావు సంపూర్ణ భారతం (1932) లో 'రణ విదూరులు స్వాతంత్ర్య రాజ్యపదవి – బందనేరక భ్రష్టులై పోరె జగతి' అని చెప్పి స్వాతంత్ర్యం కోసం అందరూ తెగువ చూపాలని ప్రబోధించాడు. అర్జునుడు శివుణ్ణి పాశుపతం కోరుతూ – 'ఘన నిరంకుశ ప్రభుల దండనము కొఱకు– భారతీయుల దాస్యము బాపు కొఱకు' అని అనడంలో స్వాతంత్ర్యేచ్ఛ స్పష్టమయింది.

తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగం లో “అలుగటయే యెఱుంగని మహా మహితాత్ముడజాత శత్రువే అలిగిన నాడు సాగరములన్నియు నేకము గాకపోవునే” అని శ్రీ కృష్ణుడు చెప్పిన మాటలు ధర్మరాజు కోప తీవ్రతతో కలిగే వినాశాన్ని సూచించడంతో పాటు శాంతి కాముకుడైన గాంధీజీ కోపిస్తే కలగబోయే విపరీత పరిణామాలు ధ్వనించాయి. వీరు రచించిన పాండవ జననంలో కిందముడనే ఋషి పాండురాజుతో రాజ్యాధికారాన్ని నిరసిస్తూ పలికిన మాటలు ఆంగ్లేయుల పాలనలోని దుర్మార్గాన్ని, మన రాజుల అనైక్యతను, పరాధీనతలోని నైచ్యతను సూచించేవిగా ఉన్నాయి.

మక్కపాటి వేంకటరత్నం ద్రౌపదీ మాన సంరక్షణం (1921) నాటకంలో దాస్య వృత్తిలోని హైన్యత, స్వాతంత్ర్యోద్దీపక భావాలు కనిపిస్తాయి. 'పాలకులు చెప్పింది చేయాలే తప్ప ... అందుకు భిన్నంగా వర్తిస్తే శిక్ష అనుభవించాల్సిందే.'అనడంలో సేవావృత్తిలోని పరాధీనత వ్యక్తమయింది. అదేవిధంగా ప్రాతిగామి ద్రౌపదిని సభకు తీసుకురాలేనందుకు దుర్యోధనుడు అతణ్ని రాజద్రోహిగా పరిగణిస్తే, అతడు ఉద్యోగ చిహ్నాలు కింద పెట్టేశాడు. ఈ విధంగా పాలకులు దుర్మార్గులైనపుడు పని చేసేవాళ్ళు కూడా పౌరుషంతో ఎదురుతిరగాలన్నదే నాటకకర్త ఉద్దేశం.

ఈ నాటకంలోనే అశ్వత్థామ మాటల్లో జాతీయ భావాలు గోచరిస్తాయి. “రాజాదరమునకు భంగముగలుగు గదాయని కూలికి విషము ద్రావకుడు....” రాజాదరము శాశ్వతమని తలచుటకన్న మౌఢ్యము లేదు. తుచ్ఛమగు రాజసన్మానము నపేక్షించి యాత్మగౌరములు వీడి భరత భూమికి భారము గాకుడు... దేశద్రోహులు గాకుడు. ఇట్టి యధర్మ ప్రవర్తకుడగు రాజును బహిష్కరించిన గాని దేశక్షేమము కలుగనేరదు”. దుష్ట పాలనాంతానికై, భారతీయ జాతి జాగృతికై, సంస్కృతీ సంప్రదాయాల నిల్పడానికై పలికిన – “స్వార్థపరత్వమును వీడి, కులగౌరవ దేశ గౌరవము బునరుద్ధరింప ముందంజ వైచిన మహాత్ముని నిన్ను దేవతలు రక్షింతురుగాక” అనే మాటలు గాంధీజీని దీవించినట్లుగా ఉన్నాయి.

కె.సుబ్రహ్మణ్య శాస్త్రి తన ద్రౌపదీ వస్త్రాపహరణంలో బానిసత్వంలోని నైచ్యాన్ని ప్రస్తావించి స్వాతంత్ర్యోద్దీపనం కలిగించాడు. 'భారతకాంతా స్వాతంత్ర్యమపహరించి, బానిస వృత్తి నొసంగ నెంచితివా' అనే మాటల్లో తెల్లవారి దౌర్జన్య ప్రవృత్తి వ్యక్తమౌతుంది. 'ప్రభు కోప భీతిని మారు వల్కక నన్ను చూచి చూడకేగు శూరులార .. మీదు స్వాతంత్ర్య విభవంబు మీదు సిరియు – నన్యదేశీయ జనుల పాలగునుగాక'. అనే మాటల్లో అన్యాయాలను, అక్రమాలను ప్రతిఘటించని మన ఉదాసీన వైఖరే మనలను పరాధీనుల గావించిందనే విషయం ధ్వనించింది. “ఓ భరతమాతా! నాయట్టి యస్తంగతభానుని నవగత పౌరుషునేల గంటివి” అనే మాటలు కర్ణుని సేవావృత్తిలోని పరాధీనతను, నిస్సహాయతను తెల్పి భారతీయులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించాలనే భావం స్ఫురింపజేస్తున్నాయి.

సోమరాజు రామానుజ రావు తన పద్మవ్యూహం నాటకంలో రాసిన “కర్మ వీరుల కడుపార కన్నతల్లి – భరతమాతకు జయమస్తు భద్రమస్తు”, “స్వరాజ్య రక్షణమునకై యెవ్వడు తన రక్తబిందువుల నెన్నిటి నీ భూమి పై వదలునో నాడన్ని వత్సరములా భూమిపై గీర్తి శరీరము ధరించి బ్రతికియుండును” అనే మాటలు స్వాతంత్రేచ్ఛను ప్రేరేపించేవిగా ఉన్నాయి.

స్త్రీలు కూడా పురుషులకంటే తక్కువేమీ కాదని స్త్రీ ప్రాముఖ్యాన్ని ఉగ్గడించిన పౌరాణిక నాటకకర్తలు కూడా ఉన్నారు. తిరుపతి వేంకట కవులు పాండవ జననం లో అంగనల ప్రాధాన్యం వివరించాడు. ధర్మవరం కృష్ణమాచార్యులు ప్రమీలార్జునీయం లో స్త్రీ విద్య, స్త్రీ సామర్థ్యాలను వివరించాడు. ధర్మవరం గోపాలాచార్యులు సుభద్రార్జునీయం లో స్త్రీ విద్య ప్రాముఖ్యం ఉగ్గడించాడు. కాళ్ళకూరి నారాయణరావు పద్మవ్యూహం లో స్త్రీల ఔన్నత్యం చాటడమే కాక స్త్రీలు సబలలని పేర్కొన్నాడు. చక్రావధానుల మాణిక్యశర్మ పద్మవ్యూహం (1926)లో స్త్రీలు కూడా పురుషులతో సమానంగా ఉద్యమంలో పాల్గనాలని ఉద్బోధించాడు. దీనిలో సుభద్ర అభిమన్యుని యుద్ధానికి పంపించేటప్పుడు – “భారత భేరీని మ్రోగించగల ఎందరు ఋత్విక్కులు రణయజ్ఞమున బలివ్రతమునకు సిద్ధముగా నున్నారో నీకు తెలియదా” అని చేసిన బోధలు భారత మాత తన బిడ్డలకు ప్రబోధిస్తున్నట్లుగానే ఉంది.

పండిత కె. సుబ్రహ్మణ్య శాస్త్రి ద్రౌపది వస్త్రాపహరణం *(1927)* లో “మన భరతఖండమున సుధీరులై, సుతేజులై, సుబలలై కాంతలు వెలరారు వరకు భరతమాత కృతార్థకానేరదు” అని పేర్కొన్నాడు. కొందరు నాటకకర్తలు దేశ సమైక్యతను కూడా ప్రబోధించారు. నిశ్శంక కృష్ణమూర్తి తన కీచకవధ (1913) నాటకంలో దేశసమైక్యతను ప్రబోధించాడు. వేలూరి శివరామ శాస్త్రి గురుదక్షిణలో – విద్యకు అన్ని కులాల వారు సమానమేనని, అందరూ ఐకమత్యంతో మసలుకోవాలని ప్రతిపాదించాడు.

ఎన్నో పౌరాణిక నాటకాల్లో వర్ణభేదం నిరసింపబడినది. కిళాంబి వేంకటవరదాచార్యులు ఘోషయాత్ర (1900), ధర్మవరం కృష్ణమాచార్యులు పాంచాలీ స్వయం వరం, పింగళి వేంకటనర్సయ్య సంపూర్ణ భారతం (1925), సోమరాజు రామానుజరావు పద్మవ్యూహం (1926), హరిపురుషోత్తం కురుక్షేత్రం (1943) మొదలైన నాటకాల్లో అన్ని వర్ణాలు సమానమని ప్రతిపాదించడం జరిగింది. పండిత కె. సుబ్రహ్మణ్య శాస్త్రి ద్రౌపది వస్త్రాపహరణం (1927)లో “జాతియందే నైచ్యము, మహత్వము నుండునా” అని గుణమే ప్రధానం కాని కులం కాదని ఉగ్గడించాడు. వేదాంత సుబ్రహ్మణ్య కవి రచించిన మహారధికర్ణ (1946)లో వర్గ వైషమ్యనిరసన విప్లవాత్మక ధోరణిలో సాగింది.

కొందరు నాటకకర్తలు చారిత్రక నాటకాలు రచించి గతవైభవ స్మరణంతో జాతి జనుల్లో చైతన్యం రేకెత్తింపజేసే ప్రయత్నం చేశారు. 19వ శతాబ్దం చివరి దశాబ్దిలో అంకురించిన చారిత్రక నాటకం 20వ శతాబ్దం పూర్వార్ధంలో జాతీయోద్యమ స్ఫూర్తి కలిగించడంలో చురుకైన పాత్ర వహించింది.

జాతీయోద్యమ ప్రభావంతో రచింపబడిన హిందీ, బెంగాలీ, మరాఠీ చారిత్రక నాటకాలు దేశభక్తి ప్రబోధానికి ఉపకరించాయి. ఆ పరంపరలో స్వాతంత్ర్యం కోసం దశాబ్దాల తరబడి పోరాడిన రసపుత్ర, మహారాష్ట్ర వీరుల చరిత్రలు తెలుగు రచయితలను ఆకర్షించాయి. మహావీరులైన రాణాప్రతాపుడు, ఛత్రపతి శివాజీ మొదలైన చారిత్రక వీరుల వీరోచిత కృత్యాలతో పాటు ఆంధ్రవీరుల శౌర్యసాహసాలు తెలిపే కథా ఇతి వృత్తాలతో తెలుగులో అనేక చారిత్రక నాటకాలు వెలువడ్డాయి. తద్వారా ప్రజల్లో దేశాభిమానం పొంగులు వారింది. ఆ విధమైన నాటకాల్లో ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ శాస్త్రి రాజపుత్ర తేజఃపుంజం, మొసలికంటి హనుమంత రావు శివాజీ విజయం, శ్రీపాద కామేశ్వరరావు చంద్రగుప్త, కొప్పరపు సుబ్బారావు రోషనార, పింగళి నాగేంద్ర రావు మేవాడ రాజ్యపతనం, శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి *బబ్బిలి యుద్ధం* మొదలైన నాటకాలు ఖ్యాతి గాంచాయి.

హిందీ, మరాఠీ, బెంగాలీ మొదలైన భాషల నుంచి ఎన్నో చారిత్రక నాటకాలు తెలుగులోకి అనూదితమైనాయి. ఆ వరుసలో శ్రీపాద కామేశ్వరరావు రాణా ప్రతాపసింహ, జన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి చంద్రగుప్త, నూర్జహాన్, షాజహాన్, మేవాడు పతనం, జంధ్యాల శివన్న శాస్త్రి దుర్గాదాసు, రాణాప్రతాప్, నండూరి శివరావు–చంద్రగుప్త, మాచిరాజు దుర్గా శంకరా మాత్యుడు శివశీలం, దినవహి సత్యనారాయణ షాజాహాన్, పింగళి నాగేంద్ర రావు మేవాడు పతనం మొదలైన నాటకాలు రచించారు.

ఆంధ్రవీరులైన పల్నాటి వీరుల చరిత్ర ఆధారంగా ఎన్నో నాటకాలు వచ్చాయి. ఉన్నవ లక్ష్మీ నారాయణ నాయకురాలు (1926), ప్రభులింగాచార్యుల పలనాటి వీరచరిత్రం (1928), వావిలాల సోమయాజులు నాయకురాలు (1946) మొదలైన నాటకాలు బహుళ ప్రదర్శనల ద్వారా ప్రజల్లో స్వాతంత్రోద్యమ చైతన్యం కలిగించాయి.

బబ్బిలి వీరుల శౌర్య ప్రతాపాలను ప్రకటించే నాటకాలు కూడా విరివిగానే వచ్చాయి. కాళ్ళకూరి సాంబశివరావు, రంగరాయక దన సమవకారం (1899), వేదం వేంకటరాయ శాస్త్రి బబ్బిలి యుద్ధం (1897) రచించాడు. శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి రచించిన *బబ్బిలి యుద్ధం* (1908) ప్రశస్త నాటకం. భాగవతుల నృసింహశర్మ ప్రతిజ్ఞా విజయ రామ రాజీయం (1918), సోమరాజు రామానుజరావు ప్రచండ *బబ్బిలి* (1918), శేషాద్రి రమణ కవుల పాపరాయ నిర్యాణం (1921), బి.సి.వి. నారాయణ శర్మ *శూరబబ్బిలి* (1922), కోటగిరి వేంకట కృష్ణారావు *బెబ్బులి* (1925), బి.శేషగిరిరావు బబ్బిలి వుయుట్టడి (1942) పేర్లతో నాటకాలు రచించి జాతీయోద్యమ స్పృహను కల్గించారు.

తెలుగు రాజుల కీర్తి బావుటాలు రెపరెపలాడించిన ఇతర రాజుల చరితలు కూడా చారిత్రక నాటకాలుగా వచ్చాయి. సింగవరపు రాఘవ శాస్త్రి కృష్ణరాయ విజయం (1921), ముక్కామల జగన్నాధరావు రాయచూరు యుద్ధం (1921), కొత్తపల్లి సూర్యారావుతోపాటు నందిరాడ చలపతిరావు కూడా *రాజకళింగ గంగు* నాటకాలు రచించారు. పోతుకూచి సుబ్బయ్య *ఆంధ్రవాణీసామ్రాజ్యం* (1935), దూపాటి కొండమాచార్యులు ఆంధ్ర విజయం (1935) మల్లాది అవధాని ఖడ్గతిక్కన (1938), నండూరి బంగారయ్య ఆంధ్రతేజం (1938) మొదలైన ప్రఖ్యాత చారిత్రక నాటకాలు కూడా ఉద్యమస్ఫూర్తికి దోహదపడ్డాయి.

పృథ్వీరాజు పరాక్రమాన్ని, ప్రేమను ప్రకటించే చారిత్రక నాటకాలు కూడా తెలుగులో రచింపబడ్డాయి. బాలాంత్రపు వేంకటరావు, చాగంటి శేషయ్యలు కలిసి సతీ సంయుక్త నాటకం (1919), బాలకవి దేవినేని వీరరాఘవ కవి తారాబాయి (1924), అవసరాల శేషగిరిరావు రాణీ సంయుక్త (1925), గుఱ్ఱాల నారాయణరావు పృథ్వీ సంయుక్త (1936) నాటకాలు రచించారు.

రాజపుత్రవీరుల అసమాన శౌర్య సాహసాలను చాటే ఎన్నో నాటకాలు తెలుగులో వచ్చాయి. కోలాచలం శ్రీనివాసరావు ప్రతాపాగ్భరీయంలో రాణా ప్రతాపుడు ఉదయపురం సాధించినప్పటి విశేషాలు చెప్పబడ్డాయి. కొండపల్లి లక్ష్మణ పెరుమాళ్ళు *రసపుత్ర కదనం* (1922)లో రాణా భీంసింగ్ శౌర్య పరాక్రమాలు, విక్రమ సింహుడి వీరత్వం ప్రకటితమైనాయి. వేదుల సత్యనారాయణ మూర్తి రాణా ప్రతాపసింహ (1924), ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ శాస్త్రి రాజపుత్ర తేజఃపుంజం

(1925) నాటకంలో రాణా ప్రతాపుడు ఉదయ పురం, రత్నపురం సాధించిన విశేషాలు వివరించాడు. ఈ నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది. కె.సుబ్రహ్మణ్యశాస్త్రి మేవాడు శౌరాగ్ని (1927)లో ప్రతాప సింహుని పరాక్రమం వీర రసస్ఫోరకంగా చిత్రించాడు. కోటమర్తి చిన రఘుపతి చితోడుపతనం లో పుట్టాసింగ్ పరాక్రమం ప్రస్తావించాడు.

దువ్వూరి రామిరెడ్డి కుంభరాణా (1921)ను విషాద నాటకంగా రూపొందించాడు. మీరాబాయి కథపై వచ్చిన నాటకాలలో ఈ నాటకం తలమానికమైంది. అనేక సమాజాలు ఈ నాటకాన్ని జనరంజకంగా ప్రదర్శించాయి.

కవుల జీవితచరిత్రను ఇతివృత్తంగా చేసుకొని కొన్ని నాటకాలు వచ్చాయి. వాటిలో సోమరాజు రామానుజరావు భోజకాళిదాసు (1932), ఎల్.రాఘవరెడ్డి వేమన (1936), విద్వాన్ చెలమచర్ల రంగాచార్యులు హాలికుడు, సి. సోమసుందర జోస్యులు తెనాలి రామకృష్ణ (1934), అయ్యగారి విశ్వేశ్వరరావు భక్త పోతన (1947) ముఖ్యమైన నాటకాలు.

ధర్మవరం కృష్ణమాచార్యుల ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలు, ధర్మ నిబద్ధత తెలుగు నాటక కర్తలను బాగా ఆకర్షించాయి. రోషనార శివాజీ చక్రావధానుల మాణిక్యశర్మ మహారాష్ట్ర విజయం (1912),కేతువరపు రామకృష్ణశాస్త్రి శివాజీ విజయం (1921), కేశవభట్ల సుదర్శన వేణుగోపాల మూర్తి శివాజీ (1925), ఊటుకూరి సత్యనారాయణ ఛత్రపతి శివాజీ (1943), నండూరి కృష్ణమాచార్యుల ఛత్రపతి శివాజీ(1947) మొదలైన నాటకాలు రచించి ఉద్యమ తీవ్రతను చాటారు.

శివాజీ సంబంధించిన కొప్పరపు సుబ్బారావు రోషనార నాటకం బహుళాదరణ పొంది ప్రభుత్వం నిషేధానికి గురయింది. మహారాష్ట్రవీరుల సాహసాలు, సింహగఢం శివాజీ వశం కావడం, శివాజీతో రోషనార ప్రేమాయణం ఈ నాటకంలో చక్కగా చిత్రించాడు. మాధవపెద్ది వేంకటరామయ్య, స్థానం నరసింహారావు వంటి ప్రముఖనటులు నాయికా నాయకులుగా నటించడం, చక్కని పద్యాలు, కీర్తనలు ఈ నాటకం బహుళాదరణ పొందడానికి దోహదం చేశాయి.

ఆయా చారిత్రక నాటకాల్లో శౌర్య పరాక్రమాలతో పాటు వర్ణ భేద నిరసన, హరిజనోద్ధరణ, దేశ సమైక్యత, దేశ భక్తి వంటి జాతీయోద్యమ దోహదాంశాలు కూడా చోటుచేసుకున్నాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ నాయకురాలు (1926)లో కులభేద నిర్మూలన, హరిజనోద్ధరణ, సత్యాగ్రహోద్యమం, దేశ సమైక్యతల ప్రబోధాలు ఉన్నాయి. బుద్ధవరపు పట్టాభిరామయ్య పెద్దాపురం ముట్టడి (1928)లో హిందూ ముస్లింల సమైక్యత ప్రతిపాదించాడు. కేతవరపు రామకృష్ణ శాస్త్రి శివాజీ విజయం (1920)లో దేశభక్తి ప్రస్ఫుటమవుతుంది. నండూరి రామకృష్ణ మాచార్యుల ఛత్రపతి శివాజీ , 1947లో రామదాసు యోగి దేశభక్తి ప్రబోధం చేశాడు. బాలసరస్వతి భక్తతుకారం, నాటకంలో లోహిదాసుఅనే మాలదాసరిని తుకారాంకు గురువును చేసి హరిజనోద్ధరణాన్ని ప్రోది చేశాడు. ద్విజేంద్రలాల్‌రాయ్ ఆంధ్రీకృత నాటకాల్లో శాంతి, దయ, ప్రేమలు ప్రస్ఫుటమౌతాయి.

గాంధేయ సిద్ధాంత ప్రాతిపదికలైన వర్ణభేద నిరసన, అస్పృశ్య నివారణం, హరిజనోద్ధరణ మొదలైన అంశాల ఆధారంగా కొందరు నాటకాలు రచించారు. దామరాజు పుండరీకాక్షుడు సంఘసమస్య లేదా సంస్కారిణి (1921) అనే నాటకంలో తరతరాలుగా వస్తున్న కులభేదాలను నిరసించాడు. ఎ. నీలకంఠ శాస్త్రి హరిజనుడు (1935), ధర్మవరం గోపాలాచార్యులు అస్పృశ్యవిజయం (1933), ఓరుగంటి కృష్ణకౌండిన్య నందనారు చరితం (1933), దామరాజు పుండరాకాక్షుని కలియుగ భారతం (1936), తాంద్ర సుబ్రహ్మణ్యం పతిత పావన (1936), మునిమాణిక్య నరసింహారావు తిరుగుబాటు (1938) ముఖ్యమైనవి. తీవ్రభావోపేతమైన వచన నాటక తిరుగుబాటు ప్రభుత్వం నిషేధాజ్ఞలకు గురి అయింది.

జాతీయోద్యమంలో భాగంగా 1907 నుంచి రైతు ఉద్యమం కూడా సాగింది. రైతు ఉద్యమ ప్రభావంతో సి. సత్యనారాయణ రావు స్వేచ్ఛాజీవులు (1937) అనే నాటకం రచించగా సబ్నవీసు రామారావు రైతుబిడ్డ (1937)లో రచించాడు. సుంకర, వాసిరెడ్డి కలసి ముందడుగు (1945), మాభూమి (1947) నాటకాల్లో జమీందారీ విధానంలో రైతుల, కూలీల సామాన్య ప్రజల కడగండ్లు కళ్ళకుకట్టినట్లు చిత్రించాడు.

మొదటి ప్రపంచ యుద్ధం ముగియగానే స్వాతంత్రం వస్తుందని భావించిన భారతీయుల కోరిక కోరికగానే మిగిలిపోయింది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆంగ్లేయులను సమర్థిస్తున్న మితవాదులు కూడా తిరుగుబాటు బావుటాలు ఎగురవేశారు. దానితో ఆంధ్రావనిలోని ప్రతి పౌరుని గుండె క్రోధ ఘూర్ణితమైంది. 1920లో మహాత్మాగాంధీ భారత జాతీయ కాంగ్రెసుకు నాయకత్వం వహించడంతో యావద్భారత జనావళికి కొండంత అండ లభించినట్లయింది. సత్యాగ్రహయుధం చేపట్టిన జాతిపిత గాంధీ దేశ సంచారంలో భాగంగా మన రాష్ట్రాన్ని కూడా చుట్టివెళ్ళాడు. ఉద్యమ ప్రభావంతో ఎందరో యువకులు చదువు సంధ్యలు మాని ఉద్యోగాలకు స్వస్తి చెప్పి స్వాతంత్రోద్యమంలోకి దూకారు. ఎందరో కవులు, రచయితలు ఉద్యమ స్ఫూర్తి కలిగించే రచనలు చేశారు. 'మాకొద్దీ తెల్లదొరతనము', 'వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరో చెప్పుడీ', 'భరతఖండంబు చక్కని

పాడియావు' మొదలైన పాటలు, పద్యాలు, 'మాలపల్లి' మొదలైన నవలలు జాతీయోద్యమ ప్రభావంతో ఆవిర్భవించాయి.

ఈవిధంగానే జాతీయోద్యమ ప్రభావం నాటక సాహిత్యంపై కూడా కనిపిస్తుంది. మొదట పౌరాణిక నాటకాల్లో భంగ్యంతరంగా కనిపించిన జాతీయోద్యమ భావాలు, పరోక్ష పద్ధతిలో చారిత్రకవీరుల శౌర్య పరాక్రమాల ద్వారా ప్రకటితంకాగా కొందరు దేశభక్తి తత్పరులైన నాటకకర్తలు జాతీయోద్యమాన్ని, సమకాలిక రాజకీయోదంతాలను ప్రత్యక్షం చేయడానికి రాజకీయ నాటకాలను రచించడానికి ఉద్యమించారు. ఇటువంటి రాజకీయ నాటకాలను మనదేశంలోనే ప్రప్రథమంగా రచింప సమ కట్టిన ఆంధ్ర జాతీయ కవి దామరాజు పుండరీకాక్షుడు.

1920 తరువాత గాంధీజీ రాజకీయ రంగంలో కాలూనడంతో రాజకీయ చైతన్యం వెల్లివిరిసింది. బెంగాలు విభజన, రౌలట్ చట్టం, పంజాబు దురంతాలు మొదలైన తెల్లవారి కుతంత్ర చేష్టలతో క్రుద్ధులైన భారత యువకులెందరో జాతీయోద్యమంలో ప్రవేశించి దేశమాత ఋణం తీర్చుకోవడానికి నడుం బిగించారు. అటువంటి తరుణంలో దేశభక్తి తత్పరులైన నాటకకవులు మన జాతీయన నాయకులకు, తెల్లదొరలకు మధ్య జరుగుతున్న రాజకీయోదంతాలను కళ్ళకు కట్టినట్లు రూపొందించి ఆనాటి ప్రభుత్వం కుటిల రాజకీయ కుతంత్రాలను బట్టబయలు చేయడానికి పూనుకున్నారు. ఇటువంటి రాజకీయ నాటకాలకు శ్రీకారం చుట్టి, దామరాజు పుండరీకాక్షుడు 1920లో స్వరాజ్య సోపానం అనే నాటకం రచించి, గుంటూరులో సంఘ సేవా నాట్యమండలి స్థాపించి,ఆంధ్రదేశమంతటా విజయవంతంగా ప్రదర్శించాడు. ఈ నాటకం తిలక్ నిర్యాణానంతరం గాంధీజీ రాజకీయ రంగంలో ప్రవేశించినప్పటి నుంచి నాగపూర్ కాంగ్రెసు సభలో గాంధీజీ ప్రతిపాదించిన స్వాతంత్ర్య తీర్మానం నెగ్గడంతో ముగుస్తుంది. ఈ నాటకంలో 1919, 20లలో జరిగిన భారత రాజకీయాలు చోటుచేసుకున్నాయి. ఈ నాటకం బహుళ జనాదరణ పొంది చరిత్ర సృష్టించింది. గాంధీగా పత్రి శీనప్ప నటనా వైదుష్యం కూడా ఈ నాటక విజయానికి దోహదం చేసింది. ప్రభుత్వ వ్యతిరేక ధోరణి కనబరచిన ఈ నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది.

ఇంతలో సోమరాజు రామానుజరావు స్వరాజ్యరథం (1921) వచ్చింది. అచ్చం అదే పోకడ, అదే కథ, అదే చిత్రణ. పత్రి శీనప్ప కొన్నాళ్ళపాటు విజయవంతంగా ప్రదర్శించిన ఈ నాటకాన్ని కూడా ప్రభుత్వం నిషేధించింది.

అకుంఠిత దీక్షాతత్పరుడైన దామరాజు పుండరీకాక్షుడు ప్రభుత్వం తన స్వరాజ్య సోపానం నాటకాన్ని నిషేధించినా, పట్టువదలక మార్గాంతరమాలోచించి అచ్చువడని స్వరాజ్యసోపాన నాటకాన్ని పెంచి మూడు నాటకాలుగా ప్రకటించాడు.
1. నవయుగారంభం లేదా గాంధీమహోదయం, 2. నవయుగం లేదా గాంధీ విజయం, 3. పంజాబు దురంతాలు లేదా పాంచాల పరాభవం.

నవయుగారంభం నాటకంలో తిలక్ మరణానంతరం గాంధీజీతో నవయుగారంభమైనట్లు నిరూపించబడింది. శ్రీకృష్ణుడు నారదుని వంటి పౌరాణిక పాత్రలు ప్రసంగవశాన స్వాతంత్ర్య విశేషాలు ప్రస్తావించడం విశేషం. తుదకు పరమేశ్వరుడే గాంధీగా అవతరించినట్లు చెప్పబడింది. ''మహాత్మాగాంధీ నాయకత్వాన .... సత్వర స్వరాజ్యప్రాప్తి కలుగుగాకో''అని భరతమాత ఆశీర్వదించడంతో నాటకం ముగుస్తుంది. నవయుగం లేదా గాంధీ విజయం నాటకంలో గాంధీజీ రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పటి నుండి నాగపూరు కాంగ్రెసు మహాసభల వరకు జరిగిన విశేషాలున్నాయి. ఈ నాటకం ''కత్తులు లేవు, శూలమును, గాండీవముల్ మొదటే హుళక్కి'' అనే నాందీ పద్యంతో ప్రారంభమైంది. ఇందులో నటి, సూత్రధారులకు బదులు దేశభక్తుడు, దేశ సేవకుడు ప్రస్తావన నడిపించాడు.

ఈ నాటకంలో గాంధీజీ ప్రతిపాదించిన అహింసా సిద్ధాంత బీజాలు అడుగడుగునా కనిపిస్తాయి. ఇందులో పన్నుల బాధ, హిందూ మహమ్మదీయుల సమ్మేళనం, గాంధీ సిద్ధాంతాల ప్రతిపాదన, సహాయ నిరాకరణోద్యమారంభం మనోజ్ఞంగా చిత్రింపబడ్డాయి. ఆ రోజుల్లో ఈ నాటకం గొప్ప సంచలనం సృష్టించింది. 'రండు స్వరాజ్య రథములాగ నవశ్యము రండటంచు..., మేలుకొనుమీ భరత పుత్రుడ, మేలుకొనుమీ సచ్చరిత్రుడ...' వంటి పద్యాలు గేయాలు, వాక్యాలు బ్రిటీష్ పాలకులపై ఏవగింపును కలుగజేస్తూ, దేశభక్తిని ఉద్దీపింప చేస్తూ ప్రేక్షకులు, పాఠకులపై చెరగని ముద్ర వేశాయి.

పంజాబు దురంతాలు లేదా పాంచాల పరాభవం నాటకం అడుగడుగునా మహాభారతంలోని ద్రౌపదీ వస్త్రాపహరణాన్ని తలపింపజేస్తుంది. పంజాబు దురంతాల యధార్థ కథనమే ఈ నాటకంలో అధిక క్రియాత్మకంగా దర్శనమిస్తుంది.

గాంధీజీ ఆదేశానుసారం ప్రజలు హర్తాల్ జరపడంతో డయ్యరు నిషేధాజ్ఞలు విధించడమేగాక వంతెన దగ్గర ప్రజలను అరెస్టు చేయించడం, నేల మీద పాకించడం మొదలైన ఘోర కృత్యాలు చేయిస్తాడు. అంతేగాక చెరసాలలో పాంచాల మాతను వివస్త్రను చేయడానికి యత్నించినపుడు కృష్ణుడు ప్రత్యక్షమై గాంధీగా మారడంతో భయపడి డయ్యరు పారిపోతాడు. అమృతసర్ కాంగ్రెసు సభలో దేశ నాయకులు స్వాతంత్ర్య దీక్ష గైకొనడంతో నాటకం ముగుస్తుంది.

ఇందులో డయ్యరు దుర్యోధనుడుగా, పంజాబు పాంచాల మాత (ద్రౌపది)గా, గాంధీజీ కృష్ణుడుగా, మోతీలాల్, షౌకతాలి, లాలా లజపతిరాయ్, చిత్తరంజన్ దాస్, మహ్మదాలీ, ధర్మజాతి పాండవులుగా కనిపిస్తారు. దేశభక్తి భరితమైన, హృద్యమైన పద్యాలు, గేయాలు, వాక్యాలు ఈ నాటకంలో ఉన్నాయి. "గాంధినామం మరువాం మరువాం– సిద్ధము జైలుకు వెళదాం వెళదాం" అనే పాట వీర సైనిక గీతంలా అనిపిస్తుంది. రామా రామా రామా–కలియుగ రామా గాంధీ నామా... అనే గేయం రామదాసు కీర్తనను తలపింపజేస్తుంది. అంతేగాక స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన రాట్నాన్ని వర్ణిస్తూ ... రాట్నమే సర్వసుఖముల కాటపట్టు – రాట్నమే స్వరాజ్య సౌధ కవాట మహహా! అని శ్లాఘించడం జరిగింది. ప్రదర్శనకు, నటనకు ఎక్కువ అవకాశం గల ఈ నాటకంలో 1935 వరకు చోటుచేసుకున్న ఘట్టాలు అప్పటి కప్పుడే రచించి నాటకంలో చేర్చేవారు. కాని ఆనాటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఈ నాటకాన్ని నిషేధించడమే గాక వేలాది ప్రతుల్ని తగుల బెట్టించింది. దామరాజు నాటకాలు ప్రదర్శనకే గాక, చదివి జాతీయోద్యమ స్ఫూర్తిని పొందడానికి కూడా ఉపకరించాయి.

ఈ కాలంలోనే శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి రచించిన గాంధీ విజయధ్వజం (1921) అనే నాటకం దేశం నలుమూలలా ప్రదర్శింపబడి విజయ దుందుభి మోగించింది. దక్షిణాఫ్రికా భారతీయుల అధ్వాన్న స్థితిని బాగు పరచడానికి గాంధీ పోరాడినప్పటి రాజకీయ జీవితం మొదలు నాగపూరు కాంగ్రెసు మహాసభ వరకు గల సమగ్ర రాజకీయ చరిత్ర తొమ్మిదంకాల నాటకంలో వివరించబడింది. నాగపూరు సభలో సహాయ నిరాకరణ తీర్మానం అందరు నాయకులు ఆమోదించిన పిమ్మట ప్రజలు గాంధీజీని పూజిస్తుండగా నాటకం ముగుస్తుంది. ఈ ప్రదర్శనను ప్రభుత్వం చాలాకాలం సాగనివ్వలేదు.

1921లోనే శ్రీపాద కృష్ణమూర్తి తిలకు మహారాజ నాటకం రచించాడు. ఈ నాటకం వందేమాతర గేయంతో ఆరంభమై, గాంధీ ఉపన్యాసంతో ముగుస్తుంది. దీనిలో తిలక్ గాంధీజీల సంభాషణ, తిలక్ నిర్యాణం మనోహరంగా చిత్రింపబడ్డాయి.

సీతారామయ్య రచించిన స్వరాజ్యధ్వజం (1921) ఆ రోజుల్లో ఊరూరా ప్రదర్శింపబడింది. దీనిలో గాంధీజీ అవతార పురుషుడుగా చిత్రింప బడ్డాడు. మూడంకాల ఈ నాటకంలో భరతమాత తన బాధలు భరత పుత్రునితో చెప్పడం, తిలక్ గాంధీకి కర్తవ్యోపదేశం చేయడం, సహాయ నిరాకరణోద్యమ కాలం నాటి రాజకీయ పరిస్థితులు మొదలైన అంశాలు చోటుచేసుకున్నాయి.

జంధ్యాల అయ్యవారిశాస్త్రి ఆలీ ప్రభృతుల నిర్బంధం (1921) జాతీయోద్యమ స్ఫూర్తితో రచించిన నాటకం. ఖిలాఫత్ ఉద్యమ నాయకులైన మహమ్మదాలీ, షౌకతాలీ సోదరులను కరాచీలో విచారించడం, నిర్బంధించడం వంటి రాజకీయాంశాలు ఈ నాటకంలో ఉన్నాయి.

1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో విప్లవ వీరుడు మంగళ పాండ్యా సాగించిన వీరోచిత పోరాటం ఇతి వృత్తంగా మద్దూరి అన్నపూర్ణయ్య 1929లో కాంగ్రెసు పత్రికలో చిచ్చరపిడుగు అనే నాటకం ప్రచురించాడు. ప్రముఖ నాటక రచయిత ఆమంచర్ల గోపాలరావు గుంటూరు యూత్‌లీగ్ పక్షాన విజయవంతంగా ప్రదర్శింపజేశాడు.

ముద్దా విశ్వనాథం జన్మభూమి(1932), సత్య దుర్గేశ్వర కవుల శాంతి సమరం (1940) జాతీయోద్యమ స్ఫూర్తితో రచింపబడిన నాటకాలు. జాస్తి వేంకటనరసయ్య, ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యం జంటగా రచించిన కాంగ్రెసు విజయం భారత రాజకీయ చరిత్రను చక్కగా వివరిస్తున్నది. టి.సూర్యనారాయణ స్వరాజ్య భారతంలో రాజకీయ చైతన్యం, దేశభక్తి ప్రస్ఫుటమవుతున్నాయి. 1946 వరకు సాగిన జాతీయోద్యమాన్ని చిత్రిస్తూ పత్తి గొడుపు రాఘవ రాజు ఢిల్లీ కోట, క్విట్ ఇండియా నాటకాలు రచించాడు.

ఈ విధంగా జాతి విముక్తి కోసం జరిగిన ఈ మహోద్యమ స్ఫూర్తిలో ఎందరో నాటక కర్తలు తమ రచనలతో ప్రజలను చైతన్యవంతుల గావించారు.

నాగిరెడ్డి

సాంఘిక నాటకరంగం

అమలాపురంలో సంస్కృత పండితుడైన కోరాడ రామ చంద్రశాస్త్రి (1816–1900) మంజరీ మధుకరీయం అనే పేరుతో ఒక స్వతంత్ర నాటకాన్ని 1860 ప్రాంతంలో రచించి, తెలుగులో నాటక రచనకు శ్రీకారం చుట్టాడు. నాటకం రాయడానికి తెలుగులో అప్పటికి కూడా మార్గదర్శక సూత్రాలు గాని, లక్షణ గ్రంథాలు గాని లేని కారణంగా సంస్కృత నాటక లక్షణాలన్ను, సంప్రదాయాలను స్వీకరించి తదనుగుణంగా స్వతంత్ర నాటక రచనకు ఆద్యుడయ్యాడు. మంజరీ, మధుకరుల ప్రణయ వృత్తాంతమే ఈ నాటకం. మంత్రాలు, మాయలతో ఒక జానపద కథలా నడుస్తుంది. గద్య పద్యాత్మకమైన ఈ నాటకంలో గద్యం కొంత సరళంగా ఉన్నా, పద్యాలు ప్రబంధ శైలిలో జటిలంగా ఉంటాయి.

తెలుగు నాటకం ఆవిర్భవించిన రెండు దశాబ్దాల తర్వాత వావిలాల వాసుదేవశాస్త్రి (1851–1897) షేక్స్పియర్ రచించిన జూలియస్ సీజర్ నాటకాన్ని సీజరు చరిత్ర అనే పేరుతో పరివర్తన చేయడంతో ఆంగ్ల నాటకానువాదానికి కొత్తబాట ఏర్పడింది. నాటకంలో సంభాషణలు యావత్తు

తేటగీతిలో రాయడం వల్ల ఇది పూర్తిగా పద్యనాటకం. ఈ నాటకాన్నే కాక *నందకరాజ్యం* (1880) అనే తొలి స్వతంత్ర సాంఘిక నాటకాన్ని కూడా రచించాడు. ఇది కూడా పద్యనాటకమే. పైన పేర్కొన్న నాటకాలు ఏవీ ప్రదర్శించబడలేదు. **1880** నుంచి నాటక రంగంలో రెండవ దశ ప్రారంభమైంది. నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, గద్య తిక్కన అని ప్రశంసించబడిన కందుకూరి వీరేశలింగం పంతులు **(1848-1919)** ప్రవేశంతో తెలుగు నాటక రంగంలో అపూర్వమైన మార్పులు చోటుచేసుకున్నాయి. వీరేశలింగం **1880**లో వ్యవహారధర్మబోధిని అనే పేరుతో ప్రహసన ప్రాయమైన ఒక సాంఘిక రూపకాన్ని రచించి, విజయ నగరం మహారాజా బాలికల పాఠశాలలో విద్యార్థులతో ప్రదర్శింప జేయడం ఆంధ్ర నాటక చరిత్రలో ఒక మరపురాని సంఘటన. తెలుగు నాటకాన్ని తొలిసారిగా రంగస్థలం మీదికెక్కించిన ఘనత వీరేశలింగందే. న్యాయ సంరక్షణకోసం పోరాడవలసిన న్యాయమూర్తులు, న్యాయవాదులు అధర్మానికి అక్రమాలకు పాల్పడితే, వాళ్ళ చేతుల్లో నిరక్షరాస్యులైన ప్రజలు పడేపాట్లు ఆ నాటకంలో చిత్రించబడ్డాయి. వ్యవహార ధర్మబోధిని ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని కందుకూరి తన స్వీయ చరిత్రలో రాసుకున్నాడు. ఈ రూపకానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. అవి: 1. వ్యవహార ధర్మబోధిని ప్రప్రథమంగా ప్రదర్శితమైన సాంఘిక నాటకం కావడం.2. రచన గ్రాంథిక, వ్యావహారిక భాషలో ఉండటం. 3. నాటక రచయితే ప్రయోక్త కావడం 4. ప్రదర్శన కోసం ఒక నాటక సమాజాన్ని స్థాపించడం. 5. నాటకంలో సమకాలీన సమస్య చోటు చేసుకోవడం మొదలైనవి.

సంఘంలోని దురాచారాలను, మూఢనమ్మకాలను, కాలదోషం పట్టిన సంప్రదాయాలను హాస్య ధోరణిలో విమర్శించి ప్రజలలో మార్పు తేవాలని అనేక ప్రహసనాలను రచించి మార్గదర్శకుడయ్యాడు కందుకూరి. వీరేశలింగం వివాహవ్యవస్థపై రాసిన బ్రాహ్మవివాహం రూపకంతో స్ఫూర్తి పొందిన గురజాడ వేంకట అప్పారావు *కన్యాశుల్కం* (1892/97-1909) పేరుతో సాంఘిక నాటకం రచించాడు. ఈ నాటకంతో తెలుగు నాటకానికి ఒక సమగ్ర రూపం వచ్చింది. సమకాలీన సామాజిక సమస్యలు ప్రతిబింబించే ఈ నాటకం పండిత పామరుల ప్రశంసలు అందుకొంది. పాత్రచిత్రణ, సన్నివేశకల్పన, సంభాషణావైఖరి, మాండలిక భాషా ప్రయోగం, సున్నితహాస్యంలోనూ అన్నిటా నాటకం మేలు బంతి అయింది. వ్యావహారిక భాషకు పెద్దపీట వేసిన కన్యాశుల్కం ఒక కళాఖండంగా గుర్తింపు పొందింది. ఆరు విదేశీ భాషల్లోకి అనూదితమైంది. సంఘ సంస్కరణాత్మక నాటక రచనకు కన్యాశుల్కం మార్గం చూపింది. ఆంధ్రదేశంలో ప్రసిద్ధ సమాజాలన్నీ ఈ నాటకాన్ని ప్రదర్శించాయి. కన్యాశుల్కం తర్వాత పౌరాణిక పద్యనాటకాలు రాజ్యం చేశాయి. రచన, ప్రదర్శన పద్యనాటకాలమయమైంది. **1920** దశకంలో కాళ్ళకూరి నారాయణ రావు సాంఘిక నాటకాలు రచించినప్పటికీ అవి పద్య నాటకాలుగా రూపొందించడం గమనార్హం. కాళ్ళకూరి బాటలో మరికొందరు సాంఘికనాటకాలు రాశారు. కానీ అవి కూడా పద్య గద్యాత్మకాలే.

1930లో నాటకరంగంలో విశేషమైన మార్పులచ్చాయి. ఆర్థిక మాంద్యం వలన, అప్పుడప్పుడే ప్రారంభమవుతున్న చలన చిత్రాల ప్రభావం వలన, జాతీయోద్యమం వైపు అన్ని వర్గాల ప్రజలు దృష్టి సారించడం వలన అన్నిటికంటె మించి కళాపోషకులైన జమీందారులు నాటక సమాజాల నిర్వహణకు తిలోదకాలివ్వడం వలన నాటకరంగం శృంగాటకంలో నిలిచింది. వృత్తి నాటక సమాజాలు మూతపడ్డాయి. జీవనోపాధి లేక వృత్తి కళాకారులు కటకటలాడుతున్న తరుణంలో 'కాంట్రాక్టర్లు' రంగప్రవేశం చేశారు. నాటక సమాజాలు లేక, నాటకాలు లేక, ఇబ్బంది పడుతున్న నటుల్ని చేరదీసి కాంట్రాక్టు పద్ధతిలో నాటకాలాడించిన వారే కాంట్రాక్టర్లు. ఒక నాటకాన్ని ఎంపిక చేసుకొని, కృష్ణుణ్ణి ఒకచోటనుంచి, అర్జున పాత్రధారిని ఇంకో వూరి నుంచి, ధర్మరాజుని, ధృతరాష్ట్రుణ్ణి వేరే వేరే చోట్ల నుంచి పిలిపించి టిక్కెట్లు పెట్టి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. నటులకు పూర్వాభ్యాసాలు(ఒద్దికలు) ఉండేవి కావు. ఎకాఎకి రంగస్థలం మీదికి వచ్చే వాళ్లు. కమనీయంగా పద్యాలు పాడే నటుడికే ప్రజల్లో పరపతి, గౌరవం ఉండేవి. "వన్స్‌మోర్" చెప్పి పద్యాలు పాడించుకొనే పద్ధతి కాంట్రాక్టు నాటకాలతోనే అంటువ్యాధిలా వ్యాపించింది. ప్రజల అభిరుచిని కనిపెట్టి ఒక నాటకంలో ఇద్దరు కృష్ణులు, ముగ్గురు కృష్ణుల్ని పెట్టి నాటకం వెయ్యడం వ్యాపార ధర్మంగా, అలవాటుగా మారిపోయింది. నటన స్థానంలో గానానికి ప్రాధాన్యం వచ్చింది. ఎంత గొప్పగా నటించినా పద్యాలు పాడలేని నటులకు గౌరవం సన్నగిల్లింది. కాంట్రాక్టర్లు నటులకు యివ్వాల్సిన పారితోషికం యివ్వకుండా పారిపోవడం, టిక్కెట్లు అమ్మి నాటకం ప్రదర్శించక పోవడం, ప్రజలు నటులపై చేయి చేసుకోవడం వంటి సంఘటనలు జరుగుతూవుండేవి. ఈ పరిస్థితులు సంప్రదాయ నాటక ప్రదర్శనలోని నాణ్యతను, గౌరవాన్ని క్షీణింపజేశాయి. ఈ

కారణాల వల్ల 1930 నాటికి పద్య నాటక మహోజ్వల శకం ముగిసింది. ఈ దశలోనే సాంఘిక నాటకాలకు ప్రోత్సాహం, ఆదరణ లభించాయి. అంటే వన్నె తరిగి నిర్జీవంగా తయారైన పౌరాణిక నాటక ప్రదర్శనలపై ప్రజలకు ఏర్పడిన వైముఖ్యం పరోక్షంగా సాంఘిక నాటకాల పురోగతికి దోహదం చేసింది.

బళ్లారి రాఘవ 1929లో విదేశీపర్యటనచేసి పాశ్చాత్య నాటక పద్ధతుల గురించి అధ్యయం చేసి వచ్చిన ఫలితంగా, తెలుగు నాటకరంగాన్ని సమూలంగా మార్చాలని సంకల్పించాడు. పద్యనాటకాల్లో రాగాలకు ప్రాధాన్యత ఉండకూడదనీ, అభినయానికి అందులో సాత్త్వికాభినయానికి ప్రాధాన్యత ఇవ్వాలని, నాటకాలు సమకాలీన సమాజ సమస్యలను ప్రతిబింబించాలని, స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించాలనీ అటు ప్రదర్శనలోను, ఇటు రచనా విధానంలోనూ రావలసిన మార్పుల్ని సూచిస్తూ ఉద్యమం లేవదీశాడు. 1930లో పి.వి. రాజమన్నార్ రచించిన తప్పెవరిది అన్న సాంఘిక నాటకాన్ని ఆధునిక పోకడలతో మనోజ్ఞంగా ప్రదర్శించాడు రాఘవ. ఈ నాటకానికి దర్శకత్వం వహించడంతో పాటు ముఖ్యపాత్రకూడా రాఘవే పోషించాడు. ఆ నాటకంలో స్త్రీ పాత్రలను స్త్రీలతోనే నటింప చేశాడు. గౌరవ కుటుంబాలకు చెందిన కొమ్మూరి పద్మావతీ దేవి, మాడపాటి సరోజిని ఆ నాటకంలో పాల్గన్నారు. నవ్యరీతిలో అద్భుతంగా ప్రదర్శించబడిన తప్పెవరిది నాటకం కొత్త రచయితలకు ఉత్సాహాన్నిచ్చింది. అప్పట్నుంచీ సాంఘిక నాటకాలకు, కొత్త బాట ఏర్పడింది. ఆధునిక నాటకం తప్పెవరిది నాటకంతోనే ప్రారంభమైందని పరిశోధకులు, నాటక విమర్శకులు స్థిరీకరించారు.

అప్పటి నుంచి సాంఘిక నాటకరచన విస్తృతంగా సాగింది. ఈ దశలోనే ఏకాంకికలకు ఒక రూపం ఏర్పడింది. 1930 ప్రాంతాలలో నాటకాల కంటె ఏకాంకిక నాటికలే ఎక్కువగా వెలువడినాయని చెప్పవచ్చు.

ఏకాంక నాటికలు : తొలిదశలో ఏకాంక నాటికాసాహిత్యానికి గట్టి పునాదులు వేసిన వారిలో పి.వి.రాజమన్నార్, విశ్వనాధకవిరాజు, నార్ల వేంకటేశ్వరరావు, ఆమంచర్ల గోపాలరావు, భమిడిపాటి కామేశ్వరరావు, మల్లాది అవధాని, జి.వి.కృష్ణారావు ముఖ్యులు. ప్రదర్శన యోగ్యమైన వచన నాటికలతోపాటు పద్యనాటికలు, గేయ నాటికలు, శ్రవ్య నాటికలు కూడా నాటికా వాఙ్మయంలో వచ్చి కలిశాయి. పి.వి. రాజమన్నార్ రాసిన నాటికలలో ఏమి మగవాళ్ళు (1930), నిష్ఫలం (1938), *మాతృప్రేమం* (1938), *దయ్యాల లంక* (1946) పేర్కొనదగినవి. రాజమన్నార్ స్త్రీ సమస్యాత్మక నాటికలు రాసిన వారిలో ప్రథములని చెప్పవచ్చు.

మల్లాది విశ్వనాథ శర్మ రచించిన నాటకాలు, నాటికలు సుమారు 40దాకా ఉంటాయి. నాటకాల కంటె నాటికలే ఈయనకు ఖ్యాతిని గడించి పెట్టాయి. ప్రతి నాటకంలోనూ చమత్కార పూరితమైన సంభాషణతోపాటు, కథనంలో చిక్కని ఉత్సుకత పూసలోదారంలా ఇమిడి ఉంటుంది. దొంగాటకం 1938) వీరి ప్రసిద్ధ నాటిక. మల్లాది రచించిన నాటికలలో దాంపత్యజీవితం అధిక ప్రాధాన్యం వహిస్తుంది. ఇటువంటి నాటికలలో రాజీ, పునస్సంధానం, డొంకలో షరాబు, లేతవిడాకులు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. వృత్తి నటులు, కంట్రాక్టర్లు రంగస్థలం మీద, రంగస్థలం వెనక వ్యవహరించే తీరు ఎలా ఉంటుందో హాస్య సన్నివేశాలకు అద్దం పడుతుంది నేపథ్యం నాటిక.

నార్ల వేంకటేశ్వరరావు *కొత్తగడ్డ* పేరుతో 16 నాటికల సంపుటిని వెలువరించాడు. గ్రామీణ జీవితం గురించి నాటికలు రాసిన వారిలో నార్ల ప్రథముడు. ఈయన నాటికలలో వస్తువైవిధ్యంతో పాటు రచనా శిల్పంలో కూడా వైవిధ్యం కనిపిస్తుంది. 1947లో రచించిన *కొత్తగడ్డ*, ప్రారబ్ధం, ఏకాభిప్రాయం , ద్రోహం అన్నీ కూడా మంచి నాటికలే.

తెలుగు **సాంఘిక నాటక రంగానికి** ప్రదర్శన యోగ్యమైన నాటికలు అందించిన **తొలితరం నాటక కర్తలలో భమిడిపాటి** కామేశ్వరరావు (1897-1958) హాస్యబ్రహ్మగా ప్రసిద్ధుడు. వ్యావహారిక భాషలో ఈయనది ప్రత్యేక శైలి. మోలియార్, షెరిడాన్ రచనలను తెలుగు పాఠకులకు పరిచయం చేసిన ప్రథమ రచయిత. భమిడిపాటి రచించిన ఎప్పుడూ ఇంతే (1926), కచటతపలు (1927), *బాగు బాగు* (1929) పేరు తెచ్చిన స్వతంత్ర నాటికలు. భమిడిపాటి సుమారు 50 నాటకాలు, నాటికలు రచించాడు. వాటిలో అత్యధిక భాగం అనువాదాలు. ఈయన నాటకాలన్నీ ప్రేమ – పెళ్ళి చుట్టూ తిరిగే ఇతివృత్తంతో ఉండటం గమనార్హం. మల్లాది అవధాని పన్నెండు నాటికలు రాశాడు. వాటిలో దువ్వూరి రామిరెడ్డి 'కాంగ్రెస్ వాలా' (1935) రాజకీయ నాటిక కాదు – మానవత్వాన్ని ప్రబోధించే నాటిక. ఆమంచర్ల గోపాలరావు 'మల్లమ్మదేవి ఉసురు' (1938) రంగస్థలం మీద బాగా రాణించిన నాటిక. 'అసంపూర్ణ రామాయణం' (1939), ఆంధ్రా స్పిరిట్ (1939) వ్యంగ్యాత్మక నాటికలు.

30వ దశకంలో వివిధ రచయితలు రాసిన నాటికలకు ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలే వేదికలయ్యాయి. 1931 ప్రాంతాలలో చలన చిత్ర పరిశ్రమ మొదలైంది. పౌరాణిక నటులను కొందరిని సినిమాల్లోకి తీసుకొంది. మిగిలిన వారికి కాంట్రాక్టర్లే శరణ్యమయ్యారు. వీరి అండతోనే 1935 వరకూ కాంట్రాక్టు నాటకాలు కొనసాగాయి. పౌరాణిక నాటక రచన కూడా తగ్గింది.

నలభయ్యవ దశకంలో సాంఘిక నాటకరంగం దశ, దిశ మారాయి. నాటకం శీఘ్రగతిలో పురోగమించడానికి నిర్మాణాత్మకమైన కృషి జరిగింది. దానికి ఆంధ్ర నాటక *కళాపరిషత్తు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగ నాటక సమితి,* ప్రజా నాట్యమండలి, *లిటిల్ థియేటర్* ఉద్యమం దోహదం చేశాయి. (వీటి పుట్టు పూర్వోత్తరాల గురించి వివరణాత్మక వ్యాసాలు ఈ గ్రంథంలోనే వేరొక చోట పొందుపరచడం జరిగింది). 1929లో స్థాపించబడిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు 1943లో పునర్వ్యవస్థీకరింప బడిన తరువాత నాటక రంగంలో అపూర్వమైన మార్పులచ్చాయి. ప్రతి సంవత్సరం నాటక పోటీలు రాష్ట్రస్థాయిలో నిర్వహించబడటంతో వందల కొలదీ నాటకాలు, నాటికలు, కొత్త రచయితలు, సాంకేతిక నిపుణులు, దర్శకులు, నటీనటులు వెలుగులోకి వచ్చారు. స్త్రీ పాత్రలు స్త్రీలే నటించే సంప్రదాయం అమలులోకి వచ్చింది. అంతేకాదు. ఆం.నా.క. పరిషత్తును ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో అనేక నాటక పరిషత్తులు వెలిశాయి. *ఆచార్య ఆత్రేయ, పినిశెట్టి శ్రీరామమూర్తి, కొడాలి గోపాలరావు, డి.వి.నరసరాజు, కొర్రపాటి గంగాధరరావు* వంటి రచయితలకు ఆంధ్ర నాటక కళా పరిషత్తే పుట్టినిల్లయింది. *ఎన్.టి. రామారావు, రమణమూర్తి, చలం, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, రావికొండలరావు, జగ్గయ్య, కె. వేంకటేశ్వరరావు, వల్లం నరసింహారావు, తిలకం, వాణిశ్రీ* ప్రభృతుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసింది ఈ పరిషత్తు. ఎన్.జి.ఓ, మాభూమి, *నాటకం, కాళరాత్రి, పునర్జన్మ, భయం, చిల్లరకొట్టుచిట్టెమ్మ, కీర్తిశేషులు, పల్లెపడుచు* మొదలైన ఉన్నత ప్రమాణాలు గల నాటకాలు, *తుఫాన్, ఎవరు దొంగ, ప్రగతి, దిష్టిబొమ్మలు, బంగారు సంకెళ్లు, వెంకన్నకాపురం, సుల్తానీ, చీకటి తెరలు, జ్వలిత జ్వాల* మొదలైన ఉత్తమనాటక కళాసృష్టికి కాణాచి గా వెలుగొందింది ఈ పరిషత్తు.

ఇదే సంవత్సరం ఆంధ్ర విశ్వవిద్యాలయ నాటకసమితిని స్థాపించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు కె.వి.గోపాలస్వామి యూనివర్శిటీ ప్రాంగణంలో కొన్ని వందల నాటక, నాటికలు ప్రదర్శింపజేసి, విద్యార్థి నాటకరంగాన్ని అభివృద్ధిపరిచాడు. నటశిక్షణిచ్చి, సాంకేతిక విలువలతో కూడిన నాటక ప్రదర్శనలకు నాంది పలికాడు.

1943లో స్థాపించబడిన ప్రజానాట్యమండలి కోడూరి అచ్చయ్య, *గరికపాటి* రాజారావుల సారధ్యంలో మాభూమి, ముందడుగు' (1945) వంటి కళాఖండాలను ప్రదర్శించింది. నాటకాన్ని గ్రామస్థాయికి తీసుకొని వెళ్ళి, నాటకోద్యమాన్ని తీవ్రంగా నడిపింది. జానపద కళారూపాలను పునరుద్ధరించి వెలుగులోకి తెచ్చింది.

1947లో 'లిటిల్ థియేటర్'ను కొప్పరపు సుబ్బారావు స్థాపించి, నటీ నటులకు నాటక కళను గూర్చిన శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, నటశిక్షణ కావాలని, ఆ దిశలో ఉద్యమ స్ఫూర్తితో పనిచేశాడు.

ఈ సంస్థల అవిరళ కృషి ఫలితంగానే సాంఘిక నాటకరచనలోను, ప్రదర్శనలోను నవ్యత వెల్లివిరిసింది. కొన్ని వందల ఔత్సాహిక నాటక సంఘాలు వెలుగులోకి వచ్చాయి.

1940 ప్రాంతంలో నాటకరంగంలో ప్రవేశించి సాంఘిక నాటక రచనలో, ప్రదర్శనలో పెనుమార్పులు తెచ్చిన ఖ్యాతి ఆత్రేయదే. రచనలో నూతన ప్రయోగాలు చేసి, ఉన్నత ప్రమాణాలు నెలకొల్పి, కొత్త వరవడిని పెట్టిన కళాస్రష్ట ఆత్రేయ. సంభాషణల్లో, రంగస్థలం మీద పాత్రల కదలికల్లో, రంగాలంకరణలో, సన్నివేశ కల్పనలో సహజత్వానికి పెద్దపీట వేసిన ప్రథమ నాటక కర్త ఆత్రేయ. వాస్తవికతను దూరంచేస్తాయన్న లక్ష్యంతో పాటలను, నృత్యాలను, చివరికి నేపథ్య సంగీతాన్ని కూడా అంగీకరించని రచయిత. 1940 నుండి 1954 వరకు మొత్తం పది నాటకాలను, పదిహేన నాటికలను రచించాడు. ప్రారంభదశలో రాసిన *గౌతమ బుద్ధ* (1943), *అశోక సమ్రాట్* (1944) చారిత్రక నాటకాలు తాను రచయితగా వెలుగులోకి రావడానికి తోడ్పడ్డాయి. 1945లో రచించిన పరివర్తన నాటకం తొలిసారిగా ఆత్రేయను వెలుగులోకి తెచ్చింది. కవి ప్రజల పక్షాన నిలవాలి, ప్రజల కోసం కవితాశక్తిని ధారబోయాలి అంతేకాని శ్రమశక్తిని దోచుకునే పెట్టుబడి దారుల కోసం సృజనాత్మక ప్రతిభను వినియోగించడం అనుచితమని ఉద్బోధిస్తుదీ నాటకం. ప్రజానాట్యమండలి ఈ నాటకాన్ని విరివిగా ప్రదర్శించింది. ఆత్రేయ కలం వాడీ, వేడీ, వాస్తవం (1948) నాటకంలో ప్రస్ఫుటమవుతుంది. స్వాతంత్రోద్యమంలో అహర్నిశలు శ్రమపడిన, త్యాగాలు చేసిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు ఏ పదవీ, గుర్తింపూ లేకుండా నిర్లక్ష్యం చేయబడగా, ఉద్యమంలో ఆవగింజంత సేవ చేయని అవకాశవాదులు పదవులు అలంకరించటం, త్యాగధనులపై బురద చల్లి దుష్ప్రచారం చేయడం వంటి సంఘటనలతో వర్తమాన రాజకీయవ్యవస్థను చిత్రిస్తుందీ నాటకం. కాగా, ఆత్రేయను అగ్రశ్రేణి రచయితగా నిలబెట్టిన నాటకం ఎన్.జి.ఓ (1949) అప్పటి పేరు అద్దె కొంప ఏలూరులో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో ఈ నాటకం అమెచ్యూర్ ఆర్టిస్ట్సు అసోసియేషన్(వెంకటగిరి) నేతృత్వంలో ప్రదర్శింపబడి ఉత్తమరచనకు, ప్రదర్శనకు బహుమతులు అందుకొంది. నాటక చరిత్రలో ఈ సంఘటన ఒక కొత్త మలుపు. బాధా సర్పదష్టుడైన మధ్యతరగతి మనిషి జీవితానికి దర్పణం ఎన్.జి.ఓ. నాటకం. సగటు మనిషిని నాయకుడ్ని చేసి నాటకం రాయడం ఆత్రేయతోనే మొదలైంది.

హిందూ-ముస్లిం సఖ్యతను ప్రబోధించే ఈనాడు (1948)నాటకం, విశ్వశాంతినికాంక్షించే విశ్వశాంతి (1953) లోకరీతుల్లో ఒక పార్శ్వాన్ని తెలిపే కప్పలు (1954), రకరకాల మనుషుల్ని వేధించే భయాన్ని గురించి భయం (1954), వయసుతో మనసు సంఘర్షించే ఇతివృత్తంతో వయసు మనసు (తిరుపతి) ఆత్రేయ కలం నుంచి ప్రాణం పోసుకున్న నాటకాలు. వీటిలో 'భయం', 'కప్పలు'నాటకాలు విస్తృతంగా ప్రదర్శించబడినాయి. కప్పలు నాటకాన్ని రెండు రంగాలతోను, భయం నాటకాన్ని ఒకే రంగంతోనూ రాసి నాటకరచనలో ఒక కొత్త ప్రయోగం చేశాడు. చిన్న చిన్న మాటలతో లోతైన భావాన్ని మనసును తాకేటట్టు రాసే నాటక శిల్పం ఆత్రేయ సొత్తు.

ఆత్రేయ నాటికలలో ప్రగతి (1950), ఎవరుదొంగ? (1951), 'చావకూడదు' (1955) బహుళ జనాదరణ పొందాయి. ఔత్సాహిక సమాజాలు ఈ నాటికలను విరివిగా ప్రదర్శించాయి. శాస్త్ర పరిశోధనల పేరిట మానవత్వాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని ఉద్బోధించే ప్రగతి నాటిక సెయింట్ జార్జి జి.ఇర్విన్ రాసిన ప్రోగ్రెస్ కు అనుసరణ. ఎవరుదొంగ? నాటిక ఆంధ్ర దేశంలో గొప్ప సంచలనం కలిగించింది. సంఘంలో అధికారులుగా, పెద్దమనుషులుగా చెలామణీ అయ్యే వారే నిజమైన దొంగలని ఈ నాటికవల్ల అర్థమౌతుంది. ప్రభుత్వం ఈ నాటికను నిషేధించింది. ఆత్రేయ రచించిన చావకూడదు నాటిక పురుషాధిక్య సమాజంలో ఒక అనాథ స్త్రీ పడే బాధలను ప్రతిబింబిస్తుంది. ఈ నాటికలో అన్నీ స్త్రీ పాత్రలే. ఆత్రేయ వామపక్ష భావాలకు అనుకూలంగా కొన్ని నాటికలు రాశాడు. వాటిలో అంతర్యుద్ధం, ఓటునీకే (1955) పేర్కొనదగినవి. మాయ (1955), వరప్రసాదం (1955), అశ్వఘోషుడు, తెరిచిన కళ్ళు, కాపలావాని దీపం ఇతర భాషలకు అనుసరణలు. కళకోసం (1954), ఛస్తేనేం, ఒకరూపాయి (1954) నాటికలను ఔత్సాహిక సమాజాల కంటె కళాశాలలు ఎక్కువ ఆదరించాయని చెప్పాలి.

1950 నుంచి సాంఘిక నాటకాలు, నాటికలు, శరపరంపరగా వెలువడసాగాయి. ఈ దశాబ్దిలో 300 నాటకాలు, 500 నాటికలు వెలుగు చూశాయంటే రచనా బాహుళ్యాన్ని అంచనా వేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా నాటక పోటీలు జరిపే పరిషత్తులు ఆవిర్భవించడం, కళాశాలల్లో, హైస్కూళ్ళలో సైతం నాటకాలు, నాటికలు విరివిగా ప్రదర్శించటం పరిపాటికావటం, సాంఘిక నాటకాల పట్ల అభిరుచి వృద్ధి కావడం నాటక ప్రగతికి దోహదం చేశాయి. ఈ దశాబ్దిలో ఎందరో కొత్త రచయితలు వెలుగులోకి వచ్చారు. కణ్వశ్రీ, సీతంరాజు, పినిశెట్టి శ్రీరామమూర్తి, కొడాలి గోపాలరావు, బోయి భీమన్న, బెల్లంకొండ రామదాసు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, డి.వి.నరసరాజు, కొర్రపాటి గంగాధరరావు, కె.ఎల్. నరసింహారావు, భమిడిపాటి రాధాకృష్ణ, ప్రఖ్య శ్రీరామమూర్తి, కారెపు అప్పల స్వామి, ఎన్.ఆర్. నంది, అంగర సూర్యారావు, రావికొండలరావు, గన్నిశెట్టి వేంకటేశ్వరరావు, వేణు, రెంటాల గోపాలకృష్ణ ప్రభృతులు ముఖ్యులు.

నాటకరంగంలో వందకు పైగా నాటకాలు రచించిన వారు ఇద్దరే ఇద్దరు. వారు కొర్రపాటి గంగాధరరావు, కొడాలి గోపాలరావు. కొడాలి నాటకాల్లో అత్యధిక భాగం గ్రామీణ జీవితాన్ని నేపథ్యంగా తీసుకొని రాసినవి కావడం గమనార్హం. పేదరైతు (1952), కూలి (1953), రైతుబిడ్డలు (1954), వైకుంఠభవనం (1954), పాపం పదిరకాలు, దొంగవీరడు (1958), లంకెలబిందెలు (1959), ఛైర్మన్ (1961) మొదలైనవి ఈ కోవకు చెందినవే. కొడాలి గోపాలరావు నాటకాలు పల్లెటూళ్ళలోనూ, పట్నాలలోనూ విరివిగా ప్రదర్శితమయ్యాయి. కొర్రపాటి గంగాధరరావు నాటకాలలో అత్యధిక భాగం పట్టణ జీవితానికి, మధ్యతరగతి జీవితానికి సంబంధించినవి. ఈయన నాటకాలు పట్టణ ప్రాంతాలలో ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. నాటక పోటీలలోను, కళాశాలల్లోను గంగాధర రావు నాటికలు ప్రదర్శించబడినంత విస్తృత స్థాయిలో మరే ఇతర రచయిత నాటికలు రంగస్థలాన్ని అలరించలేదనడం అతిశయోక్తికాదు. 50వ దశకం కొర్రపాటిదే. ఈయన రచించిన నాటికలలో బంగారు సంకెళ్ళు, నా బాబు *(1954)*, ప్రార్థన *(1954)*, పెళ్ళిచూపులు *(1955)*, తెలుగు కోపం *(1957)*, పెండింగ్ ఫైల్ అత్యంత ప్రజాదరణ పొందాయి. నాటకాలలో గుడ్డిలోకం *(1955)*, యథాప్రజా తథారాజ, పూలదోసిళ్లు సుప్రసిద్ధాలు. నాటికలలో ఈ నాటికలను ప్రదర్శించని ఔత్సాహిక సమాజంకాని, కళాశాల కానీ ఉండదు. విదేశీ నాటకాలను కూడా కొర్రపాటి అనువదించాడు, కాని వాటిలో ఈ రోడ్డు ఎక్కడికి? (1967), పూలదోసిళ్ళు (1968), సంక్రాంతి (1968) వంటి నాటకాలు మాత్రమే ప్రజాదరణపొందాయి. కొర్రపాటి 'యథాప్రజా తథారాజ' సంచలనం కలిగించింది. ''పది రూపాయలు తీసుకొని ఓట్లేసే ప్రజలుంటే, పది కోట్లిస్తే దేశాన్ని అమ్మేసే నాయకులుస్తారు'' అని ప్రజలను ఆనాడే హెచ్చరించిన నాటకం. ఈ నాటకానికి సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. డ్రాయింగ్ రూమ్ నాటికలు, స్త్రీ పాత్రలేని నాటికలను విరివిగా రాశాడు. ప్రదర్శన సౌలభ్యం కోసం కొర్రపాటి చేసిన ఈ ఆలోచన ఔత్సాహిక సమాజాలకు, విద్యార్థి నాటక రంగానికి ప్రోత్సాహాన్నిచ్చిందనే చెప్పాలి. కొడాలి గోపాల రావు, కొర్రపాటి గంగాధర రావులు చనిపోయే వరకు నాటక రచనను ఒక యజ్ఞంగా భావించి, కళాసేవలో పునీతులైన ధన్యజీవులు.

గ్రామీణ జీవితం మీద నాటకాలు రాసిన వారిలో పినిశెట్టి శ్రీరామమూర్తి, అనిశెట్టి సుబ్బారావు, బోయి భీమన్న, సీతంరాజు వేంకటేశ్వరరావు, షేక్ నాజర్ లు సుప్రసిద్ధులు. పినిశెట్టి కలం నుంచి వెలువడిన పల్లె పడుచు (1950) నాటకం రంగస్థలం మీద నిగ్గు తేలిన మంచి నాటకాలలో ఒకటి. పల్లెటూళ్లో నీతికి, మంచితనానికి కట్టుబడిన ఒక పేదరైతు ఒక స్వార్థపరుని చేతిలో కష్టాలు అనుభవించడం, చివరికి కష్టాల కడలి నుంచి బయటపడటం ఈ నాటకంలో ఇతివృత్తం. మాట, పాట, ఆటల సమ్మేళనంతో సమగ్ర నాటకంగా రూపొందిన 'పల్లె పడుచు' కు విశేష ప్రజాదరణ లభించినది. 1950లో కాకినాడలో ఆంధ్రనాటక కళాపరిషత్తు నాటక పోటీలలో ఈ నాటకం ప్రథమ బహుమతి పొందింది. టిక్కెట్టు పెట్టి ఈ సాంఘిక నాటకాన్ని గ్రామప్రాంతాల్లో ప్రదర్శించి ఔత్సాహిక నాటకానికి ప్రొఫెషనల్ స్టేటస్ సృష్టించాడు రచయిత. కులం లేని పిల్ల (1951), అన్నా చెల్లెలు (1952), పంజరంలో పక్షులు నాటకాలు, ఆడది అనే స్త్రీ పాత్రలేని నాటిక పినిశెట్టికి పేరు తెచ్చిన రచనలు.

అనిశెట్టి రచించిన *గాలివేడలు* (1950) నాటకం విశిష్టమైనది. ఈయన రాసిన *మావూరు* (1954), పండిత పామరుల ప్రశంసలు అందుకుంది. *చరమాంకం* అనే ప్రతీకాత్మక నాటిక, *శాంతి* (1955), మూకాభినయ నాటిక అనిశెట్టి రచనల్లో విశిష్టమైనవి.

బోయి భీమన్న పాలేరు (1950), *కూలిరాజు* (1951) రైతు కార్మికుల దీనావస్థకు అద్దం పట్టే శక్తివంతమైన నాటకాలు. కణ్వశ్రీ 'ఇదా ప్రపంచం' (1950) భూస్వాముల కబంధహస్తాల్లో చిక్కుకుని విలవిలలాడే పేదరైతు జీవితాన్ని హృదయంగమంగా చిత్రించే నాటకం. నెల్లూరు యాసలో వెలువడిన మొదటి నాటకం కూడా ఇదే. బి. ఎన్.సూరి 'రైతు–భూమి' (1953), సీతంరాజు *'దోపిడి'* (1953), షేక్ నాజర్ 'ఆసామి' (1954) నేలను నమ్ముకొన్న కష్టజీవుల కడగళ్లను దృశ్యమానం చేసే నాటకాలు.

స్త్రీ సమస్యలపై వచ్చిన నాటకాలలో కొప్పరపు సుబ్బారావు ఇనప తెరలు (1950), బెల్లం కొండ రామదాసు పునర్జన్మ (1956), రాచకొండ విశ్వనాథశాస్త్రి తిరస్కృతి (1957), పి.వి.రాజమన్నార్ మనోరమ (1959), అమరాల సూర్యారావు పంజరం సుప్రసిద్ధాలు. ప్రేమతత్వంపై బుచ్చిబాబు ఆత్మవంచన (1951), కె.ఎల్. నరసింహారావు క్రీనీడలు నాటకాలు ప్రేక్షకుల, విమర్శకుల అభిమానాన్ని చూరగొన్నవి. డి.వి. నరసరాజు రచించిన నాటకం (1950), వీలునామా (1955) నాటకాలు ప్రజాదరణ పొందాయి. ఇవి రెండూ విదేశీ నాటకాలకు అనుసరణలు. నరసరాజు రచించిన వాపస్ (1950), ఈ ఇల్లు అమ్మబడును (హౌస్ ఫర్ సేల్) నాటికలు రంగస్థలం మీద రాణించాయి. వాపస్ విద్యార్థుల ద్వారా విస్తృతంగా ప్రదర్శితమైంది. తమిళంలో ప్రసిద్ధ రంగస్థల నటుడు ఎం.ఆర్.రాధా నేతృత్వంలో ప్రదర్శింపబడి అపూర్వ సంచలనాన్ని కలిగించిన నాటకం రక్త కన్నీరు. ఈ నాటకాన్ని పాలగుమ్మి పద్మరాజు తెలుగులోకి అనువదించాడు. సినీ నటుడు సి.నాగభూషణం ఈ నాటకాన్ని అయిదు వేల ప్రదర్శనలిచ్చి రికార్డు నెలకొల్పాడు. 30 రంగాలున్న ఈ నాటకాన్ని సినిమా టెక్నిక్కులతో నేత్రానందంగా ప్రదర్శించిన ఘనత రవి ఆర్ట్ థియేటర్స్‌కి దక్కింది. ఈ నాటకాన్ని ప్రదర్శించేటప్పుడు స్థానిక సమస్యలను కలుపుకొని ఛలోక్తులు విసురుతూ, విమర్శనాస్త్రాలు సంధిస్తూ, వ్యంగ్యాత్మక ధోరణితో ప్రదర్శనను అద్భుతంగా రక్తి కట్టించిన నటుడు నాగభూషణం. కమర్షియల్‌గా ఇంత విజయాన్ని సాధించిన సాంఘిక నాటకం తెలుగులో మరేదీ లేదు.

1954లో భారతీయ నాట్య సంఘానికి శాఖగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం అబ్బూరి రామకృష్ణారావు సారథ్యంలో నటశిక్షణలో డిప్లొమా కోర్సు నిర్వహించింది. నాట్యసంఘం ఆధ్వర్యంలో మృచ్ఛకటికం, ప్రతాపరుద్రీయం, ఆదర్శమూర్తి, బమ్మరిల్లు, సంరక్షకుడు మొదలైన నాటకాలు జనరంజకంగా ప్రదర్శించబడ్డాయి. 1957లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఏర్పడింది. ఈ రెండు సంస్థలు నాటకాభ్యుదయానికి ఎంతగానో తోడ్పడ్డాయి.

1950–59 మధ్య కాలంలో ఇతర భాషల నుంచి చేసిన అనువాద, అనుసరణ నాటకాలు స్వతంత్రనాటకాలను అధిగమించి పేరు ప్రఖ్యాతులు గడించటం గమనార్హం. బెల్లంకొండ రామదాసు ఆకాశ రామన్న (1957), సోమంచి యజ్ఞన్న శాస్త్రి మహాను భావులు (1957), ప్రఖ్య శ్రీరామమూర్తి *కాళరాత్రి* (1955), ఫణి (1957), ప్రఖ్యాతి పొందాయి. ఫణి, *కాళరాత్రి* అపరాధ పరిశోధక నాటకాల కోవకు చెందినవి. ఫణి నాటకాన్ని కె. వేంకటేశ్వరరావు దర్శకత్వంలో ర.స.న. సమాఖ్య బృందం, *కాళరాత్రి* ని శ్రీకాకుళం నాటక సమితి ఆధ్వర్యాన జె.వి. రమణమూర్తి బృందం ఆసక్తికరంగా ప్రదర్శించాయి.

ఈకాలంలో నాటికలు కూడా పుష్కలంగా వెలువడ్డాయి. బుచ్చిబాబు *దారినపోయే దానయ్య* (1952), ఎన్.ఆర్. నంది *పుణ్యస్థలి*, *మనిషి చావకూడదు* (1952), వాన వెలసింది, గండవరం సుబ్బరామిరెడ్డి పెండ్లి చూపులు (1954), వేణు దీప్తి బమ్మలు (1955), *నిరాశ ప్రొడక్షన్ నెం.1* (1955), *చీకటి దొంగలు* (1957), జీవనశ్రీ నీ బ్రతుకెంత (1956), అంగర సూర్యారావు *కళోద్ధారకులు* (1956), పురపాలకులు

(1957), కారెపు అప్పలస్వామి ఈ రోజు బ్రాకెట్ (1957), కావ్యశ్రీ మానవుడు (1956), స్వీకారం (1957), సమర్పణ (1959), ముదిగొండ లింగమూర్తి వెంకన్న కాపురం (1958), రావికొండలరావు కథ కంచికి (1959), కుక్కపిల్ల దొరికింది (1959), గొల్లపూడి మారుతీరావు అనంతం (1959) రంగస్థలం మీద అసంఖ్యాక ప్రదర్శనలకు నోచుకొని సామాజికులను అలరించిన నాటికా శ్రేణిలో కొన్ని మాత్రమే! ఎంత క్లిష్టమైన సమస్యనైనా ఒక చిన్న నాటికలో అందంగా, ఆకర్షణీయంగా పొదిగి చెప్పగల నాటక శిల్పం ఈ రచయితలకు వెన్నతో పెట్టిన విద్య అని చెప్పవచ్చు.

1954 లో భారతీయ నాట్య సంఘానికి శాఖగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం అబ్బూరి రామకృష్ణారావు సారథ్యంలో నటశిక్షణలో డిప్లొమాకోర్సు నిర్వహించింది. నాట్యసంఘం ఆధ్వర్యంలో మృచ్ఛకటికం, ప్రతాపరుద్రీయం, ఆదర్శమూర్తి, బమ్మరిల్లు, సంరక్షకుడు మొదలైన నాటకాలు జనరంజకంగా ప్రదర్శింపబడ్డాయి1957లో ఆంధ్రప్రదేశ్‌సంగీత నాటక అకాడమీ ఏర్పడింది. ఈ రెండు సంస్థలు నాటకాభ్యుదయానికి ఎంతగానో తోడ్పడ్డాయి.

1960-69 మధ్యకాలంలో వెలువడిన నాటక నాటికల సంఖ్య అల్పమే అయినా వస్తువులోను, శిల్పంలోను, ప్రదర్శన విధానంలోను కొత్త మలుపు, కొత్త రూపు, కొత్త పోకడలను సంతరించుకొన్న దశాబ్దం ఇది. గొల్లపూడి మారుతీరావు, దాసం గోపాలకృష్ణ, ఆర్.వి.ఎస్. రామస్వామి, మోదుకూరి జాన్సన్, గన్పిశెట్టి వేంకటేశ్వర రావు, భీశెట్టి లక్ష్మణ రావు, చింతపల్లి హనుమంతరావు మొదలైన రచయితలు వెలుగులోకి వచ్చారు. కొన్ని చిరస్మరణీయమైన నాటక, నాటికలకు ఈ దశాబ్ది ఆహ్వానం పలికింది. భమిడి పాటి రాధాకృష్ణ కీర్తి శేషులు (1960) ఆంధ్ర ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించిన నాటకం. కవినీ, మహానటుడ్నీ మన సమాజం ఎలా నిరాదరిస్తుందో వ్యంగాత్మక ధోరణిలో శక్తివంతంగా చెప్పిన నాటకం. ఒక దశాబ్దంపాటు నాటకరంగంలో విజయఢంకా మోగించిన నాటకం ఇది. ఇదేమిటి, దైవ శాసనం అనే రెండు నాటకాలు కూడా రాధాకృష్ణ కలం నుంచే వెలువడినాయి. రాచకొండ విశ్వనాథ శాస్త్రి నిజం (1961), న్యాయవ్యవస్థపై ఎక్కుపెట్టిన అస్త్రం. పేదవారికి న్యాయం జరిగే అవకాశాలు మృగ్యమనే అంశాన్ని బలంగా చిత్రించింది. ఈ దశాబ్దిలో ప్రథమ శ్రేణి రచయితగా ప్రసిద్ధులైన వారిలో గొల్లపూడి మారుతీరావు ఒకడు. ఈయన రచించిన రాగరాగిణి యూజిన్ ఓ నీల్ బియాండ్ ది హోరైజన్‌నాటకానికి అనుకరణ అయినప్పటికీ స్వతంత్ర నాటకంగా తలపిస్తుంది. అంతరాంతరాల్లో అనుమానం ఎక్కడో మిణుకు మిణుకుమంటుంటే, తనచేతగాని తనం ఒకవైపు కుంగదీస్తుంటే ఆ స్థితి ఎన్ని భయంకర పరిస్థితులకు దారి తీస్తుందో, అందులోనూ విశిష్ట వ్యక్తిత్వం గల వ్యక్తుల మధ్య ఆ వ్యక్తి ఎలా తల్లడిల్లిపోతాడో సహజ గంభీరంగా చింత్రించబడిన విషాదనాటకం 'రాగరాగిణి' (1960). ర.స.న. సమాఖ్య ఈ నాటకాన్ని రసస్ఫోరకంగా ప్రదర్శించి నాటక రచయిత ఖ్యాతిని ఇనుమడింపజేసింది. లావాలో ఎర్ర గులాబీ, కరుణించని దేవతలు, మహానటుడు మొదలైన నాటకాలనూ పతిత, పగ, కళ్ళు మొదలైన నాటికలను 25 దాకా రచించాడు. గొల్లపూడి 'కళ్ళు' విశేష ప్రజాదరణ పొందింది. సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కూడా పొందింది. పి.వేణు, కె.వి.రమణారెడ్డి రచించిన రాజీవం (1960) పోటీలలో అగ్రస్థానంలో నిల్చింది. నిండు యవ్వనంతో అప్పుడే వికసించి, అనాఘ్రాత పుష్పంలా ఉన్న ఒక మూగ పిల్లను, ఆమె పరిస్థితిని ఆసరా చేసుకొని, పెడత్రోవ పట్టించి ఆమె అందాన్ని కొల్లగొట్టడం, దాని పర్యవసానం ఈ నాటికలో చిత్రితమైంది.

వేలూరి శివరామ శాస్త్రి రచించిన సుల్తానీ స్త్రీ సమస్యాత్మక నాటిక. తెలంగాణా మాండలికంలో వెలువడిన మొట్టమొదటి నాటిక. గన్పిశెట్టి వేంకటేశ్వరరావు చీకటి తెరలు (1962), చింతపల్లి హనుమంత రావు జ్వలిత జ్వాల (1962), ఆవుల శ్రీనివాసరావు ఉలిపి కట్టె, ఆదివిష్ణు మంచుతెర, పండగొచ్చింది, వాంటెడ్ ఫాదర్స్ 60వ దశాబ్దిని అలరించిన నాటికలు.

గన్పిశెట్టి వేంకటేశ్వరరావు భలే పెళ్ళి (1961), శారద నాటకాలు రంగస్థలంపై బాగా రాణించాయి. చిల్లర భావనారాయణ పదవులు – పెదవులు, పోతుకూచి సాంబశివ రావు హంతకులు, ప్రఖ్య శ్రీరామమూర్తి మనిషిలో మనిషి మొదలైనవి ప్రదర్శనలో పేరు తెచ్చుకొన్న వైవిధ్యం గల నాటకాలు.

ఎన్.ఆర్. నంది రచించిన మరో మొహెంజదారో(1964) నాటకరంగాన్ని మరో మలుపు తిప్పి చరిత్ర సృష్టించిన నాటకం. ఓ విలక్షణమైన నాటక శిల్పంతో నవ్యత ఉట్టిపడేలా ఆకర్షణీయంగా రూపొందించాడు నాటక కర్త. ఆధునిక మానవుడు నీతినియమాలను నిర్లక్ష్యం చేసి నైతిక పతనానికి దగ్గరవుతున్నాడని, ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే, మనిషి మనుగడ కష్టమవుతుందనీ, మారణ హోమం తప్పదనీ, మానవ నాగరికత మరో మొహెంజదారో అయిపోతుందనీ, ఆ ప్రమాదావస్థను, ఆ కాళరాత్రిని ఎదుర్కోక ముందే, మనిషితన ప్రవర్తనను సరిదిద్దుకోవలసిన అవసరం ఉందని హెచ్చరించాడు. ఈ నాటకం రంగాలంకరణ, రంగ పరికరాలు లేకుండా సాగిపోతుంది. ప్రయోక్త ద్వారా ఒక్కొక్క సంఘటన దృశ్యమానం అవుతుంది. నాటక ప్రదర్శనలో ప్రతీకాత్మక ధోరణి, ఎపిక్ థియేటర్ పద్ధతి, అభివ్యక్తి ధోరణి సమ్మిళితమై కనిపిస్తుంది. మైమ్,ఫ్రీజ్ అనేవి విరివిగా ఉపయోగింపబడ్డాయి. తెలుగులో

సాంఘిక నాటకాల్లో ఫ్రీజ్ అనే పద్ధతిని ప్రవేశపెట్టిన మొదటి నాటకకర్త ఎన్.ఆర్. నంది అని చెప్పవచ్చు. అప్పటి నుంచీ ఆ పద్ధతిని చాలామంది నాటక రచయితలు తమ నాటకాల్లో వాడుకోవడం సర్వసాధారణమైంది. మరో మొహెంజదారో నాటకాన్ని చాట్ల శ్రీరాములు దర్శకత్వంలో విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాదు) రాష్ట్రంలో అనేక చోట్ల జనరంజకంగా ప్రదర్శించింది. ఈ నాటకం ఇతర భారతీయ భాషల్లోకి అనూదితం అయింది.

మోదుకూరి జాన్సన్‌కు పేరు తెచ్చిన నాటకం నటనాలయం (1966). నాటకకళ కోసం మనసా, వాచా, కర్మణా పాటుపడే కళాతపస్వికి ఎదురయ్యే కష్టాలు ఈ నాటకంలో చిత్రితమయ్యాయి. ఎ.శివరామిరెడ్డి నేతృత్వంలో ఈ నాటకం ఆంధ్రదేశం నలుమూలలా ప్రదర్శించబడింది. రావికొండలరావు *పట్టాలు తప్పిన బండి నాలుగిళ్ల చావిడి, ప్రొఫెసర్ పరబ్రహ్మం* హాస్యంతో మేళవించబడి రాణించాయి. ప్రవాసాంధ్రుడైన ఆర్.వి.చలం *మాట తప్పకు, విరజాజి* తదితర నాటకాలు రచించి, కుటుంబ సభ్యులతో నాటక పోటీలలో పాల్గొని ప్రశంసలందుకొన్నాడు. ఉద్యోగం చేస్తూనే నాటకాలను తయారు చేసుకొని వందల మైళ్లు ప్రయాణంచేసి ఆంధ్రప్రాంతంలో నాటకాలాడటం ఆయనకే చెల్లింది.

1966 నుంచీ నాటక రచన ప్రారంభించిన ఆర్.వి.ఎస్. రామస్వామి 12 నాటకాలను, 25 నాటికలను రచించాడు. వాటిలో *గాలివాన, సుడిగాలి, వలయం, కళామయి* నాటకాలు, నాటికలన్నిటినీ భానుప్రకాశ్ దర్శకత్వంలో హైదరాబాదు కళారాధన సంస్థ ప్రదర్శించింది.

1970లో నాటకరంగంలో ప్రవేశించిన *గణేశ్ పాత్రో*, *యండమూరి వీరేంద్రనాథ్*, హరనాథ రావు, ఎం.సంజీవి, పూసల వేంకటేశ్వరరావు, కాశీవిశ్వనాథ్, సి.ఎస్.రావు ప్రభృతులు బహుళ జనాదరణ పొందిన నాటకాలను, నాటికలను సృష్టించి ప్రథమ శ్రేణి రచయితలుగా ప్రసిద్ధులయ్యారు.

గణేశ్‌పాత్రో 1970 ప్రాంతంలో కలం పట్టి అయిదేళ్ళయినా గడవక ముందే ప్రథమ శ్రేణి నాటక కర్తగా నాటకరంగంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. రచనలు పదికి మించకపోగా రాసిన ప్రతి నాటకమూ, నాటికా రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పుపొందాయి. *తరంగాలు, అసుర సంధ్య* నాటకాలు, *కొడుకు పుట్టాల, పావలా, లాభం, ఆగండి కొంచెం ఆలోచించండి* మొదలైన నాటికలు అందరినీ అలరించిన రచనలు. విశాఖ మాండలీకంలో రాసిన రచనలు పాత్రో రచనా విధానంలో ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ నియంత్రణ ఆధారంగా తీసుకొని రాసిన కొడుకు పుట్టాల అన్నీ భారతీయ భాషల్లోకి అనూదితమైంది. అటు రేడియో నాటికగానూ, ఇటు రంగస్థల నాటికగానూ ఉభయ తారకంగా ప్రకాశించింది. అప్పలాచార్య రచించిన తులసి తీర్థం నవ్విస్తూనే సందేశాన్నందించే పసందైన నాటిక. ముచ్చటగా మూడు పాత్రలతో ప్రేక్షకుల్ని మురిపించే రస గుళిక.

ప్రసిద్ధ నాటక విమర్శకుడు పి.వి. రమణ 1970 నుంచీ నాటకరచన ఆరంభించి సుమారు 20 నాటక, నాటికలను రచించాడు. *వెంటాడే నీడలు* (1973), *ఆకురాలిన వసంతం, చలిచీమలు, దేవతలెత్తిన పడగ, మృత్యునీడ, మహస్సు* వంటి నాటకాలు, *నిండాయి నూరేళ్ళు మానవతకూ* వంటి నాటికలు రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శింపబడి రచయితకు ఖ్యాతిని ఆర్జించి పెట్టాయి. కొన్ని రచనలు ఇతర భాషల్లోకి అనువదింపబడ్డాయి. ప్రాచ్య, పాశ్చాత్య నాటక రీతుల గురించి కూలంకషంగా అధ్యయనం చేసిన నాటక కర్తలలో, విమర్శకులలో రమణ ప్రథమగణ్యుడు. నటుడుగా, దర్శకుడుగా 1960 నుంచీ అనుభవం గడించిన డీన్‌బద్రు రచయిత కూడా. ఈయన రచించిన నాటక, నాటికలన్నీ ప్రయోగాత్మకాలు కావడం ప్రత్యేకంగా గుర్తించదగిన అంశం. ఈయన నాటికలేవీ సాదాసీదాగా మూస పద్ధతిలో ఉండవు. ఒక్కొక్క నాటికలో ఒక్కో నూతన ప్రయోగం కనిపిస్తుంది. ఈయన రాసిన *తాజీ, తాళి, పులీ మేకలస్తున్నాయి. జాగ్రత్త!, చైతన్య తరంగం, ఆ ఉదయం ఎప్పుడో!* మొదలైన నాటికలన్నీ నూతన ప్రయోగాలకు ఉదాహరణలే. డీన్‌బద్రు ప్రయోగాలు అబ్సర్డిజమ్, ఎక్స్ ప్రెషనిజం, ఎపిక్ వంటి విదేశీ రంగస్థల శైలులకు (Theatre



చింతామణి నాటక దృశ్యం

styles) అనుకరణలు కాకపోవడం, స్వయంసృష్టి కావడం గుర్తించదగిన ముఖ్యాంశం!

ఈ దశాబ్దిలో విదేశీ నాటక శైలులపై నాటక సమాజాలకు మక్కువ ఏర్పడింది. అబ్సర్డ్ థియేటర్ పద్ధతిలో సంరక్షకుడు నాటకాన్ని ఎ.ఆర్. కృష్ణ ప్రదర్శించాడు. చాట్ల శ్రీరాములు దర్శకత్వంలో ఎక్స్‌ప్రెషనిస్ట్ శైలిలో ప్రదర్శించిన నిశ్శబ్దం నీకూ నాకూ మధ్య , డామిట్ కథ అడ్డం తిరిగింది తదితర నాటకాలు విదేశీనాటకాల శైలులకు అనుకరణలే. సి.ఎస్. రావు రాసిన *ఊరువమ్మడి బతుకులు* (1974) ఐశ్వర్యంతో వచ్చిన అహంకారంతో, భూస్వాములు, తమ ఆశ్రయంలో బతికే పేదవారి పట్ల ఎంత అమానుషంగా ప్రవర్తిస్తారో, బలహీనుడు సహనం కోల్పోయి ఎదురుతిరిగితే ఏమవుతుందో దర్పణం పట్టిందీ నాటిక. చలన చిత్రంగా నిర్మించబడి స్వర్ణకమలం అందుకొంది. కాశీవిశ్వనాథ్ సుమారు 25 నాటకాలు, నాటికలు రాశాడు. నాటకాల కంటె *మీరైతే ఏం చేస్తారు?* (1970), *ఓటున్న ప్రజలకు కోటి దండాలు* (1970), జీవన సంధ్య మొదలైన నాటికలు రచయితకు పేరు తెచ్చాయి.

పరుచూరి వేంకటేశ్వర రావు రచించిన సమాధి కడుతున్నాం – చందాలివ్వండి నాటకం నాటి రాజకీయ వ్యవస్థలోని ఒక పార్శ్వాన్ని దృగ్గోచరం చేస్తుంది. బడుగు వర్గాలను ఉద్ధరిస్తున్నామని ఉపన్యాసాలిచ్చే నాయకులు, ఆ వర్గం నుంచి ఎవరైనా పైకొస్తుంటే అతనికి రాజకీయ భవిష్యత్తు లేకుండా జాగ్రత్త పడతారు. ఆ మహాపురుషుడికి 'సమాధి కడుతున్నాం – చందాలివ్వండి' అంటూ ఊరి మీదపడి చందాలు పోగుచేస్తారు. నిశిత విమర్శకు వ్యంగ్యాన్ని జోడించి రాసిన ఈ నాటకంలో సంభాషణలు శక్తిమంతంగా, విలక్షణంగా ఉంటాయి. పూసల మండువా లోగిలి , ఇసుక పల్లి మోహనరావు ఓ బూతు నాటకం(1978), హరనాథ రావు క్షీరసాగర మథనం (1979), అత్తిలి పద్మావతి సంధ్యాఛాయ ఈ దశాబ్దిలో ఎక్కువ ప్రదర్శనలతో ప్రజాభిమానాన్ని దోచుకొన్న నాటకాలు.

ఎన్. తారక రామారావు సుమారు 30 నాటకాలు, నాటికలు రాశాడు. కురుక్షేత్రం, సప్తపది, ఆత్మసాక్షి వంటి నాటకాలు, వరుడు కావాలి, ఇదీలోకం, షరా మామూలే వంటి నాటికలు రామారావును నాటక రచయితగా నిలబెట్టాయి. కె.ఎస్.టి.శాయి 20 నాటికలు, నాటకాలు రాశాడు. సంఘం చెక్కిన శిల్పం నాటకం, కలిపురుషుడు నాటిక ఈయనకు పేరు తెచ్చాయి. భీశెట్టి లక్ష్మణరావు ఛాయ లో ప్రతీకార వాంఛ మనిషిని ఉన్మత్తునిగా మార్చి విచక్షణాశక్తిని హరిస్తుందనీ, మానవత్వాన్ని నశింపజేస్తుందని వివరిస్తుంది. ఎం. దివాకర బాబు ఎవ్వనిచే జనించు నాటిక మూఢ విశ్వాసాలు, మూఢాచారాల నుంచి మనం బయటపడనంతకాలం దేవుడు పేరుతో జరిగే మోసాలకు గురికాక తప్పదని హెచ్చరిస్తుంది. ఎం.వి.ఎస్. హరనాథరావు యక్షగానం లో ప్రాచీన కళారూపమైన యక్షగానాన్ని వృత్తిగా స్వీకరించి ఆరాధించే కళాకారుల స్థితిగతులు ఎంత దయనీయంగా ఉన్నాయో హృదయంగమంగా చిత్రించాడు. యండమూరి వీరేంద్రనాథ్ ఈ దశాబ్దిలో పది పన్నెండు నాటకాలు, నాటికలు వెలువరించాడు. నాటకాలలో పుట్ట, నాటికలలో రుద్రవీణ, కుక్క, చరిత్ర సుప్రసిద్ధాలు. రుద్రవీణ, యక్షగాన పద్ధతిలో ప్రదర్శించబడి నవ్యతను సంతరించుకొంది. చరిత్ర ప్రతీకాత్మక ధోరణిలో రచించాడు.

యండమూరికి నాటకరంగంలో కుక్క, రుద్రవీణ నాటికలు సుస్థిర స్థానం కల్పించాయని చెప్పాలి. గండవరం సుబ్బరామిరెడ్డి *ఆగండి నేనూ వస్తున్నా!* నాటిక, నాటక కళ విలువను గుర్తించక పోగా చులకన చేసి మాట్లాడే పెద్దలకు కనువిప్పు కలిగిస్తుంది. బాదల్ సర్కార్ రచనకు స్వేచ్ఛానుకరణ చేసి అత్తిలి పద్మావతి రచించిన ఊరేగింపు ఆధునిక వీధి నాటికల విస్తృతికి తోడ్పడింది.

విదేశీ నాటకాలను అనువదించుకోవడం, విదేశీ నాటక పద్ధతుల్ని ప్రవేశ పెట్టడం 1950 నుంచీ సాగుతున్నా కొన్ని నాటకాలు – ఇన్ స్పెక్టర్ జనరల్, ఇనప తెరలు, వీలునామా, *రాగరాగిణి, ఫణి,* నాటకం వంటి నాటకాలు రాణించాయి. ఎ.ఆర్. కృష్ణ మాలపల్లి జీవ నాటకాన్ని పన్నెండు రంగస్థలాలతో రూపొందించాడు. మాలపల్లి దేశీయ ప్రయోగాల్ని **(Native Experiment)** ప్రజలు ఆదరించారు. నూరుకు పైగా ప్రదర్శనలకు నోచుకుంది.

1980 నాటికి కళాశాలల్లో, పాఠశాలల్లో నాటికలు వేసే పద్ధతి అడుగంటింది. నాటకాలు విడిగా ప్రదర్శించటం బాగా తగ్గిపోయింది. నాటక పరిషత్తులే ఆధారమయ్యాయి. నేటికీ అదే పద్ధతి కొనసాగుతోంది. నాటకాలు రాయడం పరిషత్తుల కోసమే అనే అభిప్రాయం రచయితల్లోనూ, ప్రదర్శకుల్లోనూ స్థిరపడిపోయింది. ఈ నేపథ్యంలోనే ఆధునిక నాటకరంగం కొనసాగుతూఉంది. ఈ దశకంలో పాటిబండ్ల ఆనందరావు, శంకరమంచి పార్థసారధి, తనికెళ్ళ భరణి, ఇసుకపల్లి మోహనరావు, సుఖమంచి కోటేశ్వరరావు, వి.ఎస్.కామేశ్వర రావు, కె.కె. ఎల్. స్వామి, జలదంకి సుధాకర్. డి.వి.రమణ మూర్తి, ఎస్.కె.ఆంజనేయులు, దాడి వీరభద్ర రావు మొదలైన వారు నాటక రచయితలుగా వెలుగులోకి వచ్చారు. బలహీనులపై బలవంతుల దౌర్జన్యం, ఆర్థిక అసమానతల వల్ల బడుగు జీవులు అనుభవించే విషాదాన్ని చిత్రిస్తూ సుఖమంచి కోటేశ్వరరావు మానమాధులే మీ పునాదులు, మారెళ్ల ఏడవకండేడవకండి, వి.ఎస్.కామేశ్వర రావు సర్పయాగం, కె.కె.ఎల్.స్వామి తేనెటీగలు పగబడతాయ్ మొదలైన నాటికలు వెలువరించారు. తనికెళ్ళ

భరణి గార్దభాండం, కొక్కొరొకో, గోగ్రహణం, జంబూద్వీపం నాటికలు విశేష ప్రజాదరణ పొందాయి. జలదంకి సుధాకర్ ఒంటి కాలి పరుగు, ఎస్.కె.ఆంజనేయులు రాధికా స్వాంతం, ఆకెళ్ళ సత్యనారాయణ మూర్తి పెద్దబాలశిక్ష నాటికలు, తాళ్ళూరి శివరామ కృష్ణారావు మార్తోభవ, కె.చిరంజీవి నీలిదీపాలు, దివాకర బాబు రస రాజ్యం వస్తు వైవిధ్యంతో రంగస్థలాన్ని అలరించిన నాటకాలు. మొదలి నాగభూషణ శర్మ రాజా ఈడిపస్ (సోఫోక్లిస్ నాటకానికి అనువాదం) రంగస్థలం మీద రాణించింది. ఇసుకపల్లి మోహన్ రావు డియర్ ఆడియన్స్ సిన్సియర్లీ యువర్స్, అన్వయ క్లిష్టత గల నాటకంగా విద్యాధికుల ప్రశంసలను చూరగొంది. ఈ కాలంలో కొన్ని హాస్యనాటికలు కూడా వెలువడ్డాయి. దివాకర్ బాబు పుటుక్కు జరజర డుబుక్కుమే, శంకరమంచి హళ్లికి హళ్లి, బలరామమూర్తి ఇల్లలికిన ఈగ, కాగితం పడవ, డి.వి.రమణమూర్తి వశీకరణం, వంటమనిషి కావాలి పేర్కొనదగిన హాస్యనాటికలు. ఎల్.బి.శ్రీరామ్ రాసిన ఒంటెద్దుబండి మధ్యతరగతి జీవితాన్ని సహజత్వం ఉట్టి పడేలా చిత్రించిన నాటకం. పైన పేర్కొన్న రచనలన్ని నాటక పరిషత్తుల్లో విరివిగా ప్రదర్శింపబడి బహుమతులు అందుకొన్నవి.

1990-2000 సంవత్సరాల మధ్యకాలంలో వెలువడిన నాటకాలలో అనంతమైన వస్తు వైవిధ్యం గోచరిస్తుంది. రచయితలు సమకాలీన సమాజాన్ని అన్ని కోణాల నుంచి వీక్షిస్తూ సామాజిక స్పృహతో నాటకరచన సాగిస్తున్నారన్నది స్పష్టం. విద్యారంగంలో చోటు చేసుకొంటున్న అనేక లోపాలను బహిర్గతం చేస్తూ, పాలక వర్గానికి, ప్రజలకూ, తల్లిదండ్రులకు కూడా కనువిప్పు కలిగించే రచనలు చేశారు. వాటిలో కావూరి సత్యనారాయణ శ్వేత పత్రం, వల్లూరి శివప్రసాద్ హింస ధ్వని పేర్కొనదగినవి. పోలీసు వ్యవస్థలోని దుర్మార్గాలను ఎండకడుతూ ఎం.సంజీవి రాసిన రాజ్యహింస ప్రజాభిమానాన్ని చూరగొంది. వైద్య రంగంలో పేదవాడ్ని పట్టించుకొనే నాథుడే లేడనీ ఆర్తిని దృశ్యమానం చేసే నాటికలు సుఖమంచి కోటేశ్వరరావు నరకం మరెక్కడో లేదు, కందిమళ్ళ సాంబశివరావు ముద్రారాక్షసం. స్త్రీల సమస్యలపై అధిక సంఖ్యలో నాటికలు వచ్చాయి. వాటిలో ఆకెళ్ళ అమ్మ, నుసుము నాగభూషణం కాలజ్ఞానం, ఎ.భాస్కరచంద్ర హిమాగ్ని, కొయ్యగుర్రం, ఎస్సే. రావు హరిత ప్రసిద్ధాలు. అలాగే కుటుంబ వ్యవస్థలో అనురాగాలు, ఆప్యాయతలు దూరమై పోతున్నాయనీ, వృద్ధుల్ని నిరాదరించే మనస్తత్వం నేటి తరంలో ప్రబలంగా విస్తరిస్తున్నదనీ వివరిస్తూ మానవత్వం ప్రబోధించే నాటికలు కూడా చాలా వచ్చాయి. అలాంటి రచనల్లో కంచర్ల సూర్యప్రకాశ రావు భేతాళ ప్రశ్న, ఆకెళ్ళ రేపటి శత్రువు, కావూరి సత్యనారాయణ జారుడు మెట్లు, అవినీతి రహిత సమాజాన్ని కాంక్షిస్తూ మన్నె శ్రీనివాసరావు రచించిన జీవనగీత (1998), సమ్రాట్ అశోక (2000) చారిత్రక నాటిక ఎన్నదగినవి.

పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రాసిన పంచవటి, శ్రీరామ వనవాసం, శ్రీరామ పాదుకలు పౌరాణిక నాటకాలుగా రంగస్థలం మీద రాణించాయి. తుపస్సు, ధృతరాష్ట్ర కౌగిలి వంటి సాంఘిక నాటికలు కూడా కులశేఖర్‌కు పేరు తెచ్చాయి. ఆటా(అమెరికా) నిర్వహించి నాటక రచన పోటీలలో ప్రథమ బహుమతి పొందిన పాటి బండ్ల ఆనందరావు పడమటి గాలి ద్వితీయ బహుమతి పొందిన వై.ఎస్. సాయిబాబా నేను మరణించాను నాటకాలు రంగస్థల మీద పలువర్గాల ప్రదర్శితమై ప్రశంసలు అందుకొన్నాయి. ఆకెళ్ళ శ్రీనాథుడు, కాకి ఎంగిలి సాంఘిక నాటకం అన్ని తరగతుల వారిని అలరించాయి. వై.ఎస్. కృష్ణేశ్వర రావు రచించిన పక్కింట్లో పుట్టండి నాటక పరిషత్తుల్లో విరివిగా ప్రదర్శింపబడిన శక్తివంతమైన నాటిక. వల్లూరు శివప్రసాద్ ఎడారి కోయిల మానవ సంబంధాలలోని మాధుర్యాన్ని చవిచూపించే నాటిక. మనుషుల్లో వింత మనుషుల్ని దృగ్గోచరం చేస్తుంది కందిమళ్ళ సాంబశివరావు రచించిన వజుడు, డి. విజయ భాస్కర్ కుర్చీ విలక్షణమైన నాటకం, బడుగు వర్గాల వారికి కుర్చీ (పదవి) ఇచ్చినట్టేయిచ్చి దానిపై కూర్చోడానికి వీల్లేకుండా ఆటంకాలు సృష్టించే పెద్ద మనుషుల పైనాన్ని, కుతంత్రాలను బట్టబయలు చేస్తుంది. పి.వి కృష్ణమూర్తి రాసిన స్వామి వివేకానంద, నేతాజీ, అశోక సమ్రాట్ నాటకాలను హైదరాబాదు యువకళావాహిని విస్తృతంగా ప్రదర్శించి రచయితకు ఖ్యాతి తెచ్చి పెట్టింది. బి.పి.ప్రసాద్ ప్రతిస్పందన, కోన గోవిందరావు రూల్స్ ఒప్పుకోవు పరిషత్తు పోటీలలో ప్రశంసలు అందుకొన్న రచనలు. స్నిగ్ధ రచించిన సద్గతి, బీనీడు కృష్ణయ్య యజ్ఞఫలం, శిష్టా చంద్రశేఖర్ బహురూపి వస్తువులో గాంభీర్యాన్ని వెలార్చిన మంచి నాటికలు. యజ్ఞఫలం ప్రతీక నాటిక కాగా బహురూపి పగటి వేషాలను వృత్తిగా చేసుకొన్న కళాకారుల దీనావస్థను తెలిపేది. నంది పురస్కారాన్ని అందుకొన్నది. ఉదయభాను అనుసరించిన చరణదాస్, బస్తీ దేవత యాదమ్మ ప్రజాదరణ పొందిన నాటకాలు. ఈ దశాబ్దిలో ఇంకా ఎందరో మంచి నాటకాలను, నాటికలను రచించి నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు-చేస్తున్నారు. తెలుగు నాటక రంగంలో ప్రతిభావంతులైన దర్శకులున్నారు. వారి కృషి విస్మరించలేనిది. చాట్ల శ్రీరాములు, దేశిరాజు హనుమంతరావు, తల్లావఝుల సుందరం, టి.జె. రామనాథం, జె.సిద్దప్ప నాయుడు, టి.శివరామ కృష్ణారావు, జి.ఎస్.ఎన్.శాస్త్రి, నాయుడు గోపి, దుగ్గిరాల

సోమేశ్వర రావు, ఎ. శివరామి రెడ్డి, కొండవలస లక్ష్మణ రావు, డి.ఎస్.ఎన్.మూర్తి, ఉదయభాను, కె.మందులు, భానుప్రకాశ్, భాస్కర్ శివాల్కర్, కొత్తూర్తి భాస్కరరావు, మిశ్రో, ఎల్. సత్యానంద్, కె.ఎస్.టి.శాయి, డీన్ బద్రు, జి.ఎస్.ఆర్.కె,శాస్త్రి, ఎం.ప్రసాదమూర్తి, జి.ఎస్.ప్రసాదరెడ్డి, కావూరి సత్యనారాయణ, కె.కె.ఎల్.స్వామి, కె.జి.రాంప్రసాద్ ప్రభృతులు దర్శకులుగా తమ సేవలను అందించారు. వీరిలో కొంతమంది కొనసాగిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈనాడు దాదాపు 65 నాటక పరిషత్తులు ఏటా పోటీలు నిర్వహిస్తూ కొత్త నటులు రంగ ప్రవేశం చెయ్యడానికి, కొత్త రచనలు రావడానికీ ప్రేరణ యిస్తున్నాయి. నటీమణులకు జీవనోపాధి కల్పించడంలో కూడా పరిషత్తులు కీలక పాత్ర వహిస్తున్నాయి. నాటకకళను ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం 1998 నుంచి నంది నాటకోత్సవాలను నిర్వహిస్తూ పద్యనాటకాలను, సాంఘిక నాటకాలను సమదృష్టితో చూడడం ముదావహం. సినిమా, టి.వి.ల ప్రాబల్యంతో గ్రామీణ ప్రాంతాలలో పట్టుకోల్పోయిన తెలుగు నాటకం ఆ ప్రాంతాలకు విస్తరించవలసి ఉంది. అప్పుడే పూర్వ వైభవాన్ని పుంజుకోగలుగుతుంది. 1970 ప్రాంతాలలో ఆధునిక వీధినాటక ప్రక్రియ ప్రాచుర్యంలోకి వచ్చింది. దీనిని గురించి ప్రత్యేక వ్యాసం 'ఆధునిక వీధి నాటకం' చూడండి.

గం.సు.రె.

సురభి నాటక రంగం

కళావనికి దేవుడు ఇచ్చిన ఒక గొప్పవరం. సురభి నాటక సమాజం తెలుగు నాటక రంగస్థలం కాదు. భారతీయ నాటకరంగమే కాదు... ప్రపంచ రంగస్థల చరిత్రను పరిశీలిస్తే, ఏ నాటక రంగానికి లేని ప్రత్యేక స్థానం సురభి నాటకరంగానికి ఉంది. కొన్ని తరాలుగా, కొన్ని కుటుంబాలు, పసివాడి నుంచి ముదుసలి వరకూ రంగస్థలమే సర్వస్వంగా భావించి జీవించిన ఘనత, తెలుగు నాట స్థిర పడిన సురభి వారికే దక్కింది. నటన, సంగీతం, సాహిత్యం, ఆహార్యం, రంగాలంకరణ, దుస్తులు, విద్యుద్దీపనం, వైరు వర్క్... ఇలా ప్రదర్శనకు సంబంధించిన ప్రతి విభాగంలోనూ ప్రవేశమే కాక ప్రావీణ్యం కూడ సాధించి, ప్రదర్శనలకు ప్రాణం పోసి, త్రికరణశుద్ధిగా నాటక కళకు అంకితమైన సురభి కళాకారులు ధన్యజీవులు... చిరస్మరణీయులు.

సురభి నాటక సమాజాలన్నీ స్వయం సమృద్ధమైనవి. స్వయంపోషకమైనవి. పుట్టిన దగ్గర్నుంచీ రంగస్థల కళల్లో శిక్షణ పొందుతూ, ఆ ప్రకారంగా ప్రదర్శనలకు సన్నద్ధమౌతూ, వచ్చిన దానిలో లేదా ఉన్న దానిలో సంతృప్తి చెందుతూ 120 సంవత్సరాలు రంగస్థలం అనే రథాన్ని అలుపు లేకుండా అవిశ్రాంతంగా లాగుతూ వచ్చారు. నాటకరంగాన్ని తమ ఆరాధ్యదైవంగా, ప్రదర్శనను పవిత్ర యజ్ఞంగా భావించి, అంకిత భావంతో, అకుంఠిత దీక్షతో ప్రజలకు ఆనందాన్ని పంచి పెట్టిన సురభి సమాజాల కళా సేవానిరతి శ్లాఘనీయం.

1850 ప్రాంతంలో మహారాష్ట్ర నుండి ఆంధ్రదేశానికి వచ్చిన సైనిక జాతి రాయలసీమ ప్రాంతంలో స్థిరపడి, కొందరు వ్యవసాయం, మరి కొందరు తోలు బమ్మలాటలు, వీధినాటకాలు ప్రదర్శిస్తూ జీవితాన్ని గడుపుతూ వచ్చారు. వీరికి ఆరెకాపులు లేదా ఆరె మరాటీలు అని పేరు. వీరందరూ వనారస కుటుంబానికి చెందినవారే. అయితే రానురాను వీరి కుటుంబాలు పెరగటంతో రాయదుర్గం వారు, బాల కొండవారు, సురభి వారని మూడు శాఖలుగా ఏర్పడ్డారు. ఆయా గ్రామాల పేర్లను బట్టి వీరికీ పేర్లు వచ్చాయి. రాయదుర్గం వారు వ్యవసాయరంగంలో స్థిరపడగా, బాలకొండ వారు నాటి బంబాయి సినిమా పరిశ్రమకు తరలి వెళ్ళగా, సురభి వారు దాదాపు అన్ని కుటుంబాల వారు నాటక ప్రదర్శనలు కొనసాగిస్తూ జీవితాన్ని గడుపుతూ వచ్చారు.

1895వ సంవత్సరం సురభివారి చరిత్రలో సువర్ణాధ్యాయమని చెప్పవచ్చు. కడపజిల్లా, రాయచోటి తాలూకా, సురభి గ్రామంలో రామిరెడ్డి, చెన్నారెడ్డి అనే సంపన్నుల ఇంట్లో జరిగే వివాహం సందర్భంగా కీచకవధ నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామస్థులంతా ఈ ప్రదర్శనకు ముగ్ధులయ్యారు. పులివెందుల మెజిస్ట్రేటు టి.ఎన్.గోవిందరాజులు నాయుడు ఆ ప్రదర్శనను తిలకించి, పులివెందులలో మరో ప్రదర్శన ఏర్పాటు చేసి, ఒక నాటక సమాజాన్ని నడపమని వీరికి ధన, స్థల సహాయం చేశారు. నాటి నుండి వనారస కుటుంబం సురభి గ్రామంలో స్థిరపడి సురభి వారుగా పిలువబడ్డారు.

ఆ తరువాత నాటి అనంతపురం తాలూకా ధర్మవరం నివాసి రాప్తాటి సుబ్బదాసు, చెన్నారెడ్డి, రామిరెడ్డి విజ్ఞప్తి మేరకు సురభివారికి హరిశ్చంద్ర, సారంగధర, శకుంతల నాటకాలు రచించి, నేర్పించి, ప్రదర్శింపజేశాడు. శ్రీ శారదా మనోవినోదినీ సంగీత నాటక సభ పేరు ఈ సమాజానికి పెట్టారు. ఈ ప్రదర్శనలు రక్తి కట్టి, ప్రజల మెప్పుపొందటంతో సురభి అనేక నాటకాలు ప్రదర్శించి, తమ నైపుణ్యాన్ని ఇతరులకూ తెలియజేసే ఉద్ధేశ్యంతో సంచార నాటకాలు ప్రారంభించింది. సంచార నాటకాలకు ప్రథములు సురభి వారే. రాయచోటిలో తమ సంచార నాటక ప్రదర్శనకు నాంది పలికి, టిక్కెట్టు పద్ధతిని ప్రవేశ పెట్టారు. తర్వాత కడపలో సొంత డేరా నిర్మించి సుభద్రా పరిణయం, రుక్మాంగద నాటకాల్ని ప్రదర్శించారు.

నాడు తెలుగునాట స్త్రీ పాత్రలను పురుషులే ధరించేవారు.



బాలనాగమ్మ నాటకంలో ఒక దృశ్యం

కానీ సురభి సమాజంలో స్త్రీ పాత్రలు స్త్రీలు, పురుష పాత్రలు పురుషులు వయోరూప గుణానుకూలంగా ధరించేవారు. సంసార స్త్రీలతో నాటకాల్ని వేయించిన ఘనత కూడ సురభి వారిదే. రాయలసీమ ప్రాంతంలో పలుచోట్ల ప్రదర్శనలిచ్చిన అనంతరం, వీరి పర్యటన సర్కారు జిల్లాలకు మళ్ళింది. 1901లో నరసారావుపేటలో ప్రదర్శించి, తదుపరి గుంటూరు, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, బరంపురంలలో వరుసగా ప్రదర్శనలిస్తూ సంచారం చేశారు. ఆ రోజుల్లోనే బరంపురంలో ఏకధాటిగా మూడు నెలలపాటు ప్రదర్శించారు. ముందు చెప్పిన నాటకాలకు తోడుగా కాంతామతి, భల్లాణరాజు చరిత్ర నాటకాలు కూడ వీరి ప్రదర్శనల్లో చోటు చేసుకొన్నాయి. రాజమండ్రిలో చిలకమర్తి లక్ష్మీనరసింహం వీరి ప్రదర్శనలను కొనియాడాడు. విశాఖపట్నంలో మారేపల్లి రామచంద్ర శాస్త్రి పారిజాతాపహరణం, బిల్హణీయం నాటకాల్ని రచించి వీరికిచ్చాడు. బరంపురం నుండి తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం, పాలకొండ, విశాఖపట్నం, బందరు, బెజవాడ, వరంగల్, సికింద్రాబాద్‌లో ప్రదర్శనలిచ్చి, 1903 నాటికి సురభి చేరుకొన్నారు. శ్రీ కాకుళంలో వఝల చింతామణి శాస్త్రి తమ చంద్రకాంత నాటకాన్ని వీరికిచ్చి ప్రదర్శింపజేశాడు. ప్రదర్శించే నాటకాల సంఖ్యతో పాటు ప్రదర్శనల సంఖ్య కూడ రానురాను పెరుగుతూ వచ్చింది. సికింద్రాబాద్‌లో ధర్మవరం గోపాలాచార్యులు, ఇప్పటి వరకూ సురభి రథాన్ని నడిపించిన ముగ్గురన్నదమ్ముల ప్రదర్శనలు చూసి బహువిధాలుగా ప్రశంసించాడు. కొంతకాలం విశ్రాంతి తీసుకున్న తర్వాత 1910 ప్రాంతంలో మద్రాసు, మైసూరు ప్రాంతాల్లో విరివిగా ప్రదర్శనలిచ్చారు. వీరు ఏ ప్రాంతం వెళ్ళినా, అక్కడ లభ్యమయ్యే ప్రదర్శనలకు కావలసిన రంగస్థల సామాగ్రి, పరికరాల్ని సమకూర్చుకొంటూ ప్రదర్శనల్ని పరిపుష్టం చేసుకొన్నారు.

ఇప్పటి వరకూ సురభి ప్రదర్శనల రథాన్ని నడిపిన ముగ్గురు అన్నదమ్ముల్లో, అభిప్రాయ భేదాలు తలెత్తి మూడు సమాజాలుగా విడిపోయారు. ఆంధ్రదేశాన్ని రాయలసీమ, తెలంగాణా, సర్కారు జిల్లాలుగా విభజించుకొని ప్రదర్శనలు కొనసాగించారు. వారి పేర్లు కృష్ణయ్య (పెద్ద కృష్ణాజీరావు), వెంకయ్య (వెంకోజీరావు), పెదరామయ్య. వీరిని కృష్ణప్ప, వెంకప్ప, రామప్పలుగా వ్యవహరించేవారు. ఈ ముగ్గురు వనారస సంజీవరావు సంతానం. సంజీవరావు సురభి కుటుంబానికి ఆద్యుడు. ఈ ముగ్గురన్నదమ్ములు తమ బాల్యావస్థలోనే తోలుబమ్మలాట ప్రదర్శనలిస్తూ 1877 ప్రాంతంలో కడప మండలంలోని హనుమద్గుండానికి రావడం జరిగింది. ఆ హనుమద్గుండమే ఆంధ్రనాటక కళోద్ధారక వనారస గోవిందరావు జన్మస్థలం. ఈయన అసలు పేరు పకీరన్న. 1868లో

జన్మించాడు. కలరావల్ల తల్లిదండ్రులు మరణిస్తే, అనాథగా మిగిలాడు గోవిందరావు. స్ఫోటకంతో ఆదరించే వారు లేకపోతే ముగ్గురన్నదమ్ముల తల్లి చెన్నమ్మ చేరదీసి, ఆదరించి పునర్జన్మ ప్రసాదించింది. అంతేకాక గోవిందరావును దత్తత తీసుకొని, గోవిందప్ప అని పేరు పెట్టి, ప్రేమగా పెంచింది. పగలు పశువుల్ని మేపుతూ, రాత్రి వేళ రామప్ప వద్ద సంగీతం నేర్చుకుంటూ, రంగస్థల నాటకాన్ని ప్రదర్శించే అర్హత సంపాదించుకున్నాడు. 1890 ప్రాంతంలో నంద్యాలకు పారిపోయి, జ్యోతి సుబ్బయ్య కంపెనీలో చేరి, ఒక్కపూటే భోంచేస్తూ, నటన, సంగీతం నేర్చుకొని, మొట్టమొదటి సారిగా హరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్ర పాత్ర ధరించాడు. తరువాత తిరిగి తన వారి వద్దకు చేరుకున్నాడు.

1910లో కుటుంబాలు విడిపోయిన తరువాత తన కుటుంబ సభ్యులతోనే నాటక ప్రదర్శనలు ప్రారంభించి, లంకాదహనం, కాంతామతి నాటకాలలో పేరు గడించాడు. 1918లో తన రెండవ భార్య అయిన లక్ష్మమ్మ ప్రసిద్ధ నటి ఆవేటి పూర్ణిమకు జన్మనిచ్చింది. 1919లో ఏలూరు సమీపంలోని, పోలసానిపల్లి అగ్రహారంలో స్థిరపడ్డారు. తర్వాత చిన్నరామయ్య (కృష్ణాజీ దత్త పుత్రుడు)తో కలసి *దశావతారములు*, వసంతసేన నాటకాలు ప్రదర్శించారు. వీరి సమాజం పేరు శ్రీ గోవిందరాయ సురభి నాట్యమండలి.

1929లో తెనాలిలో ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు అంకురార్పణ జరిగింది. దీనికి ముఖ్యకారకుడు గోవిందరావు. ఈ సందర్భంగా ఆయనకు *ఆంధ్ర నాటక కళోద్ధారక* బిరుదునిచ్చి, సత్కరించారు. 1929-30 ప్రాంతంలో రంగూన్ వెళ్ళి పలు నాటక ప్రదర్శనలిచ్చాడు. ఆ తర్వాత ఆంధ్రదేశంలో నాటక కళ వికాసానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఇతోధికంగా సేవలందించి 1953, డిసెంబర్, 17వ తేదీన కళామతల్లి ఒడిలోకి శాశ్వతంగా చేరుకున్నాడు.

సురభి కుటుంబానికి సంబంధించిన ఇతర సమాజాలు :

1. లక్ష్మీ ప్రసన్న నాట్యమండలి: మొదటి రామయ్య దీని నిర్వాహకుడు. 1955 నుండి ప్రదర్శనలిస్తున్నారు.

2. సుబ్బయ్య సమాజం : 1914 నుండి 1928 వరకూ ప్రదర్శనలిచ్చారు.

3. వీరయ్య తసమాజం : కొంతకాలం మాత్రమే ప్రదర్శించారు.

4. జంఝూటి వెంకటి సమాజం : 1916-30 వరకూ ప్రదర్శించారు.

5. శ్రీ శారదా మనో వినోదినీ సంగీత నాటక సభ :అబ్బాజీ రావు దీని నిర్వాహకుడు.

6. శ్రీ వేంకటేశ్వర నాట్యమండలి : చిన వెంకట్రావ్ దీని నిర్వాహకుడు. 1933 నుంచి ప్రదర్శిస్తున్నారు.

7. శ్రీ గోవిందరాయ సురభి నాట్యమండలి : స్థాపకుడు: వనారస గోవిందరావు.

8. శ్రీ శారదా విజయ నాట్యమండలి : 1948 నుండి నడుపుతున్నారు. శ్రీ కృష్ణ బాబూ రావు దీని నిర్వాహకుడు.

9. న్యూ పూర్ణానంద డ్రమెటిక్ థియేటర్స్ : 1943 నుండి నడుపుతున్నారు. నాగేశ్వర రావు దాని నిర్వాహకుడు.

10. శ్రీ వేంకటేశ్వర నాట్యమండలి : రేకందార్ పెద్ద వెంకట్రావు దీని నిర్వాహకుడు.

11. శ్రీ పూర్ణిమా నాటక మండలి : ఆవేటి రామయ్య దీని నిర్వాహకుడు. కొంతకాలమే నడిచింది.

12. శ్రీ గోవర్ధన నాట్యమండలి : 1943 నుండి ప్రదర్శనలిస్తున్నారు. చలపతి రావు దీని నిర్వాహకుడు.

13. శ్రీ వసుంధరా నాట్యమండలి : 1953 నుండి నడుపుతున్నారు. రామచంద్రరావు దీని నిర్వాహకుడు.

14. రామాబాయి సమాజం : 1914 నుండి 1937 వరకు నడిచింది. పెద్దరామయ్య భార్య రామాబాయి నడిపింది.

ఇవి గాక మరో 21 సురభి నాటక సమాజాలు నాటకరంగానికి తమ వంతు సేవలందించి చరిత్రలో నిల్చిపోయాయి. పైన పేర్కొన్న వాటిలో ప్రస్తుతం 10 సమాజాలు మాత్రమే సురభి వారసత్వాన్ని నిలుపుతూ, ప్రదర్శనలిస్తున్నాయి. శ్రీ శారదా మనో వినోదినీ సంగీత నాటక సభ పేరుతో ప్రారంభమైన ఒక్క సమాజం, శాఖోప శాఖలుగా విస్తరించి, ఆంధ్ర ప్రేక్షకులకు కనువిందు కలిగించాయనడంలో అతిశయోక్తి లేదు. అంతేకాక, ఆంధ్రదేశంలో ప్రతిరాత్రి ఎక్కడో ఒక చోట సురభి ప్రదర్శన కచ్చితంగా ఉంటుందనడంలో ఆశ్చర్యం లేదు. ఒక్కో గ్రామంలో రోజుకో నాటకం చొప్పున 10,15 నాటకాలు ప్రదర్శించే నాటక సమాజం ప్రపంచంలో మరొకటి లేదు. అంతేకాదు... ప్రపంచంలోనే ఏకైక కుటుంబ సంచార నాటక సమాజంగా 'సురభి' పేరొందింది. వ్యాపార దృష్టి గల వృత్తి నాటకాలు ప్రదర్శించడం 'సురభి' కళాకారులకే సాధ్యమైంది.

సురభి సమాజం ప్రదర్శించిన నాటకాలు, రచయితలు :

1. కీచకవధ – గోవిందరావు
2. సారంగధర – రాప్తాటి సుబ్బదాసు
3. శాకుంతలం – రాప్తాటి సుబ్బదాసు
4. హరిశ్చంద్ర – రాప్తాటి సుబ్బదాసు
5. స్త్రీ సాహసం – కృష్ణాజీ
6. జగన్మోహన – కృష్ణాజీ
7. పారిజాతాపహరణం – మారేపల్లి రామచంద్ర శాస్త్రి
8. బిల్హణీయం – మారేపల్లి రామచంద్ర శాస్త్రి
9. కాంతామతి – తడకలూరి కుప్పుస్వామి
10. భల్లాణ చరిత్ర – తడకలూరి కుప్పుస్వామి

11. మైరావణ – తడకలూరి కుప్పుస్వామి
12. చంద్రకాంత –చింతామణి శాస్త్రి
13. దశావతారాలు – బులుసు సీతారామ శాస్త్రి
14. కాంతామతి – శ్రీరాములు సచ్చిదానంద శాస్త్రి
15. శూర్పణఖ గర్వభంగం – శ్రీరాములు సచ్చిదానంద శాస్త్రి
16. జగన్మోహన – **మల్లాది అచ్యుత** రామ శాస్త్రి
17. **సీతాకళ్యాణం – చిలకమర్తి**
18. **సంపూర్ణ మహాభారతం – పండిత** కె.సుబ్రహ్మణ్య శాస్త్రి
19. కుమార విజయం – చక్రావధానుల మాణిక్య శర్మ
20. రావణ చర్యలు – చక్రావధానుల మాణిక్య శర్మ
21. భక్త కబీరు – చక్రావధానుల మాణిక్య శర్మ
22. సతీ సావిత్రి – విశ్వనాథకవిరాజు
23. మహానంద – విశ్వనాథకవిరాజు
24. సత్య హరిచంద్ర – విశ్వనాథకవిరాజు
25. శ్రీ కృష్ణావతారము – విశ్వనాథకవిరాజు
26. లవకుశ – విశ్వనాథకవిరాజు
27. వసంతసేన – విశ్వనాథకవిరాజు
28. జమీందార్ – విశ్వనాథకవిరాజు
29. స్త్రీ సామ్రాజ్యం – కొప్పరపు సుబ్బా రావు
30. సంపూర్ణ రామాయణం – హరి పురుషోత్తమ రావు
31. సంపూర్ణ మహాభారతం – హరి పురుషోత్తం
32. బబ్బిలి యుద్ధం – హరి పురుషోత్తం
33. బాలనాగమ్మ – హరి పురుషోత్తం
34. పలనాటి యుద్ధం – హరి పురుషోత్తం
35. ఫస్టక్లాస్ BA– హరి పురుషోత్తం
36. దేవదాసు – మల్లాది వేంకట కృష్ణ శర్మ
37. భూకైలాస్ – మల్లాది వేంకట కృష్ణ శర్మ
38. మాయాబజార్ – మల్లాది వేంకట కృష్ణ శర్మ
39. ప్రతిజ్ఞ –మల్లాది వేంకట కృష్ణ శర్మ
40. అలెగ్జాండర్ – మల్లాది వేంకట కృష్ణ శర్మ
41. బాలనాగమ్మ – మల్లాది వేంకట కృష్ణ శర్మ
42. దక్షయజ్ఞం – మల్లాది వేంకట కృష్ణ శర్మ
43. మాయల మరాఠీ – మల్లాది వేంకట కృష్ణ శర్మ
44. బలిదానం – మల్లాది వేంకట కృష్ణ శర్మ
45. శ్రీకృష్ణ దేవరాయులు – మల్లాది వేంకట కృష్ణ శర్మ
46. రమ్‌జాన్ – మల్లాది వేంకట కృష్ణ శర్మ
47. అభాగిని – మల్లాది వేంకట కృష్ణ శర్మ

సురభి ప్రత్యేకతలు :

1. ఏక కుటుంబ నటీనటులు, గాయకులు, సంగీత విద్వాంసులు.
2. ఐకమత్యంతో (Team Work) కలిసి నాటక ప్రదర్శనకు కావలసిన హంగులన్నీ సమకూర్చుకోవడం, ప్రదర్శనను దిగ్విజయం చేయడం.
3. పాత్రల విషయంలో చిన్న, పెద్ద పాత్రల తారతమ్యాన్ని పాటించకపోవడం.
4. ఒక నాటకంలో ప్రతి నటుడు, దాదాపుగా ప్రతి పాత్ర పోషించడం.
5. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించడం.
6. సుశిక్షణ, క్రమ శిక్షణ.
7. సంగీతం, నాట్యం, అభినయంలో ప్రతి ఒక్కరికీ అభినివేశం.
8. ప్రదర్శనా వేళల్లో సంప్రదాయ పద్ధతుల్ని అనుసరించడం.
9. నియమ, నిష్ఠలతో ప్రదర్శనకు సంసిద్ధులవడం.
10. నాటకాన్ని వృత్తిగా స్వీకరించడం.
11. రిపర్టరీ పద్ధతిలో నాటకాలు ప్రదర్శించడం. ఎప్పుడు కనీసం పది నాటకాలు ప్రదర్శనకు సిద్ధంగా ఉంటాయి.
12. వృత్తి నాటక రంగంలో 120 సంవత్సరాలుగా ప్రదర్శనలివ్వడం.
13. నాటక ప్రదర్శనకు మొట్టమొదటి సారిగా టికెట్ విధానం ప్రవేశపెట్టడం.
14. ఒక్కరూపాయి, రెండు రూపాయలకు కూడ నాటకాలు ప్రదర్శించడం.
15. వైరు వర్క్‌తో అద్భుత దృశ్యాలు చూపడం.
16. పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలు ప్రదర్శించడం మొదలైనవి.

సురభి మొదటితరం వారిలో వనారస గోవిందరావు, పెద్ద రామయ్య, కమలాబాయి, జంఝూటి వెంకుబాయి, చిన్న రామయ్య ప్రఖ్యాతి చెందారు. ఇక రెండవతరం వారిలో ఎస్.ఎ.బాబురావ్, ఎస్.చంద్రరావు, ఎస్.ఎ.ప్రకాష్, ఎ.నాగేశ్వర్రావ్, పుల్లారెడ్డి, భోజరాజు, ఆవేటి పూర్ణిమ, ఆర్. సుభద్రమ్మ మూడవ తరంలో మనోహర్, శ్యామసుందర్, బాబ్జీ, ఇందిర, రాజేశ్వరి, సుమతి, జమున మొదలైన వారు ఖ్యాతి గడించారు.

సినిమా, టి.వీ ప్రభావం వీరి నాటకాల మీద ఎక్కువగా పడడం, నాటక సమాజాలు, ప్రదర్శనల నిర్వహణాభారం విపరీతంగా పెరిగి పోవడం వల్ల ఈ రోజు సురభి సమాజాల సంఖ్య తగ్గింది... తద్వారా ప్రదర్శనల సంఖ్య కూడ తగ్గిపోయింది.

దాదాపు ప్రతి కళాకారుడు పాత్రను పోషించడమేకాక, సీనరీల మార్పులు, చేర్పులు, విద్యుద్దీపనం మార్పులు, పాటలు, పద్యాలు పాడడం, కర పత్రాలు పంచడం, పోస్టర్లు అంటించడం, తెరలు కుట్టడం.. రంగులు వేయడం, టిక్కెట్లు అమ్మడం లాంటి కార్యకలాపాలలో ఒకరికొకరు సహకరించుకుంటూ ఆబాల వృద్ధులు నాటక ప్రదర్శనలో జీవితాన్ని ముడిచేసి, నాటకాన్ని పెంచి పోషించి, పెరిగిన సురభి కళాకారులందరూ అదృష్టవంతులూ ... ధన్యజీవులు.

ప్ర.రె.

ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగాత్మక నాటకాలు

1942 ఏప్రిల్ 6న ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామంలో భాగంగా జపాన్ దేశం విశాఖ పట్టణంపైన బాంబులు వేసింది. ఈ కారణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విశాఖ పట్టణం నుండి గుంటూరుకు మార్చారు. 1943-44 విద్యా సంవత్సరంలో గుంటూరులో ఆంధ్ర విశ్వవిద్యాలయ కళాశాల, ఆంధ్ర క్రైస్తవ కళాశాల, హిందూ కళాశాల, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని భావించాయి. ఈ మూడు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గనే విధంగా ఒక నాటకోత్సవాన్ని ఆంధ్రాభ్యుదయోత్సవాలుగా నిర్వహింపతలచారు. ఆ ఉత్సవాన్ని అయిదు రోజుల పాటు నిర్వహించారు. విశ్వ విద్యాలయ కళాశాల, ఆంధ్ర క్రైస్తవ కళాశాలలు రెండు నాటకాల్ని, రెండు నాటికల్ని ప్రదర్శించగా, హిందూ కళాశాల మూడు నాటికల్ని ప్రదర్శించింది. ప్రదర్శనలకు ముందుగా, ప్రతి రోజు సాయంత్రం 4.30 నుంచి 6.30 వరకు ప్రముఖ రచయితలు, రాజకీయ వేత్తల ఉపన్యాసాలు, సభానిర్వహణ జరిగేది. రాత్రి 8.30 నుంచి అర్ధరాత్రి వరకూ నాటక ప్రదర్శనలుండేవి. ఈ ఉత్సవాలు విజయవంతం కావడంతో 1944 - 45లలో కూడా తిరిగి ఉత్సవాలు నిర్వహించారు.

ఆంధ్రా యూనివర్సిటీ డ్రమెటిక్ అసోసియేషన్‌ను 1943లో ప్రారంభించారు. మొదట్లో ఒక ప్రత్యేకమైన పేరు పెట్టకపోయినా, ఉత్సవాలలో వినోదాన్ని కలిగించే లక్ష్యంతో ఈ సమితిని ప్రారంభించారు. 1943, 1944, 1945 సంవత్సరాలలో ప్రదర్శించిన అన్ని నాటక, నాటికలు ప్రచురణ పొందినవే. ప్రదర్శనలు సంప్రదాయ పద్ధతిలో కొనసాగించారు. స్త్రీ పాత్రలను యువకులే ధరించేవారు. దర్శకులు విశ్వవిద్యాలయ సంస్థలకు చెందిన ఉపాధ్యాయులే. కేవలం వినోదాత్మకమైన నాటకాలను ఎంపిక చేసినా, వైవిధ్యాన్ని కూడా దృష్టిలో వుంచుకొని ప్రదర్శనల ఎంపిక జరిగేది. ఈ ప్రదర్శనలలో రంగోద్దీపనలో ప్రయోగాలు చేశారు. సుమారు అయిదు నుంచి పదివేలదాకా ప్రేక్షకులు ఈ ప్రదర్శనలు చూసేవారు. ఆ సమయంలో అల్లరి మూక ప్రదర్శనలకు విఘాతాలు కల్గించకుండా ప్రేక్షకులే నిర్వాహకులతో సహకరించేవారు.

1946లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తిరిగి విశాఖపట్టణానికి మార్చారు. స్టాతమ్ లేబరేటరీలకు ఎదురుగా వున్న రెండు షెడ్ల మధ్య స్థలంలో ఆరుబయలు రంగస్థలాన్ని నిర్మించారు. యూనివర్శిటీలో సమ్మె జరిగిన కారణంగా 1947 సంవత్సరంలో ఏ సాంస్కృతిక కార్యక్రమాలు జరగలేదు. అయితే 1948వ సంవత్సరంలో ప్రదర్శనల నివ్వడం జరిగింది. 1949వ సంవత్సరంలో రక్షణ దళాలు నిర్మించిన వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాన్ని, ఎర్స్కిన్ స్క్వేర్‌లో స్నాతకోత్సవం జరిగేచోట నిర్వహించారు. ఈ ప్లాట్‌ఫారమ్ పైన ఉక్కుగొట్టాలతో చట్రాన్ని బిగించి వాటి పై తాత్కాలికంగా టార్పాలిన్ కప్పేవారు. స్నాతకోత్సవం పూర్తికాగానే వాటిని తొలగించేవారు. 1949 నుండి 1956 వరకు ఈ వేదికపైనే నాటక ప్రదర్శనలు జరిగాయి. 1957 సంవత్సరంలో ఇప్పుడు కూడా వున్న ఆరుబయట రంగస్థలాన్ని, అదే ఎర్స్కిన్ స్క్వేర్ ప్రదేశంలో శాశ్వత కట్టడంగా నిర్మించారు. ఆ స్టేజికి ఎదురుగా మెట్ల వరుసలు కట్టి ప్రేక్షకాగారాన్ని నిర్మించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలల నుంచి, ఓరియంటల్ వృత్తి నాటకరంగం నుండి సమాజాల వారిని ఆహ్వానించి, ప్రతి డిసెంబరు నెలలో స్నాతకోత్సవం తరువాత ఆదివారం నుంచి ప్రారంభమయ్యే వార్షికోత్సవాలలో పాల్గనే విధంగా ఏర్పాట్లు జరిగేవి. మొదట్లో ఈ ప్రదర్శనలు పోటీనాటకాలుగా నిర్వహించలేదు. కాని 1950 సంవత్సరంలో బందా కనకలింగేశ్వరరావు ఒక నటరాజ విగ్రహాన్ని, నాటకాలలో ఉత్తమ ప్రదర్శనకు బహుమతి బహూకరించే ప్రతిపాదనను నిర్వాహకులు అంగీకరించారు. ఆ తరువాత మరికొన్ని బహుమతులు ప్రకటించారు. దీక్షాపరులైన ఈ ఉత్సవ కార్యకర్తల బృందం క్రమంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగాత్మక నాటక సమితిగా ఆవిర్భవించింది. ప్రయోగాత్మక నాటక సమితి ప్రధాన ఆశయాలు : 1. రంగస్థల కళలలోని అన్ని విభాగాలలోనూ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, 2. కొత్త నాటకాలను ప్రదర్శించడం, 3. రంగస్థల కళలలోని అన్ని విభాగాలలోనూ ప్రయోగాలు జరపడం, 4. విభిన్న శైలీ నాటక ప్రదర్శనలకు అనువైన రంగస్థలం, ప్రేక్షకాగారం కోసం డిజైన్లు తయారు చేయడం, 5. ప్రేక్షకులకు అవసరమైన వినోదాన్ని సమకూర్చటం.

విద్యార్థులకు శిక్షణ : రంగస్థల కళల్లో శిక్షణ ఆంధ్ర విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు, వృత్తి కళాశాలల విద్యార్థులకు మాత్రమే లభించేది. ప్రతి సంవత్సరం 100 నుండి 200 మంది విద్యార్థులు శిక్షణ పొందేవారు. ఆంధ్ర యూనివర్శిటీ ప్రయోగాత్మక నాటక సమితికి, కేవలం సిద్ధాంత రూపేణా శిక్షణ ఇవ్వటం నచ్చలేదు. ఆచరణాత్మకమైన శిక్షణ కార్యక్రమం, నటన, దర్శకత్వం, ప్రదర్శనా పద్ధతులు, దృశ్యబంధ నిర్మాణం, వేషభాషలు, ముఖాంగ రచన, దృశ్య శ్రవణ సాధనాల వినియోగంలో అమలుపరచేవారు. సమితిలో వివిధ శాఖలలో శిక్షణ పొందిన అధ్యాపకుల మార్గ దర్శకత్వం, అనుబంధ కళాశాలల, వృత్తి కళాశాల విద్యార్థులకు లభించేది. అనుబంధ కళాశాలలకు ఇవ్వబడిన శిక్షణా ఫలితాలను పరీక్షించేందుకు ఈ కింది శాఖల్లో ప్రతి సంవత్సరం పోటీలు నిర్వహించారు.

1. తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో నాటక, నాటికలు, 2. బృంద గానం, వాద్య గోష్ఠి, ఒక్కరే పాల్గనే గాత్ర, వాద్య సంగీతం, 3. బృందనృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం, కథాకళి, మణిపురి వంటి వివిధ రీతుల్లో నాట్య ప్రదర్శనలు.

ప్రతి సంవత్సరం ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించే పోటీలలో పాల్గన్న **అనుబంధ కళాశాల విద్యార్థుల్లో** విజేతల్ని ఎంపిక చేసి, **ఢిల్లీలో జరిగే అంతర్** విశ్వవిద్యాలయ యువజనోత్సవాలకు పంపేవారు. ఆంధ్ర వారోత్సవాలలో నాటకాలకు పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి లేదా ఉత్తమ స్త్రీ పాత్ర ధరించిన నటుడికి బహుమతులు ప్రకటించేవారు.

1950లో మాత్రమే ఆంధ్ర వారోత్సవాలలో పోటీలకు విశ్వవిద్యాలయ కళాశాల విద్యార్థులు పాల్గన్నారు. ఆ తరువాత పోటీలు అనుబంధ కళాశాలలు, వృత్తి కళాశాల విద్యార్థులకు మాత్రమే నిర్వహించేవారు. విద్యార్థులకు సమగ్రమైన శిక్షణ ఇచ్చేందుకు విశ్వవిద్యాలయేతర సంస్థలతో, వ్యక్తులతో శిక్షణ ఇప్పించటం అవసరం అని గ్రహించి, సంచార నాటక సంస్థలతోనూ ప్రదర్శనలు ఇప్పించారు. షేక్స్పియరానా అనే సంస్థలో కెండాల్ దంపతులు, కెండాల్ ఇద్దరు కుమార్తెలు, ప్రఖ్యాత హిందీ సినిమానటుడు పృథ్వీ రాజ్‌కపూర్ తనయుడు శశికపూర్, మార్కస్ మొదలైన ఇతర నటులు ఉండేవారు. క్రమశిక్షణకు మారుపేరైన ఈ సంస్థను చూసిన విద్యార్థులకు, రంగస్థల శిక్షణ అంటే ఏమిటో తెలిసింది. ఈ సంస్థవారే తరువాత కాలంలో షేక్స్పియరానా అనే సినిమాను తీశారు. షేక్స్పియర్, గోల్డ్‌స్మిత్, షెరిడాన్, ఆస్కార్‌వైల్డ్, బెర్నార్డ్ షాలతో పాటు ఆధునిక రచయితల నాటకాలను కూడా ప్రదర్శించారు. ఆంధ్ర దేశంలోని ప్రసిద్ధ రంగస్థల నటులు రాఘువ, స్థానం నరసింహారావు, డి.వి.సుబ్బారావు, పులిపాటి వేంకటేశ్వర్లు , బందా కనక లింగేశ్వరరావు, పీసపాటి నరసింహమూర్తి ధూళిపాళ, జోగినాథం, రేలంగి, రాజారావు తదితరులు తమ నాటకాలలోని భాగాలను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనలపై తమ వ్యాఖ్యలను వినిపించారు. ముద్దుకృష్ణ , కొప్పరపు సుబ్బారావు లాంటి దర్శకులు తమ నాటకాలకు తామే దర్శకత్వం వహించి, తమ పద్ధతులను వివరించారు.

ఏ నాటక ప్రదర్శనకైనా సంగీతం చాలా అవసరం. అందు కోసం సంగీత దర్శకుల అన్వేషణ మొదలుపెట్టారు. అప్పుడు శాస్త్రీయ సంగీతంలో ప్రవేశం వున్న విద్యార్థుల్ని సంగీత దర్శకులుగా నియోగించారు. అలాంటి వారిలో డి.అనంతం, బి.సుబ్రహ్మణ్యం, డిక్కీ, విన్సెంట్, బండారు, ఎం.జాన్సన్ మొదలైన వారు ప్రముఖులు. నృత్య నాటకాలకు సంగీతం సమకూర్చటంలో అకాశవాణికి చెందిన బాలాంత్రపు రజనీకాంతారావు, సరళాదేవి, మల్లిక్ మొదలైన వారు ప్రముఖ పాత్ర వహించారు. కాలక్రమేణా నాటకాలలో నృత్యానికి ప్రాముఖ్యత పెరిగింది. అదే విధంగా వ్యక్తిగత ప్రదర్శనలతో కూడిన నాట్యం తప్పనిసరైంది. 1950లో విశాఖపట్నంలో నృత్య పాఠశాల నెలకొల్పిన నాట్యాచార్యుడు నటరాజు రామ కృష్ణ ప్రయోగ నాటక సమితికి సహకరించాడు. కుమారి వడ్డాది సుమతి, ఉమ, సుగుణలు ప్రదర్శనల్లో సహకరించే వారు. నరసింహారావు, బి.ఆర్.మోహన్‌రావు, టి.శ్యామలరావులు నృత్య ప్రదర్శనల్లో సహాయం చేశారు. ఈ నృత్య నాటకాలే కాకుండా పి.వి.రాజమన్నార్ రచించిన నాగుబాము నాటకంలో భంగిమలు, ముద్రలు కల్పించడానికి నటరాజు రామకృష్ణ ప్రత్యేకంగా కృషి చేశారు. పౌరాణిక, చారిత్రక నాటక పాత్రోచిత వేషం విషయంలో సమగ్ర పరిశోధనను కె.వి.గోపాలస్వామి నిర్వహించి, అడివి బాపిరాజు, మాధవపెద్ది గోఖలే, ఆమంచర్ల గోపాలరావు సహాయంతో దుస్తులు, కేశాలంకరణ, ఆభరణాలు, ఆయుధాలను డిజైన్ చేశారు. ఈ నిపుణుల మార్గ దర్శకత్వంలో తన నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొన్న రామచంద్ర రావు మేకప్‌లోనూ, వేషాలంకరణల్లో ప్రావీణ్యం సంపాదించాడు. నిజానికి ఎ.రామచంద్రరావు ప్రమేయం లేకపోతే ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగాత్మక నాటక సమితికి మనుగడే వుండేది కాదు. ఈయన గొప్ప నటుడే కాక దర్శకుడు కూడా! విశ్వవిద్యాలయం కోసం రామచంద్రరావు కొన్ని పౌరాణిక, చారిత్రాత్మక నాటకాలకు దర్శకత్వం నిర్వహించాడు. ఆయన చివరి నాటకం వసంతసేన కు దర్శకత్వం వహించాడు. అందరి నటీనటులకు మేకప్ పూర్తి అయిన వెంటనే అకస్మాత్తుగా కూలబడిపోయాడు. 1962, డిశంబరు 19న ఆయన మరణించాడు. ఈయన తరువాత తెలుగు చారిత్రక, పౌరాణిక నాటకాలకు దర్శకత్వ శాఖలో లోటు ఏర్పడింది.

కొత్త నాటక ప్రదర్శనలు : తగినన్ని నాటకాలు లేకపోవడంతో 1930-40 మధ్యకాలంలో తెలుగు మాట్లాడే వారి నాటక ప్రపంచంలో స్తబ్ధత ఏర్పడింది. వృత్తి నాటక సమాజాలు తమ మనుగడ కోసం, బాక్సాఫీస్ పైన ఆధారపడి నందువల్ల ప్రసిద్ధి చెందిన కొన్ని పౌరాణిక నాటకాలు, సాంఘిక నాటకాలను మాత్రమే ప్రదర్శించారు. పౌరాణిక కథలకు నూతన భాష్యం చెప్పిన నాటకాలు చలం చిత్రాంగి (1921), శశాంక (1937), ముద్దుకృష్ణ అశోకం*(1934)*, త్రిపురనేని రామస్వామి చౌదరి హరిశ్చంద్ర *(1924)*, ఖూని*(1935)*, జి.వి.కృష్ణారావు భిక్షాపాత్ర (1938), ఆదర్శ శిఖరాలు*(1943)*, యాదవ ప్రళయం (1952) ఆమంచర్ల గోపాల రావు హిరణ్యాకశ్యపుడు *(1940)*, టి.వి.కైలాసం ఏకలవ్య మొదలైనవి. గతంలో ఈ

ప్రతిఘటన నాటకాలు, పౌరాణిక విలువల్ని ప్రశ్నించని ప్రేక్షకులకు మనస్తాపం కలిగిస్తాయేమోనన్న ఉద్దేశంతో ప్రదర్శింపబడలేదు. ఈ నాటకాలను ఆం.వి.ప్ర. నాటక సమితి చేపట్టి ప్రదర్శించింది.

ఈ కాలంలో ప్రసిద్ధి పొందిన రచయితలు సాంఘిక సమస్యలను కథా వస్తువులుగా తీసుకొని, విమర్శనాధోరణితో నాటకాలు రాశారు. రాజమన్నార్ తప్పెవరిది, నిష్ఫలం, పరకీయ, ఏమి మగవాళ్ళు, నాగుబాము, బుచ్చిబాబు దారినపోయే దానయ్య, ఆమంచర్ల అపరాధి మొదలైన నాటికలు ప్రదర్శనల వల్ల ప్రసిద్ధి పొందాయి.

కొండముది గోపాలరాయ శర్మ, ఆత్రేయ, డి.వి. నరసరాజు, పినిశెట్టి శ్రీరామమూర్తి, అనిసెట్టి సుబ్బారావు, కొర్రపాటి గంగాధరరావు, రావికొండలరావు, అవసరాల సూర్యారావు మొదలైన వారు రచించిన నాటకాలను ప్రయోగాత్మక నాటక సమితి స్వీకరించింది. ఇదే సమయంలో మరో కొత్త ప్రక్రియ 'మూకాభినయం' పేరుతో రంగప్రవేశం చేసింది. మొదట్లో వీటిని పిల్లలు మాత్రమే ప్రదర్శించే ఈ మూకాభినయ ప్రక్రియలో బృందగానం గాని, కథకుని గేయంగాని ఉంటుంది. ఈ ప్రయోగంలో మొదటిసారిగా నాలుగు సుప్రసిద్ధ గేయాలు పిల్లలతోనే సంగీతం నేపథ్యంగా పాడించి మూకాభినయాలను ప్రదర్శింప చేశారు. గురజాడ వేంకట అప్పారావు పుత్తడి బమ్మ పూర్ణమ్మ, కన్యక, లవణ రాజు కల, డామన్–పిథియాస్‌ల ప్రఖ్యాత కథలను నృత్య నాటికలుగా రూపొందించారు. విశ్వవిద్యాలయ అధ్యాపక సిబ్బంది ఈ నృత్య నాటికలను ప్రదర్శించారు. వి.వి. రామనాథన్, కృష్ణారావు, డి.వి.కె. రాఘవాచారి మొదలైన వారు రచయితలుగా ఈ మూకాభినయ ప్రదర్శనలు జరిగాయి. ఆరుద్ర సాలభంజిక సంగీత దృశ్య కావ్యంగా ప్రభవించింది. 1953 నుంచి యువజనోత్సవాలను భారత ప్రభుత్వం న్యూఢిల్లీలో నిర్వహించిన దరిమిలా అంతర్విశ్వవిద్యాలయ యువజనోత్సవాలలో, బృందగానం, బృంద నృత్య విభాగాలు తప్పని సరిగా ప్రదర్శింప చేయడం ఆనవాయితీగా మారింది.

రంగస్థల రూపకల్పన – దృశ్యశ్రవణ విభాగాలలో ప్రయోగాలు : క్రీ.శ. 16వ శతాబ్దంలో నిడివిని చూపించటానికి రంగ స్థలం పై తెరలను ఉపయోగించటం ప్రారంభమైంది. ఇటలీలో ప్రారంభించిన ఈ చిత్రకళాశైలి రానురాను ఆంధ్ర దేశానికి కూడా పాకింది. ఈ విధంగా చిత్రించిన తెరలకు బదులుగా ఇతర రంగాలంకరణ పద్ధతులకి ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగ నాటక సమితి ప్రయోగాలు జరిపింది. పార్శీ వారికి, సురభి వారికి, వృత్తి రంగస్థలానికి విస్తరించిన ఈ రోకోకోశైలిలో చిత్రింపబడిన తెరలను వర్జించి, వాటికి బదులుగా ఇతర రూపాలతో దృశ్యబంధ నిర్మాణాన్ని సమితి చేపట్టింది. ఆధునిక కథలకు అనుగుణంగా బాక్స్ సెట్స్ నిర్మించారు. వాటిలో ప్రమాణ కొలతలు గల చక్కీలు (flats) ఉపయోగించారు. అలాగే తలుపులు, కిటికీలు మొదలైనవి గది గోడలను సూచించే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. బాహ్య ప్రదేశాలను సూచించే సందర్భాలలో సైక్లోరమా, స్పాట్‌లైట్లను వినియోగించుకున్నారు. ఈ ప్రత్యేక లైటింగ్‌తో సూర్యోదయం, సూర్యాస్తమయం, మబ్బులు, తుఫానులు మొదలైనవి ప్రదర్శించారు. ఇక శబ్దప్రసరణ విషయంలో అనేక శబ్దాలను కేసెట్లలో ధ్వని ముద్రణచేసి ఉపయోగించారు. శబ్ద విస్తరణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదాహరణకు, అంత విశాలమైన ఆరుబయటి రంగస్థలంలో కూడా ఒకే ఒక్క మైక్రోఫోను, ప్రేక్షకులకి కనబడకుండా రంగస్థలంలో నిక్షిప్తంగా ఉంచేవారు. దృశ్యశ్రవణ విధానాలను ఏకోన్ముఖంగా ఉపయోగించటంలో తగిన శ్రద్ధను తీసుకొన్నారు. 1943 నుంచి 1954 వరకు భీమసేనాచార్ దూరశ్రవణ సాధనాల సాంకేతిక దర్శకుడిగా వ్యవహరించాడు. 1955 నుంచి 1963 వరకు కదిరినాథ్ అగస్త్య సాంకేత దర్శకుడుగానూ, మాస్టర్ ఎలక్ట్రీషియన్ గానూ వ్యవరించాడు. శబ్ద ప్రసరణ విభాగంలో కె. వెంకట రెడ్డి దర్శకుడుగా 1955 నుంచి 1963 వరకు ఉన్నాడు. ఈ ముగ్గురూ మేకప్ ఆర్టిస్ట్, కాస్ట్యూమ్‌లను డిజైన్ చేసిన ఎ. రామచంద్రరావుతో కలిసి సాంకేతిక వర్గంగా ఏర్పడ్డారు. నాటక ప్రయోక్తలు ఈ సాంకేతిక బృందం సహాయంతో తమ వ్యూహాలకు రూపకల్పన చేశారు. ఒక సమగ్ర కళారూపం తీర్చిదిద్దటానికి అవసరమైన వివిధాంశాలలో శిక్షణ ఇచ్చి, శాస్త్రీయ పద్ధతులలో నాటక ప్రదర్శన నిర్వహించడంలోను, నాటకాల ఎంపిక, అన్వయం, పాత్రల నిర్ణయం, రిహార్సల్స్, దృశ్య బంధ నిర్మాణం, లైటింగ్, వస్తువుల అమరిక, నేపథ్య సంగీతం, సౌండ్ ఎఫెక్ట్స్ మొదలైన విభాగాలలో యువ విద్యార్థులకు తోడ్పడి, చక్కని నాటక ప్రదర్శనలు ప్రదర్శించేందుకు తగిన తర్ఫీదును, ప్రయోగాత్మక నాటక సమితి ఇచ్చింది.

ఎన్ని ప్రయోగాలు చేసినా ప్రేక్షకుల మెప్పును పొందినప్పుడే సత్ఫలితాలిస్తాయి. ఒక ప్రదర్శన బాగోగులను నిర్ణయించేది వారే. గుంటూరులో 1943, 1944, 1945లలో ప్రదర్శనలకు ప్రేక్షకుల సంఖ్య 5000 నుండి 10,000 వరకూ ఉండేది. వాల్తేరు విషయంలో రజతోత్సవ నాటకశాలలో ప్రదర్శించినప్పుడు తప్ప, మిగతా హాళ్ళలో ప్రదర్శించినప్పుడు పరిమిత వసతుల దృష్ట్యా, ప్రేక్షకుల సంఖ్య తక్కువుగా వుండేది. అయితే ఎర్‌స్కిన్ స్క్వేర్‌లో 3000 మంది ప్రేక్షకులు కూర్చుని, నిలబడి ప్రదర్శనను చూసేవారు. ఇటువంటి ప్రేక్షక సమూహాన్ని నియంత్రించటం కష్టమే అయినా వాలంటీర్ల సహకారంతోనూ, ప్రేక్షకుల నిగ్రహంతోనూ ప్రదర్శనలు రక్తికట్టేవి.

ఎర్స్కీన్ స్క్వేర్ ప్రదర్శనలకు సరిగా రాత్రి ఎనిమిది గంటలకే గేట్లు మూసేసేవారు. ప్రేక్షకులను అంతకు ముందుగానే లోపలికి అనుమంతించేవారు. తరువాత మధ్యాంతరంలోనే వారు లోపలికి ప్రవేశించాలి. స్వల్ప రుసుము ఇచ్చిన తరువాత 180 మంది అధ్యాపకులకు సీట్లు కేటాయించబడేవి. విద్యార్థులకూ, అధ్యాపకులకు తప్ప ఇతర ప్రేక్షకులకు అనుమతి దొరికేది కాదు. ప్రేక్షకుల ప్రతిస్పందన, మంచి నాటకాలకు బాగా లభించేది. అల్లర్లు జరుగకుండా బందోబస్తు ఉండేది. ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగాత్మక నాటక సమితి ఆయుష్షు సరిగ్గా 21 ఏళ్ళు. ఈ కాలంలో వినోదంతో పాటుగా విద్యార్థులకి కట్టుదిట్టమైన శిక్షణను ఇచ్చింది. వృత్తి కళాకారులను తయారు చేయకపోయినా నాటక రచన, నటన, దర్శకత్వం, డిజైన్ రంగాల్లో శిక్షణ ఇచ్చింది. ఈ విషయంలో విశ్వవిద్యాలయంలోని అధ్యాపకుల సహాయ సంపత్తి, ప్రయోగ నాటక సమితికి బాగా లభించింది. వారు ఈ శిక్షణకు తమంతట తామే ముందుకు వచ్చి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఇతర సాంకేతిక బృందంతో పాటు, దర్శకులుగా వుండే ఉపాధ్యాయులకు సహాయ సహకారాలు లభించేవి. బి.ఎస్. మూర్తి, వి.వి.రామనాథం, కె.రామకృష్ణా రావు, డి.వి.కె. రాఘవా చారి, ఎస్.వి. లక్ష్మణరావు, జి.సుందర రెడ్డి ప్రభృతులు, విద్యార్థులలో పి.దుర్గా నాగేశ్వర రావు, ఎస్.వై. ఎల్.నర్సింహారావు, పి.శాస్త్రుల నాయుడు. పి.వేణు గోపాల రావు,ఎస్.సుబ్రహ్మణ్యాం మొదలైనవారు దర్శకులుగా పనిచేశారు.

1963, డిసెంబరు 18న ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగ నాటక సమితిని మూసి వేశారు. ఆచార్య కె.వి.గోపాల స్వామి ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రయోగాత్మక నాటక సమితి నిర్మాత గానూ, నిర్వాహకుని గానూ 1943 నుండి 1963 వరకూ కార్యభారాన్ని వహించిన మేధావి. ఈ సమితి ప్రభావం తెలుగు నాటక చరిత్రలో అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ప్రయోగాల వైపు, ప్రదర్శకుల దృష్టిని మరల్చటంలో ఈ సమితి ప్రభావం మరువలేనిది. ప్రయోగ నాటక సమితిలో శిక్షణ పొందిన వారు ప్రపంచంలో గొప్ప పేరుని సంపాదించారు. వారిలో కొందరు ఈనాటికీ ప్రయోగాలు చేస్తున్నారు.

ప్రయోగ నాటక సమితి తన ఇరవై ఒక్క సంవత్సరాల జీవిత కాలంలో 165 నాటక, నృత్య,సంగీత రూపకాలను ప్రదర్శించింది. వాటిలో ప్రతిఘటనాత్మక నాటకాలు, ఇంగ్లీషు నాటకాలు, హిందీ, సమస్యాత్మకాలు, క్లాసిక్స్, హాస్య నాటికలు ప్రదర్శింపబడ్డాయి. ఇలా ఆం.వి.ప్ర.నా. సమితి విద్యార్థి నాటకరంగానికి వెలుగు బాటలు చూపింది. ప్రయోగాలకు నాంది పలికింది. ఈ సమితి కృషి చిరస్మరణీయమైంది.

చాట్ల

ఆంధ్ర ప్రజా నాట్యమండలి

బ్రిటీష్ సామ్రాజ్యవాదుల బానిసత్వంలో మగ్గుతూ ఒక పక్క సత్యాగ్రహాలూ, శాసనోల్లంఘనాలూ, లాఠీ ఛార్జీలు, జైళ్ళ కటకటాల మధ్య ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు నానా బాధలు అనుభవిస్తున్న రోజులవి. ప్రతి భారతీయుడు అంతోఇంతో జాతీయ భావాన్నీ, దేశభక్తినీ కలిగి వున్నరోజులు. యువకులు, విద్యార్థులు, విప్లవ భావాలతోనూ, సోషలిస్టు భావాలతోనూ సమావేశ మౌతున్నరోజులు.

మా భూమి నాటకంలో ఒక దృశ్యం

దేశంకోసం ప్రాణాలర్పించిన ఆనాటి విప్లవ వీరుల జీవితాల నుంచి ఉత్తేజం పొందిన యువకులూ, విద్యార్థులు, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గనాలనీ, దేశం విముక్తికి పాటుపడాలనీ, వందలాది మంది నాటి యువజనోద్యమంలోకి ఆకర్షింపబడ్డారు.

1933లో ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి ఆంధ్రప్రజా జీవితంలో ప్రముఖస్థానాన్ని ఏర్పర్చుకుంది. సోషలిజం స్థాపన లక్ష్యంగా రాజకీయ కార్యక్రమాలతో పాటు ఆంధ్రజాతీయ పునరుజ్జీవనానికి బహుముఖ సేవలుచేసింది. పీడిత ప్రజా ఉద్యమాలతో పాటు సమాజ శ్రేయస్సును కాంక్షించడమే సాహిత్య కళల పరమావధి అనే ప్రగతిశీల దృక్పథాన్ని రచయితలలో కలిగించటానికి అభ్యుదయ రచయితల ఉద్యమం ద్వారా కమ్యూనిస్టు పార్టీ కృషి చేసింది. సాహిత్య రంగంలో తీసుకుని వచ్చిన ఈ మార్పులను సాంస్కృతిక

రంగంలో కూడా తీసుకురావటానికి కమ్యూనిస్టు పార్టీ కృషిచేసింది. ఈ నేపథ్యంలో నాటక రంగంలో నవశకాన్ని ఆరంభించి ప్రజలను జాగృతం చేసి దేశభక్తిని పెంపొందించే ప్రయత్నంలో ప్రజా నాట్యమండలి జన్మించింది. కళ కళ కోసంకాదని, అది ప్రజలకోసమని నిరూపించింది. దేశంలో వచ్చిన రాజకీయ కల్లోల వాతావరణంలో రూపొందింది ప్రజానాట్య మండలి.

1943, మే 23 నుంచి జూన్ 1 వరకు అఖిల భారతీయ కమ్యూనిస్టు పార్టీ మహాసభ, బంబాయిలో జరిగింది. ఆ సందర్భంలోనే అఖిలభారత అభ్యుదయ రచయితల మహాసభ ఆవిర్భవించింది. కొన్ని రాష్ట్రాల నుంచి వైజ్ఞానిక దళాలు వచ్చాయి. ఆంధ్ర వైజ్ఞానిక దళం కూడ బుర్రకథ, కోయ వేషం లాంటి మన ప్రాచీన జానపద కళారూపాలను కొన్నింటిని ఆ సందర్భంలో ప్రదర్శించి ప్రథమ బహుమతిని అందుకుంది. అఖిల భారత స్థాయిలో ఎన్నికైన ఆంధ్ర దళాన్ని ఆనాటి బంబాయి ఆంధ్ర మహాసభ ఘనంగా సన్మానించి, రజతపాత్రను బహుమతిగా ఇచ్చింది.

ఈ సందర్భంలోనే 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్'ఏర్పడింది. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకూ రాష్ట్రశాఖలేర్పడ్డాయి. మన రాష్ట్రానికి ఇపిటిఎ అనుబంధ శాఖగా 'ప్రజానాట్యమండలి' ఏర్పడింది. అబ్బాస్, పృథ్వీరాజ్‌కపూర్, బలరాజ్‌సహానీ, హరీంద్రనాథ ఛటోపాధ్యాయ, పి.సి. జోషి, ఎస్.ఎ. డాంగే, జి. అధికారి మొదలైన ప్రముఖులు మన ప్రదర్శనలను ముఖ్యంగా చూసి కోగంటి గోపాలకృష్ణయ్యను, నాజర్‌ను మెచ్చుకున్నారు. 1943లో బంబాయి వెళ్ళిన వైజ్ఞానిక దళం కొత్త ఉత్సాహంతో తిరిగి వచ్చి ప్రజానాట్యమండలి పేరుతో కృష్ణాజిల్లా కొడాలి గ్రామంలో ఫాసిస్టు వ్యతిరేక శిక్షణా శిబిరాన్ని ప్రారంభించింది. కృష్ణాజిల్లా యువజన సంఘం తాతినేని ప్రకాశరావు, వేములపల్లిదాసు, తమ్మారెడ్డి, బి.వి.రావు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలోనే మిక్కిలినేని రాధా కృష్ణమూర్తి మాచినేని నారాయణ చదలవాడ కుటుంబరావు, పెరుమాళ్ళు, కేశవరావు మొదలైన వారంతా కళారూపాలలో శిక్షణపొందారు. బంబాయి వెళ్ళి వచ్చిన వారిలో కోగంటి గోపాలకృష్ణయ్య, కోసూరి పున్నయ్య ఈ శిబిరంలో ప్రముఖ బాధ్యతలు వహించారు.ఈ శిక్షణా శిబిరంలో అనేక దళాలు తయారయ్యాయి. కోగంటి గోపాలకృష్ణయ్య, కోసూరి, సిరివిశెట్టి ఒక బుర్ర కథ దళంగాను, మిక్కిలినేని, మాచినేని నారాయణ మొదలైన వారు ఒక దళంగాను, పెరుమాళ్ళు, చదలవాడ, కేశవరావు ఒక దళంగాను ఏర్పడ్డారు. అటు గుంటూరులో నాజరు, రామకోటి, పురుషోత్తం మొదలైన వారితో ఏర్పడిన బుర్రకథ దళం ఉత్తేజకరంగా బుర్రకథలు చెబుతూ ఉండేది. మోటూరు ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి, లక్ష్మి మొదలైన వారు మహిళా బుర్రకథ దళంగా ఏర్పడి రష్యన్ వీరనారి టాన్యా బుర్రకథను హృదయం ద్రవించేలా చెప్పేవారు. పశ్చిమ గోదావరిలో చంద్రు సూర్య నారాయణ, మాణిక్యాలరావు మొదలైన వారు బుర్రకథతో పాటు ఫకీరు మొదలైన వేషాలతో, పాటలతో ప్రదర్శనలు ఇస్తూ ఉండేవారు.

ఆ రోజుల్లోనే ఉప్పుగుండూరు బాల సంఘం బుర్రకథలతో ఆంధ్రదేశాన్నంతటినీ ఉర్రూత లూగించింది. అమృతయ్య, ఏసుదాసుల డప్పువాద్యం కూడా ప్రజలను అమితంగా ఆకట్టుకుంది. కర్నూలు జిల్లాలో తుపాకుల బసవయ్య, నెల్లూరు జిల్లాలో రాజగోపాల్, కడప జిల్లా రాజంపేటకు చెందిన హుసేన్ బాబా దళాలు బుర్రకథలతో పాటు జానపద కళారూపాలను కూడా ప్రదర్శిస్తూ ఉండేవారు.

గుంటూరు జిల్లా వైజ్ఞానిక దళం బి. గోపాలం ఫిడేలు వాద్యంతో శ్రావ్యంగా పాటలు పాడి ప్రజలను ఉత్తేజపరుస్తూ ఉండేవారు. ఈ విధంగా ఆంధ్రదేశంలో అన్ని మూలలకు వైజ్ఞానిక ఉద్యమం వ్యాపించింది.

1943 జూన్ నెలలో కోగంటి, కోసూరి, మిక్కిలినేని ఆధ్వర్యంలో ఒక శిక్షణ శిబిరాన్ని నిర్వహించి కొందరు కళాకారులను తయారు చేశారు. జూలైలో జరిగిన ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ మహాసభకు కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి వైజ్ఞానిక దళాలు వచ్చాయి. కృష్ణాదళం పున్నయ్యదళం బుర్రకథ, కోగంటి కోయవేషం, చెంచులు, ఫకీర్లు, దేవరపెట్టె, సైసై భారతవీర, ఓయ్‌హోయ్, హో-జపాన్ హోయ్ అనే గెరిల్లా కళారూపం, జేగంట కళారూపం, హిట్లరు వీధి భాగవతం, సమిష్టి గానాలు, గురజాడ దేశభక్తి గేయం ప్రదర్శితమయ్యాయి. ఈ ప్రదర్శనలోనే గుంటూరు నుంచి నాజరు తీసుకువచ్చిన కోలాటదళం 'మాస్కోపొలిమేరలో, మారణ యంత్రాలు నిలిపి' అనే గేయాన్ని, 'జాయేంగే జాయేంగే కయ్యూరు జాయేంగే' అనే ఉరితీయబడే కయ్యూరు కామ్రేడ్స్ మీద గేయాన్ని ఎలుగెత్తి పాడి సభాసదులను ఉత్తేజపరిచింది. ప్రదర్శనలో నాజరు కోలాటం, కోగంటి కోయవేషం, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి హిట్లరు వేషం ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాయి. ఈ ప్రదర్శన విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో కొన్ని వేల మంది సమక్షంలో ప్రదర్శితమైంది.

ఈ మహాసభ ప్రభావంతో అన్ని జిల్లాలలోను దళాలు ఏర్పడ్డాయి. ఈ ఉత్సాహానికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు, మద్దూరి చంద్రశేఖర రావు, పొట్లూరి సుందరం వైజ్ఞానిక దళాల విషయంలో శ్రద్ధ తీసుకుని అడుగడుగునా సలహాలిస్తూ వైజ్ఞానిక ఉద్యమానికి అండగా నిలబడ్డారు.

ముఖ్యంగా చంద్రశేఖర రావు రచయితలను, కళాకారులను సమావేశపరచి, కళారూపాలు తీసుకోవలసిన ఇతివృత్తాలు, నాటకాలకు, నాటికలకు, కథలను ఎన్నిక చేయడం, దర్శకులు, కవులతో చర్చించడం, ప్రదర్శనలు చూసి విమర్శించి సూచనలిస్తూ, రాష్ట్ర దళాన్ని తీర్చిదిద్దడంలో ప్రముఖపాత్ర వహించాడు.

ఈ విధంగా ప్రజానాట్యమండలి ఉద్యమం ఉరకలు వేస్తూ నడుస్తున్న తరుణంలో "ఓ మిట్టిపడే హిట్లరయ్యా – ఏటికి ఎదురీదు చుంటివా" అనే సుంకర గేయం, "హోయ్ హోయ్ జపాన్ హోయ్" " మలయా బర్మా మింగిన రాక్షసి భారత భువిపై గవిసేనురా" అనే కోగంటి గేయం బహుళ ప్రశంసలు అందుకున్నాయి. దేశభక్తి గేయాలు కొల్లలుగా వచ్చి పడ్డాయి. ఏదో ఒక మూల ఏదో ఒకగేయం వినపడుతూ ఉండేది. కోగంటి కోయవేషం ద్వారా గిరిజనుల సమస్యలన్నిటినీ వివరించేవారు. అలాగే కొండలు పిండి చేసే క్వారీ కూలీల కష్టాలను వివరిస్తూ, మతసామరస్యాన్ని ప్రబోధించే పాటలు పాడేవారు.

ప్రజానాట్యమండలి ఏర్పడిననాటి నుంచే 1948 వరకూ నాట్యమండలికి కావలసిన పాటలను సభ్యులే రాసేవారు. కోగంటి వీధి నాటకాలను, కోలాటం డప్పుల పాటలనూ, కోయదొర, చెంచుల పాటలనూ రాసేవాడు. అలా ఆయన హిట్లరు భాగవతం, సిమ్లా భాగవతం, పేరిగాడి రాజ్యం మొదలైన వీధి నాటకాలను రాశాడు. కోసూరు పున్నయ్య అనేక గేయాలనూ, బుర్రకథలనూ, పిచ్చుగుంటుల కథలనూ రాశాడు. సుంకర ఎన్నో గీతాలనూ, కష్టజీవి, రైతుబిడ్డ, వీరేశలింగం, సీతారామరాజు బుర్రకథలనూ రాశాడు. నాజరు పల్నాటి వీరచరిత్ర, *బెంగాలి కరువు, బబ్బిలి* మొదలైన బుర్రకథలను రాశాడు. గరికపాటి రాజారావు దర్శకుడుగానే కాక రచయితగా పశ్చాత్తాపం, ముబ్బుతెర మొదలైన నాటకాలు, నాటికలను రాశాడు.

రేపనింగు రోజుల్లో ప్రజల కష్టాలను తెలియజేసే రాములమ్మ మన చరిత్రను, రాక్షస కృత్యాలు చేసే నైజాం నవాబుకు వర్తించే *గురజాడ* కన్యాచరితాన్ని జముకుల కథను, కష్టజీవి, స్టాలిన్ గ్రాడ్ యుద్ధం, టాన్యా, ఝూన్సీ లక్ష్మీబాయి, రైతు విజయం, అల్లూరి సీతారామరాజు, వీరేశలింగం, *బెంగాల్* కరువు, పల్నాటి వీర చరిత్ర, బుర్రకథలను ప్రదర్శించేవారు. గురజాడ, శ్రీశ్రీ, సుంకర, కోగంటి, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, శంకరంబాడి, కోసూరి, మిక్కిలినేని రాసిన దేశభక్తి గేయాలను, డప్పుల ద్వారా, రైతు కూలీ గేయాలను, జంతరు పెట్టె ద్వారా, ఇలా ఒక్కొక్క ప్రదర్శనతో ఒక్కొక్క సందేశాన్ని తీసుకుపోయిన ఆంధ్ర ప్రజానాట్యమండలి గొప్ప సంచలనాన్ని కలిగించింది.

ఈ తరుణంలో స్త్రీల బుర్రకథ దళాలు కూడా బయలుదేరాయి. ప్రప్రథమంగా 1944లో గుంటూరు జిల్లా మహిళా బుర్రకథ దళంలో మోటూరు ఉదయం కథకురాలు కాగా, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మి వంతలుగా ఉండేవారు. రష్యా–జర్మనీ యుద్ధంలో నాజీల కిరాతకత్వానికి బలైన అమరజీవి టాన్యా కథను ఈ దళం ఎంతో ప్రచారం చేసి ఫాసిస్టుల కిరాతకృత్యాలు పరాకాష్ఠచెందిన తీరును కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించింది.

కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నాటకాలలో స్త్రీ పాత్రలు ధరిస్తున్న కొండేపూడి రాధ, తాపీ రాజమ్మ, వీరమాచనేని సరోజిని మొదలైన వారు బుర్రకథ దళంగా ఏర్పడి, మన్యవిప్లవకారుడైన అల్లూరి సీతారామరాజు జీవితచరిత్రను ఎంతో రసవత్తరంగా ప్రదర్శించి ఆంధ్ర ప్రజానీకాన్ని ఉర్రూతలూగించారు. సుంకర రచించిన ఆ కథను ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాల్లోను, మద్రాసు ఆంధ్రమహాసభలోను, మైలాపూరు రసిక రంజని హాలులోను, రాజాజీ హాలులో మంత్రుల సమక్షంలో చెప్పి మంత్రుల నుంచి ప్రశంసలు, పారితోషికాలు అందుకున్నారు.

ప్రజా నాట్యమండలి చేపట్టిన జానపదకళారూపాలు :

1. కోయవేషం, 2. బుర్రకథ, 3. హరికథ, 4. వీధి నాటకం, 5. చెంచీత పాటలు, 6. గొల్లసుద్దులు, 7. పిచ్చుకుంటుల కథ, 8. డప్పుల నృత్యం, 9. జేగంట భాగవతం, 10. సమిష్టినృత్యాలు, 11. మూకాభినయ నృత్యాలు, 12. పడవ పాటలు, 13. అన్నాచెల్లెలు సంవాదం, 14. పిట్టల దొర, 15. పాముల వాని నృత్యం, 16. కనక తప్పెట్లు, 17. జముకుల కథ, 18. కోలాటం, 19.జంతరు పెట్టె, 20. ఫకీరు వేషాలు, 21.బృంద గానాలు, 22. హరిహరీ పదాలు, 23. చెక్కభజన, 24. దేవర పెట్టె, 25. షాడోప్లే, 26. తుమ్మెద పాటలు, 27.క్వారీ పాటలు, 28. బైరాగీ వేషం, 29. కత్తీ సుత్తీ నృత్యం, 30 సైసై భారత వీర.

ఆనాడు ప్రజానాట్యమండలి రాష్ట్రదళం, ఆంధ్రదేశంలో అనేక జిల్లాలలో శిబిరాలు నిర్వహించి బుర్రకథలు, వీధి నాటకాలు, చిత్రవిచిత్ర జానపద కళారూపాలలో పదిహేను రోజుల పాటు శిక్షణఇచ్చేది. ఆ శిబిరాలకు వచ్చే కళాకారులందరికీ మొదట్లో గరికపాటి రాజారావు వైద్య పరీక్షలు జరిపి శిక్షణకాలంలో ఎవరెవరికి ఏఏ మందులు కావాలో ఇచ్చేవారు. ఉదయం నాలుగు గంటలకే ప్రతి కళాకారుడు సాధన ప్రారంభించేవాడు. శిబిరం జరిగినంతకాలం క్రమశిక్షణను ఖచ్చితంగా పాటించేవారు. ఈ శిబిరాల్లో స్త్రీ దళాలు కూడా తయారయ్యేవి. శిబిరంలో స్త్రీ పురుషులందరూ అన్నాచెల్లెళ్ళ మాదిరి ఆదర్శ

ప్రాయంగా ప్రవర్తించేవారు. శిబిరాలలో ఆత్మ విమర్శ ఎక్కువగా ఉండేది. ఒక శిబిరంలో తయారైన వారందరూ గ్రామాల్లో మరిన్ని శిబిరాలు నిర్వహించి, గ్రామాలలో ప్రజానాట్యమండలి శాఖలను నెలకొల్పారు.

ఇలా ప్రజానాట్యమండలి ప్రవేశపెట్టిన సుసంప్రదాయాలు, ఆ ఉద్యమ శాఖలు ఆంధ్ర నాటక రంగంలో ఆంధ్రదేశమంతటా విస్తరించాయి. కళారూపాల స్థాయి నుంచి నాటక ప్రదర్శనల స్థాయికి చేరుకుంది. ప్రజా నాట్యమండలి కాంట్రాక్టు నాటకాల దుస్థితిలో శిథిలమైపోతున్న ఆంధ్ర నాటకరంగానికి నూతన చైతన్యాన్ని కలిగించింది. సుంకర-వాసిరెడ్డి కలం నుంచి ముందడుగు నాటకం వెలువడింది.

పాతుకు పోయిన జమీందారీ వ్యవస్థలో నలిగి పోయే రైతుల సముద్ధరణకు సాగిన జమీను రైతుల పోరాటానికి ముందడుగు నాటకం స్ఫూర్తినిచ్చింది. వందల ప్రదర్శనలతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ప్రజలను కదిలించింది.

ప్రజా నాట్యమండలి రాష్ట్రదళం, కృష్ణాజిల్లాదళం ముందడుగు, మాభూమి, అపనింద, పరివర్తనవంటి నాటకాలను, అనేక నాటికలను ప్రదర్శించాయి. రాష్ట్ర దళానికి గరికపాటి రాజారావు, జిల్లా దళానికి కోడూరు అచ్చయ్య దర్శకత్వ బాధ్యతలను నిర్వహించారు. ఈ రెండు దళాలకు సుంకర, వాసిరెడ్డి, ఆచార్య ఆత్రేయ మొదలైన వారు నాటకాలు రాసి ఇచ్చారు. ప్రజా నాట్యమండలి నాటకాలను రచయితలు, దర్శకులు, నటీనటులు అందరూ కథను గురించి సమిష్టిగా చర్చించి ఒక నిర్ణయానికి వచ్చిన తరువాతనే రాసేవారు.

నటీ నటులందరూ విమర్శకుల సలహాలను, సూచనలను హుందాగా స్వీకరించి లోపాలను సరిదిద్దుకునే వారు. డ్రెస్ రిహార్సల్స్‌లో అలంకరణలో పక్కారంగస్థలంపై తెరలు, లైటింగ్ ఎఫెక్ట్స్‌తో పూర్తి రిహార్సల్సు జరిపే వారు. ఈ సందర్భంగా విమర్శకులను, ప్రేక్షకులను కూడా ఆహ్వానించి పూర్తి హంగులతో నాటకాన్ని ప్రదర్శించేవారు. ప్రదర్శనానంతరం తెరలు, రంగాలంకరణలో కావలసిన మంచి చెడులను చర్చించుకుని దశల వారీగా అవసరమైన మార్పులు చేసుకుంటూ ఉత్తమ ప్రదర్శనగా తీర్చిదిద్దేవారు. ప్రదర్శన రోజున ఎటువంటి భిన్న అభిప్రాయాలు లేకుండా నాటక ప్రదర్శన విజయవంతం కావడానికి అంకిత భావంతో పని చేసేవారు. ప్రదర్శనకు రెండు గంటల ముందే గ్రీన్ రూమ్‌కు చేరుకుని ఎవరి అలంకరణను వారే సరిదిద్దుకునేవారు. ప్రేక్షకులు వచ్చినా రాకపోయినా సరిగా రాత్రి పది గంటలకు నాటకం ప్రారంభించి సమయ పాలనను పాటించేవారు. నాటక ప్రదర్శన పూర్తి అయ్యే వరకు నాట్యమండలి సభ్యులంతా ఒక్కత్రాటి మీద నడిచేవారు. ఇలా సమిష్టి కృషితో నాటక ప్రదర్శన జయప్రదమై ప్రేక్షకుల కరతాళ ధ్వనులను అందుకునేది.

ప్రజానాట్యమండలి ప్రదర్శనలను చూడడానికి అనేక పట్టణాల నుండి, గ్రామాల నుండి అనేక దళాలకు సంబంధించిన నటీనటులు పాల్గన్నారు. ఈ ప్రదర్శనను చూసి అదే నాటకాన్ని అన్ని దళాలు అవలీలగా ప్రదర్శించారు. కేవలం అనుకరించడమే గాక ప్రజా నాట్యమండలి ఆదర్శాలను, సిద్ధాంతాలను కూడా తూ.చ. తప్పకుండా ఆచరించేవారు. వారి నటీనటుల సామర్థ్యాన్ని బట్టి స్వతంత్ర పోకడలతో నాటక ప్రదర్శనాన్ని చక్కగా రూపొందించుకునేవారు.

ధనిక, బీద వర్గాల మధ్య నిత్య సంఘర్షణను, ధనిక వర్గాల దోపిడీ విధానాన్ని, తమ హక్కుల కోసం ప్రజానీకం సాగించిన పోరాటాన్ని సముచితంగా చిత్రిస్తూ నాటకాలు రచించిన జంట రచయితలు, సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు సర్వ సమానత్వంతో, సర్వ సౌభాగ్యాలతో ప్రజానీకమంతా సుఖసంతోషాలతో జీవించే నవ సమాజాన్ని నిర్మించుకోవాలని కలలు కంటూ, ఈ లక్ష్య సిద్ధికి మహదావేశంతో కలం పట్టిన అభ్యుదయ రచయితలు వీరు. వీరిద్దరూ రైతు ఉద్యమంలో ఆరితేరిన ప్రజాసేవకులు. 1946లో రచించిన ముందడుగు, 1947లో రాసిన మాభూమి నాటకాలు సుదీర్ఘ చరిత్రను సృష్టించుకున్నాయి. కథా విధానంలో, సన్నివేశ కల్పనలో, పాత్రోచిత సంభాషణలు నడపడంలో, పాత్ర చిత్రణలో, రసపోషణల్లో జాను తెలుగు ప్రయోగంలో విశిష్టత, విప్లవతత్వం వీరి నాటకాల్లో గోచరిస్తాయి.

నైజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి నల్గండలో సాగించిన ప్రజాపోరాటమే మాభూమి నాటక ఇతివృత్తం. ఈ పోరాటంలో 240 గ్రామాల పై పోలీసులు దాడులు చేసి 8500 మందిని అరెస్టు చేశారు. 12 లక్షల రూపాయిల విలువ గల ఆస్తులు లూటీ చేశారు. 52మంది యువవీరులు ప్రాణాలు కోల్పోయారు. నైజాం కిరాతకుల చేతుల్లో 64మంది తెలుగు సోదరీమణులకు మానభంగం జరిగింది. వారిలో ఇద్దరు మరణించారు. ఈ మహోజ్వల పోరాటమే తమను ఈ నాటకం రాయడానికి ప్రోత్సహించిదని రచయితలు మాభూమి పీఠికలో రాసుకున్నారు. ఆ తరువాత జరిగిన తెలంగాణా పోరాటంలో కొన్ని వేలమంది నేలకొరిగారు.

ఆనాడు ప్రజానాట్యమండలి నాటక ప్రదర్శనకు మూడురోజులు ముందుగానే టిక్కెట్లు అయిపోయేవి. పరిసర గ్రామాల నుండి, దూర ప్రాంతాల నుండి తండోపతండాలుగా ప్రజలు కదిలి వచ్చేవారు. ప్రతి ప్రదర్శనానికి సరిపడినంత మంది ప్రేక్షకులు రెండవ ప్రదర్శనానికి మిగిలి పోయేవారు. అందువల్ల ప్రతి పట్టణంలోను ఒకే రాత్రి రెండు ప్రదర్శనలు యివ్వాల్సివచ్చేది.

ఇలా ఒకే రాత్రి రెండు ప్రదర్శనాలిచ్చే సంప్రదాయాన్ని ప్రప్రథమంగా ఆంధ్ర ప్రజా నాట్యమండలే ప్రవేశపెట్టింది.

రాజకీయ నాయకులు, పండితులు, కవులు, నాటక కర్తలు, పత్రికా రచయితలు, మంత్రులు, నటీనటులు, గాయకులు మొదలైన వివిధ రంగాల ఆంధ్ర ప్రజానీకం మాభూమి నాటకాన్ని తిలకించి పరవశులై ప్రశంసా పత్రాలను అందజేశారు.

గరికపాటి రాజారావు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, సుంకర సత్య నారాయణ, నాజర్, కోగంటి, కోసూరి పున్నయ్య, మాచినేని ఉమామహేశ్వరరావు, సిరివిసెట్టి, సి.మోహన్‌దాస్, వెంపటి, పురుషోత్తం, జయరాం, పూర్ణచంద్రరావు, రామకోటి, బి.గోపాలం, మిక్కిలినేని సీతారత్నం, చిరంజీవి, సూర్యకాంతం మొదలైన ప్రసిద్ధ నటులు ఆంధ్ర ప్రజా నాట్యమండలి రాష్ట్రదళం సభ్యులు.

ప్రజానాట్యమండలి నాటకాలలో మొదట్లో పెరుమాళ్ళు, వల్లం నరసింహారావు మొదలైన వారు స్త్రీ పాత్రలలో నటించారు. తరువాత ఈ పద్ధతికి స్వస్తి చెప్పి కళాకారుల కుటుంబాలకు సంబంధించిన స్త్రీలతోనే స్త్రీ పాత్రలు నిర్వహించారు. ఈ విధానం ఆనాడు ఎంతో ఆదర్శంగా ఉండేది. ముఖ్యంగా రాష్ట్రదళం మాభూమి నాటకంలో మిక్కిలినేని కథానాయకుడు వీరారెడ్డి పాత్రలో, భార్య సీతారత్నం కథానాయకురాలు సీతమ్మగా నటించారు. అలాగే జిల్లా దళంలో వీరమాచనేని సరోజిని, తాపీరాజమ్మ, కొండేపూడి రాధ, మోటూరు ఉదయం, మహంకాళి లక్ష్మి, చింతల కోటేశ్వరమ్మ, కొమర్రాజు పద్మ మొదలైన వారంతా నాటకాలలో స్త్రీ పాత్రలను నిర్వహిస్తూ, బుర్రకథలను చెప్పడమే కాక ఇతర కళారూపాల్లో కూడా పాల్గన్నారు. ఈ విధానాన్నే రాష్ట్రవ్యాప్తంగా అన్నిదళాల్లోను సాగించారు. పైన ఉదహరించిన వారందరూ గృహిణులు. ఏనాడూ రంగస్థలం ఎక్కనివారు. అయినా ఆదర్శంగా ముందుకు వచ్చి కృషితో వారి పాత్రలను హృద్యంగా పోషించారు.

ప్రజానాట్యమండలి రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో కృష్ణా జిల్లా ప్రజా నాట్యమండలి ఆదర్శప్రాయమైన కృషిచేసింది. ఈ దళంలో పెరుమాళ్ళ, చదలవాడ కుటుంబరావు, వల్లం నరసింహారావు, కేశవరావు, వి. మధుసూదనరావు, పి.వి.సుబ్బారావు, కోడూరు అచ్చయ్య మొదలైన కళాకారులు పని చేస్తూ ఉండేవారు. పెరుమాళ్ళు, చదలవాడ, కేశవరావు బుర్రకథ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ప్రదర్శిస్తూ ఉండేవారు. ప్రప్రథమంగా కోడూరు అచ్చయ్య దర్శకత్వంలో ముందడుగు నాటకాన్ని తీసుకుని అద్భుతంగా ప్రదర్శించారు. అనతి కాలంలోనే ఆంధ్రదేశంలో ప్రజాభిమానాన్ని చూరగొంది. నటీనటులందరూ సమిష్టి కృషితో ఆదర్శప్రాయంగా ముందడుగు నాటకాన్ని ప్రదర్శించి అనేక ఔత్సాహిక నాటక దళాలకు కొత్తమార్గం చూపించారు. కాని ఈ నాటకానికి ప్రజాదరణ అంతగా లభించలేదు. తరువాత మాభూమి నాటకాన్ని కట్టుదిట్టంగా ప్రదర్శించి ఆంధ్రదేశంలో కాక, మద్రాసు నగరంలో మంత్రుల ఎదుట ప్రదర్శించి ప్రశంసలను అందుకుంది.

ఆనాడు రాయలసీమ, విశాఖపట్నం జిల్లాల్లోను, బెంగాల్ లోను కరువు రాక్షసి కరాళ నృత్యానికి వేలాది మంది బలైపోగా, మలమల మాడి పోయే ప్రజలను ఆదుకోవడానికి ప్రజానాట్యమండలి పూనుకుంది. బెంగాల్‌కరువును చిత్రీకరిస్తూ నాజరు ఒక బుర్రకథనే రచించి, హృదయాలు ద్రవించేలా కథ చెప్పేవాడు. మిక్కిలినేని, మాచినేని, కోగంటి కోసూరి మొదలైన వారంతా రాత్రి సమయంలో బుర్రకథను చెప్పి, మరునాడు "కరువు బాబో కరువు బాబో మలమల మాడ్చే మంటల కరువూ" అంటూ తంబూరా డక్కీలు ధరించి ఇంటింటికీ తిరిగి బియ్యం, డబ్బు, వస్త్రాలు పోగు చేసి కరువు ప్రాంతాలకు పంపించేవారు. కరువు దుర్భర పరిస్థితులను తెలుసుకున్న ప్రజలు ఎంతగానో సహాయం చేసేవారు. రైళ్ళలో దళాలు ప్రయాణం చేసే సందర్భాలలో ప్రయాణీకులకు కరువు పరిస్థితిని వివరించే బుర్రకథ పాటలు పాడి, విరాళాలు వసూలు చేసి సహాయ కేంద్రాలకు పంపించారు. ఈ విధంగా ప్రతి సమస్యలోను ప్రజానాట్యమండలి కలుగజేసుకుని కృషిచేసింది.

కళాకారులకు జరిగే అన్యాయాలను గురించి ఏ ఒక్కరూ మాట్లాడే రోజులు కావవి. మరుక్షణంలో ఏం ముంచుకు రానున్నదో తెలియని రోజులు కావడంతో కళాకారులంతా కత్తుల బోనుల్లో ఇరుక్కొని ఎక్కడి వారక్కడ చెల్లాచెదురై పోయారు. మాభూమి నాటకం, అల్లూరి సీతారామరాజు బుర్రకథ నిషేధానికి గురికావడంతో రాష్ట్ర దళం, జిల్లా దళం సభ్యులు వారి వారి గ్రామాలకు వెళ్ళి పోయారు.

ఆ రోజుల్లో నాటి సమస్యల ననుసరించి, పరిస్థితుల ప్రభావాలననుసరించి వివిధ రచయితలు రాసిన నాటకాలు, కళారూపాలను వివరిస్తూ వాటి ఇతివృత్తాలను ఇక్కడ ఉదహరించడం కష్టమైన విషయం. అందువల్ల పాఠకుల అవగాహన కోసం, కొంతమంది రచయిత పేర్లు మాత్రం, ఉదహరించ గలుగుతున్నాం. భూమికోసం, పెత్తందారు, పోతుగడ్డ, ఆ సామి, కన్యాశుల్కం నాటకంలోని కొన్ని భాగాలు, వరవిక్రయం, వీరేశలింగం ప్రహసనాలు, ప్రతిమ, ముబ్బుతెర, రాజారావు నాటకాలు. *రాజకీయ కురుక్షేత్రం, రాజకీయ గయోపాఖ్యానం, దొందూ దొందే, నేటి భారతం*, తెలంగాణా స్వాతంత్ర్యఘోష, మసాలా, సంభవామి యుగేయుగే, అల్లరి సూర్యం, నాటుమంత్రసాని, ప్రెస్ వర్కర్, నేతబిడ్డ, పత్రికా

స్వాతంత్ర్యం, పోస్టర్, గొడ్డకాడ, ఎండమావులు, జైభవాని, మరో ప్రపంచం, దేవుని బిడ్డలు, గెరిల్లా, పద్మవ్యూహం, కోతల రాయుడు, అమర జీవి, ఈ దేశం నాది, వీర తెలంగాణా, పుత్తడి బమ్మపూర్ణమ్మ మొదలైనవేకాక ప్రగతి, ఓటెవరికి, శంఖారావం ఆగష్టు 15, ప్రతి ఫలం, కనువిప్పు, స్మశాన శాంతి, జీతగాడు, అంత్యార్పణ, గిత్తల బేరం, వీర కుంకుమ మొదలైన ఎన్నో రచనలు ప్రదర్శించారు.

1948లో ఉధృతంగా తెలంగాణా పోరాటం జరిగే సమయంలో ఆంధ్రదేశంలో ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీ మీద, దాని అనుబంధ సంస్థల పైన దారుణమైన నిర్బంధ విధానాన్ని కొనసాగించింది. ముందడుగు, మాభూమి నాటకాలను, సీతారామరాజు బుర్రకథను నిషేధించింది. ప్రజా నాట్యమండలి కళాకారులను కమ్యూనిస్టులుగా చిత్రించి చింత బరికెలతో, లాఠీలతో మోదారు. అరెస్టులు చేసి జైళ్ళకు పంపారు. కళాకారుల కుటుంబాలను నానాహింసలకు గురి చేశారు.

ఈ పరిస్థితుల్లో ప్రజానాట్యమండలి రాష్ట్ర దళాన్ని 1948 జూన్‌లో తాత్కాలికంగా రద్దు చేశారు. కొంతమంది డిటెన్యూలుగా వెళ్ళారు. ఎక్కడివారక్కడ చెల్లా చెదరయ్యారు. ఈ పరిస్థితిలో మిగిలిన కళాకారులు మిక్కిలినేని, మాచినేని, వై.వి.రాజు, రాఘవాపురపు అప్పారావు, వల్లంపాటి సత్యానారాయణ, కృత్తి వెంటి సుబ్బారావు, గెల్ల రాజగోపాలం, గరికపాటి సుబ్బారావు, కారెపు అప్పల స్వామి, కర్నాటి లక్ష్మీ నరసయ్య మొదలైన వారు విజయవాడలో వెలిదండ్ల హనుమంత రాయ గ్రంథాలయ వైజ్ఞానిక శాఖగా ఆంధ్ర ఆర్ట్ థియేటర్‌ను స్థాపించి నిర్విరామంగా ప్రజా నాట్యమండలి ఆశయాలను ప్రచారం చేశారు. ఆనాటి ప్రభుత్వ వత్తిడికి తట్టుకుని నిలబడిన ఆంధ్ర ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రతి వారం నాటకాలు, నాటికలు అభ్యుదయకరంగా ప్రదర్శించారు. వీరేశ లింగం, గురజాడ మొదలైన సంఘ సంస్కర్తల వర్థంతులు నిర్వహించారు. బుర్రకథ, జముకుల కథ మొదలైన కళారూపాలు ప్రదర్శిత మయ్యేవి. ఇక్కడ కూడా ప్రభుత్వం సి.ఐ.డి లను నియమించి ప్రదర్శనలకు అంతరాయం కలిగించింది.

ప్రభుత్వ దమనకాండ ఫలితంగా 1949-50 ప్రాంతాల్లో చాలామంది ప్రజానాట్యమండలి కళాకారులు మద్రాసు సినీరంగంలో ప్రవేశించారు. చదలవాడ, పెరుమాళ్ళు, వల్లం నరసింహారావు, మిక్కిలినేని, వి.మధుసూదన రావు, వి.సరోజిని, సుంకర, వాసిరెడ్డి, ఆత్రేయ, సి. మోహన దాస్, టి.చలపతిరావు, కోగంటి, రాజారావు, రామకోటి, వెంపటి, అనిసెట్టి, బి.గోపాలం, పోట్లూరి సుబ్బారావు మొదలైన కళాకారులందరూ ఆయా శాఖల్లో ప్రవేశించి, మద్రాసులో అభ్యుదయ కళాసమితిని స్థాపించి, ప్రజానాట్యమండలి కార్యక్రమాలను సాగించారు. 1953లో సోవియట్ ఫిలిం డెలిగేషన్ మద్రాసు చలన చిత్రోత్సవానికి వచ్చిన సందర్భంలో కోగంటి రచన హిట్లర్ వీధి భాగవతాన్ని, అనిసెట్టి శాంతి మూకాభినయ నృత్యాన్ని రూసో కలర్‌తీసి తూర్పు యూరప్ రాజ్యాలలో ప్రదర్శించారు. తరువాత చైనా డెలిగేషన్ వచ్చిన సందర్భంలోను, బుల్గనిన్ మద్రాసు వచ్చినప్పుడు ప్రజానాట్యమండలి ప్రదర్శించింది.

తెలుగు సాంస్కృతిక రంగంలో విప్లవాత్మక పరిణామాలు తెచ్చిన ప్రజానాట్యమండలి 1948లో ప్రభుత్వ దమననీతికి గురై ఆగిపోయింది. తిరిగి 1968లో పునర్నిర్మాణానికి విజయవాడలో ప్రయత్నాలు జరిగినా, రాజకీయ విభేదాలతో అనతి కాలంలోనే విచ్ఛిన్నమైంది. తిరిగి 1974 అక్టోబర్‌లో ప్రజా నాట్యమండలి పునరుద్ధరణ జరిగి విజయవాడలో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకుంది.

1978లో హైదరాబాదులో ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి ఉత్సవాలు జరిగాయి. 1974 నుంచి 78 వరకు వరకు చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, ఖమ్మం, నల్గండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోను, హైదరాబాదు నగరంలోను 6 వేల మంది సభ్యులతో 184 శాఖలతో అలరారింది.

మిక్కిలినేని

ఆంధ్ర నాటక కళాపరిషత్తు

వృత్తి నాటక కళాకారులకే గాక భారత దేశంలో నాటక కళను విస్తృతం చేయడానికి, స్వయం ప్రతిభ గల కళాకారులను నాటక రంగం వైపు ఆకర్షించి, తద్వారా వారిని ప్రోత్సహించడానికి దేశంలో ప్రప్రథమంగా స్థాపితమై, ఒక సువర్ణాధ్యాయాన్ని సృష్టించి, నేటి పరిషత్తులకు మూలమైన సంస్థ-ఆంధ్ర నాటక కళాపరిషత్తు.

సంస్కృత నాటక సంప్రదాయంలో తెలుగు నాటకాలను ప్రదర్శించిన సురభి నాటక సమాజాధినేత వనారస గోవిందరావు, సురభి నాటకానికి దేశ విదేశాలలో ప్రదర్శన అవకాశాలు కల్పించి విస్తృత ప్రచారం చేసిన సురభి సమాజ కార్యదర్శి కొత్తపల్లి లక్ష్మయ్యల సంకల్ప బలంతో 1929లో ఆవిర్భవించిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు చరిత్ర పుటల్లో గణనీయ స్థానాన్ని పొంది, తెలుగు నాటక రంగాన్ని అనేక మలుపులు తిప్పి చైతన్యాన్ని సృష్టించింది.

మూకీ చలన చిత్రాలు, తెలుగు టాకీ చిత్రాలు విరివిగా వెలువడుతూ తెలుగు నాటకాన్ని, నాటక రంగ ప్రాశస్త్యాన్ని అణగదొక్కి, వెనక్కు నెట్టి వేస్తున్న రోజుల్లో నాటక రంగావశ్యకతను, దాని ప్రశస్తిని నిలబెట్టి ముందంజ వేసేందుకు తగిన ప్రోత్సాహం,

సహాయ సహకారాల కోసం తాను పడే తపనను లక్ష్మయ్య తన యజమాని గోవిందరావుకు తెలిపాడు. ఆయన సానుకూలంగా స్పందించడంతో లక్ష్మయ్య కొండంత ఉత్సాహంతో రంగ ప్రవేశం చేశాడు. తన తపనను విజ్ఞప్తి రూపంలో దేశంలో ఆనాటి ప్రసిద్ధ పండితులు, కళాకారులు, నాటకాభిమానులు, కళాపోషకులు అందరికీ తెలిపి వారినందరినీ ఒక చోట చేర్చేందుకు కృషిచేశాడు. ఆ కృషి ఫలితంగానే 1929, జూన్ 19, 20, 21 తేదీలలో తెనాలి పట్టణంలో సురభి వారి నాటక ప్రదర్శన శాలలో ప్రప్రథమంగా ఆంధ్ర నాటక కళాపరిషత్తు పేరిట ఒక సంస్థ ఆవిర్భావం, మూడు రోజుల పాటు మహాసభలు జరిగాయి.

ప్రథమ పరిషత్తు మహాసభలకు దేశోద్ధారక, విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, మహామహోపాధ్యాయ ఆచంట వేంకటసాంఖ్యాయన శర్మ, చట్టి చిన పూర్ణయ్యపంతులు, మల్లాది విశ్వనాథకవిరాజు, వనారస గోవిందరావు, కొత్తపల్లి లక్ష్మయ్య వ్యవస్థాపక సభ్యులుగా ధనసహాయం అందించారు. మొదటి రోజున సాంఖ్యాయన శర్మ, రెండవ రోజు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, పరిషత్తు మహాసభలకు అధ్యక్షత వహించారు. పరిషత్తు రిజిస్టరైంది. బుర్రా శేషగిరిరావు పంతులు, వక్కలంక అచ్యుతరావు, భమిడిపాటి యజ్ఞనారాయణ శర్మ, వింజమూరి వేంకటలక్ష్మీనరసింహారావు పంతులు, దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి, బసవరాజు సుబ్బారావు, తల్లావఝ్ఝుల శివశంకర శాస్త్రి, కోస వేంకట్రాయశర్మ, చివుకుల అప్పయ్య శాస్త్రి, గొల్లపూడి శ్రీరామ శాస్త్రి, నెల్లూరు నగరాజారావు, వనారస వెంకోబరావు, కాళ్ళకూరి గోపాలరావు, బెల్లంకొండ సుబ్బారావు, స్థానం నరసింహారావు వంటి అనేక మంది కళాభిమానులు ప్రముఖులు, కళాకారులు ఆ సభలకు హాజరయ్యారు. అనంతరం లక్ష్మయ్య పదమూడేళ్ళ పాటు పరిషత్తుకు కార్యదర్శిగా, ప్రతి ఏటా సభలకు అధ్యక్షత వహించేవారే ఆ ఏడాది పరిషత్తు అధ్యక్షులుగా కార్యక్రమాలను నిర్వహించాడు.

1930లో మద్రాసులో జరిగిన వార్షిక సభలకు సురభి వనారస గోవిందరావు, 1933 నెల్లూరులో మూడవ వార్షిక సభలకు మల్లాది విశ్వనాథ కవిరాజు, 1934లో ఏలూరులో 4వ వార్షిక సభలకు తూములూరి శివరామయ్య, 1935లో మద్రాసులో అయిదవ వార్షిక సభలకు కళాప్రపూర్ణ, బళ్ళారి రాఘవ, 1936లో మద్రాసులో ఆరవ వార్షిక మహాసభలకు గోవిందరాజుల వేంకటసుబ్బారావు, 1937లో విజయవాడ ఏడవ సభలకు పింగళి లక్ష్మీ కాంతం, 1938లో నెల్లూరులో జరిగిన ఎనిమిదవ మహాసభలకు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, 1939లో హిందూపురంలో తొమ్మిదవ వార్షిక సభలకు బెజవాడ రామచంద్రారెడ్డి, 1940లో నెల్లూరులో 10వ సభలకు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, 1941లో మద్రాసులో పదకొండవ వార్షిక మహాసభలకు డి.వి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ కాలంలో పరిషత్తు నాటక సమాజాలకు రైళ్ళలో ప్రయాణ రాయితీలు, టిక్కెట్లపై వినోదపు పన్ను రద్దు, స్త్రీలే స్త్రీ పాత్రలు పోషించేందుకు ప్రోత్సాహించడం, ఒకే పౌరాణిక నాటకాన్ని కొన్ని సమాజాలతో ప్రదర్శింపజేసి, వాటిలో ఉత్తమంగా ఎన్నికైన వాటికి బహుమతులను అందజేయడం, అంతకు ముందు సంప్రదాయాలను అధిగమించి, స్త్రీ పాత్రధారుల ఫోటోలను కూడా కరపత్రాలలో ప్రచురించి స్త్రీలను కూడా ప్రోత్సాహించటం వంటి సంస్కరణలను ప్రవేశపెట్టారు.

మద్రాసు వాల్టాక్ థియేటర్‌లో 1941లో జరిగిన పరిషత్తులో సాంఘిక నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. ఆ ఏడాది పది నాటకాలు పోటీకి రాగా గాలి బాల సుందరరావు అపోహ నాటకంలో ప్రముఖ రంగస్థల నటి పూర్ణిమకు ప్రథమ బహుమతి లభించింది. అలాగే ఆంధ్రశ్రీ చారిత్రక నాటకానికి ప్రథమ బహుమతి రాగా, ఆ నాటకంలో మాంచాల పాత్ర ధారిణి అంజలీదేవి ఉత్తమ బహుమతి గెల్చుకుంది.

హిందీ నాటక ప్రదర్శనలకు కూడా ఆంధ్ర నాటక కళాపరిషత్తు ప్రోత్సాహమిచ్చి, 1941లో మద్రాసు ఏలూరు హిందీ ప్రేమీమండలి చంద్రగుప్త నాటక ప్రదర్శనకు అవకాశమిచ్చింది. అందులో వేమూరి ఆంజనేయ శర్మ, పండిట్ రావు, నండూరి రామకృష్ణారావు, వారణాసి పద్మనాభం, తదితరులు పాల్గన్నారు. ఏక పాత్రాభినయాన్ని, రూపశిల్ప కళలను కూడా ప్రోత్సహించి ఫన్ డాక్టర్ వి. చంద్ర శేఖరం వంటి ప్రముఖులకు కూడా ఆంధ్రనాటక కళాపరిషత్తు అవకాశం కల్పించి ప్రోత్సహించింది. ఆనాడు పరిషత్తులో పాల్గనడమే ప్రతిష్ఠాత్మకంగా ఉండేది. ఇక బహుమతి గెల్చుకుంటే ఆస్కార్ అవార్డు లభించినట్లే భావించేవారు. 1943లో కొత్తపల్లి లక్ష్మయ్య అనారోగ్యానికి గురికావడంతో ఎం.ఆర్.అప్పారావు అధ్యక్షుడుగా, యర్రోజు మాధవాచార్యులు కార్యదర్శిగా, త్రిపురనేని ఒక కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి పరిషత్తును వారికి అప్పగించి, లక్ష్మయ్య సలహాదారుగా వ్యవహరించారు. నాటకరంగాభివృద్ధికి ఒక పత్రిక అవసరమని తలచిన లక్ష్మయ్య ఆంధ్ర నాటక కళాపరిషత్తు పక్షాన 1937లో నాట్యకళ అనే పత్రికను స్థాపించాడు. దానికి నీలంరాజు వేంకటశేషయ్య సంపాదకుడు. అయితే అది మూడు సంచికలతో ఆగిపోగా, తిరిగి దానిని 1940లో లక్ష్మయ్య సంపాదకత్వంలో పునరుద్ధరించారు. తరువాత కొంతకాలం శ్రీనివాస చక్రవర్తి, పసల సూర్యచంద్రరావు సంపాదకత్వంలో వెలువడింది.

పరిషత్తు కార్యవర్గం ఏర్పడిన తరువాత పరిషత్తు కార్యక్రమాలు కొత్త పుంతలు తొక్కాయి. 1949లో ఏలూరు

పరిషత్తులో ఆత్రేయ రాసిన ఎన్.జీ.వో. నాటకానికి ప్రథమ బహుమతి రావడం, 1946లో కాజ వెంకట్రామయ్య గుడివాడలో నిర్వహించిన పరిషత్తు మహాసభలు చరిత్రలో చిరస్మరణీయ సంఘటనలుగా నిలిచాయి. 1944-48 మధ్యకాలంలో ఎం.ఆర్.అప్పారావు ప్రోత్సాహంతో అప్పటి సంయుక్త కార్యదర్శి దుక్కిపాటి మధుసూదనరావు సినీ, నాటక రంగాల నటులను ఒకే వేదిక మీదికి రప్పించాడు. గుడివాడ పరిషత్తులో ఏడు ఔత్సాహిక నాటకాలను ఎంపిక చేసి పోటీలు ప్రారంభించాడు.

1948, జనవరి 18న విజయవాడ దుర్గా కళామందిరంలో జరిగిన పద్నాల్గవ పరిషత్తు మహాసభలకు బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షత వహించాడు. అయ్యదేవర కాళేశ్వరరావు, సుప్రసిద్ధ హిందీ చలన చిత్ర దర్శకుడు వి.శాంతారాం హాజరయ్యారు. పరిషత్తు సొంత భవనం కోసం విజయవాడ జింఖానా క్లబ్ ఎదుట రైవస్ కాల్వగట్టున శంకుస్థాపన చేశారు. 57 ఏళ్ళు గడిచినా ఆ రాఘవ కళామందిరం భవన నిర్మాణం జరక్కపోవడం దురదృష్టకరం. 1945, నవంబర్ 17 నాటికి ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు అనుబంధంగా సమాజాలు ఉండేవి. అవి. 1. బందరు-నవకళావని, 2.వెంకటగిరి అమెచ్యూర్ అసోసియేషన్, 3. గుడివాడ - శ్రీరామ విలాససభ, 4. సామర్ల కోట - డి.ఎస్.ఎ. డ్రమెటిక్ అసోసియేషన్, 5.గొల్లల మామిడాడ - కుసుమహర నాట్యమండలి 6.సామర్లకోట - శ్రీవాణీ నాట్యమండలి, 7. భీమవరం - నవ్య నాట్య కళాసమితి , 8. కోలవెన్ను - స్టార్ థియేటర్. 9. మోరి - బాల గంధర్వ నాట్యమండలి 10. బెజవాడ - నవ్య కళాసమితి, 11. బెజవాడ - ఆంధ్ర ప్రజా నాట్యమండలి 12. నూజివీడు - అప్పారాయ నాట్యమండలి, 13. బందరు - కళాప్రబోధ నాట్యమండలి, 14. బందరు-రాజశ్రీ నాట్యమండలి, 15.జమిగొల్వేపల్లి - భారతీ నాట్యమండలి.

1946 గుడివాడ పరిషత్తు పోటికి వచ్చిన అయిదు నాటకాలలో కొండముది గోపాలరాయ శర్మ రచించిన ఎదురీత నాటకానికి, ఆ నాటకాన్ని ప్రదర్శించిన వెంకటగిరి అమెచ్యూర్స్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు ప్రథమ బహుమతి రచన, ప్రదర్శన, నాయికా నాయకుల ఉత్తమ బహుమతులు కూడా దక్కాయి. నాటకాలతో పాటు పిల్లలు ప్రదర్శించిన అనార్కలి నాటిక, కల్పకం అనే బాలిక నృత్యం, భోలానాథ్, సరోజమ్మల రాధాకృష్ణ నృత్యం, పాముల వాళ్ళ నృత్యం, మరోబాలుని కథక్ నృత్యం కూడా ఏర్పాటు చేయడం ఆ పరిషత్తు విశిష్టత.

1948, జనవరి 16,17,18 తేదీలలో కాజ వేంకట్రామయ్య అధ్యక్షతన విజయవాడ దుర్గా కళామందిరంలో జరిగిన పరిషత్తులో పి.వి.రాజమన్నార్ ప్రవేశపెట్టిన తీర్మానంలో ఆనాటికి ఉన్న పరిషత్తు నిధులలో 75 శాతం, భవిష్యత్తులో వచ్చే ఆదాయంలో కూడా 75శాతం సొమ్మును పరిషత్తు భవన నిర్మాణానికి కేటాయించాలని ప్రతిపాదించగా రావూరు వేంకట సత్య నారాయణరావు బలపరిచారు. ఆ తీర్మానం ఇప్పటికీ కూడా అమలు కాలేదు.

నవోదయ సంపాదకుడు నీలంరాజు వేంకట శేషయ్య ఒక కవి, విమర్శకుడు, ఒక నటుడు గల సంఘాన్ని నియమించి ఆ ముగ్గురి సలహాలతో పరిషత్తు ఒక ఉత్తమనాటకాన్ని ప్రదర్శింపజేయాలని తీర్మానించాడు.

మద్రాసు ఫిలింసెన్సార్ బోర్డులో ఆంధ్రులకు ఎక్కువ ప్రాతినిధ్యం కావాలని, వారిలో పరిషత్తు ప్రతినిధులు కూడా ఉండాలన్న మరో తీర్మానాన్ని కూడా సమావేశం ఆమోదించింది. పరిషత్తుకు కొత్త ఉపాధ్యక్షులుగా కాజ వెంకట్రామయ్య, రొద్దం రాజారావు ఎన్నికయ్యారు. 1948 అక్టోబర్ మూడున పరిషత్తు నిర్మాత లక్ష్మయ్య మరణించాడు.

ఏలూరులో 1949లో జరిగిన పదహేనవ వార్షిక మహాసభల నాటికి పోలవరపు సూర్యప్రకాశరావు ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్యనిర్వాహక వర్గ సభ్యుడుగా ఎన్నికయ్యాడు. పరిషత్తు పోటీలకు వచ్చే నాటకాల సంఖ్య పెరగడంతో సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో ఉత్తమ నాటకాలను ఎంపిక చేసే పద్ధతి ప్రారంభమైంది. ఆనాటి నుండి 50 ఏళ్ళుగా ఒకటి, రెండు పరిషత్తులకు తప్ప ఆయనే ఎంపిక చేసే న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నాడు. ఆయన నిర్ణయించి ఎంపిక చేసిన నాటకాలన్నీ ఉత్తమ ప్రమాణాలు గలవిగా ప్రశంసలను అందుకోవడం ఒక విశిష్టత.

కాకినాడలో 1950లో జరిగిన పదహారవ పరిషత్తు పోటీలను హిందీ చలన చిత్ర నటుడు పృథ్వీరాజ్ కపూర్ ప్రారంభించాడు. ఈ పరిషత్తులో పినిశెట్టి శ్రీరామమూర్తి పల్లెపడుచుకు ఉత్తమ బహుమతి లభించగా, ఉత్తమ నటిగా నిర్మల ఎన్నికయ్యింది. నాటికలలో ఆత్రేయ ప్రగతి ఉత్తమ నాటికగా ఎంపికైంది. ఉత్తమ నటుడుగా నాగభూషణం ఎన్నికయ్యాడు.

తెనాలిలో 1951లో జరిగిన పదిహేడవ పరిషత్తు పోటీల్లో పాల్గన్న తొమ్మిది నాటకాల్లో విజయవాడ ఉదయినీ రాఘవ కళాకేంద్ర వారి 'నాటకం' కు ప్రథమ బహుమతి లభించింది. తరువాత రెండేళ్ళ పాటు పరిషత్తు జరగలేదు.

మచిలీపట్నంలో 1954లో జరిగిన 18వ పరిషత్తు సభలను ఆనాటి రాష్ట్ర ప్రణాళికా శాఖ మంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రారంభించాడు. ఈ పరిషత్తులో విజయవాడ ప్రజానాట్య మండలి ప్రదర్శించిన ఆసామీ నాటకానికి ప్రథమ బహుమతి,

రాజమండ్రి రాఘవ కళాసమితి వారి గుడ్డిలోకం నాటకానికి ద్వితీయ బహుమతి లభించాయి. ఉత్తమరచనకు ఆత్రేయ రచించిన విశ్వశాంతి ఎంపికయ్యింది. నాటికలలో నాబాబు కు మొదటి బహుమతి, వరప్రసాదంకు ద్వితీయ బహుమతి లభించాయి.

1948లో విజయవాడలోని శాంతారాం శంకుస్థాపన చేసిన రాఘవ కళామందిరం స్థల పునఃసేకరణకు పరిషత్తు అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవపెద్ది వేంకట్రామయ్య, జి.రామారావు, డి.వి.సుబ్బారావు, స్థానం నరసింహారావు, ఆర్.కె.రామలింగారెడ్డి, పోలవరపు సూర్యప్రకాశ రావులతో ఒక కమిటీని నియమిస్తూ, 1954లో జరిగిన 18వ పరిషత్తు తీర్మానించింది. మద్రాసు మ్యూజియం థియేటర్ మాదిరిగా విజయవాడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేయడానికి కూడా తీర్మానించింది. ముందడుగు, మాభూమి, అల్లూరి సీతారామరాజు, ఎవరుదొంగ? నాటకాలపై నిషేధం తొలగించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. నాటక కళకు విశ్వవిద్యాలయంలో ముఖ్యంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యపీఠం ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ తీర్మానించింది.

హైదరాబాదులో 1955లో జరిగిన పంతొమ్మిదవ పరిషత్తు పోటీలకు సుమారు 150 నుంచి 200వరకు నాటకాలు, నాటికలు, మద్రాసు, ఆంధ్రా, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల నుంచి వచ్చాయి. ఈ నాటకాలు, నాటికలు అన్నింటినీ పోలవరపు సూర్య ప్రకాశరావు ఒక్కడే స్వయంగా రెండు నెలలపాటు అవిశ్రాంతంగా స్క్రూటినీ చేసి ఏడు నాటకాలను, తొమ్మిది నాటికలను ప్రదర్శనకు ఎంపిక చేశాడు. ఈ పోటీలను సినీనటి భానుమతి ప్రారంభించింది. తరువాత ఇరవైయ్యవ పరిషత్తు 1958లో గుడివాడలో జరిగింది. కొడాలి గోపాల రావు రచన దొంగవీరుడు లో కె.వేంకటేశ్వర రావు ఉత్తమ నటుడు బహుమతిని అందుకున్నాడు. 1959లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున పసల సూర్యచంద్ర రావు అధ్యక్షతన సంగీత నాటక అకాడమీ ఏర్పడింది. అయితే, ఆయన ఆనాటి ఆంధ్ర నాటక కళాపరిషత్తు ప్రధాన కార్యదర్శి కూడా కావడంతో 1960లో తణుకులో జరిగిన ఇరవై ఒకటవ పరిషత్తు (రజతోత్సవ) సభలను ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ అధ్యక్షతన, అకాడమీ, పరిషత్తు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ పోటీల్లో ఉత్తమ రచన బహుమతిని చిల్లరకొట్టు చిట్టెమ్మ నాటక రచయిత దాసం గోపాలకృష్ణ అందుకున్నాడు. ఉత్తమ నటుడుగా కీర్తి శేషులు నాటకంలో శ్యామసుందర్, ఉత్తమ నటిగా ధర్మచక్రం నాటకంలో శాంత, ఉత్తమ హాస్యనటుడుగా వి.భీమరాజు బహుమతులు గెల్చుకున్నారు.

సంగీత నాటక అకాడమీ స్థాపనానంతరం ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిర్లక్ష్యానికి గురైంది. పరిషత్తు ఆదర్శంగా రాష్ట్రంలో సంపన్నులు వివిధ రకాల పేర్లతో పరిషత్తులు నిర్వహించడం ప్రారంభమైంది. సినిమా, టీవీలు లక్ష్యంగా నాటకరచనలు, పోటీల నిర్వహణ సాగుతూండడంతో పరిషత్తు లక్ష్యాలు దెబ్బతిన్నాయి. ప్రమాణాలు క్షీణిస్తున్న దశలో ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిబంధనలకు నిలవలేని నాటక సమాజాలలో, రాజకీయాలు పెరిగి, విలువలు తరిగి పోయాయి. 1960 వ దశకం నుంచి పరిషత్తు పోటీల నిర్వహణలో జాప్యం జరిగింది. 1962లో గుడివాడలో జరిగిన ఇరవై రెండవ వార్షిక మహాసభలలో ప్రభాకర నాట్యమండలి, గుడివాడ ప్రదర్శించిన పామర్తి సుబ్బారావు నటించిన సుల్తానీ నాటికకు ప్రథమ బహుమతి, చాట్ల శ్రీరాములు పుణ్యస్థలికి ద్వితీయ బహుమతి లభించాయి. 1963లో అనంతపురంలో జరిగిన ఇరవై మూడవ పరిషత్తులో మరో మొహెంజుదారో ఉత్తమ నాటకంగా ఎంపిక కాగా మాట తప్పకు ప్రథమ బహుమతిని గెల్చుకుంది. రాగరాగిణిలో ఉత్తమ నటుడుగా చెన్నం కృష్ణమూర్తి, మాట తప్పకు లో సీత ఉత్తమ నటిగా ఎంపిక అయ్యారు. చిట్టి నాటికలో ఉత్తమనటి బహుమతి పార్వతికి లభించింది.

రెండేళ్ళ తరువాత 1965లో సంయుక్తంగా సంగీత నాటక అకాడమీతో నిర్వహించిన ఇరవై నాల్గవ పరిషత్తు పోటీల్లో నటనాలయం రచయిత మోదుకూరి జాన్సన్‌కు ఉత్తమ బహుమతి, వయసు–మనసు నాటకానికి ప్రథమ బహుమతి నిర్మల నాటకంలో ఉత్తమనటి బహుమతి అనూరాధకు లభించాయి.

మళ్ళీ నాలుగేళ్ళ తరువాత 1969లో ఏలూరులో జరిగిన ఇరవై అయిదవ పరిషత్తులో పరిషత్తు స్థాపననాటి కాలంలో మాదిరిగా ఒకే నాటకం లేపాక్షి ప్రదర్శనలో కొన్ని సమాజాలు పోటీకి పాల్గనగా హైదరాబాదు సచివాలయం సమాజం ప్రథమ బహుమతి గెల్చుకుంది.

విజయవాడ రైల్వే సంస్థలో 1970లో జరిగిన ఇరవై ఆరవ సభల్లో వయసు–మనసు (ఆత్రేయ), కరుణించని దేవతలు (గొల్లపూడిమారుతీరావు) నాటకాలు, కళ్ళు (గొల్లపూడి) నాటిక ప్రథమ బహుమతులను గెల్చుకున్నాయి. అనంతరం తొమ్మిదేళ్ళ తరువాత 1979లో రాజమండ్రిలో జరిగిన ఇరవై ఏడవ వార్షిక మహాసభలను ఎం.ఆర్. అప్పారావు అధ్యక్షతన పరిషత్తు స్వర్ణోత్సవాలుగా జరుపుకున్నారు. 1980లో

విశాఖపట్నంలో 28వ వార్షిక సభలు జరిగాయి.

1983లో పోలవరపు సూర్యప్రకాశరావు పరిషత్తు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 18 ఏళ్ళుగా ఆ పదవిలో పరిషత్తు ప్రగతికి కృషిచేశాడు. 1983లో పాలకొల్లులో 29వ మహాసభలు, 1986లో ఖమ్మంలో 30వ పరిషత్తు, 1987లో భీమవరంలో 31వ పరిషత్తు నిర్వహించాడు. అనంతరం నాలుగేళ్ళ తరువాత 1992లో ఒంగోలులో పుర ప్రముఖుల తోడ్పాటుతో 32వ పరిషత్తు మహాసభలను వజ్రోత్సవాలుగా ఘనంగా నిర్వహించారు. ఈ వజ్రోత్సవ సభలలో అక్కినేని నాగేశ్వరరావు బహుమతి ప్రదాతగాను, ఈనాడు దినపత్రిక సంపాదకుడు రామోజీరావు వంటి ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు.

సుమారు 200 సమాజాలు అనుబంధంగా ఉండి, సుదీర్ఘ చరిత్ర గలిగి, రాజకీయలకు అతీతమై నటులకు, కళాకారులకు, కళాపోషకులకే ఆది నుంచి పరిమితం కావటంతో, అన్ని వర్గాలవారు ఈ సంస్థ అభివృద్ధికి కృషిచేసి చరిత్ర పుటలలో నమోదు కాబడ్డారు. కొప్పరపు సుబ్బారావు *లిటిల్ థియేటర్స్*, గరికపాటి రాజారావు ప్రజా నాట్యమండలి, కె.వి.గోపాలస్వామి నాయుడు విద్యార్థి నాటక రంగం, హైదరాబాదు ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం వంటి సంస్థలకే గాక ఈనాడు కొత్తగా ఆవిర్భవిస్తున్న సంస్థలన్నింటికీ మార్గదర్శక సంస్థ ఆంధ్ర నాటక కళాపరిషత్తే అన్నది నిర్వివాదాంశం.

చలనచిత్ర రంగంలో ప్రముఖులైన ఎందరో కళాకారులు, రచయితలు, నటీ మణులు, నిర్మాతలు, దర్శకులు పరిషత్తుతో సంబంధం ఉండి, పరిషత్తు ప్రోత్సాహంతో పైకి వచ్చిన వారే. ఉత్తమ ప్రమాణాలను నాటకరంగంలో నెలకొల్పి, అర్ధ శతాబ్దం పైగా అత్యుత్తమ సేవలు అందించిన ఈ సంస్థను యథావిధిగా తన కార్యక్రమాలు కొనసాగేలా కాపాడుకోవలసిన బాధ్యత కళాభిమానులందరిపైనా ఉంది.

పో.సు.రా.

నాటక పరిషత్తులు

ఇద్దరు వ్యక్తుల మధ్య, రెండు వర్గాల మధ్య ఏ రకమైనా పోటీ అయినా అది వ్యక్తిగతం. దాని వలన కలిగే లాభ నష్టాలు వ్యక్తి నిష్టం. కానీ ఆట..మాట.. పాట వంటి విభాగాలలో జరిగే పోటీ వ్యక్తి గతమైనా తద్వారా ప్రదర్శితమయ్యే ప్రతిభ మూలంగా జనించే రసానుభూతి సామాజికులకు ఆనంద దాయకం. ఈ రకమైన పోటీలో ఒకరి కన్నా మరొకరు చూపే నైపుణ్యం మూలంగా ఆ కళ చరితార్థమౌతుంది. పోటీ అనేది అన్ని రంగాలలోనూ సృష్టి ఆరంభం నుండి కన్పిస్తున్నా లలిత కళల్లో ఉత్పన్నమయ్యే పోటీ సామాజికులకు ఆనందం పంచి పెట్టబడుతుంది. క్రీ.పూ. ఐదవ శతాబ్దం నుంచి గ్రీకు దేశంలో డయోనిసెస్ దేవత ఉత్సవాల్లో నాటక కర్తలైన సోఫోక్లిస్, ఎస్కిలస్, యురిపిడిస్ వంటి ప్రముఖులు ఈ పోటీలలో పాల్గొని బహుమతులు పొందినట్లు తెలుస్తుంది. దాదాపు పది నుంచి 15వేల మంది ప్రేక్షకులు తిలకించే ఈ నాటకాలకు డయోనిసెస్ దేవత గుడి ప్రధాన పూజారితో పాటు, పలువురు ఏథెన్స్ నగర ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించేవారు.

తెలుగు నాటకం పుట్టిన కొద్దిరోజులకే ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా ఈ పోటీతత్వం రాజ్యం ఏలింది. బందరుకు చెందిన పుస్తక ప్రచురణకర్త, కొనుకొలను వేంకట్రామయ్య 1914లో ధర్మవరం కృష్ణమాచార్యుల చిత్రనళీయం నాటకానికి బందరులో పోటీలను ఏర్పాటుచేశాడు. తెలుగు దేశంలో జరిగిన తొలి నాటక పోటీలుగా ఇవి చరిత్రలో నిలిచిపోయాయి. ఈ పోటీలలో ఆరు నాటక సమాజాలు పాల్గొని చిత్రనళీయం నాటకాన్ని ప్రదర్శించాయి. ఈ పోటీలలో బందరు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీకి ఉత్తమ ప్రదర్శన, ఆ సమాజానికే చెందిన వెంపటి వేంకటేశ్వర్లుకు ఉత్తమ నటుడూ, ముప్పిడి జగ్గరాజు పోషించిన దమయంతి పాత్రకు ఉత్తమనటి అవార్డులు లభించాయి. ఈ పోటీలు విజయవంతమైన స్ఫూర్తితో వెంకట్రామయ్య 1915లో ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ శాస్త్రి రసపుత్ర విజయం నాటక పోటీలను ఏర్పాటు చేశాడు. ఈ పోటీలలో బందరు రాయల్ థియేటర్‌కు ఉత్తమ ప్రదర్శన బహుమతితో పాటు ఈ సమాజ నటులైన ముంజులూరి కృష్ణారావు (దుర్గాదాసుపాత్ర), పింగళి లక్ష్మీకాంతం (రాజసింహుని పాత్ర)లకు ఉత్తమ నటుల బహుమతులు లభించాయి. 1916లో వడ్డాది సుబ్బారాయుడు వేణీ సంహారం నాటక పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో బందరు రాయల్ థియేటర్‌కే ఎక్కువ బహుమతులు లభించాయి. దుర్యోధనుని పాత్ర బహుమతిని బి.టి.నరసింహాచార్యులు, పింగళి వీరయ్యలకు సంయుక్తంగా ప్రకటించారు. కానీ ఈ బహుమతిని అందుకోవడానికి నరసింహాచార్యులు తిరస్కరించడంతో వివాదం రాజుకొని పరిషత్తు రసాభాసగా మిగిలింది. బహుమతి ప్రదానం జరగలేదు.

నాటక పోటీల నిర్వహణాభిలాష ఇతర పట్టణాలకు కూడా పాకింది. 1917లో గుంటూరులో బలిజేపల్లి లక్ష్మీకాంత కవి సత్యహరిశ్చంద్ర నాటక పోటీలు జరిగాయి. ఈ పోటీలకు హరిశ్చంద్ర పాత్రకు అఖండ కీర్తి ప్రతిష్ఠలార్జించిన హరిప్రసాద రావు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. బందరు నాటక సమాజానికి చెందిన డి.వి.సుబ్బారావు ఉత్తమ నటునిగా బహుమతి పొందాడు. 1917 నుంచి 1921 వరకూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో *గయోపాఖ్యానం, కనకతార, పాదుకా*

పట్టాభిషేకం నాటకాల పోటీలను నిర్వహించారు. 1921లో విజయవాడలో జరిగిన చింతామణి నాటక పోటీలలో పలు సమాజాలు పాల్గొన్నాయి. పోటీల ఆరంభదశలో ప్రస్తుత విధానానికి భిన్నంగా నిర్వాహకులు ఒక నాటకాన్ని ఎంపిక చేసి, దానికే పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనతోపాటు, ఆ నాటకంలోని ప్రధానమైన పాత్రలకు బహుమతులు ప్రదానం చేశారు.

1919లో ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు సర్వేపల్లి రాధాకృష్ణ, జయపూర్ సంస్థాన మహారాజు రాజా విక్రమదేవవర్మ సహకారంతో విశాఖ ప్రాంతంలోని కళాకారులను, కళాసంస్థలను ఒక తాటి మీద నడపాలనే సదుద్దేశంతో విశాఖ పట్టణాంధ్ర నాటక కళాపరిషత్తును స్థాపించారు. ఒకే నాటకానికి పోటీలను నిర్వహించే విధానానికి భిన్నంగా నాటక సమాజాలు తమకు నచ్చిన నాటకాన్ని పోటీలలో ప్రదర్శించ వచ్చుననే సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. బహుమతులను వెండి, బంగారు కప్పులు కాకుండా నగదు రూపంలో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గనడానికి రాష్ట్రంలోని ఎన్నో సమాజాలు ఉత్సాహం చూపాయి. కళను పోటీలతో కొలవడం దారుణమని, ఇది కళను అవమానించడమని కొందరు సుదీర్ఘ ప్రకటన చేశారు. ఈ సమయంలో స్వాతంత్ర్య పోరాటం తారాస్థాయికి అందుకొంది. బ్రిటీష్ వారు అణచివేత చర్యల పేరున దారుణ మారణ కాండ చేశారు. ఇటువంటి వాతావరణంలో పోటీలు జరగక పోయినా, వారు నిర్దేశించిన నిబంధనావళి ఇప్పటికీ అమలులో ఉండడం విశేషం. 1923 జనవరిలో మల్లాది విశ్వనాథ కవిరాజు నాయకత్వంలో గంజాం మండల ఆంధ్ర నాటక కళాపరిషత్తును స్థాపించి పోలాకీ అనే గ్రామంలో నాటక పోటీలను నిర్వహించారు. ఇది నాటక పరిషత్తు ప్రస్థానంలో తొలిదశగా చెప్పవచ్చు.

సినిమా పరిశ్రమ మొదలైంది. రంగస్థల నటులు వెండి తెరకు వలస వెళ్లడం మొదలు పెట్టారు. నాటక శాలలన్నీ సినిమా థియేటర్లుగా రూపాంతరం చెందాయి. జీవం కోల్పోయిన నాటకానికి కాయకల్ప చికిత్స చేయాలనే ఆలోచనల మధనం నుండి పుట్టిన మహత్తర ఆశయ రూపకల్పన ఆంధ్ర నాటక కళాపరిషత్తం. ఔత్సాహిక నాటక రంగంలో కృషి చేసే కళాకారులకు, ప్రయోక్తలకు, రచయితలకు గుర్తింపు లేక పోవడం వల్ల, ఉత్సాహపరచడానికి ఏ ప్రక్రియ లేక పోవడం వల్ల, ఔత్సాహికులు ప్రదర్శించే కళాఖండాలను చూసి ప్రేక్షకులు ఆనందించి మెచ్చుకునే సదవకాశం కలిగించ లేకపోవడం వల్ల ఔత్సాహిక నాటక రంగం రాణింపుకు రాకపోవడం జరిగిందనే భావన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఏర్పడడానికి పునాదిగా నిలిచింది. అఖిలాంధ్ర నాటక కళాపరిషత్తును స్థాపించాలని విశ్వనాథ కవిరాజు అహోరాత్రులూ కృషి చేశాడు. వేలాది రూపాయల సొంత ధనాన్ని వెచ్చించి ఊరూరా తిరిగి కళాకారులను ఉత్తేజితులను చేశాడు. తెనాలి పట్టణంలో 1929, జూన్ 19న మహాసభలు జరిగాయి. అక్కడే ఆంధ్ర నాటక కళాపరిషత్తు పుట్టింది. నాటి నుండి 1944 వరకూ ప్రతి ఏటా నాటకోత్సవాలను వివిధ పట్టణాలలో నిర్వహించారు. ఇది ఆంధ్ర నాటక కళాపరిషత్తు చరిత్రలో తొలిదశ. 1944లో పరిషత్తు రూపురేఖలు పూర్తిగామారిపోయాయి. ఎం.ఆర్. అప్పారావు, పసల సూర్యచంద్రరావు, కాజ వెంకట్రామయ్య వంటి ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా నాటక పోటీలను నిర్వహించాలని తీర్మానించి, ఒక నిబంధనావళిని రూపొందించారు.

పోటీలలో సాంఘిక నాటకాలూ, నాటికలనే ప్రదర్శించాలనీ, స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలనీ, ఐదు సంవత్సరాల క్రితం ప్రకటితమైన రచనలు పోటీకి అనర్హమనీ, ఒక పర్యాయం ప్రదర్శితమైన నాటకం, నాటికను తిరిగి పరిషత్తులో ప్రదర్శించరాదనీ, ఒక నాటకంలో గానీ, నాటికలో గానీ నటించిన కళాకారుడు వేరొక సమాజం ప్రదర్శించే నాటకం, నాటికలో నటించరాదనీ, నియమ నిబంధనలు విధించారు. దీనితో పోటీలకు ఒక స్పష్టమైన రూపు, విధానం ఏర్పడినట్లైంది. సాంఘిక నాటకాలూ, నాటికలే పోటీకి అర్హమనే విషయాన్ని ఆంధ్ర నాటక కళాపరిషత్తు నొక్కి వక్కాణించింది. దీనితో ఎందరో కొత్త రచయితలు పుట్టుకొచ్చారు. అద్భుతమైన నాటకాలూ, నాటికలూ వెలువడ్డాయి. కొండముది గోపాలరాయశర్మ, ఆచార్య ఆత్రేయ, పినిశెట్టి శ్రీరామమూర్తి, బెల్లంకొండ రామదాసు, మోదుకూరి జాన్సన్, అవసరాల సూర్యారావు, ఎన్.ఆర్.నంది, భమిడిపాటి రాధాకృష్ణ, కొర్రపాటి గంగాధర రావు, పులుగుండ్ల రామకృష్ణయ్య, సుంకర, వాసిరెడ్డి, వడ్లమూడి సీతారామారావు, వేణు, ముదిగొండ లింగమూర్తి, కొడాలి సుబ్బారావు, రావికొండలరావు, గొల్లపూడి మారుతీరావు, వేలూరి శివరామ శాస్త్రి, గన్నిశెట్టి వేంకటేశ్వరరావు, కొప్పరపు సుబ్బారావు, చింతపల్లి హనుమంతరావు వంటి గొప్ప రచయితలు ఆంధ్ర నాటక కళాపరిషత్తు కోసం రచనలు చేశారు. ఈ పరిషత్తు ద్వారా ఎందరో నటులూ, దర్శకులూ తమ ప్రతిభను ఆంధ్రదేశానికి చాటి చెప్పారు. పెరుమాళ్ళు, ఆత్రేయ, మాచినేని, రామచంద్ర కాశ్యప, జె.వి.రమణమూర్తి, ఆర్.వి.చలం, కె.వేంకటేశ్వరరావు, ఎ.శివరామిరెడ్డి, చలం, పామర్తి సుబ్బారావు, గరికపాటి రాజారావు, అంకరాజు శంకరరావు, చాట్ల శ్రీరాములు, పి.ఎల్.నారాయణ, బి.వి.రామారావు, నటీమణుల్లో నిర్మల, లక్ష్మి, కోటేశ్వరమ్మ, కె.ఇందిరాదేవి, టి.ఆర్.తిలకం, రాజేశ్వరీదేవి, ఉదయలక్ష్మి, లక్ష్మీబాయి, కొప్పరపు సరోజిని, సుబ్బలక్ష్మి, పుష్పకుమారి, అన్నపూర్ణ, శకుంతలాదేవి, తులసి, యశోద ప్రభృ

తులు ఈ పోటీల ద్వారా గుర్తింపును రాణింపును పొందారు.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు మూలంగా కొత్తకొత్త ప్రయోగాలకు ఆస్కారం లభించింది. రంగాలంకరణ, రంగోద్దీపనం వంటి అంశాల పై ప్రత్యేక శ్రద్ధ పెరిగింది. స్త్రీ పాత్రలను స్త్రీలే నటించాలనే నియమంతో ఎందరో నటీమణులు వెలుగులోనికి వచ్చారు. నాటక ప్రదర్శనలపై వినోద పన్నును రద్దు చేయించిన ఘనత కూడా ఆంధ్ర నాటక కళాపరిషత్తుకే దక్కుతుంది. పోటీ నాటక వ్యవస్థకు రూపు రేఖలు దిద్దింది ఆంధ్ర నాటక పరిషత్తు అనేక పరిషత్తుల నిర్వహణకు స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించిన ఘనత పరిషత్తుదే. తెలుగు నాటకం తల ఎత్తుకొని గర్వంగా నిలవడానికి ప్రధాన కారణం పరిషత్తే. సాంఘిక నాటక రంగ ఉద్యమస్ఫూర్తి ఆంధ్ర నాటక కళాపరిషత్తు అని స్పష్టంగా చెప్పవచ్చు.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు స్ఫూర్తితో స్థాపించబడిన కొన్ని పరిషత్తులు, నిర్వహణలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పి తెలుగు నాటక రంగ వికాసానికి ఎనలేని కృషిచేశాయి. విజయనగరంలో స్థాపించిన రాఘవ నాటకోత్సవాలు, విజయరామ నాటక కళాపరిషత్తు, గూడూరు సంస్కృతీ సమ్మేళనం (గూడూరు), మహాత్మాగాంధీ మైత్రీ బృందం నాటక కళాపరిషత్తు, లలిత కళానికేతన్ (రాజమండ్రి), జగన్నాధగిరి కళాపరిషత్తు (జగన్నాధగిరి), పంతం పద్మనాభం నాటక కళాపరిషత్తు (గెద్దనాపల్లి), కళాసదస్సు(చిలకలూరి పేట), ప్రగతి కళామండలి (సత్తెనపల్లి) పరిషత్తులు చేసిన సేవ నిరుపమానం.

ఆధునిక కాలంలో కాకతీయ కళాపరిషత్తు (నాగభైరవారి పాలెం), ప్రగతి కళా మండలి(సత్తెనపల్లి), బి.హెచ్.ఇ.ఎల్. కమ్యూనిటీ సెంటర్ (రామచంద్రాపురం), ఆంధ్ర లలిత కళాసమితి (సికింద్రాబాద్), పరుచూరి రఘుబాబు స్మారక నాటకోత్సవాలు (హైదరాబాదు), నట సమాఖ్య (వెంకటగిరి), కాళిదాస కళారాధన సమితి (కావలి), చెన్న మల్లేశ్వర నాటక కళాపరిషత్తు (అమలాపురం) 20-30 ఏళ్ళ నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఏటా పోటీలను నిర్వహిస్తున్నాయి. ఉత్తర అమెరికాకు చెందిన అప్పాజోస్యుల విష్ణుభట్ల ఫౌండేషన్ గత ఏడు సంవత్సరాలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రతి ఏటా నాటిక, నాటక పోటీలను నిర్వహిస్తుంది. రంగస్థల, టి.వి.కళాకారులతో రంగస్థల కళాకారులను సమాన ప్రాతినిధ్యాన్ని కలిగిస్తూ భారతదేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 1999 నుండి ప్రతి ఏటా నంది నాటకోత్సవాలను నిర్వహిస్తూండడం విశేషం.

రాష్ట్రంలో ప్రతి ఏటా 70 వరకూ పరిషత్తులు నిర్వహించ బడడం విశేషం. ఏ రాష్ట్రంలో లేని విధంగా పోటీ సంస్కృతి , పరిషత్తుల నిర్వహణ ఆంధ్ర దేశంలోనే ఉండటం గమనార్హం. గ్రామీణ ప్రాంతం నుండి పెద్ద నగరాల వరకూ జనవరి నుండి జూన్ వరకూ పరిషత్తులను నిర్వహిస్తున్నారు. ఒక పర్యాయం నుండి అనేక సంవత్సరాలుగా నిర్వహించిన పరిషత్తులు రాష్ట్రంలో దాదాపుగా 250 ఉండటం విశేషం.

ఇప్పటి వరకూ ఆంధ్రదేశంలో జరిగిన నాటక పరిషత్తుల జాబితాను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

గూడూరు సంస్కృతీ సమ్మేళనం : త్యాగరాయ గానసభ నాటకోత్సవాలు, బి.హెచ్.ఇ.ఎల్. కమ్యూనిటీ సెంటర్, లిటిల్ థియేటర్, ఆంధ్ర లలిత కళాసమితి, హెచ్.సి.ఎల్. నాటక పోటీలు, ఆగ్రో ఇండస్ట్రీస్ నాటక పరిషత్తు, ఎ.జి.ఆఫీస్ నాటకోత్సవాలు, వంశీ నీహారిక బర్కిలీ నాటక పోటీలు, శ్రీ కళానికేతన్, ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్, అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్తు, పరుచూరి రఘుబాబు నాటకోత్సవాలు, వనస్థలిపురం వినియోగదారుల సమాఖ్య నాటకోత్సవాలు, నంది నాటకోత్సవాలు, సౌజన్యా ఆర్ట్ అకాడమీ, యంగ్ మెన్స్ హ్యాపీక్లబ్, కొట్టపాటి గంగాధరరావు నాటక పరిషత్తు, పంతం పద్మనాభం కళాపరిషత్తు, కల్చరల్ ఆర్ట్స్, లలిత కళా నికేతన్, ముదునూరి రామన్న స్మారక కళాపరిషత్తు, గురుజాడ కళాసమితి, ఎన్.టి.ఆర్.కళా పరిషత్తు, మిత్ర బృందం కళాపరిషత్తు, మహాత్మగాంధీ మైత్రీ బృందం, పాలకొల్లు సంగీత నాటక అకాడమీ, క్షీరపురి నాటక అకాడమీ, డాక్టర్ దాసరి నారాయణ రావు అకాడమీ, లలిత కళాంజలి (పాలకొల్లు), వెలిదండ్ల హనుమంత రాయ గ్రంథాలయం నాటక పోటీలు, గొల్లప్రోలు పొట్లూరి రామారావు స్మారక సంఘం నాటక కళాపరిషత్తు, జి.ఎస్.ఆర్. మూర్తి నాటక కళా పరిషత్తు, రైల్వే ఇన్స్టిట్యూట్ నాటకోత్సవాలు, నగర పాలక సంస్థ యువజనోత్సవాలు, డాన్ బాస్కో కళాపరిషత్తు, సుత్తి వీరభద్రరావు స్మారక కళాపరిషత్తు, వంగవీటి రంగా స్మారక పరిషత్తు, కె.ఎస్.మూర్తి కళా పరిషత్తు, సుమధుర కళానికేతన్ (విజయవాడ), అల్లూరి సీతారామరాజు వర్ధంతి సంఘం, మల్లయ్య లింగం స్మారక కళాపరిషత్తు, హరిప్రసాద రాయ స్మారక సంఘం, ఇందిరాగాంధీ నాటక కళాపరిషత్తు అనవేమా క్లబ్ పరిషత్తు, ఎల్.వి.ఆర్ కళా పరిషత్తు, సాహితీ కళానికేతన్, గుంటూరు కళా పరిషత్తు, జేసీస్ క్లబ్ నాటకోత్సవాలు, ఎస్.వి.రంగారావు కళా పరిషత్తు, కళాసౌధ, నగర పాలక సంస్థ నాటకోత్సవాలు, కళాంజలి (గుంటూరు), గౌరీ శంకర నాటక కళా పరిషత్తు, కనక మహాలక్ష్మి నాటకోత్సవాలు, పోర్ట్‌ట్రస్ట్ సాగరి, షిప్‌యార్డ్ నాటకోత్సవాలు, బి.హెచ్.పి.వి. కమ్యూనిటీ సెంటర్, ఇందిరా ప్రియదర్శిని, బి.ఎస్.చలం కళా పరిషత్(విశాఖ పట్నం), సి.ఆర్.క్లబ్ కళా పరిషత్తు, కక్కెర వెంకట సుబ్బయ్య స్మారక కళాపరిషత్తు, తెలుగు దేశం కళాపరిషత్తు, కమల్ హాసన్ స్మారక కళాపరిషత్తు (చిలకలూరి పేట), రాధాస్మారక కళా పరిషత్తు,

నన్నపనేని వెంకట్రామ స్మారక కళా పరిషత్తు, రసమయి, దొడ్డపనేని ఇందిర స్మారక కళా పరిషత్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళాపరిషత్తు, తెనాలి రామకృష్ణ కళా పరిషత్తు (తెనాలి), కళ్యాణం రఘురామయ్య కళా పరిషత్తు, సింగరాజు నాగభూషణం కళాపరిషత్తు, బళ్లారి రాఘవ కళా పరిషత్తు, కోన ప్రభాకరరావు కళాపరిషత్తు (బాపట్ల), **చెన్నపురి ఆంధ్రమహాసభ**, వేంకటేశ్వర నాటక **కళాపరిషత్తు, తెలుగు ఫిలిం జర్నలిస్ట్స్** అసోసియేషన్, **మహాలక్ష్మి క్లబ్ నాటక కళా పరిషత్తు**, ఎస్.కె.పి.డి. స్కూల్ కళా పరిషత్తు, ఆప్కో గోల్డ్ మెడల్ పరిషత్తు, చలన చిత్ర పరిశ్రమ, శివరంజని, కళాసాగర్ సంయుక్త పరిషత్తు (మద్రాస్), మిత్ర సమాజం, అల్లూరి సీతారామ రాజు నాటక కళా పరిషత్తు, యువజన సంఘం (భీమవరం), ప్రభాకర నాటక కళా పరిషత్తు (పొన్నూరు), నటరాజ నాటక కళా పరిషత్తు, టి.కృష్ణ చైతన్య వేదిక, మోదుకూరి జాన్సన్ స్మారక కళా పరిషత్తు, పాలపల మల్లికార్జున ఫైన్ ఆర్ట్స్ (ఒంగోలు), రాఘవ నాటకోత్సవాలు, విజయరామనాటక కళాపరిషత్తు (విజయనగరం), అజాద్ ఆర్మీ నాటక పరిషత్తు, భగత్ సింగ్ నాటక పరిషత్తు (దివిలి), కళావాహిని, కందిమళ్ల కమల నాభుడు కళా పరిషత్తు, రాజీవ్ గాంధీ కళా పరిషత్తు (మురుకు పూడి), ప్రగతి కళానికేతన్, సాయి కళాంజలి (మార్టూరు), ఫేకర్ నాటక కళా పరిషత్తు (ఫేకర్), ప్రొద్దుటూరు నాటక కళాపరిషత్తు, కళాంజలి, కామేశ్వరరావు కళా పరిషత్తు (నెల్లూరు), ఖమ్మం నాటక కళా పరిషత్తు, బోడేపూడి స్మారక కళా పరిషత్తు, యన్.టి.ఆర్. కళా పరిషత్తు (ఖమ్మం), పెనుగొండ నాటక కళా పరిషత్తు, ఫ్రండ్స్ అసోసియేషన్ (పెనుగొండ) జంగిల్ క్లబ్, దేవభక్తుని నందీశ్వరుడు కళా పరిషత్తు (చర్ల), చెన్నమల్లేశ్వర నాటక కళాపరిషత్తు (అమలాపురం), రావులపాలెం క్లబ్ (రావుల పాలెం),యూత్‌క్లబ్ (కొంతేరు) నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్తు (రామవరం), సత్యనారాయణ స్వామి దేవస్థానం నాటకోత్సవాలు (అన్నవరం), కాకతీయ కళాపరిషత్తు (నాగభైరు వారి పాలెం), యువజనోత్సవాలు (అడుసుమల్లి), కళావాణి (నాగుల పాలెం), జ్యోతుల నెహ్రూ నాటక పరిషత్తు (ఇర్రిపాక), కోట సర్వారాయుడు, సుబ్బారావు నాయుడు స్మారక కళాపరిషత్తు (వీరవరం), స్వామీ ఫైనార్ట్స్ (ప్రత్తిపాడు), డైమండ్ హిట్స్ (అనకాపల్లి), శ్రీ వేంకటేశ్వర నాటక కళాపరిషత్తు (తిరుపతి), కాళిదాస కళారాధన సమితి (కావలి), పురపాలక సంఘం నాటకోత్సవాలు (సామర్లకోట), ఆర్ట్ లవర్స్ (చిత్తూరు), కొప్పరపు సుబ్బారావు స్మారక కళాపరిషత్తు (గొల్లప్రోలు), లలిత కళాసమితి (పామఱ్ఱు), ఆఫీసర్స్ క్లబ్ (గన్నవరం), మధిర పట్టణ కళాకారుల సమాఖ్య (మధిర), సహృదయ (వరంగల్), భారతీయ నాటక పరిషత్తు (వరదన్నపేట), చైతన్య కళాపరిషత్తు (తొర్రూరు), కానుకలమాత నాటక పరిషత్తు (రెంట చింతల), ప్రగతి కళామండలి, ఉషోదయ నాటక పరిషత్తు (సత్తెనపల్లి), సాయికళా స్రవంతి ఎన్.టి.ఆర్ కళాపరిషత్తు (రేపల్లె), యువజన సమాఖ్య (సాతులూరు), కర్షక కళాపరిషత్తు (గణేశుని వారి పాలెం), కొండవీటి కళా పరిషత్తు (లింగారావు పాలెం), నర్సారావుపేట నాటక పరిషత్తు, రంగస్థలి(నర్సారావు పేట), విశ్వశాంతి కళానికేతన్ నాటక పరిషత్తు (వినుకొండ), టి.కృష్ణ కళా పరిషత్తు (మిట్ట పాలెం), పెదనంది పాడు నాటక పరిషత్తు (పెదనందిపాడు), రసభావన (కాకుమాను), నటరాజకళా సమితి, దేవాంగపురి నాటక పరిషత్తు (చీరాల), ఇందిరా గాంధీ స్మారక కళా పరిషత్తు (పేర్న మిట్ట), చీమకుర్తి కళాభారతి (చీమకుర్తి), కనిగిరి నాటక కళాపరిషత్తు (కనిగిరి), కళాసాగర్ (అద్దంకి), శాంతినికేతన్ (బప్పూడి), శ్రీశ్రీ ఆర్ట్స్ అకాడమీ (టంగుటూరు), కరవది నాటక కళా పరిషత్తు (కరవది), కందుకూరు నాటక పరిషత్తు (టంగుటూరు), లలిత కళాసమితి (అనంతపురం), కళాసాగర్ (బుచ్చిరెడ్డి పాలెం) , అభ్యుదయ కళాసమితి (పొదలకూరు), చైతన్య సమాఖ్య (దొడ్డి పట్ల), నరసాపురం నాటక కళా పరిషత్తు (నరసాపురం), కళాసమితి (తిరుపూరు), సోషల్ క్లబ్ అసోసియేషన్ (తణుకు), కళానిలయం (చింతలపూడి), విజేత ఆర్ట్స్ ఆకాడమీ (రాజంపేట), అన్నమయ్య కళాకేంద్రం (రైల్వే కోడూరు), గౌరీ శంకర యువజన సంఘం (తుని), యువజన సంఘం (తాపేశ్వరం), నృసింహస్వామి దేవస్థానం నాటకోత్సవాలు (యాదగిరి గుట్ట), స్పోర్ట్స్ క్లబ్ కళా పరిషత్తు (వీరన్న పాలెం), శ్రీ రామ నాటక కళా పరిషత్తు (కరాలపాడు), రసమయి (పిడుగురాళ్ల), నటీనట సమాఖ్య ఆఫీసర్స్ క్లబ్ (నూజివీడు), విజయ లక్ష్మి ఫైన్ ఆర్ట్స్ (నందలూరు), లలిత కళాసమితి (వేటపాలెం), సి.వి.కె. రీడింగ్ రూమ్ కళాపరిషత్తు (వహార్కాపురం), శ్రీశైలం కళా పరిషత్తు (శ్రీశైలం), యువజనోత్సవాలు (కంకటపాలెం), శేషశాస్త్రి స్మారక నాటక పోటీలు (చెరుకూరు), కళారవళి (డోర్నకల్), చెన్నకేశవ పరిషత్తు (మాచర్ల), నవయువత కళా పరిషత్తు (మాచర్ల), డిక్‌మెన్ కళా పరిషత్తు (ఫిరంగి పురం), జంపని రామయోగి కళా పరిషత్తు, గడుగొట్టు మోహన కృష్ణ, నన్నపనేని వెంకట రత్నం కళా పరిషత్తు (తాతపూడి), ఎన్.టి .ఆర్. కళా పరిషత్తు (వింజనంపాడు), ద్రాక్షారామం కళాపరిషత్తు (ద్రాక్షారామం), ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ కమిటీ నాటకోత్సవాలు (శ్రీకాకుళం), ఆలపాటి వెంకట్రమయ్య కళా పరిషత్తు (యడ్లపల్లి), చనుమోలు ఫకీరు రాయుడు కళా పరిషత్తు (వెలగ లేరు), కళాభారతి (గుడ్లవల్లేరు), ఆఫీసర్స్

క్లబ్(నందిగామ), సృజన్ ఆర్ట్స్ (ముక్తినూతల పాడు), చాగంటి భాస్కరరావు స్మారక కళా పరిషత్తు (పర్చూరు), ఎన్.టి.ఆర్.కళా పరిషత్తు (పెద కంచర్ల), కిన్నెరసాని కళా పరిషత్తు (పాల్వంచ), కొత్తగూడెం ఆఫీసర్స్ క్లబ్ (కొత్తగూడెం), నటరాజు నాటక కళాపరిషత్తు (పోలూరు), నేతాజీ యూత్ క్లబ్ (పెదవడ్లపూడి), నేతాజీ యువజన కేంద్ర (అంగల కుదురు), స్నేహసమాఖ్య (ఇంకొల్లు), లలిత కళా సమితి (కర్నూలు) పరిషత్తులను నిర్వహించాయి. వీటితో పాటు జగన్నాథగిరి, మునక పాక, రాయవరం, దుద్దుకూరు, కొణికి, పంగులూరు, సఖినేటి పల్లి, అలవలపాడు, కోలలపూడి, బండ్లమోటు, దొనకొండ, మంగళగిరి, దుర్గి, నార్నెపాడు, ముద్దిపాడు, భద్రాచలం, నల్గండ, సూర్యాపేట, గంగవరం, మండూరు, ఆర్మూరు, సిరిపూర్, కాగజ్ నగర్, ఉట్నూరు, మంచిర్యాల పట్టణాలలో నాటక కళా పరిషత్తులను నిర్వహించి తమదైన శైలిలో నాటక రంగ అభివృద్ధికి విశేషమైన కృషి చేశాయి, చేస్తున్నాయి. ప్రవాసాంధ్ర ప్రాంతాలైన బెంగుళూరు, ముంబయి, రాయగఢ్, జెంషెడ్‌పూర్, ఖరగ్‌పూర్, కటక్, బళ్ళారి పట్టణాలలో కూడా తెలుగు సంస్థలు నాటక పోటీలను నిర్వహించాయి. పోటీల ప్రస్థానంలో కీలకమైన గురుతరమైన బాధ్యత నిర్వహించేవారు న్యాయనిర్ణేతలు. వీరిని గుణ నిర్ణేతలు అనే పేరున కూడా పిలుస్తున్నారు.

తెలుగు నాటక పరిషత్తులలో పలు పర్యాయాలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి రాణించిన వారిలో మాధవపెద్ది వేంకట్రామయ్య, హరిప్రసాదరావు, పురాణం సూరిశాస్త్రి, గొల్లపూడి శ్రీరామ మూర్తి, బందా కనకలింగేశ్వరరావు, శ్రీనివాస చక్రవర్తి, డి.వి.సుబ్బారావు, మందపాటి రామలింగేశ్వరరావు, గుమ్మడి కుటుంబరావు, కొప్పరపు సుబ్బారావు, కొప్పరపు సరోజినీదేవి, కోడూరి అచ్చయ్య చౌదరి, పినిశెట్టి శ్రీరామమూర్తి, జమ్మల మడక మాధవరాయశర్మ, డి.వి.నరసరాజు, కోడూరిపాటి సరస్వతీ రామారావు, కప్పగంతుల మల్లికార్జునరావు, వడ్లమూడి సీతారామారావు, ప్రఖ్య శ్రీరామమూర్తి, చింతపల్లి హనుమంత రావు, బల్లిముంత శివరామ కృష్ణ, బయ్యవరపు, జి.ఎస్.ఆర్. మూర్తి, ఎ.శివరామిరెడ్డి, భానుప్రకాష్, కొట్టుపాటి గంగాధర రావు, బళ్ళారి రాఘవ, భమిడి పాటి రాధాకృష్ణ, శ్రీ పాద కామేశ్వరరావు, కొడాలి గోపాలరావు, పూర్ణిమ, లక్ష్మీకాంతం, కె. వేంకటేశ్వరరావు, గరిమెళ్ల రామమూర్తి, జె.ఎల్.నరసింహారావు, కె.ఎల్. నరసింహారావు, సి.ఎస్.రావు, ఎం.బాబి, గణపతి రాజు అచ్యుత రామరాజు, కాకరాల, వంకాయల, ధవళ సత్యం,ముదిగొండ లింగమూర్తి, పి.వి. రమణ, చాట్ల శ్రీరాములు, గండవరం సుబ్బరామిరెడ్డి,జి.ఎస్ ప్రసాదరెడ్డి, ఎస్.కె. ఆంజనేయులు, డి.వి.రమణ మూర్తి, జె. సిద్దప్ప నాయుడు, మల్లాది శివ, రావికొండల రావు, అడబాల, జక్కంపూడి సీతారామారావు, ఊట్ల బుడ్డయ్య చౌదరి, కోన గోవిందరావు, కారుమూరి సీతారామయ్య, కోకా సంజీవరావు, వాసిరెడ్డి నారాయణ రావు, జె.వి. రమణ మూర్తి, నూతన్ ప్రసాద్, జంధ్యాల, సి.ఎస్. నారాయణ, నాదెళ్ళ పురుషోత్తమ శాస్త్రి ప్రభృతులు రాణించారు.

ఉత్సాహం ఉండీ నాటకాలు వేసుకోవడానికి సరైన రంగస్థలాలు లేక కర్టన్లు, లైట్లు, మైకులు ఏర్పాటు చేయడానికి కావలసిన ఖర్చులు పెట్టి నాటకాలను ప్రదర్శించడానికి సతమతమవుతున్న ఔత్సాహికులకు పరిషత్తులు ఒక మంచి వేదికను చూపాయి. ప్రేక్షకులను ఇచ్చాయి. ప్రదర్శనకు సరిపడా పారితోషికాలను అందించడంవల్ల చాలావరకూ సమాజ నిర్వాహకులకు వ్యయం తగ్గిపోయింది. గత పోటీలలో ప్రదర్శించిన నాటకం తిరిగి అక్కడ ప్రదర్శించరాదనే నియమంతో కొత్త రచయితలు, కొత్త రచనలతో పాటు, కొత్తగా నటులూ, సమాజాలు పుట్టాయి. కళాకారులందరూ ఒక చోట కలవడానికి వేదికలు ఏర్పడ్డాయి. అన్ని ప్రాంతాల కళాకారులనూ ఒక చోట సంధించే సూత్రంగా పరిషత్తు నిలిచింది. అంతేకాదు తమ ప్రతిభను ఇతరులతో పోల్చుకొని బేరీజు వేసుకొని తమ తప్పులను సరిదిద్దు కోవడానికి అవకాశం కల్పించింది. తమ సమిష్టిసాధక బాధకాలను కళాకారులంతా సమిష్టిగా చర్చించు కోవడానికి, నివృత్తి మార్గాలను అన్వేషించడానికి అవకాశం కల్గింది.

నాటక పరిషత్తుల మూలంగా కలిగిన లాభాలతో పాటు ఎదురైన నష్టాలను కూడా పరిశీలించవలసి ఉంది. పోటీల మూలంగా కళాకారుల్లో ఐక్యత దెబ్బతిన్నది. పోటీలను సహృదయంతో స్వీకరించాలన్న భావన పోయి కళాకారుల్లో కక్షలూ, కార్పణ్యాలూ, ఈర్ష్యాసూయలు పెరిగాయి. ఎదుటి నాటక సమాజాన్ని చులకనగా చూసే మనస్తత్వం ప్రబలి పోయింది. లక్ష్యశుద్ధి వక్రించింది. ప్రేక్షకహృదయాలను రంజింప చేయడం నాటక ప్రదర్శన ప్రథమ లక్ష్యం. నాటకం వేస్తున్నది ప్రజల కోసమేగానీ, పోటీల కోసం కాదు. ప్రజలకు – ప్రదర్శకులకు మధ్య పోటీలు ఒక వంతెన వంటివి. ఈ విషయాన్ని విస్మరించి పోటీల దృష్టితో నాటకాలు రచించడం ప్రదర్శించడం పెరిగి పోయింది. నటులు ఉత్తమ నటుడి బహుమతిని దృష్టిలో పెట్టుకొని నాటకాలు రచించుకోవడం లేదా రాయించు కోడం ప్రారంభమైంది. నాటక సమాజాలలో ఊహించని విధంగా చీలికలు పెరిగి పోయాయి. మంచి పాత్రల కోసం పెనుగులాటలు ఈ చీలికలకు ప్రధాన కారణం. ఒక నాటక సంస్థ నుండి చీలి సమాజాలు అనేకం పుట్టాయి.

ఏది ఏమైనా తెలుగు నాటక రంగం అభివృద్ధికి పరిషత్తులు చేసిన సేవ నిరుపమానమైంది. పరిషత్తులపై కొందరు విమర్శలు చేస్తున్నా, దానికి ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పడనంత వరకూ పరిషత్తులే తెలుగు నాటక రంగానికి అశాదీపంగా ఉన్నాయి, ఉంటాయి కూడా.

· కందిమళ్ల

ఆధునిక వీధి నాటకం

1943 మే, 23వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు బంబాయిలో జరిగిన ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ప్రథమ సదస్సులో భాగంగా ఆచార్య హీరేన్ ముఖర్జీ అధ్యక్షతన మే **25వ తేదీన జరిగిన అఖిల భారత స్థాయి సదస్సులో ప్రముఖులు ముల్క్‌రాజ్** ఆనంద్, బల్‌రాజ్ **సహాని, కె.ఎ అబ్బాస్, మామా వరేర్కర్**, శంభుమిత్ర, కుమార్‌రాయ్, ఎ.సి.హంగల్, గరికపాటి రాజారావు తదితరుల సమక్షంలో రంగస్థలం, ఇతర కళారూపాల మాధ్యమం ద్వారా ప్రజలలో చైతన్య స్ఫూర్తి కలిగించాలనే ఉద్దేశంతో ఒక సాంస్కృతిక విధానాన్ని రూపొందించడం జరిగింది. ఈ విధానంలోని ప్రధాన అంశం ఏమిటంటే, సంప్రదాయ కళారూపాలను సందేశాత్మకంగా ప్రదర్శించాలనీ, ఈ ప్రదర్శనల సారం సాధారణ ప్రజానీకం సైతం అర్థం చేసుకొనే రీతిలో ఉండాలనీ, అంతేకాక వీటిని ప్రదర్శించడంలో ప్రజలను కూడ భాగస్వాములుగా చేయాలనీ అనిల్ డిసిల్వా తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈ తీర్మానానికి ఏకాభిప్రాయం కుదరడంతో పాటుగా, సంప్రదాయ జానపద కళారూపాలను బహుళ ప్రాచుర్యంలోకి తేవాలనీ, అన్ని కళారూపాలు ప్రజలకు చేరే విధంగా ఆరుబయలు ప్రదర్శనలు చోటు చేసుకోవాలనీ తీర్మానించారు.

ఈ సదస్సు తీర్మానాల ఫలితంగా దేశమంతటా ఇప్టా (IPTA) అనుబంధ శాఖలేర్పడి, ప్రజా నాటకరంగ ఉద్యమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. భారతీయ రంగస్థలాన్ని పరిపుష్టం చేయడంతో బాటుగా, భావ ప్రకటనలో సంప్రదాయ కళారూపాల వినియోగం, స్వాతంత్ర్యం కోసం ప్రజా ఉద్యమం, సాంస్కృతిక వికాసం, ఆర్థిక న్యాయం దిశగా ఆయా శాఖలు కార్యోన్ముఖమయ్యాయి. ఈ దిశలో పయనించి ఆంధ్రప్రదేశ్‌లో సత్ఫలితాలు సాధించి తెలుగు నాటక రంగ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకుంది ఇప్టా శాఖ అయిన ప్రజానాట్యమండలి.

ఇప్టా ప్రథమ సదస్సు స్ఫూర్తితో 1944లో హిట్లరు పరాభవం, 1945లో సిమ్లా భాగవతం, వీధి నాటకాలు సమకాలీన రాజకీయ ఇతివృత్తాలతో వెలువడ్డాయి. ఈ రెండింటినీ కోగంటి గోపాలకృష్ణయ్య రచించాడు. సిమ్లా భాగవతం నాటక ప్రతి పరిచయ వాక్యంలో మద్దుకూరి చంద్రశేఖర్ రావు "లక్షల మంది జనం ఈ ప్రదర్శనలను తిలకించి అభినందనలు కురిపించారు" అన్నాడు. అంటే నాడే వీధి నాటక ప్రక్రియకు ఎంత ఆదరణ లభించిందో విశదమౌతుంది. కళారూపాల ద్వారా ప్రజలను ఆకట్టుకునే సంప్రదాయం అప్పటికే ఉన్నప్పటికీ, వీధి నాటక ప్రక్రియలో సమకాలీన సమస్యలు ప్రతిబింబించడంతో ఆధునికత సమకూరింది. ప్రయోగం కోసమో, కొత్తదనం కోసమో, లేక వ్యక్తిగత గుర్తింపు కోసమో లేక పోటీలలో పాల్గనడం కోసమో కాక, ఆనాటి సమాజ అవసరాలకోసం ఆవిర్భవించింది ఆధునిక వీధి నాటక ప్రక్రియ. ఈ రెండు నాటకాల్లోనూ జాతీయ, అంతర్జాతీయ సమస్యల ప్రస్తావనతో పాటు, ప్రజల కర్తవ్యాన్ని చాటి చెప్పారు. రెండవ ప్రపంచ యుద్ధం నేపథ్యంలో హిట్లర్, ముస్సోలినీ దురాగతాలను తెలియ జేస్తూ హిట్లర్ పరాభవం, భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే అంశం నేపథ్యంలో జరిగిన సిమ్లా సదస్సు వైఫల్యాలను తెలియ చేస్తూ సిమ్లా భాగవతం ప్రదర్శించారు. సామాన్య ప్రజలకు కూడ జాతీయ, అంతర్జాతీయ సమస్యల పట్ల అవగాహన కల్గించాలనే సంకల్పం, ఆ సంకల్పాన్ని సాకారం చేయడానికి సంప్రదాయ వీధి నాటక కళారూపాన్ని ఎంపిక చేసుకోవడం చూస్తే, అరవై సంవత్సరాల క్రితమే అభ్యుదయ భావాలతో గొప్ప ప్రయోగం జరిగిందని చెప్పవచ్చు. ఈ రెండు ప్రదర్శనల్లోనూ, హిందూ ముస్లిం సామరస్యాన్ని కూడ ప్రధానంగా చెప్పడం రచయిత దూరదృష్టికి నిదర్శనం!



ఆధునిక వీధి నాటకం

1948లో తెలంగాణా స్వాతంత్ర్య పోరాట ఉద్యమం కాలంలో తిరునగరి రామంజనేయులు రచించిన వల్లభ్‌బాయి పటేల్ – నెహ్రూల వీధి భాగవతం కూడ నాటి నిజాం పాలనకు అద్దం పడుతూ, ఆ ఉద్యమ లక్ష్యాలను ప్రజలకు అందజేయడంలో సఫలీకృతమైంది. రచయిత ఆధ్వరంలో దాదాపు తెలంగాణా

ప్రాంతమంతటా ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన నిర్వహిస్తున్న ఒక బృందాన్ని నిజాం సైనికులు నిర్దాక్షిణ్యంగా చంపడం జరిగింది. అంటే భావ ప్రకటనా స్వేచ్ఛను అంత మొందించడం ఆనాడే ప్రారంభమైంది. ఈ చర్య నాటి ప్రజా ఉద్యమ కళాకారుల్లో ఉన్న చైతన్యాన్ని ద్విగుణీకృతం చేసింది.

హిట్లర్ పరాభవం, సివ్లా భాగవతం, వల్లభ్‌బాయి పటేల్–నెహ్రూ వీధి భాగవతంలో సమకాలీన సమస్యలు చోటు చేసుకొని, కొంత ఆధునికతను సంతరించుకున్నప్పటికీ, సంప్రదాయ వీధి నాటక, యక్షగాన శైలుల్లో ప్రదర్శించబడ్డాయి. అయితే 1949లో తెలంగాణా ప్రాంతంలోని జమీందారీ, దేశ్‌ముఖ్‌ల వ్యవస్థకు వ్యతిరేకంగా, వారి అరాచకాలను నిరసిస్తూ, అచ్చమైన ఈనాటి ఆధునిక వీధి నాటక ప్రక్రియ లక్షణాలతో, కనీసం ఆహార్యం కూడ లేకుండా నాడే ప్రదర్శించబడిన వీధి నాటిక 'వెట్టిచాకిరి'. ఇది కూడ రామంజనేయులు రచనే. ఈనాడు అందరూ అనుసరిస్తున్న సద్యోనటన విధానం, నాడే ఈ నాటికలో అనుసరించడం ఓ విశేషం. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు దొడ్డ నర్సయ్య ఆధ్వర్యంలో నల్గండ, ఖమ్మం జిల్లాల్లోనే దాదాపు వంద ప్రదర్శనలిచ్చినట్టుగా తెలుస్తోంది. నాటి గ్రామీణ సమాజంలోని వెట్టిచాకిరీని ప్రతిబింబిస్తూ, అమీనా వ్యవస్థకు ఎదురొడ్డి నిలిచిన గ్రామసేవకుడి కథే ఈ 'వెట్టిచాకిరి'.

లభ్యమైన సమాచారం మేరకు, సేకరించిన వాస్తవాల మేరకు తెలుగులో మొట్టమొదటి ఆధునిక వీధి నాటిక 'వెట్టిచాకిరి' అని చెప్పవచ్చు. అంతేకాదు ఆధునిక వీధి నాటక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది ఆంధ్రదేశమే అని కూడ చెప్పవచ్చు.

ఆ తర్వాత దాదాపు పాతిక సంవత్సరాల వరకూ ఈ ప్రకియకు సంబంధించి ఎటువంటి సమాచారమూ లేదు. 1973–74 లో జననాట్యమండలి నిర్వహణలో తిరిగి ఆధునిక వీధి నాటక ప్రక్రియ, ప్రజా కళారూపంగా, పోరాట ఆయుధంగా, అన్యాయాన్ని ప్రతిఘటించే శక్తిగా ప్రజల్లోకి దూసుకువెళ్ళింది. గొర్లు బోయినయ్, బీదల పాట్లు, రాజకీయ వీధి భాగోతం జననాట్య మండలి ప్రధాన ప్రదర్శనలు. హైదరాబాదు నగరంలోను, ప్రస్తుత రంగారెడ్డి జిల్లాలోను అనేక ప్రదర్శనలిచ్చారు. వీధి రంగస్థలంలో ఒకేమారు మూడు ప్రదేశాలను చూపించడం నృత్యం, పాటలను, జానపద రీతుల్లో ప్రదర్శించడం జననాట్య మండలి ప్రదర్శనల్లోని ప్రత్యేకతలు. ఇవన్నీ భూపాల్ రచనలే.

1974–75లో నవోదయ సంస్థ జనవాహిని కదిలింది నాటికను వందల కొలది ప్రదర్శనలిచ్చింది. సంప్రదాయ కళారూపాలైన వీధి నాటకం, యక్షగాన ప్రక్రియల్లో సాగిందీ ప్రదర్శన. 1974లోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక విభాగం విద్యార్థులు యుగసంధ్య నాటికను విశాఖ సముద్ర తీరంలో ప్రదర్శించడం ఆధునిక వీధి నాటక రంగ చరిత్రలో మరో మైలురాయి. ఆ తర్వాత పరుచూరి వేంకటేశ్వరరావు రచించిన దారి తప్పిన ఆకలిని వీరే ప్రదర్శించడం జరిగింది. అయితే ఈ రెండు వస్తురీత్యా, ప్రదర్శనరీత్యా ప్రొసీనియం నాటకాలు. వీటిని వీధిలో యథా తథంగా ప్రదర్శించారే తప్ప, ఆధునిక వీధి నాటక ప్రక్రియ లక్షణాలతో ప్రదర్శించలేదు. 1977లో నాట్య భారతి సంస్థ 'టామీ... టామీ... టామీ' నాటికను పోలీస్ వ్యవస్థలోని లోపాలను చూపుతూ ప్రదర్శించింది.

1979లో మరికొన్ని ప్రయోగాలు జరిగాయి. రాజకీయ కుటిలతను, అధికార దాహం, దౌష్ట్యాలను తెలియజేస్తూ కె.చిరంజీవి రచించిన పాలిట్రిక్స్, బాదల్ సర్కార్ మిఛిల్ కు అనువాదంగా అత్తిలి పద్మావతి కృష్ణ రాసిన ఊరేగింపు మొదటి ప్రయోగం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నవంబర్‌లో జరగ్గా, రెండవది ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక శాఖ నిర్వహించిన నట శిక్షణా శిబిరం ప్రదర్శనగా డిసెంబర్‌లో జరిగింది. పాలిట్రిక్స్ కు దేశిరాజు హనుమంతరావు దర్శకత్వం వహించగా, ఊరేగింపుకు ఎం.కె. రైనా దర్శక పర్యవేక్ష బాధ్యత వహించాడు. మొదటిది 50 ప్రదర్శనలుకాగా, రెండవది కొన్ని వందల ప్రదర్శనలతో వాసి కెక్కింది.

1981లో పూర్ణచంద్రరావ్, బాదల్ సర్కార్ ప్రేరణతో, త్రిపురారి శర్మ శిక్షణతో, కర్ణాటకలోని సముదాయ సంస్థ స్ఫూర్తితో సమాజంలోని ఏదో ఒక వర్గానికి సంబంధించిన సమస్యల్ని ఇతివృత్తాలుగా తీసుకొని పిపీలికం,మనువు–మనిషి,అక్షరం, మన్నెంలో, భూమి తల్లి బిడ్డలం, మమ్మల్ని బ్రతకనివ్వండి ప్రదర్శించాడు. ఎత్నిక్ ఆర్ట్స్ సెంటర్ సంస్థ ద్వారా ఆంధ్రదేశంలో ఆధునిక వీధి నాటక ఉద్యమానికి ప్రేరణగా నిలిచాడు.

1981 నుంచి 1985 వరకు జనసాహితి సంస్థ అప్పు...అప్పు...అప్పు, పరిపాలనా చక్రం, కుక్కల్ని తరిమిన కుందేళ్ళు, ప్రభంజనం, శస్త్ర చికిత్స, రాకెట్ రాకాశి, పేదలంతా ఒక్కటే, జనం తీర్పు, పంచాయితీ, తెలుగు *గంగ*, ఎం.ఎల్.ఏ., *ధరలు బాబోయ్ ధరలు*, *ప్రతిభా! ఓ ప్రతిభా* తదితర నాటికల్ని విశేషంగా ప్రదర్శించింది. సామాజిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులు వీరి ప్రదర్శనలకు అద్దం పట్టాయి. దాదాపు రాష్ట్రమంతటా వందలకొలదిగా ప్రదర్శనలు జనసాహితి ప్రజల్లోకి తీసుకువెళ్ళింది.

1982 లో అమృతవాణి, ధర్మవిజయం ఆధ్వర్యంలో ఆకెళ్ళ సత్యనారాయణ మూర్తి రచించిన పెద్దబాలశిక్ష ను దాదాపు

యాభై పర్యాయాలకు పైగా ప్రదర్శించారు.ఇదే సంవత్సరం విప్లవ రచయితల సంఘం రాజకీయ కబడ్డీ నాటికను ప్రదర్శించింది.

1985లో ఉస్మానియా విశ్వవిద్యాలయ రంగస్థల కళల శాఖ విద్యార్థులు తనికెళ్ళ భరణి రచించిన గోగ్రహణం వీధి నాటికను హైదరాబాదులోను, కరీంనగర్‌లోనూ ప్రదర్శించారు. ఇదే సంవత్సరం నవోదయ ఆర్ట్స్ అకాడమీ డి.ఎస్.ఎన్ మూర్తి మహానగరం నాటికను ప్రదర్శించింది. 'గోగ్రహణం' దాదాపు ఆంధ్రదేశమంతటా వివిధ సమాజాలు ప్రదర్శించాయి. 'మహానగరం' దాదాపు 50 ప్రదర్శనలివ్వబడింది. విశాఖ నాట్యభారతి, జంతర్ మంతర్ మామూళ్ళు ను ప్రదర్శించింది. 1986లో రాజారావ్ మెమోరియల్ ఆర్ట్స్ అకాడమీ కైలాసంలో కోర్టు ను విలక్షణంగా, పౌరాణిక పాత్రల ఆహార్యాభినయంగా 50 ప్రదర్శనలిచ్చింది. ఇదే సమాజం రుద్రవీణ ను కూడ ప్రదర్శించింది. 1989లో సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు గోగ్రహణం, 1990 లో నిచ్చెనమెట్లు, ముల్లు బోయె కత్తి వచ్చె ధాం..ధాం..ధాం.... ప్రదర్శించారు.

1990లో అక్షర కళాయాత్రలో రాష్ట్రమంతటా వివిధ సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు చదువు వెలుగు, చదువెందుకు?, నాటికలను వేల సంఖ్యలో ప్రదర్శించాయి. 1992లో నల్గొండ జిల్లాలో దేశంలోనే ప్రప్రథమంగా జరిగిన సమతా వనితా కళాయాత్ర లో ప్రశ్నించండి!, చదువెందుకు?,గోగ్రహణం నాటికలు జిల్లా అంతా శతాధిక సంఖ్యలో ప్రదర్శితమయ్యాయి.

1989, జనవరి ఒకటో తేదీన ఢిల్లీ సమీపంలో సఫ్దర్ హష్మీ హల్లాబోల్ ప్రదర్శన ఇస్తుండగా హత్యకు గురికావడం, దేశంలోని ప్రజా కళాకారులందరూ ఈ సంఘటనను ముక్త కంఠంతో ఖండించడం, తదుపరి జరిగిన పరిణామాల అనంతరం, దేశంలో ఆధునిక వీధి నాటకం ఓ ఉద్యమంలా ఊపిరి పోసుకుంది.

ఆ ఉద్యమానికి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రజా నాట్యమండలి సారథ్యం వహించి, నాటి నుంచి నేటి వరకూ ముందుకు నడిపిస్తూ, ఆంధ్రదేశంలో వీధి నాటక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసింది. అదే సంవత్సరం హష్మీ ఆశయాల మేరకు 'రైతు, అద్దం, గారడీ, హల్లాబోల్, కురుక్షేత్రం, ఆటబమ్మలు, ఆగిపోని' నాటికలను రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించారు. అంతేకాక, 1990 నుంచి నేటి వరకూ ప్రతి సంవత్సరం సఫ్దర్ హష్మీ ఓపెన్ థియేటర్ (షాట్) పేరిట ఒక్కో ప్రాంతంలో కనీసం మూడు రోజుల పాటు ఆధునిక వీధి నాటకోత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తోంది. విజయవాడ, వరంగల్, హైదరాబాదు, భువనగిరి, రాజమండ్రి, భీమవరం, ఖమ్మం, విశాఖ, గుంటూరు, కర్నూలు, తిరుపతి తదితర ప్రాంతాలలో ఇప్పటి వరకూ రాష్ట్రస్థాయి ఉత్సవాలు జరిగాయి. ముందు చెప్పిన నాటికలే కాక ప్రజాస్వామ్యం, ఎలిమెంటరీ స్కూల్, సిటీడైరీ, రాక్షస రాజ్యం, టామీటామీటామీ, గోగ్రహణం, స్ట్రగుల్, మనచరిత్ర, స్వయంవరం, పెద్దబాలశిక్ష ఆఖరాట, యజ్ఞఫలం, మహాప్రస్థానం, చౌచౌ, అప్పొ? అమ్మకుమా?, పుణ్యభూమి, మేరాభారత్ మహాన్, కూలి బతుకులు, చెలగాటమాడకు, బహుపరాక్, చీమకుట్టింది, తెలంగాణా, కూలీ, పాములపుట్ట, తోడుదొంగలు, మీడియా-మీడియా, మన్నెం వీరుడు లాంటి నాటికల్ని అద్భుతంగా, కొత్త రీతులతో ప్రదర్శించారు. అంతేగాక, జిల్లాస్థాయి షాట్ ఉత్సవాల్లో "సమైక్యత, అందరం ఒక్కటే, పిల్లగాడెక్కడ, పంటదొంగలు, యమతీర్పు, నరకానికి తొలిమెట్టు, సారాసర్కార్, సారాంశం, ప్రభంజనం, చందమామ రావె, గొయ్యి, బాకా, విషసంస్కృతి, స్త్రీ, భారతమ్మా! నీవెక్కడా?" లాంటి ప్రదర్శనలను అనేకం ప్రదర్శించారు. దాదాపు 15 వేల మంది సుశిక్షితులైన కళాకారులతో లక్షలాది ఆధునిక వీధి నాటక ప్రదర్శలిచ్చిన ఆంధ్ర ప్రజానాట్య మండలి దేశంలోనే అత్యధిక ఆధునిక వీధి నాటక ప్రదర్శనలిచ్చిన సంస్థగా పేరొందింది.

1990-91లో సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్, నాగపూర్ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా, 'పథ్‌నాట్య సమారోహ' పేరిట వీధి నాటిక పోటీలను ప్రాంతీయ స్థాయి, జోనల్ స్థాయిలోను నిర్వహించింది. ఈ పోటీలలో ఈ వ్యాస రచయిత ఆధ్వర్యంలో గోగ్రహణం రెండు స్థాయిలలోను ఉత్తమ నటుడు, నటి, ప్రదర్శన, దర్శకుడు బహుమతులు గెలుచుకొని జాతీయ స్థాయికి ఎంపిక గావడం ఓ విశేషం! ఇదే సంవత్సరం దేశంలోనే ప్రప్రథమంగా హైద్రాబాదులో ఆంధ్రప్రదేశ్ థియేటర్ నలభై రోజుల పాటు చిన్నారుల ఆధునిక వీధి నాటక శిక్షణ శిబిరం నిర్వహించి, మూడు నుంచి పదమూడు సంవత్సరాల బాలబాలికలకు శిక్షణ ఇచ్చి ఆఖరి పది రోజులు, రోజుకు మూడు చొప్పున ముప్ఫై ప్రదర్శనలిచ్చారు. వెర్రి గారాబం, కీ మరబమ్మలు, మళ్ళీ మళ్ళీ పుడితే, గిడితే నాటికల్ని ఈ బాల బాలికలు ప్రదర్శించారు. 1991 లోనే శ్రామిక విద్యాపీఠ్ రంగా రెడ్డి జిల్లా కేంద్రం శ్రామిక చైతన్య కళాసేనను ప్రారంభించి, "అడుగడుగునా అన్యాయం, పూనకం, కాలే బతుకులు, వృక్షవిలాపం" తదితర నాటికల్ని ప్రదర్శించింది. 1991లో తెలుగు విశ్వవిద్యాలయ రంగస్థల కళలశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయ రంగస్థల కళల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా ఓ మహాత్మా నాటికనూ, 1992 లో ఇదే సందర్భంగా ప్రసాద రెడ్డి దర్శకత్వంలో నా దేశమా నాటికను తెలుగు విశ్వవిద్యాలయం నటనాకళా శాఖ ప్రదర్శించింది. ఇదే నాటికను 1991 సంవత్సరంలో ఈ శాఖ విద్యార్థులతో ఆ సంవత్సరం జరిగిన దక్షిణ మండల సాంస్కృతిక యువజనోత్సవాల్లో భాగంగా త్రివేండ్రంలో జరిగిన పోటీలలో వీధి నాటక శైలి లోనే ప్రదర్శించి,

ప్రథమ బహుమతి పొంది బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయింది.

1993-94లో ప్రారంభమైన సారా వ్యతిరేక ఉద్యమంలో ఆధునిక వీధి నాటకం శక్తి వంతమైన ఆయుధంగా పనిచేసి, రాష్ట్రంలో సారా నిషేధానికి ప్రధాన కారణమైంది. ఆ ఉద్యమ ప్రభంజనానికి వీధి నాటక ప్రక్రియ ఊపిరి పోసింది. అన్ని జిల్లాల్లో ఎన్నో వీధి నాటకాలు వేల సంఖ్యలో ప్రదర్శించారు. అందులో కొన్ని: సారాహుషార్-నెల్లూరు, అంకురం, ఆందోళన - నల్గండ, ఆఖరాట, సారాసంహారం – గుంటూరు, సారాకొట్టు నరకానికి మెట్టు – ఖమ్మం, స్వయం కృతాపరాధాలు - శ్రీకాకుళం, స్వర్గానికి దారి– తూర్పు గోదావరి, సారాభాగోతం – విశాఖ, గెలిసి తీరాలి మనం – మెదక్. రాష్ట్ర ప్రభుత్వం కూడ సారావ్యతిరేక ప్రచారంలో భాగంగా ఢమాల్! ఢమాల్! మాల్ ఢమాల్ లాంటి నాటికల్ని అన్ని జిల్లాల్లోను సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించింది. 1994-95 లో రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ 'ఆర్.టి.సి. ప్రజల ఆస్తి అనే ప్రచారంతో ఈ బస్సు మనదిరో నాటికను చాలాసార్లు ప్రదర్శించింది.

1995లో రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ నిర్వహించిన అఖిలాంధ్ర నాటకోత్సవాల్లో భాగంగా ఆరు జిల్లా కేంద్రాల్లో ఆధునిక వీధి నాటకోత్సవాలు నిర్వహించి, "గోగ్రహణం, పెద్దబాల శిక్ష, ముల్లు బోయే కత్తి వచ్చె ఢాం...ఢాం...ఢాం..." నాటికల్ని ప్రదర్శింప చేసింది.

1995-96లో వినియోగదారుల చైతన్య అధ్యయన సంస్థ (కార్స్-CARS) వినియోగదారుల విజయం వీధి నాటికను రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 'మొబైల్ థియేటర్'గా దాదాపు వంద ప్రదర్శనలిచ్చింది.

1995 నుంచి సత్తెనపల్లి ఉషోదయ సంస్థ, 1997 నుంచి విజయవాడ నగర పాలక సంస్థ, 1998 నుండి సాంస్కృతిక మిత్ర బృందం, విజయ నగరం ఆధునిక వీధి నాటక పోటీలు నిర్వహిస్తున్నాయి. హల్లాబోల్, పరిసరాలు-పరిశుభ్రత, రోదించిన మృత్యువు, ఓ మనిషి! రక్షించు ఈ దేశాన్ని, గుంట నక్కలు, గోగ్రహణం, దండోర, స్ట్రగుల్, అద్దం, కైలాసంలో కోర్టు, పబ్లిక్ పార్క్, రైతు, భలేటి నమూనా జూస్కో, మనచరిత్ర, దక్షిణాయణం, పుడమితల్లి కళ్ళు తెరిస్తే, సూపర్ స్పెషలిస్ట్‌లు, తెలంగాణ, స్త్రీ తదితర నాటికలు ఈ పోటీల్లో ప్రదర్శితమయ్యాయి. సామాజిక సమస్య (Social Problem)ని, వీధి నాటక ప్రదర్శన (Social Action) ద్వారా, సమాజంలో మార్పు (Social Action) సాధించడానికి ఇంతకంటే అనువైన, శక్తివంతమైన కళారూపం మరొకటి లేదు. "Modern Street Theatre is a Powerful and Purposeful medium which can be used as a tool of information, Instruction, Education, Entertainment, Motivation and Pursuation".

ఈ చరిత్ర అంతా చూస్తే, ఒక్క ఆంధ్రదేశంలోనే ఆధునిక వీధి నాటక ప్రదర్శనలు అత్యధిక సంఖ్యలో ప్రదర్శిత మయ్యాయన్నది సత్యం. వ్యక్తులుగానీ, సంస్థలు గానీ, ప్రభుత్వ సంస్థలు గానీ, రాజకీయ పక్షాలు గానీ, ఏదో ప్రయోజనాన్ని ఆశించి, ఆ ప్రయోజనాన్ని ఆధునిక వీధి నాటక ప్రక్రియ ద్వారా పొందడం సుసాధ్యమని భావించి, తద్వారా స్వప్రయోజనం గావచ్చు, సమాజ అభివృద్ధి గావచ్చు, లబ్ధి పొందుతున్నారనేది సత్యం. ప్రధాన స్రవంతిలో ఉన్న ప్రొసీనియం రంగస్థలానికి ప్రత్యామ్నాయ రంగస్థలంగా ఆధునిక వీధి నాటకరంగం రూపుదిద్దుకొని బహుళ ప్రయోజనకారిగా గుర్తించబడింది.

ఇక చీప్ థియేటర్, పబ్లిసిటీ థియేటర్, ప్రాపగాండా థియేటర్, మొబైల్ థియేటర్, ఇంటిమేట్ థియేటర్, ఆల్టర్నేటివ్ థియేటర్, ఎరీనా థియేటర్, పొలిటికల్ థియేటర్, కమిటెడ్ థియేటర్, ప్రొగ్రెసివ్ థియేటర్, ఫ్లెక్సిబుల్ థియేటర్ ఏపేరుతో వేసినా అది ఆధునిక వీధి నాటకమే. ప్రజల మధ్యన చోటు చేసుకోవాల్సిన కళారూపమే!

నాటకం రంగస్థలాలకు (Proscenium) మాత్రమే పరిమితం కారాదు. నిర్దేశిత రంగస్థలం లేకపోయినా ప్రదర్శనలివ్వొచ్చు... ప్రజలను చైతన్యవంతం చెయ్యొచ్చు... అని వీధి ప్రదర్శనల ద్వారా నిరూపించిన 'ఆధునిక వీధి నాటక ప్రక్రియ ప్రచారోద్యమ పితామహుడు' బాదల్ సర్కార్ నిరూపించాడు. నాటక ప్రయోజనం 'సామాజిక జాగరూకత' (Social Consciousness) అని ప్రాయోగికంగా రుజువు చేశాడు. ప్రజా సమస్యల్నీ, సమకాలీన లోపభూయిష్ట అంశాలను ప్రతిబింబించి, నిర్దుష్టమైన పరిష్కారాన్ని చూపాడు 'ప్రజా కళాకారుడు' సఫ్దర్ హాష్మీ తనదైన ఆధునిక వీధి నాటక ప్రక్రియ (Political Theatre) ద్వారా!

ప్రొసీనియం రంగస్థలాల వల్ల పూర్తిగా సాధించని, సాధించలేని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాన్ని ఆధునిక వీధి నాటకం ద్వారా సాధించగలిగామని చెప్పడానికి నిదర్శనం - గత 15 ఏళ్ళుగా ఆంధ్రదేశాన ఈ ప్రక్రియ విస్తరించడమే! ప్రధాన స్రవంతిలో ఉన్న ప్రొసీనియం రంగస్థలానికి ప్రత్యామ్నాయ రంగస్థలం (Alternative Theatre) గా ఆధునిక వీధి నాటకరంగం రూపుదిద్దుకొని, బహుళ ప్రయోజన మాధ్యమంగా అవతరించింది.

ప్ర.రె

అస్సామీ నాటక రంగం

అస్సామీ భాషలో నాటకరంగాన్ని 'భోనా' అంటారు. భహోర్య అనే అస్సామీ పదానికి అర్థం నటుడు అని. బాహువా అంటే హాస్యగాడు. అనాదిగా వస్తున్న ఈ భహోర్య ప్రదర్శనలో అస్సాం సాంఘిక జీవితంలోని సంఘటనలు, సన్నివేశాలు చిత్రీకృతమవుతున్నాయి. భహోర్య భావకవి. అతను ఆశువుగా చెప్పే పద్యాలను, పాటలను మత, సాంఘికపరమైన సమయంలో ఒక్కరుగాని, గాయక బృందం గాని పాడతారు.

ధూలియా అనే నాటక ప్రదర్శనలు హాస్యరస ప్రధానమైనవి. ప్రేక్షకులను సంతోష పెట్టడానికి వీరి వద్ద అనేక హాస్యోక్తులు సర్వసిద్ధంగా ఉంటాయి. ఇవి ఇతర ప్రదర్శనల మధ్య విరామ సమయాలలో ప్రదర్శితమవుతుంటాయి.

అస్సాంలోని పురాతన నాటకరూపం బీ జపాలి పద్యాలతో, పాటలతో పురాణ గాథలను చిత్రించి చెప్పే జీజ ప్రదర్శనలలోని ముఖ్యవ్యక్తి. ఇలా గాథలను చెపుతూనే ఈ వ్యక్తి వచనం లోనే పాలీలలో ముఖ్యుడైన దైనాపాలితో సంభాషణ నెరపుతాడు. సంగీత నృత్య ప్రదర్శనలో పాల్గనే సమాజకులనే పాలీలు అంటారు.

ఈ నృత్య ప్రదర్శనల్లో రామాయణ, భారత గాథలు, పద్మ పురాణంలోని బెహులా, లకిందర్ గాథలు చిత్రితమవుతున్నాయి. ఈ నృత్యాల్లో ఎంతో పస ఉంటుంది. అస్సాంలోని కొన్ని ప్రాంతాల్లో హస్తముద్రలు ప్రదర్శించే ఆచారం కూడా ఉంది. పద్యాల లయ, తాళ, అడగుల (పాద విన్యాసం) మీద ఈ కళారూపం ఆధారపడి ఉంది.

బీజపాలిలో కథను ఎంతో ఆవేశంతో రసవత్తరంగా చెపుతారు. ఈ కళారూపాన్ని 'నాటకం' అన్నా, అనకపోయినా సంఘటనలలో, పాత్ర చిత్రణలో నాటకీయత ఎంతగానో గోచరిస్తుంది. ఈ బీజపాలి లోని థియోధని అనే మూగ స్త్రీ పాత్ర బెహులా ప్రతినిధి. ఈ పాత్ర మానస అనే దేవత ప్రీత్యర్థం నృత్యం చేస్తుంది.

ఆ తరువాత అస్సాంలో వైష్ణవ భక్తి యుగం ప్రారంభంలో బీజపాలిలో పద్మపురాణ కథల బదులు, భాగవత కథలైన ప్రహ్లాదో పాఖ్యానం, కాళీయ మర్దన, రామాయణ కథ చిత్రితం కాసాగాయి. ఈ బీజపాలి నాటక రూపంలో వైష్ణవ గాథలను ప్రవేశ పెట్టిన వాడు మహర్షి శంకర దేవ్. ఈయన క్రీ.శ. 1449-1563 మధ్య జీవించాడు, సంగీత నృత్యాలలో అందెవేసిన చేయి.

ఈ వైష్ణవ యుగంలోనే అస్సామీ నాటక రంగానికి ప్రత్యేక వ్యక్తిత్వం లభించింది. శంకర దేవ్, అతని శిష్యుడు మహదేవ్(1489-1596) అంకీయ నాట్ అనే ఏకాంకిక సారస్వతం ద్వారా వైష్ణవ సంస్కృతికి ఎంతో దోహదం చేశారు. సంస్కృత నాటక లక్షణాల మీద ఆధారపడిన ఈ నటులు తమ సంగీత నృత్య ఛందస్సులతో కూడిన శిల్పంలో సిద్ధహస్తులు. వీరి శిల్పం విశిష్టత్వాన్ని సంతరించుకున్నది. ఈ శిల్పాన్ని ఆధారం చేసుకుని వారు వైష్ణవాన్ని ప్రచారం చేశారు. కృష్ణ గాథలను ప్రజలలోకి తీసుకువెళ్ళారు. రామాయణ గాథల తోటి ఏకాంకికలు కూడా లేక పోలేదు. శంకరదేవ్, మహదేవ్‌ల నాటకాలు సంస్కృత నాటక లక్షణాలనే అనుసరించాయి. యాత్ర, ఝుమారా లాంటి వివిధ రకాల నాటకాలున్నాయి. ఝుమారాలు చిన్న చిన్న నాటకాలు. వీటికి నాందీ ప్రస్తావనలు ఉండవు. గోపాల్ అటా, రామచరణ్ ఠాకూర్, దైత్యా ఠాకూర్, శంకర దేవ్ అనుయాయులలో ముఖ్యులు.

ఈ నాటకాలలోని పాత్రలను చరితలని, ప్రధాన పాత్ర ధారులను నట్టువలని, పాఠకులను గాయనులని, జంతు వాద్యకులను బయనులని అంటారు. ఈ ప్రదర్శనంలోని సహాయకులను పాలీలు అని పిలుస్తారు. సూత్రధారుడు నాటకానికి, ప్రేక్షకులకు అనుసంధానంగా ఉంటాడు. ఈ నాటక రంగాన్ని రాఖా అంటారు. బకాసుర, కాళీయుడు మొదలైన రాక్షస పాత్రలు కరాళాలు ధరించేవారు. శంకర దేవ్ స్వయంగా తెరలను చిత్రించేవాడట. మధ్యమధ్య సంస్కృత పదాలు వాడినా వైష్ణవుల అభిమాన భాష వ్రజ భాష. కాబట్టి ఈ భాషలోని రమణీయత ప్రజాహృదయాలను హత్తుకునేది. నాటక భావాన్ని రమణీయంగా వ్యక్తీకరించే విధంగా మాటలు, పదబంధాలు, నటుల ఉచ్చారణ ఉండేవి.

ఈ నాటకాలలోని పాటలు రెండు రకాలు. 1. అంకీయగీత్, 2. భట్టిమ. మొదటిది నాటకంతో ప్రత్యక్షంగా సంబంధించినది. రెండవ తరగతికి చెందినవి ప్రార్థనా గీతాలు. అంకీయనట నృత్యాల శిల్పం ఒక రీతికి చెందినది.

సూత్రధారుడుకి, కృష్ణుడుకి, గోపాలురకు, స్త్రీ పాత్రలకు నృత్యాలు పెట్టేవారు. చాలి, నట్టువ, ఝుమూరా నృత్యాలుగా అవి ఒప్పారుతూండేవి. అంకీయ నటీనట ప్రదర్శనం ప్రారంభం కావడానికి ముందు తాళాలు, మద్దెలలతో బృందగానం జరిగేది. ఆ తరువాత గురుఘట్ అనే ఖోల్ గాన సమ్మేళనం జరుగుతుంది. ఆ తరువాత సూత్రధారుడు ప్రవేశించి నృత్యం చేసి శ్రీ కృష్ణునిగాని, శ్రీ రామచంద్రుని గాని స్తుతిస్తూ నాంది పఠిస్తాడు. రంగ స్థలం మీదకు పాత్రలు ప్రవేశించడంతో అసలు నాటకం ప్రారంభమవుతుంది. ప్రదర్శన చివర నటులంతా కలిసి దేవుని స్తుతిస్తూ మంగళం, భట్టిమ (భరత వాక్యం) పఠిస్తారు.

శంకర దేవ్ ప్రతిభావ్యుత్పత్తుల వల్ల భాషా రమణీయత, నాటక ఆదర్శం, సంగీత నృత్యాలకు వన్నె చేకూరింది. శంకర దేవ్, మహాదేవ్ రచించిన పన్నెండు నాటకాలివి. *1. కాళీయ దమన 2. పత్నీ ప్రసాదం, 3. రాసకీడ, 4. రుక్మిణీ హరణం, 5. శ్రీరామ విజయం, 6. పారిజాతాపహరణం, 7. అర్జున భంజనం, 8. చోర్ ధారా ఝుమూరా, 9. భూమిలూటీ, 10. పింపరా గుచ్ఛం, 11. భోజన వ్యవహారం, 12. శ్రీ కృష్ణ జననం.* వీరి సంప్రదాయాన్ని వీరి అనుచరులు అనుసరిస్తూ, వైష్ణవ మత భక్తి శ్రద్ధలతో, వైష్ణవ మతాన్ని నాటకం మొదలైన సాహిత్య ప్రక్రియల ద్వారా ప్రచారం చేశారు.

ఈ నాటకాలు రమణీయంగా ఉండి, ప్రజా హృదయాలను దోచుకునేవి. రంగాలు పసందుగా, వర్ణనాత్మకంగా, వీర, శృంగార రసభూయిష్టంగా విలసిల్లేవి. వీటిని రాజ గృహాలలో అంటే పది మందీ కూడే మందిరాలలో ప్రదర్శించే వారు. పురుషులే స్త్రీ పాత్రలను ధరించేవారు.

అస్సామీ నాటక రంగంలో ఈ దశ చాలాకాలం వర్ధిల్లింది. ఆ రోజులలో రాజులు కవులను పోషించే వారు. కాని ఆ తరువాత క్రమంగా రాజులపోషణ తగ్గిపోవడంతో కొంతకాలం పాటు నాటకరంగం క్షీణించింది.

18వ శతాబ్ది చివర లంబోదర బోరా అనే రచయిత కాళిదాసు శాకుంతల నాటకాన్ని అస్సామీ భాషలోకి అనువదించాడు. అయితే ఈ ప్రదర్శన ఎప్పుడు జరిగిందీ సరిగ్గా చెప్పడం కష్టం. మొన్న మొన్నటి వరకు నాటక ప్రదర్శనాలలో స్త్రీలను నాటకాలలో నటింపచేసేవారుకాదు ప్రజా హృదయాలను కదిలించి వేసే పౌరాణిక, చారిత్రక నాటకాలు అస్సామీ భాషలో ఎక్కువగా వెలువడినాయి.

అస్సామీ నాటకంలో ఒక దృశ్యం

19వ శతాబ్దంలో శ్రీ లక్ష్మీనాథ్‌బెజ్ బారువా చాలా నాటకాలు రచించాడు. వీటిలో హాస్యాన్ని ఎక్కువగా ప్రవేశపెట్టాడు. హేమచంద్ర బారువా సంఘంలోని లోటును చిత్రిస్తూ నాటకాలు రచించాడు. రత్నేశ్వర మహంత్ హరిశ్చంద్ర నాటకం లాంటి నాయక ప్రధాన నాటకాలు రాశాడు. జ్యోతి ప్రసాద్ అగర్వాలా కొన్ని నాటకాలు రాశాడు.

ప్రజలలోని దేశభక్తిని ఆధారం చేసుకొని దేశభక్తి నాటకాలను కూడా ప్రోలిన్‌ఫ్లూకన్ మొదలైన నాటక రచయితలు నాటకాలు వ్రాయసాగారు. ఫ్లూకన్ సుప్రసిద్ధ దేశభక్తులయిన మణిరాం దివాన్, లజిత్, బోర్ ఫ్లూకన్‌ల జీవిత విశేషాలను చిత్రించే నాటకాలు, అస్సామీ గ్రామీణ సాంఘిక జీవితాన్ని చిత్రించే బెందూర్ రాజ్‌కోవా, అతుల్ హజారికే వంటి రచయితలు నాటకాలు వెలయించారు. రమణీయ గ్రామీణ దృశ్యాలు భిత్తికగా విలసిల్లే ఈ నాటకాలలో గ్రామీణ ప్రజల యదార్థ జీవితం చిత్రితమైంది.

అయితే అస్సాంలో ఇంకా కట్టుదిట్టమైన జీవిత నాటక రంగం అవతరించలేదు. నాటక రంగం ఔత్సాహిక నాటకరంగంగానే మిగిలిపోయింది. నాటక శాలలు, రంగస్థలం లేని ప్రదేశాలలో తాత్కాలికంగా నిర్మించిన పాకలలో ప్రత్యేక సమయాలలో స్థానిక నటులు ప్రదర్శిస్తుంటారు. నాటకాలలో వేషాలు వేయడానికి స్త్రీలు ముందుకు రాకపోవడం వల్ల ఈ నాటకరంగం ప్రగతి సాధించలేదనే చెప్పాలి.

శ్రీ.చ.

ఉర్దూ నాటక రంగం

ఉర్దూ భాషలో నాటక ప్రక్రియ ఒక ఆకృతిని, నిండుతనాన్ని సంతరించుకోవడానికి చాలాకాలం పట్టింది. పందొమ్మిదో శతాబ్దం పూర్వార్ధం వరకు వివిధ జానపద కళారూపాలు ప్రధాన వినోద సాధనాలై జనావళిని అలరిస్తూ ఉండేవి. పర్షియన్ సాహిత్యం నుంచి అనేక సాహిత్య రూపాలను గ్రహించిన ఉర్దూ సాహిత్యం, నాటకం విషయంలో వెనక బడిపోయింది. అందుకు ప్రధాన కారణం పర్షియన్ భాషలో నాటక ప్రక్రియ లేకపోవడమే అని కొందరు పండితుల అభిప్రాయం.

సాంస్కృతిక వైభవానికి లక్నో పందొమ్మిదో శతాబ్దంలో కేంద్ర బిందువై నిలిచింది. సుల్తాన్ వజిద్ ఆలీషా పోషణలో లలిత కళలు, పద్యసాహిత్యం, సంగీత ప్రధానమైన నృత్యాలకు ప్రోత్సాహం లభించి ఉచ్ఛస్థితికి చేరుకొన్నాయి. రాసలీల అనే నాటక (కళా) ప్రదర్శనలు వజీద్ ఆలీషాను విశేషంగా ఆకట్టుకొన్నాయి. అలాంటి కళాప్రదర్శనలు కావాలని, కొందరి చేత రాసలీల పద్ధతిలో ఉర్దూలో నాటకాలు రాయించాడు. రాధా కన్యకా కిస్సా అలాంటి రూపకాల్లో ఒకటి. ఫసన్ ఎ ఇష్క్, దరియా ఎ తయ్యూష్ , బహర్ ఎ ఉల్ఫట్ అనేవి రాసలీల బాణీలో రూపుదిద్దుకొన్న రచనలే. కాని అవేవీ ప్రజల ముందుకు రాలేదు. రాజాస్థానానికే ఈ ప్రదర్శనలు పరిమితమయ్యాయి.

లక్నోకు చెందిన ఆఘహసన్ అమానత్ అనే రచయిత 1853లో ఇంద్రసభ అనే నాటకాన్ని రాసి రంగస్థలిపై తొలిసారిగా ప్రదర్శింపజేశాడు. బహిరంగ ప్రదర్శనలకు ఈ నాటకమే నాంది పలికింది. నాటక ప్రదర్శన అత్యంత ప్రజాదరణ పొందడమే కాక, ఆ నాటకం యావద్భారత కీర్తిని ఆర్జించింది ఆగ్రా, అమృత్‌సర్, బంబాయి, పాట్నా, ఢిల్లీ, కాన్పూరు, గోరక్‌పూర్, లాహోర్, మీరట్ తదితర ప్రాంతాల నుంచి ఈ నాటకం అనేక సార్లు పునర్ముద్రించబడటం ఇంద్రసభ నాటక ప్రాచుర్యానికి, ప్రబల నిదర్శనం.

మురాదాబాద్ నవాబులు, శ్రీమంతులైన హిందువులు ఢాకాలో ఉర్దూనాటకాలను ప్రోత్సహించారు. వారు లక్నోలో చూసిన ఇంధ్రసభ నాటక ప్రదర్శనకు ముగ్ధులై అలాంటి నాటకాలు తమ ప్రాంతాలలో కూడా ప్రదర్శింప చేయాలనే కృత నిశ్చయంతో కళాపోషణకు ఉద్యుక్తులయ్యారు. వారి ప్రేరణతోనే మున్షీనవాబ్ తెలీ వఫీజ్ కాన్పూరీ అనే అతను ఇంద్రసభ వంటి అనేక నాటకాలు రాశాడు. ఇవన్నీ నేడు మనం చూస్తున్న నాటకం వంటివి కావు. ఒపేరా పద్ధతిలో రాయబడినవి. అవి నాటి ప్రేక్షకులను అబ్బుర పరిచాయి. అప్పటి ఒపేరా వంటి షాజవుద్దీలా అనే నాటకం తంజావూరు సరస్వతి మహల్ గ్రంథాలయంలో లభ్యమైంది. అది ఉర్దూ రచన అయినా తెలుగులిపిలో ఉండటం విశేషం. దీనిని హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ప్రొడ్యూసర్‌గా పని చేసిన వారణాశి రామమూర్తి హిందీలోకి అనువదించారు. అంతేకాదు ఆ నాటకం ఆజ్‌కల్ అనే పత్రికలో 1975 మార్చి సంచికలో ప్రచురించబడింది కూడా.

వజీద్ ఆలీషా పరిపాలన అంతమైన తర్వాత, లక్నోలో సాంస్కృతిక జీవన స్రవంతి ఇంకిపోయినట్లైంది. నాటక ప్రగతి కుంటువడింది. సాంస్కృతిక రంగంలో నిరాశాచీకట్లు అలుముకొంటున్న దశలో, బంబాయిలో పార్శీలు నాటక సమాజం స్థాపించి నాటకాన్ని ఒక వృత్తిగా స్వీకరించి, వ్యాపార ధోరణిలో నాటకాలు వెయ్యడానికి ముందంజ వేశారు. వారి ప్రయత్నం సాంస్కృతిక రంగంలో ఒక కొత్త వెలుగును ప్రసరింప జేసింది. వెనువెంటనే మరికొన్ని పార్శీ కంపెనీలు రంగ ప్రవేశం చేశాయి. పెస్టోంజి ఫ్రెంజి నాటక కంపెనీ మొట్టమొదటి పార్శీ నాటక సమాజం. రాజా గోపీచంద్ ఔర్ జలందర్ అనే గుజరాతీ నాటకాన్ని తయారుచేయించి, ఉర్దూలోకి అనువాదం చేసి 1853లో ప్రదర్శింపజేశారు. 1861 ప్రాంతానికి సుమారు 18 నాటక సమాజాలు వెలుగులోకి వచ్చాయి.

1890 వరకు అనేక ఉర్దూ నాటకాలు రంగస్థలం మీద ప్రదర్శితమైనాయి. కాని ఇవి అంతగా ప్రజాదరణకు నోచుకోలేదని చెప్పాలి. దాదాబాయ్ పటేల్ 1871లో అనేక ఉర్దూ నాటకాలను ప్రదర్శించారు. విక్టోరియా నాటక మండలి కోసం ఫర్దుంజి మర్జాబన్ , ఖుర్షీద్ అనే నాటకాన్ని గుజరాతీ నుంచి ఉర్దూలోకి అనువదించాడు. గుజరాతీ నాటకానికి మూలకర్త ఐదల్జీ ఖోర్‌జి. ఖుర్షీద్ ప్రజాదరణ పొందిన ఉర్దూ నాటకాలలో ఒకటి.

నాటక రచనను వృత్తిగా స్వీకరించి ఉర్దూ నాటక వికాసానికి దోహదం చేసిన రచయితలలో నజర్ వాంజి మెహర్ వాంజి ఆరమ్ అగ్రగణ్యుడు. అతని రచనా పరంపరలో స్వకపోల కల్పితాలు, అనువాదాలు కూడా ఉన్నాయి. అతని రచనల్లో గుల్ సనుబార్ బెకారా, బాగ్ ఓ బాహర్, హాతీం తాయ్ మొదలైనవి సుప్రసిద్ధమైనవి. అతని సమకాలికుడైన మహమ్మద్ మియన్ ప్రముఖ నాటక రచయితే కాక ప్రతిభావంతులైన నటుడు. ఈయనకు పేరు తెచ్చిన నాటకాలలో బోనజీర్ మునీర్, లైలా–మజ్ను, అంజామ్–ఎ–ఉల్ఫట్ ముఖ్యమైనవి. సమకాలీన

సమాజాన్ని ప్రతిబింబిస్తూ జఫీజ్ మహమ్మద్ అబ్దుల్లారాసిన హీర్ రంఝు, తనూషా-అల్-పజీర మొదలైనవి నాటక రచనలో కొత్తధోరణికి మార్గం చూపాయి. మిర్జా మజీర్ బేగ్ రచించిన *గుల్-రో-జరీనా, ఫసనా-ఎ-అజేబ్* రచించిన గుల్-రో-జరీనా, ఫసనా-ఎ-అజేబ్ నాటకాలు కూడా ప్రజాదరణకు పాత్రమయ్యాయి.

పార్శీ నాటక సమాజాలు సాంకేతిక విలువలతో, ఆకర్షణీయమైన ప్రదర్శనలతో సామాజికుల మదిలో చెరగని ముద్రవేశాయి. ఉద్యమస్థాయిలో సాగుతున్న నాటకాల మీద ఆనాటి ప్రసిద్ధ రచయితలు, పండితులు, కవులు శీతకన్ను వెయ్యడం ఆశ్చర్యావహం. ఉర్దూ నాటకాలలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాలని అకుంఠిత కృషిచేసిన వారిలో తాలీబ్ బనారసి, మున్షీనారాయణ పరిషద్ బేటాబ్, అగాహషా కాశ్మీరీ, మెహిది హసన్ ఆషన్ పేర్కొనదగినవారు. విక్టోరియా నాటక మండలి ఆస్థానకవి పండిట్ వినాయక ప్రసాద్ బనారసి రాసిన *పర్దా-ఎ-గఫ్లాట్* సంచలాత్మక నాటకంగా వాసికెక్కింది. ఈయన రాసిన హరిశ్చంద్ర నాటకం అత్యంత ప్రజాదరణ పొందిందని చెప్పటానికి ఆ నాటక ప్రదర్శన ఒకటిన్నర సంవత్సరాల పాటు నిరంతరాయంగా సాగి చరిత్ర సృష్టించడమే తిరుగులేని సాక్ష్యం.

నాటక రంగంలో తాలీబ్ బనారసికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఒపేరా పద్ధతిలో సాగే నాటకాలకు భిన్నంగా వచన నాటకాలను ప్రవేశ పెట్టిన ఘనత తాలీబ్‌బనారసిది. నలదమయంతి, చమన్ ఎ ఇష్క్, కరిష్మా ఎ ఖుద్రత్, హరిశ్చంద్ర, గోపీచంద్, ఖజానా ఎ గైబ్, గోష్ఎ మొహబ్బత్, అల్లాద్దీన్, విక్రమ్ వికాస్ మొదలైనవి ఈయన వచన నాటక పరంపరలో కొన్ని.

షేక్స్పియర్ నాటకాలకు అనుకరణలు కూడా మొదలయ్యాయి. షేక్స్పియర్ నాటకాలను అనుకరించిన వారిలో మెహ్ది అహ్ సన్ అగ్రగణ్యుడు. ఒథెల్లో, బెజ్‌మెఫానీ (రోమియో జూలియట్), భూల్ బుల్లాయన్ (కామెడీ ఆఫ్ ఎర్రర్స్) ఖూన్ ఎనహాఖ్ (హేమ్లెట్), దిల్ ఫరోష్ (మర్చంట్ ఆఫ్‌వెన్నీస్) తదితర నాటకాలు స్వేచ్ఛానుకరణలు. మున్షీ నారాయణ బేటాచ్ కూడా కొన్ని షేక్స్పియర్ నాటకాలను అనువదించాడు. యాజ్ యు లైక్ ఇట్ వాటిలో ప్రముఖంగా పేర్కొన్న తగింది. మూలగ్రంథం లోని పాత్రల పేర్లను మార్చకుండా అలాగే ఉంచడం విశేషం.

అఘు మహ్మద్ షా ప్రసిద్ధ నాటక రచయిత. స్వస్థలం కాశ్మీరు. తన జీవితాన్ని నాటక రంగానికే అంకితం చేసిన కళాహృదయుడు. అఘు మహ్మద్‌షా ఉర్దూలో సుమారు 35 నాటకాలు రచించాడు. మురీద్‌ఎషక్ షేక్స్పియర్ వింటర్స్‌టేల్ నాటకం ఆధారంగా రాయబడింది. దీనిని 1899లో ప్రదర్శించాడు. *అసీర్ ఎ హైర్స్* (1900) *మార్ ఎ అస్తీమ్* (1900), *మిటీచురీ* (1901), *షహీద్ ఎ హవాజ్* (1902), *సఫేద్‌ఖాన్* (1907), *సైద్ ఎ హవాజ్* (1908), *ఖూబ్ సూరత్ బ్లా* (1908), *సిల్వర్‌కింగ్*(1910), *ప్లైహాప్యార్* (1911), *యాహూదికి లడకీ* (1915), *బిల్వమంగళ్*(1919) తదితర నాటకాలు మహ్మద్ షా రచనా వైవిధ్యానికీ, వైశిష్ట్యానికి ఉదాహరణలు. యాహూదికి లడకీ, ఖూబ్ సూరత్ హస్త, ఇష్క్ ఓ ఫర్జ్, ఆంఖ్‌కానషా నాటకాలు ప్రజల అభిమానం చూరగొన్న ఉన్నత శ్రేణి నాటకాలు. అఘా మహ్మద్‌షాను 'షేక్స్పియర్ ఆఫ్ ఉర్దు' అని వ్యవహరిస్తారు. ఉర్దూ నాటకం బహుముఖాభివృద్ధికి అఘా మహ్మద్ షా పోషించిన పాత్ర అనితర సాధ్యమైంది, చిరస్మరణీయమైంది.



హిందీ నాటకరగంలో ఒక దృశ్యం

పందొమ్మిదో శతాబ్ది ఉత్తరార్ధంలో సాహిత్యరంగంలో విప్లవాత్మక మార్పులచ్చాయి. దేశ భక్తి స్ఫోరకమైన రచనలు చేయాలన్న సంకల్పం నాటక రచయితల్లో మొగ్గ తొడిగింది. చారిత్రక ప్రాధాన్యం గల కథలను, వ్యక్తులను నాటకాల్లో అవిష్కరింపజేసి దేశభక్తిని ఇనుమడింప జేయాలని ప్రయత్నాలు జరిగాయి. కాని చారిత్రక నాటకాలు శక్తివంతంగా రూపొందలేదు.

ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో పండిత్ బ్రిజ్ మోహన్ దతారియా కైఫీ రాసిన *రాజదులారీ*(1914), జాఫర్ ఆల్జీజా వ్రాసిన *జంగ్ ఎ రూప్ ఓ జపాన్* (1905) మౌలానా అబ్దుల్ మజిద్ దరియాబడి రచించిన *జూద్ ఎ పహీమాన్* (1917) వంటి నాటకాలు దేశ భక్తి ప్రబోధాత్మకాలు కావడం గమనార్హం.

ప్రసిద్ధ కథా, నవలా రచయిత ప్రేమచంద్ కూడా నాటక రచన పట్ల మొదట్లో ఆసక్తి చూపాడు. షబెటార్, ఇంకార్, కర్‌బల

అనే మూడు నాటకాలు ప్రేమచంద్ కలం నుంచి వెలువడినవే. కర్‌బల నాటకాన్ని చూసి ముస్లింలు ప్రతిఘటించిన కారణంగా ప్రేమచంద్ ఆ తర్వాత నాటక రంగానికి దూరమయ్యాడు. అలా కాకపోతే ప్రేమచంద్ కలం నుంచి కథలు, నవలలే కాక గొప్ప నాటకాలు కూడా మనకు దక్కి ఉండేవి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం దేశంలో అన్ని రంగాలలోనూ అనూహ్యమైన మార్పులచ్చాయి. మారుతున్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు సాంస్కృతిక రంగంలో ప్రతి ఫలించడంలో ఆశ్చర్యం లేదు.

పాశ్చాత్య సాహిత్యం అందుబాటులోకి వచ్చిన ఫలితంగా మేధావులు నాటక రంగంలోకి ప్రవేశించి, నాటకరంగంలో కొంగ్రొత్త మార్పులు తేవడానికి ఉద్యమించారు. ఇబ్సన్, బెర్నార్డ్‌షా వంటి విశ్వవిఖ్యాత రచయితల నాటకాలను అధ్యయనం చేసి, ఆ స్ఫూర్తితో నూతన దృక్పథంతో కొందరు రచయితలు నాటక రచనకు పూనుకున్నారు. ఇష్టియక్ హుసేన్ ఖురేషి, మహ్మద్ ఫజుల్ ఉల్‌రహ్మాన్, అబిద్ హుసేన్ వంటి మేధావి వర్గానికి చెందిన రచయితలు కొన్ని నాటకాలు రాశారు. ఖురేషీ రాసిన *గుణాహ్ కి దేవర్, హమ్‌జాద్, సైదీ జమున్, నక్షే ఆఖిర్* మొదలైనవి కొత్త పుంతలు తొక్కిన నాటకాలు. కాని వాటిలో సాహిత్య విలువలు ఉన్నంతగా ప్రదర్శన విలువలు లేక పోవడంతో రంగస్థలంపై నిలదొక్కుకోలేక పోయాయి.

మహ్మద్ ఫజిర్ రెహ్మాన్ రాసిన *పర్దా, జహిర్ బేటిన్, నయీరోష్నన్, హ్రజాత్ ఉల్ ఆర్జ్* నాటకాలు, అబిద్ హుసేన్ రాసిన *పర్దా ఎ గఫ్లట్* వంటి నాటకాలు సంఘ సంస్కరణాత్మకాలే అయినా రంగస్థల నాటకాలుగా రాణించలేక పోయాయి.

ఈ కాలంలోఇమ్‌తియాజ్ ఆలీ రచించిన అనార్కలి అత్యంత ప్రజాదరణ పొందిన నాటకం. దీనిని 1922లో రచిస్తే 1932లో ప్రచురించబడింది. ఆధునిక ఉర్దూ నాటకరంగంలో ఆ నాటకం ఒక మైలు రాయిగా చరిత్రపుటల్లో సుప్రతిష్టమైంది. సాంకేతిక పరంగా ఇది పరిపూర్ణత సంతరించుకొన్న నాటకం. దీనితో పాటు కుర్ట్‌బాకా ఖాజీ, ఖుషీ, *దండన్ సాజ్ కికుర్సీ* మొదలైన నాటకాలను రచించబడినప్పటికీ ఈ నాటకాలేవీ *అనార్కలి* దరిదాపులకి కూడా రాలేదని చెప్పవచ్చు.

నాటకం మీద అభ్యుదయోద్యమ ప్రభావం కూడా లేకపోలేదు. సయ్యద్ సాజిత్ జహీద్ తాను లండన్‌లో నివసిస్తున్న తరుణంలో 1935లో, బీమార్ అనే నాటకం రాశాడు. దీనిపై అభ్యుదయోద్యమ ఛాయ ప్రస్ఫుటం. ప్రొఫసర్ మహమ్మద్ ముజీబ్ నాటకరంగ వికాసానికి తనవంతు సహకారాన్ని అందించిన వారిలో గణనీయుడు. ఈయన 1938లో రచించిన ఖేటి అనే నాటకంలో వ్యక్తుల మానసిక సంఘర్షణ ఫలితంగా పొడచూపే ప్రతిచర్యల ప్రభావాన్ని హృదయంగమంగా అభివ్యక్తం చేశాడు. మహమ్మద్ ముజీబ్ రచించిన హుబ్బాఖటూన్, అజ్‌వహాయిష్,ఖానా జంగీ తదితర నాటకాలు కూడా ప్రముఖంగా పేర్కొనదగినవి. ఖాన్‌జంగీ నాటకంలో జీవన సూత్రాలకు, సంస్కృతికి మధ్యసంఘర్షణ చిత్రితమైంది. పైన పేర్కొన్న నాటకాలన్నీ చిరస్మరణీయమైనవి.

మంజుఖమర్ రాసిన అఫ్‌తాబ్‌ఎ డామిష్క్ (1932) షబ్నమ్ (1944), హిట్లర్‌కి తమన్నా (1946) ఝాన్సీకి రాణి, బహుదూర్‌షా జషార్‌న్ నాటకాలలో కథాకాలం నాటి వాతావరణాన్ని మనోజ్ఞంగా చిత్రించారు.

స్వాతంత్ర్యానికి కొంచెం అటు ఇటుగా ఏకాంకిక నాటికా రచన ప్రాచుర్యంలోకి వచ్చింది. ఖాజా అహ్మద్ అబ్బాస్, ఇస్మత్ చుగ్ టై, సర్దార్ జాఫ్రి, క్రిష్ణచందర్, సాదత్ హసన్ మాంటో, ఉపేంద్రనాథ్ అష్క్, రాజేంద్రసింగ్ బేడి, రవిచరణ్ శర్మ తదితర అభ్యుదయ రచయితలు నాటక రంగ వికాసానికి ఎనలేని సేవచేశారు. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ **(IPTA)** స్థాపన నాటక రంగాన్ని మరో మలుపు తిప్పింది. కె.ఎ. అబ్బాస్ మైన్ ఖూన్ హూన్, బేవా ఇస్మాయిల్ చౌగ్ టై *దహని బ్యాక్ సాన్ , సర్దార్ జాఫ్రీ, ఎ కిస్కా ఖూన్* వాస్తవికతా వాదాన్ని ప్రతిబింబించే నాటకాలు. అభ్యుదయ రచయితల నాటక సంపుటి ప్రచురించబడి నాటకాభిలాషులకు ప్రోత్సాహమిచ్చింది. రాజేంద్ర సింగ్ బేడీ షకీల్, కిషన్ చందర్, *నీల్ కాంత్, దర్వాజా ఖోల్‌దో మంతో తీన్ ఆర్టిన్, ఆహ్‌*మొదలైన నాటకాలు వెలుగులోకి వచ్చాయి. మహ్మద్ హుస్సేన్ పైసా ఔర్ పంచాయియాన్ మైరాస్టేజ్ డ్రామే, కె.ఏ.అబ్బాస్, జుబైదా, *లాల్ గులాబ్‌కె వప్సీ ఖడిజా మస్తూర్ ఆఖ్రిబార్* రోటీ చరణ్ శర్మ దుష్మన్ మొదలైన విశిష్ట ఉర్దూ నాటకాలు నాటక రంగాన్ని అలరించాయి. పృథ్వీరాజ్ కపూర్ నాటక రంగానికి చేసిన సేవలు కూడా మరువలేనట్టివి. పృథ్వీ థియేటర్‌ను స్థాపించి దీనార్, పతాన్, పైసా మొదలైన అపురూప నాటకాలను ప్రదర్శింపజేశాడు. గుడియా ఘర్, శకుంతల,హబీబ్ తన్వీర్ రచించిన *ఆగ్రా బజార్* వంటివి ప్రజాభిమానాన్ని చూరగొన్న నాటకాలు.

సమకాలీన నాటక రంగంలో ఉర్దూనాటకం తన ఉనికిని చాటుకొంటూ నాటక కళాభ్యున్నతికి సర్వతోముఖంగా కృషిచేస్తుంది.

డా. బేగ్

అను: *గం.సు.రె*

ఒరియా నాటక రంగం

పందొమ్మిదో శతాబ్దం చివరిభాగంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం దేశ భాషలన్నిటి పైనా ప్రసరించింది. పాశ్చాత్య విద్య భారతావని అంతటా విస్తరించింది. దేశీ సాహితీ కారులు కవిత, నవల, కథ, నాటకం వంటి రూపాలను చేపట్టి తమతమ భాషా సాహిత్యాలను పరిపుష్టం చేసుకునే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే నాటకం ఒక సాహిత్య ప్రక్రియగా ఆంగ్ల,బెంగాలీ నాటకాల ప్రభావంతోనే ఒరిస్సా సాహిత్యంలోకి అడుగు పెట్టింది.

1861లో కటక్‌లో కేథలిక్ మిషనరీ విద్యార్థులు ఒక అలంకృత రంగస్థలాన్ని ఏర్పరచుకుని, ఓ ఆంగ్ల నాటకంలోని కొన్ని అంకాలను ప్రదర్శించారు. ఒరిస్సాలో రంగస్థల నాటక ప్రదర్శనకు అది శుభారంభం అయింది. తర్వాత 1877లో కటక్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో, బంబాయి నుంచి వచ్చిన రిపన్ సాంగ్లీ థియేటర్స్ పార్శీ సంస్థ ఒక నాటకాన్ని ప్రదర్శించింది. కలకత్తా నుంచి కూడా కొన్ని నాటక కంపెనీలు వచ్చి బెంగాలీ నాటకాలను ప్రదర్శిస్తూ ఉండేవారు. ఈ నాటక ప్రదర్శనల పట్ల విపరీతంగా స్పందించింది మధ్య తరగతి విద్యాధికులే. ప్రతిభా వ్యుత్పత్తులు, ఉత్సాహం ఉన్నా ఆర్థిక స్తోమత బత్తిగా లేని వర్గం ఇది. ధనిక శ్రేణికి చెందిన మహాజన్ (పెద్ద షాహుకారులు) మహంత, (దేవాలయపు ఆస్తుల్ని అనుభవించే మఠాధి పతులు) జమీందార్, రాజా–మహారాజులు నాటక కళపట్ల ఉదాశీన వైఖరిని అవలంబించేవారు.

ఆంగ్ల నాటక ప్రక్రియను ఆదర్శంగా పెట్టుకుని ఒరియాలో రాయబడిన మొదటి నాటకం బాబాజీ 1877లో ప్రచురింపబడింది. దీని రచయిత జగమోహన్ లాలా, కటక్ జిల్లా మహంగా ఆయన స్వగ్రామం. రాధాకృష్ణ థియేటర్స్ పేరిట నాటక సంస్థను స్థాపించి నాటక ప్రదర్శనలు ప్రారంభించాడు. కుటుంబసభ్యులే పాత్రలు పోషించేవారు. వంద సంవత్సరాల ఒరియా నాటక రంగం చరిత్రను అయిదు యుగాలుగా విభజించుకోవచ్చును.

ప్రథమ యుగం (1877–1900): 23 సంవత్సరాల ప్రారంభ యుగం ఒరియా సాహిత్యానికి ఇద్దరు నాటక రచయితల్నీ, 9 నాటకాలను అందించింది. రాశిలో తక్కువే అయినా వస్తు వైవిధ్యంగల నాటకాలుగా ప్రాముఖ్యతను సంతరించుకున్న నాటకాలు ఇవి:

వీటిలో జగమోహన్‌లాల్ రచించిన సాంఘిక నాటకాలు *1. సతి (1866), 2) బాబాజీ (1877).*

రామ శంకరరాయ్ రచించిన నాటకాలలో కంచికావేరీ *(1880)*, వనబాల *(1882)* నాటకాలు చారిత్రక నాటకాలు, *రామ వనవాసా (1981) పౌరాణిక నాటకం, కలికాళో (1883), బుఢాబరో (1892), కంస వధ (1896), బిసయోదకొ (1900)* సాంఘిక నాటకాలు.

రామ శంకర రాయ్‌ను ఒరియా నాటక రంగ చరిత్రలో యుగ పురుషునిగా చెప్పుకోవచ్చు. ఈయన బెంగాలీ అయినా కటక్‌లో స్థిర పడ్డాడు. రామ శంకర రాయ్ 1880లో తన మొదటి నాటకం కంచికావేరీ ఒరియాలో రాసి ప్రచురించాడు. ఈ నాటకం 1881 ఫిబ్రవరి 7వ తేదీన కటక్‌లో ప్రదర్శింపబడింది. ఈ నాటకంలో అమిత్రాక్షర ఛందస్సును ఒరియా సాహిత్యంలో ప్రవేశ పెట్టాడు.

జగమోహన లాలా నాటకం సతి లో తత్కాల సమాజ చరిత్ర కనబడుతుంది. ధనవంతుల స్వేచ్ఛా ప్రవృత్తి, దురాగతాలు, కాముకత్వం మధ్యన స్త్రీ అసహాయ స్థితిని చూపిస్తూనే, హిందూ స్త్రీ సాంప్రదాయక దృఢత్వాన్ని, స్వావలంబనా కాంక్షనూ ఎత్తి చూపి, స్త్రీని శక్తి స్వరూపిణిగా చిత్రించాడు. ఈ కారణంగా సతి నాటకాన్ని విమర్శకులు అగ్రస్థానంలో నిలబెట్టారు.

నేటి స్త్రీవాద ధోరణికి వందేళ్ళ క్రితమే తాంబూలమిచ్చిన నాటకకర్త జగమోహన లాలా. 25 సంవత్సరాల క్రితం బెంగాలీ నాటకాన్ని సుసంపన్నం చేసిన జి.సి.గుప్తా, తారాశంకర సిక్దార్, రామ నారాయణ తర్కరత్న, ఉమేష్ చంద్ర మిత్ర, మైకేల్ మధుసూదన్ ప్రభృతుల ప్రభావం లాలా పై పడిందని చెప్పక తప్పదు. హిందీ నాటక కర్త భారతేందు హరిశ్చంద్ర నాటకాలు కూడా ఆ యుగపు నాటక రచయితలకు ఎంతో కొంత సాయపడి ఉంటాయి. జగమోహన లాలా ఒరియా నాటకరంగంలో ఆద్యుడయినప్పటి కీ, మొదటి విశిష్ట నాటక కర్త అన్న కీర్తి రామ శంకర రాయ్‌కే దక్కింది. మొత్తం 14 నాటకాలు రాసి ప్రథమ యుగాన్ని అధిగమించి, మరో 17 సం.లు రంగంలో నిలబడి ఉండటం ఇందుకు కారణం. ఈ ప్రథమ యుగాన్ని రామశంకరరాయ్ యుగం గా అభివర్ణిస్తారు ఒరియా సాహిత్య విమర్శకులు.

1900–1917 మధ్యకాలంలో రామశంకర రాయ్ మరో 7 నాటకాలు; *జగధర్మో* (1902), *కాంచన మాల* (1905), *చైతన్య లీల* (1906), *లీలావతి* (1912), *బడలోకా* (1913)లు సాంఘిక నాటకాలు; *బిస్వాయజ్ఞ* (1916) జాతీయోద్యమ నాటకం; రామాభిషేకొ (1917) రాశాడు.

అవినీతి, కుసంస్కారం, స్వార్థపరత్వం, మద్యపాన దోషాలు, కులం, అస్పృశ్యత, జమిందారుల అగడాలను ఎత్తిచూపించి సంఘసంస్కరణాభిలాషను ప్రకటించుకున్న రచయిత రామశంకర రాయ్. ఈయన మొదటి నాటకం కంచి కావేరీ 1881 ఫిబ్రవరి ఏడవ తేదీన, రెండవ నాటకం వనబాల 1882 ఫిబ్రవరి నాల్గవ తేదీన కటక్‌లో ప్రదర్శించినపుడు చాలా ఇక్కట్లు పడ్డారు. టిక్కెట్ల అమ్మకం, చందాల ద్వారా ప్రదర్శన ఖర్చుల్ని రాబట్టుకున్నాడు. *కలికాళ* (ప్రహసనం) 1883 మార్చి పదిన కటక్‌లో ప్రదర్శించి, తిరిగి అదే నెల 17-24 తేదీల మధ్య ప్రేక్షకుల కోరిక మీద పలు మార్లు ప్రదర్శించాడు.

ఔత్సాహిక నటుల్ని కూడగట్టుకుని, నాటకాలను రాగీమేళ గా ఏర్పడి అనేక కష్టనష్టాల కోర్చి ప్రదర్శనలిచ్చాడు. నటుల శ్రద్ధానిష్ఠలకు ముగ్ధులైన ప్రజలు ఎంతో కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. అలా పోగయిన ధనం కేవలం రూ. 56.00 మాత్రమే.

నాటకం రాసి, నట వర్గాన్ని ఏర్పరచుకుని, స్వయంగా నటిస్తూ కటక్‌లో ప్రదర్శనలు ఇస్తుండేవాడు. రంగస్థలం లేక చాలా ఇబ్బందులను ఎదుర్కొనేవాడు. నటులు ఉద్యోగస్థులు కావడం వల్ల బదిలీలయి దూరప్రాంతాలకు పోయేవారు. ముసలి తనం, చావుల కారణంగా నటవర్గం పలచబడేది. కటక్ నివాసి అయిన కాళీపద బందోపాధ్యాయ సహకారంతో *కలికాళ* ప్రహసనం పలు మార్లు ప్రదర్శనకు నోచుకోగలిగింది.

1884లో రామశంకర రాయ్ వకాలతీ పరీక్ష పాసయి వకీలుగా కటక్‌లో నిలదొక్కుకునే రోజుల్లో నాటక ప్రదర్శనలకు కొంత కాలం దూరమయ్యారు. కానీ వృత్తి రీత్యా సీనియరు వకీలైన దైతారీ రఘునాధ పురీతో పరిచయం కలిగింది. రఘునాధపురీ కొఠాపద గ్రామ మహంతగా ఉండేవాడు. ఈ పరిచయం ఒరియా నాటక రంగ పురోభివృద్ధికి దారితీసింది. రఘునాధపురీ తమ కొఠాపదా ఎస్టేటుకి రామశంకర రాయ్‌ను న్యాయ సలహాదారు ***(Legal Adviser)*** గా నియమించి వార్షిక వేతనంగా రూ.700.00 ఇస్తూండేవాడు. వకీలుగా చేరిన రామశంకర రాయ్ క్రమంగా నటునిగా, స్టేజ్‌మేనేజర్ ***(Stage Manager)***గా మారిపోయాడు. 1885లో కొఠాపద మఠ మహంత ఒక తాత్కాలిక రంగ స్థలాన్ని నిర్మించాడు. ఆ రంగ స్థలం రఘునాథ్ జీ గుడి దగ్గర ఉండేది. నాటక ప్రదర్శనకు అవసరమైన అన్ని హంగుల్నీ ఏర్పాటు చేయడమైంది. 1885 ఫిబ్రవరిలో ఇక్కడే కంచి కావేరీ ప్రదర్శింపబడింది.

ఈ ప్రదర్శన తర్వాత మహంతకీ నటవర్గానికీ మధ్య విడదీయరాని అనుబంధం ఏర్పడింది. అలా 3 సంవత్సరాలు నాటక ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. అంతలో కొఠాపదా తాత్కాలిక రంగ స్థలం పడిపోయింది. అప్పుడు మహంత చాలా డబ్బు ఖర్చుపెట్టి కటక్‌లో ఔత్సాహిక నటుల కోసం రంగస్థలాన్ని నిర్మించాడు. ఈ రంగస్థలం మీద 40 సంవత్సరాల పాటు నాటక ప్రదర్శనలు కొనసాగాయి. ఈ కొఠాపద రంగస్థలమే కాలాంతరంలో రఘునాథ థియేటర్ గా మార్పు చెందింది. 1885-1918మధ్య కాలంలో అనేక నాటకాలు ప్రదర్శింపబడ్డాయి. ఈ నాటకాలలో స్త్రీ పాత్రలను పురుషులే పోషించేవారు. ఒరియా నాటకరంగ చరిత్రలో నాటకకర్తగా, నటునిగా, ప్రయోక్తగా రామశంకర రాయ్, నిర్మాతగా మహంత రఘునాధపురీలు మరపు రాని మనీషులు. రఘునాథ థియేటర్ స్థాపన ఒక అపూర్వ ఘట్టం.


'నాట్య చేతన కథ'లో ఒక దృశ్యం

రామశంకర రాయ్ నుంచి సుమారు 1940 వరకూ మూడున్నర దశాబ్దాల పాటు ఒరియా నాటకరంగం క్రమాభివృద్ధిని సాధించింది. ఒరియా సాహితీ, సంస్కృతులకు పట్టుగొమ్మ అయిన కటక్ నగరంలో కాక, యితర ప్రాంతాల్లో కూడా విద్యాధికులు, ధనికుల సమిష్టికృషితో పలు నాటక ప్రదర్శన శాలలు నిర్మించబడ్డాయి. ఈ కాలంలో నాటక కళకు గుర్తింపు, ప్రజల ఆదరణ, జమీందారుల, సంస్థానాధీశుల అండదండలు లభించడం విశేషం.

ఖడియాల్ రాజపుత్రుడైన విక్రమ దేవ్ స్థాపించిన విక్రమ థియేటర్స్, పర్లాఖెముండి గజపతులయిన పద్మనాభ నారాయణదేవ్ స్థాపించిన పద్మనాభ రంగాలయ, చికిటిలో

రాజారాధామోహన్ రాజేంద్రదేవ్ నిర్మించిన రంగాలయ ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. ఇవి మాత్రమే గాక, నయాగడ్, నీలగిరి, బలంగీర్, తాల్చేర్ మొదలైన చోట్ల కూడా ఒక దాని తరువాత ఒకటిగా రంగస్థలాలు వెలిశాయి. అయితే ఈ రంగస్థలాలలో ఆయా రాజులు, రాజపుత్రులు రచించిన నాటకాలు మాత్రమే ప్రదర్శింపబడుతూండేవి. ఇతర విద్వాంసుల నాటకాలు ప్రదర్శింపబడడం చాలా అరుదు. గోపీనాథ నందా, మృత్యుంజయ రథొ నాటకాలు ఇందుకు సాక్ష్యాలు. ఒరియా నాటకరంగాభివృద్ధికి కటక్ పట్టణమే మూల స్థంభంగా నిలబడి ఉంది నాడూ నేడూ. ఈ పృష్ఠ భూమిలో సాగిన చారిత్రక పరిణామంలో సంస్కృత నాటకాలు, పౌరాణిక నాటకాలు క్రమంగా వెనకబడి పోగా, ఆంగ్ల నాటకాలు, సామాజిక నాటకాలు ముందు కొచ్చి సంఘ సంస్కరణాలాషకు పెద్ద పీట వేశాయి.

సాంఘిక నాటక రచయితల్లో రామ శంకర రాయ్ తరువాత చెప్పుకోదగిన వారు ముఖ్యంగా నలుగురున్నారు. కామపాల మిశ్ర (1875-1927), భికారీ చరణ్ పట్నాయక్ (1878-1962), గోదావరీశ మిశ్ర (1886-1957), అశ్వనీ కుమార్ ఘోష్ (1892-1962).

కామపాల మిశ్ర : ఈయన మూడు నాటకాలు రాశాడు. సీతా వివాహ *(1899)*, హరిశ్చంద్ర *(1902)*, బసంత లతికా *(1903)*.

వీటిలో మొదటి రెండూ పౌరాణికాలు కాగా మూడవది చారిత్రాత్మక వాసనలు గల కాల్పనిక నాటకం. రాజమందిరాలలోని వీర ప్రతాపాలకు, కుతంత్రాలకు అద్దం పట్టిన రచన. దీని మీద సమకాలీన బెంగాలీ నాటక కర్త దీన బంధు మిత్రా నాటకం నవీన తపస్విని (1863) ప్రభావం ఉన్నట్టు చెబుతారు విమర్శకులు. అయినప్పటికీ కామపాల మిశ్ర హరిశ్చంద్ర నాటకం పౌరాణికమే అయినా నాటి యుగ ధర్మాన్ననుసరించి గొప్ప నాటకమని చెబుతారు. సంఘ సంస్కరణాభిలాష అంతర్వాహినిగా సాగిన నాటకం ఇది. పౌరాణిక ఘటనలను పేర్చుకుపోతూనే, స్త్రీ హింస, బ్రాహ్మణుల దీనావస్థ, వృద్ధుల కామ తృష్ణ వంటి నాటి (నేటి) సామాజిక రుగ్మతలను బయట పెట్టాడు. కామపాల మిశ్ర సంభాషణలతో శ్లేషను, వ్యంగ్యాన్ని చొప్పించి ఒక కళంక రహిత సమాజ నిర్మాణం ధ్యేయంగా మలచబడిన నాటకం ఇది.

ఈయన సీతావివాహో నాటకాన్ని తర్వాతకాలంలో మోహన సుందర దేవ్ గోస్వామి సినిమాగా తీశాడు.

భికారీ చరణ్ పట్నాయక్ : ఆధునిక భావ జాలంతో సాంఘిక నాటకాలు రాసిన వారిలో చెప్పుకోవల్సిన నాటక కర్త భికారీ చరణ్ పట్నాయక్. ఈయన 11 నాటకాలు రాశాడు.

కటక్ బిజయొ (1901), అభూతొ ఆదర్శొ (1909), నందికేశ్వరీ (1915), రత్నమాల (1915), సంసార చిత్రొ (1915), సుశీల (1917), జౌతుకొ (1924), రాజా పురుషోత్తమ్ (1925), పద్మలోచనొ(1940), నిరుపమ (1952), కురుక్షేత్ర (1960).

భికారీ చరణ్ 1909-1925 మధ్య కాలంలో రాసిన నాటకాలనే ముఖ్యంగా పేర్కొనాల్సి ఉంటుంది. సంసార చిత్రొ, సుశీల, జౌతుకా ప్రజాదరణ పొందిన నాటకాలు. సమాజ దురాచారాల పట్ల రచయితకున్న ఏహ్యాభావం సుస్పష్టం. కటక్‌బిజయొ, రాజాపురుషోత్తమ్, రత్నమాల ప్రసిద్ధ నాటకాలు. మొత్తం మీద రామ శంకర, కామపాల నడచిన దారినే సంఘ సంస్కరణోద్దేశ్యంతో, ఒరియా నాటకాన్ని ముందుకు నడిపించిన నాటకకర్త భికారీ చరణ్.

గోదావరీశ మిశ్ర : ఈయన పురుషోత్తమదేవ్ (1916), ముకుంద దేవ్ (1920), అనే రెండు చారిత్ర నాటకాలు రాశాడు. ఒరిస్సాలోని ఇద్దరు ప్రముఖ రాజవంశీయుల చరిత్ర ఆధారంగా రాయబడిన రచనలివి. రెండు రాజవంశాల నడుమ సాగిన యుద్ధాలు, వైరాలు-వైషమ్యాలు, సాహస కృత్యాలు, విశ్వాస ఘాతుకాలు, కాపురుష లక్షణాలకు అద్దం పట్టిన రచనలుగా ప్రసిద్ధాలు. రాజవంశీయుల అవలక్షణాలను తూర్పార బట్టిన నాటకాలు ఒరియా సాహిత్యంలో అంతవరకూ వెలువడలేదన్నది సత్యం. నాటకాలలో జాతీయ భావనలు చొప్పించి, స్వాతంత్ర్య సంగ్రామ పథంలో పాఠకులనూ, ప్రేక్షకులనూ ఉత్తేజ పరచిన రచయిత గోదావరీశ మిశ్ర.

ద్వితీయ యుగంలోకి వెళ్ళేముందు 1900-1920 కాలంలోని కొందరు రాజామహరాజులు రాసిన నాటకాల గురించి తెలుసుకోవాలి.

చికిటి రాజాకిషోర్ చంద్రదేవ్ – విదగ్ధ మాధవ సిరియా (అనువాదం), రాధా మోహన రాజేంద్రదేవ్ – ప్రేమ తరంగొ, పరిమతా సహగమనొ, ప్రకృతరహస్యొ, ప్రకృతి పరిచయొ, శ్రీప్రతాప్, విశ్వంబర రాజేంద్రదేవ్ – బసంత రాహసొ, శారద రాహసొ, రాధా ప్రేమ లీల, కిషోర్ చంద్ర హరిచందన జగద్దేవ్ – ప్రహ్లాద, పద్మనాభ నారాయణ దేవ్ – అహల్యా శాపవిమోచన, దానపరీక్ష, గోరచంద్ర గజపతి నారాయణ దేవ్ – ధ్రువొ, వీర మిత్రోదయ సింహ్ – అభిజ్ఞాన శాకుంతలం అనువాదం, రత్నావళీ, ఖడియాల్ రాజా విక్రమదేవ్ – ప్రేమలత.

ఈ రాజ వంశీయుల నాటకాలు వారి స్వంత రంగస్థలాలలో ప్రదర్శింపబడేవి. మరో ముగ్గురు పండితులు కూడా యిదే కాలంలో నాటకాలు రాసేరు. గోపీ నాథ నంద – జానకీ పరిణయొ, ఉన్నతొరాఘవొ, హరి హర రథొ – వేణీ

సంహారొ, రావణవధ, రామాభిషేకొ, రామ నిర్బాసనొ, రామజన్మ ముత్యంజయ రథొ – ముద్రరాక్షసా, మిక్రమోర్వశీ (అనువాదం).

ద్వితీయయుగం (1915-1950) : ద్వితీయ యుగం 'అశ్వనీ కుమార్ యుగం'గా ప్రసిద్ధి చెందింది. ఒరియా నాటక సమ్రాట్ బిరుదాంకితులు. దాదాపు 23 నాటకాలు రాశాడు.

భీష్మ (1915–పౌరాణికం), *సావిత్రి* (1917–పౌరాణికం), *శివాజి* (1918–పౌరాణికం), *గోవింద విద్యాధర్* (1922–చారిత్రాత్మకం), సమలేశ్వరి (1925–చారిత్రాత్మకం), *కొళాపహాడా* (1926 –చారిత్రాత్మకం), *ఉత్కళ గౌరవ్* (1926–చారిత్రాత్మకం), *కోణార్క్* (1926–చారిత్రాత్మకం), *కేసరిగంగ* (1927– జానపదం), *పాయిక పువొ* (1933–జానపదం), *తాజమహల్* (జానపదం), *దాసియా బావురీ* (1933–జానపదం), *సాల్‌బెగ్* (1933–జానపదం), *త్యాగీ రామదాస్* (1933–జానపదం), *శ్రీమందిరొ* (1934–జానపదం), *భంజ భుజంగొ* (1936–సాంఘికం), *హిందూ రమణి* (1937–సాంఘికం), *భాయి* (1941–సాంఘికం), *బంధుమహంతి* (1944–జానపదం), *చండాళుణీ* (1946–జానపదనాటకం), *శ్రీలోకనాథ్* (1946–సాంఘికం), *చాసాఝియొ* (1946–సాంఘికం), *మామలత్‌కార్* (1947–సాంఘికం).

1915లో అశ్వనీ కుమార్ రచించిన భీష్మ ప్రదర్శింపబడి, మేధావుల్ని బాగా అలరించింది. ఆ రోజుల్లో పాఠకులు, ప్రేక్షకులు చారిత్రాత్మక , పౌరాణిక నాటకాలను విశేషంగా ఆదరించేవారు. వీర గాథలకు, దేశభక్తి భావాలకు నీరాజనాలిచ్చేవారు. భీష్మ నాటకం విజయవంతమయ్యే నాటికి అశ్వనీ కుమార్ 23 సంవత్సరాల యువకుడు. ఆ హుషారులో మరో 22 నాటకాలను రెండు సంవత్సరాల వ్యవధిలో రాసి ప్రచురించాడు.

ఫలితంగా రామ శంకరరాయ్ తర్వాత గొప్ప నాటకకర్తగా అశ్వనీ కుమార్ మిగిలిపోయాడు. ఒరియా నాటకరంగ చరిత్రలో దేశ స్వాతంత్ర్యానంతరం కూడా, బెంగాలీ నాటకాల ప్రభావంతో ఆయన నాటకాలు రాస్తూనే ఉండేవాడు. 1915–1962 మధ్యకాలంలో మరో ఎనిమిది నాటకాలు రాసి ప్రచురించాడు. 1962లో ఆయన రాసిన చివరి నాటకం భువనేశ్వర్ ఒక విలక్షణ నాటకం. 1950 దశకంలో ఒరియా నాటకరంగంలో వచ్చిన అనేక మార్పుల వల్ల ఈ దశకంలో రాసిన ఈ నాటకాలు పూర్వనాటకాల లాగా విజయవంతం కాలేకపోయాయి. ఫలితంగా 1930–40 మధ్య రాసిన నాటకాల ద్వారానే ప్రసిద్ధి చెందిన అశ్వనీ కుమార్, స్వాతంత్ర్యానంతర నాటకకర్తల గణనలోకి రాలేకపోయాడు. అయినప్పటికీ ఒరియా జాతి స్వాభిమానాన్ని జాగృత పరచిన అశ్వనీ కుమార్ 1930–40 సంవత్సరాల మధ్యకాలంలో వచ్చిన నాటకకర్తల నడుమ విరాట్ మూర్తిలా నిలబడతాడు.

ఈ యుగంలో ప్రధానంగా చారిత్రాత్మక నాటకాలే వచ్చినప్పటికీ, సాంఘిక నాటకాలపై కూడా దృష్టి సారించారు రచయితలు. ఈ యుగంలోని నాటక రచయితల మీద ఆంగ్లనాటక ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. సంగీతాన్ని నాటకంలో అవసరానుగుణంగా వాడుకోవడం ఈ యుగలక్షణం. హాస్య రస ఘట్టాలను ప్రథమ యుగంలో వలె కాకుండా, సున్నితపరచి సందర్భానుసారంగా వాడుకోవడం మరొకమార్పు. కథను సూటిగా స్పష్టంగా నడిపించడం కూడా ఈ యుగ లక్షణమే. మాతృ భూమి, మాతృ భాష పట్ల నాటక కర్తలకు గల మమత స్పష్టపడింది ఈ యుగంలోనే.

తృతీయ యుగం (1950-1960) : పందొమ్మిదో శతాబ్దపు చివరి కాలం నుంచి ఆరంభమైన ఒరియా నాటకరంగం ఇరవైయో శతాబ్దపు పంచమ దశకారంభం నాటికి నాటకీయంగా పరిపూర్ణతను సాధించింది. 1950-1960 దశకంలో ఒరియా నాటకాన్ని అనుభూతి మార్గాన నడిపించిన మొదటి స్వాతంత్ర్యానంతర విశిష్ట నాటక కర్త కాళీ చరణ్ పట్ట నాయక్ (1898–1928). జీవితాన్ని నాటక కళకు సమర్పించిన కాళీ చరణ్ 40కి పైగా నాటకాలు రాశాడు.

1918–1938 వరకూ పౌరాణిక యితివృత్తాలను స్వీకరించి ధ్రువొ (1918), శకుంతల (1920), హరిశ్చంద్ర (1923) మొదలైన నాటకాలు రాశాడు. బనబిహార్ (1927), *కిషోర్ చంద్రానన చంపూ* (1932), *ప్రీతి సుధాకర* (1937), మానిని (1938) వంటి శ్రీ కృష్ణలీలలు ఆధారంగా కొన్ని లీలలు కూడా రాశాడు.

కాని, 1940–41లో ఆయన తన మార్గాన్ని మార్చుకుని పౌరాణిక నాటక రచనకు స్వస్తి చెప్పి, సమకాలీన సమాజావసరాలకు తగినట్టుగా సాంఘిక నాటకాలు రాశాడు. 1934–35 సంవత్సరాల మధ్య కాలంలోనే ప్రతిశోధ్, ఆహుతి వంటి సాంఘికాలు రాయకపోలేదు. ప్రతిశోధ్ ముక్కుపచ్చలారని కన్నె పిల్లలను పండుబారిన ముదుసలులు వివాహమాడడం మీద తిరుగు బాటు రచన. ఆహుతి, ప్రేమకు కులగోత్రాలు అడ్డు గోడలు కారాదు అని చెప్పిన నాటకం.

1940 తరువాత కాళీబాబు సాంఘిక నాటకాలు మాత్రమే రాశాడు. *గర్ల్ స్కూలు* (1941) కాళీబాబుకి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఒరిస్సాలో గర్ల్ స్కూల్సు ఉండేవి కావు. కటక్ రెవెన్యూ స్కూలు కాళీబాబుకి ప్రేరణ ఇచ్చిందనవచ్చు.

స్వయంగా ఒరిస్సా థియేటర్స్‌ను స్థాపించి అందులో తన *గర్ల్ స్కూలు* నాటకం ప్రదర్శించాడు కాళీబాబు. గాంధీజీ సిద్ధాంతాలకు ప్రచారం, పాశ్చాత్య విద్యాభ్యాసం వల్ల కలిగిన చెడు

పరిణామాలు, వీటిని ప్రదర్శిస్తూనే కామలాలస నిజమయిన ప్రేమకు పునాదికాదు అని చూపించడం జరిగింది. మరు సంవత్సరం చుంబనొ (ముద్దు) నాటకం ప్రదర్శించాడు. కథా వస్తువు ఒకటే అయినా ఈ నాటకం పేరే ఆరోజుల్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఈ రెండు నాటకాలు విజయఢంకా మ్రోగించేక కాళీబాబు **1944** లో *భాతొ* నాటకం రాశాడు. అదీ విజయవంతమైంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన కరువు, ఉన్న వారికీ లేని వారికీ మధ్య గల సంఘర్షణ దీనిలోని కథా వస్తువు. భాతొ తర్వాత కాళీబాబు సంవత్సరానికి ఓ నాటకం ప్రకారం **1947** వరకూ మరో నాలుగు నాటకాలు రాశాడు. వనమాల *(1944), బేకార్ (1945),* హరణో చాతొ *(1946), రక్తమాటి (1947).* **1953**లో సంధానొ నాటకం రాసాడు. దీర్ఘకాల విరామం తరువాత **1968**లో హీరాఖండ్ నాటకం రాశాడు. ఇది ఆయన రచించి ప్రదర్శించిన చివరి నాటకం. ఒక్క హీరాఖండ్‌ని మినహాయిస్తే, కాళీబాబు నాటకాలన్నీ థీమ్ **Boy meets the Girl** అనే వస్తువు మీద రాసినవే. అయినప్పటికీ సామాజిక సమస్యలను ఈ చట్రంలో బిగించి నాటకాలకు పుష్టిని చేకూర్చాడు.

1968లో రాసిన హీరాఖండ్, నూతన పంచవర్ష ప్రణాళికలు దేశంలో తెస్తున్న ఆర్థికాభివృద్ధిని సూచన ప్రాయంగా తెలియజేసిన నాటకం. విమర్శకులు కాళీబాబు నాటకాలను వస్తు రీత్యా పౌరాణికాలు, చారిత్రాత్మకాలు, సాంఘికాలుగా విభజిస్తారు గానీ, మరికొందరు ఈ విభజనను అంగీకరించరు. వీరి నాటకాల్లో ఈ మూడింటి మిశ్రమం ఎంతో కొంత ఉంటుందన్నది వీరి వాదం. ఉదాహరణగా **1946**లో రాసిన అభియాన్ నాటకంలోని పాత్రలు చారిత్రాత్మకం, కథ కింవదంతి ఆధారితం, సందేశం దేశ భక్తి పూరితం. ఒరియా జాతి స్వాభిమానానికి తాంబూల మిచ్చిన నాటకం యిది. అభియాన్ వీరి అత్యుత్తమ నాటకంగా పేరు తెచ్చుకొంది.

నాటక ప్రదర్శనలో కాళీబాబు కొన్ని మార్పులు చేశాడు. సరళ భాష వాడకం, సృజనాత్మకతకు, కాల్పనికతకు పెద్ద పీట ప్రేక్షకుల రసానుభూతికి ప్రధాన లక్ష్యం, స్త్రీ పాత్రలను స్త్రీలతోనే నటింపజేయడం, సన్నివేశానికి తగిన సంగీతం, హాస్య ఘట్టాలను ప్రధాన కథతో అనుసంధానించడం, ఏకాంకికలు రాసి ప్రదర్శించడం మొదలైనవి.

ఈ మార్పుల వలన రామ శంకర రాయ్‌తో ప్రారంభమైన ఒరియా నాటకం, కాళీ చరణ్ పట్టనాయక్ చేతిలో శిఖరాగ్రానికి చేరుకుంది. కాళీచరణ్ పట్టనాయక్ సమకాలికులైన ఇతర ప్రముఖ నాటక రచయితలు వీరు ;

రామ చంద్ర మహాపాత్రొ : ఈయన మూడు నాటకాలు రాశాడు. *రఘు అరక్షితొ, సుదామ, బల్వమంగళ.*

అద్వైత చరణ్ మహంతి: ఈయన నాలుగు నాటకాలు రాశాడు. మాధవ ఝియొ, నరదేవత, రాధిక, పరిచయొ.

ఉదయ నాథ మిశ్ర : ఈయన ఏడు నాటకాలు రాశాడు.

ప్రాణబంధుకరొ : కొన్ని నాటకాలు రాసినా ఈయన నాటిక రచయితగానే ప్రసిద్ధుడు. స్వేతపద్మొ నాటిక ఒక అద్భుత సృష్టి. ఈయన రాసిన ప్రతీ నాటికా విజయవంతమయింది.

ఒరియా సాహిత్యంలో సుప్రసిద్ధ నవలలకు ఈయన నాటక రూపం ఇచ్చి ప్రశంసలందుకున్నాడు. కాళిందీ చరణ్ పాణిగ్రాహి నవల మాటిరొ మణిసొ కు వీరి నాటకీకరణ బహుధా శ్లాఘించబడింది. అనేక ప్రదర్శనలకు నోచుకున్న నాటకం ఇది. వీరి అశాంతొ చిరకాలం నిలిచే రచన.

రఘునాథపండా : శివాజీ, సర్పంచ్ రచనలు చేశాడు. ఇంకా ఎందరో ఇతరులు నాటక రచనలు చేసిన వారున్నారు.

20వ శతాబ్దపు ప్రథమ దశకంలో పూరీ జిల్లా బలంగీర్ పట్టణ ప్రముఖులు బనమాలీపతి మొదటిసారిగా బనమాలీ థియేటర్స్ ను స్థాపించి వృత్తి కళాకారులకు ఓదారి చూపారు. దాని ప్రేరణగా తీసుకుని, వృత్తి నాటక కళా కారుల కోసం ప్రయత్నాలను సాగించిన చిరస్మరణీయుడు కాళీచరణ్ పట్నాయక్. **1929**లో ఈయన సాక్షిగోపాల్ నాట్య సంఘం స్థాపించాడు. ఈ సంఘ సేవల ఫలితంగానే **1939**లో ఈయనకు ఒరిస్సా థియేటర్ ను నిర్మించే అవకాశం లభించింది. ఒరిస్సా థియేటర్ స్థాపనతో ఒరిస్సాలో పౌరాణిక, చారిత్రాత్మక నాటకాలకు తెరపడి, సాంఘిక నాటకాల యుగం ప్రారంభమైంది. ఆ రకంగా కాళీ చరణ్ పట్టనాయక్ కాళీబాబుగా పేరుపడి, ఆధునిక ఒరియా నాటక రంగానికి జనకులయ్యేడు.

చతుర్థయుగం – ఆధునిక యుగం (1960-1970):

కాళీచరణ్ పట్టనాయక్ యుగం నుంచి ఇది ఏ రకంగానూ భిన్నం కాకపోయినప్పటికీ, సమ సమాజ చిత్రణ ఈ యుగపు ప్రత్యేక లక్షణంగా కనబడుతుంది. అద్వైత చరణ్ మహంతి నాటకాలు ఇందుకు ఉదాహరణలు. ప్రాణ బంధుకరొ అశాంతొ అత్యాధునిక రచన. లక్ష్మీధర నాయక్ లాలా చాబుక్, జమిందార్, పురుషోత్తమ పాణిగ్రాహి మాపువొ ప్రశంసనీయమైన ఆధునిక నాటకాలు. ఈ కాలంలోనే రామచంద్రొ మిశ్ర గొప్ప నాటక రచయితగా ఎదిగాడు. ఒరియా జాతిగా భావి ఆశలకూ, ఆకాంక్షలకూ అద్దం పట్టిన అనేక నాటకాలు రాసిన రచయిత ఈయన. ఒరియా ప్రేక్షకులు మరచిపోలేని వీరి నాటకాలు ఇవి: కవి సూర్జ్యొ, మూలియా, అభిమానొ, ఘరొసంసారొ, భాయి భవుజ, సాయి పొడిసా, మమత, నరోత్తమదాస్ కోహే .

కుసంస్కారం పట్ల అవిరామ సంగ్రామాన్ని కొనసాగించిన నాటక రచయిత రామచంద్ర మిశ్ర. భారతీయ సంస్కృతి పట్ల వీరికి గాఢాను రాగం ఉంది. గ్రామ

పంచాయితీల పట్ల వీరు ప్రకటించిన భావాలు గ్రామ రాజకీయాలకు అద్దం పడతాయి. గాంధీజీ రామరాజ్య స్వప్నాలను కలుషితపరుస్తున్న గ్రామ రాజకీయాలను ఎద్దేవాచేసాడు.

కార్తీక కుమార్ ఘోష్ కళింగ రాధాకృష్ణ థియేటర్స్‌తో **తమ నట జీవితాన్ని ఆరంభించి, ఒరిస్సాలోని అన్ని రంగస్థలాల తోనూ సంబంధాలు పెట్టుకున్న నాటక కర్త.** నటునిగా కూడా ప్రఖ్యాతి పొందిన ఈయన అనేక అనువాద నాటకాలు రాశాడు. కానీ వీరి స్వంత రచనలే ఒరియా ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేశాయి. మాతృపూజ, మీర్‌ఖాసిమ్, లక్షహీరా, రక్తరొడాకొ, గురుదక్షిణ, బిచారొ, ఎమితి బిహయె, జవాన్, కా ఆగే కొహిబా, సెదినొ రాతిరె మొదలైనవి వీరి ప్రసిద్ధ నాటకాలు. పాత్రోచిత భాషా ప్రయోగం, సున్నిత రసావిష్కరణ ఈయన ప్రత్యేకతలు.

తర్వాత చెప్పుకోవల్సిన నాటక రచయిత గోపాల ఛెట్ రాయ్. 1940-41లో కటక్‌లో భారతీ థియేటర్స్‌లో నటునిగా ఉండేవాడు. కాలక్రమంలో నాటక రచయితగా ఎదిగాడు. ఈయన రచనలు : సహధర్మిణీ (నాటిక) (1946), ఫెరి ఆ (నాటకం) అన్నపూర్ణా థియేటర్స్ లో ప్రదర్శింపబడింది, భరోసా (నాటకం) (1952) గొప్పనాటకం. కథ, సంభాషణలు, ప్రదర్శన, పాత్రచిత్రణ, ఉత్తమ స్థాయికి చేరుకున్న నాటకం. ఈయన ఇతర నాటకాలు : పరకలమ్, శంకా సింధూరొ, పథికబంధు, నష్ట ఊర్వశీ అర్ధాంగిని, నువాసువు, అభాగిని రొస్వర్గొబ మొదలైనవి. కొన్ని ఒరియా నవలలకు కూడా నాటక రూపం ఇచ్చి ప్రదర్శించాడు.

సురేంద్ర మహంతి, భువనేశ్వర్ మహాపాత్రొ, సాపుటాపుల, జదునాథ్‌దాస్ మహాపాత్రొ, నరసింహ మహాపాత్రొ, దనేశ్వర పట్టనాయిక్, శారదా నాయక్, బ్యామకేశ్ త్రిపాఠీ, ఆనంద శంకరదాస్, బలరామ్ మిశ్ర, నీలకంఠ మిశ్ర, రజిత కుమార్ కరొ ఇదే యుగానికి చెందిన ఇతర నాటక రచయితలు చందనొ హజారీ, దాబీ, బిప్లవీ సురేంద్రసాయి, అంధపుటుళీ.

అత్యాధునిక యుగం (1970-1990) : ఒరియా నాటకరంగానికి క్షీణదశ పట్టిన కాలం ఇది. 1930-1940 సం.ల మధ్య ఒరియా నాటక రంగం మహోజ్వలంగా వెలిగింది. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం కూడా కటక్‌లో అన్నపూర్ణా థియేటర్స్, ఒరిస్సా థియేటర్స్‌లలో పోటాపోటీలు మీద వారానికి ఆరు రోజులు నాటకాలు ఆడుతూండేవి. ప్రజలు టిక్కెట్లు కొనుక్కుని చూస్తుండేవారు. 1950లో రూపశ్రీ, 1953లో జనతా థియేటర్స్ కూడా ఏర్పాటయ్యాయి. కానీ ఈ రెండూ ఎంతో కాలం బతికి బట్టకట్ట లేకపోయాయి. 1977లో కళాశ్రీ పేరిట మరో థియేటర్ వెలిసింది. ఒరిస్సాలోని చిట్టచివరి థియేటరు కళా శ్రీ. 1950 నుంచి క్రమంగా వీటి ప్రభ తగ్గి 1970 తరువాత అంతరించిపోయాయి. ఒక కాలంలో ఓ వెలుగు వెలిగి, ఆతర్వాత క్షీణించి పోవడానికి గల కారణాలివి.

1. వస్తు దారిద్ర్యం : సమకాలీన సమాజాన్ని ప్రతి ఫలించిన కథా వస్తువు ఉన్నంతకాలం నాటకాలు బాగానే నడిచాయి. ఫ్యూడల్ వ్యవస్థ ప్రభావం గట్టిగా ఉన్నంతకాలం జమీందారులు బక్క రైతుల సంఘర్షణలు గల నాటకాలు విజయవంతమయ్యాయి. జమీందారీ వ్యవస్థ రద్దయిన తర్వాత కూడా ఇవే నాటకాలు రాస్తే ప్రజలు చూడలేదు. పట్టణ, గ్రామీణజీవన సంఘర్షణ చూపించిన నాటకాలు కొంతకాలం నడిచాయి. పట్టణవాసులు మోసకారులు, గ్రామీణులు అమాయకులు అని వ్యక్తీకరించే నాటకాలు మొదలయ్యాయి. చుంబనొ, ఫెరి ఆ, అభిమానొ, భాతొ స్వాతంత్ర్య సంగ్రామ గాథలు నాటకాలుగా నడిచాయి. భంజకిషోర్ పట్టనాయక్ రాసిన జహోర్, రక్తమాటి, ఘటాభూయిం మొదలైనవి ఈ కోవకు చెందిన నాటకాలు.

ప్రపంచ యుద్ధం ముగిసింది. స్వాతంత్ర్యం వచ్చింది. ఆర్థికాభివృద్ధి వైపుగా దేశం సాగుతూంది. క్రమంగా పారిశ్రామికీకరణం మొదలైంది. కానీ పారిశ్రామిక రంగానికి సంబంధించిన కథలు నాటకాలుగా రాలేకపోయాయి. యజమాని-కార్మిక సంబంధాలను పూర్వపు నాటక రచయితలు రాయలేక పోయేరు. వారికది అచుంబితమయింది. నల్లధనం ప్రభావంగా సామాజిక జీవనంలో అనేక స్థాయిల్లో వచ్చిన మార్పుల్ని శక్తివంతంగా ప్రతి ఫలించలేకపోయారు నాటక కర్తలు. ప్రేక్షకులు కొత్త కథలనూ, కొత్త ముఖాలనూ ఆశించగా వారికి నిరుత్సాహం మిగిలింది.

ఈ తరుణంలో నాటకాన్ని సజీవంగా ఉంచే నిమిత్తం, ఒరియా కవి పండితుల జీవిత గాథలను నాటకాలుగా రాసి ప్రదర్శించడం మొదలు పెట్టారు. ఉపేంద్రభంజ, కవిగోపాల కృష్ణ మొద. నాటకాలు వచ్చాయి. పరిశోధన చాలక రచన పేలవమయి ప్రజలను ఆకట్టుకోలేకపోయాయి.

2. ఔత్సాహిక నటుల పోటీ : వృత్తి కళాకారులకు పోటీగా ఔత్సాహిక కళాకారులు అవతరించారు. వీరిలో ప్రతిభా వ్యుత్పత్తులు అధికం. కొత్త భావాలు గల కథా వస్తువులతో పాటు కొత్త ముఖాలను పరిచయం చేయడంతో వృత్తి కళాకారులు ఈ పోటీని తట్టుకోలేకపోయారు.

3. ఆర్థిక లావాదేవీలు : వృత్తి కళాకారులు నాటకం మీద ఆధారపడి జీవించే ప్రాణులు. అన్నపూర్ణా థియేటర్స్ అధినేతలు లాభాలు తగ్గగానే థియేటర్స్ మూసేసారు. ఔత్సాహిక నటులకు నష్టం గురించిన చింత ఉండదు. టిక్కెట్లు మొహమాటపెట్టి అమ్మి, చందాలెత్తి, ఖర్చులు పెట్టుకుంటూ సంవత్సరానికి ఓ నాటకం ఆడి చేతులు కడుక్కుంటారు.

4. ఔత్సాహిక కళాకారుల కృషి : వృత్తి కళాకారులు, వారి థియేటర్లు మూలపడగానే ఔత్సాహిక కళాకారులు వెలుగులోకి వచ్చారు. వకీలు శివప్రసాద్ మిశ్ర వంటి ఉత్సాహవంతులు కలకత్తా వెళ్ళి మంచి నాటకం చూసి, వాటిని యథాతథంగా ఒరియాలో ప్రదర్శించడం మొదలు పెట్టారు. సరుకంతా కలకత్తాదే. కేవలం నటులు ఒరియా వారు. సంభాషణలు ఒరియా భాషవి. మేకప్‌మెన్ కూడా కలకత్తా వాడే. గౌన్తి యాబాయి, సంబల్ పురీ ఒరియా లో వచ్చిన ఓమంచి నాటకం–ఈ ఔత్సాహిక కళాకారుల సృష్టే.

5. ఇతర కారణాలు : వృత్తి కళాకారుల్లో సంఘీభావంలేక పోవడం, కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వక పోవడం, ప్రచార మాధ్యమం లేకపోవడం కూడా కారణాలయ్యాయి.

కటక్‌లో ఒకనాడు జ్వాజ్వల్యమానంగా నడచిన థియేటర్స్, ఒరిస్సాథియేటర్సు, అన్నపూర్ణా థియేటర్స్, తర్వాత వచ్చిన జనతా, కళాశ్రీ థియేటర్స్ అంధకారంలోకి వెళ్ళిపోయాయి. 1970 తరువాత ఒరియా నాటక రంగం గురించి రాయడానికి యింకేమీ మిగల్లేదు. ఇప్పుడు కేవలం ఔత్సాహిక కళాకారులు ప్రదర్శించే అరాకొరా నాటక ప్రదర్శనలు చూసి, వాటిని సమీక్షించుకుంటూ తృప్తి పడాల్సిందే.

1877–1977 వరకూ గల వంద సంవత్సరాల ఒరియా నాటక రంగం చరిత్రలో వృత్తి కళాకారుల థియేటర్స్ చరిత్ర కేవలం 60 సంవత్సారాలే. షష్ఠి పూర్తి తోపాటు నూరేళ్ళ పండించుకుంది ఒరియా నాటక రంగం. గత పది సం.లుగా (1990-2000) రూర్కెలా లోని కల్చరల్ ఎకాడమీ సంస్థ ఒరియా నాటక రంగ పునరుద్ధరణకై కంకణం కట్టుకుని, లోక్–నాటక మహోత్సవాలను స్థానిక సివిక్ సెంటర్లో నిర్వహిస్తూంది. ఒరిస్సాలోని అన్ని ఔత్సాహిక నాటక సంస్థలు ఈ నాటక పోటీల్లో పాల్గంటున్నాయి. ఈ కార్యక్రమం జనాదరణను పొందుతూంది. మంచి నాటకాలే వస్తున్నాయి. ప్రమోద్ త్రిపాఠీ, పూర్ణమల్లిక్, రమేశ్ దాస్, ప్రదీప్ భౌమిక్, పంచానన పాత్రో, శంకర త్రిపాఠీ, రణజిత్ పట్నాయక్, సోభన్ దాస్, దివాకర షడంగీ ప్రభృతుల నాటకాలు ఒరియా ప్రేక్షకులను మళ్లా తలెత్తుకునేలా చేసిన రచనలు.

కల్చరల్ ఎకాడమీ, రూర్కెలా యిచ్చిన స్ఫూర్తితో ఇతర చోట్ల కూడా నాటక పరిషత్తులు ప్రారంభమవుతున్నాయి. 21వ శతాబ్దారంభంతో నాటకం పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. భవిషత్తు ఆశావహంగా ఉంది.

మ.రా.శాస్త్రి

కన్నడ నాటకరంగం

కస్తూరి పరిమళాలు వెదజల్లుతూనే భారతీయతలో ఇమిడి పోయే ప్రత్యేకతను సంతరించుకున్నది కన్నడ నాటకరంగం. పాశ్చాత్య నాటకాల ప్రభావాలకు లోనై, ఆ ప్రలోభాలను దాటి, సంస్కృత నాటక శైలీ సంప్రదాయాలను అద్దుకుని, ఆధునికంగా ఎదిగి సమకాలీనతకు అద్దం పడుతోంది నేటి కన్నడ నాటకం. నాటకం, రంగస్థలం మీదే అర్ధవంతమయినా, అది సాహిత్యంలో భాగంగానే పరిగణించబడుతోంది.

కన్నడ నాటకరంగ చరిత్రలో మూడు ప్రత్యేక మయిన విభాగాలు సుస్పష్టంగా కనిపిస్తాయి. ఒకటి జనపద రంగభూమి, రెండవది వృత్తి రంగభూమి (**Professional theatre**), మూడవది ఔత్సాహిక రంగ భూమి (**amateur theatre**). జనపదాల్లో నాటకీయతను సంతరించుకున్న నృత్యరీతుల్నే మొదటి నాటకాలుగా విశ్లేషించారు. డొళ్ళుకుణిత, గొందలినళమేళ, కోలాట, భాగవంతికె మేళ, భూత నృత్య, సుగ్గికుణిత మొదలైన పేర్లతో గ్రామాల్లో పండుగల్లో, పూజలలో భాగంగా ప్రదర్శింపబడేవి.

దక్షిణ కర్ణాటకలోని భూతారాధనె దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇప్పటికీ సొందె అన్న పుణ్యక్షేత్రంలో హయవదన మూర్తిని ప్రతిష్ఠించుకుని ఉపాసిస్తూనే మరొక వైపు సంధ్యాకాలంలో భూతరాజుకు నివాళి ఇస్తారు. అన్నంలో కుంకుమ కలిపి బలికి ప్రతీకగా అర్పిస్తారు. పెద్దగా గంటలు మోగిస్తూ,దీప ధూప నైవేద్యాలతో, భక్తితో జరిపించే ఈ క్రతువు ఎంతో నాటకీయంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో ప్రతి పల్లెలోనూ ఒక నిర్దిష్ట స్థలంలో జట్టుగ, బబ్బుర్లి, కల్కుడ, పంజుర్లి మొదలైన భూతాలను ఊరిమీద పడకుండా భూస్థాపితం చేస్తారు.

శక్తి పూజలో భాగంగా రూపు దిద్దుకున్న మరొక ప్రక్రియ ఎల్లవ్వన కుణిత. కుణిత అంటే గెంతటం అని అర్థం. తాళ బద్ధంగా అడుగులేస్తూ నాట్యం చేయడం. బెళగాం జిల్లాలోని ఏళుకాళద లోని ఎల్లవ్వ క్షేత్రానికి ఈ కుణితలో పాల్గనడానికి కర్ణాటక నుండే కాక పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు విపరీతంగా వస్తారు. ప్రాచీన కాలం నుంచి నిర్వహిస్తూవున్న ఈ క్రతువులో ఆ ఎల్లవ్వకే తమ జీవితాన్ని ముడుపుగా పెట్టిన జోగప్ప, జోగవ్వ మొదలైనవారు ఆ తల్లి

'గదాయుద్ధ' యక్షగానం

కథాచరిత్రను తుంతుణి, బేడికె అనే సంగీత సాధనాలతో ఆడుతూ పాడుతూ అభినయిస్తారు. ముఖాలకు తొడుగులు (Mask) వేసుకుంటారు. వీటిని గుడి ఆవరణలో ప్రదర్శిస్తారు. అంటే ఒక రకంగా వీధి నాటకాలనే చెప్పుకోవచ్చు. ప్రకృతి ఒడినే రంగస్థలంగా, ప్రేక్షకుల రసానందమే పురస్కారాలుగా, ప్రజలను అలరించడమే లక్ష్యంగా పెట్టుకున్న ఆనాటి కళాకారులకు నటన సహజంగా అబ్బిన విద్య.

యక్షగానం : యక్షగానాల ప్రసక్తి చాలా ప్రాచీనంగా ఉన్నా వీటి గురించిన నిర్దిష్టమైన వివరాలు లభించేది 16వ శతాబ్దినుండే. ఉత్తర కర్ణాటకలోని శివ మొగ్గ, చిక్కమగళూరు యక్షగానాలకు పుట్టిల్లు. విష్ణువు దశావతారాల చుట్టూ అల్లిన కథల్లోంచి పుట్టుకొచ్చిన వస్తువుల నుండి రూపుదిద్దుకున్న యక్షగానాల్ని భాగవత ఆట అని కూడా అంటారు. భక్తిరస ప్రధానంగా సాగే ఈ యక్షగానాల్లో ముఖ్యపాత్ర భాగవతుడిది. ఈయన నిర్దేశకుడు కూడా. భాగవతుడు యక్షగానాల్లోని పాత్రల్ని పరిచయం చేస్తాడు. నాటకీయంగా అక్కడక్కడా కథను కలుపుతాడు. నాటక రంగం మీద ప్రదర్శనకు వీలు కాని ఘట్టాలను పాడి వినిపిస్తాడు. ఒక విధంగా ఇతని పాత్ర గ్రీకు నాటకాల్లోని కోరస్ (Chorus) లాంటిదని చెప్పవచ్చు.

యక్షగానాల్ని ఆరు బయటే ప్రదర్శిస్తారు. విశాలమైన మైదానంలో 20 అడుగుల వెడల్పు, 30 అడుగుల ఎత్తు ఉన్న వెదురు బంగులు నాటి రంగ స్థలాన్ని తయారు చేస్తారు. వాటికి అరటి చెట్లు కట్టి, మామిడి తోరణాలతో అలంకరిస్తారు. వెనక ఒక మంచాన్ని నిలబెడతారు. పక్కగా రెండు బెంచీలు వేసి భాగవతుణ్ణీ, వాద్యకారుల్నీ, సంగీత కారుణ్ణీ కూర్చోబెడతారు. రాజుపాత్ర గానీ, ముఖ్యపాత్రగానీ కూర్చోటానికి రంగస్థలం మధ్యలో ఒక కుర్చీ ఉంటుంది. భాగవతుడి ఎడమ వైపు నుండి పాత్రలు రంగ ప్రవేశం చేస్తాయి. మూడు వైపులా ప్రేక్షకులు కూర్చుని యక్షగానాన్ని చూస్తారు. దూరంగా చాపలతో ఒక గది (Makeshift) ని తయారు చేసుకుని పాత్రలు రంగులు వేసుకోడానికి ఉపయోగిస్తారు. గణపతి స్తుతి, దైవ ప్రార్థనతో నాటకం మొదలవుతుంది.

యక్షగానాల్లో ఆహార్యం అపూర్వంగా ఉంటుంది. వీటిల్లో పాత్రలు మానవాతీతాలు (Super natural) రామకృష్ణుల్లాంటి అవతార మూర్తులు, పాండవ కౌరవుల్లాంటి రాజులు, రాక్షసులు, కిన్నెరలు, గంధర్వులు, అప్సరసలు మొదలైనవారు. ఇన్ని వైవిధ్యమైన పాత్రల్ని అర్థవంతమైన రంగుల్తో, హంగుల్తో, masks తో ఎలా ప్రదర్శిస్తారో యక్షగానాలు చూస్తే గానీ అర్థం కాదు.

యక్షగానంలో మరో అందమైన విషయం పాత్రలను ప్రేక్షకులకు పరిచయం చెయ్యటం. ముఖ్యమైన పాత్ర రంగప్రవేశం చేస్తుండగానే ఇద్దరు వ్యక్తులు వారికి ఒక చిన్న తెరను అడ్డంగా పట్టుకుంటారు. ఆ పాత్ర ప్రేక్షకులకు నమస్కరించి, నేపథ్యం వైపుకి తిరిగి తాళ, లయబద్ధంగా ఆడుతుంది. భాగవతుడు ఆ పాత్ర గురించీ, దాని వైశిష్ట్యం గురించీ చెప్తూ ఉంటే, తెర కొంచెం కొంచెం పైకి తీస్తారు. ప్రేక్షకుల్లో కుతూహలాన్ని పెంచుతూ, పాట ముగిసేటప్పటికి తెరతీసేసి పాత్రను పరిచయం చేస్తారు.

యక్షగానం- పేరు సూచించే లాగునే ఒక సంగీత విధానం. ప్రసిద్ధమైన రాగాలను ఎన్నుకుని, నవరసాలతో భక్తి ప్రధానమైన కథావస్తువును నాటకీయం చేస్తుంది యక్షగానం. కుమారవ్యాస, లక్ష్మీశ, షడక్షరి, తొరవె నరహరి మొదలైన మహాకవుల రచనల నుంచి కొన్ని ఇతివృత్తాలను యక్షగానాలకు మలచుకున్నారు. ప్రతి యక్షగానంలోనూ యుద్ధం తప్పకుండా ఉంటుంది. ఈ విషయం కొన్ని యక్షగానాల పేర్లే సూచిస్తాయి. *జరాసంధన కాళగ, కృష్ణార్జున కాళగ, భస్మాసురన కాళగ, కనకాంగి కల్యాణ, ద్రౌపది స్వయంవర* మొదలైన కథల్లో యుద్ధం అనివార్యమే కదా. కథను ఆసాంతం రక్తికట్టించి రాక్షసుడూ, అతని వర్గం చనిపోయాక, కల్యాణాన్ని సూచించి, భాగవతుడు మంగళం పాడుతాడు. అప్పుడు యక్షగానానికి తెర పడుతుంది. రాత్రంతా గడిచి తెలవారుతుంది.

యక్షగానాల్లో భాగంగా సన్నాట, దొడ్డాట, తొగలు *గొంచె, గళాట*, వైష్ణవ దాసరాట మొదలైనవి గ్రామాల్లో చాలా ఏళ్ళు ప్రచారంలో ఉన్నాయి. కన్నడ సాహిత్య భీష్ములని పేరు గాంచిన సాహితీవేత్తలు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత శివరామ కారంత్ ఈ యక్షగానాల ప్రాచుర్యానికి చాలా కృషి చేశాడు. 1700లో ప్రదర్శింపబడిన సింగచార్యులు రచించిన మిత్రవింద గోవింద మొదటి యక్షగానమని కూడా ప్రతిపాదించాడు.

కన్నడ నాటక చరిత్ర వికాసాన్ని పరిశీలిస్తే, ప్రధానంగా రెండు సంప్రదాయాలు కనిపిస్తాయి. రాజాశ్రయంతో, సంస్కృత భాషప్రభావంతో సాహిత్యోచితమైన భాషతో పటిష్ఠంగా తయారైనది ఒకటి, ప్రజల మధ్య ధార్మిక కార్యక్రమాల్లో క్రతువులా, వారికర్థమయ్యే భాషలో, సంగీత నాట్యాలను కలుపుకుని ప్రజలను అలరించిన జానపదాలు రెండవది. ఈ రెండింటికీ ప్రాచీన చరిత్ర ఉంది.

మొదటి కన్నడ నాటకం : ఇగ్గప్ప హెగ్గడెయ వివాహ ప్రహసన (1887) మొదటి కన్నడ నాటకం. దీని రచయిత ఉత్తర కర్ణాటక ప్రాంతానికి చెందిన కర్కి వెంకటరమణ శాస్త్రి సూరి. పేరులో ప్రహసనం అన్నమాట ఉన్నా ఇది ప్రహసనం కాదు. గంభీరమైన సామాజిక సమస్యలు – కన్యావిక్రయం, వ్యభిచారం, అవిద్య, అజ్ఞానం మొదలైనవి ఇతివృత్తాలుగా మలచబడ్డాయి. మరుగున పడ్డ ఈ నాటకాన్ని 1988లో డా.శాలిని రఘునాథ్ పరిష్కరించి పునర్ముద్రించాడు.

వాస్తవికతావాద (Realism) నాటకాలకు శ్రీకారం చుట్టిన ఇగ్గప్ప హెగ్గడె వివాహ ప్రహసన చారిత్రక ప్రాముఖ్యత కలది. ఇలాంటి సామాజిక ఇతివృత్తాలు, నవల మొదలైన ఇతర సాహిత్య ప్రక్రియల కంటే ముందు నాటకంగా రావటం విశేషం. మరొక విశేషం చెప్పుకోవాలంటే తెలుగులో ప్రసిద్ధ సాంఘిక నాటకం కన్యాశుల్కానికీ, దీనికీ ఉన్న ఇతి వృత్తాల సారూప్యం.

పౌరాణిక నాటకాలు : ఇతిహాసం కంటే ప్రాచీనమైనవి పురాణాలు. యుగాలు మారినా వాటి ప్రాచుర్యం తగ్గలేదు. రామాయణ, భారత కథలు అందరికీ పరిచయాలే.

సుదీర్ఘమైన సంభాషణలు, పాటలు, పద్యాలు, ధర్మోపదేశాలు, నీతి సందేశాలు ఈ పౌరాణిక నాటకాలలో ఉండి తీరవలసిన లక్షణాలు. అక్షరబద్ధం చేయబడి అందుబాటులో ఉన్న మొదటి పేరు కురుక్షేత్రం. ఈ నాటకాన్ని బెళ్ళావె నరహరిశాస్త్రి, బి.పుట్టస్వామయ్య అనే పండితులు రచించారు. సమగ్ర రణ రంగాన్ని రంగస్థలం మీద బ్రహ్మాండంగా ప్రదర్శించి ఈ నాటకం గొప్ప పేరు సంపాదించింది.

సంస్కృత నాటకాల ప్రభావంతో రచింపబడిన పౌరాణికాలలో నంజనగూడు శ్రీ కంఠ శాస్త్రి రచించిన *సీతాపరిణయ, సీతా స్వర్ణమృగ, ధృవవిజయ, రాజసూయయాగ* చెప్పుకోదగ్గవి. దుష్టశిక్షణ, శిష్టరక్షణ అన్ని నాటకాలకూ స్థూలమైన ఇతివృత్తం. కొన్ని సామాజిక పరమైన, చారిత్రాత్మకమైన సంఘటనలను కూడా పౌరాణికాల ధోరణిలోనే రాసి ప్రదర్శించాడు బెళ్ళావె నరహరిశాస్త్రి. హేమరెడ్డి మల్లమ్మ, భక్తి సామ్రాజ్య, మహాత్మ కబీర్‌దాస్ వంటి నాటకాలు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. పురాణ కథల్లోని వస్తువుల్ని ప్రధానంగా నాటకం చేసినా, ఈ నాటకాల్లో శృంగార, వీర, కరుణ, భక్తి రసాలు సమాంతరాలుగా నడిచేవి. నారదుడి పాత్రను హాస్యానికి , శ్లేషకూ ఉపయోగించి పౌరాణిక నాటకాలు నవరస భరితంగా నడిపించేవాడు.

కేరూరు వాసుదేవాచార్య రచించిన నలదమయంతి మరాఠి నాటకరంగ భూమి స్ఫూర్తిలో పుట్టినదని చెప్పవచ్చు. సంస్కృత నాటకాల్లాగా అద్భుతాన్ని మేళవించకుండా, కథను వాస్తవికతకు దగ్గరగా మలిచి నాటకీకరించాడు ఈ నాటకకర్త. గరుడ సదాశివరాయరు రచించిన శ్రీ రామ పాదుకా పట్టాభిషేక కూడా కన్నడ జన ప్రియ నాటకాలలో చెప్పుకోదగ్గది.

నవోదయ సాహిత్య ఉద్యమం కన్నడ సాహిత్యాన్ని ప్రభావితం చేసినా, పౌరాణిక నాటకాల ఆదరణ తగ్గిపోలేదు. ఆధునిక నవ్య నాటకాలలో దుష్ట శిక్షణ ఆ దుష్టపాత్ర దుష్కృత్యాల వలననే. నాయకుడి విజయానికి కూడా దేవబలం, మహాత్మ్యాల అవశ్యకత లేకుండా పురుష ప్రయత్నమే ముఖ్యమైన సందేశంగా మలచబడ్డాయి. మంచి మానవ ప్రయత్నానికి దేవుడి సహాయం ఉంటుందన్న ఆశాభావం సందేశాలుగా పాత పురాణ కథల్ని నాటకీకరణం చేయబడ్డాయి. బి.ఎం. శ్రీ కంఠయ్య రచించిన *గదాయుద్ధ, అశ్వత్థామ* మొదలైన నాటకాలు ఇందుకు ఉదాహరణ. పురాణ *గాథల్ని* నాటక రచనలు చేసిన మరొక గొప్ప రచయిత మాస్తి వెంకటేశయ్యంగార్. వీరి *శాంత, సావిత్రి, ఉషా* మొదలైన నాటకాలు ప్రయోగాత్మకంగా లేకపోయినా మహారాత్రి, చంద్రహాస మొదలైన వాటిల్లో వస్తు పరిణామం, పరిణతి, స్పష్టంగా కనిపిస్తుంది. కువెంపు రచించిన గొప్పనాటకం స్మశాన కురుక్షేత్ర. మృత్యువులో పుట్టుక ఉంది. అది మరోజన్మకు నాంది. మృత్యువు నాశనం కాదు. కొత్త సృష్టికి అంకురార్పణ అనే తాత్త్వికతను ప్రతిపాదిస్తుంది ఈ నాటకం. ఈ పురాణ నాటకాల పంథాలోనే గ్రీకు విషాదంత నాటకాల **(tragedies)**ను అనుకరిస్తూ కొన్ని నాటకాలు వచ్చాయి. గోవిందపై రచించిన హెచ్చెరళు, పర్వతవాణి కీచక, దేవుడు రచించిన యాజ్ఞవల్క్య ఇలాంటి నాటకాలకు మంచి ఉదాహరణ. సి.కె.వెంకటరామయ్యకు మంచి పేరు తెచ్చిన నాటకాలు నచికేత, మండోదరి మొదలైనవి. బౌద్ధ జైనమతాల నేపథ్యంలో కూడా పురాణ నాటకాలు వచ్చాయి. జి.పి. రాజరత్నం నాటకాలు *బాహుబలి, విజయ, గొమ్మట శిల్ప* జైన కావ్య గర్భజనితాలే. అప్పట్లోనే బి.పుట్టస్వామయ్య గౌతమబుద్ధ కూడా జనరంజకంగా రాశాడు. మాస్తి యశోధర కూడా గౌతముడి కథను స్త్రీ పాత్రపరంగా చెప్పినదే. ప్రభుశంకర రచించిన అమ్రపాలి, అంగులిమాల ఇలా ఎన్నో నాటకాలను ఉదహరించవచ్చు. వృత్తి నాటకరంగం ప్రాచుర్యంలోకి వచ్చాక గిరీశ్ కర్నాడ్ లాంటి ఆధునిక రచయితలకు కూడా ముడిసరుకులు అందించింది పురాణ కథలు, చారిత్రక గాథలే.

వృత్తి నాటక రంగం : 20వ శతాబ్ది మొదట్లో భారతదేశంలో ఇంగ్లీషు భాషా ప్రభావంతో పార్సీ నాటక సంస్థలు వెలిశాయి. కలకత్తాలో , మహారాష్ట్రలో మొదలై దక్షిణ ప్రాంతాల్లో కూడా 'వృత్తి నాటకాలు' చోటు చేసుకున్నాయి. **"This was the first regular theatre in which actors received salary and tickets were sold to the public. With admirable insight and energy, they attempted all kinds of stage craft and experimented in tragedy, musical comedy, farce and pantomime"** అని ఆర్.కె. యాగ్మిక్ తన ది ఇండియన్ థియేటర్‌లో తెలిపాడు. **(R.K. Yagmik, The Indian Theatre p.89).** కర్ణాటకలో చాలా నాటక సంస్థలు, వృత్తి నాటక కంపెనీలు, పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. మంచి నాటకాలు ప్రదర్శించినా ఎంతో కాలం బతికి బట్టకట్టలేదు. ప్రగతి సాధించి నిలదొక్కుకున్న వాటిల్లో ముఖ్యమైనవి గుబ్బికంపెనీ, హిరణ్ణయ్య మిత్రమండలి గుబ్బిచందణ్ణ, అబ్దుల్ అజీజ్, సాహుకార నీలకంఠపు అన్న ముగ్గురూ కలిసి *గుబ్బి* కంపెనీ అన్న వృత్తి నాటక కంపెనీని **1884**లో ప్రారంభించారు. గుబ్బి అన్నపేరు కర్ణాటక ప్రాంతంలో ఒక చిన్న గ్రామం(తుముకూరు జిల్లా). ఈ కంపెనీ పేరున గుబ్బి శ్రీ చెన్నబసవేశ్వర కృపాపోషిత నాటక సంఘ అని పెట్టినా కలక్రమేణా గుబ్బి కంపెనీ గానే ప్రసిద్ధి పొందింది. విద్యుద్దీపాలు, గ్యాస్ లైట్లు కూడా లేనప్పుడు కాగడాలూ, కిరోసిన్ దీపాల వెలుగులోనే వివిధ ప్రాంతాలలో నాటకాలను ప్రదర్శించి రక్తి కట్టించారు. మొదట్లో పౌరాణిక నాటకాలు ప్రదర్శించినా వీరికి పేరు తెచ్చిన నాటకాలు *సదారమె, గులేబకావలి*. గుబ్బి కంపెనీ స్థాపించిన చందణ్ణ అన్న కొడుకు వీరణ్ణ, అయిదారేళ్ళ కుర్రాడిగా ఉన్నపుడే పొట్ట గడవక కుటుంబాన్ని ఆదుకోవడానికి నాటకాల్లో చేర్పించాడు. చిన్న చిన్న పనులు చేస్తూ, పాత్రలు పోషిస్తూ ఆ కంపెనీకి అధికారై, భార్య జయశ్రీతో కలసి కర్ణాటక రాష్ట్ర నాటకాలకు రాష్ట్ర వ్యాప్తమైనకీర్తి నార్జించాడు. గుబ్బి వీరణ్ణ జీవితమే కన్నడ నాటకరంగ చరిత్ర అన్నంతగా ఎదిగాడు.

గుబ్బి కంపెనీ నాటకాలలో పన్నెండు నాటకాలను ప్రధానంగా పేర్కొనవచ్చు. *సదారమె, గులేబకావలి, ప్రభామణి విజయ, సుభద్రాపరిణయ, శ్రీకృష్ణలీలా, రాజభక్తి, కురుక్షేత్ర, సాహుకార, దశావతార, అణ్ణ–తమ్మ, లవ–కుశ, సిద్ధలింగేశ్వర మహాత్మె.*

ఈ కాలంలోనే పుట్టి పెరిగిన మరొక వృత్తినాటక రంగం హిరణ్ణయ్యమిత్రమండలి. *భ్రష్టాచార లంచావతార, మఖమల్ టోపి, దేవదాసి, నడుబీది నారాయణ* మొదలైన నాటకాలు ఇప్పటికీ జనప్రియమైనవి. సమకాలీన సమాజం నుండి వస్తువును స్వీకరించి, హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, రాజకీయాలకు

ముడిపెడుతూ, నెలకు పది పన్నెండు ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను మెప్పిస్తున్నారు.

ఆధునిక నాటకాలు : ఈ రంగంలో పేర్కొనవలసిన ప్రముఖులు కారంత్, కంబార్, కర్నాడ్‌లు గుబ్బి కంపెనీలో అనుభవం గడించి, హిందీ, ఇంగ్లీషు భాషలు నేర్చుకుని భారతీయ నాటకరంగానికి విశేషంగా కృషి చేసిన వారిలో బి.వి. కారంత్ పేరు చిరస్మరణీయం. నాటకాలు వేసి, నాటక కళాకారులకు తర్ఫీదు ఇచ్చి, ఔత్సాహిక నాటకరంగాన్ని పరిపుష్టం చేశాడు. సతీమణి ప్రేమకారంత్ కూడా నటి, దర్శకురాలు. వీరి నాటకాల అనుభవం సినిమా రంగానికి కూడా కొత్త ప్రయోగాలు చేయడానికి తోడ్పడింది. కొన్ని మంచి నాటకాలను తెరకెక్కించింది.

చంద్రశేఖర్ కంబార్ ప్రముఖ కవి, నాటక కర్త గానే కాక సినిమా దర్శకుడిగా కూడా పేరు తెచ్చుకున్నాడు. ఈయన పద్ధెనిమిది నాటకాలు రాశాడు. జోకుమార స్వామి, సంగ్యాచాళ్యా, సిరి సంపెంగ లాంటి నాటకాలు జానపద ఇతివృత్తాలను ఆధునికంగా, ఆసక్తి కరంగా మలిచాడు. చంద్ర శేఖర్ కంబార్ నాటకాలు కన్నడ రంగ స్థలానికి కొత్త కల్పనలను, విన్యాసాలను కల్పించి ఒక నూతన ఒరవడిని సృష్టించాయి. సిరి సంపెంగ నాటకానికి ఒక జానపద కథ ఆధారం. స్త్రీ, పురుషుల మధ్య పరస్పర సంబంధాలు, జీవ-ఆత్మల సమస్య, వీటికి అతీతమైన దైవశక్తి, సమస్యల మధ్యలో చిక్కుకున్న మనిషి , ప్రకృతి/మానవ సంబంధాలు సిరిసంపెంగలో కనిపిస్తాయి. యక్షగాన ప్రక్రియారూపంలో ఉన్న ఈ నాటకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

నాటక రంగంలో విశేషంగా కృషిచేసి జ్ఞానపీఠ్ అవార్డు (1998) అందుకున్న నాటకకర్త గిరీశ్ కర్నాడ్. రచయితగా, దర్శకుడిగా, నటుడిగా నలభై ఏళ్ళు నాటకరంగంలో కృషిచేసిన ఈయన రచించిన నాటకాలు పదికంటే ఎక్కువలేవు. *యయాతి, నాగమండల, తలదండ, హయవదన, తుగ్లక్, అగ్నిమత్తుమళె* ముఖ్యమైనవి. మాతృభాషపైన విశేషమైన మమకారంతో ముందుగా కన్నడ భాషలో రాసుకుని తరువాత ఇంగ్లీషులోకి స్వయంగా అనువదించుకుంటాడు. ఈయన నాటకాలు దాదాపు అన్ని ముఖ్యమైన భారతీయ భాషల్లోకి అనువదింపబడి, ప్రేక్షకుల మన్ననలు అందుకున్నాయి. భారతీయ నాటకాలకు అంతర్జాతీయ స్థాయిని ఆర్జించి పెట్టాయి. పురాణాల్లో నుంచి, జానపదాల్లో నుండి ఆసక్తి కరమైన ఇతివృత్తాలను తీసుకుని, వాటిని ఆధునికంగా మలచడంలో సిద్ధహస్తుడు కర్నాడ్. ఈయన స్వయంగా నటుడు కాబట్టి నాటకాన్ని అన్ని కోణాల్లోంచి వీక్షించి రక్తి కట్టేలా రాస్తాడు. ప్రతి ఇతివృత్తానికి సమకాలీనత ఉండేలా ప్రయత్నిస్తాడు. మూలకథకు కొద్దిగా కల్పనను జోడించి, మూలానికి విరుద్ధంగా కాకుండా, భిన్నంగా ఒక కొత్త కోణంలో ఇతివృత్తాన్ని ఆవిష్కరిస్తాడు.

వందేళ్ళకు పైగా పటిష్టమైన చరిత్ర ఉన్న కన్నడ నాటకాలను ఈ చిన్న వ్యాసంలో విశ్లేషించడం అసమగ్రంగానే అనిపించవచ్చు. పైన ఇచ్చిన వివరాలు నాటక సాహిత్యం గురించే ఎక్కువగా చెప్తూంది. కానీ నాటకాలకు తెరవెనక, తెరపైన కృషి చేసిన కళాకారులు ఎంతో మందిని మనం అమర వీరుల్లా స్మరించాలి. ఎన్నో సంస్థలు నాటక రంగ ప్రగతికి కృషిచేస్తున్నాయి. మైసూరులో రంగాయణ, శివమొగ్గలోని సాగర్‌లోని తిరుగాట వీటిల్లో చెప్పుకోదగ్గవి. తిరుగాట ను స్థాపించి పెంచి పోషించిన కె.వి. సుబ్బణ్ణకు మెగసేసే అవార్డు లభించింది. ప్రభుత్వ పరంగా కూడా (National School of Drama) ప్రతి ఏడూ నాటక కళాకారులను ప్రతిభా పురస్కారాలతో గౌరవిస్తుంది. చిన్న పిల్లల కోసం కూడా బాల నాటక అకాడెమీలున్నాయి. చిన్న పిల్లల నాటకాల కోసం శివరామకారంత్ ఎంతో కృషి చేసాడు. లంకేశ్, ప్రసన్న, అనంత్ నాగ్, శంకర నాగ్ సోదరులు కన్నడ నాటకారంగానికి ప్రాణం పోసిన వారిలో ముఖ్యులు. హాస్య నాటకాలు, ప్రహసనాలు రచించి సామాజికంగా కొత్త ఇతివృత్తాలతో ప్రయోగం చేసిన టి.పి. కైలాసం నాటకాలు కన్నడ నాటక రంగంలో మైలురాళ్ళు. అనువాద నాటకాలు, అనుసరణలతో ఎన్నో నాటకాలు వచ్చాయి. టి.వి. సినిమా రంగాల పోటీని తట్టుకుని గర్వంగా తలెత్తుకుని నిలబడిన కన్నడ నాటకాల వెనక ఎందరిదో కృషి, త్యాగమూ ఉన్నాయి. కొత్త ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. హెచ్.ఎస్. శివప్రకాశ్ మదువెహెణ్ణు అనే (eco theatre)ని ఈ మధ్యనే ప్రదర్శించి మన్ననలు అందుకున్నాడు. అన్ని భాషల నాటకాల లాగే కన్నడ నాటక రంగస్థలానికి ఉన్న పెద్ద కొరత అనువైన రంగస్థలాలు అందరికీ అందుబాటులో లేక పోవడమే. పెద్ద పట్టణాలలో ఉన్న రవీంద్ర భవనాలూ, కళాభవనాలూ తప్ప చిన్న ఊళ్ళల్లో నాటకాలు ప్రదర్శింపడానికి రంగస్థలాలు లేవు. ప్రభుత్వం, ప్రజలు, సమాజాలు అన్నీ కలిసి, కృషి చేసినపుడే నాటక రంగం పరిపుష్టమవుతుంది.

భార్గవి

కాశ్మీరీ నాటక రంగం

కాశ్మీర్ను పాలించిన హిందూరాజులు కళా ప్రియులు. వారు ప్రదర్శన కళలు రాజవంశీయుల్లోనూ, ప్రజల్లోనూ బాగా వ్యాప్తి చెందాయి. కల్హణుడు రచించిన రాజతరంగిణి అనే సంస్కృత కావ్యం 12వ శతాబ్దం నాటి రాజవంశీయుల చరిత్రలు తెలుపుతున్నది. ఆ కావ్యం ద్వారా 12వ శతాబ్దం నాటికే శిష్ట, జానపద రంగస్థలాలు ఉన్నట్లు విదిత మవుతున్నది. తిరునాళ్ళ, పండుగలు, ప్రభుత్వానికి, రాజ్యానికి సంబంధించిన పండుగల సందర్భాల్లో వేలాదిమంది ప్రేక్షకులు ఈ రంగస్థలాల్లో కూర్చొని నాటకాలు చూసేవారని వెల్లడి అవుతున్నది. ఈ రంగస్థలాలు ఎంతో పవిత్రత గలిగి, ప్రార్థనా మందిరాలై, గాయకులకు గౌరవప్రదాలై ఉండేవి. సాధారణంగా ప్రదర్శనలు రాజాంతఃపురాల్లో కాని, దేవాలయాల్లో కాని, ఇతర ప్రార్థనా మందిరాల్లో కాని జరిగేవి. నృత్య, నాటక, నాట్య, సంగీతాది కళలు కేవలం ఆనందదాయకాలే కాక, ప్రజల సామాజిక, ఆర్థిక జీవనానికి అద్దం పడుతూ, వారి జీవితాలతో విడదీయరానంతగా రూపొందాయి. కవి, నాటకకర్త కాశ్మీర రాజు అయిన చందక్‌కు కల్హణుడు ఘన నివాళులర్పించాడు. చందక్‌ను సంస్కృత భారత రచయిత వ్యాసమహర్షితో పోల్చాడు.

కాశ్మీరు రాజులు కదనరంగంలో కరవాలం పట్టి యుద్ధం చేయడంలోనే కాక, కళా రంగంలో కూడా సౌరభాలను వెదజల్లిన కోవిదులు, కవులు, నాటక రచయితలు, సంగీత, నాట్యాచార్యులు చాలా మంది ఉన్నారు. వారిలో శంకర వర్మ ఒకరు. ఈయననే యశోవర్మ అని కూడా పిలుస్తారు. కలాష మహారాజు ఉపాంగ – గీత అనే ఒకరకమైన నృత్య నాటకాన్ని రచించాడు. భరతుని నాట్యశాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని అభినవ గుప్తుడు, అభినవ భారతి, నాట్యాలోచన మనే రెండు సుప్రసిద్ధ గ్రంథాలను రచించాడు.

పసిడి వెలుగులు విరజిమ్మిన కాశ్మీర సంస్కృతికి 14వ శతాబ్దంలో ముస్లింల పాలన గొడ్డలిపెట్టు అయింది. అయితే కొందరు ముస్లిం పాలకులు కళలు, లలిత కళలకు ప్రాధాన్యం ఇచ్చారు. షామిర్ వంశానికి చెందిన జైనుల్ అబిదిన్ (1420–70) లలిత కళల పట్ల అపారమైన మక్కువ కనబరిచాడు. ఆయన 50 యేళ్ల పాలనలో ప్రదర్శన కళలు అత్యంత వైభవంగా విలసిల్లాయి. అప్పటి రంగస్థలాలు 'మయసభ' లా ఉండేవి. రంగస్థలం ఉద్యానవనంలా భాసించేది. అందులో దేదీప్యమానంగా వెలిగే దీపాల వరుస, వాటి ప్రతిబింబాలు ప్రక్కనే ఉన్న కొలనులో పడి, అవి చంపకపుష్పాల్లా ప్రేక్షకులకు భ్రాంతి కలిగించేవి. అదే విధంగా కొన్ని సమయాల్లో కొలనులో వికసించే చంపకాలు దీప స్తంభాలుగా భ్రమకలిగించి 'మయసభ'ను గుర్తుకు తెచ్చేవి.

జైనుల్ అబిదిన్ మహారాజు జీవితాన్ని జ ఎన – ప్రకాశ అనే నాటకంగా 15వ శతాబ్దికి చెందిన కాశ్మీర కవి మోదభట్ట రచించాడు. సుందరంగా అలంకరించిన రంగస్థలంపై నటులు తమతమ హావభావ విన్యాసాలతో రసభరితంగా నటించిన ఈ నాటకాన్ని ప్రజలు తిలకించినట్లు ఆధారాలున్నాయి. మధ్య యుగానికి చెందిన కాశ్మీర నాటకాలను గూర్చి సంస్కృత రచయితలు ప్రస్తావించిన రచన ఇదొక్కటి మాత్రమే కనబడుతున్నది. అయితే దురదృష్టవశాత్తు ఆ నాటకం మన కిపుడు లభ్యం కావడంలేదు. అందువల్ల ఆ నాటక రచనాశైలి, తదితర అంశాలు తెలియడం లేదు. బాణాసురవధ నాటకాన్ని ' ఉపంగ – గీత' శైలిలో భట్టతార రచించి, జైనుల్ అబిదిన్ సభలో ప్రదర్శించి ఉండవచ్చని నమ్మడానికి తగిన ఆధారాలు లభ్యమవుతున్నాయి.

జానపద సంప్రదాయం: ఆ కాలంలో సంప్రదాయ సంస్కృత నాటకాలతో పాటు జానపద నాటకాలను కూడా ప్రదర్శించారు. ఆనాడు బాండ్ పథర్ (బందనాటకం)గా ప్రసిద్ధి చెందిన జానపద నాటకం నేటికీ మధ్య కాశ్మీరులో ప్రదర్శితమవుతున్నది. బాండ్ నాటకంలోని నృత్తం, నటులను గూర్చి ''నటనా కౌశలం కలిగి, పున్నమి చంద్రుని కళాకాంతులు వెదజల్లుతూ ఉండేవారు. విదూషకులు హాస్యనటులు వేలాడే స్తనాలతో, కృత్రిమ గర్భాలతో, పళ్ళ, కనుబమలు చిత్ర విచిత్ర కదలికలతో, వివిధ జంతువుల అరుపులతో హాస్యాన్ని సృష్టించేవారు'' అని శ్రీవర తెలపాడు. వేలడేస్తనాలు తప్ప మిగిలిన వర్ణన అంతా నేటి విదూషకులకు నప్పుతుంది.

బాండ్‌ను గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ బహిరంగ ప్రదేశంలో కాని పచ్చికమైదానాల్లో కాని, ఆరుబయలు రంగస్థలిలో కాని ప్రదర్శించారు. తెలుగులో యక్షగానంలాగా కాశ్మీరీలో బాండ్ ప ఏ థర్ బాగా ప్రసిద్ధి చెందింది. ఇవి సుమారుగా 10–15 రకాలు ఉన్నాయి. ''గ్రామీణ జీవితాన్ని భగత్‌లు మిక్కిలి స్పష్టంగా ప్రదర్శించారు. వారి వేషం, అలంకరణ చాలా బాగుంది వారు శ్రామిక వర్గాన్ని అత్యంత సహజంగా ప్రతిబింబించారు. ఇతివృత్తంలో వాస్తవికత ఉంది.'' అని బాండ్‌లను గూర్చి వాల్టర్ ఆర్ లారెన్స్ తెలిపాడు.

పూర్వీకులు హిందూ దేవతలను పూజించినప్పటికీ ఇప్పటి భగత్‌లు ముస్లింలు, సినిమాలు, రేడియోలు, దూరదర్శనుల ప్రతికూల ప్రభావంవల్ల జానపద నటులు ఇతర వృత్తులను స్వీకరించాల్సి వచ్చింది. అయితే రాష్ట్రకళా, సాంస్కృతిక, భాషా పరిషత్తు ఆర్థిక సహాయం వల్ల, కళాకారులకు పింఛనువల్ల ఈ జానపద కళ రోజులు లెక్కపెట్టుకుంటూ జీవిస్తున్నది. ఈ పరిషత్తు ప్రతి సంవత్సరం జానపద ఉత్సవాలు నిర్వహిస్తున్నది.

ఆధునిక కాశ్మీరీ నాటక వికాసం జరిగి సరిగా రెండున్నర దశాబ్దాలు అయింది. అంతకు మునుపు పార్శీనాటక ప్రభావితమైన కొన్ని నాటకాలు శ్రీనగర్‌లో ప్రదర్శించటం జరిగింది. వీటిలో నందలాల్ కౌల్ రచించిన సటుచీ కహ్వాత్ (సత్య పరీక్ష) ముఖ్యమైనది. ఇది 1929లో పర్షియన్ లిపిలో ప్రచురితమయింది. పౌరాణిక గాథ – సత్యహరిశ్చంద్రుడు – చంద్రమతి కథ – ఇందులో వర్ణితమయింది. ఈ నాటకం పాషాణ హృదయాలను కూడా కన్నీటి పాలు కావించింది. ఉద్రిక్త ఘట్టాల్లో కూడా సునిశిత హాస్యం చోటు చేసుకొని ప్రేక్షకులను ఆనందపరవశులను చేసింది అని ప్రముఖ రంగస్థల నటుడు జగన్‌నాథ సాకి తెలిపాడు. సటుచీ కహ్వాత్, ఇతర నాటకాలను వివరిస్తూ 'అవి హిందూస్థానీ నుంచి అనువదించిన నాటకాలు. అయితే అవి విజయవంతంగా ప్రదర్శితమయ్యాయి. కాశ్మీరీ వచనం మొట్టమొదట నాటకీయ సంభాషణలో విజయవంతంగా ప్రయోగించడం జరిగింది. పదప్రయోగం, నుడికారం సార్థకంగా ఉన్నాయి' అని నందలాల్ కౌల్, జె. ఎల్ కౌల్ తెలిపారు.

ఒక స్థాయిలో నాటకాలకు నూకలు చెల్లిపోయాయి అనిపించింది. అయితే రంగస్థల అభిమానులు, ప్రియులు జీవం పోసి బ్రతికించారు. వరకట్నం, వితంతువుల దుస్థితి, పురుషుల పై స్త్రీలు ఆధారపడి ఉండటం వంటి సామాజిక ఇతివృత్తాలు, పౌరాణిక ఇతివృత్తాలతోనూ నాటకాలు రాసి, కొద్దిమంది ప్రేక్షకులకోసమే ప్రదర్శించారు. ఈ విషయంలో స్థానిక హిందూ స్వచ్ఛంద సంస్థ అయిన 'కాశ్మీరీ సుధర్ సమితి'ని మరువడానికి వీలులేదు. అది నటులను పోషించి, ప్రోత్సహించి నాటకరంగానికి జీవంపోసింది.

1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కాశ్మీరీ సాంస్కృతిక రంగంలో విస్తృతమైన మార్పులు జరిగాయి. సాంస్కృతిక రంగం ఏర్పాటు అయింది. విస్తృత ప్రాతిపదిక మీద రంగస్థల ఉద్యమం ప్రారంభమయింది. ఏకాంకికను కాశ్మీరీలోయ నాలుగు చెరగుల ప్రదర్శించడానికి ఫ్రంటు ప్రోత్సాహించింది. రంగస్థల నాటకాలు ఉద్యమ స్ఫూర్తితో ప్రజల్లో ప్రచారం పొందాయి. ఫ్రంటు ప్రధాన శాఖ అయిన సాంస్కృతిక కాంగ్రెసు అత్యాధునిక ప్రయోగాలతో నాటకాలను ప్రదర్శించింది. సంచార రంగస్థలం (మొబైల్ స్టేజ్) పైన 15 గ్రామాలలో వరద సమస్యలపై నాటకాన్ని ప్రదర్శించారు. అత్యాధునిక కళారీతులైన అలంకరణ, కాంతి ప్రసరణలతో ప్రదర్శించిన నాటకాలను చూడటానికి వేలాది మంది ప్రేక్షకులు హాజరయ్యారు.

'బస్ అఖ్ తమహ్' నాటకంలో ఒక దృశ్యం

పాశ్చాత్య నాటకాలను, పాశ్చాత్య ప్రభావిత నాటకాలను చూపడంతో కాశ్మీరీ నాటకరంగంలో ప్రధానమైన మార్పులు వచ్చాయి. ఆధునిక మానవుని కష్టాలను, మనోవైఖరులను చిత్రించాలని నాటక రచయితల్లో స్పృహ కలిగింది. ప్రతీకాత్మక ఇతివృత్తాలను ప్రవేశపెట్టి, సంక్లిష్టమైన రంగులు, లైట్లు ఇతరాలను వాడి అర్థవంతం చేశారు. వీటి సమన్వయంతో పంచ్‌వాన్ సవార్ (అయితో వాహకుడు), కిసీ ఏక్ ఫూల్ కా నాం లో (ఏదో ఓ పూవు పేరు చెప్పు), పంఛి ఐసే ఆతే హై (పక్షులు ఇలాగే వస్తాయి) వంటి కొత్త తరహా నాటకాలు వెలువడ్డాయి. అయినప్పటికీ సంప్రదాయ నాటకాలపై మోజు తగ్గలేదు.

ఆ కాలంలో రాసిన నాటకాలన్నీ ప్రచురణ భాగ్యానికి నోచుకోనందున స్వతంత్ర నాటకాలకంటే అనూదితాలైన నాటకాలే కాశ్మీరీలో ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర అకాడమీ ఏడు నాటికల సంకలనాలను అమిన్ కమిల్ సంపాదకత్వంలో ప్రచురించింది. నాటకరంగాన్ని, ప్రత్యేకంగా జానపద నాటకరంగాన్ని విస్తృత పరచిన రచయిత, నటుడు భాగత్ మహమ్మద్ సుభన (జ.1927)ను ప్రత్యేకించి పేర్కొనవచ్చు.

కాశ్మీరీలో ప్రప్రథమ సంగీత రూపకం రచించిన ఘనత డి.ఎన్.నదీంకు, ప్రథమంగా ప్రదర్శించిన ఘనత సాంస్కృతిక కాంగ్రెసుకు దక్కుతుంది. బంబుర్ ఎంబెర్జాల్ (తుమ్మెద (నార్సిసస్ పువ్వు) సంగీత రూపకాన్ని శ్రీనగర్‌లో మొదట 1953లోను, ఆ పిదప 1955లోను ప్రదర్శించారు. ఇది జానపద గాథా ఇతివృత్తం పై ఆధారపడిన సంగీత రూపకం. ఇది నార్సిస్ పువ్వు, తుమ్మెదల ప్రేమగాథను విదితం చేస్తుంది. 1956లో నికితబది (మంచి – చెడు), హిమల్ నగ్యరె (హిమల – నాగరాజు)ను, 1965లో శిహిలీ కుల్ (చెట్టునీడ), 1976లో వేథ్ (వితస్త) సంగీత రూపకాలను నదీం రచించాడు. వేథ్‌లో మహాపద్మ – సరస్ దేవుడితో వితస్త దేవత కలిసి సుఖించాలనే కలచుట్టూ ఈ సంగీత రూపకం అల్లుకున్నది. శ్రావ్యమైన సంగీతం, ధగధగలాడే దుస్తులు, ప్రవీణులైన యువకళాకారుల బృందం మొదలైనవి ఆధునిక కాశ్మీరీ సంగీత రూపకం లక్షణాలుగా పరిణమిస్తున్నాయి. అమిన్ కమిల్ రచించిన రవ రూపి, లలర్ త బంబర్ (1956); ముజఫర అజీమ్ రచించిన నన్నె కిసూర్ (పిసిడి కురుల కన్నె) ని పేర్కొనవచ్చు. అంతేకాక మాక్సిం గోర్కీ పద్యం డెత్ అండ్ ది వర్జిన్‌ఆధారంగా రహమాన్ రాహి 1961లో లల్‌యెటి మొతాన్ షోర్ (చావును ప్రేమ మోసగించినపుడు) మరువరానిది. ఈ సంగీత రూపకాలన్నీ రేడియో కాశ్మీర్ నుంచి ప్రసారమయి మంచి ఆదరణ పొందాయి.

20వ శతాబ్దపు ఆరవ దశకం మధ్య కాలంలో జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం నాటకోత్సవాలను నిర్వహించింది. అందువల్ల నాటక సమాజాలు అసంఖ్యాకంగా పెరిగి, కాశ్మీరీ నాటక చరిత్ర కొత్త మలుపు తిరిగింది. అప్పటి నాటకాలేవీ నేటికీ హృదయ ఫలకాల మీద ముద్రితం కాలేదు. ఎందుకంటే అంత ఉన్నత ప్రమాణాలు కలిగిన నాటకాలు వెలువడకపోవటమే. 1958 ఆగస్టులో కళ, సంస్కృతి, భాషా పరిషత్తు ప్రారంభంకావడంతో నాటకరంగ ఉద్యమం బలపడటానికీ, అభివృద్ధి చెందడానికి దోహదం కలిగింది. ఇది ప్రతి సంవత్సరం నాటక ఉత్సవాలను, పోటీలను నిర్వహించి ఉత్తమ నాటకసంస్థలకు, గుర్తింపు, ఆర్థిక సహాయం అందించింది, నాటక రచన పోటీలను నిర్వహించింది. న్యూఢిల్లీ జాతీయ నాటక పీఠం (నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా) లో నటన, దర్శకత్వం, నిర్మాణం, రంగస్థల శిల్పంలో శిక్షణ పొందటానికీ ఉపకారవేతనాలు అందించింది. ఇందువల్ల ఇతివృత్త వైవిధ్యంతో సాంకేతిక ప్రయోగాత్మక నాటకాలు వెలువడ్డాయి. అందులో కొన్ని ప్రముఖ నాటకాలు – ఆర్.కె బ్రారో రచించిన యహూ (ఓ నువ్వు), ఆర్.కె. రెహ్బార్ రాసిన తలాశ్(అన్వేషణ), అలిమహ్మ మద్‌లోన్ కలం నుంచి వెలువడిన తక్దీర్ సజ్ (విధి విధాతలు), జి, ఆర్. సంతోష్ రచనలు అకనందున్ (ముద్దుల పాప), బుత్ త బుల్‌డోజర్ (విగ్రహం – బుల్డోజరు), సజోద్ సైలాని రాసిని రొతుల్ తా గునహ్‌గార్ (పాపి – రాత్రి) మొదలైన వాటిని పేర్కొనవచ్చు.

కాశ్మీరీలో చారిత్రక నాటకాలు ఎక్కువగా రాలేదు. హబ్బాఖటూన్ జీవితాన్ని ఆధారంగా చేసుకొని జగన్ నాథ్‌వలి జూన్ అనే నాటకం రచించాడు. ఇది సాంకేతికంగా చాలా బలహీనంగా ఉన్నందున దీన్ని ప్రదర్శించడానికి ఏ సంస్థ కూడా ముందుకు రాలేదు. ఇదే ఇతివృత్తంపై అమిన్ కమిల్ రచించిన నాటకం ప్రదర్శితమయింది. అలి మహమ్మద్ లోన్, సుయ్య అనే నాటకం రచించాడు. దీనికి సాహిత్య అకాడమీ బహుమతి (1972) లభించింది. 9వ శతాబ్దంలో సంభవించిన వరద బారినుండి జనులను కాపాడటానికి చండాల బాలుడు ప్రదర్శించిన శక్తి సామర్థ్యాలను, కాశ్మీరీ స్వర్ణయుగాన్ని వర్ణించడం ఇందులో ఇతివృత్తం. ఈ నాటకంలో సంస్కృత నాటకరంగ పద్ధతిలోని సూత్రధారుడు, గ్రీకు నాటక రంగంలోని బృందగానాలను లోన్ వాడుకున్నాడు. తద్వారా కథాగమనంలో కాలం వృథాకాకుండా లోన్ జాగ్రత్తపడ్డాడు. ఛాయ్ (నీడ)లో 8వ శతాబ్దంలో కాశ్మీర్‌ను జయించిన లలితాదిత్యుని చరమకాలం వర్ణితమయింది. దీనిని మోతీలాల్ కెమ్ము రచించాడు. శత్రురాజులపై దండెత్తిపోయిన రాజు సైన్యంతో సహా కొండ ప్రాంతంలోని మంచులో కప్పబడిపోవడం ఇందులో వర్ణితం. ఈయన రచించిన నాటక్ త్రుచెకు సాహిత్య అకాడమీ బహుమతి (1982) లభించింది. 15వ శతాబ్దం నాటి జైనులు అబిదున్‌ను, అతని కుమారులను గూర్చి బుద్‌శాహ్ అనే నాటకాన్ని ఔతార్ క్రిషేన్ రెహబార్ రచించాడు. తన అత్యాశ వల్ల, నిత్యం కుమారుల కుట్రవల్ల, కుతంత్రాల వల్ల బుద్‌శాహ్ రాజు మిక్కిలి శోకతప్తుడుగా మరణించడం ఇందులో ఇతివృత్తం.

పుష్కరభాన్ రచించిన హీరోమచామ సాహిత్య అకాడమీ బహుమతి(1976) అందుకున్నది. ఇది సాటిలేని మేటి హాస్యనాటకం. మధ్య తరగతి జీవితానికి సంబంధించినది. కథానాయుకుడు, అతని మిత్రులు – సుల, రెహ్మాన్, నాయిక ఖతిజా, ఆమె తల్లిదండ్రులు – అందరూ మధ్య తరగతి ప్రజలే. వారికి సంపాదన తక్కువ. అయితే వారికి డబ్బు సంపాదించాలనే కాంక్ష, కీర్తి కండూతి ఎక్కువ. వాటిని ఏవిధంగా నైనా సంపాదించాలని తీరని కోరిక. కనీసం కలలోనైనా పొందాలని తీవ్ర వాంఛ. దానికై నాయకుడు వేసిన ఎత్తుగడలు అన్ని పేకమేడల్లా కూలిపోతాయి. అయిన పట్టు వీడని విక్రమార్కునిలా యత్నం మానడు. చివరి వరకు నాటకం హాస్యంగానే సాగుతుంది. గ్రాండ్‌రిహార్సల్‌ను పుష్కర్‌భాన్, ఎస్. ఎన్. సాధులు, హవాస్ (కోరిక) ను మహమ్మద్ సుభన భగత్, ఇన్సాఫ్ (న్యాయం), త్రునోవ్(మూడుమార్లు నామకరణం) ను ఎం. ఎల్. కెమ్ము, ఫంద్‌బజ్(వంచకుడు) ను సజూద్ సాయిలాని,

గిర్‌దబ్ (సుడిగుండం) ను ఎ.కె. రెహ్బార్, నరకపురి(నరకం) ని ఎం. ఎల్. సర్రాఫ్ రచించారు.

ఇవి ఎక్కువగా పండుగలు, ఉత్సవాలు మొదలైన సందర్భాల్లో ప్రదర్శించడానికి రాసినవి. హిందీ సినిమాల నుండి చౌకబారు ఉద్రేక భావాలను గ్రహించి రాయడం వల్ల ప్రజల గుండెల్లో గూడు కట్టుకోలేకపోయాయి. ఇతివృత్తాలు అతి సాధారణం. గడుసరి కోడలు, సాధించే అత్త, కొరకరాని పుత్రులు, పెళ్లికాని కూతుళ్లు, అసమర్థులైన తల్లిదండ్రులు ఈ నాటకాల్లోని సాధారణ పాత్రలు, వరకట్నంలో బేరసారాలు కథకు వెన్నెముక. *నవనోశ్* (కొత్త పెళ్లి కూతురు), *లల్ బద్రయస్ లలెర్* (ప్రేమకోసం లాల), తక్దీర్ నాటకాలను మహమ్మద్ సుభన్ భగత్ వెలువరించారు. ప్రేంచంద్ గోదాన్‌ను భూషణ్ భేతాబ్ కాశ్మీరీలోకి అనువదించాడు. బ ఛుస్ చూర్ (నేను దొంగ)ను ఎ.కె. రెహ్మర్, *రొతుల్ త గునహగార్*ను సజూద్ సాయిలాని రచించాడు.

కాశ్మీరీలో సంపూర్ణంగా రాజకీయ నాటకాలు వెలువడలేదు. అయితే రాజకీయ అంశాలను ప్రాధాన్యం చేసుకున్న నాటకాలు వచ్చాయి. *నాటుక్ కరివ్ బంద్* (నాటకం ఆపెయ్) ను హెచ్. కె. కౌల్. తక్దీర్ సజ్‌ను అలిమహమ్మద్‌లోన్, *మంజులి నికా* (ఖర్వుని ఊయెల)ను ఎం. ఎల్. కెమ్ము రచించారు. ఈ నాటకాల్లో రాజకీయ నాయకులు, రాజకీయాలు ప్రత్యక్షంగా చోటుచేసుకోలేదు. ఏమైనా రాజకీయ నాటకాలు రాయడానికి రచయితలు సుముఖత చూపడం లేదు.

కాశ్మీరీలోకి అనేక భాషల నుండి నాటకాలు అనూదితమయ్యాయి. చెకోవ్ నాటకాలను (ముగ్గురు అక్కాచెల్లెళ్లు, ఎలుగుబంటి) ఆర్. ఎల్. శాంత్ అనువదించాడు. రవీంద్రనాథ టాగూర్ రచించిన రాజా – రాణి, ది పోస్టాఫీస్, చండాలిక, ముక్తధారాలు కాశ్మీరీలోకి భాషాంతరీకరించారు. వైల్డ్ డక్‌ను ఎస్. ఎన్. జోషి కాశ్మీరాలోకి తర్జుమా చేశాడు. ఇబ్సెన్ రాసిన ది ఘోస్ట్‌ను అక్తర్ మొహి ఉద్దీన అనువదించాడు.

నాటక వికాసానికి ఆకాశవాణి నాటకాలు దోహదపడ్డాయి. దృశ్య నాటక నిర్మాతలు కూడా నేపథ్య సంగీతం, ఫ్లాష్ బాక్‌లు మొదలైన వాటిని ఆకాశవాణి నాటకాల ద్వారా ప్రవేశపెట్టడం ప్రారంభించారు. పుష్కర్ భాన్ (జ.1926), బన్సీ నిర్దోష్, హరికిషన్ కౌల్ మొదలైన రచయిత లందరూ ఆకాశవాణి నాటకాలు రచించారు. ఈ నాటక పోటీల్లో అనేక నాటకాలు బహుమతులను అందుకున్నాయి. వీటిలో వెధ్‌రూజ్ పకన్ ధారావాహిక నాటకం మరువరానిది.

కాశ్మీరీలో అనేక ఏకాంకికలు వెలువడ్డాయి. డాలర్ సాహెబ్, అఖ్‌బటాత్రే ఏకాంకికలను రోషన్ సంపాదకత్వంలో కల్చరల్ ఫ్రంట్ ప్రదర్శించింది. యా తన్ యా తరక్‌ను పుష్కర్‌భాను, తాజీ –బటూన్ కాన్ (తాజీభట్ బాణం) ను లోన్, కాలేజ్ పేథర్ (కాలేజీ నాటకం) ను ఫరూక్ మసూదీ రచించారు.

చంద్ర

గుజరాతీ నాటక రంగం

గుజరాత్‌లో నాటకరంగం వంద సంవత్సరాల నుంచీ వర్ధిల్లుతూ వచ్చింది. నాటకం ఒక నిర్దిష్ట రూపాన్ని తాల్చడంతో నాటకరంగవ్యాసంగం తీవ్రతరం అవుతూ వచ్చింది. గుజరాత్‌లో భవై అనే జానపద నాటకం కూడా ప్రాచీన కాలం నుంచీ ప్రవర్ధమానమవుతూనే వచ్చింది. భవై సంగీత, నృత్య, కళా సంప్రదాయాలతో విలసిల్లే జానపద కళా రూపం. మార్గ నాటక రంగం ప్రవర్ధమానమవడానికి ఈ భవై కారణభూతమైంది.

నిజానికి ఆరంభం నుంచీ బంబాయి గుజరాతీ నాటక రంగానికి కేంద్రంగా విలసిల్లుతూ వచ్చింది. గుజరాతీ నాటక సమాజాలకు, ప్రముఖ నటీ నటులకు కూడా నెలవుగా ఉంటూ వచ్చింది.

గుజరాతీ నాటక రంగం ప్రారంభ దశలో ఔత్సాహిక నాటకరంగమే. ఈ నాటక రంగానికి సంబంధించిన బృందాలు వేరే విధంగా జీవనోపాధి కల్పించుకుని సాయంకాలం తీరుబడి వేళలో కలుసుకొని, నాటక కళాసేవ చేయసాగాయి. వీరంతా పెద్ద విద్యావంతులేగాక, వారి వారి రంగాలలో ప్రముఖులు. భారత జాతీయోద్యమపిత దాదాబాయి నౌరోజి కూడా ఈ ఔత్సాహిక నాటక రంగంలో ప్రముఖ పాత్ర వహించిన వాడే.

గుజరాతీ నాటక రంగాన్ని తీర్చి దిద్దడంలో పార్శీలు ప్రముఖ పాత్ర వహించినా, ఇతరులు కూడా చేయూత నిచ్చారు. ప్రప్రథమ నాటక సమాజం 1852లో స్థాపితమైన పార్శీనాటక మండలి, 15సంవత్సరాల పాటు అంటే 1867వరకూ చురుకుగా పని చేసింది. ఈ కాలంలో అనేక సమాజాలు పుట్టుకొచ్చాయి గాని ఎక్కువ కాలం మనలేదు.

గుజరాతీ నాటక రంగ చరిత్రలో ప్రముఖ పాత్ర వహించిన వారిలో కైకస్రు నవరోజిక బ్రాజీ ఒకరు. ఈయన

సుప్రసిద్ధనాటక కర్త, కవి, సంగీతజ్ఞుడు, మేధావి. ఈయన నాటకాలు రాసి స్వయంగా దర్శకత్వం వహించి ఆడించాడు. చాలా నాటక సమాజాల స్థాపనలో తోడ్పడ్డాడు. ఈయన ప్రథమ నాటకం బాయిజాన్‌మనిజే ని విక్టోరియా నాటక మండలి 1869లో ప్రదర్శించింది. తన జీవిత కాలమంతా నాటక రంగ సేవకు వినియోగించిన కళారాధకుడు కున్వార్జీ సొరాబ్జీనాజిర్. ఈయన ప్రసిద్ధ నటుడు, దర్శకుడు.

కాలక్రమేణా ఔత్సాహిక నాటక రంగం వృత్తి నాటక రంగంగా పరిణామం చెందింది. సి.ఎస్.నాజర్ 1860-61లో కాంభట్ మొదలయిన వారి సహకారంతో స్థాపించిన ఎలిఫిన్‌స్టన్ డ్రమెటిక్ క్లబ్ ఔత్సాహిక నాటక సమాజం ఎలిఫిన్ స్టన్ కళాశాల పూర్వ విద్యార్థులతో కూడినది. తన ఉనికిని కొంత కాలం పాటు నిలబెట్టుకొన్నది. ఈ నాటక సమాజం నుంచే నాజిర్ నాయకత్వాన ఎలిఫిన్‌స్టన్ నాటక మండలి ఆవిర్భవించింది. ఆ తరువాత ఈ సమాజం జంషెడ్జీ చేతిలోనికి వెళ్ళింది.

విక్టోరియా నాటక మండలికి కబ్రాజీ కార్యదర్శిగా, జగన్నాథ్ శంకర్ సేట్ అధ్యక్షుడుగా పనిచేశాడు. 1867-68లో స్థాపితమై ఆ తరువాత బాలీవాలా ఆధిపత్యం కిందకు రావడంతో దీని పేరు కూడా బాలీవాలా నాటకమండలిగా మారింది.

గుజరాతీ నాటక రంగ ప్రగతికి దోహదం చేసిన నాటక సంస్థలలో ముఖ్యమయినవి జూరాస్ట్రియన్ నాటక మండలి, పార్శీ ఎంప్రెస్ విక్టోరియా థియేట్రికల్ కంపెనీ, విక్టోరియా క్లబ్, పార్సీ థియేట్రికల్ కంపెనీ, ముంబాయి నాటక మండలి. నాటక ఉత్తేజక మండలి 1874-75లో స్థాపితమయింది. ఎలిఫిన్ స్టన్, విక్టోరియా ఆల్ఫ్రెడ్, పార్శీమండలులు ప్రముఖ పాత్ర వహిస్తూ గుజరాతీ నాటకాలనే ప్రదర్శించాయి. ఈ సమాజాలు మూత పడిన తరువాత మదన్ థియేటర్స్ వారు గుజరాతీ నాటకాలు ప్రదర్శిస్తూ నాటక సంప్రదాయాలను నిలబెడుతూనే వచ్చారు.

ప్రారంభదశలో బంబాయిలో కొద్ది నాటకశాలలే ఉండేవి. మొట్ట మొదటి నాటకశాల నిర్మించింది వినాయక జగన్నాథ శంకర్ సేట్. దీనిని గ్రాండ్ రోడ్ ప్రాంతంలో నిర్మించాడు. ఇది అనేక నాటక సంఘాలకు వరప్రసాదంగా పరిణమించింది. ఆ తరువాత ఆ ప్రాంతంలోనే విక్టోరియా థియేటర్ వెలిసింది. ఆ తరువాత ఇంకా కొన్ని నాటక శాలలు ఇక్కడే నిర్మాణం కావడంతో ఈ ప్రదేశానికి ప్లేహౌస్ అనే పేరు వచ్చింది. ఇలాగే 'కోట' ప్రాంతంలో కూడా నాటకశాలలు నిర్మాణ మయినాయి. చివరకు నాటకోద్యమం గుజరాత్ అంతటా వ్యాపించింది. నేటికీ గుజరాతీ నాటక రంగంలో పార్శీలు ప్రముఖ పాత్ర వహిస్తూ ఉన్నారు.



'మేనా గుర్‌జారీ' నాటకంలో ఒక దృశ్యం

కాలం గడిచిన కొద్దీ రంగస్థలం అందరిని ఆకర్షించసాగింది. సౌరాష్ట్ర బ్రాహ్మణులు ఎక్కువగా నాటకాలు రచించసాగారు. నటులుగా, దర్శకులుగా రాణించారు. ముంబాయి, గుజరాతీ నాటక సమాజాల్లోని నాయక, భోజక్ కులాల వారికి నటన, సంగీతం అనువంశికంగా వస్తూనే ఉన్నాయి. గుజరాతీ నాటక రంగంలోని నటులు చాలామంది ఈ కులాల వారే. చాలాకాలం వరకు పార్శీ కంపెనీలు ప్రదర్శించిన గుజరాతీ నాటకాలలో భాష వ్యవహారిక భాషే, మధ్యమధ్య ఇంగ్లీషు కూడా వాడేవారు. ఇంగ్లీషు నాటకాలు కూడా ప్రదర్శించారు.

అయితే కొంతకాలానికి గుజరాతీ నాటకాలు ప్రదర్శించే సమాజాలు ఉర్దూలోకి దిగాయి. కాల క్రమేణా ఉర్దూ నాటకాలు రచింపబడి భారత దేశమంతటా వ్యాప్తి చెందాయి. బాలీవాలా తన సమాజంతో బర్మా, ఇంగ్లండ్ దేశాలకు వెళ్ళి నాటకాలాడాడు. సోనానా మూల్నీ ఖోర్షద్ అనే సుప్రసిద్ధ నాటకాన్ని ఎదుల్జీ ఖోరే మొట్ట మొదట గుజరాతీ భాషలో రచించి ఆ తరువాత ఉర్దూలోకి అనువదించాడు. ఇదే మొట్ట మొదటి ఉర్దూ నాటకం. దీనిని 1871లో ప్రదర్శించారు.

షేక్స్పియర్ నాటకాలు, షానామా అరేబియన్ రాత్రులు అనే గ్రంథాల నుంచి కూడా పార్శీ నాటక కర్తలు కథలు తీసుకుని నాటకాలుగా మలిచారు. మరికొంత మంది రామాయణ, మహాభారత పౌరాణిక గాథలను, చారిత్రక

గాథలను, మరికొంత మంది సాంఘిక సమస్యలను తీసుకుని నాటకాలు రచించసాగారు.

నాజర్ కరన్‌గేలో అనే చారిత్రాత్మక నాటకాన్ని గుజరాతీలో ప్రదర్శించాడు. రణబోధ్ భాయ్ ఉదయరామ్ రచించిన హరిశ్చంద్ర, నల దమయంతి నాటకాలు ఎక్కువగా ప్రదర్శించారు. 1874-75లో నాటక ఉత్తేజక మండలి ఏర్పడింది. రణబోధ్ భాయ్ రచించిన హరిశ్చంద్ర నాటకం వరసగా 3 రాత్రులు ఆడింది. వీరి నలదమయంతి, ద్రౌపదీ దర్శన్, సీతాపహరణ్, శకుంతల, బాలాకృష్ణవిజయ నాటకాలను ఉత్తేజక మండలి విజయవంతంగా ప్రదర్శించింది.

ఆ తరువాత కొంతమంది గుజరాతీ హిందువులు ముందుకు వచ్చి స్వంత నాటక మండలిని ఏర్పరచుకున్నారు. వీరికి రణబోధ్ భాయ్ సహకారం లభించింది. ఇలా 1878 లో గుజరాతీ నాటక మండలి అవతరించింది. ఈ నాటక మండలి నుంచే ముంబాయి గుజరాతీ నాటక మండలి ఆవిర్భవించింది.

ఆ తరువాత నాటకోద్యమం రెండు చీలికలయింది. పార్శీ నాటక సమాజాలు ఉర్దూ నాటకాలకు ఎక్కువ ప్రాముఖ్యమివ్వ సాగాయి. అయితే గుజరాతీ నాటకం రంగస్థలం మీద సుస్థిరంగా పాదుకుంది. ఈ రెండు రకాల సమాజాలను నిర్దిష్టంగా వింగడించడం కష్టం.

ముంబాయిలో గుజరాతీ నాటక రంగం నిర్దిష్ట స్వరూపం తాలుస్తుండగానే గుజరాతీలో కూడా నాటక సమాజాలు వెలిసాయి. సుప్రసిద్ధ నాటకకర్త వాఘ్జీ ఆచారాం తన సోదరుడు, నటుడు, దర్శకుడు అయిన ముల్లా ఆశారామ్ సహకారంతో 1878లో మోర్బీఆర్యసుబోధ నాటక మండలిని స్థాపించాడు. ఈయన రచించిన త్రివిక్రమ్ నాటకాన్ని ఈ మండలి వారు వరుసగా అయిదు సంవత్సరాలు ప్రదర్శించారు. ఆ తరువాత చంద్రహాస నాటకం ఈ మండలికి శాశ్వత కీర్తిని తెచ్చిపెట్టింది. సౌరాష్ట్రలో కూడా నాటకరంగం లోతుగా కాళ్లూనుకున్నది. 1889-90 సంవత్సరాల మధ్య వంకానర ఆర్యహిత వర్ధక నాటక మండలి వంటి సమాజాలు స్థాపించబడి గుజరాతీ నాటక సంప్రదాయాలను చాలాకాలం నిలబెట్టాయి.

1912 నుంచి పది సంవత్సరాలపాటు నాటక ప్రదర్శనలు ఉధృతంగా సాగాయి. బంబాయిలోని పది, పన్నెండు నాటక సమాజాలలో, నాలుగయిదు గుజరాతీ నాటక సమాజాలే. గుజరాత్‌లో చిన్న చిన్న నాటక సమాజాలు జిల్లా ముఖ్య పట్టణాలలో కూడా నాటకోద్యమాన్ని వ్యాపింపచేశాయి.

పార్శీలలోనే గాక గుజరాతీయులలో కూడా మహా నటులు జన్మించారు. నాటక రంగ శిల్పంలో ప్రమాణాలు పెరిగాయి. మోహన్‌లాల్ లాలాజీ ఏ వేషమయినా మెప్పించగల మేటినటుడు. సౌభాగ్య సుందరి అనే నాటకంలో సుందరి పాత్ర అతి సమర్థవంతంగా నటించడంతో అతనికి సుందరి అనే పేరు వచ్చింది. విభావర్ అనే రచయిత నాటకాలలో సమకాలీన సమస్యలను ప్రవేశపెట్టి నాటకరంగానికి విస్తృత రూపం తీసుకు రావాలని కృషిచేశాడు. జమాన్ అనే ఇంకో నాటక కర్త వివాదగ్రస్థ సాంఘిక సమస్యలను నాటకాలుగా రచించాడు. షాయిదా అనే మహానటుడికి గుజరాత్ సామ్రాట్ అనే బిరుదు వచ్చింది. ఈయన 25వ ఏట సంసార నౌక అనే గొప్ప నాటకం రచించి పేరు పొందాడు. మణిలాల్ త్రిభువన దాస్ చాలా శక్తివంతమయిన రచయిత. దాదాపు వంద సాంఘిక నాటకాలు రచించాడు. హిందీలో స్వతంత్ర నాటకం రచించిన ఏకైక గుజరాతీ రచయిత మణి లాల్. ఈయన మరాఠీ నాటక మండలికి కూడా నాటకాలు రచించాడు.

నాటకోద్యమ అగ్రశ్రేణిలో నిలబడ్డ నాటక రచయిత రసకవి రఘునాథ బ్రహ్మభట్. ఈయన నాటక రంగంలో 17వ ఏట ప్రవేశించి బుద్ధ దేవ్ అనే నాటకంతో ఒక్క రాత్రితో పేరు తెచ్చుకున్నాడు. ఈయన స్వతంత్రనాటకాలు రాయడమే కాకుండా ఇతరుల నాటకాలకు పాటలు రాసేవాడు.

ప్రభులాల్ ద్వివేది అభ్యుదయ వాది. ఈయన రచించిన అరుణోదయ అనే నాటకం వరుసగా 400 రాత్రులు ఆడింది. గ్రామ పరిస్థితులను తట్టుకుని నిలబడడానికి గుజరాతీ నాటక రంగానికి ఈ నాటకం శక్తి సామర్థ్యాలు ప్రసాదించింది.

కనియలాల్ మున్షీ మంచి నాటక కర్త. స్వతంత్ర, చారిత్రక, పౌరాణిక, సాంఘిక నాటకాలు రాసి గుజరాతీ నాటక రంగానికి పుష్టిచేకూర్చాడు. నాటక శిల్పానికి ప్రయోగ విలువలకు ఎక్కువ ప్రాముఖ్యమిచ్చాడు. ప్రఫుల్ల దేశాయ్, చంద్ర వదన మహతా, గుజరాతీ నాటకరంగం ముఖ్యంగా ఔత్సాహిక నాటక రంగం సుస్థిరపడడానికి ఎనలేని కృషి చేశారు. ఆకార, విషయ శైలులలో గుజరాతీ నాటకరంగం, స్వంత లక్షణాలను సమకూర్చుకుంది. ప్రయోగ శిల్పంలో, రంగాలంకరణలో ప్రత్యేకతను సాధించింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన సంస్థలు రంగస్థలాన్ని మలుచుకున్నాయి. పాటలు, నాటకంలోని భాగంగానే పరిగణించబడ్డాయి. కొన్ని సమాజాలు వచన నాటకాలను ఎక్కువగా ప్రదర్శిస్తున్నాయి. నాటకారంభ దశలో పురుషులే స్త్రీ పాత్రలు నిర్వహించేవారు. ఇప్పుడు స్త్రీ లే ముందుకు వస్తున్నారు.

శ్రీ.చ.

తమిళ నాటక రంగం

తమిళ భాష ఎంత ప్రాచీనమైనదో తమిళ నాటకం అంత ప్రాచీనమైనది. క్రీ.పూ. 5వ శతాబ్దానికి సంబంధించిన తమిళ గ్రంథం తొల్కాప్పియమ్ లో తమిళ నాటకాలను గురించి ఉదహరించడం జరిగింది. తమిళ భాషను మూడంచెల ముత్తమిళ గా పేర్కొంటారు. అవి ఇయల్ (పద్యం), ఇసై (సంగీతం), నాడగం (నాటకం). నాటకంలో నృత్యం కూడా ఇమిడి ఉంది. ఆ విధంగా తమిళ భాషా సాహిత్యాన్ని మూడు విధాలుగా వర్గీకరించారు.

తమిళనాటకరంగాన్ని మూడుదశలుగా విభజించ వచ్చు. సంగము యుగం, మధ్యయుగం, ఆధునిక యుగం. అయితే తమిళ నాటకం ఉచ్ఛ స్థాయిలో ఉన్నది సంగము యుగంలోనే అని చరిత్రకారుల అభిప్రాయం. ఆ యుగంలో ప్రదర్శితమైన నాటకాలు ఎక్కువగా ప్రజాదరణకు నోచుకున్నవి. శిలప్పదిగారం, మణి మేఖలై గ్రంథాలలో తమిళ నాటకాలెన్నో ప్రదర్శించినట్లుగా పేర్కొనబడింది. శిలప్పదిగారం తమిళ భాషలోని మొదటి సాహిత్య కావ్యం. సంగము యుగానికి సంబంధించిన అనేక గ్రంథాలలో వివిధ నాటకాలు, నటులు, దర్శకులు, నాటకాల ప్రదర్శనలలో వారి పాత్రల గురించి విపులంగా చెప్పబడింది. శిలప్పదిగారం మీద అడియార్కు నల్లార్ రాసిన గ్రంథంలో కూత్తనుల్, భారతసేనాపదియం, ఇంద్రకాళీయం, పంచమరబు, పెరునర్రై, మధి వాణన్ నాడక తమిళ్ లాంటి గ్రంథాలను గురించి వివరంగా చర్చించబడింది. ఈ గ్రంథాలలో నాటకాలను, నాటక శిల్పాన్ని గురించి ప్రస్తావించారు. కాని, ఒక్క కూట్టనూల్ తప్ప తక్కిన గ్రంథాలేవీ నేడు లభ్యం కావడం లేదు. ఎస్.డి.ఎస్ యోగియార్ వెలికి తీయడం వలన ఇది లభ్యమయింది.

దాదాపు 2500 సంవత్సరాల క్రితమే నాటక శిల్పాన్ని గురించి వ్రాయబడిందంటే తమిళ నాటకం ఎంత ప్రాచీనమైనదో అవగతమవుతుంది. కూత్తనూల్ గ్రంథం నృత్యానికి, నాటకానికి సంబంధించిన ఒక అపూర్వమైన కావ్యం. ఈ కావ్యంలో తొమ్మిది భాగాలలో ఒక భాగం కేవలం నాటక గృహ నిర్మాణం, రంగ దీపనం, తెరలు, ఆహార్యం, నేపథ్యగృహనిర్మాణం తదితర వివరాలకు కేటాయించడం గమనార్హం. సంగము యుగంలో ధనికులనీ, బీదలనే తారతమ్యం లేకుండా ప్రజలందరికీ నాటకం పట్ల అనురక్తి ఉండడంతో ఎంతో ఆదరణ చూపించేవారు. కొత్తార్, పోరునార్, వీరలియార్ లాంటి నటులనెందరినో ఆ నాటి రాజులు ఆదరించడమే కాక బహుమతులిచ్చి గౌరవించారు. ఆనాటి నాటకాలు ఏవీ ఇప్పుడు లభ్యం కావడం లేదు.

కాలక్రమేణా తమిళనాడులో నాటకాల పట్ల ఆదరణ తగ్గిపోయింది. సంగము యుగం తర్వాత తమిళనాడు కళప్పిరార్ల పాలనలోకి వచ్చింది వారు జైనులు. సంగీతం, నాటకం, నృత్యం కళారూపాలను వారు ప్రోత్సహించలేదు సరికదా వాటి ప్రదర్శనలను సైతం ఆమోదించలేదు. ఆ కారణంగా కళారూపాలు తమిళనాడులో చాలకాలం వరకు మరుగున పడ్డాయి. కళాకారులు కూడ జీవనోపాధి కోసం వేరే మార్గాలను వెతుక్కోవలసి వచ్చింది. మళ్ళీ ఈ కళారూపాలకు పునర్జీవనం 7వ శతాబ్దంలో పల్లవ రాజుల పరిపాలనలో కలిగింది. ఈ మూడు కళారూపాలు ఒక్కసారిగా పల్లవ రాజుల అండతో ప్రజలలోకి వెళ్ళడం జరిగింది. అయితే ఈ లలిత కళాప్రదర్శనలు మేధావి వర్గాన్ని, ధనిక వర్గాన్ని ఆకట్టుకోలేక పోయాయి. అందుకు ముఖ్యకారణం ఆ ప్రదర్శనలలో విలువలు తగ్గిపోవడం, కేవలం శ్రామిక వర్గం మాత్రమే యీ కళల పట్ల ఆదరణ చూపించేదని అర్థమవుతుంది.

ఈ మధ్యయుగం నాటకాలలో నృత్యమే ప్రధానంగా ఉండేది. కథా గమనాన్ని నృత్య రూపంలోనే ప్రదర్శించేవారు. పండుగల సందర్భాలలో దేవాలయాల్లో ఎక్కువగా నాటకాలను ప్రదర్శించినట్లు తెలుస్తోంది. 10వ శతాబ్దపు రాజుల కాలం నాటి శాసనాలను చూస్తే మరికొన్ని విషయాలు అవగతమవుతాయి. తిరుమల నయనార్, ఆరియాన్ కూత్తు నాటకాలు దేవాలయ ప్రాంగణాలలో విరివిగా ప్రదర్శితమయ్యాయి. క్రీ.శ.968లో రెండవ రాజేంద్రుని శాసనం ప్రకారం రాజరాజేశ్వరి నాటకం తంజావూరులోని బృహదీశ్వర దేవాలయంలో ప్రదర్శించినట్లుగా తెలుస్తుంది. అదే బృహదీశ్వరాలయంలో 18వ శతాబ్దంలో శివ కొలుందు దేశిగర్ రాసిన శర భంద్ర భూపాల కురవంజి నాటకం ప్రదర్శితమయింది. అలా సంగీత రూపకాలు – కురవంజి, నొండినాడగం లాంటి నాటకాలు కూడా ప్రదర్శించారు. ఈ నాటకాలలో సంభాషణలన్నీ వచనం కాక, పాటలలో ఉండేవి. ఈ నాటక ప్రదర్శనలు ఎక్కువ జనాకర్షణకు నోచుకున్నవి. త్రికూట రాశప్ప కవిరాయర్ రాసిన కుట్రాల కురవంజి నాడగం, అరుణాచల కవి రాయర్ రాసిన శీదక్కాది నొండి నాడగం, 18వ శతాబ్దకాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన సంగీత రూపకాలుగా ప్రసిద్ధి కెక్కాయి. ఈ నాటకాలను ఆరుబయట ఎక్కువగా ఆడేవారు. తమిళ నాడులో 18వ శతాబ్దం వరకూ

జరిగిన నాటక ప్రదర్శనలు, రచనల వివరాలు లభ్యం కావడం లేదు.

తంజావూరు, మధుర నాయకుల కాలంలో తెలుగు, కన్నడ భాషలలో కూడ ఎన్నో నాటకాలు వెలువడినాయి. వీటిని రాజదర్బారులలో ప్రదర్శించేవారు. 18వ శతాబ్దంలో మేలట్టూర్ ప్రాంతంలో తెలుగులో సంగీత నృత్య రూపకాలు వర్థిల్లాయి. వీటిలో గోపాల కృష్ణ భారతి విరచితమైన నందనార్ చరితం, అరుణాచలకవి రాయర్ రచించిన రామ నాడగ కీర్తనై ప్రసిద్ధికెక్కినవి. వీటిననుసరించే తమిళంలో నాటకాలు రావడం ప్రారంభమయ్యాయి. ఈ నాటకాలు సంగీత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నవి. కాలక్రమేణ సంగీత నాటకాలు, సంగీత కచేరీలుగా మారిపోవడం జరిగింది. ప్రదర్శనలలో సందర్భోచితమయినా కాకున్నా త్యాగరాజ కృతులు పాడేవారు. సంగీతం ఎక్కువగా జనాన్ని ఆకర్షించడంతో సంగీతంలోని వివిధ అంశాలైన కీర్తన, ఎత్తుగడ, స్వరం, రాగం, తాళం పై దాదాపు సంగీత కుస్తీలు జరుగుతుండేవి. ఇలా సంగీతానికి ప్రాధాన్యం పెరిగి నాటక ప్రదర్శనల పట్ల ఆదరణ తరుగుతూ వచ్చింది. పైగా ఇలాంటి నాటకాలలో సంభాషణలు ఉండేవి కావు. ఎప్పటికప్పుడు అవసరమైన సందర్భోచితంగా ఆశువుగా సంభాషణలను నటులు అల్లుకొనేవారు. మధ్యమధ్యన హాస్యనటుడు తన హాస్యంతో సభికులను నవ్విస్తుండే వాడు వాద్యకారుడు పాటలు పాడి ప్రేక్షకులను రంజింప జేసేవాడు. అంతేకాక డంబాచారి పాత్ర ఒకటుంటుండేది. ఆ పాత్రతో ప్రహసనం ప్రదర్శించే వారు. 19వ శతాబ్దానికి నాటక పరిస్థితి అట్టుడుగుకు జారిపోయింది. సమాజంలో నటులకు విలువే లేక పోగా కూత్తాడి (నటుడు) అన్న పదాన్ని దూషణలలో ఉపయోగించే స్థితికి దిగజారింది. తర్వాత కొన్నాళ్లకు నాటకాలను వీధుల్లోనూ, మైదానాలలోనూ ప్రదర్శించేవారు. ఆ విధంగా ఆ నాటకాలు తెరుకూత్తు (వీధి నాటకాలు)లుగా పిలవబడ్డాయి. ఈ తెరుకూత్తులు తక్కువ వచన సంభాషణలతోనూ, ఎక్కువ సంగీతంతోనూ ప్రదర్శింపబడేవి. తమిళనాడులోని ఉత్తర, దక్షిణ ఆర్కాట్, చెంగల్పట్టు జిల్లాలలోని కూత్త తెగవారు ఎక్కువగా ప్రదర్శించేవారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల యక్షగానమో, కేరళ రాష్ట్ర కథాకళియో తెరుకూత్తులకి మూలమని కొందరు మేధావుల అభిప్రాయం. ఏది ఏమైనా తెరుకూత్తు మరే దక్షిణాది సంప్రదాయ నాటకంలా మాత్రం ఉండదు. సాధారణంగా పల్లె సీమలలో ఈ నాటకాలను ప్రదర్శించేవారు. నాలుగు వెదురు వాసాలు నాటి, ఆ ప్రదేశాన్ని రంగస్థలంగా సూచించేవారు. రంగస్థలం పై సంగీత కారులు కూర్చోనే వారు. వారి వెనకగా నాటక కంపెనీ పేరు పెద్ద పెద్ద అక్షరాలతో రాయించి తగిలించేవారు. సాధారణంగా ముఖ్యమైన పాత్రల ఆహార్య విషయంలో ప్రత్యేకత కనిపించేది. వారి ముఖాలకు ఎక్కువగా కాంతివంత మైన నీలం, ఎరుపు రంగులను అద్ది అక్కడక్కడా తెలుపు, నలుపు గీతలు గీసేవారు. పురాణాలలోని ప్రధాన నాయక పాత్రలకు పెద్ద పెద్ద మీసాలను అతికించి గంభీరంగా కనిపింప జేసేవారు. నగల అలంకరణలో యక్షగాన పాత్రలను, దుస్తుల అలంకరణలో కథాకళి పాత్రలను కొంత వరకు గుర్తుకు తెచ్చేవి. ఈ నాటకాలలో కట్టియకారన్ పాత్ర హాస్యపాత్ర. నాటకాల ఇతివృత్తం పురాణేతి హాసాల నుంచి సేకరించబడినవి.

సభానాటకంలోని దృశ్యం

సంప్రదాయ తెరుకూత్తు నాటకంలో శాస్త్రీయ, జానపద సంగీత మేళవింపు కనిపిస్తుంది. ప్రధాన పాత్రలు పాటలు పాడుతుంటే వెనుకనే కూర్చుని ఉన్న మిగతా సంగీతకారులు కోరస్, (బృందగానం)రూపంలో తిరిగి పాడేవారు. దాదాపు సగం నాటకం పాటలతో నిండిపోతే మిగిలిన సగం అప్పటికప్పుడు నటులు ఆశువుగా మాట్లాడేవారు. నటుడు తన పాత్ర పూర్తికాగానే సంగీత వాద్యాలతో కురుకుళల్, తప్పెటలు, గంటలు, చోటు చేసుకునేవి.

ఇందులో నృత్యపరంగా కూడ అడుగులు వేస్తూ నటించేవారు. పాత్రల భావోద్వేగాలను ప్రకటించడంలోనూ, యుద్ధ సన్నివేశాల ప్రకటనలోను, ఈ నృత్యపరమైన కదలికలు ఉధృతంగా ఉండి ప్రేక్షకుల నలరించేవి. తెరుకూత్తూ నాటకాలు ప్రస్తుతం ఆడుతున్న సమాజాలలో పురిసై కన్నపు తంబిరాన్, రాఘవ తంబిరాన్ కంపెనీలు పేరెన్నిక గన్నవి.

ఇది ఇలా వుండగా ధార్వాడ నాటక కంపెనీ, ఆల్ఫ్రెడ్ నాటక కంపెనీ, పార్సీ నాటక సంఘాలు మదరాసులో నాటక ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాయి. కళ్ళు మిరుమిట్లు గొలిపే దుస్తులతో, సీనరీలతో వారి నాటక ప్రదర్శనలుండేవి. యువకులను యీ ప్రదర్శనలు ఆకర్షించడంతో తాము కూడ నాటకాలు ఆడాలనే ఉత్సాహం కలిగింది.

19వ శతాబ్దాంతానికి తమిళ నాటక రంగంలో నాటక పునరుజ్జీవనానికై నడుంకట్టారు పమ్మల్‌సంబంధ మొదలియార్. సుగుణ విలాస సభ అన్న పేరుతో 1891లో ఒక సంస్థను స్థాపించాడు. *మనోరమ, బేదాళ ఉలగం, (భేతాళలోకం)*, సభాపతి అనే ప్రజారంజకమైన నాటకాలను రచించి, నటించి ప్రదర్శించాడు. న్యాయవాదులు, ఉపాధ్యాయులు మొదలు సమాజంలో గౌరవం, పలుకుబడి ఉన్నవారు కూడ సుగుణవిలాస సభలో సభ్యులుగా చేరడమే కాకుండా విరివిగా ప్రదర్శనలివ్వడం, వాటిలో నటించడం ద్వారా తమిళనాటకరంగానికి ఒక కొత్త ఊపునివ్వడానికి సంబంధ మొదలియార్ , తన సహచరులు కారకులయ్యారు.

ధర్మవరం రామకృష్ణమాచార్యుల సరస వినోదిని సభ మదరాసులో నాటక ప్రదర్శన లివ్వడం కూడ సంబంధ మొదలియార్ తమిళ నాటక రంగ పునరుజ్జీవనానికి కంకణం కట్టుకోవడానికి కారణమైంది. తమిళనాటక రంగంలో నూతన యుగం సంబంధ మొదలియార్ తోనే ప్రారంభమైందనవచ్చు. నాటక రచనా విధానంలోనూ, ప్రయోగ విధానంలోనూ గమనించదగ్గ మార్పు చోటు చేసుకుంది. ప్రయోగాలు క్రమబద్ధంగా ఉండేవి. రంగస్థలం మీద పాట కచేరీ పద్ధతి కనుమరుగైంది. సుగుణ విలాస సభ తిరువాన్కూర్, సింహళం (శ్రీలంక) లో పర్యటించి తమిళంలో విరివిగా నాటకాలు ప్రదర్శించింది. ఆ విధంగా ఔత్సాహిక నాటకరంగం తమిళ నాట స్థిర పడింది. అక్కడితో ఆగకుండా తమిళ నాడులోనే కాకుండా తమిళులు ఇతర రాష్ట్రాలలోఎక్కడున్నా అక్కడ తమిళ నాటక సమాజాలు ఏర్పడ్డాయి. నాటక ప్రదర్శనలు సంఖ్యాపరంగా కూడ ఎక్కువవుతూ వచ్చాయి. సుగుణ విలాససభ ఔత్సాహిక నాటకరంగానికి మార్గ దర్శకమయింది. అంతవరకు నటుణ్ని అగౌరవంగా కూత్తాడి అని పిలుస్తున్న పరిస్థితికి అడ్డుకట్ట వేసి నటుణ్ణి కలైంజ్ఞన్ పేరుతో పిలవడానికి దోహదం చేసింది సుగుణ విలాస సభ. అందుకే సంబంధ మొదలియార్‌ను తమిళ నాటకోద్యమ పితామహుడు అంటారు. నాటక రచనలో నాటకాన్ని అంకాలుగాను, దృశ్యాలుగాను విభజించడం, పాటలకంటే సంభాషణలకే ప్రాధాన్యతనివ్వడం అనే పద్ధతి ఇక్కడ నుంచే ప్రారంభమైంది.

1891లో సుందరం పిళ్ళై మనోన్మణీయం నాటకాన్ని షేక్స్పియర్ నాటక రచనా పద్ధతిననుసరించి నాటకం రాశాడు. ఈ సమాజంలోనే రూపావతి, కళావతి, మాన విజయం నాటకాలను కలైనర్ సూర్యనారాయణ శాస్త్రి యార్ రాయడమే కాకుండా వాటిల్లో నటించాడు. ఆ నాటకాలే కాక నాటక శిల్పం, పద్ధతులపై నాడగ వియల్ పేరుతో ప్రదర్శనలలో మెళకువలను విపులంగా చర్చిస్తూ ప్రదర్శనలకు ఉపయోగకారిగా ఉండేలాగా శాస్త్రీయ దృక్పథంతో పుస్తకం రచించాడు. మరో నాటక కర్త విపులానంద అడిగల్ ఇలాంటి పుస్తకాన్నే మాతంగ చూడామణి పేరుతో రాశాడు. 19వ శతాబ్దంలో మొట్టమొదటి సారిగా తమిళ నాటకాలు ప్రచురింపబడ్డాయి.

పార్శీ థియేటర్ తమిళనాడులో ప్రవేశించిన తర్వాత కాలక్రమేణ సంచార వృత్తి నాటక సమాజాలు రూపుదిద్దుకున్నాయి. అలా ఆ సమాజాలు పురాణేతిహాస నాటకాలు ప్రదర్శిస్తూ ప్రేక్షకులను రంజింపజేస్తుంటే, మరోవైపు చదువుకున్న యువకులు ముఖ్యంగా షేక్స్పియర్ రచనలతో పరిచయమున్న యువ బృందాలు ఆంగ్లనాటకాలను తర్జుమా చేసి ప్రదర్శించడం ప్రారంభించాయి. ఇటువంటి నాటకాలు సంబంధ మొదలియార్ కలం నుంచి ఎన్నో వచ్చాయి. అందులో హేమ్లెట్ ఆధారిత అమలాదిత్య నాటకం ఒకటి. ఆ సమాజంలోనే బాల సమాజాలు (బాయ్స్ కంపెనీలు) పుట్టుకొచ్చాయి. ఈ సమాజాలకు సంబంధించి శంకరదాస్ స్వామిగళ్ చేసిన సేవ గణనీయం. ఈ సమాజాలలో 16-17 మధ్య వయస్కులు నటులు. పెద్దవారికంటే ఈ బాల సమాజాలలో క్రమశిక్షణ ఎక్కువగా కనిపించేది. వీటిలో మధురబాల వినోద సంఘం చాల ప్రసిద్ధి చెందింది. ఈ సమాజాలకో ఒరవడి పెట్టింది కన్నయ్య చెట్టి కంపెనీ. ఆ తర్వాతది నవాబు రాజ మాణిక్యం కంపెనీ. ఈ కంపెనీ ప్రదర్శించిన నాటకాలలో నందనార్ ముఖ్యమైనది. ఈ నాటకాన్ని మహాత్మాగాంధీ చూడడం తటస్థించింది. బాల సమాజాలు ప్రదర్శించిన నాటకాలలో కత్తరిన్ వెట్రి, తెళిక్కోడి, పన్న పురత్తు వీరన్ ఉన్నాయి. ఈ బాల సమాజాలు రాష్ట్రం నలుమూలలలో తిరుగుతూ ప్రజారంజకమైన నాటకాలు ప్రదర్శించాయి. ఎక్కువగా సినిమా శిల్పాన్ని అనుసరిస్తూ వందల ప్రదర్శనలిచ్చాయి. ఆ తర్వాతి కాలంలో వెలుగొందిన సినీతారలు శివాజీ గణేశన్, ఎమ్.జి. రామచంద్రన్, ఎమ్.ఆర్.రాధా, ఎన్.ఎస్.కృష్ణన్ మొదలయిన వారు ఈ బాల సమాజాల్లోంచి వచ్చిన వారే. 1930, 1940లలో జాతీయోద్యమం విస్తరించింది. జాతీయతను చాటి చెపుతూ, ప్రజలకు ఐక్యత ప్రబోధిస్తూ, నాటకాలు విరివిగా ప్రదర్శిస్తూ వచ్చారు. బ్రిటీష్ అధికారాన్ని నాటకాల్లో సూటిగా ఎదిరించకపోయినా, డొంక తిరుగుడుగా సందేశాన్ని ప్రజల్లోకి పంపించేవారు. 1876 నాటక ప్రదర్శనల

చట్టం, తత్సంబంధ పోలీసు చట్టాలు నాటక ప్రదర్శకులకు నిరోధాలుగా నిలిచినై. వాటి ఊబిలో చిక్కుకోకుండా జాగ్రత్తపడి నాటక ప్రదర్శనలుండేవి. నాటక ప్రతిలో లేని మాటలను ఆశువుగా సమయానుకూలంగా మాట్లాడి సందేశాన్ని అందించేవారు నటులు. నటులకు–ప్రేక్షకులకు మధ్య ఒక చక్కటి అవగాహన ఉండడంతో మాటలలోని శ్లేషను అట్టే పసిగట్టేవారు ప్రేక్షకులు. నాటకాలకు రాజభక్తి లాంటి పేర్లుండేవి. పైకి బ్రిటీష్ ప్రభువులవైపు భక్తిలాగా అనిపించినా స్వదేశ రాజుల పట్ల భక్తిని చాటేవి. నాటకాలలో సుబ్రమణ్యా భారతి రాసిన గేయాలు భారత మాత నాయకులపై రాసిన పాటలను ముద్రించి ప్రజలకు పంచితే ఆ పాటలను ఎస్.జి. కిట్టప్ప, కె.బి. సుందరాంబాళ్ లాంటి మేటి గాయకులు రంగస్థలం మీద నాటకాలలో అద్భుతంగా పాడి ప్రజాహృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు.

తమిళనాడులో ఉధృతంగా వచ్చిన ఉద్యమాలలో ద్రావిడ ఉద్యమం ఒకటి. 19వ శతాబ్దంలోనే మొదలైన ఈ ఉద్యమానికి ముఖ్య కారణం అగ్రకులంగా బ్రాహ్మణ కులాన్ని పరిగణించడం. వృత్తి ఉద్యోగాలలో దాదాపు తొంభైశాతం ఆ కులం వారే ఆక్రమించు కోవడంతో, ద్రావిడులు బ్రాహ్మణ వ్యతిరేకులై ద్రావిడ ఉద్యమాన్ని లేవదీశారు. ఇరవైయ్యవ శతాబ్దం రెండవ దశకం చివరలో మూడవ దశకం ప్రారంభంలో ఇ.వి. రామస్వామి నాయకర్ (ఆయననే పెరియార్ అని కూడ అంటారు) రంగప్రవేశం చేయడంతో ఈ ఉద్యమం మళ్ళీ ఊపందుకుంది. అప్పటి దాకా కాంగ్రెసు వాదిగా ఉన్న పెరియార్ 1920లో జరిగిన వివిధ సంఘటనలతో తన భ్రమల్లోంచి బయటపడి బ్రాహ్మణేతర ఉద్యమానికి నడుం కట్టాడు. బ్రాహ్మణులను అగ్రజాతిగా గుర్తించడం ఉత్తర భారత ఆర్యుల పన్నాగమని, ద్రావిడులు ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవలసిన బాధ్యతను తమిళ ప్రజలకు నొక్కి చెప్పాడు. 1935 ప్రాంతాలలో పెరియార్ నమ్మినబంట్లు నాటకాన్ని ఆయుధంగా ఎన్నుకుని నాటక మాధ్యమం ద్వారా ద్రావిడ వ్యక్తిత్వాన్ని నొక్కిచెప్పారు.

ఈ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు అన్నాదుర్కై, కరుణానిధి నాటకాలు రాశారు. ఎక్కడ చిన్న సమావేశమైనా వీరి నాటకాలు అక్కడ ప్రదర్శింపబడ్డాయి. నాటకాన్ని ఒక బలమైన ఉద్యమ ఆయుధంగా ఉపయోగిచుకున్నారు.

ద్రావిడ సంస్కృతిని ప్రచారంచేయడానికి వీరి నాటకాలు ఎంతగానో ఉపకరించాయి. సి.ఎన్. అన్నాదుర్కై రాసిన నాటకాలలో ఓరుఇరవు (ఒకరాత్రి), వేలైక్కారి (పనిమనిషి) చాల ప్రజాదరణ పొందినవి. ఇప్పుడు కూడా వాటిని ప్రదర్శిస్తున్నారు. ద్రావిడ మున్నేట్రకజగం 1949లో స్థాపించినపుడు నాటకం, సినిమా మాధ్యమాల ద్వారా వారి రాజకీయ పార్టీ ప్రచారాలు ఉవ్వెత్తుగా సాగాయి. కరుణానిధి రాసిన ఉదయ సూర్యన్, కాగితప్పూ (కాగితం పూలు) కూడ ఆ కోవకు చెందినవే. 1943లో చంద్రోదయం నాటకంలో అన్నాదుర్కై, కరుణానిధి నటించారు. వారితో జత కూడిన మరో రచయిత భారతీదాసన్. వీరంతా ద్రావిడ ఉద్యమానికి ప్రియమైన విషయాలనే ప్రధానంగా తీసుకుని నాటకాలు రాసి నటించేవారు. సిద్ధాంత పరమైన సాంఘిక సంస్కరణల సాధన కోసం నాటకాలు వీరికి చక్కటి అస్త్రాలుగా ఉపయోగపడ్డాయి. నల్లతంబి, రంగూన్ రాధా, వేలైక్కారి లాంటి నాటకాలు రంగస్థలం మీదే కాక, బహుళ జనాదరణ పొందిన సినిమాలుగా కూడవచ్చాయి. వీటిలో కొన్ని నాటకాలకు ప్రేరణ ఆంగ్ల సాహిత్యంలోని కొన్ని కావ్యాలే. ఉదాహరణకు అన్నాదుర్కై రాసిన వేలైక్కారి లోని కొన్ని దృశ్యాలు కౌంట్ ఆఫ్ మాంటెక్రిస్టొ లో ఉన్న వాటికి పోలినవి. అలాగే నల్లతంబి నాటకంలోవి కూడ 1936లో ఫ్రాంక్ కాప్ర రాసిన మై డ్రీడ్ గోస్టు వాషింగ్టన్ లోనివి. వీటి లో ఉత్తమ నాటక లక్షణాలు కరువైనా, పొడవైన సంభాషణలు, ఉత్తేజపరిచే ప్రసంగాలు ప్రజల్ని ఆకట్టుకునేవి. వీటికి తోడు తమిళ భాషలో స్వతహాగా ఉన్న అందాన్ని అందమైన శబ్దాలంకారాలతో వినడానికి అత్యంత రమణీయంగా రాయగల నేర్పువున్న రచయితలు అన్నాదుర్కై, కరుణానిధిలు ఉద్యమానికి కంకణం కట్టుకున్నప్పుడు ప్రయోజన కరమైన నాటకాలకు కొదవ లేకుండా పోయింది.

కరుణానిధి రాసిన మరో నాటకం పరాశక్తి ఈ నాటకాన్నే సినిమాగా తీసినప్పుడు అందులో నటించిన శివాజీ గణేశన్‌కి సినీ జీవితాన్నే ప్రసాదించింది. హైందవ మతంలోని ఆచార సాంప్రదాయాలు కపటపూరితమని, ఒక కులాన్ని కేవలం స్వార్థంతో అగ్రకులంగా పరిగణించిన విధానాన్ని గర్హిస్తూ కరుణానిధి తన శక్తిమంతమైన కలంతో ఆచారాలనీ, వర్గ భేదాలనీ ఎండగట్టడమే ఈ నాటకంలోని సారాంశం.

అయితే ఈ నాటకాలన్నీ ఉత్తమ నాటక కళకి ప్రతి రూపాలు ఏమాత్రం కావు. కాకపోతే వాటిలోని సంభాషణలు, అలంకార సహితమై చక్కటి వర్ణనలతో ప్రేక్షకుల నిట్టే ఆకర్షించగల పదును గలిగి ఉండడం వలన జనంలో నిలిచిపోయాయి.

తమిళనాట మరో గొప్ప నటుడు దర్శకుడు ఆర్.ఎస్. మనోహర్. సాంకేతిక పరంగా, సెట్స్ ఎంత భారీయైనా, ప్రేక్షకులకు భ్రమ కలిగేలా సెట్స్‌ని నిర్మించడం, క్షణాల్లో వాటిని మార్చడం, ఇవన్నీ చూస్తున్న ప్రేక్షకులకు ఇది సాధ్యమా అని అనిపించేలా నాటకాలు ప్రదర్శించడంలో దిట్ట. పౌరాణిక, చారిత్రాత్మక ఇతివృత్తాలతో విశ్వామిత్ర, దుర్యోధనన్ నాటకాలు ప్రజాదరణ పొందాయి.

1960 దశకంలో నాటకాలు కొంత వ్యాపార ధోరణిని సంతరించుకొన్నాయి. ఇది నాటకాలలోనే కాక అన్ని రంగాలలోనూ వ్యాపించింది. మదరాసు నగరంలో కొత్త

సాంస్కృతిక సంఘాలు పుట్టుకొచ్చాయి. చో.రామస్వామి నాటక రచయితగా రంగ ప్రవేశం చేశాడు. సందేశాన్ని వినోదంతో, వ్యంగ్యంతో మేళవించి ప్రజారంజకంగా నాటకాలు రాసి ప్రదర్శించాడు. సంఘంలోని కుళ్ళును, రాజకీయాలను వ్యంగ్యోక్తి రూపంలో విమర్శించేవాడు, మహమ్మద్ బిన్ తుగ్లక్ నాటకం కూడ అలాంటి నాటకమే. ఇది ఎక్కువ ప్రజాదరణ పొందిన నాటకాలలో ఒకటి. ఆ ఫక్కీలోనే వచ్చిన మరో కళాకారుడు ఎస్.వి.శేఖర్.

తమిళ నాటకం కొంతకాలం కేవలం వినోదానికే పరిమితమై ఉంది. అపుడు చిన్న చిన్న నాటికలు మొదలయ్యాయి. చిన్న పత్రికలు వీటిని ప్రచురించడం జరిగింది. ఎన్. ముత్తుస్వామి కొన్ని మంచి నాటికలు రాశాడు. తమిళనాడులో ఒక వెల్లువలా వచ్చిన బుల్లి పత్రికలు చిన్న నాటికలను వరుసగా ప్రచురించడంతో ఆధునిక తమిళ నాటకావిర్భావానికి నాందిపలికాయి. నడై అన్న పత్రికలో మొదటిసారిగా ముత్తుస్వామి రచించిన కాలం కాలమాన (1969) ప్రచురితమైంది. తరాల అంతరాలను, అందులోని సమస్యల నెత్తి చూపించడం ఈ నాటికలోని ప్రధాన వస్తువు. నార్కాలిక్కారన్ (కుర్చీలో మనిషి) 1971లో కచట పర పత్రికలో ప్రచురితమైంది. ఎవరు అధికారంలో ఉన్నా సామాన్య మానవుడు ఎప్పుడూ బాధితుడే అని చెప్పే నాటకం ఇది.

1971లో ఇందిరా పార్థసారథి మళై (వర్షం) నాటకం కచట పర పత్రికలో ప్రచురించడం జరిగింది. ఈ నాటకాన్ని దక్షిణ భారత నాటక సభ ఢిల్లీలో ప్రదర్శించింది. ఈ నాటకంలో నాటకీయత సంప్రదాయ బద్ధమై ఉన్నా కథావస్తువు నవ్యతను సంతరించుకొని ఆ రోజుల్లో తమిళ నాట విరివిగా ప్రదర్శిస్తున్న సామాన్య నాటకాలకు భిన్నంగా ఉండడంతో తమిళ ఆధునిక నాటకానికి అది ప్రారంభ దశగా మారింది. ఎన్.ముత్తుస్వామి, ఇందిరాపార్థసారథి, ఆనాటి ఎ.క్యూ. విళిగల్, మైగై, పాలం లాంటి చిన్న పత్రికలలో తక్కువ నిడివిగల నాటకాలను రాయడం, ఆ నాటకాలతో ప్రేరణ పొంది యువరచయితలు కొందరు నాటక రచనలో ప్రయోగాలు చేయడం ప్రారంభించారు. ఆ విధంగా ముత్తుస్వామి, పార్థసారథి తమిళ ఆధునిక నాటకానికి ఆద్యులు అయ్యారు. ఈ కొత్త తరహా నాటకాలని తొలుత తమిళులు అంతగా ఆదరించకపోయినా, తరువాత వీటిపై ప్రజాభిరుచి బాగా పెరిగింది.

1970 దశకంలో కూత్తు పట్టరై పేరుతో ఒక నాటక సమాజాన్ని చెన్నైలో ఎన్. ముత్తుస్వామి, తెరుకూత్తులో ప్రసిద్ధుడైన పురిసై కన్నప్ప తంబియార్ స్థాపించారు. క్రమంగా ముత్తుస్వామి నాటకాలు సంప్రదాయ పద్ధతి, వాస్తవికత శైలి నుండి విడివడి కథా వస్తువు కంటే ప్రదర్శనా శైలిలో కొత్తదనాన్ని చూపించాయి.

ఆ రోజుల్లోనే కోమల్ స్వామి నాడార్ రాసిన తన్నీర్ తన్నీర్ నాటకం ప్రజలలో ఒక కొత్త కెరటాన్ని తీసుకొచ్చింది. సామాన్య ప్రజల సమస్యలే ఈ నాటకంలోని వస్తువు. అమిత ప్రజాదరణ పొందడంతో, దీనిని సినిమాగా తీయడం, అశేష జనాకర్షణకు నోచుకోవడం జరిగింది. కొత్త తరహాలో నాటక ప్రదర్శనలు ఇవ్వడానికి విశేషంగా కృషిచేసిన స్వామినాథన్ అకాల మరణంతో ఆ ఊపు ఎంతో కాలం కొనసాగలేదు.

సుజాత తమిళ నాటక రంగంలోని మరో గొప్ప నాటకకర్త. ఇతని నాటకాలు అర్థవంతమైనవి, నిర్మాణ పరంగా తృప్తి నిచ్చేవి, సందేశాత్మకంగా ఉత్సుకతను కల్గించేవి. ఊంజల్ (ఉయ్యేల)ఈయన రాసిన నాటకాలలో ఒకటి. ఇందులో చివరి దృశ్యం మెలోడ్రామా. ఒక పాతకాలపు మేధావిఅయి ఇంజనీరు, త్వరితగతిని మారుతున్న అధునాతన సాంకేతిక పద్ధతులను జీర్ణించుకోలేక, తన పాత లోకంలోనే తను పొందే తృప్తి, ఆనందం, ఈ నాటక ఇతివృత్తం.

అప్పుడే వచ్చిన సి.ఎస్.చెల్లప్ప నాటకం మురయప్పెణ్లో కథాంశం దేవర్ కులపు రైతుల కుటుంబ సమస్యలు. అభినయానికి ఎక్కువ అవకాశమున్న నాటకం. అలాగే మానవ విలువలు అంతరించిపోవడం మీద జయంతన్ రాసిన నినైక్కపడుం నాటకం.

ముత్తుస్వామి రాసిన కట్టియకారన్లో పేజీలకు పేజీలు సమసిపోని సంభాషణలున్న నాటకం. ఈయన రాసిన ప్రతి నాటకంలోనూ ఉన్నతమైన ఆదర్శాలు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి.

1984లో సంగీత నాటక అకాడమీ యువ దర్శకులను ప్రోత్సహించడం కోసమై ఆర్థిక సహాయం చేసి ఒక నాటకోత్సవాన్ని నిర్వహించింది. సంప్రదాయాన్ని నవ్యతను మేళవిస్తూ నాటక ప్రదర్శనలుండాన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం తమిళనాడులో ఎందరో నాటకకర్తలకు కొత్త నాటకాలు రాయడానికి అవకాశం కల్పించింది. ఆ సంవత్సరమే జాతీయ ఉత్సవంలో సోఫోక్లిస్ ఆంటిగని నాటకాధారంగా డా.ఎమ్.రామస్వామి రాసిన తూర్కిర ఆవళం నాటకం ప్రదర్శించబడింది. అలాగే నందన్ కథై (రాజు), కడవుల్ (ఎమ్.నటేశ్) మురుగై(ఆర్ముగం) లాంటి మరెన్నో నాటకాలు జాతీయ నాటకోత్సవాలలో ప్రదర్శింపబడి ప్రేక్షకుల మన్ననలు పొందాయి. కేవలం జాతీయ నాటకోత్సవాల కోసమే దర్శకుల అవసరాల మేరకు రచయితలు కొత్త నాటకాలు రాశారు. ఉత్సవాలలో ప్రదర్శించిన నాటక రచయితలకు ఆర్థిక సాయాన్ని కూడ అందించింది అకాడమీ. అలా వచ్చిన కొత్త నాటకాలలో

కొంగైథీ (ఇందిరా పార్థ సారధి), ఊసి కరుంచుళి (ఆర్ముగం), నాయ్మైప్పరి కొట్టుం (ఎస్. పి. శ్రీనివాసన్), తీణిప్పోర్ (ఇళయ పద్మనాధన్) నాటకాలు పేర్కొనదగినవి.

వీటితో తృప్తి చెందకుండా, తమిళ నాటక రచయితలు ప్రపంచ నాటకరంగం నుంచి కొన్ని నాటకాలను తర్జుమా చేయడమే కాక, వాటిలోని ప్రధాన సందేశమో, సన్నివేశమో, ఇతివృత్తమో తీసుకుని వాటిని ఆధారం చేసుకుని కొత్త తమిళ నాటకాలు రాయడం ప్రారంభించారు. ఇంగిలాండు, వెరియాట్టం లాంటి నాటకాలు సంప్రదాయ నాటకాన్ని నవీన నాటకాన్ని కలిపే ప్రయత్నం చేశాయి. ఇంగిలాండు నాటకంలో ఎన్. ముత్తుస్వామి తెరుకూత్తు సంప్రదాయ రీతిని అనుసరిస్తూ ప్రజలింకా పెరవారి పాలన నుంచి ఇంకా బయటపడలేదని, అస్పృశ్యతా నివారణ అధికారంలో ఉన్న వారి చేతిలో కాదు, అస్పృశ్యుల చేతిలోనే ఉందని, అలోచించమని సందేశాన్నిస్తాడు. రామానుజం యూరిపిడీస్ నాటకం దిట్రోజన్ ఉమన్ ఆధారంగా రాసిన వెరియాట్టం నాటకంలో, తమిళనాడు పల్లెల్లో ఆడవాళ్ళు శోకాన్ని ప్రకటించే రీతిలో యుద్ధం తీవ్రమైన పరిణామాలను వివరిస్తాడు.

మోలియర్ నాటకం టార్ టాఫ్ ను ఆధారంగా చేసుకుని చేసిన వేషక్కారన్ అనే నాటకాన్ని ప్రవీణ్ దర్శకత్వంలో ప్రదర్శించినప్పుడు ప్రేక్షకులు బాగా ఆదరించారు. 1998లో ఈ నాటకాన్ని తిరుగన్నామలై ప్రాంతాలలో వూరూరా ప్రదర్శించారు. ప్రజలే కాక పత్రికలు కూడా నాటక ప్రదర్శనను అభినందించాయి.

అప్పట్లో కూత్తూ పట్టరై చేపట్టిన భారీ నాటకం గాడ్ హేస్ చేంజ్డ్ హిస్ నేమ్ దేశంలో చాల చోట్ల ప్రదర్శించబడింది. ఈ నాటక రచయిత అవంతి మేడూరి. బ్రిటీష్ పాలనలో దేవదాసీల స్థితిగతులు, వారు దేవదాసీలుగా మారిన విధం, వారి నృత్యాలు వివరిస్తాడు రచయిత. అవంతి వ్యాఖ్యాతగా నటించిన యీ నాటకంలో మూగబోయిన దేవదాసి గొంతు, నాటకం ముందుకు సాగే కొద్దీ ఉత్తేజం పలుకుతో పాత్ర సజీవంగా కనిపిస్తుంది. నాటక కళ తమిళనాట అభివృద్ధి చెందడానికి నాటక కర్తలు, నటులు, ప్రయోక్త లేకాక కొన్ని పత్రికలు కూడ కారణమయ్యాయని చెప్పవచ్చు. అందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి నాడగం, నాడగకళై. ప్రదర్శనలపై విమర్శలు, సూచనలు చేస్తూ కొత్త తరానికి మార్గ దర్శకంగా కూడ పత్రికలు ఉపయోగపడుతున్నాయి.

రాను రాను తమిళ నాటక రంగంలో ఒక పక్క నాటక రచన మీద శ్రద్ధ పెరిగి, సమకాలీన సమస్యలను ముఖ్యంగా చర్చిస్తూ, సమాజంలోని లోటు పాట్లను ఎత్తి చూపిస్తూ, ప్రేక్షకులకు రసానుభూతిని కల్గించే విధంగా ఉంటూ, మరోపక్క ప్రదర్శనలలో కొత్త శైలి, విధానాలను ప్రవేశ పెట్టాలని యువదర్శకుల నిశ్చితమైన అభిప్రాయం. ఈ పరిస్థితులు తమిళనాడులో నాటకరంగం కొత్తపుంతలు తొక్కేదిశలో పయనిస్తున్నాయి. ఇది శుభసూచకం.

రవీంద్ర

పంజాబీ నాటక రంగం

అనేక రాజకీయమైన ఒడిదొడుకుల వల్ల మరికొన్ని విపత్కర పరిస్థితుల కారణంగా పంజాబులో జనసామాన్యానికి నాటక కళపై శ్రద్ధాసక్తులు చూపగల అవకాశం లేకుండా పోయింది. తరచు పరిపాలకుల దాడులు, ఆక్రమణల వల్ల వీర రసోద్దీపితమైన కవిత్వం, గేయాల ఆవశ్యకత పంజాబీ సాహిత్యకారులకు ముఖ్యంగా తోచింది. ఈ రాజకీయమైన కల్లోలాల వల్ల జనజీవితంలో కూడా సాంస్కృతిక, దైనందిన రంగాలలో పరమతాల, పరసంస్కృతుల ప్రభావం మిళితమైపోయింది. జనసామాన్యానికి హృదయోల్లాసాన్ని కలిగించేందుకు జానపద కళాకారులు ప్రదర్శించే ప్రాచీన విద్యలు గేయగాథలు, రాసగేయాలు, విచిత్రవేషధారణలు, శారీరక ప్రదర్శనా విన్యాసాలు ఉన్నాయి. అందువల్ల సంస్కృత మర్యాదలను అనుసరించిన నాటక రచన పంజాబీ సాహిత్యంలోనే లేదనే చెప్పాలి. అంతేకాక భక్తి, శౌర్యాలను ప్రబోధిస్తూ, జాతి రక్షణకు దీక్ష వహించిన సిక్కుమతం నాటకాల వంటి కాలక్షేపాలను సమర్థించకపోవటం కూడా 20వ శతాబ్దం వరకూ పంజాబీ నాటకం జన్మించకపోవడానికి మరొక కారణం. 17వ శతాబ్దంలో గురుగోవింద్‌సింగ్ తన బచిత్తెర్ ద్వారా, 18వ శతాబ్దంలో హృదయరాంసింగ్ హనుమాన్ నాటక్ ద్వారా నాటకరచనను ప్రారంభించినప్పటికీ వాటిని పరిపూర్ణమైన నాటకాలని చెప్పటానికి వీలులేదు.

19వ శతాబ్దంలో మిషనరీలు చేస్తున్న మతవ్యాప్తిని అరికట్టడానికి 'సింగ్‌సభ' వారు ప్రజలను మేలుకొలిపే నాటకాన్ని ఉపకరణం చేసుకున్నారు. అలాగే సిక్కులలో సాంఘిక పరివర్తనం అవసరమనీ, దేశీయుల గురించి ఇంగ్లీషువారు చేస్తున్న అసత్య ప్రచారం నమ్మవద్దనీ చరణ్‌సింగ్ (1853-1908) షరాబ్‌కౌర్, భాయివీర్‌సింగ్, రాజ్ లఖ్‌దాతా సింగ్ అనే ప్రబోధాత్మకమైన నాటకాలను రాశారు. ఆనాడు ఈ నాటకాలు ఆదరణ

పొందినప్పటికీ నేడు వీటి అస్తిత్వం సాహిత్య చరిత్ర వరకే పరిమితమైంది.

రంగస్థలావసరాలు, ప్రయోగ పద్ధతులు తెలుసుకోకుండానే 19వ శతాబ్దంలో కొందరు నాటకాలు రాశారు. నాటి సాంఘిక పరిస్థితులు, గ్రామీణ జీవితం, మూఢవిశ్వాసాలు, ఆ నాటకాలలో **దర్శనమిస్తాయి.** రాజాప్రబోధ్‌చంద్ర, అబ్లానిందా రాసిన ***జ్ఞానీ దీత్ సింగ్*** **(1853-1901)**, బ్రద్ వివాహ్ దుర్దశా రాసిన భాయిమోహన్ సింగ్‌వైద్, ముంద్రీచార్, నార్‌నవేలి రాసిన *బావా బుధ్‌సింగ్* (1878-1931), ప్రతిజ్ఞా, వాసవదత్త, సుకన్య రాసిన *బ్రిజ్‌లాల్ శాస్త్రి* (1894-1968), మహారాజ్ రంజిత్‌సింగ్ రాసిన *కిర్పాసాగర్* (1875-1939) నాటి నాటక రచయితలలో ముఖ్యంగా పేర్కొనదగినవారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల స్థాపనతో ఆంగ్ల నాటకానువాదాలు పంజాబీలోకి ప్రవేశించాయి. కొందరు సంస్కృత నాటకాలను కూడా అనువాదం చేశారు.

పరిపూర్ణమైన పంజాబీ నాటక ప్రాదుర్భావానికి మూలపురుషుడు అని చెప్పదగినవాడు ఈశ్వర్ చందర్ నందా (1892-1966). ఇంగ్లీషు ఆచార్యుడు ఫిలిప్స్ రిచర్డ్స్ వల్ల నందా ప్రభావితుడైనాడు. ప్రొఫెసర్ భార్య నోరా ఐర్లండ్ నాటక ప్రదర్శనల మర్యాదలు, మెళకువలు క్షుణ్ణంగా తెలిసిన వనిత. నోరాతో సన్నిహిత స్నేహం గల నందా పంజాబీలో నాటకం రాయాలంటే భాష, యాస, భావనాసరళులలో దేశీయ పంజాబీతత్త్వం ప్రస్ఫుటం కావాలని గ్రహించాడు. ఆ దేశీయతనే తన నాటకాలలో చూపాడు. నాటకాలలో పాత్రలన్నీ పంజాబీ జానపదాలలో కానవచ్చేవే. 1914లో ఈయన మొదటి నాటకం ప్రదర్శించాడు. సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలు వస్తువులుగా నందా అనేక నాటకాలు రాశాడు. నందా నాటకాలలో పాశ్చాత్య ప్రభావం ఉన్నదనే విమర్శ ఉన్నప్పటికీ, జనజీవితం నుంచి దూరంగా గాని, వాస్తవాలకు దూరంగా ఊహల్లోకి కాని పోలేదు. సమకాలీన సమస్యలన్నీ నాటక వస్తువులైనాయి. నందాను అనుసరించి చాలామంది రచయితలు నాటక రచన చేశారు. ఈ నాటకకర్తలపై షేక్స్పియర్, గాల్స్‌వర్దీ, ఇబ్సన్ వంటి వారి ప్రభావం ఉన్నప్పటికీ ఎవరూ పంజాబీతత్త్వం అనే అంశాన్ని విస్మరించలేదు.

జాషువా ఫజుల్-ఉద్-దీన్ (1903-73) హీర్-రాంఝా కథనే ఆధునిక భాషా ప్రయోగాలతో నాటకంగా మలిచాడు. పిండ్ దె వైరీ, హీర్ సయాల్ ఈయన రాసిన ఇతర నాటకాలు. అధికార దాహమత్తులు, వ్యసనపరులు ఎటువంటి నికృష్ట కార్యాలకు పాల్పడుతారో, రచయిత ఈ నాటకాల్లో చూపాడు.గురులబక్ష్‌సింగ్ ప్రీత్‌లరీ (1895-1978) ప్రేమ వృత్తాంతాలను, తత్సంబంధ సమస్యలనే ఎన్నుకొని నాటకాలలో రాశాడు. ప్రీత్‌మణి, ప్రీత్‌ముకుట్, రాజకుమారి లతికా, ప్రీత్‌లరీ మొదలైన నాటకాలు విశ్వప్రేమ తత్త్వాన్ని వెల్లడించేవి. ఈయన శైలి ఇంగ్లీషుకు అనువాదంలా సాగుతుందని ప్రతీతి.

శ్వాంగ్ బృందంలో స్త్రీ పాత్రలో పురుషులు

మోహన్‌సింగ్ దివానా (జ.1899), ఇబ్సన్, షా ల వల్ల ప్రభావితుడైన నాటక రచయిత. పంఖ్‌రియా అనే నాలుగు నాటకాల సంపుటిలో మోహన్‌సింగ్ తన ధారావేగంతో పాఠకుని ఆశ్చర్యచకితుణ్ణి చేస్తాడు. ఈ నాటకాలు సమస్యాపరమైనప్పటికీ, రచయిత ఆ సమస్యలకు నాటకాంతాన ఎలాంటి పరిష్కారం చూపక వదలివేస్తాడు.

నందా చూపిన పరిపుష్టమైన మార్గంలో నాటక రచన చేసినవాడుగా ప్రసిద్ధిగాంచిన నాటకకర్త హర్‌చరణ్‌సింగ్ (జ.1914). షేక్స్పియర్‌ను అనుసరించిన హర్‌చరణ్‌సింగ్ చారిత్రక నేపథ్యాన్ని గ్రహించి కమలా కుమారి (1937), రాజా పోరస్ (1938) నాటకాలు రాశాడు. షేక్స్పియర్ *As you Like It* ఆధారంగా ఖెదాన్ దె దిన్ చార్ (1942) నాటకాన్ని రచించాడు. విభిన్న వ్యక్తిత్వాలు గల దంపతుల జీవితాన్ని వర్ణించే అంజోర్ (1942)ను, బడుగురైతు జీవితాన్ని వర్ణించే రత్తాసాలు (1957), కాంచన్‌మాట్టి (1965), ఇతిహాస్ జవాబ్ మాంగ్‌దాహై, చంకౌర్ ది గర్హి నాటకాలను 20వ శతాబ్దం ఉత్తరభాగంలో సాంఘిక సమస్యలు ఆధారంగా హర్‌చరణ్‌సింగ్ రాశాడు. నందా చూపిన మార్గంలో నాటక రచన చేసినవారిలో సంత్‌సింగ్‌ఖాన్ (జ.1908), బల్వంత్‌గార్గి (జ.1916) పేర్కొనదగినవారు.

హర్‌చరణ్‌సింగ్‌తో మొదలైన నాటకరంగ విస్తృతి ఒక ఉద్యమం వలె సాగింది. ఆ ఉద్యమాన్ని మరింత ముందుకు నడిపినవారు గురుదయాళ్ సింగ్ ఖోస్లా (జ.1912), రోషన్‌లాల్ అహూజా (జ.1904), గురుదయాళ్ సింగ్ ఫూల్ (జ.1911) మొదలైనవారు. గురుదయాళ్‌సింగ్ ఖోస్లా 1946లో లాహోర్‌లో రంగస్థల ఉద్యమం నెలకొల్పి దేశవిభజన వల్ల ఆ ఉద్యమాన్ని 1947లో ఢిల్లీకి తరలించాడు. గాల్స్‌వర్దీ ప్రభావం ఈయన మీద అధికంగా కనిపిస్తుంది. నాటకం, ఏకాంకిక రచనలలో ఈయన సుప్రసిద్ధుడు. శరణార్థుల దీనస్థితిని వర్ణించే *భేఘరే*, అవివాహిత యువతుల సమస్యలను చూపే *బూహే బైతీ ధీ*, ఒక నిత్యశంకితురాలి వృత్తాంతాన్ని చెప్పే *జుతియాన్ దాజరా*, *బాకీ ఫేర్, ముర్దేదా రేషన్, మర్‌మిట్టన్‌వాల్, పర్లొ తొన్ పెహ్లాన్* మొదలైనవి అత్యంత ప్రజాదరణ పొందిన, విభిన్న వస్తువులు గల నాటకాలు. మొట్టమొదటగా బెర్నార్డ్ షా రచించిన *పిగ్మేలియన్* నాటకాన్ని పంజాబీలోకి అనువదించి ఖోస్లా ఢిల్లీలో ప్రదర్శించి ఖ్యాతి గడించాడు.

రోషన్‌లాల్ అహూజా దేశ విభజనానంతరం రచాన రంగంలో ప్రవేశించాడు. దేశ విభజన సందర్భంలోని అనేక సంఘటనలు అత్యంత విషాభరితంగా అనేక ఏకాంకికలలో కళ్లకు కట్టినట్టు చూపాడు. ఆ అహూజా నాటకాలలో *అబలా, శరణార్థి, హాయ్ వేంరే ధీ, పాకిస్తానీ రాజ్, పాకిస్తాన్ కె పర్లొ* విశిష్టమైనవిగాను సజీవ పాత్ర చిత్రణపరంగాను ప్రఖ్యాతి పొందాయి. *రోషన్ ఆరా, భైశాఖీ, కళింగ దా దుఃఖాంత్* ఈయన రాసిన చారిత్రక నాటకాలు. విడాకులను సమర్థిస్తూ *తలాఖ్*, వరకట్న దురాచారాన్ని వర్ణిస్తూ *దజ్* నాటకాలను రచించాడు.

అయితే ఈ రచయితలందరి నాటకాలలోను ఆధునికత కొరవడిందని, రామ్‌లీలా నాటకాల దశను దాటలేదనే విమర్శ వినవస్తుంది. సంత్‌సింగ్ సేఖాన్, బల్వంత్ గార్గి, అమ్రిక్‌సింగ్ (జ.1921) పంజాబీ నాటకరంగానికి చైతన్యం, తాజాదనం తెచ్చిన నాటకకర్తలుగా పేరొందారు. నాటికలలో ఒక నూత్న సిద్ధాంతాన్ని, విశ్లేషణను ప్రవేశపెట్టిన, *అహల్య, కలాకార్* నాటకాల ద్వారా వాదోపవాదాలకు కారకుడైన నాటక రచయిత సత్వంత్ సింగ్‌సేఖాన్, *మొయిమాన్ సార్ నకాయ్, బేరా బంధ్ న సక్యో* చారిత్రక నాటకాలు రాశారు. భారతదేశం పట్ల లెనిన్‌కు గల స్నేహతత్త్వాన్ని ఉగ్గడించే *మిత్తర్ పియారా* సాహిత్య అకాడమీ బహుమతి (1972) పొందిన నాటిక. లెనిన్, మార్క్స్ సిద్ధాంతాలు సేఖాన్ నాటకాలలో ప్రతిబింబిస్తుంటాయి. కవి వారిస్‌షా జీవితం ఆధారంగా రాసిన *వారిస్, నార్కి* (1952), *భూదాన్* (1954), *దమయంతి* (1962), సేఖాన్ ఇతర నాటకాలు. *ఇక్ ఐత్‌వార్, హర్తాల్, దూజా వియాహ్, మహాత్మా* ఈతని లఘు నాటికలు. అద్వితీయమైన, మేధావంతమైన సంభాషణలు, చర్చనీయాంశాలు, సజీవ పాత్ర చిత్రణ సేఖాన్ నాటకాలలోని విశిష్టత.

పాశ్చాత్య నాటకరంగాన్ని పూర్తిగా అర్థం చేసుకుని, పంజాబీ జానపద సాహిత్యాన్ని హృద్గతం చేసుకుని ప్రజారంజకంగా నాటక రచన చేసినవాడు బల్వంత్ సింగ్ గార్గి. మాధుర్యం, లయాత్మకమైన శైలి బల్వంత్‌సింగ్ నాటకాలలోని ప్రత్యేకత. ఈతని మొట్టమొదటి నాటకం *లోహకుత్* (1944) సంప్రదాయ శృంఖలాలను ఛేదించుకున్న తల్లీకూతుళ్ళ వృత్తాంతం. ఇది గొప్ప సంచలనాన్ని కలిగించింది. తరువాత వరసగా *ఘుగ్గి, సైల్, పత్థర్, కెస్రొ గిర్ధాన్, కణక్ ది బల్లి* (1954), *ధుణీ ది అగ్గ్* మొదలైన నాటకాలలో సాంఘిక సమస్యలను, మార్క్స్ సిద్ధాంతాలను ప్రకటించే సాంఘిక నాటకాలను, *సుల్తాన్ రజియా* చారిత్రక నాటకాన్ని, మనస్తత్వ విశ్లేషణ సిద్ధాంతాలను ఆధారం చేసుకున్న *సౌకన్* (1979) నాటికను గార్గి రచించాడు. బల్వంత్‌సింగ్ గార్గి సృజనాత్మక రచయితగానే కాక, రంగస్థల ప్రదర్శనలను గురించిన విమర్శనాత్మక వ్యాసాలు కూడా రాసిన విమర్శకుడుగా ప్రసిద్ధుడు.

కర్తార్‌సింగ్ దుగ్గల్ (జ.1917) ప్రధానంగా నవలా రచయిత అయినప్పటికీ, ఆకాశవాణి కోసం అనేక నాటకాలు రాశాడు. ప్రతీకాత్మకతకు నెలవైన ఇతని పాత్రలు పూర్తిగా సజీవమూర్తులు కావనే వాదం ఉంది. దుగ్గల్ నాటికలలో *పురాణియన్ బోత్లాన్, ఓ గయే సజన్ ఓ గయే, ఇన్ సిఫ్ సిఫ్, మీఠా పాణీ* దుగ్గల్ నాటికలలో ప్రసిద్ధమైనవి. ధారావాహికంగా సాగే వచనశైలి ఈతని ప్రత్యేకత.

దేశ స్వాతంత్ర్యానంతరం నాటక రచన చేసినవారిలో అమ్రిక్‌సింగ్, పరితోష్ గార్గి (జ.1923),కపూర్‌సింగ్ గుమ్మన్ (జ.1927), గురుచరణ్‌సింగ్ జసూజా (జ.1925), హర్‌చరణ్ సింగ్ (జ.1929), సుర్జిత్ సింగ్ సేథీ (జ.1929), మొదలైన వారంతా ప్రయోగశీలతవైపు పయనించినవారు. గతంలో చిక్కుకున్న వర్తమాన మహిళ అంతస్సంఘర్షణ, సామాన్య మానవుని కల్లోలిత జీవితం, సామాజిక క్రౌర్యాలు నాటక వస్తువులైనాయి. గుమ్మన్ రాసిన *అతీత్ ది పర్‌ఛావెన్ బుఝూరత్‌లు*, సుర్జిత్‌సింగ్ సేథీ రాసిన *కింగ్, మీర్జా కొస పేరా, నంగీపడక్ రాత్ ద ఉజాలా, మర్ద్ మర్ద్ నహీ తివిన్ తివిన్ నహీ, ఏ జిందగీ హై దోస్తో* మొదలైన నాటకాలు, పరితోష్‌గార్గి రాసిన *లుక్‌ఛిప్ జానా, ఛేదా* మొదలైనవి. అమ్రిక్‌సింగ్ నాటకాలలో *పర్‌ఛావియాన్ ది పకర్*; హర్‌చరణ్‌సింగ్ రచనలలో *జిగ్రా, ఉదాస్ లోక్, నిజాం సక్కా* ఆధునిక పంజాబీ రంగస్థలానికి జీవగర్రల వంటివని ప్రఖ్యాతి పొందాయి.

గురుచరణ్‌సింగ్ జసూజా కవితా దృష్టితో నాటక రచన చేసినవాడుగాను, సంకేతాలను విజ్ఞతతో వినియోగించుకున్న నాటకకర్తగాను ప్రసిద్ధి పొందాడు. ఈతని కంథాన్ రేత్ దయాన్, అంధ్‌కార్, మక్కరి దా జాల్, గౌముఖా-శేర్‌ముఖా, రచనారామ్‌బనాయ్ బహుళాదరణను పొందిన నాటకాలలో కొన్ని. సంత్‌సింగ్ సేఖాన్, హర్‌భజన్‌సింగ్, రవీందర్‌రావి, శివకుమార్,అజైబ్ కమల్, అజ్మీర్ జేలాఖ్, ఆత్మజిత్‌సింగ్ గేయ నాటక రచయితలుగా సాహిత్యరంగంలో విశిష్టులైన ఆధునిక నాటకకర్తలు.

పంజాబీ నాటక రంగస్థల చరిత్రను పరిశీలిస్తే, దేశవిభజనకు ముందే యువ నాటకకర్తలు లాహోరులో నాటకోద్యమం ప్రారంభించారు. బల్‌రాజ్ సహానీ, బల్వంత్‌గార్గి, జోగేందర్ భార్లా, తేరాసింగ్‌ఛన్ ఉద్యమాన్ని నడిపారు. దేశ విభజనానంతరం ఢిల్లీ కేంద్రంగా ఈ ఉద్యమాల జాతీయ నాటక విద్యాలయంగా రూపొందింది. బల్వంత్‌సింగ్ గార్గి, సుర్జిత్‌సింగ్ సేఠీ పంజాబు విశ్వవిద్యాలయంలో నాటకకళ బోధనా విభాగంలో అనేక ప్రయోగాలు చేసి, ప్రక్రియలను రూపొందించారు. ఇంతేకాక ఢిల్లీ ఆర్ట్ థియేటర్‌లో షీలాభాటియా, అమృత్‌సర్ నాటకకేంద్రం నుంచి గురుచరణ్‌సింగ్, అమృత్‌సర్ కళామందిర్ నుంచి ఆత్మజిత్, ఇంకా అజ్మీర్‌జేలాఖ్, దేవీన్దర్‌దామన్, జస్వంత్‌దామన్, లూధియానా నుంచి అశ్వనిఛాట్లీ, తృప్తాభాసిన్, రామారతన్ నాటకరంగంలో అనేక కొత్త ప్రయోగాలు చేస్తున్నారు, ప్రక్రియలను సృష్టిస్తున్నారు. చివరి ముగ్గురూ బాలల రంగస్థల వికాసం కోసం కృషి చేస్తున్నారు.

ఈ మధ్యకాలంలో హాస్యరంగం ఒకటి తలెత్తి విశేషంగా సామాజికులను ఆకర్షిస్తోంది. ప్రేం జలంధర్ ఈ హాస్య శృంగారాల నాటికల కల్పనా ప్రదర్శనలకు ఆద్యుడు. మహేశ్, సురేందర్, మాథుర్ రచయితలు, కాంతి, దేశీ, భోలీ, సూద్ మొదలైన తారాగణం గొప్ప రంగస్థల ప్రముఖులుగా ప్రజల ఆదరం పొందుతున్నారు.

కృష్ణ

పార్శీ నాటకరంగం

తమదైన సొంతబాణీ హాస్యానికి పార్శీలు పెట్టింది పేరు. అయితే భారత ఉపఖండానికి పార్శీలు చేసిన నాటక రంగ సేవ మాత్రం నవ్వే విషయం కాదు. కిమ్, కిప్లింగ్ వంటి జర్మనీ చిత్రకారుడు దృశ్యబంధ సామగ్రి సమకూరుస్తూ, సంచారబృందంగా నాటక ప్రదర్శనలిస్తున్న పార్శీ నాటక కంపెనీ వెంట ప్రయాణించాడంటే పార్శీ నాటక ప్రభావం విశదమవుతుంది. మహాపండితులైన వాళ్ళు కూడా తమ రచనల్ని పార్శీ నాటక బృందంతోనే మొదలుపెట్టారు. బ్రిటీష్‌నాటక నమూనా ఆధారంగా ఏర్పడిన పార్శీ నాటక కంపెనీ క్రమంగా ఒక సంస్థగా మారి ప్రజల్ని చైతన్యం చేస్తూ, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థగా రూపుదిద్దుకుంది.

1840లో ప్రముఖ వ్యాపారస్తుడు ఫ్రాంజీ, కొవ్వాస్‌జీ కొంతమంది స్నేహితులతో కలసి బంబాయిలో ఒక కొత్త నాటకశాల నిర్మాణానికి ఆనాటి గవర్నరుకు ఒక దరఖాస్తు సమర్పించారు. కొన్నాళ్లకు బాంబే గెజిట్‌లో ప్రభుత్వం ఇందుకు సంబంధించి తమ సమ్మతి తెలిపింది. అయితే 1846 వరకు అది కార్యరూపం దాల్చలేదు. ఇదే సంవత్సరం జమ్‌షడ్‌జీ, జీజీ బాయ్‌జీ రంగ ప్రవేశంతో 'గ్రాంట్ రోడ్ థియేటర్' ప్రారంభించబడింది. ఈవిధంగా బంబాయి పట్టణవాసులకు నాటక ప్రదర్శనల పరిచయం కలిగింది. క్రమంగా బంబాయి వర్తకులు, బంబాయి వర్తక ప్రముఖులు, వృత్తి వ్యాపారాత్మక నాటక సంస్థగా దీన్ని రూపుదిద్దారు. మొదట్లో ఆంగ్లేయుల నిర్వహణలో ఇంగ్లీష్‌లో నాటకాలను ప్రదర్శించారు. క్రమంగా గ్రాంట్ రోడ్ థియేటర్ భారతీయ నాటక ప్రదర్శనలకు నెలవైంది. దీనికి తోడు అనేక పార్శీ నాటక క్లబ్బులు వెలిశాయి.

1850 నుంచి 1950 వరకు అంటే నూరు సంవత్సరాలపాటు పార్శీ నాటకరంగం భారతీయ సంస్కృతిని తన చేతుల్లోకి తీసుకుంది. ముఖ్యంగా 1870 నుంచి 1890 వరకు పార్శీ నాటకరంగ సృజనాత్మక కాలంగా పేర్కొనవచ్చు. ప్రేక్షకుల వైఖరి, ప్రదర్శనలను ఆదరించే తీరులో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. మొట్టమొదటి పార్శీ నాటక కంపెనీ 'పార్శీ నాటక మండలి' 1853లో స్థాపించబడింది. ఫ్రామ్‌జీ జి. ధలాల్, నిర్మాణతలో మొట్టమొదటి నాటకం రుస్తుం అండ్ షోరాబ్ గ్రాంట్ రోడ్ థియేటర్లో ప్రదర్శించబడింది. దీనితోపాటుగా ధన్ జీ గారక్ అనే వ్యంగ్య హాస్యపూరిత ప్రదర్శన కూడా చోటుచేసుకుంది. ప్రదర్శనలు విజయవంతం కావటంతో పార్శీ

వర్గాల్లో ఉత్సాహం రెట్టింపై ఇరవైకి పైగా పార్శీ నాటక కంపెనీలు ఏర్పడి, నాటకరంగ కార్యకలాపాలను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్ళాయి. ఉత్తేజక్ మండలి అనే సమాజం దాదాపు పదహారు సంవత్సరాలు తన రంగస్థల జైత్రయాత్ర కొనసాగించటం ఇందుకు నిదర్శనం.

ప్రజల్ని చైతన్యవంతం చేస్తూ సమాజాభివృద్ధిని కాంక్షిస్తూ, ప్రజానీకానికి వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందించే మాధ్యమంగా నాటకరంగాన్ని వినియోగిస్తూ నీతిదాయక, సాంఘికపరమైన సందేశాన్ని ప్రేక్షకులకు అందించాలన్న అభిలాషతో ముందుకు సాగింది పార్శీ నాటకరంగం. పార్శీ నాటక కంపెనీల ప్రదర్శనలు అధికవ్యయంతో కూడుకున్నవి. ఆహార్యం, దుస్తుల కోసమే చాలా ఎక్కువ ఖర్చు పెట్టేవారు. పాట, ఆట, సంగీతం అమితమైన కంఠధ్వని, శరీర దారుఢ్యం ఇవన్నీ పార్శీ నాటకాల్లో నటించే నటులకుండవలసిన కచ్చితమైన అర్హతలు. ఇక ప్రదర్శనల ప్రారంభ విషయానికొస్తే ప్రార్థనా గీతంతో మొదలై, సందేశంతో ముగుస్తాయి. ప్రదర్శనలు రాత్రి పదిగంటలకు మొదలై తెల్లవారే వరకు కొనసాగేవి. ప్రదర్శనల్లో హాస్యం, విషాదం, పాటలు, కత్తి యుద్ధాలు, నీతి, లయబద్ధమైన పద్య పఠనం ప్రదర్శనల్లో కచ్చితంగా చోటుచేసుకునే అంశాలు. ఇక రచయితల విషయానికొస్తే పురాణాలు, పర్షియన్ గాథల నుంచి ఇతి వృత్తాలను తీసుకొని శక్తివంతమైన నాటకాలుగా మలచేవారు. చిత్రీ కరించిన రంగు రంగు కర్టెన్లను విస్తృతంగా ఉపయోగించే వారు. రంగస్థలమంతా ప్రకాశవంతంగా ఉండేట్లు అధికసంఖ్యలో గ్యాస్‌లైట్లను వినియోగించేవారు. ప్రేక్షకులకు సీట్ల ఏర్పాటు కూడా తరగతివారీగా ఉండేది. ప్రదర్శన విరామంలో ప్రేక్షకులకు అల్పాహారం, కాలకృత్యాలకు ఏర్పాట్లు ఉండేవి. ప్రదర్శనలకు ప్రవేశ రుసుము ఉన్నత తరగతికి రూ.2-50 నుంచి 3-00, సాధారణ తరగతికి రూ.1-00 లోపుగా ఉండేది. పార్శీ నాటక ప్రదర్శనలకు ప్రేక్షకుల స్పందన విశేషంగా ఉండేది. ఆరోజుల్లోనే ప్రేక్షకులకు అభిమాన నటులుండేవారు. ముఖ్యంగా పాట, నృత్యాలకు కచ్చితంగా 'వన్స్‌మోర్'లు ఉండేవి. నగదు బహుమతులు, వస్తువులు రంగస్థలంపైనే ప్రేక్షకులందించేవారు. ప్రత్యేకించి మహిళల కోసం ప్రత్యేక ప్రదర్శనలివ్వటం కూడా పార్శీవారి మరో ప్రత్యేకత. ప్రజలకనుకూలంగా ప్రదర్శనలిస్తూ క్రమంగా ప్రజాదరణను పొందిదీ సమాజం, ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల్లో ఒక ప్రత్యేక గౌరవాన్ని సంతరించుకొంది. క్రమంగా బంబాయి నగరంలోని పలుప్రాంతాల్లో పార్శీ నాటక బృందాలు విస్తరించాయి. నగరంలోని అన్ని వర్గాల నుంచి ప్రదర్శనలకు సమాదరణ లభించేది.

గెయిటీ థియేటర్, విక్టోరియా థియేట్రికల్ కంపెనీ ఏర్పడి ప్రదర్శనలకు విస్తృత అవకాశం కలిగింది. పార్శీ నాటకరంగంలో చెప్పుకోతగిన ప్రముఖుడు, దాదాబాయ్ సోరాబ్ జీ పటేల్. సరికొత్త భావాలతో, నూతన ఆలోచనలతో మొట్ట మొదటి ఉర్దూ సంగీత నాటకం బెన్ బాబ్రే మునీర్ ప్రదర్శించి అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించాడు. అంతేకాక అప్పటివరకు ఆచరణలో లేని స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించేట్టు ఈయన చేశాడు. ఈతని ఆధ్వర్యంలో దేశవంతటా పార్శీ నాటకాలు ప్రదర్శించబడ్డాయి. బర్మా, సింగపూర్లలో కూడా నాటకాలు ప్రదర్శించారు. లండన్‌లో హరిశ్చంద్ర, అల్లా ఉద్దీన్ నాటకాలను విక్టోరియా మహారాణి సమక్షంలో ప్రదర్శించి అభినందనలు పొందటం పార్శీ వారికే చెల్లింది.

'తుర్కీహల్' నాటకంలో ఒక దృశ్యం

ఒకవైపు ఈవిధంగా పేరు ప్రఖ్యాతులు పొందుతూ, మరోవైపు మధ్యతరగతి ప్రేక్షకవర్గానికి దగ్గరవుతూ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్ర ప్రజల జీవితంలో మమేకమై పోయింది. బంబాయి, ఇంగ్లీషు పత్రికలు, గుజరాత్ వార్తా పత్రికలు ప్రతిరోజు ప్రదర్శన వివరాలను తెలియజేస్తూ, ప్రదర్శనలను సమీక్షిస్తూ, వీరి నాటకాలకు విస్తృత ప్రచారం కల్పించాయి. అంతేకాక వీరి ప్రదర్శనలపై చర్చాగోష్ఠులు కూడా నిర్వహించటం మరో విశేషం.

1870 సంవత్సరం నాటికి పార్శీ నాటకరంగం పూర్తి వృత్తి వ్యాపార నాటకరంగంగా రూపుదిద్దుకుంది. బంబాయి నగరంలోని అట్టడుగు స్థాయి వర్గాల వారిని నటులుగా చేర్చుకొని, వారికి శిక్షణ ఇచ్చి ప్రదర్శనలు ఇవ్వటం పార్శీవారి మరో ప్రత్యేకత. పార్శీ నాటక కంపెనీ తరపున ప్రదర్శనల్లో ఖ్యాతి

పొందిన జహంగీర్ ఖంబట్టో' లండన్ వెళ్ళి షేక్స్పియర్ని, ఆయన నాటకాలను చూసి, ఆయనతోపాటు జావా వెళ్ళి అక్కడ 'ఆస్ట్రేలియా టూరింగ్ కంపెనీ' ప్రదర్శించిన ఒథెల్లో నాటకం చూడటం బట్టి చూస్తే, ప్రదర్శనల పట్ల వారికుండే శ్రద్ధ ఏమిటో తెలుస్తుంది. పార్శీ నాటకరంగం దర్శకులు, నటులు తమ ప్రతిభ, తమ ప్రదర్శనా పటిమకుగాను ఎన్నో సత్కారాలు అందుకున్న సందర్భాలు లేకపోలేదు. నాటి అలహాబాదు గవర్నర్ సర్ చార్లెస్ మన్రో, సొరాబ్‌జీ ఓగ్రా అనే నటుడు దర్శకుడికి ఒక బంగారు పతకంతోపాటు వంద బంగారు నాణాలను బహూకరించి సత్కరించడం వారి ప్రదర్శన ప్రతిభకు నిదర్శనం.

స్వాతంత్ర్యానంతరం సినిమా ప్రవేశంతో పార్శీ నాటకరంగంలో నూతన మార్పులు చోటు చేసుకున్నాయి. ఫిరోజ్ అంటియా, రతన్‌మార్షల్, తుర్జాబాన్ పార్శీ నాటకాన్ని సంప్రదాయ పంథా నుంచి ఆధునిక మార్గానికి మళ్ళించారు. రచయిత, నటుడు, దర్శకుడు అయిన తుర్జాబాన్ యునెస్కో స్కాలర్‌షిప్‌పై అమెరికాలో 'పసడేనా ప్లే హౌస్'లో నాటకరంగంపై అధ్యయనం చేశాడు. కేవలం పౌరాణిక, చారిత్రక ఇతివృత్తాలే కాకుండా క్రమంగా సమకాలీన సమస్యలపై కూడా స్పందించి ప్రదర్శనలివ్వడం ప్రారంభించింది పార్సీ థియేటర్.

పార్శీనాటకరంగ రచయితలు – రచనలు : 1)ఆఘా హాసర్ (1876–1935)– సీతాబన్‌బాస్, బిల్వమంగళ్, ఆంక్‌కానషా, సఫేదకూన్, కూన్–ఏ–నహాక్', రుస్తుం–ఓ–షోరాబ్, షాయిబ్–ఐ–నాజ్, క్వోచ్–ఐ–హస్తీ, సైద్–ఐ–హవస్, మురిద్–ఐ–షక్, ఆషీర్–ఐ–హార్ష్ ; 2) ఇంతియాజ్–ఆలీ–తాజ్ (1900–70) – అనార్కలీ (1922) ; 3) ఆఘా బాబర్ బర్గాషాయిబ్ (1961) ; 4) నజీర్ షాంషీ–తేరే ఖుషీసే జబ్‌హం నికలే ; 5) క్వాజా మొహినుద్దీన్–లాల్ ఖిలేసే లాలూఖెత్‌తక్ ; 6) మియాన్ జారీఫ్–బుల్ బుల్–ఐ–భీమార్, షిరీన్ ఫర్ హాద్, –లి లైలా మజ్ను, హాతియ్ తాయ్ ; 7) వినాయక్ ప్రసాద్ తారీబ్ లైలా–ఓ–నిహార్, గోపిచంద్, హరీష్ చంద్ ; 8) నారాయణ్ ప్రసాద్ బేతాబ్ మహాభారత్, రామాయణ్ ; 9) అబ్దుల్ మజీద్ దరియబాది– జూద్–పషేమాన్ ; 10) అబ్దుల్ హలీమ్– షరార్‌మేవాయ్ తక్త్; 11) పండిట్‌కైఫీ–రాజ్‌దులారీ, మురారిదోడా ; 12) కృష్ణచంద్ జేబా జక్మీ పంజాబ్. ఆలీ అహవంద్, రఫీ పీర్ కూడా పార్శీ నాటక రంగానికి రచనలందించారు.

మొదట్లో పార్శీలు తమకు కావలసిన రచనల్ని మున్షీలతో ఉర్దూలో రాయించుకునేవారు. 1880 వరకు ఇలా కొనసాగింది. 1880 తరువాత ప్రత్యేకించి కొంతమంది రచయితల్ని వారు నియమించుకున్నారు. ఈ రచయితలందరు పార్శీ నాటకరంగానికి తమ రచనల ద్వారా సేవలందించారు.

లక్నోలో వజీర్ అలీ షా సాంస్కృతిక జీవితానికి స్వస్తి చెప్పిన తరువాత బంబాయిలోని పారశీకుల ఆధ్వర్యంలో ఉర్దూ నాటకం దాదాపు అర్ధ శతాబ్దం వరకూ తన జైత్రయాత్ర కొనసాగించింది. 1870లో పెస్తోంజీ ఫ్రాంజీ ఈ విధంగా ఉర్దూ నాటకరంగానికి మూలకారకుడయ్యాడు.

ఇక పార్శీల రచనా వ్యాసంగానికి వెళితే, ప్రేక్షకుల అభిరుచి మేరకు పురాణేతిహాసాలు, హిందూముస్లిం మతగ్రంథాల గాథలు, పాశ్చాత్య కథలు ఇతివృత్తాలుగా స్వీకరించారు. రంగస్థలం, నటులు, ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకొని నాటక రచన జరిగింది. మొదట పద్యాలు, పాటలు, సంగీతం, సాంకేతిక విలువలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి, వినోద ప్రధానంగా ప్రదర్శించే నాటకాల్లో పాత్యానికి, సంభాషణలకు క్రమంగా ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. అక్కడక్కడా హిందీ భాషను కూడా ఉపయోగించారు. మొదట్లో ఎలా ఉన్నా రానురాను ఇతివృత్త నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చాడు. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా సమకాలీన సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చాడు. బాల్య వివాహాలు, సాంఘిక సంస్కరణలు, మత సామరస్యం, రాజకీయేతివృత్తాలు, దేశ సరిహద్దు వివాదాలు తదితర అన్ని రకాల సమకాలీన సమస్యల్ని ప్రతిబింబిస్తూ, నటనకు పెద్దపీట వేస్తూ రచనలు కొనసాగాయి.

పార్శీ విక్టోరియా థియేట్రికల్ కంపెనీ, అల్‌ఫ్రెడ్ కంపెనీ, ఉత్తేజక్ మండలి, న్యూ అల్‌ఫ్రెడ్ కంపెనీలు పార్సీ నాటకరంగ అభివృద్ధికి ఎనలేని సేవలందించాయి. బంబాయి, కలకత్తా కేంద్ర స్థానాలుగా ఉన్నప్పటికీ, ఉపఖండమంతా విస్తృతంగా పర్యటించి, పార్సీ నాటక కంపెనీలు వృత్తి వ్యాపార నాటకాలకు ప్రాణం పోశాయి. ఆ తరువాత ఎవరైనా వృత్తి వ్యాపార నాటకాలు ప్రదర్శించారంటే వారికి స్ఫూర్తి పార్సీ నాటకరంగమే!

ఫ్రాంజీ కొవాస్ జీ, పెస్తోంజీ ఫ్రాంజీ, కైకస్రూ, కబ్రాజీ, దాదాబాయి సోరాబ్జీ పటేల్, జహంగీర్ కంబాత్తా, ఫిరోజ్ ఆంటియా, రవన్ మార్షల్, ఆది మార్జబాన్, ఎ.ఎస్. బఖారి, సి.డి. సొంధీ పార్సీ నాటకరంగ అభివృద్ధికి ప్రధాన కారకులు.

ఇరాన్ నుంచి జరాష్ట్రియన్ తెగకు చెందిన పార్శీలు బంబాయికి వలస వచ్చి స్థిరపడి వ్యాపారాత్మక వృత్తి నాటక రంగాన్ని స్థాపించి, 1873 నుంచి 1935 వరకు విస్తృతంగా దేశమంతటా ప్రదర్శనలిచ్చి ప్రాంతీయ నాటకరంగాలను ప్రభావితం చేయటం ఓ విచిత్రం. అన్ని భాషల నాటకరంగానికి మార్గదర్శకంగా నిలవడం మరో విచిత్రం.

ప్ర.రె.

బెంగాలీ నాటకరంగం

మొదటి దశ : బెంగాలీ నాటక రంగం 1995లో ద్విశతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకొంది. ప్రొసీనియం రంగస్థలిపై తొలిసారిగ 1795లో ప్రదర్శితమైన కాల్పనిక్ సాంగ్ బాదల్ అనే బెంగాలీ నాటకం రెండొందల సంవత్సరాల నాటక చరిత్రకు నాంది పలికింది. ఆ నాటకానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి ఒక రష్యన్ యాత్రికుడు కావడం ఆశ్చర్యావహం.

ఆంగ్లేయ వర్తకుల, పాలకుల సంపర్కంతో బెంగాలీ రాష్ట్రానికి, ముఖ్యంగా కలకత్తా నగరానికి నాటకరంగంతో పరిచయం కలిగింది. బ్రిటీష్ వర్తకులు తమ వినోదం కోసం 1753 నాటికే కలకత్తాలో ఒక నాటక శాలను నిర్మించుకుని ఇంగ్లీషు నాటకాలను ప్రదర్శిస్తూ ఉండటం కలకత్తా వాసులకు నాటకం పట్ల ఆసక్తిని పెంపొందించింది. ఇంగ్లీషు నాటకాలు చూసేందుకు భారతీయులకు అనుమతి లేకపోయినా, అలాంటి నాటకాలను తాముకూడా ప్రదర్శించాలన్న ఆసక్తీ, పట్టుదల కలకత్తా వాసులకు కలిగాయి. పరోక్షంగా బ్రిటీష్‌వారిచ్చిన ప్రేరణ క్రమక్రమంగా బెంగాలీ నాటకరంగ ఆవిర్భావానికి దోహదం చేసింది. అంటే అంతకు పూర్వం నాటక ప్రక్రియ ఆ రాష్ట్రంలో అసలే లేదని కాదు. ప్రాచీన కాలం నుంచీ జాత్ర వంటి దేశీ కళారూపాలు జన జీవితంలో అల్లుకుపోయి ప్రధాన వినోద సాధనాలుగా అలరిస్తూ ఉండేవి. వాటి ఉనికి నేటికీ చెక్కుచెదరలేదు.

బెంగాలీ నాటకం 14వ శతాబ్దంలో జయదేవుడు రచించిన *గీతగోవిందం* నుంచి ఊపిరి పోసుకున్నదనే వాదన ఒకటుంది. రాధాకృష్ణుల ప్రణయానుబంధాన్ని గీతాల రూపంలో సంభాషణాత్మకంగా, నృత్యానికి అనువుగా నాటకీయతకు దగ్గరగా ఉన్న గీతగోవిందం నాటకావిర్భావానికి పునాది అయిందని కొందరి అభిప్రాయం కాగా, *గతానుగతికంగా* వస్తున్న జానపద కళారూపాల నుంచి రూపుదిద్దుకొందని కొందరి వాదన. ఈస్టు ఇండియాకంపెనీ వారసత్వంగా కలకత్తానగరంలో విస్తృతంగా ప్రదర్శించబడిన ఇంగ్లీషు నాటకాల ప్రభావంతో బెంగాలీ నాటకానికి రూపురేఖలు ఏర్పడ్డాయని మరికొందరి వాదన. ఇవేవీకాదు. ప్రాచీన కాలం నుంచీ ఆట, పాట, మాటను తనలో ఇముడ్చుకొని పల్లెప్రజలను, పట్టణ వాసులను రంజింపజేస్తున్న జాత్ర కళారూపమే నాటకానికి బీజ రూపమనీ, అదే మొలకెత్తి నాటకంగా వృద్ధి చెంది పరివ్యాప్తమైందనే పండితాభిప్రాయం కూడా ఉంది. ఈ విభిన్న వాదనలు ఎలా ఉన్నా, జాత్ర ద్వారానే బెంగాలీ నాటకం అభివృద్ధి చెందిందనే అభిప్రాయంతో చాలమంది ఏకీభవిస్తున్నారు.

జాత్ర అంటే మత సంబంధమైన ఉత్సవం లేదా ఊరేగింపు అని అర్థం. మత సంబంధమైన క్రతువుల నుంచి జాత్ర కళారూపం వెలుగులోకి వచ్చింది. దీనికి నిర్దిష్టమైన రంగస్థలం కాని, తెరలు కాని, రంగోద్దీపన, శబ్ద విస్తరణ పరికరాలు కాని అవసరం లేదు. ఆరు బయలు స్థలంలో ప్రదర్శన జరుగుతుంది. చుట్టూ జనం కూచొని జాత్ర ప్రదర్శనను తిలకిస్తారు. అత్యాధునిక కాలం వరకూ జాత్ర లిఖిత రూపంలో లేకపోవటం విశేషం.

జాత్రలో కథావస్తువు భారత, రామాయణ, పురాణ, గాథలకు సంబంధించిందే. ముఖ్యంగా శ్రీ కృష్ణ జాత్ర, రాసజాత్ర అటువంటివే. వైష్ణవమతం జాత్రను ప్రచార సాధనంగా వాడుకొంది. జాత్రను ప్రదర్శించే కళాకారులు సమాజంలో అట్టడుగు వర్గాలకు చెందిన వారు కావటం వల్ల విద్యాధికులు జాత్రను చిన్న చూపు చూసేవారు. జాత్ర సామాన్య జనానికి ఉద్దేశించింది, అందువల్ల వారికి ఆహ్లాదం కలిగించే దిశలో ప్రదర్శన సాగేది. ఆ క్రమంలో ప్రదర్శనలో మోటుదనం, అశ్లీలత చోటు చేసుకొనేవి. సభ్యతాపరిధుల్ని దాటి పోయినప్పుడు విమర్శకు తావిచ్చిన సందర్భాలెన్నో. జాత్ర నీతి బాహ్యమైందనీ, సమాజాన్ని తప్పుదారి పట్టించేపోకడలు మిక్కుటంగా కనిపిస్తున్నాయని ఆనాటి సమాచార్ దర్పణ్, సంబంద్ ప్రభాకర్ వంటి పత్రికలు నిశితంగా విమర్శించిన సంఘటనలున్నాయి. తిరుగుబాటు కవిగా ప్రసిద్ధులైన మైకేల్ మధుసూదన్ దత్తు, ప్రసిద్ధ నవలా రచయిత బంకించంద్ర చటర్జీ వంటి మేధావులు కూడా జాత్ర పట్ల తమ నిరసనను వ్యక్తం చేశారు. ఏది ఏమైనా జాత్ర ప్రజలు మెచ్చిన ఒక కళారూపంగా ప్రతి తరాన్ని అలరిస్తూ, అవిచ్ఛిన్నంగా, అప్రతిహతంగా కాలపరీక్షకు నిలిచి జనావళి హృదయసీమలో ఒక జీవనదిలా నాటికీ, నేటికీ ప్రవహిస్తూ ముందుకు సాగుతూనే ఉంది.

మారిన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వస్తువు మారినప్పటికీ జాత్ర తన మౌలిక రూపాన్ని మార్చుకోలేదు. విద్యాగంధం లేని కళాకారుల తరం మారి విద్యావంతుల తరంలో అడుగుపెట్టిన జాత్ర మునుపటి విమర్శలకు దూరమైంది. మోతీలాల్‌రే వంటి రచయితలు జాత్రలో అశ్లీలతకు తావు

పోస్టాఫీసు నాటకంలోని దృశ్యం

లేకుండా సంస్కరించి, సమకాలీన సమస్యలను ప్రవేశపెట్టి, జాత్రకు గౌరవాన్ని తెచ్చిపెట్టారు. ఈ క్రమంలో ముకుందదాస్ మరింత ముందడుగు వేసి జాత్ర స్వరూప స్వభావాల్లో కొత్తసెత్తురు ఎక్కించి, జాతీయ భావాలను ప్రచారం చేసే శక్తివంతమైన ఆయుధంగా దీనిని (జాత్రను) మలిచారు. క్రమక్రమంగా రంగస్థలం, విద్యుద్దీపనం, శబ్ద విస్తరణ యంత్రాల వాడకం మొదలైంది.

ఇదే కాలంలో, కలకత్తా నగరంలో ఇంగ్లీషు నాటకాల ప్రభావం విస్తరించిన నాటకశాల, సిరాజుద్దౌలా చేసిన యుద్ధంలో 1756లో మూతపడింది. వారెన్ హేస్టింగ్స్ హయాంలో 1776లో కలకత్తా థియేటర్ నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి నూరేళ్ళ వరకూ నిరంతరాయంగా ఆంగ్లేయుల రంగస్థల కార్యకలాపాలు కొనసాగాయి. కలకత్తా థియేటర్ 33 సంవత్సరాలు నడిచింది. కాలక్రమంలో మితిమీరిన అప్పుల భారంతో అది కుప్ప కూలిపోయింది.

అటుపిమ్మట మరికొన్ని నాటకశాలలు వెలిశాయి. వాటిలో కొన్ని ప్రైవేటు థియేటర్లు వీటి నిర్వహణభారం భరించలేక రెండు మూడేళ్ళలోపే మూతపడ్డాయి. అలాంటి వాటిలో సర్ ఎలిజీ ఇంపె ప్రైవేట్ థియేటర్ (1789), వేలార్ ప్లేస్ థియేటర్ (1797), టౌన్‌హాల్(1814), డమ్ డమ్ థియేటర్ (1817) పేర్కొనదగినవి. 1813 నవంబర్ 25న ప్రారంభించిన చౌరంఘి థియేటర్, 1839లో ప్రారంభమైన శాన్ సౌసీ థియేటర్, ఉన్నత ప్రమాణాలుగల ఇంగ్లీషు నాటకాలను ప్రదర్శించి, ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్నాయి. ఈ నాటక శాలల్లో ప్రదర్శితమైన నాటకాలలో హేమ్లెట్, మేక్బెత్, షీస్టూప్స్ టు కాంకర్, స్కూల్ ఫర్ స్కాండల్, మర్చెంట్ ఆఫ్ వెనీస్ మొదలైనవి ప్రఖ్యాతమైనవి. పూర్వోక్తమైనట్లుగా తొలి బెంగాలీ నాటకాన్ని రాసిన ఘనత జి.ఎస్ లెబెడెఫ్ అనే రష్యన్ యాత్రికునికి దక్కుతుంది. భారతదేశ పర్యటనలో ఒక భాగంగా కలకత్తా చేరుకున్న లెబెడెఫ్‌కు బెంగాలీ భాషపైన ఆసక్తి కలిగింది. వయెలిన్ వాయించటంలో నిష్ణాతుడైన లెబెడెఫ్, గోలక్ నాథ్ అనే గురువు దగ్గర బెంగాలీ భాష నేర్చుకున్నాడు. బెంగాలీ రంగస్థలం మీద నాటకం ఆడాలని అతని సంకల్పం. అప్పటి వరకు బెంగాలీ భాషలో నాటకాలు లేని లోటును భర్తీ చేయాలన్న కృతనిశ్చయంతో స్వయంగా తానే ఆపనికి పూనుకున్నాడు. ఎస్. జోడ్రెల్ రాసిన ది డిస్‌గైస్ అనే ఇంగ్లీషు నాటకాన్ని లెబెడెఫ్ తనగురువు సాయంతో బెంగాలీ భాషలోకి అనువదించాడు. ఆ నాటకం పేరు కాల్పనిక్ సాంగ్ బాదల్. బెంగాలీ భాషలో వెలువడిన మొట్టమొదటి నాటకం ఇదే. అనువాదం చేసేటప్పుడు భారత దేశ వాతావరణాన్ని, సాంఘిక పరిస్థితులను దృష్టిలో

ఉంచుకుని పాత్రల రూపురేఖలను తీర్చి దిద్దడం ఈ నాటకంలో ఒక ప్రత్యేకత. స్థానిక కళాకారులను సమీకరించి, వారికి నాటక పద్ధతులు నేర్పి బాగా తర్ఫీదు ఇచ్చి, ఆ నాటకాన్ని ప్రప్రథమంగా 1795, నవంబర్ 27 తేదీన ప్రత్యేకంగా నిర్మించిన నాటకశాలలో ప్రదర్శింపజేసాడు లెబెడెఫ్. ప్రేక్షకులు టిక్కెట్టు కొనుక్కొని నాటకం చూడటం విశేషం. కాగా, ఆ ప్రదర్శనలో స్త్రీపాత్రలు స్త్రీలే ధరించడం మరొక విశేషం. అంతకు పూర్వం ఆరుబయలు రంగస్థలాల్లో జాత్ర వంటి దేశీ రూపక ప్రదర్శనలకు అలవాటు పడిన ప్రేక్షకులకు ప్రొసీనియమ్ స్టేజిమీద నాటకం చూడటం ఎంతో ఉత్సాహాన్ని, ఉత్కంఠను ప్రోదిచేసింది. అంతేకాక ఆనాటి ప్రసిద్ధ కవి భరత్ చంద్ర రచించిన కొన్ని గీతాలను ఆ నాటకంలో సంగీతంతో మేళవించి వాడుకోవడం ప్రదర్శనకు సరికొత్త అందాన్ని తెచ్చి పెట్టి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదే నాటకాన్ని 1796, మార్చి 21వ తేదీన పునః ప్రదర్శించడం జరిగింది. అప్పుడు కూడా ప్రేక్షకుల స్పందన ప్రోత్సాహకరంగా కనిపించింది. కొన్నాళ్ళ తర్వాత లెబెడెఫ్ కలకత్తా విడిచి స్వదేశానికి వెళ్ళి పోయాడు. అతను వెలిగించిన దీపాన్ని సంరక్షించుకొంటూ అతని ప్రయత్నాన్ని కొనసాగించే బాధ్యత నలభై ఏళ్ళదాకా ఎవరూ చేపట్టలేదు. ఆనాటి సాంస్కృతిక రంగంలో నెలకొన్న నిస్తబ్ధతకు, నిష్క్రియా పరత్వానికి ఇదొక నిదర్శనం.

ఈ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, నలభై ఏళ్ళ తర్వాత 1835లో భరత్ చంద్ర రచించిన విద్యాసుందర్ అనే నాటకం వెలుగు చూసింది. నవీన్ చంద్రబోస్ అనే శ్రీమంతుని భవ్యహర్మ్యంలో ఆ నాటకం ప్రదర్శితమైంది. అప్పటి నుంచి శ్రీమంతుల భవంతులలో తాత్కాలికంగా నిర్మించబడిన రంగస్థల వేదికలు నాటకాలకు ఆదరువుగా నిలిచాయి. నాటక కళా వికాస దశలో స్మరించదగిన అంశమిది. విద్యాసుందర్ నాటకం బెంగాలీ నాటక రంగంలో ఒక మైలురాయి. ఆ నాటకంలో స్త్రీ పాత్రలను స్త్రీలే పోషించారు. నాటకానికి మంచి ప్రాచుర్యం లభించింది. విద్యాసుందర్ కలకత్తాలోనే కాక పరిసర ప్రాంతాలలో కూడా ప్రదర్శించబడింది. హిందీ, ఉర్దూ భాషల్లోకి అనూదితమై ఆ ప్రాంతాలలో కూడా జనాదరణ పొందింది. క్రమక్రమంగా బెంగాల్ రాష్ట్రంలో నాటకాలకు అనువైన వాతావరణం ఏర్పడింది. కొత్త నాటకాల కోసం నాటకాభిమానులు ఎదురు చూడసాగారు.

టాగూర్ కుటుంబం నిర్మించిన జరాసంకో థియేటర్, పాయిక్‌పారా రాజవంశస్థుల ఉద్యానవనంలో నిర్మించబడిన బెల్గాచియా నాట్యశాల, ప్రసన్న కుమార్ టాగూర్ నిర్మించిన హిందూ థియేటర్ మొదలైనవి ప్రైవేట్ థియేటర్స్‌లో పేర్కొనదగిన నాట్యశాలలు. బెంగాలీ నాటక పురోగతికోసం ప్రారంభదశలో జ్యోతీంద్రనాథ్ టాగూర్, గుణేంద్రనాథ్ టాగూర్ ప్రభృతులు అందించిన సహకారం నాటక చరిత్రలో చిరస్మరణీయమైంది.

కొత్త రచయితలను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించటం కోసం టాగూర్ వంశస్థులు నాటక రచన పోటీని నిర్వహించారు. ప్రథమ బహుమతిగా 200 రూపాయలు నిర్ణయించారు. ఈ పోటీకి న్యాయనిర్ణేతలుగా పండిట్ ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రాజకృష్ణ బెనర్జీ వంటి చారిత్రక పురుషులు వ్యవహరించారు. ఈ పోటీలో రామనారాయణ్ తారకరత్న రచించిన నవనాటక్ అనే నాటకానికి ప్రథమ బహుమతి లభించింది. నవనాటక్ బహుభార్యత్వాన్ని ఖండించే ప్రబోధాత్మక సాంఘిక నాటకం. ఆ విధంగా బెంగాలీ భాషలో మౌలిక సాంఘిక నాటక రచనకు బాటలు వేసిన వారిలో రామనారాయణ్ తారకరత్న ఆద్యుడు. 1854లో తారకరత్న రాసిన కులీన్‌కులసర్వస్వ అనే నాటకం అతని కీర్తిని ఇనుమడింప చేసింది. కులవ్యవస్థలోని ఛిద్రాలను అభివ్యక్తం చేసిన ఈ నాటకం సంఘసంస్కరణావశ్యకతను ప్రతిపాదిస్తుంది. 1857 మార్చి నెలలో తొలిసారిగా రంగస్థలం మీదికెక్కిన ఈ నాటకం ఆ తర్వాత మరికొన్ని ప్రదర్శనలకు నోచుకొని ప్రజాదరణ పొందింది.

1856-1859 మధ్యకాలంలో కొన్ని సంస్కృత నాటకాలను బెంగాలీలోకి అనువదించారు. వాటిలో రామనారాయణ్ భట్ట నారాయణుని వేణీ సంహారం (1857), శ్రీహర్షుని రత్నావళి (1857) నందకుమార్ రాయ్ అనువదించిన కాళిదాసు అభిజ్ఞానశాకుంతలం, కాళీ ప్రసన్న సిన్హా విక్రమోర్వశీయం (1857) నాటకాలు ప్రముఖంగా పేర్కొనదగినవి. ఈ నాటకాలను ప్రయివేటు థియేటర్‌లోనే, ఇంగ్లీషు వారి నుంచి సెకెండ్‌హ్యాండ్ దుస్తులు అద్దెకు తెచ్చుకుని ప్రదర్శించేవారు. ఇలా అనువాద నాటకాలతో సరిపెట్టుకొంటున్న ధోరణికి అసంతృప్తి చెందిన సమకాలీన రచయితలు స్వతంత్ర నాటకాలు రాయాలని ఉద్యమించారు. వారిలో మధుసూదన దత్తు ప్రథమ గణ్యుడు.

వ్యక్తిగత జీవితంలోనూ, సాహిత్య రంగంలోనూ తిరుగుబాటు తత్త్వానికి మారుపేరుగా నిలిచిన విద్యాధికుడైన రచయిత మైకేల్ మధుసూదన్ దత్తు(1824-1873) ఇంగ్లీషు, ఫ్రెంచ్, గ్రీక్, లాటిన్ సంస్కృతభాషలలో ప్రతిభ సాధించిన పండితుడు, మేధావి. ప్రప్రథమంగా శర్మిష్ఠ అనే నాటకం రాసి 1859లో బెల్గాచియా నాట్యశాలలో ప్రదర్శింపజేయడంతో నాటక రచయితగా రంగప్రవేశం చేశాడు. శర్మిష్ఠ నాటకానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. వెనువెంటనే ఆరుసార్లు ఆ నాటకం ప్రదర్శించబడటం దాని విజయానికి, ప్రజాదరణకు తిరుగులేని సాక్ష్యం. అదే కాలంలో రాసిన పద్మావతి, కృష్ణకుమారి నాటకాలు రంగస్థలంపై అంతగా

రాణించలేదు. వాటిలో పాశ్చాత్య వాతావరణం ప్రజలకు నచ్చకపోయి ఉండవచ్చునని మధుసూధన్ అభిప్రాయం. మధుసూదన్ దత్తు రాసిన సీరియస్ నాటకాల కన్నా, వినోద ప్రధానమైన నాటకాలే ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. ఏకైకే బోలే సభ్యత అనే నాటకంలో ఛాందసత్వాన్నీ పూర్వాచార పరాయణత్వాన్ని వ్యతిరేకించే నవయువకులు తాగుడుకు, విషయ లోలత్వానికి బానిసలై పెడదారి పడుతున్న వైఖరినీ నిశిత హాస్యంతో శక్తిమంతగా దృగ్గోచరం చేశాడు. అలాగే బురోసాలికర్ ఘరేరోన్ (Buro Saliker Ghare Ron) నాటకంలో మతోద్ధరణ, సంప్రదాయ పరిరక్షణ పేరుతో అమాయక పేద ప్రజలను దోపిడీ చేస్తున్న సనాతన వాదుల దౌష్ట్యాన్ని, బండారాన్ని బట్టబయలు చేశాడు. ఈ రెండు నాటకాలు నేటి సమకాలీన సమాజానికి కూడా అన్వయించే తీరులో మారని పరిస్థితులకు సజీవ ప్రతీకలుగా భాసిస్తున్నాయని చెప్పవచ్చు. అదేకాలంలో బెంగాలీ నాటక రంగంలో కొత్త కాంతులు ప్రసరింపజేసిన నాటకకర్త దీనబంధు మిత్ర (1830–1873).

దీనబంధు రచించిన నీలిదర్పణ్ (1860/1872) నాటకరంగంలో సంచలనం కలిగించడమే కాక బ్రిటీష్ ప్రభుత్వానికి కూడా భయాందోళనలు కలిగించి చరిత్ర సృష్టించిన నాటకం. ఇండిగో ఉత్పత్తి దారులైన ఇంగ్లీషు దొరలు పేదరైతుల పైన, రైతుకూలీల పైన జరిపే దౌర్జన్యకాండను, పాశవికచర్యను, స్త్రీలపై జరిగే అత్యాచారాలను నిర్భయంగా చిత్రించిన నీలి దర్పణ్ ప్రజలలో చైతన్యం తేవడానికి బలమైన ఆయుధంగా పనిచేసింది. ఒక రైతుకూతురుపై అత్యాచారం చేయబోతున్న రోగ్ అనే దొరను పట్టుకొని భారతీయ యువకులు చితక బాదే సన్నివేశం చూసి ఆంగ్లేయులు ఆగ్రహం చెందారు. ఆ నాటక ప్రదర్శనకు అక్కడక్కడా అడ్డంకులు సృష్టించిన సందర్భాలున్నాయి. అయితే ఆ నాటకం ఒక విధంగా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించింది. ఇండిగో ఉత్పత్తి దారుల దుండగాల గురించి దర్యాప్తు చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించమని ఒక విచారణ సంఘాన్ని, నియమించింది. ఆ విధంగా దుశ్చర్యల పట్ల ఉదాసీనత వహించి చూస్తూ ఊరుకోకుండా ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయాలనీ, ప్రతిఘటించాలనీ ఉద్బోధించిన నాటకాలకు నీలి దర్పణ్ నాంది పలికింది. నీలిదర్పణ్ ప్రదర్శనతో కలకత్తాలో గ్రేట్ నేషనల్ థియేటర్ (1872) పేరుతో పబ్లిక్ థియేటర్ స్థాపించబడింది. అంతవరకు ప్రైవేటు వ్యక్తుల భవనాలలో కాలం గడుపుతున్న నాటకరంగానికి ఇదెంతో మేలుచేసింది. మరికొన్ని థియేటర్లు స్థాపించ బడటానికి గ్రేట్ నేషనల్ థియేటర్ ప్రేరణ కలిగించింది. దీనబంధుమిత్ర రచించిన నవీన తపస్విని (1863) సధావర్ ఏకాదశి (1866) మొదలైన నాటకాలలో సధావర్ ఏకాదశి విస్తృతంగా ప్రదర్శించబడి బహుళ జనామోదం పొందింది.

బెంగాలీ నాటక పితామహుడుగా ఖ్యాతి గడించిన గిరీష్ చంద్రఘోష్ మొదటితరం నాటక రచయితలలో అగ్రగణ్యుడు. నాటకరచన, నటన, దర్శకత్వం, సమాజ నిర్వహణ ఇత్యాది శాఖల్లో సమప్రతిభ చూపి, నాటక రంగంలో కొత్త కాంతులు ప్రసరింపజేసిన ప్రజ్ఞాధురీణుడు. తొలిదశలో బెంగాలీ భాషలో నాటకాలు లేని లోటును భర్తీ చేయడంలో గిరీష్ చంద్ర నిర్వహించిన పాత్ర అనుపమానం. గిరీష్ చంద్ర సుమారు 50 నాటకాలను రచించి ప్రదర్శింపజేసాడు. ఆ నాటకాలన్నీ అద్భుతమైనవి కాకపోయినా అవసరాన్ని తీర్చినవి అని చెప్పవచ్చు. తాను రచించిన నాటకాలను ప్రదర్శించజేయడం కూడా గిరీశ్ చంద్ర రంగస్థల సేవానిరతిలో ఒక ముఖ్యాంశం. 1868లో బాగ్ బజార్ అమెచ్యూర్ థియేటర్ స్థాపించి ఆ సమాజం ద్వారా సధావర్ ఏకాదశి నాటకాన్ని జనరంజకంగా ప్రదర్శించడంతో గిరీష్ చంద్ర ఘోష్ నటజీవితం మొదలైంది. అప్పటి నుంచి నాలుగు దశాబ్దాలు అహర్నిశలు నాటకరంగ వికాసానికి ఎనలేని సేవ చేశాడు. ప్రారంభ దశలో నాటక రంగం పరిపుష్టం కావడానికి అమూల్యమైన సేవలు అందించిన కాలాన్ని గిరీష్ చంద్రఘోష్ యుగం అని పేర్కొన్నారు చారిత్రకులు. నీల్ దర్పణ్ ప్రాచుర్యానికి ముఖ్యకారకుడు గిరీష్ చంద్రే కావడం గమనార్హం. నీల్ దర్పణ్ కలకత్తాలోనే కాక ఢిల్లీ, లాహోరు, మీరట్, ఆగ్రా, లక్నో మొదలైన పట్టణాల్లో కూడా ప్రదర్శించి బెంగాలీ నాటక వైభవాన్ని చాటి చెప్పారు.

మధుసూదన్ దత్ తన నాటకాలలో పురాణ కథలకు కొత్త భాష్యం చెప్పాడు. పురాణ కథల ప్రామాణికతను ప్రశ్నించాడు. మతాన్ని, సంప్రదాయాలను, పురాణాల వైశిష్ట్యాన్ని పరిరక్షించాలన్న నిబద్ధతతో గిరీష్ చంద్ర ఘోష్ రచనా వ్యాసంగం సాగించాడు. జాతీయోద్యమానికి దోహదం చేస్తూ, జాతీయ భావాన్ని ప్రోదిచేసే నాటకాలను రచించి ప్రదర్శింపజేశాడు. సిరాజుద్దౌలా (1905), మీర్ఖాశిం ఆ నాటక శ్రేణిలో చేరినవే. గిరీష్ చంద్ర రాసిన రావణవధ, సీతా వనవాస్, అభిమన్యువధ వంటి పౌరాణిక నాటకాలు అత్యంత ప్రజాదరణ పొందాయి. పౌరాణిక నాటకాల్లో విధిబలీయం అనే భావన అడుగడుగునా స్ఫురిస్తుంది. ఉత్తమ పాత్రలకు అందమైన కావ్యభాష. నీచపాత్రలకు గ్రామ్యం ప్రయుక్తం చేయడం గిరీష్ చంద్ర నాటకాలలోనే ఆరంభమైందని చెప్పవచ్చు.

పందొమ్మిదవ శతాబ్దం చివరి పాదం చేరుకొనేసరికి బెంగాల్ రాష్ట్రంలో అనేక నాటక సమాజాలు ఏర్పడ్డాయి. వృత్తి నటులకు, వ్యాపార నాటక రంగానికి పునాదులు ఏర్పడ్డాయి. విద్యావంతులు నాటకరంగంలో ప్రవేశించి నాటకానికి గౌరవం తెచ్చి పెట్టారు. గిరీష్ చంద్ర ఘోష్‌తో పాటు అర్ధేంధు ముస్తాఫీ,

అమృతలాల్ బసు, దనిఘోష్ అపరేష్ ముఖర్జీ , అమరేంద్ర దత్త, నిర్మలేందు లహరి, దుర్గాదాస్ బెనర్జీ వంటి ప్రతిభావంతులైన నటులూ, చారుశీల, వినోదిని దాసి, గోలప్ సుందరి, కృష్ణభామిని, నిహార్‌బాల ప్రభ, తారాసుందరి వంటి నటీమణులూ రంగస్థలాన్ని అలరించి బెంగాలీ నాటకరంగానికి ఖ్యాతిని ఆర్జించి పెట్టారు.

జ్యోతీంద్రనాథ్ టాగూర్ పురువిక్రమ్ (1874) సరోజిని (1875), అశ్రుమతి (1879) మొదలైన నాటకాలతోను, అమృత లాల్‌బసు వివాహ-విభ్రాట్ (1884) వంటి నాటకాలతోను, ద్విజేంద్రలాల్ రాయ్ తన చారిత్రక నాటకాలతోను నాటకరంగానికి వన్నె చిన్నెలు కూర్చి సంపన్నవంతం చేశారు. దేశభక్తిని, జాతీయ భావాలను పెంపొందించే నాటకాలకు, బ్రిటీష్‌వారి ఆధిపత్యాన్ని ఖండించే నాటకాలకు ప్రాచుర్యం పెరుగుతున్న ప్రమాదాన్ని పసిగట్టిన ప్రభుత్వం 1876లో నాటక ప్రదర్శనల నియంత్రణ చట్టం తెచ్చింది.

క్రమక్రమంగా ఔత్సాహిక నాటకరంగం 1883 నాటికి వ్యాపార నాటకరంగంగా రూపుదిద్దుకోసాగింది. దీనికి ఆద్యుడు గిరీష్‌చంద్ర ఘోష్. వారానికి మూడు రోజులు నాటకాలు ప్రదర్శించడం అలవాటుగా మారింది. ఎమరాల్డ్ థియేటర్ వంటి మరికొన్ని నాటక శాలలు వెలుగులోకి వచ్చాయి. బెంగాలీ నాటకరంగ వికాసానికి మొదటి దశలో అమూల్యమైన సేవలు అందించిన కళాభిజ్ఞులలో రవీంద్రనాథ్ టాగూర్ చిరస్మరణీయుడు. అన్నగారైన జ్యోతీంద్రనాథ్ టాగూర్ రాసిన నాటకాలల్లో నటించడంతో రవీంద్రుని నట జీవితం(1877) ప్రారంభమైంది. అటు పిమ్మట తాను రచించిన నాటకాలలో రవీంద్రుడు పాత్రధారణ చేసేవాడు. 1887 వరకు రవీంద్రుని ప్రభావం బెంగాలీ నాటక రంగం మీద బలంగా ఉంది. రవీంద్రనాథ్ 13 స్వతంత్ర నాటకాలను రచించాడు. తను రాసిన నవలల నుంచీ, కథల నుంచీ ఎనిమిదింటిని నాటకీకరించాడు. వాల్మీకి ప్రతిభ (1881) సంగీత నాటకం,శ్యామ (1939) నృత్యనాటకం, డాగ్‌ఘర్, రాజారాణి వంటి నాటకాలు రవీంద్రుని నాటక రచనా వైదుష్యానికి అద్దం పడతాయి. రవీంద్రుని నాటక రచనల్లో దుఃఖాంతాలు, సుఖాంతాలు, ప్రహసనాలు, మార్మిక ధోరణిలో సాగినవి, ప్రతీకాత్మకాలు, సౌందర్య విలసితాలైన నాటకాలున్నాయి. రవీంద్రుని నాటకాలు ప్రధానంగా విద్యాధికులను అలరించినంతగా సామాన్య ప్రేక్షకులను ఆకట్టుకోలేదని కొందరు పండితుల అభిప్రాయం.

1883లో వినోదిని దాసి (గిరీష్ చంద్ర ఘోష్ ప్రియతమ శిష్యురాలు) పూనికతో స్టార్ థియేటర్ నిర్మాణం జరిగింది. 1887లో మొదటిసారిగా విద్యుత్‌ను ఉపయోగించి నాటకాలు ఆడటానికి స్టార్ థియేటర్ శ్రీకారం చుట్టింది. నాటకశాలలైతే ఏర్పడ్డాయి కాని పాత నాటకాలే చర్విత చర్వణం కావడంతో ప్రేక్షకులు కొత్త నాటకాల కోసం ఎదురు చూడ సాగారు. జ్యోతీంద్రనాథ్ టాగూర్ సుమారు 30 నాటకాలు రాశాడు. అధిక భాగం సంస్కృత నాటకాలకు అనువాదాలు, కొన్ని మోలియర్ రచనలకు అనుసరణలు. జ్యోతీంద్రనాథ్ రాసిన వాటిలో *అలీక్ బాబా, పోరస్-విక్రమ్, భారతమాత* మొదలైన నాటకాలు ఆయనకు పేరు తెచ్చాయి. గిరీష్‌చంద్ర 1877లో అగోమొని తో నాటకరచన ప్రారంభించి మరణించే వరకు నాటకరచనా వ్యాసంగం ఆపలేదు. మతం పట్ల, సాంప్రదాయం పట్ల బెంగాలీ భాషపట్ల గిరీష్‌చంద్రకు గల మమకారం, నిబద్ధత ఎన్నో నాటకాలు రాయడానికి దోహదం చేసింది. ఈయన రచించిన చైతన్యలీల నాటకంలో శ్రీ చైతన్య భూమికను ధరించిన వినోదిని దాసి, ఆనాటి ప్రదర్శనను తిలకించిన శ్రీ రామకృష్ణ పరమహంస ప్రశంసలు అందుకోవడం విశేషం. *బిల్వమంగళ* టాగూర్(1886) అనే నాటకాన్ని దర్శించిన స్వామి వివేకానంద గిరీష్‌చంద్ర ఘోష్‌ను ఆశీర్వదించి ప్రోత్సహించాడు. గిరీష్‌చంద్ర రాసిన ప్రఫుల్ల (1889) సాంఘిక నాటకంలో పాశ్చాత్య నాగరికత ప్రభావంతో సమకాలీన సమాజంలో వచ్చిన మార్పులతో కుటుంబవ్యవస్థ ఎలా బీటలు వారిపోతున్నదో హృదయంగమంగా చిత్రించాడు. ఈ నాటకానికి అత్యంత ప్రజా దరణ లభించింది. బకించంద్ర చటర్జీ రాసిన *దుర్గేశనందిని, కపాలకుండల, మృణాళిని* వంటి ప్రసిద్ధ నవలలను గిరీష్‌చంద్ర నాటకాలుగా మలిచి ప్రదర్శించాడు. షేక్స్పియర్‌ను ఆదర్శంగా తీసుకున్నా, తన రచనల్లో గిరీష్ చంద్ర దేశీ మార్గాన్ని విడనాడలేదు. జటిలమైన సమస్యను కూడా సామాన్య ప్రజల అవగాహన స్థాయిని మించిపోకుండా సరళ సుందరంగా వ్యక్తం చేసేనేర్పు గిరీష్ చంద్రకు వెన్నతో పెట్టిన విద్య. పందొమ్మిదో శతాబ్ది నాటకరంగానికి వెలుగుబాటలు ఏర్పరిచి పథనిర్దేశకునిగా పరిశ్రమించిన గిరీష్ చంద్రఘోష్ ను బెంగాలీ నాటకరంగ పితామహుడు గా నాటకలోకం కీర్తించడంలో ఆశ్చర్యం లేదు. మధుసూదన దత్ రాసిన *మేఘనాథ్ వధ్ కావ్య* అనే నాటకం, నవీన చంద్ర రాసిన *పలాసర్ యుద్ధ* నాటకం ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. బహుళ జనాదరణ పొందిన శరత్ నవలల్లో కొన్నింటిని కొందరు నాటకీకరించారు. కాని అవి రంగస్థలం మీద రాణించిన ఆనవాళ్లు కనబడవు. పందొమ్మిదో శతాబ్దం ముగిసే నాటికి రంగస్థలం మీద స్త్రీ పాత్రలు స్త్రీ లే ధరించే సంప్రదాయం అమల్లోకి వచ్చినా అప్పటి వరకూ వేశ్యా వృత్తిలో ఉన్న స్త్రీలే పాత్రధారణ చేస్తూ వచ్చారు. ఇరవయ్యో శతాబ్దంలోనే గౌరవనీయ కుటుంబాల నుంచి మధ్యతరగతి కుటుంబాల నుంచి స్త్రీలు రంగస్థలం మీదికి వచ్చారు.

రెండవ దశ : బెంగాలీ నాటకరంగంలో రెండవ దశను *శిశిర్‌కుమార్ యుగం* అని పేర్కొన్నారు చారిత్రకులు. బెంగాల్

క్షామం, ప్రపంచ యుద్ధం, జాతీయోద్యమం, రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితుల్లో అపూర్వమైన మార్పులు తెచ్చాయి. సామాజిక చైతన్యం వెల్లి విరిసింది. రెండు దశాబ్దాల పాటు నాటకరంగంలో చెప్పుకోదగిన అభివృద్ధి లేదు. 1921లో శిశిర్‌కుమార్ భాదురి (1889-1959) నాటకరంగ ప్రవేశం నూతన శకానికి నాంది పలికింది. శిశిర్ కుమార్ ఇంగ్లీషు ఆచార్యులుగా ఉద్యోగం చేస్తూ నాటకరంగం మీద ప్రేమతో రంగ ప్రవేశం చేశాడు. తన బంగారు భవిషత్తును నాటకరంగానికి పణంగాపెట్టిన త్యాగధనుడు. సుమారు నాలుగు దశాబ్దాలు నాటకరంగాభివృద్ధి కోసం ఆహర్నిశలు శ్రమించాడు. మారుతున్న కాలానికి, అభిరుచులకు అనుగుణంగా రచయితలతో నాటకాలు రాయించి నూతన పద్ధతుల్లో ప్రదర్శింప చేశాడు. నటుడుగా, దర్శకుడుగా అచిరకాలంలోనే ప్రజలకు చేరువయ్యాడు. అంతకు పూర్వం నాటకరంగం నటుని ప్రాధాన్యంతో నడిచేది. శిశిర్‌కుమార్ హయాంలో నటుని ప్రాబల్యం తగ్గి దర్శకుని ప్రాధాన్యత హెచ్చింది. నిజానికి దర్శకుడనే వాడు నాటకరంగంలో ప్రాచుర్యంలోకి రావడం శిశిర్‌కుమార్ తోనే ప్రారంభమైందని చెప్పవచ్చు.

జాతీయోద్యమ స్ఫూర్తితో ద్విజేంద్రలాల్‌రాయ్ (డి.ఎల్.రాయ్) రాసిన చారిత్రక నాటకాలను జనరంజకంగా ప్రదర్శించి పేరు తెచ్చిన ఘనత శిశిర్ కుమార్‌కే దక్కుతుంది. ప్రతాపసింహ (1905), మేవార్ పతన్ (1911), చంద్రగుప్త (1911), నూర్జహాన్ మున్నగు నాటకాలలో ముఖ్య భూమికలు ధరించి వాటికి కీర్తి ఆర్జించి పెట్టిన నటుడు, దర్శకుడు శిశిర్ కుమార్. సాహిత్య సౌరభంతో గుబాళించే ఆ నాటకాలలో డి.ఎల్.రాయ్ చారిత్రకాంశాలకు దగ్గరగా ఉండేటట్లు జాగ్రత్త వహించాడు. డి.ఎల్.రాయ్ నాటకాలు ఇతర భారతీయ భాషల్లోకి కూడా అనువదించబడినాయి. డి.ఎల్.రాయ్ నాటకాలను భాగవతుల నృశింహ శర్మ, శ్రీపాద కామేశ్వర రావు, జన్నలగడ్డ సత్యనారాయణ తెలుగులోకి అనువదించారు. గిరీష్‌చంద్ర రాసిన ప్రసిద్ధనాటకం ప్రఫుల్ల (1959) తెలుగులోకి మద్దిపట్ల సూరి అనువదించాడు. క్షీరద్ ప్రసాద్ విద్యావినోదిని రాసిన ప్రతాపాదిత్య, ఆలమ్‌గీర్ చారిత్రక నాటకాలు శిశిర్‌కుమార్ నటనా వైదుష్యానికి దర్పణాలుగా నిలిచాయి. జోగేష్ చౌదరి రచించిన సీత నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించి ప్రశంసలందుకొన్నాడు శిశిర్‌కుమార్. మేక్‌షిఫ్ట్ స్టేజి మీద అపూర్వ పద్ధతిలో సాగింది సీత ప్రదర్శన. 1930లో రవీంద్రుని చండాలిక, చిత్రాంగద, శ్యామ వంటి నృత్య నాటకాలు, రాజా-రాణి, విసర్జన వంటి సమగ్ర నాటకాలు, డాక్‌ఘర్, అచలాయతన్, రక్తకరబి, ముక్తధార వంటి ప్రతీకాత్మక నాటకాలు ప్రదర్శితమయ్యాయి. వాటిలో కొన్నింటికి శిశిర్ కుమార్ దర్శకత్వం వహించాడు. సీత నాటకాన్ని అమెరికా ఆహ్వానంపై బ్రాడ్వేలో ప్రదర్శించి ప్రశంసలందుకున్నాడు. ఒక బెంగాలీ నాటకం – ఆ మాటకొస్తే ఒక భారతీయ నాటకం అమెరికా రంగస్థలం మీద ప్రప్రథమంగా ప్రదర్శించిన ఘనత శిశిర్‌కుమార్‌కే దక్కింది.

శిశిర్ కుమార్ ఎందరికో శిక్షణ ఇచ్చి ఉత్తమ నటీనటులుగా తీర్చిదిద్దాడు. శిశిర్ మంచి నాటకాల కోసం పరితపించే వాడు. లభ్యం కానప్పుడు అంతంత మాత్రంగా ఉన్న వాటికే మెరుగులు పెట్టి తృప్తి పడేవాడు. ఉన్నంతలోనే నాటకాలకు ప్రాణంపోసి నాటక కళా వికాసానికి అవిశ్రాంతంగా కృషి చేసిన శిశిర్‌కుమార్ చివరి దశలో నిరాశా నిస్పృహలతో దయనీయంగా మరణించడం ఒక విషాదం.

మూడవదశ : నలభయ్యవ దశలో చరిత్రలో శాశ్వతంగా మిగిలిపోయిన సంఘటనలెన్నో జరిగాయి. ప్రపంచ యుద్ధం తాకిడికి చిన్నాభిన్నమైన ఆర్థికవ్యవస్థ, మానవ కల్పితమైన బెంగాల్ క్షామం, తత్ఫలితంగా నేల మట్టమైన మానవతా, నైతిక విలువలు, స్వాతంత్ర సిద్ధి, సగటు మనిషిలో నైరాశ్యాన్ని మిగిల్చిన ప్రభుత్వం దేశవిభజన, మతకల్లోలాలు, పాత కొత్తల సంధి కాలంలో అన్ని రంగాలలో విస్తరించిన అస్థిరత, స్తబ్ధత జనజీవనంలో సంక్షోభాన్ని సృష్టించాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో నాటకరంగం ముందుకు సాగలేదు.

సాంస్కృతిక రంగంలో స్తబ్ధతను ఛేదిస్తూ కమ్యూనిస్టు పార్టీ ప్రమేయంతో 1943లో అవతరించిన ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) భారతీయ నాటకరంగ చరిత్రలో మరపురాని సంఘటన. నాటక రంగంలో విప్లవాత్మక మార్పులతోపాటు ఇప్టా వల్ల వివిధ జానపద కళారూపాలకు ప్రోత్సాహం లభించింది. ఇప్టా మేధావి వర్గాన్ని విశేషంగా ఆకర్షించింది. నటీనటులు, దర్శకులు, నాటక కర్తలు, సాంకేతిక నిపుణులు ఇప్టా సభ్యులై అనతికాలంలోనే దాని ప్రాచుర్యానికి అవిరామంగా కృషి చేశారు. పాత పద్ధతులు, పాత విలువల స్థానే కొత్త దనాన్ని ప్రోది చేయడానికి ఇప్టా రెండు దశాబ్దాలు శ్రమించింది. శంభుమిత్ర, ఉత్పల్‌దత్ వంటి అగ్రశ్రేణి దర్శకులు, ఖలీద్ చౌదరి వంటి రంగాలంకరణ నిపుణులు, తపన్ సేన్ వంటి కాంతి ప్రసార నిపుణులు ఇప్టా ద్వారా పేరు ప్రఖ్యాతులు గడించిన వారే. ఇప్టా 1944లో ప్రదర్శించిన నాబన్న నాటకం బెంగాలీ నాటకరంగంలో సంచలనం కలిగించి చరిత్ర పుటల్లో తన స్థానాన్ని పదిలంచేసుకున్న ఒక సమగ్రనాటకం. నాటక రచయిత బైజన్ భట్టాచార్య, దర్శకుడు శంభుమిత్ర. నాబన్న

నాటకం భూస్వాముల కర్కశ కబంధ హస్తాలలో నలిగి పోతూ తల్లడిల్లిపోతున్న కర్షక కుటుంబం దయనీయ పరిస్థితులకు అద్దం పడుతుంది. వస్తు, రూప, శిల్పాలలో కొత్త రూపాన్ని, స్వభావాన్ని సంతరించుకొన్న నాబన్న నాటకం పండిత పామరులను ఆకర్షించి, ఒక నూతన వరవడిని సృష్టించింది. నా జీవితకాలంలో నేను చేయలేని పనిని *'ఇప్టా ' ఒక్క నాటకంతో సాధించింది* అని శిశిర్‌కుమార్ వంటి కళాభిజ్ఞుని ప్రశంసలందుకున్న నాటకం. ఒక విధంగా ఇప్టా బెంగాలీ నాటకోద్యమానికి ప్రాణం పోసిందని చెప్పవచ్చు. ఒక రాజకీయ సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న అంశంతో విభేదించిన కొందరు ఇప్టాను విడిచి పోవడం కాలక్రమంలో వచ్చిన పరిణామం. అలా విడిపోయిన వారిలో ఉత్పల్‌దత్ ఒకడు. అయితే తాను సిద్ధాంతానికి నిబద్ధుడనేనని ప్రకటించి, ఆ పరిధిలో తన కార్యకలాపాలు సాగించడం గమనార్హం. ఇప్టా ప్రభావంతో శక్తివంతమైన నాటక సమాజాలు కొన్ని వెలుగులోకి వచ్చాయి. వాటిలో బహురూపి (1948) ప్రథమగణ్యం. శంభుమిత్ర సారథ్యంలో బహురూపి ప్రయోజనాత్మకమైన, చిరస్మరణీయమైన ఎన్నో నాటకాలను జనరంజకంగా ప్రదర్శించింది. బెంగాలీ నాటకరంగాన్ని ముందువరసలో నిలిపింది. *చెహరా టార్*(1950), *ఉలూఖాగ్ర* (1950), *చార్ అధ్యాయ్* (1951), *దశచక్ర* (1952), *రక్తకరాబి*(1954), *డాక్‌ఘర్* (1957), *పుతుల్‌ఖేలా* (1958), *విసర్జన్* (1961), *రాజా* (1964) *ఘరేబైరే* (1974), *పగ్లాఘోడా* (1975), *మాలిని* (1986), *మిస్టర్ కకటువ* (1987) మొదలైనవి బహురూపి ప్రదర్శించిన నాటక శ్రేణిలో ముఖ్యమైనవి.

అలాగే ఉత్పల్‌దత్ నేతృత్వంలో లిటిల్ థియేటర్ గ్రూపు (1954) అంతవరకు ఇంగ్లీషు నాటకాలకు ప్రాధాన్యమిస్తూ, తన మార్గాన్ని బెంగాలీ నాటకాల వైపు మళ్లించింది.

బగ్గుగని కార్మికుల వ్యథా భరిత జీవన చిత్రణతో కూడిన *అంగార్* అనే నాటకాన్ని 1959లో అద్భుతంగా ప్రదర్శించడంతో లిటిల్ థియేటర్ గ్రూపు ప్రేక్షకుల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. ప్రవాసుల సమస్యలపై కేంద్రీకృతమైన *టీటాస్ ఏక్తీ నదీర్ నామ్* (1963), నావికుల తిరుగుబాటు ఇతివృత్తంగా గల *కల్లోల్*(1965), *బారికేడ్* (1972), ఎమర్జెన్సీ గురించిన *దుస్వప్నేర్ నగరి* (1974) మున్నగు నాటకాలు ఉత్పల్ దత్ నాటక కళా వైదుష్యానికి దర్శకత్వ ప్రతిభకి గీటురాళ్ళుగా భాసిస్తాయి. ఉత్పల్‌దత్‌ది రాజకీయ నాటకరంగం (Political theatre)గా పిలువబడుతోంది. దీనికి కారణం ఉత్పల్‌దత్ నాటకాల్లో ప్రచార ధోరణి అధికంగా ఉండటమే. ప్రజల్లో చైతన్య స్ఫూర్తి కలిగించడమే ఆయన ధ్యేయం. డాక్యుమెంటరీ నాటకాలకు, వీధి నాటక శైలిలో న్యూస్ పేపర్, పోస్టర్ నాటకాలకూ ఆద్యులు ఉత్పలదత్తే. మార్క్సిస్టు దృక్పథంతో ఆ సిద్ధాంతానికీ, భావజాలానికీ అనుకూలించే విధంగా జాత్రనాటకాలను రచించి ప్రదర్శించడంలో కూడా ఉత్పలదత్ ప్రథముడే.

తరుణ్ రాయ్ థియేటర్, సెంటర్, సవిత వ్రతదత్త, రూపకార్, గంధర్వ థియేటర్ యూనిట్ మొదలైనవి నాటకరంగ వికాసానికి తమవంతు సహకారాన్ని అందించిన నాటకసంస్థలు.

1960-70 మధ్యకాలంలో నట శిక్షణాలయాలు ప్రారంభమయ్యాయి. వాటివల్ల ఎందరో నటీనటులు నటనారీతులను, ప్రదర్శనా రీతులను శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి సుశిక్షితులు కావడానికి అవకాశం కలిగింది. 1960 ప్రాంతంలో మొదలైన పోస్టర్ థియేటర్ వీధినాటక శైలికి మార్గం చూపింది. సాంఘిక చైతన్యం కోసం, వికాసానికి, విద్యాపరమైన వికాసం కోసం, ముఖ్యంగా రాజకీయ ప్రచారం కోసమే వీధినాటకాలు ఉద్దేశింపబడినాయి. గ్రోటోవ్‌స్కీ ఫిజికల్ థియేటర్‌కు భిన్నమైన రీతిలో బాదల్‌సర్కార్ మూడో *నాటకరంగం* (Third Theatre) ను వ్యాప్తిలోకి తెచ్చాడు. బాదల్ సర్కార్ రచించి ప్రదర్శించిన నాటకాల్లో *ఏవం ఇంద్రజిత్ బాకీఇతిహాస్, త్రింగశతాబ్ది, శేష్‌న్యాయ్* మున్నగు నాటకాలు అతనికి పేరు తెచ్చాయి. ఆధునిక వీధి నాటకాలను ప్రధాన నాటక స్రవంతిలో ఒక అంతర్భాగంగా పరివ్యాప్తం చేసిన ఘనత బాదల్ సర్కారుదే. వీధి నాటకాలకు తోడుగా మరికొన్ని ప్రదర్శనా విధానాలు అభివృద్ధిలోకి వచ్చాయి. వాటిలో మైమ్ థియేటర్ పేర్కొనదగింది. నిరంజన్ గోస్వామి నిర్వహణలో ఇండియన్ మైమ్ థియేటర్, రఘునాథ్ గోస్వామి నేతృత్వంలో Puppet Theatre (బమ్మలాట) వ్యాప్తి చెందాయి.

గతానుగతికంగా వస్తున్న సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా భావవ్యక్తీకరణలో వైవిధ్యాన్ని చేకూర్చే అనేక నూతన ప్రయోగాలకు బెంగాలీ నాటకరంగం ముందంజవేసింది. రుద్రప్రసాద్ సేన్ గుప్తా నిర్వహణలో నందికార్, మనోజ్ మిత్రా ఆధ్వర్యంలో సుందరం, శ్యామల ఘోష్ నేతృత్వంలో నక్షత్ర, అరుణ్ ముఖోపాధ్యాయ సారథ్యంలో చేతన తదితర కళాసంస్థలు బెంగాలీ నాటకరంగం బహుముఖాభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయి. బెంగాలీ నాటకరంగం బెంగాలీ రాష్ట్రానికే కాక, భారత దేశానికే తలమానికంగా, మార్గదర్శకంగా పురోగమించిందనడం సత్యదూరం కాదు.

గం.సు.రె.

మరాఠీ నాటకరంగం

మహారాష్ట్ర ప్రజలు తమ నాటక రంగాన్ని గర్వకారణమైన, అపురూప సంపదగా భావిస్తారు. మరాఠీ నాటకం ఇతర భారతీయ భాషల రీతిలోనే జానపద ప్రక్రియ నుంచే ఆవిర్భవించింది. మతపరమైన ఉత్సవాలకు సంబంధించిన లలిత్, భరూడ్, గొంధాల్, బహురూపి, కీర్తన్ మొదలైన ప్రసిద్ధ జానపద కళారూపాల నుండి మరాఠీ నాటకం రూపు దిద్దుకొంది.

1843లో విష్ణుదాస్‌భావే రాసిన సీతాస్వయంవరె మొట్టమొదటి ఆధునిక మరాఠీ నాటకంగా వాసికెక్కింది. ఇది బహుళ గీతా సమన్విత పౌరాణిక నాటకం. భావే సుమారు 15 నాటకాలు రాశాడు. సంభాషణలు లిఖిత రూపంలో లేకపోయినా, నటులు సద్యః కల్పనతో సంభాషణలు పలుకుతూ నటించేవారు. నాటకం మొదటి నుంచి చివరి వరకూ సూత్రధారుడు రంగస్థలం మీదే ఉంటూ ప్రదర్శనలో తోడ్పడేవాడు. గణేశ, సరస్వతుల ఆశీస్సులనర్థిస్తూ దేవతా స్తుతితో నాటకం మొదలయ్యేది. అటుపిమ్మట ఈ దేవతా మూర్తులు రంగస్థలం మీదికి ప్రవేశించి, నృత్యం సలిపి, తమ కృపా వృష్టిని సభాసదులపై కురిపించి నిష్క్రమించేవారు. నాటకం సుఖాంతంగా ముగిసేది. విష్ణుదాస్ భావే రచించిన పౌరాణిక నాటకాలన్నీ బహుళ జనాదరణ పొందాయి. మహారాష్ట్రలోని మారుమూల ప్రాంతాలలో కూడా తమ నాటకాలను జనరంజకంగా ప్రదర్శించి మరాఠీ నాటకాలకు విశేష ప్రచారం తెచ్చి పెట్టాడు.

బంబాయి విశ్వవిద్యాలయం (ముంబాయ్ విద్యాపీఠం) స్థాపన మరాఠీ నాటకరంగంలో అనూహ్యమైన మార్పులు కలగడానికి శ్రీకారం చుట్టింది. ప్రాచీన సంస్కృత నాటకాలు, షేక్స్పియర్ నాటకాలు విద్యాధికులకు అందుబాటులోకి వచ్చాయి. తత్ఫలితంగా ఎన్నో సంస్కృత నాటకాలు, షేక్స్పియర్ నాటకాలు ప్రామాణిక రీతిలో అనువదించబడినాయి. శర పరంపరగా సాగిన ఈ అనువాదాల జోరు మూడు దశాబ్దాలపైగా కొనసాగింది. షేక్స్పియర్ విరచిత విషాదాంత నాటకాలను మరాఠీభాషలోకి అనువదించటమేకాక, వాటిని రంగస్థలంపై విజయవంతంగా ప్రదర్శించడమూ జరిగింది. ఇతర ఆంగ్లేయ, ఐరోపా నాటకకర్తల నాటకాలు ముఖ్యంగా విక్టర్‌హ్యూగో, షెరిడాన్, మోలియర్ మొదలైన ప్రఖ్యాత రచయితల నాటకాలు అనుసరణ రూపంలో మరాఠీ రంగస్థలానికి పరిచయం చేయబడ్డాయి. మహారాష్ట్రలో గణపతిరావు జోషి గొప్ప షేక్స్పిరియన్ నటుడుగా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించాడు. అతని నటనాప్రావీణ్యాన్ని వర్ణించడానికి మాటలు చాలవని, ఆ రోజుల్లో ఒక ఆంగ్లేయ అధికారి ప్రశంసించడం జోషి కీర్తి కిరీటంలో ఒక కలికి తురాయిగా భాసించింది. హేమ్లెట్, ఒథెల్లో, మేక్బత్‌వంటి పాత్రలను గణపతిరావు అద్భుతంగా పోషించేవాడు. బాల్‌బన్ జోగ్ అతని సహనటుడుగా ప్రదర్శనకు ప్రాణం పోసేవాడు. మహారాష్ట్ర నాటక మండలి ఆధ్వర్యంలో ప్రదర్శితమైన ఈ నాటకాలకు అపూర్వ ప్రజాదరణ లభించింది.

1880లో అన్నా సాహెబ్ కిర్లోస్కర్ ప్రదర్శించిన శకుంతల నాటకం, మరాఠీ నాటక రంగంలో ఒక మహోజ్వల శకానికి నాంది పలికింది. మరాఠీ సంగీత నాటకానికి ఈయనే ఆద్యుడు. తన నాటక కంపెనీ అయిన కిర్లోస్కర్ నాటక మండలి కోసం సౌభద్ర, రామరాజ్యవియోగ్ నాటకాలను రాశాడు. కిర్లోస్కర్ ప్రతిభా వంతుడైన నాటకకర్త, కవి, నటుడు, దర్శకుడు కూడ సంగీత సంభరితమై, కిర్లోస్కర్ నాటక మండలి మధుర గాయకులకు, మేటి నటులకు నిలయంగా ఉండేది. భౌలైవ్, కొల్హాట్కర్, మరోబారా వాఘోలికర్, బాల్ కోబా నటేకర్ వంటి కళాకారులు ఆ బృందంలో ఉండేవారు. బాల గంధర్వ మరాఠీ నాటకరంగంలో అద్వితీయ కళాకారుడుగా లబ్ధ ప్రతిష్ఠుడు. అసలు పేరు నారాయణ శ్రీపాద రాజహంస్. ఈయనకు బాల గంగాధర్ తిలక్ ప్రసాదించిన బిరుదే బాల గంధర్వ. ఈయన ధరించిన స్త్రీ పాత్రలు మరాఠీ రంగస్థలిపై చరిత్ర సృష్టించాయి.

కిర్లోస్కర్ అనంతరం మరాఠీ నాటక రంగాన్ని ఉద్దీప్తవంతం చేసిన ఘనత గోవింద బల్లాల్ డియోల్‌కు దక్కుతుంది. సంస్కృత నాటకం మృచ్ఛకటికను మరాఠీ రంగస్థలానికి అనువుగా మలచి అద్భుతంగా ప్రదర్శించాడు. బాణుని కాదంబరి కావ్యాన్ని షప్ సంభ్రమ్ పేరుతో నాటకీకరించాడు. శారద అనే సాంఘిక నాటకాన్ని ప్రప్రథమంగా మరాఠీ రంగస్థలానికి పరిచయం చేసిన ఘనత గోవింద బల్లాల్ డియోల్‌దే. శారద ఆనాడు విస్తృతంగా ప్రదర్శింపబడి ప్రజాభిమానాన్ని చూరగొనడమే గాక, కాలపరీక్షకు నిలిచి నేటికీ నాటకాభిమానుల హృదయాల్లో నిత్య నూతనంగా వెలుగొందుతూ నిలిచి ఉందంటే అతిశయోక్తి కాదు. డియోల్ సుప్రసిద్ధ నాటక రచయితే కాదు, నటులకు శిక్షణ ఇచ్చి వారిని ఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దడంలోనూ ఆరితేరిన ఆచార్యుడు. బాలగంధర్వ, గణపతిరావు, బోడస్ తదితరులు డియోల్ శిక్షణలో తమ నాటక సామర్థ్యానికి పదును పెట్టుకున్న వారే. స్త్రీ, పురుష పాత్రలను సమ ప్రతిభతో నిర్వహించగల

సామర్థ్యాన్ని సమకూర్చడం ఆ నట శిక్షణలో ఒక భాగం కావడం విశేషం. శక్తి మంతమైన నాటకాలలో కిర్లోస్కర్ నాటక మండలికి బలం చేకూర్చిన నాటక రచయిత శ్రీపాద కృష్ణకొల్హాట్కర్. అప్పటి సామాజిక జీవిత సమస్యలను ఇతివృత్తంగా చేసుకుని అసంఖ్యాకంగా నాటకాలు రాశాడు. నూతన శకంలో సాంఘిక జీవన శైలినీ, సమస్యల సంక్లిష్టతను, సంవేదనను తన రచనల్లో సువ్యక్తం చేశాడు. ఈయన రచించిన నాటకాలలో మూకనాయక్, గుప్తమంజూష్ , ప్రేమ్ శోధన్ సుప్రసిద్ధాలు. నాట్య సంగీతంలో కొల్హాట్కర్ కొన్ని కొత్త ధోరణులను ప్రవేశపెట్టాడు. ఈయన ప్రవేశపెట్టిన సంగీతం పార్శీ, గుజరాతీ ఉర్దూ నాటక ప్రభావ జనితం అని చెప్పవచ్చు. గతానుగతికంగా వస్తున్న నాంది, భరత వాక్యం వంటి సంప్రదాయాలకు స్వస్తి పలికి నాటక నిర్మాణంలో నూతన సంస్కరణలకు స్వాగతం పలికాడు. స్వచ్ఛమైన కాల్పనిక ఇతివృత్తమే కొల్హాట్కర్ స్వతంత్ర నాటకాలకు ఊపిరి అయ్యింది.



ఘాసీరాం కొత్వాల్‌లోని దృశ్యం

మరాఠీ నాటక రంగ వికాసానికి కె.పి.ఖదిల్కర్ చేసిన కృషి అపారమైంది. ఈయన నాటక రచయిత, దర్శకుడు, పాత్రికేయుడు కూడా. బాల గంగాధర తిలక్ పత్రికలో వ్యాసాలు రాసేవాడు. భావప్రసారానికి నాటకం శక్తివంతమైన ఆయుధం అనే భావన ఖదిల్కర్ గూడు కట్టుకొని ఉండేది. ఈయన రాసిన కీచకవధ సమకాలీన రాజకీయ పరిస్థితిని నర్మగర్భంగా అభివ్యక్తం చేసే దృశ్యకావ్యం. నాటకంలోని అంతరార్థాన్ని ప్రేక్షకులు అవలీలగా అర్థం చేసుకునే విధంగా ఉండేది. తత్ఫలితంగా నాటకం నిజస్వరూపాన్ని పసిగట్టిన బ్రిటీష్ ప్రభుత్వం ఆ నాటకాన్ని నిషేధించింది. గణపతిరావు భగవత్ ఆ నాటకంలో లార్డ్ కర్జన్‌కు ప్రాతినిధ్యం వహించే కీచక పాత్రను ధరించేవాడు. ఈతని అనన్య నటనా కౌశలం ఆ పాత్రకు చిరంజీవత్వాన్ని తెచ్చి పెట్టింది. ఖాదిల్కర్ రచించిన అనేక నాటకాలలో తౌరాలీ మాధవరావు పీష్వా, భౌబందకి విద్యాహరణ, మేనక, ద్రౌపది, స్వయంవరం, మాన్ అప్‌మాన్ నాటకాలు సుప్రసిద్ధాలు. మాన్ అప్‌మాన్ ఖదిల్కర్ అత్యంత పేరు తెచ్చి పెట్టిన సంగీత నాటకం. ఈ నాటకంలో భామిని భూమికలో బాలగంధర్వ అత్యున్నత ప్రతిభ చూపాడు. సంగీత, అభినయాలలో ప్రతిభా శాలి అయిన గోవిందరావు టెంబే ఆ నాటకానికి స్వరాలు కూర్చాడు. నిజానికి బాలగంధర్వ గళమాధుర్యం ద్వారానే టెంబే తన సంగీత కళా ప్రావీణ్యాన్ని కర్ణ పేయంగా బహిర్గతం చేయగలగాడని చెప్పాలి. మాన్–అప్‌మాన్‌నాటకం తొలి ప్రదర్శన రోజునే బాల గంధర్వ కూతురు చనిపోయిన వార్త తెలిసింది. నాటక ప్రదర్శన ఆపివెయ్యమని అతని అభిమానులు ఎంత వారించినా, బ్రతిమాలినా బాలగంధర్వ పెడచెవిని పెట్టి, నాటకం ముఖ్యం అని ఖండితంగా సమాధానమిచ్చాడు. ఆనాటి ప్రదర్శన అద్భుతంగా జనరంజకంగా, రస ప్లావితంగా సాగింది. నానాసాహెబ్ జూగ్లేకర్, గణపతి రావు బోడాస్ ఆ నాటకంలో ఇతర పాత్రలు పోషించారు. 1922లో మహాత్మాగాంధీ తలపెట్టిన తిలక్ స్వరాజ్యనిధి సేకరణార్థం కేశవపావు భాసలే కథానాయకుని పాత్రతో బాలగంధర్వ మాన్-అప్‌మాన్ నాటకాన్ని ప్రదర్శించాడు. ఆ ప్రదర్శన అఖండ విజయాన్ని సాధించి వేనోళ్ల శ్లాఘించబడింది. గణపతిరావు బోడాస్, గోవిందరావు టెంబేలతో కలిసి బాలగంధర్వ నాటక మండలిని స్థాపించాడు. నాటక దుస్తులు, తెరలు, బంగారు పూతపూసిన రజిత మకుటాలు మొదలైన రంగస్థల సామాగ్రి కోసం పెద్దమొత్తం ఖర్చు చేశాడు. ప్రదర్శన అత్యుత్తమంగా ఉండాలనేదే ఆ సమాజం వారి పరమలక్ష్యం. రాజదర్బార్ దృశ్యబంధ నిర్మాణం కోసం ఆ రోజుల్లో 75 వేలు ఖర్చు పెట్టారంటే నాటకాన్ని అత్యుత్తమంగా ప్రదర్శించాలన్న వారి తపన ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

మరాఠీ నాటక స్వర్ణయుగాన్ని సుసంపన్నం చేసిన నాటక కర్తలలో రామ్‌గణేశ్ గడ్కారీ గణనీయుడు. ఈయన కలం నుండి జాలువారిన నాటక పరంపరలో భవబంధన్, పుణ్యా ప్రభావ్, ప్రేమసన్యాస్, ఏకచ్‌ప్యాల మున్నగు నాటకాలు సుప్రసిద్ధాలు. మరాఠీ నాటక సాహిత్యంలో ఏకచ్‌ప్యాల కఠిన శిలలను సయితం ద్రవింపచేయగల శక్తి సమన్విత విషాదాంత నాటకం. ఇది తాగుడు దుర్వ్యసనాన్ని ఖండించే నాటకం. దీనిలో

బాలగంధర్వ పోషించిన సింధుపాత్ర, అతడు అంతకు పూర్వం ధరించిన పాత్రలలో కెల్లా అత్యుత్తమ అభినయ పాటవాన్ని ప్రదర్శించిన పాత్రగా ప్రశంసలు అందుకొంది.

రామ్‌గణేశ్ గడ్కారీ తర్వాత 1925 ప్రాంతంలో మరాఠీ నాటకరంగంలో **స్తబ్ధత ఏర్పడింది.** నాటకాలు చూసే వారు **కరవయ్యారు. నాటక సమాజాలు** నిలదొక్కుకోలేక **పోయాయి. మరాఠీ నాటకరంగం పునాదులు కదిలిపోయాయి.** దీనికి తోడు ఉన్న నాటకశాలలు సినిమా హాళ్ళుగా మారిపోవడం సమస్యను మరింత జటిలం చేసింది. నాటకాల అభావంతో, అస్తవ్యస్థ పరిస్థితులతో అయోమయంలో పడి వృత్తి నాటకరంగం కొట్టుమిట్టాడుతున్న సమయంలో, దీనికొక ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించారు కొందరు కళాభిజ్ఞులు. ఔత్సాహిక సమాజాలు కొత్త తరహా నాటకాలు రాయించి ప్రదర్శించడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. అలా ఏర్పడిన సమాజాల్లో నాట్యమన్మంతర్ ఒకటి. ఆధునిక భావాలతో కొత్త తరహా నాటకాలను ప్రదర్శించాలన్నదే ఆ సమాజం లక్ష్యం. ఎం.జి.రంగ్‌నేకర్ ఈ సమాజం అధినేత. ఎస్.వి. వర్టక్ రచించిన అండల్యాంచిషాలా అనే నాటకాన్ని 1933లో ఈ సమాజం ప్రదర్శించింది. అది సర్వ సమగ్రమైన అద్భుత నాటకం. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించడం ఈ సమాజంతోనే మొదలైంది. అలాంటి కళాకారిణులలో జ్యోత్స్నభోలే పేరొందిన నటీమణి. పెయింట్ చేసిన తెరలకు స్వస్తి చెప్పి బాక్స్‌సెట్ లో నాటక ప్రదర్శించే విధానానికి ఈ సమాజమే నాంది పలికింది.

అనంత్ కనేకర్ ఇబ్సన్ డాల్స్ హౌస్ నాటకాన్ని ఘర్‌కుల్‌అనే పేరుతో మరాఠీలో అనువదించాడు. స్వాతంత్ర్యానంతరం మరాఠీ నాటకరంగం కొత్త పుంతలు తొక్కడంలో ఇబ్సన్ ప్రభావం బలీయమైంది. ఈ దిశలో ప్రయాణించి బి.వి.వారేర్కర్, ఎం.జి. రజ్‌నేకర్, పి.కె.ఆత్రేప్రభృతులు సామాజికుల్ని ఆకట్టుకునే నాటకాలు రాసి, ప్రదర్శింపచేసి మరాఠీ నాటకరంగానికి పూర్వవైభవాన్ని తెచ్చి పెట్టడానికి అకుంఠిత సేవ చేశారు. పి.కె.ఆత్రే రచించిన షష్టాంగ్ నమస్కార్, లగ్‌నాచిబేడి , వందేమాతరం ఇత్యాది నాటకాలు అత్యంత ప్రజాదరణ పొందాయి. బల్‌మోహన నాటక మండలి ప్రదర్శించే నాటకాలను ప్రజలు అమితంగా ఆదరించారు. అయితే, ఆత్రే అటు తర్వాత సినిమారంగానికి వెళ్ళిపోయాడు.

బి.వి.వారేర్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన నాటక రచయిత. ఈయన నాటకాలన్నీ సామాజిక జీవితాన్ని ప్రతిబింబించేవే. ఈయన రచించిన నాటకాలను లలిత కళాదర్శ మండలి విరివిగా ప్రదర్శించింది. వారేర్కర్ చేతిలో నాటకం సంఘ సంస్కరణలకు ఒక బలమైన ఆయుధమైంది. సట్టే సే గులామ్, సన్యాస కలాష్, హాచ్ ములాబాప్, భూమికన్య, సీత, అపూర్వ బెంగాల్ తదితర నాటకాలన్నీ అతనిలోని సంఘ సంస్కరణాభిలాషకు ప్రబలోదాహరణలే.

కళ్ళుమిరుమిట్లు గొలిపే రంగోద్దీపన, సాంకేతిక విన్యాసాలు ప్రదర్శనలో అంతర్భాగాలై రసాస్వాదనకు దోహదం చేసేవి. దృశ్యబంధ నిర్మాణం వాస్తవికతకు పట్టంకట్టేది. 40వ దశాబ్దిలో నాట్యమవ్వంతర్ ఒక సమధికోత్సాహక బృందంగా విలసిల్లింది. ఈ పతాకం కిందనే ఎం.జి. రంగ్నేకర్ నాటకాలన్నీ ప్రదర్శితమయ్యాయి. కులవధు, వాహిని, ఏక్‌నోటా మతారా, భటాలాదిలిఓసరి మొదలైనవి ఈ సమాజం ప్రదర్శించిన ముఖ్యమైన నాటకాలలో కొన్ని. మధ్యతరగతి సమాజాన్ని ఆవరించిన సమస్యలు రంగ్నేకర్ నాటకాలకు ఇతివృత్తాలయ్యాయి. ఈడుకాని వివాహాలు, గృహ సమస్య, బలవంతపు వేశ్యరికం మొదలైన సమస్యలు నాటకాల్లో ఇతివృత్తాలు జ్యోత్స్నభోలే ఈ నాటకాలలో కథానాయిక పాత్ర ధరించింది. విజయం వరించిన వృత్తి కళాకారుడు రంగ్నేకర్. నిజానికి ఇలాంటి వృత్తి పరమైన సాధన వల్ల నాటకరంగానికి పెద్దగా లాభించింది అంతగా లేదు. కాని అననుకూల పరిస్థితుల మధ్య ఒంటరి పోరాటం సాగించిన రంగ్నేకర్ కృషి విస్మరించరానిది.

1943 మరాఠీ నాటకం శతవార్షికోత్సవం జరుపుకొన్న మరపురాని సంవత్సరం. ముంబాయి మరాఠీ సాహిత్య సంఘానికి చెందిన ఎ.ఎస్.భలేరావ్, ఎస్.ఎన్.బన్‌హట్టీ ఈ సందర్భంలో తమ అమూల్య సేవలను అందించారు. వీరిచ్చిన ప్రోత్సాహంతో సమాజంలోని అన్ని వైపుల నుంచి, అన్ని వర్గాల నుంచి అద్భుత స్పందన లభించింది. ఈ శతవార్షిక నాటకోత్సవాలు నాటక రంగంలో రెండు పెద్ద మార్పులకు ఊతమిచ్చాయి. వాటిలో కళాఖండాలుగా పేరు పొందిన నాటకాలను పునరుజ్జీవింపచేయడం ఒక లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో కిర్లోస్కర్, డియోల్, కొల్హాట్కర్, ఖాదిల్కర్, గొడ్కారీ నాటకాలను ఆధునీకరించి ప్రదర్శించగా ఆ ప్రయత్నం సత్ఫలితాన్ని ఇచ్చింది. అలాగే విదేశీ కళాఖండాలను అనువదించి ప్రదర్శించడం రెండోలక్ష్యం. ఈ పనికి పూనుకున్న వారిలో వి.పి.షిర్‌వాడ్‌కర్, అనంత్ కనేకర్, మాధవ మనోహర్ ముఖ్యులు. వి.వి.షిర్ వాదాకర్ ఆస్కార్ వైల్డ్ ఎన్ ఐడియల్ హజ్‌బెండ్ నాటకాన్ని డోర్ చెదివె పేరుతోనూ, మెటర్‌లింక్ మొన్నా వన్నా నాటకాన్ని వైజయంతి పేరుతోను, షేక్స్పియర్ మేక్బెత్ నాటకాన్ని రాజ్‌ముకుట్ పేరుతోనూ అనువదించాడు. బారీ రచన వాట్ ఎవ్వరి ఉమన్ నోస్ నాటకాన్ని పతంగచిడోరీ అనే పేరుతోను, గాల్స్ వర్దీ స్ట్రైఫ్ నాటకాన్ని జంజ్ పేరుతోనూ అనంత్ కనేకర్ అనువదించాడు. అలాగే కాలేవ్ స్క్వేరింగ్ ది సర్కిల్ నాటకాన్ని శేషాచిషింగే పేరుతో మాధవ్ మనోహర్ అనువదించాడు.

1955 తర్వాతనే మరాఠీ నాటకరంగంలో సొంత గొంతు వినిపించింది. సర్వత్రా విశిష్ఠ మార్పు గోచరించింది. సాంఘిక సమస్యలలోను, జీవనశైలిలోను పొడచూపిన విభిన్న మార్పులు నాటక రచనా విధానంలోను, ప్రదర్శనా వైఖరిలోనూ దృగ్గోచర మయ్యాయి. సంప్రదాయ నాటకాలను త్రోసిరాజని కొత్త పోకడలు ముందుకొచ్చాయి. ప్రదర్శనశైలి ప్రగతి పథంలో పయనించసాగింది. నాటక ప్రదర్శనలో రంగోద్దీపనకు, శబ్దప్రసారానికి ప్రాముఖ్యం పెరిగింది. వెద్యాచెఘర్ అన్హట్ నాటకం ద్వారా తొలిసారిగా ఈ విధమైన నూతన విధానానికి 1957లో శ్రీకారం చుట్టిన గౌరవం ఆ నాటక రచయిత వసంత్ కనేట్కర్‌కు దక్కుతుంది. ఈ నాటకంలో దాదా సాహెబ్ పాత్ర మూర్తిమత్వంలో ద్వైధీభావాన్ని సువ్యక్తం చేయడానికి ఉపయోగించిన చీకటి వెలుగులు, శబ్ద ప్రసరణలోని సాంకేతిక విన్యాసాలు అద్భుతమైన అనుభూతిని కలిగించాయి.

బాల్ కొల్హాట్కర్ రచించిన దురితంచె తిమిర్ జావో అన్న నాటకం ఒక కొత్త వరవడికి ప్రాణ ప్రతిష్ఠ చేసింది. మంచీ చెడుల మధ్య అనాదిగా సాగుతున్న సంఘర్షణను చిత్రించే నాటకమిది. ఈ తరహా నాటకాలలో మనోజ్ఞమైన భాషాసంపదే కాక, వాటిలోని పాత్రలు సెంటిమెంటల్‌గా ఉండటం విశేషం. ఈ రకమైన భావోద్వేగ సహిత కౌటుంబిక నాటకాలను నేటి తరం వారు కూడా ఆదరిస్తున్నారనడానికి ప్రేక్షకులే సాక్ష్యం.

పి.ఎల్.దేశ్‌పాండే రాసిన తుఝె ఆహెతుజా పాహి అనే నాటకం జీవిత విలువల సంఘర్షణను చిత్రిస్తుంది. హాస్యం, వ్యంగ్యం, సెంటిమెంట్‌ల సమ్మేళనం ఈ నాటకం. ఇదే సమయంలో విద్యాధర్ గోఖలే సంగీత నాటకాలు మరాఠీ నాటకరంగాన్ని ఝుంఝూమారుతంలా చుట్టుముట్టాయి. ముఖ్యంగా ఈయన రచించిన మొదటి సంగీత నాటకం పండిత్ రాజ్ జగన్నాథ్ విజయ దుందుభి మోగించింది. గోఖలే ఇతర నాటకాలైన *సువర్ణతుల, మందారమాల, మదనాచి మంజరి, స్వర్ణ సమ్రాథ్ని* మొదలైనవి అతని విజయతోరణంలో ఇమిడిన సుగంధ కుసుమాలే.

1950-75 మధ్యకాలంలో వి.వి.శిర్వాద్‌కర్, వసంత కనేట్కర్, సురేష్ ఖరే, విజయ్ టెండూల్కర్, రత్నాకర్ మట్కారీ, పురుషోత్తం దుర్వేకర్, జయవంత్ దాల్వీ, మధుకర తోరడ్‌మల్ ప్రభృతులు నాటకరంగాన్ని సుసంపన్నం చేసిన నాటకకర్తలు. ఈ కాలంలో వెలువడిన నాటకాలు మానవ జీవితంలోని వైవిధ్యాన్ని, వైరుధ్యాన్ని భిన్న కోణాల నుంచి ఆవిష్కరించిన విశిష్ట రచనలు. ఇవన్నీ మధ్య తరగతి జీవితాన్ని చిత్రించిన నాటకాలే.

మారుతున్న కుటుంబ పరిస్థితుల వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, బయట ఉద్యోగం చేసే స్త్రీలు, పాశ్చాత్య సంస్కృతీ ప్రభావజనిత సమస్యలు, ఆధునిక జీవన శైలిలో స్త్రీల స్థితి, స్థానం, కుటుంబ జీవితంలో ఎవరికి వారే అనే స్వార్థంతో పరుగులు తీస్తున్న నేటితరం, వృద్ధాప్యంలో జవసత్వాలుడిగిన పెద్దల్ని నిరాదరిస్తున్న దయనీయ పరిస్థితులు - ఇలాంటి ఎన్నో సమస్యలను ఈ నాటకాలు హృదయంగమంగా చిత్రించాయి. వాటిలో *గుడ్ బై డాక్టర్, కచేవాచంద్ర, ఆఖర్ చా సవాబ్, పంఖిన్న,ఓఢ్ పవలాచి, నట సమ్రాట్, సంధ్యా-ఛాయ, బారిస్టర్* మొదలైనవి ప్రసిద్ధనాటకాలు.

ఇక చారిత్రక నాటకాల విషయానికి వస్తే చారిత్రక సంఘటనలకు, సత్యాలకు పూర్తిగా భిన్నమైన మార్గంలో నాటక సృష్టి జరగడం నూతన దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది. చారిత్రక సత్యాలను మానవ నైజంతో ముడిపెడుతూ రచించటం నాటక రచనా విధానంలో ఒక ప్రత్యేక లక్షణం. వాక్యాల మధ్య ఉన్న అర్థాన్ని, అంతరార్థాన్ని చదవడానికి ఈ నాటక రచయితలు ప్రయత్నం చేశారు. వసంత కనేట్కర్ రాసిన రాయ్‌గడల జ్యోహా జయయేతి నాటకం దీనికొక చక్కని ఉదాహరణ. ఆ నాటకంలో శివాజీ మహారాజ్ ఒక మహారాజుగా కాక, శంభాజీ రాజు తండ్రిగానే సాక్షాత్కరిస్తాడు. ఒక తండ్రిగా శివాజీ అనుభవించిన అంతులేని నైరాశ్యాన్ని, అసహాయస్థితిని వ్యక్తం చేస్తుంది ఆ నాటకం. దూసరా పేష్వా, విజ్ మహనలి ఇతే, ఒషాలాలా మ్యుత్యు, మహారాణి పద్మిని, మీశ్రీంచి ఇచ్చ తదితర నాటకాలన్నీ ఈ ధోరణిలో రాయబడినవే. అలాగే పౌరాణిక ఇతివృత్తాలను కూడా భిన్న దృక్కోణం నుంచి పరిశీలించి, రామాయణ, భారత, పురాణ కథలను నాటకాలుగా రాసిన రచయితలున్నారు. కౌంతేయ, దేవయాని, మత్స్యగంధ, నలదమయంతి,మాతా ద్రౌపది మొదలైనవి ఈ కోవకు చెందిన నాటకాలు.

సంగీత నాటక సంప్రదాయానికి ప్రాతినిధ్యం వహించే ఎన్నో సంగీత నాటకాలు కూడా ఈ కాలంలో వెలుగు చూశాయి. పాత్రల భావోద్రేకాలను అభివ్యక్తీకరించే సాధనంగా సంగీతం ఈ నాటకాల్లో విరివిగా ప్రయోగించబడింది. గాయకుల జీవిత చరిత్రలు, వారు సాధించిన ఘన కార్యాలను చిత్రించే సంగీత నాటకాలెన్నో వచ్చాయి. పురుషోత్తం దార్వేకర్ *కట్యార్ కల్‌జిట్ ఘుసాలీ* వంటి నాటకాలు ఇందుకు ఉదాహరణలు. జీవిత చరిత్రలకు చెందిన నాటకాలు మరాఠీ నాటక సంచయంలో ఒక ముఖ్యమైన భాగం. ఈ నాటకాలు ప్రసిద్ధ వ్యక్తుల జీవిత ఘట్టాలను వివరిస్తాయి. హిమాలయాచి సవాటి విషామిక్షాచి చాయ, నట సమ్రాట్ ధుబంగ్ వంటి నాటకాల్లో ఒక వ్యక్తి సమగ్ర జీవిత చిత్రణ కనిపిస్తుంది. సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ జీవితానుభవాల వివరణకు ఈ నాటకాలు అద్దం పడతాయి.

ఇవేకాక మనో విశ్లేషణాత్మకాలైన నాటకాలు మరాఠీలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. సంక్లిష్టమానవ స్వభావాన్ని ఈ నాటకాలు దృశ్యమానం చేస్తాయి. అనువదించటం తన జీవిత పరమావధిగా పెట్టుకున్న నాటక రచయిత కె.బి.బల్సారే. షేక్స్పియర్ నాటకాలను ఎలాంటి కుదింపులు, మార్పులు చేర్పులు లేకుండా యథాతథంగా అనువదించటం జరిగింది. బల్సారే నాటకాలేవి రంగస్థలిపై ప్రదర్శనకు నోచుకోలేదు. అనువాద నాటకాలలో మహేందర్ శాస్త్రి ఒథెల్లో, మహాజానీ తార(సింబలిన్), అంగారక్ వికార్ విలాసిత్ (హేమ్లెట్), డియోల్ జుంగర్‌రాల్ (ఒథెల్లో), కల్కేకర్ త్రటిక నాటకాలు మాత్రం రంగస్థలిపై ప్రదర్శితమై బహుళ జనాదరణ పొందగలిగాయి. కొందరు నాటక కర్తలు మరాఠీ సంగీత నాటక బాణీలో ఆ నాటకాలకు సంగీతాన్ని సమకూర్చారు. కొందరు మౌలిక నాటకాలను భారతీయ సామాజిక, సాంస్కృతిక నేపథ్యానికి అనుగుణంగా మలిచి ప్రదర్శించారు. అవసరమైన మార్పు చేర్పులతో ప్రాంతీయ వాతావరణాన్ని కల్పించే ప్రయత్నం చేశారు. అనువాద నాటకాల విషయంలోనేకాక, స్వతంత్ర నాటక రచన చేసేవారి మీద కూడా షేక్స్పియర్ ప్రభావం ప్రగాఢంగా ఉంది. షేక్స్పియర్ ప్రభావం బలంగా ఖదిల్కర్, గోడ్కరీల మీద కొంత వరకు వి.వి. షిర్ వాడ్కర్ మీద ఉందని చెప్పవచ్చు. షేక్స్పియర్ మేక్బత్‌కు అనువాదమైన షిర్ వాడ్కర్ రాజ్‌మకుట్ నాటకం 1954లో హెర్బర్ట్ మార్షల్ దర్శకత్వంలో ప్రదర్శించ బడింది. ఆనాటి ప్రదర్శనలో రంగస్థలాన్ని మూడుభాగాలుగా విభజించడం మరాఠీ నాటక రంగ అభివృద్ధి పథంలో ఒక మైలు రాయిగా నిలిచింది.

వసంత్ కనేట్కర్ రాసిన *గజన్ భేడి* నాటకంలో షేక్స్పియర్ విషాదాంత నాటకాల్లోని నలుగురు కథానాయకుల్ని ఒక చోట చేర్చి నాటకం నడిపించాడు. తొలి ప్రదర్శన లండన్‌లో జరిగింది. వధుకర్ తోరడ్‌మల్ దీనిలో కీలక పాత్ర ధరించాడు. 1925-30 ప్రాంతాలలో ఇబ్సన్ డాల్స్‌హౌస్ నాటకాన్ని పలువురు రచయితలు మరాఠీలోకి అనువదించారు. 1970 దశకంలో గాని బెర్టోల్ట్ బ్రెహ్ట్ నాటకాలకు మరాఠీ రంగస్థలిపై అనుకూల పరిస్థితి ఏర్పడలేదు. బ్రెహ్ట్ కకేషియన్ చాక్ సర్కిల్ నాటకాన్ని సి.ఎల్. కనోల్కర్ ఆజన్యాయ వర్తులాచ అనే పేరుతో అనువదించి, విజయ మెహతా, ఫ్రిట్జ్ బెనోవిట్జ్ సంయుక్త దర్శకత్వంలో 1973లో ప్రదర్శింపజేశాడు. బెనోవిట్జ్ బ్రెహ్ట్ నాటకాలపై సాధికారికత ఉన్న పండితుడు. ప్యాంటోమైమ్ ఆధారంగా ప్రదర్శిత మైన ఈ నాటకంలో భారతీయ జానపద నాటక శైలినీ ఉపయోగించటం జరిగింది. ఈ నాటకాన్ని జర్మనీ రంగస్థలం మీద ప్రయోగించడం విశేషం. ఇదే నాటకం జర్మన్ నటీనటులతో కూడా ప్రదర్శించబడింది. ఇది నాటక ప్రదర్శనా విధానంలో ఒక క్రొత్త మలుపు. బ్రెహ్ట్ ది త్రిపెన్నీ ఒపేరా నాటకాన్ని పి.ఎల్.దేశపాండే తీన్ పైష్యాచ తమాషా పేరుతో అనువదించాడు. సమకాలీన జీవన శైలి మీద ఇదొక వ్యంగ్యాస్త్రం. ఈ నాటకంలో రచయిత వివిధ భారతీయ సంగీత బాణీలను ఉపయోగించాడు. శాస్త్రీయ సంగీతం నుండి జానపద సంగీతం వరకు,గజల్ నుండి కవాలీ వరకు అంతేకాక పాశ్చాత్య సంగీతాన్ని కూడా ఈ నాటకంలో వాడుకోవడం జరిగింది. దర్శకుడు జబ్బార్ పటేల్‌కు మరాఠీ నాటకరంగంలో ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించిన గౌరవం దక్కింది.

1970 దశాబ్దిలో ప్రధానంగా లైగింక ప్రవృత్తి, హింసతో కూడిన నాటకాలు కొంత కాలం రాజ్యం చేశాయి. మగ–ఆడ లైంగిక సంబంధాలకు ప్రాధాన్యమిచ్చే నాటకేతి వృత్తాలతో భిన్న కోణాల నుంచి చిత్రితమైన నాటకాలకు ప్రాముఖ్యత పెరిగింది. వాసన్‌కండ్, గార్బో, బేబి, గిధాడే, చిన్నా, శాఖరామ్ బైండర్, ఆరాధ్య మొదలైన నాటకాలు ఈ వర్గానికి చెందినవే.

స్త్రీల జీవిత సమస్యల్ని స్పృశిస్తూ అనేక నాటకాల చ్చాయి. స్త్రీలు–వారి స్థితిగతులు, ఎదుర్కొనే సమస్యలు, వారి బలం బలహీనతలు, తదితర అంశాలకు ప్రాధాన్యం లభించింది. మహారాష్ట్ర సామాజిక పరంగా అభ్యుదయ పథంలో నడిచే రాష్ట్రం. కనుక నాటకం కూడా అభ్యుదయ మార్గాన్ని ప్రతిబింబించటంలో ఆశ్చర్యం లేదు. మారుతున్న సమాజం, మారుతున్న జీవన శైలి ఆధునిక స్త్రీకి ఎన్నో సమస్యల సుడిగుండాలను సృష్టిస్తోంది. స్త్రీలకు అడుగడుగునా జరుగుతున్న అన్యాయం, దోపిడి, పరాధీనత, వారి త్యాగనిరతి, వైధవ్యం గురించి అనేక మంది నిర్మాణాత్మకమైన నాటకాలు రచించారు. నగర జీవితంలో తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకొంటూ స్వతంత్రంగా జీవించే స్త్రీల గురించి కూడా కొన్ని నాటకాలు వచ్చాయి. కచేచ చంద్ర, శతతారక, పంఖన్న, ఊధ్ పవలంచి, గుడ్ బై డాక్టర్, ఆయ్ రిటైర్, హోతే యకముల, శాంతతా కోర్టు చాలూ ఆహే, చేఘీ, సావిత్రి వంటి నాటకాలన్నీ స్త్రీ సమస్యాత్మకాలే.

సతీష్ అనేకర్ మహానిర్వాణ్ సాటిలేని ఒక అద్భుత నాటకం. ఇది గుడ్డి నమ్మకాలను, కాలదోషం పట్టిన సంప్రదాయాలను, అర్థం లేని ఆచారాలను తూర్పార బట్టే ఒక వ్యంగ్య నాటకం. భానూరావు అనే వ్యక్తి మరణానంతరం జరిగే సంఘటనలను వివరిస్తుందీ నాటకం. దహన సంస్కారం ఆలస్యం అయినప్పుడు తన చుట్టూ ఏం జరుగుతుందో భానూరావు గ్రహించగలుగుతాడు. ఆ సమయంలో బంధుమిత్రులు నిజ స్వరూపాలు బట్టబయలవుతాయి. మానవ ప్రకృతిని ముసుగు తీసి చూపిస్తాడు ఆలేకర్. మరాఠీ నాటక సాహిత్యంలో అదొక్కటే బ్లాక్ ట్రాజడీ.

విజయ్ టెండూల్కర్ మరాటీ నాటక రంగంలో ఒక చారిత్రక పురుషుడు **(Legendary figure)**. ఇరవై ఎనిమిది నాటకాలు రాసి నాటకరంగాన్ని సుసంపన్నం చేసిన అద్వితీయ కళామూర్తి. ఈయన రచనలు చాల వరకు భారతీయ భాషల్లోకి, ఇంగ్లీషులోకి అనువదింపబడ్డాయి. ఈ సమాజమే టెండూల్కర్ పరిశోధనాలయం. ఈయన నాటకాలన్నీ తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశిత పరిశీలన చేసిన ఫలితంగా రూపుదిద్దుకున్న కళాఖండాలే. లీలాబినారే అనే అమ్మాయిని ముద్దాయిగా న్యాయస్థానంలో ప్రవేశపెట్టడంతో శాంతతా కోర్టు చాలూ ఆహే (నిశ్శబ్దం కోర్టు నడుస్తూంది) నాటకం ప్రారంభమవుతుంది. పురుషాధిక్య మధ్య తరగతి సమాజంలోని హిపోక్రసీని అవహేళన చేస్తుంది ఈ నాటకం. రచయిత ఈ నాటకంలో ఎలాంటి ముగింపు ఇవ్వడు. మీరే పరిష్కారం ఆలోచించమని సమస్యను సామాజికులకే వదిలేస్తాడు.

టెండూల్కర్ శాఖారం బైండర్ అనే నాటకంలో స్త్రీ పురుషుల సంబంధాన్ని ఒక రకమైన ముతక ధోరణిలో పరిశీలిస్తాడు. శాఖారాం ఆవేశ పరుడైన ఒక మోటు మనిషి, ఈయనకు వివాహవ్యవస్థ మీద విశ్వాసం లేదు. అవసరం ఉన్న స్త్రీని తన ఇంటికి తెచ్చుకోవడం, కొన్నాళ్ళు తనతో ఉంచుకోవడం, మోజు తీరాక ఆమెను వదిలించుకోవడం ఇతని తత్వం, వ్యాపకం. తన జీవిత విధానాన్ని కుండబద్దలు కొట్టి చెప్పడమే అతని వ్యక్తిత్వంలో ఉన్న విలక్షణత. టెండూల్కర్ నాటకాలలో గిధాడే సంప్రదాయ విరుద్ధమైన నాటకం. అత్యాశ, అవినీతి మయమైన కుటుంబ సంబంధాల వైచిత్రిని ద్యోతకం చేస్తుంది ఈ నాటకం. మత్తు పానీయాలకు దాసులైన తండ్రిని, కొడుకుల్ని, కూతుర్నీ ఆ దుర్వ్యసనం ఎంత పతనావస్థకు తీసుకువెళ్తుందో, వారి ప్రవర్తనలో ఎంత స్వార్థం, క్రూరత్వం చోటు చేసుకొంటుందో ఆ భయంకర పరిస్థితిని కళ్ళకు కట్టినట్టు దృశ్యమానం చేస్తుంది ఈ నాటకం.

ఆధునిక మరాఠీ నాటకంలో విజయ టెండూల్కర్ రచించిన ఘాసీరాం కొత్వాల్ ఒక సంచలనాత్మక నాటకం. వివాదాస్పదమైన ఈ నాటకంలో సార్వజనీన ఇతివృత్తం ఉంది. ప్రప్రథమంగా ఈ నాటకం పూనేలో భారత్ నాట్యమందిర్‌లో 1972 డిసెంబర్ 16న ప్రదర్శించబడింది. అటు తర్వాత 1980లో పశ్చిమ బెర్లిన్‌లో ప్రదర్శితమైంది. ఐరోపాలో అనేక దేశాలలో అయిదు వారాల పాటు ఈ నాటకం విజయ విహారంచేసి రసజ్ఞుల ప్రశంసలందుకొంది. నాటక ప్రదర్శనలో సంస్కృత సంప్రదాయానుసారం సూత్రధారుని వ్యాఖ్యానం వంటి అంశాలను కూడా పొందు పరచటం జరిగింది. జానపద నాటక రంగం వలె పసందైన పాటలు, మనోజ్ఞమైన నృత్యాలు, మూకాభినయ ప్రక్రియలు ఈ ప్రదర్శనలో చోటుచేసుకున్నాయి. ప్రాచీన సంప్రదాయాలను పాటించిన ఈ నాటకంలో నేపథ్య సంగీతంగా భజనలు వినిపిస్తాయి. నాటక ప్రారంభంలో గణేష్, సరస్వతులను ఆరాధిస్తారు. మానవ హారమే దృశ్య పరికల్పన అవసరాన్ని తీరుస్తుంది. మూకాభినయంతో పాటు ఆకర్షణీయమైన మరికొన్ని ప్రక్రియలు ఈ ప్రదర్శనలో అంతర్భాగమయ్యాయి. జబ్బార్ పటేల్ ఈ నాటకానికి దర్శకత్వం వహించాడు. నానా పాత్రలో మోహన్ అగేషా, ఘాసీరామ్ పాత్రలో రమేష్ తిలేకర్ అద్భుతంగా రాణించారు. దేశ విదేశాలలో ఈ నాటకం అఖండ విజయాన్ని సాధించింది. అయితే ఈ నాటకంలో టెండూల్కర్ దూషణ భూషణ తిరస్కారాలను కూడా ఎదుర్కోవలసి వచ్చింది.

అలాగే కమల, స్త్రీ పురుష సంబంధాలలోని సంక్లిష్టతను వివరించే నాటకం. జయసింగ్ జాదవ్ అనే పాత్రికేయుడు, బీహార్లో స్త్రీల వేలంలో కమలను కొనుక్కుని ఇంటికి తీసుకువస్తాడు. స్త్రీల శరీరంతో వ్యాపారం చేసే హీనమైన ఈ వ్యవహారాన్ని బయటి ప్రపంచానికి చాటి చెప్పాలని పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తాడు. ఆలోచింపజేసే నాటకం కమల.

1960 తర్వాత మరాఠీ సాహిత్యంలోకి దళిత సాహిత్యం ప్రభంజనంలా దూసుకొచ్చింది. అట్టడుగువర్గాల దుర్భర జీవితాలను, ఆర్తిని దళిత సాహిత్యం ప్రస్ఫుటం చేసింది. అలాగే దళిత నాటకాలు కూడా. 1980 తర్వాతనే దళిత నాటకాలు ఉద్యమ స్ఫూర్తితో విజృంభించాయి. జమీందారుల దోపిడీకి, దురన్యాయానికి గురయ్యే బాధా సర్ప దష్టుల గురించి, దళిత కుటుంబ స్త్రీలను తమ స్వంత ఆస్తిగా పరిగణించే దురహంకార ప్రవృత్తి గురించి, వారి పిల్లలు తమ కొలువుకే అంకితమై, అగ్రకులాల వారి పాదాల చెంత బ్రతుకీడ్చవలసిన పరాధీన స్థితి గురించి హృదయ విదారకమైన, శక్తివంతమైన కథనాలతో నాటకాలచ్చాయి. ప్రేమానంద్ గజ్వీ, సంజయ్ పవార్, దత్తా భగత్, దిలీప్ పరదేశి, తేనాస్ గైక్వాడ్ తదితర దళిత రచయితలు, దళితుల సమస్యలను తమ నాటకాల్లో సమగ్రంగా చిత్రించారు. దళితులు రాత్రీ పగలు గొడ్డుచాకిరి చేసినా ఫలితం దక్కకపోగా, గుర్తింపుకైనా నోచుకోని వారి శ్రమని, అనంతమైన కష్టపరంపరనూ, పరిస్థితిని మరింత దిగజార్చే అంధవిశ్వాసాల చేదు అనుభవాలను ఈ నాటకాలు బహిర్గతం చేశాయి. భవిషత్తులో తమ జీవితాల్లో పెనుమార్పులు వస్తాయని, తాము బలపడి చక్రం తిప్పే మంచి రోజులు ముందున్నాయనే ఆశాభావంతో ఈ నాటకాల ముగింపు ఉండటం విశేషం.

ఈ విధంగా వైవిధ్యభరితంగా, అభ్యుదయ స్ఫోరకంగా, కాంతిమంతంగా,ఉన్నత ప్రమాణాలతో 'మరాఠీ నాటకరంగం' సర్వతోముఖంగా ముందుకు సాగుతూ తన వైశిష్ట్యాన్ని, విలక్షణతను నిరూపించుకొంటూ ఉంది.

శోభ

అను: గం.సు.రె

మలయాళ నాటకరంగం

1982 లో మలయాళ నాటకరంగం శత జయంతి చేసుకుంది. 1882లో కేరళ వర్మ రచించిన కాళిదాసు శాకుంతలానువాదం తొలి మలయాళ పరిపూర్ణ నాటకం. అదే సంవత్సరం ఆయిల్ యామ్ తిరునాళ్ ప్రభువు రాసిన శాకుంతలం వచన నాటకం కూడా ప్రచురణను పొందింది. కవిపండిత పోషకుడు, స్వయంగా కవియైన కేరళ వర్మ రాసిన శాకుంతలం రచనాపరంగాను, ప్రదర్శనల వ్యాప్తిలోను విస్తృత ప్రచారం పొందింది.

జానపద నాటక ప్రదర్శనలతో పాటుగా నృత్య రూపకాలు, గేయ రూపకాలు, కేరళీయులకు చిర పరిచితాలు. కథాకళి, మల్లల్, సాహిత్య ప్రక్రియలుగాను, సంగీత నృత్య భరితమైన కళలుగాను విశేష ప్రచారం గలవి. ఇవేగాక చాక్కియార్లు ప్రదర్శించే కూడియాట్టమ్ ఒక రంగం స్థల గేయరూపకం. ఇందులో నటి, నటుడు, విదూషకుడు ఉంటారు. దేవాలయాలలో పురాణ గాథలను ప్రదర్శించే ఆచారం కేరళలో వ్యాప్తిలో ఉంది. కాక్కారులనే తెగకు చెందిన కళాకారులు ప్రదర్శించే ప్రాచీన జానపద రూపకం కాక్కారిస్సి నాటకం బహుళ జనాదరణ పొందినది. జానపద నాటకాలను ప్రోత్సహించేందుకు నెలకొన్న తనటునాటకవేది అనే ఉద్యమం నాటకాన్ని సజీవంగా నిలిపిందని చెప్పవలసి ఉంది. వివిధ పౌరాణిక గాథలు నాటకాలుగా ఆనాడు ప్రజల మన్ననలు పొందాయి. చవిట్టునాటకమ్ అనే క్రైస్తవ గాథా నృత్యనాటిక ఒకటి కొంతకాలం ప్రజలను ఆకర్షించింది.

కేరళ వర్మ సంప్రదాయబద్ధంగా, పరిపూర్ణ నాటకంగా కాళిదాస శాకుంతలాన్ని అనువదించడంతో చాలా మంది విద్వత్కవులు సంస్కృత నాటకాలకు అనువాదాలను ప్రకటించారు. వారిలో ఎ.ఆర్.రాజరాజ వర్మ (1863-1918), కొడుంగట్లూర్ కునుకుట్టన్ తంపురాన్ (1864-1913), ఎన్.కుమరన్ ఆశాన్ (1873-1924), వల్లత్తోళ్ నారాయణ మీనన్ (1878-1958)పందలం కేరళవర్మ (1879-1919), ముఖ్యులు.

ఇదే సమయంలో షేక్స్పియర్ నాటకాలను కూడా చాలామంది అనువదించారు. కందత్తిల్ వరుగీస్ మాపిళ్లై (1858-1904), ఎ. గోవిందపిళ్లై (జ.1924) కె.ఎమ్. ఫణిక్కర్ (1894-1963), ఎస్.కె.నాయర్, సి.కె. థామస్ నాటకాలను అనువదించిన వారిలో ముఖ్యులు. ఇంకా ఇతర భారతీయ, పాశ్చాత్య నాటకాలకు అనువాదాలు కూడా అనేకం వెలిశాయి. ఒక్క శాకుంతలానికే 30, భాసుని నాటకాలకు 34 అనువాదాలు మలయాళంలో లభిస్తున్నాయి.

అనువాదాల యుగంలోనే స్వతంత్ర నాటకాలు కూడా జన్మించాయి. మలయాళంలోని తొలి స్వతంత్ర నాటకం కొడుంగల్లూర్ కుంచున్ని తంపురాన్ రాసిన కల్యాణీనాటకమ్. సంస్కృతానువాదాలను అయా నాటకాల పేర్లను పరిహసిస్తూ ముస్సీరామకురుప్ (1848-98), వ్యంగ్య హాస్య భరితంగా 1894లో చక్కి చంకరమ్ (చక్కి, శంకరులనేవి పనివాళ్ల పేర్లు) నాటకాన్ని రాశాడు. మాలతీమాధవం వంటి నాయికా నాయకుల పేర్లతో గల నాటకాలను, వాటి శీర్షికలను అటువంటి శీర్షికతోనే పరిహసిస్తూ కురుప్ ఈ నాటకాన్ని నిర్వహించాడు. ఇదే విధంగా అనువాదాలను ఎగతాళి చేస్తూ ఇదే శీర్షిక గల మరొక నాటకాన్ని మలి సంవత్సరం కె.సి.నారాయణ నంబియార్ హాస్యభరితంగా రాశాడు.

తమిళ నాటకాల ప్రభావం మలయాళ నాటకరంగంపై ప్రసరించి సంగీత నాటకాలు వ్యాప్తిలోకి వచ్చాయి. మలయాళ సంగీత నాటకాలలో టి.సి. అచ్యుతమీనన్ రాసిన సంగీత నైషధం (1892) మొట్టమొదటి నాటకం. దీనిని అనుసరించిన ఇతర నాటకాలలో ముఖ్యమైనవి ఇరువయిల్ చక్రపాణి వారియర్ హరిశ్చంద్ర చరితమ్ (1898), కె.సి. కేశవపిళ్లై (1868-1913) సదారమ (1903), కొచ్చిప్పన్ తరకన్ (1861-1940) మరియమ్మ నాటకం (1926లో 3వ ప్రచురణ) ముఖ్యమైనవి. మరియమ్మ నాటకం అత్తాకోడళ్ల కలహాలు, వరకట్న దురాచారాన్ని వివరించే నాటకం. అదే విధంగా నాయర్ కుటుంబాలలోని దురాచారాలను ఎత్తిచూపే కె.సి. కేశవ పిళ్లై నాటకం లక్ష్మీ కల్యాణం (1908) సంస్కృత వచన నాటకం వలె సాగే నాటకం. ఈయనదే మరొక నాటకం రాఘవ మాధవన్ (1893), కె.ఎన్.కుమరన్ ఆశాన్ రాసిన కరుణ (1924) సంగీత రూపకాలలో పేర్కొనదగిన రచనలు. అయితే వచననాటకాల కారణంగా సంగీత నాటకాల ప్రాభవం కొద్ది దశాబ్దాలే మనగలిగింది.

20వ శతాబ్దిలో దేశీయ భాషలపై పాశ్చాత్య భాష ప్రభావం చూపసాగిన సమయంలో వచననాటకాలు, పాశ్చాత్య

'హనుమాన్' నాటకంలో ఒక దృశ్య

నాటకానువాదాలు వ్యాప్తిలోనికి వచ్చాయి. తొలి దశ వచన నాటకాలలో అధికభాగం చారిత్రక నవలలు నాటకాలుగా రూపాంతరం చెందినవే. డి. చందుమీనన్ (1847-1900) సాంఘిక నవలలు వచన నాటకాలుగా పరివర్తనం చెందాయి. సి.వి.రామన్ పిళ్లై (1858-1922) చారిత్రక నాటకాలు రాశాడు.

చారిత్రక నవలా రచయితగా విఖ్యాతుడైన సి.వి.రామన్ పిళ్లై అనేక ప్రహసనాలను రాసి ప్రచురించాడు. వీనిలో కురుప్పిళ్లాక్కలరి (ఉపాధ్యాయుడు లేని బడి, 1909), పండిట్టైపచ్చాన్ (1935) మొదలైనవి బహుళ ఖ్యాతి పొందాయి.

సి.వి.రామన్ పిళ్లై అల్లుడు ఇ.వి. కృష్ణన్ పిళ్లై (1894-1938) న్యాయవాది, రాజకీయ నాయకుడు, రచయిత. కృష్ణన్ పిళ్లై,ఆంగ్లోపాధ్యాయుడైన ఎమ్.ఆర్. నాయర్ ఆనాడు ప్రఖ్యాత హాస్య రచయితగా పేరు తెచ్చుకున్నారు. ఇ.వి. రాసిన అసంఖ్యాకమైన ప్రహసనాలలో ప్రణయక్క మీషన్ (1932), బి.ఎ.మాయాని (1934), వివాహక్కమ్మాట్టమ్ (1935), ముఖ్యమైనవి. 1938లో తిరువానక్కూరు రాజకీయపోరాట సమయంలో ఇ.వి.అకాల మృత్యువుకు గురికావటంతో మలయాళ నాటక రంగం ఒక సమర్థుడైన నాటకరచయితను కోల్పోయింది. అయితే ఈ వ్యంగ్య నాటక రచన ఆగిపోలేదు. ఎన్.సి. చెల్లప్పన్ నాయర్ (1903-72), ఇ.వి.కి వారసుడై వ్యంగ్య ప్రహసన రచనలను కొనసాగించాడు. ఈయన రచించిన నాటకాలలో అతిశయోక్తి పాలు మెండు. వికటయోగి ఈయన రచించిన (1939), లెఫ్టినెంట్ నాని (1945), ఎన్.జి.వో (1967) చెల్లప్పన్ ప్రహసనాలు విస్తృత ప్రదర్శనల ద్వారా విశేషఖ్యాతి పొందాయి. క్రమంగా ప్రహసనాలలో కేవలం వ్యంగ్యమే ప్రధానం కాకుండా సమస్యలపట్ల ఆలోచన, స్పృహచోటు చేసుకోసాగాయి. ఈరకమైన స్పృహ ఇ.వి. ప్రహసనాలలో కూడా కన్పిస్తుంది.

ప్రహసన రచయితలలో టి. ఎస్. గోపీనాథన్ నాయర్ (జ.1918),ఆనందక్కుట్టన్ (జ.1920), ఎమ్.డి. కేశవ పిళ్లై, కెంజి సేతునాథ్, (జ.1924), కె.ఎస్. కృష్ణన్ (జ.1925), ప్రముఖంగా పేర్కొనదగినవారు.

హాస్య నాటకాలలో అంతర్లీనంగా కొంత ఆలోచనను, విషాదాన్ని, గాంభీర్యాన్ని రచయితలు ప్రదర్శించారు. ఎమ్.జి.కేశవన్ పిళ్లై, కైనిక్కార కుమార పిళ్లై (జ. 1900) ఈ రకమైన హాస్య నాటకాలు రాశారు. కుమార పిళ్లై నాటకాలలో

వేషణ్ణాత్ (1946), మాతృకామనుష్యన్ (ఆదర్శ మానవుడు - 1962) ముఖ్యంగా పేర్కొనదగినవి.

20వ శతాబ్ది పూర్వార్థంలో సాంఘిక, రాజకీయ పోరాటాలు సాహిత్యం మీద కూడా తమ ప్రభావాన్ని చూపించాయి. నాటక రచనలలోను సాంఘిక, రాజకీయ సమస్యలు, పరిణామాలు, ఆదర్శాలు, ముఖ్య వస్తువులైనాయి. వీనితో పాటు పౌరాణిక పాత్రల ఔన్నత్యం, చారిత్రక వీరుల త్యాగ, శౌర్యాలు నాటక వస్తువులైనాయి. చారిత్రక నాటక రచయితగా ఇ.వి.పిళ్లై మామగారు సి.వి.రామన్ పిళ్లై సుప్రసిద్ధుడు. ఇ.వి. కూడా సీతాలక్ష్మి (1930) అనే చారిత్రక నాటకాన్ని తిరువాన్కూరుకు చెందిన నాయర్ సంపన్న కుటుంబాలకు చెందిన వృత్తాంతం ఆధారంగా రచించాడు. తిరువాన్కూరు జానపద గాథను గ్రహించి ఇరవిక్కుట్టిప్పిళ్లై అనే నాటకాన్ని కూడా రచించాడు. ఇతర చారిత్రక నాటక రచయితలలో కప్పనకృష్ణ మీనన్ (1896-1981), కైనిక్కార పద్మనాభ పిళ్లై (1898-1976), బ్రహ్మవ్రతన్ (1908-81), వి.నీలకంఠపిళ్లై ఎస్.కె.నాయర్ (జ.1917), తిక్కోటియన్ పి. కున్ననాథన్ నాయర్ (జ.1924) ముఖ్యులు.

పౌరాణిక నాటకాలలో ముర్కోత్తు కుమరన్ (1871-1904) రాసిన కూనియాతెకుస్పృతి, (గూనివాని దుండగాలు, 1920), వి.కృష్ణతంపి రచన ధ్రువచరితమ్ (1936), కైనిక్కారకుమారపిళ్లై మోహవుమ్ ముక్తియుమ్ (1938), కె.ఎమ్. ఫణిక్కర్ నాటకం మండోదరి (1941), కైనిక్కార పద్మనాభ పిళ్లై క్రీస్తు చరిత్ర ఆధారంగా రాసిన కల్వరీమెయిల్ కల్పపాదమ్ (1932) ముఖ్యమైనవి.

సాంఘిక సమస్యలను, స్త్రీల సమస్యలను చిత్రిస్తూ, సంఘంలో వేళ్ళూనిన దురన్యాయాలను ఖండిస్తూ అనేక నాటకాలు వెలువడ్డాయి. బహుభార్యాత్వాన్ని నిరసిస్తూ, నంబూద్రి వర్గం వారి స్త్రీల దైన్యాన్ని ప్రతిఘటిస్తూ, రచయితలు చాలామంది నాటకాలను రాశారు. వి.టి. భట్టతిరిపాద్ (1896) బహుభార్యాత్వాన్ని విమర్శిస్తూ రాసిన అటుక్కళయిల్ నిన్ను అరన్నట్టెక్కు (వంటింటి నుంచి వేదిక దాకా- 1930) చాలామంది ప్రేక్షకులను, రచయితలను ఉత్తేజితులను చేసింది. స్త్రీల సమస్యలను చిత్రించిన నాటకాలలో ఎమ్. పి. భట్టతిరిపాడ్ రాసిన ఋతుమతి,అతని సోదరుడు ఎమ్. ఆర్. భట్టతి రిపాద్ రాసిన మరక్కుటియులె మహానరకమ్ (గొడుగు కింద మహానరకం - 1931), సి.ఎన్ శ్రీకాంతన్‌నాయర్ (1928-77) రాసిన నష్టక్కచ్చవటమ్(1957) ప్రముఖమైనవి. ముస్లిం సమాజాన్ని చిత్రిస్తూ కె.టి మహమ్మద్ రాసిన భూమియాణు (ఇదే భూమి - 1955), ఉమ్మడి వ్యవసాయ పద్ధతులను వివరిస్తూ ఇడస్సేరి గోవిందన్ నాయర్ (1906-74) రాసిన కూట్టుకృషి (1950) ప్రత్యేకంగా పేర్కొనదగిన నాటకాలు. జాత్యభిమానంతో కొన్ని పనులు చేయడానికి అభిమానపడే మధ్య తరగతి జనుల మిథ్యా గౌరవాలను ఎత్తి చూపుతూ ఓంచేరిని నారాయణ పిళ్లై నమ్ముటెనాటూను అనే నాటకం రాసి ప్రసిద్ధి పొందాడు.

దేశ వ్యాప్తంగా చెలరేగుతున్న స్వాతంత్ర్యోద్యమం, కేరళలో వ్యాప్తి పొందుతున్న కమ్యూనిస్టు ఉద్యమం నాటకరంగం మీద విశేషమైన ప్రభావాన్ని చూపించాయి.

మేధావి కె.దామోదరన్ (1912-1976) పాట్టబాకి (అద్దె బకాయి 1938) కమ్యూనిస్టు భావాలతో కూడిన మొదటి రాజకీయ నాటకం. కమ్యూనిస్టు సిద్ధాంతాలతో రాజకీయ నాటకాలను రాసిన రచయితలు ప్రముఖంగా పొన్‌కున్నమ్‌వర్కి (1908), తొప్పిల్‌భాసి (1914). వర్కి పాఠశాల ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి, సాహిత్య అకాడమీ ఛైర్మన్ స్థాయిని అందుకున్న మేధావి. జేతాక్కళ్ (విజేతలు1946), వళిత్తురణ్ణు (దారితెరిచారు - 1956), విశరిక్కు కాట్టు వేణ్టా (విసనకర్రకు గాలి అక్కర ఉండదు-1958) వర్కి సుప్రసిద్ధ నాటకాలలో కొన్ని. కమ్యూనిస్టు సిద్ధాంతాలను బోధించే వర్కి నాటకాలు హింసను, రక్తపాతాన్ని ప్రోత్సహించకపోవటం, సామరస్యంతో ముగియటం ప్రత్యేకంగా గమనించదగిన అంశం. భాసి నాటకాలలో మూలధనం (1958), సర్వేక్కల్లు (సర్వేరాయి-1958), నిన్నళ్ ఎన్నె కమ్యూనిస్ట్‌స్టాక్కి (నువ్వు నన్ను కమ్యూనిస్ట్‌ను చేశావ్ - 1952) ముఖ్యమైనవి. భాసి నాటకాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలో విస్తృతమైన ఖ్యాతిని పొందాయి. ఇతర రాజకీయ నాటకాలు, వామపక్ష సిద్ధాంతపరమైన నాటకాలలో చెరుక్కాడ్ (చెరుక్కాడ్.సి.గోవింద పిశారతి 1914-78) రాసిన అసంఖ్యాకమైన నాటకాలు ప్రసిద్ధిపొందాయి. పి.కె. ఆంథోని రాసిన పోతుశత్రుక్కళ్(ఉమ్మడి శత్రువులు 1961), పులిమన పరమేశ్వర పిళ్లై రాసిన (1893-1949) సమత్వవాది (1961), నవలాకర్త, సాహిత్య అకాడమీ ఛైర్మన్ పి.కేశవదేవ్ (1904-83) మొదట రాసిన కమ్యూనిస్టు సిద్ధాంతపరమైన నాటకాలు, ఆ తరువాత రాసిన నాన్ ఇప్పోళ్ కమ్యూనిష్టక్కమ్ (నేను కమ్యూనిస్ట్ నౌతాను సుమా- 1953) వైక్కమ్ చంద్రశేఖరన్ నాయర్ (1920 -) నాటకాలు, ఎస్.ఎల్. పురమ్ సదానందన్ (1927 -) నాటకాలు బహుళంగా ప్రేక్షకుల ఆదరాన్ని పొందాయి.

ఇబ్సన్ వాస్తవికతతో ప్రభావితుడైన ఎన్. కృష్ణపిళ్లై (జ. 1916) మలయాళ భాషాచార్యుడు. ఇతని భగ్నభవనమ్ (1942) నాటకంతో మలయాళ నాటకం కొత్త మలుపు తిరిగింది.

చారిత్రక నాటకాలు, సాంఘిక నాటకాలలో వస్తు గాంభీర్యం ఉన్నప్పటికీ కృష్ణపిళ్లై నాటకావిర్భావంతో సాంఘిక నాటకాలలో కేవలం సాంఘిక సమస్యలేకాక, వ్యక్తిగతమైన సమస్యలు, అంతస్సంఘర్షణలు, తక్కువ పాత్రలతో నాటకరచన మొదలైన అంశాలతో, జీవితాలలోని విషాద గంభీరమైన మరొక కోణాన్ని దర్శించడం ప్రారంభమైంది. ఈ నాటకం అత్యంత సంచలనాన్ని కలిగించింది. కన్యక, బలాబలమ్ (1946), అనురంజనమ్ (1950), మరుపచ్చ (1972), మొదలైన ఇతర నాటకాలలో కృష్ణ పిళ్లై అంతర్లీనమైన వ్యక్తిత్వాన్ని, పాత్రల అంతరంగ సంఘర్షణను అత్యంత వాస్తవికతతో చిత్రించాడు. ఇతని నాటకాలను రెండు విభాగాలు చేశారు. మొదటి విభాగానికి చెందిన నాటకాలలో సంఘర్షణ వియోగానికి దారితీసేవి. ఉదా. భగ్నభవనం, కన్యక, బలాబలమ్, రెండవ కోవకు చెందిన నాటకాలు రాజీ మార్గం అన్వేషించడంతో సంఘర్షణను తొలిగించేవి. ఉదా. అనురంజనమ్, మరుపచ్చ, దర్శనమ్ (1949).

కృష్ణ పిళ్లై అనంతరం నాటకరంగం మరొక మలుపు తిరిగింది. పాశ్చాత్య నాటకాల ప్రభావం మలయాళ నాటక రంగంపై విస్తరించింది. నేరం, శిక్ష, అపరాధభావం మొదలైన మానసిక స్థితిగతులపై ఆధారపడిన నాటకాలను ప్రఖ్యాత నాటక రచయిత సి.జె. థామస్ (*1918-60*) ప్రతిభావంతంగా రచించాడు. అవన్‌వీంటుం వరుణ్ణు (అతను మళ్లీ వస్తాడు , 1940), ఆ మనుష్యన్ నీతన్నె (ఆ మనిషివి నీవె,1955), 1128 ఇుయిల్ క్రైమ్ 27 (1128లో 27వ నేరం) థామస్ రాసిన సుప్రసిద్ధ నాటకాలలో ఎన్నదగినవి.

మలయాళ నాటక వికాసానికి దోహదం చేసిన నాటకాలలో ఉరుబ్ రాసిన టీకొంటు కళిక్కరుతు (నిప్పుతో ఆడుకోవద్దు, 1955), టిక్కోటియాన్ రచన ప్రసవక్కాట్ట అమ్మ (1955), టి. మహమ్మద్ యూసఫ్ నాటకం కంటంబెచ కొట్టె (అవసరుల కోటు - 1956), పి.ఎ.వారియర్ రాసిన చవిట్టిక్కుళచ్చు మణ్ణు , చెరుక్కడ్ రాసిన తరవాట్టిట్టమ్ (కులీనత - 1955) ముఖ్యంగా ఎన్నదగినవి.

నాటక ప్రదర్శనలో కొత్త సాంకేతిక విలువలను, నాటక రచనలో నవ్యత్వాన్ని నెలకొల్పి, నాటక సమాజాధి నేతగా ప్రసిద్ధుడైన వ్యక్తి ఎన్.ఎస్.పిళ్లై (1918) ప్రత్యేకంగా నాటక ప్రదర్శనలకు దోహదం చేసినవాడుగా గుర్తింపు పొందాడు. హారాల్డ్ పింటర్, జార్జ్ బెర్నార్డ్‌షా ప్రభావం ఇతనిపై కన్పిస్తుంది. వైన్‌గ్లాస్ (1967), మరణ నృత్తం (1967) మొదలైనవి ఈయన రచించిన నాటకాలలో ప్రసిద్ధి పొందినవి.

పౌరాణిక నాటక రచయితలలో సి.ఎస్. శ్రీకాంతన్ నాయర్ ప్రముఖుడు. రామాయణం ఆధారంగా ఈయన రాసిన కాంచనసీత(*1961*) లంకాలక్ష్మి, సాకేతం పేర్కొనదగిన నాటకాలు.

జి.శంకర పిళ్లై ధర్మక్షేత్ర -కురుక్షేత్ర (1968) అనే సెక్యూలర్ నాటకాన్ని, బందీ (1967), భరత వాక్యం (1972) అనే నాటకాలను రాశాడు.

ఒమ్‌ఛెర్రి నారాయణ పిళ్లై వెళిచ్చమ్ నిన్నళ్‌కుళ్ల తాణు (ఈ వెలుగు నీకోసం -1963), ఇటునమ్ముటె నాటణు (ఇది మన దేశం - 1959) తేవరుటె ఆణ (దేవతల ఏనుగు - 1978) ప్రేక్షకుల మనోల్లాసం కోసం హాస్య భరితంగా రాశాడు. నారాయణ పిళ్లై ప్రళయం (1979) ప్రతీకాత్మక నాటకం. కె.టి మహమ్మద్ సృష్టి (1972) జీవితంలోని అద్భుతాలను, విషాదాలను, కరుణ రసాత్మకంగా చిత్రించిన నాటకం. ఈయన రాసిన ఇటు భూమియాణు హాస్యరస భరిత నాటకం.

కావలమ్ నారాయణ ఫణిక్కర్, సి.ఎల్.జోస్, ఎస్.ఎల్.పురమ్ సదానందన్, పి.ఆర్.చంద్రన్, కుట్టనడ్ రామ కృష్ణ పిళ్లై (1919) జగతి ఎన్.కె. ఆచారి. కె.సురేంద్రన్ విభిన్న దృక్పథాలతో వారి వారి ప్రత్యేకతలు ప్రదర్శిస్తూ నాటకాలు రచించిన ప్రముఖులలో కొందరు.

మలయాళ సాహిత్యంలో ఏకాంకిక పేర్కొనదగినంత గుర్తింపును పొందలేక పోయింది. ఒమ్‌ఛెర్రి, కైనిక్కార కుమారపిళ్లై, చెరుక్కడ్, తిక్కోటియన్ రాసిన ఏకాంకికలు కొన్ని సంపుటాలుగా వెలువడ్డాయి.

కేరళలో రేడియో ద్వారా అనేక నాటకాలు వ్యాప్తిలోకి వచ్చాయి. అయితే వాటిలో సాహిత్య విలువలు గలవి కొన్ని మాత్రమే పేర్కొనవలసినవి. రేడియో నాటకాలలో ప్రచురణ పొందినవానిలో వి.మాధవనాయర్ (1915), తిరన్నేటట్టు రేడియోనాటక్కన్నళ్(1917), రేడియో నాటకన్నళ్(1947), భరతన్ (1955), కె.ఎమ్. జార్జి ఒంపటు రేడియో నాటకన్నళ్ (1957), ఎస్.కె.నాయర్ *తరంగ రంగమ్* కుట్టుండు, రామ కృష్ణ పిళ్లై రావణన్ (1959), ఆనంద కుక్కుట్టన్ ఆశరీతి (1967), ఎన్.కృష్ణవారియర్ అనతి (1967), ముఖ్యమైన కొన్ని నాటకాలు.

కేరళవర్మ శాకుంతలంతో వంద సంవత్సరాల క్రితం జన్మించిన నాటకం, కేరళ దేశంలో అనేక సంస్థలు, నాటక సమితులు, రేడియో ద్వారా ప్రజాదరణను పొందుతూ ఉన్నది. సంగీత రూపకాల ద్వారా చాలామంది గాయకులు ప్రసిద్ధి పొందారు. అనేక అమెచ్యూర్ సంస్థలు, కళాశాలలు, పాఠశాలలు నాటక ప్రదర్శనలను నిర్వహిస్తున్నాయి. అయినా కేరళరంగ స్థలం ఇంకా వృద్ధి పొందవలసి ఉన్నదని పరిశీలకులు భావిస్తున్నారు.

జె.వి. శాస్త్రి

హిందీ నాటక రంగం

హిందీ నాటక రంగానికి విశేషమైన చరిత్ర, వైవిధ్యమైన సంస్కృతీ వైభవం ఉన్నాయి. క్రీ.శ.1400-1800 సంవత్సరాల మధ్య, వైష్ణవ సంప్రదాయాల ఆధారంగా అనేక నాటకాలు ఆనాటి రాజమందిరాల్లో ప్రదర్శించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. మిథిల, నేపాల్, బుందేల్‌ఖండ్, అస్సాం, రాజ వంశాలు నాటక ప్రదర్శనలను ఆదరించాడు. ఆనాడు, సుమారు 30 మంది రచయితలు రాసిన 106 నాటకాల ప్రదర్శనకు నోచుకున్నాయి. విద్యాపతి, చండీదాస్ రాసిన భక్తి గీతాలు కాక, ఆనాడు వ్యాప్తిలో ఉన్న జానపద గీతాలు, ఈ నాటకాలలో విరివిగా వాడుకుని, హిందీ నాటకాలకు ప్రాచుర్యం కల్పించడమేగాక సంస్కృతీ వైభవం చిరస్మరణీయంగా ఉండేలా నాటక రచయితలు కృషి చేశారు.

గయ సుకుమార్ రాస్ తొలి హిందీ నాటకమనీ ఈ నాటకంలో రాసలీలాతత్వాన్ని ప్రతిపాదించడం జరిగిందనీ, రాజస్థానీ మాండలికంలో ఈ నాటకం రాయడం జరిగిందనీ దశరథ అభిప్రాయం. ప్రప్రథమ హిందీ నాటక కర్తలు దాదాపు అందరూ వైష్ణవ భక్తి రాసలీలాతత్వానికి ఆకర్షితులైన వారే. ఆ ఆకర్షణలో నందదాస్ గోవర్ధనలీల ధ్రువదాసు రాసిన కృష్ణదాసు, హృదయ్‌రాయ్ రాసిన హనుమన్నాటకమ్, బనారశీదాస్ రాసిన సమయ్ సార్ నాటకం, రఘు రాం నగరీ రాసిన సభయ్‌సార్ నాటకాలు పేర్కొనదగినవి. ఇంకా అనేకులు రాసలీల నాటకాలు రాశారు.

ఆధునిక హిందీ సాహిత్యానికి మూల పురుషుడు హరిశ్చంద్ర. ఈయనను భారతేంద్ అని ఆప్యాయంగా సాహిత్యాభిమానులు పిలుస్తారు. క్రీ.శ. 1846లో బనారస్ భారతేందు (వారణాశి) లో జన్మించిన హరిశ్చంద్ర ప్రాంతీయ భోజ్‌పూర్ మాండలికంలో నిష్ణాతుడు. అయితే ఆయనపైన పశ్చిమ హిందీ భాషా ప్రభావం ఎక్కువగా ఉంది.

1867 నుంచీ హరిశ్చంద్ర అనేక నాటకాలు, పద్యకావ్యాలు, వచనగ్రంథాలు, అనువాదాలు రాసి, హిందీ సాహిత్యాన్ని మలుపు తిప్పాడు జన జీవన చైతన్యానికి, జాగృతికి , సాంఘిక, సాంస్కృతిక విప్లవానికి భారతేందు మూల పురుషుడు. ఆయన తండ్రి నహుష్ నాటకం రాశాడు. అది తొలి ఆధునిక హిందీ నాటకమని భారతేందు అభిప్రాయం.

విద్యాసుందర్ (బెంగాలీ నుంచి) పాండవ విభండనం, వైదేహీ హింస, ధనుంజయ విజయ్, సత్యహరిశ్చంద్ర, *ప్రేమయోగిని, భారతీదుర్దశ, చంద్రావతీ* మొదలైన నాటకాలు రాశాడు. భారతేందు తన నాటకాలలో మత మౌఢ్యం, సాంఘిక దురాచారాలను తీవ్రంగా ఖండించి, ప్రజలలో దేశభక్తి, మానవతా దృక్పథాన్ని ప్రబోధించాడు. అంతేగాక, ఆనాడు వ్యాప్తిలో ఉన్న గేయాలు, భక్తి వేదాంత గీతాలను నాటకంలో ప్రవేశపెట్టి నాటకం ప్రజాబాహుళ్యం లోకి వినోద సాధనంగానే కాక, విజ్ఞాన వాహికగా ప్రవేశ పెట్టాడు. భారతేందు తన నాటక రచనలో, సంస్కృత నాటక లక్షణాలను పాటించినా, వైష్ణవ సంప్రదాయ నాటక ఛాయలను అనుసరించినా తనదైనబాణీ మాత్రం వీడలేదు. హిందీ నాటక సాహిత్యానికి తానొక సంప్రదాయాన్ని ఏర్పరచి, ఆధునిక హిందీ నాటకానికి కొత్తరూపు, ఊపు, జీవం, చైతన్యం తీసుకొచ్చాడు. సాహిత్యానికి, ముఖ్యంగా నాటక రచనకు, ప్రదర్శనకు, సాంఘిక ప్రయోజనం ఉండాలని, నిర్దేశించినందువల్ల భారతేందు ఆధునిక హిందీ సాహిత్యానికి ఆద్యుడు, వైతాళికుడు అని కీర్తింప బడ్డాడు.

భారతేందు కేవలం నాటక రచయితే కాదు. నాటక ప్రయోక్త కూడ. నాటక సమాజాన్ని ఏర్పాటు చేసి హిందీ నాటక ప్రాచుర్యానికి కృషి చేయడమేగాక, ఎందరో నటులకు, రచయితలకు స్ఫూర్తి నిచ్చాడు, తన 18 సంవత్సరాల సాహితీ జీవితంలో.

సీతాహరణ్ రాసిన దేవకీనందన్, త్రిపాఠీ, కృష్ణ సుధామ నాటక కర్త, *శివనందదాన్ సాహి*, *రుక్మిణీ పరిణయ్* కర్త *అయోధ్యాసింగ్ ఉపాధ్యాయ*, సుధామ, *అమర్‌సింగ్ రాథోడ్* రచయిత-రాధా చరణ్ గోస్వామి- ఇలా ఎందరో నాటక రచయితలు, భారతేంద్ బాటలో నాటకాలు రాశాడు.

భారతేందు మరణం తర్వాత చాలామంది, నాటక రచయితలు, గేయ సాహిత్యం, కొత్తగా ప్రాచుర్యంలోకి వచ్చిన కథ, నవల వైపు దృష్టిసారించడం జరిగింది.

భారతేందు జీవితకాలంలో ఆ తర్వాత, హిందీ నాటక రంగంలో పార్శీ నాటకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. రంగు రంగుల దుస్తులు, పాటలు, నృత్యాలు, ఈ పార్శీ నాటక సంస్థలు జనాకర్షణ కోసం ఉపయోగించేవి. ఇవన్నీ ఓ రకంగా,అమానత్ రాసిన ఇంద్రసభకు ప్రత్యామ్నాయంగా ఉండేవి. ఈ ఇంద్రసభ నాటకంలో ఉర్దూ ప్రేమైకతత్వం, ప్రకృతి వర్ణనలు అధికంగా ఉండేవి. అప్పుడే ప్రాచుర్యంలోకి వస్తున్న ఆంగ్లభాష, పశ్చిమ నాటక ధోరణులు పార్శీ నాటకాన్ని ప్రభావితం చేశాయి.

ఈ పార్శీ నాటక సంస్థల దారిలోనే న్యూ ఆల్‌ఫ్రెడ్ కంపెనీ, ఓల్డ్‌పార్శీ థియెట్రికల్‌కంపెనీ, అలెగ్జాండ్రియా కంపెనీ, ఇలా కొన్ని నాటక సంస్థలు కలకత్తా, బంబాయి, ఉత్తర భారతదేశంలోని ప్రముఖ నగరాల్లో ఆవిర్భవించాయి. భారతేందు, అతని అనుయాయులు పార్శీ నాటకసంస్థల నుంచి పోటీ తట్టుకుని ఔత్సాహిక నాటక సమాజాలు స్థాపించి, హిందీ నాటకం ప్రజల జీవనస్థితిగతులను ప్రబింబించే విధంగా కృషి చేశారు.

1888లో తొలి ఔత్సాహిక నాటక సమాజం, కాన్పూర్‌లో ప్రారంభమైంది. అలహాబాద్‌లో 1898లో శ్రీరాం లీలా నాటకమండలి, 1908లో హిందీ నాట్య సమితి, పండిట్ మహదేవశుక్లా ప్రారంభించాడు. 1909లో బనారస్‌లో *భారతేందు నాటక మండలి, కాశీ నాగరిక్ నాటక మండలి* ప్రారంభించబడ్డాయి. అంతేకాక కలకత్తాలో హిందీ నాట్య పరిషత్ పండిట్‌మహాదేవ్ శుక్లా ప్రారంభించి, పార్శీ థియేటర్ ప్రదర్శించే జనాకర్షక నాటకాల నుంచి, ప్రేక్షకులను అసలైన హిందీ నాటక ప్రదర్శనల వైపు ఆకర్షింపజేశాడు.

1900–1925 దాకా హిందీ నాటకరంగంలో రెండు విభిన్న నాటక ప్రదర్శనలు వ్యాప్తిలో ఉండేవి. ఔత్సాహిక నాటక సమాజాల కోసం నాటకాలు రాసిన వారిలో బద్రీనాథ్ దత్, ఆనంద్ ప్రసాద్ ఖత్రి, జమునా ప్రసాద్ మెహ్రా, దుర్గా ప్రసాద్ గుప్తా, హరిదాస్ మానిక్, పండిట్ మఖన్‌లాల్ చతుర్వేది ప్రముఖులు. బద్రీనాథ్ భత్ రాసిన కురువన దహన్ పండిత్ మఖన్ లాల్ రాసిన కృష్ణార్జున యుద్ధ్ ఈ కాలంలో వచ్చిన గొప్ప నాటకాలు.

ద్వివేదీ యుగం : భారతేందు తర్వాత హిందీ నాటకరంగంలో కొంత స్తబ్ధత ఏర్పడింది. సంస్కరణ, నీతిబోధ ప్రధానంగా హిందీ నాటకాలచ్చాయి. పాత్రల్లో పరిపక్వత లోపించి నాటకాల్లో సంఘర్షణ, నాటకీయ ఉత్సుకత లేక, పాత్రలు సాత్వికంగా ఉండి జనాదరణ నోచుకోలేదు. జగన్నాథ్ ప్రసాద్ ద్వివేది రాసిన తులసీదాస్, నియోగిహరి రాసిన ప్రబుద్ధ యోజన, మిశ్రబంధు రాసిన శివాజీ నాటకాలు ఈ కోవలోకి వస్తాయి.

ద్విజేంద్రలాల్ రాయ్ రాసిన బెంగాలీ నాటకాలను రూప్ నారాయణ్‌పాండే హిందీలోకి అనువదించాడు. ఇదే కాలంలో అనేక ఆంగ్ల నాటకాలను గంగా ప్రసాద్ పాండే, పురోహిత్ గోపీనాథ్, మధురా ప్రసాద్, ఉపాధ్యాయ మొదలైనవారు హిందీలోకి అనువదించారు. ఇదే కాలంలో హిందీ నాటకం విద్యాలయాల్లో ప్రవేశించి, హైస్కూల్, కాలేజీ, విశ్వవిద్యాలయాల్లో ప్రాచుర్యం పొందింది. ఔత్సాహిక నాటక సమాజాల ప్రదర్శనల్లో ప్రయోగానికి ప్రాధాన్యత పెరిగింది.

'జస్మా ఓడన్' నాటకంలో ఒక దృశ్యం

జయశంకర్ ప్రసాద్ యుగం : హిందీ నాటక సాహిత్యం శైశవదశ, బాలారిష్టాలు తట్టుకుని, ప్రౌఢత్వం సంతరించుకునేందుకు జయశంకర్ ప్రసాద్ కృషిచేశాడు. భారతేందు రచనల్లో గల దేశభక్తి, మానవతా విలువలు స్వీకరించి, అప్పటిదాకా నాటక రచయితలు వాడుతున్న సంప్రదాయాన్ని వదిలేసి, తనదైన బాణీలో నాటకాలు రాశాడు. సంఘటనలు, దానికి తగ్గ సంభాషణలు రచించడంలో ఆయన దిట్ట. ప్రాచుర్యంలో వున్న సామెతలు, పలుకుబళ్ళు, వాడిగా వేడిగా ఉండేలా జాగ్రత్త పడ్డాడు. హిందీ గేయ సాహిత్యంలో గల మార్మిక ఛాయావాదాలను హిందీ నాటకాల్లో ప్రవేశపెట్టి, ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని అందించాడు. పాత్రల అంతర్గత బహిర్గత సంఘర్షణలను మనోజ్ఞంగా రచించాడు.

జయశంకర్ ప్రసాద్ నాటకాలకు మూలకథలను, భారత, రామాయణ గాథల నుంచి గాక చరిత్ర నుంచి గ్రహించాడు. సాహిత్య విలువలు సజీవ పాత్రలు గల నాటకానికి, ఆధునిక రంగస్థలం పరికరాలు, అలంకరణలు అక్కర్లేదనీ, సజీవ నాటకం ప్రేక్షకులను హంగులు, ఆర్భాటాలు లేకపోయినా ఆకర్షిస్తుందని నిరూపించాడు తన నాటకాల ద్వారా. ఆనాడు ప్రాచుర్యంలో ఉన్న జనాకర్షక పార్శీ నాటకానికి దీటుగా నాటకాలు, ప్రదర్శనలు ఇచ్చి హిందీ నాటకం, సాహిత్యాలకు ప్రౌఢత, ఆధునికత కల్పించాడు జయశంకర్ ప్రసాద్. 1920–1933 మధ్యకాలంలో రాసిన అద్భుతనాటకాలు అజాతశత్రు (1922), స్కంధగుప్త (1928), చంద్రగుప్త (1931), ధృవవాసిని (1933) నాటకాల్లో స్త్రీ పాత్రలు భావుకతకు, జాతీయ ఆదర్శాలకు ప్రతీకలు. భారత జాతిలో నిద్రాణమైన దేశభక్తిని, జాతీయ సంస్కృతీ వైభవాన్ని పునఃప్రతిష్ఠించాలని తన నాటకాల ద్వారా ప్రయత్నించాడు. జయశంకర్ ప్రసాద్ ప్రభావం, ప్రేరణ, స్ఫూర్తితో అనేక మంది నాటక రచయితలు గొప్ప నాటకాలు రాశారు.

లక్ష్మీనారాయణ మిశ్రో వత్సరాజ్, జగన్నాథ్ ప్రసాద్ మిళింద, గోవింద వల్లభ్‌పంత్ వరమాల, రాజ్‌ముకుట్, ఉదయ

శంకర్ భట్ విద్రోహిని, అంబ, సాగర్, విజయ, మత్స్యగంధ, విశ్వామిత్ర ఆదిమ్ యుగ మొదలైనవి జయశంకర్ ప్రసాద్ నాటకరచనా ప్రభావంతో వెలువడ్డాయి.

జయశంకర్ ప్రసాద్ తరువాత హిందీ భాషలో అనేక నాటకాలు వచ్చాయి. అయితే ఈ నాటకాలు విభిన్న ధోరణుల్లో వచ్చాయి. భారత దేశంలో చలన చిత్రాలు ప్రారంభమైనాయి. బాంబేటాకీస్, న్యూ థియేటర్స్ లాంటి సంస్థలు వాస్తవిక ధోరణులతో నిత్య జీవిత సంఘటనలకు ప్రాధాన్యత ఇవ్వడంతో, ప్రజలు చలనచిత్రాల వైపు ఆకర్షింపబడ్డారు. ఆంగ్లభాష ప్రభావం వల్ల పశ్చిమ దేశాల్లోని, రకరకాల నాటక ప్రయోగ పద్ధతులు వ్యాప్తిలో కొచ్చాయి. ఇబ్సన్, బెర్నార్డ్‌షా, చెకోవ్‌ల రచనలు ఔత్సాహిక నాటక సమాజాలను, రచయితలను నటులను ప్రభావితం చేశాయి. ప్రజల్లో, స్వాతంత్రేచ్ఛ, జాతీయ ఉద్యమం వైపు ఆకర్షణ పెరిగి, నిత్య జీవిత సమస్యలు ప్రతిబింబించే రచనలు ప్రజలను ప్రభావితం చేశాయి. సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనో వైజ్ఞానిక విశ్లేషణ విద్యావంతుల ఆలోచనల్లో విప్లవాత్మకమైన మార్పు తెచ్చింది. రైతాంగ సమస్యలు, ఆర్థిక అసమానతలు, కార్మికోద్యమాలు, మార్క్స్ ప్రతిపాదిత కమ్యూనిజం, మధ్య తరగతి ఆవిర్భావం వంటి కొత్త భావాలు, ఆలోచనలు, ఉద్యమాలు నాటకరంగంపై తమ ప్రభావాన్ని చూపాయి. ఈస్థితిలో సరికొత్త హిందీ నాటక రూపం ఆవిర్భవించింది. అదే ఏకాంకిక. నాటకాలలో నిత్య జీవిత సమస్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రేమ కథలు, చారిత్రక, పౌరాణిక కథలకు ఆదరణ తగ్గి సమస్యాత్మక నాటకాలు వెలుగులో కొచ్చాయి. ఈ కోవలో మొదటి నాటకం త్రిపానాథ మిశ్రా రాసిన మణిగోస్వామి. ఈ వరుసలో లక్ష్మీనారాయణ సింధూర్ - క-హోలీ, రక్షా కి మందిర్, ముక్తి కారహస్య నాటకాలు రాశాడు.

రచనలో వైవిధ్యం , సంప్రదాయ నాటక రీతులకు వ్యతిరేకంగా, భావుకత, ఉద్వేగ భరిత సన్నివేశాలతో నాటకం చైతన్యవంతంగా తీర్చిదిద్ది వాస్తవికతకు ప్రతిరూపంగా రాంకుమార్ శర్మ, ఉపేంద్రనాథ్ అష్క్, నాటక రచన చేశారు. ముఖ్యంగా ఉపేంద్రనాథ్ అష్క్ రాసిన ఖైద్ ఔర్ అవ్‌రాన్, చోటాబేటా చెప్పుకోదగినవి. సేత్‌గోవిందదాస్, బృందావన్‌లాల్ వర్మ, శంభుదయాల్ సక్సేనా, విమలారైనా మొదలైనవారు అద్భుతంగా నాటకరచన చేసి నటనకు ప్రాధాన్యం ఇచ్చారు.

ఈ కాలంలో పార్శీనాటకాలకు ఆదరణ తగ్గింది. పృథ్వీరాజు కపూర్ హిందీ నాటక రంగంలో ప్రవేశించి అటు పార్శీ నాటక ప్రదర్శనల్లోని రంగాలంకరణను, ఔత్సాహిక నాటక ప్రదర్శనలోని వాస్తవికతను, సంభాషణాలను మిళితం చేసి పామరులను, పండితులను ఆకర్షించేలా నాటక ప్రదర్శనలు ప్రారంభించాడు. పఠాన్, ఆహుతి, కళాకార్ లాంటి నాటకాలు ఆర్థికంగా విజయం సాధించాయి.

ఆధునిక హిందీ నాటకరంగం : 1942-1947 మధ్యకాలంలో స్వాతంత్రోద్యమం ఊపందుకుంది. రాజకీయ పార్టీలు నాయకులు స్వాతంత్రోద్యమం వైపు దృష్టిసారించడంతో, హిందీ నాటకరంగం, సాహిత్యంలో చెప్పుకోదగ్గ కృషి, అభివృద్ధి అంతగా జరగలేదు.

1947లో భారతదేశంలో బ్రిటీష్ పాలన అంతమొందటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడి ప్రభుత్వాధికారం బదలాయింపు జరగడం, దేశంలో మత కల్లోలాలు జరగడం, రాజకీయ అనిశ్చిత స్థితి, ఆర్థిక మాంద్యం, రెండవ ప్రపంచ యుద్ధ విరమణ తర్వాత ఏర్పడ్డ సాంఘిక ఆర్థిక పరిస్థితుల వల్ల సృజనాత్మక కళలు అంతగా అభివృద్ధిచెందలేదు.

1950లో, వివిధ ప్రాంతాలో సంగీత, నృత్య, నాటక, అకాడమీలు ఏర్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం గేయ నాటక విభాగాన్ని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లో వ్యాప్తి చెందేందుకు కృషి చేసే దిశలో ప్రారంభించింది. విశ్వవిద్యాలయాల్లో హిందీ నాటక సాహిత్యం అంశంగా బోధన ప్రారంభమైంది.

1962లో కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (జాతీయ నాటక పీఠం) స్థాపించి, నాటక రంగంలోని వివిధ అంశాలపై శిక్షణ తరగతులు ప్రారంభించింది.

ఇదే కాలంలో మార్క్స్, ఏంగిల్స్‌లో శ్రమ జీవన సిద్ధాంతం, యూరోప్‌లో తలెత్తిన సోషలిజం మొదలైన సిద్ధాంతాల ప్రభావంతో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (IPTA) ఏర్పడింది. వామపక్ష సిద్ధాంతాలు, శ్రమజీవుల కృషి గుర్తింపు, సామాజిక న్యాయం, మానవ జీవిత విలువలకు ప్రాధాన్యతనిస్తూ, అనేక నాటక ప్రదర్శనలకు శ్రీ కారం చుట్టి 'కళకళ కోసం కాదు - కళ ప్రజల కోసం' అన్న నినాదంతో ప్రజల ముందుకు వచ్చింది. కలకత్తానుండి శంభుమిత్ర, బంబాయి నుంచి బలరాజ్ సహానీ, అలహాబాద్ (1952)లో నాటక ప్రదర్శనలిచ్చి, యువనాటక కర్తలకు, నటులకు, ప్రోత్సాహమిచ్చారు. ఈ స్ఫూర్తితో కొత్త రచయితలు, నటులు, దర్శకులు, హిందీ నాటక రంగంలో ప్రవేశించారు.

రాంప్రసాద్ ఆమ్రంపాలీ, ఉపేంద్రనాథ్ అస్కా జయపరాజయ, జగదీశ్ చంద్ర మాథుర్ కోణార్క్, భగ్నరాగిణి, రమేశ్ హేమంత హమారాగావ్, బకీనా మేక్‌బెత్, ధర్మవీర్ భారతి అంధాయుగ్ , మోహన్ రాకేష్ ఆషాఢ్‌కా ఏక్ దిన్, లహోరోనోకే రాజహంస, ఆధే- అధోరె ఈ పరిస్థితుల నేపథ్యంలో వెలువడ్డాయి.

ముఖ్యంగా హిందీ నాటక రంగంలో అత్యంత ప్రాధాన్యత కల్గిన నాటకాలు రచన, ప్రదర్శనరీత్యా ధర్మవీర్ భారతి రాసిన అంథాయుగ్, మోహన్ రాకేశ్ రచన ఆషాఢ్‌కా ఏక్‌దిన్ హిందీ నాటక రంగంలో రెండు మణిదీపాలు.

1970 ప్రాంతాల్లో మరో కొత్త రకం రచనలు, ప్రయోగాలు వచ్చాయి. బ్రిజ్ మోహన్ సాహా త్రిశంకు, సర్వేశ్వర దయాల్ సక్సేనా బకరి, యుద్ధ మాన మొదలైన నాటకాలతో హిందీ నాటక సాహిత్యంలో సరికొత్త ప్రయోగాలు చేశారు. బ్రిజ్ మోహన్‌సాహా త్రిశంకు నాటకంలో శాస్త్రీయం, జానపద కళారూపాల కలయిక ప్రవేశ పెడితే, సర్వేశ్వరదయాళ్ సక్సేనా పార్శీ నాటక సంప్రదాయంగా ప్రాచుర్యం వహించిన నౌటాంకీ జానపద సంప్రదాయాన్ని మిళితం చేసి సమాజంలో అంధ, మూఢ విశ్వాసాలను ఖండించడం విశేషం.

ఈ కాలంలోనే రచయితలు రాజకీయ నాయకులు, సంఘ విద్రోహ శక్తులపై వ్యంగ, హాస్య రచనలు చేయడం ప్రారంభించారు. నరేంద్ర కొహ్లా శంభుకి హత్య, శంకర శేన ఏక్ అవుర్ ద్రోణాచార్య, దయాప్రకాశ సిన్హా కథ ఏక్ కంసాకి చెప్పుకోదగ్గ వ్యంగ్య హాస్య రచనలు. పాశ్చాత్య నాటక ప్రభావం వల్ల హిందీ నాటక సాహిత్యంలో వినూత్న ధోరణులు ప్రారంభమైనాయి. ప్రయోగాత్మక రచనలు వెలుగులోకొచ్చాయి. స్త్రీ పురుష సంబంధాలు, లైంగిక సంబంధాల్లో విభిన్న అనుబంధాల రీతుల వైచిత్రిని చిత్రీకరిస్తూ సురేంద్ర వర్మ రాసిన ద్రౌపది సంచలనాత్మకరచన. రాజకీయాలు, కుటుంబ విలువలు సంప్రదాయాలు వీటిని ప్రశంసిస్తూ, అధిక్షేపిస్తూ అనేక రచనలు వెలువడ్డాయి.

ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వివిధ భాషల నాటకాలు అనువదించుకుని హిందీలో ప్రదర్శనలివ్వడం వల్ల కొన్నాళ్లు హిందీ భాషలో సృజనాత్మక నాటక రచన కొంత మేరకు తగ్గింది. ఐతే 1980 తర్వాత కొన్ని అద్భుతమైన నాటకాలు వచ్చాయి. భీష్మసహానీ హనూష్, మాధవి, పరిశంకర్ పర్శాయి ఈశ్వర్ ప్రేమ, చార్‌పాయి, నిర్మల్ వర్మ తీన్ ఏకాంక్, త్రిపురానశర్మ కాష్ట్ కి గాడి మొదలైనవి. అంకుర్ ప్రారంభించిన కథా నాటక ప్రక్రియ, స్వదేశ్ దీపక్ కోర్ట్‌మార్షల్, ఫణీశ్వర్‌నాథ్ రేణు పంచ్ లైట్, అవినాశ్ చంద్ర మిశ్రా బాజీ, అజలా వర్మ సుభాహోనేతక్, ప్రభాత్ కుమార్ మండల్ ఆట్ డిసెంబర్ ఉన్నీస్ సౌ ఖాన్వే, అల్కా సరావజి స్వప్న–దుస్వప్న, శిశిర్ కుమార్ దాస్ బాధ్ మొదలైనవి పేర్కొనదగిన నాటకాలు.

ఇంకా ఎందరో రచయితలు హిందీ నాటక సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తూన్నారు. నాటక రచన, ప్రదర్శన ప్రగతి పథంలో సాగిపోతూ ఉంది.

తారక

ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా)

జాతీయ సంక్షోభానికి సవాళ్ళుగా పరిణమించిన ఫాసిజం, పరదేశీ పాలన, తద్వారా ఉద్భవించిన ఆర్థిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, క్షీణించిన మానవ సంబంధాలు–నైతిక విలువలు, భంగపడిపోతున్న సంస్కృతీ సంప్రదాయాలు, సాంస్కృతికపరమైన అచైతన్యావస్థ, వీటికి ఎదురొడ్డి పోరాడే దిశగా ఆవిర్భవించింది ఇప్టా. ప్రదర్శన కళల ద్వారా ప్రజల పొరపాట్లను, మంచిచెడులను తెలియచేసేందుకు, వారిని జాగృతం చేసేందుకు నడుం కట్టింది. ఫాసిజానికి, సైనిక పాలనకు వ్యతిరేకంగా ప్రదర్శిత కళల పోరాటం ద్వారా విజయం సాధించి, తద్వారా దేశభక్తి, జీవించేహక్కు, శాంతి తదితర అంశాలతో స్వేచ్ఛా భారతాన్ని నిర్మించి, కొత్త జీవితాన్ని ప్రసాదించాలని దృఢంగా విశ్వసించింది. బలహీన దేశాలపై అగ్రరాజ్యాల విధానాలను నిరసిస్తూ, స్వాతంత్ర్య ఉద్యమంలో పాలు పంచుకొంటూ అభ్యుదయ రచయితలు, కళాకారులు మార్గదర్శకులుగా ఇప్టా రూపుదిద్దుకుంది. సాంస్కృతిక పునరుజ్జీవన, సాంఘిక, ఆర్థిక ఉద్యమాలను ప్రభావితం చేసింది. తద్వారా ఏర్పడిన సాంఘిక, రాజకీయ చైతన్యంతో రంగస్థల కళలకు అభ్యుదయపరమైన అర్థాన్నిస్తూ, కళా సృజనాత్మకతకు దోహదపడింది.

రవీంద్రనాథ్ టాగూర్, జవహర్‌లాల్ నెహ్రూ, ప్రేమ్‌చంద్ వంటివారిని ఇప్టా ఉద్యమం ప్రభావితం చేసింది. వీరి ప్రేరణతోనే ఇప్టా ఒక జాతీయ సంస్థగా ఆవిర్భవించింది.

ఇప్టా ఆవిర్భావ నేపథ్యం : ఇప్టా ఆవిర్భావానికి అంతర్జాతీయ స్థాయిలో జరిగిన అనేక సదస్సులు, సమ్మేళనాలు, ఉద్యమాలు ప్రధాన కారణాలు. 1927లో బ్రస్సెల్స్‌లో ఫిబ్రవరి 10వ తేదీన సామ్రాజ్యవాదానికి, అణచివేతకు వ్యతిరేకంగా ఒక మహాసభ జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ, బర్కతుల్లా ఈ సభకు హాజరయ్యారు. 1931లో యుద్ధాలకు వ్యతిరేకంగా రచయితల సమావేశం జరిగింది. ఐన్‌స్టీన్ పేరిట జరిగిన ఈ సమావేశంలో యుద్ధాలను పూర్తిగా వ్యతిరేకించాలని ఐన్‌స్టీన్ పిలుపునిచ్చాడు. 1932లో ప్రసిద్ధ రచయిత రోమ్‌రోలా సారథ్యంలో ఆమ్‌స్టర్‌డాంలో ఫాసిస్టు వ్యతిరేక మహాసభ జరిగింది. ఈ రెండింటి కారణంగా 1935, జూన్ 21న పారిస్‌లోనే ఫాసిస్ట్ వ్యతిరేక సభ జరిగింది. మాగ్జిం గోర్కి, రాల్ఫ్ ఫాక్స్, క్రిస్టోఫర్, కాడ్వెల్ తదితరులు ఈ సభలో పాల్గన్నారు. 1936, జూన్ 19 నుంచి 23 వరకు లండన్‌లో అంతర్జాతీయ రచయితల సంఘం ద్వితీయ మహాసభ జరిగింది. అప్పటికే మన దేశంలో రవీంద్రనాథ్

టాగూర్, శరత్ ఛటర్జీ, మున్షీ ప్రేమ్‌చంద్, నెహ్రూ, నందలాల్ బోస్ తదితరుల సంతకాలతో ఫాసిస్ట్ వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక లక్షణాలను పొందుపరచారు. 1937లో టాగూర్ అధ్యక్షతన ఫాసిస్ట్ వ్యతిరేక లీగ్ ఏర్పడింది. ఇదే సంవత్సరం అంతర్జాతీయ రచయితల సంఘం మూడవ మహాసభ మాడ్రిడ్‌లో జరిగింది. ఫాసిజానికి వ్యతిరేకంగా విప్లవ రచయితలు, కవులు, కళాకారులు, సంగీత కళాకారులు ఈ కమిటీలో ఉండి, ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా పోరాడారు. సోవియట్‌పై నాజీ జర్మనీ దాడి అనంతరం జాతీయోద్యమ నాయకులు బ్రిటీష్ వ్యతిరేకతను ప్రదర్శించారు. 1942లో క్విట్ ఇండియా తీర్మానం ఆమోదించడం, కేవలం ఆంగ్లేయులకు వ్యతిరేకంగానే ఉద్యమాలు చేపట్టకుండా ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని కమ్యూనిస్టులు నిర్ణయించడం, మరోవైపు బెంగాల్‌లో భయంకరమైన క్షామంరావడం, ప్రజలు అసంఖ్యాకంగా మరణించడం – ఈ సంఘటనలన్నీ మన దేశ కవులు, కళాకారులు, మేధావుల్ని కదిలించి వేశాయి. అభ్యుదయ రచయితల సంఘం తీవ్రంగా చలించింది. ముందుకురికింది. తత్ఫలితమే ఇప్టా ఆవిర్భావం.

ఆవిర్భావం : ఇప్టా మొట్టమొదటిసారిగా 1941లో బెంగుళూరులో ఇద్దరు మేధావులైన డాక్టర్ హోమీభాభా, సింహళ వనితైన అనిల్ డిసిల్వాలతో ఏర్పాటైంది. ఇప్టా బెంగుళూరు శాఖకు డిసిల్వా కార్యదర్శిగా ఎన్నికయ్యింది. నాటకరంగాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్ళాలని ఇరువురూ కృషి చేశారు. ఇప్టా ఆవిర్భావానికి కమ్యూనిస్టు పార్టీ దోహదపడినా, అది పార్టీ సంస్థగా నడవలేదు. సంస్కరణ ది సోషలిస్ట్ కార్మిక నాయకుడు ఎన్.ఎమ్. జోషి ఇప్టా తొలి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ప్రజా సంస్థల ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల వారు, ఏ పార్టీకి చెందని వారు కూడా ఇప్టా కార్యవర్గంలో ఉన్నారు. హిందూ–ముస్లీం ఐక్యత, జైళ్ళలోని జాతీయ నాయకుల విడుదల, దేశ రక్షణకై జాతీయ ప్రభుత్వం ఏర్పడాలనే డిమాండ్ తదితర అంశాల ప్రాతిపదికన ఇప్టా తొలి కళారూపాలు రూపొందాయి.

ఇప్టా మొదటి మహాసభ 1943, మే 25న బంబాయిలో మార్వాడీ విద్యాలయ హాలులో ప్రారంభమైంది. రాత్రి 8–30 గంటలకు రేల్ లోని దామోదర్ హాలులో కళా ప్రదర్శనలిచ్చారు. ఇవే ఇప్టా తొలి ప్రదర్శనలు. సంస్థ నిర్మాణ స్వరూపం, ఆశయాలు, లక్ష్యాలు, కళా రూపాలు, ఇతివృత్తాలు తదితర అంశాలతో తొలి ముసాయిదా రూపొందించారు. హీరేన్ ముఖర్జీ ప్రారంభ సభకు అధ్యక్షత వహించాడు. 'ఇక్కడ చేరిన మనమంతా ప్రధానంగా నాటకరంగానికి చెందినవాళ్ళం. గత 50 ఏళ్ళ కాలంలో ఈ రంగం బాగా దెబ్బతింది. రంగస్థలం అనేది ఎప్పుడూ నిజమైన ప్రజాకళగా పెంపొందడానికి ప్రయత్నించాలి. నాటకం అనేది సమిష్టికళ. రచయిత, నటుడు, దర్శకుడు, ప్రేక్షకుడు కలిస్తేనే నాటకం. మిగిలిన రంగాల మాదిరిగానే నాటకమూ పెట్టుబడిదారీ సంక్షోభపు తాకిడికి గురౌతోంది. ప్రేక్షకులకు కళా భోజనం అందించాల్సిన ఈ పవిత్రమైన వృత్తికి ధనార్జనే లక్ష్యమైంది. భవిష్యత్తులో మనం చేయవలసింది చాలా ఉంది. ప్రజల కళ, ప్రజల సృజనాత్మకత కోసం పనిచేసే వారెవరైనా కళలకు మిత్రులే' అని ముఖర్జీ తన అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నాడు. అనంతరం డిసిల్వా ప్రవేశపెట్టిన ఇప్టా ఆవిర్భావానికీ, కార్యక్రమానికీ సంబంధించిన ప్రధాన తీర్మానాన్ని అందరూ ఆమోదించారు. అందులోని ప్రధాన అంశాలు :

1. నాటకరంగాన్ని పునరుద్ధరించడం, 2. జానపదకళలకు జవసత్వాలందించడం, 3. స్వేచ్ఛ, సాంస్కృతిక పురోగమనం, ఆర్థిక, సాంఘిక న్యాయం కోసం పోరాడుతున్న ప్రజల భావాలను వ్యక్తీకరించే, సంఘటితపరిచే సాధనంగా ప్రజాకళా ఉద్యమాన్ని తక్షణమే దేశమంతటా వ్యాప్తి చేయడం.

కొంచెం వివరంగా చర్చిస్తే, స్వాతంత్ర్యానికీ, సంస్కృతికీ వ్యతిరేకంగా ఫాసిస్టుల దురాక్రమణ ఓ వైపు, మాతృదేశాన్ని రక్షించుకోవడానికి పోరాటం సల్పుతున్న ప్రజల్ని అణచివేసే పరాయి ప్రభుత్వ చర్యలు మరోవైపు, దేశ ప్రజల ఆర్థిక జీవనం ఛిన్నాభిన్నం కావడం వేరేవైపు, సామ్రాజ్యవాదాన్ని తిప్పిగొట్టగల ప్రజాశక్తుల్లో సంఘీభావం కొరత వీటన్నింటినీ నాటకరంగం, సంప్రదాయ కళా రూపాల ద్వారా చాటిచెప్పి, ప్రజల హక్కులకు సంబంధించిన అంశాలను, సమస్యలను, పరిష్కార మార్గాలను ప్రబోధించి, ప్రజలను చైతన్యం చేసి, ప్రజా వ్యతిరేక శక్తులను ఎదుర్కొనేలా చేయడం ఇప్టా ఉద్యమ కర్తవ్యంగా కనబడుతోంది.

ఇందుకోసం పాటలు, బుర్రకథలు, నాటకాలు, జానపద కళారూపాలు, జానపద ప్రక్రియల్లో ప్రజలకర్థమయ్యేలా, సూటిగా, ప్రయోజనాత్మకంగా ఉండి, వాటి రూపకల్పనలో, ప్రదర్శనల్లో పాలు పంచుకొనేట్టుగా చూసి, ప్రజలంతా హర్షించేలా ఒక ప్రణాళికను రూపొందించారు. బంబాయి ప్రధాన కేంద్రంగా తాత్కాలిక కమిటీగా ఎన్.ఎమ్. జోషి అధ్యక్షుడిగా, అనిల్ డిసిల్వా ప్రధాన కార్యదర్శిగా, కె. ఎ. అబ్బాస్ కోశాధికారిగా, ఇప్టా ఆంధ్ర ప్రాంతం నుంచి గరికపాటి రాజారావు కమిటీలో సభ్యుడుగా ఎంపికయ్యారు. దాదాపు అన్ని రాష్ట్రాలకు తాత్కాలిక కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ మహాసభలో అయిదుగురు మహిళలతో సహా పది మంది సభ్యులు గల ఆంధ్ర దళం పాల్గొని, బృందగానం, నృత్యాలు, కోలాటం, బుర్రకథ ప్రదర్శించారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన సందేశంలో 'భారతదేశంలో ప్రజా నాటకరంగం అభివృద్ధికి ఆరంభమైన ప్రయత్నం పట్ల చాలా సంతోషిస్తున్నాను. ప్రజలు, వారి సంప్రదాయాలకు అనుగుణంగా ప్రదర్శిత కళలు రూపుదిద్దుకుంటే, వాటి వికాసానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, చైనా, స్పెయిన్ దేశాల్లో

ఈ కారణంగానే రంగస్థలం అభివృద్ధి చెందిందనీ, ఇప్టా ఈ దిశగా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొనడం గమనార్హం.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఇప్టా కార్యకలాపాలు విస్తృతంగా సాగాయి. కళల గురించి ఏమాత్రం అవగాహన లేనివారు కూడా ఇప్టాలో సభ్యులయ్యారు. జాతీయస్థాయిలో అంకితభావంతో ఉన్న కొంతమందిలో హరీంధ్రనాథ్ ఛటోపాధ్యాయ, బల్‌రాజ్ సహానీ, శంభుమిత్ర, కానుజోష్, ఆత్రే, కైఫీ అజ్మీ, పృథ్వీరాజ్ కపూర్, పండిట్ రవిశంకర్, ఉదయ్‌శంకర్, చేతన్ ఆనంద్, శైలేంధ్ర, సవీలీ చౌదరి, దీనాపాఠక్, ఎ.కె. హంగల్, నిరంజన్‌సేన్, కె.ఎ.అబ్బాస్, వి. శాంతారాం, తృప్తి మిత్ర, ప్రేమ్‌థావన్, సర్దార్ జాఫ్రీ, చిట్టా ప్రసాద్, ఉమాశంకర్ తదితరులు, ఆంధ్ర ప్రాంతం నుంచి రాజారావు ఇప్టా కార్యకలాపాలు విస్తృతంగా కొనసాగడానికి విశేషంగా కృషి చేశారు. ప్రజలను ముఖ్యంగా బడుగు వర్గాలను ఆకర్షించేందుకు కళలు విశేష సాధనాలుగా పని చేస్తాయని రుజువైంది. కమ్యూనిస్టు నాయకులు చాలామంది కళారంగం పట్ల ఆసక్తి చూపారు. పి.సి. జోషి, గంగాధర్ అధికారి, ఎ.కె. గోపాల్, జ్యోతిబసు, ఇ.ఎమ్.ఎస్. నంబూద్రిపాద్, సజ్జాద్ జహీర్, హీరేన్ ముఖర్జీ వీరిలో ప్రముఖులు.

కె. ఎ. అబ్బాస్ ఇప్టా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్‌లతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉన్న కారణంగా బంబాయి సినిమా రంగంలో ఇప్టా ప్రతిష్ఠ పెరిగింది. ఆ తరువాత పార్వతీ కృష్ణన్, నిఖిల్ చక్రవర్తి, నిరంజన్‌సేన్‌ల నాయకత్వంలో 1962 వరకూ ఇప్టా తన కార్యక్రమాలు కొనసాగించింది.

ఇప్టా తదుపరి సమావేశం 1946లో బంబాయిలో జరిగింది. అప్పటివరకూ సాధించిన ప్రగతిని సమీక్షించింది. ఇప్టా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ నాటకాలు, జానపద గీతాలు, కళారూపాలు, నృత్యాల ద్వారా గ్రామీణ సంస్కృతి విశిష్టతను తెలియచేయడం, ఈ కళారూపాల ద్వారా మూడు లక్షల రూపాయలు సేకరించి, కరువు సహాయ కార్యక్రమాలకు పంపడం, నవన్నో (కొత్తపంట) బెంగాలీ నాటకాన్ని దేశమంతటా అన్ని స్థానిక భాషల్లో ప్రదర్శించడం, రుత్విక్, ఘటక్, సత్యజిత్‌రే, మృణాల్‌సేన్ వంటివారు వాస్తవిక చిత్రాల వైతాళికులుగా రూపుదిద్దుకోవడానికి కారణభూతమైన ధర్తీకౌలాల్ చిత్రం నిర్మించడం (ఈ చిత్రం యునెస్కో ఆధ్వర్యంలో పారిస్‌లో ప్రదర్శించబడింది), వివిధ భారతీయ భాషల్లో విశేషంగా కొత్త నాటకాలు వెలువరించడం ఈ కాలంలో ఇప్టా సాధించిన విజయాలుగా చెప్పుకోవచ్చు.

స్వాతంత్ర్యానంతరం కూడా ఇప్టా కార్యకలాపాలు ఉధృతంగా సాగాయి. కొన్ని కారణాల వల్ల ముఖ్యంగా కమ్యూనిస్టుల ఆలోచనాధోరణిలో మార్పులు సంభవించిన కారణంగా, సంస్థాపరంగా ఇప్టా కార్యకలాపాలు మందకొడిగా సాగడం ప్రారంభించింది. కొందరు నాటకరంగంలోనే కొనసాగుతుండగా మరికొందరు సినిమాలవైపు దృష్టి కేంద్రీకరించారు. ఇంకొందరు స్తబ్దతగా ఉండిపోయారు. మరికొందరు రాజకీయ రంగానికి పరిచయమై ఆ రంగానికే పరిమితమయ్యారు.

1949, ఫిబ్రవరి 4 నుంచి 9 వరకు అలహాబాద్‌లో జరిగిన ఇప్టా ఆరవ మహాసభ సాంస్కృతికోద్యమ తీరుతెన్నుల్ని సమీక్షించింది. నిర్బంధ విధానం కారణంగా దక్షిణాది ప్రతినిధులు ఈ సభలకు హాజరు కాలేదు. 1953, ఏప్రిల్ ఆరున జరిగిన ఏడవ మహాసభకు ఆరు వందల మంది ప్రతినిధులు హాజరై, సంస్థ ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించుకొని కొత్త ప్రణాళిక ప్రకటించింది. ఆహ్వాన సంఘ అధ్యక్షుడిగా బి.ఎల్. రాయ్ నేతృత్వంలో స్టాలిన్ మృతికి సంతాపం ప్రకటించి, మూడు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. నాటకరంగం, సినిమా, సంగీతం అంశాలపై నివేదికలు సమర్పించారు.

1943-53 మధ్యకాలంలో ఆంధ్రరాష్ట్రంలో ఇప్టా శాఖ అయిన ప్రజానాట్యమండలి కార్యకలాపాలు ఈ విధంగా ఉన్నాయి.

ప్రజా ప్రయోజనార్థం ప్రజానాట్యమండలి చేపట్టిన తెలుగు కళారూపాలు ప్రత్యేక ఆదరణ పొందాయి. జానపద కళారూపాలను పునరుద్ధరించి, వాటిని ప్రజలకనుగుణంగా మలచిన తీరు ప్రశంసనీయం. బుర్రకథలు, పాటలు, నృత్యాలు, వీధి భాగవతాలు, బృందగానాలు, నాటకాలు, కోలాటాలు, పిట్టలదొర, జముకుల కథ, హరికథ కళారూపాల ద్వారా తమ ఆలోచనా విధానాన్ని ప్రచారం చేసింది. ఏ కళారూపాన్ని ఏ విధంగా ఉపయోగించారన్న సమాచారాన్ని ఇప్టా ఇతర దళాలకు అందచేసేది. ఒక్క 1944లోనే దాదాపు 375 బుర్రకథలు ప్రదర్శించగా, 6 లక్షల మందికి పైగా తిలకించారు. కష్టజీవి, సీతారామరాజు, వీరేశలింగం, పల్నాటియుద్ధం, టాన్య వంటి బుర్రకథలు, ఆహుతి హరికథ విస్తృతమైన ఆదరణ పొందాయి. నాటకాల విషయానికొస్తే పశ్చాత్తాపం నాటకాన్ని 25 ప్రదేశాల్లో ప్రదర్శించగా35 వేలమంది చూశారు. బెంగాల్ కరువుకు అద్దం పట్టే ప్రతిమ నాటకాన్ని 59 కేంద్రాల్లో ప్రదర్శించగా రెండున్నర లక్షల మంది చూశారు. ప్రజల ఐక్యత గురించి ప్రతిబింబించే మబ్బుతెర నాటకాన్ని అయిదు వేలమంది చూశారు. మరో నాటకం పరిష్కారం కూడా బహుళ ప్రజాదరణ పొందింది. రష్యన్ నాటికకు అనువాదమైన ఇల్యాను తెనాలిలో అభ్యుదయ రచయితల సంఘం మహాసభలో ప్రదర్శించారు. ఫోర్ కామ్రేడ్స్‌కు అనువాదమైన దేశభక్తులు నాటకానికి, మరో చైనా నాటికను

అనువదించి, జోడించి 10 కేంద్రాలలో ప్రదర్శించగా 15 వేలమంది తిలకించారు. భూమి సమస్య ప్రధానంగా ఉన్న ముందడుగు నాటకాన్ని ప్రదర్శించని పట్టణం లేదంటే అతిశయోక్తి కాదు. కృష్ణాజిల్లా రైతు మహాసభ సందర్భంగా ఈ నాటకాన్ని ప్రదర్శించినపుడు 40 వేలమంది చూశారు. ప్రెస్ కార్మికుల సమస్యలతో వెలువడిన ప్రెస్‌వర్కర్ నాటికను రాజమండ్రిలో ప్రదర్శిస్తే, 10 వేలమంది తిలకించారు. కాన్పు, తల్లీపిల్లల ఆరోగ్యాన్ని తెలియచేస్తూ, మూఢనమ్మకాలను ఖండించే నాటకం ప్రసూతి కూడా వివిధ సమావేశాల్లో ప్రదర్శించారు. అపనింద, మా భూమి నాటకాలను 150 దళాలు రాష్ట్రమంతటా ప్రదర్శించాయి. మా భూమి నాటకం కొన్ని వందల ప్రదర్శనలతో లక్షల మందిని ఆలోచింప చేసి తెలుగు నాటకరంగ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకొంది.

ఇప్టా సాంస్కృతికోద్యమంలో ఆంధ్రప్రదేశ్, అస్సాం, కేరళ, ఢిల్లీ, బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు అగ్రగామిగా నిలిచాయి. 1994, మే 25న ఆనాటి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి అర్జున్‌సింగ్ ఇప్టా స్వర్ణోత్సవాల సందర్భంగా తపాలాశాఖ రూపొందించిన ఇప్టా స్మారక తపాలా బిళ్ళను విడుదల చేశాడు. 1953 తరువాత వివిధ కారణాలవల్ల ఇప్టా కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి.

ఇప్టా పునరుద్ధరణ : 1966, నవంబర్ 20 నుంచి 24 తేదీ వరకు హైదరాబాద్‌లో ఇప్టా పునరుద్ధరణ కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి దేశం నలుమూలల నుంచి 13 వందలమంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నిర్వహించిన ఈ సమావేశంలో ఇప్టా ప్రముఖుడైన రాజేంద్రసింగ్ రఘువంశీ ప్రతినిధిగా హాజరైన ఈ సమావేశాన్ని 9వ జాతీయ సదస్సుగా పేర్కొన్నారు. తీవ్రవాదం, హింస, కులతత్వం, మతమౌఢ్యం, భాషా వేర్పాటువాదాలకు వ్యతిరేకంగా సృజనాత్మక కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. మత ప్రసక్తి లేని ప్రజాస్వామ్య విలువలు, జాతీయ సమైక్యత, సామరస్యం, సార్వభౌమాధికారాలను పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. మరోసారి జాతీయ సాంస్కృతిక ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. నాటి నుంచి నేటి వరకూ ఇప్టా కార్యకలాపాలు ఆయా రాష్ట్రాలలో కొనసాగుతూనే ఉన్నాయి.

1993, మే 24, 25 తేదీలలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఇప్టా స్వర్ణోత్సవాలను హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఆంధ్ర ప్రజానాట్యమండలి నిర్వహించిన ఈ ఉత్సవాలకు పశ్చిమబెంగాల్ ఇప్టా శాఖ ఉపాధ్యక్షుడు అతిథిగా విచ్చేసి, 1943లో అవతరించిన ఇప్టా, భారతీయ సాంస్కృతిక కళారంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిందన్నారు. బెంగాల్‌కు చెందిన అభినయ్‌దాస్ గుప్తా, ఢిల్లీ జన నాట్యమంచ్ కళాకారిణి సోనియా గుప్తా పాల్గన్న ఈ ఉత్సవాలకు ఆహ్వాన సంఘ అధ్యక్షుడిగా ఎం.ఎస్.రెడ్డి వ్యవహరించాడు.

ఏ ఆశయాలతో ఇప్టా ఆవిర్భవించిందో, వాటిని దాదాపుగా సఫలీకృతం చేసుకుందనే చెప్పాలి. ప్రజల స్థితిగతులకనుగుణంగా, ఒక సందేశమివ్వాలి. వారిలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతికపరమైన పురోగమన మార్పు తీసుకురావాలీ అనే దీక్షతో ఇప్టా తన కార్యకలాపాలు కొనసాగించింది. అరకొర సౌకర్యాలున్న ఆ రోజుల్లో, కళా ప్రదర్శనాల్ని ప్రజల వద్దకు తీసుకువెళ్ళాలన్న ఇప్టా తహతహ అంతా ఇంతా కాదు. కళ కళ కోసం కాదు, ప్రజల కోసమని తన ప్రదర్శనల కార్యకలాపాల ద్వారా నిరూపించింది. ప్రజలు కూడా ఇప్టా కళాకారులతో మమేకమై దేశభక్తితో ముందుకురికారు. కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులు, గాయకులు, రచయితలను దేశానికందించింది ఇప్టా. ఒకానొక కాలంలో దేశంలో ఎక్కడోచోట ఇప్టా ప్రదర్శన చోటుచేసుకుందీ అంటే అతిశయోక్తి కాదు. సాంఘిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, వైజ్ఞానికపరమైన అంశాలకు సంబంధించిన ఇతివృత్తాలే కాకుండా పలు అంతర్జాతీయ సమస్యలపైన కూడా దేశ ప్రజలకు అవగాహన కల్పించి, జాగృతం చేసే ప్రయత్నంలో సఫలీకృతమైంది. ఈరోజు 'ప్రశ్నించే' చొరవ లేదా హక్కు చాలామందిలో ఉత్పన్నమైందీ అంటే దానికి కారణం ఇప్టాయే. 'ఆలోచించు, ప్రశ్నించు, సమస్యల్ని ఛేదించు' అనే ప్రాథమిక సూత్రాలు ఇప్టా ప్రసాదించినవే. అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, అక్రమ రాజకీయాలు, గూండాగిరి, వరకట్నం, నిరుద్యోగం, అగ్రరాజ్యాల ఆధిపత్యం, అంటరానితనం, అక్షరాస్యత, వెట్టిచాకిరి, బాల కార్మికులు, ఎయిడ్స్, నిరంకుశపాలన, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు నిర్బంధ కార్యకలాపాలు ఇటువంటి అనేక సమస్యల భారత జాతిని చైతన్యవంతం చేసిన ఇప్టా భారతీయ నాటకరంగ చరిత్రలోనే కాదు, ప్రపంచ నాటకరంగ చరిత్రలో కూడా సుస్థిర స్థానం ఏర్పరచుకుంది. ఈ ప్రస్థానంలో ఎందరో కళాకారులు జైళ్ళ పాలయ్యారు. మరెందరో కనిపించని ప్రదేశాలకు తరలి వెళ్ళారు. ఇంకొందరు పాలకుల పైశాచిక అకృత్యాలకు ప్రాణాలర్పించారు. మరికొందరు రోడ్ల పాలయ్యారు. వారందరికీ జోహార్లర్పించవలసిందే! వారంతా చిరస్మరణీయులే!! కళా ప్రదర్శనలను ప్రజా ఉద్యమంగా రూపుదిద్దిన ఘనత ఒక్క ఇప్టాకే చెందుతుంది.

ఇప్టాకు భాషా భేదం లేదు, ప్రాంతీయ భేదం లేదు, కుల, మత, రాజకీయ అసమానతలు అసలే లేవు. వసుధైక కుటుంబంలా తన ఉనికిని కాపాడుకుంటూ, తానాశించిన మార్గంలో పయనించి, ఎందరికో పథ నిర్దేశం చేసింది.

ప్ర.రె.

ప్రపంచ నాటక రంగం

గ్రీకు నాటకరంగం

క్రీ.పూ. 6వ శతాబ్దంలో గ్రీసులో నగర రాజ్యాలు ఉండేవి. వీటిలో ప్రధానమైంది ఏథెన్స్. ఏథెన్స్‌లోనే సంస్కృతి వికసించింది. అందువల్ల గ్రీకు సంస్కృతిని ఏథెన్స్ సంస్కృతి అని కూడా అంటారు. సోక్రటీస్, అరిస్టాటిల్ వంటి అనేక మంది తత్వవేత్తలు, నాటకకర్తలు ఏథెన్స్‌కు చెందినవారే. స్పార్ట, కోరింత్, అట్టిలా, థేబ్స్ గ్రీకులోని మరికొన్ని రాజ్యాలు. వీటిలో కొన్నింటిలో ప్రజాస్వామ్యపాలన, మరికొన్నింటిలో సైనిక నియంతృత్వం ఉండేది.

పర్షియన్లు (ఇప్పటి ఇరాన్) గ్రీసుపై దండెత్తి వస్తుండేవారు. గ్రీకులోని రాజ్యాలు కూడా పరస్పరం యుద్ధాలు చేసుకొంటుండేవి. ఫలితంగా ప్రజల్లో అభద్రతా భావం ఉండేది. ఈ అభ్రదాతాభావం నుంచే విధి బలీయమైంది – దాన్ని తప్పించటం ఎవరితరమూకాదు అన్న సిద్ధాంతం పట్ల విశ్వాసం ఏర్పడింది. హోమర్ (క్రీ.పూ 900–800)రాసిన ఇలియడ్, ఒడెస్సీ గ్రీకుల మహాగ్రంథాలు, కావ్యాలు. గ్రీకుల చరిత్ర, సంస్కృతులను తెలుసుకోవటానికి ముఖ్య ఆధార గ్రంథాలు. గ్రీకు నాటకాలలో ఇతివృత్తాలు కూడ ఈ కావ్యాల నుండి గ్రహించినవే.

గ్రీకు నాటకరంగం పుట్టుక: నిజానికి గ్రీకు నాటకరంగం అవిర్భావాన్ని తెలియచేసే ఆధారాలు యిదమిద్ధంగా ఏమీ లభ్యం కాలేదు. గ్రీకు విషాద నాటకాలు, కామెడీల పుట్టుక గురించి కూడా ఏ ఆధారాలు లేవు. అయితే గ్రీకు నాటకం పుట్టిందీ, వికసించిందీ ఏథెన్స్‌లో అన్నది నిర్వివాదం. ఏథెన్స్‌వారు, మనకిప్పుడు తెలిసిన గ్రీకు నాటక చరిత్రను తమ గొప్పతనాన్ని తెలుపుకోవటంకోసం రాసుకొన్నారు. వారి రచనల ప్రకారం ఏథెన్స్ నాటకరంగం మత ఉత్సవాల నుంచి పుట్టింది.

గ్రీకులకు వ్యవసాయం ముఖ్యవృత్తి. వ్యవసాయం, ప్రకృతి శక్తులైన నేల, నీరు, వెలుగు, గాలి, ఆకాశం, అనే శక్తులపై ఆధారపడి ఉంటుంది. కనుక ఆ ప్రకృతి శక్తులను దేవతలుగా భావించి పూజించారు. యజ్ఞాలు,క్రతువులు నిర్వహించేవారు. వాటిలో నుంచే గ్రీకు నాటకం పుట్టిందని పాశ్చాత్య విమర్శకులు నిర్ధారించారు. క్రీ.పూ. 6వ శతాబ్దం సంగతి ఇది. అయితే అంతకు ముందే ఈజిప్టులో, ఆసియా మైనర్‌లో పేషన్ నాటకాలు ఉండేవని తెలుస్తోంది. వాటిని అబిడోస్ పేషన్ ప్లేస్ అని అన్నారు. ఆకాశం, భూమి సంపర్కం వల్ల జన్మించిన దేవుడు ఒసిరిస్. ఈజిప్టుప్రజల ధాన్యదేవత. జనన మరణాలకు అధిపతి కూడ. పేషన్ నాటకాలు ఈ ఒరిసిస్ గౌరవార్థం జరిగే ఉత్సవాలలో ప్రదర్శించబడేవి. అతనిని పలు విధాలుగా స్తుతించటాన్నే నాటకం అన్నారు. దుక్కి దున్నేనాడు ఆరంభమై, 18 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరిగేవి. యీ కాలంలో నాటకాలు కేవలం స్తుతిరూపాలే.

మధ్య ఆసియాలో ధాన్య (సస్య) దేవత పేరు టోమ్ముజ్. ఈ సస్యదేవత, దేవతల స్తుతిగీతాలనే మధ్య ఆసియాలో నాటకంగా పరిగణించేవారు. టోమ్ముజ్‌కు మరో పేరు అడొనిస్.

అలా పేషన్ నాటకాలుగా పిలవబడే ఈ స్తుతులలో ఇతివృత్తాలు వ్యవసాయ సంబంధమైనవి. వ్యవసాయ ఉత్పత్తులకు ఆధారభూతమైన భూమి, నీరు, పొలాలు, పైర్లు కొన్ని ఋతువుల్లో పుట్టి మరో ఋతువులో ఎండిపోవటానికి ప్రతీకలుగ ఈ దేవుళ్ల కథలుంటాయి.

క్రమంగా గ్రీకులు దేవుళ్లకు, దేవతలకు మానవ రూపాలు కల్పించుకొన్నారు. వారి చుట్టూ ఎన్నో కథలు కల్పించారు. డయొనిసస్ అనే దేవుడికి అనేక అంశలను ఆపాదించారు. అతడిని అనేక పేర్లతో పిలిచారు. వసంత దేవుడు, వృషభదేవుడు, పునఃసృష్టి దేవుడు, మేక దేవుడు, ద్రాక్షా రసాధిష్టదేవుడు ... ఇలా ఎన్నో పేర్లు.

ఈ డయొనిసస్ దేవత ప్రీతికోసం వారు ఉత్సవాలను, క్రతువులను నిర్వహించేవారు. ఆయా క్రతువుల్లో (కర్మ కాండలలో) స్తుతి గీతాలను గానం చేసే వారు. గంతులేస్తూ నాట్యం చేసేవారు. మేక చర్మాన్ని ధరించేవారు. మేకదేవత ప్రీత్యర్థం మేకను బలియిచ్చేవారు. డయొనిసస్ పుట్టుకను గురించి,అతనికి యితర దేవుళ్లతో గల సంబంధాన్ని గురించి అనేక కథలు, కల్పనలు ఉన్నాయి. అవన్నీ విషాదాంత కథలే. ఉత్సవాల్లో ఈ విషాద కథలనే గానం చేసేవారు. అలా చాలచోట్ల జరిగిన ఉత్సవాల్లో అనాగరిక మతాచారాలు, కీర్తనలు కన్పిస్తాయి. ఉత్సవాల్లో డిథిరాంబ్ నృత్యాలను చేసేవారు. మొదట్లో నోటి కొచ్చినట్లు ఏవేవో పాటలు పాడేవారు. ఏథెన్స్ ప్రభావం వల్ల వీటికి క్రమంగా ఒక పద్ధతి ఏర్పడింది. పాటలు కవిత్వ రూపాన్ని సంతరించుకొన్నాయి. దేవతాగృహం ముందు ఒక ఎత్తైన వేదికను అమర్చేవారు. దాని ముందు 50 మంది కూర్చొని లేదా నిలబడి బృందంగా దేవతల ప్రీత్యర్థం స్తుతిరూపంలో గానం చేసేవారు.



గ్రీకు రంగస్థలం

వీరికి కోరస్ లేక బృందగాయకులు అని పేరొచ్చింది. ఇది భజన బృందం వంటిదన్నారు శ్రీనివాస చక్రవర్తి. ఆయా దేవతల పుట్టు పూర్వోత్తరాలను, మహిమలను వర్ణిస్తూ, మన హరికథలలో దాసులాగ, కథల రూపంలో గానం చేసే వారు. ఈ బృందం గానం చేసే గీతికలను డిథిరాంబ్స్ అంటారు. డయొనిసస్ జనన మరణ సూచనగా, ఈ ఉత్సవాలు వసంతకాలంలో ఒకటి, శీతాకాలంలో ఒకటి మొత్తం రెండు సార్లు జరిగేవి. బృందగాయకులు మేకతోలు కప్పుకునేవారు. ఈ బృందానికి ఒక నాయకుడు ఉండేవాడు. అతనిని కొరిఫెకస్ అనేవారు. ఈయన మన సూత్రధారుడు లాంటి వాడు. థెస్పిస్‌ను మొదటి బృందగాన నటునిగా పేర్కొంటారు. ముఖానికి కరాళాలు (Masks) ధరించే పద్ధతి కూడా థెస్పిస్‌తోనే ఆరంభమైంది. గాయకుల నుంచి మొదటిసారిగ ఒక నటుణ్ని కల్పించారు.

పిసిస్ట్రాటస్ అనే ఒక క్రూర పాలకుడు డయొనిసస్ ఉత్సవాన్ని ఏథెన్స్ నగరంలో క్రీ.పూ. 535లో జరిపించాడని తెలుస్తున్నది. ఈయన వల్లే హోమర్ రాసిన ఇలియడ్, ఒడెస్సీ కావ్యాలలోనాయకులైన అగమెమ్నన్, ఒడీసియస్ వంటి పాత్రలు కీర్తన గీతాల్లోకి ప్రవేశించాయంటారు.

ఈ పరిణామక్రమం నుంచి 'డిథిరాంబ్' మూడు విధాలుగా రూపొందింది. 1. ట్రాగోస్ సాంగ్స్ – శోకభక్తి సమ్మిళిత గీతాలు. ట్రోగోస్ అంటే మేక అని అర్థం. కనుక 'మేక గీతాలు' అని కూడా అనవచ్చు. 2.కోమోస్ సాంగ్స్ – ఆనందోత్సవ గీతాలు, 3. సాటిర్ సాంగ్స్ – భావావేశ గీతాలు. ట్రాగోస్ గీతాలనుంచి ట్రాజడీలు (విషాదాంత నాటకాలు) , కోమోస్ గీతాల నుంచి కామెడీలు (సుఖాంత నాటకాలు), సాటిర్ గీతాల నుంచి సాటిర్ నాటకాలు ఉత్పన్నమయ్యాయని కొందరి ఊహ. థెస్పిస్ తర్వాత విషాద నాటకానికి ఒక అస్తిత్వాన్నిచ్చి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తి ఎస్కిలస్. గ్రీకు విషాదాంత నాటక రచయితలుగా ప్రఖ్యాతి చెందిన వారు ముగ్గురు, ఎస్కిలస్, సోఫోక్లిస్, యూరిపిడిస్.

విషాద నాటకాలకు పితామహుడు ఎస్కిలస్ అని నాటక పండితుల అభిప్రాయం. క్రీ.పూ. 499లో మొదటిసారి నాటకపోటీల్లో ప్రవేశించి 13 సార్లు బహుమతులు అందుకున్నాడు. అప్పటి నాటకరంగంలో కొన్ని మార్పులు ప్రవేశపెట్టాడు. థెస్పిస్ ప్రవేశపెట్టిన మొదటి నటుడికి తోడుగా రెండో నటుణ్ణి ప్రవేశ పెట్టడం అత్యంత ప్రధానమైన మార్పు. ఒక్కడు మాట్లాడితే అది ఉపన్యాసం లేదా స్వగతం అవుతుంది.

ఇద్దరు మాట్లాడితే అది సంభాషణ అవుతుంది. ఆ విధంగా ఎస్కిలస్ బృందగానాలకు సంభాషణలను యిద్దరు నటుల ద్వారా జోడించటంతో నాటకీయత ఏర్పడింది. కోరస్ సంఖ్య 50 నుండి 15కు పరిమితం చేయడం వల్ల కోరస్ ప్రాముఖ్యం తగ్గి, పాత్రల ప్రాధాన్యం పెరిగింది. ఇది ఎస్కిలస్ ప్రవేశ పెట్టిన రెండో మార్పు.

ఎస్కిలస్ దృష్టిలో మానవ జీవితం విషాదమయం. దేవతల అపార శక్తిసామర్థ్యాల ముందు మానవుడు తల వొగ్గవలసిందే. దేవుడు పాపులను శిక్షిస్తాడు. పాపం నుంచి పాపం పుడుతుంది. విధిని ఎవరూ తప్పించుకోలేరు. మానవుల పతనానికి మానవులే కారణం అని ఎస్కిలస్ సిద్ధాంతీకరించాడు. ఈయన రాసిన ఎనభై నాటకాలలో ఏడు మాత్రమే లభ్యమవుతున్నాయి. ది సప్లయంట్ ఈయన రాసిన మొదటి నాటకం. రెండోది ది పర్షియన్స్, మూడోది ప్రోమోథియస్ బౌండ్ మొదలైనవి.

సోఫోక్లిస్ క్రీ.పూ 496లో ఒక సంపన్న వ్యాపార కుటుంబంలో జన్మించాడు. వందకు పైగా నాటకాలు రాశాడంటారు. కాని ఏడు మాత్రమే లభ్యమవుతున్నాయి. నాటక పోటీలలో ఎస్కిలస్‌నే ఓడించాడు. పోటీలలో 18 సార్లు గెలుపొందాడు. సంభాషణలున్న మూడో నటుడిని ప్రవేశ పెట్టాడు. నాటక సంభాషణల్లో క్లుప్తత పాటించాడు. పాత్రచిత్రణలో నైపుణ్యం ప్రదర్శించాడు. పాత్రల మధ్య స్పర్థను, సంఘర్షణను ప్రవేశపెట్టాడు. బృందగానం, నాటక నటుల మధ్య సమన్వయాన్ని సమకూర్చాడు. సీన్ పెయింటింగ్ ప్రవేశ పెట్టిన ఖ్యాతి ఇతనిదే. సోఫోక్లిస్ రచనలో రెండు రకాల విషాదాలు కన్పిస్తాయి. ఒకటి విపరీతమైన మోహం నుంచి పుట్టిన విషాదం (మోహఫలం). రెండవది విధి సంకల్పం వల్ల పుట్టిన విషాదం. సోఫోక్లిస్‌కు దేవుళ్లపై విశ్వాసం ఉంది. విధి అనివార్యత పై కూడా విశ్వాసం ఉంది. అందుకు బలమైన ఉదాహరణ ఈడిపస్ నాటకం. ఈడిపస్ ది కింగ్, ఈడిపస్ ఎట్ కలోనస్, ఆంటిగొని, ఫిలాక్టిటస్, ఎలక్ట్రా, ఆజాక్స్, ది ట్రాకినేయ్ మొదలైన నాటకాలు రచించిన, సోఫోక్లిస్ క్రీ.పూ. 406లో మరణించాడు.

గ్రీకు నాటకరంగంలో సోఫోక్లిస్ వారసుడు యురిపిడిస్. ప్రవృత్తి రీత్యా సోఫోక్లిస్‌కి పూర్తిగా విరుద్ధ స్వభావం. 92 నాటకాలు రచించిన యురిపిడిస్ నాటక పోటీల్లో అయిదు సార్లు బహుమతులు గెల్చుకున్నాడు. ఈయనకు మత విశ్వాసాలపై, గ్రీకు దేవతలపై విశ్వాసం లేదు. యురిపిడిస్ నాటకాలపై ఇతని సమకాలికులు కొన్ని విమర్శనాస్త్రాలు సంధించారు. వాటిలో ప్రధానమైనవి రెండు. యురిపిడిస్ సంప్రదాయ విలువలకు, పురాణ కథలకు భిన్నమైన వ్యాఖ్యానాలు చేశాడనీ, తద్వారా సమాజ పునాదుల్ని కించపరచాడనేది ఒక అభియోగం కాగా,అతని నాటక రచనలో స్పష్టత లేదనీ, అన్వయక్లిష్టత హెచ్చుగా ఉందనేది రెండో విమర్శ.

యురిపిడిస్ తన నాటకాల్లో బృందగాన ప్రాముఖ్యాన్ని తగ్గించి నాటకీయతకు ప్రాధాన్యం ఇచ్చాడు. ఈయన రచించిన నాటకాలలో వాస్తవికతకు ఎక్కువ ప్రాముఖ్యం యిచ్చినట్లు కొందరు విమర్శకుల అభిప్రాయం. యురిపిడిస్ సమాజ శ్రేయస్సుకు అవసరమైన మతం, నీతి మొదలైన సమస్యల కంటె వ్యక్తుల ప్రేమ, ద్వేషం ప్రతీకారం మొదలైన రజోగుణాలను, ఉద్వేగాలను ఎక్కువగా చిత్రించాడు. ఈయన నాటకాలలో స్త్రీద్వేషం కనిపిస్తుంది. ఈయన రాసిన 92 నాటకాలలో యిప్పుడు 18 మాత్రమే లభ్యమవుతున్నాయి. వాటిలో సైక్లోప్స్, ఆల్సెస్టిస్, హిపోలిటస్, మోడియా, ఆగమెమ్నన్, ది ట్రోజన్ ఉమెన్, సప్లయంట్స్, హెలెన్, ది బాకీ మొదలైనవి సుప్రసిద్ధ నాటకాలు. యురిపిడిస్ మరణంతో గ్రీకు విషాద నాటక రచయితల శకం ముగిసింది. యురిపిడిస్ తరువాత గ్రీకు నాటకరంగంలో చెప్పుకోదగిన నాటకకర్తలు లేరు. అయితే 4వ శతాబ్దం లో నాటక విమర్శకు ప్రాధాన్యం పెరగడం ప్రత్యేకంగా పేర్కొనదగిన అంశం.

అరిస్టాటిల్ (క్రీ.పూ. 384-322) రాసిన కావ్య శాస్త్రం (Poetics) అనే గ్రంథం నేటికీ నాటక లక్షణాల పరిశీలనకు ప్రామాణికంగా నిలిచి ఉంది. తన పూర్వులు వేసిన నాటకాలననుసరించి నాటక లక్షణాలను సూత్రీకరించాడు. అరిస్టాటిల్ సూత్రాల ప్రకారం, సహజంగా జరిగే ఒక క్రియకు ప్రతిరూపం నాటకం. కనుక నాటకంలో కథకు (ఇతివృత్తానికి) ఆది, మధ్యాంతాలు ఉండాలి. ఒక సంఘటన నుంచి మరొక సంఘటన పుట్టుకురావాలి. సంఘటనలు తర్కానికి నిలిచేవిగా ఉండాలి. అయా పాత్రల నైతిక ప్రవర్తనను అనుసరించి పాత్రచిత్రణ జరగాలి. నాటక నిర్మాణంలో కాల, వస్తు, ఐక్యతలను విధిగా పాటించాలని అరిస్టాటిల్ సిద్ధాంతం. విషాద నాటక లక్షణాలను వివరిస్తూ అరిస్టాటిల్, నాయకుడు ప్రేక్షకుల సానుభూతి పొందే మంచి లక్షణాలున్న వ్యక్తిగా ఉండాలనీ, అతనిలో ఏదో స్వల్ప లోపం వల్ల అతని జీవితం విషాదం అయ్యేలా ఉండాలని తెలిపారు. ఈ లోపాన్ని అరిస్టాటిల్ గ్రీకు భాషలో హామర్షియా అని పేర్కొన్నాడు. కెథారిసిస్ అనే మరొక సిద్ధాంతాన్ని కూడ అరిస్టాటిల్ ప్రతిపాదించాడు. జాలి, భయం, లాంటి ఉద్వేగాలను విషాదం, శోకం పరిశుద్ధం చేస్తుంది. అందువల్ల ఈ అనుభూతుల్ని ప్రేక్షకుడు, రంగస్థలంపై నటుని బాధను తనబాధగా అనుభవిస్తాడు. ఆ తన్మయత్వంలో తన బాధల్ని మరచిపోతాడు. అందుకే, ప్రేక్షకుడుని పాత్రలో లీనం చేసేలా నటన ఉండాలని ఈ సిద్ధాంత సారం.

గ్రీకుల సాటిర్ నాటకాలు: క్రీ.పూ. 3వ శతాబ్దంలో అలెగ్జాండ్రియా రాజధానిగా పాలించిన రెండవ టాలమీ కాలంలో, అతని పోషణలో గ్రీకుల విషాదాంత నాటకాల పునరుద్ధరణ జరిగింది. రెండవ టాలమీ పెద్ద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాడు. ఆ గ్రంథాలయం అగ్నికి ఆహుతి కావటంతో గ్రీకు సంస్కృతి క్షీణించింది. నాటక రంగంలో తొలి ఆవృతం (the first circle) పూర్తయింది.

గ్రీకుల ట్రాజడీ నాటకాల ప్రదర్శనానంతరం సాటిర్ నాటకాన్ని ప్రదర్శించడం ఆచారం. అయితే క్రీ.పూ. 5వ శతాబ్దం తర్వాత సాటిర్ నాటకాలను విడిగా ప్రదర్శించే ఆచారం వచ్చింది. ఈ సాటిర్ నాటకాలు మొరటుగా ఉండేవి. కథ కన్నా సాహస కృత్యాలకే ప్రాధాన్యం. గుర్రం తల, మానవ శరీరం, తోకలు ధరించిన బృంద గాయకులు తోళ్లు కప్పుకుని ఆడుతూ పాడుతూ ప్రదర్శనలిచ్చేవారు. ఇలాంటి సాటిర్ నాటకాన్ని ట్రాజడీ నాటకానికి అనుబంధంగా ఎందుకు ప్రదర్శించే వారో తెలియదు. అసభ్య సంభాషణలు, అసభ్య శారీరక విన్యాసాలు యీ తరహా నాటకాలలో పుష్కలంగా ఉండేవి. ఏరియన్ ప్రాటినస్ ఇటువంటి నాటకాలు రాసేవాడని తెలుస్తుంది.

గ్రీకుల కామెడీ నాటకాలు : సాటిర్ నాటకాలకు ఇంచుమించు సమాంతరంగా కామెడీ నాటకాలు ఆరంభమయ్యాయి. ఇవి సంగీత ప్రధానాలు. కమ్యూసెస్ (comuses) అన్న గ్రీకు పదం నుండి కామెడీ (comedy) పదం వచ్చింది. కామెడీ అంటే ఆంగ్లంలో రెవెల్‌సాంగ్ (revel song) అని అర్థం. దీనినే కొందరు కేరింత గీతం అని ఆంధ్రీకరించారు. డయోనిసిస్ ఉత్సవాలలో కామెడీ కూడా ఒక భాగం. ఇది స్త్రీ పురుష లైంగిక సంబంధమైన ఒక క్రతువు. నటులు, పక్షులు, కోళ్లు, గుర్రాలు ఆనవాలు గల ముసుగులు ధరించి పాటలు పాడుతూ నృత్యం చేసేవారు. స్త్రీ పురుష సంపర్కమే సృష్టికి ఆధారం. పిల్లలు పుట్టాలన్న కోరిక యీ సంప్రదాయానికి మూలం. కామెడీలను చాలకాలం వరకు ఎవరూ పట్టించుకోలేదు. వాటిని ఉత్తమ తరగతి నాటకాలుగా పరిగణించలేదు. ట్రాజెడీ నాటకాల పోటీ ప్రారంభమైన 50 సంవత్సరాల తరువాత గాని కామెడీ (సుఖాంత) నాటకాల పోటీలు ప్రారంభం కాలేదు. కామెడీలను మధ్యాహ్నం పూట ప్రదర్శించేవారు. తొలి కామెడీ నాటకాలు ఏవీ లభ్యం కాలేదు. ఈ నాటకాలు అవహేళనాత్మకంగా ఉండేవి. క్రీ.శ. 5వ శతాబ్ది ద్వితీయార్థంలో కామెడీలకు గుర్తింపు వచ్చింది. అందుకని కామెడీని పాత కామెడీ (Old comedy), మధ్య కామెడీ (Middle comedy), నవీన కామెడి (New comedy) గా విభజించారు.

పాత కామెడీ : క్రేటినస్ (Cratinus), యుపోలిస్ (Eupolis) లను తొలి కామెడీ కర్తలుగా పరిగణిస్తారు. ది క్లౌడ్స్ (The clouds) అనే నాటకాన్ని యుపోలిస్ రాశాడు. అరిస్టోఫెన్స్ కాలంలో కామెడీ ఉచ్ఛస్థితికి చేరుకుంది.

అరిస్టోఫెన్స్ (క్రీ.పూ.448-380) ఉన్నత వంశంలో జన్మించాడు. తనకు ముందున్న రచయితల కంటె ఈయనది భిన్నమైన తత్వం. అభిప్రాయ మనేది మనసుకి సంబంధించింది. హేతువుకు నిలబడక పోవచ్చు అన్నది ఈయన మతం. ఈయన యుద్ధ వ్యతిరేకి. శాంతి కాముకుడు. ఆనాటి ప్రభుత్వం అవినీతికి నిలయంగా ఉండేది. నటులకు ఉన్న స్వేచ్ఛను ఉపయోగించుకొని, తన నాటకాల ద్వారా, సమాజంలో బాధ్యతా రహితంగా, విశృంఖలంగా వ్యవహరించే వ్యక్తుల్ని, అధికార గణాన్ని తన నాటకాల ద్వారా అవహేళన చేశాడు. ప్రజాస్వామ్య పక్షనాయకుడు క్లియోన్, నాటక రచయిత యురిపిడీస్ అతనికి ఇష్టంలేదు. ఎస్కిలస్, సోఫోక్లిస్ నాటకాలను ఇష్టపడేవాడు. సోక్రటీస్‌ను కూడా పరిహసించేవాడు. అరిస్టోఫెన్స్ రాసిన నాటకాలలో ది బాంక్వటర్స్, ది బాబిలోనియన్స్, ది వాస్ప్స్, పీస్ మొదలైనవి రాజకీయ ఇతివృత్తాలతో కూడినవి. సాంస్కృతిక అంశాలపై రాసిన నాటకాలలో ది ఫ్రాగ్స్, ప్లూటస్ ప్రసిద్ధమైనవి. చివరి నాటకం క్రీ.పూ 388లో ప్రదర్శించబడింది. ఆ తరువాత మూడేళ్ళకు అరిస్టోఫెన్స్ మరణించాడు. అరిస్టోఫెన్స్ నాటక ఇతివృత్తాలలో సార్వజనీనత లేదు. అన్నీ స్థానిక సమస్యలతో నిండి ఉండేవి. అయితే ఈయన కవిత్వం గొప్పగా ఉంటుంది. అందువల్లనే ఈయన నాటక రచయితగా నిలదొక్కుకోగలిగాడు.

మధ్య కామెడీ (Middle comedy) : మిడిల్ కామెడీకి కూడా అరిస్టోఫెన్స్ పేరు ప్రసిద్ధం. చివరి దశలో ఈయన రాసిన నాటకాలు మిడిల్ కామెడీకి చెందినవే. నాలుగవ శతాబ్దపు చివరి మూడు పాదాలలో ప్రేమ, కుట్రలకు సంబంధించిన ఇతివృత్తాలు గల నాటకాలు వెలువడినట్లు తెలుస్తుంది.

నవ్య కామెడీ (New Comedy) : నాలుగో శతాబ్దపు ప్రథమ పాదానంతరం యీ నవ్య కామెడీ నాటకాలు మొదలయ్యాయి. అప్పటికి ఏథెన్స్ నగరం మెసడోనియా పాలన కిందికి వెళ్లింది. రచయితలు సెంటిమెంటల్ కామెడీల వైపు దృష్టిని సారించారు. వీటిని డొమెస్టిక్ కామెడీలు, కామెడీ ఆఫ్ మేనర్స్ అని పిలుస్తారు. అంటే గృహ వాతావరణ సంబంధమైన నాటకాలన్నమాట. వీటిలో మనుషుల స్వభావాలు, ప్రవృత్తులు చిత్రించబడ్డాయి.

గృహసంబంధమైన ఇతివృత్తాలతో , నవ్య కామెడీ నాటకాలు రాసిన వారిలో మోనాండర్ (క్రీ.పూ. 342-241) అగ్రగణ్యుడు. ఈయనే నవ్య కామెడీ పితామహుడు. షేక్స్పియర్, మోలియర్ చాలా తెలుగు నాటకాలలో కూడా, ఇతని కామెడీశైలి ఛాయలు కనిపిస్తాయి. మోనాండర్ ఏథెన్స్ నగరంలో క్రీ.పూ.342లో జన్మించాడు. అప్పటికే గ్రీస్‌లో పెరిక్లిస్ యుగం సమాప్తమయింది. అలెగ్జాండర్ తూర్పు దండ యాత్రలు, విజయాలు మోనాండర్‌ని బాల్యంలో ఆకర్షించాయి. ఎపిక్యురస్, (క్రీ.పూ.341-270) అరిస్టాటిల్, థియోఫ్రాస్టస్ లాంటి పండితులు ఆ రోజుల్లో ఏథెన్స్‌లో ఉండేవారు. వీరిలో థియో

ఫ్రాస్టస్ ప్రభావం మోనాండర్ మీద బలంగా ఉంది. అప్పట్లో ఎలెక్సిస్‌తో సహా 30 మందికి పైగా నాటక రచయితలు మిడిల్ కామెడీ నాటకాలు రాశారు. మెసడోనియాకు చెందిన ఏథెన్స్ పాలకుడు డెమిత్రియస్ మోనాండర్ స్నేహితుడు. 307లో డెమిత్రియస్ తన పదవిని కోల్పోయాడు. అయినా మీనాండర్ ఖ్యాతి ఎంత గొప్ప దంటే, మెసెడోనియా, ఈజిప్టుదేశాల పాలకులిద్దరూ ఇతనిని తమ ఆస్థానానికి ఆహ్వానించారు. కానీ మోనాండర్ అంగీకరించలేదు. 291 లో మీనాండర్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మరణానంతరం మోనాండర్ ఖ్యాతి దశదిశలా విస్తరించింది. ఈయన నాటకాలు తరువాత వారికి పాఠాలయ్యాయి. ఈయన రచించిన మూడు నాటకాలలో కొన్ని భాగాలు మాత్రమే 1905లో బయటపడ్డాయి. మోనాండర్ నాటక రచన ఆరంభించే నాటికి ఏథెన్స్ నగర జీవితంలో ప్రజల అభిరుచుల్లో ఎంతో మార్పువచ్చింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో విలువలు అంతరించి, సర్వత్రా స్వార్థం నెలకొని ఉంది. అందరికీ అధిదేవత ధనలక్ష్మి అయింది. అందుచేత వివిధ రకాల మనుషుల మనస్తత్వాల చిత్రణకు మోనాండర్ ప్రాధాన్యం ఇచ్చాడు. ఆ రోజుల్లో ఏథెన్సులో బానిసత్వం ఉండేది. ప్రేమ పెళ్లిళ్లకు అనేక అవరోధాలు ఉండేవి. ఉన్నత కుటుంబాలలో పుట్టి, తప్పిపోయి, బానిసలుగా పెరిగిన యువతుల కథలు ఈయన నాటకాలలో ఎక్కువగా ఉండేవి. కాల్పనికశృంగారంపాలుహెచ్చు. స్వగతాలు సుదీర్ఘంగా ఉంటాయి. పాత్రల ప్రవేశ, నిష్క్రమణలకు ఎన్నో కారణాలు సృష్టించేవారు. పాత్రధారులు ముఖానికి పాత్రోచితమైన ముసుగులు (Masks) ధరిస్తారు. నటన మధ్యలో, విశ్రాంతి సమయంలో హాస్యంతో ప్రజలను నవ్విస్తారు. బృందగానం (కోరస్) ఆరంభం నుంచి చివరిదాకా కొనసాగే పద్ధతికి మోనాండర్ స్వస్తి చెప్పాడు. అయిదు అంకాల కింద నాటకాన్ని విభజించాడు. మోనాండర్ నాటకాల కథా వస్తువులు, పాత్రలు, ఆ తర్వాత వచ్చిన నాటకాలలో కనిపిస్తాయి.

గ్రీకుల రంగస్థలాలు : మొదట్లో ఉత్సవ క్రతువుల్లో ప్రదర్శనలు బహిరంగ ప్రదేశాలలో జరిగేవి. క్రీ.పూ. 500 లో ఏథేన్స్‌లో తొలి రంగస్థల నిర్మాణం జరిగింది. వర్తులాకారంగా వుండే భాగంలో బృందగాన నృత్యం జరిగేది. దీనిని ఆర్కెస్ట్రా అంటారు. గ్రీకు రంగస్థలానికి ప్రాథమిక రూపం ఈ ఆర్కెస్ట్రా. దీని చుట్టూ ప్రేక్షకారాగాన్ని నిర్మించారు. ఆర్కెస్ట్రాకు 55 అడుగుల దూరంలో అర్థ చంద్రాకారంలో కొండరాళ్లను ఓ క్రమపద్ధతిలో చదునుచేసి ప్రేక్షకులకు కూర్చొని చూసే ఏర్పాటు చేశారు. దీనిని థియాట్రాన్ అంటారు. గ్రీకు నాటకాలు సూర్యోదయం తరువాత ప్రారంభమై సాయంకాలం వరకూ నడిచేవి. సుమారు 15వేల మంది ప్రేక్షకులు ప్రదర్శనలను తిలకించే వారు. వర్తులాకారంగా ఉండేస్థలం మధ్యలో ఒక మంటపం (Alter) ఉండేది. దానిని గ్రీకు భాషలో థెమిల్ (Thymle) అని పిలుస్తారు. వాద్య బృందం కూర్చొనే చోటుకు వెనక ఎత్తైన వేదిక ఒకటి ఉండేది. దాన్ని (Skene) అన్నారు. ఇరుకైన పొడవాటి మార్గం ఇది. భాగంలో మెట్లుండేవి. గ్రీకు రంగస్థలాలన్నీ దాదాపు యిదే పద్ధతిలో ఉండటం విశేషం.

క.మ.రా.

రోమన్ నాటకరంగం

రోమ్, గ్రీసు దేశాన్ని జయించి (క్రీ.పూ. 160) పాలించటంతో, గ్రీకు సంస్కృతి తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. అయితే గ్రీకు నాటక ప్రభావం రోమన్ నాటకాలపై ఉంది. గ్రీకు నాటకాల రచనా శైలిని అనుకరిస్తూ రోమన్ పురాణాలు, చారిత్రక ఘట్టాలనూ ఇతివృత్తాలుగా స్వీకరించి నాటక రచనలు చేశారు. రోమన్ సామ్రాజ్యం యిటు గ్రీకు, అటు స్పెయిన్, ఇంగ్లండు దాకా విస్తరించింది. ఏడెనిమిది శతాబ్దాలు మన గలిగింది. అందుచేత రోమన్ నాగరికత, సంస్కృతులతో పాటు, వాటిలో అంతర్గతంగా ఉన్న గ్రీకు సంస్కృతి కూడ ఐరోపాలో చాల వరకు పాతుకు పోయింది. గ్రీకు, రోమన్ నాటకసంప్రదాయాలు ఇతర ఐరోపారాజ్యాల వారికి మూలస్తంభాలుగా నిలిచాయి.

ఇటలీలో ప్రాచీన కాలంలో దేవతోత్సవాల్లో, ఏవేవో హాస్యపుపాటలు పాడేవారు, ఆడేవారు. ఆ తరువాతి కాలంలో ఆలాంటి ప్రహసనాలను ప్రదర్శించేవారు. తిండిపోతులు, గూనివాళ్ళలాంటి వికృత స్వరూపుల పాత్రలతో హాస్యం అల్లేవారు. ఆ తరువాత మైమ్, (మూకాభినయం) ఫాంటోమైమ్‌లు ప్రదర్శించారు. ఇవి కూడా మొరటుగా ఉండేవి.

రోమన్ రిపబ్లిక్ అవతరించాక, ప్రజల కోసం వినోద క్రీడలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వినోద క్రీడల్లో నాటక ప్రదర్శన కూడా ఒకటి. అప్పట్లో రోమన్‌ల భాష లాటిన్. గ్రీకుల ఆహ్లాద నాటకాలను లాటిన్‌భాషలోకి అనువదించి ప్రదర్శించే వారు. ఈ నాటక రచయితలు తమ జీవనోపాధి కోసం నాటకాలు రాసేవారు. వినోద క్రీడల్లో నాటక ప్రదర్శన కూడా



రోమ్ రంగస్థలం

ఒక భాగం కనుక రచయితలు యితర క్రీడలతో పోటీపడేవారు. అప్పట్లో రోమ్‌లో నాటక శాలలులేవు. బహిరంగంగా ప్రదర్శించే వారు. ప్రవేశం ఉచితం. ప్రదర్శన ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా జరిగేది. రాజకీయ పరిపాలన, అధికార వర్గం మీద విసుర్లు ఉండేవి కాదు. సమకాలీన వ్యక్తులను, సంఘటనలనే చిత్రించేవారు రచయితలు. కథ సామాన్య ప్రేక్షకులకు కూడ అర్థమయ్యేలా జాగ్రత్తలు తీసుకొనేవారు. పిరికిపందలు, లోభులు, దుబారా ఖర్చులు చేసే వ్యక్తుల వంటి పాత్రలుండేవి. నటులు గొంతు చించుకొని అరిచేవారు. పెద్ద కంఠస్వరం నటులకు తప్పనిసరి అయ్యేది.

లివియస్ ఆండ్రోనికస్ తొలితరం రోమన్ నాటకకర్త. అనేక గ్రీకు నాటకాలను లాటిన్ భాషలోకి అనువదించి ప్రప్రథమంగా ప్రదర్శింపజేసిన ఘనత ఈయనకే దక్కుతుంది. రోమ్‌లో జరిగే వినోద క్రీడల్లో భాగంగా ప్రదర్శించటానికి గ్రీకు నాటకాలను అనువదించి, తరువాతి రోమన్ నాటకకర్తలకు మార్గదర్శకుడయ్యాడు. క్వింటస్ ఎన్నియస్ (క్రీ.పూ 239–169)కూడా తొలితరం నాటకకర్తలలో ఎన్నదగిన రచయిత. ఈయన నాటక ప్రక్రియలోనే కాక యితర సాహిత్య ప్రక్రియల్లోనూ పేరు తెచ్చుకున్నాడు. క్వింటస్ విషాద నాటకాలు, ఆహ్లాద నాటకాలు ఇరవై దాకా రాసినప్పటికీ, ఆహ్లాద నాటకాలు అంతగా రాణించలేదు. విషాద నాటకాలు మాత్రమే ఈయనకు గుర్తింపు తెచ్చాయి. ఈ విషాద నాటకాలు కూడా యురిపిడీస్ రచనలకు అనుసరణలే. ఆండ్రోనికస్ రచనలేవీ లభ్యం కాకపోగా, క్వింటస్ రచనల్లో కొన్ని మాత్రం లభ్యమౌతున్నాయి. మార్కస్ పాక్యూలియస్ (క్రీ.పూ 210–130) దాదాపు పన్నెండు విషాద నాటకాలు రాశాడు. నేవియస్ (క్రీ. పూ 274–202) రాసిన వ్యంగ్య నాటకాలు కూడా కొన్ని ప్రజాదరణ పొందాయి.

ఆర్థికంగా ఎన్నో కష్టాలు అనుభవిస్తూ నాటక రచన సాగించిన ప్లాటస్ అసలు పేరు అది కాదనీ మారు పేరనీ కొందరి అభిప్రాయం. ప్రజారంజకత్వమే పరమార్థంగా పెక్కు నాటకాలు రాశాడు. ప్రేక్షకుల నాడి తెలిసిన రచయిత. ప్రేక్షకుల్ని సంతోష పెట్టడానికే తన రచనా వ్యాసంగం సాగించాడు. ఆ క్రమంలో నీతి నియమాలను అంతగా పట్టించుకోలేదు. నాయకుడ్ని వెన్నంటి ఉండే బానిస పాత్రలను హాస్యానికి ఆటపట్టుగా

చిత్రించాడు. ఎత్తుకు పై ఎత్తులు, రసవత్తర సంఘటనలు నాటక విజయానికి ప్రధానమని ప్లాటస్ విశ్వసించాడు. వ్యంగ్యాన్ని సమర్థవంతంగా పోషించాడు. హాస్యం పండించటంలో దిట్ట. ఈయన రచించిన మెనాచ్మి నాటకం షేక్స్పియర్ కామెడీ ఆఫ్ ఎర్రర్స్ కు మాతృక. ప్లాటస్ సుమారు 130 నాటకాలు రచించినట్టు తెలుస్తోంది. వాటిలో 21 మాత్రమే ప్లాటస్ రచనలని అధికారికంగా వెల్లడైంది. 'క్యాప్టివీ' సుప్రసిద్ధ నాటకం. ది కాస్కెట్ ప్లే, అల్యూలారియా, మైల్స్ గ్లోరియోసస్, ఎపిడికస్, త్రినూమస్ మొదలైనవి ప్లాటస్‌కు పేరు తెచ్చిపెట్టిన నాటకాలలో కొన్ని. ప్లాటస్ నాటకకర్తే కాదు. నటుడు, నిర్వాహకుడు కూడా. ప్లాటస్ ప్రజల అభిరుచులను దృష్టిలో పెట్టుకొని రాస్తే టెరెన్స్ మేధావుల కోసం నాటకాలు రాశాడు.

క్రీ.పూ.190లో కార్థేజ్‌లో జన్మించినటెరెన్స్, బానిసగా యజమానితో రోమ్ నగరానికి వచ్చాడు. యజమానే ఈయనకు విద్య నేర్పించాడు. ఈయన ప్రతిభను గుర్తించాడు. బానిసత్వం నుంచి స్వేచ్ఛ ప్రసాదించాడు. ఇతని స్ఫురద్రూపం, సాహిత్యంలో పాండిత్యం, ఉన్నత కుటుంబాల వారిని ఆకర్షించింది. టెరెన్స్ పాలకులను, ప్రభుత్వ అధిపతులను సంతోషింపచేయడం తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. 19 ఏళ్ల వయసులో ఈయన రాసిన మొదటి నాటకం ఆండ్రియా నుంచి చివరి నాటకం అడెల్ఫీ వరకు అతని నాటకాలలో క్రమపరిణామం, పరిణతి కన్పిస్తుంది. గ్రీకు నాటకాల్లో అంతస్సారాన్నిపట్టుకుని, వాటికి మెరుగులు దిద్ది నాటకాలు రాశాడు. గ్రీకు నాటకాలలోని నాంది ప్రస్తావనలను, స్వగతాలను పరిత్యజించాడు. వాటి స్థానంలో నాటకీయతను, సంభాషణలను ప్రవేశపెట్టాడు. స్థల, కాలాదులకు అతీతమైన ఒక ప్రపంచ వాతావరణం ఈయన నాటకాలలో కన్పిస్తుంది. స్త్రీ, పురుషులు ప్రేమించుకొనే సన్నివేశాలను ప్రవేశ పెట్టాడు. లాటిన్ భాషకు టెరెన్స్ రచనలు సరళత్వాన్ని, శుద్ధతను, ఆలంకారికతను సంతరించి పెట్టాయి. అయితే టెరెన్స్ నాటకాలను విమర్శించిన వాళ్లు, హేళన చేసిన వాళ్లు లేకపోలేదు. సిసిరో, హోరేస్ వంటి మేధావులు ఈయన నాటకాలను వేనోళ్ల కొనియాడారు. పునరుజ్జీవన కాలంలో ఈయన రాసిన అనేక నాటకాలు యూరోపియన్ భాషల్లోకి అనువాదం అయ్యాయి. టెరెన్స్ గ్రీసుకు వెళ్లి అక్కడ అకాల మరణం చెందాడు.

రోమన్ నాటకరంగంలో విషాద నాటకాలు రాసిన వారు కొద్ది మంది మాత్రమే. వీరిలో సెనెకా కూడా ఒకడు. టెరెన్స్ మరణం తరువాత రోమన్ నాటక రంగం మరింత వేగంగా క్షీణించింది. ప్లాటస్, టెరెన్స్‌ల కాలంలో వారి నాటకాలు ప్రదర్శించటానికి రంగశాలలే లేవు. ఎత్తైన వేదికలనే రంగస్థలాలుగా చేసుకొని నాటకాలను ప్రదర్శించేవారు. నాటక ప్రదర్శనల పట్ల అభిరుచి పోయింది. ఇంతలో రోమన్ సామ్రాజ్యానికి జూలియస్ సీజర్ చక్రవర్తి అయ్యాడు. ఈయనకు నాటకాలంటే ఇష్టంలేదు. ప్రజలు బానిసల ప్రదర్శనలను, గ్లాడియేటర్స్ పోరాటాలను, సాముగరిడీలను, సర్కస్‌లను చూసి విపరీతంగా ఆనందించే వారు. పాలకవర్గం, ఉన్నత వర్గాల వారికి అధికారం కోసం ఎత్తులు పైఎత్తులు , పోరాటాలు, క్రీడలుగా మారాయి. వ్యభిచారం వారికి ఆనంద సాధన అయింది. ప్రజలు అనేక మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారు. కామెడీ నాటకాల స్థానాన్ని ఈ గ్లాడియేటర్స్ ఒకరినొకరు చంపుకోవడం ఆక్రమించింది. ఈ పరిస్థితుల్లో నాటక ప్రదర్శనలు మూల పడ్డాయి. అయితే కొందరు శ్రవ్య నాటకాలు రాశారు. చక్రవర్తి జూలియస్ సీజర్ స్వయంగా శ్రవ్య నాటకాన్ని రాశాడు. అయితే శ్రవ్య నాటక రచనకు శ్రీకారం చుట్టిన రచయిత సెనేకా. అంతేకాదు ఈయన ఒక విధంగా రోమన్ నాటక రంగాన్ని పునరుజ్జీవనం చేశాడు. సెనెకా స్పెయిన్ దేశస్థుడు. లాటిన్ భాష నేర్చుకుని ఆ భాషలో తొమ్మిది విషాద నాటకాలు రచించాడు. ఈయన ప్రభావం షేక్స్పియర్ పై కూడా ఉంది.

నిరాశా, నిస్పృహలు, మంత్ర తంత్రాలు, కుట్రలు కుయుక్తులు, స్వామి ద్రోహం, భీభత్స దృశ్యాలు, పశుప్రవృత్తి సెనెకా నాటకాలలో కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలున్న గ్రీకు నాటక కథలనే ఈయన తన అనువాద నాటకాలకు ఇతివృత్తాలుగా ఎన్నుకొన్నాడు. అయితేఈయన నాటకాలలో ప్రదర్శనార్హత మృగ్యం. అందువల్ల వీటిని శ్రవ్య నాటకాలుగా పేర్కొనవచ్చు. శబ్దాడంబరంతో కూడిన ఉద్వేగపూరిత సంభాషణలు, బృందగాయకులు, దయ్యాలు, మాంత్రికులు, చివరికి శవాల గుట్టలు ఈయన నాటకాలలో ఎక్కువగా కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఆంగ్లంలో షేక్స్పియర్ నాటకాలలో కూడా కనిపిస్తాయి. సెనెకా రచించిన (అనువదించిన) నాటకాలు మోడియా, ట్రోడ్స్, ఫెడ్రా, ఆగమెమ్నన్, హెర్క్యుల్స్, ఫ్యూరెన్, ఈడిపస్, ఫోనిస్, ధీసిస్తా మొదలైనవి పేర్కొనదగినవి.

సెనెకా రాజకీయ వేత్త, తత్వవేత్త . ఈయన నీరో చక్రవర్తి (క్రీ.శ 54–68) గురువు, అతని ఆజ్ఞ మేరకు సెనెకా ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే క్షీణించిపోయిన రోమన్ నాటకరంగం సెనెకా తరువాత కాలగర్భంలో కలిసిపోయింది.

క.మ.రా

ఫ్రెంచి నాటకరంగం

ఫ్రెంచ్, లాటిన్ భాషనుంచి ఉత్పన్నమైందని భాషా శాస్త్రజుల అభిప్రాయం. ప్రపంచ నాటకరంగంలో పెనుమార్పులు రావడానికి ఫ్రాన్స్ దేశం ప్రముఖ పాత్ర పోషించింది. పియారీ కార్నియల్, జీన్ రేసిన్, మోలియర్, వాల్టేర్, రూసో, ఎమిలీ జోలా, మేటర్‌లింక్, యూజీనీ ఇయెనెస్కో, శామ్యూల్ బెకెట్, జీన్ పాల్ సార్త్రే, ఆల్బర్ట్ కామూ వంటి ప్రపంచ విఖ్యాత నాటక కర్తల మేధో నిలయం ఫ్రాన్స్.

ఫ్రాన్స్‌లో సాంస్కృతిక పునరుజ్జీవనం 1550 ప్రాంతంలో ప్రారంభమైంది. 1522 నాటికే పాత పద్ధతిలో కొన్ని నాటకాలు వెలువడినప్పటికీ, యుద్ధ వాతావరణంతో తల్లడిల్లిపోతున్న పరిస్థితుల్లో ఆ నాటకాలేవీ రాణించ లేదు. ప్రదర్శనలు కూడా చెదురు మదురుగా ఉండేవి. సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ ఫలితంగా వివిధ రంగాలలో మేధో విప్లవం మొదలైంది. విజ్ఞానం బహుముఖంగా విస్తరించింది. సాహిత్యం, కళలు కొత్త రూపు సంతరించుకొన్నాయి. 17వ శతాబ్దంలో ఫ్రెంచి అకాడమీ స్థాపించబడింది. ఆనాటి పాలకుడు లూయీ, సాహిత్యం, కళల అభివృద్ధికి అండగా నిలిచాడు. ప్రభుత్వ ఆదరణతో నాటకానికి అత్యంత ప్రాధాన్యం లభించింది. నాటక రచన ఉద్దేశ్యం మానసికోల్లాసం కలిగించటంతో బాటు మనోవికాసాన్ని కలిగించేదిగా ఉండాలన్నది గమ్యంగా స్థిరపడింది. ఆహ్లాద నాటకాలు మనుషుల దుర్వర్తనను, వింత చేష్టలను వ్యంగ్యాత్మకంగా, పరిహసించే ధోరణిలో ఉండాలనీ, విషాద నాటకాలు వివిధ వ్యక్తులు చేసే తప్పిదాల వలన, దుర్మార్గాల వలన సంభవించే భయంకర ఫలితాలను ఎత్తిచూపే రీతిలో ఉండాలనేది ఒక సంప్రదాయంగా వెలుగులోకి వచ్చింది. 17, 18వ శతాబ్దాలలో నాటకరంగం సాహిత్యంలో నవ్య సంప్రదాయవాదం (నియోక్లాసిజం) వ్యాప్తిలోకి వచ్చింది. దీని ప్రకారం నాటక రీతుల్లో స్వచ్ఛత ఉండాలనీ, అయిదు అంకాలు విధిగా ఉండాలనీ, నాటక శైలి ఆకర్షణీయంగా ఉండాలనీ, అన్నిటికంటె ముఖ్యంగా కాల, వస్తు, స్థల ఐక్యతల సూత్రాన్ని పాటించాలని కొన్ని లక్షణాలు నిర్దేశింపబడినాయి. నవ్య సంప్రదాయం ప్రకారం విషాదాంత నాటకాలలో పాత్రలు రాజవంశీయులకు సంబంధించినవై ఉండటం, సుఖాంత నాటకాలలో పాత్రలు మధ్య తరగతి, దిగువ తరగతి వర్గం వారై ఉండటం ఒక నియమం. విషాదాంత నాటకాలలో సంభాషణాశైలి కావ్యధోరణిలోను, సుఖాంత నాటకాలలో సామాన్యుల భాషాశైలి లోనూ ఉండాలనే నియమం నవ్య రూపక రచనా సంప్రదాయంలో అంతర్భాగమే. ఈ నిబంధనలు ఈనాడు వింతగా తోచినా ఆ కాలంలో రచయితలందరూ వీటిని అనుసరించిన వారే. ఈ విధానానికి నాంది పలికిన నాటక కర్త పియరీ కార్నియల్ (1606-1684). ఈయన 1620 నుంచీ రాస్తున్నా 1636 నాటికి గాని ప్రసిద్ధిలోకి రాలేదు. ఈయన రచించిన ది సిడ్ నాటకం వివాదాలకు దారి తీసింది. నవ్య రూపక రచనా సంప్రదాయాన్నే పాటించినా, వస్తువులో స్వచ్ఛతలేదనీ, హుందాతనం కానరాదనీ, ఐక్యత్రయాన్ని పాటించలేదనీ పండితులు విమర్శించారు. ఈ కారణాల చేత ది సిడ్ విషాద నాటక పరిధిలోకి రాదని ఆక్షేపించారు. పండితుల తీర్పును గౌరవించిన కార్నియల్ ఆ తరువాత రాసిన నాటకాలలో సంప్రదాయానికి పెద్ద పీఠ వేశాడు. ది సిడ్ నాటకాన్ని మోలియర్ (అప్పటికి నటుడే) 1664లో ప్రదర్శించాడు. రచనాపరంగా తీవ్ర విమర్శలకు గురైన ది సిడ్ నాటకం విజయం సాధించడం విశేషం. జీన్‌రేసిన్ (1639-1699) ఫ్రెంచి నాటకాలు గ్రీక్ రోమన్ విషాద నాటకాలకు ధీటైనవని నిరూపించి అనంతర రూపక రచయితలకు మార్గ దర్శకుడయ్యాడు. ఈయన రాసిన విషాద నాటకాలలో *ఆంద్రోమాక్ (1667), బెరెనైస్* (1670), ఫెద్రా(1677) నాటకాలుప్రసిద్ధాలు. రేసిన్‌ఖ్యాతిని ఇనుమడింప జేసిన ఫెద్రా నాటకం చిత్రాంగి, సారంగధరుల కథను పోలిన నాటకం. గ్రీక్ నాటకం హిప్పోలిటస్ నాటకాన్ని అనుసరించి రేసిన్ ఈ నాటకం రచించాడు. సవతి కొడుకును ప్రేమించి భంగపడిన ఫెద్రా అనుభవించే మానసిక సంఘర్షణ, పశ్చాత్తాపంతో కుమిలిపోవడం, తాను తప్పు చేస్తున్నాననే స్పృహ ఉన్నా ఆపుకోలేని కామోద్రేకం ఆమె పతనానికి ఎలా దారి తీశాయో ఈ నాటకంలో సహజంగా చిత్రితమైంది. గ్రీకు నాటకకర్త యురిపిడీస్ రాసిన నాటకంలో ఉన్న దేవుళ్ళను, కోరస్‌ను పరిహరించి సహజత్వానికి, నిత్యజీవిత సంఘటనలకు దగ్గరగా రేసిన్ ఈ నాటకాన్ని రాశాడు. ఫెద్రా పండిత పామరుల అభిమానాన్ని చూరగొన్న నాటకం. మోలియర్‌తో సమ భాగస్వామిగా ఓ నాటక కంపెనీని ప్రారంభించిన నాటక రచయిత రేసిన్. ఈయన ప్రదర్శించిన ప్రదర్శనల్లో స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించేవారు. వృద్ధ స్త్రీ పాత్రలు మాత్రం పురుషులే

పోషించేవారు. ప్రదర్శన ద్వారా వచ్చే డబ్బు నటీనటులు, రచయిత పంచుకొనేవారు. నటీనటులు రంగస్థలం మీద మామూలు దుస్తులే వేసుకొనేవారు. షేక్స్పియర్ నాటకాలలో వాడే దుస్తుల వంటి ఆడంబరాలకు పోయేవారు కాదు. అంతవరకూ నటుడుగా జీవితం సాగిస్తున్న మోలియర్ క్రమంగా నాటక రచన చేపట్టి మొదటి నాటకంతోనే ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు.


పాంపే నాటకంలో విషాద నాయక పాత్రలో మోలియర్

17వ శతాబ్దంలో హాస్య రచయితలలో అగ్రగణ్యుడుగా ప్రపంచఖ్యాతి గడించిన ఫ్రెంచి నాటకకర్త మోలియర్ (1622-1673) అసలు పేరు జీన్ బాప్టిస్ట్ పొక్యూలిన్. మోలియర్ పేరు వినగానే హాస్యపాత్రలు, సన్నివేశాలు, చమత్కారభరితమైన సంభాషణలు స్ఫురణకు వస్తాయి. నిజానికి మోలియర్ హాస్య నాటకాలే కాక తద్భిన్నమైన రచనలు కూడా చేశాడు. కాని హాస్య రచయితగానే ప్రపంచ నాటకరంగంలో అతనికి ముద్రపడింది. కడుపుబ్బనవ్వించే ఈయన ఫార్సులకు ముడిపదార్థం ప్లాటస్, టెరెన్స్ వంటి రచయితల నుండి గ్రహించింది కొంత, స్పానిష్, ఇటాలియన్ సాహిత్య భాండాగారాల నుండి పరిగ్రహించింది కొంత. విషాద నాటకాలకే సాహిత్యరంగంలో పరపతి, గౌరవం ఉన్న ఆ కాలంలో ఆహ్లాద నాటకాలకు విశిష్టతను, ప్రత్యేక ప్రతిపత్తిని సమకూర్చాడు మోలియర్. విషాద నాటకాలు కూడా మోలియర్ నాటకాల ముందు వెలవెల బోయే పరిస్థితిని కల్పించిన ప్రథమ నాటక కర్త మోలియర్. ఈయన రచించిన *ది స్కూల్ ఫర్ వైవ్స్ (1662), టార్ టఫ్(1664), డాక్టర్ ఇన్ స్పైటాఫ్ హిమ్ సెల్ఫ్ (1666), ది మిసంత్రోప్ (1666), ది ఇమాజినరీ ఇన్ వాలిడ్ (1673)* మొదలైన ఆహ్లాద రూపకాలన్నీ మోలియర్ హాస్య రచనా చమత్కృతికి ఉదాహరణలే. ప్రదర్శనల ద్వారా హాస్య రసాన్ని అందించాలనే తపన ప్రతి నాటకం చాటున దాగి ఉంటుంది. అధిక్షేపాత్మక రచనల ద్వారా ఆ నాటి ప్రభుత్వాధికారుల్లో పెచ్చు పెరిగిన అవినీతి, లంచగొండితనం, అలసత్వం వంటి రుగ్మతలపై ధ్వజమెత్తాడు. ఉన్నతవర్గాల డాంబికాన్ని, డొల్లతనాన్ని హేళన చేశాడు. అన్నిటికీ మించి ఆనాడు సంఘంలో అత్యంత గౌరవస్థానంలో ఉండే మతగురువుల కాపట్యాన్ని బట్టబయలు చేశాడు. మోలియర్ రాసిన టార్టఫ్ నాటకంలో మతగురువు అనుచిత ప్రవర్తన, ఆడిన కపట నాటకం వంచనా శిల్పానికి పరాకాష్ఠ అనిపిస్తుంది. ఈ నాటకం ఫ్రాన్సులో పెద్ద సంచలనం రేపింది. *లవ్ ఈజ్ ది బెస్ట్ డాక్టర్, ది స్కూల్ ఫర్ హజ్బండ్స్ డాన్ జాన్* నాటకాలు కూడా హాస్య రసగుళికలు. మోలియర్ రచనలను భమిడిపాటి కామేశ్వరరావు తెలుగులో అనువదించాడు. మోలియర్ 1673లో మరణించాడు. మోలియర్ చనిపోయే నాటికి ఆనాటి సమాజంలో క్రైస్తవ మత సంప్రదాయం ప్రకారం నటులకు సమాజంలో గౌరవ స్థానం ఉండేదికాదు. నటనా వృత్తిలో ఉన్నవారు చనిపోతే చర్చి మర్యాదలతో సమాధిచేయటానికి అర్హత ఉండేదికాదు. అందుకని నటులు తమ అవసానదశలో నటనావృత్తిని మానుకుని, చర్చి పరిధిలోకి రావడానికి వీలు కల్పించుకొనేవారు. మోలియర్ రచయితగా ప్రపంచ ఖ్యాతి గడించినా నటుడుగా చనిపోయినపుడు సమాధి చేయడానికి చర్చి ఆధిపత్యం నిరాకరించింది. మోలియర్ మరణానంతరం ఫ్రెంచి నాటక రంగంలో స్తబ్ధత ఏర్పడింది. పురోగమనం కనిపించలేదు. 1674 ప్రాంతంలో కార్నియల్ నాటక రచన మానుకున్నాడు. రేసిన్ కూడా కొత్తనాటకాలేవీ రాయలేదు. 1680 నాటికి ఫ్రెంచి నాటక వైభవం అంతరించింది. అనేక నాటకశాలలు మూత పడ్డాయి. మోలియర్ కంపెనీ తరువాత 17వ శతాబ్దాంతం వరకు సంగీత రూపకం రాజ్యం చేసింది. నూతన రూపక రచనా సంప్రదాయయానికి బలమైన పునాదులు వేసి రచయితల త్రయం బాటలో పదిహేడవ శతాబ్ది పూర్వార్థంలో కాల్పనికవాదం బయలుదేరే వరకు అదే పద్ధతి కొనసాగుతూ వచ్చింది.

18వ శతాబ్దంలో ఇంగ్లీషు నాటకరంగం ఆకర్షణీయంగా వర్థిల్లుతూ ఉన్నప్పటికీ ఆ రచయితలు ఫ్రెంచి నాటక కర్తల రచనా విధానాన్నే అనుకరిస్తూ వచ్చారు. ఫ్రెంచి

నాటక రంగం ఐరోపా దేశాలన్నిటికీ తలమానికంగా ఉండేది. దాని ప్రభావం సర్వత్రా విస్తరించింది. రాజకీయంగా, సాంస్కృతికంగా ఫ్రాన్స్ ఆధిక్యంలో ఉండడమే అందుకు కారణం. మోలియర్ నాటకాలను ఆదర్శంగా తీసుకుని ఆ వెలుగులోనే నాటకరచనా వైశిష్ట్యాన్ని కొలిచే సంప్రదాయం పాతుకుపోయిన కారణంగా 18వ శతాబ్దిలో ఐరోపా నాటకరంగంలో నూతనావిష్కరణలు కుంటుపడ్డాయి. వాటికి తగిన వాతావరణం గాని, ప్రోత్సాహం గాని లభించలేదు. వాల్టేర్ (1694-1778) ప్రవేశంతో నాటకరంగంలో నూతన ఆవిష్కరణలు కొంతలో కొంతగా మొదలయ్యాయి. వాల్టేర్, రేసిన్ పద్ధతుల్ని పాటించినప్పటికీ నాటకరంగంలోకి కొత్త నెత్తురు ఎక్కించడానికి పూనుకొన్నాడు. రంగస్థలం మీదికి బహుళ పాత్రల్ని, భూత ప్రేత గణాన్ని ప్రవేశ పెట్టాడు. హింసను తగ్గించాడు. నాటకం కేవలం సంభాషణాత్మకంగా కాక, సంఘటనలతో వాస్తవ రీతిలో దృశ్యమానం చేసే ప్రయత్నాలు చేశాడు. ఈయన రచించిన జైరే(1732), అల్ జీరే(1736) ఉత్తమ నాటకాలుగా ప్రజాదరణ పొందాయి. ఆహ్లాద నాటకాలలో సెంటిమెంటల్ కామెడీని ప్రవేశ పెట్టిన రచయిత పియరీ కార్లెట్ డీ చాంబ్లెయిన్ డి మారివా (1688-1763). అంతరంగిక సమస్యలతో గాని, బాహ్య పరిస్థితుల ప్రాబల్యంతో గాని ప్రేమజంట సంఘర్షించడం వంటి ప్రేమ కథలకు కొత్త రూపం ఇచ్చాడు పియరీ కార్లెట్. ఈయన రాసిన నాటకాల్లో ది గేమ్ *ఆఫ్ లవ్ అండ్ ఛాన్స్ (1730), ది సర్‌ప్రైజ్ ఆఫ్ లవ్ (1733), ఫాల్స్ కాన్ఫిడెన్సెస్ (1737)* సుప్రసిద్ధాలు. కౌటుంబిక, విషాద నాటకాలకు అంకురార్పణ చేసిన రచయిత డిడరాట్ (1713-1784). వాస్తవిక సన్నివేశాలతో కూడిన విషాదాంత, సుఖాంత నాటకాలు ప్రజలకు చేరువు అవుతాయనీ, పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలు వాస్తవిక దృక్పథంతో మలచినపుడే వాటికి సజీవత్వం వచ్చి చేరుతుందని డిడరాట్ అభిలషించాడు. ఆ మేరకు కృషి చేశాడు. రంగస్థలం మూడు గోడలతో కూడిన ఒక గది అనీ, దాని నాలుగో గోడ అదృశ్య రూపంలో ఉంటుందనీ, ప్రేక్షకులు ఈ పారదర్శక గోడ ద్వారా ప్రదర్శన తిలకిస్తారని ఫోర్త్‌వాల్ (నాలుగో గోడ) భావనను అభివ్యక్తం చేసిన ఖ్యాతి డిడరాట్‌దే. అభినయం గురించి ది పారడాక్స్ ఆఫ్ ది ఏక్టర్ రచించాడు. ఈ గ్రంథంలో కాల్పనిక సన్నివేశాలను చూసి అవి వాస్తవంగా జరుగుతున్నవేనని అనుభూతి చెందేవిధంగా నటవర్గం తమ బాహ్య ఉద్రేకాలను ప్రదర్శించి వారిని ఆకట్టుకోవాలని ఉద్బోధించాడు. ఈయన చెప్పిన భావాలు ఆచరణీయాలే అయినా అవి సమకాలీనుల ఆదరణకు నోచుకోలేదు. డిడరాట్ రాసిన ది ఇల్లెజిటిమేట్ సన్ (1757) ఫాదర్ ఆఫ్ ఎ ఫామిలీ (1758) నాటకాలు అంతగా రాణించలేదు. విషాద నాటకాలనే పేరుకు మారుగా ఈయన సృష్టించిన డ్రేమ్ అనే పదప్రయోగం గంభీర నాటకాలకు స్థిరపడి, వ్యాప్తిలోకి వచ్చింది. ఈ శతాబ్దంలో ప్రాచుర్యంలోకి వచ్చిన నాటక కర్తలలో పియరీ ఆగస్టిన్ కరోన్ (1732-1799) పేర్కొనదగినవాడు. డిడరాట్ పద్ధతిలో కొన్ని డ్రేమ్స్‌కు రూపకల్పన చేశాడు. వాటిలో ది బార్బర్ ఆఫ్ సెవెల్లే (1775) ది మేరేజ్ ఆఫ్ ఫిగారో (1784) నాటకాలు ముఖ్యమైనవి. క్లెయిరాన్, డుమెస్‌నిల్, లెకైన్ ఈ శతాబ్దిలో గొప్ప నటులుగా ప్రసిద్ధికెక్కారు. నవ్య రూపక రచనా సంప్రదాయానికి క్రమక్రమంగా దూరమౌతూ, వాస్తవికతా వాదానికి చేరువు అవుతూవచ్చింది నాటకరంగం. 19వ శతాబ్దంలో అడుగు పెట్టేసరికి నాటకరంగంలో కాల్పనికవాదం పొడచూపింది. ఇది నియోక్లాసిజమ్‌ను వెనక్కు నెట్టసాగింది. మధ్యతరగతికి నాటక రచనలో ప్రాధాన్యం పెరిగింది. హేతువాదం ప్రబలింది. అమెరికా, ఫ్రెంచి విప్లవాలకు హేతువైన సమానత్వం, స్వేచ్ఛ, సౌహార్దతలు నాటకరంగంలో ప్రతిఫలించాయి. ప్రదర్శనలో మెలోడ్రామా ప్రాధాన్యం సంతరించుకొంది. నాటకం ప్రధాన వినోద సాధనంగా అన్ని తరగతుల ప్రజల్లో ప్రాచుర్యం పొందింది. ఎవరో నిర్దేశించిన అంశాలను ఆమోదించే పద్ధతి మారి రచయితలో స్వయం నిర్ణయం ఆరంభమైంది. రాజకీయ, ఆర్థిక శక్తులకు లంగకుండా, స్వతంత్ర ఆలోచనతో వ్యవహరించే తత్వం అలవడింది. నిత్యజీవితంలో తర్కబద్ధంగా సంభవించే సంఘటనలే చిత్రించాలని నియోక్లాసిజం పరమాశయమైతే, కాల్పనికవాద రచయితలకు అలౌకిక విషయాలు కూడా ఆమోదయోగ్యమయ్యాయి. దయ్యాలు, భూతాలు, మంత్రాలు, శాపాలు కూడా రచనా విధానానికి స్వీకార యోగ్యం అయ్యాయి. వీటివల్ల నాటకరచనా స్వరూప స్వభావాలలో అపూర్వమైన మార్పులచ్చాయి. జర్మనీలో స్కిల్లర్, గోథే కాల్పనిక వాదం బాటలో ఉత్తమ రచనలు చేసి ఇతర దేశాలకు స్ఫూర్తి నిచ్చారు. ఫ్రెంచి కాల్పనికవాద నాటకకర్తలలో అలెగ్జాండర్ డ్యుమాస్ (1803-1870), ఆల్‌ఫ్రెడ్ డి విగ్ని (1797-1863), ఆల్ ఫ్రెడ్ డి ముస్సేర్ (1810-1857) ముఖ్యులు. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఫ్రాన్స్‌లో ఆర్థిక సంక్షోభం తలెత్తింది. పారిశ్రామిక విప్లవం ఫలితంగా కార్మికులు జీవిక కోసం పట్టణాలకు ఎగబడటంతో నగర జీవితం నరకప్రాయమైంది. మనిషి జీవించడమే ప్రధాన సమస్య అయిన తరుణంలో కాల్పనిక

రచనలకు ఆదరణ లేకుండా పోయింది. మనిషినీ, సమాజాన్ని అవగాహన చేసుకోవడానికి సామాజిక శాస్త్రాలు ప్రధాన పాత్ర వహించాలని ఆగస్ట్ కాంప్టే (1798-1857) ప్రవచించాడు. ఈ సమయంలో డార్విన్ జీవపరిణామ సిద్ధాతం (1859) ప్రకటించబడింది. ప్రతి మనిషి చేసే పని వెనక అనువంశిక లక్షణం, పరిసరాల ప్రభావం ఉంటుందనీ కనుక అతను చేసే తప్పులకు అతను బాధ్యుడు కాదనీ అనువంశికత, పరిసరాలే కారణమని వివరించబడింది. నాటకరచనలో నిజం ప్రతిబింబించాలనీ, ఆ నిజం మన పంచేంద్రియాల ద్వారా గ్రహించినదై ఉండాలని రియలిజం (వాస్తవికతావాద) సారాంశం. ఫ్రాన్స్‌లోనే తొలిసారిగ రియలిజం ప్రాణం పోసుకుంది. కళ్ళ ముందు కనబడే, మనకు పరిచయమైన సమాజాన్నే నాటక రచయితలు చిత్రించాలనే లక్ష్యం వారికి ఆదర్శ ప్రాయమైంది. సంప్రదాయవాదులకు ఇది కొరుకుడు పడలేదు. నాటకరంగాన్ని మురికి కూపంలోకి ఈడ్చుకుపోతున్నారని ఆక్రోశించారు. అలెగ్జాండర్ డ్యూమాస్, ఎమిలీ ఆగియర్ (1820-1889) వాస్తవిక నాటకాలు రాసిన ఫ్రెంచి రచయితలలో ప్రముఖులు. డ్యూమాస్ రాసిన ఫైల్స్, కెమిల్లె నాటకాలు తీవ్ర విమర్శలకు గురైనవి. కెమిల్లెలో బంగారు మనసు గల వేశ్యను గాక ఉంపుడుగత్తెను రచయిత చిత్రించాడని విమర్శలు చెలరేగాయి. 1885 వరకు కెమిల్లె నాటకం ప్రదర్శించక పోవడానికి ఆ విమర్శలే కారణం. ఆగియర్ నాటకాలు ఆనాటి ఫ్రెంచి రాజకీయ, సాంఘిక పరిస్థితుల ఆధారంగా రాయబడినవి. డబ్బుకు గల శక్తి, రాజకీయాలలో చర్చి జోక్యం చేసుకోవడం, పతిత స్త్రీలు మున్నగు అంశాలు ఈయన నాటకాలలో కథా వస్తువులుగా ఉండేవి. యూత్ (1858), గిబాయర్స్ సన్ (1862), ఆగియర్ వాస్తవిక నాటకాలలో పేరొందినవి. ఇదే సమయంలో నార్వేజియన్ నాటకకర్త ఇబ్సన్ చేతిలో వాస్తవికతా వాదం బహుముఖాలుగా విస్తరించి విశ్వవ్యాప్తమైంది. ఇంగ్లాండ్‌లో జార్జి బెర్నార్డ్‌షా, రష్యాలో ఆంటోని చెకోవ్ వాస్తవిక నాటకాలకు ప్రాణం పోశారు.

వాస్తవికతావాదం వేళ్లూనుకొంటున్న దశలోనే సమాంతరంగా స్వభావవాదం (నేచురలిజమ్) అభివృద్ధి చెందుతూ వచ్చింది. దీనికి ఎమిలీ జోలా (1840-1902) ఆద్యుడు. వాస్తవికతావాదానికి, స్వభావవాదానికి మధ్య పెద్ద తేడాలేదు. జీవితాన్ని పంచేద్రియాలతో అధ్యయనం చేసి వాస్తవికంగా చిత్రించాలన్నది రెండింటి ధ్యేయమైనా, స్వభావ వాదులు నాటకాల్లో శాస్త్రీయ దృక్పథం ఉండాలంటారు. సమాజంలోని రుగ్మతలను కనిపెట్టి వాటిని దృశ్యమానం చేయాలని వారి ఆశయం. వ్యథిత మానవ చిత్రణ రచన పరమావధి కావాలని వారి లక్ష్యం. నాటకం జీవిత శకలంగా ఉండాలనే ఉద్దేశ్యంతో స్వభావ వాదులు కలం సాగించారు. జోలా థైరిసెరాక్విన్ (1873), హెన్రీబెక్ (1837-1899) ది వల్చర్స్ (1882) స్వభావవాద నాటకాలు ప్రసిద్ధి చెందాయి. ఫ్రాన్స్‌లో బయలుదేరిన స్వభావవాదం క్రమక్రమంగా ఇతర దేశాలకు కూడా విస్తరించింది. జర్మనీలో గెర్హార్ట్ హాప్ట్‌మాన్, రష్యాలో మాక్జిమ్ గోర్కీ స్వభావ రచయితలుగా ప్రసిద్ధి చెందారు. పారిస్‌లో 1887లో స్థాపించబడిన థియేటర్ లిబర్ ఆంద్రీ ఆంటోయిన్ సారథ్యంలో స్వభావ వాద నాటకాలకు వేదికను సమకూర్చి పాటుపడింది.

1880లో ప్రతీకవాదం (సింబాలిజమ్)కు కూడా ఫ్రాన్స్ దేశమే ఉత్పత్తి కేంద్రమైంది. ఇది వాస్తవికవాదానికి వ్యతిరేకం. రియలిజంలోను, నేచురలిజంలోనూ పంచేద్రియాల ద్వారా గ్రహించిన జ్ఞానం ప్రధానమైంది. పంచేంద్రియాల ద్వారా లభించే జ్ఞానం బాహ్య జగత్తుకు సంబంధించినదనీ, అంతర ప్రకృతిలో దాగున్న భావాన్ని వెలికి తీసినపుడే, నిజం అనే దానికి అర్థం ఉంటుందనీ, అలా కానప్పుడు ఆ ప్రయత్నం అసంపూర్ణమౌతుందనీ, సింబాలిజం ద్వారానే అది సాధ్యమవుతుందని ప్రతీకవాదుల మతం. కొన్ని సంకేతాల చాటున మూలార్థాన్ని మరుగు పరచి చిత్రించడం, ప్రతీక వాదంలో ముఖ్య లక్షణం. వాస్తవిక వాదులకు భిన్నంగా ప్రతీక వాదులు సమకాలీన సమాజాన్ని కాని, సమస్యలను గాని, వాతావరణాన్ని గాని చిత్రించరు. పైపెచ్చు వర్తమాన కాలాన్ని కాక, గతాన్ని, భవిష్యత్తుని సృష్టిస్తారు. కాలానికి, స్థలానికి, తర్కబద్ధతకు దూరంగా ఉండటం ప్రతీకవాదుల రచనావైఖరి. ఇటువంటి అస్పష్టతను, మార్మికతను సంతరించుకొన్న విధానం కనుకనే ప్రతీకవాదం నాటకరంగంలో పదేళ్ళయినా నిలదొక్కుకోలేకపోయింది. ప్రతీకవాదుల నాటక రచయితలలో మోరీస్ మాటర్‌లింక్ (1862-1949) అగ్రగణ్యుడు. ఫెల్లియాస్ ఎటీ మెలిసాండే (1892) ఈయన రచించిన ప్రసిద్ధ నాటకం.

20వ శతాబ్దం ఉత్తరార్ధంలో నాటకరంగం అపూర్వమైన మార్పులకు తావిచ్చింది. రెండు ప్రపంచ యుద్ధాల నడిమికాలంలో పాశ్చాత్య దేశాలలో ప్రజాజీవనం అతలాకుతలమైంది. కుటుంబ వ్యవస్థ చిన్నా భిన్నామైంది. నైతిక విలువలు నేలమట్టమయ్యాయి. మనిషికి స్వార్థమొక్కటే చుక్కాని అయింది. మధ్యతరగతి సమాజం, బడుగు వర్గాలు

నిరాశాకూపంలో పడి తల్లడిల్లిపోయాయి. అలాంటి పరిస్థితుల్లో ఆదర్శ, ఆధ్యాత్మిక వాదాలు ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న మనిషిని సురక్షితంగా గట్టుకు చేర్చలేమనే అపనమ్మకం బలపడుతోంది. అలాంటి తరుణంలో జీన్‌పాల్ సాత్రే వంటి మేధావులు ప్రజలకు బ్రతుకు మీద ఆత్మవిశ్వాసం కల్గించడానికి ఒక నూతన జీవన విధానాన్ని ప్రబోధించారు. సాత్రే ప్రవచించిన జీవిత తత్త్వమే అస్తిత్వవాదం (ఎక్సిస్టెన్షియాలిజమ్). సాత్రే రచించిన నో ఎగ్జిట్, అస్తిత్వవాదాన్ని అభివ్యక్తం చేసే ప్రసిద్ధ నాటకం. అస్తిత్వ వాదులు దేవుని ఉనికిని త్రోసిరాజన్నారు. ఈ లోకంలోకి వచ్చిపడిన మానవులు మనుగడ సాగించాలి. తన బాగోగులకు, సుఖదుఃఖాలకు తానే బాధ్యుడు. కనుక తన జీవిత విధానాన్ని తానే రూపొందించుకుని బ్రతకాలి. ఎవరో నిర్ణయించిన నీతి సూత్రాలను, ప్రవర్తనా నియమావళిని, సంప్రదాయాలను పట్టుకు వేలాడక ఎవరికి వారు స్వేచ్ఛగా, స్వంత అభిప్రాయాలను, విలువలను నిర్ణయించుకొని తమ జీవన విధానం ఏర్పరుచుకోవాలని,అదే ఆత్మబలాన్ని ఇస్తుందనీ జీన్‌పాల్ సాత్రే సిద్ధాంతం. ఈయన తన సిద్ధాంతాలను నాటకరూపంలో ఆవిష్కరించాడు. అస్తిత్వవాదం ఆలంబనగా మరి కొంతమంది కూడా శక్తివంతమైన నాటకాలు రచించారు. వారిలో ఆల్బర్ట్ కమూ (1913-1960)ముఖ్యుడు. ఈ నాటకోద్యమం ఐరోపా, అమెరికా ఖండాలలో విశేషప్రచారం పొంది, నాటకాభిమానులను బాగా ఆకర్షించింది. సరికొత్త భావాలను నాటక సాహిత్యంలో పొందుపరచారే గాని, ప్రదర్శన రీతిలో మాత్రం సంప్రదాయ పద్ధతిని విడనాడలేదు. ఈ ప్రదర్శనల్లో మౌలికమైన మార్పు వస్తువులో వచ్చినంతగా రూపంలో రాలేదు. ఆల్బర్ట్ కమూ రచనలలో క్రాస్ పర్పెసస్ (1944), కలిగుల (1945), జస్ట్ ఎ సాసిన్ (1949) ప్రముఖ నాటకాలు.

ఫ్రాన్స్‌లో మొదలైన మరొక వాదం అసంబద్ధ వాదం **(Absurdism)**. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఫ్రాన్స్‌లో ఉద్భవించిన సరికొత్త నాటక విధానం అసంబద్ధ నాటకం. దీనినే అనిబద్ధ నాటకమనీ, అయోమయ నాటకమని కూడా పిలుస్తారు. అబ్సర్డ్ అనే మాట వినగానే అర్థం పర్థం లేని, అసంగతమైన, అపహాస్యంతో కూడిన నాటకం అని స్ఫురిస్తుంది. నిజానికి ఈ ప్రపంచంలో అర్థవంతంగా లేని మానవుని జీవన గతిని యథాతథంగా (ఎలాంటి ముసుగులు లేకుండా) చిత్రించే నాటకమే అసంబద్ధనాటకం. సంప్రదాయకంగా నాటకాలలో కనిపించే కథాక్రమం, ఇతివృత్తం, పాత్రచిత్రణ, పరాకాష్ఠ, ముగింపు మొదలైన లక్షణాలు ఈ నాటకంలో కనబడవు. సంప్రదాయ నాటకానికి ఇది పూర్తిగా వ్యతిరేకం. సంప్రదాయ నిబంధనలేవీ పాటించని నాటకం కనుక ఇది అనిబద్ధ నాటకం. ప్రదర్శన చూసే ప్రేక్షకుడికి తలాతోక తెలియకుండా గందరగోళంలో పడవేసే నాటకం. అసంబద్ధ నాటకానికి నిరాశావాదమే ప్రాతిపదిక. ఈ నాటక కర్తల భావన ప్రకారం దేవుడు లేని ఈ ప్రపంచంలోకి మనిషి తన ప్రమేయం లేకుండానే తోసివేయబడ్డాడు. గమ్యం తెలియని బాటసారిలా ఒంటరి జీవితాన్ని గడుపుతూ, కొత్త విలువల కోసం గాలిస్తున్నాడు. మానవుడు ఆశలకు అర్థంలేని, అశాస్త్రీయమైన, హేతుబద్ధంకాని ఈ ప్రపంచానికీ సామరస్యం లేదనీ, ఆ కారణం చేత మనిషి మృత్యువు కబళించే వరకు వేచి వుండటం తప్ప మార్గాంతరం లేదనీ అసంబద్ధ నాటకకర్తలు భావిస్తారు. అసంబద్ధ నాటకాలలో నిర్దిష్టమైన కథ, ప్రారంభం, ముగింపు అనేవి ఉండవు. సన్నివేశాలకు, పాత్రల ప్రవేశ, నిష్క్రమణలకు అర్థం ఉండదు. సంభాషణలు సహేతుకంగా ఉండక, అందీ అందకుండా ఒక దానితో ఒకటి పొంతన లేకుండా పిచ్చి వాళ్ల ప్రేలాపనలా ధ్వనిస్తాయి. ఈ ఉన్మాద ప్రేలాపన వెనక అంతరార్థం దాగి ఉంటుందనీ, దాన్ని ప్రేక్షకులు గ్రహించాలనీ ఈ నాటక కర్తల నిశ్చితాభిప్రాయం. స్వాప్నిక జగత్తులో పలికే భాష, భావనలు ఈ నాటకాలలో కనిపిస్తాయి. అసంబద్ధ నాటకానికి ఆద్యుడు శామ్యూల్‌బెకెట్(1915-1969) ఈయన రాసిన వెయిటింగ్ ఫర్ గోడో అసంబద్ధనాటక విధానానికి గీటురాయి. జేన్ గెనెట్ (1910), యూజినీ అయినెస్కో (1912) ఈ బాటలో నడిచిన ప్రసిద్ధ నాటకకర్తలు. బెకెట్ రాసిన ఎండ్ గేమ్, క్రాప్స్ లాస్ట్ టేప్, హేపీ డేస్, జేన్ గెనెట్ ది మెయిడ్స్, ది బాల్కనీ, ది బ్లాక్స్, అయెనెస్కో ఛైర్స్, ది న్యూ టెనెంట్, ఎగ్జిట్ ది కింగ్ మొదలైనవి ఈ జాతి నాటకాలలో సుప్రసిద్ధాలు. అసంబద్ధవాద (అబ్సర్డ్) నాటకాలు వివిధ దేశాల్లో ఇప్పటికీ ఉనికిలో ఉన్నాయి. ఫ్రెంచి నాటకరంగం వివిధ కాలాల్లో ఎన్నో నూతన ఆవిష్కరణలతో ప్రపంచ నాటకరంగానికి వెలుగు బాటలు చూపినప్పటికీ, 1960 నుంచీ ఫ్రాన్స్ దేశం నుంచి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన నాటక కర్తలు లేక పోవడం ఆశ్చర్యావహమైన విషయం.

గం.సు.రె.

జర్మన్ నాటకరంగం

జర్మనీలో 17వ శతాబ్ది ఉత్తరార్ధం వరకు సాంస్కృతిక కార్యకలాపాలకు అనువైన వేదిక ఏర్పడలేదు. మతపరంగా ప్రొటెస్టెంట్లు, కాథలికుల మధ్య పరస్పర వైరుధ్యం, రాజకీయంగా అస్థిరత, 1618లో ప్రారంభమైన ముప్పై ఏళ్ళ యుద్ధంతో అడుగంటిపోయిన ఆర్థిక వ్యవస్థ, వీటి కారణంగా కకావికలమైన సాంఘిక జీవనం ఉన్న పరిస్థితుల్లో సాంస్కృతిక రంగం తల్లడిల్లి పోయింది. అయినా 17వ శతాబ్దానికి పూర్వం జర్మనీలో నాటక ప్రక్రియ లేదని కాదు. గ్రీకు, రోమన్ సంప్రదాయాల కనుగుణంగా నాటక వాఙ్మయం ఉండేదని తెలుస్తోంది. నీతి బోధక ధోరణిలో సాగే క్రైస్తవ నాటకాలు, వ్యంగ్య పరిహాస ధోరణిలో సాగే హాస్య నాటకాలు ఉండేవి. మతాధికారుల నిబంధనల నీడలో ప్రదర్శితమయ్యే ఆ నాటకాలు నిర్జీవంగా, నిస్తేజంగా ఉండేవి. అద్భుత, నీతిబోధక నాటకాలలో సాహిత్య విలువలు, నాటకీయత కొరవడి దృశ్యపరంగా రాణించేవి కావు. కాలక్రమేణా ఆ నాటకాలు చర్చిప్రాంగణాలను దాటి వీధుల్లోకి రావడం జరిగింది. ఈ మార్పు నాటక ప్రదర్శన కొత్త రూపుదాల్చడానికి దోహదం చేసింది. మతసంబంధమైన వస్తువుతోపాటు రచయితలు తమ భావనాబలంతో కొత్తతరహా స్వతంత్ర నాటకాలు రాయడానికి పూనుకొన్నారు. మొదట్లో వారి ప్రయత్నం అంతగా ఫలించలేదు. ప్రదర్శనార్హత గల నాటకాలు కాకపోవడమే దానికి కారణం. పాలకులు అనాదిగా వీరగాథలు గానం చేసే బృందాలను, సంగీత రూపకాలను ప్రోత్సాహిస్తూ వచ్చారు. కొత్తదారి ఏర్పడని కాలంలో ప్రజలు కూడా వాటికే అలవాటు పడి ఆదరిస్తూ వచ్చారు.

16వ శతాబ్దాంతంలో వృత్తి నాటక సమాజాలేర్పడి ప్రదర్శనలివ్వడం మొదలైంది. వీటికి ప్రాచుర్యం కల్పించిన వారు ఇంగ్లీషు నటులు, కొంత వరకు ఇటలీ నటులు. ఇంగ్లీషు నటులు తొలుత జార్జిపీలె,క్రిస్టఫర్ మార్లో, థామస్‌కిడ్ ముతక నాటకాలను ప్రదర్శించినా,తరువాతి కాలంలో షేక్స్పియర్ నాటకాలను కూడా వేయడం జరిగింది. కొన్నాళ్ళు ఆంగ్లంలోనే ప్రదర్శనలు జరిపినా, తరువాత ఈ నాటకాలు జర్మన్ భాషలోకి తర్జుమా చేశారు. బ్రౌన్స్‌విగ్ డ్యూక్ హీన్ రిచ్ జూలియస్ (1564-1613) కొంతవరకు శ్రద్ధ తీసుకొని ఇంగ్లీషు నటులను రప్పించి నాటక సమాజాన్ని నడుపుతూ ఓ పది నాటకాలను రచించాడు. అవన్నీ దాదాపు రక్తసిక్తమైన విషాదాంత నాటకాలు. ప్రప్రథమంగా ఇలా ప్రదర్శించిన సంచార నాటక బృందాలలో రాబర్ట్ బ్రౌన్(1590 -1606), జాన్ స్పెన్సర్ (1605-1623), జాన్ గ్రీన్ (1606-1628) ఆద్యులుగా పేర్కొనవచ్చు. జర్మన్ భాష మాట్లాడే ప్రాంతాలలోని ప్రజలను ఆకట్టుకోవడానికి ఇంగ్లీషు నటులు వారి నాటకాలలో ఎక్కుగా వినోద భరిత సన్నివేశాలను, మూక రూపకం, సంగీత, నృత్యాలను చొప్పించడంతో భాష తెలియకపోయినా ప్రజలు ఆకర్షితులయ్యేవారు. ఇంగ్లీషు నాటకాలంటేనే వాటికొక విలువుండేది. అలా జర్మనీ నటులను మెల్లమెల్లగా ఆ ఇంగ్లీషు బృందాలలో చేర్చుకోవడం ప్రారంభ మయింది. 1650 ప్రాంతానికి పూర్తి జర్మనీ నటులతో నట బృందాలేర్పడ్డాయి. తరువాత పదేళ్ళలో ఇంగ్లీషు నటులు క్రమంగా దూరమైపోయారు.

కాస్త పేరున్న మొట్టమొదటి జర్మనీ బృందాన్ని 1650 నుండి 1687 వరకు కార్ల్ ఆండ్రియాస్ పాల్‌సెన్ నడిపేవాడు. ఆ కాలంలో మరో ముఖ్యమైన వ్యక్తి జహాన్నెస్ వెల్ టెన్ (1640-1695) విద్యాధికుడే కాకుండా జర్మన్‌లో నాటి నాటకరంగ ప్రమాణాల స్థాయిని పెంచాలన్న సదుద్దేశంతో మోలియర్ లాంటి రచయితల నాటకాలను జర్మన్ భాషలోకి అనువదించి తన నాటక సమాజం ద్వారా ప్రదర్శించాడు. సొంత రంగస్థలాలు లేకపోవడం, ప్రేక్షకుల ఆదరణ సన్నగిల్లడం మొదలైన కారణాలతో నాటక బృందాలు కొత్తకొత్త ప్రేక్షకులను వెదుక్కుంటూ ఊరూరా సంచరించడం ప్రారంభించాయి. పెద్ద పెద్ద నగరాల్లో , పండుగ రోజుల్లో ఎక్కువగా ప్రదర్శనలివ్వడం జరిగింది. ప్రేక్షకులను ఆకర్షించడం కోసం ప్రదర్శనల్లో మార్పులు చేసుకుంటూ వచ్చారు. ఆనాటి నాటకాల్లో హింస, అసాధారణ పాత్రలు, సమాసభూయిష్ఠమైన మాటలు చోటు చేసుకోవడమే కాక కొన్ని మూస పాత్రలు దాదాపు అన్ని నాటకాలలోనూ ప్రధానంగా కనిపించేవి.

1725వరకు జర్మన్ నాటకరంగం స్థితి అంతంత మాత్రమనే చెప్పాలి. సరిగ్గా ఆ సమయంలో జోహన్ గాట్‌షెడ్ (1700-1766), కారోలినా న్యూబెర్ జర్మన్ నాటకరంగంలో మార్పు తీసుకురావడానికి కృషిచేశారు. గాట్‌షెడ్ నాటక రంగాభివృద్ధిని కాంక్షించి ఫ్రెంచి నవ్య సంప్రదాయ నాటక విలువలను క్రమంగా జర్మన్ నాటకరంగంలోకి ప్రవేశ పెట్టాడు. జర్మనీ ప్రేక్షకులకు ఈ నియోక్లాసికల్ నాటకం కొత్త. మరోవైపు కారొలినా, నాటక పూర్వాభ్యాసాలు చాలా నిశితంగా పకడ్బందీగా నిర్వహిస్తూ, అభినయంలో స్థాయిని పెంచేందుకు అమితమైన కృషి సల్పింది. గాట్‌షెడ్, కారొలినా న్యూబెల్‌ల కృషి, జర్మన్ నాటక రంగంలోనే కొత్తమలుపుకు కారణమైంది.

జర్మనీ దేశపు ప్రసిద్ధ నాటక రచయితలలో గొట్టోల్డ్ ఎఫ్రయిమ్ లెస్సింగ్ (1729–1781) ప్రథముడు. జర్మన్ ప్రజల అభిరుచి ననుసరించి ఫ్రెంచ్ నియోక్లాసిజం కంటె ఇంగ్లీషు నాటకాలే జర్మనులకు ప్రీతి పాత్రమవుతాయని తన దృష్టి అటువైపు సారించాడు. ఈయన రచించిన మిస్సర సాంప్సన్ (1755) నాటకం విషాదాంత నాటకాభివృద్ధికి దోహదం చేసినా, మిన్నా ఓన్ బార్న్ హెల్మ్ (1767) అనే హాస్య నాటకం ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందింది. లెస్సింగ్ రచనా వ్యాసంగానికి ప్లాటస్, టెరెన్స్, మోలియర్ రచనలు స్ఫూర్తి దాయకమ్మైనవి. పాత్రలు సహజంగా ఉండి మానవ విలువలు సమృద్ధిగా ఉన్నప్పుడే ప్రేక్షకులు అటు హాస్యంలోగాని, విషాదంలో గాని ఆ పాత్రలతో ఐక్యత పొంది రసానుభూతిని పొందగలరని లెస్సింగ్ దృఢ విశ్వాసం.

లెస్సింగ్ చివరి రచన నాథన్ ది వైస్ (1779) ప్రదర్శన కోసమని రాయకపోయినా 18వ శతాబ్దపు ఉత్తమ తాత్విక నాటకంగా పరిగణించుబడింది. అందులో జుడాయిజం, ఇస్లాం, క్రిస్టియానిటీల ప్రతినిధులుగా పాత్రలను సృష్టించి విశ్వమానవ ప్రేమకున్న శక్తిని చాటాడు.

క్రిస్టోఫ్ మార్టిన్ వీలాండ్ (1733–1813) చక్కటి భాషలో షేక్స్పియర్ 22 నాటకాలను తర్జుమా చేయడంతో జర్మనీలో ఓ కొత్త షేక్స్పియర్ సంప్రదాయం ఏర్పడింది. ఈ సమయంలోనే అభినయంలో విలువలు పెరగనారంభించాయి. నటులకు గౌరవం పెరిగింది. 18వ శతాబ్దంలో నటుడిగా తన వృత్తికి పెంచిన, సమకూర్చిన గౌరవాన్ని మరే నటుడు సమకూర్చలేదు. అభినయంలో సహజత్వం కోసం మార్పులు తీసుకురావడంతో పాటు, కొన్నాళ్ళపాటు నట శిక్షణా పాఠశాలను కూడ నడిపి, సమకాలీన గొప్ప నటులనెందరినో ప్రభావితం చేశాడు. ఫ్రెడరిచ్ లుడ్విగ్ ఫ్రోడర్ (1744–1816) 18వ శతాబ్దపు ఉత్తమ నటుడుగా పేరు గడించాడు. అతడి నటనాకౌశలం, నేర్పు, స్వతస్సిద్ధమ్మైన అందం, నాటకాల నిర్వహణలో అతనికున్న ప్రతిభ, నాటక వృత్తిలో జర్మనీలో చాలాకాలం పాటు ఈయన తలమానికంగా నిలవడానికి దోహదం చేశాయి.

1755లో గోతాలో మొదటి జాతీయ నాటకశాల నిర్మించబడింది. తరువాత వరుసగా, వియన్నా, మాన్‌హీమ్, కొలోన్, వెయ్‌మర్, బెర్లిన్‌లలో నాటకశాలలు వెలిశాయి. 1800సంవత్సరానికి ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ ఫ్రెంచ్ కామెడియా ఫ్రాంకోయిస్ తరహాలో నాటకశాలలు నెలకొన్నాయి. గోతా నాటకశాలలో పని చేసే ప్రతి నటుడు ప్రభుత్వ ఉద్యోగి. పెన్షన్ వగైరాలకు అర్హత కల్పించారు. ఇక్కడ నాటకాల ప్రదర్శనకు ఎకాఫ్ బాధ్యుడైన కారణంగా దేశంలోని ప్రతిభావంతులైన యువనటులనెందరినో గోతా థియేటర్‌లో చేర్చుకుని, అభినయంలో శిక్షణ ఇవ్వడంతో తన తదనంతరం వారందరూ గొప్ప నటులుగా రాణించారు.


వెయిటింగ్ ఫర్ గోడో నాటకంలో ఓ దృశ్యం

ప్రారంభంలో సంచార నాటక బృందాలే ఎక్కువగా ఉండడం వలన దృశ్య బంధాలను అనువుగా నిర్మించుకొని వాటినే కొద్దికొద్ది మార్పులతో ప్రతి నాటకానికీ ఉపయోగించేవారు. 1752కు ముందు 3 దృశ్యబంధాలే ఏ నాటకానికైనా సరిపోయేవి. బహిరంగ దృశ్యాల కోసం ఓ అడవి, భవనాల కోసం ఒక హాలు, ఇంటి లోపలి దృశ్యాలకు ఒక ఇంటి సెట్టు ఉండేవి. 1790 నాటికి నాటక రచయితలు, భారీ దృశ్యాలతో వంతెనలు, గోడలు, తలుపులు, కిటికీలు తమ నాటకాల్లో సృష్టించడం వలన క్రమంగా దృశ్యబంధాలు మరికొంత వృద్ధిని సాధించి క్రమంగా జర్మనీలో మొదటిసారిగా పేటికా దృశ్యాలు (Box Set) ప్రారంభమయ్యాయి.

నటుల వేషభూషణ విషయంలో 1725కు పూర్వం జర్మనీలో నటులు ఆడంబరాలకు పోయేవారు కారు. ఒకటో రెండో జతల దుస్తులతోనే ప్రతినటుడూ కొద్ది కొద్ది మార్పులతో ఏ పాత్రనైనా పోషించేవారు. నాటక బృందం యజమాని ప్రతి నటుడికీ ఒక కోటు, వేయిస్ట్‌కోటు మాత్రమే సమకూర్చేవాడు. నాటకంలో నాయకుడు మాత్రం ఒక స్కార్ఫ్, ఒక హెల్‌మెట్ ధరించేవాడు. అదే నటి విషయంలోకి వచ్చే సరికి చాలా అందమ్మైన దుస్తులు ధరించేది. దుస్తులపై కాగితపు లేస్‌ను కుట్టేవారు. 1800 సంవత్సరానికి చాల మార్పులు వచ్చాయి. ప్రతిపాత్రకు సరిపోయే దుస్తులు, సామాగ్రి సమకూర్చడం ఆచారమ్మైంది.

1800 సంవత్సరం తరువాత క్రమక్రమంగా ప్రతిరోజు ప్రదర్శనలు జరిగేవి.

ఆగస్ట్ విల్‌హెమ్ ఇఫ్‌లాండ్(1759-1814) గోతా కంపెనీలో ఎకాఫ్‌కింద తన జీవితాన్ని ప్రారంభించి, 1779లో మాన్‌హీమ్ థియేటర్‌లో చేరాడు. అక్కడే ష్రోడార్ 1780లో షేక్స్పియర్ నాటకాలని ఆ రిపర్టరీకి పరిచయం చేశాడు. ఇఫ్‌లాండ్ అతి తక్కువ వ్యవధిలోనే నటుడుగా, రచయితగా పేరు తెచ్చుకున్నాడు. మాన్‌హీమ్ కంపెనీ ఇఫ్‌లాండ్ 37 నాటకాలను ప్రదర్శిచడంతో ఈయన నాటకాలకు అనూహ్యమైన ప్రజాదరణ పెరిగింది. తరువాత బెర్లిన్ స్టేట్ థియేటర్‌కు ఆధ్వర్యం వహిస్తూ ఆ రిపర్టరీని ఒక చక్కటి ఆదర్శవంతమైన బృందంగా తీర్చిదిద్దాడు.

ఇఫ్‌లాండ్ కన్నా మరింత ప్రసిద్ధి కెక్కిన నాటక రచయిత ఆగస్ట్ ఫ్రెడెరిక్ వాన్ కోట్జెబ్యూ (1761-1819). ప్రజల నాడిని అనుసరించి వారికి ఆనందాన్ని కలిగించే నాటకాలు రచించడమే ఈయన ప్రత్యేకత. బర్గ్ థియేటర్‌లో దాదాపు పాతిక శాతం ప్రదర్శనలు కొట్జెబ్యూ నాటకాలే. ఈయన రాసిన రెండు వందల నాటకాలలో చారిత్రక, వినోద భరితాలున్నాయి. మానవ విలువలు ప్రధానంగా ఆ నాటకాల్లో ఉండడం, మామూలు ప్రజానీకానికి కూడ అర్థమయ్యే భాష, సన్నివేశాల చిత్రణ కారణంగా అవి ప్రజాబాహుళ్యంలో ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందాయి. 1800 ప్రాంతంలో జర్మన్ నాటకాలు ప్రపంచంలో ఎక్కువగా ప్రజాదరణ పొందడానికి ఈయన నాటకాలు చాలావరకు తోడ్పడ్డాయి.

గెటే, షిల్లర్: ఇఫ్‌లాండ్, కొట్జెబ్యూ నాటకరంగాన్ని ఊహించని ఎత్తుకు తీసుకుపోగలిగారు.అలాగే గెటే, షిల్లార్‌లు కూడా నాటకరచనలో ఉన్నత శిఖరాలను స్పృశించారు. వీరిద్దరూ కలిసి వీయ్‌మర్ ప్రత్యేకమైన శైలితో రూపొందించిన ప్రయోగాలు, 19వ శతాబ్దం చివరి వరకూ ప్రజామన్నన పొందుతూనే వచ్చాయి. జర్మనీ మానవాళికి ప్రసాదించిన ఒక మహా సాహితీవేత్త జోహన్ వుల్ఫ్‌గాంగ్ వాన్ గెటే (1749-1832). బాల్యం నుండే సాహితీ క్షేత్రంలో వ్యవసాయాన్ని ప్రారంభించాడు. 1773లో రచించిన గోయట్జ్‌నాటకం ఈయనకు ఎనలేని ఖ్యాతిని ఆర్జించి పెట్టింది. ఆగస్ట్ ప్రభువు అభ్యర్థన మేరకు గెటే, వాయ్‌మర్‌లో స్థిరపడ్డాడు. సెయ్‌లర్, ఎకాఫ్‌ల తరువాత గెటే ఆ పట్టణంలో నాయకుడుగా గుర్తింపబడ్డాడు. అయితే గెటే 1786 నుంచి 1788 వరకు సలిపిన ఇటలీ పర్యటన, తన దృక్పథంలో చాలా మార్పును తీసుకొచ్చింది. సంప్రదాయ రూపకాల పట్ల ఈయనకు కల్గిన ప్రత్యేకమైన అభిరుచితో అంతవరకు అభిమానించిన స్టార్మ్ అండ్ డ్రైస్ నాటకాలను తిరస్కరించడం ప్రారంభించాడు.

గెటే అపారమైన సృజనాశక్తి లోంచి విశ్వవిఖ్యాత నాటకాలు రావడమే కాకుండా, ఆనాటి అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ ఈయన ముద్ర ప్రస్ఫుటంగా కనిపించింది. లీప్‌జిగ్‌లో విద్యార్థి దశలోనే తన ది మూడీలవర్ కామెడీతో గాట్‌షెడ్ గెల్లెర్ట్ లాంటి వారిని అధిగమించాడు. షేక్స్పియర్ రచనలను అధ్యయనం చేసి స్నేహితులతో చర్చించి గోట్జ్ అనే చారిత్రాత్మక నాటకాన్ని రచించాడు. ఇందులో రాబిన్ హుడ్ లాంటి పాత్రను సృష్టించాడు. ఈ నాటకంలో నాటక సంఘర్షణ హేమ్లెట్‌లో ఉన్నట్లుగా కేంద్రీకృతమై ఉంటుంది. ఇందులో పాత్రలు సజీవాలు, దృశ్యాలు, సన్నివేశాలు అందమైనవి. సంఘర్షణ పటిష్ఠంగా, హృదయాలను కదిలించేవిగా ఉంటాయి. శైలి మనోహరంగా ఉంటుంది.

గెటే నాటకాలలో ప్రసిద్ధమైనది డాక్టర్ ఫాస్ట్. సృష్టి రహస్యాన్ని ఛేదించడానికి తన ఆత్మను సాటన్‌కు అప్పగించడమే ఈ నాటకంలోని ప్రధానాంశం. అలాగే గెటే తన సృజనాశక్తిని వ్యంగ్య సన్నివేశాలను రాయడంలో కూడ వినియోగించాడు.

గెటే నాటకాలలో కొంతవరకు నాటకీయత లోపించడాన్ని ఎద్దేవా చేశాడు ఫ్రెడ్‌రిచ్ షిల్లర్. పరస్పరం అసూయపరులైన గెటే, షిల్లర్‌లు తరువాత మంచి మిత్రులయ్యారు. గెటే కంటే షిల్లర్‌కు రంగస్థల పరిజ్ఞానం ఎక్కువ. గెటే దర్శకత్వంలో షిల్లర్ రచించిన ఉత్తమ విషాదాంత నాటకాలు, గెటే రాసిన మనోహరమైన నాటకాలు విరివిగా ప్రదర్శనకు నోచుకున్నాయి. వీరిద్దరూ తమపై షేక్స్పియర్ ప్రభావం లేదని నిరాకరించకపోయినా వీరి నాటకాలలో పురాతన గ్రీకు, ఫ్రెంచ్ నవ్య సంప్రదాయ నాటక ప్రభావం కొంతవరకు కనిపిస్తుంది. అయినా షిల్లర్ విషాదాంత నాటకాలలోని కల్పనా చమత్కృతి, గెటే నాటకాల్లోని మానవతా విలువలు నాటకరంగ చరిత్రలో వారికో ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చాయి.

నాటక ప్రదర్శనల కొచ్చేసరికి, అభినయంలో ఉన్నత ప్రమాణాల వైపు 19వ శతాబ్దంలో బాగా కృషి జరిగింది. ప్రదర్శనలు మెరుగు పడుతూ వచ్చాయి. 1796లో బెర్లిన్ రాయల్ థియేటర్‌కు దర్శకుడుగా ఇఫ్‌లాండ్ నియమింపబడినప్పుడు, ప్రష్యా కోర్టు నుంచి ఈయనకు విరివిగా సబ్సిడీ అందింది. ఈ ధనాన్ని ఈయన ఎక్కువగా షేక్స్పియర్, షిల్లర్ తదితరుల నాటకాలు ప్రదర్శించడానికి ఖర్చు పెట్టాడు. ఈ ప్రదర్శనలు కూడా మున్నెన్నడు ప్రజలు చూడని రీతిలో రంగురంగుల భారీ సెట్లతో, చారిత్రక దృశ్యాలతో ప్రేక్షకులకు మిరిమిట్లు గొలిపేలా ఉండేవి. మిగిలిన థియేటర్లు ఇంత వైభవానికి నోచుకునేవి కావు. నాటకంలోని వస్తువుకన్నా, నటుల సామర్థ్యాలకన్నా, నాటక ప్రయోజనాన్ని పూర్తిగా ప్రేక్షకుల

కందించాలన్న తపన కన్నా, రంగస్థలంపై కనిపించే దృశ్యానికే ప్రాధాన్యతనిచ్చాడు ఇఫ్‌లాండ్.

19వ శతాబ్దంలో జర్మనీలో నగరాల సంఖ్య పెరిగినట్లే,రంగస్థలాల సంఖ్య కూడా పెరిగింది. ఆస్ట్రియా, ఫ్రాన్సు, ఇంగ్లాండు దేశాల్లో లాగ కాకుండా జర్మనీలో నాటకరంగానికి ప్రభుత్వం సహకరించడం కారణంగా ప్రష్యా రాజధాని బెర్లిన్‌లోను ఆ తరువాత ఐక్యజర్మనీలోను ఉధృతమైన అభివృద్ధి సాధించింది.

నాటకరంగ పురోభివృద్ధి వల్ల, నాటకాలలో నటించే కొందరు నటులకు ప్రత్యేక గౌరవం లభించింది. నటనా సామర్థ్యం అధికంగా కల్గిన నటుల ఆవశ్యకత పెరిగింది. ధనార్జనకు అవకాశాలు పెరిగాయి. ఇటు జర్మనీలోనే గాక అమెరికాలాంటి దేశాల్లో థియేటర్ అభివృద్ధి చెందుతుండటంతో ఈ నటులు విదేశాలలో కూడ నాటకాలను ప్రదర్శించి ధనంతో పాటు కీర్తి గడించారు.

1830 విప్లవాల తరుణంలో యంగ్‌జర్మనీ అనే ఉద్యమం ఒకటి ప్రారంభమయింది. దర్శకులు కొందరు కొన్ని వివాదాస్పదమైన నాటకాలను 1830–40లో ప్రదర్శించారు. ఈ నాటకాల్లో ప్రజలెదుర్కొంటున్న రాజకీయ, సాంఘిక పరిస్థితులను స్పృశిస్తూ సాంఘిక చైతన్యాన్ని కలిగించేవారు. ఈ యంగ్ జర్మనీ లోంచి వచ్చినవాడే జార్జి బుఖ్‌నర్. వోయ్‌జెక్ నాటకంలోని యితివృత్తంలో స్వాభావికవాదం, అభివ్యక్తివాదం ఆనాడే తొంగిచూడడంతో రాబోయే తరాలలో ఆవిష్కరింపబడే నాటక శిల్పానికి నాంది పలికాడని 1910లో మాక్స్ రీన్‌హార్ట్ పేర్కొన్నాడు. అప్పటి నుండి బుఖ్‌నర్ 19వ శతాబ్దపు గొప్ప రచయితలలో ఒకడుగా గుర్తింపబడ్డాడు.

1840 తరువాత సమకాలీన విమర్శకుల ప్రశంసలనందుకున్న జర్మన్ నాటకకర్త ఫ్రెడరిచ్ హెబ్బెల్. ఈయన రచించిన నాటకాలలో ప్రధానమైనవి జెనోవేవ (1841), మరియామగ్ధలీనా(1844), హెరోడ్ అండ్ మిరియామ్నె (1849), ది నీబెలున్ జెన్. అన్నింటికన్నా ప్రసిద్ధికెక్కిన మరియా మగ్ధలీనా నాటకంలో పాత్రలు సాధారణ జీవితంలోంచి తీసుకున్నవి. సంఘంలోని సమస్యల కారణంగా నాయిక ఆత్మహత్య చేసుకోవడంతో కథ ముగుస్తుంది. ఈ నాటకం 19వ శతాబ్దపు జర్మన్‌ల జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. తన మిగిలిన నాటకాలలాగే, ఈ నాటకంలో భూత, భవిష్యత్కాల విలువల మధ్య సంఘర్షణ ప్రధానంగా కనిపిస్తుంది. 1863లో హెబ్బెల్ మరణం తరువాత 1890వరకు దాదాపుగా జర్మనీలో నాటకం తిరోగమనాన్ని చవి చూచింది. అయినప్పటికీ, అత్యుత్తమమైన నటులను ప్రసాదించింది. అందులో ప్రత్యేకంగా కనిపించే నటుడు లుడ్‌విగ్ డెవ్‌రియంచ్ (1784–1832). ఈయన నాటకరంగం మీద దాదాపు 500 పాత్రలు ధరించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. ప్రదర్శించిన వాటిలో ప్రత్యేకమైనవి, పేరు తెచ్చి పెట్టినవి షైలాక్, ఫాల్‌స్టాఫ్, కింగ్‌లియర్, ఫ్రాంజ్‌మూర్ (షిల్లర్ రాసిన రాబర్స్ నాటకంలో) 1820 నుండి 1832 వరకు బర్గ్ థియేటర్‌లో తన నటనా కౌశలంతో వియన్నా ప్రజల హృదయాల్లో నిలిచిపోయాడు. అలాగే గెటే, షిల్లర్ నాటకాలలో తన వాచిక, ఆంగికాభినయాలతోనూ ముగ్ధులను చేశాడు.

19వ శతాబ్దపు చివర మెసీంజన్ కోర్టు థియేటర్ ప్రజాదరణకు ఎక్కువగా నోచుకున్నది. ఈ కంపెనీని బాగా అభివృద్ధిలోకి తీసుకువచ్చిన వారు రెండవ జార్జి, డ్యూక్ ఆఫ్ సాక్స్ మెసీంజన్ (1826–1914). అతడి భార్య ఎల్లెన్ ఫ్రాంజ్, దర్శకుడు లుడ్‌లిగ్ క్రోనెక్, బెర్లిన్‌లో 1874లో మొదటిసారి జూలియస్ సీజర్, ట్వెల్త్‌నైట్ తదితర నాటకాల ప్రదర్శనతోనే మెనింజన్ కంపెనీ జాతీయ ప్రాముఖ్యతను సంపాదించింది. అప్పటి నుండి 1890 వరకు జర్మనీ యూరప్‌లలో 38 నగరాలలో ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలలో చారిత్రక విషయాలలోను, పాత్రల దుస్తుల విషయంలోనూ మెనింజన్ ప్రత్యేకతను కనబరిచింది.

చరిత్రకారులు డ్యూక్ ఆఫ్ సాక్స్ మెసీంజన్ కృషిలో ఆధునిక నాటకరంగావిర్భావం చూడగలిగారంటే అందుకు కారణం పూర్వాభ్యాసాలలో దర్శకుడి స్థానం అతిముఖ్యమైనదని డ్యూక్ గుర్తించడమే కాకుండా ఆ స్థానాన్ని గట్టిగా పదిలపరచడమే. దర్శకుడి కారణంగా నాటక సమాజాలలో అడోల్ఫ్‌లా అరాంజ్ లాంటి నటులను ఉత్తేజపరచడంతో 1883లో బెర్లిన్‌లోడ్యాఫెస్ థియేటర్ స్థాపనకుకారణమయింది.

1889లో నాటక విమర్శకుడు ఓట్టో బ్రహ్మ స్వాభావికవాద నాటకాల మీద తనకున్న ఉత్సాహంతో ఒక వృత్తి నాటక కంపెనీ ఫ్రయ్ బూనెని స్థాపించాడు. అందులో వృత్తి నట సముదాయం స్వాభావికవాద నాటకాలను ప్రదర్శించేవాడు. కాని ఆ నాటకాలు సాధారణ ప్రజానీకాన్ని ఆకర్షించలేదు. కాని విద్యాధికులను, మేధావి వర్గాన్ని ఆకట్టుకున్నాయి.

1894లో బ్రహ్మ డ్యాషెస్ థియేటర్‌కు దర్శకుడుగా నియమింపబడ్డ తరువాత ఆధునిక సంప్రదాయిక నాటకాలను స్వాభావిక పద్ధతిలో ప్రదర్శనలకు కృషిచేశాడు. పురాతన లాక్షణిక నాటకాలలో తగినంత విజయాన్ని సాధించలేకపోయినా సమకాలీన నాటకాలు ముఖ్యంగా ఇబ్సన్, గెర్హార్ట్ హాఫ్ట్ మెన్, ష్నిట్‌జ్లర్, సూడర్‌మన్ రచించిన నాటకాల ప్రదర్శనలలో ఈయనను మించిన వారు లేరు.

అయితే ఫ్రీయ్‌బూనె పరిచయం చేసిన జర్మనీ నాటక రచయితలలో ముఖ్యుడు గెర్హార్ట్ హాప్ట్‌మన్ (1862–1946). 1889 లో మొదటి సారిగా తన నాటకం *బిఫోర్ సన్ రైజ్* ప్రదర్శించినప్పుడే ప్రేక్షకులు హాప్ట్‌మన్‌ను గొప్ప రచయితగా గుర్తించారు. ఆ నాటకంలో జోలా సిద్ధాంతాలు, ఇబ్సన్ నాటక శిల్ప ప్రభావం హాప్ట్‌మన్ మీద ఎంతగా ఉందో విడమరచి చెబుతుంది. జర్మన్ నాటకరంగంలో స్వాభావికతావాదానికి ప్రతినిధిగా హాప్ట్‌మన్‌ను కొనియాడారు. ఓ యాభైఏళ్ళ కాలంలో దాదాపు 30 నాటకాలు రాశాడు. వాటిలో ది వీవర్స్ నాటకం హాప్ట్‌మన్ ప్రతిభకో మచ్చుతునక. ఈ నాటకంలో కథాసారథులు కార్మిక సముదాయం వారి నిస్సహాయస్థితి విప్లవం వైపు దారితీయడం ఇందులోని కథాంశం.

హాప్ట్‌మన్ ప్రతీకవాదధోరణిలోనూ నాటక రచనలు చేశాడు. వాటిలో ఎన్నదగ్గది ది అసంప్షన్ ఆఫ్ హాన్నిల్(1893), *ది సంకెన్ బెల్* (1896).

హాప్ట్‌మన్ 1912లో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. తన మరణానికి పూర్వం హిట్లర్ ఆధిపత్యం పట్ల అంగీకారధోరణి ప్రజలలో హాప్ట్‌మన్‌పై ఉన్న గౌరవ మర్యాదలు తగ్గడానికి కారణమయింది. తన నాటకాలలో ఎక్కువగా గోచరించేది తోటి మానవుల బాధలు, కష్టాలు తమ ప్రగాఢ సానుభూతి. ఈయన నాటకాల్లోని నాయకులు ఎక్కువగా పరిస్థితులకు బానిసలు కావడంతో వారి పట్ల సానుభూతి కలుగుతుందే తప్ప వారు ధీరోదాత్త నాయకులుగా అగుపించరు.

ఫ్రమ్‌బూనె లాగానే బెర్లిన్‌లో ఫ్రయ్ వోక్స్ బూనె 1890లో స్థాపించబడింది. ప్రతి ఆదివారం మధ్యాహ్నం ఇందులో నాటకాలు ప్రదర్శించేవారు. రంగస్థలానికి విచ్చేసి నాటకాలను చూడాలన్న ధోరణి ప్రజల్లో పెంపొందించిన ఘనత ఈ కంపెనీలదే.

హాప్ట్‌మన్‌తో పాటు వెలుగులోకి వచ్చిన మరో ఇద్దరు ప్రముఖ నాటకకర్తలు – సూడర్‌మన్, ష్నిట్జ్లర్. వాస్తవికతావాదాన్ని ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండడానికి హాప్ట్‌మన్ కంటే సూడర్‌మన్ ఎక్కువగా శ్రమపడి ఫలితాలను సాధించాడు. సూడర్‌మన్ రాసిన నాటకాల్లో ఎక్కువ ప్రజాదరణ పొందిన నాటకం *మగ్ధ* (1893). అలాగే ఆస్ట్రియా నాటకకర్త ఆర్థర్ ష్నిట్జ్లర్ రాసిన నాటకాల్లో ముఖ్యంగా ప్రజాదరణ పొందిన నాటకం *ఆనటోల్* (1893).

జర్మనీలో ఎక్కువమంది నాటక రచయితలు ముఖ్యంగా హాప్ట్‌మన్, సూడర్‌మన్‌లు వాస్తవికవాద శైలిలోనే కాక, వాస్తవ వ్యతిరేకశైలిలోనూ నాటకాలు రాయడం జరిగింది. వీరితో పాటు పేరెన్నికగన్న రచయితలు హాఫ్‌మాన్స్‌తల్ (1874-1929), *బెంజమిన్, వేడ్‌కైండ్.* అయితే హాఫ్‌మన్స్‌తల్ నవ్యకాల్పనిక శైలికి ప్రతినిధిగా చెప్పుకోవచ్చు. ఫ్రాన్సు దేశంలో ప్రతీకవాదానికి సమాంతరంగా జర్మనీలో నియోరొమాంటిజం ప్రాచుర్యంలో ఉండేది. హాఫ్‌మాన్స్‌తల్ తొలి నాటకాలు ది ఫూల్ అండ్ డెత్(1893), ది అడ్వెంచరర్ అండ్ ది సింగింగ్ గర్ల్ (1899) తక్కువ నిడివితో పద్యరూపంలో రాసిన నాటకాలు. నాటక విమర్శకులు గెటే తరువాత అంత గొప్పకవి అని హాఫ్‌మన్స్‌తల్‌ను శ్లాఘించారు.

బెంజమిన్ వేడ్‌కైండ్ జర్మనీలో తన నాటకాలను విరివిగా ప్రదర్శించినా తగినంత ప్రజాదరణ పొందలేక పోయాడు. కామ సంబంధ ఇతివృత్తాలనే తన నాటకాలలో తీసుకొని రాశాడు. *ఎర్త్ స్పిరిట్, పండోరాస్ బాక్స్* లాంటి నాటకాలు అందులో ముఖ్యమైనవి. చివరిదశలో పిచ్చి, వెట్టి సమస్యలను తీసుకొని సా సన్ (1914), హెరకల్స్ (1917) నాటకాలను రాశాడు. 1990 తర్వాత ఇతని పట్ల గౌరవం పెరగడమే కాకుండా అభివ్యక్తివాదుల (expressionists) పై తన ప్రభావాన్ని చూపగలిగాడు.

1907లో స్థాపించబడిన మ్యూనిచ్ ఆర్ట్ థియేటర్‌లో నవసమాజాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రేక్షకాగారం రంగస్థల నిర్మాణాల్లో కొన్ని మార్పులు తీసుకురావడం జరిగింది. ప్రేక్షకాగారానికి రంగస్థలానికి మధ్య (orchestra pit) ఏర్పాటు చేయడం, అవసరమైనప్పుడు రంగస్థల విస్తీర్ణాన్ని పొడిగించడం, రంగద్వారాన్ని (proscenieum) ముందుకు వెనకకు మార్చ గలిగేలా నిర్మించడం, నాలుగు రకాల రంగాల్లో గగనిక (cyclorama)లను నిర్మించుకోవడం లాంటివి చోటు చేసుకున్నాయి.

మాక్స్ రీన్‌హార్ట్ (1873–1943) తన 19వ ఏటనే నటుడుగా గుర్తింపబడిన రీన్‌హార్ట్ డాష్స్ థియేటర్‌లో బ్రహమ్ కంపెనీలో నటుడుగా చేరాడు. అక్కడే దర్శకుడుగా వివిధ దేశాలకు చెందిన నాటకాలను ప్రదర్శించాడు. అన్ని నాటకాలను ఒకే శైలిలో ప్రదర్శించడం కంటె ఏ నాటకానికి ఏ శైలి సరిపడుతుందో శైలిలోనే ఆ నాటకాన్ని ప్రదర్శించాలి అన్న సూత్రాన్ని రీన్‌హార్ట్ గుర్తించాడు. ఈడిపస్ రెక్స్ నాటకాన్ని ఒక సర్కస్ ఆవరణలో ప్రదర్శించాడు. దీనికి కారణం ఆ సర్కస్ వాతావరణం కొంత వరకు ప్రాచీన గ్రీకు రంగస్థలాన్ని తలపింపచేయటమే. ఈ విధంగా రంగస్థల ప్రదర్శనలలో ఎన్నో ప్రయోగాలు చేసి జర్మనీలోనే గాక అమెరికా తదితర దేశాల్లో తన ప్రభావాన్ని చూపగలిగాడు.

నాటక ప్రదర్శనలో అన్ని భాగాల మీద దర్శకుడికి పట్టు వుండాలన్నది రీన్‌హార్ట్ విశ్వాసం. నాటకంలో నటుల కదలికలు, దృశ్యబంధం, సామాగ్రి, ధ్వని, రంగదీపనం, వేష

భూషలు మొదలైన వాటిని విపులంగా ప్రాంప్ట్ బుక్‌లో రాసి సిద్ధం చేసేవాడు. ఈయన నాటకాలలో నటులు అతని చేతిలో కీలు బమ్మలూ అనే విమర్శ ఉండేది. కాని అతను నటులతో చాల సఖ్యంగా, దగ్గరగా ఉండి, అత్యుత్తమ నాటక ప్రదర్శనలను ఏర్పాటు చేశాడు.

నాటకంలో త్వరితగతిని దృశ్యబంధాల మార్పు జర్మనీలో ప్రవేశపెట్టారు. ఈ రంగస్థలాన్ని మొదటి సారిగా 1896లో మ్యూనిచ్‌లోని రెసిడెంజ్ థియేటర్‌లో కార్ల్ లేటెన్‌ష్లాగెర్ నిర్మించాడు. అలాగే బెర్లిన్‌లోని రాయల్ ఒపేరా హౌస్ రోలింగ్ ప్లాట్‌ఫామ్ రంగస్థలాన్ని నిర్మించారు. ఎలివేటర్ స్టేజిని మ్యూనిచ్ ఆర్ట్ థియేటర్‌లోనూ బర్గ్ థియేటర్‌లోను నిర్మించడం జరిగింది.

క్రమంగా జర్మనీలో నాటకరంగం వాస్తవికతావాదం నుండి దూరమవుతూ అభివ్యక్తివాదం వైపు పరుగులు తీసింది. రీన్‌హార్ట్ జహాన్నెస్ సోర్జ్ *ది బెగ్గర్* నాటకం మొదటి అభివ్యక్తివాద నాటకంగా పరిగణించబడింది. వాల్టర్ హేసన్ క్లవర్ రాసిన ది సన్ (1916)నాటకం కూడ ఆ కోవకు చెందినదే. ఈ నాటకాలలో పురాతన ఆచారాలకు, కొత్త విలువలకు మధ్య సంఘర్షణ ప్రధానం.

తరువాత కాలంలో అభివ్యక్తివాదం ఇతివృత్తపరంగా వ్యక్తిగత విషయాల నుండి జాతీయ సమస్యల పైకి వెళ్ళింది. హైసన్‌క్లవర్ యుద్ధ వ్యతిరేక నాటకం అంటిగని అలాంటిదే. ప్రేమ ఒక్కటే ఆనందానికి మార్గమని, నీతిలేని రాజ్యాధికారులను తొలిగించినప్పుడే ఆ మార్గం సాధ్యమని ఆ నాటకం నీతి. 1924 ప్రాంతానికి అభివ్యక్తివాదం అంతరించేస్థితి ఏర్పడింది.

అభివ్యక్తివాదం అంతరిస్తుండడంతో మరోకొత్త విధానంతో ఎపిక్ థియేటర్ ప్రారంభమయింది. ఈ కొత్త పద్ధతికి ఆద్యుడు *ఎర్విన్ పిస్కేటర్* (1893–1966). కొన్ని చిన్న చిన్న నాటక కంపెనీలలో పనిచేసిన తరువాత పిస్కేటర్ బెర్లిన్‌లోని వోక్స్‌బూనె నిర్ధేశకుడుగా నియమింపబడ్డాడు. తర్వాత 1927లో పిస్కేటర్ థియేటర్‌ను ప్రారంభించాడు. అక్కడే ఎపిక్ థియేటర్ కోసం సంబంధిత శైలి, శిల్పాన్ని నిర్ధుష్టపరిచాడు. టోలర్ రాసిన హుర్రా, మియ్‌లివ్ రాసిన రాప్పుటిన్‌లను ఎపిక్ పద్ధతికి అనువుగా కార్టూన్లూ, ట్రెడ్‌మిల్లులను, ఫిలిమ్ సన్నివేశాలను నాటకాల్లో పొందుపరచాడు. 1939లో పిస్కేటర్ అమెరికాకు వెళ్ళి 1951 వరకు న్యూయార్క్ తదితర నగరాలలో నాటకాలను ప్రదర్శించాడు.

పిస్కేటర్ ఆద్యుడైనా, ఎపిక్ థియేటర్‌ను ఉచ్ఛస్థితికి చేరడానికి, ఆ థియేటర్ కోసం ఎక్కువగా శ్రమించి, ఉద్యమ సారథిగా పరిగణింపబడింది *బెర్టోల్డ్ బ్రెఖ్ట్* (1898–1956). మ్యూనిచ్ థియేటర్ డైరెక్టరుగా నాటకరంగ ప్రవేశం చేసి నాటక రచయితగా బాల్, డ్రమ్స్ ఇన్ ది నైట్ నాటకాలలో అభివ్యక్తివాదాన్ని ప్రయోగించాడు. అయితే ఈయన మొట్టమొదటి విజయం 400 ప్రదర్శనలిచ్చిన ది త్రీపెన్నీ ఆపెరా (1928) ద్వారా వచ్చింది.

నాజీల బారి నుంచి తప్పించుకోడానికి జర్మనీ వదలి డెన్మార్క్‌లో ఉన్న బ్రెఖ్ట్‌తన నాటకాలలో తాదాత్మ్య విచ్ఛేద సిద్ధాంతాన్ని పాటిస్తూ ప్రయోగాలు చేశాడు. అప్పుడే ఈయన గొప్ప నాటకాలు *గెలీలియో* (1937–39), *మదర్ కరేజ్* (1938), *ది గుడ్ వుమన్ ఆఫ్ సెట్జువాన్* (1938–40), *ది కాకేషియన్ చాక్ సర్కిల్* (1944–45) వెలువడ్డాయి. విదేశాలలో తల దాచుకున్నందువల్ల తన నాటకాలు ఆ సమయంలో ఎక్కువగా ప్రదర్శింపబడకపోయినా తిరిగి ఈయన 1947లో జర్మనీకి వచ్చిన తరువాత ఆ నాటకాలు ప్రపంచఖ్యాతిని ఆర్జించాయి.

నాటకంలో సన్నివేశ వివరణలు, నాటకీయ శిల్పం ప్రత్యేకమైన శైలిలో ఉంటూ, ప్రేక్షకులపై ఒక నిర్దిష్టమైన బాధ్యతను ఉంచాడు బ్రెఖ్ట్. ప్రేక్షకులు కేవలం సాత్వికంగా నాటకాన్ని తిలకించి వెళ్ళిపోకుండా,అక్కడ జరుగుతున్న సన్నివేశాన్ని నిశితంగా, విమర్శనాత్మకంగా పరికించి చూచి స్పందించమని బ్రెఖ్ట్ ఆశయం. ఏ క్షణంలోనూ ప్రేక్షకుడు పాత్రల ఉద్వేగాలకు లోను కాకుండా, పాత్రలతో తాదాత్మ్యం పొందకుండా బయటి నుండే పాత్రలను చూడగలగాలి. అది సాధించడం కోసం సన్నివేశాల మధ్యన పాటలు, వివరణలు చొప్పించేవాడు. సంఘంలోని చెడును రూపుమాపడానికి ప్రేక్షకులు సిద్ధం కావాలనే సందేశాన్నిచ్చే నాటకాలను ప్రదర్శించేవాడు. నటనాపరంగా స్టానిస్లవ్‌స్కీ సిద్ధాంతాలను పూర్తిగా వ్యతిరేకించాడు.

1941 నుంచి ఫిన్‌లాండ్, అమెరికాలలో కొన్నేళ్ళు గడిపిన తరువాత 1948లో తూర్పు బెర్లిన్ నగరానికి తిరిగివచ్చి అక్కడ స్థిరపడ్డాడు. జర్మనీ లోని నాటక కంపెనీ బెర్లినర్ ఎన్‌సెంబల్ ముఖ్యమైనది. తూర్పు జర్మనీలో స్థాపించబడిన యీ కంపెనీ ఎక్కువగా బ్రెఖ్ట్ నాటకాలకే పరిమితమయింది. బెర్లినర్ ఎన్‌సెంబల్ ద్వారా ప్రదర్శితమైన నాటకాల వల్లే బ్రెఖ్ట్ ప్రతిభ విశ్వవిఖ్యాతమయింది. 1954, 1955లో త్రీపెన్నీ ఆపెరా ఫ్రాన్స్‌లో ప్రదర్శించడంతో బెర్లినర్ ఎన్‌సెంబల్ అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించింది. 1956లో బ్రెఖ్ట్ మరణానంతరం ఇతని భార్య హెలెన్ వీయ్‌గెల్ ఆధ్వర్యంలో కంపెనీ కొన్నాళ్ళు నడిచింది.

1933లో హిట్లర్ అధికారంలోకి రావడంతో రంగస్థల కళాకారులెందరో జర్మనీని వదిలి వెళ్ళిపోయారు. అలా వెళ్ళని రచయితలు కేవలం చారిత్రక నాటకాలు రాసుకుంటూ

సమకాలీన సమాజానికి దూరంగా ఉండిపోయారు. 1933 నుండి 1945 వరకు జర్మనీ నాటకరంగం రాజకీయ ఒత్తిడుల వలన స్వతంత్రంగా జీవించలేకపోయింది.

1945లో జర్మనీ మిత్రరాజ్యాలకు లోబడిపోవడంతో, థియేటర్‌లు ఎక్కువగా మూతబడ్డాయి. అయినా 1960 నాటికి మళ్ళీ పుంజుకుని శక్తివంతంగా నాటక ప్రదర్శనలు చేయగలిగాయి. 1945లో జర్మనీ రెండుగా విడిపోయినా తూర్పు, పశ్చిమ జర్మనీల రెండింటిలోనూ నాటకరంగానికి ప్రభుత్వాలు చేయూత నిచ్చాయి. పశ్చిమ జర్మనీలో 150 వృత్తి నాటక సమాజాలు ఏర్పడగా, తూర్పు జర్మనీలో 135 వెలిశాయి. ప్రతి నగరంలోనూ ఒక నాటక కంపెనీ ఉండేది. ప్రపంచ సంగ్రామంలో 100కి పైగా థియేటర్ భవనాలను కూల్చివేయడం జరిగింది. 1950 తరువాత అవన్నీ మళ్ళీ పునరుద్భవించాయి. కొత్త సదుపాయాలతో పశ్చిమ బెర్లిన్‌లోని షిల్లర్ థియేటర్ 1951లో తిరిగి ప్రారంభమైనపుడు అందులో భ్రమణ రంగ స్థలం, ఎలివేటర్లు, రోలింగ్ ప్లాట్‌ఫారమ్ సమకూర్చారు.

1950 ప్రాంతంలో జర్మనీలో నాటకాలను ముఖ్యంగా ఇద్దరు స్విస్ నాటకకర్తలు ఫ్రిష్, డురెన్‌మట్ రాశారు. ఫ్రిష్ రాసిన నాటకాలు ది చైనీస్ వాల్(1946), బైడర్‌మన్ అండ్ ది ఫైర్‌బగ్స్ (1958), అండొర్రా(1961). ఇవన్నీ సమాజ నేరాలకు సంబంధించినవి. ఈ నాటకాలలో పాత్రలు, చేసిన నేరాలను సమర్థించుకోవాలని ప్రయత్నిస్తాయే తప్ప వాటికి బాధ్యతను అంగీకరించవు.

అలాగే డురెన్‌మట్ రాసిన నాటకాలు ది విజిట్ (1956), ది ఫిజిసిస్ట్స్ (1962). ధనం, అధికారాలను ఎఱజూపి అవినీతి పాల్జేయడం, మానవ బలహీనతలు మొదలైన వాటికి సంబంధించినవే. 1960 తర్వాత జర్మన్ నాటకాలు ఎక్కువగా డాక్యుమెంటరీ నాటకాలుగా ఉండేవి.

1965 తర్వాత జర్మన్ నాటకకర్తలు సమకాలీన సామాజిక సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని నాటకాలు రాయడం మొదలుపెట్టారు. జర్మనీలో ప్రజల మెప్పును పొందిన దర్శకుడు పీటర్ స్టీన్ కోసం బోతోస్ట్రాస్ నాటకాలు రాసేవాడు. వాటిలో *బిగ్ అండ్ లిటిల్* గొప్ప విజయాన్ని సాధించింది. *విజిటర్* (1989)నాటకం కూడ బాగా పేరు తెచ్చుకుంది. 1990 నాటికి పశ్చిమ జర్మనీలో ఎక్కువ ప్రదర్శనలు స్ట్రాస్ రాసిన నాటకాలు కావడం గమనార్హం.

1970 దశకంలో స్టీన్ ప్రదర్శించిన నాటకాలలోని అంతరార్థ విశదీకరణం నాటక దర్శకత్వంలోనే ఒక కొత్త మలుపును చూపించింది. 1980 తరువాత స్టీన్‌తోపాటు ఎందరో దర్శకులు నాటక ప్రతిని యధాతథంగా ప్రదర్శించడం ప్రారంభించారు. 1984లో స్టీన్ ప్రదర్శించిన చెకొవ్ నాటకం ది త్రీ సిస్టర్స్ వాస్తవికతావాదానికి పూర్తి ప్రతీకగా, నాటక ప్రతిని పొల్లుపోకుండా యధాతథంగా ప్రదర్శించడంతో ఆ నాటక ప్రదర్శనను కంపెనీ ప్రదర్శించిన నాటకాలలో ఉత్తమ నాటకంగా అందరూ కీర్తించారు.

జర్మనీలో నాటక విమర్శలు, సమీక్షలు పత్రికాముఖంగా ప్రచురితం కావడం నాటక కళావికాసానికి ఎంతో మేలు చేస్తున్నాయి. కొన్ని వ్యాపార సంస్థలు నాటక సమాజాలను దత్తత తీసుకొని వాటికి అండగా నిలబడటం జర్మన్ నాటక రంగంలో ప్రత్యేకంగా పేర్కొనదగిన విశేష అంశం.

ఈ విధంగా నాటకకర్తలు రచనలోను, ప్రదర్శనలోను ప్రతితరంలోను కొత్త పుంతలు తొక్కి నూతన ప్రయోగాలతో జర్మన్ నాటక రంగాన్ని సుసంపన్నం చేయడమే కాక, ప్రపంచ నాటక రంగాన్ని కూడా ప్రభావితం చేశారు. ముఖ్యంగా నూతన నాటక విధానాలలో పథ నిర్దేశకులుగా జర్మనీ నాటకకర్తలు చిరయశస్సు గడించారు.

– రవీంద్ర

అమెరికా నాటకరంగం

ఐరోపా, ఇంగ్లాండ్, ఐర్లాండ్ దేశాలను కుదిపేసిన ఆధునిక నాటకోద్యమం అమెరికా చేరడానికి బాగా ఆలస్యమైంది. ప్రత్యేక ప్రతిపత్తి గల నాటకరంగం ఆవిర్భవించడానికి 19వ శతాబ్ది పూర్వార్థం వరకూ ఆగాల్సివచ్చింది. అంతకు పూర్వం అమెరికాలో నాటక ప్రదర్శనల వాసన లేదని కాదు. అప్పుడప్పుడూ కొన్ని ప్రదర్శనలు జరిగినా, ఇంగ్లాండు నాటక బృందాల నిర్వహణలో సాగేవి. అమెరికా, ఇంగ్లీషు వలస రాజ్యంగా ఉండటం ఒక కారణమైతే, నాటక ప్రదర్శనల విషయంలో శాసనాలు కఠినంగా ఉంటూ సాంస్కృతిక రంగానికి అడ్డుగోడలు కావడం మరోకారణం. వీటి వల్ల అమెరికాలో నాటక కళావికాసానికి తీవ్ర అవరోధాలు ఏర్పడ్డాయి. యుద్ధానంతరం 1783లో అమెరికాకు సంపూర్ణ స్వాతంత్ర్యం లభించిన తరువాత గానీ నాటకరంగంలో ఆశారేఖలు ప్రసరించలేదు. అప్పటి నుంచి అమెరికన్ నాటకరంగం క్రమక్రమంగా బాలారిష్టాలను దాటి అభివృద్ధి పథంలోకి అడుగు పెట్టింది. అయితే ఇంగ్లీషు నాటక బృందాలు విడిచిపోయిన నాటక విధానాల పరిష్వంగం నుంచి అమెరికన్ నాటకరంగం బయట పడటానికి చాలాకాలం పట్టింది.

ఇంగ్లీషు వలస రాజ్యంగా ఉన్న కాలంలో అమెరికా వాసులకు నాటకం రుచి చూపించిన ఘనత లెవీస్ హల్లమ్ (1714-1756) సంచార నాటక బృందానికి దక్కుతుంది. ఈ ఇంగ్లీషు నాటక కంపెనీ, వర్జీనియా రాష్ట్రంతో ప్రారంభించి అనేక రాష్ట్రాలలో పర్యటించి ప్రదర్శనలిచ్చింది. ఈ కంపెనీలో అందరూ కుటుంబ సభ్యులు కావడం విశేషం. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించేవారు. 1780 నాటికి అమెరికన్ నాటకకర్తలు, నటీ నటులు స్వతంత్ర నాటకరంగం వైపు దృష్టి సారించారు. ఏది ఏమైనా 18వ శతాబ్దంలో చెప్పుకోతగిన నాటకాలు వెలుగు చూడలేదు. స్థానిక కళాకారులను సమీకరించి నాటకాలు ప్రదర్శించడం మొదలు పెట్టిన ప్రారంభ దశలో, కొన్ని పాత్రలకు ఇంగ్లీషు నటులను పిలిపించి, వారిచేత పాత్రధారణ చేయించి, ప్రదర్శించారు. కాలక్రమేణ ఈ పద్ధతికి స్వస్తి చెప్పారు. దేశీయ కళాకారులే నాటకాలు ఆడటం ప్రారంభించారు.

19వ శతాబ్దంలో అమెరికన్ నాటక రంగం స్వరూప స్వభావాల్లో గణనీయమైన మార్పులచ్చాయి. దీనికి అంకుల్ టామ్స్ కేబిన్ నాటకం నాంది పలికింది. మానవత్వానికి మచ్చగా మిగిలిన ఆనాటి బానిసల వ్యవస్థకు చరమగీతం పాడాలనే తపనతో, ఒక మహదాశయంతో హారియట్ బీచర్ స్టౌవ్ రచించిన అంకుల్ టామ్స్ కేబిన్ (1852) నవల ఆధారంగా, జార్జ్ ఎల్ ఐకిన్ అదే పేరుతో రాసిన నాటకం అత్యంత ప్రజాదరణ పొందింది. నవలకు అంతర్జాతీయ ఖ్యాతి లభించడంతో, నాటకీ కరణకు కూడా ఆదరణలభించింది. ఐకిన్ ఈ నాటకాన్ని మొదట్లో మూడు అంకాలకు పరిమితం చేసినా, ప్రజాదరణను దృష్టిలో ఉంచుకొని ఆరు అంకాలకు విస్తరించాడు. గీతాలు, నృత్యాలు పొందుపరచడమే గాక సాంకేతిక విలువలను కూడా సమకూర్చడం వల్ల ప్రదర్శనలో నిండుతనం వచ్చింది. కొద్దికాలంలోనే అంకుల్ టామ్స్ కేబిన్ 325 ప్రదర్శనలకు నోచుకోవడం ఆ నాటకం ప్రాచుర్యానికి గీటురాయి అయింది. ఇదే నవలను మరికొందరు రచయితలు కూడా నాటకీకరించడం జరిగింది. కాని ఆ నాటకాలేవీ ఐకిన్ నాటకం ముందు నిలబడలేకపోయాయి. 20వ శతాబ్దంలో కూడా అంకుల్ టామ్స్ కేబిన్ ప్రదర్శింపబడటం దాని విశిష్టతకు ప్రబలోదాహరణ. ప్రజల్లో నాటకాభిరుచి పెరిగిన కారణంగా అనేక నాటక సమాజాలు వెలిశాయి. ప్రతి సమాజం తాము ప్రదర్శించే నాటకాలతో రిపర్టరీని ఏర్పరచుకోవడం జరిగింది. అయితే త్వరత్వరగా నాటకాలు మార్చడం వల్ల ప్రదర్శన వ్యయం మోయలేని భారమైంది. అందుకని రెండు మూడు నాటకాలనే ఎక్కువకాలం ప్రదర్శించడం మొదలు పెట్టారు. ఇతర రాష్ట్రాలలో నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి థియేట్రికల్ సిండికేట్ (నాటక సమాఖ్య) న్యూయార్క్‌లో ఏర్పడింది. నాటక సమాజాలకు ఇది సౌకర్యం కలిగించినా, సిండికేట్ గుత్తాధిపత్యం వల్ల కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. నాటక రంగానికి న్యూయార్క్ కేంద్రీకృత వ్యవస్థగా నేటికీ నిలిచి ఉంది.

స్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైర్ నాటకంలో ఒక దృశ్యం

20వ శతాబ్దం మొదటి రెండుపాదాల్లో నాటకరచనలో, ప్రదర్శన విధానంలో నూతన పోకడలు వెల్లివిరిశాయి. నాటక శిల్పంలో ఐరోపా దేశాల్లో ప్రారంభమైన నూతన ఆవిష్కరణలు మెల్లమెల్లగా అమెరికా చేరుకున్నాయి. రాబర్ట్ ఎడ్మండ్ జోన్స్ (1887-1954), లీ సైమన్ (1888-1967) అనే సాంకేతిక నిపుణులు యూరప్‌లో విస్తృతంగా పర్యటించి, నూతన పద్ధతుల్ని అధ్యయనం చేసి, వాటిని అమెరికన్ నాటకరంగంలో ప్రవేశ పెట్టారు. 1910-1920 మధ్యకాలంలో వికసించిన లిటిల్ థియేటర్స్ కూడా నూతనత్వానికి దోహదం చేసింది. యూజీన్ ఓ నీల్ (1888-1953) నాటక రచయితగా ఈ కాలంలోనే వెలుగులోకి వచ్చాడు. ఆధునిక నాటకకర్తలలో అగ్రతాంబూలం ఇతనిదే. తొలినాటి అమెరికన్ నాటకాలలో కొత్తరక్తం ఎక్కించి, దిశానిర్దేశం చేసిన ఘనత కూడా ఈయనదే. మొదట్లో బియాండ్ ది హరైజన్ (1920), అన్నా క్రీస్టీ (1920) వంటి వాస్తవిక నాటకాలు రాసినా ఒకే పద్ధతికి కట్టుబడలేదు. యూరప్‌లో వచ్చిన నూతన ప్రయోగాలను స్వీకరించి, అభివ్యక్తి ధోరణిలో హెయరీ ఏప్ (1921), ఎంపరర్ జోన్స్ (1920) వంటి నాటకాలను రచించి నాటకరంగంలో సంచలనం రేపాడు. బియాండ్ ది హరైజన్‌లో కర్షక జీవితంలో సుఖదుఃఖాలను చిత్రించాడు. అన్నదమ్ముల మధ్య ఏర్పడిన అపోహలు

విషాదాంతానికి దారి తీయడం ఆ నాటకంలో ఇతివృత్తం. అది మధ్యతరగతి జీవితానికి సంబంధించింది కాగా అన్నా క్రిస్టీ దిగువ తరగతి జీవితానికి సంబంధించింది. సముద్రం మనుషులను ఎలా విడదీస్తుందో, బ్రతుకుబాటను ఎలా చిందర వందర చేస్తుందో సహజ సుందరంగా అభివ్యక్తం చేశాడు ఈ నాటకంలో. కష్ట జీవుల శ్రమను దోచుకునే దుర్మార్గులకు సుఖశాంతులు ఉండవనీ, చేసిన పాపం వారిని భయం రూపంలో వెంటాడి వేధిస్తుందనీ, అదే దుర్మార్గుల పాలిటి నరకమనీ ద్యోతకం చేస్తుంది ఎంపరర్ జోన్స్. సుమారు 20 నాటకాలు రాసిన యూజీనీ ఓ నీల్‌కు నాలుగుసార్లు పులిట్జర్ బహుమతులు లభించాయి. 1936లో నోబెల్ ప్రైజ్ ఫర్ లిటరేచర్ కూడా యూజీనీ ఓ నీల్‌ను వరించింది. ఈ ప్రతిష్ఠాత్మక బహుమతిని పొందిన అమెరికన్ నాటకకర్త ఈయనొక్కడే. డిసైర్ అండర్ ది ఎల్మ్స్ (1924), స్ట్రేంజ్ ఇంటర్లూడ్(1926), ఐస్‌మేన్ కమెత్ (1939), మొదలైన నాటకాలు ఓనీల్ కీర్తిని ఇనుమడింపచేశాయి.

ఈ శతాబ్దంలో రెండు సంస్థలు అమెరికా నాటక రంగంలో పెనుమార్పులు తేవడానికి దోహదం చేశాయి. వాటిలో ఒకటి థియేటర్ గిల్డ్. ఇది 1919లో ప్రారంభించబడి, పదేళ్ళపాటు కొనసాగింది. యూరప్ నాటకరంగంలో ఉన్న నూతన ప్రయోగాలతో కూడిన నాటకాలను అమెరికాలో ప్రదర్శించి, నూతనత్వానికి వాకిళ్ళు తెరిచింది. విదేశీ నాటకాలనే కాకుండా ప్రముఖ అమెరికన్ నాటక కర్తల నాటకాలను కూడా ప్రదర్శించి ఆ రచయితలకు ఖ్యాతి ఆర్జించిపెట్టింది. ఎల్మర్ రైస్ రచించిన ది యాడింగ్ మెషీన్ (1923), యూజీనీ ఓనీల్ స్ట్రేంజ్ ఇంటర్లూడ్ (1926), సిడ్నీ హవార్డ్ రాసిన దె న్యూ వాట్ దె వాంటెడ్ (1927), మాక్స్‌వెల్ ఆండర్సన్ నాటకం ఎలిజబెత్ ది క్వీన్ (1930), మొదలైనవి. థియేటర్ గిల్డ్‌లో చీలిక ఏర్పడి 1931లో గ్రూప్ థియేటర్ అనే పేరుతో వేరే సంస్థ ప్రారంభమైనది. సామాజిక స్పృహతో సమకాలీన సమస్యలతో కూడిన నాటకాలను ప్రోత్సహించడం, నటులకు శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ గరపడం తన లక్ష్యాలుగా చేసుకొని కృషి చేసింది. ఈ సంస్థకూడా పదేళ్ళలో కాలగర్భంలో కలసి పోయింది. గ్రూప్ థియేటర్ ద్వారా హెరాల్డ్ క్లర్‌మెన్, ఎలిజా కజన్ వంటి ప్రతిభావంతులైన దర్శకులు, లీ జెకబ్, మోరిస్ కార్నోవ్‌స్కీ, వంటి అగ్రశ్రేణి నటులు వెలుగులోకి వచ్చారు. స్టానిస్లవ్‌స్కీ నటశిక్షణ విధానానికి అమెరికాలో వారసులుగా నిలిచి ఎంతో సేవ చేశారు.

రెండవ ప్రపంచ యుద్ధం 1945లో ముగిసేవరకు వాస్తవిక వాదమే అమెరికన్ నాటకరంగంలో రాజ్యం చేసింది. అప్పటికే నూతన ప్రయోగాలు నాటకరంగంలో వచ్చి చేరినప్పటికీ వాటిని కూడా కొంత మేరకు తనలో ఇముడ్చుకొని, వాస్తవిక నాటకాలు వర్ధిల్లుతూ వచ్చాయి. వాస్తవిక, వాస్తవిక వ్యతిరేక పద్ధతులలో కలగలిపి నాటకాలు రాసిన రచయితలలో టెన్నిస్సె విలియమ్స్ (1914-1983) ప్రముఖుడు. 1945 నుంచి వెలుగులోకి వచ్చిన టెన్నెస్సె, ది గ్లాస్ మేనేజరి (1944), ఎ స్ట్రీట్‌కార్ నేమ్డ్ డిజైర్(1947), సమ్మర్ అండ్ స్మోక్(1948), ది రోజ్ టాటూ (1951), సడన్లీ లాస్ట్ సమ్మర్ (1958) వంటి ప్రసిద్ధ నాటకాలు రాశాడు. ఆశ నిరాశల మధ్య నలిగి పోతూ ఘర్షణకు లోనయ్యే, మధ్య తరగతి మనుషుల మనస్తత్వానికి అద్దం పడుతుంది ది గ్లాస్ మేనేజరి నాటకం. నాలుగు పాత్రలకే పరిమితమ్మైన ఈ నాటకం ప్రదర్శన సౌలభ్యానికి పెట్టింది పేరు.

ఈ నాటకం టెన్నిస్సె విలియమ్స్‌కు ఎనలేని ఖ్యాతి తెచ్చి పెట్టింది. అణచి పెట్టుకున్న లైంగిక కోర్కెలు మనుషులను ఎలా చిత్రవిచిత్రంగా వేధిస్తాయో, ఎలాంటి పరిణామాలను సృష్టిస్తాయో వివరించే నాటకం ఏస్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైర్. టెన్నిస్సె నాటకాలల్లో ప్రతీకాత్మక ధోరణి విస్తృతంగా కనిపిస్తుంది. టెన్నిస్సె, ఓనీల్‌తో సరిసాటి అయిన రచయిత అని అమెరికా విమర్శకుల అభిప్రాయం. టెన్నెస్సె రాసిన ది బ్యాటిల్ ఆఫ్ ఏంజెల్స్ (1940), క్యాట్ ఆన్ ఎ హాట్ టిన్ రూఫ్ (1955), ది మిల్క్ ట్రైన్ డజ్‌నాట్ స్టాప్ హియర్ ఎనీమోర్ (1963) మొదలైనవి రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శించబడిన ప్రసిద్ధ నాటకాలలో కొన్ని. ఫ్రాయిడ్ భావజాలాన్ని నాటకాల్లో ప్రవేశపెట్టిన నాటకరచయితలలో టెన్నిస్సె విలియమ్స్ ఆద్యుడు.

అమెరికా నాటకరంగానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ప్రసిద్ధ రచయితల లో ఆర్థర్ మిల్లర్ (జ.1915) ప్రముఖుడు. సమకాలీన సమస్యలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన రచయిత. ఆల్ మై సన్స్ (1947) నాటకం ద్వారా ప్రసిద్ధి చెందిన ఈ రచయిత ది క్రూసిబుల్ (1953), ఆఫ్టర్ ది ఫాల్ (1964), ది ప్రైజ్ (1968) నాటకాలతో నాటక రంగంలో నిలదొక్కుకోగలిగాడు. అయితే ది డెత్‌ఆఫ్‌ఎసేల్స్‌మన్ (1949) ఈయనకు నాటకరంగంలో సుస్థిర స్థానం కల్పించింది. ఆర్థర్ మిల్లర్ అనే పేరు వినగానే ది డెత్ ఆఫ్ ఎ సేల్స్ మన్ నాటకమే స్మృతి పథంలో తళుక్కుమంటుంది.

ది డెత్ ఆఫ్ ఎ సేల్స్ మన్ ఆలోచింపజేసే ఓ విషాదాంత నాటకం. విజయాన్ని సాధించడమే మనిషి గొప్పతనానికి గీటురాయి అని, మనిషి ఔన్నత్యాన్నీ, విలువను, అతను సాధించిన విజయంతోనే ముడిపెట్టి గౌరవించే అమెరికన్ ప్రజల సామాన్య అభిప్రాయాన్ని ఆధారంగా తీసుకొని, అద్భుతంగా

రచించిన ఉత్తమ నాటకం ఇది. 20వ శతాబ్దంలో విశిష్ట నాటకంగా దీన్ని అమెరికన్లు భావిస్తారు.

గతంలో జరిగిన సంఘటనలను దృశ్యాలు (ఫ్లాష్ బ్యాక్) కథాగమనానికి అందాన్ని, ఆకర్షణను సమకూర్చాయి. విల్లీలోమేన్ అనే అసమర్థుని జీవయాత్రను నాటకరూపంలో చూసి జాలిపడని పాఠకుడుగానీ, ప్రేక్షకుడు గానీ బహుశా ఉండరేమో! ఆర్థర్ మిల్లర్ రచనలన్నీ వాస్తవిక నాటకాల కోవకు చెందినవే.

ఉత్తమ ప్రదర్శన విలువలకు పేరు మోసిన బ్రాడ్ వే నాటకాలు యుద్ధానంతర కాలంలో అధిక వ్యయంతో కూడినవి కావడంతో ఆఫ్ బ్రాడ్వే నాటకాలు మొదలయ్యాయి. మంచి నాటకాలు న్యూయార్క్‌లోనే కాకుండా సమీపంలో తక్కువ వ్యయంతో లభించే థియేటర్లలో వివిధ సమాజాల పక్షాన ప్రదర్శించబడే విధానం అమలులోకి వచ్చింది. దీనితో ఇతర రాష్ట్రాలలో కూడా బ్రాడ్వే నాటకాలు చూడగలిగే అవకాశం లభించింది. సంగీత వినోద రూపకాలు (Musical comedies) కూడా యుద్ధానంతరకాలం నుంచీ ప్రజాదరణ పొందుతూ వచ్చాయి.

ఈ శతాబ్ది రెండవ పాదంలో నాటకరచనలో కొత్త ఒరవడిని సృష్టించిన రచయిత ఎల్మర్ రైస్ (1892-1967). వృత్తి రీత్యా న్యాయవాది కావడం వల్ల ఈయనకు నాటక రచనలో న్యాయశాస్త్ర పరిజ్ఞానం అక్కరకొచ్చింది. 1914లో ఎల్మర్ రాసిన ఆన్ ట్రయల్ అనే నాటకంలో కోర్టు దృశ్యాలు ప్రవేశపెట్టడంలో నూతనత్వంప్రస్ఫుటమైంది. న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా జరిగిపోయిన సంఘటనలను ఫ్లాష్ బ్యాక్ దృశ్యాలుగా చూపించడం ప్రదర్శనా విధానంలో ఓ కొత్త మలుపు. అమెరికన్ నాటకాలలో ఫ్లాష్‌బ్యాక్ సీన్లు ప్రవేశ పెట్టిన ప్రథముడు ఎల్మర్ రైస్. కొత్తదనం కోసం అన్వేషించే ఎల్మర్ రైస్, జర్మనీలో ప్రాచుర్యంలోకి వచ్చిన అభివ్యక్తి (Expressionism) నాటకశైలిని స్వీకరించి ది ఏడింగ్ మెషీన్ (1923) అనే నాటకం రాశాడు. ఈ నాటకమే అతనికి పేరు తీసుకువచ్చింది.

అవమానవీయకరణ గురించి అభివ్యక్తి శైలిలో రచించబడిన ఈ నాటకం మేధావుల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. ఎల్మర్ రైస్ నాటకాలలో నియంతృత్వం మీద దాడి, కష్టజీవులపై కారుణ్య దృష్టి ప్రతిబింబిస్తాయి. ఉయ్ ది పీపుల్స్ (1933), విన్నర్స్ (1954) మొదలైన నాటకాలు కూడా ప్రజాదరణ పొందాయి.

అమెరికాలో అసంబద్ధ నాటక శైలికి (Theatre of the Absurd) అంకురార్పణ చేసినవాడు ఎడ్వర్డ్ అల్బీ (జ.1928). ఈయన రాసిన ది జూ స్టోరీ (1958), హూ ఈజ్ అఫ్రయిడ్ ఆఫ్ వర్జీనియా ఉల్ఫ్ (1962),టినీ ఆలిస్ (1964), ఎ డెలికేట్ బ్యాలెన్స్ (1966), సీ స్కేప్ (1975) మొదలైన నాటకాలు అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాయి. ఎ డెలికేట్ బ్యాలెన్స్, సీ స్కేప్, త్రీ టాల్ ఉమెన్ నాటకాలకు పులిడ్జర్ బహుమతులు లభించాయి. నాటకకర్తగా అతని పేరు అమెరికా నాటక చరిత్రలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొంది.

అమెరికా నాటకరంగానికి అంతర్జాతీయ ఖ్యాతి సముపార్జించిన పదిమంది గొప్ప రచయితలలో థారంటన్ వైల్డర్ (1897-1975) ఎన్నదగినవాడు. ఈయన రచించిన నాటకాలు రాశిలో కొంచెమే అయినా వాసిలో పేరెన్నికగన్నవి. ఈయన ఆరు ఏకాంకికలు, మూడు నాటకాలు రచించాడు. వైల్డర్ మొదట్లో వాస్తవికతా వాదం వైపు మొగ్గు చూపినా, క్రమంగా నూతన ప్రయోగాలపై దృష్టినిలిపాడు. నిజానికి వైల్డర్‌ను అగ్రశ్రేణి రచయితగా నిలబెట్టినవి ప్రయోగాత్మక నాటకాలు కావడం విశేషం. 1931 నుంచి నాటకరచన చేస్తున్నా రచయితగా పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది 1937లోనే. అవర్ టౌన్ (1938) అనే నాటకం వైల్డర్ రచనా జీవితంలో పెద్ద మలుపు. సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రయోగాత్మకంగా నాటకాన్ని మలిచిన తీరు ప్రేక్షకులను అబ్బురపరచింది. దృశ్యబంధ నిర్మాణం, రంగస్థల పరికరాలు మొదలైనవి లేకుండా మూకాభినయం (Mime) ప్రక్రియతో కావ్యార్థాన్ని అభివ్యక్తం చేస్తూ, అక్కడక్కడా నిశ్చల దృశ్య విధాన ప్రక్రియ (ఫ్రీజ్)తో నాటకాన్ని నడిపిస్తూ, ప్రేక్షకుల ఊహాశక్తికి పదును పెట్టే విధంగా రూపొందించిన ఆ నాటకం పండిత పామరుల ప్రశంసలు పొందింది. అనవసరపు హంగులు లేకుండా సాంకేతిక విలువలతో నాటక ధ్యేయాన్ని సామాజికులకు సులభగ్రాహ్యం చేసిన ఈయన శిల్ప నైపుణ్యాన్ని నాటకాభిమానులు ఎంతో ప్రశంసించారు. అప్పటికి ప్రాచుర్యంలో లేని తాదాత్మ్య విచ్ఛిత్తి అనే ప్రక్రియ అవర్ టౌన్ లో చోటు చేసుకోవడం ఆశ్చర్యకరమైన విషయం. ది స్కిన్ ఆఫ్ అవర్ టీత్ (1942) అనే నాటకం కూడా ఈయన ఖ్యాతిని ద్విగుణీకృతం చేసింది. అవర్ టౌన్, ది స్కిన్ ఆఫ్ అవర్ టీత్ నాటకాలకు పులిడ్జర్ బహుమతులు లభించాయి.

ఈ శతాబ్దిలో సుమారు వందమంది నాటక రచయితలు తమ నాటక రచనలతో అమెరికా నాటకరంగాన్ని సుసంపన్నం చేశారు. వారిలో నీల్ సైమన్, డేవిడ్ రబి, ఆర్థర్ కోపిట్, షామ్ షెపార్డ్, బెర్నార్డ్ స్లేడ్, థామస్ హెగ్గిన్, విలియమ్

సరోయన్, షేర్ వుడ్ అండర్సన్ తదితరులు పేర్కొనదగిన రచయితలు.

నీల్ సైమన్ (1927) 1961 లో రచయితగా రంగ ప్రవేశం చేసి సుమారు 25 నాటకాలు రచించాడు. తన నాటకాల్లో హాస్యం అంతర్లీనంగా ఉండడం చేత రంగస్థలం మీద బాగా రాణించాయి. కనక వస్తు వాహనాల సంపాదన కోసం మధ్య తరగతిపడే తపన ఈయన నాటకాల్లో గోచరిస్తుంది. కమ్ బ్లో యువర్ హారన్ (1961), ఆడ్ కపుల్ (1965), చాప్టర్ టు (1977), నీల్ సైమన్‌కు పేరు తెచ్చిన నాటకాలు. డేవిడ్ రబి (1940) వియత్నామ్ యుద్ధ సంబంధిత నాటకాలను రచించాడు. హింస, జాతి ద్వేషం, అసంగత వీరోచిత కార్యాలు ఈయన రచనల్లో పుష్కలంగా ఉంటాయి. కుటుంబ సమస్యలతో కూడిన స్టిక్స్ అండ్ బోన్స్ (1971), స్ట్రీమర్స్ (1976) అనే నాటకాలు రబికి పేరు తెచ్చి పెట్టాయి. ఆర్థర్ కోపిట్ నాటకాలు పరిశోధనాత్మకంగా ఉంటాయి. వింగ్స్ (1978), ది ఎండ్ ఆఫ్ ది వరల్డ్ (1984) ఈయన ప్రసిద్ధ నాటకాలు.

ప్రయోగాత్మక నాటకాలపై అత్యుత్సాహం చూపే నాటక సమాజాల ధోరణి వెర్రితలలు వేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. 1968లో బ్రాడ్వే ఆధ్వర్యంలో హేర్ అనే నాటకం సభ్యతాపరిధుల్ని అధిగమిస్తూ న్యూయార్క్‌లో ప్రదర్శితమైంది. ఆ ప్రదర్శనలో నటీనటులు వివస్త్రలై నటించడం, రంగస్థలంపై అసభ్యపదజాలం ఉపయోగించడం సభ్య ప్రపంచానికి జుగుప్సావహంగా తోచింది. ప్రజాభిప్రాయాన్ని మన్నించి ఆ నాటకాన్ని విరమించుకోక తప్పింది కాదు. ఈ హేర్ నాటకాన్ని ఇతర దేశాల్లో కూడా ప్రదర్శించబడటం జరిగింది. చే, ఓహ్ కల్‌కటా అనే పేర్లతో హేర్ నాటక ధోరణిలో కొద్దిగా చేర్పులు మార్పులతో మరో రెండునాటకాలుకూడా 1970లో ప్రదర్శితమయ్యాయని తెలుస్తోంది.

బ్లాక్ థియేటర్ : నల్ల జాతి నాటకరంగం. నీగ్రోలు బానిసత్వం నుంచి విముక్తి పొందిన తరువాత తమదైన సంస్కృతిని, సాహిత్య కళారూపాలను పరిరక్షించుకోవలసిన అవసరం ఏర్పడింది. అందులో భాగంగానే నాటకరంగం అభివృద్ధి కోసం శ్రద్ధ వహించారు. 1960లో లీ రాయ్ జోన్స్ తదితరులు కలసి బ్లాక్ ఆర్ట్స్ రిపర్టరీ థియేటర్ స్కూల్ పేరిట న్యూయార్క్‌లో ఒక సంస్థకు అంకురార్పణ చేశారు. ఇది ఎక్కువ కాలం కార్యక్రమాలు నిర్వహించకపోయినా నాటకకళ పట్ల అభిమానాన్ని ప్రోది చేయడంలో ఈ సంస్థ ప్రేరణ కలిగించిందని చెప్పవచ్చు. 1964 నాటికి దేశంలో 40 నల్లజాతి కళా బృందాలు వెలిశాయంటే బ్లాక్ థియేటర్ కృషి వృథాకాలేదని అర్థమవుతుంది. ఆ కళా బృందాలలో నీగ్రోఎన్‌సెంబుల్ కంపెనీ, ది న్యూ లఫాయెట్ థియేటర్, ది స్పిరిట్ థియేటర్ నాటక రచయితలను, నాటక సమాజాలను ప్రోత్సహించడంలో ప్రధాన పాత్ర వహించాయి. ఈ కళాబృందాల నీడలో అనేక మంది నల్లజాతి నాటకకర్తలు ఎదిగారు. లోరైన్ హాక్స్‌బెరి (1930-1965) రాసిన ఎ రైసిన్ యిన్ ది సన్ నాటకం బహుళ ప్రచారం పొందింది. చికాగో నగరంలో ఒక నల్ల జాతి కుటుంబం అహర్నిశలూ చెమటోడ్చి పని చేసినప్పటికీ కష్టాల కడలిలో ఇడుములు పడిన దైన్య జీవితం గురించి హృదయంగమంగా చిత్రించబడింది ఆ నాటకంలో. లీరాయ్ జోన్స్ ది టాయ్‌లెట్ నాటకం వేర్పాటు వాద ధోరణిలో సాగింది. స్లేవ్ షిప్ (1967) అనే నాటకం ఆఫ్రికానుంచి బానిసలుగా తెచ్చిన నాటి నుంచి అప్పటి వరకు అనుభవించిన బాధల గాథలను సాకల్యంగా వివరిస్తుంది. డగ్లస్ టర్నర్ వార్డ్ రాసిన డే ఆఫ్ ఆబ్సెన్స్ (1967), ది రెకనింగ్ (1969), లోనీ ఎల్డర్, నర్ మొనీస్ ఇన్ డార్క్ ఓల్డ్ మెన్ (1969), లెస్లీలీ ది ఫస్ట్ బ్రీజ్ ఆఫ్ సమ్మర్ (1975) మొదలైన నాటకాలు బ్లాక్ థియేటర్‌లో ప్రసిద్ధి చెందిన నాటకాలు. బ్లాక్ థియేటర్‌ను సంపన్నవంతం చేసిన నాటకరచయితలలో రిచర్డ్ వెస్లే, మెల్విన్ వాన్ పీబుల్స్, రోనిమిల్నర్, ఒస్సీ డేవిస్, అండ్రియన్నీ కెనడీ, బెన్ కోల్డ్ వెల్ ముఖ్యులు. జాతుల మధ్య సామరస్యాన్ని కూర్చే దిశలో ఈ నాటకకర్తల కృషి అవిచ్ఛిన్నంగా సాగుతూ ఉంది.

1970 తరువాత వచ్చిన నాటక కర్తలు సృష్టించిన నాటకాలు ఎక్కువ కాలం నిలబడలేక పోతూ, ఒక్కో ప్రాంతానికే పరిమితమవుతున్నాయి. ఎక్కువ ప్రదర్శనలకు నోచుకోవడం లేదు. మారిన ప్రజాభిరుచులు దీనికి కొంతకారణంకావచ్చు. ఓనీల్, మిల్లర్, టెన్నిస్సె నాటకాల్లో ప్రదర్శన విలువల తోపాటు సాహిత్య విలువలు నిక్షిప్తమై ఉండేవి. నేటి నాటకాల్లో ముఖ్యంగా ప్రయోగాత్మక నాటకాల్లో ప్రదర్శన విలువలకే పెద్ద పీట, సాహిత్య విలువలు మృగ్యం. సమకాలీన నాటకకర్తల రచనల్లో లైటర్ వీన్‌లో రాసే ధోరణి ప్రస్ఫుటమవుతోంది. ప్రస్తుతం మ్యూజికల్ కామెడీలకే అగ్రతాంబూలం లభిస్తోంది. షేక్స్పియర్, ఇబ్సన్, మోలియర్, బెర్టోల్ట్ బ్రెష్ట్, పింటర్, షా వంటి విదేశీయ నాటక కర్తల రచనలు అమెరికాలో యింకా ఆదరింపబడుతూ ఉన్నాయి. అమెరికాలో ఔత్సాహిక నాటకరంగం నామమాత్రమే. మొదటి నుంచీ వృత్తి నాటకరంగమే రాజ్య మేలుతూ ఉంది. ఏది ఏమైనా సమకాలీన అమెరికన్ నాటకరంగం కేవలం వినోద ప్రక్రియలకే ప్రాధాన్యమిచ్చి శాశ్వత విలువలను విస్మరిస్తుంది అన్నది ఒక చేదు నిజం.

గం.సు.రె.

బ్రిటన్ నాటక రంగం

ఇంగ్లాండులో నాటక ఆవిర్భావం మతపరమైన ఆరాధనల నుంచి జరిగింది. క్రీ.శ. పదవ శతాబ్దంలో ఈస్టర్ సందర్భంగా నాలుగు పంక్తులు నాటకీకరణ చేయడం జరిగింది. క్రీస్తు సమాధిని పరిరక్షిస్తున్న ఒక దేవతకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక మతగురువు, మేరీ మాతకు ప్రతిరూపంలో ఉన్న ముగ్గురు మత గురువులను సంభాషణ రూపంలో ప్రశ్నిస్తాడు. ఈ విధంగా, లాటిన్ భాష తెలియని సామాన్యప్రజలకు, క్రీస్తు జీవితాన్ని నాటకరూపంలో అదనపు పాత్రలను సృష్టించి, చర్చిలలో ప్రదర్శించేవారు. వినోదం అతి తక్కువగా లభించే ఆ రోజుల్లో అతి సామాన్య నాటక ప్రదర్శన కూడా ప్రజలను అమితంగా ఆకర్షించింది. క్రమక్రమంగా చర్చి ప్రాంగణాన్ని దాటి బయట ప్రదర్శనలు నిర్వహించటంతో, మత పరమైన కట్టుబాట్లకు లోబడని వారు కూడా ప్రదర్శనల్లో పాల్గనటం ప్రారంభించారు. **చర్చి ఆవరణలను దాటి బయటి ప్రదర్శనల్లో పాల్గనటాన్ని నిషేధించినపుడు మత** గురువులు కానివారు ఈ **పాత్రలలో నటించారు.**

13వ శతాబ్దం నుంచి 15వ శతాబ్దం వరకు క్రైస్తవ మతపరమైనఅద్భుత నాటకాలు (Miracle Plays) విరివిగా ప్రదర్శించారు. మధ్యయుగపు నాటకాలు ఆరుబయట ప్రదేశాలలో ప్రదర్శించేవారు.14వ శతాబ్దంలో భగవంతుని స్తుతిచేసే నాటకాలలో సుగుణ, దుర్గుణాలను రూపకీకరించి వాటిలో పరస్పర ఘర్షణ చూపేవారు. 15వ శతాబ్దంలో బైబిల్ ప్రాశస్త్యాన్ని వివరించే పద్ధతుల మాదిరిగా, కొత్త నాటకాలను ప్రయోగించే విధానం మొదలైంది. మానవాళికి ప్రాతినిధ్యం వహించే విధంగా నాటకాలలోని ప్రధాన పాత్రను తీర్చిదిద్దారు. వృత్తి పరంగా సంచార గాయక నటుల్ని, ఔత్సాహిక బృందాలను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ శతాబ్ది చివరి భాగంలో బాగా ప్రచారంలో ఉన్న ఫ్రెంచి ప్రహసనాలకు 16వ శతాబ్దపు ప్రథమ భాగంలో తర్జుమాలు వచ్చాయి. జాన్ హేవుడ్ అనే రచయిత మధ్యయుగపు సత్ప్రవర్తన లేదా అద్భుత (Miracle Plays) నాటకాలనూ, ఎలిజబెత్‌కాలంనాటి హాస్య నాటకాలను, సంధియుగంలోని ఫ్రెంచి ప్రహసనాలనీ ఇంగ్లీషులోకి అనువదించాడు. ఇంతకు ముందున్న మొరాలిటీ నాటకాలలో ఉండే మూసపాత్రలు కాకుండా వాస్తవిక పాత్రలను, హాస్యాన్ని సృష్టించే సన్నివేశాలతో ఇంటర్‌లూడ్స్ రాశాడు. 16వ శతాబ్దంలో అనువాదాలు ప్రాముఖ్యాన్ని వహించాయి. టెరెన్స్, ప్లాటస్ మోదాంత నాటకాలు ఇటలీ నుంచి ఇంగ్లాండ్‌కు చేరి అనూదితమైనాయి. విద్యార్థులే ఈ నాటకాలను ప్రదర్శించారు.

గ్రీకు నాటకం గురించి ఇంగ్లాండులో తెలియదు. అయితే తొలి విషాదాంత నాటకం ఆధారాలు లాటిన్ భాషలో ఉన్నాయి. 1562 లో కోర్టు ఆవరణలో ప్రదర్శించిన గోర్బోడక్ నాటకాన్ని థామస్ నార్టన్, థామస్ సాక్‌విల్ రాశారు. ఈ నాటకం సెనెకా ధోరణిలో ప్రతీకారాన్ని ఆధారం చేసుకొని రాయడం జరిగింది. సత్ప్రవర్తనను లక్ష్యంగా పెట్టుకొని చారిత్రక ఆధారంతో రాసిన తొలి బ్రిటీష్ నాటకం.

టాంబుర్లేన్ ప్రపంచాధిపత్యకాంక్షతో సరిపడేవిధంగా నిషిద్ధజ్ఞానాన్ని సంపాదించుకునే విపరీతమైన తృష్ణతో ఉన్న డాక్టర్ అతడు సామాన్యుడు. అతి సామాన్యులుగా పుట్టిన వారిద్దరికీ అధికారంపైన అంతులేని కోరిక. మార్లో ఉద్దేశ్యం ప్రకారం ఆయన రాసిన టాంబుర్లేన్ ది గ్రేట్ (1587) నాటకంలోని ప్రధానపాత్ర, అహంకారంతో భగవదాజ్ఞను తిరస్కరించి, ధిక్కారం చేసినా అతడు శిక్షార్హుడుగా భావించలేదు. ఈ నాటకం మొదటి భాగం విజయవంతం కాగా, రెండవ భాగంలో రక్తపిపాసి అయిన మంగోల్ నాయకునికి తగిన శాస్తి జరుగుతుంది. అయితే థామస్ కిడ్ రాసిన ది స్పానిష్ ట్రాజడీ (1558) టాంబుర్లేన్ కన్నా ప్రశస్తిని, ప్రశంసలను పొందింది.

పదహారవ శతాబ్దంలో షేక్స్పియర్ (1564–1616) ఆవిర్భావం ఇంగ్లీషు నాటక రంగంలో ఒక నూతన శకానికి నాంది పలికింది. నాలుగు శతాబ్దాలు గడిచినా ప్రపంచనాటకరంగంలోని నాటక కర్తలలో అగ్రగణ్యుడుగా నేటికీ కీర్తింపబడుతూ ఉండటం ఒక్క షేక్స్పియర్‌కే చెల్లింది. ప్రపంచంలోని అన్ని ముఖ్యభాషలలోకి షేక్స్పియర్ నాటకాలు అనువదించబడటం ఇంగ్లీషు నాటక రంగానికి గర్వకారణమైన విషయం. షేక్స్పియర్ రాసిన 38 నాటకాల్లో సగంకూడా అతని జీవితకాలంలో ముద్రించ బడలేదు. రాతప్రతులను భద్రపరిచే అలవాటు లేనందువల్ల అవి చాలా కాలం ముద్రణకు నోచుకోలేదు. ఆనాటి నటులు దాచుకొన్న రాతప్రతులే అక్కరకు వచ్చాయి.

షేక్స్పియర్ నటుడుగానే జీవిక ప్రారంభించి, క్రమక్రమంగా నాటక బృందాల నిర్వహణలో భాగస్వామిగా, నాటక రచయితగా స్థిరపడ్డాడు. ఆనాడు సమాజంలో నటుల పట్ల చులకన భావం ఉండేది. నటులను పనీపాట లేని వ్యర్థ జీవులుగా, దేశదిమ్మరులుగా, దోపిడీ దార్లుగా భావించేవారు. షేక్స్పియర్ కాలంలో నాటక ప్రదర్శనలు పట్టణాల వెలుపల,తాత్కాలికంగా

లుక్ బ్యాక్ ఇన్ ఏంగర్ నాటకంలో ఒక దృశ్యం

నిర్మించుకొన్న ప్రదేశాలల్లోనో, విశ్రాంతి గృహాల్లోనో పగటి పూట ప్రదర్శించారు. షేక్స్పియర్ నటనా వైదుష్యానికి, రచనా పాటవానికి ముగ్ధులైన ప్రజల నుంచి క్రమక్రమంగా మంచి ఆదరణ లభించింది. ఆ ఆదరణే అతనితో అన్ని నాటకాలు రాయించింది.

షేక్స్పియర్ తన నాటకాలకు కథావస్తువును చరిత్ర, పురాణ కథలు, ఇతిహాసాలు, జానపద కథల నుంచి పరిగ్రహించేవాడు. స్వీకరించిన వస్తువు అతని చేతిలో సుందర శిల్పంగా మారేది. షేక్స్పియర్ నాటకాలను విషాదాంత నాటకాలు, సుఖాంత నాటకాలు, చారిత్రక నాటకాలు, కాల్పనిక నాటకాలుగా వర్గీకరించవచ్చు. షేక్స్పియర్ రచనా శిల్పంలోని విశిష్టత, ఇతివృత్త నిర్మాణం, సంభాషణ శైలి, పాత్రచిత్రణ ముందు తరాలకు మార్గదర్శకంగా నిలిచాయి. అతని నాటక శ్రేణిలోని జూలియస్ సీజర్ (1599) మొదలైనవి విషాదాంత నాటకాలు, మర్చెంట్ ఆఫ్ వెనీస్ (1596), మచ్ ఎడో ఎబౌట్ నథింగ్ మొదలైనవి సుఖాంత నాటకాలు, మూడవ రిచర్డ్ (1592), ఆరవ హెన్రీ (1591), ట్వెల్త్ నైట్ (1599), హేమ్లేట్ *(1600)*, ఒథెల్లో (1604), కింగ్ లియర్ (1605), మాక్బెత్ (1606), మొదలైన చారిత్రక నాటకాలు. ది వింటర్స్ టేల్ (1610) మొదలైన కాల్పనిక నాటకాలు ఆధునిక కాలంలో కూడా వివిధ దేశాలలో ప్రదర్శింపబడుతూ ఉండడమే ఆ నాటకాల ప్రాశస్త్యానికి తార్కాణం.

షేక్స్పియర్ రాసిన ఇతర నాటకాలైన ట్రాయిలెస్ అండ్ క్రెసిడా (1601), మెజర్ ఫర్ మెజర్ (1604)లలో కథలు రాజకీయాలకు, లైంగిక సంఘటనలకు సంబంధించినవైౖ, నైరాశ్యాన్ని, ఆధునికతను తెలియజేస్తాయి. ఆంటోని అండ్ క్లియోపాత్రా (1606) నాటకంలో సెక్స్ ప్రాబల్యం, రాజకీయంపై వత్తిడిని పెంచినా, నిర్మాణంలోను, ధోరణిలోను, నాయక లక్షణాలకు వ్యతిరేకంగా ఆంటోనిలోని బలహీనతలను ఎత్తిచూపింది.

షేక్స్పియర్ సృష్టించిన అనేక పాత్రలు నేటికీ జన. సామాన్యంలో శాశ్వతంగా నిలిచిపోయాయి. షైలాక్, ఆంటోనీ, మాక్బెత్, హేమ్లెట్, ఒథెల్లో, ఫాల్స్టాఫ్ – ఇంకా ఎన్నో పాత్రలు చిరంజీవత్వాన్ని సంతరించుకొన్నాయి. తన జీవిత కాలంలో షేక్స్పియర్ నాటకాల మీద విమర్శకుల, మేధావి వర్గం నుంచి అంతగా స్పందన రాలేదు. అతని సమకాలికులైన బెన్ జాన్సన్, ఫ్లెచర్ వంటి నాటక రచయితల కంటె షేక్స్పియర్‌ను తక్కువగా చూడటం కూడా జరిగింది. షేక్స్పియర్ నాటకాలు అచ్చు రూపంలో వెలువడిన తరువాత అతని గొప్పతనం ప్రస్ఫుటమైంది. 17వ శతాబ్దంలో షేక్స్పియర్ రచనలకు విశ్వవ్యాప్తమైన కీర్తి

లభించింది. 19వ శతాబ్దంలో షేక్స్పియర్ కీర్తి శిఖరాగ్రాన్ని తాకింది. షేక్స్పియర్ రచనలపై పరిశోధనలు, విశ్లేషణాత్మక గ్రంథాలు వేల సంఖ్యలో వెలువడినాయి. నేటికీ వెలువడుతూనే ఉన్నాయి.

బెన్ జాన్సన్ (1572-1637) షేక్స్పియర్ సమకాలికుడైనా ఇద్దరి రచనా రీతులు వేరు. షేక్స్పియర్ రాజుల కథలు, జానపద వీరుల కథలు రచిస్తే, జాన్సన్ సమకాలీన సమాజంలోని వ్యక్తుల భిన్న మనస్తత్వాల పైన దృష్టి నిలిపాడు. ఎవ్వరిమేన్ ఇన్ హిజ్‌హ్యూమర్ (1598), వాల్‌పోన్ (1606), ది ఆల్ కెమిస్టు (1610), బెర్త్ లో మ్యుస్యుఫేర్ (1614) ఇతని ప్రసిద్ధ నాటకాలు. బెన్ జాన్సన్‌కు రాజాదరణ లభించింది. ఈయనను ప్రభుత్వం ఆస్థాన కవిగా నియమించింది. ఉపకార వేతనం కూడా ఇచ్చింది.

థామస్ డెక్కర్ (1572-1632) మానవత్వానికీ, నైతిక విలువలకూ ప్రాధాన్యమిస్తూ నాటక రచన చేశాడు. ది షూ మేకర్స్ హాలిడే (1599) డెక్కర్ ప్రసిద్ధనాటకం. థామస్ హేవుడ్ (1574-1641) కూడా ఆ కాలంలో ప్రజాదరణ పొందిన నాటక రచయిత. శతాధికంగా నాటకాలు, వాటిలో అధిక భాగం విషాదాంతాలు రచించాడు. ఏ ఉమన్ కిల్డ్ విత్ కైండ్‌నెస్ (1603), జాన్ ఫ్లెచర్ (1579-1625) ఫ్రాన్సిస్ బోమాంట్(1584-1616)తో కలిసి సుమారు 50 నాటకాలు రాశాడు. ది మెయిడ్స్ ట్రాజడీ, ఫిలాస్టర్, ఎ కింగ్ అండ్ నో కింగ్ మొదలైనవి ప్రజాభిమానాన్ని చూరగొన్న నాటకాలు. ఫిలిప్ మెసెంజర్ (1583-1639/40) రాసిన నాటకాలలో ఎ న్యూ వే టు పే ఓల్డ్ డెట్స్ (1622) ప్రసిద్ధి చెందింది. జాన్‌ఫోర్డ్ (1586-1639), జేమ్స్ షిర్లే (1599-1666) మొదలైన రచయితల నాటకాలు కూడా 16వ శతాబ్దిలో ప్రఖ్యాత నాటకాలుగా గుర్తింపు పొందాయి.

షేక్స్పియర్ సమకాలికుడైన జాన్ వెబ్‌స్టర్ రెండు విషాద రూపకాలతో ప్రసిద్ధుడయ్యాడు. ఆ నాటకాలు ది వైట్ డెవిల్(1611), ది డచెస్ ఆఫ్ మాల్ఫి (1612). ఇటాలియన్ పునరుజ్జీవన కాలంలోని రెండు సంఘటనలకు సంబంధించిన నాటకాలివి. జాన్ మార్‌స్టన్, థామస్ మిడిల్‌టన్, జార్జి చాప్‌మెన్, జాన్ ఫోర్, జేమ్ షిర్లీ మొదలైన ప్రముఖ నాటకకర్తలు ఈ కాలంలో మంచి నాటకాలు రచించారు. థామస్ ఆట్‌వే ది ఆర్ఫన్ అనే నాటకం బ్లాంక్‌వర్స్‌లో రాయడం జరిగింది. ఉత్కంఠ భరితమైన విషాద నాటకంగా దీనికి గుర్తింపు లభించింది. వెనీసుకు వ్యతిరేకంగా పోప్ పై జరిగిన కుట్ర ఆధారంగా రాసిన వెనీస్ ప్రిజర్వ్‌డ్ (1682) నాటకం రచయితకు పేరు తెచ్చిపెట్టింది.

రెస్టోరేషన్ నాటకాలు ఐశ్వర్యవంతులకు సంబంధించినవి కాగా, 18వ శతాబ్దపు నాటకాలు ప్రధానంగా మధ్య తరగతి మనుషుల గురించి రాయబడినవి. ప్రేక్షకుల దృష్టిలో వీరులు, శూరులు మాత్రమే ప్రశంసనీయులు కాదనీ, సాధారణ మనిషిలోని మానవత్వం కూడా ప్రశంసార్హమే అనే భావన వ్యాపించింది. జార్జి ఫార్ ఖుహార్ రాసిన ది రిక్రూటింగ్ ఆఫీసర్ (1706) నాటకంలో మిలటరీ న్యాయవ్యవస్థ లోని అధికార దుర్వినియోగాన్ని దుయ్యబట్టాడు. సెక్స్ పరమైన మోసాల ప్రాబల్యాన్ని, మానవ స్వభావాల వైలక్షణ్యాన్ని ది బోస్ట్రాటజమ్ అనే నాటకంలో సునిశితంగా విశ్లేషించాడు. ఐర్లాండులో విద్యాభ్యాసం చేసి లండన్ నగరంలో కవిగా స్థిరపడిన గోల్డ్‌స్మిత్ ప్రధానంగా కవిత్వం రాసేనాడు. వ్యాసరచన, నవలా రచన కూడా అనతికాలంలో చేపట్టి అన్ని ప్రక్రియల్లోనూ ఖ్యాతి గడించాడు. క్రమంగా నాటక రచనకు కూడా పూనుకొని, తొలి సారిగా ది గుడ్ నేచర్డ్ మాన్ (1768) నాటకం రచించాడు. అది అత్యున్నతమైన ఆహ్లాద రూపకంగా జాన్సన్ అభివర్ణించాడు. అతని మరో నాటకం షిస్టూప్స్ టు కాన్‌క్వర్ (1773) ఆహ్లాద రూపకం. అప్పుడూ ఇప్పుడు కూడా ప్రేక్షకులను అలరిస్తూ గోల్డ్‌స్మిత్ కీర్తి స్తంభానికి బాసటగా నిలిచి ఉంది.

ఇంగ్లీషు నాటకరంగానికి పసందైన మోదాంత రూపకాలను అందించిన వారిలో షెరిడాన్ (1751-1816) గణనీయుడు. ఈయన రాసిన ది రైవల్స్, ది డ్యూయెన్నా, ది స్కూల్ ఫర్ స్కాండల్స్ మొదలైన నాటకాలు విజయవంతంగా ప్రదర్శించబడటమే కాక వివిధ భాషల్లోకి అనువదింపబడి, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టాయి. ఈ శతాబ్ధిలో రిచర్డ్ స్టీల్, నికొలాస్‌రో, జొసెఫ్ ఎడిసన్, జార్జి కోల్మోన్ మొదలైన వారు రచించిన నాటకాలు ప్రజాదరణ పొందాయి.

ప్రసిద్ధ కవులు నాటక రచన పట్ల ఆకర్షితులు కావటం 19 శతాబ్దంలో ఒక పరిణామం. వర్డ్స్‌వర్త్, కీట్స్, షెల్లీ, బైరన్, బ్రౌనింగ్, టెన్నిసన్ వంటి ప్రసిద్ధ కవులు నాటకాలు రాయడానికి పూనుకున్నారు. కాని వారు రచించిన నాటకాలలో ఒకటి రెండు మినహా ఏవీ రాణింపుకు రాలేదు. కొన్నయితే రంగస్థలాన్ని తాకిన దాఖలాలు లేవు. 1819లో షెల్లీ రాసిన ది సెన్సీ అనే నాటకం మాత్రం ఈయనకు పేరు తెచ్చిపెట్టింది. ఈ నాటకంలో రచయిత 16వ శతాబ్దపు సమస్యలు, హత్యలు, సంపర్కం, శారీరక హింసలు మొదలైన అనేక అంశాలను చర్చించటం జరిగింది. మెలోడ్రామాలు వినోదానికి ఆటపట్టుగా నిలవడం ఆనాటి ప్రేక్షకుల అభిరుచికి తార్కాణం. రాను రాను శ్రవ్యానికి ప్రాముఖ్యం తగ్గి దృశ్యానికి ప్రాధాన్యం పెరిగింది. అందుచేత వ్యాపార దృష్టి పెరిగిన రచయితలు తమ నాటకాలలో

దృశ్యపరమైన ఎఫెక్ట్సుని పొందుపరచి ప్రేక్షకుల్ని ఆకట్టుకొనే వారు. ప్రతి నాటకంలోను ఒక ప్రత్యేక సంచలనాత్మక రంగాన్ని విధిగా రాసేవారు. వెబ్‌స్టర్, టోర్నియర్, మిడిల్ టన్ రచించిన నాటకాలలో ప్రేతాత్మలు, స్మశానాలు, కంకాళాలు, గాలివానలు మొదలైన భయానక దృశ్యాలు పుష్కలంగా ఉండి ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేశాయి.

19వ శతాబ్దం పూర్తిగా మెలోడ్రామాలు రాజ్యం ఏలిన కాలం. థామస్ హెూల్ఫర్డ్ రాసిన ఎ టేల్ ఆఫ్ మిస్టరీ (1802), డగ్లస్ జెరోల్ బ్లాక్ ఐడ్ సూసన్ (1823), టామ్ టేలర్ ది టికెట్ హెన్రీ ఆర్థర్ జోన్స్ ది సిల్వర్ కింగ్ (1862), ఆఫ్ లీవ్ మాన్ (1863), లియోపాల్డ్ లీవిస్ ది బెల్స్ (1872) వీటికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

శతాబ్దం ముందుకు జరిగిన కొద్దీ, రచనలో ఆధునికత ఎక్కువైంది. పినెరో 1898లో రాసిన ది ట్రెలానీ ఆఫ్ ది వేల్స్ అరవయ్యో దశకంలో టి. డబ్ల్యు.రాబర్ట్‌సన్ ప్రవేశపెట్టిన వాస్తవికతావాదాన్ని అనుసరిస్తూ రాసిన నాటకం. రాబర్ట్‌సన్ సొసైటీ (1865), కేస్ట్ (1867) అనే అద్భుత నాటకాలను రాశాడు.

హెన్రీ ఆర్థర్ జోన్స్ రచించిన నాటకాలు మెలోడ్రామాలే అయినప్పటికీ, సాంఘిక సమస్యలను గంభీరంగా చర్చించటంలో ఇంగ్లీషు నాటకాన్ని ముందడుగులు వేయించాయి. ఆస్కార్ వైల్డ్ రాసిన లేడీ విండర్ మియర్స్ ఫాన్ (1892) భావనలోను, నిర్మాణంలో మెలోడ్రామాయే. ఈ నాటకంలో మెలోడ్రామా పాలు ఎక్కువైనా చక్కని లోకోక్తులతో రాయడం వల్ల ప్రేక్షకుల్ని బాగా ఆకర్షిస్తుంది. ఆస్కార్ వైల్డ్ రాసిన ఎ ఉమన్ ఆఫ్ నో ఇంపార్టెన్స్, ఏన్ ఐడియల్ హజ్బెండ్ (1893), ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్ (1895) నాటకాలు కూడా బహుళ జనాదరణ పొందినవి. సర్ జేమ్స్ ఎం. బారీ రాసిన క్వోలిటీ (1901), ది ఎడ్మిరిబుల్ క్రిచ్‌టన్ (1902), పీటర్ పాన్ (1904) నాటకాలు కూడా రంగస్థలం మీద బాగా రాణించాయి.

నాటకాన్ని శక్తివంతమైన ఆయుధంగా చేసుకొని మత, రాజకీయ, సామాజిక వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరవేసిన ఘనత జార్జిబెర్నార్డ్‌షాది (1856- 1950). సంప్రదాయం నిర్వచించిన విలువల్ని ప్రశ్నించాడు. మత మౌఢ్యాన్ని ఖండించాడు. సమసమాజాన్ని కాంక్షించాడు. ఈయన రచించిన నాటకాలు భావోద్వేగాన్ని, ఆశయాలను అభివ్యక్తం చేసే వాహికలయ్యాయి. మురికివాడల్లో ఇండ్ల యజమానులు పేదవారిపై చూపే దౌష్ట్యాన్ని, అమానుషత్వాన్ని తూర్పారపడుతూ విడోయర్స్ హౌసెస్ (1892) అనే నాటకం రాశాడు. అది ధనికుల, అధికారగణం గుండెల్లో గుబులు పుట్టించింది. మిసెస్ వారెన్స్ ప్రొఫెషన్ (1902) నాటకంలో వేశ్యా వృత్తిలోని స్త్రీ జీవితాన్ని స్పృశించి, సమాజంలో సంచలనం సృష్టించాడు. ఏపిల్ కార్ట్ (1929), టూట్రూటుబిగుడ్ (1932), జెనేవా (1938) రాజకీయ వ్యవస్థపై సంధించిన అస్త్రాలు. వైద్యవృత్తిలో సంస్కరణావశ్యకతను ప్రతిపాదిస్తూ రాసిన డాక్టర్స్ డైలమా (1906) విమర్శకు తావిచ్చింది. పిగ్మేలియన్ (1914), మాన్ అండ్ సూపర్‌మాన్ (1905) నాటకాలు బెర్నార్డ్ షా కీర్తిని శిఖరాగ్రానికి చేర్చాయి. ఆర్మ్సఅండ్ ది మాన్ (1894), కాండిడా (1897), డెవిల్స్ డిసైపుల్ (1897) మొదలైన 30 నాటకాలు షా కలం నుంచి వెలువడి, రచయిత ఖ్యాతిని ఇనుమడింప జేశాయి.

ఈ శతాబ్దిలో ఇంగ్లీషు నాటకరంగాన్ని పరిపుష్టం చేసిన వారిలో షా అగ్రగణ్యుడు కాగా, జాన్ గాల్స్ వర్దీ, సోమర్ సెట్ మామ్, నోయల్ కవర్డ్, టెరెన్స్ రాటిగన్, టి.ఎస్. ఇలియట్, హారాల్డ్ పింటర్, జాన్ ఆస్బర్న్, జె.బి. ప్రీస్ట్లీ ప్రభృతులు ముఖ్యులు.

జాన్ గాల్స్ వర్దీ (1867-1933) నవలా రచయిత, నాటక కర్త. కార్మిక వ్యవస్థలో జరిగే అన్యాయాలపై ధ్వజమెత్తాడు. న్యాయవ్యవస్థలో సామాన్యుని గోడు అరణ్యరోదన అవుతుందనడానికి ఆర్తి జస్టీస్ (1910) నాటకమే దర్పణం. జైల్లో ఖైదీలు అమానుష చర్యలకు గురౌతున్నారనీ, జైలు సంస్కరణలు జరగాలని ఎలుగెత్తి చాటాడు. గాల్స్‌వర్దీకి సిల్వర్ బాక్స్ (1906), స్ట్రైఫ్ (1909) నాటకాలు సమస్యాత్మక నాటకాలుగా అతనికి పేరు తెచ్చాయి. ఈయన నాటకాలలో కళాత్మకత కంటె ప్రచార ధోరణి అధికంగా ఉంటుందనే విమర్శ ఉంది.

సోమర్‌సెట్ మామ్ (1874-1965) 19వ శతాబ్దం చివరలో నాటకరచనకు పూనుకొని లేడీ ఫ్రెడరిక్ (1903), మిసెస్ డాట్ (1904) వంటి ఆహ్లాద రూపకాలు రచించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. 1908లో మామ్ రాసిన నాటకాలు ఒకేసారి వెస్ట్‌ఎండ్ నాటక మందిరాలలో ప్రదర్శింపబడటం విశేషం. జాక్‌స్ట్రా, ది ఎక్స్ ప్లోరర్, ది సర్కిల్, అవర్ బెటర్స్, ది కాన్‌స్టెంట్ వైఫ్ (1926), ది లెటర్ (1927), ది సెకెండ్ ఫ్లేమ్ (1928) మొదలైన నాటకాలు వెస్టెండ్ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడ్డాయి.

డ్రాయింగ్ రూమ్ కామెడీ రచనలో మరో సిద్ధహస్తుడు నోయల్ కొవర్డ్ (1899-1973). తొలుత నటుడుగా జీవితం

ప్రారంభించి 1920 నాటికి రచయితగా స్థిరపడ్డాడు. 1920-40 మధ్యకాలంలో ఆహ్లాద రూపక పరంపరంతో నాటకరంగాన్ని పులకింప చేశాడు. ఈయన రచనలలో *హేఫీవర్* (1925), *ప్రైవేట్ లైవ్స్* (1930), *బ్లైత్ స్పిరిట్* (1941), *ప్రెజెంట్ లాఫ్టర్* (1942), *ఫాలన్ ఏంజెల్స్* (1925) ప్రజాదరణ పొందిన నాటకాలు.

జె.బి.ప్రీస్ట్లీ (1894-1984) ప్రసిద్ధ నవలా రచయిత, నాటకకర్త, విమర్శకుడు. సుమారు 50 నాటకాలు రాశాడు. వాటిలో రాజకీయ నాటకాలు, అభివ్యక్తి శైలిలో రాసిన నాటకాలు, హాస్య నాటకాలు కూడా ఉన్నాయి. ఈయన రాసిన నాటకాలలో *ఐహావ్ బీన్ హియర్ బిఫోర్* (1933), *ఏన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్* (1946) నాటకాలు అత్యంత ప్రజాదరణ పొందాయి. *ది గుడ్ కంపానియన్స్* (1931), *ది డేంజరస్ కార్నర్* (1932), *ఈడన్ ఎండ్* (1934), *వెన్ వుయ్ మారీడ్* (1938) నాటకాలు ప్రీస్ట్లీ నాటక పరంపరలో కొన్ని. *టైమ్ అండ్ కాన్వాస్, ఐ హావ్ బీన్ హియర్ బిఫోర్, ఏన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్* నాటకాలలో భూత, వర్తమాన, భవిష్యత్కాలాల సమ్మేళనం కనిపించడం ఓ ప్రత్యేకత.

1940 దశకంలో టెరెన్స్ రాటిగన్ (1911-77) సున్నిత ఆహ్లాద రూపక రచయితగా పేరు గడించాడు. ఫ్రెంచ్ వితౌట్ టియర్స్(1936) అనే నాటకాన్ని పాతికేళ్ల వయసులోనే రాశాడు. ఇతని రచనల్లో విన్ స్లో బాయ్ (1946) ఇతర దేశాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. ఫ్లేర్ పాత్ (1942), వైల్ ది సన్ షైన్ (1943), ఇన్ ఐడిల్ నెస్ (1944) మొదలైనవి ఈయన ప్రసిద్ధ నాటకాలు.

అమెరికాలో జన్మించిన టి.ఎస్. ఇలియట్ (1888-1965) 1915లో ఇంగ్లాండ్‌లో స్థిరపడ్డాడు. ఈయన కవి, నాటక కర్త. పద్య నాటకాలకు ప్రాధాన్యమిచ్చిన రచయిత. ప్రతి నాటకంలోను పద్యాలు, పాటలను పొందుపరచడం ఈయనకు అలవాటు. *మర్డర్ ఇన్ ది కెథడ్రాల్* (1935) బహుళ జనాదరణ పాత్రమైంది. ఇందులో కవిత్వ ధోరణి అధికం. *ది ఫామిలీ యూనియన్(1939), ది కాక్‌టెయిల్ పార్టీ (1949), ది కాన్ఫిడెన్షియల్ క్లార్క్(1953)* నాటకాలు ఇలియట్‌కు పేరు తెచ్చాయి.

ఇంగ్లీషు నాటకరంగంలో ప్రయోగాత్మక నాటకాలు రాసిన వారిలో హేరాల్డ్ పింటర్ (1930) ప్రముఖుడు. నాటక రచయిత, దర్శకుడు, నటుడు కూడా. 1957లో ది రూమ్ నాటకంతో రచనా వ్యాసంగంతో అడుగు పెట్టిన పింటర్ 1993 వరకూ సుమారు 15 నాటకాలు నాటక రంగానికి అందించాడు. ది రూమ్, ది బర్త్ డే పార్టీ (1958) నిశిత విమర్శకు గురిఅయ్యాయి. ది కేర్ టేకర్ (1960) నాటకం పింటర్‌కి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి పెట్టింది. పింటర్ నాటకాల్లో అత్యధిక భాగం అబ్సర్డ్ నాటకశైలికి చెందినవి. ది హోమ్ కమింగ్ (1965), సైలెన్స్ (1969), నో మ్యాన్స్ లాండ్ (1975) *బిట్రేయల్* (1978) పింటర్ నాటకాలలో ముఖ్యమైనవి. 2005 సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారం ఈయనకు లభించింది.

అగథాక్రిస్టీ (1891-1976) ప్రసిద్ధ అపరాధ పరిశోధక నవలా రచయిత్రి, నాటకకర్త. తాను రచించిన నవలల్లో కొన్నింటిని స్వయంగా తానే నాటకీకరించింది. *టెన్ లిటిల్ నిగ్గర్స్* (1943), *మర్డర్ ఆన్ ది నైల్*(1946) మొదలైనవి రంగస్థలం మీద రాణించాయి. 1952లో రాసిన *మౌస్ ట్రాప్* అనే నాటకం ప్రపంచ నాటకరంగంలో చరిత్ర సృష్టించింది. వెస్ట్ ఎండ్‌లో అంబాసిడర్ థియేటర్ లో 1952లో ప్రదర్శన ప్రారంభమై, రోజు వారీ ప్రదర్శనలలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఇంకా ఆ నాటకం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడా నాటకం సెయింట్ మార్టిన్ థియేటర్‌లో ప్రదర్శింపబడుతూంది.

ఇంగ్లీషు నాటకరంగానికి ఖ్యాతి తెచ్చిన నాటక కర్తలలో జాన్ ఆస్బో (1929-94) మొదట నటుడుగా రంగప్రవేశం చేసి, నాటకకర్తగా గుర్తింపు పొందాడు. ఈయన రాసిన *లుక్ బ్యాక్ ఇన్ ఏంగర్* (1957) అంత్యత ప్రజాదరణ పొందింది. ఈ నాటకాన్ని ఇంగ్లీషు థియేటర్ కంపెనీ విస్తృతంగా ప్రదర్శించి, రచయితకు ఖ్యాతి నార్జించి పెట్టింది. ఈ నాటకంలో కథా నాయకుడు జిమ్మిపోర్టర్ పాత్ర ఇంగ్లీషు సాహిత్యంలో ఆవేశ పరుడైన యువకుడికి పర్యాయపదంగా నిలిచిపోయింది. అంతేకాదు సమాజం మారాలని, సంస్కరించబడాలని నిశితంగా విమర్శించే వ్యక్తులను యాంగ్రీ యంగ్ మెన్‌గా వ్యవహరించడం జిమ్మీపోర్టర్ తోనే మొదలైందని చెప్పవచ్చు. ఆస్బో *ఎంటర్ టైనర్ (1957), లూథర్ (1961), ఇన్ ఎడ్మిసబుల్ ఎవిడెన్స్* (1964) నాటకాలు రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శితమై రచయితకు పేరు తెచ్చాయి.

1970 తరువాత వస్తున్న నాటకాలలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన నాటకాలు లేవు. నాటక కర్తలూ లేరనటం సత్యదూరం కాదు.

చైనా నాటక రంగం

చైనా దేశంలో నాటకం ఎప్పుడు ప్రారంభమైందో చెప్పటానికి చారిత్రక ఆధారాలు లేవు. అనేక మంది చరిత్రకారులు అనేక రకాల కాలాలను సూచించారు. మొత్తానికి క్రీస్తుపూర్వం 2,500 సంవత్సరాల ప్రాంతంలో అక్కడ మతపరమైన దైవప్రార్థనలు జరిపే సమయంలోనూ, శత్రువులను జయించినప్పుడు ప్రకటించే ఆనందోత్సాహాలలోనూ, సంగీతానికి అనుబద్ధమైన మూకాభినయాలు, నృత్యాలు ఉండేవని తెలుస్తోంది. అప్పటికే చనిపోయినవారినీ, వారి ఆత్మలనీ పూజించే ఆచారం ప్రజల్లో ఉండేది. ప్రాచీన ఈజిప్టులో లాగే ప్రాచీన చైనాలో కూడా ఈ పూజల సందర్భంగా జరిపే కొన్ని తంతుల నుండే చైనా నాటకరంగం అభివృద్ధి చెందినదని చెప్పవచ్చు. చైనా చరిత్రలో స్వర్ణయుగంగా చెప్పబడే క్రీస్తుపూర్వం 2205-1766 కాలంలోనే ప్రజలు వారివారి వృత్తులు చేసుకుంటూ పాటలు పాడేవారని, నృత్యాలు చేసేవారిని తెలుస్తోంది. క్రీ.పూ. 1122-255 కాలంలో చైనాను పాలించిన చౌ (Chou) రాజవంశీయుల కాలంలో అక్కడ నృత్యాలకి ఆదరణ, పోషణ లభించాయి. దేవాలయ ప్రాంగణాలలోనూ, పొలాల మధ్య, రహదారుల కూడళ్లలో ప్రదర్శించబడే నృత్యాలు, మూకాభినయాలు, రాజులు నిర్మించిన ఎత్తైన రంగస్థలాలకి చేరుకున్నాయి.

క్రీ.శ. 8వ శతాబ్దంలో చైనాను పాలించిన మింగ్ హువాంగ్ తన దర్బారులో సంగీత, నృత్య కళాకారుల్ని పోషించాడు. ఈయన యువతీ యువకులకి సంగీతం, నృత్యం నేర్పించటానికి ఒక పాఠశాలను కూడా ప్రారంభించాడు. చైనా నాటకరంగానికి ఆదిగురువు ఈయనే. ఆనాటి ఆ పాఠశాల పియర్ ఆర్చర్డ్ కాలేజీగా రూపుదిద్దుకుంది. ఆ చక్రవర్తి తను నిర్మించిన రంగస్థలం మీద నటించాడు కూడా. ఈనాటికీ చైనాలో వున్న ప్రతి నాటకశాలలోనూ ఆయన చిత్రపటం అగరొత్తులతో దర్శనమిస్తుంది. ఆయన కాలంలోనే చరిత్రకి తెలిసిన నాటక రచన, ప్రదర్శన మొదలైనదనవచ్చు. ఆ శతాబ్దాన్ని చైనా నాటక వికాసంలో ప్రాథమిక దశగా పేర్కొనవచ్చు. అయితే ఆనాటి ప్రదర్శనలు చక్రవర్తుల కోటకే పరిమితమైనాయి. క్రీ.శ.13వ శతాబ్దం దాకా సామాన్య ప్రజలకి చైనాలో నాటకం అందుబాటులోకి రాలేదు.

క్రీ.శ.1280లో మంగోలియాకి చెందిన కాబులాయ్ ఖాన్ చైనాపై దండయాత్ర చేసి అక్కడ యూవాన్ రాజవంశాన్ని నెలకొల్పాడు. అప్పటినుంచే చైనాలో నాటకం అభివృద్ధి చెందింది. యూవాన్ చక్రవర్తుల కాలంలో విద్యావేత్తలని, పండితులను ప్రభుత్వ ఉద్యోగాల నుంచి తొలగించారు. వారితో పాటే చైనీయుల సాహిత్యం, నాటకం, ఇతర కళారూపాలు కోటదాటి బయటకు వచ్చాయి. వారంతా ప్రజాజీవనంలోకి రాగానే జానపద కళలు, సాహిత్యం, జానపద నాటకం మొదలైనవి అభివృద్ధికి నోచుకున్నాయి. అంతకు ముందు ఉన్న సంగీత, నాటకాలాధారంగా చైనాలో సంప్రదాయ నాటకం మొదలైంది. ఆ కాలంలో రాజకీయ, సాంఘిక అణచివేత విద్యావంతుల మీద ఉన్నా, ఒక వంద సంవత్సరాలలో చైనా నాటకరంగం అత్యున్నత స్థాయికి చేరుకుంది. అప్పటి నాటక రచయితలు చరిత్ర, నవల, జానపదంలోని సంఘటనలు, కథలేకాక అప్పటి సమకాలీన అంశాల్ని కూడా ఆధారం చేసుకుని నాటక రచనలు చేశారు. ఈ నాటకాలలో వచ్చే పాత్రలు సామాన్యుల నుంచి చక్రవర్తుల దాకా ఉండేవి. ఆ నాటకాలు కుటుంబ సభ్యులను ప్రేమించాలనీ, వృద్ధులను గౌరవించాలని, నీతి నిజాయితీలతో పనిచేయాలని ఇంకా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సందేశాలనిచ్చాయి. అప్పటి రచయితలు చైనీయుల జీవితాన్ని తమ రచనలలో ప్రతిబింబించారు. అన్నీ సుఖాంత నాటకాలేకానీ విషాదాంత నాటకాలు రాలేదు. యవనుల కాలంలో ఉత్తమ రచయితలందరూ ఉత్తర చైనాలో ఉండేవారు. ముఖ్యంగా పెకింగ్ నగరం చుట్టూపక్కల ఉండేవారు. వారి నాటకాల పద్ధతిని ఉత్తరాది బాణీ గా పిలిచేవారు. వారి నాటకాలను పరిశీలిస్తే అన్నీ నాలుగు అంకాలలో రాయబడి కథానాయకుడికి పది నుంచి ఇరవై దాకా పాటలతో ఉండేవి. మిగతా పాత్రలకి పాటలు ఉండేవికావు. పాటలబాణీ అంకానికీ, అంకానికీ మారుతుండేది. నాలుగు అంకాలలో నాటకం పూర్తి కాకపోతే, నాలుగో అంకం తరువాత ఒక వ్యాఖ్యాన రూపంలో మిగతా కథ చెప్పబడేది. వ్యాఖ్యానంలోని ఆఖరి వాక్యం ఆ నాటకానికి పేరుగా ఉంచేవారు. నాటకంలోని కథాంశం కొన్ని నెలలపాటు లేదా సంవత్సరాల పాటు నాటకంలో జరగటం, సాధారణం. కథమొత్తం ఒక ప్రదేశంలోనే కాక అనేక ప్రదేశాలలో కూడా జరిగేది.

ఈనాడు చైనాలో ప్రదర్శింపబడుతున్న సంప్రదాయ నాటక ప్రదర్శనా పద్ధతులు క్రీ.శ. 14వ శతాబ్దపు నాటక ప్రదర్శన పద్ధతులలోనే జరుగుతున్నాయి. నాటక కథకి అనుగుణంగా చిత్రించిన పెయింటింగ్‌లు ఖాళీ రంగస్థలం వెనుక భాగంలో దర్శనమిస్తాయి. రంగస్థలం ఖాళీగా ఉంటుంది. పాత్రల ప్రవేశ, నిష్క్రమణలకు రంగస్థలానికి కుడి, ఎడమన తలుపులుంటాయి. రంగస్థలం మీద కనిపించే చిత్రాలలోని పాత్రలు రంగురంగుల దుస్తులు, పెద్ద గడ్డాలు, మీసాలతోను ఉంటాయి. పాత్రధారులు విసన కర్రలు, కత్తులు, కర్రలు మొదలైనవి వాడేవారు. స్త్రీపాత్రలు స్త్రీలే ధరించేవారు.

యువానులకాలంలో ఏడువందల నాటకాలు రచింపబడినట్టుగా తెలుస్తోంది కాని 170 మాత్రమే లభ్యమవుతున్నాయి. ఈ కాలంలో 550 మంది నాటక రచయితలు ఉన్నట్టుగా తెలుస్తోంది. వారిని గురించిన వివరాలు చరిత్ర పుటల కెక్కలేదు. కువాన్ హాన్ చింగ్ (1245-1332) ఆనాటి ఉత్తమ నాటక రచయితగా పేర్కొనవచ్చు. చైనా నాటక పితామహుడుగా ఈయనను గుర్తిస్తారు. ఈయన రాసిన 67 నాటకాలలో, 18 మాత్రమే దొరుకుతున్నాయి. నాగోటౌకి జరిగిన అన్యాయం (The Injustice done to NGOTOU) అనేది నిజంగా జరిగిన ఒక సంఘటన. ఇదే అత్యుత్తమ నాటకం. ఈ నాటకంలో ఒక బాల్య వితంతువుని ఒక దుర్మార్గుడు ప్రేమిస్తాడు. ఆమె నిరాకరించడంతో అతను కక్ష కట్టి ఒక హత్యకేసులో ఆమెను ఇరికిస్తాడు. కొన్నాళ్లకి ఆమె తండ్రి న్యాయాధికారి అవుతాడు. చనిపోయిన ఆమె ఆత్మ రోదిస్తూ ప్రతిరోజు అతనికి కనిపించి తను అమాయకురాలినని, అన్యాయంగా తనను శిక్షించారని చెబుతుంది. ఆమె తండ్రి న్యాయాధికారి అయినందువల్ల ఆ కేసును తిరిగి విచారిస్తాడు. అసలు హంతకుణ్ణి గుర్తించి శిక్షిస్తాడు. ఆ నాటకంలోనే ప్రధాన పాత్ర నాగోటౌ, చైనా దేశపు సతికి ప్రతీక. ఆమె మానసిక ధైర్యం అందరికీ ఒక పాఠం.

ఆ కాలంలోనే వచ్చిన మరో నాటకం రొమాన్స్ ఆఫ్ ది వెస్టర్న్ చాంబర్ (**Romance of the Western chamber**). ఇది అప్పటి చైనా ఉత్తర బాణి నాటకాలలో అత్యుత్తమ నాటకంగా పేరు పొందింది. దీని రచయిత వాంగ్‌షిఫూ (**Wang Ṣhihfu**) ఒక నవల ఆధారంగా రాయబడిన ఈ నాటకంలో ఇరవై అంకాలున్నాయి. నాలుగు అంకాలు ఒక భాగంగా కూర్చబడిన ఈ నాటకం అయిదు భాగాలలో ఉంటుంది. ఇద్దరు యువ ప్రేమికులు కొన్ని విచిత్ర పరిస్థితులలో విడిపోయి కొన్ని సంవత్సరాల తరువాత తిరిగి కలుసుకోవడం ఇందులోని కథాంశం. అద్భుతమైన పాత్ర చిత్రణ, భావోద్వేగమైన పాటలు, వైవిధ్యమైన సంఘటనలు, సంభాషణాలు ఈ నాటకాన్ని అప్పటి అత్యుత్తమ నాటకంగా నిలబెట్టాయి. చీ చున్ షియాంగ్ (Chi chun hsiang) రాసిన మరో అద్భుత నాటకం ఆర్ఫన్ ఆఫ్ ది హౌస్ ఆఫ్ ఛావో (Orphan of the house of chao) ఈ నాటకంలో బలికాబోతున్న ఒక పిల్లవాడు కొందరి సహాయంతో రక్షింపబడతాడు. అతడు పెరిగి పెద్దవాడై అతనికీ, అతని కుటుంబానికీ అన్యాయం చేసిన ఒక లంచగొండి మిలిటరీ జనరల్ మీద తిరగబడి పగ తీర్చుకుంటాడు. పాశ్చాత్య దేశాలలో మొట్ట మొదటుగా తెలిసిన చైనీస్ నాటకం ఇది. 1755లో ది ఆర్ఫన్ ఆఫ్ చైనా అనే పేరుతో వోల్టేయిర్ (Voltaire) ఈ నాటకాన్ని ఇంగ్లీషులో అనువదించాడు. పాశ్చాత్య నాటక రచయితలను బాగా ప్రభావితం చేసిన నాటకం లీహిస్సింగ్ టావో రచించిన ది స్టోరీ ఆఫ్ ది చాక్ సర్కిల్ (The Story of the chalk circle). ఈ నాటకంలో ఇద్దరు స్త్రీలు ఒక పిల్లవాడిని తన కొడుకంటే తనకొడుకని పోటీపడతారు. కోర్టులో ఇద్దరి వాదనలూ విన్న న్యాయాధికారి సుద్దముక్కతో ఒక పెద్ద వృత్తం గీసి అందులో పిల్లవాడిని నిలబెడతాడు. ఈ స్త్రీలిద్దరినీ ఆ పిల్లవాడి చెరోచెయ్యి పట్టుకొని లాగమంటాడు. ఒక ఆమె లాగుతుంది. మరొకామె పిల్లవాడిచెయ్యి నొప్పిపుడుతుందేమోనని లాగదు. ఆమెను న్యాయాధికారి నిజమైన తల్లిగా ప్రకటించి పిల్లవాణ్ణి అప్పగిస్తాడు. దీని ఆధారంగానే పాశ్చాత్య రచయితలైన ఎ.హెచ్ క్లాబండ్, ది సర్కిల్ ఆఫ్ చాక్ (1923), బెర్టోల్డ్ బ్రెష్ట్ ది కకేషియన్ చాక్ సర్కిల్ (1944) నాటకాలు రాశారు. యువానుల కాలంలోనే చైనాలోని అనేక పట్టణాలలో నాటకశాలలు వెలిశాయి. వీటిల్లో పోషకులు కుర్చీల్లో కూర్చుని ఇతరులు నిలుచుని నాటకాలు చూసేవారు.

14వ శతాబ్దం మధ్య ప్రాంతంలో దక్షిణ చైనాలో దక్షిణ బాణి నాటకం మొదలైంది. ఈ బాణీ నాటకాలు ఉత్తర బాణీ నాటకాలకు భిన్నంగా ఉండేవి. ఈ బాణీలో కావోమింగ్ రాసిన లూట్‌సాంగ్ (1350) బాగా ప్రసిద్ధి చెందింది. 1368లో మంగోలియా రాజులను జయించి మింగ్ రాజ్యవంశం అధికారంలోకి వచ్చింది. ఈ నాటకాలన్నీ 50 అంకాలతో రాయబడ్డాయి. ప్రతీ అంకానికీ ఒక పేరుండేది. మొదటి అంకంలో ఒక పాత్ర ప్రవేశించి నాటక రచయితను గురించి, కథాంశం గురించి వివరించేది. రెండవ అంకం నుంచి అసలు కథ ప్రారంభమయ్యేది. ఈ నాటకాలలో బృందగానాలు, యుగళగీతాలు పుష్కలంగా ఉండేవి. మింగ్‌రాజుల కాలంలో బాగా పేరుపొందిన రచయిత టాంగ్ హిసిన్ త్సూ. ఈయన రాసిన నాలుగు అద్భుత నాటకాలని నాలుగు కళలుగా ప్రజలు

పిలిచేవారు. ఈ నాలుగు నాటకాలలో ఒకటైన ది పియోని పెవీలియన్ విశేషంగా ప్రదర్శించబడింది. 55 అంకాలతో రూపొందించిన ఈ నాటకంలో, ఒక యువతి తనకి కలలో కనిపించిన ఒక యువకుడిని ప్రేమించి జీవితంలో అతను కనిపించక పిచ్చిదై చనిపోతుంది. కానీ ఆ వ్యక్తి నిజంగా ఆమె సమాధి దగ్గరకి వచ్చినప్పుడు ఆమె బతికివస్తుంది. ఇది చూసిన ఆమె తల్లి అతనిని మాంత్రికుడిగా భావించి, కొట్టి జైలుపాలు చేస్తారు. చివరకు వాస్తవం తెలియడంతో అతను విడుదలవుతాడు.

ప్రారంభంలో ఈ దక్షిణబాణీ నాటకాలు ప్రదర్శింపబడినా, రాను రాను అవి చదువుకునే నాటకాలుగానే మిగిలిపోయాయి. నాటకాలనిడివి చాలా ఎక్కువగా ఉండడం, పామరులకు అర్థం కాని భాషను రచయితలు వాడడం, మొదలైన కారణాల వల్ల ఇవి తరువాత కాలంలో ప్రదర్శింపబడలేదు. 1664లో ఉత్తర చైనా నుంచి దండయాత్ర చేసి చింగ్ రాజవంశం అధికారంలోకి వచ్చేదాకా దక్షిణ బాణీ నాటకాలు సాహితీపరంగా మిగిలిపోయాయి. చింగ్ రాజుల పరిపాలన కాలంలో నాటక ప్రదర్శనలు మళ్ళీ ప్రారంభమైయ్యాయి. కుంగ్‌షంగ్ జన్, హంగ్ షంగ్, లీయూ మొదలైన రచయితలు వీరి హయాంలో ఎన్నో నాటకాలు రచించారు. వాటిలో విషాద నాటకాలు కూడా ఉన్నాయి. 19వ శతాబ్దం మధ్యదాకా దక్షిణ బాణీ నాటకాలు విపరీతంగా ప్రదర్శించబడ్డాయి. వీటి ప్రభావంతోనే చైనాలో 19వ శతాబ్దం రెండవ భాగంలో పెకింగ్ ఒపేరా అనే నూతన సంగీత నాటకబాణీ ప్రారంభమైంది. ఆనాటి నుంచి ఈనాటిదాకా చైనాలో పెకింగ్ ఒపేరా విశేషమైన ప్రజాదరణ పొందుతోంది. ఈ నూతన బాణీలో దాదాపు వందరకాల ప్రాంతీయ సంగీత బాణీలు చోటు చేసుకున్నాయి. గతంలో చైనా నాటకాలలాగానే కాక పెకింగ్‌ఒపేరానాటకాలు కేవలం సాహిత్యపరంగా రాసినవికావు. ప్రదర్శనకోసం రాయబడినవి. వీటిలో సంగీతం, నృత్యం, అభినయం ఎక్కువగా ఉంటుంది. నటీనటుల కదలికలు, శారీరక విన్యాసాలు ఈ ప్రదర్శనలలో అధికంగా కనిపిస్తాయి.

పెకింగ్‌ఒపేరా నాటకాలను రెండురకాలుగా వర్గీకరించ వచ్చు. సాంఘిక సమస్యలు, కుటుంబగాథలు ఇతివృత్తాలుగా రాయబడే వాటిని సివిల్‌నాటకాలు అని, యోధులు, యుద్ధవీరులు చేసే సాహస కృత్యాలు కథాంశాలుగా రాయబడ్డ నాటకాలను మిలిటరీ నాటకాలు అని విభజించవచ్చు. ఇవన్నీ సుఖాంత నాటకాలే. ఈ ప్రదర్శనల్లో రచయితకి అంతగా ప్రాముఖ్యత ఇవ్వలేదు. ప్రేక్షకులు ప్రదర్శనకే ప్రాముఖ్యం ఇచ్చారు. కాలంతో పాటు నాటక ప్రదర్శనల్లో, రచనల్లో మార్పులు వచ్చినా రంగస్థలాలలోనూ, నాటకశాలల నిర్మాణంలోనూ చైనీయులు పాత పద్ధతులనే పాటించారు. రంగస్థలం మీద ఒక కుర్చీ, బల్ల ఉంచి వాటిని అనేక సందర్భాలలో అనేక వస్తువులుగా నటులు వాడతారు. సుదూర ప్రయాణం చేసినట్టుగా పాత్రధారులు గుండ్రంగా తిరుగుతారు. సంఘటనా స్థలం మారినప్పుడల్లా ఏదైనా వస్తువు సహాయంతోనో మారిన ప్రదేశాన్ని ప్రేక్షకులకు తెలియజేసేవారు. మెట్లు ఎక్కడం, తలుపు తట్టడం, గదుల్లోకి ప్రవేశించడం మొదలైనవి మూకాభినయంతో ప్రదర్శిస్తారు. రంగస్థలం మీద ఉన్న కుర్చీలను, బల్లను కొన్నిటికి ప్రతీకలుగా వాడతారు. ఉదాహరణకి కుర్చీలు వెనక్కి వేసి ఒక వారధిగా వాడడం, ఒక కుర్చీని చెట్టుకు ప్రతీకగానో, ఒక జైలు గది తలుపుగానో, బల్లని ఒక కొండగానో ప్రతీకలుగా వాడడం ఈ పెకింగ్ ఒపేరా ప్రదర్శనల ప్రత్యేకత. ఇలాంటి ప్రదర్శనలన్నీ ప్రేక్షకుల ఊహాశక్తిని ఉత్తేజపరుస్తుంటాయి.

డ్రంకన్ బ్యూటీ నాటకంలో ఒక దృశ్యం

నాటి నుంచి నేటి దాకా చైనా నాటక ప్రదర్శనలో సంగీతం, ముఖ్య భూమిక పోషిస్తోంది. సన్నివేశానికి తగ్గ నేపథ్య సంగీతం నటులు పాట పాడుతున్నప్పుడు రాగయుక్తంగా అనుసరించడం, పాత్రధారుల కదలికలకు అనుగుణంగా సంగీతాన్ని జోడించడం గమనిస్తే చైనా నాటకంలో సంగీతం ఎంత రసవత్తరంగా మిళితమయ్యిందో గ్రహించవచ్చు. పెకింగ్ ఒపేరా ప్రదర్శనల్లో ముఖ్యపాత్రధారులకు మేకప్ అధికంగానూ, ఇతర పాత్రలకి తక్కువగానూ వేస్తారు. హాస్య పాత్రధారి నాటక కథాంశం ఏదైనా, సమకాలీన భాషనే మాట్లాడుతాడు. ఈయనకు మాత్రమే ప్రదర్శనలో సద్యోనటన చేసే సౌలభ్యం ఉంది. ప్రదర్శన మధ్యలో హాస్యనటుడు ప్రేక్షకులతో మాట్లాడుతూ సందర్భాన్ని బట్టి కొన్ని

హాస్య సంఘటనలు చెబుతుంటాడు. మిగతా పాత్రలకంటే ఇతని పాత్రే సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. సామాన్యంగా ఈ హాస్య పాత్ర ఒక నౌకరో, వ్యాపారస్తుడో, సైనికుడో అయి ఉంటుంది. పెకింగ్ ఒపేరా ప్రదర్శనలలో ప్రతి ముఖ్య పాత్రధారి రంగ ప్రవేశం చేయగానే తను ధరిస్తున్న పాత్రల గురించి, నాటకంలో ఆ పాత్ర ప్రాముఖ్యాన్ని గురించి వివరిస్తాడు. పాత్రల పేర్లు, నాటక కథాంశం మొదలైనవి తెలియపరిచి అసలు ప్రదర్శన ప్రారంభిస్తారు.

పెకింగ్ ఒపేరాలో అతిముఖ్యమైన అంశం మేకప్, వస్త్రాలంకరణ. పాత్ర సాంఘిక స్థితిగతులు, వయస్సు, స్వభావం మొదలైన వాటి ఆధారంగా 300 రకాలదుస్తులను రూపొందించారు. రాజుల పాత్రలకు ఎరుపు, పసుపు, దుర్మార్గులకి, దొంగలకి నలుపురంగు, ప్రేయసీ ప్రియుల పాత్రలకు గులాబీ, నీలం వాడతారు. దుస్తుల మీద చిత్రీకరించిన చిత్రాలు ఆ పాత్రల స్వభావాన్నీ, సాంఘిక స్థితిగతులను తెలియజేస్తాయి. కిరీటాలు, ఇతర ఆభరణాలు పుష్కలంగా ధరిస్తారు.

చైనాలో నటనను వృత్తిగా స్వీకరిద్దామనుకునేవారు 10–12 ఏళ్ల నయస్సు నుంచే నటశిక్షణ సంస్థల్లో చేరతారు. వీరి శిక్షణ దాదాపు ఏడు సంవత్సరాలు ఉంటుంది. ప్రారంభంలో అందరికీ నటన, వాచికం, సంగీతం, నృత్యం, శరీరవిన్యాసం, మూకాభినయం మొదలైన అంశాలలో శిక్షణనిస్తారు. చివరి రెండు మూడు సంవత్సరాలలో ఒక నటుడు ఎలాంటి పాత్రలు చేయగలడో నిర్ణయించి అటువంటి పాత్రనే అభినయించడానికి తగిన ప్రత్యేక శిక్షణనిస్తారు. శిక్షణాకాలానంతరం వారు నటులుగా స్థిరపడుతారు.

1912లో చైనాలో రాచరికం అంతమై స్వతంత్ర దేశంగా మారిపోయింది. ఆ తరువాతనే చైనా నాటకరంగం మీద పాశ్చాత్య నాటక ప్రభావం కనిపించసాగింది. ప్రారంభంలో ఈ ప్రభావంతో వచ్చిన నాటకాలని కొత్త నాటకం లేదా ఆధునిక నాటకం అనేవారు. 1920 తరువాత వీటిని వచన నాటకంగా పిలవనారంభించారు. ఈ నాటకాలలో పెకింగ్ ఒపేరాలోలాగా నృత్యాలు, సంగీతాలు ఉండవు. అన్నీ సంభాషణలే ఉంటాయి. మొదట్లో షేక్స్పియర్, చెకొవ్, ఇబ్సన్, బెర్నార్డ్ షా మొదలైనవారి నాటకాలు చైనీస్ భాషలోకి అనువదించి ప్రదర్శించారు. తరువాత వీటి ప్రభావంతో స్వంత రచనలు వచ్చాయి. వారిలో ప్రథముడు ట్సయియూ (1910). ఈయన రచించిన థండర్ స్టార్ (1933), సన్‌రైజ్ (1935), ది బ్రిడ్జ్ (1945) సమకాలీన సాంఘిక సమస్యలు, సంప్రదాయానికీ, ఆధునికతకూ జరిగే ఘర్షణను చర్చించాయి. కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చాక పెకింగ్ ఒపేరాతోపాటు, చైనీస్ నాటకరంగం అనేక మార్పులు చెందింది. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ప్రాచుర్యం కలిగించే నాటకాలు రచయితలు రాశారు. అప్పటిదాకా ప్రదర్శింపబడుతున్న కొన్ని నాటకాలను ప్రభుత్వం నిషేధించింది. 1966 తరువాత సంభవించిన సాంస్కృతిక విప్లవం అనేక పరిణామాలకు దారి తీసింది. అన్ని రకాల సంప్రదాయ నాటక బాణీలను ప్రభుత్వం అణగ దొక్కింది. కొంతకాలం పాటు చైనాలో నాటక ప్రదర్శనలన్నీ నిలచిపోయాయి. కొన్ని ప్రభుత్వ ప్రచార నాటకాలు తప్ప. 1969 తరువాత ప్రజా నిరసనని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నాటకరంగం మీద క్రమంగా ఆంక్షలు తొలగించింది. పాతనాటకాలు కొత్త దృష్టితో రాయబడ్డాయి.

1981 తరువాత చైనాలో లిటిల్ థియేటర్ ఉద్యమం బాగా ప్రాచుర్యం పొందింది. ఈ ఉద్యమంలోని నాటకాలకి రంగస్థలం, రంగాలంకరణ ఏమీ ఉండవు. ప్రేక్షకులందరూ నటీనటులు చుట్టూ నేల మీద కూర్చుంటారు. ఈ నాటక ప్రదర్శనల్లో సాహిత్యానికంత ప్రాచుర్యం ఉండదు. పాటలు, శారీరక కదలికలు, మూకాభినయం మొదలైన అంశాలు ఎక్కువగా ఉంటాయి. కానీ ప్రభుత్వాన్ని విమర్శించే నాటక ప్రదర్శనలను నిషేధించారు. గత శతాబ్దంలో చైనా నాటక రచయితల్లో ఒక నూతన ధోరణి ప్రవేశ పెట్టిన రచయిత గావో జింగ్ జియాంగ్. ఈయన నవలా, నాటక రచయిత, చిత్రకారుడు, రంగస్థల దర్శకుడు. శామ్యూల్ బెకెట్, బెర్టోల్డ్ బ్రెష్ట్ రచనా పోకడలు జియాంగ్ రచనల్లో కనిపిస్తాయి. చైనాలో అధికార పార్టీకి ఈయన రచనలు రుచించకపోవడంతో ప్రభుత్వం ఈయన రచనలను దగ్ధం చేసింది. కొన్ని నాటకాలను, నవలలను నిషేధించింది. బస్టాప్, ది అదర్ ఫోర్, పోల్ మౌంటేన్, అబ్సల్యూట్ సిగ్నల్ మొదలైన నాటకాలు జియాంగ్‌కు ప్రజల్లో ఎంతో పేరు తెచ్చి పెట్టాయి. ది అదర్ ఫోర్ నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఆదర్శవంతమైన దిశగా పయనించే రచయితగా గుర్తించి 2000సంవత్సరానికి నోబెల్ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేశారు. కాని ఈయన ఆ బహుమతిని నిరాకరించాడు. చైనా నాటకరంగ చరిత్రలో మొట్టమొదటిసారిగా నాటకరంగం తరపున నోబెల్ పురస్కారానికి ఎంపికైన మొదటి రచయిత ఈయనే.

డి.ఎస్.ఎన్

జపాన్ నాటకరంగం

క్రీ.శ.712లో రికార్డ్స్ ఆఫ్ ఏన్షియంట్ థింగ్స్ అనే పుస్తకం రాయబడేదాకా ప్రాచీనకాలపు జపాన్ దేశ చరిత్రగాని, ఆ దేశపు కళారూపాల గురించిగాని ఎవరికీ తెలియదు. అంతకు ముందు అన్ని దేశాలలోలాగే జపాన్‌లో కూడా మతపరమైన పూజలు, వాటిలో జరిపే అనేక తంతులు తరువాతి కాలంనాటి జపాన్ కళారూపాల అభివృద్ధికి కారణాలైనాయి. ప్రాచీన జపాన్‌లో షింగ్టోయిజం అనే మతపరమైన వేడుకలలో ప్రకృతిని పూజించడం, చనిపోయినవారి ఆత్మలను పూజించడం జపనీస్ సంప్రదాయంలో ఒక భాగం. ఈ తంతులన్నింటినీ ఈనాడు కాగూర (**Kagura**) అనే పేరుతో పిలుస్తున్నారు. చరిత్రకి తెలిసిన మొట్ట మొదటి నృత్యబాణి సంగాకు (**Sangaku**) లయబద్ధమైన సంగీతానికి అనుగుణంగా ఉండేది.

క్రీ.శ.6వ శతాబ్దంలో దేశంలోకి బౌద్ధమతం ప్రవేశించడంతో జపాన్‌లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు ఇండియా, చైనా, కొరియా మొదలైన సంస్కృతులను జపాన్ దేశీయులు తమ సంస్కృతిలో విలీనం చేసుకున్నారు. సాహిత్యం, సంగీత బాణీలు, ముఖానికి తొడుగులు ధరించి చేసే నృత్యాలు మొదలైనవన్నీ ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుని, తమ రచనల్లో జపాన్ ప్రజలు విలీనం చేసుకున్నారు. ఎనిమిదవ శతాబ్దానికల్లా ప్రధానంగా జిగాకు, బుగాకు, సరుగాకు అనే మూడు బాణీల కళాప్రదర్శనలు ఆ దేశంలో చాలా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. వీటికి అధికార గుర్తింపు, రాజపోషణ ఉండేది. వీటిల్లో కళాకారులకు ప్రత్యేక శిక్షణను ప్రభుత్వమే కల్పించింది. కాలక్రమేణ జిగాకు, సరుగాకు అంతరించి పోయాయి.

నాటి నుంచి నేటిదాకా ప్రదర్శింపబడుతున్న నృత్యం బుగాకు మాత్రమే. ఈనాటికీ షింగ్టో మందిరాలలోను, రాజాస్థానంలోను, అతి ముఖ్యమైన ప్రభుత్వ ఉత్సవాలలోనూ బుగాకు ప్రదర్శిస్తూనే ఉన్నారు. బుగాకు అంటే రాజాస్థానంలో ప్రదర్శింపబడే ప్రాచీన నృత్యం అని అర్థం. గాయకులు పాటలో ఒక కథ చెబుతుంటే దానికి అనుగుణంగా హావభావాలను ప్రకటిస్తూ నృత్యం చేయడం ఈ ప్రదర్శనలోని విశేషం. ఈ రూపమే జపాన్‌లో తరువాత కాలంలో ఆవిర్భవించిన ణో (**NOH**) అనే నాటక ప్రక్రియకు ఆధారం.

కీ శ. **1023** నాటి చారిత్రక ఆధారంతో 'ణో' నాటక ప్రక్రియ రెండు రూపాలుగా ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. అందులో మొదటిది సరుగాకు ణో. ఇది విదేశీ ప్రభావంతో మొదలైనట్టుగా తెలుస్తోంది. ఇందులో నృత్యం, ధ్వన్యనుకరణం ఎక్కువగా ఉండడం వల్ల ప్రదర్శనంతా అరుపులతోనూ, కేకలతోనూ ఉండేది. సరుగాకు ణో అంటే కోతి సంగీతం అందుకే ఈ ప్రదర్శనల్లో హాస్య పూరితమైన చేష్టలు, శృతిలయలు లేని సంగీతం ఎక్కువగా ఉంటాయి. రెండవది డెంగాకు ణో (**Dengaaku-NoH**) అనే రూపం కొరియా దేశం నుంచి దిగుమతైనట్లుగా తెలుస్తోంది. గ్రామాలలో వ్యవసాయిక పనులు చేసేటప్పుడు ప్రజలు పాడే పాటలు, చేసే తంతులు, శారీరక విన్యాసాలు ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇది ఒక రకమైన జానపద కళారూపమని చెప్పవచ్చు. 12వ శతాబ్దంలో బుద్ధుడి బోధనలవ్యాప్తికి మతగురువులు సరుగాకు నోని ఉపయోగించుకున్నారు. యూరప్ దేశాల్లో క్రైస్తవ మత వ్యాప్తికి మధ్యయుగంలో అప్పటి మత గురువులు మిస్టరీ సైకిల్స్ (**Mystery Cycles**), నీతి నాటకాలు (**Morality plays**) ఎలా వాడుకున్నారో జపాన్‌లో సరుగాకు 'ణో'ని బౌద్ధమతవ్యాప్తికి మతగురువులూ వాడుకున్నారు. మొదట్లో ఈ ప్రదర్శనల్లో మతగురువులే పాల్గనేవారు. తరువాత వృత్తి కళాకారులు ఇందులో ప్రవేశించారు. ఆ ప్రదర్శనలకి ప్రజాదరణ లభించగానే వీటిలోకి వ్యాపార ధోరణి ప్రవేశించింది. నాటక బృందాలన్నీ దేవాలయాల అధికారం కిందకి వచ్చాయి.

క్రీ.శ. **1192**లో జపాన్ చక్రవర్తి తన అధికారాలలో కొన్నింటిని షోగన్ (**Shogun**) అనే మిలిటరీ నియంతకి అప్పగించాడు. ఈ మార్పుతో సాంఘిక, ఆర్థిక, రాజకీయ కళారంగాలలో నూతన ధోరణులు ప్రవేశించాయి. జపాన్ తమ సంస్కృతిని తిరిగి పునరుజ్జీవింప చేసుకుంది. దానిలో భాగంగానే 14వ శతాబ్దం అర్థ భాగంలో జపాన్ దేశపు అద్భుత నాటకరంగం ణో ఒక ఆధునిక రూపంగా ఆవిర్భవించింది.

యోషిమిట్సి అషికాగి (**yoshimitsy, Ashikagi**) జపాన్ షోగన్ (**shogun**)గా ఉన్నరోజుల్లో కియోసుబూ కనామీ అనే సరుగాకు ణో కళాకారుడు షోగన్ ముందు తన ప్రదర్శనిచ్చాడు. అతని నైపుణ్యానికి ముచ్చటపడ్డ షోగన్ అతనినీ,అతని కుమారుడు జీమీ మోటోకియోలను చేరదీసి తన కొలువులో ఉద్యోగస్తులుగా నియమించాడు. ణో కళారూపం అభివృద్ధి చెందడానికి కావలసిన ధనాన్ని సమకూర్చాడు. కనామీ అతని కొడుకు జీమీ సరుగాకు ప్రదర్శనలో ఉన్న నృత్య సంగీతానికి బుద్ధుడి బోధనలు జతపరచి కొత్త రకం ణో

ప్రదర్శనలని ప్రారంభించాడు. మిలిటరీ రాజవంశీయులు, సామాన్య ప్రజలు ఈ ప్రదర్శనలని విపరీతంగా ఆదరించారు. అప్పటి నుంచి ణో వారి జాతీయ కళాప్రదర్శనగా పేరు తెచ్చుకొంది. జీమీ, ణో నాటక రచయితగా రెండు వందల నలభై నాటకాలు రచించాడు. ఈ నాటికీ అతని రచనలే కళాకారులు ప్రదర్శిస్తున్నారు. నాటక రచనలే కాక జీమీ, ణో నాటకాన్ని ప్రదర్శించే విధానాలని మూడు పుస్తకాలలో రూపొందించాడు. ఈ నాటికీ ఆ పుస్తకాలు కొత్త కళాకారులకి మార్గదర్శకంగా ఉన్నాయి. ణో నాటకాలలోని ప్రత్యేకత వాటిలోని ప్రధాన పాత్రలన్నీ దయ్యాలు, రాక్షసులు, లేదా కోరికలు తీరని మానవులు ఉండటం. ఎందుకంటే వీరి ఆత్మలకు వాటి జీవితంలో తీరని కోరికలు ఉండటం వల్ల అవన్నీ తిరిగి ఈ ప్రపంచంలోకి రావాలని ప్రయత్నం చేస్తున్నాయి. బౌద్ధ మత వ్యాప్తికి ఈ ణోనాటకాలు దోహదపడ్డాయి.

ణో నాటకాలని అయిదు రకాలుగా విభజించారు. అవి కామోణో-దేవుళ్ళని పొగిడే నాటకాలు, షురామోణో-యుద్ధ వీరుల్ని పొగిడే నాటకాలు, కజూరామోణో- స్త్రీలను గురించిన నాటకాలు, కులియమోణో-ఆత్మలు, పిచ్చివాళ్లు మొదలైన వారి గురించిన నాటకాలు, కిరీనోమోనో-రాక్షసులు, దయ్యాలు, భూతాలు మొదలైన వాటిని గురించిన నాటకాలు. సంప్రదాయ పరంగా ఈ అయిదు నాటకాలు ఒక దాని వెంట ఒకటి గొలుసుగా ప్రదర్శిస్తారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత నో ప్రదర్శన నిడివిని తగ్గించడానికి రెండు , మూడు కలిపి ప్రదర్శిస్తున్నారు. ణో నాటకాలు ఒక కథకు పరిమితమైనవి కావు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలను సంగీత, నృత్య, సంభాషణల ద్వారాప్రదర్శించిప్రేక్షకులను కొన్ని ఉద్వేగాలకులోను చేయడం ఈ నాటకాల ఉద్దేశం. ఆరు నుంచి పది మంది వరకూ ఉన్నగాయకులుబృందగానం చేస్తూ ఉంటారు. ఈ గానానికి అనుగుణంగా నటులు నృత్యం చేసి హావభావాలు ప్రదర్శిస్తారు. సామాన్య సంభాషణలన్నీ కూడా రాగయుక్తంగానే కలుపుతారు. రెండు నాటకాల మధ్య ఒక పాత్ర ప్రవేశించి, జరిగిన నాటకాన్ని విశ్లేషిస్తూ జరగబోయే నాటకాన్ని పరిచయం చేస్తాడు. ఈ నటుడు మాత్రమే సంభాషణల్ని మామూలుగా పలుకుతాడు.

ణో నాటకాలలో రెండు రకాల పాత్రలు ఉంటాయి. వాకీ అనేది ప్రధాన పాత్ర. అతని సహచరులు నాటకాన్ని పరిచయం చేసి ప్రధాన పాత్రధారిని కథాంశంలోకి ప్రవేశింపజేసి వెళ్లిపోతారు. మరో ప్రధానపాత్ర షీటే, అప్పుడప్పుడూ చిన్నపిల్లల పాత్రలు, గ్రామస్థులు వగైరా. నో ప్రదర్శనలోని పాత్రలన్నీ పురుష పాత్రలే. షీటే, అతని అనుచరులు రకరకాల తొడుగులు వేసుకుంటారు లేదా ముఖానికి రకరకాల రంగులు పూసుకుంటారు. నటులందరూ అందమైన రంగులతో ప్రత్యేకంగా రూపొందించిన వస్త్రాలు ధరిస్తారు. వాద్యకారులు, బృంద గాయకులు కూడా రకరకాల రంగు దుస్తులు ధరిస్తారు. పాత్రధారులు చేతిలో విసనకర్రలు, కత్తులు, కర్రలు సందర్భాన్ని బట్టి వాడతారు. రంగస్థలం మీద ఎటువంటి అలంకరణగాని, ఇతర పరికరాలుగాని ఉండవు.

ది హాల్ ఆఫ్ ది క్రయింగ్ డీర్

ణో ప్రదర్శనలకి రంగస్థలం గతంలోలాగానే ఒక ఎత్తైన అరుగు. దీనికి మూడు పక్కల ప్రేక్షకులు కూర్చుంటారు. నాలుగు పక్కల ఉన్న స్థంభాల మీద పైకప్పు వేయబడి ఉంటుంది. రంగస్థలాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. అరుగు మధ్య భాగం నుంచి ముందు దాకా ముఖ్యమైన స్టేజి, వెనుక భాగం రెండవ స్టేజి. ఈ రెండవ భాగం నుంచి దాదాపు 40-50 అడుగుల దూరంలో మేకప్‌గది ఉంటుంది. అక్కడ నుంచి సరాసరి స్టేజి మీదకి పాత్రధారులు ప్రవేశించడానికి ఎత్తైన మార్గం ఉంటుంది. కొన్ని పాత్రలు స్టేజి వెనుక భాగం, ఎడమ పక్క నుండి నిష్క్రమిస్తాయి. స్టేజి వెనుక భాగాన్ని చెక్కతో గాని, మామూలు తెరతోగాని మూసి వేస్తారు. వాద్య కారులు, గాయకులు రంగస్థలం మీద ఒక మూలన కూర్చుంటారు. సాధారణంగా ఈ ప్రదర్శనశాలల్లో 300-500 వరకు ప్రేక్షకులు ప్రదర్శనను తిలకిస్తారు. నాటి నుంచి నేటి దాకా ణోప్రదర్శనలు ప్రభుత్వ పోషణతో, ప్రజల అభిమానంతో విజయవంతంగానే నడుస్తున్నాయి.

18వ శతాబ్దం మధ్యకాలంలో జపాన్‌లో మరో రెండు కొత్త నాటక రూపాలు గ్రామీణ ప్రజల ఆనందం కోసం ప్రైవేటు వ్యక్తుల ప్రోత్సాహంతో ఆవిర్భవించాయి. అవి తోలు బొమ్మలాట, మరొకటి కబూకీ (**Kabuki**) నాటకం. ప్రారంభంలో ఈ

తోలుబమ్మలాటలో కేవలం ఒక తల మాత్రమే ఉండేది. తరువాత కాళ్లుచేతులు ఈ బమ్మలకి అమర్చి వాటిని ఆడించే ఏర్పాటు కూడా ప్రవేశ పెట్టారు. తోలు బమ్మలాటకోసం టకేడో ఇజూమో, చికామాత్సు ఆంజీ లాంటి రచయితలు ప్రత్యేకమైన రచనలు చేశారు. కబూకీ నాటకం బలపడడంతో 18వ శతాబ్దం చివరి నాటికి తోలుబమ్మలాట ప్రాచుర్యం తగ్గిపోయింది. అయితే 19వ శతాబ్దపు ప్రథమ భాగంలో బున్రా కుకెన్ **(Bunrakuken)** అనే పోషకుడు తోలుబమ్మలాటను పునరుద్ధరించాడు. నేడు జపాన్‌లో ఈయన పేరుతోనే ఈ తోలుబమ్మలాటను ప్రదర్శిస్తారు. 1963లో బున్రా పేరుతో ప్రభుత్వం ఒక ప్రత్యేక కళాసంస్థను నెలకొల్పింది. జపాన్‌లో అన్నీ కళారూపాల నిర్వహణ ఈ సంస్థ చేతుల్లో ఉంటుంది.

ణో, తోలుబమ్మలాట, ఇతర కళారూపాల ప్రేరణతో జపాన్‌లో ఆవిర్భవించిన మరో అద్భుత నాటకరంగం కబూకి **(Kabuki)**. అందరూ స్త్రీలే పాల్గనే నృత్య రూపకంగా ప్రారంభమైన కబూకీ, తరువాత అందరూ పిల్లలే పాల్గనే రూపకంగా మారింది. చివరికి మూగవారే పాల్గనే రూపకంగా మిగిలి పోయింది. అయితే కబూకీలో పాల్గనే నటులందరూ కనుబమ్మలపై ఉన్న వెంట్రుకలను కత్తిరించుకోవాలి. అందంగా కనిపించకూడదు. 1862 తరువాత జపాన్ నాగరికతలో పెరిగిన పాశ్చాత్య ధోరణులు కబూకీని ప్రభావితం చేసాయి. దీనితో కబూకీ చాలా ఖరీదైన నాటకంగా మారిపోయింది. 1966లో కబూకీ జపాన్ జాతీయ నాటకంగా గుర్తింపు పొందింది. చికమాత్సు మోంజీమోన్ మొట్టమొదటి కబూకీ నాటక రచయిత. ఈయన దాదాపు 50 నాటకాలు రాశాడు. అతని తరువాత టకేడో ఇజుమో చాలా కబూకీ నాటక రచనలు చేశాడు. ఈయన రాసిన చూషింగీ యూరా **(Chushing Ura)** గొప్ప ప్రజాదరణ పొందిన కబూకీ నాటకం. ఇందులో 11 అంకాలు ఉంటాయి. మొత్తం ప్రదర్శించాలంటే 10–12 గంటలు పడుతుంది. యజమానికి ద్రోహం తలపెట్టిన వారి మీద పగ తీర్చుకునే 47 మంది సేవకుల యథార్థ కథ. కబూకీ బాగా ప్రాచుర్యంలోకి రావడంతో కబూకీ కంపెనీలు నటులతో పాటుగా రచయితలను, సహాయకులను కంపెనీలోకి తీసుకున్నారు. రచయిత నాటకంలోని ప్రధాన ఇతివృత్తాన్ని చెబుతాడు. సహాయకులు అనేక సంఘటనలను సమకూర్చి నాటక రచన పూర్తిచేస్తారు. 19వ శతాబ్దపు చివరిలో కవటాకే ముకేమీ అనే రచయిత కొత్త తరహా నాటకాలు రాయడం ప్రారంభించాడు. ఈయన రాసిన సాంఘిక నాటకాలలో దొంగలు, జీవితంలో చిల్లరగా తిరిగేవాళ్లు ప్రధాన పాత్రలుగా ఉంటారు. ఈయన రాసిన 50 నాటకాలు ఈనాటికీ జపానులో ప్రదర్శిస్తూనే ఉంటారు. కబూకీ నాటకం ఒక సాహిత్య పరమైన సృష్టిగా పరిగణించారు. ఈ నాటకాలలో కొన్ని హాస్య నాటకాలు ఉన్నా ఎక్కువ భాగం మెలోడ్రామాలే.

పూర్తిగా పురుషులే పాల్గనే కబూకీ నాటకంలోకి 20వ శతాబ్దంలో స్త్రీలు కూడా ప్రవేశించారు. దానితో నృత్యానికి ఎక్కువ ప్రాముఖ్యత వచ్చింది. పాటకు అనుగుణంగా శారీరక విన్యాసాలను చేయడం, హావభావాలను ప్రకటించడం, తద్వారా ఒక గంభీర వాతావరణాన్ని సృష్టించడం కబూకీ నృత్యంలోని ప్రత్యేకత. గాయకులు, వాద్యకారులు రంగస్థలం మీదే ఓ మూల కూర్చుంటారు. ప్రత్యేక శబ్దాలను రంగస్థలం వెనుకనుంచి వినిపిస్తారు. కొన్ని ప్రదర్శనల్లో నటులే స్వయంగా పాడతారు.

కబూకీ నటులు అభినయంలోనూ, సంభాషణలు పలకటంలోనూ, నృత్యం చేయటంలోనూ శిక్షణ పొందుతారు. కబూకీ నాటకాలలో ధైర్య వంతులైన పురుషులు, దుర్మార్గులు, యువకులు, హాస్యగాళ్లు, పిల్లలు, స్త్రీలు మొదలైన పాత్రలుంటాయి. కొన్ని ప్రదర్శనల్లో పురుషులే స్త్రీ పాత్రలు ధరిస్తారు. కబూకీ నటులు ముఖానికి తొడుగులు వాడతారు. పాత్ర స్వభావాన్ని బట్టి రంగులను ముఖాలకు పూసుకుంటారు. వివాహిత స్త్రీ పాత్రలకి పళ్లు నల్లగా చేస్తారు. వేషధారణంతా పాత్ర స్వభావాన్ని బట్టి ఉంటుంది. రంగురంగుల దుస్తులు, ఆభరణాలు ప్రదర్శనల్లో వాడతారు. విసనకర్రలు, చేతిరుమాళ్లు తప్పనిసరిగా ప్రతి ప్రదర్శనలోనూ వాడతారు. వీటినే అనేక వస్తువులకు ప్రతీకలు **(Symbols)**గా పాత్ర ధారులు ఉపయోగిస్తారు. ప్రారంభంలో కబూకీకళాకారులునో రంగస్థలాన్నే వాడేవారు. తరువాత రంగస్థలాన్ని తెరలతో మూయడం జరిగింది. కాలక్రమేణా కబూకీ ప్రదర్శనలో అనేక యంత్రాలు, దీపాలు చోటు చేసుకున్నాయి. రంగస్థలం మీద నుంచి పాత్రధారుల్ని పైకి తీసుకెళ్ళడం, స్టేజి దిగువ భాగం నుంచి ఒక పాత్ర తలుపు తీసుకుని రంగస్థలం పైకిరావడం, భ్రమణ రంగస్థలం మొదలైన యాంత్రిక పద్ధతులు కబూకీ ప్రదర్శనలలో అనేక అద్భుతాలను సృష్టించాయి. కబూకీ రంగస్థలంలో ప్రత్యేక ఆకర్షణ హానామిచీ **(Hanamichi)**. హానామిచీ అంటే ప్రేక్షకాగారంలోని ఒక మూల ఉన్న చిన్న గదిలో నుంచి ప్రధాన రంగస్థలాన్ని కలిపే ఎత్తైన బాట. ఆ గదిలో నుంచి ప్రేక్షకుల మధ్య గుండా ప్రధాన పాత్రలు ఈ బాట మీద నడిచి రంగస్థలాన్ని చేరుకుంటాయి. ఈ పద్ధతి బాగా ప్రాచుర్యంలోకి రావడంతో ఇలాంటిదే మరొకటి కూడా ఏర్పాటు చేయడం తరువాతి కాలంలో జరిగింది. ఈ రెండు బాటల మధ్యలోనూ, వాటికి ఇరుపక్కల ప్రేక్షకులు కూర్చుంటారు. దీనివల్ల ప్రేక్షకులకి, నటులకి మధ్య దూరం తగ్గిపోయింది. నాటకంలో జరిగే ప్రతి ప్రదేశాన్ని రంగులు వేసిన బమ్మల తెరలు కట్టి సూచిస్తారు.

వృత్తాకారంలో తిరిగే రంగస్థలాన్ని వాడడంవల్ల రెండు రంగాలకి కావలసిన అలంకరణ ముందే పూర్తి చేసుకుంటారు.

20వ శతాబ్దంలో జపాన్ నాటకంలోకి పాశ్చాత్య నాటకాలు ప్రవేశించాయి. 1909లో ప్రారంభించబడ్డ ఫ్రీ థియేటర్ సొసైటీ అనే సంస్థ షేక్స్పియర్, ఇబ్సన్, బెర్నార్డ్‌షా, చెకోవ్ మొదలైన వారి నాటకాలు జపనీస్ భాషలోకి తర్జుమా చేసి ప్రదర్శించింది. ఇటీవల కాలంలో జపాన్‌లో కూడా పాశ్చాత్య నాటక పద్ధతుల్లో రచనలు చేశారు. వారిలో కుబోయొబ్, యాకియో, మిషిమా ప్రసిద్ధులు. యొబ్ రచనల్లో జర్మన్ రచయిత బెర్టోల్డ్ బ్రెష్ట్ ప్రభావం బాగా కనిపిస్తుంది. ఎన్ని ఆధునిక నాటకాలు వచ్చినా జపాన్ సంస్కృతికి అద్దం పట్టే బుగాకు తోలుబమ్మలాటలు, నో, కబూకీ ప్రదర్శనల స్థానాన్ని ఏవీ పొందలేక పోతున్నాయి.

డి.ఎస్.ఎన్

రష్యా నాటకరంగం

రష్యా నాటకరంగం గ్రామీణ జీవితంలోని క్రతువులు, సాంప్రదాయ పండుగలు, పునరుత్పత్తికి సంబంధించిన ప్రక్రియలు, మౌఖిక సంప్రదాయంలోంచి వచ్చే పాటలు, కోరస్ కలిగిన నృత్యాలు, గ్రామీణ విదూషక ప్రదర్శనలలో నుంచి ఆవిర్భవించింది. క్రమేణా జానపద నాటకాలు రూపొందాయి. జానపదుల సద్యో నాటక ప్రదర్శనలు, వినోదాత్మక నాటికలు, వెర్‌టెప్ అనే పేరుగల తోలుబమ్మలాటలు సాధికారికంగా ప్రదర్శించే వారుగా నైపుణ్యాన్ని సంపాదించారు.

క్రైస్తవమత ప్రభావం వల్ల మిస్టరీ నాటకాల్ని చర్చి ప్రాంగణాల్లో ప్రదర్శించేవాళ్లు. క్రీస్తుజీవితాన్ని ప్రతిబింబించే ఘట్టాల్ని ఓ ఎత్తైన భాగంలో ప్రదర్శిస్తూ, కొన్ని వినోదాత్మక సన్నివేశాల్ని దిగువ భాగంలో ప్రదర్శించేవాళ్ళు. ఇవి ముఖ్యంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడానికి ఉపయోగపడేవి. రష్యాకి తనదైన మొరాలిటీ (నీతి) నాటక సంప్రదాయాలున్నప్పటికీ, 16వ శతాబ్దపు ప్రారంభం నుండి పోలాండ్ మొరాలిటీ నాటక ప్రక్రియ ప్రభావం ఎక్కువగా ఉంది. 1645 నుంచి 1676 వరకు రష్యాను పాలించిన అలెల్పి జార్జి చక్రవర్తి కాలంలో నాటక రంగంలో కొన్ని గణనీయమైన మార్పులు జరిగాయి. కొంతమంది అనుభవజ్ఞులను జర్మనీకి పంపి సమర్థులైన నటులను ఎంపిక చేయడానికి ఏర్పాట్లు జరిగాయి. అదే సమయంలో జర్మన్ లూథరన్ చర్చికి సంబంధించిన మతగురువు జానన్ గ్రెగరీ (1631-75) జర్మన్ భాషనుంచి అనువదించిన మత పరమైన నాటకాలను మాస్కోలో కొత్తగా ఏర్పాటుచేసిన ఇంపీరియల్ థియేటర్‌లో ప్రదర్శించాడు. ఈ నాటకాలు క్రైస్తవుల ఈస్టరు పండుగకు సంబంధించినవి. ఒకరకంగా ఈ నాటక కంపెనీని మొట్టమొదట అప్పటి రష్యన్ ప్రభుత్వం ఆదరణ పొందిన నాటక కంపెనీగా చెప్పుకోవచ్చు. ఈ కంపెనీలోని నటులందరినీ అప్పట్లో ప్రభుత్వోద్యోగులుగా పరిగణించేవాళ్ళు.

1682 నుంచి 1725 వరకు పాలించిన పీటర్ దిగ్రేట్ రష్యాని పూర్తిగా యూరోపియన్ ప్రభావాలకు అనుగుణంగా మార్చాలని ప్రయత్నించాడు. ఈ ప్రయత్నానికి నాటక రంగాన్ని ఓ సాధనంగా ఎంచుకున్నాడు. 1702లో జానన్ కుక్స్ నాయకత్వంలోని ఓ నాటక కంపెనీని జర్మనీనుంచి రష్యాకు దిగుమతి చేసుకున్నాడు. ప్రదర్శనలు ఎక్కువమంది ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశ్యంతో ప్రదర్శనా స్థలాన్ని ఇంపీరియల్ థియేటర్ నుంచి రాజప్రాసాదానికి, రాజ ప్రాసాదం నుంచి రెడ్‌స్క్వేర్ కి మార్చాడు. 1709లో సెంట్ పీటర్స్ బర్గ్ ఇంపీరియల్ థియేటర్‌ని స్థాపించాడు. దీనివల్ల రష్యన్ ప్రేక్షకులు అనేక కొత్త పాశ్చాత్య నాటకాలని చూడడానికి అవకాశం కలిగింది. అలాగే జానన్ కుక్స్, అతని వారసుడు అట్టాఫర్ట్‌కి రష్యన్ నాటక ఔత్సాహికులకు పాశ్చాత్య నటశిక్షణ, రచనా విధానాలను నేర్పడానికి అవకాశం ఏర్పడింది.

పీటర్ దిగ్రేట్ వ్యక్తిత్వం అప్పటి రష్యన్ నాటక రంగం మీద విశేషమైన ప్రభావాన్ని చూపింది. పాశ్చాత్య నాటకాలు, వాటి అనుసరణలు అప్పటి కప్పుడు అవసరాలకనుగుణంగా వేసిన నాటకాలు ఎన్నో రంగస్థలం మీదికి వచ్చాయి. రాజకీయంగా కూడా నాటకం ఉపయోగపడింది. నిజానికి అప్పటి జార్ చక్రవర్తులు తాముచేసే లేదా చేపట్టే ప్రతి పనిని పొగడడానికీ, లేదా ప్రచారం చేయడానికీ పనికివచ్చే సాధనంగా నాటకాన్ని వాడుకునేవాళ్ళు. అందుకోసమే వాళ్ళు నాటకాన్ని పోషించారని చెప్పవచ్చు.

1730 నుంచి 1740 వరకు అంటే దాదాపు పదేళ్ళు రష్యాను పాలించిన సామ్రాజ్ఞి అన్నా నేతృత్వంలో రష్యన్ నాటకరంగం పూర్తిగా జర్మనీ నాటక ఆధిపత్యంలో ఉండి పోయింది. అయితే మెల్లగా ఇటాలియన్ నాటక సంప్రదాయ ప్రభావం కమెడియాడిల్లార్టే ఫ్రెంచి బాలే ప్రదర్శనల వల్ల ఫ్రెంచి నాటకాల ప్రభావం రష్యన్ నాటక రంగం మీద పెరిగింది.

1741 నుంచి 1762 వరకు ఎలిజబెత్ పాలించిన కాలంలో రష్యన్ నాటకరంగం పూర్తిగా ఫ్రెంచి నాటకాల ప్రభావానికి లోనైంది. మోలియర్, రెసిన్, కోరినెల్ రచించిన నాటకాలు విస్తృతంగా ప్రదర్శింపబడేవి. వీటి ప్రభావం వల్ల రచింపబడిన నాటకాలలో ప్రాచీన నాటక సంప్రదాయాలను తప్పకుండా రచయితలు పాటించేవాళ్ళు. అయితే ఇవి కేవలం ప్రాచీన నాటక రచనా సంప్రదాయాలను అనుకరించడంతో వాటిల్లో సృజనాత్మకత కొరవడిందనే చెప్పాలి.

అయితే 1729-1763 ప్రాంతాల నుంచి వోల్కోవ్ రష్యా సంప్రదాయాన్ని ఆవిష్కరించడానికి కృషి చేశాడు. తన తమ్ముడితో కలసి ఓ నాటక కంపెనీని స్థాపించాడు. బహుళ జనాదరణ పొందిన ఈ కంపెనీ ఎలిజబెత్ సామ్రాజ్ఞి మెప్పుకూడా పొందింది. ఈ నాటక కంపెనీని రాజధానిలో ప్రదర్శనలు ఇవ్వడానికి ఆహ్వానించడమే కాక, నాటక కళను ఇతరులకు బోధించమని ఆజ్ఞలు జారీ చేసింది. రాణి ఎలిజబెత్ ఒక దశలో పూర్తిస్థాయి జాతీయ రష్యా నాటకాన్ని రూపొందించమని నాటక కళాకారులకు, వివిధ సాహితీ ప్రక్రియల్లో కృషిచేస్తున్న విద్వాంసులకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల ప్రఖ్యాత రష్యా శాస్త్రవేత్త, కవి, మిఖలాయ్ లమోనోవ్ చాలా జాగ్రత్తగా వివిధ విషాదాంత నాటకాలను రచించడానికి ప్రయత్నించాడు కానీ, అవి అనుకున్నంతగా విజయవంతం కాలేదు.

ఎలిజబెత్ పరిపాలనా కాలంలో దర్శకుడుగా, రచయితగా వెలుగులోకి వచ్చిన వారిలో అలెగ్జాండర్ సమరోకోవ్ ముఖ్యుడు. ఈయన 11 విషాదాంత నాటకాలను, 12 ఆహ్లాద రూపకాలను రచించాడు. 1747లో ప్రప్రథమంగా రాసిన ఖోరేవ్ అనే విషాదాంత నాటకం 1749లో ప్రదర్శించబడింది. ఫ్రెంచి నాటక రీతిని అనుసరించి రాసిన నాటకాలు ఆనాటి రంగస్థలానికి ఆయువు పట్టుగా నిలిచాయి. డిమిట్రీ ది ప్రిటెండర్ (1771) అనే నాటకం 19వ శతాబ్దం దాకా నాటకరంగాన్ని అలరించింది. సమరోకోవ్ నాటకాలు వస్తు, స్థల, కాలైక్యాలను పాటించేవి. అలంకారిక భాషలో సంభాషణలు తొణికిసలాడేవి. అయితే స్వగతాలు అత్యధికంగా ఉండేవి. రాజాదరణ నాటకరంగానికి లభించటంచేత ఖెరాస్కోవ్, నికోలయ్ పెట్రోవిచ్ నికోలెవ్, డేవిస్ ఇవానోవిచ్, ఫాన్ విజిన్ వంటి నాటక కర్తలు వెలుగులోకి వచ్చారు. రాజులకు సంబంధించిన కథలకు మారుగా సమకాలీన సమాజం వైపు దృష్టిసారించి, జన జీవితంలోని సుఖ దుఃఖాలను తమ నాటకాల్లోచిత్రించారు. ఫాన్‌విజన్ బ్రిగేడియర్, ది మైనర్, షెకోవ్స్కీ ఎన్స్యూస్టెర్న్, ఆల్ ఇన్ ది ఫ్యామిలీమొదలైనవి ఆ కాలంలో ప్రజాదరణ పొందిన నాటకాలు.

కేథరిన్ ది గ్రేట్ అధికారంలోకి వచ్చాక, బోల్షోయ్ నాటకసంస్థ 1779-80 ప్రాంతంలో స్థాపించబడింది. ఇంపీరియల్ థియేటర్ లాగానే ఇదీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిచేది. కొన్ని సార్లు ప్రభుత్వం కొంతమంది ధనవంతులకు నాటక సంస్థలను నడపడానికి అనుమతించింది. ఇలాంటి సంస్థలలోని నటులు సాధారణంగా బానిసలు. ఒక్కోసారి వారికి కూడా తెలియకుండా వేరే సంస్థలకు వేరే యజమానుల ద్వారా అమ్మబడేవాళ్ళు. అయితే కొంతమంది బానిస నటులు తమ ప్రతిభ వల్ల ఇలాంటి పరిస్థితుల నుంచి తప్పించుకునే వాళ్ళు.

18వ శతాబ్దంలో రష్యాలో అనేక గొప్ప నాటకాలు ప్రదర్శితమయ్యాయి. రసిన్, కోరినెల్ రాసిన ట్రాజెడీలు, మోలియర్ రాసిన హాస్య నాటకాలు, షేక్స్పియర్, గోథే, వోల్టేర్, కొరోల్ గోల్డోనీలు రాసిన సుప్రసిద్ధ నాటకాలు ప్రదర్శింపబడేవి. వీటి ప్రభావం వల్ల దాదాపు రెండు మూడు వందల నాటకాలు మూసపద్ధతిలో తయారై ప్రదర్శితమయ్యేవి. ఇవి కేవలం పైన తెలిపిన నాటకాలకు రష్యా వాతావరణంలోకి మార్చబడిన అనుసరణలు మాత్రమే, కానీ ఈ అనుసరణ నాటకాలు ఎక్కువ కాలం ప్రదర్శింపబడలేదు. అయితే మోలియర్ నాటక రచనలను అనుసరించి రాసిన హాస్య నాటకాలు మాత్రం కాస్త విజయాన్ని సాధించాయనే చెప్పవచ్చు. అవి ఆనాటి రష్యన్ సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ జానపద లక్షణాలను సమ్మిళితం చేసుకుంటూ పోలెండ్, జర్మనీ సాంస్కృతిక వారసత్వాన్ని పుణికి పుచ్చుకుంటూ తనదైన ప్రత్యేకతను సంతరించుకొంది. 1781 వరకు వీటికి కూడా రావలసినంత గుర్తింపు రాలేదు. ఈ సంవత్సరంలోనే డెనిస్‌ఫోక్ వినిజిన్ మొట్టమొదటి రష్యన్ కామెడీ ది మైనర్ రాశాడు. ఈ నాటకం అత్యంత ప్రజాదరణ పొందింది. ఈ నాటకం తరువాతే రష్యన్ నాటకం తనదైన ధోరణి ఏర్పరచుకుందని చెప్పాలి.

క్రమేణా రష్యా నాటకం ఎదిగి, ఆంటోని చెకోవ్ లాంటి రచయితల వల్ల 20వ శతాబ్దంలోయూరోపియన్ నాటకరంగంలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంది. అయితే జార్ ఆధిపత్యం లేదా సోవియట్ అధికారుల నియంత్రణ వల్ల నాటకం తన స్వేచ్ఛను కోల్పోయింది. దాదాపు 150 ఏండ్లు 1780 నుంచి 1930 వరకు అంటే కాథరిన్ ది గ్రేట్ నుంచి స్టాలిన్ పరిపాలన వచ్చేంత వరకు రష్యన్ నాటకరంగం చాలా వరకు నిశ్శబ్ద విప్లవంగానే అభివృద్ధి చెందింది. స్టాలిన్ పాలన అంటే సోవియట్ అభ్యుదయవాదం నుంచి వచ్చిన చాలామంది ప్రతిభావంతులైన రష్యన్ నాటక రచయితలు, కళాకారులను నిర్వీర్యపరచింది. 1932లో ప్రభుత్వం రష్యన్ సాహిత్యంలో సోషలిస్టు రియలిజం ప్రతిఫలించాలని శాసించడంతో కావ్య సృష్టిలో పటుత్వం నీరుగారిపోయింది.

తగిన స్వేచ్ఛ లభించని కారణంగా ప్రత్యేక మార్గాన్ని నాటకరంగం ఎన్నుకుంది. ఒకరకంగా అసమ్మతి వర్గపు ఆయుధంగా నాటకం ఉపయోగపడింది. అయితే రష్యాను పాలించిన వారందరూ నాటకం త్వరగా జనసామాన్యానికి దగ్గరగా తీసుకువెళుతుందని గ్రహించిన వాళ్ళే, నాటకాన్ని ఎప్పుడూ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఎదగనిచ్చారు. ఆవిధంగా నాటక రంగాన్ని ప్రభుత్వ సంస్థగా మార్చి దానిపై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ తమపై వ్యతిరేక ధోరణులను ఎదగనీయకుండా జాగ్రత్తపడ్డారు. కాథరిన్ ది గ్రేట్ నుంచి స్టాలిన్ ది గ్రేట్ వరకు అనేక నాటకాలు ప్రభుత్వ విధానాలకు అనుకూలంగా తిరిగి రాయబడి ప్రదర్శించబడ్డాయి. కాని ఇవన్నీ కళాత్మకత లోపించిన ప్రదర్శనలుగానే మిగిలి పోయాయి. ఏది ఏమైనా డెనిస్ పాన్‌విజ్ రష్యా నాటకరంగాన్ని తనదైన శైలిలోకి ప్రయాణం చేయడానికి ఉత్తేజపరిచాడు. ఆయన రాసిన ది మైనర్ నాటకం కళాత్మకంగా ఉండటమే గాక అభ్యుదయ భావజాలం గల సందేశాన్ని కూడా ఇచ్చింది. అప్పటి వరకూ ఇతర పాశ్చాత్య నాటకాన్ని అనుసరిస్తున్న రచయితలు కొత్త దారుల్ని తొక్కారు. డెనిస్ ఫోకంజ్ ప్రభావం దాదాపు రష్యన్ నాటక రంగంపై అర్థశతాబ్దం పైగా ఉంది. డెనిస్ వల్ల **ప్రభావితమైన అలెగ్జాండర్ గ్రిబోయెడివ్ 1824** ప్రాంతాల్లో 'వోవ్ **ప్రామ్‌విట్' అనే అద్భుతమైన** ఆహ్లాద రూపకాన్ని రచించాడు. ప్రఖ్యాత రచయిత, కాల్పనిక వాది అలెగ్జాండర్ పుష్కిన్ కూడా నాటకాలు రాశాడు. అయితే రష్యా సెన్సార్‌షిప్ వల్ల ఆయన రాసిన నాటకాలు ఆయనజీవించి ఉండగా ప్రదర్శనకు నోచుకోలేదు. 1835లో మిఖిలాయ్ లెర్మెంన్‌టాన్ రచించిన ఉస్కరాడ్ అనే నాటకం ముప్పై సంవత్సరాల తరువాత ప్రదర్శనకు నోచుకుంది. రచయితల్ని ప్రభుత్వ సెన్సార్‌షిప్ అనేక ఇబ్బందులకు గురిచేసినా డెనిస్ ప్రారంభించిన కృషిని నికలాయ్ గొగొల్(1809-1852) అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లాడు. నవలా కథా రచయిత అయిన గొగొల్, ది ఇన్‌స్పెక్టర్ జనరల్ (1836) నాటకాన్ని రాశాడు. ఈ నాటకం రష్యన్ నాటకరంగ చరిత్రలో అత్యుత్తమ నాటకంగా ఖ్యాతి గడించింది. అప్పట్లో వచ్చిన మెలోడ్రామాలను గొగొల్ తీవ్రంగా విమర్శించాడు. ఆలోచనా రహితంగా చేసిన విపరీత చేష్టలుగా ఆ నాటకాల్ని ఆయన అభివర్ణించాడు.

గొగొల్ ప్రభావానికిలోనైన మరొక సుప్రసిద్ధ నవలా కారుడు ఇవాన్ తర్గనేవ్, ఈయన 1847లో ది పారాసైట్, ది మంత్ ఇన్ ది సెంచరీ అనే నాటకాలను రచించాడు. సూటిగానూ, ఆత్మతత్వాన్ని బోధించే నాటకాలుగా ఇవి పేరు తెచ్చుకొన్నాయి. తరువాత వచ్చిన ఆంటోని చెకొవ్ (1860-1904)కి ఇవి ఆదర్శమయ్యాయి.

19వ శతాబ్దంలో నాటక రంగంలో గణనీయమైన మార్పులు తేవడానికి జీవితపర్యంతమూ కృషిచేసిన నాటక రచయిత అలెగ్జాండర్ ఆస్ట్రోవ్‌స్కీ (1823-1886). వస్తు, రూప, శిల్పాలలో నవ్యతను ప్రవేశ పెడుతూ సుమారు ఎనభై నాటకాలను రచించాడు. వాటిలో అధిక భాగం ఆహ్లాద రూపకాలే, ప్రదర్శనలో సహజత్వానికి పెద్ద పీట వేసిన నాటక రచయితలలో ఆస్ట్రోవ్‌స్కీ ప్రథముడు. ఈయన నాటక రచయితే కాదు, దర్శకుడు, ప్రయోక్త కూడా. అంతరార్థ విశదీకరణ కోసం నటులకు తగిన శిక్షణ ఇవ్వడం అతని ప్రత్యేకత. నటులు, నాటక రచయితల హక్కులను కాపాడే సంస్థలను కూడా స్థాపించి, వారికి తగిన ప్రతిఫలం లభించేటట్లు కృషి చేసిన కళాభిజ్ఞుడు. బానిస వ్యవస్థను తీవ్రంగా ఖండించిన వారిలో ప్రముఖుడు. ఎనభై నాటకాలు రాసినా ప్రభుత్వ నిబంధనల కోరల్లో చిక్కుకొన్న కారణంగా ఎక్కువ నాటకాలు అతడి జీవిత కాలంలో ప్రదర్శితం కాలేదు. బాంక్రప్ట్ (1849), ఎ పూర్ బ్రైడ్ (1852), ది థండర్ స్టార్మ్ (1859) మొదలైన నాటకాలు బహుళ జనాదరణ పొందాయి. రష్యన్ సామెతలను తన నాటకాలకు టైటిల్స్‌గా పెట్టడం ఆస్ట్రోవ్‌స్కీ కి అలవాటు. పావర్టీ ఈజ్ నో క్రైమ్, ఈవెన్ ది వైస్ కెన్ ఎర్ వంటి నాటకాలు దీనికి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ప్రసిద్ధ నవలా రచయిత లియొ టాల్‌స్టాయ్ నాటకరంగాన్ని తన బోధనలకి సాధనంగా వాడుకున్నాడు. సమాజంలోని నిరక్షరాస్యులకు, నిమ్న వర్గాలకు చెప్పదలచుకున్న విషయాన్ని, వచన సాహిత్యం కంటె నాటకమే త్వరగా చేర్చగలదని దృఢంగా నమ్మాడు. ది పవర్ ఆఫ్ డార్క్‌నెస్ (1886), ది ఫ్రూట్స్ ఆఫ్ ఇన్ లైట్ మెంట్ (1889), ది లివింగ్ కార్ప్స్ (1900) అనే నాటకాలు టాల్‌స్టాయ్‌కి ప్రపంచ ప్రఖ్యాతిని తెచ్చిపెట్టాయి. 1861 ప్రాంతంలో బానిసత్వానికి వ్యతిరేకంగా ప్రతిస్పందిస్తూ, రైతులను దృష్టిలో పెట్టుకొని దున్నే వానికే భూమి ఉండాలని, అనువంశికంగా ఆస్తులు సంపాదించిన వారి అధికారాలు చెల్లవని వాదించాడు.

నాటికల రచనతో ప్రారంభమైన ఆంటోని చెకోవ్ రచనలు రష్యా నాటకరంగంలో అతి ముఖ్యమైన నాటకాలుగా గుర్తింపు పొందాయి. తగరొవ్, గొగొల్ లాంటి ప్రసిద్ధ రచయితల ప్రభావం చెకోవ్ మీద ఎక్కువగా ఉండేది. చమత్కారాత్మకంగానూ, విలాస భరితంగానూ ఉండేవి. తగరొవ్ రచనల్లో మానసిక సంఘర్షణ చిత్రితమయ్యేది. వ్లాదిమెర్ నెమెరువి డాన్ షెంకో, కాన్‌స్టాన్ టిన్ స్టానిస్లవ్‌స్కీల సాహచర్యం, వారు చెకోవ్ నాటకాలను ప్రదర్శించడం వల్ల కూడా అవి ప్రపంచ ఖ్యాతిని పొందగలిగాయి. అయితే ఈ నేపథ్యంలో రష్యా నాటకరంగాన్నే గాక ప్రపంచనాటకరంగాన్నే విప్లవాత్మకమైన మార్పుకు గురిచేసిన వ్యక్తి కాన్‌స్టాన్‌టిన్ స్టానిస్లవ్‌స్కీ (1863-1938). వెండి, బంగారం వ్యాపారం చేసే ధనిక కుటుంబంలో జన్మించిన

స్టానిస్లవ్స్కీ, అప్పటికే రష్యాలో ప్రబలంగా ఉన్న అతి నటన, మూస పాత్రలు, పరంపరగా వస్తున్న దృశ్య బంధనిర్మాణం, నటుల మధ్య పరస్పర అవగాహన లేక పోవడం, ఇలాంటి వాటి వల్ల విసిగి, నెర్మొవిచ్ డాన్ షింకోతో కలిసి మాస్కో ఆర్ట్ థియేటర్ స్థాపించాడు. ఈ సంస్థ రష్యన్ నాటకాలు కాకుండా షేక్స్పియర్, హాప్ మెన్, గోల్టోని, ఇబ్సన్ రచించిన అనేక నాటకాల్ని విజయవంతంగా ప్రదర్శించింది. నాటకాల్ని సహజంగా ప్రదర్శించడంలో మాస్కో ఆర్ట్ థియేటర్ పెట్టింది పేరు. 1902లో మాక్సిమ్ గోర్కీ రాసిన లోవర్ డెప్త్స నాటకాన్ని ప్రదర్శించడానికి మాస్కో పరిసర ప్రాంతాలలో మురికి వాడల్లో నివసించే ప్రజా జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి పరిశోధన చేసి, తదనుగుణంగా నాటకానికి దర్శకత్వం వహించి విజయవంతంచేశాడు. 'రంగస్థలం మీద సహజత్వానికి గురువు స్టానిస్లవ్స్కీ' అని గోర్కీ అభివర్ణించాడు. 1898 నుండి 1906 వరకూ స్టానిస్లవ్స్కీ ప్రదర్శనలు సహజత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ముద్రాంకిత నటనకు వ్యతిరేకంగా సహజ నటనకే ప్రాధాన్యత ఇచ్చిన స్టానిస్లవ్స్కీ నటసిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. నటన కేవలం పుట్టుకతో వచ్చే గుణం మాత్రమే కాదని, శిక్షణ ద్వారా నటుల్ని తయారు చేయవచ్చునని వాదిస్తూ, నటుడు తన మనస్సు, వాక్కు, శరీరాన్ని క్రమబద్ధంగా వివిధ అభ్యాసాల ద్వారా పదును పెట్టుకోవడం వల్ల సహజమైన నటనని సాధిస్తాడని స్థూలంగా ఆయన సిద్ధాంతం. వీటిని విశదీకరిస్తూ యాన్ యాక్టర్ ప్రిపేర్స్, బిల్డింగ్ ఏ క్యారెక్టర్, క్రియేటింగ్ ఏ రోల్ అనే గ్రంథాలను రాశాడు. ఆయన చివరి పుస్తకం మై లైఫ్ ఇన్ ఆర్ట్ అనే గ్రంథం స్టానిస్లవ్స్కీ స్వీయ చరిత్రని తెలియచేస్తుంది. స్టానిస్లవ్స్కీ రూపొందించిన నటన సిద్ధాంతం మెథడ్ ఆఫ్ ఆక్టింగ్ పేరుతో ప్రపంచ ప్రసిద్ధం. ఈ సిద్ధాంతం కేవలం రష్యాలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది నటులను తయారు చేయడానికి ఉపకరించింది.

స్టానిస్లవ్స్కీ తరువాత రష్యా నాటకరంగాన్ని ప్రభావితం చేసింది మేయర్ హోల్డ్ (1874-1940), వఖ్తాంగొవ్. మేయర్ హోల్డ్, స్టానిస్లవ్స్కీకి మాస్కో ఆర్ట్ థియేటర్‌లో శిష్యుడు. ఈయన నట జీవితం అంతగా విజయవంతం కాలేదు. ఐదు సంవత్సరాలు మాస్కో ఆర్ట్ థియేటర్‌లో పని చేశాడు. అయితే స్టానిస్లవ్స్కీ సిద్ధాంతమైన సైకోటెక్నిక్ తో విభేదించిన మేయర్ హోల్డ్, 1902లో మాస్కో ఆర్ట్ థియేటర్‌ని వదలిపెట్టాడు.

సింబాలిక్ నాటకాల్ని ప్రదర్శించడానికి ప్రయత్నాలు చేశాడు. వెరాకోమిజిరాజెవిస్కావా తో కలిసి మారిస్ మేటర్‌లింక్, ఇబ్సన్, చెకోవ్ నాటకాల్ని ప్రదర్శించాడు. తనదైన నటసిద్ధాంతం బయోమెకానిక్‌ని ప్రతిపాదించాడు. నటుల్ని కేవలం సూత్రధారుడి చేతిలో ఆడే బమ్మలని భావించాడు మేయర్ హోల్డ్. స్టానిస్లవ్స్కీలాగ నటులు తమ పాత్రలను సృజించడానికి ఇచ్చిన స్వేచ్ఛను ఈయన ఇవ్వలేదు. నటులు కేవలం ఒక యంత్రంలా తన పనితాను చేసుకుపోవాలని ఈయన సిద్ధాంతం. రచయిత-నటుడు-ప్రేక్షకుడు ఈ పరిధిని వ్యతిరేకిస్తూ దర్శకుడు, నటుడు, ప్రేక్షకుడు అనే ఆలోచనకి రూపకల్పన చేశాడు. నటులను తనను చూసి కేవలం అనుకరణ చేయమని కోరేవాడు. మేయర్ హోల్డ్‌త సిద్ధాంతాలు స్థిరమైన ప్రతిపాదన మీద ఆధారపడకపోవడం వలన ఆయన, నటులకు అంత తేలికగా అర్థంకాక పోవడం వల్ల, ఈయన సిద్ధాంతాలు ఎక్కువ కాలం నిలువలేదు. అయితే హోల్డ్ అమోఘమైన సృజనాత్మకత వల్ల, దర్శక ప్రతిభ వల్ల, నాటకాలు విజయవంతం అయ్యేవి. వాటిలో ఘోస్ట్స్, మిస్టరీ బఫ్, ది మాగ్నఫిషియంట్ కుక్లడ్, ది ఇన్‌స్పెక్టర్ జనరల్ ముఖ్యమైనవి.

వఖ్తాం ఘొవ్ (1883-1922) 1909లో మాస్కో ఆర్ట్ థియేటర్‌లో చేరాడు. వఖ్తాంఘొవ్, స్టానిస్లవ్స్కీ మెథడ్ ఆఫ్ యాక్టింగ్‌లో శిక్షణ పొందాడు. మాస్కో ఆర్ట్ థియేటర్ నాటకం ఫ్లడ్‌లో అద్భుతంగా నటించి అందరి మన్ననల్ని పొందాడు. స్టానిస్లవ్స్కీ అభిమానాన్ని సంపాదించిన వఖ్తాంఘొవ్, ఆయన అభ్యర్థన మేరకు మొదట స్టూడియోలో నటశిక్షకుడిగా చేరాడు. నాటకం కోసం నిరంతరం శ్రమిస్తూ స్టానిస్లవ్స్కీ ప్రియ శిష్యుడిగా పేరుపొందాడు. ఆ రోజుల్లో పగలు నట శిక్షణ, సాయంత్రం నాటక ప్రదర్శనలలో నటుడిగా పాల్గని, రాత్రి తిరిగి నాటకం రిహార్సల్స్‌లో పాల్గనే వాడు వఖ్తాంఘొవ్. స్టానిస్లవ్స్కీని విపరీతంగా అభిమానించినా, సిద్ధాంతపరంగా విభేదించాడు వఖ్తాంఘొవ్. నటుడు పాత్రలో లీనమై, పాత్రే తానై పోవడాన్ని వ్యతిరేకించాడు. నటుడు తాను పోషించే పాత్రను పోలి ఉంటే సరిపోతుంది. పాత్రే తానై పోనక్కరలేదు. రంగస్థలం మీద సహజత్వం ఎంత అవసరమో, వేస్తున్న పాత్ర ద్వారా పాత్రధారి ఆనందం పొందడం, ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగించడం కూడా అంత అవసరమని ఆయన అభిప్రాయం. అందుకే కొన్ని స్టానిస్లవ్స్కీ సిద్ధాంతాలు, కొన్ని మేయర్ హోల్డ్ పద్ధతులను మేళవించి నాటకీయ సహజత్వం (Theatrical realisam) ప్రతిపాదించాడు ఈయన. వఖ్తాంఘొవ్ ప్రభావం అమెరికా నటులమీద, వారినటశిక్షణమీద ఉంది. 1920 నాటికి వఖ్తాంఘొవ్ పేరు ప్రఖ్యాతులు విస్తరించాయి. ఒక్క మాస్కో ఆర్ట్ థియేటర్లోనే కాక సెకండ్ థియేటర్‌లోను, హబిమాలోని అమెరికన్ స్టూడియోలోను పనిచేసి అందరి మన్ననలను పొందిన వఖ్తాం 1922, మే 22న మరణించాడు.

ఇరవయ్యోవ శతాబ్దంలో చెకోవ్,అతని సహచరుల ప్రభావం రష్యా నాటకరంగంపై చాలా కాలం కొనసాగింది.

సహజత్వం రంగస్థలంపై కదం తొక్కింది. స్టానిస్లవ్స్కీ డాన్ షెంకో నిజజీవితానికి దగ్గరగా నాటకాల్ని ప్రదర్శించడం, అవి విజయవంతం కావడం ముఖ్యవిశేషాలు.

అయితే ఈ సహజత్వ ధోరణిని వ్యతిరేకించిన నికలోయెవ్‌ఎవరినోవ్ (1879-1953). 'సహజత్వాన్ని రంగస్థలం మీదికి తీసుకురావడం హాస్యాస్పదం, నాటకకళ ఒక అసహజమైన, సాంకేతిక పరమైన కళారూపం అందువల్ల నిజ జీవితాన్ని నాటకం అనుకరించాల్సిన పనిలేదు. నటన సాంకేతిక పరమైనది కావాలని చేసే శైలీగత ప్రక్రియ' అని వాదించాడు. ఈ ఆలోచనలు తన మెలోడ్రామా(1909), ది థియేటర్ ఫర్ అవర్‌సెల్వ్స్ (1915) అనే గ్రంథాలలో వివరించాడు. ది స్కూల్ ఆఫ్ స్టార్, ది ఎటర్నల్ డాన్సర్ మొదలైనవి ఈయన ప్రఖ్యాత నాటకాలు.

1918 అక్టోబర్ విప్లవం నూతన రంగస్థల ప్రక్రియలకు బాటలు వేసింది. అటు ప్రేక్షకులు, ఇటు ప్రదర్శకులు కూడ కొత్త రకమైన సమాచార వ్యవస్థ కోసం ఆరాట పడ్డారు. జార్, సోవియట్ పరిపాలనల మధ్యరెండువిలక్షణమైననాటక రచన సంప్రదాయాలను గమనించవచ్చు. మాక్సిమ్‌గోర్కీ (1868 -1936) విప్లవానికి అతిసన్నిహితుడుగా, భావి రష్యన్ పాలకులకు దగ్గరివాడుగాఉంటూ జార్‌పాలనలోజరిగిన అన్యాయాలను తనరచనలద్వారాఎండగట్టాడు. ఆయన నాటకం లోవర్ డెప్త్స్ (1902), విప్లవానికి ముందు, విప్లవం తరువాత కూడా విజయవంతమైంది. ఇంకో వైపు ఆంద్రెయోవ్, గోర్కీకి ప్రత్యర్థిగా పరిగణింపబడ్డాడు. ఆంద్రీయాల్ రచనలు అంత సులభంగా ప్రదర్శనకు నోచుకోలేదు. సోవియెట్ ప్రభుత్వాన్ని బహిరంగంగా వ్యతిరేకించే విమర్శకుడుగా పేరు పొంది ప్రవాసానికి వెళ్లాడు. లైఫ్ ఆఫ్ ఏ మాన్, హి హు గెట్స్ స్లాప్‌డ్ మొదలైనవి ఈయనప్రఖ్యాతనాటకాలు. స్టాలిన్ మరణం తరువాత మాత్రమే ఈయన రచనలు సోవియట్ యూనియన్‌లో ప్రచురింపబడ్డాయి.

గోర్కీ రచనలు ఈయనకు అఖండమైన ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. లెనిన్ ఆదరణ పొంది సోవియట్ రియలిజానికి ఆద్యుడయ్యాడు. మాక్సిమ్‌గోర్కీ సోవియట్‌గాఏర్పడిన ప్రారంభంలో లునార్ చాస్కీ (అప్పటి సాంస్కృతిక వ్యవహారాల కమిషనర్ మంత్రి) ఆధ్వర్యంలో కొన్ని ప్రయోగాలు జరిగాయి. కొత్త సమాజం కోసం కొత్త భాష అనేది అప్పటి నినాదం. మయకవోస్కీ రాసిన మిస్టీరియాబఫ్ నాటకం ఇదే ఆలోచనని ముందుకు తీసుకువచ్చింది. ఈ నాటకం నటుల, ప్రేక్షకుల మధ్య దూరాన్ని కూడా తగ్గించడానికి ప్రయత్నం చేసింది. ది బెడ్ బగ్, ది బాత్ హౌస్ నాటకాలు ప్రయోగాత్మకాలుగా పేరు పొందాయి. అప్పట్లో అతిప్రాచుర్యం పొందిన ప్రతీక, అభివ్యక్తీకరణ వాదాలను ప్రతిబింబిస్తూ ఈ నాటకంలో ప్రాచుర్యం పొందాయి.

మయకవోస్కీతరువాత యూరిఓ లేషా రాసిన నాటకాలు ది కాన్సిరసీ ఆఫ్ ఫీలింగ్స్, ఎ లిస్ట్‌ఆఫ్‌ఎసెట్స్ పేరు పొందాయి. సోవియట్ పరిపాలనలో వచ్చిన అనేక నాటకాలు ప్రభుత్వ విధానాలు, దాని రాజకీయ ఉద్దేశాలను సమతుల్యంగా ప్రతిబింబింప చేశాయి. వీటిని సోవియట్ క్లాసిక్స్‌గా ఆనాటి సాహితీ విమర్శకులు కొనియాడారు. వీటిలో ఇవనోవ్ రాసిన ఆర్ మ్మోడ్ ట్రైన్, బోరిస్ లావరెన్‌వోయ్ రాసిన ఎనిమీస్, కాన్‌స్టాంటిన్ ట్రెనోవ్ రచించిన లుబయోవ్ యరనోవ, నికలోవ్ పొడిగిన్ రాసిన అరిస్ట్రాక్రిట్స్ ముఖ్యమైనవి. అరిస్ట్రాక్రిట్స్ ఇంగ్లీషులోకి అనువదించిన తరువాత న్యూయార్క్‌లో 1960లో ప్రదర్శించారు.

1953లో స్టాలిన్ మరణం తరువాత కూడా రష్యన్ నాటకరచనఅణగదొక్కబడే ఉంది. సోవియట్ రియలిజం ఆదర్శాలు కొంచెం పక్కకుతొలిగినాలెనిన్‌ప్రభావంమళ్ళీ రచనలపై కొనసాగింది. అనేకపాశ్చాత్యసాహిత్య ప్రభావాలున్నప్పటికీ రష్యన్ నాటకరంగం మాత్రం తన భావజాలాన్ని మార్చుకోలేదు. అందువల్ల జనసామాన్యం ఆదరణకు అది దూరమైంది. వాళ్ళని తిరిగి ఆకర్షించడానికి తిరిగి పాత రష్యా క్లాసిక్ నాటకాలను తిరగతోడి ప్రదర్శించారు.

పాశ్చాత్య నాటకరంగంలో వచ్చిన అనేక మార్పులకు రష్యా నాటకరంగం 1960 వరకు కూడా ప్రభావితం కాలేదు. బ్రెష్ట్ లేదా అనిబద్ధ రూపకం (అబ్సర్డ్ డ్రామా) ముఖ్యంగా అయెనెస్కో, పింటర్ నాటకాలు రష్యాభాషలోకి అనువదించిన తరువాత 1960 ప్రాంతంలో ప్రదర్శించారు. దీనివలన కొంతమంది నాటకరచయితలు ముఖ్యంగా యూరిలిబిమోవ్, వోజెనెస్కీ, జాన్ రీడ్ ప్రభావితులైనారు.

రష్యా నాటకరంగం కాలానుగుణంగా అనేక కొత్త పుంతలు తొక్కింది. జార్‌చక్రవర్తులప్రభావం, సోవియట్ ప్రభుత్వ ధోరణులు, విప్లవనేపథ్యం, వ్యక్తిగతఆరాధన, పారిశ్రామికీకరణ ఇలా అనేక పరిస్థితులకు, ఆటుపోట్లకులోనై, రష్యా నాటకరంగం ముందుకు సాగింది. అభ్యుదయ భావాలు, నాటకాన్ని నిజ జీవితానికి దగ్గరగా తీసుకువేళ్లే ప్రయత్నాలు, ప్రపంచ రంగస్థలానికి నటశిక్షణలో అత్యద్భుతమైన శాస్త్రీయ విధానాన్ని అందించడం, రష్యా నాటకరంగం సాధించిన ఘనవిజయాలు.

మొదటి నుంచి కూడా రష్యాలో ప్రభుత్వం నాటక రంగాన్ని శాసించింది. రచన, ప్రదర్శన ఆలోచన, ఇవన్నీ కూడా అధికారం గుప్పిట్లో వుంటే రష్యా నాటకరంగమేకాదు ఏ నాటక రంగమైనా స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకుని అభివృద్ధి చెందలేదు.

భరద్వాజ

పోలాండ్ నాటకరంగం

కర్మలు, క్రతువులు, తంతులు, ఉత్సవాల్లో భాగంగా కొంతమంది ప్రజలు జంతుచర్మాలతో, నారతో చేసిన వస్త్రాలతో తమ బంధుమిత్రుల సమక్షంలో నృత్యం చేయడం, ఆ నృత్యానికి కపాలాలు, మొక్కజన్న కంకులు, ఎల్లో చెట్ల కొమ్మలతో ప్రజలు ఆనందంతో స్పందించడం, ఈ తంతులోనే కొన్ని ప్రశ్నలు వేయడం, నృత్యకారులు సమాధానం చెప్పడం, నృత్య ప్రదర్శన పూర్తికాగానే ఉత్సవం ముగియడం – ఇలా సాంప్రదాయ వేడుక నృత్యంతో పోలాండ్ నాటకరంగం ప్రారంభమైంది. ఆ తరువాత ఈ ప్రాంతంలో క్రైస్తవ మతం ప్రవేశించడం ద్వారా చర్చిలలో క్రీస్తుకు సంబంధించిన గాథలతో, వంత సంబంధమైన అద్భుతాలను తెలియచేస్తూ ప్రశ్న–జవాబు పద్ధతిలో, చర్చించుకుంటున్న ధోరణిలో ప్రదర్శనలు జరుగుతూ వచ్చాయి.

13–14 శతాబ్దాల మధ్యకాలంలో పశ్చిమదేశాలనుంచి కొంతమంది నృత్యకారులు, కథాగానం చేసేవారు, హాస్యగాళ్ళు, మూకాభినయ ప్రదర్శనకారులు, ఇంద్రజాలికులు వచ్చి ఈ దేశంలో ప్రదర్శనలిచ్చేవారు. వాళ్ళ స్ఫూర్తితో ఆల్బర్టస్ కథల ప్రచారం నిమిత్తం వీధినాటకరంగం ప్రారంభమై విస్తృతంగా ప్రదర్శనలివ్వడం కొన్ని సంవత్సరాలుగా కొనసాగింది.

జార్నోలాస్‌కు చెందిన జన్‌కోషానోవ్‌స్కీ రాసిన ది డిస్మిసల్ ఆఫ్ ది గ్రీక్ ఎన్వాయిస్ నాటకాన్ని 1578, జనవరి 12వ రాజు స్టీఫెన్ బ్యాటరీ సమక్షంలో ఒక వివాహ వేడుకలో రాజప్రాంగణంలో ప్రదర్శించటంతో రాజ ప్రాసాద నాటకరంగం (Court Theatre) ప్రారంభమైంది. 1580లో విల్‌కోవీకోకు చెందిన మికోలస్ క్రీస్తుకు సంబంధించిన అద్భుతగాథతో ది స్టోరీ ఆఫ్ ది గ్లోరియస్ రిసరెక్షన్ ఆఫ్ అవర్ లార్డ్ పేరుతో నాటక పాఠ్యాన్ని ముద్రించాడు. ఈ కథ క్రీస్తు అంత్యక్రియలతో ప్రారంభమై, పునరుత్థానంతో ముగుస్తుంది. పోలాండ్ నాటకరంగ చరిత్రలో ఇదే ప్రథమ ముద్రిత నాటకం. దీన్ని ఇప్పటికి కూడాకొన్ని మార్పులు, చేర్పులతో ప్రదర్శిస్తున్నారు.

క్రమంగా కోర్టు థియేటర్‌లో ఇటాలియన్, జర్మన్, ఫ్రెంచ్, ఇంగ్లీష్ నటుల ప్రదర్శనలు కొనసాగుతూ వచ్చాయి. శాక్సన్ రాజవంశానికి చెందిన పోలాండ్ రాజు ఆగస్ట్ II స్ట్రాంగ్ 1748లో మొట్టమొదటి నాటకశాలను నిర్మించాడు. 1764లో కడపటి పోలాండ్ రాజైన స్టానిస్‌లాస్ ఆగస్టస్ పోనియా టోవ్‌స్కీ మొట్టమొదటి పోలాండ్ పబ్లిక్ థియేటర్‌ను 1765లో నిర్మించి, దానికి నేషనల్ థియేటర్ అని పేరు పెట్టాడు. ఈ నాటకశాల ప్రారంభోత్సవం సందర్భంగా జోజెఫ్ బైలావ్‌స్కీ రచించిన ఇంటర్ లోవర్స్ ఆహ్లాదరూపకాన్ని ప్రదర్శించారు. పోలాండ్‌లో ఆధునిక, పబ్లిక్ థియేటర్‌కు నాంది పలకడం జరిగింది. ఫ్రెంచ్ నాటకాల మాతృకల నుండి పోలాండ్ పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా తొలుత ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా రాజు చేపట్టిన కార్యక్రమాలను, సంస్కరణలను ప్రజలకు తెలియచెప్పేందుకు నాటకాన్ని ప్రచారసాధనంగా వినియోగిస్తూ వచ్చారు. నేషనల్ థియేటర్ యజమాని, నాయకుడు, నటుడు, దర్శకుడు, రచయిత, ప్రయోక్త అయిన ఓజేసెక్ బోగస్ లావ్‌స్కీ, పోలాండ్ నాటకరంగ పితామహుడిగా గుర్తించబడ్డాడు.

1791, జనవరి 15 నాటికి పోలాండ్ నాటకరంగానికి వార్సా కేంద్ర బిందువైంది. ఈ సందర్భంగా జూలియన్ ఉర్సిన్ నియామ్ సెవీజ్ పోలాండ్‌దేశ భాషలో స్వతంత్రంగా రచించిన ఆహ్లాద నాటకం ది రిటర్న్ ఆఫ్ ది ఎన్వాయ్‌ని ప్రదర్శించారు. స్వాతంత్రోద్యమంలో భాగంగా 1794, మార్చి 1వ తేదీన నేషనల్ థియేటర్ సంగీత నృత్య రూపకం ఎల్లెజిడ్ మిరాకిల్ ను ప్రదర్శించింది. దీన్ని ఓజ్‌సీక్ బోగస్ లావ్‌స్కీ రచించాడు. కేవలం మూడు ప్రదర్శనలతోనే కదలిక రావడంతో ఈ నాటకాన్ని నిషేధించారు. చాలారోజులు నాటక ప్రదర్శనలు ఆగిపోయాయి.

పోలాండ్ విభజనకు గురైంది. ఆ తరువాత ఆహ్లాద రూపకాలు, విషాదాంత రూపకాలు, కార్నీలీ, రేసీన్, మోలియర్ రచించిన ఆహ్లాద, విషాదాంత రూపకాలు మొట్ట మొదటిసారిగా ప్రదర్శించబడ్డాయిద. క్రమంగా 19వ శతాబ్దం ప్రథమంలో దర్శకత్వానికి ప్రాధాన్యత హెచ్చింది. పోలాండ్ సాహిత్యం నాటకరంగాలలో ఉన్నత ప్రమాణాలకు ప్రాధాన్యత పెరిగింది. కాల్పనిక వస్తువు ప్రదర్శనల్లో ప్రవేశించి కొంతకాలం ప్రదర్శనలకు నోచుకుంది. స్టానిస్‌లా విస్పియాన్‌స్కీ రొమాంటిక్ నాటకరంగంలో ఒక ఒరవడిని సృష్టించాడు. తన ప్రదర్శనల ద్వారా ప్రశ్నించడం ప్రారంభించాడు.

ఆ తరువాత ప్రాపంచిక ఆలోచనలకు తావివ్వకుండా కేవలం పోలాండ్‌దేశ, ప్రజల అభీష్టానికి అనుగుణంగా మికీవిజ్ ది ఫోర్ ఫాదర్స్ ఈవ్, స్లోవాకీ కోర్డియాన్. క్రాసిన్‌స్కీ, అన్ డివైన్ కామెడీ,

విస్పియాన్స్కీ నవంబర్ నైట్ నాటకాలతో పోలాండ్ నాటకరంగం తన ఉనికిని ప్రపంచదేశాలకు చాటింది. పోలాండ్ కాల్పనిక నాటకరంగంలో ఇవి ఉత్తమ నాటకాలుగా పరిగణింపబడ్డాయి. ఈ దశలో అలెగ్జాండర్ కౌంట్ ఫ్రెడ్రో ఆహ్లాద నాటకాలు ఊపందుకున్నాయి. బాగా ప్రజాదరణ పొందాయి. ఈనాటికి కూడా ఆ నాటకాలు ప్రదర్శిస్తున్నారు. సాంఘిక, పేద ప్రజల కథలు, జాతీయ ప్రయోజనాలు ఈ నాటకాల్లోని ప్రత్యేకత. ఆనాడు ప్రదర్శితమైన అన్ని నాటకాలు పోలాండ్ స్వాతంత్రోద్యమానికి ఎంతో దోహదపడ్డాయి.

19వ శతాబ్దం ప్రారంభంలో టాడ్యియూజ్, పావ్లీకోవ్స్కీ, లుడ్విక్ సోన్స్కీ, జోజెఫ్ కోటార్బిన్స్కీ లాంటి సృజనాత్మక దర్శకులు వెలుగులోకి వచ్చి పోలాండ్ నాటకరంగాన్ని నిబద్ధత, ఉత్సుకతలతో ప్రయోగాత్మక నాటకరంగంగా రూపుదిద్దారు. స్టానిస్లా విస్పియాన్స్కీ రచించిన ది వెడ్డింగ్, లిబరేషన్, నవంబర్ నైట్ నాటకాలను కొత్త కోణంలో ప్రదర్శించారు.

1919లో పోలాండ్‌కు స్వాతంత్రం లభించిన తరువాత నాటకరంగం నిలదొక్కుకోవడానికి కొంతకాలం పట్టింది. ఆ తరువాత నాటకరంగ కళాకారులతో యూనియన్ ఆఫ్ పోలాండ్ స్టేజ్ ఆర్టిస్ట్స్ పేరిట ఒక స్వయం కార్యనిర్వాహక సంఘం ఏర్పడింది. కళ, నైతిక విలువలను పెంపొందించే ఉద్దేశంతో కేవలం సేవా దృక్పథంతో జూలియజ్ ఆస్టర్‌వా నాయకత్వంలో కొంతమంది కళాకారులు రీ డ్యూటా (**Reduta**) పేరిట ఒక బృందంగా ఏర్పడ్డారు. స్టీఫాన్ జెరాజ్, మేరియా పొటోకా, జోజెఫ్ వెగ్రిజెన్, జాన్ కుర్నాకోవిజ్, బలెస్ లాలెస్ జిన్ సిన్స్కీ, డాబీస్ లా డెమికి లాంటి గొప్ప నటులతో ఏర్పడిన ఈ బృందం వాస్తవిక నాటకరంగానికి శ్రీకారం చుట్టింది.

స్టానిస్‌లా ఇగాన్సీ విట్ కీవిజ్ (విట్ కసీ) తో అవంత్ గార్డ్ **Avant-Garde** సర్‌రియలిస్ట్ నాటకాలను వాస్తవిక ప్రక్రియలో ప్రదర్శించడం మొదలైంది. ఇతని నాటకాలు పోలాండ్‌లోనే కాదు ప్రపంచ నాటకరంగ చరిత్రలో అతని మరణం తరువాత వెలుగులోకి రావడం విచిత్రంగా అనిపిస్తుంది. కాబ్లర్స్ (**Cobblers**), *గైబాల్ వహాజర్* (**Guybal Wahazar**), *డెయిన్ టీ షేప్స్ అండ్ హెయిరీ ఏప్స్* (**Dainty Shapes and Hairy Apes**), మిస్ టుట్లీ–పుట్లీ (**Miss Tutli-Puttli**) నాటకాలు పోలాండ్ నాటకరంగంలో కొత్త చరిత్ర సృష్టించాయి. అంతేగాక ప్రపంచవ్యాప్తంగా పోలాండ్ నాటకరంగం ఈ నాటకాలతో వెలుగులోకి వచ్చింది.

పోలిష్ నాటకంలో దృశ్యం

1939 సెప్టెంబర్‌లో రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో రష్యావాసులు పోలాండ్‌లోకి ప్రవేశించినపుడు విట్‌కసీ సెప్టెంబర్ 17న ఆత్మహత్య చేసుకున్నాడు. పోలాండ్ నాటకరంగానికి ప్రపంచ గుర్తింపు తెచ్చినవైటోల్డ్ గోంబ్రోవిజ్ అర్జెంటీనాకు వెళ్ళిపోయాడు. పోలాండ్ దేశం ఆక్రమణదారులను ఎదుర్కొనడంలోను, తమ ఉనికిని కాపాడుకోవడంలోను ఉద్యమించి, పోరాటం సలిపింది. ఈ కారణాల వల్ల నాటకరంగం అజ్ఞాతంలోకి వెళ్ళిపోయింది.

ఆ తరువాత దర్శకుడు, సైద్ధాంతికవేత్త బోదాన్ కోర్జి నియోవ్స్కీ నాయకత్వంలో నాటకరంగం కోసం ఒక ప్రత్యేక రహస్య మండలి ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం నాటకరంగ అభివృద్ధికి తిరిగి కృషి ప్రారంభమైంది. ఈ వృత్తికి ఒక నియమావళిని రూపొందించారు. అయితే ఆ నియమావళికి యుద్ధానంతర వాస్తవ పరిస్థితులు కొంతమేరకు అవరోధం కల్పించాయి.

1946లో కథావస్తువు పరంగానూ, ప్రక్రియ పరంగాను కొన్ని ఆంక్షలతో పోలాండ్ నాటకరంగం కొత్తరూపు దాల్చింది. కమ్యూనిస్టులు రంగ ప్రవేశం చేయడంతో అంతకుముందున్న సోషలిస్టు భావాలకు తెరపడి క్రమంగా మరుగున పడిపోయాయి. అయితే కమ్యూనిస్టుల కాలంలో పోలాండ్ నాటకరంగం వికసించిందనే చెప్పాలి. వీరి కాలంలో అంతకుముందున్న ఆంక్షలకు స్వస్తి పలకడం జరిగి, మేధో మథనం జరిగి, బహుళార్థక ప్రయోజనం కలిగినభావాలు, కథలు, శైలులు, ప్రదర్శనా

పద్ధతులు, నూతన మార్పులు, పరివర్తనా సంబంధిత విషయాలతో పోలాండు నాటకరంగం ఉత్సాహంతో ఉరకలేసింది. పోలాండ్ నాటకరంగం ఎగుమతి నాటకరంగంగా పిలువబడింది. కాంటర్, టోమాస్ జ్యూస్కీ, గ్రోటోవ్స్కీ, మోజెక్, గోంబ్రోవిజ్, విట్‌కేసీల కృషితో పోలాండ్ నాటకరంగం ప్రపంచ నాటకరంగ చరిత్రలో స్థానం సంపాదించుకొంది.

విద్యార్థి నాటకరంగం:

1950-60 మధ్యకాలంలో పోలాండ్ సాంస్కృతిక వికాసంలో భాగంగా బిమ్-బామ్ థియేటర్ డాన్స్కీ నగరంలోను, స్టూడెంట్ సెటెయిర్‌కల్ థియేటర్ వార్సాలోను వెలిశాయి. తిరిగి 1970లో రెండవసారి విద్యార్థి నాటకరంగం వికసించింది. అగ్నీజ్‌స్కా ఒసికా, ఆండ్రెజ్ జారేకీ బిస్‌జెక్ సైబూల్‌స్కీ, బోగుమిల్ కోబీలా విద్యార్థి నాటకరంగ ఆవిర్భావానికి ఆద్యులుగా చెప్పుకోవచ్చు. ది థియేటర్ ఆఫ్ ది ఎయిత్ డే, ది థియేటర్ ఆఫ్ ది హండ్రెడ్, ది ఎయిత్ డే విద్యార్థి నాటక బృందాలు విశేషంగా కృషి చేశాయి.

పోలాండ్ నాటకరంగ ఉనికి 1835 నుంచి మనకు కనిపిస్తుంది. కౌంటీ జిగ్మంట్ క్రాసిన్‌స్కీ కవితాత్మక ధోరణిలో రాసిన ది ప్రొఫేన్ కామెడీ పోలాండ్ భాషలో వెలువడిన సాహిత్య ప్రక్రియల్లో అత్యుత్తమమైనదిగా భావిస్తారు. దీర్ఘకాలిక ప్రేమ వైఫల్యం ప్రధాన అంశంగా కనబడినప్పటికీ, పోలాండ్ ప్రజల అగ్రవర్ణాల వారికి, నిమ్నవర్గాల వారికి మధ్య వివాదం అంతర్గత ఇతివృత్తంగా కనబడుతుందీ నాటకంలో.

యుగోస్లేవియా, రొమేనియా, బల్గేరియా నాటకరంగాల ప్రభావంతో పోలాండునాటకరంగం కొంతఆధునికతను సంతరించుకొని, క్రాసిన్‌స్కీ మరికొన్ని రచనలు చేశాడు. ఆ తరువాత రోస్ట్ వోరోవ్స్కీ రచించిన జూదాస్, కలిగుల చారిత్రక కవితాత్మక కళాఖండాలుగా నిలిచాయి. అప్పటివరకూ చారిత్రక ఇతివృత్తాలకు ప్రాధాన్యమిచ్చిన వోరోవ్స్కీ, వాస్తవిక నాటకాన్ని నీతిదాయక నాటకత్రయం పేరిట ఒకరైతు జీవితం ఆధారంగా ది సర్‌ప్రైజ్, మూవింగ్ డే మరియు ఎట్ ది గోల్ నాటకాలను ప్రదర్శించాడు. పోలాండ్ నాటకరంగ చరిత్రలో వాస్తవిక రచనలు ఇతనితోనే ప్రారంభమయ్యాయి. ఆ తరువాత మానసిక చిత్రణకు ప్రాధాన్యమిస్తూ, జోఫ్యా నల్ కోవ్‌స్కా *డోం కోబియట్* (హౌస్ ఆఫ్ ఉమెన్), ది డే ఆఫ్ హిజ్ రిటర్న్ నాటకాల్ని రాశాడు. అంటే చారిత్రక నేపథ్యం ఇతివృత్తాల నుంచి సామాజిక ఇతివృత్తాల దిశగా సాగింది పోలాండ్ నాటకరంగం. ది డే ఆఫ్ రిటర్న్ పైశాచిక ప్రవృత్తి కల్గిన సైనికుడు, ఒక సాధారణ ఖైదీకి మధ్య జరిగిన సంఘటనల ఆధారంగా వెలువడిన విషాద రూపకం. ఆ తరువాత ఆ దేశఆర్థికసంక్షోభం, ఆర్థిక అసమానతలు, నియంతృత్వ ధోరణులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల జులుం కారణాల వల్ల జాతి యావత్తు నిర్వీర్యమై కుప్పకూలిపోయింది. ఈ పరిస్థితుల్లో పోలాండ్ నాటకరంగంలో అడపాదడపా సాంఘిక నాటకాలు చారిత్రక సంఘటన సమ్మిళితంగా ప్రదర్శించబడ్డాయి. ఈ పరిస్థితుల్లో పోలాండ్ నాటకరంగం బానిస నాటకరంగంగా (Slavic Theatre) గా పిలువబడింది. ఆనాటి నుంచి పోలాండ్ నాటకరంగం పూర్తిగా మరుగున పడిపోయిందని చెప్పవచ్చు. అయితే 1939లో మారియన్ హేమర్ రచించి ప్రదర్శించిన ఫూర్ మెన్స్ మిరా కిల్‌తో తిరిగి ప్రపంచ నాటకరంగ చరిత్రలో పోలిష్‌నాటకరంగం తళుక్కున మెరిసింది. ఆత్మప్రబోధక అంశాలకు ప్రాధాన్యతనిస్తూ, సామాజిక ఇతివృత్తంతో కూడిన ఈ నాటకం విశేషాదరణ పొందింది. ఆ తరువాత గ్రోటోవ్స్కీ ఆగమనం వరకూ పోలాండ్ నాటకరంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కాదుగదా కనీసం ప్రస్తావన కూడా లేదు.

పోలాండ్ జ్యూయిష్ స్టేట్ థియేటర్ :

1948 ప్రాంతంలో పోలాండ్‌లో పోలాండ్ జ్యూయిష్ స్టేట్ థియేటర్ పేరిట ఒక నాటకసమాజం వార్సాలో ఇడా కమిన్‌స్కాతో ప్రారంభించబడింది. ఈ సమాజం1953 వరకూ ఆ దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలిస్తూ, ఆ తరువాత లాడ్జ్‌కు వెళ్ళి, అక్కడ కొంతకాలం ప్రదర్శనలిచ్చి, రోక్లాకు వచ్చి అక్కడ కొంతకాలం ప్రదర్శనలిచ్చి, తిరిగి స్వస్థలమైన వార్సాకు వచ్చి స్థిరపడింది. ఒక నటమండలిని స్థాపించి, ఇద్దిష్, యూరోపియన్ ప్రఖ్యాత నాటకాలను దేశమంతటా ప్రదర్శించింది. 1956లో హాలెండ్, బెల్జియం, ఫ్రాన్స్ దేశాలు, 1959లో ఇజ్రాయిల్ పర్యటించి, ప్రదర్శనలిచ్చిన ఈ సమాజ నటమండలి ఆ దేశంలో జ్యూయిష్ జనాభా తగ్గిపోవడంతో తన మనుగడ కొనసాగించలేకపోయింది.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో పాలాండ్ నాటకరంగం అధునాతనంగా, సాంకేతికపరంగా అభివృద్ధిచెందింది. 1945 తరువాత పోలాండ్ నాటకరంగం సోవియట్ ఆధిపత్యంలోకి వెళ్ళింది. ఆనాడు నాటకరంగ కార్యకలాపాలపై ఉన్న ఆంక్షల్ని క్రమంగా తొలగించుకుంటూ కార్యకలాపాలను కొనసాగించిన తూర్పు యూరోపియన్ దేశాలలో పోలాండ్ మొట్టమొదటగా నిలిచింది. అయినప్పటికీ 1956 నుండి 1960

వరకూ పోలాండ్ నాటకరంగంపై సోవియట్ ప్రభుత్వం ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఒత్తిడి తెస్తూనే ఉంది. ఈ మధ్యకాలంలో అనిబద్ధవాదం పోలాండ్ నాటకరంగంలో బలంగా చోటుచేసుకుంది. ఈ కాలంలో స్టానిస్‌లా ఇగ్నసీ విట్ కీవిజ్ (1885–1939) రాసిన ది వాటర్ హెన్, ది మదర్, ది మేడ్ మేన్ అండ్ ది నన్ అవాన్ గార్డే (Avant Garde) నాటకాలుగా బహుళ ప్రచారం పొందాయి. రెండు ప్రపంచయుద్ధాల మధ్య కాలంలో అధివాస్తవిక (సర్‌రియలిస్టిక్) నాటకకర్తగా పేరు పొందిన ఈయనను ఎవ్వరూ పట్టించుకోక పోవడం విచిత్రం. స్టానిస్‌లా ప్రదర్శనలకు తోడుగా శామ్యూల్ బెకెట్ రచించిన వెయిటింగ్ ఫర్ గోడో నాటకంతో అనిబద్ధ రూపకాలకు ఆదరణ పెరిగింది. తరువాత టాడ్యూజ్ రోజ్ విజ్ రాసిన ది వార్డ్ ఇండెక్స్ (The Vard Index) (1960), ది లెఫ్ట్ హోమ్ (The left Home) (1964) నాటకాలు తరువాత రచయితలకు స్ఫూర్తినిచ్చాయి. ఈయన జీవితంలో మన అవసరాలు తీర్చే తప్పనిసరి సాధనాలు, అవకాశాలు ఎన్ని ఉన్నా, కోల్పోయిన దాని గురించి వెతుక్కోవడం, వాటికి కారణాలు కనుగొనే అన్వేషణ ప్రధానమైన రచనలు చేశాడు. ది లాస్కూన్ గ్రూఫ్ (The Lascoon Group) (1974), వైట్ మ్యారేజ్ (White Marriage) కూడా ఇతని రచనలే. ఇవి కూడా ఇదే కోవకు చెందుతాయి. పోలాండ్ నాటకరంగం యావత్తు వినమ్రంగా ఇతన్ని గౌరవించింది.

అయితే, సాల్వవెంర్ మ్రోజెక్ (Salvomir Mrozek) వ్యంగ్యాత్మక సంఘటనల ఆధారంగా రాసిన ది పోలీస్ (1958) తో రోజ్‌విర్ ప్రభతగ్గింది. మోజెక్ (Mrozek) అసంఖ్యాకంగా రచనలు చేసినా, ఆనాటి పోలీస్ వ్యవస్థలోని లోపాలను కళ్ళకు కట్టినట్టుగా చిత్రించిన 'ది పోలీస్' అతనికెంతో పేరు తెచ్చింది. ఆ తరువాత 1965లో రాసిన టాంగో నాటకంతో యూరప్ అంతటా మార్మోగిపోయాడు. మానవ విలువలు, సిద్ధాంతాలను ఖాతరు చేయకుండా, అధికారంలోకి రావాలని పాకులాడడం వంటి దౌష్ట్యాలకు ప్రతిరూపం ఈ నాటకం. ఆ తరువాత 1971లో ఆల్ హ్యాపీ ఈవెంట్, ది ఎమిగ్రిస్ రచనలు కూడా ప్రజాదరణ పొందాయి. ది ఎమిగ్రిస్ కేవలం రెండు పాత్రలతో నడిచే నాటకం. వామపక్ష మేధావి – సాధారణ కార్మికుడు వారి ఉనికిని కాపాడుకోవడం, ఒకరికొకరు త్యాగం చేసుకోవడం ఈ నాటక సారాంశం. 1975లో రాసిన స్లాటర్ హౌస్ (Slaughter house) లో కళపట్ల విశ్వాసం కోల్పోయి, కొత్త నిజాల్ని పరిశోధించే క్రమంలో ఆత్మహత్యకు పాల్పడటం దీని ఇతివృత్తం. అయితే రచనకంటే ప్రదర్శనాపరంగా ఈ నాటకం పోలాండ్ అంతా విజయఢంకా మ్రోగించింది.

పోలాండ్ నాటకరంగంలో ఇర్విన్ ఏక్సర్, (Erwin Axer) కోన్రాడ్ స్వినర్ స్కీ, (Konrad Swinarski) బహుళ ప్రజాదరణ పొందిన దర్శకులు. 1975 వరకు అంటే వారు మరణించేవరకు దర్వకత్వం వహిస్తూనే ఉన్నారు. పోలాండ్ నాటకాలే కాక, విదేశీ నాటకాలకు కూడా దర్శకత్వం వహించి, అద్భుతంగా ప్రదర్శించి పోలాండ్ నాటక చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకొన్నారు.

హెన్రిక్‌తో మాస్‌జెవెస్కీ (Henryk Tomaszewski) పాంటోమైమ్ థియేటర్ ద్వారా స్వదేశంలోను, విదేశాల్లోనూ పేరొందిన మరో దర్శకుడు.

అంతర్జాతీయ స్థాయిలో విశేషఖ్యాతి పొందిన జెర్జీగ్రొటోవ్‌స్కీ (Jerzy Grotowski) రంగప్రవేశంతో అంతకుముందున్న పోలాండ్ నాటకరంగ చరిత్రంతా బోసిపోయింది. ఓపోల్‌లో 1959లో పోలిష్ లేబరోటరీ థియేటర్ స్థాపించి, దానికి దర్శకుడిగా బాధ్యతలు వహిస్తూ, తన ప్రదర్శనల ద్వారా మరో చరిత్ర సృష్టించాడు. మాస్కోలోని సెటట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌లో డిగ్రీ చదివిన గ్రోటోవ్‌స్కీ ఆధ్వర్యంలో 1965లో లేబరోటరీ థియేటర్ వ్రోక్లా (Wroclaw) (Breslen) కు తరలివెళ్ళి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ ఏక్టింగ్ గా రూపాంతరం చెందింది. క్రాకో అడ్వాన్స్‌డ్ ఏక్టింగ్ స్కూల్‌లో నాటకరంగ శిక్షణ పొందిన పొందినప్పటికీ 1965 వరకు నామమాత్రంగా పేరున్న గ్రోటోవ్‌స్కీ 1966 నాటికే తన మొదటి ప్రదర్శన ద్వారానే దేశ, విదేశాల్లో ప్రదర్శనలిచ్చి ఉత్తమ దర్శకుడిగా వాసికెక్కాడు. తన నట సిద్ధాంతాన్ని దేశ, విదేశాల్లో బోధించాడు. పలు విదేశీ నాటక సమాజాలకు దర్శకత్వం వహించాడు. Towards a Poor Theatre పేరుతో తాను చేసిన ప్రయోగాల్నీ, తన అనుభవాల్నీ గురించి ఒక గ్రంథం రచించి, 1968లో ప్రచురించాడు.

అంతర్జాతీయ ఆమోదం, గుర్తింపు పొందిన తదుపరి, గ్రోటోవ్‌స్కీ తన పంథాను మార్చుకోవడం ప్రారంభించాడు. అతని రంగస్థల కార్యకలాపాలతో రెండు దశలుగా వర్గీకరించవచ్చు. అవి 1960 దశకంలో చూసిన కృషి, 1970 దశకంలో చేసిన ప్రయోగాలు మొదటి దశకంలో ప్రత్యేకించి చలనచిత్రం, టెలివిజన్ మాధ్యమాల స్ఫూర్తితో నాటకరంగం రూపుదిద్దుకొందని భావించి, నాటకరంగ మూలసూత్రాలను ఉల్లంఘించి, కొత్త సిద్ధాంతం పూర్ థియేటర్ ను పరిచయం చేశాడు. అప్పటి నుంచి

నటుడితో సృష్టించబడని దృశ్య సంపదను, వాటికి కావలసిన సామగ్రినీ వ్యర్థంగా భావించాడు. తన ప్రదర్శనల్లో మేకప్, దుస్తులును నిషేధించాడు. సంగీతాన్ని నటులే సమకూర్చాలి. సంప్రదాయ సీనరిలకు స్వస్తి చెప్పాడు. లభ్యమయ్యే వస్తు సామగ్రిని కూడా కచ్చితంగా ఒక ప్రయోజనం కోసమే కాకుండా పలు విధాలుగా ఉపయోగించాడు. ప్రొసీనియం ఆర్చ్‌ని తీసివేసి, విశాలమైనహాలులోప్రదర్శనకుసౌలభ్యంగా ఉండే వెసులు బాటుతనాన్ని కల్పించాడు. అంటే స్థిరంగా ఉండే గోడలు, కర్టెన్లు లేకుండా చేశాడు. ఈవిధంగా నాటకీయతకు మూలమైన తన నటుడ్ని ప్రదర్శక 'వనరు'గా ఉపయోగించుకున్నాడు. ఇదే పూర్ థియేటర్ సారాంశం.

ఈ కాలంలో నటుడికి పరిపూర్ణమైన శిక్షణ అవసరమని అభిప్రాయపడి, ఆ అభిప్రాయాన్ని సాకారం చేసేందుకు – స్టానిస్లవ్స్కీ, యోగా, మేయర్‌హోల్డ్ వఖ్తంఘొవ్, డెల్‌సార్త్రే, డల్లిన్, మొదలైనవారి నటనాపరమైన, ప్రదర్శనపరమైన సిద్ధాంతాలను అధ్యయనం చేసి తనదైన పూర్ థియేటర్ సిద్ధాంతాన్ని అమలు చేయడం ప్రారంభించాడు. కొలూవస్కీ భారతదేశాన్ని దర్శించి 'కథాకళి'లో ఆంగికాభినయాన్ని చూసి ముగ్ధుడై తన నటశిక్షణలో ఆ పద్ధతుల్ని ఇముడ్చుకున్నాడు. నటుడు వాచికపరంగా, శారీరకపరంగా పూర్తి నియంత్రణ కావాలని శాసించాడు. పాత్రలకనుగుణంగా అప్పటికప్పుడు నటుడు ఈ రెండు అంశాలపరంగా మారిపోయే వెసులుబాటుతనం కావాలన్నాడు. నటులు తమకు తాముగా తమ ప్రతిభను ప్రదర్శించుకోవడానికి పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. ప్రేక్షకుల ఊహాశక్తికి దూరంగా లేదా విరుద్ధంగా నటులు తమదైన భావవ్యక్తీకరణను సృష్టించాలన్నాడు. ఈ మొదటి దశలో నాటక ప్రదర్శనలను ఒక సంద్రాయ, భక్తిపరమైన పూజా విధానంగా భావించాడు గ్రోటోవ్స్కీ. ప్రేక్షకులను ప్రదర్శనల్లో భాగస్వాములుగా చేశాడు. ఆత్మప్రబోధానికి ప్రతీకలుగా ప్రేక్షకులను భావించాడు.

ప్రతి ప్రదర్శనకూ ప్రేక్షకుల మానసిక స్పందన ఎలా ఉంటుందో ఊహించి తదనుగుణంగా ప్రేక్షకులకు, నటులకు మధ్య ఒకరకమైన మానసిక దూరాన్ని సృష్టించడానికి ప్రయత్నించాడు. అంటే వాళ్ళు ఆలోచించడానికి అవకాశం కల్పించాడు. ప్రదర్శనలను ఆవిధంగా మలచేవాడు. సమకాలీన సార్వజనీనత ఉట్టిపడేలా, సర్వజనామోదమైన రచనల కోసం అన్వేషించాడు. కొందరు విమర్శకులు ఇతని ప్రదర్శనలు అసమగ్రంగా ఉన్నాయనీ, ఉద్రిక్తతలు సృష్టించేవిగా ఉన్నాయనీ విమర్శించాడు.

ఇక రెండవ దశ చూస్తే 1970 దశకంలో సాంకేతికపరమైన అంశాల్లో పరిపూర్ణత సాధించిన గ్రోటోవ్స్కీ సరికొత్త ప్రదర్శనలు పరిచయం చేయాలని నిర్ణయించాడు. ఎటువంటి అనుభవం లేని ఐదుగురు యువకులతో ఒక ప్రత్యేక ప్రణాళిక చేపట్టి, తిరిగి పాత నటులతో ఆరు ఉపబృందాలను నియమించి, మనిషి–తన శరీరం, ఊహాశక్తి, సహజ ప్రపంచం ఇతర మానవీయ సంబంధమైన అంశాలపై దృష్టి సారిస్తూ ప్రదర్శనలను ప్రారంభించాడు. 1975లో ప్రపంచం నలుమూలల నుంచి సుమారు ఐదు వందలమంది నాటకరంగానికి చెందిన వ్యక్తులు గ్రోటోవ్స్కీ రోక్లాలో నిర్వహించిన 'రీసెర్చ్ యూనివర్సిటీ' కార్యక్రమానికి హాజరయ్యారు. పీటర్‌బ్రూక్, ఆండ్రీగ్రెగోరి, బాదల్‌సర్కార్‌తో పాటుగా పలువురు నాటకరంగ విద్యార్థులు, అధ్యాపకులు, పాత్రికేయులు, దర్శకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆక్రో పోలీస్, ఎల్ ప్రిన్సెస్ కాన్‌స్టేంటి, అపోకాపిసిస్ కం ఫిగురిస్, డాక్టర్ ఫాస్టస్, ది కాన్‌స్టాంట్ ప్రిన్స్ నాటకాలు గ్రోటోవ్స్కీని ప్రపంచ నాటకరంగ చరిత్ర పుటల్లో నిలిపాయి.

1968లో పోలాండ్‌లో నాటకరంగం సంక్షోభానికి గురైంది. చెకోస్లోవేకియా స్వేచ్ఛా ఉద్యమానికి భంగం కలిగించే కార్యక్రమాల్లో పోలాండ్ ప్రజలు పాల్గనడం పట్ల నాటకరంగ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిఫలంగా పలువురు విమర్శకులు అజ్ఞాతంలోకి వెళ్ళవలసివచ్చింది. మోజెక్ నాటకాల్ని నిషేధించారు. ఈపరిస్థితులు 1970 నాటికిక్రమంగా తగ్గుముఖంపట్టాయి. పలుపాతనాటకశాలల్ని ఆధునీకరించారు. మరికొన్ని కొత్త ప్రదర్శనశాలలు వెలిశాయి. మ్రోజెక్ నాటకాలు తిరిగి ప్రదర్శించబడ్డాయి. 74, 18 సంగీత, 25 బమ్మలాట కంపెనీలు చురుగ్గా కార్యక్రమాలు కొనసాగించాయి. 1970–74 మధ్యకాలంలో పోలెండ్ ప్రభుత్వం నాటకరంగానికి సబ్సిడీలు, బహుమతులు ప్రకటించింది. సమకాలీన జీవితానికి, సృజనాత్మక ప్రదర్శనలకు, కళాసృష్టికీ పెద్దపీట వేసింది. దీంతో పోలెండ్ నాటకరంగం ఊపందుకుంది. దీనికి ఉదాహరణ 1975లో నాలుగు వందల వివిధ ప్రదర్శనలను 90 లక్షల ప్రేక్షకులకు చూపగలిగారు.

పోలాండ్ నాటకరంగం – ప్రముఖులు

టాడ్యూజ్ కేంటర్ థియేటర్:

టాడ్యూజ్‌కేంటర్ పోలాండ్ నాటకరంగానికి తొలి గురువుగా కీర్తికెక్కాడు. 20వ శతాబ్దంలో గొప్ప కళాకారుడిగా పేరు పొందాడు. చిత్రకారుడు, స్టేజి డిజైనర్, నటుడు, దర్శకుడు, 1933–39 ప్రాంతంలో అవాన్ గార్డే నాటకాల ఆలోచనా విధానాలకు విస్తృత ప్రచారం కల్పించినవాడు. విట్‌కేసీ రాసిన సెపియా, ఇన్ ఏ స్మాల్ మేనర్, డెయిన్ టీ షేప్స్ అండ్ హెయిరీ ఏప్స్ నాటకాలను ఏ థియేటర్ ఆఫ్ డెత్ సిద్ధాంతం ఆధారంగా తనదైన శైలిలో ప్రదర్శించి ఖ్యాతి గడించాడు. తాను ప్రదర్శించిన డెడ్‌క్లాస్ నాటకాన్ని చలనచిత్రంగా రూపొందిం చారు. కాంటర్ ప్రదర్శనలు సంపూర్ణ వాస్తవికత, పరిపూర్ణమైన అర్థంతో కూడుకొని, భావప్రకటనకు నాటకరంగాన్ని మించిన శక్తి మరొకటి లేదని నిరూపిస్తాయి. మరణం లేమీ, రోజువారి జీవితం, మనో వికాస అనుభవాలను కాంటర్ కొత్త దృక్పథంతో నిర్వచించాడు. యుగోస్లోవియా అసమగ్రత, బాల్కాన్ జిన్స్ విడుదల, బోస్నియా యుద్ధం వీటన్నింటినీ తాను ప్రత్యక్షంగా చూడనప్పటికీ తన ప్రదర్శనల్లో ఊహించి చెప్పగలిగిన దూర దృష్టిగల గొప్ప నాటకరంగ పండితుడిగా పోలిష్ నాటకరంగ చరిత్రలో నిలిచిపోయాడు.

జెర్జీ గ్రోటోవ్‌స్కీ థియేటర్ :

గ్రోటోవ్‌స్కీ కూడా పోలాండ్ నాటకరంగానికి గురువు. అంత కంటే గొప్పవాడు. ప్రపంచమంతటాగుర్తింపు తెచ్చుకున్నవాడు. కాంటర్‌మాదిరిగాకాకుండా తనకు అనుచరులు, ఒక శిక్షణాలయం, రంగస్థల కళల విద్యార్థులు, అభిమానులు, ఒక ప్రత్యేక సిద్ధాంతం, ప్రత్యేక వ్యక్తులతో కూడిన తనదైనఒక సమాజం కలిగినవాడు గ్రోటోవ్‌స్కీ. ఎందరో దర్శకులకు స్ఫూర్తినిచ్చినవాడు. వారంతా గ్రోటోవ్‌స్కీ నుంచి నేర్చుకున్నవారే. తాను నమ్మిన సిద్ధాంతాన్ని తనదైన చిన్న బృందంతో ప్రదర్శనలిస్తూ నాటక రంగపండితుడిస్థాయికి ఎదిగాడు. కొన్ని సంవత్సరాలు విదేశీనాటకరంగంలో గడిపినవాడు. ప్రేక్షకులతో ప్రయోగాలు ప్రారంభించినవాడు. రంగస్థలం – ప్రేక్షకుల మధ్య ఉన్న దూరాన్ని తొలగించినవాడు. ఓపోల్‌లో 13 వరుసలలో నాటకశాలను నిర్మించినవాడు. నాటక సాహిత్యం ప్రజలకు చేరాలంటే వారుప్రదర్శనలో పాలుపంచుకోవాలి అని భావించి ప్రదర్శనలు నిర్వహించినవాడు. 1970లో భారతదేశం, చైనా పర్యటించి అక్కడ నాటకరంగాన్ని అధ్యయనంచేశాడు. అంతకుముందున్న పోలాండ్ నాటకరంగాన్ని పూర్తిగా మార్చివేసినవాడు. ఇతని కృషి తరువాత పుటల్లో తెలుసుకుందాం.

హెన్రీ టమాస్ జ్యూస్కీ థియేటర్ :

దీనిని 'రొక్లా థియేటర్ ఆఫ్ ది పాంటోమైమ్' అని కూడా పిలిచేవారు. శారీరక భాషకు ప్రాధాన్యం ఇస్తూ, వేదాంత, తాత్విక, ధోరణితో అధునాతనమైన సీరియస్ ప్రదర్శనలిచ్చి తనదైన శైలిని నిరూపించుకున్నాడు. *గిల్‌గమేష్, ఫాస్టర్స్ డిపార్చర్, హామ్లెట్–* ఐరన్ అండ్ మార్నింగ్, ప్రోడిగాల్ సన్ ఇతనికి బాగా పేరు తీసుకొచ్చిన ప్రదర్శనలు.

జోజెఫ్ జాజ్‌నా థియేటర్:

వేదాంత, తాత్త్విక, కళాత్మక నాటక విలువలకు ప్రాధాన్య మిచ్చాడు. దృశ్యం, భావనాశక్తి ప్రదర్శనల్లో అత్యంత శక్తివంతంగా చోటుచేసుకోవాలనినమ్మినవాడు. నటులు కాకుండా దృశ్యాలే మాట్లాడాలని తన శైలిలో ప్రదర్శనలిచ్చాడు. తన ప్రదర్శనలు కళాత్మకంగా ఉండి ప్రేక్షకులను రెచ్చగొట్టేవిధంగా ఉండేవి.

స్లావోమిక్ మోజెక్ థియేటర్ :

1960 నాటి కాలంలో సమకాలీన రచయితగా పేరు పొందాడు. సాంఘిక ప్రవర్తనలో యాంత్రీకరణ గురించి అధ్యయనం చేశాడు. 1964లో టాంగో ప్రదర్శన ద్వారా దేశాలన్నీ చుట్టి వచ్చాడు. పోలాండ్ నాటక రచనా ప్రక్రియలో మకుటంలేని మహారాజుగా చెలామణి అయ్యాడు.

పోలాండ్ నాటకరంగంలో ప్రస్తుతం 60 నాటక కంపెనీలు ప్రదర్శనలిస్తున్నాయి. దాదాపు ఆరు వేల మంది సుశిక్షితులైన నటులున్నారు. ఆరు నాటక విద్యాసంస్థలున్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వం సబ్సిడీలు కల్పించింది. జెర్జి గ్రెగోర్ జ్యూయెస్కీ (నేషనల్ థియేటర్ దర్శకుడు), కాజిమీర్జ్ డెస్‌మెక్, మేసీస్ ఎంగ్‌లర్ట్, క్రిస్టియన్ లూపా, జెర్జి జారోకీ, ఎర్విన్ యాక్సర్ దర్శకులుగా పేరొందగా, గుస్తాన్ హోలోబెక్, ఆంద్రెజ్ లపీకీ, జాన్ నోవీకీ, అన్నాడమ్నా, అన్నాపాలోని, క్రిస్టినా జాండా ప్రముఖ నటులుగా పేరు పొందారు.

క్రాకోలోని ఓల్డ్ థియేటర్, రొక్లాలోని పోలాండ్ థియేటర్, వార్సాలోని కాన్‌టెంపరరీ థియేటర్, నేషనల్ థియేటర్, పావ్‌జెస్నీ థియేటర్, పోలాండ్ అండ్ అత్నెన్యూమ్ థియేటర్‌లు చురుగ్గా పనిచేస్తున్నాయి.

ప్ర.రె.

ఐర్లాండ్ నాటకరంగం

ఐర్లాండ్‌లో స్వతంత్ర ప్రతిపత్తిగల నాటకరంగం ఆవిర్భవించడానికి పందొమ్మిదో శతాబ్దం వరకు ఆగాల్సి వచ్చింది. నిజానికి 17వ శతాబ్దం నుంచీ డబ్లిన్ ఇంగ్లీషు నాటకాలకు కేంద్రంగా ఉన్నప్పటికీ, దేశీయ నాటకాలను అభివృద్ధిపరిచే ప్రయత్నాలేవీ చేయకపోవటంపెద్దఆటంకంగానిలిచింది. ఐర్లాండ్ ప్రజల్లో జాతీయతాభావం వేళ్ళూనుకొనే వరకూ స్వదేశీ నాటకానికి అంకురార్పణ జరగలేదు.

1898లో ఐరిష్ భాషను, సంస్కృతిని పరిరక్షించే దిశలో తొలి ప్రయత్నం జరిగింది. 'ఐర్లాండ్ సాహిత్య రంగస్థలం' (Irish Literary Theatre) అనే పేరుతో డబ్లిన్‌లో ఒక సంస్థ రూపుదిద్దుకుంది. విలియమ్ బట్లర్ ఈట్స్ (1865–1939), లేడిఅగస్టాగ్రెగరి(1863–1935),జార్జిమూర్(1853–1933), ఎడ్వర్డ్ మార్టిన్ (1859–1923) ఈ సంస్థ వ్యవస్థాపకులు. 1899–1902 మధ్యకాలంలో సుమారు ఏడు నాటికలను ఈ థియేటర్ ప్రదర్శించి నాటకానికి అనువైన వాతావరణాన్ని సృష్టించి, రంగస్థలానికి కావలసిన ప్రేరణను కలిగించటంలో సఫలీకృతమైంది. ఐర్లాండ్ నాటక వికాసానికి అది తొలిమెట్టు. ఒక విధంగా ఐర్లాండ్ సాంస్కృతిక పునరుజ్జీవనానికి అదే నాంది పలికింది. అయితే 'ఐర్లాండ్ సాహిత్య రంగస్థలం' ఏర్పడక పూర్వం ఐర్లాండ్‌లో సాహిత్యం ఉనికి అసలేలేదని అర్థం కాదు. లిఖిత సాహిత్యం క్రీ.శ. 6వ శతాబ్దం నుంచి ఉన్నట్టు ఆధారాలున్నాయి. ఆ సాహిత్యం దేవతాస్తుతికి, వీరగాథల వర్ణనకు పరిమితమై పద్యరూపంలో, గేయరూపంలో ఉండేది. ఐర్లాండ్ బ్రిటిష్ పాలకుల ఆధిపత్యంలో ఉండిపోవటం వల్ల ఐర్లాండ్ (గైలిక్) భాషకు తగిన ఆదరణ కొరవడింది. అందువల్ల ఐర్లాండ్ భాషలో ప్రామాణిక రచనలేవీ వెలువడలేదు. 'ఐర్లాండ్ లిటరరీ థియేటర్' పటిష్ఠమైన కార్యాచరణకు పూనుకొని నాటకరంగంలో అపూర్వమైన మార్పులకు వాకిళ్ళు తెరచింది. ఈట్స్ రచించిన *ది కౌంటెస్ కేథలీన్* (The Countess Cathleen) నాటకాన్ని, మార్టిన్ రాసిన *ది హీథర్ ఫీల్డ్*(The Heather Field) నాటకాన్ని తొలిసారి ప్రదర్శించటంతో థియేటర్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. అప్పటికి నాటక ప్రదర్శన సమర్థవంతంగా ప్రదర్శించగల నాటక సంస్థలేవీ లేనందువల్ల ఆ రెండు నాటకాలను ఇంగ్లీషు నటులే ప్రదర్శించారు. 1900–1901 మధ్యకాలంలో ప్రదర్శించబడిన మరికొన్ని నాటకాల్లో కూడా ఇంగ్లీషు నటులనే ఆశ్రయించవలసి వచ్చింది. 1902లో ఈ పరిస్థితిలో కొంత మార్పొచ్చింది. ఫ్రాంక్, విలియమ్ జి.ఫే అనే నాటకాభిమానుల చొరవతో ఐరిష్ జాతీయ నాటక రంగ సంస్థ (The Irish National Theatre Society) ఏర్పాటైంది. ఔత్సాహిక నటులను చేరదీసి వారికి శిక్షణ ఇచ్చి లండన్‌లో నాటక ప్రదర్శనలు ఇచ్చారు. ఆ నాటకాలను చూసిన లండన్ పౌరులు ఎంతో మెచ్చుకొని ప్రశంసలు కురిపించారు. ఆ ప్రదర్శనలు చూసి ఆకర్షితురాలైన మిస్ ఎ.ఎఫ్. హార్నియమన్ వారికి ఆర్థికసహాయం చేసి ప్రోత్సహించింది. డబ్లిన్‌లో మెకానిక్స్ ఇన్‌స్టిట్యూట్‌ని కొనుగోలు చేసి 1904లో దానిని ఆబీ థియేటర్ గా నామకరణం చేసింది. ఆ థియేటర్‌ను ఉచితంగా వాడుకోవచ్చని చెప్పింది. అంతేకాదు ప్రతి సంవత్సరం ఆబీ థియేటర్ నిర్వహణ కోసం కొంత సబ్సిడీని కూడా ఇవ్వసాగింది.

ఆబీ థియేటర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ, దాని పక్షాన ప్రదర్శనలివ్వడానికి నాటకాలు రాసిన వారిలో ఈట్స్, లేడీగ్రిగరీ, జార్జిమూర్, మార్టిన్, సీన్ ఒకాసీ ముఖ్యులు. వీరి కృషి ఫలితంగానే ఆబీ థియేటర్ ప్రపంచఖ్యాతి గడించింది. ప్రపంచ నాటకరంగంలో ఐర్లాండ్ నాటకరంగానికి గుర్తింపు లభించింది. ఐర్లాండ్ సాంస్కృతిక వికాసానికి చేయూతనివ్వగల రచయితలను ప్రోత్సహించి వెలుగులోకి తీసుకొని రావటమే ఆబీథియేటర్ ప్రధాన లక్ష్యం. ఆబీ థియేటర్ కోసం సుమారు 30 నాటకాలు రచించి, వాటిని విజయవంతంగా ప్రదర్శింపజేసి థియేటర్ అభ్యున్నతి కోసం అత్యంత శ్రద్ధాసక్తులు కనబరచిన రచయిత్రి లేడీగ్రిగరీ. ఈమె రచనలు చేయటమే కాక నాటకాలకు దర్శకత్వం కూడా వహించింది. జానపద కథలను, వీరగాథలను, చరిత్రలను గైలిక్‌భాషలోరచించి అనేక సంపుటాలను వెలువరించింది. అసంఖ్యాకంగా అనువాదాలు కూడా చేసింది. గ్రామీణ ప్రజల సుఖదుఃఖాలు ప్రతిఫలించే నాటకాలు రాసింది. వాటిలో స్ప్రెడింగ్ ది న్యూస్ (1904), ది రైజింగ్ ఆఫ్ ది మూడ్ (1906), ది గోల్ గేట్ (1906), ది వర్క్ హౌజ్ వార్డ్ (1908) నాటకాలు గ్రిగరీకి పేరుతెచ్చాయి. ఆమె రచించిన సుఖాంత నాటకాలు ఈట్స్ వంటి ప్రముఖ రచయితల ప్రశంసలు అందుకున్నాయి.

ఐర్లాండ్ నాటకరంగ ప్రగతికి విలియమ్ బట్లర్ ఈట్స్ ప్రధాన కారకుడైనప్పటికీ ఈట్స్ ప్రధానంగా కవి, విమర్శకుడు.

ఐరిష్ నాటకంలో ఒక దృశ్యం

ఈయన నాటకాల్లో కవితాధోరణి అధికం. సంగీతం, నృత్యం, మాస్కులు ప్రదర్శనలో ప్రాముఖ్యం వహిస్తాయి. వాస్తవికతవైపు ఎన్నడూ మొగ్గు చూపలేదు. జపాన్ దేశంలో ప్రాచుర్యంలో ఉన్న ణో నాటకాలను ఈట్స్ అనుసరించటం జరిగింది. ప్రతీకాత్మక **(Symbolic)** నాటకాలు పాఠక లోకాన్ని అలరించిన స్థాయిలో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొనలేకపోయాయి. వాటిలో నాటకీయత, ప్రయోగాత్మకత లోపభూయిష్టంగా ఉండటమే అందుకు కారణం. ఈట్స్ రచించిన నాటకాలలో ది గోల్డెన్ హెల్మెట్ (1910), ది గ్రీన్ హెల్మెట్ (1910), ది వర్డ్స్ అపాన్ ది విండో పేన్ (1930), ఎట్ ది హాక్స్‌వెల్ (1916), ది డ్రీమింగ్ ఆఫ్ ది బోన్ (1931) ముఖ్యమైనవి. ఈట్స్ చివరి నాటకం పర్గెటరీ (1931).

ఐర్లాండ్ నాటకరంగంలో సంచలన నాటక రచయితగా పేరుపొందిన జాన్ మిల్లింగ్టన్ సింజ్ (1871 -1909) రాసిన నాటకాలు ఐర్లాండులోనే కాక ఇతర దేశాలలో కూడా ప్రాచుర్యం పొందాయి. సింజ్ రాసిన ఇన్ ది షాడో ఆఫ్ ది గ్లెన్ *(In the Shadow of the Glan - 1903)* వివాదాస్పదమైన నాటకంగా పరిగణించబడింది. ఐరిష్‌స్త్రీ జాతిని కించపరిచే కొన్ని వ్యాఖ్యాలు, సన్నివేశాలు ఉండటమే ఆ నాటకం వివాదానికి దారితీయడానికి ప్రధాన కారణం. పురుషాధిక్య సమాజంలో మగవాడి దౌష్ట్యానికి, అణచివేతచర్యలకు గురైనభార్య, అతనిఅహంకారాన్ని సహించలేక అతనిపై తిరుగుబాటు చేసి అతని విడిచి మరొకరితో వెళ్లిపోవటం ఆ నాటకంలోని ఇతి వృత్తం. ఆమె చర్య నైతిక సూత్రాలకు, సామాజిక కట్టుబాట్లకు విరుద్ధంగా ఉందనీ ఆ నాటకాన్ని తీవ్రంగా నిరసించారు ప్రేక్షకులు. సింజ్ రాసిన అనేక నాటకాల్లో అణచివేతకు గురౌతూ బాధామయ జీవితాన్ని గడుపుతున్న వ్యక్తికీ, స్వేచ్ఛ కోసం ఆ వ్యక్తి పడే తపనకూ మధ్య సంఘర్షణను చిత్రించడం సాధారణ లక్షణంగా గోచరిస్తుంది. సింజ్ రాసిన ది ప్లే బాయ్ ఆఫ్ ది వెస్టెన్ వరల్డ్ *(The Play Boy of the Western World - 1907)* నాటకం వివాదాస్పదమై తీవ్ర నిరసనలకు దారితీసింది. నాటకం ప్రదర్శించిన ప్రతిచోట ప్రేక్షకుల నుంచి నిరసనలను, ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చింది. గ్రామ ప్రాంతంలో తండ్రిని చంపినతనయుడ్ని కథానాయకుడిగా చేసి అతనికి ప్రాముఖ్యాన్ని కట్టబెట్టడం జాతి సౌశీల్యాన్ని, వ్యక్తిత్వాన్ని అవమానించడమేనని విమర్శకులు తీవ్రంగా దుయ్యబట్టారు. సింజ్ నాటకాలలో ఇంతగా ప్రేక్షకుల, విమర్శకుల ఆగ్రహానికి గురైన నాటకం మరొకటి లేదు. సింజ్ రచించిన రైడర్స్ టు ది సి ***(Riders to the Sea)*** బహుళ జనాదరణ పొందిన నాటకం. తాత్త్వికధోరణి ప్రతిబింబించే ఈ నాటకంలో మౌర్య అనే వృద్ధురాలి మనఃస్థితిని రచయిత ఎంతో ప్రతిభావంతంగా చిత్రించటం జరిగింది. ఆరుగురు బిడ్డల్ని సముద్రం బలితీసుకొన్న నేపథ్యంలో తల్లి అనే మాటలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కొడుకులందరినీ పొట్టన పెట్టుకుంది సముద్రం.

ఇది విధి విలాసం. కష్టాలన్నీ ఒక్కసారిగా కట్టబెట్టిన 'విధి' ఇంక తననేం చెయ్యగలుగుతుంది అనటంలో ఆమె నైరాశ్యం చాటున దాగిన ఆర్తి, స్థిరచిత్తం ద్యోతకమౌతాయి. కష్ట పరంపరకు పరాకాష్ఠగా మనశ్శాంతిలభించిందని మౌర్య భావించటంలో ఆమె వ్యక్తిత్వంలోని విలక్షణత ప్రస్ఫుటమౌతుంది. సింజ్ రాసిన ది *టింకర్స్ వెడ్డింగ్ (The Tinker's Wedding)* మతాధికారులపై సంధించిన అస్త్రం. చర్చిని విమర్శించే ఆ నాటకాన్ని ప్రదర్శించడానికి ఆబీ థియేటర్ ముందుకు రాలేదు. 1971లో గాని ఆ నాటకానికి ప్రదర్శన భాగ్యం కలగలేదు. ది వెల్ ఆఫ్ ది సెయింట్స్ *(The Well of the Saints)* కూడా సింజ్‌కి పేరు తెచ్చిన నాటకాలలో ఒకటి.

తమ రచనా పటిమతో గొప్ప నాటకాలను సృష్టించి నాటకరంగంలో కొన్ని సంప్రదాయాలను, మార్గదర్శక సూత్రాలను నెలకొల్పిన మొదటితరం నాటకకర్తలను స్ఫూర్తిగా తీసుకుని ఆ తరువాతి తరం రచయితలు నాటకోద్యమంలో తమవంతు సహకారాన్ని అందించి ఐర్లాండ్ నాటకరంగంలో నూతనోత్తేజాన్ని కలిగించాడు. వారిలో లార్డ్ డన్ సనీ (1878-1957), జాన్ ఎర్విన్ (1883-1971), లెన్నాక్స్ రాబిన్‌సన్ (1886-1958) తదితరులు పేర్కొనదగిన రచయితలు. డన్‌సనీ రాసిన *ది గ్లిట్టరింగ్ గేట్* (1909) వాస్తవేతర నాటకశైలి కూడా అంగీకారయోగ్యమేనని నిరూపించింది. ఎర్విన్ రాసిన *జేన్‌క్లర్గ్* (1913), జాన్ ఫెర్గ్యూసన్ (1915) నాటకాల్లో వాస్తవిక ధోరణి తొణికిసలాడింది. రాబిన్‌సన్ వైట్ హెడెడ్ బాయ్ (1916), ఫారాఫ్ హిల్స్ (1928) నాటకాల్లో గ్రామీణ వాతావరణం వెల్లివిరిసింది.

ఐర్లాండ్ నాటక వికాసానికి తోడ్పడిన వారిలో సీన్ ఒకాసీ పేర్కొనదగిన రచయిత. దారిద్ర్యంలో మగ్గిపోయిన దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. పేదరికం వల్ల కళాశాలల్లో విద్యార్జన చేయలేకపోయినా, పట్టుదలతో స్వయంకృషితో చదువుకున్నాడు. పరిశీలన ద్వారా సమాజ పోకడలను, విభిన్న వ్యక్తుల మనస్తత్వాలను, మతాన్ని, రాజకీయ రంగాన్ని గురించి కూలంకషంగా అధ్యయనం చేశాడు. విస్తృత గ్రంథ పఠనం వల్ల వివిధ రంగాల గురించి అవగాహన పెంచుకున్నాడు. ఇవన్నీతన రచనావ్యాసంగానికి ముడిసరుకుగా అనుకూలించాయి.

సీన్ ఒకాసీ నాటక రచయితగా నిలదొక్కుకోవటానికి, రాణించడానికి ఆబీ థియేటర్ ఆలంబన అయింది. 1923లో ఒకాసీ రచించిన ది షాడో ఆఫ్ ఎ *గన్‌మేన్ (The Shadow of a Gunman)* నాటకాన్ని స్వీకరించి ఆబీ థియేటర్ విజయవంతంగా ప్రదర్శించింది. ఆంగ్లో-ఐర్లాండ్ యుద్ధం, 1921లో దానికి సంబంధించిన ఒప్పందం (Settlement) గురించి ది షాడో ఆఫ్ ఎ గన్‌మాన్‌నాటకంలో వివరించబడింది. ఆ ఒప్పందం తరువాత జరిగిన 'సివిల్‌వార్' గురించిన ఇతివృత్తంతో జూనో అండ్ పేకాక్ *(Juno an Paycock - 1924)* నాటకాన్ని రాశాడు. ఈ నాటక ప్రదర్శనతో ఆబీ థియేటర్ కొత్త ఊపిరి పీల్చుకుంది. అప్పుల్లో కూరుకుపోయి దీనావస్థలో ఉన్న ఆబీ థియేటర్ జూనో అండ్ పేకాక్ ప్రదర్శనలకు వచ్చిన రాబడితో కోలుకొని నిలదొక్కుకోగలిగింది. ఒకాసీ రాసిన ది ప్లో అండ్ ది స్టార్స్ *(The Plough and the Stars - 1926)* నాటకం ప్రేక్షకుల ఆగ్రహానికి గురైంది. 1916లో జరిగిన ఐర్లాండ్ యుద్ధంలో పాల్గొన్న స్వాతంత్ర్యయోధుల వ్యక్తిత్వాలను దిగజార్చే విధంగా చిత్రించబడిన ది ప్లో అండ్ ది స్టార్స్ నాటకాన్ని ప్రేక్షకులు, విమర్శకులు, పత్రికారంగం కూడా తీవ్రంగా వ్యతిరేకించడం జరిగింది. కొన్నిచోట్ల నాటక ప్రదర్శనను సాగనివ్వకుండా ఘర్షణలు జరిగాయి. ఈట్స్ వంటి ప్రముఖ రచయితలు ఆ నాటకాన్ని సమర్థించినా ఆ నాటకంపై నిరసనోద్యమం ఆగలేదు. ఆబీ థియేటర్ కోసం 1928లో రాసిన ది సిల్వర్ టస్సీ *(The Silver Tassie)* నాటకాన్ని 'ఆబీ' ప్రదర్శనకు అంగీకరించలేదు. మొదటి ప్రపంచయుద్ధాన్ని ఇతివృత్తంగా చేసుకొన్న ఆ నాటకంలో కొంతభాగం అభివ్యక్తిశైలి (Expressionistic style) లో రాయటం 'ఆబీ' కి ఆమోదయోగ్యం కాలేదు. ప్రతీకాత్మక ధోరణిలో రంగులతో, శబ్దాలతో మూకాభినయంతో వస్తు వివరణ చేయటం ఈట్స్‌కి రుచించలేదు. కళాభివ్యక్తిలో ఐర్లాండులో తనకు తగిన స్వేచ్ఛ లేదని నిరాశ చెందాడు ఒకాసీ. ఈ విషయంలో మనస్తాపానికి గురైన సీన్ ఒకాసీ ఐర్లాండు వదలి లండన్‌కు ప్రయాణం కట్టాడు. నిజానికి ఐరిష్‌నాటకరంగంలో ప్రయోగాత్మక నాటకాలకు నాంది పలికిన ఘన ఒకాసీదే కావటం గమనార్హం. ఒకాసీ లండన్‌లో స్థిరపడి తన రచనా వ్యాసంగం అక్కడి నుంచే కొనసాగించాడు. మరలా ఐర్లాండుకు తిరిగి రాలేదు. ది సిల్వర్ టస్సీ నాటకం 1929లో లండన్‌లో ప్రదర్శింపబడి ప్రశంసలందుకొంది. మొదట్లో ఆ నాటక రచనా ధోరణి మీద ఈట్స్-ఒకాసీ మధ్య భేదాభిప్రాయాలు పొడచూపినప్పటికీ, చివరకి ఈట్స్ నాటకం విషయంలో రాజీపడ్డాడు. తత్ఫలితంగా సిల్వర్ టస్సీ నాటకాన్ని చేపట్టి ఆబీ థియేటర్ 1935లో ప్రదర్శించింది.

ఒకాసీ కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ప్రభావితుడైన తదనంతర కాలంలో రచించిన నాటకాల్లో వామపక్ష భావాలు ప్రతిబింబిస్తాయి. అప్పుడు రాసిన నాటకాల్లో అధిక భాగం ప్రయోగాత్మకాలు (Experimental Plays) కావటం పరిశీలనార్హం.

విత్ ఇన్ ది గేట్స్ (*With in the Gates - 1934*), ది స్టార్ టరన్స్ రెడ్ (*The Star turns Red - 1940*), రెడ్ రోజెస్ ఫర్ మి (*Red Roses for Me - 1943*), పర్పుల్ డస్ట్ (*Purple Dust - 1945*), ఓక్ లీవ్స్ అండ్ లావెండర్ (*Oak Leaves and Lavendar - 1947*), కాక్ ఎ డూడుల్ డాండీ (*Cocka Duddle Dandy - 1949*) ది బిషప్స్ బోన్ ఫైర్ (*The Bishop's Bonifre - 1955*), ది డ్రమ్స్ ఆఫ్ ఫాదర్ నెడ్ (*The Drums of Father Ned - 1958*) నాటకాలు ఒకాసీ ఖ్యాతిని ఇనుమడింపజేశాయి. సీన్ ఒకాసీ మరణానంతరం కూడా అతని నాటకాలు నేటికీ ప్రదర్శింపబడుతూ సజీవంగా నిలిచి రంగస్థలాన్ని అలరిస్తూ ఉండటం విశేషం.

1904లో వెలుగులోకి వచ్చిన ఆబీ థియేటర్ ఆనాటి నుంచి తన కార్యక్రమాలలో, వ్యవహార సరళిలో చేర్పులు, మార్పులు చేసుకొంటూ, అనేక ఆటుపోట్లకు లోనవుతూ ముందుకు సాగుతూ వచ్చింది. 'ఆబీ' ప్రదర్శనలు ఐర్లాండ్‌కే పరిమితంకాకబ్రిటన్, అమెరికాదేశాలలో కూడా ప్రదర్శించే స్థాయికి ఎదిగింది. కాలక్రమేణా 1930–40 ప్రాంతాలలో ఆబీ ప్రమాణాల స్థాయి దిగజారుతూ వచ్చింది. 'ఆబీ' లో లోపించిన క్రమశిక్షణ, నటనలోనూ, దర్శకత్వంలోనూ పొడచూపిన నిర్లక్ష్యం ఆ సంస్థ పతనావస్థకు హేతువులయ్యాయి. అయినా వీటన్నిటినీ తట్టుకొంటూ ఆబీ నిలబడింది. పాల్ విన్సెంట్ కరోల్, యం.జె. మోలె వంటి యువ రచయితల రాకతో ఆబీ థియేటర్ కాలిపోవటంతో ఆబీ కార్యక్రమాలకు తేరుకోలేని దెబ్బ తగిలింది. ఎండిపోయిన మోడు చిగిర్చడానికి పదిహేనేళ్లు పట్టింది. ఈ లోపల అప్పుడప్పుడే వృద్ధిలోకి వస్తున్న 'గేట్ థియేటర్' ఆధిక్యం కోసం పాటుపడింది. కానీ ఆబీ తో ఏ సంస్థా పోటీకి నిలబడలేదని రుజువైంది. ప్రతిభావంతులైన నూతన దర్శకులతో, నాటక రచయితలతో 1960 నుంచీ ఆబీ థియేటర్ తన పూర్వవైభవాన్ని నిలబెట్టుకొంది. బ్రెయిన్ ఫ్రెయల్, బెర్నార్డ్ ఫారెల్, టామ్ ముర్రె, టోమ్ కిల్‌రాయ్, సెబాష్టియన్ బారే వంటి సమకాలీన యువ రచయితల ప్రాభవంతో 'ఆబీ థియేటర్' నేటికీ ఐరిష్‌నాటక రంగానికి కేంద్ర బిందువుగా, మార్గదర్శకంగా, నిత్యనూతనంగా వెలుగొందుతూ ఉంది.

గం.సు.రె.

అకారాది వ్యాసాలు

అంకం: నాటక విభాగం, రూపక భేదం, రెంటినీ అంకమని అంటారు.

1.నాటక విభాగం: నాటక కథాగమనంలో ఒక దశగాని, ఒక అవస్థగాని, రెండు అవస్థలు గాని పూర్తయి, ఇంకొక అవస్థ ప్రారంభం అయ్యేటప్పుడు, స్థలంలోగాని, కాలంలోగాని మార్పు వచ్చినప్పుడు ప్రేక్షకులకు విశ్రాంతి ఇవ్వడానికి నాటకాన్ని వివిధ భాగాలుగా విభజించడం అవసరం. అలా విభజించిన భాగాన్ని 'అంకం' అంటారు.

అంకమంటే లక్షణమనే రూఢ్యర్థం. రస విహీనం, సూచ్యం అయిన విష్కంభాదుల కంటే విలక్షణం, రసవంతం, దృశ్యనీయమైన దానికి అంకం అని పేరు వచ్చింది.

ఏభి: సం సూచయే త్సూచ్యం దృశ్య మంకైః ప్రదర్శయేత్
- ద.రూ. 1-62.

దృశ్యనీయమైన ఈ అంకంలో దూర ప్రయాణం, వధ, యుద్ధం, విప్లవం, కోట ముట్టడి, భోజన, స్నాన, సురత, చందన, చర్చ వస్త్రధారణ మొదలైనవి రంగం మీద ప్రత్యక్షంగా చూపరాదని, అంకాంతాన పాత్రలన్నీ నిష్క్రమించాలనీ, సంస్కృత లాక్షణికులు అనుశాసించారు. ఒక్కొక్క అంకంలో ఒక్కొక్క అవస్థను మాత్రమే చిత్రిస్తే నాటకం అయిదంకాలు అవుతుంది. అలాగాక ఒకే అవస్థను రెండు అంకాలలో నిబంధిస్తే నాటకం పది అంకాలను సంతరించుకుంటుందని సంస్కృత లాక్షణికులు పంచావస్థల్లో పేర్కొన్నారు.

అంకం సుదీర్ఘంగా ఉండకూడదు. అంకంలో ఇరవై నాలుగు గంటలకు మించని కథా భాగాన్ని నిబంధించాలని, నాటక లక్షణాలన్నీ అంకానికి వర్తింపజేయాలని సంస్కృత లాక్షణికుల మతం. ప్రతి అంకానికి రూపక నాయకుడుగానీ, ఉపనాయకుడుగానీ, ప్రతినాయకుడుగానీ నాయకుడుగా ఉండాలి. వేణీసంహారం నాటకంలో ప్రథమాంకానికి నాయకుడు భీముడు, ద్వితీయాంకానికి ప్రతినాయకుడు దుర్యోధనుడు తృతీయాంకానికి అశ్వత్థామ, షష్ఠాంకానికి నాయకుడు యుధిష్ఠరుడు. అయితే ఒక్కొక్క అంకానికి వేరు వేరు నాయకులుండాలని నియమం లేదు. ఒకే నాయకుడు ఒకటికన్నా ఎక్కువ అంకాలకు నాయకుడు కావచ్చు. ఉదాహరణకు శాకుంతలంలో ఆరంకాలకు దుష్యంతుడు నాయకుడు.

కొందరు నాటకకర్తలు తమ నాటకాలలో ముఖ్యంగా ప్రకరణం, నాటికలలో ప్రతి అంకానికి వేరువేరు పేర్లు పెట్టడం పరిపాటి. భవభూతి మాలతీమాధవంలో ప్రథమాంకం పేరు 'వకుళవీథి' అనీ, ద్వితీయాంకానికి 'ధవళగృహం' అనీ, నవమాంకానికి 'సౌదామిని దర్శనం' అని పేరు పెట్టడం జరిగింది. శ్రీహర్షుని రత్నావళిలో ప్రథమాంకం పేరు 'మదన మహోత్సవం', ద్వితీయాంకం పేరు 'కదళీగృహం', తృతీయాంకం పేరు 'సంకేతం', చతుర్థాంకం పేరు 'ఇంద్రజాలికం'గా సూచించడం జరిగింది.

అంకనాయకుడు కథానాయకుడైనా, ఉపనాయకుడైనా, ప్రతినాయకుడైనా నాయకుని చరిత్ర ప్రత్యక్షంగా చూపవలసి ఉంటుంది. ఒకే అంకంలో అనేక కార్యాలు అనుసంధించకూడదు. అవశ్యకార్యానికి దెబ్బతగలకుండా సన్నివేశాలను కూర్చాలి. రంగస్థలంపై ప్రవేశించిన పాత్రలు తమ పని పూర్తికాగానే లేదా అంకాంతాన గానీ నిష్క్రమించాలని సంస్కృత లాక్షణికుల మతం. ఆనాడు కదలాడే తెర లేకపోవడమే దీనికి కారణం కావచ్చు. అంకంలో పరిమితమైన పాత్రలనే ప్రవేశపెట్టాలి. కోహలుడు, తదితర లాక్షణికులు మూడు విధాలైన అంకాలను ఉదహరించారు. అవి చూళికాంకం, అవతారాంకం, అంకముఖం.

చూళికాంకం : ఒకానొక విషయం అనుసంధాన పూర్వకంగా ఇతరుల వల్ల ప్రాప్తించినట్లు చిత్రించిన అంకాన్ని చూళికాంకం అన్నారు.

అవతారాంకం: నాటకంలోని అన్ని అంకాలలో బీజరూపంగా ఉన్న అర్థాన్ని ఒకే అంకంలో నిబంధించిన అంకం. ఉదాహరణకు వేణీసంహారం ప్రథమాంకం.

అంకముఖం : ఒక అంకం చివర, తరువాత అంకం మొదట వచ్చే ఇతివృత్తాన్ని నిబంధించిన అంకం. ఉదాహరణకు ముద్రారాక్షస నాటకం చివరి అంకముఖం.

సంస్కృత నాటకాలలో అంకవిభజన ఉంది. సంస్కృత లాక్షణికులు నాటక భేదాన్ని బట్టి అంకాల సంఖ్యను నిర్ణయించారు. నాటకానికి అయిదు మొదలు పది అంకాలు, ప్రకరణానికి పది అంకాలు, డిమంలో నాలుగు అంకాలు, సమవాకారంలో మూడు అంకాలు, ప్రహసన వీథి, వ్యాయోగ, ఉత్సృష్టికాంకాలకు ఒకే అంకం ఉంటాయని తెలిపారు.

అంకం రసభావాదులతో పాటు అర్థాన్ని పాఠకుల, ప్రేక్షకుల హృదయాలలో ఆరోహింపజేస్తుందని లాక్షణికులు వివరించారు. అర్థసమాప్తి, బీజ సంహారం జరిగిన చోట అంకం ముగించాలి. కాని బిందువు మాత్రం కథ అంతటా వ్యాపించి ఉండాలి. ఒకరోజు జరిగిన కార్యమంతా ఒక అంకంలో నిబంధించడానికి వీలుపడకపోతే, అంకాన్ని ముగించి, మిగిలిన దానిని ప్రవేశకాదులతో (అర్థోపక్షేపకాలు) సూచించాలి. ఈ ప్రవేశకాలలో నెల, సంవత్సరంలోపుగాని జరిగిన కార్యాన్ని సూచించాలి. సంవత్సరం మించిన కార్యాన్ని చూపరాదు. ప్రవేశకాన్ని రెండంకాల మధ్య కూర్చాలి. ప్రతి అంకాంతంలో బిందువు సూచితం కావాలి.

ప్రాచీన గ్రీకు, రోమన్ నాటకాలలో అంక విభజన లేకుండా నాటకం సాగిపోతున్నట్లు పైకి కనిపించినా, జాగ్రత్తగా

పరిశీలిస్తే అయిదు అంకాలుగా లేక అయిదు దశలుగా విభాజితమైనట్లు కనబడుతుంది. పాశ్చాత్య నాటకాలలో ప్రప్రథమంగా అంకవిభజన చేసి నాటకాలు రచించింది గ్రీకు రచయిత అగథాన్. ఈయన ఫ్లవర్ అనే నాటకంలో అంక విభజన చేసి మార్గదర్శకుడయ్యాడు. అంకవిభజన పద్ధతిని బాగా వ్యాప్తిలోకి తెచ్చింది 'సెనెకా' అనే రోమన్ నాటకకర్త. తరువాత కాలంలో షేక్స్పియర్ మొదలైన పాశ్చాత్య నాటకకర్తలు అంకాలను రంగాలుగావిభజించారు. నాటకాన్నిఅంకాలుగా విభజించకుండా ఏకబిగిని నడిపినపుడే ప్రేక్షకుల మనసులు విచ్ఛిత్తి లేకుండా నాటకం మీద లగ్నమవుతాయి. రసాస్వాదన అడ్డులేకుండా సాగుతుందని మరికొందరి లాక్షణికుల అభిప్రాయం. ఆధునిక నాటకకర్తలు కొందరు 'Scene' అనే ఆంగ్ల పదాన్ని 'రంగం' అనే తెలుగు పదాన్ని 'అంకం' అనే పదానికి పర్యాయపదాలుగా వాడుతున్నారు.

అంకం అనే పదానికి సరైన ఆంగ్ల పదం యాక్ట్ (Act). పూర్వం ఇంగ్లండులో నాటక ప్రదర్శనలలో అంకానికీ అంకానికీ మధ్య విరామ సంగీతాన్ని యాక్ట్ అనేవారు.

2. రూపక భేదం: సంస్కృత దశరూపకాలలో అంకం ఒకటి. ఇది స్వతంత్ర రూపకం. దీనిని నాటక విభాగమైన అంకం నుంచి వేరుచేయడానికి దీనికి ఉత్సృష్టం, ఉత్సృష్టికాంకమని సంస్కృత లాక్షణికులు పేరు పెట్టారు. ఇందులో ఇతివృత్తం ప్రఖ్యాతంగానీ, కల్పితంగానీ అయి ఉండవచ్చు. ఒకటే అంకం. కరుణరస ప్రధానం. నాయకుడు ప్రాకృత జనుడు. దివ్య పురుష పాత్ర ఉండరాదు. స్త్రీ విలాపం, భారతీవృత్తి, వాగ్యుద్ధ వర్ణన ముఖ్యం. జయాపజయాలు వాగ్రూపంలో మాత్రమే ఉండాలి. ముఖ నిర్వహణ సంధులు, లాస్యాంగాలు నిబంధించవలసి ఉంటుంది. శౌర్యవర్ణనలో వీరరసం, సౌభాగ్యవర్ణణలో శృంగార రసం సూచించాలి.

శ్రీ.చ.

అంకముఖం : అర్థోపక్షేపం. దీనిని అంకాస్యమని కూడా అంటారు. ఉత్తరాంకానికి ఇది ముఖం లాంటిది. కాబట్టి అంకముఖంగా పేర్కొన్నారు.

ఉత్తరాంకాల వస్తువునుగాని, పాత్ర ప్రవేశాన్నిగాని, పూర్వాంకం చివర సూచించి, అంకాలు విడిపోకుండా అనుసంధించడం దీని ప్రయోజనం. ఉత్తరాంక వస్తువును గాని, పాత్ర ప్రవేశాన్ని గాని సూచించవలసింది పూర్వ అంకాంత పాత్ర. ఇది రెండు విధాలు. ఆ పూర్వాంక పాత్రే నిష్క్రమిస్తూ, అంకముఖం ప్రయోగించడం (అంటే ఉత్తరాంక వస్తువును సూచించడం) ఒక విధం. పూర్వాంకం చివర కొత్తగా పాత్ర ప్రవేశంతో సూచించడం రెండో విధం.

శ్రీ.చ.

అంక యవనిక : యవనిక అంటే తెర అని అర్థం. అంకానికీ, అంకానికి మధ్య రంగ ముఖ ద్వారాన్ని మూసివేసే తెరకు, 18వ శతాబ్ది చివర పెట్టినపేరు అంక యవనిక.

శ్రీ.చ.

అంకావతరణం : అర్థోపక్షేపకం. వివరాలకు చూ. అంకావతారం.

శ్రీ.చ.

అంకావతారం : అర్థోపక్షేపకం. దీనిని అంకావతరణం అని కూడా అంటారు. అంకముఖం ద్వారా ఒక అంకం నుంచి ఇంకొక అంకం అవతరించడం అంకావతారం. అయితే, ఈ రెండు అంకాల మధ్య విష్కంభాదులు ఉండకూడదు.

ఇది మూడు విధాలు. ఒకటి ఆముఖం ప్రయోగించిన అంకాంత పాత్ర ఉత్తరాంకంలో అసూచితంగా ప్రవేశించి కథ నడపడం, రెండు పూర్వాంకాంత పాత్ర సూచన మేరకు మరో పాత్ర ఉత్తరాంకం నడపడం. మూడు పూర్వాంకాంత పాత్ర ఉత్తరాంక ప్రారంభంలో ప్రవేశించడం.

శ్రీ.చ.

అంకాస్యం : అర్థోపక్షేపకం. అంకాంత పాత్ర, ఉత్తరాంకార్థాన్ని సూచించడం అంకాస్యం. దీనికి అంకముఖమని కూడా పేరు. వివరాలకు చూ. అంకముఖం.

శ్రీ.చ.

అంకీయనాట్ : రూపక భేదం. అస్సామీ భాషలో 15వ శతాబ్ది నుంచి వ్యాప్తిలో ఉన్న దేశి రూపకం. ఇది వైష్ణవ మత ప్రచారాస్త్రంగా వెలుగులోకి వచ్చింది. ఈ కళారూపానికి ఆద్యుడు శంకరదేవుడు (1449-1568). అంకీయనాట్ ఏకాంక రూపకం. రచన, సంస్కృత, అస్సామీ భాషల సమ్మేళనంతో ఉండటం విశేషం. సంస్కృత రూపక లక్షణాలను అనుసరించిన ఛాయలు కనిపిస్తాయి. ఇందుకు సూత్రధారుడే ప్రత్యక్ష నిదర్శనం. సంస్కృత నాటకాలలో సూత్రధారుడు కొన్ని సందర్భాలలో మాత్రమే రంగస్థలం మీద ఉంటాడు. అంకీయనాట్‌లో ఆద్యంతమూ రంగస్థలం మీదే ఉండి నాటక ప్రదర్శన

అంకీయనాట్ - రామవిజయం

కొనసాగిస్తాడు. గ్రీకు నాటకాల్లో కోరస్ ఉన్నట్లే 15 మందితో కూడిన బృందం అంకీయనాట్‌లోనూ ఉంటుంది. ఆ బృందానికి నాయకుడు సూత్రధారుడే. ఆ బృందంతో కలిసి గీతాలాపన చేయటం, నృత్యం చేయటం సూత్ర ధారుని కర్తవ్యం. అంకీయనాట్ నృత్య–గీతాల సమ్మేళనం కనుక ప్రేక్షకుల్ని అమితంగా ఆకర్షిస్తుంది. మత సంబంధమైన కళారూపం కనుక దానిని ఆలయ ప్రాంగణాలలోను, ప్రార్థనా మందిరాలలోను ప్రదర్శించేవారు. కథా గమనంలో పక్షులు, సర్పాలు, మర్కటాలు, ఎలుగుబంట్లు మొదలైన పాత్రల్ని చూపవలసి వచ్చినపుడు మనుషులే వాటి రూపాల్లో ఉన్న కరాళాలు (మాస్కులు) గ్రీకు సంప్రదాయంలో మాదిరిగా ధరించేవారు. అంకీయనాట్ ప్రదర్శన రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో మొదలై సూర్యోదయం వరకూ కొనసాగుతుంది. స్త్రీ పాత్రలను పురుషులే ధరిస్తారు. ఆర్థిక, సామాజికరంగంలో ఎన్నో మార్పులచ్చినా ఆధునిక కాలంలో కూడా అంకీయనాట్ చెక్కు చెదరకుండా వర్థిల్లుతూ, సామాజికుల్ని నేటికీ అలరిస్తూ ఉండటం ఈ కళా రూపం విశిష్టతను వెల్లడిస్తుంది.

గం.సు.రె.

అంగిరసం : రసానుభూతికి దోహదకారి అయ్యే అంశాలుగా తొమ్మిది రసాలను మన ప్రాచీన లాక్షణికులు పేర్కొన్నారు. అవి శృంగార, వీర, రౌద్ర, హాస్య, కరుణ, భయానక, భీభత్స, అద్భుత, శాంత రసాలు. ఇవి దృశ్య కావ్యాలకే పరిమితం కావు. శ్రవ్య కావ్యాలలోను ఉద్దిష్టమవుతాయి. ఈ నవరసాలలో ఏదో ఒక రసాన్ని ప్రధాన రసంగా చేపట్టి, దృశ్య కావ్య నిర్మాణంలో పోషిస్తే దాన్ని అంగిరసం అని పిలుస్తారు. ఉదాహరణకు సక్కుబాయి (భక్తిరసం), బొబ్బిలి యుద్ధం (వీరరసం), కంఠాభరణం (హాస్యరసం), చింతామణి (శాంతరసం).

నాటకంలో ప్రధాన రసంతో పాటు ఆస్వాదన కోసం మరికొన్ని రసాలు కూడా సుప్రతిష్టమవుతాయి. వాటిని అంగరసాలు అంటారు. ఉదాహరణకు కాళ్ళకూరి నారాయణ రావు మధుసేవ నాటకంలో అంగిరసం శాంతం. కస్తూరి, కాశిసాహెబుల సంభాషణలు హాస్యరసం, కస్తూరి, రఘునాథరావుల సంభాషణలు శృంగార రసం, నిర్మల మరణం కరుణరసం. ఈ నాటకంలో ఇవన్నీ అంగరసాలు.

గం.సు.రె.

అంతర్నాటకం : నాటకంలో నాటకమే అంతర్నాటకం. నాటకంలో అంతర్భాగంగా అందలి పాత్రలు, ఇంకో చిన్న నాటకం ఆడినట్లు ప్రదర్శించడాన్ని సంస్కృత లాక్షణికులు 'గర్భాంకం' అన్నారు.

అయితే ఈ అంతర్నాటకానికీ, ప్రధాన నాటకానికీ గల సంబంధం ఏమిటీ? దీనిని ఎప్పుడు ఎలా ప్రధాన నాటకంతో మేళవించాలి?ఎలాప్రదర్శించాలి?అంతర్నాటక ప్రయోజన మేమిటి? అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. ఈ ప్రశ్నలకి సమాధానాలు తెలుసుకోవడానికి కొన్ని ప్రసిద్ధ అంతర్నాటకాలను చూద్దాం. వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన ప్రతాపరుద్రీయం నాటకంలో ఢిల్లీ సుల్తాను, బందీగా ఉన్న ప్రతాపరుద్రుణ్ణి వెంటబెట్టుకుని రత్నాలు పరీక్షించేందుకు వర్తకుల ఓడలోకి వెళతాడు. అక్కడ సుల్తాన్ తన గౌరవార్థం ఆడిన నాటకంలో నిమగ్నుడైనప్పుడు యుగంధరుడు పడవ వేపు లంగరెత్తిస్తాడు. పడవ ఢిల్లీ వదలి సాగిపోతుంది.

అంతర్నాటకం వల్ల వల్లీఖాన్ కుట్ర బయటపడుతుంది. సుల్తాన్ వల్లీఖాన్ పక్షం వారందరినీ చంపించేస్తాడు. ఒంటరై పోయిన సుల్తానే యుగంధరునికి బందీ అవుతాడు. ప్రతాప రుద్రుని చెర విముక్తి అవుతుంది. ఈవిధంగా అంతర్నాటకం ద్వారా కథా నిర్వహణ జరిగి ఫలసిద్ధి కలిగింది.

'నాటకం' అనే నాటకంలో నాయిక రహస్య ప్రియుడితో ఉండగా వారి ప్రేమ సంభాషణ చాటున ఉండి విన్న నాయకుడు నాయిక ఎడ విముఖుడవుతాడు. కాని అతని కవి మిత్రుడు ఆ ప్రేమ సంభాషణనే ఒక నాటికలో చొప్పించి ఆ నాయికతో, ఆమె రహస్య ప్రియుడితో రిహార్సలుగా ఆడిస్తాడు. చాటున ఉండి తాను విన్న సంభాషణే రిహార్సలులో వినిపించేసరికి గత రాత్రి కూడా జరిగింది నాటిక రిహార్సలేననీ, నాయిక నిర్దోషి అనీ నమ్మి నాయకుడు నాయికను స్వీకరిస్తాడు. ఈవిధంగా అంతర్నాటకం ద్వారా కథా నిర్వహణ జరిగి నాటక సమస్య పరిష్కారమవుతుంది. కాని ఇందులో అంతర్నాటకం ప్రదర్శన రూపంలో కాక రిహార్సలు రూపంలో ఉండడం గమనార్హం.

విశ్వశాంతి నాటకంలో అంతర్భాగంగా యుద్ధ భీభత్సాన్ని చిత్రించే 'యుద్ధం' అనే చిన్ననాటకం పొందుపర్చారు. ఇందులో ప్రధాన నాటకంలోని నాయికా నాయకులు పాత్రలు ధరిస్తారు. ప్రధాన నాటక ఇతివృత్తానికి అంతర్నాటకం దోహద మిస్తుంది.

అంతర్నాటక ప్రయోజనం నాటక సమస్యా పరిష్కారానికి మాత్రమేగాక పూర్వవృత్తాంతం దృశ్యమానం చేయడానికి కూడా ఉపయుక్తమవుతుంది.

శ్రీ.చ.

అంతర్యవనికాంగాలు : పూర్వ రంగాంగ భాగాలు. అసలు నాటక ప్రదర్శనకు ముందుగా తెరలోపల ప్రయోక్తలు తంత్రీ భాండ వాద్యాలతో నివర్తించేవి అంతర్యవనికాంగాలు. అవి 1.ప్రత్యాహారం; 2. అవతరణం; 3. ఆరంభం; 4. అశ్రావణం; 5. వక్త్రపాణి; 6. పరిఘట్టన; 7. సంఘోటన; 8. మార్గాశారితం; 9. అసారితం. అసారితం జ్యేష్ఠం, మధ్యమం, కనిష్ఠం అని మూడు విధాలు. అంతర్యవనికాంగాలనే బహిర్గీతాలు అని, నిర్గీతాలని

కూడా అంటారు. నిజానికి అశ్రావణాదులు ఆరు. ప్రత్యాహార, అవతరణ, ఆరంభాలనే మూడింటికి ప్రత్యేకమైన అస్థిత్వం లేదు. కాబట్టి వాటిని అశ్రావణ భాగాలుగానే పరిగణించవలసి ఉంటుంది. వీటిని ప్రయోక్తలు తెర వెనుక తంత్రీ భాండ వాద్యాలతో నిర్వహిస్తారు.

శ్రీ.చ.

అంబికా వరప్రసాదరావు, కందుకూరి (1884-1964): తెలుగు, హిందీ నటుడు, నాటక కళావేత్త, సమాజ నిర్వాహకుడు, న్యాయవాది, వాడుక పేరు అంబయ్య. 1884లో ఏలూరులో పుట్టాడు. ధార్వాడ కంపెనీ నాటక ప్రదర్శనలు ఈయనలోని నాటక కళాభిలాషను ఉద్దీపింపచేశాయి. 'ధాత్రీసభ' అనే పేరుతో ఈయన హిందీ, తెలుగు నాటకాలు ప్రదర్శించాడు. ఆ తరువాత ముంజులూరి కృష్ణారావుతో కలిసి 'ది గ్రేట్ ఇండియన్ థియేటర్' అనే నాటక సమాజం స్థాపించి, తాను కూడా పాత్రలు ధరిస్తూ నాటకకళకు ఎనలేని గౌరవం సంపాదించి పెట్టాడు. ఈయన రిహార్సల్ సమయంలో నటులను చుట్ట, బీడి, సిగరెట్టు కాల్చనిచ్చేవాడు కాదు. నాటక సమాజాన్నికట్టుదిట్టంగా నడిపాడు. వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన ప్రతాపరుద్రీయం నాటక ప్రదర్శనకు వీరి సమాజం పెట్టింది పేరు. ప్రతాపరుద్రీయంలో పేరిగాని పాత్ర ఈయన ప్రత్యేకత. అచ్చంగా తెలంగాణా రజకుడనిపించేవాడు.

ఆంధ్ర నాటక కళా పరిషత్తు, ఏలూరు కళాక్షేత్రం ఈయనను ఘనంగా సన్మానించాయి. 60 సంవత్సరాలకు పైగా నాటక కళనుఆరాధించాడు. పేరిగాడు, వాసుదేవమూర్తి, అక్బరు, సలీం, రామప్పంతులు, కరండకుడు, పిచ్చిరామ శాస్త్రి, రాజా కళింగ గంగు పాత్రల్లో నటించి మెప్పించిన వరప్రసాదరావు 1964, సెప్టెంబరు 20న మరణించాడు.

శ్రీ.చ.

అక్షర సంఘాతం : నాటకలక్షణం. దీనిని అక్షర సంహతి అని కూడా అంటారు. అల్పాక్షరాలతో కూడిన మాటకు వేరొక విచిత్రార్థం కూడా తీయడం అక్షర సంఘాతం లేక అక్షర సంహతి. ఉదా: అభిజ్ఞాన శాకుంతలం తృతీయాంకంలో...

రాజు : మీ సఖిని శరీర సంతాపం హెచ్చు బాధింపదు గదా?

ప్రియంవద: ఇప్పుడు లబ్ధౌషధమై ఉపశమముం బందగలదు.

ఇక్కడ నీవు వచ్చితివిగాన సంతాపము ఉపశమించునని చమత్కారంగా తాపోపశమన హేతువు చెప్పడం వల్ల ఇది అక్షర సంఘాతం.

శ్రీ.చ.

అగథాన్ (క్రీ.పూ. 416) : గ్రీకు విషాద నాటకకర్త యురిపిడీస్‌కు సమకాలికుడు. నాటి కాలంలో నిర్వహించిన నాటక పోటీలలో రెండు సార్లు విజయం సాధించిన మహానాటకకర్త. పురాణాల నుంచి, చరిత్ర నుంచి ఇతివృత్తాలు తీసుకోకుండా, స్వకపో కల్పిత గాథలు ఇతివృత్తాలుగా నాటకాలు రచించాడు. ఇలా స్వకపోకల్పిత నాటకాలు రచించడంలోనూ, నాటక కథతో సంబంధం లేని బృందగాన గీతాలను నాటకంలో ప్రవేశపెట్టడంలో కూడ ఈయనే ఆద్యుడు. ఈయన రచించిన నాటకాలు పూర్తిగా లభించడం లేదు.

శ్రీ.చ.



అచ్చయ్య, కోడూరు : నటుడు, దర్శకుడు, ప్రయోక్త, నాటకకర్త. ఈయన కృష్ణా జిల్లా ముదినేపల్లిలో జన్మించాడు. నాటక కళాలక్ష్యంతో పని చేశాడు. తొలుత 1939లో ముదినేపల్లి ఎక్సెల్షియర్ థియేటర్ ప్రదర్శించిన ఆశాజ్యోతి నాటకానికి దర్శకత్వం వహించాడు. అక్కినేని నాగేశ్వరరావును నటుడుగా తీర్చిదిద్దిన వ్యక్తి. సాధన, (రిహార్సలు) చేయించడంలో, నటీ నటులు క్రమ శిక్షణను పాటించేటట్లు చేయడంలోను, నాటక పఠన దశ నుంచి నాటక ప్రదర్శన వరకు అన్ని దశలను అతి చాకచక్యంతో, కట్టుబాటుతో నిర్వహించడంలో అచ్చయ్య మేటి. ప్రజానాట్యమండలి కృష్ణాజిల్లా దళానికి దర్శ కత్వం వహించి అఖండ విజయం సాధించడంతో ఈయనకు యావదాంధ్ర ఖ్యాతి లభించింది. రంగ స్థలంమీద, సినివాలో అతి సమర్థవంతంగా నటించి పేరు పొందాడు. పెత్తందారు నాటకం రచించి, దర్శకత్వం చేపట్టి, పాత్రను పోషించి విజయవంతంగా ప్రదర్శించి మెప్పుపొందాడు.

ఆశాజ్యోతి, ముందడుగు, మాభూమి, అపనింద, పరితాపం, పెత్తందారు, తప్పునాదే మొదలైన నాటకాలకు దర్శకత్వం వహించి, అచ్చయ్య (ముందడుగు), వెంకటరావు (మాభూమి), లాయరు (అపనింద, తప్పునాదే), రైల్వేపోర్టర్ (ఆశాజ్యోతి), పెత్తందారు (పెత్తందారు) మొదలైన పాత్రలలో నటించి కళారాధకుల ఆదరాభిమానాలు చూరగొన్నాడు.

శ్రీ.చ.

అచ్యుత రామరాజు, గణపతిరాజు (1924-2005): రచయిత, నటుడు, దర్శకుడు, విశాఖ నాటకమండలి స్థాపకులలో ముఖ్యుడు. తూర్పు గోదావరి జిల్లా తుని తాలుకా కొనిమేరు గ్రామంలో 1924లో జన్మించాడు. తల్లిదండ్రులు ఛాయ భాస్కరయ్యమ్మ, సాంబమూర్తి రాజు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఏ చదివాడు. తరువాత మదరాసు విశ్వవిద్యా

లయంలో న్యాయశాస్త్రం పూర్తి చేశాడు. ఈయన కొంత కాలం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగినప్పటికీ న్యాయవృత్తిలో స్థిరపడ్డాడు. పాఠశాలలో చదువుతున్నప్పుడే నాటకాల పట్ల అభిరుచి పెంచుకున్నాడు. ఆ అభిమానం ఖడ్గ తిక్కన, బ్రహ్మముడి, వినాయకుడి పెళ్లి, తీర్పు, మధుర వాణి, కల్పన, మహారాజశ్రీ లాంటి నాటకాలు వెలువరించడానికి ఉపకరించింది. ఈ నాటకాలు కేవలం ఆంధ్రరాష్ట్రంలోనే కాదు రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా ప్రదర్శింపబడ్డాయి.

గణపతిరాజు అచ్యుత రామరాజు ఉన్నత పాఠశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడే తకిరీ రాసిన ఆంగ్ల నాటకంలో ప్రధాన పాత్రను పోషించి ప్రిన్సిపాల్ మెప్పును పొంది ప్రథమ బహుమతిని సంపాదించాడు. 1940లో షేక్స్పియర్ రచించిన యాజ్ యు లైకిట్ లో స్త్రీ పాత్రను పోషించాడు. ఆ తరువాత చంద్రగుప్త నాటకంలో చాణక్య, షాజహాన్‌లో షాజహాన్, ఖిల్జీ రాజ్యపతనంలో ఖజీర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌లో చైనులు, తిక్కన, తిమ్మరసు నాటకాలలో వివిధ పాత్రలను పోషించి పి.వి. రాజమన్నారు వంటి ఉద్దండ పండితుల ప్రశంసలందుకున్నాడు. విశాఖ నాటకమండలి ప్రదర్శించిన వివిధ నాటకాలకు ప్రయోక్తగా, దర్శకుడుగా, నటుడిగా వ్యవహరించాడు. రామరాజు సాంస్కృతికోద్యమ కృషితోపాటు వివిధ సంస్థలకు అధ్యక్షులుగా కూడా పనిచేశాడు. శాసన మండలి సభ్యునిగానే కాకుండా ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాలకు సెనేట్ సభ్యులుగా కూడా వ్యవహరించాడు. ఈయన 2005లో విశాఖపట్టణంలో తుదిశ్వాస విడిచాడు.

దాసరి.ఎన్

అచ్యుతరామశాస్త్రి, మల్లాది (1872-1943) : నాటకకర్త, దర్శకుడు, కవి, మైలవరం రాజా ఆస్థాన పండితుడు, విద్వత్కవి, నాటక చక్రవర్తి బిరుదాంకితుడు. ప్రప్రథమాంధ్ర నాటకకర్త కోరాడ రామచంద్ర శాస్త్రి ప్రియశిష్యుడు. బందరులోని గొడుగుపేట కంపెనీ అనే జగన్మోహినీ నాటకసమాజానికి 1903 ప్రాంతంలో వచన నాటకాలు రాసివ్వడంతోపాటు వేషాలు వేయడంతో అచ్యుతరామశాస్త్రి నాటక జీవితం ప్రారంభమైంది. విజయవాడలో హిందూ థియేటర్‌కి రామరాజ్యవియోగం నాటకం రాసిచ్చాడు. ఆ తరువాత మైలవరం రాజా ఆస్థాన పండితుడిగా, మైలవరం కంపెనీ నాటకకర్తగా, దర్శకుడుగా చాలాకాలం నాటక రంగానికి సేవ చేశాడు. మైలవరం కంపెనీకి అఖండ కీర్తి తెచ్చి పెట్టిన ద్రౌపదీ వస్త్రాపహరణ నాటకం రచయిత, దర్శకుడు కూడా ఈయనే. ఉప్పులూరి సంజీవరావు ద్రౌపదిగా, యడవల్లి సూర్య నారాయణ దుర్యోధనునిగా ప్రదర్శించిన ఈ నాటకం, మైలవరం కంపెనీకే గాక అచ్యుత రామశాస్త్రికి కూడా కీర్తి తెచ్చి పెట్టింది.

తెలుగు నాటకరంగంలో చరిత్రను సృష్టించిన సక్కుబాయి నాటకకర్త ఈయనే. ధైతాగోపాలం దర్శకత్వంలో ఈ నాటకం వాడవాడలా ప్రదర్శింపబడి చరిత్రను సృష్టించింది. ద్రౌపది వస్త్రాపహరణంలోని పద్యాలు నన్నయ సభా పద్యాలను తలపింపజేస్తాయి. పండిత పామరుల చేత తలలూపిస్తాయి. ఇక సక్కుబాయి నాటకంలో పరమ భక్తురాలు, పతివ్రత, ఎన్నడో జీవించిన సక్కుబాయి కథను నేటి కాలపు వ్యభిచారిణి కథతో మేళవించి విపర్యయం ఎంతగానో సాధించాడు. ప్రజానీకాన్ని ఈ నాటకం ఉర్రూతలూగించింది. స్వరాజ్య పత్రికలో నాటక కళ మీద వ్యాసాలు ప్రచురించి విమర్శన సాహిత్యానికి దోహదం చేశాడు. అశ్వత్థామ, సుదేవుడు ఈయనకు పేరు తెచ్చిపెట్టిన పాత్రలు. 1922లో విజయనగరం పౌరులు అచ్యుతరామశాస్త్రిని ఘనంగా సన్మానించి 'నాటక చక్రవర్తి' బిరుదు ప్రదానం చేశారు. ఈయన 30 నాటకాలు రచించగా వాటిలో కొన్ని మాత్రమే లభ్యం.

రామరాజ్యవియోగం (1907), రత్నమాల (1909), చంద్రకాంత (1909), సత్యామోద చంద్రోదయం (1909), రామదూత (1914), దౌపదీ వస్త్రాపహరణం (1927), శ్రీకృష్ణలీలలు (1935), భక్త చొక్కా మీళ (1941), అహల్య (1947), సతీసక్కుబాయి (1947),భక్తకుచేల (అముద్రితం) వంటి రచనలే కాకుండా కలివార్త (1900), గడుసు పెండ్లాము (1913), తన్ను (1915), ముద్దు (1915), ఇద్దరు పెండ్లాల ఇబ్బంది(1921), అంతాగమ్మత్తు (1926)మొదలైన ప్రహసనాలను రచించాడు. రామశాస్త్రి 1943లో నిర్యాణం చెందాడు.

శ్రీ.చ.

అచ్యుతరావు, టేకుమళ్ళ (1881-1947) : నాటక సిద్ధాంతవేత్త, సంస్కృతాంగ్ల భాషా పండితుడు, విమర్శకుడు, వాఙ్మయ చారిత్రక పరిశోధకుడు, జానపద వాఙ్మయ ప్రచార పరిశోధనలకు ఆద్యుడు. స్థిరనివాసం రాజమండ్రి. విశాఖపట్టణం జిల్లా పోతన వలస గ్రామంలో కామయ్య, వెంకమ్మ దంపతులకు 1881, ఏప్రిల్ 18న జన్మించాడు.

ఎం.ఏ. పూర్తిచేసిన టేకుమళ్ళ ప్రభుత్వ విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా, పరీక్షాధికారిగా పనిచేశాడు. 1926లో రాసిన ఆంధ్ర నాటకములు– రంగస్థలములు అనే విమర్శ గ్రంథం ఆనాటి ఆంధ్ర నాటకరంగంలో దుమారం రేపింది. ఆంధ్ర

వాఙ్మయ విమర్శలో ఒక నూతన మార్గాన్ని ప్రదర్శించినవాడుగా అచ్యుతరావు గణనీయుడు. ఈయన 1947, ఫిబ్రవరి 12వ తేదీన నిర్యాణం చెందాడు.

శ్రీ.చ.

అటెల్లానా ప్రహసనం : అటెల్లా పట్టణంలో రూపుదిద్దుకొన్న ప్రహసనం కాబట్టి దీనికి అటెల్లానా ప్రహసనం అని పేరు వచ్చింది. కొన్ని కొన్ని సంప్రదాయ పాత్రలు, హాస్యాస్పదమైన సన్నివేశాలలో చిక్కుకోవడాన్ని చిత్రించే ఈ ప్రహసనాలు గ్రామీణ ప్రజానీకానికి ఎక్కువ ఆనందాన్ని కలిగించేవి. ఈ అటెల్లానా ప్రహసన ప్రధాన లక్షణం సంప్రదాయ పాత్రలను నిబంధించడమే. మాకస్, పాలస్, బక్కో అనే విదూషకులు, మాండకాస్ అనే భూతం ఈ ప్రహసనాలలోని ప్రధానపాత్రలు. ఇవన్నీ హాస్య పాత్రలే. తాగుబోతుతనానికీ, అసభ్యతకు విరగబడి నవ్వే ఆ ప్రేక్షకులను నవ్వించడంలో ఈ ప్రహసనం పేరు పొందింది. ఈ ప్రహసనాలు చిన్నవి. పాత్రల సంఖ్య కూడ పరిమితం. మాకస్ ప్రహసనావళి, బక్కో ప్రహసనావళి, ఆడ గాడిద ఈ అటెల్లానా ప్రహసనశాఖకు మచ్చుతునకలు.

శ్రీ.చ.

అడబాల, టి.ఆర్ (జ.1936) : నటుడు, రూపశిల్పి. ఆంధ్ర లలిత కళాసమితిలో స్థాపక సభ్యుడు, రంగస్థలకళల అధ్యాపకుడు. ఈయన 1936, ఫిబ్రవరి 9న జన్మించాడు. తల్లిదండ్రులు సత్యమ్మ, వెంకన్న నాయుడు. నాటకరంగానికి రూప శిల్పిగా సుపరిచితుడు. ఆ శాఖలో లోతుపాతులు కూలంకషంగా, శాస్త్రీయ పద్ధతులలో అధ్యయనం చేసి నైపుణ్యం సంపాదించాడు. జాతీయ స్థాయిలో నాటక విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఆహార్యంలో మెళకువలు బోధించాడు.

అడబాల బాల్య దశ నుంచే నాటకాల్లో వేషాలు వేశాడు. విద్యార్థి దశలో భమిడిపాటి ఇప్పుడు అనే నాటికలో శానయ్య పాత్ర ధరించి శభాష్‌అనిపించుకున్నాడు. 1940 నుంచీ పినిశెట్టి శ్రీరామమూర్తి నిర్వహించిన ఆదర్శ నాట్యమండలి పక్షాన ప్రదర్శించిన పల్లెపడుచు, అన్నాచెల్లెలు తదితర నాటకాల్లో పాల్గన్నాడు. ఆదర్శ నాట్యమండలి నాటకాలకు అప్పట్లో మేకప్ చేస్తున్న మాస్టారు అడబాల జిజ్ఞాసను పసిగట్టి, మేకప్‌లో తొలి పాఠాలు నేర్పి ప్రోత్సహించాడు. ఆనాటి నుంచీ అటు నటన, ఇటు రూపశిల్పం రెండింటినీ నిర్వహిస్తూ వచ్చాడు. మద్రాసులో రైల్వేశాఖలో ఉద్యోగం. కె. వేంకటేశ్వరరావు శిక్షణలో ర.స.న సమాఖ్యలో ఫణి, రాగరాగిణి వంటి ప్రతిష్ఠాత్మక నాటకాలలో పాల్గన్నాడు. పలుచోట్ల ఉత్తమ నటుడుగాను, హాస్య నటుడుగానూ బహుమతులు అందుకున్నాడు. 1966లో సికింద్రాబాదు వచ్చిన అడబాల 1967లో ఆంధ్ర లలిత కళాసమితిని స్థాపించిన వ్యవస్థాపక సభ్యులలో ఒకడయ్యాడు. ఆ సంస్థ ప్రదర్శించిన నాటక నాటికల్లో పాల్గన్నాడు. ఎ.ఆర్. కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నో నాటకాలలో పాల్గన్నాడు. వాటిలో మాలపల్లి ప్రముఖంగా పేర్కొనదగింది. నేరము–శిక్ష, కప్పలు, నీలి తెరలు, లేపాక్షి, ఆశ్రయం, అరణి, వీలునామా మొదలైన నాటకాలు, మానవుడు, పెళ్లి చూపులు, పగ, అమ్మ, రాజీవం, రాతిమనిషి మొదలైన నాటికలు నటుడిగా ఈయనకు పేరు తెచ్చాయి.

ఉస్మానియా,సెంట్రల్ యూనివర్సిటీల్లోని రంగస్థల కళల శాఖలో విజిటింగ్ లెక్చరర్‌గా పని చేశాడు. ఈయన శిక్షణలో అనేక మంది శిష్యులు ఆహార్యంలో నైపుణ్యం సంపాదించారు.

గం.సు.రె.

అడెల్ఫీ రూపకం : రూపక భేదం. లండన్‌లోని పాత అడెల్ఫీ థియేటర్ సంప్రదాయంగా ప్రదర్శించే నాటకం. అడెల్ఫీ థియేటర్ ఆశయం మంచి నాటకం, మంచి నటన. అయితే ఇది నేడు వాడుకలో లేదు. హార్బర్ లైట్సు, వరెస్టు ఉమన్ ఇన్ లండన్ ఈ తీరు నాటకాలకు మచ్చుతునకలు.

శ్రీ.చ.

అతిశయం : నాటక లక్షణం. దీనికి గుణాతిశయమని పేరు. సర్వ సామాన్యమైన గుణాలను చెప్పి ఆ తరువాత అధిక గుణం చెప్పడం అతిశయం. ఉదా. విక్రమోర్వశీయం చతుర్థాంకంలో విరహి పురూరవుడు గజరాజుకూ తనకూ గల సామాన్య గుణాలను తెలిపి ఆ తరువాత తనకు గల ప్రియా విరహం గజరాజుకు లేదని చెప్పడం అతిశయం.

శ్రీ.చ.

అద్భుత రసం : నవ రసాలలో ఒకటి. వీరరస సంజనితం. లోకోత్తర విషయంగాని, వ్యక్తిని గాని, వస్తువును గాని చూసినా, వాటిని గురించి విన్నా, తలవని తలంపుగా కోరిక సిద్ధించినా, ఆశ్చర్యం కలుగుతుంది. విస్మయం స్థాయీ భావంగా గల రసం అద్భుతరసం. వైచిత్ర్య అనే ధాతువు నుంచి అద్భుత పదం జనించింది. అద్భుతరసమే సకల రసాలకు మూలకందమని, దాని నుంచి సకల రసాలు జనించాయని సిద్ధాంతీకరించింది నారాయణుడు. సత్త్వగుణాధిక్యం వల్ల లౌకిక ప్రపంచాన్ని మరిపించే ఒకానొక ఆనందం కలుగుతుంది. అది బ్రహ్మానందం లాంటిది. దీనికి లోకోత్తర చమత్కారం ప్రాణం. చమత్కారం వల్ల మనస్సు విస్తరించుకొంటుంది. ఈ మనో విస్తారమే విస్మయం. అందువల్ల సకల రసాలకు మూలకందం అద్భుత రసం. అద్భుతరసంలోనే తక్కిన రసాలు నిబిడీకృతమై

ఉన్నాయని ఈయన వాదం. ఈ భావంలోనే శక్తి భద్రుడు సంస్కృతంలో అద్భుతరస ప్రధానంగా ఆశ్చర్య చూడామణి అనే నాటకం రచించి అద్భుతరస ప్రాశస్త్యం నిరూపించాడు.

శ్రీ.చ.

అద్భుత రూపక చక్రం (Mystery Cycle) : ఐరోపా ఖండంలో మధ్య యుగాలలో పెంపొందిన నాటకరూపం. ఆదాం నాటక ప్రదర్శన చర్చి ఆవరణలోనే జరిగేది. నాటకం దేశీ భాషలో విరచితమైనా లాటిన్ భాషలోనే భక్తి కీర్తనలు పాడేవారు. ప్రవక్తల వాచికం కూడా లాటిన్ భాషలోనే ఉండేది. చర్చితో సన్నిహిత సంబంధం కలిగిన నాటి నాటకరంగం ప్రజావళి వైపు మొగ్గుతూ ఉండేది. చివరికి నాటకం పూర్తిగా దేశ భాషలలోనే రచించబడుతూ ప్రజల సొత్తుగా రూపొందింది. ప్రజలు ఈ నాటకాలను చూసి ఆనందించాలని కుతూహలపడసాగారు. అందువల్ల అనేక అద్భుత రూపకాలు ఆవిర్భవించాయి. ఇలా ఆవిర్భవించిన పౌర నాటకరంగంలో పట్టణ, గ్రామీణ సామాన్య పౌరులు, చేతివృత్తుల వారు వేషాలు వేయడానికి దిగారు. ఇంగ్లాండులో 1311 లో ఈ నాటక ఖండాలు ప్రదర్శించడానికి జరిపిన నాటకోత్సవం తరువాత, వృత్తి సంఘాలే నాటక ప్రదర్శనలను చేపట్టాయి. ఫ్రాన్సులో దొరికిన 16వ శతాబ్దపు పత్రాలను బట్టి ఆనాటి నటులు హస్తకళాకారులు, యంత్ర కార్మికులు. అయితే నాటక రంగాన్ని తీవ్రవిషయంగానే వారు పరిగణించారు. అవసరమైతే తెల్లవార్లూ సాధన చేసేవారు. ఈ అద్భుత రూపక ప్రదర్శనంలో అర్చక నాటక సూత్రాలనే ఎక్కువగా అనుసరించారు. ప్రేక్షకుల ముందు అలంకరించిన వేదికలను సరళరేఖలోగాని, అర్ధచంద్రాకారంలోగాని, వృత్తాకారం లోగాని అమర్చేవారు. పన్నెండవ శతాబ్దం నాటికే ఫ్రాన్స్‌లో ఈ విధానం పరాకాష్ఠకు చేరింది. రంగస్థలం మీద ఒకేసారి నాలుగైదు వేదికలు అమర్చేవారు. ఇంగ్లాండు మొదలైన చోట్ల ఈ వేదికలకు చక్రాలు అమర్చి ప్రేక్షక సమూహాల దగ్గరకు తీసుకు వెళ్ళేవారు. ఫ్రాన్సులో యంత్రాలు, 'ఎఫెక్ట్సు' ప్రవేశ పెట్టారు. స్వర్గ నరకాల 'ఎఫెక్ట్సు' ఇంద్రజాలం అనిపించేవి. దేవదూతలు, సత్యం మొదలైన పాత్రలు ఆకాశం మీద నుంచి దిగి వచ్చినట్లు చూపేవారు. వారు నరకంలో నుంచి మొసలి మీద ఎక్కి లూసిఫర్ పైకి రావడం, మోసెస్ చేతికర్ర హఠాత్తుగా పుష్పించడం, నీరు సారాగా మారడం, గ్రహణం, భూకంపం మొదలైన చిత్ర విచిత్రాలు రంగస్థలం మీద చూపెట్టేవారు. ఈ నాటకాలు చారిత్రక, సాంకేతిక నాటకాలు కావడం, నీతి ప్రచారం ఆశయం కావడం వల్ల వీటిలో ప్రతీక తీవ్రరూపం దాల్చింది.

యూరప్ దేశాలన్నిటిలోనూ ఈ నాటకాల సామాన్య లక్షణాలు ఒకటే అయినా, ఒక్కొక్కదేశంలో ఒక్కొక్క లక్షణానికి ప్రాధాన్యతనిచ్చారు. జర్మనీలో వింతలు, భయం కొల్పే పిశాచ రంగాలు, యూదులను తూర్పారపట్టే రంగాలు, బైబిల్‌లోని పాత్రల మాటున సమకాలీన వ్యక్తులను మోటు హాస్యంతో పరిహసించే రంగాలను ఎక్కువగా మెచ్చుకునేవారు. ఇవి సమకాలీన జీవితాన్ని ప్రతిబింబింపజేసేవి. ఈ వాస్తవికతా ధోరణికి క్రమేణా ప్రాధాన్యం వచ్చింది. ఉదాహరణకు రెడింటన్ ఈస్టర్‌ప్లే, వియన్నా ఈస్టరు ప్లే, హెసియన్ కిస్మస్ ప్లే. విశ్వంలోని సమస్యలను బహిర్గతం చేయడమే వాటి లక్ష్యం. ఈ లక్షణం మధ్య యుగాల అద్భుత నాటకాలలో బాగా గోచరిస్తుంది.

శ్రీ.చ.

అధమ ప్రకృతి : 1. పురుష ప్రకృతి భేదం, 2. స్త్రీ ప్రకృతి భేదం, 3. వేశ్య.

1. పురుషప్రకృతి భేదం : కర్కశంగా మాట్లాడేవాడు, దుశ్శీలుడు, కుటిలుడు, అల్పబుద్ధి, ఆవేశపరుడు, ఘాతకుడు, మిత్రద్రోహి, గృహకల్లోల కారకుడు, దుష్టుడు, ఉద్ధత వాక్యోపేతుడు, ఉపకారం మరిచేవాడు, అలసుడు, స్త్రీలోలుడు, కలహప్రియుడు, కొండెగాడు, పాపిష్ఠి, పరద్రవ్యాపహారి, జ్ఞాన విహీనుడు.

2. స్త్రీ ప్రకృతి భేదం : చలించనిది, మృదుభావంకలది, నవ్వుతూ మాట్లాడేది. మాట్లాడడంలో ప్రజ్ఞ ఉన్నా గురువుల విషయంలో లజ్జాన్విత, వినయాన్విత, రూప అభిజన, గాంభీర్య, ధైర్య సంపన్న, రూప అభిజన మాధుర్య స్వభావి.

3. వేశ్య : స్థానాస్థానాల భేదం పాటించకుండా కోపం వహించేది. దుశ్శీల, అతి మానుషం గలది, చపల, కఠిన స్వభావ, దీర్ఘరోష.

శ్రీ.చ.

అధముడు : నాయక భేదం. స్త్రీ అవమానించినా సిగ్గులేకుండా ఆమెను సమీపించేవాడు. ఆ స్త్రీ అన్య పురుషులతో స్నేహం చేసినా తన స్నేహాన్ని మరవ లేకుండడం. మిత్రులు వారించినా, ఆమె పరపురుష స్నేహం ప్రత్యక్షంగా చూచినా ఇంకా ఎక్కువగా ప్రేమించడం అధమ నాయకుడి లక్షణాలు. ఉదాహరణకు మృచ్ఛకటిక లో శకారుడు.

శ్రీ.చ.

అధిదేవతలు : 1. జర్జరాది దేవతలు, 2. నాట్య మండప అధిదేవతలు 3. రసాధి దేవతలు

1. జర్జరాది దేవతలు : తల కణుపు (మొదటి కణుపు) లో బ్రహ్మ, రెండవ కణుపులో శంకరుడు, మూడవ కణుపులో విష్ణువు, నాల్గవ కణుపులో స్కంధుడు, అయిదవ కణుపులో శేష, వాసుకీ, తక్షకుడు అధిదేవతలు.

2. నాట్య మండప అధిదేవతలు : సర్వ మండపానికి చంద్రుడు, దిశలకు లోకపాలురు, మూలలకు మరుత్తులు, నేపథ్య భూమికి మిత్రుడు, అంబరానికి వరుణుడు, వేదికకు అగ్ని, ఖాండ వాజ్యాలకు మేఘాలు, ప్రధాన స్తంభాలు నాల్గింటికి చతుర్వర్ణ అధిష్ఠాన దేవతలు, ఇతర స్తంభాలకు ఆదిత్య రుద్రులు,

ధారణులకు భూతాలు, ఆయా శాలలకు అప్సరసలు, వేశ్యాతనానికి యక్షిణులు, మహీస్పృష్టానికి మహోదధి, ద్వార శాలలకు కాలకృతాంతులు, ద్వార పత్రానికి లక్ష నాగులు, దేహలికి యమ దండం, దేహలి పైభాగానికి త్రిశూలం అధిష్టాన దేవతలు.
3. రసాధి దేవతలు : శృంగారానికి విష్ణువు, హాస్యానికి ప్రమథులు, కరుణానికి యముడు, రౌద్రానికి రుద్రుడు, వీరానికి మహేంద్రుడు, భయానికి కాలుడు, బీభత్సానికి మహాకాలుడు, అద్భుతానికి బ్రహ్మ, శాంతానికి పరబ్రహ్మ అధిదేవతలు.

శ్రీ.చ.

అధిబలం : 1. గర్భ సంధ్యంగం, 2 . వీధ్యంగం.
1. గర్భ సంధ్యంగం : అధిబలం, అతి సంధానం అంటే వంచన. కార్యసిద్ధి కోసం చేసే మోసమే అధిబలం. ఉదాహరణకు ధర్మవరం రామకృష్ణమాచార్యుల 'విషాదసారంగధర' నాటకం ద్వితీయ యాంకం ప్రథమ రంగంలో చిత్రాంగి సారంగధరునిపై పగ దీర్చుకొనడానికి రాజుతో సారంగధరుడు తన్ను బలాత్కా రించాడని చెప్పి వంచించడం. 2. వీధ్యంగం : స్పర్థ వల్ల ఒకరిని మించి ఒకరు అధికోక్తులు పలకడం. ఉదాహరణకు తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగం తృతీయాంకంలో కర్ణాశ్వత్థామల సంవాదం. స్పర్థ వల్ల తమ తమ సామర్థ్యాలను ప్రకటించటం అధిబలం.

శ్రీ.చ.

అధి వాస్తవికతా వాదం (Surrealism): ఐరోపా ఖండంలో 1920 ప్రాంతంలో కళారంగంలో బయలుదేరిన వాదం. ఇది విధ్వంసక వాదానికి (డాడాయిజం) చాలా సన్నిహితంగా ఉంటుంది. రెంటికీ భేదం కనిపెట్టడం కష్టం. ఈ వాదాన్ని లేవదీసిన ప్రముఖుడు అండ్రే బ్రెటన్. దీనిని ఇలా నిర్వచించాడు: "ఇది శుద్ధ మనస్తత్వ స్వయం చలనశక్తి. హేతువాదానికి లోబడని, రసానికి నైతిక పూర్వాక్రమణలేని నిజమైన ఆలోచనా క్రమం మాటలలోను, ఇతర విధానాల ద్వారాను వ్యక్తం చేయడం దీని ఉద్దేశం". అయితే దీని ప్రభావం నాటకరంగం మీద ఎక్కువగా పడలేదు.

శ్రీ.చ.

అధృతి : ప్రవాసస్మర దశ. 'అన్నిటను రాగములేమి అధృతి' (ఆం. సా. ద. 3-222). ఉదాహరణకు పానుగంటి లక్ష్మీనరసింహారావు 'రాధాకృష్ణ నాటకం' చతుర్థాంకంలో... మధుర : (ఏడ్చుచు) .... కేశములకు తైల సంస్కారం లేక యొడలికి జందనాది చర్చలు లేక, కంఠమునకు బుష్పదామాద్య లంకారములు లేక, తనువునకు పరిశుభ్రమైన వసనమైన లేక రాత్రింబగళ్ళు నిద్రాహారములు లేక, సర్వసంగ పరిత్యాగమును జేసి నటువంటి స్థితి 'అధృతి'.

శ్రీ.చ.

అనసూయ, పువ్వుల : రంగస్థల, సినీనటి. కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా మేడూరు గ్రామంలో జన్మించింది. పదిహేను సంవత్సరాల వయస్సులోనే రంగస్థల ప్రవేశం చేసి వేలాది నాటకాలలో వైవిధ్యం గల పాత్రలు పోషించి పండిత పామరుల మన్ననలు అందుకొన్న నట విదుషీమణి. దైతాగోపాలం శిక్షణలో 'చంద్ర మతి' పాత్ర ధరించి యావదాంధ్ర కీర్తిని ఆర్జించింది. చక్కని వాచికం, మధురమైన కంఠం, అద్భుతమైన నటనా కౌశల్యం ఆమె సొత్తు. ద్రౌపది, చింతామణి, మండోదరి, కైక, యశోద, సత్య, సక్కుబాయి, సావిత్రి మొదలైన పాత్రలు ధరించింది. ఆనాటి ప్రసిద్ధ నటులందరి సరసన నటించి, సహనటుల ప్రశంసలు పొందిన నటీమణి అనసూయ. రాజేశ్వరి, పూర్ణిమ ఈమె సమకాలికులు.

అనసూయ కళాసేవను గుర్తించి ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఈమెను ఘనంగా సన్మానించింది. ఆంధ్రదేశంలో ప్రసిద్ధ సంస్థలెన్నో అనసూయను సత్కరించాయి. అలనాటి రైతుబిడ్డ, మాలపల్లి, తెనాలి రామకృష్ణ, చండిక వంటి చలనచిత్రాలలో నటించి, ప్రేక్షకాదరణను చూరగొన్న అసమాననటి అనసూయ.

అయ్యదేవర

అనుకరణ: ఇంగ్లీషులో Imitation అనీ, తెలుగులో అనుకృతి అనీ అంటారు. మానవుడు పుట్టినది మొదలు తన చుట్టూ ఉన్న మానవులను పరిశీలిస్తున్నాడు. వారిచేష్టలను చూస్తున్నాడు. మాటలను వింటున్నాడు. ఆలోచిస్తున్నాడు. తక్కిన వారి లాగానే కూర్చోవాలని, నిలబడాలని, నడవాలని, మాట్లాడాలని ఉత్సహించి, అలా సాధనచేసి కృతకృత్యు డవుతున్నాడు. అయితే ఆయా చేష్టలు, మాటలు మానవునికి స్వభావ సిద్ధంగా అలవడినట్లే కనిపిస్తాయి గాని నేర్చుకున్నకృతకచేష్టలు లాగా కనిపించవు. మానవునికీ, మానవునికీ చేష్టలలోమాటలలో భేదం పొడగడుతుంది. దీనిని బట్టి మానవుడు తాను చూసిన చేష్టలను గుడ్డిగా అనుకరించకుండా ఆ క్రియలను మాత్రమే నేర్చుకొని, తన శరీరానికి అనుగుణంగా మలచుకొని, వాటిని అవలంబించి, ప్రత్యేక మానవుడుగా రూపొందుతున్నాడు. దీనిని బట్టి అనుకరణ, అంధానుకరణగాక సృజనాత్మక అనుకరణ అని స్పష్టమవుతుంది. లోకంలో దుఃఖపూరితాలైన సంఘటనలు చూసి విచారిస్తాం. కాని ఆ సంఘటనలే కవిత్వంలో, నాటకంలో చదివినపుడు , చూసినపుడు ఆనందిస్తాం. దీన్నిబట్టి కూడా అనుకరణ

లోకానికి యథాతథ అనుకరణ కాదని తెలుస్తోంది. ప్రాచ్య పాశ్చాత్య లాక్షణికులు, విమర్శకులు, కవులు అనుకరణను పునః సృష్టిగానే పరిగణించారు. పాశ్చాత్యులలో అరిస్టాటిల్ రచించిన కావ్యాలంకార శాస్త్రం (పొయిటిక్స్) అనే గ్రంథానికి వ్యాఖ్య రచించిన బుచర్, "A work of art reproduces its original not as it is in itself but as it appears to the senses" (Aristotle's Theory of Poetry, P, 127.)

బుచర్ పండితుడే అందులోనే "Imitation so understood is a creative act" (అనుకరణ సృజనాత్మక క్రియ) అన్నాడు. దీనివల్ల కళ యథాతథ అనుకరణ గాదని, సృజనాత్మకమైనదని తెలుస్తోంది. అనుకరణ రెండు విధాలు : 1. ఉన్నది ఉన్నట్టుగా వర్ణించడం. ఇది బాహ్య స్వరూపానికి సంబంధించింది. 2. ఉన్న దానిని ఉన్నట్టుగా గాక ఎలా ఉండాలో అలా వర్ణించి చెప్పడం. ఇది ఆంతర్యానికి సంబంధించింది.

శ్రీ.చ.

అనుకరణ నటన: నటనా భేదం. పాత్ర బాహ్య రూపాన్ని సమగ్రంగా చిత్రించుకోవడానికి ఈ విధానంలో నటుడు పాత్ర లాగానే జీవిస్తాడు. పాత్ర అవస్థను తాను అనుభవిస్తాడు. ఆ చిత్రాన్ని తన మీద ఆరోపించుకొని, దానిని సుశిక్షిత కండరాల సహాయంతో ఆవిష్కరిస్తాడు. అప్పుడు నిర్ణయించుకొన్న బాహ్య చేష్టలు, స్వర భేదాలు, ముఖ కవళికలు జ్ఞాపకం పెట్టుకొని వేషం వేసినపుడల్లా ఉద్వేగం పొందకుండా వాటిని తెచ్చి పెట్టుకుంటాడు. ప్రక్రియా విధానం ఒకసారి నిర్ణయించుకున్న తరువాత తిరిగి అనుభూతి పొందనవసరం లేదని వీరి వాదం.

శ్రీ.చ.

అనుకూలుడు : శృంగార నాయకులను దక్షిణ నాయకుడు, శఠుడు, ధృష్టుడు, అనుకూలుడు అని నాలుగు విధాలుగా విభజించారు. ఒక స్త్రీ పట్ల ప్రేమ నిలిపే వ్యక్తి అనుకూల నాయకుడు అంటే ఏకపత్నీ వ్రతుడు.

అనుకూల నాయకులు నాలుగు విధాలు - ధీరోదాత్తుడు, ధీరలలితుడు, ధీరోద్ధతుడు, ధీరశాంతుడు.

శ్రీ.చ.

అనుభావం : రస సంబంధి. భావ భేదం. విభావానికి కార్యరూపం అనుభావం. నాయికా నాయకుల మనస్సులలోని భావాలను చతుర్విధాభినయాలద్వారాబహిర్గతం చేసి, అనుభవ యోగ్యంగా చేసేది అనుభావం. అంటే విభావాలైన నాయికా నాయకుల చేష్టలు ముఖ వికాసం, భ్రూవిక్షేపం, సాత్త్వికాభినయాంశాలు, రోమాంచం మొదలైన వానిని ప్రదర్శించడం.

శ్రీ.చ.

అనుమానం : గర్భ సంధ్యంగం. దీనిని అభ్యూహం అని కూడా అంటారు. ఏదైనా ఒక సూచనను బట్టి గాని, గుర్తును బట్టి గాని విషయాన్ని ఊహించడం లేక అనుమానించడం. ఉదా॥ రత్నావళి తృతీయాంకంలో సాగరిక మీద తన ప్రేమవల్ల వాసవదత్త తనువు చాలిస్తుందేమోనని వత్సరాజుకు కలిగిన అనుమానం.

శ్రీ.చ.

అనుమితి వాదం : రససంబంధి. రస విషయంలో శంకుని వాదం. రసము నట నిష్ఠమనే ఈ వాద సారాంశం.

శ్రీ.చ.

అనురక్త : నాయికా భేదం. ప్రియుని గుణాలను సఖులతో ముచ్చటించడం, అతనికి ధనం పంపడం, అతని మిత్రులను పూజించడం, శత్రువులను ద్వేషించడం, అతని వద్దకు తన సఖులు వెళ్ళి వస్తుంటే సంతోషించడం, అతని సమాగం కోరడం, అతనితోపాటు సుఖదుఃఖాదులు అనుభవించడం మొదలైన గుణాలు గల స్త్రీ అనురక్త.

శ్రీ.చ.

ఆన్వ్.

అనువిల్, జాన్ (1910-1987) : అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఫ్రెంచ్ నాటక కర్త. రెండవ ప్రపంచయుద్ధం తరువాత ఫ్రెంచ్ నాటకరంగం మీద బల మైన ప్రభావం చూపించిన రచయిత.ఈయన నాట కాలు సందేశాత్మకాలు. రంగ స్థలం అంటే ఈయనకున్న ప్రీతినీ, నటులన్నా, గృహిణులన్నా, ఉంపుడు గత్తెలన్నా, విశ్వవిద్యాలయపండిత భిషక్కులన్నా, ప్రభుత్వఉద్యోగులన్నా ఆయన కుండే ఏవగింపుని ఈయన నాటకాలు ప్రకటి స్తాయి. అనువిల్ నాటకాలలో అంతర్నాటకం, పూర్వ కథా కథనాలు, భావి కథా సూచనలు, పాత్రల మార్పిడి మొదలైనవి విశిష్ట లక్షణాలు.

న్యాయశాస్త్రం అభ్యసించి కొద్దికాలంపాటు ఎడ్వర్టైజ్మెంట్ రంగంలో పనిచేశాడు. 18వ ఏట జీన్ జిరాదో రచించిన సీగ్ఫ్రీడ్ నాటకం చూసి, రంగస్థలోచితమైన, కవితా మయమైన భాష ఎలా ఉండాలో గుర్తించాడు. అదే అటు తరువాత ఆయన జీవిత మార్గాన్ని నిర్దేశించింది. కొద్దికాలంపాటు నటుడూ, దర్శకుడూ అయిన లూయీ జొవెట్ వద్ద కార్యదర్శిగా పని చేశాడు.

అనువిల్ రచించిన మొదటి నాటకం లా హెర్మీన్ (1932). తరువాత 1937లో లా వాయేజర్ శాన్స్ బాగేజ్ (లగేజీ లేని ప్రయాణికుడు), 1938లో లా సేవేజ్ అనే నాటకాలు రచించడంతో అనువిల్ సుప్రసిద్ధుడయ్యాడు.

'స్వాభావికవాదాన్నీ' (**Naturalism**) 'యథార్థవాదాన్నీ' (**Realism**) త్రోసిరాజని అనువిల్ 'నటనావాదాన్ని' (**Theatricalism**) ఆదరించాడు. భావనకూ, కవితకూ రంగస్థలం మీద తిరిగి పట్టం గట్టాడు.

లా ఇన్విటేషన్ ఔ చాటో ('చంద్రుని చుట్టూ వలయం' 1947) అనే నాటకంతో అనువిల్ రచనలు మరింత గాంభీర్యాన్ని సంతరించుకున్నాయి. 1950-60 మధ్య అనువిల్ రచించిన నాటకాలలో రాజకీయ చైతన్యం ఎక్కువగా కనిపిస్తుంది. *పవర్ బిటోస్, ఔ లె డివెర్ డి టెటెస్* (1956) ఇందుకు చక్కని ఉదాహరణ. 1968-70 మధ్య 'అసంగతవాద' (**Absurdism**) నాటక రచయితలైన యూజీన్ అయొనెస్కో, శామ్యూల్ బెకెట్‌లతో పోల్చి చూస్తే అనువిల్ నాటకాలు పాతబడిపోయినట్లు కనిపిస్తాయి. 1968లో ఆయన రచించిన *లె బౌలంగెర్, ఎత్ లె పెతిత్ మిత్రోన్* (ది బేకర్స్ వైఫ్ అండ్ ది బేకర్స్ బోయ్) అనే నాటకానికి ప్రజలు ప్రతిస్పందించలేదు. అయితే ఆ తరువాతి దశాబ్దిలో ఆయన రచించిన *చెర్ ఆండోయ్‌నె* (1969), *ఔ లామౌర్ రతే* (*ది లవ్ దట్ ఫెయిల్‌డ్* - 1971), *లెస్ పాయిసన్స్ రోజెస్ ఔ, మొన్‌పెరె, చె హెరోస్* (*గోల్డ్ ఫిష్* - 1970), *నె రెవిలిజ్ పస్ మదామ్* (*డూ నాట్* అవేకెన్ ది లేడీ - 1970) *లె డైరెక్టర్ డి లపెరా* (1972), లారె స్టేషన్ (ది అరెస్ట్ - 1975), *లె సెనేరియో* (1976), *వైవ్ హెన్రీ - IV* (1977), *ల చులటే* (ది ట్రౌసర్స్ - 1978) నాటకాలు అద్భుతమైన జనరంజక శక్తి గల నాటక రచయితగా అనువిల్ స్థానాన్ని సుస్థిరం చేశాయి.

ఇ.నా.

అన్యాపదేశం : భావవ్యక్తీకరణ సంబంధి. కావ్యాలలో కవి భావాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అభివ్యక్తం చేయడం జరుగుతుంది. కొన్ని సమయాలలో భావాన్ని సూటిగా వ్యక్తం చేస్తున్నట్టు కనబడినా దాని అంతరార్థం వేరుగా ఉంటుంది. ఒకరిని గురించి ప్రస్తావిస్తున్నట్టు బాహ్యంగా స్ఫురించినా, ఆ ప్రస్తావన వేరే వ్యక్తికి అన్వయించే విధంగా ఉండవచ్చు. దీనినే మనం అన్యాపదేశం అంటాం. ఈ పద్ధతిలో పద్యాలూ, నాటకాలూ ఎన్నో వచ్చాయి. ఉదా. మాతృదాస్య విమోచనం (1924) అనే పద్య నాటకంలో కథ పౌరాణికమైనా దాని అంతరార్థం భారత జాతి దాస్య విమోచనమే. కాళ్ళకూరి నారాయణరావు రాసిన పద్మవ్యూహం (1919) ప్రథమాంకంలో శ్రీ కృష్ణుడు అర్జునునితో ఇలా అంటాడు:

తే. రాజ్యమెల్లను బరుల కర్పణ చేసి
మగతనము చంపు కొని కీర్తి మాపుకొనియ
హర్నిశలు పొట్టకొరకు దాస్య మొనర్చు
కంటె మన జాతికింక గళంకంబు గలదె.?

పారతంత్ర్యాన్ని గురించి సామాజికులకు గుర్తుచేసి, దేశభక్తిని జాగృతం చేయడమే కవి మనోభావమని పద్యం వినగానే స్ఫురిస్తుంది. బిపిన్ చంద్రపాల్ సభలో చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆశువుగా చదివిన ఈ పద్యం అన్యాపదేశం కోవకు చెందినదే.

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పిదుకుచున్నారు మూతులు బిగియగట్టి.

గం.సు.రె.

అన్యాపదేశ రూపకం : మానవునిలోని గుణగణాలను పాత్రలుగా చేసి అన్యాపదేశంగా నీతిని బోధించడమే ఈ రీతి రూపకాల ప్రధాన లక్షణం. సంస్కృత ప్రబోధ చంద్రోదయం దీనికి మచ్చుతునక. దీనిలోని పాత్రలు ప్రవృత్తి, నివృత్తి, అహంకారం, వివేకం, మోహం, శాంతి, మతి, శ్రద్ధ మొదలైనవి.

శ్రీ.చ.

అన్యోఢ : పరకీయ. నాయికాభేదం. ఒకరిని వివాహమాడి వేరొకనితో సంభోగించడానికి ఇష్టపడేది అన్యోఢ. ఇటువంటి స్త్రీనే పరోఢ అని కూడా అంటారు. అన్యోఢను క్షుద్ర కావ్యాలలో చిత్రించాలి గాని సత్కావ్యాలలో ముఖ్యంగా దృశ్య కావ్యాలలో చిత్రించడం నిషిద్ధం.

శ్రీ.చ.

అపటీక్షేపం: నాటక ప్రయోగ సంబంధి. అపటీ అంటే తెర, ఆక్షేపం అంటే తొలగించడం. దీనినే పటాక్షేపం అని కూడా అంటారు. తెరను తొలగించుకొని పాత్ర ప్రవేశించడం అని అర్థం. నేపథ్యంలో పాత్ర ఉండి, రంగస్థలం మీద కార్యకలాపాల్ని కనిపెట్టి చూస్తూ, తగిన సమయంలో హఠాత్తుగా, అసూచితంగా రంగస్థలం మీదికి ప్రత్యక్షమవడం.

శ్రీ.చ.

అపవారితం: నాట్యోక్తి. నియత ప్రకాశ భేదం. వాచిక చిత్రాభినయం. రహస్య భాషణం. అపవారితంగా, అపవారించి, రహస్యంగా అనే పదాలను పర్యాయపదాలు గానే నాటక రచయితలు వాడుతూ వచ్చారు.

రంగస్థలం మీద చాలా పాత్రలు ఉన్నప్పుడు అందులో ఒక పాత్ర ఇంకొక పాత్రతో ఇతర పాత్రలకు వినిపించకుండా కాస్త ఎడంగా వెళ్లి రహస్యంగా మాట్లాడడం అపవారితం లేక రహస్య భాషణం. ఉదా॥ అభిజ్ఞాన శాకుంతలం ద్వితీయాంకం చివర రంగస్థలం మీద దుష్యంతుడు, విదూషకుడు, ఇద్దరు ఋషికుమారులు ఉన్నారు. ఋషికుమారులకు వినిపించకుండా దుష్యంతునితో విదూషకుడు రహస్యంగా మాట్లాడడం.

శ్రీ.చ.

అప్పారావు, ఎం.ఆర్ (1915-2003) : విద్యావేత్త, ఆంధ్ర నాటక కళాపరిషత్తు అధ్యక్షుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు. 1915, మార్చి 21న నూజివీడు జమిందారీ కుటుంబంలో జన్మించాడు. తల్లి రామయ్యమ్మారావు, తండ్రి కళాప్రపూర్ణ మేకా వేంకటాద్రి అప్పారావు. సాంస్కృతికరంగ వికాసం కోసం కృషి చేసిన కుటుంబంలో పుట్టిన అప్పారావు విద్యాభ్యాసం నూజివీడు, మచిలీపట్నం నోబుల్ కళాశాల, మద్రాసు క్రైస్తవ కళాశాల, ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులో సాగింది. ఈయన శాసనసభ్యుడుగా, సాంస్కృతిక శాఖామాత్యుడుగా పనిచేశాడు. ఎం.ఏ వరకు చదువుకున్న అప్పారావు తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబించే ప్రాచీన గ్రంథాలను ముద్రించి, తక్కువధరకు అమ్మే విషయంలో ప్రభుత్వాన్ని ఒప్పించడంలో కృతకృత్యుడయ్యాడు. రచయితగా గీత గోవిందం ను ఇంగ్లీషులోకి అనువదించాడు. ఆంధ్రజాతి సంస్కృత చరిత్ర, బ్రహ్మర్షి వెంకటరత్నం నాయుడు జీవిత చరిత్ర, చంద్రగుప్త నాటకాన్ని రచించాడు. యాంటీగని గ్రీకు నాటకాన్ని ఉమర్ ఖయ్యాం గీతాలను తెలుగులోకి అనువదించాడు. 1944 నుంచి ఆంధ్ర నాటక కళాపరిషత్తు అధ్యక్షుడుగా ఉండి ప్రయోగ నాటకాలను ప్రోత్సహించాడు. పరిషత్తు నిర్వహించే నాటక పోటీలకు సంబంధించిన నియమావళిని రూపొందించాడు. పోటీలో పాల్గొనే నాటకం అయిదు సంవత్సరాలలోపు రచించినదై ఉండాలనీ, స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలనీ, నాటకంలోని ఇతివృత్తం సమకాలీనమైనదిగా ఉండాలనీ నిబంధనలను రూపొందించడంవల్ల కొత్త నాటకాలు, రచయితలు నాటక రంగానికి పరిచయం కావడం జరిగింది. సంగీత నాటక అకాడమీ తరపున కూచిపూడి నాట్య సదస్సు సంచిక, 'నాట్యకళ' మాసపత్రికవెలువడటానికి కృషిచేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న కాలంలో 'లలిత కళలు' విభాగాన్ని ప్రారంభించి చిత్రకళాభ్యుదయం కోసం పాటుపడ్డాడు. సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేసిన అప్పారావు 2003, జనవరి 31న మరణించాడు.

[redacted]

దాసరి.ఎస్.

అప్పారావు, కోట: (చూ. రావుజీ)

అప్పారావు, గురజాడ వెంకట (1862-1915) : నాటకకర్త, సాహిత్యవేత్త, వ్యవహారిక భాషావాది. విశాఖ జిల్లా, ఎలమంచిలి తాలూకా, రాయవరం గ్రామంలో 1862, సెప్టెంబరు 21న జన్మించాడు. తండ్రి వెంకట రామదాసు, తల్లి కౌసల్యమ్మ. అప్పారావు బాల్యం గులివిందాడ, ఎలమంచిలి, రాయవరాల్లో గడిచింది. అప్పారావుకు సంస్కృతాంధ్ర, ఆంగ్ల భాషలు నేర్పిన గురువు వెలువల రామమూర్తి. పదేళ్ళ వరకు చీపురుపల్లిలో అప్పారావు చదువు కున్నాడు. 1872లో విజయనగరం మహారాజా వారి ఆంగ్ల కళాశాలలో విద్యార్థిగా చేరాడు. గిడుగు రామమూర్తి పంతులు ఈయనకు సహాధ్యాయులు. నాటి ప్రిన్సిపాల్ చంద్రశేఖర శాస్త్రి అప్పారావు ప్రతిభను గుర్తించి భాషా సార స్వతాలలో మంచి పాండిత్యం అలవడేటట్లు చేశాడు.

బి.ఎ పూర్తికాకముందే 1884లో నెలకు పాతిక రూపాయల జీతం మీద మహారాజా వారి కళాశాలలో గురజాడ అసిస్టెంటుగా చేరాడు. ఆ ఉద్యోగం మనస్కరించక తిరిగి చదువులో ప్రవేశించాడు. పట్టభద్రుడైన తరువాత 1887లో డిప్యూటీ కలెక్టర్ కచేరీలో హెడ్ గుమాస్తాగా చేరాడు. కాని ఆనంద గజపతి అప్పారావును కళాశాలలో నెలకు నూరు రూపాయల జీతం మీద 1891లో అధ్యాపకుడిగా నియమించాడు. ఎఫ్.ఎ., బి.ఎ. తరగతులకు తత్త్వ శాస్త్రం, ఇంగ్లీషు, సంస్కృత సాహిత్యచరిత్ర, వ్యాకరణం, గ్రీకు, రోమను చరిత్రలు బోధించాడు. 1896లో ఆనందగజపతి అప్పారావును సంస్థాన శాసన పరిశోధకునిగా నియమించాడు. ఆనందగజపతి అనంతరం వారి సోదరి రీవా మహారాణికి గురజాడ ఆంతరంగిక కార్యదర్శిగా 1898 జులైలో నియమింపబడ్డాడు.

మెట్రిక్యులేషన్ చదివే రోజులలోనే కోకిల మీద ఇంగ్లీషులో పద్యాలు రచించి ఆనందగజపతి దృష్టినాకర్షించాడు. పట్టభద్రుడు కాకమునుపే 1883లో ఇంగ్లీషులో సారంగధర అనే పద్య కావ్యం రచించి కలకత్తాలోని పత్రికా సంపాదకుడు శంభుచంద్ర ముఖర్జీ ప్రశంసలకు పాత్రుడయ్యాడు.

ఆ తరువాత కన్యాశుల్కం నాటకం 1892లో రచించి, 1897, జనవరి 1న దీని ప్రథమ ముద్రణకు పీఠిక రాశాడు. 1909లో కొన్ని అంకాలు మార్చి రాశాడు.

1906లోనే కొండుభట్టీయం అనే సాంఘిక నాటకం రచించాడు. ఆ సంవత్సరమే ముత్యాల సరాలు అనే గేయ ఖండ కావ్యం రచించి వాల్మీకి అనే పేరు తెచ్చుకున్నాడు. 1911లో రెండవ అంకం రాసి ప్రచురించలేదు. తెలుగు ప్రజాహృదయాలలో నాటుకుపోయి బహుళ ప్రచారంలో ఉన్న దేశభక్తి గేయాన్ని (దేశమును ప్రేమించుమన్న) 1910లో రచించాడు.

ఇవిగాక మీ పేరేమిటి, మెటిల్డా, దిద్దుబాటు, పెద్ద మసీదు, సంస్కర్త హృదయం అనే రసగుళికల్లాంటి చిన్న కథలు రచించాడు. లవణరాజు కల, పూర్ణిమ, కన్యక, దేశభక్తి, నీలగిరి పాటలు, సుభద్ర మొదలైన ఖండకావ్యాలు రచించాడు. 'ప్రకాశిక' అనే తెలుగు పత్రికకు కొంతకాలం సంపాదకత్వం వహించాడు. వ్యవహారిక భాషా వ్యాప్తికి ఆంధ్ర సాహిత్య సంఘం స్థాపించాడు.

సాంఘిక సంస్కరణోద్యమాన్ని పురోగమింప జేయడానికి, నాటకరంగానికి తెలుగు భాష అనువు కాదనే సామాన్య దురభిప్రాయాన్ని పోగొట్టడానికి, వాస్తవిక జీవితం నుంచి సమకాలీన ఇతివృత్తాన్ని స్వీకరించి వాడుక భాషలో అప్పారావు రచించిన అపూర్వ నాటకం కన్యాశుల్కం.

1897లో ప్రథమముద్రణకు నోచుకున్న ఈ నాటకం 1892 ఆగస్టులోనే విజయనగరంలో జగన్నాథ విలాసినీ నాటక సమాజం ప్రదర్శించింది. పత్రికలవారు, సాహితీవేత్తలు ఆంధ్ర నాటక సాహిత్యంలో కన్యాశుల్కం రచనతో ఒక సరికొత్త పద్ధతి, ఒక నూతన పంథా ప్రారంభమైందని ప్రశంసించారు.

కన్యాశుల్కం ఒక అపూర్వ సృష్టి. సంభాషణాల రచనలో, సన్నివేశ కల్పనలో పాత్రచిత్రణలో, వ్యావహారిక భాషా ప్రయోగంలో మనస్తత్వ చిత్రణలో మేటి నాటకం కన్యాశుల్కం. నాటి సమాజంలోని ఛాందసులు, లుబ్ధులు, పండితులు, కుహనా సంస్కర్తలు, పోకిరీలు, పోలీసులు, న్యాయవాదులు, తాగుబోతులు, కోర్టు పక్షులు, దొంగ బైరాగులు మొదలైన వారెందరో మనకు ఈ నాటకంలో కనిపిస్తారు. వారి మనస్తత్వాలను, ఆనాటి సాంఘిక జీవితాన్ని, సమాజంలోని వైరుధ్యాలను ఈ నాటకంలో సజీవంగా చిత్రించాడు. నాటకంలోని పాత్రలు ఆంధ్రుల హృదయాలలో పీఠం వేసుకున్నాయి. ఆంధ్ర నాటక సాహిత్యానికి అప్పారావు తీర్చిదిద్ది అర్పించిన మరపురాని పాత్రలు గిరీశం, మధురవాణి.

ప్రపంచ నాటక సాహిత్యంలో ఇలాంటి నాటకాలు చాలా అరుదు. కన్యాశుల్కం ఆచారాన్ని ఆధారం చేసుకుని అతి సంకీర్ణ సాంఘిక పరిస్థితులలో సంఘటితమై ఉన్న ఆనాటి సమాజాన్ని ఈ నాటకంలో ప్రతిబింబింపచేశాడు. కన్యలను అమ్మడం ఇతివృత్తంగా తీసుకున్నట్లు కనిపిస్తుందేగాని, నిజానికి అంతకు మించి మానవ జీవితాన్ని గంభీరమైన దానిగా భావించి ఇతివృత్తంగా స్వీకరించాడు.

కన్యాశుల్కం ఆసాంతం హాస్యరసంలో తొణికిసలాడుతూ పెద్ద ప్రహసనమనిపిస్తుంది. హాస్యంలోని వివిధ రీతులు శబ్దగతహాస్యం, క్రియాగతహాస్యం, సన్నివేశహాస్యం కన్యాశుల్కంలో కడుపుబ్బ నవ్విస్తాయి. లట్టిపిట్ట సన్నివేశం హాస్యానికి పరమావధి. చిరునవ్వు దగ్గర నుంచి కడుపుబ్బ నవ్వు వరకు హాస్యం గోచరిస్తుంది. కాని ఇంత హాస్యం వెనక ఎంతో గంభీరత ఉంది. ఇంచుమించు ప్రతిపాత్ర ఈ నాటకంలో అగ్నిపరీక్షను ఎదుర్కొం టుంది. కన్యాశుల్కం జీవితమంత గొప్పదని శ్రీశ్రీ పేర్కొన్నాడు. ఇలా జీవితమంతా తెలుగు సాహిత్య సేవకు అంకితంచేసిన మహాకవిగా, నవ్యాంధ్ర కవితా వాల్మీకిగా ఖ్యాతి గాంచిన గురజాడ 1915, నవంబరు 30న విజయనగరంలో తనువు చాలించాడు.

శ్రీ.చ.

అప్పారావు, పోణంగి శ్రీరామ (1923-2005) : నాటకకర్త, అధ్యాపకుడు, నాట్యశాస్త్రం అనువాదకుడు, కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత. పశ్చిమ గోదావరి జిల్లా,కొవ్వూరు తాలూకా, బరంపురంలో 1923 జులై 21వ తేదీన జన్మించాడు. కొవ్వూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోను, విజయవాడ శ్రీరాజా రంగయ్యప్పారావు కళాశాలలోను,ఆంధ్ర విశ్వవిద్యాలయంలోను విద్యాభ్యాసం చేశాడు. తెలుగు నాటకవికాసం అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌పట్టా స్వీకరించాడు. తెలుగు నాటక రంగాన్ని గురించిన సర్వ సమగ్రమైన గ్రంథమిది. 1967లో ఈ గ్రంథం వెలువడిన నాటి నుంచి నాటకరంగానికి ప్రామాణిక గ్రంథంగా విరాజిల్లుతోంది. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.



అప్పారావు వృత్తిరీత్యా అధ్యాపకుడు. భీమవరం, రాజమహేంద్రవరం, మద్రాసు, కడప, శ్రీకాకుళం ఆర్ట్సు కాలేజీలలోను , మద్రాసు ప్రెసిడెన్సి కాలేజిలోనూ కొంతకాలం ఉపన్యాసకుడిగా పనిచేశాడు. విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలోను పాఠ్యగ్రంథ జాతీయకరణ ప్రత్యేకోద్యోగిగా పనిచేశాడు. తాజ్‌మహల్ (1942) వంటి నాటికలు రచించాడు. భరతముని నాట్యశాస్త్రాన్ని తెలుగులో సరళ సుందరంగా అనువదించి కళా ప్రపంచానికి కానుకగా ఇచ్చాడు. ఈ గ్రంథానికి కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి లభించింది. నాటకరంగ పరిశోధనలో విశేషంగా కృషిచేసిన అప్పారావు 2005, జులై 2న కన్నుమూశాడు.

గం.సు.రె.

అప్సరసలు : బ్రహ్మ నాట్యవేదాన్ని సృజించి భరతమునికి ప్రసాదించిన తరువాత కైశికీ ప్రయోగాన్ని, అంటే శృంగార రసాభినయం చేయడానికి 24 మంది అప్సరసలను సృజించి భరతునికి ఇచ్చాడు. ఆ అప్సరసలు – మంజుకేశి, సుకేసి,

మిశ్రకేశి, సులోచన, సౌదామిని, దేవదత్త, దేవసేన, మనోరమ, సుదతి, సుందరి, విదగ్ధ, విపుల, సుమాల, సంతతి, సునంద, సుముఖి, మాగధి, అర్జుని, సరల, కేరల, ధృతి, నంద, పుష్కల, కలమ.

గం.సు.రె.

అబ్బులు పోలవరపు (జ. 1935) : నటుడు, రంగస్థల పత్రికా సంపాదకుడు. నటన, దర్శకత్వం, రచన, సాంకేతిక విభాగాలలో చక్కని ప్రతిభా విశేషాలు కలిగి ఉన్నా, ఆయా అంశాలకే పరిమితం కాకుండా రంగస్థల పత్రికా నిర్వహణకు శ్రీకారం చుట్టిన విశిష్టకళా కారుడు. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో వీరన్న, రామచంద్రమ్మ దంపతులకు 1935 డిసెంబర్ 20న జన్మించాడు.

తన 10వ ఏట హైస్కూల్ విద్యాభ్యాస సమయంలో రామదాసు నాటికలో యోగి పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేశాడు. ఆ నాటికలో అబ్బులు చూపిన ప్రతిభకు ముగ్ధులైన ఉపాధ్యాయ బృందం తదనంతర కాలంలో తమ టీచర్స్ డ్రమెటిక్ అసోసియేషన్ ప్రదర్శించే నాటికల్లో తగిన పాత్రలనిచ్చి ఈయనలోని కళామూర్తిని తీర్చిదిద్దారు.

ప్రముఖ సినీనటులు హరనాథ్‌రాజు, రావుగోపాలరావుల నాటక సమాజాల్లో లైటింగ్, ఆహార్యం, సెట్టింగ్ విభాగాల్లో సాంకేతిక నిపుణుడిగానే కాక ప్రచార బాధ్యతలు కూడా నిర్వహించాడు. ఈ సమయంలోనే రంగోద్దీపనంలో నిష్ణాతులైన జి. ముఖర్జీ దగ్గర ఆ విభాగంలో చక్కని శిక్షణ పొందాడు. అనంతర కాలంలో 1955 – 56 ప్రాంతాల్లో మెట్రోఫైన్ ఆర్ట్స్ అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా దాదాపు ఆరు సంవత్సరాలు ప్రతినెలా రెండు ప్రదర్శనల చొప్పున నిరాటంకంగా ప్రదర్శనలు ఇచ్చాడు.

జ్వలితజ్వాల, సమిధ, పల్లెపడుచు నాటకాలు నట ప్రయోక్తగా మంచి పేరు తీసుకొచ్చాయి. నటప్రపూర్ణ అనే నాటకాన్ని కూడా రచించి, స్వీయ దర్శకత్వంలో ప్రధానపాత్ర పోషిస్తూ అనేక ప్రదర్శనలు ఇచ్చాడు.

అబ్బులు రంగస్థల జీవితాన్ని మలుపు తిప్పిన ఘటన కళాజగతి రంగస్థల మాసపత్రికను ప్రారంభించడం. 1970 ఆగస్టు 15న నాటి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఎల్. మాలకొండయ్య రాజమండ్రిలో ప్రారంభించిన ఈ పత్రిక గత 37 సంవత్సరాలుగా నిరాటంకంగా వెలువడుతూ తెలుగు నాటకరంగ చరిత్రలో చరిత్ర సృష్టించింది. వివిధ పరిషత్తుల నిర్వహణ వివరాలు, ప్రదర్శనలపై సమీక్షలు, పలు కళాకారుల జీవన పరిచయాలతో ఈ పత్రిక ఎంతో విలువైన సమాచారం అందిస్తూ వస్తున్నది.

1976లో భిలాయ్ పరిషత్తులో గుణ నిర్ణేతగ ప్రారంభమైన ఈయన ప్రస్థానం, అమలాపురం, కాకినాడ, బరంపురం, గూడూరు, ఖరగ్‌పూర్, వైజాగ్ ఇత్యాది పరిషత్తుల ద్వారా జాతీయ స్థాయిలో ఖ్యాతి నార్జించుకొన్నది. ప్రవాసాంధ్రుల పరిషత్తు నిర్వహణలో ఈయన సహకారం గణింపతగినది. 1995 నుంచి రంగస్థల ప్రతిభామూర్తులకు కళాజగతి అవార్డుల ప్రదానంకు శ్రీకారం చుట్టాడు. ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతుంది.

మన్నెశ్రీ

అభిజ్ఞానం : ఇతివృత్త సంబంధి. అభిజ్ఞానమనగా ఆనవాలు లేక గుర్తు. గుర్తుపట్టలేని స్థితి నుంచి గుర్తుపట్టగలిగే స్థితికి కారణభూతమైన దానిని అభిజ్ఞానమంటారు. ఈ అభిజ్ఞానం మూలంగా ఆయా పాత్రలకు శుభాశుభాలు కలగడమేగాక, నాటక సమస్య కూడా పరిష్కారమవుతుంది. దీనినే ఇంగ్లీషులో డిస్కవరీ లేక రికగ్నిషన్ అంటారు. గ్రీకు సిద్ధాంతవేత్త అరిస్టాటిల్ దీనిని ఇలా నిర్వచించాడు. తెలియని తనం నుంచి తెలివిడికి పరిణామం డిస్కవరీ (అభిజ్ఞానం). ఇది అదృష్టదురదృష్టాలకు నోచుకొన్నవారి మధ్య ప్రేమకుగాని, ద్వేషానికిగాని దారితీస్తుంది.

ఉదాహరణకు ధర్మవరం రామకృష్ణమాచార్యులు రచించిన చంద్రహాస అనే నాటకంలో చంద్రహాసుని భుజం మీది మచ్చ బయటపడడంతో అతను రాజుగారి మేనల్లుడు మణిమంతుడని తేలిపోతుంది. దానితో చంద్రహాసునికి శుభం (రాజ్యప్రాప్తి), ప్రతినాయకుడు కుంభీనస మంత్రికి అశుభం (ఆశాభంగం, మరణం) కలుగుతాయి. నాటక సమస్య పరిష్కారమవుతుంది. భుజం మీది మచ్చ గుర్తువల్ల చంద్రహాసుని జన్మరహస్యం బయటపడుతుంది.

అభిజ్ఞానం నాలుగు విధాలు:

1.బాహ్యోపకరణఆభిజ్ఞానం : శరీరం మీది మచ్చలు, ఆభరణాలు, తాయత్తులు మొదలైన వాటివల్ల వ్యక్తిని గుర్తుపట్టడం; 2. అక్షర సంయోగాభిజ్ఞానం : వస్తువు మీది పేరు వల్ల గుర్తు పట్టడం. వ్యక్తి స్వయంగా పేరు చెప్పుకోవడం వల్ల గుర్తుపట్టడం; 3. సాదృశ్యాభిజ్ఞానం : పోలిక జ్ఞప్తికి రాగా గుర్తు పట్టడం; 4. తర్కబద్ధాభిజ్ఞానం : తర్కంలో తెలుసుకొన్న ఈ యీ కారణాల వల్ల ఈ వ్యక్తి ఫలానా అని తేల్చుకోవడం ద్వారా గుర్తు పట్టడం.

శ్రీ.చ.

అభినయం : 1. నటన, 2. గ్రంథం

1. నటన : రంగస్థలం మీద నటీనటుల శారీరక, మానసిక వాచిక కలాపం. నటుడు తాను ధరించిన పాత్ర సుఖదుఃఖాది అవస్థలను, హావభావ విలాసాది చేష్టలను వ్యక్తీకరిస్తూ, ఆ పాత్రే మన ముందు ప్రత్యక్షమైందని భ్రమింపజేసి, రసానుభూతి

కలిగించే ప్రక్రియే అభినయం. తేలు కుట్టినపుడు ఏడవడం సహజం. అది అభినయమనిపించుకోదు. తేలు కుట్టనపుడు కుట్టినట్టు నటించి, నిజంగా తేలుకుట్టిందని ఎదుటివారు నమ్మేటట్టు చేయడం అభినయం. ఇది సామాన్యాభిప్రాయం.

ఈ అభినయం 1. స్థూలాభినయం, 2. సూక్ష్మాభినయమని రెండు విధాలు. స్థూలాభినయం అంటే వాక్యార్థ అభినయం. వాక్యార్థాన్ని స్థూలంగా ప్రేక్షకుల హృదయాలలో హత్తుకునేటట్టు చేయడం. ఇది నాటక ప్రదర్శనలో ప్రయోగిస్తారు. ఇక సూక్ష్మాభినయం అంటే ప్రతి పదానికి అర్థాన్ని అభినయించి చూపడం. ఇది నృత్య ప్రదర్శనంలో ఉపయోగిస్తారు. ఇది తిరిగి నాలుగు విధాలు. 1.ఆంగికాభినయం, 2. వాచికాభినయం, 3. ఆహార్యాభినయం, 4. సాత్త్వికాభినయం. (వివరాలకు అయా శీర్షికలు చూడండి.)

మానవునికి పుట్టుకతో సిద్ధించిన అనుకరణ ప్రవృత్తి అభినయానికి మూలకందమని కొందరి చరిత్రకారుల అభిప్రాయం. అత్మావిష్కారమే అభినయమని కొందరు, నాటక కళ ద్వారా సిద్ధించిన మానవ హృదయ జీవనమే అభినయమని కొందరి భావన. పాత్ర బాహ్యాకృతిని చిత్రించడమే గాక, నటుడు తనలోని మానవ స్వభావాలను ఆ పాత్రలో పొందుపరచి తన ఆత్మను అందులో ప్రతిష్ఠించి, మానవుల అంతర్జీవితాన్ని సృజించి కళాత్మకంగా ప్రదర్శించడమే అభినయమని మరికొందరు నిర్వచించారు.

ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క కళాకారుని ద్వారా ఒక్కొక్క రీతిలో అభినయం వర్ధిల్లి ప్రచారంలోకి వచ్చింది.

2. గ్రంథం : నాటక సిద్ధాంత గ్రంథం సుప్రసిద్ధ నాటక సిద్ధాంతవేత్త, దర్శకుడు, నటుడు స్టానిస్లవ్‌స్కీ రచన ఏన్ యాక్టర్ ప్రిపేర్స్ (An Actor Prepares) అనే సిద్ధాంత గ్రంథానికి అనుసరణ. ఈ గ్రంథాన్ని శ్రీనివాస చక్రవర్తి 1956లో ముద్రించాడు. మామూలు సిద్ధాంత గ్రంథాల్లాగా సూత్రం దాని వివరణ పద్ధతిలో గాక, ఒక నాట్య విద్యాలయంలో దర్శకుడు విద్యార్థులను ఏదో ఒక ఘట్టం నటింపచేసి వారి నటనా విధానంలోంచి సూత్రాన్ని రూపొందించి దాన్ని వివరించే దిశగా ఈ గ్రంథం నడుస్తుంది. అనుసరణలో ఈ విధానాన్ని అనుసరించడమేగాక సంస్కృతాంధ్ర నాటకాల్లో నుంచి ఉదాహరణలు తీసుకోవడం, స్టానిస్లవ్‌స్కీ అభిప్రాయాలను సంస్కృతాలంకారికుల అభిప్రాయాలతో పోల్చి చూపడం ఈ గ్రంథంలోని మరో ప్రత్యేకత. ఈగ్రంథంలో ప్రథమ పరీక్ష అభినయం – కళ, ప్రక్రియ, భావనాశక్తి, ఏకాగ్రత, కండరాల సారళ్యం, ఘట్టాలు, ఆశయాలు, విశ్వాసం, యదార్థతా పరిజ్ఞానం, ఉద్వేగస్మృతి, సంసర్గం, అనువర్తన, అంతర సంచాలక శక్తులు, అవిచ్ఛిన్నరేఖ, అంతర సృజనాత్మక స్థితి, పరమాశయం, ప్రత్యక్ చైతన్య ద్వారం అనే 16 అధ్యాయాలున్నాయి.

స్టానిస్లవ్‌స్కీ అభిప్రాయంలో "పాత్రగా జీవించడమే నటన. నటుడు తనలోని మానవ స్వభావాలను ఆ పాత్ర జీవితంలో పొందుపరచాలి. తన ఆత్మను అందులో ప్రతిష్ఠించాలి. కళ ప్రధాన లక్ష్యం మానవుల అంతర్జీవితాన్ని సృజించి దానిని కళాత్మకంగా వ్యక్తీకరించడమే".

అయితే కళాసృష్టికి ఆవేశం ప్రధానం. ఈ ఆవేశాన్ని ప్రత్యక్ చైతన్య మొక్కటే ప్రసాదించగలదు. దీనికి మొదటి మెట్టు ఏకాగ్రత. ఈ ఏకాగ్రతతో ప్రారంభించి ప్రత్యక్ చైతన్యావస్థను చేరుకునే మార్గాన్ని స్టానిస్లవ్‌స్కీ ఈ గ్రంథంలో వివరించాడు.

శ్రీ.చ.

అభినయదర్పణం : లక్షణ గ్రంథం. నందికేశ్వరుడు క్రీ.శ. 3వ శతాబ్ది ప్రాంతంలోగాని, ఆ తరువాత గానీ రచించినట్టు పరిశోధకులు భావిస్తున్నారు. కూచిపూడి, భరతనాట్యాలకు ఇదే ఆధారగ్రంథం. మనదేశంలో లభ్యమయ్యే అభినయదర్పణపు రాతప్రతులన్నీ తెలుగు లిపిలోనే ఉండటంతో నందికేశ్వరుడు తెలుగువాడే అని ధృవపడుతుంది. నాట్యశాస్త్రంలో పేర్కొనబడిన తండు మహర్షి, నందికేశ్వరుడు ఒక్కడేనని పండితుల అభిప్రాయం. నందికేశ్వరుడు 'భరతార్ణవం' అనే పేరుతో మరొక బృహద్గ్రంథాన్ని కూడా రచించాడు. ఇందులో దాక్షిణాత్యుల నృత్య సంప్రదాయరీతుల గురించిన విపులమైన వ్యాఖ్యానం ఉంది.

గం.సు.రె.

అభినయావరణ (Acting Area) : రంగస్థలం మీద నటీనటులు కార్యకలాపాలు జరిపే ప్రదేశం. అంటే రంగస్థలంలోని రెండు పార్శ్వభాగాలు పోను మిగతా భాగం. ఈ భాగ పరిమితులలోనే అభినయం జరుగుతుంది. దీనినే భరతముని రంగపీఠం అన్నాడు.

శ్రీ.చ.

అభినవగుప్తుడు (11వ శతాబ్ది) : సుప్రసిద్ధ పండితుడు, వ్యాఖ్యాత, అలంకార శాస్త్రవేత్త, కవి. వీరి పూర్వులు అంతర్వేది నివాసులు. 8వ శతాబ్ది చివరికాలంలో వీరి కుటుంబం కాశ్మీరుకు వలస వెళ్ళినట్టు తెలుస్తోంది. అభినవగుప్తుని తల్లి పేరు విమల కోశ. అభినవగుప్తుడు ఆజన్మ బ్రహ్మచారి, మహాయోగి. ఈయన పదముగ్గురు పండితుల వద్ద విద్య అభ్యసించాడు. ఈయన రచించిన గ్రంథాలు ఇరవైనాలుగు. వాటిలో ఆరు ఆగమ గ్రంథాలు. ఎనిమిది ప్రత్యభిజ్ఞాన శాస్త్రాలు, ఎనిమిది స్తోత్రాలు, రెండు వ్యాఖ్యానాలు. నాట్య శాస్త్రానికి

అభినవ భారతి అనే పేరుతోను, ధ్వన్యాలోకానికి లోచన అనే పేరుతోను ఈయన రాసిన వ్యాఖ్యలు జగత్ప్రసిద్ధాలు, ప్రామాణికాలు.

శ్రీ.చ.

అభినవ భారతి : భరతముని నాట్య శాస్త్రానికి వ్యాఖ్యానం. రచయిత అభినవగుప్తుడు. రచనాకాలం. క్రీ.శ. 980–1020. ఇది భరతముని నాట్యశాస్త్రానికి ప్రామాణిక వ్యాఖ్య. సంప్రదాయబద్ధమైన పాఠం నిర్ధారించిన పరిశోధనారచన. ప్రాచీన మతాలలోను అంగీకరించి సవిమర్శగా వ్యాఖ్యానించి రచించడం జరిగింది.

శ్రీ.చ.

అభివ్యక్తివాదం (Expressionism) : ఫ్రాన్స్‌లో ప్రఖ్యాత చిత్రకారుడైన వాంగో చిత్రకళలో రూపొందించిన ఒక ప్రత్యేక శైలిని ఎక్స్‌ప్రెషనిజమని పిలిచారు. ఇది క్రమంగా అన్ని కళలకూ, సాహిత్య ప్రక్రియలకూ అన్వయించబడి విశేష ప్రచారం పొందింది. బాహ్యరూపాన్ని చిత్రించడం కాక దృఢమైన మనోభావాలను, అంతర ప్రకృతిని వ్యక్తీకరింపజేసే ఒక విధానమే అభివ్యక్తివాదం. జర్మనీలో 1910 ప్రాంతాలలో సాహిత్యరంగంలో అభివ్యక్తివాదం మొదటిసారిగా ప్రవేశించింది. క్రమంగా ఇది నాటకరంగాన్ని కూడా ఆకర్షించింది. యదార్థవాదానికి వ్యతిరేకమైన నాటక శైలి ఇది. బాహ్య జగత్తులో మానవుడి ప్రవర్తనను చిత్రించడం వరకే వాస్తవవాదుల, యదార్థవాదుల కృషి పరిమితంకాగా, అభివ్యక్తివాదులు మానవుడిలో చెలరేగే అంతర్గత భావాలను, ఉద్వేగాలను, సంఘర్షణను అభివ్యక్తం చేస్తారు. మానవుడు పరిసరాల ప్రభావానికి లొంగిపోయే నిస్సహాయుడుకాడనీ, పరిస్థితుల్ని తన అదుపులోకి తీసుకొని సంఘాన్ని శాసించగల శక్తిసంపన్నుడని అభివ్యక్తివాదుల దృఢ విశ్వాసం. ఆత్మావలోకనానికి దారి చూపించి మానవుడిని నైతిక పతనం నుంచి రక్షించాలన్నదే అభివ్యక్తివాదుల ధ్యేయంగా ఉండేది. కాని క్రమక్రమంగా యుద్ధాన్ని, రాజకీయ దోపిడిని ఎదిరించడానికి ప్రజలను సమాయత్తం చేసే ప్రబలశక్తిగా కూడా పరివర్తన చెందింది.

విజ్ఞానశాస్త్రం సృష్టించిన యాంత్రిక ప్రపంచంలో దోపిడీకి గురవుతున్న మనిషి ఆత్మబలాన్ని కోల్పోతున్నాడనీ, అతనిలో ఆశావాదం పాదుకొల్పాలని కూడా అభివ్యక్తివాదుల లక్ష్యం. సంప్రదాయంగా వస్తున్న విలువలస్థానంలోనే కొత్త విలువలను ప్రతిష్ఠించి, మానవుడి మనోనేత్రాలకు ఒక సుందర స్వప్నలోకాన్ని చూపించాలన్నదే అభివ్యక్తి నాటకశైలిలో ఇమిడివున్న పరమార్థం.

అభివ్యక్తి నాటక విధానంలో వస్తువు కంటె ప్రదర్శనరీతిలో విలక్షణత గోచరిస్తుంది. నాటక ప్రదర్శన రంగాలంకరణలో కృత్రిమత్వం కనబడుతుంది. అసాధారణమైన రంగులు వాడటం, యాంత్రిక నటన, టెలిగ్రాఫిక్ ఫక్కీలో వ్యాకరణబద్ధంకాని పొడిపొడి మాటలు అభివ్యక్తి విధానంలోని ప్రధాన లక్షణాలు. పురాణ గాథలు, బైబిల్ కథలు కొత్తమూసలో కథా వస్తువులు కావడం కద్దు. పాత్రలకు వ్యక్తిగతమైన పేర్లుండవు. మొదటి శ్రోత, రెండవ శ్రోత, గుమాస్తా, ఫ్యాక్టరీ యజమాని, పోలీసు, బడిపంతులు, కవి–ఇలా ఉంటాయి పాత్రల పేర్లు.

అభివ్యక్తి నాటకాలు విరివిగా జర్మనీలో ప్రదర్శితమయ్యాయి. ఐరోపా ఖండంలో అన్ని దేశాలలోనూ అభివ్యక్తి నాటకాలు ప్రదర్శింపబడినప్పటికీ పది పన్నెండేళ్ళ కంటే ఎక్కువకాలం నిలదొక్కుకోలేక పోయాయి.

అభివ్యక్తి వాదుల్లో జార్జ్ కైజర్, ఎర్నెస్ట్ టాలర్, యూజీనీ ఓనీల్ ఖండాతరఖ్యాతిని ఆర్జించిన నాటకకర్తలు. 1925 నాటికి ఈ నాటక విధానం ఆశావాదం నుంచి నిరాశావాదానికి దిగింది. అదే కాలంలో ప్రజాదరణ పొందుతున్న బ్రెష్ట్ 'ఎపిక్ థియేటర్'తో అభివ్యక్తి నాటకరంగం మరుగున పడిపోయింది.

అభివ్యక్తి నాటకవిధానం ప్రభావం తెలుగు రచయితల మీద అంతగా లేదు. ఇద్దరు ముగ్గురు రచయితలు కొంత ప్రయత్నం చేశారు. మొదలి నాగభూషణశర్మ రచించిన నరజాతి సమస్తం, కె.చిరంజీవి నీలిదీపాలు, శశిమోహన్ ఆర్ నాటిక అభివ్యక్తి నాటక లక్షణాలను సంతరించుకున్న దృశ్యరూపకాలే.

గం.ను.రె.

అభిసారిక : శృంగార నాయిక. అభి అంటే ఎదురుగా, సారిక అంటే సంచరించేది, పోయేది. ప్రియునికి ఎదురుగా పోయేది కాబట్టి అభిసారిక అని వ్యుత్పత్త్యర్థం. అభిసారిక రెండు రకాలు:
1. కామాతురయయి, స్వయంగా ప్రియుని వద్దకు పోయేది స్వయం అభిసారిక. ఉదా॥ మృచ్ఛకటిక చతుర్థాంకం చివర వసంతసేన తన ప్రియుడు చారుదత్తుని వద్దకు బయలుదేరడం,
2. ప్రియుని తనవద్దకు రప్పించుకొనేది. పానుగంటి రచించిన రాధాకృష్ణ నాటకంలో రాధ శ్రీకృష్ణుని తన వద్దకు రప్పించుకోవడం, సంతాపం, చింత మొదలైనవి ఆమె చేష్టలు.

స్వయం అభిసారిక స్వీయ, కన్య, వేశ్య, ప్రేష్య అని నాలుగు విధాలు. స్వీయ, భర్తను అనుసరించడంలో సిగ్గుపడుతుంది. బెదురుతూ నలుపు, ఎరుపు రంగుల మేలిముసుగు ధరించి అవయవాలను ముడుచుకొని చప్పుడు చేయకుండా నడుస్తూ, నమ్మకస్తురాలైన చెలికత్తెను వెంటబెట్టుకుని ప్రియుని చేరుకుంటుంది. కన్య కూడా స్వీయలాగానే నాయకుని అభిసరిస్తుంది. ఇక వేశ్యాభిసారిక ఉజ్జ్వల వేషధారిణి. ఈమె విచిత్రోజ్జ్వల వేషం ధరించి, అందెలను, కంకణాలను మోగిస్తూ సంతోషంతో, నవ్వు ముఖంతో, మదంతో కన్నులు తిప్పుతూ, శరీరం నిండా గంధం పూసుకుని గగుర్పాటుతో భోగోపకరణాలు పట్టుకుని అభిసరిస్తూ, ప్రియుని మెల్లగా తాకి తలను గోకి మేల్కొల్పుతుంది. ఉదా॥ మృచ్ఛకటిక పంచమాంకంలో ఉజ్జ్వల

వసంతసేన ప్రవేశించడం. అభిసరణ కాలాన్నిబట్టి అభిసారిక ప్రధానంగా రెండు విధాలు. 1. దివాభిసారిక, 2. నిశాభిసారిక. పగటిపూట అభిసరించేది దివాభిసారిక. రాత్రిపూట అభిసరించేది నిశాభిసారిక. నిశాభిసారిక తిరిగి రెండు విధాలు. 1.తమోభిసారిక, 2. జ్యోత్స్నాభిసారిక. తమోభిసారిక చీకటిలో ఎవరికీ కనిపించకుండా నల్లని దుస్తులు, నల్లని కలువలు ధరించి అభిసరిస్తుంది. జ్యోత్స్నాభిసారిక వెన్నెలలో ప్రియుని అభిసరిస్తుంది. తెల్లనిపూలు ధరిస్తుంది. తెల్లనిగంధం పూసుకుంటుంది. అందువల్ల తెల్లని వెన్నెలలో ఈ తెల్లని వస్తువులు కనిపించవు. దివాభిసారిక తాను స్వయంగా అభిసరించక ఇంట్లో ఎవరులేని సమయంలో ప్రియుని ఇంటికి రప్పించుకొంటుంది.

శ్రీ.చ.

అభూత హరణం : గర్భసంధ్యంగం. కార్యసాఫల్యం కోసం చేసే మోసమే అభూతహరణం. ఇది రెండు రకాలు.

1. మాటలతో మోసం : ఉదా॥ కపటపు మాట. ద్రోణవధ కార్యసాధన కోసం ధర్మరాజు అశ్వత్థామ బతికి ఉండగానే చనిపోయాడని చెప్పి, ద్రోణుని మోసగించడం. 2. ఆకార గోపనం : ఉదా॥ రత్నావళి తృతీయాంకంలో సాగరిక వత్సరాజ సమాగము కార్యసిద్ధికోసం వాసవదత్త వేషంలో రావడం.

శ్రీ.చ.

అభ్యంతర పరివారం : రాజాంతఃపురానికి సంబంధించిన జనం. రాజాంతఃపుర పరివారం అని కూడా అంటారు. వీరు 1. మహాదేవి, 2. దేవులు, 3. స్వామినులు, 4. స్థాపితులు, 5. భోగినులు, 6. శిల్పకారికలు, 7. నాటకీయలు, 8. నర్తకి, 9. అనుచారిక, 10. పరిచారికలు, 11. సంచారికలు, 12. ప్రేషణకారికలు, 13. మహత్తరాలు, 14. ప్రతీహారులు, 15. కుమారికలు, 16. స్థవిరలు, 17. ఆయుక్తికలు.

శ్రీ.చ.



అమరేంద్ర, బి. (జ.1952) : నటుడు, దర్శకుడు. 1952, ఆగస్టు 8న హైదరాబాద్‌లో జన్మించాడు. తల్లిదండ్రులు ఆండాలమ్మ, వెంకటహరి. 1969లో 'ఆదర్శ యువ భారతి' సంస్థను స్థాపించి నటుడుగా, దర్శకుడుగా, సమాజ నిర్వాహకుడుగా కొనసాగుతున్నాడు. 1800 ప్రదర్శన లిచ్చాడు. పలు పరిషత్తులలో పాల్గొని ఉత్తమ నటనకు అనేకసార్లు బహుమతులు అందు కున్నాడు. ఆకాశవాణిలో 'ఎ' గ్రేడు కళాకారుడుగా 1972 నుంచి రేడియో నాటక కళా కారుడుగా పాల్గొంటు న్నాడు. పలు టీ.వి. సీరియల్స్‌లో ప్రముఖ పాత్రలలో నటించాడు. కళారంగానికి సేవచేసిన అమరేంద్రను 1977లో 'కళాజగతి' విశిష్టనటుడు అవార్డునిచ్చి సత్కరించింది.

దాసరి.ఎన్.

అమెచ్యూర్ ఆర్టిస్ట్సు అసోసియేషన్ (వెంకటగిరి) : ఈ నాటక సమాజాన్ని నెల్లూరు జిల్లా, వెంకటగిరి పట్టణంలో కొంత మంది ఔత్సాహిక నటులు 1945 ప్రాంతంలో స్థాపించారు. సి.మోహన్‌దాసు, సి.రంగనాథదాసు, డి. జగన్నాథం, బాబు ప్రభృతులు ఈ సమాజంలో ముఖ్య కార్యకర్తలు. ఈ సమాజాన్నే వెంకటగిరి అమెచ్యూర్స్ అనే పేరుతో వ్యవహరిస్తున్నారు. ఈ సంస్థ పది పన్నెండేళ్ళలోపలే తన అస్తిత్వాన్ని కోల్పోయినా, నాటక ప్రపంచంలో విస్మరించలేని చరిత్ర సృష్టించి,అజరామరమైన కీర్తిని ఆర్జించింది. ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలకు ఒక నాటకం ఎంపిక కావడమే ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆ రోజుల్లో, వరుసగా మూడు నాటకాలను ప్రదర్శించి ఉత్తమ బహుమతులు గెల్చుకోవడం నాటక కళాభిజ్ఞుల్ని విస్మయపరిచింది. కొండముది గోపాలరాయశర్మ రచించిన ఎదురీత, ఆచార్య ఆత్రేయ రచించిన ఎన్.జి.వో (అప్పటి పేరు అద్దెకొంప), ఈనాడు (ప్రస్తుతం రామ్-రహీమ్ గా మార్చబడింది) నాటకాలను వెంకటగిరి సంస్థ నభూతో నభవిష్యతి అన్న తీరులో ప్రదర్శించి కళాజగత్తును సమ్మోహన పరిచింది. వెంకటగిరి అమెచ్యూర్స్ సంస్థ నాటకం ప్రదర్శిస్తున్నారంటే ఇతర పోటీ సమాజాలు నిరుత్సాహపడే స్థితిలో ఉండేవారంటే సత్యదూరం కాదు. వాస్తవికతకు పట్టంకట్టిన ఆ మూడు నాటకాలు వస్తువులోను, ప్రదర్శనా విధానంలోనూ, కొత్త పోకడలను ఆవిష్కరించి భవిష్యత్తుకు బంగారుబాటలు నిర్మించాయి. కాల పరిస్థితులను శాసించే ఈ మూడు నాటకాలు ఔత్సాహిక నాటకరంగానికి శిరోధార్యమై, మణిదీపాలై భాసించాయి. వెంకటగిరి అమెచ్యూర్ ద్వారానే ఆత్రేయ వెలుగులోకి వచ్చాడు. అలాగే ఆ సమాజం కూడా ఆత్రేయ సాహచర్యంతోనే తన ఉనికిని సమర్థించుకొన్నదని చెప్పాలి.

గం.సు.రె.

అమెచ్యూర్ నాటక సభ : ఈ నాటక సమాజాన్ని 1896లో నెల్లూరులో స్థాపించారు. నిర్వాహకుడు ఎరగుడిపాటి గోపాల కృష్ణారావు. ప్రధాన నటులు కందాడై శ్రీనివాసన్, కందాడై శఠగోప రామానుజయ్యంగార్‌లు.కార్యదర్శి నేలటూరి సింగరాచార్యులు. స్టేజి డైరెక్టర్ వంగవోలు వెంకటరంగయ్య. ఈ సమాజం స్థానిక ధనిక వర్గ సహాయసంపత్తులతో మొట్టమొదట పదిహేను ఇంగ్లీషు నాటకాలను టిక్కెట్లు లేకుండా ఉచితంగా ప్రదర్శించింది. ఆ తరువాత తెలుగు నాటకాలు ప్రదర్శించింది. ధర్మవరంరామకృష్ణమాచార్యుల నాటకాలు సర్కార్ జిల్లాలలో మొట్టమొదటగా ప్రదర్శించింది ఈ సమాజమే. వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన

ప్రతాపరుద్రీయం నాటక ప్రదర్శన విజయవంతం కాకపోవడం వల్ల ఈ సభ్యులలో చీలిక ఏర్పడి, ఈ సమాజం రెండు ముక్కలు కావడంతో దీని కార్యకలాపాలు స్థంభించిపోయాయి.

శ్రీ.చ.

అమోల్ పాలేకర్ (జ.1944) : ప్రముఖ మరాఠీ నటుడు, దర్శకుడు, హిందీ చలనచిత్ర నటుడు. ఈయన 1944 నవంబరు బంబాయిలో జన్మించాడు. 1967లో సత్యదేవ్ దూబె సహకారంతో రంగస్థల ప్రవేశం చేశాడు. చుప్‌కోర్టు చాలు హైతో నటజీవితం ప్రారంభించిన అమోల్ పాలేకర్, దూబె నాటకాలకు సహాయ దర్శకుడిగా కొన్నాళ్ళు పనిచేశాడు.

1972లో తన భార్య చిత్రతో కలిసి కొత్త నాటక బృందాన్ని ఏర్పరచి గోచి, చల్‌రే భోప్‌లియా, తుమక్ తునుక్, జులుస్ నాటకాలను ప్రదర్శించాడు. మూడవ నాటక రంగ ఉద్యమాన్ని మరాఠీ నాటక రంగానికి పరిచయం చేసింది పాలేకరే. అధే ఆదూరే, హయ వదన, ప్రతిమ, కళావజీర్ పాంద్రారాజ, అవధ్య వాసనా కంద్, పార్టీ నాటకాలు పాలేకర్‌కు మంచి పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయి.

ప్ర.రె.

అయనెస్కో, యూజీన్ (1912-1994) : ఫ్రెంచ్ నాటక రచయిత. రుమేనియాలోని స్లటేనాలో 1912, నవంబరు 26న జన్మించాడు. అయనెస్కో బాల్యదశ ఫ్రాన్సు -రుమేనియాల మధ్యగడచింది. బుఖారెస్ట్ విశ్వవిద్యాలయంలో ఫ్రెంచ్‌లో పట్టభద్రుడై 1939లో పారిస్‌లో డాక్టరేట్ డిగ్రీ పొందాడు. బాల్యదశ నుంచీ నాటకకళపై గల అభిమానం, అభిరుచి, అయనెస్కోను నాటక రచయితగా నిలబెట్టాయి.

అయనెస్కో రాసిన మొట్టమొదటి నాటకం బాల్డ్ ప్రైమాడొన్న (1950) ప్రేక్షకులను ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఈ నాటకంలోని నిశితహాస్యం మేధావి వర్గాన్నిసైతం విశేషంగా ఆకర్షించింది. ఆ బాణీలో మరికొన్ని ఏకాంకికలు అయనెస్కో కలం నుంచి జాలువారాయి. ది లెసన్ (1951), ది ఛైర్స్ (1952) వంటి నాటకాలు మనిషిలోని ఉద్విగ్న మానసికస్థితికి ప్రతీకలుగా భాసిస్తాయి. ఈయన రచనల్లో కథాక్రమంగాని, పాత్రచిత్రణగాని, చర్చలుగాని కనబడవు. అధివాస్తవిక ధోరణిలో సంఘటనలు ఉంటాయి. ది కిల్లర్(1959) అనే మూడంకాల నాటకం, ఆ తరువాత వచ్చిన ఎగ్జిట్ ది కింగ్ (1962) నాటకం ఈయన నాటకతత్వాన్ని, స్వరూప స్వభావాలను ఆవిష్కరించే దర్పణాలు. ఈయన నాటకాలు ప్రపంచ భాషల్లోకి అనూదితాలై విస్తృతంగా ప్రదర్శితమైనాయి. ఈయన రచనల నిండా నిరాశావాదం అంతర్లీనమై ఉంటుంది. అసంబద్ధంగా ఉన్న మనిషి జీవితంలో శాశ్వత సత్యాలు, తర్కమూ ఉండవనీ క్రమబద్ధమైన జీవనవిధానం కోసం అన్వేషించడం అర్థరహితమని అయనెస్కో నాటకాలు అభివ్యక్తం చేస్తాయి. తర్కాన్నీ, భాషను కూడా పరిహసిస్తాయి. ఈ ధోరణి అసంబద్ధ నాటకరంగ విధానానికి (Theatre of the Absurd) తొలిమెట్టు అయింది.

గం.సు.రె.

అయోగ శృంగారం : శృంగార రస భేదం. భరతముని, విశ్వనాథకవి రాజు దీనిని విప్రలంభశృంగారభేదంగా పరిగణించాడు. సింగభూపాలుడు పూర్వానురాగ భేదంగా తెలిపాడు. దీనినే భరతముని 'ప్రచ్ఛన్నకామిత' అన్నాడు. ధనంజయుడు దీనిని శృంగార భేదంగానే పరిగణించాడు. స్త్రీ పురుషుల మధ్య ప్రేమ ఉదయించినా పారతంత్ర్యం వల్ల దైవానుకూలం లేకపోవడంవల్ల, కలయిక కలగకపోవడం అయోగ శృంగారం. పారతంత్ర్యం అంటే స్వాతంత్ర్యం లేకపోవడం, తల్లిదండ్రుల అభీష్టం వారి కలయికకు ఆటంకం కావడం. ఉదాహరణకు అభిజ్ఞాన శాకుంతలం తృతీయాంకంలో దుష్యంతుడు బలవంతంగా వెళ్లిపోయే శకుంతలను మరల్చగా శకుంతల తన పారతంత్ర్యం వెల్లడించడం. దైవప్రాతికూల్యం అంటే దైవప్రాతికూల్యం వల్ల నాయికా నాయకుల కలయికకు ఆటంకం రావడం. ఈ అయోగశృంగారరసానికి పది అవస్థలుంటాయనీ ఈ పది అవస్థలను కామావస్థలుగా భరతముని పేర్కొన్నాడు. ఇవి : అభిలాష, చింత, స్మృతి, గుణకథనం, ఉద్వేగం, ప్రలాపనం, ఉన్మాదం, సంజ్వరం, జడత్వం, మరణం ఇచ్చు, ఉత్కంఠత అనే ఇంకో రెండు అవస్థలను చెప్పి అయోగ శృంగారావస్థలు 12 అని లాక్షణికులు అన్నారు. కాని సింగభూపాలుడు ఇచ్చు అభిలాషలు ఉత్కంఠత చింతల అంతర్భాగాలు గాబట్టి వాటిని ప్రత్యేకావస్థలుగా పరిగణించక ఈ అవస్థలు పదేనని సిద్ధాంతీకరించాడు.

శ్రీ.చ.

అరిస్టాటిల్ (క్రీ.పూ. 384-322) : గ్రీకుతత్వవేత్త, సాహిత్య లక్షణవేత్త. కావ్యశాస్త్రం (Poetics - 330)

ప్రామాణిక లక్షణ గ్రంథం, ఇతని కీర్తికి పతాక. ప్రప్రథమంగా విషాద, ఆహ్లాద రూపకాల లక్షణాలను నిర్వహించి, వాటిపుట్టు పూర్వోత్తరాలను తెలిపి, భావక్షాళనే విషాద రూపక ప్రయోజనమని నిర్వచించిన లక్షణవేత్త.

గ్రీసులోని మాసడోనియాలోని షాగిర్‌లో అరిస్టాటిల్ పుట్టాడు. 15వ ఏట గ్రీసు రాజధాని ఏథెన్స్‌కు వెళ్లి, సుప్రసిద్ధ తత్వవేత్త ప్లేటో వద్ద విద్యనభ్యసించాడు. క్రీ.పూ. 342లో మాసిడోనియా రాజు ఫిలిప్ తన కుమారుడు అలెగ్జాండరుకు అధ్యాపకుడుగా ఇతనిని నియమించాడు.

అలెగ్జాండర్ క్రీ.పూ. 335లో సింహాసనం అధిష్టించిన తరువాత అరిస్టాటిల్ ఏథెన్సుకు తిరిగి వచ్చాడు. అలెగ్జాండర్ ఆయనను గురుకుల కులపతిగా నియమించాడు. అరిస్టాటిల్ మహాపండితుడు, విజ్ఞాని. ఆ రోజులలో అధ్యయనార్థంగా భాసించిన మానవ విజ్ఞాన విషయాలన్నింటి మీద రచన సాగించాడు. అందువల్లనే ఆ గురుకులం అనేకమంది విద్యార్థులను ఆకర్షించ గలిగింది. అలెగ్జాండర్ నిర్యాణానంతరం కొన్ని పక్షాలవారు ఈయనను అనుమానించి ఒక కంట కనిపెట్టసాగారు. దుష్టునిగా, భక్తిహీనునిగా చిత్రించసాగారు. అందువల్ల అరిస్టాటిల్ క్రీ.పూ. 322లో ఇయోబియోలోని బాలసిస్ పట్టణానికి పారిపోయి అక్కడే ఆ సంవత్సరమే మరణించాడు. కావ్యశాస్త్రం అనే లక్షణగ్రంథం రచించడమేగాక అరిస్టాటిల్ ఆనాడు పోటీలలో బహుమతులను అందుకున్న విషాద అహ్లాద నాటక రచయితలను కూడా ఇందులో ప్రస్తావించాడు. ఈ గ్రంథాన్ని అనేక భాషలలోకి అనువదించడం జరిగింది. వీటిలో ఫెఫీ, బుచర్, డోర్ష్ ఇంగ్లీషు అనువాదాలు ప్రసిద్ధికెక్కాయి.

శ్రీ.చ.

అరిస్టోఫేన్స్ (క్రీ.పూ. 448-380) : గ్రీకు నాటకకర్త. ఇతని తండ్రి ఏథెన్స్ వాసి, పెద్ద భూస్వామి. తాను ఉన్నత వంశంలో పుట్టాననే అహంకారం అరిస్టోఫేన్స్‌కు ఎక్కువ. అరిస్టోఫేన్స్ పూర్వాచార పరాయణుడు. ప్రాచీన గ్రీకు వ్యవస్థ, ఆచారాల మీద, ప్రాచీన దేవతా పూజల మీద ఈయనకు మక్కువ ఎక్కువ. నాటి ప్రజాస్వామిక వ్యవస్థ పద్ధతులు ఇతనికి రుచించలేదు. స్త్రీ స్వాతంత్ర్య వాదానికి, సర్వసమానవాదానికి అతను బద్ధవిరోధి. విద్యా విషయంలో ఆనాటి నూతన భావాలు అతనికి నచ్చలేదు. ఆనాటి వైజ్ఞానిక విప్లవంలోని గొప్పతనం గుర్తించలేకపోయాడు. చింతనాపరులను, సాహితీవేత్తలను ఒకే గాటికి కట్టి వారిని పాషండులని తననాటకాలలో దుయ్యబట్టాడు. అభిప్రాయమనేది మనసుకు సంబంధించిందే గాని, హేతువాదానికి సంబంధించింది కాదని అతని మతం. అయితే అరిస్టోఫేన్స్ యుద్ధ వ్యతిరేకి. శాంతికాముకుడు. వీటికి తోడు ఆనాటి గ్రీకు ప్రభుత్వం, ప్రజలు అవినీతికి, దురాచారాలకు ఆలవాలమయ్యారు. ఆనాటి రాజ్యాంగంలో నటులకు సంపూర్ణ స్వేచ్ఛ ఉండేది. రంగస్థలం మీద నటులు ఏమి మాట్లాడినా, ఎవరిని ఎంత అవహేళన చేసినా అపరాధంగా తీసుకునేవారు కాదు. ఈ అవకాశాన్ని అరిస్టోఫేన్స్ పూర్తిగా వినియోగించుకుని తన ప్రత్యర్థులను తూర్పారబట్టాడు. ఈయనకు ప్రధాన శత్రువులు ఇద్దరు. ఒకరిలో మొదటివ్యక్తి ప్రజాస్వామ్యపక్షనాయకుడు క్లియోన్. రెండవవ్యక్తి సుప్రసిద్ధ నాటక రచయిత యురిపిడిస్.

ΑΡΙΣΤΟΦΑΝ
ΦΙΛΙΠΠΙΔΟΥ
ΑΘΗΝΑΙΟΣ

అరిస్టోఫేన్స్ నాటకాలలో శిల్ప సంపద కొరవడిందని కళావేత్తల అభిప్రాయం. ఈయన నాటకాలను ప్రాచీనరీతి ఆహ్లాద నాటకాలు (ఓల్డ్ కామెడీ), మధ్యకాలరీతి అహ్లాద నాటకాలు (మిడిల్ కామెడీ) అని రెండు రకాలుగా విభజించవచ్చు. అతని ప్రాచీన రీతి నాటకాలలో కథా విన్యాసం క్రమబద్ధంగా ఉండదు. ఒక అపూర్వ సన్నివేశాన్ని హఠాత్తుగా కల్పించడం ఇతనికి పరిపాటి. నాయకునికి, బృంద గాయకులకు మధ్యనో, బృంద గాయకుల మధ్యనో వివాదం ద్వారా ఈ సన్నివేశం ప్రారంభమవుతుంది. ఈ సన్నివేశం చుట్టూ హేతుబద్ధంకాని రంగాలు అతికించినట్టుంటాయి. సాధారణంగా ప్రధానమైన ఇతివృత్తం ఆనాటి రాజకీయ పరిస్థితినో, సాంఘిక సమస్యనో ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఈ అవకాశం తీసుకుని అతనికి నచ్చని వ్యక్తులను విమర్శిస్తుంటాడు. ఈ నాటకాలలో ఆశ్చర్యం గొలిపే కల్పన, వ్యంగ్యం, రాజకీయ ప్రచారం, కడుపుబ్బించే హాస్యం, ఇతరుల సాహిత్య సంగీతాలను అనుకరిస్తూ వెక్కిరించే వికటకవిత్వం, భావ గీతాలు కలగాపులగంగా ద్యోతకమవుతాయి.

అరిస్టోఫేన్స్ నాటకాలలోని ఇంకొక లక్షణం బృంద గాయకులు ముందుగా వచ్చి సూటిగా ప్రేక్షకులను సంబోధిస్తూ మాట్లాడటం. ఈ ప్రక్రియలో భ్రాంతిని పరిత్యజించి కవి ప్రేక్షకులతో మాట్లాడినట్లుంటుంది. ఒక పాత్ర మాట్లాడిన తరువాత రెండవ పాత్ర, మొదటి పాత్ర మాట్లాడినన్ని వాక్యాలే

మాట్లాడడం మరో విశేషం. ఒక్కొక్క రంగం ఒక్కొక్క ఛందస్సులో నడవడం కూడా ఈయన నాటకాలలో గోచరిస్తుంది. అరిస్టోఫేన్స్ నాటకాల పేర్లు కూడా బృందగాయకులు ధరించిన దుస్తులను బట్టే వచ్చినవే. ఇక రెండవ రకం నాటకాలలో రాజకీయాలను, వ్యక్తులను పరిహసించే ధోరణి తగ్గింది. కథావిన్యాసానికి ప్రాధాన్యం హెచ్చింది. బృందగానానికి ప్రాధాన్యం తగ్గింది.

అరిస్టోఫేన్స్ మొత్తం నలభై నాలుగు అహ్లాద నాటకాలు రచించినప్పటికీ పదకొండు నాటకాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. అచార్నియన్స్, యోధులు, మబ్బులు, కందిరీగలు, శాంతి, పక్షులు, లైసిస్ట్రోటా, ఉత్సవంలో స్త్రీలు, కప్పలు, పార్లమెంట్‌లో స్త్రీలు, భాగ్య దేవత. మొదటి తొమ్మిది ప్రాచీనరీతి ఆహ్లాద నాటకాలకు ఉదాహరణలు. చివరి రెండు నాటకాలు మధ్యకాలపు ఆహ్లాద నాటకాలకు ఉదాహరణలు.

శ్రీ.చ.

అరుణా బాబూరావు (1938-2005) : నటుడు, దర్శకుడు, నాటక రచయిత. 'అరుణా పబ్లిషింగ్ హౌస్' అధినేత. పేరున్న నాటక రచయితల పుస్తకాలనే కాక, కొత్త రచయితలకు కూడా తన స్నేహ హస్తాన్నందించి, వారి రచనలను ప్రచురించి వెలుగులోకితెచ్చి తెలుగునాటక కళా వికాసానికి పరోక్షంగా తోడ్పడిన కళా సేవకుడు. 1960లో రంగ ప్రవేశం చేసిన బాబూరావు నటుడుగా నటలోకానికి సుపరిచితుడు. హాస్యరస పోషణలో ప్రత్యేకతను సంతరించుకున్న నటుడు. *ప్రెసిడెంటు పట్టయ్య, వానవెలిసింది, మండువాలోగిలి, ఇదేమిటి, మళ్ళీ మధుమాసం,* పుణ్యస్థలి వంటి నాటక నాటికలలో నటించి పోటీలలో ఉత్తమనటుడు, ఉత్తమ హాస్య నటుడు, క్యారెక్టర్ ఏక్టర్ బహుమతులు పొందాడు. కొన్ని నాటకాలలో బాబూరావు ధరించిన పాత్రల వైఖరి గమనిస్తే వాటిని బాబూరావు కోసమే రచయిత సృష్టించాడా అనిపిస్తుంది. 1975 ప్రాంతంలో బాబు పేరుతో నాటక రచనకు కూడా పూనుకుని విజయం సాధించాడు. అప్పటి నుంచీ సుమారు 15 నాటికలను రచించాడు. మారేజీడే వంటి అషామాషీ నాటిక నుంచి, పేగులు కదిలించే మధ్యతరగతి కథ వంటి కరుణ రసాత్మక నాటిక వరకూ వైవిధ్యం గల రచనలు చేశాడు. ఈయన రచించిన సుందరి సుబ్బారావు, టెలిఫోన్ అన్ని తరగతులవారినీ అలరించే చక్కని హాస్యనాటికలు. కనువిప్పు, అన్యాయం సాహిత్యదృష్ట్యా, ప్రదర్శన దృష్ట్యా ఉన్నత ప్రమాణాలుగల నాటికలు. హాస్యనాటిక లలో కఠోర సత్యాలను సమ్మిళితంచేసి పంచదార అద్దిన చేదు మాత్రలను ప్రేక్షకులకు తినిపించడంలో బాబూరావు దిట్ట. ఈయన రచించిన కైలాసంలో కోర్టు వీధి నాటిక విస్తృతంగా ప్రదర్శింపబడి, పండిత పామరుల ప్రశంసలు అందుకొంది. బాబూరావు కళాసేవను గుర్తించి ఎన్నో సంస్థలు సన్మానించాయి. నాటకమే జీవిత పరమార్థంగా బతికిన బాబూరావు 2005, నవంబరు 26న దివంగతుడయ్యాడు.



గం.సు.రె.

అరుణోదయ సంగీత నాట్యమండలి : ఈ నాటక సమాజాన్ని 1945లో విజయవాడలో స్థాపించారు. వ్యవస్థాపకుడు, కార్యదర్శి సుంకర కనకారావు. ఇందులో సావిత్రి, వహీదా రెహమాన్. నిర్మల, కొంగర జగ్గయ్య, ఎ.వి.ఎస్.శర్మ, శివరావురాజు, వేణుగోపాలస్వామి ప్రభృతులు ప్రధాన నటీనటులు. సంగీత నృత్య నాటక కళలను ఉన్నతస్థాయికి తీసుకువెళ్లాలనే సదుద్దేశంతో స్థాపించిన సమాజం. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమికి, కేంద్ర సంగీత నాటక అకాడమికి, నాట్య సంఘం, ఆంధ్ర నాటక కళా పరిషత్తులకు అనుబంధ సంస్థ. ఈ సంస్థకు సొంత ఆర్కెస్ట్రా ఉండేది.

ఈ సంస్థ అనేక నాటకపోటీలలో పాల్గొని బహుమతులు పొందింది. నేటి సినిమా లోకంలో ప్రముఖులు చాలామందికి దీనితో ఏదో విధమైన సంబంధం ఉండేది. *బలిదానం, పన్న,* శాక్యసింహ నాటక ప్రదర్శనలలో ఈ సమాజం ప్రసిద్ధిగాంచింది. ఖిల్జీ రాజ్యపతనం, వేనరాజు, ఉమర్ ఖయ్యాం, వేమన, కన్యకాపరమేశ్వరి, నాదేశం, తీరని కోరికలు, దారిన పోయే దానయ్య, శాంతి, మా బావ, ప్రతీక్ష వంటి నాటకాలను ఈ సమాజం ప్రదర్శించింది.

శ్రీ.చ.

అర్చనా నాటకం (Liturgical Drama) : ఐరోపా ఖండంలో మధ్యయుగంలో వర్ధిల్లిన నాటక రూపం. 10వ శతాబ్దంలో నాటకరంగం ఈస్టరు పండుగ అర్చనలోని నాలుగు సంభాషణా వాక్యాల నుంచి ఉద్భవించినదని తెలుస్తోంది. ఈ సంభాషణా వాక్యాలకు బైబిల్ మార్క్ సువార్తలోని ఈ కింది వాక్యాలు ఆధారం.

"అప్పుడు వారు సమాధిలో ప్రవేశించి తెల్లని నిలువు టంగీ ధరించుకొని ఉన్న ఒక పడుచువాడు కుడివైపున కూర్చుండుట చూచి మిగుల కలవరపడిరి. అందుకతడు "కలవరపడకుడి. సిలువ వేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదకుచున్నారు. ఆయన లేచియున్నాడు. ఇక్కడ లేడు. వారు ఆయనను ఉంచిన స్థలము చూడుడి. మీరు వెళ్ళి ఆయన కంటె ముందుగా గలియలోకి వెళ్ళు చున్నాడనియు, ఆయన

మీతో చెప్పినట్లు అక్కడ మీరు ఆయనను చూతురనియు ఆయన శిష్యులతోను, పేతురుతోను చెప్పుడి" –తెలుగు బైబిల్.

కథావస్తువు లభ్యమైంది. దానితో నాటకం రూపొందింది. చర్చిలోని పూజాపీఠమే రంగస్థలం. దాని మీద వస్త్రం కప్పిన శిలువ సమాధికి చిహ్నం. ఆ తరువాత కొయ్యతోగాని, ఇనుముతోగాని చేసిన శవపేటిక ఆకారంలో సమాధి నిర్మించేవారు. పూజాపీఠానికి దగ్గరలో తెల్లటి నిలువుటంగీ వేసుకొని ఒక మతాచార్యుడు కూర్చునేవాడు. స్త్రీల దుస్తులు ధరించి ముగ్గురు మతాచార్యులు అతని దగ్గరకు నడచి వెళతారు. అప్పుడు మొదటి మతాచార్యుడు వారితో, 'ఓ క్రిష్టియన్ మహిళలారా! సమాధిలో మీరు ఎవరి కోసం వెతుకుతున్నారు?' అని అడుగుతాడు. తక్కిన ముగ్గురు ఏకకంఠంతో 'ఓ దివ్యపురుషా! శిలువ వేయబడిన జీసస్‌ను వెతుకుతున్నాము.' అని జవాబిచ్చేవారు. పూజాపీఠం మీది వస్త్రాలను తొలగించి మొదటి మతాచార్యులు ఆయన ఇక్కడ లేడు. ఇదివరలో చెప్పినట్లు లేచినాడు. వెళ్లి ఆయన సమాధి నుంచి లేచినాడని ప్రకటించండి అని ప్రత్యుత్తరమిస్తాడు. ఇదీ చర్చిలోని అర్చనా కార్యకలాపం. ఇది చాలా చిన్నదైనా నాటకానికి కావలసిన లక్షణాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. రంగస్థలం – సమాధి, మతాచార్యుల ప్రశ్నోత్తరాలు నాటక సంభాషణలు, మతాచార్యులే నటులు. మొదటి మతాచార్యులు ద్వితీయ పురుషపాత్ర, తక్కిన ముగ్గురు మేరీల పాత్రలు ధరించేవారు.

క్రమేణా మూకాభినయం, పరికరాల వినియోగం, ఉచితమైన వస్త్రధారణ, ఈ చిన్న ఇతివృత్తానికి ఇతర ఉపకరణాలు జోడించడం అమలులోకి వచ్చాయి. ఈ నాటకాలు చర్చిలలోని మతసంబంధ అర్చనా భాగం గాబట్టి, లాటిన్ భాషలోనే వీటిని రచించారు.

వీటివల్ల అర్చనా నాటకరూపం యూరప్ అంతటా ఎంతో వ్యాప్తి చెందిందనీ, చర్చి కార్యకలాపంలో శతాబ్దాల పాటు ఒక అంశంగా పరిణమించిందని తెలుస్తోంది. కాథలిక్ మతం నెలకొన్న చోట్లలో అర్చనా నాటకం అభివృద్ధిచెందింది. చర్చీలలో అర్చనా భాగంగా ఈ నాటకాలను ప్రవేశపెట్టడంలో ఉద్దేశం ఏసుక్రీస్తు గాథలోని ప్రధానాంశాలను జన సందోహానికి వివరించడమే. దీని ఫలితం వారాశించినంతకంటే ఎక్కువగానే కలిగింది. మధ్యయుగ ప్రారంభంలో జన సందోహానికి ఈ నాటకాలు వినోదక్రీడలుగా కూడా పరిణమించాయి. ఈ నాటకాలలో పాల్గనడం మతాచార్యులకు కూడా ఆనంద దాయకంగా ఉండేదేమో. ఇలాంటి వినోదక్రీడలు కావాలన్న ఒత్తిడి చర్చీలో వారి నుంచి, బయటి జన సందోహం నుంచి రావడంవల్ల నూతన రంగస్థలం వ్యాప్తి చెందింది. 12వ శతాబ్దంలో ఆదం అనే నాటకం నాటక లక్షణాలన్నింటినీ సంతరించుకుంది.

శ్రీ.చ.

అర్థ ప్రకృతులు : ఫల సాధనోపాయాలు. అర్థమంటే ఫలం, ప్రకృతులు అంటే ఉపాయాలు లేక హేతువులు. అర్థప్రకృతులనగా ఫలసాధనోపాయాలు లేక హేతువులు. సాధారణంగా మానవుడి మనస్సులో ఏదో ఒక అభిలాష కలిగినపుడు తత్సంబంధమైన పనిచేయడానికి పూనుకుంటాడు. అంటే ఒకానొక కార్యం సాధించడానికి అతనిలో పుట్టిన అభిలాష హేతువవుతోంది. ఈ హేతువునే అలంకారికులు అర్థప్రకృతిగా పిలిచారు. కార్యసాధనకు నాటక నాయకుడు చేసే ప్రయత్నాలకు, అప్పటి అతని మనోభావాలకూ గల సంబంధ దశలు లేక అవస్థలు బంధితమై ఉండడానికి హేతువులే అర్థప్రకృతులు.

ఇక కళా సంబంధంగా ఆలోచిస్తే నాటక కథ ఆశయసిద్ధికి కారణభూతాలైన అంశాలు అర్థప్రకృతులు. నాటక కథ గమ్యస్థానానికి చేరుకోవడానికి, అంటే ఫలసిద్ధికి హేతుభూతాలైన అంశాలు. కథా విన్యాసంలోని అంశాలు కథ గమ్యస్థానాన్ని చేరుకోవడానికి ఉపకరించే సోపానాలు. వృక్షం ఫలవంతం కావడానికి పూర్వం మొదట బీజరూపంలో ఉండి, దానిని భూమిలో నాటిన తరువాత భూమిని చీల్చుకొని పైకివచ్చి రెమ్మలు వేసి పెరిగి, కొమ్మలు వేసి, పుష్పించి కాయలు కాచినట్టే నాటక వస్తువు కూడా క్రమపరిణామం చెందుతుంది. ఈ పరిణామంలోని మైలురాళ్ల లాంటి స్థానాలే అర్థప్రకృతులు. ఇవి; బీజము, బిందువు, పతాక, ప్రకరి, కార్యము.

శ్రీ.చ.

అర్థోపక్షేపకాలు : సూచ్యార్థ సూచకాలు. జరిగిన, జరుగుతున్న, జరగనున్న నీరస విషయాలను, దృశ్యమానం చేయతగని, చేయలేని విషయాలను, దేశకాలాలను, ప్రేక్షకులకు సూచించడానికి నాటకకర్త అవలంబించే విధానాలను అర్థోపక్షేపకాలంటారు. వీనికి సూచ్యమని కూడా పేరు.

వీటిలో రెండు రోజులు మొదలు సంవత్సర కాలం వరకు జరిగిన కథను మాత్రమే సూచించాలి. కథ సంవత్సరం కంటె ఎక్కువకాలం జరిగినదైతే సంవత్సరం లోపల జరిగినట్లే చెప్పాలి. వీటిలో ప్రధానపాత్రలను ప్రవేశపెట్టాలని కొందరి అలంకారికుల మతం. ఈ అర్థోపక్షేపకాలు అయిదు. విష్కంభం, ప్రవేశకం, చూళిక, అంకముఖం, అంకావతారం.

(విష్కంభ చూలికాం కాస్యాం కావతార ప్రవేశకైః – ద.రూ. 1–58)

శ్రీ.చ.

అలంకార సంగ్రహం : అలంకార శాస్త్రం. రచయిత అమృతానందయోగి. రచనాకాలం 1350 ప్రాంతంలో 11 పరిచ్ఛేదాలలో 7, 8, 9, 10 నాటక లక్షణాలకు సంబంధించినవి. ఇందులోని లక్షణాలు సులభ గ్రాహ్యాలు, సంక్షిప్తాలు, సమగ్రాలు. తెలుగు

లక్షణశాస్త్రకర్తలు లక్షణ గ్రంథాలు రచించడంలో ఈ గ్రంథాన్ని కూడా ఎక్కువగా అనుసరించారు.

శ్రీ.చ.

అలీన నటన : నటనా భేదం. నటుడు పాత్రలో లీనం కాకుండా కొంత నిర్లిప్తతతో తాను వేరు, పాత్ర వేరు, నేను ఫలానా పాత్రలో నటిస్తున్నాననే సంపూర్ణ పరిజ్ఞానంతో, నేను నాటక వ్యాఖ్యాతననే భావంతో ప్రేక్షకులను కూడా నిర్లిప్తతతో తాము చూస్తున్నది నిజం కాదు, నాటకం అనే పరిజ్ఞానంతో, నాటక పాత్రలను, సంఘటనలను విమర్శనా దృష్టితో చూసేట్లు చేసే నటనా విధానం. ఈ విధానంలో నటులు వాచికాన్ని పఠిస్తున్నట్లుగా కాక గ్రంథంలో నుంచి ఉటంకిస్తున్నట్లు ఉచ్చరించాలి. దర్శకుడు ఇలా నటించాలని నటులకు నటించి చూపుతున్నట్లు నటన ఉండాలి. ఈ రీతి భ్రాంతి వాదానికి వ్యతిరిక్తమైంది. దీన్ని ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చింది బెర్టోల్డ్ బ్రెష్ట్ (1898-1956) ఇలాంటి నటనతో కూడిన నాటకరంగాన్ని 'ఎపిక్ థియేటర్' అంటారు.

శ్రీ.చ.

అలీన నాటక రంగం (Epic Theatre) : రసాస్వాదన కంటే విమర్శనాదృష్టితో, ఆలోచనాదృష్టితో ప్రేక్షకులు నాటక ప్రదర్శనాన్ని తిలకించేటట్లు చేసే నాటకరంగం. ఇది భ్రమ సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకం. ప్రేక్షకులను భ్రమగొలిపేదిగా నాటక ప్రదర్శన, దాని అంగాలైన నటన, నాటక రచన మొదలైనవి ఉండకూడదు. ప్రేక్షకులు నిర్లిప్త సాక్షులు మాత్రమే, నటులు నిర్లిప్తులైన వేషధారులు మాత్రమే అనే భావన ఈ నాటక రంగోద్యమంలో ప్రాధాన్యం వహిస్తుంది. నాటక రచయిత, ప్రేక్షకులు, నాటక పాత్రలతోను, సన్నివేశాలతోను తాదాత్మ్యం పొందకుండా రచనలో జాగ్రత్తపడాలి. దీనినే తాదాత్మ్య విచ్ఛిత్తి (Theory of Alienation)అంటారు. ఈ నాటకోద్యమ ప్రవర్తకుడు బెర్టోల్డ్ బ్రెష్ట్. యదార్థ సన్నివేశాలను వాస్తవికంగా చిత్రించకుండా విచిత్రమైనవానిగా చిత్రించాలని ఈయన వాదం.

నాటక రచనలో, నటనలోనే గాక, నాటక ప్రయోగంలో కూడా ఈయన అలీనతను సాధించాడు. ఒక రంగంలో వాస్తవిక చిత్రణ, దాని తరువాత కథా కథనం, కొన్ని రంగాలలో నృత్యాలు, పాటలు, కొన్ని రంగాలలో పాత్రలకు బదులు స్లయిడ్లు లేక సినిమా ఫిల్ము చూపుతూ, ప్రేక్షకులను వాస్తవికత నుంచి దూరం చేసేవాడు. రంగాలంకరణలో, దీపాలంకరణలో భ్రమను తొలగించాడు. బ్రెష్ట్ రచించిన *మదర్ కరేజ్*, *గెలీలియో* మొదలైనవి ఈ నాటక రంగానికి మంచి ఉదాహరణలు.

శ్రీ.చ.

అల్కాజి, ఇబ్రహీమ్ (జ.1940) : నటుడు, థియేటర్ గ్రూపు స్థాపకుడు. జాతీయ నాటకమండలి సంచాలకుడు. రంగస్థల వికాసానికి భారతదేశంలో నిర్మాణాత్మకంగా కృషిచేసి, జాతీయ స్థాయిలోను, అంతర్జాతీయ స్థాయిలోను, ఖ్యాతి గడించిన విశిష్ట కళాకారుడు ఇబ్రహీమ్ అల్కాజి. అల్కాజి బంబాయిలో కళాశాల విద్య పూర్తి చేసుకొని నట జీవితంలోకి అడుగు పెట్టాడు. దొరికిన వేషం తీసుకొని సాదాసీదాగా నాటకం ఆడేసి తృప్తిపడే తత్వంకాదు అల్కాజీది. అభినయకళలో లోతుపాతులు సమగ్రంగా తెలుసుకోవాలన్న ఆరాటం ఈయనను నిరంతర అధ్యయనశీలిగా మార్చింది. ఆ అన్వేషణలో భాగంగానే అల్కాజి లండన్ చేరి రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్స్‌లో శిక్షణపొంది కూలంకష పరిజ్ఞానంతో బంబాయికి తిరిగివచ్చాడు. వచ్చీరాగానే స్నేహితుల్ని, కళాభిలాషుల్నీ కూడగట్టుకుని 'థియేటర్ గ్రూప్'ని ప్రారంభించాడు. అప్పట్లో అది ఇంగ్లీషు నాటకాలకు పరిమితమై ఉండేది. అనతికాలంలోనే 'థియేటర్ యూనిట్'ని ఏర్పరచి హిందీ నాటకాలను అద్భుతంగా ప్రదర్శించటంతోపాటు, నాటక శిక్షణా శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించటంతో అల్కాజి పేరు దశదిశలా మారుమ్రోగింది. తత్ఫలితంగా 1960లో న్యూఢిల్లీలో 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' డైరెక్టరు పదవి అల్కాజిని వరించింది. సమర్థులైన, నిష్ణాతులైన అధ్యాపకవర్గాన్ని ఏర్పరచి రంగస్థల కళల వివిధ శాఖల్లో విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు గల శిక్షణ ఇచ్చి, దేశంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సంస్థను అగ్రస్థానంలో నిలిపిన ఘనత అల్కాజికి దక్కుతుంది. సమకాలీన నాటకరంగానికి అల్కాజి ఏర్పరచిన సంప్రదాయాలు మార్గదర్శకాలుగా ఉన్నాయి. అప్పుడు శిక్షణ పొందిన విద్యార్థులు రంగస్థలం మీదనే కాక చలనచిత్ర రంగంలో అత్యున్నత శిఖరాలను అందుకున్నారు కూడా.

గం.సు.రె.

అల్లాబక్ష్, ఎం (జ.1932) : నటుడు. ఆంధ్ర నాటక కళా సమితి స్థాపకుడు. ఈయన 1932, జులై 1న కర్నూలు జిల్లా లద్దిపల్లిలో జన్మించాడు.



ఇతని పూర్వీకులు జానపద కళారూపాలను ప్రదర్శించేవారు కావడం వల్ల అల్లాబక్ష్ కూడా కళలపట్ల అనురక్తిని పెంచుకున్నాడు. 1953లో మొట్టమొదటి సారిగా పాండవోద్యోగం నాటకంలో శ్రీకృష్ణుని పాత్రను ధరించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. శ్రావ్యమైన కంఠస్వరం, పాత్రకుతగ్గ అభినయం, మంచినటుడిగా గుర్తింపబడటానికి ఉపకరించాయి. ఆ

తరువాత కాలంలో శ్రీకృష్ణ తులాభారం, కురుక్షేత్రం, *గయోపాఖ్యానం* నాటకాలలో శ్రీకృష్ణునిగాను, *చింతామణి*లో బిల్వ మంగళుడు, రామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడు, ఆంజనేయుని పాత్రలను పోషించాడు. ఈయనకు సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్ర పాత్ర ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టింది. 1953లో లద్దిపల్లెలో ఆంధ్ర నాటక కళా సమితిని స్థాపించి హరిశ్చంద్ర నాటకాన్నిరాష్ట్రం నలువయాలలా ప్రదర్శించాడు. సుప్రసిద్ధ రంగస్థల నటులైన పులిపాటి, అద్దంకి,అబ్బూరి మొదలైన వారితో కలిసి నటించాడు.

1964లో వేంకటేశ్వర నాట్యమండలి (తిరుపతి) తరపున ప్రదర్శించిన హరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్ర పాత్ర పోషించిన అల్లాబక్షని సుప్రసిద్ధ సాహితీవేత్త పింగళి లక్ష్మీకాంతం ప్రశంసించాడు. 1985, నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు అల్లాబక్ష్‌ను ఘనంగా సత్కరించాడు. ఆంధ్ర నాటకరంగానికి విశేషకృషి సల్పిన అల్లాబక్ష్‌ను ఎమ్మిగనూరు కళాకారులు 'నటసార్వభౌమ' బిరుదునిచ్చి ఘనంగా సత్కరించారు. 1984-85లో తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన పౌరాణిక నాటకాలకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున నిర్వహించిన ప్రథమ నంది నాటకోత్సవాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు.

దాసరి.ఎన్.

అవధాని, మల్లాది (జ.1915) : నాటక రచయిత, అధ్యాపకుడు. విశ్వనాథ కవిరాజు కుమారుడు. సమకాలీన సాంఘిక జీవితం నుంచి వస్తువును స్వీకరించి వ్యంగ్యాత్మకంగా నాటికల రూపంలో చెప్పడంలో ఈయన దిట్ట. ఈయన అసలు పేరు వేంకట సూర్య నారాయణ అవధాని. ఏ ఉద్యమాన్నైనా ఆవేశంతో చేపట్టి ఆరంభశూరత్వం ప్రదర్శించడంలో ఆంధ్రుల బలహీనతను తెలియజేస్తూ, ఆంధ్రరాష్ట్రం (1938), ఆంధ్రాస్పిరిట్ (1938) నాటికలు రాశాడు. ఇతని తండ్రి రాసిన నాటికలకు కూడా ఇలాంటి నేపథ్యమే ఉండటం గమనార్హం. అవధాని హాస్యనాటికలనేకాక *బాలచంద్ర*, *పలనాటి దుందుభి* వంటి చారిత్రక నాటికలను, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని ప్రబోధించే *గాలివాన* వంటి కౌటుంబిక ఇతివృత్తం గల నాటికలను కూడా రచించాడు. ఇవన్నీ విరివిగా ప్రదర్శించబడినవే. అవధాని నెల్లూరు ప్రభుత్వ ట్రైనింగ్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేశాడు.



ఎస్.కె.

అవమర్శ సంధి : పంచ సంధులలో నాల్గవది. దీనికే విమర్శ సంధి అని పేరు. కార్యసాధన కృషిలో ఒకానొక దశలో పర్యాలోకన చేసుకోగా ఆటంకాలన్నీ తొలగి కార్యం తప్పకుండా సిద్ధిస్తుందనే నిశ్చితాభిప్రాయం కలుగుతుంది లేదా ఆఖరి అడ్డంకి తొలగడం కష్టమని, ఇతోధిక కృషి అవసరమని తోస్తుంది. ఇది ఆఖరి ఊపులాంటిది. తాడు ఊడి రావచ్చు లేదా మధ్యలో తెగిపోవచ్చు.

భూమిలో నాటిన బీజాన్ని, భూమిని, చీల్చుకొని పైకి వచ్చిన అంకురం పెద్దదై చిగిర్చి పూతపట్టిన దశలో పర్యావలోకన చేసుకోగా తప్పకుండా కాపు కాస్తుందనే నిశ్చితాభిప్రాయం కలుగుతుంది. కాని ఆఖరి దశలో పూత మాడిపోవచ్చు లేదా పక్షులు కొట్టి వేయవచ్చుననే సందేహమూ కలగవచ్చు.

ఈ పర్యాలోకన దశనే నాటక పరిభాషలో అవమర్శ లేక విమర్శ సంధి (కథాభాగం) అంటారు. ఈ సంధి సాధారణంగా నాటకం ఆఖరి రెండంకాలలో నిబద్ధమై ఉంటుంది. అర్థ ప్రకృతులలోని నాలుగో ప్రకృతి ప్రకరిని, కార్యావస్థలలోని నాల్గవ అవస్థ నియతాప్తిని అనుసంధించే కథా భాగం అవమర్శసంధి.

ప్రకరి అంటే నాటకం మధ్యలో వచ్చి అప్పటికప్పుడే అంతరించిపోయే ఉపకథ. నియతాప్తి అంటే నాటకఫల విషయమైన నిశ్చితాభిప్రాయం. వేణీసంహారం నాటకం తృతీయాంకంలోని దుశ్శాసనవధ ప్రకరి. షష్ఠాంకంలోని కృష్ణ సందేశం నియతాప్తి. ఈ రెంటి మధ్య కథా భాగమే అవమర్శ సంధి. ఈ అవమర్శ సంధి కథా భాగంలో అవమర్శ (పర్యాలోచన) శంక, నిశ్చితాభిప్రాయం కనిపిస్తాయి.

శ్రీ.చ.

అవరోహణగతి : దేశానుసార గతిభేదం. దీనినే 'అవతరణగతి' అని కూడా అంటారు. అవరోహణ, అవతరణ, అంటే పై నుంచి కిందకు దిగడం. ఈ దిగడం అభినయించడమే అవరోహణగతి లేక అవతరణగతి.

శ్రీ.చ.

అశ్వఘోషుడు (1-2శ మధ్య): ప్రథమ సంస్కృత నాటకకర్త. కాలం 1-2వ శతాబ్దం. సారీపుత్ర ప్రకరణం, మరి రెండు నాటకాలు ఈయన రచించినట్లు తెలుస్తోంది గాని ఇవి ఇపుడు పూర్తిగా లభించడం లేదు. ఈయన కనిష్కచక్రవర్తి ఆస్థానకవి అని తెలుస్తోంది. నాటకాలేకాక బుద్ధ చరిత్ర, సౌందరనందం అనే రెండు శ్రవ్య కావ్యాలు కూడా రచించాడు.

మనకు తెలిసినంతవరకు ఈయనే ప్రకరణ,అన్యాపదేశ రూపక రచనకు మార్గదర్శి.

సారిపుత్ర ప్రకరణంలోని గద్యాన్ని బట్టి తండ్రి పేరు సువర్ణాక్షి అని తెలుస్తోంది. ఇది తొమ్మిదంకాల ప్రకరణం. సారవద్వతిపుత్ర ప్రకరణమని దీనికి పూర్తిపేరు. కథను ప్రచారసాధనంగా ఉపయోగించే శక్తి అశ్వఘోషునికెంతో ఉందని దీనివల్ల వ్యక్తమవుతుంది. మహాయానంలోని విజ్ఞానవాదాన్ని పోలిన ఒకానొక తాత్త్విక రీతికి ఈయన ప్రవక్త. బౌద్ధ భిక్షువులు ఈయనను ఆచార్య భదంత అశ్వఘోష అనేవారు.

శ్రీ.చ.

అశ్వనీకుమార్ ఘోష్ (1892-1962) : ఒరియా నాటక రచయిత. 1915 నుంచి 1950 వరకూ ఒరియా నాటకరంగాన్ని తన నాటకాలతో సుసంపన్నం చేసి ఒరియా నాటకానికి ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని, విశిష్టతను సమకూర్చిన మేటి దృశ్యకావ్య రచయిత. ఒరియా నాటకరంగ పితామహుడుగా ప్రఖ్యాతి గాంచిన రామశంకరరాయ్ యుగం తర్వాత 1915 నుంచి అశ్వనీకుమార్ ఘోష్‌యుగం 1950 వరకు కొనసాగింది. 'ఒరియా నాటక సమ్రాట్' గా అశ్వనీకుమార్‌ను కళాలోకం కీర్తించింది. 23 నాటకాలు రాసిన ఘనత ఈయనకే దక్కింది. భీష్మ (1915), సావిత్రి (1917) వంటి పౌరాణిక నాటకాలను, *గోవింద విద్యాధర్* (1922), *కళాపహాడా* (1926) వంటి చారిత్రక నాటకాలను, *భంజ భుజంగో* (1936), *హిందూ రమణి* (1937), *భాయి* (1941) మొదలైన సాంఘిక నాటకాలను, చారిత్రక వాసనతో కూడిన కొన్ని జానపద నాటకాలను రచించాడు. నాటకాలను నృత్య, సంగీత సమ్మేళనంతో మనోజ్ఞంగా ప్రదర్శించి పండిత పామరుల ప్రశంసలందుకున్నాడు. రంగ పరికరాలు, ఇతర సౌకర్యాలు లేని మారుమూల గ్రామాలలో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నాటక ప్రదర్శనలిచ్చేవాడు.

అశ్వనీకుమార్ నాటక రచనకు పూనుకొనే నాటికి ఆయన వయస్సు 23 సంవత్సరాలే. వీరగాథలకు, దేశభక్తి భావాలను జోడించి రాసిన చారిత్రక నాటకాలు జాతీయోద్యమానికి స్ఫూర్తినిస్తూ బాసటగా నిలిచాయి. ఈయన అత్యధికంగా చారిత్రక నాటకాలు రచించడానికి జాతీయోద్యమానికి తోడ్పడాలన్న తపనే ముఖ్యకారణంగా భావించవచ్చు. స్వాతంత్ర్యానంతరం కూడా అశ్వనీకుమార్ ఘోష్ కొన్ని నాటకాలు రాశాడు. ఆయన రచించిన కడపటి నాటకం 'భువనేశ్వర్' (1962). ఆ సంవత్సరంలోనే అశ్వనీకుమార్ కన్నుమూశాడు.

గం.సు.రె.

అష్టరసాలు : రసాలు తొమ్మిది (నవ రసాలు) అని లోకంలో ప్రసిద్ధిగాంచినా, భరతముని 'నాట్యశాస్త్రం'లో ఎనిమిది రసాలనే పేర్కొన్నాడు. అవి : 1. శృంగారం, 2. హాస్యం, 3. కరుణం, 4. రౌద్రం, 5. వీరం, 6. భయానకం, 7. బీభత్సం, 8. అద్భుతం.

(శృంగార హాస్య కరుణారౌద్ర వీర భయానకాః బీభ-త్సాద్భుత సంజ్ఞాచేతష్టౌ నాట్యే రసాః స్మృతాః) నా.శా. 6-15. వీటిలో శాంత రసం లేకపోవడం గమనార్హం.

శ్రీ.చ.

అసంబద్ధ రూపకం (Absurd Play) : రూపక భేదం. ఇరవయ్యో శతాబ్దం ప్రథమార్థంలో ప్రపంచం అర్థం పర్థం లేనిదిగా ఆనాటి మేధావులకు గోచరించింది. వారి ప్రగాఢ విశ్వాసాలు, నిశ్చితాలు పటాపంచలయ్యాయి. ప్రపంచం నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వర్థిల్లుతుందనే ఆశలు అడియాశలయ్యాయి. హఠాత్తుగా మానవుడు భయంకరమూ, క్రమబద్ధమయూగాని ప్రపంచాన్ని 'అసంబద్ధ ప్రపంచాన్ని' ఎదుర్కొనవలసి వచ్చింది. ప్రపంచ భవితవ్యం ఆశాజనకమనే వాదన భ్రాంతి అనీ, ఎండమావి అనీ తేలిపోయింది.

నిశితంగా లోకాన్ని పరిశీలించగా నిత్యజీవితంలోని సంభాషణలు హేతుబద్ధమైనవికావని, అర్థం పర్థం లేనివని వెల్లడైంది. హేతుబద్ధంగా నగిషీ చెక్కిన సంభాషణలతోకూడిన సంబద్ధనాటకాలే అవాస్తవికమైనవని, అసంబద్ధ నాటకాలు వాస్తవికతకు కచ్చితమైన ప్రతిరూపాలని, అసంబద్ధనాటకాలే వాస్తవికవ్యాఖ్యానాలని కొందరు నాటకరచయితలు నమ్మి, తాము దర్శించిన ఈ ప్రపంచాన్ని నాటకాలలో ప్రతిబింబింప జేయాలనుకున్నారు. ఈ అసంబద్ధ నాటకాలలోని వాస్తవికత మనోధర్మానికి చెందిన అంతర వాస్తవికత మానవుల బాహ్యకృతులను, బాహ్య ప్రక్రియలను చిత్రించడమేగాక, సాంఘిక వాస్తవికతను నిబంధించే ప్రత్యక్ చైతన్యావస్థ (Substate conscious) లోతులను పరిశోధించి చిత్రించడమే ఈ నాటకకర్తల ధ్యేయం. అందుకే ఈ నాటకాలు స్వప్నజగత్తులా గోచరిస్తాయి. నాటకం అంతరార్థం ఏ మాత్రం పొక్కదు. ఈ నాటకాలలో అనేక పొరలు ఉంటాయి. అసంఖ్యాకమైన ఈ పొరలలో నాటక సారాంశం ఇమిడి ఉంటుంది. నటులు ఈ సారాంశాన్ని ప్రేక్షకులకు అందజేయాలి. సంప్రదాయ నాటక నిర్మాణ సూత్రాలను, సాహిత్య విలువలను తోసిరాజని, ఈ అసంబద్ధ నాటక రచనకు శ్రీకారం చుట్టిన రచయితలు బెకెట్, అయనెస్కోలు. అసంబద్ధ నాటకాలు ఐరోపాలో ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొంటున్నాయి.

సంప్రదాయ నాటకాలలో ప్రారంభం, పరాకాష్ఠ, ఫలసిద్ధి క్రమానుగతంగా ఆవిష్కారమవుతాయి. అసంబద్ధ నాటకాలలో అసలు కథ ఎక్కడో ప్రారంభమై, ఎక్కడో ముగుస్తుంది. సంప్రదాయ నాటకాలలో కథా కథనమో, సమస్యా వివరణమో

ప్రాధాన్యం వహిస్తుంది. అసంబద్ధ నాటకాలలో భావచిత్రాన్ని గాని, సంక్లిష్ట భావచిత్రాల నమూనాలను గాని అందజేస్తారు. సంప్రదాయ నాటక పాత్రలు వాస్తవిక జగత్తులో గుర్తించగలిగిన పాత్రలు. వారి ప్రక్రియలకు ఏదో ఒక ఉద్దేశం ఉంటుంది. అసంబద్ధ నాటక పాత్రలను వాస్తవిక జగత్తులో గుర్తించడం కష్టం. వారి ప్రక్రియలకు ఏదో ఒక నిర్దిష్ట ఉద్దేశం గోచరించదు.

సంప్రదాయ నాటకాలలోని సంభాషణలు హేతుబద్ధంగా తీర్చిదిద్దినట్లుంటే, అసంబద్ధ నాటక సంభాషణలు అర్థం కాని పిచ్చాపాటి కింద దిగజారినట్లు కనిపిస్తాయి. ప్రపంచం అర్థవంతమైంది, గట్టి వాస్తవికత మీద నిర్మితమైందనేది సంప్రదాయ నాటకాల ప్రాతిపదిక. ఇక అసంబద్ధ నాటకాలలో నిర్దిష్ట, విస్పష్ట విశ్వాసం లోపించిన అఘాతం గోచరిస్తుంది. వెయిటింగ్ ఫర్ గోడో, ఎమెండీ, జూ స్టోరీ అసంబద్ధ నాటకాలకు మచ్చుతునకలు.

శ్రీ.చ.

అసత్ప్రలాపం : వీధ్యంగ అసంబద్ధ భాషణమే అసత్ప్రలాపం. అంటే సందర్భ శూన్యమైన ప్రసంగం. ఇవి మూడు రకాలు 1. అసంబద్ధ భాషణం, 2. అసంబద్ధోత్తరం, 3. అసంబద్ధ హితోక్తి.

శ్రీ.చ.

అసినౌజెనోవ్, అలెగ్జాండర్ మైకోలెవిచ్ (1904-1941)

: సోవియట్ నాటకర్త, 1926 నుంచి నాటకాలు రాయడం ప్రారంభించాడు. మొదటి నాటకం ఫియర్. ఈ నాటకాన్ని మొట్టమొదట 1931లో లెనిన్‌గ్రాడ్‌లో ప్రదర్శించాడు. ఫియర్‌లో మంచి శిల్పం, నాటకీయత వెల్లివిరుస్తున్నా పార్టీ ప్రచారం కోసం రాసిన మొదటి నాటకం.

సోవియట్ రష్యాను భయం ఆవరించిందనే సిద్ధాంతవేత్త సోషలిస్టుగా మారడం నాటకంలోని ఇతివృత్తం. ఈ నాటకాన్ని మహీధర రామమోహన రావు తెలుగులోకి అను వదించి 1943లో ప్రచు రించాడు.

అసినౌజెనోవ్ రెండవ నాటకం డిస్టెంట్ పాయింట్ (Distant point -1934) మానవత్వం, విప్లవపూర్వ నాటక లక్షణాలతో పార్టీ ప్రచారంతో సమ్మిళితమైన ఈ నాటకాన్ని రష్యాలోనే గాక, ఇంగ్లాండులో కూడా అనేక సమాజాలు ప్రదర్శించాయి. ఈ నాటక ప్రదర్శనమూలంగా రష్యా ప్రభుత్వానికి, అసినౌజెనోవ్‌కి అభిప్రాయభేదాలు వచ్చాయి. ద్వితీయ ప్రపంచ సంగ్రామం రావడంతో అభిప్రాయభేదాలు సమసిపోయి, ప్రభుత్వ అభిమానానికి పాత్రుడయ్యాడు. ఇతని మూడవ నాటకం మాషెంకా (1940)ప్రదర్శన తరువాత సంవత్సరానికి విమాన ప్రమాదంలో మరణించాడు. ఇతని ఆఖరి నాటకం ఆన్ ది ఈవ్ (1941) అతని మరణానంతరం ప్రదర్శితమైంది.

శ్రీ.చ.

అసూచ్యం : నాటక వస్తు భేదం. అసూచితం అంటే సూచితం కానిది. అంటే సూచన ద్వారా గాక ప్రత్యక్షంగా చూపబడేది. నాటక కథానాయకుని జీవితంలో కొన్ని ఘట్టాలు మాత్రమే రసవత్తరంగా, ప్రదర్శనయోగ్యంగా ఉంటాయి. మిగిలినవాటిని సూచన ద్వారా మాత్రమే తెలియజేయాలి. అందుకే దీనికి 'సూచ్యం' అని పేరు వచ్చింది. ఇక సూచ్యం ద్వారా కాక ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపదగిన రసవత్తర ఘట్టాన్ని అసూచ్యం అంటారు.

శ్రీ.చ.

అస్తిత్వవాదం (Existentialism) : రెండు ప్రపంచ యుద్ధాల ఫలితంగా పాశ్చాత్య దేశాలలో ప్రజాజీవనం అతలాకుతలమైంది. ఆర్థిక పరిస్థితి, కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. నైతిక విలువలు నేలమట్టమయ్యాయి. మనిషికి స్వార్థమొక్కటే చుక్కాని అయింది. మధ్యతరగతి సమాజం, బడుగు వర్గాలు నిరాశా కూపంలో పడి తల్లడిల్లిపోతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఆదర్శవాదాలు, ఆధ్యాత్మికవాదాలు ప్రవాహంలోపడి కొట్టుకుపోతున్న మనిషిని సురక్షితంగా గట్టుకు చేర్చలేవనే భావన బలపడింది. అలాంటి తరుణంలో జీన్‌పాల్ సార్త్రే ప్రజలకు బతుకు మీద ఆత్మవిశ్వాసం కలిగించడానికి ఒక నూతన జీవన విధానాన్ని ప్రబోధించాడు. సార్త్రే ప్రవచించిన జీవితతత్త్వమే 'అస్తిత్వవాదం'. సార్త్రే రచించిన 'నో ఎక్జిట్' అస్తిత్వవాదాన్ని అభివ్యక్తం చేసే ప్రసిద్ధ నాటకం. అస్తిత్వవాదం 1943లో తొలిసారిగ ఆవిష్కృతమైంది. కథ, నవల వంటి సాహిత్య ప్రక్రియల్లోకి అస్తిత్వవాదం విస్తృతంగా వ్యాపించి సాహిత్య ప్రపంచంలో అలజడి రేపింది.

అస్తిత్వవాదులు దేవుని ఉనికిని త్రోసిరాజన్నారు. ఈ లోకంలోకి వచ్చి పడిన మానవుడు మనుగడ సాగించాలి. తన బాగోగులకు, సుఖదుఃఖాలకు తానే బాధ్యుడు. కనుక తన జీవన విధానాన్ని తానే రూపొందించుకొని బతకాలి. ఎవరో నిర్ణయించిన నీతిసూత్రాలను, ప్రవర్తనా నియమావళిని, సంప్రదాయాలను పట్టుకు వేలాడక ఎవరికి వారు స్వేచ్ఛగా సొంత అభిప్రాయాలను, విలువలను నిర్ణయించుకొని తమ జీవన విధానం ఏర్పరచుకోవాలనీ, అదే ఆత్మబలాన్ని ఇస్తుందనీ సార్త్రే సిద్ధాంతం. తన సిద్ధాంతాలను నాటకరూపంలో ఆవిష్కరించాడు. అస్తిత్వవాదం ఆలంబనగా మరికొంతమంది కూడా శక్తివంతమైన నాటకాలను రచించారు. వారిలో ఆల్బర్ట్ కామూ ముఖ్యుడు. ఈ నాటకోద్యమం ఐరోపా, అమెరికా ఖండాలలో విశేష ప్రచారం పొంది, నాటకాభిమానులను బాగా ఆకర్షించింది. సరికొత్త భావజాలాన్ని నాటక సాహిత్యంలో పొందుపరిచారే గాని ప్రదర్శనారీతిలో మాత్రం సంప్రదాయ పద్ధతిని విడనాడలేదీ రచయితలు.

గం.సు.రె.

ఆంగికాభినయం : చతుర్విధాభినయాలలో ఒకటి. అంగవిన్యాసం. అంగ విక్షేపం. దీనికి సంక్షిప్త రూపం ఆంగికం. నందికేశ్వరుడు దీనిని భావన (జగత్)తో పోల్చాడు.

ఆంగికం భువనం యస్య వాచికం సర్వ వాఙ్మయమ్
ఆహార్యం చన్ద్ర తారాది తం వందే సాత్త్వికం శివమ్.
అభినయ దర్పణం (1-1)

మానవుడు చలనజీవి. ప్రాణమున్నంతవరకు అవయవాలను చలింపచేస్తూనే ఉంటాడు. ఒక భావాన్ని వ్యక్తీకరించడానికి భాషనేగాక అవయవాలను కూడా ఉపయోగిస్తాడు. ఒక్కొక్కప్పుడు రెండూ ఉపయోగిస్తాడు. 'ఇటురావలసింది' అనే భావాన్ని 'రా', 'రమ్ము' అని భాష ద్వారానేగాక చేయి ఊపడం ద్వారా కూడా వ్యక్తీకరిస్తాడు. ఒక్కొక్కప్పుడు తల ఊపుతాడు. ఏ మాత్రం చలనం లేకుండా మాట్లాడితే శిలాప్రతిమ మాట్లాడుతున్నట్లుంటుంది. సహజత్వం చచ్చిపోతుంది. లోక వృత్తానుకారి, లోక ప్రతిబింబమూ అయిన నాటక ప్రదర్శనలో నటులు కరచరణాది అంగ విన్యాసంతో భావాన్ని వ్యక్తీకరించడమే ఆంగికాభినయం లేక అంగాభినయం. ఈ అంగాభినయానికి కూడా లోకమే ప్రమాణం. ఇది లోక వృత్తానుకరణం. లోకంలోని ప్రజలు ఏయే అవస్థలలో కరచరణాదులను ఎలా కదుపుతారో బాగా గుర్తించి, ఆయా విన్యాసాలను అభ్యసించి తనవిగా చేసుకొని రంగస్థలం మీద ప్రదర్శించాలి. సహజంగా మానవుని వైఖరి, అంగ విక్షేపం, సంతోషంగా ఉన్నప్పుడు ఒకవిధంగా, దుఃఖంతో ఉన్నప్పుడు మరొకవిధంగా ఉంటుంది. అంతేగాక ఒకే అవస్థలో భిన్నవ్యక్తులు, భిన్న భిన్న రీతుల్లో ప్రవర్తిస్తారు. కరచరణాది అవయవ విన్యాసం కూడా భిన్నంగా ఉంటుంది. ఆయా పాత్రల దేశ కాల మతాదులనుబట్టి ఈ భిన్నత్వం వస్తుంది. ఒకే వ్యక్తి ఇతరులతో మాట్లాడేటప్పుడు బాంధవ్యాలనుబట్టి అవయవ విన్యాసం మారుతూంటుంది.

అలవాట్లు: కొంతమంది అంగవిన్యాసంలో ఇతరులలో అరుదుగా కనిపించే అలవాట్లు ఉంటాయి. కొంతమంది మాట్లాడుతుంటే భుజాలు ఎగరవేస్తారు. ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క అలవాటు (Mannerism) ఉంటుంది. ఆ అలవాటును పాత్రకు అనుసంధించి చూపదలచినపుడు చాలా జాగ్రత్త వహించాలి. ఈ అలవాట్లు నిర్ణీత సమయాలలోనే కనిపిస్తాయి. కాబట్టి నటుడు నిర్ణీత సమయాలలోనే ఆ అలవాటును వ్యక్తీకరించాలి. మాటిమాటికీ వ్యక్తీకరిస్తే సహజత్వం కోల్పోయి, కృత్రిమంగా తయారవుతుంది. ప్రేక్షకులను నవ్వించి మెప్పు పొందాలని ఈ అలవాటును అతిగా చూపితే ప్రదర్శన పాడవుతుంది. ఆ అలవాట్లను తూకంగా వాడకపోతే ప్రమాదిస్తుంది కూడా. నాటకం మంచి రసపట్టులో గంభీరంగా నడుస్తోంటే అలవాట్లను ప్రదర్శిస్తుంటే ప్రేక్షకులకు, ఒక్కొక్కపుడు పక్క నటులకు నవ్వు వచ్చి గంభీరత ధ్వంసమైపోయి నాటకం దెబ్బతింటుంది.

సంజ్ఞలు : ఆదిమానవుడు తన భావాలను తోటి మానవుడితో పంచుకోవడానికి కొన్ని సంజ్ఞలను ఉపయోగించేవాడు. కాలక్రమేణ భాషను నేర్చుకొని తన భావాలను భాష ద్వారా వెల్లడిస్తూ ఆ సంజ్ఞలను తగ్గించుకున్నా, వాటిని పూర్తిగా విసర్జించలేక పోయాడు. వాచికం ద్వారా వెల్లడించలేని భావాలను ఎవరికీ తెలియకుండా తాను ఏ ఒక్కరికో తెలపాలనుకున్నప్పుడు ఇవి అత్యంతావశ్యకాలయ్యాయి. అందుకనే మానవుడు నేటికీ వాటిని అంటిపెట్టుకొని ఉన్నాడు.

ఒక్కొక్క భావానికి దేశకాల పాత్రలను బట్టి వేరు వేరు సంజ్ఞలు ఏర్పడ్డాయి. ఒక సంజ్ఞ అనేక భావాలను స్ఫురింప జేస్తుంది కూడా. ఒక సంజ్ఞ ఒక దేశంలో, ఒక కాలంలో ఒక భావాన్ని తెలియజేస్తుంది. ఈ సంజ్ఞలను మానవులు తెలిసి ఆరంభించినవే కాని ఏ శాస్త్రకారుడూ ఏర్పరచినవి కావు. ప్రజలందరికీ తెలిసిన సంజ్ఞలన్నింటినీ భరతముని క్రోడీకరించి నాట్యశాస్త్రంలో పొందుపరిచాడు. ఒక్కొక్క సంజ్ఞ ఏయే భావాలకు గుర్తో కూడా వెల్లడిస్తూ వాటిని విభాగించి హస్తాలని, గ్రీవాలని, శిరోభేదాలని ఆయా అవయవాలను బట్టి, వాటికి పేరుపెట్టాడు.

శ్రీ.చ.

ఆంజనేయరాజు, షణ్ముఖి (1932- 1997): నటుడు, దర్శకుడు, 'బాలాత్రిపుర సుందరి నాట్యమండలి' స్థాపకుడు.



పౌరాణిక పాత్రలకు జీవంపోసిన షణ్ముఖి ఆంజనేయరాజు 1932లో తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం దగ్గరలోని అనకాపల్లిలో పుట్టాడు. తల్లి దండ్రులు లక్ష్మీనారాయణమ్మ, రంగరాజు. షణ్ముఖి ప్రాథమిక విద్యను పూర్తి చేసిన తరువాత శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాడు. ప్రసిద్ధసంగీత విద్వాంసుడు, సంగీత వాద్య కళాపరిషత్తు అధ్యక్షుడు శ్రీరామరాజు పరిచయంతో 1946లో నాటకరంగంలో కాలుపెట్టాడు. ఆంజనేయరాజుకు నటనలో మెళకువలు నేర్పిన గురువు మహా శివభట్ట వెంకటరాజు.

పాండవోద్యోగం, గయోపాఖ్యానం, సతీసక్కుబాయి నాటకాలలో శ్రీకృష్ణుడు, రామాంజనేయయుద్ధం, పాదుకా పట్టాభిషేకంలో శ్రీరాముడు, శ్రీకృష్ణ తులాభారం, శ్రీకృష్ణలీల,

మైరావణలలో నారదుడు, సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్ర, నారదుడు, రామదాసులో కబీరు, చింతామణిలో బిల్వ మంగళుడు, భవానీ శంకరుడు, కృష్ణలీలలో అక్రూరుడు, బబ్బిలిలో విజయ రామరాజు, తెలుగుతల్లి నాటకాల్లో నాగేశ్వరరావు పాత్రలలో నటించి ప్రేక్షకుల మెప్పుపొందాడు. గాయకరత్నంగా పేరు తెచ్చుకున్నాడు. పద్యగానంలో షణ్ముఖి బాణీ అనే ముద్రపడింది. ఆంధ్రదేశంలోనేగాక రాష్ట్రేతర ప్రాంతాలలోని ప్రదర్శనలలో కూడా పాల్గన్నాడు. 1948లో బాలాత్రిపుర సుందరి నాట్యమండలిని స్థాపించాడు. ఈ సంస్థ పక్షాన నందనార్, రేవతి, తెలుగుతల్లి, హరిశ్చంద్ర, గయోపాఖ్యానం, సుభద్రార్జున, శ్రీ కృష్ణాభిమన్యు యుద్ధం మొదలైన నాటకాలను స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించాడు. సంగీతం, మంచి గాత్రం, నటనలో అనుభవం సంపాదించిన ఆంజనేయ రాజును నాటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు గాంధీ జీవితాన్ని బుర్రకథగా చెప్పమన్నాడు. ప్రకాశం పంతులు కోరిక నెరవేర్చాడు. కళాభిమానుల కోసం ఆంజనేయ రాజు పాడిన పద్యాలను గ్రామ ఫోను రికార్డులో ఎక్కించారు. పండితులు మొదలు కొని పల్లెల్లోని పామరుల వరకు ఈయన పద్యాన్ని విని పరవశించని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఆకాశవాణి ఆర్టిస్టుగా అనేక కార్యక్రమాల్లో పాల్గన్నాడు. మాంగల్య విజయం చిత్రంలో రాముని పాత్రలో నటించాడు.

కళారంగంలో ఖ్యాతిగాంచిన ఆంజనేయరాజుకు ఆంధ్రదేశంలోని ప్రముఖ సంస్థలు కనకాభిషేకాలు చేశాయి. రాజమండ్రి కళాకారులు 'ఆంధ్ర బాల గంధర్వ' బిరుదుతో గౌరవిస్తే, కర్నూలు కళాకారులు 'పౌరాణిక నాటక చక్రవర్తి' బిరుదుతో గౌరవించారు. ఏలూరు తెలుగు దర్బారులో కూరెళ్ల లక్ష్మణరావు ప్రోత్సాహంతో షణ్ముఖి ఆంజనేయరాజుకు మహౌక్తికాభిషేకం జరిగింది. ఐదు దశబ్దాల పాటు పద్య నాటకరంగాభివృద్ధి కోసం కృషిచేసిన షణ్ముఖి 1997, ఫిబ్రవరి 18న నటరాజులో ఐక్యమయ్యాడు.

దాసరి.ఎన్.

ఆంజనేయులు. ఎస్.కె. (1925-2005) : నటుడు, దర్శకుడు, ప్రయోక్త, గుణనిర్ణేత, నాటక రచయిత, సాంకేతిక నిపుణుడు. 1925, ఏప్రిల్ 8న జన్మించాడు. నిజాం స్టేట్ రైల్వేలో 1945లో ఉద్యోగంలో చేరాడు. ఆనాటి నుంచి సాంఘిక, చారిత్రక, పౌరాణిక నాటకాలలో నటించి, దర్శకత్వం చేపట్టి, తన ప్రతిభను నిరూపించాడు. 1962లో సారంగధర నాటకానికి దర్శకత్వం వహించి అనేకసార్లు ప్రదర్శింపజేశాడు.

నాటక వికాసానికి ఆయన చేస్తున్న అవిశ్రాంత కృషిని గుర్తించి యాజమాన్యం రెండు అడ్వాన్స్‌డ్ ఇంక్రిమెంట్స్ నిచ్చి ప్రోత్సహించింది. పదోన్నతి కల్పించి గౌరవించింది. ఒక నాటక కళాకారునికి ఇటువంటి ప్రోత్సాహం లభించడం అరుదైన విషయం. ఆంజనేయులు రంగస్థలసమస్తవిభాగాల్లో ప్రవీణుడేగాక మంచి నాటక రచయిత కూడా. సంస్థలోని మహిళా ఉద్యోగుల కోసం స్త్రీ పాత్రలతో నాటికలను రాశాడు. కార్మికులకోసం రాసిన పలునాటికలను ఆకాశవాణి ప్రసారం చేసింది. 1987లో ఆంధ్ర జ్యోతి నిర్వహించిన నాటిక రచనా పోటీలలో ఆంజనేయులు రాసిన రాధికా స్వాంతం నాటికకు ప్రథమ బహుమతి లభించింది. విశాఖ సాహితీ సేవా సమితి ట్రస్ట్ నిర్వహించిన నాటక రచనల పోటీలలో ఎస్.కె. రాసిన స్మృతి ప్రతీక నాటికకు తృతీయ బహుమతి లభించింది.



శిరోమణి, వలయం, ఆత్మీయులు, రాగరాగిణి, పవిత్రులు, చావకూడదు, నీడలు-నిందలు వంటి అనేక నాటికానాటకాలను విజయవంతంగా ప్రయోగించాడు. 1952లో జంటనగరాలలో తెలుగు మాట్లాడటమే చెదురు మదురుగా ఉండే పరిస్థితుల్లో మిత్రుడు లక్ష్మీపతి సహకారంతో 'విశ్రుతీనాట్యమండలి'ని స్థాపించి అనేక నాటకాల్ని ప్రదర్శించాడు. 1955 నుంచి శతాధిక పరిషత్తు నాటక పోటీలకు గుణనిర్ణేతగా ఉండి రికార్డు సృష్టించిన ఆంజనేయులు ఒక సంచార రంగస్థలం. రాష్ట్రంలో అనేక కళా సంస్థలు ఈయనను సన్మానించాయి. 2005, సెప్టెంబర్ 11న ఎస్.కె. హైదరా బాద్‌లో కన్నుమూశాడు.

రమణ

ఆంజనేయులు, కుందుర్తి (1922-1982) : కవి, నాటకకర్త. వచన కవితా పితామహుడుగా ఖ్యాతి గడించిన కుందుర్తి ఆంజనేయులు 1922, డిసెంబర్ 16న జన్మించాడు. వచన కవిత అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ ప్రవేశించాలని ఆశించి జీవిత పర్యంతమూ కృషిచేసిన దీక్షాదక్షుడు. 'ఫ్రీవర్స్‌ఫ్రంట్' వ్యవస్థాపకుడు. 'నగరంలో వాన, నాలోని నాదాలు' అనే కవితా సంపుటికి 1969లో 'సోవియట్ లాండ్' నెహ్రూ అవార్డు లభించింది.

ఇదే సంపుటికి 1970లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి కూడా లభించింది.

వచన కవితా ధోరణిలో రాసిన ఆశ నాటిక ఈయనకు పేరు తెచ్చింది. ఆవిధంగా నాటికలు రాసిన వారిలో కుందుర్తి ఆద్యుడు. ఈ నాటిక ప్రసిద్ధ దర్శకుడు ఎ.ఆర్. కృష్ణసారథ్యంలో తొలిసారిగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శించబడి ప్రశంసలు అందుకుంది. ఆచార్లగారమ్మాయి, శిక్ష ఏమిటి మొదలైన వచన కవితా నాటికలు కూడా కుందుర్తి కలం నుంచి వెలువడ్డాయి.

కుందుర్తి సమాచార పౌర సంబంధాల శాఖలో పని చేసి పదవీ విరమణ చేశాడు. 1982లో భౌతిక కాయాన్ని విడిచిపెట్టాడు. ఈయన స్థాపించిన 'ఫ్రీవర్స్‌ఫ్రంట్' వచన కవితకు ఆశాదీపంగా నేటికీ వెలుగొందుతూనే ఉంది.

గం.సు.రె.

ఆంజనేయులు. సి.ఎస్.ఆర్. (1907-1963): రంగస్థల, సినీనటుడు, జాతీయవాది, స్నేహ పాత్రుడు. నిగర్వ నిష్కల్మష హృదయుడు, చమత్కారి. హార్మోనియం వాయించడంలో సిద్ధహస్తుడు. పూర్తిపేరు చిలకలపూడి సీతా రామాంజనేయులు. ఈయన పూర్వులది బందరు దగ్గరి చిలకలపూడి.సి. ఎస్.ఆర్. 1907, జులై 11న జన్మించాడు. ఈయన తండ్రి కూడా నటుడే.

బాడ్మింటన్ ఆట అంటే అభిమానం. స్కూలుఫైనల్ వరకు చదివి కో-ఆపరేటివ్ సూపర్‌వైజర్ ఉద్యోగం చేస్తున్న కాలంలో నాటకాల మీద మోజు కలిగింది. ఉద్యోగం కాలదన్ని నాటకరంగంలో ప్రవేశించి అగ్రశ్రేణి నటుడుగా రూపొందాడు. పద్యాలు, పాటలు పాడడంలో సొంత బాణీని రూపొందించుకొని 'సి.ఎస్.ఆర్. బాణి' అని పేరు తెచ్చుకున్నాడు. శ్రీకృష్ణ పాత్రతో ప్రారంభమైన సి.ఎస్.ఆర్. నాటక జీవితం తుకారం పాత్రతో పతాకస్థాయి చేరుకుంది. సి.ఎస్.ఆర్. సంస్కరణవాది. గాంధీజీ అస్పృశ్యతా నివారణోద్యమం ఈయనను కదిపివేసింది. తాండ్ర సుబ్రహ్మణ్యశాస్త్రిని అభ్యర్థించి పతిత పావన నాటకం రాయించి వాడవాడలా ప్రదర్శించి అస్పృశ్యతోద్యమానికి దోహదం చేశాడు. తుకారాం నాటక ప్రదర్శన వల్ల వచ్చిన పదివేలనగదును నేషనల్ ఆర్మీ ఉద్యమానికి సమర్పించిన త్యాగి. ఒక రీతి పాత్రలనేగాక వివిధ రీతుల, విభిన్న ప్రకృతుల పాత్రలను కూడా అభినయించడంలో దిట్ట.

ఆ తరువాత చలనచిత్ర రంగంలో ప్రవేశించాడు. అక్కడ మొదటి వేషం శ్రీకృష్ణుడే. కృష్ణుడు వేషంతో ప్రారంభమైన ఆయన సినీ జీవితం రామప్పంతులు వేషంతో తారాస్థాయి నందుకుంది. సి.ఎస్.ఆర్. లేని సినిమా ఏమిటి అని అనుకునేటంత కీర్తి నార్జించాడు. ఆయన నటించిన సినిమాల సంఖ్య 150 పైచిలుకు. మాయా బజారు లో శకుని పాత్ర నిర్వహణ ఆయన నటనా ప్రతిభకు తార్కాణం. తులాభారంలో శ్రీకృష్ణుడు, తుకారాం పాత్రల నిర్వహణలో సాటిలేని మేటిగా అఖండ ఖ్యాతి నార్జించాడు. తులాభారంలోని 'ప్రమదల గూడి..' మొదలైన పద్యాలు ఆయన నోటి వెంట విన్నవారు ఎన్నటికీ మరచిపోలేరు. చెవులలో గింగురుమంటూనే ఉంటాయి.

ప్రజలకు నా వేషాలు నచ్చకపోతే సినిమారంగం నుంచి నిష్క్రమిస్తానని ఒక రేడియో ప్రసంగంలో శపథం చేశాడు. కాని ఆయన జీవితంలో ఆ అవసరం రాలేదు. ఈయనకు శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, రామదాసు, తుకారాం, భవానీశంకరుడు మొదలైన పాత్రలు బాగా పేరు తెచ్చాయి. సి.ఎస్.ఆర్. 1963, అక్టోబర్ 8న చెన్నైలో కన్నుమూశాడు.

శ్రీ.చ

ఆండర్సన్, మాక్స్‌వెల్ (1888-1959) : అమెరికా నాటకకర్త. పద్య నాటక ఆవశ్యకతను ప్రచారం చేసిన నాటక సిద్ధాంతవేత్త. ఈయన రాసిన మొదటి నాటకం వైట్ డిజర్ట్ ప్రదర్శన విజయవంతం కాలేదు. ప్రథమ ప్రపంచ సంగ్రామానికి సంబంధించిన ఆహ్లాద నాటకం వాట్ ప్రయిస్ గ్లోరీ అనే నాటకం ఈయనకు ఖ్యాతి తెచ్చి పెట్టింది. ఈయన నాటకాలలో నాటకీయత ఎక్కువ గోచరిస్తుంది. భాషలో ఉద్రిక్తత ఎక్కువగా గోచరించదు. 1911లో నార్త్‌డకోటా విశ్వవిద్యాలయంలో పట్టభద్రుడైన తరువాత ఆండర్సన్ కొంత కాలంపాటు కాలేజీ అధ్యాపకుడుగాను, వార్తా పత్రికలలోను పని చేశాడు. గొప్ప కవిత లేనిదే గొప్ప నాటకం లేదని ఇతని దృఢాభిప్రాయం. సమకాలీన ఇతివృత్తం నుంచి విషాద కవిత జనింప చేయడమే ఆయన లక్ష్యం. నాటకంలో కవిత, విషాద నాటక పరమాశయం అనే విషయాల మీద ఉపన్యాసాలు ఇచ్చాడు. వ్యాసాలు రచించాడు. ఇవి అన్నీ

ఒక గ్రంథంగా ప్రచురిత మయ్యాయి. ఆధునిక నాగరికత ,తన కవితా జీవితం విషయాలలో ఎంత ఆందోళన చెందినా ఈయన నాటకరంగాన్ని మాత్రం వదలలేదు.

వైట్ డిజర్ట్ (1923), వాట్ ప్రయిస్ గ్లోరీ (1924), ఎలిజబెత్ ది క్వీన్ (1930), మేరీ ఆఫ్ స్కాట్‌లెండ్ (1933), వాలిఫోర్జ్ (1934), వింటర్ సెట్ (1935), హైటార్ (1936), నిక్కర్ బాకర్ హాలీడే (1938), కీలార్గో (1939), లాస్ ఇన్ ది స్టార్స్ (1950) మొదలైన నాటకాలు రాశాడు. ప్రేక్షకుల ఆనందం కోసమే నాటకం అనే సిద్ధాంతానికి కట్టుబడకుండా రాజకీయ విషయాలకు సంబంధించిన నాటకాలు కూడా రచించాడు. రాజకీయ అవినీతిని బహిర్గతం చేస్తూ రాసిన నాటకాలు ప్రేక్షకుల మీద ఎక్కువ ప్రభావాన్ని చూపాయి.

శ్రీ.చ.

ఆంద్రీయేవ్, లివోనిడ్ (1871-1919) : రష్యన్ నాటక కర్త. మాస్కో, పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టభద్రుడైన తరువాత ఒక మాస్కో పత్రికలో విలేఖరిగా పనిచేశాడు. 1897లో ఈయన రచించిన ఒక చిన్నకథ గోర్కీని ఆకర్షించింది. దానితో ఆంద్రీవ్ విజయానికి బాట ఏర్పడింది. చిన్నతనంలో విప్లవోద్యమం ఇతనిని ఆకర్షించింది. అక్టోబర్ విప్లవం తరువాత ఫిన్లెండ్ వలస వెళ్ళి అక్కడే మరణించాడు.

ఈయన రాసిన నాటకాలు విప్లవ పూర్వ రష్యాలో ఎక్కువ ప్రజాదరణ పొందాయి. ఆనాటి నిరాశా నిస్పృహలను ఆ నాటకాలలో ప్రతిబింబించడం నాటి సోవియట్ అధికారులకు నచ్చలేదు. ఈయన నాటకాలను రెండు రకాలుగా విభజించ వచ్చు. 1. వాస్తవికతా నాటకాలు, 2. సాంకేతిక నాటకాలు. సాంకేతిక నాటకాలలో ముఖ్యంగా చెప్పుకోతగింది సాలైన్ ఉమన్. ఈయన నాటకాలలో నిరాశ ఎక్కువగా కనిపిస్తుంది. ఈయన నాటకాలు ఐరోపాలోనూ, అమెరికాలోనూ 1920లో ఎక్కువగా విజయవంతమయ్యాయి. కొంతకాలం గ్రహణగ్రస్తమైనా ఇవి అసంబద్ధ నాటకాలకు చేరువగా ఉండడంవల్ల బ్రిటన్, అమెరికాల లోని విశ్వవిద్యాలయాలలోనూ, పరిశోధన నాటక కేంద్రాలలోనూ ఎక్కువ ఆసక్తిని జనింపచేస్తున్నాయి. *లైఫ్ ఆఫ్ మాన్ (1906), ది సెవెన్ హూవర్ హాంగ్డ్ (1908), సాలైన్ ఉమన్ (1911), హీ హూగెట్స్ స్లాప్డ్ (1914),* మొదలైనవి ఈయన సుప్రసిద్ధ నాటకాలు.

శ్రీ.చ.

ఆంధ్ర ఆర్టిస్ట్స్ అసోసియేషన్ : తెనాలి రామవిలాస సభ చితికి పోయిన తరువాత, అందులోని కొందరు వేరువేరుగా సమాజాలు పెట్టుకున్నారు. అలా నెలకొల్పిన సమాజాలలో ఒకటి ఆంధ్ర ఆర్టిస్ట్ అసోసియేషన్. ఈ సమాజాన్ని 1950లో మాధవపెద్ది వెంకట్రామయ్య స్థాపించాడు. పీసపాటి నరసింహమూర్తి గుంటూరు పరిషత్తులో ప్రథమ బహుమతి పొందిన కొత్త రోజులు. మాధవపెద్ది, నరసింహమూర్తి నటన చూసి, తృప్తిపడి, సమాజాన్ని ఏర్పాటు చేశాడు. ఇందులో నరసింహమూర్తి, మాధవపెద్ది వెంకట్రామయ్య, తంగిరాల శ్రీరామమూర్తి, పంచాంగం బ్రదర్స్, వాలేశ్వరరావ్, మైనేపల్లి శ్రీరామమూర్తి, పోతూరి రామకృష్ణమూర్తి. వెంకటస్వామి నాయుడు, సత్యవతి వివిధ పాత్రలు ధరించారు. జంధ్యాల గౌరీ శ్రీనాథశాస్త్రి మేనేజరుగా పని చేశాడు. ఈ సమాజం ఎక్కువగా *పాండవోద్యోగవిజయాలు, గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులాభారం* ప్రదర్శించింది. మాధవపెద్ది చనిపోయిన తరువాత కూడా పీసపాటి నరసింహమూర్తి ఈ సమాజాన్ని నిర్వహించాడు.

నే.వ.శ.

ఆంధ్ర ఆర్టు థియేటర్ : 1948లో ప్రజా నాట్యమండలిని ప్రభుత్వం నిషేధించిన తరువాత ప్రజానాట్యమండలికి ప్రత్యామ్నాయంగా, హనుమంతరాయ గ్రంథాలయ వైజ్ఞానిక శాఖగా ఆంధ్ర ఆర్టు థియేటర్ పని చేసింది. విజయవాడలో అనేక నాటక సమాజాలకు ఉత్సాహాన్నిచ్చింది. *ఈనాడు, పరివర్తన, గాలిమేడలు, విశ్వశాంతి, మావూరు, కప్పలు, భయం, ప్రగతి* మొదలైన నాటకాలను ప్రదర్శించింది. ఆర్టు థియేటరులో మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, రెంటాల, అనిసెట్టి, అప్పలస్వామి, ఉమామహేశ్వరరావు, హరినారాయణ, వై.వి.రాజు, ఆత్రేయ, వి.మధుసూదనరావు, వి.సరోజని, కొడాలి ఆదిశేషయ్య, జి.ఎస్.ఆర్. మూర్తి, కర్నాటి లక్ష్మీనరసయ్య, కె. వేంకటేశ్వరరావు మొదలైన వారంతా కృషి చేశారు.

ఈ సమాజం జానపద కళారూపాలపై సదస్సులు నిర్వహించి, వారోత్సవాలను ఏర్పాటుచేసి కళాకారులను ప్రోత్సహించింది. సాంఘిక నాటికలను నెలవారీ కార్యక్రమాలుగా ప్రదర్శింప జేసింది.

మిక్కిలినేని

ఆంధ్ర డ్రమెటిక్ కంపెనీ : 1944లో అబ్బూరి వరప్రసాద రావు ఆధ్వర్యంలో తెనాలిలో స్థాపించబడింది. ఈ సమాజానికి అబ్బూరి బ్రదర్స్ సమాజమని పేరు. అబ్బూరి నాగేశ్వర రావు మేనేజరుగా పని చేశాడు. అబ్బూరి వెంకటప్పయ్య, అబ్బూరి

సుబ్బారావు, పులిపాక వెంకటప్పయ్య, బి.వాలేశ్వరరావ్, మాలతి, రాజకుమారి, వివిధ పాత్రలలో నటించారు. ఈ సమాజం కురుక్షేత్రం, గయోపాఖ్యానం, చింతామణి నాటకాలు ఎక్కువగా ప్రదర్శించింది. ఈ సమాజంలో వరప్రసాదరావు ముఖ్యమైన నటుడు. ఈయన పేరు మీదుగానే, ఈ సమాజం నడిచిందంటే అతిశయోక్తి కాదు. ఈయన పద్యాలు ఒక ప్రత్యేక బాణీలో పాడి, ఖ్యాతి గడించాడు. సమాజం దిగ్విజయంగా నడుస్తూవుండగా ప్రసాద రావు అనారోగ్యానికి గురైనాడు. ప్రసాదరావు మరణంతో సమాజం విచ్ఛిన్నమైంది.

నే.వ.శ.

ఆంధ్ర నట ప్రకాశిక : నాటక సిద్ధాంత గ్రంథం. రచన పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రి. ప్రథమ ముద్రణ 1930. సిద్ధాంత, సాంకేతిక విషయాలు రెంటిని క్రోడీకరించడమేగాక తెలుగు నాటక చరిత్రను లక్ష్య సమన్వయంతో వెలువరించిన గ్రంథం. ఈ గ్రంథంలోని పది ప్రకరణాలలో రంగస్థలానికి సంబంధించిన వివిధ విషయాలపై సాధికారంగా చర్చించడమైంది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటకకర్తలు : సమీక్షావ్యాస సంపుటి. 1957లో మొదటి సంపుటం ముద్రితం. తెలుగు నాటకకర్తల సమగ్ర జీవిత రేఖలు, వారి వారి నాటక రచనా విధానాల మీద సమీక్షలతో కూడిన వ్యాస సంపుటి.

ధర్మవరం, వేదం వారి నాటకాలగురించి దివాకర్ల వేంకటావధాని, కోలాచలం శ్రీనివాసరావు నాటకసాహిత్యంపై కప్పగల్లు సంజీవమూర్తి, పానుగంటి లక్ష్మీనరసింహారావు నాటక సాహిత్యం మీద పోణంగి శ్రీరామ అప్పారావు, చిలకమర్తి నాటక సాహిత్యం గురించి చెలమచర్ల రంగాచార్యులు రాసిన సమీక్ష వ్యాసాలు ఈ సంపుటంలో చోటుచేసుకున్నాయి. 1962లో రెండవ భాగం పాఠకులకు అందుబాటులో వచ్చింది. బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటక సాహిత్య విశేషాల గురించి దర్భా వేంకట కృష్ణమూర్తి, తిరుపతి వేంకట కవుల నాటకాల మీద రాజేశ్వరశర్మ, గురజాడ నాటకాల మీద దివాకర్ల వేంకటావధాని సమీక్ష ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి.

శ్రీ.చ.

ఆంధ్ర నాటక కళ : ఈ వ్యాస సంపుటిని శిష్టారామకృష్ణ శాస్త్రి రచించాడు. ప్రథమ ముద్రణ 1970. మద్రాసు విశ్వవిద్యాలయ పత్రికలో వెలువడిన వ్యాసాల సంపుటీకరణ. ఈ గ్రంథంలో నాటక కళ, కూచిపూడి భాగవతులు, పాశ్చాత్య నాటక ప్రపంచం, సంస్కృత నాటక లోకం, ఆంధ్ర నాటక జగత్తు, నాటక తత్త్వం, అభినయం, నటుడు, ప్రాచ్య, పాశ్చాత్య నాటక సంప్రదాయాలు, నేటి ఆంధ్ర నాటకరంగ సమస్య అనే శీర్షికల కింద వివిధ విషయాలు ప్రస్తావించిన గ్రంథం.

శ్రీ.చ.

ఆంధ్ర నాటక కళా పరిణామం : ఈ నాటక చరిత్ర గ్రంథాన్ని శ్రీనివాస చక్రవర్తి రచించాడు. ప్రథమ ముద్రణ 1972. ఆంధ్రదర్శిని నుంచి పునర్ముద్రితం. కురవంజి, యక్షగానం మొదలైన జానపద కళారీతుల నుంచి నేటి నాటక రచన, నాటకరంగం ఎలా పరిణతి చెందిందో వివరించే వ్యాసం. కురవంజి, యక్షగానం, వీధి నాటకం, నృత్య కళ, బుఱ్ఱకథ, హరికథ, పగటి వేషాలు. తోలుబమ్మలు, నాటకరంగం అనే శీర్షికలతో వ్యాసాలున్నాయి.

ఆంధ్ర నాటక కళా పరిణామం

శ్రీ.చ.

ఆంధ్ర నాటక దర్శిని : దీని గ్రంథ కర్త శ్రీనివాస చక్రవర్తి. 1963లో ముద్రితమైన ఈ గ్రంథంలో 1500 నాటక, నాటిక, ఏకపాత్రాభినయ రచనల సమాచారం పొందుపరచడమైంది. ప్రతిరచనకు రచనపేరు, రచయిత పేరు, హక్కుదారుని పేరు, ప్రథమ ముద్రణ తేదీ, అంకాలు, రంగాల సంఖ్య, పురుష పాత్రలు, స్త్రీ పాత్రలు, చిల్లర పాత్రల సంఖ్య, సెట్టుల సంఖ్య, ఇతివృత్తం మొదలైన విషయాలు తెలిపే గ్రంథమిది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటక నామావళి : తెలుగు నాటక గణాంక సూచీ పత్రం. సంపాదకులు పురాణం సూరి శాస్త్రి, కానుకొలను వెంకట రామయ్య. ఈ గ్రంథాన్ని 1916లో ముద్రించాడు. 1901 నుంచి 1916 వరకు తెలుగులో వెలువడిన నాటకాల పేర్లు, రచయితల పేర్లు,అంకాల సంఖ్య, మూల్యంతో విరాజిల్లే పత్రం. నాటకాలను ఇతివృత్తానుసారం వివిధ రీతులుగా వింగడించి చూపడమైంది. అంతేగాక ఆంధ్రదేశంలోని విశాఖ సీమ, సర్కారు సీమ, రాయలసీమ, నెల్లూరు సీమ ప్రకారం రేఖాచిత్రా (గ్రాఫు)ల ద్వారా కూడా ఆయా విషయాలు సులభగ్రాహ్యంగా ఈ గ్రంథంలో తెలియజేయడమైంది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటక పద్య పఠనం : సిద్ధాంత గ్రంథం. ఈ గ్రంథాన్ని భమిడిపాటి కామేశ్వరరావు రచించాడు. తెలుగు నాటకాలలో పద్యం పాడాలా, చదవాలా అనే విషయం మీద 1920 ప్రాంతంలో తెలుగుదేశంలో తర్జన భర్జనలు జరిగాయి. ఆ తర్జన భర్జనల పర్యవసానమే ఈ గ్రంథం. కామేశ్వరరావు ఈ గ్రంథంలో సోపోపత్తిగా పద్యం చదవాలే గాని, పాడరాదని సిద్ధాంతీకరించాడు. ఈ వాదనకు సంబంధించిన పూర్వాపరాలను చక్కగా వివరించాడు.

ప్రాతిపదిక, పద్యం పాడే సంప్రదాయ వివరణ, పద్య రూపం, రాగం, పద్యం – రాగం, కొన్ని ఇతర పదాల విషయ మీమాంస, వాద ప్రతివాదన, అనర్థాలు, పూర్వ సంప్రదాయాలు, పర్యవసానం, ఆక్షేపణలు, సమాధానాలు. 1939లోని ఒక ఉప

న్యాస సంగ్రహం అనే 14 అధ్యాయాలతో ఈ గ్రంథం విరాజిల్లుతోంది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటక పితామహుడు : ఈ నాటక విమర్శన గ్రంథాన్ని దివాకర్ల వేంకటావధాని 1937లో రచించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎం.ఎ (ఆనర్స్) పట్టాకు సమర్పించిన సమీక్షా గ్రంథం. ఆంధ్రనాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటక సాహిత్య సమీక్ష, ఆంధ్ర నాటక ఆరంభ దశ, ఆంధ్ర నాటక పితామహుని నాటకాలు, వాని మూలాలు, విషాదాంత నాటకాలు, నాటకాలలోని వస్తువు, నాటక పితామహుని నాటక నిర్మాణం, పూర్వరంగాదులు, నాటక సమయాలు, పాత్ర పరిపోషణ, కవిత్వం, జీవితతత్త్వ వ్యాఖ్యానం, హాస్యం, ఆంధ్ర నాటక పితామహుడు అనే 13 అధ్యాయాలతో ఈ గ్రంథం విరాజిల్లుతోంది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటకరంగం : ఈ సిద్ధాంత గ్రంథాన్ని గొల్లపూడి శ్రీరామశాస్త్రి రచించాడు. ఇందులో చతుర్విధాభినయాల వివరణే గాక పాత్రోచిత భాష, నాటకాలలో పద్యాలు, నాటక సమస్యలు కూడా చర్చించిన గ్రంథం. 1922-23 ప్రాంతంలో రచించిన ఈ గ్రంథం 1924లో ముద్రణకు నోచుకుంది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటకరంగ చరిత్ర : తెలుగు నాటకరంగ చరిత్రను సాకల్యంగా తెలిపే 853 పుటల బృహద్గ్రంథం. తెలుగు భాషా సమితి వారి పోటీలలో బహుమతి పొందిన రచన. ఈ గ్రంథాన్ని మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించాడు. ఈ గ్రంథంలో నాట్య కళారంభం, ఆంధ్రుల కళాచరిత్ర, జానపద కళారూపాలు, కూచిపూడి కళాక్షేత్రం, తోలుబమ్మలాటలు, జంగం కథలు, పగటి వేషాలు, దేవదాసీలు, తెలుగు నాటక సాహిత్య సమీక్ష, ఆంధ్రప్రదేశ్ నాటక రంగం, ప్రజానాట్య మండలి, హిందీ నాటకరంగం, ప్రసిద్ధ నాటక రచయితలు, కళాకారుల జీవితాలు, కళాసాహిత్యం, తెలుగు సినిమారంగ పరిణామం, చతుర్విధాభినయాలు, నటుడు, దర్శకుడు, నాటక సమాజం, ప్రదర్శన బాధ్యతలు, నాటక మందిరాలు, అనుబంధం మొదలైన విషయాలతో విలసిల్లుతున్న ఈ గ్రంథం 1969లో ప్రచురించబడింది

శ్రీ.చ.

ఆంధ్ర నాటక రంగాలు : ఈ సిద్ధాంత గ్రంథాన్ని టేకుమళ్ళ అచ్యుతరావు రచించాడు. నాటకతత్త్వం, కథా నిర్మాణం, పాత్రశీల చిత్రణ, సుఖాంత, దుఃఖాంత నాటక విభాగ విచారణ, ప్రదర్శనా విధానం అనే అయిదు అంశాలను ఈ గ్రంథంలో అచ్యుతరావు చిత్రించాడు. మానవల్లి రామకృష్ణకవి ప్రస్తావన రాసిన ఈ గ్రంథం 1926లో ముద్రణకు నోచుకుంది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటక సంస్కరణం : ఈ విమర్శన గ్రంథాన్ని పురాణం సూరిశాస్త్రి రచించాడు. బందరులో 1924, జూన్ 4వ తేదీ నుంచి జరిగిన ఆంధ్ర నాటక సాహిత్య సభలలో ప్రముఖుల ప్రసంగాలతో, ముట్నూరి కృష్ణారావు ప్రభృతుల విమర్శకాభిప్రాయాలతో, పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రి, కాశీ కృష్ణమాచారిల సంభాషణలు, కోలాచలం శ్రీనివాసరావు నాటక కవులకు, నటులకు విజ్ఞప్తులు, వాటి మీద ముత్తరాజు ప్రభృతుల వ్యాఖ్యలు, నాట్యాంబుజ ప్రశంసలు, నటనా ప్రణాళిక అనే శీర్షికల కింద అమూల్యమైన రచనలతో విరాజిల్లిన ఈ గ్రంథం 1925లో ముద్రింపబడింది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటక సమాఖ్య : ఈ నాటక సమాజాన్ని 1954లో రాజమండ్రిలో స్థాపించారు. ఆంధ్రదేశంలోని వివిధ నాటక సమాజాల కృషిని సమన్వయపరచి ఒకతాటి మీద నడిపించాలనే మహదుద్దేశంతో స్థాపితమైన సంస్థ. 1954 ఆగస్టులో దీనికి బలరాజ్ సహానీ ప్రారంభోత్సవం చేశాడు. 1954, ఆగస్టు 7న జరిగిన మహాసభలో దీనికి ఆధ్యక్షుడిగా కొప్పరపు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా గరికపాటి రాజారావు ఎన్నికయ్యారు. సమాఖ్య నిర్వహించే కార్యకలాప పట్టికలో అంశాలనేకం ఉన్నా, ముందుగా నాటక సిద్ధాంత సాంకేతిక విజ్ఞాన పరివ్యాప్తి తలపెట్టారు. తదనుసారంగా విజయవాడలో 1956, జనవరి 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు రామమోహన గ్రంథాలయ హాలులో నాటక తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు స్థానం నరసింహారావు ప్రధానాచార్యుడిగా వ్యవహరించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ నాటక సంస్థల నుంచి 115 మంది విద్యార్థులు ఈ తరగతులకు హాజరయ్యారు. కూర్మా వేణుగోపాలస్వామి, ఆచార్య ఆత్రేయ, శ్రీనివాస చక్రవర్తి, భాగవతుల కుటుంబరావు, జమ్మలమడక మాధవరాయ శర్మ, కొప్పరపు సుబ్బారావు, గరికపాటి రాజారావు, నాటకరంగానికి సంబంధించిన వివిధ విషయాలు బోధించారు. ప్రతిరాత్రి రూపశిల్పి కుమార్ ఆహార్యం మీద తరగతులు నిర్వహించాడు. కుమార్ బోధనకు శాశ్వత రూపమివ్వడానికి 'ఆహార్యం' అనే పేరుతో చిన్న పుస్తకం ప్రచురించింది.

ఆ తరువాత 1978, జనవరి 17 నుంచి 22 వరకు ఆరు రోజులు వీరేశలింగం హైస్కూలు రాజమండ్రిలో ఈ సమాఖ్య నాటక తరగతులు నిర్వహించింది. కె.వి. గోపాలస్వామి, శ్రీనివాస చక్రవర్తి, వి.కుమార్, వి.రోహిణి, నండూరి రామకృష్ణమాచార్యులు, దివాకర్ల వేంకటావధాని, పోణంగి శ్రీరామ

అప్పారావు, కొర్రపాటి గంగాధర రావు, గరికపాటి రాజారావు, చాగంటి సన్యాసిరాజు, గిడుగు సీతాపతి ఈ తరగతులు నిర్వహించారు. కొప్పరపు సుబ్బారావు, గరికపాటి రాజారావు గతించడంతో ఈ సమాఖ్య అంతరించింది.

శ్రీ.చ.

ఆంధ్ర నాటక సమీక్ష : ఈ సమీక్షా గ్రంథాన్ని శ్రీనివాస చక్రవర్తి రచించాడు. 1963లో ముద్రింపబడిన ఈ గ్రంథంలో 14వ శతాబ్దిలో వెలువడిన ప్రథమాంధ్ర రూపకం క్రీడాభిరామం మొదలు 1963 వరకు తెలుగులో వెలువడిన వివిధ నాటకాల సమీక్ష, ఆయా కాలాల్లో ఆంధ్రదేశంలో చెలరేగిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలు, తెలుగు నాటకాల ప్రభావం మొదలైన అంశాలు ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి.

శ్రీ.చ.

ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం : వివిధ సంస్కృతులనూ, దేశాలను అర్థం చేసుకోవడానికి, వాటి మధ్య అవగాహన పెంపొందించుకోవడానికి నాటకరంగాన్ని మించిన మాధ్యమం లేదు అనే సత్యాన్ని 1947లో యునెస్కో గుర్తించింది. ఆ సంవత్సరమే స్థాపించబడ్డ ఐక్యరాజ్యసమితి సమైక్యతను సాధించడానికి పిలుపునిచ్చింది. ఈ సమైక్యతను సాధించే దిశలో ఓ అంతర్జాతీయ కేంద్రం, దానికి అనుబంధంగా ప్రతిదేశంలోనూ, జాతీయస్థాయిలో ఒక దేశీయ కేంద్రం అవసరమని నిపుణుల సంఘం భావించింది. ఈ సదుద్దేశంతోనే అంతర్జాతీయ నాటకసంస్థ 1948లో పారిస్‌లో స్థాపించబడింది.

ఒక దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులను, సంస్కృతిని ప్రతిబింబించే నాటకాన్ని మరో దేశంలో ప్రదర్శించడంవల్ల, వారి వారి దేశాల ప్రవృత్తుల్నీ, ఆచార వ్యవహారాలనీ, జీవన ప్రమాణాలనీ తెలుసుకోవడం సాధ్యమవుతుంది. ఆదర్శవంతమైన విలువల్ని మానవాళికి అందజేయడంలో నాటకరంగం ప్రాముఖ్యాన్ని పునరుద్ఘాటిస్తూ, ఆ విలువల సాధనకు అంతర్జాతీయ నాటక సంస్థ ఐదు సూత్రాలను నిర్దేశించింది. అవి 1. జాతీయ కేంద్రాల స్థాపన: వీటి ద్వారా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వివిధ ప్రయోగాల గురించి, నాటక సిద్ధాంతాల గురించి, అన్ని దేశాల కళాభిమానులకూ సమాచారాన్నిఅందజేయడం; 2. ఈ సమాచారాన్ని అందజేయడానికి వరల్డ్ థియేటర్ (World Theatre) అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించడం; 3. ప్రతి దేశంలోనూ ప్రదర్శించబడ్డ కొత్త నాటకాల సమాచారాన్ని, అన్ని సభ్య దేశాలకు అందజేయడానికి ఒక సమాచార పత్రికను నిర్వహించడం; 4. వివిధ దేశాల నాటక స్థితిగతులనూ, చరిత్రను పుస్తకరూపంలో గ్రంథస్థం చేయడం; 5. నాటకకళలో నిష్ణాతులైనవారిని, ప్రముఖ నాటకసంస్థల ప్రయోగాల్ని, సాంస్కృతిక సంపదను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం. ఈ సూత్రాలకు అనుగుణంగా, అంతర్జాతీయ నాటక సంస్థకు అనుబంధంగా భారతీయ నాట్యసంఘం 1950లో ఢిల్లీలో ఆవిర్భవించింది. దీనికి అధ్యక్షురాలు కమలాదేవి ఛటోపాధ్యాయ.

ఈ భారతీయ నాట్యసంఘానికి అనుబంధంగా, భారత దేశంలోని చాలా రాష్ట్రాలలో ప్రాంతీయ నాట్యసంఘాలు ఆవిర్భవించాయి. ఆ క్రమంలో 'Theatre Centre Hyderabad' (తర్వాత నాట్యసంఘం) 1954లో ఏర్పడింది. 1955లో ఎ.ఆర్. కృష్ణ భారతీయ నాట్యసంఘానికి సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌గా కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక 1956లో హైదరాబాదు కేంద్రంగా 'ఆంధ్ర ప్రదేశ్‌నాట్యసంఘం' ఏర్పడింది. ఈ సంఘానికి మర్రి చెన్నారెడ్డి అధ్యక్షుడిగా, మామిడిపూడి ఆనందం కార్యదర్శిగా, ఎ.ఆర్.కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉండేవారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో కూడా భారతీయ నాట్యసంఘం అధ్యక్షురాలు హోదాలో కమలాదేవి ఛటోపాధ్యాయ, వివిధ రాష్ట్రాలలో పర్యటించి ప్రాంతీయ నాట్యసంఘాల పని తీరును పరిశీలించి, వాటి కార్యక్రమాల అభివృద్ధికి కృషిచేసింది.

ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం సారథ్యంలో 1956లో ఆంధ్రప్రదేశ్ ఐదు జోన్లుగా విభజింపబడి, నాట్యసంఘం జోనల్ కమిటీలు ఏర్పడ్డాయి. ఆ జోనల్ నాట్యసంఘం కార్యాలయాలు విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, వరంగల్లు, నిజామాబాద్‌లలో ఉండేవి. ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని నాటకసంస్థలు నాట్యసంఘానికి అనుబంధమయ్యాయి.

భారతీయ నాట్యసంఘం ఆశయసిద్ధికి ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం, అయిదు ప్రధాన కార్యక్రమాలను చేపట్టింది.

1. రాష్ట్రస్థాయిలో ప్రతి సంవత్సరం రంగస్థల ఉత్సవాలు జరపడం; 2. రంగస్థల కళలలో శిక్షణ ఇవ్వడానికి నాట్య విద్యాలయ నిర్వహించడం; 3. రంగస్థల సేవాకేంద్రాల ద్వారా సహాయ సహకారాలందివ్వడం; 4. జిల్లాస్థాయిలో నాటకశాలల నిర్మాణం; 5. భారతీయ నాట్యసంఘం తలపెట్టిన వివిధ కార్యక్రమాలను అమలుపరచడం. 1956లో ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం సికింద్రాబాదు మెహబూబ్ కాలేజి ఆవరణలో మొదటి ఆంధ్రప్రదేశ్ థియేటర్ ఫెస్టివల్ ను జరిపింది. అదే సంవత్సరం నాట్యసంఘం ఆధ్వర్యంలోనే ఆంధ్ర నాటక కళా పరిషత్తు నాటక పోటీలు కూడా హైదరాబాదులో జరిగాయి. ఎ.ఆర్. కృష్ణసారథ్యంలో కళాకారులు సాగించిన ఉద్యమం వల్ల 'ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమి'ని 1957 లో ప్రభుత్వం ఏర్పరచింది. 1959లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, రవీంద్రభారతి, హైదరాబాదు ఎగ్జిబిషన్ సొసైటీలను, ఒకే వేదిక కిందకు చేర్చి, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో, 40 రోజులు సంగీత, నాటక, నృత్యోత్సవాలు ఘనంగా జరిపిన ఘనత ఆంధ్రప్రదేశ్

నాట్యసంఘానికి దక్కుతుంది. ఈ ఉత్సవాల్లో పృథ్వీరాజ్ కపూర్, డాగర్ బ్రదర్స్, దమయంతి జోషి మొదలైన ప్రముఖులు తమ సమాజాలతో పాల్గనడం విశేషం. ఈ ఉత్సవాల్లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక పోటీలు కూడా పాలుపంచుకుని, ఉత్సవాలకు శోభ కూర్చాయి. ఓల్డ్‌విక్ బ్రిటీష్ థియేటర్ ట్రూప్ నాటక ప్రదర్శనలను కూడా ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం హైదరాబాదులో నిర్వహించింది.

ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం ప్రతి సంవత్సరం, ఆంధ్రప్రదేశ్ అవతరించిన నవంబరు ఒకటిన ఉత్సవాలు ప్రారంభించి ఘనంగా జరిపేది. హైదరాబాదులోనేకాక, రాష్ట్రంలోని నాట్యసంఘం జోనల్ కేంద్రాల్లో కూడా ఈ ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలలో నాటకాలేకాక అన్ని కళారూపాలూ చోటుచేసుకునేవి. ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర దేశాల నుంచి కళాకారులు, పండితులు ఈ ఉత్సవాల్లో పాల్గనేవారు. 1970-71లో నాట్యసంఘం జిల్లాస్థాయిలో ఉత్సవాలు చేపట్టడంవల్ల గ్రామాలలోని యువకళాకారులు తమ ప్రతిభ వెల్లడించడానికి అవకాశం ఏర్పడింది.

ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం నిర్వహించిన ప్రధానమైన కార్యక్రమాలలో నాట్యవిద్యాలయ ఒకటి. నాటకరంగానికి సంబంధించిన వివిధ శాఖలలో సువ్యవస్థితమైన, శాస్త్రీయమైన శిక్షణను ఉన్నత ప్రమాణాలలో ఇవ్వడంలో నాట్య విద్యాలయ పేరు పొందింది. మొదటిసారిగా 1959లో ఆరు మాసాల శిక్షణ కార్యక్రమం, అబ్బూరి రామకృష్ణారావు ప్రధానాచార్యుడిగా ప్రారంభమైంది. తరువాత రెండు సంవత్సరాల సమగ్రమైన శిక్షణను నాట్య విద్యాలయ ప్రవేశపెట్టింది.

అప్పటి నాట్యసంఘం అధ్యక్షుడు మర్రి చెన్నారెడ్డి, కమలాదేవి ఛటోపాధ్యాయల చొరవవల్ల నాట్య విద్యాలయ కార్యకలాపాలు నడపడానికి రవీంద్రభారతి మొదటి అంతస్తు (ఇప్పటి కాన్ఫరెన్సుహాలు) కేటాయించబడింది. అబ్బూరి రామకృష్ణారావు అనారోగ్యంకారణంవల్ల రాజీనామా చేయడంతో ఎ.ఆర్.కృష్ణ నాట్య విద్యాలయానికి డైరెక్టరయ్యాడు. కూర్మా వేణుగోపాలస్వామి ప్రధానాచార్యుడు. ఎస్.ఆర్. మంత్రి శ్రీనివాసరావు, పాతూరి శ్రీరామ శాస్త్రి, పి.ఎస్.ఆర్. అప్పారావు, సముద్రాల గోపాలమూర్తి, అయ్యగారి వీరభద్రరావు, నటరాజ రామకృష్ణ, శ్రీనివాస చక్రవర్తి ప్రభృతులు అధ్యాపకులుగా పనిచేసారు. హెర్బర్ట్ మార్షల్ మార్గదర్శకత్వం కూడా దీనికి లభించింది.

నాటక దర్శకులు, నటులు, రంగస్థల సాంకేతిక నిపుణులు మొదలైనవారికి స్వల్పకాలిక శిక్షణ కోసం, నాట్య విద్యాలయలో సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరిక మీద 1967లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు, 1970లో ప్రభుత్వ కళాశాలలో పనిచేసే అధ్యాపకులకు స్పెషల్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహించారు. దీనివల్ల పాఠశాలల్లో, కళాశాలల్లో నాటక సుశిక్షితులైన అధ్యాపకులు ఉండడానికి అవకాశం కలిగింది. ఈ రిపర్టరీ, నాట్య విద్యాలయ విద్యార్థులకు, అనుభవజ్ఞులైన నటీనటులతో కలిసి పనిచేసే అవకాశం కల్పించడమే కాక, వారి సృజానాత్మక కళా శక్తికి దోహదం కలిగించే ప్రయోగశాలగా కూడా ఉపయోగపడేది. ఈ కోవలో దుగ్గిరాల సోమేశ్వరరావు, ఎమ్. చంద్రశేఖరరావు, లక్ష్మీదేవి కనకాల, ఉషాబాల (విజయవాడ) రిపర్టరీలో పనిచేసే వారు.

నాట్యవిద్యాలయ ప్రదర్శించిన మొదటినాటకం మృచ్ఛకటిక. దీనిని అబ్బూరి రామకృష్ణారావు తెలుగులోకి అనువదించి, దర్శకత్వం వహించి, సామాన్య ప్రేక్షకులు, విజ్ఞులు, విశ్లేషకులు, విమర్శకులు 'ఓహో' అనే రీతిలో ప్రదర్శింపజేసాడు. నాట్య విద్యాలయ రిపర్టరీ తయారుచేసి ప్రదర్శించిన ముఖ్యమైన మరికొన్ని నాటకాలు కన్యాశుల్కం, గవర్నమెంటు ఇనస్పెక్టర్, నిజం, పెద్దమనుషులు, ఆదర్శమూర్తి, ప్రతాపరుద్రీయం, సంరక్షకుడు, కీలుబమ్మలు మొదలైనవి.

1969 ఫిబ్రవరిలో, బంబాయిలో జరిగిన వార్షిక సదస్సులో భారతీయ నాట్యసంఘానికి జనరల్ సెక్రటరీగా ఎ.ఆర్.కృష్ణని, ప్రెసిడెంటుగా ఇక్బాల్ మహమ్మద్ భాషాని ఎన్నుకున్నారు. దరిమిలా భారతీయ నాట్యసంఘం ఆఫీసు ఢిల్లీ నుంచి హైదరాబాదుకు మార్చబడింది. ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం చరిత్రలో 1969 ముఖ్యమైనది. ఈ సంవత్సరం అక్టోబరు 5 నుంచి నవంబరు 6వ తేది వరకూ 33 రోజులు నాట్యసంఘం ఉత్సవాలు రవీంద్రభారతిలో అతివైభవంగా నిర్వహింపబడ్డాయి. రంగస్థలమే జీవనాధారంగా కృషిచేస్తున్న వందలాది కళాకారుల సమస్యలు పరిష్కరించి, వారి అవసరాలు తీర్చే నిమిత్తం నాట్యసంఘం అధ్వర్యాన, 1971 డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల సంఘం ఏర్పాటైంది. ప్రముఖ రంగస్థల సినీనటుడు సి.నాగభూషణం అధ్యక్షతన కార్యవర్గం ఏర్పాటు జరిగింది. అలాగే నాట్యసంఘం ఔత్సాహిక కళాకారుల శ్రేయోభివృద్ధికి కృషి చేసేందుకు 'ఔత్సాహిక కళాకారుల సంఘం' ఏర్పాటు కావడానికి దోహదం చేసింది.

తోలుబమ్మల ప్రదర్శన గురించి విశేషమైన పరిశోధన జరిపించి, మారుమూలలనున్న కళాకారులను వెలుగులోకి తెచ్చింది. ఒక విధంగా నాట్యసంఘం కృషివల్ల, తోలుబమ్మలకు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు లభించాయి. ఇతర జానపదకళల గురించి కూడా నాట్యసంఘం పరిశీలనలు జరిపించింది.

తెలుగు కళాకారులు విదేశాల నాటకరంగం గురించి స్వయంగా తెలుసుకునేందుకు అక్కడి నాటకరంగం గురించి

అధ్యయనం చేయడానికి వీలుగా, నాట్యసంఘం చాలామందిని ప్రపంచ నాటకసంస్థ మహాసభలకు పంపింది. నాటకోద్యమంలో మొత్తం దేశానికి నేతృత్వం వహించగల నైపుణ్యం, కార్యోత్సాహం పెంచుకున్న ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం, కొన్ని అసాధారణ పరిస్థితుల తాకిడికిలోనై, వ్యవస్థాగతంగా చిక్కులు ఏర్పడ్డంవల్ల, 1973 తరువాత, తన పూర్వవైభవాన్ని, చైతన్యాన్ని కోల్పోయింది.

దు.సో.రా.

ఆంధ్ర భాషాభిమాన సమాజం : ఈ నాటక సమాజానికి ఆధ్యక్షుడు వేదం వేంకట రాయ శాస్త్రి. ప్రధాన నటులు కందాడై శ్రీనివాసన్, నందగిరి హనుమంతరావు ప్రభృతులు. అమెచ్యూర్ నాటకసభ నుంచి చీలిపోయిన నటుడు కందాడై శ్రీనివాసన్ నాయకత్వాన స్థాపించుకున్న నాటక సంస్థ. కేవలం వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన నాటకాలు ప్రదర్శించడమే ఈ సంస్థ పరమాశయం. 1920 ప్రాంతంలో ఈ సమాజం నెల్లూరు ఆంధ్రసభలో కలిసిపోయింది.

శ్రీ.చ.

ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర : యస్వీ. జోగారావు రచించిన ఈ పరిశోధనా గ్రంథం 1961లో ముద్రితమైంది. 1. యక్షగానం, ఉత్పత్తి విచారం – పరిణామచరిత్ర, 2. యక్షగాన కవులు – కావ్యాల్ని గురించి విపులంగా చర్చించి నిగ్గు తేల్చిన ఈ పరిశోధనా గ్రంథానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చింది. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రను వ్యక్తీకరించే ప్రప్రథమ సమగ్ర గ్రంథమిది.

శ్రీ.చ.

ఆంధ్రలో నాటకం – నాటకరంగం : ఆంధ్ర నాటకరంగానికి సంబంధించిన ఈ చారిత్రక గ్రంథాన్ని డి.వి.ఎ. ఆచార్య రచించాడు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ నిర్వహించిన పోటీలలో ప్రథమ బహుమతి పొందిన ఈ గ్రంథం 1965లో ముద్రించబడింది. ఈ గ్రంథంలో రూపకాలు, నాటకాలు, నాటక శిల్పం, శాస్త్రీయ చర్చ, రూపక ప్రయోజనాలు, ఆంధ్ర నాటకం–దాని పుట్టు పూర్వోత్తరాలు, ఆంధ్ర నాటక రచన, ఆంధ్ర నాటకరంగం, ఆంధ్రనాటక రచయితలు–రచనలు, ఏకాంక నాటికలు, రచయితలు, ఆంధ్ర నాటక సమాజాలు, ప్రసిద్ధ పాత్రధారులు, ఆంధ్ర నాటకరంగం– సినిమారంగం, ఆంధ్ర నాటక కళ–దానిపై పాశ్చాత్య ఔత్తరాహ ప్రభావం, నాటకం–రసం –శాస్త్రీయ చర్చ, నాటకం–నాట్యం–వాద్య సమగీతం, మోదాంత, ఖేదాంత నాటకాలు–శాస్త్రీయ చర్చ, నటీనటులు–సంస్కృతి, నటకులు–శరీరసౌష్ఠవం, నాటకరంగం–జీవితరంగం, నాట్య మండపములు–శాస్త్రీయ వర్ణన, ఆంధ్ర దేశంలోని ఔత్సాహిక సమాజాలు, ఆధునిక నాటక రంగం–సంస్కరణ విధానాలు, నటకులు – కళారాధన సోపానాలనే పేరుతో 20 అధ్యాయాలున్నాయి.

శ్రీ.చ.

ఆకెళ్ల (జ.1950): కథ, నవల, టి.వి., సినిమా, నాటక రచయిత. పూర్తి పేరు ఆకెళ్ల వెంకట సూర్య నారాయణ.

ఈయన 1950 ఫిబ్రవరి 10న జన్మించాడు. కొన్ని కథలు, నవలలు కన్నడ, హిందీ, తమిళ భాషల్లోకి అను వాదం పొంది తెలుగు బావుటానను ఎగురవేశాయి. ఈయన సంభాషణలురాసిన 'స్వాతి ముత్యం', 'శ్రుతిలయలు' వంటి చిత్రాలు జాతీయ స్థాయిలో అవార్డులు పొందాయి. నాటక రచన ఆలస్యంగా ప్రారంభించినా, అనతి కాలంలోనే ఉత్తమ శ్రేణి రచయితగా ఎదిగాడు. *అమ్మ(1996), రేపటి శత్రువు (1997), ఇండియన్ గ్యాస్ (1999), భవదీయం, నాలుగోసింహం (2001), ఏ చీర కట్టను (2001), గ్రీన్ కార్డ్, నాలుగోపాదం (2002), నాటికలూ, కాకి ఎంగిలి (1998), క్రాస్‌రోడ్స్ (1999), ఎయిర్ ఇండియా (1999), ఆకాశంలో సగం, శ్రీనాథుడు (2001), అల్లసాని పెద్దన (2002), రాణా ప్రతాప్ (2003)* నాటకాలు రచించాడు. చివరి మూడు పద్య నాటకాలు. నంది నాటక పోటీలతో సహా వివిధ నాటక పోటీల్లో పాల్గని ఉత్తమ ప్రదర్శన, మరెన్నో ఇతర బహుమతులుపొంది ఆకెళ్ల కీర్తిని ఇనుమడింప జేశాయి. సన్నివేశ కల్పనలో సహజత్వం, పాత్రచిత్రణలో తెలుగుదనం, అన్నింటికీమించి కావ్యార్థాన్ని మనోజ్ఞంగా ఆవిష్కరించే నాటక శిల్పం ఆకెళ్ల రచనా వ్యాసంగానికి పెట్టని కోటలు. అందుకే ప్రతి రచనలోనూ నిష్కరసత్యంతో కూడిన నిజాయితీ పాత్రచిత్రణలో అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈయన రచించిన కాకి ఎంగిలి నాటకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది.

గం.సు.రె.

ఆగియర్, ఎమిలి (1820–1889) : ఫ్రెంచి నాటకకర్త. 1820లో ఫ్రాన్స్‌లో జన్మించాడు. అప్పట్లో నాటకరంగంలో కాల్పనికధోరణి ఉండేది. పాన్‌సార్డ్ అనే రచయితతో వచ్చిన కాల్పనిక దోరణికి వ్యతి రేకంగా ఆగియర్ తిరుగుబాటు చేశాడు. ఆగియర్ న్యాయవాది కావాలని న్యాయశాస్త్రం చది వాడు. ఈయన రచించిన మొదటి నాటకం హెమ్‌లాక్ (1844) విజయవంతం కావటంతో మనసు మార్చుకొని నాటక రంగానికి

అంకితమయ్యాడు. మొదట్లో కవిత్వధోరణిలో నాటకాలు రాశాడు. ఆ తరువాత సమకాలీన ఫ్రెంచి సాంఘిక సమస్యలను ఇతివృత్తాలుగా చేపట్టి వచన నాటకాలు రాశాడు. ది పూర్ లైనెసెస్ (1858) గిబాయర్స్ సన్ (1862) నాటకాలు స్వభావ వాద ధోరణిలో నాటకాల వ్యాప్తికి దోహదం చేశాయి.

1950 నాటికి నేచురలిజమ్ ఒక ఉద్యమంగా రూపు దిద్దుకొన్నది. ఈ ఉద్యమం ఫ్రాన్స్‌లోనే ప్రారంభమైంది. ప్రపంచంలో జరిగే సంఘటనలను వాస్తవంగా, సత్యసంధతతో నాటకాలలో చిత్రించటం నేచురలిజం నాటకకర్తల లక్ష్యం. ఆగియర్ రచించిన Le Gendre De Monsiur Poirier లాంటి ఉత్తమ నాటకాలలో ఒకటి. ఈ నాటకంలో పతితురాలైన వేశ్య జీవితాన్ని యథాతథంగా ఆగియర్ చిత్రించాడు. శీలం కోల్పోయిన ఒక కుటుంబ స్త్రీ, భార్యవల్ల కుటుంబ జీవితం ఎలా విధ్వంసమైంది ఈ నాటకంలో చిత్రించాడు. ఆగియర్ రాజకీయ నాటకాలను కూడా రచించాడు. షేమ్‌లెస్ వన్స్ (Shameless ones 1861), *గిబాయర్స్ సన్* (1862) రాజకీయ ఇతివృత్తం గల నాటకాలే. ఆగియర్‌కు మధ్యతరగతి నేపథ్యం ఉంది. ఈయన నాటకరంగంలో కాలు పెట్టేటప్పటికి భావ కవిత్వ నాటకాలు క్షీణదశలో ఉన్నాయి. రొమాంటిక్ (కాల్పనిక) నాటకాలతో ప్రజల మొహం మొత్తిపోయి ఉన్నారు. అందువల్ల మొదట నూతన సంప్రదాయ ధోరణి వైపు మొగ్గు చూపాడు. అక్కడ నుంచి త్వరలోనే సామాజిక ఇతివృత్తంతో నాటకాలు రాసే స్వభావవాద నాటక రచయితగా పేరు పొందాడు. ఆ రోజుల్లో ఐరోపాలో వీస్తున్న కొత్తగాలికి అద్దంపట్టే మైమ్ కవర్ లెట్ (1876), ఫోర్‌చంబాల్ట్ (1879) అనే రెండు నాటకాలు రాశాడు. ఆగియర్ ఫ్రాన్స్‌లోని నేచురలిస్ట్ నాటకకర్తలలో ప్రముఖుడు, ప్రథముడు కూడ. ఈయన 1889లో మరణించాడు.

క.మ.రా.

ఆచార్, పి.వి (ని.1966) : నాటక రచయిత, నటుడు, గాయకుడు, విమర్శకుడు. విద్యాభ్యాసం గుంటూరు క్రిస్టియన్ కాలేజిలో, డాక్టరు కోర్సు మద్రాసులో. చిన్నప్పట్నుంచీ నాటకాలంటే ప్రాణం. వృత్తిరీత్యా డాక్టరు అయినా ప్రవృత్తిరీత్యా కళాకారుడు. తెలుగు మాతృభాష కాకపోయినా మంచి ప్రావీణ్యాం సంపాదించాడు. 'వెండితెర, చిత్రజగత్తు' అనే రెండు విమర్శన గ్రంథాలు రాశాడు. చిత్రజగత్తు తెలుగు భాషా సమితి బహుమతి పొందింది. మన సమాజం, ఆపద్బాంధవులు వీరి ప్రసిద్ధ నాటకాలు. 1966, ఆగస్టు 17న ఈయన మరణించాడు.

గం.సు.రె.

ఆత్రేయ, ఆచార్య (1921-1989) : ప్రసిద్ధ నాటక రచయిత. ఆత్రేయ అసలుపేరు కిళాంబి వేంకట నరసింహాచార్యులు. 1921, మే ఏడవ తేదీన నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట తాలుకా మంగళంపాడులో జన్మించాడు.



వెంకటగిరి అమెచ్యూర్ అసోసియేషన్ సభ్యుడిగా ఉండి 1949లో ఏలూరులో జరిగిన ఆంధ్రనాటకకళా పరిషత్తు పోటీలలో ఎన్.జి.ఓ (*గుమాస్తా*) నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించి, ఉత్తమ ప్రదర్శనకు, రచనకు బహుమతి పొందటంతో ఆత్రేయ పేరు ఆంధ్రదేశంలో మార్మోగిపోయింది. ప్రజా సమస్యలను స్వాభావికంగా ప్రతిబింబించే ఎన్.జి.ఓ సామాన్య ప్రేక్షకుల మొదలు మేధావి వర్గం వరకూ అమితంగా ఆకర్షించింది. వాస్తవిక జీవిత చిత్రణ గల ఈ కొత్త తరహా నాటకాన్ని చూసి ఎందరో రచయితలు తమ ఆలోచనారీతిని, రచనా విధానాన్ని మార్చుకున్నారు. రచయితలకు, దర్శకులకు, నటులకు మార్గదర్శకుడయ్యాడు. మధ్యతరగతి మనిషిని నాయకుడిగా చేసిన ఎన్.జి.ఓ. నాటక ప్రదర్శన నాటకరంగంలో ఒక నూతనాధ్యాయాన్ని సృష్టించింది. నాటక రంగంలో ఆత్రేయ నాటకశైలి అనేది ఏర్పడింది. వాస్తవికతావాదానికి నాటక రంగంలో ప్రాచుర్యాన్ని తెచ్చి పెట్టింది ఆత్రేయ నాటకాలే. ఈయన పది నాటకాలు, పదిహేను నాటికలు రచించాడు. నాటకాలు: *గౌతమబుద్ధ (1943)*, *శాంతి (1943)*, *అశోక సమ్రాట్ (1944)*, *పరివర్తన (1945)*, *ఎన్.జి. ఓ. (1949)*, *విశ్వశాంతి (1953)*, *కప్పలు (1954)*, *భయం (1954)*, *ఈనాడు (1954)*, *మనసూ-వయసూ (1955)*. నాటికలు: *వాస్తవం (1948)*, *ప్రగతి (1950)*, *ఎవరు దొంగ? (1950)*, *చావకూడదు (1950)*, *కళకోసం (1954)*, *చస్తే ఏం? (1954)*, *అంత్యార్పణ (1955)*, *అంతర్యుద్ధం (1955)*, *ఓటు నీకే (1955)*, *ఒక రూపాయి (1959)*, *మాయ (1955)*, *వరప్రసాదం (1955)*, *అశ్వఘోషుడు (1955)*, *తెరచిన కళ్ళు (1955)*, *కాపలావాని దీపం (1955)*.

పరివర్తన, ఎన్.జి.ఓ, విశ్వశాంతి, భయం, కప్పలు బహుళ జనాదరణ పొందిన నాటకాలు. ప్రగతి,ఎవరు దొంగ,

కళకోసం, అంత్యార్పణ మొదలైన నాటికలు నాటక పరిషత్తులలో బహుమతులందుకొని ఆత్రేయ కీర్తిని ఇనుమడింపజేశాయి. ఆత్రేయ చలనచిత్ర రంగంలో ప్రవేశించి కొన్నివందల చిత్రాలకు పసందైన మాటలు, పాటలు రాసి అగ్రశ్రేణి రచయితగా నాలుగు దశాబ్దాలు ప్రేక్షకలోకాన్ని అలరించాడు. 1989లో ఆత్రేయ దివంగతుడయ్యాడు.

గం.సు.రె.

ఆదమోవ్, ఆర్థర్ (1908-70) : 'అసంగత' (absurd) నాటక రచనలు చేసిన ప్రముఖ ఫ్రెంచ్ రచయిత. 1908, ఆగస్టు 23న రష్యాలోకి స్లోనొడొస్కలో జన్మించాడు. 1912లో ఆర్మీనియాకు చెందిన ఈయన కుటుంబం పశ్చిమ జర్మనీలో స్థిరపడింది. జెనీవా, మెయింజ్, పారిస్‌లో ఈయన విద్యాభ్యాసం చేశాడు. 1924లో పారిస్‌లో ఉన్న అధివాస్తవిక (Surrealist) వర్గాలతో సంబంధాలు పెట్టుకొని, అక్కడే ఉండి పోయాడు. 'డిస్‌కంటిన్యుయిటీ' అనే పత్రికకు సంపాదకత్వం వహించాడు; కవిత్వం రాశాడు. 1938-43 లలో తన స్వీయ చరిత్ర రాశాడు. దానిపేరు లా ఆవ్యూ. దీనిలో తనని తనే కించపరుచుకుంటూ తన సంక్షుభిత అంతరంగాన్ని విశదపరచాడు. ముందు రాయబోయే అసంగత నాటకాలకు పనికివచ్చే భావాన్ని, వ్యక్తిని విపరీతంగా భయపెట్టే 'నేను అన్యుణ్ణి' అనే భావాన్ని ఈ గ్రంథంలో ఆయన వ్యక్తీకరించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఖైదీల శిబిరంలో సుమారు ఒక ఏడాదిపాటు ఉన్నాడు. దీనివల్ల మానసికంగా ఆయన చాలా దెబ్బ తిన్నాడు.

అసంగత నవలలు రచించిన స్వీడిష్ రచయిత ఆగస్ట్ స్ట్రిండ్‌బెర్గ్, ఫ్రాంజ్ కాఫ్కాల వల్ల ప్రభావితుడై, 1947లో ఆదమోవ్ నాటకాలు రాయడం మొదలుపెట్టాడు. భగవంతుడు మరణించాడనీ, జీవిత పరమార్థం అందుకోరానిదనీ నమ్ముతూ, కమ్యూనిస్టు ఆదర్శాలకు తనసొంతతాత్త్వికవ్యాఖ్యలు చెప్పాడు. నాటకం ద్వారా మానవుని ఒంటరితనాన్ని ప్రకటించవచ్చునని భావించాడు.

ఆదమోవ్ రాసిన మొదటి నాటకం లా పేరడీ లో ముళ్ళు లేని ఒక గడియారం ఉంటుంది. అందులోని పాత్రలు ఎప్పుడూ కాలం గురించి ప్రశ్నించుకుంటూ ఉంటాయి. ఈ నాటకంలోని ప్రపంచం మానవునికి ఒక పేరడీ. ఈయన దృష్టిలో మానవుడు జీవితానికి ఒక అర్థం కోసం నిస్సహాయంగా వెదుకుతున్నాడు. జీవితానికి అర్థం ఉన్నప్పటికీ, అది మానవునికి అందడం లేదు. లా ఇన్వేషన్ అనే నాటకంలో మానవుని పరిస్థితి ఇంకా వాస్తవికంగా చిత్రించడానికి ప్రయత్నం చేశాడు. ఈ నాటకం ఆంద్రీజీద్, జా విలార్ లకు బాగా నచ్చింది. 1950 లో విలార్ దర్శకత్వంలో దీనిని పారిస్‌లో ప్రదర్శించారు. ఆదమోవ్ రచించిన మూడవ నాటకం *లె గ్రాండ్ ఎట్ లా పెటిట్ మెనూవర్* మీద ఆయన స్నేహితుడు, క్రూరతా నాటకరంగం (Theatre of cruelty) ప్రవక్త ఆంటోనిన్ ఆర్టోద్ ప్రభావం కనబడుతుంది.

1953లో ప్రదర్శించిన *లె ప్రొపెన్యూర్ తరాన్* లో ఒక విశ్వవిద్యాలయంలోని ఆచార్యుడు తన బాహ్య జీవితపాత్రలో విఫలుడవడం చూస్తాం. ఈ నాటకం స్వప్నానికి సంబంధించిన అసంగత తర్కం మీద ఆధారపడి ఉంది. కాని దీని నిర్మాణం, పాత్రీకరణ స్పష్టంగా, గాఢంగా ఉన్నాయి. ఆధునిక ప్రపంచంలో దాగి ఉన్న నిరాశాపూరితమైన దారుణమైన కలవరాన్ని (Cruel confusion) నిరసిస్తూ ఆదమోవ్ తాను గుర్తించిన ఆపదలకు పరిష్కారాలు సూచించాడు. 1955లో ప్రదర్శించిన లాపింగ్ పాంగ్ అనే ఆయన నాటకం బాగా ప్రజాదరణ పొందింది. ఈ నాటకంలో పాత్రలన్నీ యంత్రానికి లంగిపోతాయి. ఇది అంతులేని, లక్ష్యంలేని జూదం లాంటిది. మానవుడు తప్పుడు ధ్యేయాలను అంటిపెట్టుకుని, వాటిని గురించి ఎంతో కష్టపడి నిష్ఫలుడవడానికి ఇది మంచి నిదర్శనం. ఈయన తర్వాతి రచనలు పావులో పావ్‌లీ (1957), *లె ప్రింటెమ్స్ 71*, (1961), *లా పొలిటీక్ డెస్ రెస్టెస్* (1963)లలో విప్లవాత్మకమైన రాజకీయ ప్రకటనలు ఉన్నాయి. అయినా, ఆయనకు నాటకీయమైన ప్రయోగాలు చేయడంలో ఆసక్తి తగ్గలేదు. చివరికి, జీవితం అసంగతం (absurd) కాదనీ, అది క్లిష్టమైంది మాత్రమేనని ఒప్పుకుని, 1970, మార్చి 16న పారిస్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. 1955లో ప్రచురించిన ఆయన నాటకాల రెండవ సంపుటానికి రాసిన ముందుమాటలో ఆదమోవ్ తన పనిలో తన వైఖరిని గురించి, తన జీవితం గురించి వ్యాఖ్యానించాడు.

ఇ.నా.

ఆదర్శ నాట్య మండలి : ఈ నాటక సమాజాన్ని 1944లో పాలకొల్లులో స్థాపించారు. వ్యవస్థాపకుడు, దర్శకుడు, రచయిత పినిశెట్టి శ్రీరామమూర్తి. ప్రధాన నటీనటులు: ధనకోటేశ్వరి, నిర్మల, లక్ష్మి, పినిశెట్టి, ద్రోణంరాజు, చలం, మల్లాది, పామర్తి సుబ్బారావు ప్రభృతులు. సాంఘిక నాటకోద్యమానికి చేయూత నిచ్చి కట్టుదిట్టంగా నాటకాలాడాలనే పరమాశయంతో నెలకొన్న సంస్థ. తన ఆశయం సిద్ధింపజేసుకుని యావదాంధ్ర ప్రజానీకం ఆదరాభిమానాలను పొందటమేగాక, ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక పోటీలలో సైతం ప్రదర్శన, రచన, నటన, బహుమతులను పొందింది. పల్లెపడుచు నాటకం, ఆడది నాటికను ఈ సమాజం

ప్రదర్శించిన ప్రదర్శనలలో మకుటాయమానం. ఇలా ఆదర్శనాట్య మండలి ఆంధ్ర ప్రజానీకాన్ని ఉర్రూతలూగించింది. ఈ సమాజంలోని ఒక్కొక్కరు చలనచిత్రరంగంలో చేరడం మూలంగా, 1962 తరువాత కాలగర్భంలో కలిసిపోయింది.

పైన చెప్పిన నాటక, నాటికలతోపాటు ఈ సమాజం ప్రదర్శించిన నాటకాలు ఆదర్శ జ్యోతి (కన్న కొడుకు), కులంలేని పిల్ల, అన్నా చెల్లెలు, పంజరంలో పక్షులు. నాటికలు రిక్షావాడు, చలిజ్వరం, అమ్మ.

శ్రీ.చ.

ఆదివిష్ణు (జ.1940) : నవల, కథ, సినీ, నాటక రచయిత, అసలు పేరు విఘ్నేశ్వరరావు, ఈయన బందరులో 1940, సెప్టెంబరు పదిన జన్మించాడు. తల్లిదండ్రులు లక్ష్మీనరసమ్మ, నాగయ్య. బి.కాం. వరకు చదువుకున్న ఆదివిష్ణు కొంతకాలం ఆంధ్రప్రభలో పనిచేశాడు. తెలుగు సాహిత్యంలో రచయిత్రులు విరివిగా నవలలు, కథలు రచిస్తున్న కాలంలో కలం పట్టిన ఆదివిష్ణు అనేక కథలు, నవలలు రాశాడు. రచయిత్రులతో పోటీపడి రచనా వ్యాసంగం చేసిన ఆదివిష్ణుకు 'సగటు మనిషి', 'మనిషి మిథ్య' నవలలు మంచి పేరును తెచ్చిపెట్టాయి. ఆంధ్రేతర భాషలలోకి అనువదింపబడ్డాయి. కథలలో 'కలెక్టరు క్షమించు' ప్రసిద్ధమైనది, బహుమతులు కూడా తెచ్చిపెట్టింది. కథ, నవలా సాహిత్యంలో పేరు తెచ్చుకున్న ఆదివిష్ణు ఇది ఆత్మహత్య, సిద్దార్థ, ఆశ్రయం' వంటి నాటకాలు; 'మంచు తెర, చూడుచూడు నీడలు, అరకు రాణి, రాతిమనిషి, వాంటెడ్ ఫాదర్స్,పండ గొచ్చింది, అతిథి దేవుళ్లస్తున్నారు, నథింగ్ బట్ ట్రూత్, వందనోటు, ఎంతెంత దూరం, వాళ్లిద్దరితో వీళ్లు ముగ్గురు, మగవారి మాయలు నాటికలు రచించాడు. ఈయన ప్రధానంగా హాస్య నాటక నాటికలే రచించాడు. అంతవరకు ఉద్యమ నినాదాలు, అత్తకోడళ్లవేధింపులు, సగటుమనిషికష్టాలు, కన్నీళ్లు ఇతి వృత్తంతో వెలువడిన నాటకాలను చూసిన ప్రేక్షకులకు ఆదివిష్ణు నాటక నాటికలు చక్కనిహాస్యాన్నిఅందించాయి. కడుపుబ్బ నవ్వించాయి. రాష్ట్రంలోని వివిధ పరిషత్తులలో ప్రదర్శింపబడి రచయితకు ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఈయన రాసిన 'మంచు తెర', 'సిద్దార్థ' తప్ప మిగతా నాటక, నాటికలన్నీ హాస్య రచనలే. పదవీ విరమణానంతరం ఆదివిష్ణు ఈనాడు దినపత్రికలో 'సరిగమలు' పేరుతో హాస్య రచనలు చేశాడు. ఉషాకిరణ్ మూవీస్ 'సుందరీ సుబ్బారావు' సినిమాకు స్క్రీన్‌ప్లే తో పాటు సంభాషణలు సమకూర్చాడు. 1984లో రాష్ట్ర నంది అవార్డును అందుకున్నాడు. అహ! నాపెళ్లంట సినిమాకు కథా రచయిత. ఈయనకు యువకళావాహిని 2002లో షష్ఠిపూర్తిమహోత్సవం నిర్వహించింది. సాహిత్యానికి, నాటక రంగానికి తను చేసింది చాలా తక్కువేనని చెప్పుకునే వినయశీలి ఆదివిష్ణు.

దాసరి.ఎస్.

ఆధికారికం : ఇతివృత్త భేదం. దీనిని ఆధికారికేతివృత్తం అని కూడా అంటారు. ప్రధాన కథ నాటకారంభంతో ప్రారంభమయి నాటకాంతంతో అంటే నాయక ఫలసిద్ధితో అంతమవుతుంది. అభిజ్ఞాన శాకుంతలంలో శకుంతలా దుష్యంతుల ప్రణయగాథ ఆధికారికేతి వృత్తం. ఈ ప్రణయగాథ అవరోధాలను అధిగమించి సప్తమాంకంలో (ఆఖరి అంకం) పుత్రసమాగమ ఫలసిద్ధితో అంతమవుతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే రూపకం ఆసాంతం వ్యాపించిన నాటక నాయకుని కథ ఆధికారికం. హరిశ్చంద్ర, చిత్రనళీయ నాటకాలలో నాయకులైన హరిశ్చంద్ర, నలుల కథ, ఆధికారికేతివృత్తం.

శ్రీ.చ.

ఆధునిక తెలుగు నాటకం : రచయిత గండవరం సుబ్బరామి రెడ్డి. ఈ గ్రంథం మొదటి భాగం 1989లోను, రెండవ భాగం 1991లోనూ ప్రచురణ అయింది. 1860 నుంచీ 1990 వరకూ తెలుగు నాటకరంగ పరిణామదశల గురించిన వివరాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. సంస్కృత నాటకాలు, దేశీ నాటకాలు, పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు, నాటికలు, ఆంధ్రనాటక కళాపరిషత్తు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగాత్మక నాటక సమితి, ప్రజానాట్య మండలి, లిటిల్ థియేటర్,ఆత్రేయ యుగం, స్వాతంత్ర్యానంతర నాటకరంగం, ఆధునిక నాటక రంగం, నాటక పరిషత్తులు, నాటకకర్తల సంక్షిప్త జీవితాలు మొదలైన వివరాలతో ఈ పుస్తకం ముఖ్యంగా సాంఘిక నాటకాల సమగ్ర స్వరూపాన్ని చూపించే కరదీపికగా ఉంది.

బోయిన

ఆధునిక నాటకరంగం - ఈ దశాబ్ది ప్రయోగాలు : రచయిత బోయిన వేంకటేశ్వరరావు, ప్రచురణ 1998. ఆధునిక నాటకరంగం-ఈ దశాబ్ది ప్రయోగాలు అన్న అంశంపై పరిశోధనకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాపొందిన సిద్ధాంత గ్రంథం. 1980-1990 దశాబ్దిలో వెలువడిన నాటక సాహిత్యం, ప్రదర్శనల్లో వచ్చిన

మార్పులు, నూతన ప్రయోగాల గురించి చర్చించిన గ్రంథం ఇది. 1980వ దశకంలో వచ్చిన నాటక సాహిత్యంలోని వస్తు స్వరూపాన్ని విపులంగా వివరించడం ఈ పుస్తకంలోని ఒక ప్రత్యేకత. ఈ పుస్తకంలో తెలుగు నాటకం పుట్టుపూర్వోత్తరాలు, ఈ దశాబ్ది నాటకాలలోని వస్తు వైవిధ్యం, కుటుంబ వ్యవస్థ, స్త్రీవాదం, దళితవాదం, ప్రయోగాలు, నాటక పరిషత్తులు ప్రయోగాలు, వీధి నాటకాలు ప్రయోగాలు, నాటక పరిషత్తులు ప్రయోగాలు అనే తొమ్మిది ప్రకరణలున్నాయి. 1980లో వెలువడిన నాటక, నాటికల పట్టిక, ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రసిద్ధ నాటక సమాజాల జాబితా, కళామూర్తుల పరిచయ వేదిక, అనుబంధాలలో విలువైన విషయాలను అందిస్తున్న గ్రంథం.

గం.సు.రె.

ఆనంద్, ఎ.బి. (జ.1938) : నటుడు, ప్రయోక్త, వ్యాఖ్యాత. రంగస్థలం, ఆకాశ వాణిలలో విశేష ప్రతిభ కనబరిచి, రంగస్థలానికి భిన్న భూమికల్లో విశిష్ట సేవలు అందించిన వారిలో ఎ.బి. ఆనంద్ ఎన్నదగిన వాడు. ఎ.బి. ఆనంద్‌గా వాసికెక్కిన ఆరు మళ్ళ బ్రహ్మ నందరెడ్డి 1938, ఏప్రిల్ ఒకటిన కృష్ణాజిల్లాలోని తేలప్రోలులో ఆరువంళ్ళ సుబ్బారెడ్డి, సీతారత్నమ్మ దంపతులకు జన్మించాడు.

బి.ఏ. పట్టభద్రుడైన ఆనంద్ తొలిసారిగ తన 20 వ ఏట అల్లరి పిల్లలు అనే హిందీ నాటికద్వారారంగస్థలప్రవేశం చేయటం విశేషం. లయోలా కాలేజీలో పి.యు.సి. చదివే రోజుల్లో అంతర కళాశాల పోటీల్లో హితశ్రీ రచించిన విముక్తుడులో ప్రొఫెసర్ పాత్రకి, అనంతరం మార్తాహళి నాటికలకు ప్రథమ బహు మతులు లభించటంతో ఆనంద్ ప్రతిభ పలువురి ప్రశంసలకు నోచుకొంది. దాంతో ఆయన నాటకాల పట్ల మోజుపెరిగిలయోలాకాలేజి వదలి నాటక సమాజాలకు నెలవైన ఎస్.ఆర్.ఆర్, కె.వి.ఆర్ కాలేజికి మారాడు. అక్కడ ప్రముఖ రంగస్థల దర్శకులు ఎ.శివరామిరెడ్డి దర్శకత్వంలో తుఫాను లో కుప్పుస్వామి రెడ్డి పాత్ర ధరించాడు. అనంతరం గురజాడ కళామందిరంలో చేరి పలు పాత్రలు ధరించి తనలోని నటుడు పరిణతి సాధించేలా కృషి సాగించాడు. ఆ రోజులల్లో ఈయనకి మంచి పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన నాటకాల్లో ఆదివిష్ణు రచించిన సిద్ధార్థ ది ప్రత్యేక స్థానం. ఆనాటి రంగస్థల దిగ్గజాలైన శివరామిరెడ్డి, మాచినేని, కె.వెంకట్రాజు, కర్నాటిల సరసన పలుపాత్రలు పోషించి నటనలో మెళుకువలు నేర్చుకున్నాడు. త్యాగయ్య, వేమన, పోతన లాంటి సాత్వికాభినయ ప్రాధాన్యం గల పాత్రలు పోషించి రాణించాడు.

రంగస్థలంపై తాను గడించిన అనుభవమే పునాదిగా తాను ఆకాశవాణిలో చేరిన తరువాత వందలాది నాటకాలకు ప్రయోక్తగ, నటునిగా వ్యవహరించేందుకు దోహదపడింది. ఈయన చేసిన సేవల్లోకెల్లా విశిష్టమైనది మహీధర రాంమోహనరావు, ఎం.ఆర్ అప్పారావు, బాలాంత్రపు రజనీకాంతరావు, అద్దేపల్లి, చాట్ల శ్రీరాములు లాంటి ప్రముఖుల జీవితవిశేషాలను వారి మాటల్లోనే వీడియోఫిల్మ్స్ రూపంలో భావితరాల కోసం భద్ర పరచడం. అలాగే పలు యువకవుల రచనలను సేకరించి విశ్లేషణ–అన్వేషణ శీర్షికను గ్రంథస్తం చేశాడు.

మన్నెశ్రీ

ఆనందరావు, పాటిబండ్ల (జ.1951) : రచయిత, దర్శకుడు, స్పందన థియేటర్ సారథి. ప్రకాశం జిల్లాలోని మల్లవరప్పాడులో 1951, మార్చి ఇరవై ఒకటిన జన్మించాడు. తల్లిదండ్రులు అచ్చమ్మ, బడ్డయ్యలు. ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఆనందరావుకు నాటకం అంటే ప్రాణం. ఈయన రచించిన నాటక నాటికల సంఖ్యారాశిలో తక్కువైనా వాసిలో విశిష్టతను సంతరించుకుని ప్రజల ఆదరాభిమానాలకి నోచుకున్నాయి. నాటక నిర్మాణంలో, పాత్రచిత్రణలో, సన్నివేశ కల్పనలో, సంభాషణ విధానంలోనూ ఆనందరావు ముద్ర విలక్షణమైంది. ప్రతీకాత్మక ధోరణిలో ఈయన రచించిన దర్పణం నాటిక సృజనాత్మక ప్రతిభకు దర్పణం. అస్పృశ్యతను ఇతివృత్తంగా తీసుకొని రచించిన నిషిద్ధాక్షరి నాటకం ఆనందరావుకు 1986లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నాటక రచయిత బహుమతిని తెచ్చిపెట్టింది. బహుళజాతి కంపెనీ ఫ్యాక్టరీ నిర్మాణ ప్రయత్నంలో, భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న సామాన్య పేద రైతు ఇతివృత్తాన్ని తీసుకొని రాసిన పడమటిగాలి నాటకం 1998లోఅమెరికా 'ఆటా' సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ నాటక పోటీలలో ప్రథమ బహుమతి గెల్చుకుంది. సుమారు 40 మంది నటీనటులతో నాలుగు గంటలు ప్రదర్శింపబడే పడమటిగాలి వంటి నాటకం ఇంతవరకు రాలేదు. ఈ నాటకం ఎక్కడ

ప్రదర్శించినా కుదించకుండా ఉన్నదున్నట్లుగా ప్రదర్శించడం ఔత్సాహిక నాటకరంగంలో గొప్ప సాహసం. ఈయన రచించిన కాదు సుమా కల, నీతి చంద్రిక మధ్యతరగతి ప్రజల బలహీనతలపై సంధించిన అస్త్రాలుకాగా మానస సరోవరం మేనరికపు పెళ్ళిళ్ళవల్ల సంతానానికి సంక్రమించే ఆనువంశిక లక్షణాలపై అవగాహన కలిగించే ఈ నాటకాలను గంగోత్రి పెదకాకాని నాటక సమాజం పలుచోట్ల ప్రదర్శిం చడమే కాకుండా, **1996**లో గ్రంథరూపంలోకి తెచ్చింది. నిషిద్ధాక్షరి, సహారా, పడమటిగాలి నాటకాలు, దర్పణం, అపూర్వ చింతామణి, వేయిపడగలు నాటికలు స్పందన థియేటర్ తరపున రచయిత దర్శకత్వంలో పలుచోట్ల ప్రదర్శించబడి ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. నిషిద్ధాక్షరి నాటకానికి **1986**లో తెలుగు విజ్ఞాన పీఠం అవార్డు, **1991**కళాసాగర్ మద్రాసు వారి త్రైవార్షిక తెలుగు ఉత్తమ నాటక రచయిత అవార్డు, **1998**లో ఉండేల విజ్ఞాన కళాపీఠం (హైదరాబాదు) అవార్డులు లభించాయి.

దాసరి. ఎన్.

ఆముఖం : భారతీ వృత్యంగం. దీనినే ప్రస్తావన, స్థాపన అని కూడా **అంటారు. ఆముఖ**, ప్రస్తావనా పదాలను భరతముని, ధనంజయ, **విశ్వనాథులు పర్యాయ**పదాలుగానే వాడారు. కాని సింగభూపాలుడు మాత్రం ప్రస్తావన, స్థాపన ఆముఖ భేదాలుగా పేర్కొన్నాడు.

సూత్రధారుడు ప్రేవేశించినది మొదలు నాటకారంభం (ముఖసంధి) వరకు రంగస్థలం మీద జరిగే కార్యకలాపం ఆవముఖం. ఈ కార్యకలాపంలో సూత్ర ధారుడు, నటి, పారిపార్శ్వకుడు, విదూషకుడు పాల్గంటారు. చిత్రమయిన సంభాషణలో ప్రస్తుత నాటక కార్యాన్ని ప్రస్తావిస్తారు. అందుకే దీనికి 'ప్రస్తావన' అని పేరు వచ్చింది. ఈ ఘట్టంలో నాటకం స్థాపితమవుతుంది. కాబట్టి 'స్థాపన' అని పేరు వచ్చింది.

భాసుడు ఈ ఘట్టానికి 'స్థాపన' అని పేరు పెట్టాడు. అంతేకాదు రెండు రంగాల స్థాపనను **తన రూప**కాలలో నిబంధించాడు. సూత్రధారుడొక్కడే నిర్వహించే స్థాపన ఉదాహరణకు స్వప్న వాసనదత్త, బాల చరితం.

నటితోగాని, పారిపార్శ్వకునితోగాని కలిసి నిర్వహించే స్థాపన ఉదాహరణకు ప్రతిమ, ప్రతిజ్ఞా యౌగంధరాయణం. కుందమాలలో కూడా స్థాపన పదమే ఉపయుక్తమయింది. దీనిలో సూత్ర ధారుడొక్కడే స్థాపన నిర్వహిస్తాడు. ఆముఖ పద ప్రయోగం మృచ్ఛకటిక లోను, నలవిలాసం లోను కనిపిస్తుంది. ప్రస్తావన పదాన్నే సంస్కృత నాటక కర్తలు ఎక్కువగా ప్రయోగించారు. ఉదాహరణకు శాకుంతలం.

ఆముఖం (ప్రస్తావన, స్థాపన)లో పాత్రలు అధికంగా ఉండకూడదు. సూత్రధారుడు మాత్రం ఆవశ్యకం. ఈ సూత్రధారుడు నటితో గాని, పారిపార్శ్వకునితో గాని, విదూషకునితో గాని కలిసి ఆముఖం ప్రయోగించాలి.

సూత్రధార నటీ ప్రయోగం : శాకుంతలం, రత్నావళి. సూత్రధారుడు, పారిపార్శ్వకుడు లేక నటుడు లేక మారీషుడు: వేణీ సంహారం, ఉత్తరరామ చరిత.

శ్రీ.చ.

ఆరంభం : 1. కార్యావస్థ, 2. పూర్వరంగ అంతర్యవనికాంగం. కార్యావస్థల్లో మొట్టమొదటిది. ఒక కార్యం సాధించాలని నిశ్చయించుకొంటే చాలదు. ఆ కార్యసాధన విషయంలో ఉత్సాహం చూపాలి. కార్యసాఫల్యంకోసం కృషి ప్రారంభించాలి. ఈ ఉత్సాహాన్నే, ఈ ప్రారంభాన్నే సంస్కృత లాక్షిణికులు 'ఆరంభం' అన్నారు. ఔత్సుక్యమంటే నాటక ప్రధాన ఫలాన్ని దృష్టిలో పెట్టుకొని రూపక పాత్రలు కార్య సాధనోపాయాన్ని స్మరణ, ఉత్కంఠాదులను ప్రదర్శించడం. ఈ ఔత్సుక్య ప్రదర్శన నాయికా నాయకులు, అమాత్య ప్రతినాయక దైవాలలో ఎవరిద్దైనా కావచ్చు. (అభినవ భారతి, మూడవ సంపుటం, పుట. 6, అను. పోణంగి శ్రీరామ అప్పారావు). 2. పూర్వరంగ అంతర్యవని కాంగం : గీతం ప్రారంభించడానికి ముందు గాయనీ గాయకులు గాత్రాలు సరిచేసుకొని ఆలాపన చేయడం. దీనినే పరిగీతి క్రియారంభమంటారు.

శ్రీ.చ.

ఆరభటి : నాట్య (అర్థ) వృత్తి. దీనికి ప్రవర్తకుడు శ్రీ మహావిష్ణువు. విష్ణువుకు, మధుకైటభులకు జరిగిన యుద్ధంలో ఈ వృత్తి కూడా జనించింది. మాయ, ఇంద్రజాలం, సంగ్రామం, క్రోధం, మొదలైన చేష్టలతో ఆరభటీ వృత్తి విలసిల్లుతుంది.అరులు అనగా ఉత్సాహ వంతులు. ఉత్సాహపరులైన భటవ్యాపారంఆరభటి. దీనిని బట్టి ఆరభటి యుద్ధాలకు సంబంధించిన వృత్తి అని స్పష్టమవు తుంది. ఇది ఉద్ధత, కాయక వృత్తి, రౌద్ర, బీభత్స, రసావిష్కరణకు ఉపయుక్తమయిన వృత్తి.

'రౌద్రే భయానకే చైవ విజ్ఞేయారభటీ బుధైః' (నా.శా. 20-74)

అంగాలు: ఆరభటి వృత్తికి అంగాలు నాలుగు. అవి. 1.సంక్షిప్తిక, 2. సంఫేటం, 3. వస్తూత్థాపనం, 4. అవపాతనం.

శ్రీ.చ.

ఆర్చర్, విలియం (1856-1924) : ఇంగ్లీషు నాటకరంగ విమర్శకుడు, నాటక కర్త, అనువాదకుడు. స్కాట్‌లాండ్‌లో జన్మించాడు. **1878**లో లండన్‌లో స్థిరపడి ఫిగోరో మొదలైన పత్రికలకు నాటక విమర్శ కుడుగా వ్యవ హరించాడు. ఇబ్సన్ నాటకా వళిని **1906-08** లో సంకలించి ప్రప్రథమంగా ఇంగ్లీషులోకి అనువదిం చాడు. ఆధునిక నాటక సాహిత్యం

ఏకాలపు నాటక సాహిత్యానికీ తీసిపోదని సమర్థిస్తూ వాదించాడు. పాత నాటకాలను పొగడడం, ఆధునిక నాటకాలను చులకన పరచడం అతనికి గిట్టేదికాదు.



లీహంట్, హాజ్లిట్‌ల నాటక విమర్శ సంపుటీకరణ, నేటి ఇంగ్లీషు నాటకకర్తలు (1882) హెన్రీంయిర్వింగ్ (1883), కరాళాలు-ముఖాలు (1888), *విలియం చార్లెస్ మక్రీడి* (1890), స్టడీ-స్టేజీ (1899), *నేటి అమెరికా* (1900), *పాత కొత్త* నాటకాలు (1923) ఆర్చర్ వెలువరించాడు. ఈయన రచించిన *గ్రీన్ గాడేస్* అనే నాటకం 416 సార్లు ప్రదర్శితమై సినిమాగా తీయడమైంది.

శ్రీ.చ.

ఆలంబన విభావం : విభావ భేదం. ఆలంబనమనగా ఆధారం. ఏ వ్యక్తిని గాని, వస్తువును గాని ఆధారం చేసుకొని రసోత్పత్తి జరుగుతుందో ఆ వ్యక్తి లేక ఆ వస్తువు ఆలంబన విభావం. 1. శృంగార రసంలో స్త్రీ పురుషులు (శాకుంతలం లోశకుంతలా దుష్యంతు లు, సావిత్రిలో సావిత్రీ సత్యవంతులు); 2. హాస్య రసంలో వికృతాకార చేష్టలు (శాకుంతలంలో విదూషకుడు, ధర్మవరం రామకృష్ణమాచార్యుల సావిత్రీ చిత్రాశ్వంలో సుమాలి); 3. కరుణ రసంలో బంధువియోగం (ఉత్తర రామచరిత్రలో సీతావియోగం, చిత్రనళీయంలో దమయంతీ వియోగం); 4. రౌద్ర రసంలో అపరాధి లేక శత్రువు (వేణీ సంహారంలో దుర్యోధనుడు, హరిశ్చంద్రలో విశ్వామిత్రుడు); 5. వీర రసంలో ధిక్కృతుడు (ఉత్తర రామచరిత్రలో రాముడు); 6. భయానక రసంలో శార్దూలం (మాలతీ మాధవం, సావిత్రీ నాటకాలలో శార్దూలం); 7. బీభత్స రసంలో స్మశానాదులు (మాలతీ మాధవం); 8. అద్భుత రసంలో ఆశ్చర్య వస్తువులు (శాకుంతలంలో తాయెత్తు); 9. శాంత రసం - ప్రపంచమే ఆలంబన.

శ్రీ.చ.

ఆలఫీర్, విటోరియో ఆమెడో (1749-1803) : ఇటాలియన్ నాటక కర్త. ఆలఫీర్ ట్యూరినెలో సంపన్న కుటుంబంలో జన్మించాడు. ఫ్రెంచి భాషను ప్రధాన భాషగా అభ్యసించి, 20వ ఏటనే ఇటాలియన్‌భాష నేర్చుకొని అందులో చాలా పద్య విషాద, ఆహ్లాద నాటకాలు రచించి పేరు తెచ్చుకున్నాడు. ఫ్రెంచి విప్లవ సమయంలో ఫ్రాన్సులో ఉండి విప్లవాన్ని మొదట సమర్థించి తరువాత అసహ్యించుకొని ఇటలీకి వెళ్లాడు. ఫ్రెంచి దేశస్థులు ఈయనను వలసదారుగా పరిగణించి ఆస్తిపాస్తులను ఆక్రమించుకున్నారు. ఈతని మొట్ట మొదటి నాటకం క్లియోపాత్రా 1775లో ప్రదర్శితమైంది. సాల్ (1784), క్లియోపాత్రా (1775), మిర్రా (1786), అరెస్టీ ఆలఫీర్ ప్రసిద్ధ నాటకాలు.

శ్రీ.చ.

ఆవిద్ధ రూపకం : నాటక భేదం. ఆవిద్ధమనగా ఉద్ధృతం. ఉద్ధృతంగా ఉండడం వల్ల దీనికి ఆవిద్ధ రూపకమని పేరు వచ్చింది. సంస్కృత దశరూపకాలలోని డిమం, సమవకార, వ్యాయోగం, ఈహామృగాలు అనే నాలుగు ఈ జాతికి చెందిన రూపకాలు.

శ్రీ.చ.

ఆశీర్వాదం, రాయపాటి (జ.1945) : రచయిత. నటుడు, దర్శకుడు. 1945వ సంవత్సరం జూలై 15న ఒంగోలు సమీపంలోని ముక్తినూతల పాడులో జన్మించాడు. తల్లిదండ్రులు రాయపాటి తిరుపాలు, తిరుపాలు. ఆశీర్వాదం పాఠశాలలో చదువుతున్న రోజుల్లోనే విచిత్ర వేషధారణ, ఏక పాత్రాభినయం పోటీల్లో పాల్గని బహుమతులు అందుకున్నాడు. ఇంటర్మీడియట్‌లో ఉండగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం నవ్యకళా నాట్య మండలిని స్థాపించాడు. ఈ సంస్థ పక్షాన *నిరుద్యోగి*, *దొంగ వీరడు* నాటకాలను, అల్లూరి సీతారామరాజు నాటికను ప్రదర్శించాడు. ప్రజానాట్యమండలి నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గన్నాడు.

బాలనాగమ్మ, వీర పాండ్యకట్టబ్రహ్మన, మనీషి, జరుగుతున్న చరిత్ర, మాకు శాంతి కావాలి, నరకం మరెక్కడో లేదు, యథాప్రజా- తథారాజా, నటనాలయం, ఈ చరిత్ర తిరిగి రాస్తాం, వాడుతూర్పు వేటగాడు మొదలైన వాటిలో నటించాడు. నాటక రచయితగ కళామయి, మహోదయం (క్రీస్తు జననం) నాటకాలు రచించాడు. ఆశీర్వాదంకు రంగస్థల నటుడుగా పేరు తెచ్చిన పాత్రలు బాల నాగమ్మలోని మాయలఫకీర్, అల్లూరి సీతారామరాజులోని రూథర్‌ఫర్డ్, రక్తపిపాసిలోని బంగారయ్య, వీరపాండ్య కట్ట బ్రహ్మనలోని ఎట్టప్ప నాయుడు, యథాప్రజా-తథారాజాలో సింగ రాచార్యులు మొదలైనవి. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పరిషత్తులు నిర్వహించిననాటకపోటీలకు న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించాడు.

దాసరి.ఎన్.

ఆశు నాటకం : ఐరోపా ఖండంలో 16–18శతాబ్దాలలో చెలరేగిన పునరుజ్జీవనోద్యమ కాలంలో వర్ధిల్లిన నాటక కళారూపం. నిర్దిష్టపాఠ్యం (సంభాషణాదులు) లేకపోవడమే ఈ నాటక రూప విశిష్టత. ఈ నాటకాలలో నటించే నటులు బాగా ఆరితేరినవారు. నిర్దిష్ట కథ, విన్యాసం, ముందుగా వీరికి తెలిసి ఉంటుంది. అనుభవం ద్వారా ఏరోజు కారోజు ప్రదర్శన సమయంలో అప్పటికప్పుడు సంభాషణలు, ఆశువుగా చదువుతారు. వీరికి అందుబాటులో ఉండే కథావిన్యాసరచనలో ప్రతిరంగంలోని కథా సరళి, ప్రవేశ, నిష్క్రమణలు సూచితమై ఉంటాయి. ఈ సాధనసంపత్తిని ఆధారం చేసుకొని నటులు తమ నేర్పు కొద్దీ పటిష్ఠమైన, ఆసక్తిదాయకమైన సంపూర్ణ నాటకంగా రూపొందిస్తారు. ఈ నాటక రూపం కూడా రూఢి పాత్రలతో విలసిల్లుతూ ఉంటుంది. పుల్సినెల్లా అనే రూఢి పాత్ర తరువాత ఇంగ్లాండులో పంచ్‌గా పరిణామం చెందింది. ఆర్లెషినో కొలంబినా పాత్రలు తరువాత మూక నాటకాలలో హార్లెక్విన్, కొలంబియా పాత్రలుగా రూపొందిందాయి. ఈ నటులు వారి వారి ప్రతిభ ననుసరించి నాటకాన్ని రూపొందించుకునే స్వేచ్ఛ ఉన్నా ఒకేమూసలో పోసి నాటకాలను నడిపించవలసి ఉంది.

ఇతివృత్తం బహువిశాలమైంది. వీటిలో రెండు జంటల ప్రేమకలాపం సైనికునిడంబాలుడొటోర్(Dottore) రూఢి పాత్ర ప్రసంగాలు, కొట్లాటలు, అపోహలు, విపరీత హాస్యం ఈ నాటకాలలోని రూఢి విషయాలు. ఆనాడు ఎక్కువ ప్రచారంలో ఉన్న గోపనాటకాలధోరణులు వీటిలోగుబాళిస్తుంటాయి. అన్నింటినిమించి ఇవి నాటి నాటకరంగానికి శక్తిని, రుచిని, నూతన జీవాన్ని ప్రసాదించాయి.

ఇంతకీ ఈ ఆశు నాటక రూపం ఎప్పుడు ఎలా పుట్టిందీ ఖచ్చితంగా తెలిపే ఆధారాలు కనిపించవు. మధ్యయుగాలలోని సంచార వీధి గాయకుల నుంచి మూక నాటకం ద్వారా పరిణతి చెందిందని మాత్రం చెప్పగలం. ఇటువంటి నాటక సమాజాలు వ్యాపార స్థలాలలోనే కాక, రాజదర్బారులలో ప్రదర్శనలు ఇస్తూ ఈ నాటకరూప వ్యాప్తికి ఎంతో కృషి చేశాయి. క్రమంగా ఇటలీ, ఫ్రాన్సు దేశాలలోనేగాక ఐరోపా ఖండమంతటా ఈ నాటక రూపం వ్యాపించి, ప్రవర్ధమానమై రెండు వందల సంవత్సరాలు అజేయంగా వెలుగొంది తరువాత మార్గ నాటకరంగం మీద తన ప్రభావం ఎంతగానో ప్రసరించింది.

శ్రీ.చ.

ఆశ్విక రూపకం (Equestrian Drama) : పాశ్చాత్య రూపక భేదం. దీనిని సర్కసు డేరాలలో 18–19 శతాబ్దాలలో ప్రదర్శించేవారు. ఇందులో గుర్రాలను ఎక్కువగా ప్రవేశ పెట్టడం వలన దీనికీ పేరు వచ్చింది. ఉదా. టైమూర్, మూడవ రిచర్డ్ నాటకం.

శ్రీ.చ

ఆసక్తి : నాటకం సాగుతున్నంత సేపు ప్రేక్షకుల మనస్సు నిరంతరం నాటకం మీదే లగ్నమై ఉండాలి. అయితే ఈ ఏకాగ్రత నిరంతరం ఒకే స్థాయిలో ఉండదు. కెరటాల లాగా హెచ్చుతూ, తగ్గుతూ ఉంటుంది. ఒక్కొక్క కెరట శృంగం చిన్న పరాకాష్ఠ, అన్నింటి కన్నా ఎత్తైన కెరట శృంగం ప్రధాన పరాకాష్ఠ అయితే ప్రేక్షకాసక్తి నాటక పాఠ్యంలోనే నిక్షిప్తమై ఉంటుంది. ప్రదర్శనాంశాలను, దానికి బలం చేకూర్చి తీర్చిదిద్దడానికి ఉపయోగించాలి.

ఆసక్తిని పెంచే యత్నాన్ని నిర్మాణం అంటారు. అవసరమైనంతగా ఆసక్తిని పెంచడానికి మొదటి నుంచి చివరి వరకు ఏదో ఒక అంశాన్ని క్రమంగా పెంచడంవల్ల ఈ నిర్మాణం సాధ్యమవుతుంది. ఈకింది అంశాలలో ఏదో ఒక అంశాన్ని పెంచి నిర్మాణం తీసుకురావచ్చు. 1. పాత్రలలో ఉద్వేగ తీవ్రత, 2. ముఖ్య పాత్రల ప్రాధాన్యత, 3. ముఖ్య పాత్ర ప్రాముఖ్యం మీద ప్రేక్షకుల మనస్సును కేంద్రీకరింప జేయడం, 4. రంగస్థలం మీది నటుల సంఖ్యను పెంచడం లేక తగ్గించడం 5. సంచాలనల పొడవు, సంఖ్య పెంచడం లేక తగ్గించడం 6. కాంతి తీవ్రత, 7.ధ్వని తీవ్రత, 8. వేగం.

సామాన్యంగా ఈ అంశాలలో కొద్ది వాటినే ఒకే ఒక సన్నివేశంలో ఉపయోగిస్తారు. మామూలు సన్నివేశాలలో ప్రాముఖ్యం, వేగం, తీవ్రతలతో నిర్మాణం సరిపోతుంది.

ఆసక్తిని పెంచే రంగాలు ప్రేక్షకులకు ఎక్కువగా నచ్చుతాయి. ఆసక్తిదాయకమైన విషయం ఎక్కువైన కొద్దీ నచ్చడం కూడా ఎక్కువవుతుంది. దర్శకుడు నాటకకథా విధానంలోని ప్రయత్న (Rising Action) భాగంలో గరిష్ఠాసక్తి, నియతాప్తి (Falling Action) కాలంలో కనిష్ఠాసక్తి రేకెత్తేటట్టు చూడాలి. అయితే ఇందులో చాలా పరిమితులను గుర్తించడం అవసరం. 1. ప్రధాన పరాకాష్ఠస్థాయినాటకానికినాటకానికి భేదిస్తూంటుంది, 2. అంకంలో ఆసక్తి క్రమంగా పెరుగుతుండాలి. ప్రతి అంక పరాకాష్ఠ కిందటి అంక పరాకాష్ఠ కంటె ఉన్నతంగా ఉండాలి. ఒక రంగం అతిగా 'నిర్మాణం' అయితే ఆ తరువాతి రంగాలు దెబ్బతింటాయి. 3. అతి ఉన్నతిని ప్రేక్షకులు తట్టుకోలేరు. ఒక్కొకప్పుడు పిచ్చిగా నవ్వుతారు. అందుకని విరామం అవసరమవుతుంది. నియతాప్తి (Falling Action) మందకొడిగా ఉంటే దానిని ఎంత త్వరగా ముగిస్తే అంతమంచిది. 4. నిర్మాణం ఆగిపోగానే ఆసక్తి కూడా సమాప్తమవుతుంది. రంగ పరాకాష్ఠకు చేరుకోకముందే నిర్మాణం పూర్తయితే పరాకాష్ఠ ప్రముఖంగా గోచరించదు. పైగా నియతాప్తిలో సమసిపోతుంది.

దిగువ కేంద్రం (Down Stage) వినియోగించుకోవడంలో ఈ తప్పిదం ఎక్కువగా గోచరిస్తుంది. దిగువ కేంద్రం

రంగస్థల మంతటిలోకి ప్రముఖమైంది. సంఘర్షణ శక్తులు కలుసుకోవడానికి దీనిని వినియోగించాలి. కాని సాధారణంగా పెద్ద నటులు ఇక్కడకు చేరుకుంటారు.

సంయమనం : సాంకేతిక సంపత్తి ముందుగానే సమసిపోకుండా చేయడానికి తక్కువ స్థాయిలో ప్రారంభించడం, అవసరమైతే విడనాడడం వంటి ప్రక్రియ సంయమనం. ఇది నిర్మాణం కంటే కష్టమైంది కాబట్టి ఎక్కువ శ్రద్ధ చూపించవలసి ఉంటుంది.

సంయమన మార్గాలు : ప్రధాన పరాకాష్ఠను, ముఖ్యమైన చిన్న పరాకాష్ఠలను ముందుగా నిర్ణయించుకోవాలి. ప్రతిదాని ఉన్నత స్థాయిని (శృంగ ఉన్నతి) నిర్ణయించుకోవాలి. ఈ పరాకాష్ఠల నిర్మాణం ఎక్కడ ప్రారంభం కావాలో నాటక ప్రతిలో గుర్తించాలి తరువాత నిర్మాణ సాంకేతిక విధానం రంగమంతటికీ విభాగించాలి.

కౌతుకం : ఆసక్తిని నేర్పుగా సంబాళించుకునే సాంకేతిక ఫలితమే కౌతుకం. నాటకంలో చోటుచేసుకొన్న పరాకాష్ఠను ప్రేక్షకులు గుర్తించి దానితో తారసిల్లడానికి మేధాపరంగా పరుగెత్తుతారు. కాని ఒక్కొక్కప్పుడు అనుకొన్న సమయానికి రాకుండా పరాకాష్ఠ ఆలస్యమవుతుంది. అపుడు ప్రేక్షకులకు విసుగు పుడుతుంది. అందుకే దర్శకుడు చిన్న చిన్న పరాకాష్ఠలను సృష్టించాలి. చివరకు అసలు పరాకాష్ఠను రానివ్వాలి. ఈ కృత్రిమ పరాకాష్ఠల సంఖ్య మారుతుంటుంది.

ఆసక్తి రేఖ స్వరూపం : ఏ రెండు నాటకాల ఆసక్తి రేఖలు ఒకే రూపంలో ఉండవు. కాని ఈ కింది సాధారణ సూచనలు అన్నింటికి వర్తిస్తాయి. 1. ప్రేక్షకులు ఒక్కొక్కరు వచ్చి సుఖాసీనులైన సమయంలో అంటే మొదట కొద్ది నిమిషాలలో ఆసక్తిని రేకెత్తించే నిర్మాణానికి పూనుకోకూడదు. ఆ తరువాత సాధ్యమైనంత త్వరలో ఆసక్తిని రేకెత్తించడానికి యత్నించాలి, 2. ఒక్కొక్క కెరటానికి కేటాయించే కాలం మార్చాలి, 3. తెరపడే ముందు ఎప్పుడూ ఆసక్తి ఎక్కువయ్యేటట్టు చూడాలి. ఈ విషయంలో రచయిత తగు శ్రద్ధ తీసుకోకపోతే దర్శకుడు తన భావనాశక్తితో కొత్త మార్గం ద్వారా ప్రేక్షకుల ఆసక్తిని తీవ్రంగా రేకెత్తించాలి, 4. ప్రధాన పరాకాష్ఠను వీలున్నంతవరకు ఆలస్యం చేస్తే తరువాత వచ్చే మందకొడితనాన్ని పరిహరించవచ్చు. అలాగే దీర్ఘ సంభాషణలను, భాషణలను కూడా పరిహరించాలి.

శ్రీ.చ.

ఆసియస్, లూసియస్ (క్రీ.పూ. 170-86) : రోమన్ నాటకకర్త. విషాద నాటక కర్తలలో ఆఖరివాడు. ఈయన దాదాపు 40 నాటకాలు రచించినట్లు తెలుస్తోంది.

రచనా శైలిలో రోమన్ నాటక కర్తలనందరినీ మించిపోయాడు. ఈయన రచించిన నాటక కథలు హింసాకాండతో, అద్భుత సన్నివేశాలతో, ఉదాత్త వాచికంతో, బలీయ వాక్కేళితో, డాబూడొలు పాత్రలతో ఒప్పారుతూ ఉంటాయి. సంభాషణలు అలంకార భూయిష్ఠంగా ఉంటాయి. అమిత అలంకార ప్రయోగం, సన్నివేశాలను పూర్తిగా వినియోగించుకోవడం, రోమన్ విషాద నాటక లక్షణాలు. ఈ లక్షణాలు ఇతని నాటకాలలో పరాకాష్ఠనందుకున్నాయి.

శ్రీ.చ.

ఆస్కార్, వైల్డ్: (చూ.వైల్డ్ ఆస్కార్)

ఆస్ట్రోవస్కీ, అలెగ్జాండర్ (1823-86) : రష్యన్ నాటకకర్త. మాస్కో విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం పఠిస్తూ మధ్యలోనే స్వస్తి చెప్పి, అయిదేండ్ల పాటు బాల నేరస్థుల న్యాయ స్థానాలలో గుమాస్తాగా పనిచేశాడు. ఆ కాలంలోనే వ్యాపార వర్గం సరళిని అవలోఢన చేశాడు. అతని తండ్రి న్యాయవాది. అతని కక్షిదారులు కూడా వ్యాపారస్తులే. వారిని కూడా శ్రద్ధగా పరిశీలించి వారి మోసాలు, కుతంత్రాలు, అవినీతిని గ్రహించాడు. దీని ఫలితంగా ఇతనిని 'మాస్కోవర్తక వర్గ బాల్జాక్' అని పిలవసాగారు.



ఈ పరిశీలనను ఆధారం చేసుకుని 1848లో ఈయన 'దివాళాకోరు' నాటకం రాశాడు. ఈ నాటకంలో కొంతమంది వణిక్పుంగవుల అబద్ధాల దివాళాను వర్ణించడంతో ఈయనకు మంచి పేరు ప్రతిష్ఠలు లభించాయి గాని ఉద్యోగం ఊడింది. ఈ నాటకం ప్రదర్శించక ముందే ప్రభుత్వ నిషేధానికి గురి అయింది. కాని లిఖిత ప్రతి ప్రచారం కావడం వల్ల ఆస్ట్రోవస్కీకి పేరువచ్చింది. ఈ నిషేధం పదమూడు సంవత్సరాలు కొనసాగింది. ఆ తరువాత అతని ఆహ్లాద రూపకం పావర్టీ *ఈజ్ నో డిస్‌గ్రేస్* (Poverty is no disgrace) విజయవంతమైంది.

ఈయన చారిత్రాత్మక నాటకాలు, ఊహాకల్పిత నాటకాలు, సమకాలీన సాంఘిక వ్యంగ్య నాటకాలు, అనువాదాలు 1855-1886 మధ్య ఎనభై పైచిలుకు రచించాడు. ఈయన రచించిన మంచుకన్య సంగీత రూపకంగా ప్రదర్శితమైంది. నాటకాలలో చాలాభాగం ఇంగ్లీషులోకి అనువదిత మయ్యాయి. మత అసహనాన్ని చిత్రించే తుఫాను వ్యంగ్య రూపకానికి, కిలాడీ డైరీ ప్రపంచ ఖ్యాతి లభించింది. ది డైరీ ఆఫ్ ఎ స్కౌండ్రెల్ నాటక అనుసరణ కిలాడీ అనే పేరుతో తెలుగులోకి వచ్చింది.

1882లో జాతీయ నాటకరంగ స్థాపనావశ్యకతను గురించి విజ్ఞాప్తిని రచించి ప్రచురించాడు. రష్యన్ నాటక రచయితల సంఘం స్థాపించాడు. 1885లో మాస్కో ఇంపీరియల్ థియేటర్లో వ్యవహర్తగా నియమితుడయ్యాడు. ఆస్ట్రోవస్కీ

నాటకాలు ఎక్కువగా మాస్కోలోని మాలీ థియేటర్‌లో ప్రదర్శితం కావడంవల్ల మాలీ థియేటర్ ఆవరణలో ఈయన విగ్రహం నెలకొల్పారు.

దివాళాకోరు **(The Bankrupt-1850)**, *నిర్భాగ్య వధువు* **(The poor Bride-1851)**, *స్టిక్ టు యువర్ ఓన్ స్లై* **(Stick to your own sleigh-1853)**, *లాభదాయకమైన ఉద్యోగం* **(A Profitable job-1857)**, *పిచ్చి డబ్బు* **(Wild Money-1859)**, *ది వార్డ్* **(The ward-1859)**, *తుఫాను* **(The Storm-1860)**, *కట్నం లేకుండా* **(Without Dowry-1863)**, *హాట్ హెడ్* **(Hot head--1868)**, *తోడేళ్ళు-గొర్రెలు* **(Wolves and Sheep-1872)**, *టాలెంట్స్ అండ్ సూటర్స్* **(Talents and suiters-1882)**, *మేధావులైనా పొరబడవచ్చు* **(Even the wise can err)** అనే నాటకాలను రచించాడు. 1823లో జన్మించిన ఆస్ట్రోవస్కీ 1886లో మరణించాడు.

శ్రీ.చ.

ఆస్బోర్న్, జాన్ (1929-94) : ఇంగ్లీషు నాటక రచయిత. రెండో ప్రపంచ యుద్ధానంతరం అల్లకల్లోలమై ఉన్న బ్రిటన్ సామాజిక వ్యవస్థనూ, ఆనాటి రాజకీయ వ్యవస్థ మూలాలను కదిలించే శక్తి లేక, సంఘటితం కాలేక ఆగ్రహావేశాలతో ఊగిపోయే యువతనూ తన నాటకాలలో సహజాతి సహజంగా చిత్రించి, ఆధునిక ఆంగ్ల నాటక రంగాన్ని ఓ మలుపు తిప్పిన గొప్ప నాటక రచయిత. ఈయన సృష్టించిన *యాంగ్రీ యంగ్ మేన్* పాత్ర తీవ్ర ఆశాభంగం చెందిన యువకులకు ప్రతీకగా ప్రేక్షకుల నీరాజనాలందుకొంది. నాటక రచయితగా ఆస్బోర్న్‌కు ప్రపంచ వ్యాప్త కీర్తి ప్రతిష్ఠలను చేకూర్చిపెట్టిన *లుక్ బ్యాక్ ఇన్ యాంగర్* **(look back in anger)** నాటకంలోని నాయక పాత్రే (జిమ్మి పోర్టర్) ఆ యంగ్‌మాన్. ఈ నాటకాన్ని ఇంగ్లీషు స్టేజి కంపెనీ 1956, మే నెలలో రాయల్ కోర్ట్ థియేటర్‌లో ప్రదర్శించింది. ఏడాదిన్నర పాటు ఏకధాటిగా ఈ నాటక ప్రదర్శన జరిగింది. జిమ్మి పోర్టర్ పాత్ర ద్వారా *యాంగ్రీ యంగ్ మాన్‌*ను సృష్టించి ఆంగ్ల నాటక రంగాన్ని ఓ కుదుపు కుదిపిన జాన్ జేమ్స్ ఆస్బోర్న్ 1929, డిసెంబర్12న లండన్‌లో జన్మించాడు. బెల్మాండ్ కళాశాలలో చదివాడు. కొంత కాలం జర్నలిస్టుగా పని చేశాడు. షెఫీల్డ్ నోరూం ఎట్ ది ఇన్ నాటకంలో 1948లో నటునిగా తన నటజీవితాన్ని ప్రారంభించి, స్టెల్లా లిండెన్‌తో కల్సి ది డెవిల్ ఇన్ సైడ్ హిమ్ నాటకాన్ని రాశాడు. 1955లో హర్రోగేట్‌లో ఈ నాటకం ప్రదర్శింపబడింది. ఈ లోపు ప్రొవిన్షియల్ రిపర్టరీలో నటునిగా, దర్శకునిగా కొనసాగాడు. తండ్రి కమర్షియల్ ఆర్టిస్ట్. నటన, నాటక రచన వంశ పారంపర్యంగానే అందివచ్చింది. ఈ అనుభవంతోనే ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటిష్ నాటక రంగం పునరుద్ధరణ జరుగుతున్న తరుణంలో 1956లో లుక్ బ్యాక్ ఇన్ యాంగర్ నాటకాన్ని రాసి సంచలనం సృష్టించాడు.

ఆస్బోర్న్ రాసిన ది ఎన్‌టర్ టైనర్ (1957) బ్రెఖ్ట్ ఎపిక్ థియేటర్ ప్రభావమున్న నాటకం. ఆధునిక జీవితంలోని నిస్పృహ, నిరాసక్తత, స్తబ్ధతలను ఈ నాటకరంగం పైకి తెస్తుంది. స్వప్న సన్ని వేశాల్ని అభివ్యక్తి (ఎక్స్ ప్రెషనిస్టిక్) ధోరణిలో చూపినా ఉన్నత స్థాయి సాంకేతిక విలువలతో కూడిన నాటకమిది. లారెన్స్ ఆలివర్ ఆనాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించాడు. ఆంగ్ల సమాజంలో పెచ్చురిల్లిన హిపోక్రసీని లెటర్ టు మై ఫెలో కంట్రీమెన్ (1961), లూథర్ (1961) నాటకాల్లో వెలికితోడాడు ఆస్బోర్న్. లూథర్ యువ విప్లవవాది. పోప్ ఆధిపత్యంపై తిరుగుబాటు చేశాడు. జర్మన్ రైతుల తిరుగుబాటుతో లూథర్ సాగించిన విప్లవం పతాక స్థాయికి చేరుతుంది. సంస్కరణ భావాలతో సమాజంలో ఏ మార్పు సాధ్యపడదనీ, మేధావుల ప్రబోధాలన్నీ నీటి మీద రాతలవంటివేనని ప్రకటిస్తాడు లూథర్. లూథర్ పాత్ర చిత్రణలో కొంత గందరగోళమున్నా ఆస్బోర్న్ యాంటీ హీరో లక్షణాలతో చిత్రించిన పాత్రలోని విలక్షణం ప్రేక్షకుల్ని ఆకట్టుకొంది.

డాబు, దర్పాలతో జరిగే వివాహాలపై వ్యంగ్యంగా రాసిన నాటకం ది బ్లడ్ ఆఫ్ ది బాంబెర్గ్స్ (1962). వివాహానికి ముందు రాజు హత్యచేయబడితే అతని పోలికలున్న ఓ ప్రెస్ ఫొటో గ్రాఫర్‌ను వరుని స్థానంలో కూర్చోబెడతారు. చివరకు ఈ ఫోటో గ్రాఫర్ రాజు సంతానమే అని తెలుస్తోంది. ఇదీ ఈ నాటక కథాంశం. ఇన్ ఎడ్మిజబుల్ ఎవిడెన్స్ నాటకం క్రిమినల్ కేసులు, విడాకుల కేసులను మాత్రమే స్వీకరించి వాదించే వదరుబోతు లాయర్ గురించి తెల్పుతుంది.

సిద్ధాంత నిబద్ధతలేని నాటక రచయిత సమస్యాత్మక సమాజాన్ని సవ్యంగా అవగాహన చేసుకోలేడంటాడు ఆస్బోర్న్. సమాజం నటుణ్ణి కమర్షియల్ విజయం కోసం దగ్గరకు తీస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు. హోటల్ ఇన్ అమ్‌స్టెర్ డాం *(1968)*, టు వెస్ట్ ఆఫ్ సూయజ్ *(1971)* వాచ్ ఇట్ కమ్ డౌన్ *(1976)* వంటివి ఆస్బోర్న్ చివరగా రాసిన నాటకాలు. ఆయన రచనా పటుత్వం, ఈ నాటకాలలో పల్చబడిపోయింది. ఎసెక్స్ ఆఫ్ డిటాచ్‌మెంట్(1972) వంటి కొసమెరుపు నాటక రచనలు చేసినా ఇవేవీ ప్రేక్షకుల్ని అలరించ లేక పోయాయి. రాజకీయ, సామాజిక సంఘర్షణల్ని సహజంగా చిత్రిస్తూ ఆస్బోర్న్ రాసిన లుక్ బ్యాక్ ఇన్ యాంగర్ నాటకం దరిదాపులకు కూడా ఇవి రాలేకపోయాయి. భావాత్మకంగా, భౌతికంగా ఆంగ్ల నాటక రంగంలో పెక్కు మార్పులు తీసుకువచ్చిన ఆస్బోర్న్ 1994లో మరణించాడు.

రమణ

ఆహార్యం : రంగస్థలం మీద నటించే నటీనటుల నిజరూపాలను మరుగుపరచి, పాత్రగా రూపొందించే ప్రక్రియ ఆహార్యం. అందుకే దీనికి రూపశిల్పం అని పేరు వచ్చింది. ఈ ప్రక్రియ నేపథ్యగృహంలో జరుగుతుంది. భరతముని దీనిని చతుర్విధ అభినయాలలో చేరుస్తూ నాటక ప్రయోగమంతా ఆహార్య నిష్ఠమేనని చెప్పడం దీని ప్రాముఖ్యాన్ని గుర్తించవచ్చు.

అది పౌరాణికం గాని, చారిత్రాత్మకం గాని, సాంఘికం గాని ప్రయోగించే పాత్రలు యదార్థంగా ఆ కథకు సంబంధించిన వ్యక్తులేనని ప్రేక్షకులకు భ్రాంతి కలిగినపుడే వారికి నాటక ప్రయోగంలో విశ్వాసం కుదురుతుంది. అలా భ్రాంతి కలుగనపుడు రసానుభూతి కలగదు. నాటక ప్రయోగ లక్ష్యమే దెబ్బతింటుంది. అయితే ఈ భ్రాంతి పాత్రోచితమైన వేషం వేసుకున్నపుడే కలుగుతుంది. ఇలా ప్రేక్షకులకు భ్రాంతి కల్గించాలంటే నటునికి తన వేషంలో తనకు నమ్మకం కుదరాలి. తన వేషం రాజు వేషం లాగా, రైతు వేషం లాగా ఉందని నమ్మకం కలిగినపుడే నటుడు సవ్యంగా నటించగలుగుతాడు. ఈ నమ్మకమే నటుడు రంగస్థలం మీద పాత్రగా జీవించడానికి మొట్టమొదటి మెట్టు. అందుకే భరతముని వేషవర్ణాలతో మరుగుపడిన వ్యక్తి ఏ వేషం ధరిస్తే ఆ వేష భావం చక్కగా పొందాలని చెప్పాడు. ఇంతకీ ఆహార్యానికి ప్రమాణమేమిటనే ప్రశ్న కలగడం సహజం. భరతముని లోకమే ప్రమాణమన్నాడు. అదిగాక శ్రవ్య, దృశ్య కావ్యాలు, జీవిత చరిత్రలు, సాంఘిక నాటకాలలోని పాత్రలు మనం నిత్యం చూస్తూనే ఉంటాం కాబట్టి వారిలా వేషం వేసుకోవచ్చు. ఇపుడు సాంఘిక నాటకాలలో, నాటికలలో రచయితే ఆయా పాత్రల ఆకార వేషాలను అంద జేస్తున్నాడు. వీటన్నింటినీ తెలుసుకున్న తరువాత నటుడు తాను నటించవలసిన పాత్ర చిత్రం వీటి ఆధారంగా గీసుకొనో, గీయించుకొనో అలా వేషం వేసుకోవాలి. దీనినే సంస్కృత అలంకారికులు ఆరోపింప చేసుకోవడమంటారు. అవస్థానుకరణం అభినయమన్నారు సంస్కృత లాక్షణికులు. మరి ఆహార్యం కూడా చతుర్విధాభినయాలలో ఒకటి కదా! అందువల్ల పాత్ర అవస్థకు అంటే దేశకాల శీల వయోరూప సుఖదుఃఖాది అవస్థలకు అనుగుణంగా ఆహార్యముండేటట్టు నటీనటులు చూసుకోవాలి. ఆహార్యాభినయం రెండు భాగాలు. 1. ముఖాంగరచన, 2. అలంకరణ. ముఖాంగ రచన అంటే పాత్రానుగుణంగా ముఖానికి, చేతులకు, పాదాలకు రంగు వేసుకోవడం; అలంకరణ అంటే పాత్రానుగుణమైన దుస్తులు, చిహ్నాలు, ఆభరణాదులు ధరించడం. ఈ రెండు పాత్రానుగుణంగా అవలంబించినపుడే వ్యక్తి మరుగునపడి, పాత్ర అని భ్రాంతి కలుగుతుంది.

ముఖాంగరచన : దీనినే భరతముని అంగరచన అన్నాడు. వేషధారణలో ముఖాంగరచన వేసుకోవడం ముఖ్యాంశం. వేషధారణ అంటే మేకప్ వేసుకోవడమనే అర్థం రూఢి అయిపోయింది.

ముఖాంగరచన: 1. వ్యక్తిని మరుగు పరచి పాత్రగా భ్రాంతి కలిగించడం; 2. ముఖ కాంతిని దీపాల కాంతి మింగివేయకుండా చేయడం; 3. ముఖాలలోని లోటుపాట్లను సరి చేయడం; 4. పాత్ర వయస్సుకు తగినట్లుముఖం రూపొందించడం; 5. స్ఫోటక మచ్చల ముఖం, జబ్బు చేసిన ముఖం మొదలైనవి రూపొందించడం; 6. దీపాల వల్ల ముఖ లక్షణాలు మారకుండా చూడడం; 7. ముఖ వర్చస్సులోని వాస్తవిక ఛాయలు కృత్రిమ దీపకాంతి వల్ల మరుగున పడకుండా చూడడం. ప్రేక్షకుల సంఖ్య మీద, రంగస్థలం మీద, దీపకాంతి శక్తి మీద ముఖాంగ రచన ఆధారపడి ఉంటుంది. నటుడు మేకప్ వేసుకొనేటపుడు అవసరమైనంత దీపకాంతి ఉండాలి.

సాధన సామాగ్రి : ముఖాంగ రచనకు కావలసిన సాధన సామాగ్రి పెట్టుకోవడానికి మేకప్ బాక్స్ లేదా మేకప్ కిట్ అవసరం. ఈ పెట్టెలో అమర్చు కోవలసినవి – సన్నని మెత్తని కుంచెలు, పౌడరు, తుడిచేకుంచె, కత్తెర, దువ్వెన, స్పాంజి, పింగాణి గిన్నెలు, లేత ముదురు రంగు గ్రీజు, లేపనాలు, కనుబమ్మలు దిద్దుకునే పెన్సిలు, వేజ్‌లైన్, స్పిరిట్ గమ్, క్రేప్ హేర్, హేర్ వైటనర్, లిప్‌స్టిక్, రెడ్‌రూజ్, కోల్డ్ క్రీమ్, పౌడర్ పఫ్‌లు, కేక్స్.

ముఖాంగరచన తొమ్మిది దశలలో ముగుస్తుంది. ముందుగా పాత్రధారుడు నున్నగా క్షౌరం చేసుకుని, జిడ్డు పోయేటట్టు ముఖం శుభ్రపరచుకోవాలి. కొందరికి కనుబమ్మలు పెద్దవిగా ఉండి, అసహ్యంగా కనిపిస్తాయి. అందుకని ముందుగా బాగా పెరిగిన వాటిని కత్తిరించి ఉండవలసిన ఆకృతిలో రేఖలు గీసుకోవాలి. చర్మం బిగుసుగా ఉంటే కొబ్బరినూనెతో కాని, కోల్డ్ క్రీముతో గాని, ఆలివ్ నూనెతో కాని ఇంకే వరకు మర్ధన చేయాలి. తరువాత మెత్తని గుడ్డతో జిడ్డు తుడిచేసుకోవాలి. సబ్బుతో, గోరువెచ్చని నీటితో కడుక్కోవాలి. పాత్ర రూపం, ముఖ వర్చస్సు, రంగులను బట్టి తొలి పూతరంగు, వయస్సు తక్కువైతే లేత రంగు గ్రీస్ లేపనం ముఖమంతటా సమ మోతాదులో రాసుకోవాలి. తొలి పూతరంగు సరిగ్గా నిర్ణయించుకుంటేనే తరువాత దశలు రాణిస్తాయి. ఈ తొలి పూతరంగు చెవుల వెనుక భాగంలోను, నొసటి పై భాగంలోను కూడా పూసుకోవాలి.

రెండవ దశలో ముఖాకృతులను సరిదిద్దుకోవాలి. ఎత్తుగా కనిపించే భాగాలను సమమట్టంగా ఉన్నట్లు కన్పించేలాగా చేయడానికి బ్రౌనిష్ రెడ్ రంగు వాడాలి.

మూడవదశలో కళ్లు, కనుబమ్మలు తీర్చిదిద్దుకోవాలి. ముఖంలో కన్ను అతిముఖ్యమైంది. భావప్రకటనకు కన్ను ప్రధానం. అందుకోసం నేత్రాలు పెద్దవిగా, స్పష్టంగా కనపడేట్లు రెండు

కళ్ళూ, రెండు కనుబమలూ తీర్చిదిద్దాలి. ముక్కుకు రెండు వైపులా కనుకొలకుల లోపల ఐ షాడో ఉపయోగిస్తే రెండు కళ్లూ ఒకదానికొకటి చాలా దగ్గరగా ఉన్నట్టు కన్పిస్తాయి. ఐ షాడో వెలపల కొలకులకు ఉపయోగిస్తే దూరదూరంగా ఉన్నట్టు కన్పిస్తాయి. వెలుపలి కొలకుల చివరలో చుక్క లాగా రంగు పెట్టితే కళ్లు పెద్దవిగా కనిపిస్తాయి. లోతట్టు కొలకులకు ఎరుపు చుక్కపెడితే కన్ను గంభీరంగాఉంటుంది. ఐ షాడోను కనురెప్పలకు రాసుకుంటే, వాటి మీద వికారంగా కనపడే కాంతిని సమసిపోయేటట్లు చేస్తుంది. నాలగవదశలో ముక్కు సరిచేసుకోవాలి. ముక్కు పొడుగ్గా కనిపించేటట్లు చేయడానికి ఇరుపక్కలా షేడింగ్ కలర్ రాసుకోవాలి. కాని దీనిని ముక్కు మధ్య భాగంలో రాసుకోకూడదు. అవసరమైతే పెట్టుడు ముక్కులు పెట్టుకోవాలి.

అయిదవ దశలో పెదవులను తీర్చిదిద్దుకోవాలి. పెదవులకు లిప్ రోజ్ లేదా లిప్‌స్టిక్ (గులాబీ రంగు), వాటి సహజత్వం చెడకుండా రాసుకోవాలి. పై పెదవిరంగుకింది పెదవి రంగు కంటె ముదురుగా ఉండాలి.

ఆరవ దశలో గడ్డం పొడుగు, కురుచ గడ్డాలను తగ్గించడానికి షేడ్ రాసుకోవాలి. పొట్టి గడ్డం పొడుగ్గా కనిపించా లంటే గడ్డానికి చుట్టూ షేడ్ చేయాలి. హైలైట్, షేడ్ తొలి పూత రంగులు ఒక దానితో ఒకటి కలిసి పోయేటట్లు చూసుకోవాలి. హైలైట్‌కు తెలుపు లైనింగ్ కలర్, షేడ్‌కు బ్రౌనిష్ రెడ్ రంగు వాడాలి.

ఏడవ దశలో చెవులకు తొలిపూత రంగు సరిగా అంటిందీ లేందీ చూసుకోవాలి. ఇక ఆ తరువాత పౌడర్ వేసుకోవాలి. గులాబీ రంగు పౌడర్‌నే వాడటం మంచిది. ఆ తరువాత 'లిక్విడ్ బాడీ మేకప్' ను చేతులకు పట్టించాలి. దీనితో సాధారణ మేకప్ (కోటా) వ్యాసంగం పూర్తవుతుంది. ఇపుడు విగ్‌లు, మీసాలు, గడ్డాలు స్పిరిట్ గమ్‌తో అంటించుకోవాలి. లేదా కృత్రిమమైన వాటిని వాడాలి.

లోట్ల సవరణ : సాధారణంగా ప్రతి ముఖం లోనూ ఏదో ఒక లోటు ఉంటూనే ఉంటుంది. ఆ లోటును సవరించుకోవడం అవసరం. లోతు కళ్ళు, దట్టమైన కనుబమ్మలు ఉంటే కనురెప్పల పై నుంచి కనుబమల వరకు గులాబిరంగు వాడితే లేక మీసాలు పెట్టుకుంటే లోతు కళ్లు అలాకనిపించకుండా చేయవచ్చు. ముక్కు చిన్నదైనపుడు లేతరంగు ఉపయోగించాలి. మీసాలు పెట్టుకోకూడదు. ఇక ముక్కు పెద్దదైనపుడు ముదురు రంగు వాడడం, హైలెట్ చేయకుండా ఉండడం వల్ల ముక్కు పెద్దదిగా కనిపించకుండా చేయవచ్చు. ముఖం ఉబ్బుగా ఉంటే కనుబమలు కణతల పైకి పొడిగించి స్ఫుటంగా దిద్దాలి. నుదురుకు, గడ్డానికి లేత రంగు వేసుకోవాలి. కణతల దగ్గర, బుగ్గల దగ్గర నీలి రంగు ముదురు షేడింగ్ ఇవ్వాలి.

జాగ్రత్తలు : ముఖాంగ రచనలో వీలైనంత వరకూ రంగులూ, లేపనాలూ తక్కువ మోతాదులో వాడాలి. కంటికి కనిపించే శరీర భాగాలన్నింటికీ రంగు వేసుకోవాలి. తల వెంట్రుకల రంగుకు, కనుబమ్మల వెంట్రుకల రంగుకు సామ్యం ఉండాలి. కనుబమ–కనుబమకు మధ్య ఎడం ఉండాలి. ముక్కు దగ్గర, కళ్ళ కింద ముదురు గులాబి రంగు గాని, ఎరుపు రంగు గాని వాడకూడదు. నటుడు రంగానికీ రంగానికి మధ్య తగు మాత్రంగా పఫ్ అద్దుకోవాలి. స్త్రీ వేషాల పెదిమలకు ఉపయోగించే ఎర్రరంగు, పురుష వేషాల పెదిమలకు వాడ కూడదు. ముసలి వేషం పాత్రధారి జుట్టుకు, కనుబమ్మలకు తెలుపు రంగు వేసుకోవడం మరచిపోకూడదు.

ఇంతకీ కోటా వేసుకోవడంతో సరిపోదు. పాత్రకు తగిన అలంకరణ కూడా ఉండాలి. ఈ అలంకరణ నాలుగు రకాలు. 1. టోపా, మీసాలు వగైరా 2. దుస్తులు, 3. చిహ్నాలు, 4. ఆభరణాదులు. ఇవి పాత్ర దేశ, కాల, వయోరూప అవస్థలకు తగినట్లుగా ఉండాలి.

శ్రీ.చ.

ఆహార్యాభినయం : చతుర్విధాభినయాలలో ఒకటి. నాటకంలో కావ్యార్థాన్ని వ్యక్తీకరింప చేయడంలో ఆహార్యాభినయం ప్రముఖ పాత్ర వహిస్తుంది. రంగస్థలం మీద నటీ నటులు ధరించే పాత్రలను సామాజికులు గుర్తుపట్టేటట్లు చేసే ప్రక్రియే ఆహార్యం. ఆహార్యంతో కూడిన నటనే ఆహార్యాభినయం. తెర తీయగానే రంగస్థలం మీద పాత్రల ఆకారాన్ని చూస్తారు ప్రేక్షకులు. అక్కడ నిలుచున్న వ్యక్తి రాముడా, నారదుడా, జమీందారా, కార్మికుడా, పౌరోహితుడా, డాక్టరా, కర్షకుడా అన్న విషయం అతని వేషాన్ని బట్టి, ఆకారాన్ని బట్టి వెంటనే స్ఫురిస్తుంది. అభినయానికి ఆహార్యం నిండుదనం ఇస్తుంది. 60 ఏళ్ల వృద్ధుడి పాత్ర ఒక్కోసారి 16 ఏళ్ల కుర్రాడు ధరించే సందర్భాలుంటాయి. అలాంటప్పుడు ఆహార్యం తోడ్పాటు లేకుండా ఆ పాత్ర నిర్వహణ కష్టతరమౌతుంది. సముచిత ఆహార్యం లేకపోతే ఆ పాత్రధారి నటన ప్రేక్షకుల కంటికి ఆనదు. సంతృప్తి నివ్వకపోగా కృత్రిమంగా ఉంటుంది. అపహాస్యం పాలయ్యే సందర్భాలు కూడా లేకపోలేదు.

గం.సు.రె.

ఆహ్లాద రూపకం (Comedy): దీనిని ఇంగ్లీషులో కామెడీ అంటారు. సుఖాంతంగా ముగిసే నాటకమని సామాన్యాభిప్రాయం. కామెడీ అనే పదానికి అర్థం కేరింత గీతం. దీనికి మూల గ్రీకు పదం కోమోస్. ఈ పదానికి రెండు అర్థాలు చెపుతారు.

1. లైంగిక కర్మకాండకు చెందింది. సంగీత నృత్య అసభ్య పరిహాసం, కేరింతల మిశ్రమం, 2. తాగి కేరింతలు కొట్టే వారు, జంతువులు, పక్షుల వేషాలు వేసుకొని ఆడే ఆట.

ఇది డయోనిసస్ ఉత్సవాలలో ఒక భాగం. ఊరేగింపు, జంతుబలి, లైంగిక గేయ పఠనం. వీటి నుంచే ఆహ్లాద రూపకం పుట్టిందని కొందరు, జంతువుల పక్షుల వేషాలు వేసుకోవడంవల్ల ఈ పేరు వచ్చిందని కొందరి అభిప్రాయం. అరిస్టాటిల్ సద్యః కల్పన ఆహ్లాద రూపకానికి ప్రాథమిక రూపకమనే అభిప్రాయం వెలిబుచ్చాడు. రెండవది మన నగరాలలో ఇప్పటికీ ఆచరణలో ఉన్న లైంగిక గీతాల నుంచి ఆవిర్భవించిందని కూడా చెప్పాడు.

ఆహ్లాద రూపక లక్ష్యం వాస్తవిక జీవితంలోని మానవుని కంటె తక్కువగా నీచంగా మానవులను చిత్రించడమే. గ్రీకు విమర్శకులు ఆహ్లాద రూపకాలను పూర్వ, మధ్యమ, నవీన అని మూడు వర్గాలుగా వింగడించారు. పూర్వ కామెడీలలో ఇతి వృత్తం జీవితం, వ్యక్తులు, భావాలు, రాజకీయాలను అవహేళనకు గురి చేయడమే ఈ కామెడీ ప్రధానాశయం. నాటిసాంఘికాచారాలను పరిహసించడం ఈ రూపకాలలో పరిపాటి.

మధ్య ఆహ్లాద రూపకాలలో పూర్వకాలపు కామెడీ లక్షణాలు తక్కువ. నాటకంలో భ్రమ ప్రాధాన్యం వహిస్తుంది. స్త్రీ, పురుష సమానత్వభావం తగ్గుతుంది. కేవలం సాంఘిక నాటకంగా గతి క్రమం గోచరిస్తుంది. సాంఘిక జీవితం నాటకానికి భూమికగా తయారైంది.

నవీన కామెడీలో గృహవాతావరణ చిత్రణ ఎక్కువగా గోచరిస్తుంది. బృందగాయకులకు,నాటక కథకు సంబంధ ముండదు. కోపిష్టి వృద్ధుడు, బానిస, అనాధ బాలిక మొదలైన రూఢి పాత్రలు, తాగి తుళ్ళుతూ ప్రవేశించే తాగుబోతు బృందగాయకులు పాత్రలు. వీటిలో వ్యక్తుల అదృష్టాలను ఎక్కువగా చిత్రిస్తారు. రంగం మీద ఒకరి మాట ఒకరికి వినబడనట్టు నటించే సంప్రదాయం ఈ నాటకాలతోనే ప్రారంభమైంది.

కప్పలు, తూనీగలు, పార్లమెంట్‌లో స్త్రీలు, హీరో సామియా గ్రీకు ఆహ్లాద నాటకాలకు ఉదాహరణలు.

గ్రీకు ఆహ్లాద రూపకం తరువాత అనేక మార్పులతో నూతన రూపాలు సంతరించుకుంది. వాటిలో చెప్పుకో తగ్గది రోమన్ కామెడీ. ఈ రోమన్ కామెడీ గ్రీకు కామెడీని ఒరవడిగా పెట్టుకొని ఆవిర్భవించింది. ఇందులోని పాత్రలు సామాన్యంగా జాతులకు సంకేతాలు. లోభులు, కుంటెన కత్తెలు, దుబారా మనుషులు, భీరువులు, తంత్రపరులైన బానిసలు, అతిరోగగ్రస్తు భార్యలు, డప్పాలు కొట్టే నావికాధికారులు మొదలైన వారు వీటిలో రూఢి పాత్రలు. ఈ నాటకాలలోని నాయికలు సామాన్యంగా గౌరవ కుటుంబాలలో వారు గాక వేశ్యల్లో, అనాధలై ఎక్కడో బానిసలుగా పెరిగినవారై ఉంటారు. కథాసరళి ఒకే ధోరణిలో నడుస్తుంది. బానిసకన్యను ప్రేమించిన యువకుడు సేవకుని సహాయంతో తండ్రిని మోసగించో మరో విధంగానో డబ్బు సంపాదిస్తాడు. చివరకు ఆ బానిస బాలిక ఉన్నత కుటుంబానికి చెందినదని తేలుతుంది. మోసాలు, కుతంత్రాలు ప్రేమ, వివాహం, ధనార్జన ఈ రకం నాటకాలలో ప్రాధాన్యం వహిస్తాయి.

మానవునిలో మంచి చెడ్డలు రెండూ వెలుగు నీడలలాగా ఉంటాయని నిరూపించడమే ఈ ఆహ్లాద నాటకాల ఆశయం. సానుభూతి, అవహేళన కలసిన హాస్యం ఈ నాటకాలలో ఎక్కువగా గోచరిస్తుంది. అతిశయోక్తి, స్థానిక విషయాల తీవ్రత, దుస్తులు, సీనరీలు అతిగా ఉపయోగించడం వీటి ప్రత్యేకత.

శీల ప్రధాన కామెడీ మనోవైకల్య ఆహ్లాద నాటకం **(Comedy of humour)**, వర్తన కామెడీ **(Comedy of manners)**, తాంత్రికకామెడీ **(Comedy of intrigue)**, ఆధునిక కామెడీ **(Modern comedy)** అని కామెడీ పలు రకాలుగా పరిణామం చెందింది.

పాత్ర శీలం మీదనే ప్రధానంగా నడిచే ఆహ్లాద నాటకాలు శీల ప్రధాన కామెడీలు. షేక్స్పియర్ కామెడీలు దీనికి ఉదాహరణలు. మనోవైకల్య ఆహ్లాద నాటకాలలో మానవ ప్రకృతిలోని ప్రముఖ దోషాలను ప్రతీకలుగా పాత్రలను సృష్టించి వాటితో కథ నడపడం ఈ నాటకాల ప్రధాన లక్షణం.

వర్తన ఆహ్లాద రూపకంలో నైతిక విలువల కంటె నాగరిక ప్రవర్తన గొప్పదని నిరూపించడమే ఈ నాటకాల లక్ష్యం. నియమిత సాంఘిక సూత్రాలకు కట్టుబడిన స్త్రీ, పురుషుల వర్తనను వారి జీవితాలను చిత్రించేవి. ఈ రకం నాటక రచన గణనీయమైందని ఫ్రెంచి నాటకకర్త మోలియర్ నిరూపించాడు. ఉదాహరణకు టార్టఫ్.

పాత్ర శీలాన్ని మరుగుపరిచే కథా విన్యాసం గల నాటకాలు తంత్ర ప్రధాన ఆహ్లాద నాటకాలు. ఆధునిక కామెడీలలో లైంగిక సమస్యలకు ప్రాధాన్యం ఎక్కువ. హాస్యం తక్కువ. ఆస్కార్ వైల్డ్ నాటకాలు ఈ రకం నాటకాలకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఇవిగాక ఇటలీలో 16-18 శతాబ్దాలలో ఇంకోరకమైన ఆహ్లాద రూపకం ఆవిర్భవించి ప్రవర్ధిల్లింది. దీనినే సద్యః కల్ప ఆహ్లాద రూపకం **(Commedia dell arte)**. దీనికి నాటక ప్రతి అంటూ ఉండదు. పాఠ్యం కంఠస్థం చేయడమంటూ ఉండదు. స్థూలంగా కథా సరళి, రంగ విభజన, ప్రవేశ నిష్క్రమణలు, క్రియలు మాత్రం ముందుగా చేయడానికి నిర్ణీతమై ఉంటాయి.

సాధన (రిహార్సల్) చేయడమంటూ ఉండదు. నటులు మాత్రం బాగా ఆరితేరిన జీవిక (వృత్తి) నటులై ఉంటారు. ఈ నటులు పూర్వ సన్నాహమేమీలేకుండా వేళకు రంగస్థలమెక్కి

తగిన సంభాషణలు, క్రియలు అప్పటికప్పుడే అల్లుకొని నాటకం ప్రదర్శిస్తారు. నాటకం రక్తి కట్టడం గూడా నటుల సద్యః కల్పనా శక్తిమీదనే ఆధారపడి ఉంటుంది.

ఈ రూపకంలో తన ధైర్య సాహసాల విషయంలో డప్పాలు కొట్టే ఒక కెప్టను, ఒక పండితుడు ఒకటో రెండో స్త్రీ పురుష హాస్య పాత్రలు, రెండు జంటల ప్రేయసీ ప్రియులు సామాన్యంగా వచ్చే పాత్రలు సైనికుల డప్పాలు, పండితుని శుష్క ప్రసంగాలు, కొట్లాటలు, అపార్థాలు, మోటు హాస్యాలతో ఈ రూపక భేదం విలసిల్లుతూండేది. అయితే ఆ నాడు ఎక్కువగా ప్రచారంలో ఉన్న గోప నాటక (**Pastoral play**) లక్షణాలు వీటిలో గోచరిస్తుండేవి. కాని నాడు శల్యావస్థలో ఉన్న నాటకరంగానికి ఇవి జీవం పోశాయి. ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి.

భావగర్భిత ఆహ్లాద రూపకాలు: 18వ శతాబ్దం మధ్య తరగతి వారి మృషా పరిజ్ఞానాన్ని ప్రతిబింబింపచేసే కరుణరసాత్మక ఆహ్లాద నాటకాలు ఇవి. షి స్టూప్స్ టు కాంకర్ (**She stoops to conquer**), డ్యుయన్నా (**Duenna**) వీటికి మచ్చు తునకలు.

శ్రీ.చ.

ఇంజ్, విలియమ్ (మోటర్) (1913-73) : ప్రముఖ అమెరికన్ నాటక రచయిత. *కమ్ బాక్ లిటిల్ షీబా* (1952లో చలనచిత్రంగా వచ్చింది), *పిక్నిక్* (1956లో చలన చిత్రం తీశారు), *బస్ స్టాప్* (1956లో చలన చిత్రం తీశారు) అనే నాటకాలు ఈయన రచనలలో ప్రసిద్ధ మైనవి. పిక్నిక్ నాటక రచనకు ఈయనకు పులిట్జర్ బహుమతి లభించింది.



లారెన్స్‌లోని కాన్సాస్ విశ్వవిద్యాలయంలోను, నాష్‌విల్‌లోని జార్జ్‌పీబడీ ఉపాధ్యాయ కళాశాలలోను ఇంజ్ చదువుకొన్నాడు. ఆ తరువాత 1937 నుంచి 1949 వరకు ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. 1943 నుంచి 1946 వరకు సెయింట్ లూయీలోని స్టార్‌టైమ్స్ పత్రికలో నాటక విభాగ సంపాదకుడుగా పనిచేశాడు.

ఈయన మొదటి నాటకం *ఫార్దర్ ఆఫ్ ఫ్రమ్ హెవెన్* (1947). పదేళ్ళ తరువాత దీనినే పరిష్కరించి *ది డార్క్ ఎట్ ది టాప్ ఆఫ్ ది స్టెయిర్స్* అనే నాటకంగా రూపొందించాడు. 1960లో ఇది చలనచిత్రంగా వచ్చింది.

మిడ్‌వెస్ట్‌ని, చిన్న చిన్న పట్టణాలలో కనిపించే జీవన సరళిని రూపు గట్టించిన మొదటి అమెరికన్ నాటకకర్తలలో ఇంజ్ ఒకడు. 1950-60 దశాబ్దిలో ఈయనకు మంచి పేరు ప్రతిష్ఠలు వచ్చాయి. అనంతర కాలంలో ఈయన రచనలలో ప్రసిద్ధమైనవి *ఏ లాస్ ఆఫ్ రోజెస్* (1960 - ఇది 1963లో *ది స్ట్రేంజర్* అనే పేరుతో చలనచిత్రంగా రూపొందింది), *నాచురల్ అఫెక్షన్* (1963), *వేరీజ్ డాడీ* (1966), *ది లాస్ట్ పాడ్* (1970). 1961లో ఈయన రాసిన *స్ప్లెండర్ ఇన్ ది గ్రాస్* అనే మౌలికమైన చలనచిత్ర రూపకానికి అకాడమీ పురస్కారం లభించింది. ఈయన లఘు రచనలలో చెప్పుకోదగ్గవి; *గ్లోరీ ఇన్ ఫ్లవర్* (1958), *టు బబోలింక్, ఫర్ హెర్ స్పిరిట్* (1962), *ది బోయ్ ఇన్ ది బేస్‌మెంట్* (1962), *బస్ రైలేస్ బాక్ ఇన్ టౌన్* (1962). 1973లో ఈయన మరణించాడు.

పో.ద.

ఇండియన్ డ్రమటిక్ కంపెనీ : ఈ సమాజాన్ని 1910లో బందరులో స్థాపించారు. దీని వ్యవస్థాపకుడు ముల్లాది బ్రహ్మానందం. దర్శకులు బి.టి. రాఘవాచార్యులు, పింగళి నాగేంద్రరావు, కృత్తివెంటి సుబ్బారావు, గబ్బిట బాలసుందర శాస్త్రి, మంగూ వీర భద్రరరావు, తోట వేంకటేశ్వరరావు మొదలైనవారు.

ఈ జీవిక (వృత్తి) నాటక సమాజం పుట్టిన కొద్ది కాలానికే అదృష్టదేవత వరించింది. 1914 బందరు చిత్ర నళీయం నాటక పోటీలలో ప్రదర్శన బహుమతి, 1916 గుంటూరు హరిశ్చంద్ర నాటక పోటీలలో హరిశ్చంద్ర పాత్ర బహుమతి ఈ సమాజనికే లభించాయి. డి.వి.సుబ్బారావు ఆధిపత్యంలో ఈ సమాజం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లింది. ఏకధాటిగా నలభై సంవత్సరాల పాటు సుమారు నలభై వివిధ నాటకాలు ఎంతో కట్టుదిట్టంగా ప్రదర్శించిన నాటక సమాజం ఆంధ్ర దేశంలో ఇది ఒకటే. ఎన్నో కఠిన నియమాలతో నడిపిన నాటక సమాజం కూడా ఇదే.

ఈ సమాజంలోని నటులకు మొదటి తేదీన జీతాలు ముట్టేవి. వేరొక సమాజంలో వేషం వేయడానికి వీలు లేదు. కిరాయి నటులను ఇందులో వేషం వేయనిచ్చేవారు కాదు. ప్రకటించిన వేళకు హాలు నిండినా నిండకపోయినా తెర ఎత్తవలసిందే. వేషాలు వేసుకొనేటపుడు ఎవరినీ నేపథ్యగృహంలోకి రానిచ్చేవారు కాదు. ఇవీ ఈ సమాజం ముఖ్య నియమాలు. హరిశ్చంద్ర ఇండియన్ డ్రమటిక్ కంపెనీ వారిదే చూడాలనేది నాటి ప్రేక్షకుల కోరిక.

గులేబకావళి, గయోపాఖ్యానం, సుగుణమణి, రంగరాయకదన సమవకారం, గోపీచంద్, బుద్ధిమతీ విలాసం, చాణక్య, సాత్రాజితీయం, హరిశ్చంద్ర, చిత్రనళీయం, చంద్రహాస, పాండవోద్యోగం, పాండవ విజయం, వీర సంయుక్త, లవకుశ, కృష్ణ లీలలు, రసపుత్ర విజయం, శ్రీ కృష్ణ నిర్యాణం, వేణీ

సంహారం, ముక్తావళి, రామరాజు, మేవాడు పతనం, సావిత్రి, సారంగధర, బుద్ధిసాగర విజయం, నారాజు, వింధ్యారాణి, చింతామణి, శ్రీకృష్ణ తులాభారం, ప్రహ్లాద, కనకతార, మదన విజయం, వసంతసేన మొదలైన నాటకాలను ఈ సమాజం ప్రదర్శించింది.

శ్రీ.చ.

ఇందిర, మండలపు (జ.1935) : ప్రసిద్ధ రంగస్థలనటి. మండలపు ఇందిర గుంటూరు జిల్లా వేమూరుకు సమీపంలోని మొసలిపాడులో మండలపు వెంకయ్య, మహాలక్ష్మమ్మ దంపతులకు 1935 ఏప్రిల్‌లో జన్మించింది. సంప్రదాయ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన ఇందిరకు బాల్యదశ నుంచీ నాటకాలంటే ప్రాణం. 1953లో పల్లె పడుచు నాటకం లోని రమా దేవి పాత్రతో రంగ ప్రవేశం చేసింది. తొలి ప్రదర్శనలోనే ప్రజాభి మానాన్ని చూరగొనటం ఆమెలో ఆత్మ స్థైర్యాన్ని ప్రోదిచేసింది. రంగస్థలం మీద నిలదొక్కుకోగలనన్న నమ్మకం బలపడింది. కుటుంబ అవసరాల దృష్ట్యా రంగస్థల కళాకారిణిగా కొనసాగాలని నిర్ణయించుకుంది. అప్పటి నుంచీ కొన్ని వందల నాటకాల్లో పాత్ర పోషణ చేసింది. ఒక్క పల్లె పడుచు నాటకాన్నే వందల సార్లు ప్రదర్శించిందంటే రమాదేవి పాత్రలో తానెంతగా మమేకం చెందిందో ప్రస్ఫుటమవు తుంది. తెనాలి నాటకరంగంలో గాఢమైన అనుబంధం ఏర్పరచు కొని, జనతా ఆర్ట్ థియేటర్స్, క్రాంతి థియేటర్స్, ప్రజా నాట్యమండలి మొదలైన నాటక సమాజాలలో ప్రధాన భూమికలు ధరించి, ఉత్తమ నటిగా ఎన్నో బహుమతులు అందుకుంది. ఎంతటి సుదీర్ఘ సంభాషణలనైనా అలవోకగా తన సుమధుర గళంతో పలకడంతోను, ఎంతటి సంక్లిష్ట భావావేశాన్నయినా సహజ గాంభీర్యంతో ఆవిష్కరించ డంలోను అశేష ప్రేక్షకావళిని మూడు దశాబ్దాల కాలం అలరిం చింది. అనేక పరిషత్తు పోటీల్లో పాల్గని ఉత్తమనటి బహు మతులు పొందింది.

పల్లెపడుచులో రమా దేవి, పునర్జన్మలో శ్యామల, భయంలో టైపిస్టు పార్వతి, కప్పలులో పంకజం, శిక్షార్హులులో జానకమ్మ ఆనాడులో సంయుక్త, పల్నాటి యుద్ధంలో మాంచాల, రామరావణ యుద్ధంలో సీత, భూకైలాస్‌లో మండోదరి మొదలైన పాత్రాలకు జీవం పోసిన నటీమణి ఇందిర. సాంఘిక, పౌరాణిక, చారిత్రక నాటకాల్లో సమ ప్రతిభతో నటించి ఆపాత్రలకు న్యాయం చేసిన నటీ, మూడుతరాల ప్రేక్షకులను తన నాటనా వైదుష్యంతో అలరించి కీర్తి శిఖరాలను అందుకొన్న మేటినటీమణి ఇందిర.

గం.సు.రె.

ఇనాక్, కొలకలూరి (జ.1939) : కవి, పండితుడు, ఆచార్యుడు, కథా నవలా రచయిత, నాటకకర్త, పరిశోధకుడు, అన్నిటికీ మించి మానవతా వాది. ఈయన 1939లో జులై ఒకటిన గుంటూరు జిల్లా వేజెండ్ల గ్రామంలో జన్మించాడు.

1944లో వేజెండ్లలో ప్రాథమిక విద్య, గుంటూరు ఏ.సి. కాలేజిలోను, ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాల యాల్లో ఉన్నత విద్య నభ్యసిం చాడు. శ్రీ వేంకటేశ్వర, శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయాలలో అధ్యా పకుడిగా, ఆచార్యుడిగా పనిచేశాడు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా పదవీ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించాడు.

సాహిత్య రంగంలో రాశి లోనూ వాసిలోనూ ఎన్నదగిన రచనలు చేశాడు. సుమారు రెండువందల కథలు, కవితలు, ఎనిమిది నవలలు, ఇరవైనాలుగునాటికలు, ఆరు నాటకాలను రచించాడు. రేడియోలో ఎన్నో విలువైన ప్రసంగాలు చేశాడు. *త్యాగి (1960)*, *కూలి (1984)*, *దర్శనం (1985)*, *దిక్కులేనోడు (1985)*, *నిర్ణయం (1985)*, *న్యాయం (1985)*, ముని వాహనుడు *(1985)*, సమానత్వం *(1985)* మొదలైన నాటికలు, జైహింద్, సాక్షి మొదలైన నాటకాలు రచించి నాటక రచయితగా నాటక రంగంలో సుస్థిర స్థానం సంపాదించు కున్నాడు. తెలుగు వ్యాస పరిణామం, అధునికాంధ్ర విమర్శసూత్రం, శూద్రకవి శుభమూర్తి, వసు చరిత్ర వైశిష్ట్యం మొదలైన గ్రంథాలు ఇనాక్ సాహితీ సౌరభాన్ని వెదజల్లే సుగంధ భరిత సుమాలు. వీరి బహుముఖీనసేవకు రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీల నుంచి అవార్డులు లభించాయి. తెలుగు విశ్వ విద్యాలయం 1988లో ముని వాహనుడు నాటకానికి ఉత్తమ నాటక పురస్కారం యిచ్చి గౌరవించింది. 1997లో జూలూరి నాగరాజారావు స్మారక సాహిత్య బహుమతిపొందాడు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడిగా ఉంటూ, సాహితీ ప్రపం చానికి ఎనలేని సేవ చేశాడు.



గం. సు.రె.

ఇబ్సన్, హెన్రిక్ (1828-1906) : నార్వే నాటక రచయిత. 1828, మార్చి 20న నార్వేలోని స్కెయిన్‌లో ఇబ్సన్

హెన్రిక్ జన్మించాడు. తొలుత సుఖవంతమైన జీవితాన్నే అనుభవించినా, తండ్రి వ్యాపారం దివాలా తీయటంతో ఎనిమిదేళ్ళ వయస్సు వచ్చే సరికి పేదరికాన్ని రుచి చూడాల్సి వచ్చింది. పది హేనేళ్ళ వయసులో ఇబ్సన్ ఇంటి నుంచి వెళ్ళిపోయి ఓ కెమిస్ట్ వద్ద పనిలో చేరాడు. మెడిసిన్ చదవాలని ఉబలాటపడ్డాడు. కానీ, గ్రీక్, లాటిన్, గణితాల్లో ఫెయిల్ కావటంతో ఆ ఆశ అడియాసైంది. ఫలితంగా జర్నలిజం వైపు మళ్ళాడు. అక్కణ్ణుంచే కవితలు, నాటకాలు ఆరంభించాడు. నాటకాల కారణంగా నార్వే థియేటర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం దొరికింది. సామాజిక సమస్యల పట్ల, అన్యాయాల పట్ల నాటక రచయితలకు మనోవిశ్లేషణతో కూడిన గాఢమైన అవగాహన ఉండాలన్న జెనా విశ్వవిద్యాలయం ఆచార్యుడు హెర్మాన్ హెట్టర్ పిలుపు ఇబ్సన్‌ను కదిలించింది. హెట్టర్ రాసిన దాస్ మోడర్న్ డ్రామా అనే గ్రంథం వాస్తవిక వాద నాటక రచన చేపట్టాడనికి ఇబ్సన్‌కు ప్రేరేపకంగా నిల్చింది. ఇబ్సన్ రచనల్లో ఎ డాల్స్ హౌస్, *బ్రాండ్ (1809)*, *పిర్‌జైంట్ (1865)*, *పిల్లర్స్ ఆఫ్ ది సొసైటీ (1877)*, *ఘోస్టు (1881)*, *యాన్ ఎనిమీ ఆఫ్ ది పీపుల్ (1882)*, *హెడ్డా గాబ్లర్(1890)*, *ది మాస్టర్ బిల్డర్*, *వెన్ ఉయ్ డెడ్ ఎవేకెన్ (1899)*, వైల్డ్ డక్, ది లేడీ ఫ్రం ది సీ వంటి నాటకాలు ప్రసిద్ధి పొందాయి. నూతనప్రయోగం, ఆశావాదం, సత్యాన్వేషణ, వాస్తవిక చిత్రణ, సమకాలీన సమస్యల అనుసంధాన రూపాలే ఇబ్సన్ నాటకాలు. జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీల్లో పర్యటించిన అనుభవం కూడా ఆయన నాటక రచనా వైవిధ్యానికి తోడ్పడింది.

తన కాలంనాటి సమాజాన్ని అత్యంత సహజంగా రంగస్థలం పైకి తెస్తూ ఇబ్సన్ జనాన్ని ఆలోచింపజేశాడు. మనిషి స్వరూప స్వభావాలను అచ్చు గుద్దినట్లుగా ప్రతిఫలింప జేశాడు. తాను దర్శించిన సమాజాన్ని, అను భవించిన జీవితాన్ని సమ్మి ళితంచేసుకొంటూ, మరుగై పోతున్న మానవ సంబంధాలను పొదివి పట్టుకొని నవ్యరీతిలో నాటక సృష్టిచేశాడు. ఇబ్సన్ నాట కాలు సమస్యాత్మకాలే కాదు. సందేశాత్మకం కూడా. బతుకు బాధల్ని కళాత్మకంగా, సంఘర్షణాత్మకంగా నాటకీకరించడంలో ఆయన ప్రతిభ అసాధారణమైంది.

1862లో రాసిన లవ్స్ కామెడీ నాటకంలో ఇబ్సన్ అలనాటి గృహస్థ జీవనంలోని వెలుగు నీడల్ని ప్రస్తావించాడు. ప్రేమ వివాహాల పేరుతో జరిగే కాపట్యాలు, కల్లబల్లి కబుర్లు, పలు స్త్రీ, పురుష సమస్యల్ని చర్చించి బలవంతపు వివాహం జీవన మాధుర్యాన్ని హరింపజేస్తుందనే సందేశాన్నిచ్చాడు. పిల్లర్స్ ఆఫ్ ది సొసైటీ నాటకంలో పట్టణాల పటాటోప జీవితాల్లోని డొల్లతనాన్ని, అవినీతి విశృంఖలతనూ ఇబ్సన్ కళ్లకు కట్టినట్లు చూపించాడు. తెలుగులో వచ్చిన పెద్ద మనుషులు సినిమాకు ఈ నాటకమే ఆధారం. స్త్రీ అణచివేతను చిత్రీకరిస్తూ రాసిన ఎ డాల్స్ హౌస్ నాటకం సంచలనాన్ని రేకెత్తించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన నాటకమిది. స్త్రీ స్వాతంత్ర్యాన్ని బలపర్చే నాటక రచనలకు ఇది ముఖద్వారం లాంటిది.

యాన్ ఎనిమీ ఆఫ్ ది పీపుల్‌నాటకం కూడా ఇబ్సన్‌కు విశ్వవాప్త కీర్తినార్జించి పెట్టింది. స్వార్థం, అధికార వ్యామోహం మనిషిని ఎంతటి అధోగతికి దిగజారుస్తాయో, ఈ అన్యాయాన్ని ఎదుర్కోవాలనుకొన్న డాక్టర్ చివరకు నిరాశ్రయుడై ఆ ఊరినే వదిలిపెట్టి పోవాల్సిన పరిస్థితి ఎలా వచ్చిందో ఈ నాటకం వెల్లడిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ నాటకానికి అనువాదాలు వెలువడ్డాయి. ఆదర్శవాదానికి మారుగా వాస్తవిక వాదాన్ని ఇబ్సన్ ప్రోత్సహించాడు. ఆదర్శాల వల్లింపులకు ఆచరణకు వ్యత్యాసం ఉండకూడదన్నది ఆయన సిద్ధాంతం. బలహీనుని ఆదర్శం కొరగానిదంటూ బ్రాండ్ నాటకం ద్వారా నిరూపించాడు. భార్యాభర్తల మధ్య ఉండవలసిన అనురాగం, పరస్పర అవగాహన లోపించినందువల్లనే బ్రాండ్ ఆదర్శవాదిగా రూపమెత్తాడు. మనిషిని నైతిక బంధనాల్లో కట్టిపడేసేందుకే ఆదర్శవాదం పుట్టిందనీ, ఈ వాదం స్వయంసేవ వంటిదని బ్రాండ్ పాత్ర ద్వారా ఇబ్సన్ చాటి చెప్పాడు. షా అన్నట్టు బ్రాండ్ ధార్మికుడుగా అంత మొందినా, ఆ ధార్మికత ఎంత వ్యర్థమైనదో, ఎన్ని అనర్థాలకు కారణమైందో వివరించి, ప్రేక్షకుల వివేకాన్ని నిద్రలేపాడు ఇబ్సన్.

ఇబ్సన్ రాసిన మరో విలక్షణమైన నాటకం ఎ లేడి ఫ్రం ది సీ. ఆకర్షణలు, ఉద్రేకాలు, పట్టుదలలు, చాతుర్యాలు వివాహ వ్యవస్థను ఎట్లా ఛిన్నాభిన్నం చేస్తాయో ఎలిడా పాత్ర ద్వారా ప్రతీకాత్మక ధోరణిలో ఇబ్సన్ వెల్లడించాడు. ఇబ్సన్ రచనా జీవితం తొలిదశలో రొమాంటిక్ ప్రాధాన్యాంశాలైతే, తరువాతి దశలో జీవిత లోతుల్ని అంతరంగాల్ని తవ్వాడు.

ఆధునిక నాటకరంగానికి అనువుగా ఇతి వృత్తాన్ని ఎన్నుకోవటం, కథను ఒక రంగంపై నడిపించటం, సమస్యలకు పరిష్కారాలను ప్రేక్షకుల ఊహాశక్తికి వదిలివేయటం, స్త్రీ పురుష సంబంధాలలోని వైరుధ్యాలను సహజంగా అభివ్యక్తం చేయటం వంటి విషయాలు ఇబ్సన్‌ను వాస్తవిక నాటక రచయితగా నిలబెట్టాయి. ప్రసిద్ధ రచయిత బెర్నార్డ్ షా యే ఇబ్సన్ నన్ను ఎంతగానో ప్రభావితం చేశాడని కితాబిచ్చాడు. ప్రఖ్యాత రష్యన్ నాటక రచయిత చెకోవ్ కూడా ఇబ్సన్‌ను కొనియాడాడు.

1906, మే 23న ఇబ్సన్ జీవితరంగ స్థలం నుంచి నిష్క్రమించాడు.

రమణ

ఇలియట్, థామస్ స్టీరన్స్ (1888-1965) : ఇంగ్లీషు నాటకకర్త, తత్త్వవేత్త, నోబెల్ బహుమాన గ్రహీత. మొదటి నాటకం స్వీనీ ఎగొనిస్ట్స్ (Sweeny Agonists 1927-28), రెండవ నాటకం ది రాక్ . ఇలియట్‌కు ఖ్యాతి తెచ్చిన నాటకం మర్డర్ ఇన్ ది కెథడ్రాల్. ఆ తరువాత సొంత రీతిలో ఆధునిక నాటక రంగానికి అనువుగా పద్య నాటక రచనకు పూనుకున్నాడు. ఎక్కువగా నాటకీయతను సంతరించుకున్న నాటకం ఫామిలీ రీయూనియన్ (Family reunion-1937) డిశంబర్ మహోత్సవాలకు ఈయన రచించిన కాక్ టైల్ పార్టీ (Cock tail Party -1949) కాన్ఫిడెన్షియల్ క్లర్క్ (Confidential clerk - 1953), ఎల్డర్‌స్టేట్స్ మన్ (Elder States man - 1958) నాటకాలు కూడా ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొన్నాయి.

శ్రీ.చ.

ఈట్స్, విలియం బట్లర్ (1865-1939) : నాటకకర్త. నాటక సిద్ధాంతవేత్త, కవి. ఐరిష్ నాటకోద్యమ పితామహుడు. రవీంద్రనాథ టాగూర్ గీతాంజలి ఆంగ్ల అనువాద కర్త. ఐరిష్ ఇతివృత్తాలతో ఐరిష్ నాటక కర్తలు రాసిన నాటకాలనే ఐరిష్‌నటులతో నటింప జేయాలనే ఉద్దేశంతో లేడీ గ్రెగరీతో కలిసి 1899లో ఐరిష్ నాటకోద్యమం లేవదీసి, దానికి నాయకత్వం వహించాడు. అందుకు గాను 1904లో డబ్లిన్‌లోని అబీ థియేటర్‌ను తీసుకుని దానికి డైరెక్టర్‌గా మరణపర్యంతం వ్యవహరించాడు. ఈ థియేటర్‌నే కేంద్రంగా చేసుకొని నాటకోద్యమం నడిపాడు.



ఆ తరువాత ఐరిష్ ఐతిహాసిక నాటకాలు రచించాడు. జపాన్ నాటక ప్రభావంతో కొన్ని నాటకాలు రాసివాటిని నృత్యరూప కాలుగా రూపొందించాడు. అనేక మంది ఐరిష్ రచయితలను ప్రోత్సహించి నాటకాలు రాయించాడు. టాగూర్ గీతాంజలికి నోబుల్ బహుమానం రావడంతో టాగూరుతో పాటు ఈట్స్ పేరు కూడా భారత దేశంలో బహుళ వ్యాప్తి చెందింది. హృదయం కోరిన భూతలం (The land of hearts desire - 1894), *కాథలీన్ రాణి* (The Countess Cathleen), ఛాయానీళ్ళు (Shadowry water -1906), ఆన్‌బెయిల్స్ స్ట్రాండ్ (On Baile's Strand - 1904), డీర్డ్ (Deide -1905-06), ఎమర్ అసూయ (The jealousy of Amar) మొదలైన నాటకాలు రాసిన ఈట్స్ 1939లో మరణించాడు.

శ్రీ.చ.

ఈహామృగం : దశ విధ రూపకాలలో పదవది 'ఈహా' అనగా చేష్ట, పోలిక, అనుసరణ. మృగం వంటి చేష్టను అంటే స్త్రీ మాత్ర పరమగు చేష్టను ప్రదర్శించేది ఈహామృగం. (ఈహా చేష్టా మృగస్యేన స్త్రీ మాత్రార్థాయత్ర – కావ్యాను శాసనం.)

అలభ్యమైన నాయికను నాయకుడు కోరడం చేత లేక అనుసరించడం చేత ఈహామృగం. భరతముని ఈహామృగంలో దివ్య పురుషుడు నాయకుడుగా ఉండాలన్నాడు. కాని ధీరోద్ధతులైన నరదివ్యులు నాయికా ప్రతి నాయకులుగా ఉండవచ్చని ధనంజయుడు అభిప్రాయపడ్డాడు. అంక సంఖ్య విషయంలో భరతముని వ్యాయోగంలా అనడంచేత ఒకే అంకమని అనుశాసించినట్లయింది. కాని ధనంజయుడు నాలుగు అంకాలని చెప్పాడు.

ఒకే అంకమైతే ఒకరోజు జరిగిన కథను, నాలుగు అంకాలైతే నాలుగు రోజుల కథను నిబంధించాలని నాట్య దర్పణం చెబుతోంది.

శ్రీ.చ.

ఉత్తరరంగం : దీనినే ఇంగ్లీషులో 'ఎపిలోగ్' అంటారు. సంస్కృత లాక్షణికులు దీనిని పూర్వవాక్యం, పూర్వభావం అని పేర్కొన్నారు. నాటకం చివర్లో ప్రధాన పాత్రగానీ, నాటకంతో సంబంధం లేని ఒకానొక నటుడుగానీ, నాటక కర్తను, ఈ రంగంలోని నీతిని వివరించే ఘట్టమే నిర్వహిస్తే అది నాటకంలోని కడపటి భాగంగా కనిపిస్తుంది. అదే ఒకానొక నటుడు నిర్వహిస్తే వేరే రంగంగా కనిపిస్తుంది. భరతముని నాట్య శాస్త్రంలో దీని లక్షణాన్ని ఇలా చెప్పాడు.

('యథోక్తార్థ ప్రదర్శనము' 'పూర్వ వాక్య' మనబడును అంటే పూర్వం చెప్పిన విషయాన్ని మళ్లీ స్మరించుట. నా.శా, 19-63, అను. పోణంగి శ్రీరామ అప్పారావు.)

ఉత్తరరంగాన్ని తెలుగులో మొట్ట మొదట ప్రవేశ పెట్టింది ధర్మవరం రామకృష్ణమాచార్యులు. ఇంగ్లీషు నాటకాలననుసరించి ఈయన ఈ ప్రక్రియ చేపట్టాడు.

కోలాచలం శ్రీనివాసరావు సునందినీ పరిణయ నాటకంలో కొత్త పంథా చూపాడు. ప్రధాన పాత్రతో ప్రత్యక్షంగా ఉత్తరరంగం పఠింపజేయకుండా, పరోక్షంగా అతని ఉత్తరం ఇతరులు చదవడం ద్వారా ఉత్తరరంగం నిర్వహించాడు. ఈ ఉత్తరపఠనం పూర్తయితేనేగాని, నాటకంసమాప్తం కాదు కాబట్టి ఈ ఉత్తరరంగంనాటకంలోభాగమే. ఈయనే సుఖమంజరీ పరిణయం నాటకంలో ఉత్తరరంగం అనే పేరుతో నాయికా నాయకుల వివాహ ఘట్టం పొందుపరిచాడు. ఈ ఘట్టంలో గాని ఫలసిద్ధి కలిగి నాటకం సమాప్తం కాదు.

పాశ్చాత్య నాటకాలలో ప్రప్రథమంగా ఉత్తరాంకం ప్రవేశపెట్టింది గ్రీకు నాటకకర్త యురిపిడీస్ (క్రీ.పూ. 5వ శతాబ్ది). యురిపిడీస్ తన నాటకాలలో పూర్వ కథా వివరణ కంటె నీతి బోధనకే ఎక్కువగా ఉపయోగించాడు. అంతేగాక ఇతని ఉత్తర రంగాలను నిర్వహించేది ప్రధానంగా కోరస్ (బృందగాయకులు). హెలెన్, బాషే అనే నాటకాలు రెంటిలోనూ తానొకటి తలచిన దైవ మొకటి తలచును అనే నీతి కోరస్ ద్వారా వ్యక్తమవుతుంది.

ఇంగ్లీషు నాటకాలలో పూర్వరంగం నిర్వహించినవారే సాధారణంగా ఉత్తరరంగాన్ని కూడా నిర్వహిస్తారు. ఈ పూర్వోత్తర రంగాలను నాటక రచయితే రాయాలని నియమంలేదు. ఇతరులు కూడా రాయవచ్చు. గారిక్, డ్రైడెన్ ప్రభృతులు చాలా నాటకాలకు పూర్వోత్తరరంగాలు రాశారు. తెలుగులో పానుగంటి లక్ష్మీనరసింహ రావు నాటకాలకు కూచి నరసింహం నాందీ ప్రస్తావనలు రాసిన విషయం లోక ప్రసిద్ధమే. ఆంగ్ల నాటకాలలోని ఉత్తర రంగాలలో వైవిధ్యం ఎక్కువగా గోచరిస్తుంది. పాత్రలలోనే గాక వస్తువులో కూడా వైవిధ్యం కనిపిస్తుంది. పూర్వ కథా కథనం నీతిబోధనే గాక సమకాలీన రాజకీయ సాంఘిక పరిస్థితులను వ్యాఖ్యానించడానికి, నాటక పరిమితులవల్ల రచయిత ఎదుర్కోవలసిన చిక్కులను వివరించడానికి, వీడ్కోలు చెప్పడానికి ఉత్తర రంగం ఉపయోగించారు. థామస్ కిడ్ (1558-1894) స్పానిష్ ట్రాజెడీ అనే నాటకంలో పూర్వోత్తర రంగాలను నిర్వహించే పాత్రలు ప్రేతాత్మ, ప్రతీకారం అనే సాంకేతిక పాత్రలుగా చూపాడు.

షేక్స్పియర్ నాటకాలలో ఉత్తరరంగాలను నిర్వహించేది ప్రధాన పాత్రలేగాక బృందగాయకులు (5వ హెన్రీ), నర్తకి (4వ హెన్రీ నాటకం రెండవ భాగం) మొదలైనవి. టైమన్ ఆఫ్ ఏథెన్స్ (Timon of Athems) నాటకం, ఉత్తరరంగ ప్రయోజనం చరమ గీతం (Epitoph) ద్వారా నెరవేరుతుంది.

బెర్నార్డ్ షా ఉత్తరరంగం అనే పేరుతో సెయింట్ జోన్ నాటకంలో మామూలు రంగమే నడిపాడు. షేక్స్పియర్, షెరిడాన్ నాటకాలు కొన్నింటిలో పూర్వరంగం పఠించే వారొకరు, ఉత్తర రంగం పఠించేది వేరొకరు. ఉదా. షేక్స్పియర్, 4వ హెన్రీ రెండవ భాగం, షెరిడాన్ రైవల్స్ నాటకం.

ఇంగ్లీషు నాటకాల ఉత్తరరంగాలు పూర్వకథ పునశ్చరణకు, పాత్ర భావి కార్యక్రమం, రచయిత భావి నాటక రచనా కార్యక్రమం వివరించడానికి, ప్రేక్షకులకు వీడ్కోలు చెప్పడానికి, నాటకం రచనా ప్రయోగాలలోని లోపాలను క్షమించ వలసిందిగా ప్రేక్షకులను అభ్యర్థించడానికి, కువిమర్శకులను దుయ్యబట్టడానికి, సమకాలీన రాజకీయ, సాంఘిక పరిస్థితుల సమీక్షకు, పాత్రలను వ్యాఖ్యానించడానికి ఉపయుక్తమవుతాయి.

శ్రీ.చ.

ఉత్పల్‌దత్ (జ.1929) : బెంగాలీ నటుడు, దర్శకుడు. ఈయన 1929, మార్చి 29న జన్మించాడు. షేక్స్పియర్ రచించిన హేమ్లెట్ నాటకంలో హేమ్లట్ పాత్ర ద్వారా రంగస్థల మెక్కి, చిన్న వయస్సు లోనే 1947లో నాటక సమాజాన్ని స్థాపించాడు. షేక్స్పియర్ నాటకాలను బెంగాలీలోకి అనువదించి ప్రదర్శించాడు. అట్లాగే బ్రెఫ్ట్ నాటకాలను బెంగాలీలోకి అనువదించి ప్రదర్శించాడు. 1949లో ఉత్పల్ దత్ స్థాపించిన షేక్స్పియర్ గ్రూపు లిటిల్ థియేటర్ గ్రూపుగా రూపాంతరం చెంది ప్రసిద్ధ రచయితల నాటకాలను ప్రదర్శించింది.

ఈయన ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (IPTA) సభ్యుడిగాచేరి నాటకాలను ప్రదర్శిస్తూనే 'జాత్ర' అనే కళారూపాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చాడు. ప్రభుత్వం అంతరంగిక భద్రతా చట్టం కింద ఉత్పల్‌దత్‌ను నాలుగుసార్లు నిర్బంధించింది. వీధుల్లోనే అప్పటికప్పుడు జనాన్ని పోగు చేసి ప్రదర్శించే కళా రూపమే జాత్ర. గ్రామీణ ప్రజల కోసం బీహార్ స్వాతంత్ర సమర యోధుడు కేమర్ సింగ్ జమీన్ కథ కుథర్ అనే నాటకంగా రాసి ప్రదర్శించి పెద్ద సంచలనం సృష్టించాడు. కల్లోల్, దుస్వప్నేర్ నగర్, తీర్, అంకూర్ వంటి నాటకాలు ఈయన సారథ్యంలో ప్రదర్శింప బడ్డాయి. 1959లో ఉత్పల్‌దత్ ప్రదర్శించిన అంకూర్, కల్లోల్ బెంగాల్‌లో తీవ్ర సంచలనం సృష్టించాయి. 1955-66లో బెంగాల్ రాష్ట్రంలోని కల్లోల పరిస్థితుల్నీ, కాంగ్రెస్ ద్వంద్వ నీతిని ఈ నాటకం ప్రజల ముందుంచింది. ఈ నాటక ప్రధాన సన్నివేశంలో వేదికపై అలంకరించిన నౌకపై అరుణ పతాకాన్ని ఎగుర వేయించాడు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నాటకంపై దాడులు చేసి ఉత్పల్‌దత్‌ను నిర్బంధించడం

జరిగింది. ఆరుమాసాల ఆందోళన తరువాత విడుదల చేశారు. అజేయ వియత్నాం అనే నాటకం జర్మన్ భాషలోకి అనువదింపబడి అక్కడ ఎన్నోమార్లు ప్రదర్శింపబడింది. బెంగాల్ కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ 1970లో ఉత్పలదత్ నాటకాలను ప్రదర్శించాడు. హిట్లర్ కిరాతకాలను చిత్రిస్తూ బ్యారికేడ్, కాంగ్రెస్ పాలన వైఫల్యాలను చిత్రిస్తూ దుష్వప్నేర్ నగర్, ఇందిరా, సంజయ్ గాంధీలను విమర్శిస్తూ ఎబార్ రాజార్ నాటకాలను ప్రదర్శించాడు.

బెంగాల్‌లో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాక తన నాటకాలలో నూతన భావాలకు స్థానం కల్పించాడు. స్టాలిన్, శృంబాన్‌చెర, నీవ్ సదాలార్, జంతర్ ఆఫమ్ వంటి పలు నాటకాలను కొన్ని వందలసార్లు ప్రదర్శించాడు. నాటకాన్ని ప్రజా చైతన్యానికి, నిరంకుశ ప్రభుత్వాన్ని ఎండగట్టటానికి ప్రధాన ఆయుధంగా చేసుకొన్న కళాకారుడు ఉత్పల్‌దత్.

రమణ

ఉద్దీపన విభావం : విభావ భేదం. అగ్నికణంలో సూక్ష్మ రూపంలో ఉండే అగ్నిని గాలి ప్రజ్వరిల్ల చేసేటట్టు ఆలంబన విభావాలయిన నాయికా నాయకులలో సూక్ష్మ రూపంలో ఉండే స్థాయి భావాన్ని (రసమును) ఉద్దీపింపజేసేవి ఉద్దీపనవిభావాలు. (ఏవి రసమును ఉద్దీపించునో అవి ఉద్దీపన విభావములు – ఆం. సా.ద. 3-161)

ఉద్దీపన విభావాలు, గుణాలు (నాయికా నాయకుల రూప యవ్వన లాలిత్యాదులు), చేష్టలు (నాయికా నాయకుల హావ భావాదులు) అలంకారాలు (ఆభరణాదులు), తటస్థాదులు (చంద్రమలయాదులు) అని నాలుగు విధాలు. సంస్కృతాలంకారికులు తటస్థాలలో మన్మథుని చేర్చలేదు. కాని కవులు శృంగార కావ్యాలలో మన్మథ దూషణను పొందుపర్చడంవల్ల రామరాజభూషణుడు నరసభూపాలీయంలో మన్మథునిని కూడా తటస్థాలలో చేర్చాడు. ఆ తరువాత తెలుగు ప్రబంధాలలో, నాటకాలలో కూడా మన్మథ దూషణ సంప్రదాయమైంది.

ఈ నాలుగు ఉద్దీపన భేదాలకింద వచ్చే విభావాలు ఇరవై ఆరు. అవి, గుణాలు, యౌవనం, రూపం, లావణ్యం, సౌందర్యం, అభిరూపత, మార్దవం, సౌకుమార్యం, అలంకృతి, తటస్థ వైఖరి, చంద్రిక, ధారాగృహం, చంద్రోదయం, కోకిలాలాపం, మాకందం, మందమారుతం, షట్పదం, లతామండపం, భూగృహం, దీర్ఘిక, జలదారవం, విద్యుత్తు, ప్రాసాద గర్భం, సంగీతం, క్రీడాద్రి, సరిత్తు.

శ్రీ.చ.

ఉద్వేగం : 1. కామావస్థ (అయోగశృంగారావస్థ, పూర్వాను రాగావస్థ), 2. గర్భ సంధ్యంగం. 1. కామావస్థ : భరతముని దీనిని కామావస్థగాను, ధనంజయుడు అయోగ శృంగారావస్థగాను, సింగభూపాలుడు పూర్వాను రాగావస్థగాను చెప్పాడు. మనసు కంపించి పోవడం ఉద్వేగం. దీనికి మనసుకు సంతాపం, నిట్టూర్పు, శయ్యాసనాదులపట్ల ద్వేషం, చింత, స్తంభం, కన్నీరు, వైవర్ణ్యం, దీనత్వం దీనికి అనుభావాలు. 2. గర్భ సంధ్యంగం : శత్రువు, రాజు, దొంగల వల్ల కలిగే భయం ఉద్వేగం (శత్రుచోరాది సంభూతం భయ ముద్వేగ ఉచ్యతే - ర.సు. 3-56).

శ్రీ.చ.

ఉన్మత్తగతి : గతి భేదం. పిచ్చివాని గతి క్రమరహితంగా ఉండాలి. బిరుసెక్కిన చింపిరిజుట్టు, దుమ్ము పట్టిన శరీరం, అధిక ప్రసంగం, అకారణ ప్రలాపం, వికృత చేష్టలు, హఠాత్తుగా పాడడం, నవ్వడం, ఒంటరిగా ఉండడం, ఆడుతూ జనంలో పరుగెత్తడం, ఒకొకసారి నిల్చుండడం, ఒకొక సారి పడుకోవడం, చింపిరి గుడ్డలు ధరించి వీధిలోనే బసచేయడం ఉన్మత్తగతి లక్షణాలు. ఉదాహరణకు వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన ప్రతాపరుద్రీయం నాటకంలో యుగంధరుని పిచ్చి చేష్టలు.

శ్రీ.చ.

ఉన్మాదం : 1. ప్రవాస స్మర దశ, 2. వ్యభిచారీ భావం
1. ఉన్మాదమంటే ప్రవాస వియోగం వల్ల చేతనా చేతన భేదం నశించడం. వాటి పట్ల సమంగా ప్రవర్తించడం ఉన్మాదం. ఉదాహరణకు విక్రమోర్వశీయం చతుర్థాంక ప్రారంభంలో ఉన్మత్త వేషుడు రాజు ప్రవేశించి చేతనా చేతన జ్ఞానం నశించడంతో చివరకు కొండను కూడా చేతనంగా భావించి తన ప్రియురాలి జాడ నడగడం; 2. వ్యభిచారి భావం: విరహం, సన్నిపాత జ్వరం మొదలగు వాటి నుంచి పుట్టే చిత్త విభ్రమమే ఉన్మాదం. అసంబద్ధ భాషణ, అచేతనాలతో భాషణ, పరిగెత్తడం, విలాసం, అకారణ హాసం, పడుకోవడం మొదలైనవి అనుభావాలు. ఉదాహరణకు విక్రమోర్వశీయంలోని చతుర్థాంకంలో విక్రముడు విరహోన్మాదంతో నెమలితో భాషించడం.

శ్రీ.చ.

ఉపకథ : ప్రధాన కథతో అనుసంధానమై దాని అంతర్భాగంగా నడిచే కథ ఉపకథ. సంస్కృత లాక్షణికులు ఈ ఉపకథనే పతాక, ప్రకరి అని రెండు రకాలుగా విభజించారు. పతాక, ప్రధాన కథకు సహాయపడుతూ దానితోపాటు చాలాదూరం నడుస్తుంది. ప్రకరి మధ్యలో ఆగిపోతుంది.

అరిస్టాటిల్ విషాద రూపకాలలో కథ స్వయం సంపూర్ణం, సమగ్రంగా ఉండాలని చెప్పడంవల్ల ఫ్రెంచి విమర్శకులు స్వయం సంపూర్ణం, సమగ్రం అనే పదాలకు కథలు, ఉపసన్నివేశాలు లేని ఒకే ఒక కథ అని అర్థం చెప్పారు. ఆ తరువాత కాల్పనికోద్యమ వాదులు ఉపకథలు,ఉపసన్నివేశాలు, పాత్రలు సృజించే విషయంలో స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. వీరి దృష్టిలో ఐక్యత సంక్లిష్టతకు విరుద్ధం కాదు. ఐక్యత అంటే ఒకే ఒక క్రియ కాదు సౌష్టవం. కాబట్టి చిన్న చిన్న క్రియలు లేక ఉపకథలు పొందుపరచవచ్చు. అయితే కథలోని అంగాలన్నీ ఒక దానితో ఒకటి

లంకె వేసుకొని ఒకదాని మీద ఒకటి ఆధారపడుతూ కథా పరిణామంలో సహకారావయవాలుగా కొనసాగాలి. ఈ రెండు దృక్పథాలకు కారణం నాటక నిర్వచన విషయంలో వారి వారి దృక్పథాలలో భేదమే. ఒకరి దృక్పథంలో నాటకం ఆదర్శ ప్రతిబింబం. ఇంకొకరి దృక్పథంలో సంక్లిష్ట మానవజీవిత ప్రతిబింబం.

ప్రధాన కథకు ఉపకథ లంగి ఉండి ప్రధానకథతో పాటు ఒకే ఒక లక్ష్యానికి పురోగమించాలి. అపుడు నాటకానికి స్వయం సంపూర్ణత, సౌష్ఠవం చేకూరుతాయి. ప్రధాన కథతో లంకె వేసుకొని దానికి బలం చేకూరుస్తూ, దాని నుంచి బలం పొందుతూ, దానితో పాటు ఒకే ఒక ప్రధాన లక్ష్యానికి పురోగమించే కథే ఉపకథ. ఉపకథా ప్రయోగ దక్షత షేక్స్పియర్ లియర్ రాజు (King Lear) నాటకంలోనూ, శూద్రకుని మృచ్ఛకటిక రూపకంలోనూ, పానుగంటి లక్ష్మీనరసింహారావు కంఠాభరణంలోనూ ఎక్కువగా గోచరిస్తుంది.

ఉపకథ – కంఠాభరణం : పానుగంటి లక్ష్మీనరసింహారావు రచించిన కంఠాభరణం నాటకంలో ఉపకథలు నాలుగు.

ప్రధాన కథ : కృష్ణారావు, రుక్మిణిగాథ. ఉప కథలు;

1. కృష్ణారావు, సుందరి గాథ, 2. సుబ్బి శెట్టి, సుందరి గాథ, 3.సోమావధానుల గాథ, 4.పిచ్చిరామశాస్త్రి గాథ. ఇలా నాటకంలోని కథలు, పాత్రలు ఒక దానితో ఒకటి పెనవేసుకొని దోహదం చేసుకుంటూ ముందుకు సాగిపోతాయి.

మల్లాది అచ్యుత రామ శాస్త్రి రచించిన సక్కుబాయి నాటకంలో కథలు రెండు. ఈ రెండింటికి ఒక దానితో ఒకటికి సంబంధం లేదు. రెండూ విపర్యయ కథలు. చివరి వరకు సమాంతరంగా నడిచి చివరకు పాండురంగ దేవాలయంలో కలుసుకుంటాయి. ఒక దానితో ఒకటి పెనవేసుకోలేదు. ఒక దాని ప్రభావం రెండవ దాని మీద లేదు. ఒక దానికి ఒకటి దోహదం చేసుకోలేదు. కాబట్టి ఈ రెండు స్వతంత్ర కథలే. ఒకటి ప్రధాన కథ, రెండవది ఉపకథ అనడానికి వీలు లేదు.

శ్రీ.చ.

ఉపరూపకాలు : శారదాతనయుడు భావ ప్రకాశనంలో రూపక ఉపరూపకాలను వింగడిస్తూ ఉపరూపకాలు నృత్య భేదాలు గల భావాత్మకాలని స్పష్టీకరించాడు. సంస్కృత లాక్షణికు లలో ఉపరూపకాల విషయంలో భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. అగ్నిపురాణం 17 ఉపరూపకాలను చెప్పింది కాని వాటికి ఉపరూపకాలని పేరు పెట్టలేదు. అవి: తోటకం, నాటిక, సట్టకం, శిల్పకం, కర్ణం, దుర్మల్లికా, ప్రస్థానం, భాణికా, భాణీ, గోష్ఠి , హల్లీశక, కావ్య, శ్రీగదిత, నాట్యరాసక, రాసక, ఉల్లోప్యక ప్రేక్షణం.

అభినవగుప్తాచార్యుడు అభినవభారతిలో తొమ్మిదింటిని పేర్కొన్నా, వాటిని ఉపరూపకాలనకుండా గేయరూపకం, నృత్త ప్రకారం, రాగ కావ్యాలని చెప్పాడు. అవి: డోంబికా, భాణ, ప్రస్థాన, షిద్గక, భాణిక, ప్రేరణ, రామాక్రీడ, హల్లీసక, రాసకాలు.

కోహలుడు ఉపరూపకాలను పేర్కొనడమే గాక, వాటిని మార్గ, దేశి అని రెండు విధాలుగా వింగడించాడు.

మార్గ భేదాలు: నాటిక, ప్రకరిణిక, భాణిక, హాసిక, వ్యాయోగిని, డిమిక, కలోత్సాహవతి, చిత్ర, జుగుప్సిత, చిత్రత–వీటిలో నృత్య గానాలుండవు. ఇక డోంబిక, భాణ, ప్రస్థాన, షిద్గక, భాణిక, ప్రేరణ, రామాక్రీడ, రాగ కావ్యం, హల్లీసక, రాసక దేశి భేదాలు. వీటిలో చివరి ఆరు నృత్త ప్రకారాలు.

కావ్యాను శాసనం అభినవ భారతిలో చెప్పిన తొమ్మిది ఉపరూపకాలకు గోష్ఠిని, శ్రీగదాన్నిచేర్చి పదకొండు ఉపరూప కాలను చెప్పింది. శృంగార ప్రకాశం పధ్నాలుగు ఉప రూపకాలు చెప్పింది. నాట్య దర్పణం గూడా సట్టక, శ్రీ గదిత, దుర్మల్లికా, ప్రస్థాన, గోష్ఠి, హల్లీసక, నర్తనక, ప్రేక్షణక, రాసక, నాట్య రాసక, కావ్య, భాణ, భాణిక, భాణక అని పధ్నాలుగు చెప్పింది. భావ ప్రకాశనం ఇరవై ఉపరూపకాలను పేర్కొన్నది. ఇక దశరూపకంలో రసార్ణవ సుధాకరంలో ఉపరూపకాల ప్రసక్తి లేదు.

విశ్వనాథకవిరాజుసాహిత్యదర్పణంలో చెప్పిన పద్దెనిమిది ఉపరూపకాలనేతరువాతి లాక్షణికులు ఉపరూప కాలుగా పేర్కొనడం జరిగింది. సాహిత్య దర్పణం పేర్కొన్న నాటిక, త్రోటకం, (తోటకం) గోష్ఠి, సట్టకం, నాట్యరాసకం, ప్రస్థానకం, ఉల్లాప్యం, కావ్యం, ప్రేంఖణం, రాసకం, సంలాపకం, శ్రీగదితం, శిల్పకం, విలాసిక, దుర్మల్లికా, ప్రకరణిక, హల్లీసకం, భాణిక అనే 18 ఉపరూపకాలుగా రూఢికెక్కాయి.వీటిలోని ప్రకరణికను కొందరు ప్రకరణ జన్యరూపకంగా పరిగణించారు.

ఇక తెలుగు లక్షణకర్తలలో చిత్రకవి పెద్దనార్యుడొక్కడే లక్షణసార సంగ్రహం నాటకం ప్రకరణంలో నాటిక, సట్టక, తోటక, ఉపేక్షణ, గోష్ఠి, భాణికా, సల్లాపకా, ప్రస్థాన, కావ్య, భల్లిస, రాసక, శ్రీగదిత, లాసిక, దుర్మల్లికా, నాట్య రసక, ఉల్లాప్యం అనే పదహారు ఉపరూపకాలను పేర్కొన్నాడు. సంస్కృత లాక్షణికులు స్పష్టంగా చెప్పని ఉపేక్షణ, భల్లిసకలనే ఉపరూపకాలను పెద్దనార్యుడు కొత్తగా పేర్కొన్నాడు.

శ్రీ.చ.

ఉపవేశన విధి : నటీనటులు ఆయా పరిస్థితులలో రంగస్థలం మీద కూర్చునే విధానం. నడుము మీద ఒక చేయి ఉంచి, రెండో చేయి తొడ మీద ఉంచి కూర్చోవడం స్వస్థతను సూచిస్తుంది. ఒక పాదాన్ని కొంచెం చాచి, రెండో పాదాన్ని ఆసనం మీద ఉంచి తల ఒక ప్రక్కకు వంచి కూర్చోవడం చింతను తెలుపుతుంది. శోకం అభినయించడానికి చేతులు రెండూ గెడ్డం కింద పెట్టుకుని, తల భుజం మీదకు వాల్చి మనసును, ఇంద్రియా లను అరికట్టాలి. మూర్ఛ, మద, గ్లాని, శ్రమ, విషాదాలను

నటించడానికి చేతులు చాచి, దేనికయినా చేరగిలబడి కూర్చోవాలి. వ్యాధి, సిగ్గు, నిద్ర, ధ్యానం మొదలైనవి చూపేటప్పుడు పాదాలు మోకాళ్ళ మధ్య అవయవాలన్నింటినీ చేర్చవలసి ఉంటుంది. పితృ తర్పణాది కర్మకాండల్లో గొంతు కూర్చోవాలి. హోమాదు లన ర్చడం, ప్రియురాలిని ప్రసన్నురాలిని చేసుకోవడానికి మోకాలు భూమి మీద ఆనించి, రెండోది మామూలుగా వుంచాలి. దేవతా వందనం,ఏడ్వడం మొదలైన వాటికి రెండు మోకాళ్లు భూమి మీద ఆనించి తలవంచాలి.

శ్రీ.చ.

ఉపసంహృతి సంధి : పంచ సంధులలో అయిదువది, ఆఖరుది. దీనికే నిర్వహణసంధి అని మరో పేరు. ఉప సంహృతి అనగా ముగింపు. నాటకం ముగింపు దశలోని కథా భాగం సంధి కాబట్టి దీనికి ఉపసంహృతి సంధి అని పేరు వచ్చింది. నాటక కథ ఈ కథా భాగంలో నిర్వహింపబడుతుంది కాబట్టి నిర్వహణ సంధి అని పేరు వచ్చింది.

రామయ్య అనే వస్తాదు కుస్తీలో భీమయ్యపై గెలు పొందుతాడు. అంతటితో కుస్తీ ముగుస్తుంది. ఈ ముగింపునే నాటక పరిభాషలో ఉపసంహృతి, నిర్వహణ అంటారు. ఈ ఉపసంహృతితో, ఈ నిర్వహణతో కూడిన రూపక కథాభాగం ఉపసంహృతి. పై మూడింటిలోనూ బీజాలు ఏకోన్ముఖంగా సాగిపోయి చివరిలో, నిర్వహణ సంధిలో ఫలప్రదమవుతాయి. అర్థ ప్రకృతిలోని అయిదవ ప్రకృతి కార్యం, కార్యావస్థలలోని అయిదవ అవస్థ ఫలాగమాలను అనుసంధించే కథా భాగం ఉపసంహృతి సంధి. సమగ్ర ఫల ప్రాప్తికి కారణభూతమైనది కార్యం. వేణీసంహారం నాటకంలో ద్రౌపదీ కేశసంహారానికి కారణభూతమైంది దుర్యోధన వధ. ఫలాగమనం లేక ఫల ప్రాప్తి ద్రౌపదీ వేణీ సంహారం (జుట్టును ముడవడం).

అంగాలు: నిర్వహణ సంధికి దీనికి సంధి, విబోధం, గ్రథనం, నిర్ణయం, పరిభాషణ, ప్రసాదం,ఆనందం, సమయం, కృతి, భాషణం, ఉపగూహనం, పూర్వభావం, ఉపసంహారం, ప్రశస్తి అనే పధ్నాలుగు అంగాలు ఉన్నాయి.

శ్రీ.చ.

ఉమర్/ఆలీషా (1885-1945) : నాటక కర్త, సంస్కృతాంధ్ర అరబ్బీ పారశీకాంగ్లాది బహుభాషా వేత్త, తత్త్వ శాస్త్రజ్ఞుడు. ఈయన పిఠాపురంలో 1885లో జన్మించాడు. తండ్రి మొహిద్దీన్, తల్లి చాందుబీ.

ఆలీషా తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత పారశీ కాది భాషలు నేర్చాడు. సాహిత్య సేవకే జీవితం అంకితం చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగం చేయలేదు. 14వ ఏట కవిత్వం రాయడం ప్రారంభించాడు. 18వ ఏట 'మణిమాల' నాటకం రాశాడు. ఈయన తన జీవిత కాలంలో శ్రవ్య, దృశ్య కావ్యాలు 50కి పైగా రచించాడు. 1934 డిసెంబర్‌లో కేంద్ర శాసన సభ (నేటి లోక్‌సభ) కు సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఈయన కవిత్వం రసభరితంగా ఉంటుంది. నాటకాలు ప్రయోగ సౌలభ్యాన్ని సంతరించుకున్నాయి. 1936లో ఇంటర్నేషనల్ ఎకాడమీ ఆఫ్ అమెరికా ఈయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ అనే గౌరవ పట్టా ఇచ్చింది.

1910లో *విచిత్ర బిల్హణీయం*, 1911లో *చంద్రగుప్త*, 1912లో *మణిమాల*, 1914లో *ఎక్స్ కాలేజి గర్ల్*, *దానవ వధ*, 1916లో *పద్మావతి*, 1917లో *విషాద సౌందర్యం*, 1936లో *మహాభారత కౌరవరంగం*, *అనసూయాదేవి*, *కళ* అనే నాటకాలు రచించిన ఉమర్ 1945లో మరణించాడు.

శ్రీ.చ.

ఉల్లాప్యం : సంస్కృత ఉపరూపకం. దీనికి ఉల్లాప్యకమని కూడా పేరు. ఒకే అంకం, ఇతివృత్తం దివ్యం. నాయకుడు ఉదాత్తుడు, శిల్పాంగాలతో హాస్య, శృంగార, కరుణ రసాలతో ఒప్పారుతూ ఉంటుంది. అవమర్శసంధి ఉండదు. మూడు భాగాల ఉల్లాప్యకమనే గేయంతో కూడి ఉంటుంది. కొందరి మతంలో పెక్కుయుద్ధాలతో , అస్రగీతంతో, మూడంకాలతో, నలుగురు నాయకులతో విలసిల్లాలి. అయితే శృంగార ప్రకాశనం ఉల్లాప్యాన్ని ఉపరూపకాలలో చేర్చలేదు.

శ్రీ.చ.

ఉషాబాల, రాచకొండ (జ.1938) : రంగస్థలనటి. విజయదుర్గ నాట్యమండలి స్థాపకురాలు. రాజమహేంద్రవరంలో 1938లో జన్మించిన రాచకొండ ఉషాబాల తల్లి మరణంతో 1947లో విజయవాడలో బాబాయి నరసింహమూర్తి వద్దకు చేరింది. విజయవాడ ఆకాశవాణిలో జరిగే బాలానందం కార్యక్రమాన్ని చూడడానికి వెళ్లిన ఉషాబాలతో బందా కనకలింగేశ్వర రావు చిన్నవేషం వేయించాడు. అప్పటి నుండి దాదాపు పది సంవత్సరాలు రేడియో నాటకాలలో నటించింది. ఒకసారి రేడియో నాటకం రిహార్సల్స్ చేస్తున్న సమయంలో కె.వేంకటేశ్వరరావు ఆమె ప్రతిభను గుర్తించి తన సమాజంలో డి.వి.నరసరాజు రచించిన నాటకం లోని పాత్రను ఇచ్చాడు. ఉషాబాల నటిగా రంగస్థల ప్రవేశం చేసిన మొదటి నాటకం ఇదే. ర.స.న సమాఖ్య రాజమండ్రిలో ప్రదర్శించిన నాబాబులో ఉషాబాల నటనను చూసిన హిందీ నటుడు బలరాజ్ సహాని అభినందించి ఆమెతో ప్రత్యేకంగా ఫోటోదిగాడు. కొడాలి ఆది శేషయ్యతో 'కప్పలు, విశ్వశాంతి' నాటకాలలో నటించింది.

తనతో పాటు అనేక నాటకాలలో నటించిన రాంబాబుతో ఉషాబాలకు వివాహం జరిగింది. విరివిగా ప్రదర్శనలిచ్చిన ఉషాబాల ఎ.ఆర్.కృష్ణ, సిద్ధప్ప నాయుడు, వెంపటి రాధాకృష్ణ, ఎం.ఎస్. మూర్తి, కొప్పరపు సుబ్బారావు, మురళీ మోహన్,

నూతన ప్రసాద్, బెల్లంకొండ సుబ్బారావు వంటి ప్రముఖులతో పలు నాటకాల్లో నటించింది. ఎ.శివరామిరెడ్డి దర్శకత్వంలో నటనాలయం, వడ్లమూడి సీతారామారావు శ్రీరంగనీతులు, రాబందులు, కళ్యాణం రఘురామయ్య, పి. సూరిబాబులతో పాదుకాపట్టాభిషేకం వంటి నాటకాల్లో ముఖ్యపాత్రలను పోషించింది. ఆర్.వి.చలం దర్శకత్వంలో ఫణి లో కథానాయిక పాత్రను ఆత్మీయులు, అదృష్టవంతులు, బందిపోటు దొంగలు వంటి చిత్రాలలో నటించింది. 1965లో శ్రీనివాస చక్రవర్తి విజయవాడలో నెలకొల్పిన నాటక విద్యాలయంలో మూడు సంవత్సరాలు శిక్షణపొందింది. ఎ.ఆర్.కృష్ణనాట్య విద్యాలయంలో డిమాన్‌స్ట్రేటర్‌గా వ్యవహరించింది. దాదాపు రెండు వేల రేడియో నాటకాలలో నటించి 'ఎ' గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపును పొందింది. హైదరాబాదులో విజయదుర్గ నాట్య మండలిని స్థాపించి పలు నాటకాలను ప్రదర్శించింది. 'ఆంధ్ర నాటక కళాపరిషత్తు'లో ఉత్తమనటిగా మూడు పర్యాయాలు బహుమతి పొందడం విశేషం.

కందిమళ్ళ

ఋతుగానం : ప్రవర్తకా భాగం. నాటక ప్రారంభానికి ముందు ప్రేక్షకులను రంజింప చేసేందుకు సూత్రధారాదులు అవలంబించే ప్రక్రియే ఋతువర్ణన లేక ఋతుగానం. సూత్రధార నటి పార్శ్వ పార్శ్వకులలో ఒకరు ఈ ఋతుగానం చేయడం పరిపాటి. ప్రదర్శించే కార్యార్థానికి అనుగుణమైన ఋతువర్ణన చేయాలి. రూపకంలో ఏ రసం ప్రధానమైనా ప్రథమాంక కథా కాలానికి అనుగుణమైన ఋతుగానం చేయవలసి ఉంటుంది.

నాటక ప్రధాన రసం శృంగారమైతే వసంత ఋతువర్ణన, వీర రసమైతే శరత్కాల వర్ణన చేయాలి. ఈ ఋతువర్ణన తప్పనిసరి కాదు. ఐచ్ఛికం.

శ్రీ.చ.

ఎన్నిక : 1. నాటకం ఎన్నిక, 2. పాత్రల ఎన్నిక

1. నాటకం ఎన్నిక : కొంతమంది ఉత్సాహవంతులైన వ్యక్తులు కలిసి నాటకం ఆడాలనే కుతూహలంతో ఒక సంఘంగా ఏర్పడిన వెంటనే ఎదురయే ప్రశ్న ఏ నాటకం ఎంపిక చేసుకోవాలి అని? ఈ ప్రశ్నకు వచ్చే సమాధానం మీదనే కొంతవరకు ఆ నాటక సమాజం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఆ నాటకం పౌరాణికమా? చారిత్రకమా? సాంఘికమా? జానపదమా? ఎన్నిక దేన్నిబట్టి? ఈ సందర్భంలో ఎవరికోసం అనే ప్రశ్న కూడా వేసుకోవడం అవసరం. ప్రేక్షకులలో పట్టణవాసులు, గ్రామీణులు, విద్యావంతులు, విద్యాహీనులు, వివిధ అభిరుచులు గలవారు ఉంటారు. ప్రదర్శన ఎవరి కోసం అనేది ముందుగా నిర్ణయించుకోవడం మంచిది. లేకపోతే ప్రేక్షక దృక్పథానికి , సమాజం వారి దృక్పథానికి విభేదాలు వచ్చి చిక్కులకు దారి తీస్తుంది.

పౌరాణిక, చారిత్రక, జానపద నాటకాలాడాలంటే వాటిలో నటించడానికి తగిన నటులు కావాలి. అలాంటి నటులుంటేనే వాటి సంగతిఆలోచించాలి. లేకపోతే ఆఆలోచనవదిలేసి సాంఘిక నాటక, నాటికలు ఎన్నుకోవాలి. సాంఘికమైనా ఎటు వంటి నాటకం ఎన్నుకోవాలి? దీనికి గీటురాయి ఏది? మొదటిది సభ్యుల అందరికీ ఇష్టమైనదై ఉండాలి.

రెండోది ప్రదర్శన యోగ్యత. నాటకం ప్రదర్శన యోగ్యం గాలేక, క్రియాత్మకం కాకపోతే ప్రేక్షకులకు విసుగెత్తి మొదటికే మోసం వస్తుంది. నాటకం రక్తి కట్టదు. ప్రేక్షకులు, ఒకరొకరే నిష్క్రమిస్తే ఖాళీ కుర్చీలకు, బల్లలకు నాటకం చూపవలసి వస్తుంది. అయితే నాటకం రక్తి కడుతుందా లేదా అని తేల్చడం కష్టం. రక్తి కడతాయనుకొన్నవి రక్తి కట్టకపోవడం, రక్తి కట్టవన్నవి రక్తి కట్టడం ఆచరణలో చూస్తున్నాం. ప్రదర్శన యోగ్యత లోని భాగమే ఉత్సుకత. ప్రేక్షకులలో ఉత్సుకతను రేకెత్తించలేని నాటకం విజయవంతం కావడం అసాధ్యం. తరువాతది, అతిముఖ్యమైనది ప్రయోగ సౌలభ్యం. ఎక్కువ వ్యయం లేకుండా ప్రదర్శించడానికి వీలుగా నాటకం ఉండాలి.

ఇక ఆఖరి గీటురాయి ప్రయోజనం. ఎందుకు? ఏ ప్రయోజనం ఆశించి నాటకం ప్రదర్శించ పూనుకున్నారు? ప్రేక్షకులను కేవలం ఆనందింపజేయడానికా? నీతి బోధించడానికా? ఈ రెంటిలో ఏదో ముందు తేల్చుకోవడం మంచిది. ప్రతి నాటకంలోనూ ఆనందింప చేసే గుణమే కాక కొద్దో గొప్పో నీతి బోధ కూడా ఉంటుంది.

ఈ పై విషయాలను దృష్టిలో పెట్టుకుంటే నాటకం ఎన్నికకు ఈ కింది నాలుగు సూత్రాలు పొడగడతాయి. విజయవంతం కావడానికి అవకాశం ఉంటుంది.

1. అందరికీ నచ్చింది, 2. రక్తి కట్టేది అనగా ప్రదర్శనయోగ్యమయింది, 3. ప్రేక్షకులకు ఆనందాన్నిచ్చేది, ఉత్సుకత కలిగించేది,
4. ఎక్కువ వ్యయం లేకుండా ప్రదర్శన సౌలభ్యం కలిగింది.

2. పాత్రల ఎన్నిక : నాటకం ప్రదర్శించాలని నిర్ణయించుకున్న తరువాత ఏ పాత్ర ఎవరికివ్వాలనే సమస్య ఎదురవుతుంది. దీని పరిష్కార బాధ్యత దర్శకుడిది. నాటకాన్ని దర్శకుడు క్షుణ్ణంగా చదివి ఒక పాత్రకు ఒక పాత్రకు గల సంబంధాన్ని గ్రహించిన తరువాత పాత్ర ఎన్నికకు పూనుకోవాలి.

ముందుగా సమాజ సభ్యుల శరీర ఆకారాలు, వారి అభిరుచులు, అభిమాన రీతి పాత్రలు, వారి వారి ఊహా శక్తి, నటనా సామర్థ్యం గ్రహించాలి. వ్యక్తిగత సంబంధాలను పాత్రల ఎన్నికలోకి తావివ్వరాదు.

ప్రేక్షకులలో భ్రాంతి కలిగించాలన్నా, ఔచిత్యం పోషించాలన్నా ముందుగా చూసుకోవలసింది ఆకారం. ముందుగా ప్రేక్షకుల కంటబడేది, హృదయం మీద ముద్ర వేసేదీ ఆకారమే.

అందుచేత ఆకారరీత్యా పాత్రకు అనుగుణమైన వ్యక్తిని ఎన్నుకోవాలి. సన్నగా ఉన్న నటుడిని భీముడి వేషం వేయిస్తే ఎబ్బెట్టుగా, నవ్వులాటగా ఉంటుంది. పౌరాణిక, చారిత్రక పురుషుల ఆకార విశేషాల విషయంలో సామాన్య భావం వ్యాప్తిలో ఉంది. గ్రంథస్థమై ఉంది. ఇక సాంఘిక నాటక పాత్రల విషయంలో సామాన్య ధర్మమంటూ లేదు. రైతు బక్కగానూ ఉండవచ్చు, లావుగానూ ఉండవచ్చు. కాని నాటకకర్త నేరుగాగాని, సంభాషణల ద్వారా గాని ఆయా పాత్రల ఆకార విశేషాలను నాటకంలో తెలిపి ఉంటే దాని ప్రకారం పాత్ర ఎన్నిక చేయవలసి ఉంటుంది. అలా ఎన్నిక చేసేటపుడు తక్కిన పాత్రలకు, పాత్రకు గల సంబంధాన్ని గూడ దృష్టిలో పెట్టుకొని ఎన్నిక చేయాలి. లేకపోతే భార్యభర్తల వేషాలు, తల్లీకొడుకుల లాగానో, అన్నదమ్ముల వేషాలు తండ్రీకొడుకుల లాగానో కనిపించవచ్చు. ఇది పాత్ర ఎన్నిక కార్యక్రమంలో ఆకార సంబంధి.

పాత్ర ఆకారంతో పాటు ఆలోచించవలసిన విషయాలు మూడు. సాంఘికం, మానసికం, శారీరకం, శరీర విషయంలో పైన వివరించడమైనది. ఇక సాంఘికం విషయానికొస్తే నేటి సంఘం శ్రమజీవి, మధ్య తరగతి జీవి, ధనిక వర్గం అని మూడు తరగతులుగా చెప్పుకోవచ్చు. ఒక వ్యక్తి స్థానం ఏ తరగతికి చెందిందీ ఆ వ్యక్తి ఆర్థిక స్థితి గతులు, బంధుమిత్ర వాతావరణం బట్టి తేలుతుంది. మానసికంగా కూడా ఉత్తమ, మధ్యమ, కింది తరగతికి, ద్వంద్వ ప్రకృతులు కలవారు ఉన్నారు.

ఈ మూడూ ఒకదానితో ఒకటి పెనవేసుకొని పాత్రల సంపూర్ణ స్వరూపాన్ని వ్యక్తంచేస్తాయి. రచయిత పాత్రలకు సంబంధించిన ఈ మూడు విషయాలను అర్థం చేసుకొని, దృష్టిలో పెట్టుకొని పాత్రలను సృష్టిస్తాడు. అందుచేత దర్శకుడు రచయిత దృష్టికి అనుగుణంగా నటులను ఎన్నిక చేయవలసి ఉంటుంది.

అయితే ఒక పాత్రకు తగిన నటులు ఇద్దరు ముగ్గురిలో ఎంపిక చేయాల్సి వచ్చినపుడు వారిని పరీక్షించాలి. ప్రదర్శించడానికి ఎన్నుకొన్న నాటకం లోంచి రెండు, మూడు ఘట్టాలు పరీక్షకు ఎంపిక చేయాలి.

పరీక్ష ప్రారంభించడానికి ముందుగా ఆ నాటక ఇతివృత్తం, ఘట్టాలలో వచ్చే పాత్రలు, వారి గుణగణాలు మొదలైన విషయాలన్నీ నటులకు దర్శకుడు విశదీకరించాలి. తరువాత అభ్యర్థులను నటించమని చెప్పాలి. బాగా నటించినవారిని ఆ పాత్రధారునిగా ఎన్నుకోవాలి.

శ్రీ.చ.

ఎన్నియస్, క్వింటస్ (క్రీ.పూ. 239-169) : ప్రముఖ లాటిన్ నాటక రచయిత, కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి. దక్షిణ ఇటలీలోని రూడియేలో జన్మించి క్రీపూ. 204లో రోమ్ చేరుకున్నాడు. లాటిన్ నాటక సాహిత్యంలో ఒక నూతన ప్రేరణను తీసుకువచ్చాడు. రోమ్‌లో పాఠక లోకం లేకపోవడం వల్ల సహజంగా ఎన్నియస్ దృష్టి నాటక రచన మీద ప్రసరించింది. చాలా నాటకాలు రచించినా 20 విషాదనాటక శకలాలు మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి. ఈయనకు యూరిపిడీస్ అభిమాన రచయిత. ఈయన నాటకాలనే ఎన్నియస్ ఎక్కువగా అనువదించాడు. గ్రీకు నాటక భావాలనే ఎక్కువగా అంటి పెట్టుకున్నా, ఛందస్సులో, వ్యక్తీకరణ విధానంలో కొంత స్వాతంత్ర్యం వహించాడు. ఇఫిజీనియా నాటకంలో సైనిక బృంద గాయకులను ప్రవేశపెట్టాడు. గ్రీకు కవితతో పోలిస్తే ఇతని కవితలో ఆడంబరత్వం గోచరిస్తుంది. ఇతని నాటకాలలో రమణీయత, హృదయాలను కదిలించే శక్తి వ్యక్తమవుతాయి. ఎన్నియస్ విషాద నాటకాల ప్రభావం ఆ తరం వారి మీద ఎక్కువగా పడింది. ఎన్నియస్ ఆహ్లాద నాటక రచనకు కూడా పూనుకున్నాడు గాని అందులో కృతకృత్యుడు కాలేదు.

శ్రీ.చ.

ఎస్కిలస్ (క్రీ.పూ .525-456) : గ్రీకు నాటకకర్త. విషాద నాటక స్రష్టగా, మహాకవిగా విశ్వవిఖ్యాతి గాంచిన ఎస్కిలస్ క్రీస్తుపూర్వం 525లో గ్రీసు దేశంలో ఎల్యూసిన్ అనే గ్రామంలో జన్మించాడు. ఎస్కిలస్ తండ్రి యూఫోరిన్ ప్రభువుల వంశానికి చెందినవాడు. తల్లి కూడా ఉన్నత వంశానికి చెందిందే.

దేవుడు, జీవాత్మ, స్వర్గనరకాలు మొదలైన విషయాలలో గ్రీకుల నమ్మకాలకు, ఉత్సవాలకు ఎంతో దగ్గరి సంబంధం ఉంది. దేవతల శక్తిప్రభావాలు, మానవులకు దేవతలకు గల సంబంధం, విధి విలాసం, స్వర్గ నరకాలలో మానవుని భవిష్యజ్జీవితం మొదలైన క్లిష్ట సమస్యల పట్ల చిన్ననాటి వాతావరణ ప్రభావం ఇతని మీద కనిపిస్తుంది.

26వ ఏటనే ఈయన మొదటి నాటకం ఏథెన్స్ నగరంలో ప్రదర్శించాడు. ఆ కాలంలో దేవతోత్సవాలలో నాటకాలు ప్రదర్శించడానికి ముగ్గురు నాటకకర్తలను ఎన్నిక చేసేవారు. వారు నాటకాలు రాసి నటులకు శిక్షణ యిచ్చి ప్రదర్శింప జేసేవారు. ప్రదర్శన వ్యయాన్ని ధనికులు భరించేవారు. ఈ ఉత్సవాలను నడిపించే అధికారి గుణ నిర్ణేతలను ప్రేక్షకులే ఎన్నుకునేవారు.

గుణ నిర్ణేతలు ఈ ముగ్గురు నాటకకర్తల నాటకాలను చూచి వరుసగా ఒకటవ, రెండవ, మూడవ బహుమతులను నిర్ణయించే వారు.

ఎస్కిలస్ నాటకానికి మొదటిసారిగా క్రీస్తుపూర్వం 484లో అనగా నాటక రచనకు పూనుకున్న పదిహేను సంవత్సరాల అనంతరం బహుమతి లభించింది. నాడు నిర్వహించిన నాటక పోటీలలో ఎస్కిలస్‌కు పన్నెండు పర్యాయాలు బహుమతులు లభించాయి. అంటే క్రీస్తుపూర్వం 500–458 మధ్య ఎస్కిలస్ సాటిలేని మేటి నాటకకర్తగా వెలుగొందాడు. ఈయన దాదాపు తొంభై నాటకాలు రచించినట్లు తెలుస్తోంది. కాని ఇప్పుడు మనకు లభ్యమవుతున్న నాటకాలు ఏడు మాత్రమే. అవి 1. యూమనైడ్స్ (458 క్రీ.పూ.), 2. సప్లయంట్స్ (490 క్రీ.పూ.), 3. చియోఫోరి, (458 క్రీ.పూ.), 4 పెర్షయన్స్ (472 క్రీ.పూ.), 5. ఆగమెమ్నన్, (458 క్రీ.పూ.), 6. ప్రొమెథియస్ (460 క్రీ.పూ.), 7. సెవన్ ఎగనెస్టు తీబ్స్ (469 క్రీ.పూ.). ఎస్కిలస్ నాటకకర్త మాత్రమే కాదు, గొప్ప జాతీయ వాది, సైనికుడు, కలం, కత్తి పట్టిన వ్యక్తి. క్రీ.పూ.490లో పారశీకదేశపు బానిసత్వపు శృంఖలాలను తెంచుకోవడానికి గ్రీకుజాతి యావత్తూ ఉవ్వెత్తున లేచింది. ఎస్కిలస్ కూడా సైనికుడుగా చేరి 490–470 మధ్య కాలంలో పారశీలతో జరిగిన నాలుగు యుద్ధాలలోను పాల్గొని పోరాడాడు. వీరపతకం పొందాడు. 456లో అసువులు కోల్పోయాడు. గేలా అనే చోట అతని భౌతిక కాయాన్ని సమాధి చేశారు. ఎస్కిలస్ మరణించిన తరువాత అతని నాటకాలు ప్రదర్శించడానికి అధికారుల అనుమతి పొందాలని శాసనం చేయడం, సమకాలీన నాటక కర్తలలో అతని ఉన్నత స్థానాన్ని సూచిస్తుంది.

పూర్వపు నాటక పరిస్థితిని పూర్తిగా మార్చి రంగస్థలం మీదికి ఇద్దరు ముగ్గురు నటులను ప్రవేశపెట్టి సంభాషణల ద్వారా నాటకం నడిపించడమే గాక ఆయా పాత్రలకు అనుగుణమయిన దుస్తులను ధరింపజేసి భ్రమను సృజించిన ఘనత ఎస్కిలస్‌కు దక్కుతుంది. అర్థగాంభీర్యం, ఉదాత్త శైలి, నాటకీయత, ప్రేక్షక హృదయాలకు హత్తుకునే నాటక నిర్మాణం, కల్పనాశక్తి, కళా వైదగ్ధ్యం ఎస్కిలస్ నాటకాలలోని ప్రధాన లక్షణాలు.

మూడేసి తరాల వంశగాథలను, మూడేసి నాటకాలుగా రచించడానికి ఒరవడి పెట్టింది కూడా ఎస్కిలసే. తరువాత వచ్చిన గ్రీకు నాటకకర్తలు ఈ ఒరవడిలోనే నాటకాలు రచించారు. ఒక పాప కృత్యం సంవత్సరాలకు సంవత్సరాలు గడిచినా, ఇంకో పాపకృత్యానికి ఎలా దారి తీస్తుందో ఎస్కిలస్ నిరూపించాడు. ఈ మూడు నాటకాలలో మొదటిదానిలో పాపకృత్యం, రెండవదానిలో శిక్ష, మూడవదానిలో సమాధానం గోచరిస్తాయి.

నాటకం ప్రారంభించడంలో, పాత్రచిత్రణలో, నేపథ్యంలో జరిగిన సంఘటనలను కళ్ళకు కట్టినట్టు వర్ణించడంలో ఎస్కిలస్ ప్రజ్ఞ అసమానం. ఆగ్‌మెమ్నన్ నాటకం ప్రారంభించిన తీరు, నాయికను చిత్రించిన విధానం, ప్రపంచ కళా విమర్శకుల జోహారులందుకుంది.

ఎస్కిలస్ నాటకీయతకు ప్రాధాన్యమిచ్చాడు. ఈయన నాటకాలు సగంపైగా బృందగాన రూపంలోనే ఉన్నాయి.బృంద గాయకుల సంఖ్యను యాభై నుంచి పన్నెండుకు తగ్గించాడు. ఎస్కిలస్ నాటకాలలో ధీరోదాత్త పాత్రలనేగాక కాపలావాడు, దాది మొదలైన సామాన్య మానవులను కూడా పాత్రలుగా ప్రవేశపెట్టి వారిని ఎంతో వాస్తవికంగా చిత్రించాడు. భయస్వరూపాన్ని ద్యోతకం చేయడంలో ఎస్కిలస్ దిట్ట. భయచిహ్నాలు మానవునికి ఎలా క్రమక్రమంగా ఆవరిస్తాయో ద్యోతకం చేసిన విధానం నిరుపమానం. ఈయన రచించిన విషాద నాటకాలలో కథ ప్రఖ్యాతమైందే. ప్రేక్షకులు కథలో ముందేమి జరుగుతుందోననే జిజ్ఞాస కలిగించడంలో ఎస్కిలస్ బహునేర్పరి. ఎస్కిలస్ నాటకాలన్నింటిలో ప్రధాన రసం భయానకం. ఈ రసాన్ని సృష్టించడంలో ఈయనకు ఈయనే సాటి.

గ్రీకు నాటకాలు డయోనిసస్ ఉత్సవాలలో పుట్టడంవల్ల సహజంగా మతానికి ప్రాధాన్యం ఉంటుంది. ఎస్కిలస్ మతతత్వాన్ని తన నాటకాలలో పొందుపరిచాడు. ఆయన దృక్పథంలో మానవ జీవితమే విషాద సంభరితం, దేవతల శక్తి సామర్థ్యాలు అపారం. వారి నిగూఢ కార్యకలాపాలు దుర్భేద్యం. వారి కోపతాపాలు,అసూయ తిరుగు లేనివి. దుష్టశిక్షణ వారి పని. దేవతలు మానవుల కార్యకలాపాలను కనిపెడుతూ ఉంటారు. పాపులను శిక్షిస్తారు. పాపం మరొక పాపానికి దారితీస్తుంది. సాధారణంగా గ్రీకులు సంపద మానవ పతనానికి దారి తీస్తుందని నమ్మేవారు. ఈ సిద్ధాంతాన్ని తోసిరాజని, క్రూరకృత్యాలే మానవ పతనానికి కారణమని, పతన బాధ్యత మానవునిదేనని ఎస్కిలస్ తన నాటకాలలో సిద్ధాంతీకరించాడు. పాపభీతి మానవుణ్ణి పాపాల నుంచి, పతనం నుంచి కాపాడుతుందని ఆయన విశ్వాసం. అందుకే తన నాటకాలలో పాపభీతికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు.

శ్రీ.చ.

ఏక పాత్రాభినయం : నటనా భేదం. రంగస్థలం మీద ఒకే ఒక నటుడు ఏదో ఒక పాత్రను అభినయించి చూపడం ఏకపాత్రాభినయం. సంస్కృత రూపకాలలోని భాణం, వీధి మొదలైన రూపక భేదాలు ఒక రకంగా చెప్పాలంటే ఏకపాత్రాభినయాలే.

బళ్ళారి నాటక కవి చతుష్టయం ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, పండిత కె.సుబ్రహ్మణ్య శాస్త్రి, ధర్మవరం గోపాలాచార్యుల నాటకాలలోని దీర్ఘ స్వగతాలు

ఏకపాత్రాభినయానికి తొలిరేఖలు. అయితే ఇవి షేక్స్పియర్ నాటకాలలోని దీర్ఘ స్వగతాలలాగా పాత్ర మనోభావాలను, ఆలోచనలను ప్రేక్షకులకు తెలియచేయడానికి ఉద్దేశించినవే కాబట్టి వీటిని ఏకపాత్రాభినయాలుగా పరిగణించలేం.

కోలాచలం శ్రీనివాసరావు రచించిన రామరాజు చరిత్రం నాటకంలోని పఠాణి రుస్తుం దీర్ఘ స్వగతం శైలిలో మయసభలో దుర్యోధనుడు అనే ఏకపాత్రాభినయం మక్కపాటి వెంకటరత్నం రాశాడు. దానిని యడవల్లి సూర్యనారాయణ ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకంలో భాగంగా ప్రదర్శించేవారు. అప్పటికింకా ఏకపాత్రాభినయం విడిగా ప్రదర్శించే ఆచారం అమలులోకి రాలేదు. 1928లో శ్రీనివాస చక్రవర్తి 'రాయచూరు ముట్టడి' అనే తెలుగు నవలలోని రామయ్య పంతులు పాత్రకు వాచికం రాసుకొని ఆ సంవత్సరమే బందరులో జరిగిన అఖిల భారత విద్యార్థి మహాసభలలో ఏకపాత్రగా ప్రదర్శించాడు గాని అది ప్రేక్షకుల మనస్సు కెక్కలేదు. ఆ తరువాత ఈ ప్రక్రియను చేపట్టినవారే లేరు.

1929లో విజయవాడలో కాశీనాథుని నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావుల సన్మాన సందర్భంలో యడవల్లి సూర్యనారాయణ మయసభలో దుర్యోధనుని ఏకపాత్రాభినయం చేశాడు. ఇదే ఆంధ్ర దేశంలో మొదటిసారి ప్రత్యేకంగా జరిగిన ఏకపాత్రాభినయ ప్రదర్శన. ఈ ప్రదర్శన ప్రజల మన్ననలను పొందినా ఈ ప్రక్రియ మాత్రం ప్రచారంలోకి రాలేదు.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు 1958లో నాటక, నాటికల పోటీలతోపాటు ఏక పాత్రాభినయ పోటీలుకూడా నిర్వహించడం ప్రారంభించి ఏకపాత్రాభినయ ప్రక్రియకు తిరిగి ప్రాణం పోసింది. నాటి నుంచి నటుల దృష్టి, రచయితల దృష్టిఏకపాత్రాభినయ ప్రక్రియ మీదకు మరలింది. ఆ తరువాత ఎక్కడ నాటక పోటీలు జరిగినా వాటితోపాటు ఏకపాత్రాభినయ పోటీలు కూడా జరగడం పరిపాటయిపోయింది. కేవలం ఏకపాత్రాభినయ పోటీలు కూడా జరుగుతున్నాయి. అయితే హరీంద్రనాథ చటోపాధ్యాయ, వెంకోబారావు, రాళ్ళబండి కామేశ్వరరావు, డాక్టర్ చంద్రశేఖర రావు, రావి వెంకటాచలం, ఆంధ్రదేశంలో ఇంగ్లీషులో, తెలుగులో ఏక, ద్విపాత్రాభినయం చేస్తూ ఈ ప్రక్రియను బహుళ ప్రచారంలోకి తెచ్చారు. ధారారామనాథశాస్త్రి నాట్యావధానం కూడా ఏకపాత్రాభినయమే. తెలుగులో పెమ్మరాజు వేణుగోపాలమూర్తి, సోంపల్లి బాపయ్య, కొడాలి గోపాలరావు ప్రభృతులు ఏకపాత్రాభినయ పాత్యాలురాసి, పేరుపొందారు.

ఏకపాత్రాభినయంలో చిక్కులు, బరువులు ఎక్కువ. కనీసం పావుగంట సేపు ఒక్కడే రంగస్థలం మీద నటించి ప్రేక్షకులను ఆకట్టుకోవలసి ఉంటుంది. ఈ ఏకపాత్రాభినయ కాలం సాధారణంగా అరగంటకు మించదు. ఈ స్వల్ప కాలంలో వివిధ భావాలనేకం వ్యక్తీకరించవలసి ఉంటుంది. క్షణక్షణానికి భావం మారుతుండవచ్చు. ఈ భావాలు సాదృశ్య భాగాలు కావచ్చు విరుద్ధ భావాలు కావచ్చు. సాదృశ్య భావాలు వ్యక్తీకరించడం కొంతవరకు తేలిక. విరుద్ధ భావాలు క్షణ క్షణం మార్చడం బహుకష్టం. మయసభలో దుర్యోధనుని ఏకపాత్రాభినయ ప్రక్రియనే తీసుకొంటే ఆశ్చర్యం, అసూయ, కోపం, రోషం, పౌరుషం, పగ, కక్ష మొదలైన వివిధ భావాలు ఒక దాని తరువాత ఒకటి క్షణక్షణం మారుస్తూ వ్యక్తీకరించాలి. అలాంటిదే కోలాచలం శ్రీనివాసరావు రచించిన రామరాజు చరిత్రం నాటకంలో పఠాణీ రుస్తుం దీర్ఘ స్వగతం, ధర్మవరం కృష్ణమాచార్యుల చిత్రనళీయ నాటకంలోని బాహుకుడి దీర్ఘ స్వగతం, పానుగంటి లక్ష్మీ నరసింహరావు రచించిన రాధాకృష్ణ నాటకంలో రాధ ఏకపాత్రాభినయం. పెమ్మరాజు వేణుగోపాల కృష్ణమూర్తి అశ్వత్థామ కష్టతరమ్మైనవి. నటనలో ఎంతో సామర్థ్యం అలవరచుకుంటేనే గాని ఏకపాత్రాభినయం రక్తి కట్టదు. నిజానికి నటుని సామర్థ్యానికి గీటురాయి ఏకపాత్రా భినయం.

శ్రీ.చ.

ఏకాంకిక : ఒకే ఒక అంకంతో, ఒకే వస్తువుతో, ఒకే ఒక లక్ష్యంతో ఒక గంట ప్రయోగ కాలపరిమితితో విలసిల్లే దృశ్య కావ్య ప్రక్రియ ఏకాంకిక. దీనినే ఇపుడు తెలుగులో నాటిక అనీ, రూపిక అనీ అంటున్నారు. ఏకాంకమంటే ఒక రోజులో జరిగిన ఇతివృత్తం గలది. ఏకాంకిక, విశేషాంక నాటకానికి హ్రస్వ రూపంగా పైకి కనిపించినా, అది ప్రత్యేక స్వతంత్ర ప్రక్రియ. ఏకాంకిక నుంచే విశేషాంక నాటకం ఆవిర్భవించిందని కొందరు విమర్శకుల అభిప్రాయం. వేదాలలోని సంవాదాలు, సంస్కృత దశవిధ రూపకాలలోని వీథి, భాణం, ప్రహసనం, వ్యాయోగం, అంకం, ఉపరూపకాలలోని తొమ్మిది గోష్ఠి, నాట్య రాసకం, ఉల్లాప్యం, కావ్యం, ప్రేంఖణం, రాసకం, శ్రీగదితం, విలాసిక, హల్లీసకం, ఏకాంకికలే.

ఇంగ్లాండులో విక్టోరియా రాణి కాలంలో కర్టన్ రైజర్ (Curtain raiser) అనే పేరుతో అసలు నాటక ప్రదర్శనానికి ముందు ప్రదర్శించిన ఏకాంకికలు నేటి ఏకాంకికకు తొలి రేఖలు.

కాని నేడు ప్రదర్శిస్తున్న ఏకాంకిక ప్రత్యేక ప్రక్రియ. దీనికి ప్రత్యేక లక్షణాలు, శిల్పం ఉన్నాయి. ఒకే ఒక సన్నివేశం లేదా భావం, నాటి సంఘర్షణ ఏకాంకిక ప్రత్యేక లక్షణాలు. ఏకాంకికలో వాతావరణం, పాత్ర శీలం తొందరగా ద్యోతకం చేయాలి. నాటక పరిసమాప్తికి కథా విన్యాసం శరవేగంతో పయనించాలి. స్వల్ప వ్యవధిలో విశ్వసనీయతకు, విలువకు భంగం కలుగకూడదు. కథకు ప్రాణతుల్యమైన సంభాషణలు తాపీగా, సహజంగా సాగాలి.

ఏకాంకికలో ఒకే ఒక సన్నివేశం, సంఘర్షణ చిత్రితమవుతుంది కాబట్టి, రచనలలో పొదుపు, సంక్షిప్తత అత్యవసరం. ఈ పొదుపును వివిధ విధానాల ద్వారా సాధించవచ్చు. ప్రధాన పాత్రకు ఎక్కువ ప్రాముఖ్యం కలిగించడానికి పాత్రల సంఖ్య తగ్గించాలి. అవసరం కంటే మించి ఒక మాట కూడా సంభాషణలో ఉండకూడదు. వాచిక, ఆంగికాభినయాలు, సంచాలనం, రంగం మీది వస్తువుల ఏర్పాటు విషయంలో సూచనలు సంపూర్ణంగా ఉండాలి. అప్పుడు అనవసరంగా కాలయాపన జరగదు. దాని వల్ల సన్నివేశ పరిణామం సంక్లిష్టత, సంఘర్షణను పతాక స్థాయికి తేవడం తేలిక. దాని పరిష్కారం విశేషాంక నాటకంలో కంటే ఏకాంకికలో విభిన్న మార్గంలో చిత్రించవలసి ఉంటుంది. పాత్రశీలాన్ని ఒక్క క్షణంలో తళుక్కుమనిపించాలి గాని, విశేషాంక నాటకంలోలాగా ఎక్కువ వ్యవధి తీసుకోకూడదు. ఒక్కమాటలో గాని, ఒక్క చేష్టలో గాని వ్యక్తీకరించాలి.

ఐక్యత్రయం (కాలైక్య, వస్త్వైక్య, స్థలైక్యాలు) ఏకాంకికకు ఎక్కువగా బలం చేకూరుస్తుంది. అంకం అంతటినీ ఒకే ఒక రంగంగా చిత్రించవచ్చు లేదా రంగాలుగా విభజించు కోవచ్చు. ఒకే రంగమైతే బిగువు ఎక్కువగా ఉంటుంది. నాటక కథా కాల పరిమాణం, ప్రయోగ పరిమాణం తక్కువ కాబట్టి ఉపకథలు, దీర్ఘ సంభాషణలు నిబంధించడం ఏకాంకికకు హానికరం. పాఠకులలో, ప్రేక్షకులలో ఆశ్చర్యం జనించే విధంగా ఏకాంకిక సమాప్తం కావాలి. ఇలాంటి సమాప్తిని కొసమెరుపు అంటారు. ఉదాహరణకు కొప్పరపు సుబ్బారావు నేటి నటుడు అనే ఏకాంకికలో మాధవరావు అనే నటుడు తన భార్య మాలతి ఎవరితోనో లేచిపోయిందనే భావం ఆ రంగం మీది పాత్రలకు, ప్రేక్షకులకు కలిగిస్తాడు చివరికి అదంతా నటన అని తేలిపోతుంది.

తెలుగులో తొలి ఏకాంకికారచనకు పూనుకున్నది కందుకూరి వీరేశలింగం. అయితే ఈ ఏకాంకికలను ప్రదర్శించడం కోసం రాయలేదు. సాంఘిక సంస్కరణలకు ఆయుధంగా ఏకాంకికను చేపట్టాడు. కందుకూరి తరువాత చిలకమర్తి, పానుగంటి ఏకాంకికలను ప్రహసనాలనే పేరుతో రాసి ప్రచురించారు. పాఠశాల, కళాశాల విదార్థులు వార్షికోత్సవాలలో వీటిని ఎక్కువగా ప్రదర్శించేవారు. జీవిక (వృత్తి) నటులు వీటి జోలికి పోలేదు.

ఔత్సాహిక నాటకరంగం వేళ్లూనిన తరువాత ఏకాంకికలకు తెలుగు నాట ఎక్కువ ప్రాచుర్యం వచ్చింది. తెలుగు ఏకాంకికలను శ్రీపాద గోపాల కృష్ణమూర్తి ఇలా వర్గీకరించాడు. 1. పౌరాణిక, చారిత్రక పాత్రల చిత్రణ – చలం భానుమతి, బుచ్చిబాబు, తిష్యరక్షిత మొదలైనవి; 2. కాల్పనిక వాతావరణ చిత్రణ – అవధాని జగజ్యోతి, కృష్ణశాస్త్రి ఊర్వశి మొదలైనవి; 3. వ్యాఖ్యాన దృష్టి – జి.వి. కృష్ణారావు భిక్షాపాత్ర. ఏకాంకికల వెలువడిన తొలి రోజులలో చింతా దీక్షితులు, కవికొండల వేంకటరావు, అడివి బాపిరాజు ప్రభృతుల రచనలు; 4. కథా ప్రధానాలు చందూరి నాగేశ్వరరావు, ముద్దా విశ్వనాథం ప్రభృతుల రచనలు; 5. జీవితంలోని సన్నివేశ చిత్రణ – మల్లాది రామకృష్ణశాస్త్రి బాల, వేంపటి నాగభూషణం కళాకేళి, నార్ల వేంకటేశ్వరరావు నాటికలు మొదలైనవి; 6. ఉప (సం) దేశాత్మకాలు – సోమయాజుల వేంకట రామమూర్తి సిద్ధౌషధం, అవధాని భద్రకాళి, ముద్దుకృష్ణ టీ కప్పులో తుఫాను మొదలైనవి. పి.వి. రాజమన్నారు రచనలలో సందేశంతో పాటు సూక్ష్మ దృష్టి, వివేచనాశక్తి ఉన్నాయి. విశ్వనాథ కవిరాజు రచనలు వినోదాత్మకాలే కాక, సంస్కారాన్ని పెంపొందిస్తాయి. (తెలుగు నాటక వికాసము, పుట 401)

తెలుగులో శరపరంపరగా వచన ఏకాంకికలు వెలువడుతున్నా, పద్య, గేయ నాటికలు కూడా విరివిగానే వెలువడుతున్నాయి. కొప్పరపు సుబ్బారావు అల్లీముతా వందల సార్లు ప్రదర్శితమైంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి, రజనీకాంతరావు, నండూరి రామకృష్ణమాచార్యులు, సి. నారాయణరెడ్డి ప్రభృతులు పద్య గేయ నాటికలు రచించి, తెలుగు ఏకాంకికా సాహిత్యానికి పుష్టి చేకూర్చారు. అల్లీముతా, పద్మావతీ చరణ చారణ చక్రవర్తి, ఊర్వశి, చండీదాసు, పద్య, గేయ నాటికలకు మచ్చుతునకలు.

ఇక కేవలం వచన ఏకాంకికలకు తెలుగులో నేటి నటుడు, దొంగాటకం, దయ్యాల లంక, భిక్షాపాత్ర, ఇంగ్లీషులో రైడర్స్ ఆఫ్ ది సీ, ది లిటిల్ మాన్, ది ఫ్లయిట్ ఆఫ్ ది క్వీన్ మచ్చుతునకలు.

శ్రీ.చ.

ఐక్యత్రయం : ప్రతి కళ కొన్ని కొన్ని సమయాలు లేక సాంకేతికాలతో విరాజిల్లుతుంటుంది. ఈ సమయాలలో కొన్ని నియమాలు, కొన్ని ఐచ్ఛికాలుగా ప్రారంభమైన సమయాలు, సంప్రదాయంగా మారి, ఆ తరువాత నియమాలుగా అంటే అనుశాసనాలుగా పరిణమిస్తుంటాయి. నాటకకళలో అలాంటి కళా సమయాలే ఐక్యత్రయం. అవి స్థలైక్యం, కాలైక్యం, వస్త్వైక్యం. ఒకే ఒక స్థలంలో నాటకమంతా జరగడం స్థలైక్యం. ఒకే ఒక కథను పొందుపరచడం వస్త్వైక్యం. కాలైక్యం అంటే కథ జరిగినంత కాలంలోనే ప్రదర్శన జరగడం. (వివరాలకు ఆయా శీర్షికలు చూడండి.)

గ్రీకు లక్షణవేత్త అరిస్టాటిల్ వస్త్వైక్య, కాలైక్యాలను మాత్రమే ప్రస్తావించాడు గాని స్థలైక్య విషయం ప్రస్తావించలేదు. అయితే ఈ రెంటినైనా ఆయన తప్పనిసరి నియమాలుగా చెప్పలేదు. నాటి విషాద నాటకాలలో ఎక్కువగా గోచరించే యదార్థాలను అరిస్టాటిల్ పొందుపరిచాడు. తప్పనిసరి నియమాలు చెప్పలేదు. ప్రాచీన గ్రీకు నాటక కవులెవరూ ఈ ఐక్యత్రయాన్ని కచ్చితంగా పాటించలేదు. సోఫోక్లిస్ రచించిన అజాక్స్ నాటకంలోను, ఎస్కిలస్ రాసిన యుమెనైడ్స్ నాటకంలో స్థలైక్యత లేదు. ఎస్కిలస్ రాసిన అగమెమ్నాన్ నాటకంలోను,

యురిపిడీస్ రాసిన సప్లయంట్స్ నాటకంలోనూ కాలైక్యం కనిపించదు. దీనిని బట్టి ప్రాచీన గ్రీకు నాటకకర్తలు వాటిని ఇచ్ఛికంగా ప్రయోగించారేగాని నియమంగా పెట్టుకోలేదని నిర్ధారణ అవుతోంది. కొంతవరకయినా వీటిని ప్రాచీన గ్రీకు నాటకకర్తలు పాటించడానికి కారణం ఆనాటి నాటక రంగం పరిస్థితులే. ఆనాటి నాటకరంగంలో తెర లేదు. రంగభూమిక లేదు. బృంద గాయకులు రంగస్థలం నుంచి నిష్క్రమించడమంటూ లేదు. అందుచేత ఈ సమయాలు కొంతవరకు అవసరమయ్యాయి.

అయితే వస్త్వైక్యతను పాటిస్తే తక్కిన రెండు ఐక్యతలు వాటంతటవే సురక్షితమవుతాయి. స్థల, కాల మార్పుల వల్ల వస్త్వైక్యత దెబ్బతినే ప్రమాదముంది. కొన్ని స్పెయిన్ నాటకాలలో ప్రథమాంకంలో కథా నాయకుడు పుట్టి, నాటకం చివర వృద్ధుడుగా రంగం మీదకు వస్తాడు. ఆద్యంతాల మధ్య అతని జీవితంలో ఏమి జరిగింది కథన రూపంలో చెప్పవలసి రావడం వల్ల ఆ నాటకాలు చప్పగా ఉండేవి. అయితే షేక్స్పియర్ రాసిన వింటర్స్‌టేల్‌నాటకంలో అంకానికి అంకానికి మధ్య సంవత్సరాలు గడచినా నాటక ఐక్యత దెబ్బతినలేదు.అలాగే ఉత్తర రామచరిత్రలో రెండు మూడు అంకాల మధ్య పన్నెండు సంవత్సరాలు గడిచినా నాటక ఐక్యత చెడలేదు.

నాటకకర్త తన శక్తి సామర్థ్యాల వల్ల ప్రేక్షకులను/పాఠకులను ఏ సుదూర ప్రదేశాలకో, ఏ కాలంనాటికో విజయవంతంగా తీసుకువెళ్ళగలిగితే మనం కాలం విషయం పట్టించుకోము. ప్రతి అంకం చివర ఎంత కథా కాలం గడించిందీ అని లెక్కించే పట్టికలు లేవు. ప్రేక్షకులు కాలాన్ని మలిచేటట్లుగా చేయడమే కవిశిల్పం. నాటక ప్రపంచం యదార్థ ప్రపంచమనే విశ్వాసం కల్పించడం కష్టం.

ఫ్రెంచి, రోమన్ నాటక కవులు వస్త్వైక్యత మీద తక్కిన రెండు ఐక్యతలు ఆధారపడేటట్లు చేయకుండా, వస్త్వైక్యతను తక్కిన రెంటికీ బానిసగా చేశారు. అందుచేత సంఘటనా పరంపరను, భావసంఘర్షణను ఇరవై నాలుగు గంటలకు కుదించవలసి వచ్చింది.

శ్రీ.చ.

ఐవర్ నాటకం : కేరళ ప్రాంతంలో ప్రదర్శించే జానపద నాటకం. దీనినే ఐవర్‌కలి, పాండవర్‌కలి, తట్టిన్‌మోల్ కలి అని కూడా అంటారు. జానపద నాటకాల్ని అనుష్ఠాన నాటకాలు, అనుష్ఠానాభాస నాటకాలు, సాంకేతికాభాస నాటకాలు, అనుష్ఠానేతర నాటకాలుగా విభజించారు. ఐవర్ నాడగం అనుష్టానేతర నాటకాలలో ఒకటి. పురాట్టు నాడకం. కాక్కాళ్ళిచ్చి నాడకం, చవిట్టు నాటకాలు కూడా ఈ కోవలో ప్రస్తావించదగినవి. పాండవులకు సంబంధించిన కథను నాటకరూపంలో ప్రదర్శించడంవల్ల దీనిని పాండవర్ కలి అని, ఆసారి, ముసారి, తట్టాన్, కరువాన్, చెంబోటి కమ్మాళవర్ వంటి ఐదు (ఐవర్) కులాల కథకు సంబంధించింది, కాబట్టి ఐవర్ నాడకం అని అంటారు. పాండవర్‌కళి పేరు కంటే ఐవర్ నాడకం పేరే ప్రబలంగా ఉంది. కేరళ రాష్ట్రంలో 75% కళారూపాలు ఆ కళల్ని ప్రదర్శిస్తున్నవారి పేరుతోనే వ్యవహరింపబడుతున్నాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులేగాక ఈళవ, దళితులు కూడా ప్రదర్శిస్తారు.

ఐవర్ నాడకం రంగస్థలాన్ని భగవతి ఆలయ సమీపంలో ఏర్పాటు చేస్తారు. ఇది ఐదు మెట్లుగా అమర్చబడి ఉంటుంది. వెదురుబంగులు నాటి, పందిరి వేసి దానిక్రింద ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారు. పందిరి ముందు ఉన్న బంగులకు అరటిచెట్లు నాటి, పూలతో అందంగా అలంకరిస్తారు. ఐదు లేక ఏడు వత్తులు వేసి వెలిగించిన దీప స్తంభాల ముందు బియ్యం, పూలు, కొబ్బరి, బరుగులు పళ్ళేరాల్ని ఉంచుతారు. నటులు దీపస్తంభం చుట్టూ నిలబడి, అడుగులు వేస్తూ వలయాకారంగా తిరుగుతారు. నటులు స్నానం చేసి ముఖంపై తెల్లని విభూతిరేఖలు దిద్దుకొని, చలువవస్త్రాలు కట్టి, తెల్లనిదోతి దానిపై పట్టుకండువాను నడుముకు కట్టుకుంటారు. నుదురు, రొమ్ము, చేతులు, మెడకు రంగు పూసుకుంటారు. ఇలా వేషం వేసుకున్న నటులు మధ్యలో పెట్టిన దీపస్తంభం చుట్టూ నాట్యం చేస్తారు. దీనినే 'వట్టికళి' అంటారు. నాటక ప్రారంభానికి ముందు గణపతిస్తుతి, గురుస్తుతి, ఇష్టదేవతాస్తుతి చేసి దీపస్థంభం చుట్టూ కూర్చుని దానికి మ్రొక్కుతారు. ఆ తర్వాత నాటక గురువు వందనస్తుతి పాడుతాడు. ఈ ప్రార్థన అయిన తర్వాత నాటకం ప్రారంభం అవుతుంది. ఇలా రాత్రి 8, 9 గంటలకు ప్రారంభమైన ఈ నాటకం ప్రాతఃకాలం వరకు కొనసాగుతుంది.

ఐవర్ నాడకం గాన ప్రధానమైంది. గురువు ఆశువుగా కొన్ని పద్యాలు, పాటలు పాడుతాడు. ఇందులోని భాష శిష్ట సాహిత్య భాష అని చుమ్మార్‌చూండాబ్ లాంటి పరిశోధకుల అభిప్రాయం. అయినా ఇది శాస్త్రీయ సంప్రదాయ నాటకం కాదు. ఈ నాటకంలో 1. వట్టికళి (వలాయాకర నృత్యం లేక వందన నృత్యం), 2. కోల్‌కళి (కోలాట నృత్యం), 3. పరిచ్చకళి లేక పరిచ్చముట్టుకళి (ఔద్ధత్య నృత్యం లేక యుద్ధ నృత్యం) అనే నృత్యరీతులుంటాయి. వట్టికళిలో కోల్‌మని, పుంటి, గజ్జలు కట్టిన చేతి కట్టెలు వాద్యాలుగా ఉంటాయి. ఈ వాద్యాలకు, పాటలకు అనుగుణంగా చేతులు తడుతూ ఆడతారు. ఇది కుమ్మి, కైకొట్టికళి, కన్నియర్‌కళి నాట్యాన్ని పోలి ఉంటుంది. కోల్‌కళి నృత్య సంప్రదాయంలో కోలాటం ఆటలాగే ఆడతారు. వారి చేతుల్లో అందంగా ఉండే కోలాటం కట్టెలుంటాయి. వాటిని పాటకు, వాద్యాలకు అనుగుణంగా కొడుతూ చాలా ఉధృతంగా

ఆడుతుంటారు. ఇక పరిచ్చకళిలో యుద్ధ దృశ్యాల్ని ప్రదర్శిస్తారు. ఒకచేత కత్తి, మరోచేత డాలు ధరించి చాలా ఉద్ధృతంగా దీన్ని ప్రదర్శిస్తారు. దీనికి కఠోరదీక్ష, అభ్యాసం ఉంటే తప్ప ప్రదర్శించడం కష్టం.

ఐవర్ నాటకాన్ని ఉత్తర కేరళ రాష్ట్రంలోని ఈళవజాతి వారు కార్తీక పండుగరోజు ప్రదర్శిస్తారు. కొన్ని సందర్భాలలో ఈ నాటకాన్ని మూడు రాత్రులు ప్రదర్శిస్తారు. సర్వసాధారణంగా ఇందులో మహాభారతంలోని కథల్ని ప్రదర్శిస్తుంటారు. అయినా రామాయణకథకు సంబంధించిన నాటకాలు కూడా ఉంటాయి. ఇందులో వారు 'కిళిప్పాట్టు' ఛందస్సులో పాటలు పాడుతారు. ఇవి కేరళలోని జానపద గీతాల్ని పోలి ఉంటాయి. ప్రస్తుతం ఈ నాటకాన్ని అకాడమీలు, సాంస్కృతిక సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి.

ఆనందన్

ఓకాసీ, సీన్ (1880-1963) : ఐరిష్ నాటకకర్త. హాస్య, విషాద ఇతివృత్తాలలో నాటక రచన చేపట్టిన ఒకాసీ 1880, మార్చి 30న డబ్లిన్‌లో జన్మించాడు. నగరాల్లోని మురికి పేటల్లో దుర్భర జీవితాన్ని గడిపే బడుగు జీవుల దయనీయ జీవితాన్ని తన నాటకాల్లో ప్రముఖంగా ప్రస్తావించిన తొలి నాటకకర్త సీన్ ఓకాసి. ఐర్లెండు స్వాతంత్ర్య పోరాటాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని, తన కళ్ళవయుందు కదలాడిన పోరాటవీరుల్నీ,యూనియన్ నాయకుల్నీ, తాగు బోతుల్నీ, పడకకుర్చీ దేశభక్తుల్నీ, భీరువుల్నీ, ఆయుధ ధారుల్నీ, వాళ్ళ చుట్టూ మసలే స్త్రీలనూ పాత్రలుగా మలచి నాటక రచన చేపట్టాడు. హింసా, విధ్వంసాల పట్ల ఒకాసీ అసంతృప్తిని ఈయన నాటకాల్లో గమనిస్తాం. స్త్రీ పాత్రల నేత్రాల ద్వారా హింసాగ్ని జ్వాలల్ని ప్రజ్వ లింప జేస్తాడు. వ్యవస్థలోని వైరుధ్యాలను ఈయన నాటకాలు ప్రస్తావించడమే కాదు, ప్రతిఘటిస్తూ ఉంటాయి. మానవునిలోని కాపట్యాన్నీ, కృత్రిమత్వాన్ని ఎండగడుతూ ఉంటాయి. హాస్య వ్యంగ్యాలు ఒకాసీ ఆయుధాలు. విషాద హాస్యం ఈయన రచనా ధోరణి. మానవతే ముఖ్య ఇతి వృత్తం.

ఒకాసీకి ఆరేళ్ళప్పుడు తండ్రి మైఖేల్ కాసీ వెన్నెముక గాయంతో మరణించాడు. దీనితో కుటుంబం వీధిన పడింది. డబ్లిన్ మురికి పేట నివాసమైంది. కంటి వ్యాధి సోకి చిన్ననాడే ఒకాసీ ఎడమ కన్ను చూపు కోల్పోయింది. కుడికన్ను కూడా దెబ్బతింది. ఫలితంగా పాఠశాల చదువు మూడేళ్ళతోనే ముగిసింది. పధ్నాలుగు సంవత్సరాల వయసులో నిఘంటువుల సహాయంతో చదవటం, రాయటం అలవాటు చేసుకొన్నాడు. బైబిల్‌లో పాండిత్యం సంపాదించాడు. 45 సంవత్సరాలు వచ్చేవరకూ ఓడ పనివారితో, భవన నిర్మాణ కార్మికులతో కలసి పని చేశాడు. సంగీత, నాటక కార్యక్రమాలకు సహకరించే కంపెనీకి సెంట్‌లారెన్స్ ఓ టూల్ క్లబ్ స్థాపనకు తోడ్పడ్డాడు. ఈ సమయంలోనే తన పేరును జాన్ ఒకాసీ నుండి సీన్ ఒకాసీ గా మార్చుకొన్నాడు. 1914లో ఐరిష్ సిటిజన్ ఆర్మీ కార్యదర్శిగా పనిచేశాడు. 1918లో తల్లి మరణించింది. 1919లో ది స్టోరీ ఆఫ్ ఐరిష్ సిటిజన్ ఆర్మీ అనే గ్రంథాన్ని రాశాడు. నాలుగు దశాబ్దాల పాటు డబ్లిన్ నగర మురికి పేటల్లో నివసించి, దుర్భరమైన బతుకు గడిపిన సీన్ ఒకాసీ తన నలభై మూడో సంవత్సరంలో నాటక రచనకు పూనుకొన్నాడు. తాను గడిపిన జీవిత నేపథ్యంలో, ఐరిష్ స్వాతంత్ర ఉద్యమ పోరాటం కేంద్ర బిందువుగా, మూడు నాటకాలను రాసి అబ్బీ థియేటర్‌కు అందించాడు. ఆ థియేటర్ డైరెక్టర్స్ ఒకాసీ పంపిన మూడు నాటకాలనూ తిరస్కరించారు. నాటక రచయితగా తన స్థానాన్ని సుస్థిరం చేసిన ది షాడో ఆఫ్ ఎ గన్‌మాన్ అనే నాటకాన్ని 1923లో రాశాడు. మూడు రాత్రులు విజయవంతంగా అబ్బీ థియేటర్ ఈ నాటకాన్ని ప్రదర్శించింది. సిన్‌ఫియన్ దేశభక్తులకు, బ్రిటిష్ సైనికులకూ మధ్య జరిగిన సమరాన్ని ఈ నాటకం వెల్లడిస్తుంది. ఈ నాటకానికి మొదట ఆన్ ది రన్ అని పేరు పెట్టాడు. నిజ జీవితంలోని వ్యక్తుల్నే ఈ నాటకంలో పాత్రలుగా రూపొందించాడు.

1924లో జూనో అండ్ ది పికాక్ అనే విషాద హాస్య నాటకాన్ని రాశాడు. ఈ నాటకంతో అబ్బీ థియేటర్ దశ తిరిగింది. దివాళాస్థితిలో ఉన్న ఆ థియేటర్ తిరిగి పుంజుకొంది. ఈ నాటకం రెండువారాల పాటు ప్రదర్శింపబడింది. ఐరిష్ పట్టణ బడుగు జీవుల యాస భాషను వాడాడు. ఆశలకూ, యదార్థాలకూ ఉన్న అంతరాలను చూపి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాడు. 1922లో డబ్లిన్‌లో జరిగిన యుద్ధ భీభత్స నేపథ్యం ఈ నాటకంలో ఇతివృత్తం. 1926లో ది ప్లవ్ అండ్ ది స్టార్స్ అనే విషాద హాస్య నాటకాన్ని రాశాడు. ది ప్లవ్ అండ్ ది స్టార్స్ బానర్‌తో సాగిన ఐరిష్ స్వాతంత్ర్య పోరాటం ఈస్టర్ తిరుగుబాటు నేపథ్యంలో ఈ నాటక రచన సాగుతుంది. ఈ నాటకంలోని కొన్ని సన్నివేశాలు డాక్యుమెంటరీ పద్ధతిలో సాగుతాయి. రొమాంటిక్ అయిడిలిజంతో ఉన్న వాస్తవికవాద నాటకమది. స్వాతంత్ర్యమనేది ఒకటే. ఉన్నవారికీ లేని వారికీ సమంగా ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి అన్నభావం ఈ నాటకంలో తెలియజేస్తాడు ఒకాసీ. తమ అస్తిత్వానికే ముప్పు ఏర్పడ్డప్పుడు

మురికివాడ నివాసులంతా ఏకమవుతారన్న వాస్తవాన్ని వెల్లడిస్తాడు.

1929లో ఒకాసీ రాసిన ది సిల్వర్ టాస్సీ ట్రాజీ కామెడీ మొదటి ప్రపంచ యుద్ధ బీభత్స పరిస్థితుల్ని అభివ్యక్తి ధోరణిలో వెల్లడించే నాటకం. 1929లో ది సిల్వర్ టాస్సీ నాటక ప్రథమ ప్రదర్శన లండన్‌లో జరిగింది. 1934లో విత్‌ఇన్ ది గేట్స్ నాటక ప్రదర్శనను చూడడానికి న్యూయార్కుకు వెళ్ళాడు. 1939లో తన కుటుంబాన్ని లండన్ నుండి టోట్నెస్‌కు మార్చి 1955 వరకూ అక్కడే గడిపాడు. విత్ ఇన్ ది గేట్స్ పూర్తిగా ఎక్స్‌ప్రెషనిజం ధోరణిలోరాయబడిననాటకం. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి ఇలా నాలుగు సీన్లు. నాలుగు ఋతువులకు సంకేతంగా ఉంటాయి. బిషప్, స్వాప్నికుడు, యువతి ఈ నాటకంలోని పాత్రలు. ఒకరితో మరొకరు విభేదించుకొంటారు.

1940లో ది స్టార్ టర్న్ రెడ్ అనే నాటకాన్ని ఫాసిజంకు వ్యతిరేకంగా రాశాడు. కమ్యూనిష్టులకు, ఫాసిస్టులకు మధ్య సమరం ఈ నాటకం ఇతివృత్తం. 1943లో రాసిన రెడ్ రోజెస్ ఫర్ యు నీతిబోధక నాటకం. కవిత్వం పట్ల విపరీత అభిమానం గల ప్రొటెస్టెంట్ కార్మికుని కథ ఈ నాటకం. 1947లో ఒకాసీ రాసిన ఒక్ లీవ్స్ అండ్ లావెండర్ నాటకం రెండో ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటీష్‌ప్రజల్లో గూడు కట్టుకొన్న దేశాభిమానం గురించి తెలియజెప్పే నాటకం. సంగీతం స్వేచ్ఛగా ఉపయోగింపబడ్డఈ నాటకంలో భావుకత, వాస్తవికతలు సరిసమంగా మిళితం చేయబడ్డాయి. బ్లాక్ అవుట్స్, సైరన్‌లు, బాంబుల మోతలు, హోంగార్డుల కవాతులు, శవపేటికలు నాటక ప్రదర్శనలో భాగాలు.

1949లో ఒకాసీ రాసిన కాక్-ఎడొడిల్-డాండీ. ఓ ప్రతీకాత్మక హాస్య నాటకం. 1955లో ది బ్రిటీష్ బోన్‌ఫైర్ అనే హాస్య నాటకాన్ని రాశాడు. నైతిక కపటత్వానికి ప్రతీకగా ఈ నాటకాన్ని రూపొందించాడు ఒకాసీ. హాస్య, విషాద నాటకాలన్నీ కలిపి, మొత్తం ఇరవైరెండు వరకూ రాశాడు. తన మీద బెర్నాడ్‌షా ప్రభావం ఉందని ప్రకటించే ఒకాసీ, ఐర్లెండ్ ప్రజలు దారిద్ర్యం, ఆకలి, రోగాల నుండి విముక్తం కావటానికే తాను నాటక రచన చేపట్టానని ప్రకటించాడు. 1963, సెప్టెంబర్ 18న తుది శ్వాస విడిచాడు.

రమణ

ఓనీల్, యూజీన్ (1888-1953): అమెరికా నాటకకర్త, తండ్రి జేమ్సు ఓనీల్. విఖ్యాత నటుడు. ఓనీల్ పత్రికారచయితగా జీవితం ప్రారంభించాడు. ఆ తరువాత నాటక రచనకు పూనుకుని చాలా నాటకాలు రచించాడు. న్యూయార్క్‌లో మొట్టమొదట ప్రదర్శింప బడిన నాటకం బియాండ్ ది హొరైజన్ (1920). ఈ నాటకానికి ఓనీల్‌కు పులిట్జర్ బహు మతి లభించింది. అప్పటి నుంచి 1934 వరకు నాట కాలు ధారావాహికంగా రచించాడు. ఈయనకు 1936లో నోబుల్ బహుమతి ప్రదానం చేశారు. ఆ తరువాత 1946 వరకు ఓనీల్ నాటకరంగం నుంచి తప్పుకున్నాడు. ఇరవయ్యవ శతాబ్ది నాటక రచయితలలో ఈయన నాటకాలు వివాదగ్రస్తంగా పరిణమించాయి.

1920లో బియాండ్ ది హొరైజన్, ఎంపరర్ జోన్స్, అన్నాక్రిస్టీ(1921), 1922లో హేరీ ఏప్, డిజైర్ అండర్ ది ఎల్మ్స్, ది గ్రేట్ గాడ్ బ్రౌన్, మార్కోమిలియన్స్, స్ట్రేంజ్ యింటర్లూడ్, మోర్నింగ్ బికమ్స్ఎలక్ట్రా, 1924లో లాంగ్‌వాయేజ్ హోం మొదలైన నాటకాలు రచించాడు. ఈయన రచించిన బియాండ్ ది హొరైజన్ నాటకాన్ని గొల్లపూడి మారుతీరావు రాగరాగిణి అనే పేరుతో తెలుగులోకి అనువదించాడు.

శ్రీ.చ.

ఓబులయ్య, పత్తి (జ.1952): రంగస్థల నటుడు, అధ్యాపకుడు, దర్శకుడు, రచయిత. రసమాధురి సంస్థ స్థాపకుడు. లలిత కళా సమితి (కర్నూలు) అధ్యక్షుడు. ప్రకాశం జిల్లాలోని జెల్లివారి పుల్లల చెర్వులో 1952, జనవరి 1న జన్మించాడు. తల్లిదండ్రులు పిచ్చమ్మ, పిచ్చయ్యలు. ఓబులయ్య తండ్రి పౌరాణికులు కావడం వల్ల, చిన్నప్పుడే పద్య పఠనంపట్ల ఆసక్తి పెంచుకున్నాడు. స్నాతకోత్తర స్థాయి దాకా చదువుకొన్న ఓబులయ్య కళాశాల అధ్యాపకుడుగా కర్నూలులో స్థిరపడ్డాడు. పద్యనాటకంపట్ల అభిమానం పెంచుకొన్న ఓబులయ్య మొట్టమొదట శ్రీకృష్ణరాయబారం నాటకంలోని దుర్యోధన పాత్రతో నట జీవితం ప్రారంభించాడు. ప్రదర్శన కళల ప్రయోజనం గుర్తించి రసమాధురి అనే కళావేదికను ఏర్పాటు చేసి, నాటకాల ప్రదర్శనతో పాటు సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించాడు. రచయితగా *రంగస్థలం, తెలుగుభోజుడు, యేసు శతకం, కనక శురభేశ్వరచరిత్ర, తెలుగు వెలుగు* మొదలైన రచనలు

చేశాడు. లలిత కళా సమితికి అధ్యక్షుడుగా ఉంటూనే రావణాంజనేయ యుద్ధం లో విశ్వామిత్రుడు, శ్రీకృష్ణ రాయబారంలో అర్జునుడు, యమాంజనేయ యుద్ధంలో బభ్రువాహనుడు, నరనారాయణలో దుర్యోధనుడు, చింతామణిలో బిల్వ మంగళుడు పాత్రలలో నటించాడు. లలిత కళా సమితి పక్షాన డి. విజయ భాస్కర్ రచించిన పులి స్వారీ సాంఘిక నాటకానికి దర్శకత్వం వహించి నంది నాటకోత్సవాలలో ప్రదర్శించి ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నాడు. తరువాత ఈ నాటకాన్ని రాష్ట్రంలోను, రాష్ట్రేతర కళా వేదికలపై ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలకు పాత్రుడయ్యాడు. లలిత కళా సమితి అధ్యక్షుడుగా ఎక్కువ కాలం పనిచేసిన వారిలో ఓబులయ్య ఒకడు.

దాసరి.ఎస్.

కంచుకి : సంస్కృత నాటక సాహిత్యంలోని రూఢి పాత్ర. అభ్యంతర (అంతఃపుర) పరివారంలోని వాడు. అంతఃపుర సంరక్షకుడు. రాజభక్తి పరాయణుడు. ఈతని రాజసేవ కత్తి మీద సాములాంటిది. కంచుకమంటే కవచం. కవచం ధరించువాడు కంచుకి. కంచుకం అంటే వేషానికి తగిన నడవడి. ఆ నడవడిని ఆచరించేవాడు కాబట్టి కంచుకీయుడు అని అభినవ భారతిలో అర్థం కనిపిస్తోంది. తలకు పాగా, శరీరానికి కవచం, చేతిలో కర్ర కంచుకి వేషం. కంచుకి గతి వయసును, అవస్థను బట్టి ఉంటుంది. ముసలి వాడయితే కంపిస్తూ చేతి కర్రను ఊతగా చేసుకొని అడుగులు మెల్లగా వేస్తూ నడవాలి. వృద్ధుడు కాని పక్షంలో అర్థతాల పరిమితంగా పైకెత్తుతూ గట్టిగా అడుగులు వేస్తూ బురదలో దిగబడిన వాడిలాగా ప్రయత్న పూర్వకంగా అవయవాలు ఆకర్షించేటట్టునడవాలి. కంచుకిని రాజు అర్థ విషయ నిర్వహణకు నియోగిస్తుంటాడు.

శ్రీ.చ.

కక్ష్య : రంగస్థల సంబంధి. రంగస్థలాన్ని కొన్ని గడులుగా విభజించుకుంటే ఆ గడికి లేక ఆ స్థలానికి కక్ష్య అని పేరు. ఈ గడి ఒక ప్రదేశాన్ని నిర్దేశిస్తుంది. పాత్ర ఒక గడి నుంచి ఇంకో గడిలోనికి ప్రవేశించడం. ఆ పాత్ర ఒక ప్రదేశం నుంచి ఇంకో ప్రదేశానికి పరిక్రమించినట్లు ప్రేక్షకులు భావించుకోవాలి. గృహాలు, నగరాలు, ఉద్యానవనాలు మొదలైనవాటిని కక్ష్య విభాగంతో నిర్దేశించాలి. ఈ కక్ష్యలు మూడు విధాలు. 1. అభ్యంతర కక్ష్య, 2. బాహ్య కక్ష్య, 3. మధ్యమ కక్ష్య.

శ్రీ.చ.

కణ్వశ్రీ : అధ్యాపకుడు, రచయిత, నాటక సమాజ స్థాపకుడు. అసలు పేరు మైసూరు చంద్రశేఖరం. పుట్టింది నెల్లూరు జిల్లాలోని కోట గ్రామం. నెల్లూరులో లలిత కళానిలయం స్థాపనకు మజ్జిగ విశ్వనాథ రెడ్డితో పాటు కణ్వశ్రీ కృషి చేశాడు. కళలపట్ల అభిమానం కనబరిచే కణ్వశ్రీ 1948లో అజాత శత్రువు, ఆనాడు 1950లో ఇదా ప్రపంచం, బాలనాగమ్మ, 1953లో మాయాబజారు నాటకాలను కళా రంగానికి అందించాడు. ఈ నాటకాలన్నీ లలిత కళానిలయం పక్షాన రాష్ట్రంలో విస్తృతంగా ప్రదర్శింపబడి, ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొన్నాయి, రచయితకు ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టాయి. పాశ్చాత్య, ఆధునిక, నాటక రీతులను పరిశీలించిన కణ్వశ్రీ ప్రదర్శనాపరంగా నాటకాలు రచించడంలో కృతకృత్యుడయ్యాడు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత కూడా పేద రైతులపై భూస్వాముల పెత్తనం తగ్గలేదు. పేదవారి జీవితాల్లో మార్పు రాలేదు. బడుగుజీవుల బాగుకోసం ప్రయత్నాలు చేయడంలో పాలక వర్గం విఫల మవుతుందనే సమస్యను ప్రేక్షకుల ముందుంచి,ఆలోచించాలని ఇదా ప్రపంచం నాటకం ద్వారా హెచ్చరించాడు. నెల్లూరు యాసలో నాటకంరాసినతొలి రచయిత. సాంఘిక నాటకాలు విస్తృతంగా ప్రదర్శిస్తున్న రోజుల్లో కణ్వశ్రీ బాలనాగమ్మ, మాయాబజారు లాంటి జానపద, పౌరాణిక నాటకాలను రచించి, ప్రదర్శించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. సరళమైన సంభాషణలతో పామరులను సైతం ఆకట్టుకోవడం ఈ నాట కాలలోనివిశిష్టత. ఈ నాటకాలను నేడు కూడా సురభి సమాజం ప్రదర్శించడం విశేషం. బాలనాగమ్మ నాటకాన్ని ఎస్.వి.సుబ్బారావు, రాజ నాలబృందం విరివిగా ప్రదర్శించి ప్రచారంలోకి తెచ్చింది. సింహాసనం కోసంతండ్రినే కారా గారంలో బంధించి, చివరకు పశ్చాత్తాపపడి, ప్రేమ, వాత్సల్యం మనిషికి చాలా అవసరమని హితవు చెప్పిన చారిత్రక నాటకం అజాత శత్రువు. మహమ్మదు ఘోరీ, పృథ్వీరాజుల మధ్య జరిగిన సమర గాథను తెలిపే మరో చారిత్రక నాటకం 'ఆనాడు'. కణ్వశ్రీ రాసిన నాటకాలు రాశిలో స్వల్పమే అయినా వాసిలో వాటికి ప్రత్యేకత ఉంది. కణ్వశ్రీ మద్రాసులో స్థిరపడిన తరువాత కొన్ని సినిమాలకు మాటలు, పాటలు రాశాడు. 1970లో లవ్ ఈజ్ బ్లైండ్ నాటికను రాసి మద్రాసులో ప్రదర్శించాడు.

దాసరి.ఎస్.

కత్తీ ముసుగు రూపకం : స్పెయిన్ ఆహ్లాద నాటక భేదం. దీనిని స్పెయిన్ నాటక సాహిత్యానికి మచ్చుతునకగా పరిగణిస్తున్నారు. మొట్టమొదట ఈ పేరు నాటక బాహ్య ప్రకృతి నుంచి వచ్చింది. అప్పటి నాటకాలలో పాత్రలు ప్రభు వంశస్తులు ఈ ప్రభు వంశీయుల ప్రేమ కలాపం, కుట్రలు ఈ రకం నాటకాలకు ఇతి వృత్తాలు. తరువాత పందొమ్మిదవ శతాబ్ది నాటక కర్తలను ఈ నాటకరూపంబాగా ఆకర్షించింది. ఘాటు ప్రేమ, కత్తి యుద్ధాలు, డాబు దుస్తులు ఈ నాటక రూపంలో ప్రవర్థిల్ల సాగాయి.

శ్రీ.చ.

కథాకళి : కేరళ దేశీయ నృత్య రూపక భేదం. కథాకళి రూపకాల ఇతి వృత్తాలు రామాయణ మహాభారతాది ఇతిహాస పురాణాల నుంచి తీసుకున్నవే. రౌద్రరస ప్రధానాలు. అందుకే దుశ్శాసన వధ, పూతన వధ, కీచక వధ, కళ్యాణ సౌగంధికం లాంటి రూపకాలకే అగ్ర తాంబూలం. వీటిలో వాచికం ఉండదు. నటులు స్వయంగా వాచికం పఠించరు. ఆంగిక, మూకాభినయాల ద్వారా భావం వ్యక్తీకరిస్తారు. నిర్థిష్ట వర్ణం గల పాత్రలుగాక తక్కిన పాత్రలకు వారి వారి తత్వాలను (సాత్త్విక, రాజస, తామస) బట్టి ముఖానికి రంగు వేస్తారు. అందుచేత భావానుగుణంగా ముఖ కవళికలు మార్చడం ఈ కళా రూపంలో సాధ్యంకాదు. అంటే సాత్త్వికాభినయానికి అవకాశం లేదు. అందుకే ఆంగికాభినయాన్ని ఎక్కువగా ఆశ్రయిస్తారు.

మద్దెల, ఢంకా, చెండా మొదలైన వాద్య విశేషాలు రసానికి పుష్టిచేకూరుస్తూ పాత్రధారులను ఉత్తేజపరుస్తాయి. కథాకళిలో యుద్ధ ఘట్టాలు రసవత్తరంగా ఉంటాయి. ఈ ఘట్టాలలో రౌద్రరసం పరా కాష్ఠకు చేరి ఒడలు జలదరింప చేస్తుంది. ఇందులోని అభినయ భాష గంభీరమైంది. నృత్య భంగిమలు రమణీయమైనవి. రంగురంగుల వస్త్రాలు, ఆహార్యవిశేషాలు మనోహరాలు. అవయవ విక్షేపం, అభినయం, సంగీతాలతో సమన్వయం చెందుతూంటుంది.

ధర్మాధర్మాల సంఘర్షణ, ధర్మవిజయం ఈ రూపకాలలో కనిపిస్తుంది. వీటిలోని పాత్రలు ఆయా వ్యక్తుల చిహ్నాలు గాక ఆయా ధర్మాల ప్రతీకలు. కథాకళిలోని ఇంకో విశిష్ట గుణం వేదాంత తత్త్వ వ్యాఖ్యాన ఘట్టాలు ఎక్కువగా కన్పిస్తాయి. కథాకళి సంగీతాన్ని సోపాన సంగీత మంటారు. వేషాలను పచ్చవేషాలంటారు. ఒక్కొక్క వేషం తయారు కావడానికి కొన్ని గంటలు పడుతుంది. ప్రదర్శన రాత్రంతా జరుగుతుంది. నేటి కథాకళికి స్వరూపం కల్పించి మూడువందల సంవత్సరాలైంది. ఈ కథాకళికి మూల పురుషుడు కొత్తరక్కర రాజు (1575–1650). దీనికి విశ్వ విఖ్యాతి తెచ్చి పెట్టింది మహాకవి వల్లథోల్.

శ్రీ.చ.

కనకలింగేశ్వర రావు, బందా (1907–1968): నటుడు, ఏలూరు ప్రభాత్ థియేటర్ వ్యవస్థాపకుడు, అధినేత. జీవితమే నాటకం, నాటకమే జీవితం అనే భావనతో ఆంధ్ర నాటక రంగానికి, కూచిపూడి నృత్య నాటకరంగానికి జీవితం అంకితం చేసిన కళాతపస్వి, ఆంధ్ర నాటక రంగానికి ధృవతార. కేంద్ర సంగీత నాటకఅకాడమీ బహుమతి గ్రహీత. తల్లిదండ్రులు సుందరమ్మ, శ్రీశైలంలు. బందా కనక లింగేశ్వరరావు 1907, జనవరి ఇరవైన కృష్ణాజిల్లా, కైకలూరు తాలూకా ఆటపాక గ్రామంలో జన్మించాడు. చిన్నతనంలోనే నాటకాలలో నటించాలనే కోరిక ప్రబలింది. 1927లో బందా నోబుల్ కాలేజీలో బి.ఏ లో చేరగానే కళాశాల నాటక సంఘ అధ్యక్ష పదవి వరించింది. అతని వాంఛ ఉరకలు పెట్టింది. వెంటనే పాండవోద్యోగ విజయాలు చేపట్టాడు. బందరు బుట్టయ్యపేట హాలులో నాటక ప్రదర్శనం. బందా కృష్ణుడుగా ప్రప్రథమంగా రంగస్థలం మీద అడుగుపెట్టింది ఆ వేదిక మీదనే.

1932లో లా పరీక్షలో ఉత్తీర్ణుడై ఆరు సంవత్సరాల పాటు ప్లీడరు వృత్తిలో ఉన్నాడు. 1939లో ప్లీడరీ వృత్తికి స్వస్తి చెప్పి విరివిగా నాటకాలలో నటించడంప్రారంభించాడు. తొలి రోజులలోనే ఆంధ్ర ప్రజానీకం బందానటనాచాతుర్యాన్ని గుర్తించింది. నాటక సంగీతంలో బందాతనసొంతబాణీని అందరికీ అర్థమయేటట్లుగా పద్యం చక్కగా విడమర్చి చదవడం, మనసును రంజింపజేసే రాగధోరణి బందా ప్రత్యేకత.

బసవరాజు అప్పారావు రచించిన 'గుత్తొంకాయకూర' పాటను బందాఎంతోరసవత్తరంగాపాడేవాడు. ఔచిత్యానౌచిత్యాలు పాటించ కుండా ప్రేక్షకులు నాటకం మధ్యలో ఆ పాట పాడించుకుని విని ఆనందించేవారంటే బందా ఆ పాటను ఎంత జన రంజకంగా పాడేవాడో బోధపడుతుంది.

ఆ రోజులలో ఆంధ్ర ప్రదేశ్‌లో నాటక కళాశాలలు లేవు. నాటక కళాసిద్ధాంత పరిజ్ఞానంగలనటులు, ప్రయోక్తలు, అధ్యాపకులు తక్కువ. ఈ పరిజ్ఞానాన్ని కలిగించే గ్రంథాలు కూడా తెలుగులో లేవు. సిద్ధాంత పరిజ్ఞానం ఉన్నపుడే నాటక కళ పురోభివృద్ధి చెందుతుంది. కొత్తపుంతలు తొక్కడానికి వీలవుతుందనే నమ్మకంతో బందాసిద్ధాంత పరిజ్ఞానాన్ని కలిగించడానికి ఏలూరులో ఆంధ్ర నాటక కళాశాలను 1938లో స్థాపించి రెండు సంవత్సరాలు నడిపాడు. పరీక్షలునిర్వహించి విద్యార్థులకు యోగ్యతా పత్రాలిచ్చాడు. భారతీయ నాటక రంగ

చరిత్ర, నటన, ఆహార్యానికి సంబంధించిన అంశాలను ప్రధానంగా ఆ నాటక కళాశాలలో బోధించేవాడు. కళావేత్తలతో ప్రత్యేకోపన్యాసాలిప్పించాడు. ఆ రెండు సంవత్సరాలలో ముప్పై ఎనిమిది మంది విద్యార్థులకు శాస్త్రీయ పద్ధతులలో శిక్షణ యిచ్చి వారి నటనా కౌశలాన్ని తీర్చి దిద్దాడు.

ఆ కాలంలోనే సినిమారంగం నుంచి ఆహ్వానం వచ్చింది. 1935లో **ద్రౌపదీ మానసంరక్షణలో** కృష్ణుడుగా సినిమా తెర మీద కనిపించాడు. ఆ తరువాతవరసగాసారంగధర, బాల నాగమ్మ, కాలచక్రం, పాదుకా సినిమాలలో నటించి పేరు ప్రతిష్ఠలు సంపాదించు కున్నాడు. 1942 బందా జీవితంలో ఇంకో మైలు రాయి. అదే సంవత్సరంలో ఏలూరులో ప్రభాత్ థియేటర్ స్థాపించాడు. బందరులో డి.వి.సుబ్బారావు స్థాపించిన ఇండియన్ డ్రమెటిక్ కంపెనీని ఆదర్శంగా పెట్టుకున్నాడు. ప్రఖ్యాత రచయిత ఊటుకూరి సత్యనారాయణను దగ్గర కూర్చోబెట్టుకుని ప్రయోగయోగ్యంగా నూతనపద్ధతులలో ద్రౌపది, అనార్కలి మొదలైన నాటకాలు రాయించాడు. మహానటుడు ముంజులూరి కృష్ణారావును ట్రూపు మేనేజర్‌గా నియమించి ప్రభాత్ థియేటర్స్‌ను కళామయంగా తీర్చిదిద్దాడు. రసవత్తరంగా యావదాంధ్రలో నాటకాలు ప్రదర్శించి రసజ్ఞుల మన్ననలు పొందాడు. ప్రయోగంలో కొత్తతోవలుతొక్కి ఆంధ్ర నాటక కళాలక్ష్మికి నూత్నాలంకారాలు సమర్పించాడు.

ఏలూరులో బూజు పట్టిన వై.ఎం.హెచ్.వి.ఎ. హాలును శుభ్రంచేసి కళాక్షేత్రంగా మార్చాడు. ఆంధ్ర దేశంలోని సుప్రసిద్ధ నటులు, నాటక కర్తల చిత్రాలతో కళాక్షేత్రాన్ని అలంకరించాడు. నృత్య కళాశాలను నెలకొల్పాడు.

ఆంధ్ర నాటక రంగానికి చేసిన మహాసేవ ఫలితంగా బందాకు 1952లో కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యత్వం లభించింది. అపుడే బందా భారతనాటక పురోభివృద్ధికి సూచనలుచేస్తూ ఒక విజ్ఞాపనపత్రాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీకి సమర్పించాడు.

1954లో ప్రపంచ శాంతిమహాసభలలో ఆంధ్ర ప్రతినిధిగా పాల్గన్నాడు. ఆ అవకాశంవినియోగించుకొని పాశ్చాత్య నాటకరంగాన్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. మాస్కోలో ప్రభుత్వ సంస్కృత భాషా విభాగంలోకి శాకుంతలంలోని కణ్వుని సంస్కృత శ్లోకాలు చదువుతూ అడుగు పెట్టేసరికి స్వచ్ఛమైన సంస్కృత ఉచ్చారణ విని అక్కడి వారు ఎంతో ఆనందించారట. ఆంధ్రదేశం తిరిగి వచ్చిన తర్వాత ప్రాచ్య, పాశ్చాత్య నాటక రంగాల మీద సోదాహరణంగా అనేక ఉపన్యాసాలిచ్చాడు.

1956లో బందాను ఆకాశవాణిలో నాటక ప్రయోక్తగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. సరికొత్త పద్ధతిలో నాటకాలు కొన్ని వందలు ప్రసారం చేసి విజయవాడ ఆకాశవాణి నాటక విభాగానికి గౌరవ ప్రతిష్ఠలు సమకూర్చాడు.

ఈ కాలంలోనే బందా మనోవీధిలో ఒక భావం తళుక్కుమని కూచిపూడి నృత్య కళోద్ధారణ రూపం దాల్చింది. అదే అతని జీవిత పరమార్థంగా పరిణమించింది. ఆ నాటికింకా కూచిపూడి నృత్య నాటకకళ 'సామాన్య ప్రజానీకంలో' 'యీది బాగోత మే'. అధికారవర్గం దృష్టిలో అశాస్త్రీయమైన జానపద కళారూపం. కూచిపూడి నృత్య నాటక రూపం భరత శాస్త్రోక్తమైందని, విశిష్ట కళారూపమని నిర్ధారించి కూచిపూడి కళకు పట్టం కట్టించవలసిన కార్యభారం ఆంధ్రజాతిపై పడిందని బందా ఆ కార్యనిర్వహణకు నడుంకట్టాడు.

ఈ ఆశయానికి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ దోహదంచేసింది. 1959, ఫిబ్రవరిలో కూచిపూడి నాట్య సదస్సును నిర్వహించి, కూచిపూడి నృత్యం శాస్త్రీయమైనదేనని నిరూపించాడు. దానితో బందాకు ఏనుగంతబలం వచ్చింది. ఇక ఢిల్లీ నుంచి కన్యాకుమారి వరకు బందా ఆధ్వర్యాన కూచిపూడి నృత్య విశిష్టత మారు మోగింది. భారతావని అంతటా కూచిపూడి నాటక ప్రదర్శన లిప్పించాడు. ఇంగ్లీషు తెలుగు పత్రికలలో వ్యాసాలు రాశాడు. కూచిపూడిలో అన్ని హంగులతో సిద్ధేంద్ర నృత్య కళాశాలను స్థాపించాడు. పలుచోట్ల నుంచి ఆర్థిక సహాయం రాబట్టాడు. ఆ కళాశాలకు భవనం నిర్మించాడు. ఈ కాలంలోనే కేంద్ర సంగీత నాటక అకాడమీ బందాకు అవార్డు బహుకరించింది. ఈయన శ్రీకృష్ణుడు, ప్లీడరు శర్మ (మధుసేవ), సారంగధరుడు, బిల్వమంగళుడు, సలీం, చంద్రగుప్తుడు, భిక్షుకుడు (చంద్రగుప్త), శ్రీనివాసులు, ఎరుకలసాని, కణ్వుడు, విజయ రామరాజు, శ్రీరాముడు, నలబాహుకులు, అల్లూరి సీతారామరాజు, పిచ్చిరామశాస్త్రి, రఘునాథ (శివాజీ), కాళుడు, కాళిదాసు, పేరిగాడు, అభిమన్యుడు, కర్ణుడు, ప్రతాపరుద్రుడు వంటి పాత్రలు ధరించాడు. కళారంగ వికాసం కోసం విశేషంగా శ్రమించిన బందా కనక లింగేశ్వరరావు 1968, డిసెంబరు 3న దివంగతుడయ్యాడు.

శ్రీ.చ.

కన్నాంబ, పసుపులేటి (1913-64) : ప్రముఖ నటి. రాజరాజేశ్వరి నాట్యమండలి స్థాపకురాలు. నిరాడంబర జీవి, నవరసాలు ఒప్పించగల నటీమణి.

సినిమా నిమిత్తం మదరాసులో స్థిరనివాసం ఏర్పరచుకొంది. ఈమె 1913, సెప్టెంబరు 20న ఏలూరు సమీపంలోని కొవ్వూరులో జన్మించింది. పదమూడవ ఏటనే బాలిక పాత్రలు ధరించి మెప్పుపొందింది. క్రమంగా పెద్ద పెద్ద పాత్రలు నిర్వహించి అగ్రశ్రేణి నటీమణిగా పేరు గడించింది. కొంతకాలంపాటు గుంటూరు నవలా సమాజంలో ప్రధాన పాత్రలు ధరిస్తూ

రాజరాజేశ్వరీ నాట్యమండలి అనే సొంత సమాజం స్థాపించి, ఆంధ్ర దేశమంతటా *రంగూన్ రౌడీ, సావిత్రి, అనసూయ,* హరిశ్చంద్ర నాటకాలు ప్రదర్శించి అఖండ కీర్తి గడించింది. 'కృష్ణం భజే రాధ' అనే గ్రామ ఫోన్ రికార్డు ఆమె సంగీత కళా సామర్థ్యానికి పతాక. ఆ పాట వినడానికి ఆబాలగోపాలం గుమికూడే వారు.

1935లో కన్నాంబ సినీరంగంలో ప్రవేశించి తెలుగు, తమిళ, సినిమాలలో నటించి కీర్తి పొందింది. ఈమె దాదాపు 150 చలనచిత్రాలలో నటించింది. కొన్నింటిని రాజరాజేశ్వరీ సినిమా కంపెనీ పేరుతో నిర్మించింది. ఆంధ్ర నాటక కళా పరిషత్తు ఈమెను 'నాట్య కళావిశారద' బిరుదుతో సన్మానించింది. ఈమె కొంతకాలం ఆంధ్ర ప్రదేశ్ సంగీత అకాడమీ కార్యవర్గ సభ్యురాలుగా పనిచేసింది. 1964, మే 7న మద్రాసులో నిర్యాణం చెందింది.

శ్రీ.చ.

కబీర్‌దాస్, చింతా (జ.1934) : రంగస్థల నటుడు. 1934లో కృష్ణాజిల్లా మచిలీపట్టణంలో చింతా బలరామమూర్తి, వెంకటేశ్వరమ్మ దంపతులకు జన్మించిన కబీర్‌దాస్ 1963లో విజయవాడ ఆంధ్రాసిమెంట్ కంపెనీ ఉద్యోగంలో చేరాడు. 1954లో ఆంధ్రా సిమెంట్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ కల్చరల్ వింగ్ ప్రదర్శించిన నా చెల్లెలు నాటికలో నాయిక పాత్రను ధరించాడు. ఈ సంస్థ ద్వారా పలు నాటికలను ప్రదర్శిస్తూ వాచికాభినయంలో దిట్టగా పేరు ప్రతిష్ఠలు పొందాడు. కె. వేంకటేశ్వర రావు దర్శకత్వంలో నటించాలనే బలీయమైన కోరిక రసన సమాఖ్య *కనక పుష్యరాగం* నాటకంలో ఆనందం పాత్ర ద్వారా తీరింది. 1964-66లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిర్వహించిన నాటక విద్యాలయంలో శిక్షణ పొందాడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో ఉత్తమ నటుడు బహుమతి పొందాడు. 1965లో శ్రీ వేంకటేశ్వర నాటక కళాపరిషత్తు (తిరుపతి) నిర్వహించిన నాటక పోటీలలో ఉత్తమ సంభాషణ అవార్డు పొందాడు. రాజమండ్రి లలిత కళానికేతన్ పోటీలలో రెండు పర్యాయాలు ఉత్తమ నటుడిగా ఎంపికయ్యాడు. రసన సమాఖ్య, సత్య కళానికేతన్ సంస్థలలో సభ్యుడై దంత వేదాంతం, వెంకన్న కాపురం, *కళాకార్,* పెళ్లి చూపులు, రాత్రించరులు నాటికలలో, పాలెకాపు, *గుడ్డిలోకం,* మట్టే బంగారం, ఎన్.జి.ఓ., కీర్తి శేషులు, అన్నా చెల్లెలు, తిరస్కృతి, విశ్రాంతి, మారని మనిషి, ఆరాధన, నీలి తెరలు, నీలి నీడలు నాటకాలలో నటించాడు.

యువ కళాభారతివారి (విజయవాడ) 'నటనాచార్య' బిరుదును పొందాడు. చింతా నటనను చూసిన రావుగోపాల రావు కీర్తి శేషులు నాటకంలో వాణీనాథం పాత్రనుఇచ్చాడు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పలు పరిషత్తులకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. ఆకాశవాణిలో 'ఎ' గ్రేడ్ కళాకారుడిగా వందలాది నాటకాల్లో నటించాడు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు నాటక రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా నిడదవోలు రాఘవ కళానిలయం వారి అత్యుత్తమ పురస్కారాన్ని పొందాడు.

కందిమళ్ళ

కబీర్‌దాస్, శనగల (జ.1944) : నటుడు. ఈయన కృష్ణా జిల్లా తోట్ల వల్లూరులో 1944, అక్టోబరులో జన్మించాడు.

తల్లిదండ్రులు వెంకాయమ్మ, చినమస్తాన్‌రావు. కబీర్‌దాసుది మధ్యతరగతి కుటుంబం. ఈయన హైస్కూల్లో చదువుతున్న రోజుల్లోనే నాటకాలలో నటించడం ప్రారంభించాడు. కబీర్‌దాసు మొట్టమొదటిసారిగా 1959లో మొద్దబ్బాయి నాటికలో నటించాడు. తరువాత పినిశెట్టి శ్రీరామమూర్తి రచించిన ఆడదిలో శతభిషం పాత్రలోను, అన్నాచెల్లెలులో పిచ్చయతాతగా నటించాడు. హాస్యం దివ్యౌషధం అని భావించిన కబీర్‌దాసు ముఖానికి రంగు పూసుకున్నప్పటి నుంచి నేటివరకు హాస్యపాత్రల్లో నటించి పేరు తెచ్చు కున్నాడు. జీవికకోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలో పనిచేస్తూనే నాటకాలలో, చలన చిత్రాలలో, ప్రసార భారతి, దూరదర్శన్‌లలో ప్రసారమైన అనేక నాటకాలలో నటించాడు. అన్నీ హాస్యపాత్రలే.

శతాధిక ప్రదర్శనలలో నటించిన ఈయనకు పేరు తెచ్చి పెట్టినవి భమిడిపాటి రాధాకృష్ణ రచించిన ఇదేమిటిలో ప్రసాదం, చో రామస్వామి రచించిన సంభవామి యుగేయుగేలో కాశి, *ఈజ్ గాడ్ డెడ్?*లో జూనియర్ డాక్టరు, ఆదివిష్ణు రచించిన అతిథిదేవుళ్ళులోసీతాపతి, పండగొచ్చిందిలో కృష్ణమూర్తి, డి. విజయభాస్కర్ రచించిన బ్రహ్మరాతలో రామలింగం, మినిష్టర్‌లో చిన్నికృష్ణ పాత్రలు. ఈ పాత్రలలో వివిధ వేదికలపై ప్రదర్శించినప్పుడు అనేక బహుమతులు తెచ్చిపెట్టాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2003 సంవత్సరం నిర్వహించిన నాటిక పోటీలలో మినిష్టర్ నాటకంలోని చిన్నికృష్ణ

పాత్రకు ఉత్తమ హాస్య నటుడుగా నంది బహుమతి అందుకున్నాడు. ప్రసార భారతిలో 'ఎ' గ్రేడు కళాకారుడుగా అనేక నాటకాలలో నటించాడు. సినిమా, సీరియల్స్‌లలో నటిస్తూ కళారంగానికి సేవ చేస్తున్న కళారాధకుడు కబీర్‌దాస్.

దాసరి.ఎస్.

కబూకీ: జపాన్ 'ణో' నాటకరంగం నుంచి, జూరోరీ (బమ్మలాట) నుంచి ఆవిర్భవించిన జపాన్ ప్రజానాటక రంగం. ఇది మన యక్షగానం లాంటి సంగీత నృత్య నాటక రంగం. ఇది జపాన్ వారి మనస్తత్వాన్ని, నాగరికతను, సంస్కృతిని వ్యక్తం చేస్తుంది. సాధారణంగా కబూకీ నాటక ఇతివృత్తం 'ప్రతీకారం'. తమ యజమానిని హత్యచేసిన, హత్యకు తోడ్పడిన వారి మీద ప్రతీకారం తీర్చుకోవడమే కబూకీ ఇతివృత్తాలలో ముఖ్యమైంది.

ఈ నాటకరంగానికి మాతృక అయిన కీలుబమ్మల అభినయాన్ని, సంప్రదాయాలను కబూకీ అనుకరించసాగింది. కబూకీ నటులు కీలుబమ్మలు మాదిరిగానే గిర్రున తిరుగుతూ నటిస్తారు. భావోద్రేకాన్ని ప్రదర్శించవలసిన గంభీర రంగాలలో కూడా చేతులు ఊరికే తిప్పడం, బిగపట్టడం, కనుబమలు ముడవడం, యంత్రంలాగా తల అటూ ఇటూ ఆడించడం, కనుగుడ్లు తిప్పడం మొదలైన చేష్టలు చేస్తుంటారు.

ప్రతీకార ఇతివృత్తాలే గాక పౌరాణిక, చారిత్రక, జానపద ఇతి వృత్తాలలో కూడా కబూకీ నాటకాలు విలసిల్లుతూ ఉన్నాయి. కబూకీ రంగస్థలం బాగా వెడల్పయిందే కాని ఎత్తు తక్కువ, లోతు తక్కువ . ఇలా రంగస్థలం లోతు తక్కువ పెట్టడానికి కారణం 1760 నుంచి అమలులో ఉన్న భ్రమణ రంగస్థలం. ఎడమవేపు నుంచి రంగస్థలం వెనుకకు వంతెన లాంటిది ఉంటుంది. ఈ వంతెన మీదే పాత్రల ప్రవేశ, నిష్క్రమణాలు జరుగుతాయి. ఇదంతా ప్రేక్షకుల తల ఎత్తునే జరుగుతుంది. ఈ ప్రవేశ నిష్క్రమణాలకు రంగస్థలం కుడిపక్క నుంచి కూడా ఒక్కొక్కపుడు వంతెన నిర్మిస్తుంటారు. తెర పైకి చుట్టుకోదు. ఒక పక్కకు చుట్టుకుంటుంది. రంగ భూమికలు (scenery) అతి విపులంగా ఉంటాయి.

నాటకేతివృత్తం చారిత్రాత్మకమైతే పట్టు దుస్తులు, డాబూ, దర్పాలతోను, సామాన్య ప్రజా జీవితం ఇతివృత్తమయితే నిరాడంబరంగానూ ఉంటాయి. 'ణో' నాటకరంగంలోలాగా కబూకీ నాటకరంగంలో కరాళాలు (Masks) ఉపయోగించరు. మహా నాటకాల(Classical plays)లో పాత్రలకు సంప్రదాయ సిద్ధమయిన ముఖరంగు వేస్తారు. స్త్రీవేషాలు పురుషులే ధరిస్తారు. సంగీతం పాడేవారు, sound effects ఇచ్చేవారు, రంగస్థలానికి ఎడమపక్క అల్లిక తడిక చాటున కనిపించకుండా కూర్చుంటారు. కథ, బమ్మలాటకు సంబంధి అయితే బమ్మలాటలో పాడే వ్యక్తులు కుడిపక్క ప్రేక్షకులకు కనిపించేటట్టే కూర్చుంటారు. 'ణో' రంగ ఇతివృత్తమైతే రంగసంబంధి పాటకులు కూడా కూర్చుంటారు. రంగస్థల సామాగ్రిని, రంగ భూమికను ఇద్దరు సర్దుతుంటారు. వీరిలో ఒకడు టోపీ ధరిస్తాడు. ఒకడు ధరించడు. వీరిద్దరినీ ప్రేక్షకులు అదృశ్యవ్యక్తులు గానే భావిస్తారు.

కబూకీ నాటకాలు చాలా పెద్దవి. ఒక్కొక్క నాటకం ఆడటానికి రెండు మూడు రోజులు పడుతుంది. అందుకని 'చౌచౌ' నాటకాలనే ఎక్కువగా ప్రదర్శిస్తారు. ముందు చరిత్రాత్మక నాటకంలో నుంచి ఒక అంశం, తరువాత నృత్యం, నృత్యం తరువాత గేయ నాటకం, ఆ తరువాత తిరిగి నృత్యం ఇలా కబూకీ నాటక ప్రదర్శనసాగుతూ ఉంటుంది. చౌచౌనాటక ప్రదర్శనంలో *రోనిన్* అనే నాటకంలోని ఒక రంగమైనా తప్పకుండా ప్రదర్శితమవుతూంటుంది.

ప్రేక్షకులు కుటుంబాలతో సహా మధ్యాహ్నమే వచ్చి అర్ధరాత్రి వరకు నాటక శాలలోనే ఉంటారు. మెత్తటి దిండ్ల మీద కూర్చుని నాటకం చూస్తూ మధ్యమధ్య పానీయాలు తాగుతూ ఆనందిస్తారు.

ఇక కథ ప్రేక్షకులకు బాగాతెలిసినదే అయినా హంగుదారు సంఘటనలను వర్ణించి చెపుతూన్నా, భావ తీవ్రతను వెల్లడించడానికి ఆయా సందర్భాలకు అనుగుణంగా కిన్నెరను గాని, మురళిని గాని, మృదంగం గాని ఉపయోగిస్తారు. బీభత్స రంగాలను కబూకీ ప్రేక్షకులు ఎక్కువ అభిమానిస్తారు. జపాన్ జాతి స్వభావానికి అనుగుణమైన నాటక రంగం కాబట్టే కబూకీకి ఎంతో ఆదరణ లభిస్తోంది.

శ్రీ.చ.

కమలాదేవి, అబ్బూరి (1925-2005) : ప్రముఖ రంగస్థల నటి. దర్శకురాలు. నాటక సమాజ నిర్వాహకురాలు. ఈమె 1925లో నవంబర్ 2వ తేదీన కృష్ణాజిల్లా బందరు సమీపంలోని పెడన గ్రామంలో తోట వెంకయ్య, సుబ్బమ్మ దంపతు

లకు జన్మించింది. కమలాబాయి చిన్నతనం నుండి తండ్రితో కలిసి భజన కార్య క్రమాలలో పాల్గనేది. సోదరుడు సుబ్రమణ్యాం, డి.వి. సుబ్బారావు నాటక సమాజంలో నటిస్తున్న సమయంలో కలిసి రిహార్సల్స్‌కు వెళ్లేది. చిన్న వయస్సులోనే డి.వి. సుబ్బారావు అభిమానానికి పాత్రురాలై ఆశీస్సులు పొందింది. విద్యార్థి దశలో సతీసావిత్రి నాటకంలో సత్యవంతుని పాత్రద్వారా రంగస్థల జీవితానికి శ్రీకారం చుట్టింది. డి.వి. సుబ్బారావు దర్శకత్వంలో తులసీదాసు నాటకంలో మమత పాత్రను పోషించి పలువురి మన్ననలు పొందింది. కృష్ణలీలలో దేవకి పాత్రతో అందమైన రూపం, కమనీయమైన గాత్ర మాధుర్యంతో ఉర్రూతలూగించింది.

నాటకాల్లో నటించడానికి కుటుంబ సభ్యులు వ్యతిరేకించడంతో, ఇల్లు వదిలి గుడివాడలో స్నేహితురాలి ఇంటఆశ్రయం పొందింది. మల్లికార్జునరావు అనే సంగీత విద్వాంసుని వద్ద మెళకువలను నేర్చుకొంది. ఏలూరులో స్థిరనివాసం ఏర్పరచు కొన్న అనంతరం కమలాదేవి నట జీవితం మలుపు తిరిగింది. అద్దంకి శ్రీరామమూర్తి, బందా కనకలింగేశ్వర రావు, చింతలపూడి సత్యం వంటి ప్రముఖులతో పలు నాటకాలలో నటించింది. హార్మోనిస్ట్‌సాతాని రంగయ్యవద్ద సంగీత శిక్షణ ఆమె నట జీవితానికి మరింత మెరుగులు దిద్దింది. ద్రౌపది వస్త్రాపహరణంలో ద్రౌపది, చింతామణిలో చింతామణి,రాధ వంటి పాత్రలను చక్కగా పోషించింది. పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరులో శ్రీ కృష్ణపాత్ర పోషణతో కమలాదేవి పురుషపాత్ర ధరించిన నటిగా చరిత్రపుటలలోకి ఎక్కింది.

తెనాలికి చెందిన అబ్బూరి నాగేశ్వరరావుతో కాంట్రాక్ట్ కుదుర్చుకొన్న తరువాత తెనాలిలో స్థిరపడింది. స్థానం నరసింహా రావు, గోవిందరాజుల సుబ్బారావు వంటి రంగస్థల మహామహులు కమలాదేవి గానమాధుర్యాన్ని చవిచూసి అభినందించారు. అబ్బూరి వరప్రసాదరావుతో చింతామణి, కురుక్షేత్రం వంటి నాటకాలను ప్రదర్శించింది. పీసపాటి, మల్లాది సూర్యనారాయణ, సూరిబాబు,మాధవ పెద్ది వెంకట్రామయ్య, షణ్ముఖి ఆంజనేయరాజువంటి ప్రముఖులతో కలిసి నాటకాల్లో నటించింది. కురుక్షేత్రం నాటకంలో ఒక దృశ్యంలో కళ్యాణం రఘురామయ్య కృష్ణునిగా నటిస్తే ఒక సన్నివేశంలో కృష్ణుని పాత్రను కమలాదేవి నటించింది. మాధవపెద్ది దుర్యోధనుని పాత్ర, కమలాదేవి కృష్ణ పాత్రధారులుగా కురుక్షేత్రం నాటకాన్ని ఆంధ్ర దేశ వ్యాప్తంగా ప్రదర్శించారు. బాలనాగమ్మ నాటకంలో పీసపాటి సత్యవతి బాలనాగమ్మగా నటిస్తే కమలాదేవి కార్యవర్థి రాజుగా నటించింది. మాధవపెద్దితో కలసి పలు నాటకాలలో నటించిన స్ఫూర్తితో కమలాదేవి దుర్యోధన పాత్రను కూడా పోషించింది. అబ్బూరి నాగేశ్వరరావుతో కులాంతర వివాహం జరిగిన అనంతరం 1952లో కమలా నాట్యమండలిని స్థాపించి, పలువురు కళాకారు లను నెలవారీ జీతాలపై నియమించి నాటకాలను ప్రదర్శించింది. చింతామణి నాటకంలో బుర్రా చింతామణిగా నటిస్తే కమలాదేవి బిళ్వమంగళునిగా, టి. కనకం భవానీశంకరుడిగా నటించారు. హరిశ్చంద్రునిగా అబ్బూరి, చంద్రమతిగా బుర్రా కాంబినేషన్‌తో సత్యహరిశ్చంద్ర నాటకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించారు.

అనేకమంది అనాథ బాలబాలికలకు ఆశ్రయమిచ్చి నటులుగా తీర్చిదిద్దింది. తానే వివాహాలు జరిపించి వారి జీవిత గమ్యాలకు దిక్సూచిగా నిలిచింది. 1961లో కమలా నాట్యమండలి నేషనల్‌మహిళా మండలిగా మార్చబడింది. రాజమండ్రి, భీమవరం, నంద్యాల, విజయవాడ వంటి పట్టణాలలో కనకాభిషేకాలను పొందింది. భారత రాష్ట్రపతి వి.వి.గిరి, ప్రధాని ఇందిరా గాంధీ సమక్షంలో నాటకాలను ప్రదర్శించి ప్రత్యేక ప్రశంసలను పొందింది. కొల్లేటి కాపురం, భూమికోసం, ఈ చదువులు మాకొద్దు, తరం మారింది, పల్నాటి పౌరుషం వంటి చిత్రాలలో ముఖ్యభూమికలను పోషించింది. 1998లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్.టి.ఆర్ వర్థంతి సందర్భంగా కమలాదేవిని ఘనంగా సన్మానించింది. 1999లో రంగస్థల అభివృద్ధికి కృషిచేసిన వారికి ప్రదానంచేసే ఎన్.టి.ఆర్ రంగస్థల పురస్కారం అందుకొన్న కమలాదేవి 2005లో మరణించింది.

కందిమళ్ళ

కమలాబాయి, సురభి: (1908-1971) : రంగస్థల, సినీ నటి. ఈమె ఏలూరులో 1908, ఏప్రిల్ 4న జన్మించింది. తండ్రి వనారస పెదకృష్ణాజీ రావు, తల్లి వెంకుబాయి. వెంకుబాయి సంగీతంలో మంచి విద్వాంసురాలు. కమలాబాయి తండ్రికి సొంత నాటక కంపెనీ ఉండేది. ఈ వాతావరణంలో పెరుగుతూ కమలాబాయి చిన్నతనంలో బాలకృష్ణుడు, ప్రహ్లాదుడు, లవుడు మొదలైన బాల పాత్రలలో నటించింది. ఈమెకున్న మంచి రూపం, కమ్మని కంఠస్వరం పాత్ర పోషణకు మరింత వన్నె తెచ్చింది. క్రమంగా నాయక పాత్రలలో నటిస్తూ తండ్రి గతించిన తరువాత కొంతకాలం నాటక కంపెనీ నడిపింది. ఈమె నటనా జీవితంలో కొన్నివందల సువర్ణ పతకాలను బహుమతిగా పొందింది. ఈమె నాటకాలలో నటించడమే గాక నాటకం మధ్యలో ప్రదర్శించే హాస్య రంగాలలో నృత్యం చేస్తుండేది.



ఈమె భక్త ప్రహ్లాద సినిమాలో నటించడానికి బంబాయి వెళ్లినపుడు అక్కడ హిందూస్థానీ సంగీత విద్వాంసుడైన పరశురామ్ బువవద్ద హిందూస్థానీ సంగీతం నేర్చుకొని బాలగంధర్వ మెప్పును కూడా పొందింది. ప్రహ్లాద, శకుంతల, పాదుక, ద్రౌపది, కీచకవధ మొదలైన నూటముప్పై హిందీ, అరవ చిత్రాలలో నటించింది.

భారత చలనచిత్ర రజతోత్సవ సందర్భంగా 1957, జనవరి 17న మదరాసులో దక్షిణ భారత ఆర్టిస్ట్ అసోసియేషన్ వారు ప్రప్రథమంగా తెలుగు చిత్రంలో నటించిన ఈమెను సన్మానించారు. ఆంధ్ర ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్ 1966లోను, ఆంధ్రనాటక కళాపరిషత్తు 1967లోనూ, ఏలూరు వై.ఎం.హెచ్.ఎ. 1969లోనూ నాటక, సినీ రంగాలకు ఈమె చేసిన సేవను ప్రశంసిస్తూ ఘనంగా సన్మానించాయి.

కమలాబాయి హిందూ స్థానీ సంగీతం బాగా పాడటంలోనే గాక హార్మోనీ, సారంగి, వయొలిన్ మొదలైన వాద్యాలను చక్కగా వాయించేది. శకుంతల, చింతామణి, యశోద, సత్యభామ, చిత్రాంగి, తులసి, జియాబాయి (తుకారాం) వంటి పాత్రలలో నటించి పేరు తెచ్చుకున్న ఈమె 1971లో మరణించింది. యమునా కల్యాణి, భీంపలాస్, పడదీప్, కాఫీ, భైరవి, మల్హాణి, జయజయవంత్రి రాగాలు ఈమెకు అభిమాన పాత్రమైనవి.

శ్రీ.చ.

కమాల్ సాహెబ్, కొండపేట (జ. 1915) : స్త్రీ పాత్ర నిర్వహణలో దిట్ట. ఈయన 1915, ఫిబ్రవరి 12న కడప జిల్లా కొండపేటలో పుట్టాడు. తండ్రి పేరు హుసేన్‌సాహెబ్. నిరుపేద కుటుంబంలో పుట్టిన కమాల్ సాహెబ్ అయిదవ తరగతి చదువుతోనే విద్యాభ్యాసం ముగిసింది. పదకొండవ సంవత్సరం లోనే కమ్మగాపాడే కమాల్ సాహెబ్‌ను, గాజుల లక్ష్మయ్య చేర దీశాడు. లవకుశ నాటకంలో నటింపజేశాడు. నాటి ప్రదర్శనలో కమాల్ సాహెబ్ నటన, శ్రావ్యమైన గాత్రం నటుడిగా ముందుకు వెళ్లడానికి తోడ్పడింది. ఈయన డి.వి. నరసింహారావు దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న తరువాత రామదాసు, కృష్ణలీల, తులాభారంలో నటించాడు.

తురిమెళ్ల వారి మాధవ విలాస నాటక సమాజం నలభై మంది నటులతో రాయలసీమ ప్రాంతంలో నాటకాలు ప్రదర్శిస్తుండేది. కమల్ సాహెబ్ ఆ సమాజంలో చేరి రంగూన్ రౌడి, చింతామణి, హరిశ్చంద్ర, పాదుకా పట్టాభిషేకం మొదలైన నాటకాలలో నటించి మంచి నటుడుగా పేరు తెచ్చుకున్నాడు. 1935లో రామవిలాస సభ తరపున కడపలో ప్రదర్శించిన రామదాసు, చండిక, పాదుక మొదలైన నాటకాలలో బళ్ళారి రాఘవ, దొడ్డన గౌడ, పద్మావతి దేవి బృందంతో కలిసి నటించాడు. స్త్రీ పాత్ర నిర్వహణలో సహజత్వాన్ని కనబరచిన కమాల్ సాహెబ్ తరువాత నాటకాలలో సత్యభామ, సక్కుబాయి, చింతామణి, కైక, మురు, చంద్రమతి, సావిత్రి, తార, యశోద, పద్మావతి పాత్రలలో నటించి స్థానం నరసింహారావు, బళ్ళారి రాఘవ, సుప్రసిద్ధకవి జాషువా మెప్పునుపొందాడు. కమాల్ సాహెబ్ మహమ్మదీయుడైనప్పటికీ నటనలో కులమతాలు లేవని, హిందూమతానికి సంబంధించిన ఆధ్యాత్మిక, పౌరాణిక పాత్రలలో నటించి నటనా రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. 1962 వరకు సురభి సమాజం ప్రదర్శించిన నాటకాలలో నటించాడు. ప్రదర్శనా పరంగా లభించిన సొమ్మును అనాథ పిల్లలకోసం, నిరుపేదల కోసం, స్కూళ్ల నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చాడు. ఈయన నటించిన నాటకాలు మన రాష్ట్రంలోనే కాదు బెంగుళూరు, మైసూరు, మదరాసులలోనూ మెప్పును పొందాయి. నాటక రంగం కోసం పనిచేసిన కమాల్ సాహెబ్‌ను అనేక పరిషత్తులు అభినందించాయి. సువర్ణ పతకాలతో సత్కరించాయి. 1971లో ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘానికి అనుబంధంగా ఉన్న రాయలసీమ ప్రాంతీయ సంఘం 'నాటక కళాధురీణ ' బిరుదునిచ్చి గౌరవించింది.

దాసరి.ఎస్.

కరాళం (Mask): ఆహార్య భేదం. నటుడు తన నిజరూపాన్ని కప్పి పుచ్చుకోవడానికి తలకు తగిలించుకొనే కృత్రిమ శిరం లేదా ముఖ కవచం. దీనిని ప్రతిశిరం, ప్రతిశీర్షం, ముఖాచ్ఛాదనం అని కూడాఅంటారు. మనదేశంలో మానవేతర పాత్రలు ధరించేటప్పుడు కరాళం తగిలించుకుంటారు. నరసింహ కరాళం, రావణ కరాళం, దితి కరాళం సుప్రసిద్ధ కరాళాలు.

ప్రాచీన గ్రీకు, రోమన్, జపాన్ నాటక రంగాలలో దీనిని విరివిగా వాడేవారు. అయితే కరాళ ధారణ వల్ల వివిధ భావాలను ముఖంలో చూపడం అసాధ్యం కాబట్టి క్రమంగా కరాళధారణ ప్రాధాన్యం తగ్గింది. ఆ తరువాత ఐరోపాలో కరాళ నృత్యం ఒక ప్రత్యేక కళగా పరిణమించింది. దానిలోనుంచి కరాళనాటకం ఆవిర్భవించింది. బెన్ జాన్సన్ వంటి సుప్రసిద్ధ నాటకకర్తలు కరాళ నాటకాలను రచించడంతో రాజాస్థానాలలో వీటికి ఆదరాభిమానాలు పెరిగాయి.

ఆంధ్ర దేశంలో ఒక ప్రత్యేక కళగా రూపొందిన బుట్ట బమ్మలు ఈ కోవకు చెందినవే. పెద్దపెద్ద బుట్టలకుపైన కరాళాలను

బిగిస్తారు. కరాళంలోకి నటుడి శిరస్సు పోతుంది. నేటికినీ పీర్ల పండుగలో పెద్ద పులి వేషాలు వేసే వారు పులి డ్రస్సు, కరాళాలను ధరించడం అలవాటు. అసలు ఇటువంటి పండుగలు, ఉత్సవాల నుంచే కరాళ నృత్యాలు, నాటకాలు ఆవిర్భవించాయని విమర్శకుల అభిప్రాయం.

శ్రీ.చ.

కరాళ రూపకం : రూపక భేదం. ఈ రూపక ప్రదర్శనంలో పాత్రధారులు కరాళాలు లేక ముఖకవచాలు ధరించడంవల్ల దీనికి కరాళ రూపకమని పేరు వచ్చింది. ఇంగ్లీషులో దీనిని మాస్క్ అంటారు. తెలుగు దేశంలోని బుట్ట బమ్మలు ఈ జాతి నాటకాలకు చెందినవే. ప్రాచీనకాలంలో మతకర్మ కాండలలో, గ్రీకు నాటకాలలో కరాళాలను ధరించారు. ఆ తరువాత క్రమంగా కరాళాలు ధరించి సామాన్య గృహస్థులకు, రాజులకు కానుకలు తీసుకోవడానికి వెళ్లేటప్పుడు వీటిని ధరించి వెళ్లి నృత్యం చేస్తారు. నర్తకుడు ఎవరో తెలియకుండా ఉండేందుకుగాను వీటిని నిర్మించారు. నృత్యం నుంచి ఈ రూపకం ఆవిర్భవించినా, నాటకం నృత్యంతో ముగియడం సంప్రదాయమయింది. తుది నృత్యంలో ప్రేక్షకులు కూడా రంగస్థలం మీదికి వెళ్లి పాల్గంటారు.

కరాళ రూపకాన్ని విశుద్ధ రూపకంగా పరిగణించలేం. ఇందులో నిజానికి కళ అంటూ ఉండదు. క్రియ ఉండదు. సందిగ్ధావస్థ ఉండదు. సరియైన ముగింపు ఉండదు. ఇది స్తుతి, బహుమతి, వినోద క్రీడలకు నిమ్నరూపం మాత్రమే.

శ్రీ.చ.

కరుణ రసం : నవరసాలలో ఒకటి. రౌద్రరస సంజనితం. కరు శబ్దానికి క్లేశమని అర్థం. క్లేశం సహింపలేని ధీవృత్తి కరుణాత్మకం. కరు పదానికి ప్రత్యయం వేరుగా కరుణ పదం ఉత్పన్నమయింది. ప్రేమపాత్రులైన వారి మరణ భావం, నాశనం, వియోగం, శాపం, దేశ బహిష్కారం మొదలైన ఆపదల వల్ల ఏడ్పు (శోకం) వస్తుంది. ఈ భావం స్థాయీ భావం గల రసం. శోకం వస్తుంది కాబట్టి దీనికి శోకరసమనే పేరు కూడా ఉంది. కరుణ రసానికి శోకం స్థాయీ భావం. కరుణ రసానికి హాస్య శృంగారాలు విరోధ రసాలు. రసానుభవ సహాయంతో చిత్తద్రుతి (మనస్సు విరగడం) జరుగుతుంది. చిత్తద్రుతి అంటే కరుణమని, అందువల్ల కరుణ రస మొక్కటే రసమని తక్కిన రసాలు కరుణనుంచే పుడతాయని భవభూతి సిద్ధాంతం. (ఏకోరసః కరుణ ఏవ .... ఉత్తర రామ చరితం, 3-47)

ఈ సిద్ధాంతానికి లక్ష్యంగా భవభూతి ఉత్తరరామచరిత నాటకం రచించి తన సిద్ధాంతాన్ని నిరూపించాడు. ఉత్తర రామచరిత కరుణరసానికి ప్రతీక.

శ్రీ.చ.

కరుణ విప్రలంభం : విప్రయోగ శృంగార భేదం. ప్రేయసీ ప్రియులలో ఒకరు లోకాంతరం వెళ్ళినప్పుడు రెండవ వారు విరహ వేదన అనుభవిస్తూనే, లోకాంతరం వెళ్ళిన వారు తిరిగి వస్తారనే ఆశతో జీవించడం కరుణ విప్రలంభం. ఆశలేకపోతే అది కరుణ రసం. కరుణ, కరుణ విప్రలంభాలకు భేదం ప్రత్యాశ. (యౌవనవంతులగు ఇరువురు స్త్రీ పురుషుల యందు ఒకరు లోకాంతరమునకుంబోయి వెండియు దొరకువారై యుండ రెండవ వారు దుఃఖపడుట కరుణ విప్రలంభమగును – ఆం. సా.ద. 3-224.)

శ్రీ.చ.

కరుణాభాసం : రసాభాస భేదం. ధీరోద్ధత నాయకుడు తాను చంపిన లేక చంపించిన శత్రువు చావుకు దుఃఖించినట్లు చిత్రించడం కరుణాభాసం. ఉదాహరణకు మహావీర చరిత్ర పంచమాంకంలో వాలిని సుగ్రీవుడు రామునితో చంపించి అతని మృతికి దుఃఖించడం కరుణాభాసం.

సుగ్రీ: ఆర్యా! దైవము నిర్దయంబు. ఇది యకాల మందలి పిడుగు (దుఃఖమభినయింతురు – అను. మ.సూ.నా.శా.)

శ్రీ.చ.

కర్ణోక్తి : దీనిని 'చెవిలో' అని కూడా అంటారు. దీనిని భరతముని నాట్యశాస్త్రంలో ఆత్మగతాదులతో పాటు చెప్పాడు కాని సాహిత్య దర్పణం, దశరూపకాదులలో దీని ప్రశక్తి లేదు. రహస్యంగా చెవిలో చెప్పే వాచికం అని దీని అర్థం. ఒకసారి రంగస్థలంమీద ప్రయోగించిన లేక చెప్పిన విషయం తిరిగి తప్పనిసరిగా ప్రయోగింప వలసి వచ్చినా, చెప్పవలసి వచ్చినా పునరుక్తి దోషంలేకుండా ఒక పాత్ర ఇంకొక పాత్ర చెవిలో రహస్యంగా చెప్పినట్లు నటించడం కర్ణోక్తి.

శ్రీ.చ.

బొ

కర్ర బమ్మలాట : జానపద నాటక కళారూపం. కంబ సూత్రాల ఆట కర్రబమ్మలాట. కర్ర బమ్మలు క్రీ. శ. 12వ శతాబ్దినాటికే తెలుగుదేశంలో ప్రసిద్ధి కెక్కినట్లు పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర వల్ల తెలుస్తున్నది.

కంబ [illegible]

(కడు నద్భుతంబుగ గంబ సూత్రంబు లడరంగ బమ్మల నాడించివారు – ప్రథమ ప్రకరణము, పుట 435)

ఈ బమ్మలాటకు వెనక తెర మాత్రమే ఉంటుంది. కథానుసారంగా బమ్మలు తెరవెనక నుంచి వస్తూ పోతూ ఉంటాయి. ఈ బమ్మలాట కథాసంయుతంగా జరుగుతుంది. అట్టి కథలలో *గంగావతరణం* కథ ప్రసిద్ధం. ఈ కర్ర బమ్మలాట ప్రదర్శనలు సంస్కృతంలో బాలరామాయణం పంచమాంకం లోను, తెలుగులో చిత్రాంగద చరిత్రలోనూ గోచరిస్తాయి. ఈ బమ్మలాట తెల్లవార్లు జరుగుతుంది. ఇందులోని కథా పాత్రలే 2 గాక హాస్య పాత్ర బమ్మలు కూడా ఉంటాయి. ఈ కర్రబమ్మలను

[illegible]

సూత్రం లేక తాళ్ళ సహాయంతో ఆడిస్తారు. అందుకే ఈ సూత్రాలను పట్టుకుని బొమ్మలను ఆడించేవానిని సూత్రధారుడంటారు. ఈ సూత్రధారుడే సంభాషణ చెబుతుంటాడు లేదా ప్రసంగి అనే వ్యక్తి చెబుతుంటాడు. సంగీతం పాడే వ్యక్తి కూడా వేరే ఉంటాడు. ఈ కర్ర బొమ్మలాటనే కట్టబమ్మలాటని, కీలుబొమ్మలాటని వ్యవహరిస్తున్న విషయం మనకు తెలిసిందే. ఈ కర్ర బొమ్మలాట నేడు పాశ్చాత్య దేశాలలో ఎక్కువ అభివృద్ధిలోకి వచ్చింది. వీరు ఆరడగుల ఎత్తువరకు మూసి ఉంచిన భాగంలో కనపడకుండా దాగి ఉండి తమ తలల మీదనే బొమ్మలనాడిస్తారు. ఇందులో ఒక్కొక్క బొమ్మకు నలుగురైదుగురు వ్యక్తులు పని చేస్తారు. ఈ బొమ్మలు గుడ్డ బొమ్మలు. కాని మనుష్యులు లాగానే ఆడుతున్నట్లు సూత్ర సహాయంతో సూచిస్తారు.

భారతదేశంలోని రాజస్థాన్‌లో ఇటువంటి ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలుస్తోంది. వీరు ప్రచ్ఛన్నంగా ఉండి పైనుంచే బొమ్మలను సూత్ర సహాయంతో ఆడిస్తారు. పాశ్చాత్య దేశాలలోని బొమ్మలు ఐదు విధాలు. 1.ఛాయా బొమ్మలు (Shadow Puppets), 2. చేతి బొమ్మలు (Hand Puppets), 3. చేతి కర్ర బొమ్మలు (Hand and Rod Puppets), 4. కర్ర బొమ్మలు (Rod puppets), 5. సూత్రీయ బొమ్మలు (String controlled Puppets).

శ్రీ.చ.

కర్నాడ్, గిరీష్ (జ.1938) : నటుడు, నాటక రచయిత. భారతీయ నాటకరంగం ప్రాంతీయ నాటకరంగంగా మాత్రమే అభివృద్ధి పొందుతున్న తరుణంలో అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళి ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టిన ఘనత గిరీష్ కర్నాడ్‌కే దక్కుతుంది. జాతీయ స్థాయిలో నాటక రచయితగా జ్ఞానపీఠ్ పురస్కారం అందుకొన్నాడు. గిరీష్ కర్నాడ్ 1938, మే 19న ధారవాడ (ఉత్తర కర్ణాటక)లోని మాథె రాన్‌లో జన్మించాడు. 1958లో రోడ్స్ స్కాల ర్‌గా ఆక్స్‌ఫర్డ్‌లో ఎం.ఎ. ముగించుకొని తిరిగి వచ్చాడు. ఐదారేళ్ళు ఉద్యోగం చేస్తూ నాటకాలు వేస్తూ, రాస్తూ సినివహాల పట్ల కూడా ఆకర్షితులయ్యాడు. అనంత మూర్తి నవల సంస్కారను చలనచిత్రంగా రూపొం దించి నపుడు, దానికి మాటలు సమకూర్చడమే కాక నాయకుడిగా కూడా నటించి ఆ చలన చిత్ర విజయానికి కారణమనిపించుకున్నాడు.



ఈయన మొదటి నాటకం యయాతి (1961) భారతీయ పురాణంలోని ఒక ఘట్టాన్ని ఇతి వృత్తంగా తీసుకొని చేసిన రచన ఇది. ఈ నాటకంలో యయాతి తన కొడుకు పురు నుండి యౌవ్వనాన్ని తీసుకుంటాడు. ప్రాపంచిక సుఖాల పట్ల ఆకర్షణ తగ్గనపుడు యౌవ్వనంలోనే సుఖం ఉందనుకుంటాడు. చివరికి పశ్చాత్తాపపడతాడు. ఒకవ్యక్తితాను తీసుకునే నిర్ణయాలకు తానే బాధ్యుడు అనే అస్తిత్వ వాదం దీనికి ప్రాతిపదిక.

తుగ్లక్ (1964) రెండవ నాటకం. నలభైపాత్రలతో కావ్యంలా సాగే ఉత్తమ నాటకమిది. సామాన్యంగా ప్రజలు అనుకునే పిచ్చి తుగ్లక్ లా కాక ఒక విషాద నాయకునిగా తుగ్లక్‌ను చిత్రించిన నాటకం. తుగ్లక్ అపజయాలకు కారణం అతని చుట్టూ ఉన్న వాతావరణమనీ, అతడు సదుద్దేశంతో చేసిన పనులు కూడా అతని ఆప్త వర్గంలోని స్వార్థపరులైన నాయకులు, మతాధికారుల దుర్మార్గాలవలన రాణించలేదని, వారి ఒత్తిడికి బలి అయినట్టుగా తుగ్లక్‌ను చిత్రించాడు నాటక రచయిత.

జానపదాల నుంచి ఇతివృత్తాలుగా తీసుకొని చేసిన రచనల్లో ముఖ్యమైనవి హయవదన *(1971)*, నాగమండల *(1988)*. బుద్ధిబలం గొప్పదా? దేహబలం గొప్పదా? అనే భేతాళ ప్రశ్నను ఒక జానపద కథలో ఇమిడ్చి ఉత్కంఠ భరితంగా రచించిన నాటకం హయవదన. బుద్ధికి, శిరస్సుకూ ప్రతీకగా దేవదత్తుడూ, దేహబలానికీ ప్రతీకగా కపిలుడూ, ఈ ఇద్దరు ప్రాణ స్నేహితులూ ప్రాణప్రదంగా ప్రేమించే పద్మిని దృష్టికోణంలో ఈ సమస్య విశ్లేషించబడిన నాటకం.

1995లో ఈయన రచించిన అగ్నివర్ష అన్ని భారతీయ భాషలలోకి అనువదింపబడి విమర్శకుల మన్ననలందుకున్న రచన. యజ్ఞం చేయడమనేది మానవ కల్యాణానికి కానీ, తపస్సు మాత్రం వ్యక్తిగత ప్రయోజనానికే అని యవక్రీతుడి ద్వారా నిరూపించాడు ఈ నాటకంలో.

గిరీష్‌కర్నాడ్ నాటకాలన్నీ ఆధునికంగా ప్రదర్శించినవే. సమకాలీన సమాజానికి ముడిపెడుతూ ప్రేక్షకులను ఆలోచింపచేసే నాటకాలివి. మాతృభాష కన్నడంలోనే కర్నాడ్ నాటకాలను రాసుకుని ప్రదర్శనలిప్పించి, తరువాత వాటిని ఇంగ్లీషులోకి అనువదిస్తాడు. రచయితగానేకాక కళాకారుడిగా కూడా ఈయనకు మంచి అనుభవం వుంది. సినిమా, టి.వి. ప్రేక్షకులకు కూడా చిరపరిచితులే. గంభీరంగా కనిపించే ఏ పాత్రలోనైనా ఇమిడిపోగల కళ కర్నాడ్ సొంతం. ఆ అనుభవాల్ని, తాను చదివిన సాహిత్యాన్నీ నాటకాలుగా మలచడంలో గిరీష్ కర్నాడ్ ప్రజ్ఞాశాలి.

భార్గవి

కలాపం : యక్షకన్యలా నృత్యానికనువైన ఆహార్యంగాక ఏదో ఒక నాయిక పాత్ర ఆహార్యాన్ని ధరించి ఆడుతూ పాడుతూ

తన కథను వినిపిస్తుంటే సూత్రధారుడు హంగు చేస్తాడు. కథాసంధి, హాస్యం, చెలికత్తె మొదలైన పాత్రల వాచికం చెపుతాడు. ఈ రూపం ఇంచుమించు ఏక పాత్రాభినయ కలాపం. శ్రీనాథుని కాలం నాటికే వర్థిల్లినట్లు తెలుస్తోంది. భామాకలాపం, గొల్ల కలాపం మార్గ శాఖకు చెందినవి. వీటి సంగీతం, నృత్యం శాస్త్రోక్తమైనవి. చోడిగాని కలాపం లాంటివి దేశీ శాఖకు సంబంధించినవి. ఈ కలాపంలో సంగీతం, నృత్యం జానపద సరళిలో ఉంటుంది. ఉదా. భామా కలాపం. గొల్ల కలాపం, చోడిగాని కలాపం.

శ్రీ.చ.

కళాభిలాషక నాటక సమాజం : ఈ సమాజాన్ని 1895లో విశాఖపట్టణంలో స్థాపించారు. మారేపల్లి రామచంద్రకవి, సెట్టి లక్ష్మీనరసింహం, ఆకెళ్ళ సత్య నారాయణలు దీని వ్యవస్థాపకులు. ఈ సమాజంలో రామచంద్రకవి, లక్ష్మీనరసింహం, తడకలూరి కుప్పుస్వామి, శివకోటి అప్పలరాజు, ఎం.రత్నవేలు మొదలియార్ ప్రభృతులు ప్రధాన నటులు. రామచంద్రకవి దర్శకుడు.

సమాజంలోని సభ్యుల నాటకాలే ప్రదర్శించాలని ఈ సమాజం నియమం. అందువల్ల మారేపల్లి, లక్ష్మీనరసింహం సెట్టి, ఆకెళ్ళ సత్యనారాయణ నాటకాలే ప్రదర్శించారు. తెరల్ని (వగైరాలు) ఈ సమాజ సభ్యుడు రత్నవేలు మొదలియార్ స్వయంగా తయారు చేసేవాడు.

నాందీ ప్రస్తావనలకు బదులుగా నాటక ప్రదర్శన ముందు, చివర నాటక కర్తను గురించి, నాటకం గురించి ఉపన్యాసాలివ్వడం ఈ సమాజం వారే ప్రారంభించారు. సంస్కృత లాక్షణికులు నిషేధించిన కత్తి యుద్ధాలను వీరు ప్రదర్శించి చూపించారు. ఈ సమాజం 1912 వరకు కొనసాగింది. ఈ సమాజం *జయంత జయపాలం, హరిశ్చంద్ర, బిల్హణీయం, సావిత్రి, కన్యకాపరమేశ్వరి, సారంగధర, కంసవధ, వేణీసంహారం, పారిజాతాపహరణం, గయనాటకం, కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం* మొదలైన నాటకాలను ప్రదర్శించింది.

శ్రీ.చ.

కళారాధన, హైదరాబాదు : ఈ సమాజం 1964లో హైదరాబాదులో స్థాపించబడింది. దీని వ్యవస్థాపకులు బి. భాను ప్రకాష్, ఆర్. వి. ఎస్. రామస్వామి, శశాంక రావు, శ్రీనివాస మూర్తి, శ్రీరంగం శ్రీధరాచార్య, శ్రీకాంత్ ప్రభృతులు. ఆంధ్ర దేశంలో నాటక పరిషత్తులు ఆవిర్భవించి అన్ని జిల్లాల్లోను నాటక పోటీలు జరుపబడుతున్న రోజుల్లో ప్రారంభమైన ఈ కళా సంస్థ దాదాపు అన్ని పరిషత్తు పోటీలలోనూ పాల్గొని అసంఖ్యాకంగా బహుమతులు గెల్చుకొంది. కళారాధన సమాజం పోటీలకు వస్తుందంటే ఇతర సమాజాలకు దడ పుట్టేలా ఉండేది. ఈ సమాజం ప్రదర్శించే ప్రతి నాటకానికి భానుప్రకాష్ దర్శకుడు. ఈ సమాజానికి ఆస్థానకవి ఆర్. వి.ఎస్. రామస్వామి. ఈయన రచించిన *చీకటికోణాలు, వలయం, సుడిగాలి, గాలివాన, కెరటాలు, వెల్లువ, శ్రీమాన్ శ్రీపతి, వర్ధంతి, గాలిపటం* మున్నగునాటకాలకు కళారాధన తన అద్భుత ప్రదర్శనలతో ప్రాణం పోసింది. వరప్రసాద్ (నూతన్ ప్రసాద్, సుప్రసిద్ధ చలన చిత్ర నటుడు) శ్రీకాంత్, భానుప్రకాష్, దేశిరాజు హనుమంత రావు, ధరణీధర్, శ్రీనివాస మూర్తి, శ్రీధరాచార్య, ఆర్.వి. ఎస్. రామస్వామి, చలపతి, రామమూర్తి తదితరులు కళారాధన నాటకాల్లో పాల్గొన్న నటులు. క్రమశిక్షణతో, నాటక కళపట్ల అంకిత భావంతో ఈ సమాజ సభ్యులు కళారంగానికి సేవ చేశారు.

గం.సు.రె.

కవాలమ్ నారాయణ ఫణిక్కర్ (జ.1928) : మలయాళీ నాటక రచయిత, నవలా రచయిత, అనువాదకుడు, నాటక దర్శకుడు. ఈయన కుంజలక్ష్మి, గోదావరి తిరుముల్‌పాద్ దంపతులకు 1928, ఏప్రిల్ 28న కేరళలో అలెప్పీ జిల్లాలో జన్మించాడు.

ఈయన కేరళ విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ. పట్టాను, 'లా' డిగ్రీని మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి తీసుకున్నాడు. అలెప్పీ జిల్లా కోర్టులో 1955 నుంచి 1961 వరకు న్యాయవాదిగా పనిచేశాడు. ఆయన ఆసక్తిగల చారిత్రక అన్వేషకుడుగా కేరళ జానపదకళలపై అనేక పరిశోధనలు నిర్వహించాడు. ఆయన కేరళ సంగీత నాటక అకాడమీ కార్యదర్శి (1961-71)గా ఎనలేని సేవలు చేశాడు. తిరువనంతపురంలోని ప్రయోగాత్మక నాటకరంగ 'సోపానం' కు ఆయన వ్యవస్థాపకుడు/డైరెక్టరు. సంగీతం వంటి వివిధ నాట్య, సంగీత రూపాలను ఆధారంగా చేసుకొని నాటకరంగ మౌలిక సూత్రాలను ఆవిష్కరించటానికి సోపానం ద్వారా ప్రయత్నించాడు. సంగీతాన్ని, నాట్యరీతులను రంగస్థల నటుల నటనను పరస్పరం అల్లుకొనేట్లు చేసి, మహాభారతం, రామాయణం వంటి పురాణ కథలలో అంతర్గతంగా ఉన్న తాత్త్విక అర్థాన్ని స్పష్టంగా చూపాడు.

ఆయన సుమారు 20 నాటకాలను రచించాడు. అందులో కొన్ని నాటకాలు *సాక్షి, అవనవన్ కదంబ, దైవతార్, కరింకుట్టీ, తిరనోత్తం, ప్రేమరెష్మి, భూతం, తిరుముడి, కొయివమా, తెయ్య తెయ్యం, మురుకుదతి*. ఆయన నవలారంగంలో కూడా తనదైన ముద్రలను ప్రదర్శించాడు.

ఫణిక్కర్ అనేక నాటకాలను మలయాళంలోకి అనువదించాడు. అందులో భాసన్ కూడా ఉంది. ఆయన

సోపానం బృందం ప్రదర్శించిన 18 నాటకాలకు, కేరళ కళా మండలం, కాళిదాస అకాడమీ, నృత్తాలయ ఈస్తటిక్ సొసైటీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, విస్కాన్సిన్ (అమెరికా సంయుక్త రాష్ట్రాలు) ప్రదర్శించిన 18 పైబడి నాటకాలకు దర్శకత్వం వహించాడు.

ఆయన ప్రపంచంలో జపాన్, లండన్, పోలెండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, రష్యా, చైనా వంటి అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు.

చంద్ర

కాంగ్రేవ్, విలియం (1670-1729) : డబ్లిన్. ఇంగ్లీషు నాటకకర్త. పునరుద్ధరణ కామెడీ (Restoration Comedy) రచనలో సిద్ధహస్తుడు. డబ్లిన్‌లోని ట్రినిటీ కాలేజీలో చదువుకుని మిడిల్ టెంపె కళాశాలలో ప్రవేశించాడు. అపుడే రచనా వ్యాసంగం ప్రారంభించాడు. ఈయన మొదటి నాకటం ఓల్డ్ బాచలర్. ఈ నాటకాన్ని 1693లో విజయవంతంగా ప్రదర్శించారు. ఆ తరువాత వరసగా ఆహ్లాద నాటకాలు, విషాద నాటకాలు రాశాడు. విషాద నాటకాలలో ఎక్కువ కీర్తి గడించింది ది మోర్నింగ్ బ్రయిడ్. ఈయన రచనలు తీవ్ర విమర్శకు గురైనా వాటి శైలీ ప్రభావం వల్ల నేటికీ చదువుతున్నారు, చూస్తున్నారు. కాంగ్రేవ్ రచించిన ఓల్డ్‌బాచలర్ (1693), డబుల్ డీలర్ (1693), మోర్నింగ్ బ్రయిడ్ (1693), లవ్ ఫర్ లవ్(1695), ది వే ఆఫ్ ది వరల్డ్ (1700) మొదలైన నాటకాలను కందుకూరి వీరేశలింగం అనువదించాడు.

శ్రీ.చ.

కాంతయ్య, పావట్ల (1880-1923) : కవి, హిందూస్తానీ సంగీత విద్వాంసుడు, వాగ్గేయ కారుడు, స్వరసింహ బిరుదాంకితుడు. ఈయన జగ్గయ్యపేటలో 1880లో జన్మించాడు.

ఈయనను మొట్టమొదటగా ఆంధ్రదేశానికి పరిచయంచేసిన వ్యక్తి రాజమండ్రి గున్నేశ్వర రావు. చింతామణి నాటక సమాజ నాటకాలకు కాంతయ్య పాటలు రాశాడు. తరువాత మైలవరం కంపెనీలో వాగ్గేయకారుడిగాచేరి ప్రహ్లాద, శాకుంతల, సావిత్రి, మొదలయిన నాటకాలకు పాటలురాసి ఖ్యాతి గడించాడు. నేటికీ వృత్తి నాటక సమాజాల వారు పాడే ప్రార్థనా గీతం 'పరబ్రహ్మ' ఈయన స్వరపరిచిందే. ఈయన వేములవాడ దేవాలయ ఆస్థాన పండితుడిగా ఆమరణాంతం వ్యవహరించాడు.

శ్రీ.చ.

కాకరాల (జ.1937) : రంగస్థల, సినీ నటుడు. ప్రజా నాట్యమండలి సభ్యుడు. 1937, డిసెంబరు 18న వీరభద్రం, కనక మహాలక్ష్మి దంపతులకు జన్మించి కాకరాలగా వాసి కెక్కిన ఈయన పూర్తి పేరు వీర వేంకట సత్య నారాయణ. కాకరాల బాల్యం అమ్మమ్మ ఊరైన పశ్చిమగోదావరి జిల్లాలోని కాకరపర్రులో గడిచింది. ఈ ఊరు ఆ రోజుల్లో సాంస్కృతిక కార్య కలాపాలకు కేంద్రంగా ఉండేది. శ్రీరామనవమి ఉత్సవాలు, దేవీ నవరాత్రులు సందర్భంగా భజనలు, నగర సంకీర్తనలు, హరికథలు, బుర్రకథలు, తోలుబొమ్మలాటలు, నాటకాలు జరుగుతూ ఉండేవి. వీటన్నింటిని వెర్రిగా చూసి పొందిన స్ఫూర్తితో తన బాల్య స్నేహితులను కలుపుకొని స్వీయ దర్శకత్వంలోనే తన పన్నెండవ ఏట జయంత జయపాల అనే జానపద నాటకం ద్వారా రంగస్థల ప్రవేశంచేశాడు. ఈయన కంఠంలోని శ్రావ్యత, పద్య పఠనం విన్న తెలుగు మాస్టారు ఈయనతో భోజ సభలో సంస్కృత పండితునిగవేషం వేయించాడు. నటన పట్ల కాకరాల మొగ్గు చూపడంతో చదువు కుంటు పడింది. దాంతో ఈయన తండ్రి రాజమండ్రిలో ఎస్.ఎస్.ఎల్.సిలో చేర్పాడు. స్కూల్ పక్షాన ప్రదర్శించిన వెంకన్న కాపురంలో పెద్దకొడుకుగా నటించాడు.



ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు స్క్రూటినీ ఇస్తున్న సందర్భంలో ఆశువుగా కాకరాల చేసిన అభినయం గరికపాటి రాజారావు సమాజంలో సభ్యుడ్ని చేసింది. ఇది 1957లో జరిగిన సంఘటన. ఆనాటి నుంచి చివరివరకు రాజారావుతోనే వుండి, ఆయన తద నంతరంకూడా చిత్తశుద్ధితో కృషిచేస్తున్న కళాకారులలో కాకరాలది అగ్రస్థానం. రాజారావుతో గల సాన్నిహిత్య ఫలమే కాకరాలను అధ్యయనశీలిగా, అత్యుత్తమ కళాకారుడుగా రూపొందించింది. రాజారావుతో కలిసి ఆత్రేయ రచించిన భయంలో అకౌంటెంటు, కొర్రపాటి గంగాధరరావు రచించిన భవబంధాలులో కమలాకరంగా, మనోవ్యథలో డాక్టర్‌గా, నాబాబులో చైతన్యం పాత్రధారణ చేశాడు. గరికపాటి ప్రతిష్ఠాత్మక

నాటకం అల్లూరి సీతారామరాజులో సింగన్న, జై భవానిలో బాజీరావు పాత్రలు పోషించాడు.

రావికొండలరావు నాటకం పట్టాలు తప్పిన బండిలో టెలిఫోన్ మామయ్య లక్ష్మీపతి, నాలుగిళ్ల చావిడిలో భీమశంకరం, కుక్కపిల్లదొరికింది మొదలైన నాటక నాటికల్లో నటించాడు. అలాగే జె.వి.రమణమూర్తితో కన్యాశుల్కంలోను, సప్తపది, వాగ్దానం, గాంధీ జయంతిలోను, కాళహస్తీశ్వర మాహాత్మ్యంలోనూ నటించాడు.

ఈయన పట్టాలు తప్పిన బండిలోని టెలిఫోన్ మామయ్య లక్ష్మీపతి పాత్రకి ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ఉత్తమ హాస్య నటుని బహుమతి, నంది నాటకోత్సవాలలో ఉత్తమ సహాయనటుడి. బహుమతులు లభించాయి. ఇక సినిమారంగంలో కూడా కాకరాలది ఓ ప్రత్యేకస్థానం. అనేక చలన చిత్రాలలోను, టివి సీరియల్స్‌లోనూ నటించి ప్రశంసలుపొందాడు. తెలుగు నాటక రంగం వికాసానికి విలువైన ప్రసంగాలుచేస్తూ, ప్రజానాట్యమండలి సిద్ధాంతాలకి కట్టుబడ్డ క్రియాశీలి కాకరాల.

మన్నెశ్రీ

కాకినాడ ఎమెచ్యూర్స్ : ఈ సమాజాన్ని 1913లో కాకినాడలో స్థాపించారు. దీని వ్యవస్థాపకులు నటులు పళ్ళే హనుమంతరావు, వి.వి.ఎల్. నరసింహారావు, రామారావు నాయుడు, ఎలగర్ల రామచంద్రరావు మొదలైనవారు. ఈ సంఘంలోని నటులంతా విద్యావంతులు, ఉద్యోగస్తులు. గోదావరి మండలమంతా పర్యటించి, నాటకాలు ప్రదర్శించి విఖ్యాతిగాంచిన సమాజం ఇది. రాజమండ్రిలో జరిగిన గయోపాఖ్యాన పోటీలలో ఈ సమాజంలోని వి.వి.ఎల్. నరసింహారావు నటించిన గయపాత్రకు బహుమతి లభించింది. గయోపాఖ్యానం, నరకాసుర వధ, పాండవ విజయం, చిత్ర నళీయం మొదలైనవి ఈ సమాజం ప్రదర్శించిన నాటకాలు.

శ్రీ.చ.

కాకువు : వాచికాభినయ భేదం. వివరాలకు వాచికాభినయం చూడండి.

శ్రీ.చ.

కామావస్థలు : కామాతురమైన కన్యగాని, పురుషుడుగాని మనోరథం తీరనపుడు పదిఅవస్థలకు లోనవుతారు. ఈ అవస్థలనే కామావస్థలంటారు. ఇవి స్త్రీ పురుషులిద్దరికీ సమానం. ఇవి అయోగ లేక పూర్వానురాగ స్థితికి సంబంధించినవి. అర్వాచీనాలంకారికులు వీటికి ఇచ్ఛ, ఉత్కంఠ చేర్చి పన్నెండుగా చెప్పారు.

భరతుడు చెప్పిన పది కామావస్థలు : 1. అభిలాష, 2. చింతనం, 3. అనుస్మృతి, 4. గుణకీర్తన, 5.ఉద్వేగం, 6. విలాసం, 7. ఉన్మాదం, 8. వ్యాధి, 9. జడత, 10. మరణం.

ధనంజయుడు వ్యాధిని దశరూపకంలో సంజ్వరమని, అనుస్మృతిని స్మృతియని, గుణకీర్తనాన్ని గుణకథనమని, విలాసాన్ని ప్రలాపమని చెప్పాడు. నరసభూపాలీయంలో చూచుట, చింతించుట, తలచుట, గుణ వినుతి, అరతి, తాపం, లజ్జాస్ఖలనం, గమనం, మూర్ఛ, ధన్యత అని తెలిపి విశ్వనాథుడు వీటిని కామ దశలు అన్నాడు. ప్రతాపరుద్రీయంలో ఈ పది అవస్థలకు తోడుగా ప్రలాపం, సంజ్వరం అని మరి రెండు చెప్పాడు.

కా మే స్వరరావ్, [illegible]

శ్రీ.చ.

కామేశ్వర రావు, కవివరపు (జ.1929) : రంగస్థల నటుడు, దర్శకుడు, ప్రయోక్త, నాటకసమాజ నిర్వాహకుడు.



పుట్టి పెరిగింది నెల్లూరులో. భ్రమరాంబ, కృష్ణారావు దంపతులకు 1929, మే 31న కామేశ్వర రావు జన్మించాడు. నెల్లూరు వి.ఆర్. కళాశాలలో ఇంటర్ తరువాత, లా చదవడానికి బందరు వెళ్ళాడు. బి.ఎల్. పూర్తయ్యాక గుంటూర్లో ప్రముఖ న్యాయవాది దేశిరాజు హనుమంత రావు వద్ద అప్రెంటిస్‌గా చేరాడు. ఈలోగా ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌కు మకాం మార్చాడు.

పోలీసుచర్య అనంతరం హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడినా, సాయంత్రాలు గడవడం ఉద్యోగులకు సమస్యగా ఉండేది. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం, వేమన గ్రంథాల యాలలో మాత్రమే కవి సమ్మేళనాలు, నాటకాలు జరుగుతుండేవి. అంతకుమించి తెలుగుపాటకు, తెలుగు మాటకు హైదరాబాద్‌లో గౌరవం ఉండేది కాదు. ఈ పరిస్థితిని భరించలేని కొందరు మిత్రులతో కలిసి కామేశ్వరరావు ఇండియన్ నేషనల్ థియేటర్ ఆవిర్భావానికి శ్రీకారం చుట్టాడు. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎస్. నాయక్ అధ్యక్షుడిగా, ప్రఖ్యాత నాటక ప్రయోక్త ఎ.ఆర్.కృష్ణ ప్రధాన కార్యదర్శిగా, కామేశ్వర రావు సంయుక్త కార్యదర్శిగా ఆ సంస్థ ఏర్పడింది. మొదట్లో అబ్బరాజు వెంకట్రామయ్య ఢిల్లీ ఛలో నాటకం ప్రదర్శించాడు. తరువాత బెల్లంకొండ రామదాసు మా పార్టీ, గిడుతూరి సూర్యం అధికారి నాటకాల ప్రదర్శనలు ఆరంభించారు. ప్రదర్శనలు మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు వీలుగా ప్రొడక్షన్ బాధ్యతలు

ఎ.ఆర్. కృష్ణకు అప్పగించి నిర్వహణ వ్యవహారమంతా కామేశ్వరరావు భుజాల పైకెత్తుకున్నారు. నిర్వహణ బాధ్యత మోయడంవల్ల రావు వేషాలు వేయడం తగ్గిపోయింది. విభిన్నశైలిలో నడిచే హాస్య పాత్రలను పోషించి బహుమతులు అందుకున్నా, నిర్వాహకుడిగా వచ్చిన పేరు ముందు నటుడు మరుగున పడిపోయాడు.

కామేశ్వరరావు అజమాయిషీలో ఇండియన్ నేషనల్ థియేటర్ మిగతా సమాజాలకు ఆదర్శంగా నిలిచింది. రిహార్సల్స్, నాటక ప్రదర్శనల్లో సమయపాలన, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవాడు. కె.ఎల్.నరసింహారావు *కొత్తగుడి*, మాధేయండ రామారావు *బలిదానం*, ఎ.ఆర్.కృష్ణ *నిచ్చెనలు*, *అరగంటలో అదృష్టం*, చిల్లర భావనారాయణ *అగ్గి గుండెలు*, ఎన్. తారక రామారావు *శరణం గచ్ఛామి* నాటకాలను సమాజం తరపున విరివిగా ప్రదర్శించాడు. సంధ్యాఛాయ నాటకం నూట ఎనిమిదిసార్లు విజయవంతంగా ప్రదర్శింపబడింది. కామేశ్వరరావు సుశిక్షితుడైన సాంస్కృతిక సైనికుడు. టిక్కెట్లు, పాసులు లేకుండా ప్రదర్శనకు వచ్చే ఎంతటివారినైనా అనుమతించేవాడు కాదు. శాసనసభ్యుల కోసం ఒకసారి నాటకం ప్రదర్శిస్తుండగా పాస్ లేకుండా వచ్చిన ఒకే ఒక వ్యక్తికి కామేశ్వరరావు ఆహ్వానం లభించింది. ఆయన ఎవరో కాదు పుచ్చలపల్లి సుందరయ్య. నాటక ప్రదర్శనలో కొత్త ప్రయోగాలు అంటే రావుకు వల్లమాలిన ఆసక్తి. కలకత్తా, బంబాయి పర్యటించి అక్కడి రంగస్థల పోకడలను ఆకళింపు చేసుకొని వచ్చి వాటిని అమలుపరచడానికి ఎంతో శ్రమించేవాడు. 1961లో తొలి మూకాభినయ ప్రదర్శన ఏర్పాటు చేసి మైమ్ కళాకారులకు స్ఫూర్తినిచ్చాడు. 1977లో రాష్ట్రంలో 'రివాల్వింగ్ సెట్' రూపొందించి ప్రదర్శనలు ఏర్పాటుచేసిన ఘనత కామేశ్వరరావుదే.

ప్రపంచ తెలుగు మహాసభలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ ఉత్సవాలు, స్వాతంత్ర్యరజతోత్సవాలు, నంది నాటకోత్సవాల నిర్వహణకు కువిపరపు ప్రభుత్వానికి చేదోడుగా నిలిచాడు. నాటక రచనా పోటీలు నిర్వహించి కొత్త నాటకాలతో రంగస్థలానికి రంగు లద్దాడు. నాటకాలే కాకుండా సంగీతం, నృత్యకళల వికాసానికి కూడా ఆయన కృషిచేశాడు. హైదరాబాద్ జవహర్ నగర్‌లో ప్రభుత్వం నుంచి స్థలం సంపాదించి, దానిని కబ్జాల బారి నుంచి రక్షించి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మించాడు. దీంతో సొంత ఆడిటోరియం ఉన్న తొలి సమాజంగా కూడా ఇండియన్ నేషనల్ థియేటర్ నిలిచింది. అప్పటి నుంచి కామేశ్వరరావు పేరు 'ఐ.ఎన్.టి. కామేశ్వరరావు'గా స్థిరపడింది. హౌసింగ్ బోర్డులో లా ఆఫీసర్‌గా రిటైర్ అయ్యాక మళ్లీ న్యాయవాద వృత్తి చేపట్టాడు. తన సంపాదనతో ట్రస్టును స్థాపించి పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నాడు. 'సంస్కృత సేవక్' అనే బిరుదు, నాటక అకాడమీ సభ్యత్వం ఆయన కళాసేవకు అందిన కొన్ని గౌరవాలు. ప్రయోగాలతో, కొత్త పథకాలతో ఎప్పటికప్పుడు నాటకానికి ఊపిరి పోయగలిగిన వారుంటేనే అది జీవకళగా అలరారుతుందని కామేశ్వరరావు విశ్వసిస్తాడు.

పి.వి.రా.నా.

కామేశ్వర రావు, భమిడిపాటి(1897-1958) : నాటక రచయిత, ఉపాధ్యాయుడు, నటుడు, 'హాస్యబ్రహ్మ' బిరుదాంకితుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో 1897, ఏప్రిల్ 30న లచ్చమ్మ నరసావధానుల దంపతులకు జన్మించాడు.



నరసాపురం టైలర్ హైస్కూలులోను, కాకినాడ, రాజమహేంద్రవరం కళాశాలలో విద్యార్థి దశలో సుప్రసిద్ధ విద్యావేత్తలు, కళావేత్తలు ప్రణతార్థహర అయ్యర్, కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం నాయుడు శిక్షణలో సత్సంప్రదాయాలు, కళా రహస్యాలు ఆకళింపు చేసు కున్నాడు. బి.ఏ. తరువాత ఒక సంవత్సరం అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో పనిచేశాడు. వీరేశలింగంఆస్తికోన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడుగాచేరి క్రమేపి ప్రధానోపాధ్యాయుడుగా ఎదిగాడు. రేఖాగణితం బోధించడంలో అసమానడను పేరు గడించాడు. ఈయన హాస్యరస స్రష్ట, హాస్య రచనలు చేసి ఆంధ్ర ప్రజానీకం ఆదరాభిమానాలను చూరగొన్నాడు. ఈయన ప్రసంగిస్తూ శ్రోతలను కడుపుబ్బ నవ్విస్తాడు కానీ ఈయన ఎంతో గంభీరంగా కనిపిస్తాడు.

ఈయనకు ఆంధ్రాభిమానం ఎక్కువ. అనైక్యత వల్ల, బహునాయకత్వంవల్ల ఆంధ్రజాతి పాడయిపోతోందని బాధ పడేవాడు. దీని ఫలితమే కచటతపలు అనే హాస్య నాటిక. మానవులలోని బలహీనతలను హాస్యం ద్వారా ఎత్తి చూపడంలో దిట్ట. 1924 ప్రాంతంలో నాటకంలో పద్యం పాడాలా, చదవాలా, రాగం ఎంతపెట్టాలి అనే ప్రశ్నలు ఆంధ్రదేశంలోఅలజడి కలిగించాయి. కామేశ్వరరావు ఈ అలజడిలో పాల్గని నాటకంలో పద్యాలు చదవాలేగాని, పాడకూడదని సిద్ధాంతీకరిస్తూ, *ఆంధ్ర నాటక పద్య పఠనం* అనే గ్రంథం రచించి ప్రచురించాడు. అనేక సభలలో సోదాహరణగా ఉపన్యసించాడు. కళాపూర్ణోదయం క్లుప్తీకరించి గంటలో పద్యాలు చదివేవాడు. కాశీఖండం,

భారతంలోని కొన్నికొన్ని ఘట్టాలు రాగంలేకుండా చదివి, శ్రోతలను మైమరపించి పద్య పఠనమే మంచిదనే అభిప్రాయాన్ని కలిగించాడు.

త్యాగరాజ కీర్తనలు మథించి *త్యాగరాజ ఆత్మ విచారం* అనే వ్యాఖ్యాన గ్రంథం రచించాడు. మేటర్ లింక్, మొలియర్, భాస మహాకవి ఈయనకు అభిమాన రచయితలు. మొలియర్ ప్రభావం ఈయన రచనల మీద ఎక్కువగా కనిపిస్తుంది. భాస నాటకాలు, ఏకాంకికలు అందరూచదువుకోవడానికి, ప్రదర్శించడానికి అనువుగా కేవలం వచనంలో అనువదించాడు.

కామేశ్వరరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. నిరాడంబర జీవి, దైవచింతనాపరుడు, శిష్టాచార సంపన్నుడు, ఆత్మ గౌరవానికి ప్రాధాన్యమిచ్చిన మహావ్యక్తి, సత్శీలుడు. ఈయన తొలిగా మెటర్‌లింక్ నాటికలు మూడింటిని అనువదించాడు. ఉద్యోగ విరమణ తరువాత శూద్రకుని మృచ్ఛకటికం, భాస నాటక చక్రం మొదలైనవి అనువదించాడు.

కచటతపలు (1927), *బాగు బాగు, ఎప్పుడూ ఇంతే* (1929), *వద్దంటే పెళ్ళి, తప్పనిసరి, ఘటన* (1939), *పెళ్ళి ట్రైనింగ్, ఎవరి గొడవ వాళ్ళది, నామాటే నెగ్గింది, పూర్వరంగం, రెండూ రెండూ నాలుగు* (1946), *మాయల మాలోకం, పెళ్ళి కంట్రోలు* (1950), *రాక్షస గ్రహణం, వసంతసేన, ప్రణయ రంగం, వినయప్రభ, ఈడూ జోడూ, చెప్పలేం* (1953), *జరగాలి, అనుకోవాలి, నిజం కూడా అబద్ధమే , స్వప్నం, ఐదు రోజులు, కర్ణ హృదయం, ఘటోత్కచ, రాయబారం, దుర్యోధన పతనం, పట్టాభిషేకం, ప్రతిజ్ఞ, ప్రతివం, బాలకేసరి, బాలకృష్ణమాయ, మధ్యముడు, శాంతిదూత* (1955), *స్వరాజ్యం* (1956) మొదలైన నాటకాలు రచించాడు. *ఆంధ్ర పద్య పఠనం* (1957), *త్యాగరాజ ఆత్మ విచారం, నౌకాయాత్ర* ఇతర రచనలు. కామేశ్వరరావు 1958, ఆగస్టు 29న నిర్యాణం చెందాడు.

శ్రీ.చ.

కామేశ్వరరావు, శ్రీపాద (1878-1943) : నాటక సిద్ధాంతవేత్త, విమర్శకుడూ, నాటక కర్త, నటుడు, సంగీతజ్ఞుడు. ఈయన 1878లో రాజమండ్రిలో జన్మించాడు. తల్లి దండ్రులు నర్సమ్మ, ఉమామహేశ్వరరావు.

శ్రీపాద ఎం.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడై రాష్ట్ర విద్యాశాఖలో అధ్యాపకుడిగా, డి.ఇ.ఓ గా పని చేశాడు. రాజమండ్రిలో ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించాడు.

తెలుగు నాటక ప్రయోగ, రచనా విధానాలను గురించి సిద్ధాంత, విమర్శ వ్యాసాలు అనేకం ప్రచురించి, ఉపన్యసించి తెలుగు నాటక ప్రగతిలో ప్రముఖ పాత్ర వహించాడు. తెలుగు నాటక రంగంలో సంగీతం మితి మీరిపోయి నటనను, ప్రయోగాన్ని దెబ్బతీస్తున్నదనే విశ్వాసంతో వచన నాటకాల ఆవశ్యకతను ప్రచారం చేస్తూ, ఉద్యమం లేవదీశాడు. నేటి తెలుగు వచన నాటకానికి నాంది పలికాడు.

ద్విజేంద్రలాల్‌రాయ్ రచించిన కాళిదాస భవభూతులు అనే విమర్శన గ్రంథాన్ని నాటక మీమాంస (1929) అనే పేరుతో అనువదించి దానికి అనుబంధంగా రాయ్ వాదనలను నిశితంగా విమర్శించాడు. ఈయన ప్రచురించిన సుదీర్ఘ వ్యాసం ఎంతో విలువైంది. నాటక పోటీలు నిర్వహించే విధానం, గుణ నిర్ణేతలు మార్కులు వేయవలసిన విధానం తొలుత ఆంధ్రపత్రిక ఉగాది సంచిక (1917 -18)లో పత్రికాముఖంగా వెలువరించాడు. 1908లో రాజమండ్రిలో రాజమండ్రి అమెచ్యూర్స్ అనే నాటక సంస్థ స్థాపించి ఆదర్శవంతంగా నాటకాలు ప్రదర్శించాడు. నిర్మొహమాటంగా నిశితంగా విమర్శించేతత్వం ఈయనది. అందుకని తెలుగు నటులకు ఈయనంటే సింహస్వప్నం. కామేశ్వరరావు తెలుగు నాటకాలలోనే గాక ఇంగ్లీషు నాటకాలలో కూడా నటించాడు.

చాణక్య, రాణా ప్రతాప్, పేరిగాడు, కీచకుడు, అశ్వత్థామ మొదలైన పాత్రలు నేర్పుగా నటించి పేరు పొందాడు. బెంగాలీ, మహారాష్ట్ర, ఓఢ్ర మొదలైన భారతీయ భాషల నుంచి నాటకాలను తెలుగులోకి అను వదించాడు.

కొత్తల్లుడు (1921), చంద్రగుప్త (1925), సొరాబు రుస్తుం (1925), గడుసు గంగలు (1925), భారత రమణి (1926), సీత (1926), రాణా ప్రతాప్ (1926), పిసినిగొట్టు (1926), బిల్వ మంగళ (1927), లీలావతీ సులోచన (1927), పునర్వివాహం (1928), తగిన శాస్తి (1929), కళాపహాడ్ (1931), మొదలైనవి అనువాద నాటకాలు. శ్రీపాద 1943, మార్చి 16న రాజమహేంద్రవరంలో కన్నుమూశాడు.

శ్రీ.చ.

కారంత్, బి.వి (జ. 1929) : కన్నడ నాటక రచయిత, నటుడు, దర్శకుడు. కర్ణాటకలోని బాబుకోడిలో 1929, సెప్టెంబర్ 19న అతిపేద కుటుంబంలో జన్మించిన కారంత్ బాల్యం నుంచే సంగీత సాహిత్యాల పట్ల మక్కువ చూపేవాడు. ఈ మక్కువే కారంత్‌ను 'గుబ్బి వీరణ్ణ' నాటక కంపెనీకి చేర్చింది. ఎందరో ప్రసిద్ధుల్ని నాటక, సినీ రంగాలకందించిన సంస్థ ఇది. ఈ ప్రముఖుల పరిచయం కారంత్ ఆశించే కళాత్మక ప్రపంచం వైపుకు పరుగులు పెట్టించింది. జి.వి.అయ్యర్, రాజకుమార్, బాలకృష్ణ వంటి సినీ, నాటకరంగ దిగ్గజాలతో కారంత్ గుబ్బి కంపెనీల మనుగడ సాగింది. ఆ కంపెనీలోనే బాల్యంలో చిన్న చిన్న వేషాలు వేశాడు. కారంత్‌లోని సృజన, కళాతృష్ణ ఆ కంపెనీ పరిధిలో ఒదగలేకపోయాయి. ఉత్తరాదికి వెళ్ళి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో హిందీ ఎం.ఏ.లో చేరాడు. ఈ చదువు



కడుపు నింపుకోవటానికే. కారంత్‌లోని కళాకారుడి ఆరాటం అతన్ని ఆనాటి సుప్రసిద్ధ విద్యాంసుడు పండిట్ ఓంకారనాద టాగూర్ వద్ద సంగీతాన్ని అభ్యసించేటట్లు పురిగొల్పింది. కారంత్ జీవితంలో ఇదొక పరిణామదశ. బాల్యం కర్ణాటకలో గడిపి, యవ్వన దశ ఉత్తర భారతంలో గడపటంతో భిన్న ప్రాంత ప్రజల జీవన సరళితో, ఆచారవ్యవహారాలలో అతనికి ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. ఈ అనుభవమే ఉత్తరోత్తరా నాటక, సినీరంగాలలో దర్శకుడిగా విజయం సాధించటానికి తోడ్పడింది.

దర్శకుడిగా కారంత్ విజయం చెందటానికి, నాటకాన్ని ప్రజల హృదయాలకు చేరువ చేయటానికీ ప్రధాన కారణం దేశ పలు ప్రాంతాల్లో అతని మజలీలే. మరో కారణం సర్వసమగ్ర కళారూపంగా నాటకాన్ని రూపొందించ టంలో కారంత్‌కు సంగీత ఉపజ్ఞ తోడ్పడింది. సైడ్ పైపర్, కైలాసం వంటి నాటకాలను సంగీతాత్మ కాలుగానే కారంత్ తీర్చి దిద్దాడని మర్చిపోలేం. అప్పటికే భారతీయ, పాశ్చాత్య నాటక రచనల్ని, ఆధునిక నాటక దర్శకుల ధోరణుల్ని, ప్రజ్ఞా పాటవాల్నీ వంట పట్టించుకొన్నా, మరేదో నేర్చుకోవాలన్న తపనతో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో చేరి డిప్లొమా పొందాడు కారంత్.

లంకేష్

బెంగుళూరుకు తిరిగి వచ్చిన కారంత్ 'కన్నడ భారతి' పేరున ఒక నాటక సంస్థను స్థాపిం చాడు. బాదల్ సర్కార్ 'ఏవం ఇంద్రజిత్, లంకేష్, సంక్రాంతి, ఈడిపస్, కింగ్‌లియర్‌కు కన్నడరూపం జోకుమారస్వామి వంటి నాటకాలకు దర్శకత్వం వహించాడు. ఈ నాటకాలు కారంత్‌కు నాటక దర్శకుడిగా, సంగీతకారుడిగా ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. గుబ్బికంపెనీలో చేరటానికి ముందే నన్నగోపాల అనే నాటకంలో పాత్ర ధరించాడు కారంత్. గుబ్బి కంపెనీలో చేరిన తర్వాత స్త్రీ వేషం ధరించాడు. 'శ్రీ కోడెన బేడే (1967), పంజరశాలె (1971), ఓడిపస్, సంక్రాంతి, జోకుమారస్వామి (1972), ఏవం ఇంద్రజిత్ (1972), హయవదన (1973), సత్తాపరనెరలు (1974), చోర్ చరణ్‌దాస్ (1981), ఋష్యశృంగ (1981), దెడ్డిబగిలు (1981), హిత్తినహుంజ (1981), మిస్ సదారమి (1985), కింగ్‌లియర్ (1988) వంటి నాటకాలను కర్నాటకలో కారంత్ ప్రదర్శించగా, పంజరశాలె, నందగోపాల, ఇన్స్‌పెక్టర్ రాజా (1963), తుగ్లక్, విజయనరసింహ (1965) వంటి నాటకాలను న్యూఢిల్లీలో ప్రదర్శింపచేశాడు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రిపర్టరీ కంపెనీ తరపున 1997లో హిందీ నాటకం 'బడపంపన', 1980లో చోటే సయాద్ బడా సయాద్, 1980లో 'అంధేర్‌నగరి', 1978లో ముద్రారాక్షస, షాజహాన్, భగవదజ్జుక నాటకాలను కారంత్ ప్రదర్శించి భారతీయ నాటకరంగాన్ని తేజోవంతం చేశాడు. కర్నాటక, ఢిల్లీలోనేగాక భారతదేశంలోని పలు పట్టణ, నగరాలలో పలునాటకాలనుప్రదర్శింప చేసిన ఘనత సమకాలిక భారతీయ నాటకరంగ ప్రముఖులలో కారంత్‌కే దక్కుతుంది. 1972లో 'కనకదెబల్లి' ని చండీగర్‌లోనూ, 1981లో 'ఘాశీరాం కొత్వాల్' ను భోపాల్‌లోనూ, 1982లో 'మాళవికాగ్నిమిత్ర', 'స్కందగుప్త' నాటకాలను భోపాల్‌లోనూ ప్రదర్శింపజేసి నీరాజనాలందుకొన్న విశిష్ట దర్శకుడు కారంత్. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పక్షాన 'హయవదన' నాటకాన్ని ఆస్ట్రేలియా దేశంలో ప్రదర్శించడం విశేషం.

నాటకాన్ని విశ్లేషించే శక్తితోపాటు, ప్రేక్షకులనాడి తెలిసినవాడు కాబట్టి ఈయన రూపొందించిన నాటకాలు ప్రజాదరణ పొందాయి. ప్రాచీన సాంస్కృతిక నాటకాలలోని సూత్రధారి పాత్రను అభిమానించే కారంత్, నాటక ప్రదర్శన విజయం రచయిత, దర్శకునికంటే నటుడి మీదనే ఆధారపడి ఉందని ప్రకటించటం విశేషం. నాటక ప్రదర్శన విజయానికి అనేక జానపద, సంప్రదాయ కళారీతుల్ని మేళవింపజేయటంలోనూ కారంత్ సిద్ధహస్తుడు. చివరకు మేగల్స్ నాటక ప్రదర్శనలోనూ యక్షగాన పోకడల్ని ప్రవేశపెట్టి నాటకాన్ని జనరంజకం చేయటం కారంత్ కే చెల్లింది. చంద్రశేఖర్ కంబార్ 'జోకుమారస్వామి', పి. లక్ష్మణ్ సంక్రాంతి నాటకాలు కన్నడంలో నూతన నాటకోద్యమానికి మార్గాన్నేర్పర్చాయని తెల్పుతూ 'జోకుమారస్వామి' రాతప్రతిలో చదివినప్పుడు తనకు నచ్చకపోయినా ప్రదర్శనా పరంగా విజయ వంతమైంది. ప్రేక్షకుల నాడిని గ్రహించటం దర్శకుని ప్రథమ కర్తవ్యమంటాడు. రంగస్థల నాటక భాషగురించి చెప్తూ కేవలం శుద్ధ సాహిత్యాన్నే రంగస్థలంపై ప్రయోగించరాదనీ, శబ్దాలకతీతమైన ఒక పరిభాషను భావనాత్మకంగా నటులు వాడాలనీ కారంత్ అభిప్రాయం.

నట్టవరనెరళ నాటకంలో పురందరదాసు కీర్తనలు ప్రవేశపెట్టినందువల్లా, ఆ కీర్తనలు కూడా వ్యంగ్య ధోరణిలో ఉన్నందువల్ల, నాటక గంభీరతను అపహాస్యం చేస్తూ ఒక ప్రత్యేక స్వరంతో గానం చేసినందువల్ల నాటక ప్రయోగం విలక్షణంగా తయారై ప్రేక్షకాభిమానం పొందిందని కారంత్ అభిప్రాయం.

తన అద్భుత ప్రతిభా సంపత్తితో భారతీయ నాటకాన్ని ఇంతగా వికాసవంతం చేసిన ఈ మహా దర్శకుడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా నాటకాలకు దర్శకత్వం వహించి జనరంజకంగా ప్రదర్శింప చేశాడు. 1996లో భువనగిరిలో ఆర్. నాగేశ్వరరావు సారథ్యంలోని సురభి వేంకటేశ్వర నాట్యమండలి పక్షాన నలభై రోజులు

రిహార్సల్స్ చేయించి భీష్మ నాటకాన్ని, 1997లో నల్గండ జిల్లాలోని భీమ్మల రామారంలో ముప్పయి రోజుల పాటు రిహార్సిల్స్ చేయించి ఛండీప్రియ జానపద నాటకాన్ని ప్రదర్శింపచేశాడు. పురుషులతో పాటు స్త్రీలకూ సమాన హక్కులు కావాలని ప్రబోధించే నాటకం ఛండీప్రియ 1998లో బస్తీదేవత యాదమ్మ నాటకాన్ని ముప్పయి రోజులపాటు సురభి వారితో రిహార్సల్స్ చేయించి ప్రదర్శింపచేశాడు. వంశవృక్ష చోమనదుడివంటి జాతీయ పురస్కారాలు పొందిన చిత్రాలకు కారంత్ దర్శకుడిగా పని చేశాడు. మరెన్నో చిత్రాలకు సంగీతం అందించిన కారంత్‌కు ఎన్నో జాతీయస్థాయి పురస్కారాలు లభించాయి. 1981లో పద్మశ్రీ, మధ్యప్రదేశ్ కాళిదాస్ సమ్మాన్ అవార్డ్, కర్నాటక ప్రభుత్వ గుబ్బి వీరణ్ణ అవార్డ్ కారంత్‌కు లభించినవాటిలో కొన్ని మాత్రమే. భారతీయ నాటకరంగాన్ని తేజోవంతం చేసినకారంత్ చిరస్మరణీయుడు.

రమణ

కర్నెయ్

కార్నిలా, పీర్ (1606-1684) : ఫ్రెంచి నాటకకర్త. ఫ్రెంచి రంగస్థల ప్రముఖులలో ముఖ్యుడు. విషాదంత నాటక రచనలో ఖ్యాతి గడించిన వ్యక్తి. జన్మస్థలం రోయేన్. సంచార నాటక సమాజాల నాటకాలు చూచి ఉత్తేజి తుడై నాటక రచనకు దిగాడు. మెడీ ఈయన రచించిన మొదటి విషాద నాటకం. ఈ నాటకం విజయవంతంకావడంతో మహానాటకకర్తగా కార్నీలా స్థానం సుస్థిరమైంది. 1665లో రచించిన పెర్కరైట్ నాటకం విజయ వంతం కాకపోవడంతో తిరిగి స్వస్థలం రోయేన్ చేరుకోవలసి వచ్చింది. కాని ఈయన రచించిన ప్రధాన నాటకాలు ఇప్పటికీ ప్రదర్శితమవుతూ ప్రజాదరణ పొందుతున్నాయి. 1647లో ఈయనను ఫ్రెంచి అకాడమీ సభ్యుడుగా ఎన్నుకుంది.

మెడీ (1635), హరాసి (1640), సిన్నా (1641), పాలేక్యూట్(1642), లామోర్డ్ డిపాంపే, లీమెంటార్, రోడోజిన్ (1645), థియోడర్ మొదలైన నాటకాలను రచించిన కార్నిలో 1684లో మరణించాడు.

శ్రీ.చ.

కార్యావస్థలు : అధికారిక ఇతివృత్త విభాగాలు. కథా గమనానికి సంబంధించిన క్రమ దశలు (అవస్థలు) అవడం వల్ల వీటికి కార్యావస్థలని పేరు వచ్చింది. ఇవి కథా నాయకుని చిత్త వృత్తులని కూడా భావించవచ్చు. ఒక వ్యక్తి ఒకానొక కార్యం సాధించాలని నిశ్చయించుకొని ఆసాంతం సాధన కొనసాగించినపుడు ఆ సాధనా కృషి ఐదుదశలలో జరుగుతుంది. అతని చిత్త వృత్తి కూడా క్రమంగా అయిదు అవస్థలు పొందుతుంది. అవస్థాపంచకం, 1. ప్రారంభం లేక ఆరంభం, 2. ప్రయత్నం లేక యత్నం, 3. ప్రాప్తి సంభవం లేక ప్రాప్త్యాశ, 4. నియత ఫల ప్రాప్తి లేక నియతాప్తి, 5. ఫలయోగం లేక ఫలాగమం.

అవస్థలు అయిదు. ఆరంభం, ప్రసవం, ఉద్భేదం, కించిచ్ఛేషం, సమాప్తి. ఫల ప్రాప్తికి చెందిన ప్రయత్నానికి ఆరంభమని పేరు. ఫల ప్రాప్తి గోచరించకపోగా ఫలోద్దేశ వ్యాపారం ప్రసవం. దీని వల్ల ఔత్సుక్యం అధికమవుతుంది. కొద్దిగా ప్రాప్తి సంభవించుకునే ఆశతో కూడినది ఉద్భేదం. నియత ఫలప్రాప్తి కనిపించేది కించిచ్ఛేషం. సమగ్ర ఫలసంపత్తి సమాప్తి. ఈ అవస్థలు దైవ ప్రాధాన్యంకలవి. పురుష వ్యాపార ప్రాధాన్యమైన అయిదు సంస్థలు ఉన్నాయి. 1. ప్రారంభం, 2. ప్రయత్నం, 3. ప్రాప్తి, 4. నియత ఫలప్రాప్తి, 5. ఫలయోగం లేక ఫలప్రాప్తి. భరతముని నాట్యశాస్త్రంలో చెప్పిన అవస్థల పేర్లు ఇవీ ఒకటే. ఇక సమవస్థలు. దైవ పౌరుషోభయ ప్రాధాన్యాలు. వీనిలో 1. ప్రార్థన, 2. లాభం, 3. సంయోగనాశం, 4. ఫలప్రాప్తి ఉంటాయి. వీటిలోని లాభ నాశాలు దైవ ప్రాధాన్యాలు. ప్రార్థనా సంయోగాలు పౌరుష ప్రాధాన్యాలు. సంప్రాప్తి దైవ పౌరుష ప్రాధాన్యాలు.

శ్రీ.చ.

కాలైక్యం : ఐక్యత్రయంలో ఒకటి.కాలానికి సంబంధించిన ఐక్యత. ఎంత కాలంలో జరిగిన కథను నాటకంగా రూపొందించాలి? దీనికేమైనా పరిమితి, నిబంధనలున్నాయా? అంటే నాటక కథా కాలం ఎంతై ఉండాలి? నాటక కథా కాలానికి, ప్రదర్శనా కాలానికి సంబంధమేమైనా ఉందా అనే ప్రశ్నలు రాక మానవు.

ఈ ఐక్యతలను ప్రస్తావించిన అరిస్టాటిల్ నాటక కథా కాలం గురించి విషాద రూపకం సాధ్యమైనంత వరకు సూర్యుని ఒకేఒక పరిభ్రమణ(రోజు)నకు మించరాదు. కాని మించితే బహుకొద్దిగా మాత్రమే మించవచ్చు అని పేర్కొన్నాడు. ప్రదర్శన రెండు గంటలు పడితే కథాకాలం కూడా రెండు గంటలు ఉండాలని, సంభవనీయతకు భంగం లేకుండా రెండు గంటలకు మించడం సాధ్యంకాక పోతే నాలుగు, అయిదు, పది గంటల వరకు వ్యాపింప వచ్చు గాని ఇరవై నాలుగు గంటలకు మించరాదని ఫ్రెంచ్ నాటకకర్త కార్నీలా అభిప్రాయపడ్డాడు.

డేసియర్ అనే పాశ్చాత్య విమర్శకుడు ఒకే ఒక సూర్య భ్రమణం అంటే ఇరవై నాలుగు గంటలనే వాదాన్ని వ్యతిరేకిస్తూ ఆ వాదన ఘోరమనీ, యదార్థతను నాశనం చేస్తుందనీ వాదించాడు. కథా కాలం పన్నెండు గంటలకు మించకూడదని,

ఆ కాలం కూడా ఒక పగలు గాని, ఒక రాత్రిగాని లేదా సగం పగలు సగం రాత్రిగా ఉండవచ్చునని చెప్పాడు. దీనినే పగలు నుండి రాత్రికి, రాత్రి నుండి పగలుకు మార్పు అని డేసియర్ అర్థం తీశాడు. డేసియర్ కూడా కథా కాలం, ప్రదర్శనాకాలం సరిపోవాలని వాదించాడు. అయితే కథా స్వభావాన్ని బట్టి ఈ రెండు కాలాలను సరిపెట్టడం సాధ్యం కాకపోతే యదార్థ భ్రాంతిని ఆశ్రయించాలని చెప్పాడు. దీనివల్ల రంగస్థలం మీద జరిగే యదార్థజీవితానికి ప్రతిబింబమనే భ్రాంతికి ప్రేక్షకులు లోనుకావచ్చు.

వాల్తేర్ కూడా ఈ అసంబద్ధ సిద్ధాంతాన్నే అంగీకరించి 14 రోజులలో ఒక కుట్ర జరిగినట్లు చిత్రిస్తే ఆ 14 రోజులలో జరిగిన సంఘటనలను వివరించాలని తెలిపాడు.

ఆంగ్ల నాటకకర్త షేక్స్పియర్ టెంపెస్ట్, కామెడి ఆఫ్ ఎర్రర్స్ నాటకాల్లో మాత్రమే కాలైక్యాన్ని పాటించాడు. టెంపెస్ట్ కథాకాలం నాలుగు గంటలు. ప్రదర్శనాకాలం కూడా నాలుగు గంటలే. కామెడీ ఆఫ్ ఎర్రర్స్ కథా కాలం రోజు లోపు మాత్రమే. ఎలిజిబెత్ కాలం నాటి నాటక కర్తలు ఈ సమస్యను ఇంకో విధంగా పరిష్కరించుకొన్నారు. రంగ భూమిక లేని రంగస్థలం భ్రాంతి కలగాలనే ఆలోచన వదలుకొని ప్రేక్షకులలో ఊహాశక్తిని రేకెత్తించడం ఈ విధానం మూల సూత్రం. అంటే ఊహాశక్తి రేకెత్తించి కొన్ని సంవత్సరాల కాలాన్ని గంటగా ఊహించేటట్లు చేయడం.

సంస్కృత నాటక కవులు కాలైక్య విషయం పట్టించుకోలేదు. ఉత్తరరామచరిత ప్రథమాంకం నాటికి సీత పూర్ణ గర్భిణి. ద్వితీయాంకం కథలో సీతకు కవలపిల్లలు కుశలవులు కలిగారు. తృతీయాంకం నాటికి ఆ పిల్లలకు పన్నెండవ జన్మదినోత్సవం జరిగింది. దీన్ని బట్టి రెండు మూడు అంకాల మధ్య పన్నెండు సంవత్సరాలు గడిచాయి. నాటకాంతానికి కథా కాలం పదమూడు సంవత్సరాలు కావచ్చు.

శాకుంతలం నాటకంలో భరతునికి మరీచ మహర్షి జాతకాది కర్మలు నిర్వహించాడని చెప్పడంవల్ల నాటక కథాకాలం ఎనిమిది సంవత్సరాలని భావించవచ్చు. అయితే సంస్కృత నాటక కర్తలు అంకంలో ఒక రోజు జరిగిన కథ మాత్రమేనని నిబంధించారు. అంకానికీ అంకానికి మధ్య ఎన్ని సంవత్సరాల కథ జరిగినా ఒక సంవత్సరంలో మాత్రమే జరిగినట్లు భ్రాంతి గొలిపేవిధంగా విష్కంభాదులలో చిత్రించాలని అనుశాసించారు. దీన్ని బట్టి దశ రూపక భేదాలైన ఏకాంకికలు భాణం, ప్రహసనం, వ్యాయోగం, వీధి, అంకం, మరి కొన్ని ఏకాంక ఉపరూపకాలలో ఒక రోజు కథను మాత్రమే చిత్రించాలని నిబంధించారు.

ఆధునిక కాలంలో ఒకే రంగభూమికలో తెర దించకుండా ఏకబిగిన నాటకం ప్రదర్శించడం వల్ల నాటకంలో వాస్తవికతకు ప్రాధాన్యం ఎక్కువ కావడం వల్ల నేడు తిరిగి కాలైక్యాన్ని ఎక్కువగా పాటిస్తున్నారు. ఆమంచర్ల గోపాలరావు రచించిన విశ్వంతర నాటక కాలం పన్నెండు గంటలు మాత్రమే.

శ్రీ.చ.

కాల్డెరోన్ డె లా బార్కా, పెడ్రో (1600-81): స్పానిష్ స్వర్ణయుగంలో 'లోప్ డీ వేగా' తరువాత పేర్కొనదగిన నాటకరచయిత, కవి. కాల్డెరోన్ రచించిన లౌకిక నాటకాలలో మిక్కిలి ప్రసిద్ధి పొందినవి: ది సర్జన్ ఆఫ్ హిజ్ ఆనర్ (1635), జీవితం ఒక కల (1635), జలామియా మేయర్ (1640), ది డాటర్ ఆఫ్ ది ఎయిర్ (1653). చివరిది ఆయన రచనలలో మణిపూసగా భావించబడుతూంది. ఈ లౌకిక నాటకాలేకాక కొన్ని వీధి నాటకాలూ (Operas), మత సంబంధమైన ఇతి వృత్తంతో కూడిన నాటకాలు కూడా కాల్డెరోన్ రచించాడు.



'కాల్డెరోన్' 1600, జనవరి 17న మాడ్రిడ్‌లో జన్మించాడు. ఆయన తండ్రి ఒక ప్రభుత్వోద్యోగి. ఆయన చండ శాసనుడు కావడంవల్ల ఆయన ప్రభావం కాల్డెరోన్ యౌవనం మీదా, ఆయన తొలి రచన మీదా ఎక్కువగా కనిపించింది.

ఆల్కలా (Alcala) విశ్వవిద్యాలయంలో కాల్డెరోన్ 1614లో మెట్రిక్యులేషన్ పాసైన తరువాత సాలమాంకాకు మారి, 1619 వరకు న్యాయ శాస్త్రం, భగవచ్ఛాస్త్రం అధ్యయనం చేశాడు. మొదట మతోద్యోగిగా చేరాలనుకున్నాడు. కాని 'కాస్టిలీదుర్గ' రక్షక దళంలో చేరాడు. 1623లో రాజాస్థానం కోసం నాటకాలు రాయడం మొదలుపెట్టి, నాలుగవ ఫిలిప్ ఆస్థానంలోని ప్రముఖ నాటక కవులలో ఒకడయ్యాడు. 1636లో రాజు ఆయనకు 'నైట్' బిరుదు ఇచ్చి గౌరవించాడు. కాల్డెరోన్ తొలి నాటకాలు రాజాస్థానంలోనే గాక ప్రజల నాటకశాలలో కూడా ప్రదర్శింపబడి, ప్రశంసలందుకున్నాయి. 1635లో లోప్‌డీవేగా మరణించిన తరువాత కాల్డెరోన్ స్పానిష్ నాటక రంగానికి అధినేత అయ్యాడు. 'కేటలాన్' తిరుగుబాటు సందర్భంలో 1640లో ఒక అశ్వికదళంలో చేరి 1642 వరకూ సైన్యానికి గొప్పసేవ చేశాడు. సైన్యం నుంచి పదవీ విరమణ చేసిన తరువాత 1645లో 'అల్బా ప్రభువు' (Duke of Alba) ఆస్థానంలో కార్యదర్శిగా చేరాడు.

ఆస్థాన నాటక కవిగా కాల్డెరోన్ స్పెయిన్‌లో వీధి నాటకాల అభ్యుదయానికి కూడా అంకురార్పణ చేశాడు. 1648లో పాలెరినా ఉద్యానవనం రచించాడు. రెండు అంకాలు కలిగి కొంత వచనం, కొంత గేయం ఉన్న రూపకం ఇది. తరువాత ఇలాంటి రూపకాలు చాలా రచించాడు. 1660లో తన మొదటి ఏకాంకిక (గులాబీ ఎఱ్ఱదనం) రచించాడు. ఇది పూర్తిగా సంగీత రూపకమే! ఆ ఏడాదే జలసి ఈవెన్ ఆఫ్ ది ఎయిర్ కెన్ కిల్ అనే మూడంకాల వీధి నాటకం రాశాడు. ఇటాలియన్ సంప్రదాయంలో లాగానే సంగీతం సాహిత్య విధేయంగా ఉంటూ కాల్డెరోన్ సంగీత నాటకాలన్నీ పూర్తిగా కవితామయాలుగా ఉంటాయి.

కాల్డెరోన్ రచించిన మతసంబంధమైన నాటకాలలో మనిషికీ దేవుడికీ మధ్య అఖాతం (1652–57), ప్రపంచ మహా నాటకం (1635), దేవుణ్ణి మించిన అదృష్టం లేదు వంటి నాటకాలు చెప్పుకోదగ్గవి. క్రైస్తవ మత విశ్వాసాలను ప్రచారం చేసే అద్భుతమైన నూతననాటకరూపాన్నిఆవిష్కరించి 'కాల్డెరోన్' ప్రపంచ సాహిత్య చరిత్రలో శాశ్వతమైన స్థానం సంపాదించుకున్నాడు. భావ గాంభీర్యం, పాత్రచిత్రణ కౌశలం, నిజాయితీ, అంతర దృష్టి, హేతుబద్ధ, నైతిక దృక్పథం ప్రపంచ మహా నాటక రచయితలలో ఒకడుగా కాల్డెరోన్‌కు గణన చేకూర్చాయి. తన 81వ ఏట 1681, మే 25వ తేదీన మాడ్రిడ్ నగరంలోనే కాల్డెరోన్ శాశ్వతంగా కన్ను మూశాడు.

బ.శ్రీ.

కాళిదాస కళారాధన సమితి : ఈ సమాజాన్ని 1964లో నెల్లూరు జిల్లా, కావలిలో స్థాపించారు. వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు రాజనాల కల్లయ్య, అధ్యక్షుడు ఎల్.వి. కృష్ణారెడ్డి. ఎల్.వి. ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నా 1954 నుంచి నాటకాలలో నటిస్తూ 'కాళిదాస కళారాధన సమితి' ప్రారంభించాడు. ఈ సమాజం రాష్ట్రంలోని వివిధ పరిషత్తులు నిర్వహించిన ప్రదర్శనలలో ఛైర్మన్, భలే పెళ్లి, పునర్జన్మ, కీర్తిశేషులు, చిల్లర కొట్టు చిట్టెమ్మ, ఆవలి గట్టు, సమిధ, జ్వలిత జ్వాల, ఇదే నా లోకం ప్రదర్శించి బహుమతులు గెలుచుకుంది. అంతేకాకుండా ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి నాటక, నాటిక పోటీలు నిర్వహిస్తోంది. పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన సమాజాన్ని ఎన్.టి. రామారావు చేతుల మీదుగా 'రోలింగ్ షీల్డ్' ఇప్పించి సన్మానించిన సంస్థ కాళిదాస కళారాధన సమితి. ప్రతి సంవత్సరం కళారంగంలో విశేషంగా కృషి చేసిన వ్యక్తిని సన్మానిస్తుంది. ఈ సమాజం 2001లో 40వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయస్థాయి నాటక పోటీలు నిర్వహించింది.

దాసరి.ఎన్.

కాళిదాసు (క్రీ.పూ. 150–56) : సంస్కృత నాటకకర్త. మహాకవి, కాళిదాసు అనే పేరు పౌరుషనామం. కాళికాదేవి భక్తుడు కావడంవల్ల కాళిదాసనే పేరు వచ్చింది. అసలు పేరు హరిషేడ్ అని కృష్ణచరిత కావ్యం వల్ల తెలుస్తోంది. విక్రమాదిత్యుని ఆస్థానంలోని నవరత్నాలలో ఒకడు. ఈయన ఉపమాలంకార ప్రయోగంలో సిద్ధహస్తుడు కావడంవల్ల ఉపమా కాళిదాసస్య అని పేరు వచ్చింది. కవి కులగురువు, భారతీ విలాస అనేవి కాళిదాసు బిరుదులు. కాళిదాసు ముందు, తరువాత కవి అని చెప్పడానికి ఎవరూ లేరని పండితాభిప్రాయం.

కాళిదాసు నైపుణ్యం ఇతని ప్రతి రచనలోని, ప్రతి వాక్యంలోను గోచరిస్తుంది. ప్రతిమాట, ప్రతివాక్యం చెక్కినట్లు ఉంటుంది. రచనలోని ఉపమానాలు ఎక్కడో దూరస్థమైనవి గాక నిత్యజీవితంలో తారసిల్లేవే. శ్లోకాలు క్లిష్టాన్వయాలు కాక ద్రాక్షాపాకం లాగా మృదు మధురంగా, మనోరంజకంగా ఉండి రస పుష్టితో ప్రవహిస్తుంటాయి. ప్రతి పద ప్రయోగంలోనూ ఎంతో సార్థకత గోచరిస్తూఉంటుంది. ఆయాదృశ్యాలను, ఆయా సన్నివేశాలను, ఆయా పాత్రలను కళ్ళకు కట్టేటట్లు వర్ణించడంలో కాళిదాసు సిద్ధహస్తుడు. శాకుంతలం ప్రథమాంకంలో లేడి పరుగు వర్ణన, రథ వేగ వర్ణన, అలసిన శకుంతలా వర్ణన మొదలైనవి తార్కాణాలు.

కాళిదాసు దృష్టిలో వాస్తవికత కంటే పాత్రపోషణకు, రస పోషణకు ప్రాధాన్యం ఎక్కువ. అందుకే శాకుంతలంలో దూర్వాస శాపం కల్పించి దుష్యంతపాత్రశీలంకాపాడాడు. అలాగే రసాభాస గాకుండా నాటకం చివర శకుంతలా దుష్యంతుల కలయికను సమకూర్చి రసం పోషించాడు.

ప్రకృతికి, మానవునికి సంబంధం ఏమిటి? మానవావస్థకు ప్రకృతి కూడా ప్రతి చలించినట్లు చిత్రిస్తే నాటకానికి బలం చేకూరుతుంది. అందుకే కాళిదాసు శకుంతల అత్తవారింటికి వెళ్లే సందర్భంలో కణ్వుడు మొదలైన ఆశ్రమ వాసులేగాకుండా

'మృగతతులు దర్భకబళంబు మ్రింగకుండె,
నెమలి గుంపులు తమ నర్తనములు మానె,
పండుటాకులు రాల్చుచు భవ్యలతలు
బాష్పకణములు విడిచెడుపగిది నుండె' అని

వర్ణించాడు (అను. కందుకూరి వీరేశలింగం).

కాళిదాసు రచనలలోవిశ్వజనీనత గోచరిస్తుంది. శాకుంతలం నాల్గవ అంకంలో శకుంతలను అత్తవారింటికి పంపే ఘట్టంలోనికణ్వునిపరితాపం విశ్వమానవపరితాపం. కూతురుని అత్తవారింటికి పంపే సమయంలో ప్రతి తండ్రికి మనస్సులో తారాడేది ఈ భావమే.

కాళిదాసు రచించిన నాటకాలు మూడు. మాళవికాగ్నిమిత్రం, అభిజ్ఞాన శాకుంతలం, విక్రమోర్వశీయం.

మాళవికాగ్నిమిత్రం : ఇది ఐదు అంకాల సంస్కృత చారిత్రక నాటకం. సంస్కృత నాటక సాహిత్యంలో మాళవికాగ్ని మిత్రంలోని విదూషక పాత్రకు విశిష్ట స్థానముంది. ఈ విదూషకుడు హాస్య ప్రియుడు, నర్మ సచివుడు మాత్రమే కాదు. కామ మంత్రి. ఈ నాటకకథాగమనం అంతటినీనడిపించిందివిదూషకుడే. దీనిలోని ప్రస్తావన మూలంగానే మనకు భాసుని కాలం నిర్ణయించే ఆధారం కొంత దొరుకుతుంది. భరత నాట్యం లోని భూవరుడగ్ని మిత్రడిల .... అనే వాక్యం వల్ల ఈ కథా నాయకుడు కాళిదాసుని సమకాలికుడని భావించవలసి వస్తోంది.

అభిజ్ఞాన శాకుంతలం : విశ్వనాటక సాహిత్యంలోఖ్యాతి సంపాదించుకున్న నాటకం.ఈ నాటక కథ మర్త్యలోకంలో ప్రారంభమై స్వర్గ లోకంలోఅంతమవుతుంది. ఈ నాటకం స్వర్గ, మర్త్య లోకాలకు వారధి.

విక్రమోర్వశీయం: ఇది అయిదు అంకాల త్రోటకం. ఈ నాటకంలో నరుడు నాయకుడు. దేవ వేశ్య నాయిక. శాకుంతలంలో లాగానే ఇందులో కూడా చతుర్థాంకం ప్రసిద్ధికెక్కింది. ఇందులోనూ ప్రకృతికీ మానవునికీ సంబంధం చిత్రితమైంది. ప్రేమ పరాకాష్ఠ ఈ రూపకంలో కనిపిస్తుంది. కాళిదాసు కవిత్వం కూడా ఇందులో పరాకాష్ఠకు చేరుకుంది. ఈ రూపకంలో పురూరవునికి ప్రకృతి అంతా ఊర్వశిమయంగా కనిపిస్తుంది. ఇందులోని విశేషం గేయరచన. సంస్కృత సాహిత్యంలో అరుదైన గేయ రచన చతుర్థాంకంలో గుబాళిస్తుంది.

మొట్ట మొదట ఇంగ్లీషులోకి శాకుంతలం అనువదించింది సర్ ఆర్థర్ జోన్స్ (1789). ఈ మూడు నాటకాల అనువాదాలు ప్రపంచ భాషలన్నింటిలోకివెలువడ్డాయి. ఇంచుమించు అన్ని దేశాలలోను ప్రదర్శించబడ్డాయి.

శ్రీ.చ.

కాళ్ళకూరి నారాయణరావు రచనలు : కాళ్ళకూరి నారాయణరావు రచనలపై సమగ్రంగా పరిశోధించి వెలువరించిన సిద్ధాంత గ్రంథం. కొట్టే వెంకటాచార్యులు రచించిన ఈ గ్రంథం 1989లో ప్రచురింపబడింది. ఈ గ్రంథంలో కాళ్ళకూరి నారాయణరావు జీవిత రేఖా చిత్రణ, నాటకాలు, ప్రహసనాలు, నవల, కథాసాహితి, విమర్శ, చరిత్ర గ్రంథాలు, వ్యాసావళి, గ్రంథ విమర్శలు, కవితలు, అలభ్య గ్రంథాలు, లభ్య సమాచారం అనే అంశాల మీద విలువైన సమాచారం ఉంది. పద్మవ్యూహం, చింతామణి, వరవిక్రయం, మధుసేవ నాటకాలపై విపులంగా చర్చించిన గ్రంథం.

గం.సు.రె.

కావ్యశ్రీ : నాటక రచయిత, నటుడు. అసలు పేరు జి. నారాయణరావు. స్వస్థలం కాకినాడ. ఈయన రచించిన నాటికలన్నీ వరుసగా ఆనాటి ప్రసిద్ధ సాహిత్య మాసపత్రిక 'భారతి' లో ప్రచురితమయ్యాయి. భారతి పత్రిక ఆధారంతోనే రాష్ట్రంలో పలు నాటక సమాజాలు ఆ నాటికల్ని విశేషంగా ఆదరించాయి. కావ్యశ్రీకి పేరు తెచ్చిన నాటిక మానవుడు. దీనిని ప్రదర్శించని నాటక సమాజంగాని, కళాశాల, హైస్కూలుగాని ఆంధ్రదేశంలో లేదంటే అతిశయోక్తి కాదు. కావ్యశ్రీ రచనలన్నీ మానవత్వంతో గుబాళిస్తూ ఉంటాయి. తాను చెయ్యని నేరానికి జైలు పాలవుతాడు ఒక వ్యక్తి. శిక్షా కాలం పూర్తయిన తరువాత ఒక రైల్వే స్టేషన్‌లో యాదృచ్ఛికంగా తనకు అపకారం చేసిన వ్యక్తులందరూ తటస్థపడతారు. వాళ్లను చంపాలని ఆవేశంతో ముందుకు ఉరుకుతాడు. కాని వాళ్లు ఒక్కొక్కరు చెప్పిన దీనగాథ విని అందర్నీ క్షమించి వదిలేస్తాడు. ఇదే మానవుడు నాటికలోని ఇతివృత్తం. కావ్యశ్రీ రచించిన సమర్పణ, స్వీకారం నాటికలు, కలెక్టరు, ప్రతిఫలం నాటకాలు కూడా రంగస్థలం మీద ప్రదర్శితాలై బహుళ జనామోదం పొందినవే.

గద్దెశ్రీ

కిడ్, థామస్ (1558-1594) : ఇంగ్లీషు నాటకకర్త. ప్రతీకార నాటక స్రష్ట. స్పానిష్ ట్రాజెడీ అనే నాటకం ఇంగ్లీషు ప్రతీకారనాటక పరంపరకు దారితీసింది. ఈయన రచించిన నాటకాలలో మనకు లభ్యమవుతున్న నాటకం ఇదొకటే. ఈయన రచించినట్టు భావిస్తున్న హామ్లెట్, టేమింగ్ ఆఫ్ ది ష్ర్యూ నాటకాల ఆధారంగానే షేక్స్పియర్ ఆయా నాటకాలు రచించాడని ప్రతీతి. ఇతని నాటక ఛాయలు టైటస్ ఆండ్రోనికస్, ఆర్డెన్ ఆఫ్ ఫేవర్ షాం నాటకాలలో గోచరిస్తాయి. కిడ్ సుప్రసిద్ధ నాటక రచయిత మార్లోకి ప్రాణ స్నేహితుడు. నాస్తికుడనే ప్రమాదం నుంచి అతి కష్టం మీద తప్పించుకున్నాడు. ఈయన హామ్లెట్, కార్నిలా, జెరోనియో, సోలిమన్ అండ్ పెర్సెడా అనే నాటకాలు కూడా రచించాడు.

శ్రీ.చ.

కిర్లోస్కర్, అన్నాసాహెబ్ (బల్వంత్ పాండురంగ) (1843-85) : మరాఠీ నాటక పితామహుడు. ప్రముఖ నాటకకర్త మాత్రమేకాక స్వయంగా నాటక కంపెనీ నిర్వహించాడు. సంగీత నాటకాలకు ఈయనే ఆద్యుడని ప్రతీతి. శాకుంతల, సౌభద్ర,రామరాజ్య వియోగ ఈయన రాసిన ప్రసిద్ధ నాటకాలు. ఉపాధ్యాయుడుగా, పోలీసు క్లర్కుగా పనిచేసి ప్రముఖ నాటకకర్తగా రూపొందాడు. బెల్గాంలో ఉపాధ్యాయుడుగా ఉన్నప్పుడు ఈయన రాసిన శంకరాచార్యుల జీవిత చరిత్ర శంకర్ దిగ్విజయ్, అల్లా ఉద్దీన్ చితోడ్‌గడ్‌పర్‌స్వారి (1873) అనే నాటకాలు అంతగా రాణించలేదు.

పూనాలో తాను చూసిన ఫార్సీ నాటక ప్రభావంతో వాటిని పోలిన మరాఠీ నాటకాలు రాయడానికి పూనుకొన్నాడు. ఈయన రాసిన శాకుంతలం (1880) నాటకం కాళిదాసు

శాకుంతలానికి అనువాదం. దానిలోని మొదటి నాలుగు అంకాలు ప్రదర్శించారు. అది మరాఠీ నాటకరంగంలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చింది. ఈ నాటకం సంగీతపరంగా ఆకట్టుకొన్నది. దీనిలో వేర్వేరు పాత్రలకు ఎన్నో పాటలున్నాయి. దీనితో కిర్లోస్కర్ మరాఠీ నాటకరంగంలో సంగీత నాటకాలకు పాదువేశాడు. తరువాత *సౌభద్ర* (1882) అనే స్వతంత్ర పౌరాణిక నాటకం రాశాడు. ఈ నాటకం ఈనాటికీ ప్రదర్శనలు అందుకొంటున్నది. దీనిలో హాస్యవ్యంగ్య ధోరణులు, పాత్రలు చక్కగా పోషించ బడ్డాయి.

*రామరాజ్యవియోగ*మనే నాటకాన్ని కిర్లోస్కర్ అసంపూర్తి గానే వదిలిపోయాడు. ఇది మూడు అంకాల్లో నడిచిన విషాదాంత నాటకం. రాముని వియోగంలో తండ్రి దశరథుడు, పినతల్లి కైక, దాసి మంధరలు ప్రముఖపాత్రలు.

కిర్లోస్కర్ ప్రముఖ నాటకకర్త కాక మంచి నటుడు, దర్శకుడు. కిర్లోస్కర్‌ను, ఈయన నాటకసంస్థ ప్రాశస్త్యాన్ని చిప్లూంకర్ కేసరి పత్రికలో పేర్కొన్నాడు. నాటకవృద్ధికి కిర్లోస్కర్ సేవ నిస్సందేహంగా శ్లాఘనీయమైంది.

నాగిరెడ్డి.

కూచిపూడి భాగవతం : కూచిపూడి భాగవతం పేరు విననివారు ఉండరు. పెద్ద పెద్ద రాజాస్థానాల నుంచి మారుమూల గ్రామం వరకు కూచిపూడి భాగవతులు ప్రదర్శనలు ఇచ్చేవారు. కూచిపూడి భాగవతానికి మూల పురుషుడు సిద్ధేంద్రయోగి. ఆయన తరువాత ఈ కళను దేశ విదేశాలలో ప్రచుర పరచి గొప్ప పేరుప్రఖ్యాతులు సంపాదించిన వారెందరో ఉన్నారు. ఈ కళ వంశపారంపర్యంగా వస్తూ ఉంది. కూచిపూడి గడ్డపై పుట్టిన ప్రతి బ్రాహ్మణ బిడ్డకిముక్కు చెవులు కుట్టిస్తారు. ఇలా చేయడంవల్ల ముక్కుకు, చెవులకు రంధ్రాలుండి నాటకంలో ఆభరణాలు ధరించడానికి వీలవుతుంది. క్రీ.శ. 1505-1509లో ఈ కళ ప్రచారంలో ఉంది.

కూచిపూడి వీధి భాగవతులు భారత భాగవత రామాయణాల నుంచి వస్తువును స్వీకరించి, యక్షగాన నాటక రూపంలో భరతుడు నిర్దేశించిన సంప్రదాయాలకు అనుగుణంగా ప్రదర్శిస్తూ ఉంటారు. వీరు ప్రదర్శించిన యక్షగానాల్లో *పారిజాతాపహరణం, గిరిజా కల్యాణం, కీచక వధ, హరిశ్చంద్ర, కిరాతార్జునీయం, కాళీయ మర్దనం, శశిరేఖా పరిణయం, రామ నాటకం, రుక్మాంగద, లవకుశ, ఉషా పరిణయం* వంటి పేర్కొనదగినవి.

కూచిపూడి భాగవతాల ప్రదర్శనలో ముఖ్యంగా భామాకలాపంలో తెరమీద ఒక జడవేసి తద్వారా తమ పాండితీ ప్రకర్షను వెల్లడించడానికి ప్రయత్నించేవారు. జడను 27 నక్షత్రాలతో ఒక నక్షత్రమాల లాగా అలంకరించి తెర వెలుపలి భాగంలో ప్రేక్షకులకు కనపడేటట్లు వేలాడదీసేవారు. ప్రదర్శన ప్రారంభంలో జడ వర్ణన చేస్తూ ఉంటే ప్రేక్షకుల్లోని ప్రదర్శకుల నుంచి ప్రశ్నలు వచ్చేవి. వాటికి చక్కని సమాధానాలు ఇస్తూ సభను ఆశ్చర్యచకితుల్ని చేసేవారు.

పూర్వం కూచిపూడి భాగవతాల్ని నాలుగు వీధుల కూడలిలో గాని, ఊరి మధ్య బజారులలోగాని, ఊరి వెలుపల బయట ప్రదేశంలోగాని ప్రదర్శించేవారు. జన సమ్మర్దం ఎక్కువగా ఉంటే ఎత్తుగా ఉండడం కోసం బల్లలతో ఒక బల్లకట్టు నిర్మించేవారు. ప్రదర్శన నాలుగు వైపులా స్పష్టంగా కనిపించేలా పందిరిని నిర్మించేవారు. ఆనాడు తెరలు లేవు కాబట్టి కలంకారీ అద్దకం బమ్మల దుప్పటి లాంటి దాన్ని ఇరువురు వ్యక్తులు చెరోపక్క పట్టుకొని నిలుచుకొనేవారు.

ప్రదర్శన రాత్రి సుమారు 10 గంటలకు ప్రారంభమయ్యేది. ఈలోగా భాగవతులు గ్రామంలోని బ్రాహ్మణుల ఇండ్లలో భోజనం చేయడంగాని స్వయం పాకం చేసుకొనిగాని భోంచేసేవారు. రంగస్థలానికి సమీపంలో ఒక ఇంటిలో ముఖాలంకరణ చేసుకొనేవారు. ప్రేక్షకులందరూ వచ్చేవరకు గణపతి, సరస్వతి, లక్ష్మి స్తుతిల్ని గానం చేసేవారు. గ్రామ పెద్దలందరూ వస్తేగాని ప్రదర్శన ప్రారంభమయ్యేది కాదు.

ప్రతి జట్టులోను సమర్థులైన ఇద్దరు, ముగ్గురు హాస్యనటులు ఉండేవారు. వారు ఏ పాత్రనైనా పోషించేవారు. ప్రదర్శనలో ప్రతి పాత్ర రంగస్థలం మూడు పక్కలకు తిరిగి అభినయించేవారు. దూరంగా ఉన్నవారికి వినబడేటట్లు సూత్రధారులు హెచ్చుస్థాయిలో ప్రతి చరణాన్ని ఒకటికి రెండుసార్లు రెట్టించి పాడేవారు.

వేషధారణలో ఈనాటి కలరు కేకులుగాని, పౌడర్లుగాని, బ్రష్‌లుగాని ఉండేవి కావు. ముఖాలంకరణలకు అరదళం, మణిశిల, బగ్గుపొడి, సింధూరం ఉపయోగించేవారు. క్రేప్ హెయిర్ బదులు నారపీచు ఉపయోగించేవారు. వీరే ప్రదర్శనలో ప్రతి పాత్రకు ఒక ప్రత్యేకమైన వేషధారణ, ప్రాచీన సంప్రదాయాలతో కూడుకొన్న ఆభరణాలు ప్రవేశపెట్టారు. కూచిపూడి భాగవతంలో పురుషులకంటే స్త్రీలకు ఆభరణాలు ఎక్కువగా ఉండేవి. ఆయా కాలాలలో స్త్రీలు ధరించే ఆభరణాలనన్నింటినీ స్త్రీ వేషధారులు ధరించేవారు.

కూచిపూడి వారిలో వేదాంతంవారు, చింతలవారు, పసుమర్తివారు, భాగవతులవారు, వెంపటివారు, ఇంగువవారు, బుక్కావారు అని వివిధ కుటుంబాలవారు 19వ శతాబ్ది ప్రారంభం నుంచి నేటివరకు కూచిపూడి సంప్రదాయాన్ని ఉద్ధరించి ప్రచారంచేసి గొప్ప కీర్తిప్రతిష్ఠలను పొందారు, పొందుతున్నారు. ఈ కళాకారులు నాట్యసంగీతాలలోనే కాక అలంకార

శాస్త్రం, మంత్ర శాస్త్రం, భాషా శాస్త్రం, వాద్య శాస్త్రం వంటి వాటిలో గొప్ప నైపుణ్యాన్ని సంపాదించారు.

ఇక కూచిపూడి సంప్రదాయం క్రీ.శ. 1880 వరకు వేయి వెలుగులు వెలిగింది. ఆ తరువాత ధార్వాడ నాటక సమాజాలు ఆంధ్రదేశానికి వచ్చి నూతన పద్ధతుల్లో నాటక ప్రదర్శనలు ఇవ్వడానికి పూనుకొన్నాయి. నూతనత్వం కోసం పరితపించే ప్రజల్ని ఆ నాటకాలువిశేషంగాఆకర్షించాయి. అందుకే క్రీ.శ.1880 నుంచే క్రీ.శ. 1930 వరకు కూచిపూడి వారు కూడా తమ ప్రదర్శనలో మార్పులు తీసుకొని రావల్సి వచ్చింది. ధార్వాడ నాటకాలు ప్రజల్ని ఎందుకు ఆకర్షిస్తూ ఉన్నాయో గ్రహించి, భాగవత నాటక సంప్రదాయాల్లో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. తెరలు, హార్మోనియం, పద్యాలు, పాటలు, చెమ్కి దుస్తులు ప్రవేశపెట్టి భరత నాట్య సంప్రదాయాన్ని అనుసరించి ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టారు.

ఆనందన్

కూడియాట్టం : కేరళలో మాత్రమే కనిపించే జానపద రంగస్థల గేయరూపకం. దీని ఆవిర్భావం గురించి సరైన ఆధారాలు లేవు. అయితే పదవ శతాబ్దం నాటికే ఈ ప్రక్రియ బాగా అభివృద్ధిచెంది, ఉన్నత దశలో ఉందని కులశేఖర వర్మ తెలిపాడు. కానీ ఇది ఇంకా ప్రాచీనమైనదనే ఆధారాలు కూడా లభిస్తున్నాయి. కూడియాట్టం స్వరూపంలోనూ, ప్రదర్శనలోనూ సంక్లిష్టమైనది. దీనిని గత శతాబ్ది వరకు హిందూ దేవాలయాలలో నిర్మించిన రంగస్థలంపైన ప్రదర్శించాడు. దీనిని దేవాలయంలో ప్రదర్శించడం వల్ల దేవాలయంలోని దేవతకు దృశ్యాత్మక నివేదనగా సమర్పించారు. చాక్కియార్లు, నంబియార్లు ప్రదర్శించే రంగస్థల గేయ రూపకాలలో కూడియాట్టమ్ ఒకటి. ఇందులో నటి, నటుడు, విదూషకుడు ఉంటారు. ఇది బృందనాట్యం వలె వివిధ పాత్రలతో, సంభాషణలతో సాగిపోతుంది. నటన సంప్రదాయకంగా ఉంటూ, ప్రతీకాత్మక విన్యాసంతో కూడి ఉంటుంది. నటన లాగా ఆహార్యం, అలంకరణ కూడా సంప్రదాయకంగా ఉంటాయి. కూడియాట్టంను సంస్కృతం, ప్రాకృతం, మళయాళాలలో రచించారు.

ప్రాచీన కాలంలో దీని ప్రేక్షకులు కేరళ బ్రాహ్మణులు, రాజ కుటుంబీకులు. అయితే నేడు దేవాలయాలలోనే కాకుండా బయట కూడా ప్రదర్శించడం వల్ల అన్ని మతాలు, కులాలు, వర్గాలకు చెందిన పురుషులు, స్త్రీలు కూడా చూస్తున్నారు. సమకాలీనంగా కొందరు మాత్రమే సంస్కృతం, ప్రాకృతాలను అర్థం చేసుకుంటున్నారు. ఇది బహుళ ప్రచారం పొందిన కళారూపంగా కానీ, అన్ని వర్గాల ప్రజలు దీనిని దర్శించినట్లు కానీ మనకు ఆధారాలు లేవు.

దేవాలయాల ప్రాభవం తగ్గడంతో ఈ కళకు పోషణ కూడా తగ్గింది. ఇప్పుడు వీటి ప్రదర్శన చాలా తగ్గిపోయింది. ఈ కళాకారులు తమ జీవిక కోసం ఇతర వృత్తులను వెదుకుకోవాల్సిన పరిస్థితి, దేవాలయాలలోనే కాకుండా ఇతర ప్రదేశాలలో ప్రదర్శించాల్సిన స్థితి, అంతేకాక ప్రేక్షకుల అభిరుచుల మేరకు ప్రదర్శనను సంక్షిప్తం చేసుకోవడం, వారికి అనుకూలంగా మలచుకోవడం వంటివి జరుగుతున్నాయి. ఈ కళా రూపం ఎన్ని రోజులు బతికి బట్టకడుతుందో నిశ్చయంగా చెప్పలేము.

కూట్టు, చకార్ అనే పదాలు తమిళ ప్రాచీన గ్రంథమైన 'శిలప్పధికారం'లో కనిపిస్తాయి. కూట్టు, కూడియాట్టంలు చాలా కాలం బీజావాపంగా ఉన్నప్పటికీ, కేరళను పాలించిన కులశేఖర వర్మ (978-1036) కాలంలో మంచి ప్రసిద్ధిని గడించాయి. ఆయన స్వయంగా మంచి కళాకారుడు. అంతేకాక ఆయన రచించిన సుభద్ర ధనంజయ, తపతి సంవరణలు కూడియాట్టంగా మలచబడ్డాయి. కూడియాట్టం బాగా ప్రసిద్ధిచెందిందనటానికి ఆయన ఎంతో కృషిచేశాడు. అతని ఆస్థాన కవి అయిన తొల (అరుల) సహాయంతో అప్పుడు ప్రసిద్ధిచెందిన రూపం (కూడియాట్టం) లోకి సంస్కృత నాటకాన్ని తీర్చిదిద్దాడు. రాజు తాను రచించిన నాటకాలపైన 'వ్యంగ్య వ్యాఖ్య' లో కూడియాట్టంలోని కళాత్మకతను, సౌందర్యాన్ని వర్ణించాడు. ఈ కాలంలో ఆయన ఈ దిగువ తెలిపిన అంశాలను నవీకరించాడు. అవి 1) అప్పటికే కూడియాట్టంలో ఉన్న విదూషకుని వచనంతో పాటు, సంస్కృత శ్లోకాలను, సంభాషణలను, వాటి వ్యాఖ్యానాలను మళయాళంలో 'ప్రతి శ్లోకాలు' (సంస్కృత శ్లోకాలకు సమానంగా మళయాళంలో పద్యాలు) ను ప్రవేశపెట్టాడు. 2) విస్తృతంగా ఆంగిక, సాత్త్విక అభినయాలను జోడించాడు. 3) నిర్వహణ (జరిగిన కథలను వివరంగా తెలపడం) అనే కొత్త సంప్రదాయాన్ని చేర్చారు. నటులకు సహాయపడటానికి అట్ట ప్రకారం (కూడియాట్టంను ప్రదర్శించే విధానం), క్రమదీపిక (నటనకు సంబంధించి నటులకు సూచనలు) ను అదనంగా వివరించారు. అనేక నాటకాలకు తయారుచేసి చూపారు.

నాట్యశాస్త్రంలో తెలిపిన విధంగా ప్రధాన దేవాలయాల్లో కూడియాట్టంలను నిర్మించారు. తిరుచురాపల్లి, పెరువనం, ఇరింజలక్కుడు, కితంగూరు, హరిపాద్, గురువయ్యూరు వంటి ప్రదేశాలలో ప్రధాన కూడియాట్టంలు వెలిశాయి. 12వ శ. నుంచి 19వ శతాబ్దంలోగా అనేక కూడియాట్టంలు నిర్మించారు. వీటిని సంప్రదాయరీతుల్లో, కళా కౌశలం ఉట్టిపడేలా, కొలతలు నిర్దిష్టంగా అవి రూపొందాయి. కేరళ కళామండలంలో ఇటీవలి కాలంలో కూడా నిర్మించారు.

కూట్టు, కూడియాట్టంను ప్రదర్శించే చెక్కియార్ జాతి నటులు కుట్టంజెరి, అమ్మన్నూరు, వలియ పరిచ, ఈనూరు, మెక్కత్, మణి, కోయ్‌పాలో ఉన్నారు.

కూడియాట్టం ప్రదర్శనకు ఈ దిగువ తెలిపిన రచనలను స్వీకరిస్తారు. భాసుడు రచించిన ప్రతిమ, అభిరేఖ, ప్రతిజ్ఞ, స్వప్నవాసవదత్త, దూత ఘటోత్కచ, దూతవాక్యమ్, పంచరాత్రమ్, కర్ణాభరణమ్, అవిమారక, బాలచరితమ్, చారుదత్త, ఊరుభంగం, మధ్యమ వ్యాయోగమ్ మొదలైన నాటకాలు. శక్తి భద్రుడు రచించిన ఆశ్చర్య చూడామణి, కులశేఖర వర్మ రచించిన సుభద్ర ధనుంజయ, తపతి సంవరణమ్, హర్షుడు రచించిన నాగానందమ్, మహేంద్ర విక్రమ పల్లవుడు రచించిన మత్త విలాసమ్, బోధమానుడు రచించిన *భగవదజ్జుకీయమ్*, నీలకంఠుడు రచించిన *కల్యాణ సౌగంధికం* వంటి నాటకాలను అప్పుడప్పుడు ప్రదర్శిస్తారు. ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్త్విక అభినయాలను 'కూడియాట్టమ్'లో అభినయించారు. ఈ కళా రూపంలో విస్తృతమైన ఆంగికాభినయం ప్రత్యేకమైన లక్షణం. అందువల్ల ఒక నాటకంలోని ఒక అంకం ఒక రాత్రిలో ప్రదర్శించడం అసాధ్యమైనపని. శాకుంతలమ్, సుభద్ర ధనుంజయలో విదూషక పాత్ర ప్రదర్శనలో వాచికం విస్తృతంగా ఉంటుంది. విదూషకుడు పౌరాణిక, సామాజిక, చారిత్రక, సమకాలీన ఇతివృత్తాలను తీసికొని వాటిని ఇంపుగా, పొందికగా శ్రోతలకు అందిస్తాడు. విదూషకుని పలుకులు హాస్యంగా ఉంటూ, మధ్యయుగంలో దిగజారిన బ్రాహ్మణ సమాజాన్ని ప్రతిబింబిస్తాడు. కూడియాట్టం అంటే వివిధ పాత్రల సమాహారము కాదు. ఒకే నటుడు విభిన్న పాత్ర పోషణను కూడా తెలుపుతుంది. ఆశ్చర్య చూడామణిలో రావణుని పాత్రను ధరించే నటుడు, సీత, లక్ష్మణుడు (ఆహార్యంలో మార్పు లేకుండా) పాత్రలను ధరించాల్సి ఉంటుంది. ఇది కూడియాట్టంలో సంప్రదాయంగా వస్తుంది.

కూడియాట్టంలోని పద్యాలు/శ్లోకాలను ప్రత్యేకరీతిలో పాడుతారు. స్వరం కూడా ప్రత్యేకంగా ఉంటుంది. వేదమంత్రాల కంటే భిన్నమైన రీతిలో అంటే భిన్నమైన రాగం లేదా స్వరంలో పాడతారు. కూడియాట్టంలో సుమారుగా 20 రాగాలను పాడతారు. అవి – శ్రీకంఠి, ధనం, దుఃఖగాంధారం, చౌటి పంచమం, భిన్న పంచమం, శ్రీకమురం, కైశికి, ఘట్టాంతర, అంతరి, ముద్దాన, తోడి, ఆర్తన, ఇందోలం, మురళీదళం, కొలాధురి, ధనం, తర్కాన, విరాటక్కన, కొరకుంజి, పాలారి, పురాణీర్, దుఃఖ గాంధారం, చౌటి పంచమం, భిన్న పంచమం, శ్రీకమురం, అంబారి మొదలైనవి. ఆయా రాగాలను ఆయా రసాభివ్యక్తీకరణకు ఎన్నుకుంటారు.

మిఝువు, కురిఝు తాళం వాద్యాలను ఇందులో వాడుకుంటారు. మిఝువును కొన్ని శుభ సందర్భాల్లో నంబియార్లు వాయిస్తారు. కురుంకుఝల్, ఇడక్క, శంఖువు వంటి వాద్యాలను కూడా ఇందులో వాడుకుంటారు. వార, ధ్రువ, త్రిపుట, చంప, అతంట, చెంపట, లక్ష్మి మొదలైన తాళాలను వాడుకుంటారు.

ఆహార్యాభినయం (ఆహార్యం-రంగాలంకరణ) చాలా సాధారణంగా ఉంటుంది. ఆహార్యం పౌరాణికంలాగా ఉంటుంది. అయితే అలంకరణ సాధారణంగా ఉంటుంది. కిరీటం, కంకణం, కటక నూపురం మొదలైనవి ధరిస్తారు. నాయకుడు ధరించే ఆహార్యాన్ని పచ్చ లేదా మినుక్కు అంటారు. స్త్రీ పురుష పాత్రలు సాధారణంగా ఎర్రటి పూర్తి చేతుల చొక్కాను, ప్రత్యేకమైన ఆభరణాలు ధరిస్తారు. శూర్పణఖకు నల్లని దుస్తులు వాడతారు.

పెద్ద పాత్ర నిండ బియ్యం, తాటాకులు, కొబ్బరి కాయల గెల, అరటి గెలలు మొదలైనవాటితో వేదికను అలంకరిస్తారు. రంగస్థలానికి ముందు ఒక దీపాన్ని వెలిగిస్తారు. రంగస్థలంలో తెరలకు మధ్య ఒక దీపాన్ని వెలిగిస్తారు. కూడియాట్టంలో అనేక రంగస్థల సంప్రదాయాలున్నాయి. అవి నిర్వహణ, పురుషార్థం పరమావ వంటివి. ఇందులో సాత్త్వికాభినయం స్వల్పంగా ఉంటుంది. అందువల్ల ప్రతి పాత్రలోనూ ఇదే ప్రతిబింబిస్తుంది. ఆంగికాభినయంలో ముద్రాభినయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

సంస్కృత నాటకాన్ని సంపూర్ణంగా విస్తృతంగా కూడియాట్టం ప్రదర్శిస్తుంది. కొట్టు, కూడియాట్టంలో చాలాకాలంగా సంప్రదాయంగా వస్తున్నందున నేడు కూడా కనిపిస్తున్నది. అయినప్పటికీ ఈ సంప్రదాయ కళారూపం పైన అటు విద్యార్థులు, ఇటు పండితులు శ్రద్ధ కనబర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది కథక్కళి, నాట్యధర్మి కంటే ప్రత్యేకమైనది. భరతముని తన నాట్యశాస్త్రంలో తెలిపిన సంస్కృత నాటకంలోని వ్యూహాలను, ప్రక్రియలను సజీవంగా నాడు కూడా భారతదేశంలో నిలుపుకున్న ఏకైక కళారూపం కూడియాట్టం మాత్రమే.

చంద్ర

కృష్ణంరాజు, బి (1937-1988) : నటుడు, సూత్రధారి, పత్రికాధిపతి. ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం అధ్యక్షుడు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ కార్యదర్శి. తాళ్ళపాక అన్నమాచార్య కళాక్షేత్రం, నవకళా కేంద్రం స్థాపకుడు. ఈయన కడపజిల్లా రాజంపేట మండలం తాళ్ళపాక గ్రామంలో 1937, మార్చి 8న జన్మించాడు. తల్లిదండ్రులు వెంకటమ్మ, బాలరాజు బుగ్గ రాజులు. కృష్ణంరాజుకు చిన్నప్పటి నుంచే సంగీతం, నాటకం పట్ల అభిమానాన్ని పెంచు కున్నాడు. కమ్మని కంఠస్వరం ఆయనను జానపద గేయ గాయకుడ్ని చేసింది. కృష్ణంరాజు పాడిన జానపదగేయాలు విన్న లండను దేశ చిత్ర నిర్మాత జాన్

లిటిల్‌వుడ్ తనునిర్మించే చిత్రంలో కృష్ణంరాజును ప్రముఖ పాత్రలో నటించమని ఆహ్వానించాడు. రేడియో నాటకాలలో విరివిగా నటించాడు. సాంస్కృతిక కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తూ కృష్ణంరాజు 1963లో నాటకం, సంగీత విషయాలను పాఠక ప్రపంచానికి తెలియచేయాలనే కోరికతో 1963లో సూత్రధారిఅనే పత్రికను ప్రారంభించి రెండు దశాబ్దాలు నడిపాడు. ఈయన చేస్తున్న సేవను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంగీత, నాటక అకాడమీ సభ్యుడుగా నియమించింది. తరువాత కాలంలో కార్యదర్శిగా పనిచేశాడు. 1968లో స్టాక్‌హోం, 1977లో న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీయరంగస్థలకళల సమావేశాలకుభారతదేశ ప్రతినిధిగా వెళ్లాడు. కృష్ణంరాజు సంగీత నాటక అకాడమిలో ఉన్నప్పుడు (1970) ప్రసిద్ధనటుడు బళ్ళారి రాఘవ నటనావైదుష్యాన్ని యువనటులకు తెలిపేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించాడు. సాంస్కృతిక రంగం ఔన్నత్యం కోసం విశేషంగా కృషిచేసిన కృష్ణంరాజుకు అమెరికాలోని ప్రపంచ విశ్వవిద్యాలయం సాంస్కృతికడాక్టరేటు ప్రదానం చేసింది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్‌సభ్యుడుగా, నవకళాకేంద్రం అధ్యక్షుడుగా సేవలందించిన కృష్ణంరాజు 1988, ఆగస్టు 14న హైదరాబాదు నుంచి రాజంపేటకు వెంకటాద్రి రైలులో ప్రయాణిస్తూ మరణించాడు.

దాసరి.ఎన్.

కృష్ణ, ఎ.ఆర్. (1926-1992) : ప్రముఖ రంగస్థల నటుడు, అధ్యాపకుడు, దర్శకుడు, ప్రయోక్త, నాటక రచయిత. ఎ.ఆర్. కృష్ణగా ప్రసిద్ధుడైన అడుసుమిల్లి రాధాకృష్ణ శాస్త్రి 1926, నవంబర్ 13న సికింద్రాబాదులో నీలకంఠ సుబ్రహ్మణ్యం, యశోదమ్మ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశ నుంచి నాటకాల పై మక్కువ ఏర్పడింది. అది జీవితాంతం వరకూ వీడని బంధమైంది. వృత్తిరీత్యా విద్యుచ్ఛక్తి శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అయినా ప్రధాన వ్యాపకం నాటకమే. తెలంగాణాలో నాటక ప్రదర్శనలకు అనువైన వాతావరణంకాని, ప్రోత్సాహం కాని లేని రోజుల్లో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి నాటక ప్రదర్శనలు నిర్వహించాడు. నాటక రంగంలో నూతన పోకడలకు శ్రీకారంచుట్టాడు. నాటకకళా వికాసానికి పటిష్ఠమైన ఒక కేంద్రీయ వ్యవస్థ ఉండాలని గుర్తించి ఆంధ్రప్రదేశ్‌నాట్యసంఘాన్ని 1954లో స్థాపించాడు. దీనికి అనుబంధంగా 1959లో నాట్య విద్యాలయం స్థాపించబడింది. నటీనటులకు శాస్త్రీయమైన నటశిక్షణ అవసరమన్న ధ్యేయంతో రెండేళ్ళ డిప్లొమా కోర్సు ప్రవేశపెట్టాడు. తదనంతర కాలంలో నాటక రంగంలో వెలుగులు ప్రసరింపజేసిన ఉత్తమశ్రేణి నటీనటులకు ఈ నాట్య విద్యాలయమే పునాది. పాశ్చాత్య నాటక సౌరభాన్ని రాష్ట్రప్రజలకు తొలిసారిగా అందించిన ఘనత ఎ.ఆర్.కృష్ణకే దక్కుతుంది. బెర్టోల్డ్ బ్రెహ్ట్, పింటర్‌హెరాల్డ్, శామ్యూల్ బెకెట్, ఆర్థర్ మిల్లర్, జె.బి. ప్రీస్ట్లీ, ఇబ్సన్, సీన్ ఒకాసీ మొదలైన పాశ్చాత్య నాటకకర్తల నాటకాలను తెలుగు రంగస్థలం మీదికి తెచ్చినవారిలో ఎ.ఆర్. కృష్ణ ప్రథమగణ్యుడు. కొన్ని నాటకాలను తానే స్వయంగా అనువదించాడు. ఆస్కార్‌వైల్డ్ రచించిన ఐడియల్ హజ్బెండ్ నాటకాన్ని ఆదర్శమూర్తి (1967), హారాల్డ్ పింటర్ రచించిన కేర్ టేకర్ నాటకాన్ని సంరక్షకుడు (1968), హ్యాయర్స్ ఆఫ్ కోల్ నాటికను చీకటి వెలుగులు (1962) పేరుతో అనువదించి ప్రదర్శింపజేశాడు. ఇవేకాకుండా అరగంటలో అదృష్టం వంటి స్వతంత్ర నాటికలను కూడా రచించాడు. మృచ్ఛకటికం, తుగ్లక్, ప్రతాపరుద్రీయం, నిజం, ఆశ, బంగారులేడి, కీలుబమ్మలు, నిశ్శబ్దం కోర్టు నడుస్తోంది, యథా ప్రజా – తథా రాజామొదలైన నాటకాలు అద్భుతమైన సాంకేతికవిన్యాసాలతో కృష్ణనేతృత్వంలో జనరంజకంగా ప్రదర్శితమై ప్రయోగరీతుల్లో మార్గదర్శకంగా నిలిచాయి. 1974లో పన్నెండు రంగస్థలాలలో 60 మంది నటీనట, సాంకేతివర్గంతో భారతదేశ నాటకరంగ చరిత్రలో కనీవినీ ఎరగనిరీతిలోమాలపల్లి నాటకాన్ని అత్యద్భుతంగా ప్రదర్శింపజేసి సంచలనం సృష్టించాడు. నిజానికి ఎ.ఆర్. కృష్ణ కృషికి నిలువుటద్దంగా నిలిచింది మాలపల్లి నాటక ప్రదర్శనేనని చెప్పవచ్చు. మాలపల్లి 120 ప్రదర్శనలకు నోచుకుంది. ఆంధ్రదేశంలో ఎన్నో నటశిక్షణా శిబిరాలను నిర్వహించి వందలాది శిష్యులకు, ప్రశిష్యులకు ఈయన గురుపీఠం అయ్యాడు.



ప్రదర్శన ఖర్చులు భరించలేక ఇక్కట్లు పడుతున్న నాటక సమాజాలకు వినోదపు పన్ను ప్రతిబంధకంగా ఉన్న తరుణంలో ప్రభుత్వంతో పోరాడి వినోదపు పన్ను రద్దు చేయించడంలో కృష్ణ ప్రముఖ పాత్ర వహించాడు. విద్యార్థులకు నాటక విజ్ఞానాన్ని

కళాశాల స్థాయిలోనే అందించాలన్న సంకల్పంతో నిష్ణాతులతో రంగస్థల శాస్త్రం రెండు భాగాలుగా రాయించి ప్రకటించాడు. ఆ గ్రంథాలు నేటికీ ప్రామాణిక గ్రంథాలుగా రాణిస్తున్నాయి.

ఎ.ఆర్.కృష్ణ సాంఘిక, పద్య నాటకాలనే కాకుండా జానపద కళారూపాలపై కూడా దృష్టినిలిపాడు. షాహాజీ రచించిన సతీదాన సూరం అనే యక్షగానాన్ని సంస్కరించి, ఆధునిక ప్రేక్షకులను అలరించేవిధంగా రూపకల్పన చేసి మనోజ్ఞంగా ప్రదర్శింపచేశాడు.

నాటకరంగంలో ఎ.ఆర్. కృష్ణ చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదును ప్రదానంచేసి గౌరవించింది. నాటకమే తన ఊపిరిగా చేసుకుని అహరహం నాటకాన్ని ఒక ఉద్యమంగా నడిపించిన కళాతపస్వి 1992, నవంబర్ 10వ తేదీన నటరాజులో ఐక్యమయ్యాడు.

అడబాల

కృష్ణపారిజాత నాటకం : కృష్ణపారిజాత నాటకంలోని రంగస్థల కళలోని వైవిధ్యం కారణంగా అది అనతికాలంలో ప్రజల ఆదరాభిమానాల్ని చూరగొనింది. దొడ్డాటకు సంస్కరణాత్మక రూపకమే ఈ కృష్ణ పారిజాతం. దీనికి ఇంత ప్రశస్తి రావడానికి గోకాక్ జిల్లాకు చెందిన 'కులగోడ్ తిమ్మన్న' కృషే ప్రధాన కారణం. కృష్ణపారిజాత నాటకం 19వ శతాబ్దికి చెందిన 'అపరాల తమ్మన్న' కృతమని పరిశోధకులు అంటారు. దీనిపై ఎక్కువగా యక్షగాన ప్రభావం ఉండేది. కాని చాలా కాలం తరువాత 'కులగోడ్ తిమ్మన్న' ఈ యక్షగానం వైపు ఆకర్షితుడైనాడు. ఈయన అపరాల తమ్మన్నగారి ఇతివృత్తాన్ని తీసుకొచ్చాడు. ఇతివృత్తం తమ్మన్నగారి నుంచి గ్రహించినా తన సొంత పాటల్ని చేర్చి తన స్నేహితులతో కలసి దానిని ప్రదర్శించాడు. అది ఆనాడు గొప్ప ఆదరాభిమానాన్ని పొందింది.

కృష్ణ పారిజాత నాటకంలోని ఇతివృత్తం ప్రేమకు సంబంధించినదైనా దాన్ని ప్రదర్శించేటప్పుడు కొత్తదనాన్ని కల్పించారు. మహారాష్ట్ర నాటకంలోని లలిత సంగీతాన్ని గ్రహించడం, పాత్రలు ఎవరి పాటల్ని వారు పాడడం వంటివి ఇందులో చోటు చేసుకున్నాయి. తబెల, సారంగి, హార్మోనియం వంటి ఆధునిక వాయిద్య పరికరాల్ని ఇందులో ప్రయోగిస్తారు. ఈ నాటకంలో రంగాలంకరణ, వాడే అలంకరణ సామాగ్రి, స్త్రీ పాత్రల్ని స్త్రీలే ధరించడం వంటి ఆధునికపద్ధతుల్ని ప్రయోగించడం వల్ల ఆనాడు అది చాలా ఆదరాభిమానాల్ని పొందింది.

ఆనందన్

కృష్ణమాచార్యులు, కిళాంబి (1900-1959) : నటుడు, నాట్యాచార్యుడు, దర్శకుడు, సంగీతజ్ఞుడు, ప్రయోక్త, నాటక కళలో అఖండ ప్రతిభాశాలి. ఈయన 1900, మే 5న సామర్లకోటలో చూడమాంబ, ధర్మాచార్యుల దంపతులకు జన్మించాడు.



పండిత వంశంలో పుట్టిన ఈయనకు సంగీత సాహిత్యాలు అనువంశికంగా వచ్చిన వరాలు. చిన్నతనంలోనే ఆరాధనోత్సవాలలోపాటలు పాడుతూ సంగీతాన్ని అభివృద్ధి పరుచుకున్నాడు. నాటక లక్షణ గ్రంథాలు చదివి నాటక కళలో ప్రావీణ్యం సంపాదించాడు.

ఏ పాత్రకైనా సరిపోయే అంగసౌష్టవం, విభిన్న మనస్తత్వాలు గల పాత్రలు నటించడంలో నేర్పు, సూక్ష్మబుద్ధి, నలుగురినీ కూడగట్టి నాటకాలాడించే శక్తి, పట్టుదల, క్రమ శిక్షణాభావం ఈయనను ఆంధ్ర నాటకరంగంలో ఉన్నత స్థానం అధిష్టించడానికి దోహదం చేశాయి.

ఆచార్యులు స్వాతంత్ర్య ప్రియుడు. ఆ స్వాతంత్ర్యాన్ని అరికట్టే ఇంగ్లీషు బడుల చదువు అబ్బలేదు. నాటక కళారాధనలో ఎన్ని చిక్కులు వచ్చినా ధైర్యంగా నిలబడిన నిర్విచార కళాతపస్వి. ఈయన చిన్న వయసులోనే కాకినాడకు వెళ్లి, వెదురుమూడి శేషగిరి రావు, ముప్పిడి జగ్గరాజు, ఆలమూరు పట్టాభిరామయ్య మొదలైన మహానటులతో కలిసి నటించాడు. ఆచార్యులు అనకాపల్లిలోని లలితా సమాజంలో ప్రదర్శించిన ప్రదర్శనలలో నటించాడు.

1917 ప్రాంతంలో లలిత సమాజం సంస్థకు కొంత కాలం ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేశాడు. ఈ సంస్థ అభివృద్ధికి సొంత ధనం ఖర్చు చేశాడు. ఈయన దర్శకత్వంలో రూపొందిన అనార్కలి, చాణక్య, ఆంధ్రశ్రీ, వేనరాజు, కురుక్షేత్రం నాటక ప్రదర్శనలు ఆంధ్ర ప్రదేశ్ అంతటా మెప్పుపొందాయి.

నటులకు శిక్షణ ఇవ్వడంలో దిట్ట. ఈయన శిక్షణలో రూపొందిన నటులు నాటక, సినీరంగాలలో పేరు గడించారు. ఈయన ప్రజ్ఞా విశేషాలను గుర్తించి ఆంధ్ర నాటక కళా పరిషత్తు 1950లో ఘనంగా సన్మానించింది. భారతీయునాటక లక్షణాలను, సంప్రదాయాలను బాగా ఆకళింపు చేసుకొని తెలుగు నాటక రంగం మీద ఆ సంప్రదాయాలను నెలకొల్పడానికి యత్నించిన కళావేత్త. ఆంధ్ర నాటక రంగ పరిణామంలో ఈయన పాత్ర మరువరానిది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, కంసుడు, రుక్మాంగదుడు, విశ్వామిత్రుడు, ధర్మరాజు, భవానీ శంకరుడు, బిల్వమంగళుడు, లింగరాజు, శర్మ (మధుసేవ),

అక్బర్, భరతుడు, దుర్యోధనుడు, అర్జునుడు మొదలైనవి ఆచార్యులకు మంచి పేరు తెచ్చి పెట్టాయి.

1957 నాటికి చక్కెర వ్యాధి మూలంగా కుడికాలు తీయవలసి వచ్చింది. అయినా శిష్యులకు శిక్షణిస్తుండేవాడు. ఈయన 1959, జులై 27న పరమపదించాడు.

శ్రీ.చ.

కృష్ణమాచార్యులు, శిరోభూషణం వెంకట (1893-1972) : రంగస్థల నటుడు, అధ్యాపకుడు. ఈయన 1893, ఫిబ్రవరి 23న నెల్లూరులో జన్మించాడు. తల్లి అండాళమ్మ తండ్రి వెంకట కృష్ణమాచార్యులు. విభిన్న పాత్రలను అభినయించడంలో మేటి. ఇంగ్లీషు, తెలుగు నాటక పాత్రలను రసవత్తరంగా అభినయించిన నటుడు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూనే నాటకాలలో నటిస్తూ కళానిధి, వెటరన్ బారన్ యాక్టరు బిరుదులు పొందాడు.

చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోగా మేనమామ పోషణలో చదువుకున్నాడు. సుప్రసిద్ధ నటుడు సరస్వతి రంగస్వామివద్ద సంగీతంలో శిక్షణ పొందాడు. ఈయన మొట్ట మొదటి పాత్ర నెల్లూరు రంగ నాయకులు పేట యంగ్ మెన్స్ అసోసియేషన్ వారి మర్చెంట్ ఆఫ్ వెనీసు ఇంగ్లీషు నాటకంలో గ్రేసియో. ఆ తరువాత ఇంగ్లీషు, తెలుగు నాటకాలలో అనేక పాత్రలు ధరించి మెప్పు పొందడమే గాక నెల్లూరులో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పోటీలలో పాల్గని హరిశ్చంద్ర పాత్రకు పతకం గెల్చుకున్నాడు.

హరిశ్చంద్రుడు, నలుడు, సారంగధరుడు, రాజరాజు, శ్రీకృష్ణుడు, శివాజి, రాజసింహ, చారుదత్తుడు, బిల్వమంగళుడు, సలీం, రుక్మాంగదుడు, రాముడు, మాయల మరాటి, బాహుకుడు, అక్రూరుడు, రంగరాయుడు, విద్యానాథుడు, చంద్రగుప్తుడు, చాణుక్యుడు, రామదాసు, తానీషా, కుంభరాణా, కృష్ణ దేవరాయలు, రాణా ప్రతాపసింహుడు, నారదుడు, రామరాజు వంటి పాత్రలే కాకుండా ఇంగ్లీషులో గ్రేసియానో, కేసియస్, వంటి పాత్రలు వేశాడు.

గూడూరు నుంచి పాకాలకు బదిలీ చేయడంతో ఉద్యోగానికి రాజీనామా చేసి నెల్లూరుకు తిరిగి వచ్చాడు. కుమార్తె మరణశయ్య మీద ఉన్నప్పుడు సారంగధర వేయడం ఆయన కళాతృష్ణకు నిదర్శనం. ఈయన నాటకాలలో సంపాదిస్తున్న మొత్తాన్ని సంస్థలకు ఆర్థిక సహాయంగా అందజేసేవాడు. కాని అంతిమ దశలో దారిద్ర్యంతో కుంగిపోయి చెన్నపురిలో 1972, ఫిబ్రవరి 2న మరణించాడు.

శ్రీ.చ.

కృష్ణమిశ్రుడు (క్రీ.శ.1050) : సంస్కృత నాటకకర్త. తన శిష్యులలో ఒకనికి అద్వైతమతం సరిగా బోధపడకపోవడం వల్ల, ప్రబోధ చంద్రోదయమనే అన్యాప దేశ నాటకం రచించి అతనికి అద్వైతం సులభంగా అర్థమయ్యేటట్టు చేశాడు. ప్రబోధ చంద్రోదయంలో మోహుడు, ఉపనిషద్దేవి, దంభుడు, క్రోధుడు, శ్రద్ధ మొదలైనవే గాక షడ్దర్శనం లోని వివిధ మతాలకు సాంకేతికంగా చార్వాక, బౌద్ధ మొదలైన పాత్రలను కూడా సృష్టించాడు. సంస్కృత అన్యాప దేశ నాటకకర్తల మీద ప్రబోధ చంద్రోదయ ప్రభావమే ఎక్కువ. దుష్టశక్తుల మీద సుగుణ శక్తుల విజయం విజ్ఞాన చంద్రోదయానికి ప్రతీకగా రూపొందింది.

శ్రీ.చ

కృష్ణమూర్తి, చెన్నూరు (1931-2005) : రంగస్థల సినీ నటుడు. ఉపాధ్యాయుడు. 1931లో నెల్లూరు జిల్లా గూడూరు సమీపంలోని చెన్నూరులో జన్మించాడు. పాఠశాలలో చదువుతున్న రోజుల్లోనే పర్వతనేని రామచంద్రారెడ్డితో కలిసి రామదాసు నాటకంలో శ్రీరాముడుగా నటించాడు. ఆ తరువాత నగరాజకుమారితో రంగూన్ రౌడి నాటకంలో మోహన రావుగా నటించి ప్రేక్షకుల మన్ననలను పొందాడు. ఎం.ఏ., బి.ఇడి. పూర్తి చేసిన కృష్ణమూర్తి ఉపాధ్యాయుడుగా వృత్తిలో కొనసాగుతూనే ప్రవృత్తిగా ఎంచుకున్న నాటకరంగం కోసం తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించాడు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, హరిశ్చంద్రుడు, నారదుడు, దుర్యోధనుడు, అర్జునుడు వంటి పౌరాణిక పాత్రలతో పాటు కార్యవర్ది, తుకారాం, సలీం మొదలైన పాత్రలను వివిధ పరిషత్తు పోటీలలో ప్రదర్శించి ఉత్తమ నటుడు బహుమతులందుకున్నాడు. 1973లో మద్రాసు పరిషత్తులో, 1979లో ప్రసిద్ధ పౌరాణిక, చారిత్రక సంబంధమైన దుర్యోధనుడు, బబ్బిలి రాయుడు వంటి ఏకపాత్రాభినయాలను ప్రదర్శించి ఘన సన్మానాలందుకున్నాడు. ఇవేకాకుండా ఛత్రపతి శివాజీ, మహామంత్రి తిమ్మరుసు, భగ్నజీవి, మురారి వంటి ఏక పాత్రాభినయ పాత్రలను పలుచోట్ల ప్రదర్శించాడు. కళాతపస్వి, నటరాజ బిరుదాంకితుడు. నాటకరంగంలో గుర్తింపు తెచ్చుకున్న కృష్ణమూర్తి సినిమాలో ప్రవేశించి కోడెనాగు, కన్నవారి కలలు, వైకుంఠపాళి, నాయుడు బావ, గడుసు పిల్లోడు, సీతాపతి సంసారం, సూత్రధారులు, జయసింహ మొదలైన వాటిలో ముఖ్య పాత్రలలో నటించాడు. కళారంగం కోసం కృషి చేసిన కృష్ణమూర్తిని నెల్లూరు జిల్లాలో పలు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో 1991, అక్టోబరులో ఈయన రంగస్థల జీవిత స్వర్ణోత్సవాన్ని



ఘనంగా నిర్వహించాయి. 2005లో వాకాడు గ్రామంలో కన్నుమూశాడు.

దాసరి,ఎన్

కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీపాద (1866-1960) : నాటకకర్త, కవి, వీర గ్రాంథికవాది, పత్రికా సంపాదకుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థానకవి, మహామహోపాధ్యాయ, కవిరాజు, కవి సార్వభౌమ, ఆంధ్ర వ్యాస, కళా ప్రపూర్ణ బిరుదాంకితుడు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా, దేవరపల్లి గ్రామంలో 1866, అక్టోబర్ 29న, వెంకటసుబ్బ సోమిదేవమ్మ, వెంకట సోమయాజి దంపతులకు జన్మించాడు. ఈయన పన్నెండవ ఏటనే కవిత్వం చెప్పడం ప్రారంభించి 200 శ్రవ్య, దృశ్య కావ్యాలు రచించాడు. వజ్రాయుధం పత్రిక నడిపి వ్యవహారిక వాదులను ముప్పతిప్పలు పెట్టాడు. మానవ సేవ, వందే మాతరం పత్రికలు నడిపాడు. కళావతీ ముద్రణాలయం నిర్వహించాడు. ఆంధ్రదేశంలో ఈయనకు శిష్యకోటి అసంఖ్యాకం.



1902లో *కలభాషిణి*, 1907లో *ఆంధ్ర వేణీ సంహారం*, 1908లో *బబ్బిలి యుద్ధం*, 1911లో *రాజభక్తి*, 1914లో *మోహినీ మనోహరం*, 1921లో *తిలక మహారాజ నాటకం*, 1921లో *గాంధీ విజయధ్వజం*, 1927లో *భోజరాజ విజయం*, *శ్రీనాథ కవిరాజీయం*, *మహాభారత యుద్ధం*, 1931లో *చంద్రికా పరిణయం*, *మాయావతీ నాటకం*, *సావిత్రి*, *వీర రుద్ర నాటకం*, *శ్రీ రామకుమార విజయం*, *విక్రమదేవ విజయం*, *యయాతి నాటకం*, *యాజ్ఞవల్క్య నాటకం*, 1948లో *వీరసేన విజయం*, 1955లో *యజ్ఞ ఫలం* నాటకాలను రచించాడు. వీటితోపాటు 1911లో *డాలోరిబుచ్చిగాడు*, 1930లో *దాష్టికపంతులు*, అనే ప్రహసనాలను వెలువరించాడు.

శ్రీపాద లక్షణ సంప్రదాయవాది. విషాదాంతంగా నాటకం ముగించ గూడదనే సంప్రదాయాన్ని తోసిరాజని బబ్బిలి నాటకం విషాదాంతం చేశాడు. నాటకాలలో పాత్రోచిత భాష ఉపయోగించాడు. భారత, భాగవత, రామాయణాలు మూడు ఒక చేతి మీదుగా అను వదించినా, వేణీసంహారాది నాటకాలు అనువదించినా, స్వతంత్ర నాటకాలు రాసినా, ఈయన పేరు బబ్బిలి యుద్ధ నాటకంతో వెలుగులోకి వచ్చింది. ఈయన కీర్తిని చిరస్థాయిగా నిలిపింది. ఇందులోని పద్యాలు, పండిత పామరుల నోట తాండవ మాడుతుంటాయి. కృష్ణమూర్తి శాస్త్రి 1960, డిసెంబర్ 29న నిర్యాణం చెందాడు.

శ్రీ.చ.

కృష్ణమోహన్, మక్కపాటి : నటుడు, అధ్యాపకుడు, నాటక రచయిత, దర్శకుడు, సమాజ స్థాపకుడు. పుట్టింది ప్రకాశం జిల్లాలోని కరవది గ్రామంలో. నాటక కళ పట్ల అభిమానం పెంచుకున్న కృష్ణమోహన్ విద్యార్థి దశలోనే అంటే 14వ ఏటనే రంగస్థలంపై నటించాడు. రంగకవి రచించిన ఇదేనా మాదేశం నాటకంలో మొట్టమొదటి సారిగా నటించాడు. నాటకాలలో నటిస్తూనే విద్యనభ్యసించాడు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాడు.

కృష్ణ మోహన్ రంగస్థలం వైపు మొగ్గడానికి కారకులు నీలంరాజు శ్రీనివాసరావు, కె.వి.రమణారెడ్డి, ధారా రామనాథ శాస్త్రి, బండారు రామారావు తదితరులైతే, గురువు మాత్రం తల్లావఝుల శివశంకరస్వామి. ఒంగోలులోని యువ కళాకారులను ఒకవేదిక పైకి తెచ్చి రంగస్థలం వికాసవంతం చేయాలనే కోరికతో 1954-55లో 'నవ్య కళాసమితి'ని స్థాపించాడు. ఈ సంస్థలో కప్పగంతుల మల్లికార్జునరావు, ముదిగొండ శివప్రసాద్, కె. విశ్వనాథం, తల్లావఝుల పతంజలి శాస్త్రి, తైలం లక్ష్మీనారాయణ, వి.ఎస్. కామేశ్వరరావు మొదలైనవారు సభ్యులు. నవ్య కళా సమితి పక్షాన 1958, 59వ సంవత్సరాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన నాటక పోటీలలో వీలునామా, పునర్జన్మ నాటకాలను, ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిర్వహించిన నాటక పోటీలలో చీకటి తెరలు, జ్వాల, నాటికలను ప్రదర్శించి నటుడుగా, దర్శకుడుగా ప్రథమ బహుమతి అందుకున్నాడు. ఆంధ్రదేశంలో సాంస్కృతికోద్యమాన్ని బలోపేతం చేయడం కోసమే ఉద్భవించిన ప్రజా నాట్యమండలి నిర్వహించిన నాటక, నాటిక పోటీలలో కృష్ణమోహన్ నవ్య కళా సమితి పక్షాన తెలుగు కోపం నాటిక ప్రదర్శించి గరికపాటి రాజారావు చేతులమీదుగా ప్రథమ బహుమతి అందుకున్నాడు. ఆ తరువాత చింతపల్లి హనుమంతరావు రచించిన సుడిగుండాలు, ఆత్రేయ భయం, ప్రగతి, కప్పగంతుల మల్లికార్జున రావు సప్తపది, మారని మనిషి, రావి కొండలరావు పట్టాలుతప్పినబండి, నీలంరాజు శ్రీనివాసరావు లీడర్ల కార్ఖానా, కోన గోవిందరావు రాజీనామాలలో నటించాడు. రాష్ట్రస్థాయి నాటిక పోటీలలో పాల్గని పదహారు సార్లు ఉత్తమ

నటుడు అవార్డులను అందుకున్నాడు. సుప్రసిద్ధ రంగస్థల నటుడు కె. వేంకటేశ్వరరావు, పులిపాటి వేంకటేశ్వర్లు ప్రభృతుల ప్రశంసలందుకున్నాడు.

మక్కపాటి ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్న కాలంలో విద్యార్థులకు కళారంగం పట్ల ఆసక్తి పెంచుకోవ డానికి అవసరమైన వాతా వరణం కల్పించాడు. విద్యార్థులతో నాటకాలు వేయిం చడమే కాకుండా, వారి కోసం మనం–మన పిల్లలు అనే నాటకం రచించాడు. ఈ నాటకం పలు వేదికల మీద ప్రదర్శించి ప్రశంసలందు కున్నాడు. ఒంగోలు అభ్యుదయ నాటకరంగాన్ని ఆంధ్ర దేశానికి పరిచయం చేయడంలో మక్కపాటి కృషి అభినందనీయం. ఆ తర్వాత తెనాలిలో 'కళాభారతి' అనే సంస్థను స్థాపించడానికి కృషి చేశాడు. ఈసంస్థపక్షాన ఝాన్సీ భవానీ అనే చారిత్రకనాటకం ప్రదర్శింపబడింది. ఆంధ్ర నాటక రంగంలో ఈ ప్రదర్శన సంచలనం కలిగించింది. ఈనాటకం రాష్ట్రంలోని పలు ప్రాంతాలలోనే గాకుండా, రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శింపబడి ప్రేక్షకుల ప్రశంసలనందుకుంది. కృష్ణమోహన్‌కు నటుడిగా, దర్శకుడిగా, రచయితగా ఎనలేని కీర్తి తెచ్చి పెట్టింది.

దాసరి.ఎన్.

కృష్ణ విలాస సభ (అల్లూరు) : నెల్లూరు జిల్లా, కోవూరు తాలూకా, అల్లూరు గ్రామంలో పర్వతనేని రామచంద్రారెడ్డి స్థాపించాడు. ఈయన రామదాసు నాటకంలో కబీరు పాత్రకు చాలా ప్రసిద్ధి. విషాద సారంగధర నాటకాన్ని కూడా ఈ సమాజం జనరంజకంగా ప్రదర్శించింది. ఈ సమాజం నెల్లూరు పరిసర ప్రాంతాలలోనే కాకుండా ఇతర జిల్లాల్లో కూడా ప్రదర్శించింది.

శ్రీ.చ.

కృష్ణశర్మ, మల్లాది వెంకట (1907–73) : సుప్రసిద్ధ నాటకకర్త. ఈయన 1907లో నారాయణ అవధానులు, గోదావరమ్మ దంపతులకు శ్రీకాకుళంలో జన్మించాడు. సుప్రసిద్ధ నాటకకర్త విశ్వనాథశర్మ ఈయనకు స్వయాన అన్న.

శ్రీ కాకుళంలోనే కృష్ణశర్మ మెట్రిక్యులేషన్ చదివి కలెక్టరాఫీసులో కొద్దికాలం ఉద్యోగం చేశాడు. చందమామ పబ్లికేషన్స్ కథా రచన శాఖలో కొంతకాలం పని చేశాడు. అన్న ప్రభావం మూలంగా కృష్ణశర్మకు నాటకకళలో అభిరుచి, అభినివేశనం కలిగింది. సురభికంపెనీ నటులతో స్నేహం కుదిరింది. ఆంధ్ర నాటకరంగ ప్రగతికి జీవితం అంకితం చేయాలనే మహదుద్దేశంతో ఉద్యోగానికి స్వస్తి చెప్పి నాటకరంగంలోకి అడుగు పెట్టాడు. సురభి సమాజం ప్రదర్శించే నాటక ప్రయోగరీతులకు అనుగుణంగా పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలు రాసి ఇచ్చాడు. వారికి ప్రయోగంలో స్వయంగా శిక్షణ ఇచ్చాడు. నాటి నుంచి నేటికీ సురభివారు మల్లాది నాటకాలనే ఎక్కువగా ప్రదర్శిస్తున్నారు. ఈయన రచనా చాతుర్యంవల్లనే ఆనాటకాలువందలసార్లు ప్రదర్శిత మవుతున్నాయని చెప్పవచ్చు.

రవీంద్రనాథ టాగూరు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈయన అనువదించిన టాగూరు బలిదానం నాటకం ఊరూరా ప్రదర్శించడానికి భారత ప్రభుత్వం 'న్యూ పూర్ణానందా డ్రమెటిక్ థియేటర్స్' వారికి గ్రాంటు ఇచ్చింది. అందుకే ఈయనకు సురభి కవి అని పేరు వచ్చింది. నాటకాలే గాక మల్లాది ఏకాంకికలు కూడా విశిష్టమైనవి. ఈయన రచించిన తెరలో కురుక్షేత్రం అనే వ్యంగ్య నాటిక నేటి మన అస్తవ్యస్త వృత్తి నాటక రంగానికి ప్రతిబింబం.

మల్లాది రచించిన నాటక నాటికలు సాహిత్య దృష్టిలోనే గాక ప్రయోగ దృష్టిలో కూడా ఉన్నతస్థాయికి చెందినవి. వ్యంగ్యాత్మక హాస్య సృష్టిలో సిద్ధహస్తుడు.

మాయాబజార్, భూకైలాస్, దేవదాసు, బాల నాగమ్మ, అభాగిని, స్త్రీ, మిస్ ప్రేమ బి.ఏ, వసంతసేన, లవకుశ, బలిదానం, శ్రీ కృష్ణదేవరాయలు, ప్రతిజ్ఞ, అలెగ్జాండర్, కృష్ణవేణి, వీర బ్రహ్మం, కాలాపహాడ్, దక్షయజ్ఞం, దశావతారాలు (అముద్రితాలు) మొదలైన నాటకాలు రచించాడు. ఇవే కాకుండా స్త్రీ (1945), ప్రత్యక్షదైవం (1946), వీర విహారం (1946), వారసత్వం (1946), నామకరణం (1946), ప్రతిమ (1957), సుబ్బక్క విరహం (1959), తెరలో కురుక్షేత్రం (1960), అప్పుపత్రం (1962), ప్రేమ సాగర మథనం (1962), విషకన్య (1957), గతిలేని దేశంలో (1957) ఏకాంకికలు వెలువరించాడు.

1970లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు విజయవాడలో నిర్వహించిన నాటకోత్సవాలలో ఈయనను ఘనంగా సన్మానించింది. ఆంధ్ర నాటకరంగ ప్రగతిని ప్రగాఢంగా వాంఛిస్తూ, అహోరాత్రులు కృషిచేసిన కృష్ణశర్మ 1973, జనవరి 19న స్వరస్థుడయ్యాడు.

శ్రీ.చ.

కృష్ణానంద హిందూ నాటక సమాజం : ఈ సమాజాన్ని 1910లో గుంటూరులో స్థాపించారు. గిరిరాజు రామమూర్తి, యెద్దనపూడి నరసింహం, ఉండవల్లి లక్ష్మీనారాయణ, ఆరణి వెంకట సత్యనారాయణ మొదలైవారు ప్రధాన నటులుగా ఉండేవారు. ఈ సమాజంలోని నటులంతా ప్లీడరు గుమాస్తాలు. ఈ సమాజం తొలుత 1917లో గుంటూరులో, విజయవాడలో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పోటీలలో పాల్గంది.

ప్రసన్నయాదవం, పాండవవిజయం, గయోపాఖ్యానం, వేణీ సంహారం, సత్యహరిశ్చంద్ర, బబ్బిలి నాటకాలను ప్రదర్శించిన ఈ సమాజం 1923 వరకు విజయవంతంగా నడచి కాల గర్భంలో కలిసిపోయింది.

శ్రీ.చ.

కృష్ణారావు, అత్తిలి (1938-1998) : నటుడు, దర్శకుడు, రచయిత. ఆంధ్ర విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగం స్టేజి డైరెక్టరు. నాటక విభాగం శాఖాధ్యక్షుడు. ఈయన ఫేకల్టీ ఫైన్ ఆర్ట్స్ ఛైర్మన్‌గా నాలుగు దశాబ్దాలు నాటక రంగ వికాసానికి కృషి చేశాడు. విశాఖ పట్టణంలో అత్తిలి మహాలక్ష్మి నాగన్న దంపతులకు 1938, ఏప్రిల్ 18న జన్మించిన కృష్ణా రావు చిన్నతనం నుంచి నాటకాభిలాషతో సంస్కృత, పాశ్చాత్య నాటక ధోరణులను ఆమూలాగ్రం అధ్యయనం చేశాడు. ధర్మజ్యోతి నాటకంలో బాలనటుడిగా రంగ ప్రవేశం చేసిన అత్తిలి కె. వేంకటేశ్వరరావు, కొమాండూరు కృష్ణమాచార్యులు, రాఘవన్ దర్శకత్వంలో నిష్ణాతుడై పలు నాటకాలలో భూమికా ధారణ చేశాడు. 1952లో విశాఖ కళా మండలి ప్రదర్శించిన పల్లెపడుచు నాటకంలో గోపి పాత్రను ధరించి తెన్నేటి విశ్వనాథం చేతుల మీదుగా ఉత్తమ నటుడి బహుమతి స్వీకరించాడు.

అంగర సూర్యారావు రచించిన *దొంగ-దొర, దేశ దిమ్మరులు* నాటకాల్లో ముఖ్యపాత్రలను పోషించాడు. కళా ప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు దర్శకత్వంలో అన్నాచెల్లెలు, ఆడది నాటకాల్లో నటించాడు. 1953లో ఆంధ్రవిశ్వవిద్యాలయం లో జరిగిన యువ జనోత్సవాలలో భమిడి పాటి రచించిన మనస్తత్వాలు నాటకం ప్రదర్శించి ఉత్తమ నటుడు, దర్శకుడు బహుమతులను పొందాడు. అంగర సూర్యారావు స్ఫూర్తితో నాటక రచన వైపు దృష్టిని మళ్లించాడు. 1960లో జరిగిన విశ్వవిద్యాలయ నాటకోత్సవాలలో అంగర సూర్యారావు రచించిన *రణరంగం* నాటకాన్ని ప్రదర్శించి ఉత్తమ దర్శకుడు పురస్కారాన్ని అందుకున్నాడు. రాచకొండ విశ్వనాథశాస్త్రి రచించిన *నిజం* నాటకంలో సార్వభౌమరావు పాత్ర పోషించాడు. సమకాలీన రాజకీయాలను ఇతివృత్తంగా చేసుకొని రచించిన అయోమయోపాఖ్యానం నాటకంలో బహురూపం అనే జానపద కళా ప్రక్రియను చక్కగా వినియోగించాడు. 1986లో జోగినీ వ్యవస్థ దురాగతాలను అధ్యయనం చేసి జోగు జాతర అనే నాటకాన్ని రచించాడు. ఈ నాటకంలో జముకుల కథను ప్రవేశపెట్టాడు. ఈ నాటకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణా ప్రాంతంలో అనేక ప్రదేశాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. వీధి నాటక ప్రక్రియలో టామీ టామీ టామీ ని రచించి కళింగాంధ్ర జిల్లాలలో నాట్య భారతి సంస్థ ద్వారా ప్రదర్శించాడు. సుందరీ సుందరుడు కిడ్నాప్ నాటికలను రచించి ప్రదర్శించాడు. సంగీత మర్మాలను ఔపోసన పట్టిన అత్తిలి కమనీయంగా పద్యాలను రంగరించి రచించిన వ్యాసాలను నాటకీయం పేరుతో సంకలనంగా ముద్రించాడు. సెంట్రల్ యూనివర్సిటీ (హైదరాబాద్) రంగస్థల కళల శాఖలో కొంతకాలం ఆచార్యునిగా పనిచేశాడు. ఊరేగింపు ఆధునిక వీధి నాటకం ద్వారా ఈయనకు వచ్చిన గుర్తింపు అసామాన్యం! ఈయన 1998, డిసెంబర్ 1న కృష్ణారావు దివంగతు డయ్యాడు.

కె.బి.రాజు

కృష్ణారావు, జి.వి. (1914-1979) : కవి. రచయిత. విమర్శకుడు. ఈయన పూర్తి పేరు గవిని వెంకట కృష్ణారావు. కృష్ణా జిల్లా తెనాలి తాలూకాలోని కూచిపూడి గ్రామంలో 1914, నవంబరు 15న జన్మించాడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన కృష్ణారావు తురుమెళ్ళ, కొల్లూరు హైస్కూళ్లలో పాఠశాల విద్య పూర్తి చేశాడు. గుంటూరు ఎ.సి. కాలేజిలో బి.ఏ వరకు చదువు కున్నాడు. హైస్కూలులో చదువుతున్న రోజుల్లోనే రచనలు చేయడం ప్రారంభించిన కృష్ణారావు బి.ఏ పూర్తి చేసిన తరువాత ఉద్యోగం లభించక పోవడంతో ఇబ్బందులకు లోనయ్యాడు. నాటి స్థితిని భిక్షాపాత్ర నాటికగా రచించాడు. ఈ నాటిక 1953లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రదర్శించాడు. ఈ నాటికకు ప్రయోక్త నాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె.వి. గోపాల స్వామి. తరువాత కాలంలో ఈ నాటిక పదహారు భారతీయ భాషలలోకి అనువదింపబడింది. కృష్ణారావు కొంతకాలం ఆంధ్రప్రభ, దేశాభిమాని, విజయప్రభ పత్రికలలో పనిచేశాడు. పత్రికలు, ముద్రణాలయాలు ప్రారంభించి ఆర్థికంగా నష్ట పోయాడు. కళాపూర్ణోదయం పై పరిశోధనచేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి పట్టాపొందాడు. ఇది తెలుగు సాహిత్యంలో వెలువడిన ప్రామాణిక గ్రంథాలలో ఒకటి. నవల, కథ, విమర్శ గ్రంథాలు వెలువరించిన కృష్ణారావు సంస్కృత సాహిత్యంలో సుప్రసిద్ధ భాస మహాకవి రాసిన ప్రతిమ నాటకాన్ని తెలుగులోకి అనువదించాడు. రామ పట్టాభిషేక పర్యవసానం ఈ నాటకానికి కేంద్ర బిందువు. మరో నాటకం అమ్మ ఏడ్చింది (1937). బౌద్ధ ధర్మవైశిష్ట్యాన్ని ప్రదీప్తం చేసే నాటకం. మత ఛాందసానికి ప్రజల్ని సమైక్యంగా వుండే బౌద్ధ ధర్మానికీ మధ్య వున్న తేడా ఈ నాటకం

తెలుపుతుంది. ఈయన రాసిన సునీథ, భిక్షాపాత్ర, పాడు సంఘం, డమడమాల బండి, యాదవ ప్రళయం (పద్యాలు లేని పౌరాణిక నాటిక), తమ్మిపడిగ, దానధార, విధి నిర్ణయం, ధమ్మిల్లం, ప్రతిక్రియ, ఫ్రెంచికామెడీ, స్వర్గమా? నరకమా? ఆదర్శ శిఖరాలు అనే పదమూడు నాటికలను ఆదర్శశిఖరాలు (1943) పేరుతో నాటికల సంపుటిగా ప్రచురించాడు. సమాజంలోని పలు సిద్ధాంతాలు, తాత్విక ఆలోచనలు సంఘంలోని పలు సమస్యలు ప్రధాన వస్తువుగా కనబడుతాయి. సంస్కృతాంధ్ర, ఆంగ్ల సాహిత్యాలలో గట్టి పట్టున్న అతి కొద్ది మంది సాహితీ వేత్తలలో కృష్ణారావు ఒకరు. ఈయన 1979వ సంవత్సరం ఆగస్టు 23న మరణించాడు.

దాసరి.ఎన్.

కృష్ణారావు, ముంజులూరి (-1944): ప్రసిద్ధ రంగస్థల నటుడు. బందరు రాయల్ థియేటర్‌లో ప్రధాన భూమికాధారి.



నాటకకళా ప్రపూర్ణ బిరుదాంకితుడు. వివాహాది ఇహ సౌఖ్యాలను విసర్జించి నాటక కళకే జీవితం ధారపోసిన నటతపస్వి. ఆ రోజుల్లో మెట్రిక్యులేషన్ చదివితే పెద్ద పెద్ద ఉద్యోగాలు లభించేవి. కాని ఆ ప్రలోభానికి కృష్ణారావు గురి కాలేదు. అచంచల దీక్షతో నట తపస్సుకు నడుం కట్టాడు. బందరులో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి అధ్యక్షతన నెలకొన్న రాయల్ థియేటర్ ఈయన నట తపస్సుకు తపోభూమి అయింది. క్రమంగా ప్రధాన పాత్రధారేగాక దర్శకుడుగా, పరిణమించాడు. హిరణ్యకశ్యప వేషంతో ముంజులూరి నట జీవితం ప్రారంభమైంది. ఆ తరువాత శ్రీకృష్ణుడివేషం కృష్ణారావుకి అఖండకీర్తి తెచ్చి పెట్టింది. బందరులో జరిగిన రసపుత్ర విజయం, వేణీ సంహారం నాటక పోటీలలో దుర్గాదాసు, అశ్వత్థామగా రంగస్థలం మీద అవతరించి ప్రత్యర్థులను పరాజితులను చేసి ఆయా పాత్రల పతకాలను గెలుచుకొని మహానటుడనిపించుకొన్నాడు.

1923-25 ప్రాంతం వరకు రాయల్ థియేటర్‌లో ముంజులూరి నట జీవితం దిగ్విజయంగా సాగిపోయింది. క్రమంగా రాయల్ థియేటర్ చిన్నా భిన్నా మయింది. కృష్ణారావు బందరు వదిలిపెట్టి, ఏలూరు చేరుకొన్నా నటించడం మానలేదు. దిగ్రేట్ ఇండియన్ థియేటర్ సమాజం ఈయనకు స్వాగతం పలికింది. శర్విలకుడు, యుగంధరుడు మొదలైన వేషాలతో ఆంధ్రదేశమంతటా జైత్రయాత్ర సాగించాడు. తరువాత బందా స్థాపించిన ప్రభాత్ థియేటర్‌లో చేరి నటుడుగా, దర్శకుడిగా, మేనేజర్‌గా జీవితాంతం నాటక కళా సేవ చేశాడు.

నాటక కళా తపస్సులో, ఒక్కొక్క పాత్రధారణ ఒక్కొక్క మెట్టుగా పరిణమించింది. చాణక్య పాత్రధారణతో ఈయన తపస్సు సిద్ధి పొందింది. కృష్ణారావు దృష్టిలో చిన్నా పెద్దా పాత్రల భేదం లేదు. ఏ పాత్రలైనా రసవత్తరంగా నటించాలనేదే ఈయన దృక్పథం. అందుకే శ్రీకృష్ణుడు, యుగంధరుడు లాంటి పెద్ద వేషాలు వేశాడు. సారంగధరలో సదయుడనే చిన్నపాత్రలో నటించి మెప్పించాడు. ఆయన నటించే నాటకాలలో ఆయనకు కాని పాత్ర అంటూ లేదు. సమర్థవంతంగా నటించ లేని పాత్ర అంటూ లేదు. పాత్రను బాగా అధ్యయనం చేసిఅహార్యం, ప్రక్రియలు ముందుగా నిర్ణయించుకొని భావస్ఫోరకంగా నటించాడు. వచనం చెప్పడంలో ముంజులూరి బహునేర్పరి. వాచికం ఉదాత్తానుదాత్త స్వరాలతో భావ స్ఫోరకంగా ఉండేది.

తోటి నటులకు ఈయనే స్వయంగా పోర్షను రాసివ్వడమే కాకుండా ప్రాంప్టింగ్, బేనర్లు రాయడం, పోస్టర్లు గోడలకు అంటించడం వంటి పనులు చేయడం కృష్ణారావుకి సరదా. ఈయనకు విమర్శనా శక్తి కూడా ఎక్కువే. ఒకసారి వేదం వేంకటరాయ శాస్త్రి తమ నాటక సమాజం ప్రతాపరుద్రీయం నాటక ప్రదర్శన చూడడానికి రమ్మని ఆహ్వానించారట. ఆనాటి పిచ్చి యుగంధరుడు గోని పట్టాలతో కుట్టిన లాగు, కోటు తొడిగాడట. పిచ్చివాడులాగు, కోటు కుట్టించుకొని తొడుగుతాడా? అని కృష్ణారావు ఆక్షేపించే సరికి వారి విమర్శనా శక్తికి మెచ్చుకొని నాటి నుంచీ ఆ పిచ్చి యుగంధర వేషధారి కుట్టిన లాగు, కోటు తొడగడం మాని వేశారట.

ఏలూరు పౌరులు ముంజులూరిని సన్మానించి నాటక కళాప్రపూర్ణ బిరుదునిచ్చారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఈయనను ఘనంగా సన్మానించింది. హిరణ్యకశిపుడు, శ్రీకృష్ణుడు, దుర్గాదాస్, అశ్వత్థామ, సుందరకుడు, యుగంధరుడు, లింగరాజు, పిచ్చి రామశాస్త్రి, బుస్సీ, శర్విలకుడు, సదయుడు, శకుని, చాణక్యుడు, బిల్వమంగళుడు మొదలైన పాత్రలలో నటించి మెప్పించిన ముంజులూరి 1944, జూన్ 29 తేదీన పరమపదించాడు.

శ్రీ.చ.

కృష్ణారావు, ముట్నూరి (1879-1945) : నాటక సిద్ధాంత వేత్త. నాటక విమర్శకుడు, జాతీయవాది, కృష్ణాపత్రిక సంపాదకుడు, వేదాంతి, విమర్శకుడిగా ప్రసిద్ధుడు. చిన్నతనంలో

ఒథెల్లో ఆంగ్ల నాటకంలో డెస్డిమోనా వేషం వేశాడు. పెద్దవాడైన తరువాత నటించ లేదు. కాని ఈయనకు నాటక రంగానికి సంబంధించిన వారే సన్నిహితులు. ఈయన నేతృత్వంలో వెలు వడే కృష్ణాపత్రిక దర్బారులో నాటక గోష్ఠులు ఎక్కువగా సాగించే వారు. ఈయన కృష్ణాపత్రిక సంపాదకీయం ద్వారా ఆంధ్ర నాటకరంగ ప్రగతికి ఎంతో తోడ్పడ్డాడు. సమీక్షలో వెలుగులు, కృష్ణాపత్రిక సంపాదకీయాలు అనే గ్రంథాలను వెలువరించిన కృష్ణారావు 1945, జూన్ 23న దివంగతుడయ్యాడు.



శ్రీ.చ.

కృష్ణారెడ్డి, ఎల్.వి. (జ.1937) : నటుడు, దర్శకుడు, ఉపాధ్యాయుడు. కాళిదాస కళారాధన సమితి వ్యవస్థాపకుడు, న్యాయనిర్ణేత. ఈయన నెల్లూరు జిల్లా కావలిలో రోసిరెడ్డి, వెంకట సుబ్బమ్మలకు 1937, జులై 1వ తేదిన జన్మించాడు. కృష్ణారెడ్డి విద్యార్థి దశలోనే అంటే 1954లో డి.వి. నరసరాజు రచించిన ఈ ఇల్లు అమ్మబడును నాటికలో నటించాడు. 1961లో గూడూరు సంస్కృతి సమ్మేళనం నిర్వహించిన నాటక పోటీలలో లోగుట్టు నాటికను ప్రదర్శించి, నటించి ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నాడు. ఆ తరువాతి కాలంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే 1964లో కాళిదాస కళారాధన సమితిని స్థాపించాడు. ఈ సమితి తరుపున ఛైర్మన్, పునర్జన్మ, కీర్తిశేషులు, భలేపెళ్ళి మొదలైన నాటకాలను వివిధ పరిషత్తులు నిర్వహించిన పోటీలలో ప్రదర్శించి ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు అవార్డులు అందుకొన్నాడు. ఆ తరువాత ఈ సమితి నిర్వహించిన నాటక నాటిక పోటీలలో చిల్లరకొట్టు చిట్టెమ్మ, ఆవలగట్టు నాటకాలు, సమిధి, జలితజ్వాల, ఇదే నాలోకం మొదలైన నాటికలను ప్రదర్శించాడు. వివిధ పరిషత్తులు నిర్వహించిన నాటక నాటికల పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించాడు. 1964 నుంచి కాళిదాసు కళారాధన సమితి పక్షాన ప్రతి సంవత్సరం నాటక నాటిక పోటీలు నిర్వహించడమే కాకుండా కళారంగ వికాసం కోసం కృషి చేసిన ప్రసిద్ధ నాటక, సినిమా కళాకారులను సత్కరించడం సమితి కార్యక్రమాలలో ఒక భాగం. ఈ పరంపరలో సుప్రసిద్ధ నటుడు ఎన్.టి. రామారావు, రాజనాల కల్లయ్య, కాంతారావు, హరినాథరావు, పి.ఎల్. నారాయణ మొదలైనవారిని కళారాధన సమితి పక్షాన సత్కరించిన కళాకారుడు కృష్ణారెడ్డి. సినిమా రంగంలో ప్రవేశించి సినిమాలలో నటించడమే కాకుండా 'పగడాల పడవ, బందరు పిచ్చోడు, శాంతినికేతన్' చిత్రాలకు నిర్మాతగ వ్యవహరించాడు. సినిమా రంగం కంటే నాటకరంగం పట్ల అభిమానం పెంచుకున్న కృష్ణారెడ్డి పరదేశి అనే చారిత్రక నాటకం ప్రదర్శించి ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నాడు.

దాసరి.ఎన్.

కృష్ణేశ్వరరావు, వై.ఎస్. (జ.1955) : రంగస్థల, సినీ నటుడు, రచయిత, దర్శకుడు. 'రసఝరి' స్థాపకుడు. 1955, మే 2వ తేదీన గుంటూరు జిల్లా బోడుపాడులో వెంకట రమణమ్మ, హనుమంతరావు దంపతులకు జన్మించాడు. పాఠశాలలో చదువుతున్న రోజుల్లోనే నాటకాల పట్ల అభిమానం పెంచుకున్నాడు. వైద్యవృత్తిలో స్థిరపడి నటన, నాటక రచనపైన మక్కువ పెంచుకొని పొన్నూరులో 'రసఝరి' అనే సంస్థను స్థాపించి, నాటక ప్రదర్శనలు నిర్వహిస్తూ, కె.ఎస్.టి శాయి సహచర్యంతో నటనలో మెళకువలు నేర్చుకొని 1980 నుంచి నటుడిగా, దర్శకుడిగా ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. నాటక రచయితగా ఈయన వెలువరించిన నాటక నాటికలు రాశిలో తక్కువే అయినా వాసిలో గొప్పవే. 1986లో రోజూ చస్తున్న మనిషితో నాటకరచన ప్రారంభమైంది. ఆ తరువాత గొంగళి పురుగు, కాళ్ళు కడిగిన చేతులు, పక్కింట్లో పుట్టండి, అధికారి, సంపద మొదలైన నాటికలు, ప్రార్థన, సారసుద్దులు వంటి నాటకాలు రచించి నటించాడు. వీటిలో సమాజంలో సగటు మనిషి స్థితిగతులకు గొంగళిపురుగు దర్పణమైతే హితోక్తులు చెప్పడమే కాదు ఆచరించాలని చెప్పే నాటిక పక్కింట్లో పుట్టండి. డబ్బు సంపాదన ధ్యేయంతో పరదేశపయనానికి స్థిరమౌతున్న నేటి యువతను హెచ్చరించే నాటికసంపద. ఈ నాటికలన్నిటికీ బహుమతులు లభించాయి. ప్రచండ భారతం, కాలచక్రం, మౌనం, సూర్య పుత్రులు, కామ్రేడ్ మొదలైన చలనచిత్రాలకు సంభాషణలు రాశాడు. రసఝరి పక్షాన ప్రతి

సంవత్సరం నాటిక పోటీలు నిర్వహిస్తూ తనవంతు సహకారాన్ని అందిస్తున్నాడు. 2005లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నాటక రచయితగా అభినందిస్తూ పురస్కారంతో గౌరవించింది.

దాసరి.ఎస్.

కెథారసిస్ : చూ. (శీర్షిక) క్షాళన

కేశవ దాసు, చందాల (1876-1956) : నాటకకర్త, కవి, అష్టావధాని, శతావధాని, నటుడు, వాగ్గేయకారుడు, హరికథకుడు, ఆంధ్రసూత, కలియుగ దశరథ, నటనా వతంస బిరుదాంకితుడు.

ఈయన నల్గండ జిల్లా హుజూర్‌నగర్ గ్రామంలో 1876, జూన్ 20న జన్మించాడు. తల్లి పాపమ్మ, తండ్రి లక్ష్మీ నారాయణ. వీరి అన్న వెంకటరమణయోగి నిర్వహణలోని వీధిబడిలోనే కేశవదాసు విద్యనభ్యసించాడు. ఛందస్సు, అవధానాది ప్రక్రియలు నేర్చుకున్నాడు. విద్యాభ్యాసానంతరం తను చదువుకున్న వీధి బడి నడుపుతూ అవధానాది ప్రక్రియలలో నేర్పరి.

అష్టావధానాలు చేస్తూ దేశాటన చేస్తున్న కాలంలో సుప్రసిద్ధ వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్యతో స్నేహం కుదిరింది. దాసు ప్రతిభా సంపత్తికి మెచ్చి కాంతయ్య ఈయనకు సంగీతంలోని మెలకువలను తెలియ జేశాడు. గేయరచనలో, సంగీతం కూర్పులో, హరికథనంలో, రచనలో కేశవదాసు ఆరితేరాడు. కాంతయ్య నాటక సమాజంలోచేరి కవిగా, నటుడుగా పేరుగాంచాడు. ఈయన సేవకుడు వేషం నుంచి రాజు వేషం వరకు ఏ వేషమైనా వేసి మెప్పించగల సమర్థుడు. మైలవరం కంపెనీకి శ్రీ కృష్ణ తులాభారం, రాధా కృష్ణ నాటకాలకు పాటలు రాసి పెట్టాడు. ఆంధ్రదేశమంతటినీ ఉర్రూత లూగించిన బలే మంచి చౌక బేరం అనే పాట ఈయన రచించిందే. ఆంధ్ర ప్రజానీకం ఆదరాభిమానాలను చూరగొన్న కనక తార నాటకం ఈయన కలం నుంచి వెలువడిందే.

కొంతకాలం నాటకరంగానికి స్వస్తి చెప్పి తెలంగాణా అంతటా హరికథలు చెప్పాడు. రామాలయాలను నిర్మింప చేశాడు. ఈయన విధిగా ప్రతిరోజు ఒక పాట, మూడు పద్యాలు చొప్పున కొన్ని సంవత్సరాలు రచన సాగించాడు. పాటలలో భక్తి భావం, సరళత్వం తొణికిసలాడుతుంటాయి. నాటక సమాజాలు ఆలపించే 'పరబ్రహ్మ పరమేశ్వర' అనే ప్రార్థనా గీతం ఈయన రచించినదే. ఈ ప్రార్థనా గీతాన్ని స్వరపరచిన ఖ్యాతి పాపట్ల కాంతయ్యకు దక్కింది. ఈయన 1925లో *బలి బంధనం*, 1926లో *కనకతార* నాటకాలను రచించాడు. సత్యభామా పరిణయం, సీతా కల్యాణం, రుక్మాంగద, నాగదాసు అనే హరికథలను రచించిన కేశవదాసు 1956, మే 14న నటరాజులో ఐక్యమయ్యాడు.

శ్రీ.చ.

కైలాసం, టి.పి (1885-1946) : కన్నడ నాటక రచయిత, భూగర్భ శాస్త్రవేత్త. ఈయన 1885లో బెంగుళూరులో జన్మించాడు. తల్లి కనకమ్మ, తండ్రి పరమ శివ అయ్యర్. కైలాసం కన్నడ సాంఘిక నాటక యుగవైతాళికుడు. మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో పట్టభద్రుడై, లండన్‌లోని రాయల్ కాలేజి ఆఫ్ సైన్సులో భూగర్భశాస్త్రం అభ్యసించాడు. లండన్, పారిస్ లోని నాటక ప్రదర్శనలుచూసి నాటక కళలో ప్రావీణ్యం సంపాదించాడు. భారతదేశం తిరిగివచ్చి భూగర్భ శాస్త్రవేత్తగా అయిదేళ్ళ పాటు ఉద్యోగంచేసి, నాటక కళపై దృష్టిసారించి ఉద్యోగానికిరాజీనామాచేసి నాటక రంగంలోకి ప్రవేశించాడు. ఆ తరువాత కైలాసం అమెచ్యూర్ నాటకసంఘం నిర్వహించే సాంఘిక నాటక పోటీలలో పాల్గనడానికి టళ్ళుగట్టి అనే నాటకం రాశాడు. ఇదే ఇతని ప్రథమ సాంఘిక నాటకం. ఈ నాటకం ప్రదర్శన విజయవంతం కావడంతో కైలాసం పేరు ప్రతిష్ఠలు వ్యాపించాయి. అందుకే తనకు తాను 'స్కైలాసం' అని వర్ణించుకున్నాడు. కైలాసానికి తెలుగు నాటకాలంటే అభిమానం ఎక్కువ. సుప్రసిద్ధ నటుడు బళ్ళారి రాఘవ ఈయనకు సన్నిహిత మిత్రుడు.

నాటకాలు, నాటికలు మైసూరు వ్యవహారిక భాషలో రాశాడు. ఇంగ్లీషు పదాలు, హాస్యోక్తులు ఎక్కువగా వాటిలో గోచరిస్తాయి.

టళ్ళుగట్టి, హోంరూలు, అమ్మగారి భర్త, తాళి కట్టడానికి కూరి, సూళె (వేశ్య), ఏకలవ్య, కీచక, కర్ణ, బందవాళ, విల్లదబడాలు, నమ్ బ్రాహ్మణ్కే (మన బ్రాహ్మణ్యం), నమ్ క్లబ్స్ నష్ కంప్నీ, గండస్కత్రీ, బహిష్కార్ వంటి రచనలు చేశాడు.

ఈయన నాటకాలు ఇతర భాషలలోకి అనువదించబడ్డాయి. స్థూలంగా కైలాసం నాటకాలు, నాటికలు రెండు రకాలు. ఒకటి సమాజ నిజ రూపానికి ప్రతి బింబాలు, రెండు మానవశక్తిని వెల్లడించేవి. ఈయన 1946లో మరణించాడు.

శ్రీ.చ.

కైశికీవృత్తి : 1. నాట్య (అర్థ వృత్తి), 2. లాస్యాంగం. ఈ వృత్తి ప్రవర్తకుడు శ్రీమహావిష్ణువు. ఇది విష్ణు-మధుకైటభుల యుద్ధంలో పుట్టింది. (వృత్తి చూడండి.) గీత నృత్య విలాస కామోప భోగాది యుక్తమైన మృదు శృంగార వ్యవహారం కైశికీ వృత్తి. ఇది స్త్రీలు ప్రయోగించేది. నాట్య శాస్త్ర బరోడా ముద్రణలో కైశికీ వృత్తికి ఇంకొక నిర్వచనం కనిపిస్తున్నది. (బహువాద్య-నృత్త-గీతములు,

శృంగారాభినయము, చిత్ర నైపథ్యం, మూల్యాలంకారములు, ప్రశస్తవేషము – చిత్ర వాక్య పద బంధములును కలిగినదై హసిత – రుదిత – రోషములతో కూడిన స్త్రీ–పురుషకామ వ్యాపారము కైశికీ వృత్తి అనబడును. బరోడా ముద్రణ – 54–55 శ్లో॥ – నా.శా. అను. డాక్టర్ పోణంగి.) కైశికీ వృత్తి శృంగార, హాస్య రసాలలో సంయుక్త మౌతుంది. అంగాలు: ఈ కైశికీ వృత్తికి నర్మం, నర్మస్ఫుంజం, నర్మ స్ఫోటం, నర్మగర్భం అని నాలుగు అంగాలు.

(నర్మతత్ స్ఫింజతత్ స్ఫోటతత్ గర్భైశ్చ తురంగికా – ద.రూ. 2–43)

శ్రీ.చ.

కొండలరావు, నిడసనమెట్టు (1892–1972) : తెలుగు, హిందీ నటుడు, నాటకకళాశేఖర, కళాప్రపూర్ణ బిరుదాంకితుడు. చింతామణి నాటక సమాజంలో ప్రముఖ పాత్రధారి. ఈయన 1892లో రాజమండ్రిలో జన్మించాడు. 18వ ఏటనే చింతామణి నాటక సమాజం (రాజ మండ్రి)లో పెద్ద పాత్రల మొదలు చిన్న పాత్రల వరకు, విభిన్న మనస్తత్వాలు గల పాత్రలు అభినయించి మెప్పుపొందాడు. పాండవోద్యోగ విజయాలు గోదావరి మండలంలో ఎక్కడ ప్రదర్శించినా భీముని పాత్ర ఈయన ధరించాల్సిందే, అంతగా ప్రజాదరణ పొందిన నటుడు కొండలరావు. ఈయన సుమారు 36 తెలుగు నాటకాలలో రెండు హిందీ నాటకాలలో నటించాడు.

ఈయన ఏ పాత్రలో నటించవలసి వచ్చినా ఆ పాత్రను ఆమూలాగ్రంగా పరిశోధించి, అలా తీర్చి దిద్దుకునేవాడు. ఈయన తెలుగులో భీముడు, ధర్మరాజు, నలుడు, బాహుకుడు, దుర్గాదాసు, జయసింహుడు వంటి తెలుగు రంగస్థల పాత్రలే కాకుండా పీష్వానారాయణరావు, అభిమన్యు వంటి హిందీ రంగస్థల పాత్రలలో నటించిన నిడసనమెట్టు 1972, ఫిబ్రవరి 29న మరణించాడు.

శ్రీ.చ.

కొండలరావు, రావి : రచయిత, రంగస్థల, సినీ నటుడు, పత్రికా రచయిత. ఈయన శ్రీకాకుళంలో జన్మించాడు. ఈయనరచించిన నాలుగిళ్ళచావిడి, పట్టాలు తప్పిన బండి, ప్రొఫెసర్ పరబ్రహ్మం నాటకాలు, కుక్కపిల్ల దొరికింది, కథకంచికి మొదలైన నాటికలు ఈయన ప్రసిద్ధ రచనలు.

పట్టాలు తప్పిన బండి నాటకంలో పిల్లలను అతి గారాబంతో పెంచితే అప్రయోజకులై పోవడమే గాక వారి జీవితం పట్టాలు తప్పిన బండి అవుతుంది అని సూచించాడు. రచయిత తన సొంతట్రూపుతో ఈ నాటకాన్ని కొన్ని పెద్దపట్టణాలలో ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాడు. రావికొండలరావు రచనలలో సందేశం హాస్య సన్నివేశాలను అంటి పెట్టుకుని ఉంటుంది. మీరు నవ్వడానికే ఈ సంభాషణలు అనే పద్ధతిలో అతికించినట్టు కనబడవు. సన్నివేశాల చాటున హాస్యం దాక్కుని ప్రేక్షకులను ఆహ్లాద పరుస్తుంది. 1977 ప్రాంతంలో ప్రొఫెసర్ పరబ్రహ్మం నాటకం వెలువడింది. మందు సేవిస్తే వయస్సుతో నిమిత్తం లేకుండా ఎంతటివాడైనా అమాంతం బాల్య దశలోకి వెళ్ళి పోవచ్చు. మళ్ళీ మందు తాగితే యధా స్థితికి రావచ్చు. ఈ ఇతివృత్తంతో హాస్య ప్రధానంగా సాగిపోతుంది ఈ నాటకం.

కొండలరావు నాటికలలో కుక్కపిల్ల దొరికింది బహుళ ప్రచారం పొందిన నాటిక. భారతి పత్రికలో ప్రచురించిన ఈ నాటికను ఎన్నో నాటక సమాజాలు ప్రదర్శించాయి. ఆ బాల వృద్ధుల్ని ఆనంద పరిచిన నాటిక ఇది. 1959లో *కథ కంచికి* అనే హాస్య నాటికను వెలువరించాడు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో నిర్వహింపబడే నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా అనేక సార్లు వ్యవహరించాడు. ప్రసిద్ధ రంగస్థల నటుడు, నాటక రచయిత రావి వెంకటాచలం ఇతని సహోదరుడే. రావి కొండలరావు సుమారు 200 చలనచిత్రాలలో వైవిధ్యం గల పాత్రలలో నటించాడు. రావికొండలరావును 2002లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సన్మానించింది.

గం.సు.రె.

కొరవంజి : యక్షగాన విశేషం. కొరవంజి పరిణామమే యక్షగానమని కొందరు పరిశోధకులు, కొరవంజి పాత్ర ప్రవేశం గల యక్షగానాలనే కొరవంజులని కొందరు పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు.

అసలు కొరవంజి లేక కురవంజి అనే పదానికి నిఘంటువులలో కొరవ జాతి స్త్రీ, ఎరుకలు చేసే నాట్యం, నాట్య విశేషం అనే అర్థాలు ఇచ్చారు. కొరవంజి పేరుతో దృశ్య రూపకాలు కూడా లభ్యమవు తున్నాయి.

తెలుగుకావ్యాలలో కొరవంజి ప్రసక్తి విస్తృతంగా కనిపిస్తుంది. వర్ణనలను బట్టి కొరవంజి పదం మొదట ఎరుకల జాతి వాచకంగా, తరువాత స్త్రీ లేక పురుషుల వాచకంగా, ఆ తరువాత వారి నాట్యవిశేషంగా ప్రయుక్త మైందని స్పష్టమవు తోంది.

16వ శతాబ్దిలోని అయ్యలరాజు రామభద్రుడు రామాభ్యుదయంలో 'జక్కిణి కొరవంజి మేళంల గేళికలు సల్పిరి',

అని ప్రస్తావించడంవల్ల అంతకుముందే కొరవంజి నాట్యం వర్థిల్లుతుందని భావించవచ్చు. విజయరాఘవ రాయలు ఆస్థానంలో కోమలవల్లి అనే నర్తకి కొరవంజి నాట్యం చేసేదట.

ఎరుకే కాదు, వీరికి స్తంభన, వశీకరణ, ఆకర్షణ, సాముద్రిక లక్షణాది విద్యలెన్నో తెలుసు. విడి నృత్యంగా విలసిల్లిన కొరవంజి పాత్ర ఏనాడు దృశ్య కావ్యాలలో ప్రవేశించిందో ఖచ్చితంగా చెప్పలేము గాని తంజావూరు నాయక రాజుల యుగంలో ఈ ప్రవేశం జరిగిందనీ, అందులోనూ రంగాజమ్మ మొదట దీనిని మన్నారుదాస విలాసంలో ప్రవేశ పెట్టిందని భావించవచ్చు. చెంగమ్మయో లేక శివుడో కొరవంజి వేషంలో వెళ్లి నాయికకు ఎరుక చెప్పి రంజింప జేస్తారు. మన్నారుదాస విలాసంలో చెంగమ్మ, తులాభారంలో భారతీదేవి, రుక్మాంగద చరిత్రలో యోగమాయ, మృత్యుంజయ విలాసంలో శివుడు ఎరుక పాత్ర ధరిస్తారు.

కొరవంజి పాత్రగల యక్షగాన నాటకాలను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి. శృంగార కొరవంజులు, రెండు వేదాంత కొరవంజులు; 1. శృంగార కొరవంజులు: నాయికా నాయకుల ప్రణయానికి సంబంధించినవి. ఇవి మూడు విధాలుగా కనిపిస్తాయి. కొరవంజి–కొరవ నాయకుల ప్రణయాన్ని చిత్రించేవి మొదటిరకం. ఉదాహరణకు *గరుడాచల యక్షగానం, కిరాత విలాసం*. వీటిలో కొరవంజి సోది చెప్పడం ఉండదు. రెండవ రకం శృంగార కొరవంజులలో భారతీదేవో, పార్వతీ దేవో, కథా నాయకుడో కొరవంజి వేషంలో వెళ్ళి నాయికకు సోది చెప్పడం. ఉదా॥ శ్రీకృష్ణతులాభారం, మన్నారుదాస విలాసం. ఇక మూడవ రకం కొరవంజిలో ఎరుకత మామూలు ఎరుకతే గాని దేవ గణానికి చెందింది కాదు; 2. వేదాంత కొరవంజి ప్రధానోద్దేశం వేదాంత బోధ. వీటిలో ఎరుకత వేదాంత బోధ చేస్తుంది. సుజ్ఞాన పెరుకలో

> మరపు లేనట్టి సన్మార్గుల కెల్ల నెరుక
> ఇట్టి దటంచు నెరుక పడంగ
> నెరుక జెప్పుటకొర కెరుకతవచ్చె

ఇందులో ఎరుక ఇట్టి దటంచు అనే చోట ప్రయోగించిన ఎరుక శబ్దానికి అర్థం జ్ఞానం. ఉదా: సుజ్ఞాన పెరుక, జీవ ఎరుకల కురవంజి, ముక్తి కాంతా విలాసం.

శ్రీ.చ.

కొల్హాట్కర్, చింతామణ్ గణేశ్ (1891–1959) : స్వయంకృషితో సుశిక్షితుడైన నటుడిగా రూపొంది, తన ప్రత్యేకతను చాటుకున్న ప్రముఖ మరాఠీ నటుడు కొల్హాట్కర్. ప్రఖ్యాతమైన బల్వంత్ సంగీత నాటకమండలి స్థాపక సభ్యుల్లో ఒకడు. ఈయన నటజీవిత విశిష్టతకు గుర్తింపుగా రాష్ట్రపతి బంగారు పతకం (1957) లభించింది. దీనివల్ల కొల్హాట్కర్‌కు సమకాలికులైన దేవళ్, ఖాదీల్కర్, వారేర్కర్, గడ్కర్, సావార్కర్, బేడేకర్ వంటి ప్రముఖనటులందరితో సంబంధాలు పెరిగాయి. సాహిత్య అకాడమీ బహుమతి (1958) పొందిన బహురూపి (1957) అనే ఆత్మకథలో కొల్హాట్కర్ తనతో తగాదాపడ్డ సమకాలీన ప్రముఖ నాటకకర్తలను గురించి రాయడానికి ఆసక్తి కనబరచినట్లు కనిపిస్తుంది.

నాగిరెడ్డి

కోటిరత్నం, దాసరి (1900–1972) : రంగస్థల, సినీనటి. స్త్రీ పురుష పాత్రలు రెంటినీ కడు సమర్థవంతంగా నటించిన మేటి. సంగీత విద్వాంసురాలు. సువర్ణ హస్త కంకణాది బహు బహుమతులందుకున్న నటీమణి. ఈమె 1900లో నరసరావు పేటలో జన్మించింది.

తండ్రి నటుడు కావడంవల్ల ఈయన శిక్షణలో బాల్యంలోనే లోహితాది పాత్రలలో నటించింది. తల్లి గతించిన తరువాత ఆమె పేరిట నక్క బక్కలపాడులో సొంత సమాజం నెలకొల్పి విజయ వంతంగా నడిపింది. తరువాత కొంతకాలం నవలా నాటక సమాజం ప్రదర్శించిన నాటకాలలో నటించింది. తరువాత కొంత కాలానికి సొంత కంపెనీని నడిపింది. ఆంధ్రదేశమంతటా పర్యటించి నాటకాలు ప్రదర్శించింది. తరువాత సినీరంగంలో ప్రవేశించి మొదట సక్కుబాయి చిత్రంలో నటించి పేరు పొందింది. లోహితాస్యుడు, కుశుడు, ప్రహ్లాదుడు, సత్యవంతుడు, నారదుడు, సత్యభామ, కమలాంబ ఈమె నటించిన ముఖ్యపాత్రలు. ఈమె నటనా చాతుర్యానికి మెచ్చి ఇచ్చిన పతకాలు రెండు వందలు. 1960లో ఆంధ్ర నాటకకళాపరిషత్తు ఈమెను సన్మానించింది. దాదాపు 45సంవత్సరాలు ఆంధ్ర నాటకరంగానికి సేవ చేసిన కోటిరత్నం 1972 డిశంబరులో కన్ను మూసింది.

శ్రీ.చ.

కోటిశివ, నుసుము (జ.1956): రంగస్థల నటుడు, దర్శకుడు. గుంటూరుజిల్లా, కాకాని మండలం అనమర్లపూడి గ్రామంలో రంగమ్మ చెన్నయ్య దంపతులకు 1956, జూన్15న జన్మించాడు. 1972లో హైస్కూల్లో పేటెంటు మందు నాటికతో నట జీవితానికి నాంది పలికాడు. విద్యార్థి దశలో మరికొన్ని నాటికల్లో పాల్గని పెద్దల ఆశీస్సులు పొందాడు.

సోదరుడు నుసుము నాగభూషణం శిష్యరికంలో నటనలో మెళకువలు నేర్చుకొని తన నటనా సామర్థ్యానికి మెరుగులు దిద్దుకుంటూ అనేక నాటక నాటికల్లో నటించాడు. 1989లో తాను రచించిన కాలజ్ఞానం నాటికను అనేక పరిషత్తుల్లో ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనకు, నటనకు బహుమతులు అందుకొన్నాడు. ఈ నాటిక కోటిశివకు మంచి గుర్తింపు తెచ్చింది.కాలజ్ఞానం కోటిశివగా పేరు స్థిరపడిపోయింది. ఇసుకపల్లి మోహనరావు రాసిన డియర్ ఆడియన్స్ సిన్సియర్లీ యువర్స్, పాటిబండ్ల ఆనందరావు నీతి చంద్రిక, సహారా నాటకాల్లో వైవిధ్యంగల పాత్రలలో నటించాడు. 1992 నుంచి ఎల్.వి.ఆర్. ఆర్ట్ క్రియేషన్స్ పతాకం కింద అనేక నాటక నాటికలు స్వీయ దర్శకత్వంలో ప్రదర్శిస్తూ ఆ సంస్థ ప్రతిష్ఠను ఇనుమడింప చేస్తున్నాడు.

2000లో నంది నాటకోత్సవాలలో జారుడుమెట్లు నాటికకు 'వెండి నంది' గెల్చుకున్నాడు. అలాగే 2001లో మేలుకొలుపు నాటికకు 'బంగారునంది' దక్కింది.

ఎల్.వి.ఆర్. ఆర్ట్ క్రియేషన్స్ ప్రదర్శించిన ఉత్తమ పంచాయితీ నాటకాన్ని ఎన్నికచేసి రాష్ట్ర ప్రభుత్వం పదిచోట్ల ప్రదర్శించే అవకాశం కల్పించటం గర్వకారణమైన విషయం. కోటిశివ వాచికాభినయంలో దిట్ట. విలక్షణమైన ఈయన వాచికాభినయానికి ముగ్ధులైన ప్రేక్షకులు నాటిక/నాటకంలోని సంభాషణలను, ప్రదర్శనానంతరం మళ్ళీ మళ్ళీ చెప్పించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇంతవరకు ఈయన 140 నాటక, నాటికలలో సుమారు 2000 ప్రదర్శనల్లో పాల్గన్నాడు.

గం.సు.రె.

కోటేశ్వరరావు, పి.ఎల్.వి. (జ.1941) : నటుడు, హార్మోనిస్టు, నాటక శిక్షకుడు. వెంకటసుబ్బమ్మ, వెంకటచలపతి దంపతులకు 1941, ఆగస్టు 9న జన్మించాడు. ప్రాథమిక విద్య నరసరావుపేటలోనే సాగింది. పుట్టుకతో అబ్బిన మధుర స్వరం క్రమక్రమంగా సాధనతో పరిపక్వతను సాధించింది. కోటేశ్వరరావు బాల్యదశలో పాడే పాటలు, పద్యాలు విని స్కూల్లో తోటి విద్యార్థులు, అధ్యాపకులు ఎంతో ఆనందిస్తూ అతనిని ప్రోత్సహించే వాళ్ళు. పదవతరగతిపూర్తిచేసుకొన్న కోటేశ్వరరావును నాటకాలు ఆకర్షించాయి. తన గళాన్ని సద్వినియోగం చేసుకోనేందుకు నాటకాల్లో వేషాల కోసం అన్వేషించసాగాడు.

1956లో తన 15వ ఏట తొలిసారిగా నాటకరంగ ప్రవేశానికి అవకాశం లభించింది. ప్రసిద్ధనటుడు బెల్లంకొండ సుబ్బారావు దృష్టిని ఆకర్షించిన కోటేశ్వరరావుకి ఆయన చల్లని ఆశీస్సులు లభించాయి. కోటేశ్వరరావు గానం విన్న అబ్బూరి వరప్రసాదరావు ఆ యువకుణ్ణి చేరదీసి, ప్రసిద్ధ గానకళా కోవిదుడైన పోలూరి లక్ష్మీకాంతరావు వద్ద శిక్షణ ఇప్పించి, వికర్ణుడు, అభిమన్యుడు మొదలైన పాత్రలలో నటింపచేశాడు. అప్పటి నాటకాలలో మహానటుల సరసన నటించడం పి.ఎల్.వి. అదృష్టం. నాటకరంగంలో పది సంవత్సరాలు వివిధ పద్య నాటకాలలో వికర్ణుడు, సహదేవుడు, అభిమన్యుడు, నక్షత్రకుడు, శ్రీకృష్ణుడు, భవానీశంకరుడు, అర్జునుడు మొదలైన పాత్రలు ధరించి రసజ్ఞుల ప్రశంసలు అందుకొని నటలోకంలో తన స్థానాన్ని పదిల పరచుకున్నాడు.

ఆంధ్ర ప్రాంతంలో పౌరాణిక నాటకాలు 1966 నాటికి మందకొడిగా సాగుతూ ఉండడంతో జీవిక కోసం హైదరాబాద్ చేరుకొన్నాడు. హైదరాబాద్‌లో కూడా పద్య నాటక ప్రదర్శనలు ఆశావహంగా లేవు. సాంఘిక నాటకాలే అంతంత మాత్రంగా ఉంటున్న ఆ రోజుల్లో పద్య నాటకాలపై ఆధారపడి బతకటం భారమనిపించింది. అయినా నిరుత్సాహపడకుండా, ఏదో చిన్న ఉద్యోగం సంపాదించుకొని ధైర్యం కూడగట్టుకున్నాడు. రాత్రిపూట, ఔత్సాహిక కళాకారులకు హార్మోనియం వాయిస్తూ, పద్యాలు పాడటం, నాటక ప్రదర్శనలో మెలకువలు నేర్పించటంతో నాటకరంగ అనుబంధాన్ని కొనసాగిస్తూ వచ్చాడు. పద్య నాటక ప్రదర్శనలకు హార్మోనియం వాయించటం కూడా తన జీవనగతిలో ఒక భాగమైంది. తన శిక్షణలో కొన్ని వందలమంది శిష్యప్రశిష్యులు వెలుగులోకి వచ్చారు. రక్తకన్నీరు నాటకానికి కొంతకాలం సంగీతం సమకూర్చి ప్రముఖ రంగస్థల, సినీనటుడు నాగభూషణం ప్రశంసలందుకొన్నాడు.

కోటేశ్వరరావు గత నాలుగు దశాబ్దాలుగా నాటక రంగానికి అందించిన సేవలను గుర్తిస్తూ రాష్ట్రంలో అనేక కళా సంస్థలు ఘనంగా సన్మానించాయి. 'కళా కౌస్తుభ' అన్న బిరుదునిచ్చి గౌరవించాయి. ఆర్థికపరమైన ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటూ నేటికీ కళాసేవలో నిమగ్నమై తనవంతు సహకారాన్ని అందిస్తూ ఉండటం అభినందనీయం.

డి.వి.సా.

కోటేశ్వర రావు, సుఖమంచి (జ.1953) : నటుడు, నాటక రచయిత. ఈయన విజయవాడలో 1953 సంవత్సరం అక్టోబరు 21న జన్మించాడు. తల్లిదండ్రులు రావూ నుజమ్మ, రంగా రావులు. కోటేశ్వర రావు తండ్రి ప్రజానాట్య మండలి కార్యక్రమాల్లో చురుకైన కార్యకర్తగా పని చేశాడు. కళోద్యమం కోసం పనిచేసే కుటుంబంలో పుట్టిన కోటేశ్వరరావు చిన్నప్పటి నుండి కళల పట్ల అభిమానాన్ని పెంచు కున్నాడు. ఈయన ఇంటర్మీడియట్ చదువుతున్నరోజుల్లో పగడం పలికింది నాటకంలో నటించాడు. అదే కాలంలోనే నాటక రచన ప్రారంభించాడు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను కథా వస్తువుగా స్వీకరించి గమ్యం (1974) నాటికను రచించి, అందులో నటించి ప్రదర్శించాడు. ప్రదర్శనా పరంగా విజయం సాధించడంతో పేదవాడి జీవితంలో వెలుగును ప్రసరింపజేసే బాధ్యతను స్వీకరించవలసిన అవసరాన్ని గుర్తు చేసే నేపథ్యంలో మా సమాధులే మీ పునాదులు (1976) రచించాడు. ఈ నాటిక వివిధ పరిషత్తు పోటీలలో ప్రదర్శింపబడి బహుమతులను అందుకుంది. అభ్యుదయ దృక్పథాన్ని రచనలలో ఇనుమడింపజేసే క్రమంలో నరకం మరెక్కడోలేదు *(1987)*, ధర్నా *(1990)*, *కలహాల కాపురం (1994)*, *గోడకుర్చీ (1995)*, *త్రిపుటతాళం (1995)*, మర్రి విత్తనం *(1996)*, రాధకు నీవేరా ప్రాణం *(1997)*, అమ్మ *(2000)*, హెచ్చరిక *(2001)*, ఆకాశంలో సగం *(2002)*, సురక్ష *(2003)* నాటిక, నాటకాలను ప్రదర్శించి ప్రయోగ పూర్వకంగా సఫలీకృతుడయ్యాడు. వాస్తవికత ధోరణి పునాదులపై నాటకాలను రచించి, లబ్ధ ప్రతిష్ఠులైన నాటక రచయితల సరసన స్థానం సంపాదించాడు. 1998లో భిలాయ్ (మధ్యప్రదేశ్)లో జరిగిన బహుభాషా నాటక పోటీలలో మర్రి విత్తనం ప్రదర్శించి జాతీయ ఉత్తమ రచయిత అవార్డును అందుకున్నాడు.

రంగస్థల వికాసంకోసం కృషి చేస్తూనే దూరదర్శన్, ప్రసార భారతి, కార్యక్రమంలో పాల్గంటూ, సినిమాలకు కథలు, మాటలు రాశాడు. ఉన్నత విద్యనభ్యసించిన కోటేశ్వరరావు వాస్తవిక జీవితాన్ని ప్రతిబింబించే నాటకాలే రచించి నాటక రంగ ఔన్నత్యానికి కృషి చేశాడు, చేస్తున్నాడు.

దాసరి, ఎన్.

కోటేశ్వరి, ఆర్ (జ. 1926) : రంగస్థల నటి. ఈమె 1926వ సంవత్సరంలో జన్మించింది. తల్లిదండ్రులు రమణమ్మ, వనారస అంజనప్ప, సురభి కుటుంబంలో పుట్టిన కోటేశ్వరి ఆరవ సంవత్సరంలోనే లోహితాస్యుడుగా నటించింది. నాటకరంగం కోసం జీవితాలు అంకితం చేసిన సురభి సమాజంలో పుట్టిన కోటేశ్వరి తరువాతి కాలంలో పౌరాణిక, సాంఘిక నాటకాలలో ప్రధాన పాత్రలలో నటించి ఆంధ్ర నాటకరంగ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

రంగస్థల వికాసంకోసం విశేషంగా కృషిచేస్తున్న బందా కనక లింగేశ్వరరావు, కొచ్చర్ల కోట, కాగితం సుబ్బారావు కంపెనీల తరపున ప్రదర్శించిన కురుక్షేత్రం, కాళిదాసు, వేంకటేశ్వర మాహాత్మ్యం, లవకుశ, మైరావణ, బొబ్బిలి యుద్ధం, నర్తనశాల, పల్నాటి యుద్ధం మొదలైన నాటకాలలో నాటి సుప్రసిద్ధ రంగస్థల నటులు గగ్గయ్య, ఎస్.వి. ఎల్. ఆచారి, స్థానం నరసింహారావు, షణ్ముఖి ఆంజనేయరాజు, కె.రఘురామయ్య, కర్రి అబ్బులు మొదలైన ఉద్దండుల సరసన నటించి, ప్రేక్షకుల మెప్పును పొందింది.ఆంధ్రదేశంలో విరివిగా ప్రదర్శించబడ్డ పేదపిల్ల నాటకంలో నటించింది. ఏ పాత్రనైనా సమర్థవంతంగా నటించగల నటీమణి కోటేశ్వరి.

దాసరి, ఎన్.

కోటేశ్వరి దేవి, ఎ. (జ.1937) : రంగస్థలనటి, శ్రీ రామ కృష్ణ నాట్యమండలి సభ్యురాలు. సురభి కుటుంబానికి చెందిన వెంకట్రావు, నరసమాంబ లకు 1937, జులై 13న జన్మించింది. తల్లి దండ్రులు వృత్తిపరంగా నాటక కళాకారులు కావడంతో కోటేశ్వరిదేవి చిన్నప్పుడే ప్రహ్లాదుడు, లోహితాస్యుడు, లవుడు, కుశుడు పాత్రలలో నటించింది.

ఆవేటి నాగేశ్వరరావు స్థాపించిన న్యూ పూర్ణానంద కంపెనీలో నెల జీతంతో ఈయన శిక్షణలోనే చంద్రమతి, శ్రీకృష్ణుడు, ద్రౌపది, సత్య, చింతామణి, అనసూయ, కనకసేనుడు వంటి స్త్రీ, పురుష పాత్రలలో నటించింది. ఈ కంపెనీ ప్రదర్శనలలో నటిస్తున్నప్పుడే 1958లో త్రినాథరావుతో వివాహమైంది. భర్త నటుడు కావడంతో 1962 వరకు సురభి కంపెనీలు ప్రదర్శించిన నాటకాలలో నటించింది. నెల జీతంతో జీవిక సాగించడం కష్టం కావడంతో ఔత్సాహిక నాటక సమాజాలు ప్రదర్శించే నాటకాలలో నటించడానికి కొంతకాలం కర్నూలులో నివాసముంటూ

రాయలసీమలోని పలుప్రాంతాలలో ప్రదర్శించిన నాటకాలలో స్త్రీ, పురుషపాత్రలలో నటించి రాణించింది. 1970లో గుంటూరులో జరిగిన అఖిలాంధ్ర సత్యహరిశ్చంద్ర నాటక పోటీలలో శ్రీ రామకృష్ణ నాట్యమండలి పక్షాన చంద్రమతి పాత్రలో నటించి ద్వితీయ బహుమతినందుకుంది. మండలి ప్రదర్శించిన నాటకానికి ఉత్తమ ప్రదర్శన బహుమతి, హరిశ్చంద్ర పాత్రలో నటించిన పొన్నాల రామసుబ్బారెడ్డికి ప్రథమ బహుమతి లభించాయి. ఆంధ్రదేశంలో విభిన్న పాత్రలలో పలు కళావేదికలపై నటించిన కోటీశ్వరిదేవికి అసంఖ్యాకంగా వెండి, నగదు బహుమతులు లభించాయి, సన్మానాలు జరిగాయి. ఆకాశవాణి (విజయవాడ)లో కూడా సత్యహరిశ్చంద్ర, చిత్రనళీయం, సారంగధర, శకుంతల నాటకాలలో నటించి కళారంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటి కోటీశ్వరిదేవి.

దాసరి.ఎన్

కోపిట్, ఆర్థర్ (జ.1937) : అమెరికన్ నాటక రచయిత. మొదటిసారిగా 1960లో నాటక రచయితగా గుర్తింపు వచ్చింది. అంతకు పూర్వం అమెరికా నాటక రచయితలు రాసిన నాటకాల్లోని వస్తువుకు భిన్నమైన ఇతివృత్తంతో నాటకాలు రాయడం ఆర్థర్ కోపిట్ ప్రత్యేకత. ఓ డాడ్, పూర్ డాడ్, మామా హేజ్ హంగ్ యు ఇన్ ది క్లాసెట్ అండ్ అయాం ఫీలింగ్ సో శాడ్ (1960), అనే నాటకం కోపిట్‌కు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చి పెట్టింది. ఈ నాటకం ఈడిపస్ కాంప్లెక్స్‌కు వ్యంగ్యాత్మక విమర్శన. భిన్నమైన వస్తువే కాకనాటక రూపంలో కూడా మార్పులు తేవాలని ప్రయత్నించిన వారిలో కోపిట్ గణనీయుడు. ది డే ది వోర్స్ కేమ్ అవుట్ టుప్లే టెన్నిస్ అనేనాటకం సమాజంలో అంతస్తు పెరగాలని ఆరాటపడే వారి గురించి హాస్య రసస్ఫోరకంగా చేసిన రచన. ఇండియన్స్ *(1968)*, వింగ్స్ *(1978)*, ఎండ్ ఆఫ్ ది వరల్డ్ *(1984)*, ది రోడ్ టు నిర్వాణ *(1990)* మొదలైన రచనలు కోపిట్ ఖ్యాతిని ఇనుమడింపజేశాయి. పైకి కనిపించే వస్తువు ఒకటైతే కోపిట్‌నాటకాల్లో అంతరార్థం వేరుగా ఉండటం, వాటిలో నిగూఢాంశం ఇమిడి ఉండటం, నాటకంలో అనేక పొరలు (layers) వుండటం ఈయన రచనావిధానంలో ప్రత్యేకంగా పేర్కొనదగిన విశిష్టాంశాలు. జాత్యహంకారాన్ని నిరసిస్తూ శ్వేతజాతి అధికారుల పాత్రలని కేరికేచర్ చేసి అపహాస్యం చేసిన సందర్భాలెన్నో.

మొత్తం మీద 1960 దశకంలో అమెరికాలో వచ్చిన నాటక ధోరణుల్లో చాలామటుకు అమెరికా జీవన విధానంలో గల చీకటి కోణాలను ఆవిష్కరించటం కోపిట్ రచనా లక్ష్యంగా స్పష్టమౌతుంది. కోపిట్ రచనలు పండితులను ఆకర్షించినంతగా సామాన్య ప్రజలను ఆకట్టుకోలేక పోయాయని కొందరి అభిప్రాయం.

క.మ.రా.

కోహలుడు : నాటక సిద్ధాంతవేత్త. నాట్య శాస్త్ర కర్త. భరతముని నాట్య శాస్త్ర పరిష్కర్త. ఆదర్శ నటుడు. ఇతని కాలం నిర్ధారణగా చెప్పలేంగాని భరతమునికి సమకాలికుడని పండితాభిప్రాయం. భరత పుత్రులు నూరుగురిలో ఒకరి పేరు కోహలుడు కావడం ఈ అభి ప్రాయానికి బలం చేకూరు స్తోంది.

“శేష ముత్తర తంత్రేణ కోహల కథ యిష్యతి” అని గ్రంథాంతంలో ఉండడం వల్ల భరతముని నాట్యశాస్త్రం సవరించడానికి ప్రస్తుత రూపమిచ్చిన కర్త కోహలుడని చెప్పవచ్చు. భరతుడి నాట్య శాస్త్రానికి కోహలుడి గ్రంథం మాతృకగా భావించి అభినవ గుప్తుడు, “కోహలాది శాస్త్ర లక్ష్య ప్రవాహసిద్ధమతి చిత్రాభినయం సూచయతి” అన్నాడు. అభినవ గుప్తుడు కోహలుడుని అనేక చోట్ల ప్రస్తావించాడు. శారదా తనయుడు భావ ప్రకాశనంలో – “ప్రయుజ్య తేయది భవేత్త త్రాంక ఇతి కోహలః” (8-167) అనీ; అస్యాక మేకం భరతోద్వావంకావితి కోహలః (8-323).

అయితే కోహలుడి గ్రంథం ఇంతవరకు లభ్యం కాలేదు. నృత్తమేగాక నృత్యం కూడా శివుడే సృజించాడని కోహలుడి అభిప్రాయం. ఉప రూపకాలను పెంపొందించినది కోహలుడే. ఈయనే ఉపరూపకాలలో మార్గదేశీ భేదాలను పేర్కొన్నాడు.

శ్రీ.చ.

క్రూర రూపకం : పాశ్చాత్య విషాదనాటక భేదం. ఈ నాటక రూపం అతి క్రూర చిత్రహింసలు, కుట్ర పై కుట్రలు, హత్య పై హత్యలతో నిండివుంటుంది. ఈ విధానం వల్ల మానవుని క్రూరత్వం, అరాచకం, కామోన్మాదం, క్షాళన అవుతాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఈ నాటక రూపంలో ప్రేమ, ప్రతీకారం, ప్రాధాన్యం వహిస్తుంటాయి. ఉదా. తెల్లదెయ్యం, మాల్ఫీ రాణి.

శ్రీ.చ.

క్రోధం : రౌద్ర రస స్థాయిభావం, సంధ్యంతరం.

రౌద్ర రసస్థాయి భావం : ఈ స్థాయీ భావం పరిపుష్టమై రౌద్రరసంగా పరిణమిస్తుంది. క్రోధమంటే ఆగ్రహం, మహాకోపం, పగ, హింస. పండ్లు కొరకడం, కనుబమముడి పాటు, పెదవులు కరచడం, గర్జన మొదలైనవి, దీనికి అనుభావాలు. రోషం మూడు విధాలు. చంపే వరకు గాని, నరికే వరకు గాని ఉండేది క్రోధం. ఇది క్రూరులలో ఉంటుంది. వీరుల కోపం ప్రార్థించే వరకు మాత్రమే ఉంటుంది.

క్రోధరసం : రౌద్ర రసానికి ఇంకొక పేరు. రౌద్ర రసానికి క్రోధం స్థాయీభావం కావడంవల్ల ఈ పేరు వచ్చింది. వివరాలకు రౌద్రరసం చూడండి.

శ్రీ.చ.

క్షాళన : రస సంబంధి. గ్రీకు లక్షణవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన **సిద్ధాంతం. వేడి, వేడిని** హరించి వేసి శీతల పరుస్తుంది (**ఉష్ణేన ఉష్ణం శీతలం**) అనే వైద్యశాస్త్ర సిద్ధాంతం దీనికి ప్రాతి పదిక. ఈ సిద్ధాంతానికి గ్రీకు భాషలో కెథార్సిస్ (Catharsis) అని పేరు. దీనికి మత సంబంధంగా పవిత్రీకరణం (Purification), వైద్య శాస్త్రానుసారంగా క్షాళనం లేక శోధనం (Purgation) అని అర్థం. అరిస్టాటిల్ ఈ క్షాళనను విషాద రూపక ప్రయోజనంగా సిద్ధాంతీకరించాడు. – "శోక భయముల మూలమున ఆయా ఉద్వేగములకు ఉచితమైన క్షాళనమును కలిగించునది 'విషాద రూపక' మనబడును". (– డా. పోణంగి, నా.శా., పుట 547)

విషాద రూపక పఠన శ్రవణ దృశ్యాల వల్ల మానవునిలో అంతర్గతంగా ఉండే శోక భయ బాధాకర ఉద్వేగాలు పైకుబికి క్షాళనం చెందడంవల్ల మనసు ప్రశాంతత చెందుతుందని దీని పిండితార్థం. లోకానుభవం కూడా అంతే. ఏదైనా ఒక కారణం వల్ల, అంటే దుఃఖానికి సంబంధించిన వార్త వినడం వల్ల గాని, దృశ్యం చూడడం వల్ల గాని ఏడుపు వస్తే శోకోద్వేగం శమనం పొంది, మనసుకు ప్రశాంతత కలగడం సహజం.

సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనంలో నటుడు హరిశ్చంద్రుని కష్టాలను అభినయిస్తూ శోకరసం ఒలికిస్తుంటే ప్రేక్షకహృదయాలు ద్రవిస్తాయి. వారి కళ్లు చెమ్మగిల్లుతాయి. ఏడుపు వస్తుంది. కాని తరువాత వారి హృదయాలు తేలిక పడి ప్రశాంతత వహిస్తాయి. ఇలా బాధాకర ఉద్వేగం శమించి రసానందం కలుగుతుంది. అందుకే మనం సత్యహరిశ్చంద్ర నాటకాన్ని పదే పదే చూస్తుంటాం. కేవలం ఏడ్వడానికయితే వెళ్ళం.

శ్రీ.చ.

క్షిప్తి : గర్భ సంధ్యంగం. అయితే దీనిని గర్భ సంధ్యంగంగా భరతముని, విశ్వనాథ కవిరాజు చెప్పారేగాని శారదా తనయ సింగభూపాల, ధనంజయులు చెప్పలేదు. క్షిప్తినే ఆక్షిప్తి, ఆక్షిప్తం అని కూడా అంటారు. క్షిప్తి అంటే వెలికి తీయడం. రహస్యార్థం వ్యక్తమవడం.

శ్రీ.చ.

క్షేమేశ్వరుడు (9–10వ శతాబ్ది) : సంస్కృత నాటక కర్త. విజయ ప్రకోష్ఠుని మనుమడు. క్రీ శ. 9–10 శతాబ్దులలోని కన్యాకుబ్జ ప్రభువు మహీపాలుని ఆస్థానకవి. ఈయన రచన చండకౌశిక (హరిశ్చంద్ర కథ) నాటకం. ఈయన నైషధానందం అనే పేరుతో నలకథను నాటకంగా రచించాడని ప్రతీతి. దేవీ భాగవతాంతర్గత హరిశ్చంద్ర కథననుసరించి చండకౌశికం రచించాడు. ఈ కథ ఉత్తర హిందూదేశంలో ఎక్కువ ప్రచారంలో ఉంది. ఆంధ్ర దేశంలో ప్రచారంలో ఉన్న కథకు, చండ కౌశిక కథకు కొంత తేడా ఉంది. సత్య హరిశ్చంద్ర కథలో సత్యవ్రతానికి ప్రాధాన్యం ఎక్కువ. చండకౌశికం కథా సంవిధానంలో సంభాషణా చమత్కృతిలో బిగువు ఎక్కువ. పండితులను రంజింప చేసి నంతగా సర్వజనులను రంజింపచేయలేదు.చండకౌశిక నాటకంలోని హరిశ్చంద్రుని భార్య పేరు శైబ్య, కుమారుని పేరు రోహితాశ్వుడు. ఈ చండకౌశిక నాటకాన్ని వడ్డాది సుబ్బారాయుడు అనువదించి 1900లో ప్రచురించాడు. (ఆం.సా.ద. 6–480.)

శ్రీ.చ.

ఖండితగతి నాటకం : తెలుగు నాటక భేదం. ఒకే ఒక చిన్న ఘట్టం. ఏకాంకిక కంటె చిన్నది. దీన్ని ప్రదర్శించడానికి ఇద్దరు ముగ్గురు నటులు సరిపోతారు. రూపారోపం వాచికాభినయం, బహునటులు మూలంగా దీనిని రూపకజాతిలోనిదిగానే పరిగణించాలి. కాని సమగ్ర ఇతి వృత్తం లేకపోవడం వల్ల ఖండ ఘట్టం కావడం వల్ల దీనికి ఖండితగతి నాటకం అని పేరు వచ్చింది. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్యచరిత్రలో ఈ ఖండితగతి నాటకాలను వర్ణించాడు.

శ్రీ.చ.

ఖజూరియా విశ్వనాథ (జ.1906) : డోగ్రీ నాటక వ్యాస రచయిత, నటుడు. జమ్మూలోని ఉధంపూర్ జిల్లా మరియాఘర్ గ్రామంలో జన్మించాడు. జమ్మూలోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ కళాశాలలో బి.ఎ. చదువుకున్నాడు. విద్యార్థి జీవితంలోనే సాహిత్య సమ్మేళనాల్లో పాల్గన్నాడు. పద్య రచన సాగిస్తూ నాటకాల్లో నటించాడు. ఈయన 1933లో కొండ ప్రాంతం రాంనగర్‌లో ఉద్యోగంలో చేరాడు. అక్కడ 'పార్శిథియేటర్' నమూనాలో నాటక సమాజాన్ని స్థాపించాడు. తన నాటక ప్రదర్శనలు ఆ ప్రాంతంలోని నిరక్షరాస్యులకు, అరకొర చదువుకొన్న వారికి రుచించలేదని తెలుసుకున్నాడు. 'ఆర్య సమాజ' భావాలతో ప్రేరితుడై, ఆ ప్రజల భాష ద్వారానే సంఘ సంస్కరణ తేవాలని నిశ్చయించుకున్నాడు. ఆవిధంగా ఈతని మొదటి నాటకం అఛూత్ వెలువడింది. ఈయన దర్శకత్వంలో బడిపిల్లలు దీనిని ప్రదర్శించగా అది మంచి మన్నన పొందింది. అయితే అది హిందువులలోని అగ్రవర్ణాల ఆగ్రహానికి గురైంది. ఈ నాటకానికి మరి నాలుగు కలిపి నీలకంఠ్ (1980)గా ప్రచురించాడు.

డోగ్రీలో మొదట ఆత్మకథ పగడందీయన్ (1985)ను ప్రచురించాడు. అంతేకాక మంచి అనువాదకుడు కూడా. ఉర్దూ, బెంగాలీ, హిందీ భాషల నుంచి అనేక అనువాదాలు చేశాడు.

చంద్ర

ఖాదిల్కర్, కృష్ణాజీ ప్రభాకర్ (1872-1948) : ప్రఖ్యాత మరాఠీ నాటకకర్త, నటుడు, పత్రికా రచయిత. దక్కన్ కళాశాలలో డిగ్రీ పుచ్చుకొని (1892) న్యాయవాద పట్టం పొందక ముందే సవాయి మాధవరావ్యాంచమృత్యు (1893) అన్న గొప్ప చారిత్రక నాటకం రాశాడు. చిన్నప్పటి సవాయి మాధవరావు పీష్వా వేషం కూడా ధరించాడు. సమకాలీన దేశభక్తి ప్రబోధంతో *కాంచన్‌గఢ్ చి మోహన* అనే గంభీర నాటకం రాశాడు. కేసరి పత్రిక సంపాదక మండలిలో (1907) చేరేసరికి ఈ నాటకంపై నిషేధం విధించబడింది. ఈయన రాసిన ప్రఖ్యాత నాటకం కీచకవధ కూడా ఆంగ్లప్రభుత్వ నిషేధానికి గురైంది. ప్రజలు కూడా నాటకంలోని కీచకుడు కర్జన్‌గా, అతణ్ణి సవాలు చేసిన భీముడు తిలక్‌గా పసికట్టగలిగారు. ఈయన నాటకాలు ఆనాటి రాజకీయ వాతావరణాన్ని పట్టి చూపుతాయి.

మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభం కాగానే ఖాదిల్కర్ *చిత్రమాయా జగత్* పేరిట యుద్ధ వ్యాసాలు ఒక ప్రఖ్యాత జాతీయ పత్రికలో ప్రకటించాడు. యుద్ధం సంవత్సరాల తరబడి సాగేసరికి ఈ వ్యాసాలకు బహుళవ్యాప్తి కలిగింది. లోకమాన్యుని అస్తమయంతో కేసరి పత్రికను వీడి లోకమాన్య అనే దినపత్రికకు సంపాదకత్వం వహించాడు.

ఈయన ఎన్నో నాటకాలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, వ్యాసాలు రాశాడు. *సవాయి మాధవరావ్యాంచమృత్యు* (1893), *కీచకవధ* (1907), *భావు బందకీ* (1909), *కాంచన్‌గఢ్ చిమోహనా, ప్రేమధ్వజ్, సత్వపరీక్ష, సవతీ మత్సర్* మొదలైన గద్య నాటకాలూ, *మేనక, ద్రౌపది, స్వయంవర్, విద్యాహరణ్, మానాపమాన్, సావిత్రి, బాయికాంచబండ్, త్రిదండిసన్యాస్* మొదలైన సంగీత నాటకాలు రాశాడు.

నాగిరెడ్డి

ఖోరిలస్ (క్రీ.పూ. 5వ శతాబ్ది) : క్రీ.పూ. 5వ శతాబ్ది. గ్రీకు నాటక కర్త. థెస్పిస్ ప్రవేశపెట్టిన కరాళ నాటకాన్ని ఎంతో ముందుకు తీసుకువెళ్లిన కళావేత్త. సాటిర్ నాటక రచనలో సిద్ధహస్తుడు. క్రీ. పూ. 499లో గ్రీకు నాటక పోటీలలో ఎస్కిలస్‌తో పోటీపడ్డ నాటకకర్త. క్రీ.పూ. 482 ప్రాంతంలో ఇతని కీర్తి తారాస్థాయినందుకొంది. క్రీ.పూ. 520లో ఈయన నాటకం మొట్టమొదటిసారిగా ప్రదర్శితమయినట్లు తెలుస్తూంది. ఈయన మొత్తం 160 నాటకాలు రచించాడని పండితుల అభిప్రాయం.

శ్రీ.చ.

గంగప్ప, ఎస్ (జ.1936) : నాటక పరిశోధకుడు. ఆంధ్రోపన్యాసకుడు. అనంతపురం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాదు, కర్నూలు ప్రభుత్వ కళాశాలల్లో ఆంధ్రోపన్యాసకుడిగా పని చేసి, నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా 1996 నవంబరులో పదవీ విరమణచేశాడు. ఈయన అనంతపురం జిల్లా పెనుకొండ తాలూకా నల్లగొండ్రాయనిపల్లిలో 1936లో జన్మించాడు. తల్లిదండ్రులు కృష్ణమ్మ, వేంకటప్ప.

ఈయన కోలాచలం శ్రీనివాసరావు 'నాటక సాహిత్య సమాలోచనం' అనే అంశం మీద పరిశోధన చేసి, పిహెచ్.డి. పట్టా పొందాడు. ఇది 1977లో ప్రచురితమైంది. పరిశోధన పూర్తయిన తరువాత ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ కోసం 'కోలాచలం శ్రీనివాసరావు' గురించి ఒక ఏకాంశవ్యాఖ్య రచించాడు. నాటకరంగానికి సంబంధించి ఈయన రాసిన తెలుగు నాటకం – సామాజిక చైతన్యం (U.G.C మేజరు రీసర్చి ప్రాజెక్టు) 1860 నుంచి 2000 వరకు తెలుగునాటకం పొందిన పరిణామ వికాస దశలనుగురించి తెలియజేస్తుంది. ఈ గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు. *గత శతాబ్ది తెలుగు నాటకం, సంస్కరణోద్యమంలో తెలుగునాటకం, విశ్వనాథనాటకసాహిత్యం* అనే మూడు గ్రంథాలను కూడా రచించాడు. ఇవేకాక తెలుగు నాటకం మీద వివిధ పత్రికలలో వ్యాసాలు, సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించాడు. గంగప్ప కొన్ని నాటకాలు, నాటికలు రచించాడు. వాటిలో *పద కవితా పితామహుడు* (1986), *దేశం బాగుపడాలంటే* నాటికలు రచయితకు పేరు తెచ్చాయి. ఈయన రచించిన *దివ్య దీపావళి* అనే సంగీత రూపకం రేడియోలో ప్రసారమైంది. గంగప్ప నాటక ప్రయోక్త కూడా. నాటక రంగం మీదేకాక పద సాహిత్యం మీద విశేషకృషిచేశాడు. క్షేత్రయ్య, అన్నమాచార్య, జయదేవుని మీద ఈయన రాసిన గ్రంథాలు అమూల్యమైనవి. జానపదరంగంలో ఈయన కృషి చెప్పుకోదగింది. గంగప్ప పరిశోధకుడేకాక, ఎన్నో నవలలు, కథలు, కవితలు రచించాడు.

జి.వె.కే.రె.

గంగాధర రావు, కొర్రపాటి (1922-86) : నటుడు, దర్శకుడు. శతాధిక నాటకకర్త. కళావని సమాజ స్థాపకుడు. ఈయన1922, మే 10న బాపట్లలో జన్మించాడు. ఏలూరు, మద్రాసులలో విద్యనభ్యసించాడు. ఎల్.ఐ.ఎం. పరీక్షలో ఉత్తీర్ణుడై, వైద్యవృత్తిని చేపట్టి బాపట్లలో స్థిరపడ్డాడు. చిన్నప్పటి నుంచి నటన, నాటకాల పట్ల అభిమానం ఎక్కువ. తెలుగు నాటక సాహిత్యంలో

వందకు పైగా నాటకాలు, నాటికలు రచించిన మొదటి రచయిత. గొలుసు నాటక సృష్టికర్త. 1955-65 ప్రాంతంలో నిద్రపోతున్న నాటకరంగాన్ని మేల్కొల్పి, రంగస్థల ప్రదర్శనలకనువైన రచనలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా నాటకోద్యమాన్ని బలోపేతం చేయడంలో విశేషకృషి చేశాడు. బాపట్లలో 'కళావని' సంస్థను స్థాపించి అనేక వంది యువ కళాకారులను నాటక రంగానికి పరిచయం చేశాడు. ప్రసిద్ధ రంగస్థల నటులు కె. వేంకటేశ్వరరావు, చాట్ల శ్రీరాములు ప్రారంభదశలో కొర్రపాటి గంగాధరరావు నాటకాలలో నటించి నటనా వైదుష్యానికి మెరుగులు పెట్టుకున్నవారే. గంగాధరరావు నటుడుగా, దర్శకుడుగా అనుభవం సాధించిన తరువాత ఔత్సాహిక నాటక సమాజాలకు ఎలాంటి ప్రదర్శనలు అవసరమో గుర్తించి, నాటక, నాటికలు రచించాడు. ఔత్సాహిక నాటక సమాజాలకు ఊపిరిపోసి నటులలో ఉత్సాహాన్ని నింపాడు.

ప్రాచ్యపాశ్చాత్య నాటకరీతులను అవగాహన చేసుకొన్న కొర్రపాటి గంగాధరరావు *గుడ్డిలోకం, విషకుంభాలు, కమల, యథాప్రజా-తథా రాజా, తస్మాత్ జాగ్రత్త, లోకంపోకడ, పోటీ నాటకం, నిజరూపాలు,రాగద్వేషాలు, రాగ శోభిత, పుడమి తల్లికి పురిటి నొప్పులు* మొదలైన నాటకాలు; ప్రార్థన, నాబాబు, పెళ్లి చూపులు, *బంగారు సంకెళ్ళు*, తెలుగు కోపం, విధివశం, *తనలో తాను, పెండింగ్ ఫైలు* వంటి ప్రజాదరణ పొందిన నాటికలు రచించాడు. ఇతర భాషల ఆధారంగా రాసిన *ఈ రోడ్డు ఎక్కడికి? పూలదోసిళ్లు, మరా-మనిషి, సంక్రాంతి, సాహసి* వంటి నాటకాలను ఆంధ్ర నాటకరంగానికి అందించి సుసంపన్నం చేశాడు. కొర్రపాటి రచించిన నాటకాలు, నాటికలు ప్రదర్శించని సమాజం లేదు. నాలుగు దశాబ్దాలపాటు కళాశాల వార్షికోత్సవాలలో, పండుగలలో, నాటక పోటీలలో నిత్యం ప్రదర్శనకు నోచుకున్నాయి, రచయితకు ఖ్యాతిని తెచ్చి పెట్టాయి. *యథాప్రజా-తథారాజా* ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, ప్రార్థన ఆంధ్ర నాటక కళాపరిషత్తు అవార్డు అందుకున్నాయి.

నేటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు ప్రతిరూపం *యథా ప్రజా- తథా రాజా*. ఆదర్శాలు చెప్పడానికే కాని ఆచరించడానికి కాదని చెప్పే నాటకం లోకం పోకడ. మనిషిపట్ల ప్రేమాభి మానాలు, గౌరవాభి మానాలు పెంపొందించ డానికి ధనం మూలమని నిజరూపాలు నాటకం ద్వారా వెల్లడించాడు. *కమల, గుడ్డిలోకం* నాటకాలను గరికపాటి రాజారావు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి తరపున విస్తృతంగా ప్రదర్శించి ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించాడు. ఒకరికి రాసిన ఉత్తరం మరొకరు చదవడంవల్ల ఎదురయ్యే ఇబ్బందులు, అపోహలు, అనుమానాలు, గొడవలు, వాటి పర్యవసానాలను వివరించిన నాటకం రాగశోభిత. పరిస్థితుల ప్రభావంవల్ల ప్రేమాభిమానాల స్థానంలో ద్వేషం చోటు చేసుకొనే అవకాశముందనే విషయాన్ని రాగ ద్వేషాలు నాటకం ద్వారా తెలిపాడు. ఇలా భిన్న సమస్యలను నాటకంలో కథా వస్తువుగా స్వీకరించి, ప్రదర్శనా పరంగా విజయవంతం చేయడంలో కొర్రపాటిది అందవేసిన చెయ్యి.

గంగాధరరావు ఉత్తమ నాటికల్లో ప్రార్థన ఒకటి. యుద్ధం పెట్టుబడిదారుడి స్థితిని మెరుగుపరుస్తుంది. సామాన్య మానవుడి స్థితిని దిగజారుస్తుందని, విశ్వశాంతి అవసరమని చెప్పిన నాటిక ఇది. ఇందులో ప్రపంచచరిత్రలో, యుద్ధనిర్వహ ణలో పాల్గన్న సుప్రసిద్ధ నాయకులను ప్రదర్శించి, కొత్త ప్రయోగం చేసి ప్రేక్షకుల మెప్పును పొందడమే కాదు, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అవార్డును పొందాడు. తెలుగు వారి కోపం తాటాకుల మంటేనని, క్షణిక కాలంలో మాయమయ్యే కోపాన్ని తెలుగు కోపం అనే హాస్య నాటికలో వివరించాడు. గంగాధరరావు రాసిన తెలుగు కోపం పెళ్లికి పూర్వం కథకు సంబంధించింది. *బంగారు సంకెళ్ళు* పెళ్లికి తరువాత కథ. మొదటి నాటికలో ఉన్న పాత్రలే రెండో నాటికలో కూడా ఉన్నాయి. వీటిని నాటికలుగా ప్రదర్శించుకోవచ్చు, నాటకంగానూ ప్రదర్శించుకోవచ్చు. లంచగొండితనం దాని పర్యవసానాలను, లంచగొండితనానికి కారకులు ఎవరని ఆలోచింపజేసే నాటిక పెండింగ్ ఫైలు అయితే, కళాకారులు ఎదుర్కొనే సమస్యల తోరణం కళాకార్ నాటిక. తనలో తాను, విధివశం మొదలైనవి గంగాధరరావు ప్రసిద్ధ నాటికా పరంపరలోనివే.

మద్యపాన నిషేధాన్ని కథాస్తువుగా స్వీకరించి పెడదోవ నాటకాన్ని రచించాడు. ఈ నాటకానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీలలో ప్రదర్శించగా ప్రథమ బహుమతి లభించింది. కుటుంబ నియంత్రణ, అధిక సంతానం వల్ల ఎదురయ్యే సమస్యలను చిత్రిస్తూ రాసిన నాటకాలకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం బహుమతులు లభించాయి. బాపట్లలో కళావని నాటక సమాజ స్థాపకుడుగా 'కళాభారతి' అనే సాంస్కృతిక సంస్థకు, బాపట్ల ఫిల్మ్‌క్లబ్‌కు అధ్యక్షుడుగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాడు.

ఆంధ్ర నాటక కళా పరిషత్తు నిర్వహించిన నాటక పోటీలలో ప్రథమబహుమతులు అందుకున్న 25 నాటికలను ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ నాటికా పంచవింశతి పేరుతో

సంకలనంచేసి ప్రచురించింది. ఈ సంకలనానికి రూపకర్త ఈయనే. నాలుగు దశాబ్దాల పాటు నాటకరంగానికి సేవ చేసిన కొర్రపాటి గంగాధర రావు లంబాడోళ్ల రాందాసు, బోధిశ్రీ అనే నవలలు రచించాడు. కళారంగ వికాస కృషిలో కొర్రపాటి గంగాధరరావు కలం **1986** జనవరి **26**న ఆగిపోయింది.

దాసరి.ఎన్

గండం : వీథ్యంగం. ప్రకృత్యర్థానికి అన్వయిస్తూ ఆకస్మికంగా యథాలాపంగా పలికే పలుకు భవితవ్యాన్ని సూచించి వేరొక అర్థాన్నిస్తే దానిని సంస్కృత లాక్షణికులు గండం అన్నారు. (గండః ప్రస్తుత సంబంధి భిన్నార్థం సహ సోదితమ్ - ద.రూ. 3-18)

బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర పంచమాంకంలో

"కలికీ రెక్కలు రాని పిల్లలను సాకన్ గూటిలో నుండిమే
తలకై పోతొక చెంత బెంటి యొక చెంతన్ బాఱి నీలో నేబి
ల్లలను బామేగ్ర సియించు నొ వలల పాలన్ చిక్కునో పులులీ
యిల పై బ్రాణులకున్ వియోగముగుచో నెవ్వారికెవ్వారలో"

పై పద్యంలోని పామే గ్రసియించునొ అనే పదాలు యథాలాపంగా వచ్చి ప్రకృతార్థానికి అన్వయిస్తాయి. అంతేకాదు ఆ తరువాత లోహితాస్యుని పాము కరుస్తుంది. అందుచేత "పామేగ్రసియించునొ" అనేది భవితవ్యాన్ని సూచిస్తుంది. కాబట్టి ఇది గండం.

శ్రీ.చ.

గగనిక (Cyclorama) : రంగస్థలానికి వెనక భాగాన నిర్మించిన వక్రరూప కుడ్యం లేక గుమ్మట భాగం గగనిక. దీని మీద వెలుతురు సహాయంతో గగనాన్ని (ఆకాశాన్ని) రూపొందిస్తారు కాబట్టి దీనికీ పేరు వచ్చింది. ఇది కుడ్యమూకావచ్చు వంపు తెరా కావచ్చు. తెరగా అమర్చినపుడు ముడతలు లేకుండా గట్టిగా బిగించి ఉంచాలి. ఇది కదల్చడానికి వీలులేని ఏర్పాటు కాబట్టి అవసరం లేనపుడు అడ్డంకిగా తయారవుతుంది. పార్శ్వాల నుంచి ప్రవేశ నిష్క్రమణాలకు ఇబ్బంది కలుగవచ్చు. పైనుంచి సీనరీ వేలాడదీయడం కష్టసాధ్యం కావచ్చు. అంతే గాక ఒకే సీనరీ రీతికి పరిమితమై,ఇతర రీతులకు స్థానం లేకుండా చేయవచ్చు. కదల్చడానికి వీలయ్యే గగనికలు కూడా సృజించారు గాని ఇవి ఎక్కువగా ప్రచారంలోకి రాలేదు. రంగస్థలం ఆచ్ఛాదించడానికి కావలసిన సీనరీని గగనిక తగ్గిస్తుంది. అయితే ఆ సీనరీలు గగనతలాన్ని చూపవలసినపుడే ఇది సాధ్యమవుతుంది. అయితే చాలా సందర్భాలలో దీన్ని ఆచ్ఛాదించడానికి దీని ముందు సీనరీ కట్టవలసి ఉంటుంది.

అధోదీపాల సహాయంతో దీని మీద నీలాకాశ భ్రమను కలిగించవచ్చు. కదిలే, స్థిరంగా ఉండే మబ్బులను చూపించవచ్చు. అంతేకాక ప్రతీక చిహ్నాలను, నీడలను ప్రసరింప చేయవచ్చు. సమర్థవంతంగా ప్రకాశమానం చేస్తే ప్రేక్షకులకు సహజమైన ఆకాశమే అనే భ్రమతోపాటు అనంతత్వ భావం కూడా గోచరిస్తుంది. కేంద్రీకరణ దీప సహాయంతో చంద్రబింబం వంటి కాంతి ఫలితాలను తేలికగా చూపించవచ్చు.

ఐరోపా ఖండంలో వివిధ దేశాలలో ఒకే విధమైన గగనికను ఉపయోగిస్తారు. ఇది పై దూలం నుంచి రంగస్థల ఉపరితలానికి వ్యాపించి ఉంటుంది. సామాన్యంగా ఎత్తు **90** అడుగులు. ఒక మూల మొదలై రంగస్థలం వెనక భాగాన్ని చుట్టి రెండవ మూల చేరుకొని అర్ధ వర్తులాకారం దాలుస్తుంది. వీటిలో ఎక్కువ భాగం కొత్తనార గగనికలే. ఇవి పై నుంచి కిందికి వేలాడుతూ అవసరం లేనపుడు చుట్టి వేయడానికి అనువుగా ఉంటాయి.

సగటు రంగస్థలానికి అర్ధ చంద్రాకార గగనిక వల్ల నష్టం ఎక్కువ. ఇంగ్లాండులో భవనాల ఎత్తు పరిమితి చట్టం మూలంగా సంక్షిప్త గగనికను రూపొందించుకున్నారు. రంగస్థలం మీద దృశ్య సామగ్రిని ఉపయోగించి చూపలేని అభినయ ప్రదేశాలను ఇంకా చూపడానికి వీలుకాని దృశ్యాలను గగనిక సహాయంతో, రంగోద్దీపనం ద్వారా సూచనాప్రాయంగా వివరంగా తెలియ జేయడానికి ఉపకరించే సాధనం గగనిక.

శ్రీ.చ.

గగ్గయ్య, వేమూరి (1895-1955) : రంగస్థల నటుడు. ఖంగుమనే కంఠధ్వని, స్పష్టమైన సంభాషణ ఈయన సొత్తు.

ఈయన 1895, మే 15న వేమూరులో జన్మించాడు.

దుష్ట పాత్రలు నటించడంలో మేటి. చదువు అబ్బలేదు. సంగీతం పట్టుపడలేదు. చివరకెలాగో పద్యం చక్కగా పాడడం నేర్చుకుని సురభి నాటక సమాజంలో చేరి, రంగూన్‌లో పది నెలల పాటు నాటకాలు ప్రదర్శించాడు. రంగూన్ నుంచి తిరిగి వచ్చిన తరువాత తెనాలి ఫస్టు కంపెనీలో కొంతకాలం, ఆ తరువాత మైలవరం కంపెనీలో, ఆ తరువాత నంద్యాల మహానంద రెడ్డి కంపెనీలో దుష్ట పాత్రలలో నటిస్తూ యావదాంధ్ర ఖ్యాతి గాంచాడు. యమపాత్ర ధారణకు గురజ నాయుడు లేని లోటు తీర్చాడు.

తరువాత సినిమాలో చేరాడు. శ్రీకృష్ణలీలలో కంసుడు, సావిత్రిలో యమయుడు మొదలైన పాత్రలలో నటించి ఆంధ్రప్రదేశ్‌లోనే గాక తమిళనాడులో కూడా ఎంతో పేరు

సంపాదించాడు. శ్రీకృష్ణలీలలో 'ధిక్కారము సైతునా' అనే పాట పాడుకోని ఆంధ్రుడు లేడనే చెప్పవచ్చు. ఈయన కంసుడు, యముడు, జరాసంధుడు, శిశుపాలుడు మొదలైన పాత్రలలో నటించాడు. గగ్గయ్య క్యాన్సరు వ్యాధితో 1955, డిసెంబర్ 30న స్వర్గస్థుడయ్యాడు.

శ్రీ.చ.

గణేశ్‌పాత్రో : నాటక రచయిత. స్వస్థలం విశాఖపట్టణం. కొడుకు పుట్టాల నాటికతో యావద్భారత కీర్తి లభించింది. ఆ నాటిక భారతీయ భాషలన్నిట్లోకి అనూదితమై ఆకాశవాణిలోను, దూరదర్శన్‌లోనూ ప్రసార మైంది. 1970 ప్రాంతంలో కలం పట్టిన గణేశ్ పాత్రో అయిదేళ్ళు గడవక ముందే ప్రథమశ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నాడు. రచనలు పదికి మించక పోయినా రాసిన ప్రతి నాటకమూ, నాటికా రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథా వస్తువును పరిగ్రహించడంలో, కథనంలో, పాత్రచిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేశ్‌పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం ఈయన రచనా విధానంలోని ప్రత్యేకత. *తరంగాలు, అసుర సంధ్య* నాటకాలూ కొడుకు పుట్టాల, *పావలా, లాభం, త్రివేణి, ఆగండి!* కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు ఆంధ్ర ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. ప్రస్తుతం చలనచిత్రాలకు కథలు, సంభాషణలు సమకూరుస్తున్నాడు.

గం.సు.రె.

గతి ప్రచారం : అభినయ సంబంధి. గతి అంటే నడక. గతి ప్రచారమంటే నడకలోని విశేషం. స్వభావం, రసం, అవస్థ, దేశం, కాలం, అనుసరించి పాత్రల నడకలు మారుతుంటాయి. దీనికి లోకమే ప్రమాణం. సమ గతి, మిశ్రమ గతి, మధ్యమ గతి, రాజుల గతి, సంభ్రమాద్యవస్థల గతులు, రస గతులు, దేశానుసార గతి మొదలైనవి గతి భేదాలు. మెల్లగా తాపీగా నడవడాన్ని పెళ్ళి నడక అనే మాటతో పోలుస్తుంటారు.

శ్రీ.చ.

గర్భసంధి : పంచ సంధులలో మూడవది. గర్భమనగా మధ్యమం. పంచసంధులలో ఇది మధ్య సంధి. సామాన్యంగా నాటకం మధ్యలో వస్తుంది కాబట్టి దీనికి గర్భసంధి అని పేరు వచ్చింది. ఇందులో పతాక ఉండి తీరాలనే నియమం లేదు. మాళవికాగ్ని మిత్రంలో పతాక లేదు. పతాక లేనపుడు దాని స్థానంలో బీజ బిందువులలో ఒక దానిని ప్రవేశపెట్టాలి.

ముఖ సంధిలో ఉత్పన్నమై ప్రతిముఖ సంధిలో స్పష్టమై తిరిగి మరుగుపడిన బీజాన్ని అన్వేషించడం ఆ గర్భసంధితో జరుగు తుంది. ఈ గర్భసంధిలోనే నాటకం పరాకాష్ఠకు చేరుకుంటుంది. కథ మలుపు తిరుగు తుంది. పతాక లేక దాని స్థానంలోని బీజం లేక బిందువు ప్రాప్త్యాశకు దారి తీస్తుంది. అంగాలు: గర్భసంధికి సంబంధించిన అంగాలు గర్భాంగాలు. ఇవి పద మూడు,1. అభూత హరణం, 2. మార్గం, 3. రూపం, 4. ఉదాహరణం, 5. క్రమం, 6. సంగ్రహం, 7. అనుమానం, 8. ప్రార్థన, 9. క్షిప్తి, 10. త్రోటకం, 11. అధిబలం, 12. ఉద్వేగం, 13. విద్రవం.

శ్రీ.చ.

గర్భాంకం : దీనినే అంతర్నాటకమని, నాటకంలో నాటకం అని వ్యవహరిస్తారు. భరతముని దీనికి 'నాట్యాయితమ' అని పేరు పెట్టి ఇలా నిర్వచించాడు. ''నాట్యమందలి పాత్రలనే సామాజికులుగా కల్పించి,ఆ నాట్యం కంటె వేరగు ఇంకొక నాట్యాన్ని ప్రయోగించి, అది అసత్యమైనను యదార్థమగు నాట్యమే అనునట్లు ప్రదర్శించుట నాట్యాయిత'' మనబడును. ''అనగా నాటకము నందు ఇంకొక నాటకమును ప్రయోగించుట నాట్యాయిత మనబడునని సారాంశం. దీనినే గర్భాంకమందురు'' (అను. డా. పోణంగి). ఉదా॥ సంస్కృత ఉత్తరరామ చరిత సప్తమాంకం అంతర్నాటకం, బాలరామాయణం తృతీయాంకం సీతా స్వయంవరం అంతర్నాటకం.

తెలుగులో తిరుపతి వేంకట కవులు పాండవాశ్వమేథ షష్ఠాంకం బభ్రువాహన విజయం గర్భాంకం. పాశ్చాత్య నాటకాలలో హామ్లెట్ తృతీయాంక అంతర్నాటకం, చెఖోవ్ సీటికాకి ప్రథమాంక అంతర్నాటకం గర్భాంకానికి మంచి ఉదాహరణ (వివరాలకు అంతర్నాటకం చూడండి).

శ్రీ.చ.

గాంధీ నాటకాలు : మహాత్మాగాంధీ, నెహ్రూ, సి.ఆర్.దాస్, ఆలీ సోదరులు మొదలైన జాతీయ నాయకులు పాత్రలుగా జాతీయోద్యమాలను ప్రతిబింబింపచేసే నాటకాలకు గాంధీ నాటకాలని, జాతీయ నాటకాలని పేరు. ఈ రకం నాటకాలకు ఆంధ్రదేశంలోనేగాక యావద్భారతంలోనే ఆద్యుడు, గుంటూరు వాస్తవ్యుడు దామరాజు పుండరీకాక్షుడు. నాటక కళ ద్వారా జాతీయోద్యమాలకు దోహదం చేయాలనే పరమోద్దేశంతో మొట్ట మొదటగా 1920లో స్వరాజ్య సోపానం అనే నాటకం రచించి, 'సంఘసేవా నాట్య మండలి' అనే నాటక సంఘం స్థాపించి తద్వారా ఆంధ్ర దేశమంతటా దీనిని ప్రదర్శింప జేశాడు. ఇదే తొలి జాతీయ నాటకం.

ఇది తిలక్ నిర్యాణం, గాంధీజీ రాజకీయ రంగంలో ప్రవేశించడంతో ప్రారంభమై, నాగపూరు కాంగ్రెస్ మహాసభలలో గాంధీజీ ప్రతిపాదించిన స్వాతంత్ర్యతీర్మానం నెగ్గడంతో అంతమవుతుంది.1919, 1920 లలో భారత రాజకీయాలు

ఈ నాటకంలో చోటుచేసుకున్నాయి. ఈ నాటకం బహుళ జనాదరణ పొందడంతో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఈ నాటకాన్ని ప్రదర్శించకుండా నిషేధించింది.

ఇంతలో సోమరాజు రామానుజరావు *స్వరాజ్య రథం* వచ్చింది. ఇదీ *స్వరాజ్య సోపానం* లాగానే నడుస్తుంది. అదే కథ,అదే చిత్రణ, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం దీనిని కూడా నిషేధించింది. ఎంతో ప్రజాదరణ పొందిన *స్వరాజ్య సోపానం* అచ్చుపడలేదు. ఆ తరువాత రచయిత దీనిని కొంత పెంచి మూడు నాటకాలుగా ప్రచురించాడు. 1. *నవయుగారంభం లేక గాంధీ మహోదయం*, 2. *నవయుగం లేక గాంధీ విజయం*, 3. *పంజాబ్ దురంతాలు లేక పాంచాలీ పరాభవం*. ఆ తరువాత శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రి *గాంధీ విజయ ధ్వజం*, *తిలక్ మహారాజు నిర్యాణం* వచ్చాయి. వీటి ప్రదర్శనను కూడా బ్రిటీష్ ప్రభుత్వం కొనసాగనీయలేదు. 1947వరకు రాజకీయాలు చిత్రిస్తూ, సత్తి గొడుపు రాఘవ రాజు, అబ్బరాజు రంగారావు, వడ్లపల్లి కోటయ్య ప్రభృతులు ఇలాంటి నాటకాలు రాశారు. సమకాలీన రాజకీయాలను చిత్రించే ఈ రీతి నాటకాలను గాంధీ నాటకాలనడం పరిపాటి.

శ్రీ.చ.

గాంధీ, సమ్మెట (జ.1950) : నటుడు, నాటక రచయిత. ఈయన1950లో కృష్ణాజిల్లా, నేలకొండపల్లిలో జన్మించాడు. గాంధీ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నప్పుడే *చూడబోతే చుట్టాలు పట్టుకుంటే దయ్యాలు* అనే హాస్య నాటికలో నటించాడు. బి.డి.ఎల్.లో ఉద్యోగం చేస్తున్నా ప్రవృత్తి మాత్రం నాటకరంగంలో పనిచేయడమే. *రుద్రవీణ, గార్ధభాండం, వైకుంఠపాళి, కుక్కపిల్ల దొరికింది, అంతా ఇంతే, సమరం, శేషప్రశ్న, ఆ పొద్దు పొడవాలి, మనుషులస్తున్నారు జాగ్రత్త, ఫర్ సేల్* మొదలైన నాటికలలో నటించాడు. *నట్టింట్లో నాటకం* హాస్యనాటికలో యముడు పాత్ర ఈయనకు బాగా గుర్తింపు తెచ్చిన పాత్ర. సాంఘిక ప్రదర్శనలలోనే కాకుండా *పాండవోద్యోగం*లో అర్జునుడు, ఆకెళ్ళ రచించిన *శ్రీనాథుడు*లో సింగనామాత్యుడు, *అల్లసాని పెద్దన*లో శ్రీకృష్ణదేవరాయలుగా నటించాడు. *శ్రీనాథుడు* నాటకం రాష్ట్రంలోని వివిధ కళావేదికల మీద కాకుండా 'అప్పాజోస్యుల విష్ణుభట్ల కందాళం ఫౌండేషన్ (అమెరికా)' ఆహ్వానం మేరకు అమెరికాలో పలుచోట్ల నిర్వహించిన ప్రదర్శనలలో పాల్గన్నాడు. నాటక రచయితగా *వైకుంఠపాళి* వెలువరించాడు. విజ్ఞాన సమితి (బెంగుళూరు) నిర్వహించిన పోటీలలో ఈ నాటికకు ఉత్తమ రచన బహుమతి లభించింది. *అల్లసాని పెద్దన* నాటకంలో శ్రీకృష్ణదేవరాయలు పాత్రలో నటించిన గాంధీకి ఉత్తమ సహాయనటుడుగా నంది బహుమతి లభించింది. కళారంగంలో పనిచేస్తున్న గాంధీని కళా జగతి 31వ వార్షికోత్సవం సందర్భంగా 2001 రంగస్థలం అవార్డునిచ్చి గౌరవించింది.

దాసరి.ఎన్



గార్గి, బల్‌వంత్ (జ.1916) : పంజాబీ సాహిత్యంలో సుప్రసిద్ధ నాటకరచయిత, కథకుడు, నవలాకర్త. 1938లో లాహోర్‌లో ఎం.ఎ. పట్టా పొందాడు. రవీంద్రుని సాహిత్యంతో ప్రభావితుడై 1942లో రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టాడు. రవీంద్రుని *పోస్ట్ ఆఫీస్* మాతృకగా రాసిన *తారా తూటియా* (పొడిచే నక్షత్రం, 1942) ఈతని తొలినాటిక. ఇబ్సన్, షిండె, స్టెయిన్‌బెక్ వంటి ప్రముఖ రచయితల సాహిత్యాలలోని వాస్తవికత ఈయనను బాగా ఆకట్టుకుంది. ఆ ప్రభావంతోనే *లోహకుత్*(కమ్మరి, 1944) నాటికను రాశాడు. ఇదే ఈయన తొలి స్వతంత్ర రచన. బల్‌వంత్‌గార్గి లోని ప్రగతిశీలాన్ని, అభ్యుదయ భావాలను వెలికితెచ్చిన రచనలు *సెయిల్ పథర్* (నిశ్చల శిల, 1949), *కెన్రో* (1952). *కెన్రో*లో ప్రగతికి అవరోధంగా ఉన్న సనాతన సంప్రదాయాంధకారాన్ని చీల్చుకొని ఒక నవశకం ఉదయించగలదన్న ఆశాభావాన్ని వెలిబుచ్చాడు. *కనక్ దీ బల్లీ* (గోధుమ కాడ, 1954)లో వాస్తవికతకు తన భావుకతను మేళవించి మెరుగులు దిద్దాడు.

చిత్త సంక్షోభం, మనోవిశ్లేషణలతో సాగిన రచనలు *ధుని* (లోలోపల రగులుకొనే నిప్పు, 1976), *సౌంకన్* (సవతి, 1979). కాముకురాలైన ఒక యువతి తన ప్రియుని ద్వారా సంతానాన్ని పొందాలన్న తపనకి లోనై హతాశురాలైనందువల్ల మనస్సంక్షోభానికి గురికావడమే *ధుని* లోని కథావస్తువు. *సౌంకన్* సవతి పోరున్న స్త్రీ గర్భవతిగా ఉన్నదశలో పుట్టబోయే శిశువుని గురించి సంఘర్షణకు లోనైనప్పటి మనోవైకల్యాన్ని చిత్రించిన రచన. కవితా సంపత్తిలో గేయకవితా విన్యాసాలతో హృద్యంగా ఈయన లేఖిని నుంచి వెలువడ్డ మరికొన్ని ఏకాంకికలు – *పట్టన్ ది బేడీ* (లంగరు వేసిన నౌక, 1951), *కౌరీ టిసి* (కన్నె శిఖరం,

1944), బెడె (తల్లి, 1951), మోఘా (ఉపనది), డా.పల్టా. ఈయన నాటికలు ప్రశంసనీయమైన వస్తువులతో విశేషాదరణ పొందాయి.

నాటక ప్రక్రియలో నిష్ణాతుడైన బలవంత్ గార్గి రచించిన రంగస్థల పరిశోధక గ్రంథం రంగ్ మంచ్ (1961) సాహిత్య అకాడమీ అవార్డు (1962)ను సంపాదించి పెట్టింది. 1959లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వపు ఉత్తమ సాహిత్య పురస్కారం గార్గి రచనలకి లభించింది. రెండు సంవత్సరాలు వాషింగ్టన్‌లోను, చాలాకాలం ఛండీగర్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలోనూ ఈయన భారతీయ నాటక ప్రక్రియని బోధించాడు. నీమ్ దీ పత్తే (వేపాకులు, 1961), సుథ్మే వాలి అఖ్ (1977), కౌడియన్ వాలా సాంప్ (1980) అనే గ్రంథాలు ఈయన సమకాలీనసాహితీ ప్రముఖులను గురించి నిష్కర్షగా స్వేచ్ఛా యుతంగా చిత్రించిన అక్షర చిత్రాలు.

కాంతలక్ష్మి

గాలస్వర్దీ, జాన్ (1867-1933) : లండన్. ఇంగ్లీషు నాటక కర్త. నవలా కారుడు. నోబుల్ బహుమతి గ్రహీత.



ఈయన ప్రాచీన డెవాన్ కుటుంబంలో జన్మించి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన హారో, న్యూ కాలేజ్‌లలో విద్యాభ్యాసం చేశాడు. 1890లో న్యాయవాద వృత్తి ప్రారంభించాడు. ఇతని ప్రప్రథమ నాటకం ది సిల్వర్ బాక్స్ 1906లో విజయవంతంగా ప్రదర్శింపబడటంతో ఉత్సాహం రేకెత్తి వరసగా నాటకాలు రాయనారంభించాడు. పారిశ్రామిక అశాంతిని చిత్రించే స్ట్రయిఫ్ (1909), జస్టిస్ (1910) అనే నాటకాలు గాలస్వర్దీకి అఖండ ఖ్యాతిని తెచ్చి పెట్టాయి. ఆ తరువాత రచించిన నాటకాలు జయప్రదం కాలేదు. స్కిన్‌గేమ్ (1920) అనే నాటకం రచించి ఖ్యాతిని తిరిగి పుంజుకుని, 1926లో ఎస్కేప్ నాటకం రచించి తన స్థానం సుస్థిరం చేసుకున్నాడు. సోమంచి యజ్ఞన్న శాస్త్రి జస్టిస్ నాటకాన్ని తెలుగులోకి అనువదించాడు.

శ్రీ.చ.

గావో జింగ్జియాన్ (జ.1940): వచన రచయిత, అనువాదకుడు, నాటక రచయిత, దర్శకుడు, విమర్శకుడు, కళాకారుడు, చిత్రలేఖకుడు. 2000వ సంవత్సరానికి నోబెల్ బహుమతి గ్రహించిన చైనీస్ రచయిత. ప్రస్తుతం ఫ్రెంచి పౌరుడు. నోబెల్ బహుమతికి ఎంపికైన మొట్టమొదటి చైనీస్ రచయిత.

గావో జింగ్జియాన్ 1940, జనవరి 4న తూర్పుచైనాలో గంఝౌ (Ganzhov) లో జన్మించాడు. జపాన్ దండయాత్ర తదనంతరం తన జీవనం సాగించాడు. ఈయన తండ్రి బ్యాంకు ఉద్యోగి, తల్లి ఔత్సాహిక నటి. తల్లి ద్వారా స్ఫూర్తి చెంది, రంగ స్థలం పైన, నాటక రచన పైన మంచి అభిమానం పెంపొందించుకున్నాడు.

ఈయన ప్రాథమిక విద్యస్కూల్స్ ఆఫ్ ది పీపుల్స్ రిపబ్లిక్‌లో సాగింది. బీజింగ్ లోని విదేశీ భాషల శాఖ నుంచి 1962లో ఫ్రెంచ్‌లో డిగ్రీ తీసుకున్నారు. సాంస్కృతిక విప్లవం కాలం (1966-67)లో ఆయన పునఃవిద్య శిబిరంలో పాలన్నాడు.

ఆయన 1979 వరకు తన రచనలను ప్రచురించలేదు. ఫ్రాన్స్, ఇటలీ వంటి విదేశాలలో కూడా ప్రచురించలేదు. 1980-87లో చైనాలోని సాహిత్య పత్రికల్లో ఆయన కథానికలు, వ్యాసాలు, నాటకాలను ప్రచురించాడు. తన పుస్తకాలకు ముఖ చి(ప)త్రాలను తానే రచించుకున్నాడు. అంతేకాక నాలుగు గ్రంథాలను కూడా ముద్రించాడు. అందులో కళ, ఆధునిక వచన రచనపై మౌలిక చర్చ సాగింది. 1986లో తన రచనలపై చైనా ప్రభుత్వం నిషేధం విధించినపుడు శరణార్థిగా ఫ్రాన్స్‌కు పోయాడు. 1989లో తియాన్మన్ స్క్వేర్‌లో జరిగిన దుర్ఘటనను తీవ్రంగా నిరసించి, చైనా కమ్యూనిస్టు పార్టీకి తిలోదకాలు ఇచ్చాడు. 1987లో రాజకీయ నవలను, నాటకాన్ని అత్యాధునిక అసంగత (absurd) పద్ధతులలో సుసంపన్నం చేసిన రచయిత.

ఈయన రచించిన బస్ స్టాప్ (1983), ది అదర్ షోర్ (1986) ప్రభుత్వ నిషేధానికి గురయ్యాయి. అయితే ది అదర్ షోర్ నాటకం తైవాన్‌లో, హాంకాంగ్‌లో విజయవంతంగా ప్రదర్శింపబడింది.

అబ్సల్యూట్ సిగ్నల్స్ (1982), బస్ స్టాప్ (1983), వైల్డ్‌మన్ (1985), ది అదర్ షో (1986), ది ఫ్యుజిటివ్స్ (1993 నవల), ది వాయిస్ ఆఫ్ ఇండివిడ్యువల్స్, వితవుట్ ఇజమ్స్, సోల్ వహెంటెన్ *(1997)* వంటి రచనలను వెలువరించాడు.

బస్ స్టాప్ నాటకాన్ని 1983లో రచించాడు. 10 ప్రదర్శనల తరువాత ఈ నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది.

ఈ నాటకాన్ని శామ్యూల్ బెకెట్ రచించిన వెయిటింగ్ ఫర్ గోడో ప్రభావంతో గావొ వెలువరించాడు. అసంబద్ధ అంశాలు (**absurd elements**)ను అత్యంత ప్రతిభావంతంగా వినియోగించుకున్నాడు. ఈ నాటకంలోని ఇతివృత్తం సార్వత్రికం అని చెప్పాలి. దీనిలో నగరానికి, శివారు ప్రాంతానికి మధ్యనున్న ఓ బస్సు స్టాపులో ప్రయాణికుల అష్టకష్టాలను వర్ణించాడు. ఆ బస్సు స్టాపులో ప్రయాణికులు బస్సు కోసం పదేళ్ళుగా పడిగాపులు కాయడం ప్రధాన అంశం. అనేక బస్సులు వచ్చినా, ఏ బస్సు ఆగదు, వారిని ఎక్కించుకొని పోదు. ఆ గుంపులో నుంచి ఒక మనిషి మిగిలిన వారికి తెలియకుండా అక్కడి నుంచి జారుకుంటాడు. మిగిలినవారు తమ అష్టకష్టాల గురించి, తమ పగటికలలు గురించి ఏకరు పెట్టుకుంటారు. ఒకవేళ బస్సు రూటు మార్చి వేశారేమో అని అందరికీ అనుమానం వచ్చి, పెట్టెబేడ సర్దుకుని నగరం వైపుకు ప్రయాణమవుతారు. నాటకం ముగుస్తుంది. బహుశ అందుకే ఇది నిషేధానికి అయి ఉండవచ్చు.

గావొ రచించిన నవలల్లో సోల్ మౌంటేన్ అత్యంత ప్రధానమైన నవల అని స్వీడిష్ అకాడమీ (నోబెల్) ప్రశంసించింది. ది అదర్ షోర్ నాటకం ప్రభుత్వ నిషేధానికి గురైంది. అంతేకాక ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న వేధింపులను తప్పించుకోడానికి సెజ్వాసిన్ రాష్ట్రంలో నిషుయన అడవుల్లో, మాంజో నది ఒడ్డున సుమారు పది నెలల పాటు **15** వేల కిలో మీటర్ల పాద యాత్ర చేశాడు. తన అనుభవసారమే సోల్ మౌంటెన్ నవల. అబ్సల్యూట్ సిగ్నల్ నాటకాన్ని **1982**లో బ్యాక్‌డ్రాప్ కాకుండా ప్లాట్ ఫారం మీద ప్రదర్శించాడు. సెట్టింగు లేదు, నాలుగు గోడలు లేవు. ప్రేక్షకులందరూ స్టేజీ చుట్టూ నేలపైన కూర్చుకొని నాటకాన్ని తిలకించారు. ఆ ప్రదర్శన బ్రహ్మాండమైన విజయాన్ని సాధించింది. ది అదర్ షోర్‌లో జీవితంలోని మరో పార్శ్వాన్ని స్పృశించి లోటుపాట్లను ఎత్తి చూపాడు. ట్రెడిషన్ పీకింగ్ ఆపెరా నుంచి కొన్ని అంశాలను స్వీకరించి నవీకరించాడు.

చంద్ర

గిరీష్ కర్నాడ్: చూ. కర్నాడ్|గిరీష్

గిరీష్ చంద్ర ఘోష్ (1844-1912) : ప్రసిద్ధ బెంగాలీ నాటకకర్త, నటుడు, దర్శకుడు. కలకత్తా నగరంలో మధ్యతరగతి కుటుంబంలో **1844**లో జన్మించాడు. తన **14**వ ఏటనే తల్లిదండ్రులను పోగొట్టుకొన్న కారణంగా చదువుకు అంతరాయం ఏర్పడింది. అప్పటినుంచీ స్వయం కృషితోనే చదువుకున్నాడు. ఆంగ్ల భాషను కూడా అభ్యసించాడు. చిన్నతనంలో అప్పుడప్పుడూ చూసిన జానపద కళారూపమైన జాత్ర ప్రదర్శనలు గిరీష్ ఘోష్‌ను బలంగా ఆకర్షించాయి. నాటక ప్రక్రియ పట్ల మక్కువ పెంచుకోవడానికి ఆ ప్రదర్శనలు దోహదం చేశాయి. నాటకాలు చూడటం, నాటకకళ పట్ల గిరీష్‌కు ఆసక్తి పెరిగింది. **1867**లో నటుడుగా రంగ ప్రవేశం చేశాడు. పార్కర్ అండ్ కంపెనీలో బుక్ కీపర్‌గా పనిచేస్తూ వీలైనపుడల్లా నాటకాల్లో నటించాడు. మైకేల్ మధుసూదన్ దత్ రాసిన శర్మిష్ఠ నాటకాన్ని చేపట్టి, కొంతమంది నటుల్ని సమీకరించి, వారికి శిక్షణ యిచ్చి ఆ నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించి ప్రశంసలు అందు కొన్నాడు. శర్మిష్ఠ నాటకం గిరీష్ ఘోష్ నటుడుగా నిలదొక్కు కోవడానికి వీలు కల్పించింది. ఈ నాటకంలో కొన్ని పాటలు తానే రచించి, నాటకానికి ప్రత్యేక ఆకర్షణను సమకూర్చాడు. శర్మిష్ఠ విజయంతో ఉత్సాహం పుంజుకొని, 'భాగ్‌బజార్' ఔత్సాహికసమాజాన్నిస్థాపించి ప్రదర్శనలివ్వడం మొదలుపెట్టాడు. **1869**లో ప్రదర్శించిన సధావర్ ఏకాదశి అనే నాటకంలో గిరీష్ చంద్ర ధరించిన నీమ్ చంద్ పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకొంది. ఈ నాటకం అనేక సార్లు ప్రదర్శింపబడి అత్యంత ప్రజాదరణ పొందింది. రెండేళ్ళు తిరగక ముందే గిరీష్ ఘోష్‌ను గొప్ప నటుడుగా నాటక లోకం గుర్తించింది. అప్పటి నుంచీ నటజీవితంలో వెనుదిరిగి చూడ లేదు. నాటకమే సర్వస్వంఅయింది. నటనతోపాటు రచనా వ్యాసంగం కూడా సాగించేవాడు. మొదట్లో ఇది అవసరార్థం చేసిన పనే అయినా, క్రమక్రమంగా నాటక రచన ప్రారంభించ డానికి ప్రేరణ కలిగించింది. **1870**లో రాణీ మోహన్ రచించిన ఉషా అనిరుద్ధ నాటకానికి **26** పాటలు రాసి ఆ నాటకానికి మెరుగులు పెట్టిన ఘనత గిరీష్ ఘోష్‌దే. మొదట్లో వ్యాపార నాటకరంగం ఈయనకు నచ్చేదికాదు. దానిపట్ల విముఖత చూపేవాడు. కానీ కాలక్రమేణా పరిస్థితుల ప్రభావంతో వ్యాపార నాటకరంగం పట్ల ఆసక్తి చూపవలసి వచ్చింది.

గిరీష్ ఘోష్ నాటకరంగలో ప్రవేశించే నాటికి బెంగాల్లో నాటకరంగం 50ఏళ్ళు పూర్తి చేసుకొన్నప్పటికీ అప్పటి వరకూ ఇంగ్లీషు వారు ప్రదర్శించే ఇంగ్లీషు నాటకాలే ప్రాచుర్యంలో ఉండేవి. బెంగాలీ నాటకానికి ప్రత్యేక ప్రతిపత్తి ఏర్పడలేదు. బెంగాలీ నాటకం శైశవ దశలోనే ఉంది. గిరీష్ ఘోష్ పాతకొత్తల మధ్య కాలంలో ప్రయాణించవలసి వచ్చింది. దుర్గ మారణ్యంగా ఉన్న బెంగాల్ నాటకరంగంలో కొత్త బాటలు వేసుకోవలసిన

అవసరం ఏర్పడింది. ప్రదర్శించడానికి అనువైన నాటకాలు లేవు. నాటక సమాజాల అవసరాన్ని తీర్చే నాటకాలు కావలసి వచ్చింది. ఆ పరిస్థితుల్లోగిరీష్ ఘోష్ కలంపట్టి నాటకరచనకు నడుం కట్టాడు. తన జీవితకాలంలో చిన్నవీ, పెద్దవీ సుమారు వంద నాటకాలను నాటక రంగానికి అందించాడు, ఇన్ని నాటకాలు రాసిన రచయిత బెంగాల్ నాటకరంగంలో లేరని చెప్పవచ్చు. షేక్స్పియర్, గిరీష్ ఘోష్‌కు ఆదర్శంగా నిలిచాడు. నాటక రచనలో షేక్స్పియర్ విధానాల జాడలు విరివిగా కనిపిస్తాయి. షేక్స్పియర్ మేక్బత్, హేమ్లేట్, కింగ్ లియర్ నాటకాలు గిరీష్ బెంగాలీ భాషలోకి అనువదించి ప్రదర్శింపజేశాడు. కానీ అప్పటి ప్రేక్షకులు ఆనాటకాలనుఅంతగా ఆదరించలేదు. ఆ నాటకాలను సామాన్య ప్రేక్షకులు అర్థం చేసుకోగల వాతావరణం యింకా ఏర్పడలేదని సమాధాన పరచుకొన్నాడేగాని నిరాశపడ లేదు. ఒకవైపు నాటకాల్లో నటిస్తూనే నాటకాలు రాసేవాడు. ప్రతి రెండు నెలలకు ఒక నాటకం తయారయ్యేది. *రావణ్ వధ్, అభిమన్యు వధ్, సీతా బనబాస్(1882), ప్రహ్లాద చరిత్ర* వంటి పౌరాణిక నాటకాలను, *సిరాజుద్దౌలా, మీర్ ఖాశి అబూ హసన్* వంటి చారిత్రక నాటకాలను, *ప్రపుల్ల, చైతన్యలీల, చందా* వంటి వస్తు వైవిధ్యం గల నాటకాలను రచించి పండిత పామరుల ప్రశంసలు అందుకొన్నాడు. 1867–1912 మధ్య కాలాన్ని, గిరీష్ ఘోష్ యుగంగా పరిగణిస్తారు చరిత్రకారులు. బెంగాల్ నాటక వికాసానికి ఎనలేని సేవచేసిన గిరీష్‌చంద్రఘోష్ 'బెంగాలీ నాటక పితామహుడు'గా వినుతికెక్కాడు. దక్షిణ భారత దేశంలో ధర్మవరం రామకృష్ణమాచార్యులతోను, సంబంద మొదలియార్‌తోను పోల్చవచ్చు. నాటక రచనలో కొత్త దారులు ఏర్పరచి, నాటకంలో వాడే భాషకు గిరీష్‌చంద్ర ఘోష్ ఒక నిర్దిష్ట రూపాన్నిచ్చి బెంగాల్ నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మార్గదర్శకుడు.

1874లో భార్య మరణించి వ్యక్తిగత జీవితం కొన్ని ఒడిదుడుకులకులోనైంది. మూడేళ్ళపాటు నాటకాలకు దూరమై, మళ్లీ నాటక రచనకు, ప్రదర్శనకు పూనుకొన్నాడు. ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న గిరీష్, ప్రతాప్ జుహూరి అభ్యర్థనతో ఆ ఉద్యోగం వదిలేసి నేషనల్ థియేటర్‌లో మేనేజర్‌గా చేరాడు. నిజానికి అక్కడి వేతనం తక్కువే అయినా నాటకాలతో ఉన్న అనుబంధంతో ఇటువైపే మొగ్గు చూపాడు. కాని అనుకొన్నట్టు ఏదీ జరగలేదు. నెలజీతం సక్రమంగా వచ్చే అవకాశాలు సన్నగిల్లి, తరువాతికాలంలో ఎన్నో ఆర్థిక బాధలు ఎదుర్కోవలసివచ్చింది.

బెంగాల్ రాష్ట్రంలో విస్తరిస్తున్న ఇంగ్లీషు భాష సంస్కృతుల ప్రభావానికి లోనై హిందూమతం మీద, ఆచారాల మీద యువతలో రాజుకొంటున్న ద్వేషభావం, మత విశ్వాసాల మీద తిరుగుబాటు ధోరణి, రాజారామ్ మోహన రాయ్ బోధనలు, బ్రహ్మ సమాజ ప్రభావం, 1905 విభజనపై ఆంగ్లేయులపై పెల్లుబికిన నిరసనల తీవ్రత మొదలైన రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులతో బెంగాల్ రాష్ట్రం అట్టుడికి పోతున్న సంక్లిష్ట వాతావరణంలో గిరీష్ చంద్ర నాటకోద్యమం సాగించవలసి వచ్చింది. ఆ రోజుల్లో మతం రాజకీయాలు నాటక రచనకు ముడిసరుకులుగా ఉండేవి. గిరీష్‌చంద్రఘోష్‌సంప్రదాయవాది. మతాన్ని, సంప్రదాయాన్ని సమర్థించాడు. తన రచనలలో నైతిక విలువలను విధిగా పాటించాడు.నటీనటులకు శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ యిచ్చి నాటక ప్రదర్శనకు అనువుగా వారిని తీర్చి దిద్దేవాడు. బెంగాల్ నాటక రంగంలో అగ్రశ్రేణి తారగా మహోజ్వలంగా వెలిగిన నటీమణి వినోదినీ దాసి గిరీష్‌చంద్రఘోష్ శిక్షణలో తయారైన ఆణిముత్యమే.

బెంగాల్ నాటకరంగానికి ప్రారంభదశలో బంగారు బాటలువేసి అహరహం నాటకకళా వికాసానికి సర్వశక్తులూ ధారబోసిన గిరీష్ చంద్రఘోష్ అవసానదశలో, ఆర్థికంగా చితికిపోయి, 1912లో దయనీయ స్థితిలో అనామకంగా మరణించడం ఓ విషాదం!

గం.సు.రె.

గీర్వాణ రూపకం: ఈ శాస్త్రగ్రంథాన్ని తల్లావజ్ఝల కృత్తివాసతీర్థులు రచించి 1952లో ముద్రించాడు. సంస్కృత నాటక చరిత్ర, పరిణామ లక్షణాలను తెలిపే శాస్త్రగ్రంథం. ఇందులో ప్రాదుర్భావం, రూపక భేదాలు, రూపక శబ్దం, నృత్తాదికం, రూపక భేదాలు, లక్షణం, రూపక వివరణం, వ్యుత్పన్న రూపకాలు, రూపక పరిణామం, ప్రేక్షాగృహం, ఉపరూపకం, కొందరు నాటకకర్తలు, పరిభాషలు అనే అధ్యాయాలతో ఈ గ్రంథం విలసిల్లుతోంది. ఆయా విషయాల మీద వివిధ లక్షణ కర్తల అభిప్రాయాలను కూడ పొందుపరచడం ఈ గ్రంథంలోని విశేషం.

శ్రీ.చ.

గుంటూరు సెకండ్ కంపెనీ : చేగు కనకరత్నం శ్రేష్ఠి 1895లో స్థాపించిన ఈ సమాజానికి పొన్నాడ చక్రధరం అధ్యక్షుడుగాను, పత్రి శేషగిరి రావు కార్యదర్శిగా పని చేశాడు. త్రి 1902 –1904 ప్రాంతంలో మల్లాది గోవిందశాస్త్రి ఈ సెకండు కంపెనీలో చేరి నాయక పాత్రలు నిర్వహించాడు. ఈయన తిరుపతి వేంకటకవుల పాండవ విజయం నాటకంలో శ్రీ కృష్ణ పాత్రలో నటించాడు. శాస్త్రి వల్ల ఈ సమాజానికి అఖండ ఖ్యాతి లభించింది. వేండిశెట్టి సుబ్బారావు, ఉలిగుండం వెంకటరమణయ్య, కోటం రాజు లక్ష్మీకాంతం స్త్రీ పాత్రలలో నటించారు. బెజవాడలో 1913, జూన్ 13 నుంచి 5 రోజుల పాటు జరిగిన గయోపాఖ్యానం నాటకంలోని అర్జునపాత్రకు

ప్రథమ బహుమతి పొందిన పత్రి వేంకట రమణరావు ఈ సమాజం సభ్యుడే. ఈయన కాక ముప్పరపు రామారావు ఆనాటి పోటీలలో శ్రీ కృష్ణపాత్ర ధరించాడు. ఈ సమాజం దాదాపు 1920 వరకు నడిచింది.

జి.ఎస్.ఎన్.

గున్నేశ్వరరావు, సత్యవోలు (1860-1925) : నాటక కళా పోషకుడు. ఈయన రాజమహేంద్రవరపు కరణం. మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నాడు. మంచి పలుకుబడి ఉన్న వ్యక్తి. అంతేకాదు, గొప్ప వ్యవస్థీకరణ పటిమ కలవాడు. స్వయంగా నటుడు కాకపోయినా, నాటకకళ మీద అమితమైన అభిమానం. 1908లో కృత్తివెంటి నాగేశ్వరరావుతో కలిసి రాజమహేంద్రవర హిందూ నాటక సమాజపు యాజమాన్యం చేపట్టాడు.

దానిని స్వయం సమగ్రమైన ఉత్తమ సమాజంగా రూపొందించటమేగాక ఆంధ్రదేశం మొత్తం మీద ఆ నాటక సమాజానికి వర్తక మర్యాదులు తెచ్చి పెట్టడంలో ప్రముఖ పాత్ర వహించాడు.

నాటకాన్ని సువ్యవస్థిత రీతిలో నడపటానికి గున్నేశ్వరరావు అత్యంత శ్రద్ధ వహించేవాడు. సమాజ సభ్యులలో క్రమశిక్షణ ఉన్నపుడు మాత్రమే నాటకం రక్తి కడుతుందని ఈయన ధృడ విశ్వాసం. ముందే ఏర్పాటు చేసుకొనిన వ్యవధిని అతిక్రమించకుండా నాటకంలో ఎంత పెద్ద దృశ్యమైనా యథావిధిగా సాగిపోయేటట్లు ఆయన పట్టుదల వహించేవాడు.

1912లో మిత్రులిరువురు విడిపోయారు. 1914లో గున్నేశ్వరరావు సొంతంగా నాటక సమాజాన్ని ప్రారంభించాడు. దీనికి చింతామణి థియేటర్ అని చిలకమర్తి లక్ష్మీనరసింహం నామకరణంచేశాడు. పేరుకు అది చింతామణి థియేటర్ అయినా దానిని 'గున్నేశ్వరరావు కంపెనీ' అనే పేరుతోనే పిలిచేవారు. అది 1923 వరకు చాలా కట్టుదిట్టంగా సాగింది. 1925, ఫిబ్రవరి 2న గున్నేశ్వరరావు కన్నుమూశాడు. అనంతరం ఆ చింతామణి థియేటర్ 'జయా టాకీసు' గా మారింది.

పోణంగి

గుబ్బి వీరన్న, హెచ్ (1890 - 1972) : కన్నడ నాటకరంగంలో భీష్మాచార్యుడు లాంటి వాడు. ఈయన కర్ణాటక రాష్ట్రంలోని టుంకూరు జిల్లా గుబ్బి గ్రామంలో 1890లో జన్మించాడు. ఆరవ ఏట చెన్న బసవేశ్వర నాటక సంఘంలో చేరి సహాయకుడిగా పనిచేశాడు. తరువాత నటుడిగా ఎదిగి అదే నాటక కంపెనీకి భాగస్వామిగా మారి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని, చివరికి 1917 నాటికి ఆ నాటక కంపెనీకి అధిపతి అయ్యాడు. నిరంతరం నూతన ఆలోచనలతో ప్రదర్శనల స్థాయిని మెరుగు పరచుకుంటూ ఎందరో నటులను, రచయితలను తీర్చిదిద్దాడు. ప్రముఖ కన్నడ చలనచిత్ర నటుడు కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ కూడా ఈయన శిష్యుడే. రంగస్థల సాంకేతిక అంశాల్లో కూడా ఎప్పటి కప్పుడు అధునాతన సామాగ్రిని, పద్ధతుల్నీ ప్రవేశపెడుతూ కంటికింపైన ప్రదర్శనలను ప్రదర్శించి కనువిందు చేసేవాడు.

కురుక్షేత్ర, క్రిష్ణలీల, దశావతార నాటకాల్ని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో విస్తృతంగా ప్రదర్శించి, 1930 నాటికి 3 శాఖలతో, 300 మంది సిబ్బందితో దక్షిణ భారతదేశంలోనే గుబ్బి కంపెనీ అగ్రగామిగా నిలిచేటట్టు చేశాడు. మైసూర్ మహారాజు క్రిష్ణరాజ వడియార్ వీరప్పను ప్రముఖ హాస్యనటుడిగా సత్కరించాడు. 1940లో కంపెనీని తన కుమారుడు జీ.వి. చెన్న బసప్పకు అప్పగించాడు. కర్ణాటకలో శతాబ్దానికిపైగా ఒక నాటక సంస్థ కొనసాగటం ఈ కంపెనీకే చెల్లింది. వీరన్న జీవిత చరిత్ర 1967లో ముద్రితమైంది. కన్నడ నాటకరంగ వికాసం కోసం కృషిచేసిన గుబ్బివీరన్న 1972లో తుదిశ్వాస విడిచాడు.

ప్ర.రె.

గురజ నాయుడు : రంగస్థల నటుడు. స్వగ్రామం కృష్ణాజిల్లా గురజ కావడం వల్ల ఈయనకు గురజ నాయుడనేది వ్యవహారిక నామమైంది. కాని అసలు పేరు గూడపాటి నరసింహా రావు నాయుడు. ఈయన నవరసాలు ఒప్పించగల మేటి నటుడు. నిండైన విగ్రహం, గంభీర గాత్రంతో ఒప్పే మహానటుడు. ప్రేక్షక లోకాన్ని చిటికల్లో ఆకట్టుకోగల నటుడు.

మొదట ఈయన బందరు రామమోహన్ థియేటర్ ప్రదర్శించిన నాటకాలలో నటించాడు. త్రిపురనేని రామస్వామి చౌదరి రచించిన రాణా ప్రతాప్ నాటకంలో మాన్‌సింగ్ పాత్రతో వీరి నటనా ప్రతిభ గుప్పుమంది. తరువాత కొంతకాలం స్వగ్రామంలో నాటక సమాజం నడిపాడు. గురజనాయుడి ప్రజ్ఞా, విశేషాలకుమెచ్చి మైలవరం రాజా ఈయనను తమ సమాజంలోకి ఆహ్వానించాడు. నాయుడు 'మైలవరం కంపెనీ'లో చేరి నిర్యాణం వరకు అందులోనే ప్రధాన భూమికలు ధరించాడు. నాయుడు నటించే 'యముడు' వేషం రాకకు ప్రేక్షకులు ఆత్రుతతో కాచుకుని కూర్చునేవారు. కలియుగ యమ బిరుదాంకితుడు. ఈయన మానసింగ్, యముడు, హిరణ్యాకశిపుడు, కంసుడు, రావణుడు, భీముడు, క్రూరసేనుడు, బాహుకుడు, దశరథుడు, రాజరాజు, ధర్మరాజు మొదలైన పాత్రలలో నటించాడు.

శ్రీ.చ.

గృహస్థ రూపకం : సాంఘిక రూపక భేదం. సామాన్య మానవుని గృహ జీవితంలోని రోజువారీ సన్నివేశాలు, సమస్యలను చిత్రించే రూపకం. కథాసరళిలో సంభాషణలలో క్లిష్టతకు ఇందులో వీలు ఉండదు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడానికి కొద్ది ముందు లండన్‌లో ఎక్కువ విజయవంతంగా ప్రదర్శింపబడిన జార్జి మార్గరెట్ అనే రూపకం గృహస్థ రూపకానికిమచ్చుతునక. తెలుగులో ఆత్రేయ రాసిన *గుమాస్తా* (ఎన్.జి.ఓ.) నాటకం, ఈ గృహస్థ రూపకానికి మచ్చుతునక.

శ్రీ.చ.

గేయ రూపకం : పాశ్చాత్య రూపక భేదం. దీనిని ఇంగ్లీషులో మెలోడ్రామా అంటారు. ఇది గేయ ప్రధాన నాటకం కాబట్టి గేయ రూపకం అని పేరు వచ్చింది. గేయ సహితంగాను, రహితంగాను క్రియలకు వాచికానికి సహకార సంగీతంతో విలసిల్లే నాటక భేదం. ఒక విధమైనకాల్పనికతతో, తీవ్ర ఉద్వేగాలతోఆశ్చర్యకర సంఘటనలతో విలసిల్లే అనాగరిక, సంప్రదాయబద్ధమైన కవితా న్యాయాన్ని, సుఖాంతాన్ని ఖచ్చింతంగా పాటించే నాటకం. అతిలోక విషయాలకు ఇందులో ప్రాధాన్యం ఎక్కువ. ఈ రకం నాటకాలను ప్రప్రథమంగా రచించిన నాటకకర్త రిమాసినీ (1559) అనే ఇటాలియన్. ఆ తరువాత వంద సంవత్సరాల వరకు ఈ నాటక రూపం సంగీత రూపకం అనే పేరుతోనే చలామణీ అయింది. హెండెల్ అనే నాటక కర్త తన రూపకాలకు ఈ రెండు పేర్లు వాడాడు. జర్మనీలో జంత్ర సమ్మేళన సహకారం తోడి సంగీత గేయానికి ఇదే పేరు ఆ తరువాత ధృవాగానం (పాత్ర ఉద్వేగాలను వ్యక్తీకరించే నేపథ్యగానం)గా పేరుపొందింది. ప్రజానీకంలోని మంచిచెడ్డల ఆధారంగా మానవోద్వేగాలను వ్యక్తీకరించడం ఈ గేయ రూపకంలో జరుగుతుంది. వీటిలోని సంభాషణలు, సంగీతం చకచకా సాగుతాయి.

శ్రీ.చ.

గొగోల్, నికోలాయ్ (1809-1852) : రష్యన్ నాటకకర్త. నవలాకారుడు 'గవర్నమెంట్ ఇన్‌స్పెక్టర్' నాటకం ద్వారా ప్రపంచఖ్యాతి నార్జించిన నాటకకర్త. పురపాలక సంఘం అవినీతిని బట్టబయలు చేసే నాటకం జార్జ్ చక్రవర్తిని ఆనందింపజేయడం మూలంగా ప్రభుత్వ నిషేధానికి గురి కాకుండా తప్పించు కుంది. ఇతని తక్కిన నాటకాలు విజయ వంతం కాలేదు. సుప్రసిద్ధ రష్యన్ నాటకకర్త చెఖోవ్ మీద ఈ నాటక ప్రభావం ఎంతగానో పడింది. 'గవర్నమెంట్ ఇన్‌స్పెక్టర్' నాటకాన్ని వివిధ పేర్లతో రెంటాల గోపాలకృష్ణ, గిడుతూరి సూర్యం, బెల్లంకొండ రామదాసు, యజ్ఞన్న శాస్త్రి తెలుగులోకి అనువదించారు. డెకొరేషన్ ఆఫ్ వాల్డి మిర్ (1832), గవర్నమెంటు ఇన్‌స్పెక్టరు (1836), వివాహం (1837-42), సర్వెంట్స్‌హాల్, లాసూట్ మొదలైన నాటకాలు రచించిన గోగోల్ అతిచిన్న వయసులోనే అంటే 1852లో మరణించాడు.

శ్రీ.చ.

గోంధళే వీధి భాగవతం : ఆంధ్రదేశంలో ఆరె వారనే ప్రత్యేక తెగవారు ఆరె భాషలో ప్రదర్శించే జానపద వీధి నాటకమే గోంధళే వీధి భాగోతం. ఆరెవారు కరీంనగర్, వరంగల్, నల్గండ జిల్లాలో ఉన్నారు. ఆరె వారిలో అంబీర, ఇంగ్లె, గుండెకాలి, గుగ్గె, దూదాటి, షేక్‌నారా – సింధే – అనే ఇంటి పేర్లు గల గోంధళీ కుటుంబాలు సుమారు రెండువందల దాకా తెలంగాణాలో ఉన్నట్లు ఆచార్య జగన్నాథంపేర్కొన్నాడు. గోంధళీలు, మధ్య తెలంగాణాలో ఎక్కువగా ఉండే ఆరెవారి గ్రామాలకు వెళ్ళి ఈనాటికీ వీధి భాగోతాలు ప్రదర్శిస్తున్నారు. ఇవి మన వీధి భాగోతాల్ని పోలి ఉంటాయి.

గోంధళేవీధి భాగవతానికి అన్ని వీధి నాటకాలలాగా నాలుగు గుంజలు పాతి రంగస్థలాన్ని అలంకరిస్తారు. కానీ, ఏ వీధి నాటకంలో లేని ఒక ప్రత్యేకతను కలిగి ఉంది. రంగస్థలం ముందు భాగంలో ఉన్న స్తంబాలకు ఒక గవ్వల హారాన్ని వేలాడదీస్తారు. ఆ హారాన్ని అంబా భవానీగా భావిస్తారు. ఈమె నాటకం మొదటి నుంచి తుది వరకు తమను ఎలాంటి అవరోధాలు కలగకుండా కాపాడుతుందని నమ్ముతారు.

ఈ భాగోతాలకు హార్మోనియం, మద్దెలను పక్క వాయిద్యాలుగా ఉపయోగిస్తారు. వీరు ప్రదర్శించే ఇతివృత్తాలు భారత, భాగవత జానపద గాథలకు సంబంధించినవై ఉంటాయి. జయ్యారాణి కథ వీరికి అత్యంత ప్రీతిపాత్రమైన కథ.

గోంధళే వీధి భాగోతాలలో స్త్రీ పాత్రల్ని పురుషులే ధరిస్తారు. కథలోని పేర్లు మహారాష్ట్రకు చెందినవై ఉంటాయి. వారు నాటకాన్ని ప్రదర్శించే రంగస్థలంలో ఒక పొడుగాటి గవ్వల హారాన్ని వేలాడదీస్తారు. ఈ దండను అంబా భవానికి చిహ్నంగా గుర్తించి ఆరాధిస్తారు. నేడు గోంధళీలు వీధి భాగవతాలను ఆశ్రయించి బతుకు వెళ్ళబోసుకొంటూన్నారు. క్రమక్రమంగా ఈ కళ క్షీణదశకు చేరుకుంది. ఇటీవల ఔత్సాహికులైన గోంధళే కళాకారులు ఈ కళను కాపాడుకోవడం కోసం మహాలింగం పల్లి కేంద్రంగా గోంధళే నాటకమండలిని స్థాపించుకొన్నారు.

గోంధళే వీధి భాగవతంలోని హాస్య పాత్రను 'ప్రధాని' అంటారు. ఈ పాత్ర సంస్కృత నాటకంలోని విదూషక పాత్రను పోలింది. ఆరెభాషలోప్రదర్శించే ఈ భాగోతాలలోని సంభాషణల్ని ఈయన తెలుగులో వ్యాఖ్యానం చేస్తూ మంత్రిగాను, సైనికునిగాను వ్యవహరిస్తాడు. ప్రేక్షకులకు కథపట్లఆసక్తిని కలిగిస్తాడు. పాత్రధారులంతా ఆరె భాషలో సంభాషిస్తూ ఉంటే, ప్రధాని మాత్రం తెలుగులోనే మాట్లాడుతూ సందర్భానుసారంగా హాస్యాన్ని అందిస్తూ ఉంటాడు.

ఆనందన్

గోథే (1749-1832): జర్మన్ నాటకకర్త. ఈయన 1749, ఆగస్టు 28న జన్మించాడు. గోథే కేవలం నాటకకర్తే కాదు, జర్మనీ కళలపై అత్యధిక ప్రభావం నెరపిన కవి, పండితుడు, నవలాకారుడు. చిన్న తనంలో తండ్రి వద్దనే విద్యనభ్యసించాడు. ఫ్రెంచి నాటక కంపెనీ నాటక ప్రదర్శనలు, షేక్స్పియర్ నాటకాలు, నాటక సాహిత్యం మీదకు మళ్ళించాయి. 16వ ఏటే లీప్జిగ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించ డానికి వెళ్ళి అక్కడ కళలను అభ్యసించి, ప్రేమలో పడి, 1768లో జబ్బు పడి ఇంటికి తిరిగి వచ్చాడు.



జబ్బునుంచి కోలుకొన్న తరువాత స్ట్రాస్‌బర్గ్‌లో చదివి, న్యాయశాస్త్ర పట్టా పొందాడు. గోడ్జ్ అనే చరిత్రాత్మక నాటకం, వెర్దర్ అనే విషాద నాటకం ఈయనకు బాగాపేరు తెచ్చిపెట్టాయి. 1786లో ఆర్థికమంత్రి పదవి లభించింది. 1788 నుంచి విశ్రాంతి తీసుకొని, ప్రభుత్వ నాటక సమాజానికి దర్శకుడుగా 20 సంవత్సరాలు పని చేశాడు. ఫాస్టు నాటకంతో ప్రపంచ నాటకకర్తగా గుర్తింపు వచ్చింది.

గోథే మొదటి నాటకం గోట్జ్‌వాన్ బెర్లిచింజెన్, ఆఖరి నాటకం ఫాస్ట్. ఈయన నాటకాలు జర్మన్ నాటక సాహిత్యం మీదఅత్యధికప్రభావంనెరపాయి. గోట్జ్‌వాన్ బెర్లించింజెన్ (1773), ఎగ్మాంట్, వెర్ధర్, ఇఫిజినీ (1787), టాసో (1790), ఫాస్ట్ (1808), ఫాస్ట్ - *II* (1832), క్లావిగో మొదలైన నాటకాలు రచించిన గోథే 1832, మార్చి 22న మరణించాడు.

శ్రీ.చ.

గోపరూపకం (Pastoral Play) : ఇటలీలో 16వ శతాబ్ది మధ్యలో ఆవిర్భవించిన రూపక భేదం. గోపాలుర జీవితం, వారి ప్రేమ కలాపాలను చిత్రించడం దీని ప్రధాన లక్షణం. అయితే అంతకు ముందు ఈ లక్షణాలు నాటకాలలో లేకపోలేదు. టాసో రచించిన అమంటా (1573) సంపూర్ణ ప్రప్రథమ గోప రూపకంగా పేరు పొందింది.

ఇంగ్లీషులో మొట్టమొదటి గోపరూపకం పీల్‌క అరైన్ మెంట్ ఆఫ్ పారిస్ (1581). షేక్స్పియర్ రచించిన ఏజ్ యు లైక్ ఇట్ అనే నాటకంలో గోప రూపక లక్షణాలు ఎక్కువ. భాసుని బాలచరితం, తెలుగు కృష్ణలీలలు ఈ గోప రూపక లక్షణాలను ఎక్కువగా సంతరించుకొన్నాయి.

శ్రీ.చ.

గోపాలం, దైతా (1899-1953) : మైలవరం బాలభారతి నాటక సమాజంలో ప్రముఖ నటుడు, ప్రయోక్త కవి, సమాజ నిర్వాహకుడు. గోపాలం స్వస్థలం కృష్ణాజిల్లా శ్రీకాకుళం. వృత్తిరీత్యా విజయవాడలో స్థిర పడ్డాడు.

భక్తిరసం నాటకాలు ప్రదర్శించడంలో ఈయన దిట్ట. ద్రౌపదీ వస్త్రాప హరణంలో విదురుడుగా, సక్కుబాయిలో యోగిగా వీరి రసావిష్కరణ ప్రేక్షక హృదయాలను చూరగొన్నది. మైలవరం కంపెనీ మూతపడిన తరువాత గోపాలం జన్నవిత్తుల శేషగిరిరావు, తుంగల చలపతిరావు లతో 'గంధర్వ నాటక మండలి' స్థాపించి సక్కుబాయి నాటకం బాగా సాధన చేసి ఆంధ్రదేశంలోని ప్రతి పట్టణం, పల్లెల్లోనూ వరసగా రోజుల తరబడి ప్రదర్శించి చరిత్రను సృష్టించాడు. సక్కుబాయి లోని పాటలు ఈయనే స్వయంగా రచించి, స్వరకల్పన చేశాడు. ఆనాడు ఆ పాటలు ప్రజల నోట మారుమోగాయి. ఈయన 'ధర్మపత్ని' మొదలైన చిత్రాలకు పాటలు రాశాడు. దైతా 1953లో మరణించాడు.



శ్రీ.చ.

గోపాలకృష్ణ, అబ్బూరి (జ.1937) : ప్రసిద్ధ కవి, నాటకకర్త, దర్శకుడు, చిత్రకారుడు, శిల్పి. తండ్రి కళాప్రపూర్ణ అబ్బూరి రామకృష్ణారావు, తల్లి రుక్మిణమ్మ. అబ్బూరి విశాఖపట్టణంలో 1937, మార్చి 2న జన్మించాడు. ప్రఖ్యాత చిత్రకారుడు పైడి రాజు వద్ద నాలుగేళ్ళు చిత్రకళలో విద్య నభ్య సించాడు. హైదరాబాదులో ప్రభుత్వ ఫైనార్ట్స్ కళా శాలలో బి.ఏ. చదివాడు. తదుపరి మాస్టర్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ పట్టాపొందాడు. 'తాళ్ళపాక అన్నమాచార్యులు – యక్షగాన సంప్రదాయం' అనే అంశం మీద పరిశోధన చేసి 1986లో డాక్టరేట్ పట్టాపొందాడు. ఉద్యోగరీత్యా అఖిల భారత హస్తకళల బోర్డులో డిజైనర్‌గా, కొన్నాళ్ళు క్యూరేటర్‌గాను ఉద్యోగం చేశాడు. హైదరాబాదులో నాట్య విద్యాలయంలో డిజైన్ శాఖలో అధ్యాపకుడుగా పని చేశాడు.

1974లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక విభాగంలో చేరి, స్టేజి డిజైనర్, అధ్యాపకుడుగా, శాఖాధిపతిగా అనేక పదవులు చేపట్టి 1974–1997 వరకూ నాటకరంగానికి బహుముఖ సేవలు అందించాడు. నాటక, చిత్రకళారంగాల పై సమదృష్టితో వ్యవహరిస్తూ, నిర్మాణాత్మకంగా అహర్నిశలూ కృషి చేశాడు. గోపాలకృష్ణ సాహిత్యాభిమాని కూడ. తెలుగు,ఇంగ్లీషు భాషలతో పాటు హిందీ, కన్నడ భాషల్లోని సాహితీ సౌరభాలను కూడా ఆఘ్రాణించిన సాహిత్య పిపాసి. నాటకరంగం నిత్య నూతనంగా పరిమళించాలంటే వృత్తి నాటక రంగం అభివృద్ధి చెందాలని అబ్బూరి ఆశయం. ప్రయోగాత్మక నాటకాలు విరివిగా వృద్ధి చెందినపుడే ఔత్సాహిక నాటకరంగం నవనవోన్మేషంగా ఉంటుందనీ, కొత్త కాంతులు వెదజల్లుతుందనీ అబ్బూరి దృఢాభిప్రాయం. గోపాలకృష్ణను నాటక రచయితగా నిలబెట్టిన నాటకం త్రిజాకీయమదర్శనం . ఇది ఆధునిక యక్షగాన రీతిలో మలచిన నాటకం. ఈ నాటకాన్ని టోటల్ థియేటర్ అని నాటక విమర్శకులు పేర్కొన్నారు. చాట్ల శ్రీరాములు దర్శకత్వంలో ఈ నాటకం దాదాపు వంద ప్రదర్శనలకు నోచుకుంది. ఈ నాటకం కృష్ణచైతన్య దర్శకత్వంలో కూడా కొన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శించబడింది. అబ్బూరి దేవుడా నాదేశాన్ని రక్షించు నాటకం కృష్ణచైతన్య దర్శకత్వంలో జనరంజకంగా ప్రదర్శితమై అబ్బూరి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప జేశాయి. బోధాయనుని భగవదజ్జుకం సంస్కృత నాటకానికి స్వేచ్ఛానువాదం చేసి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వర్క్‌షాపు విద్యార్థులతో ప్రదర్శింప చేశాడు. బెర్టోల్ట్ బ్రెహ్ట్ రచించిన ఎక్సెప్షన్ అండ్ ది రూల్ నాటకాన్ని కూడా అనుసరించాడు. అబ్బూరి చీకటి చెప్పిన కథ అనువాద నాటకం ఆంధ్రవిశ్వవిద్యాలయం నాటక విభాగం విద్యార్థులు హృద్యంగా ప్రదర్శించారు. అబ్బూరి దర్శకత్వంలో శ్రీశ్రీ విదూషకుని ఆత్మహత్య నాటిక కొత్త తరహాలో ప్రదర్శింపబడి సంచలనం సృష్టించింది. ఈ ప్రదర్శన విజయంలో మంత్రి శ్రీనివాసరావు సహకారం మరవరానిది.

నాటకరంగంలోనే కాక చిత్రకళా రంగంలోను గోపాలకృష్ణ కృషి చిరస్మరణీయం. నేషనల్ బుక్ ట్రస్ట్, కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీలు ప్రచురించిన సుమారు 200 పుస్తకాలకు తనదైన ప్రత్యేక శైలిలో ముఖచిత్రాలను ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాడు. అబ్బూరి సుప్రసిద్ధ చిత్రాలు సాలార్జంగ్ మ్యూజియంలోనే కాక, దేశంలో వివిధ మ్యూజియంలలో చిత్ర కళాభిమానులను అలరిస్తూవుండటం గర్వకారణం. అమెరికాలో ఆయన చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ లలిత కళల అకాడమీ, నాట్య అకాడమీల స్థాపనలో అబ్బూరి కృషిగణనీయమైంది. దేశవ్యాప్తంగా జరిగిన అనేక సదస్సులలో 36 పరిశోధక వ్యాసాలను సమర్పించాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఈయన చేసిన కళా సేవను గుర్తించి అనేకకళా సంస్థలు సన్మానించాయి. 1997లో కూరెళ్ల సోమేశ్వరరావు ట్రస్ట్ అవార్డు, 1998లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, సన్మాన పరంపరలో పేర్కొనతగినవి. అబ్బూరి రచించిన త్రిజాకీ యమ దర్శనం నాటకం కన్నడ భాషలోకి అనువదింపబడింది. ఈయన తండ్రి పేరిట అబ్బూరి కళాకేంద్రం స్థాపించి కళా ప్రదర్శనలు నిర్వహిస్తూ 500 మంది చిత్రకారులను ప్రోత్సహిం చాడు. విశాఖలో ఆర్ట్‌గేలరీకితన సేవలు అందిస్తూ నిర్వి రామంగా కళాసేవ చేస్తున్నాడు.

కె.బి.రాజు.

గోపాలకృష్ణ, గుమ్మడి (జ. 1955) : రంగస్థల నటుడు, గాయకుడు. 1955, నవంబరు పదకొండవ తేదీన కృష్ణాజిల్లా, వేండూరు గ్రామంలో జన్మించాడు. ప్రాథమిక విద్యతోనే చదువుకు మంగళం పాడినా, కళా రంగంలో ప్రథమశ్రేణి నటుడుగా రూపుదిద్దుకున్నాడు. పద్య నాటకాలలో పేరు ప్రతిష్ఠలు గడించినా, *లంకెల బిందెలు* అనే సాంఘిక నాటకంలో చిరంజీవి పాత్రలో రంగస్థల ప్రవేశం చేయటం విశేషం. అనేక జానపద, చారిత్రక నాటకాలలోను పాత్రపోషణచేసి అన్ని ట్లోనూ, సమ ప్రతిభను చాటుకున్నాడు. రాగ యుక్తంగా పద్యాలు పాడి, సామాజికుల్ని ఆకర్షించాలన్న ధోరణిలో కాకుండా అభినయం లోని లోతు పాతుల్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయాలన్న సంకల్పంతో పద్మభూషణ్ ఎ.ఆర్. కృష్ణ, జె. సిద్దప్ప నాయుడు,

మద్దెల పంచనాదం, వై. రామ చంద్రరావు వంటి కళాభిజ్ఞుల వద్ద నటశిక్షణ పొంది నటజీవితానికి పటిష్ఠమైన పునాది ఏర్పరచుకున్నాడు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో నాటక ప్రదర్శనలిచ్చి లబ్ధ ప్రతిష్ఠుడయ్యాడు. శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణ తులాభారం వంటి పౌరాణిక నాటకాలలో శ్రీకృష్ణ పాత్రలో ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్రుడుగా, చింతామణిలో బిల్వమంగళుడుగా, శిలువధారిలో జీసెస్ క్రైస్ట్‌గా, గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడుగా, మృచ్ఛకటికలో శకారుడుగా, రామాంజనేయయుద్ధంలో శ్రీరాముడుగా విభిన్న పాత్రలలో నటించి, తన గానమాధుర్యంతో ప్రేక్షకులను తన్మయులను చేసి వారి హృదయాలలో చెరగని ముద్ర వేశాడు. పుట్టపర్తిలో భగవాన్ సత్యసాయి బాబా సమక్షంలో శ్రీకృష్ణ రాయబారంలో శ్రీకృష్ణ పాత్ర అద్భుతంగా పోషించి, పుట్టపర్తి సాయిబాబా ఆశీస్సులు అందుకొన్న మేటి కళాకారుడు. ఆంధ్రదేశంలో అనేక నాటక పరిషత్తులలో పద్య నాటకాలు ప్రదర్శించి, ప్రేక్షకుల మన్ననలతో పాటు ఉత్తమ నటనకు బహుమతులు అందుకున్నాడు.

1999లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాలలో శ్రీకృష్ణతులాభారం నాటకం ప్రదర్శించి శ్రీకృష్ణపాత్రలో ఉత్తమ నటుడుగా ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డు కైవసం చేసుకున్నాడు. 1995లో బందా కనకలింగేశ్వరరావు అవార్డుతో పాటు 'గానగంధర్వ', శ్రీ సాయి కళాస్రవంతి వారి 'అభినయ అభినవ శ్రీకృష్ణ ' బిరుదులు, మద్రాసు తెలుగు అకాడమీ పురస్కారం, వంశీ కళాసంస్థ ఎన్.టి.ఆర్. రంగస్థల పురస్కారం, తెనాలి స్వరలహరి వేదిక 2001 ఉగాది పురస్కారం మొదలైన పురస్కారాలెన్నో గోపాలకృష్ణని వరించాయి. దూరదర్శన్‌లోను, ఆకాశవాణిలోను అనేక పౌరాణిక చారిత్రక పద్య నాటకాలలో పాల్గని ప్రశంసలందుకున్నాడు. 1995లో తానా సంస్థ ఆహ్వానం పై అమెరికా పర్యటించి అనేక రాష్ట్రాలలో పద్య నాటకాలను ప్రదర్శించి, విదేశాలలో తెలుగు బావుటా ఎగురవేసి, తెలుగు నాటక రంగం కీర్తి ప్రతిష్ఠల్ని ఇనుమడింపజేశాడు. సాంప్రదాయ నాటకాలను ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో జతచేసి మనోజ్ఞంగా ప్రదర్శించాలనే తపనతో నిరంతరం శ్రమిస్తున్న నాటక రంగ కృషీవలుడు గుమ్మడి గోపాలకృష్ణ.

గం.సు.రె.

గోపాలకృష్ణ, మల్లాది (జ.1948) : నటుడు, రూపశిల్పి, నటశిక్షణ అధ్యాపకుడు. ఈయన విజయవాడలో 1948, సెప్టెంబర్ 22న జయలక్ష్మి, సుబ్బారావు దంపతులకు జన్మించాడు. స్కూలుఫైనల్ వరకూ విజయవాడలో విద్యాభ్యాసం చేశాడు. చిన్నతనంలో ఏడిద కామేశ్వరరావు (రేడియో అన్నయ్య) ప్రోత్సాహంతో ఆకాశవాణి బాలానందం కార్యక్రమాలలో పాల్గనటంతో నాటకాలపై అభిరుచి ఏర్పడింది. రేడియో అన్నయ్య రచించిన నాటకాలలో ముఖ్యపాత్రలు నటించడం ద్వారా వాచికాభినయంలో మెరుగులు దిద్దుకున్నాడు. క్రమక్రమంగా రంగస్థలంపై చిన్నచిన్న నాటకాలలో పాల్గనడంతో నట జీవితానికి అంకురార్పణ జరిగింది. ఆనాటి నుంచీ నాటకరంగమే ప్రధాన వ్యాసంగంగా పరిణమించింది. ఆ తరువాత గుంటూరులో గురజాల కృష్ణమూర్తి, మంచికంటి కామేశ్వరరావు, పత్రి కృష్ణారావు, సోమ శేఖర్, రాజాజీ, గబ్బిట మొదలైన వారితో కలసి మూడు సంవత్సరాలు నాటకాల్లో పాల్గని, తన నటనా సామర్థ్యాన్ని పెంచుకొంటూ వచ్చాడు.

ఆ తరువాత విజయవాడలో జి.ఎస్.ఆర్ మూర్తి శిష్యరికంలో, దర్శకత్వంలో జగపతి రాజు, అన్నపూర్ణ, అడివి శంకరరావు, సంజీవి, సీతాలత, జి.ఎస్.ఆర్.కె శాస్త్రి మొదలైన వారితో కలసి అనేక నాటకాల్లో నటించాడు. ఆ నాటకాల్లో పునర్జన్మ, ఆశ్రయం, సిద్ధార్థ, కళ్ళు, లాభం, కొడుకుపుట్టాల, వెంకన్న కాపురం పేర్కొనదగినవి. సహాధ్యాయుడు, మిత్రుడూ అయిన జంధ్యాల రచించిన నాటక, నాటికలన్నిటినీ ఆంధ్రదేశం నలుమూలలా ప్రదర్శించాడు.

విజయవాడలో ప్రముఖ కళాసంస్థ ర.స.న. సమాఖ్యలో చేరి, జి.ఎస్.ఆర్.మూర్తి, సి.హెచ్. కబీర్‌దాస్, విన్నకోట రామన్న పంతులు, రామచంద్ర కాశ్యప, విజయరాం, జంధ్యాల, సి. రామమోహనరావు, నండూరి సుబ్బారావు, కోకా సంజీవరావు, వాసుదేవ మూర్తి, మురళీ మోహన్, శివరామిరెడ్డి మొదలైన ప్రముఖ నటులతో కలిసి నటించాడు.

క్రమంగా గోపాలకృష్ణ కార్యక్షేత్రం హైదరాబాద్‌కు మారింది. ఎ.ఆర్.కృష్ణ ఆధ్వర్యంలో సాగే ఆంధ్రప్రదేశ్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రిపర్టరీ (ఆం.ప్ర. నాటక విద్యాసంస్థ, నటమండలి) లో నటశిక్షణలో చేరి విద్యార్థిగా నాటకాధ్యయనం చేశాడు. ఆ తరువాత ఆ సంస్థలోనే ఆహార్యాభినయంలో అధ్యాపకునిగా నియామకం జరిగింది. ఆ సంస్థ ప్రదర్శించిన అభిజ్ఞాన శాకుంతలం, శ్రీకష్ణ రాయబారం, ఆశ వంటి నాటక నాటికల్లో నటించాడు. అనేక వర్క్ షాప్‌లలో ఆహార్యాభినయం, వాచికాభినయం అంశాలలో ఔత్సాహిక నటులకు శిక్షణ యిచ్చాడు. ఆహార్యం మీద దృష్టి సారించి, శాస్త్రీయ పద్ధతిలో మెలకువలు నేర్చుకొన్న గోపాలకృష్ణ రూపశిల్పాన్ని వృత్తిగా స్వీకరించాడు. తెలుగు విశ్వవిద్యాలయం, ఉస్మానియా

యూనివర్శిటీ, సెంట్రల్‌యూనివర్శిటీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, (బెంగుళూరు) ఆర్.ఆర్.సి. నిర్వహించిన శిక్షణా శిబిరాలలోను అధ్యాపకత్వం నిర్వహించాడు. టి.వి. మాధ్యమాలలో 50 సింగిల్ ఎపిసోడ్స్‌కి, టి.వి. సీరియల్స్‌కు మేకప్ చేయటమే కాక అనేక సీరియల్స్‌లో నటించాడు. కన్యాశుల్కం నాటకాన్ని జె.వి. సోమయాజులు, జె.వి.రమణమూర్తి, చాట్ల శ్రీరాములు, ఆలపాటి లక్ష్మి వంటి ప్రముఖ రంగస్థలనటులతో కలిసి ఆంధ్రేతర రాష్ట్రాలలో 30 ప్రదర్శనలిచ్చాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో జరిగిన తొలి నాటక పోటీలలో ఉత్తమ ఆహార్యానికి ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డుకు ఎన్నికయ్యాడు.

2003లో శ్రీనాథుడు చారిత్రక నాటకాన్ని అప్పాజోస్యుల విష్ణుభట్ల కందాళం ఫౌండేషన్ ఆహ్వానం మేరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో దిగ్విజయంగా ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నాడు. నాటకరంగ వికాసంపట్ల నిర్మాణాత్మక దృక్పథం, నిబద్ధతగల గోపాలకృష్ణ అహరహం నాటక రంగానికి తన విలువైన సేవలు అందిస్తూ కృషి చేస్తున్నాడు.

[illegible] సోమయాజులు

గం.సు.రె.

గోపాలకృష్ణ, రెంటాల(1920-1995) : అభ్యుదయకవి. పత్రికా రచయిత. అనువాదకుడు, నాటకకర్త. ఈయన గుంటూరు జిల్లా పల్నాడు సమీపంలోని రెంటాల గ్రామంలో 1920 సెప్టెంబరు ఐదవ తేదీన జన్మించాడు. విద్యాభ్యాసం నరసరావు పేట, గుంటూరులలో సాగింది. 1939లో రాజ్యశ్రీ అనే చారిత్రక నవలతో రచనా వ్యాసంగం ప్రారంభమైంది. వివిధ పత్రికలలో పనిచేస్తూ వ్యాసాలను రచించాడు. 'నవభారతి' సాహిత్య మాస పత్రికకు సంపాదకుడుగా పనిచేశాడు. భగవద్గీత, మహాభారతం, వాల్మీకి రామాయణాలను సరళమైన వచనంలో రాసి ప్రకటించాడు. కామసూత్రాలు అనే గ్రంథాన్ని జయ మంగళ వ్యాఖ్యతో ప్రకటించాడు. అభ్యుదయకవిగా 'సర్పయాగం, సంఘర్షణ' మొదలైన ఖండకావ్య సంపుటాలు రచించాడు. నాటక రచయితగా శిక్ష నాటికల సంపుటిని ప్రకటించాడు. పురపాలక సంఘం చేపట్టే పనుల లసుగుల్నీ, పాలకుల ముసుగుల్ని తెలిపే ఇన్‌స్పెక్టర్ జనరల్‌నాటకాన్ని తెలుగులోకి అనువదించి తెలుగు కళాభిమానుల ముందుంచాడు. ఆటం అనే మూకాభినయం నాటికను1952లో ప్రచురించాడు. విశ్వసాహిత్యంలో ఖ్యాతి గాంచిన టాల్‌స్టాయ్, విక్టర్ హ్యూగో, పుష్కిన్, గోగోల్, మాక్సిం గోర్కి రచనలలో కొన్నింటికి స్వేచ్ఛానువాదం చేశాడు. టాల్‌స్టాయ్ రచించిన వార్ అండ్ పీస్ ను సమరం-శాంతి పేరుతోను, అలెగ్జాండర్ కుప్రిన్ రచించిన యమా ది హెల్ హోల్ నవలను యమకూపం పేరుతో తెలుగులోకి అనువాదం చేశాడు. సాహిత్యరంగానికి సేవ చేసిన రెంటాల గోపాలకృష్ణ 1979లో ఆంధ్ర నాటకకళా పరిషత్తు, 1981లో నెఫ్జా నాటక కళా పరిషత్తు అవార్డులు అందుకున్నాడు. ఈయన 1995, జులై 18న మరణించాడు.

గోపాలకృష్ణమూర్తి, శ్రీపాద

దాసరి. ఎన్

గోపాలకృష్ణయ్య, కోగంటి (1923-2001) : నటుడు, నాటకకర్త. ప్రజానాట్యమండలి సభ్యుడైన కోగంటి 1923, సెప్టెంబరు 15న కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా బమ్ములూరు గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు వెంకమ్మ, అచ్యుత రామయ్య. గుడివాడలో ఫోర్త్ ఫారం చదివే రోజుల్లోనే సీస పద్యాలు, గీత పద్యాలు రాసి ఉపాధ్యాయులను ఆశ్చర్య చకితులను చేశాడు. గుడివాడ లోని హైస్కూలు విద్యను అభ్యసించి బందరు హిందూ కళాశాలలో చేరాడు. విద్యార్థి ఫెడరేషన్‌లో చేరి చిన్నచిన్న పాటలు, పద్యాలు, నాటికలు, బుర్రకథలు వంటి కళారూపాలను తాజా సమస్యలు ఇతివృత్తంగా తీసుకొని రంగస్థలంపై ప్రదర్శింపచేశాడు. విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేయడానికి ఇవి ఎంతో దోహదం చేశాయి. 1942, ఏప్రిల్ 30న బ్రిటిషు ప్రభుత్వం కోగంటిని నిర్బంధించి తొమ్మిది నెలల కఠిన కారాగార వాసానికి పంపింది. జైలు నుంచి విడుదలైన అనంతరం చదువుకు స్వస్తి చెప్పి మరింత చురుకుగా విద్యార్థి యువజన ఉద్యమాలలో పాల్గొని యువతను సమీకరించాడు. కమ్యూనిస్టు నాయకులు తమ్మారెడ్డి సత్యనారాయణ, మద్దుకూరి చంద్రశేఖరరావు ప్రోత్సాహంతో కమ్యూనిస్టు పార్టీలో చేరాడు.

హిట్లరు పరాభవం, సిమ్లా భాగవతం అనే వీధి భాగవతాలను, కోయదొర, సోది,గొల్లసుద్దులు, పెద్దింటాయన, విధవ వేషం, జంతర్‌పెట్టె, చెంచిత, అల్లాకే నామ్ వంటి మరుగున పడిన జానపద కళారూపాలకు సమకాలీనతను అద్ది సరికొత్త రూపాలను సృష్టించాడు. సంక్రాంతి, బళ్లగాడి అనే నాటికలతో పాటు అనేక పాటలు, పద్యాలను ఆశువుగా రచించాడు. 1943, మే 23 నుంచి బంబాయి దామోదర హాలులో జరిగిన అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ తొలి జాతీయ మహాసభలో కోగంటి ప్రదర్శించిన కోయవేషం ప్రథమ స్థానంలో నిలిచింది. కె.ఎ. అబ్బాస్, పి.సి. జోషి, ఎస్.ఎ డాంగే, బలరాజ్ సహానీ, పృథ్వీ రాజ్‌కపూర్ వంటి ప్రముఖులు కోగంటిని వేనోళ్ళ కొనియాడారు.

కోగంటి వివిధ జిల్లా శాఖలను ఏర్పాటు చేయడంలో గణనీయమైన పాత్రను పోషించాడు. ప్రజానాట్య మండలి కోసం ఎన్నో రచనలు చేసి తానే సూత్రధారిగా వ్యవహరించి ప్రదర్శనల

ద్వారా వేలాది మందిని ఉత్తేజితులను చేశాడు. మా భూమి నాటకాన్ని ప్రభుత్వం నిషేధించిన అనంతరం కోగంటిని ప్రభుత్వం నిర్బంధించి కడలూరు జైలుకు డిటెన్యూగా పంపింది. కడలూరు జైలులో కూడా ఎన్నో జానపద కళారీతులను ప్రదర్శించి జైలు అధికారుల ప్రశంసలు పొందాడు. కోగంటి ప్రముఖ రచయిత ఆత్రేయను ప్రజా నాట్యమండలికి పరిచయం చేయక పోయి ఉంటే పరివర్తన, ఈనాడు, భయం వంటి నాటకాలు వెలువడేవి కావేమో! ఆత్రేయ రచించిన పరివర్తన నాటకాన్ని కోగంటి అద్భుతంగా ప్రదర్శించాడు. కాకినాడ నుంచి మద్రాసు వరకూ పరివర్తన నాటకాన్ని ప్రదర్శించిన కోగంటికి ఈ నాటకం ద్వారా ఉత్తమ కళాకారునిగా ఎనలేని కీర్తిప్రతిష్ఠలు లభించాయి. రాష్ట్రదళం ప్రదర్శించిన మాభూమి నాటకంలో కోటిరెడ్డి పాత్రను కోగంటి అనితర సాధ్యంగా పోషించాడు.

వీధి భాగవతం కళా రూపాన్ని కోగంటి ఆధునిక తతో తీర్చిదిద్దిన తీరు 'కళ కళ కోసం కాదు ప్రజల కోసం' అనే నినాదానికి దర్పణం. సాంప్రదాయిక వీధి భాగవతంలో సమకాలీన, వర్తమాన రాజకీయ సమస్యలను జోడించి ప్రదర్శించే విధానానికి కోగంటి తొలిసారిగా శ్రీకారం చుట్టాడు. కోగంటి రచించిన హిట్లర్ పరాభవం అనే వీధి భాగవతం ఆ కాలంలో ఒక సంచలనాన్ని సృష్టించింది. ప్రపంచంపై గుత్త పెత్తనంచేయాలని దురాశతో ఉన్న నియంత హిట్లర్‌ను ఎర్రసైనికులు నిరోధించి తరిమి వేసిన ఉదంతాన్ని ఈ వీధి భాగవతంలో రచించాడు. హిట్లర్‌గా మిక్కిలినేని, ఎర్ర సైనికునిగా కోగంటి, సూత్రధారులుగా కోగంటి, కోసూరి నటించారు. హిందూ ముస్లింలకు మధ్య బ్రిటీష్‌ప్రభుత్వం విభేదాలను సృష్టించి భారతదేశాన్ని రెండుగా విభజించడం ఇతివృత్తంగా కోగంటి రచించిన మరొక వీధి భాగవతం సిమ్లా భాగవతం.

ఆంధ్రప్రదేశ్ వివిధ ప్రాంతాల్లోని గ్రామసీమల్లో అనేక జానపద కళా రూపాలను, వేషధారణను సామాజిక, రాజకీయ సమస్యలతో అన్వయించి జాతిని జాగృతం చేయవచ్చుననే ఆలోచనతో కోగంటి పలుప్రయోగాలుచేశాడు. ఈ కళారూపాలతో పాటు జంతరు పెట్టె, విధవ వేషం వంటివి కోగంటి ప్రతిభకు అద్దం పడతాయి.

కోగంటి 1990లో 'కొసరాజు అవార్డు'తోపాటు 'జానపదబ్రహ్మ' బిరుదును పొందాడు. 1988లో తెలుగు విశ్వ విద్యాలయం ఉగాది పురస్కారాన్ని ఎన్.టి. రామారావు చేతుల మీదుగా అందుకున్నాడు. విజయవాడలో కోగంటి స్వర్ణోత్సవ సంఘం కోగంటి ప్రతిభా ప్రభాస పేరుతో వీరి రచనలను ముద్రించింది. తన ఆటపాటల ద్వారా పండిత పామరులకు ప్రగతిబాట చూపిన వైతాళికుడు కోగంటి. ఈయన 2001, నవంబర్ 23న విజయవాడలో అస్తమించాడు.

కందిమళ్ళ

గోపాల్ ఛోట్రం (గోపాల్ ఛోటరాయ్) (జ.1918) : ఒరియా రచయిత. ఒరియా నాటకరంగంలో మార్గదర్శి, అనువాదకుడు. కటక్‌లోని జగత్సింహపుర గోపాల్ ఛోటరాయ్ జన్మస్థలం. కటక్‌లో ఈయన మెట్రిక్ పాస్ అయ్యాడు. ఏకాంకికల దర్శకుడుగా కటక్ ఆకాశ వాణిలో పని చేశాడు. ఇప్పటి వరకు ఈయన 15 నాటకాలు ప్రచురించాడు. గోపాల్‌ఛోట్ రాయ్ సహజ శైలి, భావం కల నాటకకర్త. నాటకాలు ముఖ్యంగా శిల్ప సౌందర్యంతో నిండి ఉంటాయి. ఉత్తమ కథా వస్తువు, చక్కని పాత్ర చిత్రణ, నిశిత ఆలోచనా ధోరణి, కుతూహలాన్ని రేకెత్తించే సన్నివేశాలు, కళాత్మకమైన సన్నివేశాలు, సున్నితమైన హాస్యం, భాషా పటిమ ఈయన నాటకాలలో కనిపిస్తాయి. నాటకకర్తగా కొన్ని నిర్దిష్ట అభిప్రాయాలు కల గోపాల్ ఛోట్‌రాయ్ రచనలో అనవసర హాస్యం, పాత్రల అనౌచిత్యం మచ్చుకైనా కనిపించవు. *ఫెరిఆ, పరకలను, నష్ట ఊర్వశి, శంఖసిందూర, భరసే* మొదలైన నాటకాలు రచించాడు. '*ఝుంఝు, అమండ బాట, మలాజన్హ, ప్రతిభ*' నవలలు నాటకాలుగా రాసినవి. ఈయన ఎన్నో ఏకాంకికలు, రేడియో నాటకాలు రచించాడు. మొదటి ఏకాంకిక *సహధర్మిణి* (1941) తోటే ఏకాంకికా రచయితగా ప్రసిద్ధి పొందాడు. అంతేకాక *పంచ నాటిక* (1993), *నపహురతి* (Napahu rati, 1971), *కపటపాషా* (1989, Kapatapasha), *హాస్య రసర నాటక* (1981), *బాబుచంద్ర మణి* (1992) లను కూడా రచించాడు. ఆయన రచించిన నాటకాలు హిందీ, ఇంగ్లీషు, తెలుగులోకి అనువాదం చెందాయి. ఆయనకు (కేంద్ర) సాహిత్య అకాడమి బహుమతి లభించింది. ఆయన హిందీ, గుజరాతీ, మరాఠీ నాటకాలను మరాఠీలోకి అనువదించాడు.

ప్రభావతి (చంద్రశేఖర్)

గోపాలరాయ శర్మ, కొండముది (జ.1920) : నాటక రచయిత, నటుడు. గుంటూరు జిల్లా, రేపల్లె తాలుకా భట్టిప్రోలు గ్రామంలో 1920, అక్టోబరు 17న జన్మించాడు. చిన్ననాటి నుంచి నాటకాల్లో వేషాలు వేయడానికి ఉత్సాహం చూపించాడు. 1935లో తుడిమెళ్ళ గ్రామంలో స్కూలు ఫైనల్ చదువుతూ వివిధ వేషధారణతో ప్రదర్శనం ఇచ్చాడు. 1936లో మద్రాసు

లయోలా కాలేజీలో ప్రవేశించాడు. యుగంధరుడు, శకుంతల లో విదూషకుడు, బెస్తవాడుగా, చంద్రగుప్త లో చాణక్యుడుగా, రంగూన్ రౌడీగా నటించి పేరుప్రతిష్ఠలు సంపాదించాడు. 1940లో **సంస్కృత ఏకపాత్రాభినయ పోటీలలో మృచ్ఛకటిక లో** మైత్రేయుడుగా నటించి బహుమతి అందుకున్నాడు. 1941లో అంతర్విశ్వ విద్యాలయ ఆంధ్రభాషా వక్తృత్వపు పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. 1942లో రాణీ రుద్రమ నాటకాన్ని రచించటంతో రచనా వ్యాసం గానికి శ్రీకారం చుట్టాడు. 1943 నుంచి 1946 వరకు ఆంధ్రప్రభ సంపాదకీయ వర్గంలో ఉండి, నాటకరంగం మీద పరంపరగా వ్యాసాలు రాశాడు. 1944 నుంచి 1954 వరకు ఆంధ్ర నాటకకళాపరిషత్తు కార్యవర్గ సభ్యుడుగా పనిచేశాడు. 1945, డిసెంబరులో గుడివాడ పరిషత్తులో ఎదురీత నాటకానికి ప్రథమ బహుమతి అందుకున్నాడు. 1952లో గౌతమబుద్ధ నాటకానికి ఆంధ్ర సారస్వత పరిషత్తు బహుమానం లభించింది. ఇదీ లోకం మొదలైన నాటకాలను, మరికొన్ని నాటికలను రచించాడు. 1946లో సినిమా రంగంలో ప్రవేశించి అనేక చిత్రాలకు మాటలు, పాటలు సమకూర్చాడు.

మిక్కిలినేని

గోపాలరావు, ఆమంచర్ల (1907-1969) : ఈయన 1907, సెప్టెంబర్ 26న గుంటూరులో జన్మించాడు. నాటకకర్త, నటుడు, చరిత్రకారుడు, సినీ దర్శకుడు. కావలి, గుంటూరు, కాకినాడ, మద్రాసులలో విద్య నభ్యసించి 'లా' పట్టా పుచ్చు కొన్నాడు. విద్య పూర్తి కాగానే స్వాతంత్రోద్యమంలో చేరి అనేకసార్లు జైలుకు వెళ్లాడు.



చిన్నతనంలోనే సుప్రసిద్ధ చిత్రకారుడు వరుబాబూరావు వద్ద చిత్ర కళను అభ్యసించి కొంత కాలం బొంబాయి 'జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్'లో అధ్యాపకుడిగా పని చేశాడు. ప్రక్తి దేవాలయ చిత్ర సంపదను గురించి ఆంగ్లంలో రచించిన గ్రంథాన్ని వర్ణచిత్రాలతో 'ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ' ప్రచురించింది.

నాటకంలో ఆహార్యం గురించి ఎంతో పరిశ్రమ చేశాడు. నాటక రచనలో కూడా ఈయన సమర్థుడు. ఈయన రచించిన విశ్వంతర (1946) నాటకానికి కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి లభించింది. మాట పట్టింపు (1937), మల్లమ్మదేవి ఉసురు (1938), అపరాధి (1950)లు ఈయన ఇతర రచనలు. కళారంగ వికాసం కోసం పని చేసిన ఆమంచర్ల 1969, ఫిబ్రవరి ఏడవ తేదీన కాలధర్మం చెందాడు.

శ్రీ.చ.

గోపాలరావు, ఎ.జె. (జ.1896) : నటుడు, స్ఫురద్రూపి, ఆజానుబాహుడు, న్యాయవాది, సమాజ నిర్వాహకుడు, నట లక్షణాలన్నీ మూర్తీభవించిన కళాకారుడు. 'రంగసింహ' బిరుదాంకితుడు. ఈయన 1896, అక్టోబరు 16న జన్మించాడు. 1913లో రంగప్రవేశంచేసిన గోపాలరావు ఆంధ్ర ఎమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్‌లో ప్రదర్శించిన నాటకాలలో నరకాసురుడు, శ్రీ కృష్ణుడు, శ్రీ రాముడు వేషాలలో నటించి మెప్పు పొందాడు. 1920లో న్యాయ శాస్త్రంలో పట్టా పొంది న్యాయవాద వృత్తి ప్రారంభించి అటు న్యాయవాదిగా, కళాకారుడుగా పేరు పొందాడు. విజయనగరం పార్కులో రామ గోపాల్ హాల్ నిర్మించాడు. 'వాణీ విలాస సభ' నాటక సమాజాన్ని స్థాపించాడు.

విజయనగరం ప్రభువులు విజయరామారావు గజపతి ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేస్తూ విజయరామా డ్రమెటిక్ కంపెనీ, విజయరామగాన పాఠశాల స్థాపించడానికి కృషి చేశాడు. అఠాణి రాగం పాడటంలో దిట్ట. నరకాసురుడు, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, దుర్గాదాసు, రుస్తుం, రామదాసు, హిరణ్యకశ్యపుడు ఈయనకు అభిమాన పాత్రలు.

దాసరి.ఎన్.

గోపాలరావు, ఏడిద (జ.1938) : రంగస్థల నటుడు, దర్శకుడు, రచయిత. ఆకాశవాణి న్యూస్‌రీడర్. కళాప్రపూర్ణ రాఘవ కళా సమితి, సరస నవరస సంస్థల స్థాపకుడు. ఈయన తూర్పుగోదావరి జిల్లా లోని కొత్తపేటలో 1938వ సంవత్సరంలో జన్మించాడు. తల్లిదండ్రులు పాపలక్ష్మి, సత్తి రాజు నాయుడు. గోపాల రావు అన్న ప్రముఖ సినీ దర్శకుడు ఏడిద నాగేశ్వర రావు. గోపాలరావు విజయ నగరం మహారాజ కళాశాల హైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న రోజుల్లోనే రాంగ్‌నంబర్ నాటికలో 'ఆర్ముగం' అనే హాస్యపాత్రలో నటించి బహుమతి గెలుచుకున్నాడు. ఇదే ఆయన తొలి ప్రదర్శన.

ఈయన నాటకం పట్ల ఆకర్షితుడు కావడానికి ప్రధాన కారణం నాడు తను చదువుతున్న హైస్కూల్లోని హస్తబల్ హాల్లో ప్రదర్శిస్తున్న నాటకాలను చూడటం, గోపాలరావు అన్న నాగేశ్వరరావు రాఘవ కళాసమితిని స్థాపించి నాటకాలు ప్రదర్శించడం.

చిన్నప్పుడే నాటకాల పట్ల మక్కువ పెంచుకున్న ఏడిద గోపాలరావు ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిర్వహించిన నాటక పోటీలలో వరప్రసాదం, పగ, కప్పలు, ఇన్‌స్పెక్టర్ జనరల్, పంజరం మొదలైన ప్రదర్శనలలో నటించాడు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన తరువాత తను పనిచేస్తున్న సెన్సస్ ఆఫీసులోని కొంతమంది మిత్రులతో కలసి 1965లో 'కళా ప్రపూర్ణ రాఘవ కళాసమితి'ని స్థాపించాడు. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే భమిటి పాటి రాధాకృష్ణ మనస్తత్వాలు, పి. వేణు దిష్టి బమ్మలు, బెల్లంకొండ రామదాసు మాస్టర్జీ, డి.వి. నరసరాజు ఈ ఇల్లు అమ్మబడును, యండమూరి వీరేంద్రనాథ్ కుక్క, ఆదివిష్ణు రాజీ, గొల్లపూడి మారుతీరావు కళ్ళు మొదలైన ప్రదర్శనల్లో నటించాడు. కొక్కొరకొ నాటికకు దర్శకత్వం వహించాడు. సాయంకాల వేళల్లో ఎ.ఆర్. కృష్ణ నేతృత్వంలో నిర్వహిస్తున్న నాట్య విద్యాలయంలో చేరి 'రంగస్థల కళల' డిప్లొమా కోర్సుచేసి నాటకరంగంలోని మెలకువలు నేర్చుకున్నాడు.

ఆకాశవాణిలో ఉపాధి లభించడంతో ఉద్యోగ నిర్వహణ నిమిత్తం ఢిల్లీలో, మాస్కోలో కొంతకాలం పనిచేశాడు. ఈయన ఢిల్లీలో పనిచేస్తున్న కాలంలో దక్షిణ భారత నటీనట సమాఖ్యలో సభ్యుడిగా చేరి ఈ సంస్థ పక్షాన నాటకాలను ప్రదర్శించడమే కాకుండా వాటిలో నటించాడు. కళారంగ వికాసం కోసం 1978లో సరస నవరస సంస్థను స్థాపించి వివిధ కళావేదికలపై ప్రదర్శనలు ఏర్పాటు చేశాడు. 1998 నుంచి భారతీయ భాషలలో ఆరుసార్లు జాతీయ స్థాయిలో నాటకోత్సవాలు నిర్వహించాడు. గోపాలరావు ఉద్యోగ విరమణ తరువాత హైదరాబాదులో ఉంటూ బాపు చెప్పిన మాట, నేతాజీ నాటకాలలో 'గాంధీ' వేషం వేసి పలువురి ప్రశంసలు పొంది 'అభినవ గాంధీ'గా పేరు తెచ్చుకున్నాడు. అయిదు దశాబ్దాలుగా నాటక రంగంలో కృషి చేసిన గోపాలరావుకు నటనలో ఆదిగురువు నాగేశ్వరరావు అయినా నటన, దర్శకత్వంలో మెలకువలు నేర్చుకున్నది ఎ.ఆర్. కృష్ణ, కె. వేంకటేశ్వరరావుల దగ్గరనే అని చెప్పుకున్నాడు. గోపాలరావు రచయితగా ఇది ఒక నాటకమే, భారతి (1993), (60 పాత్రల నాటకం) గోపాల తరంగాలు (కవితా సంపుటి), ప్రగతిపథంలో స్త్రీ వ్యాస సంపుటి మొదలైనవి రచించాడు. నాటకరంగం కోసం కృషి చేసిన ఏడిద గోపాలరావును సంస్కృతి ఇంటర్ నేషనల్ సంస్థ 'సంస్కృతీ రత్న' బహు భాషా నాటకోత్సవ సంఘం 'నటభూషణ' ఇచ్చి సత్కరించాయి. ఇవే కాకుండ అనేక సంస్థలు బహుమతులిచ్చి సత్కరించాయి. ఉద్యోగరీత్యా విశ్రాంతి తీసుకుంటూ ఎన్నుకున్న ప్రవృత్తిని అవిశ్రాంతంగానే కొనసాగిస్తున్న కళారాధకుడు. శతాధిక నాటక నాటికలలో నటించిన నటుడు, దర్శకుడు ఏడిద గోపాలరావు.

దాసరి.ఎన్.

గోపాలరావు, కొడాలి : నాటక రచయిత. ఈయన గుంటూరు జిల్లా పెద రాపూరులో జన్మించాడు. గ్రామీణ జీవితాన్ని, డబ్బునుం కథా వస్తువులుగా స్వీకరించి, నాటకాలు, నాటికలను రచించి ఔత్సాహిక నాటక సమాజ వికాసానికి ఊపిరి పోశాడు. పేదరైతు (1952), కూలి (1952), తిరుగు బాటు (1954), దొంగ వీరడు (1958), లంకెల బిందెలు (1959), చేసిన పాపం కాశీకి పోయినా (1960), వైకుంఠ భవనం (1960), ఛైర్మన్ (1961), అపరాధి (1961), పాపం పది రకాలు (1964), రైతుబిడ్డలు, సుఖదుఃఖాలు, రక్త సంబంధాలు మొదలైన నాటకాలు, ఎవరినీ నమ్మకు, త్యాగమూర్తి, నటన వంటి నాటికలు రచించాడు.

రైతులు సంఘటితమై పోరాటం సాగించినపుడే విజయం సిద్ధిస్తుందని ఉద్బోధించే నాటకం పేద రైతు. ఈ నాటకం పరి షత్తులలో విరివిగా ప్రదర్శింపబడింది. ఆస్తి కోసం అయినవాళ్లను అంతం చేయాడానికి ప్రయత్నించే యజమానికి, మానవత్వం గల ఒక దొంగ కనువిప్పు గలిగించడం దొంగవీరడు నాటకంలోని కథా వస్తువు. ఈ నాటకాన్ని ర.స.న. సమాఖ్య (విజయవాడ) కె.వేంకటేశ్వర రావు బృందం రాష్ట్రంలోని వివిధ పరిషత్తులలో ప్రదర్శించి బహు మతు లందుకుంది. కూలి, తిరుగు బాటు నాటకాలు కష్టజీవుల గాథలను వివరిస్తే, డబ్బు కోసం మనిషిని మనిషి చంప డానికి సిద్ధపడే విషయాన్ని తెలిపే

నాటకం లంకెబిందెలు. నిరాశా, నిస్పృహలతో వేగిపోయే నిరుద్యోగి హత్య చేయడానికి కూడా తలపడే పరిస్థితుల నేపథ్యానికి, మానసిక దౌర్బల్యానికి, అసహనానికి అద్దం పడుతుంది అపరాధి నాటకం. తెలుగు నాటక వాఙ్మయంలో గ్రామీణ జీవితాన్ని నేపథ్యంగా తీసుకొని తెలుగుతనం ఉట్టి పడేలా నాటకాలు రాసిన వారిలో ఈయన అగ్రగణ్యుడు.

డబ్బుకు లోబడి మనిషి చేసే కుట్రలు, కుతంత్రాలు, దగుల్బాజీ పనులు ద్రోహాలు మొదలైన విషయాలు *సుఖ దుఃఖాలు, రక్తసంబంధాలు, వైకుంఠ భవనం, పాపం పది రకాలు* మొదలైన నాటకాల్లో చిత్రితమయ్యాయి. ప్రేమించి మోసం చేసినందుకు తగిన ఫలితాన్ని అనుభవించిన విషయాన్ని చేసిన పాపం కాశీకి పోయినా నాటకం ద్వారా తెలిపాడు. ప్రజా ప్రతినిధులుగా గద్దెనెక్కిన పాలకులు ప్రజలకు ఎలాంటి సేవలు చేస్తున్నారనే విషయాన్ని హాస్యరస స్ఫోరకంగా ఆవిష్కరించిన నాటకం ఛైర్మన్ నాటకం. ఈయన రచించిన నాటకాలలో పరిమితమైన పాత్రలు ఉండటం, ఎక్కువ నాటకాల్లో స్త్రీ పాత్రలు లేకపోవడంవల్ల ఔత్సాహిక నాటక సమాజాలు ఈయన నాటకాల్ని విరివిగా ప్రదర్శించాయి. అవే కాకుండా చెదరిన కాపురం, ఆపద మొక్కులు, *అందని ఆనందం (అపరాధ పరిశోధన)* మొదలైన నాటికలను రచించి నాలుగు దశాబ్దాలు నాటక సాహిత్య ఔన్నత్యానికి తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించిన కళాజీవి కొడాలి గోపాలరావు.

దాసరి.ఎస్

గోపాలస్వామి, కె.వి. (1903-1983): విద్యావేత్త, ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్రయోగాత్మక నాటకశాల నిర్మాత. ఆంధ్ర యూనివర్శిటీ డ్రమెటిక్ అసోసియేషన్ స్థాపకుడు.



ఈయన కూర్మా వెంకటరెడ్డి నాయుడు, లక్ష్మీకాంతమ్మ దంపతులకు 1903, డిసెంబరు 19న జన్మించాడు. మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చదివి పట్టభద్రుడయ్యాడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పట్టం పొందడమే గాక 'బార్ ఎట్ లా' పట్టం కూడా పుచ్చుకొన్నాడు. కొంతకాలం మద్రాసులో చరిత్రోపన్యాసకుడిగా, మద్రాసు హైకోర్టులో వకీలుగా ప్రాక్టీసు చేశాడు. 1937లో స్వతంత్ర సభ్యుడుగా మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యాడు. 1942లో ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా నియమితులై ఆ పదవికి గౌరవం తెచ్చాడు. మొట్టమొదటగా 1961లో 'థియేటర్ ఆర్ట్సు'లో విశ్వవిద్యాలయ గౌరవ ఉపన్యాసకుడిగా నియమితుడయ్యాడు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ ఎఫైర్స్‌లో సభ్యుడు. 1954-57లలో కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు. మొదటి సంగీత నాటక అకాడమీ సభ్యుడై ఆ తరువాత అధ్యక్ష పదవిని చేపట్టాడు.

వేణుగోపాలస్వామి ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగా ఉంటూ తెలుగు నాటక రంగానికి చేసిన సేవ అనన్య సామాన్యమైంది. 1938లో 'ఆంధ్ర యూనివర్శిటీ డ్రమెటిక్ అసోసియేషన్' స్థాపించబడింది. రిజిస్ట్రార్ పదవి చేబట్టిన వెంటనే వేణుగోపాలస్వామి 1943లో దానిని ఎక్స్‌పెరిమెంటల్ థియేటర్‌గా రూపొందించాడు.

ఈ ప్రయోగాత్మక నాటక సమితిలో నటన, దర్శకత్వం, నాటక నిర్మాణ ప్రక్రియ, రంగస్థల రూపకల్పన, దుస్తులు, ఆహార్యం, దృశ్య, శ్రవణ సాధనాల వినియోగంలో శిక్షణ ఉండేది.

1943లో ప్రారంభమైన 'ప్రయోగాత్మక నాటక సమితి' కార్యకలాపాల్లో 1963 నాటికి 300 నాటకాలు ఎక్సపెరిమెంటల్ థియేటర్ పక్షాన ప్రదర్శించబడ్డాయంటే దాని విశిష్టత వ్యక్తమవుతుంది. హేతువాద, మానవతావాద, సంస్కరణాత్మక సిద్ధాంతాలకనుగుణంగా రచితమైన కవిరాజు త్రిపురనేని నాటకాలు *ఖూనీ, శంబుకవధ, ముద్దుకృష్ణ , అశోకం, చలం శశాంక, చిత్రాంగి, హరిశ్చంద్ర, ఆముంచర్ల హిరణ్యకశిపుడు* మొదలైన నాటకాలకన్నిటికీ ప్రదర్శన భాగ్యం లభించింది ఇక్కడే. 1943 నుంచి ప్రారంభమైన ఎక్స్‌పెరిమెంటల్ థియేటర్ ఇరవై సంవత్సరాల్లో రంగస్థల కళలు రూపొందేదాకా 165 రకాల ప్రయోగాలు చేసింది. వీటిలో నాటకాలు, నృత్య నాటికలు, ఇంగ్లీషు, హిందీ నాటకాలు, స్త్రీలు, పిల్లల కోసం ప్రత్యేకించిన నాటికలు, నాటకాలు ఉన్నాయి. అదంతా వేణుగోపాలస్వామి కృషి, దార్శనికత.

1957లో వేణుగోపాలస్వామి సంపాదకత్వంలో దక్షిణ భాషా పుస్తకసంస్థ సహకారంతో కుబేర ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రసిద్ధ నాటకాల సంపుటిని ప్రచురించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఇండియన్ డ్రామా' అనే గ్రంథంలో తెలుగు నాటకరంగాన్ని గురించి వ్యాసం రాశాడు. 1963లో న్యూయార్కులోని ఎ సినిమా పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన *జనరల్ ఎడ్యుకేషన్ రీకన్సిడర్డ్* అనే గ్రంథంలో లలితకళలు, సంగీతం, నాటకం అనే అంశాలపై విపులంగా వివరించాడు. ఇలా తెలుగుగడ్డపై నాటకరంగ పురోభివృద్ధికి ఎంతగానో పాటుపడిన కూర్మా వేణు గోపాలస్వామి 1983లో కాలధర్మం చెందాడు.

గంగప్ప

గోపాలాచార్యులు, ధర్మవరం (1859-1936) : నాటకకర్త, నటుడు, నాటక సమాజ వ్యవస్థాపకుడు, న్యాయవాది, ఆంధ్ర నాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యుల సోదరుడు. గోపాలాచార్యులు 1859లో బళ్ళారిలో లక్ష్మమ్మ, కృష్ణమాచార్యుల దంపతులకు జన్మించాడు.

ఈయన తెలుగులో నాటకం రాసి ప్రదర్శించగా అది విజయవంతం కాకపోవడంతో తెలుగుభాష నాటక రచనకు పనికిరాదనే అపప్రథ బయలుదేరింది. రామకృష్ణమాచార్యులు చిత్రనళీయాది నాటకాలు రాసి ఆ అపప్రథను వమ్ము చేశాడు. గోపాలాచార్యులు అన్నతో కలిసి భరతాది భూమికలలో నటించాడు. ఆ తరువాత హైదరాబాదు వెళ్లి వకీలుగా పని చేస్తూనే 'కృష్ణ విలాస సభ' అనే పేరుతో నాటక సమాజం స్థాపించి సత్యహరిశ్చంద్రాది నాటకాలు స్వయంగా రాసి ప్రదర్శించాడు.

హైదరాబాదు నుంచి 1910 ప్రాంతంలో బళ్లారికి తిరిగివచ్చి అన్నతో కలసి అభినవసరసవినోదిని సమాజం స్థాపించాడు. రామకృష్ణమాచార్యుల నిర్యాణానంతరం కృష్ణమాచార్య సభ అనే పేరుతో నాటక సమాజం స్థాపించి నాటకాలు ప్రదర్శించాడు. తన మేనల్లుడు నటుడు రాఘవతో తన నాటకాల రాత ప్రతులు పరిశీలింపచేసి ఆయన సలహాలను స్వీకరిస్తూండేవాడు. ఈయన రచించిన నాటకాలన్నింటిలో ఎక్కువ ప్రచారంలోకి వచ్చిన నాటకం రామదాసు. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక సమాజాలు దీన్ని ప్రదర్శించాయి. నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ దీన్ని రసవత్తరంగా ప్రదర్శించడంతో దీనికి మరింత వన్నె వచ్చింది. కబీరు, తానీషాలకు ఉర్దూ భాష, పౌరులాది పాత్రలకు మిశ్రమ భాషను ప్రయోగించిన పాత్రోచిత భక్తి రస ప్రధాన నాటకం. నాటకంలోని జైలుసీను నటుల సామర్థ్యానికి గీటురాయి. ఈయన రచించిన నాటకాలు పన్నెండు. రామదాసు, రుక్మిణీ కృష్ణీయం *(1920)*, రాం కబీర్ (ప్రేమ చంద్రయోగం) *(1926)*, సుభద్రార్జునీయం *(1932)*, అస్పృశ్య విజయం *(1933)*, అనే అయిదుమాత్రమే ముద్రణకు నోచుకున్నాయి. *శ్రీరామలీల, గిరిజా శంకరీయం, పాండవాజ్ఞాత వాసం, ఉత్తర రామచరిత్ర, సత్యహరిశ్చంద్ర, కైజర్, ఉషా పరిణయం* నాటకాలు అముద్రితాలుగా మిగిలి పోయాయి. భరతుడు, ఘటోత్కచుడు పాత్రలలో నటించిన గోపాలాచార్యులు 1936లో మరణించాడు.

శ్రీ.చ.

గోపీచంద్, త్రిపురనేని (1910-1962) : నాటక, కథానిక, నవలా, సినీ రచయిత. దర్శకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, న్యాయశాస్త్ర వేత్త, మేధావి, సత్యాన్వేషి. ఈయన 1910, సెప్టెంబర్ 8న కృష్ణాజిల్లా అంగలూరులో పున్నమాంబ, రామస్వామి చౌదరి ప్రతిభా వ్యుత్పత్తులు పుణికి పుచ్చుకున్న తనయుడు.

న్యాయశాస్త్రంలో పట్టాపుచ్చుకొని తెనాలిలో ప్రాక్టీస్ పెట్టినా, ఆ వృత్తి నచ్చక చెన్నై వెళ్లి 1938లో సినీరంగంలో ప్రవేశించి 'రైతుబిడ్డ' మొదలైన చిత్రాలకు సంభాషణలు రాశాడు. 'లక్ష్మమ్మ' చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఈయన ఆంధ్రరాష్ట్ర సమాచార శాఖ డైరెక్టర్‌గా, ఆకాశవాణి గ్రామ స్థుల కార్యక్రమ ప్రయోక్తగా పనిచేశాడు. 1963లో ఆవుల సాంబశివరావు సంపాదకత్వంలో గోపీచంద్ గురించి ఒక స్మారక సంచిక వెలువడింది. ఈయన రాసిన నాటకేతర రచనలు అసంఖ్యాకం. నాటకాలు నాలుగే అయినా ఆణి ముత్యాలు. కరువు రోజులు (1947), మాంచాల (1956), అభాగిని (1960), మాలపల్లి (రేడియో అనుసరణ నాటకం) అనే రచనలు వెలువరించిన త్రిపురనేని గోపీచంద్ 1962, నవంబర్ 2న మరణించాడు.



శ్రీ.చ.

గోపీనాథ్, ఆమళ్ళదిన్నె (1932-2007) : నటుడు, జానపద కళాకారుడు, రచయిత. అనంతపురం జిల్లా, బత్తలపల్లి మండలం, అప్పరాశ్చెర్ల్వు గ్రామంలో 1932లో జన్మించాడు. బి.ఏ. చదివి, గ్రంథాలయ శాఖలో శిక్షణ పొంది, పౌర గ్రంథాలయ శాఖలో పని చేసి, 1990లో పదవీ విరమణ చేశాడు.

1944లో ఎరుకల సాని వేషంలో కళారంగ ప్రవేశం చేసిన నాటి నుంచీ కళకు అంకితమయ్యాడు. జానపద కళలకు కూడా సమ ప్రాధాన్యమిస్తూ ఆరు దశాబ్దాలుగా కళారంగానికి తన అమూల్య సేవలు అందించాడు. అనేక పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక నాటకాలలో విభిన్న పాత్రలు పోషించి మంచి నటుడుగా వినుతి కెక్కాడు. ముఖ్యంగా హాస్యరస పోషణలో ఈయనది అందెవేసినచేయి. మంచివక్త కూడా. హాస్యస్ఫోరకంగా ఆకాశవాణి కడప, అనంతపురం కేంద్రాలలో శతాధిక ప్రసంగాలు చేశాడు. సభా కార్య క్రమాలను అరుదైన శైలిలో నిర్వహించటంలో

దిట్ట. 1948 నుంచి పాల్గన్న, నిర్వహించిన సభలు, సదస్సులు, ప్రదర్శనలు నాలుగు వేలకు పైమాటే! అష్టావధానం వంటి సాహిత్య కార్యక్రమాలలో అప్రస్తుత ప్రసంగం చేయటంలో గోపీనాథ్ అగ్రగణ్యుడని చెప్పవచ్చు. గోపీనాథ్ వివిధ అంశాల మీద పది పుస్తకాలు వెలువరించాడు. అనేక కళాసంస్థలు అవార్డులిచ్చి సత్కరించాయి. వీటిలో ధర్మవరం కళాజ్యోతి స్వర్ణకంకణం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, చక్రపాణి అవార్డు, రేడియో ఎల్లయ్య మూవ అవార్డు పేర్కొనదగినవి. వినోద రత్నాకర, హాస్యభారతి, సభావాచస్పతి గోపీనాథ్‌ను వరించిన బిరుదులు. అనంతపురం లలిత కళాపరిషత్ కార్యనిర్వహణ కార్యదర్శిగా కొనసాగుతూ కళాభివృద్ధికి అవిశ్రాంతంగా కృషిచేసిన గోపీనాథ్ 2007 ఆగస్టు 16న కన్నుమూశాడు.

దాసరి. ఎన్

గోప్యార్థ గోపనం : సంధ్యంగ ప్రయోజనం. కళను మరుగు పరచడంలోనే కళా చాతుర్యం ఇమిడి ఉంది. Art lies in concealing art అని ఆంగ్ల సూక్తి. విషయాన్ని మరుగు పరచి తెలిసీ తెలియకుండా చేసినపుడు ప్రేక్షకులలో ఉత్సుకత, ఆకర్షణ పెంపొందుతాయి.

పాత్రలు, ఆశయాలు, సంఘటనలకు సంబంధించిన ప్రధాన విషయాలను ప్రేక్షకులకు, పాఠకులకు తెలపకుండా మరుగుపరచి ఉత్సుకతను రేకెత్తించవచ్చు. ఆ తరువాత ఈ విషయాలు నాటక కార్యరంగంలో ప్రవేశించి, గుప్త శక్తులుగా ప్రవర్తించి, పర్యవసాన ఫలితంగా వ్యక్తమవుతాయి. అపుడు మరుగుపడిన విషయాలు వ్యక్తం కావడంతో ప్రేక్షకులకు విస్మయం కలుగుతుంది. ఇకరెండవ విధానంలో నాటక రచయిత ముందుగానే నాటకంలోని ప్రధాన శక్తుల స్వభావాలను ప్రేక్షకులకు సూచించి ఈ శక్తుల సంఘర్షణ ఆసక్తితో పరికించేటట్టు చేయవచ్చు. ఈ రెండు విధానాలలో ఏ విధానం మంచిది అనే విషయం ఆయా కథా పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. ఈ గోప్యార్థ గోపనం ఎంత నైపుణ్యంగా ఏవిధంగా ప్రయోగించినా మొదటిసారి వరకే ఉత్సుకతను, విస్మయాన్ని రేకేత్తిస్తుంది. ఒకసారి నాటకం చూసేసరికి లేక చదివేసరికి గోప్యార్థ మంటూ ఉండదు. అంతా తెలిసిపోతుంది. రెండవసారి నాటకం చూచినా చదివినా మొదటిసారి అనుభవించినంత ఉత్సుకత, విస్మయం రేకేత్తవు. ప్రేక్షకులు, పాఠకులు కథలో నిమగ్నులై నాటకం కొత్తగా చూస్తున్నట్లు, చదువుతున్నట్లు భ్రమ చెందేటట్లు చేస్తేనే ఈ సంధ్యంగ ప్రయోజనం సిద్ధిస్తుంది.

ఈ రెండు విధానాల గోప్యార్థ గోపనం భాసుని ప్రతిజ్ఞా యౌగంధరాయణం లోనూ, ధర్మవరం ప్రమీలార్జునీయం లోను కనిపిస్తాయి. ఇట్లాంటిదే స్త్రీ, పురుషుని వేషం వేసుకోవడం, పురుషుడు స్త్రీ వేషం వేసుకోవడం. మొదటి దానికి రోషనార పురుషవేషం, రెండవ దానికి శశిరేఖా పరిణయంలో ఘటోత్కచుడు శశిరేఖ వేషం వేసుకోవడం ఉదాహరణలు.

అపరాధ పరిశోధక నాటకాలలో గోప్యార్థ గోపనం ఇంకా స్పష్టంగా గోచరిస్తుంది. నాటకం చివరగాని అపరాధ పరిశోధకుడు, అపరాధి ఎవరో ప్రేక్షకులకు తెలియదు. చిక్కు ఎలా విడేదీ కూడ తెలియదు. అందుచేత రెండింతల ఉత్సుకత పెరుగుతుంది. అవసరాల సూర్యారావు రచించిన పంజరం నాటకంలో డాక్టర్ అపరాధి అని, శ్రీనివాసరావు పోలీసు ఆఫీసరు అని చివరికి గాని తెలియదు. పిచ్చి వాడే జ్యోతి భర్త మోహన్ అని మధ్యన సూచనా ప్రాయంగా ప్రేక్షకులు పసిగట్టినా చివరకు గాని స్పష్టంగాదు.

శ్రీ.చ.

గోర్కీ, మాక్జిం (1868-1936) : రష్యన్ నాటకకర్త . నవలాకారుడు, కథకుడు, సాహిత్య సిద్ధాంతవేత్త. కలం పేరు గోర్కీ. అసలు పేరు అలెగ్జే మాక్సిమోవిచ్ ప్యెష్కోల్. ఈయన 1868 మాస్కోలోని ఒక కార్మిక కుటుంబంలో 1868లో పుట్టాడు. చాలా కష్టాలన నుభవించాడు. 1901లో చెఖోవ్ ప్రోద్బలంతో నాటక రచన ప్రారంభించాడు. మొదటి నాటకం స్మగ్ సిటిజెన్స్. దీనిని మాస్కో ఆర్ట్ థియేటర్ 1922లో విజయవంతంగా ప్రదర్శించింది. రెండవ నాటకం లోయర్ డెప్త్స్ విశ్వవిఖ్యాతి గడించి పెట్టడమే గాక ప్రపంచభాషలన్నింటిలోకి అనువదింపబడి ప్రదర్శింపబడింది.

ఆ తరువాత గోర్కీకి, మాస్కో ఆర్ట్ థియేటర్ వారికి అభిప్రాయ భేదాలు రావడం మూలంగా వారు గోర్కీ నాటకాలు ప్రదర్శించడానికి నిరాకరించారు. ప్రభుత్వం గోర్కీ నాటకాలను నిషేధించింది. అక్టోబరు విప్లవం తరువాత గోర్కీ నాటకాలు తిరిగి ప్రదర్శితం కాసాగాయి. గోర్కీ నాటకాలను శ్రీనివాస చక్రవర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ, నిడమర్తి ఉమామహేశ్వరరావు తెలుగులోకి తీసుకువచ్చారు. అధోలోకం *(1902)*, పెటీ బూర్జువా *(1902)*, శత్రువులు *(1906)*, వృద్ధు, ఎగార్ బులచీల్ అండ్ అదర్స్ *(1932)*, డొస్టిగమీల్ *(1933)*, వేసవి జనం *(1904)* అనే నాటకాలు రాసిన గోర్కీ 1936లో మరణించాడు.

శ్రీ.చ.



గోల్డ్‌స్మిత్, ఆలివియర్ (1730-1774) : ఇంగ్లీషు నాటకకర్త. నవలా కారుడు, వ్యాసకర్త, దయార్ద్ర హృదయుడు. వేణుగాన ప్రవీణుడు. ఈయన 1730లో లండన్‌లో జన్మించాడు. విశ్వవిద్యాలయం విద్యలో ఆరితేరక పోయినా చక్కటి ఇంగ్లీషు రచయితగా ప్రసిద్ధుడు. డాక్టర్ జాన్సన్ మెప్పును పొందిన రచయిత. వేణుగాన కచేరీలు చేస్తూ ఐరోపా ఖండ వంతా పర్యటించిన కళాకారుడు. ఈయన రచించిన నాటకాలు రెండే అయినా వాటిని ఇప్పటికీ ఇంగ్లండులో ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఈయన రచించిన షీస్టూప్స్ టు కాంకర్ (1773) అనే నాటకంలోని టొరన్స్ లంప్కిన్ అనేపాత్ర ధరించ డానికి ఆనాటి హాస్య నటులు పోటీ పడ్డారు. ఈయన 'వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ ' అనే నవలను నాటకంగా మలచి అనేకసార్లు ప్రదర్శించాడు. ఈ నవల అమ్ముడుపోయినన్ని ప్రతులు ఏ నవల ప్రతులు అమ్ముడుపోలేదు. ఈ నవలను అనుసరించే కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్ర రాశాడు. *గుడ్ నేచర్డ్ మన్* అనే నాటకాన్ని కూడ ఈయన రచించాడు.

గోల్డ్‌స్మిత్ నాటకాలు రెండూ వ్యక్తిత్వంతో కూడినవి, బలీయమైన హాస్యప్రధాన నాటకాలు. ఈయన 1774లో మరణించాడు.

శ్రీ.చ.



గోల్డోనీ, కార్లో (1707-1793) : ఇటాలియన్ నాటక రచయిత. ఇటలీలో వెనిస్‌లో 1707లో జన్మించాడు. తల్లి దండ్రులు కార్లోను న్యాయ వాదిగా చూడాలను కున్నారు. కాని గోల్డోనీకి చిన్నతనం నుంచి నాటక రంగం పట్ల అభిరుచి, ఆసక్తి. 1731లో లాయర్ పట్టాను పొంది న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించాడు. కొద్ది రోజుల్లోనే దాన్ని వదిలేసి నాటక రంగంలోకి వచ్చాడు. నాటక రచయితగా నిలదొక్కుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించాడు. తొలుత ది సర్వెంట్ ఆఫ్ టు మాస్టర్స్ (1745) అనే నాటకంతో రచనా వ్యాసంగం ప్రారంభించాడు. ఆ నాటకం అంతగా ప్రజాదరణకు నోచుకోలేదు. దాన్నే రెండేళ్ల తర్వాత చేర్పులు మార్పులతో పునః ప్రదర్శింపజేశాడు. ఆ నాటకంతో గోల్డోనీ పేరు ప్రసిద్ధికెక్కింది. అప్పట్లో ఇటలీలో ఫార్స్ (ప్రహసనాలు) నాటకాలను ఎక్కువగా ప్రదర్శించేవారు. అప్పటి కప్పుడు నటులు అసభ్య సన్నివేశాలను ప్రదర్శిస్తుండే వారు. అవే ఆశు నాటకాలు. నాటకాన్ని ముందుగా లిఖిత పూర్వకంగా రాసేవారు కాదు. ఆ పద్ధతిలో నాటకాలు ఆడేవారు కాదు. ఈ పద్ధతిని సంస్కరించాలని గోల్డోనీ పూను కొన్నాడు. నాటకాన్ని పూర్తిగా రాయాలనీ, కొన్నాళ్లు అభ్యాసం చేసిన తరువాతనే ఆ నాటకాన్ని ప్రదర్శించాలనీ, ప్రదర్శనలో మాస్కులు వాడే పద్ధతి విడనాడాలని గోల్డోనీ ప్రతిపాదించాడు. అంతే కాదు విదూషకత్వం పేరిట అసభ్యమైన సంభాషణాలు, శ్రుతిమించిన శృంగారం నాటకంలో ఉండరాదనీ, ప్రదర్శనలో కొత్త మార్పులు ప్రవేశపెట్టాడు. వాటిని తన నాటకాల్లో పొందు పరచి కొత్త పద్ధతులకు శ్రీకారం చుట్టి మార్గదర్శకుడయ్యాడు గోల్డోనీ.

గోల్డోనీ జీవనయానంలో ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొన్నాడు. కొన్ని నాటక కంపెనీలకు కొంతకాలం నాటక రచయితగా పనిచేశాడు. ఆర్థిక సమస్యలు అతనిని వెంటాడుతూ వచ్చాయి. హాస్య రచయితగా గోల్డోనీ పేరు నలుదిశలా వ్యాపించింది. సుమారు 150 హాస్య నాటకాలను, 83 మెలోడ్రామాలను రాశాడు. *ది కన్నింగ్ విడో, ది ఏంటిక్వేరియన్ ఫ్యామిలీ, రెస్పెక్టబుల్ గర్ల్, న్యూ హౌస్, మిస్ట్రెస్ ఆఫ్ ది ఇన్, ది లవర్స్* మొదలైన నాటకాలు రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శించబడి ప్రజాదరణ పొందాయి. కార్లోకు పోటీగా సియట్రో చైరీ అనే రచయిత నాటకాలు రాసి గోల్డోనీ ఖ్యాతిని దిగజార్చాలని విఫల ప్రయత్నాలు చేశాడు. ఇరువురి మధ్యా రచనాపరంగా పోటీ భయంకర రూపం దాల్చిన సందర్భాలున్నాయి. ఆశు పద్ధతికీ, మాస్కులు ఉపయోగించే సంప్రదాయానికీ అడ్డుకట్ట వేసి కొత్త పద్ధతిని ప్రవేశపెట్టిన గోల్డోనీ కార్లో మీద కక్ష గట్టి కార్లో గోడీ అనే రచయిత ప్రబల విరోధిగా తయారయ్యాడు. కానీ కాల ప్రవాహంలో గోల్డోనీ పద్ధతులే నాటక రంగంలో శాశ్వతంగా నిలిచిపోయాయి.

1761లో గోల్డోనీ ఫ్రాన్సుకి వెళ్లాడు. అక్కడ కూడా సంప్రదాయవాదులతో ఘర్షణ తప్పలేదు. ఫ్రెంచ్ రాజ కుటుంబంలో పిల్లలకు ట్యూటర్‌గా పని చేశాడు. 1789 లో ఫ్రెంచి విప్లవ ఫలితంగా 1792లో రాచరిక పాలన అంతమయింది. అతనికి రాజాస్థానంలో ఉద్యోగం పోయింది. బీదరికాన్ని అనుభవిస్తూ 1793లో ఫ్రాన్సులోనే గోల్డోనీ మరణించాడు.

క.మ.రా

గోవిందరాజులు, దాడి (1909-1970) : తెలుగు, ఇంగ్లీషు, హిందీ నాటకాలలో స్త్రీ పురుష పాత్రధారి, వృత్తిరీత్యా

న్యాయవాది. ఆంధ్ర నాటక కళాపరిషత్తు, ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యుడు. ఈయన 1909, ఆగస్టు 27న జన్మించాడు. విద్యాభ్యాసం విజయవాడ, కాకినాడ, మదరాసు లలో సాగింది. 1930లో న్యాయ శాస్త్రం పట్టా పుచ్చుకొని 1932లో మచిలీపట్నంలో న్యాయవాదిగా పని చేశాడు. 1941లో జిల్లా మునిసిఫ్‌గా నియమితుడై జిల్లా న్యాయాధికారిగా ఉద్యోగ విరమణ చేశాడు.

మదరాసులో మార్కండేయ (తమిళం)లో మార్కండేయ పాత్రలో నటించడంతో ఈయన నాటకరంగ జీవితం ప్రారంభమైంది. ఆ తరువాత మదరాసులోని 'షేక్స్పియర్ అమెచ్యూర్స్', విజయవాడలో 'నాట్యగోష్ఠి' నాటక సంస్థలో, 'ఏలూరు అమెచ్యూర్', 'బందరు నేషనల్ థియేటర్', 'ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ' మొదలైన నాటక సమాజాలు ప్రదర్శించిన ప్రదర్శనలలోనేగాక, బళ్ళారి రాఘవ సరసన కూడా నటించి అతని మెప్పును, ప్రజల మెప్పును పొందాడు. రాఘవ ఈయనను 'డెస్డిమోనా' అని, ఈయన రాఘవను 'ఒథెల్లో' అనీ సంబోధించుకునేవారు. ఈయన రాజమండ్రిలో మొదలు పెట్టిన ఆంధ్రనాటక సమాఖ్య ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించాడు. ఈయన తెలుగు నాటకాలలో ప్రహ్లాదుడు, మధురవాణి, తిష్యరక్షిత, కైక, సత్య, సీత, భ్రమరాంబ, కమలాంబ, రోషనార, ఆఫియా, సుందరి, జానకి, వసంతసేన, శ్రీకృష్ణ దేవరాయల పాత్రలు ధరించాడు. ఇంగ్లీషు నాటకాలలో పోర్షియా, బ్రూటస్, లేడీ మాక్బెత్, డెస్డిమోనా, ఒఫీలియా, జూలియట్ పాత్రలలో నటించిన గోవిందరాజులు 1970, డిసెంబరు 25న కన్నుమూశాడు.

శ్రీ.చ.

గోవిందరావు, ఇందుపల్లి (1897-1969) : బందరు, రాయల్ థియేటర్, రామమోహన్ థియేటర్లలో స్త్రీ పాత్రధారి. చింతామణి నాటక పోటీలలో మెడలిస్టు. రంగభూషణం బిరుదాంకితుడు. తల్లిదండ్రులు లక్ష్మీకాంతమ్మ, కృష్ణారావులు. ఈయన 1897 ఆగస్టు 12న జన్మించాడు.

బాల్యంలోనే ఇందుపల్లిలో నటన, సంగీతాలు గుబాళించాయి. మొట్టమొదటి వేషం తారాశశాంకం లో రెండవ చంద్రుడు లోకమాన్య బాల గంగాధరతిలక్ ఆశీర్వాదం పొందింది. ఆనాటి నుంచి పలు నాటకాలలో పెద్ద పెద్ద వేషాలు అనేకం వేసి కీర్తి, ధనం విస్తారంగా సంపాదించాడు.

కొంతకాలం నెలజీతం మీద బందరు రాయల్ థియేటర్, రామమోహన్ థియేటర్లలో స్త్రీ పురుష పాత్రలలో నటించాడు. తరువాత కాలానుగుణంగా కిరాయికి వేషాలు వేశాడు. ఈయన ఆంధ్రదేశంలోని దాదాపు అందరి మహానటుల సరసన నటించాడు. 1920-21లలో విజయవాడలో జరిగిన చింతామణి నాటక పోటీలలో రాధ పాత్రకు 'సువర్ణ పతకం' గెల్చుకున్నాడు. చిత్రరేఖ, సత్యభామ, చంద్రమతి పాత్రలకు సువర్ణ పతకాలు గెల్చుకున్నాడు. ఇవిగాక ప్రేక్షకులు ఈయన ధరించిన పాత్రకు ముగ్ధులై రంగస్థలం మీదకు విసిరి వేసిన పతకాలు అనేకం. ఈయన చంద్రుడు, రాధ, చింతామణి, చంద్రముఖి, సత్యభామ, విమల, చిత్రలేఖ, ఇందిర, అన్నపూర్ణ, కమల, సావిత్రి, రత్నాంగి, రాధ, సంజయుడు పాత్రలలో నటించి మెప్పించాడు.

చివరిదశలో దారిద్ర్యం అనుభవించి 1969, సెప్టెంబరు 8న స్వర్గస్థుడయ్యాడు.

శ్రీ.చ.

గోవిందరావు, వనారస (1867- 1953) : సురభి నాటకరంగ వ్యవస్థాపకుడు, ఉత్తమ నటుడు, ప్రయోక్త, ధర్మదాత, ఆంజనేయో పాసకుడు, 'ఆంధ్ర నాటక కళోద్ధారక' బిరుదాంకితుడు. తల్లిదండ్రులు పకీరమ్మ, గంపరామన్న, పెంపుడు తల్లిదండ్రులు సుంకమ్మ, వెంకోజీరావులు. ఈయన 1867లో జన్మించాడు.

గోవిందరావు అసలు పేరు పకీరప్ప. పెంపుడు తల్లి దండ్రులు పెట్టిన పేరు గోవిందప్ప. గోవిందప్ప గోవిందరావుగా మారాడు. పెంపుడు తండ్రి వెంకోజీరావు దగ్గర సంగీతం, ఫిడేలు నేర్చు కున్నాడు. నంద్యాల జ్యోతి సుబ్బయ్య కంపెనీలో చేరి పాటలు నేర్చుకొని ఆహార్య సామాగ్రి సేకరించాడు. ఆ కంపెనీలో ఈయన వేసిన మొదటి వేషం సత్య హరిశ్చంద్రలోని విశ్వామిత్రుడు. అప్పటి వరకు గోవిందరావు తల్లి దండ్రులు తోలుబమ్మ లాటలు, వినోద ప్రదర్శనలు ఇస్తుండేవారు. మద్రాసులో స్టేజి నాటకాలు చూసిన గోవిందరావు తను కూడా స్టేజి నాటకాలు ప్రదర్శించ డానికి పూనుకున్నాడు. ముందుగా సురభి గ్రామంలో కీచకవధ నాటకం ప్రదర్శించాడు. అందులో గోవిందరావు నకులుడు. ఆ తరువాత 1857లో 'శ్రీ శారదా మనో వినోదినీ సభ' అనే పేరుతో నాటక సమాజం స్థాపించి

స్టేజి నాటకాలు ప్రదర్శించడం ప్రారంభించాడు. ఆ సభే నేటి సురభి కంపెనీలకు మాతృసంస్థ.

ఆ తరువాత గోవిందరావు తమ కంపెనీని సంచార నాటక రంగంగా రూపొందించాడు. క్రమక్రమంగా సంచారానికి పనికి వచ్చే రేకులహాలు, విద్యుత్ దీపాలకు ప్రత్యేకంగా డైనమో, వైరువర్క్ సామాగ్రి సంపాదించి పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాలలో నాటకాలు ప్రదర్శించడం ప్రారంభించాడు.ఆంధ్రప్రదేశ్‌లోనే గాక రంగూన్‌లోనూ నాటకాలు ప్రదర్శించాడు.

ఆ రోజుల్లో స్త్రీలు వేషాలు వేస్తే గౌరవంగా ఉండదనే నమ్మకం ప్రగాఢంగా ఉండేది. కాని గోవిందరావు ఈ అభిప్రాయాన్ని లెక్క చేయకుండా తన భార్యాబిడ్డలను నాటకాలలో నటింపజేసి సురభి నాటకసమాజాన్ని నాట్యశాస్త్ర విహిత సమాజంగా తీర్చిదిద్దాడు.

1917లో భీమవరంలో లంకాదహనం నాటకంలో ఆంజనేయ పాత్రలో నటిస్తుండగా గోవిందరావు ధరించిన దుస్తులకు నిప్పంటుకొని దేహం కాలిపోయింది. నాటకాలలో నటించడానికి పనికిరాని పరిస్థితి ఏర్పడింది. అయినా ఆయన సమాజాన్ని వదలిపెట్టలేదు. హాస్యం చెబుతుండేవాడు. కాంతామణి నాటకంలో మాత్రం దొంగవేషం వేసి అద్భుతంగా నటించేవాడు. అందుకే నాటక ప్రదర్శన కరపత్రాలలో 'కంపెనీ ప్రొప్రయిటర్‌చే దొంగ వేషం ధరింపబడును' అని అచ్చు వేసేవారు. చివరికి గోవిందరావు ఏలూరు దగ్గర పోలసానిపల్లిలో స్థిరనివాసం ఏర్పరచుకొని చాలా దాన ధర్మాలు చేశాడు. ఈయన శిలావిగ్రహాన్ని కళాకారులు ఏలూరులో ప్రతిష్ఠించారు.

1929 నాటికే ఆంధ్రదేశంలో నాటకకళ క్షీణదశ ప్రారంభమైందని గ్రహించి దానిని ఉద్ధరించడానికి పెద్దలతో కలిసి 'ఆంధ్ర నాటకకళా పరిషత్తు' స్థాపించాడు. ఆ సమయంలోనే పరిషత్తు ఈయనను 'ఆంధ్రనాటక కళోద్ధారక' బిరుదుతో సన్మానించింది. ఈయన విశ్వామిత్రుడు, నకులుడు, ఆంజనేయుడు, దొంగ, అర్జునుడు (సుభద్ర), రాజరాజ నరేంద్రుడు, కర్ణుడు, శ్రీకృష్ణుడు (పారిజాతాపహరణం), దశరథుడు, హరిశ్చంద్రుడు, అనిరుద్ధుడు, రావణుడు, శ్రీరాముడు (సంపూర్ణ రామాయణం), విక్రమార్కుడు, బిల్వమంగళుడు, జగన్మోహనుడు, హిరణ్యకశిపుడు, రుక్మాంగదుడు పాత్రలలో నటించాడు. జీవితాన్ని నాటకోద్ధరణ కోసం ధారపోసిన వనారస 1953, డిసెంబరు 17న నటరాజులో ఐక్యమయ్యాడు.

శ్రీ.చ.

గోవింద శాస్త్రి, మల్లాది (1887-1958) : గుంటూరు సెకండ్ కంపెనీలో ప్రధాన నటుడు. ఈయన 1887లో గుంటూరులోని కోటమ్మ, జోగయ్య దంపతులకు జన్మించాడు. మల్లాది అఖండ నటనా చాతుర్యం మూలంగా గుంటూరు సెకండ్ కంపెనీకి అఖండ కీర్తి రావడమే కాక గోవింద శాస్త్రి కంపెనీ అనే పేరు వచ్చింది. అభిప్రాయభేదాలు రావడం వల్ల తరువాత కాలంలో తెనాలిలో స్థిరపడి అక్కడి సమాజాలలో నటించినా, సెకండ్ కంపెనీ గోవింద శాస్త్రి అనే పేరు మాసిపోలేదు. మల్లాది 1917లో విజయవాడలో జరిగిన సత్యహరిశ్చంద్రనాటక పోటీలలో హరిశ్చంద్రకు పతకం గెల్చుకున్నాడు.



గోవిందశాస్త్రి మెట్రిక్యులేషన్ వరకు గుంటూరులో చదివి, నూజివీడులో ఉయ్యూరు రాజావారి దివాణంలో నాలు గేండ్లు ఉద్యోగం చేశాడు. అప్పుడే ఆ దివాణం ఉద్యోగుల నాటకసమాజం ప్రదర్శించిన నాటకంలో మొట్టమొదటగా సరస్వతి పాత్ర ధరించాడు. ఆ తరువాత గుంటూరు వచ్చి సెకండ్ కంపెనీలో చేరి ప్రధాన పాత్రలు నటిస్తూ పేరు తెచ్చుకొన్నాడు, ఆ కంపెనీకి పేరు తెచ్చాడు. ఈయన నాటకాలలో నటించడం ఇష్టం లేక తండ్రి మల్లాదిని ఇంటి నుంచి వెళ్ళ గొట్టాడు. అయినా నాటకకళా సేవ మానుకో లేదు. పైగా పట్టుదల ఎక్కువైంది. ఓ బ్యాంకులో నెలకు రూ.8/- జీతం మీద గుమాస్తాగా చేరాడు. 1910 నాటికి జీతం రూ.15కు పెరిగింది. ఆ సంవత్సరమే వివాహ మైంది.

1920 నాటికి సెకండ్ కంపెనీ ఆర్థికంగా దెబ్బతిని స్తంభించిపోయింది. అప్పుడు గోవింద శాస్త్రి తెనాలి వెళ్ళి 'శ్రీకృష్ణ హిందూ థియేటర్'లో చేరి నాయక పాత్రలలో నటించ సాగాడు.

శ్రావ్యమైన కంఠస్వరం, చక్కటిపాట, గద్య పద్యాలు రెంటినీ రసవత్తరంగా పఠించగల నేర్పరి. పాత్రను విశ్లేషించి చూసి ఆ పాత్ర మర్మాలను తెలుసుకొని తదనుగుణంగా నటించగల కళాకారుడు గోవిందశాస్త్రి. తిరుపతి వేంకటకవుల పాండవ విజయం (రాయబారం, యుద్ధం) ప్రప్రథమంగా రంగస్థలం మీదికి ఎక్కించిన కీర్తి ఈయనదే. అలాగే తిరుపతి వేంకటకవుల పాండవ నాటకాలలో మొట్టమొదటి శ్రీకృష్ణ పాత్రధారి ఈయనే. శ్రీకృష్ణపాత్ర నిర్వహణలో అఖండ కీర్తి కూడా ఈయనకే దక్కింది. తరువాతి శ్రీకృష్ణపాత్రలో నటించే నటులకు మార్గదర్శకమైంది. గుంటూరు ఫస్ట్ కంపెనీ హరిప్రసాదరావుతో ధీటుగా వేషాలు, ముఖ్యంగా సారంగధరుడిగా నటించి కీర్తి గడించిన మహానటుడు గోవింద శాస్త్రి.

నాటక ప్రయోగానికి తగినంతగా సంగీతం పాడేవాడు. సంభాషణలు సహజంగా ఉండేవి.ఈయన శ్రీకృష్ణుడు,

హరిశ్చంద్రుడు, సారంగధరుడు, యముడు, క్రూరసేనుడు, జలంధరుడు, భీమడు, రుక్మాంగదుడు, కంసుడు, హిరణ్యకశిపుడు, కైక, సరస్వతి, కనకవల్లి (మదన విజయం), భారతి (చిత్ర నళీయం) పాత్రలలో నటించాడు. 1936లో గృహాన్ని, గృహిణిని కోల్పోయి నాటకరంగానికి స్వస్తిచెప్పి విజయవాడ చేరుకొని అక్కడ బడిపిల్లలకు ఇంటి దగ్గర చదువు చెపుతూ కాలక్షేపం చేస్తూ 1958, ఫిబ్రవరి 18న కన్నుమూశాడు.

శ్రీ.చ.

గ్రాండ్ గయినాల్ : పాశ్చాత్య రూపక భేదం. ప్యారిస్‌లోని థియేటర్ గ్రాండ్ గయినాల్ నుంచి ఈ నాటక భేదానికి పేరు వచ్చింది. నిజానికి ఈ పదం ఫ్రాన్సులోని కట్టె బమ్మ లాటలోని బమ్మపేరు. ఆ తరువాత ప్రేక్షకులకు గగుర్పాటు కలిగించే హత్యలు, మానభంగాలు, పిశాచ సంచార స్థలాలు మొదలైనవి ఇతివృత్తాలుగా గల నాటక చిత్రానికి ఈ పేరు వచ్చింది.

గ్యాస్ లైట్, డ్యూయట్ ఫర్ టూ హాండ్స్, ఈ రీతి నాటకాలకు మచ్చుతునకలు. ఫ్రెంచి నాటకశాల పక్కన త్వరగా ఆహార్యం మార్చుకోవడానికి, సరిచేసుకోవడానికి అద్దాలు కడుగు తొట్టెలు అమర్చిన గదిని 'గయినాల్' అంటారు.

శ్రీ.చ.

గ్రామీణ నాటకం : శాస్త్ర గ్రంథం. ఆంగ్ల మూలం నోరా రిచర్డ్స్. కళ్యాణ్‌సింగ్ తెలుగులోకి అనువదించిన ఈ గ్రంథం, 1956లో ముద్రణకు నోచుకుంది. గ్రామీణ ప్రాంతాలలో సమాజ వికాసానికి దోహదం చేసే నాటక ప్రయోగ విధానాలను వ్యక్తీకరించే ఉద్దేశంతో రచించిన గ్రంథమిది. ఇందులో పరిచయ వాక్యాలు, నాటక రచన, నాటక ప్రయోగం, నాటకశాల అని నాలుగు భాగాలు. అందరికి అర్థమయ్యే సులభశైలిలో చక్కని ఉదాహరణ చిత్రాలతో నాటక రంగానికి సంబంధించిన వివిధ విషయాల వివరణతో ఈ గ్రంథం శోభిల్లుతోంది.

శ్రీ.చ.

గ్రిల్ పార్జర్, ఫ్రాంజ్ (1791-1872) : ఆస్ట్రియన్ నాటక రచయిత. ఆస్ట్రియాలోని ఫ్రాంజ్ వియెన్నాలో 1791లో జన్మించాడు. తండ్రి ఋణ బాధలతో మరణించాడు. తల్లి సంగీత విద్వాంసుల కుటుంబానికి చెందినది. భర్త మరణించిన పదేళ్లకు ఆమె ఆత్మహత్య చేసు కుంది. వియెన్నా విశ్వ విద్యాలయంలో న్యాయ శాస్త్ర పట్టభద్రుడైన ఫ్రాంజ్ జీవితంలో ఎక్కువ కాలం ప్రభుత్వోద్యోగిగా గడిపాడు.

1817లో ఫ్రాంజ్ సాహిత్య జీవితం ఇతని తొలి విషాదాంత నాటకం డీ ఆన్ ఫ్రాన్ ప్రదర్శనతో ప్రారంభమైంది. తరువాత సంవత్సరంలోనే ఈయన ప్రఖ్యాత రంగస్థల వేదిక హాఫ్‌బర్గ్ థియేటర్‌కు రచయితగా నియమింప బడ్డాడు. సున్నితమైన మనస్సుగల ఫ్రాంజ్ తన జీవితంలో ప్రణయ కలాపాలవల్ల, తన నాటకాల మీది విమర్శల వల్ల, ప్రజల అభిరుచి లోపం వల్ల ఎంతో బాధపడ్డాడు. 1820-21 మధ్య కాథరీనా అనే ఆమెను ప్రేమించినా, పెళ్లి చేసుకోలేక పోయాడు. భగ్నప్రేమికుడిగా మరో రెండు ప్రణయాలలో కూడా తీవ్రమైన బాధకు గురయ్యాడు. ఈయన డైరీలవల్ల, ఇతని పద్య సంకలనం ట్రిస్టియా ఎక్స్‌పేటో (1835) వల్ల ఈ విషయాలు మనకు అవగత మవుతున్నాయి.

విమర్శకు గురై బాధపడడంవల్ల 1830 నుంచి రచనలు తాపీగా చేయడం మొదలుపెట్టాడు. తరువాతి సంవత్సరాలలో ఈయన సంపాదించిన కీర్తి తన సాహిత్య జీవితా రంభంలో పొందిన బాధకు కొంత ఉపశమనాన్ని కలిగించింది. 1861 నాటికి చట్టసభకు ఎన్నికై, తన 80వ జన్మదినోత్సవం దేశం అంతా జరుపుకున్నా, ఫ్రాంజ్ మరణించే నాటికి ఈయన నాటకాలు మూడు ఇంకా అముద్రితాలుగానే మిగిలిపోయాయి. ఫ్రాంజ్ రచనలలో అతని పన్నెండు దుఃఖాంత నాటకాలు, ఒక సుఖాంత నాటకం నాటక ప్రక్రియా వైవిధ్యాన్ని, ఇతివృత్త విభిన్నతను సూచిస్తాయి. గ్రీక్ ఇతిహాసాల నుంచి స్వప్న ఇతివృత్తాంతాల వరకు, భగ్నప్రణయం నుంచి బాధాతప్త జీవనరీతి వరకు అన్నీ చిత్రించ బడ్డాయి.

నాటకంలో సంఘటనలకు సరిపోయిన సంభాషణలు రచించడం ఫ్రాంజ్ రచనలలోని విశిష్టత. పాత్రలు తమ తమ పరిధులలోనే ఉంటూ చివరికి ఎలా విచ్ఛిన్నం అవుతాయో ఈయన రచించిన దుఃఖాంత నాటకాలలో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. 1818లో ప్రదర్శింపబడిన సాఫ్పో అనే నాటకంలో జీవితానికీ, కళకూ గల విభిన్న పరిధులను ప్రతిబింబింప చేశాడు. తల్లి ఆత్మహత్య చేసుకున్న తరువాత రాసిన నాటకం ది గోల్డెన్ ఫ్లీస్ (1821)లో బతుకులో నిరాశ, నిస్పృహ ఎలా ఆవహిస్తాయో చూపిస్తాడు. ది వేవ్స్ ఆఫ్ సీ అండ్ లవ్ అనే దుఃఖాంత నాటకం ఫ్రాంజ్ రచనలన్నింటిలోను తలమానికమైంది.

ఫ్రాంజ్ 1872లో మరణించిన తరువాత అతని అముద్రిత నాటకాలు మూడూ ప్రచురితమయ్యాయి. ఫ్రాంజ్ రచనలలో ఆదర్శవంతమైన ఇతివృత్తాల కన్న సామాజిక స్పృహ, జీవితాన్ని ప్రతిబింబించే ఇతివృత్తం ఎక్కువగా కనిపిస్తాయి.

పప్పు

ఘుమన్, కపూర్‌సింగ్ (1927-85) : ప్రముఖ పంజాబీ నాటకకర్త, దర్శకుడు, నిర్మాత. పాకిస్తాన్‌లోని సియాల్ కోట జిల్లాలోని దుల్భిక్ గ్రామంలో 1927లో జన్మించాడు. పంజాబ్ విశ్వవిద్యా లయంలోను, లాహోర్‌లోను విద్యాభ్యాసం పూర్తి చేశాడు. పట్టభద్రుడై ఉపాధ్యాయవృత్తిలో ఉన్న కపూర్‌సింగ్ పదవీ విరమణ సమయానికి పాటియాల (పంజాబ్) భాషా శాఖ సంచాలకుడుగా, చండీఘర్‌లోని పంజాబ్ స్టేట్ విశ్వవిద్యాలయం పాఠ్యపుస్తక సంఘం అధ్యక్షుడిగా ఉన్నత పదవులను అధిష్ఠించాడు.

కపూర్‌సింగ్ తన శక్తి సామర్థ్యాలను, కలాన్నీ, కాలాన్నీ, యావజ్జీవితాన్ని నాటక రచనకు, దర్శకత్వానికి, రంగస్థల నిర్వహణకు వినియోగించడానడం అక్షరసత్యం. *జియాందీ లాష్, పుత్‌లీఘర్, మానస్ కి ఏక్ జాట్, అతీత్ దీ పర్ఛావే, విస్మద్ నాద్, అజాది దా సుప్నా, నూర్జహాన్, ఉఛాతఖ్త్, లాహోర్ దారోడా జలాలీ* అనే నాటకాలు రచించాడు.

రబ్ దే రంగ్, జలిదార, గల్త్ కీమ్తాన్, దో జోతన్ దో మూర్తన్, కవితే కవిత, కచ్ దీ గజ్జరే, జంగల్‌మాత, ఇస్‌పార్ ఉస్‌పార్, మన్ అంతర్ కీ పీడ్, నరంతర్ ఛల్ దే నాటల్, దో కురియాన్, బెహరాన్ నాటక్ అనే ఏకాంకిక సంకలనాలను ప్రచురించాడు. ఈయన నాటకాలలో కొన్ని జాతీయస్థాయిలో ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యాయి.

పంజాబీలో నాటక రంగాన్నీ, ప్రక్రియనీ విస్తరించేందుకు కృషిచేసిన ప్రముఖుడు. నాటకాలను రచించడమేకాక దర్శకత్వ, నిర్వహణ బాధ్యతలను కూడా చేపట్టాడు. ఈ సందర్భంలో తన కుటుంబ సభ్యులను కూడా ప్రోత్సహించి నాటకరంగంలో ప్రవేశపెట్టాడు. విభిన్న ప్రయోగాలు చేయడం ఈయన అభీష్టం. అచ్చమైన నాటక సంప్రదాయాన్ని జీర్ణించుకుని ఈశ్వర చంద్ర నందా అనే ప్రముఖ పంజాబీ నాటక కర్త శైలినీ, ప్రక్రియనీ ఆకళింపు చేసుకొని నాటకాలను తయారుచేశాడు. జానపద సాహిత్యం ఆధారంగా జానపద సంప్రదాయాలతో నాటకాలను సంతరించాడు. ఈయన రచించిన *రాణి కోక్లాన్, రోడా జలాలీ* నాటకాలు ఈ కోవకి చెందినవి. *పాగల్ లోక్* నాటకానికి సాహిత్య అకాడమీ అవార్డు (1984) లభించింది.

కాంతలక్ష్మి

చంద్రన్న, హెచ్ (జ. 1951): రంగస్థల నటుడు. శ్రీ రాయల నాటక కళాపరిషత్తు నిర్వాహకుడు. కర్నూలు జిల్లా కల్లూరు సమీపంలోని నెరవాడలో హనుమక్క,మారెన్న దంపతులకు 1951 జూన్ ఒకటవ తేదీన జన్మించాడు. చంద్రంగా ప్రసిద్ధుడు. ఉన్నతవిద్య చదువుకున్న చంద్రం 1961లో కురుక్షేత్రం లోని నకులుడు పాత్రతో రంగస్థల జీవితం ప్రారంభించాడు. ఆ తరువాత అభిమన్యుడు, వికర్ణుడు పాత్రలలో నటించాడు. ఈయనకు నాటకరంగంలో గురువులు ఎ. పాండు రంగయ్య, అబ్బూరి వరప్రసాదరావులు. పౌరాణిక నాటకాల పట్ల మక్కువ పెంచుకున్న చంద్రంకు హరిశ్చంద్రుడు, శ్రీకృష్ణుడు పాత్రలు నటుడుగా పేరు తెచ్చి పెట్టాయి. పద్య నాటకాలు విరివిగా ప్రదర్శించి ప్రజలలో పద్య నాటకం పట్ల అభిమానం పెంపొందించడానికి 1980లో ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గ్రామంలో శ్రీ రాయల కళా పరిషత్తును ప్రారంభించాడు. ఈ పరిషత్తు పక్షాన వివిధ సమాజాల ఆహ్వానం మేరకు సత్య హరిశ్చంద్ర, చింతామణి, శ్రీకృష్ణ రాయబారం నాటకాలను విస్తృతంగా ప్రదర్శించాడు. వివిధ కళా వేదికలపై ప్రముఖ నటులు బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, రేబాల రమణ, గూడూరు సావిత్రి, రజనీబాయిలతో కలసి నటించాడు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, బిల్వమంగళుడు పాత్రలలో నటించి ప్రేక్షకుల మెప్పును పొందినప్పటికీ ఈయనకు ఎనలేని కీర్తి తెచ్చి పెట్టింది హరిశ్చంద్రుడి పాత్ర. ఈయన నటించిన సత్యహరిశ్చంద్ర నాటకం చూసిన పద్మశ్రీ శ్రీపాద పినాకపాణి సువర్ణ హస్త కంకణం తొడిగి ఘనంగా సన్మానించాడు. వృత్తిరీత్యా మార్కెట్టు యార్డులో సెలెక్షన్ గ్రేడు కార్యదర్శిగా పని చేస్తున్నా ప్రవృత్తిగా ఎంచుకున్న నాటకరంగమంటే ఆరోప్రాణం.



దాసరి,ఎన్

చంద్రశేఖరం, కొల్లూరి (1903-1943) : విజయనగరం నాట్య అకాడమీ, చింతామణి థియేటర్ (రాజమండ్రి)లో ప్రధాన పాత్రధారి. 'రంగమల్లు' బిరుదాంకితుడు. జంత్రగాత్రాలు రెండింటి లోను సమర్థుడు. ఈయన 1903లో విజయనగరంలో జన్మించాడు. ఈయనకు నటన, సంగీత చాతుర్యం అనువంశికంగా వచ్చాయి. తండ్రి భామాకలాపంలో సత్యభామ పాత్రకు ప్రసిద్ధి కెక్కాడు. చంద్రశేఖరం గాత్ర సాధన కూడా తండ్రి దగ్గరనే. పన్నెండవ ఏట చంద్రశేఖరం తన ఇంటి డాబాపై రాత్రి 12 గంటలకు మోహనరాగం మనోహరంగా పాడుతూంటేవిని విజయ రామ గజపతి ఈయనను తన కోటకు రప్పించి తన ఆస్థానంలోని నాట్య అకాడమీలో నటునిగా చేర్చుకున్నాడు. అదే కొల్లూరి నాటక జీవితానికి నాంది.

1925లో విజయనగరం నాట్య కళాపరిషత్తు పోటీలలో ఈయన అశ్వత్థామ పాత్రలో నటించి పతకం గెల్చుకున్నాడు. ఈయన నటనా చాతుర్యానికి మెచ్చి రాజమండ్రి సత్యవోలు గున్నేశ్వరరావు తన నాటక సమాజంలో చేర్చుకొని ఆదరించాడు. కొల్లూరి ఒకే పద్యాన్ని అనేక రాగాలలో పాడి రక్తి కట్టించగల సమర్థుడు. మోహన, శంకరాభరణం, కల్యాణి, భైరవి, ఆనంద భైరవి, మధ్యమావతి, వసంత, అఠాణ రాగాలంటే ఈయనకు అభిమానం. ఈయన అశ్వత్థామ, నలబాహుకుడు, రాజ సింహుడు, సారంగధరుడు, హరిశ్చంద్రుడు, రుక్మాంగదుడు, వెంగళరాయడు పాత్రలలో నటించి మెప్పు పొందాడు. చంద్ర శేఖరంకు చివరి దశలో మతిచాంచల్యం కలిగి 1943లో దివంగతుడయ్యాడు.



శ్రీ.చ.

చంద్రశేఖరం, వేలూరి (1896-1964) : నాటకకర్త, కవి, సంస్కృతాంధ్ర ఆంగ్లాది బహు భాషా పండితుడు, ప్రకృతి సౌందర్యోపాసకుడు, అరవిందయోగి అనుయాయుడు. ఈయన కృష్ణాజిల్లా చిరివాడలో 1896లో జన్మించాడు.

ఈయన రచించింది ఒకే ఒక వచన నాటకం కాంచనమాల. ఈ నాటకం గ్రీకు మహా నాటకకర్త యురిపిడీస్ రచించిన హిప్పోలిటస్‌నాటకంతో తులతూగేదిగా ప్రసిద్ధి కెక్కింది. దీనిని అమరేంద్ర ఇంగ్లీషులోకి అనువదించాడు. 1938లో ఈ నాటకాన్ని బందరులో ప్రదర్శించడంతో ఆంధ్ర నాటక రచనలో, ప్రయోగంలో నూతన పరిణామం సంభవించింది.

అచలాయతనం (అను. 1921), కాంచనమాల (1939) నాటకాలు వెలువరించిన వేలూరి 1964లో మరణించాడు.

శ్రీ.చ.

చంద్రశేఖర, కంబార (జ.1937) : కవి, నాటకకర్త, సినిమా దర్శకుడు. ఈయన 1937లో కర్ణాటక రాష్ట్రంలోని బెళగాం జిల్లాలో చోడ్‌గెరి గ్రామంలో జన్మించాడు. నాటక శాస్త్రాన్ని అభ్యసించి ఎం.ఏ, పిహెచ్.డి డిగ్రీలను పొందాడు. కొంత కాలం అధ్యాపకుడిగా పని చేశాడు. హంపిలోని కన్నడ విశ్వవిద్యాలయానికి కులపతిగా పనిచేశాడు. ప్రస్తుతం 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' అధ్యక్షుడిగా ఉన్నాడు.

చంద్రశేఖర కంబార 18 నాటకాలు, 5 కవితా సంగ్రహాలు, మూడు వ్యాస సంకలనాలు, 10 పరిశోధనా గ్రంథాలు రచించాడు. ఋష్యశృంగ, జోకుమార స్వామి, జైసివనాయ్క, సిరి సంపెంగ నాటకాలు ప్రసిద్ధమైనవి. సిరి సంపెంగ నాటకానికి 1991లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. మానవుడి అస్తిత్వాన్ని వివిధ కోణాల్లో రంగస్థల ప్రదర్శనలో చూపించే గొప్పనాటకం. ఆధునిక నాటక ప్రయోగాలకు అనువుగా ఉన్న సిరి సంపెంగ నాటకం భారతీయ సాహిత్యంలో గుబాళించే పరిమళం. కన్నడ సాహిత్యానికి, నాటక రంగానికి సేవ చేసిన చంద్రశేఖర కంబార సినీ దర్శకుడుగానే కాకుండా సంగీత దర్శకత్వం కూడా చేపట్టాడు. పలు సంస్థల అవార్డులు, అభినందనలు అందుకున్నాడు. నాటక సాహిత్య వికాసం కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నాడు.



భార్గవీ.

చంద్రశేఖరరావు, విడియాల (1930-1985) : నటుడు, దర్శకుడు, నాటక, నవలా రచయిత. వ్యాసకర్త. ఈయన 1930లో కృష్ణాజిల్లా డోకిపఱ్ఱులో నాగ కోటేశ్వరమ్మ, విడియాల కోటిలింగం దంపతులకు జన్మించాడు. బాల్యం నుంచి ఈయనకు సాహిత్యం, కళలు, అంటే మక్కువ ఎక్కువ. విద్యాభ్యాసం బందరు, తెనాలిలలో జరిగింది. తెనాలిలో విద్యాభ్యాసం చేసే రోజుల్లో మాధవపెద్ది వెంకట్రామయ్య ప్రోత్సాహంతో రంగస్థలంలో నటనా విభాగంలో కొద్దికాలం కృషి చేశాడు. భూలోకంలో యమలోకం లో యముడుపాత్ర విడియాలకు మంచి పేరు తెచ్చిపెట్టింది. వదిన, ఇంటిదీపం, పంగనామాలు, త్రిశంకుస్వర్గం, కాకారాయుళ్ళు అనే నాటికలు, వెండితెర, మూగబొమ్మ తదితర రేడియో నాటకాలు రాశాడు. రంగస్థల కళాకారుల జీవిత విశేషాలను పరిశోధించి నాటకరంగం శీర్షికపేరుతో వివిధ పత్రికల ద్వారా అందించిన విడియాలను ఆనాటి విద్యాశాఖమంత్రి

మండలి వెంకటకృష్ణారావు 'వ్యాసరచనా ప్రవీణ' బిరుదునిచ్చి సత్కరించాడు. బందరులో జీవిత బీమా ఉద్యోగ మిత్రులతో కలసి 'లలిత కళా సమితి'ని స్థాపించి పోటీలు నిర్వహించాడు. కళారంగ సేవచేస్తున్న విడియాల ప్రతిభను గుర్తించి ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా నియమించింది. జీవిత బీమా సంస్థలో పనిచేసిన విడియాల 1985, ఏప్రిల్ 17న పరమపదించాడు.

మన్నెశ్రీ

చకితం : నాయికాలంకారం. చకితమనగా భయం. ప్రియుని ముందు పెద్ద కారణం లేకపోయినా భయపడి తొట్రుపాటు చెందడం చకితం. ఇది నాయికకు అలంకారప్రాయమైన శృంగార చేష్ట.

శ్రీ.చ.

చతురుడు : నాయక భేదం. ఈ చతుర నాయకుడు సుఖ దుఃఖాలు కావడి కుండలని భావించేవాడు. కష్టాలను సహింప గల సమర్థుడు. ప్రణయ కోపం పొందిన స్త్రీని ప్రసన్నురాలను చేసుకోగల నాయకుడు. నాయిక ఇష్టానుసారం ప్రయత్నించే వాడు అర్థిదక్షుడు ఉదా. శ్రీకృష్ణుడు (తులాభారం, రాధాకృష్ణ)

శ్రీ.చ.

చతుర్విధ నాయకులు: సంస్కృత లాక్షణికులు, కథా నాయకుని ధీరోదాత్తుడు, ధీరోద్ధతుడు, ధీరలలితుడు, ధీర శాంతుడు అని నాల్గు రకాలుగా వింగడించారు. అయితే ఈ చతుర్విధనాయకులను విభిన్న వ్యక్తులుగా పరిగణించవలసిన అవసరం లేదు. వయో భేదాన్ని బట్టి మానవుని శిశువు, బాలుడు, కౌమారుడు, యవ్వనుడు, మధ్యవయస్కుడు, వృద్ధుడు అనినట్టే అవస్థా భేదాన్ని బట్టి ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరలలిత, ధీరశాంత నాయకులని అంటారు. ధీరోదాత్త లక్షణాలు ఎక్కువగా ప్రస్ఫుట మైనపుడు ఆ నాయకుడు ధీరోదాత్తుడు. అలాగే ఇతర నాయకుల విషయంలో కూడా వర్తిస్తుంది.

మహావీర చరిత్రలో రాముడు, నాగానంద నాటకంలో జీమూత వాహనుడు ఆయా అవస్థలలో ఆయా నాయకులుగా చిత్రితం కావడం, దీనికి నిదర్శనం.

శ్రీ.చ.

చతుర్విధాభినయాలు : అభినయం నాలుగు విధాలు. 1. ఆంగికం, 2. ఆహార్యం, 3. వాచికం, 4. సాత్త్వికం. (వివరాలకు ఆయా శీర్షికలు చూడండి).

శ్రీ.చ.

చలం, ఆర్.వి (జ.1917) : రంగస్థల నటుడు, రచయిత, ప్రయోక్త. చలన సమితి నిర్వాహకుడు. 1917, నవంబరు 11న శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో చిదంబరం, సీతారామమ్మ దంపతులకు జన్మించాడు. చిన్నప్పుడే తల్లి మరణించడంతో అమ్మమ్మ దొడ్డమ్మ దగ్గరే పెరిగాడు. చలం తండ్రి తపాలాఫీసులో ఉద్యోగి కావడం వల్ల పలు ప్రాంతాలలో విద్యాభ్యాసం సాగింది. చలం ఆరవ తరగతి చదువుతున్న రోజుల్లోనే మందస గ్రామంలో ప్రహ్లాద నాటకంలో ప్రహ్లాదుడు పాత్రలో మొట్టమొదటిసారిగా నటించాడు. కళింగపట్నంలో ఏడవ తరగతిలో పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా చిలకమర్తి రచించిన ప్లీడర్ తమాషా లో ప్లీడర్ గుమాస్తాగా నటించాడు. ఈయనకు నాటకరంగంలో ఆదిగురువు ఎం.కె.ఆర్. దీక్షితులు. నాడు కాకినాడలో కపిలవాయి రామనాథశాస్త్రి ప్రదర్శించిన విప్ర నారాయణ, శ్రీకృష్ణతులాభారం, గయోపాఖ్యానం, రామదాసు, బి.ఎల్. నరసింహారావు అనార్కలి, దొమ్మేటి సూర్యనారాయణ రంగూన్ రౌడీ ప్రదర్శనలు చలంపై చెరగని ముద్రలు వేశాయి. ఇదే కాలంలో నర్సీపట్నంలో కందుకూరి సన్యాసిరావు సమాజం ప్రదర్శించిన వరవిక్రయం నాటకంలో పెళ్లిళ్ల పేరయ్య వంటి కీలకమైన హాస్య పాత్రలో నటించి ఉత్తమ నటుడు అవార్డుతో పాటు నగదు బహుమతి అందుకున్నాడు. షేక్స్పియర్ రచించిన నాటకాలలోని పతాక సన్నివేశాలను ఏకపాత్రలుగా మలచుకొని పలుచోట్ల ప్రదర్శించే సందర్భంలో తెనాలి వెళ్ళాడు. తెనాలిలో చలం ఏకపాత్రాభినయాన్ని చూసిన గోవిందరాజుల సుబ్బారావు షైలాక్, చంద్రగుప్త పాత్రలను కూడా ప్రదర్శించమని చెప్పడంతో తరువాత కాలంలో ఆ పాత్రలను ప్రదర్శించి పలువురి మన్ననలను పొందాడు. ఉద్యోగరీత్యా జంషెడ్‌పూరు వెళ్లినపుడు ఖరగ్‌పూర్, చక్రధర్‌పూర్, టాటానగర్‌లలో ఖిల్జీ రాజ్యపతనం, ఫోర్ రాస్కెల్స్, చంద్రగుప్త నాటకాలను ప్రదర్శించి రాష్ట్రేతర ప్రాంతంలో తెలుగు నాటక కీర్తిని చాటిన నటుడు, దర్శకుడు చలం.



1949లో విజయనగరంలో రాఘవ స్మారక నాటక కళాసమితి నాటక పోటీలలో చంద్రగుప్తనాటకం ప్రదర్శించి ఉత్తమ నటుడు అవార్డును పొందాడు. 1956లో చలన సమితిని స్థాపించి విజయనగరంలో రాఘవ స్మారక నాటక కళా సమితి పోటీలలో విచిత్రజీవులు, ఆత్మార్పణ నాటికలను ప్రదర్శించి బహుమతులు అందుకున్నాడు. ఈ నాటికలు స్వీయ రచన, దర్శక

త్వంలో పలుసార్లు అనేకవేదికల మీద ప్రదర్శించాడు. ఈ రెండు నాటికలే కాకుండా ఉసురు, నియంత పతనం, మాట తప్పకు, మహోదధి, దారితప్పకు, ఇది నాటకం కాదు, అభినేత్రి, విరజాజి వంటి రచలు చేశాడు. ఈ నాటక నాటికలన్నీ స్వీయ దర్శకత్వంలో చలన సమితి పక్షాన అనేక వేదికలపై ప్రదర్శించి ఉత్తమ బహుమతులందుకున్నాడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో మాట తప్పకు విజయవంతంగా ప్రదర్శించడంతో ఎ.పి. నాట్యసంఘం ఉత్సవాలలో ప్రత్యేక ప్రదర్శనగా ఎంపిక చేసి ప్రదర్శించారు. ఈ నాటకాన్ని చూసిన స్థానం నరసింహారావు ఇటువంటి సందేశాత్మక నాటకాన్ని రచించినందుకు రచయితను అభినందించాడు. ఈ నాటకంలో చలం కూతురు సీత కథానాయిక పాత్రలో నటించి ఉత్తమ నటి అవార్డును పొందింది. ఇది నాటకం కాదు ఆహార్యం, రంగాలంకరణ లేకుండా ప్రదర్శింపబడి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న నాటకం. ఈ నాటకాన్ని చిలకలూరిపేట కళా సదస్సు పోటీలలో ప్రదర్శించిన సమయంలో నాటకంలోని మైఖేల్ పాత్ర నాటకాన్ని ప్రదర్శించలేకపోతున్నాం అని అనడంతో ప్రేక్షకులు టికెట్ కొని నాటకం చూడటానికి వచ్చాం అంటూ రంగస్థలం పైకి దూసుకెళ్ళారు. ఇది నాటకంలో ఒక భాగం అని నిర్వాహకులు చెప్పడానికి నానా అవస్థలు పడ్డారు. నాటక ప్రదర్శనలో ప్రేక్షకులు భాగస్వాములు కావడం ఇది నాటకం కాదుకున్న ప్రత్యేకత. చలం స్థాపించిన చలన సమితిలో చలం నలుగురు కుమార్తెలు అల్లుడు, మనుమరాలు సభ్యులే. వీరందరూ నాటక ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. ఆత్రేయ రచించిన భయం నాటకాన్ని హిందీలోకి అనువదించి ప్రదర్శించాడు.

రంగస్థల వికాసం కోసం పాటుపడిన చలంను తెలుగు నాటక శతజయంతి ఉత్సవాల సందర్భంగా కళాసాగర్ సంస్థ (మద్రాసు) ఘనంగా సన్మానిస్తే, ఇండియన్ నేషనల్ థియేటర్ సంస్థ (హైదరాబాద్) చలం షష్ఠిపూర్తి వేడుకలను నిర్వహించింది. యువకళావాహిని డాక్టర్ రాజారావు అవార్డు, జూలూరి వీరేశలింగం కల్చరల్ అవార్డు, కాకతీయ కళాపరిషత్తు నాటక కృషీవలుడు, మద్రాసు తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, ఆచార్య గంగప్ప సాహితీ పురస్కారాలే కాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2003లో నందమూరి తారకరామారావు రంగస్థల పురస్కారం అందుకున్నాడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2005 ధర్మనిధి పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించింది.

దాసరి.ఎస్

చలం, గుడిపాటి వెంకట (1894-1979) : సుప్రసిద్ధ నవలా రచయిత. నాటకకర్త. వ్యాసరచయిత. ఈయన 1894, మే 19న మద్రాసులో జన్మించాడు. తల్లిదండ్రులు కొమ్మూరి వెంకట సుబ్బమ్మ, సాంబశివరావులు. చలం కొమ్మూరి వంశంలో జన్మించినా చిన్నప్పుడే గుడిపాటి వారి దత్తతలో పెరగడం వల్ల గుడిపాటి ఇంటి పేరుగా స్థిరపడింది. తోటవల్లూరు, తెనాలి, కాకినాడ, చెన్నపట్టణం, రాజ మహేంద్రవరంలో విద్యనభ్యసించి బి.ఏ. ఎల్.టి.లు పూర్తి చేశాడు. ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన తరువాత రమణాశ్రమంలో చేరాడు. 1911లో పిఠాపురం మహారాజ కళాశాలలో చదువుతున్నప్పుడు బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు నెలకొల్పిన బ్రహ్మ సమాజం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆంధ్రదేశంలో ఊపందుకున్న సంస్కరణల ప్రభావంతో స్త్రీ స్వేచ్ఛకై కలం పట్టి సాహిత్యంలో విప్లవం సృష్టించి సంచలన రచయితగా పేరు తెచ్చుకొన్నాడు. చలం రచనలన్నింటికి 'స్త్రీ' మూలబిందువు. సనాతనులు ఈయన భావాలను జీర్ణించుకోలేక పోయినప్పటికి నమ్మిన సిద్ధాంతాన్ని రచనలలో పొందుపరచి పాఠక ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక ముద్రను ఏర్పరచుకున్న వ్యక్తి చలం. నవలలు, లేఖలు, వ్యాసాలే కాకుండా పౌరాణిక కథలకు ఆధునిక వ్యాఖ్యానంతో నాటకాలు రచించాడు. ఇవి శ్రవ్య నాటకాలే గాని దృశ్య పరంగా విజయవంతం కాలేదు. *చిత్రాంగి (1921)*, *సావిత్రి (1924)*, *శశాంక (1927)*, *జయదేవ(1937)*, *విడాకులు (1938)*, *పురూరవ (1947)* మొదలైనవి వీరి ప్రసిద్ధ నాటకాలు. *నరసింహావతారం (1951)* నాటిక. చలం చివరి రోజులలో రమణ మహర్షి ఆశ్రమంలో కాలం గడుపుతూ 1979, మే 4న మరణించాడు.



దాసరి.ఎస్

చలపతిరావు, నందిరాజు (1873-1960) : నాటకకర్త, కవి, పత్రికా సంపాదకుడు, 'సాహిత్య భూషణ', 'విద్యారత్న' బిరుదాంకితుడు. ఈయన ఏలూరు నుంచి 'మంజువాణి' అనే పత్రిక నడుపుతూ సారస్వత సేవ చేశాడు. నాటక ప్రక్రియలో సిద్ధహస్తుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో 1873లో జన్మించాడు. నందిరాజు రచించిన *రాజా కళింగగంగు* (1947) తెలుగులో మంచి నాటకాలలో ఒకటి. ఈ నాటకాన్ని కళాశాల తరగతులకు పాఠ్య గ్రంథంగా నిర్ణయించారు. ఈయన *సాహిత్య దర్పణ* మనే లక్షణ గ్రంథం అనువదించాడు. సావిత్రి

(1919), చిత్రాంగి (1932) అనేవి ఈయన ఇతర నాటకాలు. ఆంధ్ర మహాజన సభాకోలాహలం (1918), నాజూకుబిడ్డ (1921) అనే ప్రహసనాలను రచించిన నందిరాజు 1960లో మరణించాడు.

శ్రీ.చ.

చలపతిరావు, వేంకట శేషా అంబటిపూడి (జ.1961): నటుడు, నాటక రచయిత, దర్శకుడు. అంబటిపూడి వెంకట శేషా చలపతిరావు1961లో సూర్యప్రకాశరావు, అన్నపూర్ణమ్మ దంపతులకు ఒంగోలులో జన్మించాడు. 1984–86లో పిజి డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ చేశాడు. ఆ తరువాత శ్రీ మురళీ కళా నిలయంలో నటుడుగా చేరి మహార్ణవం, దొంగలబండి తదితర నాటికల్లో నటించాడు. సుందరం ప్రేరణతో ఈహామృగం నాటకంతో రచయితగా వెలుగులోకొచ్చాడు. ఈ నాటకం పలు పరిషత్తుల్లో ప్రదర్శింపబడి బహుమతులు గెలుచుకుంది. 1992లో తెలుగు విశ్వవిద్యాలయం ఈ నాటకాన్ని ఉత్తమ రచనగా పరిగణించి ఉత్తమ రచయిత అవార్డుకు ఎంపిక చేసింది. చీకటింట్లో నల్లపిల్లి, ఋష్యమూకం, జ్వాలాసమిధలు, *యథా యథాహి ధర్మశ్య,* మూక, *వేయికాళ్ళ జెర్రి* తదితర నాటికల్ని రచించాడు. సంభాషణల శైలిలో ప్రయోగాత్మక రచనలో తనదంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నాడు. కేవలం రంగస్థల ప్రదర్శనలకే పరిమితం కాకుండా పలు వీధి నాటికల్ని కూడా రచించాడు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కోసం రాసిన ప్రస్థానం (ఈ బస్సు మనదిరో) వీధి నాటిక వందలసార్లు ప్రదర్శనలకు నోచుకుంది. రాష్ట్రప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారోద్యమంలో భాగంగా జన్మభూమి, ప్రజల వద్దకు పాలన, ఎయిడ్స్, జల చైతన్యం, వెలుగు వంటి పలు వీధి నాటికల్ని రచించి ప్రజలను చైతన్యపరచాడు. అంతేకాక వినియోగదారుల చైతన్యరథం వీధి నాటికను వినియోగదారుల సంస్థ కోసం రచించాడు. ఈ నాటికను దాదాపు రాష్ట్రం అంతటా పలు కళావేదికలు ప్రదర్శించాయి.

నాటకరంగంలోనే కాక సినిమా, టివి రంగాల్లో కూడా రచయితగా, దర్శకుడిగా రాణించాడు. అఖండ ద్వీపం సీరియల్ పొట్టి శ్రీరాములు, ఆదిశంకరాచార్య, తానీషా కూచిపూడి సందర్శన, 1857 టెలీఫిల్మ్స్‌కు రచన చేశాడు. వీటన్నింటికీ నంది అవార్డులు రావడం విశేషం. అనుబంధం, మూడుముళ్ల ఆట, కొత్త శత్రువు, స్వయంవరం టీవీ సీరియళ్ళకు రచయితగాను, దర్శకుడిగాను వ్యవహరించాడు. ఎం.ఏ. థియేటర్ ఆర్ట్స్ 2000లో పూర్తి చేసిన చలపతిరావు రంగస్థల విద్యార్థులకు, టీవీ, సినిమా మాధ్యమాల్లో శిక్షణ ఇస్తున్నాడు. అనేక రేడియో, టీవీ వాణిజ్య ప్రకటనలను రూపొందించి సమర్పించాడు. గత ఇరవై ఏళ్ళ నుంచి నాటకరంగంలో ఉంటూ స్వయంశక్తితో ప్రత్యేక గుర్తింపు పొందిన చలపతిరావు రాష్ట్ర ప్రభుత్వ దృశ్య శ్రవణ విద్యాకేంద్రంలో ప్రయోక్తగా పని చేస్తున్నాడు.

ప్ర.రె.

చవిట్టు నాడగం : చవిట్టు నాడగం అంటే నృత్య నాటకమని అర్థం. కేరళ ప్రాంతంలోని గానాత్మక నృత్య నాటకం. ఈ నాటకం 16వ శతాబ్దిలో పోర్చుగీసువారి రాకతో ఆరంభమైంది. కేరళ రాష్ట్రంలోని జానపద నాటకాలలోని ప్రధాన అంశాల్ని పాశ్చాత్యుల (ఓపెరా) సంగీత నాటకాలలోని లక్షణాల్ని తనలో ఇముడ్చుకొన్న కళారూపం. కొచ్చిన్ కోటే ఈ నాటకానికి పుట్టినిల్లని పరిశోధకుల అభిప్రాయం. ఆ కోటలోని చిన్నతంబి అణ్ణావిని చవిట్టు నాటక పితామహుడిగా పేర్కొంటారు. పోర్చుగీసువారు కేరళ రాష్ట్రంలోని క్రైస్తవుల్ని పూర్తిగా పాశ్చాత్యీకరణవైపు మరల్చలేకపోయారు. అయినా ఆ రాష్ట్రంలోని లాటిన్ క్రైస్తవులు మాత్రం పోర్చుగీసు, భారతీయ నాటక సంప్రదాయాల కలయికగా ఉద్భవించిన చవిట్టు నాటకాన్ని ప్రదర్శించడానికి అలవాటు చేసుకొన్నారు. కోస్తా, కేరళ రాష్ట్రంలోని చాలామంది కళాకారులు, గురువులు దీన్ని ప్రదర్శించటం ఎక్కువైంది. అనేకులు నాటకాలు రాశారు. కాని కొన్నింటికి వారి పేర్లు లేవు. జేసుతచ్చన్ (ఏసు సేవకుడు), మరియతచ్చన్ (మరియ సేవకుడు) వంటి పేర్లతో ఈ నాటకాలు రాసేవారు చాలామంది ఉండేవారు.

చవిట్టు నాటకం శిక్షణ మైదాన ప్రాంతాలలోను, వ్యాయామశాలల్లోను జరిగేది. ఈ శిక్షణ అవసరాన్ని బట్టి కొన్ని సంవత్సరాలు కూడా తీసుకొనేది. చవిట్టు నాటకంలో యుద్ధ దృశ్యాల శిక్షణకు ఎక్కువ సమయం తీసుకొనేది. పూర్వం శరీర వ్యాయామం, కత్తిసాము వంటి శిక్షణ పూర్తి చేసినవారికి మాత్రమే చవిట్టు నాటకంలో ప్రధాన పాత్రలు ధరించడానికి వీలుండేది. పాత్రలకు సరిపడే సంభాషణలు, పాటల్ని నేర్చుకొన్న తర్వాత ఒద్దికలు (reharsal) పెట్టేవారు. ప్రతిరోజు ఈ శిక్షణ ఉండేది. గురువును ఎనలేని గౌరవాదరాభిమానాలతో చూచుకొనేవారు. శిక్షణ సమయంలో ఆ గురువుకు శిష్యులో లేక ఆ ఊరి పెద్దో జీతభత్యాల్ని చూచుకొనేవారు. గురువును అణ్ణావి లేక ఆసాన్ అనేవారు. ఈయన పాటలు, నటన, సంభాషణ, కథ, కత్తిసాము వగైరా విషయాలలోను, సాహిత్యపరంగా గొప్ప నిష్ణాతుడై ఉండాలి. సర్వసాధారణంగా చవిట్టు నాటకం శిక్షణ రాత్రుల్లో ఉండేది. ఆ శిక్షణకు తప్పనిసరిగా నిలవిళక్కు (దీపం), కురిసు (శిలువ) ముందు పెట్టుకొనేవారు. ఈ శిక్షణ కాలాన్ని వారు కొల్లియాట్టం అంటారు.

చవిట్టు నాటకంలో పాల్గన దలచిన శిష్యుల ఎంపిక చాలా సంప్రదాయసిద్ధంగా జరుగుతుంది. మొదటిసారి స్వరపరీక్ష, నాట్య సామర్థ్యం, శరీర సౌష్టవం మొదలైన వాటిని

చూచిన తరువాతే వారి ఎంపిక జరుగుతుంది. కళరి (నాట్యశాల) దగ్గరకి చేరిన పెద్దలు, గురువు (అణ్ణావి) ముందుంచిన నిల విళక్కు (దీపం), కురిసు (శిలువ) ముందు ఈ ఎంపిక జరుగుతుంది. ప్రతి శిష్యుడు వయాడు తమలపాకుల్లో ఒక రూపాయి డబ్బును పెట్టి గురువు పాదాలకు మ్రొక్కి, తరువాత ఆతని మూర్ధన్యాన్ని, రొమ్ముల్ని కూడా తాకి మ్రొక్కిన తరువాత గురువు అతన్ని ఆశీర్వదించి తన శిష్యుడిగా చేర్చుకుంటాడు. ఈ చేర్చుకున్న శిష్యులు వారికిచ్చిన పాత్రలకు సరిపడే అంశాల్లో శిక్షణను పూర్తి చేసిన తరువాత అరంగేట్రానికి ముహూర్తం పెడతారు.

చవిట్టు నాటకాన్ని సర్వసాధారణంగా చర్చి ప్రాంగణంలోనో లేక ఓ మైదాన ప్రాంతంలోనో ఏర్పాటు చేస్తాం. సర్వసాధారణంగా ఎనిమిది అడుగుల ఎత్తులో ఈ రంగస్థలాన్ని ఏర్పాటు చేస్తారు. పొడవు దాదాపు 30 నుంచి 100 అడుగుల వరకుంటుంది. కాని వెడల్పు మాత్రం తక్కువగా ఉంటుంది. అంతా దాదాపు 30, 40 మంది నటులు నటించడానికి వీలుగా, ముఖ్యంగా యుద్ధ దృశ్యాల్ని చిత్రించడానికి అనువుగా ఈ రంగస్థలాన్ని అలంకరిస్తారు. సర్వసాధారణంగా తెరలు ఉండవు. పాత్రల ప్రవేశ నిష్క్రమణలకు అనువుగా రెండు ద్వారాలు ఉంటాయి.

చవిట్టు నాటకంలో ఆహార్యం చాలా ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటుంది. వారు ధరించే దుస్తులు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. ఐరోపా దేశానికి చెందిన చక్రవర్తులు, రాజులు ఇందులో పాత్రలు కనుక వారికి తగిన రీతిలో ఈ దుష్తులు ఉంటాయి. ఈ దుస్తులు వాస్తవికతకు అద్దం పడుతుంటాయి. రాచరికపు వ్యవస్థకు తడిగోట్లు సింహాసనాదుల్ని తయారు చేస్తారు. నెమలిఫించాలతో 'ఆలవట్టు' అనే వింజామరను ముత్యాలతో అలంకరించిన 'వెంరుకుట్టై' అనే గొడుగుల్ని, సెయింట్ థామస్ క్రైస్తవుల్లో వారి ఉత్సవాలలో ఇలాంటి గొడుగుల్ని ఉపయోగిస్తుంటారు. ఇప్పటికి గోతురుత్తు చవిట్టు నాడగం ట్రూప్‌లోని వారు ఈవిధమైన గొడుగుల్ని ఉపయోగిస్తున్నారు. సైనిక వేషధారులు గ్రీకు రోమను సైనికుల్లా వేషం ధరిస్తారు. మొత్తం మీద వీరి దుస్తులు చాలా విలువైనవి ఉంటాయి.

చవిట్టు నాడగంలోని వస్తువుల్ని చువటీస్ అంటారు. దాదాపు 50 నాటకాల్ని వీరు ప్రదర్శిస్తున్నారు. వీటిలో కారళమాన్ చరితం మొదటిది. ఇందులోని భాషతమిళమో లేక మలయాళమో అవుతుంది. వీటి ప్రదర్శనకు దాదాపు వంద మంది పదిహేను రాత్రులు ప్రదర్శించేవారు. దీనిని చిన్నతంబి పిళ్ళై అనే ఓ ప్రసిద్ధ తమిళకవి రాసినట్లు చెబుతారు. ఇది తాళపత్రాల్లో రాయబడింది. ఈ నాటకాల్లో చరిత్ర, బైబిలు, మత, సాంఘి కాలకు సంబంధించినవే కాక హైందవ చరిత్ర, దర్శనాలకు సంబంధించినవి ఉంటాయి. వాటిలో కారల్‌మాన్ నాడగం, రాబర్టు చరితం, నెపోలియన్ నాడగం, అబ్రహం నాడగం, తిరువస్త్రం, దావీదు విజయం, నికోలస్ నాడగం, అల్లేసు నాడగం, కనకబాలన్, వనబాలన్, వల్సకుమారి, అక్బరు, అనార్కలి, చంద్రగుప్తన్ వంటివి కొన్ని నాటకాల్ని పేర్కొనవచ్చు.

చవిట్టు నాడగం సంగీత రూపకం కాబట్టి ప్రతి నటుడు పాడటం, ఆడటంలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. సర్వసాధారణంగా ఇందులో వచనమే ఉండదు. భారతీయ సంగీత సంప్రదాయానుసారం పాటులు పాడుతారు. ఇందులో ప్రాంతీయ పెళ్ళి పాటలు కూడా చోటు చేసుకోవడం పేర్కొనదగిన అంశం. తమిళ తెరుక్కుత్తు పాటలు కూడా ఇందులో చోటు చేసుకొంటాయి. ఈ నాటకంలో తమిళంలోని జానపద, సంప్రదాయ సంగీత ప్రభావం ఎక్కువగా ఉండడం గమనార్హం. ముఖ్యంగా కావడి, చిందు, కుమ్మి కోలాటం, అమ్మానై వంటివి ఉన్నాయి. యుద్ధ సన్నివేశాలకు చెందిన పోర్టరు పాటలు మాత్రం పాశ్చాత్య సంప్రదాయాన్ని అనుసరించి ఉంటాయి. ఆయా పాత్రల్ని ధరించినవారు మొదట పాడితే వారిననుసరించి తెర వెనక ఉన్న ఇతరులు ఆ పాట పాదాన్ని తిరిగి పాడుతారు. ఇది జానపద నాటకాల్లో ఉన్న పద్ధతి.

ఇందులో చండ, పెలత్తాళం, మద్దాలం, డోలకీ, జాతర వంటి భారతీయ వాద్యాలు, కిట్టెల్ డ్రమ్, సంభాలే వంటి పాశ్చాత్య వాద్యాల్ని ఉపయోగిస్తారు. ఫిడేలు, క్లారినెట్, హార్మోనియం, బుబుల్ తారలను కూడా ఉపయోగిస్తారు.

చవిట్టు నాడగం 17, 18, 19 శతాబ్దాలలో చాలా ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్న కళారూపం. కాని 20వ శతాబ్దంలో ఇది చాలా వెనకపడిపోయింది. వి.జి. జాన్, తోట్టగం జోసఫ్ వంటివారు క్రైస్తవ వృత్తాలనే కాక హరిశ్చంద్ర వంటి హైందవ ఇతివృత్తాలకు సంబంధించిన నాటకాల్ని రాశారు. కేరళ కళాసమితి వారు హరిశ్చంద్ర, అక్బరు వంటి మలయాళ నాటకాల్ని చాలా విజయవంతంగా ప్రదర్శించారు.

సచీనారాఫే అభిప్రాయం ప్రకారం 1969 నాటికి దాదాపు 50 కేంద్రాల్ని ఈ చవిట్టు నాటకాల్ని ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. కాని 1984 నాటికి ఇవి అంతరించాయి. ప్రస్తుతం ఈ నాటకాల్ని ప్రదర్శించేవారు చాలా తక్కువ. అంటే దాదాపు ఈ కళారూపం మరుగునపడిపోతూ ఉంది.

ఆనందన్

చాపల్యం : వ్యభిచారీభావం. రాగ ద్వేష మాత్సర్యాదుల వల్ల జనించిన మనోచాంచల్యమే చాపల్యం.

మాత్సర్య ద్వేష రాగా దేశ్చాపం త్వనవస్థితిః
తత్ర భర్త్సన పారుష్య స్వచ్ఛందా చరణా దయః
(ద.రూ. 4-33)

అనాలోచిత ఆలింగనం, అవలంబనం, ఉక్తిపారుష్యం, తాడనం, ఆనతి, స్వేచ్ఛా ప్రవర్తనం దీని అనుభావాలు.

రాగ చాపల్యం : అనురాగం వల్ల కలిగే అస్థిరత. చతుర్థాంకంలో జనక కౌసల్యలకు లవ కుమారుని మీది అనురాగంవల్ల మనో చాంచల్యం కలగడం.

ద్వేష చాపల్యం: ద్వేషంవల్ల కలిగే అస్థిరత. ఉదా. బాల రామాయణం పంచమాంకంలో మన్మథ తాపానికి రావణుడు మన్మథాదుల మీద ద్వేషంతో పలికే పలుకులు.

మాత్సర్య చాపల్యం: మాత్సర్యంవల్ల కలిగే అస్థిరత. ఉత్తర రామచరిత్ర చతుర్థాంకంలో యాగాశ్వానికి కట్టిన పట్టం చదవగా విని మాత్సర్యానికి లోనైన లవుడి స్థితి.

శ్రీ.చ.

చింతామణి నాటక సమాజం : ఈ నాటక సమాజాన్ని 1912లో సత్యవోలు గున్నేశ్వరరావు రాజమండ్రిలో స్థాపించాడు. ప్రధాన నటులు నిడసనమెట్ల కొండలరావు, బ్రహ్మజోస్యుల సుబ్బా రావు, వద్దాది శేషగిరిరావు, ముప్పిడి జగ్గరాజు.

రాజమండ్రి హిందూ నాటక సమాజం నుంచి చీలిపోయిన సమాజం గున్నేశ్వరరావు స్థాపించడంవల్ల దీనికి గున్నేశ్వరరావు నాటక సమాజమని పేరొచ్చింది. పెద్ద ఎత్తున వ్యాపార సరళిలో నడిచిన సమాజం. బొంబాయి నుంచి 'రాం' అనే చిత్రకారుణ్ణి పిలిపించి బ్రహ్మాండమైన సీనరీలు రాయించారు. కర్ణాటక హిందూస్తానీ సంగీత విద్వాంసుడు పాపట్ల కాంతయ్యని పిలిపించి మొదటిసారిగా హిందూస్తానీ మెట్లను తెలుగు నాటక రంగం మీద ప్రవేశపెట్టారు. సొంత నాటకశాల కట్టించుకుని నాటకాలు బహు కట్టుదిట్టంగా ప్రదర్శించారు. తెలుగు నాటక రంగ చరిత్ర కొత్త మలుపుకు ఈ సమాజమే మూలం. ఈ సమాజం గున్నేశ్వరరావు మరణపర్యంతం అంటే 1927 వరకు నడిచింది. ఆ తరువాత మూతపడింది. శశిరేఖా పరిణయం, సిరియాళ, హరిశ్చంద్ర, గయోపాఖ్యానం, రామనాటకాలు, పాండవ నాటకాలు, చిత్ర నళీయం వంటి నాటకాలను ప్రదర్శించారు.

శ్రీ.చ.

చిందు భాగవతం : 'చిందు' అంటే అడుగు అని అర్థం. అడుగు హావ భావయుక్తంతో అభినయం, ప్రధానంగా ఉంటుంది కాబట్టి దీనికి చిందు భాగవతం అనే పేరు వచ్చింది. దీనిని చిందు యక్షగానం అని కూడా అంటారు. ఈ నాటకం లేదా యక్షగానం నల్గండ, మెదక్, వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ప్రచారంలో ఉంది. మాదిగ కులస్థులను ఆశ్రయించి జీవించే చిందోళ్ళు దీనిని ప్రచారంలోకి తెచ్చారు. తెలుగువారు ఒక విశిష్ట తెగగా ఏర్పడినప్పటి నుంచి ఈ కళారూపం ప్రచారంలో ఉంది. ఏ కళారూపంలో లేనివిధంగా ఈ కళారూపంలో స్త్రీల పాత్రలు ఎక్కువగా ఉంటాయి. స్త్రీలు కూడా వేషం వేసి ప్రదర్శనలో పాల్గొంటారు.

చిందోళ్ళు ఎక్కువగా జాంబపురాణం ప్రదర్శిస్తూ ఉంటారు. మాదిగలు జాంబవంతుని సంతానమని చెప్పుకుంటూ ఉంటారు. అందుకే ఇది కులపురాణంగా ప్రసిద్ధికెక్కింది. జాంబపురాణం ప్రదర్శన చివర ఎల్లమ్మ వేషం తప్పనిసరిగా ఉంటుంది. ఇందులో స్త్రీ వేషాన్ని పురుషులు, మగవేషాన్ని ఆడవాళ్ళు ధరించడం చెప్పుకోదగిన విశేషం. ఈ చిందు యక్షగానాన్ని అనేకులు అనేక రకాలుగా ప్రచారంలోకి తీసుకొచ్చినా కొందరి పేర్లు చిరస్థాయిగా గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది. వారిలో చిందు పిల్లిట్ల వెంకయ్య చెప్పుకోదగిన వాడు. ఈయన నల్గండ జిల్లా యక్షగాన పితామహుడిగా గుర్తింపబడ్డాడు. చిందోళ్ళల్లో గొప్ప కళాకారిణి ఎల్లమ్మ. స్త్రీ పాత్రల్ని ఎంత సమర్థవంతంగా ప్రదర్శించగలదో, పురుషపాత్రల్ని అంతే సమర్థవంతంగా పోషించగలదు. స్త్రీలు మాత్రమే ప్రధానంగా వంత పాటలో పాల్గొంటారు. వీరు తమ ప్రదర్శనల్ని పగటిపూటే ఎక్కువగా ప్రదర్శిస్తుంటారు. వీరు ఒక వీధి కూడలిలో బెంచీలు వేసి చిన్న రంగస్థలం ఏర్పాటు చేసుకుంటారు. ఆ రంగస్థలంపైనే ఇతర జానపద నాటకాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా వీరు హావభావాల్ని ప్రదర్శిస్తూ, చిందులు తొక్కుతూ జానపదుల్ని ఆకట్టుకొంటారు.

చిందోళ్ళు వారి అలంకరణ సామగ్రిని వారే తయారు చేసుకోవడంలో సిద్ధహస్తులు. ఒక్కో వేషానికి అలంకరణ సామగ్రిని తయారు చేసుకోడానికి కొన్ని నెలల సమయం కూడా తీసుకుంటుందని అంటారు. వీరి అలంకరణ చాలా ఆకర్షణీయంగా ఉంటూ అందరినీ ఆకట్టుకుంటుంది. ఏ నాటకంలో లేనివిధంగా ఈ నాటకంలోని హాస్యగాడు బుడ్డరఖాన్ ఆహార్యంలో ప్రత్యేకతను కలిగి ఉంటాడు. అందరు వేషగాళ్లలాగే ఇతడు కూడా కిరీటం ధరిస్తాడు. దాన్ని సూర్యకిరీటం అంటారు. ఇతడు ఇతర జానపద నాటకాల వలె మధ్యమధ్య హాస్యాన్ని పోషిస్తూ ఉంటాడు.

చిందు భాగవతులు మోహినీ రుక్మాంగద, సారంగధర, చెంచులక్ష్మి, వీరాభిమన్యు, సుందరకాండ, సతీసావిత్రి, మైరావణ,

భక్తప్రహ్లాద, *సత్యహరిశ్చంద్ర*, *అల్లిరాణి*, *గంగా గౌరీ* సంవాదం, *బాలనాగమ్మ* వంటి ముప్ఫై యక్షగానాల్ని ప్రదర్శిస్తారు. వీటిలో కాంభోజి, ఆసావేరి, మోహన, శోభరవళి వంటి రాగాలు, రూపకం, ఆది, జుల్వ, త్రిపుట వంటి తాళాలు ఉపయోగిస్తారు. జట్టులోని అందరికీ ఈ రాగాలతో పరిచయం ఉండడం విశేషం.

చిందు యక్షగానాన్ని ప్రదర్శించేవారు నిజామాబాద్ జిల్లాలో సుమారు ఏభై దళాలుంటారు. వారిలో చిందుల ఎల్లమ్మ బృందం, చిందుల శ్యాం బృందం, చిందుల గోపాల్ బృందం పేర్కొనదగినవి.

ఆనందన్

చికమట్సు మోన్జాయెమోన్ (1653-1725): సుప్రసిద్ధుడైన జపనీస్ నాటక కర్త. అసలు పేరు సుగిమోరీ నోబ్యుమోరీ. దాదాపు 160 నాటకాలను రచించాడని పరిశోధకులు లెక్క తేల్చారు. వాటిలో ఎక్కువ భాగం 'బున్‌రాకు' **(Bunraku)** అనబడే తోలుబమ్మల నాటకాల కోసం రాసినవి. చికమట్సుకు ముందు తోలుబమ్మల నాటకాల కోసం కొందరు రచయితలు తోలుబమ్మలను ఆడించే వారి ఇష్టానిష్టాలకూ, శక్తియుక్తులకూ అనుగుణంగా చౌకబారు రచనలు చేస్తూ ఉండేవారు. చికమట్సు మొట్టమొదటిసారిగా కళాత్మకమైన విలువలు గల నాటకాలు రాశాడు.

ఆయన నాటకాలను చారిత్రకాలు, సాంసారిక విషాదాంతాలు అని రెండు వర్గాలుగా విభజించుకోవచ్చు. ఆధునిక విమర్శకులు రెండవ వర్గం నాటకాలనే ఎక్కువగా మెచ్చుకుంటున్నారు. అందుకు కారణం వాటిలో వాస్తవికత ఎక్కువగా ఉండడం, పాశ్చాత్య నాటక సిద్ధాంతాలకు అవి మరింత చేరువగా ఉండడం. 1738లో మిత్రుడొకడు రచించిన నానివా మియాగె అనే గ్రంథంలో తోలుబమ్మల నాటకాలను గురించిన చికమట్సు అభిప్రాయాలు ఉదహరించబడ్డాయి. ఒకచోట చికమట్సు "వాస్తవికానికీ, అవాస్తవికానికీ మధ్య ఉన్న అతి సూక్ష్మమైన సరిహద్దు రేఖలో నిజమైన కళ ఇమిడి ఉంది" అనంటాడు. తన నాటకరచనలో కూడా నాడు ప్రచారంలో ఉన్న అసందర్భపు అతిశయోక్తులకూ, కొత్తగా వాడుకలోకి వస్తున్న వాస్తవిక చిత్రణలకూ మధ్యస్థంగా అతి నేర్పుగా రచన సాగించాడు. 'బసాకా' నగరంలో జీవిస్తున్న వర్తకులు, గృహిణులు, దొంగలు, వేశ్యలు మొదలైనవారంతా చికమట్సు సాంసారిక విషాదాంత నాటకాలలో మనకు దర్శనమిస్తారు.

ఈయన రచనలలో అధిక ప్రజాదరణ పొందింది కోకుసేన్యా కస్సేన్ (కోక్సింగా యుద్ధాలు 1715). చైనాలో మింగ్ రాజవంశ పాలనను పునఃప్రతిష్ఠించాలని చూసిన ఒక సాహసికుణ్ణి గురించిన చారిత్రాత్మక నాటకం అది. మరొక ప్రముఖ రచన షింజూ తెన్ నో అమిజిమా (1720, అమిజిమా ఆత్మహత్య). ఈ నాటకం నేటికీ తరచు ప్రదర్శించబడుతూంది. 1725, జనవరి 6న 'బసాకా' నగరంలో చికమట్సు మరణించాడు.

బ.శ్రీ.

చిత్రాభినయం : అభినయ భేదం. బాహ్యవస్తువులకు సంబంధించిన అభినయమే చిత్రాభినయం. ఈ అభినయ విశేషం చిత్రమయింది కాబట్టి దీనికి చిత్రాభినయమని పేరు వచ్చింది. ప్రభాతం, గగనం, రాత్రి, ప్రదోషం, పగలు, ఋతువు, మేఘం, దిశలు, నక్షత్రం మొదలైన ఆకాశ వస్తువులు; భూమిపై ఉన్న పర్వత, సింహ, వన, వ్యాఘ్రాదులను, త్రిమూర్తులు మొదలైన దేవతా గణాలను, మలయానిలాదులను సూచించడానికి కొన్ని హస్తాలను భరతముని నిర్దేశించాడు. ఈ హస్తాలను, వాటికి అనుగుణమైన శిరోభేదాలను ప్రదిర్శించడమే చిత్రాభినయం. ఈ చిత్రాభినయం స్థలాభినయంలో కంటే ప్రతి పదాభినయంలో ఎక్కువగా ఉపయోగపడుతుంది.

శ్రీ.చ.

చిన్నరామయ్య, వనారస : సురభి నటుడు, ప్రయోక్త, చిత్రకారుడు, నాటక కళా విశారద బిరుదాంకితుడు. పెంపుడు తండ్రి కృష్ణాజీ. వనారస చినరామయ్య శ్రీ శారదా మనో వినోదినీ నాటక సభలో ప్రధాన పాత్రధారి. చిన్నతనం నుంచీ స్త్రీ పురుష పాత్రలలో నటిస్తూ, 1919 నుంచీ వనారస గోవిందరావుకు నాటక ప్రయోగంలో అండగా నిలిచాడు.

కాంతామణి నాటకంలో 'దొంగ' వేషానికి బహు ప్రసిద్ధిపొంది "దొంగరాముడు" అనే పేరు తెచ్చుకొన్నాడు. చిన్నరామయ్య సలహా మేరకే గోవిందరావు స్వంత డేరా నిర్మించాడు. మల్లాది విశ్వనాథశర్మ రచించిన వసంతసేన నాటకానికి దర్శకత్వం వహించి రమణీయంగా ప్రదర్శించాడు. ఆ తరువాత కాలంలో కొత్త కొత్త నాటకాలు రాయించాడు. 1929లో గోవిందరావుతో విడిపోయాడు. రావణుడు, యముడు, శకారుడు, క్రూరసేనుడు, దొంగ, సత్యభామ, మాతంగకన్య, కలహకంఠి మొదలైన పాత్రలలో నటించాడు.

శ్రీ.చ.

చిరంజీవి, కె. (1935) : నాటక, నవలా రచయిత, మానవతావాది. ఈయన 1935, మార్చి 18న గుంటూరు జిల్లాలోని ఒక రైతు కుటుంబంలో జన్మించాడు. తల్లితండ్రులు రామమ్మ, రామదాసు. కొంతకాలం వారపత్రిక 'నవశక్తి' లోనూ, మాస పత్రిక 'యువ' లోను పనిచేశాడు. ఆ తరువాత ఆకాశ వాణిలో స్టాఫ్ అసిస్టెంటుగా 1993 వరకు పని చేశాడు. రేడియో నాటకం ఎలా రాయాలి, ఎలా చేయాలి అనే విషయం ఆయన ఆధ్వర్యంలో ప్రసారమైన నాటకాలే నిదర్శనం. తన రచనలలో ప్రతి మాటకి ప్రతి సన్నివేశానికి ఓ ప్రాముఖ్యతను సంతరింప చేసిన వ్యక్తి. రేడియో రంగస్థల ప్రదర్శనలలో మేటి నటులు కీ.శే. లక్ష్మీపతి, నండూరి మురళీకృష్ణ, డి. రాజేశ్వరరావు, రవీంద్రరెడ్డి, బెనర్జీ,

శారదా శ్రీనివాసన్ తదితరులు పాల్గని నాటకాలని విజయవంతం చేశారు.

చిరంజీవి రచించిన నాటకాలలో (కొక్కొరకో, ఇక్కడ *పెళ్ళి చేయబడును, ఆకలి మందు, మహా నిష్క్రమణం*) భారతీయ భాషలన్నింటిలోనూ తర్జుమా చేయబడి రేడియోలో జాతీయ నాటక కార్యక్రమంలో ప్రసారం చేయబడ్డాయి. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహింపబడే 'ఏషియెా-పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రాడ్ కాస్ట్ డెవలప్‌మెంట్' సంస్థ ఆయన రచించిన ఆకలి మందు నాటికను ఒక 'నమూనా రేడియో నాటకం'గా వాడుకుంటున్నవి. 'రేడియో నాటికలు' గ్రంథానికి 1980లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నాటక సంకలనం బహుమతికి ఎంపికైంది.

చిరంజీవి రంచించిన నాటకాలలో – *నర్తనబాల, నీలిదీపాలు, సోనార్ బాంగ్లా, శ్రీకృష్ణ శిరోభారం, వంశాంకురం, బీళ్ళు తిరగబడుతున్నాయి, కాలయంత్రం, ఆకలి మందు, మహా నిష్క్రమణం* ఎక్కువ ప్రజాదరణ పొందినవి. మహా నిష్క్రమణం నాటకానికి జాతీయస్థాయిలో ఆకాశవాణి అవార్డు లభించింది.

ప్రజలలో చైతన్యాన్ని కలిగించే దిశగా నాటకాలు రచించి, వాటిని రంగస్థలం, రేడియో మాధ్యమాల ద్వారా ప్రజల దగ్గరకు తీసుకుపోవడంలో చిరంజీవి కృషి ఎన్నదగినది.

రవీంద్ర

చిరంజీవి, నార్ల (1925-71) : నాటకకర్త, కవి, కథకుడు, సినీ, రేడియో రచయిత. సంస్కృతాంధ్ర భాషా ప్రవీణుడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. కృష్ణాజిల్లా కాటూరులో 1925, మే ఒకటో తేదీన జన్మించాడు. ఏలూరు వెళ్ళి వైద్యశాస్త్రం, ఛందోశాస్త్రం అభ్యసించాడు. శ్రీకాళహస్తి సమీపంలోని ఏర్పేడు ఆశ్రమంలో ఉన్నప్పుడు బుద్ధచరిత వంటి సంప్రదాయ రచనలు చేశాడు. సామాజిక ఉద్యమాలు గమనించిన చిరంజీవి ప్రజా ఉద్యమాలలో పాల్గన్నాడు. విప్లవాత్మ పేరుతో గేయ సంపుటి వెలువరించాడు. బడిపంతులు పేరున నాటికల సంపుటి ప్రచురించాడు. చిన్నపిల్లల సాహిత్యం వెలువరించిన ప్రముఖుల సరసన చోటు సంపాదించుకున్న చిరస్మరణీయుడు. కథలు, నవలలు, వ్యాసాలు వెలువరించిన చిరంజీవి హైదరాబాద్ నగర చరిత్ర ఇతివృత్తాన్ని తీసుకుని భాగ్యనగరం (1971) నాటకాన్ని రచించాడు. ఈ నాటకం ప్రేక్షకుల మన్ననలతో పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును తెచ్చిపెట్టింది. బడిపంతులు, అద్దం *తిరిగింది, నౌకాభంగం, పునరాగమనం,* స్త్రీ మొదలైన నాటికలను 1955లో రచించాడు. వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేపట్టడమే కాకుండా విశాలాంధ్ర దినపత్రికలో పనిచేసే కాలంలో విలువైన వ్యాసాలను వెలువరించాడు. అలుపెరుగని సాహితీసేవచేసిన నార్ల చిరంజీవి 1971, అక్టోబర్ 16న మరణించాడు.

దాసరి.ఎస్.

చూళిక : అర్థోపక్షేపకం: తెర లోపల పాత్ర ఒకానొక విషయం సూచించడం చూళిక. దీనికి చూడ అని కూడా పేరు. చూళికను సూత వందిమాగధాది నీచ పాత్రలతో ప్రయోగింపచేయాలని కోహలుని మతం. **(భా.ప్ర. 7-426)**

దీనిని అంకా **రంభంలో,అంకమధ్యంలో** ప్రయోగించాలని శారదాతనయ మతం. (చూళికాయాః క్వచిత్ బాహ్యే, క్వచిన్మధ్యే నివేశనమ్) కాని సంస్కృత నాటకకర్తలు వందిమాగధాదులతోనే గాక భీముడు (వేణీ సంహారం) లాంటి ఉత్తమపాత్రలతో కూడా ప్రయోగింపచేయడం వల్ల అన్ని రకాల పాత్రలతో చూళికను ప్రయోగింపవచ్చునని తరువాతి అలంకారికుల అభిప్రాయం. చూళిక ప్రధానంగా మూడు విధాలు : 1. పూర్ణ చూళిక 2. ఖండ చూళిక 3. మిశ్రమ చూళిక. సంస్కృతాలంకారికులు మిశ్రమచూళికను చెప్పలేదు గాని కొన్ని సంస్కృతాంధ్ర నాటకాలలో మిశ్రమ చూళిక కనిపిస్తోంది.

శ్రీ.చ.

చెఖోవ్, ఆంటోనిన్ (1860-1904) : రష్యన్ నాటకకర్త. వృత్తిరీత్యా వైద్యుడు. సామాన్య కుటుంబంలో పుట్టినా మాస్కో విశ్వవిద్యాలయంలో వైద్యశాస్త్రంలో 1884లో పట్టా పొందాడు.

ఆనాడు ప్రజాభిమానం చూరగొంటున్న ఫ్రెంచి ప్రహసనాల రీతిలో రష్యన్ వాతావరణంతో ప్రహసనాలు రచించాడు. ఆ తరువాత వరుసగా పెద్ద నాటకాలు రాశాడు గాని, అవేవీ రంగస్థలం మీద విజయవంతం కాలేదు. చివరకు ఈయన రచించిన సుప్రసిద్ధనాటకం "నీటికాకి" (Seagull) కూడా విజయ వంతంగా ప్రదర్శింపబడక పోవడంతో చెఖోవ్

నాటక రచనకు శ్రీముఖం చుట్టా లనుకున్నాడు. కానీఇంతలో మాస్కో ఆర్ట్‌థియేటర్‌వారు సీగల్ నాటకం పునరుద్ధరించి విజయవంతంగా ప్రదర్శించడంతో తిరిగి ధైర్యం తెచ్చుకొని పెద్ద నాటకాలు రాసి చెఖోవ్ ఖ్యాతి గాంచాడు.



ప్రపంచ ఖ్యాతి గాంచిన నాటకాలలో ఇతని *సీగల్ (1898), త్రీ సిస్టర్స్ (ముగ్గురు సోదరీ మణులు)(1901), చెర్రీ ఆర్చర్డ్ (1904) (రేగితోట)* నాటకాలు ముఖ్యమైనవి.

విషాద, ఆహ్లాద ఘట్టాలను మేళనం చేసి సమపాళ్ళలో నడిపించడం చెఖోవ్ ప్రత్యేకత. చెఖోవ్ భార్య మాస్కో ఆర్ట్ థియేటర్‌లో నటీమణి. *హైరోడ్* (1884) అనే ఏకాంకిక, *దిబేర్* (1888), *ప్రపోజల్* (1889), *వెడ్డింగ్* (1890) అనే ప్రహసనాలు రచించిన చెఖోవ్ 1904లో మరణించాడు. ఈయన రచించిన నాటకాలను శ్రీనివాస చక్రవర్తి, శ్రీశ్రీ, విద్వాన్ విశ్వం ప్రభృతులు తెలుగులోకి అనువదించారు.

శ్రీ.చ.

చెన్నారెడ్డి, గుర్రం (1930-1996) : నటుడు, రచయిత, దర్శకుడు. ఈయన 1930, ఏప్రిల్ 28న ప్రకాశం జిల్లాలోని రంగాపురంలో జన్మించాడు. నివాసం గుంటూరు జిల్లా రెంటచింతల. ప్రజానాట్య మండలి తరపున విస్తృతంగా పల్లెల్లో ప్రదర్శిస్తున్న తిరునగరి రామాంజ నేయులు, కర్పూరపు నాసరయ్యలతో కలిసి చెన్నారెడ్డి గొల్లసుద్దులు కళారూపాలు పల్లెల్లోనే కాదు, గుంటూరులోనూ, హైదరాబాద్ నగరంలోనూ ప్రదర్శించి పలువురి ప్రశంస లందుకున్నాడు. కళారంగం పట్ల మక్కువ పెంచుకొన్న చెన్నారెడ్డి నటుడిగా సాంఘిక, జానపద, చారి త్రాత్మక, పౌరాణిక నాటకాలలో నటించాడు. ఈయనకు బాగా పేరు తెచ్చిపెట్టిన ఏకపాత్రాభినయం పాత్ర లలో పల్నాటియుద్ధంలో నరసింగరాజు, బాలనాగమ్మలో మాయలఫకీరు. అల్లూరి సీతారామరాజులో రూథర్‌ఫర్డ్, ధర్మదీక్ష లో విజయసింహుడు, రఘుపతి, ఆర్య చాణక్యలో చాణక్యుడు క్రైస్తవ మతప్రాశస్త్యాన్ని పెంచే పాత్రలలో నటించి పేరు తెచ్చుకొన్నాడు.

ఆంధ్రనాటక రంగస్థలంపై విరివిగా ప్రదర్శింపబడిన *మాస్టర్జీ, కప్పులు, దొంగవీరడు, ఛైర్మన్*‌లలో ప్రధాన పాత్రలలో నటించాడు. 1962లో బందరులో పల్నాటి యుద్ధంలో నరసింగరాజు పాత్రను నటిస్తున్న సందర్భంలో ఈ నాటకాన్ని చూసిన ప్రముఖ కవి కవిపాదుషా పువ్వాడ శేషగిరిరావు, చెన్నారెడ్డిని ఘనంగా సన్మానించాడు. ఇదే సంవత్సరంలో గుంటూరులో జరిగిన చారిత్రక నాటక పోటీలలో పల్నాటి చరిత్ర నాటకానికి ప్రథమ బహుమతి లభించింది. రంగస్థలంపై వివిధ పాత్రలను పోషించి పండిత పామర జనాన్ని మెప్పించిన గుర్రం చెన్నారెడ్డి 1970వ సంవత్సరంలో మాచెర్లలో ఉత్తమ నటుడుగా రామకృష్ణ అవార్డు అందుకున్నాడు. కళారంగం వికాసంకోసం విశేషంగా కృషిచేసిన గుర్రం చెన్నారెడ్డిని ప్రముఖ సాహితీసంస్థలు, విద్యా సంస్థలు, సువర్ణపతాకాలిచ్చి సత్కరించాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వంటి ప్రముఖ విద్యాసంస్థలు ఈయనను ఘనంగా సత్కరించాయి. క్విట్ ఇండియా స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రముఖ రంగస్థల, సినిమా నటుడు జె.వి. సోమయాజులతో కలసి జాతికి ఊపిరి స్వాతంత్ర్యం అనే రూపకంలో బిపిన్‌చంద్రపాల్‌గా నటించాడు.

నటుడుగా వివిధ నాటకాలలో నటిస్తూనే దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టి పేరు తెచ్చుకున్నాడు. మాచర్లలోని 'నటరాజ నాటక కళా సమితి', నాగార్జున నాటక మండలి' రెంట చింతలలోని విజయమేరి నాటక మండలి, ఫాతిమా నాటక కళాసమితుల స్థాపనలో ప్రముఖ పాత్రను నిర్వహించి, అనేక నాటకాలను ప్రదర్శించాడు. సాహిత్యం, ప్రదర్శన కళల పట్ల మక్కువ కనబరచడం వల్ల *నవోదయం, అరణ్యవాసి, మబ్బుతెర, బరబ్బాస్, మగ్గాల మరియు, రక్తాభిషేకం, ఆర్యచాణక్య, పలనాటి వీరులు, తిరుపతమ్మ కథ, చేజారిన స్వర్గం* లాంటి నాటకాలను ఆంధ్ర నాటక రంగానికి అందిం చాడు. ఇవేకాకుండా 'కవి కొకమాట' (ఖండకావ్యం), జీవితం (పద్యకావ్యం), అక్షర తూణీరం (వచన కవితా సంపుటి) వంటి సాహితీ విలువలున్న కావ్యాలను రచించాడు.

పల్నాటి చైతన్య కళాస్రవంతి అనే సమాజం స్థాపించి, ఆ సంస్థ సారథ్యంలో అనేక ప్రదర్శనలు ఏర్పాటుచేసి కళారంగానికి సేవ చేసిన గుర్రం చెన్నారెడ్డి 1996, జనవరి ఒకటిన కీర్తి శేషుడయ్యాడు.

దాసరి, ఎన్.

చెల్దేరోడె, మిషెల్ డి (1898-1962) : బెల్జియన్ నాటక రచయిత. 1898లో బెల్జియంలోని ఇక్సెల్స్‌లో జన్మించాడు. తన నాటకాలను ఫ్రెంచ్‌లో రాసి, ప్రదర్శన కోసం ఫ్లెమిష్ భాషలోకి తర్జుమా చేసేవాడు. కీర్తికాంక్ష లేనివాడు కావడంతో, ఈయన ప్రజ్ఞ రెండవ ప్రపంచయుద్ధం తరువాత గాని బాహ్య ప్రపంచానికి వెల్లడి కాలేదు. మంచిచెడుల ఘర్షణ, సైతాను అస్తిత్వం ముఖ్య వస్తువులు. ఫ్లాండర్స్‌కు చెందిన హియరోనిమస్ బోష్, బ్రూగైల్ అనే చిత్రకారుల ప్రభావం ఈ నాటకాలపై కనిపిస్తుంది.

చెల్దేరోడె నాటకాలలో చాలా వాటిని ఫ్లెమిష్ పాప్యులర్ థియేటర్‌కోసం రాశాడు. ఈయన నాటకాలలో కొన్ని ప్రత్యేకంగా తోలుబమ్మలాట కోసం రాయబడినవి. 1927లో సెంట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అసిసీ జీవితాన్ని గురించి రాసిన నాటకం విశేష ఆదరణ పొందింది. 1928లో పై సంస్థ కోసం బరబ్బాస్ (Barabbas) నాటకం రాశాడు. ఇది జీసస్ జీవితంలోని అంతిమ ఘడియలను, ఆయనను శిలువ వేయడాన్ని ఆర్ద్రతతోను, సానుభూతితోను చిత్రిస్తుంది. పై రెండు నాటకాలలో మానవతా దృష్టి, సానుభూతి కనిపిస్తాయి గాని, భక్తిభావం గోచరించదు. బరబ్బాస్ ఈనాటికీ ఈస్టర్ సమయంలో ప్రదర్శింపబడుతూ ఉంది.

ఇవికాక ఈయన పెంటగ్లెట్స్, హాప్ సిగ్నోర్ (1935), ది స్కూల్ ఫర్ జెస్టర్స్ (1942), క్రానికల్స్ ఆఫ్ హెల్ (1949) నాటకాలూ, కొన్ని నవలలూ రాశాడు. వీనిలో ముఖ్యపాత్ర వికల మనస్కుడైన ఒక కళాకారుడు. కథారచనలో పటుత్వం, నిర్వహణలో కొత్త పంథా, జానపదభాషలో సంభాషణలు ఈ నాటకాలకు అన్నితరహాల ప్రేక్షకుల ఆదరాన్నీ సంపాదించాయి. 'టోటల్ థియేటర్' ఉద్యమానికి ఈయన బాగా దోహదం చేశాడు. ఈ పద్ధతిలో నాటకకర్త ప్రేక్షకులను అన్నివిధాలా (శబ్ద, దృశ్య ప్రేరణల ద్వారా) నాటకంలో సంలీనం చేసి, నాటకంలో ప్రతిపాదించబడిన సమస్యను గురించి ఆలోచించేట్టు చేస్తాడు. ఈయన ఆధునిక యూరపియన్ నాటక రంగంలో సంచలనం సృష్టించి, అమెరికాన్ నాటకరంగాన్ని కూడా ప్రభావితం చేసి, 1962లో బెల్జియంలో మరణించాడు.

డి.ల.రా.

చో రామస్వామి ఎస్. (జ. 1934): తమిళ నాటక రచయిత, నటుడు, నవలా రచయిత, పాత్రికేయుడు, రాజకీయ వ్యాఖ్యాత, పౌరహక్కుల కార్యకర్త. "చో" అనే కలం పేరుతో రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన రామస్వామి మద్రాసులో 1934లో జన్మించాడు. విద్యాభ్యాసం కూడా ఇక్కడే సాగింది. వై.జి. పార్థసారథి నాటకాలు చూసిన చో ఆయన నాటకాలకు సహాయకుడుగా పనిచేశాడు. 1958లో అనుకోని పరిస్థితుల్లో రచయితగా మారి తన సహచర మిత్రులతో వివేక ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌ను ప్రారంభించాడు. తమిళ నాటక రంగంలో కొన్ని నాటకాలు రోజుకు మూడు సార్లు ప్రదర్శించిన ఘనత రామస్వామికి దక్కింది. వేలకొలది ప్రదర్శనల్లో నటుడుగా, రచయితగా, దర్శకుడిగా పలు భూమికలు పోషించాడు. మహమ్మద్ బిన్ తుగ్లక్, వందేమాతరం ఆయనకు బాగా పేరు తెచ్చిన నాటకాలు.

ప్ర.రె.

చౌదరి, సి.వి. (1939-2008) : నటుడు, ప్రయోక్త, దర్శకుడు. సి.వి. చౌదరిగా వినుతికెక్కిన చల్లపల్లి వెంకటేశ్వరరావు గుంటూరు జిల్లా, తెనాలి తాలుకా జంపని గ్రామంలో చల్లపల్లి వరలక్ష్మి, లక్ష్మినారాయణ దంపతులకు 1939, ఆగస్టు 19న జన్మించాడు. తండ్రి స్వతంత్ర పోరాటోద్యమాలలో పాల్గని ఆచార్య ఎన్.జి. రంగా, కల్లూరి చంద్రమౌళి ప్రభృతులతో కలసి వేలూరు, రాజమండ్రి సెంట్రల్‌జైళ్ళలో జైలు జీవితం గడిపాడు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో బ్రిటీషు సిపాయి లాఠీ దెబ్బలకు మరణించాడు. అలాంటి త్యాగమూర్తి కడుపున పుట్టిన సి.వి. చౌదరికి దేశభక్తి, సామాజిక స్పృహలు సహజాత వారసత్వ సంపదగా లభించాయి. ఆ నేపథ్యం, స్ఫూర్తి, త్యాగనిరతులే ఆయనను క్రమశిక్షణ కలిగిన ప్రజా కళాకారునిగా తీర్చిదిద్దాయి.

ఈయన తన ఏడవ ఏట తురిమెళ్ళలో 1946లో గొడ్డుకాడ నాటికలో జీతగాని పాత్రద్వారా రంగస్థలప్రవేశంచేశాడు. బాలనటునిగా చౌదరి ప్రతిభ పెద్దలప్రశంసలు పొందటంతో తొలి అవకాశం ఇచ్చిన స్థానిక నవ్యాంధ్ర థియేటర్‌వారు ప్రదర్శించిన మలి నాటకం రేరాణి లో కథానాయిక పాత్రను ఇచ్చిప్రోత్సహించారు.

తొలి ప్రదర్శనలు ఇచ్చిన స్ఫూర్తితో నటుడిగా తన రంగస్థల ప్రస్థానం విజయవంతంగా కొన సాగించాడు. కూలిపిల్ల, దొంగవీరడు, ఎన్.జి.ఓ., పోతుగడ్డ, తప్పెవరిది, పల్లెపడుచు, కోహినూర్ ఇత్యాది నాటక నాటికల్లో పలుప్రాధాన్యతగల పాత్రలు పోషించి, తనలోని నటుణ్ణి పరిపూర్ణంగా తీర్చిదిద్దు కున్నాడు.

అనంతర కాలంలో వృత్తిరీత్యా రెవిన్యూ డిపార్ట్‌మెంటులో చేరినా నాటకరంగాన్ని వీడక పలునాటకాలు స్వీయదర్శకత్వంలో ప్రదర్శించి ప్రయోక్తగా, నటుడిగా తన సృజనాత్మక సంపదతో ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందగలిగాడు.

ముఖ్యంగా ఈయనకు చారిత్రాత్మక నాటకాలు ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. వీరపాండ్య కట్ట బ్రహ్మన్నలో కట్టబ్రహ్మన్న, మేజర్ బ్యానర్‌మెన్, కలక్టర్ జాక్సన్ పాత్రలు, అల్లూరి సీతారామరాజులో రూథర్‌ఫర్డ్, సికిందర్‌లో అలెగ్జాండర్, బబ్బిలి యుద్ధం లో బుస్సీ, సమ్రాట్ పృథ్వీరాజ్ లో పృథ్వీరాజ్ పాత్రలు ఈయన నటనా ప్రతిభకు, దర్శకత్వపు సామర్థ్యానికి ఉదాహరణలుగా నిలుస్తాయి.

రచయితగా భారతదేశం వర్థిల్లాలి అనే నాటకం, అక్షర శరణం గచ్ఛామి, వైల్డ్ జస్టిస్ నాటికలు రాసి ప్రజలలో సామాజిక చైతన్యం పెంపొందించేలా స్వీయ దర్శకత్వంలో పలు ప్రదర్శనలు ఇచ్చాడు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంత కళాకారులకు తర్ఫీదు ఇచ్చే నిమిత్తం నటశిక్షణా శిబిరాలను కూడా నిర్వహించారు. 2002 నుంచి ఎన్.టి.ఆర్., ఎలిమినేటి మాధవరెడ్డి స్మారక నాటక పరిషత్తును నల్గొండ పట్టణంలో విజయవంతంగా నిర్వహిస్తున్నాడు. నటునిగా, ప్రయోక్తగా, రచయితగా పలు పోటీలలో బహుమతులు పొందిన సి.వి. వృత్తిరీత్యా తహసీల్దార్ హోదాలో పదవీ విరమణ చేసినా, కళాసేవ కొనసాగించారు. ఈయన 2008లో దివంగతులయ్యారు.

మన్నెశ్రీ

ఛాదనం : 1. అవమర్శ సంధ్యంగం 2. అంగరచన

భరతముని, విశ్వనాథ కవి రాజులు మాత్రమే దీనిని అవమర్శ సంధ్యంగా లెక్కించారు. ధనంజయుడు, సింగభూపాలుడు, విద్యానాథుడు లెక్కించలేదు. అవమాన కళంకాన్ని ఆచ్ఛాదించడం వల్ల ఇది అచ్ఛాదనం. నాటక లక్షణ కోశకారుడు దీనిని 'సాధ్య'అన్నాడు. ఛాదనమనగా అవమానం సహించడం లేక పరిగణనలోకి తీసుకోకపోవడం. (కార్యార్థమై యవమానాది కమును జేర్చుట యేదో అది ఛాదనము– ఆం.సా.ద. 6–390).

అంగరచన: వర్తనానికి పర్యాయపదం. దీని అర్థం సహజ రూపాన్ని కప్పిపుచ్చుకోవడం.

శ్రీ.చ.

ఛాయా రూపకం : తోలుబమ్మలాట ప్రభేదం. బమ్మలాటలో నేపథ్యంలోని మాటకు, ఆటకు అనుగుణంగా బమ్మలు కదులుతాయి. ఛాయారూపకంలో బమ్మలు బదులు మనుష్యులు వ్యవహరిస్తారు. తెల్లటి తెర, తెర వెనుక నేపథ్యం నుంచి వచ్చే మాటలకు, పాటలకు అనుగుణంగా మనుష్యులు ఆడుతూంటే వారి వెనుక నుంచి వెలుతురుకు వారి నీడలు తెర మీద పడి ప్రేక్షకులకు దృగ్గోచరమవుతాయి.

ఈ ఛాయా నాటకాల ప్రదర్శనకు ఉపయోగార్థంగా రచించినవే భాసనాటకాలనికొందరుపండితుల అభి ప్రాయం. పూర్వ రూపకాలను అనుసరిస్తూ స్వకపోల కల్పన లను చేరుస్తూ పూర్వ రూపకాలలోని కొన్ని శ్లోకాలను గ్రహించిన మూల రూపకాలకు ఛాయలే ఇవి అని కొందరి అభి ప్రాయం. ధర్మాభ్యుదయం, దూతాంగదం ఛాయా రూపకాలకు ఉదాహరణలు. నేటి ఛాయా రూపకాలలో వ్యక్తుల ఆకార రేఖలు మాత్రమే ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. వ్యక్తులు అక్కర లేకుండానే చేష్టలతోను, హస్తాభినయంతోను ఛాయారూపకాలు ప్రదర్శించవచ్చు. ఉదయశంకర్ ప్రదర్శించిన రామలీల, బుద్ధభగవాన్; బాపట్ల ప్రజానాట్యమండలి వారు ప్రదర్శించిన రత్నగర్భ, రామచంద్ర ఛాయా రూపకాలకు మంచి ఉదాహరణలు. సంపూర్ణ ఛాయా రూపకాలేగాక నాటకాలలో చిన్న చిన్న ఛాయా రంగాలను నిబంధించడం కూడా కద్దు. ఉదాహరణకు సుంకర సత్యనారాయణ భూమికోసం నాటకంలో భూమి కోసం రైతులు వెళ్ళడం ఛాయారంగంగా చిత్రితమైంది.

శ్రీ.చ.

ఛౌ

జానపద కళారూపం. బీహార్ రాష్ట్రంలో ప్రాచుర్యం పొందిన ఒక నృత్యరూపం. భారతదేశంలోని అన్ని ప్రాంతాలూ బ్రిటీషువారి అధీనంలోకి వచ్చినాగాని బీహార్‌లోని ఒక మారుమూల ప్రదేశమైన సెరైకెల్లా ఎవరి అధీనంలోనికి రాలేదు. 1820లో ఈ ప్రాంతం బ్రిటిషువారితో ఒక రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం ప్రకారం ఇక్కడి అత్యంత ప్రీతి పాత్రమైన గిరిజన నృత్యాలు, జానపద కళలు వంటి వాటిని బ్రిటీషు వారు ఏ విధంగాను నష్టపరచకూడదు. అటువంటి వాటిలో అత్యంత ప్రధానమైనది. 'ఛౌ' కళారూపం.

సెరైకెల్లా పాలకులు ఛౌ కళారూపాన్ని పరిరక్షించారు. రాజకుమార్ సిద్ధేంద్ర ఆదిత్యా ప్రతాప్‌సింగ్ దేవ్ ఈ కళకు ప్రాణంపోసారు.

ముఖానికి ముసుగు ధరించి ప్రదర్శించే ఈ ఛౌ నృత్యంలో దేవతలు, జంతువులు, పక్షులు, మానవులు, ఇంద్ర ధనుస్సులాంటి అనేక చిన్న చిన్న విషయాలను ప్రదర్శిస్తారు. ప్రతి ఏడాది ఏప్రిల్ మాసంలో సెరైకెల్లాలో జరిగే చైత్ర పర్వ ఉత్సవంలో ఈ నృత్యకళను ప్రదర్శిస్తారు. ఈ సందర్భంలో మొత్తం గ్రామం ఈ ఉత్సవంలో పాల్గంటుంది. ఛౌ నృత్యాన్ని మతపరమైన పూజలలో ప్రదర్శించినప్పటికీ మతానికి దీనికి ఎటువంటి సంబంధం లేదు.

ఛౌ నృత్యంలోని కొన్ని అంశాలను పరిఖండ (పరి అంటే ఢాలు, ఖండ అంటే కత్తి)ల నుంచి తీసుకున్నారు. దీనిని శివునికి నివాళి నర్పించడంతో పోలుస్తారు. గురువు దీనిని చేయిస్తాడు. ఇది చేసేవారి వస్త్రధారణ దీనికి అనుకూలంగా ఉంటుంది.

ఛౌలో వివిధ అంశాలను ప్రదర్శిస్తారు. 'హరే విష్ణు మదనగోపాల' అంశాన్ని యువకులు, అప్పుడే నేర్చుకుంటున్న వారు ప్రదర్శిస్తారు. ఇది భక్తితో కూడుకున్న అంశం. నృత్యం కథా వస్తువును బట్టి ఉంటుంది.

మాస్క్ (ముఖానికి తొడుగు)

ఛౌ అంటే మాస్క్ అని అర్థం. ఈ నృత్యంలో ఒక అత్యంత ప్రాధాన్యతగల వస్తువు. అక్బర్ సమయంలో బీహార్‌లోను, ఒరిస్సాలోగల అక్బర్ సైన్యం విసిగి పోవడంతో వారిని ఆహ్లాదపరచ డానికి ఈ నృత్యాన్ని ప్రారంభించారు. అప్పట్లో సైన్యంలోని ఎగువ స్థాయి, దిగువస్థాయి తెలియకుండా ఉండేందుకు ఈ ముసుగును (మాస్క్)ను ధరించి నర్తించేవారు. మొదట్లో దీనిలో మాటలు కాని, పద్యాలుకాని ఉండేవి కావు. అయితే ఈ విధానం అక్కడి జానపద కళలతో కలిసి ప్రస్తుత విధానంగా రూపాంతరం చెందింది. ఈ నృత్య కళారూపంలో ముఖకవళికలతో సంబంధం లేదు. వివిధ పాత్రల కోసం వివిధ రంగులు, ఆకారాలతో మాస్క్‌లను తయారు చేస్తారు.

మారుతున్న కాలంతోపాటు ఈ గిరిజన నృత్యం ప్రస్తుతం అంతగా ప్రాచుర్యం పొందటం లేదు. నామావశిష్టంగా నిలిచిందని చెప్పవచ్చు.

ఆనంద గజపతి

సుధాకర్

జగన్నాథ విలాసినీ సభ : ఆంధ్రదేశంలోని ప్రప్రథమ నాటక సమాజం. ఈ సమాజాన్ని 1874లో విజయరామ గజపతి విజయనగరంలో స్థాపించాడు. ఈ సమాజం సంస్కృత నాటకాలను ఎక్కువగా ప్రదర్శిస్తుండడంవల్ల దీనికి 'సంస్కృత అకాడమీ' అని పేరు వచ్చింది. గంటి బుచ్చిశాస్త్రి దీనికి ప్రధాన వ్యక్తి కావడం వల్ల "బుచ్చి శాస్త్రి కంపెనీ" అని కూడా అనేవారు. 1879లో విజయరామ గజపతి నిర్యాణం తరువాత ఆంధ్ర గజపతి ఆధ్వర్యంలో అవిచ్ఛిన్నంగా నడిచింది.

సుప్రసిద్ధ నాటకకర్త, నటుడు, "ఆంధ్ర గారిక్" బిరు దాంకితుడు గోమఠం శ్రీనివాసాచార్యులు కొంతకాలం ఈ సభకు దేశికత్వం వహిస్తూ నాయక పాత్రలు ధరించాడు. ఈ సభలోని నటులంతా పండితులు కావడంవల్ల, దీనికి మహారాజా వారు పోషకులు కావడం వల్లా ఈ సభ ఆంధ్రదేశంలో మంచి గౌరవం సంపాదించుకుంది. గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం ప్రప్రథమంగా 1892 ఆగస్టులో ప్రదర్శించి ఆంధ్ర నాటకరంగ చరిత్రలో నూతన యుగానికి ఈ సభ నాంది పలికింది. ఈ సభలో గంటి బుచ్చిశాస్త్రి, చొప్పల్లి నరసింహం, కట్టా పేరయ్యశాస్త్రి, కట్టా పాపయ్యశాస్త్రి, ఆదిభట్ల జగ్గావధానులు, గోమఠం శ్రీనివాసాచార్యులు ప్రధాన భూమికలు నిర్వహించే వారు. ఈ సమాజం ప్రదర్శించేనాటకాలకు కట్టా పాపయ్య శాస్త్రి సూత్రధారుడు.

ఈ సభ శాకుంతలం, ఉత్తర రామచరిత్ర, విక్రమోర్వశీయం, హరిశ్చంద్ర, కన్యాశుల్కం మొదలైన నాటకాలు ప్రదర్శించింది. విజయనగరం కోట పక్కన మూడు కోవెలల కెదురుగా ఉండే ఖాళీ స్థలంలోని పెంకుటిల్లును ఈ సభవారు నేపథ్యగృహంగా, రంగస్థలంగా ఉపయోగించుకున్నారు.

శ్రీ.చ.

జగన్మిత్ర సమాజం: ఈ సమాజాన్ని 1882లో రాజా అంకితం జగ్గారావు విశాఖపట్టణంలో స్థాపించాడు. సెట్టి లక్ష్మీనరసింహం, తెన్నేటి జగన్నాథరావు, కాదంబరి జగన్నాథ రావు, గోటేటి కామేశ్వరరావు, నీలమణి పాణిగ్రాహి ప్రధాన నటులు.

ఈ సమాజం ఇంగ్లీషు, సంస్కృతం, తెలుగు నాటకాల్ని ప్రదర్శించింది. 1890 ప్రాంతంలో మొసలికంటి వెంకట సూర్యనారాయణరావు ప్రోత్సాహంతో ఈ సమాజం చాలా ఉచ్ఛస్థితికి వచ్చింది. 1900 ప్రాంతంలో రాజా విక్రమ దేవవర్మ ఈ సమాజ భారం వహించి విజయవంతంగా నడిపించాడు. వీరి అన్న రఘునాథవర్మ కూడా ఈ సమాజ స్థాపకులలో ముఖ్యుడు. 1900 తరువాత ఈ సమాజం టిక్కెట్ల మీద వచ్చే డబ్బుతో ధర్మకార్యాలు చేపట్టింది. ఈ నాటక సమాజానికి విక్రమ దేవవర్మ స్వంత హాలు కట్టించి ఇచ్చాడు. ఉత్తర గోగ్రహణం, వేణీ సంహారం, చంద్రహాస, శ్రీనివాస కల్యాణం, రుక్మిణీ కల్యాణం, మానినీ విజయం, అహల్య, మానవతీ, సత్యహరిశ్చంద్ర నాటకాలను ఈ సమాజం ప్రదర్శించింది.

శ్రీ.చ.

జగన్మోహన మోహినీ సమాజం : కందుకూరి వీరేశలింగం పంతులు వేశ్యా సంస్కరణోద్యమం ఫలితంగా ఉద్భవించిన స్త్రీల నాటక సమాజం. ఈ సమాజాన్ని 1907లో బందరులో స్థాపించారు.

ఈ సమాజానికి డి.వి. సుబ్బారావు (ఫొటోగ్రాఫర్) వ్యవహర్త, బి.టి. రాఘవాచార్యులు నాటకకర్త, దేశికుడు. ఈ సమాజం శకుంతల, సారంగధర, రుక్మాంగధ, లంకాదహనం, కాంతామతి మొదలైన నాటకాలు ఆంధ్రదేశమంతటా ప్రదర్శించి మెప్పు పొందింది. రామాబాయి, అంకాలు, మహాలక్ష్మి ప్రభృతులు స్త్రీ పురుష పాత్రలలో నటించి సమాజ దిగ్విజయానికి తోడ్పడి, ఎంతో కీర్తి గడించారు.

శ్రీ.చ.

జగ్గయ్య, కొంగర (1926-2004) : రంగస్థల, సినీ నటుడు. ఈయన 1926, డిసెంబర్ 31న కొంగర సీతా రామయ్య, రాజ్యలక్ష్మమ్మ దంపతులకు గుంటూరు జిల్లా

తెనాలి తాలూకా మోరం పూడి గ్రామంలో జన్మిం చాడు. తండ్రి దగ్గరే సంస్కృతాంధ్ర సాహిత్యాలు చదువుకున్నాడు.

దుగ్గిరాల లోని ఉన్నత పాఠశాల, గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన జగ్గయ్య ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రుడు. 1947లో దుగ్గిరాల హైస్కూల్‌లో బి.ఇడి అసిస్టెంట్‌గా ఆంగ్లం,చరిత్ర పాఠ్యాంశాలు బోధించాడు. తరువాతకాలంలో ఆకాశ వాణి ఢిల్లీ కేంద్రంలో వార్తా విభాగంలో ఉప సంపాదకు నిగా, అనౌన్సర్‌గా 1948 నుంచి 1951 వరకు పనిచేశాడు. విలక్షణరీతిలో వార్తలను చదివి ఆ రోజుల్లో వార్తా ప్రసారానికి ఒక ప్రత్యేక ఆకర్షణ తెచ్చిన వ్యక్తి జగ్గయ్య. 1951లో త్రిపురనేని గోపీచంద్ ఆహ్వానం మేరకు "ప్రియురాలు" చిత్రం ద్వారా చిత్ర జగతిలోకి ప్రవేశించాడు. తన తండ్రి నుంచి కళావారసత్వాన్ని పుణికిపుచ్చుకొని అనేక తెలుగు, ఇంగ్లీషు నాటకాలలో విభిన్నపాత్రలను పోషించి రసజ్ఞుల మెప్పు పొందాడు. తన పదకొండవ ఏట "లవకుశ" అనే హిందీ నాటికలో లవుడిపాత్ర నటించడంతో రంగప్రవేశం చేశాడు.

మర్చంట్ ఆఫ్ వెనీస్ లో 'షైలాక్', జూలియస్ సీజర్ లో 'మార్క్ ఆంథోని', ఆలీ ది కాబ్లర్ నాటికలోని ప్రధాన పాత్రను పోషించి తనలోని సహజ గంభీర ఉచ్చారణ శైలికి, వైవిధ్య నటనా పాండిత్యానికి మెరుగులు దిద్దుకున్నాడు. కళాశాల రోజుల్లోనే బుచ్చిబాబు రచించిన దారినపోయే దానయ్య అనే నాటికలో కథానాయకుడి పాత్ర ఈయనకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. కళాశాల విద్యాభ్యాసానంతరం స్వయంగా నాటకాలు ప్రదిర్శంచటమే కాక నందమూరి తారక రామారావు స్థాపించిన 'రవి ఆర్ట్ థియేటర్స్' (తరువాతి ఎన్.ఎ.టి) లోనూ, సుంకర కనకారావు 'అరుణోదయం'లో చేరి మేటినటుల కలయికతో, పలు నాటికలు, నాటకాలను ప్రదర్శించాడు. ముఖ్యంగా నందమూరి తారక రామారావుతో కలిసి ప్రదర్శించిన వేనరాజు నాటకం, చేసిన పాపం నాటిక, 'అరుణోదయ'లో ప్రదర్శించిన బలిదానం అనే స్వీయరచన జగ్గయ్యలోని నటనావైదుష్యాన్ని ఆవిష్కరించడమే కాక తదనంతర సినీజీవితంలో పోషించిన పరస్పర విరుద్ధమైన పాత్రలలో రాణించేందుకు అవసరమైన అభినయ సామర్థ్యాన్ని అందించాయి. 1946వ సంవత్సరం "ఆంధ్రనాటక కళా పరిషత్తు" నిర్వహించిన పోటీలలో రెండు నాటికల్లో పాల్గొని సంచలనం సృష్టించడం ఒక ఎత్తయితే, రెండు నాటికలకు బహుమతులు సాధించటం మరో ఎత్తు. ఎన్.టి.రామారావుతో కలిసి నటించిన చేసిన పాపం నాటికకు ఉత్తమ ప్రదర్శనా బహుమతి, గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి తరపున ప్రదర్శించిన తెలంగాణా స్వాతంత్ర్య ఘోష అనే నాటికలో పోషించిన వృద్ధుని పాత్రకు ఉత్తమ నటుని బహుమతి లభించింది.

కళ పరమార్థం సామాజిక అభ్యుదయమేనని, విశ్వసించి, తన సహ నటీనటులతో కలిసి నాటక ప్రదర్శనల ద్వారా (ముఖ్యంగా 'మనోహర' అనే నాటకం ప్రదర్శించి) తెనాలిలోని వి. ఎస్. ఆర్. అండ్ ఎన్.వి. ఆర్. కళాశాలకు రెండు లక్షల రూపాయలు, వరంగల్‌లోని ఒక కళాశాలకు లక్ష రూపాయలు, చెన్నై ఆంధ్ర మహిళా సభ ఆసుపత్రికి 25 వేలు, బందరు నోబుల్ కళాశాలకు లక్ష రూపాయలు నిధిని సేకరించి యిచ్చాడు. 1967లో ఒంగోలు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. విలువలు మృగ్యమైన వర్తమాన రాజకీయాల్లో ఇమడలేక, క్రియాశీల రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా విరమించుకున్నాడు. అసాధారణ ప్రతిభ, సంస్కారం తనలో ఇముడ్చుకున్న జగ్గయ్యకు ఢిల్లీలోని అంతర్జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం 'కళావాచస్పతి' 1967లోనూ, తెలుగు విశ్వవిద్యాలయం 1991లో గౌరవ డాక్టరేట్, ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' పట్టాలను, తమిళనాడు ప్రభుత్వం 'కలైమామణి', ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'తెలుగు వెలుగులు', భారత ప్రభుత్వం 1992లో 'పద్మభూషణ్' పురస్కారాలను ప్రదానంచేసాయి. ఈయన 2004లో కాలధర్మం చెందాడు.

మన్నెశ్రీ

జగ్గరాజు, ముప్పిడి (1885-1938) : రాజమహేంద్రవరం. పిఠాపురం, కాకినాడ, రాజమండ్రిలలోని పలు నాటక సమాజాలలో నాయికా పాత్రధారి. కళాప్రపూర్ణ బిరుదాంకితుడు. ఈయన పిఠాపురంలో 1885లో జన్మించాడు. పద్మినీజాతి స్త్రీ లక్షణాలతో కిన్నెర కంఠంతో విలసిల్లుతూ, రూపుదాల్చిన పాతివ్రత్యం, మూర్తీభవించిన శోకరసం, హావభావ విలాసాది చేష్టలతో స్త్రీలను మరిపించేది జగ్గరాజు స్త్రీ వేషం.

1898లో విద్యార్థి దశలో జంఖండే కంపెనీ నాటకాలు చూసి, స్త్రీ పాత్రధారి బాబూరావు నటనాచాతుర్యానికి ముగ్ధుడై, జగ్గరాజు ఆడవేషాలు వేయాలని సంకల్పించాడు. జంఖండే నాటక సమాజం నమూనాలో పిఠాపురంలో ఏర్పడిన నాటక సమాజంలో స్త్రీ వేషాలు వేయసాగాడు. జగ్గరాజు పేరు ప్రతిష్ఠలు నలుదిక్కులా వ్యాపించాయి. కాకినాడ సింగీతం అబ్బాయి నుంచి ఆహ్వానం రాగానే కాకినాడ వెళ్ళి అబ్బాయి

కంపెనీలోచేరి స్త్రీ పాత్రలు ధరిస్తూ ప్రఖ్యాతుడయ్యాడు. నట వృత్తికి గౌరవం తెచ్చిపెట్టాడు. ఆ తరువాత 1902 ప్రాంతంలో రాజమండ్రి హిందూ నాటక సమాజం, మానేపల్లి కంపెనీలు ప్రదర్శించిన నాటకాలలో 30 ఏళ్ళు నాయిక భూమికలు ధరించి ఆంధ్ర ప్రజానీకాన్ని రససము ద్రంలో వోలలాడించాడు.

1916లో బందరులో జరిగిన చిత్రనళీయం నాటక పోటీలలో దమయంతి పాత్రలో నటించి 'సువర్ణపతకం' గెలుచుకున్నాడు. ఈయన నటనా చాతుర్యానికి మెచ్చి కాకినాడ పౌరులు 'కళాప్రపూర్ణ' బిరుదుతో సన్మానించారు. 1930లో ఖరగ్‌పూర్ ఆంధ్రసభ, 1935లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఈయనను ఘనంగా సన్మానించాయి. చీరకట్టు, హావభావ విలాస ప్రదర్శన, పాత్రోచిత నటన జగ్గరాజుసొత్తు. స్త్రీ పాత్ర ,దారణలో చిత్ర నళీయంలో దమయంతిగా శోకరసం పరాకాష్ఠకు తీసుకువెళ్ళేవాడు. ఈయనకు ముఖారి, నీలాంబరి, సావేరి, శహన, హంసధ్వని రాగాలంటే అభిమానం. విమల, చంద్రమతి, దమయంతి, రత్నాంగి, మల్లమాంబ, లీలావతి, సుగుణమణి, యశోధర, చిత్రలేఖ, భానుమతి, ద్రౌపది, సీత మొదలైన పాత్రలలో నటించాడు. జగ్గరాజు 1938లో మరణించాడు.

శ్రీ.చ.

జనాంతికం : నాట్యోక్తి. నియత శ్రావ్య భేదం. నాటక కథా మధ్యలో, రంగస్థలం మీది పాత్రలలో ఒక పాత్ర తన వాచికం వినకూడని వారి వైపు పతాక హస్తం (బటన వేలు, ఉంగరపు వేలు వంచి తక్కిన మూడు వేళ్ళను చాచి పట్టిన అభినయ హస్తమే పతాకహస్తము). పట్టి జన సమీపంలోనే తక్కిన పాత్రలతో రహస్యంగా సంభాషించడం జనాంతికం.

'ఇది మీరు వినకూడదు' అని చెప్పడానికి త్రిపతాక హస్తం సంకేతం. ప్రేక్షకులు త్రిపతాక హస్తం ఎవరివైపున వున్నదో వారు ఆ వాచికాన్ని వినడం లేదని భావించుకుంటారు.

జనాంతికం, అపవారితం రెండూ నియత శ్రావ్య భేదాలే. ఈ రెంటికీ భేదం స్వల్పం. ఈ స్వల్ప భేదాన్ని పాటించకుండా అభేదభావాన్ని కల్పించుకుని వీటిని పర్యాయపదాలుగా కొందరు వాడసాగారు. అందుచేత ఈ స్వల్ప భేదాన్ని తెలుసుకుందాం.

'ఒకడే వినవలెనని ఇతరులకు వినపడకుండునట్లు రహస్యముగా చెప్పబడునది అపవారితము. ఒక్కడు మాత్రము వినకుండునట్లు మిగిలిన అందరికిని చెప్పబడునది జనాంతికము' – నాట్యశాస్త్రం, డా॥ పోణంగి 25వ అధ్యాయం. పుట 725, అధ సూచిక – 22).

"మూఁడుఁ వ్రేళ్ళు దగ్గరఁ గూర్చిన హస్తము నితరుల కడ్డము పెట్టి, కథామధ్యమున నితరునిఁ బిలిచి మాటలాడుట జనాంతికమగును. పక్కకు మళ్ళి యొక్కనితో రహస్యము పల్కునది యపవారిత మగును" (ర.సు. 3–206–207)

పై నిర్వచనాలను బట్టి వినదగని వారి, వినదగిన వారి సంఖ్య విషయంలో కొద్దిపాటి భేదాభిప్రాయమున్నట్లు తోస్తుంది. ఇక అపవారిత జనాంతిక భేదమ్మైన అపవారితంలో పాత్రధారి కొందరు పాత్రధారులవైపు వీపు పెట్టి ఒక్క పాత్రతో రహస్యం చెప్పడం. ఆ ఒక్క పాత్రధారి చెప్పే రహస్యం వినడమే గాని మాట్లాడడు. ఇక జనాంతికంలో వినగూడనివారు ఒకరైనా, పెక్కుమందైనా వారివైపు త్రిపతాక హస్తంపట్టి ఇంకొకనితోగాని, అనేకులతోగాని రహస్యంగా సంభాషించడం. ఇందులో అపవారితంలోలాగా ఆ ఒక్కడూ మౌనంగా వినడంకాకుండా మాట్లాడతాడు. ఇదీ ఈ రెంటికీ ప్రధాన భేదం.

ముగ్గురు పాత్రల జనాంతికం: ఉదాహరణకు కన్యాశుల్కం. చతుర్థాంకం 4వ స్థలంలో –

సిద్ధాంతి : "కోపం వచ్చినపుడు లౌక్యం మఱిచిపోకూడదు. మీరుప్రభువులు. మేం ఆశ్రితులం. తమకి లాభించే మాట చెపుతాను. ఇలా దయ చెయ్యండి.

రామప్పంతులు : మర్యాదగా మాట్లాడితే నా అంత మంచివాడు లేడు.

సిద్ధాంతి : అవధాన్లు గారు మీరు కూడా ఇలా రండీ (అవధాన్లు, సిద్ధాంతి, రామప్పంతులు రహస్యంగా మాట్లాడుదురు)

శ్రీ.చ.

జన్యరూపకం : సంస్కృత దశ రూపకాలలోని నాటక ప్రకరణాలలోని నాటక ప్రకరణాల సంయోగంవల్ల జనించిన రూపకాలకు జన్యరూపకాలని పేరు. వీటినే వ్యుత్పన్నరూపకాలని అంటారు. అవి: నాటిక (నాటి), ప్రకరిణి (ప్రకరిణిక), తోటకం (త్రోటకం), సప్టకం.

శ్రీ.చ.

జమునారాయలు, ఆవేటి (జ.1960) : సురభి కుటుంబానికి చెందిన జమునా రాయలు నటి, దర్శకురాలు. 1960, జనవరి 21న తెనాలిలో వసుంధరాదేవి, కొండలరావు దంపతులకు జన్మించింది. కొండలరావు ఆవేటి నాగేశ్వరరావు తెనాలిలో స్థాపించిన న్యూ పూర్ణాడ్రమెటిక్ థియేటర్‌లో సభ్యుడు. జమున సురభి కుటుంబంలో జన్మించడం వల్ల చిన్న

ప్పటి నుంచే లోహితాస్యుడు, చిన్నికృష్ణుడు వంటి బాల వేషాలతో నాటకరంగంపైకి అడుగు పెట్టింది. ఏడవ తరగతి వరకు చదువుకున్న జమున సురభి సమాజం ప్రదర్శించిన నాటకాలన్నింటిలో కూడా నటించింది. సురభి సమాజం రాష్ట్రంలోని పలు ప్రాంతాలలోనే కాకుండా రాష్ట్రేతర ప్రాంతాలలో నిర్వహించిన ప్రదర్శనలలో నటించింది. గజపతి నాట్య మండలి (యమ్మిగనూరు, మహబూబ్‌నగర్ జిల్లా) స్థాపకుడు సురభి ఆవేటి శ్రీకృష్ణదేవ రాయలతో జమునకు వివాహం జరగడంవల్ల గజపతి నాట్య మండలి ప్రదర్శనలలో జమున కీలకస్థానం పోషించింది. జమున, శ్రీకృష్ణదేవరాయల సారథ్యంలో అనేక ప్రదర్శనలు పలు ప్రదేశాలలో నిర్వహించారు. ఆర్థిక కారణాలవల్ల 1986లో గజపతి నాట్య మండలి మూతపడడంతో ఔత్సాహిక నాటక సమాజాలు ప్రదర్శించే నాటకాలలో నటిస్తోంది. ఈమె 2004లో సురభిళ నాట్య కళామండలి స్థాపించి నాటక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. ఈ సమాజం పక్షాన 2005లో నంది నాటకోత్సవాలలో ఈమె దర్శకత్వం వహించిన *శశిరేఖా పరిణయం* నాటకానికి బంగారు నంది అవార్డు లభించింది. ఈమెకు రాధ, చంద్రమతి, జిజియాబాయి, నర్సమాంబ పాత్రలు ఉత్తమనటి అవార్డులు తెచ్చిపెట్టాయి. నాటకరంగం కోసం కృషిచేస్తోన్న జమునా రాయలును యువకళావాహిని సంస్థ పద్మశ్రీ స్థానం నరసింహా రావు అవార్డుతో సత్కరించింది.

బిట్టు

జయదేవుడు (12వ శతాబ్దం) : సంస్కృత నాటక కర్త. అలంకారికుడు. విదర్భ దేశస్థుడు. తల్లిదండ్రులు సుమిత్ర, మహాదేవులు. గీత గోవిందకర్త జయదేవుడు, ఈయన ఒకరు కాదు. ఈయన చన్ద్రాలోకం అలంకార శాస్త్రం రచించాడు. ప్రసన్న రాఘవం నాటకం జయదేవ రచించిన ప్రసిద్ధ రచన.

ఈ నాటకం రామాయణ కథకు సంబంధించినది. నూతన కల్పనలతో, మనోహర వర్ణనలతో విలసిల్లుతోంది. ఈ నాటకంలో నాటకీయత కంటే వర్ణనలు, కవిత్వ పటాటోపం ఎక్కువ. సంస్కృత నాటకం క్షీణదశలో వెలువడిన నాటకం. ఈ కవికి వసంత తిలక, శారదా విక్రీడితం, శిఖరిణి ఛందస్సులు అభిమాన ఛందస్సులు. స్వగతాలు వీరి నాటకంలో ఎక్కువ. సర్వలక్షణ సంపన్నంగా నాటకం రాయాలని ఈ రచయిత లక్ష్యంగా కనిపిస్తుంది. ప్రయోగ కౌశలం తక్కువ.

ఈ నాటకాన్ని మొట్టమొదట శ్రీ రామానుజదాసు (1888), తరువాత కొక్కొండ వెంకట రత్నం పంతులు (1897) ప్రభృతులు తెలుగులోకి అనువదించారు. కొక్కొండ వెంకటరత్నం పంతులు అనువాదంమీద వేదం వేంకటరాయ శాస్త్రి విమర్శ లోక ప్రసిద్ధం.

శ్రీ.చ.

జయరాజు, గుమ్మడి (జ.1940) : ప్రసిద్ధ రంగస్థల నటుడు. గుమ్మడి అంజయ్య, మాణిక్యమ్మ దంపతులకు కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామంలో 1940, డిసెంబర్ 30న జన్మించాడు. ఉపాధ్యాయుడుగా పనిచేసి 1998, డిసెంబర్ 30న పదవీ విరమణ చేశాడు.

విద్యార్థి దశ నుంచీ నాటక కళపై అభిరుచి పెంచుకున్నాడు. మధు రంగా పాడగల గళం జయరాజును పద్య నాటకాలవైపు దృష్టి మరల్చేటట్టు చేసింది. 1958లో తొలిసారిగా స్త్రీ పాత్ర ద్వారా నాటకరంగ ప్రవేశం చేశాడు. ఆనాటి నుంచీ ఐదువేల పైచిలుకు ప్రదర్శనల్లో వైవిధ్యభరితమైన పాత్రలు సమర్థవంతంగా పోషించి పండిత పామరుల ప్రశంసలు అందుకున్నాడు. *కురుక్షేత్రం, రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర, చింతామణి, గయోపాఖ్యానం, పల్నాటియుద్ధం, బాలనాగమ్మ, శ్రీకృష్ణ తులాభారం* వంటి ప్రసిద్ధ నాటకాలలో ప్రధాన పాత్రలు పోషించి రసజ్ఞుల మన్ననలు అందుకున్నాడు. ఇవేకాక *దావీదు విజయం, భక్త లాజరు, యేసు కృప, పది ఆజ్ఞలు, శిలువ ధారి* మొదలైన క్రైస్తవమత సంబంధ నాటకాలను కూడా విరివిగా ప్రదర్శించాడు. అయిదు దశాబ్దాలుగా నాటక రంగంలో జయరాజు చేసిన కృషిని ప్రశంసిస్తూ రాష్ట్రంలో అనేక కళా సంస్థలు 'ఆంధ్రరత్న', 'నటగాయక చక్రవర్తి', 'నటరత్న', 'గానకోకిల' మొదలైన బిరుదులతో జయరాజును సత్కరించాయి. మూడు తరాల నటీనటులతో నటించే అదృష్టం ఈయనను వరించింది. ఈలపాటి రఘు రామయ్య, పీసపాటి నరసింహమూర్తి, మల్లాది సూర్యనారాయణ, షణ్ముఖి ఆంజనేయరాజు, ఎ.వి. సుబ్బారావు, వల్లూరి వెంకట్రామయ్య చౌదరి, బండారు రామారావు, బుఱ్ఱా సుబ్రహ్మణ్య శాస్త్రి, రేబాల రమణ, డి.వి. సుబ్బారావు, ఎం.ఆర్. తిలకం, టి.కనకం, అబ్బూరి కమల, గూడూరు సావిత్రి, గుమ్మడి గోపాలకృష్ణ ప్రభృతుల

సరసన నటించాడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2000 సంవత్సరంలో ధర్మనిధి పురస్కారంతో సత్కరించింది. ఈయన దూరదర్శన్, ఆకాశవాణి కార్యక్రమాలలో విరివిగా పాల్గొన్నాడు. 65 సంవత్స రాలు దాటినా కూడా నాటకాల్లో పాల్గొంటూ ఉండటం జయరాజులోని కళాతృష్ణకు నిదర్శనం.

గం.సు.రె.

జర్జర : ఇంద్రధ్వజం. భరతముని స్వర్గలోకంలో ప్రప్రథమంగా అసురపరాజయ మనే రూపకం ప్రదర్శించినపుడు నాందీ ప్రస్తావనంలోనే పొందుపరిచిన అసుర పరాజయ విషయ సూచనను భరించలేక ప్రేక్షక స్థానంలోని రాక్షసులు విరూపాక్షుడు మొదలైన విఘ్నకారులను ప్రోత్సహించడం వల్ల వారు విజృంభించి మాయ వల్ల అదృశ్యులై నటుల వాక్కును, చేష్టలను, స్మృతిని స్తంభింపచేశారు. దానిని ఇంద్రుడు దివ్య దృష్టితో గ్రహించి కోపోద్రిక్తుడై పొదిగిన రత్నాలతో ప్రకాశిస్తున్న తన ధ్వజంతో విఘ్నకారులను కొట్టాడు. దానితో వారి సర్వావయవాలు జర్జరమైనవి, అంటే శిథిలమైనవి. జర్జర మొనరించినవి కాబట్టి దీనికి జర్జరమని పేరు వచ్చింది.

ఈ సంఘటన స్మారకంగా రంగపూజా విధానంలో భాగంగా జర్జరపూజ చేయాలని భరతముని అనుశాసించాడు. ఈ ధ్వజపూజ సంప్రదాయంగా వస్తుంది. జర్జరను వెదురుతో తయారుచేయడం ఉత్తమం లేకపోతే చెట్టువేరుతో గాని, చెట్టు కొమ్మతో గాని నిర్మించవచ్చు. శ్వేతభూమిలో జనించిన వేణువును పుష్యమీ నక్షత్రంలో స్వీకరించాలి. 108 అంగుళాల పొడవున్న జానెడు జానెడు దూరంగా ఉండే నాలుగు గ్రంథులు ఉండాలి. ఈ గ్రంథులు కనిపించేటంత పెద్దవిగా ఉండకూడదు. శాఖలుగాని, రంధ్రాలు కాని ఉన్నది పనికిరాదు. పురుగులు తిన్నది కాని, ఇతర వెదురు బంగులతో రాపిడి వలన సన్నపడినది వాడరాదు. తేనె, నెయ్యి, ఆవాలు, పూలదండలు ధూపంతో వెదురును పూజించి జర్జరగా స్వీకరించాలి.

దీర్ఘ పర్వం, తను పత్రం అగ్రపర్వంలో గల వెదురు బియ్యం జర్జరాన్ని పుష్య లేక పుణ్య వేణువంటారు.

శ్రీ.చ.

జలయుద్ధరూపకం (Aquatic Drama): పాశ్చాత్య నాటక భేదం. నాటకంలో నౌకాయుద్ధాలు ఎక్కువగా ప్రదర్శిస్తారు కాబట్టి దీనికా పేరు వచ్చింది.

ఈ నాటక ప్రదర్శనంలో రంగం మీద పెద్ద పెద్ద నీటి తొట్లుపెట్టి ఆ నీటిమీద ఉత్తుత్తినౌకా యుద్ధాలు ప్రదర్శించేవారు. ఈ నాటకాలలో నాయికను నాయకుడు రక్షించడం, తప్పిపోయిన పిల్లలను శునకాలు వెతికి తీసుకురావడం చూపుతారు. ఉదా : జిబ్రాల్టర్ ముట్టడి, నెల్సన్ విజయం.

శ్రీ.చ.

జవనిక : చూ. యవనిక

జానకీ రామశర్మ, వీరసూరి (జ.1946): రంగస్థల నటుడు. డిప్యూటి కలెక్టర్. ఈయన 1946, డిసెంబరు 20న నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం ఫణిగిరిలో జన్మించాడు. నివాస స్థలం నల్లగొండ. 1980లో నాటక రంగంలో అడుగు పెట్టిన శర్మ శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణ తులాభారం, గయోపాఖ్యానం, శ్రీరామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర, చింతామణి, ఉషాపరిణయం, సతీ సావిత్రి, నల దమయంతి, వసంత తరాజీవం నాటకాలలో నటించాడు. జానకీరామశర్మకు శ్రీకృష్ణుడు, అనిరుద్ధుడు పాత్రలు నటునిగా గుర్తింపు తెచ్చాయి. 2003లో త్యాగరాజ నాట్య కళాపరిషత్తు, సాంస్కృతి కళా కేంద్రం (మిర్యాల గూడ), 1990, 2004లో గణతంత్ర, స్వాతంత్రదినోత్సం సందర్భంగా కలెక్టర్, మంత్రివర్యుల ప్రశంసలందుకున్నాడు. 'నట సుధాకర, నవరస నటనా మర్మజ్ఞ' బిరుదులు అందుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలలో (2000, 2001, 2002)లలో నటించాడు. దూరదర్శన్, ఆకాశవాణి నాటకాలలో నటించాడు.

దాసరి.ఎన్.

జాన్సన్, బెన్ (1572-1637) : ఆంగ్ల నాటక రచయిత. భావకవి, సాహిత్య విమర్శకుడు. 'బెంజమిన్ జాన్‌సన్'గా కూడా ప్రసిద్ధుడు. ఇంగ్లీష్‌లో షేక్స్పియర్ తరువాత మళ్లీ అంతటి ప్రముఖ నాటకకర్తగా ఈయనను పరిగణిస్తున్నారు. ఈయన రచించిన ప్రముఖ నాటకాలలో సెజానస్ (1603), ఈస్ట్‌వర్డ్ హో (1605),వాల్పోనే (1606), ఎపికోనే (1609), ది ఆల్ కెమిస్ట్ (1610), ఆయన రచించిన రెండు ట్రాజెడీలలో ఇది ఒకటి, బర్తొలొమ్యు ఫెయిర్ (1614), ఎవ్విరి మాన్ ఇన్ హిజ్ హ్యూమర్ (1798) చెప్పుకోదగ్గవి.

తొలిదశలో బెన్‌జాన్‌సన్ నటుడుగాను, నాటక రచయితగాను జీవితం ప్రారంభించాడు. ఫిలిప్స్ హెన్ స్లోవేకు ఈయన

నాటకాలు రాసేవాడు. ది కేస్ ఈజ్ ఆల్‌టర్డ్ అనే ఒక్క నాటకం తప్ప ఆ దశలో ఈయన రచించిన నాటకాలలో ఏవీ లభించలేదు.

ఈయన ట్రాజెడీలూ, కామెడీలూ కూడా రచించినా, లభించిన రచనలలో రెండే ట్రాజెడీలు కనిపిస్తున్నాయి. అవి సెజానస్ (1603), కేటిలైన్ (1611).

జాన్‌సన్ నాటకాలు నేటికీ ప్రదర్శన యోగ్యాలుగా ఉన్నాయి. అనంతర నాటక రచయితల మీద బెన్ జాన్‌సన్ ఎక్కువ ప్రభావాన్ని ప్రదర్శించాడు.

బ.శ్రీ.

జాన్సన్, మోదుకూరి (మ.1989): వృత్తిరీత్యా న్యాయవాది. ప్రవృత్తి రీత్యా నటుడు, గాయకుడు. ఈయన గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించాడు. మోదుకూరి జాన్సన్ పేరు వినగానే నటనాలయం నాటకం జ్ఞాపకం వస్తుంది.

నటనాలయం (1966) ప్రదర్శించబడని రంగస్థలం ఉండదు. 'నటనాలయం'లో ఒక కళాతపస్వి కళ కోసం పడే తపన, ఆవేదన, లక్ష్యసాధనలో బాహ్య పరిస్థితులతో పడే ఘర్షణ, అడుగడుగునా కనిపిస్తుంది. అందువల్లనే నాటక కళాభిలాషులకు చాలా సన్నిహితమైంది ఈ నాటకం.

నటనాలయం ఒక సజీవ నాటకం. జాన్సన్ చాలాకాలం తర్వాత దేవాలయం అనే నాటకాన్ని కూడా రచించాడు. అది చాలా ఆలస్యంగా 1986లో అచ్చయింది. విధి వైపరీత్యం ఈ నాటకంలో ఇతివృత్తం. జాన్సన్ నిచ్చెనమెట్లు అనే డాక్యు-డ్రామా కూడా రచించాడు. చలన చిత్ర రంగంలో ప్రవేశించి అనేక చిత్రాలకు సంభాషణలు రాశాడు. మోదుకూరికి 1986లో హైదరాబాద్‌లో ఘనసన్మానంజరిగింది. జాన్సన్ 1989లో స్వర్గస్థుడయ్యాడు.

గం.సు.రె.

జారి, ఆల్ఫ్రెడ్ (1873-1907): ఫ్రెంచ్ నాటకరచయిత. 'అసంగత' (absurd) రూపకకర్తగా ప్రసిద్ధుడు. 23 సంవత్సరాల వయస్సులోనే ఉబూరాయి (1896 ఉబు రాజు) అనే 'అసంగత' రూపక రచన చేసి, ఆ ధోరణి సంప్రదాయానికిఆద్యుడయ్యాడు. తరువాత ఈ సంప్రదాయం థియేటర్ ఆఫ్ ది అబ్‌సర్డ్ గా ప్రసిద్ధి పొందింది. ఉబూ రాయి తొలి ప్రదర్శన అప హాస్యానికి పాత్రమై గందరగోళం సృష్టించింది. రెండు రాత్రులు మాత్రమే ఆడింది. కాని 20వ శతాబ్దంలో కూడా నేటికీ దాని ప్రతిస్పందనలు కనిపిస్తూనే ఉన్నాయి. ప్రపంచంలోని సాధారణ విషయాలలో అసంగతత్వాన్ని, అసందర్భాన్నీ, అర్థరాహిత్యాన్నీ జారీ చిత్రించాడు.

18 సంవత్సరాల వయస్సులో యౌవనోత్సాహంతో, సామాన్యమైన కుటుంబ వారసత్వపు ఆస్తితో పారిస్ వచ్చాడు. గ్రంథాలయాలను తరచు సందర్శిస్తూ రచనలకు ఉపక్రమించాడు. ఆయన వేషం విపరీతంగానూ, కొట్టవచ్చినట్టుగానూ ఉండేది. ప్రవర్తన విడ్డూరంగా ఉండేది. బైసికిల్ ఎక్కి రివాల్వరు తరచు వెంట ఉంచుకొని తిరుగుతూ ఉండేవాడు. తొందరలోనే ఆయన సంపద, అదృష్టం తరిగిపోయింది. ఈయన జీవితంలో అరాచక పరిస్థితులు దాపురించాయి. దిక్కులేని స్థితిలో తాగుడుకు బానిసై అల్పాయుష్కంగా 24 ఏళ్లకే ఆయన జీవితం ముగిసింది.

1896, డిసెంబర్ 10న ఆయన ఉబూరాయి ప్రదర్శితమైంది. 15 సంవత్సరాల వయసులోనే జారీ తన సహపాఠులు కొందరితో కలసి ప్రదర్శించడం కోసం ఆ రూపకం రచించాడు. పాఠశాలలోఉపాధ్యాయుణ్ణి ఒకరిని దృష్టిలో పెట్టుకుని ఆయనను వెటకారం చేయడానికి ఈ నాటకం ఆయన రాశాడు. 'ఉబు' పాత్రది రాక్షస ప్రవృత్తి. చాలా అట్టహాసం, ఆడంబరం అతని లక్షణం. తోలుబమ్మలాంటి వ్యక్తిత్వం. ఈయన పోలండుకు రాజవుతాడు. అమిత మూర్ఖత్వం, అంతులేని అధికార వ్యామోహంతో ఎన్నో క్రూర కృత్యాలకు తలపడతాడు. ఈ నాటకం తరువాత ఉబు ఎంచెయినే (1900), ఉబు సర్ లబు టే (1901) అనే రూపకాలు కూడా ఆయన రాశాడు. ఈ మూడు నాటకాలనూ జేన్ విలార్ 1958లో ప్రదర్శింపచేశాడు. జారీ కథలు, కవిత్వం కూడా ప్రచురించాడు. లమూర్ ఎన్ విజిటిస్ (1898), లె సురమలె (1902) అనేవి ఆయన నవలలు. ఇవి శృంగారాత్మకంగా ఉన్నాయి. అయితే అశ్లీలాలు కావు. తాను నిరూపించిన ఈ అసందర్భ ధోరణి రచనా ప్రక్రియకు పాటాఫిజిక్ అని పేరు పెట్టాడు. దీనిని గురించిన ఒక లక్షణ గ్రంథం కూడా ఆయన రాశాడు (1911లో ప్రచురితం). అది భౌతిక విషయాలను అధిగమించి 'ఊహాత్మకమైన శాస్త్రీయ పరిష్కార విజ్ఞానం'గా దానిని పేర్కొన్నాడు. డాడా సంప్రదాయోద్యమం, అధివాస్తవికతా

ఉద్యమాల ఆదిమ ప్రవర్తకులు రూపొందించిన పరిభాషా రూపకల్పనలను ఉపయోగించుకోవడమే కాక, వాటిని ఆయన మరింత పటిష్ఠం చేశాడు.

మంజుశ్రీ

జాషువ, గుర్రం (1895-1971) : ప్రసిద్ధ కవి. నాటక రచయిత, ఉపాధ్యాయుడు. నవయుగ కవి చక్రవర్తి, కవికోకిల బిరుదాంకితుడు. ఈయన 1895, సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో లింగమాంబ, వీరయ్య దంపతులకు జన్మించాడు. పాఠశాలలో చదువుతున్న రోజుల్లో కటిక పోకిరిగా పేరు తెచ్చుకున్న జాషువ వినుకొండలో ఏడవ తరగతి పూర్తి చేసిన తరువాత, 1908లో బాపట్లలోని హయ్యర్ గ్రేడ్ ట్రైనింగ్ స్కూల్లో ఉపాధ్యాయ శిక్షణ కోసం వెళ్లాడు. తరువాత వినుకొండ సమీపంలోని చాట్రగడ్డపాడులో బడిపంతులుగా చేరాడు. కానీ ఎక్కువ కాలం పనిచేయలేదు. జీవించడానికి ఏదో ఒక ఉద్యోగం అవసరం కాబట్టి గుంటూరులో టూరింగ్ సినిమాలో మూకీ చిత్ర కథా వాచకుడిగా చేరి గుంటూరు, గోదావరి జిల్లాలో విస్తృతంగా తిరిగాడు. ఈ సమయంలోనే జాషువకు ప్రసిద్ధ నటుడు తోలేటి వేంకట సుబ్బారావుతో పరిచయమేర్పడింది. జాషువ ప్రతిభను గుర్తించిన సుబ్బారావు చింతామణి నాటక మండలి నిర్వాహకుడు సత్యవోలు గున్నేశ్వరరావుకు పరిచయం చేసి నాటక రచయితగా రుక్మిణీ కల్యాణం, మదాలస నాటకాలు వెలువడటానికి దోహద పడ్డాడు. కాంట్రాక్టర్లు నాటకరంగంలో అడుగుపెట్టి కాసులపంట పండించుకుంటున్న సమయంలో జాషువ రచించిన రుక్మిణీ కల్యాణం ప్రదర్శింపబడి ప్రేక్షకుల ప్రశంసలందుకోవడం గమనార్హం. కొద్దిరోజుల తరువాత చింతామణి నాటక మండలి మూతపడడంతో జాషువ గుంటూరుకు మకాం మార్చి యునైటెడ్ లూథరన్ మిషన్ బోధనాభ్యాసన పాఠశాలలో పండిట్ ఉద్యోగంలో చేరాడు. గుంటూరులోని నాటక సమాజాలు, నటులు పరిచయమయ్యారు. ఇదే కాలంలోనే దావీదు చరిత్ర (1920), చిదానంద ప్రభాతం రచించాడు. ఈ నాటకాలు అనాదరణకు నోచుకున్నాయి. నటుడు, ప్రయోక్త, రచయిత కొప్పరపు సుబ్బారావు సలహా మేరకు జాషువ ధ్రువ విజయం (1925), వీరాబాయి (1926) నాటకాలను రచించాడు. ఇవి శ్రీ రాధాకృష్ణ విలాస సభ, బాలమిత్ర సమాజం కోరిక మేరకు రచించాడు. ఆ తరువాత 1935లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిర్వహించిన నాటక, నాటిక పోటీల కోసం తెరచాటు (1935) నాటకాన్ని రచించాడు. ఈ నాటకంలో బాల వితంతువుల హృదయ వేదన, తత్ఫలితంగా జరిగే అనర్థాలు చిత్రింపబడ్డాయి. 1918 నుంచి 1935 వరకు బడిపంతులుగానే కాకుండా నాటక రచయితగా రచనలు చేసిన జాషువ, సంస్కృత నాటక సంప్రదాయాలను అనుసరించక, ఆధునిక దృష్టితో అంకాలుగా కాకుండా రంగాలుగా విభజించి ప్రదర్శన దృక్పథంతో రచించాడు. ఈ నాటకాలలో జాతీయ సమైక్యత, దేశభక్తి, సామాజిక స్థితిగతులు ఉన్నాయి. నాటక రచయితగా తనవంతు కృషి చేసినా కవిగానే జాషువ ఎనలేని కీర్తిని సంపాదించాడు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ఘన సన్మానాలు స్వీకరించిన జాషువ 1971, జూలై 24న కన్ను మూశాడు.

దాసరి,ఎన్.

జితేంద్ర శర్మ : (చూ. శర్మ జితేంద్ర)

జీవనశ్రీ (జ.1929) : నటుడు, దర్శకుడు, రచయిత. అసలు పేరు ఎం.ఎ. ఖాదర్. ఈయన 1929వ సంవత్సరం నవంబరు ఆరున నెల్లూరు జిల్లా గూడూరులో జన్మించాడు. జాతీయోద్యమం జరుగుతున్న రోజుల్లో తెలుగు తల్లి, నాదేశం, ఆగస్టు *15* వంటి దేశభక్తి నాటకాలలో నటించాడు. చదువుకునే రోజుల్లో కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు *15* నాటికలో నటించి ఉత్తమ నటుడి బహుమతిని గెలుచుకున్నాడు. నిబద్ధతగల నటుడుగా సమాజానికి కళల ద్వారా తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించే ప్రయత్నంలో 1952లో 'ది నెల్లూరు యంగ్ ఆర్టిస్ట్సు అసోసియేషన్' స్థాపించాడు. ఈ సంస్థ పక్షాన పి. రమణారెడ్డి, ఏకాంబరం, పుష్పలత మొదలైన వారితో కలిసి రెండు దశాబ్దాలు పాటు వివిధ ప్రదేశాలలో ప్రదర్శనలిచ్చి ప్రథమ బహుమతులు అందుకున్నాడు.



ప్రేక్షకుల నాడి తెలుసుకొన్న నటుడిగా కొన్ని హాస్య నాటికలను కళాభిమానుల ముందుంచాడు. నాటి రాజకీయ స్థితిగతులకు కొంత హాస్యాన్ని జోడించి రచించాడు. *నీ బ్రతుకెంత? (1953)* బాగా ప్రజాదరణ పొందిన నాటిక. *పరిషత్ పోటీదారులు (1956)*, *కొరివిదయ్యం*, *వింతవైఖరి (1958)*, *రౌడీ వల్లన్న (1960)*, *దేవాంగ పిల్లులు (1962)*, *దంపతులు (1965)*, *మిణుగురు పురుగులు (1968)*,

ప్రెస్ వర్కర్ *(1969)* మొదలైనవి ఈ కోవలోనివే. పరిషత్తు పోటీలలో వీటిని ప్రదర్శించాడు. ఇవి ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమయ్యాయి. జీవనశ్రీ దూరదర్శన్ కోసం 2000లో డాడీ యు ఆర్ గ్రేట్ సీరియల్ రూపొందించాడు. జీవితాలు (తెలుగు), లోక్ పర్‌లోక్ (హిందీ) చిత్రాలలో నటించాడు. కళారంగ వికాసంకోసం కృషిచేసిన జీవనశ్రీని 1982లో నెల్లూరు జిల్లా కళాకారులు ఘనంగా సత్కరించారు.

దాసరి, ఎన్.

జుగుప్స : బీభత్సరస స్థాయి భావం. జుగుప్స అంటే రోత, ఏవగింపు. రోతపుట్టించే వస్తువులను చూడడం వల్ల గాని, వాటిని గురించి వినడం వల్ల గాని కలిగే సంకోచ (విచికిత్స) రూపచిత్తవృత్తి విశేషమే జుగుప్స. ఉదా॥ మాలతీమాధవం పంచమాంకంలో మాధవుడు స్మశానం వంక చూసి

మాధవుడు : (పరిక్రమించి చూచి) అబ్బా రోత రోత! ఎదుట ప్రేతరంకమును పిశాచము చేయు చేష్టయెంత బీభత్సముగా నున్నదో! – మాలతీమాధవం అను : మల్లాది సూర్య నారాయణ శాస్త్రి

శ్రవణం: వస్తుతత్వాన్ని తెలిపే ఆగమాది శాస్త్రాలను వినడం వల్ల శరీరం మీద జుగుప్స కలగడం.

ఘృణాశుద్ధ జుగుప్స: వైరాగ్య కారణంగా స్త్రీల పిరుదులు, స్తనాలు మొదలైన స్త్రీ శారీరకావయవాల పట్ల జుగుప్స పుడుతుంది. ఈ జుగుప్సను ధనంజయుడు దశ రూపకంలో ఘృణాశుద్ధ జుగుప్స అని పేర్కొన్నాడు. అయితే దీనిని సింగభూపాలుడు శ్రవణ జుగుప్స కిందే జమకట్టి ఘృణాశుద్ధ జుగుప్సను ప్రత్యేకంగా వివరించాడు.

శ్రీ.చ.

జూక్‌మేయర్, కార్ల్ (1896-1977) : ప్రముఖ జర్మన్ నాటకకర్త. 1896, డిసెంబర్ 27న జర్మనీలోని నకెన్ హైమ్ పట్టణంలో జన్మించాడు. జాక్‌మేయర్ నాటకాలు రెండు ప్రపంచ యుద్ధాల వల్ల మిక్కిలి క్లిష్టమైన సమకాలిక జీవిత సమస్యలను చిత్రిస్తూ రచించినవి.

మొదటి ప్రపంచ సంగ్రామ కాలంలో నాలుగు సంవత్సరాలు జర్మన్ సైన్యంలో పని చేశాడు. అటు తరువాత తన జీవితాన్ని పూర్తిగా రచనలకే అంకితం చేశాడు. 1924లో ప్రసిద్ధ నాటక రచయిత బెర్టోల్డ్ బ్రెష్టాకు, ప్రసిద్ధ దర్శకుడు మాక్స్ రైన్‌హార్ట్‌కు సన్నిహితుడుగా ఉన్నా, తన స్వాభావికవాద (Naturalism) ప్రక్రియ పట్ల విశ్వాసాన్ని ఏ మాత్రం కోల్పోలేదు.

జూక్‌మేయర్ 1925లో రాసిన మొట్టమొదటి నాటకం ది హాపీ వైన్ యార్డ్‌కు క్లైస్ట్ బహుమతి వచ్చింది. 1931వ సంవత్సరంలో ది కెప్టెన్ ఆఫ్ కోపెనిక్ అనే నాటకం రాశాడు. ఇది ప్రష్యన్ సైనికవాదాన్ని హేళన చేసే ఒక వ్యంగ్య పరిహాస రచన. నాటక రచయితగా దీనివల్ల ఆయనకు ఎనలేని ఖ్యాతి వచ్చింది. 1933లో రాజకీయ ఒత్తిడులు కారణంగా ఆస్ట్రియా దేశానికి ఆయన వలస పోవలసి వచ్చింది. అక్కడ ది విలన్ ఆఫ్ బ్రెజెన్ అనే నాటకం రాశాడు.

1939వ సంవత్సరంలో అమెరికా వెళ్లి ఆ దేశ పౌరుడుగా స్థిరపడిపోయాడు. అక్కడే ఈయన నాటకాలన్నిటిలోకి ఉత్తమమని చెప్పదగ్గ ది డెవిల్స్ జనరల్ రాశాడు. ఈ నాటకంలో దేశభక్తికీ, అంతరాత్మ ప్రబోధానికీ మధ్య సంఘర్షణను చక్కగా చిత్రించాడు.

ఈ నాటక రచనవల్ల జాక్‌మేయర్ జీవితం ఒక కొత్త మలుపు తిరిగింది. తొలి రచనలలో కంటే ఈ రచనలో ఎంతో పరిణతి కనిపిస్తుంది. అంతకుముందు ఉత్సాహంతో ఉరకలు వేస్తూ ఉండే ఆయన రచనలలో నైతిక విలువల మదింపుకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పద్ధతిలోనే 1949లో బార్బరా బ్లమ్‌బెర్గ్, 1950లో ది సాంగ్ ఇన్ ది ఫియరీ ఫర్‌నేస్, 1955లో ది కోల్డ్ లైట్ రాశాడు. ఈ చివరి రచనను అణుశాస్త్రవేత్త అయిన 'క్లాస్ ఫక్స్' మీద వచ్చిన దేశద్రోహం కేసును ఆధారంగా చేసుకొని రచించాడు.

జూక్‌మేయర్‌ది ఒకచోట స్థిరంగా ఉండే ప్రవృత్తి కాదు. 1946లో తన నివాసాన్ని స్విట్జర్‌లాండ్‌కు మార్చాడు. 1952లో తన రచనలకు 'గోథే' బహుమతిని పొందాడు. భగవంతుడిలో విశ్వాసం, మనిషి ప్రవర్తన పట్ల నమ్మకం జూక్‌మేయర్‌లో ఎన్నడూ సడలలేదు. ఆయన నాటకాలన్నీ విమర్శనాత్మకాలే!

జూక్‌మేయర్ చేసిన ఇతర రచనలలో వ్యాసాలూ, వాట్ ప్రైస్ గ్లోరీ వంటి రచనలకు చలనచిత్రానువాదాలూ, ది బ్లూ ఏంజెల్ వంటి చలన చిత్రాలకు రాసిన సినేరియోలూ, సల్వేర్ ఆర్డర్, ది మూన్స్ రైడ్ ఓవర్ వంటి నవలలూ చెప్పుకోదగ్గవి. రెండు ఆత్మ చరిత్రాత్మక రచనలు ఆయన వెలువరించాడు. 1940లో సెకండ్ విండ్ అనే పేరుతో ఒకటీ, 1970లో ఏ పార్ట్ ఆఫ్ మై లైఫ్ అనే పేరుతో రెండవదీ వెలువడ్డాయి. 1961లో ఇతని రచనలన్నీ మొత్తం నాలుగు సంపుటాలుగా ప్రకటించబడ్డాయి. 1977, జనవరి 18న స్విట్జర్లాండ్‌లోని విస్ప్ నగరంలో జూక్‌మేయర్ కన్నుమూశాడు.

శే.వెం.న.

జోగినాథం, గండికోట (1897-1969) : హాస్యనటుడు, 'కాకినాడ యంగ్‌మెన్స్ హాపీ క్లబ్' దర్శకుడు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ విశిష్ట సభ్యుడు. హాస్యనటశేఖర, హాస్య కళానిధి, హాస్య రస చక్రవర్తి, హాస్య

నటకాగ్రణి బిరుదాంకితుడు. ఈయన కాకినాడలో 1897, జులై 15న జన్మించాడు.

నేడు సినిమా లోకంలో, నాటకరంగంలో ప్రసిద్ధికెక్కిన హాస్యనటులంతా ఈయన శిష్యులు, సహచరులే. పౌరాణిక, సాంఘిక నాటకాలలో హాస్యపాత్రలు మోటు హాస్యం లేకుండా సున్నిత హాస్యంతో నటించి అభినందనలతో పాటు బిరుదులు అందుకున్నాడు. ఈయన హాస్యం కోసం హాస్యాన్ని ప్రదర్శించేవాడు కాదు. సుబ్బిశెట్టి పాత్ర ఆనాటి కోమటి రసికులకు ప్రతిబింబం. ఆయన మాట్లాడే ప్రతి మాటకు ప్రతి చేష్టకు ఒక అర్థంఉంది. అర్థం లేని వెర్రిమొర్రి హాస్యానికి తావిచ్చేవాడు కాడు. ఈయన సుబ్బిశెట్టి, బండ అబ్బాయి (కృష్ణలీల) మొదలైన హాస్యపాత్రలలో నటించాడు.



జీవితాన్ని నాటకరంగానికి ధారపోసిన గండికోట జోగినాథం 1969, అక్టోబర్ 17న మరణించాడు.

శ్రీ.చ.

జోరూరి : జపాన్ తోలుబొమ్మలాట. కబూకీ నాటక రంగానికి ఇదే మాతృక. ఈ బొమ్మలాటల కోసమే జపాన్ రచయితలు తమ మహానాటకాలలో చాలా భాగం కేటాయించారు.

ఈ బొమ్మలాట వెడల్పాటి ఎత్తు తక్కువ ఉన్న రంగస్థలం మీద జరుగుతుంది. కబూకీ నాటక రంగస్థలం మీది వాస్తవికత అంతగా ఈ బొమ్మలాటలో ఉండదు. 'దృశ్యం మాత్రం బాగా విపులంగా ఉండి బొమ్మలను ఆడించడానికి అనువుగా ఉంటుంది. బొమ్మలు మనిషి ఎత్తులో మూడింట రెండు వంతులుంటాయి. ఈ బొమ్మలాటలోని ముఖ్యమైన పాత్రలు మంచి దుస్తులు ధరించిన వ్యక్తి ఆడిస్తాడు. కరాళం ధరించడు. ప్రేక్షకులకు కనిపించేటట్టుగానే వీటిని ఆడిస్తాడు. ఈ బొమ్మల సూత్రాలు పైనుంచి వేలాడుతుంటాయి. ప్రధాన సూత్రధారిగాక ఇంకా ఇద్దరు ముగ్గురు బొమ్మలను ఆడిస్తారు. వీరికి టోపీలుంటాయి. బొమ్మల ప్రక్రియలతోపాటు ఐదుగురు బృందగాయకులు పాడుతారు. వీణలు వారి పాటలకు సహకార వాయిద్యాలు.

శ్రీ.చ.

టాల్‌స్టాయ్, లియోకొలయవిచ్ (1828-1910) : రష్యన్ నాటక కర్త, నవలాకారుడు, కథకుడు, తత్త్వవేత్త, మహర్షి, గాంధీజీకి గురుతుల్యుడు. టాల్‌స్టాయ్ నవలలు, కథల ముందు నాటకాలు ఆచ్ఛాదితమయ్యాయి.

టాల్‌స్టాయ్ మొట్టమొదటి నాటకం ది ఫస్ట్ డిస్టిలర్, రెండవ నాటకం ది పవర్ ఆఫ్ డార్క్‌నెస్. టాల్‌స్టాయ్ నాటకాలలో ఇది ఉత్తమోత్తమైన నాటకంగా పరిగణించబడుతుంది. ఆనాటి రష్యన్ రైతు జీవితానికిది ప్రతిబింబం. ఈ నాటకాన్ని ప్యారిస్, బెర్లిన్ నగరాలలో మొట్టమొదటగా ప్రదర్శించారు. టాల్‌స్టాయ్ నాటకాలలోఎక్కువగా వేదాంతం తళుక్కుమంటూ ఉంటుంది. ఈయన రచించిన రిజిరెక్షన్, అన్నాకెరెనీనా, వార్ అండ్ పీస్ నవలలను నాటకీకరించి ఎక్కువగా ప్రదర్శించాడు.

టాల్‌స్టాయ్‌కి నాటక రచన ప్రధాన వ్యాసంగం కాదు. నాటక స్వరూప రచన విషయంలో కొంత తొందరపాటు, సమకాలీన తాత్త్విక చింతన మీద నిరాకరణ, టాల్‌స్టాయ్ నాటకాల ముఖ్య లక్షణాలు. ఈయన నాటకాలను వేలూరి శివరామ శాస్త్రి, గద్దె లింగయ్య, దండమూడి మహీధర్ ప్రభృతులు తెలుగులోకి అనువదించారు.



మొదటి సారాబట్టీ *(The First distiller - 1887)*, అంధకారశక్తి *(The Power of Darkness - 1889)*, ప్రకాశఫలితాలు *(Fruits of Enlightenment - 1891)*, జీవచ్ఛవం *(Livecorpse - 1900)*, అన్నింటికి కారణం *(The cause of it all)*, అంధకారంలో కాంతి ప్రకాశనం *(The power of enlightenment)* మొదలైన నాటకాలు రచించిన టాల్‌స్టాయ్ 1910లో మరణించాడు.

శ్రీ.చ.

టిర్సో డి మొలీనా (1584-1648) : స్పానిష్ నాటక రచయిత, లోప్ డి వేగాకు ముఖ్య అనుచరుడు. 'గేబ్రియల్ టెల్లెజ్' పెట్టుకొన్న కలం పేరు ఇది. ఆల్కలా విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేశాడు. 1601లో 'మెర్సి డేరియన్ ఆర్డర్'లో సభ్యత్వం పొందాడు. ఆ వ్యవస్థ చరిత్రను హిస్టారియా జనరల్ డి లా ఆర్డెన్ డీ లా మెర్సిడ్ గా 1637లో రూపొందించాడు. మతాన్ని అధ్యయనం చేసి, ధర్మ సూక్ష్మాలను బాగా అవగాహన చేసుకున్న మేధావి. సహజంగా రంగస్థలం పట్ల ఉన్న ఆసక్తి,

శ్పానిష్ కమెడియా స్రష్ట అయిన 'లోప్ డి వేగా' సాధించిన విజయాలూ కలిగించిన ఉత్సాహం ఆయనను నాటక రచన వైపుకు మళ్లించాయి. ఈయన నాటకాలలో తాత్త్విక చింతన కనిపిస్తుంది. స్పెయిన్, పోర్చుగల్, వెస్ట్ఇండీస్‌లలో మతోద్యోగరీత్యా విస్తృతంగా పర్యటించిన ఈ రచయిత తన నాటకాలలో ఆయా దేశాల విశేషాలను విరివిగా వాడుకొన్నాడు.

ఆయన నాటకాలలో మనకు లభ్యమయ్యేవి 80 మాత్రమే. 1627-1636 మధ్యఐదు భాగాలుగా ఇవి ప్రకటితమయ్యాయి. సుఖాంత, విషాదాంత నాటకాలు రాయటంలో ఈయన దిట్ట. 'కామెడి'లు రాయటంలో తన సమకాలీనులతో సరితూగినవాడే అయినా 'ట్రాజెడి'లు రాయటంలో వాళ్లందరిపై ఉన్నతస్థాయి వాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఈయన రాసిన విషాదాంత నాటకాలలో ప్రముఖంగా పేర్కొనదగినవి – ఎల్ బుర్లడార్ డి సెవిల్లా, ఎల్ కాండినెండొ పార్ డిస్ కాన్ఫియాడొ (1635). పాత్రలలోని మానసిక సంఘర్షణలను, పరస్పర విరుద్ధమైన లక్షణాలను చిత్రీకరించడంలో ఈ రచయిత అందెవేసిన చేయి. ఆంటోనా గార్సియా(1635)లో 'మంది భావావేశాన్ని' హేతువాదబద్ధంగా చక్కగా విశ్లేషించి చూపాడు. లా ప్రుడెన్షియా ముజర్ (1634)లో ప్రాచీన కాలంలోని ప్రాంతీయ సంఘర్షణలను ప్రదర్శించాడు. లావెన్ గాన్జా డి తమర్ (1634)లో వాస్తవికత కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది.

నాటకాలు మాత్రమే కాక, అనేక కవితలు, కథలు కూడా రచించాడు.

కె.జి.మూర్తి

టెరెన్స్ (క్రీ.పూ. 190-క్రీ.పూ. 159) : రోమన్ నాటక రచయిత. ప్రజారంజకత్వమే ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని ప్లాటస్ నాటకాలు రాస్తే, మేధావి వర్గ రంజకత్వం, మెప్పులను దృష్టిలో పెట్టుకుని నాటకాలు రచించిన రచయిత టెరెన్స్. మానవులకు సంబంధించిన విషయాలన్నీ నా విషయాలే అనే సూక్తిని జీవిత లక్ష్యంగాపెట్టుకుని, ఆ లక్ష్యాన్నే తన నాటకాలలో ప్రతిబింబింపచేసిన మేటి రచయిత. అందుచేతనే ఇతని నాటకాలు ప్రజలను ఆకర్షించి వారి ఆదరాభిమానాలను ఎంతగానోచూరగొన్నాయి. క్రీ.పూ. 166-160 మధ్యకాలంలో ఇతని నాటకాలు వెలువడినాయి. టెరెన్స్ గ్రీకు నాటకాలకు మెరుగులు దిద్దాడు. మెరుగులు దిద్దడంలోనే ఏ రోమన్ నాటకకర్తలోనూ కనిపించని స్వతంత్ర రచనా శక్తి గోచరిస్తుంది. నాటక రచనకు టెరెన్స్ కొన్ని కొలతబద్దలు ఏర్పరచుకున్నాడు. నాటక కథావివరణ నాటకంలోనే ఇమిడి ఉండాలి గాని ప్రస్తావన ద్వారా వివరించకూడదని మతం. ఈయన మతం నాటకీయతను పెంపొందించడానికి కొన్ని కొన్ని చోట్ల మాతృకలోని స్వగతాలను సంభాషణలుగా మార్చివేశాడు. పరస్పర విరుద్ధ పాత్రలు ఈయన నాటకాలలో ఎక్కువగా తారసిల్లుతాయి. ఈ నాటకకర్తకు కులీనులతో పరిచయం ఎక్కువ. అందుకనే ఇతని నాటకాలలో నాటి కులీన సంస్కృతీ సంస్కారాల వాతావరణం ద్యోతకమవుతుంది. ఈయన నాటకాలలోని ప్రపంచం కచ్చితంగా గ్రీకు ప్రపంచమూ కాదు, రోమన్ ప్రపంచమూ కాదు, స్థల కాలాలకు అతీతమైన ప్రపంచం. ఒక అంతస్తులోని స్త్రీ పురుషులు ప్రేమించుకునే సన్నివేశాలను నాటకాలలో ప్రవేశపెట్టింది కూడా ఇతనే. గ్రీకు ఆహ్లాద నాటకాలలో ఇలాంటి సన్నివేశాలు మృగ్యం. కారణం గ్రీకు సమాజంలో స్త్రీది ఏకాంతవాస జీవితం, రోమన్ సమాజంలో స్త్రీకి స్వేచ్ఛా విహారావకాశాలుండడమే. ఆధునిక రీతులలో సాహిత్యంలో ప్రేమగాథ ప్రవేశించడానికి కారణం రోమన్ స్త్రీల స్వాతంత్ర్యమే.

టెరెన్స్ రచనల మీద విమర్శలు ఎక్కువగా చెలరేగినా మొత్తం మీద ఈయన నాటకాలు విజయవంతమైనాయనే చెప్పాలి. జీవిత కాలంలోనే గాక మరణానంతరం కూడా ఇతని నాటకాలు శైలీ, గాంభీర్యం మూలంగా చాలా కాలం జీవించాయి. మధ్యయుగంలోని పాఠశాల విద్యార్థులు ఈయన నాటకాలను పఠించారు, ప్రదర్శించారు. పునరుజ్జీవన కాలంలో ఈయన నాటకాలు అనేక భాషలలోకి అనువదింపబడ్డాయి. ఈయన నాటకాల ప్రభావం ఫ్రెంచి నాటకాల మీద ఎక్కువ గోచరిస్తుంది.

టెరెన్స్ నాటకాలలో ఇపుడు మనకు అందుబాటులో ఉన్నవి ఆరు: యాండ్రియా, అడెల్ఫీ, హెక్రియా, యూనక్స్, పోర్మియో, హెటోస్టి మెర్మెనాస్.

శ్రీ.చ.

టోపా : ఈ పదాన్ని ఆంగ్లంలో 'విగ్' అంటారు. విగ్ అనే పేరే ఎక్కువగా వాడుకలో ఉంది. నటీనటులు తాము నిర్వహించే పాత్రలకనుగుణంగా తలకు ధరించే శిరోరాసినే టోపా అంటారు. పాత్ర లింగ వయో ఆశ్రమ భేదాలను పట్టి, కుల మత భేదాలను పట్టి, ప్రకృతావస్థను పట్టి రకరకాల టోపాలను ధరించవలసి ఉంటుంది.

ఈ టోపాలలో ముఖ్యమైనవి గిరజాల టోపా, పిలక టోపా, బట్టతల టోపా, ఋషి టోపా, సగం (పొయ్యి) విగ్గు,

వెనకముడి విగ్గు, క్రాపు విగ్గు, జటాజూట విగ్గు, వేలుముడి విగ్గు, మధ్య పాపిడి విగ్గు, పక్క పాపిడి విగ్గు, బారు వెంట్రుకల విగ్గు, సవరాలు,జడ కుచ్చులు, ఉంగరాల జుట్టు విగ్గు, జడవిగ్గు.

ఈ విగ్గులనుధరించడంలో ఎంతో జాగ్రత్త తీసుకోవాలి. విగ్గు ధరించే ముందు నటీనటులు తమ సహజ శిరోజాలను అణిగిపోయేటట్టు దువ్వి, టోపా కచ్చితంగా బిగిసేటట్టు చూడాలి. లేకపోతే విగ్గు సరిగా బిగువక తల తిప్పినపుడు ఊడి కిందపడే ప్రమాదం ఉన్నది. విగ్గు పెట్టుకున్నా అసలు వెంట్రుకలు కొన్ని వెలుపల మిగిలిపోతే వాటికి ఆ విగ్గు రంగు వేయాలి. టోపా నుదురు భాగం నుంచే ధరించాలి. నాటకం ముగిసిన తరువాత దానిని కొయ్య తలకు తగిలించి ఉంచాలి. కాని వుడత పెట్టకూడదు. విగ్గుకు ఎప్పుడూ గాలి తగులుతూండడం మంచిది.

దీనినితగిలించుకొనేటపుడు స్థానంసరిగా చూసుకొని ముందు భాగాన్ని బాగా నొక్కి పట్టి వెనక భాగం బాగా కిందకులాగి సరిచేసుకోవాలి. టోపా ధరించుకున్న తరువాత ఒదులుగా ఉంటే పిన్నులతో వెనుక తట్టు బిగ్రు చేసుకోవాలి. తరువాత మొదటి భాగంలో చెంపదగ్గర కనిపించకుండా క్రేప్ హెయిర్ అంటించి సహజంగా ఉండేటట్లు సరిచేసుకోవాలి.

బట్టతల టోపా ఉపయోగించేటపుడు దాని అతుకు కనపడకుండా చూసుకోవాలి. తొలి పూతరంగుతో అతుకు కనిపించకుండా జిగురుతో గాని, కొవ్వుతో గాని అతికించాలి. గడ్డాలను, మీసాలను కృత్రిమ కేశాలతో పెట్టుకుంటారు. కృత్రిమ కేశాలనే క్రేప్‌హెయిర్ అంటారు. ఇది జడలు జడలుగా అల్లుకొని ఉంటుంది. అల్లిక వల్ల ఏర్పడ్డ నొక్కులు అలాగే ఉంటే గడ్డాలు, మీసాలు సహజంగా ఉండవు. అందుకని వాటిని ధరించడానికి రెండు మూడు గంటల ముందు నీళ్లలో నానపెట్టాలి. అపుడు ఇవి మెత్తపడి మృదువుగా ఉంటాయి. ఇది అన్ని రంగులలోనూ దొరుకుతుంది. కావలసినరంగు క్రేప్‌హెయిర్‌ను సమంగా కత్తిరించి, చిక్కులుంటే విడదీసి, స్పిరిట్ గమ్ దీనికి గాని, గడ్డానికి గాని పుల్ల సహాయంతో అంటించుకుంటూ పోవాలి. ఇలా వరుస మీద వరస అంటించుకుంటూ పోతే గడ్డం సహజంగా ఉన్నట్టు ఉంటుంది. తరువాత తడిగుడ్డతో అదిమిపెట్టి దువ్వెనతో నెమ్మదిగా దువ్వాలి. ఎగుడు దిగుళ్లు ఉంటే కత్తెరతో సరిచేసుకోవాలి.

రకరకాల గడ్డాలు, మీసాలు, గుడ్డ పట్టి మీద కుట్టి ఉంటాయి. మనకు కావలసినపరిమాణం గల పట్టీలనెంచుకొని గడ్డానికి, మూతికి అంటించుకొని పట్టీ భాగం పెన్సిల్‌తో దిద్దితే స్వాభావికంగా ఉంటుంది. దీనిని పట్టీ మీసం అనీ, నైలాన్ నెట్ మీసం అనీ అంటారు.

శ్రీ.చ

టోరెస్ నహారో, బార్టోలోమెడి (1484-1525) : శ్పానిష్ నాటక రచయిత, వ్యాస రచయిత. 1484వ సంవత్సరంలో స్పెయిన్ దేశంలో 1484లో లాటారె డీ మిగ్వెల్ సెస్‌మిరో అనే చోట జన్మించాడు. నాటక రచయితగా, సృజనాత్మక సిద్ధాంతకర్తగా పేరు పొందాడు.

ఈయన సైనికుడిగా కొంతకాలం పని చేశాడు. కొంతకాలం ఆల్జీర్స్‌లో నిర్బంధితుడుగా ఉన్నాడు. తరువాత రోమ్‌కు పారిపోయాడు. అక్కడ పోప్ 10వ లియోకు విశ్వాసపాత్రుడు అయ్యాడు. అక్కడ ఉన్న ముఖ్యులైన చర్చి అధికారులతోను, వ్యాపారస్తులతోను అనుబంధాన్ని పెంచుకున్నాడు.

టోరెస్ నహరో తన రచనలను మొదట 1517వ సంవత్సరంలో ఒక సంపుటిగా ప్రచురించాడు. దాని పేరు ది ఫస్ట్ థింగ్స్ ఆఫ్ పల్లాస్ . ఈ రచనలో నాటక కళను గురించి, విషాదాంత, సుఖాంత నాటకాలను గురించి చర్చించాడు. తన రచనలను తానే రెండు విధాలుగా వర్గీకరించుకొన్నాడు. 1) కామీడియా అనోటీసియా: వాస్తవికాలు, స్వయంగా గమనించిన యథార్థ ఘటనలతో కూడినవి; 2)ఫాంటాసియా: కల్పితాలు, యథార్థాలు కాకపోయినా, యథార్థాలు అనిపించేవి.

టోరెస్ నహారో ఒక గొప్ప వ్యంగ్య నాటకాన్ని రాశాడు. దానిపేరు కామెడీ ఆఫ్ కిచెన్ (వంటశాల ప్రహసనం). దీనిలో రోమన్ రాజభవనంలో జరుగుతున్న అవినీతిని వ్యంగ్యంగా ప్రకటించాడు. లా సెలిస్టీనా అనే నవలను ఆధారంగా చేసుకొని ఈ నాటకాన్ని రాశాడు.

టోరెస్ నహారో శ్పానిష్‌నాటకరంగ వికాసానికి తన జీవితాన్ని ధారపోసి, 1525లో ఫెనిల్లె లో చనిపోయాడు.

శే.వెం.న.

త్రిలజి : నాటక సంబంధి. నాటకత్రయం. క్రీ.పూ. 5వ శతాబ్దంలో గ్రీసుదేశంలో డయోనిసస్ ఆరాధనోత్సవాలలో గేయ, నృత్య ప్రదర్శనలు విధిగా ఉండేవి. ఆ సందర్భంలో నాటక పోటీలు కూడా నిర్వహింపబడేవి. ఎస్కిలస్, సాఫోక్లిస్, యురిపిడీస్ ప్రఖ్యాత గ్రీకు నాటకకర్తలు. వీరు తమ తమ నాటకాలతో ఆ పోటీలలో పాల్గనేవారు. ఒకే కథతో కూడిన మూడు నాటకాలుగాని, వేరు వేరు ఇతివృత్తం గల మూడు నాటకాలు గాని (ఒకే రచయిత రాసినవి) ఆ పోటీలలో ప్రదర్శించాలని నియమం ఉండేది. ఆ ప్రకారం నాటకకర్తలు నాటకత్రయాన్ని ప్రదర్శించడం గ్రీసు నాటక పోటీలలో

ఆనవాయితీగా పరిణమించింది. నాటకత్రయం రీతిలో నాటకాలు రచించే పద్ధతి గ్రీసు దేశానికే పరిమితమనిపిస్తుంది. ఇతర దేశాలలో ఇలాంటి పద్ధతిలో నాటకాలు రచించినట్లు కనబడదు. తెలుగులో ట్రిలజి వంటి నాటక నిర్మాణం జరిగింది కాని అవి మూడు నాటకాలు కావు. తిరుపతి వేంకటకవులు మహాభారతకథను ఆరునాటకాలుగా రచించారు. పాండవోద్యోగం, పాండవ విజయం ఆ వర్గంలోని నాటకాలు కావడం గమనార్హం.

గం.సు.రె.

డిడెరాట్, డెనిస్ (1713-1784) : నాటక సిద్ధాంతవేత్త, నాటకకర్త, విమర్శకుడు, సర్వతోముఖ ప్రజ్ఞాశాలి, నాటక లక్షణాల మీద, నటునికి పాత్రకు గల సంబంధంమీద, నటులకు, నాటకకర్తకు గల సంబంధం మీద ఈయన రాసిన రచనలు అమూల్యమైనవి, నేటికీ ఆసక్తిదాయకమై, పాశ్చాత్య నాటక రంగం మీద బాగా ప్రభావాన్ని చూపాయి. డెనిస్ రచనలు అతని జీవిత కాలంలోనే ఇతర పాశ్చాత్య భాషలలోకి అనువదింపబడి విశ్వవిఖ్యాతి గాంచాయి.



శ్రీ.చ.

డిమం : సంస్కృత దశవిధ రూపకాలలో ఐదవది. డిమమనగా సంఘాతం. అంటే సమూహం. డిమమంటే విద్రవం లేక ఉపద్రవం అని కూడా అర్థం. ఈ రూపకాలలో యుద్ధం, జల, వాయు,అగ్ని, గజేంద్రోపద్రవముంటాయి కాబట్టి డిమం.

ఈ రూపకంలో దేవ, గంధర్వ, యక్ష, రక్షో, మహూరగ, భూత, పిశాచాదుల వంటి 16మంది నాయకులు, ప్రఖ్యాత ఇతివృత్తం, రౌద్రం ప్రధానరసం. అంకాలు నాలుగు, సాత్త్వతార్భటి వృత్తులు, శాంత, శృంగార, హాస్య రసాలు కాక మిగిలిన ఆరురసాలు ఉంటాయి. విష్కంభ, ప్రవేశకాలు ఉండకూడదు. విమర్శకాక తక్కిన నాలుగు సంధులు విరాజిల్లాలి. మాయ, ఇంద్రజాలం, యుద్ధం, సూర్య చంద్రగ్రహణాలను వర్ణించాలి. నాటకంలో ఉన్నట్లే ప్రస్తావనాది నాట్యధర్మాలు నిబంధించాలి. ఉదా - వృత్రోద్ధరణం, తారకోద్ధరణం, త్రిపురదాహం.

శ్రీ.చ

డీన్‌బద్రు (జ.1940) : నటుడు, నాటక రచయిత. 1940లో పశ్చిమగోదావరిజిల్లా పందలపాక గ్రామంలో జన్మించాడు. రామవరం హైస్కూలులోను, విశాఖపట్నం ఎ.వి.ఎస్ కళాశాలలోనూ చదువుకున్నాడు. బాల్యదశ నుంచీ నాటకాలంటే ప్రాణం. 1964లో ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ నుంచి నటన (Acting)లో డిప్లమా పొందాడు. కె.వేంకటేశ్వర రావు శిక్షణలో తన శక్తి సామర్థ్యాలకు తుది మెరుగులు దిద్దుకున్నాడు. 1965 నుంచి నాటక రచనకు పూనుకొని, సుమారు 15 నాటికలు 5 నాటకాలు రాశాడు. అన్నీ ప్రయోగాత్మక రచనలు కావడం విశేషం. అనేక నాటక పరిషత్తులలో ఉత్తమ ప్రదర్శనకు, రచనకు, నటనకు బహుమతులందుకొన్నాడు. రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో జరిగిన నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. ఉరి శిక్ష కాదు (నాటకం) తాజి, తాళి, పులీ మేక లన్నున్నాయి జాగ్రత్త, చైతన్య తరంగం, ఆ ఉదయం ఎప్పుడో మొదలైన నాటికలు ఈయన ప్రసిద్ధ రచనలు.

గం.సు.రె.

డ్యురెన్~~మట్~~మాట్, ఫ్రెడ్రిక్ (జ.1921) : జర్మన్ నాటక రచయిత. ఈయన రచించిన 'ట్రాజీ-కామిక్' నాటకాలు ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం జర్మన్ నాటకరంగ పునరుద్ధరణలో ప్రముఖ పాత్ర నిర్వహించాయి.

జ్యూరిఖ్, బెర్న్‌నగరాలలోవిద్యాభ్యాసంచేశాడు. 1933-45 మధ్యకాలంలో జర్మన్ నాటకం ఒక్క స్విట్జర్లాండ్ దేశంలో మాత్రమే ప్రవర్ధమానంగా ఉండడంవల్ల డ్యురెన్‌మట్‌కీ, ఈయన మిత్రుడు మాక్స్ ఫిష్‌కీ జర్మన్ నాటకరంగంలో నూతన ప్రయోగాలు చేసే అవకాశం లభించింది. డ్యురెన్‌మట్ నాటకీయ శిల్పం మీద బెర్టోల్డ్ బ్రెఫ్ట్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. మధ్యలో పిట్ట కథలు చెప్పించడం, నటులు తమ పాత్రల నుంచి వెలువడి మధ్య మధ్య కథకులుగా వ్యవహరిస్తు ఉండడం వంటి

విధానాలను బ్రెష్ట్ నుంచే గ్రహించాడు. డ్యురెన్‌మట్‌కి లోకం అసంబద్ధంగా కనిపించింది. ఆ అసంబద్ధ సన్నివేశాలను యథాతథంగా ప్రదర్శించాడు.

ఆయన తొలి నాటకం ఎస్ స్టేట్ గెష్రీబెన్ ప్రదర్శించి ప్రచురించాడు. డెర్ బ్లిం (The Blind Man, ప్రదర్శన 1948, ప్రచురణ 1960), రోమ్యులస్ డెర్‌గ్రోసే (Romulus the Great, ప్రదర్శన 1949, ప్రచురణ 1962) అనే నాటకాలలో చారిత్రక సత్యాలలో హాస్యం కలిగించడానికి వీలుగా కొద్ది మార్పులు చేశాడు. డీ ఎహే డెస్ హెర్న్ మిసిసిపి (The Marriage of Mr. Mississippi, ప్రదర్శన, ప్రచురణ 1952) డ్యురెన్‌మట్‌కు అంతర్జాతీయ ఖ్యాతి చేకూర్చింది. 1958లో అమెరికాలో ఫూల్స్ ఆర్ పాసింగ్ త్రూ అనే పేరుతో ఆ నాటకం ప్రదర్శించాడు. అనంతరం 1974 వరకూ ఆయన పలునాటకాలురాసి ప్రదర్శింప చేశాడు.

బ.శ్రీ.

డ్యూమాస్, అలెగ్జాండర్ (1824-95) : ఫ్రెంచ్ నాటక రచయిత, నవలా రచయిత. సమస్యాగర్భిత నాటక (Problem Play) ఉద్యమ స్థాపకులలో ఒకడు. సమస్యా గర్భిత నాటకం మధ్యతరగతి ప్రజల జీవితాన్ని వాస్తవికంగా చిత్రిస్తూ, సంఘంలోని ఒక సమకాలిక సమస్యకు పరిష్కార మార్గాన్ని సూచిస్తుంది.

డ్యూమాస్ ఫిల్స్ అనే మారుపేరు గల ఈయన 1824, జులై 27న పారిస్‌లో జన్మించాడు. తండ్రి సాహిత్య ప్రతిభ వారసత్వంగా ఈయనకు సంక్రమించింది. అయితే ఇద్దరి రచనల మధ్య ఎలాంటి పోలికా కనిపించదు. విజయవంతమైన ఈయన తొలి నవల లా డామ్ జేక్స్ కామిలియాస్ (1848). కథనే నాటకంగా (కామిలి – Camille) రచించినప్పుడు దానికి విశేష ప్రశస్తి లభించింది. ఈనాటకం 1852లో తొలిసారి ప్రదర్శించబడింది. ఈ నాటకాన్ని ఆధారంగా చేసుకునే గైజెపే వెర్డీ తన వీధి నాటకం (Opera) లాట్రావియాటా రచించి, 1853లో ప్రదర్శింప చేశాడు.

తండ్రి కల్పనలతో నిండిన చారిత్రక నాటకాలు, నవలలు రచింపగా, డ్యూమాస్ వర్తమాన సాంఘిక నాటకాలకే ప్రాధాన్యం ఇచ్చాడు. చట్టవిరుద్ధమైన ప్రేమకలాపాల వల్ల తన తండ్రి ఎలా సర్వనాశనం అయ్యాడో ప్రత్యక్షంగా చూసిన డ్యూమాస్ తన నాటకాలలో కుటుంబ జీవనం, వివాహ వ్యవస్థల పవిత్రతను గురించి ప్రబోధించాడు. ఉదాహరణకు లేడెమీ మాండే (1855లో ప్రదర్శితం) వేశ్యలవల్ల వివాహ వ్యవస్థకు ఏర్పడిన చేటును గురించి చర్చించింది. ఆధునిక ప్రేక్షకులకు డ్యూమాస్ నాటకాలు నీరసంగానూ, మాటల పోగులుగానూ కనిపించినా, 19వ శతాబ్దం చివరి విమర్శకులు ఆ నాటకాలలోని నిజాయితీతో కూడిన నైతిక ప్రబోధాన్ని విశేషంగా ప్రస్తుతించారు. 1875లో డ్యూమాస్ 'అకాడమీ ఫ్రాన్సాయిజ్'లో చేర్చుకోబడ్డాడు.

డ్యూమాస్ రాసిన మిక్కిలి రసవంతమైన నాటకాలలో పేర్కొనదగినవి లేఫిల్స్ నేచురల్ (1858), అన్ పీరేప్రాడిగ్యు (1859). ఈ రెండవ నాటకంలో డ్యూమాస్ తన తండ్రి స్వభావాన్ని చిత్రించాడు.

అలెగ్జాండర్ డ్యూమాస్ 1895, నవంబరు 27న ఫ్రాన్స్‌లోని మార్లీలీరాయ్‌లో మరణించాడు.

బ.శ్రీ.

డ్రయిడన్, జాన్ (1631-1700) : ఆంగ్ల నాటకకర్త. లండన్ అవహేళన కావ్య రచనాదురంధరుడు. సమకాలీన ఆంగ్లసాహిత్యరంగ కవిరాజు. విషాద, ఆహ్లాదాది వివిధ నాటక రచనలలో సిద్ధహస్తుడు. అనేక సాహిత్య యుద్ధాలలో నెగ్గిన విమర్శక శిరోమణి. నాటకకవిత (An Essay of Dramatic Poetry) అనే లక్షణ గ్రంథం ఈయన రచనలలో మకుటాయమానమైంది. నాటికి నేటికి ప్రామాణిక గ్రంథం. డ్రయిడన్ ఉద్దేశంలో నాటకం జీవిత ప్రతిబింబం, హితోపదేశ జనకం.

నాటి ఆంగ్ల నాటక రచనా విధానాన్ని, నాటక కవితలో అంత్య ప్రాసను సమర్థించిన ఘన విమర్శకుడు.

స్వయంగాను, ఇతరులతో కలిసి 30కి పైగా నాటకాలు రచించాడు. ఆంటనీ క్లియోపాట్రా గాథను ఇతివృత్తంగా తీసుకొని రాసిన ఆల్ ఫర్ లవ్ (All for love) అనే నాటకం డ్రయిడన్ నాటకాలలో ఉత్తమమైందైనా, షేక్స్పియర్ నాటకం ముందు మరుగున పడింది. ఈయన నాటకాలు కొన్ని అనేకసార్లు ప్రదర్శితమయ్యాయి. ఇండియన్ క్వీన్ *(1664)*, ఇండియన్ ఎంపరర్ *(1665)*, సర్ మార్టిన్ మారల్ *(1667)*, సీక్రెట్ లవ్ *(1667)*, ఆల్ ఫర్ లవ్ *(1678)*, ట్రాయిలస్ క్రెసీడా

(1679), లవ్ ట్రయంఫంట్ *(1694)* మొదలైన నాటకాలను రచించినడ్రయిడన్ 1700లో కన్నుమూశాడు.

శ్రీ.చ.

డ్రింక్ వాటర్ జాన్ (1882-1937) : ఇంగ్లీషు నాటకకర్త, దర్శకుడు. ఆధునిక పద్య నాటక ప్రక్రియను ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువచ్చిన నాటకకర్త. సర్ బారీ జాక్సన్‌కు చెందిన 'పిలిగ్రిం పేయర్స్' నాటక సమాజ వ్యవస్థాపక సభ్యుడు. ఆ తరువాత నటుడు, ప్రయోక్త, జనరల్ మేనేజరు. ట్రోజన్ యుద్ధానికి సంబంధించిన పద్యనాటిక విజయవంతం కావడంతో ఈయనకు పేరు ప్రతిష్ఠలు లభించాయి. అబ్రహాం లింకన్, మేరీ స్టూవార్డ్ రాబర్ట్ విలియంలా గద్య నాటకాలతో ఇతని కీర్తి ప్రపంచమంతా వ్యాపించింది. అమెరికన్ ప్రదర్శనాలలో డ్రింక్ వాటర్, అబ్రహాం లింకన్ నాటకంలో క్రొనైకల్స్ పాత్ర ధరించేవాడు. డ్రింక్ రాసిన ఆహ్లాద రూపకం బర్డ్ యిన్ హాండ్ లండన్, బర్మింగ్‌హాంలలో విజయవంతంగా ప్రదర్శితమైంది.

శ్రీ.చ.

డ్రేమ్ : ఆహ్లాద రూపక భేదం. అలార్టిస్ నికాల్ తన నాటక సిద్ధాంత ప్రవేశిక అనే గ్రంథంలో దీనిని ఇలా నిర్వచించాడు.

డ్రేమ్ వ్యక్తిత్వాన్ని చిత్రించే విశుద్ధ ఆహ్లాద రూపకం, జాతులను, వర్గాలను చిత్రిస్తుంది. వ్యక్తికి బదులు జాతిని, ఉద్వేగానికి బదులు అచేతనతను, శుద్ధ కృత్రిమత్వానికి బదులు రస భావాలను పొందుపరచడంలో ఆహ్లాద రూపకం డ్రేమ్ నుంచి వేరవుతుంది. ఈ డ్రేమ్ మూడు రకాలు 1. సుఖాంతాలు, 2. అసంపూర్ణ సుఖాంతాలు, 3. డ్రేమ్ అహ్లాద మిశ్రమ రూపకాలు. సుఖాంతాలు - రోడ్ టు రూయిన్, అసంపూర్ణాలు - వెన్నిస్ వర్తకుడు, డ్రేమ్ ఆహ్లాద మిశ్ర రూపకాలు - స్పానిష్ ఫ్రెయర్.

శ్రీ.చ.

ణో నాటక రంగం : జపాన్ దేశ మార్గ నృత్య రూపకం. ఇది ప్రభువుల, పండితుల కుటుంబాలకు మాత్రమే పరిమితం కావడంవల్ల కబూకీ నాటకరంగం లాగా ఎక్కువగా ప్రజాభిమానాన్ని చూరగొనలేక పోయింది. ఈ నాటక రూపం 15వ శతాబ్ది ప్రారంభంలో జానపద గీతాల నుంచి, దేవాలయ ఆరాధనానృత్యాల నుంచి ఆవిర్భవించింది. క్వనామీ, అతని కుమారుడు సీమ ఈ నాటక రంగ ప్రవక్తలని చెప్పవచ్చు.

ణో రంగస్థలం 18అడుగుల చదరం కలిగి నేల నుంచి 3 అడుగుల ఎత్తుండి ప్రేక్షకాగారంలోకి చొచ్చుకుని వస్తుంది. రెండు వైపుల ప్రేక్షకులు కూర్చుంటారు. వీరి నుంచి కొద్ది దూరంలో గులకరాళ్ళ బాట ఉంటుంది.

నాలుగు లావుపాటి స్తంభాల ఆధారంగా ఒక దేవాలయంపై కప్పు ఉంటుంది. దాని చూరు నేల నుంచి 12 అడుగులు, దాని వెన్ను 20 అడుగుల ఎత్తు ఉంటుంది. కుడిచేతి వైపు ముందు స్తంభం రెండవపాత్ర స్తంభం. దీని నుంచి కర్ణంగా ఎడమ చివరి స్తంభం మొదటి నటుని స్తంభం. కుడివైపున మూడు అడుగుల వెడల్పు వరండాలో 10 మంది బృంద గాయకులు కూర్చుంటారు. రంగస్థలం వెనక అడ్డంగా నలుగురు పాఠకులు, ఇద్దరు రంగస్థలంలో ఉద్యోగులు ఉంటారు. దీని ఎడమ చివర నుంచి 40 అడుగుల పొడవు, రంగస్థలం అంతవెడల్పుగలదోవఉంటుంది. ఈ దోవ గుండానే నటులప్రవేశనిష్క్రమణాలుజరుగుతాయి. రంగస్థలం చివర వెడల్పు తక్కువ తెర కట్టి ఉంటుంది.

రంగస్థలం మీద సీనరీ అంటూ ఉండదు. రంగస్థలం వెనక గోడ మీద దేవదారు వృక్షం, వంతెన కర్రల మీద మూడు చిన్నచిన్న దేవదారు వృక్షాలు చిత్రించి ఉంటాయి. వస్తు సామాగ్రి కూడా తక్కువగానే ఉంటుంది. నాటక కథను బట్టి ఒక ఇంటినో, దేవాలయాన్నో, రాజభవనాన్నో తెలియచేయడానికి నాలుగు స్తంభాలు ఆధారంగా రెండు అడుగుల వెడల్పు చట్రం వేలాడుతూ ఉంటుంది. దుస్తులు తళతళ లాడుతూంటాయి.

మొదటి నటుడు నాటకం రెండవ భాగంలో నృత్యం చేసేటప్పుడు కరాళం ధరిస్తాడు. తక్కిన నటులు కరాళాలను ధరించరు. ఈ నాటక రూపంలో నిజానికి పాత్రలు రెండే గాని అనుచరులు పదిమంది ఉంటారు. రెండవ నటుని పాత్ర ముఖ్యమైనది కాదు. ఒక మురళి, రెండు మద్దెలలు ఈ నాటక ప్రయోగంలో ఉపయోగిస్తారు.

ఆ తరువాత రెండవనటుడు మన వీధి నాటకాలలోని హంగుదారుని లాగాఆడబోయే కథను, తదితర విషయాలను వర్ణించి తన స్తంభం దగ్గరకు వెళ్తాడు. ఆ తరువాత నటీ సూత్రధారుడు లాగా వీరిద్దరికీ నాటక ఇతివృత్తాల విషయంలో సంభాషణ జరుగుతుంది. 'ణో' నాటకాలు చాలాపెద్దవి. వీటిని ప్రదర్శించడానికి రోజుల తరబడి పడుతుంది. అందుకని చౌచౌ ప్రదర్శనాలే ఎక్కువ. ఈ చౌచౌలో అంకానికి అంకానికిమధ్య చిన్న ప్రహసనం ప్రదర్శిస్తారు. భూస్వాములు, మత గురువులు

మొదలైన వారిని అవహేళనచేస్తారు. అంతేగాక తాగుబోతులను, తిండిపోతులను, అవినీతిపరులను కూడా అవహేళన చేస్తారు.

ణో నాటక ప్రదర్శన ఆరు భాగాలు. మొదటిది దేవతలకు, రెండవది యుద్ధానికి, మూడవది టోపాకు, నాల్గవది ఉన్మత్తతకు, ఐదవది గేయనాటికకు సంబంధించినది. ఆరవది ఉపసంహారం. ఈ ప్రదర్శనకు ఏడు గంటలు పడుతుంది.

శ్రీ.చ.

తండువు : నాటక సిద్ధాంతవేత్త. శివుని పరివారంలోని వాడు, వాహనం. ఇతనికి నందికేశ్వరుడని పేరు కూడా ఉంది. శివుని ఆదేశం మేరకు ఈ తండువు భరతమునికి అంగహార సహిత నృత్యం నేర్పాడు. తండువు నేర్పినందు వల్ల దీనికి తాండవమని పేరు వచ్చింది.

నందికేశ్వరుని రచనలుగా అభినయ దర్పణం, భరతార్ణవ మనే రెండు నృత్య శాస్త్ర గ్రంథాలు కనిపిస్తున్నాయి. భారతదేశంలో లభ్యమైన అభినయ దర్పణ రాత ప్రతులన్నీ తెలుగు లిపిలోనే ఉండడం వల్ల నందికేశ్వరుడు తెలుగువాడని భావించవలసి వస్తోంది.

శ్రీ.చ.

తమాయా యి బవూస్, మానుయేల్ (1829-98): శ్పానిష్ నాటక రచయిత. అడిలార్డో అయాలా యి హెరేరా తో కలసి ఆయన19వ శతాబ్దిమధ్యభాగంలో శ్పానిష్‌నాటకరంగాన్ని తీర్చిదిద్దాడు. కాల్పనికత నుంచి వాస్తవికతవైపుకు శ్పానిష్ సాహిత్య రథాన్నిమళ్లించినవారిలోతమాయా ముఖ్యుడు.

తమాయా ఒక సుప్రసిద్ధ శ్పానిష్ నటుని కుమారుడు. చిన్నతనంలోనే నాటకాలను రాయడం ప్రారంభించాడు. తన 11వ ఏట మొదటి నాటకం రంగస్థలం మీద ప్రదర్శించబడింది. నాటక సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో ప్రయోగాలు చేశాడు. విరివిగా నాటకాలు రాసి నాటకరంగంలో ఘనవిజయం సాధించాడు.

తమాయా 1870వ సంవత్సరంలో నాటక రచనకు స్వస్తి చెప్పి అటు తరువాత ''బిబిలియోటికా నేషనల్'' అనే సంస్థకు డైరెక్టరుగానూ, శ్పానిష్‌అకాడమీకి కార్యదర్శిగానూ పని చేశాడు.

ఈయన జీవితాన్ని రెండు ఘట్టాలుగా విభజించవచ్చు. ఇందులో మొదటి ఘట్టంలో ఈయన మీద జర్మన్ నాటక రచయిత ఫ్రీడ్రిఖ్ షిల్లర్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఆ ప్రభావంతో రాసినవే స్త్రీ, ప్రేమ పిచ్చి మొదలైన నాటకాలు.

రెండో ఘట్టంలో వాస్తవికతావాద దృష్టితో నాటకాలు రాసి సమకాలీన శ్పానిష్‌సమాజంలో ఉన్న కుళ్లును ప్రదర్శించాడు. లో పోజిటివో (1862), లాస్సెస్ డి ఆనర్ (1863), లోస్ హోంబ్రెస్ డి బీన్ (1870) వంటి నాటకాలు ఈ దశకు చెందినవి. రంగస్థల నటుడుగా అనుభవం ఉన్న తమాయా రంగస్థలోచితమైన చక్కని రచనలు చేశాడు. ఈతని ప్రహసనాలు జీవంతో ఉట్టిపడుతూ ఉంటాయి.

తమాయా రచనలలో తలమానికమైంది క్రొత్త నాటకం (1867). ఈ నాటకం వల్లఇతనికిఅంతర్జాతీయఖ్యాతి లభించింది. ఇందులో విషాదాన్ని అతి నేర్పుతో చిత్రించాడు.

శే.వెం.న.

తమాషా : మహారాష్ట్రలోప్రసిద్ధిపొందినకళారూపం. పార్వతీదేవిని కొనియాడుతూ సాంప్రదాయ 'గోంధాలీలు' నృత్యం చేస్తూ పాడే విధానం ద్వారా కొత్తపద్ధతి 'తమాషా' రూపుదిద్దుకుంది. తమాషా అనేది పర్షియన్ పదం. దానిని మొఘల్ సేనలు మహారాష్ట్ర, డక్కన్ ప్రాంతాలకు తెచ్చారు. తమాషా అంటే సరదా, ఆట, వినోదమని అర్థం. మహారాష్ట్రగడ్డపై తమాషా వంద ఏళ్ళ పాటు వర్ధిల్లింది. బాజీరావు-11 (1796-1818) కొలువులో శాస్త్రీయ సంగీత విద్వాంసులు, గాయకులు, నర్తకులు ఉండేవారు. ఈయన కళాపోషణలో దిట్ట. కానీ రాజకీయ దక్షత లేకపోవడం వల్ల తన సామ్రాజ్యాన్ని బ్రిటీషువారికి సమర్పించుకోవలసి వచ్చినపుడు తన కళాకారులను వెంటతీసుకు వెళ్ళే అవకాశం ఇచ్చారు. తమాషా మొట్టమొదటిసారిగా మహర్‌లు, మంగ్‌లు అనే దిగువజాతికులాలవారు ప్రారంభించిన కారణంగా ఉన్నత కులాలవారికి నచ్చేది కాదు.

18, 19 శతాబ్దాలలో తమాషా నృత్య విధానం మంచి ఆదరణ పొందింది. సామాజికంగా దిగువ స్థాయికి చెందినదైనా ఎగువ కులాల వారిని కూడా ఆకర్షించింది. 18వ శతాబ్ది ద్వితీయార్థంలో అనంత్ ఫండి, రామ్‌జోషి, ప్రభాకర్‌లనే బ్రాహ్మణులు తమాషాను రూపొందించిన వారిలో ఉద్దండులు కాగా, వారిని ఇతర బ్రాహ్మణ కులాలు బహిష్కరించాయి కూడా.

ఈ ముగ్గురిలో అతిముఖ్యుడు షోలాపూర్‌కు చెందిన రామ్‌జోషి(1762-1802). తమాషాలో పాల్గనడం వల్ల ఇతని అన్న ఈయనని ఇంటి నుంచి వెళ్ళగొట్టాడు. దాంతో రామ్‌జోషి తమాషా ప్రదర్శకులతోనే కలిసి ఊరూరా ప్రదర్శనలిచ్చి పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాడు.

పీష్వా కాలంలో స్త్రీ పాత్రలను మగవారే ధరించేవారు. వారిని 'నాచ్య పార్య' అని పిలిచేవారు. మరాఠా పాలన అంతమై బ్రిటీషు పాలన మొదలవ్వడంతో తమాషాకు ఆదరణ తగ్గింది. భూకామందులు, వారి సంతానం తమాషాను ప్రదర్శించడం మొదలుపెట్టడంతో దీనిలో వింత పోకడలు మొదలయ్యాయి. పత్తె సుబ్బారావు అనే బ్రాహ్మణ కులానికి చెందిన గాయకుడు, కవి, తమాషాను బ్రహ్మాండంగా రచించాడు.

ప్రదర్శన: స్టేజి తక్కువ ఎత్తులో ఉండి మూడు వైపులా తెరచి ఉంటుంది. ప్రేక్షకులు మూడువైపులా కూర్చుంటారు. నగరాలలో మామూలు స్టేజీలు ఉపయోగిస్తారు. పూనాలోని లక్ష్మి రోడ్డులోని ఆర్యభవన్ థియేటర్‌లో ప్రతిరోజు రాత్రి తమాషా ప్రదర్శన జరుగుతుంది.

ప్రదర్శన, ఢోలక్‌వాలా, హల్గివాలా అనే ఇద్దరు కళాకారులతో మొదలవుతుంది. వీరు చివరి వరకు ఉంటారు. ఢోలక్‌వాలాకు ఒక పొడవాటి ఢోలక్ ఉంటుంది. ఇది ఒకవైపు లోహంతోను, రెండోవైపు తోలుతోను కప్పబడి ఉంటుంది. ఈ వాద్యకారుడు ఒక కాలు ముందుకు ఒక కాలు వెనకకేసి నిలబడి తన మెడలోని వాయిద్యాన్ని వాయిస్తూ ఉంటాడు.

హల్గి అనేది ఒక చిన్న చెక్క డ్రమ్ముపై మేక తోలు కప్పబడిన వాయిద్యం. ఈ వాయిద్యాన్ని వేడి చేసి దాని తోలు బిగుసుకున్నాక వాయిస్తారు. హల్గీని అక్కడి వాతావరణాన్ని ఉద్రేకపరచడానికి వాయిస్తారు. ఢోలక్‌వాలా, హల్గీవాలా పోటీపడి వాయిద్యాలను వాయిస్తారు. వీరికి ఇంకో రెండు వాయిద్యాలు తోడవుతాయి. ఒకటి మంజీరా, రెండవది తంతు. మంజీరా అనేది లోహంతో చేయబడిన రెండు చిన్న బిళ్ళలవంటి వాయిద్యం కాగా, మంజీరా ఒక లోహపు తీగ కలిగిన ఒక చిన్న డప్పు. దానిని వాయించేవాడు ఆ తీగను లాగుతూ చూపుడు వేలుతో ఆ తీగను మీటుతూ రెండవ వైపు డప్పు వాయిస్తాడు. దీని వల్ల డప్పు శబ్దంతోపాటు 'టుయ్... టుయ్' అనే శబ్దం కూడా వెలువడుతుంది. ఈ రెండు వాయిద్యాలను వాయించేవారు వంతలుగా పాడతారు. ప్రధాన కథకుడు ఆపినపుడు వీరిద్దరు ముందుకు దూకి తీవ్రస్వరంతో పాడతారు.

వాయిద్యాలను వాయించేవారు ప్రధాన కథకుని వెనుక నిలబడతారు. మధ్యలో అప్పుడప్పుడు ముందుకు వచ్చి కథను కొనసాగిస్తూ ఉంటారు. ఒక్కోసారి ప్రశ్నలడగడం ద్వారా కథను ముందుకు తీసుకుపోతారు. ప్రధాన కథకుడిని సూత్రధారి అని వ్యవహరిస్తారు. వాయిద్యకారులు తెల్లని పైజామా వేసుకుంటారు. దీనిపై ఎంబ్రాయిడరీ ఉంటుంది. ఎర్రటి కండువాను, తెల్లటి తలపాగాను ధరిస్తారు. కింద ధరించిన పంచె వదులుగా వారు కదలడానికి వీలుగా ఉంటుంది. మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో 25 మీటర్ల పొడవైన గుడ్డను తలపాగగా వాడతారు.

వాయిద్యాలను వాయిస్తూ గణేశ స్తుతితో ప్రదర్శన మొదలవుతుంది. కళాకారులు ప్రదర్శకులకు వీపు పెట్టి నిలబడి పైకి కిందికి కదులుతూ ప్రార్థన చేస్తారు. దీనిని ఆవాహం అంటారు. దీంట్లో వినాయకునితోపాటు శివుని, పార్వతిని కూడా కొలుస్తారు.

తరువాత శ్రీకృష్ణుడి కాలంలో ఉన్న గోపిక 'గాలన్'ను ఒక మహిళ ప్రదర్శిస్తుంది. ఈమె ప్రధాన కథకునితో సంభాషిస్తుంది. ఈమె లయబద్ధంగా నడుచుకుంటూ వచ్చి నర్తిస్తుంది. ఆ సమయంలో చీర ముసుగుతో తల దాచుకుని నర్తిస్తుంది. తరువాత ఒక వ్యక్తి శ్రీకృష్ణుడిలా నటిస్తూ స్టేజిపై కలియతిరుగుతూ సంభాషిస్తాడు. శ్రీకృష్ణునితోపాటు తన మిత్రుడు పైండియా కూడా ఉంటాడు.

దీని తరువాత ప్రధానకథ (వాగ్) మొదలవుతుంది. దీనిలో అనేక అంశాలను ప్రదర్శిస్తారు. సామ్రాజ్య స్థాపకులు, రాజులు, వ్యాపారులు, మంత్రులు, యోధులు, సోదరులు వంటి ఇతిహాసాలను ప్రదర్శిస్తారు. అలాగే పురాణాలు, శాస్త్రాలు కూడా ప్రదర్శింపబడతాయి.

లావణి: లావణి అనేది ప్రేమాప్యాయతలను వ్యక్తపరిచే కవితా గీతం. ఇది మొత్తం ప్రదర్శనకు వెన్నెముక వంటిది. ప్రధాన గాయకుడు దీనిని ప్రారంభిస్తాడు. మధ్యలో కొన్ని మాటలను లయబద్ధంగా వాడుతూ ప్రధానమైన మాటలను సైగలతో కూడా చెప్తాడు. మొదటి లావణి పాత్రలను పరిచయం చేసి, చెప్పబోయే కథను ప్రేక్షకులకు తెలియజేసి వారిని సంసిద్ధులను చేస్తుంది. తరువాత కొన్ని మాటలు చేర్చి మళ్ళీ లావణి మొదలవుతుంది. కొన్నిసార్లు సన్నివేశానికి తగ్గట్టుగా నృత్యం కూడా ఉంటుంది. ఒక్కో ప్రదర్శనలోను దాదాపు 30 వరకు లావణీలు ఉంటాయి. లావణిలో వాడే పదాలు ఎంతో అర్థవంతంగా ఎదుటివారిని ఆకర్షించేలా ఉంటాయి.

ఏవాలా అనే మహార్ జాతిస్త్రీని పత్తేబాపురావు బ్రాహ్మణుడు భార్యగా స్వీకరించినపుడు ఆమెకు గుర్తింపు వచ్చింది. దీంతో అనేకమంది మహర్ స్త్రీలు తమాషాలో చేరారు. గత ఏభై ఏళ్ళలో తమాషాలో మహిళా నర్తకులు తప్పనిసరైపోయారు.

తమాషా స్త్రీ మెరిసే రంగులు గల తొమ్మిదిగజాల చీరతో నృత్యం చేయటానికి వీలుగా వెనుకవైపుపైకి దోపుకుంటుంది. దీని వల్ల చూపరులకు మరింత అందంగాను, వెనుక భాగం కనిపించేదిగాను ఉంటుంది. ఆమె చేతులు, వేళ్ళకు ఆభరణాలు ధరిస్తుంది. మెడలో హారం, చెవులకు బుట్టలు ధరిస్తుంది. జుట్టును జడగా కాకుండా కొప్పుగా ముడుచుకుంటుంది.

తమాషా నృత్యం ఏ శాస్త్రీయ నృత్యానికిగాని, జానపద నృత్యానికి గాని సంబంధించినది కాదు. ఉత్తర భారత కథక్ నృత్యరీతిలో గెంతడం ఉంటే తమాషాలో నర్తకి పాదాలు భూమిని అనుకునేఉంటాయి. పాదాలులయబద్ధంగా కదులుతాయి.

తమాషా స్త్రీ మొత్తం ప్రదర్శనకు మూలం. ఈమె నర్తిస్తుంది కాబట్టి 'నాచి' అంటారు. సాధారణంగా ప్రదర్శన మొదలు పెట్టకముందు నాచి ఎవరు అని అడగడం పరిపాటి.

తమాషా ప్రదర్శనలో అశ్లీలత ఎలావచ్చిందిఅని కొందరికి అనిపిస్తుంది. దీనికి కారణం మొదట్లో ఈ ప్రదర్శనలో స్త్రీలు లేకపోవడమే. పురుషులే స్త్రీ వేషాలు వేయడం వల్ల, స్త్రీ ప్రేక్షకులు లేకపోవడం వల్ల అశ్లీలత ఎక్కువగా ఉండేది. తరువాత స్త్రీలు ప్రదర్శనలో పాల్గన్నా అదే మోస్తరు అశ్లీలత కొనసాగింది. తమాషా పనితీరు: బృందాలను రెండుగా విభజిస్తారు. 'ఢోలకీబారి' (వాయిద్యాలు వాయించేవారు), 'సంగీత్ బారీ' (సంగీతంతో సంబంధముండేవారు). సంగీత్‌బారీలో ఆరు, ఏడుమంది ఉంటారు. హార్మోనిస్టు, క్లారియోనిస్ట్, ఒక డప్పు వ్యక్తి స్టేజికి ఒక పక్క కూర్చుంటారు. వీరు ప్రదర్శనలో ప్రత్యక్షంగా పాల్గనకపోయినా వారి సంగీతంతో ప్రేక్షకులను అలరిస్తారు. తమాషాలో ముఖ్యమైనది ఢోలకీ బారి. వీరిలో 20 నుంచి 25 మంది వరకు ఉండి ప్రదర్శనకు తోడ్పడతారు.

సుధాకర్

తాదాత్మ్యం : నటుడు వేషం వేసుకుని రంగస్థలం మీదకు వచ్చిన తరువాత తనను తాను మరచిపోయి పాత్రలో ఐక్యమై నటించాలా? లేక నేను ఫలానావాడిని, ఫలానా పాత్ర ధరిస్తున్నాను అనే సంపూర్ణ పరిజ్ఞానంతో నటించాలా? అంటే నటునికి రసానుభూతి యోగ్యత ఉందా? ఉంటే ఎంతవరకు ఉంది. ప్రకృతి బంధనాలలో చిక్కుకున్న మానవుని వ్యక్తిత్వాన్ని మరచి పోవడం సాధ్యమవుతుందా? తనను తాను మరచి పోయిన నటుడు రంగం మీద తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తింపగలడా? ఈ ప్రశ్నలను అన్ని దేశాలలో, అన్ని కాలాల్లో చర్చిస్తూనే వచ్చారు. చిత్తూరు జిల్లాలో ప్రహ్లాద నాటక ప్రదర్శనంలో నరసింహమూర్తి వేషధారి తన వ్యక్తిత్వం మరచిపోయి నరసింహమూర్తి పాత్రలో తాదాత్మ్యం పొంది నిజంగానే హిరణ్యకశిప పాత్రధారిని చంపివేసినట్టు చెప్తారు. అయితే ఈ దుస్సంఘటన నిజంగా జరిగిందో కాకమ్మ కథో గట్టిగా చెప్పలేం. ఈ దుస్సంఘటనకు కారణం నరసింహ వేషధారి తన పంచేంద్రియాలను అదుపులో పెట్టుకోలేక పోవడమే. అంతేగాదు, ఇంగిత జ్ఞానమున్న నటుడు ఎవడైనా వాడిగల ఇనపగోళ్ళను ధరిస్తాడా? నటనలో మోతాదు తప్పటం వల్ల, ఇటువంటి దుస్సంఘటన జరిగిందేమో గాని తాదాత్మ్యం వల్ల కాదని అనుకోవలసి వస్తుంది.

అయితే 'మనసులో లేనిదే కావలించుకుంటే వస్తుందా' అనే సామెతననుసరించి నటుడు తాను రసానుభూతి పొందకుండా నాటక రసాన్ని ప్రేక్షకులను ఆస్వాదించేటట్టు చేయగలడా? ఈ విషయం ప్రాచీన పాశ్చాత్య విమర్శకుడు 'హోరాషీ (క్రీ.పూ. 65–8)' అనే గ్రంథంలో ప్రస్తావించాడు. చిరునవ్వు నవ్వే వారి వైపే నవ్వు ముఖాలు తిరిగినట్టుగా ఏడుస్తున్న వారికే సానుభూతి. నాకు కన్నీరు తెప్పించాలంటే ముందుగా నువ్వు శోకాన్ని అనుభవించాలి. నటుడు కూడ ప్రేక్షకుడు లాంటి మనిషి. అతనికి అంతఃకరణంలో భావాలు నిబిడీకృతమై ఉంటాయి. అతను దృశ్య కావ్యాన్ని సాకల్యంగా అధ్యయనం చేస్తున్నాడు. కథలో నిమగ్నుడవుతున్నాడు. తన పక్క నటుల అభినయం తిలకిస్తున్నాడు. తానూ ఒక పాత్రగా ప్రదర్శనలో పాల్గంటున్నాడు. అలాంటప్పుడు ప్రేక్షకులవలె నటుని భావాల ఆవరణ భగ్నమై రసానుభూతి ఎందుకు కలగదు? ఈ విషయం గమనించే ఆంధ్ర దశ రూపకంలో "కావ్యార్థమును తెలుసుకొనుటచేత నందుమా? అట్లయినచో ప్రేక్షకులవ్వైన మనకెట్లో వాని కట్లే కావ్యరసాస్వాద మంగీకరింపదగినదే" అని సెలవిచ్చారు. మరి నటుడు ఎప్పుడైతే మనసులో పాత్ర అవస్థ భావించుకుంటాడో అప్పుడే రసం ఉత్పన్నమవుతుంది కూడా.

ఇక భరతముని, నాట్య శాస్త్రానికి వ్యాఖ్యానం రాసిన అభినవగుప్తుడు రసం సామాజిక నిష్ఠం అన్నాడు. అనుకరణ మాత్రాపరుడైన నటునికి రసానుభవయోగ్యతమ్ముగ్యం. నటుడు తాదాత్మ్యం వహించితే అభినయ ప్రకాశం చేయ జాలడని సిద్ధాంతీకరించారు. తరువాత ధనంజయాది లాక్షణికులు ఈ అభిప్రాయాన్నే వ్యక్తీకరిస్తూ "అవస్థానుకరణం నాట్యం" అని తేల్చారు.

అయితే భరతముని రాసిన "యథా జీవ స్వభావస్వం" అనే శ్లోకంలో పరభావం, సోస్మితి మన సాస్మరన్, అనే దానిని బట్టి నటుడు ఎవరిని అనుకరిస్తున్నాడో అతనితో అభేద భావం పొందాలనే భరతముని అభిప్రాయం పరభావం పొంది, మనసాస్మరించిన తరువాత అభేద భావంపొంది తీరతాడు. పాత్ర సుఖ దుఃఖాలను ఆత్మదుఃఖాలుగా భావించటమేరు. వాటి ప్రదర్శనం వల్ల కలిగే రసం అనుభవించుట వేరు. నటుడు భావాశ్రయుడు, పై శ్లోకంలోని సోస్మి అనుమాటను బట్టి భరతముని అభిప్రాయంలో నటుడు, నేను ఫలానా పాత్రను అని భావించుకుని పాత్రతో ఐక్యభావంపొందినా తననుతానుమర్చిపోడని అభినవగుప్తుడు వ్యాఖ్యానించాడు. ప్రకృతి బంధనాల్లోని నటుడుకి నేను అను పరిజ్ఞానం నశించకుండా పాత్రతో ఐక్య భావానికి కళ్ళెంలా పని చేస్తుంది. అభ్యాసం కూసు విద్య అన్నారు కదా! బాగా అభ్యాసం చేస్తే నటుడు తాను అనుభూతి పొందకుండా ప్రేక్షకులకు రసానుభూతి కలిగింపవచ్చుకదా అనే శంక రావచ్చు. నటుడుకి

అభ్యాసం అవసరమే కాని అనుభూతి లేని అభ్యాసం వల్ల జీవకళ లేని కృత్రిమాభినయమో, యాంత్రికాభినయమో అలవడుతుంది. జీవకళలేని నటన వల్ల ప్రేక్షకులకు రసానుభూతి కలగదు. ఎంత అభ్యాసం చేసినా నటులు ప్రేక్షకులను రంజింపజేయ లేకపోవడానికి కారణం అనుభూతి లోపించడమే. మానవుడు భోజనం చేస్తూ పక్కవారితో ఇతర విషయాలు మాట్లాడుతూనే ఉంటాడు. కాబట్టి నటుడు తన్మయీ భావం పొందినా అభ్యాసగతమైన ప్రక్రియలకది అడ్డురాదు.

నటుడు తనను మరచి తాను ధరించిన పాత్రలో ఐక్యమైనా హృదయం మారుమూలల్లో నేను 'నటుడను మాత్రమే' అనే భావం మరువరాదు. అంటే నటుడు తాదాత్మ్యం వహించి దానిని తన అదుపులో ఉంచుకోవాలి. అప్పుడు నటుడు రసాన్ని అస్వాదిస్తూ ప్రేక్షకులకు రసానందం కలిగిస్తాడు.

ఇంకొక విషయంకూడా ఇక్కడజ్ఞాపకం ఉంచుకోవాలి. పాత్ర గత సుఖ దుఃఖాది అవస్థలను నటుడు అనుభవించడు. సాదృశ్యావస్థలను మాత్రమే అనుభవిస్తాడు. ఇలా తాదాత్మ్యం పొందినా సంయమనంతో ఉండడాన్ని అనుష్ఠంభనయోగం అంటారు. పాశ్చాత్యులు ఈ అవస్థను ప్రత్యక్ చేతన్యావస్థ (subconscious state) అంటారు. ఈ ప్రత్యక్ చేతన్యావస్థను నటుడు చేరుకోగలిగితే నటనలో చిక్కులేవీ లేకుండా పాత్రలో ఐక్యమై నటించ గలుగుతాడు.

శ్రీ.చ.

తారకరామా రావు, నెమలికంటి (జ.1937) : కథకుడు, నవలాకారుడు. నాటకకర్త. నటుడు. గుంటూరు జిల్లా అమరావతి సమీపంలోని నెమలికల్లులో 1937, మార్చి 5న జన్మించాడు. తండ్రి మృత్యుంజయశర్మ. స్వాతంత్ర్య సమరయోధుడు. తల్లి సీతారామమ్మ. తారకరామారావు మొట్ట మొదట గనిపిశెట్టి వేంకటేశ్వరరావు భలే పెళ్ళి నాటకంలో నటించాడు. ఆ తరువాత లింగమూర్తి రచించిన వెంకన్న కాపురంలో వేంకటేశ్వర్లు పాత్రలో నటించాడు. ఈయనకు ప్రయోగ శీలిగా, నాటక రచయితగా ఆత్మసాక్షి (1969), మహాప్రస్థానం (1971), *శరణం గచ్ఛామి* (1973), నాతిచరామి (1974) నాటకాలే గాక తనకు రచయితగా కీర్తి తెచ్చిపెట్టిన *బకాసుర* (1990), జనమేజయం (1997) వంటి నాటకాలు రచించాడు. వరుడు కావాలి (1980), షరా మామూలే (1981), వీధి నాటకం (1983), మేలుకొలుపు (1985) నాటికలను వెలువరించాడు. ఇవన్నీ జనాదరణ పొందినవే. ఈయన రచించిన చరమాంకం నాటకానికి 1982లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ రచన పురస్కారమిచ్చి సత్కరించింది. ఇదే నాటకం 1987లో రాష్ట్ర ప్రభుత్వం అవార్డును అందుకుంది. నాతిచరామి నాటకానికి ఆంధ్రజ్యోతి నాటక పోటీలలో తృతీయ బహుమతి లభించింది. మహాప్రస్థానం నాటకం అనేకసార్లు ప్రదర్శింప బడింది.

శరణం గచ్ఛామి నాటకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రదర్శించింది. శ్రీకళానికేతన్ సంస్థను స్థాపించి, ఆ సంస్థ తరపున 30 నాటక, నాటికలను హైదరాబాదులోను, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ప్రదర్శింపజేశాడు. ఈ సంస్థ ప్రతియేటా ఒక కళాకారుని సత్కరించి, నాటకానికి సంబంధించిన వ్యాసాలను నిష్ణాతులైన రచయితలతో రాయించి, సంకలనంగా వెలువరిస్తుంది.

దాసరి.ఎన్.

తిరుపతి వేంకటకవులు : దివాకర్ల తిరుపతిశాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి జంట కవులు, నాటకకర్తలు, శతావధానులు.

తిరుపతి వేంకటకవులు గోదావరీ తీరస్థులు. సహాధ్యాయులు. పశ్చిమ గోదావరి జిల్లా కడెద్ద గ్రామ వాస్తవ్యులు, కాశీ పండితులు, షడ్దర్శనవేత్త, చర్ల బ్రహ్మయ్యశాస్త్రి శిష్యులు. శతావధానాలు, అష్టావధానాలు చేశారు. అనేక గ్రంథాలు రచించారు. కవిత్వ జైత్రయాత్ర సాగిస్తూ విశాలాంధ్రలోని రాజాస్థానాలలో, పట్టణాలలో, పల్లెలలో విజయ దుందుభి మోగించారు.

దివాకర్ల తిరుపతిశాస్త్రి 'కవితకు వెలనాటిన' వెలనాటి పండితకవి. 1872లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకా ఎండగండి గ్రామంలో జన్మించాడు. తండ్రి వేంకటావధాని, తల్లి శేషమ్మ. సంస్కృతాంధ్ర భాషలలో మంచి పండితుడు. బూదుల సుబ్బారాయుడు ప్రభృతుల వద్ద కొంత చదివినా ప్రధానంగా విద్యనభ్యసించింది చర్ల బ్రహ్మయ్య దగ్గరనే. తన జంటకవి చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిని తన కవితా గురువుగా భావించాడు. ఈయన గ్రహణ శక్తి అత్యద్భుతం. పోలవరం జమీందారు శ్రీకృష్ణ రాయభూపతి ఆస్థానకవిగా కాకినాడలో స్థిరనివాసం ఏర్పరుచుకొని, అక్కడే 1919లో దివంగతుడయ్యాడు.

చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి 1870లో తూర్పు గోదావరి జిల్లా కడియం గ్రామంలో జన్మించాడు. తండ్రి కామయ్య. తల్లి రామచంద్రమ్మ. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, ప్రతివాది భయంకరం రాఘవాచార్యులు వద్ద ఏ కొద్దో చదువుకున్నా, ప్రధానంగా చర్ల బ్రహ్మయ్య శాస్త్రి దగ్గరనే విద్యను అభ్యసించాడు. ఈయనకు ధారణశక్తి అధికం. చిన్నతనంలోనే కాశీయాత్ర చేశాడు. కవిత్వంలోనే గాక, గానంలో, మృదంగ వాద్యంలో ప్రజ్ఞావంతుడు. బందరు హిందూ హైస్కూలులో ఆంధ్రోపాధ్యాయుడుగా చాలాకాలం పని చేశాడు. ఎవరి ఆస్థానంలోను శాశ్వతంగా ఉండడం ఈయనకు గిట్టేది కాదు. బందరు పట్టణం ఈయన కవితా విహారానికి క్రీడా స్థలం. వేలూరి శివరామశాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి, అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి, పింగళి కాటూరి కవులు, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ మొదలైన అనేక మందిని సాహితీ వేత్తలుగా, కవులుగా తీర్చిదిద్దాడు. ఈయన శిష్యులమని చెప్పుకోవడం నాటి తెలుగు కవులకు గర్వకారణంగా ఉండేది. శిష్య వాత్సల్యంలో వేంకట శాస్త్రి ద్రోణుడంతటివాడు. బందరు హిందూ హైస్కూల్‌లో 1916లో పదవీ విరమణ చేసిన తరువాత కొంతకాలం కడియం గ్రామంలో, ఆ తరువాత విజయవాడలో స్థిరపడ్డాడు. ఉమ్మడి మదరాసు ప్రభుత్వం విజయవాడలో మహాసభ జరిపి వేంకటశాస్త్రిని ఆస్థానకవిగా నియమించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళా ప్రపూర్ణ' బిరుదుతో గౌరవించింది. జీవితపర్యంతం సాహిత్య సేవ చేస్తూ 1950లో మహాశివరాత్రి పర్వదినాన వేంకటశాస్త్రి శివ సాయుజ్యం పొందాడు.

వేంకటశాస్త్రి కవిత్వంలోని ప్రధాన లక్షణం రంజకత్వం. పద్యం చదివే తీరు కూడా అత్యంత ఆకర్షణీయంగా ఉండి శ్రోతల హృదయాలను రంజింపజేసేది. తిరుపతి శాస్త్రి కవిత్వంలో ప్రధాన లక్షణం ప్రౌఢిమ. ఆంధ్ర నాటక సాహిత్యానికి రసవత్తరమైన పాండవ నాటకాలు సమర్పించారు. పాండవ జననం మొదలు అశ్వమేధం వరకు కథను ఆరు నాటకాలుగా రచించారు. ఆ తరువాత కథను ఎత్తుకుంటే విషాదాంతం చేయవలసి వస్తుందని మానివేసినట్టు తోస్తుంది.

ఈ ఆరు నాటకాలలో పాండవ జననం, పాండవ రాజసూయం, పాండవ ప్రవాసం, పాండ వాశ్వమేధం వేంకటశాస్త్రి రచించాడు. పాండవోద్యోగ విజయాలలో మూడు వంతుల రచన వేంకట శాస్త్రిదే. మొదట పాండవోద్యోగం పాండవ విజయం అంటూ రెండు నాటకాలు వేరువేరుగా లేవు. రెండింటి కథను కలిపి పాండవ విజయం అనే పేరుతోనే ప్రకటించారు. తరువాత పాత పాండవ విజయాన్ని రెండు చేసి మొదటి రెండంకాలకు ఇంకా నాలుగు అంకాలు చేర్చి పాండవోద్యోగమని పేరు పెట్టారు. తక్కిన దానికి ఇప్పటి మొదటి అంకం చేర్చి పాండవ విజయమని ప్రకటించారు.

తిరుపతి వేంకటకవులు తమ నాటకాలలో సంస్కృత నాటక లక్షణాలనే అనుసరించి సంస్కృత విష్కంభాదులు వాడారు. పద్యాత్మకాలైనా పద్యబాహుళ్యాన్ని బట్టి (పాండవోద్యోగంలో 342 పద్యాలు, విజయంలో 362) వీటిని పద్య నాటకాలుగా పరిగణించవచ్చు. ఈ నాటకాలలోని కథా సంవిధానం, దృక్పథం ఆంధ్ర మహాభారతాన్ననుసరించే ఉన్నాయి. కొద్ది మార్పులు చేసినా అవి నాటకానికి పుష్టిని చేకూర్చాయి. దృశ్యమానం చేయడానికి నాటకీయత గల ఘట్టాలను ఎంచుకుని వాటిని రమణీయంగా నిర్వహించడంలో, పాత్రచిత్రణలో వేంకటశాస్త్రి ప్రతిభ అడుగడుగునా గోచరిస్తుంది. శ్రీకృష్ణుని ప్రపంచ నాటక సూత్ర ధారిత్వం, బహుముఖ ప్రజ్ఞ, ధృతరాష్ట్రుని దుర్బుద్ధి, దుర్యోధనుని రాజసం, కర్ణుని స్వామి భక్తి, ధర్మరాజు రాజనీతి, భీష్ముని కృష్ణ భక్తి, అశ్వత్థామ ఔద్ధత్యం మిక్కిలి సమర్థవంతంగా చిత్రించాడు.

ఈ ఆరు నాటకాలలో ఎక్కువ ప్రచారంలోకి వచ్చి ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొన్న నాటకాలు పాండవోద్యోగం, పాండవ విజయం. ఈ రెంటిని కలిపి పాండవోద్యోగ విజయాలను పేరుతోనూ, కురుక్షేత్రం అనే పేరుతోనూ ప్రదర్శిస్తున్నారు. ఇవి పౌరాణిక నాటకాలకు విజయ పతాకలు. ఈ నాటకాలలో స్త్రీ పాత్రకు అంత ప్రాధాన్యం లేకపోవడం వల్ల వీటికి ప్రదర్శనా సౌలభ్యం అలవడింది. ప్రధాన పురుష పాత్రలు వీటిలో ఎక్కువ. రెండు కలిపిన నాటకం పెద్దది కావడంవల్ల పేరు పొందిన నటులు అనేకమంది ఒకే ప్రదర్శనలో పాల్గనే అవకాశం కలిగింది. అందువల్ల ఈ అర్థ శతాబ్దిలో ఇవి ఎక్కువ ప్రచారంలోకి వచ్చి విరివిగా ప్రదర్శితమయ్యాయి. ఈ నాటకాల ద్వారానే ముంజులూరి కృష్ణారావు, బుర్రా రాఘవాచార్యులు, పింగళి లక్ష్మీకాంతం, మల్లాది గోవింద శాస్త్రి, బెల్లంకొండ సుబ్బారావు,

బందా కనకలింగేశ్వరరావు, పీసపాటి నరసింహమూర్తి, మాధవపెద్ది వెంకట్రామయ్య ప్రభృతులు నటలోకంలో తారాపథం అందుకున్నారు. ముద్రారాక్షసం, మృచ్ఛకటికం మొదలైన సంస్కృత నాటకాలను అనువదించగా ఆంధ్రసభ (బందరు) ముద్రారాక్షసాన్ని, ఏలూరు మోతే కంపెనీ, మృచ్ఛకటికాన్ని చాలాసార్లు ప్రదర్శించాయి.

పాండవ విజయం (1903), *శ్రీమదెడ్వర్డు పట్టాభిషేకం* (1904), *పాండవ ప్రవాసం* (1907), అపూర్వ కవితా వివేచనం (1907), సుకన్య (1908), పాండవ జననం (1908), *దంభవామనం* (1909), *అనర్ఘనారదం* (1909), *పండితరాజం* (1909), *పాండవ ఉద్యోగం* (1911), *పాండవ అశ్వమేధం* (1913), *ప్రభావతీ ప్రద్యుమ్నం* (1919), *రాజ సూయం* (1921), వ్యసన విజయం (1954) మొదలైనవి స్వతంత్ర నాటకాలు. పల్లెటూళ్ళ పట్టుదలలు (1903) , నవీనవిద్యా విలాసం (1910), గ్రామ సింగం (1910), తవిటిరొట్టె (1913), రసాభాసం (1934), కవిసింహ గర్జితములు (1934), మొదలైనవి ప్రహసనాలు. *బాలరామాయణం* (1902), మృచ్ఛకటికం (1907), ముద్రారాక్షసం (1908) లు వీరి అనువాద నాటకాలు.

ఎడ్వర్డు పట్టాభిషేకం, *పాండవాశ్వమేధం* నాటకాల మీద పత్రికాయుద్ధం జరిగింది. విజయం తిరుపతి వేంకట కవులదే.

శ్రీ.చ.

తూర్పు భాగవతం : శ్రీకృష్ణ భగవానుడి గాథని తెలియచేసే 'మహాభాగవతం', అందులోని కథల్ని సంగీతం, నృత్య రూపంలో ప్రదర్శించే ప్రక్రియను 'భాగవతం' అంటారు. దీన్ని ప్రదర్శించే కళాకారులను 'భాగవతులు' అంటారు. ప్రాంతం, గ్రామం, కులం, దేవుని రూపం ఆధారంగా ప్రదర్శించే ఈ కళారూపాలను పలు ప్రాంతాల్లో పలురకాలైన భాగవతాలుగా గుర్తించబడ్డాయి. అందులో మొట్టమొదటిది తూర్పు భాగవతం. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతంలో కృష్ణకథల్ని ప్రదర్శించిన కారణంగా దీనికి తూర్పు భాగవతం అని పేరొచ్చింది.

13వ శతాబ్దానికి చెందిన భక్త జయదేవుని 'గీత గోవింద' ప్రభావం కారణంగా వైష్ణవ వ్యాప్తి ప్రధానోద్దేశంగా ఈ భాగవత ప్రదర్శనలు రూపుదిద్దుకున్నాయి.

భాగవత ప్రదర్శన రకాలు ఎన్ని ఉన్నప్పటికీ తూర్పు భాగవతానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే కృష్ణగాథని రెండు భాగాలుగా విభజించి, కృష్ణుడి బాల్య లీలల ఆధారంగా కృష్ణలీలలులేదా జలక్రీడలు అని, కృష్ణుడు యవ్వన రాసలీలలను తెలిపే 'కలాపం' అని రెండు భాగాలుగా ఈ ప్రదర్శనలు చోటు చేసుకున్నాయి. భక్తి భావాన్ని ముఖ్యంగా వైష్ణవ తెగలో పెంపొందింపచేయటమే ఈ ప్రదర్శనల ముఖ్యోద్దేశం.

తూర్పు భాగవతం – లక్షణాలు : 1. పురుషులే ప్రదర్శించే కళారూపం, 2. కూచిపూడి భాగవతంలా కాకుండా సంప్రదాయ ధ్రువగానం, గమక శైలిలో ఉంటుంది, 3. కథకు తగినట్టుగా సంగీతాన్ని జోడించి ఒక ప్రత్యేక అవస్థను సృష్టించడం తూర్పు భాగవతం ప్రత్యేకత, 4. నృత్యం, అభినయాలకు ప్రాధాన్యం తక్కువ, 5. దేశి రాగాల్లో పాఠ్యాన్ని సంగీత ప్రధానంగా చెప్పటం మరో ప్రత్యేకత, 6. సాధారణంగా సాంఘిక కుల ప్రాతిపదికన జానపద కళారూపాలు ప్రదర్శించబడుతుంటాయి. అయితే తూర్పు భాగవతాన్ని అన్ని కులాల వారు ప్రదర్శించి కళా రూప ప్రదర్శనలో సార్వజనీనత పాటించటం విశేషం; 7. హస్త విన్యాసాలు, హస్త భంగిమలకు ప్రాధాన్యం; 8. కలాపంలో ఒకే ఒక ప్రధాన నటుడు భామ పాత్ర ధరిస్తాడు. కథను నడిపే సూత్రధారుడు అవసరాన్ని బట్టి విదూషకుని పాత్ర కూడా పోషిస్తాడు, 9. తూర్పు భాగవతం ప్రధాన కథ శ్రీకృష్ణుడు, సత్యభామ మధ్య ప్రేమ, వివాదం, పునఃకలయికకు అద్దం పడుతుంది. అడపాదడప సత్యభామ రాధల మధ్య 'సవతుల కయ్యం'ను కూడా వివరిస్తుంది, 10. ఆహార్యం నాటి రాచకుటుంబం మాదిరిగానే సంప్రదాయంగా ఉంటుంది, 11. మరో ముఖ్యమైన లక్షణం 'మృదంగ విన్యాసం' ఈ విన్యాసం పురుష, స్త్రీ పాత్రలకు అనువుగా తాండవ, లాస్య శైలిలో ఉంటుంది, 12. భాగవత పాత్ర సంక్లిష్టమైంది. అభినయపరమైన విన్యాసాలు, బృందగానం, హాస్యం, సంగీత ప్రధానమైన పాఠ్యాన్ని గద్యంగా మార్చటంలోనూ నాయకత్వం వహిస్తాడు, 13. ప్రాచీన జానపద సంభాషణలను లేదా పాటలను కీర్తన, పురాణ ప్రవచనం రూపంలోనూ ప్రధాన భూమిక పోషిస్తాడు. కొన్ని సమయాల్లో శ్రీకృష్ణుడు, సత్యభామ పాత్రల మధ్య అనుసంధానకర్తగా హాస్యపూరితమైన ధోరణితో వ్యవహరిస్తాడు. ఇతన్ని మాధవ లేదా మాధవి అనే పాత్రల పేర్లతో కూడా వ్యవహరిస్తారు, 14. తూర్పు భాగవత పాఠ్యం ప్రదర్శన కారుల అభీష్టం మేరకు ప్రదర్శించబడ్డాయి, ప్రదర్శించబడు తున్నాయి. ఉదాహరణకు నరసింగపల్లి వారు, కేశవపూరు వారు, బబ్బిలివారు, దువ్వ వారు, నెల్లిమర్ల వారు, ఇలా పలు తూర్పు భాగవత బృందాలు వారి స్వీయ రచనలతో ప్రదర్శనలిస్తుంటారు. అయితే 19వ శతాబ్దంలో వంకాయల బలరామ భక్త రచించిన భాగవత పాఠ్యాన్ని నేటికి కొన్ని బృందాలు అనుసరిస్తున్నాయి, పురుషుడు ప్రధానపాత్ర అయిన సత్యభామ పాత్రను పోషించడం, ఈ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతుండడం ఈ ప్రక్రియ ప్రత్యేక లక్షణం. కేశవదాసు, పాడుకు అప్పలస్వామి, కొచ్చర్ల వీరభద్రుడు, అక్కభక్తుడు, చేబ్రోలు సన్యాసయ్య, వరద

ఆది నారాయణ, దూడల శంకరయ్య, బంతలకోటి జగన్నాథం, కొచ్చర్ల బ్రహ్మానందం సత్యభామ పాత్రలో రాణించిన ప్రముఖులు, 15. నృత్య నాటకం అయిన తూర్పు భాగవతంలో శృతి, మృదంగం, తాళాలు, కాలి గజ్జెలు ప్రధాన సంగీత సాధనాలు. శృతి వాయిద్యాన్ని 'తిత్తి' అంటారు. ప్రస్తుతం దీని స్థానంలో హార్మోనియం వాడుతున్నారు, 16. ముగ్గురు లేదా నలుగురు గాయకులు బృందగానంగా పాఠ్యాన్ని ఉచ్ఛస్థాయిలో ఆలపిస్తారు. మృదంగాన్ని దృపద సంప్రదాయంలో మూడు స్థాయిల్లో, విలంభితలయ, మధ్యమలయ, దృఢలయల్లో వినియోగిస్తారు. ఈ సంప్రదాయం ఒక్క తూర్పు భాగవత కళాకారులే ఆచరిస్తున్నారు, 17. ప్రదర్శన వ్యవధి సాధారణంగా 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రాత్రంతా ప్రదర్శిస్తారు. మరికొన్ని సందర్భాల్లో మూడు రాత్రులు కూడా ప్రదర్శిస్తారు, 18. ప్రతిపాత్ర ప్రవేశ 'దరువు'తో ప్రవేశిస్తుంది. ప్రతి పాత్ర ప్రవేశాన్ని ఇద్దరు వ్యక్తులు తెరతో ఆవిష్కరిస్తారు, 19. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన జానపద కళారూపం తూర్పు భాగవతం. ఏ దేవుడి పేరిట ఏ పండగ జరిగినా తూర్పు భాగవత ప్రదర్శన లేకుండా ఆ పండగకు పరిపూర్ణత చేకూరదనటంలో అతిశయోక్తి లేదు.

భాగవత ప్రదర్శనల్లో తూర్పు భాగవతం తనదైన ప్రత్యేక శైలిని సంతరించుకుంది. శృంగార రసం ప్రాధాన్యంగా గల తూర్పు భాగవతంపై కూచిపూడి భాగవతులు ప్రదర్శించే 'భామా కలాపం' ప్రభావం ఉందని చెప్పవచ్చు. వినోద ప్రధానంగా సాగే ఈ ప్రదర్శన సందేశాత్మకంగా ముగుస్తుంది. కళాత్మక ప్రదర్శనలలోనూ, ప్రేక్షకాదరణలోనూ తూర్పు భాగవతం అగ్రభాగాన నిలుస్తుంది.

ప్ర.రె.

తెర : నాటకశాలలో ప్రేక్షకాగారాన్ని, రంగస్థలాన్ని, నేపథ్యాన్ని వేరుపరిచేదే తెర. ప్రేక్షకాగారాన్ని, రంగస్థలాన్ని వేరు పరిచే తెరను ముందు తెరని, రంగస్థలాన్ని నేపథ్యాన్ని వేరుపరిచే తెరను వెనక తెర అని అంటారు. దీనికి జవనిక, యవనిక పటం, తిరస్కరిణి, ప్రతీసీర పర్యాయపదాలు.

జనులు దీనిలో కలుస్తారు కాబట్టి యవనిక. నటులను కనపడకుండా చేసేది తిరస్కరిణి అని వ్యుత్పత్తి అర్థాలు. ప్రతీసీర అంటే అడ్డంగా కట్టింది.

నేపథ్యం ప్రేక్షకులకు కనిపించకూడదు. కాబట్టి వెనక తెర ఎప్పుడూ వాలే ఉంటుంది. ఇక ముందు తెర మూడు రకాలు, 1. పైకి కిందికి కదిలేది, 2. పక్కకు తప్పుకొనేది, 3. అప్పటికప్పుడు కట్టేది. మొదటి రకం ముందు తెర పక్కీల తాళ్లతో దీనిని పైకి కిందకు కదుపుతారు. ముందు తెర పైకి లేవడంకాని పక్కకు లాగడం కాని నాటక ప్రారంభానికి సూచన. ముందు తెర కిందకు పడడం లేక మూసుకోవడం నాటకాంతానికి గాని అంకాంతానికి గాని సూచన. ముందు తెర మీద నాటకశాల చిహ్నంగాని, నాటక శాలాధిపతుల ఇష్ట దైవం చిత్రంగాని చిత్రింపబడి ఉంటుంది.

ముందు తెర, వెనక తెరల మధ్య సామాన్యంగా వీధి తెర, దర్బారు తెర, అంతఃపురం తెర, అడవి తెర, ఉద్యానవనం తెర ఇలా రకరకాల తెరలు కట్టి ఉంటాయి. అంకం పూర్తయిందని తెలపడానికి ఎక్కువగా వీధి తెరలు ఉపయోగిస్తారు. వీధి తెర లేకపోతే ముందు తెరనే అంక తెరగా వాడతారు. ఇక మూడో రకం తెర సాధారణంగా ఆరు బయట పందిళ్లలో ప్రదర్శించే వీధి నాటకాలకు వాడతారు. ఇద్దరు వ్యక్తులు చక్కటి దుకూలాన్ని చెరోవైపున పట్టుకుని ఉంటారు. దుకూలం తొలగించగానే పాత్ర కనిపిస్తుంది. ప్రేక్షకాగారం వాస్తవిక జగత్తు. రంగస్థలం మీద జరిగేదంతా భావనా జగత్తు. ఈ రెండు జగత్తులకు సరిహద్దు లేక ముందు తెర రంగస్థలానికి నాలుగవ రేఖ తెర. తెర తొలగడంతో భావనా జగత్తు కనిపిస్తుంది. ప్రేక్షక లోకాన్ని భ్రాంతి అలుముకుంటుంది. తెరపడడంతో భావనా జగత్తు అంతరిస్తుంది. భ్రాంతి తొలగిపోతుంది. ప్రేక్షకులు తిరిగి ప్రాకృత జగత్తులో పడతారు.

ప్రాకృత జగత్తుకు సంబంధించిన నటీనటులు కవి కల్పిత భావనాజగత్తులో ప్రవేశించడానికి నేపథ్యంలో సన్నద్ధులవుతారు. ఇది మిశ్రమ జగత్తు. సంధ్యాకాలం లాంటిది. నేపథ్యంలోని సన్నాహక దశ కంట పడితే ప్రాకృత జగత్తులోని ప్రేక్షకులను భ్రాంతి ఆవరించదు. అందుకే సన్నాహ దశను ఆచ్ఛాదించడానికి ఉద్దేశించిందే వెనక తెర. ఈ రెండు తెరలకు మధ్య ఉండే తెరలు ఆయా రంగాలు, ఆయా స్థలాలలో జరుగుతున్నాయని ప్రేక్షకులకు తెలియచేయడానికి ఉద్దేశించినవే.

ప్రాచీన గ్రీకు నాటక రంగంలో ముందు తెర లేదు. వెనక తెర బదులు అలంకృతమైన గోడ ఉండేది. ఈ గోడను 'స్కెనీ' అనే వారు.

ప్రాచీన రోమన్ నాటకరంగంలో కూడా మొదట ముందు తెర లేదు. తరువాత తరువాత పాంపె క్రీ.పూ. మార్షియన్ రాతితో కట్టించిన నాటకశాలలో మొట్టమొదట ముందు తెరను ప్రవేశపెట్టారు. ఈ ముందు తెర తేలిక

చక్రంలో బిగించేవారు. నాటక ప్రారంభంలో ఈ చక్రం భూగర్భంలోకి పోయేది. నాటకాంతంలో పైకి లేచేది.

ఇంగ్లండులో **1660**తో ప్రారంభమైన పునరుద్ధరణ కాలంలో ముందు తెర అమలులోకి వచ్చింది. రంగానికి రంగానికి మధ్య తెర దించే ఆచారం 18వ శతాబ్దంలో కాని అమలులోకి రాలేదు. ఈ తెర, ముందు తెర వెనక ఉండేది. దీనిని 'ఏక్ట్ డ్రాప్' (**Act Drop**) అనే వారు. ఆ తరువాత క్రమంగా ఈ తెరలు వాడడం భారతదేశంలో కూడా అమలులోకి వచ్చింది.

ప్రాచీన సంస్కృత నాటకరంగం యుగంలో ముందు తెర ఉన్నదీ లేనిదీ నిర్ధారణగా చెప్పలేం. భరతముని నాట్యశాస్త్రం, దానికి అభినవగుప్తుని వ్యాఖ్యానం పట్టి రంగ, పీఠ రంగ శీర్షాల మధ్య తెర ఉండేదని తెలుస్తోంది. ఇది వెనక తెర. బహుశా ఈ వెనక తెరను తొలగించుకొనే 'పటాక్షేపము' న పాత్ర ప్రవేశించేది. మృచ్ఛకటిక, ముద్రారాక్షసం మొదలైన సంస్కృత నాటకాలలో అపటేక్షేపం, పటాక్షేపం అనే పదాలు ఎక్కువగా ప్రయుక్తమయ్యాయి. భరతముని నాట్యశాస్త్రం 12వ అధ్యాయం మొదట తెర తొలగించిన పిమ్మట పాత్ర ప్రవేశించాలని చెప్పడంవల్ల ముందు తెర ఉండేదేమోనని అనుమానించాల్సి వస్తోంది. అభినవగుప్తుడు చెప్పిన బహిర్యవనిక ఇదేనేమో.

ముందుతెర లేదు కాబట్టి సంస్కృత నాటక లాక్షణికులు అంకాంతంలో పాత్రలన్నీ నిష్క్రమించాలని నియమం పెట్టారు. ముందు తెర వాడకంలోకి వచ్చిన ఈ కాలంలో ఈ నియమం అర్థరహితమైపోయింది. అంకాంతాన పాత్రలన్నీనిష్క్రమించడానికి 'మధ్యాహ్నమైంది... లెమ్ము పోవుదము' లాంటి భాషతో పాత్రలు నిష్క్రమించడం చప్పగా ఉంటుంది. ముందు తెర ఈ చప్పదనాన్ని తొలగించి రంజింప చేస్తుంది.

తెరలేదు కాబట్టే స్థలం మార్పును సూచించడానికి సంస్కృత నాటకకర్తలు 'పరిక్రమణం' ఆశ్రయించవలసి వచ్చింది. పరిక్రమణం అంటే పాత్ర ఒక చోట నుంచి ఇంకో చోటకు నాల్గడుగులు వేసి ఆ కొత్త చోట పేరు చెప్పడం.

ఉదా॥ విదూషకుడు – (ఎదురం గాంచి) ఓయీ ఇదే ఆ మకరందోద్యానం. రా ప్రవేశింతము. (అని ప్రవేశింతురు). (రత్నావళి 1వ అంకం. అను. వేదం)

రంగస్థలంమీద మృత దేహాలను బాహాటంగా మోసుకు పోవాల్సిన అవసరం లేకుండా ముందు తెర దించిన తరువాత ప్రేక్షకులకంటపడకుండా మృతపాత్ర నిష్క్రమించవచ్చు.

పాత్ర ప్రవేశ సమయంలో ఏదో ఒక క్రియలో నిమగ్నమై ఉన్నట్టు చూపితే ఆ పాత్ర మనస్తత్వం, శీలం, కార్య దీక్ష సూచితమవుతాయి. ప్రత్యక్షంగా చూపడానికి వీలులేని క్రియలను, ఘట్టాలను తెరవేయడంద్వారా మరుగుపరచవచ్చు. ప్రయోక్త ప్రతిభను బట్టి, సందర్భాన్ని బట్టి తెర హఠాత్తుగా దించడం, మెల్లగా దించడం ద్వారా రంగానికి ఎంతో నాటకీయత చేకూర్చవచ్చు.

చంద్రశేఖర పండితుడు భరత సారంలో తెరను ఇలా వర్ణించాడు. "బహువిధ వర్ణములచే అలంకరింపబడి బహువిధాకారములు గల భావములతో లోకత్రయమును రంజింప రమ్యమగు యవనికను నాట్యమండపమున నేర్పరచ వలయును. ఇంకను అతుకులు లేక నలుచదరముగా నుండి చిత్ర వర్ణములు గలిగి రంగస్థలమునకు సరిపోవునంతటి పెద్దదియగు నేపథ్య వస్త్రమునకు లోపలి భాగముననే యుండి మొదటరంగపూజను, దేవతాప్రార్థనమును జేయ వలయును" (అను. లం.సూ.నా.శా., పుట 13).

శ్రీ.చ.

తెర నాటకం : తెల్లని సన్నని తెర వెనుక నుంచి బొమ్మలు ఆడిస్తూ ఇచ్చే ప్రదర్శన తెర నాటకం. దీనినే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట అంటారు. పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో దీని ప్రస్తావన ఉంది.

"భారతాది కథల జీర మరుగుల
నారంగ బొమ్మల నాడించు వారు" (పుట. 435)
(వివరాలకు "తోలు బొమ్మలు" చూడండి.)

శ్రీ.చ.

తెరుక్కూత్తు : ఇది తమిళ జానపద నాటకం. తెరు అంటే వీధి అని, క్కూత్తు అంటే నాటకం అనే అర్థం ఉంది. తెరుక్కూత్తు అంటే వీధి నాటకం. ఈ తెరుక్కూత్తు తెలుగులోని వీధి నాటకాన్ని పోలి ఉంటుంది. ఈ నాటకం క్రీ.పూ. నుంచి ప్రచారంలో ఉన్నట్లు పరిశోధకులు తెలిపారు. అయినా పదవ శతాబ్ది నుంచి దీనికి స్పష్టమైన చారిత్రక ఆధారాలు ఉన్నాయి. పూర్వం వసతి సౌకర్యాలు లేనిరోజుల్లో రంగస్థలం అవసరం లేకుండా నడివీధిలో కొద్దిపాటి వేషధారణతో నటించే నాటకమే వీధి నాటకం. ఇంతేగాక చెక్కలతో తయారుచేసిన భుజకిరీటాలు, కిరీటం ఇతర ఆభరణాల్ని ధరించి ప్రదర్శించే నాటకమే వీధి నాటకం అని కొందరి ఉవాచ. ఇది మొదట దైవరాధనకు సంబంధించిన ఆలయ కార్యక్రమంగానే ఉండేది. ఆ తరువాత ఇతర కార్యక్రమాలకు, ఇతర సందర్భాలకు విస్తరించింది. తమిళనాడులోని కన్యాకుమారి, రామనాథపురం, తిరువెల్వేలి, మధురై, తంజావూరు, ఉత్తర ఆర్కాడు, దక్షిణ ఆర్కాడు, సేలం, చెంగల్పట్టు, మద్రాసు వంటి జిల్లాల్లో తెరుక్కూత్తు ప్రదర్శిస్తున్నారు. కొన్ని ప్రధాన ఉత్సవాల్లోను గ్రామదేవతల

జాతర్లలోను భారత, భాగవత, రామాయణ గాథలు చారిత్రక, జానపద ఇతివృత్తాలకు చెందిన నాటకాలు ప్రదర్శిస్తున్నారు.

తెరుక్కూత్తుకు నాలుగు వీధుల కూడలిలోనో, నడి వీధిలోనో, దేవాలయం ముంగిట్లోనో లేదా గ్రామానికి వెలుపల పొలంలోనో రంగస్థలాన్ని ఏర్పాటు చేస్తారు. నాలుగు గుంజల్ని పాతి వాటిపై కొబ్బరి ఆకులను వేసి పందిరి ఏర్పాటు చేస్తారు. ఇలా మట్టిలో పాతిన కర్రలకు పూర్వం దివిటీలు కట్టేవారు. వాటిపై అప్పుడప్పుడు నూనెపోసివెలుతురు రప్పించేవారు. ఆ తరువాత పెట్రోమాక్స్ లైట్లు, ప్రస్తుతం విద్యుద్దీపాలతో రంగస్థలాన్ని దేదీప్యమానంగా వెలిగేలా చేస్తున్నారు. ఈ పందిరి లోపలి భాగాన తెరలు వేలాడ దీస్తారు. ఆ తెరల నుంచి పాత్రలు ప్రవేశ నిష్క్రమణాదులు చేస్తుంటారు. తెరుక్కూత్తు ప్రదర్శనకు ముందు తెరవెనుక ప్రదేశంలోనో లేక రంగస్థల సమీపంలోని ఇంటిలోనో ఆహార్యం (మేకప్) వేసుకొంటారు. దీపం వెలిగించి కర్పూర హారతి ఇచ్చి పూజించిన తరువాతనే వేషధారణ చేసుకొంటారు. ఇలా మేకప్ పూర్తి అయ్యేంతవరకు కొందరు కలిసి మేళం కట్టుకొంటారు. దీనితోనే తెరుక్కూత్తు ప్రారంభమవుతుంది. ప్రారంభదినాల్లో ఇద్దరు కలిసి తెల్లని పరదాను చెరొకపక్క పట్టుకొనేవారు. కాని ప్రస్తుతం మంచి, మంచి దృశ్యాలుగల తెరలు వచ్చాయి. ప్రతి పాత్ర తెరబయటికి వస్తూ దైవప్రార్థన చేసుకొంటూనో లేక తనను తాను పరిచయం చేసుకొంటూనో ప్రవేశిస్తుంటుంది. కట్టియంగారన్ అనే హాస్యగాడు ప్రదర్శన ప్రారంభంలోనే ప్రవేశించి వినాయకుని ప్రార్థించి నాటకాన్ని ప్రారంభిస్తాడు. తాము ప్రదర్శించబోయే నాటకం గురించి చెప్పి, ప్రదర్శనలో ఏవైనా లోటుపాట్లుంటే మన్నించమని అర్థిస్తాడు. ఒక్కొక్కసారి ఈ పనిని నాటకాన్ని నేర్పిన గురువు చేస్తుంటాడు.

తెరుక్కూత్తుల్లో భారత, భాగవతాలకు సంబంధించిన నాటకాలే కాకుండా తిరువిళయాడళ్ పురాణం, పెరియ పురాణం, స్కంధ పురాణం వంటి భక్త్యాత్మక గాథలు, గంగై అమ్మన్‌కూత్తు వంటి కల్పిత గాథలు, కట్టబమ్మన్, దేశింగు రాజన్ కథ లాంటి చారిత్రక గాథలు ప్రదర్శింపబడుతూ ఉన్నాయి. ఈ నాటకాల్ని ప్రధానంగా ద్రౌపది అమ్మన్ తిరువిళా సందర్భంలోనే ఎక్కువగా ప్రదర్శిస్తూ ఉంటారు. ఈ ద్రౌపది దేవి ఉత్సవాన్ని మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై నెలలో దాదాపు 18 రోజులు వరుసగా ప్రదర్శిస్తూ ఉంటారు. తెరుక్కూత్తులను వేంకటేశ్వర స్వామిని దర్శించి వచ్చిన తరువాత కూడా ప్రదర్శించడం ఆనవాయితీ.

తెరుక్కూత్తులో ప్రధానంగా పురుష పాత్రలు ప్రవేశించిన తరువాత దుముకుతూ ఉధృతంగా ఆడడం సహజం. క్కూత్తూ అంటేనే దుముకుతూ ఆడు అనే అర్థం ఉంది. ఇలా ఆడడమే కాక వేగంగా గిరకలు కొడుతూ ఆడడం కూడ వీధి నాటకంలో చూడవచ్చు. వీధి నాటకం సంగీతం, నృత్యాత్మకమైన గ్రామీణ కళారూపం. ఇందులో హార్మోనియం, తాళం, మద్దెల, ముఖవీణ మొదలైన వాయిద్యాలను ఉపయోగిస్తారు. కొందరు ముఖవీణను వాడరు. కళాకారులు తమకు తెలిసిన రాగ, తాళాలకు అనుగుణంగా పాటలకు బాణీలను ఏర్పరచుకొని ప్రదర్శిస్తూ ఉంటారు.

తెరుక్కూత్తును ప్రధానంగా మూడు విభాగాలుగా విభజిస్తారు. మొదటి విభాగంలో దైవ ప్రార్థన, తోడయం, మంగళం, రచయిత సభా ప్రార్థన, గురుస్తుతి, సంక్షిప్త కథా సంగ్రహం వంటి అంశాలుంటాయి. రెండో విభాగంలో కట్టియంగారన్ ప్రవేశించి ప్రధాన పాత్ర పరిచయం చేయడం, కథాగమనం ఉంటాయి. మూడో విభాగంలో మంగళం పాడడం, ఆశీర్వచనాలు చెప్పడం, (వచన రూపేణా ఉన్న ఆశీర్వచనం) ఉంటుంది.

ఆనందన్

తెలుగు ఏకాంకికా వికాసం : గ్రంథకర్త వనం మధుసూదన్. (ప్రచురణ 1988. శరత్ ప్రచురణలు, శంభుని పేట, వరంగల్ ద్వారా ప్రచురించ బడింది.) 1876-1985 మధ్య కాలంలో వెలువడిన ఏకాంకికలన్నిటినీ తన పరిశోధనా పరిధిలోకి తీసుకొని, ఏకాంకికల ప్రాదుర్భావ వికాసాలు, వాటి చారిత్రక భూమిక, ఏకాంకికాభేదాలు, వాటి విశ్లేషణం అధికారికంగా, సమగ్రంగా చేసిన పరిశోధనా ఫలితం ఇది. మౌలికమైన, సృజనాత్మకమైన దృక్పథంతో ఈ పరిశోధన సాగినట్టు ప్రతి పుటా సాక్ష్యమిస్తుంది. తెలుగు ఏకాంకికల గురించి ఇంత విస్తృతంగా, విశ్లేషణాత్మకంగా పరిశోధన జరిగిన వాటిలో ఇది మొదటి పుస్తకంగా పేర్కొనవచ్చు. ఐదు ప్రకరణాలుగా విభాజితమైన ఈ పుస్తకంలో గ్రీకు నాటక రంగం, భారతీయ నాటక రంగం, తెలుగు ఏకాంకిక అవతరణం, తెలుగు ఏకాంకికా వికాసం, తెలుగు ఏకాంకికా రచనా సమీక్ష అనే శీర్షికల కింద, ఉపశీర్షికల కింద వందలాది నాటక కర్తల రచనల ప్రాశస్త్యాన్ని గురించిన విశ్లేషణాత్మక వివరణ ఈ పుస్తకంలో ఉంది. గ్రంథం చివర చేర్చిన అనుబంధాలు పరిశోధకులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

గం.సు.రె.

తెలుగు నాటక కవులు : జీవిత రేఖల సంపుటి. రచన శ్రీనివాస చక్రవర్తి. ప్రథమ ముద్రణ 1966. పుటలు. 105, సుప్రసిద్ధ తెలుగు నాటక కవులు కోరాడ రామచంద్ర శాస్త్రి,

వావిలాల వాసుదేవ శాస్త్రి, కందుకూరి వీరేశలింగం, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, గురజాడ అప్పారావు, వేదం వేంకటరాయ శాస్త్రి, పానుగంటి లక్ష్మీ నరసింహారావు, దామరాజు పుండరీకాక్షుడు, తిరుపతి వేంకటకవులు, కొప్పరపు సుబ్బారావు జీవితాల సంగ్రహం, వారి వారి నాటక రచనా పద్ధతుల కౌశలం, వారి వారి ప్రధాన నాటకాల సమీక్ష ఈ గ్రంథంలో వివరించడమైంది.

శ్రీ.చ.

తెలుగునాటకవికాసం : ఈ గ్రంథాన్ని పి.ఎస్.ఆర్. అప్పారావు రచించాడు. (ప్రథమ ముద్రణ 1967, పుటలు.845.) ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా పొందిన పరిశోధనావ్యాసం.

ప్రాచీన కాలంలోని యక్షగానం మొదలు 1967 వరకు తెలుగు నాటక సాహిత్య నాటక రంగ క్రమవికాసాన్ని తెలిపే గ్రంథం. ఇది ఐదు భాగాలుగా, ప్రతిభాగం అధ్యాయాలుగా విభజితమైంది. నాందీ ప్రస్తావన, రచనా ప్రణాళిక తరువాత ప్రథమ భాగం ప్రారంభమౌతుంది. ఈ గ్రంథంలో నాటక విశిష్టత, ప్రాచ్య, పాశ్చాత్య, నృత్య, నాటకాల వికాసం, దృశ్య కళారూపాలు, అనే నాలుగు అధ్యాయాలతోను, ద్వితీయ భాగం ఆధునిక నాటకారంభం, ఆధునిక నాటక వికాసం, రచనా ప్రయోగాలు-విస్తృతి, నూతన ప్రయోగాలు, నాటకాలు, నాటికలు, ఏకాంకికలు, సమకాలీన రచనలు అనే ఆరు అధ్యాయాలతోను, తృతీయ భాగం నాటక రచనా సమీక్ష, నాటక ప్రయోగ సమీక్ష, విమర్శలు-సమస్యలు అనే మూడు అధ్యాయాలతోను, చతుర్థభాగం రచనలు, రచయితలు, నటులు-నాటక సమాజాలు, ఉపయుక్త గ్రంథ సూచి, ముఖ్య పదానుక్రమణిక అనే ఐదు అనుబంధాలతో పంచమ భాగం, నటుల, నాటకకర్తల, నాటక విమర్శకుల చిత్రాలతో విరాజిల్లుతోంది.

శ్రీ.చ

తెలుగులిటిల్‌థియేటర్ : నాటక ప్రదర్శనలో నాణ్యతను, సౌలభ్యాన్ని పెంచి సామాన్య ప్రజలకు ప్రదర్శన అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఉద్భవించిన ఒక నాటకోద్యమమే లిటిల్ థియేటర్. ఇది 1915 ప్రాంతంలో అమెరికాలో బోస్టన్, నార్త్‌డకోటా, చికాగో రాష్ట్రాలలో ప్రారంభమైంది. క్రమక్రమంగా ఇతర ప్రాంతాలకు విస్తరించి ఒక ఉద్యమ స్వరూపాన్ని దాల్చింది. ఆనాటి కొన్ని వృత్తి నాటక సమాజాలు ప్రదర్శించే నాటకాల్లో కళాత్మక విలువలు లుప్తమై దిగజారుడు తత్వాన్ని పులుముకొంటున్న దశలో, ప్రదర్శనలో నాణ్యతను సంరక్షించాల్సిన అవసరాన్ని గుర్తించిన కొన్ని ఔత్సాహిక సంఘాలు లిటిల్‌థియేటర్‌ఉద్యమాన్ని చేపట్టాయి. నాటకాలను ప్రజల వద్దకు తెచ్చి జనావాసాల నడుమ, హోటల్ ఆవరణలోను, బహిరంగ ప్రదేశాలలో తాత్కాలికంగా కట్టిన రంగస్థలం మీదను నాటక ప్రదర్శనలిస్తూ ప్రజలకు నాటకాన్ని చేరువగా తెచ్చారు. రంగస్థల సామాగ్రిని తగ్గించి, పరిమిత రంగోద్దీపనతో రంగాలంకరణ, అనవసర ఆర్భాటం లేని ప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇబ్సన్, షా, స్ట్రిండ్‌బర్గ్ నాటకాలను కూడా ఆ చిన్న రంగస్థలం మీదనే ప్రదర్శించి రక్తి కట్టించి ఉద్యమానికి బలాన్నిచేకూర్చాయి ఔత్సాహిక నటబృందాలు.

ఈ ఉద్యమం తెలుగునాటకరంగానికికూడా అవసరమని గ్రహించిన తొలి కళావేత్త కొప్పరపు సుబ్బారావు. ఈయన కవి, నటుడు, దర్శకుడు, వాద్య నిపుణుడు, సాంకేతిక నిపుణుడు కూడా. అమెరికాలో కొనసాగిన లిటిల్ థియేటర్ ఉద్యమ స్ఫూర్తితో తెలుగునాటకరంగాన్ని అభివృద్ధి పరచాలని సంకల్పించాడు. ఆ ఆలోచనలకు కార్య రూపమే తెలుగు లిటిల్‌థియేటర్. ఇది 1942లో తొలిసారి వెలుగులోకి వచ్చింది. కళాకారులలో సహజంగా వుండే ప్రతిభాపాటవాలకు తోడు నాటక కళను శాస్త్రీయ దృక్పథంతో అభ్యసిస్తే బంగారానికి తావి అబ్బినట్లు అవుతుందనీ, సుశిక్షితులైన కళాకారుల వల్లనే నాటకరంగం ప్రగతి పథంలో సాగుతుందనీ ఈ ఉద్యమ నిర్మాత విశ్వాసం, ఆకాంక్ష. నాటక ప్రదర్శన కళాత్మకంగా వుండాలంటే అభినయం ఒక్కటే చాలదు. సముచిత రంగాలంకారణ, ఆహార్యం, రంగోద్దీపన, సంగీతం, కొన్ని ఇతర హంగులు కూడా ఉండాలి. ఇలాంటి సాంకేతిక విషయాలలో నటీనటులకు కొంత పరిజ్ఞానం, అవగాహన అవసరం. కొన్ని నాటక సమాజాలలో ప్రజ్ఞావంతులైన నటులుంటారు. అలాంటి కళాకారులకు సహకారం అందించాలన్నదే లిటిల్ థియేటర్ ప్రధాన లక్ష్యం.

లిటిల్‌థియేటర్ కార్యక్రమంలో భాగంగా కళాకారులకు నట శిక్షణ ఇవ్వడానికి ఒక పాఠశాల ప్రారంభించారు. ఔత్సాహిక సంఘాలకు తోడ్పడటం కోసం ఎంతో విలువైన విద్యుత్ పరికరాలను, రంగస్థల సామాగ్రిని సేకరించారు. ఆంధ్రదేశంలో ఉన్న నాటకసంఘాల పేర్లు, వాటి నిర్వాహకుల పేర్లు, నటీనటుల సంగ్రహ జీవిత చరిత్రలు, మొదలైన వివరాలను ప్రప్రథమంగా సేకరించింది సుబ్బారావే. నాటకకళను గురించి వివరించే ప్రాచ్య పాశ్చాత్య దేశాల గ్రంథాలను తెప్పించి, సేకరించి విజయవాడలో 1944లో అమూల్యమైన గ్రంథాలయాన్ని ఏర్పరచాడు. నాటక విజ్ఞానం అందించే 2000 గ్రంథాలు గల గ్రంథాలయం దేశంలో ఇదే మొదటిదని పేరు పొందింది. కొప్పరపు సుబ్బారావు ఉద్యమ స్ఫూర్తితో లిటిల్ థియేటర్‌ను కొనసాగించాలని ఎంత

శ్రమించినా అదంతా one-manarmyగానే మిగిలిపోయింది. లిటిల్‌థియేటర్ ప్రాముఖ్యాన్ని ఆనాటి పెద్ద పెద్ద నటులే గుర్తించలేక పోవడం దురదృష్టకరం. ఆంధ్రదేశంలోని నాటక సంఘాల నుంచి తగిన ప్రోత్సాహం, అండదండలు లభించలేదు. 1957 నాటికికొప్పరపు సుబ్బారావు మరణంతో తెలుగు లిటిల్‌థియేటర్ కాలగర్భంలో కలిసిపోయింది.

గం.సు.రె.

తెలుగువారిజానపద కళారూపాలు : ఈ గ్రంథాన్ని మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించాడు. (ప్రథమ ముద్రణ 1992, పుటలు 800.)

నన్నయకు పూర్వం నుంచే తెలుగునాట బహుళ ప్రచారంలో వున్న జానపద కళారూపాల గురించి సమగ్రమైన అవగాహన కలిగించే గ్రంథమిది. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల కళారూపాలకు సంబంధించిన విశ్లేషణ ఇమిడి ఉన్న గ్రంథమిది. ఈ గ్రంథంలో జానపద కళారూపాల ఆవిర్భావం, శాతవాహన తెలుగు చక్రవర్తుల కళాపోషణ, బౌద్ధ యుగంలో వర్ధిల్లిన కళలు, చాళుక్య, చోళుల పోషణ, కాకతీయుల కళావిన్యాసం, మాచల్దేవి, నాట్యకళను ఆరాధించిన రెడ్డి రాజులు, విజయనగర రాజులు, కురవల కురవంజి, బహురూపం, యక్షగానం, చెక్కబమ్మలాటలు, తోలుబమ్మలు, చోడిగాని కలాపం, వీధి నాటకం, కూచిపూడి కళాక్షేత్రం, బయలునాటకాలు, పగటివేషాలు, విప్ర వినోదులు, జంగం కథలు, బుర్రకథలు, బుడిగ జంగాలు, గారడీ విద్యలు, దేవదాసీ నృత్యాలు, హరికథలు, గరగ, చిందు నృత్యం, రామభజనలు, మోడీలు, బతుకమ్మ, జముకుల కథలు, గొల్ల సుద్దులు, దొమ్మరాటలు, ఒగ్గు కథలు, హరిదాసులు, గంగిరెద్దాటలు, కాశీ కావడి వంటి ఎన్నో వందలాది కళారూపాల గురించి ఆసక్తికరమైన, అమూల్యమైన వివరాలతో కూడిన విషయపరిపుష్టమైన గ్రంథమిది.

గం.సు.రె.

తోటకం (త్రోటకం) : 1. నాటక భేదం (ఉపరూపకం), 2. గర్భసంధ్యంగం

1. నాటక భేదం: అనాటకంబు తోటకంబు. *(ఆం.ద.రూ. 3-64)* లక్షణంలో నాటకానికి భిన్నమైనదైన నాటక సదృశమైనది తోటకం. ఇందులో 5, 7, 8, 9 అంకాలుండ వచ్చు. ఇందులో దివ్య మానవుల సందర్భముండాలి. సాహిత్య దర్పణం ప్రకారం ప్రతి అంకంలోను విదూషకుడు ఉండాలి. భావ ప్రకాశనం ప్రకారం విదూషకుడు ఉండనవసరం లేదు.

2. గర్భసంధ్యంగం: తోటకం అంటే కోపంతో కాని, భేదంతో కాని కూడిన మాట. ఉదా: రత్నావళీ తృతీయాంకంలో, వాసవదత్త – (అతని యెదురుగా కన్నీళ్ళుకార్చుచు) ఆర్యపుత్రా, ఆలాగనకు, ఈయక్షరాలు వేటుకతె పాలయినవి. – అను. వేదం వేంకటరాయ శాస్త్రి

శ్రీ.చ.

తోలు బమ్మలు : జానపద నాటక కళారూపం. సజీవ వ్యక్తులకు బదులు నిర్జీవ తోలుబమ్మలు పాత్రలుగా వ్యవహరించే నాటక కళారూపం తోలుబమ్మలు. తోలుతో చేసిన బమ్మలు పాత్రలుగా వ్యవహరించే ఆట కాబట్టి ఈ కళారూపానికి తోలుబమ్మలాట అని పేరు వచ్చింది.

సంస్కృతంలో వీటిని ఛాయా నాటకాలు అంటారు.

పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో పాల్కురికి సోమనాథుడు

భారతాది కథల జీర మరుగుల
నారంగ బమ్మల నాడించువారు.
– పర్వత ప్రకరణం, పుట *435*.

అని వర్ణించడంవల్ల 11-12 శతాబ్దాల నాటికే తోలు బమ్మలాట ఆంధ్రదేశంలో ప్రసిద్ధికెక్కిందని తెలుస్తోంది. ఆ తరువాత బమ్మలాట సాంబయ్య మొదలైన వారి పేర్లు శాసనాలలో తప్పితే తోలుబమ్మలాట వర్ణన ఎక్కువగా తెలుగు సాహిత్యంలో కనిపించదు. ఈ కళ ఆంధ్రదేశం నుంచి ఇరుగు పొరుగు రాష్ట్రాలకే గాక ఆగ్నేయాసియా దేశాలకు పాకిందని చరిత్రకారుల అభిప్రాయం. తంజావూరు మహారాష్ట్ర రాజుల కాలంలో మహారాష్ట్ర తోలుబమ్మల వారు ఆంధ్రదేశంలో స్థిరపడి దేశమంతా వ్యాపింపచేశారు. నేటికీ తోలుబమ్మలవారిభాష, సంగీతం మహారాష్ట్ర భాషా సంగీతాలే.

ఈ బమ్మలను జింక, మేక, గాడిద తోళ్లతో తయారు చేస్తారు. ఉత్తమ పాత్ర బమ్మలను జింకతోళ్లతోను, తక్కిన పాత్రలను తదితర తోళ్లతోను తయారు చేస్తారు. వీటి ప్రమాణం అడుగు నుంచి ఏడడుగుల వరకుంటుంది.

తోళ్లను నున్నగా శుభ్రపరచి వాటి మీద బగ్గుతో ఆ పాత్ర ఆకారం గీసి కత్తిరిస్తారు. చిన్నచిన్న రంధ్రాలు చేసి వాటి చుట్టూ రంగు వేసి ఆభరణాలుగా రూపొందిస్తారు. చేతులు, కాళ్లు మొదలైన అవయవాల కదలికలను చూపడానికి కాళ్ల దగ్గర, మోచేతుల దగ్గర అతుకులు పెట్టి తాళ్లతో బిగిస్తారు. మొత్తం బమ్మకు ప్రధాన సూత్రం ఉంటుంది. బమ్మ మధ్య నిలువునా వెదురుబద్ద ఉంటుంది. ఈ బద్దను ఎడమ చేతితో, సూత్రాన్ని కుడిచేతితో పట్టుకుని ఆడిస్తారు.

ఈ బమ్మలాటవారు ఎక్కువగా లంకాదహనం, మైరావణ, లక్ష్మణమూర్ఛ, పద్మవ్యూహం ప్రదర్శిస్తారు. రంగనాథ రామాయణం, ద్విపద భారతం పాఠ్యంగా ఉపయోగిస్తారు. ఇవికాకుండా ప్రత్యేకంగా తోలుబమ్మలాట కోసం రాసిన గ్రంథాలు కూడా ఉన్నాయి.

తోలుబొమ్మలాట కూడా ఆరుబయలు కళారూపమే. దీని రంగస్థలం నాలుగువైపులా మూసిన పెట్టెలాంటిది. రంగస్థలానికి వెనుక, పక్కల దడులు కట్టి మూసి వేస్తారు. ముందు వైపున తెల్లటి దుప్పటి లాంటి వస్త్రం బాగా బిగించి కడతారు. ఇదే తెర. ఈ వస్త్రానికి బొమ్మలను ఈత ముళ్లతోనో, తుమ్మ ముళ్లతోనో గుచ్చి అంటి పెడతారు. తెర ఏటవాలుగా భూమికి రెండు, మూడు అడుగులు ఎత్తున ఉంటుంది. తెర వెనుక ఆముదం దీపాలు ఉంటాయి. తోలు బొమ్మలు పారదర్శకాలు అయినందువల్ల బొమ్మలు ప్రేక్షకులకు స్పష్టంగా కనిపిస్తాయి.

బొమ్మను తెర మీద ఆడించేందుకు పాత్ర ప్రవేశంలో ఆ పాత్రకు గల పేర్లను అమర శ్లోకం చదివి వెల్లడిస్తారు. పురుష పాత్రల వాచికం పురుషులు, స్త్రీ పాత్రల వాచికం స్త్రీలు పఠిస్తారు. వాచికం పద్యం, గద్యం రూపంలోనే కాకుండా దరువుల రూపంలో కూడా ఉంటుంది.

ప్రదర్శన దైవ ప్రార్థనతో ప్రారంభమవుతుంది. ప్రార్థన తరువాత వినాయక, సరస్వతీ దేవి బొమ్మలు తెరమీదకు వచ్చి ఆశీర్వదిస్తాయి. సూత్రధారుడు ఆట ఆడించే వారి పేరు చెప్పి జయం పలుకుతాడు. ఆ తరువాత అసలు కథ ప్రారంభవౌతుంది. ఈ ఆటకు హార్మోనియం, మద్దెల, తాళాలు, సహకార వాద్యాలు. కళాకారుల కంఠస్వరాన్ని బట్టి ఫిడేలు కూడా వాడడం కద్దు.

రాక్షసుల వికటాట్టహాసం, యుద్ధధ్వనులను నోటితో, మృదంగంతోనే గాక రెండు పేప చెక్కలను ఒకదాని మీద ఒకటి పెట్టి తొక్కడం ద్వారా ధ్వనులను కలిగిస్తారు.

ప్రదర్శనం మధ్యలో బంగారక్క, కేతిగాడు, జుట్టుపోలి గాడు ప్రహసనం వస్తుంది. ఇది కొంత అసభ్యంగా ఉన్నా గ్రామీణ ప్రజల ఆదరణకు ఎక్కువగా పాత్రమైంది. తోలు బొమ్మలాట సురటరాగంతో ముగుస్తుంది.

ఈ కళ సంగీత, సాహిత్య, శిల్ప, చిత్ర, వాస్తుకళల సమ్మేళనకళ. అందుకే దీనికి పంచకళాత్మక రూపకమని పేరు.

శ్రీ.చ.

త్ర్యశ్ర నాట్యమండపం : నాట్య మండప భేదం. భరత ముని ఆదేశానుసారం విశ్వకర్మ నిర్మించిన నాట్య మండపాలలో ఒక రకం. ఇది సమ త్రిభుజంగా ఉండడం వల్ల దీనికి త్ర్యశ్ర నాట్యమండపమనిపేరు వచ్చింది. దీని ఒక్కొక్క భుజం పొడవు 3 హస్తాలు. (1 హస్తము = $1^{1}/_{2}$ అడుగులు). పశ్చిమ కోణానికి ఎదురుగా ఉండే రంగ పీఠం కూడా త్రిభుజాకృతిగానే ఉంటుంది. ద్వారం పశ్చిమ కోణంలో ఉంటుంది. దీని వివరాలు 1. నేపథ్య గృహం, 2. రంగ శీర్షం; ద్వారాలు: 3. రంగపీఠం, 4. మత్తవారణులు, 5. రంగ మండలం (*డా.పోణంగి శ్రీరామ అప్పారావు నాట్య శాస్త్రము నుంచి*). ఇంకో ద్వారం రంగపీఠం వెనుకఉంటుంది. స్తంభాదులు చతురశ్ర నాట్య మండపంలో లాగానే ఉంటాయి.

శ్రీ.చ.

త్రాసం : వ్యభిచారీ భావం. ఆకస్మికంగా భయం కలిగించే గర్జనాదుల వల్ల కలిగే చిత్త క్షోభం. కలత, క్షోభ, కంపం అనుభావాలు.

మహావీర చరిత్ర ప్రథమాంకంలో హర ధనుర్భంగం వల్ల కలిగిన భయం –

హర ధనుర్భంగ జనిత మహారవంబు
రామ చరితాద్య డిండి మారావమనగ
ప్రబలి బ్రహ్మాండ భాండోదరంబు నిండి
భయము గొల్పుచు నాగ దిప్పటికినైన

– అను. మల్లాది సూర్య నారాయణ శాస్త్రి

శ్రీ.చ.

త్రిగతం : 1. వీథ్యంగం, 2. పూర్వరంగ బహిర్యవనికాంగం.

ధ్వని సామ్యం మూలంగా అనేక అర్థాలను గ్రహించడం త్రిగతం. ఇది పూర్వ రంగంలో సూత్రధారాది ముగ్గురి మధ్య సంభాషణ అని కొందరి అభిప్రాయం.

2. సూత్రధారుడు, పారిపార్శ్వకుడు, విదూషకుడు, ముగ్గురు కలిసి యథాలాపంగా ప్రదర్శింపబోయే నాటకాన్ని గురించి ప్రస్తావించడం త్రిగతం. ఈ ప్రస్థావన సమయంలో సూత్రధారుడికి విదూషక పారిపార్శ్వకుడు చెరోవైపున నిలబడతారు. వీరి సంభాషణలో కావ్యార్థం సూచితమవుతుంది. దీనినే త్రికం అని కూడా అంటారు. అయితే భావ ప్రకాశనకారుడు సూత్రధారుడు, నటుడు, పారపార్శ్వికుల సంభాషణ త్రిగతమని, నటుడు విదూషకునిలాగ వర్తిస్తాడని అభిప్రాయం వెల్లడించాడు.

అయితే ఇలా ముగ్గురు ముగ్గురు చొప్పున ప్రయోగించే త్రిగతాలు సంస్కృత నాటక సాహిత్యంలో చాలా అరుదు. సూత్రధారుడు–నటి, సూత్రధారుడు–పారిపార్శ్వకుడు, సూత్రధారుడు – నటుడు, ఇలా ఇద్దరిద్దరు చొప్పున ప్రయోగించేవే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన *బొబ్బిలి యుద్ధం* నాటకంలో సూత్రధారుడు, పారిపార్శ్వకుడు, నటి, త్రిగతంలో పాల్గంటారు. అయితే పారిపార్శ్వకుడు సూత్రధారునితో సంభాషించి నిష్క్రమించిన తరువాత నటి ప్రవేశించి సూత్రధారునితో సంభాషణ సాగిస్తుంది. అంతే కాని పై ముగ్గురు కలసి పాల్గనలేదు.

శ్రీ.చ.

త్రిగూఢకం : లాస్యాంగం. పురుషుడు స్త్రీ వేషం వేసుకొని సుకుమారంగా నాట్యం చేయడం త్రిగూఢకం.

"స్త్రీ వేషధారులైన పురుషుల యొక్క సుకుమార నాట్యము త్రిగూఢకమనబడును." - ఆం.సా.ద. *6-507.*

ఉదా: మాయాబజారు నాటకంలో ఘటోత్కచుడు శశిరేఖ వేషం వేసుకోవడం.

శ్రీ.చ.

త్రిపురారి శర్మ (జ.1956) : హిందీ నాటకరంగంలో నూతన అధ్యాయాన్ని నిర్వచించారు. సమైక్య కృషితో నాటకాన్ని ప్రదర్శించాలని నమ్మి, దానిని రుజువు చేసి నాటకాలను ప్రదర్శింపచేసిన నాటక రచయిత్రి.

హర్యానాలోని కురుక్షేత్రలో 1956లో జన్మించింది. మిరండా హౌస్ కాలేజ్ (ఢిల్లీ విశ్వవిద్యాలయం) నుంచి ఇంగ్లీషు సాహిత్యం చదివి 1976లో డిగ్రీ తీసుకున్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో 1979 వరకు చదువుకున్నారు. మిరండా హౌస్ కాలేజ్ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పని చేశారు. మహిళా సమస్యలను ప్రదర్శించడానికి, వారిని భాగస్వామ్యం చేయడానికి వీధి నాటకం (స్ట్రీట్ థియేటర్) ను ఎన్నుకున్నారు. ఈ దిశలో అమ్మాయిలను ఏడిపించడం, టీజింగ్‌పై కేవలం అమ్మాయిలతోనే కళాశాలలో ఒక ప్రదర్శన ఇచ్చింది. ఇది మహిళల సమస్యలను తెలపడానికి మంచి వేదిక అయింది. అదేవిధంగా సమాజంలోని అనేక అంశాలను తీసుకొని ప్రదర్శన ఇచ్చింది. మహిళల సమస్యలను చెప్పడానికి నాటకాన్ని ఒక వాహికగా వాడుకున్నారు. ఆమె దేశవ్యాప్తంగా పర్యటించి వర్క్‌షాపులను నిర్వహించింది. స్థానికులతో కలసి నాటకాలను విజయవంతంగా ప్రదర్శించింది. సామాజిక సమస్యలను ప్రదర్శించటానికి అలరిప్పు (వికాసం) అనే సంస్థను 1983లో ప్రారంభించింది.

సమైక్య కృషితో నాటక ప్రదర్శన (Collectively evolving a play) లో త్రిపురారి శర్మ అనేక సమస్యలను ఎదుర్కొంది. ఆర్థిక ఇబ్బందులేకాక, నాటక ప్రదర్శనలో అంశాలపై కూడా తోటి స్నేహితుల నుంచి ప్రతిఘటన ఎదుర్కొంది. వీధినాటక ప్రదర్శనకు కూడా తగినంత ప్రవేశం మురికివాడల్లో లభించలేదు.

రాజస్థాన్‌కు చెందిన మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి త్రిపురారి శర్మ తన సంస్థ అలరిపు పని చేసింది. రాజస్థాన్ గ్రామాలలో పర్యటించి నాటకాలను ప్రదర్శించింది. సాంస్కృతిక వైవిధ్యమున్న ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంకలో అనేక వర్క్‌షాపులను నిర్వహించింది. స్థానిక సమస్యలను ఎంచుకొని, నాటకంలో అందరిని సమన్వయపరుస్తూ ప్రదర్శించడం ఆమె ప్రత్యేకత. ఈ అనుభవాలను పొందుపరుస్తూ Searching for a voice అనే గ్రంథాన్ని రచించింది. ఆమె *బహు, బిర్యాముంద్రా, అక్సే, పహెలి, బంజ్‌ఘటి, సజా, కథ్‌కి గడి, రేష్మి రుమాల్, పక్ష్, ధైర్యాలలో శాంతి, మహిళా హక్కులు,* మానవ హక్కులు, సమాచార హక్కు మొదలైన విషయాలను తెలియజెప్పింది. మిర్చ్‌మసాలా, సంశోధన, హజార చౌరాసీ కామా వంటి సినిమాలకు కూడా ఆమె పని చేసింది. నౌటంకి, తమాషా, ఖ్యాల్, పండ్వాని, సురభి వంటి జానపద నాటక ప్రక్రియల్లో మహిళా చిత్రీకరణ అనే అంశంపైనా నాలుగు సంవత్సరాల పాటు అధ్యయనం సాగించింది.

చంద్ర

త్రిమూఢకం : లాస్యాంగం. తీవ్ర పరుషేతర పదాలతో, సమ వృత్తాలతో అలంకృతమైన పురుష భావాఢ్యమైన నాట్యం త్రిమూఢకం.

శ్రీ.చ.

త్రివిధ నాయికలు : సంస్కృతాలంకారికులు నాయికను వారి వారి గుణాలను బట్టి స్వీయ, పరకీయ, సామాన్య అని మూడు విధాలుగా వింగడించారు. నాయకుని సామాన్య గుణాలే నాయికకు వర్తిస్తాయి.

స్వీయ: స్వస్త్రీ - భార్య, పతివ్రత. ఉదా. సీత, దమయంతి, రుక్మిణి.

పరకీయ: భార్యేతర స్త్రీ - పరపురుషుని భార్య లేక వేశ్య లేక కన్య. ఉదా. మాలతీమాధవంలో మాలతి

సామాన్య - కళలలో నైపుణ్యం, ధనాశ గల వేశ్య. ఉదా. చింతామణి

శ్రీ.చ.

థార్న్టన్, వైల్డర్: చూ. వైల్డర్, థార్న్టన్

థెస్పిస్ (క్రీ.పూ.6వ శతాబ్దం) : గ్రీకు నాటక పితామహుడు, నటుడు, ప్రయోక్త. ఇకేరియా గ్రామవాసి. ఈ గ్రామంలో జరిగే బేకస్‌దేవత ఉత్సవాలలో బృంద గాన నాయకుడు. అప్పటి వరకు రచయితే సూత్రధారుడుగా వ్యవహరిస్తూ గాయకుడు అడిగే ప్రశ్నలకు జవాబు ఇస్తూ ఉండేవాడు. మొట్టమొదటగా సూత్రధారుని గాయకుల నుంచి వేరుచేసినట్లునిస్పష్టించింది ఈ థెస్పిస్. గాయకుడు విశ్రాంతి తీసుకొనే సమయంలో కరాళం అమర్చిన నటుని ఈయన ప్రవేశపెట్టాడు.

తరవాత నాందీ ప్రస్తావనలు, సంభాషణలు రచించి ఈ బృందగానానికి ప్రప్రథమంగా రూపకరూపం తీసుకువచ్చాడు. వివిధ కరాళాలను ధరించి ఒకే నటుడు వివిధ పాత్రలను

ధరిస్తూ హాస్య రూపకాలు ప్రదర్శించేవాడు. ఇది బహుజనామోదంపొందడంవల్ల ఉత్సవేతర సమయాలలో కూడా థెస్పిస్ ఈ రకం నాటకాలను శకటాల మీద ప్రదర్శిస్తూ దేశమంతటా సంచారం చేశాడు. నటుని దేవతా మండపానికి అంటి ఉన్న ఎత్తయిన బల్ల మీద నటింపచేశాడు. క్రీ.పూ. 534లో ఏథెన్స్ నగరంలో జరిగిన నాటక పోటీలలో ఇతనికి ప్రథమ బహుమతి లభించింది.

ఇతని నాటకాల పేర్లు మాత్రమే లభ్యమవుతున్నాయి కాని నాటకాలు దొరకడం లేదు. ఈ నాటకాలు అతను రాసినవో కావో నిశ్చయంగా చెప్పలేం.

అయితే థెస్పిస్ నాటకాలు సంపూర్ణ రూపకల్పనతో ఒప్పారుతుండేవి కావు. అవి గ్రీకు నాటక రచనా ప్రారంభ దశను మాత్రమే సూచిస్తాయని కళాభిజ్ఞుల అభిప్రాయం. ఆనాడు థెస్పిస్ గ్రీకు రూపక స్రష్టగా ఎంతో గౌరవం, పేరు తెచ్చుకొన్నాడు.

శ్రీ.చ.

దండం : 1. సంధ్యంతరం, 2. మానభంజనోపాయం

1. సంధ్యంతరం: చతుర్విధోపాయాలలో నాలుగవది, ఆఖరిది. దండమనగా శిక్ష. ముద్రారాక్షస నాటకం ప్రథమాంకంలో చాణక్యుడు చందనదాసును శిక్షించడం.

2. మాన భంజనోపాయం. అయితే భరతముని ఒక్కడే దీనిని మానభంజనోపాయంగా చెప్పాడు. ధనంజయ, సింగభూపాల, విశ్వనాథాదులు చెప్పలేదు.

శ్రీ.చ.

దండకాష్ఠం : విదూషకుని చేతి పరికర్ర. దీనిని వెలగ, మారేడు, వెదురు కర్రతో తయారుచేస్తారు. ఇది మూడు వంకలు తిరిగి ఉంటుంది. మందశాఖగా ఉండాలి. పురుగు తొలిచిందీ, పుచ్చిందీ కాకూడదు. దీనిని కొంకికర్ర, కుటిలకం అంటారు. ఇప్పటికీ వీధి నాటకాలలో హాస్యగాడు దీనిని ధరిస్తూనే ఉన్నాడు.

శ్రీ.చ.

దక్షిణ నాయకుడు : నాయకా భేదం. అనేకమంది నాయికలను సమానంగా ప్రేమించి ఆదరించువాడు దక్షిణ నాయకుడు. ధనంజయాదులు ఇతర కాంతలను ప్రేమించినా మొదటి భార్య పట్ల అనురాగం వీడనివాడని పేర్కొన్నారు.

శ్రీ.చ.

దత్తాత్రేయ శర్మ, అడుసుమిల్లి (1890-1950) : ఉత్తమ నటుడు, నాటకకర్త, దర్శకుడు, సంస్కృతాంధ్ర పండితుడు, సంఘ సంస్కరణాభిలాషి, గ్రంథాలయోద్యమ నాయకుడు, మంత్ర శాస్త్రవేత్త. ఈయన సికింద్రాబాద్‌లో 1890లో జన్మించాడు.

సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజిలో తెలుగు పండితుడుగా చాలా కాలం పని జేశాడు. అనువంశికంగా వచ్చిన పాండిత్యానికి తోడు మహాకవి, నటుడు అనుమల విశ్వనాథశాస్త్రి సాంగత్యం వల్ల నాటకకళ మీద ఆసక్తి కలిగింది. 1913 నుంచి సంస్కృత కళాభివర్థని అనే గ్రంథాలయాన్ని, నాటక సమాజాన్ని ఈయనతోపాటు అతని సహచరులు నడిపారు. విశ్వనాథ శాస్త్రి 'పఠాన్ రుస్తుం' వేషం వేయగా, దత్తాత్రేయ శర్మ రామరాజు భూమికలో నటించాడు. ఆ తరవాత శాస్త్రి ఉన్మాదులు గావడంతో భారమంతా దత్తాత్రేయ శర్మ మీద పడింది. దత్తాత్రేయ శర్మ పఠాన్ భూమికను మిక్కిలి సమర్థవంతంగా నటించి మెప్పు పొందాడు. ఈ కాలంలోనే ఈయన 'అయేషా' అనే నాటకం రచించాడు.

ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తూనే, పిల్లల కోసం నాటకాలు రచించి చక్కగా, శ్రద్ధగా అభిన యాదులు నేర్పి రసవంతంగా నాటకాలు ప్రద ర్శింపజేశాడు.

ఈయనకు భారత పాత్రలలో శకుని పాత్ర బాగా నచ్చిన పాత్ర. శకుని ప్రధాన పాత్రగా తెలుగులో నాటకాలు లేని కొరత తీర్చడానికి ఈయనే స్వయంగా అశ్వత్థామ అనే నాటకం రాసి శకుని పాత్ర ధరించి అద్భుతంగా నటించి ప్రశంసలందుకొన్నాడు. ఈయన రాజరాజ నరేంద్రుని పాత్ర సికింద్రాబాద్ పౌరుల హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది.

ఒకవైపు ఉపాధ్యాయ వృత్తిలో నిమగ్నులైనా, మరొకవైపు నాటకాలలో తలమునకలు వేసినా, ప్రతి సాంస్కృతిక, సాంఘిక కార్యకలాపంలోను ప్రముఖ పాత్ర వహించాడు. 1945లో ఆంధ్ర సారస్వత మహాసభకు కార్యదర్శిగా వ్యవహరించాడు.

కొంతకాలం దక్కన్ కేసరి అనే సాహిత్య పత్రిక నడిపాడు. మిత్రులు ఆ పత్రికను దక్కన్-కే సరి అని వేళాకోళం చేసేవారు. చాలామందికి నాటక కళలో ఓనమాలు దిద్దించి ఉత్తమ నటులుగా తయారు చేశాడు. అయేషా, అశ్వత్థామ, జగన్మాత, పీష్వా నారాయణ రావు, శకుంతల, శివాజీ, చంద్రగుప్త, భీష్మ ప్రతిజ్ఞ, ధర్మాత్మ, శ్రీకృష్ణ దేవరాయలు, పార్వతీ పరిణయం (సంస్కృతం, అముద్రితం) నాటకాలను రచించాడు.

ఈయన రామరాజు, పఠాన్ రుస్తుం, శివాజి, రాజరాజ నరేంద్రుడు, చాణక్యుడు, దుర్యోధనుడు, శకుని మొదలైన పాత్రలలో నటించి మెప్పు పొందాడు.

శ్రీ.చ.

దయావీరం : వీరరస భేదం. ఆపదలో ఉన్న ఆర్తజనులను, దిక్కులేని వారిని, దయతో ఎంత త్యాగమైనా చేసి రక్షించడం దయావీరం.

ఇందులోని నాయకుని దయావీరుడు అంటారు. ధృతి, మతి మొదలైనవి దీనికి వ్యభిచారీ భావాలు. ఆర్తులను రక్షించడం, ఊరడింపు, మాటలు, స్థైర్యం మొదలైనవి చేష్టలు.

ఉదా॥ నాగానంద నాటకంలో జీమూతవాహనుడు శంఖచూడుని గరుడుడి బారి నుంచి రక్షించడం.

శ్రీ.చ.

దర్శకుడు : నాటకప్రయోగానికి మూలస్తంభం, శిక్షకుడు, దృశ్యకావ్యాన్ని ప్రదర్శనాపరంగా రూపురేఖలు దిద్ది రంగస్థలం మీద నటీనటులతో మనోజ్ఞంగా ప్రదర్శింప జేసే గురుతర బాధ్యతను నిర్వహించే కార్యదక్షుడు. రచయిత రాసిన నాటకంలో అందచందాలను, అంతరార్థాన్ని సామాజికులకు కళాత్మకంగా, రసస్ఫోరకంగా అభివ్యక్తీకరించే వ్యాఖ్యాత దర్శకుడు. రంగస్థల వ్యాపారంలో నటీనటులకు శిక్షణనిచ్చి ప్రదర్శనోన్ముఖంగా వారిని నడిపించే మార్గదర్శి. గురువు. నాటక ప్రయోగసారథి. నటవర్గానికి ప్రేక్షకావళికి మధ్య సేతువు.

మొదట్లో తెలుగు నాటకరంగంలో దర్శకుడు అనే మాట వ్యవహారంలో లేదు. కాలక్రమంలో పాశ్చాత్య నాటక ప్రభావంతో డైరెక్షన్ అన్న ఇంగ్లీషు పదం సమానార్థంలో 'దర్శకుడు'గా మన నాటకరంగంలో చోటు చేసుకుంది. అంటే, దీని అర్థం అంతకు పూర్వం తెలుగు నాటక రంగంలో దర్శకుడు అనే వ్యక్తి లేడని అర్థం కాదు. దర్శకుడనే మాట వాడుకలో లేకున్నా గురువు అనే పేరుతోనో లేదా దేశికుడు అన్నపేరుతోనో దర్శకుని బాధ్యతలు నిర్వర్తించే వ్యక్తి ఒకరుండేవారు. 1980లో సంవత్సరంలో రాజమహేంద్రవరంలో ప్రదర్శితమైన వ్యవహార ధర్మబోధిని నాటకం కోసం పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారిని రంగస్థలం మీదికి తెచ్చిన కందుకూరి వీరేశలింగం పంతులు చేసింది దర్శకత్వమే కదా ! నాదెళ్ళ పురుషోత్తమశాస్త్రి, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, ఇమ్మానేని హనుమంతరావు నాయుడు, కొండుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, వేదం వేంకటరాయశాస్త్రి ప్రభృతులు తొలితరం దర్శకులు కావటం గమనార్హం, ధర్మవరం రామకృష్ణమాచార్యులు నాటకాలలో పద్యాలు, పాటలు ప్రవేశపెట్టి పద్యాలను గానం చేసే సంప్రదాయం మొదలైన నాటినుంచే వచన నాటకాలు పద్యనాటకాలుగా పరివర్తనం చెందాయి. పద్యనాటకాలు వేసే వారికి రాగాలు నేర్పించటం హార్మోనిష్టు వంతు అయింది. అప్పటి నుంచి సంప్రదాయ నాటకాలకు హార్మోనిష్టే గురుస్థానంలో స్థిరపడ్డాడు. ఈ పరిస్థితి ఆధునిక కాలం వరకూ కొనసాగుతూ వచ్చింది. తర్వాత కాలంలో పద్యనాటకాలకు కూడా దర్శకుడు అవసరమయ్యాడు. పద్యనాటకాలలో అభినయం లుప్తమై గానకచేరీలుగా పరిణామం చెందిన దృష్ట్యా, గానానికి తోడుగా నటన ఉండాలన్న ప్రజాభిప్రాయాన్ని మన్నిస్తూ, ఆ దిశలో కృషిచెయ్యడానికి కొందరు నిష్ణాతులు దర్శకత్వపు బాధ్యతలు స్వీకరిస్తూ ముందుకు వచ్చారు. వీరు సాంఘిక నాటకాలలో దర్శకులుగా ప్రసిద్ధులయ్యారు. కొప్పరపు సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణారావు, పామర్తి సుబ్బారావు, ఎ. ఆర్. కృష్ణ, కె. ఎస్.టి. సాయి, ఎ. శివరామిరెడ్డి, గాంధి, దుగ్గిరాల సోమేశ్వరరావు, జె. సిద్ధప్పనాయుడు, జి. ఎమ్. రెడ్డి మొదలైనవారు దర్శకులుగా పద్యనాటకాలకు కొత్త రూపం ఇచ్చారు. సంప్రదాయానికి ఆధునికతను జతచెయ్యడమే ఈ నాటకాలు విజయవంతం కావడానికి ముఖ్యకారణం. ప్రభుత్వం ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు 1998 నుండి ప్రారంభమైన నాటి నుండి చాల మంది పద్య నాటకాలకు దర్శకత్వం వహించి పద్యనాటక స్వరూపాన్ని మార్చడంలో విశేషంగా కృషిచేస్తున్నారు. దర్శకుని పాత్రకు ప్రత్యేకమైన గుర్తింపును తెస్తున్నారు.

1940 నుంచి సాంఘిక నాటకరంగంలో దర్శకుని ప్రాముఖ్యం గుర్తించటం జరిగింది. 1943-1945 మధ్యకాలంలో ఆవిర్భవించిన కొన్ని సంస్థలు దర్శకుని ఆవశ్యకతను బలంగా చాటి చెప్పడమేకాక, అతనికి విస్తృతమైన ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టాయి. ఆంధ్ర విశ్వ కళా పరిషత్తులో కె. వి. గోపాలస్వామి ప్రమేయంతో ప్రారంభమైన ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగాత్మక నాటక సమితి, గరికపాటి రాజారావు ఆధ్వర్యంలో ప్రారంభమైన ప్రజానాట్యమండలి, వనారస గోవిందరావు, కొత్తపల్లి లక్ష్మయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, ఆచంట సాంఖ్యాయనశర్మ, విశ్వనాథ కవిరాజు మొదలైన పెద్దల సంకల్పబలంతో వెలుగులోకి వచ్చిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు, కొప్పరపు సుబ్బారావు పూనికతో వ్యవస్థాపితమైన లిటిల్ థియేటర్ సంస్థలు నాటక రంగంలో దర్శకుణ్ణి ముందుకు తెచ్చి అతనికి ప్రచారాన్ని కూర్చాయి. తరువాతి కాలంలో వచ్చిన ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ, ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం, వివిధ జిల్లాలలో ఏర్పడిన నాటక పరిషత్తులు, విశ్వవిద్యాలయాల్లో ప్రారంభమైన రంగస్థల కళల శాఖలు దర్శకుని ప్రాముఖ్యాన్ని పెంచడంలో ప్రముఖపాత్ర వహించాయి. నాటక పోటీలలో దర్శకత్వానికి కూడా బహుమతి నిర్ణయించడంతో నాటకాలకు దర్శకుడు అనివార్యమైన వ్యక్తిగా స్థిరపడ్డాడు. గరికపాటి రాజారావు, కోడూరి అచ్చయ్య, ఆత్రేయ, కె. వేంకటేశ్వరరావు, చాట్ల శ్రీరాములు, మొదలి నాగభూషణశర్మ, మిశ్రో, తాళ్ళూరి శివరామకృష్ణారావు, అత్తిలి కృష్ణారావు, తల్లావఝుల సుందరం ప్రభృతులు నాటకరంగంలో దర్శకత్వంలో కొత్తపోకడలకు మార్గం చూపారు. ఎ. ఆర్. కృష్ణ, చాట్ల శ్రీరాములు విదేశీ నాటక రీతులకు స్వాగతం పలికి, వినూత్నమైన ప్రదర్శన పద్ధతులను ఆవిష్కరించి దర్శకుడ్ని కొత్త వెలుగులో ప్రకాశింపజేశారు. దర్శకులలో భరతుని నాట్యశాస్త్రాన్ని

అనుసరిస్తూ స్టానిస్లవ్స్కీ నాటక విధానాలను కూడా స్వీకరించి కొత్త – పాతల మేలు కలయికతో నాటక ప్రదర్శనకు కొత్తరూపం ఇచ్చేవారున్నారు. అభివ్యక్తి వాదం, అస్తిత్వవాదం, అసంబద్ధ నాటకం, ప్రతీకవాదం, ఐతిహాసిక నాటకశైలి మొదలైన పాశ్చాత్య నాటక శైలులను కూడా తెలుగు నాటకరంగంలో ప్రవేశపెట్టిన దర్శకులున్నారు. ఆధునిక వీధినాటకాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన అత్తిలి కృష్ణారావు, టి.జె.రామనాథం, జి. ఎస్. ప్రసాదరెడ్డి వంటి దర్శకులున్నారు.

అయితే నటనాసామర్థ్యం ఉన్న ప్రతివ్యక్తీ దర్శకుడుగా రాణించగలడా అంటే సాధ్యం కాదు. ఎందుచేతనంటే అభినయంతో పాటు దర్శకునికి మరికొన్ని అర్హతలు కూడా ఉండి తీరాలి. ఏ ఒక్క అంశంలోనో నిష్ణాతుడైనంత మాత్రాన దర్శకత్వపు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటం సాధ్యంకాదు.

దర్శకుని అర్హతలు : ఒక నటుడు ఎలా నటించాలో, ఆ సన్నివేశాన్ని ఎలా రక్తి కట్టించాలో దర్శకుడు నటించి చూపాల్సిన సందర్భం రావచ్చు. అటువంటప్పుడు దర్శకుడు ఆ పని చెయ్యలేకపోతే విలువ ఉండదు. కనుక అతనికి అభినయ కౌశలం తప్పని సరిగా ఉండాలి. సాహిత్యపరిజ్ఞానం అవసరం. ప్రజాభిరుచిని గ్రహించగల శక్తి ఉండాలి. సంగీతం గురించిన ప్రాథమిక అవగాహన ఉండాలి. రంగోద్దీపనం, దృశ్య బంధ నిర్మాణం గురించి ప్రాథమిక సూత్రాలు తెలిసివుంటే నాటకాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి వీలు కలుగుతుంది. ఒద్దికలు (రిహార్సల్స్) జరిపే సమయంలో నటీనటులను ఒక త్రాటిపై నడిపించగల ఓర్పు, నేర్పు కావాలి. సమాజ సభ్యుల అభిప్రాయాలు, అంగీకార యోగ్యంగా ఉంటే స్వీకరించే మనస్తత్వం ఉండాలి. తాను చెప్పిందే వేదమనే ధోరణి కాకుండా దర్శకునికి పట్టు విడుపు ఉండాలి.

నాటక సమాజ సభ్యుల నుండి క్రమశిక్షణ ఆశించే ముందు వ్యక్తిగతంగా దర్శకుడు కూడా క్రమశిక్షణ పాటించాలి. సమయ పాలన విషయంలో దర్శకుడే సభ్యులకు ఆదర్శంగా ఉండాలి. ఎప్పుడూ మెతక ధోరణిలో కాకుండా, క్రమశిక్షణ పాటించని నటీనటులపట్ల కఠినంగా వ్యవహరించగల ధైర్యం కూడా ఉండాలి. నాటక విజయానికి తోడ్పడే ఏ అంశంలోనూ రాజీపడి సర్దుకు పోయే తత్త్వం పనికిరాదు. నాటకం రక్తి కట్టించడానికి ఏ ఒక్క వ్యక్తీ ముఖ్యుడు కాడనీ, సమిష్టి కృషి మీదనే ప్రదర్శన ఆధార పడుతుందనీ విశ్వసించి ఆ మేరకు కృషిచేసేవాడే నిజమైన దర్శకుడు. దర్శకుడుగా రాణించాలంటే పై చెప్పిన అంశాలన్నింటినీ కలిగివున్నప్పుడే అర్హతగల దర్శకుడిగా పరిగణింప బడతాడు.

దర్శకుని విధులు : ఒక నాటకాన్ని రంగస్థలం మీద ప్రదర్శింపజేసే వరకు దర్శకుడు బాధ్యత వహిస్తాడు. నాటకం రంగస్థలం ఎక్కేవరకు ఎన్నోదశలను దాటుకొని రావాలి. అన్ని దశలలోను దర్శకుని ప్రమేయం తప్పనిసరి. మొదటి దశ నాటకం ఎంపికతో మొదలవుతుంది. నాటక సమాజం ప్రదర్శించే నాటకం ఎలాంటిదై ఉండాలి? పద్యనాటకమా ? సాంఘిక నాటకమా ? పౌరాణికమా, చారిత్రికమా లేక కాల్పనిక ఇతివృత్తమా ? అనేది నిర్ణయించు కోవాలి. పద్యాలు పాడగల నటులు ఆ సమాజంలో లేకపోతే పద్యనాటకాన్ని ప్రదర్శించే ప్రయత్నం మానుకోవడం మంచిది. ఒకవేళ సాంఘిక నాటకమే కావాలని నిశ్చయించుకొంటే, అప్పుడు కూడా కొన్ని ప్రశ్నలు ఎదురౌతాయి. నాటకం ఎవరికోసం వేస్తున్నాం? ఎక్కడ వేస్తున్నాం? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవలసివస్తుంది. ఎందుకంటే, అన్ని నాటకాలూ అన్ని ప్రాంతాలకు ఆమోద యోగ్యం కావు కాబట్టి అంతర్జాతీయ సమస్యను చర్చించే నాటకం, మనస్తత్వ శాస్త్రం ఆధారంగా రాసిన నాటకం, నగరాలకు పరిమితమైన సమస్యలను విశ్లేషించే నాటకం లేదా సైన్సు విషయాలతో సంక్లిష్టంగా ఉన్న నాటకం, గ్రామీణ ప్రాంతాలలో ప్రదర్శిస్తే రాణించదు. అలాగే రైతుకూలీ సమస్యలతో, చేనేత కార్మికుల సమస్యలతో, ఋణబాధలతో ఆత్మహత్యకు పాల్పడే రైతుల విషాదగాథను వివరించే నాటకం నగరవాసుల సమక్షంలో ప్రదర్శిస్తే వారికి రుచించవు. కాబట్టి ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని దర్శకుడు నాటక నిర్ణయం చెయ్యాల్సి ఉంటుంది. నాటకం ఎంపిక పూర్తయిన తర్వాత రెండవ దశ ప్రారంభమౌతుంది.

రెండవ దశ: నాటక రచనలోని లోటుపాట్లను సరిదిద్దుకోవడమే ఆ రెండవదశ. దర్శకుడు నాటకాన్ని క్షుణ్ణంగా చదివిన తర్వాత అతనికి ఆ నాటకంలో అక్కడక్కడా లోపాలు కనిపించవచ్చు. నాటకంలో పతాక సన్నివేశం పటిష్ఠంగా లేకపోవడమో, కొన్ని సన్నివేశాలలో తర్కబద్ధంగా లేకపోవడమో, కొన్ని సంభాషణలు పేలవంగానో, అభ్యంతరకరంగానో ఉండటం, నాటక గమనం ఆరోహణ క్రమంలో ఉండక అక్కడక్కడ కుంటు పడుతూ ఉండటం, కొన్ని చోట్ల సుదీర్ఘ సంభాషణలు విసుగు పుట్టించేవిగా ఉండటం, ఉత్కంఠ భరితంగా లేకపోవడం వంటి లోపాలు దర్శకునికి స్ఫురించినపుడు వాటిని సవరించుకొనే ప్రయత్నం చేస్తాడు. నాటక రచయిత అందుబాటులో ఉంటే అతనితో చర్చించి ఆ రచయితతతో నాటకంలో మార్పులు చేర్పులూ చేయిస్తాడు. ఒకవేళ రచయిత లభ్యం కాకపోతే దర్శకుడే స్వయంగా మార్పులు చేర్పులు చేసి ఆ నాటకాన్ని ప్రదర్శన యోగ్యంగా మార్చుకోవడం జరుగుతుంది. ఆ విధంగా నాటక ప్రతిని సిద్ధం చేయటంలో రెండవదశపూర్తి అవుతుంది.

మూడవదశ : నాటక సమాజ సభ్యుల్ని సమావేశపరచి వారందరికీ నాటకాన్ని చదివి వినిపిస్తాడు. ఆ సమయంలోనే వివిధ పాత్రల స్వరూప స్వభావాలను, ప్రత్యేక లక్షణాలను వివరిస్తాడు. అంతేకాదు ఆ నాటకంలోని సందేశం, సామాజిక ప్రయోజనాన్ని గురించి కూడా వ్యక్తం చేస్తాడు.

నాలుగోదశ : సమాజ సభ్యుల్లో ఎవరు ఏ పాత్రకు సరిపోతారో నిర్ణయిస్తాడు. పోర్షన్లు రాసుకోవడానికి గడువిచ్చి పాత్ర తాలూకు పాఠ్యం చదువుకొని రమ్మని అందర్నీ ఆదేశించటంతో ఆ ఘట్టం పూర్తవుతుంది.

ఐదవదశ : సిట్టింగ్ రిహార్సల్ నిర్వహణ, నటీనటులు అందర్నీ కూర్చోబెట్టి వాళ్లతో నాటకం చదివించడం జరుగుతుంది. ఆ సమయంలో నటీనటులు ఉచ్చారణ దోషాలను దర్శకుడు సవరించడమే కాక, సందర్భాన్నిబట్టి సంభాషణలు రసానుగుణంగా పలికే పద్ధతికి అలవాటు పడేలా చేస్తాడు.

ఆరవదశ : ఏ సన్నివేశంలో ఏ పాత్ర ఎక్కడ నిలబడి సంభాషణలు చెప్పాలి. ఎప్పుడు ఎక్కడ కూర్చోవాలి. సందర్భానుసారం వివిధ రసాలను ఎలా ఆవిష్కరించాలి. సంభాషణల్లో హెచ్చుతగ్గులు. ముఖకవళికల్లో మార్పులు, గతి ప్రచారం మొదలైన అంశాలపట్ల దర్శకుడు ఇచ్చే సూచనలను, సలహాలను పాటిస్తూ నటీనటులు రిహార్సల్స్ చేస్తారు. సందేహాలను దర్శకుడే నివృత్తి చేస్తాడు. ఏ నటుడైనా తన పాత్రను సరిగా అభినయించక పోతే ఆ నటుడికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంలో దర్శకుడు శ్రద్ధవహిస్తాడు.

ఏడవదశ : నాటకం అందరూ బాగా నేర్చుకున్నారని దర్శకుడు తృప్తి పడిన తర్వాత డ్రెస్ రిహార్సల్స్ చేయిస్తాడు. నాటక ప్రదర్శనలో ఏ నటుడు ఏ దుస్తులు ధరించాలో ఆ దుస్తులతో డ్రెస్ రిహార్సల్స్ చేయడం జరుగుతుంది. ఫోన్లో మాట్లాడటం లోనూ, పంచె కట్టుకుని నడవటంలోనూ, బూట్లు వేసుకుని నడవటంలోనూ, కళ్ళజోడు వేసుకొని నటించడంలోనూ, స్టెతస్కోప్‌తో రోగిని పరీక్షించడంలోనూ, కొంత అసౌకర్యానికి గురై కొందరు నటులు కృత్రిమంగా నటిస్తారు. డ్రెస్ రిహార్సల్స్ చేయడం వల్ల లోటుపాట్లు సవరించుకోవడానికి వీలు కలుగుతుంది.

ఎనిమిదవ దశ : నాటకరంగ ప్రముఖులను, విమర్శకులను ఆహ్వానించి వాళ్ళ ఎదుట నాటకాన్ని ప్రదర్శించి వాళ్ళ అభిప్రాయాలను, సూచనలను స్వీకరించటం జరుగుతుంది. ఈ ప్రదర్శనకు వాద్యకారుణ్ణి (మ్యూజిషియన్), రూపశిల్పిని (మేకప్ ఆర్టిస్ట్) రంగోద్దీప నిపుణుడిని (లైటింగ్ ఎక్స్‌పర్ట్) రంగాలంకరణ చేసేవారిని కూడా పిలిపించి నాటకం చూపించడం వల్ల వారికి నాటక ప్రదర్శనపట్ల ఒక అవగాహన ఏర్పడుతుంది. ఇలా చెయ్యకపోతే ఎవరిదారి వారిదై ప్రదర్శన లోపభూయిష్టంగా జరిగే ప్రమాదం ఉంది.

తొమ్మిదవ దశ : దర్శకుడు ఆహార్యం, లైటింగ్, సంగీతం, రంగాలంకరణ తదితర అంశాల అన్నిటిమీద దృష్టి సారించి అన్నీ సక్రమంగా ఉండేలాగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రదర్శన జరుగుతున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలి. దర్శకుడు తాను తయారుచేసుకొన్న దర్శకుని ప్రతి (డైరెక్టర్స్ కాపీ) సహాయంతో అన్ని అంశాలను క్షుణ్ణంగా, ఏకాగ్రచిత్తంతో పర్యవేక్షించాలి.

పదవ దశ : అభిప్రాయసేకరణ (ఫీడ్‌బ్యాక్) ప్రదర్శనానంతరం నాటకరంగ ప్రముఖుల, విమర్శకుల, ప్రేక్షకుల అభిప్రాయాలను సేకరించాలి. తొలి ప్రదర్శనలో చోటుచేసుకున్న లోపాలను, పొరపాట్లనూ మలి ప్రదర్శనలో సరిదిద్దుకోవడానికి ఈ అభిప్రాయ సేకరణ ఎంతో ఉపకరిస్తుంది.

గం.సుం.రె.

దశరూపకం : ఇది సంస్కృతంలో ధనంజయుడు అనే లక్షణవేత్త శ్లోకాలలో రచించిన నాటక లక్షణ గ్రంథం. భరతముని పేర్కొన్న పది ప్రధాన రూపకాలను ప్రధానంగా తీసుకొని వివరిస్తూ దీనికి దశరూపకం అని పేరు పెట్టాడు. నాట్యశాస్త్రంలో చెప్పిన దశరూపకలక్షణాలకు ధనంజయుడు చెప్పిన లక్షణాలకు కొద్దిపాటి తేడాలు ఉన్నా అవి ఏమంత ముఖ్యమైనవి కావు. ఈ గ్రంథానికి ధనికుడు అవలోకం అనే పేరుతో వ్యాఖ్యానం రాశాడు. ధనంజయుని దశరూపక గ్రంథాన్ని ఆధారం చేసుకొనే విల్‌సన్ అనే పాశ్చాత్య పండితుడు హిందూ థియేటర్ అనే గ్రంథం రచించి భారతీయ నాటకరంగ ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటాడు.

ఈగ్రంథంలోప్రకాశం అనేపేరుతో నాలుగు ప్రకరణాలు ఉన్నాయి. ప్రథమ ప్రకాశంలో రూపక నిర్వచనం, నృత్య నృత్త, నాట్య భేదాలు, వస్తువు, పంచసంధులు, విష్కంభాది వస్తుభేదాలు. ద్వితీయ ప్రకాశంలో నాయికా నాయక భేదాలు, లక్షణాలు కైశిక్యాది వృత్తులు. తృతీయ ప్రకాశంలో దశ విధ రూపక లక్షణాలు. చతుర్థ ప్రకాశంలో రస విచారం వివరించడం జరిగింది.

శాంతం రసమగునా? కాదా? అనే విషయం వివరిస్తూ, సకల వ్యాపారాలను నశింపజేసే శమం అభినయ యోగ్యం కానందు వల్ల రూపకాల్లో శమం అంటే శాంతరసం ఉపయోగించరాదని ధనంజయుడు ఈ గ్రంథంలో అభిప్రాయం వెలిబుచ్చాడు.

దశరూపకాలలోని వ్యాయోగ లక్షణంచెపుతూ ధనంజయుడు దేవుడు రాజర్షే అయినా మానవుడు కూడ ఈ రూపకానికి నాయకుడు కావచ్చని చెప్పాడు. ఇవికాక

ఇంకా కొద్దిపాటి చిన్న చిన్న అభిప్రాయ భేదాలు కూడ ఈ గ్రంథంలో ధనంజయుడు వెలిబుచ్చాడు.

ఈ గ్రంథం క్రీ.శ. 999 ప్రాంతంలో ధనంజయుడు రచించినట్లు భావన. ఈ సంస్కృత దశరూపకాన్ని ప్రప్రథమంగా మల్లాది సూర్యనారాయణశాస్త్రి అనువదించి, 1915లో ప్రచురించాడు. తరువాత వావిళ్ళ వారు కొమాండూరి అనంతాచార్యులు అనువాదం ప్రకటించాడు. హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1960లో గడియారం రామకృష్ణ శర్మ దశరూపకసారం ప్రచురించింది. ఇటీవల సరిపెల్ల విశ్వనాథ శాస్త్రి సంస్కృత మూలంతో పాటు చంద్రిక అనే ఆంధ్ర వ్యాఖ్యానంతో ప్రచురించాడు.

శ్రీ.చ.

దశరూపకాలు : సంస్కృత లాక్షణికులు నాయకుడు, రసం, అంక సంఖ్య ప్రధానంగా చేసుకొని, పది ప్రధానరూపకాలుగా, పద్దెనిమిది ఉపరూపకాలుగా వింగడించారు.

నాటకం, ప్రకరణం, భాణం, ప్రహసనం, డిమం, వ్యాయోగం, సమవకారం, వీధి,అంకం, ఈహామృగం దశ రూపకాలు.

వీటిలో నాటకం, ప్రకరణం, డిమం, సమకారం, ఈహామృగం ఈ ఐదు పెద్ద రూపకాలు (full length plays). తక్కిన అయిదు భాణం, ప్రహసనం, వీధి, అంకం ఏకాంకికలు (one act plays).

శ్రీ.చ.

దానవీరం : వీర రసభేదం. అర్థిజనులు పదే పదే అర్థించిన, ఇతోధికంగా దానం చేయడం దాన వీరం. ఇతనిని దాన వీరుడు అంటారు.

ధృతి, హర్షం, మతి, వ్యభిచారీ భావాలు. చిరునవ్వుతో మాట్లాడడం, చూపులలోన్వ్వేద్యోతకం చేయడం, అనుగ్రహించి ఇతోధికంగా ఇవ్వడం, మాట ఇవ్వడం, గుణాగుణాలను తెలిసికోవటం మొదలైనవి అనుభావాలు.

ఉదా॥ బలిజేపల్లి వారి హరిశ్చంద్ర తృతీయాంకంలో హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి తన రాజ్యం దానం చేయడం.

శ్రీ.చ.

దాస్, మనోరంజన్ (జ.1923) : ఒరియా నూతన నాటక శకానికి మార్గదర్శకుడైన ప్రముఖ రచయిత. కొంతకాలం ఒరిస్సా సంగీత నాటక అకాడమీకి కార్యదర్శిగా, తరువాత కటక్ ఆకాశవాణి కేంద్రంలో నాటకశాఖ డైరెక్టర్‌గా పనిచేశాడు. చిన్నవయసులోనే నాటకాలు రాయడం మొదలుపెట్టాడు. ఈయన తొలినాటకం రాత్రి (1942). నలభై ప్రాంతాలలో ఈయన రచనలన్నీ కూడా సంప్రదాయ ఒరవడిలో సాగినవే. ఇందులో ప్రముఖమైన రచన బక్సీ జగబంధు (1949). ఇది ఫైరౌ తిరుగుబాటు చారిత్రక విషయ ప్రధానంగా సాగిన రచన. తెల్ల ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టిన పితూరి నాయకుడు బక్సీ.

1950 నాటికి మనోరంజన్ దాస్ కొత్త నాటకరీతులను అవగాహన చేసుకొన్నాడు. ఫ్రాయిడ్, మార్క్స్, గాంధీ సిద్ధాంతాలను బాగా జీర్ణించుకొన్నాడు. అలా వచ్చిందే ఆగామి (1950). కథా వస్తువు, శైలి మొదలైనవాటిలో నూతన ప్రయోగాలకు నాంది పలికిన రచన. 'కళ కోసం కళ' అనే సిద్ధాంతం మీద గొడ్డలిపెట్టు రచన ఆగామి. 'నౌబ నాట్య ఆందోళన' అవతరణకు నాంది పలికింది. స్త్రీ మనస్తత్వాన్ని, స్త్రీ పురుష సంబంధాలలో వైఫల్యాలను ఇందులో చక్కగా చిత్రీకరించాడు. తరువాతి నాటకాలను, స్వాతంత్ర్యానంతర భారతదేశ రాజకీయ స్థితిగతులను కథావస్తువులుగా స్వీకరించాడు. బనహంసీ, అరణ్య ఫసల, అమృతస్యపుత్ర, కాఠఘోడా, ఛోట నాటక, మహా సముద్ర మొదలైన నాటకాలన్నీ ఒరియా సాహిత్యంలో పెద్ద పరివర్తన కలిగించాయి.

అరణ్య ఫసలకి సాహిత్య అకాడమీ అవార్డు (1971) వచ్చింది. ఒరిస్సా సాహిత్య అకాడమీ కూడా ఈయనకు బహుమతినిచ్చి సత్కరించింది. బనహంసీ అభివ్యక్తవాద నాటకం. ఇందులో స్ట్రిండ్‌బర్గ్ రాసిన దిడ్రీం ప్లే, ఓ నిల్ నాటకం ది ఎంపరర్ జోన్స్ నాటకాల ప్రభావం కనబడుతుంది. జె.బి.ప్రీస్ట్లీ ఏన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్ నాటకానికి ఒరియా అనువాదం సాగర మంథన.

అబరోధ పూర్తిగా రాజకీయ విషయ ప్రాధాన్యంగా మలచిన సాంఘిక నాటకం. అమృతస్యపుత్ర నాటకం ఆశ, నమ్మకాల సమ్మేళనం. కాఠఘోడా (కొయ్యగుర్రం) సంచలనం కలిగించిన ప్రయోగాత్మక సంగీత నాటకం. ఇందులో ఆధునిక జీవన విధానాన్ని ఒరియా జానపద నాటక శైలికి అనుగుణంగా చిత్రీకరించాడు. ఈయన ఇతర రచనలలో యాచన, అనశన, కవిసామ్రాట్, ఉపేంద్ర భంజ, అగ్నిస్నానో, సిపాయి బిద్రోహ, నారీ, జన్మమాటి ప్రసిద్ధమైనవి. ప్రతి నాటకంలో కూడా ఏదో ఒక నూతన ఒరవడిని ప్రవేశపెట్టిన నాటకస్రష్ట దాస్. మానవుని నిరంతర అన్వేషణ, ప్రయత్నాలకు ఒక అర్థవంతమైన మనుగడను ప్రసాగించడానికి పూనుకుంటాడు.

నాగరాజ్

దాసరాట : ఉత్తర కర్ణాటకలో దాసర్లు అనే కళాకారులు ప్రదర్శించే నాటకాన్ని దాసరాటఅంటారు. దాసర్లు పండుగపబ్బాల్లోను, జాతర్లలోను నాటకాలు ప్రదర్శించి తద్వారా కొంత ధనమార్జించి బతుకుతుంటారు. ఈ దాసరాట పాత మైసూరులో గాని, దక్షిణ కర్ణాటకలోగాని ప్రచారంలో లేదు.

అయినా కర్ణాటకలో యక్షగానానికి గాని, దొడ్డాటకుగాని లేని ప్రత్యేకత ఈ దాసరాటకు ఉంది. ఇందులోని పాటల్ని, స్త్రీ పురుషులు ఇద్దరూ కలిసి పాడుతారు. ప్రదర్శనలో కూడా (హెణ్ణుదాస) స్త్రీ, (గండుదాస) పురుషులిరువురు పాల్గనడం విశేషం. ఇందులో ప్రధానంగా పాట పాడే స్త్రీలు నాయిక వేషం ధరిస్తుంటారు. నాయకుణ్ణి 'గొడ్డి భీమన్న' అని హాస్యగాడి పాత్రను 'జవారి' అని అంటారు. నాయకుడు 'గొడ్డి భీమన్న' కొంతఉపోద్ఘాతంచెప్పిన తరువాతనాటకం ప్రారంభమవుతుంది. నాటకం ప్రారంభంలోనే సహాయక స్త్రీ పాత్ర పాట, నృత్యం ఉంటుంది. ఈ నృత్యం అయిన వెంటనే నాయిక ప్రవేశించి తన పాట, ఆటతో ప్రేక్షకుల్ని అలరిస్తూ ఉంటుంది.

దాసరాటలో నాయికా నాయకులు తమ ప్రేమ వ్యవహారాల్ని వాద ప్రతివాదాలతో వ్యక్తీకరిస్తుంటారు. ఈ వాద ప్రతివాదాలు జావడి, దాసర పద, లావణి, వచన వంటి ఛందస్సుల్లో నడుస్తుంది. వీరి మధ్య హాస్యగాడు ప్రవేశించి తన హాస్య ప్రసంగాలతో, బూతు మాటలతో ప్రజల్ని నవ్విస్తూ ఉంటాడు. ఇలా నాలుగు ఐదు గంటల కాలం ప్రదర్శించే నాటకంలో వస్తువు ఉండదు. అందుకే దీన్ని నాటకంగా పరిగణించరు. జన వ్యవహారంలోని ఒక సామెతను ఈ సందర్భంలో చెప్పుకోవాలి. 'దాసరాట ఆటవల్ల' దోస ఊట ఊట వల్ల' అని అంటే దాసరాట ఆట కాదు. దోసతిండి తిండి కాదు అని అంటారు.

దాసరాటను దాదాపు వంద సంవత్సరాల నుంచి వేర్వేరు ప్రదేశాల్లో ప్రదర్శిస్తూ చక్కని హాస్యాన్ని వినోదాన్ని కల్గిస్తూ వెళ్ళడం వల్ల దీనికి మంచి ప్రచారం వచ్చింది. దాసరాట కళాకారులు మహారాష్ట్ర ప్రాంతంలో సంచరించడంవల్ల మహారాష్ట్రలో దాన్ని అనుసరించి తమాషా అనే నాటక రూపం ఏర్పడడానికి దోహదం చేసిందని హెచ్.కె. రంగనాథ్ అభిప్రాయపడ్డాడు.

కన్నడం దాసరాటలోని 'గొడ్డి భీమన్న' తమాషాలో 'గల్భోజి' అయ్యాడు. నాయిక రాధ అయింది. హాస్యగాడు 'జావారి' తమాషాలో 'శఖారామ్ తాట్య' అయ్యాడు. ఆ తరువాత కొంత కాలానికి మహారాష్ట్ర తమాషా కళాకారులు కన్నడ దేశానికి వచ్చినప్పుడు కన్నడిగులు దానిని ఆదరించి, అనుకరించి కన్నడంలో 'రాధన ఆట' అనే మరో రూపకాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చారు.

ఆనందన్.

దిజ్ఞాగ : సంస్కృత నాటకకర్త. బౌద్ధ తార్కికుడు. ఈయనకే ధీరనాగుడనిపేరు. కుందమాల ఈయన రచించిన ప్రసిద్ధ నాటకం. ఇతడు అకారాలపుర వాస్తవ్యుడని తెలుస్తోంది. కాలం 6వ శతాబ్ది అని పండితుల భావన.

భవభూతి ఉత్తర రామచరితం, దిజ్ఞాగుని కుందమాల ఇతి వృత్తంలో ఒకటే అయినా దృక్పథంలో తేడా ఉంది. రాముని పక్షాన వ్రాసింది ఉత్తర రామచరిత. సీత పక్షాన వ్రాసింది కుందమాల.

ఉత్తర రామచరిత కుందమాల కంటే కవిత్వంలో మిన్న. కుందమాల ఉత్తర రామచరిత కంటే నాటకీయతలో మిన్న. కుందమాల నాటకాన్ని వడ్డాది సుబ్బారాయుడు తెలుగులోకి అనువదించి 1932లో ప్రచురించాడు.

శ్రీ.చ.

దివ్యలీలా రూపకాలు (Miracle plays) : మధ్య యుగంలో యూరప్‌లో బైబిల్ నాటకాల సరసనే మహర్షుల జీవితగాథలను చిత్రించే దివ్యలీలానాటకాలు కూడా వర్ధిల్ల సాగాయి. ఇవి అర్భక నాటకాల పరిణామంగా రూపొందినా అద్భుత నాటకాల నుంచి ఆవిర్భవించినట్టుగా కాక వాటితో సమాంతరంగా పెంపొందినట్లుగాకనపడుతంది. పన్నెండవశతాబ్దం ప్రారంభానికే ఈ దివ్యలీలా నాటకాలు ప్రవర్ధమానం చెందినట్లు ఆధారాలు దొరుకుతున్నాయి. డన్‌స్టలిన్‌లో సైంట్ కాథరిన్ నాటకం ప్రదర్శించినట్టు చారిత్రక పత్రాల వల్ల తెలుస్తోంది. 'జఫరీ' అనే గుమాస్తా నాటకాలలో ఒక చర్చి నుంచి దుస్తులు ఎరువు తెచ్చినట్టు, అతని ఇల్లు నిప్పంటుకొని, ఇంటితో పాటు ఆ దుస్తులు దగ్ధమైపోగా అతను సన్యసించినట్టు ఒక గాథ లిఖిత పూర్వకంగా లభిస్తోంది. దీన్ని బట్టి ఇంగ్లాండులో దివ్యలీలా నాటకాలు ప్రదర్శించేవారని నిర్ధారణ అవుతోంది. అయితే ఇంగ్లాండులో ఈ నాటకాల ప్రతులు ఇప్పుడు లభ్యం కావడం లేదు.

ఫ్రాన్స్‌లో దొరుకుతున్న ఈ నాటక ప్రతులను బట్టి వాటి ఉత్పత్తి వికాసాలను గురించి స్పష్టంగా తెలుస్తోంది. జీన్ బోడెన్ అనే రచయిత సెంట్ నికొలస్ అనే నాటకం రాసినట్టు, ఈయన 1210లో మరణించినట్టు నిర్ధారణగా తెలుస్తుండడం వల్ల నాటికే ఫ్రాన్స్‌లో దివ్యలీలా నాటకాలు ప్రదర్శించినట్టు నిశ్చయించవచ్చు. ఈ నాటకాలలో సాహసకృత్యాలు, హాస్యంతో కూడిన నిత్య సాంఘిక జీవిత ఘట్టాలు, పాపకృత్యాలు, పశ్చాత్తాపం, క్షమాభిక్ష, దేవతలు, మహర్షుల దివ్యలీలలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. సమకాలీన సాంఘిక సమస్యలు దైవ మహిమవల్ల పరిష్కృతమైనట్టు చూపించేవారు. ఈ నాటకాలలో తలమానికం లాంటిది మిరాకిల్స్ ఆఫ్ అవర్ లేడీ నాటక చక్రం. ఈ చక్రంలోని నాటకాలు ఒకేకథలోని భాగాలు కాక విడివిడి నాటకాల సముదాయం. వీటిలోని ప్రతి ఒక్క నాటకం, రెండు భాగాలు. మొదటి భాగంలో పాపాచరణ, రెండో భాగంలో అద్భుతం

కొలిపే మహిమా ప్రదర్శన, పశ్చాత్తాపం, సన్మార్గావలంబన చిత్రితమయ్యేవి. మహిమా ప్రదర్శన నాటకం చివర జరుగుతుంది కాబట్టి కథ చాలా భాగం లౌకికానికి సంబంధించింది.

ఈ నాటక చక్రంలోని నాటకాలను మూడు రకాలుగా విభజించవచ్చు. 1. మహిమా ప్రదర్శన నాటకాలు, పరాకాష్ఠ (క్లైమాక్సు)లో జరిగే నాటకాలు. వీటిలో రచయిత మహిమా ప్రదర్శన ఘట్టానికి నాటకాన్ని క్రమబద్ధంగా నడుపుతాడు. 2. సమస్యా పరిష్కారానికి మహిమా ప్రదర్శన అవసరమైనా లౌకిక విషయాలు ప్రాధాన్యం వహించేవి. 3. పూర్తి లౌకిక ఇతివృత్తానికి మహిమా ప్రదర్శన అనుబంధంగా మాత్రమే ఉండేది. ఈ దివ్యలీలా నాటకాలు సాంఘిక ఘట్టాలకు, సాహసకృత్యాలకు నాటక రూపమీయడం ఎలాగో నేర్పాయి.

శ్రీ.చ.

దిష్టం : నాటక లక్షణం. దీనికే దృష్టము అని మరో పేరు. ఇది నాట్యశాస్త్ర అనుష్టుప్ వృత్త పాఠంలోనిది. ఉపజాతి వృత్తపాఠంలోని 'సారూప్యం'తో సమన్వయిస్తుంది.

దేశకాల స్వరూపాలకు తగినట్టు, వీక్షించినట్టు వర్ణించడం

1. దిష్టం (ప్రత్యక్ష వస్తువును పరోక్షంగా కాని, పరోక్ష వస్తువును ప్రత్యక్షంగా కాని వర్ణించుట దృష్టం)

2. ప్రత్యేకదిష్టం: మాళవికాగ్నిమిత్రమ్ ప్రథమాంకంలో ఎదుటనున్న మాళవికను రాజు వర్ణించడం.

అప్రత్యక్ష దిష్టం: చిలకమర్తి గయోపాఖ్యానం ప్రథమాంకంలో కృష్ణుడు తన శైశవ క్రీడలను వర్ణించడం.

శ్రీ.చ.

దీక్షిత్, డి.ఎస్. (జ.1956) : రంగస్థల నటుడు, అధ్యాపకుడు. పూర్తి పేరు దీవి శ్రీనివాస దీక్షిత్. గుంటూరు జిల్లా రేపల్లెలో 1956 జులై 28న జన్మించాడు. తండ్రి హనుమంతాచార్యులు. తల్లి సత్యవతమ్మ. తెలుగు, సంస్కృతాలలో భాషా ప్రవీణ, సంస్కృతం, తెలుగు భాషలలో ఎం. ఎ., డిగ్రీలు పొందాడు. డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శన కళలలో ఎం. ఎ. చేశాడు.

రేపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగాన్ని రంగస్థలంపైనున్న మక్కువతో, ఆయన తల్లిదండ్రుల అనుమతితో విడిచి పెట్టాడు. తర్వాత హైదరాబాదు వచ్చి ఎ.పి. థియేటర్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రిపర్టరీలో డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్‌లో చేరాడు. శిక్షణ సమయంలో శాకుంతలం, మానాన్న కావాలి, కీలు బొమ్మలు, ఆశ, ప్రతాపరుద్రీయం మొదలైన నాటకాలలో నటించాడు. ఎన్నో పద్యనాటకాలకు దీక్షిత్ దర్శకత్వం వహించాడు. వాటిలో హరిశ్చంద్ర, సక్కుబాయి, (పద్యనాటకాలు), వ్యవహార ధర్మబోధిని, వెయిటింగ్ ఫర్ గొడో, స్వతంత్ర భారతం (సాంఘిక నాటకాలు) గోగ్రహణం, కొక్కొరోకో, జాతికి ఊపిరి స్వాతంత్ర్యం (వీధినాటకాలు) మొదలగునవి ఉన్నాయి. అంతే కాకుండా ఆలిండియా రేడియో, (హైదరాబాదు)లో రేడియో నాటకాల్లో కూడా నటుడిగా పాల్గొన్నాడు. ఎల్లమ్మ, మురారి, ఇంద్ర, ఠాగూర్, ప్రాణం, వర్షం, అతడు మొదలగు చలన చిత్రాలలో నటించాడు. స్వంతంగా డాక్యుమెంటరీలు తీశాడు. టి.వి.లో ఈయన నటించిన ఆగమనం సీరియల్‌కు దాదాపు అన్ని నంది అవార్డులు లభించాయి. వర్ధమాన నటులకు రంగస్థల శిక్షణ అవసరమని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వంటి సంస్థలతో కలిసి శిక్షణ శిబిరాలు నిర్వహించాడు.

శ్రీకృష్ణతులాభారం పద్యనాటకానికి దర్శకత్వం వహించి 1999 నంది నాటకోత్సవాలలో ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకుడు బహుమతులు పొందాడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం అవార్డు. గరికపాటి రాజారావు మెమోరియల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, చైతన్య ఆర్ట్ థియేటర్ అవార్డు మొదలగునవి ఈయనకు లభించిన అవార్డులు. ప్రస్తుతం ఈయన అక్కినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మీడియా యాక్టింగ్‌లో ప్రదర్శన కళలన్నిటికీ సంబంధించిన శిక్షణ ఈయన నేతృత్వంలోనే సాగుతుంది.

రమాంజనీ

దీక్షితులు, చింతా (1891-1960) : నాటకకర్త, కథకుడు, పండితుడు, ప్రభుత్వ విద్యాశాఖలో ప్రముఖోద్యోగి. వ్యవహార భాషావాది. గురజాడ మీద గురుభక్తి. ఈయన తంగేడులో 1891లో జన్మించాడు. బాలవాఙ్మయ పితామహుడు, 'కథక చక్రవర్తి' బిరుదాంకితుడు. చిన్న చిన్న మాటలతో ఎంతటి ఉన్నత భావాన్నైనా వెల్లడించగల సమర్థుడు. వీరికి నాటక దృష్టికంటె సాహితీ దృష్టి ఎక్కువ. భావం ఉరకలు ఎత్తుతూ నాటకీయతకు అడ్డు వస్తుంది. ప్రయోగ సౌలభ్యంతక్కువ. ఈయననాటకాలలో, నాటికలలో సంఘర్షణ, నాటకీయత తక్కువయినా కథా వ్యాఖ్యానం ఎక్కువ. అందుకే ఇవి వ్యాఖ్యాన నాటికలని పేరు గాంచాయి.

ఈయన రచించిన శబరి నాటకం రామభక్తికి ప్రతీక. ఇందులో భక్తి భావం పరాకాష్ఠకు చెందింది. శబరి భక్తి సాధన కథా వస్తువు. ఆ సాధనలోని 5 మెట్లు (ఉపదేశం, సాధన, పరివర్తనం, నిరీక్షణం, సిద్ధి) చక్కగా చిత్రించాడు. నాటక ప్రహసనంలో కాంట్రాక్టు నాటకల స్థితిని హాస్య ధోరణిలో చెప్పాడు.

ఈయన చక్రవాక మిథునం నాటిక రసిక హృదయాలను ద్రవీభూతం చేస్తుంది. ఈయన రచించిన నాటక, నాటికలలో మానవుల్నే కాక పశుపక్ష్యాదులను కూడ ప్రవేశ పెట్టడం విశేషం. ఈయన నాటకం - శబరి (1925), నాటికలు - శ్రీకృష్ణుడు, అహల్య, జటాయువు, రేణుక, శర్మిష్ఠ, తిరుప్పాణాళ్వార్, కాంచీకుమారి, దశరా దిబ్బ, వరూధిని, చక్రవాక మిథునం, అనుమానం మనిషి, మానవుడు, కైలాస శిఖరం. పద్య నాటకాలను విమర్శిస్తూ ధూళిపాళ వెంకట సుబ్రహ్మణ్యం, చలంతో కలిసి మదన సాయక విలాసం అనేనాటకాన్నిరచించినదీక్షితులు 1960లో పరమపదించాడు.

శ్రీ.చ.

దుర్మల్లిక : సంస్కృత ఉపరూపకం. దీనికి మతల్లిక, దుర్మీలిత, అనే పేర్లు కూడా ఉన్నాయి. మహారాష్ట్రలో దీనికి క్షుద్ర కథ అని పేరు. శృంగార, భావ ప్రకాశనాలు దీనిని శ్రవ్య కావ్యంగా పరిగణించాయి. కావ్యానుశాసనం దీనిని వచన కథగా పేర్కొన్నది.

నాలుగంకాలు, ప్రౌఢనాయిక, గర్భసంధి గాక మిగిలిన సంధులు చౌర్యరతం, ప్రతిభేదం, దూతిక తెలియజేసి ధనం గ్రహిస్తుంది. ప్రతి అంకంలో నృత్యముంటుంది. కైశికీ, భారతీ వృత్తులు వుండాలి. అమాత్య, పురోహిత, తాపసుల చిక్కులు ఉంటాయి. నాయకులు పరిమితం.

మొదటి అంకంలో విటుడు మూడు నాడికలు, రెండవ అంకంలో విదూషకుడు ఐదు నాడికలు, మూడవ అంకంలో పీఠమర్దుడు ఏడు నాడికలు, నాలుగవ అంకంలో అందరూ నాగర క్రీడలతో పది నాడికలు నటించాలి, హీన జాతి నాయకుడు. పాత్రలు నాగరక జనులు. ఉదా : బిందుమతి.

శ్రీ.చ.

దృశ్య కావ్యం : కావ్యాలు రెండు విధాలు. శ్రవ్య కావ్యం, దృశ్య కావ్యం. స్వయంగా చదువుకోవడానికిగాని, ఇతరులు చదువుతూండగా వినడానికి గాని ఉద్దేశించిన రచన శ్రవ్య కావ్యం. వివిధపాత్రలనువివిధనటీనటులునటించి ప్రదర్శించడానికి ఉద్దేశించిన రచన దృశ్య కావ్యం. దృశ్య మానం చేయడానికి ఉద్దేశించిన కావ్యం కాబట్టి దీనికి దృశ్య కావ్యం అని పేరు వచ్చింది.

ఉదా. అభిజ్ఞాన శాకుంతలం (సంస్కృతం), చిత్రనళీయం (తెలుగు), హామ్లెట్ (ఇంగ్లీషు).

శ్రీ.చ.

దృశ్య బంధ రూప కల్పన (set design) : నాటక ప్రదర్శన విజయవంతం కావడానికి దృశ్య భూమిక ఎంతో ముఖ్యం. దీనికి సరైన రూపకల్పన చేస్తే దర్శకత్వం సులభమౌతుంది. రూపకల్పన సరిగా లేకపోతే దర్శకునికి, నటులకు చాలా చిక్కులు ఎదురవుతాయి.

దృశ్య భూమిక పలు విధాలుగా ఉపయోగపడుతుంది. అందువల్ల దృశ్య భూమిక రూపకల్పన చేసేటపుడు అనేక విషయాలు మనసులో పెట్టుకోవాలి.

1. భూమిక: ప్రేక్షకుల ధ్యాస నాటకం నుంచి మళ్లకుండా ఉండడానికి భూమిక అవసరం. ఈ భూమిక తళుకు బెళుకులతో డాబు దర్పాలతో నిండి ఉంటే ప్రేక్షకుల దృష్టి అనుక్షణం దాని మీదే ఉంటుందిగానీ నాటకం మీద నిలవదు. భూమికగా బూడిద రంగు వెనుక తెరను వాడితే ప్రేక్షకుల ధ్యాస నాటకం నుంచి అంతగా మళ్లదు.

2. రీతి: దృశ్య భూమిక నాటకరంగంలో ప్రధానమైనది. దీని రీతిని సరిగ్గా నిర్వచించుకోకపోతే దాని వల్ల ప్రేక్షకులు సరైన మార్గం తప్పే ప్రమాదముంది. నాటకరీతికి మాత్రమే దృశ్య భూమిక అంటిపెట్టుకొనిఉండకూడదు. తెర లేచిన మరుక్షణం నుంచి ప్రేక్షకులను నిర్దేశిత మార్గంలో నడిపే రీతి బహిర్గతం కావాలి.

3. సమాచారం: తెర లేచేసరికి ప్రేక్షకులకు ఆ రంగాన్ని గురించిన సమాచారం అందచేయవలసి ఉంటుంది.

తలుపు మీది అక్షరాలు అక్కడ నివసించే వ్యక్తి పేరు, పదవి మొదలైన విషయాలను వెల్లడిస్తాయి. అవి నివాస గృహమో, కచ్చేరీగదో, కార్యాలయమో, వీధో, తోటో తెలియాలి.

ఉదయమా, పగలా, రాత్రా , ఏ వారం, ఏ తేదీ వంటివి కాలెండర్లు వగైరాల ద్వారా తెలిపేటట్టు ఉండాలి.

ఆ గృహస్థుడు భాగ్యవంతుడా, బీదవాడా, అతనంటే అందరికి అభిమానమా, ఏవగింపా, అభిరుచులు మంచివా, చెడ్డవా మొదలైన సమాచారం అనేక విధాల తెలియచేయవచ్చు.

4. వాతావరణం: ప్రేక్షకులు నాటకాన్ని సరిగా అర్థం చేసుకోవాలంటే సరి అయిన వాతావరణాన్ని కల్పించాలి. వాతావరణ కల్పన సరిగా లేక పోతే ప్రేక్షకులు గందరగోళ పడి నాటకాన్ని అపార్థం చేసుకుంటారు. బీద వాని గుడిసెలో ఖరీదైన వస్తువు ప్రేక్షకులను గందరగోళ పరుస్తుంది.

5. రస విలువలు: దృశ్య బంధం కంటికి ఇంపుగా ఉండాలి. నాటకానికి రమణీయకత అవసరం కాబట్టి దృశ్యబంధం కూడా రమణీయంగా ఉండాలి. కాని రమణీయం శృతి

మించితే ప్రమాదకరం. నాటకం నుంచి ప్రేక్షకుల ధ్యాస మళ్లేటంతగా కౌతుకం కలిగించకూడదు. మంచి దృశ్య భూమిక దీనికిఆటంకంకాదు. ఆకర్షణ ఉండాలిగాని అదేప్రాధాన్యం వహిస్తే దృశ్య భూమిక ఉద్దేశ్యం నశిస్తుంది. రంగస్థలం మీద ఎవరూ లేనపుడు దృశ్యబంధం సమ తూకంలో ఉండాలి. లేకపోతే నటులు తమను తామే గాక దృశ్య బంధానికి కూడా సమతూకంలో నిలపవలసి వస్తుంది.

సమాంతరంగానెలకొలిపిన దృశ్యబంధాలకంటే కోణాలుగా నెలకొల్పిన దృశ్య బంధాలకు మూడు ప్రధాన లక్షణాలుంటాయి. 1.వాస్తవికతా భావాన్ని అందించడం, 2. ఎక్కువ శక్తివంతం చేయడం, 3. సమీకరణ, సంచాలన రూప కల్పనలను తేలిక పరచడం. ఈ లక్షణాలన్నీ చాలా నాటకాలకు అవసరం కాబట్టి దృశ్య బంధాలను కోణంలో ఏర్పరిచి ఒక నిర్దిష్టాకారంలో ఒక సమాంతర దృశ్య బంధాన్ని నెలకొల్పాలి. దీనికి కారణాలు మూడు. 1. అనేకరంగాలతో కూడిన నాటకంలో కొన్ని దృశ్య బంధాలయినా సమాంతరంగా నెలకొల్పితే విసుగనిపించదు. అంతేగాక నాటక పరంపరలో ఒక దృశ్య బంధమైనా సమాంతరంగా ఏర్పరచడం మంచిది. 2. పురాతన రీతిలో దృశ్య బంధం సమాంతరంగా నెలకొల్పితే నాటకం చెడిపోతుంది. 3. కోణ దృశ్య బంధం శక్తి ఉద్రిక్త నాటకాల వంటి కొన్ని నాటకాలలో సమ్మేళనం చెందదు.

దృశ్యబంధంకోణంకుడివేపుకుతేలినా, ఎడంవేపుకు తేలినా ఒకటే. 10 డిగ్రీలకోణం తేలితేదృశ్యబంధం సమాంతరంగా నెలకొలపడానికి తలపోసినట్లు పొరపాటున వక్రంగా నెలకొల్పినట్టుకనిపిస్తుంది. 25 డిగ్రీలు దాటితే దృశ్యబంధం ఉపయుక్తం కాదు.

నాటకంలోని ప్రధాన రంగాలు, వాటికి తగిన స్థలాలలో ప్రదర్శించడానికి అనువుగా ఉండేట్టు దృశ్య బంధాన్ని ఏర్పరచుకోవాలి. గృహరంగాలు దిగువ కుడిలో ప్రదర్శిస్తే ఎక్కువ ఫలవంతంగా ఉంటాయి. అందుకనిగృహానికి చిహ్నమైన మంచంగాని, చాపగాని తదితర వస్తువులు గానిఈ స్థలంలో పెట్టి ఉంచాలి. ఇలాగే ఇతర రంగాలు సామాగ్రి ఏర్పరిచే తీరును బట్టి స్థలాల ఆకార పరిధులు ఏర్పడతాయి. సామాగ్రి సముదాయం గల స్థలాన్ని సామాగ్రి స్థలం అంటారు. ఎక్కువ దృశ్య బంధాలకు రెండు మూడు సామాగ్రి స్థలాలు అవసరం కావచ్చు. రంగస్థలానికి ఎగువ భాగంలో ఉన్న దృశ్య బంధానికి ఒక వైపున ఒకటి, దిగువన రెండోది. బల్ల మీద ఒక పాత్ర, సోఫాలో ఇంకో పాత్ర, దిగువ ఎడమలో ఇంకో పాత్ర కూర్చుంటే రంగస్థలంలోని మధ్య, ఎడమ ఒకే ఒక సామాగ్రిసముదాయ స్థలమవుతుంది.

సామాగ్రి ఏర్పాటు ఇంకా తేలిక కావడానికి ఇంకో మార్గం ఒకే కుర్చీని దానిలో ఆసీనుడైన వ్యక్తి తిరిగిన దిక్కును బట్టి నిర్ణయించడం.

ప్రధాన రంగాలలోని సమీకరణాలను సామాగ్రి ఏర్పాటు తీరు దృష్ట్యా పరిశీలించాలి. సాధ్యమైనంత వరకు వెనక గోడలోని ముఖ్యమైన ద్వారం దిగువలో సామాగ్రి పెట్టకూడదు. అలా పెడితే ప్రవేశ నిష్క్రమణలకు అడ్డం వస్తుంది. కాని పక్క గోడలోని ద్వారాలకు దిగువలో ఎత్తు తక్కువ కుర్చీలను పెడితే సంతృప్తి కరంగా ఉంటుంది. దిగువ వైపుకు ముఖం వచ్చేటట్టు కుర్చీలు పెట్టకూడదు.

ఒక్కొక సామాగ్రిని ఎంచుకొనే సందర్భంలో దానిని ఎన్ని భంగిమల్లో ఉంచవచ్చు అనే విషయం ఆలోచించాలి. ఒక్కొక్క సామాగ్రి కొన్ని భంగిమలకు పనికి వస్తుంది. కొన్నింటికి పనికి రాదు. ఉపయోగ విషయం కూడ అంతే. ఈ సాధ్యాసాధ్యాలను మనసులో పెట్టుకొని దృశ్య బంధరూపకల్పన చేస్తే సాధన కాలంలో సమీకరణలను ఏర్పరచడంలో దర్శకుని, నటుల పనిసులభమవుతుంది.

ద్వారాలు: దృశ్య బంధంలో ద్వారాలు ఆవశ్యకమనే విషయం వేరే చెప్పనక్కరలేదు. అయితే ఎన్ని ద్వారాలుండాలి? పాత్రలు వచ్చిపోయే స్థలాలు జాబితాలను తయారు చేసుకొని దాన్ని బట్టి ద్వారాల సంఖ్యను నిర్ణయించుకోవాలి. ద్వారాల సంఖ్య పెరిగేకొద్దీ రూపకల్పన సంక్లిష్ట మవుతుంది. ప్రేక్షకులను గందరగోళ పరుస్తుంది. అంతేగాక ద్వారాలు గోడ స్థలాన్ని ఆక్రమిస్తాయి. వీటికి బదులు వివిధ స్థలాలకు దారి తీసే వరండా ఏర్పరచుకోవడం మంచిది. వానితోపాటే మేడ మెట్లు కూడాకట్టవచ్చు.

ఒక్కొక్క ద్వారం నుంచి జరిగే ప్రవేశ నిష్క్రమణాల జాబితా రాసుకోవాలి. ఆకస్మిక ప్రవేశాలు ఎగువ నుంచి జరగడం ఉత్తమం. అందువల్ల సాధ్యమైనంత వరకు ఇందుకు వెనుక గోడలో ద్వారాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. అయితే ఇందుకు భిన్నంగా ఎగువ నుంచి నిష్క్రమించడం కష్టసాధ్యం. అందుకని ద్వారాలు పక్కగోడలో ఏర్పరచడం మంచిది. ముఖ్యమైన ప్రవేశ నిష్క్రమణాలు ఒకే ద్వారం నుంచి జరగవలసి ఉన్నప్పుడు పక్కగోడలో ద్వారం పెట్టాలి. పక్క నుంచి ఆకస్మిక ప్రవేశం, వెనుక నుంచి ఆకస్మిక నిష్క్రమణ తేలిక.

ద్వారం గుండా ప్రేక్షకులకు ఏదయినా కనిపించవలసి ఉంటే ఆద్వారంవెనుకగోడలోఅమర్చాలి. ఇందుకు బహుళార్థ సాధనమయిన వరండా ఏర్పరచాలి. వివిధ స్థలాలను నిర్దిష్ట సూచిక మీద ప్రక్రియాభావం ఆధార పడనపుడు అటువంటి వరండాను కోణంగా ఏర్పరచిన పక్కగోడ వెనుక కట్టాలి.

ద్వారాలస్థలం నిర్దేశించేటప్పుడు అవి సంచాలనాశయాలకు ఉపయోగపడతాయని గుర్తుంచుకోవాలి. దృశ్య బంధంలో రెండే ద్వారాలు ఏర్పాటు చేసుకోవలసి వస్తే ఆ రెంటినీ దగ్గర దగ్గరగా గాని, ఎగువలో ఒకటి, దిగువలో ఒకటి గాని కట్టకూడదు. సాధారణంగా రంగస్థలం మీది ద్వారాల తలుపులు నేపథ్యంలోనికి తెరచుకుంటాయి. ఈ విధమైన ద్వారాలు నిర్మించడం తేలిక. రంగస్థలం మీదికి తలుపులు తెరుచుకొనేటట్టు ఏర్పాటు చేయడానికి కారణాలు మూడు. 1. వాస్తవికత ఎక్కువ కావలసినపుడు, 2. తలుపు చాటున పాత్ర దాగడం మొదలైన ప్రత్యేక ఫలితం కావలసినపుడు, 3. మార్మిక నాటకాలలో ఎగువకు తెరచుకొని దిగువకు తిరిగే తలుపులతో ఉత్సుకతను సృష్టించినపుడు ప్రేక్షకులు ఏదో భయంకరమైంది ప్రవేశిస్తుందని భావిస్తారు.

కిటికీలు: కిటికీగుండా ప్రేక్షకులు ఏదైనా ప్రక్రియ చూడవలసి వలసి ఉంటే కిటికీ వెనక గోడకు ఉండాలి. కాని ప్రక్రియను నీడల ద్వారా చూపించదలచుకుంటే కిటికీ పక్క గోడకు ఉంచవచ్చు. నటుడు కిటికీ గుండా చూస్తూ బయటి దానిని వర్ణించవలసి ఉన్న పక్షంలో కిటికీ పక్క గోడకు ఉండాలి. లేకపోతే నటుడు ముఖ్యమైన వాచికం చెప్పేటపుడు వీపు ప్రేక్షకులవైపు పెట్టి చెప్పకుండా తప్పించుకునేందుకు శ్రమపడి సాంకేతిక సహాయం తీసుకోవలసి ఉంటుంది.

మెట్లూ – వేదికలు: ఇంటిలోపలి రంగంలోని మెట్ల స్థానం వాటి పొడుగూ, వెడల్పూ, కమ్మీలు, కోసు, ప్రదర్శన లక్షణం మొదలైన వాటిని బట్టి ఉంటుంది. ఒకే మెట్టు ఉపయోగించడం తక్కువ. ఎక్కడయినా మూడు నాలుగు మెట్లు పెట్టడం మంచిది. అందువలన వాటి మీద నటులు వివిధ సమీకరణాలకు కూర్చోవచ్చు లేదా నిలబడవచ్చు. వెనక తెర వెంట ఎక్కువగా వెడల్పు లేని మెట్ల వరుస సంతృప్తికరంగా ఉంటుంది. మెట్లు అడుగు భాగం దిగువకుండి, పక్క గోడవెంట మెట్లు ఉంటే మెట్లు ఎక్కేటపుడు నటుడు ప్రేక్షకుల వేపు వీపు పెట్టవలసి వస్తుంది. మెట్లు అడుగు భాగం ఎగువలో ఉంటే మెట్లు నటులను మరుగుపరుస్తాయి.

వేదికా దృశ్య బంధాలు: వేదికలతో ఎక్కువగా నిండిన దృశ్య బంధాలు సత్ఫలితాలనిస్తాయి. నటుడు నిలబడవలసిన స్థానం నిర్ణయించి దాని కింద వేదిక నిర్మించడమే వేదికా దృశ్యబంధ నిర్మాణం. అంటే వేదిక మీదకు తెచ్చి ఏ స్థలానికి ప్రాధాన్యం ఇవ్వవలసిందీ నిర్ణయించడం. ఈ సందర్భంలో సంచాలనం కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఇటువంటి వేదికలూ, మెట్లూ రంగస్థల పరికరాల కింద ఉపయోగపడతాయి. వీటి మీద కూర్చునే సమీకరణలు ఏర్పరచవచ్చు.

దృశ్యబంధం ఎలా నిర్మించాలో, ఎలా రంగు వేయాలో ఎలా ప్రకాశమానం చేయాలో సాంకేతికజ్ఞులకు సూచించడమే దృశ్య బంధ రూపకల్పన. దృశ్య బంధంలోని ఏయే భాగాలు వాటి ఆకారం ప్రకారం ఉపయోగపడతాయో తెలుసుకొని ఉండాలి. నిర్మాణం ఎలా జరుగుతుందో మొదలైన విషయాలన్నీ తెలుసుకోవాలి. దృశ్య బంధ రూపకల్పనను సాంకేతికజ్ఞులు స్వయంగా అర్థం చేసుకోవడానికి రూపశిల్పి వారికి నమూనాలను రచించి ఇవ్వాలి. దృశ్య బంధం ఏక ఖండం కాదు. కిత్తనార చిత్రాల అతుకుల బంత. 5 చట్రాలు బిగించిన దానిని బుక్ అంటారు. ఇలాంటి కొన్ని బుక్‌లు కలిపితేగాని దృశ్య బంధం నిర్మాణం గాదు. వీటితోనే ద్వారాలు, కిటికీలు, వగైరాలను అమర్చారు.

వైవిధ్యం: దృశ్యబంధాలు వర్తులాకారంలో ఉంటే సామాగ్రిని అర్ధచంద్రాకారంలో ఏర్పరచవలసి ఉంటుంది.

ఒక దృశ్య బంధంలో గోడ పొడవుగాను, ఇంకో దానిలో పొడవు తక్కువగాను ఉంటే ఆ రెండూ భిన్నమైనవిగానే కన్పిస్తాయి. రెండు దృశ్య బంధాలు నిర్మాణంలో ఒకే విధంగా కన్పించినా వాటి అలంకరణ మారిస్తే భిన్నమైనవిగానే కనిపిస్తాయి. అలాగే సామాగ్రి మారిస్తే రెండు దృశ్య బంధాలు విభిన్నమైనవిగా గోచరిస్తాయి. లోకప్పు ఆకారం మార్చడం ద్వారా కూడా భిన్నత్వాన్ని సాధించవచ్చు.

దృష్టి రేఖలు: దృశ్య బంధంలోని ఏయే భాగాలు ప్రేక్షకులందరికీ కన్పిస్తాయో, ఏవి కన్పించవో రూపశిల్పికి తెలిసి ఉండాలి. అడ్డం, నిలువు దృష్టి రేఖలు గీసుకుంటే ఈ విషయం తేటతెల్లమవుతుంది. దృశ్య బంధం భూమి నమూనా పటం మీద ట్రేసింగ్ కాగితం పెట్టి ప్రేక్షకాగారంలోని మొదటి ఆసనాల వరుస మొదటి ఆసనం, ఆఖరి ఆసనం గుర్తించాలి. ఆఖరి ఆసనం గుర్తు నుంచి దృశ్య బంధం లోని ప్రతిభాగానికీ రేఖలు గీయాలి. దృశ్యబంధం దగ్గర వేపు కొంతమంది ప్రేక్షకులకు కన్పించని భాగాలను తెలియచేస్తాయి. ఇక్కడ ముఖ్యమైన ప్రక్రియలను జరగనీయకూడదు. దృశ్య బంధానికి దూరపు వేపు రేఖలు ప్రేక్షకులు కొందరికి కన్పించే భాగాలను తెలియజేస్తాయి.

శ్రీ.చ.

దేవీవరప్రసాద్, సమ్మెట (జ.1935) : రంగస్థల నటుడు. సమ్మెట వీర రాఘవయ్య, నాంచారమ్మ దంపతులకు 1935లో బేతవోలు (గుడివాడ)లో జన్మించాడు. బాల్యదశ నుంచీ నటన మీద మక్కువ పెంచుకున్నాడు. చలన చిత్రాల్లో నటించాలన్న కోరిక నాటకరంగ ప్రవేశానికి స్ఫూర్తినిచ్చింది. జూ॥ సుబ్బారావు నిర్వహణలో కులం లేని పిల్ల నాటకంలో వేషం వెయ్యటంతో.

వరప్రసాద్ నట జీవితం ప్రారంభమైంది. అప్పటి నుంచీ సాంఘిక నాటకాల్లోనూ, పద్య నాటకాల్లోనూ వైవిధ్యభరితమైన పాత్రలు పోషిస్తూ గుర్తింపు పొందాడు. పామర్తి సుబ్బారావు శిక్షణలో పల్లె పడుచు నాటకంలో అన్ని పాత్రలూ పోషించే అవకాశం ఈయనకు లభించడం విశేషం. ముఖ్యంగా ఈ నాటకంలో కైకాల సత్యనారాయణ కథా నాయకుడిగా నటిస్తూ, సినిమా రంగానికి వెళ్ళిపోవడంతో వరప్రసాద్ ఆ స్థానాన్ని భర్తీ చేశాడు.

పామర్తి దర్శకత్వంలో ఓ వెలుగు వెలిగిన సుల్తానీ నాటికలో చెప్పే 'రామకథ' గానం వరప్రసాద్‌కు మంచిపేరు తెచ్చింది. బాలనాగమ్మ లో చాకలి తిప్పడు, మహిషాసుర మర్దని లో దేవాంతకుడు పాత్ర పోషణలో వరప్రసాద్‌కు బహుళ ప్రజాదరణ లభించింది. సూరిబాబు, ఆచంట, అబ్బూరి, షహీదా, పామర్తి వంటి ఉద్దండుల సరసన నటించి ఖ్యాతి గడించే భాగ్యం అబ్బింది. అక్కినేని ఫైన్ ఆర్ట్స్ అనే సమాజాన్ని స్థాపించి 1962 నుంచి 5 సంవత్సరాలపాటు 'పూలరంగడు' నాటకాన్ని విస్తృతంగా ప్రదర్శించి ప్రశంసలందుకున్నాడు. బి.ఎన్. సూరి 'రాజ్యం థియేటర్స్', పువ్వుల సూరిబాబు 'రాజరాజేశ్వరి నాట్యమండలి' నాటకాల్లోనూ ప్రముఖ పాత్రలు ధరించి పెద్దల మెప్పు పొందాడు.

వందలాది నాటకాల్లో వివిధ పాత్రలు పోషించిన దేవీ వరప్రసాద్ 70 ఏళ్ళ వయస్సులో కూడా నాటకరంగంతో తన అనుబంధాన్ని కొనసాగిస్తూ, నేటి యువతరాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నాడు.

ఎమ్మెస్వీ

దైన్యం : వ్యభిచారీ భావం. దరిద్రం, అవమానం వలన కలిగిన తేజోహీనత దైన్యం.

ఉదా : మృచ్ఛకటికం ప్రథమాంకంలో దారిద్ర్య దుఃఖం. చారుదత్తుడు : కీడ్వడిన మీద జనుడు సుఖింపవచ్చు, గటిక చీకటిలో దివ్వెగాంచి నట్లు, వేం లనుభవించి మీద లేమిపడెనేని, వాడు నిజముగ జీవచ్ఛవంబచూవె (అను. తిరుపతి వేంకటకవులు).

శ్రీ.చ.

దైవావతరణం : నాటకాంతంలో సమస్యా పరిష్కారానికి దేవుడు దివి నుంచి భువికి దిగిరావడం లేక ప్రత్యక్షం కావడం. ఇది గ్రీకు నాటకరంగంలో ఎక్కువ పరిపాటిగా ఉండేది. క్రేన్ ద్వారా ఈ తతంగం జరిగేది. ఆ తర్వాత రథాల్లో కూర్చొని దేవతలు దిగి రావడానికి కూడా ఈ పదమే ఉపయోగించేవారు. ఇపుడు నాటక కథతో సంబంధంలేని వ్యక్తి చివరకు వచ్చి నాటక సమస్యను పరిష్కరించడమనే అర్థంలో వాడుతున్నారు.

ఈ సంప్రదాయంతెలుగునాటకాలలో కూడా కనిపిస్తోంది. గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర మొదలైన నాటకాలలో ఏ శంకరుడో దివి నుంచి భువికి దిగి వచ్చి నాటక సమస్యను పరిష్కరిస్తాడు. నేటికీ మన తెలుగు దేశంలో సురభి నాటక సమాజాలు వైర్ వర్క్ సహాయంతో ఇలా దేవతలు దిగి వచ్చినట్లు చూపెడుతున్నారు.

శ్రీ.చ.

దోష హానం : హానమనగా పరిహరించడం, విడిచి పెట్టడం. నాయకుని శీలంలోని దోషాన్ని పరిహరించి, అతనిని నిర్దోషిగా చిత్రించడం దోష హానం.

ఆంధ్రమహాభారతం శకుంతలోపాఖ్యానంలో దుష్యంతుడు శకుంతలను రహస్యంగా వివాహమాడి తరువాత నిరాకరించడం. ఇలా నిరాకరించడం దుష్యంతుని శీలంలో దోషమే. ఈ దోషం పరిహరించి దుష్యంతుని నిర్దోషి గా చిత్రించడానికి కాళిదాసు దుర్వాసశాపంకల్పించాడు. దుర్వాసునిచే శాపగ్రస్త అయిన శకుంతల దగ్గర ఉంగరం లేకపోవడం వల్ల దుష్యంతు నికి గతం గుర్తుకు రాలేదని చిత్రించడం కారణంగా దుష్యంతునికి దోషం అంటలేదు. నిర్దోషిగా చిత్రించడం జరిగింది. ఇదే దోష హానం.

శ్రీ.చ.

ద్వంద్వాభినయం : అభినయ భేదం. రెండు విరుద్ధ భావాలను ఒకేసారి ప్రకటిస్తూ నటించడాన్నే ద్వంద్వాభినయమంటారు. ఇంగ్లీషులో డబుల్ ఏక్టింగ్ (Double acting) అంటారు. నిరంతర సాధన వల్ల, పాత్రగా రంగస్థలం మీద జీవించగలగడం వల్ల నటుడుకి ద్వంద్వాభినయం చేయడం సాధ్యమవుతుంది. దీనిని విజయవంతంగా ప్రకటించడం మహానట లక్షణంగా కళావేత్తలు పరిగణిస్తారు.

కొందరు మనసులో అనుకునేదొకటి, చెప్పేదొకటి, చేసేదొకటి.తియ్యగా మాట్లాడుతూ కాళ్లకింద గోతులు తవ్వుతుంటారు. నోటితో ప్రస్తుతిస్తూ నొసటితో వెక్కిరిస్తారు. వారిభావానికి, మాటకు, చేష్టకుపొంతనఉండదు. తడిగుడ్డలతో గొంతులు కోస్తారు. పైకి సంతోషం నటిస్తారు. లోపల కుళ్ళిపోతారు. ఇలా విరుద్ధ భావాలు గల వారిని మనం

దుష్టులు అంటాం. వీరే నాటకరంగం మీద పాత్రల యినపుడు దుష్టపాత్రలు (విలన్స్) అంటాం. భారతంలో శకుని, చంద్రహాస నాటకంలో మంత్రి దుష్టబుద్ధి ఈ పాత్రలకు చక్కని ఉదాహరణలు. సాంఘిక నాటకాలలో కూడా జమీందారు, కరణం మొదలైన పాత్రలలో ఇలాంటి లక్షణాలు మనకు తటస్థపడతాయి.

అయితే కొన్ని నాటకాలలో అసలు ఆపాత్ర దుష్టపాత్ర అని ప్రేక్షకులకు తెలియనీయకుండా రచయిత రచన సాగిస్తాడు. చివరకు ఆ పాత్ర దుష్ట పాత్ర అని తెలుస్తుంది. ప్రేక్షకులకు సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. ఇటువంటి నాటకాలలో రచయిత ఆశయం దుష్ట పాత్ర దుష్టత్వాన్ని చివరి వరకు మరుగు పరచి చివర ప్రేక్షకులను ఆశ్చర్య చకితులను చేయాలనేదే కాబట్టి ఇక్కడ ద్వంద్వాభినయం అవసరం అంతగా ఉండదు.

శ్రీ.చ.

ద్విజేంద్రలాల్, రాయ్ (1863-1916) : (చూ. రాయ్ ద్విజేంద్రలాల్)

ధనంజయుడు : దశరూపక నాటక లక్షణ గ్రంథకర్త. క్రీ.శ. 913 ప్రాంతం. ధారానగరం ఏలిన మంజుశ్రీ మహారాజు ఆస్థాన విద్వాంసుడు. ధనంజయుడు దశరూపక వ్యాఖ్యాత ధనికుడు, తమ తండ్రి విష్ణు అని చెప్పుకోవడం చేత వీరిద్దరూ అన్నదమ్ములని పలువురి ఊహ.

శ్రీ.చ.

ధనికుడు: ధనంజయ విరచిత దశ రూపక గ్రంథానికి 'అవలోకం' అనే పేరుతో వ్యాఖ్యానం రచించిన అలంకార శాస్త్రవేత్త.

ధనంజయుని తండ్రి పేరు,ఇతని తండ్రి పేరు విష్ణు అవడం చేత వీరిద్దరూ అన్నదమ్ములని కొందరు, వీరిద్దరూ ఒకరేనని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఈయున తన వ్యాఖ్యానంలో ఇతర నాటక కర్తల నాటకాలలో నుంచి గాక స్వంత శ్లోకాలే ఉదాహరణంగా ఇవ్వడం ఒక విశేషం. అంతేగాక కావ్యనిర్ణయం అనే అపురూప లక్షణ గ్రంథాన్ని ఈ వ్యాఖ్యానంలో ధనికుడు ఉటంకించడం ఇంకో విశేషం.

శ్రీ.చ.

ధర్మవీరం : వీరరస భేదం. స్వధర్మ రక్షణ కోసం ఎంతటి త్యాగమైనా చేయడం ధర్మవీరం. నాయకుడు ధర్మవీరుడు.

ప్రజారాధనం రాజుధర్మం. ఈ ధర్మం నిలబెట్టాడానికి శ్రీరాముడు సీతను పరిత్యజించడం ధర్మవీరం. ఇక్కడ శ్రీరాముడు ధర్మవీరుడు.

ఉత్తర రామచరిత్రం ప్రథమాంకంలో

శ్రీరాముడు :

> ప్రజల యారాధనంబె నా ప్రాణపదము
> దానికై స్నేహమును గాని దయనుగాని
> సౌఖ్యమునుగాని తుదకు నీ జనక తనయ
> గాని విడిచెద బాధ యింతేని లేక

(అను. మ.సూ.నా.శా).

శ్రీ.చ.

ధీరలలితుడు : చతిర్విధ నాయకులలో ఒకడు. ధీరస్య అసే లలితః అని విగ్రహం. రాజ్యపాలనాభారాన్ని మంత్రులకు అప్పగించి ఏ విచారం లేకుండా గాన నృత్యాది కళలలో నిమగ్నుడై, అంతఃపురంలో భోగభాగ్యాలను అనుభవిస్తూ శృంగార జీవితం గడిపే లలిత హృదయుడు ధీర లలితుడు.

ఉదా: వత్సరాజు, శ్రీకృష్ణుడు(రత్న పాంచాలి), విద్యాధరమల్లు (విద్ధ సాలభంజిక)

శ్రీ.చ.

ధీరశాంతుడు : చతుర్విధ నాయకులలో ఒకడు. 'ధీరక్ష అసేశంతః' అని విగ్రహం. దయా సత్య శౌచ వినయాది నాయక సామాన్య లక్షణాలు కలిగిన సచివ విప్రవైశ్యులు ధీర శాంత నాయకులు. దశరూపకాలలోని ప్రకరణానికి ఈయనే నాయకుడు. ఈ నాయకునికి శాంతం ప్రధాన గుణం. ఉదా. చారుదత్తుడు, మాధవుడు.

శ్రీ.చ.

ధీరోదాత్తుడు : చతుర్విధ నాయకులలో ఒకడు. అరిషడ్వర్గాలకు కలతపడక, సుఖదుఃఖాలను సమంగా భావిస్తూ పొగడ్తలకు, ఆత్మశ్లాఘ పరాయణతకు విముఖుడు, అహంకృతి లేనివాడు, వినయవంతుడు, క్షమ, శక్తివంతుడు, ఆరంభించిన కార్యాన్ని మధ్యలో వదలివేయక సాధించు తత్వం కలవాడు ధీరోదాత్తుడు. ఉదా. ధర్మరాజు, నలుడు, హరిశ్చంద్రుడు.

శ్రీ.చ.

ధీరోద్ధతుడు : చతుర్విధ నాయకులలో ఒకడు. "ధీరస్య అసే ఉద్ధతః" అని విగ్రహం. ధీరత్వం కలవాడు, ఆత్మశ్లాఘ పరాయణుడు, అహంకారి, మాయావి, అసహనుడు, శౌర్యవంతుడు, చంచలుడు, ధీరోదాత్త నాయకుడు. ఉదా: పరశురాముడు, భీముడు, విశ్వామిత్రుడు.

శ్రీ.చ.

ధృతి : 1. నిర్వహణ సంధ్యంగం, 2. వ్యభిచారీ భావం.

1. నిర్వహణ సంధ్యంగం: ధనంజయాదులు చెప్పిన 'కృతి'కి

బదులుగా భరతముని ధృతిని నాట్య శాస్త్రంలో నిర్వహణ సంధ్యంగంగా చెప్పాడు. దీనికి 'ద్యుతి' పాఠాంతరం. (క్రోధాదులను సామర్ధ్యముతో శమింప జేయుట ధృతి అనబడును) (నా.శా.19వ అధ్యాయం, అను. డా. పోణంగి, పుట. 576)

ఉదా: దువ్వూరి రామిరెడ్డి *కుంభరాణా* నాటకం 11వ రంగంలో అక్బరు కుంభరాణా క్రోధాన్ని ఉపశమింప జేయడం.

2. వ్యభిచారీ భావం: జ్ఞానం వల్లగానీ, శక్తి వల్ల గానీ కలిగే సంతోషం. "జ్ఞానము చేతను అభీష్టాగమునము చేతను కోర్కె తీరుట ధృతి, దాని వలన తృప్తి వచనోల్లాసము హాసముతోడి ప్రతిభాదికమును కలుగును." (ఆం. సా.ద. 3-199).

ఉదా : ధర్మవరం వారి *చిత్రనళీయం* నాటకం 4వ అంకం, 8వ రంగంలో సుదేవుడు బాహుకుని నలునిగా గుర్తించి సంతోషించడం -

శ్రీ.చ.

ధృవాగానం : పాత్ర ప్రవేశ సంబంధి. దీనినే ప్రావేశిక ధృవ లేక ప్రావేశిక ఆక్షిప్తిక అంటారు. ఈ ధృవ పాత్ర ప్రవేశాన్నే గాక చిత్తవృత్తిని కూడా వ్యక్తీకరిస్తుంది.

శ్రీ.చ.

ధృష్టుడు : చతుర్విధ శృంగార నాయకులలో ఒకడు. అన్య స్త్రీ సంభోగ చిహ్నాలతో ఇంకొక ప్రియురాలి దగ్గరకు నిర్భయంగా వెళ్లేవాడు ధృష్టుడు. ఉదా. పానుగంటి వారి రాధాకృష్ణ నాటకం ప్రథమాంకంలో శ్రీకృష్ణుడుఅన్యస్త్రీ సంభోగ చిహ్నాలతో రాధ దగ్గరకు వెళ్ళునపుడు.

రాధ : మహానుభావా! నీ చెక్కులపై నధరముపైనవియేమి? లలితా! అద్దము దెచ్చియిమ్ము ?

శార - అమ్మా! నీ నాథునిప్రాణమిచ్చుట నుంచి యాతని యొడలు మాత్రమే యిచ్చుటకై వచ్చి నందులకు దారావళి యితని యంగీ కారముపై జేసిన శిక్షా చిహ్నములు.

శ్రీ.చ.

నందన : సంబోధన, కులీనుడు, ధీరుడు, సమర్థుడు, వాగ్విశారదుడు, ప్రశంసనీయుడు అయిన నాయకుని నాయికసంబోధించే తీరు, సంబోధన.

శ్రీ.చ.

నంది : నాంది అని పాఠాంతరం.ఆశీస్సులతో కూడిన మధుర వాక్యాలతో స్తుతి అభివాదయుక్తంగా సర్వలోకాలను స్తుతించేవాడు. లేక నాటకంలోని సంస్కృత ప్రాకృత పాఠ్యాలతో ప్రజల శ్రేయస్సును కోరేవాడు నంది లేక నాంది. (వివరాలకు నాంది చూడండి.)

శ్రీ.చ.

నంది, ఎస్.ఆర్. (జ.1933-2003) : కథా, నవలా, నాటక రచయిత. ప్రవాసాంధ్ర నాటకకళాపరిషత్తు స్థాపకుడు. ఈయన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో 1933వ సంవత్సరం మే 3వ తేదీన జన్మించాడు.

1948లో కలంపట్టిన నూకరాజు నంది 200 కథలు, 25 నవలలు, కొన్ని నాటకాలు రచించాడు. పుణ్యస్థలి నాటిక రచనతో నాటకరంగంలో అడుగుపెట్టిన నంది మరో మొహెంజోదారో, అరణి నాటకాలనూ వాన వెలిసింది, మనిషి చావ కూడదు నాటికలను రచించాడు. ఔత్సాహిక నాటక రంగంలో లబ్ధప్రతిష్ఠుడైన నాటక రచయితగా పేరు తెచ్చుకున్నాడు. మరో మొహెంజోదారో ఐతిహాసిక (ఎపిక్ థియేటర్) నాటక విధానంతో రాసిన మొదటి నాటకం. మెలో డ్రామాను నియంత్రిస్తూ రంగస్థల పరికరాల అవసరం లేకుండా కేవలం నీలి తెరలతోనే ప్రదర్శించగల సౌలభ్యం గల ఈ నాటకం రంగస్థల చరిత్రలో సంచలనం కలిగించింది. ప్రదర్శనాపరంగా ఫ్రీజ్ (బమ్మల్లా నిలబడిపోవడం) అనే నూతన పద్ధతి ఈ నాటకంతోనే ప్రారంభమైంది. వందల సార్లు పలుచోట్ల ప్రదర్శింపబడి, వివిధ భాషలలోకి అనువదింపబడింది. మరో మొహెంజోదారో తెలుగు నాటకరంగ కీర్తిని నేల నాలుగు చెరుగులా విస్తరింపజేసింది.

మనిషిలోని సహనశక్తి,ఆత్మవిశ్వాసం నశించిపోరాదని, వీటిని పెంపొందించుకోవాలని మనిషి చావకూడదు నాటిక ద్వారా సందేశమిస్తే, పుష్కరాలలో తప్పిపోయిన కూతురు కోసం తండ్రి పడే ఆవేదనను తెలుపు తుంది వానవెలిసింది. నేటి మానవుడు నీతి నియ మాలను పక్కన బెట్టి నైతిక పతనానికి చేరువ వుతున్నాడనీ, ఈపరిస్థితిని అధిగమించక పోతే మరో మొహెంజోదారో పతనం తప్పదని ఈ నాటకం ద్వారా హెచ్చరించాడు.

ఈయనకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, నంది అవార్డులు లభించాయి. తెలుగుసాహిత్యానికి, నాటకరంగానికి ఇతోధికంగా సేవచేసిన ఎస్.ఆర్. నంది 2003, ఆగస్టు మూడున మరణించాడు.

దాసరి. ఎస్.

నగరాజారావు, నెల్లూరు (1887-1942) : ప్రసిద్ధ నటుడు, చిత్రకారుడు, ఉపాధ్యాయుడు, రంగోద్ధారక బిరుదాంకితుడు. ఈయన 1887లో నెల్లూరులో జన్మించాడు.

పూర్వులది తూర్పు గోదావరి జిల్లా రాజోలు ప్రాంతం, తల్లి దండ్రులు మహాలక్ష్మమ్మ, నరసింహా రావులు. నెల్లూరుకు వలస వచ్చి నగల వ్యాస రాయ పీఠంలో స్థిరపడి పోవడం వల్ల ఈయన ఇంటి పేరు పాలూరు, నెల్లూరుగా మారింది.

చిరుబజ్జ, చామన చాయ, శరీరం చిన్నదైనా భావాన్ని స్పష్టంగా ద్యోతకం చేసే నేత్రాలు, చిరునవ్వుతో కళకళలాడే ముఖం, రాజఠీవితో ఒప్పారే విగ్రహం.

ఈయన చిత్రకారుడు. ఆ చిత్రకళానైపుణ్యమే ఆహార్యంలో సాటిలేని దిట్టగా రూపొందించింది. చిత్ర లేఖనమే వృత్తిగా పెట్టుకొనినెల్లూరుజిల్లాబుచ్చిరెడ్డి పాలెంలో చిత్రలేఖనోపాధ్యాయుడుగా పనిచేశాడు. వేషధారణకు కావలసిన దుస్తులు తగు రీతిలో స్వయంగా తయారు చేసుకొనేవాడు.

ఈయన తొలుత ధరించిన పాత్ర నెల్లూరు జ్ఞానోదయ సమాజం ప్రదర్శించిన ప్రహ్లాదలో ఇంద్రుడు. ఆ తరువాత బుచ్చిరెడ్డిపాలెంలో చిత్ర కళోపాధ్యాయుడుగా పనిచేస్తూ *లవకుశ, కృష్ణలీలలు, సారంగధర, పాదుక, విజయనగర రాజ్యపతనం* నాటకాలు ప్రదర్శించాడు. నాటినుంచి అవిచ్ఛిన్నంగా నాటకాలలో నటిస్తూ క్రమేపీ రాటుదేలి ఆంధ్ర దేశంలోని ప్రముఖ నటుల సరసన స్థానం సంపాదించాడు. అచ్చంగా పాత్రలాగా కనిపించి, భ్రమింప చేయగల ఈయన నేర్పును గురించి ఒక యదార్థ గాథ చెపుతుంటారు. ఒకసారి బళ్ళారి రాఘవ మద్రాసు సౌందర్య మహల్‌లో తప్పెవరిది నాటకం ప్రదర్శించాడు. ఆ సమయంలో నగరాజారావు ప్రేక్షకులలో కూర్చోవడం గమనించి పిలిపించి ఆ నాటకంలోని పురప్రముఖుని వేషం వేయవలసిందని రాఘవ కోరాడట. రాఘవ కోరిక మేరకు నగరాజారావు నేపథ్యగృహంలో కూర్చొన్న పండిత డి.గోపాలాచార్యులు లాగా వేషం వేసుకొని రంగస్థలం మీదికి వచ్చేసరికి ప్రేక్షకులు విస్తుపోయి రంగస్థలం మీది గోపాలాచార్యులను అసలు గోపాలాచార్యులని తబ్బిబ్బు పడ్డారట.

ఆంధ్రనాటక కళాపరిషత్తు నెల్లూరులోజరిపినపోటీ పరీక్షలో నగరాజారావు ధరించిన నలుడు పాత్ర ప్రేక్షకుల మెప్పుపొందింది. గద్యాన్ని ఉదాత్తంగా, స్పష్టంగా, భావానుగుణంగా పఠించి సంగీతంలేనిలోటును అభినయంతో కప్పి పుచ్చుకొని ప్రేక్షకుల మెప్పు పొందేవాడు. ఈయన ధరించిన పఠాన్, నలుడు, కంసుడు, హిరణ్యకశిపుడు, దశరథుడు పాత్రలు ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాయి.

ఆంధ్ర నాటకరంగంలో జైత్రయాత్ర జరిపి విజయ ఢంకా మోగించి అనేక మంది ఏకలవ్య శిష్యులను సంపాదించుకుని, సినిమా రంగంలో ప్రవేశించి విదూషకుడు మొదలు శకుని వరకు విభిన్న పాత్రలను ధరించి ప్రసిద్ధ నటుడిగా పేరు తెచ్చుకున్నాడు. బందరు పౌరులు నగరాజారావుని సన్మానించి రంగోద్ధారక బిరుదునిచ్చారు. ఇంద్రుడు (ప్రహ్లాద), పఠాన్, హిరణ్యకశిప, దాశరథి, నల, దుష్టబుద్ధి, యుగంధరుడు, పాపారాయుడు, కంసుడు, శివాజి, అక్బర్, ఔరంగజేబు, తానీషా, రాజరాజు, రుస్తుం, నందుడు, వీరనాయకుడు, కీచకుడు, నక్షత్రకుడు, శకుని, కర్ణుడు మొదలైన పాత్రలలో నటించిన నగరాజారావు 1942లో మరణించాడు.

శ్రీ.చ.

నటన : 1. పాత్రధారి కార్యకలాపం, 2. గ్రంథం. రంగస్థలం మీద పాత్రధారి కార్య కలాపం నటన. ఈ నటన పదం నట్ ధాతువు నుంచి జనించింది. ఈ నట్ ధాతువు ప్రాకృత ధాతువని కొందరు విమర్శకులు, అనార్య భాష నుంచి సంస్కృతంలో ప్రవేశించిందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఋగ్వేదకాలంలో నట్ ధాతువును వ్యాపించు అనే అర్థంలో ప్రయోగించారు. నాట్యము, నటులు అనే అర్థం ప్రప్రథమంగా పాణినీయంలో కనిపిస్తోంది.

సంస్కృతాలంకారికులు దీనిని నాట్యం అని కూడా పేర్కొన్నారు. (అవస్థానుకృతిర్నాట్యమ్.... దశ దైవ రసాశ్రయమ్ - ద.రూ. 1-7)

ఈ శ్లోకానికి ధనికుడు, కావ్యాలలో వర్ణించిన ధీరోదాత్తాది నాయకుల, తదితరుల అవస్థలను అనుకరించడం అంటే చతుర్విధాభినయాలతో నటులు నాయకాదులతో తాదాత్మ్యం పొందడం. 'నాట్య రసాశ్రయమ్' అని వ్యాఖ్యానించాడు. నటనకే ఇంకో పేరు అభినయం. (వివరాలకు అభినయం చూడండి.)

అయితే నాటకాలలోని పాత్ర కార్యకలాపం నటనని, నృత్యాదులలోని పాత్ర అంగవిక్షేపం అభినయమని నేడు వాడుకలోనికి వచ్చింది.

ఈ శాస్త్ర గ్రంథాన్ని రిఛర్డ్ బోలెస్లవస్కీ రచించాడు. నటన-మొదటి ఆరు పాఠాలలోని మొదటి అయిదు పాఠాలకు అనుసరణ. (అనుసరణ: శ్రీనివాస చక్రవర్తి, ప్రథమ ముద్రణ. 1953, పుటలు. 102.)

సూత్రం, దాని వ్యాఖ్యాన రూపంలోగాక ఈ గ్రంథం సంభాషణ రూపంలో ఉంది. నేను అనే దర్శకుడికి, కిన్నెర అనే నాటక విద్యార్థినికి సంభాషణ, ప్రశ్నోత్తర రూపంలో ఏకాగ్రత, ఉద్వేగస్మృతి, ప్రక్రియ, పాత్రపోషణ, పరిశీలన, అనే అయిదు అధ్యాయాలలో నడిచింది.

ఈ గ్రంథంలో పాశ్చాత్య నాటకాలలోంచి ఉదాహరణలు గాక సంస్కృతాంధ్ర నాటకాల నుంచి ఉదాహరణ లివ్వడం విశేషం.

శ్రీ.చ.

నటమిత్రమ్ : ఈ నాటక చరిత్ర గ్రంథాన్ని బండారు రామస్వామి రచించాడు. ప్రథమ ముద్రణ. 1964, పుటలు.158.

దశాబ్దాలపాటు నటుడుగా, విమర్శకుడుగా, రచయితగా సముపార్జించుకున్న అనుభవాన్ని పురస్కరించుకొని రచించిన గ్రంథం. ఇందులో భాగాలు మూడు. ప్రథమభాగం నాటకీయ నాట్య ప్రస్తావన. ద్వితీయ భాగం మధుర స్మృతులు. తృతీయ భాగం అనుబంధాలు.

ఈ గ్రంథంలో గుంటూరు నాటకరంగ చరిత్ర విశిష్ట స్థానం ఆక్రమిస్తోంది. ఒక పట్టణ రంగస్థలం చరిత్రను వివరించిన మొట్టమొదటి గ్రంథం ఇదేనేమో.

శ్రీ.చ.

నటరత్నాలు : ఈ గ్రంథాన్ని మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించాడు. (రేణుకా గ్రంథమాల 1980లో ప్రచురించింది.) నాటకరంగానికి అంకితమై తమ సర్వస్వాన్ని నాటక కళకు అర్పించిన త్యాగధనులైన ప్రసిద్ధ కళాకారుల సంక్షిప్త జీవిత చరిత్రలను మిక్కిలినేని ఈ పుస్తకంలో పొందు పరిచాడు. కళాసేవలో పునీతులై కాలగర్భంలో కలిసిపోయిన 256 మంది విశిష్ట కళాకారుల గురించి ఈ పుస్తకంలో ప్రస్తావించ బడింది. కళాకారుల వ్యక్తిగత జీవితం నట జీవితంతో మేళవించి వివరించిన తీరు హృద్యంగా ఉంది. నేటి తరం కళాకారులకు, కళాభిమానులకు, పరిశోధనాసక్తి గల కళా హృదయులకు నటరత్నాలు కరదీపిక వంటిది.

గం.సు.రె.

నటశిక్షణ : సుప్రసిద్ధ రష్యన్ నాటక సిద్ధాంత వేత్త, రపపోర్ట్, రచన. నట కార్యకలాపం (Work of the Actor)కు నట శిక్షణ అనే పేరుతో శ్రీనివాస చక్రవర్తి అనుసరణ. (ప్రథమ ముద్రణ. 1963, పుటలు.63.) ఏకాగ్రత ప్రమేయం, కండర సంకోచం, కండర సారళ్యం సిద్ధి, కల్పనాశక్తి, రంగస్థల వైఖరి, సమూహంలో ఏకాంతం, భౌతిక క్రియాస్మృతి, క్రియ, రంగస్థల కార్యకలాపం, రంగస్థల మూల విషయాలు, క్రియ - ప్రతి క్రియ, భావాలు - కార్యకలాప నిర్వహణ పర్యవసానం,అన్యోన్య ప్రభావం, పాత్ర సాధన, విభాగాలు, వాచికం - ఉపవాచికం, పాత్ర చిత్రణ - ప్రధాన లక్షణాలు, వివిధ భాగాల ప్రాధాన్యం అనే శీర్షికలక్రింద విభాజితమయి అభ్యాసాలతో పాఠ్య గ్రంథంలా ఆసాంతం నడుస్తుంది.

శ్రీ.చ.

నటాలీ నాటక సంస్థ (తెనాలి) : 1943లో నటాలీ నాటక సంస్థను అబ్బూరి రామకృష్ణారావు నెలకొల్పాడు. సంస్థలోని నటులకు నెలకు వందరూపాయలు జీతం ఇచ్చారు. ఈ సంస్థలో వంగర వెంకటసుబ్బయ్య, కమలనాభ ప్రసాద్, పులిపాటి వెంకటేశ్వర్లు, పులిపాటి లక్ష్మీ నారాయణ, ముదిగొండ లింగమూర్తి, కల్యాణి, శేషమాంబ పనిచేశారు.

అతిథి నటులుగా జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, బలిజేపల్లి లక్ష్మీకాంతం, చంద్రమౌళి సత్యనారాయణ, అబ్బూరి రామకృష్ణారావు వేషధారణ చేశారు. ఈ సంస్థ కన్యాశుల్కం, ప్రతిమాసుందరి, మృచ్ఛకటిక, ముఖ్యమంత్రి మొదలైన నాటకాలను ప్రదర్శించింది.

నే.వ.శ.

నటి : 1. పాత్రధారిణి, 2. సూత్రధారుని భార్య

1. నాటకాలలో పాత్ర ధరించే స్త్రీ నటి. (వివరాలకు 'నటుడు' చూడండి.)

2. సూత్రధారుని భార్య : ప్రస్తావనాది నిర్వహణలో సూత్రధారునికి చేదోడు వాదోడుగా నిలిచేది. చతుర్విధ వాద్య విద్యానిపుణురాలు. నాట్యాభినయాలలో సమర్థురాలు. నటీ, సూత్రధారుడు ప్రస్తావనను నిర్వహించిన సన్నివేశాల నాటకాలే సంస్కృతంలో ఎక్కువ.

ఉదా: శాకుంతలం, మృచ్ఛకటికం, ముద్రారాక్షసం.

శ్రీ.చ.

నటుడు : పాత్రధారి, సూత్రధార సహాయకుడు

1. నాటక కథా పాత్రకు అనుగుణమయిన వేషం వేసుకొని రంగస్థలం మీద ఆ పాత్రగానే వ్యవహరించే (నటించే) వ్యక్తి నటుడు. అంటే నటించే పురుష వ్యక్తి నటుడు, స్త్రీ వ్యక్తి నటి.

ప్రాచీనకాలంనుంచీ నటవర్గం వర్ధిల్లుతూందని తెలుస్తోంది. భరతముని కాలం నాటికి నటవర్గం పెంపొందింది. భరత పుత్రులు అనగా నటులు. ఆనాటికి వంద మంది స్త్రీ పాత్రధారణకు గాను బ్రహ్మ అప్సరసలను సృష్టించాడు.

పాణిని (క్రీ.పూ.5వ శతాబ్ది) నట సూత్రాలను పేర్కొనడం బట్టి, భాసుడు ప్రతి నాటకంలో నటులను పేర్కొనడం బట్టి క్రీస్తుపూర్వమే భారత దేశంలో నటులు వర్థిల్లుతున్నారని తెలుస్తోంది. క్రీ.పూ. 2వ శతాబ్దిలోని పతంజలి పాణినీయ షష్ఠాధ్యాయ 2వ సూత్రం వ్యాఖ్యానిస్తూ 'వ్యంజనములు నటుల భార్యల వంటివి' అని వ్రాయడాన్ని బట్టి, 13వ శతాబ్దిలోని దక్షిణ దేశ శాసనాలను బట్టి 15వ శతాబ్ది నాటి క్రీడాభిరామంలో 'నటుల దోర సముద్రం' అని వ్రాయడాన్ని బట్టి అనాది నుంచి భారత దేశంలో నటులు వర్థిల్లుతున్నారని నిర్ధారణ అవుతోంది.

నటీనటులు యోగితుల్యులు. వీరి కార్యకలాపం అనుష్టంభ యోగం. తన వ్యక్తిత్వాన్ని మరుగుపరచి ఇంకో వ్యక్తి లాగా అవతరించి వ్యవహరిస్తాడు. పాత్రను కేవలం అనుకరించడు, సృష్టిస్తాడు. నిజమయిన నటీ నటులు ప్రతి విషయం, సంగీతం, నృత్యం, మూకాభినయం, విషాద, ఆహ్లాద పాత్రలు రెంటినీ నటించగల సామర్థ్యం, సాహిత్యం అభ్యసించి ఉండాలి. మంచి శరీర సౌష్టవం, మంచి జ్ఞాపక శక్తి, మంచి భావనా శక్తి, చురుకైన మేధ, స్వచ్ఛమైన గొంతు, స్పష్టోచ్చారణ, ఉచ్ఛ్వాస నిశ్వాసాల అదుపు కలిగి ఉండాలి.

భరతముని ఉత్తమ నటుని లక్షణాలు ఇలా వివరించాడు: "నటుడు వేష సంశ్రయములగు వర్ణకములచే (రంగులచే) తన సహజ వర్ణమును మరుగుపరచి, ఏ ప్రకృతి ప్రస్తుతమో (ఏ వేషమును తాను నిర్వహింపనుండెనో) తదాకృతిని కల్పించు కొనవలయును. జంతువు (జీవాత్మ) దేహాంతరము నాశ్రయించినప్పుడు (పునర్జన్మచే లేదా పరకాయ ప్రవేశముచే) స్వస్వభావమును పరిత్యజించి, అన్య దేహ స్వభావములను పొందునట్టే వేష- వర్ణకములచే ఆచ్ఛాదింపబడిన పురుషుడు ఏ వేషమును ఆశ్రయించునో తద్భావమును చక్కగా పొందవలెను" (నా.శా. అధ్యాయం 21, పుట 636, - అను. డా.పోణంగి).

తమ నటనద్వారా అసంఖ్యాక ప్రేక్షకలోకానికి ఆనందం చేకూరుస్తూ కవి సందేశాన్ని అందచేసి ఉత్తేజ పరుస్తున్నా నటీనటులకు అనాది నుంచీ సమాజంలో గౌరవ స్థానం లేదు.

ఐరోపా ఖండంలో ఎంత గొప్పవాడయినాసరే నటుడు మరణిస్తే మతాధికారులు అంత్యక్రియలు జరిపేవారు కాదు. పవిత్ర స్థలంలో సమాధి చేయనిచ్చేవారు కాదు. ఇంగ్లండులో ప్యూరిటన్స్ (సనాతనులు) నాటకాల మీది ఏహ్య భావంతో నాటకశాలలను మూయించి వేశారు.

భారతదేశంనటులను, వారిభార్యలను నీతి విహీనులుగా పరిగణించి, మనువు వారిని పంక్తి బాహ్యులని పేర్కొన్నాడు. చాణక్యుడు అర్థశాస్త్రంలో నటులను వేశ్యాగణంలో చేర్చాడు. అయినా శ్రీకృష్ణ దేవరాయలు వంటి రాజులు నటులను సన్మానించి అగ్రహారాలు ఇచ్చారు. సంస్కృత నాటకాలు చదివితే పూర్వం రాజాంతఃపుర పరివారం నాటకాలాడేవారని తెలుస్తోంది.

నటుడు వాస్తవికతకు, కవితకు, నాటకరంగానికి ప్రతీక. నిజమయిన నటుడు వర్ణచిత్రంలాగా అవతరిస్తాడు. కాని ఛాయాచిత్రంలాగా అవతరించడు. నటుడికి ఉద్వేగాన్ని పొందే శక్తేగాక ఆ ఉద్వేగాన్ని వ్యక్తీకరించే శక్తి కూడా ఉండాలి. మంచి నటుడు భావనాశక్తితో పాత్రకు రూపం కల్పిస్తాడు. ఇంకో పాత్రగా అవతరించి ఆ పాత్రతో పాటు నవ్వుతాడు, ఏడుస్తాడు, ఆ పాత్రలాగే వ్యవహరిస్తాడు. మానవుని మనస్సును చూపెడతాడు. నాటక క్రియ అర్థాన్ని ఆవిష్కరిస్తాడు. నాటక ప్రదర్శనంలో పాల్గనే అందరిలోనూ భ్రాంతిని ఎక్కువ కల్పించేది నటుడే. నేటి నట పరంపరకు మూల పురుషుడు పరమేశ్వరుడు 'నటరాజు'.

సామాన్య లక్షణాలు: గురుముఖంగా గ్రహించడం, గ్రహించిందాన్ని జ్ఞాపకం ఉంచుకోవడం, నాటక రచయిత చెప్పని దానిని కల్పించుకోవడం, సభా కంపం లేక పోవడం, వ్యాయామాభ్యాసాదులు చేసి దృఢ దేహులు కావడం, నాటకం బాగా సాధన చేయడం.

సూత్రధార సహాయకుడు : పారి పార్శ్వక మారిషులకే నటుడని పేరు. ఈ నటుడు నాటక పాత్రధారి కాకపోవచ్చు. సూత్రధారునికి ప్రస్తావనా నిర్వహణలో తోడు పడుతాడు. ఉదా: ఉత్తర రామచరితం, మాలతీ మాధవం, సత్య హరిశ్చంద్ర (రామచంద్ర సూరి)

శ్రీ.చ.

నటుడు-శిల్పం : ఈ నాటక సిద్ధాంత వ్యాస సంపుటిని పాలెం రఘుపతి రచించాడు. (ప్రథమ ముద్రణ 1966, పుటలు 72.) నాటకరంగానికి సంబంధించి వివిధ పత్రికలలో ప్రచురించిన వ్యాసాల సంపుటి.

సంప్రదాయక అభినయ పద్ధతుల అధ్యయన, ఆచరణ ద్వారాపొందిన అనుభవాన్ని వ్యక్తీకరించే వ్యాసాలు, నటుడు -పాత్రలు, నటుడు-వాస్తవికత, నటుడు-రసపోషణ, సినిమా-నాటకం, నాటక ప్రయోగం-ప్రయోక్త అనే ఐదు వ్యాసాలతో సులభ శైలిలో అలరారుతున్న వ్యాస సంపుటి.

శ్రీ.చ

నటేశయ్య, రాళ్ళపల్లి (1889-1968): రంగస్థల, చలన చిత్ర నటుడు, సంగీత విద్వాంసుడు. రాళ్ళపల్లి ఆదిశేషయ్య భ్రమరాంబ దంపతులకు 1889 మే 17న

నటేశయ్య నెల్లూరులో జన్మించాడు. వీరి తోబుట్టువులు ఐదుగురిలో ఈయన మధ్యములు. నటేశయ్య విద్యాభ్యాసం నెల్లూరులోన ముత్తరాజు సుబ్బరామయ్య పాఠశాలలో జరిగింది. ఏడవ తరగతి చదివిన తర్వాత ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా నెల్లూరు వదలి మద్రాసు చేరారు. మద్రాసులో గొప్ప ఫిడేలు విద్వాంసులైన గూటాల వేంకట రామయ్య వద్ద సంగీత శిక్షణ ప్రారంభించాడు. కొద్దికాలంలోనే ఫిడేలు వాయించడంలో విశేష ప్రతిభ సంపాదించాడు. ప్రఖ్యాతి గన్న సంగీత విద్వాంసుల సంగీత కచేరీలలో ఫిడేలు సహకారం అందించే స్థాయికి చేరుకొని పేరు తెచ్చుకున్నాడు. నెల్లూరులో వేదం వేంకట్రాయశాస్త్రిగారి నాటకాలలో నాయక పాత్రలు ధరించిన శ్రీనివాసన్ (దొరస్వామి) నటేశయ్యను తమ నాటకాలలో సంగీత శిక్షణ యిచ్చి సహాయపడమని నెల్లూరుకు పిలుచుకొని వచ్చాడు. అప్పటి నుంచి జీవితాంతం వరకు నెల్లూరు పౌరులకు వివిధ రంగాలలో సేవలు అందిస్తూ జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు. నాటకం సాధన చేసే నటులకు పద్యాలు పాటలు పాడే విధానంలో సంగీత శిక్షణ యివ్వడమే గాక సంగీతం అభ్యసించాలని ఉత్సాహం చూపే యువకులను చేరదీసి వారికి శిక్షణ యిచ్చి సంగీత విద్యాదానం చేసిన కళాహృదయుడు నటేశయ్య. నెల్లూరులోని నాటక సమాజాలకు నటేశయ్య సంగీత సారథ్యం తప్పనిసరిగా ఉండేది. నాటకాలలో హాస్యపాత్రలను పోషించి ప్రదర్శనను జనరంజకం చేయుటంలో నటేశయ్య దిట్ట. ఆ కాలంలో నెల్లూరు జిల్లాలోగాని వెలుపలగానీ శ్రీమంతుల ఇంట ఏ శుభకార్యం జరిగినా నటేశయ్యను ప్రత్యేకంగా ఆహ్వానించి ఈయనచేత వినోద ప్రదర్శన ఏర్పాటు చేసేవారు.

చలన చిత్ర నిర్మాణం ఊపందుకొని నాటకాల సందడి తగ్గుముఖం పట్టిన దశలో నటేశయ్య సినిమారంగ ప్రవేశం చేసి పెక్కు తమిళ, తెలుగు చిత్రాలలో హాస్యనటుడుగా రాణించి ఖ్యాతి గడించాడు. ఏన్‌మణ్షైలీ, విశ్వమోహిని, తాసిల్దార్, త్యాగయ్య చిత్రనళీయం సినిమాలలో ధరించిన పాత్రలు ఈయన నటనా చమత్కృతికి గీటు రాళ్ళుగా భాసించాయి.

నెల్లూరులో ఉన్నత సంగీత విద్యాగురుకులము స్థాపించి సంగీతాభిమానులైన వారికి శిక్షణ యిచ్చి వారిని విద్వాంసులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషిచేసేవాడు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఈయన సేవలను గుర్తించి ఉన్నత విద్యా సంగీత గురుకులానిక అండగా నిలిచి సహాయం అందించి ప్రోత్సహించింది. సంగీత నాటక కళాభివృద్ధే తన జీవిత పరమార్థంగా ఎంచి నిస్వార్థంగా సేవ చేసిన నటేశయ్య తన శిష్యుల నడుమ సంగీత పాఠం చెపుతూ 1968 డిసెంబర్ 10వ తేదీన కన్నుమూశారు.

గం.సు.రె.

నతం : శయన విధి భేదం. కాలి పిక్కలను కొద్దిగా సాచి, చేతులను వదులుగా పడవేసి పండుకోవడం నతం. ఆలస్య, శ్రమ భేదములందు ఈ శయన విధి ప్రయుక్తమవుతుంది.

ఉదా : స్వప్న వాసవదత్త నాటకం పంచమాంకంలో సముద్ర గృహంలో పాన్పు మీద వత్సరాజు శయనించిన విధం.

శ్రీ.చ.

నతి : మానభంజనోపాయంలో నాల్గవది. నతి అనగా పాదాభివందనం, కోపగించిన ప్రియురాలినిగాని, పూజ్యులను గాని ప్రసన్నం చేసుకోవడానికి పాదాల మీద పడటం నతి.(పాదయోః పతనం నతి: – ద.రూ. 4–63)

శ్రీ.చ.

నరసరాజు, డి.వి. (జ. 1920–2006) : నటుడు. దర్శకుడు. నాటక, సినిమా రచయిత. పూర్తిపేరు దాట్ల వెంకట నరసరాజు. ఈయన 1920 జూలై 15న కృష్ణాజిల్లా, ముత్యాలపాడులో జన్మించాడు.

ప్రాచ్య, పాశ్చాత్య నాటకరంగం గురించి తెలిసినతెలుగు నాటక రచయితలలో ముఖ్యుడు. హంగేరియన్ రచయిత ఫెరన్స్ మోల్నార్ ద ప్లే *ఈజ్‌ది థింగ్* (1926) నాటకాన్ని ఆధారంగా చేసుకొని తెలుగులో నాటకం (1950) పేరుతో ఒక నాటకాన్ని రచించాడు.పాశ్చాత్య నాటక రంగాన్ని పరిశీలించి, ఆ నాట కాలలోని ప్రదర్శనా సౌలభ్యాన్ని తెలుగు నాటక రంగానికి పరిచయం చేయాలని పాశ్చాత్య నాటకాలను తెలుగులోకి విరివిగా అనువదించే కాలంలో ఈ నాటకం అనువదింపబడింది. ప్రేమికుల మధ్య అపార్థం నెలకొన్న సందర్భంలో నాటక రచయితగా ప్రేమజంటకు కనువిప్పు కలిగించి అపోహలు సమసి పోవడానికి ఉపకరించి, ప్రేమ సఫలం కావడానికి తోడ్పడటం ఈ నాటకంలోని కథా వస్తువు. ఈ నాటకం ప్రయోగపరంగా విజయవంతమైంది. పరిషత్తు పోటీలలో బహుమతులు అందుకుంది. నరసరాజుకు నాటక కర్తగా మంచి పేరు తెచ్చి పెట్టింది. రంగస్థలం మీద రెండు

గదులలో సన్నివేశాలను ఒకే కాలంలో చూపడం, నాటక రచయిత ప్రేక్షకులను ఉద్దేశించి ముఖాముఖి మాట్లాడటం వంటి కొత్త పద్ధతులను ఈ నాటకం ద్వారా ప్రవేశపెట్టాడు.

ఒకరి ఆస్తి వీలునామా వల్ల తనకు సంక్రమిస్తుందని తెలిసినపుడు మధ్య తరగతి వ్యక్తిలో చోటు చేసుకొనే భౌతిక మానసిక ఆలోచన ధోరణి, ప్రవర్తనలను హాస్య ధోరణిలో మలచిన నాటకం వీలునామా (1955). ఈ నాటకం సీన్ ఓకాసీ రచించిన జూనో అండ్ పీకాక్ నాటకానికి అనుసరణ. ఈయన రచించిన ఆత్మహత్య, ఈ ఇల్లు అమ్మబడును, ప్రేమ పక్షులు, కోడి పుంజులు పరిషత్తులలో ప్రదర్శింపబడ్డాయి. వాపస్ నాటికను ఆంధ్రదేశంలోని అనేక నాటక సమాజాలు, కళాశాలలు విస్తృతంగా ప్రదర్శించాయి. అంతర్వాణి, స్వర్గసీమ నాటికలను నాటక రంగానికి అందించడంతో పాటు చలన చిత్రసీమలో ప్రవేశించి అనేక సినిమాలకు మాటలు రాశాడు. కళారంగం అభివృద్ధికోసం తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించి 2006లో కన్నుమూశాడు.

దాసరి.ఎన్.

నరసింహం, కూచి (1866-1940) : కవి, నాటక కర్త, సంస్కృతాంధ్రాంగ్లభాషా పండితుడు, ఆదర్శోపాధ్యాయుడు, సింహత్రయంలో ఒకరు (తక్కిన ఇద్దరూ చిలకమర్తిలక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహం). ఈయన పిఠాపురంలో 1866లో జన్మించాడు. తల్లిదండ్రులు పుల్లమాంబ, వెంకటాచార్య.

1888లో పట్టభద్రుడయి ఎలమంచిలి, నూజివీడు, నరసాపురం, పిఠాపురం ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడుగా పని చేసి ఉద్యోగ విరమణ చేశాడు. 1920 నుంచి 1938 వరకు 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' కార్యాలయంలో పండితుడుగా పనిచేశాడు.

ఈయన రూపలత *(1917)*, వనవాసి *(1918)* అనే రెండే రెండునాటకాలురాసినా అవిరెండూ సాహిత్యపరంగా ఉత్తమ నాటకాలుగా పేరుగాంచాయి.

పానుగంటి లక్ష్మీనరసింహం రచించిన నాటకాలకు కూచి నరసింహం, ఈయన నాటకాలకు పానుగంటి నాందీ ప్రస్తావనలు రాసుకొన్నారు. పై రెండు నాటకాలే గాక భ్రమ ప్రమాద ప్రహసనం, కొత్త తెనుగు తమాషా (1914) అనే ప్రహసనాలు కూడాఈయన రచించాడు.

శ్రీ.చ.

నరసింహమూర్తి, ఆదోని (జ.1927) : నటుడు, చిత్రకారుడు, రచయిత, దర్శకుడు. లలితకళా పరిషత్తు కార్యదర్శి. ఈయన 1927 అక్టోబర్ తొమ్మిదవ తేదీన అనంతపురం జిల్లా హిందూపురంలో జన్మించాడు. తల్లిదండ్రులు సుభద్రమ్మ, నారాయణా చార్యులు. నరసింహమూర్తి ఎం.ఏ పూర్తి చేశాడు. ఈయన పాఠశాలలో చదువుతున్నప్పుడే రంగస్థల కళలపట్ల అభిరుచి ఏర్పడింది. పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా సనాతన నాటకంలో కర్కటక శాస్త్రిఅనేపాత్రలో నటించి బహుమతి సంపాదించాడు. కళాశాలలో చదువుతున్నప్పుడు పలు నాటికలలో నటించాడు.

నరసింహమూర్తి సాయిబాబా పాఠశాలలో పనిచేస్తున్న రోజుల్లో సహ అధ్యాపకులతో కలసి 'రాఘవ ఫైన్ అర్ట్సు అసోసియేషన్' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ పక్షాన ప్రదర్శించిన చింతామణి లో సుబ్బిశెట్టి, ఛైర్మన్ లో స్వామిజీ, మాష్టర్‌జీ లో సేట్, ఎన్.జి.ఓ.లో గోపి తండ్రిగా నటించాడు. తక్కువ సమయంలో పాత్రకు సంబంధించిన సంభాషణలు నేర్చుకుని చక్కగా నటించడం నరసింహమూర్తి ప్రత్యేకత. 1975 నుంచి నేటి వరకు లలిత కళా పరిషత్తు, (అనంతపురం) కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఈ సంస్థ ద్వారా నరసింహమూర్తి భలే పెళ్ళి, ప్రేమలేఖ లను రచించి ప్రదర్శించాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సాంగ్ అండ్ డ్రామా కార్యక్రమంలో రెండులోకాల కథ, మానవత్వమే మతం లను ప్రదర్శించాడు. ఈ ప్రదర్శనలో పాల్గన్న నరసింహమూర్తికి ఉత్తమ రచయిత, నటన, దర్శకత్వ అవార్డులు లభించాయి. లలిత కళాపరిషత్తు కార్యదర్శిగా బళ్ళారి రాఘవ, కల్లూరు సుబ్బారావు, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ శతజయంతి సంచికలు ప్రచురించాడు. కల్లూరు సుబ్బారావు ట్రస్టు ఏర్పాటు చేశాడు. కళోద్ధారకులు పైడి లక్ష్మయ్య సహకారంతో ఆడిటోరియం నిర్మించాడు. పరిషత్తు స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహించుకునే స్థితికి ఎదగడానికి విశేష కృషి చేసిన కళాభిమాని నరసింహమూర్తి.

దాసరి. ఎన్.

నరసింహమూర్తి, పీసపాటి (1920-2007) : ప్రఖ్యాత రంగస్థల నటుడు. శ్రీరామనాట్యమండలి స్థాపకుడు. ఆస్థాన నటుడు. కళాప్రపూర్ణ బిరుదాంకితుడు. ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యుడు. ఈయన 1920 జూలై 10న విజయనగరం జిల్లా బబ్బిలిమండలం రాముడు వలసలో జన్మించాడు. నాటక కళ పట్ల అభిమానం ఏర్పరుచు

కున్న పీసపాటి 1934లో కిళాంబి కృష్ణమాచార్యుల దగ్గర నటశిక్షణ పొందాడు. సామర్లకోటలో కిళాంబి స్థాపించిన వాణీ నాట్య మండలి పక్షాన ఖిల్జీరాజ్య పతనం అనే చారిత్రక నాటకంలో గణపతి పాత్రలో నటించాడు. ఇదే పీసపాటి మొట్ట మొదటి ప్రదర్శన. నాడు ప్రారంభమైన నాటక జీవితం అనతి కాలంలోనే రంగస్థల నటులలో ఒక సుప్రసిద్ధ నటుడి స్థాయికి చేర్చింది. నాటకాలను విరివిగా ప్రదర్శించాలనే పట్టుదలతో పీసపాటి శ్రీరామనాట్యమండలి (పొందూరు) సమాజాన్ని స్థాపించాడు. ఈసమాజం పక్షాన సత్యహరిశ్చంద్ర, చిత్రనళీయం, పాండవోద్యోగ విజయాలు, విరివిగా పలుచోట్ల ప్రదర్శించి పేరు తెచ్చుకున్నాడు. మద్రాసులో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో ఆంధ్రశ్రీ నాటకంలోని 'కన్నమదాసు' పాత్రలో నటించి ద్వితీయ ఉత్తమ నటుడు అవార్డును అందుకున్నాడు. 1949లో గుంటూరులో చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి సన్మానసంఘం సభ్యులు ఏర్పాటు చేసిన పాండవోద్యోగ విజయాలు నాటకంలోని పోటీలలో పీసపాటికి ప్రథమ బహుమతి లభించింది. శ్రీకృష్ణపాత్రను అభినయించడంలో పేరు తెచ్చుకొన్న పీసపాటిని ఆంధ్ర ఆర్టిస్టు అసోసియేషన్ ప్రదర్శించే ప్రదర్శనలలో పాల్గనమని సమాజ నిర్వాహకులలో ఒకరైన మాధవపెద్ది వెంకట్రామయ్య ఆహ్వానించాడు. మాధవపెద్ది కోరిక మేరకు ఆంధ్ర ఆర్టిస్టు అసోసియేషన్ ప్రదర్శనలలో నాటి సుప్రసిద్ధ నటులు అద్దంకి, పులిపాటి, పంచాంగం మొదలైన వారితో కలిసి పీసపాటి నటించాడు.

పాండవోద్యోగవిజయాలలో శ్రీకృష్ణుడుగా, అర్జునుడుగా, ఖిల్జీరాజ్య పతనంలో గణపతిగా ప్రతాప రుద్రీయంలో చెకుముకి శాస్త్రిగా, హరిశ్చంద్రలో హరిశ్చంద్ర, నక్షత్రకుడిగా, చిత్రనళీయంలో బాహుకుడుగా, గౌతమబుద్ధలో గౌతముడుగా నటించినా, శ్రీకృష్ణ పాత్రే పీసపాటికి నటుడిగా విశేషఖ్యాతిని, అనేకమంది సుప్రసిద్ధుల అభినందనలను, విలువైన నగదు, బంగారు బహుమతులను, నటశేఖర, నట విద్యాధర, నటరాజ బిరుదులను తెచ్చి పెట్టింది. నాటక రంగం కోసం విశేషంగా పనిచేసిన పీసపాటిని 1986లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు నిచ్చి గౌరవించింది. ఈ అవార్డును అందుకొన్న ఆంధ్రరంగస్థలనటులలో మూడవవాడు. అనేక నాటకాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన పీసపాటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది నాటకోత్సవాలు ప్రారంభోత్సవానికి 2005లో ఆహ్వానించి, ఘనంగా సత్కరించింది. ఈయన 2007 సెప్టెంబరు 28న మరణించాడు.

అయ్యదేవర

నరసింహశాస్త్రి, మొక్కపాటి (1892-1973) :

నాటికాకర్త, నవలా కారుడు, కథకుడు, హాస్య చక్రవర్తి, సాహితీ సమితి సభ్యులలో ముఖ్యుడు. ఈయన 1892వ సంవత్సరం అక్టోబరు 9న పిఠాపురంలో జన్మించాడు.

వ్యవసాయశాస్త్రం చదవడానికి ఇంగ్లండు వెళ్లి పట్టాపుచ్చుకోకుండానే తిరిగి వచ్చి సాహితీ రంగంలోకి ఉరికాడు. బారిష్టరు పార్వతీశం నవల ఈయనకు అఖండ కీర్తి తెచ్చి పెట్టింది. ఆ తరువాత ఈయన ఎన్ని రాసినా బారిష్టరు పార్వతీశం ముందు మరుగున పడి పోయినాయి. ఇర్విన్ రచించిన ఇంగ్లీషు నాటిక ప్రోగ్రెస్‌నుమొట్ట మొదటుగా అభ్యుదయం పేరుతో అనువదించి ప్రదర్శింప చేసినది ఈయనే.

తక్కిన నాటికలన్నీ హాస్య నాటికలే. తెలుగు వారి నిత్య జీవితాన్ని చిత్రించేవే. సంఘర్షణ చిత్రించడంలో, చెప్పదలిచింది సూటిగా మనసున నాటేటట్టు చెప్పడంలో ఈయన సిద్ధహస్తుడు. సుబ్బారాయుడు నాటిక ఈయన రచనా శక్తికి మంచి తార్కాణం.

మొక్కుబడి, అభ్యుదయం , పెద్దమామయ్య, అసాధారణ సమావేశం, వారసత్వం, ప్రాతివ్రత్యం *(1951)*, సుబ్బారాయుడు, దయ్యాలకొంప, మనసు-సిగ్గు (అముద్రితాలు) అను రచించిన మొక్కపాటి 1973, మార్చి 5న మొక్కపాటి మరణించాడు.

శ్రీ.చ.

నరసింహాచార్యులు, బి.టి. (1892-1964) :

ఉత్తమనటుడు,తత్త్వవేత్త, పట్టభద్రుడు, ఆదర్శోపాధ్యాయుడు. ఈయన 1892, అక్టోబర్ 9న కృష్ణాజిల్లా ఉరుటూరు

గ్రామంలో జన్మించాడు, తల్లిదండ్రులు తాయారమ్మ, బుక్కపట్నం తిరుమల వెంకటాచార్యులు. పుట్టినది కృష్ణాజిల్లా. కొన్ని కారణాల వల్ల వలస వచ్చి ఉపాధ్యాయ వృత్తి చేపట్టి సికింద్రాబాదు నాటకరంగ పురోగతికి ఎంతగానో తోడ్పడిన మేటినటుడు.



నిగనిగలాడే గిరిజాల జుట్టు, ఆకర్షణీయమయిన ముఖం, మంచి ఎరుపు, ఆజాను బాహువిగ్రహం, కళా కారుడని ఇట్టే చెప్పేసేవి. నవరసాలు ఈయన ముఖంలో ప్రస్ఫుట మయ్యేవి. ఈయన బందరు నోబుల్ కాలేజీలో బి.ఏ. పూర్తి చేశాడు. మేటి నటుడు ఆచార్య పింగళి లక్ష్మీ కాంతం, మహా కళావేత్త దుగ్గిరాల గోపాలకృష్ణయ్యతో సాహచర్యం మూలంగా నాటకకళ మీద ఆసక్తి జనించింది. 1916లో బందరులో జరిగిన *వేణీ సంహారం* నాటక ప్రదర్శన పోటీలలో దుర్యోధన పాత్రధారణకు బంగారు పతకం గెలుచుకొన్నాడు.

ఆ తరవాత బందరు జాతీయకళాశాలలో కొద్దికాలం ఉపాధ్యాయుడుగా పని చేశాడు. ఆ కాలంలోనే పింగళి లక్ష్మీకాంతంతో కలిసి ఆంధ్ర సభ పేరుతో తెలుగు ముద్రారాక్షసు నాటకం ప్రదర్శించాడు. అందులో ఆచార్యులుగా నటించాడు. ఈ వేషధారణతో ఈయనకు మహానటుడనే ఖ్యాతివచ్చింది. అయితే ఆచార్యులకు సంగీతం రాదు. ఒట్టి 'ప్రోజు' నటుడు. సంగీతం రాని నటులకు ప్రఖ్యాతే గాని ఆర్థికంగా ఏమీ లభించేది కాదు. అదీగాక ఈయనకు నటనను వృత్తిగా స్వీకరించాలనే ఆపేక్ష ఉండేది కాదు. ఉన్నత విద్యకు అమెరికా వెళ్ళాలని బయలు దేరి బంబాయిలో జబ్బుపడి ప్రయాణం మాని ఇంటికి తిరిగి వచ్చి సికింద్రాబాద్‌లో సెయింట్ పాట్రిక్ యూరోపియన్ హైస్కూల్‌లో చేరాడు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూనే, నాటక రంగానికిసేవచేశాడు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సాహచర్యంతో ఈయనకు తత్త్వశాస్త్రం మీద, యోగ శాస్త్రం మీద మనసు పోయింది. శంకర, రామానుజ, మధ్వాచార్యులు విస్మరించిన విషయాలను చిన్న గ్రంథంగా ప్రచురించాడు.

ఈయనకు సంస్కృత నాటకాల మీద మోజు ఎక్కువ. *అభినయ దర్పణం*, *భరత నాట్యశాస్త్రం*, ఆధునిక నాటకరంగానికి కూడా ఉపయుక్తమవుతాయని విశ్వాసం. ఈయన దుర్యోధనుడు, కృపాచార్యుడు (*వేణీ సంహారం*), సారంగధరుడు, రామదాసు, చాణక్యుడు వంటి పాత్రలు ధరించాడు. నరసింహాచార్యులు 1964 డిసెంబరు 5న మరణించాడు.

శ్రీ.చ.

నరసింహారావు, కె.ఎల్ (1924-2003): నటుడు, నాటక రచయిత, సమాజ స్థాపకుడు, నల్గండ జిల్లా, హుజూర్ నగర్ తాలూకా, రేపాల గ్రామంలో 1924 అక్టోబరు 23న జన్మించాడు. గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగిన కారణంగా తరువాతి కాలంలో నరసింహారావు చేపట్టిన రచనా వ్యాసంగానికి గ్రామీణ నేపథ్యం ఆయువు పట్టు అయింది. విద్యార్థిదశలో నటించిన నాటకాలు అతనిలో నాటకాభిరుచిని పెంపొందించాయి. రేపాల గ్రామంలో 'గ్రామ వెలుగు నాట్యమండలి' స్థాపనకు ఈ నాటకాభిమానమే పునాది అయింది. కొంత మంది నాటకాభిలాషులను సమీకరించి 1946 'గ్రామ వెలుగు నాట్యమండలి' ద్వారా నాటకాలుప్రదర్శించడానికి అంకురార్పణ చేశాడు. దానికి గ్రామ పెద్దల అండదండలు కూడా లభించడంతో, రేపాలలోనే కాకుండా చుట్టు పక్కల గ్రామాల్లో కూడా నాటక ప్రదర్శనలిచ్చి ప్రజల్లో నాటక కళాభిరుచికి దోహదం చేశాడు.

ఉద్యోగం కోసం హైదరాబాదు చేరుకొని, కొన్నాళ్ళు ఓ పత్రికలో ఉపసంపాదకుడిగా పనిచేశాడు. ఆ తరువాత ఆలిండియా రేడియో, హైదరాబాద్ కేంద్రంలో నాటక విభాగంలో పనిచేశాడు. ఈయన కలం నుంచి సుమారు ఇరవై అయిదు నాటకాలు, నాటికలు వెలువడ్డాయి. వాటిలో ఆదర్శలోకాలు (1948), *గెలుపునీదే* (1952), *గుడిగంటలు*, *అడుగుజాడలు* (1956), *కొత్త గుడి* (1957), *క్రీనీడలు* (1957) మొదలైన నాటకాలు బహుళ జనాదరణ పొందాయి. గ్రామీణ పునర్ నిర్మాణదిశగా సాగినఆనాటకాలు తెలంగాణా నాటకోద్యమానికి బాసటగా నిల్చి, నాటక రంగంలో కోదాటి లక్ష్మీ నరసింహారావుకు సుస్థిర స్థానాన్ని సంపాదించి పెట్టాయి. ఈయన రచించిన భారతి నాటకం నక్సలైట్ ఉద్యమంపై సంధించిన అస్త్రం. నాటకరంగంలో సంచలనం కలిగించింది.

గం.సు.రె.

నరసింహా రావు, జె.ఎల్. (1929-1992) : నటుడు, దర్శకుడు. విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) స్థాపకులలో ముఖ్యుడు.

ఎన్నో నాటకాల్లో విద్యార్థి దశ నుంచీ వైవిధ్యంగల పాత్రలు ధరించినా, బహుమతులు అందుకున్నా, ఈయన పేరు దర్శకుడు గానే నాటక రంగంలో సుస్థిరంగా నిలిచింది. జె. ఎల్. అంటే నాణ్యత గల నాటక ప్రదర్శనలకు చిరునామా అయింది. క్రమశిక్షణతో ఒద్దికలు జరపడంలోను, తానను కొన్న రీతిలో నాటకం రూపుదిద్దుకొనే వరకు నటీనటులను తీర్చి దిద్దడంలోను, నాటకం తాను ఆశించిన స్థాయిలో ఉండేటట్టు రచనలో చేర్పులు మార్పులు చేసి దానిని సమగ్ర సుందరంగా రూపొందించడంలోను నరసింహారావు దిట్ట. నాటక ప్రదర్శన ఆద్యంతమూ ఆసక్తి జనకంగా సాగేటట్టు జాగ్రత్త వహించడంలో జె.యల్. సిద్ధహస్తుడు. గొల్లపూడి మారుతీరావు రాసిన లావాలో ఎర్రగులాబీ, యండమూరి వీరేంద్రనాథ్ మధ్య రఘుపతి రాఘవ రాజారాం నాటకాలు జె.ఎల్. చేతిలో అద్భుతమైన కళాఖండాలుగా భాసించాయి. జె.ఎల్. ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఏ నాటకమూ అపజయం పొందలేదు.

నాటకరంగంలో దాదాపు అన్ని శాఖల గురించి కూలంకషంగా అధ్యయనం చేసిన ప్రజ్ఞాధురీణుడు. అయినా అంతకు మించిన వినయశీలి, నిగర్వి. నరసింహారావు వ్యక్తిగతంగా తన పేరు ప్రతిష్ఠల కోసం ఏనాడూ ప్రయత్నించలేదు. సన్మానాలకు విముఖుడు. చాట్ల శ్రీరాములు, సోమేశ్వరరావు, గరిమెళ్ల రామమూర్తి వంటి రంగస్థల ప్రముఖులు జె.ఎల్. ప్రాపకంలో, స్నేహహస్తంతో తమ ప్రతిభా పాటవాలకు మెరుగులు దిద్దుకున్నారనటం అతిశయోక్తి కాదు. నాటక ప్రదర్శనలో ఎన్నో కొత్త బాటలు వేసి, ముందు తరాలకు మార్గదర్శకుడైన జె.ఎల్. నరసింహారావు 1992లో నిర్యాణం చెందాడు.

గం.సు.రె.

నరసింహారావు, వల్లం (1927-2006) : ప్రసిద్ధ రంగస్థల కళాకారుడు. కృష్ణాజిల్లా తిరువూరులో 1927లో మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. అయిదారేళ్ళ వయస్సులో గ్రామఫోను రికార్డులు విని తానూ అలా పాడాలని ఉబలాటపడేవాడు. ఆ ఉత్సాహమే క్రమ క్రమంగా వయసుతో పాటు పెరుగుతూ నాటకరంగ ప్రవేశానికి నాంది పలికింది. ఈయన తొలి గురువు కోడూరుపాటి సరస్వతీ రామారావు. పుచ్చలపల్లిసుందరయ్య, కొండపల్లి సీతారామయ్య, చండ్ర రాజేశ్వరరావు వంటి నాయకుల ప్రసంగాలు విని కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితుడయ్యాడు. ఆ పార్టీకి సాంస్కృతిక విభాగంగా పని చేస్తున్న ప్రజా నాట్య మండలిఅండన చేరాడు. వాసిరెడ్డి భాస్కరరావు రాసిన ముందడుగు (1944) నాటకాన్ని జనరంజకంగా ప్రదర్శించి జన బాహుళ్యంలో వల్లం పేరు పదిలం చేసుకున్నాడు. ఈయన నటనకు ముగ్ధుడై పి.సి. జోషి బంగారు పతకంతో సత్కరించాడు. గరికపాటి రాజారావు నేతృత్వంలో సుంకర, వాసిరెడ్డి రచించిన మాభూమి నాటకంలో వందలసార్లు పాల్గని ప్రజానాట్య మండలి ప్రతిష్ఠను పెంపు చేయడంలో తనవంతుపాత్ర నిర్వహించాడు. మా భూమి నాటకం ప్రభుత్వ నిషేధానికి గురికావడంతో ప్రజానాట్య మండలి కార్యక్రమాలు నిలిచిపోయాయి. జీవనోపాధి కోసం మద్రాసుకు వెళ్లి ప్రసిద్ధ సినీదర్శకుడు ఎల్.వి.ప్రసాద్, కె.ఎస్. ప్రకాశరావు సహకారంతో సినిమా రంగంలో ప్రవేశించాడు. విజయా స్టాఫ్ ఆర్టిస్టుగా చాల చిత్రాల్లో నటించాడు. అంతా మనవాళ్ళే, మాగోపి చిత్రాల్లో కథా నాయక పాత్ర సమర్థంగా నటించి పేరు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత మారిన పరిస్థితులకు అనుగుణంగా డబ్బింగ్ ఆర్టిస్టుగా జీవిక ప్రారంభించి ఎన్నో వందల చిత్రాలకు ప్రముఖ నటులకు తనగాత్రం ఇచ్చాడు.

సినిమారంగంలో వున్నా నాటకరంగాన్ని మరచిపోలేదు. హాస్య నటుడు పద్మనాభంతో కలిసి శాంతి నివాసం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాళహస్తి మహాత్మ్యం వంటి నాటకాలను ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రదర్శించాడు. చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ ప్రతిభాపురస్కారం - 2002, వల్లం నరసింహారావును వరించింది. ఈయన 2006 మార్చిలో మరణించాడు.

గం.సు.రె.

నరసింహారావు, వి.వి.ఎల్. (1880-1969) :

ఉత్తమ నటుడు, నాటక కర్త, దర్శకుడు, కవి, సంస్కృతాంధ్ర పండితుడు, పత్రికా సంపాదకుడు, ఆదర్శోపాధ్యాయుడు, పూర్తి పేరు వింజమూరి వెంకట లక్ష్మీ నరసింహారావు. ప్రఖ్యాత గాయనీమణులు సీతా అనసూయల తండ్రి, దేవులపల్లి కృష్ణ శాస్త్రి బావగారు.

కాకినాడ ఎమెచ్యూర్స్, కాకినాడ యంగ్మెన్స్ హ్యాపీక్లబ్, కాకినాడ, పెద్దాపురం విద్యావినోదినీ సభలలో ప్రధాన భూమికాధారి.

ఈయన కాకినాడలో 1880లో జన్మించాడు. చిన్నతనంలో చూసిన వీధినాటకాలు, విశాఖపట్నం జగన్మిత్రనాటక సమాజం వారి *ఉత్తర గోగ్రహణం*, జవ్ంఖండేవారి నాటక ప్రదర్శనలు ఈయనను ఉత్తేజ పరిచాయి. పది మంది పిల్లలను చేర్చుకొని చూసిన నాటకాలను ఇంట్లో ప్రదర్శించడం ఈయనకు మొదటిలో సరదా, ఆ తరువాత పరిపాటయింది.



పిఠాపురం హైస్కూల్లో చదువు తున్న రోజుల్లోనే పద్యాలు బాగాపాడతారనే పేరువచ్చింది. అయిదవ ఫారం చదువుతుండగా ఆ పాఠశాల వార్షికోత్సవంలో వెన్నిస్ వర్తకుడు అనే ఆంగ్ల నాటకంలో గ్రేషియానో పాత్రలో నటించి మెప్పు పొందాడు. ఇదే ఈయన మొదటి వేషం.

1905లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయి కాకినాడ కళాశాలలో ఎఫ్.ఏ చదివాడు. 1909లో సామర్ల కోట మిషన్ మిడిల్ స్కూల్‌లో తెలుగు పండితులుగా చేరాడు. 1912లో ఆ స్కూలు కాకినాడకు మార్చడంతో ఈయన కాకినాడకు తిరిగి వచ్చాడు. ఆ నాటి నుంచే వీరి నాటకరంగం జీవితం నిజంగా ప్రారంభమయిందనే చెప్పాలి. కాకినాడ ఎమెచ్యూర్స్ అనే నాటక సమాజంలో చేరి తెలుగులో మొదటి సారిగా *గయోపాఖ్యానం*లో గయుడు వేషం వేసి మెప్పుపొందడమే గాక రాజమండ్రిలో జరిగిన *గయోపాఖ్యాన* నాటక పోటీలలో సువర్ణ పతకం గెలుచుకున్నాడు. దానితో ఈయన కీర్తి ఆంధ్ర దేశమంతటా వ్యాపించింది. ఆ తరువాత వి.వి.ఎల్. పెద్దాపురం విద్యా వినోదినీ సభ, కాకినాడ సాహితీసంఘం, యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ మొదలైన సంస్థలలో చేరి రకరకాల పాత్రలు ధరించాడు.

తోడి, కళ్యాణి, శంకరాభరణం, సింహేంద్ర, మధ్య, చక్రవాక, మోహన ఈయన అభిమాన రాగాలు. శృంగార, కరుణరసాలుఅభిమానరసాలు. గయుడు, విద్యానాథుడు, రామప్పంతులు వీరి అభిమాన పాత్రలు.

చారిత్రక నాటక పంచకం (1919), *కవి పరాజయం* (1928), *అనార్కలి* (1931), *నరసన్నభట్టు* (1957), *రుక్మిణీ కళ్యాణం* (అముద్రితం), మొదలైన రచనలు వెలువరించాడు.

వి.వి.ఎల్ రచించిన అనార్కలి, నరసన్న భట్టు నాటకాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం బి.ఏకు పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించింది. సాహిత్య నాటకరంగాలలో ఈయన చేసిన సేవను గుర్తించి భారత ప్రభుత్వం 1964లో పద్మశ్రీ బిరుదునిచ్చి గౌరవించింది.

ఈయన తెలుగు నాటకరంగంలోని రాజరాజ నరేంద్రుడు, హరిశ్చంద్రుడు, బాహుకుడు, గయుడు, శివాజి, పృథ్వీరాజు, రాజసింహుడు, విద్యానాథుడు, బిల్వమంగళుడు, శ్రీకృష్ణుడు (నరకాసుర వధ), ధర్మరాజు, రామప్పంతులు, దశరథుడు, పఠాన్, అక్బర్, వసుదేవుడు. గ్రేషియానో, వంటి ఇంగ్లీషు నాటకాలలోని పాత్రలలో కూడా నటించాడు.

ఈయన యుద్ధరంగం అనే వారపత్రికకు సంపాదకత్వం వహించి సమర్థవంతంగా నడిపాడు. ఆ పిమ్మట వి.వి.ఎల్. మద్రాసుకు మకాం మార్చి ప్రశాంత జీవితం గడుపుతూ 1969 జనవరి 12న కన్ను మూశాడు.

శ్రీ.చ.

నరసింహా రావు, స్థానం (1902-1971) : తెనాలి రామ విలాస సభలో నాయికా పాత్రధారి, అధినేత, పద్మశ్రీ, నటనా వతంస, నటశేఖర, ఆంధ్రబాల గంధర్వ, నాటక కళా ప్రపూర్ణ బిరుదాంకితుడు. ఈయన 1902 సెప్టెంబరు 23వ తేదీ బాపట్లలో జన్మించాడు. తల్లి ఆదవ్మ, తండ్రి హనుమంతరావు. తండ్రి చిన్నతనంలోనే చనిపోవడం వల్ల మేనమామ వెంకట నారాయణ పోషకత్వంలో పెరిగాడు. ఈయనకు చిన్నతనంలోనే సంగీత, సాహిత్య, చిత్రలేఖన కళలలో ఆసక్తి జనించింది. వినికిడి సంగీతంలో కూనిరాగాలు తీయడం ప్రబంధ నాయికల చిత్రాలు గీయడం ప్రారంభించాడు. స్కూల్ ఫైనల్ వరకు బాపట్లలో చదివాడు. ఆధునిక కళారీతులలోను, ఛాయా గ్రహణ విద్యలోను కొంత సామర్థ్యం సంపాదించాడు.



1920లో మొట్ట మొదటి సారిగా బాపట్లలో తిరుపతి వేంకటకవుల సన్మాన సందర్భంలో సత్యహరిశ్చంద్ర నాటకంలో చంద్రమతి పాత్ర సమర్థవంతంగా నటించి తిరుపతి కవుల ఆశీస్సులను పొందాడు.

ట్రైనింగ్ స్కూలులో మాస్టరీ చేయతలపెట్టిన స్థానం జీవితంలో కొత్త మలుపు ప్రారంభమయింది. స్థానం ధరించిన చంద్రమతీ పాత్ర నిర్వహణా కౌశల ఖ్యాతి తెనాలి చేరింది. కృష్ణా హిందూ థియేటర్స్ అనే నాటక సమాజం ఆహ్వానం మేరకు నెలకు రూ. 25ల జీతంతో అందులో చేరి యశోద, లీలావతి, మోహిని మొదలైన వేషాలు వేసి కీర్తి గడించాడు. ఆ తరువాత తెనాలి రామవిలాస సభలో చేరి కొంతకాలం నటుడుగా, తరువాత అధినేతగా పనిచేసి ఆ సంస్థకు ఎంతో ఖ్యాతి తెచ్చిపెట్టాడు. రోషనార, మధురవాణి, చిత్రాంగి, సత్య, చింతామణి పాత్రాభినయంలో వీరి కళా నైపుణ్యం పరాకాష్ఠకు చేరుకుంది. ఒకనాడువీరివేషభాషలు అనుకరించని స్త్రీ పాత్ర ధారులు, స్త్రీలు ఆంధ్రలో లేరనే చెప్పాలి.

రోషనారగా స్థానం పాడిన 'నా తల వెంట్రుకల నీడ దాచుదాన, చిత్రాంగి గా 'నామాట వేదమంత్రముగాగ', సత్యగా 'మీరజాలగలడా నాయానతి', తెలుగు రసిక లోకాన్ని ఆనందంలో ముంచెత్తాయి. వారి హృదయాలపై చెరగని ముద్రవేశాయి. ఇక మధురవాణి (లేట్టి పిట్ట) మరుపురాని సన్నివేశం.

స్థానం ఆంధ్రరాష్ట్రంలోనే కాక మద్రాసు, మైసూరు, మహారాష్ట్ర, బెంగాల్ మొదలైన రాష్ట్రాలలోని అనేక పట్టణాలలో, రంగూన్‌లో నాటకాలు ప్రదర్శించి మన్ననలు పొందాడు. స్వర్ణ కిరీట, స్వర్ణ రజిత పతకాలను బహుమతిగా పొందాడు. **1933**లో బర్మా యాత్రలో రంగూన్ పౌరులు బహుకరించినదే వారి స్వర్ణ కిరీటం.

ఈయన నటుడే గాక రచయిత కూడా. నటస్థానం *(స్వీయ చరిత్ర)*, మోహినీ రుక్మాంగద, శ్రీకృష్ణదేవరాయులు (1955) (నాటకాలు), వ్యాసావళి రచించాడు.

విజయవాడలో **1955** డిసెంబర్ **31** నుంచి జరిగిన నాటక తరగతులకు ప్రధానాచార్యత్వం వహించాడు. ఈయనను కేంద్ర ప్రభుత్వం **1956**లో పద్మశ్రీ బిరుదుతో గౌరవించింది.

1957లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో నాటక ప్రయోక్తగా నియమితులయి కొన్ని వందల నాటకాలకు ప్రయోక్తగా వ్యవహరించాడు. ఇదే ఏడాది ఆంధ్రప్రదేశ్ సంగీత నాటకఅకాడమీకిసంయుక్త కార్యదర్శిగా నియమితుడయ్యాడు. **1960**లో అకాడమీ నాటక కళా ప్రపూర్ణ బిరుదు, విశిష్ట సభ్యత్వం ఇచ్చింది. **1961**లో ఈయనకు కేంద్ర సంగీత నాటక అకాడమీ జాతీయ అవార్డు బహూకరించింది. **1962**లో హైదరాబాదులో షష్ఠి పూర్తి మహోత్సవం సమయంలో ఈయనకు మల్లాది వెంకట కృష్ణ శర్మ వసంతసేన నాటకాన్ని, గుమ్మలూరి సత్యనారాయణ కళోపాసి నాటకాన్ని అంకితమిచ్చారు.

ఆకాశవాణి పదవీ విరమణ చేసి తిరిగి తెనాలి చేరుకొని ఒకటిన్నర సంవత్సరాలు పక్షవాతంతో బాధపడ్డాడు. ఆ పక్షవాతంతోనే **1970** సెప్టెంబర్‌లో విజయవాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటకోత్సవాలకు అధ్యక్షత వహించాడు.

సుమారు **50** సంవత్సరాలలో **2000** నాటక ప్రదర్శనలిచ్చి నాటకరంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచు కున్నాడు.

వేషధారణలో స్థానం ఎంతో శ్రద్ధ చూపేవాడు. వేషం మీదికి దుస్తులు మొదలైనవి స్వయంగా నిర్ధారణ చేసుకొనేవాడు. నాటక ప్రదర్శనానికి కొన్ని గంటల ముందే వేషం వేసుకోవడం అలవాటు. చీర మడతకు **70, 80** పిన్నీసులు ఉపయోగించేవాడు. రవికలు, జాకెట్ల నమూనా దర్జీకి చెప్పి కుట్టించుకొనేవాడు. ఒకసారి ఈయన ఆడవేషం వేసుకొని పేరంటానికి వెళితే ఎవరూ ఈయనను గుర్తించ లేకపోయారట.

చంద్రమతి, మోహినీ, లీలావతి, యశోద, రోషనార, మధురవాణి, చిత్రాంగి, సత్యభామ, చింతామణి, ముర, రాణి సంయుక్త, యామినీ పూర్ణ తిలక, శకుంతల, చండిక, కోకిల, దేవదేవి, పృధువు, సైరంధ్రి, మల్లమ్మ దేవి, సుభద్ర, వీరాబాయి, అనసూయ, విద్యాధరి, నారదుడు (రాధాకృష్ణ సినిమా) మొదలైన పాత్రలలో నటించిన స్థానం **1971**లో మరణించాడు.

శ్రీ.చ.

నర్తనకం : సంస్కృత ఉపరూపకం. నాట్య దర్పణ, భావ ప్రకాశన ప్రేక్షణక లక్షణ ప్రథమ శ్లోకం నర్తనకానికి అన్వయిస్తుంది.

నర్తనకంలో నేపథ్యంలో నాంది, ప్రరోచన సాగుతాయి. గర్భవిమర్శ సంధులుండవు. వృత్తిలో అన్నీ ఉంటాయి. మాగధ శౌరసేన ప్రాకృతాలు ఎక్కువ. రెండు సంధులే ఉంటే ఉత్తమ అధమ నాయకులు, ఆరభటీ భారతీ వృత్తులు. దీనిని కొందరు లాక్షణికులు ప్రేంఖణమన్నారు. ఉదా. వాలివధ, నృసింహ విజయం.

శ్రీ.చ.

నర్మం : 1. ప్రతి ముఖ సంధ్యంగం. 2. కైశికీ వృత్యంగం. కథా బీజానికి సంబంధించిన పరిహాస వాక్యం, నర్మం.

ఉదా : వేణీ సంహార నాటకం ద్వితీయాంకంలో పాండవుల క్రోధాన్ని దుర్యోధనుడు పరిహసించడం.

2. కైశికీ వృత్యంగం : నర్మమనగా పరిహాసం, శృంగార చేష్ట, శృంగార రసంతో నిండి ప్రియుని మనస్సును రంజింపచేసే అగ్రామ్య పరిహాసం నర్మం.

(శృంగార రస భూయిష్టః ప్రియ చిత్తాను రంజకః అగ్రామ్యః పరిహాసస్తు నర్మ స్యాత్తత్రిధామతమ్ -ర.సు. 1-270).

శ్రీ.చ.

నర్మగర్భం : కైశికీ వృత్యంగం. భరతముని దీనిని ఛన్నవేత్త ప్రతీచారం అన్నాడు. నాయకుడు తన కార్య నిర్వహణకు ప్రచ్ఛన్నంగా ఉండి కార్యం సాధించుకోవడం. అనురాగాభి వృద్ధి కూడా ఇందులో కనబడుతుంది.

ఉదా॥ వేదంవేంకటరాయశాస్త్రి రచించిన ప్రతాపరుద్రీయ నాటకంలో ప్రతాపరుద్రుని చెర నుండి విడిపించే కార్య నిర్వహణకు యుగంధరుడు పిచ్చివాని వేషంలో 'ఢిల్లీ సుల్తాన్ పట్టుకపోతాన్' అంటూ ఢిల్లీలో పిచ్చి వానివలె తిరగడం నర్మగర్భం.

శ్రీ.చ.

నర్మద్యుతి : ప్రతిముఖ సంధ్యంగం. హాస్య వచనం వల్ల జనించిన ఆనందం లేక ధైర్యం నర్మద్యుతి. క్రోధ, దుష్టత్వాలను కప్పిపుచ్చే పరిహాస ప్రసంగం నర్మద్యుతి.

శ్రీ.చ.

నర్మస్ఫింజం : కైశికీ వృత్తి భేదం. దీనినే నర్మ స్ఫుంజం అని కూడా అంటారు. సుఖంతో ఆరంభమైన నాయికానాయకుల తొలి సంగమం భయంతో అంతమవడం నర్మస్ఫింజం.

(నర్మస్ఫింజః సుఖారంభో భయాంతో నవ సంగమే. - ద.రూ.2-51)

నర్మమనగా శృంగారోచిత వ్యవహారం. స్ఫింజం లేక స్ఫుంజం అనగా విఘ్నం. నర్మ స్ఫింజమనగా శృంగారోచిత వ్యవహారా నికి విఘ్నం. సాధారణంగా విఘ్నం పూర్వ నాయిక మీది భయం వల్ల శృంగారోచిత వ్యవహారానికి విఘ్నం. ఉదా॥ మాళవికాగ్ని మిత్రంలో మాళవికాగ్ని మిత్రుల నవసంగమం సుఖారంభం చివరకు భయంతో అంతమవుతుంది.

శ్రీ.చ.

నర్మస్ఫోటం : కైశికీ వృత్యాంగం. చిన్న చిన్న భావాలతో ప్రేమను సూచించడం నర్మస్ఫోటం. ఆకస్మిక సంభోగ విచ్ఛిత్తి కూడా నర్మ స్ఫోటమేనని కొందరు లాక్షణికుల మతం. ఉదా॥ కాళ్లకూరి నారాయణరావు రచించిన చింతామణి నాటకం ద్వితీయాంకంలో సుబ్బిశెట్టి చింతామణితో -

సుబ్బి - ఓ పాల ముద్దు పెట్టుకుందునా (తెరలో) అమ్మా ఎవరో మేళము కావలెనని వచ్చినారు. ఒకసారి క్రిందికి రమ్మా.

సుబ్బి - పాడుముండ. పానకంలో పుడకలాగా సమయానికి సక్కావొచ్చి సరదా చంపేసింది.

శ్రీ.చ.

నవరసాలు : భరతముని నాట్య శాస్త్రంలో ఎనిమిది రసాల ప్రస్తావనే ఉంది.

(అష్టౌ నాట్యే రసః) అని చెప్పినా ఆ తరువాత వచ్చిన లాక్షణికులు శాంతాన్ని కూడా ప్రత్యేక రసంగా పరిగణించి రసముల సంఖ్య తొమ్మిదని సిద్ధాంతీకరించారు. ఈదృష్టితోనే ఉద్భటుడు అనే లక్షణ శాస్త్రవేత్త భరతుని అష్టరస శ్లోకంలో శాంత పదాన్ని పొందుపరచి ఈ కింది విధంగా సవరించి నాట్య శాస్త్రంలో పొందు పరచినట్లు అభిజ్ఞుల అభిప్రాయం.

శృంగార హాస్య కరుణా రౌద్ర వీర భయానకాః
భీభత్సాద్భుత శాంతాశ్చ నవ నాట్యే రసాః స్మృతాః
రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహో భయం తథా
జుగుప్సా విస్మయశమాః స్థాయిభావాః ప్రకీర్తితాః)

శ్రీ.చ.

నవలా నాటక సమాజం (గుంటూరు) : దంటు వెంకట కృష్ణయ్య నవలా సమాజాన్ని 1928లో స్థాపించాడు. ఈ సమాజంలో అందరూ స్త్రీలే, దాసరి కోటిరత్నం, పసుపులేటి కన్నాంబ, సిద్దాబత్తుని శ్రీహరి, ఆదోని అమ్మణ్ణిబాయి, దాసరి యామినీ పూర్ణతిలకం, దాసరి అంజనీబాయి, జె. సరస్వతి మొదలైన వారు ఈ సమాజ సభ్యులు ఈ సమాజం ప్రదర్శించిన వివిధ నాటకాలలో పాల్గొన్నారు. *శ్రీకృష్ణ తులాభారం, రోషనార, కృష్ణ లీలలు, రామదాసు, సతీ అనసూయ, సావిత్రి, సారంగధర* మొదలైన నాటకాలను ప్రదర్శించేవారు. ఈ సమాజంలో అందరూ స్త్రీలే కావడం వల్ల స్త్రీ, పురుష పాత్రలను స్త్రీలే ధరించేవారు. ఆ రోజుల్లో ఈ సమాజం నాటకాలను ప్రజలు బాగా ఆదరించారు.

నే.వ.శ.

నాంచారయ్య సి.హెచ్ (జ: 1944) : నటుడు, మహతీ కళా స్రవంతి స్థాపకుడు. సంప్రదాయ, సాంఘిక నాటకాలలో నటించి పేరు తెచ్చుకున్న నాంచారయ్య 1944, నవంబరు 24న జన్మించాడు. తల్లిదండ్రులు రామలక్ష్మి, చిలుకోటి రాములు. మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాలలో బి.ఏ వరకు చదువుకున్నాడు.

ప్రముఖ రంగస్థలనటుడు అబ్బూరి వరప్రసాదరావు పాడిన గ్రామ్‌ఫోన్ రికార్డులు విన్న నాంచారయ్య నాటక రంగం వైపు ఆకర్షితు డయ్యాడు. పన్నెండవ ఏటనే గయోపాఖ్యానం నాటకంలో నటించాడు. శ్రావ్యమైన కంఠం, చక్కనిరూపం, నటనలో ఉన్నతస్థితిని చేరుకోవాలనే తపన నాంచారయ్యను మంచి నటుడుగా తీర్చి దిద్దాయి. శ్రీకృష్ణ రాయబారం, గయోపాఖ్యానం, శ్రీకృష్ణ నారదీయంలో శ్రీకృష్ణుడు, సత్యహరిశ్చంద్రలో సత్యహరిశ్చంద్రుడు, చింతామణిలో బిల్వమంగళుడు, రామాంజనేయ యుద్ధంలో రాముడు మొదలయిన పాత్రలలో నటించి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ప్రదర్శనలిచ్చి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. బబ్బిలియుద్ధం, తెనుగుతల్లి, ఛైర్మన్ మొదలైన సాంఘిక నాటకాలలో నటించాడు.

ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడి 1990లో మహతీ కళా స్రవంతి సంస్థను స్థాపించి నాటక సప్తాహాలను నిర్వహించాడు. రాష్ట్రస్థాయి పద్య నాటక పోటీలు నిర్వహించాడు. సంప్రదాయ నాటకాలలోని ప్రధాన భూమికలు పోషించి పేరెన్నికగన్న రంగస్థల నటుల సరసన స్థానం సంపాదించాడు. నాటకరంగసేవ చేస్తున్న నాంచారయ్యను బండారు రామారావు కళాస్రవంతి, శ్రీ కృష్ణదేవరాయ కళా సమితి, కళా రాజ్యం (హైదరాబాదు), ఆంధ్ర మహాసభ (బంబాయి) కళాసంస్థలు ఘనంగా సత్కరించి, గానకళానిధి, మధురగాన నటప్రవీణ బిరుదులనిచ్చి గౌరవించాయి. యువకళా వాహిని వనారస గోవిందరావు పురస్కారాన్ని, ఆర్.కె. అసోసియేషన్ (అనంతపురం) బళ్లారి రాఘవ అవార్డును, సాహితి మిత్ర సమితి (మచిలిపట్నం) అభినవ హరిశ్చంద్ర అవార్డునిచ్చి సత్కరించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2000లో నిర్వహించిన నంది నాటకపోటీలలో శ్రీకృష్ణ నారదీయం నాటకంలో శ్రీ కృష్ణుని పాత్రధరించి ఉత్తమ నటుడు అవార్డుతో బాటు బంగారు నంది బహుమతి అవార్డును అందుకున్నాడు.

దాసరి.ఎన్

నాంది : భారత దేశంలో ఏ శుభకార్యంచేసినా, చివరకు ఏ సమావేశం జరిపినా ముందుగా విఘ్నోపశాంతికి విఘ్నేశ్వర పూజగాని, దైవ ప్రార్థన గాని చేయడం సంప్రదాయం. ఈ సంప్రదాయానుసారం నాటక ప్రయోగానికి ముందు తెరలోపల చేసే పూజాపునస్కారాలలో భాగంగా ప్రథమ సూత్రధారుడు పఠించే శ్లోకం లేదా పద్యానికి నాంది అని పేరు. ఇది పూర్వరంగం. రంగ ద్వారమనే అంగం.

ప్రేక్షకులను నన్వింప (ఆనందింప) చేసేది గాబట్టి దీనికి నాంది అని పేరు. దేవతలను, ఇంద్రియాలను ఆనందింప జేసేది కాబట్టి నాంది అని కొందరు, నందీశ్వరునకు ప్రియమైనది (నాందీ నందీశ్వర ప్రియా - వసంత రాజీయం) కాబట్టి నాంది అని మరి కొందరు నిర్వచించారు.

అసలు నాంది రెండు రకాలు - క్రియారూపనాంది, వాగ్రూప నాంది. పరమ శివుని వాహనం నంది. ఈ నంది రంగరూపం దాలుస్తుంది. పూర్వరంగంలో శివుడు సన్నిహితుడు. అతని సన్నిధిలో ఉంటుంది నంది. పూర్వరంగం ఉద్దేశించి చేసే పూజ క్రియా రూప నాంది, ఇక సూత్రధారుడు పఠించే శ్లోకం లేక పద్యం వాగ్రూపనాంది.

ఈ వాగ్రూప నాందిని సూత్రధారుడు గాని, నాటక కవిగాని రచించాలి. నాటక ప్రారంభంలో విధిగా దీన్ని పఠించాలి. ప్రేక్షకాదులకు శుభంకోరేదిగా మంగళప్రదంగా ఉండాలి. ఇందులో శుభ స్ఫోరకమైన చంద్ర, శంఖ,అబ్జ కైరవాది పదాలు గాని, వాటి పర్యాయపదాలు గాని ఉండాలి.

శ్రీ.చ.

నాగభూషణం, సి (జ.1922) : నటుడు, ప్రజా నాట్య మండలి సభ్యుడు. రక్త కన్నీరు నాగభూషణంగా ప్రసిద్ధుడు. పూర్తి పేరు చుండి నాగభూషణం, ప్రకాశం జిల్లా, అనకర్ల పూడి గ్రామంలో 1922, మార్చి 22న జన్మించాడు. ఆ గ్రామంలో విద్యాభ్యాసానికి ఎక్కువ అవకాశాలు లేనందు వల్ల ఈయన కుటుంబం నెల్లూరుకు తరలివెళ్ళింది. 10 సంవత్సరాల ప్రాయంలో నాటకాలలో నటించడం ప్రారంభించాడు. మిడిల్ స్కూలు నుంచి హైస్కూలు, కాలేజి వరకు నాటకపోటీలలో ఎప్పుడూ నాగభూషణమే ప్రథమ బహుమతి గెల్చుకునే వాడు. ఇంటర్మీడియట్ పాసైన మీదట రైల్వే ఉద్యోగిగా చేరాడు. 1947లో విజయవాడకు బదిలీ అయిన తరువాత తన రంగస్థల కార్యక్రమాలను విస్తృతం చేసి

నాటకరంగాన్ని నవ చైతన్యంతో ఉద్దీపింపజేశాడు. పరివర్తన, *ప్రగతి, ఇదా ప్రపంచం, ఎదురీత, బాగుబాగు, మావూరు, గాలి మేడలు, అల్లీముఠా, మహా నటుడు* వంటి అనేక నాటకాలు, నాటికలు ప్రదర్శించి తన నటనా చాతుర్యంతో నాగభూషణం ప్రజలందరి హృదయాలను ఆకర్షించుకోగలిగాడు. పరిషత్తులలో పెక్కు బహుమతులందుకున్నాడు.

సినిమాలలో అవకాశం రావడంతో 1952లో రైల్వే ఉద్యోగానికి రాజీనామాచేసి మద్రాసులో స్థిరపడ్డాడు. అనతి కాలంలోనే సినిమా రంగంలో అగ్రశ్రేణి నటుడయ్యాడు. నాటక ధర్మాన్నే సినిమా ప్రక్రియలోను సమప్రతిభతో పోషించడంలో నాగభూషణంకు సాటి ఆయనే. దాదాపు 200 సినిమాలలో నటించాడు.

రక్త కన్నీరు నాటకం ద్వారా ఆయన తెలుగు నాటక రంగంలో అపూర్వ విజయాన్ని సాధించాడు. ఈ నాటకం 5000 సార్లు ప్రదర్శితమైంది. సాంఘిక నాటకానికి వృత్తి పరమైన అంతస్తును కల్పించిన అసాధారణ తొలి కళాకారుడాయన. ప్రజానాట్య మండలి కార్యక్రమాలలో నిర్మాణాత్మక పాత్రనిర్వహించిన ప్రజా నటుడు నాగభూషణం.

గం.సు.రె.

నాగభూషణరావు, సింగరాజు (1896-1968) : ఔత్సాహిక నటుడు. కళాతపస్వి. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. గుంటూరుజిల్లాలోని పలు ఉన్నతపాఠశాలల్లో ఉపాధ్యాయుడుగా, ప్రధానోపాధ్యాయుడుగా పని చేసి ఎంతమందినో విద్యావేత్తలుగా తయారు చేసిన నాగభూషణరావు 1896, నవంబరు 3న బాపట్లలో జన్మించాడు. ఈయనకు నాటకమే లోకం. అలా అని ఉపాధ్యాయ వృత్తిలో ఏ మాత్రం అశ్రద్ధ చూపలేదు.

నాగభూషణరావు పూర్వ నాటక రంగానికీ, ఆధునిక నాటకరంగానికి వారధి. పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలోనూ నటించి, రెంటిలోనూ మేటి అనిపించుకొన్నాడు. యుద్ధంలో సైనికునికి లాగానే నాటక లోకంలో నటునికి క్రమశిక్షణ ఎంతో అవసరం అన్న స్టానిస్లవస్కీ మాటలు నాగభూషణరావుకి ఎంతగానో అన్వయిస్తాయి. గంట కొట్టే సరికి తరగతిగదిలోనికి ఎలా హాజరయే వారో ఒద్దికల సమయానికి నిక్కచ్చిగా హాజరయేవాడు. ఎన్ని పర్యాయాలు ఒద్దిక చేయవలసి వచ్చినా విసుగుచెందేవాడు కాదు. పాత్రను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అర్థం చేసుకోనిదే వేషం వేసేవాడు కాదు.

దృఢకాయం, విశాలమైన ముఖం. భావ ప్రకటనకు ఎంతగానో ఉపయుక్త మయ్యాయి. ఈయనకు వీర రసం అభిమాన రసం, నటించిన పాత్రలు ఎక్కువగా వీర రస ప్రధానమైనవే. తెలుగు నాటకాలలోనే గాక ఇంగ్లీషు నాటకాలలో కూడా నటించి మెప్పుపొందాడు.

1958లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలో వెంకన్న కాపురం నాటికలో వెంకన్న పాత్ర ధరించి ఉత్తమ నటుని బహుమతి తీసుకొన్నాడు. ఆంధ్ర దేశంలో వివిధ ప్రాంతాలలో జరిగిన అనేక పోటీలలో ఉత్తమ నటునిగా ఎన్నికయ్యాడు. వృద్ధాప్యం వచ్చినా వేషాలు వేయడం మానలేదు. వృద్ధ పాత్రలు ధరిస్తూనే వచ్చాడు. యుగంధర పాత్రాభినయంలోను, వెంకన్న పాత్రాభినయంలోను వీరి నటనా కౌశలం పరాకాష్ఠనందుకొన్నది.

ఈయన యుగంధరుడు, హిరణ్యకశిపుడు, తానీషా, రుస్తుం, తానాజీ, కర్ణ, పఠాన్, చాణక్యుడు, పాపారాయుడు, భీముడు, దుర్గాదాస్, వాల్మీకి, విశ్వామిత్రుడు, యముడు, కరండకుడు, వసంతకుడు, తిమ్మరుసు, వెంకన్న, (వెంకన్న కాపురం), సుందర రామయ్య (తెరలో తెర) కోదండం(నిజరూపాలు). ఇవేగాక ప్రతాపరుద్రీయంలోని అన్ని పాత్రలలో నటించాడు. ఆంగ్ల నాటకాలలో బ్రూటస్, పిజారో, ఒథెల్లోగా నటించిన నాగభూషణరావు 1968, సెప్టెంబరు 27న మరణించాడు.

శ్రీ.చ.

నాగభూషణశర్మ, మొదలి (జ:1936) : నటుడు, దర్శకుడు, నాటకకర్త, రంగస్థల అధ్యాపకుడు, విమర్శకుడు. 1936, జులై 24న గుంటూరు జిల్లా, ధూళిపూడి గ్రామంలో జన్మించాడు. నివాసం హైదరాబాదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషుశాఖలోను, నాటక శాఖలోను ఆచార్యులుగా పనిచేశాడు. నాటక విజ్ఞానంలో నిధులు. విదేశాలలో పర్యటించి నాటక ప్రయోగ రీతుల్ని అధ్యయనం చేసి శిక్షణ పొందాడు.

నవల, నాటక సాహిత్యానికి చెందిన అనేక పరిశోధనాత్మక వ్యాసాలు పత్రికల్లో ప్రకటించాడు. విషాదాంతం, జంట పక్షులు, సంభవామి, నరజాతి చరిత్ర, మన్మధుడు మళ్లీ పుట్టాడు, రాజా ఈడిపస్ (సోఫోక్లిస్ నాటకానికి అనువాదం) ప్రజానాయకుడు ప్రకాశం మొదలైన నాటకాలను, అన్వేషణ, అడ్డదారి, ఆగస్టు *15*, జననీ జన్మ భూమి, రాజదండం మొదలైన నాటికలను రచించాడు. తెలుగు సాహిత్యం - *గాంధీజీ ప్రభావం, నూరేళ్ళ తెలుగు నాటకరంగం* (సంపాదకులు), లోచన (వ్యాససంపుటి) వీరి ఇతర రచనలు. *ప్రజానాయకుడు ప్రకాశం* నాటకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం లభించింది.

గం.సు.రె.

నాగమణి (జ.1959) : రంగస్థల నటి. తూర్పు గోదావరి జిల్లా ముమ్ముడివరం గ్రామంలో 1959, జూన్ 6న జన్మించింది. పదహారవ ఏట చదువెందుకు అనే వయోజన విద్యా ప్రచారక నాటికతో రంగస్థల ప్రవేశం చేసింది. ఆనాటి నుంచి రంగస్థలానికే అంకితమైంది. తొలిదశలో ఎర్రంశెట్టి సుబ్బారావు దగ్గర అభినయరీతుల్లో మెళకువలు నేర్చుకొన్న ఈ నటికి కన్యాశుల్కం నాటకం గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ నాటకంలో బుచ్చమ్మగా, పూటకూళ్ళమ్మగా, మధురవాణిగా సమప్రతిభతో వివిధ సందర్భాలలో నటించి నటనలో వైవిధ్యం చూపి ప్రశంసలందుకొంది. జె.వి. సోమయాజులు, జె.వి. రమణ మూర్తివంటి ప్రతిభామూర్తులతో కలిసి నటించింది. ఎన్ని నాటకాల్లో పాల్గన్నా ఇంకా ఏదో నేర్చుకోవాలన్న తపనకు పట్టుదల, క్రమశిక్షణ తోడై ఈమెను ఉత్తమనటిగా తీర్చిదిద్దాయి. నాగమణి సాత్త్వికాభినయంలోను, వాచికాభినయంలోనూ దిట్ట.

సంధ్యాఛాయ, అడవి దివిటీలు, గారడీ, పావల, భయం, అసురసంధ్య, డామిట్ కథ అడ్డం తిరిగింది, రాజా ఈడిపస్, సామ్రాట్ అశోక, మహోదధి, చీకటింట్లో నల్లపిల్లి, హిరోషిమా వంటి నాటికా నాటకాల్లో వైవిధ్యంగల పాత్రలను సమర్థవంతంగా పోషించి వాటికి ప్రాచుర్యం తెచ్చింది. అత్తిలి కృష్ణారావు, బాబీ, కృష్ణ చైతన్య, కె.ఎస్.టి. శాయి, తల్లాఝుల సుందరం, తాళ్ళూరి శివరామకృష్ణారావు, రామనాథం వంటి ప్రతిభావంతులైన దర్శకుల సారథ్యంలో పోషించిన పాత్రలకు న్యాయం చేసింది. శ్రీకృష్ణ రాయబారం, మైరావణ వంటి పద్య నాటకాల్లోనూ పాత్రధారణ చేసి మెప్పించింది. తన నట జీవితంలో సుమారు 200 నాటకాలతో 2000ల ప్రదర్శనలిచ్చింది. హైదరాబాద్‌లో జరిగిన నంది నాటకోత్సవాలలో నాలుగో సింహం నాటికను స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించింది. టి.వి. సీరియల్స్‌లో విరివిగా పాల్గనే నాగమణి నాటకరంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చే నటి.

గం.సు.రె.

నాగయ్య, చిత్తూరు వి (1904-1973) : రంగస్థల, సినీనటుడు, ప్రయోక్త, నిర్మాత, వదాన్యుడు, సంగీత విద్యాంసుడు, నట సమ్రాట్, నట శేఖర బిరుదాంకితుడు, ఈయన రేపల్లెలో 1904 మార్చి 28న జన్మించాడు. తండ్రి వి.ఆర్.శర్మ. ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ మాజీ సభ్యుడు, పద్మశ్రీ బిరుదాంకితుడు.

నాగయ్య రేపల్లెలో విద్యపూర్తిచేసుకొని చిత్తూరు జిల్లా బోర్డులో ఉద్యోగిగా చేరాడు. పని చేస్తూనే చిత్తూరు రామవిలాస సభలో చేరి అందులో ముఖ్య భూమికలు ధరిస్తూ ఆ సభ అభివృద్ధికి ఎంతగానో పాటుబడ్డాడు. ఈ సభ నిర్మాతలలో ఒకడుగా ఈయునను పరిగణించవచ్చు. బళ్ళారి రాఘవ వంటి మహానటుల సరసన నటించి పేరు పొందాడు. కబీరు పాత్రధారణ వీరి ప్రత్యేకత. ఈయన ధరించిన నాటక పాత్రలు కబీరు, చిత్రాంగి, షాబి, యశోద.

ఆ తరువాత చలన చిత్ర రంగంలో చేరి వాహినీ పిక్చర్స్‌లో ప్రధాన పాత్రలు ధరించి, రేణుకా ఫిలింస్ అనే స్వంత సంస్థను స్థాపించి త్యాగరాజు, రామదాసు వంటి ఉత్తమ చిత్రాలను స్వయంగా నిర్మించాడు. దాదాపు 138 చిత్రాలలో నటించిన నాగయ్య 1973, డిసెంబర్ 30న మరణించాడు.

శ్రీ.చ.

నాగేంద్రరావు, పింగళి (1901-1971) : నాటక, సినీ రచయిత, కవి, కథకుడు, నాటక ప్రయోక్త, నాటక సమాజ నిర్వహణా దక్షుడు, నిరాడంబర జీవి, బహుభాషా పండితుడు, కృష్ణాపత్రిక దర్బారులో ప్రముఖ దర్బారీయుడు. తండ్రి గోపాల కృష్ణయ్య, తల్లి మహాలక్ష్మమ్మ.

నాగేంద్రరావు 1901 డిసెంబరు 29న రాజాంలో జన్మించినా బందరులో స్థిరనివాస మేర్పరచుకోవడంతో బందరు వాసిగానే పరిగణితుడయ్యాడు.

1919 ప్రాంతంలో కలకత్తాలో ద్విజేంద్రలాల్ రాయ్ నాటకం మేవాడపతనం ప్రదర్శనంచూసి ఉద్దీపితుడయ్యాడు. స్వదేశీ ఉద్యమం ప్రేరణ అయింది. 1922లో దీన్ని

ఆంధ్రీకరించాడు. దీనిని బందరు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ ప్రదర్శించింది. నాగేంద్రరావు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ కార్యదర్శిగా, ప్రయోక్తగా, 1940 వరకు పనిచేశాడు. ఈయన దర్శకత్వంలో ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ కళా శిఖరాలను అధిరోహించింది.

బందరులో ఉండగానే తారుమారు, భలే పెళ్లి చిత్రాలకు సంభాషణలు రాశాడు. ఆ తరువాత 1940లో మద్రాసులో స్థిర నివాసమేర్పరచుకొని అనేక చిత్రాలకు మాటలు, పాటలు, రాసి అగ్రశ్రేణి సినీ రచయితగా పేరు తెచ్చుకున్నాడు. ఈయనను ఆంధ్ర నాటకకళాపరిషత్తు ఘనంగా సన్మానించింది. నాగేంద్రరావుకు తెలుగు దేశాభిమానం ప్రగాఢం. నారాజు నాటకం లోని చిత్రపాత్ర పాట వల్ల తెలుస్తుంది. ఈ క్రింది తెలుగు తల్లి పాట ఆ రోజులలో నలు మూలలా మారు మోగింది.

"తెలుగు దేశము మాది
తెలుగు వారము మేము
తెలుగు వారంటేను దేవతలె మెచ్చాలి"

ఈయన జేబున్నీ సా నాటకం ఆనాటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వ ఆగ్రహానికి, నిషేధానికి గురయింది.

జేబున్నీసా (1923), వింధ్య రాణి (1928), పాషాణి, మేవాడు పతనం, నారాజు (1929), క్షాత్రహిందు (1948), ఒకే కుటుంబం, హరిశ్చంద్ర (అముద్రితం), ప్రహసనం - గుమ్మెత్తుచావు (1921) నాటకాలను రచించిన నాగేంద్రరావు 1971, మే 6న మరణించాడు.

శ్రీ.చ.

నాగేశ్వర రావు, ఆవేటి (1914 - 1967) :

నటుడు, కళాపిపాసి, దర్శకుడు, సురభి నాటక సమాజ వ్యవస్థాపకుడు, న్యూ పూర్ణానంద థియేటర్స్ అధినేత, కనకాభిషిక్తుడు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యుడు, వదాన్యుడు, నటరాజేంద్ర, నాట్య కళా ధురీణ బిరుదాంకితుడు. 1914, ఆగస్టు ఒకటిన జన్మించాడు. తల్లి అంజనమ్మ, తండ్రి వెంకటస్వామి.

భీమవరం, గుంటూరులో చదువుకుంటున్న రోజులలోనే వంశానుగతమయిన నాటక కళ మీద అభిలాష పుట్టింది. చిన్న పిల్లలను చేర్చి నాటకాలాడిస్తూ పెద్దల మన్ననలు పొందాడు. స్కూల్ ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తరువాత కుటుంబమంతా కలిసి తండ్రి ఆధిపత్యంలో 1934 సెప్టెంబర్ 4న మొదటి కుటుంబ నాటకం తులాభారం ప్రదర్శించారు. నాగేశ్వరరావు, పూర్ణిమ, నాయకా నాయిక పాత్రల ధరిస్తూ ఆంధ్రదేశమంతటా దిగ్విజయంగా నాటకాలు ఆడారు. కాని అంతః కలహాల వల్ల 1943లో అన్నదమ్ములు విడిపోయారు. నాగేశ్వరరావు న్యూ పూర్ణానంద థియేటర్స్ పేరుతో మరో కొత్త సమాజం స్థాపించి నిర్యాణం వరకు అతి రమ్యంగా దేశమంతటా నాటకాలాడాడు.

క్షణంలో దృశ్యం మారడానికి వీలయ్యే ట్రాలీ స్టేజీని మొట్ట మొదటగా ప్రవేశపెట్టింది ఈయనే. ఎప్పుడూ ఏదో ఒక నూతనత్వం చూపడానికి అర్రులు చాస్తూండేవాడు. భారత ప్రభుత్వం వీరి *బలిదానం*,*శ్రీకృష్ణదేవరాయలు* నాటకాలు ప్రదర్శించడానికి, లైటింగ్ వగైరాలు కొనుక్కోవడానికి సహాయం చేసింది.

సురభి నాటక కళా సంఘం స్థాపించి, సురభి సప్తతి స్వర్ణోత్సవాలు జరిపాడు. ప్రత్యేక సంచిక వెలువరించాడు.

ఈయన నారద (*అనసూయ*), రామదాసు, శ్రీరాముడు, హరిశ్చంద్రుడు, శకారుడు, రాజు (*బలిదానం*) శ్రీకృష్ణ దేవరాయలు, దుర్యోధనుడు, మాయల మరాఠి వంటి పాత్రలు ధరించాడు. 1959లో బాపట్ల విజ్ఞాన సమితి ఈయనకు నట రాజేంద్ర బిరుదు నిచ్చి సన్మానించింది. తెనాలి వర్తక సంఘం నాగేశ్వరరావు దంపతులకు కనకాభిషేకం చేసింది. నవరత్న హారం బహూకరించింది. గాలివీడు గ్రామంలో సువర్ణ ఘంటాకంకణం బహూకరించారు. ఈయన 1967, సెప్టెంబర్ 26న మరణించాడు.

శ్రీ.చ.

నాగేశ్వర రావు, కృత్తివెంటి (1886-1956) :

ఈయన 1886, ఫిబ్రవరి 23న బందరులో జన్మించాడు. నటుడు, సమాజ నిర్వహణా దక్షుడు, సువర్ణపతక గ్రహీత. రంగూన్ తదితర దేశాల్లో నాటకాలు ప్రదర్శించిన ఘనుడు. అనేక మంది యువ నటులకు అచార్యుడు.

నాటకాలు వేసే తొలిరోజుల్లోచెలికత్తె పాత్రలలో నటించే వాడు. తరువాత సీత, శకుంతల మొదలయిన నాయిక పాత్రలలో నటించాడు. కలకత్తా మొదలైన పట్టణాలలో దేశ



విదేశీ నాటక సమాజాల వారి నాటకాలు చూచి వారి నమూనాలో బ్రహ్మాండమయిన సీనరీలు రాయించాడు. ఫోకసు లైటింగు మొదలైన ఆధునిక సాధన సామాగ్రి సమకూర్చుకున్నాడు. అయితే అసూయా పరుల వల్ల ఆ హాలంతా పరశురామ ప్రీతిఅయింది. అధైర్యపడలేదు. తిరిగి అదంతా పెద్దల ఆర్థిక సహాయంతో సమకూర్చుకున్నారు. సుగుణ మణి, కాలేజీ *గరల్* నాటకాలు తయారుచేసి ఆంధ్రదేశమంతటా ప్రదర్శించి మెప్పు పొందాడు. ఇదంతా నిస్వార్థ కళాసేవ. కాలేజ్ *గరల్* నాటకంలో స్త్రీలతో స్త్రీ పాత్రలు ధరింపజేసి మార్గదర్శకుడు అయ్యాడు. ఈయన సీత, శకుంతల, ద్రౌపది, చిత్ర రేఖ, దమయంతి, సుగుణమణి ఇత్యాది పాత్రలలో నటించాడు.చివరకు 1956, డిసెంబర్ 22న మదరాసు సానిటోరియంలో నిర్యాణం చెందాడు.

శ్రీ.చ.

నాగేశ్వర రావు, గొట్టిముక్కల : నటుడు, రచయిత. స్వస్థలం నెల్లూరు జిల్లా వింజమూరు మండలం, మాధవ నగర్ గ్రామం. *ఊబి* నాటిక రచయితగా వెలుగులోకి వచ్చాడు. దరిమిలా సుమారు 12 నాటక నాటికలు రచించాడు. గ్రామీణ జీవితంలోని ఒడిదుడుకులను, పల్లె ప్రాంతాలలో బడుగు వర్గాలు, భూస్వామ్యవర్గాల క్రౌర్యానికి, నియంతృత్వపు పోకడలకు తట్టుకోలేక ఎలా విలవిల లాడిపోతున్నాయో, ఆ వైనాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. ఈయన రచించిన నాటిక నాటకాలలో పల్లె వాతావరణం, తెలుగు నుడికారపు ఇంపు సొంపులు, జాతీయాలు పుష్కలంగా ఉంటాయి. కల్లా కపటం ఎరగని గ్రామీణుల హాస్యం సామాజికులను కట్టి పడవేస్తూ సెలయేరులా సాగిపోతుంది. సన్నివేశాల కూర్పులో గొట్టి ముక్కల నేర్పరి. *ఊబి*, న్యాయ వేలం (నాటికలు) ఊరికో రుద్రమ్మ (నాటకం) ఈయన ప్రసిద్ధ రచనలు.

బోయిన

నాగేశ్వరరావు, చీమకుర్తి (1951-2006)

రంగస్థల నటుడు. ఈయన 1951వ సంవత్సరంలో అంకమ్మకోటయ్య దంపతులకు ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి సమీపంలోని అగ్రహారంలో జన్మించాడు. తండ్రికోటయ్య, పెదనాన్న రోశయ్య వీధినాటకాలు ప్రదర్శించడంలో దిట్టలు, వారి కుటుంబంలో జన్మించిన నాగేశ్వరరావు కళలపట్ల మక్కువ పెంచుకున్నాడు. ఆర్థిక కారణాలవల్ల పెద్దగా చదువుకోలేదు కానీ ప్రాథమిక విద్యతోనే ముగించి జీవనం గడపటానికి కూలిపనికి వెళ్ళాడు. నాగేశ్వరరావు ఇంటిపేరు తొట్టెంపూడి, కానీ స్థిరనివాసం ఏర్పరచుకున్న చీమకుర్తి గ్రామమే ఇంటిపేరుగా స్థిరపడింది. ప్రముఖ హార్మోనిస్టు తొట్టెంపూడి సుబ్బారావుతో కలసి అనేక నాటకాలు చూశాడు. నటన పట్ల ఆశక్తి ఉండడమే కాకుండా ఆయనకున్న శ్రావ్యమైన గాత్రం పద్యనాటకం వైపు మళ్ళించాయి. చీమకుర్తి 1975లో మొట్టమొదటి సారిగా సంతనూతలపాడు మండలం చెర్లోగుడిపాడులో సత్యహరిశ్చంద్ర నాటకంలో నక్షత్రకుడిగా నటించాడు. ఆ తరువాత రామాంజనేయ యుద్ధంలో భవానీ శంకరుడుగా నటించాడు. చీమకుర్తి ఈ పాత్రలలో నటించినప్పటికి, ఈయనకు నాటక రంగంలో సుస్థిర స్థానం సంపాదించిపెట్టిన పాత్ర సత్యహరిశ్చంద్ర నాటకంలోని హరిశ్చంద్రుడు. తెలుగు నాటకరంగ చరిత్రలో హరిశ్చంద్ర పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించిన వారిలో బండారు రామారావు. డి.వి. సుబ్బారావు, ఆ తరువాత చీమకుర్తే, చీమకుర్తికి సంగీతంలో మెళుకువలు నేర్పింది తొట్టెంపూడి సుబ్బారావు, బండారు రామారావు అయితే సత్యహరిశ్చంద్ర పాత్రలోని మెళుకువలు నేర్చుకొన్నది మాత్రం అద్దంకి మాణిక్యరావు దగ్గరే. చీమకుర్తి అయిదవ తరగతివరకే చదువుకున్న పద్యాలను అలవోకగా పాడటమే గాకుండా శుద్ధ గ్రాంథిక భాషాసమ్మిళితమైన సంభాషణలను అనర్గళంగా చెప్పి నాటకాన్ని రక్తికట్టించగల నటుడు. చీమకుర్తి హరిశ్చంద్రుడుగా, చంద్రమతిపాత్రలో ఒంగోలు భవానీ, నెల్లూరు కోటేశ్వరి, నరసరావుపేట భానుమతి, విజయరాజులు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని వందలసార్లు రాష్ట్రంలోని పలు గ్రామాలలోను, పట్టణాలలోనే కాకుండా రాష్ట్రేతర పలు ప్రాంతాలలో కూడా ప్రదర్శించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. చీమకుర్తి నటనావైదుష్యాన్ని చూసిన ప్రేక్షకులు, కళాసంస్థలు ఆయనను ఘనంగా సన్మానించాయి. బంగారం, నగదు బహుమతులిచ్చి గౌరవించాయి. ఈయన ప్రదర్శన చూడటానికి ప్రేక్షకులు బళ్ళు ట్రాక్టర్‌లలో వచ్చేవారు. ప్రదర్శనలలో అప్పుడప్పుడు గాత్రం సహకరించినప్పుడు అత్యంత తెలివిగా సాత్విక, వాచిక అభినయాలను ముందుకు తెచ్చి పాత్రను రక్తకట్టించిన చీమకుర్తి 2006 జనవరి 21న ప్రకాశంజిల్లా కె. అగ్రహారంలో కన్నుమూశాడు.

దాసరి, ఎన్

నాగేశ్వరరావు, తేలప్రోలు (జ.1929) : రంగస్థల నటుడు. స్వస్థలం బాపట్ల. సరళ గంభీరమైన వాచికాభినయం, దాంతో పోటిపడే భావ ప్రకటన ఈ రెండిటికి ధీటుగా

అర్థవంతమైన గతి ప్రచారం ఏకకాలంలో వెంట్రుకవాసి తేడా లేకుండా సమ్మిళితం అయ్యే రీతిలో అభినయించే ప్రతిభామూర్తి తేలప్రోలు నాగేశ్వరరావు. పూల వ్యాపారం చేయటంతో పూల నాగేశ్వరరావుగా పేరు స్థిరపడింది. తండ్రి తేలప్రోలు పున్నయ్య, తల్లి వెంకట సుబ్బమ్మ.

నాగేశ్వరరావు తొలుత క్రీస్తు జననంలో హేరోదు మంత్రి పాత్ర ద్వారా 4వ తరగతి చదివే సమయంలో రంగస్థలంలో ప్రవేశించాడు. ఈ నాటికలో లభించిన ప్రశంసలతో కనకతారలో పల్లెవాడు, సతీ సావిత్రిలో చెలికత్తె వేషాలలో నటించి బాల్యంలోనే తనలోని కళాకారుణ్ణి సంతృప్తి పర్చుకున్నాడు.

మాచిరాజు బాలగంగాధరశర్మ దగ్గర నటనాధ్యయనంలో తన సహపాఠి అయిన కె.ఎస్.టి. సాయి 1959లో స్థాపించిన ఫైన్ ఆర్ట్ థియేటర్స్‌లో వ్యవస్థాపక సభ్యుడుగా చేరాడు. మాచిరాజు వీరిలో నటుడ్ని మలిచితే, కె.ఎస్.టి. నటనా కౌశలానికి మెరుగులు దిద్దాడు.

సంఘం చెక్కిన శిల్పంలో రాముడు, భోగి మంటల్లో పానకాల, గాజు పెంకులు లో భీముడు, మహానీయులు లో మామ, ప్రెసిడెంట్ లో వెంకన్న పాత్రలు సాంఘిక ప్రదర్శనలో ప్రధానమైనవి కాగా, సత్యహరిశ్చంద్ర లో వీరబాహుడు, బొబ్బిలియుద్ధంలో హైదర్‌జంగ్, రాయబారం లో భీముడు, కరండకుడు, సచివ సమ్రాట్ లో చందనదాస్, రామాంజనేయ యుద్ధం లో జాంబవంతుడు, విశ్వామిత్రుడు, సమ్రాట్ రావణ లో మాయారావణుడు, చారిత్రాత్మక పౌరాణిక నాటకాల్లో ధరించిన ప్రధాన పాత్రలు. సుమతిలో రిక్షావానిగా, అసమర్థుని డైరీలో సింహంగా, సర్పజాతిలో ఇంటి యజమాని పాత్రలు ఈయన నటించిన నాటికల్లో ప్రధానమైనవి. బాపట్లలో నేటికీ ఈ రంగంలో దర్శకునిగా, నటునిగా తన కృషి అవిశ్రాంతంగా సాగిస్తున్న కళాజీవి పూల నాగేశ్వరరావు.

మన్నెశ్రీ

నాజర్ (1920-1997) : బుర్రకథ కళారూపానికి గుర్తింపును, గౌరవాన్ని తెచ్చిన ద్రష్ట. ప్రజల కొరకు కవిత్వం రాసే కవి అజరామరుడని నమ్మిన నాజర్ కలం పట్టింది మొదలు కన్ను మూసే వరకూ ఆ నిబద్ధతతోనే బుర్రకథలు రాశాడు, పాడాడు, ఆడాడు.

గుంటూరుకు సమీపాన పొన్నెకల్లు గ్రామంలో 1920, ఫిబ్రవరి 5న షేక్‌మస్తాన్, బీబాబీ దంపతులకు నాజర్ జన్మించాడు. బుడిబుడి నడకల సమయంలో సంగీతం పట్ల ఆకర్షితుడయ్యాడు. కీలివాయి రికార్డులు విని, 'కోరి భజింతు గోవిందు నామది', అనే పాటను వీధుల్లో పాడుకుంటూ బడికి వెళుతున్నప్పుడు ఆ గానమాధుర్యానికి మెచ్చిన పలువురు కోరికోరి పాడించు కొని పప్పు బెల్లాలను బహుమతిగా ఇచ్చేవారు. తండ్రితో పాటు పీర్ల పండుగలో వీధి భాగవతాలలో ఆడి పాడేవాడు. స్కూలు వార్షికోత్సవంలో ద్రోణవిజయం నాటికలో ద్రోణుని పాత్ర ధరించి దెబ్బలు కొట్టిన గురువు చేతనే పుస్తకాలు, పెన్సిల్‌ను బహుమతిగా పొందాడు. శ్రీరామనవమి పందిళ్లలో కనకతార నాటకంలో నటించి పలువురి దృష్టిని ఆకర్షించాడు. హార్మోనిస్టు ఖాదర్ నాజర్‌లోని ప్రతిభను గుర్తించి పెద్దరావూరులోని బాలరత్నసభ నాటక సమాజంలో చేర్చాడు. రామదాసు, తులాభారం, శ్రీకృష్ణలీల, రాధాకృష్ణ నాటకాలలో స్త్రీపాత్రలను అత్యద్భుతంగా పోషించాడు. రామదాసు నాటకంలో చాందిని పాత్ర పోషణకు తెనాలిలో కళావంతుల వద్ద రెండు నెలలు నాట్యం అభ్యసించాడు. పన్నెండేళ్ళ వయస్సులోనే తెనాలి, విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, గూడూరులలో నాటకాలను ప్రదర్శించి వెండి, బంగారు పతకాలను బహుమతిగా పొందాడు.

నాజర్‌కు సంగీతం నేర్పిన గురువు మురుగుళ్ల సీతారామయ్య. తండ్రి మరణంతో చిన్న వయస్సులోనే బరువు బాధ్యతలను నెత్తిమీదకు ఎత్తుకొని వ్యవసాయ కూలీగా, పొగాకు కంపెనీలో మేస్త్రీగా పనిచేసి కుటుంబాన్ని పోషించాడు. పొన్నెకల్లులో మిషన్ కుడుతూ గ్రామంలోని యువకులతో పాదుకా పట్టాభిషేకం, ఖిల్జీరాజ్యపతనం నాటకాలను ప్రదర్శించాడు. తుళ్ళూరులో జరిగిన కమ్యూనిస్టు సభల పాటల పోటీలలో వేములపల్లి శ్రీకృష్ణ, కొండపనేని బలరామ్ ప్రోత్సాహంతో నాజర్, రామకోటి, పురుషోత్తం ఒక బృందంగా కలిసి బుర్రకథను నేర్చుకున్నారు. బుర్రకథ ప్రక్రియలో తనకు ఎన్నో సలహాలను ఇచ్చి తన ఉన్నతికి

ముఖ్యకారకుడు రామకోటి అని నాజర్ ఆజన్మాంతం సందర్భానుసారం పేర్కొనడం విశేషం.

కాకుమాను సుబ్బారావు, లక్ష్మీకాంత మోహన్, రామకోటి, పురుషోత్తం, నాజర్, మోటూరి ఉదయం కలిసి గుంటూరు జిల్లా ప్రజానాట్య మండలి దళం ఏర్పడింది. రాష్ట్ర దళ దర్శకుడైన గరికపాటి, నాజర్, పురుషోత్తం, రామకోటిని, రాష్ట్ర దళంలో సభ్యులుగా తీసుకొన్నాడు. రాష్ట్ర దళం ప్రదర్శించిన మాభూమి నాటకంలో దేశ్‌ముఖ్ జగన్నాథరెడ్డి, క్రిప్సు రాయబారం వీధి భాగవతంలో భోపాల్ నవాబు పాత్రను నాజర్ అత్యద్భుతంగా పోషించాడు. అహమ్మదాబాద్‌లో జరిగిన ఇప్టాసభల్లో జానపదకళలవిభాగంలోనాజర్ దళానికి ప్రథమ బహుమతి లభించింది. *బెంగాల్ కరువు* కథ అందిరినీ కదిలించి కరిగించి వేసింది. బెంగాల్ కరువు బుర్రకథ రచనలో తన స్వానుభవాలను ముఖ్యంగా పేదరికాన్ని నాజర్ సందర్భానుసారంగా ఇమిడ్చాడు.

నాజర్ కళారంగ జీవితంలో పల్నాటి వీర చరిత్ర ఒక మైలురాయిగా నిలిచిపోయింది. నాలుగు గంటల కథను అసాంతం ఉత్కంఠగా, ఉద్వేగంగా చెప్పేతీరు ప్రేక్షకులను మరో లోకంలో విహరింపచేసేది. బుర్రకథ చెప్పే సమయంలో వీర, కరుణరసాల అవిష్కరణను భారతీయ కళారంగంలో నాజర్ తర్వాతే మరో కళాకారుని చెప్పవలసి వుంటుంది. 1945లో బాపట్ల హైస్కూలు ఆవరణలో *బెంగాల్ కరువు* కథను చెప్పే సమయంలో ఆ ప్రదర్శనకు వచ్చిన బళ్ళారి రాఘవ ఉబికి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ రంగస్థలం పైకి వచ్చి నాజర్‌ను కౌగలించుకొని బావురమని ఏడ్చాడట.

1948లో ప్రజానాట్యమండలిని మద్రాసు ప్రభుత్వం నిషేధించింది. నిరుపేద ప్రజలను సాయుధ పోరాటానికి పురిగొల్పుతున్నది భారత కమ్యూనిస్టు పార్టీ అని, ఆ పార్టీ దేశమంతటా వ్యాప్తి చెందడానికి నాజర్ బుర్రకథలే కారణమని ప్రభుత్వం ప్రకటించిందంటే పాలకుల గుండెల్లో నాజర్ బుర్రకథ ఎంత శక్తివంతమైన శతఘ్నులను పేల్చిందో తేటతెల్లమవుతుంది. 1949లో పార్టీతో సంబంధాలను తగ్గించుకొని స్వతంత్రంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాడు. సుంకర సత్యనారాయణ రచించిన అల్లూరి సీతారామరాజు, కష్టజీవి కథలను అనేక గ్రామాలలో చెప్పి ప్రజలను ఉర్రూతలూగించాడు. రాజారావు నిర్మించిన పుట్టిల్లు చిత్రంలో సుంకర రచించిన రాణీ రుద్రమ్మ బుర్రకథను వీర రస స్ఫోరకంగా చెప్పి మెప్పు పొందాడు. ఈ సమయంలో ఆసామి నాటకాన్ని నాజర్ రచించాడు. విజయవాడ ఆంధ్ర ఆర్ట్సు సమాజం మాచినేని వేంకటేశ్వరరావు దర్శకత్వంలో ఆసామి నాటకాన్ని ప్రదర్శించాడు. 1954లో బందరులో జరిగిన ఆంధ్రనాటక కళాపరిషత్తుపోటీలలో ఆసామి నాటకానికి ఉత్తమప్రదర్శనతో పాటు ఎనిమిది బహుమతులు లభించాయి.

నాజర్ *రాయలసీమ కరువు, బబ్బిలి యుద్ధం,* వీరాభిమన్యు అనే బుర్రకథలను, పిట్టలదొర, నాచేతి మాత్ర అనే ఏక పాత్రలను రచించాడు.

కాకినాడలో రథానికిడెబ్బైజతలఎడ్లనుకట్టి పురవీధుల్లో ఊరేగించి స్వర్ణగండపెండేరాన్ని బహూకరించారు. బుర్రకథా సమ్రాట్ అనే బిరుదునుప్రదానం చేశారు. ఢిల్లీ ఆంధ్ర సంఘం ఆహ్వానంపై ప్రదర్శనలిచ్చాడు. ఆగ్రా, బంబాయి, అహమ్మదాబాద్, కలకత్తా, టాటానగర్‌లలో బుర్రకథలు చెప్పి మెప్పించాడు.

1966 రిపబ్లిక్ దినోత్సవం అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నాడు. 1987 ఉగాది సందర్భంగా ఆనాటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు నాజర్‌కు స్వంత ధనం రు.5 వేలను బహూకరించాడు. నాజర్ నృత్యగీతాల పరిణామదశను విశ్లేషిస్తూ రాసిన జాతి జీవితం కళా పరిణామం అనే గ్రంథం ప్రామాణికంగా నిలిచింది. అవసాన దశలో తీవ్ర అస్వస్థతకు గురైన నాజర్‌కు ఆపరేషన్ నిమిత్తం వైద్యులు రు. 30వేలు డిమాండ్ చేయగా ప్రముఖ వైద్యుడు డాక్టర్. కె. సదాశివరావుఉచితంగాఆపరేషన్‌చేసి మానవత్వాన్ని చాటుకొన్నాడు. పల్లీయుల కథలను, గాథలను చెప్పి నరనరాన ఉత్తేజాన్ని నింపి పరవళ్లు తొక్కించిన నాజర్ తీవ్ర రక్తపోటుతో 1997 ఫిబ్రవరి 22న గుంటూరులో కన్నుమూశాడు.

కందిమళ్ళ

నాటకం : 1. రూపకం పర్యాయ పదం 2. రూపక భేదం. దశవిధ రూపకాలలో శ్రేష్ఠమైనది నాటకం. అందువల్ల నాటక పదం రూపక పదానికి పర్యాయ పదంగా వాడుకలోకి వచ్చింది. 'కావ్యేషు నాటకం రమ్యం',' నాటకాంతం హి సాహిత్యం' అనే నానుడులు ఈ విషయాన్ని చాటుతున్నాయి.

2. దశవిధరూపకాలలో మొట్ట మొదటిది, ప్రధానమైనది. 'నాటకమిపి నాటయతి విచిత్రరంజనా ప్రవేశక సభ్యానాం హృదయం నర్తతీతి నాటకం' అని నాటక దర్పణకర్తలనిర్వచనం. ప్రేక్షక హృదయాలను నర్తింపచేయునది గాన నాటకమని పిండితార్థం.

భరతముని దశ రూపకాలను దశరూపాలని పేర్కొంటూ 'నాటకం సప్రకరణే' అని నాటకాన్ని మొట్ట మొదటగా పేర్కొనడం గమనార్హం. సప్రకరణం వల్ల ప్రకరణంతో కూడిన నాటకమని ప్రకరణానికి దీనికి సంధ్యంగాదుల విషయంలో

సామ్యం ఉన్నదని చెప్పినట్టయింది. ప్రఖ్యాత ఇతివృత్తంతో, ధీరోదాత్త నాయకునితో శృంగార, వీర, కరుణ రసాలలో ఒకటి ప్రధాన రసంగా, తక్కినవి ఆనుషంగిక రసాలుగా అయిదు మొదలు పది వరకు అంకాలతో అద్భుతావహమైన ముగింపుతో నాటకం ఒప్పారుతూంటుంది. సంస్కృతాలంకారికులైన విశ్వనాథ, విద్యానాథాది ప్రముఖ లాక్షణికులు శృంగార, వీర రసాలలో ఏదో ఒక రసమే ప్రధాన రసంగా ఉండాలని నిర్వచించారు. కాని భవభూతి కరుణ రసం కూడా ప్రధాన రసంగా ఉండవచ్చని నిరూపించాడు. కొందరు లాక్షణికులు శాంతరసం, మరికొందరు ఆశ్చర్యరసం, మరి కొందరు ప్రధాన రసంగా నిబంధించవచ్చని వాదిస్తూ నాగానంద, ఆశ్చర్య చూడామణి నాటకాలను ఉదాహరణగా చూపుతున్నారు.

నాటకంలో కైశికీ వృత్తి ప్రయోగించాలి. పతాక ప్రకరణలు అంటే ఉపకథలు ద్వ్యాశ్రయంగా ఉండవచ్చు. అర్ధ కామాలు నాటకంలో నిరూపించాలి. నానా భావ చేష్టాదులతో, బహువిధ సుఖదుఃఖాలతో కూడి ఉండాలి. అంకాలలో విష్కంభ ప్రవేశ కాదులు నిబంధం కావాలి. పంచ సంధులు నిబంధం కావాలి. ఇక నాయకుడు ధీరోదాత్తుడు, ప్రతాపవంతుడు, రాజర్షి గాని దివ్యుడుగాని అయి ఉండాలి. అయితే నాట్య దర్పణకారుడు రాజే నాయకుడు కానక్కర లేదు క్షత్రియుడు కావచ్చును అనేఅభిప్రాయంవెలిబుచ్చాడు. నాటకంలోనాందీ ప్రస్తావనలు తప్పకుండా ఉండాలి.

కోహలుడు పతాకాస్థానకం ఉండాలనీ, బీజాంతంలో బిందువు ప్రారంభించాలని చెప్పాడు. సుబంధువు అనే అలంకారికుడు నాటకాన్ని అయిదువిధాలుగా వింగడించాడు. 1. పూర్ణం, 2. ప్రశాంతం, 3. భాస్వరం, 4. లలితం, 5. సమగ్రం.

1. పూర్ణంఐదుసంధులునిబంధించాలి. ఉదా: కృత్యారావణం. 2. ప్రశాంతం శాంతరస ప్రధానం, సాత్వతీ వృత్తి ఉదా. స్వప్న వాసవదత్తం. 3. భాస్వరం వీరాద్భుతరసాలు, భారతీ వృత్తి. ఉదా. బాలరామాయణం. 4. లలితం కైశికీ వృత్తి, శృంగార రసం. ఉదా. ఊర్వశీ విప్రలంభం. 5. సమగ్రం అన్ని వృత్తులూ, అన్ని లక్షణాలూ ఉండాలి. దీనికే వృత్తాచారమని కూడా పేరు. ఇతి వృత్తంలో నాయక ప్రతిష్ఠకు గాని, రసానికి గాని అనుచితమైన అంశాలుంటే వాటిని త్యజించాలి, లేదా సంస్కరించాలి. భారత శకుంతలో పాఖ్యానంలో నాయకుని శీల కళంకాన్ని తుడిచివేయడానికే కాళిదాసు అభిజ్ఞానశాకుంతలంలో దూర్వాస శాపం కల్పించడం ఇందుకుదాహరణ. నాటక కథా సరళి నిబంధన గోపుచ్ఛాగ్రంగా ఉండాలి.

ఇలా సకల లక్షణాలతో, పది అంశాలతో విలసిల్లే నాటకాన్ని లాక్షణికులు మహానాటకం అన్నారు. ఇంతకీ నాటకం పేరు ఎలా పెట్టాలి? నామకరణం శీర్షిక చూడండి.

శ్రీ.చ.

నాటక కళ : 1. నాట్యకళ, 2. పత్రిక.

1. 'నాట్య కళ' చూడండి.

2. పత్రిక : విజయనగరం నుంచి మల్లాది విశ్వనాథ కవిరాజు సంపాదకత్వంలో 1923లో ప్రచురితమయి కొద్ది కాలమే నడచిన మాస పత్రిక. నాటక కళా విమర్శకు బయలు దేరిన ప్రప్రథమ తెలుగు పత్రికిదే. దీని మొట్ట మొదటి సంచిక సంపాదకీయంలో ఈ పత్రిక ఆశయం ఇలా వివరించడమయింది.

''రూపక గ్రంథములకును, నాటక సమాజాలకును, అవినాభావ సంబంధమున్నది. వీని రెంటినీ సంస్కరించి అభివృద్ధి పరచునుద్దేశంతో నీ పత్రిక వెలిబుచ్చుచున్నాము."

శ్రీ.చ.

నాటక ప్రయోగం(1963): గరికపాటి రాజారావు ఈగ్రంథాన్ని 1963లో ప్రచురించాడు. రెండుదశాబ్దాలనాటక రంగానుభవంతో రాజారావు 1958లో రచించి నాట్యకళ పత్రికలో వరసగా ప్రచురించిన మూడు వ్యాసాల సంపుటి. పాత్ర నిర్ణయం, రిహార్సల్స్, ప్రదర్శనం – ఔత్సాహిక నటీనటుల, ప్రయోక్తల ఉపయోగార్థం రచించిన ఈ మూడు వ్యాసాలతో ఈ చిరుగ్రంథం ఒప్పుతున్నది.

శ్రీ.చ.

నాటక ప్రయోగం (1964): ఈ శాస్త్రగ్రంథాన్ని వి. రామన్న పంతులు రచించాడు. (ప్రథమ ముద్రణ. 1964, పుటలు. 172.) ఈ గ్రంథంలో ప్రయోక్త, పాత్ర నిర్ణయం, ప్రయోక్త – అతని సహాయకులు, ప్రయోక్త – నటులు, ప్రదర్శన ప్రతి, గ్రౌండు ప్లాను, రిహార్సల్స్, రంగస్థలం, రంగాలంకరణ, లైటింగ్, ఎఫెక్ట్స్, ఆహార్యం, నాటకోత్సవాలు – పోటీలు, ప్రేక్షకుల మధ్య రంగస్థలం, అనుబంధాలు అనే ప్రధాన శీర్షికల కింద ఆయా విషయాలు ప్రస్తావించాడు.

శ్రీ.చ.

నాటక దీపిక : శాస్త్రగ్రంథం. రచన: బి.టి. రాఘవాచార్యులు. (ప్రథమ ముద్రణ. 1924, పుటలు. 44. విజయవాడ.) భరతముని బృందం కళాశాల విద్యార్థుల ఉపయోగార్థం రచించిన ఎనిమిది అధ్యాయాల గ్రంథం.

ఒకటవ అధ్యాయంలో ఎమెచ్యూర్లు, ప్రొఫెషనల్ నటులు, రెండవ అధ్యాయంలో నాటక సమాజ సంస్థాపనమూ రంగ నిర్ణీత లక్షణాలు, మూడవ అధ్యాయంలో రిహార్సలు విధులు, నాల్గవ అధ్యాయంలో నాట్యకళను గురించిన అభిప్రాయాలు,

ఐదవ అధ్యాయంలో సీనులు, రంగాలంకరణ, ఆరవ అధ్యాయంలో నాయిక నాయకుల సంబంధం, ఏడవ అధ్యాయంలో డాంబిక నటులు, ఎనిమిదవ అధ్యాయంలో స్థాపకులకు నటులకు ఉపదేశాలు పొందుపరచడమైంది.

శ్రీ.చ.

నాటక లక్షణాలు : పురుషునికి శౌర్య పరాక్రమాదులు, స్త్రీకి సౌందర్య లావణ్యాదులు సహజ ధర్మాలయినట్టే నాటకానికి లక్షణాలు సహజ ధర్మాలు. సహజంగా అందగత్తె అయిన స్త్రీ రత్నాభరణాదులతో మరింత శోభించినట్లే లక్షణోపేతమయిన నాటకం శోభిస్తుంది. అలాగే అలంకారాలతో నాటకం మరింతగా శోభిస్తుంది. లక్షణోపేతంగాని నాటకం గుణాలంకారాలతోనిండి ఉన్నానీరసంగానే ఉంటుంది. లక్షణ, అలంకారాలు రెండూ నాటకానికి శోభనిచ్చేవే. కాని కాలం గడచినకొద్దీ లక్షణాలు అలంకారాలుగా మారిపోయాయి.

నాటక లక్షణాలు విభావానుభావ వ్యభిచారి భావాలను, అర్థాలను ఆశ్రయించి ఉంటాయి. నాటకానికి ఇవి అలంకారాలు. వీటిని రసానుగుణంగా నాటకంలో పొందుపరచాలి.

నాటక లక్షణాలు 36 అని భరతముని పేర్కొన్నాడు. అవి: 1. భూషణం, 2. అక్షరసంహతి, 3. శోభ, 4. అభిమానం, 5. గుణకీర్తనం, 6. ప్రోత్సాహనం, 7. ఉదాహరణం, 8. నిరుక్తం, 9. గుణానువాదం, 10. అతిశయం, 11. హేతువు, 12. సారూప్యం, 13. మిథ్యాధ్యవసాయం, 14. సిద్ధి, 15. పదోచ్చయం, 16. ఆక్రందం, 17. మనోరథం, 18. ఆఖ్యానం, 19. యాచ్ఞ, 20. ప్రతిషేధం, 21. పృచ్ఛ, 22. దృష్టాంతం, 23. భాసనం, 24. సంశయం, 25. ఆశీస్సు, 26. ప్రియం, 27. కపటం, 28. క్షమ, 29. ప్రాప్తి, 30. పశ్చాత్తాపం, 31. అనువృత్తి, 32. ఉపపత్తి, 33. యుక్తి, 34.కార్యం, 35. అనునీతి, 36. పరిదేవనం.

నాట్య శాస్త్రంలో ఈలక్షణాలను వివరించే భాగానికి రెండు పాఠాంతరాలున్నాయి.

1. ఉపజాతి వృత్త విభాగంలోను, రెండోది అనుష్టుప్ వృత్త విభాగంలో ఉంది. ఉపజాతి వృత్త పాఠాన్ని అభినవ గుప్త, కీర్తిధర, ధనంజయులు అనుసరించారు. అనుష్టుప్ వృత్త పాఠాన్ని విశ్వనాథకవిరాజు, సింగభూపాలుడు, అభినవ గుప్తునికి పూర్వమందున్న వ్యాఖ్యాతలు అనుసరించారు. ఈ రెండు పాఠాలలో చాలా భేదముంది. వీటిలో 17 లక్షణాల పేర్లు మాత్రమే ఈ రెండు పట్టికలలో సమానంగా ఉన్నాయి. వీటిలోని ఎనిమిది లక్షణాల నిర్వచనాలు మాత్రమే ఒకే విధంగా ఉన్నాయి. సింగభూపాలుడు వీటిని భూషణాలుగా పేర్కొన్నాడు.

పొణంగి శ్రీరామ అప్పారావు నాట్య శాస్త్రం అనువాదం 443వ పేజీ అధఃసూచికలో ఈ రెండు పాఠ భేదాలను ఇలా చూపాడు.

భూషణం(1), అక్షర సంఘాతం(2), శోభ (3), ఉదాహరణం (7), హేతువు (11), సంశయం (24), దృష్టాంతం (22), ప్రాప్తి (29), అభిప్రాయం (33), నిదర్శనం (25), నిరుక్తం(8), సిద్ది(14), విశేషణం (28), గుణాతిపాతం(9), అతిశయం (10), తుల్యతర్కం (16), పదోచ్చయం (15), దృష్టం(12), ఉపదిష్టం(32), విచారం(30), విపర్యయం(13), భ్రంశం (26), అనునయం(31), మాల (23), దాక్షిణ్యం(19), గర్హణం (27), అర్థాపత్తి(34), ప్రసిద్ధి(18), పృచ్ఛ (21), సారూప్యం (4), మనోరథం (17), లేశం (20), క్షోభం(35), గుణకీర్తనం (5), అనుక్త సిద్ధి (36), ప్రియోక్తి (6).

ఈ పట్టికలోని పేర్లు అనుష్టుప్ వృత్త పాఠంలోనివి. కుండలీకరణంలోని అంకెలు ఉపజాతి వృత్త పాఠంలోని పేర్ల అంకెలు. ఈ రెంటి సంవదకం ఈ పట్టిక తెలియజేస్తుంది.

శ్రీ.చ

నాటక విద్యాలయం : నాటక కళాశాల, విజయవాడ. వ్యవస్థాపకులు: ఆంధ్రనాటకకళాపరిషత్తు. కాలం 1964–68.

నాటక కళలోని వివిధ శాఖలలో శిక్షణిచ్చేందుకు గాను ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఆర్థిక సహాయంతో ఆంధ్ర నాటక కళా పరిషత్తు నెలకొల్పిన నాటక కళాశాల.

ఈ విద్యాలయం 1964 ఆగస్టు 1న ప్రారంభింపబడింది. సెప్టెంబర్ 1 నుంచి తరగతులు మొదలయ్యాయి. నాటక ప్రయోగం, చతుర్విధాభినయాలు, నాటక రచన, రంగ ప్రకాశనం, మొదలైన వివిధ విషయాలు ఇందులో బోధించారు. దీనికి ప్రధానాచార్యుడు శ్రీనివాస చక్రవర్తి. బసవరాజు వేంకట సుబ్బారావు, విన్నకోటరామన్నపంతులు, కొడాలి ఆదిశేషయ్య ప్రభృతులు అధ్యాపకులు. వారం వారం వివిధ విషయాల మీద ప్రత్యేకోపన్యాసాలు నిర్వహించడం జరిగింది. ఈ విద్యాలయ విద్యార్థులు నాటకం, గుమాస్తా, చేసిన పాపం, దూత వాక్యం మొదలైన నాటక, నాటికలు ప్రదర్శించి మెప్పుపొందారు.

శ్రీ.చ.

నాటక విమర్శ : ఈనాటకవిమర్శగ్రంథాన్ని శిష్టారామకృష్ణ శాస్త్రి రచించాడు. (ప్రథమ ముద్రణ. 1950 పుటలు. 152.) సంస్కృత నాటకాల మీద సాహిత్య విమర్శ ఈ గ్రంథంలో విరాజిల్లుతోంది. వ్యాసాలు నాలుగు. 1. నాటక

రచన, 2. భాసుని స్వప్న వాసవదత్తం, 3. విశాఖ దత్తుని ముద్రారాక్షసం, 4. భట్ట నారాయణుని వేణీ సంహార నాటకాలు ప్రాచ్య పాశ్చాత్య దృష్టితో పరిశీలించడమైంది. తెలుగులో వీటి అనువాదాల పరామర్శన, కథా సంవిధానం, రసం, నాయకుడు, శైలి మొదలైన విషయాలు, అనువాద సరళి సమీక్షించడం జరిగింది.

శ్రీ.చ.

నాటక వ్యాఖ్యానం : పూర్వం ఏ నటుడుకానటుడు తన పాత్రను వ్యాఖ్యానించి చూపేవాడు. అందువల్ల నటులను బట్టి వ్యాఖ్యానం కూడా మారుతూండేది. పాత్రల వ్యాఖ్యానం నాటక వ్యాఖ్యానం మీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఆధునిక ప్రయోగాలలో దర్శకుడే మూలాధార వ్యాఖ్యాన బాధ్యతను వహించి నటీ నటులకు తెలియజెప్పి వివరాలు మాత్రం వారికి విడిచి పెడుతున్నాడు.

ఒక నాటకాన్ని వ్యాఖ్యానించేటప్పుడు ముందుగా అందులోని నాటక సామాగ్రిని తెలుసుకోవాలి. నాటక ప్రతిలోని ప్రతి అంశం, సంభాషణలు, సీనరీలు, భావాలు, కార్యకలాపాలు, నాటక సామాగ్రి కిందకే వస్తాయి. ఈ సామాగ్రిని వర్గీకరించి ప్రేక్షక దృష్టితో విలువలు కట్టాలి. ప్రేక్షకులను నవ్వించేవి, ఏడ్పించేవి ఉద్వేగ విలువలు, కొత్త భావాలను రేకెత్తించేవి, పాత భావాలనే గాఢంగా ముద్రవేసేవి మేధా విలువలు. రమణీయత ద్వారా, రస ప్రపంచ సృష్టి ద్వారా ఆనందాన్ని కలిగించే అమేయ (abstract) విలువలు, నాటకసామాగ్రినుంచే నాటకీయవిలువలు రూపొందుతాయి. సామాగ్రి అంటే ఉపయోగించే వస్తు సముదాయం. విలువ అంటే ప్రేక్షకులకు అందేవి. ప్రేక్షకుల మెప్పుపొందేవి, మేధా విలువలు. ఇవి సాధ్యమైనంత విస్పష్టంగాను, నిరాడంబరంగాను ఉండాలి. ఉద్వేగ, అమేయ విలువలు ప్రేక్షకులు అర్థం చేసుకునేవి కావు. మనసులో నాటుకునేవి.

1. మేధా విలువలు: నాటకం వెనక విలసిల్లే భావాలు తాత్త్విక విలువలు 'ఎవరు తీసుకొన్న గోతిలో వారే పడతారు' లాంటి నీతివాక్యం తరచుగా ప్రశ్న రూపంలో ఉంటుంది. తక్కినవి పాత్ర శీలాన్ని తెలిపేవి. పాత్ర ప్రధాన శీలాన్ని వ్యక్తీకరించడానికి సృజించిన సన్నివేశానికి ఆ పాత్ర ఎలా ప్రతిచలిస్తుంది? నాటకంలో గోచరించే భావాలలో కొత్తదనం లేకపోతే నిరాశ చెందకూడదు. నాటకంలో ఎల్లపుడూ కొత్త విషయాలే చెప్పాలని లేదు. పాత భావాలనే ఇంకా విస్పష్ట రూపంలో చూపెట్టవచ్చు. తాత్విక విలువలేగాక విజ్ఞాన విలువలు కూడా నాటకంలో ఉంటాయి. అయితే ఇవి పంచదార కప్పిన మాత్రలలాగా ఉండాలి.

2. ఉద్వేగ విలువలు: చాలా నాటకాలలో పాత్రల అనుభవాలను ప్రేక్షకులు భావనా ప్రపంచంలో అనుభవిస్తారు. ఈ అనుభవాలు ఉద్వేగాలను రేకెత్తిస్తాయి. ఇదే నాటక ప్రధానాకర్షణ. పాత్రలో లీనం కాకుండా ప్రేక్షకులు దూరంగా ఉన్నప్పుడు కూడా ఉద్వేగ విలువలు ఆవిర్భవిస్తాయి. ఇందుకు నవ్వు మంచి ఉదాహరణ. అపహాస్యానికి గురి అయిన పాత్రను చూసి నవ్వుతాంగాని అపహాస్యం చేసిన పాత్రను చూసికాదు.

3. అమేయ విలువలు: కంటికి ఇంపు కలిగించే రమణీయత, చెవికి ఇంపు గొల్పే పద్యం, సంగీతం, మనస్సును రంజింపచేసే లయ, అలంకరణ అమేయ విలువలు.

ఇతివృత్తం: నాటక తాత్త్విక భావమే ఇతివృత్తం. ఇతివృత్తం మీదనే నాటక ఐక్యత నిర్మితమవుతుంది. నాటకంలో భావాలు అనేకం ఉంటాయి. కాని నాటకం మొత్తం మీద అంతర్గతంగా ఉండే భావమే ఇతివృత్తంగా తీసుకోదగ్గది. అలా ఇతివృత్తంగా తీసుకోదగ్గ అంతర్గత భావాలు అనేకం ఉన్నప్పుడు అందులో ఏదో ఒకటే తీసుకోవాలి. ఒక నిర్దిష్ట ఇతివృత్తాన్ని ఎన్నుకోడం అంటే తక్కిన భావాలను గాలికి వదలడం కాదు. అతి ప్రాధాన్యం వహించకుండా ఉన్నంత వరకు అవి ఉపయుక్తాలే. ఇతివృత్తం నాటక సమగ్రతను కాపాడుతుంది. అయితే ఒక్కొక్కప్పుడు ఇతివృత్తానికి ప్రాధాన్యం తక్కువ కావచ్చు. అత్యంత ప్రాధాన్యమైన విలువలను ఒత్తి ఒత్తి చెప్పవలసి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఇతివృత్తాన్ని అణచివేయవలసి ఉంటుంది. ఒత్తి చెప్పవలసిన విలువలను ఎంచుకొని వాటిని చక్కగా వ్యక్తీకరించే విధానాన్ని ప్రదర్శన రీతి (Treatment) అంటారు. ప్రదర్శనలో ఇదే అత్యంత ప్రధాన విషయం. ప్రతి నాటకంలో అన్ని రకాల విలువలు ఉంటాయి. కాని ఒకే ఒక ప్రదర్శనలో ఏవో కొన్ని విలువలు మాత్రమే లాభదాయకంగా ఉపయోగించుకోవాలి.

నాటకంలోనివాచికంతోపాటు, ప్రేక్షకుల వైఖరి మీదకూడా నాటక ప్రాముఖ్యం ఆధారపడి ఉంది. తెరలేచిన తరువాత గాని సామాన్యంగా ప్రేక్షకుడు తన వైఖరిని నిర్ణయించుకోడు. నిర్ణయించుకొన్న తరువాత తాను చూస్తున్నది, వింటున్నది ఆ వైఖరికి సరిపోయేటట్టుగా అమర్చుకొంటాడు. ఏదైనా ఒక వివరణ ఆ వైఖరి చట్రంలో ఇమడకపోతే ప్రేక్షకుడు కంగారుపడతాడు, కోపగించు కుంటాడు. ఏ దృష్టితో నాటకాన్ని చూడాలో, నిత్య జీవిత ప్రమాణాలతోనా లేక నాటకీయ సంప్రదాయ దృష్టితోనా అని ముందుగానే ప్రేక్షకులు తేల్చుకోవాలి.

ప్రదర్శనను ప్రేక్షకులు ఏ భావంతో పరిశీలించేదీ ప్రదర్శన భావం మీద ఆధారపడి ఉంటుంది. ప్రదర్శన అంతర్గత భావం

నాటక అంతర్గత భావం మీద ఆధారపడి ఉంటుంది. నాటక భావాన్ని దానికి తగిన విశేషణాల ద్వారా నిర్ణయించవచ్చు. తేలిక, చప్పన, హాస్య, అపహాస్య, చింతాక్రాంత, విరసం, వినాశనం, భయంకరం, చిత్రహింస మొదలైన పదాలు వాడాలి. నాటక అంతర్గత భావం తగిన విశేషణాలతో వర్ణించిన గుణాలతో కూడి ఉంటుంది. ఈ విశేషణాలు పరస్పర విరుద్ధమయినపుడు ఆ రెంటి కలయిక మూలంగా నాటక ఉత్కంఠ ఇనుమడిస్తుంది. చప్పన, సంతోషకరం మొదలైన పదాలుసరిపోతే ఆనాటకం తేలికఅన్నమాట. ధైర్యసాహసాలు, గట్టి, కాఠిన్యం ఇలాంటి పదాలు సరిపోతే ఆ నాటకం బరువైందన్నమాట. సాధారణంగా తేలిక నాటకాలలో అప్రధాన విషయాలు, గట్టి నాటకాలలలో గాఢోద్వేగాలు, గంభీర భావాలు ఎక్కువగా ఉంటాయి.

నాటకం ముగింపు నాటక అంతరార్థం మీద తన ప్రభావం ఎక్కువగా నెరపుతుంది. నాటకం సుఖాంతం కావాలను కొన్నప్పుడు మొదటి రంగాలను విషాదచ్ఛాయలలముకున్నా మొత్తం మీద నాటక అంతరార్థం ఆశాభావంతో తొణికిస లాడుతుండాలి. ఇక విషాందాంతం నిరాశాభావాన్ని సూచిస్తుంది. ఈ అంతర్గతభావం 'ఇదిఇంతే', 'ఇలా జరగవలసిందే' అనే భావాన్ని ప్రేక్షకులలో కలిగిస్తుంది.

ప్రేక్షకులు ఆనందించడానికి నాటక ప్రదర్శనం చూస్తారు. విషాద నాటకం సుఖాంత నాటకం కంటే ఎక్కువ ఆనందం కలిగించవచ్చు. ఏమయినా ప్రేక్షకులు ఉద్వేగాలు రేకెత్తాలనే ఆశిస్తారు కానిఆగిపోవాలనికోరుకోరు. అయితే ఉద్వేగ భద్రతను కాంక్షిస్తారు. ఈ భద్రతను కాపాడడానికి నాటకాంతరార్థం, నాటకం ముగింపు ఒకటిగానే ఉండాలి. ఉద్వేగ ఆఘాతాలు, విస్మయాలు ఉండకూడదు.

కపటవిస్మయాలసందర్భంలో కూడా ఆశించిన ఆనందం కలగాలి. విషాదాంత నాటకాలలో అసంతోషకర విస్మయాలు కలుగకుండా భవితవ్యాన్ని ముందుగా సూచించవలసి ఉంటుంది. అయితే హాస్య నాటకంలో మాత్రం ప్రేక్షకులు సంతోష విస్మయాలనే ఆశిస్తారు. అయితే దీని అర్థం ఆహ్లాదాన్ని, నాటకీయతను కలపకూడదనికాదు. కాని, ఈ మిశ్రమం నాటక మంతటా ఒకే విధంగా ఉండాలి. నాటకీయత, ఆహ్లాదాల నిష్పత్తి ప్రతి అంకంలోనూ ఒకే విధంగా ఉండేటట్టు చూసుకోవాలి. ఒక దాని నుంచి రెండో దానికి మార్పు అసంతోషకర విస్మయాన్ని కలిగించకూడదు. అంతర్గత భావం మార్పును భావస్తుతి అంటారు.

పాత్రల ఉద్వేగాలు నిత్యం మారుతూ ఉంటాయి. ఈ ఉద్వేగాలు ఒక దాని కొకటి అనుగుణంగా ఉండవచ్చు లేదా విపర్యంగా ఉండవచ్చు. భూమిక ఉద్వేగధోరణినే 'వాతావరణం' అంటారు. ఇది కూడా మార్పు చెందవచ్చు. నాటక అంతర్గత భావానికిది అనుగుణంగా ఉండవచ్చు లేదా విభిన్నంగా ఉండవచ్చు.

ఒకసారి అంతర్గత భావం నిర్ణయమయితే నాటక రచనాక్రమానికి అది మార్గదర్శకమవుతుంది. పాండవ విజయంలో విషయం కథనం ద్వారా తెలుస్తుంది. వీరాభిమన్యు నాటకంలో విషయం ప్రత్యక్షంగానే జరుగుతుంది. ఏది సరయినదీ అంతర్గత భావం నిర్ణయిస్తుంది.

నాటకానికి, వాస్తవికతకు గల సంబంధమే శైలి. ఇది ప్రేక్షకుల దృక్పథాన్ని రూపొందిస్తుంది. నిత్య జీవితానికి సన్నిహితంగా ఉండే *కన్యాశుల్కం* లాంటి నాటకం మీది దృక్పథానికి, చిత్రనళీయం లాంటి నాటకం మీది దృక్పథానికి తేడా ఎంతో ఉంటుంది. ఈ రెండు నాటకాలకు ఒకే శైలి పనికి రాదు.

సామాన్య నిత్యజీవిత దృక్పథం నుంచి పరిశీలించవలసిన నాటకాన్ని వాస్తవికతా నాటకం అంటారు. అంటే దీని అర్థం సమగ్ర ప్రకృత్యనుకరణ కాదు. ఇది రంగస్థలం మీద చూపడం సాధ్యం కాదు. అసహజంగా కనిపించకుండా ఉంటే చాలు.

సాధ్యమయినంతగా వాస్తవికతను అనుకరిస్తూ అతి తక్కువ నాట్యధర్మిని ఉపయోగించే నాటకాలు వాస్తవికత లేక సహజత విభాగానికి చెందే నాటకాలు. నిత్య జీవితాన్ని తూచా తప్పకుండా అనుసరించకుండానే సాంకేతిక పద్ధతుల ద్వారా వాస్తవికతా భ్రాంతిని కలిగించడం నాటకీయ వాస్తవికత. ఇలాంటి నాటకఅంతర్గతభావాన్ని, హాస్యనాటక శైలి అంటారు. అంతర్గత భావం నాటకీయతతో నిండి ఉంటే దానిని మెలోడ్రామా శైలి అంటారు.

నిత్య జీవితానికి అనుగుణంగా నాటకం లేనపుడు దాని శైలిని అవాస్తవికత శైలి అంటారు. ప్రేక్షకులు సరయిన దృక్పథాన్ని అవలంబించేందుకు శైలిని ఉపయోగిస్తారు. పద్యాలు, అసహజ పదప్రయోగం, విస్పష్టంగా గోచరించే లయ మొదలయిన కృత్రిమాల ద్వారా వాస్తవికతా విరుద్ధతను సూచించడం ఉంటుంది. పాత్రలు మాట్లాడుకోవడానికి బదులు ప్రసంగించుకుంటారు. స్వగతాలు ఉపయోగిస్తారు. పాత్రలకు బదులు ప్రేక్షకులను సంబోధించి మాట్లాడుతారు. ఒకానొక సంఘటన వ్యక్తిగత జీవితంలోని సంఘటన మాత్రమే కాదు అది సార్వజనీనమయినదని, సార్వకాలికమయిదని చెప్పదలచుకోవచ్చు. వీధి నాటక కర్తలు, సంస్కృత నాటక కర్తలు ఇటువంటపుడు వాడిన శైలిని సంప్రదాయ శైలి అంటారు. కేవలం ప్రదర్శనా సౌలభ్యం కోసం రచించిన నాటక శైలిని ఆకార శైలి (formalism) అంటారు.

వాస్తవికజీవితంలోకంటే ప్రతిదానినిఎక్కువ రమణీయంగా, విస్పష్టంగా, అద్భుత దృశ్యాల చిత్రీకరణనే కాల్పనిక శైలి అంటారు. సాహసకృత్యాలతో నిండిన రాణీ సంయుక్త వంటి గాథలకు ఇది అనుకూలమయిన శైలి. ఇది సీనరీ, దుస్తులు, ఆకారాలను, వర్ణాలను వికృతీకరిస్తుంది.

వివిధ శైలులలోని ఉత్తమ అంశాలను కలపడానికి యత్నించినప్పుడు కలగూరగంప తయారవుతుంది. కాని ఇది విజయవంతమయితే మాత్రం ప్రేక్షకుల మీద ఉద్వేగ ప్రభావం అద్భుతంగా ఉంటుంది. ఈ శైలినే అభివ్యక్తి శైలి అంటారు.

ఒక నాటకం శైలిని నిర్ణయించాలంటే అది నిశ్చయంగా వాస్తవికమైనదో, అవాస్తవికమైనదో నిర్ణయించుకోవాలి. అప్పుడు వాస్తవికత ఏ పాళంలో ఉందీ తెలుస్తుంది. అవాస్తవికతా ప్రభావం దానిమీద ఎంత పడిందీ పరిశీలించాలి.

కొద్ది నాటకాలే ఒకటి కంటె ఎక్కువ వ్యాఖ్యానాలకు లంగుతాయి. పాదుకా పట్టాభిషేక నాటాకాన్ని సత్య వాక్య పరిపాలనా, పితృవాక్య పరిపాలనా, భ్రాతృ భక్తి, పతివ్రతా ధర్మం అని వ్యాఖ్యానించవచ్చు. అయితే వ్యాఖ్యానం మారితే శైలి కూడా మారుతుంది.

ప్రదర్శన అంతరార్థం నాటక అంతరార్థానికి ఎపుడో గాని విభిన్నంగా ఉండదు. శైలి విషయం అలా కాదు. నాటక నిర్మాణం గురించి తెలుసుకోవాలంటే ముందుగా కథా విన్యాసం తెలుసుకోవాలి. ఇతివృత్తాన్ని సోదాహరణగా తెలిపేదే కథా విన్యాసం. ఇతివృత్తాలు అనేకం ఉంటే కథా విన్యాసాలు కూడా అనేకం ఉంటాయి. ఎన్నుకొన్న ఇతివృత్తానికి అనుగుణంగానే కథను విన్యసించాలి. పాదుక కథలో 'సత్య సంధత'ను ఇతివృత్తంగా ఎన్నుకుంటే దశరథుని దృష్టిలో పెట్టుకొని అతనికి ప్రాధాన్యమిస్తూ కథను విన్యసించాలి. అలాగాక భ్రాతృ భక్తిని ఇతివృత్తంగా తీసుకొంటే భరతునికి ప్రాధాన్యమిచ్చే కథను విన్యసించాలి.

ప్రక్రియకు అస్థిపంజరం కథా విన్యాసం అందుచేత అది నాటక నిర్మాణాన్ని వ్యక్తీకరించే సాధన. కథా విన్యాసాన్ని అర్థం చేసుకోకపోతే నాటకాన్ని సరిగా అర్థం చేసుకోలేం. అందుకని కథా విన్యాసాన్ని మాటలలో పెట్టి రాసుకోవడం మంచిది.

కథావిన్యాసం విస్పష్టంకాగానే నాటకనిర్మాణం క్రమంగా అర్థమవుతుంది. నాటక కథ క్రమబద్ధంగా ఉండదు. అంకాలు, రంగాలు, ఘట్టాలు, ప్రక్రియ సాఫీగా నడవడానికి అనుకూలంగా నిబంధమవుతాయి. నాటకంలోని ఘట్టాలకు, రంగాలకు పేర్లు పెట్టి ఆ పేర్లను విడిగా ఇంకో కాగితం మీద రాసుకుంటే నిర్మాణం విస్పష్టమవడమే గాక విభిన్న భాగాలు ఎలా అతుకుకుందీ తెలిసిపోతుంది.

ఘట్టాలకు పేర్లు పెట్టేటపుడు దాని సాంకేతిక ప్రయోజనాన్ని గణనలోకి తీసుకోవాలి. ఘట్టాలు ప్రధానంగా 5 విధాలు. 1. మేధాపరమైన సంఘర్షణా ఘట్టాలు. ఇవి కథా విన్యాసం మీద ఆసక్తి కలిగిస్తాయి. ఉదా. శాకుంతలం పంచమాంకం, 2. సాదృశ్య ఘట్టాలు. సంఘర్షణ లేని ఘట్టాలు అంటే ప్రేమఘట్టాలు, విష్కంభాలు మొదలయినవి. 3. వాతావరణ ఘట్టాలు. సంఘర్షణకు, కథా కథనానికి గాక కేవలం వాతావరణ సృష్టికి మాత్రమే ఉపయుక్తమయే ఘట్టాలు. 4. పరిణామ ఘట్టాలు. ప్రవేశ నిష్క్రమణాదులకు ఉపయోగించేవి. 5. విరామ ఘట్టాలు. ప్రేక్షకుల ఉద్వేగాలు పరాకాష్ఠకు చేరిన తరువాత తిరిగే వాటిని అణచే విరామ కల్పనకు ఉపయుక్తమయే ఘట్టాలు. ఉదా. శాకుంతలం షష్ఠమాంకంలో మాతలి ఘట్టం.

పాత్రవ్యాఖ్య: నాయక పాత్రలు కూడా వాటంతట అవి ప్రధానమయినవి కావు. నాటకం మొత్తాన్ని దృష్టిలో పెట్టుకొని పాత్రలను వ్యాఖ్యానించవలసి ఉంటుంది.

మంచి నాటకంలో ప్రతిపాత్ర ఏదో ఒకపాత్రకి పైచేయిగా ఉంటుంది. పాత్ర ప్రయోజనం **అర్థం** చేసుకోవడం పాత్ర వ్యాఖ్యకు మొదటి మెట్టు.

పాత్రలు - వాటి ప్రయోజనాలు: ముఖ్యపాత్రలు: కథా విన్యాసంలోని కథకు నాయకుడు. ఈ పాత్రను ముఖ్యపాత్ర లేక కథా సారథి అంటారు. సామాన్యంగా పాత్యం ఎక్కువగా ఉన్న పాత్ర ప్రముఖ పాత్రగా ఉంటుంది. మాలతీ మాధవం నాటకంలో రెండు ముఖ్య పాత్రలుంటాయి. కన్యాశుల్కం నాటకంలో పాత్రలన్నీ ముఖ్యపాత్రలే.

కథా ప్రతిసారథి కథా సారథికి వ్యతిరేక పాత్ర. వివాద పాత్ర. ముద్రారాక్షసంలో భాగురాయణ పాత్ర, విశ్వాసపాత్ర. దీనినే సంస్కృత లాక్షణికులు నర్మసచివులన్నారు. పాత్రలు బాహాటంగా వెల్లడించే భావాలను వినడానికి ప్రవేశపెట్టే పాత్ర. సంస్కృత నాటకాలలో విదూషకపాత్రలు. పాశ్చాత్య నాటకాలలో జెస్టర్ మొదలైనవి.

ఉపయుక్త పాత్ర: తలుపులు తీయడం, వేయడం, ఫోను చేయడం, సందేశాలు తీసుకువెళ్లడం మొదలైన పనులు చేసే పాత్ర. కథా విన్యాసంలో ఈ పాత్రకు ఎలాంటి సంబంధముండదు. కాని సాంకేతికంగా ఈ పాత్ర నాటకానికి ఉపయోగం. రచయిత ప్రతినిధి. రచయిత భావాలను వెల్లడించే పాత్ర. విశ్వనాథసత్యనారాయణ రచించిన అనార్కలి నాటకంలో కవి పాత్ర.

ప్రాతినిధ్య పాత్ర: వ్యక్తిగతంగా గాక ఒక పక్షానికి గాక ఒక బృందానికి గాని, ఒక శక్తికి గాని ప్రాతినిధ్యం వహించే పాత్ర.

ప్రత్యేక పాత్ర : ప్రత్యేక నాటకీయ విలువలకు ఉపయుక్తమయే పాత్ర – హాస్య పాత్ర.

సానుభూతి : పాత్ర మీద ప్రేక్షకుల ఇష్టాయిష్టాలను, ఆసక్తిని సానుభూతి అంటారు. సానుభూతి అన్ని పాత్రల మీద సమంగా పడేటట్టు దర్శకుడు చూడాలి. నాటక ప్రదర్శన విజయవంతం కావాలంటే క్షణ క్షణానికి మారే సానుభూతి సమపాళ్ళలో ఉండాలి. స్వభావంలోని ఉత్తమ లక్షణాలను ప్రస్ఫుటం చేయడం ద్వారాగాని, అటువంటి లక్షణాలను వ్యక్తీకరించే కార్యకలాపం కల్పించడం ద్వారా గాని పాత్ర పట్ల సానుభూతిని ఇనుమడింప చేయవచ్చు.

పాత్ర మీద ప్రేక్షకులకు సానుభూతిని కలిగించడానికి హాస్య ధోరణి ఆ పాత్రకు కల్పించడం మరో పద్ధతి. నవ్వించే పాత్ర మీద ప్రేక్షకులకు సానుభూతి ఎక్కువగా ఉంటుంది. అయితే ఎంత ఆకర్షణీయుడయినా గంభీర నాయకుడు హాస్యధోరణి ద్వారా సానుభూతి పొందలేడు.

పాత్ర పోషణ: పాత్ర ప్రయోజనం, సానుభూతి పరిణామం నిర్ణయించిన తరువాత అతని స్వభావాన్ని వ్యాఖ్యానించవచ్చు. పాత్రను అనవసరంగా చెడ్డగా చిత్రించ కూడదనేది నాటకరంగ అనుశాసనం. ఈ అనుశాసనానికి మినహాయింపులు లేవు. చెడు అంటే పిరికితనం, పిసనారితనం, అజ్ఞానం మొదలైనవి. అనవసరమైన చోట్ల ఇలాంటి పాత్రను ప్రవేశపెట్టకుండా ఉండటం మంచిది. పాత్రకు ఏదో ఒక అవలక్షణం ఆపాదించి, చెడుగా చిత్రించడానికి అనేక కారణాలు ఉండవచ్చు. ప్రేక్షకులు ప్రతి నాయకుని ద్వేషించడానికి అతనికి చెడు లక్షణాలు ఆపాదించవచ్చు. చెలికత్తె పాత్రను నాయిక పాత్రకంటే ఆకర్షణీయంగా చిత్రించకూడదు.

ప్రధాన పాత్రలు చైతన్యవంతంగా ఉండేటట్టు రూపొందించడానికి స్థబ్దుగా ఉన్నట్టు చూపించకూడదు. చైతన్యవంతం అంటే పరిణామ శీలం. స్థబ్దు అంటే మార్పు చెందకుండా ఉండడం.

పాత్ర స్వభావం నిర్ణయమయిన తరువాత "ఈ పరిస్థితులలో ఈ స్వభావం గల పాత్ర ఎలా ఆలోచిస్తుందీ, ఏం చేస్తుందీ? ఎలా ప్రతిచలిస్తుందీ?" అనే ప్రశ్నలు వేసుకుంటే అనేక సమస్యలు పరిష్కారమవుతాయి.

వాక్య వ్యాఖ్యానం: ఒక భావాన్ని వివిధ భాషలలో వెల్లడించినపుడు ఆయా వాక్యాలకు అర్థమొకటే, ఒకే వాక్యానికి నాటక వ్యాఖ్యానాన్ని బట్టి, సన్నివేశాన్ని బట్టి, పాత్ర స్వభావాన్ని బట్టి, వాక్యంలోని మాటను ఒత్తి ఒత్తి పలకడాన్ని బట్టి అర్థం మారుతూంటుంది. ముందుగా నిర్ణయించుకొన్న అర్థం వచ్చే విధంగా ఆ వాక్యాన్ని ఉచ్చరించాలి.

విరుపులు: సంభాషణను ఏకమొత్తంగా కంఠస్థం చేసే నటుడు సహజంగా దానిని ఏక మొత్తంగానే పఠిస్తాడు. కాని సంభాషణకు అనేకార్థాలు ఉంటాయి. కాబట్టి తగిన విరుపులు లేకుండా చదివితే ప్రేక్షకులకు అర్థం గాకుండా పోతుంది. విరామం, స్వరస్థాయి, గమకాలలో మార్పు చేస్తే ప్రేక్షకులకు ఆ సంభాషణ సరిగా అర్థమవుతుంది. సంభాషణ వ్యాఖ్యాన విషయం, పఠనంలో విరుపుల విషయంలో జాగ్రత్త పడితే నటనకు బలం చేకూరుతుంది.

శ్రీ.చ.

నాటక శాల: నాటకాలు ప్రదర్శించడానికి, ప్రదర్శించే నాటకాలు ప్రేక్షకులు కూర్చొని చూడడానికి ఉద్దేశించి, తగిన రీతిలో నిర్మించిన ప్రత్యేక ప్రదేశం నాటకశాల.

భరతముని నాట్య శాస్త్రంలో ఈ నాటకశాలను నాట్య వేశ్మం, నాట్య గృహం, నాట్య మండపం, నాట్యశాల, ప్రేక్షాగృహం అని పేర్కొన్నాడు. కాని నాట్య మండపమనే మాటనే ఎక్కువగా వాడాడు. వికృష్ట మండపం, చతురశ్ర మండపం, త్ర్యశ్ర మండపం అనే మూడు ప్రధాన నాట్యమండపాలు భరతముని కాలంలో ఉండేవి. ప్రమాణ భేదం పట్టి ఈ నాట్య మండపాలు ఒక్కొక్కటి మూడు విధాలు.

భరతముని మొదట ఆరు బయటనే నాటకాలు ప్రదర్శించేవాడు. స్వర్గలోకంలో భరతముని ప్రయోగించిన రూపకానికి కినిసి రాక్షసులు అల్లరి చేయగా బ్రహ్మ విశ్వకర్మ చేత నాటక శాలలు నిర్మింపచేసినట్టు భరత శాస్త్రం వల్ల తెలుస్తోంది.

నాటకశాలలో భాగాలు మూడు. అవి నేపథ్య గృహం, రంగస్థలం, ప్రేక్షకాగారం. నటీనటులు వేషాలు వేసుకోవడానికి ఉపయోగించే భాగం నేపథ్య గృహం. ఈ నేపథ్యగృహం స్త్రీ పురుషులు వేషాలు వేసుకోవడానికి రెండు వేర్వేరు గదులు. నాటకం ప్రదర్శించే భాగం రంగస్థలం (చూ. రంగస్థలం). ప్రేక్షకులు కూర్చుని నాటకం చూసే భాగం ప్రేక్షకాగారం. సాధారణంగా ఈ ప్రేక్షకాగారం రెండు భాగాలు. 1. గొయ్యి లేక పిట్, 2. నేల గోతిలో మూడు తరగతులు. సోఫా, కుర్చీ, బెంచీ. పూర్వం నేలకు పై భాగంపైన స్త్రీలకు ప్రత్యేకంగా గాలరీ ఉండేది. తర్వాత తర్వాత గాలరీ తీసి వేసి ప్రతి తరగతి లోను స్త్రీలకు ఆసనాలు ప్రత్యేకించసాగారు. ఇపుడు సినిమా శాలలోనే నాటకాలు ప్రదర్శించడం వల్ల మూడు వైపులా గాలరీలు అమర్చే ఉంటున్నాయి.

అయితే, ఐరోపా ఖండంలో ముఖ్యంగా ఎలిజబెత్ రాణి కాలంలో రంగస్థలానికి రెండు వేపులా ప్రేక్షకులు కూర్చునేందుకు గాలరీలు నిర్మించేవారు. ఈ రెండు గాలరీలకు మధ్య ఆచ్ఛాదన లేని గొయ్యి ఉండేది.

ప్రేక్షకాగారానికి – రంగస్థలానికి సరిహద్దు ముందుతెర. రంగస్థలానికి, నేపథ్యగృహానికి సరిహద్దు వెనక తెర. ఆంధ్రప్రదేశ్‌లో కల్లా పెద్దదైన రవీంద్ర భారతిలో సుమారు 1,040 మంది ప్రేక్షకులు మాత్రమే కూర్చోవచ్చు. రష్యా, చైనా లాంటి విదేశాలలో వేల మంది పట్టే నాటక శాలలుంటాయి. పూర్వం రోమన్, గ్రీకు నాటకశాలలలో 20 నుంచి 30 వేల మంది పట్టేవారు.

నాటకశాలలు వివిధాకారాలలో ఉంటాయి. ముఖ్యమైనవి; దీర్ఘచతురస్ర నాటక శాలలు, అండాకార నాటక శాలలు. భరతమునే గాక ఇతర లక్షణ కర్తలు కూడా నాట్యశాలల ఆకారాలను వివరించారు.

నారద శిల్పంలో నారదుడు మూడు రకాల నాటక శాలలను పేర్కొన్నాడు. 1. దైవం, 2. గాంధర్వం, 3. క్షేత్రం.

దైవ నాటక శాలలు దేవాలయాలలో నిర్మించాలి. ఇందులో భక్తి రస ప్రధానమైన నాటకాలు మాత్రమే ప్రదర్శించాలి. గాంధర్వ నాటకశాలలు ప్రజలంతా నాటకం చూడడానికి వీలుగా నిర్మించాలి. ఈ నాటకశాలలో నానారసాలతో కూడిన నాటకాలు ప్రయోగించాలి. గాంధర్వ నాటకశాలలో స్త్రీలు కూర్చునే బాల్కనీలు కూడా పేర్కొనడం జరిగింది. క్షేత్ర నాటకశాలలు రాజ ప్రాసాదాలలో నిర్మించాలి. ఇందులో వీరరస ప్రధానాలయిన నాటకాలు ప్రదర్శించాలి.

శ్రీ.చ.

నాటక శిల్పం : ఈ సిద్ధాంత గ్రంథకర్త రోహిణి. ఈ గ్రంథంలోని వ్యాసాలు మొదట 1960లో రచించాడు.

కృష్ణా పత్రికలో ధారావాహికంగా వెలువడ్డాయి. ఇందులో నాటకరంగం, నటుడు, నాటక సమాజ స్థాపన, నిర్వహణ, నాటక ప్రయోగం, నాటకానంతరం, మరో ప్రదర్శన అనే అయిదు వ్యాసాలున్నాయి. నాటక ప్రయోగంలోని వివిధాంశాలైన వృత్తి, నాటక ప్రయోగం, ఔత్సాహిక నాటక ప్రయోగం, నాటక నిర్ణయం, పాత్రల నిర్ణయం, నిర్మాత నియామకం, రిహార్సలు, అభినయం, ఆహార్యం, పాత్రధారణ, దుస్తులు, రంగాలంకరణ ఇందులో వివరించడమైంది.

జగన్నాటక సూత్రం మీద ఆధారపడిందే నాటకరంగం. నాటకం ప్రకృతి బింబం. అంతేగాని ప్రకృతి మటుకుగాదు అనే ప్రాతిపదిక మీద రచించబడిందీ గ్రంథం.

శ్రీ.చ.

నాటక సమీక్ష : ఈ గ్రంథాన్ని కప్పగంతుల మల్లికార్జునరావు రచించాడు. (ప్రథమ ముద్రణ 1979.) ఇందులో తెలుగు నాటక రంగం–ఒక సమీక్ష, ఆధునిక నాటకరంగం, నడుస్తున్న దశాబ్దంలో (1960) తెలుగు నాటకరంగం, నాటక విమర్శ తీరు తెన్నులు, నాటకాల్లో నీతి, అవినీతి, ఎలాంటి నాటకాలు మాకు కావాలి, నాటకాలు ఎలా చూడాలి, ఆధునిక నాటకం– సినిమా, తెలుగు నాటకం – ప్రకాశం జిల్లా సేవ, నాటక పోటీలు– మంచి చెడ్డలు, పోటీ నాటకాలు, నాటక పోటీలు– న్యాయనిర్ణయ విధానం, నాటకాలు (అ) వాస్తవికత, మరవ కూడని మహానట దర్శకుడు, యుగకర్త కె.వేంకటేశ్వరరావు, తెలుగు నాటక రంగంలో కొన్ని తరంగాలు–స్థూల పరిశీలన, నిత్య చైతన్య నాటక మూర్తి రావి వెంకటచలం అనే అంశాలపై చక్కని వ్యాసాలున్నాయి.

గం.ను.రె.

నాటక సర్వస్వం : నాటక సిద్ధాంత గ్రంథం. రచన. ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ. (ప్రథమ ముద్రణ. 1970, పుటలు. 53 సూత్రాలు 149.) సంస్కృత నాటక లక్షణాలను అనువాదాలుగా గాక, స్వతంత్ర సూత్రాలుగా రచించిన సిద్ధాంత గ్రంథం. లక్షణాలకు రత్నావళి, వేణీ సంహారం లాంటి సంస్కృత నాటకాల నుంచే ఈ గ్రంథానికి ఉదాహరణలు ఇచ్చారు. ఈయన దశరూపక, సాహిత్యదర్పణాలను ఈ గ్రంథంలో ఎక్కువగా అనుసరించారు.

నాట్యశాలాకోశం! సాధనం శిల్పారం శ్రీ.చ.

నాటకీయ వ్యంగ్యం : విపర్యయప్రభేదం. దీనినే ఇంగ్లీషులో డ్రమెటిక్ ఐరనీ (**Dramatic Irony**) అంటారు. సంస్కృత లాక్షణికులు దీనిని పతాకాస్థానకం అన్నారు.

ఒక విషయంలోని రెండు దృక్పథాల విపర్యయంగా నాటకీయ వ్యంగ్యాన్ని నిర్వచించవచ్చు. ఈ విపర్యయం ఆ క్షణంలోనే గోచరించవచ్చు లేదా తరువాత గోచరించవచ్చు.

రంగస్థలం మీది పాత్రలు జరిపిన కార్యకలాపానికి లేదా చెప్పిన మాటలకు గల అర్థానికి, ప్రేక్షకులు తీసుకునే అర్థానికి విస్పష్టమైన విపర్యయ ఫలితం వ్యక్తీకరణ అని దీన్ని చెప్పవచ్చు.

ఈ విపర్యయం అసలు ముఖ్యవిషయం తెలియక పాత్రలు కార్యకలాపం సాగించడం లేక మాట్లాడడం, యదార్థ విషయం ప్రేక్షకులకు తెలిసి ఉండటం వల్ల జనిస్తుంది.

ఈ నాటకీయ వ్యంగ్యం చేతలలో ఉండవచ్చు లేదా మాటలలో ఉండవచ్చు. అందుచేత దీనిని సన్నివేశ వ్యంగ్యం, వాచిక వ్యంగ్యం అని రెండుగా వింగడించుకోవచ్చు. ఈ

రెండూ కలిసి కూడా వుండే అవకాశమూ వుంది. ఒక సన్నివేశంలోని యదార్థ విషయం ప్రేక్షకులకు మాత్రమే తెలిసి, పాత్రలకు తెలియనప్పటి విపర్యయం సన్నివేశం. (ఒక విషయంలో పాత్రల అజ్ఞానానికి, ప్రేక్షకుల జ్ఞానానికి సంభవించిన సంఘర్షణ)

విపర్యయం : ఆశ్చర్య చూడామణి నాటకంలో రావణుడు రాముని రూపంలో రథం మీద వచ్చి సీతను రథం ఎక్కమంటాడు. సీత రథం ఎక్కుతూ "అదృష్ట వశమున రాక్షస మాయ నుండి తప్పించుకుని పోవుచున్నాను" అంటుంది.

ఇక్కడ ఆ రాముడు అసలు రాముడు కాడు రావణుడు అని ప్రేక్షకులకు తెలుసు. సీతకు తెలియదు. అతను నిజంగా రాముడే అనుకుంది. పైగా రాక్షస మాయను తప్పించుకున్నాను అనడంలో నాటకీయ వ్యంగ్యం పరాకాష్ఠకు చేరుకుంది.

బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర నాటకం స్మశాన రంగంలో హరిశ్చంద్ర, చంద్రమతులు ఒకరినొకరు గుర్తుపట్టరు. ఆమె తన భార్య చంద్రమతి అని హరిశ్చంద్రునికి, అతడు తన భర్త హరిశ్చంద్రుడని చంద్రమతికి తెలియదు. కాని వారు హరిశ్చంద్ర చంద్రమతులని ప్రేక్షకులకు తెలుసు. ఈ ఘట్టంలో హరిశ్చంద్ర చంద్రమతుల సంభాషణ ప్రేక్షకులలో మనకు తెలిసింది వారికి తెలియక పోయిందనే భావం ప్రేక్షకులకు కలుగుతుంది.

శ్రీ.చ.

నాటకోపన్యాసాలు : ప్రసంగ వ్యాస సంపుటి. రచన. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ (ప్రథమ ముద్రణ. 1935, పుటలు. 79.) బళ్ళారిలో జరిగిన ధర్మవరం, కోలాచలం వర్థంతి సభలకు అధ్యక్షత వహిస్తూ, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ చేసిన రెండు ప్రసంగాల సంపుటి. మొదటి ప్రసంగ వ్యాసంలో సంహార కళ, కళ అనుసరణ, స్వాతంత్ర్య వాదం, స్వభావ వాదం,అభినయ కళ, నాటకంలో సంగీతం, కామెడీలు, ట్రాజెడీలు చర్చితమయ్యాయి.

ఇక రెండవ ప్రసంగ వ్యాసంలో ధర్మవరం, కోలాచలం రచించిన నాటకాలలోని విశిష్టత, రచనా పద్ధతులు, కళ–నీతి, వీరిద్దరి నాటకాలలోని పద్యాలు, పాటల తులనాత్మక పరిశీలన, శైలి సంస్కృత విధి నిషేధాల విషయాలలో వారి ధోరి సిద్ధాంతం, ఆచరణ మొదలైన విషయాలు ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి.

శ్రీ.చ.

నాటిక : సంస్కృతం ఉపరూపకాలలో మొదటిది, ముఖ్యమైనది. భరతముని నాట్య శాస్త్రంలో దీనిని నాటక- ప్రకరణ లక్షణ సమ్మేళనం వల్ల జనించిన జన్య రూపకంగా పేర్కొన్నాడు. ధనంజయుడు దీనిని సంకీర్ణ రూపకమన్నాడు. విశ్వనాథాదులు దీనిని ఉప రూపకాలలో చేర్చారు. ప్రఖ్యాత నృపనాయకత్వ లక్షణం నాటకాన్ని, కల్పితేతివృత్త ప్రకరణ ధర్మమూ కలియడం వల్ల ఇది సంకీర్ణ రూపకం. నేడు తెలుగులో నాటిక పేరుతో ఉన్న ఏకాంకికకు ఈ సంస్కృత నాటికకు ఎలాంటి సంబంధమూ లేదు. రెండూ వేరు వేరు ప్రక్రియలు.

సంస్కృత నాటికలో అంకాలు 4. రాజ్య వ్యవహారాలు మంత్రుల చేతిలో పెట్టి అంతఃపురంలో భోగానురక్తుడయిన ధీరలలితుడు నాయకుడు. శృంగార రసం ప్రధానం. ఇతివృత్తం కల్పితం. కైశికీ వృత్తి, స్త్రీ ప్రధానం. నాయిక ముగ్ధ నవానురాగ బహు పాత్ర శోభితం. రాజవంశ సంభవ కన్య. పట్టపురాణికి ఆత్మబంధువు. పరిస్థితి ప్రభావం వల్ల నాయిక రాజాంతఃపురంలో పట్టపురాణికి అనువర్తిని. సంగీత నృత్య విద్యార్థిని. నాయికా నాయకులు ఒకరి నొకరు ప్రేమించుకుంటారు. పట్టపురాణి వీరి సమాగమునానికి అడ్డంకి అవుతుంది. కాని చివరకు నాయిక తనకు ఆప్తబంధు వని తెలిసి పట్టపురాణి పశ్చాత్తాపం చెంది రాజు కిచ్చి వివాహం చేస్తుంది. ఇలా కథా లక్షణాన్ని లాక్షణికులు బిగించడం వల్ల సంస్కృత నాటికలు కొన్ని సంఘటనలలో తప్ప ఒక దాని కొకటి పోలి అచ్చుగుద్దినట్టుంటాయి.

సంధి ప్రవేశక ప్రస్తావనాదులు ప్రకరణానికి లాగానే దీనికీ వర్తిస్తాయి. ఇందులో నాయిక సహాయుడుగా విదూషకుడు ఉండవచ్చు గాని విటులుండరాదు.

రతి, రాజ్య ప్రాప్త్యాది ఫల సంయుతం. బహువృత్త గీత పాఠ్య క్రోధ ప్రసాదన వంచికాయుక్తం.

ఉదా. మాళవికాగ్ని మిత్రం, ప్రియదర్శిక.

సామాన్యంగా నాటికకు నాయిక పేరు పెట్టడం మామూలు. ఉదా: రత్నావళి, ప్రియదర్శిక ప్రకరణానికి లాగానే నాయికా నాయకుల పేర్లు కలిపి పెట్టడం గూడా కద్దు. ఉదా. మాళవికాగ్ని మిత్రం.

శ్రీ.చ.

నాట్యం : నాట్యం అనే పదం 'నట్ ' అనే ధాతువునుంచి పుట్టింది. దీని నుంచి నాట్య పదమే గాక నటన, నటుడు, నటి అనే పదాలు కూడా జనించాయి. ఈ ధాతువు ప్రాకృత ధాతువని పాశ్చాత్య విమర్శకుల అభిప్రాయం. ఈ 'నట్ ' అనే ధాతువు అనార్యభాష నుంచి సంస్కృతంలో చేరిందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. 'నట్ ' అనే ధాతువునకు అసలు అర్థం అవస్పందనం. అంటే కించిత్ చలనం. ఈ 'నట్' అనే ధాతువు మొట్ట మొదట గా ఋగ్వేదంలో ప్రస్తావించబడింది.

'మమోరక్షోభినట్' అని ఇందులో నట్ ధాతువు వ్యాపించు అను అర్థంలో ప్రయుక్తమయింది. నాట్యం, నటుడు అను అర్థంలో మొట్టమొదటగా ఈ ధాతువును ప్రయోగించింది పాణిని (క్రీ.పూ. 5వ శతాబ్ది). ఈయన పేర్కొన్న నటసూత్రాలు నటులకు సంబంధించినవేనని ఆధునిక విమర్శకుల అభిప్రాయం. పాణినీయానికి వ్యాఖ్య రచించిన పతంజలి (క్రీ.పూ. 2వ శతాబ్ది) ఆ వ్యాఖ్యలో ఆరవ అధ్యాయంలో రెండవ సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ "వ్యంజనాని పునర్నట భార్యావద్భవంతి" (వ్యంజనాలు నట భార్యలవంటివి) అన్న దానిని బట్టి ఈ దశాబ్దికే నటులు సకుటుంబంగా నాటకాలాడుతున్నారని తెలుస్తోంది.

శ్రీ.చ.

నాట్య అశోకం : ఈ తెలుగు విమర్శనాగ్రంథాన్ని పురాణం సూరిశాస్త్రి రచించాడు. (ప్రథమ ముద్రణ. 1925, పుటలు 273.) ఇందులో తాటాకులతో పచార్లు, చెట్టుకింది ముచ్చట్లు, నాట్య లేఖలు, వ్యాస ప్రసూనాలు అనే నాలుగు అధ్యాయాలున్నాయి.

తాటాకులతో పచార్లు అనే మొదటి అధ్యాయం నేటి రంగస్థల నాటకాలకు పూర్వ రూపాలైన యక్షగానాలు, వీధి నాటకాల చరిత్ర విమర్శ. తంజావూరు సరస్వతి మహల్ గ్రంథాలయంలోని వీధి నాటకాలలోని పాత్ర పోషణ, అసభ్య భాష మొదలైన విషయాల సమీక్ష. చెట్టు కింది ముచ్చట్లు తెలుగు నాటక ప్రదర్శన, నటనా సమీక్ష.

నాట్య లేఖలులో కబీరు, రామదాసు, హరిశ్చంద్ర, నట ప్రకాశిక నాటకాలు, కన్యాశుల్కం, ప్రతాపరుద్రీయం, షోయబ్ రుస్తుం, దొరసామి దుష్యంతుడు, గంజాం నటులు, నటలోక సంచారం, ఇక వ్యాస ప్రసూనాలలో మృచ్ఛకటిక, రాధా కృష్ణ అనే శీర్షికల క్రింద ఆయా నటుల నటనా వైదుష్యం, ఆయా ప్రదర్శనాలు, ఆయా నాటకాలు, విలువలు చక్కగా సమీక్షించాడు.

శ్రీ.చ.

నాట్య కళ : 1. సమాహార కళ, 2. సామూహిక కళ, 3. రూపక కళ.

1. నాట్య కళ ఏదొక నిర్దిష్ట కళ కాదు. వాత్స్యాయన ఋషి చెప్పిన అరవై నాలుగు కళలు, అందులోనూ ముఖ్యంగా అయిదు లలిత కళలు కలిసిన మిశ్రమ కళ.

నాటకంలో సంభాషణలు కేవలం వచనంలో నడిచినా, గద్య పద్యాత్మకంగా నడచినా అందులో కవిత్వం ఉంటుంది. రంగస్థలం మీది నటీనటుల కార్యకలాపమే అభినయం. పద్యాలు, పాటలు, నేపథ్య ధ్వనులు, సంగీతం మొదలైన వాటిలో సంగీతం ఉంటుంది. తెరలు మొదలయినవి చిత్రించడంలో చిత్ర కళ ఇమిడి ఉంది. రంగ సజ్జ నిర్మాణంలో దారు కర్మ లేక శిల్పం ఇమిడి ఉంది. ఇలానే చతుస్షష్టి కళలు (64) నాటకంలో ఉపయుక్తమవుతున్నాయి. అంటే నాట్య కళ వీటన్నిటికీ మిశ్రమమని తేలుతోంది. అందుకే దీనికి సమాహార కళ అని పేరు వచ్చింది. స్వరూపం, ప్రయోజనం మొదలైన వాటిని గురించి నాట్యం అనే శీర్షిక క్రింద చర్చించడమైనది.

2. ఇందులో కవి, నటీనటులు, పాఠకులు మొదలు తెరలాగే వ్యక్తి వరకు అనేక మంది నాటకంలో పాల్గొంటూండడం వల్ల దీనిని సామూహిక కళ అని పేర్కొంటున్నారు.

3. రూపక కళ – మానవుడు బాల్య దశలో తన చుట్టూ ఉన్న పెద్దల చేష్టలు, వేష భాషాదులు చూచి నేర్చుకుంటున్నాడు. కాని ఆ చేష్టలు, వేష భాషాదులు అతనికి సహజంగా అలవడినట్టే కనిపిస్తుంది గాని అనుకరిస్తున్నట్టు అనిపించదు. సామాన్యంగా ఒకరి చేష్టాదులను ఇంకొకరు అనుకరిస్తే వెక్కిరించినట్టుంది. మనిషి మనిషికీ చేష్టలలో, స్వరంలో విస్పష్టమయిన భేదం గోచరిస్తుంది అంటే మానవుడు తను చూచిన చేష్టాదుల రీతిని కాక వాటి ప్రక్రియను మాత్రమే నేర్చుకొని, తన స్వంతం చేసుకొని, ప్రత్యేక మానవుడుగా జీవిస్తున్నాడన్న మాట. దీనిని బట్టి లోక వృత్తాన్ని చూచి నేర్చుకొని దానిని తనదిగా చేసుకునే శక్తి మానవుడికి స్వభావసిద్ధంగా ఉన్నదని తేలుతోంది.

అయితే ఈ బాలబాలికలెవరూ భరతముని నాట్య శాస్త్రం చదివిన వారు కాదు. అయినా సహజంగా నటిస్తూ, మానవ జీవితపు వెలుగు నీడలను వ్యక్తీకరిస్తున్నారు. ఇందువల్ల మానవులకు నటించాలనే అభిలాష, ఇతర మానవులుగా జీవించగల శక్తీ వుందని బోధపడుతుంది. పిల్లలకీ శక్తి వుందని బోధపడుతుంది. ఈ పిల్లల ఆటలను ప్రాతిపదికగా చేసుకొని ప్రపూర్ణత చేకూర్చి, తీర్చిదిద్ది, రమణీయం చేయడంలో ఆవిర్భవించినదే రూపక ప్రదర్శనం.

[illegible]

శ్రీ.చ.

నాట్యధర్మి : కవి, నట వ్యాపార మందలి వైచిత్రి నాట్యధర్మి. ఇతిహాసాలలోని అర్థాలను కవి రంజకంగా కల్పన చేయడం, కవి కల్పిత చిత్త వృత్తి విశేషాలతో కూడి ఉండడం, స్వర అలంకార యోజనలతో కూడి ఉండడం, పురుషులు స్త్రీ పాత్రలు, స్త్రీలు పురుష పాత్రలు ధరించడం నాట్యధర్మి లక్షణాలు.

అభినయంతో సూచించదగిన వస్తువులకు, భావాలకు ఆకృతి కల్పించి పాత్రలుగా చేయడం, పర్వతాలు, వాహనాలు మొదలయిన వాటి రూపం కల్పించి పాత్రలుగా ప్రవేశ పెట్టడం, దగ్గరలో మాట్లాడుతున్నా వినిపించనట్టు, అసలు

చెప్పునిది వింటున్నట్టు నటించడం, ఒకే ప్రదర్శనలో ఒకరే రెండు పాత్రల ధరించడం, మామూలుగా నడవడానికి బదులు లలిత అంగవిన్యాసంతో తాళ సహిత పాదగతులతో నడవడం, నదిని దాటడం, మెట్లు ఎక్కడం దిగడం మొదలయినవి చూపడం కూడా నాట్యధర్మికి చెందినవే.

నృత్య, నృత్తాలలో నాట్యధర్మి ఎక్కువగా ఉంటుంది. రూపక ప్రదర్శనలో లోకధర్మి ఎక్కువగా ఉంటుంది. అయితే ఒక సందేహం రావచ్చు. 'లోక వృత్తాను కరణం నాట్యమ్' అన్నారు గదా! మరి ఈ భేదమేమిటి? అని. లోకధర్మి భూమిక **(Background)** లాంటిది. నాట్యధర్మి ఆ భూమిక మీద వేసే చిత్రం లాంటిది. లోకధర్మి లేనిదే నాట్య ధర్మి లేదు. నాట్యధర్మిలో లోకధర్మి అంతర్భూతంగా ఉంటుంది. లోకధర్మి లోకంలో, నాట్యంలో రెండింటా కనిపిస్తుంది. నాట్యధర్మి ఒక్క నాట్యంలోనే కనిపిస్తుంది. ఈ రెండూ తర తమ భేదాలతో రూపకాలలోనూ కనిపిస్తాయి. లోకధర్మికి రంజకత్వం కల్పించి, అతిశయింపజేయడమే నాట్యధర్మి ప్రయోజనం. అందుకే లక్షణకర్తలు ఈ రెంటికీ సమప్రాధాన్యం ఇచ్చారు.

శ్రీ.చ.

నాట్యరాసకం : సంస్కృత ఉపరూపకం. దీని లక్షణం విషయంలో విశ్వనాథకవి, శారదా తనయుల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయి.

ఇతివృత్తం కల్పితం. ఒకే ఒక అంకం. ధీరోదాత్తుడు నాయకుడు. వాసవసజ్జిక నాయిక. పీఠమర్దుడు నాయక సహాయకుడు. శృంగార రస ప్రధానం. హాస్యరసం అంగం. తాళ లయలతో కూడి లాస్యాంగాలు పది, ముఖ నిర్వహణ సంధులు రెండు మాత్రమే ఉండేటటువంటిది నాట్య రాసకం. ఇది విశ్వనాథ కవి రాజు మతం. కొందరు ప్రతి ముఖసంధి తప్ప తక్కిన నాలుగు సంధులు ప్రయోగించవచ్చని అన్నారు.

ఇక శారదా తనయుడు భావ ప్రకాశనంలో తెర వెనుక నుంచి పాత్రల పూర్ణ నాంది పఠనం, ముఖాది సంధులు, నాల్గు వృత్తులు, విప్రలంభ శృంగారం, ప్రసిద్ధ నాయకుడు దివ్యంగాని, మానుషంగాని వస్తువు, ఏకపాత్ర ప్రవేశ నిషేధం, సూత్రధార ఆవశ్యకత, ఆముఖంలో నటీనటుల ప్రవేశం, గాన నృత్యాలతో రాస చర్యల స్త్రీ సంకీర్తన నాట్య రాసకానికి లక్షణాలుగా చెప్పాడు.

రెండు సంధుల నాట్య రాసకానికి వీణావతి, నాలుగు సంధుల నాట్య రాసకానికి విలాసవతి ఉదాహరణలు.

శ్రీ.చ.

నాట్యశాల : ఈ వ్యాస సంపుటిని శ్రీనివాస చక్రవర్తి రచించి 1946లో ముద్రించాడు. 1963లో రెండవ ముద్రణకు నోచుకుంది.

ప్రథమ ముద్రణ నాట్యవృత్తి, అభినయం, యక్షగానం అనే మూడు వ్యాసాల సంపుటి. ద్వితీయ ముద్రణలో, ప్రథమ ముద్రణలోని యక్షగానం అనే వ్యాసం స్థానంలో నాట్యం, సూక్ష్మాభినయం, లోకధర్మి, నాట్యధర్మి, రసం, సిద్ధి, అభినయం – సీమ దృక్పథం, నటుడు-రచయిత అనే వ్యాసాలు పొందుపరచడం జరిగింది.

నాటక సిద్ధాంతాలను, అందులోనూ భారతీయ నాటక సిద్ధాంతాలను, సంప్రదాయాలను తేలిక భాషలో వెల్లడించడమే ఈ రచన ఉద్దేశం.

శ్రీ.చ.

నాట్య శాస్త్రం : ప్రప్రథమ సంస్కృత నాటకాలంకార శాస్త్రం. దీనికి నాట్య వేదం, పంచమవేదం అని కూడా పేర్లు. దీనిని క్రీ.పూ. 4వ శతాబ్దంలో భరతముని రచించాడు. ప్రథమ ముద్రణ 1865లో. ఎస్. హాల్ తాను ప్రచురించిన *దశరూపక* గ్రంథానికి అనుబంధంగా నాట్యశాస్త్రంలోని నాలుగు అధ్యాయాలు ప్రచురించాడు. సంపూర్ణ గ్రంథం 1894లో ప్రచురితమైంది. ఇది వ్యాఖ్యాసహితంగా అభినవభారతి లో మొట్టమొదట మానవల్లి రామకృష్ణ కవి సంపాదకత్వాన 1926లో వెలువడింది.

ఇందులో అధ్యాయాలు 36. శ్లోకాలు ఆరువేలు. కాని అభినవగుప్తుడు 36వ అధ్యాయాన్ని రెండుగా విభజించి మొత్తం 37 అధ్యాయాలు చేశాడు.

నాట్య శాస్త్రం రచించింది భరతముని అని లోక ప్రసిద్ధి. కాని నాట్య శాస్త్రంలో మాత్రం దేవతల ప్రార్థన మీద బ్రహ్మ దీనిని సృజించి భరతమునికి ప్రసాదించినట్టుగా చెప్పబడింది. ఈ భరత పదం నటుడనే అర్థంలో చాలా చోట్ల ప్రయుక్తమై ఉంది. భరత అనగా భావం, రాగం, తాళం అని కొందరు అర్థం చెపుతున్నారు. అందువల్ల భరతముని కల్పిత పురుషుడేమోనని కొందరు విమర్శకులు అనుమానిస్తున్నారు.

ఇదిలా ఉండగా, నాట్యశాస్త్రం బంబాయి ముద్రణ చివర 'నంది భరత సంగీత పుస్తకము సమాప్తం' అని ఉండడం వల్ల ఈ శాస్త్రానికి కర్త నందికేశ్వరుడేమోనని అనుమానించవలసి వస్తోంది. ఈ కారణాల వల్ల నాట్య శాస్త్రం ఒకరే రాసింది కాదని, సంకలన గ్రంథమని భావించవలసి వస్తోంది. దీనికి అభినవగుప్తుడు వ్యాఖ్యానం రచించాడు. తెలుగులో ప్రప్రథమంగా పోలూరి గోవింద కవి 1600 ప్రాంతంలో *రాగతాళ చింతామణి*, *తాళదశ ప్రాణ దీపిక* అనే పేర్లతో కొన్ని భాగాలను అనువదించాడు. ఆ తరువాత ఈ శతాబ్దిలో భాగవతుల కుటుంబరావు మొదటి రెండు అధ్యాయాలను తెనిగించి త్రిలింగ పత్రికలో 1953లో ప్రచురించాడు. పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన ఆంధ్రానువాదం నవభారతి పత్రికలో ప్రచురించాడు.

పి.ఎస్.ఆర్. అప్పారావు నాట్యశాస్త్రం మొత్తాన్ని అనువదించి గుప్త భావ ప్రకాశిక అనే వ్యాఖ్యానంతోనే గాక, అధస్సూచికలు, విశేషాంశాలు అనే పేరున ఇతర సంస్కృత లక్షణ కర్తల అభిప్రాయాలు, పాశ్చాత్య నాటక రీతులు, లక్షణాలు భరతముని సూత్రాలతో సరిపోలుస్తూ రూపొందించాడు. దీనికి సాహిత్య అకాడమీ, రాష్ట్రపతి బహుమతి 1967లో లభించింది.

ఈ నాట్య శాస్త్రంలో సూటిగా రూపకం ప్రక్రియకు సంబంధించిన విషయాలే గాక నృత్యం, భాష,అలంకారం, సంగీత విషయాలకు సంబంధించిన అధ్యాయాలు కూడా పొందు పరచడం వల్ల ఆనాడు ప్రచారంలో ఉన్న రూపక భేదం సంగీత నృత్య రూపకమని భావించవలసి వస్తోంది.

నాట్య శాస్త్రం ఇంతవరకూ ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మనీ, బెంగాలీ, హిందీ మొదలైన భాషలలోకి అనువదితమయింది. భరతమునే గాక, వ్యాస, ఆంజనేయ, కోహలుడు కూడా నాట్య శాస్త్రాన్ని రచించినట్టు తెలుస్తోంది.

సదాశివుడు ప్రప్రథమ నాట్యశాస్త్ర కర్త అని శారదా తనయుని అభిప్రాయం. దీనికే శివభరతముని సదా శివభరతముని పేర్లు. ఆ తరవాత బ్రహ్మభరతం వెలువడిందని, భరతముని నాట్యశాస్త్రానికిది మాతృకని భావించవచ్చు. ఇవేగాక శారదా తనయుని కథనం ప్రకారం నందికేశ్వరుని నాట్యశాస్త్రం ఉండేదని, భరతముని నాట్యశాస్త్రానికిది కూడా మాతృక అయి ఉండవచ్చునని తెలుస్తోంది.

36000 సూత్రాలతో ఒకటి, 12000 సూత్రాలతో మరొకటి, నాట్య శాస్త్రాలుండేవని శారదా తనయుని 'నాట్య వేదాల' అనే శ్లోకం వల్ల తెలుస్తోంది. ఇక అభినవ గుప్తుడు సదాశివ, బ్రహ్మ, భరతుడు అనే ముగ్గురు నాట్య శాస్త్రాలు రచించినట్లు, ఈ శాస్త్రాలు పరిశీలించి బ్రహ్మమతాన్ని స్థాపించడానికి భరతముని ఈ నాట్యశాస్త్రం రచించాడని చెప్పారు.

శారదా తనయుడు రస నిష్పత్తి వివరణ సందర్భంలో వృద్ధ భరతాన్ని పేర్కొన్నాడు. ఈ వృద్ధ భరతమే ఆది భరతం కావచ్చు. సదాశివ భరతానికి ఈ ఆది భరతం సంక్షిప్తమని విమర్శకుల ఊహ. వీరు గాక కీర్తిధరుడు అనే శాస్త్రవేత్త ఇంకో నాట్యశాస్త్రం రచించాడని వృద్ధ భరత నాట్యశాస్త్రంలోనుంచి స్వీకరించకుండా భరతముని వదిలి వేసిన సూత్రాలను ఈయన ఉద్ధరించాడని పండితుల అభిప్రాయం.

రాఘవ భట్టు శాకుంతలం నాటక వ్యాఖ్యానంలో మాతృగుప్తుడు కూడా నాట్య శాస్త్రం రచించినట్లు చెప్పాడు. ప్రసిద్ధ ఇతివృత్తాన్ని గాక ఉత్పాద్య వస్తువును కూడా స్వీకరించవచ్చునని ఇతని మతం. ఇతని సూత్రాధార లక్షణ కారికలు భరతముని శ్లోకాలకు దగ్గరగా ఉండడం వల్ల ఈయన కూడా ప్రాచీన నాట్య శాస్త్రాన్ని సంక్షేపించి ఉండవచ్చు. అభినవ గుప్తుడేకాక దత్తిల, రాహుల, శ్రీహర్షాదులు కూడా కార్తికలు రచించారు. లోల్లట, శ్రీశంకుకుడు, ఉద్భటుడు, భట్టనాయక, తౌతు భట్టులు కూడా వ్యాఖ్యానాలు రచించారు.

శ్రీ.చ.

నాట్యాంబుజం : తెలుగులో ప్రప్రథమ నాటక విమర్శ గ్రంథం. పురాణం సూరిశాస్త్రి రచించిన ఈ గ్రంథం 1923లో ముద్రణకు నోచుకుంది. ఆంధ్ర నాటక లోకంలో సంచలనం రేకెత్తించిన విమర్శక గ్రంథం. ఈ గ్రంథంలో నాటకాను భవాలు, ఆంధ్ర నాటకాలు, నాటక సమాజాలు, ప్రసిద్ధ నటులు, ప్రదర్శన విమర్శనలు, ఆంధ్ర నాటక విమర్శ, నాటక సమస్యలు, నాటక విమర్శన అని ఎనిమిది విభాగాలున్నాయి.

ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో కోలాచలం శ్రీనివాసరావు ప్రకటించిన ప్రణాళిక, దాని మీద ముత్తరాజు సుబ్బారావు ప్రభృతుల వ్యాఖ్యలు, ఆరవ విభాగంలో చేర్చడం ఈ గ్రంథంలోని విశేషం. నాటకానుభవాలు అనే మొదటి భాగంలో భాగవతాలు, జాతీయాలు, దేశీయ వినోదాలు, గద్య నాటకాలు, నవయుగం, నాట్యం పరిచయం, ఆంధ్ర నాటక పరిషత్తు, ఆంధ్ర నాటక వికాసం, ఆంధ్రప్రతిభ అనే శీర్షికల కింద వివిధ నాటకాంశాలు ప్రస్తావించబడ్డాయి.

ఆంధ్ర నాటకాలు అనే రెండవ భాగంలో తెలుగు నాటకాల పూర్వరూపాలు వాటి పరిణామ చరిత్ర, విషయ విభజన, మండలంలోని గాథా భేదాలు, కర్తవ్యం అనే భేదాలు చర్చితమయ్యాయి.

నాటక సమాజాలనే మూడవ భాగంలో సుగుణ విలాస సభ (బళ్ళారి), మైలవరం, రాజమండ్రి సమాజాలు, కర్ణాటక నాటకాలు, తమిళ నాటకాలు చెన్నపురి పౌరులు, నటరాజాచారి, సతారాం ప్రదర్శనం, సింహళ నాటకాలు, బంబాయి నాట్య శాలలు, కలకత్తా ఆంగ్ల నాటకాలు, కామెడీలు, ఆవర్తులు, బయస్కోపు, మూకాభినయాలను గురించి వివరణ ఉంది.

నాలుగవ భాగంలో ఈమని లక్ష్మణ స్వామి, నెల్లూరి నగరాజారావు, శృంగారాభినయం, భాషల రసానుకూలత, పఠాన్ వేషం, రామరాజు వినాశనం, పాదుకా పట్టాభిషేకం, దశరథుడు, ప్రహ్లాదుడు, హిరణ్య కశిపుడు, మాగంటి సుబ్బారావు, బందరు హాస్యగాండ్రు, ఇతర హాసకులు, పెదన రామయ్య, పత్రి శ్రీనివాసరావు (సీనప్ప), ముంజులూరి కృష్ణారావు, పింగళి వెంకట నరసయ్య, నరసింహారావు నాయుడు, దేవరకొండ వేంకట సుబ్బారావు, దైతా గోపాలం, ఉప్పులూరి సంజీవరావు, పింగళి లక్ష్మీకాంతం, హరిప్రసాదరావు, మల్లాదిగోవిందశాస్త్రి, యనమండ్ర శీనయ్య, అంకరాజు రామారావు, ముప్పిడి జగ్గరాజు, పారుపల్లి సుబ్బారావు, రామకృష్ణయ్య ఆయా శీర్షికల కింద ఆయా నటుల

ఆకార నటనా విశేషాలనే గాక నాటక కళపై వారివారి అభిప్రాయాలు కూడా పొందుపరిచారు.

'ప్రదర్శన విమర్శన' అనే అయిదవ భాగంలో చంద్రహాసలో దుష్టబుద్ధి – డి.వి.సుబ్బారావు, ముద్రా రాక్షసం నాటకంలో మంత్రి రాక్షసుడు పింగళి లక్ష్మీ కాంతం, నాటక కవులు, నటులు, చారిత్రక నాటకాలు, ముగ్గురు పఠానీ నటులు, తిమ్మరసు, పఠాన్ రుస్తుం, రామరాజ్య వినాశనం, కంచర్ల గోపరాజు భక్తిస్వభావం, శివాజీ రామదాసులు, బళ్లారి రాఘవాచార్యులు అనే విషయాలు వివరించాడు.

ఆరవ భాగంలో ఆంధ్ర నాటక విమర్శనం కోలాచలం శ్రీనివాసరావు ప్రణాళిక, దానిమీద పలువురు విమర్శకుల అభిప్రాయాలు పొందుపర చడమైంది. ఏడవ భాగంలో నాటక సమస్యలు, ఎనిమిదవ భాగంలో నాటక విమర్శనం, నాటక ఆదర్శాలు సోదాహరణంగా వివరించాడు.

శ్రీ.చ.

నాట్యాలంకారాలు : విశ్వనాథ కవిరాజు కింద తెలిపిన ముప్పది మూడింటిని నాట్యాలంకారాలుగా పేర్కొన్నాడు. ఇవి నాటకానికి అలంకార హేతువులు.

ఆశీస్సు, ఆక్రందం, కపటం, అక్షమ, గర్వం, ఉద్యమం, ఆశ్రయం, ఉత్ప్రాసనం, ఆకాంక్ష, క్షోభ, పశ్చాత్తాపం, ఉపపత్తి, ఆశంస, ప్రతిజ్ఞ (అధ్యవసాయం), విసర్పం, ఉల్లేఖం, ఉత్తేజనం, భర్త్సనం, నీతి, అర్థ విశేషణం, ప్రోత్సాహనం, సాహాయ్యం, అభిమానం, అనువర్తనం, ఉత్కీర్తనం, యాజ్ఞ, పరిహారం, నివేదనం, ప్రవర్తనం, ఆఖ్యానం, యుక్తి, ప్రహర్షం, శిక్ష.

వీటిలోని ఆశీస్సు, ఆక్రందం, కపటం, అర్థవిశేషణం, ప్రోత్సాహనం, అభిమానం, యాజ్ఞ, ఆఖ్యానం, యుక్తి భరతముని నాట్యశాస్త్రంలో చెప్పిన 36 నాటక లక్షణాల లోనివే.

శ్రీ.చ

నాట్యావధానం : నాటక ప్రయోగ భేదం. శతావధానం, అష్టావధానం, ఆశు కవిత్వం, ఆశు నాటకం వంటిదే నాట్యావధాన ప్రక్రియ.

ఈ ప్రక్రియలో ఒకే నటుడు ప్రాశ్నికులు కోరిన పాత్ర వేషం అప్పటి కప్పుడు వేసుకొని, వారు చెప్పిన సంఘటనకు అవసరమయిన వాచికం అప్పటికప్పుడు అల్లుకొని, నటించడమే నాట్యావధానం. అయితే ప్రాశ్నికులు కోరే పాత్ర, సంఘటన ప్రఖ్యాతమైనదిగా ఉండాలి లేదా ప్రాశ్నికులు వాటిని వివరించాలి. ఇది ఏకపాత్ర స్వగత రూపంలో ఉండాలి. ఉదా. కృష్ణదేవరాయలు కనుగుడ్లు తీయించిన తర్వాత తిమ్మరుసు మనోభావాలు. ఈ కళారూప స్రష్ట, ప్రచారకుడు, ధారా రామనాథ శాస్త్రి.

శ్రీ.చ.

నాట్యోత్పలం : ప్రపంచ నాటక రంగ చరిత్రను తెలిపే గ్రంథం. దీనిని పురాణం సూరిశాస్త్రి రచించాడు. (ఈ గ్రంథం 1924లో ముద్రింపబడింది.) నెల పొడుపు, ఆట మొలకలు, ఆట విరుల విప్పుటందములు, తెల్ల తెలుపులు, తీగ మల్లికలు, ఆటకైతల పూలసరం, ఆటకొలను, ఆటతోటల కమ్మ పెమ్మదలు, ఆటకుదురులు, ఆట నెరవులు, ఆట తెరువులు, తుది చూపు అనే శీర్షికల కింద గ్రంథోద్దేశ్యం, నాట్యోత్పత్తి వికాశ దశలు, పాశ్చాత్య రూపక విశేషాలు, పాశ్చాత్య నాగరికత చరిత్ర, పాశ్చాత్య రూపక కవుల జీవిత విశేషాలు, అభినయ మర్యాదలు, మహానటులు, రూపక విమర్శనం, యూరప్‌లోని నాట్యశాలా పరిపాలనా పద్ధతులు, నాట్య మందిరాలు, సభాంగం, రంగస్థలం, ప్రాచ్య నాటక రీతులు, ఆంధ్రులు – పాశ్చాత్య రూపకాలు అనే విషయాలను వివరించారు.

శ్రీ.చ.

నాదశుద్ధి : ధ్వని ఏర్పాట్లు, ధ్వని శాస్త్రం. నాటక శాలలో అసంఖ్యాక శ్రవణేంద్రియాలకు నటుడు కేంద్రం. నటుడి వాచికాభినయం ప్రేక్షకులకు విస్పష్టంగా, నిర్దుష్టంగా వినిపించడం మీదనే నాటక ప్రదర్శన విజయం ఆధారపడి ఉంది. కాని నటుని వాచికం మీద, రంగస్థలం మీద, తదితర శబ్దాల మీద నాటకశాల ప్రభావం గోచరిస్తుంది. కొన్ని మాటలను మింగివేస్తుంది. కొన్నింటిని మరీ బిగ్గరగానూ, కర్కశంగానూ ధ్వనింపచేస్తుంది. ప్రతిధ్వనింపచేస్తుంది. కాకువును చంపివేస్తుంది. అనవసరమైన చోట్ల ఒత్తి పలికినట్టు, ఒత్తి పలకవలసిన చోట్ల తేలికగా పలికినట్లు వినిపింపచేస్తుంది. ఇలాంటి దోషాలను పరిహరించి నటుల వాచికం, తదితర శబ్దాలు విస్పష్టంగా నిర్దుష్టంగా ప్రేక్షకులకు వినిపించేటట్టు చేసే ఏర్పాట్లకు సంబంధించిన విషయాలను చర్చించే శాస్త్రమే ధ్వనిశాస్త్రం.

ధ్వని ఉత్పత్తిని, ప్రసారాన్ని సక్రమ పద్ధతిలో పెట్టడమే ఈ శాస్త్రం ఉద్దేశం. ఈ శాస్త్ర పఠనం వల్ల ధ్వని ప్రసార సమస్యలు, వాటి పరిష్కారాలు విస్పష్ట శ్రవణానికి అనుకూల పరిస్థితులు తెలుస్తాయి. ఫలితాలను బేరీజు వేసుకోగలిగేటట్టు చేస్తుంది.

శ్రీ.చ.

నామకరణం : 1. రూపక నామకరణం, 2. పాత్ర నామకరణం. లోకంలో మానవులు తమ సంతానానికి పేరు పెట్టడం ఆచారం. లోక వృత్తానుసారంగా రూపకానికీ, రూపక పాత్రలకూ పేరు పెట్టాలి కదా. పేర్లు పెట్టే విధానాన్ని సంస్కృత లాక్షణికులు నిబంధించారు. ఈ విధానాన్ని భరతముని నామ విధానమని విశ్వనాథ కవిరాజు నామకరణమని పేర్కొన్నాడు.

1. రూపక నామకరణం : దశవిధ రూపకాలలో నాటకం శ్రేష్ఠం. ఈ నాటక నామకరణానికి విశ్వనాథ కవిరాజు సూత్రం "నాటకమునకు గర్భితార్థ ప్రకాశముగా పేరు పెట్టవలెను"–

(ఆం. సా.ద. *6-427.*) గర్భసంధిని బట్టి పేరుకు ఉదాహరణ - కుందమాల, ముద్రారాక్షసం, అభిజ్ఞాన శాకుంతలం.

కథా గర్భిత ప్రధానాంశాన్నిబట్టి పేరు - *వేణీసంహారం, ప్రతిమ, ప్రబోధ చంద్రోదయం.* అయితే, సంస్కృతాంధ్ర నాటక కర్తలు ఈ నియమాలను ఖచ్చితంగా పాటించినట్లు లేదు. వేరు వేరు విధానాలవలంబించారు. నాయకుని పేరుతో *ఉత్తర రామచరిత, నలవిలాసం,* ప్రతాపరుద్రీయం. నాయిక పేరుతో వీణావాసవదత్త, ఉషా కోకిల. నాయికా నాయకుల పేర్లు కలిపి *రాధాకృష్ణ, సావిత్రీ చిత్రాశ్వం, తారా శశాంకం.* ఇతివృత్తాన్ని బట్టి *యజ్ఞఫలం, వర విక్రయం.* నాయికా నాయకుల పేర్లను కలిపి ప్రకరణానికి పేరు పెట్టడం జరిగింది. ఉదా - మాలతి మాధవం, మల్లికా మారుతం.

కాని శూద్రకుడు తన ప్రకరణానికి మృచ్ఛకటిక అని పేరు పెట్టడం, కాళ్ళకూరి నారాయణ రావు తన ప్రథమాంధ్ర ప్రకరణానికి కేవలం చింతామణి అని పేరు పెట్టడం గమనార్హం. నాటిక సట్టకాదులకు నాయిక పేరు పెట్టాలని నిబంధన. ఉదా: *రత్నావళి, కర్పూరమంజరి.* కాని కాళిదాసు తన నాటికకు నాయికా నాయకుల పేర్లు చేర్చి మాళవికాగ్నిమిత్రం అని పేరు పెట్టాడు. వీటిని బట్టి కవులు అర్థవంతాలు, చమత్కార కారకాలు, కథానిర్వహణలో ప్రాధాన్యం వహించే వస్తు వ్యక్తి సన్నివేశాల పేర్లు పెట్టడం ఆచారమని తెలుస్తూంది.

2. పాత్ర నామకరణం: పాత్రలకు నామ కరణం చేసే విధానాన్ని కూడా సంస్కృత లాక్షణికులు సూచించారు. భరతముని నాట్య శాస్త్రంలో "నాటకమునందు కవులెల్లప్పుడును ప్రకృతులకు ఔత్పత్తిక (కల్పిత)ములును, అప్రఖ్యాతములును అయిన పేర్లను ప్రస్తుతార్థ సూచకములగు నట్లుగా పెట్టవలెను". (నా.శా. *17*వ అ. పుట: *492*)

శ్రీ.చ.

నాయకుడు : నాటక పాత్రలలోని ప్రధాన పాత్ర నాయకుడని సామాన్యాభిప్రాయం. నాటక కథ నడుపువాడు నాయకుడని కొందరు, నాటక ఫలం అనుభవించువాడు నాయకుడని కొందరు అభిప్రాయపడ్డారు.

"నయతి = ప్రాప్నోతి. వృత్తం ఫలం చేతి నాయకః" అని నాయక పద వ్యుత్పత్తి. కథాశరీరమంతటా వ్యాపించి వుండేవాడు. ముఖ్య ఫలభోక్త నాయకుడు. (అధికారః ఫల స్వామ్యమధికారీ చతత్ప్రభుః - ద.రూ. 1-12)

మొదటి అభిప్రాయం ప్రకారం వేణీ సంహార నాటకంలో కథను నడిపిన భీముడు నాయకుడు, ముద్రారాక్షసంలో చాణక్యుడు నాయకుడు, సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడు నాయకుడు. రెండవ అభిప్రాయం ప్రకారం వేణీసంహార నాటకంలో భీమాదులు విజయం సాధించినా, రాజు ఫలభోక్త, కాబట్టి ధర్మరాజు నాయకుడు. ముద్రారాక్షసంలో ఫలభోక్త చంద్రగుప్తుడు నాయకుడు. హరిశ్చంద్ర నాటకంలో ఫలభోక్త హరిశ్చంద్రుడు నాయకుడు.

అయితే కొందరు ఫలభోక్తను కథానాయకుడని, కథను నడుపు వారిని కథాసారథి (**protagonist**) అని నిర్వచించారు. హామ్లేట్‌లో నాటక భాగం కథా సారథి, ఫలభోక్త ఒకరే, అయినపుడు ఈ సమస్య ఉత్పన్నం కాదు. (వివరాలకు రూపక విశ్లేషణం చూడండి)

నాయకుడు వినయవంతుడు, ప్రియదర్శకుడు, ప్రియభాషి, త్యాగి, కార్య నిర్వహణాదక్షుడు, సర్వులకూ ప్రేమ పాత్రుడు, శుచి, ప్రఖ్యాత వంశజుడు, స్థిర బుద్ధి, కీర్తికాముడు, యువకుడు, యుద్ధ కుశలుడు, ఉత్సాహవంతుడు, జ్ఞాపకశక్తి గలవాడు, ప్రజ్ఞావంతుడు, కళా ప్రవీణుడు, అభిమాని, శూరుడు, వీరుడు, తేజశ్శాలి, శాస్త్ర ప్రవీణుడు, ధార్మికుడు అయివుండాలి.

అయితే, ఇన్ని లక్షణాలు ఒకే ఒక వ్యక్తిలో సమకూరి ఉండడం సంభవమా అనే సందేహం రావచ్చు. అయితే సంస్కృత లాక్షణికుల, రచయితల లక్ష్యం వాస్తవికతా చిత్రణ కాదు. ఆదర్శ చిత్రణ. అందువల్ల కొన్ని లక్షణాలు నాయకునకున్నట్లు చిత్రించాలని అనుశాసించారు.

ధనంజయుడు ఇరవైరెండు నాయక లక్షణాలు ప్రస్తావిస్తే, రుద్రటుడు పదహారు, భోజుడు పన్నెండు, విశ్వనాథుడు ఇరవై లక్షణాలు చెప్పారు.

రుద్రటుని నాయక లక్షణాలు: రత్యుపచార చతురత, కులీనత, సంపత్తి, కోపములేమి, అభిమానం, అగ్రామ్యత, ఉజ్జ్వల వేషం, అనుల్బణ చేష్టత, స్థిర ప్రకృతి, సుభగత్వం, కళాకౌశల్యం, యౌవనం, త్యాగం, ప్రియంవదత్వం, దక్షత, విశ్వాసం.

భోజుని నాయక లక్షణాలు: మహాకులీనత, ఔదార్యం, మహాభాగ్యం, కృతజ్ఞత, రూప సంపద, యౌవనం, వైదగ్ధ్యం, శీలం, సౌభాగ్యం, మానిత, ఉదారవాక్యత, స్థిరానురాగిత్వం.

విశ్వనాథుని నాయక లక్షణాలు: త్యాగం, కృతజ్ఞత, కులీనత్వం, భాగ్యం, రూపం, యౌవనం, ఉత్సాహం, దక్షత, ప్రజానురాగం, తేజం, వైదగ్ధ్యం, శీలం, శోభ, విలాసం, మాధుర్యం, గాంభీర్యం, ధైర్యం, తేజస్సు, లాలిత్యం, ఔదార్యం.

విద్యానాథుని నాయక లక్షణాలు: మహాకులీనత, ఔజ్జ్వల్యం, మహాభాగ్యం, ఔదార్యం, తేజస్వితా, విదగ్ధత, ధార్మికత, మహామహిమత్వం, పాండిత్యం.

సింగ భూపాలుని నాయక లక్షణాలు: మహాభాగ్యం, ఔదార్యం, ధైర్యం, దక్షత, ఔజ్జ్వల్యం, ధార్మికత్వం, కులీనత, వాగ్మిత, కృతజ్ఞత, నయజ్ఞత, శుచిత్వం, మానశాలిత్వం, తేజస్వితా, కళావత్త్వం, ప్రజారంజకత.

విద్యానాథుని నాయకులు ఉత్తమ, మధ్యమాధమ భేదాలని మూడు విధాలు. సమస్త సద్గుణవంతుడు, ఫలభోక్త, కథా వ్యాపి, ఉత్తమ నాయకుడు, కొద్ది గుణాలు మాత్రమే వ్యాపించినవాడు మధ్యముడు, చాలా లక్షణాలు లోపించిన వాడు అధముడు.

సరస్వతీ కంఠాభరణంలో భోజుడు నాయకులను ఇలా విభజించాడు. కథను బట్టి – నాయకుడు, ప్రతి నాయకుడు, ఉపనాయకుడు, అను నాయకుడు. గుణాలను బట్టి – ఉత్తముడు, మధ్యముడు, అధముడు. ప్రకృతిని బట్టి – సాత్త్వికుడు, రాజసుడు, తామసుడు. వివాహమును బట్టి – సాధారణుడు, ధైర్యవృత్తిని బట్టి ఉదాత్తుడు, ఉద్ధతుడు, లలితుడు, శాంతుడు – ప్రవర్తన బట్టి శఠుడు, అనుకూలుడు, దక్షిణుడు.

శ్రీ.చ.

నాయికాలంకారాలు : నాటక కథా నాయికకు అలంకారాలుగా ఉపయోగపడే అంగాలు నాయికాలంకారాలు.

ధనంజయుడు వీటిని దశ రూపకంలో ఇరవైగా లెక్కించి లక్షణం చెప్పాడు. అవి: భావం, హావం, హేల, శోభ, కాంతి, మాధుర్యం, దీప్తి, ప్రాగల్భ్యం, ఔదార్యం, ధైర్యం, లీల, విలాసం, విచ్ఛిత్తి, విభ్రమం, కిలికించితం, మొట్టాయితం, కుట్టమితం, బిబ్బోకం, లలితం, విహృతం.

ఈ ఇరవైలో మొదటి మూడు శరీరజాలని, తరువాతి ఏడు అప్రయత్నజాలని, చివరి పది స్వభావ జాలని పేర్కొన్నాడు. మొదటి పదిమంది పురుషులకు సాత్త్విక భావాలు కూడా వర్తిస్తాయి.

ఇక విశ్వనాథ కవిరాజు సాహిత్య దర్పణంలో సత్త్వజ్వాల లగు నాయికాలంకారాలు యాభై అని చెప్పినా, ఇరవై ఎనిమిదినే పేర్కొని లక్షణం చెప్పాడు. వీటిలో ఇరవై ధనంజయుడు చెప్పినవే. ఇవి గాక విశ్వనాథ కవిరాజు మదం, తపనం, మాధ్యం, విక్షేపం, హసితం, చకితం, కుతూహలం, కేళి ఎక్కువగా చెప్పాడు.

సర్వజ్ఞ సింగభూపాలుడు రసార్ణవ సుధాకరంలో ధనంజయుడు చెప్పిన ఇరవై నాయికాలంకారాలను అనుభావాలనే పేరుతో పేర్కొన్నాడు. వీటిలో మొదటి పదిని చిత్తారంభావాలని, తక్కిన పదిని గాత్రారంభావాలని వర్ణించాడు.

విద్యానాథ కవి ప్రతాపరుద్రీయంలో పద్దెనిమిది పేర్కొని వాటిని శృంగార చేష్టలుగా అభివర్ణించాడు. అంతేకాక వీటన్నిటినీ అనుభావాలు కిందే లెక్కించాడు. ప్రాచీనాలంకారికులు కొందరు వీటిని ఉద్దీపన భావాలుగా పరిగణించారు. ఈ చేష్టలు నాయకునిలోని ప్రేమను ఉద్దీపింప చేస్తాయి. కాబట్టి ఇవి నాయికకు అనుభావాలు. అవి 18. భావం, హావం, హేల, మాధుర్యం, ధైర్యం, లీల, విలాసం, విచ్ఛిత్తి, విభ్రమం, కిలికించితం, మొట్టాయితం, కుట్టమితం, బబ్బోకం, లలితం, కుతూహలం, చకితం, విహృతం, హాసం.

వీటిలో మొదటి అయిదు మానసిక చేష్టలని, తక్కినవి కాయక చేష్టలని అన్నాడు. ధనంజయుడు చెప్పిన ఇరవై అలంకారాలు నాట్య శాస్త్రంలో భరతముని చెప్పిన అలంకారాలతో సరిపోతున్నాయి. నరసభూపాలీయంలో రామరాజభూషణుడు శోభ, కాంతి, దీప్తి, ప్రగల్భ్యత, ఔదార్యం, మదం, తపనం, మౌఢ్యం, విక్షేపం, కేళి అనే పదింటిని వర్ణించనేలేదు. శారదా తనయుడు ధనంజయుడు చెప్పిన ఇరవై అలంకారాలను అనుభావాలుగానే పరిగణించాడు.

శ్రీ.చ.

నాయుడు గోపి (జ.1953) : నటుడు, దర్శకుడు. 1953 మార్చి 17న గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామంలో జన్మించాడు. పూర్తి పేరు నాయుడు గోపాలరావు, 1975లో నటజీవితం ప్రారంభించాడు. ప్రముఖ దర్శకుడు, నటుడు, రచయిత కె.ఎస్.టి. శాయి దగ్గర నటనలో ఓనమాలు దిద్దుకున్నాడు. జి.ఎస్.ఆర్.కె.శాస్త్రి కూడా ఈయనకు గురుతుల్యుడు. 1980లో 'గంగోత్రి' అనే నాటక సమాజాన్ని స్థాపించి, వందల సంఖ్యలో నాటక ప్రదర్శనలిచ్చి ఆంధ్ర ప్రేక్షక హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నాడు. నాయుడు గోపి నట ప్రస్థానంలో ఎన్ని విజయాలో, ఎన్ని అవార్డులో, ఎన్ని సన్మానాలో, ఎన్ని సత్కారాలో! గంగోత్రి ప్రదర్శించిన డియర్ ఆడియన్స్ సిన్సియర్లీ యువర్స్, తర్జని, నీతి చంద్రిక, కాదు సుమా కల, నిషిద్ధాక్షరి, మానస సరోవరం, నరవాహనం, వానప్రస్థం వంటి నాటకాలు, శ్వేతపత్రం, నవ్వండి ఇది విషాదం, దర్పణం, దహాతి మమమానసం, దంత వేదాంతం, శ్రీముఖ వ్యాఘ్రం, హింసధ్వని, ఎడారి కోయిల మొదలైన నాటికలు ప్రేక్షక లోకాన్ని ఎంతగానో ఆకట్టుకొన్నాయి. ఉత్తమ నటుడుగా 200 బహుమతులు, ఉత్తమ దర్శకుడుగా 60 బహుమతులు పొందడం అపూర్వమైన విషయం. 1983లో ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ఒకేసారి నాటకంలోను, నాటికలోను ఉత్తమనటుడుగా రెండు బహుమతులు పొందడం, ప్రగతి కళాపరిషత్తు, సత్తెనపల్లి నిర్వహించిన పోటీలలో వరసగా 1992, 1993, 1994లలో ఉత్తమ నటుడుగా రావడం, కాకతీయ కళాపరిషత్తు,

నాగభైరువారి పాలెం సమాజం 'విశిష్ట నటుడు' గా బంగారు పతకం పొందడం, 1982లో కళాసాగర్ మద్రాసు అవార్డు, వంశీ బర్కిలీ అవార్డు, విజయవాడ నగర పాలక సంస్థ అవార్డు ఇలా పేర్కొంటూపోతే వందకు మించిపోతుంది. నాటకాన్ని ఒక పవిత్రయజ్ఞంగాభావించి, అహర్నిశలు కళాసేవకు అంకితమైన కళాతపస్వి నాయుడు గోపి.

[illegible] బోయిన

నారాయణదాసు, ఆదిభట్ల (1864-1945) : పండితుడు, కవి. హరికథకుడు, సంగీతజ్ఞుడే గాక భక్తుడు, భోగి, యోగి. విద్యాదాత. విజయ నగరం మహారాజా వారి సంగీత కళాశాల ప్రధానాధ్యాపకుడుగా ఎందరికో సంగీతం నేర్పాడు. ఎందరో హరికథకులను తయారుచేశాడు. ఈయన బబ్బిలి తాలూకా అజ్జాడ అగ్రహారంలో 1864, ఆగస్టు 31న జన్మించాడు. నారాయణదాసు అసలు పేరు సూర్యనారాయణ. హరికథకుడైన తరువాత నారాయణ దాసుగా పేరు స్థిరపడింది. పిన్న వయసులోనే ఈయన విద్యాభ్యాసం కోసం విజయ నగరం వెళ్ళవలసి వచ్చింది. ఆనాడు విజయ నగరం విద్యానగరం, లలిత కళలకు నెలవు. అక్కడ ఈయనకు మహా విద్వాంసులతో, లలిత కళాభిజ్ఞులతో పరిచయం ఏర్పడింది. ఆచంట సాంఖ్యాయన శర్మ, మేడేపల్లి రమణాచార్యులు, నిడదవోలు సుందరంతో కలిసి చదువుకున్నాడు. గిడుగు రామమూర్తి పంతులు, గురజాడ అప్పారావు, కేసరి కామేశ్వరరావు ప్రభృతులు మిత్రులు. నారాయణదాసు, ఏకసంథాగ్రాహి, సహజ పాండితీ విలసితుడు. సంస్కృతాంధ్ర, ఆంగ్ల, అరబ్బీ, పార్సీ, హిందీ మొదలైన భాషలలో, వేదాంత, వ్యాకరణ, జ్యోతిష, ఆయుర్వేదాది శాస్త్రాలలో పాండిత్యం సంపాదించాడు. ఈ బహుముఖ పాండిత్యాన్ని హరికథా రచన, ప్రదర్శనల మీద కేంద్రీకరించి, యక్షగానాలకు కొత్త సొగసులు దిద్దాడు. 'హరికథా పితామహుడు' అనిపించుకొన్నాడు. ఉమర్ ఖయ్యాం రుబాయీలను సంస్కృతంలోకీ, అచ్చ తెలుగులోకీ అనువదించాడు. విశ్వకవులైన కాళిదాసు, షేక్స్పియర్ కావ్యాలలోని రసవత్తర ఘట్టాలను అనువదించి వివిధ శీర్షికలలో అమర్చి నవరస తరంగిణి అనే గ్రంథంగా ఆంధ్ర సాహితికి కానుకగా అర్పించాడు. ఋగ్వేదంలోని 300 ఋక్కులను అనువదించాడు. సంగీతంలో సర్వజనులను సమ్మోహింప చేయగల కళామర్మజ్ఞుడు.

నారాయణ దాసు జీవిత లక్ష్యం భక్తి, నీతి ప్రచారం. అందుకే హరికథను వేదాంత బోధతో, నీతి బోధతో ప్రారంభించి, దాని నుంచి కథను అవతరింపజేసిన దిట్ట. ఇక హరికథా కాలక్షేప సమయంలో జూదరులను, లంచగొండులను, అసత్యవాదులను ఒకరి నేమిటి వారి దృష్టిలో అధర్మ పరివర్తనులను నిర్భయంగా, నిస్సంకోచంగా తూర్పారా బట్టేవాడు.

సంస్కృతాంధ్ర హిందీ అచ్చ తెలుగు భాషలలో గద్య పద్య గేయ కవిత్వం అనర్గళంగా చెప్పగల ధీశాలి నారాయణ దాసు. అలతి అలతి పదాలతో, సంస్కృత సమాసాలలో వివిధ వృత్తులలో వివిధ పాకాలలో రసవత్తరంగా, చమత్కారంగా కవిత్వం చెప్పగల ప్రజ్ఞాశాలి.

సారంగధర నాటకం, దంభపురి ప్రహసనం, బాటసారి, తారకం, వేల్పుమాట, కవి, శివముకుందాది శతకాలు, అచ్చ తెలుగు నిఘంటువు, ఈసబు నీతి కథలు ఈయన ఇతర రచనలు. అయితే ఈయన హరికథలు వ్యాప్తిలోనికి వచ్చినంతగా ఇతర రచనలు వ్యాప్తిలోకి రాలేదు. హరికథకుడుగా ఎన్ని సంస్థానాలలోనో ఢంకా మోగించాడు. గండపెండేరం, ఏనుగు అంబారీ వైభవం అనుభవించాడు. ఆయా రంగాలలో సాటి లేని మేటిగా 80 సంవత్సరాలు జీవనయాత్ర సాగించి 1945, జనవరి 2న దివంగతుడయినాడు.

శ్రీ.చ.

నారాయణ నాయుడు, పై (జ.1938) : వృత్తిరీత్యా పోలీసు అధికారి. ప్రవృత్తి నటన. అభిరుచి క్రీడారంగం. ఈయన కర్నూలు జిల్లా అమకతాడు గ్రామంలో 1938, జులై 1న జన్మించాడు. తల్లి దండ్రులు గుర్రమ్మ, మద్దిలేటి. పల్లెల్లో పండుగ సందర్భంగా ప్రదర్శించే నాటకాలను చూసి నటన పట్ల అభిరుచి పెంచుకున్నాడు. పగటి పూట స్కూలుకు వెళ్ళటం, రాత్రి పూట నాటకఒద్దికలు జరగే చోటుకు వెళ్లి పద్యగానాన్ని పరిశీలించడం. శ్రావ్యమైన గాత్రం నారాయణనాయుడికి దేవుడిచ్చిన గొప్పవరం. నాటకం పట్ల అభిమానం పెంచుకున్న నాయుడ్ని ఊరిపెద్దల సలహా మేరకు మొట్టమొదటి సారిగా కురుక్షేత్ర నాటకంలో అభిమన్యుడు పాత్రలో నటించాడు. ఈ నాటకంలో విజయుడు పాత్ర ధరించిన ప్రసిద్ధ నటుడు వెంకటనర్సు నాయుడు అభిమన్యుడు పాత్ర ధరించిన నారాయణ నాయుడ్ని అభినందించాడు. శ్రావ్యమైన గాత్రం నాటి నాటకరంగ స్థలంపై నారాయణ నాయుడు నటుడుగా



ఎదుగటానికి తోడ్పడింది. ఉన్నత పాఠశాల చదువుతున్న రోజుల్లోనే వెల్దుర్తిలో వెంకటనర్సు నాయుడు దగ్గర సంగీత శిక్షణ పొందాడు. 1959లో పోలీసు విభాగంలో చేరిన తరువాత కూడా ప్రవృత్తిపట్ల పట్టుదల సడలలేదు. రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర, సీతారామకల్యాణం, చింతామణి, కురుక్షేత్రం, శ్రీకృష్ణరాయబారం నాటకాలలో ప్రధాన పాత్రలలో నటించాడు. నారాయణ నాయుడు శ్రీకృష్ణుడుగా, వెల్దుర్తి వెంకటనర్సునాయుడు విజయుడి పాత్రలో నటిస్తూ వందలాది ప్రదర్శనలిచ్చి, కాంట్రాక్టర్లకు కనక వర్షం కురిపించిన విషయం కర్నూలు జిల్లా నాటకరంగ చరిత్రలో మరువరానిది. నాటక సమాజాల పిలుపు మేరకు ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతాలలో సుప్రసిద్ధ నటులు షణ్ముకి ఆంజనేయరాజు, ఎ.వి. సుబ్బారావులతో నటించాడు. 1965వ సంవత్సరం లలిత కళా సమితి (అనంతపురం) నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటక పోటీలలో ఉత్తమ గాయకుడు అవార్డు అందుకున్నాడు. పోలీసు విభాగం నిర్వహించి వివిధ క్రీడోత్సవాలలో పాల్గని ప్రథమ బహుమతులు అందుకున్నాడు. 'రసమాధురి' కర్నూలు నిర్వహించిన ప్రదర్శనలలో నటించాడు. అయిదు దశాబ్దాల పాటు కళారంగం కోసం కృషి చేసిన నారాయణ నాయుడ్ని 2001వ సంవత్సరంలో లలిత కళా సమితి (కర్నూలు) కళాకారులు ఘనంగా సన్మానించారు. వయసురీత్యా ఉద్యోగ, క్రీడా రంగాలలో పాల్గనకపోయినా కళారంగంతో మాత్రం నేటికి అనుబంధాన్ని పెంచుకొని యువకళాకారులకు నటనలో మెలకువలు నెర్పుతున్న కళాకారుడు నారాయణ నాయుడు.

దాసరి.ఎన్

నారాయణమూర్తి, నందిరాజు (జ.1934-2006) :
నటుడు, దర్శకుడు, ప్రయోక్త. 1934, జులై 31న తెనాలిలోని వెంకట్రావమయ్య, బాలా త్రిపురసుందరి దంపతులకు జన్మించాడు. తన 12వ ఏట నటన పట్ల మక్కువతో నాటక రంగంలోకి ప్రవేశించాడు. ప్రసిద్ధ నటులు అబ్బూరి వరప్రసాద్, ముదిగొండ లింగమూర్తిల సాహచర్యంతో అభినయంలో మెళకువలను నేర్చుకున్నాడు. వీలునామా అనే హాస్య నాటికతో ప్రారంభమైన నందిరాజు నట జీవితం వారసత్వం, వెంకన్న కాపురం, పల్లెపడుచు వంటి సాంఘిక నాటకాలతోను, ఉద్యోగ విజయాలు, కురుక్షేత్రం వంటి పద్య నాటకాలతోను పరిపుష్టమైంది. 1976లో అబ్బూరి కళాపరిషత్తు ప్రారంభించి నాటకాలను ప్రదర్శించటం ప్రారంభించాడు. బి.ఏ. డిగ్రి పూర్తి చేసి వి.డి.ఓ. గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరి కొంతకాలం పనిచేసి, రాజీనామ చేసి రంగస్థలానికే పూర్తి కాలాన్ని వినియోగించాలని నిర్ణయించుకున్నాడు. అనంతరం కృష్ణాజిల్లా గుడివాడకు తరలివచ్చి పౌరాణిక నాటకాలను ముమ్మరంగా ప్రదర్శించాడు. సినిమా అవకాశాలు ఆదుర్తి సుబ్బారావు రూపంలో వచ్చినా నందిరాజు రంగస్థలానికే ప్రాధాన్యం ఇచ్చాడు. సుమారు 70 నాటకాలకు దర్శకత్వం వహించిన నందిరాజు పౌరాణికాలలో ప్రతినాయక పాత్రలను ఏరి కోరి ఎంచుకుని వాటితోనే మంచి గుర్తింపును సాధించాడు. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, రావణబ్రహ్మ, మైరావణుడు, హిరణ్యాకశ్యపుడు వంటి పాత్రలను ప్రతిభావంతంగా పోషించి పేరు తెచ్చుకున్నాడు. హిరణ్యకశ్యపునిగా నందిరాజు, భక్తప్రహ్లాదగా ప్రస్తుత నేపథ్యగాయకుడు 'మనో', లీలావతిగా నందిరాజు సతీమణి సుప్రసిద్ధ నటీమణి 'జ్యోతి' రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో వందలాది ప్రదర్శనలిచ్చాడు. నట దంపతులుగా నందిరాజు, జ్యోతి నాటకరంగానికి ఎనలేని సేవ చేశారు. అనేక నాటక పోటీలలో బహుమతులు సాధించాడు. కులం లేని పిల్ల, కూలి పిల్ల, పునర్జన్మ, ఇన్స్‌పెక్టర్ జనరల్, భయం, వీలునామా, బాలనాగమ్మ, రామదాసు, మోహినీ భస్మాసుర, సీతారామ కళ్యాణం మొదలైన నాటకాలలో నటించాడు.

వేమూరి రామయ్య, చుండూరు మధుసూదనరావు, ఎ.వి. సుబ్బారావు, ఆచంట వెంకటరత్నం నాయుడు, గుమ్మడి గోపాలకృష్ణ, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, బి.ఎన్. సూరి వంటి ప్రసిద్ధనటుల సరసన నందిరాజు అనేక ప్రదర్శనల్లో పాల్గన్నాడు.

అనేక రేడియో, టీ.వి. నాటకాల్లో కూడా నటించాడు. నందిరాజు కళాసేవను గుర్తించి రాష్ట్రంలో వివిధ సంస్థలు సన్మానించి, నటనాచార్య, కళాతపస్వి, ఆంధ్రశివాజీ మొదలైన బిరుదులతో సత్కరించాయి. అనేక నాటక సమాజాలకు ఈయన కార్యవర్గ సభ్యుడుగా పని చేశాడు. నందిరాజు 2006లో కాలధర్మం చెందాడు.

ఎమ్మెస్వీ

నారాయణ రావు, కాళ్లకూరి (1871-1927) :
ప్రథమాంధ్ర ప్రకరణ కర్త, కవి, సంఘ సంస్కార ప్రియుడు, జాతీయ వాది, ఛాయా గ్రహణ విద్యాదురంధరుడు, 'మహాకవి' బిరుదాంకితుడు. తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ

మత్స్యపురి గ్రామంలో 1871, ఏప్రిల్ 28న జన్మించాడు. తండ్రి బంగారురాజు, తల్లి అన్నపూర్ణమ్మ. పౌరాణిక, సాంఘిక ప్రహసనాది నాటక ప్రక్రియా రచనలో దిట్ట. కళారంగంలో కాళ్లకూరి మహా సాహసికుడు. ఈయన నాటక రచనకు ఉద్దీపన శక్తి సంస్కరణ.

సంస్కరణ, నీతి ఈయన నాటకాలలో అడుగడుగునా తళుక్కుమంటుంటాయి. కాళ్లకూరి సాహితీ సాహసి కాబట్టే ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా చిత్రాభ్యుదయ నాటకంలో చిత్రాంగిని నిర్దోషురాలుగా చిత్రించడమే గాక, సాహసించి చిత్రాంగీ సారంగధరుల వివాహం రాజరాజ నరేంద్రుని చేతనే జరిపించాడు. ఇలా మార్చడానికి ఇంకో కారణం మూల కథ నీతి దాయకం కాకపోవడమే.

మహాభారతం ద్రోణపర్వంలోని కొన్ని శంకలు, యుద్ధ జ్వాలలు చల్లారిన ప్రశాంత కాలంలో ప్రజలను వినోదింప చేయడం, పద్మవ్యూహ నాటక రచనకు ప్రేరకాలు. ఆనాటి రాజకీయోద్యమాలను ఈ నాటకంలో కాళ్లకూరి నారాయణ రావు ప్రతిధ్వనింప చేశాడు. వీర, అద్భుత రసాలు ప్రధానంగా గల నాటకమే ఉత్తమ నాటకమనే కాళ్ళకూరి అభిప్రాయం ఈ నాటకం ద్వారా నిరూపించాడు. 1919లో ప్రచురితమైన తెలుగు గ్రంథాలలో అత్యుత్తమైందిగా నాటి రాష్ట్ర ప్రభుత్వం దీన్ని పరిగణించింది.

ఈయన రచించిన సాంఘిక నాటకాలు 1. చింతామణి (1921), 2. వరవిక్రయం (1923), 3. మధుసేవ (1926), 4. సంసారనటన (అముద్రితం). ఈ నాలుగింటి రచనకు ప్రేరకం సంఘ సంస్కరణ, సంఘంలోని కుళ్లును దుయ్యబట్టడం.

కాళ్ళకూరికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన నాటకం చింతామణి. ఇది లీలాశుకుని చరిత్ర. అయినా సాంఘికంగా నడిచింది. ఆనాటి కాకినాడ వేశ్యల గుట్టుమట్లు ఈ నాటకంలో కాళ్లకూరి బట్టబయలు చేశాడు. చింతామణి బిల్వమంగళుల పాత్రోన్మీలనం మీద కంటే వేశ్యావృత్తి నికృష్టతను నిరూపించడం మీదనే ఎక్కువ దృష్టి. కాళ్ళకూరి నాటకంలోని రంగాలు మానవులలోని పాశవత్వాన్ని, బలహీనతలను రెచ్చగొట్టేవిగా ఉన్నాయని విమర్శకులు అభిప్రాయం.

ఆనాడు చింతామణి నాటకం ప్రదర్శించని నాటక సమాజమంటూ లేదు. అందుకే విజయవాడలో 1921 ప్రాంతంలో ఈ నాటక ప్రదర్శనకు పోటీలు జరిగాయి. ఈ నాటకంలోని పద్యాలు ప్రజల నోటిలో తాండవించసాగాయి.

వరవిక్రయం వరశుల్క ఆచారం మీద దాడి. మధుసేవ మధుపాన దుర్వ్యసనం మీద దాడి. ఈ రెండు నాటకాలు కూడా విరివిగా ప్రదర్శింపబడ్డాయి. ఈయన సృష్టించిన సుబ్బిశెట్టి పాత్ర ప్రేక్షక హృదయాలను బాగా ఆకట్టుకొన్న పాత్ర.

కాళ్ళకూరి శిష్టవ్యావహారికంలో వచనమే గాక పద్యాలు కూడా జనరంజకంగా రాసి అశేష ప్రజానీక గౌరవానికి పాత్రుడైన నాటకకర్త. చిత్రాభ్యుదయం (1909), పద్మవ్యూహం (1919), చింతామణి (1921), వర విక్రయం (1923), మధుసేవ (1926), సంసార నటన (1974 కళలో ధారావాహికంగా ప్రచురితం) మొదలైన నాటకాలు, కారణం లేని కంగారు (1920), దసరా తమాషాలు (1920), లుబ్ధాగ్రేసర చక్రవర్తి, (1906), రూపాయి గమ్మత్తు (1920), ఘోరకలి (1921), మునిసిపల్ ముచ్చట్లు (1921), విదూషకకపటము (1921)' వంటి ప్రహసనాలు రచించిన కాళ్ళకూరి నారాయణరావు 1927, జూన్ 27న మరణించాడు.

శ్రీ.చ.

నారాయణ రావు, చిలుకూరి (1890 -1952) : నాటికా రచయిత, కవి, పండితుడు, సాహిత్య పరిశోధకుడు, ఆంధ్రులలో మొట్టమొదటి డాక్టరేట్, బహుభాషా వేత్త, ప్రభుత్వ విద్యాశాఖలో ఉద్యోగి, వివిధ కళాశాలల్లో ఆచార్య పదవులు నిర్వహించాడు. 'మహా మహోపాధ్యాయ' బిరుదాంకితుడు.



ఈయన రచించిన నాటికలు రాసిలో తక్కువైనా వాసిలో ఎక్కువే. ఈయన అశ్వత్థామ నాటిక సుప్రసిద్ధరచన. ఈయన నాటికలు సాహిత్యదృష్టిలోనే గాక ప్రయోగ దృష్టిలో కూడా ఉత్తమ శ్రేణి కోవలోకి చేరుతాయి. పౌరాణిక కథలైనప్పటికీ శుద్ధ వ్యవహారిక భాషలో రచించి వ్యవహారిక భాషకు ఎనలేని గౌరవం తెచ్చి పెట్టాడు. అశ్వత్థామ పాత్ర చిత్రణలో చిలుకూరి ప్రజ్ఞా విశేషాలు చక్కగా గోచరిస్తాయి. ఈయన సాంఘిక నాటికలు కూడా రచించి తెలుగు జన జీవితానికి అద్దం పట్టాడు.

అశ్వత్థామ (1934), *అచ్చి* (1934), *అంబ* (1937), *నాటక నాటకం* (1949), *వాడే* (1949), *పెండ్లి, తిమ్మరసు, బమ్మ పొత్తికలు, మధురాంతకి.*

నారావు, [illegible]

శ్రీ.చ.

నారాయణరావు, రూపనగుడి (1883 - 1963) : నాటకకర్త, కవి, **సాహిత్య వేత్త**, విద్యావేత్త, వేదాంతి, ఆదర్శ ఉపాధ్యాయుడు, అనువాదకర్త, 'సాహితీశిల్పి'బిరుదాంకితుడు. క్రీడాకారుడు. తల్లి సీతమ్మ, తండ్రి నరసింగరావు.

ఈయన బళ్ళారి వార్డా కళాశాలలో విద్యాభ్యాసం చేశాడు. అనంతపురం, బళ్ళారి, కర్నూలు, రాయచోటి, సైదాపేట (మదరాసు) పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుడుగా 30 సంవత్సరాలు పనిచేశాడు. స్వతంత్రంగా నాటకాలు రాశాడు. సంస్కృతాంగ్ల నాటకాలు అనువదించాడు. ఈయన నాటకాలలోని దృశ్యాలను 'స్థలకం' అని పేర్కొన్నాడు. ఈయన గ్రంథాలను మైసూరు విశ్వవిద్యాలయం పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించింది. ఈయన నాటకాలే గాక కళ మీద అనేక వ్యాసాలు రచించి పత్రికలలో ప్రకటించాడు.

విప్రనారాయణ (1932), *గౌతమబుద్ధ* (1936), *సౌందరనందం* (1964), *ఉన్మత్తరాఘవం* (అనువాదం - 1964) అనే నాటకాలు రచించిన రూపనగూడి 1963లో మరణించాడు.

శ్రీ.చ.

నారాయణరెడ్డి. సి. (జ. 1931) : ఆధునికాంధ్ర కవి. సినీగేయ రచయిత, నటుడు, గేయ నాటకకర్త. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత. సి. నారాయణ రెడ్డికి మొదట కవిగా గుర్తింపు తెచ్చినది గేయ నాటికలే. ఆయన మొట్ట మొదటి రచన *నవ్వనిపువ్వు* గేయ నాటికే. కపట ప్రణయాన్ని చూపి, ఆమాయకుల జీవితాలతో చెలగాటమాడే కాముందులను దృష్టిలో ఉంచుకొని ప్రతీకాత్మకంగా, సందేశాత్మకంగా రచించిన నాటిక ఇది. ఈ నాటికలోని పాత్రలు, కవి, మొగ్గ తీగ, తుమ్మెద, పవనుడు. ఇందులో కవి పాత్ర తప్ప మిగతా వన్నీ అమూర్తపాత్రలే. నవ్వని పువ్వు సంపుటిలోనే *వలపుకాడు, దగ్ధశాంతి, భిన్న స్వరాలు* అనే గేయ నాటికలు కూడా ఉన్నాయి.



సి. నారాయణ రెడ్డి రెండవ గేయ నాటికల సంపుటి *అజంతా సుందరి*. ఈ సంపుటిలో *అజంతాసుందరి, సుగాత్రి, ఋతువుల రాణి* ఉన్నాయి.

నారాయణ రెడ్డి మూడవ గేయ నాటికల సంపుటి. ఈ సంపుటిలో *వెన్నెలవాడ, దివ్వెలసంగీతం, సంక్రాంతి, గోకుల విహారం, వెన్నెలవాడ, మనిషి-యంత్రం* అనే నాటికలున్నాయి.

నారాయణ రెడ్డి గేయ నాటికలలో కాల్పనికత ఎక్కువగా కనిపిస్తుంది. ఈయన రాసిన గేయ నాటికలన్నీ ఆకాశవాణి ద్వారా ప్రసారితమైనవి. కొన్నిటికి నృత్యాన్ని జోడించి సంగీత నృత్య రూపకాలుగా మలిచి, వేదిక మీద ప్రదర్శించినవి కూడా ఉన్నాయి. వాటిలో *నవ్వని పువ్వు, వెన్నెలవాడ*, అనే గేయ నాటికలు ఆంధ్రాభ్యుదయ ఉత్సవాలలోను అనేక వార్షికోత్సరాలలోను ప్రదర్శితమై బహుళ జనాదరణ పొందినవి. గేయ నాటికలనే గాక వచన నాటికలను కూడా రచించాడు. వాటిని *నారాయణ రెడ్డి నాటికలు* పేరుతో సంపుటంగా ప్రచురించాడు. వీటిలో పది నాటికలున్నాయి. అవి *ఊర్మిళ, వరూధిని, మేఘమాధురి, దీపలీల, నాగార్జునసాగరం, కర్పూర వసంతరాయలు, విజయ సంక్రాంతి, రఘుపతి రాఘవ రాజారాం, కాళిదాసు పునరాగమనం, హరిచరణ దాసి మీరా.* ఈ నాటికలు పూర్తిగా వచన నాటికలు కావు. మధ్యమధ్య గేయాలు, పాటలూ ఉంటాయి.

ఇవేకాక *వసంతలక్ష్మి, బలే లక్ష్మి, శిథిల శీల, సినీ కవి* అనే నాటికలు కూడా రచించాడు. సినీకవి నాటికలో మకరందమూర్తి (భావకవి) పాత్రలో నారాయణరెడ్డి స్వయంగా నటించి, ఉత్తమ నటుని బహుమతి అందుకోవడం విశేషం.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భం (1975)గా *తరతరాల తెలుగు వెలుగు* అనే నృత్య గేయరూపకాన్ని రచించి, ఆ సభల వేదిక మీద ప్రదర్శింపజేయడం జరిగింది. ఐతరేయ బ్రాహ్మణ కాలం నుంచి ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకు గల ఆంధ్ర పురారమ్య చరిత్ర - సంస్కృతులకు సంబంధించిన సముజ్వల ఘట్టాలను కవితామయంగా చిత్రించడం జరిగింది. కాకతీయులు నిర్మించిన రామప్ప గుడి నిర్మాణానికి సంబంధించిన వాతావరణాన్ని ప్రతిబింబించిన ఇతివృత్తాన్ని కల్పించి రచించిన రూపకమిది. ఈ సంగీత రూపకం 14 భారతీయ భాషలలోకి పరివర్తనం కావడం తెలుగు గేయ నాటిక ప్రక్రియకు కలిగిన ఘనమైన గౌరవం. హైదరాబాదు ఆకాశవాణి సంగీత రూపకాల్లో ఇంత ప్రశస్తి వహించిన సంగీత రూపకం మరొకటి లేదనే చెప్పాలి.

జి.చె.కే.రె.

నారాయణ, పి.ఎల్. (జ. 1938) : రంగస్థల, సినీ నటుడు. 1938లో గుంటూరు జిల్లా బాపట్లలో సుందరమ్మాళ్, సుబ్రమణ్యా అయ్యర్ దంపతులకు జన్మించాడు. పూర్తిపేరు

పుదుక్కోట లక్ష్మీనారాయణ. బాపట్ల బోర్డు హైస్కూలులో హైస్కూలు విద్య, చీరాల వి.ఆర్.ఎస్.వై. ఆర్.ఎన్. కళాశాలలో బి.ఎ చదివాడు. ప్రముఖ నటుడు మాచిరాజు బాల గంగాధర శర్మ, రచయిత కొర్రపాటి గంగాధరరావు శిష్యరికంలో నటనా రంగంలో అడుగుపెట్టిన పి.ఎల్. నారాయణ, 1953లో కె. ఎస్.టి. శాయి రచించిన ఈ ఉత్తరం నాది నాటికతో రంగ ప్రవేశం చేశాడు. 1954 బందరులో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు పోటీలలో కోపం నాటికను ప్రదర్శించి ప్రశంసాత్మక బహుమతిని పొందాడు. మూడు దశాబ్దాల కాలం వందకు పైగా వైవిధ్యభరితమైన పాత్రలను పోషించి, పరిషత్తులలో బహుమతులు గెలుచు కున్నాడు. పినిశెట్టి శ్రీరామమూర్తి రచించిన అన్నాచెల్లెలులో రంగడు, పల్లెపడుచులో గోపి, ఆత్రేయ ఎవరు దొంగలో దొంగ, ఎన్.జి.ఓ.లో గోపి, భయంలో అకౌంటెంట్, కొర్రపాటి గంగాధరరావు కమలలో అహోబిలం, పూల దోసిళ్లులో నిర్మలం, తస్మాత్ జాగ్రత్తలో సోమసుందరం, కోన గోవిందరావు రాజీనామాలో ఛైర్మన్, అక్షింతలులో జడ్జి, మట్టిబమ్మలులో తండ్రి, పాలమ్మర్తి రామ్ ప్రసాద్ రచించిన నయనదాతలో తిమ్మరుసు. కె.ఎస్.టి శాయి రచించిన సంఘం చెక్కిన శిల్పంలో శరభయ్య, మహానీయులు లో సూర్యం, పులీ మేకలో పానకాలు, శ్రీపాద కృష్ణమూర్తి బబ్బిలియుద్ధంలో బుస్సీ, పాండవోద్యోగాలులో శ్రీ కృష్ణుడు వంటి పాత్రలను పోషించాడు.

తస్మాత్ జాగ్రత్త నాటిక ద్వారా ఆంధ్ర నాటక పరిషత్తులో ఉత్తమ నటుడి బహుమతిని పొందాడు. రాజీనామా నాటికలో ఛైర్మన్ పాత్ర ద్వారా పాల్గన్న పరిషత్తులో ఉత్తమ నటుడు బహుమతిని పొందాడు. గెద్దనాపల్లి పంతం పద్మనాభం కళాపరిషత్తు పోటీలలో సంఘం చెక్కిన శిల్పం, మహానీయులు నాటకాలలో పి.ఎల్ నారాయణ నటనను చూసి న్యాయ నిర్ణేతలు ముగ్ధులై వ్యక్తిగతంగా నగదు బహుమతిని ప్రదానం చేశారు.

ఆర్య చాణక్య, ఇండియా ద టీజ్ భారత్, బ్లాక్ లైట్ , అనతోమాసద్గమయా వంటి నాటికలు, నాటకాలను రచించి ప్రదర్శించాడు. నటించిన ప్రతి నాటకానికి పి.ఎల్ నారాయణ దర్శకత్వం వహించడం విశేషం. రంగ స్థల నటునిగా లభించిన విశేషమైన పేరు ప్రతిష్ఠలను చూసి దగ్గుబాటి రామానాయుడు రాముడు భీముడు చిత్రంలో ప్రిన్సిపాల్ పాత్ర ఇవ్వడం ద్వారా చిత్రరంగంలో ప్రవేశించి, దాదాపు 30 సంవత్సరాలు పలు ప్రముఖ పాత్రలు పోషించాడు. మయూరి, రేపటి పౌరులు, కుక్క వంటి చిత్రాలలో నటనకు రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డులు పొందాడు. యజ్ఞం చిత్రం ద్వారా జాతీయ స్థాయిలో ఉత్తమ సహాయ నటుడి బహుమతి పొందాడు. ఆర్. నారాయణమూర్తి నిర్మించిన ఊరేగింపు చిత్రానికి, రేపటి పౌరులు రిక్షా కార్మికుని పాత్రకు విశేషమైన పేరు ప్రతిష్ఠలు లభించాయి. రాజమండ్రిలో ఒక టి.వి. సీరియల్‌లో పాత్ర పోషణ చేసి కారులో హైదరాబాదుకు ప్రయాణిస్తూ, మార్గ మధ్యంలో మృతి చెందాడు.

కందిమళ్ళ

నారాయణ, సి.ఎల్. (జ.1933) : నటుడు, దర్శకుడు, రచయిత, నాటక సమాజ స్థాపకుడు. అసలు పేరు చేబ్రోలు లక్ష్మీనారాయణ. 1933 అక్టోబరులో వెంకటరత్నం, అన్నపూర్ణమ్మలకు జన్మించాడు. స్వస్థలం గుంటూరు జిల్లా రేపల్లె. ప్రాథమిక విద్య చదువుతున్న రోజుల్లోనే ప్రధానోపాధ్యాయుడి ప్రోత్సాహంతో పదకొండవ యేటనే శ్రీకృష్ణ రాయబారంలో ధర్మరాజు పాత్రలో నటించాడు. తరువాత ప్రతి సంవత్సరం వార్షికోత్సవాల సందర్భంగా పలు నాటకాల్లోనూ, నాటికల్లోనూ నటించాడు.

సి.ఎల్. నారాయణలోని నటసామర్థ్యాన్ని బయటపెట్టిన పాత్రలు వరవిక్రయంలోని పురుషోత్తమ రావు, నార్ల వెంకటేశ్వరరావు ద్రోహం లోని విద్యార్థి, ఏకాభిప్రాయం లోని సర్పంచ్ పాత్రలు. ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదువుకున్న నారాయణ వృత్తి అర్చకత్వమైనా ప్రవృత్తిగా ఎన్నుకొన్న నాటకరంగం పైనే ఆసక్తిని పెంచుకున్నాడు. 'శ్రీనివాస ఆర్ట్ థియేటర్స్' నెలకొల్పి నాటకాలను ప్రదర్శించాడు. యువకులకు కళారంగం పట్ల అభిమానాన్ని పెంచాడు. నటులను తయారు చేశాడు. సమాజం పక్షాన ఎన్.జి.ఓ, పరివర్తన, ఆడది, అంతర్వాణి, లేపాక్షి మొదలైన వాటిని ప్రదర్శించాడు.

ఈయన రచించిన వెలుగునీడలు ప్రదర్శన పలువురి ప్రశంసలందుకుంది. దర్శకుడిగా సఫలీకృతుడైన నారాయణ మహాకవి కాళిదాసు, న్యాయం మీరే చెప్పాలి, ధర్మవీర, సంఘం శరణం గచ్ఛామి, కాలచక్రం మొదలైన నాటకాలను ప్రదర్శించాడు. ఎన్.జి.ఓ. నాటకంలో తండ్రి పాత్రలో నటించిన నారాయణను నాటి ప్రముఖ నటుడు చిత్తూరు నాగయ్య

బహుమతినిచ్చి సత్కరించాడు. చదువురాని నటులకోసం పూలరంగడు నాటకం ప్రదర్శించి కళాభిమానుల అభినందనలకు పాత్రుడైన సి.ఎల్. నారాయణ కొన్ని టెలిఫిల్ములు నిర్మించాడు. వాటిలో నటించాడు. నేటికీ నాటకరంగం కోసం కృషిచేస్తున్నాడు.

దాసరి. ఎన్

నారాయణ, సి.ఎస్ (1927-2004) : నటుడు, రచయిత. పూర్తి పేరు చిలకమర్తి సత్యనారాయణ. సుప్రసిద్ధ నాటకరచయిత చిలకమర్తి లక్ష్మీ నరసింహం ఈయనకు పెదనాన్న. 1927, మార్చి 3న తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించాడు. ఉద్యోగరీత్యా 1956 వరకు బంబాయిలో ఉన్నప్పుడు ఆర్.ఎం.సింగ్, శంభు మిత్ర, రిత్వీఘటక్ వంటి సుప్రసిద్ధ నటుల దగ్గర శిష్యరికం చేశాడు. వారి ప్రోత్సాహంతో ఎ.కె. హంగల్, సత్యే కప్పు, బాలరాజ్ సహానీల సరసన హిందీ నాటకాలలో నటించాడు. బంబాయిలో ఉన్నప్పుడే గరికపాటి రాజారావు దగ్గర మేకప్ నేర్చుకున్నాడు.

1958లో లలితకళాసమితి రాష్ట్రస్థాయి నాటిక పోటీలో కొర్రపాటి గంగాధరరావు మనోవ్యధ నాటకంలోని డాక్టరు పాత్రను పోషించిన నారాయణ ఉత్తమ నటుడు బహుమతిని అందుకున్నాడు. ఆంధ్ర దేశంలో మొట్టమొదట లలిత కళానికేతన్ రాజమండ్రి నిర్వహించిన కన్యాశుల్కం ఆఖరి దృశ్యంలోని గిరీశం పాత్ర పోషించి మరోసారి ఉత్తమ నటుడు అవార్డును అందుకున్నాడు. నటుడిగా కథకంచికి, ఇంటి దీపం, దైవశాసనం, మాష్టర్జీ, ఫణి, ఒకే కుటుంబం, చరిత్ర, పద్మవ్యూహం మొదలైన వాటిలో నటించి ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్ అవార్డును అందుకున్న నారాయణ రచయిత కూడా. *క్రీనీడ (1964)*, *కళాప్రపూర్ణ* వంటి పలు రచనలు చేశాడు. ఈయన విశ్వవిద్యాలయాలలోని రంగస్థలకళల విద్యార్థులకు ఉపకరించే *నటనాశిల్పం*, *రంగస్థల శిల్పం* అనే పుస్తకాలను రచించాడు. ఈయన 2004లో మరణించాడు.

దాసరి.ఎన్

నాలుగో గోడ : ఈ నాటక విమర్శన గ్రంథాన్ని జయప్రభ, 1992లో రచించింది. 1940 నుంచీ 1990 వరకూ ప్రదర్శించిన ఆధునిక, అత్యాధునిక నాటకాలూ, నాటకోద్యమాలనీ విశ్లేషించిన పుస్తకం ఇది. ఎనిమిది అధ్యాయాలుగా వింగడింపబడిన ఈ పుస్తకంలో ఆధునిక నాటకం, కళాపరిషత్తు, నాట్య గోష్ఠి, అబ్బూరి రామకృష్ణారావు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగ రంగ స్థలం, రాజకీయ నాటకరంగం, ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం, అత్యాధునిక నాటక రంగం, ముగింపు అనే విభాగాలున్నాయి.

గం.సు.రె.

నాసరయ్య, కన్నెగంటి (జ: 1926) : రంగస్థల నటుడు. జనతా ఆర్ట్ థియేటర్ స్థాపకుడు. 1926లో తెనాలిలో జన్మించిన నాసరయ్య రెండు పదుల వయసులో స్వాతంత్ర్య పిపాస అణువణువునా రగలడంతో కాంగ్రెస్ పార్టీ ఆశయాలను బుర్రకథల ద్వారా గుంటూరు జిల్లాలో సుడిగాలిలా పర్యటించాడు. 1950లో కణ్వశ్రీ రచించిన ఇదా ప్రపంచం నాటకంతో నటుడిగా రంగ ప్రవేశం చేసిన నాసరయ్య నాటకానికే తన జీవితాన్ని అంకితం చేశాడు. ఈ నాటకంలో ప్రధాన పాత్ర పోషణతో దర్శకత్వం, నిర్వహణ బాధ్యతలను చేపట్టి వందలాది ప్రదర్శనలిచ్చాడు. కళకు ఒక అర్థం, పరమార్థం ఉన్నాయనీ, జన చైతన్యానికి కళ ఆయుధమని మనసా వాచా నమ్మి జనతా ఆర్ట్ థియేటర్‌ను స్థాపించాడు.

ఆర్టిస్ట్, భయం, భలే పెళ్లి వంటి నాటకాలను, చీకటి తెరలు, ఉలిపి కట్టె, వీరకుంకుమ, జైజవాన్, రైలు ప్రమాదం, మానవుడు, చిరంజీవి వంటి నాటికలను కాకినాడ, రాజమండ్రి, తెనాలి, వెల్లటూరు జాగర్ల మూడి, వడ్లమూడి, కావలి, నరసరావుపేట ప్రాంతాలలో జరిగిన నాటక పోటీలలో ప్రదర్శించి బహుమతులు పొందాడు. ఇదా ప్రపంచం నాటకాన్ని విరివిగా ప్రదర్శింప చేశాడు. నాటకంలో రహీం పాత్ర పోషణకు మూడు నెలలు గడ్డం పెంచి సహజంగా నటించాడు. అన్నపూర్ణ, సభారంజని వంటి నటీ నటులను తీర్చిదిద్దాడు. సాటి కళాకారులు కన్నుమూసినా ఆత్మ బంధువులా హాజరై ఉత్తర క్రియలు, కర్మకాండలకు సహాయమందించే మనసున్న మంచి మనిషి, నాటకం పట్ల స్పష్టమైన అవగాహన గల కళారాధకుడు నాసరయ్య.

కందిమళ్ల

నిజోంబమ్ ఇబోబీసింఘా (జ.1921) : మణిపురి నాటక రచయిత, నటుడు, అనువాదకుడు. మణిపూర్ రాజధాని

ఇంఫాల్‌లో జన్మించిన ఈయన ఏ పాఠశాలలోనూ విద్యాభ్యాసం చేయలేదు. భాగ్యవంతుల వంశంలో జన్మించినప్పటికీ, సవతి తల్లి కారణంగా అనాథగానే అక్కడా ఇక్కడా తిరుగుతూ స్వయంకృషితో సంస్కృతం, బెంగాలీ, హిందీ భాషలతోపాటు మాతృభాష మణిపురిని క్షుణ్ణంగా అభ్యసించాడు. ఒక చిన్న పల్లెటూరిలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసి రిటైర్ అయ్యాడు.

చిన్ననాటి నుంచి ఇబోబీసింహకు నాటకమన్నా, నాటకాలలో నటించాలన్నా ఎంతో అభిలాష. ఈయన ఇర్వై వరకు నాటకాలు రాశాడు. తన నాటకాలలో నటించడమేగాక వీటికి దర్శకుడిగా పనిచేశాడు. మణిపూర్‌లో ఈ నాటకాలు ప్రదర్శించి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. కంటిచూపు క్రమేపి తగ్గటం వల్ల ఆఖరికి 1975లో గుడ్డివాడయ్యాడు. అయినప్పటికీ నిరంతర సాహిత్య సాధనలో నిమగ్నుడై ఉన్నాడు. ఇంఫాల్ ఆకాశవాణి కేంద్రం నుంచి ఈయన రాసిన నాటకాలు ప్రసారమయ్యాయి.

ఇప్పటివరకు ఇబోబీసింహ రచనలు 20 ప్రచురితమయ్యాయి. 1981లో ప్రచురింపబడిన కర్ణగీమమా, అమసుజ కర్ణగీ అరో ఇబాయహిప్ (కర్ణుని తల్లి, కర్ణుని అంతిమ నిద్ర) అన్న నాటకంలో కర్ణుడు, కుంతీదేవి మనోభావాలను ఒక వినూత్నదృక్పథంతో పరిశీలించటం జరిగింది. ఈ నాటకానికి 1982లో మణిపూర్ స్టేట్ కళా అకాడమీ, 1983లో సాహిత్య అకాడమీ బహుమతులనిచ్చి సత్కరించాయి.

బెంగాలీ భాషలో కృత్తివాస రాసిన రామాయణాన్ని, కాశీరామ్‌దాస్ రాసిన మహాభారతాన్ని మణిపురి పద్యాలలో అనువదించి అనువాదకుడుగా అపార కీర్తిని ఆర్జించాడు. మైకెల్ మధుసూదన్ దత్ మేఘనాథ్ వధ్ కావ్యాన్ని కూడా ఈయన మణిపురి భాషలోకి అనువదించాడు.

ఇబోబీసింహ మంచి వక్త. పండగలు, పబ్బాల సందర్భంగా ఈయన రామాయణ మహాభారతాది కావ్యాలలోని ప్రసంగాలను హరికథల రూపంగా చెబుతూ పురాణ కాలక్షేపంలో పాల్గొంటూ ఉంటాడు.

పో.వి.రా.రె.

నియతాప్తి : కార్యావస్థలలో ఒకటి. దీనిని భరతముని నియత ఫలప్రాప్తి అన్నాడు.

కార్యసాధన కృషిలో ఒకానొక దశలో ఆటంకాలన్నీ తొలగిపోయి, ఫలసిద్ధి నిశ్చయమని అభిప్రాయం కలుగుతుంది. ఇదే నియతాప్తి. రామయ్య, భీమయ్య అనే ఇద్దరు వస్తాదులు కుస్తీ పడుతుంటే ఒక దశలో భీమయ్య బాగా అలసి పోవడంతో అంటే ఆటంకం తొలగడంతో రామయ్య తప్పకుండా గెలుస్తాడనే అభిప్రాయం కలగడం నియతాప్తి. బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్య హరిశ్చంద్రీయం నాటకంలో హరిశ్చంద్రుడు హరిజనుడికి అమ్ముడు పోవడం సత్యవ్రత విజయమనే కార్యఫలసిద్ధికి ఉపాయం. ఈ నియతాప్తినే ఇంగ్లీషులో "ఫాలింగ్ యాక్షన్ రిసొలేషన్, డాక్యుమెంట్" అంటారు.

శ్రీ.చ.

నిరంజనరావు, తోట (1906-1964) : స్త్రీ, పురుష వేషధారి. దర్శకుడు, సంగీత విద్వాంసుడు, నాటక సమాజ సంచాలకుడు. క్రీడాకారుడు. ఈయన బందరులో 1906లో జన్మించాడు.

చిన్నతనంలో బడివేదిక మీద బాల వేషాలలో నటించి, పాటలు శ్రావ్యంగా పాడి మెప్పు పొంది అనేక బహుమతులు పొందాడు. ఆనాటి నాటకాలలో కత్తియుద్ధాలు, మల్లయుద్ధాలు ఉండేవి కాబట్టి అవి కూడా అభ్యసించాడు. ఆ తరువాత నేషనల్ థియేటర్, ఇండియన్ డ్రెమెటిక్ కంపెనీలలో చేరి, ప్రధాన భూమికలలో నటించి ఖ్యాతి పొందాడు. ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ అంతరించిన తరువాత సొంత కంపెనీ పెట్టి అనేక నాటకాలు ప్రదర్శించాడు. గాత్రంతో పాటు, వీణ, ఫిడేలు, హార్మోనియం మొదలైన వాద్య పరికరాలు వాయించగల సమర్థుడు.

ఈయన శ్రీకృష్ణుడు, లవుడు, కుశుడు, ప్రహ్లాదుడు, మార్కండేయుడు, శ్రీకృష్ణదేవరాయలు, అర్జునుడు, శివశ్రీ, నలుడు, చంద్రహాసుడు, యముడు, లక్ష్మణుడు, బిల్వమంగళుడు, భోజరాజు, సారంగధరుడు, అప్పాజీ, భరతుడు, హరిశ్చంద్రుడు, సత్యకీర్తి మొదలైన పాత్రలలో నటించాడు. సతీ సులోచన చిత్రంలో కూడా నటించిన ఈయన 1964, ఏప్రిల్ 21న తుదిశ్వాస విడిచాడు.

శ్రీ.చ.

నిర్లిప్త వైఖరి : నాటక ప్రదర్శనం, నటుల అభినయం చూస్తుంటే భావనా ప్రపంచంలోనే తప్ప వాస్తవానికి ప్రేక్షకులు నిర్లిప్తతనే అనుభవిస్తారు. రమణీయతను గ్రహించడానికి ఈ నిర్లిప్త వైఖరి అత్యవసరమని లాంగ్ ఫీల్డ్ మొదలైన కళావేత్తల అభిప్రాయం. ప్రేక్షకులకు అభినయావరణ మధ్య ఖాళీప్రదేశం, రంగ ముఖద్వారం, తెరలు, రంగస్థలం మీద దీపకాంతి, ప్రేక్షకాగారంలో చీకటి ఈ నిర్లిప్త వైఖరిని కలిగిస్తుంటాయి. నటుడు తన సత్త్వాన్ని మరుగు పరచి పాత్రగా వ్యవహరించడం, నటుడు భావనా జగత్తులోను, ప్రేక్షకుడు వాస్తవిక జగత్తులోనూ

ఉండడం వల్ల ప్రేక్షకులతో నటుడి వైఖరి కూడా నిర్లిప్తతే. ప్రేక్షకులతో నటుడు ప్రత్యక్ష సంసర్గం పెట్టుకుంటే నటన, ప్రదర్శన దెబ్బతింటాయి.

శ్రీ.చ.

నిర్వహణ సంధి : పంచ సంధులలో ఆఖరుది. నాటక కథ ఈ కథాభాగంలో నిర్వహింపబడుతుంది కాబట్టి దీనికీ పేరు వచ్చింది. దీనినే ఉప సంహృతి సంధి అని కూడా అంటారు. వివరాలకు 'ఉపసంహృతి సంధి' చూడండి. నిర్వహణ సంధికి అంగాలు 14. అవి: సంధి, విబోధం, గ్రథనం, నిర్ణయం, పరిభాషణం, ఆనందం, సమయం, ప్రసాదం, కృతి, ఉపగూహనం, భాషణం, పూర్వ వాక్యం, కావ్య సంహారం లేక ఉపసంహారం, ప్రశస్తి.

శ్రీ.చ.

నీతి రూపకాలు (Moralities) : యూరప్‌లో మధ్యయుగాలలో పరిఢవిల్లిన నాటక రూపం. అద్భుత రూపకాలలో బైబిల్‌లోని వ్యక్తులు, కల్పిత వ్యక్తులు, పాత్రలు. వీటి ప్రేరణలో నీతి రూపకాలని ఇంకొక విధమైన రూపకాలు ఆవిర్భవించాయని భావించవచ్చు. ఈ రకం రూపకాలలోని పాత్రలు అరూప పాత్రలు. సద్గుణ దుర్గుణాలకు, విజ్ఞాన అవిజ్ఞానాలకు ప్రతీకలు. 12వ శతాబ్దంలో జర్మనీలో క్రైస్తవేతర దేవతారాధనలు, యూదులు, కౌటిల్యం మత భ్రష్టత పాత్రలుగా నాటకాలు వెలువడినాయి. ఈ నీతి రూపకాలలో ప్రధాన పాత్ర మానవుడు. ఈ మానవుడు ప్రలోభానికిలోనై పతనం చెంది తిరిగి ఉద్ధారితుడవడం ఈ నాటకాల ఇతి వృత్తం. ఈ నాటక కర్తలలో కొందరి రచనలు బరువుగా, మందకొడిగా, రసహీనంగా నడుస్తాయి. మరికొంతమంది రచయితలు నీతిబోధకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల నాటకీయత చచ్చిపోయింది. అయితే మొత్తం మీద ఈ ఇతివృత్తాలు సాంఘిక జీవితాన్ని విస్పష్టంగా చిత్రించడానికి దోహదం చేశాయి. ఫ్రెంచి నీతి నాటకాలలో ప్రతీక పాత్రలకు బదులు వాస్తవిక పాత్రలు, జాతి పాత్రలు ప్రవేశించాయి.

అద్భుత నాటక ప్రదర్శనలో ఒకేసారి అనేక వేదికలు ఉపయోగించవలసి ఉంటే ఫ్రెంచి, ఇంగ్లీషు నాటకాలలో ఒకే ఒక వేదిక ఉపయోగించేవారు. ఆనాడు ఉపయోగించే ఖరీదైన, విశాలమైన సెట్లు అక్కరలేకుండా 15వ శతాబ్దిలో అవతరించిన చిన్న చిన్న జీవిక నాటక సమాజాలకు ఈ విధానం ఎంతో ఉపయుక్తమయింది. అందువల్ల ఈ నీతి రూపకాలు మధ్య యుగాల నాటకరంగానికి, ఆధునిక నాటకరంగానికి వారధిగా పనిచేశాయని చెప్పవచ్చు. ఉదా. ఫోర్ ఎలిమెంట్స్, కాజిల్ ఆఫ్ ప్రిజర్వెన్స్.

శ్రీ.చ.

నూతన్ ప్రసాద్ (జ:1945) : రంగస్థల, సినీనటుడు. కృష్ణాజిల్లా కైకలూరులో 1945, డిసెంబర్ 12న జన్మించాడు. చిన్నప్పటి పేరు వరప్రసాద్. 1963-64 ప్రాంతాల్లో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, దుర్యోధనుడిగా నటించి దాదాపు 50 ప్రదర్శనల్లో పాల్గన్నాడు. మొదట 1961లోనే స్కూలులో నిర్వహించిన నాటకాలలో నటుడిగా పాల్గన్నాడు. 1965 నుంచి పూర్తిగా నాటకాల వైపు మళ్లాడు. రాజీవం, ప్రతిధ్వనులు, సుడిగాలి, గాలిపటం, కెరటాలు, వలయం, గాలివాన, సమాధి కడుతున్నాం చందాలివ్వండి, గాంధీ పుట్టిన దేశమేనా ఇది, పైడిరాజు, ఊరుమ్మడి బ్రతుకులు, వెల్లువ మొదలైన నాటికలు ప్రసాద్‌కు నటుడిగా పేరు తెచ్చిపెట్టాయి. భాను ప్రకాష్ దర్శకత్వంలో మద్రాసునుంచి విజయ నగరం వరకూ చాలా పరిషత్తుల్లో పాల్గని ఉత్తమ నటుడు, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ ప్రతి నాయకుడు, ఉత్తమ హాస్యనటుడు బహుమతులు పొందాడు. ప్రసిద్ధ దర్శకుడు ఎ. ఆర్. కృష్ణ దర్శకత్వంలో మాలపల్లి నాటకంలో 'తక్కెళ్లజగ్గడు' పాత్ర ప్రతిభావంతంగా పోషించి ప్రశంసలందుకున్నాడు.

అంతేకాదు ఆకాశవాణిలో 'ఏ' గ్రేడ్ కళాకారుడుగా దాదాపు పదకొండు సంవత్సరాలు కార్యక్రమాల్లో పాల్గన్నాడు. దూరదర్శన్ ప్రారంభమైన తొలిరోజుల్లో దాదాపు 50 టీవీ నాటకాల్లో పాల్గన్నాడు.

బాపు దర్శకత్వంలో 1973లో అందాల రాముడులో నటించాడు. అది మొదలు సంవత్సరానికి ఒక సినిమా చొప్పున 1976 వరకూ ఐదు సినిమాల్లో నటించాడు. 1978 నుంచి 1989 వరకూ దాదాపు 365 సినిమాలలో నటించాడు. రవీంద్రభారతికి కార్యదర్శిగా పనిచేశాడు.

కళారంగానికి సేవ చేసిన ప్రసాద్‌ను ఎన్నో సమాజాలు సత్కరించాయి. ప్రసాద్ సేవలను గుర్తించి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2000లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2002లో నిర్వహించిన నంది నాటకోత్సవాలలో తెలుగు ఆత్మ గౌరవ పురస్కారం ప్రదానం చేసి గౌరవించింది.

అడబాల

నూరేళ్ల తెనాలి రంగస్థలి : 1998లో వెలువడిన ఈ గ్రంథం రచయిత నేతి పరమేశ్వర శర్మ. తెనాలి తాలూకాలోని రంగస్థల వికాసానికి , నటీనటులు, రచయితలు, కళాపోషకుల కృషికి

పరిమితమైనట్టు స్ఫురించినప్పటికీ, తెనాలి పరిధిని దాటి అనేక విషయాలను ఇందులో ప్రస్తావించడం జరిగింది. తెనాలి ప్రాంతంలో ప్రసిద్ధ నటీనటుల జీవిత చరిత్రలు, కళాసేవ, నాటక సమాజాల ప్రదర్శనల సరళి, జానపద కళారూపాలు, వాటిలో నిష్ణాతులైన కళాకారుల అకుంఠిత కృషి, సాంకేతిక నిపుణులు, నాటక పరిషత్తులు తదితర అంశాలకు ఈ పుస్తకంలో ప్రాధాన్యం లభించింది. తాలూకా, జిల్లాకు పరిమితమైన నాటక చరిత్రను గ్రంథస్తం చేసే సంప్రదాయానికి తెనాలి రంగస్థలి స్ఫూర్తినిస్తోంది.

గం.సు.రె.

నూరేళ్ల తెలుగు నాటకరంగం : వ్యాససంపుటి. సంపాదకుడు మొదలి నాగభూషణశర్మ. (ప్రథమ ముద్రణ 1980.) తెలుగు నాటక శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించింది. ఇందులో తెలుగు నాటకం పుట్టు పూర్వోత్తరాలను వివరించే వ్యాసాలున్నాయి. నాటక రచనా శిల్పం, ప్రదర్శన రీతులు, నూరేళ్లలో తెలుగు నాటకరంగంలో వచ్చిన మార్పులు, నూరేళ్ల నటనారీతులు, దర్శకత్వం – నాడునేడు, తెలుగు నాటకంలో పద్యం పోయిన పోకడలు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగ రంగస్థలం, తెలుగు నాటకం – సాంఘిక సమస్యలు, ఇతర రాష్ట్రాలలో నాటకరంగం–తెలుగు వారు నేర్చుకోవలసింది, రచనా రీతులు – కొత్తపోకడలు అనే అంశాలపై వివిధ రచయితలు రాసిన విలువైన వ్యాసాలు ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి.

గం.సు.రె

నృత్తం : 'నృత్' అనే సంస్కృత ధాతువు నుంచి పుట్టిన శబ్దం. ఈ ధాతువు నుంచే నర్తనం, నర్తకుడు, నర్తకి అనే పదాలు కూడా పుట్టాయి. ఈ ధాతువు ఋగ్వేదకాలం నుంచి ఉన్నదని తెలుస్తూంది. నృత్తమనే అర్థంలోనే ఈ ధాతువు ప్రయుక్తమైంది. అందులోనూ గాత్ర విక్షేపమనే అర్థంలోనే ప్రయుక్తమైంది.

అమరసింహుడు తన నిఘంటువు (అమరకోశం)లో 'తాండవం, నటనం, నాట్యం, లాస్యం, నృత్యంచ నర్తనం' అనడం వల్ల ఈ పదాలు సమానార్థకాలుగా వాడుకలో ఉన్నాయని భావించవలసి వస్తోంది. దీనిలోని నృత్య పదానికి నృత్తమనే పాఠాంతరం ఉందని *గురుబాల* ప్రబోధికను బట్టి తెలుస్తోంది.

నాట్య శాస్త్రంలోని నృత్య పదానికి నృత్తమనే పదం పాఠాంతరంగా ఇవ్వడం జరిగింది. ఈ నృత్యానికి ప్రవర్తకుడు పరమేశ్వరుడు. ఇది కరుణ, అంగహార సంపన్నమైంది. తాండవమనే పదం కూడా నృత్తమనే అర్థంలోనే ప్రయుక్తమైంది.

శారదా తనయుడు ''నృత్యం భావాశ్రయం, నృత్తం రసాశ్రయ ముదాహృతమ్'' అన్నాడు. ఇందులోని నృత్తమనే పదానికి నృత్యః అనే పాఠాంతరం కూడా ఉంది. దీనిని బట్టి నృత్యం కూడా భావాశ్రయమని చెప్పవలసి ఉంటుంది.

నందికేశ్వరుడు అభినయ దర్పణంలో 'రస భావ విహీనంతు నృత్య మత్యభిధీయతే' (1-18) అన్నాడు. నృత్తంలో రస భావాలుండవు. అంగ విక్షేపం మాత్రమే ఉంటుంది. ధనంజయుడు కూడా దశరూపకంలో 'నృత్తం తాళ లయాశ్రయం' (1-9) అన్నాడు. పైగా ఆద్యం పదార్థాభినయోమార్గో దేశీతథా పరమ్'' అని నృత్యాన్ని దేశిగా పరిగణించాడు. దీనిని బట్టి తాళలయాశ్రయమై కేవలం అంగ విక్షేపంతో కూడింది నృత్తమని బోధపడుతోంది.

అభినవభారతి లో అభినవగుప్తుడు ఈశ్వర ప్రవర్తితాలయినవని చెబుతూ ఏడు నృత్త రీతులను వివరించాడు. 1. శుద్ధ నృత్తం – ఇది కేవలం అంగ విక్షేపం ప్రధానమైంది, 2. గాన క్రియానృత్తం – ఇందులో గీతానికి ప్రాధాన్యంఎక్కువ. ఆంగికాభినయానికి ప్రాధాన్యం తక్కువ. 3. వాద్య తాళానుసారి నృత్తం– ఇందులో వాద్య తాళాలకు అనుగుణంగా ఆంగికాభినయం ఉంటుంది. 4. ఉద్ధతనృత్తం – ఇందులో నృత్తం ఉద్ధత, 5. సుకుమార ఉద్ధత నృత్తం, 6. సుకుమార నృత్తం, 7. ఉద్ధత – సుకుమార నృత్తం.

నిజానికివన్నీ నృత్త భేదాలు కావు. వీటిలో చివరి నాల్గింటిలో అభినయం ఉండటం వల్ల ఇవి నృత్యం భేదాలుగా పరిగణించవలసి ఉంటుంది. ఈ సప్తవిధ నృత్తాలలో మొదటి మూడు ఒక తరగతికి, తరువాతి నాలుగు ఒక తరగతికి చెందినవి. శుద్ధ, ఉద్ధత, సుకుమార భేదాల వల్ల నృత్యం చతుర్విధాలైంది. ఈ ఏడింటిలోని మొదటి మూడు దేవతల ప్రీతి కొరకు, లౌకిక స్వతంత్ర నృత్తంలో ఉపయోగపడుతాయి. ఇక రెండవ రకం పూర్వరంగానికి ఉపయుక్తమవుతాయి.

నృత్తం రూపకోప కారకం. అలంకారం. నాటకం మధ్య మధ్య దీనిని ప్రయోగిస్తే నాటకానికి శోభ చేకూరుతుంది.

శ్రీ.చ.

నృత్యం : ఇది ఋగ్వేద కాలం నుంచీ ఉందని నృత్తమనే అర్థంలోనే ఈ పదం ప్రయుక్తమైందని, కేవలం గాత్ర విక్షేప మాత్రమని భావించవలసి ఉంది.

అమర సింహుడు తన నిఘంటువులో ''తాండవం, నటనం, నాట్యం, లాస్యం, నృత్యంచ నర్తనే'' (అమరకోశం, ప్రథమకాండం, నాట్య వర్గం, సూత్రం9) అనడం వల్ల ఈ పదాలు సమానార్థకంగా వాడుకలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులోని నృత్య పదానికి నృత్తమనే పాఠాంతరం కూడా కన్పిస్తోంది.

విప్రదాసు (15వ శతాబ్ది) సంగీత శబ్దంలో ''రసాభివ్యక్తి పర్యాంతో (ఆంగికః) నృత్యభియతే'' అని నిర్వచించాడు. ఇక ధనంజయుడు దశరూపకంలో 'అన్యద్భావాశ్రయం నృత్యం' అంటూ దీనిని మార్గవిధానంగా

చెప్పాడు. శారదా తనయుడు కూడా భావ ప్రకాశనంలో 'నృత్యం భావాశ్రయం' అన్నాడు.

నందికేశ్వరుడు అభినయ దర్పణంలో "రస భావ వ్యంజకాది యుతం నృత్యమితీరితే" అనే అభిప్రాయం వెల్లడించాడు. నన్నె చోడుడు (12వ శతాబ్ది) కుమార సంభవంలో నృత్యం రసస్ఫోరకమని చెప్పాడు. అయితే ఇది నాట్యం కాదు నృత్తం కాదు అభినయ పూర్వకమైన నృత్తం. ఇదే నృత్యం.

ధనంజయుడు అన్యద్భావాశ్రయం నృత్యం, నృత్తం తాళలయాశ్రయం, ఆద్యం పదార్థాభినయం అనడం వల్ల ప్రతి పదాభినయం నృత్యమని భావించవలసి వస్తోంది. దీనిని బట్టి నర్తకి ఏదో ఒక శ్లోకంలోగాని, గేయంలోగాని, ప్రతి పదం అభినయించి చూపే నృత్తవిధానమే నృత్యమని నిర్ధారించుకోవచ్చు. ధనంజయుడు దీనిని మార్గనృత్యంగా పేర్కొన్నాడు.

నృత్యం రూపక ఉపకారకం, ఆలంకారికం, నాటకం మధ్య మధ్యలో దీన్ని ప్రయోగిస్తే నాటకానికి శోభనిస్తుంది.

శ్రీ.చ.

నృత్య రూపకం : దీనినే ఇంగ్లీషులో బాలే (ballet) అంటారు. తెరలోపల ప్రయోగించే జంత్రగాత్ర సంగీతాన్ని తోడు చేసుకొని మాటలు, సంభాషణలు లేకుండా కేవలం ఆహార్యం, ఆంగిక, సాత్త్వికాభినయాల ఆధారంగా నృత్య రూపంలో కథను, ప్రక్రియలను వ్యక్తీకరించే రూపక భేదం నృత్య రూపకం. ఇందులో ప్రాధాన్యం వహించేవి నృత్యం, మూకాభినయం. డిన్‌లే హుస్సే అనే ఆంగ్ల లక్షణ వేత్త ఈ నృత్య రూపకాన్ని ఇలా నిర్వచించాడు.

"సంగీత సహకారంతో నృత్య, మూకాభినయాల ద్వారా ప్రక్రియను ద్యోతకం చేసే దృశ్యకావ్యం." **(A dramatic spectacle in which the action is presented in dancing and in mime to the accompaniment of music. -** ***Oxford companion to the Theatre, page 47)***

ప్రప్రథమ నృత్య రూపక ప్రదర్శన ఐరోపా ఖండంలోని వజిల్స్‌లో 1581లో జరిగినట్లు చరిత్రకారుల అభిప్రాయం. నాటి నుంచి 18వ శతాబ్ది మధ్య వరకు నృత్య రూపక ప్రదర్శన అట్టహాసంగా, కనులు మిరుమిట్లు గొలిపే రంగాలంకరణ, రంగ సజ్జలతో విలసిల్లుతుండేది. 1760లో పారిస్‌లో జీన్ జార్జెస్ నొవెరా అనే కళాకారుడు ఒక ప్రణాళికను ప్రచురించడంతో నృత్య రూపకంలోని డాబు, దర్పం తగ్గి స్వాభావికమైన నిరాడంబరతకు స్థానం ఎక్కువగా లభించింది. అంతేగాక సాత్త్వికాభినయానికి, మూకాభినయం ద్వారా కథా కథన విధానానికి ప్రాధాన్యం వచ్చింది.

వస్త్రధారణలో పెద్ద మార్పు తెచ్చిన నటీమణి మేరాషాలీ. పౌరాణికాలలో ధరించే చెమికీ దుస్తులకు బదులు, మజ్లిన్ దుస్తులతో నృత్యం చేసి కొత్త ఒరవడి కల్పించింది. అలాగే లూగ్లియానా హెల్తర్ అనే కళాకారుడు బటన వ్రేలి మీద నిలబడి నృత్యం చేసే సంప్రదాయాన్ని 1930 ప్రాంతంలో నెలకొల్పాడు. బిగువయిన దుస్తులు ధరించడం 18వ శతాబ్దిలో మొదలయింది. 1901లో అమెరికా నర్తకి ఎసోడోల్ డంకన్ పాదరక్షలు లేకుండా నృత్యం చేసే ఆచారం ప్రవేశ పెట్టింది.

19వ శతాబ్దిలో ఈ నృత్య రూపకాలు స్వర కల్పనలతో ప్రచురితం కాసాగాయి. శిల్పదృష్టి హెచ్చింది. పురుష నర్తకులు లేకుండా స్త్రీ నర్తకీ మణులే నృత్య రూపకాలు నిర్వహించే స్థితి వచ్చింది.

ఐరోపాలో అవతరించిన ఈనృత్య రూపక కళారూపం ప్రపంచమంతా వ్యాపించి ఆయా దేశాల కాలమాన పరిస్థితులను బట్టి పెంపొందుతూ వచ్చింది. ఇప్పుడు రష్యాలో పతాక స్థాయినందుకొంది.

శ్రీ.చ.

నెల్లూరు నాటక కళ : ఈ చారిత్రక గ్రంథ రచయిత కొమాండూరు పార్థసారధి అయ్యంగార్. నెల్లూరు పట్టణ నాటకరంగం చరిత్రను వివరించే గ్రంథం. తెలుగులో ఒక ప్రత్యేక ప్రదేశ రంగస్థల చరిత్రను తెలిపే మొట్ట మొదటి గ్రంథం. అయితే నాటక సంస్థల, నటుల వృత్తాంతం కంటె ఆనాటి సంస్థల మధ్య సంఘటిల్లిన కలతలు, వైషమ్యాలు ఎక్కువగా ఇందులో ప్రస్తావించబడ్డాయి.

శ్రీ.చ.

నేపథ్య గృహం : నటీనటులు పాత్రకు సంబంధించిన ఆహార్యం కోసం వినియోగించే ప్రదేశం. దీనిని నేపథ్యభూమి అని, ఇంగ్లీషులో గ్రీన్‌రూం (Green Room) అంటారు.

సాధారణంగా రంగస్థల వేదికకు ఇరుపక్కల స్త్రీలకొకటి, పురుషులకొకటి , రెండు గదులను ఏర్పాటు చేస్తారు. నటీనటులు వాటిలో నుంచి రంగస్థలంలోకి ప్రవేశించడానికి రెండు ద్వారాలుంటాయి.

శ్రీ.చ

నేపథ్య విధి : నాటక ప్రయోగ సంబంధి. ఇది నేపథ్యంలో జరిపే ప్రక్రియ. ఇది నాట్యానికి అలంకారం. ఈ నేపథ్యజ విధి నాల్గు విధాలు.

1. పుస్తం – ప్రదర్శించవలసిన వస్తువులను తయారు చేయడం.
2. అలంకారం – భూషణాదులను తయారు చేసి ధరించే విధానం.
3. అంగ రచన – ముఖాదులకు రంగు వేసుకోవడం, టోపా మొదలైనవి ధరించడం.
4. సంజీవం – పశుపక్షిమృగాదులు రంగస్థలం మీద తిరుగుతున్నట్టు చూపడం.

శ్రీ.చ.

నేవియస్ (క్రీ.పూ. 274-202) : రోమన్ నాటకకర్త. రోమన్ నాటక సాహిత్యానికి గ్రీకు నాటక సాహిత్యం మాతృక అయినా, గ్రీకు నాటకకర్తలనుభవించిన వాక్స్వాతంత్ర్యం రోమన్ నాటకకర్తలకు లోపించింది. నేవియస్ అరిస్టోఫేన్స్ లాగానే అనేక హేళన నాటకాలు రచించాడు. ఒక నాటకంలో మెటాలస్ అనే ఉన్నత కులీనుని అవహేళన చేసినందుకు కారాగారవాస శిక్ష అనుభవించవలసి వచ్చింది. కారాగారం నుంచి విడుదలైన తరువాత ఇలాంటి మరో నేరానికి దేశ బహిష్కరణ శిక్షకు గురయ్యాడు. ఆ తరువాత నాటకకర్తలు ఈ సంఘటనలను దృష్టిలో పెట్టుకుని అరిస్టోఫేన్స్‌ను అనుకరించకుండా మెనాండర్‌ను అనుకరించడం ప్రారంభించారు. ఈయన గ్రీకు నాటకాలను అనువదించడమే గాక రోమన్ చారిత్రక నాటకాలు రెండు రచించాడు. శైలిలో కిందటి తరం వారిని మించిపోయాడు. స్వాతంత్ర్య కాముకుడు. సాంఘిక, రాజకీయ, వ్యంగ్య రచనలకు ఆద్యుడు. *ద గరల్ ఫ్రమ్ టారెన్‌టం* **(The girl from Toranton)** అనేది ఇతని ప్రసిద్ధ నాటకం.

శ్రీ.చ.

నేషనల్ థియేట్రికల్ సొసైటీ : ఈ సమాజాన్ని 1880 – 1882లో బందరులో స్థాపించారు. వ్యవస్థాపకులు దేవరసు వెంకట శివరావు, బాలకృష్ణయ్య. ఆంధ్రదేశంలో నాటకరంగం అవతరించిన కొత్తలో స్థాపితమైన నాటకసమాజం. దీని మొదటి పేరు 'జువెనయిల్ హిందూ థియేటర్' తరవాత దీని పేరు 'నేషనల్ థియేట్రికల్ సొసైటీ'గా మారింది. ఇదే సంక్షిప్త రూపంలో 'నేషనల్ థియేటర్' అయింది. అయితే ఈ నాటక సమాజం బుట్టయ్యపేటలో ఉండడం వల్ల దీనికి 'బుట్టయ్యపేట కంపెనీ' అని పేరు వచ్చింది. వీరి నాటకశాల శారదా విలాస్‌కు బుట్టయ్యపేట హాలు అనే పేరు వాడుకలోకి వచ్చింది.

ఈ నాటక సమాజం జీవితం అయిదు దశలలో నడిచింది. మొదటిదశలో ఈ సమాజం పక్షాన తెలుగు నాటకాలు ప్రదర్శించారు. 1884తో మొదలైన రెండవ దశలో నాదెళ్ల పురుషోత్తమ కవి హిందీ నాటకాలు కళావతీ పరిణయం, బిల్హణీయం, రామదాసు మొదలైనవి ప్రదర్శించారు. వీటికి ఆచార్యులు, సూత్రధారుడు పురుషోత్తమ కవే.

ఆంధ్రదేశంలోని ప్రధాన పట్టణాలలో నాటకాలు ప్రదర్శించి మెప్పుపొందడమే గాక నూజువీడు, బాపట్ల, పెద కళ్లేపల్లి గ్రామాలలో తమ శాఖలను కూడా స్థాపించుకొన్నారు. 1884లో ధార్వాడ కంపెనీ రెండవ సారి బందరు వచ్చినప్పుడు ఆ సమాజ సభ్యుల కోసం కళావతీ పరిణయ నాటకం ప్రదర్శించి వారి మెప్పు పొందారు.

మూడవ దశ లక్ష్మణస్వామి దశ. ఈ దశలో కూడా హిందీ నాటకాలాడి, అఖిలభారత కీర్తిని ఈయన సంపాదించుకున్నాడు. ఈవెన లక్ష్మణస్వామి నాయక పాత్రలు, జోస్యుల శేషయ్య నాయిక పాత్రలు ధరించేవారు. ఈ దశలో వీరు శివాజీ, పీష్వా నారాయణ రావు, విక్రమార్క, పద్మిని, విజయనగర రాజ్యపతనం ఎక్కువగా ప్రదర్శించారు. వీరి నాటకాలను చూసిన బిపిన్ చంద్రపాల్ ఎంతగానో మెచ్చుకున్నాడు. వీరి నాటకాలలో శివాజీ నాటక ప్రదర్శన ప్రజాభిమానాన్ని ఎక్కువగా చూరగొన్నందు వల్ల గుర్రమెక్కిన శివాజీ చిత్రమే ఈ సమాజానికి చిహ్నంగా పెట్టుకున్నారు. నాటకశాల ముందు తెర మీద కూడా ఈ చిహ్నాన్ని చిత్రించుకున్నారు.

1913 జనవరిలో లక్ష్మణస్వామి నిర్యాణానంతరం నాల్గవ దశ ప్రారంభమైంది. ఈదశలో ఈసమాజం హిందూస్తానీలోనే గాక, తెలుగులో కూడా నాటకాలు ఎక్కువగా ప్రదర్శించింది. వెంపటి వెంకటేశ్వర్లు, వంగల ఆంజనేయులు, గుత్తి రామమూర్తి ప్రధాన పాత్రలు ధరించేవారు. చిత్ర నళీయం, రస పుత్ర విజయం, ప్రతాప రుద్రీయం, బొబ్బిలి, నరకాసురవధ నాటకాలు ఎక్కువగా ప్రదర్శించారు. బందరులో జరిగిన చిత్రనళీయం నాటక పోటీలలో ఈ సమాజం ప్రధాన నటుడు వెంపటి వెంకటేశ్వర్లుకు నల బాహుక పాత్రలకు 'సువర్ణ పతకం' లభించింది.

ఐదవ దశలో తెలుగునాటకాలే ఎక్కువగా ప్రదర్శించారు. వీరి **కాళిదాసు** నాటక ప్రదర్శన యావదాంధ్ర ఖ్యాతి గాంచింది. ఈ సమాజంలోని నటులు ఎక్కువ మంది ప్లీడర్ గుమాస్తాలు కావడం వల్ల దీనికి 'ప్లీడర్ గుమాస్తాల కంపెనీ' అని పేరు కూడా వచ్చింది. ఈ దశలో యడవల్లి సూర్యనారాయణ, కనకసుందర రావు, తుర్లపాటి ఆంజనేయులు, సుసర్ల రామచంద్రరావు, విన్నకోట రామన్నపంతులు, ఉదయభీమరాజు ప్రధాన భూమికలు ధరించేవారు.

కాళిదాసు, తెనాలి రామలింగడు, పద్మిని, *గయ్యాళి గంప* మొదలైన చారిత్రక, సాంఘిక నాటకాలనే ఈ సమాజం వారు ఎక్కువగా ప్రదర్శించారు.

శ్రీ.చ.

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా అండ్ ఏషియన్ థియేటర్ ఇనిస్టిట్యూట్ : జాతీయ నాటక విద్యాలయం (నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా), ఆసియా నాటకరంగ సంస్థ (ఏషియన్ థియేటర్ ఇనిస్టిట్యూట్)ను 1959లో ఢిల్లీలో భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆర్థిక సహాయంతో సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో స్థాపించారు. 1975లో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థగా నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పేరుతో నమోదైంది. కేంద్ర

మానవ వనరుల మంత్రిత్వశాఖ సాంస్కృతిక విభాగం దీనికి ఆర్థిక సహాయంతో కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

ఈ సంస్థలో నాటకరంగంపై మూడు సంవత్సరాలు శిక్షణ ఇస్తారు. సిద్ధాంతం, ప్రాయోగికం రెండు అంశాల్లో శిక్షణ ఇచ్చే ఈ డిప్లొమా కోర్సులో చేరిన విద్యార్థులకు ఉపకార వేతనం కూడా లభిస్తుంది. మౌఖిక పరీక్ష, ప్రాయోగిక శిక్షణ శిబిరం విభాగాల ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. జాతీయ స్థాయిలో నాలుగు లేదా ఐదు జోన్లలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆశ్రమ పాఠశాల పద్ధతిలో మూడు సంవత్సరాల నాటకరంగ శిక్షణా విద్యాబోధన ప్రధానాంశంతో పాటుగా విస్తరణ కార్యక్రమాల్లో భాగంగా దేశంలోని పలు ప్రాంతాల్లో నాటకరంగ శిక్షణా శిబిరాలు నిర్వహించడం, థియేటర్ ఇన్ ఎడ్యుకేషన్ కార్యక్రమం కింద పిల్లల కోసం నాటకాలు ప్రదర్శించడం, వారికి, ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం సంస్థ ఇతర కార్యకలాపాలు.

ఒక ఛైర్మన్, మరికొందరు సభ్యులతో ఏర్పాటైన పాలకమండలి ఆధ్వర్యంలో ఈ సంస్థ తన కార్యకలాపాలు కొనసాగిస్తోంది. దేశంలో జాతీయస్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో, అన్ని వనరులతో ఉన్న నాటక విద్యాసంస్థ ఇదొక్కటే.

ప్ర.రె.

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రిపర్టరీ కంపెనీ : 1964-65 మధ్యకాలంలో నాటక విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో, నాటక ప్రదర్శనలు ఇవ్వాలనే తలంపుతో ఇబ్రహీం అల్కాజీ రాష్ట్రీయ నాటక విద్యాలయ నటమండలి (రిపర్టరీ) ని స్థాపించాడు. ప్రారంభంలో ఈ నటమండలిలో కేవలం నలుగురు నటులు మాత్రమే ఉండేవారు. ఆ తరువాత అనేకమంది నటీనటులు, సంగీత కళాకారులు, సాంకేతిక నిపుణులతో ఈ నటమండలి విస్తరించింది. 1964లో ఓం శివపురి, 1977లో మనోహర్‌సింగ్ ఈ మండలికి ఆద్యులు కాగా, 1985లో ఉత్తర బావకర్, ఆ తరువాత సురేష్ సీకారీ, జె. ఎస్. కౌశల్ దీనికి సారథ్యం వహించిన తదుపరి ప్రముఖులు. 1989 నుంచి 1994 వరకూ రాంగోపాల్ బజాజ్, 1994 నుంచి 1997 వరకు తిరిగి కౌశల్ దీనికి సారథ్యం వహించి ఎందరో కళాకారులను వృత్తి కళాకారులుగా తీర్చిదిద్దారు.

సంస్కృత నాటకాలు, విదేశీ భాషల నాటకాలు, సాంఘిక నాటకాలు, సమకాలీన ఇతివృత్తంతో కూడిన నాటకాలు, ప్రయోగాత్మక నాటకాలు అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నటమండలి ప్రదర్శించి, దేశ విదేశీ ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఈ నటమండలి ఇప్పటి వరకు 70 మంది రచయితలతో సుమారు 120కి పైగా నాటకాలు ప్రదర్శించింది. 50 మంది దర్శకులు ఈ నాటకాలకు పనిచేశారు. ఈ నటమండలి ద్వారా పేరు సంపాదించిన నటీనటులు చాలామంది నాటక, సినిమా, టీవీ రంగాల్లో విశేషమైన సేవలందించారు. జర్మనీ, పోలెండ్, బ్రిటన్, నేపాల్, మారిషస్ దేశాల్లో పలు నాటకాలు ప్రదర్శించి ప్రశంసలందుకొంది. మోహన్ రాకేష్ 20వ వర్ధంతి సందర్భంగా ఆయన రచించిన నాటకాలన్నింటిని ఒక ఉత్సవం పేరిట ప్రదర్శించి శ్రద్ధాంజలి ఘటించింది. 1992-93లో నటమండలి రజతోత్సవం సందర్భంగా 1991లో నటమండలి నిర్వహించిన కార్యకలాపాలన్నింటినీ, ఛాయాచిత్రాలు, ప్రదర్శన వివరాలు, రంగస్థల సామగ్రి, పోస్టర్లతో రంగయాత్ర పేరుతో ఒక ప్రదర్శనను బంసీ కౌల్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రారంభించింది. ఇది శాశ్వతంగా ఉండే ప్రదర్శన.

భారతీయ నాటకరంగంలో గొప్ప పేరుపొందిన రచయితలు రచించిన అన్ని నాటకాలనూ నాట్యమండలి ప్రదర్శించింది. (ప్రదర్శితమైన నాటకాల జాబితా అనుబంధంలో చూడండి.)

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా – రీజనల్ రిసోర్స్ సెంటర్స్ (జాతీయ నాటక విద్యాసంస్థ – ప్రాంతీయ వనరుల కేంద్రాలు) : దేశ రాజధానికే పరిమితమైన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా తన కార్యకలాపాలను దేశమంతటా విస్తరింపచేయాలనే లక్ష్యంతో 1994లో దేశంలోని ఐదు మండలాల్లో (జోన్స్) ప్రాంతీయ వనరుల కేంద్రాల్ని స్థాపించింది. ప్రధాన నగరాల్లో ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆయా మండలాల్లోని, రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో రంగస్థల కళలకు సంబంధించిన పలు అంశాలలో అంటే అభినయం, దర్శకత్వం, రంగోద్దీపనం, దృశ్య పరికల్పన, రచన తదితర అంశాల్లో స్వల్పకాలిక శిక్షణా శిబిరాలను నిర్వహించి, నాటకరంగం పట్ల అభిరుచి కలిగిన వారిని కార్యోన్ముఖులను చేయడం ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యం. స్థానిక ప్రభుత్వ సంస్థలు, నాటక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తుల సహకారంతో వారి వారి అవసరాల మేరకు సంబంధిత అంశాలపై శిక్షణ– బోధనకు ఈ ప్రాంతీయ వనరుల కేంద్రాలు సహకరిస్తాయి. అంతేకాకుండా నాటకోత్సవాలు, నాటకరంగ సదస్సులు కూడా నిర్వహిస్తాయి.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, పాండిచ్చేరి, గోవా రాష్ట్రాలకు బెంగుళూరు ప్రాంతీయ కేంద్రంగా పనిచేస్తోంది. ఈ కేంద్రానికి ఇన్‌ఛార్జి అధికారిగా ఒకరు ఉంటారు. ఈ రాష్ట్రాల నుంచి ఒక్కరు లేదా ఇద్దరు చొప్పున ప్రాంతీయ వనరుల కేంద్ర సలహామండలి సభ్యులుగా

ఎంపికవుతారు. ఇప్పటివరకూ మన రాష్ట్రం నుంచి ఈ ప్రాంతీయ కేంద్ర సలహామండలి సభ్యులుగా చాట్ల శ్రీరాములు, జి.ఎస్. ప్రసాదరెడ్డి, ఎల్.వి. భూషణ్, మొదలి నాగభూషణ శర్మ తమ సేవలందించారు. సలహా మండలి సభ్యులను నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఢిల్లీ డైరెక్టర్ ఎంపిక చేస్తాడు.

ప్ర.రె.



నోయల్, కోవార్డ్ (1889-1973) : ఇంగ్లీషు నాటకకర్త, నటుడు, వాగ్గేయ కారుడు, 'సర్' బిరుదాంకితుడు. ఈయన 1889 డిసెంబరు 16న లండన్‌లో జన్మించాడు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన నోయల్ 1911 లోనే బాలనటుడుగా రంగస్థలంమీద ప్రవేశించాడు. తరువాత 1921 నుంచినాటకాలు రాయడం మొదలు పెట్టాడు. సమకాలీన యువతరానికి ప్రతినిధిగా పేరొందాడు. 1952లో ఈయన రచించిన హేఫీవర్ అనే నాటకంతో ఇతని కీర్తి వ్యాపించింది. కాంగ్రేవ్, వైల్డ్‌ల సంప్రదాయాలననుసరించి రచించిన ఇతని నాటకాలు రంగస్థలం మీద బాగా రాణించాయి. ది యంగ్ ఐడియా (1921), ఫాలెన్ ఏంజెల్స్ (1925), హేఫీవర్ (1925), ఆన్ విపిదిడాన్స్ (1925), దిస్ ఇయర్ ఆఫ్ గ్రేస్ (1928), బిట్టర్ స్వీట్(1929), ప్రయివేట్ లైవ్స్ (1930) మొదలైనవి నోయల్ ప్రసిద్ధ రచనలు. నాటక ఖండికలను కూడా చాలా రచించిన నోయల్ 1973, మార్చి 26న మరణించాడు.

శ్రీ.చ.

పంచనాదం, మద్దెల (1920 - 1984) : నటుడు, వాద్యకారుడు, నాటక రచయిత. గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని జంగాలవారి పాలెంలో మద్దెల ధర్మపురి, ధర్మాంబ దంపతులకు 1920లో జన్మించాడు. బాల్యం నుంచి నాట్యకళ అంటే పంచప్రాణాలు. హార్మోనియం పట్ల మక్కువ ఎక్కువ. అంతేకాకుండా బాల్యం నుంచి ఎంతటి క్లిష్టతరమైన రాగాన్నైనా ఒకసారి వినగానే అలవోకగా పాడేవాడు.

కొమ్మూరి నారాయణమూర్తి దగ్గర ప్రాథమికంగా నటశిక్షణ పొందాడు. విద్యావతి (కాళిదాసు), చంద్రమతి (హరిశ్చంద్రుడు) వంటి స్త్రీ పాత్రలను తొలిదశలో పోషించి, రాణించాడు. అనంతర కాలంలో హరిశ్చంద్రుడు, నక్షత్రకుడు వంటి పాత్రలలో సమర్థుడైన నటగాయకునిగా రాణించాడు. 1940వ దశకంలో స్వగ్రామంలోని దళితవాడలో 'క్రైస్తవ యువజన నాట్యమండలి'ని స్థాపించి దావీదు విజయం వంటి నాటకాలు ప్రదర్శింప చేశాడు. దీని తరపున నీలా బాపనయ్య వంటి ప్రయోక్తను గ్రామానికందించాడు. ఈ సమాజం నేటికి కొనసాగటం విశేషం.

తనలోని ప్రతిభా ప్రదర్శనకు అనువైన వేదికలను వెదుక్కొంటూ సురభి కంపెనీలలో చేరి 14 సంవత్సరాలపాటు ఆంధ్రావని అంతటా ప్రస్థానం సాగించాడు. అనంతరకాలంలో బేతా వెంకట్రావు, మల్లాది సూర్యనారాయణ వంటి రంగస్థల నటుల సరసన నక్షత్రకుడు, నారదుడు, అశ్వత్థామ, అర్జునుడు వంటి పలు పాత్రలలో నటించి పేరు తెచ్చుకున్నాడు. తరం మారింది అనే చలనచిత్రంలో కరణం పాత్రను పోషించి రాణించాడు.

అనంతరకాలంలో ఈయన నాటక రచయితగా మోహినీ భస్మాసుర, తులసీ జలంధర, యోగి వేమన, రామభక్త హనుమాన్, మహాకవి కాళిదాసు, భూకైలాస్ మొదలైన నాటకాలు రచించాడు. వీటిల్లో రామభక్త హనుమాన్‌కు 1980లోను, మహాకవి కాళిదాసుకు 1985లోను, సంగీత నాటక అకాడమీ బహుమతులు లభించాయి. మోహినీభస్మాసుర, రామభక్త హనుమాన్‌లను జి. రామ్మోహనరావు చౌదరి బృందం ఈయన దర్శకత్వంలోనే రాష్ట్రంలో పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహించింది. ప్రసిద్ధ నటుడు ఎ.వి. సుబ్బారావు పంచనాదం శిక్షణలోనే శ్రీకృష్ణ తులాభారం లో శ్రీకృష్ణుని పాత్ర సాధన చేసి విశేషఖ్యాతి గడించగలిగాడు. యోగి వేమన నాటకాన్ని జి.ఎస్.ఎన్. శాస్త్రి (వేమన), బుర్రా సుబ్రమణ్యా శాస్త్రి (వేశ్యపాత్ర)లు కలసి అనేక ప్రదర్శనలు ఇచ్చి పేరు ప్రతిష్ఠలు గడించారు. కాగా పంచనాదం మరణానంతరం కూడా ఈయన రచనలు నంది నాటకోత్సవాలలో ప్రదర్శించబడటం విశేషం. అయితే ఈయన తన రచనలను ప్రదర్శించే హక్కు కొందరికే ఇవ్వటంతో మరిన్ని ప్రదర్శనలకు నోచుకోలేదు. కొండవీటి వేంకట కవి, అత్తోట రత్నకవి లాంటి ప్రముఖులు ఈయన రచనలను ప్రశంసించారు.

పంచనాదానికి హార్మోనియం వాయించటంలో విశేష అనుభవం ఉంది. అంతేకాక తెల్లాకుల వేంకటేశ్వరగుప్త దగ్గర హరికథాగానంలో శిక్షణ పొంది శతాధికంగా హరికథలు చెప్పాడు. ఇటీవలే స్వర్గస్థుడైన ఈయన కుమారుడు విద్యాసాగరదత్తు ఈయన వారసత్వాన్ని హరికథా ప్రక్రియలో మరణించే వరకు కొనసాగించటం విశేషం. పంచనాదం సేవలను గుర్తించి రాష్ట్రంలోని అనేక కళాసంస్థలు సన్మానాలు చేశాయి.

1984లో తణుకులో 'పౌరాణిక చక్రవర్తి' బిరుదుతో షణ్ముఖి ఆంజనేయరాజు చేతుల మీదుగా సన్మానం అందుకొని,

సందేశం ఇస్తూ 'ఇక వస్తాను సెలవ్' అంటూ షణ్ముఖి చేతులలోనే ఒరిగి, జీవన నాటకరంగం నుచి శాశ్వతంగా నిష్క్రమించాడు.

మన్నెశ్రీ

పగటి వేషాలు : జానపద నాటక కళారూపం. ప్రహసన తుల్యం. హాస్యరస ప్రధానం. ఎక్కువగా పగటి పూట వేషాలు కట్టి ప్రదర్శిస్తారు కాబట్టి ఈ కళారూపానికి పగటి వేషాలు అని పేరు వచ్చింది. ఈ పగటి వేషాలనే విచిత్ర వేషాలు, ప్రచ్ఛన్న వేషాలు అంటారు. ఇది పాశ్చాత్యుల 'ఫాన్సీ డ్రస్సు' లాంటిది.

పగటి వేష కళలో పంతులు, పఠానీ, గారడీ వంటి కొన్ని కొన్ని వేషాలను రాత్రిపూట కూడా ప్రదర్శిస్తుంటారు. కొందరు విమర్శకులు భారతకోశంలో చెప్పిన బహురూపమే పగటి వేషమని అభిప్రాయ పడుతున్నారు. ("నానా వేషధరం యత్తత్ బహూరూప మిదీరితమ్")

ఆదట గంధర్వ, యక్ష
విద్యాధరాదులై పాడెడు నాడెడి వారు
విధమున ప్రచ్ఛన్న వేషముల్ దాల్చి
అధికోత్సవముదులు కాడు నాట్లాడు

– పండితారాధ్య చరిత్ర, పర్వత ప్రకరణం, పుట. 256.

అని పాల్కురికి సోమనాథుడు వర్ణించడం వల్ల ఈ పగటి వేషాలు పదకొండు, పన్నెండు శతాబ్దాల నాటికే ఉజ్జ్వల స్థితిలో ఉన్నాయని ఊహించవచ్చు. అయితే ఆ తరువాత 18వ శతాబ్ది వరకు వీటి ఆచూకీ తెలియడం లేదు. సుమారు 200సంవత్సరాల క్రితం మైసూరు ఆంధ్ర బ్రాహ్మణుడు పల్లావర్ఝుల వెంకట్రామయ్య ఆంధ్ర దేశంలో పర్యటిస్తూ ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని పగటి వేష కలాపం ఇక్కడి వారికి నేర్పినట్లు తెలుస్తోంది. ఈ కళను పతాక స్థాయికి తీసుకు వెళ్లిన ఘనత కూచి వెంకయ్య, సున్నం వీరయ్యలకు దక్కుతుంది.

మొట్టమొదట బాహ్మణులే ఈ కళా ప్రదర్శనల ప్రారంభకులు. ఆ తరువాత వీరి వద్ద ఈతముక్కు జంగాలు, విశ్వబ్రాహ్మణులు మొదలైనవారు కూడ నేర్చుకొని ఈ కళను వృత్తిగా చేపట్టి బహుళ ప్రచారంలోకి తీసుకువచ్చారు.

ప్రచ్ఛన్న వేషధారణ ఈ కళకు ఆయువుపట్టు. సంఘ సంస్కరణే పరమార్థం. సమకాలీన సమాజంలోని లోటుపాట్లను, వ్యక్తుల లోపాలను, బలహీనతలను, హాస్య రసంలో రంగరించి బట్టబయలు చేయడం ఈ పగటి వేషాల లక్ష్యం. ఈ లక్ష్యం సిద్ధించడానికి ప్రేక్షకులలో విశ్వాసం కలిగించడం అత్యవసరం. అందుకే వీరి వేషభాషలు, క్రియలు ఆనాటి వ్యక్తులకు, సంఘటనలకు దర్పణం లాగా ఉంటాయి. ఈ పగటి వేషాల వేష భాషాక్రియలు, కథాసారం జాగ్రత్తగా అవలోకనం చేస్తే సమకాలీన సాంఘిక చరిత్ర రాయడానికి వస్తుసామాగ్రి ఎంతో దొరుకుతుంది.

పగటి వేషాలు అరవై నాలుగు. వీటిని జాతీయాలు అంటారు. వేషాల కార్యకలాపాన్ని కలాపమంటారు. పగటి వేష కళాకారులు రహస్యంగా వేషాలు వేసుకొని, ఉదయాన్నే గ్రామంలో ప్రవేశించి ఇంటింటికి వెళ్లి ప్రదర్శనలిస్తుంటారు. అయితే పంతులు, పఠానీ, రెడ్డి మొదలైన వేషాలు రాత్రి పూట గ్రామ చావడి ముందో, నాలుగు వీధులు కలిసే చోటనో పందిరి వేయించి దానికింద ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శనా పరంపర సామాన్యంగా బుడబుక్కల వేషంతోనో, బైరాగి వేషంతోనో, ఫకీరు వేషంతోనో ప్రారంభమై శారద వేషంతో అంతమవుతుంది.

పగటివేషాలు వినోదవేషాలు, ప్రబోధ వేషాలు, తామస వేషాలు అని మూడు రకాలు. బుడబుక్కల, ఫకీరు, చెంచు, కోయ, గారడి, మందుల వంటి వేషాలు కేవలం వినోదం కలిగించే వేషాలు. కోమటి, పంతులు, రెడ్డి వేషాలు ప్రబోధ వేషాలు. శక్తి, భేతాళ, శూర్పణఖ, దేవరపెట్టె మొదలైన వేషాలు తామస వేషాలు. అయితే వేషం వినోదమైనా, ప్రబోధమైనా, తామసమైనా, మధ్య మధ్య హాస్య ధోరణిలో సంఘంలోని, వ్యక్తులలోని లోపాలను బట్టబయలు చేయకుండా ఉండరు. ఈ వేషాలలో బుడబుక్కల, ఫకీరు మందుల వేషాలు ఏక పాత్ర వేషాలు. కోమటి, లింగబల్జీ వేషం ద్విపాత్ర వేషానికి ఉదాహరణ. ఈ వేషాల మీది కలాపాదులు నేటి హాస్య నాటికల లాగా ప్రవేశ, నిష్క్రమణాలు, ప్రారంభ, పతాక నిర్వహణలతో విరాజిల్లుతుంటాయి.

ఆధునిక తెలుగు నాటకరంగానికి ఇవి బీజ ప్రాయాలని విమర్శకుల అభిప్రాయం.

శ్రీ.చ.

పటాక్షేపం : నాటక ప్రయోగ సంబంధి. పటం అంటే తెర, ఆక్షేపం అంటే తొలగించడం. హఠాత్తుగా తెరను తొలగించి పాత్ర రంగం మీద ప్రవేశించడం. వివరాలకు 'అపటీక్షేపం' చూడండి.

శ్రీ.చ.

పతాక : ప్రాసంగేతి వృత్త భేదం. ప్రధాన కథ మధ్యలో వచ్చి సుదూరంగా గాని, చివరి వరకు గాని నాయకునితో అనుసంధించి సాగి, తన కార్యం సిద్ధింప చేసుకొని ప్రధాన కథ ఫలసిద్ధికి తోడ్పడే అవాంతర కథ పతాక.

రామాయణం లో విభీషణ కథ పతాక. ఈ పతాక కథ మధ్యలో అవాంతరంగా వస్తుంది. చివరి వరకు వ్యాపిస్తుంది. విభీషణుడు ఉపనాయకుడు. ఈ కథ స్వప్రయోజనం లంకారాజ్య పట్టాభిషేకం నెరవేర్చుకొని, ప్రధాన కథ రావణ సంహారానికి తోడ్పడుతుంది.

శ్రీ.చ.

పతాకా స్థానకం : రాబోయే విషయాన్ని పతాకా వలె సూచించేది పతాకా స్థానకం. ఇది రూపకంలో చమత్కార హేతువు. దీనిని ఇంగ్లీషులో డ్రమటిక్ ఐరనీ తెలుగులో నాటకీయ వ్యంగ్యం అంటారు.

ధనంజయుని అభిప్రాయంలో ఈ సూచన అన్యోక్తి అంటే నాయకుడు గాక అన్యుల భాషణ ద్వారా జరగాలి. *(ప్రస్తుతా గంతు భావస్య వస్తునోన్యోక్తి సూచకమ్ – ద.రూ. 1-14)*. దీనిని స్వీయోక్తి అని కూడా అంటారు. నాయకుని యథాలాపన ద్వారా భావి సూచన.

ఉదా॥ *గయోపాఖ్యానం ద్వితీయాంకంలో గయుడు.* *గయుడు* : నాకు ..... జీవితం మీద ఆశ లేదు. ఇది రాబోయే *గయుని* ఆపదను సూచిస్తుంది.

ఈ పతాకాస్థానకం విషయంలో ధనంజయ మతానికి, భరతముని మతానికి కొద్ది భేదం ఉంది. ఒక అర్థాన్ని ఉద్దేశించి ప్రయోగించిన ఒక వాక్యం ఆగంతుక భావంతో వేరొక అర్థాన్ని సాధించినట్లయితే దానిని పతాకాస్థానకం అంటారు. నిగూఢంగా ఉన్న అర్థం మొదటి దానికి అనుగుణంగా ఉండాలి.

పతాక అంటే లింగం. నిగూఢార్థాన్ని ధ్వనింపజేసేది లింగం. అందుచేత నిగూఢార్థం గలది పతాక స్థానకం. ఈ నిగూఢార్థం నుంచే రెండవ అర్థం జనించాలి.

పతాకాస్థానకం నాలుగు విధాలు. భరతముని వీటికి వేరు వేరు పేర్లు పెట్టకుండా ఒకటవ పతాకా స్థానకం, రెండవ పతాకాస్థానకం, మూడవ పతాకాస్థానకం, నాల్గవ పతాకాస్థానకం అని పేర్కొన్నాడు. సింగభూపాలుడు పతాకా స్థానక నిర్వచనంలో భరతముని శ్లోకాన్ని అనుసరించినా రెండు, మూడు, నాలుగు పతాకా స్థానాలకు శిష్టం, శిష్టోత్తరం, తుల్య విశేషణం అని పేర్లు పెట్టాడు. శారదా తనయుడు, సింగ భూపాలుడు మొదటి మూడు పతాకా స్థానకాలను తుల్యసంవిధానమని, నాలుగవది తుల్య విశేషణమని పేర్కొన్నారు. అంతేగాక శారదా తనయుడు మొదటి మూటిని అన్యోక్తి రూపంలోనూ, రెండవది సమాసోక్తి రూపంలోనూ ఉంటుందని చెప్పాడు.

శ్రీ.చ.

పద్మరాజు, పాలగుమ్మి (1915-1983) : ప్రసిద్ధ కథా రచయిత, వ్యాసకర్త, నాటక రచయిత. పశ్చిమగోదావరి జిల్లా, తణుకు తాలుకా తిరుపతిపురం గ్రామంలో సీతమ్మ, సాంబ మూర్తి, దంపతులకు 1915, జూన్ 24న జన్మించాడు. కొవ్వూరు హైస్కూలులో చదువు కొనసాగించాడు. తన సహాధ్యాయితో కలిసి పద్యాలు రాయడం అక్కడే మొదలైంది. ఆ పద్యాలు కొన్ని అప్పట్లో కృష్ణా పత్రికలో ప్రచురితమయ్యాయి. తరువాత రాజమండ్రిలో బియస్సీ పూర్తిచేసి, రసాయన శాస్త్రంలో ఎం.యస్సీని కాశీలోని హిందూ విశ్వ విద్యాలయంలో పూర్తి చేశాడు. 1937వ సంవత్సరంలో కథలు రాయటం ప్రారంభించాడు. అప్పటి నుంచి ఈయన కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు ఎన్నో వెలువడి పాఠకుల అభిమానాన్ని చూరగొన్నాయి. కాకినాడ పి.ఆర్.కళాశాలలో కొంత కాలం ఉద్యోగం చేశాడు. ఆ తరువాత భీమవరం కళాశాలలో రసాయనశాస్త్ర ప్రధానోపన్యాసకుడుగా పని చేస్తున్న కాలంలో ఈయన రచించిన గాలివాన కథ, న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ నిర్వహించిన కథల పోటీలో అంతర్జాతీయ బహుమతి సంపాదించుకున్నది. 1952లో మద్రాసుకు చేరి, సినిమా రంగంలో రచయితగా శేష జీవితాన్ని గడిపాడు.



పద్మరాజు తమిళ నాటకాన్ని రక్తకన్నీరు పేరుతో తెలుగులోకి అనువదించగా, ఆ నాటకాన్ని సినిమా నటుడు నాగభూషణం ఐదువేల సార్లు విజయవంతంగా ప్రదర్శించి విశేష ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టాడు. 150కి పైగా కథలు, ఆరు నాటకాలు , అర్వై రేడియో నాటికలు రచించి ప్రజాభిమానాన్ని చూరగొన్న పద్మరాజు ఆకాశవాణి ఏటేటా నిర్వహించే పోటీలకు న్యాయ నిర్ణేతగా ఢిల్లీకి వెళ్ళి ఆకస్మికంగా 1983, ఫిబ్రవరి 17న స్వర్గస్థుడయ్యాడు.

పా.వి.

పద్మాబాయి నాట్యమండలి (తెనాలి) : ఈ సమాజాన్ని 1947-48లో స్థాపించారు. రెండు కుటుంబాల వారు కలసి స్థాపించిన సమాజం. పద్మాబాయి ప్రధాన పాత్రలు పోషించింది. ఈ సమాజంలో చింతల వెంకటేశ్వర్లు (హార్మోనిస్టు), చింతల చెంచురామయ్య, చింతల భాస్కరరావు, వేజండ్ల మోజస్, కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, వీరేశలింగం, శేషగిరి, శ్రీనివాసరావు, వైకుంఠేశ్వరరావు, నాగేంద్రరావు, పురుషోత్తం, పెద్ద మైసన, పద్మాబాయి, మణి కుమారి, పరదేశి, సభారంజని, మొదలైన వారు నటులు, నటీమణులు. ఈ సమాజంలో 20 నుండి 25 మంది సభ్యులు వుండేవారు. అందరూ వివిధ వృత్తులు నిర్వహిస్తూ వుండేవారు. ఈ సమాజం సుమారుగా 1970 వరకు పనిచేసింది. నాటకాలకు ఆదరణ తగ్గినందు వల్ల, క్రమక్రమంగా మూతపడింది.

నే.వ.శ

పద్మావతీదేవి, కొమ్మూరి (1908-1970) : కథా రచయిత్రి, వ్యాసకర్త, నటీ మణి. ఈమె ప్రసిద్ధ రచయిత చలం సోదరుని భార్య. పద్మావతీ దేవి 1908, జులై 7న మద్రాసులో జన్మించింది.

బళ్ళారి రాఘవ సంసార స్త్రీలు నాటకాలలో ప్రవేశించాలని ఇచ్చిన పిలుపునందుకొని నాటక రంగంలో ప్రవేశించిన మొదటి బృందంలోని మహిళ. అందమైన విగ్రహం, నిర్దుష్టమైన వాచికం, క్రమశిక్షణతో కూడిన నటన ఈమె ప్రత్యేకత. ఈమె బళ్లారి రాఘవ పక్కన తప్ప ఇంకే యితర నటులతోను నటించినట్లు లేదు. ఈమె రైతుబిడ్డ లాంటి సినిమాలలో, అనేక రేడియో నాటికలలో వివిధ పాత్రలలో నటించింది. పద్మావతి 1970, మే 7న మరణించింది.

శ్రీ.చ.

పరమేశ్వర శర్మ, నేతి (జ:1928) : నటుడు, ప్రయోక్త, రచయిత, నాటక సమాజ స్థాపకుడు. ఈయన 1928లో కృష్ణాజిల్లాదివి తాలుకాలోని సంగేగడ్డలో జన్మించాడు. నివమ్మగడ్డ సుబ్బమ్మ, శ్రీరాములు తల్లిదండ్రులు. పెరిగింది తెనాలి సమీపం లోని పెదరావూరు గ్రామంలో.

1948లో మొట్ట మొదటి సారిగా రంగూన్ రౌడి నాటకంలో సబ్ ఇన్స్పెక్టర్ పాత్రను పోషించి నట జీవితాన్ని ప్రారంభించాడు. ఈయన 'క్రాంతి థియేటర్' సంస్థను స్థాపించి, కార్యదర్శిగా అనేక నాటకాలు ప్రదర్శించాడు. ఈ సంస్థ తరపున తిరుపతిలో పునర్జన్మ నాటకాన్ని ప్రదర్శించి ప్రథమ బహుమతిని అందుకున్నాడు. 1956 జనవరిలో నాటక కళాపరిషత్తు (విజయవాడ)లో విద్యార్థిగా చేరడం వల్ల క్రాంతి థియేటర్స్ కార్యక్రమాలు నిలిచిపోయాయి. తరువాత 'నటరాజ కళామందిర్'ను స్థాపించి రెండు సంవత్సరాల పాటు ఏక పాత్రాభినయ పోటీలు నిర్వహించాడు. సాంఘిక నాటక రంగం పరిషత్తులకు పరిమితమవుతున్న తరుణంలో తెనాలి కళాకారులంతా కలసి 'ది తెనాలి యునైటెడ్ ఎమెచ్యూర్స్' అనే సంస్థను నెలకొల్పారు. ఈ సమాజం తరపున మదరాసులో దొంగవీరడు నాటకాన్ని ప్రదర్శించాడు. ఈ నాటకం పరమేశ్వరశర్మకు మంచిపేరు తెచ్చిపెట్టింది. ఈ నాటకాన్ని చూసిన సుప్రసిద్ధ రంగస్థల నటుడు గోవిందరాజుల వేంకటసుబ్బారావు పరమేశ్వర శర్మను అభినందించాడు. ఆ తరువాత కళాభారతి తరపున జైభవాని నాటకంలో వల్లూరి వెంకట్రామయ్య చౌదరి సరసన హీరో పాత్రను పోషించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. దాదాపు నలభై నాటకాలలో విభిన్న పాత్రలను పోషించి యాభై సంవత్సరాలుగా నాటకరంగ వికాసానికి కృషి చేస్తున్న పరమేశ్వర శర్మ నూర్ళేళ్ల తెనాలి రంగస్థలి పేరుతో సాంస్కృతికరంగ పరిశోధకులకు ఉపకరించే గ్రంథాన్ని రచించి కళాకారుల జీవితాలను గ్రంథస్థం చేశాడు.

దాసరి.ఎన్.

పరావర్తం : (పరావృతము). తలపెట్టిన కార్యం సఫలం కాకపోగా వికటించి ఎదురు తిరిగి విరుచుకు పడడం పరావర్తం. తానొకటి దలచిన దైవమొకటి తలచు అనే సామెత దీనికి తార్కాణం. దీనిని ఇంగ్లిషులో రివర్సల్ (Reversal) అంటారు.

ఉదా. మృచ్ఛకటికం లో శకారుడు చారుదత్తుని అంత మొందించాలని అనుకుంటాడు. న్యాయవమూర్తులు చారుదత్తునికి మరణ దండన విధిస్తారు. కాని శూలారోపణ సమయంలో ఆర్యకరాజు ఆజ్ఞ మేరకు చారుదత్తుడు రక్షింపబడడమేగాక, హత్య శకారునిమీది కెదురుతిరిగి అతనికి ఆపద మూడుతుంది. ఇదే పరావర్తం.

శ్రీ.చ.

పరిక్రమం : సంస్కృత నాటకాలలో అంకాలను రంగాలుగా విభజించే ఆచారం లేదు. ముందు తెర కూడా ఉన్నట్లులేదు. రంగాలంకరణ లేదు. ఈ పరిస్థితిలో అంకం మధ్యలో స్థలం మారిందని సూచించడానికి పరిక్రమంను (నడచుటను) సంకేతంగా పెట్టుకున్నారు. అంటే రంగస్థలంలోని ఒక కక్ష్య (విభాగం) నుంచి ఇంకో కక్ష్యలోకి అడుగుపెట్టడం. రంగస్థలం మీది పాత్రలు నాలుగు అడుగులు వేసి ఆ కొత్త స్థలం పేరు చెప్పడం ద్వారా ఆ పాత్రలు ఆ కొత్త ప్రదేశాన్ని చేరినట్లు సూచన. ఈ సంప్రదాయం సంస్కృత నాటకరంగంలోనే కాదు. గుజరాత్ 'భవై'లో కూచిపూడి వారి నాటక సాంప్రదాయంలో గుండ్రంగా తిరగడం ఉంది.

అభిజ్ఞాన శాకుంతలం ప్రథమాంకంలో ప్రారంభం కణ్వాశ్రమారణ్యంతో ప్రారంభమవుతుంది. దుష్యంతుడు ప్రవేశిస్తాడు. వైఖానస ముని కణ్వాశ్రమానికి వెళ్ళి ఆతిథ్యం స్వీకరించమని కోరుతాడు. ఇపుడు నిజానికి రంగం మారాలి.

కాని అప్పుడు రాజు (నడిచి అటు ఇటు చూచి) ఇదే ఆశ్రమ ద్వారం అంటాడు. దీనిని బట్టి రాజు ఆశ్రమం చేరినట్లు ప్రేక్షకులు భావించుకోవాలి.

శ్రీ.చ.

పరిఘట్టన : పూర్వరంగ అంతర్యవనికాంగం. వీణతంత్రులను మీటడం, మద్దెల వాయించడం వల్ల శుష్కాక్షరాలను పలికించడం పరిఘట్టన.

శ్రీ.చ.

పరిచారికలు : అభ్యంతర పరివారంలోని వారు. ఈ పరిచారికలు 1. శయ్యాపాలి (శయ్యనలంకరించేది), 2. ఛత్రధారిణి (గొడుగు పట్టుకునేది మృచ్ఛకటికలో చేటి), 3. వ్యజనధారిణి (విసనకర్ర పట్టుకొనేది), 4. సంవాహిక (కాళ్లు పట్టేది), 5. గంధ యోక్త్ర (గంధం తీసేది), 6. ప్రాసాదిక (అలంకరించునది), 7.ఆభరణ యోక్త్రి (ఆభరణముల నలంకరించేది), 8. మాల్య సంయోజిత (పూలదండలు గుచ్చేది) ఉదా: పాదుకలో మంథర.

శ్రీ.చ.

పరివర్తనం : పూర్వరంగ బహిర్యవని కాంగం. రంగస్థలం మీది నటీనటులు నాలుగు దిక్కులకూ పరావర్తనంలో తిరుగుతూ లోక పాలకులకు నమస్కరించడం. రంగ విఘ్నశాంతికి నాలుగు వేపులా పరావర్తనం ద్వారా దేవుళ్ళకు నమస్కారాలు చేయడం వల్ల దీనికి పరివర్తనం అని పేరు వచ్చింది.

శ్రీ.చ.

పర్యుపాస్తి : ప్రతి ముఖ సంధ్యంగం. అనునయించడం పర్యుపాస్తి. *(పర్యుపాస్తి రనునయః - ద.రూ. 1-34)*
ఇది రెండు విధాలు. 1. కోపగించిన వారిని అనునయించడం, 2. దీనులైన వారిని అనునయించడం.
ఉదా. బాలరామాయణం చతుర్థాంకంలో కోపగించిన పరశురాముని విశ్వామిత్రుడు అనునయించడం –
వేణీసంహారం తృతీయాంకంలో తండ్రి మరణ వార్త విని దీనుడైన అశ్వత్థామను సూతుడు అనునయించడం.

శ్రీ.చ.

పాంచాల్,గోవర్ధన్ ప్రేమ్‌చంద్ (1913 - 1996) : ప్రముఖ గుజరాతీ పండితుడు, రంగస్థల అధ్యాపకుడు, దృశ్యబంధ నిపుణుడు. ఉత్తర గుజరాత్‌లోని ఛిత్తియార్థ గ్రామంలో 1913లో జన్మించాడు. ముంబాయిలో లలితకళల పాఠశాలలో చిత్రకళను అభ్యసించి రవీంద్రనాథ్ ఠాగూర్ నృత్య – నాటక ప్రదర్శనల్లో దేశమంతటా పర్యటించాడు. ఇండియన్ నేషనల్ థియేటర్ సంస్థ ప్రదర్శించిన నాటకాలకు సెట్ డిజైనర్‌గా పనిచేశాడు. 1959లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో సీనిక్ డిజైన్ – స్టేజ్ క్రాఫ్ట్ విభాగంలో అధ్యాపకుడిగా నియమితుడై, 1975 వరకూ ఎందరో ఉత్తమ సాంకేతిక నిపుణులను భారతీయ నాటకరంగానికి అందించాడు. దాదాపు 80 నాటకాలకు డిజైన్ బాధ్యతల్ని నిర్వర్తించాడు. నాలుగు సంస్కృత నాటకాలకు దర్శకత్వం వహించాడు. ఈయన ప్రదర్శించిన దూతవాక్యం, ప్రబుద్ధ నాటకాలు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాయి. రంగస్థలానికి సంబంధించి ఆరు పుస్తకాలు రచించాడు. "ద థియేటర్స్ ఆఫ్ భరత అండ్ సమ్ ఆస్పెక్ట్స్ ఆఫ్ సాంస్క్రిట్ ప్లే ప్రొడక్షన్" అనే గ్రంథం రంగస్థల విద్యార్థులకు, అధ్యాపకులకు పరిశోధన గ్రంథంగా నిలిచింది. గుజరాతీ జానపద కళారూపాలైన భవై మీద ఎంతో పరిశోధన చేశాడు. నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ముంబాయ్‌లో అతిధేయ అధ్యాపకునిగా ఎంతోకాలం తన సేవలను అందించాడు.

ప్ర.రె.

పాండురంగయ్య, ఎ. (1938-1993) : రంగస్థల నటుడు, కర్నూలు జిల్లా రంగస్థల పితామహుడయిన కల్లూరు శేషయ్య శిష్యుడు. ఈయన 1938లో కర్నూలు పట్టణానికి దగ్గరలో ఉన్న పెదపాడులో జన్మించాడు. తల్లిదండ్రులు అలివేలు మంగమాంబ, మాధవస్వామి. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో మేనమామ వెంకటకవి దగ్గర పెరిగాడు. మేనమామ అష్టావధాని, పండితుడు. ఈయన దగ్గరే పాండురంగయ్య సంస్కృతాంధ్ర భాషలు చదువుకున్నాడు. తొమ్మిదో తరగతి వరకు చదువుకున్న పాండురంగయ్య 1953లో మిత్రులతో కలసి మొట్ట మొదటి సారిగా బోయి భీమన్నరాసినకూలిరాజు నాటకంలో పరంజ్యోతి అనే స్త్రీ పాత్రను ధరించాడు. సంగీతం, నటనలో శిక్షణ పొందిన పాండురంగయ్య కురుక్షేత్రం, గయోపాఖ్యానం, శ్రీ కృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుడుగా, రామాంజనేయ యుద్ధంలో రాముడు, సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్రుడుగా, చింతామణిలో బిల్వమంగళుడు, భవానీ శంకరుడుగా నటించి ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందాడు. 1970లో లలిత కళాపరిషత్తు (అనంతపురం) నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో నూటపదిమంది నటులు శ్రీకృష్ణ పాత్రను ప్రదర్శించారు. ఈ పోటీలో పాల్గన్న పాండురంగయ్యకు ఉత్తమ నటుడు అవార్డు లభించింది. ప్రముఖ కళాసంస్థలు, వ్యక్తుల చేతుల మీదుగా బంగారు నగదు బహుమతులతోపాటు గానకళా విశారద, సంగీత సరస్వతి, రాయలసీమ నటరత్న బిరుదులందుకున్నాడు. నాటకకళ పట్ల ఆసక్తి చూపుతున్న హెచ్. చంద్రం,ఆర్. మీరా హుసేన్, జి.రంగనాథం, మాస్టారు హనుమంతులను కళాకారులుగా తీర్చిదిద్దాడు. నాలుగు దశాబ్దాల పాటు

కళారంగానికి సేవ చేసిన పాండురంగయ్య 1993లో మరణించాడు.

దాసరి.ఎన్.

పాండురంగా రావు, దేవరకొండ వేంకట (జ.1942) : నటుడు, సంగీత విద్వాంసుడు, నట శిక్షణాచార్యుడు, ఉపాధ్యాయుడు. ఈయన 1942, డిసెంబరు 1న రాజ్యలక్ష్మి, సర్వేశ్వర శాస్త్రి దంపతులకు జన్మించాడు. కళాకారుల కుటుంబంలో పుట్టడం వల్ల చిన్నప్పుడే సంగీత కచ్చేరిలలో, నాటకాలలో నటించడం ప్రారంభించాడు. సత్యహరిశ్చంద్రలోని లోహితాస్యుడి పాత్ర ద్వారా రంగస్థలంపైకి ప్రవేశించాడు. పందొమ్మిదవ యేట గయోపాఖ్యానంలో అర్జునుడు, పాండవోద్యోగ విజయాలలో శ్రీకృష్ణుడి పాత్రలో నటించడం ఆరంభించాడు. బేతా వెంకట్రావు నటించిన ఆంజనేయుడి పాత్రను చూసిన దేవరకొండ ఈయనలాగే నటించాలని సాధన చేశాడు. ఆంజనేయుడి పాత్రను ఆకళింపు చేసుకొని విస్తృతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. ఇదే సమయంలో తండ్రి మరణించటంతో కుటుంబ పోషణ పైబడటంతో నటించే నటులకు (హార్మోనియం) సంగీతం సమకూర్చడం ప్రారంభించాడు. దూరవిద్యా కేంద్రం ద్వారా ఎం.ఏ. తెలుగు పూర్తి చేసి తెలుగు పండితుడిగా పనిచేశాడు. నేడు సంప్రదాయ నాటకాలలో నటించే సుప్రసిద్ధ నటీనటులందరికీ సంగీతం సమకూర్చాడు.

దాసరి, ఎన్

పాండురంగారావు, పి. (జ : 1940) : రంగస్థల నటుడు. ఆకాశవాణిలో నాటకప్రయోక్త. 1940 జూన్ పదిన నరసాపూర్‌లో జన్మించాడు. హాస్యరస పాత్రపోషణలో దిట్ట.

పాండురంగారావు విద్యాభ్యాసం నర్సాపురం, తెనాలిలో సాగింది. ఈయన మొదట తెనాలి వి.ఎస్.ఆర్., ఎన్.వి.ఆర్ కాలేజిలో లక్ష్మీ కా స్వాగత్ అనే హిందీ నాటికతో రంగస్థల ప్రవేశం చేశాడు. అనంతరం ఆకాశరామన్న నాటకంలో నటించాడు. ఈ నాటకానికి లభించిన ప్రేక్షకుల ప్రశంసల స్ఫూర్తితో తెనాలిలో 'భార్గవ్ డ్రమెటిక్ అసోసియేషన్' స్థాపించి పలు నాటకాలు ప్రదర్శించాడు. 1963-66 వరకు హైదరాబాదులో ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం నిర్వహించిన నాట్య విద్యాలయంలో డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ చేశాడు. ఈ శిక్షణాలయంలోనే ఎ.ఆర్. కృష్ణదగ్గర నటన, నాటక ప్రయోగం, ఆహార్యం, రంగోద్దీపనం, రంగస్థల నిర్వహణ వంటి అంశాలలో శాస్త్రీయమైన శిక్షణ పొందాడు. శిక్షణకాలంలోనే అల్లీముఠా, ఆశ, *హల్లో ఔట్ దేర్, గవర్నమెంట్ ఇన్‌స్పెక్టర్, కంఠాభరణం* మొదలైన నాటకాల్లో నటించాడు. ఆంధ్రప్రదేశ్ నాట్య విద్యాలయ తరపున కన్యాశుల్కం (వెంకటేశం), మృచ్ఛకటికం మొదలైన నాటకాలు హైదరాబాదు, గుంటూరు, ఢిల్లీ, విజయవాడ, తదితర పట్టణాలలో విజయవంతంగా ఎ.ఆర్.కృష్ణ దర్శకత్వంలో నటించాడు.

బాలాంత్రపు రజనీకాంతరావు ప్రోత్సాహంతో 'ఆర్టిస్ట్స్ అసోసియేషన్' 1972లో స్థాపించి, ఈ సమాజం ఆకాశవాణి ఉద్యోగులతో కలిసి పదవీవిరమణ వరకు పలు రంగస్థల నాటికలలో వివిధపాత్రలు పోషించాడు. దేశవ్యాప్తంగా ఆయన ప్రదర్శించిన వాటిల్లో *వరుడు కావాలి, వడ్ల గింజలో బియ్యపు గింజ, మనస్తత్వాలు, దంత వేదాంతం, పెళ్ళి సందడి, ఇల్లు అలికిన ఈగ, హరహర మహాదేవ, నెక్లెస్ దొరికింది, అప్పు సత్యాగ్రహం* ప్రధానమైనవి. ఈ నాటికలను పలు పరిషత్తులలో ప్రదర్శించి ఉత్తమ హాస్యనటుడుగా బహుమతులు అందుకున్నాడు. పదవీవిరమణ అనంతరం విజయవాడలో ఉంటూ 'అభిరుచి' అనే సంస్థ పక్షాన నాటకరంగ సదస్సులు, శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాడు. పలు పరిషత్తులకు న్యాయనిర్ణేతగ వ్యవహరిస్తూ, నాటకరంగ వికాసానికి సేవలు అందిస్తున్నాడు.

మన్నెశ్రీ

పాక్యూవియస్ (క్రీ.పూ. 220-131) : రోమన్ నాటకకర్త. ఈయన విషాద నాటకరచనలో దిట్ట. కరుణరసం ఇతనికి అభిమాన రసం. ఇతని నాటకాలలో కరుణరసం, తాత్త్విక చర్చలు, సంక్లిష్టమైన కథావిన్యాసం గోచరిస్తాయి.

పాక్యూవియస్ నాటక రచయితే కాదు, చిత్రకారుడు కూడా. అందుచేత ఇతని రచనలలో చిత్రణాశక్తి, పద ప్రయోగ శక్తి ఎక్కువగా ద్యోతకమవుతుంది. కాని శైలి మాత్రం కృతకంగా, అస్పష్టంగా ఉంటుంది. ఈయన నాటకాలు ప్రజాదరణ పొందాయి. ఈయన పన్నెండు విషాద నాటకాలు, ఒక చారిత్రక నాటకం రచించినట్లు ప్రతీతి.

శ్రీ.చ.

పాత్రచిత్రణ : కథా సంవిధానం, పాత్ర చిత్రణ రెండూ నాటకానికి ప్రాణాలు. ఈ రెంటిలో దేనికి ఎక్కువ ప్రాముఖ్యం

ఇవ్వాలనే విషయం వివాదాస్పదంగా తయారైంది. గ్రీకు లక్షణ వేత్త అరిస్టాటిల్ "కథా సంవిధానమే ప్రప్రథమమైంది. విషాదాంత రూపకానికి జీవకళ లాంటిది. దాని తరువాతనే శీలం." అని పేర్కొన్నాడు. అంతేకాదు, కథా సంవిధానం లేని విషాద నాటకం శీలచిత్రణ లేక పోయినా అది విషాద నాటకమే అవుతుంది.

తన అభిప్రాయాన్ని సమర్థించుకొంటూ అరిస్టాటిల్ 'విషాదరూపకం మానవులను అనుకరించదు, కాని క్రియను, జీవితాన్ని అనుకరిస్తుంది. జీవితం క్రియాత్మకం. కాని పర్యవసానం గుణంకాదు. క్రియ, శీలం మానవుల శీలాన్ని నిర్ణయిస్తుంది. వారి క్రియల మూలంగానే వారికి సుఖదుఃఖాలు కలుగుతాయి. నాటకీయ క్రియ పాత్ర చిత్రణ దృష్టిలో జరిగేది కాదు. క్రియలకు అనుషంగికంగా పాత్ర చిత్రణ' వస్తుంది.

అరిస్టాటిల్ అభిప్రాయాన్ని వ్యాఖ్యానిస్తూ బుచర్ ఇలా చెప్పాడు. "ప్రధాన కథా విన్యాసానికి అనుగుణంగా నాటక సన్నివేశాల నుంచి పాత్రలు పెంపొంది రూపం దాలుస్తాయి". ఇక అరిస్టాటిల్ అభిప్రాయంలో పాత్రలప్రకృతిని నిర్వచించడానికి సాయపడేదే పాత్ర చిత్రణ. పాత్ర చిత్రణలో నాలుగు విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి. మొదటిది మాట, క్రియ ద్వారా పాత్ర శీలాన్ని వ్యక్తీకరించడం, రెండోది చిత్రణలో ఔచిత్యం లేక అనురూపత. మూడోది జీవిత యథార్థ ప్రతిబింబం. నాలుగోది పొందిక.

అయితే ఆధునిక విమర్శకులు అరిస్టాటిల్ అభిప్రాయాలతో ఏకీభవించడం లేదు. కథా సంవిధానం కంటె పాత్ర చిత్రణకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. పాత్ర శీలంలో నుంచే కథాసంవిధానం రూపొందుతుందని అభిప్రాయ పడుతున్నారు. ఈ సందర్భంలో లాజోస్ అగ్రే (Lajos egri) పాత్ర శీలం కథాసంవిధానాన్ని సృజిస్తుంది. దీనికి ఆధారంగా ప్రధాన గ్రీకు నాటకాలన్నింటిలోనూ పాత్ర శీలమే క్రియలను సృజిస్తుంది. దీనికి ఉదాహరణ ఈడిపస్ నాటకం. ఈడిపస్ ఇంకోరకమయిన వ్యక్తి అయితే అతనికి విషాద పరిణామం వచ్చేది కాదు. కోపిష్టి గాకపోతే రోడ్డుమీద తారసిల్లిన అపరిచిత వ్యక్తిని చంపేవాడు కాదు. మొండిఘటం కాకపోతే లాయిస్ రాజును ఎవరు చంపింది తెలుసుకోవడానికి, తన జన్మ రహస్యం తెలుసుకోవడానికి పట్టుపట్టేవాడు కాదు. నిజాయితీ పరుడు కాబట్టే తనను తాను శిక్షించుకుంటాడు. ఈడిపస్ ద్వారానే దెబ్బకొట్టిన కుడిహస్తం నాదే, మరెవరిదీ కాదు అని చెప్పించాడు.

పాత్ర చిత్రణ నాలుగు విధానాలు 1. పరభాషణం, 2. స్వభాషణం, 3. మాటలు-చేతలు, 4. దివ్య ప్రకాశనం.

1. పరభాషణం: పాత్రను గురించి ఇతర పాత్రలు వర్ణించి చెప్పడం పరభాషణం. ఇది తిరిగి రెండు విధాలు. అ) రూపవర్ణన. ఆ) శీలాది వర్ణన.

(అ) రూపవర్ణన – పాత్ర రూపం పాఠకుని కనులకు కట్టేటట్టు వర్ణించడం. ఉత్తర రామ చరిత్ర తృతీయాంకంలో సీత రూపవర్ణన.

తెల్లపడి చిక్కినట్టి చెక్కిళ్ళ తోడ
గొప్పు విడిపోయి మోము పై గురులు చెదర
గరుణరసమూర్తియో మేను గాంచు విరహ
బాధయో యన నడవికి వచ్చుచుండె. (– అను. మల్లాది సూర్య నారాయణ శాస్త్రి).

(ఆ) శీలాది వర్ణన : మృచ్ఛకటిక ప్రథమాంకంలో చారుదత్త శీల వర్ణన

'తెలివికి గాపురంబతడు, దీనుల పాలిటి వేల్పు జెట్టు, యో
గ్యులకు గుటుంబి, త్యాగమునకుంగని, మెవ్వని నించుకేని నో
బలుకని శీలముం గుణము పౌరుష ముం గల మేటి వానిచే
నిలిచె జగంబు, బట్టి రమణీయ చరిత్రుని నీవెఱుందుగుదే.
– అను. తిరుపతి వేంకట కవులు

2. స్వభాషణం : పాత్ర తనను గురించి తానే చెప్పుకోవడం స్వభాషణం. ఉదా : బాల రామాయణం చతుర్థాంకంలో పరశురాముడు తనను గురించి తానే చెప్పుకోవడం.

3. మాటలు, చేతలు : పాత్ర మాట్లాడే మాట తీరు, భాషల పట్ల అతని శీలం గోచరించడం.

మాట తీరు : మృచ్ఛకటిక ప్రథమాంకంలో శకారుని మాట తీరు

గల్లురని నగలు మ్రోయగ వెళ్ళెదేల ?
రామునకు జంకి పఱువెత్తు ద్రౌపదివలె
హనుమ, విశ్వావసుని చెల్లెలగు సుభద్ర
పగిది, నిను బల్మి హరియించు వాడజూవె (– అను. తిరుపతి వేంకట కవులు)

ఈ అసంబద్ధ ప్రలాపం వలన శకారుడు వట్టి వెఱ్ఱి వెంగళాయ అని బోధ పడుతుంది.

4. దివ్య ప్రకాశనం : ఒక పాత్రను తక్కిన పాత్రలకంటే ప్రముఖంగా దేదీప్యమానం చేయడానికి నాటకకర్త అవలంబించే ప్రక్రియ దీప్తి. దీనినే ఇంగ్లిషులో క్రాస్ లైటింగ్ (Cross lighting) అంటారు. నాటకకర్త దేదీప్యమానం చేయదలచిన పాత్రను ఇతర పాత్రలతో పదే పదే ప్రస్తావింప చేయడం, అతని గుణ గణాల ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పడమే ఈ ప్రక్రియ. ఉదా: అభిజ్ఞాన శాకుంతలం కణ్వమహర్షి చతుర్థాంకంలో మాత్రమే వస్తాడు. కాని అతని పేరు ప్రశస్తి నాటకమంతా మారు మ్రోగుతూనే ఉంటుంది.

వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన బబ్బిలి యుద్ధ నాటకంలో పాపారాయుడు ఆఖరి అంకంలో మాత్రమే కనిపిస్తాడు. కాని అతని పేరు నాటకమంతా ఉంటుంది.

శ్రీ.చ.

పాత్ర భంగిమ : గతి సంబంధి. రంగం మీదకు ప్రవేశించిన ఉత్తమ, మధ్యమ పాత్రలు వైష్ణవస్థానంలో నిలుచుండాలి. వక్షస్థలం సమున్నతంగా, సమంగా, చతురశ్రంగా ఉంచాలి. భుజాలు చలించకుండా సమానంగా ఉండాలి. అనగా చెవులకు ఎనిమిది అంగుళాల దూరంలో ఉండాలి. గడ్డం వక్షానికి నాలుగు అంగుళాల దూరంలో ఉండాలి. ఎడమ చేయి నడుం మీద, కుడి చేయి బద్దు మీద ఉండాలి. ఇది భరతముని సూచన.

శ్రీ.చ.

పాత్రోన్మీలనం : నటనా భేదం. పాత్రకు అనుగుణంగా, సవ్యంగా, హేతుబద్ధంగా, ఆలోచనాపూర్వకంగా శ్రమించి అనుభూతి చెందడమనే అంతర్విధానాలను పాత్ర భౌతిక, ఆధ్యాత్మిక జీవితానికి అనుసంధించడమే పాత్రలో జీవించడం. నటుడు తనలోని మానవ స్వభావాలను పాత్ర జీవితంలో పొందుపరచాలి. తన ఆత్మను పాత్రలో ప్రతిష్ఠించాలి. మానవుల అంతర్జీవితాన్ని సృజించి కళాత్మకంగా వ్యక్తీకరించాలి. అయితే ఈ విధమైన కళాసృష్టికి సృజనాత్మక చిత్తవృత్తి అంటే ఆవేశం ఎంతైనా అవసరం. ఆవేశానికి ఉత్పత్తి స్థానం ప్రత్యక్ చైతన్యావస్థ. చైతన్యం ద్వారా ప్రత్యక్ చైతన్యావస్థను చేరుకుని ఆవేశంతో నటించే శాస్త్రీయ విధానాన్ని స్టానిస్లవ్‌స్కీ (1863–1938) విధానం అంటున్నారు.

ఈ విధానానికి మొదటి మెట్టు ఏకాగ్రత. అయితే, భావనా శక్తి, ప్రక్రియ, కండర సారళ్యం, విశ్వాసం, ఉద్వేగ స్మృతి, సంసర్గం, అనువర్తనల ద్వారా ప్రత్యేక చైతన్యావస్థకు చేరుకోగలుగుతారు. అపుడు ఆవేశం అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తుంది. సజీవ కళా సృష్టి జరిగి ప్రేక్షకులకు విశ్వాసం కలిగి, రసానందం పొందగలుగుతారు.

శ్రీ.చ.

పామర్రు కంపెనీ (1908–1913) : ఈ కంపెనీ వ్యవస్థాపకుడు, అధినేత, ప్రధాన నటుడు ఉరుటూరు గ్రామ కరణం మానికొండ వెంకట రామయ్య. ఈ కంపెనీ కృష్ణా జిల్లా పామర్రు గ్రామంలో నెలకొని ఉండటం వల్ల దీనికి పామర్రు కంపెనీ అని పేరు వచ్చింది. కాని అసలు పేరు సంగీత సరస వినోదినీ హిందూ నాటక సమాజం.

ఈ కంపెనీలో ఉప్పులూరి సంజీవరావు నాయిక, మానికొండ వెంకట రామయ్య నాయక పాత్రలలో నటించేవారు. సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు క్రోవి సీతారామశాస్త్రి కూడా ఈ కంపెనీలోని నటుడే. ఈ కంపెనీ ప్రదర్శించిన నాటకాలలో నరకాసుర వధ, రుక్మాంగద ప్రసిద్ధమైనవి.

ఉప్పులూరి సంజీవరావును మహానటుడుగా తీర్చిదిద్ది ఆంధ్ర నాటకరంగానికి సమర్పించిన ఘనత ఈ కంపెనీదే. సంజీవరావు ఈ కంపెనీ విడిచి మైలవరం కంపెనీలో చేరడంతో ఈ కంపెనీ అంతరించింది.

నరకాసుర వధ, రుక్మాంగద, సారంగధర, హరిశ్చంద్ర, చిత్రనళీయం, పాండవాజ్ఞాతవాసం, సిరియాళ మొదలైన నాటకాలను ప్రదర్శించడంతో పేరు తెచ్చుకొంది.

శ్రీ.చ.

పారిపార్శ్వకుడు : సూత్రధారుని సహచరుడు. ఇతనికి మారీషుడని ఇంకొక పేరు. సూత్రధారుడు ఇతనిని మారీష అని పిలుస్తాడు. పారిపార్శ్వకుడు సూత్రధారుని బావా అని పిలుస్తాడు. పారిపార్శ్వకుడు లేక మారీషుడు సూత్రధారుని గుణాల కంటె కొంచెం తక్కువ గుణాలు కలవాడు, మధ్యమ ప్రకృతి, ప్రస్తావనా నిర్వహణలో సూత్రధారునికి ఈ పాత్ర పారిపార్శ్వకుడు తోడ్పడుతుంటాడు. ఉదా: వేణీసంహారం, చండకౌశికం, బలిజేపల్లి లక్ష్మీకాంతం సత్యహరిశ్చంద్ర.

శ్రీ.చ.

పార్వతీశం, వోలేటి (1882–1955) : నాటకకర్త, నవలా కారుడు, పండితుడు, కవిరాజహంస, కవికులాంకార బిరుదాంకితుడు. ఈయన 1882లో తూర్పు గోదావరి జిల్లా కొమరగిరిలో జన్మించాడు. తల్లి వెంకమ్మ, తండ్రి అచ్యుత రామయ్య, పార్వతీశం, బాలాంత్రపు వేంకటరావుతో కలిసి అనేక నవలలు అనువదించాడు, స్వతంత్ర రచనలు సాగించాడు.

వేంకటరావుతో కలవక ముందు పార్వతీశం ఒక్కడే సువర్ణమాల (1907), తారా శశాంకం (1908) అనే రెండు నాటకాలు రాశాడు. జంటకవుల సారథ్యంలో అనేక నవలలను (బెంగాలీ) తెలుగులోకి అనువదించడమే కాకుండా ధనాభిరామం నాటికను కూడా వెలువరించాడు. బాలబాలికల కోసం '*బమ్మల భారతం, బమ్మల భాగవతం, బమ్మల రామాయణం*' రచించాడు. వీరి రామాయణాంధ్రీకరణ పూర్తి కాలేదు. సాహిత్య నాటకరంగానికి సేవలందించిన పార్వతీశం 1955లో కన్నుమూశాడు.

శ్రీ.చ

పింటర్, హరల్డ్ : (చూ. హారల్డ్ పింటర్)

పిరాండిల్లో, లూగి (1867–1936) : ఇటాలియన్ నాటకకర్త, నవలా రచయిత. అసంబద్ధ నాటక ప్రక్రియకు ప్రాణం పోసినవాడు. మానవ జీవితం అతని కర్తృత్వ శక్తికి అతీతస్థాయికి చేరిపోయిందనీ, సాంఘిక నియమాలు, సత్య నిర్ధారణలో, నైతిక సూత్రీకరణలో ఇవన్నీ బూటకమనీ, ఆర్థిక గుత్తాధిపత్యంతో కూడిన రాజకీయ నియంతృత్వంలో సామాన్యుడు నిస్సహాయుడనీ, పరిస్థితులకు బానిసనీ పిరాండిల్లో ప్రకటిస్తాడు.

సత్య వ్యక్తీకరణలో ఒకే వ్యక్తికి చెందిన ఒకే సంఘటనను పలువురు పలువిధాలుగా వ్యాఖ్యానించటం ఈయన నాటకాల్లోని ప్రత్యేకత. మనిషి మంచివాడేననీ, ఈ వ్యవస్థే అతణ్ణి వక్రమార్గానికి మళ్లిస్తుందని, ఇలా మారడానికి అతని అవసరార్థం జీవిత స్థితిగతులేననీ ఈయన అభిప్రాయం. సత్యభ్రాంతుల మధ్య కాలం తాకిడికి కదిలిపోయే కృత్రిమ విలువల కట్టడాల మధ్య, సందిగ్ధావస్థల మధ్య బందీయై విలపించే మానవునితోపాటుగా, వీటన్నిటినీ ధిక్కరించి, తమకు తోచినవిధంగా ప్రవర్తించే మరో మానవుణ్ణి కూడా మన ముందుకు తెస్తాడు నాటకకర్త.

1867, జూన్ 28న అగ్రిగెంట్‌లో జన్మించిన ఈ ఇటాలియన్ రచయిత ఎన్నో కథల్నీ, నవలల్నీ కూడా రాశాడు. తండ్రి సల్ఫర్ గనులయజమాని. తండ్రి వ్యాపారంలో నష్టపోవటంతో పిరాండిల్లో కష్టాల పాలైనాడు. వ్యాపారం తనకు సరిపడదని గ్రహించాడు. విశ్వవిద్యాలయంలో ఫొనిటిక్స్ మీద డాక్టరేట్ కోసం పరిశోధన చేసి, 1923 వరకూ ఉపాధ్యాయ వృత్తిలో ఉండిపోయాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఇటాలియన్ సైన్యంలో చేరి, ఖైదీగా నిర్బంధింపబడి, తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. ఈ విషాద పరిస్థితుల్లోనూ పిరాండిల్లో రచనా వ్యాసంగం కొనసాగిస్తూ వచ్చాడు.

నలభై రెండు సంవత్సరాల వయసొచ్చే వరకు నాటక రచనకే పూనుకోని పిరాండిల్లో నలభైకి పైగా నాటకాలు రాశాడు. జీవన మార్మికతతో నిండిన పిరాండిల్లో నాటకాలను అవగాహన చేసుకోవటం సులభం కాదు. పిరాండిల్లో వ్యక్తిగత విషాద జీవితం అతని ఆశావాదాన్ని చిన్నాభిన్నం చేసింది. 1923లో పిరాండిల్లో సిక్స్ కేరెక్టర్స్ ఇన్‌సర్చ్ ఆఫ్ యాన్ ఆథర్ అనే నాటకాన్ని రాశాడు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిపొందిన నాటకమిది. 1923లో ఫ్రాన్స్‌లో ఈ నాటకాన్ని ప్రదర్శించినపుడు నాటకాభిమానులు నీరాజనం పట్టారు. జీవితంలోని అసంబద్ధతల్నీ, వైవిధ్యాల్ని హాస్యధోరణిలో ఈ నాటకంలో రూపు కట్టించాడు పిరాండిల్లో. విరుద్ధాంశాలతో విచ్చలవిడిగా సాగిపోయే జీవనక్రీడే ఈ నాటకం. అసంబద్ధ నాటక రచయితలు శామ్యూల్ బెకెట్, అయనెస్కో వంటి వారికి ఈ నాటకం ప్రేరణశక్తిగా నిల్చింది. జీవన వాస్తవికతలు, కళాసృజనలు ఈ రెండూ ఎంత యదార్థాలో, అంత భ్రమలన్న విషయాన్ని ఈ నాటకంలో వివరించాడు రచయిత. వస్తువును సాంఘిక జీవనం నుంచి స్వీకరించినా, రీజనింగ్‌ను వాస్తవికతకు విరుద్ధంగా, పాత్రల మనస్తత్వ నిరూపణ దిశగా అభివ్యక్తం చేయటం జరిగింది. పిరాండిల్లో రచించిన ది *డాక్టర్స్ డ్యూటీ* (1913), *రైట్ యు ఆర్ ఇఫ్ యు థింక్ యు ఆర్* (1917), *బట్ ఇటీజ్ నాట్ ఎ సీరియస్ ఎఫైర్* (1918), *డయానా అండ్ ట్యుడా* (1927), ది న్యూ కాలనీ (1929) మొదలైన నాటకాలు రచయితను శిఖరాగ్రంలో నిలిపాయి. పిరాండిల్లో నోబెల్ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ రచయిత నాటకాలు ఇటలీలో నేటికీ ప్రదర్శింపబడుతూ ఉండటం ఆ నాటకాల విశిష్టత ద్యోతకం అవుతుంది. పిరాండిల్లో నాటకాలు ఎన్నో భాషల్లోకి అనువదింపబడినాయి. ఆయన ప్రపంచ నాటకరంగాన్ని ప్రభావితం చేసిన మహా నాటక రచయిత. నాటక రచనకే జీవిత సమస్తాన్నీ అంకితం చేసిన పిరాండిల్లో 1936, డిసెంబర్ 10వ తేదీన కన్నుమూశాడు.

రమణ

పీఠమర్ధుడు : నాయక సహాయుడు. ఈతనినే ఉపనాయకుడని కూడా అంటారు. పతాకకు నాయకుడు. నాటక నాయకుని కంటే గుణంలో కొంచెం తక్కువయిన వాడు. నాయకుని అనుసరిస్తూ అతనికి కార్యసిద్ధిలో సహాయపడేవాడు. కోపించిన స్త్రీలను అనునయించడంలో నేర్పరి. ఉదా: మాలతీ మాధవంలో మకరందుడు, రామాయణంలో సుగ్రీవుడు.

శ్రీ.చ.

పుండరీకాక్షుడు, దామరాజు (1898-1970) : ప్రముఖ జాతీయవాది, గాంధేయకవి, రామరాజ్యం మాసపత్రిక, రామరాజ్య గ్రంథాలయ స్థాపకుడు. 1898 జూన్ 5న రంగమాంబ, గోపాల కృష్ణయ్యలకు, గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా పాటిబండ గ్రామంలో జన్మించాడు. 1920లో బి.ఏ, 1925లో బి.ఎల్ పట్టాలు పొంది, గుంటూరులో న్యాయవాది వృత్తిని చేపట్టాడు. స్వరాజ్యోద్యమంలో తిన్న లాఠీ దెబ్బలకు ఊపిరితిత్తులు చెడి, చాలాకాలం అనారోగ్యంతో బాధపడ్డాడు.

ఉత్సాహం, దేశభక్తి, ధైర్యసాహసాలు, నాటక రచనకు తగిన పాండిత్యం కలిగిన దామరాజు పుండరీకాక్షుడు జాతీయోద్యమ ప్రబోధాత్మకమైన నాటకాలు తెలుగులో

ప్రప్రథమంగా రచించి, జాతీయ నాటక పితామహుడుగా ప్రసిద్ధిగాంచాడు.

దామరాజు స్వరాజ్యసోపాన నిలయము అనే పేరుతో ప్రచురించిన *గాంధీ మహోదయం*, *గాంధీ విజయం*, *పాంచాల పరాభవం* (1921-22) అనే నాటకాలు బహుళ ప్రజాదరణ పొందాయి. గాంధీ మహోదయం లేదా నవయుగారంభం అనే నాటకంలో తిలక్ మరణానంతరం గాంధీయుగం ఆరంభించబడినట్లు నిరూపించబడింది. *గాంధీ విజయం* లేదా నవయుగం అనే నాటకంలో గాంధీ యుగారంభం నుంచి నాగపూర్ మహాసభాంతం వరకు గల చరిత్ర చిత్రింపబడింది. పాంచాలీ పరాభవం లేదా పంజాబు దురంతాలు అనే నాటకంలో జలియన్ వాలాబాగ్‌లో ఆంగ్లేయులు సాగించిన దమనకాండ (1919) ప్రత్యక్షీకరించబడింది. ఆనాడు ఈ నాటకాలు రంగస్థలంపై విజయవంతం కావడమేగాక, పలువురు ఈ నాటకాలు చదివించుకొని ఉత్తేజితులయ్యేవారట. ఈ విధంగా దామరాజు నాటకాలు ఆంధ్ర దేశంలో జాతీయోద్యమ స్ఫూర్తికి ఎంతగానో తోడ్పడ్డాయి. ఆయన నాటకాల్లోని "*గాంధీనామం మరువం మరువం*" వంటి పాటలు, "కత్తులు లేవు శూలమును *గాండీవమున్ మొదలే హుళక్కే*" వంటి పద్యాలు పాడుకోని తెలుగు వాడు ఆనాడు ఉండేవాడు కాదనడం అతిశయోక్తి కాదు. దామరాజు రాసిన పాంచాల పరాభవం నాటకం ఆంగ్లదేశం పార్లమెంటులో అలజడి కలిగించింది. ఈయన రాసిన నాటకాలను పత్రి శీనప్ప బృందం అద్భుతంగా ప్రదర్శించేది. దామరాజు రాసిన కొన్ని నాటకాలను ఆంగ్ల ప్రభుత్వం నిషేధించడమే గాక, వాటి ప్రతులు తెప్పించి తగుల బెట్టించింది.

దామరాజు మిస్ విహార్ లేదా *కలియుగ భారతం* నాటకంలో బ్రహ్మ సృష్టి నుంచి కలియుగం వరకు వివిధ కులస్థులు పడే బాధలు వర్ణించాడు. వర్ణాంతర వివాహాలు, విధవా వివాహాలు, మద్యపానం మొదలైన సాంఘికాంశాలను వివరించిన సంఘ సంస్కరణాత్మక నాటకమిది. ఈయన రచించిన ఇదా స్వరాజ్యం (1920), *సంస్కారిణి*(1923) కూడా సంఘసంస్కరణకు సంబంధించిన నాటకం. ఆధునిక విషయాలపై హాస్య ప్రధానంగా రాయబడ్డ నాటకం. ఓట్ల ప్రహసనం కూడా హాస్య ప్రధాన నాటకం. *రణభేరి* (1947) నాటకం కూడా ప్రజాభిమానాన్ని పొందింది. ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం ఈ నాటకంలోని 'గాంధీ' పాత్రను తొలగిస్తే గొప్పగా పారితోషికం ఇస్తామని ఆశచూపినా లొంగని నిష్కళంక దేశభక్తుడు. స్వరాజ్య మహాసభ, క్విట్ ఇండియా మొదలైన అభ్యుదయ నాటకాలు రచించాడు. ఇవే గాక *భగవాన్ నారద* (1935), *కుంభరాణా* (1938), *తారాశశాంకం* (1940), *భక్తపోతన* (1940) మొదలైన నాటకాలు కూడా రచించాడు.

పుండరీకాక్షుడు రచించిన *గాంధీమహాత్మ* అనే కలియుగ హరికథ (1921)లో సహాయ నిరాకరణోద్యమ చరిత్రతో మొదలై ఉప్పుసత్యాగ్రహం వరకు కొనసాగింది. టర్కీ వాడైన *కమల్‌పాషా జీవితం* (1924) తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ రచించాడు. *గుంటూరు గొప్ప* (1921) సమకాలిక సంఘజీవితాన్ని చిత్రించిన గొప్ప గ్రంథం. నిలువీత అనే ఖండ కావ్యం, *శ్రీనాథ పోతన* (1943), *స్వరాజ్య సౌధం* (1947), *కలియుగ కురుక్షేత్రం*, *విజయాంధ్ర* (1954), *కాంగ్రెసు ఉద్యమ చరిత్ర*, *సత్యాగ్రహపాలన*, *హరిజనాభ్యుదయం* మొదలైన రచనలు చేశాడు.

'నేను' అనే పేరుతో స్వీయచరిత్రను కూడా రాసుకున్నాడు. 1968లో ఆయనకు ఘనంగా సప్తతి మహోత్సవం జరిగింది. త్రికరణ శుద్ధితో దేశభక్తి, సామాజికోద్ధరణకు జీవితాన్ని సమర్పించిన దామరాజు పుండరీకాక్షుడు **1970**లో మరణించాడు.

నాగిరెడ్డి

పున్నయ్య, కోసూరి (జ.1916) : రంగస్థల నటుడు, బుర్రకథ, జముకులకథ కళాకారుడు. ప్రజానాట్య మండలి నిర్మాణ సారథులలో ప్రముఖుడు. కృష్ణాజిల్లా దివితాలుకా కొత్తపాలెం గ్రామంలో 1916లో జన్మించాడు. పున్నయ్య తల్లి దండ్రులు నాగమాంబ, అప్పయ్యలు. స్వగ్రామమైన కొత్తపాలెంలో బాల జగన్మోహన నాట్య మండలిని స్థాపించి, కాంతామతి, కాళిదాసు, సక్కుబాయి, కనకతార, లవకుశ నాటకాల్లో స్త్రీ పాత్రలు ధరించాడు. కృష్ణ తులాభారంలో నారదునిగా, వరవిక్రయంలో సింగరాజు లింగరాజుగా నటించి నవ్వుల పువ్వులను పూయించాడు.

బ్రిటీష్‌సామ్రాజ్యవాద వ్యతిరేకోద్యమాలు, జమిందారీ వ్యతిరేకోద్యమాలతో స్ఫూర్తి పొందిన పున్నయ్య యువజన సంఘాల స్థాపనలో విశేషమైన కృషి చేశాడు. 1943, మార్చిలో కృష్ణాజిల్లా దివితాలూకా కొడాలి గ్రామంలో జరిగిన ఫాసిస్ట్ వ్యతిరేక శిబిరంలో బుర్రకథ ప్రక్రియలో శిక్షణ పొందాడు. 1943 జూన్ 23 నుంచి బంబాయిలో జరిగిన అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ తొలి మహాసభల్లో సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన రాష్ట్ర దళంలో పున్నయ్య ఒకరు. మాభూమి నాటకంలో యల్లమంద పాత్రలో జీవించాడు అనే ప్రశంసకు పాత్రమయ్యాడు.

పూనా, షోలాపూర్ వంటి పట్టణాలలో యల్లమంద పాత్రకు విశేషమైన ఖ్యాతి లభించింది. పున్నయ్య ధరించిన ఈ పాత్ర స్ఫూర్తిగా ప్రముఖ చలన చిత్ర నటుడు బలరాజ్ సహానీ దోభీఘా జమీన్ చిత్రంలో రైతు పాత్రను సృష్టించి, ఆ పాత్రను తానే పోషించాడు. కానీ పున్నయ్య స్థాయిలో తాను నటించలేక పోయినట్లు సహానీ ప్రకటించడం గమనార్హం.

కృష్ణాజిల్లా రాష్ట్రదళంలో బుర్రకథలో హాస్య వంతగా వందలాది ప్రదర్శనలిచ్చాడు. కోగంటి రచించిన హిట్లర్ భాగోతం, క్రిప్సురాయబారం, తెలంగాణా వీధినాటకాలలో పున్నయ్య వ్యాఖ్యాతగా ప్రేక్షకులను ఉత్తేజితులను చేశాడు. మిక్కిలినేని హిట్లరుగా, రాజారావు ఎర్రసైనికుడుగా నటిస్తున్న పతాక సన్నివేశంలో తాళం వేస్తూ కదను తొక్కేవాడు. హిట్లరు భాగవతంలో పున్నయ్య అడుగుల వైచిత్రిని చూసి కూచిపూడి నాట్యాచార్యుడు వేదాంతం రామకృష్ణయ్య ప్రశంసించాడు. 'పట్టరా చుక్కాని ఓరన్నా.. పడవ తిన్నగ నడుపు పెద్దన్నా' వంటి పాటలను రచించి, పాడి, లక్షలాది మందిని అలరించాడు. *బాలచంద్రుడు, మగువమాంచాల, జవహర్ బుర్రకథలను, ఆకలిమంటలు, ద్విపద, పిచ్చుక గుంటుల కథ, మాధవయ్య హరికథ, స్పుత్నిక్* వీధి భాగవతం వంటి జానపద ప్రక్రియలను రచించడమే కాక స్వయంగా ప్రదర్శించాడు. ఏ పాత్ర అయినా, ఏ కళారూపమైనా ప్రదర్శిస్తున్న సమయంలో ఆశువుగా చెప్పే హాస్యం ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తేది.

కందిమళ్ల

పురుషోత్తమకవి, నాదెళ్ల (1863-1938) : తెలుగు, హిందీ నాటకకర్త, సరస చతుర్విధ కవితాసామ్రాజ్య దురంధరుడు, బహుభాషా వేత్త, అభినయ వేత్త, వేద పండితుడు, ఆదర్శోపాధ్యాయుడు, శతాధిక గ్రంథకర్త, బుధ విధేయని పత్రికా సంపాదకుడు, జ్యోతిష మంత్ర శాస్త్ర వేత్త. తెలుగు నాటకాలలో పాత్రోచిత భాషా ప్రయోగానికి ఆద్యుడు.

ఈయన పూర్వులది కృష్ణాజిల్లా నాదెళ్ళ గ్రామం. ఈయన దివితాలూకా సీతారామపురం అగ్రహారంలో 1863, ఏప్రిల్ 23న జన్మించాడు. తల్లిదండ్రులు సుబ్బాంబిక, కామేశ్వరశాస్త్రి.

1864లో ఉప్పెనకు గ్రామం కొట్టుకు పోగా ఈయన కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. ఇక్కడ హిందీ, పారశీక భాషలు నేర్చుకున్నాడు. తొమ్మిదవ ఏటనే పితృవియోగం కలిగినందువల్ల నాదెళ్ల హైదరాబాదు నుంచి తిరిగి వచ్చి సీతారామపురంలో స్థిరపడ్డాడు. తరువాత బందరు హిందూ హైస్కూల్లో ఉన్నత విద్యను అభ్యసించాడు. అనంతరం కొంతకాలం ఉపాధ్యాయుడుగా పనిచేశాడు.

రేపల్లెలో ఉండగా బందరు నేషనల్ థియేట్రికల్ సొసైటీ కోరిక మేరకు హిందుస్తానీలో నాటకాలు రాసి ఇచ్చాడు.

బందరులో 1886లో **'బుధజన విధేయని'** పత్రిక స్థాపించాడు. 1887లో బందరు హిందూ హైస్కూల్ బ్రాంచి ప్రధానోపాధ్యాయుడిగా చేరాడు. ఆ తరువాత1890లో హైందవ పాఠశాలను, హిందూమత బాలసమాజం స్థాపించి హిందూ మతోద్ధరణకు పాటు పడ్డాడు.

సిద్ధేంద్రయోగి భామాకలాపం, వీధి నాటకాల ప్రభావంతో 16వ ఏటనే 1879లో *'అహల్యాసంక్రందనం'* అనే యక్షగానం రచించాడు. ఈ యక్షగానాన్ని వీధినాటకాల వారు ఎక్కువగా ప్రదర్శించారు.

పాత్రోచితభాషాప్రయోగానికి దారి చూపాడు. 1888లో నాదెళ్ల రచించిన హరిశ్చంద్ర నాటకంలో పాత్రోచిత భాషాప్రయోగం చేశాడు. ఈ నాటకం 1888లో 'బుధజన విధేయని' పత్రికలో ప్రకటించి, తరువాత 1890లో గ్రంథరూపంలో ప్రచురించాడు. ఇది పాత్రోచిత ప్రసంగ వచన సమన్వితం. నవల వలే చదువుకోవడానికి కూడ తగింది. ఇందులో అంక రంగ విభజన లేదు. సంధి వాక్యాలున్నాయి. అప్పట్లో సత్యనారాయణ వ్రతాలలో కాలక్షేపంగా చదివేవారట.

నాదెళ్ల రచించిన హిందీ నాటకాలు బందరు నేషనల్ థియేటర్ ప్రదర్శించింది. ఈ ప్రదర్శనలకు కవే దర్శకుడు, సూత్రధారి. ధార్వాడ కంపెనీ రెండవసారి 1884లో బందరు వచ్చినపుడు వారి కళావతీ పరిణయ నాటకం ఆ సొసైటీ వారి ముందు ప్రదర్శించి మెప్పుపొందాడు.

ఈయన రచించిన హిందీ నాటకాలలో సూత్రధారుడు నాటకం చివరి వరకు రంగస్థలం మీదనే ఉండి, సంధి వచనాలు చెబుతాడు. వీటిలో అంక విభజన లేదు. సంభాషణలు సుదీర్ఘాలు. ఉర్దూ టపాలు ఎక్కువ. అక్కడక్కడా సంస్కృత శ్లోకాలు ఉన్నాయి. హిందీ నాటకాలన్నీ తెలుగులిపిలో ముద్రితమైనాయి. హిందీ నాటకమైనా రంగస్థల సూచనలు మాత్రం తెలుగులోనే పొందుపరిచాడు.

ఈ నాటకాలలో రాజామాత్యులకు ఫార్సీ, ముని పురోహితాదులకు సంస్కృతం, సేవకులకు ఉర్దూ, తక్కిన వారికి హిందీ ఉపయోగించి పాత్రోచిత భాషా వాదానికి పునాదులు వేశాడు. పర భాషలలో నాటకాలు రాసిన ఘనత, పాత్రోచిత భాషా ప్రయోగ ఘనత ఈయనదే.

ఈయన రాసిన **చంద్రహాస** నాటకంలో మొదట పద్యాలు లేవు. పాటలు మాత్రం ఉండేవి. తరువాత నాటకాలలో పాటలను పద్యాలుగా మార్చి ముద్రించాడు. నటులకు వాచికాభినయం నేర్పేవాడు. బందరు నేషనల్ థియేట్రికల్ సొసైటీ నాదెళ్ల దర్శకత్వంలోనే ఉచ్ఛస్థితికి వచ్చింది.

తెలుగులో అహల్యా సంక్రందనం (1883), హరిశ్చంద్ర (1917), పారిజాతాపహరణం , సారంగధర, ద్రౌపదీ వస్త్రాపహరణం, చంద్రహాస (1916), స్త్రీల మీటింగు నాటి హరికథ ప్రహసనం (1908), హిందీ- కాళాసురవధ, పంచాక్షరీ మహిమ, సుభద్రా పరిణయం, భస్మాసుర వధ, కళావతీ పరిణయం, శంబూక వధ, శారదోపాఖ్యానం, లవణాసుర సంహారం (1916) మొదలైన ప్రసిద్ధ రచనలు చేసిన నాదెళ్ల 1938, నవంబర్ 27న మరణించాడు.

శ్రీ.చ.

పురుషోత్తమ రావు, అయ్యదేవర (జ.1933) : రంగస్థల నటుడు, సమాజ వ్యవస్థాపకుడు, రచయిత. 1933, జూన్ 30న ఖమ్మంజిల్లా ఎర్రుపాలెంలో జన్మించాడు. స్కూలు ఫైనల్ వరకు విజయవాడలో చదివాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పట్టభద్రుడై బ్యాంకు ఉద్యోగంలో చేరాడు. విద్యార్థి దశ నుంచీ నాటకాలపై పెంచుకున్న అభిరుచి హైదరాబాద్ నగరంలో ద్విగుణీకృతమై జీవితగమనంలో పెనవేసుకు పోయింది. మొదట్లో కన్యాశుల్కం, గృహప్రవేశం వంటి సాంఘిక నాటకాలు వేసినా, కాలగమనంలో పద్య నాటకాలవైపు ఆకర్షితుడయ్యాడు. చక్కని శరీరసౌష్టవం, రూపురేఖలు, మధురమైన కంఠం, స్ఫుటమైన భాషోచ్చారణ పద్య నాటకాల్లో ప్రధాన పాత్రలు ధరించడానికి విశిష్ట లక్షణాలుగా నిలిచాయి. ఎక్కువసార్లు వివిధ నాటకాల్లో శ్రీకృష్ణ పాత్ర ధరించటంవల్ల పురుషోత్తమరావుకు 'బ్యాంకు కృష్ణుడు'గా ముద్రపడిపోయింది. పాండవోద్యోగం, ద్రౌపదీ మానసంరక్షణ, గయోపాఖ్యానం, రాధాకృష్ణ, కర్ణ నాటకాలలో వందలసార్లు శ్రీకృష్ణపాత్రల్లో నటించి ప్రేక్షకలోకాన్ని అలరించి 'అభినవకృష్ణ , నటసారథి' మొదలైన బిరుదులు పొందాడు.

బబ్బిలి యుద్ధం, అనార్కలి, శ్రీరామాంజనేయ యుద్ధం, భక్త రామదాసు, మహామంత్రి తిమ్మరుసు, భువన విజయం, సతీ సావిత్రి, అభిజ్ఞాన శాకుంతలం, భక్త తుకారాం, తారాశశాంకం, శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం, చింతామణి, నర్తనశాల, వీరాభిమన్యు మొదలైన పౌరాణిక, చారిత్రాత్మక నాటకాలలో ప్రధాన పాత్రలు ధరించి బహుళ జనాదరణ పొందాడు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా, బెంగుళూరు, చెన్నై, తిరువనంతపురం, భువనేశ్వర్, కలకత్తా, హరిద్వార్ నగరాలలో కూడా నాటక ప్రదర్శనలిచ్చి ఆ ప్రదేశాలలో తెలుగు నాటకం బావుటా ఎగురవేశాడు.

తానా వారి ఆహ్వానంతో అమెరికా వెళ్ళి న్యూయార్క్, న్యూజెర్సీ, పిట్స్‌బర్గ్, డెట్రాయిట్, చికాగో, శాన్‌ఫ్రాన్సిస్కో మొదలైన నగరాల్లో నాటక ప్రదర్శనలిచ్చి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాడు.

హైదరాబాద్‌లో 'సి.ఎస్.ఆర్. కళామందిర్' స్థాపించి, వందలాది నాటకాలను ప్రదర్శించాడు. ప్రతి ఏటా నాటకోత్సవం నిర్వహిస్తూ, కళాకారులను సన్మానిస్తూ, నాటకరంగ వికాసానికి అహరహం పాటుపడుతున్న కళాహృదయుడు అయ్యదేవర పురుషోత్తమరావు.

గం.సు.రె.

పురుషోత్తమ శాస్త్రి, నాదెళ్ల (జ.1929-2007) : సాహితీవేత్త, నటుడు, నాటక రచయిత, ప్రయోక్త, న్యాయ నిర్ణేత, పరిషత్తు నిర్వాహకుడు. 1880 ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి ఆంధ్రదేశం సంచారం వచ్చిన ధార్వాడ కంపెనీ ఇచ్చిన ప్రదర్శనల స్ఫూర్తితో 32 హిందీ నాటకాలు రాసి, బందరులో ప్రదర్శింపచేసిన విఖ్యాత హిందీ నాటకకర్త, ప్రయోక్త నాదెళ్ళ పురుషోత్తమ కవీంద్రులకు పౌత్రులుగా, మేధా దక్షిణామూర్తి, పార్వతమ్మ దంపతులకు పుత్రునిగా 1929, జనవరి 9న బందరులో జన్మించి తాత తండ్రుల దగ్గర నుంచి ప్రతిభా వారసత్వం పుణికిపుచ్చుకున్నాడు.

తెలుగు కళాజగతికి అహరహం సేవలు అందించిన శాస్త్రి 1946లో తన తాతగారి సహకారంతో 1883లో స్థాపితమైన నేషనల్ థియేట్రికల్ సొసైటీలో సభ్యుడుగా చేరి, తన భావి రంగస్థల ప్రస్థానానికి శ్రీకారం చుట్టాడు. 1948లో ఎన్.జి.ఓ. నాటకం ద్వారా రంగప్రవేశం చేసిన శాస్త్రి నటుడిగా దాదాపు దశాబ్దకాలం కొనసాగాడు. ఈ కొద్దికాలంలోనే పలు సాంఘిక, చారిత్రక, పౌరాణిక నాటకాలలో నటించి, దర్శకత్వం వహించాడు. ఎందరో కళాకారులను రంగస్థలానికి పరిచయం చేయటమే కాకుండా ఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దాడు. ఇక రచయితగా తోడు దొంగలు అనే నాటకం, కుక్కగొడుగులు, అల్లుని మంచితనం అనే నాటికలు రచించి, ప్రదర్శింపచేసి నాటకకర్తగా కూడా ప్రశంసలు పొందాడు. 1960 నుంచి పలు

ప్రతిష్ఠాత్మక పరిషత్తులకు న్యాయనిర్ణేతగా వ్యవహరించి నిష్పాక్షిక న్యాయనిర్ణేతగా, సునిశిత విమర్శకునిగా ఔత్సాహిక కళాకారుల, మేధావుల ప్రశంసలు పొందాడు.

1953లో బందరులో జరిగిన ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల నిర్వహణలో కీలక పాత్ర పోషించాడు. తెలుగు నాటకాన్ని విశేషంగా ప్రభావితం చేసిన ఆంధ్రనాటక కళాపరిషత్తు పనిచేసినంత కాలం దాని వికాసానికి కృషిచేశాడు.

ఈయనకు ఇటు నాటక, సాహితీరంగాలతోనే కాకుండా అటు సినిమారంగంతో కూడా అనుబంధం ఉంది. ప్రముఖ సినీ దర్శకుడు చిత్రపు నారాయణమూర్తి వద్ద ఎడిటింగ్ అసిస్టెంట్‌గా 1950 నుంచి 1954 వరకు పనిచేశాడు. 'నా చెల్లెలు' అనే చిత్రానికి సహాయదర్శకునిగా వ్యవహరించటంతో పాటు కొన్ని పాత్రలు కూడా పోషించాడు. నాటకరంగంలోను, సాహితీరంగంలోను ఈయన చేసిన విశిష్ట కృషికిగాను 1964 నుంచి 1969 వరకు ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యత్వం ఇచ్చి ప్రభుత్వం గౌరవించింది. 1975లో హైదరాబాద్‌లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలలో ఘనంగా సత్కరించబడ్డాడు. 2001లో జరిగిన కృష్ణా మహోత్సవాలలో జిల్లాలోని సాంస్కృతిక ప్రముఖుల్లో ఒకడిగా గుర్తింపబడి సన్మానించ బడ్డాడు. 'నవ్యకవి, గేయశేఖర' బిరుదులు పొందాడు. అష్టావధానాల నిర్వహణలోను, సభా నిర్వహణలోను ఈయనది ప్రత్యేకశైలి. నాటకరంగానికి విశేష సేవలు అందించిన నాదెళ్ళ 2007 ఫిబ్రవరి 19న స్వర్గస్థుడయ్యాడు.

మన్నెశ్రీ

పుస్తం : ఆహార్యభేదం. నాటకప్రయోగంలో ప్రదర్శించడానికి, కొండలు, విమానాలు, చర్మ వర్మ ధ్వజాలు నిర్మించడం పుస్తం. బాల రామాయణం లో విమానం దీనికి ఉదాహరణ. ఈ పుస్తం మూడు విధాలు. 1. సంధిమం, 2. వ్యాజిమం, 3. వేష్టిమం.

శ్రీ.చ.

పూర్ణ,సురభి (జ.1952): రంగస్థల నటుడు, సాంకేతిక నిపుణుడు. సురభి పూర్ణగా నాటకరంగానికి పరిచితుడైన ఈయన అసలు పేరు వనారస పూర్ణచంద్రశేఖర్. సురభి కళాకారుడు. వనారస హనుమంతరావు, శారదాదేవి దంపతులకు అనంతపూర్ జిల్లాలోని బెల్డోన్ గ్రామంలో 1952లో జన్మించాడు. సురభి సమాజం సంప్రదాయం ప్రకారం తన ఏడో ఏట నుంచే నటుడుగా రంగప్రవేశం చేశాడు. కొన్ని నాటకాల్లో పాత్రధారణ చేసి మంచినటుడని పేరు తెచ్చుకున్నాడు. క్రమంగా పూర్ణ అభిరుచి సాంకేతిక విభాగం వైపు మొగ్గు చూపింది. అప్పటినుంచీ సెట్ డిజైన్, రంగోద్దీపనం, రంగస్థలంపై స్పెషల్ ఎఫెక్ట్స్ వైపు దృష్టి సారించి ఆ దిశలో ప్రత్యేక శ్రద్ధ వహించి తీవ్రంగా కృషి చేశాడు. అచిరకాలంలోనే ఆ రంగంలో తన ప్రతిభావ్యుత్పత్తుల ద్వారా సాంకేతిక నిపుణుడుగా పేరు తెచ్చుకున్నాడు. టెక్నీషియన్‌గా, శిల్పిగా, చిత్రకారునిగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, విగ్ మేకర్‌గా తన ప్రత్యేకతను నిరూపించుకున్నాడు. తన సేవలను సురభి సమాజానికే పరిమితం చేయకుండా ఆంధ్రప్రదేశ్‌లో అనేక నాటక సమాజాలకు అందించి నాటక ప్రదర్శనలకు అదనపు ఆకర్షణను, నిండుతనాన్ని సమకూర్చుతూ ఉత్తమ సాంకేతిక ప్రమాణాలతో ప్రదర్శనకు ప్రాణం పోస్తున్న సాంకేతిక మాంత్రికుడు చంద్రశేఖర్. విదేశాలలో కూడా పర్యటించి అక్కడి ప్రేక్షకులకు తన సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించి మెప్పు పొందాడు.

రంగూన్, మయన్మార్, దక్షిణ కొరియా తదితర ప్రాంతాల్లో ఐ.సి.సి.ఆర్. ఆధ్వర్యంలో జరిగిన నృత్యోత్సవాల్లోనూ పూర్ణ హస్తం ఉంది. జమ్ముకాశ్మీర్‌లో జరిగిన సంధు ఫెస్టివల్‌లో నటుడిగా, సెట్ డిజైనర్‌గా, లైటింగ్ ఎక్స్‌పర్ట్‌గా ప్రత్యేకతను చాటుకున్నాడు. ఝాన్సీ ఉత్సవాలు, గంగా మహోత్సవాల్లో పాల్గని ఉత్తరప్రదేశ్ పర్యాటకశాఖ నుంచి అవార్డులు, రివార్డులు కూడా అందుకున్నాడు. నంది నాటకోత్సవాలలో 2001, 2004 సంవత్సరాల్లో రంగోద్దీపన ఎక్స్‌పర్టుగా నందులు కైవసం చేసుకున్నాడు. రాజంపేట నట కళాపరిషత్తు ఉత్తమ డిజైనర్ అవార్డును ఇచ్చి గౌరవించింది. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠాత్మక 'గరుడ' అవార్డును కూడా అందుకున్నాడు. రాష్ట్రప్రభుత్వ నంది నాటకోత్సవాలకు సాంకేతిక కమిటీలో గౌరవ సలహాదారుగా నియమితుడయ్యాడు. ఢిల్లీలో ఉన్న చమన్ లాల్ మెమోరియల్ సొసైటీ ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా ఇచ్చే చమల్ లాల్ స్మారక అవార్డును 2006వ సంవత్సరానికి పూర్ణను ఎంపిక చేసి 25 వేల రూపాయల నగదు, శాలువా, జ్ఞాపిక అందచేసి సత్కరించింది. శ్రీ శారదా కళా వినోదిని పేరిట సొంత థియేటర్ గ్రూపును కూడా నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్త ప్రదర్శనలు ఇస్తున్నాడు. నాటకరంగానికి అమూల్యమైన సేవలు అందించటమే కాక రంగాలంకరణ, రంగోద్దీపన విభాగాల్లో యువకులకు శిక్షణ ఇచ్చి తెలుగు నాటకరంగంలో సాంకేతిక నిపుణుల లోటును భర్తీ చేస్తూ ప్రోత్సహిస్తున్న సురభి పూర్ణ ఆదర్శ కళాకారుడు.

గం.సు.రె.

పూర్ణ చంద్రరావు: (చూ. మేకప్ అన్నయ్య)

పూర్ణయ్య పంతులు, చట్టిచిన (1885-1962) : నటుడు, నాటక కళా నిష్ణాతుడు, దర్శకుడు, నాట్యాచార్య బిరుదాంకితుడు, శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మంలో 1885 అక్టోబరు 16వ తేదీన జన్మించాడు. శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో విద్యాభ్యాసం సాగింది.

ఆ తరువాత ఫస్టు గ్రేడు ప్లీడరు పరీక్షలో ఉత్తీర్ణుడై శ్రీకాకుళంలో 1912-1932 వరకు న్యాయవాదిగా పనిచేశాడు.

శ్రీకాకుళం పురపాలక సంఘ సభ్యుడుగా ముప్పై సంవత్సరాలు పనిచేశాడు. వరుసగా నాలుగు సార్లు పురపాలక సంఘాధ్యక్షపదవి నలంకరించాడు. జాతీయవాది. విద్యార్థి దశలో వందేమాతరం ఉద్యమంలో పాల్గన్నందుకు పంతులును రెండు సంవత్సరాలు కాకినాడ కాలేజి నుంచి తొలగించారు. ఈయన రంగస్థలి మీద అడుగు పెట్టింది హామ్లెట్ నాటకంలో హారేషియో పాత్ర ద్వారానే.

పూర్ణయ్య పంతులు సంస్కృత, ఆంగ్ల, తెలుగు భాషలలో పండితుడు. భరత నాట్యశాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడంతో పాటు పాశ్చాత్య నాటక కళా మర్యాదలను తెలుసుకొన్నాడు. ఆనాటి నాటకాలలో, సంగీతం ప్రాధాన్యం వహిస్తూ భావ ప్రకటనను సొంపుగా, భావయుక్తంగా చదువుతూ తన భావప్రకటనా సామర్థ్యంతో సంగీతపు లోటు కనిపించనీయకుండా ప్రేక్షకుల ప్రశంసలనందుకొన్నాడు. పద్యం వచనంగా చదవడానికి ఈయనే మార్గదర్శకుడు.

పూర్ణయ్య పంతులు విజయనగరం ఆంధ్ర భారతీ తీర్థ గౌరవ సభ్యుడు. భారతీయ నాటకరంగం మీది పరిశోధనా గ్రంథానికి ఫ్రాన్సులోని మార్షలీస్ విశ్వవిద్యాలయం ఈయనకు 'డాక్టర్ ఆఫ్ ఇండియన్ డ్రమెటర్జీ' అనే గౌరవపట్టా ఇచ్చి గౌరవించింది. పూర్ణయ్య పంతులు ఆంధ్ర నాటక కళా పరిషత్తు సంస్థాపకులలో ముఖ్యుడు. తెనాలిలో 1929లో జరిగిన ప్రప్రథమ పరిషత్తు మహాసభల రెండవ రోజు కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ ఈయన చేసిన ప్రసంగం ప్రామాణిక లక్షణ గ్రంథం లాంటిది. 1962లో తిరిగి ఈయన గుడివాడలో జరిగిన పరిషత్తు మహాసభలకు అధ్యక్షత వహించాడు. ఆ సందర్భంలో పరిషత్తు పూర్ణయ్య పంతులును సన్మానించింది.

వ్యక్తికి గాకసమష్టి కృషికి ప్రాధాన్యం ఇచ్చినపుడే నాటకానికి సార్థకత అనే భావంతో శ్రీకాకుళంలో "రామవిలాస ఎమెచ్యూర్స్" నాటక సమాజానికి ఆరు సంవత్సరాలు, రామ విలాసినీ కంపెనీకి మూడు సంవత్సరాలు దర్శకత్వం వహించి, అనేక మంది నటులను తయారుచేశాడు. పూర్ణయ్యపంతులు అభిమాన రసం వీరరసం. అభిమాన పాత్ర శివాజీ. ఈయన వీరరసం అభినయిస్తూ మాటల పిడుగులు కురిపించి ప్రేక్షకులను వీర రసమగ్నులను చేసేవాడు. పూర్ణయ్య పంతులు శ్రీకూర్మంలో 1962లో నిర్యాణం చెందాడు.

ఈయన తెలుగులో శివాజి, హైదర్‌జంగ్, దుష్టబుద్ధి, పఠాన్ రుస్తుం, కంసుడు, దుర్యోధనుడు, తానీషా, రఘునాధ రావు, కర్ణ, హరిశ్చంద్ర, ఇంగ్లీషు నాటకాలలో హారేషియో పాత్రలలో నటించాడు.

శ్రీ.చ.

పూర్ణశ్రీ నాట్యమండలి (తెనాలి) : ఎ.వి. సుబ్బారావు 1960లో ఈ సమాజాన్ని స్థాపించాడు. కొంతకాలం సమాజాన్ని దివ్యంగా నడిపాడు. వయస్సురీత్యా నటించడం విరమించుకున్నాడు. ప్రస్తుతం ఈయన పెద్దకుమారుడు వేంకటేశ్వరరావు నిర్వహిస్తున్నాడు. భక్తచింతామణి, గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, పాండవోద్యోగ విజయాలు, శ్రీకృష్ణ తులాభారం మొదలైన నాటకాలను ఈ సమాజం ప్రదర్శిస్తోంది.

ఎ.వి. సుబ్బారావు, ఎ. వేంకటేశ్వరరావు, నూతక్కి సుబ్బారావు, అక్కి వేంకటేశ్వర్లు, కోడె రాధాకృష్ణ మూర్తి, ఎం.జగన్‌కుమార్, కాళిదాసు కోటేశ్వరరావు, ఆకుల వెంకయ్య, తీగెల శేషారావు మొదలైనవారు ఈ సమాజ నటులు.

నే.వ.శ.

పూర్ణిమ, ఆవేటి (జ.1918) : రంగస్థల నటి, సురభి నాటక సమాజ వ్యవస్థాపకులలో ముఖ్యుడైన వనారస గోవిందరావు పుత్రిక. తల్లి సురభి లక్ష్మమ్మ. పూర్ణిమ 1918 మార్చి 1వ తేదీన జన్మించింది. కళాకారుల కుటుంబంలో పుట్టిన పూర్ణిమ బాల్యంలో బాల పాత్రలు ధరించేది. 15వ ఏట ఆవేటి రామయ్యతో వివాహం జరిగాక, 1936లో శ్రీ శారదా మనో వినోదిని అనే నాటక కంపెనీ స్థాపించి నాటకాలు ప్రదర్శించడం ప్రారంభించింది. చక్కని రూపం, సరళమైన వాచికం, మధురమైన కంఠస్వరం, నిరంతర సాధన ఈమెను ఉత్తమ నటిగా తీర్చిదిద్దాయి. 1940లో అపవాదు, సత్యాభామ చిత్రాలలో ప్రధాన పాత్రలు ధరించింది. 1941లో మదరాసులో ఆంధ్ర నాటక కళా పరిషత్తు మొట్ట మొదటిసారిగా నాటక పోటీలు నిర్వహించినపుడు గాలి బాల సుందరరావు అపోహ నాటకంలో ప్రధాన పాత్ర పోషించినందుకు ప్రథమ బహుమతి లభించింది. రెండవ ప్రపంచయుద్ధకాలంలో మద్రాసు ఫిలిం కంపెనీలు మూసి వేయడంతో తెనాలిలో స్థిరపడింది. రెండు దశాబ్దాల పాటు ప్రముఖ పౌరాణిక, సాంఘిక నాటకాలలో సుప్రసిద్ధులైన రంగస్థల నటులందరి సరసన నటించి మెప్పు పొందిన మేటి నటి పూర్ణిమ. ఈమె కరుణ రసం చిందించే చంద్ర మతిగా, శృంగార నాయిక సత్యభామగా, చింతామణి లో వేశ్యగా విప్ర నారాయణలో దేవ దేవి, నాయకురాలు మొదలైన విభిన్న పాత్రలను సమర్థవంతంగా పోషించి ప్రేక్షకుల

ప్రశంసలందు కుంది. ఆంధ్ర రాష్ట్రంలోనే కాక ఒరిస్సా, బీహార్, మహారాష్ట్ర, పొరుగుదేశమైన రంగూన్‌లో ప్రదర్శించిన పలు నాటకాలలో నటించి నటలోకంలో పేరున్న నటిగా నిలిచింది. 1944లో పూర్ణిమ నాట్యమండలి స్థాపించి వరద బాధితుల సహాయార్థం నాటకాలు ప్రదర్శించి, వచ్చిన సొమ్మును విరాళంగా ఇచ్చింది. 1949లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు ఉత్తమ నటిగా ఘనంగా సన్మానించింది. నాటకరంగానికి విశేష సేవలందించినందుకు అప్పటి ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ భీమ్‌సేన్ సచార్ పూర్ణిమకు సువర్ణ ఘంటాకంకణాన్ని బహూకరించి ఘనంగా సన్మానించాడు .ఈమె ఆంధ్రప్రదేశ్ నాటక కళా సమితి కార్యవర్గ సభ్యురాలిగా పని చేసింది. బళ్ళారి రాఘవ, వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వంటి మహానటుల పక్కన దీటుగా నటించింది.

దాసరి.ఎన్

పూర్వరంగం : నాటక ప్రదర్శన ప్రారంభించడానికి ముందు జరిపే కార్యకలాపం పూర్వరంగం.

సంగీత చంద్రమనే లక్షణ గ్రంథంలో విప్రదాసు రంగ సంరక్షణ కోసం చేసే కార్యకలాపం పూర్వరంగం అన్నాడు. ఈ పూర్వరంగం రెండు విధాలు 1. అంతర్యవనికాంగాలు, 2. బహిర్యవని కాంగాలు. (వివరాలకు ఆయా శీర్షికలు చూడండి).

నాటక ప్రారంభానికి ముందు ప్రేక్షకులను నాటక వీక్షణోమ్ముఖులను చేయడానికి పూర్వరంగం ఉపకరిస్తుంది. కొంతమంది ఆలస్యంగా రావచ్చు. ఇందువల్ల వారు కూడా అసలు నాటకం చూసే అవకాశం ఉంటుంది.

గతంలో ఇంగ్లండులో కూడా అసలు నాటకానికి ముందు ప్రేక్షకుల కాలక్షేపం కోసం చిన్న ప్రహసనం లాంటిది ప్రదర్శించేవారు. దీనిని కర్టన్ రైజర్ (Curtain Raiser) అనేవారు. నేడు సినిమాలలో ఈ ప్రయోజనం సాధించడానికే అసలు సినిమా ప్రారంభానికి ముందు వార్తాచిత్రాలను చూపుతున్నారు. ఇపుడు పూర్వరంగ విధిని యథాతథంగా ప్రయోగించక పోయినా తెరలో రంగాన్ని సిద్ధం చేసుకోవడం, ప్రార్థనా గీతం లేక ప్రబోధ గీతం పాడడం, నాటకం పేరు, రచయిత పేరు, నటీనటుల పేర్లు ప్రకటించడం ద్వారా మరోరూపంలో ఈ పూర్వరంగాన్ని ప్రయోగిస్తూనే ఉన్నారు.

శ్రీ.చ.

పృథ్వీరాజ్ కపూర్ (1906-1972) : బంబాయి స్థిరనివాసం. అఖిల భారత ఖ్యాతి గడించిన రంగస్థల, సినీనటుడు, పృథ్వీ థియేటర్స్ అధినేత, ప్రయోక్త, పద్మశ్రీ బిరుదాంకితుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆంధ్ర నాటక కళా పరిషత్తు, సంగీత నాటక అకాడమీ, నాట్య సంఘ సన్మానితుడు.

పృథ్వీ థియేటర్స్ నాటక సంస్థను స్థాపించి, మామూలు నాటక సమాజంలా కాక నాటక విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాడు. అనేక మందిని మంచి నటులుగా తయారు చేశాడు. అభిజ్ఞాన శాకుంతలంలో దుష్యంత వేషంతో ఈతని కీర్తిచంద్రికలు వెల్లివిరిశాయి. పఠాన్, దీవార్, ఆహుతి, శకుంతల, కళాకార్ మొదలైన నాటకాలలో ప్రధాన భూమికలను ధరించి ప్రేక్షకులను ఆనందపరిచిన నటుడు.

1933లో చలనచిత్ర రంగంలో ప్రవేశించి, అనేక చిత్రాలలో కొడుకులతోనే గాక, మనుమలతో కూడా నటించి అఖండ ఖ్యాతి నార్జించాడు.

ఈయనకు 1972లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించారు గాని స్వయంగా స్వీకరించకుండానే స్వర్గస్థుడయ్యాడు. ఈయన నటనకు జకోస్లేవెకియా జాతీయ లలిత కళా అకాడమి బహుమతి లభించింది. పృథ్వీరాజ్ 1972, మే 29న దివంగతుడయ్యాడు.

శ్రీ.చ.

పెరుమాళ్ళు, సూరపనేని లక్ష్మీ (1916-1972) : రంగస్థల, సినీ నటుడు. హిందీ పండితుడు. ఈయన కృష్ణా జిల్లా ఉంగుటూరు గ్రామంలో 1916లో జన్మించాడు. భావోద్రేక పూరితమైన పాత్రలు నటించడంలో ప్రజ్ఞాశాలి. ఈయన మొట్టమొదట చంద్రమతి, విద్యాధరి పాత్రలలో నటించాడు.



కాశీ విద్యాపీఠంలో హిందీకోవిద చదువుకున్నాడు. వెల్దిపాడు గ్రామంలో కొంతకాలం హిందీ టీచరుగా పనిచేసి, నాటకాల మీద ఆసక్తితో ఉద్యోగానికి స్వస్తి చెప్పి ప్రజానాట్య మండలిలో చేరి, వివిధ పాత్రలు నేర్పుగా నటించి పేరు తెచ్చుకున్నాడు. మాభూమి, ముందడుగు, అపనింద నాటకాలలో అసమానంగా నటించాడు. 1947లో విజయవాడలో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు నాటక పోటీలలో ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నాడు. ప్రజా

నాట్యమండలి మూత పడడంతో, 1952లో తెలుగు సినిమారంగంలో ప్రవేశించి చాలా చిత్రాలలో నటించి పేరు గడించాడు. 1955లో మద్రాసు సినీ ఫాన్స్ అసోసియేషన్ ఈయనను రోజులు మారాయి చిత్రంలో ఉత్తమ సహాయ నటుడిగా ఎన్నిక చేసింది. 1972 లో నిర్యాణం చెందాడు.

శ్రీ.చ.

ప్రకరణం : సంస్కృత దశరూపక భేదం. ఇతి వృత్తం కల్పితం, సాంఘికం, ప్రధాన రసం శృంగారం. నాయకుడు ధీర శాంతుడు. మంత్రిగాని, విప్రుడు గాని, వణిజుడు గాని నాయకుడు. కులస్త్రీగాని, వేశ్యగాని, ఇరువురూ గాని నాయికలు. మంత్రి (కుమారుడు) నాయకుడుగా గల ప్రకరణం మాలతీ మాధవం. విప్రుడు నాయకుడుగా గల ప్రకరణం మృచ్ఛకటిక, వణిజుడు నాయకుడుగా గల ప్రకరణం పుష్పభూషితం.

నాయికను బట్టి ప్రకరణం మూడు విధాలు. శుద్ధం, వికృతం, సంకీర్ణం. కులస్త్రీ నాయికగా ప్రకరణం శుద్ధం. ఉదాహరణకు మాలతీ మాధవం. వేశ్య నాయికగా ప్రకరణం వికృతం లేదా ధూర్తం. ఉదాహరణకు తరంగ వృత్తం. కుల స్త్రీ, వేశ్య ఇద్దరూ నాయికలుగా గల ప్రకరణం సంకీర్ణం. ఉదాహరణకు మృచ్ఛకటిక. ఈ సంకీర్ణ ప్రకరణంలో ద్యూతకాలాది ధూర్త పాత్రలుండాలి.

ప్రకరణ లక్షణ విషయంలో సంస్కృత లాక్షణికులలో భిన్నాభిప్రాయాలున్నాయి. భరతముని మతంలో ప్రకరణంలో ఉదాత్త నాయకుడుగాని, దివ్య విషయం గాని, రాజ వైభవంగాని ఉండకూడదు. దాస, విట, వేశ్యలు ఎక్కువగాను, కుల స్త్రీలు తక్కువగాను ఉండాలి. మంత్రి, బ్రాహ్మణ, పురోహిత, శ్రేష్ఠి, సార్థవాహులలో ఎవరైనా నాయకులైతే వేశ్య ఉండరాదు. వేశ్య ఉంటే కుల స్త్రీ ఉండకూడదు. అంకాలు అయిదు నుండి పది వరకు ఉండవచ్చు.

భావప్రకాశనంలో కులజ సంస్కృతం, వేశ్య ప్రాకృతం మాట్లాడాలని అను శాసనం. కాని మాలతీ మాధవం లో నాయిక మాలతి ప్రాకృతంలో మాట్లాడుతుంది.

నాట్యదర్పణం ప్రకారం నాయకుడు ధీరశాంతుడే కానక్కర లేదు. ధీరోదాత్తుడు కూడా కావచ్చు. నాయికా నాయకులు తక్కువ కులంవారు ఉండవచ్చు. కైశికీవృత్తి ఎక్కువగా వాడకూడదు.

శృంగార ప్రకాశం ప్రకారం ప్రకరణంలో శుద్ధ విష్కంభం, విట, శకార, చేట, కుట్టుని మొదలైన పాత్రలు ఉండి తీరాలి. దశరూపకం ప్రకారం కులజ, వేశ్య కలుసు కోరాదు. ఉభయులూ నాయికలు కావచ్చు. ప్రకరణానికి సాధారణంగా నాయికా నాయకుల పేర్లు పెట్టడం ఆచారం. ఉదా: మాలతీ మాధవం, మల్లికా మారుతం. నాయిక పేరుతో కూడా ప్రకరణం కనిపిస్తున్నది. ఉదా: చింతామణి (తెలుగు)

శ్రీ.చ.

ప్రకరణి : సంస్కృత ఉత్పన్న రూపకం. కొందరు దీనిని ఉపరూపకంగా పరిగణించారు. దీనికి ప్రకరణిక అని కూడా పేరు.

నాట్యదర్పణం మతంలో ఇది నాటికా భేదం. నాటికలో ప్రభువుల ప్రేమ ప్రకరణిలో వణిక్కుల ప్రేమ ఉంటుంది. నాయకులు సార్థవాహ, పురోహితామాత్యులలో ఒకరు. నాయిక వారితో సమానమైన వంశంలో పుట్టి ఉండాలి.

శ్రీ.చ.

ప్రకరి : ప్రాసంగికేతి వృత్త భేదం. నాటకం మధ్యలో వచ్చి కొద్ది దూరం సాగి తన పనిని నిర్వర్తించుకొని తద్వారా ప్రధానకథకు సహాయపడి మధ్యలో అంతమయ్యే అవాంతర కథ ప్రకరి.

ముద్రారాక్షసం లోని నగల పెట్టెకథ ప్రకరి. ఇది నాటకం మధ్యలో వచ్చికొద్ది దూరమే సాగిమధ్యలోనే ముగుస్తుంది. దీని ఆశయం మలయకేతు, మంత్రి రాక్షసులకు మిత్రభేదం కల్పించడం. ఈ కథ తన ఆశయం నెరవేర్చుకొని తన ద్వారా చంద్రగుప్త మంత్రి రాక్షసుల సన్నిహితత్వానికి మార్గం ఏర్పరచి ప్రధాన కథకు తోడ్పడుతుంది. నాయకుని (చంద్రగుప్తుని) ప్రయోజనం సిద్ధిస్తుంది. అభిజ్ఞాన శాకుంతలంలో అంగుళీయక వృత్తాంతం ప్రకరి. ఈ వృత్తాంతం నాటకం మధ్యలో వచ్చి దుర్వాస శాప విమోచన మనే ఆశయం నెరవేర్చుకొని, దుష్యంతునికి శకుంతలను జ్ఞప్తికి తేవడం ద్వారా ప్రధాన కథకు తోడ్పడి మధ్యలోనే ముగుస్తుంది.

అయితే నాయకేతరుడు గాక నాయకుడే స్వయంగా నిర్వర్తించిన ప్రకరి సంస్కృతాంధ్ర నాటకాలలో కన్పిస్తున్నది. ఉత్తర రామచరిత లో శంభూక వధ, చిత్ర నళీయం లో కర్కోటక వృత్తాంతం, మహావీర చరిత్ర లో వాలి వధ దీనికి ఉదాహరణలు.

శ్రీ.చ.

ప్రకాశం : నాట్యోక్తి. దీనిని సర్వశ్రావ్యం (ద.రూ. 1-64) అంటారు. పైకి, బిగ్గరగా అని కూడా అంటారు. అంటే అందరూ వినదగినది, అందరికీ వినిపించేటట్టు బిగ్గరగా చదవవలసినది లేదా చెప్పవలసినది. ఇది వాచిక చిత్రాభినయ భేదం.

సామాన్యంగా పాత్ర స్వగతం (ఆత్మ గతం, తనలో, మనస్సులో) గాని జనాంతికంగాని పూర్తయిన తరువాత ఆపైది అందరికీ వినిపించేట్టు బిగ్గరగా అనవలసినదని సూచనగా కుండలీకరణంలో (ప్రకాశంగా), బిగ్గరగా అని నాటక రచయితలు రాస్తుంటారు.

జనాంతికం తరువాత ప్రకాశం. వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన బబ్బిలి యుద్ధం నాటక ప్రారంభంలో –

ఉదా. విజయరామరాజు – (జనాంతికము) బళిబళి అప్పన్నా నీవోయి మమ్ము గొలువనేర్చిన వాడవు! మంచిది, వీరి యొద్దికంగనియెదగాక (ప్రకాశము) ఎవరురా మీరు? ఏల మాప్రోల నిట్లు మొఱయిడెదరు?

శ్రీ.చ.

ప్రకాశం పంతులు, టంగుటూరి (1872-1957) : నటుడు, న్యాయవాది, రాజకీయ నాయకుడు. ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, హిందూ నాటక సమాజం (రాజమండ్రి) సభ్యుడు. ప్రకాశం జీవిత మార్గాన్ని తీర్చిదిద్దిన వ్యక్తి-ఇమ్మానేని హనుమంతరావు నాయుడు.



1872, ఆగస్టు 23 తేదీన కనపర్తి గ్రామంలో సుబ్బమ్మ గోపాలకృష్ణయ్య దంపతులకు జన్మించాడు. వీరి పూర్వుల స్వగ్రామం ఒంగోలు తాలూకా టంగుటూరు. వల్లూరులో వెంకటప్పయ్య వీధి బడిలోను, ఆ తరువాత అద్దంకిలో పెద్దబావ పోరూరి నరసింహం వద్ద, తరువాత నాయుడుపేట ఇంగ్లీషు స్కూలులోను విద్యను అభ్యసించాడు. 1884లో తండ్రి గోపాలకృష్ణయ్య ఆకస్మిక మరణం ప్రకాశం స్థితిలో మార్పు వచ్చింది. తల్లి సుబ్బమ్మ ఒంగోలులో పూటకూళ్ళు నిర్వహించి పిల్లల భవిష్యత్తు కై పాటుపడినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంలోనే పంతులు నాటకాల పై మనసు పడి, ఇమ్మా నేని హనుమంతరావుకి అభిమాన పాత్రుడయ్యాడు. హనుమంతరావు ఉద్యోగరీత్యా1885లో రాజమండ్రికి సకుటుంబంగా వెళ్లడంతో ప్రకాశం కూడా వెళ్ళాడు. 13వ ఏటనే పంతులు ధార్వాడ నాటకాలు చూసి, మురిసి నాటకాలలో ప్రవేశించాడు.

రాజమండ్రిలో నాయుడు స్థాపించిన హిందూ నాటక సమాజంలో చిలకమూర్తి నాటకకర్త, నాయుడుతో పాటు ప్రకాశం పంతులు నటుడు. 1894 వరకు ఆ సమాజం వర్ధిల్లింది. ప్రకాశం పంతులు చాలా వరకు స్త్రీ పాత్రలలో నటించాడు. *కీచకవధలో* ద్రౌపది, *గయోపాఖ్యానంలో* చిత్రరేఖ, పారిజాతాపహరణంలో సత్యభామ, నల నాటకంలో దమయంతి మొదలైన పాత్రలలో నటించాడు. *గయోపాఖ్యానం* లో అర్జునుడు, ద్రౌపదీ పరిణయంలో అర్జునుడు, శ్రీరామ జననంలో దశరథుడు మొదలైన పురుష పాత్రల్లోను నటించి మెప్పుపొందాడు. సమాజంలో సభ్యుడైన చిలకమూర్తి ప్రకాశం నటనను మెచ్చుకొంటూ, 'ప్రకాశము గారు నాటకములోనే రసమునభినయించినను మిక్కిలి సొగసుగా నటించేవారు. కరుణ రసమునకు, వీరరసమునకు వీరు పెట్టినది పేరు' అనేవాడు. ఈ నాటకాలలో స్త్రీ పాత్ర నిర్వహణకు ప్రజలు ముగ్ధులయ్యేవారట. శ్యామసుందర రాజు అనే ఒరిస్సా పౌరుడు ప్రకాశం నటనకు మెచ్చి 'స్టార్ ఆఫ్ ది స్టేజ్' (రంగస్థల తార) బిరుదునిచ్చాడు. రాజమండ్రిలోనే గాక ఇతర ప్రదేశాల్లోను ప్రదర్శించిన నాటకాలలో నటించాడు.

ఈ నాటకాల సందడిలో 1887లో మెట్రిక్యులేషన్ పరీక్ష తప్పాడు. 1889లో దీక్షతో చదివి పాసయ్యాడు. 1890లో జానకమ్మతో వివాహమైంది. 1891లో పంతులు ఎఫ్.ఏ. పాసయ్యాడు. తరువాత మద్రాసులో సెకండరీ గ్రేడు ప్లీడర్ పట్టాను పొందాడు. 1894లో రాజమండ్రిలో ప్రాక్టీసు ప్రారంభించిన తరువాత నాటకాలకు స్వస్తి పలికాడు.

ప్రకాశం పంతులు ఆరోజులలోనే బాగా డబ్బు గడించే ప్లీడర్ వృత్తిని వదులుకొని మహాత్మాగాంధీ పిలుపునందుకొని దేశ స్వాతంత్ర్యం కోసం జాతీయోద్యమంలో చేరాడు. సైమన్ కమిషన్ గోబ్యాక్ అంటూ తెల్ల దొరల తుపాకీగుళ్లకు గుండెలు చూపిన ధైర్యశాలి పంతులు. తదనంతరం ఆంధ్ర రాష్ట్రముఖ్యమంత్రిగా ఎంతో సేవచేసిన మహనీయుడు. రాజకీయంగానే గాక నాటకరంగానికి విశేష సేవ చేసిన ప్రకాశం 1957, మే 20వ తేదీన మరణించాడు.

శ్రీ.చ.

ప్రతాపరుద్ర యశోభూషణం : సంస్కృత అలంకార శాస్త్రం. దీనిని ప్రతాపరుద్రీయమని కూడా అంటారు. ఈ గ్రంథాన్ని విద్యానాథ కవి. క్రీ.శ 1275-1325 ప్రాంతంలో రచించాడు. ఇందులో ప్రకరణాలు తొమ్మిది. నాయక ప్రకరణం, కావ్య ప్రకరణం, నాటక ప్రకరణం, రస ప్రకరణం, దోష ప్రకరణం, గుణ ప్రకరణం, శబ్దాలంకార ప్రకరణం, అర్థాలంకార ప్రకరణం, మిశ్రాలంకార ప్రకరణం. ఈ తొమ్మిది ప్రకరణాలు గ్రంథం కారికలు, వృత్తి ఉదాహరణ శ్లోకాలు అని మూడు భాగాలు. ఇందులో మొత్తం కారికలు 330. ఉదాహరణ శ్లోకాలు 590.

ఉదాహరణ శ్లోకాలు ఇతర కవుల రచనల నుంచి గాక ప్రతాపరుద్రుని పరంగా స్వయంగా రచించడం, సర్వలక్షణయుతంగా ప్రతాపరుద్ర కల్యాణ మనే నాటకం రచించి ఈ లక్షణ గ్రంథంలో చొప్పించడం గ్రంథంలోని విశిష్టత. ఈ గ్రంథంలోని మూడవ ప్రకరణం నాటక ప్రకరణం. దశ రూపకాది నాటక లక్షణ గ్రంథాలలో లాగానే నాటక స్వరూప నిర్వచనంతో ప్రారంభమై రచన సాగింది. ఈ సంస్కృతాలంకారిక గ్రంథానికి రత్నాపణం, రత్నశాణం అనే వ్యాఖ్యలు వెలువడ్డాయి.

అనుసరణాలు - అనువాదాలు : ఈ ప్రతాపరుద్రీయ లక్షణ గ్రంథానికి సంస్కృతంలో ఒకటి, తెలుగులో ఒకటి అనుసరణాలున్నాయి. సంస్కృతానుసరణ సుష్మకృష్ణ యజ్వ రచించిన అలంకార ముక్తావళి. దీనికి నృసింహ భూపాలీయమని పేరు. తెలుగుదేశంలో దీనికి సంస్కృత నరసభూపాలీయమని వ్యవహారనామం. ఆంధ్ర నరసభూపాలీయం భట్టుమూర్తి విరచితం. ఇవి గాక ప్రతాపరుద్రీయసారమనే పేరుతో చేట్లూరి నారాయణాచార్యులు సంస్కృతంలో రచించినట్లు తెలుస్తోంది.

ఇక తెలుగు అనువాదాలలో మొట్ట మొదటిది ఆంధ్ర ప్రతాపరుద్రీయం. అనువాద కర్త గణపవరపు వేంకట కవి. ద్వితీయానువాదం చెలమచర్ల రంగాచార్యుల అనువాదం (1944). రుచిర అనే సమీక్షతో ద్వితీయ ముద్రణ 1961లో వెలువడింది. ఇందులో మూల శ్లోకాలకు పద్యానువాదాలే గాక ఆయా విషయాల మీద వివిధ లాక్షణిక మతాలను వివరించడం, వ్యాఖ్యానించడం జరిగింది. ప్రతాపరుద్ర కల్యాణం అనే నాటకానికి కూడా అంధ్రానువాదం ఇందులో పొందుపరచడం ఇంకో విశేషం.

మూడవది జమ్ములమడక మాధవరాయశర్మ అనువాదం (1946). ఇందులో మూల శ్లోకాలకు పద్యానువాదం లేదు. ఇది వ్యాఖ్యాన ప్రాయమైన అనువాదం. ప్రతాపరుద్ర కల్యాణ ఉదాహరణ నాటకం అనువాదం లేదు.

శ్రీ.చ.

ప్రతాప రెడ్డి, సురవరం (1896-1953) : నాటక కర్త, కవి, కథకుడు, సద్విమర్శకుడు, ఆంధ్ర సారస్వత పరిషత్తు సంస్థాపకుడు. ఆంధ్ర మహాసభ ప్రథమ అధ్యక్షుడు, గోలకొండ పత్రిక సంస్థాపకుడు, సంపాదకుడు. తెలంగాణ అభివృద్ధికి పాటుపడిన మహనీయుడు. ఈయన రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర (1949) పరిశోధనా గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఉపనిషత్తులలో, తర్క శాస్త్రంలో పండితుడు. ఈయన ఇతర సాహిత్య ప్రక్రియలతో పాటు నాటక ప్రక్రియను కూడా చేపట్టి ఉత్తమ నాటకాలు రచించాడు. ఉచ్ఛల విషాదం (1933) తెలుగులోని ఉత్తమ రూపకాలలో ఒకటి. ఈయన రాసిన మరో నాటకం భక్త తుకారం (1952).



సామాజిక, సాహిత్య రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకొన్న సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగస్టు 25న మరణించాడు.

శ్రీ.చ.

ప్రతి కరాళ రూపకం : దీనిని కృత్రిమ కరాళ రూపకమని కూడా అంటారు. దీనిని అసలు కరాళ రూపక ప్రదర్శనానికి ముందుగా ప్రదర్శిస్తారు. విపరీతమైన హాస్యం ఈ రూపక ప్రధాన లక్షణం.

ఇది కరాళ రూపకానికి స్వర్గం ముందు నరకం, ప్రశాంతత ముందు నౌకాభంగం లాంటిది. ఈ రకం రూపకాలను ఇంగ్లిషులో ఎక్కువగా రచించి ప్రచారంలోకి తెచ్చినవాడు బెన్ జాన్సన్ (1570-1637). ఈ కరాళ రూపకంలో సంగీతం ఎక్కువైన తరువాత కరాళ రూపకం, ప్రతికరాళ రూపకం అనే భేదం ఏర్పడి, ప్రతికరాళ రూపకం హాస్య మూకాభినయ రూపకంగా రూపొందింది.

శ్రీ.చ.

ప్రతి ముఖ సంధి : పంచ సంధులలో రెండవది. అర్థ ప్రకృతులలోని రెండవ ప్రకృతి బిందువును, కార్యావస్థలలోని రెండవ అవస్థ, యత్నాన్ని అనుసంధించే లేక కలిపే కథా భాగం ప్రతిముఖ సంధి.

అవాంతర కథ వల్ల బీజం కనుమరుగైనపుడు లేక అంతరాయం కలిగినపుడు దానిని బహిర్గతం చేసేది బిందువు. ఇది బీజస్థానీయం. కార్య సాధనారంభాన్ని కొనసాగించేది యత్నం. ఈ రెంటిని అనుసంధించేది ప్రతిముఖ సంధి. ముఖసంధిలోని కథాబీజాన్ని ముందుకు తీసుకుపోతుంది. ఇందులో ఆరంభం యత్నంగా పరిణమిస్తుంది. బిందువు యత్నానికి హేతువు లేక ప్రేరకమవుతుంది. లేక మార్గదర్శకమవుతుంది. ఈ కథా భాగంలో మరుగైన బీజం మరల స్పష్టమవుతుంది.

ముఖసంధియందు నిష్పన్నమై ఉన్న బీజము అవాంతర కారణములచే మరుగుపడినప్పుడు ఆ బీజము మరల ఉద్ఘాటితము (సుస్పష్టము) చేయబడినచో, ఆ కథా భాగము ప్రతిముఖసంధి అనబడును. ముఖ సంధిలో కన్పట్టిన బీజము విరోధి సన్నిధానముచే నష్టమైనట్లు మరుగు పడియుండును. అప్పుడు, మట్టిపెల్లను తొలగించినచో క్రింద నుండు బీజాంకురము బైటకు వచ్చినట్లుగా ఇందు బీజము స్పష్టముగా కనిపించును (నా.శా., పుట-567, పో.శ్రీ.అ.రా.)

ఈ ప్రతిముఖ సంధికి అంగాలు పదమూడు. విలాసం, పరిసర్పం, విధూతం, శమం, నర్మం, నర్మద్యుతి, ప్రగమనం, నిరోధం, పర్యుపాసనం, పుష్పం, వజ్రం, ఉపన్యాసం, వర్ణసంహారం.

శ్రీ.చ.

ప్రతీక వాదం : దీనికే సాంకేతిక వాదమని మరొక పేరు. ఇంగ్లిషులో సింబాలిజమ్ (symbolism) అంటారు. వాస్తవికత, స్వాభావిక వాదాలకు వ్యతిరేకంగా బయలుదేరిన వాదం.

జీవిత రూపానికి లేక తత్త్వానికి, అనుభూతికి, భావోద్రేకానికి ప్రాధాన్యమీయడం, ఆ తత్త్వాన్ని సంకేతాల ద్వారా వ్యక్తం చేయడం ఈ వాద ప్రధాన లక్షణాలు. ఈ రకం నాటకాలలోని పాత్రలకు స్వంత వ్యక్తిత్వమంటూ ఉండదు. అవి రచయిత అంతర జీవితానికి ప్రతీకలు. ఈ రీతి నాటకాలలో నాటకీయత ఎక్కువగా గోచరిస్తుంది. కార్య కారణ సంబంధాన్ని అంగీకరించకుండా అనుభూతికే ప్రధాన స్థానం ఈ వాదంలో గోచరిస్తుంది.

ఈ రీతి నాటక కర్తలు వాస్తవిక జీనితాన్ని తమ నాటకాలకు ఇతివృత్తంగా తీసుకోకుండా గత కాల గాథలను తీసుకొని వాటి ద్వారా సార్వజనీన, విశ్వజనీన సత్యాన్ని ద్యోతకం చేయడం ఆశయంగా పెట్టుకున్నారు. ఎలిజబెత్ కాలం నాడు ఇంగ్లిషు నాటకరంగంలో దర్బారుకు సాంకేతికంగా సింహాసనం వేయడం, యుద్ధ భూమికి ప్రతీకగా గుడారం, అడవికి చిహ్నంగా చెట్టు బమ్మవాడడం, ఈ ప్రతీక వాదానికి పూర్వ రంగం. ఈ ప్రతీక వాదానికి మూల పురుషుడు మేటర్ లింక్. పెలియాస్ అండ్ మెలిషాండ్, వెల్ ఆఫ్ ది సెయింట్ ప్రతీక రూపకాలకు మచ్చుతునకలు.

శ్రీ.చ.

ప్రతీకారం : ప్రతీకారమంటే ప్రతికృతి. పగ, పరాభవాదులు చేసిన వ్యక్తి మీద పగ తీర్చుకోవడం ప్రతీకారం. ఈ ప్రతీకారం ఇతి వృత్తంగా నిర్మించిన నాటకాలను ప్రతీకార నాటకాలంటారు. ఇంగ్లిషులో కిడ్ రచించిన స్పానిష్ ట్రాజెడీ తెలుగులో పానుగంటి రచించిన పూర్ణిమ నాటకం దీనికి మచ్చుతునకలు.

శ్రీ.చ.

ప్రత్యభినయం : అభినయ భేదం. నటుని అభినయానికి పక్కనటుని ప్రతి స్పందనే ప్రత్యభినయం. తనకు వాచికం లేదు గదా అని కొయ్యబమ్మలాగా నిలుచోకూడదు. పక్క పాత్ర అభినయ ప్రభావం వల్ల తనలో రేగే భావాలను ద్యోతకం చేయాలి లేక పోతే వాచికం చెప్పే పక్క పాత్ర అభినయం నిష్ప్రయోజన మయిపోతుంది. ప్రేక్షకులకు భ్రాంతి కలగదు.

శ్రీ.చ.

ప్రదీప్ కువమార్ (జ.1952) : రంగస్థల నటుడు, అధ్యాపకుడు, దర్శకుడు, నాటక రచయిత. ఈయన 1952, జూన్ 10న కములాబాయి, బహదూర్ దంపతులకు జన్మించాడు. సురభి కళాకారుల నాటక ప్రదర్శనలు చూసి నాటకరంగం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఈయన హిందీలో ఎం.ఎ పూర్తి చేసి నిజాం కళాశాలలో డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ చేశాడు. ఆ తరువాత పిహెచ్.డి. పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హిందీ విభాగంలో ఆచార్యులుగా హిందీ నాటకాలు రచించి ప్రదర్శించాడు. ప్రముఖ పాత్రల్లో నటించాడు. కొంతకాలం నిజాం కళాశాలలోని రంగస్థల కళల శాఖకు అధిపతిగా పనిచేశాడు. రంగస్థల కళలకు సంబంధించిన దృశ్య, కాంతి పరికల్పనల పట్ల మక్కువ ఎక్కువ. ఈయన ఆషాఢ్ కా ఏక్ దిన్, లెహరోంకే రాజహంస్, చంద్రగుప్త, అలెగ్జాండర్ మొదలైన హిందీ నాటకాలతో పాటు నాట్య మయూరి, అల్లూరి సీతారామరాజు, అతిథి దేవుళ్లస్తున్నారు, చరిత్రకందని కథ, క్రాంతి, భాగ్యనగరం వంటి నాటకాలకు దర్శకత్వం వహించాడు. నాటక రచయితగా హిందీలో నారీ కే ఆవాజ్, సతి, నుక్కడ్, తెలుగులో నాట్య మయూరి, లాటరి చిన్నోడు, చరిత్రకందని కథ, క్రాంతి మొదలైన రచనలు చేశాడు.



నటుడిగా ఆషాఢ్ కా ఏక్ దిన్, లెహరోంకె రాజ్‌హంస్, ఆధే ఆధూరే, శాకుంతలమ్, మృచ్ఛకటక్, ఔరంగజేబ్‌కె ఆఖరీ రాత్, అలెగ్జాండర్, బాలనాగమ్మ, రుద్రవీణ, అల్లూరి సీతారామరాజు, క్రాంతి, కాకి బంగారం, డామిట్ కథ అడ్డం తిరిగింది మొదలైన హిందీ, తెలుగు నాటకాలలో నటించాడు. కేంద్ర గేయ నాటక విభాగం, హైదరాబాద్ శాఖ రూపొందించిన భారతరత్న ఇందిరమ్మ రూపకంలో నెహ్రూగా నటించాడు. ఈ రూపకం రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శింపబడింది. ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని నిజాం కళాశాలలోని రంగస్థకళలశాఖలో అధిపతిగా పనిచేసి 2006లో పదవీ విరమణ చేశారు.

దాసరి.ఎన్

ప్రపంచ నాటకరంగ ధోరణులు –చారిత్రక నేపథ్యం : రచన: కప్పగంతుల మల్లికార్జున రావు, ప్రచురణ కాలం 2001. చారిత్రక నేపథ్యంతో నాటకరంగచరిత్ర, ధోరణులను, వాస్తవిక దృష్టితో తెలుగులో వెలువడిన గ్రంథాలలో ఇదే మొదటిది. 14 అధ్యాయాలు గల ఈ పుస్తకంలో గ్రీకు నాటకరంగం, ఐరోపాలో ఆధునిక యుగారంభం, షేక్స్పియర్, మోలియర్ అధిక్షేపాత్మక నాటకాలు, అత్యాధునిక నాటకరంగానికి తెరతీసిన ఇబ్సన్, వాస్తవికతా వాదం, రష్యాలో చెకోవ్, ఇంగ్లాండులో జార్జ్ బెర్నార్డ్‌షా, రియలిజం వ్యతిరేక ధోరణులు – నేచురలిజం, సింబాలిజం, ఎక్స్‌ప్రెషనిజం, బ్రెష్ట్ ఎపిక్‌థియేటర్, రెండవ ప్రపంచయుద్ధా

నంతర నాటక ధోరణులు – అమెరికాలో నియోరియలిజం, ఫ్రాన్స్‌లో అబ్సర్డిజం, **1960** తరువాత ప్రపంచ నాటక ధోరణులు, జర్మనీలో డాక్యుమెంటరీ డ్రామా, అమెరికాలో **1960** తరువాత నాటకరంగం – వివిధ ధోరణులు అనే అంశాలను వివిధ అధ్యాయాలలో విపులీకరించాడు.

గం.సు.రె.

ప్రభాకర్, గొల్లాపిన్ని (జ.1935) : రంగస్థల హాస్య నటుడు. అభ్యుదయ కళాసమితి సభ్యుడు. ఈయన కర్నాటక రాష్ట్రంలోని రాయచూరు సమీపంలోని అల్కూర గ్రామంలో **1935**, జులై **1**న జన్మించాడు. తల్లిదండ్రులు చెల్లమ్మ, బిందుశాస్త్రిలు.

వృత్తిరీత్యా కర్నూలు జిల్లా న్యాయాధికారి కార్యాలయంలో ఉద్యోగం చేశాడు. అభ్యుదయ కళా సమితి స్థాపకులలో ఒకరైన కోదండ రామయ్య పరిచయంతో ప్రభాకర్‌నటన వైపు ఆకర్షితుడయ్యాడు. అభ్యుదయ కళాసమితి తరుపున ఇన్‌స్పెక్టర్ జనరల్ నాటకంలో మేజిస్ట్రేట్ పాత్రలో మొట్టమొదటి సారిగా నటించాడు. ఈ సవాజం పక్షాన రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించిన సాంఘిక, పౌరాణిక, చారిత్రక నాటకాలలో హాస్య పాత్రలలో నటించాడు. **1978**లో కడపలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీలలో సంఘం చెక్కిన శిల్పం నాటకంలో బావ పాత్రతో ద్వితీయఉత్తమ హాస్య ప్రతినాయకుడు అవార్డును అందుకున్నాడు. **1981**లో కళారాజ్యం హైదరాబాదు, **1991**లో లలిత కళాపరిషత్తు నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీలలో యథా ప్రజా తథా రాజా లో బంట్రోతు, పుట్టుక్క *జరజర డబుక్కుమే* లో చాకలి పాత్రలకు ఉత్తమ హాస్యనటుడు అవార్డులు అందుకున్నాడు. ఉత్తమ హాస్య నటుడుగా పేరు తెచ్చుకొన్న ప్రభాకర్‌కు పెళ్ళిచూపులు లో పిచ్చోడు, బొబ్బిలి యుద్ధంలో హాసన్ అలీ అభిమాన పాత్రలు. మూడు దశాబ్దాల పాటు కళారాధకులకు ఉత్తమ హాస్యాన్ని అందించిన నటుడు గొల్లా పిన్ని ప్రభాకర్. నాటకరంగంలో తనకున్న అను బంధాన్ని ఇప్పటికీ పదిలంగా కాపాడుకొంటున్న కళాహృదయుడు.

దాసరి, ఎన్.

ప్రయత్నం : ఎవరైనా ఏదైనా ఒకఫలం సాధించడానికి పూనుకొని, దానిని ఫలం సిద్ధించేవరకు కొనసాగిస్తే ఆ కార్యాచరణలో ముఖ్యంగా ఐదు అవస్థలు మనకు గోచరిస్తాయి. అవి, ప్రారంభం, ప్రయత్నం, ప్రాప్తి సంభవం (ప్రాప్త్యాశ) లేదా టర్నింగ్ పాయింట్, నియతఫలప్రాప్తి, ప్రయోగం అనేవి. కార్యసాధన కోసం ప్రయత్నించడమే 'ప్రయత్నం' కార్యావస్థల్లో ఈ ప్రయత్నం అతి ప్రధానమైంది.

శ్రీ.చ.

ప్రయోక్త : నాటకం ప్రయోగించే వ్యక్తి ప్రయోక్త. అంటే నాటకం ఎన్నిక నుంచి ప్రదర్శన వరకు సక్రమంగా నడిపించే వ్యక్తి.

నాటక ప్రదర్శన విజయం నాటకకర్త, నటుడు, ఆహార్యకారుడు, దీపకారుడు మొదలైన వ్యక్తుల సమిష్టి కృషి మీద ఆధారపడిందే గాని ఏ ఒక వ్యక్తి మీద ఆధారపడి కాదు. విభిన్న వ్యక్తులందరినీ ఏకోన్ముఖులను చేసి సమిష్టికృషి చేయించడమే ప్రయోక్త ప్రధాన కర్తవ్యం. నాటక ప్రదర్శనానికి సంబంధించి వివిధ శాఖలలో సామర్థ్యం ఉండడమే గాక వాటన్నిటినీ సమన్వయించగల శక్తి కూడా ప్రయోక్తకు అవసరం.

ప్రయోక్త తన భావాల కోసం నాటకాన్ని, నటులను తలకిందులు చేయకూడదు. నటుల కోసం నాటక భావాన్ని కాని, నాటక భావం కోసం నటులను కాని మార్చడానికి యత్నించరాదు. నాటకకర్త రాసిన మాటలకు ప్రాణం పోసి రంగస్థలానికి ఎక్కించాలే కాని నూతన సృష్టికి పూనుకోకూడదు. అయితే నటీ నటుల లోటు పాట్లు, శక్తి సామర్థ్యాలు మొదలైనవి దృష్టిలో పెట్టుకొని ప్రదర్శన విజయవంతం కావడానికి అవసరమైనంత వరకూ కొద్దిపాటి మార్పులు చేయవచ్చు. నాటకాంతరార్థం నటీనటులకు నాటక కర్త అందచేయలేక పోవచ్చు, వారి చేత వ్యాఖ్యానించలేకపోవచ్చు. అందువల్ల నాటక కర్తకు, నటీనటులకు మధ్య అనుసంధాన కర్త ప్రయోక్త. ఈ ప్రయోక్త నాటకం రాత ప్రతిని కాని, అచ్చుప్రతిని తీసుకొని చదివేటపుడు విమర్శకుడు, ప్రేక్షకుడు. ఊహా ప్రపంచంలోని నాటక ప్రయోగానికి ప్రయోక్తే ప్రప్రథమ ప్రేక్షకుడు. అతని ప్రప్రథమ భావాలు నాటక ప్రదర్శన చూచే విమర్శకుని ప్రప్రథమ భావాల కంటే ముఖ్యమైనవి. ప్రయోక్త ప్రయోగ స్రష్ట అయి ఉండాలి.

రాతప్రతి నుంచి పూర్తి ప్రదర్శన వరకు జరిగే కార్యకలాపాలకు ప్రయోక్తే బాధ్యత వహించవలసి ఉంటుంది. అందుకని పాత్రలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి సమర్థవంతంగా నిర్వహించగలవారికి పాత్రలు పంచాలి. ఆ తరువాత ఒక్కొక్క రంగాన్ని బహుజాగ్రత్తగా పరిశీలించి, ఆ రంగం పరిమాణాలు, ప్రవేశ నిష్క్రమణాలు ముందుగా నిర్దేశించుకోవాలి. రంగస్థలం

మీద పాత్రలు ఉపయోగించవలసిన వస్తువుల జాబితా తయారుచేసి రంగస్థల దర్శకునికి అందచేయాలి. పాత్రల ఆహార్యం, దుస్తులు ముందుగానే ఊహించి నిర్ణయించుకోవాలి. నాటక ప్రయోగం ఆసాంతం జీవ కళతో ఉట్టిపడేటట్టు ప్రయోక్త చూసుకోవాలి. సాధన (రిహార్సల్స్) సమయంలోనే కాదు ప్రతి విషయంలోను ప్రయోక్తే తుది నిర్ణయం తీసుకోవాలి. అయితే, నటీ నటుల సూచనలను అహంభావంతో త్రోసి వేయకుండా పరిశీలించాలి. నాటకకర్త భావాన్ని వ్యక్తీకరించడం మాత్రమే ప్రయోక్త లక్ష్యం కాదు. ప్రయోక్త మనసులోని చిత్రాన్ని రంగస్థలం మీద తిరిగి సృజించడమే లక్ష్యం కావాలి.

ఇంతకీ ప్రయోక్త ఎవరయితే ప్రయోగం ఎక్కువగా రాణిస్తుంది. రచయితా? నటుడా? మరో వ్యక్తా? అయితే రంగస్థలానుభవం, నటనా పరిజ్ఞానం లేని నాటకకర్త ప్రయోగం ఆచరణయోగ్యంగా ఉండకపోవచ్చు. రంగస్థలానుభవం లేని రచయిత ప్రయోక్తయితే నటనకు అడ్డంకులు తెచ్చి పెట్టవచ్చు. ప్రయోగంవిజయవంతంకావాలంటే రచయితకు రంగస్థలానుభవం ఉండితీరాలి.

ఇక నటుడికి రంగస్థలానుభవం, నటనానుభవం ఉంటుంది కాబట్టి ప్రయోక్తగా రచయిత కంటే ఎక్కువగా రాణించగలుగుతాడు. అయితే నటన, ప్రయోక్తత్వం రెంటినీ నిర్వహించేటపుడు ఏదో ఒకటి దెబ్బతినే ప్రమాదం ఉంది. విభిన్నత్వాన్ని వ్యక్తీకరించలేరు. విభిన్న స్వభావాలకు, వయసులకు చెందిన పాత్రలు ధరించేనటులు ప్రయోక్తలుగా రాణించే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రయోక్త నాటకకర్తకు వ్యాఖ్యాత. కాబట్టి రచయిత భావాలను, ఆశయాలను పూర్తిగా అర్థం చేసుకుని ప్రయోగానికి సిద్ధపడాలి. ప్రదర్శన చూసి ప్రేక్షకులు ఆనందించేట్లు చూడాలి.

ప్రయోక్త బహుముఖ ప్రజ్ఞాశాలి కావాలి. సాహిత్య జ్ఞానం, ప్రపంచజ్ఞానం, విభిన్న తత్వాలు గల వారితో కలసి మెలిగే నేర్పు, స్వర జ్ఞానం, దృశ్య చిత్రణా ప్రతిభ, శిల్ప, చిత్రలేఖన, వాస్తు పరిజ్ఞానం, పాలనా దక్షత, ఆదర్శ ప్రాయత, నిష్కామ దృష్టి, నటన కళా పరిజ్ఞానం, కాంతి ప్రదీపనా పరిజ్ఞానం, ఆహార్య పరిజ్ఞానం, చరిత్ర పరిజ్ఞానం కలిగి ఉండాలి

శ్రీ.చ.

ప్రయోజనం : ప్రయోజనం లేని పని ఏదీ చేయరాదు. అనేది నాటకరంగ సూత్రాలలో ముఖ్యమైనదీ, ప్రాచీనమైనదీ. దీనిని ఇంకావిస్తరించి సాంకేతిక ప్రయోజనం, పాత్ర ప్రయోజనం నెరవేర్చని పని ఏదీ చేయరాదు అనడం సబబు. వైవిధ్యం, ప్రాధాన్యం,నిర్మాణం, సాంకేతిక సంచాలనం, సంచాలనకు ముందు ముందు సంసిద్ధం కావడం సాంకేతిక ప్రయోజనం. పాత్ర ప్రయోజనం సంబంధ బాంధవ్యాల నుంచి జనించే ప్రయోజనం. సాంకేతిక కారణాల వల్ల సంచాలనం అనవసరమైన, అవసరమైన సంబంధ బాంధవ్య ప్రయోజనం లేనప్పుడు దానిని సృజించుకోవాలి.

సాంకేతిక ప్రయోజనంలేని పని చేయవలసి వస్తే ప్రేక్షకుల దృష్టికి రాకుండా, హడావిడి లేకుండా ఆపని చేస్తే చిక్కు తీరుతుంది. దీనినే రహస్యం (steal) అంటారు. ఇది అవాంఛనీయమైనా, ఒక్కొక్కప్పుడు తప్పనిసరి అవుతుంది.

శ్రీ.చ.

ప్రవాసం : విప్రయోగ (విప్రలంభ) శృంగార భేదం. ప్రవాసమంటే పరదేశ వాసం.

మొదట కలుసుకొన్న ప్రేయసీ ప్రియులకు పర దేశవాసం వల్ల కలిగిన ఎడబాటు (వియోగం) ప్రవాసం.

ఉదాహరణకు అభిజ్ఞానశాకుంతలంలో భూలోకంలో దుష్యంతుడు, దేవలోకంలో శకుంతల నివసించడం. చిత్రనళీయం లో అయోధ్యలో నరుడు, భీమపురిలో దమయంతి నివసించడం ప్రవాసం.

ఈ ప్రవాసం కారణ రీత్యా మూడు విధాలు: 1. కార్యజం, 2. సంభ్రమజం, 3. శాపజం.

1. కార్యజం : ధర్మాన్ని,అర్థాన్ని సంగ్రహించే బుద్ధి పూర్వక వ్యాపారం కార్యం. ఇది బుద్ధి పూర్వక వ్యాపారం కాబట్టే లాక్షణికులు దీనిని 'బుద్ధి పూర్వతః' అన్నారు.

ఒకరి నొకరు విడవకుండా ఉండాలని కోరిక ఉన్నా బుద్ధి పూర్వకంగా కలిగిన ప్రవాసం కార్యజం లేక బుద్ధి పూర్వక ప్రవాసం. సముద్రయానం, తీర్థ యాత్ర, రాజసేవ వల్ల కార్యజ ప్రవాసం సంభవిస్తుంది. ఈ కార్యజ ప్రవాసం కాలరీత్యా మూడు విధాలు 1. వృత్తం (భూతకాలం), 2. వర్తిష్య మానం (భావి), 3. వర్తమానం. కుందమాలలో సీతా ప్రవాసం, స్వప్న వాసవదత్తలో వాసవదత్త ప్రవాసం ఉదాహరణలు. వృత్తం - పూర్వం జరిగిపోయిన కలయిక తరువాత ఎడబాటు. స్వప్నవాసవదత్త నాటకంలో భవిష్యత్తులో భర్తకు సుఖం చేకూరుతుందని, వర్తమానంలో వాసవదత్త ప్రవాసం.

2. సంభ్రమజం : సంభ్రమనగా ఆవేదం. హఠాత్సంభవం. అలజడి. ఈ సంభ్రమజం ప్రవాసం దివ్యం, మానుషం అని రెండు విధాలుగా శారదా తనయ, ధనంజయాదులు చెప్పారు. కాని విశ్వనాథుడు దీనిని మూడుగా విభజించాడు. "సంభ్రమము, దివ్యము, మానుషనిర్ఘాతాదిజము." (ఆం.సా.ద. *3-223*).

ఇక సంభ్రమం వల్ల కలిగిన ప్రవాస విప్రలంభం మూడు విధాలు

దైవకృతం : దైవికంగా, అబుద్ధి పూర్వకంగా కలిగిన ప్రవాసం దైవకృతం. విక్రమోర్వశీయం చతుర్థాంకంలో రాజు ఊర్వశీ

ప్రవాసానికి కారణం ఏదీ తోచక దైవికంగా భావించడం. ఉదాహరణకు ఊర్వశీ పురూరవ ఋగ్వేద గాథలో ఉపవస్త్రం లేకుండా పురూరవుడు తన కంట బడితే వెళ్ళి పోతానని ఊర్వశి నియమం పెడుతుంది. పురూరవుడు సంభ్రమంలో అబుద్ధి పూర్వకంగా ఉపవస్త్రం లేకుండా ఆమె కంట పడతాడు. వెంటనే ఆమె స్వర్గలోకానికి వెళుతుంది. పురూరవుడు ప్రవాసం అనుభవిస్తాడు. ఇది హఠాత్సంభవం, దైవికం. నాభసం ఆకాశ భవం. ఆకాశం నుంచి జనించే పిడుగు పాటు, తుఫాను మొదలైన వాటి వల్ల కలిగిన ప్రవాసం.

3. శాపజం : శాపకారణంగా కలిగిన ప్రవాసం. ప్రియుడు కాని, ప్రియురాలు కాని సమక్షంలోనే ఉన్నా తెలుసుకోలేక ప్రవాస దుఃఖం అనుభవించడం.

అయితే సింగభూపాలుడు రసార్ణవ సుధాకరం లో శాపకృతం రెండు విధాలని చెప్పాడు. 1. వైరూప్యం, 2. తాద్రూప్యం.

1. వైరూప్యం : శాపం వల్ల రూపుమారడం వైరూప్యం. విక్రమోర్వశీయంలో కుమారవనంలో అడుగు పెట్టి ఊర్వశి శాప వశంవల్ల లతగా వైరూప్యం పొందడం. చతుర్థాంకంలో ఊర్వశి కుమారస్వామి శాపాన్ని రాజుకు తెలియజేయడం. లతగా మారిన ఊర్వశి సమీపంలో ఉన్నా తెలుసుకోలేక రాజు ప్రవాస దుఃఖ మనుభవిస్తాడు.

2. తాద్రూప్యం : శాప మూలంగా రూపం మారకుండా ఉండడం తాద్రూప్యం. శాకుంతల నాటకంలో దూర్వాస శాపం మూలంగా శకుంతల రూపు మారకపోయినా రాజు ఆమెను గుర్తించలేకపోవడం తాద్రూప్యం. శాప ప్రభావం వల్ల శకుంతల రూపుమారకపోయినా రాజు గుర్తించలేదు.

శ్రీ.చ.

ప్రవాస స్మరదశలు : ప్రవాస కాలంలో ఎడబాటు వల్ల నాయికా, నాయకులిద్దరు అనుభవించే మన్మథావస్థలు. ఇవి పదకొండు.

"ప్రవాసమందు అవయవముల యసౌష్ఠవము, తాపము, పాండుత, కృశత, అరుచి, అధృతి, అనాలంబము, తన్మయము, ఉన్మాదము, మూర్ఛ, మృతియునని వరుసగా పదునొకండు స్మర దశల నెఱుంగ వలయును''. – (ఆం.సా.ద. 3–222).

శ్రీ.చ.

ప్రవృత్తి : ప్రవృత్తి అంటే నివేదన, సమాచారం తెలియచేయడం. ఆయా దేశాలలోని ప్రసిద్ధ ఆచార, వ్యవహారాలను, వేషభాషలను, వార్తలను, క్రియలను తెలిపేవి ప్రవృత్తులు. లోకాచారాన్ని గమనించి యథోచితిగా ప్రయోగించాలి.

ఇక సింగ భూపాలుడు కూడా ఇదే అర్థంలో ''ఆయా దేశములకు దగిన భాషలు, క్రియలు, వేషములు ప్రవృత్తులగును''. (*ర.సు. 292–295. పుట. 267. అను. బులుసు వేంకట రమణయ్య*).

ఈ ప్రవృత్తులకు 24 హేతువులు. అవి : దేశం, కాలం, పాత్రం, వయస్సు, అవస్థ, శక్తి, సాధన, అభిప్రాయం, వ్యత్యాసం, విపరిణామం, నిమిత్తి, అభిగము, సంగ్రామ, విహార, ఉపహార, ఛల, ఛద్మ, ఆశ్రమ, జాతి, వ్యక్తి, విభావం, సంకీర్ణ, విప్రకీర్ణ. – (శృం.ప్ర. అను. జమ్మల మడక, పుట.211)

భరతముని ప్రవృత్తులు అవంతీ, దాక్షిణాత్య, ఓఢ్ర మాగధి (అర్ధమాగధి, ఆంధ్ర మాగధి) పాంచాల మధ్యమ అని నాలుగు విధాలుగా పేర్కొన్నాడు.

అవంతీ, విదిశ, సురాష్ట్ర, మాలవ, సింధు, సౌవీర, ఆనర్త, అర్బుద, దశార్ణ, త్రిపుర, మృత్తి కావతీ దేశాల ప్రజల వేష భాషాదులను నివేదించేది అవంతీ ప్రవృత్తి.

కోసల, తోసల, కళింగ, యవన, ఖస, ద్రవిడ, ఆంధ్ర, మహారాష్ట్ర, వైణ్ణ, దేశ ప్రజల వేషభాషాదులను నివేదించునది దాక్షిణాత్య ప్రవృత్తి.

అంగ, వంగ, కళింగ, వత్స, ఓఢ్ర, మగధ, పుండ్ర, నేపాల, అంతర్గిర, బహిర్గిర, ప్లవంగము, మలద, మల్ల వర్తక, బ్రహ్మోత్తర, భార్గవ, మార్గవ, ప్రాగ్జ్యోతిష, పుళింద, విదేహ, తామ్రవిప్త దేశస్థుల వేష భాషాదులను తెలియజేసే ఓఢ్ర పద్ధతి.

పాంచాల, శూరసేన, కాశ్మీర, హస్తినాపుర, బాహ్లిక, శకల, మద్రక, ఉశానర దేశాల ప్రవృత్తిని తెలిపేది పాంచాల మధ్యమ. దీనినే భోజుడు పౌరస్త్య ప్రవృత్తిగా పేర్కొన్నాడు.

భాషా ప్రయోగ విషయంలో ధనంజయుడు దశ రూపకంలో ఉత్తమ పాత్రలు (ఉత్తమ వంశీయులు, భక్తులు, విద్వాంసులు, సన్యాసులు, మహాదేవీ ఆమె సంబంధీకులు) సంస్కృతంలో మాట్లాడాలనీ, సామాన్యులు ప్రాకృత భాష ఉపయోగించాలని, నీచ పాత్రలకు సూరసేని వాడాలని, పిశాచాలకు,అతి నీచ పాత్రలకు పైశాచీ, మాగధి వాడాలనీ, నీచ పాత్రల దేశాన్ని బట్టి భాష వాడాలని, ఒకవేళ ప్రత్యేక ప్రయోజనమాశించి నటుడు ఉత్తమ నీచ పాత్రలకు భాషా పరివర్తితం చేయవచ్చని అభిప్రాయం వెల్లడించాడు.

సింగభూపాలుడు రసార్ణవ సుధాకరంలో భాషను భాష, విభాష అని రెండుగా విభజించాడు. తిరిగి భాష , అవంతి, మాగధి, బాహ్లిక, దాక్షిణాత్య, సూరసేని, ఆంధ్ర, మాగధి, అని ఏడు విధాలుగా పేర్కొన్నాడు. ఇక విభాషలు – శబర, ద్రమిళ, ఆంధ, శకార, అభీర, చండాల, కోయ.

పైన చెప్పిన విషయాలు సంస్కృత భాషా నాటకాలకు వర్తిస్తాయి. మరి తెలుగు నాటకాలలో ఎలాంటి భాష ప్రయోగించాలి? పూర్వాంధ్ర తెలుగు కవులు నాటకాలు రాయనందువల్ల తెలుగు నాటకాలకు ప్రత్యేక లక్షణాలను నిర్దేశిస్తూ ఎవరూ లక్షణ గ్రంథాలను వెలువరించలేదు. భాషా విషయంలో పూర్వోక్త మని చెప్పుకోడానికేమీ లేదు.

మల్లాది సూర్యనారాయణ శాస్త్రి ఆంధ్ర దశరూపకంలో ఇలా నిర్దేశించాడు. "ఉత్తమ పాత్రములకు బూర్వకవి ప్రయోగ సిద్ధంబును, తదన్యములకు శిష్టవ్యవహార సిద్ధంబునగు నాంధ్రము ప్రయోజ్యము" (ఆంధ్ర దశ రూపకము 2-91, పుట -61).

తెలుగులో నాటకభాషగురించి మొట్ట మొదట ఆలోచించి ఒక పద్ధతి ప్రవేశపెట్టిన పండితుడు నాదెళ్ల పురుషోత్తమ కవి. తెలుగు స్వతంత్ర నాటకాలలో పాత్రోచిత భాష వాడాడు. స్త్రీ, పురుష, ఉత్తమ పాత్రలకు సులభ గ్రాంథికం, మధ్యమ పాత్రలకు శిష్ట వ్యవహారం, నీచపాత్రలకు గ్రామ్యం వాడి పాత్రోచిత భాషావాదానికి నాంది పలికాడు. తరువాత వేదం వేంకటరాయశాస్త్రి స్వతంత్ర అనువాద నాటకాలలో పాత్రోచిత భాషను ప్రయోగించి ఈ సిద్ధాంతానికి సుస్థిరత్వం లభింపచేశాడు. అంతేగాక గ్రామ్య భాషా ప్రయోగ నిబంధనం పేరుతో గ్రంథం రచించి పాత్రోచిత భాషా ప్రయోగం శాస్త్ర సమ్మతమని సప్రమాణంగా నిరూపించాడు. దీనితో ఉత్తమ పాత్రలకు గ్రాంధికం, మధ్యమ పాత్రలకు శిష్ట వ్యావహారికం, నీచపాత్రలకు గ్రామ్యం వాడడం తెలుగులో సాధారణమై పోయింది.

ఇప్పుడు తెలుగులో వెలువడుతున్న నాటకాలు ఎక్కువగా సాంఘిక నాటకాలు కావడం, వాస్తవికతకు ఎక్కువ ప్రాధాన్యం కల్పించడం వల్ల ఉత్తమ పాత్రలైనా గ్రాంథికంలో మాట్లాడడం ఎబ్బెట్టుగా ఉంటుంది. కాబట్టి ఉత్తమ పాత్రలకు కూడా శిష్ట వ్యావహారికమే వాడడం పరిపాటయిపోయింది.

శ్రీ.చ.

ప్రవేశకం : అర్థోపక్షేపకం. ఒక తరహా విష్కంభం. ఈ రెంటి ప్రయోజనం ఒక్కటే. అయితే విష్కంభంలా ప్రవేశకాన్ని నాటకారంభంలో ప్రయోగింపచేయకూడదు. రెండంకాల మధ్య ప్రయోగింపచేయాలి. అందులోనూ ఒకటిగాని, రెండుగాని అధమ పాత్రల ద్వారా ప్రయోగింప చేయాలి. పాత్రలను ప్రవేశ పెట్టేది గాన ప్రవేశకం అని పేరు వచ్చింది. (*ప్రవేశయతి పాత్రాణి రంగమితి ప్రవేశకం. - నాటక లక్షణ రత్నకోశం*)

రెండంకాల మధ్య కొన్ని దినాల, మాసాల, సంవత్సరంగాని, కొన్ని సంవత్సరాల లోపుగాని జరిగిన కథను సంక్షిప్తంగా ప్రవేశకం ద్వారా తెలియచేయాలి. అంతేగాక కాలోదయం, గూడార్థం వచ్చే అంకముందలి ఇతివృత్తాన్ని సూచించాలి. గడచిన, రాబోయే అంకాల కథను సమన్వయపరచి చెప్పాలి. భాష ఉదాత్తంగా ఉండక గ్రామ్యమై ఉండాలి.

ఏకపాత్ర ప్రవేశకానికి భవభూతి మాలతీ మాధవంలో ఆరు, ఏడు అంకాల మధ్య బుద్ధరక్షిత ప్రయోగించిన ప్రవేశకం, శ్రీహర్షుని ప్రియదర్శికలో ద్వితీయ, తృతీయ అంకాల మధ్య మనోరమ ప్రయోగించిన ప్రవేశకం ఉదాహరణలు. ద్విపాత్ర ప్రవేశానికి రాజశేఖరుని బాల రామాయణం, ద్వితీయ, తృతీయాంకాల మధ్య గృద్ధ మిధునం ప్రవేశకం. వేణీ సంహార నాటకంలో రెండు, మూడు అంకాలు మధ్య రాక్షస మిధునం ప్రయోగించిన ప్రవేశకం. కాళ్లకూరి గోపాలరావు వాల్మీకి నాటకం షష్ఠాంక ప్రథమ, ద్వితీయ రంగాల మధ్య నిషాదుడు, నిషాది ప్రవేశకం చక్కటి ఉదాహరణలు. అయితే విదూషకుడు, చేటి, ఇద్దరు చేటులున్న ప్రవేశకాలు కూడా సంస్కృతాంధ్ర నాటకాల్లో కనిపిస్తున్నాయి. కాళిదాసుని విక్రమోర్వశీయం నాటకంలో ప్రథమ, ద్వితీయాంకాల మధ్య ప్రవేశకంలో పాత్రలు విదూషకుడు, చేటిక. అందులోనే తృతీయ, చతుర్థాంకాల మధ్య చెలికత్తెల ప్రవేశకం.

శ్రీ హర్షుని రత్నావళిలోనూ, వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన ఉషానాటకంలోనూ కూడా ఈ విధమైన ప్రవేశకాలు కనిపిస్తాయి. ఇక శాకుంతలంలో బెస్తవాని దృశ్యం, యౌగంధ రాయణంలో గాత్ర సేవకుని దృశ్యం (మూడు, నాలుగు అంకాల మధ్య) ప్రవేశకానికి ఉదాహరణలు.

శక్తి భద్రుడు ఆశ్చర్య చూడమణిలో నాలుగు, ఐదు అంకాల మధ్య ప్రవేశపెట్టిన ప్రవేశకం ప్రయోగించినది రావణుని పట్టపురాణి మండోదరి, చేటి.

విదూషకుడు, మండోదరి లాంటి పాత్రల ద్వారా ప్రవేశకం ప్రయోగింపచేయడం చూస్తే సంస్కృత లాక్షణికులు ప్రవేశాన్ని అధమ పాత్రల ద్వారా ప్రయోగింప చేయాలని నిబంధించినా, సంస్కృత నాటక కర్తలు దానిని కచ్చితంగా పాటించినట్టు లేదని అనిపిస్తోంది.

శ్రీ.చ.

ప్రశస్తి : నిర్వహణ సంధ్యంగం. నృప, దేశాదులకు శుభం కలగాలనే ఆకాంక్ష ప్రశస్తి. అభినవగుప్తుడు దీనినే భరత వాక్యం అన్నాడు. (వివరాలకు భరత వాక్యం చూడండి ప్రశస్తిః శుభశంసనమ్ (ర.సు. 1-53)

శ్రీ.చ.

ప్రసాద్,చిల్కా (జ.1948) : ప్రముఖ నటుడు, సంగీతజ్ఞుడు. రేపల్లె తాలుకా, పమిడిమర్రు గ్రామంలో సుశీల, సత్యం దంపతులకు 1948, జూన్ 6న జన్మించాడు. గుంటూరు ఎ.సి. కాలేజిలో బి.ఏ. వరకుచదివాడు. విద్యార్థిదశ నుంచీ నాటకమన్నా, సంగీతమన్నా ప్రాణం. సంగీతం ప్రథమస్థానంలో నిలిచింది. దాంతో ఓ ప్రతిభావంతుడైన గురువును ఆశ్రయించి తనకు సంగీతంలో శిక్షణ ఇమ్మని అర్థించాడు. కులవివక్షతతో ఆ గురువు ప్రసాద్ కోర్కెను తిరస్కరించాడు. ప్రసాద్ నిరాశపడక పట్టుదలతో ఎలాగైనా నేర్చుకోవాలని, హార్మోనియం కొనుక్కొన్నాడు. తన లక్ష్యసాధనలో ఎదురైన అపశ్రుతినే శ్రుతిగా చేసుకొని, ఆవేదనను ఆలాపనగా మార్చి, సప్తస్వరాలను తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా మార్చుకొని స్వయం సాధనకు



పూనుకున్నాడు. అనతికాలంలోనే, స్వయంకృషితో కళామతల్లికి అర్చన చేసే పవిత్ర ఆరాధకునిగా రూపొందాడు. తనను అవహేళన చేసినవారు సిగ్గుపడేలా చేశాడు. కళాసాధనకు కులమతాలు అడ్డు గోడలు కావనీ, కారాదని రుజువు చేశాడు. ఈయన హార్మోనియంలోనే కాక, గిటార్, తబలా, ఫ్లూట్ వంటి వాద్యాల వినియోగంలో కూడా మంచి ప్రావీణ్యం సాధించాడు. అప్పటి నుంచీ సంగీతాన్ని తన వృత్తిగా చేసుకొన్నాడు. ఈయన సంగీత సారథ్యంలో *మైరావణ*, *తులసీ జలంధర*, *భక్తయోబు*, *రారాజు క్రీస్తు*, *వాసవీ కన్యకా పరమేశ్వరి*, *సత్యహరిశ్చంద్ర* మొదలైన నాటకాలు కమనీయ దృశ్య కావ్యాలుగా మలచబడ్డాయి. *సమ్రాట్ అశోక*, *సచివ సమ్రాట్* వంటి నాటికలకు అందించిన సంగీత సహకారం రసజ్ఞుల ప్రశంసలు అందుకొంది. చిల్కా ప్రసాద్ సమకూర్చిన, 'శివ సంకీర్తన' క్యాసెట్లు అత్యంత ప్రజాదరణ పొందాయి. ఈయన సంగీతంలోనే కాక చిత్రలేఖనంలోను, నఖచిత్రలేఖనంలోనూ అందెవేసిన చేయి. రంగస్థలంపై నటునిగా, ముఖ్యంగా ప్రతినాయక పాత్రల్లో ప్రశంసలు పొందాడు. తన సుదీర్ఘ కళారంగ ప్రస్థానంలో ఎన్నో సన్మానాలు, సత్కారాలు అందుకొన్నాడు. నేటికీ తన సంగీత అనుభవాన్ని నలుగురికీ పంచి పెడుతూ నాటక రంగానికి విశిష్ట సేవలు అందిస్తున్నాడు.

మన్నెశ్రీ

ప్రసాద్, జయశంకర్ (1889-1937) : ప్రసిద్ధ హిందీ కవి. నాటక రచయిత. ఈయన 1889లో కాశీలోని కన్యాకుబ్జలో సంపన్న కుటుంబంలో జన్మించాడు.

ఆంగ్లం, హిందీ, సంస్కృతం, ఉర్దూ, ఫారసీ భాషలలో మంచి పండితుడు. ఆయన చిన్నతనంలోనే వేదాలు, ఉపనిషత్తులు, స్మృతి, పురాణ, బౌద్ధ జైన గ్రంథాలను అధ్యయనం చేశాడు. కవిత్వం, నవల, కథ, వ్యాసం మొదలైన సాహిత్య ప్రక్రియలలో దిట్ట. ఆయన ప్రతి నాటకమూ దేశభక్తితో తొణికిసలాడుతూ ఉంటుంది. హిందీ సాహిత్యంలో ప్రసాద్‌ని ప్రప్రథమ మౌలిక నాటకకర్తగా పేర్కొనవచ్చు. ప్రాచీన సాహిత్యపు విలువలను గౌరవిస్తూ, ఆంగ్ల, బెంగాలీ సాహిత్యాలలో మేలిమిని మిళితం చేస్తూ ఒక కొత్త బాటకు దారి చూపాడు.

సజ్జన్, *కల్యాణి*, *పరిణయమ్*, *ప్రాయశ్చిత్*, *రాజ్యశ్రీ*, *అజాతశత్రు*, *జనమేజయ్‌కా నాగయజ్ఞ*, *స్కందగుప్త*, *చంద్రగుప్త్*, *ధ్రువస్వామిని* మొదలైన నాటకాలు రచించాడు.

సరోజ

ప్రసాదమూర్తి, ఎం (జ.1955) : నటుడు, దర్శకుడు, సమాజ నిర్వాహకుడు. రత్నమ్మ, రామన్న దంపతులకు 1955, జనవరి 14న పశ్చిమగోదావరిజిల్లాకాశీపాడు గ్రామంలో జన్మించాడు. స్కూల్ ఫైనల్ వరకు చదువుకున్నాడు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం, వృత్తి ఏదైనా ప్రవృత్తి నాటకరంగమే. 1972లో బి. ఇంద్రకుమార్ ప్రోత్సాహంతో *వరుడు కావాలి* తో నాటక రంగ ప్రవేశం చేశాడు. ఈయనను ప్రముఖ దర్శకుడు టి.జె. రామనాథం వెలుగులోకి తెచ్చాడు. *నలభై ఆరో నిముషం*, *నరకం మరెక్కడో లేదు*, *ముద్రారాక్షసం* నాటకాలకు రామనాథం దర్శకత్వం వహించగా, వాటిలో ప్రసాదమూర్తి ప్రధాన పాత్రలలో నటించి పేరు తెచ్చుకున్నాడు. అప్పటినుంచీ ఎన్నో నాటక, నాటికలలో నటించడమేకాక వాటికి దర్శకత్వం వహించి, ఆ నాటకాలకు ప్రాణం పోశాడు. వాటిలో 'నలభై ఆరోనిమిషం', 'నరకం మరెక్కడో లేదు', *సింధూరం*, *నీలిరాగం*, *ముద్రారాక్షసం*, *సతి*, *శ్వేతపత్రం* మొదలైనవి సుప్రసిద్ధాలు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే అనేక నాటక పరిషత్తు పోటీలలో పాల్గొని ఉత్తమ బహుమతులు గెల్చుకున్నాడు. ఈయన స్థాపించిన 'కళావాణి' సమాజం ఉభయ గోదావరి జిల్లాల్లో నాటక కళావికాసానికి అకుంఠిత సేవ చేస్తూంది. ప్రసాదమూర్తి దర్శకత్వంలో *సద్గతి*, *అలరాస పుట్టిల్లు* నాటికలు బహుళ జనాదరణ పొందాయి. ఈయన దర్శకత్వంలో 2002 లో నంది నాటకోత్సవాలలో పాల్గొన్న *అమరజీవి* నాటకం, ఉత్తమ ప్రదర్శనగా ఎన్నికై బంగారు నందిని కైవశం చేసుకొంది. కేవలం నాటక పోటీల్లో బహుమతులు గెల్చుకోవాలన్న ఆశతో కాకుండా ప్రజలకు మంచి నాటకాలను నవరసభరితంగా అందించాలన్న తపనతో, అంకిత భావంతో, దీక్షతో అహరహం కృషి చేసే కళాజీవి ప్రసాదమూర్తి.

గం.సు.రె

ప్రసాదరావు, హరి (1871-1936) : గుంటూరు ఫస్టు కంపెనీలో నాయక పాత్ర ధారి. 'ఆంధ్ర నట పితామహుడు' బిరుదాంకితుడు. ఈయన 1871లో జన్మించాడు. ఈయన మొట్టమొదట గుంటూరులో రైల్వే సంజ్ఞా ప్రసారం, తరువాత

తంతీ ప్రసారం, ఆ తరువాత జిల్లా కోర్టులో నకళ్ళ నవీసీ, ఆధ్యాత్మిక వృత్తి నాట్య తపస్సులో పండి సిద్ధి పొందిన నటయోగి. నాటక కళాసేవకోసం నిక్షేపంలాంటి రైల్వే ఉద్యోగం కాలదన్నిన త్యాగమూర్తి.

'పుంసాం మోహన రూపాయ' అనే శ్లోకాన్ని సార్థక పరిచే సుందర రూపం. గుంటూరు పుర రాజవీధిలో నడిచి వెళుతుంటే ఏ హరిశ్చంద్ర మహారాజో, ఏ నలసార్వభౌముడో దురదృష్ట వశాత్తూ వనవాసానికి వెళ్ళుతున్నాడా, వినయ వేషంలో దుష్యంత మహారాజు కణ్వాశ్రమానికి నడిచి వెళ్ళుతున్నాడా లేక సారంగధరుడు పావురాలాటకుబయలు దేరాడా అనిపించేదట.

హరిప్రసాదరావు ఆంధ్ర నాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులను కలిసి చిత్రనళీయం ప్రదర్శించడానికి అనుమతి ఇమ్మని అర్థించాడు. ఆంధ్ర నాటక పితామహుడు 'మా నాటకాలను మీరేం ఆడగలరు' అని ఈసడించారట. ప్రసాద రావుకు పౌరుషం ప్రజ్వరిల్లింది. అక్కడే వేషం కట్టి ఆంధ్ర నాటక పితామహుని మెప్పించి, మహదానందంతో చిత్రనళీయం రాత ప్రతి తీసుకుని వచ్చారట. దీనితో ఆంధ్ర నాటకరంగ చరిత్రలో వచన నాటక యుగం అంతరించి, నూత్న సంగీత నాటకయుగం అవతరించింది. ధర్మవరం రామకృష్ణమాచార్యుల బాణీలో శరపరంగా నాటక రచన, ప్రదర్శనలు సాగాయి.

భావస్ఫోరకంగా, సుబోధకంగా, రసం చిప్పిలేటట్టు రాగం పద్యంలోనే ఇమిడ్చి, పద్యంతో పాటు రాగమూ ముగిసే వినూత్న సంప్రదాయానికి సృష్టికర్త ప్రసాదరావు, నాటికీ నేటికీ ఈ సంప్రదాయం హరిప్రసాదరావు బాణీ అనే పేరుతో వాసి కెక్కింది. ఆనాటి వర్థమాన నటులెందరికో భిక్ష పెట్టింది.

భైరవి, ఆనంద భైరవి, మోహన రాగాలు ఆయన స్వంతం. పద్యం ఎత్తుకుంటే, ఆయా రాగాలు పద్యంలో అంతర్లీనమై భావస్ఫోరకత్వానికి దోహదం చేసే విభావం సూటిగా ప్రేక్షక హృదయాలకు హత్తుకునేది. అందుకనే ఆయన పద్యం పాడుతున్నాడా, చదువుతున్నాడా అనే సందేహం కలిగేది.

ఆ నాటికి నటనలో,నాటక ప్రయోగంలో ప్రామాణిక సంప్రదాయమంటూ ఏదీ ఏర్పడలేదు. ఆధునిక నాటక రంగ నటన, ప్రయోగాలమీద లక్షణగ్రంథాలు వెలువడలేదు. ఈ పరిస్థితులలో నటనలో, నాటక ప్రయోగంలో ఒక సుసంప్రదాయాన్ని నెలకొల్పిన నటుడు ప్రసాదరావు.

చతుర్విధాభినయాలలో దిట్ట. కరుణ రసాభినయంలో నాటికీ నేటికీ ఆయనను మించిన వారు కాదు కదా, సమఉజ్జీలు కూడా లేరని కళాభిజ్ఞుల అభిప్రాయం. హరిశ్చంద్ర వేషంలో 'మాయా మేయ జగంబె నిత్యమని సంభావించి ....', 'హృదయమాచ సతికి...' అనే పద్యాలు చదువుతుంటే ఎంత రాతిగుండె అయినా కరిగి తీరవలసిందే. శాకుంతలం షష్టమాంకంలో దుష్యంతుడుగా కరుణ విప్రలంభం అభినయిస్తూ ప్రేక్షకులను తన్మయులను చేసేవాడు. ఇక సారంగధర, దుర్యోధన (వేణీ సంహారంలో) భూమికలలో వారి హావభావ విలాసం అసమానం.

హరిశ్చంద్ర, నల, దుష్యంతాది ధీరోదాత్త నాయక భూమికలలో నటించి మెప్పు పొందిన ప్రసాదరావు చిన్న చిన్న హాస్యపాత్రలలో కూడా నటించాడు. సుంకరి కొండడు, మొద్దబ్బాయి మొదలైన హాస్య పాత్రలలో నటించి ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించేవాడు. ఆంధ్ర ప్రజానీకం ప్రసాదరావును ఆంధ్రనటపితామహుడు **బిరుదుతో**, గండపెండేరంతో నీరాజనం సమర్పించింది. **ఏనుగంబారీ మీద ఊరేగించింది.** దానితో నటులు పంక్తి బాహ్యులనే శాస్త్ర వచనం నడుం విరిగింది.

ప్రసాదరావు నిగర్వి. సాటి నటులలోని గొప్పదనాన్ని గుర్తించి ప్రోత్సహించేవాడు. ప్రసాదరావుకు అఖండ ఖ్యాతిని తెచ్చి పెట్టిన హరిశ్చంద్ర భూమికను 1916లో గుంటూరులో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పోటీలలో డి.వి. సుబ్బారావు కొత్త ఫక్కీలో నటిస్తుంటే గుణనిర్ణేతగా కూర్చుని చూసి ఆనందం పట్టలేక, సగంలోనే 'ఏమోయ్, వీడు మన్ని మించి పోతున్నాడు' అంటూ మెచ్చుకున్న ఉదారగుణ సంపన్నుడు. ప్రసాదరావు హరిశ్చంద్రుడు, సారంగధరుడు, నలుడు, బాహుకుడు, సుదేవుడు (చిత్ర నళీయం), దుష్యంతుడు, దుర్యోధనుడు (వేణీ సంహారం, పాండవ విజయం), సిరియాలుడు, రాముడు (జనక జానందము), సుంకరి కొండడు (ఫార్సు), మొద్దబ్బాయి (ఫార్సు), సుదేవుడు (సునందినీ పరిణయం), కృష్ణుడు (సాత్రాజితీయం), భామ (భామా కలాపం ఫార్సు), రాజరాజ నరేంద్రుడు , సుబ్బిసెట్టి, హనుమంతుడు, బోయీ (జమీందర్ ఫార్సు) మొదలైన పాత్రలలో నటించాడు. సుమారు అర్థ శతాబ్దం నటలోకానికి పితామహుడుగా, ఆంధ్ర నాటక రంగానికి రారాజుగా వెలుగొందిన ప్రసాదరావు 1936, అక్టోబర్ 7న మరణించాడు.

శ్రీ.చ.

ప్రసాద రెడ్డి, జి.ఎస్ (జ: 1959) : నటుడు, దర్శకుడు, రచయిత, ప్రయోక్త, సాంకేతిక నిపుణుడు, న్యాయనిర్ణేత, రంగస్థలం, రేడియో, టీవీ, సినీ మాధ్యమాల అధ్యాపకుడు, టి.వి., రేడియో న్యూస్‌రీడర్. 1959, జనవరి 30న గుంటూరు జిల్లా మాచర్ల, తల్లిదండ్రులు అనసూయా దేవి, పున్నా రెడ్డి. కళాశాల స్థాయి వరకూ మాచర్లలో విద్యాభ్యాసం జరిగింది.

ఉన్నత పాఠశాలలో భువన విజయం ఏకాంకికతో రంగస్థల ప్రవేశం జరిగింది. కళాశాల స్థాయిలో కన్యాశుల్కం, వరుడు కావాలి, రామరాజ్యం, కుక్కపిల్ల దొరికింది, బహుకృత వేషం, వగ ప్రదర్శనలన్నింటిలో బహుమతులు రావడం వల్ల నటన పట్ల అభిరుచి పెరిగింది. కళాశాలానంతరం నీరుపాయ్, యాగం, రేపటి నటుడు, సిప్పొచ్చింది, రుద్రవీణ, గుండెలు మార్చబడును, అవినీతి! నీ చోటెక్కడ?, కుక్క, సుడిగుండాలు, రాజ్యం లేని రాజ్యం, ఫర్ సేల్, వీరపాండ్య కట్టబ్రహ్మన నాటిక, నాటకాల్లో పలు పాత్రలు పోషించి, బహుమతులూ, ప్రేక్షకాదరణ పొందినప్పటి నుంచి నటనా ప్రవృత్తి బలంగా మారి, ఉన్నత చదువుల పట్ల నిర్లక్ష్యం ఆవహించింది. బాలచంద్రుడు, శిథిల శిల్పం ఏకపాత్రల్లో పలు పోటీలలో పాల్గన్నాడు. చిన్న వయసులోనే మంచినటుడు, దర్శకుడిగా పేరు రావడంతో నిప్పురవ్వలు, రాముడు-రంగడు, పూలరంగడు వంటి నాటకాల్ని పల్లెల్లో, పల్లెటూరి నటులతో ప్రదర్శించాడు.

నాటకరంగంలోనే పేరు సంపాదించాలనే పట్టుదల పెరగడంతో తల్లితండ్రులనూ, చేస్తోన్న వ్యాపారాలనూ ఉన్నపళంగా వదిలేసి, అక్షరాలా వంద రూపాయలతో తెగిన గాలిపటంలా 1983, జనవరి 1న హైదరాబాద్‌కు వచ్చాడు. ఆంధ్రప్రదేశ్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లమా ఇన్ ఏక్టింగ్ కోర్సు చేశాడు. అక్కడ నానాజాతి సమితి, పెళ్ళిచూపులు, ఎవరు దొంగ? ప్రేమపక్షులు తదితర నాటకాల్ని ప్రదర్శించాడు. మేకప్ ప్రత్యేక అంశంగా బ్యాచ్ మొత్తంలో ప్రథముడిగా నిలిచాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయ రంగస్థల కళల శాఖలో పి.జి. డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ విద్యార్థిగా చేరాడు. ఇక్కడ రాజా ఈడిపస్, లావొక్కింతయు లేదు, ఇప్పుడు వీస్తున్న గాలి, ఆషాఢ మేఘం, పాపం! ఉరి తీస్తారు కాబోలు, విశ్వశాంతి నాటకాల్లోను, నీలిదీపాలు, గోగ్రహణం నాటికల్లోను ప్రముఖ పాత్రలు ధరించి నట విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. ఇదే కాలంలో రంగధార సమాజంలో ఏకలవ్య, నీటిచుక్క నాటికల్లో ప్రధాన పాత్రల్లో పరిషత్తుల్లో నటించాడు. 1985లో సౌత్‌జోన్ డ్రామా ఫెస్టివల్ ఎర్నాకుళంలోను, ఆ వెంటనే రవీంద్రభారతిలోను గోగ్రహణం నాటకంలో నటించాడు. కోర్సు పూర్తికాగానే పార్ట్ టైం లెక్చరర్‌గా మేకప్ పాఠాలు రెండేళ్ళపాటు బోధించాడు. ఇదే సమయంలో ఫల్ ఫల్ గుర్రం నాటికను మాచర్లలోను, స్పందన నాటికను భెల్ పరిషత్తులో ప్రదర్శించాడు. 1985 నుంచి 1990 వరకు శ్రీ మురళీ కళానిలయం తరపున గోగ్రహణం, జంబూద్వీపం, బుర్రుపిట్ట తుర్రుమన్నది, ఊహోవృగం ప్రదర్శనల్లో ముఖ్యపాత్రలు పోషించి, మద్రాసు కళాసాగర్, ఆంధ్ర నాటక కళాపరిషత్తు (ఖమ్మం)తో సహా రాష్ట్రంలోని పలు పరిషత్తులలో విరివిగా ప్రదర్శనలిచ్చి ఎన్నో పర్యాయాలు ఉత్తమ నటుడిగా బహుమతులందుకున్నాడు.

1984 నుంచి డెబ్బై రేడియో నాటకాలలో పాల్గన్నాడు. 1985 నుంచి ఇరవై వరకు టి.వి. నాటకాల్లో పాల్గన్నాడు. ఇప్పటివరకూ రేడియోకు సుమారు యాభై నాటికలు, టివికి ఐదు నాటికలు, మూడు సీరియళ్ళకు రచన చేశాడు. ఆ వెంటనే ఉస్మానియాలో ఎం.ఏ. చేశాడు. ఇదే కాలంలో బమ్మ, త్రిశంకు, తాజ్‌మహల్, జాకీ, కట్నం లక్ష నాటికల్ని రాశాడు. వీటిని అన్ని పరిషత్తులలో ప్రదర్శించాడు.

1987 నుంచి 1999 వరకు టివి న్యూస్ రీడర్‌గా, 1988 నుంచి రేడియో న్యూస్‌రీడర్‌గా కొనసాగుతూ ఉన్నాడు. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇటు రంగస్థల నటుడిగా, అటు ఉత్తమ టి.వి. న్యూస్‌రీడర్‌గా పలు సన్మానాలూ, మరెన్నో అభినందనలకూ పాత్రుడయ్యాడు. 1988లో సెంట్రల్ యూనివర్సిటీలో ఎం.ఎ. (కమ్యూనికేషన్ - రేడియో, టి.వి.) లో చేరి, గోగ్రహణం, నిచ్చెనమెట్లు ఆధునిక నాటికలకు శ్రీకారం చుట్టి ప్రదర్శించాడు. కాగితంపులి లో ప్రధాన పాత్రలో నటించాడు. ఈ సంవత్సరంలో పి.ఆర్. థియేటర్స్ సమాజాన్ని ప్రారంభించాడు. ఇదే సమయంలో నాగపూర్ బాలల కోసం నిర్వహించిన నటశిక్షణ శిబిరాల్లో బాలలకు శిక్షణ ఇచ్చి గోమాత తదితర నాటికల్ని ప్రదర్శింపచేశాడు. తిరుమల ఆర్ట్ థియేటర్ నిర్వహించిన హాస్యనాటికల ఉత్సవాల్లో ఈ ఇల్లు అమ్మబడును ప్రదర్శించాడు. ఒకవైపు చదువుకుంటూనే మధు ఫిల్మ్ అండ్ టివి ఇనిస్టిట్యూట్‌లో అభినయ అధ్యాపకుడుగా రెండేళ్ళు పని చేశాడు. 1989-90లో ఎస్‌సిజడ్‌సిసి పథ్ నాట్య సమారోహ పేరిట ప్రాంతీయ, జోనల్ స్థాయిల్లో నిర్వహించిన తొలి ఆధునిక వీధి నాటిక పోటీల్లో గోగ్రహణం ప్రదర్శించి నటన, దర్శకత్వం, ప్రదర్శన బహుమతులను రెండు స్థాయిల్లోనూ గెలుపొంది, జాతీయస్థాయికి తెలుగు నాటకాన్ని తీసుకెళ్ళాడు. ఇదే సంవత్సరం తొలిపొద్దు చలన చిత్రంలో ఒక కథానాయకునిగా

నటించాడు. ఆ తరువాత ఎన్నో అవకాశాలు వచ్చినా ఆ వైపు మొగ్గు చూపలేదు. కోర్సు పూర్తికాగానే సెంట్రల్ యూనివర్శిటి రంగస్థల కళల శాఖలో రెండేళ్ళు అధ్యాపకుడిగా సేవ లందించాడు.

1991లో తెలుగు విశ్వవిద్యాలయం నటనాకళ శాఖలో అధ్యాపకునిగా చేరి సంవత్సర కాలం పనిచేశాడు. నా దేశమా నాటికకు దర్శకత్వం వహించి, సౌత్‌జోన్ పోటీలలో ప్రథమ బహుమతి పొంది, తెలుగు నాటకాన్ని మరోసారి జాతీయ స్థాయిలో బెనారస్‌లో ప్రదర్శింపచేశాడు. గాంధీ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ కృష్ణకాంత్ సమక్షంలో నా దేశమా, మహాత్మా ఓ మహాత్మా వీధి నాటకాల్ని ప్రదర్శించాడు. విశ్వవిద్యాలయ సిబ్బందితో నామకరణం నాటికను ప్రదర్శించాడు. 1992లో ఉస్మానియా విశ్వవిద్యాలయ రంగస్థల కళల శాఖలో చేరి, ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా కొనసాగుతూ అనేకమంది విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నాడు. భాగ్యనగరం, నాటకం, కప్పలు, పంజరం, కాగితం పులి, ఉరి, రిహార్సల్స్, ముక్తధార, ఎలిమెంటరీ స్కూల్ నాటకాలను విద్యార్థులతో ప్రదర్శింపచేశాడు.

1988 నుంచి సినిమా, టి.వీల డబ్బింగ్ ఆర్టిస్టుగా, వాయిస్ లెండర్‌గా కొనసాగుతున్నాడు. మరెన్నో యాడ్స్ చెప్పాడు. ఓపెన్ యూనివర్శిటీ, ఇంటర్మీడియట్ మండలి వారి ఆడియో పాఠాలెన్నింటికో తన గళాన్నందించాడు. 1986 నుంచి ఇప్పటి వరకు టెలిస్కూల్ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నాడు. 1990 నుంచి ప్రజానాట్యమండలి నటులు, రచయితలు, దర్శకుల శిక్షణా శిబిరాలకు పాఠాలు బోధిస్తూ, వారి ప్రదర్శనలకు మార్గదర్శకంగా ఉంటున్నాడు. 1992లో ఈనాటి రసరంజని స్థాపనకు శ్రీకారం చుట్టిన వారిలో ప్రసాదరెడ్డి ఒకడు. మిగిలిన ఇద్దరు జె.వి. సోమయాజులు, మొదలి నాగభూషణ శర్మ. సంస్థ ప్రారంభానికి ముందు మొదటి మూడు సమావేశాలు నిజాం కళాశాల రంగస్థల కళల శాఖలో జరగడానికి కారణభూతడయ్యాడు. రసరంజని తరపున ముద్రారాక్షసం, హయవదన నాటకాల్లో నటించి, సహకార దర్శకత్వ బాధ్యత వహించాడు. ఈ ఇల్లు అమ్మబడును స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించాడు. 1994లో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అఖిలాంధ్ర నాటకోత్సవాల్లో ఏడు జిల్లా కేంద్రాల్లో పెద్ద బాలశిక్ష వీధి నాటిక ప్రదర్శించాడు.

1989లో ఆధునిక వీధి నాటకరంగంపై దేశంలోనే మొట్ట మొదటి పిహెచ్.డి. సాధించిన ఘనత కూడా ప్రసాదరెడ్డికే దక్కింది. *గోగ్రహణం, ఎలిమెంటరీ స్కూల్, మనకోసం మనం, మా హక్కుల్ని మాకివ్వండి, స్వయంకృతం, నిచ్చెనమెట్లు, పెద్ద బాలశిక్ష, ఇవ్వండి* సహకారం పొందండి సంక్షేమం, కలసి ఉంటే కలదు సుఖం నాటికలు ప్రసాదరెడ్డి దర్శకత్వం వహించిన వీధి నాటకాలలో ముఖ్యమైనవి. ఇవ్వండి సహకారం పొందండి సంక్షేమం రాష్ట్రమంతటా వెయ్యి ప్రదర్శనలు ఇచ్చాడు. కలసి ఉంటే కలదు సుఖం (వికాలంగ కళాకారులతో) పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు వందల ప్రదర్శనలిచ్చాడు. తెలుగు నాటకరంగ చరిత్రలో వికలాంగులతో ప్రదర్శించడం ఇదే ప్రథమం. 2002లో నంది నాటకోత్సవాలలో న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. మరెన్నో పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. ఇదే సంవత్సరం దేశంలోనే మొదటిసారిగా విశ్వవిద్యాలయ స్థాయిలో మీడియా (యాక్టింగ్, న్యూస్ రీడింగ్, యాంకరింగ్) కోర్సును ప్రవేశపెట్టాడు. 2003లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రీజినల్ రీసోర్స్ సెంటర్ సలహామండలి సభ్యుడిగా ఎంపికై, రాష్ట్రంలో వారి నిర్వహణలో అధిక సంఖ్యలో శిక్షణ శిబిరాల నిర్వహణకు దోహదపడ్డాడు. ఈ శిబిరాల్లో అధ్యాపకుడిగా, నిపుణుడిగా పాల్గన్నాడు. 1988, 1989, 1994, 2002 సంవత్సరాల్లో ఎ.పి. థియేటర్ నిర్వహించిన నటశిక్షణా శిబిరాల్లో అభినయ అధ్యాపకుడిగా, శిబిరాల సహాయ సంచాలకుడిగా వ్యవహరించాడు. తెలుగు విశ్వవిద్యాలయ, రంగస్థల కళల శాఖలో వరుసగా ఏడేళ్ళు అతిథేయ అధ్యాపకుడిగా బోధించాడు. పోలీసు సాంగ్ అండ్ డ్రామా విభాగంలోని కళాకారులకు శిక్షణ ఇచ్చి, గోగ్రహణం ప్రదర్శింపచేసి, వారికి ఉద్యోగ భద్రత కలగడానికి దోహదపడ్డాడు.

నాటకం సమాజానికి దోహదపడేదిగా ఉండాలని, తన వంతు కృషిగా 1990 అక్షర కళాయాత్ర, 1992 సైన్స్ కళాజాతల్లోను, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రచార నాటకాల్లోనూ, రచయితగా, దర్శకుడిగా, నిర్వాహకుడిగా, శిక్షకుడిగా వ్యవహరించాడు.

రమణ

ప్రస్తావన : భారతీ వృత్యంగం. (చూ. ఆముఖం)

శ్రీ.చ.

ప్రస్థానకం : సంస్కృత ఉపరూపకం. ఏనుగు నడకతో బయలు దేరుతుంది కాబట్టీ, ఇందులో ప్రయాణ విషయం ఉంటుంది. కాబట్టే దీనికి ప్రస్థానమని పేరు వచ్చింది. ఉదా: శృంగార తిలకం.

రెండంకాలు. నాయకుడు దాసుడు, లేక నటవిటచేట ప్రభృతులు. ఉపనాయకుడు ఇంకా తక్కువ వాడు. నాయిక దాసి. కైశికీ, భారతీ వృత్తులు, మధుపాన గోష్ఠి, లయతాళాదికమయిన విలాస బహుళం, ముఖ నిర్వహణ సంధులు.

ప్రస్థానకం మొదటిది మూడు విధాలు. అల్ప విద్ధము, మసృణం, రెండవ విధంలో ఒకే ఒక అంకం, ప్రయాణం వలన గాని, ప్రథమాను రాగం వల్ల గాని ఉద్బుద్ధమైన శృంగారం, వీర రసంగా

పరిణమిస్తుంది. మూడోది వసంత, వర్ష ఋతువర్ణనతో శోభిస్తుంది మూడవ విధం.

శ్రీ.చ.

ప్రహసనం : దశవిధ రూపకాలలో నాలుగవది. ప్రకృష్టంగా (ఎక్కువగా) హసింప జేసేది, నవ్వుపుట్టించేది, కాబట్టి ప్రహసనం. హాస్యవచన భూయిష్టమైంది కాబ్టటి ప్రహసనం. అందుకనే దీనిని ఆధునికులు హాస్య నాటిక అని, వినోద నాటిక అని వ్యవహరిస్తున్నారు.

దీనిలో హాస్యరసం ప్రధాన రసం, భారతీ వృత్తి ప్రయోగించాలి.ఒకే అంకం, అందులో మొదటి సగం ముఖసంధికినీ, తక్కిన సగం నిర్వహణ సంధికినీ ఉపయోగించాలి. ఇతివృత్తం కల్పితం. దీనిలో విష్కంభ ప్రవేశకాలు, ఆరభటీ వృత్తి ప్రవేశ పెట్టరాదు.

భరతముని నాట్య శాస్త్రంలో ప్రహసనం రెండు విధాలని చెప్పాడు. 1. శుద్ధ ప్రహసనం, 2. సంకీర్ణ ప్రహసనం. కాని ధనంజయుడు దీనిని మూడు విధాలుగా వింగడించాడు. భరతముని చెప్పిన రెండు భేదాలే గాక వికృత మని ఇంకొక ప్రహసన భేదం కూడా చెప్పాడు.

శుద్ధ ప్రహసనం : భగవత్, తాపస, బ్రాహ్మణ, శాక్యాదులు పాత్రలు. వీరిలో ధృష్టుడు (కుశ్చితుడు) నాయకుడు. ఒకే ఒకరి చరిత్ర ప్రయుక్తమయి వేష భాషా చేష్టలచే నవ్వు పుట్టించేది. పాత్రల భాషా, ఆచారాలను యథాతథంగా ప్రయోగింపజేయాలి. ఉదా: కలికేళి; సంకీర్ణం: చోరులు, జూదరులు మొదలైన ధూర్తుల చరిత్ర ఇతివృత్తం. ఒకటి గాని, రెండు గాని అంకాలు, ముఖ నిర్వహణ లాస్యాంగాలే గాక వీధ్యంగ నిబద్ధం సర్వత్రా హాస్య రస విస్తరణ కాని హాస్యం, మోటుగా ఉండక మృదువుగా ఉండాలి. అశ్లీలం పనికిరాదు. ఉదా: లటకమేళకము, ధూర్త చరితము. పునర్మరణ ప్రహసనం (తెలుగు), బధిర చతుష్టయం (తెలుగు). దశవిధ రూపకాలలోని ప్రహసన రూపకానికి అంగాలు పది. అవి. అవలగితం, అవస్యందం, వ్యవహారం, విప్రలంభం, ఉపపత్తి, భయం, అనృతం, విభ్రాంతి, గద్గద వాక్కు, ప్రలాపం.

శ్రీ.చ.

ప్రాంప్టర్ – ప్రాంప్టింగ్ : ప్రాంప్టర్- ప్రాంప్టింగ్ అనే పదాలు ఇంగ్లీషు పదాలైనా తెలుగులో బహుళ ప్రచారంలోకి వచ్చాయి. నాటకరంగానికి సంబంధించినవారు ఈ పదాలను తెలుగు పదాలుగానే వాడుతున్నారు.

నాటక ప్రదర్శన సమయంలో రంగ స్థలం మీద నటీ నటులు నటిస్తూ తమ వాచికం మరిచిపోతే వారికి అందించి ప్రదర్శన రసాభాసం కాకుండా కాపాడే వ్యక్తి ప్రాంప్టరు. ఇలా చేయడం ప్రాంప్టింగు. కొన్ని సందర్భాల్లో ప్రదర్శన విజయం ఈమేరకు అతని మీద ఆధారపడి ఉంది. ప్రాంప్టింగ్ నిర్వహించేటపుడు ప్రేక్షకులకంట పడరాదు. ప్రాంప్టింగు ప్రేక్షకులకు వినిపించకూడదు. ఇది కూడా ఒక కళే.

ప్రదర్శన హడావిడిలో నటులు వాచికం మరచి పోవడం సహజం. వాచికం మరిచిపోయినపుడు స్వంత మాటలు వాడడం జరుగుతుంది, అవి నాటకంలో అతకక పోవచ్చు. అందువల్ల ప్రాంప్టింగు, ప్రాంప్టరు అవసరం. ప్రయోక్త లేక దర్శకుని దృష్టి సామాన్యంగా నటుల అభినయం, కదలికలు మొదలయిన వాటి మీద ఉంటుంది. అందువల్ల ఒద్దికల సమయంలో ప్రాంప్టరు అవసరం. ఒద్దికలలో ప్రాంప్టరు పాల్గంటే ఏ నటుడు ఎక్కడ వాచికం మరచిపోతున్నాడో తెలుసుకొని ఆవాచికం గుర్తు పెట్టుకొని తగు సమయంలో అందించడం తేలికవుతుంది.

నటుడు వాచికం ఎక్కడ మరచి పోతున్నాడో, తెలుసుకోవడమే గాక ఏ వాక్యంలో ఎక్కడ ఎంత విరామం ఇస్తున్నాడో, ఏ స్థాయిలో ఎత్తుకొని ఏ స్థాయిలో ముగిస్తున్నాడో గమనించి జ్ఞాపకం పెట్టుకొని ఆయా విరామాలలో, ఆయా స్థాయిలలో అందివ్వాలి. అపుడు నటుడు తీరికగా వాచికాన్ని అందుకొని ఆ స్థాయిని కోలుపోకుండా జాగ్రత్తపడతాడు.

నటునికి ప్రాంప్టింగు చక్కగా, త్వరగా అందాలంటే ప్రాంప్టింగు నటునికి సాధ్యమైనంత దగ్గరలో ఉండి అందించాలి. నటుని కదలికల్ని కనిపెట్టి ప్రాంప్టరు నటునితో పాటు తానూ కదలుతూ వాచికం అందివ్వాలే గాని ఒక చోట నిలబడి దూరంగా ఉన్న నటునికి వాచికం వినబడాలని బిగ్గరగా చెప్పివ్వకూడదు. అలా చేస్తే ప్రాంప్టరు వాచికం ప్రేక్షకుల చెవినపడి రసాభాస అవుతుంది.

ఒద్దికలలో పాల్గనని వానిని ప్రదర్శన సమయంలో ప్రాంప్టరుగా అనవసరమైన కొత్త చిక్కులు రావచ్చు.

ఈ ప్రాంప్టరు – ప్రాంప్టింగు ప్రాచీన గ్రీకు నాటకరంగంలో కూడా కనిపిస్తుంది. అరిస్టోఫేన్స్ (క్రీ.పూ. 450–387) పక్షులు అనే నాటకంలో రంగస్థలం మీది నటుడు వాచికం మరచిపోయి, ప్రాంప్టరు – ప్రాంప్టరు అని కేక పెట్టడం ప్రాంప్టరు తెరలో నుంచి వాచికం అందివ్వడం చిత్రించాడు.

భరతముని నాట్య శాస్త్రంలో 'సిద్ధి' అనే ఇరవై ఏడవ అధ్యాయంలో నటుడు వాచికం మరవడం స్మృతి ప్రమోహమని, తడబాటును స్ఖలనమని పేర్కొనడం వల్ల నాడు కూడా ప్రాంప్టరు ఉండేవాడేమోనని అనుమానించ వలసి వస్తోంది. ఏదేమైనా ప్రాంప్టర్ సహాయంతో నాటకాన్ని ప్రదర్శించడం కంటే ప్రదర్శించకపోవడమే మంచిది.

శ్రీ.చ.

ప్రాచీన పాశ్చాత్య నాటకరంగం : ఈ నాటక చరిత్ర గ్రంథాన్ని 1961లో శ్రీనివాస చక్రవర్తి రచించాడు. ఈ గ్రంథంలో ప్రాచీన

గ్రీకు నాటకరంగం, గ్రీకు నాటక కవులు, ప్రాచీన రోమన్ నాటకరంగం, మధ్య యుగాల పాశ్చాత్య నాటకరంగం అనే నాలుగు అధ్యాయాలున్నాయి.

ప్రాచీన కాలంలో ఆయా పాశ్చాత్య దేశాలలో నాటకరంగ ప్రగతి, వివిధ రీతుల నాటకాలు, నాటక రచనా విధానం, ప్రదర్శనా విధానం,నాటక కర్తలు, నటులు, రంగస్థలం మొదలైన నాటక రంగ విషయాలు వ్యక్తీకరించాడు.

శ్రీ.చ.

ప్రాప్త్యాశ : కార్యావస్థల్లో మూడవది. ప్రాప్త్యాశ అనగా ఫల ప్రాప్తి సంభవించుననే ఆశ. దీన్ని భరతముని నాట్య శాస్త్రంలో ప్రాప్తి సంభవం అన్నాడు.

కార్యసాధన కృషిలో ఫలం సిద్ధిస్తుందనే ఆశ కొద్దిగా అంకురిస్తుంది. దీనితో పాటు సిద్ధించదేమోననే శంక కూడా కలిగి సందిగ్ధావస్థ వస్తుంది. ఈ అనిశ్చిత సందిగ్ధావస్థనే ప్రాప్త్యాశ, ప్రాప్తి సంభవం అని సంస్కృత లాక్షణికులు చెప్పారు. ఇంగ్లీషులో దీనిని సంక్షోభం (crisis),క్లైమాక్స్ . అంటారు. ఈ సందిగ్ధావస్థలో నాటకం కొత్త మలుపు తిరుగుతుంది. అందుకనే దీనిని టర్నింగ్ పాయింట్ అంటారు.

"ఉపాయాపాయ శంకల చేత ప్రాప్తి సంభవము ప్రాప్త్యాశ. సంభవము కలుగునని తోచుట." ఆం. సా.ద. 6-327.

బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్రీయం తృతీయాంకంలో హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి రాజ్యం ధారపోయడంతో అతని కష్టాలు ప్రారంభమౌతాయి. ఇక విశ్వామిత్రుని పక్షంలో రాజ్యం పోయింది కాబట్టి తన మాట వింటాడనే ఆశ, రాజ్యమే పరిత్యజించిన హరిశ్చంద్రుడు అబద్ధమాడతాడా అనే శంక ఒక వంక సందిగ్ధావస్థలో పడతాయి.

శ్రీ.చ.

ప్రాప్తి : 1. ముఖ సంధ్యంగం, 2. నాటక లక్షణం. సుఖం ప్రాప్తించడం ప్రాప్తి. (ప్రాప్తిః సుఖాగమః).
నాటక లక్షణం: ఒక అంశం ఆధారం చేసుకొని ఇంకొక అంశం అనుమానించడం లేదా అభియోగించడం ప్రాప్తి. (ఏదేనొక యంశము చేత నొక దానిని అనుమానించుట ప్రాప్తియనంబడును - ఆం. స. ద. 6-446)

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి రచించిన సత్యహరిశ్చంద్రీయం షష్ఠమాంకంలో చంద్రమతి మంగళ సూత్రం వీరదాసు కంట పడడం అనే అంశం మూలంగా అతడు హరిశ్చంద్రుడని చంద్రమతి అనుమానించడం.

శ్రీ.చ.

ప్రాసంగికం : వస్తు (ఇతివృత్తం) భేదం. ప్రధాన కథ (అధికారికం)లో అంతర్భాగంగా నడిచే వేరు కథ. ఈ ప్రాసంగికేతివృత్తాన్నే పాశ్చాత్యులు ఉపకథ (sub plot) అన్నారు. అధికారిక, ప్రాసంగికేతివృత్తాలు రెండూ వేరు వేరు అనే భావం కలిగించకుండా ఒక దానితో ఒకటి పెనవేసుకొని ఒక దానికొకటి దోహదం చేసుకుంటూ సాగిపోవాలి. అప్పుడే నాటకానికి పరిపూర్ణత చేకూరుతుంది. ప్రాసంగికేతివృత్త నిర్మాణం నాటక రచయిత ప్రతిభకు గీటురాయి.

నాటక నాయకుని (ఫలభోక్త) చరిత్ర, స్వభావం చిత్రించిన కథ ఆధికారికేతి వృత్తం. ఈ ఫలసాధనలో నాయకునికి సహాయ పడే ఉపనాయకుని కథ ప్రధానకథకు దోహదం చేసినపుడు దానిని ప్రాసంగికేతి వృత్తం అంటారు. ఇది ప్రసంగవశాత్తు ప్రసక్తమవుతుంది కాబట్టి ప్రాసంగికం లేదా ప్రాసంగికేతి వృత్తం. దీనికి నాయకుడు, నాయక సహాయకుడు అంటే ఉపనాయకుడు లేక నాయకేతరుడు. ధనంజయుడు దీనిని ఇలా నిర్వచించాడు. (ప్రాసంగికం పరార్థస్య స్వార్థోయస్య ప్రసంగతః - ద.రూ. 1-12)

నాయకుడు గాక పరుల ద్వారా నిర్వర్తితమయ్యేది, ప్రసంగ వశాత్తు నాయకుని ప్రయోజనం కూడా సాధించేది ప్రాసంగికేతి వృత్తం. దీనినే విశ్వనాథ కవిరాజు -

'ఆధికారికేతి వృత్తమునకు ఉపకరణ నిమిత్తమయిన చరితమేదో అది ప్రాసంగికము.' ఉదా: సుగ్రీవాది చరితము. అను: వేదం. 6-29).

దీని ఫలసిద్ధిని ప్రాసంగికం అంటారు. ఈ ప్రాసంగికం ప్రకరి, పతాక అని రెండు విధాలు.

శ్రీ.చ.

ప్రియోక్తి : నాటక లక్షణం. నాట్యశాస్త్రంలో ఉపజాతి వృత్త పాఠ భేదం. ప్రోత్సాహంతో సమన్వయిస్తుంది. దీనిని ప్రియ వచనమని, మధుర భాషణమని కూడా అంటారు. పూజ్యులను స్తుతించేటప్పుడు హర్షాన్ని వ్యక్తీకరించే వాక్యం ప్రియోక్తి.

"ప్రసన్నమైన మనస్సుతో పూజ్యులను పూజించునప్పుడు తన మనస్సులోని హర్షమును వెల్లడి చేయుటకు చెప్పెడి మాటలు 'ప్రియోక్తి' అనబడును". *(నా.శా. 16 అధ్యాయం, - అను. డా. పోణంగి, పుట 444)*

శ్రీ.చ.

ప్రీస్ట్లీ, జె.బి. (1894-1984) : ప్రముఖ ఆంగ్ల నాటకకర్త, నవలా రచయిత, వ్యాసకర్త. జాన్‌బ్లైటన్ ప్రీస్ట్లీ బ్రాడ్ ఫోర్డ్‌లో 1894, సెప్టెంబర్ 13న జన్మించాడు. తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో అతికష్టం మీద కుటుంబ భారాన్ని మోస్తూ వచ్చాడు. అందువల్ల పిన్నవయసులోనే ప్రీస్ట్లీ స్వయం పోషణతోనే విద్యాభ్యాసం సాగించాల్సి వచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధంలో సైనికుడిగా చేరి, తన శక్తి సామర్థ్యాలతో కమిషన్డ్ ఆఫీసర్ స్థాయికి ఎదిగాడు. యుద్ధం ముగిశాక కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చేరి

ఆంగ్లసాహిత్యంలో ఆనర్స్ డిగ్రీ పొందాడు. పదహారవ ఏట నుంచీ లండన్ పత్రికలకూ, స్థానిక పత్రికలకూ వ్యాసాలు రాయడం ద్వారా లభించే ప్రతిఫలంతోనే అతని విద్యావ్యాసంగం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోయింది. 1922లో లండన్ చేరుకొని సమీక్షకుడుగా, సాహిత్య విమర్శకుడుగా గుర్తింపు పొందాడు. 1929 నుంచి నవలా రచనకు పూనుకొని సుమారు 20 నవలలు రాశాడు. (ది గుడ్ కంపానియన్స్) 'మంచి మిత్రులు'అనే నవల ప్రప్రథమంగా బహుళ జనాదరణ పొంది, ప్రీస్ట్లీ పేరును ప్రాచుర్యంలోకి తెచ్చింది. నవలా రచయితగా తన స్థానం పదిలం చేసుకొన్న తరవాత ఈయన దృష్టి నాటకరంగంపై మళ్ళింది. 1931 నుంచీ నాటక రచయితగా కలం పట్టి, మంచి మిత్రులు నవలను ప్రదర్శనానుకూలంగా నాటకీకరించి అద్భుతంగా ప్రదర్శింపచేయడంతో ప్రీస్ట్లీ నాటక జీవితానికి అంకురార్పణ జరిగింది. 1932లో డేంజరస్ కార్నర్ నాటకానికి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన, ప్రోత్సాహం లభించడంతో నాటక రచయితగా తానింకా ముందుకు దూసుకు పోగలనన్న నమ్మకం, ఆత్మవిశ్వాసం బలపడ్డాయి. అప్పటి నుంచీ నాటకరచనే ఆయన ప్రధాన వ్యాపకమైంది. ఆ క్రమంలో ప్రీస్ట్లీకలం నుంచి 49 నాటకాలు వెలుగు చూశాయి. 1930వ దశకంలో వాస్తవిక నాటకాల నమూనాతో విజయవంతంగా నడుస్తున్న డ్రాయింగ్ రూమ్ నాటకాల నుంచి భిన్న మార్గం తొక్కడానికి ప్రతి రచయితా వెనకంజవేసే ఆ రోజుల్లో, కొత్త ప్రయోగాల వైపు దృష్టి నిలిపిన రచయిత ప్రీస్ట్లీకావడం గమనార్హం. గతంతో వర్తమానాన్ని మేళవించి ప్రేక్షకుల ఉత్కంఠను చివరిక్షణం దాకా పట్టి నిలిపే నాటక శిల్పం ప్రీస్ట్లీ కి వెన్నతో పెట్టిన విద్య. భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లోని పాత్రలను ఒకే రంగస్థలం మీదికి రప్పిస్తూ రచయిత 'కాలం'తో చేసే విన్యాసాలు ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తూ వారిలో అనిర్వచనీయ అలౌకిక ఆనందానుభూతిని కలిగిస్తాయి. వాస్తవ వ్యతిరేక (నాన్ రియలిస్టిక్) నాటక నిర్మాణ పంథాలో కొన్ని నాటకాలను రచించి, ప్రదర్శనలో రక్తి కట్టించి తన సృజనాత్మక సాహితీ గరిమను నిరూపించుకున్నాడు. కష్టాల కొలిమిలో అంటకాగిన ప్రీస్ట్లీకి జీవితమే పాఠాలు నేర్పింది. ఆ పాఠాలే తన రచనా వ్యాసంగానికి ఊపిరి పోశాయి.

కాలగమనంలోని వైచిత్రిని భిన్నకోణాల నుంచి ఆవిష్కరించే క్రమంలో ప్రీస్ట్లీ కలం నుంచి జాలువారిన 'టైమ్ అండ్ ది కాన్వేస్' (1937), 'ఐ హావ్ బీన్ హియర్ బిఫోర్' (1937) అనే నాటకాలు ఆయన శిల్ప వైదుష్యానికి, నిశిత తాత్విక ధోరణికి మణిదర్పణాలు. ప్రీస్ట్లీకి అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించిపెట్టిన నాటకాలలో 'యాన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్' (1946) అతి ముఖ్యమైంది. ఇది సంక్లిష్టతా సంభరితమైన ఆలోచనాత్మక నాటకం. స్వార్థంతో కరడుగట్టుకుపోయిన ఈ సంఘంలో అనాథలు పడుతున్న కష్టాలు, కార్చే కన్నీళ్ళు, ఒక అనాథ జీవితం పతనమైపోవటానికి తామే కారకులమని తెలిసి కూడా పశ్చాత్తాపపడి ఒక కన్నీటిబట్టయినా రాల్చని నరరూప రాక్షసుల మనస్తత్వానికి ఈ నాటకం అద్దం పడుతుంది.

ఒక మనిషి కొన్నాళ్ళు ఒక ప్రదేశంలో కాలం గడిపి, తరువాత ఎన్నో ఏళ్ళకు అదే చోటికి రావడం జరిగితే ఒకనాటి జ్ఞాపకాలు అతనిని వెంటాడుతూ, జ్ఞాపకాల పొరల్లో దాగిన అనుభూతుల మధురిమను అందిస్తూ ఆహ్లాదపరుస్తాయనీ, మనసును ఏదో తెలియని లోకాలకు పరుగులు తీయిస్తాయని, ఐ హావ్ బీన్ హియర్ బిఫోర్ అనే నాటకం అభివ్యక్తం చేస్తుంది. ఈ నాటకాన్ని కాలచక్రం (1961) పేరుతో తెలుగులోకి జె. రమాకాంత్ అనువదించాడు. యాన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్ నాటకాన్ని కొప్పరపు సుబ్బారావు ఇనపతెరలు (1950) పేరుతో అనువదించాడు. ఇనపతెరలు నాటకం 50వ దశకంలో విస్తృతంగా ప్రదర్శింపబడి రసజ్ఞుల ప్రశంసలు పొందింది. యాన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్ నాటకాన్ని ఆచార్య ఆత్రేయ చావ కూడదు పేరుతో అన్నీ స్త్రీ పాత్రలతో నాటికగా రాశాడు. ఈ నాటిక గుడివాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తులో జనరంజకంగా ప్రదర్శితమై అనేక బహుమతులు అందుకొంది.

ప్రీస్ట్లీనాటకాలకు తెలుగు నేల మీద ఆదరణ లభించడానికి ముఖ్య కారణం ఆ రెండు నాటకాల ఇతివృత్తం తెలుగువారి సంస్కృతికి, ఆలోచనాసరళికి అతి సన్నిహితంగా ఉండటమే! 90 సంవత్సరాల వయసులో ప్రీస్ట్లీ 1984లో మరణించాడు.

గం.సు.రె.

ప్రేంఖణం : సంస్కృత ఉపరూపకం. దీనిని ఉపరూపకంగా కొందరు లాక్షణికులు చెప్పలేదు. ఏకాంకం, హీన నాయకం, సూత్రధారుడు, గర్భావమర్శ సంధులు, విష్కంభక ప్రవేశికాలు ఉండవు. వీథ్యంగాలుంటాయి. నాందీ ప్రరోచన నేపథ్యంలోనే ప్రయోగించాలి. నియుద్ధం, రోషభాషణం అన్ని వృత్తులు కలిగి ఉండాలి.

శ్రీ.చ.

ప్రేక్షకులు : ప్రేక్ష అనగా చూపు. నాటకాన్ని చూసేవారు ప్రేక్షకులు. పెద్దలు, పిన్నలు, స్త్రీలు, విద్యాధికులు, నిరక్షరాస్యులు, నాగరీకులు, అనాగరికులు, రసికులు, అరసికులు, ధనికులు, దరిద్రులు, శత్రువులు, మిత్రులు మొదలైన వివిధ తరగతుల వారితో ప్రేక్షక లోకం కూడి ఉంటుంది. నాటక ప్రదర్శన ఇన్ని రకాల వారిని మెప్పించేదిగా ఉండాలి. ఈ ప్రేక్షక లోకపు కనీస లక్షణం సహృదయత. గుణ గ్రహణం. నటీనటులు, దర్శకులు ఎంత కష్టపడి నాటకం ప్రదర్శించినా, ప్రేక్షకులు సహృదయులు, సానుభూతి పరులుకాకుంటే వారికి నాటక ప్రదర్శనం నచ్చదు.

నాటకశాలలో సృష్టింపబడే రసప్రపంచంలో ప్రధాన భాగస్వాములు ప్రేక్షకులు. నిజానికి రసాన్ని ఆస్వాదించి ఆనందించేది ప్రేక్షకులే. వారికోసమే నాటక ప్రదర్శన. వీరు లేకుంటే నాటక ప్రదర్శన లేనట్టే. ఆ ప్రదర్శన సాధన (రిహార్సల్స్) లాంటిదవుతుంది.

నందికేశ్వరుడు అభినయదర్పణంలో ప్రేక్షక లోకాన్ని సభ అని పేర్కొన్నాడు. ప్రేక్షకుల్లో కొందరు నటవర్గానికి మిత్రులు, కొందరు శత్రువులై ఉండవచ్చు. మిత్రులు సానుభూతితో నాటకం చూస్తారు. ఇక శత్రువులు ఏవగింపుతో, అసూయతో, పక్షపాత దృష్టితో చూస్తారు. నాటకం విజయం పొందకుండా అల్లరి చేస్తారు. ఈ శత్రు వర్గాన్ని నటులు తమ నటనా నైపుణ్యం వల్ల గాని, ఇతరత్రాగాని అదుపులో ఉంచవలసి ఉంటుంది.

నటుల ద్వారా రసానందాన్ని పొంది ప్రేక్షకులు వారిని ఉత్తేజపరుస్తారు. ప్రేక్షకులు లేని ప్రేక్షాగారం నటుల ఉత్సాహాన్ని చంపివేస్తుంది. నాటకం మానవ జీవితానికి దర్పణం కాబట్టి అది ప్రేక్షకుల భావాలను ప్రతిబింబిస్తుంది. అందుచేత ప్రేక్షకులను కేవలం నాటకం చూచేవారుగానే గాక నాటక ప్రదర్శనలో భాగస్వాములుగానే పరిగణించాలి.

నాటకీయులు ప్రేక్షకలోకాన్ని ప్రజాబాహుళ్యంగా పరిగణిస్తారు. వీరు ప్రజా బాహుళ్యానికి ప్రతి నిధులు. అందువల్ల నాటకరంగం కళారంగానికే గాక సామాజిక రంగానికి కూడా సంబంధించింది.

శ్రీ.చ.

ప్రేక్షణకం : సంస్కృత ఉపరూపకం. నర్తన రూపక భేదం. అగ్ని పురాణం ఈ ఉపరూపకాన్ని పేర్కొంది. సాహిత్య దర్పణం దీన్ని ప్రేంఖణమని చెప్పింది.

వీధిలో గాని, సమాజంలోగాని, సత్రంలోగాని, దేవాలయ ప్రాంగణంలోగాని అనేక పాత్రలతో కూడిన ప్రదర్శనం ప్రేక్షణకం. ఏకాంకం, అన్ని వృత్తులు, హీన నాయకం, నియుద్ధ సంఫేటములుంటాయి. గర్భ విమర్శ సంధులు, సత్రధార విష్కంభ ప్రవేశకాలు ఉండవు. ఉదా: కామ దహనం.

గర్భ అవమర్శ సంధులు, నేపథ్యభాషితాలు, నాలుగు వృత్తులు కలిగి సూత్రధారుడు లేని నర్తనం ప్రేక్షణకమని శారదా తనయుని అభిప్రాయం. ఉదా: త్రిపుర మర్దనము.

భావ ప్రకాశనములో ''ఆధ్యప్రాయం ప్రేక్షణకం స్యాత్ప్రహేలిక యాన్వితం'' అన్న దానినే అభినవ భారతిలో ప్రేరణగా చెప్పడమైంది. (హాస్య ప్రాయం ప్రేరణంతు)

నర్తనం, ప్రేక్షణకం ఒకే రూపక భేదాలుగా కనపడతాయి. విభిన్న రూపాలు లేనట్టే తోస్తుంది. ఇక సాహిత్య దర్పణం ప్రకారం నర్తనకం లోపించి ప్రేక్షణకం వికసించి రెండు భేదాలను తనలో కలుపుకొని ఒకటిగా గోచరిస్తుంది. ప్రేక్షణకంను శృంగాటకంలో నరనారీజనం ప్రదర్శిస్తుంది.

శ్రీ.చ.

ప్రేయోరసం : రుద్రటుడు కావ్యాలంకారంలో దీనిని పదవ రసంగా (దశమో రసః ప్రేయాన్)పరిగణించి, దీనికి స్నేహం స్థాయీ భావంగా (స్నేహ ప్రకృతిః ప్రేయాన్) పేర్కొన్నాడు. సారాంశంగా స్నేహితుల పరస్పర వ్యవహారమే ప్రేయోరసమని సిద్ధాంతీకరించాడు.

శ్రీచ.

ప్రోషిత భర్తృక : అష్టవిధ నాయికా భేదం. కార్యనిర్వహణలో భర్త దూరదేశంలో ఉన్నప్పుడు ఇంటి వద్ద విరహార్తితో బాధపడే భార్య ప్రోషిత భర్తృక.

ఉదాహరణకు ధర్మవరం కృష్ణమాచార్యులు రచించిన చిత్ర నళీయ నాటకంలో దమయంతి ప్రోషిత భర్తృక.

శ్రీ.చ.

ప్లాటస్ (క్రీ.పూ. 254-184) : రోమన్ నాటక రచయిత. ప్రజారంజకత్వమే ప్రధాన దృష్టిగా పెట్టుకుని నాటకాలు రచించి, హాస్య రూపక స్రష్టగా, మార్గదర్శిగా పేరొందిన రచయిత. దారిద్ర్యాన్ని అధిగమించడానికి నాటక రచనను చేపట్టాడు. ప్రేక్షకులు కోరే విషయాలను,అభిమానించే విషయాలను నాటకాలలో చొప్పించాడు. సాహితీ లోకంలో పెద్ద స్థానం అభిలషించకుండా ప్రేక్షకులను నవ్వించ గలిగితే చాలునని భావించాడు.

ప్లాటస్ గ్రీకు నవ్య నాటకాల నుంచి ముఖ్యంగా మెనాండర్ ఆహ్లాద నాటకాల నుంచి కథ, పాత్ర చిత్రణ, సంభాషణలు తీసుకొని వాటికి అటెల్లానా ప్రహసనాల లక్షణాలను జోడించి నాటకాలు రచించాడు. దీని వల్ల ఇతని నాటకాలు పరస్పర విరుద్ధ విషయాల మిశ్రమ రూపంగా రూపొందినాయి. మెనాండర్ వాస్తవికతను మేలుబంతిగా తీసుకొని రచించిన రంగాలు, మూకాభినయ నాటకాల రీతి హాస్యం, సిసిలీ ఆహ్లాద రూపక అవహేళన ఇతని నాటకాలలో గోచరిస్తాయి. వ్యవహారిక భాషలో

రచించిన సంభాషణలు, పాటలు 18వ శతాబ్ది సంగీత నాటకాలను జ్ఞప్తికి తెస్తాయి.

ప్లాటస్ నాటకాలలోని పాత్రచిత్రణ బహుసున్నితమైంది. ఈయన సృజించిన పాత్రలన్నింటిలో ప్రధానమైనదీ, అపూర్వమైనదీ బానిస పాత్ర. ఈ పాత్ర హాస్యానికి ఆటపట్టు. ఎట్టి శిక్షకైనా భయపడకుండా హుషారుగా ఎత్తులకి పై ఎత్తులు వేస్తూ, మొండిగా వ్యవహరిస్తూ నాయకునికి తోడ్పడే పాత్ర. ముసలి పాత్రలు కూడా ఇతని నాటకాలలో తరచు వస్తూంటాయి. అద్భుతం గొలిపే కథా విన్యాసం, హృదయాన్ని ఆర్ద్రం చేసే రసవత్తర ఘటనలు, ఎత్తుకు పై ఎత్తులు, హాస్య సంఘటనలు నాటక విజయానికి ప్రధానాంశాలని ప్లాటస్ నమ్మాడు. ఈ విధంగా నవీన నాటక రచనా సూత్రం నిర్ధారితమయింది. ఈయన నాటకాలలో నాటకీయవ్యంగ్యం ఎక్కువగా గోచరిస్తుంది. ప్రస్తావనలోనే నాటకకథ ప్రేక్షకులకు తెలిసేటట్టు నాటకీయ ఆనందాన్ని కలిగించేవాడు.

ప్లాటస్ రోమన్ సంఘంలోని పాత్రలను, ఆచార వ్యవహారాలను కథాంశాలుగా తీసుకొని నాటకాలు రచించాడు. షేక్స్పియర్, జాన్సన్ మొదలైన నాటకకర్తలు ప్లాటస్ నాటక కథాంశాలను, పాత్రలను తీసుకొని సొంతం చేసుకున్నారు. ఇతని మెనాచిమీ నాటకం షేక్స్పియర్ రచించిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ నాటకానికి మాతృక. కాప్టిలేస్ అనే ఇతనినాటకం ప్రపంచ నాటక సాహిత్యంలోని అగ్రశ్రేణి నాటకాలలో ఒకటిగా పరిగణిస్తున్నారు. మానవస్వభావ చిత్రణప్లాటస్ నాటకాలలో ఎక్కువగా కనిపిస్తుంది. వాగుడు సిపాయి, కవలపిల్లలు, ఆకేరియా, దయ్యం, బేడకాసు మొదలైనవి ప్రసిద్ధ నాటకాలు.

శ్రీ.చ.

ఫలయోగం : కార్యావస్థ. దీనికి ఫలాగమం అని ఇంకొక పేరు. (వివరాలకు ఫలాగమం చూడండి)

శ్రీ.చ.

ఫలాగమం : కార్యావస్థలలో ఆఖరిది. కార్యసాధన కృషి పూర్తిగానెరవేరడం అంటే పూర్తి ఫలాన్ని పొందడం ఫలాగమం. నాయకుడు ఆశించిన ఫలితాన్ని పూర్తిగా పొందడం ఫలాగమం. (సమగ్రేష్ట ఫలావాప్తిర్నాయ కస్య ఫలాగమః – ర.సు. 3–25)

ఫలాగమంలో ఇంకో విశేషం ఉంది. నాయకుడు ఆటంకాలను అధిగమించి సమగ్ర ఫల ప్రాప్తి పొందుతాడు. లేదా ఆటంకాలను అధిగమించలేక చివరకు వాటికి లంగిపోయి, ప్రత్యర్థులచేతిలో ఓడిపోతాడు లేక మరణం పొందుతాడు లేదా ఆత్మహత్య చేసుకుంటాడు. అయితే భారతీయుల దృష్టి రస దృష్టి, నాటకం హితోపదేశ జనకంగా ఉండాలని వీరి ఆశయం. అంతేగాక సంస్కృతాలంకారికులు మంగళాదీని, మంగళ మధ్యాని, మంగళాంతాని అని అనుశాసించడంతో దుఃఖాంత నాటకాలు సంస్కృతంలో వెలువడలేదు. తెలుగులో విషాద సారంగధర, ఉచ్చల విషాదము, నర్తనశాల, వేనరాజు విషాద నాటకాలకు మచ్చుతునకలు.

శ్రీ.చ.

ఫలితాలు : నాటక ప్రదర్శన వాస్తవికతను సంతరించుకోవడానికి చేసే అదనపు హంగులను ఫలితాలు (Effects) అంటారు. ఈ ఫలితాలు రెండు రకాలు 1. ధ్వని ఫలితాలు, 2. కాంతి ఫలితాలు.

1. ధ్వని ఫలితాలు : నాటక ప్రయోగ సమయంలో వివిధ ధ్వనులను వినిపించవలసి ఉంటుంది. అవి సహజంగా ఉంటేనే వాస్తవిక వాతావరణం సృజితమవుతుంది. పూర్వం టేపురికార్డర్ లాంటి సాధనాలు లేక పోవడం వల్ల ధ్వనులను వర్ణించి చెప్పేవారు. ధర్మవరం కృష్ణమాచార్యులు రచించిన సావిత్రీ చిత్రాశ్వంలో తెర లోపలి వ్యాఘ్ర ధ్వనిని చిత్రాశ్వుని చేత ఇలా వర్ణింపచేశాడు. “ఆహా ఏమీ అద్భుతారావము. వ్యాఘ్రధ్వానము వలేనున్నది. (అంకము : రంగము3)

ఇపుడు వ్యాఘ్రధ్వని రికార్డులు దొరుకుతున్నాయి. వాటిని ప్రయోగంలో తగు సమయంలో వాడడం వల్ల సహజ వాతావరణం సృజితమవుతుంది. టేప్‌రికార్డర్ ద్వారా గాని, ఇతర చేతి పనుల ద్వారా గాని సహజ వాతావరణం సృష్టించవచ్చు. అవసరమైనంత పొడవు, వెడల్పుగల రేకును వేలాడగట్టి కింద అంచును పట్టుకొని కదిలించడం ద్వారా ఉరుము శబ్దం పుట్టించవచ్చు. ఈ రేకును ఉరుము రేకు (thunder sheet) అంటారు.

కొబ్బరి చిప్పలను నేల మీద ఒకవైపున నొక్కి పట్టి కొట్టడం ద్వారా గుఱ్ఱం డెక్కల చప్పుడు విన్పించవచ్చు. ఒక బక్కెనలో గాజుముక్కలు పోసి వాటిని అమాంతం ఇంకో ఖాళీ బక్కెనలో గుమ్మరిస్తే గాజు తలుపులు బద్దలయిన శబ్దం వస్తుంది.

కర్రచివర బాగా ఉండగా గుడ్డలు చుట్టి ఖాళీ డ్రమ్ము మీద కొట్టడం ద్వారా ఫిరంగి శబ్దం, మెత్తటి సోఫా మీద ఫేము బెత్తంతో కొట్టడం ద్వారా తుపాకి శబ్దం, రివాల్వర్ కాల్పుల శబ్దం పుట్టించవచ్చు. మెరుగు కాగితం అంటించిన రెండు కొయ్య ముక్కలు ఒక దాని మీద ఒకటి పెట్టి రుద్దడం ద్వారా సిపాయిల కవాతు శబ్దం వినిపించవచ్చు. వీటినే లయబద్ధంగా రుద్దితే రైలింజన్ శబ్దం వస్తుంది.

ఒక పెద్ద అట్ట పెట్టెలో గాని, కొయ్య పెట్టెలో గాని కందులు, పెసలు లేదా చిన్న గుళ్లు గాని వేసి కదల్చడం వల్ల వాన శబ్దం వస్తుంది. ఈ కదల్చడంలోని వేగం మార్పు వల్ల వర్షపాతం తక్కువ ఎక్కువ శబ్దం వస్తుంది. ఈ పెట్టెను 'రెయిన్‌బాక్స్' అంటారు.

ఖాళీ అగ్గిపెట్టలు మైక్ ముందు విరవడం, నలపడం ద్వారా కర్రలు, చెట్లు ఫెళఫెళా విరగడం వినిపించవచ్చు. మైక్ ముందు సెలఫెన్ కాగితం నలపడం ద్వారా మంటల శబ్దాలు, ఉలిపిరి

కాగితం మడిచి దాని సందు నుంచి మైక్ ముందు ఊదడం వల్ల ఏనుగు ఘీంకారం, ఫిడేల్ మీద అపశ్రుతిలో కమాను లాగడం ద్వారా తలుపుల కిర్రు శబ్దం వినిపించవచ్చు. అవసరాలను బట్టి రకరకాల ధ్వనులను వినిపించవచ్చు. లేదా ఆయా రికార్డుల ద్వారా వినిపించవచ్చు.

2. కాంతి ఫలితాలు : నాటక ప్రయోగ కాలంలో వివిధ దృశ్యాలను ప్రేక్షకులకు ద్యోతకం చేయవలసి ఉంటుంది. దీనివల్ల వాస్తవిక వాతావరణం ఏర్పడి ప్రయోగానికి పుష్టినిస్తుంది. రససిద్ధికి తోడ్పడుతుంది. దృశ్యాలను ద్యోతకం చేయడానికి కాంతిని ఉపయోగించే అవకాశాలు లేని పూర్వకాలంలో వర్ణనలతో ఆయా దృశ్యాలను ప్రేక్షకుల కళ్లకు కట్టేటట్టు చేయడానికి నాటకకర్తలు వర్ణనలు ఉపయోగించేవారు. ఇపుడు కాంతి ప్రసారం ద్వారా ఆయా దృశ్యాలను యదార్థంగా ప్రేక్షకులకు చూపించే అవకాశాలు సాంకేతిక నిపుణుడిపై ఆధారపడి ఉంటుంది.

వెనక తెల్లటి తెర (సైక్లోరమా) మీద ఎరుపు, పసుపు పచ్చ, గులాబీ, బంగారు రంగు గల వెల్లువ దీపాలు **(lights)** క్రమేపీ కాంతిని తగ్గించడం, ఎక్కువ చేయడం వల్ల ఎఫెక్ట్స్ ప్రొజెక్టర్ **(effects projector)** మీద వివిధ రంగుల స్లైడులు, మబ్బుల స్లైడులు వేయడం వల్ల సూర్యాస్తమయం ద్యోతకం చేయవచ్చు.

చివరి తెర వెనక ఒకటి రెండు బల్బులు గల ఎనామిల్ బేసిన్ కావలసిన స్థానంలో వేలాడగట్టి స్పాటు లైట్‌కు అడ్డంగా కావలసిన ఆకారంలో (అర్ధ చంద్రుడు వగైయిరా) కత్తిరించిన రేకు అడ్డంగా ఉంచి వెనక తెర మీద కాంతి బింబం పడే విధంగా ఏర్పాటు చేస్తే చంద్రుడు కనిపిస్తాడు. నాటకం జరుగుతున్నపుడు చంద్రుని స్థానం మారడం చూపించాలంటే గ్రిడ్ మీద నుంచి దీపం వేలాడదీసి తీగల ద్వారా స్థానం మార్చడం.

ప్రేక్షకుల దృష్టికి గోచరించకుండా ఉండే ఎత్తున చిల్లుల గొట్టంలోకి నీళ్లు ప్రవహించే ఏర్పాటు చేయాలి. ఆ నీళ్లు పడడానికి కింద దోనె లాంటిది అమర్చాలి. కిటికీ పైన చిల్లుల గొట్టం, కిటికీ కింద దోనె ఉండేలాగా ఏర్పాటు చేస్తే వాన దృశ్యం స్పష్టంగా గోచరిస్తుంది. చిల్లుల గొట్టంలో నుంచి పడే నీటిని అదుపులో ఉంచడానికి పంపులు అమర్చి వాన ఎక్కువ తక్కువలను చూపించవచ్చు.

వెనక తెర మీదకు, వెల్లువ దీపాల మీద ఎరుపు, నారింజ, గులాబీ, చాక్‌లెట్, పసుపు పచ్చ రంగుల మీడియాలు వాడి పొగ కూడా ఏర్పాటు చేయడం వల్ల, ఎరుపు, రోజా, పసుపు పచ్చ రంగు గల సిల్కు పీకెలు ఎగుడుదిగుడుగా కత్తిరించి అనుకూలమైన వస్తువునకు కట్టి అవి పైకెగిరే లాగా ఎలక్ట్రిక్ ఫ్యాన్ గాని, బ్లోయర్ గాని వేయాలి. దాని మీద నారింజ రంగు మొదలైన వాటితో వెల్లువ దీపకాంతిని ప్రసరింప చేస్తే మంటల దృశ్యం కనిపిస్తుంది.

శ్రీ.చ.

ఫార్క్యుహార్, జార్జ్ (1687-1707) : ఐరిష్ నాటక రచయిత. 18వ శతాబ్ది ప్రారంభంలో ఇంగ్లీష్‌నాటకరంగం కోసం శక్తివంతమైన హాస్య రూపకాలు రచించాడు. సంభాషణలలోని మౌలికత, స్వయంగా నటుడు కావడంవల్ల సాధించిన రంగస్థల యోగ్యత ఈయన సమకాలికులలో విలక్షణ నాటక రచయితగా నిరూపించాయి.

మతోద్యోగి కుమారుడైన ఫార్క్వహార్ డబ్లిన్‌లోని ట్రినిటీ కళాశాలలో చేరాడు. కాని తన శక్తియుక్తులన్నీ డబ్లిన్‌లోని స్మాక్ ఆలీ థియేటర్‌లో నటుడుగా రాణించడానికే వినియోగించి, చివరికి దానిలో విఫలుడయ్యాడు. అనంతరం నటనా వృత్తిని పరిహరించి తనతో నటించిన ప్రముఖ నటుడు రాబర్ట్ విల్క్స్ సలహా మీద కామెడీ రూపకాలను రచించడం కోసం లండన్ వెళ్లాడు. ఈయన రచించిన తొలి నాటకాలు విజయవంతం అయ్యాయి.

ఫార్క్వహార్ తొలి రూపకం లవ్ అండ్ ఏ బాటిల్ 1699లో లండన్‌లోని డ్రూరీ లేన్ థియేటర్‌లో ప్రదర్శింపబడి విజయవంతం కావడంతో ఆ ఏడాదే ది కాన్‌స్టెంట్ కపుల్ అనే మరొకరూపకం కూడారాశాడు. 1701లో సర్‌హారీ విల్‌డెయిర్ వెలువడింది. 1702-04 మధ్య ది ఇన్‌కాన్‌స్టెంట్(జాన్ ఫ్లెచర్ రాసిన వైల్డ్ గూస్ ఛేజ్‌కి అనుసరణ), ది ట్విన్ రైవల్స్, ఫ్రెంచ్ నుంచి యథేచ్ఛానువాదం చేసిన ది స్టేజ్‌కోచ్ అనే రూపకాలను రచించాడు. తరువాత 1706 వరకూ ఫార్క్వహార్ ఏ నాటకాలూ రచించలేదు.

ఇంగ్లీష్ నాటకరంగానికి ఫార్క్వహార్ అందించిన గొప్ప కానుక 1706లో వెలువడిన ది రిక్రూటింగ్ ఆఫీసర్. ఆ మరుసటి సంవత్సరం ది బ్యూక్ స్ట్రేటజెమ్ వెలువడింది. ఈ నాటకాలలో ఎలిజబెతెన్ నాటక రచయితలకు ఉన్న సహజమైన శబ్ద శక్తీ, పాత్రలపై రచయిత ప్రీతి వ్యక్తమయ్యాయి. ది బ్యూక్ స్ట్రేటజెమ్ నాటకాన్ని అవసాన దశలో మంచం మీద ఉండి ఫార్క్వహార్ పూర్తి చేశాడు. హే మార్కెట్ థియేటర్‌లో అది ప్రదర్శింపబడిన కొద్దిరోజులకే 1707, ఏప్రిల్ 29న లండన్‌లో మరణించాడు.

బ.శ్రీ.

ఫార్సు : ఫార్సు అనే పదానికి చెత్త అని అర్థం. ఇది చవుకబారు హాస్యరూపకం. సంస్కృత ప్రహసనాలను పోలి ఉంటుంది. సంభవనీయతను చంపి కేవలం నవ్వించడమే ఈ ఫార్సు లక్ష్యం. మానవజాతిలోని లోటుపాట్లను ప్రదర్శిస్తూంటుంది. పరిసరాలతో తలపడే మానవునికి జన్మతో సంక్రమించిన అవివేకం ఈ ప్రహసనానికి కథా వస్తువు.

ఫార్సులో సాహిత్యపు విలువలు తక్కువైనా వినోద విలువలు ఎక్కువ. వివాహ సంబంధమయిన అసంబద్ధ సన్నివేశంతో కూడిన విశేషాంక రూపకానికి ఫార్సు అని పేరు వాడుతున్నారు. ఈ రూపకంలో సున్నితతత్వం తక్కువగావడం వల్ల భాషాంతరీకరణ తేలిక. ఆహ్లాదరూపక పాత్రలు, భావాలు హాస్యకారకాలు. ఫార్సులో మాటలు చేర్పులు హాస్యకారకాలు. ఇంగ్లండులో క్రీ.శ. 1800 వరకు నాటకంచివర ప్రదర్శించే చిన్న చిన్న హాస్య నాటికలను ఫార్సులనే వారు. 1900 శతాబ్ది చివరభాగంలో ఇవి స్వతంత్రంగా మనుగడ సాగించసాగాయి.

సర్కసు బఫూన్ చేష్టలు, ఫ్రాన్సులోని మర్మ (మిస్టరీ) రూపకాలు, ఇంగ్లండులోని నీతి (Morality) రూపకాలు ఫార్సులకు మూలాలని చెప్పవచ్చు. తెలుగులో చీట్లాట ఫార్సు, నాటక ఫార్సులు ఉదాహరణలు.

శ్రీ.చ.

ఫ్రినికస్ : ప్రాచీన గ్రీకు విషాద నాటకకర్త. ఎస్కిలస్ పూర్వుడు. ఈయన గ్రీకు నాటక పోటీలలో 512బి.సి.లో ఒకసారి, 476 బి.సి.లో ఒకసారి గెలుపొందాడు.

డయోనిసస్ దేవతాగాథలతోపాటు హోమర్ రచనలలోని గాథలను ఇతివృత్తాలుగా స్వీకరించిన మొట్ట మొదటి నాటక కర్త. ఈయనే బృందగానంలో వినూత్న బాణీలను ప్రవేశ పెట్టాడు. ఈయన గేయాలు పుట్ట, తేనెలాగా మృదుమధురంగా ఉండేవి. సమకాలీన ఇతివృత్తాలతో నాటకాలు రచించడానికి ప్రయత్నించిన ప్రథముడు.

క్రీ.పూ. 494లో మిలెటస్ నగరపతన నాటకం ప్రదర్శింపజేశాడు. ప్రేక్షకులు ఆ నాటకం చూస్తూ కన్నీరు కార్చారట. గ్రీకు పరాజయాన్ని గ్రీకులు భరించలేక పోయారు. ఈ నాటకం రాసి ప్రదర్శింప చేసినందుకు ఆనాటి ప్రభుత్వం ఫ్రినికస్‌కు జరిమానా విధించి ఆ నాటకాన్ని నిషేధించింది. ఆ తరువాత పర్షియా చక్రవర్తి పరాజయాన్ని చిత్రిస్తూ ఫొయెనీషియన్ స్త్రీలు అనే నాటకం రచించాడు.

ఈయన నాటకాలలో నటన కంటే బృంద గానానికి ప్రాధాన్యం ఎక్కువ. గ్రీకు నాటకాలలో స్త్రీ పాత్రలను, స్త్రీల కరాళాలను మొట్ట మొదటి సారిగా ప్రవేశపెట్టింది కూడా ఈయనే. తొమ్మిది నాటకాలు రచించినట్టు తెలుస్తోంది గానీ ఇవన్నీ అలభ్యాలే.

శ్రీ.చ.



ఫ్లెచర్, జాన్ (1579-1625) : ఆంగ్ల నాటక కర్త. బ్యూమోంట్ ఫ్లెచర్ జంట కవులు. వీరిద్దరూ కలిసి 50 నాటకాలు వరకు రచించారని ప్రతీతి. ఫ్లెచర్ కవి, కల్పనలో ప్రతిభావంతుడు. బ్యూమెంట్ వివాహ నంతరం నాటకాలు రాయడం మానుకున్నా, ఫ్లెచర్ నాటక రచన కొనసాగిస్తూనే వచ్చాడు. ది ఫాల్స్ వన్, ది బెగ్గర్స్ ఈయన రాసిన ప్రధాన నాటకాలు.

స్త్రీ బహుమతి *(Woman's Prize)*, నమ్మకస్తురాలైన గొల్లపిల్ల *(The faithful Shepherdress)*, శ్రీ థామస్ *(Monsieur Thomas)*, బొండుకా *(Bonduca)* మొదలైన స్వతంత్ర నాటకాలు రచించిన ఈయన 1625లో ప్లేగు వ్యాధితో మరణించాడు.

శ్రీ.చ.

బంగారయ్య, నండూరి (1903-1970) : విమర్శకుడు, నాటక కర్త. తూర్పుగోదావరి జిల్లా చెయ్యేరు గ్రామంలో 1903 నవంబర్ 20 తేదీన జన్మించాడు. రాజమహేంద్రవరంలో న్యాయవాదిగా పనిచేశాడు. ప్రసిద్ధ నాటకకర్తల నాటకాల మీద సునిశిత విమర్శలు రాసి విమర్శక రంగంలో తనదైన ముద్రవేశాడు. పత్రికలలో వివిధాంశాల మీద ఈయన రాసిన వ్యాసాలు మేధావుల దృష్టిని విశేషంగా ఆకర్షించాయి. 1928 ప్రాంతంలో నాటకరచనకు పూనుకొని కొన్ని నాటకాలను వెలువరించాడు. రాజ్యలక్ష్మి (1928), ఆంధ్రతేజము (1938) నాటకాలు ఈయనను నాటకకర్తగా నిలబెట్టాయి. స్త్రీ పాత్రలు స్త్రీ లే నటించాలి అనే నినాదానికి రూపకల్పన రాజ్యలక్ష్మి నాటకం. ఇతివృత్తం సాంఘికమే అయినా, అది పద్య నాటకాల కాలం గనుక, దీనిని పద్య, గద్యాత్మకంగా రాశాడు. స్త్రీలు నాటక ప్రదర్శనలో పాల్గనడం అనే సమస్యలో అంతర్గతంగా ఉన్న తీవ్రతను రాజ్యలక్ష్మిలో దృగ్గోచరం చేశాడు. 'ఆంధ్ర తేజం' ఆంధ్రోద్యమాన్ని ఆలంబనగా చేసుకొని రాసిన నాటకం. ఈ రెండు నాటకాలు రంగస్థలం మీద విరివిగా ప్రదర్శితమై నాటక కర్తకు పేరు తెచ్చాయి. సాహిత్య విమర్శకుడు, నాటకకర్తగా గుర్తింపు తెచ్చుకొన్న బంగారయ్య 1970లో మరణించాడు.

గం.సు.రె.

బంగారరాజు, కొత్తపల్లి (జ.1947) : నటుడు, ప్రయోగాత్మక నాటక రచయిత, దర్శకుడు. 1947, ఫిబ్రవరి

1వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరులో బంగారమ్మ, రామలింగరాజులకు జన్మించాడు. ప్రాథమిక విద్య జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పూర్తి చేసుకున్న బంగారరాజు మైసూరు విశ్వ విద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఉద్యోగరీత్యా విశాఖపట్నంలో బి.హెచ్.పి.వి.లో డిప్యూటి మేనేజర్‌గా పని చేశాడు. వృత్తి ఇంజనీరింగ్ అయినా ప్రవృత్తి మాత్రం నాటకరంగం. పాఠశాలలో పదవతరగతి చదువుతున్న రోజుల్లోనే కొడాలి గోపాలరావు రచించిన ఆపద మొక్కులు నాటకంలో కాంతారావు పాత్రలో నటించాడు. ఆ తరువాత భమిడిపాటి భజంత్రీలు లో గండబేరుండంగా, గొల్లపూడి మారుతీరావు అనంతం లో రామదాసు, అత్తిలి కృష్ణారావు జాతీయజ్యోతి లో లార్డ్ మెకార్థీగా, యండమూరి వీరేంద్రనాథ్ చీమకుట్టిన నాటకం లో నాగభూషణంగా, యుగసంధ్య లో పోలీసు అధికారిగా, ఆరాధన లో పార్థసారథిగా, ఫణి లో శంకరంగా, రాజా ఈడిపస్ లో ఈడిపస్‌గా నటించాడు. ప్రవృత్తిపట్ల ప్రత్యేక శ్రద్ధ పెంచుకొన్న బంగారరాజు శ్రీకళా కౌముది అనే సంస్థను స్థాపించి, విశాఖపట్నంలో గాజువాకలో ప్రతి శనివారం నిర్విరామంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాడు. నాటకరంగానికి సంబంధించిన పలు డిప్లొమాలు పూర్తి చేసిన ఈయన నాటకరంగాన్ని పరిషత్తుల వలలో పడకుండా ప్రయోగాత్మక పద్ధతిలో నాటకాలను ప్రదర్శించాడు, ప్రదర్శిస్తున్నాడు. రారాజు అనే కలం పేరుతో కనరు వినరు మూర్ఖులు, నీ కన్నా పశువు నయం, మాస్క్‌లు ధరించి ప్రదర్శించే నాటిక కనబడుటలేదు *(బాల కార్మికుల నాటిక)*, గ్రహణం విడిచిన పూర్ణిమ *(స్త్రీవాద నాటిక)*, తీరనిబంధం *(స్త్రీ పాత్ర లేని సాంఘిక నాటిక), కోటి విద్యలు కూటి కొరకే, మనసారా... మానుసారా (మూకాభినయ నాటిక)*, ఏకోనారాయణ *(ఏకపాత్ర నాటిక)*, మనిషిలో మనిషి *(ఒకటిన్నర నిమిషాల నాటిక)*, తెలుగు నాటకాన్ని కొత్తపుంతలు తొక్కించిన దేహాంతరప్రాప్తి (నవలా నాటకం), చంద్రిక, ఎంకి (జానపద నృత్యగేయ నాటకాలు), క్యూ *1,2,3,4,5.* (ఆధునిక వీధి నాటకం) మొదలైన ప్రదర్శనా రూపాలను రంగస్థలంపై ప్రదర్శించి ప్రయోగాల రారాజుగా పేరు తెచ్చుకున్నాడు. రంగస్థలంపై వెలుగునీడల్ని (లైట్ అండ్ షేడ్) సమయానుకూలంగా మార్చడంలోనూ, గగనిక (సైక్లోరమా)ను వినూత్నశైలిలో మలచి ప్రదర్శించడంలో ఆయనకు ఆయనే సాటి. పరిషత్తు మూసలో సాగుతున్న నాటక ప్రదర్శన, రచనలను ప్రయోగాలవైపు మళ్లించే ప్రయత్నంలో కృషిచేస్తున్న నటాలీ సంస్థకు కన్వీనరుగా ఉంటూ ప్రయోగపరమైన నాటకాలను, నాటికలను ప్రదర్శించడానికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాడు. కళారంగంపట్ల తనదంటూ ఒక వరవడిని ఏర్పరచుకొని పనిచేస్తున్న బంగారురాజును పలు కళాసంస్థలు లలిత కళావాచస్పతి, ప్రయోగాత్మక నాటక చక్రవర్తి, ప్రపూర్ణ కళానిధి బిరుదులనిచ్చి ఘనంగా సత్కరించాయి. రారాజు పేరుతో కొన్ని కథలు రచించి బహుమతులందుకున్నాడు. నాటకరంగం కోసం కృషి చేసిన రచయితల గురించి 'ఆదర్శమూర్తులు' పేరిట గ్రంథాన్ని రచించాడు. కళామతల్లి సేవకు అంకితమైన నిత్య ఆరాధకుడు బంగారరాజు.

దాసరి.ఎన్.

బయలాట : బయలు అంటే ఆరు బయలు రంగస్థలం, ఆట అంటే నాటకం. ఆరుబయట రంగస్థలంలో ప్రదర్శించే నాటకాన్ని బయలాట అంటారు. కర్ణాటక ఉత్తర ప్రాంతంలోని ఈ సంప్రదాయ కళారూపం కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో బహుళ ప్రజాదరణ పొందింది. ఈ ప్రాంతాల్లో యక్షగాన కళారూపాలకు సంబంధించిన ప్రదర్శనలను బయలాట కళారూపాలుగా పరిగణిస్తారు. వీటిలో దాసరాట, రాధనాట, పారిజాట, దొడ్డాట, సన్నాట ప్రముఖమైన బయలాట కళా రూపాలుగా చెప్పుకోవచ్చు. భాగవత కథల్ని గొల్లభామల ద్వారా చెప్పించడం బయలాట ప్రత్యేకత. హాస్యం ప్రధానంగా చోటు చేసుకుంటుంది. సమకాలీన ప్రస్తావనలతో పౌరాణిక ఇతి వృత్తాలను మేళవిస్తూ పాటలు, సంభాషణలతో ప్రదర్శనలు జనరంజకంగా సాగుతాయి. 18వ శతాబ్దంలో ప్రముఖ కళారూపాలుగా పేరుపొందిన దాసరాట మహారాష్ట్రకు వెళ్ళి అక్కడ తమాషాగా రూపాంతరం చెందిందని పండితుల అభిప్రాయం. తమాషా కళారూపం కర్ణాటకలో రాధనాటగా రూపాంతరం చెందిందని కూడా వీరి అభిప్రాయం, కర్ణాటక తూర్పు జిల్లా అయిన రాయచూరులో 18వ శతాబ్దిలో ఆపర్ల తిమ్మన ఆంధ్రప్రదేశ్‌లోని భామాకలాపం ఆధారంగా రాసిన శ్రీకృష్ణపారిజాతం నాటకం బహుళ ప్రజాదరణ పొందింది. కర్ణాటక ఉత్తర ప్రాంతం దొడ్డాట పురాణ గాథల్ని ఇతివృత్తంగా సంప్రదాయ నృత్య శైలులతో, సంప్రదాయ ముఖాంగ రచన, వస్త్రధారనతో ప్రత్యేకమైన, సంభాషణా శైలులతో విస్తృత ప్రజాదరణ పొందింది. దొడ్డ అంటే పెద్దది. దొడ్డాట అంటే ఎక్కువ వ్యవధి కలిగిన ప్రదర్శన అని అర్థం.

మతపరమైన పండుగలు, గ్రామ ఉత్సవాల్లో ప్రత్యేకంగా చెక్కతో నిర్మించిన రంగస్థలంపై ఈ ప్రదర్శనలు చోటు చేసుకుంటాయి. హార్మోనియం, తబల, చిరుతలు, తాళాలు,

ప్రముఖ వాయిద్యాలు. దొడ్డాటలో పురుషులే స్త్రీ పాత్రలు ధరిస్తారు. అయితే, పారిజాత వంటి ప్రదర్శనల్లో స్త్రీలు కూడా పాత్రలు ధరిస్తారు.

ప్ర.రె.

బలరామకృష్ణయ్య, అట్లూరి (జ. 1929) : రంగస్థల నటుడు. కృష్ణాజిల్లా కైకలూరు సమీపంలో మొఖాసాకలవపూడిలో వెంకటసుబ్బమ్మ, లక్ష్మయ్యలకు 1929, జులై 15వ తేదీన జన్మించాడు. స్థిరనివాసం అనంతపురం జిల్లాలోని గుంతకల్లు. నేషనల్ ఆర్ట్ థియేటర్ విజయవాడలో నటశిక్షణ పొందాడు. నటనలో ఈయనకు గురువు నందమూరి తారక రామారావు. ఉద్యోగరీత్యా గుంతకల్లులో స్థిరపడ్డాక నటుడిగా తనను తీర్చి దిద్దిన గురువు పేరిట 1960లో 'రామా అమెచ్యూర్' అనే నాటక సమాజాన్ని స్థాపించాడు. గుంతకల్లు, పరిసర ప్రాంతాలలో కళలపట్ల ఆసక్తి చూపుతున్న యువకులను కళాకారులుగా తీర్చిదిద్దాడు. సమాజం తరపున రాయలసీమలోని వివిధ ప్రాంతాలలో జరిగే నాటక కళా పరిషత్తు పోటీలలో పాల్గన్నాడు. 'మహామంత్రి తిమ్మరుసు' నాటికలో తిమ్మరుసు పాత్రలో నటించిన బలరామకృష్ణయ్యకు ఉత్తమ నటుడు బహుమతి లభించింది. 1964 సెప్టెంబర్‌లో బళ్ళారిలో రాఘవ మెమోరియల్ నాటక కళాపరిషత్తు నాటక నాటిక పోటీలలో బలరామకృష్ణయ్య బృందం మహారథికర్ణ నాటికను ప్రదర్శించింది. దుర్యోధన పాత్రలో నటించిన బలరామకృష్ణయ్యకు ఉత్తమ నటుడు అవార్డుతో పాటు మహారథి కర్ణ ఉత్తమ ప్రదర్శనగా ఎన్నికైంది. నిరంతరం శిక్షణ, ప్రదర్శన ప్రదర్శనకు పాత్రలో నటనా మెళుకువలు చూపించడం, ఎంచుకున్న పాత్రను, నాటకాన్ని సజీవంగా రూపొందించి ప్రదర్శించడం అట్లూరి ప్రత్యేకత.

దాసరి. ఎన్

బలరామమూర్తి, కె.వి. (జ.1943) : నాటక రచయిత, నటుడు. గుంటూరు జిల్లా, తెనాలి మండల్, పెదరావూరులో సత్యనారాయణ, సరస్వతమ్మ దంపతులకు 1943, మే 27న జన్మించాడు. బిఏఎల్ఎల్‌బి పట్టభద్రుడు. విద్యార్థి దశ నుంచీ నాటకాలంటే మక్కువ. హైస్కూలు దశలోను, కళాశాలో చదివే రోజుల్లోనూ నాటకాల్లో చిన్నాచితకా వేషాలు వేస్తూ తనలోని నటనాభిలాషను పెంపు చేసుకొంటూ వచ్చాడు. 1960లో ఆదాయ పన్నుల శాఖలో ఉద్యోగిగా హైదరాబాదుకు వచ్చాడు. అప్పటి నుంచీ హైదరాబాదే స్థిర నివాసమైంది. రవీంద్రభారతి ప్రారంభోత్సవం నాడు మునిమాణిక్యం నరసింహారావు రచించిన క్లాస్‌రూమ్ అనే హాస్యనాటికలో నటించాడు. ఈ నాటికలో మాస్టారు పాత్రలో మునిమాణిక్యంగారే నటించడం విశేషం! అప్పటి నుంచీ అనేక నాటికల్లో, నాటకాల్లో నటించటం జరిగింది. ముఖ్యంగా హాస్యపాత్రల్లోనే.

గడించిన నటనానుభవం రచనవైపు దృష్టి మళ్లించింది.1979లో ఇల్లలికిన ఈగ అనే హాస్యనాటికను రచించి ప్రదర్శింపజేయడంతో తొలి ప్రయత్నంలో నాటక రచయితగా గుర్తింపు లభించింది. ఈ నాటిక దేశిరాజు హనుమంతరావు దర్శకత్వంలో అనేకచోట్ల జనరంజకంగా ప్రదర్శింపబడింది. ఆ తరువాత భరతవాక్యం, గువ్వాగూడెక్కె నాటకాలు, ఇల్లు చేసిన పెళ్ళి, మునుగు, పగటివేషాలు, కాయితం పడవ నాటికలు బలరామమూర్తి కలం నుంచి వెలువడ్డాయి. కాయితం పడవ నాటికకు యం.జి. ప్రసాద్ దర్శకత్వం వహించి అనేక ప్రదర్శనలివ్వడం జరిగింది. గుడుగుడు గుంజం నాటిక యం.జె. భిక్షు దర్శకత్వంలో ప్రదర్శితమైంది. అరణ్యరోదన నాటికను కేంద్రీయ విశ్వవిద్యాలయ నాటక శాఖ విద్యార్థులతో ప్రదర్శింపబడింది.

దూరదర్శన్‌లోను, ఆకాశవాణిలోను అనేక నాటికలు ప్రసారమయ్యాయి. శాంతి నివాసం (13 ఎపిసోడ్ల) సీరియల్‌కు ప్రజాదరణ లభించింది. జంటనగరాలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు తొలి ప్రేక్షకుడుగా ప్రత్యక్షం కావడం ఈయనలో తరిగిపోని నాటకాభిలాషకు నిదర్శనం.

గద్దెశ్రీ

బలరామయ్య, అయితా(మ.1981) : రంగస్థల నటుడు, ఆంధ్రాభ్యుదయ నాట్యమండలి స్థాపకుడు. ఈయన నెల్లూరు జిల్లా గూడురులో జన్మించాడు. సామాన్య కుటుంబంలో పుట్టి చిన్నవ్యాపారంతో జీవిక సాగిస్తూ నాటకాలపై మక్కువ పెంచుకున్నాడు. కమ్యూనిస్టు అభిమానిగా ఉంటూ పార్టీ తరపున సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గనేవాడు. 'ఆంధ్రాభ్యుదయ నాట్యమండలి'ని స్థాపించి ముందడుగు, పోతుగడ్డ నాటకాలను అద్భుతంగా ప్రదర్శించేవాడు. గూడూరులో ఆవుల శ్రీనివాసరావు, గండవరం సుబ్బరామిరెడ్డి, సి.హెచ్. కృష్ణ మూర్తి, డి.వి. శేషయ్య, అల్లూరి రంగారెడ్డి పూనికతో 1954లో స్థాపించబడిన సంస్కృతీ సమ్మేళనం కార్యక్రమాలలో బలరామయ్య క్రియాశీలపాత్ర నిర్వహిస్తూ ఆ సంస్థకు వెన్నెముకగా నిలిచాడు. డా. పి. వేణుని ప్రోత్సహించి,

నిరాశాప్రొడక్షన్ నెం. 1, దిష్టి బమ్మలు, చీకటి దొంగలు, వంశ వృక్షం, రాజీవం వంటి నాటికలు రాయించిన ఘనత బలరామయ్యకే చెందుతుంది. ఈయన నటించిన నాటక నాటికలకు అనేక పరిషత్తు పోటీలలో, ఉత్తమప్రదర్శన, ఉత్తమ నటన, బహుమతులు లభించాయి. రంగస్థలనటి గూడూరు సావిత్రికి సాంఘిక నాటకాల్లో నటించే అవకాశమిచ్చి ఉత్తమ నటిగా రూపొందడానికి చేయూతనిచ్చింది బలరామయ్యే. నాలుగు దశాబ్దాలుగా సంస్కృతీ సమ్మేళనం నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటక పోటీల నిర్వహణలో బలరామయ్య కృషి ఎనలేనిది. గూడూరు పట్టణంలో సాంఘిక నాటక వికాసానికి అహర్నిశలు పాటుపడుతూ స్థానికంగా నాటక సంస్థలకు ఊపిరిగా నిల్చిన కళామయ హృదయుడు నిస్వార్థ కళాసేవకుడు బలరామయ్య. నాటక కళావికాసానికి అహరహరం నిస్వార్థంగా కృషి చేసిన కళాకారుడు అయితా బలరామయ్య. 1981, అక్టోబర్ 26న తుదిశ్వాస విడిచాడు.

గం.సు.రె.

బహురూపం : జానపద కళారూపం. బహూరూపం అంటే అనేక రసాలు లేక వేషాలు. అనేక వేషాలతో కూడిన కళారూపం బహురూపం. నాటకంలో అనేక వేషాలు ఉన్నా ఒక్కొక్క వేషాన్ని ఒక్కొక్క వ్యక్తి ధరిస్తాడు. ఈ బహురూప కళకు నాటకశాల, మేళగాంఢ్రు, తూర్యాలు, జంత్రమేళ నాట్యక్రియా భాషాంగాలు, నర్తకులు ఉంటారు. అంతేకాదు వీళ్ళందరినీ నడిపించే సూత్రధారుడు కూడా ఉంటాడు. ఈ బహురూపాన్ని గురించి సాహిత్యంలో ప్రస్తావన ఉంది.

"నానా వేషధరం యత్తద్బహురూప మితీరితమ్" (భరత కోశము, పుట : 418)

"పశుపక్షి మృగ ముఖ్య బహురూపధారణా విధి పరకాయ ప్రవేశములును... ఆదిగాగల విద్యల నతిశయిల్లె..." (విక్రమార్క చరిత్ర: 5–66)

"రూప్యాచలము బహురూపంబుల నటించు రమణ, శోభిల్లు సౌధముల పెల్లు" (కేయూర బహుచరిత్రము 1–19)

ఊసరవెల్లి శివుడు కావడాన్ని కూడా బహురూప కళా రూపంగా పేర్కొన్నారు. హిందీ శబ్ద సాగరంలో "బహురూపి, బహురూపియా" పదాలకు "అనేక విధాల వేషాలు వేసేవాడు" (అనేక ప్రకార్ కే రూపధారణ్ కర్నేత వాలా) అనే అర్థం ఇచ్చాడు.

ఒకే నటుడు అనేక వేషాలు వేయడం పగటి వేషాల వారికి పరిపాటి కాబట్టి ఈ కళారూపం పగటి వేషాలకు మారు రూపమని కొందరు భావిస్తున్నారు. నృత్త రత్నాకర పరిష్కర్త వి. రాఘవన్ పీఠిక పుట 52లో ఇదే అభిప్రాయం వెల్లడించాడు.

జాయపసేనాని నృత్త రత్నావళిలో బహురూప కళను ఇలా నిర్వచించాడు.

"అనేక రూపాలు గల లోకుల ఆయా రూపాలను, వేషం, చేష్ట, భాషలతో ప్రదర్శించేది బహురూపం అనబడుతుంది. (రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, పుట : 367).

ఈ బహురూపం అన్ని హంగులూ ఉన్న కళారూపం. తాళ్లపాక పెద తిరుమలయ్య వేంకటేశ్వర వచనాలలో జగత్తును, మానవ జీవితాన్ని బహురూపంతో పోల్చడం వల్ల ఈ బహురూప స్వరూపం స్పష్టమవుతుంది.

ఇక పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో చెప్పిన దానిని బట్టి ఈ కళారూపంలో చతుర్విధాభినయాలు ప్రాధాన్యం వహిస్తాయని భావించవచ్చు.

'లలితాంగ రస కళాలంకార రేఖ
లలవడ బహురూప మాడెడువారు' (పుట 435)
బహురూప ప్రదర్శనలో తెర ఉండేదని ఊహించవచ్చు.

"జవనికవాయం దట్టినంబడుసూపు బహురూపి తెఱంగున" (శృంగార నైషధం 4–2)

బహురూప నటుని లక్షణాలను జాయపసేనాని ఇలా వివరించాడు. రక్తి గలిగింప గల వాడు, మంచి పలుకు గల వాడు, యుక్తిగా మాటలాడు నేర్పుగలవాడు, ఆరోగ్యవంతుడు, కైవారమున నేర్పరి, మంచి రేఖ గలవాడు, రసికుడు, రూపరి, భావనాశక్తి గలవాడు, ప్రాయము గలవాడు, మిక్కిలి పొడుగరి, సంస్కృతము, ఇతర దేశభాషలలో దక్షుడు, సభ్యత నెరిగిన వాడు, బలవంతుడు, శ్రమను గెలిచినవాడు, త్వరలో వేషము మార్చుకొనగలవాడు, ప్రస్తావమునకుచితమ్మైన వానిని చదువగలవాడు, తన వంటి యనుచరులలో గూడినవాడు, గడ్డమును, తల వెంట్రుకలను క్షౌరము చేసికొన్నవాడు, మధుర ధ్వని గల గాత్రము గల వాడు. బహురూపి యనదగును. ఈ గుణములన్నియు గలిగిన స్త్రీ యైనను గావచ్చును" (అను: రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, పుట: 367–369). జాయపసేనాని నిర్వచనం ప్రకారం బహురూపంలో సాత్త్వికాభినయం ఉండదు. వేష(ఆహార్యం), చేష్టిత (ఆంగికం), భాషాభిః (వాచికం) మాత్రమే ఉంటాయి.

అయితే జాయపసేనాని దీనిని ప్రత్యేక కళగా పరిగణించకుండా 'నృత్తం'గా పరిగణించి 'బహురూప నృత్తం' అని పేర్కొన్నాడు. దామరాజు సోమయ్య భరతం అనే గ్రంథంలో దీనిని దేశి నాట్య విశేషంగా పేర్కొన్నాడు (కుండలి బహురూప దండ లాస్య విలాస దేశి మార్గంబుల తెరువు లెరిగి).

శ్రీ.చ.

బహురూపి : బెంగాల్‌లో 'ఇప్టా' వదిలివేసిన సభ్యులతో 1948లో ఏర్పడిన ప్రముఖ బెంగాలీ నాటక సంస్థ. మనోరంజన్, భట్టాచార్య, శంభుమిత్ర ఆధ్వర్యంలో, మార్గ దర్శకత్వంలో అప్పటికింకా బహురూపి పేరుపెట్టక ముందు 1948లో బైజన్ భట్టాచార్య రచించిన నాబన్నాను, 1949లో తల్సి లాహిరి రచించిన పాతిక్ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలకు ఆకర్షితుడై ఖలీద్ చౌదరి, తప్పసేన్, తృప్తిసేన్, తృప్తిమిత్రా, కుమార్ రాయ్ వంటి వారు కూడా ఈ బృందంలో సభ్యులుగా ఉంటూ 1950లో బహురూపిగా ఈ సంస్థను రూపొందించారు. బెంగాలీ నాటక రంగంలో నూతన నాటకోద్యమానికి తెరతీశారు. భారతదేశంలోని నాటక బృందాలన్నింటికి బహురూపి ఆదర్శం. క్రమశిక్షణ, కట్టుబాటు, సృజనాత్మకత, నిర్దిష్ట ఆశయం, నిర్దిష్ట ప్రయోజనం, నిబద్ధత, నూతన ఆలోచనలకు తెరతీయడం, క్రమపద్ధతిలో అభ్యాసం, సరియైన ప్రణాళిక, శ్రద్ధ బహురూపి నుంచి ఇతరులు నేర్చుకోవలసిన అంశాలు.

చార్ అధ్యాయ్, రక్తకరాబి, డాక్‌ఘర్, ముక్తధార, బిసర్జన్, రాజా, ఘరేబైరే, మాలినీ వంటి వైవిధ్యంగల అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వటం బహురూపికే చెల్లింది. క్రమంగా బహురూపి ఒక రిపర్టరీగా రూపొంది అనువాద, అనుసరణ, మాతృక నాటకాలను సమాన స్థాయిలో ప్రదర్శించి ఉన్నత ప్రమాణాలు గల సంస్థగా ఎదిగింది. బాకీ ఇతిహాస్, ప్రలాష్, త్రింష్గ శతాబ్ది, పగలా ఘోడా వంటి బాదల్ సర్కార్ రచనల్ని కూడా సజీవంగా ప్రదర్శించింది.

ఎంత పెద్ద సంస్థకైనా సమస్యలు తప్పవు. కొందరు చనిపోగా, ఇంకొందరు విడిపోగా, మరికొందరు వేరే బృందాలుగా ఏర్పడటంతో సంస్థ విచ్ఛిన్నమైంది. అయితే ఈనాటికీ ఈ సంస్థ తరువాత తరం వారితో ముఖ్యంగా కుమార్‌రాయ్ నేతృత్వంలో ప్రదర్శనలు కొనసాగిస్తూనే ఉంది.

ప్ర.రె.

బాదల్‌సర్కార్ : బెంగాలీ రంగస్థల దర్శకుడు. 1970 ప్రథమార్థంలో ఆధునిక వీధినాటక ప్రక్రియకు ప్రాణం పోసినవాడు. బడుగుజీవుల దయనీయ బతుకులు, మధ్యతరగతి అశాంతి జీవితాలు, సంపన్న వర్గం దోపిడీని బహిర్గతం చేయటానికి, ఎటువంటి రంగస్థల ఉపకరణాలు లేకుండా బాదల్‌సర్కార్ వీధి నాటకాన్ని ఉపయోగించుకున్నాడు. జానపద నాటక ఫక్కీలో ప్రొసీనియం థియేటర్‌కు విరుద్ధంగా మూడో నాటక రంగ నిర్మాణానికి రూపకల్పన చేశాడు. గ్రోటోవ్స్కీ 'పూర్ థియేటర్', రిచర్డ్ షెక్‌నర్ 'ఎన్విరాన్‌మెంట్ థియేటర్'ల ప్రభావంతో 1971, అక్టోబరు 24న కలకత్తా నగరంలో సగీనా మెహతోనాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించాడు. ఆ తర్వాత అబూహాసన్, స్పార్టకస్ నాటకాలను ప్రదర్శించి వీధి నాటక ప్రయోగానికి గట్టిపునాదులువేశాడు. ప్రస్థాన్, మిచ్ఛిల్, భాసీకబర్, ఏవం ఇంద్రజిత్, హట్టమలర్, ఓసారే, గొండి, ఖటమిట్‌క్రామ్ నాటకాలను పలుమార్లు ప్రదర్శించాడు. 'స్ట్రీట్ థియేటర్'గా బాదల్ నామకరణం చేసుకొన్న ఈ వీధి నాటక ప్రయోగం బెంగాల్‌లోనే గాక, భారతదేశమంతటా ప్రభావం చూపింది.

బాదల్ సర్కార్ ఒక ఉద్యమస్ఫూర్తితో ప్రారంభించిన వీధి నాటక ప్రక్రియ బహుళ ప్రచారం పొంది అన్ని రాష్ట్రాలలోనూ వ్యాప్తి చెంది సమకాలీన సమస్యలను సామాన్య ప్రజల దృష్టికి తెచ్చి ఆలోచింపచేసే ప్రబలశక్తిగా ఎదిగింది.

రమణ

బాబు సాహెబ్ (1937-1975) : రంగస్థల నటుడు, లలిత కళాసమితి సభ్యుడు. 1937లో కర్నూలు జిల్లా బనగాని పల్లె సమీపంలోని చెరువుపల్లెలో జన్మించాడు. తండ్రి షేక్ కతాల్ సాహెబ్. శ్రావ్యమైన కంఠస్వరం ఆయన నాటకరంగంలోకి అడుగుపెట్టడానికి దోహదం చేసింది. బాలనటుడుగా నటించాడు. శ్రీకృష్ణరాయబారం లో కృష్ణుడు, కర్ణుడు, బొబ్బిలియుద్ధం లో రంగరాయుడు, సత్యహరిశ్చంద్ర లో నక్షత్రకుడు, వేమారెడ్డి మల్లమ్మ లో భద్రయ్య, పద్మమ్మగా నటించాడు. పురుష పాత్రలతో పాటు స్త్రీ పాత్రలలో కూడా నటించి ప్రేక్షకుల మెప్పు పొందాడు. ఈ నాటకాలన్నీ లలితకళా సమితి పక్షాన వివిధ వేదికల మీద ప్రదర్శించినవే. పైడి లక్ష్మయ్య రచించి, వీరయ్య చారి దర్శకత్వంలో ప్రదర్శించిన వేమారెడ్డి మల్లమ్మ నాటకంలో భద్రయ్య, పద్మమ్మ పాత్రలలో నటించి నాటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్‌ల మెప్పును పొందిన నటుడు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తూనే ప్రవృత్తిగా ఎంచుకున్న నాటకరంగంలో పని చేశాడు. 1975లో బొబ్బిలి యుద్ధం నాటకంలో రంగరాయుడు పాత్రలో నటించి ప్రదర్శనానంతరం మరణించాడు. ప్రవృత్తిగా ఎంచుకున్న రంగంలోనే పనిచేస్తూ మరణించిన ధన్యజీవి బాబూసాహెబ్.

దాసరి,ఎన్

బాబూరావ్ పావర్ (1917-2002) : నటుడు, రూపశిల్పి. ఈయన 1917లో జగన్నాథరావు, తుల్జాబాయి దంపతులకు హైదరాబాదులో జన్మించాడు. మాతృభాషమరాఠీ, కానీ ఆయన తెలుగు నాటక రంగానికి చేసిన సేవ ఎనలేనిది. మరాఠ్వాడా ఆనాటి నిజాం రాష్ట్రంలో భాగం కాబట్టి బాబూరావు తల్లిదండ్రులు హైదరాబాదులో స్థిరపడ్డారు.

పని వెతుక్కుంటూ కలకత్తా వెళ్లాడు. అక్కడ బబ్బన్లాల్ అనే కళాకారుడి పరిచయం వల్లనాటకరంగంతో పరిచయం ఏర్పడింది. ఆయన వద్ద ఆహార్యం కళను నేర్చుకున్నాడు. తక్కువ మేకప్‌తో పాత్రలను చక్కగా తీర్చిదిద్దటం నేర్చుకున్నాడు. ఆ తరువాత హైదరాబాదు చేరుకొని కొన్నాళ్లు నాటకాలలో నటించాడు.

ఆ రోజుల్లో బాపూ రాజా జాగిర్దార్ హైదరాబాదులో మరాఠీ నాటకాలు ఆడించేవాడు. బాబూరావు మేకప్ పెట్టె తీసుకొని బయలు దేరేవాడు. పండుగ రోజుల్లో, ఉత్సవాల్లోఎక్కువగా పౌరాణిక, చారిత్రాత్మక నాటకాల ప్రదర్శన జరిగేది. వాటికి కావలసిన దుస్తులు తయారు చేసేవాడు. అంతేకాదు తలపాగాలు, విగ్గులు ఆయనే స్వయంగా తయారు చేసేవాడు. క్రీప్ హేయిర్‌తో మీసాలూ, గడ్డాలు పెట్టడంలో దిట్ట.

ఆ రోజుల్లో ప్రఖ్యాత నట దర్శకుడు ఖాదర్ ఆలీ బేగ్ ఉర్దూ నాటకాలు ఉధృతంగా ఆడేవాడు. ఆయన ప్రదర్శనలన్నిటికీ బాబూరావే ఆహార్యం, దుస్తులు, రంగాలంకరణ సమకూర్చేవాడు. గోల్కొండ కోటలో లైట్ అండ్ సౌండ్ ప్రక్రియలో భారీ ఎత్తున ప్రదర్శించిన నైజాం, కులీ కుతుబ్ షా భాగమతీ నాటకాలను రసరమ్య దృశ్య కావ్యంగా నిలపటానికి బాబూరావు కృషి చేశాడు. అలాగే ప్రముఖ జానపద నృత్య దర్శకుడు గోపాల్‌రాజ్ భట్‌తో కలిసి జానపద నృత్య నాటకాలకు రూపకల్పన చేశాడు.

1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత హైదరాబాదులో తెలుగు నాటకాలు ఊపందుకున్నాయి. రాష్ట్ర సచివాలయం ప్రదర్శించిన అన్ని పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక నాటకాలకు బాబూరావు దుస్తులు తయారుచేసి ఇచ్చేవాడు. నాటక ప్రదర్శనల సంఖ్య పెరగడం వల్ల దుస్తులు అద్దెకివ్వటం మొదలు పెట్టాడు. రాయబారం నాటకాలకు ఒకే సారిదుస్తులుయిచ్చి మేకప్ చేయగల స్థితికి ఎదిగాడు.

ఆయన ఆప్యాయతా, అలుపెరుగని చిరునవ్వు అందరి మన్ననలు అందుకున్నాయి. ఆహార్య రంగంలో ఉన్న వారంతా ఆయన్ను 'నాయనా' అని పిలిచేవారు. ఆయన తన 85వ ఏట కన్నుమూశాడు. ఆయన మరణానంతరం ఆయన కుమారులు ఆయన పేర స్వర్ణ కంకణ ప్రదానం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఆయన జయంతి రోజున ఒక రంగస్థల ప్రముఖునికి ఆ బహుమతిని అందచేస్తున్నారు.

అడబాల

బాలకృష్ణ, తులసి (జ.1951) : నటుడు, కథ, నాటక, నవలా రచయిత. దర్శకుడు. అభ్యుదయ నట సమాఖ్య స్థాపకుడు. కార్యదర్శి. తూర్పుగోదావరి జిల్లా ఇంజరం గ్రామంలో 1951, సెప్టెంబర్ 22న జన్మించాడు. తల్లిదండ్రులు సుబ్బలక్ష్మమ్మ, రామమూర్తి. పల్లెల్లో వేడుకల సందర్భంగా నాటకాలను చూసిన బాలకృష్ణ నటనపట్ల ఆసక్తి పెంచుకున్నాడు. యర్రంనేని చంద్రమౌళి దగ్గర నటనలో శిక్షణ పొంది, నటించడంలో ప్రముఖ రంగస్థల నటుడు కె. వేంకటేశ్వర రావును ఆదర్శంగా తీసుకొన్నాడు. ఈయన ప్రహ్లాద వేషంలో మొట్ట మొదటిసారి రంగస్థలంపై నటించాడు.

బాలకృష్ణ మూడు వందల కథలు, 25 రేడియో నాటికలు, ఒక నవల రచించాడు. తులసీదళాలు పేరుతో వెలువడిన పది కథలు ఇతర భాషలలోకి అనువదింపబడ్డాయి. నలభై కథలకు బహుమతులందుకున్న బాలకృష్ణ ఆంధ్రాబ్యాంక్‌లో అధికారిగా పనిచేస్తూనే రంగస్థలం కోసం సర్వం జగన్నాథం, నటరాజు నవ్వాలి, జూ, డియర్ రాస్కెల్స్ ఎదగండి, ఆర్తగీతం, కేకికేక, జ్వాలాముఖి, ఉగ్గుపాలు, రుద్రస్థలి, తెర తీసేశాం తన్నుకు చావండి మొదలైన నాటికలు రచించి ప్రధాన పాత్రలలో నటించాడు. కొన్నిటికి దర్శకత్వం వహించాడు. 1975లో అభ్యుదయ నట సమాఖ్య స్థాపించి ప్రదర్శనలు నిర్వహించాడు. అనగా అనగా ఒకరాజు, ప్రకాశం పంతులు, విశ్వనాథ నాయకుడు, గౌతమబుద్ధ, భజంత్రీలు తదితర నాటకాలలో నటించాడు. స్వీయరచనలో ప్రదర్శింపబడిన డియర్ రాస్కెల్స్ ఎదగండి, తెర తీసేశాం తన్నుకుచావండి నాటికలు దర్శకుడిగా గుర్తింపు తేవడంకాకుండా బహుమతులు కూడా తెచ్చిపెట్టాయి.

దాసరి.ఎస్.

బాల గంధర్వ (1888-1967) : మహారాష్ట్ర రంగస్థల నటుడు, మధుర గాయకుడు. స్త్రీ పాత్రధారి. ఈయన 1888లో జన్మించాడు. అసలు పేరు శ్రీపాద నారాయణ రాజహంస. తిలక్ మహాశయుడు పెట్టిన పేరు బాలగంధర్వ. ఈయన గానం గంధర్వ గానం అనడంలో అతిశయోక్తి లేదు. ఈయన ప్రభావం పడని తెలుగు నటులంటూ లేరు. సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత.

చిన్నతనంలో మేనత్త పాడే మేలుకొలుపుల సంగీతం ఈయనలోని సంగీత కళను మేల్కొల్పింది. 1902, మే లో 'కిర్లోస్కర్' నాటక కంపెనీలో చేరి స్త్రీ వేషాలు వేయడం ప్రారంభించాడు. ఈయన మొదటి వేషం శకుంతల. కిర్లోస్కర్ కంపెనీ మూతపడిన తరువాత గంధర్వ నాట్యమండలి అనే నాటక సమాజం సొంతంగా స్థాపించి అనేక నాటకాలాడి లక్ష

లాది భారత ప్రజానీకాన్ని తన సంగీతంతో హావభావ ప్రకటనతో ఆనందంలో ముంచివేశాడు. నాటకాల మీద లక్షలకు లక్షలు సంపాదించి దానధర్మాలు చేసి అంతా ఖర్చు పెట్టాడు. 1920లో మానావమాన నాటకం వివిధ పట్టణాలలో ప్రదర్శించగా వచ్చిన పదహారు వేల రూపాయలను తిలక్ స్వరాజ్య నిధికి సమర్పించాడు.

కుచ్చెళ్ళతో చీర కట్టుకోవడానికి పది గజాల చీర ఉపయోగించేవాడు. బాలగంధర్వకు భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' బిరుదు ప్రదానం చేసింది. బంబాయి పురపాలక సంఘం ఈయన పేరిట ఆరుబయలు నాటకశాల నిర్మించింది. నెలకు ఏడు వందల1 రూపాయల ఫించను ఇచ్చింది. కేంద్ర సంగీత నాటక అకాడమి ఈయనకు అవార్డు ప్రసాదించింది. శకుంతల, రుక్మిణి, సుభద్ర, ద్రౌపది, మీరాబాయి, సింధు రేవతి, అర్జునుడు మొదలైన పాత్రలు ధరించిన బాలగంధర్వకు భీమ్‌పలాస్, కళింగ, మల్‌హర్ సలార్, భాగేశ్వరి, భైరవి రాగాలంటే అభిమానమెక్కువ. ఈయన పదిహేను సంవత్సరాలు పక్షవాతంతో బాధపడి 1967, జులై 15న మరణించాడు.

శ్రీ.చ.

బాలచందర్ కైలాసమ్ (జ.1930) : తమిళనాటక రచయిత, రంగస్థల, సినీ దర్శకుడు. తంజావూరు జిల్లా నల్లమాంగుడి గ్రామంలో 1930 జన్మించాడు. 1964 వరకు మద్రాస్‌లో అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో పనిచేశాడు. 1957 లో రాగిణి క్రియేషన్స్ పేరిట ఔత్సాహిక నాటకక్లబ్‌ను తన సహచరులతో ఏర్పాటుచేసి తమిళ నాటక రంగంలో సంచలనం సృష్టించాడు. మేజర్ చంద్రకాంత్, నానల్, సర్వర్ సుందరం, *నీటి బుడగ*, కొవ్వొత్తి వంటి ప్రదర్శనలు బాలచందర్‌కు పేరు తెచ్చి పెట్టాయి. తన నాటకాలనే సినిమాలుగా తీసి, తమిళ సినీ రంగాన్ని ప్రభావితం చేశాడు. భామావిజయం, అపూర్వ *రాగంగల్*, మన్మత్తలీలాయ్ సింధుభైరవి నాటకాలు కూడా బాలచందర్‌ను ఉన్నత శిఖరంపై నిలిపాయి. కమలహాసన్, రజనీకాంత్, సుజాత వంటి నటీనటులను తీర్చిదిద్దింది బాలచందరే.

ప్ర.రె.

బాలమిత్ర నాటక సమాజం (గుంటూరు) : దంటు వెంకట కృష్ణయ్య గుంటూరులో బాలమిత్ర నాటక సమాజం, నవలా నాటక సమాజం అనే పేర్లతో రెండు సమాజాలను స్థాపించాడు. బాలమిత్ర సమాజంలో 15, 16 సంవత్సరాల లోపు వయస్సు గలవారిని చేర్చుకున్నాడు. ఇందులో భట్ల రామకృష్ణ శాస్త్రి, కె. రఘురామయ్య, పైడిబాబు, పి. సూరిబాబు, రావుల లక్ష్మీకాంతం, మాష్టర్ త్రిపురారి, కల్యాణి, నాగలింగం, సవరం కోటేశ్వరరావు, మాష్టర్ అంజి మొదలైన వారు వివిధ పాత్రలలో నటించారు. నవలా నాటక సమాజంలో అందరూ స్త్రీలే! దాసరి కోటిరత్నం, పసుపులేటి కన్నాంబ, సిద్దాబత్తుని శ్రీహరి, ఆదోని అమ్మణ్ణిబాయి, దాసరి యామినీ తిలకం, దాసరి అంజనీబాయి, జె. సరస్వతి మొదలైనవారు ఉన్నారు. శ్రీకృష్ణ తులాభారం, రోషనార, కృష్ణ లీలలు, రామదాసు, సతీ అనసూయ, సావిత్రి, సారంగధర మొదలైన నాటకాలను ఈ సమాజం ప్రదర్శించి ప్రసిద్ధికెక్కింది. నవలా సమాజంలో స్త్రీలే సభ్యులు కావడం వల్ల స్త్రీ పురుషపాత్రలను స్త్రీలే నటించారు. ఆ రోజుల్లో ఈ సమాజాల నాటకాలను ప్రజలు బాగా ఆదరించారు.

నే.వ.శ

బాలసుందర శాస్త్రి, గబ్బిట (1895-1961) : రంగస్థల నటుడు. నాటక కళావేత్త. 1895లో వేదాంతి సుబ్బమ్మ, గురునాథం దంపతులకు బందరులో జన్మించాడు. అరవింద ఘోష్ అనుయాయుడు. మేధావి. బందర్ ఇండియన్ డ్రమెటిక్ కంపెనీలో ముఖ్య పాత్రధారి. ఆజానుబాహుడు, గంభీర విగ్రహం, గిరజాల జుట్టు, పచ్చని ఛాయ, నవరసాలు ఒప్పించ గల సామర్థ్యం ఉన్న వ్యక్తి. ఆదర్శజీవి. అనవరత ఖద్దరు ధారి, జాతీయవాది.

ఒథెల్లో పాత్రాభినయంలో మేటి అని పేరు పొందిన మహానటుడు. సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడు కేవలం కోపిష్టి కాదని తంత్రవేత్త అని ఆ పాత్ర నిర్వహణ ద్వారా నిరూపించిన కళావేత్త.

1920లో గాంధీజీ పిలుపునందుకొని బి.ఏ. చదువుకు స్వస్తి చెప్పిన త్యాగి. నాటక కళా వ్యాసంగం, ఆధ్యాత్మిక చింతన తప్ప వేరే వ్యాసంగం లేదు. బాలసుందర శాస్త్రి నాటకాచార్యుడు కూడా. ఎంతోమందిని నటులుగా తీర్చిదిద్దిన మేటి. ఈయనకు సంగీతం రాదు. కేవలం వచన నటుడు. అయితేనేం ఉచ్చారణతో ప్రేక్షకులను ఆకట్టుకొని మెప్పించేవాడు. ఆనాటి బందరు నాటక రంగానికి సుందరశాస్త్రి పెద్దదిక్కు. బందరు నటులు ఈయనను గురుతుల్యుడుగా భావించేవారు.

ధర్మరాజు, దుర్యోధనుడు, కంసుడు, ఆంజనేయుడు, సుదర్శన చక్రవర్తి, కలి, సుదేవుడు, రామరాజు, ఔరంగజేబు, యముడు, అమరసింహుడు, గిరీశం, శతమిత్రుడు, పెద్దన, స్వామినాథం, విశ్వామిత్రుడు మొదలైన పాత్రలలో నటించడంలో దిట్ట. ఇంగ్లీషు నాటకాలలో ఒథెల్లో పాత్రలో నటించాడు.

నాటకరంగంలో ఒక వెలుగు వెలిగిన బాల సుందరశాస్త్రి జీవితపర్యంతమూ దుర్భర దారిద్ర్యం అనుభవించి 1961, జులై 2న మరణించాడు.

శ్రీ.చ.

బాలె (Ballet) : నృత్య విశేషం. వాచికాభినయ రహితమైన నృత్య రూపకాన్ని బాలె అంటారు. పాశ్చాత్య దేశాలలో ఈ నృత్య రూపకానికి విశేష ప్రాచుర్యం ఉంది. ఫ్రాన్సు దేశంలో 14, 15 శతాబ్దాల నాటికే ఈ నృత్య రూపకం ప్రసిద్ధికెక్కి,

ప్రజాభిమానాన్ని దోచుకొంది. నేపథ్యం నుంచి వెలువడే జంత్ర, గాత్ర సమ్మేళనంతో బాలె ప్రదర్శన సాగుతుంది. ఫ్రాన్సు దేశ చక్రవర్తి 14వ లూయీ బాలెను ప్రోత్సహించి దీనికి విశిష్టతను కల్పించాడు. మోలియర్ నృత్య రూపకాలను రచించడమే కాకుండా ఈ ప్రక్రియకు తోడ్పడిన వారిలో ముఖ్యుడు. ఈ నృత్య ప్రక్రియ ఇంగ్లాండు, అమెరికా, రష్యాదేశాలకు వ్యాపించి కళాత్మక రూపం ధరించింది. భారత దేశంలో 19వ శతాబ్దం నుంచి బాలె వ్యాప్తిలో ఉంది. తెలుగులో సి. నారాయణ రెడ్డి, భుజంగరాయ శర్మ నృత్య రూపకాలు రాసిన వారిలో అగ్రగణ్యులు.

గం.సు.రె.

బీజం : సాహిత్య ప్రక్రియలన్నింటికీ మూలాధారం. నాటక నిర్మాణానికి ఆయువు పట్టు. ఎంతటి మహావృక్షమైనా అతి చిన్నబీజంతోనే వృద్ధిలోకి వస్తుంది, శాఖోపశాఖలుగా విస్తరిస్తుంది. నాటకం దేన్ని గురించి రాయాలి అనే ప్రశ్నకు సమాధానమే బీజం. ఇది వస్తువులో అంతర్భాగం. బీజం వస్తువుగా రూపం ధరిస్తుంది. వస్తువు ఇతివృత్తంగా విస్తరిస్తుంది. ఇతివృత్త నిర్మాణమే నాటకానికి ఆకృతిని ఇస్తుంది. సంభాషణలు, వస్తు వివరణకు, పాత్ర స్వభావ నిరూపణకు, మూలాధారమైన బీజం శక్తివంతంగా ఉన్నపుడే అది విశిష్ట సాహిత్యసృష్టికి హేతువుగా నిలుస్తుంది. బీజం శక్తివిహీనంగా ఉంటే నాటకంకూడా నిస్సారంగా, నిస్తేజంగా తయారవుతుంది. నాటక నిర్మాణంలో కథా గమనంలో ఎన్ని మార్పులచ్చినా బీజం ఉనికి మారదు. బీజం ఉనికి మారితే ఆ నాటకం చుక్కాని లేని నావ అవుతుంది.

ఉదాహరణకు కన్యాశుల్కంలో 'కన్యాశుల్కం' లేదా 'బాల్య వివాహం' బీజం. సత్యహరిశ్చంద్ర నాటకంలో ఇంద్రసభలో వశిష్ట విశ్వామిత్రులకు సత్యవాక్పరిపాలన మీద జరిగిన వాగ్వివాదం బీజం. ఆత్రేయ ఈనాడు నాటకంలో హిందూ ముస్లిం ఐక్యత బీజం. చింతామణిలో వేశ్యాసంపర్కం వినాశ హేతువు అన్నది బీజం. గయోపాఖ్యానంలో వాగ్దానం లేదా అభయం అనేది బీజం.

గం.సు.రె.

బీభత్స రసం : నవ రసాలలో ఒకటి. మూలరసం. గర్హ, నింద, కుత్స, బీభత్స అనేవి పర్యాయ పదాలు.

సాధారణంగా మాంసం, నెత్తురు, బమికలు మొదలైనవి చూచినా, దుర్గంధం వాసన తగిలినా, చెడు పదార్థాలు తాకినా, చూడగూడని విషయాలు, పదార్థాలు చూసినా రోత (జుగుప్స) కలుగుతుంది. ఈ జుగుప్స స్థిరంగా ఉంటే స్థాయీభావం అవుతుంది. జుగుప్స స్థాయి భావం కలది బీభత్సరసం.

బీభత్స రసానికి మాంసం, నెత్తురు, దుర్గంధం మొదలైనవి ఆలంబన విభావాలు. అపస్మారం, ఉద్వేగం, ఆవేశం, వ్యాధి, మరణం వ్యభిచారీ భావాలు. ముఖం, నేత్రాలు కుంచించుకుపోవడం, ముఖం వంచుకోవడం, ముక్కు మూసుకోవడం, ఉమ్మి వేయడం, వాంతి చేసుకోవడం, నేలకు అంటీఅంటకుండా అడుగులు ఎత్తెత్తి వేయడం ద్వారా దీనిని అభినయించాలి.

శ్రీ.చ.

బుచ్చిబాబు (1916-1967) : కథ, నవల, నాటక రచయితగా ప్రసిద్ధుడైన బుచ్చిబాబు అసలు పేరు శివరాజు వెంకట సుబ్బారావు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో 1916, జూన్ 14న జన్మించాడు. తల్లిదండ్రులు సుబ్బమ్మ, సూర్యప్రకాశ రావు. బుచ్చిబాబు పేరు వినగానే వెంటనే గుర్తుకు వచ్చే పుస్తకం చివరకు మిగిలేది. బుచ్చిబాబు నాటకరంగంలో కూడ సముచిత స్థానాన్ని సంపాదించుకున్నాడు. నాటక రచయితగా ఈయనకు గుర్తింపు తెచ్చిన నాటకం ఆత్మవంచన (1951). ప్రేమతత్వాన్ని వేరొక దృక్కోణం నుంచి చూపించడం ఈ నాటకంలో ఉన్న ప్రత్యేకత. పాత్రచిత్రణలో ప్రేక్షకుల్ని ఆలోచింపచేసే నాటకాలను రాసిన వారిలో బుచ్చిబాబుది ప్రత్యేకస్థానం. 1950లో కాకినాడలో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు నాటక పోటీలలో ఆత్మవంచనకు ఉత్తమ రచన బహుమతి లభించింది.

గొలుసు, ఒక నిద్ర, ఎన్నో కలలు అనే నాటకాలు, *దారినపోయే దానయ్య, ఒమర్ ఖయామ్, ఉత్తమ ఇల్లాలు, తెరపడని నాటకం* మొదలైన నాటికలు కూడా రచించాడు. ఈయన రచించిన నాటికలలో ప్రసిద్ధమైన వాటిలో మరొకటి తిష్యరక్షిత (1943). అశోక చక్రవర్తి అర్థాంగి సవతి కొడుకు కుణాలుని కామించి వెంటబడుతుంది. కుణాలుడు తిరస్కరించడంతో అతని కళ్ళు తీయించి కక్ష తీర్చుకుంటుంది. విచారణ జరిపి అశోకుడు ఆమెకు శిక్ష విధిస్తాడు. మరణ దండన అమలు జరగక ముందే తిష్యరక్షిత ఆత్మహత్య చేసుకొని మరణించడం ఆ నాటికలోని ఇతివృత్తం. ఈ కథకు చారిత్రక ఆధారాలు లేవని విమర్శకులు అనుమానం వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ దీన్ని కాల్పనిక నాటికగా తీసుకున్నా, సాహిత్య విలువలు గల ఒక మంచి నాటికగా గణించదగింది. వయో వృద్ధులు, యౌవనోద్రేకంతో ఉన్న యువతులను పెండ్లాడితే, కోర్కెలు చల్లారక స్త్రీలు అనుభవించే మానసిక వ్యథ, విషయ వాంఛలు తీరక వారు పడే తపన ఆ నాటికలో చిత్రితమైంది.

కోర్కెలు ఈడేరనప్పుడు, కట్టు బొట్లను తెంచుకొని వావివరసలు మరచి నైతిక ధర్మాన్ని ఎలా విస్మరిస్తారో ఎలాంటి తెగువ చూపిస్తారో సాంఘిక ధర్మాల మీద ఎలా తిరుగుబాటు చేస్తారో తిష్యరక్షిత పాత్ర ద్వారా విశదం చేశాడు రచయిత.

ఆద్యంతాలు మధ్యరాధ, రాయల కరుణ కృత్యం, షష్టిపూర్తి, నాలుగో పరిణామం, గాజు మేడ, రాజ మార్గం మొదలైన శ్రవ్య నాటికలు రాసిన బుచ్చిబాబు 1967, సెప్టెంబరు 20న మరణించాడు.

గం.సు.రె

బుడ్డయ్యచౌదరి, ఊట్ల (జ.1944) : నటుడు, నటనాలయ సంస్థ స్థాపకుడు. 1944, ఫిబ్రవరి14న గుంటూరుజిల్లా, చెర్వు జమ్ములపాలెం గ్రామంలో సీతమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించాడు. తన 11వ ఏటనే బుర్రకథలో వంతగా రంగస్థల ప్రవేశం చేశాడు. అనంతరం ఆయన ప్రదర్శించిన *కళాజీవి, బిచ్చగాడు, మురారి, మహానటుడు, జంగమదేవర* వంటి పలు ఏకపాత్రలు ఆయనకు అనేక బహుమతులు తెచ్చిపెట్టాయి. ఈయన మిత్రులతో కలిసి 'యూత్ రిక్రియేషన్ క్లబ్'ని స్థాపించి, దాని ఆధ్వర్యంలో పంజరం నాటకంలో డాక్టర్ పాత్రతో కళారంగ జీవితానికి శ్రీకారం చుట్టాడు. ఆ సమాజం ద్వారా ఆయన ప్రదర్శించిన ప్రెసిడెంట్ పట్టయ్య, *దొంగవీరడు, లంకెబిందెలు, ఇదేమిటి?, సుడిగాలి, వలయం, గాలివాన, పల్లెపడుచు, పాండవోద్యోగ విజయాలు* వంటి నాటకాల ద్వారా పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో యువకుల్ని కళారంగంవైపు ఆకర్షించాడు.



ప్రముఖ రంగస్థల నటప్రయోక్త అన్నపురెడ్డి శివరామిరెడ్డి శిక్షణలో నటనాలయం లో రాజారావు పాత్ర పోషించి, దానిలో విశేషంగా రాణించి, రెడ్డి శిక్షణతో గడించిన పరిణితి, అనుభవంతో ఉలిపికట్టె, కోహినూర్, మంచుతెర, *గరీబిహఠావో, చీకటిరాత్రి, కొక్కొరోకో, రావురాజ్యం,* షరామామూలే, మనుషులస్తున్నారు జాగ్రత్త నాటికలు తన దర్శకత్వంలో రూపొందించి, వాటిలో ప్రధానపాత్రలు పోషించి రాణించాడు. కోహినూర్ నాటికలో ఆయన పోషించిన కర్రా కనకరాజు పాత్రకు ఉత్తమ నటుడు, సహాయ నటుడు, హాస్య నటుడు, విలన్ వంటి బహుమతులు సాధించి ఒకే పాత్రలోని విభిన్న పార్శ్వాలను ఎలా స్పృశించవచ్చో ప్రయోగపూర్వకంగా ఋజువు చేసిన ప్రతిభాశాలి. శతాధిక ప్రదర్శనలలో పాల్గొని అనేక బహుమతులు పొందిన చౌదరి నటనాలయంలో రాజారావు, కోహినూర్‌లో కర్రా కనకరాజు, రాజీనామాలో రామారావు పాత్రలు ప్రేక్షకావళి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇవే కాకుండా వందలాది ఆకాశవాణి నాటకాల్లో కూడా నటించాడు.

అనంతర కాలంలో ఈయన 'నటనాలయం' అనే సంస్థను స్థాపించి పలువురు యువకళాకారుల్ని తన శిక్షణలో ఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దుతున్నాడు. దర్శకునిగా కొనసాగుతూ న్యాయనిర్ణేతగా కొత్త భూమికకు శ్రీకారం చుట్టి, పలుప్రాంతాల్లో జరిగే పరిషత్తులకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నాడు.

ఈయన సేవలను, ప్రతిభను గుర్తించి సాయి కళా స్రవంతి, రేపల్లె 1998లో ఎన్.టి. రామారావు అవార్డును, ఒరిస్సాలోని కటక్‌లో గల ఉత్కళ యువ సాంస్కృతిక సంఘ్ నాట్యభూషణ్ అవార్డు 2000లోను, ఆచార్య ఎన్.జి. రంగా ఫౌండేషన్ ఉత్తమ రంగస్థల ప్రయోక్త అవార్డు 2000లోను, వినుకొండ విశ్వశాంతి కళానికేతన్ అవార్డును ప్రదానం చేసి గౌరవించాయి.

మన్నెశ్రీ.

బుర్రకథ : యక్షగాన భేదం. యక్షగాన విశేషం. కథకుడు వాయించే తంబురా బుర్రను బట్టి ఈ పేరు వచ్చింది. ఈ బుర్రకథనే 'తందాన పాట' అని కూడా అంటారు. ఇది శుద్ధ యక్షగానం. యక్షగానంలో ఒక స్త్రీ కథ చెప్పడం పరిపాటి. బుర్రకథలో సామాన్యంగా కథ చెప్పేది పురుషుడు. కథకుడు తంబూరగాని, సితార గాని పుచ్చుకొని కథ చెపుతుంటే ఇరు పక్కల ఇద్దరు స్త్రీలు గుమ్మటలు వాయిస్తూ హాస్యం చెప్తారు. దీనిని వృత్తిగా స్వీకరించి వ్యాప్తిలోకి తెచ్చింది జంగాలు. వీరు ఊరూరా తిరుగుతూ ప్రదర్శనలిచ్చేవారు. ఇపుడు కులంతో నిమిత్తం లేకుండా స్త్రీ పురుషులు, బాలబాలికలు బుర్రకథ చెప్తూ ప్రజలను రంజింప చేస్తున్నారు.

యక్షగానం బుర్రకథగా ఎపుడు రూపాంతరం పొందిందో చెప్పలేముగాని శ్రీనాథుని కాలం నాటికే బుర్రకథలు బాగా ప్రచారంలో ఉన్నాయని క్రీడాభిరామం వల్ల తెలుస్తోంది. మొన్న మొన్నటి వరకు ఈ కథలను మంజరీ ద్విపదలో రచించేవారు. శ్రీనాథుడంతటివాడు వీటికి ఉన్న ప్రజాదరణను గమనించి, పల్నాటి వీర చరిత్ర ద్విపదలో బుర్రకథగా రాశాడు. ఇపుడు మనకు లభ్యమవుతున్న బుర్రకథలలో ప్రాచీనమైందీ, ఉత్తమమైందీ పల్నాటి వీర చరిత్ర అని తెలుస్తోంది.

బుర్రకథ దేశి సాహితీ శాఖకు చెందింది. చక్కటి జాను తెనుగులో రచితమై ప్రేక్షకులను తొందరగా ఆకర్షించి

రసానుభూతి కలిగించడంలో ప్రముఖ స్థానం అందుకుంది. వీటిలో ఎక్కువ ప్రాధాన్యం వహించేవి వీర, కరుణ రసాలు. నేర్పరి అయిన కథకుడు కథ చెప్తుంటే ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుంది.

ఈ విధంగా ద్విపదలో విరచితమై ఎక్కువ ప్రజాభిమానం చూరగొన్న బుర్రకథలు *పల్నాటి చరిత్ర, బబ్బిలి కథ, ఆరుగురు మరాఠీల కథ, బాలనాగమ్మ కథ, భారత రామాయణ కథలు, కామమ్మ కథ* మొదలైనవి. ఈ ద్విపద కథలను చెప్పడంలో ఈ అర్ధ శతాబ్దంలో పెద్దపేరుపొందింది రెంటపాళ్ళ గుడ్డి జంగం.

ధేనువకొండ వెంకయామాత్యుడు రచించిన *ఉత్తర గోగ్రహణం*తో బుర్రకథ ఇంకో దశ అందుకుంది. ఇందులో ద్విపదలే గాక కీర్తనలు, దరువులు, కందార్థాలు మొదలైనవి వాడడం గమనించ తగ్గది. ఈ రకం బుర్రకథలను చెప్పడంలో యావదాంధ్ర విఖ్యాతి గాంచింది దొడ్డవరపు వెంకటస్వామి. నిండైన విగ్రహం, పెద్ద జరీ అంచు తలపాగా, నవరసాలను ఆవిష్కరించే ముఖంతో *ఉత్తర గోగ్రహణం* చెబుతూంటే ప్రేక్షకులు తన్మయులయ్యేవారు.

చాలాకాలం వరకు బుర్రకథలన్నీ పురాణ సంబంధమైనవి. వీరుల సంబంధమైనవి. ప్రజా సమస్యల్ని, పోరాటాల్ని తీసుకుని వాటిని బుర్రకథగా రచించిన ప్రప్రథమ కవి సుంకర సత్యనారాయణ. ఈయన రచించిన *కష్టజీవి, అల్లూరి సీతారామరాజు, వీరేశలింగం* మొదలైన కథలు ఎంతో ప్రజాదరణ పొందాయి. ఈ ఒరవడిలోనే నాజరు మొదలైన కవులు ఎన్నో బుర్రకథలు రాసి ప్రజలలో చైతన్యం కలిగించారు.

నాజరు యావదాంధ్రలోను సాటిలేని మేటి కథకునిగా పేరు పొందాడు. కథకుడు ప్రత్యేకమైన దుస్తులు ధరించడం ఇతనితోనే ప్రారంభమైంది. వంతపాడే స్త్రీల స్థానం ఎక్కువగా పురుషులకు లభ్యమైంది. వంతలు పూర్వం హాస్యం మాత్రమే చెప్పేవారు. ఇపుడు రాజకీయాలు కూడా చెప్పటం పరిపాటైంది. అందుకే ఇద్దరు వంతలను హాస్యం, రాజకీయం పేరుతో పిలుస్తుంటారు.

శ్రీ.చ.

బెటీ, ఉగో (1892-1953) : 20వ శతాబ్దపు తొలి అర్ధ భాగంలోని ప్రముఖ ఇటాలియన్ నాటక రచయిత. తన రచనల ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించినవాడు. న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేసి మేజిస్ట్రేటుగా, జడ్జిగా పనిచేశాడు. మొదటి ప్రపంచయుద్ధంలో పాల్గొని 1917-18లో జర్మన్ల బందీగా ఉన్న సమయంలో తాను రాసిన కవితలను ఇల్ రె పెన్సియారొసా (1922 The Thoughtful King) అనే పేరుతో ప్రకటించాడు. ఇదిగాక ఇంకా రెండు కవితా సంపుటాలు, మూడు కథా సంకలనాలు, ఒక నవల, ఇరవై ఆరు నాటకాలు రచించాడు.

ఫ్రానా అల్లో స్కేలో నార్డ్ (తొలి ప్రదర్శన:1933 ఆంగ్లంలో Land slide, 1964) ప్రకృతి బీభత్సం, సామూహిక అపరాధం అనే ఇతివృత్తం గలది. డెలిట్టో ఆల్ ఇసోలా డెల్లి కేపర్ (తొలి ప్రదర్శన 1950), అనే నాటకం ప్రేమను, పగను చిత్రిస్తుంది. లాఫుగిటివా (తొలి ప్రదర్శన 1953, ఆంగ్లానువాదం The Fugitive 1964) లో న్యాయ శాస్త్రాలే ప్రపంచముక్తికి సాధనాలని రచయిత ప్రతిపాదిస్తాడు. కరజియోన్ ఆల్ పాలజోడి గ్యుస్టిజియా (తొలి ప్రదర్శన 1949, ఆంగ్లానువాదం Corruption in the Palace of Justice, 1962) లో నీతి నియమాలు లేని ఒక న్యాయాధ్యక్షుడు చివరకు తన తప్పును గ్రహించి తనకు తానుగా బోనులో నిలబడి శిక్షను కోరుకుంటాడు.

1950 నుంచి ఈయన నాటకాలు పారిస్‌లో ప్రదర్శింపబడటంతోను, ఆ తరువాత వాటి ఆంగ్లానువాదాలు ప్రచురితమవటంతోను బెటీ కీర్తిప్రతిష్ఠలు అంతర్జాతీయ స్థాయిని అందుకొన్నాయి.

కె.జి.మూర్తి.

బెనావెంతే-యి-మార్టినెజ్,జాసింతో (1866-1954): 20వ శతాబ్దపు ప్రముఖ శ్పానిష్ నాటక రచయితలలో ఒకడు.

1922లో నోబెల్ బహుమతి గ్రహీత. సాంఘిక విమర్శ ద్వారా వాస్తవికత వైపు శ్పానిష్ నాటక రచనను మళ్లించాడు. నాటకంలో పద్యాలస్థానే వచనాన్ని, ఆశ్చర్యకర సన్నివేశాలస్థానే హాస్య సన్నివేశాలను, లాక్షణిక రూపం స్థానే సొంత అనుభూతిని ప్రవేశపెట్టాడు. బెనావెంతే ఆరంభంలో సౌందర్య శాస్త్రం మీద, అనంతరం నీతి శాస్త్రం మీద ఎక్కువ ఆసక్తి చూపాడు. బెనావెంతే నాటకాలలోని వైవిధ్యంవల్ల నాటక

ప్రభావపరిధిని ఎంతగా విస్తృతం చేశాడో బోధపడగలదు. బెనావెంతే రచించిన నాటకాలలో ముఖ్యమైనవి; లాస్ ఇంటరీసెస్ క్రియాడోస్ (ప్రదర్శన-1903, ప్రచురణ 1907; The Bonds of Interest), లానోకేడెల్ సెబడో (ప్రదర్శన-1903 Saturday Night), లాస్ మాల్హెపోరిస్ డెల్ డీన్ (ప్రదర్శన-1905, The Evil Doers of Good), లా మాల్కెరిడా (1913, The Passion Flower). వీటిలో మొదటి నాటకం ఈయన నాటకాలన్నింటిలో మిక్కిలి ప్రసిద్ధిచెందింది. ఇటాలియన్ కామెడీలు ఆధారంగా ఇది రచింపబడింది. చివరి నాటకం ఒక గ్రామీణ దుర్ఘటనను వర్ణించేది. నిషిద్ధ ప్రణయం దీని ఇతివృత్తం. స్పెయిన్‌లోనూ, ఉత్తర, దక్షిణ అమెరికాలోనూ ఈ నాటకం విశేషంగా విజయవంతమైంది. సెనోరా అమూన్ (1908) అనే నాటకం వ్యక్తిగతంగా బెనావెంతేకి మిక్కిలి ఇష్టమైంది.

1928లో బెనావెంతే రచించిన పేరా ఎల్ సీలో యి లోస్ ఆల్టారెస్ (Toward Haeven and the Altars) అనే నాటకం రాబోయే శ్పానిష్ రాజరికపు పతనాన్ని సూచించడం వల్ల ప్రభుత్వం దానిని నిషేధించింది. శ్పానిష్ అంతర్యుద్ధ కాలంలో బార్సిలోనా, వాలెన్షియాలలో జీవిస్తూ కొంతకాలం జైలులో కూడా ఉన్నాడు. 1941లో ది ఇన్ క్రెడిబుల్ అనే నాటకం రచించి తిరిగి ప్రజాదరణను చూరగొన్నాడు. 150 పైచిలుకు నాటకాలను రచించిన ఈ రచయిత లోప్ డీ వేగా నాటి స్వర్ణయుగాన్ని గుర్తుకు తెచ్చాడు. ఆయన నాటకాలలో చాలాభాగం ఆంగ్లంలోకి అనువదింపబడ్డాయి.

నాగరాజ్ (బ.శ్రీ.)

బెర్నార్డ్, జీన్-జేక్విస్ (1888-1972) : ఫ్రెంచ్ నాటకకర్త. నాటకంలోని పాత్రల నిజమైన మనోభావాలను సంభాషణల ద్వారా వ్యక్తం చెయ్యని 'అవ్యక్త నాటక పద్ధతి'కి ప్రధాన ప్రతినిధి. అవ్యక్త నాటక పద్ధతి 'మౌన పద్ధతిగా' ప్రసిద్ధికెక్కింది. జీన్ జేక్విస్ 1922లో రాసిన మార్టిన్ నాటకం అవ్యక్తనాటకపద్ధతికి మంచి ఉదాహరణ. అందులోని పాత్రల స్వభావాలను గ్రహించడానికి ఆ పాత్రల సైగలు, ముఖ భంగిమలు, వాటి పొడి పొడి మాటలు, మౌనం తోడ్పడుతాయి.



జీన్ జేక్విస్ తండ్రి ట్రిస్టాన్ బెర్నార్డ్ కూడా నాటకకర్తగా ప్రసిద్ధుడే. జీన్ జేక్విస్ తొలి నాటకాలలో మనోవైజ్ఞానిక సమస్యలు ఇతివృత్తాలు. లైఫ్యుక్వీ రిఫ్రెండ్‌మాల్ (1921), లె ప్రింటెమ్ప్స్ డె ఆట్రెస్ (1924) అనే రెండు నాటకాలలో అకారణ ద్వేషం ఇతివృత్తం. 1926లో వెలువడిన లామెన్ పెయిన్ లో పరస్పరం పరిచయం లేని రెండు పాత్రలు ఒకదాన్ని మరొకటి సమీపించేటప్పుడు అనుభవించే అశాంతి ఇతివృత్తం.

యూదు జాతికి చెందినవాడన్న కారణంగా రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జర్మనీ వారి 'కాన్‌సెన్‌ట్రేషన్ కాంప్'లో బందీగా ఉన్న జీన్ జేక్విస్ ఆ సజీవ నరకంలో తాను పొందిన అనుభవాలను లె కాంప్ ద లా మార్ట్‌లెంటె (1944; 'The Camp of Slow Death' 1945) పేరిట 1944లో ఒక స్మృతి గ్రంథంగా ప్రకటించాడు. తన నాటకానుభవాలను గురించి 1958లో మొన్ అమి లె థియేటర్ అనే పుస్తకం రాశాడు. జీన్ జేక్విస్ రాసిన నాటకాలు కొన్నిటిని జె.ఎల్. ఫ్రిత్ ఆంగ్లంలోకి అనువదించి 1939లో ది సల్కీ ఫెయిర్ పేరిట సంకలనంగా ప్రచురించాడు.

పి.ఎస్.జి.

బెర్నార్డ్, షా జార్జి: (1856-1950) : బ్రిటన్ నాటకకర్త. తండ్రి జార్జి కార్ష్, తల్లి లుసిండా ఎలిజిబెత్ షా. ఆర్థిక కారణాల వల్ల తల్లిదండ్రులతో పాటు లండన్ వలస వచ్చి తొలుత వివిధ పత్రికలకు గ్రంథ సమీక్షకుడుగా, సంగీత నాటక విమర్శకుడుగా పని చేశాడు. నవలలు రాశాడు గాని అవి ప్రజాదరణను పొందలేదు. నాటక రచనలో ఆసక్తి కలిగి నాటక రచన ప్రారంభించాడు. షా, ఇబ్సన్ అనుయాయుడు. ఇబ్సన్ నాటక ప్రశస్తి మీద గ్రంథం రచించాడు. ఇబ్సన్ నాటక రచనా విధానం ప్రచారం చేశాడు.



సాంఘిక, మత, రాజకీయ సమస్యలను హాస్య, అవహేళన, నిశిత విమర్శలతో రంగరించి చిత్రించడం, నాటక ఇతివృత్తం మీద తన దృక్పథాన్ని విశదీకరిస్తూ నాటకాలకు పీఠికలు రాయడం ఇతని ప్రత్యేకత. జీవశక్తి (Life force) సిద్ధాంతాన్ని ఇతివృత్తంగా చేసుకుని రాసిన మానవుడు - మానవోత్తముడు (Man and Super man) నాటకానికి నోబుల్ బహుమతి లభించింది గాని నిరాకరించాడు.

ఇతని మొదటి నాటకం విడోయర్స్ హౌసెస్. ఇది 1885లో రచించినా 1892లో గాని ప్రదర్శితం కాలేదు. ఆ తరువాత నాటకాలన్నీ విజయవంతమై ప్రపంచఖ్యాతి తెచ్చిపెట్టాయి.

1904 నుంచి తన నాటకాల ప్రదర్శనంలో స్వయంగా శ్రద్ధగా తీసుకోసాగాడు. జీవితం ఆఖరి దశలో ప్రపంచమంతా పర్యటించాడు.

విడోయర్స్ హౌసెస్ (Widower's Houses, 1892), ది మాన్ ఆఫ్ డెస్టినీ (The Man of Destiny, 1897), కాండిడా (Candida, 1897), ది డెవిల్స్ డిసైపుల్ (The Devil's Disciple, 1897), ఆర్మ్స్ అండ్ ది మాన్ (Arms and The Man, 1898), యు నెవర్ కెన్ టెల్ (You Never Can Tell, 1899), ఫిలాండరర్ (Philanderer, 1905), మాన్ అండ్ సూపర్ మాన్ (Man And Superman, 1905), డాక్టర్స్ డైలమా (Doctor's Dilemma,1906), సీజర్ అండ్ క్లియోపాత్ర (Ceaser And Cleopatra, 1907), పిగ్‌మేలియన్ (Pygmalion, 1914) మొదలైన రచనలు వెలువరించిన బెర్నార్డ్ షా 1950లో మరణించాడు.

శ్రీ.చ.

బెహాన్, బ్రెండన్ (1923-64) : ఐరిష్‌నాటక రచయిత. పదునైన వ్యంగ్యానికి పెట్టింది పేరు. ఘాటైన రాజకీయ వ్యాఖ్యలు బెహాన్ 'అసంబద్ధ' నాటకాలకు ప్రసిద్ధి చేకూర్చాయి. తన రచనలలోనూ, జీవితంలోనూ ఆంగ్లేయ వ్యతిరేక ధోరణిని అవలంబించాడు.

బెహాన్ కుటుంబం వామపక్ష ధోరణులకు, విప్లవ కార్యకలాపాలకు, ఆంగ్లేయ విరుద్ధ భావాలకు ఆలవాలం. తన 14వ ఏటనే ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీలో వార్తాహరుడుగా పని చేశాడు. విధ్వంసక చర్యల్లో పాల్గన్నందుకు గాను 1940లో శిక్షకు గురై, మూడేళ్లపాటు సాధారణ పాఠశాలకు పంపబడ్డాడు.

ఈ నిర్బంధిత కాలం నాటి అనుభవాలను, జ్ఞాపకాలను బోర్‌స్టల్ బాయ్ (1958) అనే గ్రంథంలో ప్రకటించాడు. 1942లో డబ్లిన్‌కు పంపబడినప్పుడు బెహాన్ పోలీసులపై కాల్పులు జరిపినందుకుగాను 14 ఏళ్ల కారాగారవాస శిక్షకు గురయ్యాడు. క్షమాభిక్ష వేడి, 1946లో జైలు నుంచి విడుదల అయ్యాడు. బెహాన్ జైలులో ఉన్నప్పుడు తన ఐరిష్ భాషా సామర్థ్యాన్ని పెంపొందించుకున్నాడు. ది క్వేర్ ఫెలో (1954), ది హోస్టేజ్ (1958) బెహాన్‌కు చిర యశస్సు నార్జించి పెట్టిన నాటకాలు.

బెహాన్ రేడియో, టెలివిజన్లకు రచనలు చేసేవాడు. వాటి కార్యక్రమాల్లో పాటలు పాడేవాడు. పత్రికలకు రచనలు పంపేవాడు. డబ్లిన్ గురించి ఐరిష్ పత్రికలో రాసిన వ్యాసాలు హోల్డ్ యువర్ అవర్ అండ్ హేన్ అనదర్ పుస్తకంగా వెలువడ్డాయి. ది క్వేర్ ఫెలో అనే నాటకం 1954లో డబ్లిన్‌లో విజయవంతంగా ప్రదర్శింపబడింది. ఒక ఖైదీని ఉరితీయడం గురించి తోటి ఖైదీల, జైలు అధికారుల భావాలు, అభిప్రాయాలు శక్తివంతంగా ఈ నాటకంలో నిరూపించబడ్డాయి. ఈ నాటకం లండన్, న్యూయార్క్ నగరాలలో కూడా ప్రదర్శింపబడి, ప్రేక్షకుల మన్ననలు పొందింది.

బెహాన్ రచనలో విశిష్టమైనది ది హోస్టేజ్. ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ ద్వారా ఒక వేశ్యా వాటికలో నిర్బంధింపబడిన ఒక ఆంగ్ల సైనికుని అవస్థ ఈ నాటకంలో చిత్రించబడింది. ఆనాటి సాంఘిక పరిస్థితులు కథాగేయాలు, ఫాంటసీల ద్వారా విమర్శనాత్మకంగా ఈ నాటకంలో నిరూపింపబడ్డాయి. ది హోస్టేజ్ నాటకం లండన్, న్యూయార్క్ నగరాల్లో ప్రదర్శింపబడి బెహాన్‌కు గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టింది.

బెహాన్ రచనలలో వైవిధ్యముంది. బ్రెండన్ బెహాన్స్ ఐలండ్ (1962) ఐరిష్ సంఘటనల సంకలనం దొంగ వస్తువులను అక్రమంగా రవాణా చేసే ఇతివృత్తంతో కుతూహలజనకంగా సాగే నవల 'ది స్కార్పెరర్ (1964)'. ఐరిష్ విప్లవకారుడుగా తన అనుభవాలను, జ్ఞాపకాలను క్రోడీకరించి కన్‌ఫెషన్స్ ఆఫ్ ఆన్ ఐరిష్ రెబెల్ (1965) అనే గ్రంథంగా బెహాన్ వెలువరించాడు.

జి.అ.నా.

బ్యూఖ్నర్, జార్జ్ (1813-1837) : జర్మన్ నాటక రచయిత. 20వ శతాబ్దపు ఆరంభ కాలంలో నాటకరంగంలో వెలసిన అభివ్యక్తవాద (ఎక్స్‌ప్రెషనిస్ట్) సంప్రదాయానికి వైతాళికుని వంటివాడు.

1830లో పారిస్‌లో జరిగిన తిరుగుబాటు వల్ల చెలరేగిన విప్లవోద్యమంలో పాల్గని బ్యూఖ్నర్ 1834లో ఒక కరపత్రం ప్రకటించాడు. దానిలో ఆర్థిక, రాజకీయ విప్లవాన్ని ప్రబోధించాడు. అంతేకాక ఒక రాడికల్ సొసైటీని స్థాపించాడు. అరెస్ట్ కాకుండా తప్పించుకొని, 1836లో జూరిఖ్‌లో నేచురల్ సైన్స్ ఉపన్యాసకుడుగా నియమింపబడ్డాడు.

బ్యూఖ్నర్ రచించిన మూడు నాటకాల శైలిమీద షేక్స్పియర్ ప్రభావం, జర్మన్ రొమాంటిక్ స్టుర్మ్‌ండ్‌డ్రాంగ్ ఉద్యమ ప్రభావం స్పష్టంగా కనిపిస్తాయి. వాటిలోని హ్రస్వమైన, హఠాత్తుగా ముగిసే దృశ్యాలలో స్వాభావికత, దార్శనిక బలం కనిపిస్తాయి. ఈతని మొదటి నాటకం డాంటన్స్ టోడ్ (1835). ఇది ఫ్రెంచ్

రివల్యూషన్‌కి సంబంధించిన నిరాశాపూరితమైన నాటకం. ఈ నాటకంలో నాయకుడైన డాంటన్ తాను కారణభూతుడైన రక్తపాతానికి ప్రగాఢంగా విచలితుడైన వ్యక్తిగా చిత్రించ బడ్డాడు. లియోన్స్ ఉండ్ లెనా (1836) అనే వ్యంగ్య పరిహాసనాటకంలో కాల్పనికభావాల అస్పష్టత పరిహరించ బడింది. ఈతని చివరి నాటకం వోంయి ట్సెక్ (1836) అసం పూర్ణంగా మిగిలి పోయింది. 1890 తరువాత పేదసాదలపై కారుణ్యాన్ని చూపుతూ వచ్చిన సాంఘిక నాటక ప్రక్రియకు దీనిని పూర్వ నిర్దేశికగా భావింపవచ్చు. బ్యూఖ్నర్ రచనలలో చాలా భాగం ఆయన మరణానంతరమే ప్రకటించ బడ్డాయి. ఆయన జీవితకాలంలో ప్రచురింపబడిన డాంటన్స్ టోడ్ 1902లో గాని రంగస్థల ప్రదర్శనకు నోచుకోలేదు.



ఈయన తన 24వ ఏటనే 1837, ఫిబ్రవరి 19న జూరిఖ్ నగరంలో అకాల మరణం చెందాడు.

బ.శ్రీ.

బ్యూయేరో వలేజో, ఆంటోనియో (జ.1916) : రెండవ ప్రపంచయుద్ధానంతరం స్పెయిన్ దేశంలో వర్ధిల్లిన యువతరంలో అతి ప్రసిద్ధుడైన నాటకకర్త. ఈయన నాటకాలలో అధిక సంఖ్యాకమైన వాటికి స్పెయిన్ దేశంలో ప్రతిష్ఠాకరమైన సాహిత్య పురస్కారాలు లభించాయి.



స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ మహానగరంలోనూ, స్వస్థలమైన గాదల జారాలోనూ విద్య గరచి, కళారంగంలో నిష్ణాతుడయ్యాడు. 1936-39 సంవత్సరాల మధ్య స్పెయిన్‌లో చెలరేగిన అంతర్యుద్ధంలో రిపబ్లికన్ పక్షం తరపున సైనికుడిగా యుద్ధంలో పాల్గన్నాడు. యుద్ధానంతరం నేషనలిస్టు నియంతృత్వం ఇతనికి మరణశిక్ష విధించినా, వెంటనే దాన్ని జీవితఖైదుగా మార్చడంతో బతికి బయటపడ్డాడు. ఆరేళ్లకు పైగా ఈయన ఖైదీగా మగ్గాడు. 1969లో రాసిన ది కేస్ ఆఫ్ ఏ స్టెయిర్ కేస్ (సోపానకథ) అనే నాటకంతో ప్రప్రథమంగా ఈయన ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. ఇందులో మాడ్రిడ్ మహానగరంలోని మురికివాడలలో, అపార్టుమెంటుల్లో నివసించే నిరుపేదల విషాదగాథలను నైపుణ్యంతో చిత్రించాడు. దానికి స్పెయిన్‌లో అతి ముఖ్యమైన 'లోప్ డి వేగా' సాహిత్య పురస్కారం లభించింది. అదే సంవత్సరం రాసిన ఏకాంకిక నాటిక వలబ్రాన్ ఎన్ లా ఎరీనా కూడా మరో సాహిత్య పురస్కారం అందుకుంది. ఇన్ ది బర్నింగ్ డార్క్‌నెస్ ఈతని రెండవ మహా నాటకం. ఇది ప్రతీకాత్మకం. దీనిలో గుడ్డివాని గృహం సమాజానికి ఒక ప్రతీక.

ఈయన నాటకాలలో మానవాళి సుఖశాంతులకు విఘ్నం కలిగించే ప్రతీక శక్తులు ప్రధానంగా కనిపిస్తాయి. జర్మన్ నాటకకర్త బెర్టోల్డ్ బ్రెష్ట్ రచనలను శ్పానిష్ భాషలోకి అనువదించడమేకాక, అతని ప్రభావంతో ఎన్నో నాటకాలను కూడా రచించాడు. మూడవ చార్లెస్ కాలంలో స్పెయిన్ ఆధునీకరణం ఎందుకు విఫలమైందో ది డ్రీమర్ ఫర్ ది నేషన్ (మహా స్వాప్నికుడు, 1961)లో వివరించాడు. అట్లే ది లేడీజ్- ఇన్-వెయిటింగ్ (చెలికత్తెలు) అనే నాటకంలో ప్రసిద్ధ చిత్రకారుడు వెలాజ్ క్విజ్ జీవితాన్ని, ది కాన్‌సర్ట్ ఎట్ సెంట్ ఓవిడ్ (సెంట్ ఓవిడ్‌లో సంగీత కచేరీ, 1967)లో ఫ్రెంచి విప్లవ సమయంలో పారిస్ నగర జీవితాన్ని, ది బేస్మెంటు విండో (కింది కిటికీ, 1967)లో స్పెయిన్‌లోని అంతర్యుద్ధాన్ని సవిమర్శకంగా చిత్రించాడు. అనంతర రచనలలో ది డ్రీమ్ ఆఫ్ రీజన్ (హేతు స్వప్నం, 1970), ది డబుల్ లైఫ్ ఆఫ్ డాక్టర్ వల్మీ (డాక్టర్ వల్మీ రెండు జీవితాలు, 1978) ప్రధానమైనవి. ఈతనికి 1971లో ప్రతిష్ఠాత్మకమైన శ్పానిష్ అకాడమీ సభ్యత్వం లభించింది.

గం.శ్రీ.

బ్రెష్ట్, బెర్టోల్ట్ (1898-1956) : జర్మన్ నాటక కర్త, దర్శకుడు, కవి. ప్రపంచ నాటకరంగాన్ని పెనుమలుపులు తిప్పిన మహా రచయిత బెర్టోల్డ్ బ్రెష్ట్. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ, అగ్రరాజ్యాల చేతిలో అవమానాలతో, సైనిక పాలకుల అణచివేతతో ఉడికిపోతున్నప్పుడు బతుకు రాపిడి నుంచి పుట్టుకొచ్చిన నిజాల నిప్పురవ్వల్లాంటి అనుభవాలనే అక్షరాలుగా చేసుకొని నాటక రచనలు చేశాడు. తన తరాన్ని పరామర్శిస్తూ ముందు తరాల భవిష్యత్తును పర్యావలోకం చేశాడు.

బెర్టోల్డ్ బ్రెష్ట్ 1898 ఫిబ్రవరి 10న జర్మనీలోని ఆగస్‌బర్గ్‌లో జన్మించాడు. తండ్రి పేపరుమిల్లు యజమాని. స్కూల్ చదువు ఆగస్‌బర్గ్ లోనే పూర్తి చేసుకొన్న బెర్టోల్డ్ బ్రెష్ట్ 1917లో మ్యూనిచ్‌లో మెడిసిన్ చేశాడు. ఏడాది పాటు సైనిక అస్పత్రిలో డాక్టర్‌గా పనిచేశాడు. 1917లోనే జర్మన్ కమ్యూనిస్టుపార్టీ

(కె.పి.డి)లో సభ్యుడిగా చేరాడు. మొదటి ప్రపంచ యుద్ధ ముగింపు దశలో కార్మిక సైనిక సలహా మండలి సభ్యుడిగా పనిచేశాడు. అదే సంవత్సరం తన తొలినాటకం బాల్ రాశాడు. ఇది విజయవంతం కావటంతో మ్యూనిచ్‌లో నాటక సాహిత్య సలహాదారుగా పనిచేశాడు. నాటకం పట్ల బెర్టోల్డ్ బ్రెహ్ట్‌కున్న అభిప్రాయాలు మిగిలిన వారికి భిన్నమైనవి. జాతిని చైతన్యపరచి ప్రజలను విప్లవోన్ముఖులుగా రూపొందించటమే నాటక రచన లక్ష్యమని బెర్టోల్డ్ బ్రెహ్ట్ భావించాడు. వ్యక్తిని వ్యవస్థలో విడదీయరాని భాగంగా,అనుబంధం వీడలేని జీవిగా నాటకంలో చూపుతున్నందువల్ల ప్రేక్షకునిలో తాను నిస్సహాయుడు, అస్వతంత్రుడూ అన్న నిస్పృహ కల్గుతుందనీ, ఇది సృజనాత్మక వివేచనను అడ్డుకొంటుందనీ భావించి, నాటక నిర్మాణ శిల్పంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాడు. విప్లవ భావాలున్న రచయితలు ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకోవటమే గాక వారితోనే జీవించాలని బ్రెహ్ట్ అభిప్రాయం. అంతర్, బహిర్యుద్ధాలతో అతలాకుతలమైపోయిన జర్మనీలో అభద్రత, అశాంతి, ఆర్థిక అసమానలతో జీవించే ప్రజల దుర్భరస్థితిగతుల్ని కళ్ళకు కట్టేట్టుగా తన నాటకాల్లో చిత్రించాడు.

1926లో రాసిన మాన్ మ్యావ్ ఈక్వెల్స్, 1928లో రాసిన ది త్రీ పెన్నీ ఆపెరా బ్రెహ్ట్ రచనా శిల్పానికి నిలువుటద్దాలు. డ్రమ్స్ ఇన్ ది నైట్ బ్రెహ్ట్‌కు ఎంతో పేరు తెచ్చి పెట్టింది. మానవుని మహత్వాకాంక్షకూ, విధ్వంసక మనస్తత్వానికీ రక్తతర్పణం చేస్తూ మారణహోమాన్ని సృష్టించే యుద్ధ బీభత్సాన్ని చిత్రించే నాటకమిది. బలిదానం అంచున నిలబడ్డ సైనికుని స్వరూపాన్ని, యుద్ధం నెపంతో విలయతాండవం చేసే దోపిడీ మూకల స్వార్థ మనస్తత్వాన్ని, విలాస జీవితాన్ని, శక్తివంతంగా ఇందులో ప్రదర్శించాడు బ్రెహ్ట్. దీనికి ఆనాటి సాహిత్య బహుమతుల్లో అత్యున్నతమైన 'క్లైస్ట్ అవార్డు' లభించింది.

రెండు ప్రపంచ యుద్ధాలకు, 1917–18 జరిగిన విప్లవాల్లో ఆస్ట్రియా, జర్మనీ, హంగరీ, రష్యా రాజ్యాల విధ్వంసానికీ, కమ్యూనిస్టు ప్రజా ఉద్యమానికి, జర్మనీ విభజన, పారిశ్రామికీకరణ, పట్టణీకరణాల పరిణామాలకు బ్రెహ్ట్ ప్రత్యక్ష సాక్షి. ఈ నేపథ్యాల్నే తన నాటక ఇతివృత్తాలకు సరంజామాగా తీసుకొని ఇన్ ది జంగిల్ ఆఫ్ సిటీస్', సెయింట్ జోన్ ఆఫ్ స్టాక్‌యార్డ్ అనే నాటకాలను రాశాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో జరిగిన జననష్టాన్ని గూర్చి ప్రశ్నించి, అందుకు కారకులైన వారిని లెజెండ్ ఆఫ్ డెడ్ సోల్జర్ అనే రాజకీయ విమర్శన గ్రంథంలో ప్రస్తావించాడు.

1933లో ప్రాబల్యం సాధించిన నాజీలు తమ హిట్ లిస్టులో బ్రెహ్ట్ పేరు కూడా చేర్చారు. పౌరసత్వాన్ని రద్దుచేశారు. ఆయన పుస్తకాల్ని తగులబెట్టారు. దీంతో బ్రెహ్ట్ జర్మనీ నుంచి డెన్మార్క్‌కు పారిపోయాడు. తరువాత స్వీడన్, ఫిన్లాండ్, అమెరికా, సోవియట్ యూనియన్‌లలో ప్రవాస జీవితం గడిపాడు. అమెరికాలో ఉన్నప్పుడు కమ్యూనిజాన్ని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొన్నాడు. దీంతో 1948లో తూర్పు జర్మనీకి వచ్చి స్థిరపడ్డాడు. నాలుగు నెలల తరువాత తన సహచరుడు ఎరిచ్ ఏంజెల్‌తో కలిసి మదర్ కరేజ్‌లో యుద్ధ బీభత్సాన్ని అద్భుతంగా చూపాడు. ఇద్దరు కొడుకులూ, మూగ చెవిటి కూతురు యుద్ధ కారణంగా బలైపోయినా, ఏకాకిగానే సైన్యాన్ని అనుసరించే మదర్ పాత్రను విలక్షణంగా చిత్రించాడు. ది కాకేషియన్ ఛాక్ సర్కిల్, గెలీలియో, ది మెజర్స్ టేకెన్, మదర్ కరేజ్, ది గుడ్ ఉమన్ ఆఫ్ షెజ్వాన్ వంటి నాటకాలు బ్రెహ్ట్‌కు విశ్వవ్యాప్త కీర్తిని చేకూర్చిపెట్టాయి.

'ది కాకేషియన్ ఛాక్ సర్కిల్' నాటకంలో ఇద్దరు స్త్రీలు ఒక బిడ్డకు తామే నిజమైన తల్లులమంటూ తగాదాలు పడి రాజు వద్దకు వస్తారు. మన దేశంలో గ్రామ గ్రామానా ప్రజల నోళ్ళల్లో నలిగిన కథా సారమే ఇది. అయితే ఈ నాటకంలో నిజమైన తల్లి కాకుండా, నిరుపేద సేవకురాలైన స్త్రీ ఆ బిడ్డను తల్లిగా సాకుతుంది. అసలు తల్లి ఆస్తి ఆడంబరాల కోసం బిడ్డను దూరం చేసుకుంటుంది. ధన వ్యామోహం మానవ బంధాలనూ, రక్త సంబంధాలనూ ఏ విధంగా కాలరాస్తుందో, ఆర్థిక బంధం మానవ బంధాలనూ ఏ విధంగా శాసిస్తుందో ఈ నాటకం ద్వారా ఆనాడే వెల్లడించాడు బ్రెహ్ట్.

మహాగాథ (ఎపిక్), సైంటిఫిక్ థియేటర్ కోసం పరిశ్రమించిన బ్రెహ్ట్ తన నాటకాల్లో ప్రేక్షకుణ్ణి గురుస్థానంలో కూర్చోబెట్టాడు. నాటకం ప్రేక్షకుడికి ఒక ప్రశ్నావళిగా ఉండాలి అన్నది బ్రెహ్ట్ సిద్ధాంతం. కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఎంతగా ఆమోదించారో, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకూ బ్రెహ్ట్ అంతే విలువనిచ్చాడు. స్టాలినిస్టు సిద్ధాంతాన్ని (సోషలిస్టు రియలిజం) విమర్శిస్తూ రచనలు చేశాడు. పార్టీ నియంతృత్వం కింద ఏ కళాకారుడూ స్వేచ్ఛగా పనిచేయలేడని బ్రెహ్ట్ వాదించాడు. కవిగా, నాటక రచయితగా, దర్శకుడిగా, ప్రయోక్తగా సామ్యవాదాన్నే ఆలంబనగా చేసుకున్న బ్రెహ్ట్ నాటి జర్మన్ ప్రజల ప్రతి పోరాటంలో పాలు పంచుకుంటూనే కాలం గడిపాడు. "ప్రపంచాన్ని వదలి వెళ్ళేప్పుడు నీ మట్టుకు నీవు మంచిగా ఉండటమే కాదు. నువ్వు

వదలి వెళుతున్న ప్రపంచం మంచిగా ఉండేట్టు చేయాలి" అంటూ నూతనత్వానికి నాందీ గీతం పాడిన బ్రెహ్ట్ గుండెపోటుతో 1956, ఆగస్టు 14న మరణించాడు.

రమణ

భట్టనారాయణుడు (క్రీ.శ.6,7 శతాబ్దాలు) : సంస్కృత నాటక కర్త. సంస్కృత సాహిత్యంలో సుప్రసిద్ధమైన వేణీసంహారం నాటకం ఈయన రచించిందే. ఇది భరతుని నాటక లక్షణాలు కలిగిన ఇతివృత్తం. భట్ట నారాయణుడు క్రీ.శ. 6, 7 శతాబ్దాల కాలంవాడు. బెంగాల్‌లో ఆదిసూరుని ఆస్థానంలో ఉన్నాడు. మహాభారతంలో భీముడు, దుశ్శాసన దుర్యోధనులను వధించి తన ప్రతిజ్ఞను తీర్చుకునే వృత్తాంతాన్ని తీసుకొని వేణీ సంహారం రచించాడు. వస్తువును చక్కని నాటకీయతతో ప్రస్తుతీకరించాడు. భీముడు ధీరోద్ధత నాయకుడు దుశ్శాసన రక్తసిక్తమైన చేతులతో ద్రౌపది వేణిని ముడవడమే ఈ నాటకంలోని ఇతివృత్తం. ఇది ఆరు అంకాల నాటకం. ఈ నాటకంలో ద్రౌపది కేశపాశాన్ని ముడవడమే ప్రధాన ఇతివృత్తం కాబట్టి వేణీ సంహారమన్న పేరు సార్థకంగా ఉంది.

అయితే నాటక లక్షణాలను శాస్త్రోక్తంగా అనుసరించాలనే కవి కోరిక వల్ల నాటకంలో కొంత కృత్రిమత ప్రవేశించిందని కొందరు అభిప్రాయపడ్డారు. సంఘటనలు ఇంకా వేగంగా జరిగినట్లయితే నాటకం రక్తి కట్టేదని అంటారు. సంభాషణలు, వర్ణనలు దీర్ఘంగా ఉన్నా, నాటక కళలో కొన్ని లోపాలున్నా రస, భావ, శైలి విషయంలో పాత్ర చిత్రణ శిల్పంతో ఈ నాటకం శ్రేష్ఠమైందని చెప్పాలి. దీర్ఘమైన సమాస భరితమైన వీరరస స్ఫోరకత కోసం పరుష కఠినపదాలు ప్రయోగింపబడడం చేత సామాన్యజనుల అవగాహనకు ఈ నాటకం దూరంగా ఉంది. అయినా పటిష్ఠమైన పాత్రచిత్రణ వల్ల యీ నాటకం రంగస్థలం మీద రక్తి కట్టే విధంగా ఉంది. శృంగారరసంతో కూడిన నాటకాలే సంస్కృత సాహిత్యంలో ఎక్కువగా వెలువడ్డాయి. వీరరసం ప్రాధాన్యం గల ఈ నాటకం ఒక విభిన్నతను సృష్టించి ప్రేక్షకులను అలరిస్తున్నది. ఈ ఒక్క నాటకంతోనే భట్టనారాయణ ప్రసిద్ధ సంస్కృత నాటకకర్తల మధ్య స్థానాన్ని సంపాదించుకున్న ప్రతిభాశాలి.

ముదిగంటి

భట్టు తౌతుడు (క్రీ.శ. 9వ శతాబ్దం ఉత్తరార్థం):

భట్టు తౌతుడు అభినవగుప్తుని గురువు. అలంకారశాస్త్రవేత్త, ఇతని కృతి కావ్యకౌతుకం. ఇది అలభ్యం. దీనికి అభినవ గుప్తుడు వివరణ కూడా రాశాడట. క్షేమేంద్రాది ఆలంకారికులు భట్టు తౌతుని ఉద్ధరించారు. రసనిష్పత్తికి హేతుభూతం నటులు రామాది నాయకులను అనుకరించటం కాదని భట్టుతౌతుడు చెప్పాడని హేమచంద్రుడు పేర్కొన్నాడు. భట్టు తౌతుడు శాంతాన్ని నవమ రసంగా అంగీకరించడమే కాక శృంగార రసం కన్నా ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు. భట్టుతౌతుని అభిప్రాయాలను అభినవ గుప్తుడు లోచనంలో ప్రస్తావించాడు. ఈయన గొప్ప మీమాంసకుడు.

ముదిగంటి

భయానకం : నవరసాలలో ఒకటి. తీవ్రస్థాయిలో భయాన్ని సూచిస్తుంది. భయమనే స్థాయి భావం వల్ల జనిస్తుంది. వికృత శబ్దాలు వినటం, పిశాచ దర్శనం, నక్కల గుడ్లగూబల అరుపులు, భయంకరారణ్యంలో సంచారం, స్వజనుల వధను తిలకించటం, హత్యలకు సంబంధించిన కథలు చెప్పటం మొదలైన విభావాలవల్ల భయానక రసం ఉత్పన్నమవుతుంది. కంపించే కాళ్ళూ చేతులూ, చలించే కళ్ళు, ఎర్రబడిన ముఖం, కంఠ స్వరంలో మార్పు మొదలైన అనుభవాలతో భయానక రసం అభినయించాలి.

శ్రీ.చ.

భయానక రసం : నవ రసాలలో ఒకటి. బీభత్స రస జనితం. భయంకర ధ్వనివినడం, దుష్ట జంతువులను, భయంకర రూపాన్ని చూడడంవల్ల భయం కలుగుతుంది. ఆ భయం స్థిరంగా ఉంటే అది భయానక రసం.

భయానక రసానికి భయం స్థాయి భావం. కాలుడు అధి దేవత. స్త్రీలు, నీచ పాత్రలు నాయకులు. భయ కారణం ఆలంబనం. ఘోర చేష్టలు ఉద్దీపన విభావాలు. వైవర్ణ్యం, స్వేదం, రోమాంచం, కంపం, దిక్కులు చూడడం అనుభవాలు – జుగుప్స, వేగం, సమ్మోహం, సంత్రాసం, గ్లాని, దీనత, శంక, అపస్మారకం, భ్రాంతి, మృత్యువు మొదలైనవి వ్యభిచారీ భావాలు.

కాళ్లు, చేతులు కంపించడం, స్తంభించి పోవడం, గద్గద స్వరం, గుండె వేగంగా కొట్టుకోవడం, పెదిమలు మెలివడి పోవడంతో ఈ రసం అభినయించాలి. శృంగార, వీర, రౌద్ర , హాస్య, శాంత రసాలు భయానక రసానికి విరోధి రసాలు.

శ్రీ.చ.

భరణి, తనికెళ్ళ (జ.1955) : రంగస్థల, సినీ నటుడు, రచయిత. ఈయన 1955, జులై 14న లక్ష్మీనరసమ్మ, రామలింగేశ్వరరావు దంపతులకు సికింద్రాబాదులో జన్మించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖలో థియేటర్ ఆర్ట్స్ కోర్సు చేశాడు. నాలుగో కోతి నాటకం, గొయ్యి, *గార్ధ భాండం, బేకం బాకా, కొక్కొరోకో, ఫల్‌ఫల్ గుర్రం, గోగ్రహణం, జంబూద్వీపం, హుళక్కి, గ్రహణం పట్టిన రాత్రి, శని గ్రహాలు, గాలిహోరు మైదానం, ఎలకల బోను* నాటికల్ని రచించాడు. వీటిలో చాలా నాటికలను పరిషత్తుల్లో ప్రదర్శించి బహుమతులు అందుకున్నాడు.

1990లో ఈయన రచించిన గోగ్రహణానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నాటక రచనా పురస్కారం లభించింది.

పలు పరిషత్తులలో ఉత్తమ రచయితగా, ఉత్తమ నటుడుగా వందకు పైగా బహుమతులు పొందాడు. గోగ్రహణం వీధి నాటిక ప్రసాదరెడ్డి దర్శకత్వంలో ఎస్‌సిజడ్‌సిసి, నాగపూర్ ఆధ్వర్యంలో జరిగిన తొలి ఆధునిక వీధి నాటక ఉత్సవాల పోటీలలో ప్రాంతీయ స్థాయిలోనూ, జోనల్ స్థాయిలోనూ ఉత్తమ రచన, దర్శకుడు, నటుడు, నటి, ప్రదర్శన బహుమతులను గెలుచుకుని జాతీయస్థాయికి ఎంపికైంది. ఆ తరువాత ఈ గోగ్రహణంను పలు ఔత్సాహిక నాటక సమాజాలు, వివిధ విశ్వవిద్యాలయాలలోని రంగస్థల కళల శాఖ విద్యార్థులు అనేకసార్లు ప్రదర్శించారు.

నాటకరంగం ద్వారా సినీరంగంలో రచయితగా ప్రవేశించి 46 సినిమాలకు మాటలందించాడు. 370 సినిమాల్లో నటించాడు. సముద్రం సినిమాకు ఉత్తమ విలన్, నువ్వు-నేను సినిమాకు ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, గ్రహణం సినిమాకు ఉత్తమ కథానాయకుడిగా నంది అవార్డులు లభించాయి. కళాసాగర్, భరతముని వంటి సంస్థలు భరణిని ఘనంగా సత్కరించాయి. కవితారంగంలో, ఆధ్యాత్మిక చింతనలో *పరికిణీ*, *ఆట గదరా శివ* అనే రెండు కవితా సంపుటాలు, సంగీత విద్వాంసుల జీవిత చరిత్ర మీద 'ఎందరో మహానుభావులు' గ్రంథాన్ని రచించాడు.

భరణి నాటక రచనల మీద తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ విద్యార్థులు కొందరు ఎం.ఫిల్. చేస్తున్నారు.

ప్ర.రె.

భరత పుత్రులు : 1. భరతముని కుమారులు, శిష్యులు, 2. నటులు.

ఇంద్రుని విన్నపం ప్రకారం బ్రహ్మ నాట్య వేదం సృజించి భరతమునిని పిలిచి ''పుత్ర శతయుక్తుడవైన నీవు దీనిని ప్రయోగించుము'' అని ఆజ్ఞాపించినట్లు నాట్యశాస్త్రం వల్ల తెలుస్తున్నది. భరతముని కుమారులు కొందరు, శిష్యులు కూడా పుత్రసములని శాస్త్రాలు చెప్తున్నాయి. కాబట్టి వీరు భరతముని శిష్యులని కొందరు, బ్రహ్మర్షాది సంస్కృత నాటకకర్తలు నర్తనావళి మొదలైన నాటకాలలో భరతపుత్ర పదాన్ని నటపరంగా ప్రయోగించడంచేత ఈ భరతపుత్రులు నటులని, భరతముని నాట్య సమాజంలోని నటులై ఉంటారని కొందరు అభిప్రాయపడుతున్నారు.

భరత పుత్రులు 104 మంది. శాండిల్యుడు, వాత్స్యుడు, కోహలుడు, దత్తిలుడు, జటిలుడు, అంబష్టకుడు, తండువు, అగ్నిశిఖుడు, సైంధవుడు, పులోముడు, శాద్వని, విపులుడు, కపింజలి, బాదిరుడు, యముడు, ధూమ్రా యముడు, జంబుధ్వజుడు, కౌక జంఘుడు, స్వర్ణకుడు, తాపసుడు, కైదారి, శాలికర్ణుడు, దీర్ఘగాత్రుడు, శాలికుడు, కౌత్సుడు, తండాయని, పింగలుడు, చిత్రకుడు, బంధులుడు, భల్లకుడు, ముష్టికుడు, సైంధవాయనుడు, తైతిలుడు, భార్గవుడు, శుచి, బహులుడు, అబుధాడు, బుధసేనుడు, పాండుకర్ణుడు, కౌరలుడు, ఋజుకుడు, మండకుడు, శంబరుడు, వంజలుడు, మాగధుడు, సరలుడు, కర్త, ఉగ్రుడు, తుషారుడు, పార్షదుడు, గౌతముడు, బాదరాయణుడు, విశాలుడు, శబలుడు, సునారుడు, మేషుడు, కాలియుడు, భ్రమరుడు, పీఠముఖముని, నఖకుట్టుడు, అశ్మకుట్టుడు, షట్పదుడు, ఉత్తముడు, పాదుకుడు, ఉపానహుడు, శ్రుతి, చాషస్వరుడు, అగ్నికుండుడు, ఆజ్యకుండుడు, వితండ్యుడు, తాండ్యుడు, కర్త రాక్షుడు, హిరణ్యాక్షుడు, కుశలుడు, దుస్సహుడు, లాజుడు, భయానకుడు, బీభత్సుడు, విచక్షణుడు, పుండ్రాక్షుడు, పుండ్రవాసుడు, అసితుడు, సితుడు, విద్యుజ్జిహ్వుడు, మహాజిహ్వుడు, శాలంకాయనుడు, శ్యామాయనుడు, మాఠరుడు, లోహితాంగుడు, సంవర్తకుడు, పంచశిఖుడు, త్రిశిఖుడు, శిఖుడు, శంఖవర్ణ ముఖుడు, షండుడు, శంకు కర్ణుడు, శక్రనేమి, గభస్తి, అంశుమావి, శఠుడు, విద్యుత్తు, శాత జంఘుడు, రౌద్రుడు, వీరుడు.

ఈ భరతపుత్రులు నాట్యవేదజ్ఞానమదాన్వితులై ఋషులను అవహేళన చేస్తూ ప్రహసనాలను ప్రదర్శించ సాగారు. గ్రామ్య ధర్మ ప్రవర్తితం, నిష్ఠురం, అప్రశస్తమైన ఈ ప్రహసనాల విషయం విని ఋషులు కోపోద్రిక్తులై భరతపుత్రులను ''మీ జ్ఞానం నాశనం చెందుగాక'' మీరు శూద్రాచారులవుతారు. మీరు మీ వంశస్థులు అపాంక్తేయులు, కుత్సితులు, అధములు, శాస్త్రోప జీవులవుతారని శపించారు. ఇలా శాపగ్రస్తులైన భరత పుత్రులు నహుషుని కోర్కె మీద భూలోకానికి వెళ్ళి మానవ స్త్రీలతో కలిసి రూపకాలు ప్రదర్శించారు. మానవ స్త్రీల మీదనురక్తులై, పుత్రవంతులై వారి కోసం వివిధాశ్రయాలైన ప్రయోగాలను నిబంధించారు. ఆ తరువాత బ్రహ్మ ఆదేశానుసారం తిరిగి స్వర్గ లోకానికి వెళ్లారు. భూలోకంలో నాట్యం అవతరించడానికి, భరతవంశం భూలోకంలో ప్రబలడానికి భరతపుత్రులు ఇలా కారకులయ్యారు.

శ్రీ.చ.

భరతవాక్యం : నాటకాంతంలో కథాంశాన్ని సమర్థిస్తూ, సందేశాన్నిస్తూ ఒక పాత్రధారి పలికే ముగింపు మాటలే భరతవాక్యం. సామాజికులకు శుభం కలగాలని ఆశించే విధంగా ఆశీర్వచన రూపంలో కూడా భరతవాక్యం ఉంటుంది. ఉదా: ముత్తరాజు సుబ్బారావు రచించిన శ్రీకృష్ణ తులాభారం నాటకంలో–

"నారదుడు : దేవా! నీ భక్తవాత్సల్యంబు లోక విదితమయ్యె ఇంద్రాణీ ప్రభృతులు పారిజాత లాభంబున బ్రమోదాన్వితలైరి. రుక్మిణీదేవి భక్తి తెల్లమయ్యె. సత్యభామాదేవి ప్రేమంబు భక్తిగా బరిణమించె, నాకలహక్షుత్తుశాంతి జెందె నాకింకేమి కామ్యముండును? అయిననిట్లగు గాక –

మ॥జలజాతేక్షణ పాద భక్తి పరులై సౌభ్రాత్ర సంపన్నులై
తులసీ పాదపూజ నప్రమదులై దోష ప్రదూరాత్ములై
బలులై బల్లిదులై ప్రభావయుతులై భద్రార్థులై భవ్యులై
కలకాలంబు చరింత్రుగాత! భరతక్ష్మామాతృ సంతానముల్"

పౌరాణిక నాటకాలలో ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది.

సాంఘిక నాటకాలు, నాటికలలో కూడ భరత వాక్యం అనే పేరుతో కాకపోయినా ఒక నటుడి ద్వారా సందేశం చెప్పించటం అనేది నాటక నిర్మాణంలో ఒక అంతర్భాగం.

ఉదా: డి. విజయభాస్కర్ రాసిన పులిస్వారి అనే నాటకంలో– ".... రండి అభ్యుదయం వైపు సాగుదాం. సమిష్టిగా సహజీవన శాంతిమంత్రం పలుకుదాం.

సర్వేజనా స్సుఖినోభవంతు
సమస్తాలోకా స్సుఖినోభవంతు."

గం.సు.రె.

భవభూతి (క్రీ.శ. 8వ శతాబ్ది) : సంస్కృత నాటకరంగం చరిత్రలో కాళిదాసు తరువాత ప్రసిద్ధిచెందిన నాటకకర్త భవభూతి. ఈ కవి కనోజును పాలించిన యశోవర్మ ఆస్థానంలో ఉండేవాడు. క్రీ.శ. 8వ శతాబ్దంవాడు. ఈయన రచించిన మూడు నాటకాలు కూడ కాల ప్రియనాథుని సమక్షంలో ప్రదర్శింపబడ్డాయి. భవభూతి పండిత వంశంలో జన్మించాడు. స్వయంగా వేద మీమాంసాదులనభ్యసించాడు. కాని అతనికి నాటకాలంటేనే ప్రీతి. మొదటి నుంచి ఈయన నటులు, నాటక సమాజాలతో తిరిగినట్లుగా మహావీర చరిత్ర, మాలతీ మాధవం నాటకాలను బట్టి తెలుస్తున్నది.

భవభూతి మహావీర చరిత్ర, మాలతీ మాధవం, ఉత్తర రామచరిత్ర అనే మూడు నాటకాలు రచించాడు. వీటిలో ఉత్తర రామ చరిత్ర ప్రౌఢమైన రచన. ఉత్తర రామాయణ కథను తీసుకొని ఉత్తరరామ చరిత్ర అనే నాటకాన్ని రచించాడు. ఇది అతనికి గొప్ప కీర్తి తెచ్చి పెట్టింది. మహావీర చరిత్ర ఏడు అంకాల నాటకం. పూర్వ రామాయణ కథనంతా రక్తి కట్టేట్టుగా ఒక్కనాటకంలో మలచడంతో కవి మనోరంజకంగా చేయలేకపోయాడని విమర్శకుల అభిప్రాయం. వాల్మీకి కథలో కొన్ని మార్పులను భవభూతి చేశాడు. అవి అంతగా లోకాదరణను పొందినట్లుగా లేదు. ప్రధానరసం వీరం.

మాలతీమాధవం ప్రేమకథ. శృంగారం ప్రధాన రసం. అద్భుత సంఘటనలున్నవి. పది అంకాల ప్రకరణం–మాలతి నాయిక. మాధవుడు నాయకుడు. వీరే గాక మదయంతిక మకరందులనే మరో ప్రేమజంట కూడా ఉన్నారు. రెండు జంటల ప్రేమకథను కవి సమానాంతరంగా చక్కగా నడిపాడు. పాత్రచిత్రణ సజీవంగా ఉంది. అఘోర ఘంట, కపాల కుండల అనే కాపాలిక పాత్రలను కవి అద్భుతంగా పోషించాడు. ఇది ప్రకరణమైనా మృచ్ఛకటికంలాగా సమకాలిక జీవితాన్ని చిత్రించేదిగా లేదు. ఈ నాటకాన్ని అనుకరిస్తూ త్వరిత కాలంలో మల్లికా మారుతాది నాటకాలు రచింపబడినవి. కాని ఈ నాటకాలు రంగస్థలం మీద ప్రదర్శింపబడి ప్రజాదరణ పొందినట్లుగా కన్పించదు.

భవభూతి వాల్మీకి ఉత్తరరామాయణ కథ తీసుకొని ఉత్తర రామచరిత్ర నాటకాన్ని రచించాడు. భవభూతి తరువాత చాలామంది కవులు పూర్వరామాయణ కథను నాటకంగా రాశారు. అదేవిధంగా ఉత్తరరామాయణ కథను తీసుకొని కుందమాల మొదలైన నాటకాలను కవులు రచించారు. వాల్మీకి ఉత్తర రామాయణ కథను దుఃఖాంతంగా రచిస్తే భవభూతి చివరకు సీతారాములను కలిపి సుఖాంతంగా రచించాడు. కవి ప్రతిభతో ఈ కథను నాటకంగా మలచి అజరామరమైన కీర్తిని పొందాడు. నాటకీయత కోసం కొన్ని సన్నివేశాలను కల్పించాడు. ముఖ్యంగా తృతీయాంకంలో సీత గంగాదేవి ఇచ్చిన వరం వల్ల భూమి మీద ఎవరికీ కనపడకుండా ఉంటుంది. రాముడు శంభూక వధ తరువాత పంచవటిలో ప్రవేశించి పాత జ్ఞాపకాలతో విరహదుఃఖాన్ని పొంది మూర్ఛిల్లుతాడు. అప్పుడు సీత అదృశ్యంగా ఉండి రామున్ని స్పర్శిస్తుంది. భవభూతి స్పర్శం ప్రవేశపెట్టి ఒక వినూత్న కల్పన చేశాడు. ఆధునిక మనోవైజ్ఞానికి శాస్త్రవేత్తలు చెప్పే స్పర్శకు ఇది దగ్గరగా ఉంది. ఉత్తర రామచరిత్రలో సీతారాముల పాత్రలను అపూర్వంగా చిత్రించాడు. వారి దాంపత్య ప్రేమను, విరహాన్ని, దుఃఖాన్ని కరుణరస భరితంగా వర్ణించి "ఏకోరసః కరుణయేవ" అని తన కరుణ రసాభిమానాన్ని చాటుకున్నాడు. కథానాయకుడు ధీరోదాత్తుడైనా ఏకాంతంలోనైనా దుఃఖించక మానడు. ఆ సత్యాన్ని దృష్టిలో పెట్టుకొని భవభూతి రాముణ్ణి విలపింపజేశాడు. రాముని పాత్ర పూర్తిగా ప్రేక్షకుల సానుభూతి పొందేట్లుగా చిత్రించాడు. సంస్కృత నాటక సాహిత్యంలో అభిజ్ఞాన శాకుంతలం తర్వాత ఉత్తర రామ చరిత్ర గొప్ప గ్రీకు ట్రాజెడీ లక్షణాలు గల నాటకమని చెప్పవచ్చు. భవభూతి విషయానుకూలమైన, రసానుకూలమైన, పాత్రానుకూలమైన శైలిని ప్రయోగించాడు. భవభూతి ప్రకృతి వర్ణనలు రమ్యంగా చిత్రపటంలా ప్రేక్షకుల మనస్సుల్లో రూపుకట్టి నిలుస్తాయి.

స్థిరమైన వివాహ బంధాన్ని దాంపత్య ప్రేమను ఉత్తరరామ చరిత్ర నాటకంలో ఉన్నతంగా ఉత్కృష్టంగా చిత్రించి భవభూతి భారతీయాత్మను ఆవిష్కరించాడు.

ముదిగంటి

భవై : రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో విస్తృతంగా ప్రదర్శించబడిన కళారూపం. భారతదేశంలో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క జానపద నాటక కళారూపం ప్రముఖంగా తన ఉనికిని చాటుకుంటూ వస్తూంది. అటువంటి వాటిలో రాజస్థాన్, గుజరాత్‌లకు చెందిన భవై నాటక కళా రూపం. భారతదేశంలోని అతి పురాణ కళారూపాలలో ఒకటి. ప్రదర్శనలో సంగీతం, నృత్యం, నాటకం మూడింటిని కలబోసుకొని పరిపూర్ణ నాటక కళారూపంగా విలసిల్లుతోంది.

రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలలో నాటి నుంచి నేటి వరకు ప్రజాదరణ పొందిన ఈ కళారూపం మొదట్లో భక్తి భావాన్ని చాటే ప్రచార సాధనంగా ఉన్నప్పటికీ, రానురాను సమకాలీన సామాజిక అవసరాలకు తోడ్పడే కళారూపంగా రూపుదిద్దుకుంది.

లక్షణాలు : 1. సంగీతం, నృత్యం, నాటకంతో కూడిన సంపూర్ణ కళారూపం, 2. వంశపారంపర్యంగా సంక్రమించిన సంప్రదాయ కళారూపం, 3. ప్రజలకు దగ్గరగా ఉండే ప్రాంతీయ మాండలిక ప్రయోగం, 4. పలు ఉదంతాల సమ్మేళనం, 5. సంప్రదాయ రాగాలను జానపదశైలిలో వినియోగించడం, 6. నృత్యానికి సంబంధించిన అంశాలు కథక్ శైలీ ఆధారంగా ఉన్నప్పటికీ, వీరు ప్రదర్శించే నృత్యాల శైలి మాత్రం సంప్రదాయం కాకపోవడం, 7. స్త్రీ పాత్రలను పురుషులే ధరించటం, 8. నటులే గాయకులు, నృత్యకారులుగా ఉండడం, 9. జానపద కథలు ప్రధాన ఇతివృత్తాలుగా ఉండడం, 10. సంభాషణలు సద్యోనటనను స్ఫురింపజేయడం, 11. సామూహిక బృందగానం, 12. సమకాలీన సమస్యలను, 'భవాయీస్' పేరుతో పిలువబడే కళాకారులు ప్రతిబింబించటం.

భవై ప్రదర్శన సౌరాష్ట్ర ప్రాంతంలో శివప్రార్థనతో మొదలవుతుంది. ఉత్తర గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాల్లో అంభాజీ దేవత ప్రార్థనతో మొదలవుతుంది. ప్రదర్శన స్థలంలో ఒక 'దివిటీని' వెలిగిస్తారు. ఈ దివిటీ ఆ దేవతకు ప్రతీక. ప్రదర్శన సమయం రాత్రివేళల్లో సుమారు 4 గంటల నుంచి 6 గంటల వరకు సాగుతుంది. వేషధారణ సంప్రదాయంగా ఉంటుంది. ఒకానొకప్పుడు అత్యంత బహుళ ప్రజాదరణ పొందిన ఈ భారతీయ జానపద కళారూపం నేడు క్రమంగా తెరమరుగవుతూ ఉంది.

ప్ర.రె.

భాణం : నాట్యవేదంలో పేర్కొన్న దశరూపకాలలో భాణం ఒకటి. నాటకం, ప్రకరణం,అంకం, వ్యాయోగం, భాణం, సమవకారం, వీధి, ప్రహసనం, డిమం, ఈహామృగం అనేవి భరతుడు చెప్పిన దశరూపకాలు. వీటిలో భాణం, వీధి, ప్రహసనం, అంకం (ఉత్సృష్టికాంకం), వ్యాయెాగం అనేవి ఏకాంకికలు. ఆధునికకాలంలో మనం చూస్తున్న ఏకాంకికలకు ఇవి పూర్తిగా భిన్నమైనవి. ఏ విధంగానూ లక్షణ సమన్వయం కుదరదు.

ఒకే ఒక పురుషపాత్ర, దీర్ఘమైన స్వగతం కలిగి ఉండటం భాణం ప్రధాన లక్షణం. దీనిలోని వస్తువు ఉత్పాద్యం. ధూర్తచరితం,ఒకే అంకం ఉంటుంది. దీనిలో ఉక్తి ప్రత్యుక్తి ఉండదు. దీనికి మారుగా ఆకాశ పురుషుడు చెప్పే మాటలకు ప్రతి వచనాన్ని ఆ పాత్ర అభినయ పూర్వకంగా వ్యక్తీకరించడం ఉంటుంది. ముఖ నిర్వహణ సంధులతో ఉండి, పది లాస్యాంగాలతో భారతీయ వృత్తి కలిగి ఉంటుంది. పాత్ర తన స్వీయానుభవాన్ని గాని, ఇతరుల అనుభవాన్ని గాని వర్ణిస్తుంది. దీనిలో శృంగారంఅంగిరసంగానూ, వీర, హాస్యరసాలు అంగరసాలుగాను ప్రయుక్తమై ఉంటాయి. వాచికాభినయమే కాని సాత్వికాభినయానికి తావుండదు. లీలామధుకరం, లలిత నాగారం , పద్మ ప్రాభృతం, పాదతాడితం మొదలైన రూపకాలను భాణానికి ఉదాహరణంగా పేర్కొనవచ్చు.

గం.సు.రె.

భాణిక : సంస్కృత ఉపరూపకం. దశరూప భాణ భేదం. హరి చరితము, గాథలు మొదలైనవి ఉండి, లలితాభినయయుక్తమైతే అది భాణిక. స్వల్ప ఇతివృత్తం, శృంగార రసం, విట పీఠమర్ద విదూషక సంకులమై వాక్ చమత్కృతితో ప్రేక్షకులలో ఉద్రేకం కలిగించాలి. హీన నాయకుడు, ఉదాత్త నాయిక, ముఖ నిర్వహణ సంధులు, భారతీ కైశికీ వృత్తులు, ఉపన్యాసాది సప్తాంగాలు, ఒకే ఒక అంకం లేక రెండంకాలు, పాంచాలీ రీతి స్త్రీలేనటించాలి. ఉచిత స్థానాలలో తాళలయలు. రుచిర వేషాదులు.
ఉదా॥ కామదత్త, దానకేళీ కౌముది. దీనినే కొందరు లాక్షణికులు డోంబిల్ అన్నారు.

శ్రీ.చ.

భానుప్రకాష్, బి (జ 1938) : రంగస్థల నటుడు, దర్శకుడు. వెంకటసూరి, ఆండాళమ్మ, దంపతులకు హైదరాబాద్‌లో 1938 ఏప్రిల్ 21న జన్మించాడు. విద్యాభ్యాసం హైదరాబాదులోనే సాగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ తీసుకున్న తరువాత హిందుస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ (హెచ్. ఎ. ఎల్)లో పనిచేశాడు. 1950లో రంగస్థల ప్రవేశం చేసిన భానుప్రకాష్‌వందలాది నాటక, నాటికలలో నటించి సామాజికుల ప్రశంసలందుకున్నాడు. 1960 – 70 మధ్య

కాలంలో భానుప్రకాష్ విస్తృతంగా నాటక ప్రదర్శనలిచ్చాడు. తన మిత్రులతో కలసి స్థాపించిన కళారాధన సాంస్కృతిక సమాజం ద్వారా ఆంధ్ర ప్రదేశ్‌లో అన్ని జిల్లాలలోనూ వైవిధ్యభరితమైన నాటకాలను ప్రదర్శించి పండిత పామరులను అలరించాడు. కళారాధన సంస్థ స్థాపించేనాటికి రాష్ట్రంలో నాటక పరిషత్తుల సందడి హెచ్చుగా ఉంది. ఆర్.వి. ఎస్. రామస్వామి రచించిన *గాలివాన* నాటకాన్ని రాష్ట్రంలో దాదాపు అన్ని పరిషత్తుల్లోనూ ప్రదర్శించాడు. ఆర్.వి. ఎస్. రచించిన *వలయం, వెల్లువ, సుడిగాలి* మొదలైన 20 నాటకాలు భానుప్రకాష్ దర్శకత్వంలోనే ప్రదర్శితమయ్యాయి. అన్ని నాటకాలలోను ముఖ్యపాత్రధారి భానుప్రకాష్‌కావడం విశేషం. డి. హనుమంత రావు, అమరేంద్ర, విద్యాసాగర్, రామస్వామి, నూతన్‌ప్రసాద్ వంటి నటులు భానుప్రకాష్ శిక్షణలో ఆరితేరినవారే ! కళారాధన సాధించిన బహు మతులు వందలసంఖ్యలో ఉంటాయి. రామస్వామిని రచయితగా వెలుగులోకి తెచ్చిన ఘనత భానుప్రకాష్‌కే దక్కుతుంది. హెచ్. ఎ. ఎల్. సంస్థలో సహోద్యోగులను సమీకరించి సాంస్కృతిక సంఘాన్ని స్థాపించాడు. హెచ్. ఎ. ఎల్ సాంస్కృతిక సంఘం ప్రదర్శించిన *గాలిగోపురం, ఒంటికాలి పరుగు, హలాల్* మొదలైన నాటికలు పోటీల్లో ఎన్నో బహుమతుల గెల్చుకొని భానుప్రకాష్ ఖ్యాతిని ఇనుమడింప జేశాయి. భానుప్రకాష్ చలన చిత్రాలలో కూడా నటించి తన అభినయ పటిమను ఆ రంగంలో కూడా నిరూపించుకున్నాడు.

ఐదు దశాబ్దాల నట జీవితంలో ఈయన ఎన్నో సంస్థల ఘన సన్మానాలు అందుకున్నాడు. ఎన్నో పురస్కారాలు స్వీకరించాడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రతిభా పురస్కారం, శ్రీ కళానికేతన్ పురస్కారం, యువకళా వాహిని నటరత్న పురస్కారం మొదలైనవి వాటిలో కొన్ని.

2007 నంది నాటకోత్సవాలలో ఎన్.టి. ఆర్. రంగస్థల పురస్కారం లభించింది.

గం.సు.రె.

భారతి దాసన్ (1891-1964) : ఆధునిక యుగంలో వెలసిన తమిళ కవులలో సుబ్రమణ్యభారతి తరువాత పేర్కొనదగినాడు భారతిదాసన్. తన కల్పనాశక్తితో, విప్లవాత్మక భావాలతో, పదునైన, పరిచితమైన భాషతో అందరినీ అలరించాడు. సులభగ్రాహ్యమైన శైలితో కొత్త భావాలను వెదజల్లాడు, కొత్త ఆలోచనలను రేకెత్తించాడు. కవితారంగంలో నూతన ప్రయోగాలెన్నో చేశాడు. భావంలోను, భాషలోను, అభివ్యక్తం చేసే పద్ధతిలోను విప్లవాత్మకమైన ధోరణులు అవలంబించడంవల్ల ఇతనికి పురచ్చి కవిజ్ఞర్ (విప్లవకవి) అనే సార్థకనామం వచ్చింది. కనక సభాపతికి, లక్ష్మీయమ్మాళ్‌కు పాండిచ్చేరిలో భారతిదాసన్ జన్మించాడు. తల్లిదండ్రులు ఇతనికి పెట్టినపేరు కనకసుబ్బరత్నం. కుప్పురత్నం అనే మరోపేరు కూడా ఇతనికి ఉంది. పాండిచ్చేరిలోనే విద్యనభ్యసించాడు. 1908లో బంగారు పట్టర్, తిరుప్పులిసామి, పెరియసామి దగ్గర తమిళ సాహిత్యాన్ని అభ్యసించాడు. తమిళ విద్వాన్ పరీక్షలో సర్వప్రథముడుగా ఉత్తీర్ణుడయ్యాడు. ఈయన ఆంగ్ల, ఫ్రెంచ్ భాషలను కూడా నేర్చుకున్నాడు. భారతిదాసన్ పాండిచ్చేరిలోని కాల్వే కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేశాడు. సుప్రసిద్ధ తమిళ మహాకవి సుబ్రమణ్యభారతిని 1908లో పాండిచ్చేరిలో సందర్శించాడు. అతనితో బాగా ఆకర్షితుడయ్యాడు. అతని ప్రభావంతో 'భారతిదాసన్' అనే పేరు పెట్టుకొని కవితా వ్యాసంగం సాగించాడు. 1919లో తిరుప్పువాపై కమ్యూన్‌లో తమిళ ఉపాధ్యాయుడుగా ఉన్నప్పుడు ఫ్రెంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేశాడన్న ఆరోపణమీద జైలుశిక్షకు గురయ్యాడు. 1921లో పళణియమ్మాళ్‌తో భారతిదాసన్‌కు పరిణయమైంది. జాతీయవాదిగా, భగవంతునిపట్ల విశ్వాసం ఉన్న రోజుల్లో శ్రీమయిలమ్ సుబ్రమణియార్ తుదిఅముదు (శ్రీమయిలమ్ సుబ్రమణ్యస్తుతి సుధ, 1926), కదర్ ఇరాట్టినపాట్టు (ఖద్దరు రాట్నాల పాటలు, 1930) అనే చిన్న పుస్తకాలను వెలువరించాడు. ఇ.వి. రామస్వామి నాయకర్ ప్రభావంతో భారతిదాసన్ ఆ వెంటనే నాస్తికుడయ్యాడు. 1930 నుంచి మూడు దశాబ్దాల దాక తమిళ కవితారంగాన్ని భారతిదాసన్ బాగా ప్రభావితం చేశాడు. 1935లో ప్రారంభించిన సుబ్రమణ్యభారతి కవితా మండలం వారి కవితా పత్రికకు సంపాదకత్వం వహించాడు. 1946లో కుయిల్ పత్రికకు సంపాదకత్వం నెరపి వివిధ అంశాలమీద అతని అభిప్రాయాలను, భావాలను ఆవిష్కరించాడు. భారతిదాసన్ పాండిచ్చేరి రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించాడు. 1954లో పాండిచ్చేరి శాసనసభకు ఎన్నికయ్యాడు. సాహిత్య అకాడమీ బహుమతి (1969)నీ,

ఆ తరువాత తమిళనాడు ప్రభుత్వ పురస్కారాన్నీ అందుకున్నాడు. సాంఘిక దురాచారాలను, హేతువాదగరిమను చిత్రించిన తమిళ కవులలో భారతిదాసన్ ప్రథముడు, అగ్రశ్రేణికి చెందినవాడు. ఇయల్ (పద్యం), ఇశై (సంగీతం), నాడగం (నాటకం) అనే మూడు శాఖలతో కూడింది ముత్తమిళ్. ఈ మూడు శాఖల్లోనూ రచనలు సాగించి పుంభావ ముత్తమిళ్ అనేందుకు భారతిదాసన్ యోగ్యత సంపాదించుకున్నాడు. భారతియార్‌ను అనుకరించి సులభగ్రాహ్యంగా, లయబద్ధంగా రచన సాగించాడు. కవితా సంపుటాలు, నాటకాలు ఇతరాలు 50 పైచిలుకు గ్రంథాలు భారతిదాసన్ కలం నుంచి వెలువడ్డాయి. అతని కవితాసంపుటాల్లో ముఖ్యమైనవి – భారతిదాసన్ కవిదైగల్ (1, 2, 3, 4 సంపుటాలు 1938, 1949, 1955, 1977), అళగిన్ సిరుప్పు (సౌందర్య దరహాసం, 1944), కాదల్ నినైవుగళ్ (ప్రేమస్మృతులు, 1944), తమిళ్ ఇయక్కమ్ (తమిళ ఉద్యమం, 1945). కవితా సంపుటాలనేగాక లఘు కావ్యాలను, పద్య కథలను భారతిదాసన్ రచించాడు. లఘు కావ్యాల్లో ఎదిర్ పారాద ముత్తమ్ (ఎదురు చూడని ముద్దు, 1941), కుడుంబ విళక్కు (కుటుంబదీపం, 1942 - 5 భాగాలు), పాండియన్ పరిశు (పాండ్యుని కానుక, 1943) ప్రముఖంగా పేర్కొనదగ్గవి. భారతిదాసన్ తన లఘుకావ్యాల్లో తమిళ భాషా సంస్కృతుల గొప్పతనాన్ని ఆవిష్కరించాడు, శిలప్పదికారం, మణిమేకలై అనే ప్రాచీన కావ్యాలను విప్లవాత్మక దృక్పథంతో కణ్ణకి ప్రతిఘటన కావ్యం, మణిమేకలై వెణ్బా అనే పేర్లతో మళ్లీ రచించాడు. అతని పద్యాలు మనోహరంగా ఉంటాయి. తమిళ సంగీతాభివృద్ధిపట్ల భారతిదాసన్ ఎంతో శ్రద్ధ చూపాడు. తమిళ బాణీల్లోనే పాడాలని ప్రచారం చేశాడు. సంగీతానికి సంబంధించిన గ్రంథాలను కూడా ఇతడు రచించాడు. అవి – ఇశై అముదు (సంగీతామృతం 1942, 1952), తేనరువి (తేనవాగు, 1956) మొదలైనవి ప్రసిద్ధాలు.

భారతిదాసన్ కలం నుంచి అనేక నాటకాలు వెలువడ్డాయి. అవి చదువుకొని ఆనందించడానికి అనువుగా ఉన్నాయి. భారతిదాసన్ రచించిన హిరణ్యాన్ (1934) అనే నాటకం మద్రాసులోని వి.పి. హాలులో ప్రదర్శింపబడింది. హిరణ్యకశ్యపుణ్ణి ఉదాత్తనాయకుడుగాను, ప్రహ్లాదుణ్ణి బ్రాహ్మణ పక్షపాతిగాను ఈ నాటకంలో చిత్రించాడు. నల్లతీర్పు *(మంచితీర్పు, 1944), పడిత్త పెణ్‌గళ్ (చదువుకొన్న స్త్రీలు, 1948), చేరతాండవమ్ (1949), కలైకూత్తియిన్ కాదల్ (దొమ్మర స్త్రీ ప్రేమ, 1951), పిసిరాందయార్ (1967)* మొదలైనవి ఆయన నాటకాల్లో పేర్కొనదగ్గవి. పిసిరాందయార్ నాటకానికి సాహిత్య అకాడమీ బహుమతి (1969) లభించింది. 'బాలామణి' లేక 'పక్కాతిరుడన్' (1937), 'వలయాపతి' (1952), 'పొన్ముడి' (1950) వంటి తమిళ చలనచిత్రాలకు కథ, మాటలు, పాటలు రాశాడు. భారతిదాసన్ మరణానంతరం కూడా ఈయన రచించిన ప్రసిద్ధ గేయాలు కొన్నిటిని తమిళ చలనచిత్ర సన్నివేశాల్లో ఉపయోగించుకున్నారు. ప్రకృతి కవిత్వంలోని భావుకతవల్ల, తమిళ గేయాల్లోని ఆవేశం వల్ల, కావ్యాల్లోని విప్లవాత్మక సిద్ధాంతాల వల్ల భారతిదాసన్ తన సమకాలీన కవులలో అత్యున్నత శ్రేణికి చెందినవాడుగా నిలిచాడు. భారతిదాసన్ సిద్ధాంతాలను అడుగుజాడలను అనుసరించే కవులు ఇప్పటికీ తమిళనాడులో ఉన్నారు.

జె.ము.ర.

భారతీయ నాటక కళాసమితి (వరదన్నపేట) : తెలంగాణ ప్రాంతంలో నాటకానికి అంతగా ప్రాధాన్యం లేని రోజుల్లో ఈ సంస్థ 1974లో వరంగల్‌జిల్లా వరదన్నపేట సమీపంలోని ఇల్లింద గ్రామంలో ప్రారంభమైంది. సంస్థ వ్యవస్థాపకులు ఈగ శ్రీహరి, వనం లక్ష్మీకాంతారావు మొదలైనవారు. సంస్థ వికాసానికి గ్రామం కంటే తాలూకా కేంద్రం మంచిదని భావించిన సమితి కార్యవర్గం 1980లో కార్యక్షేత్రాన్ని వరదన్నపేటకు మార్చింది. సంస్థకు స్వంత భవనాన్ని నిర్మించుకున్నారు. గ్రామస్థాయి పోటీలు నిర్వహించే స్థితి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించే స్థాయికి ఎదిగింది. 1995లో అల్లూరి సీతారామరాజు నాటకాన్ని ప్రదర్శించింది. ఆ తరువాత దర్పణం, ఊరేగింపు, తమసోమా జ్యోతిర్గమయ, రేపేంది, మానవత్వం, మంచం మీద మనిషి , మొదలైన నాటికలను రాష్ట్రంలోని పలుప్రాంతాలలో ప్రదర్శించింది. ఈ సంస్థ నాటక ప్రదర్శనలతో పాటు ప్రముఖ రంగస్థల నిపుణులను, మేధావులను ఒకవేదికపై చేర్చి సదస్సులు, సాహిత్య సమావేశాలు నిర్వహించింది, నిర్వహిస్తోంది. వందలాది ప్రదర్శనలను అనేకమంది కళాకారులను కళారంగానికి అందించిన భారతీయ నాటకకళాసమితి 1999లో రజతోత్సవం జరుపుకొంది. కళారంగానికి విశేషంగా సేవ చేస్తున్న ఈ సంస్థను 1995లో చైతన్య కళా సమాఖ్య, తొర్రూరు , 1997లో అక్కినేని నాటకకళా పరిషత్తు హైదరాబాద్, సహృదయి వరంగల్ లాంటి సంస్థలు అభినందించి ఘనంగా సత్కరించాయి.

దాసరి. ఎస్.

భారతీ వృత్తి : వాగ్వ్యాపారం ప్రధానంగా కలది భారతీవృత్తి. వాచికాభినయం. కైశికీవృత్తి, సాత్త్వతీవృత్తి, ఆరభటీవృత్తి మిగిలిన వృత్తులు.

శ్రీ.చ.

భారతేందు హరిశ్చంద్ర (1850-1885) : కవి, నటుడు, నాటకకర్త, సంఘసంస్కర్త, పత్రికా సంపాదకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆధునిక హిందీ భాషా పితామహుడు. భారతేందు

తండ్రి గోపాలచంద్ర. నాడు వారణాశిలో నివాసముంటున్న ప్రముఖులలో ఒకడు. భారతేందు తల్లి చిన్నప్పుడే మరణించడంతో సవతి తల్లివెహాహన్ బీబీ పోషణలో ఇమడలేక ఇబ్బందులు పడ్డాడు. నాటక కళపట్ల అభిమానం పెంచుకొన్న భారతేందు, సీతల్ ప్రసాద్ త్రిపాఠి రచించిన జానకి మన్‌దళ్ (1867)లో మొట్ట మొదటి సారిగా లక్ష్మణుని పాత్రలో నటించాడు. ఇదే సంవత్సరంలోనే ప్రవాస్ నాటక్ (1867) రచించాడు. కానీ ప్రస్తుతం ఈ రచన అలభ్యం. దీనితోపాటు *విపస్య విపమౌషధం, సత్య హరిశ్చంద్ర, చంద్రావళి, ముద్రారాక్షస, రత్నావళి, ధనంజయవిజయ, కర్పూర మంజరి, పాఖండ్ విడంబన్, అంధేరీ నగరి, విద్యాసుందర్, భారత దుర్దశ, నీల్‌దేవి* వంటి నాటక నాటికలను రచించాడు. భారతేందు నాటక నాటికల రచనలో సహజత్వాన్ని తీసుకురావాలనే సంకల్పంతో బ్రాహ్మణ పాత్రలకు సంస్కృత పదాలను విరివిగా ఉపయోగించి, సామాన్య పాత్రలకు వాడుక భాష 'ఖండబోలిని' ప్రవేశపెట్టాడు. హిందీ నాటక సాహిత్యంలో, రచన చేపట్టే రచయితలకు భారతేందు మార్గదర్శకుడుగా నిలిచాడని చెప్పడం అతిశయోక్తి కాదు. హరిశ్చంద్రతోపాటు పలువురు కవులు కలసి, 'హరిశ్చంద్ర మండలి'గా ఏర్పడి సాహిత్య గోష్ఠులు నిర్వహించేవారు. వివిధ పత్రికలలో రచనలు వెలువరించేవారు. మిత్రుల సహాయ సహకారాలతోనే 'కవి వచనసుధ' అనే మాస పత్రికను, 'బాలబోధిని' అనే చిన్నపిల్లల పత్రికను వెలువరించాడు. భారతేందు ఆధ్యాత్మిక దృష్టితో భక్తి సర్వస్వ, ప్రేమమాలిక, ప్రేమ సరోవర్ వంటి గ్రంథాలను రచించి వెలువరించాడు. ఈ తరుణంలోనే 'నాటక్' అనే గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథంలో నేటి నాటక, నాటికల స్వరూప స్వభావాల గురించి విపులంగా చర్చించాడు. కవిగా, నటుడిగా, నాటక రచయితగా, పత్రికా సంపాదకునిగా, సంఘసంస్కర్తగా హిందీ సాహిత్యచరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకొన్న భారతేందు 35 సం॥ వయసులో 1885, జనవరి 5న మరణించాడు.



భారతేందు హరిశ్చంద్ర మరణించిన తరువాత ఈయన వెలువరించిన సాహిత్యాన్ని నగర ప్రచార సభ, వారణాశి మూడు భాగాలుగా ముద్రించింది. మొదటిభాగంలో నాటక, నాటిక సాహిత్యం, రెండవ భాగంలో పద్య సాహిత్యం, మూడవ భాగంలో గద్య సాహిత్యం పొందుపరచి వెలువరించింది.

దాసరి.ఎస్.

భావ ప్రకాశనం (1175-1250) : సంస్కృత అలంకార శాస్త్ర గ్రంథం. రచన శారదా తనయుడు. ఈ గ్రంథం సర్వ లక్షణ గ్రంథ సూత్రాత్మకం. భరతముని నాటి నుంచి వచ్చిన రస, నాటక సిద్ధాంతాలను సమన్వయపరచి, శారదా తనయుడు దీనిని రచించాడు. నాట్య వేద అభినవ భారత్యాది లక్షణ గ్రంథాలలోని ఉపేక్షిత భావాలను సూత్ర భాషలో దీనిలో పొందుపరిచాడు. ఇది నాట్య మీమాంసకు సంబంధించిన శాస్త్రీయ విజ్ఞాన ఖని.

దీనిలో అధికారాలనే పేరిట పది ప్రకరణాలున్నాయి. ఇందులోని ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది అధికారాలు నాటకానికి సంబంధించినవి. ఇవి – 1. నాట్యేతివృత్త శరీర లక్షణాభిధానం, 2. దశరూపక లక్షణం, 3. నృత్య భేద స్వరూప నిరూపణం, 4. నాట్య ప్రయోగ భేద ప్రకార విశేష నిర్ణయం.

దీనిని సర్వులు ప్రామాణిక గ్రంథంగా నేటికీ ఆదరిస్తున్నారు. ఈ రచన లలిత నిబంధం, మిత్ర సమ్మితం. నాట్యవేద ప్రణాళిక ననుసరించే ఈ రచన సాగింది. అభినవగుప్తాదులు నాట్య రసంగా స్వీకరించిన శాంత రసాన్ని తిరస్కరించి శాంత రసం నాట్య రసం కాజాలదని శారదా తనయుడు నిరూపించాడు.

ఇందులో ఇరవై ఉపరూపకాలను శారదా తనయుడు పేర్కొన్నాడు. దీని సంస్కృత ప్రతిని బరోడా గైక్వాడ్ గ్రంథమాల 1993లో ప్రచురించింది. తెలుగులోకి ప్రప్రథమంగా జమ్మలమడక మాధవ రాయశర్మ భావాలోక అనే వ్యాఖ్యానంతో అనువదించాడు. దీనిని 1973లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురించింది.

శ్రీ.చ.

భాస నాటక చక్రం : భాస మహాకవి రచించిన నాటకాలను, ఏకాంకికలను కలిసి సాముహికంగా భాస నాటక చక్రం అంటారు.

భాస నాటక చక్రంలో 1. ప్రతిజ్ఞా యౌగంధరాయణం, 2. స్వప్న వాసవదత్త, 3. అవిమారకం, 4. బాలచరితం, 5. ప్రతిమ, 6. పంచ రాత్రం, 7. అభిషేకం, 8. దరిద్ర చారుదత్తం, 9. మధ్యమవ్యాయోగం, 10. దూతవాక్యం, 11. దూత ఘటోత్కచం, 12. కర్ణభారం, 13. ఊరు భంగం అనే నాటకాలు చోటు చేసుకున్నాయి. ఇవి గాక, యజ్ఞఫలము కూడా భాసుడే రచించాడని కొందరి విమర్శకుల అభిప్రాయం.

పై పదమూడు లోని మొదటి ఎనిమిది పెద్ద నాటకాలు, చివరి ఐదు ఏకాంకికలు. వీటిలో భారత కథలు ఆరు, రామాయణ కథలు రెండు, భాగవత కథ ఒకటి, కథా సరిత్సాగర కథలు మూడు, కల్పితం ఒకటి.

ఈ రూపకాల పేర్లే ప్రచారంలో ఉన్నాయి గాని ప్రతులు 1909 వరకు లభ్యం కాలేదు. 1909లో పి. గణపతిశాస్త్రి

బయటికి తీసి 1912లో ప్రచురించారు. వారే ఈ 13 రూపకాలు భాసుడు రచించినవే అని నిర్ధారణ చేశాడు.

ఈ రూపకాలలో నటీ, సూత్రధారుల సంభాషణ మొదలయిన ప్రస్తావనాంగాలు ఎక్కువగా కనిపించవు. సూత్రధారుడు ఒక్కడే ప్రవేశించి నాంది పఠించి పాత్ర సూచన చేస్తాడు. ఈ ప్రక్రియకు భాసుడు స్థాపన అని పేరు పెట్టాడు.

ఈ రూపకాలలో ప్రాచీన సంస్కృతాలంకారికులు దృశ్యమానం చేయరాదని నిషేధించిన మృతి, యుద్ధాదులు ఈ నాటకాలలో దృశ్యమానం చేయడమయింది. ఉదాహరణకు ప్రతిమలో దశరథుని మృతి బాల చరిత్రలో యుద్ధాలు దృశ్యమానం చేయడం. ఈ నాటకాలన్నిటిలోనూ నాటకీయత పెల్లుబుకుతూంటుంది. ఈ నాటకాలలో నృత్యం, సంగీతం, శిల్పం, చిత్రకళ, రంగాలంకరణ ప్రాధాన్యం వహిస్తున్నాయి.

శ్రీ.చ.

భాసుడు : క్రీ.శ. 1909 వరకు భాసుడు కేవలం నామ మాత్రంగానే పరిచితుడు. కేరళలోని ఒక మఠంలో గణపతి శాస్త్రి పండితునికి పదమూడు నాటకాల లిఖిత ప్రతులు మలయాళ లిపిలో దొరికాయి. తరువాత త్రివేండ్రమ్ ప్యాలెస్ లైబ్రరీలో, మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స లైబ్రరీలోను దేవనాగర లిపిలో ఈ పదమూడు నాటకాల్లో కొన్ని దొరికాయి. దొరికిన ఈ నాటకాలు భాసునివని గుర్తింపబడ్డాయి. 1912లో ప్రచురింపబడి ప్రపంచవ్యాప్తంగా సంస్కృతపండితుల్లో సంచలనాన్ని సృష్టించాయి. ఆ నాటకాలు భాసునివా? కాదా? అనీ, భాసుడు ఏ కాలం వాడని చర్చోపచర్చలు జరిగాయి. చివరకు ఈ నాటకాలు భాసునివే అని, భాసుడు క్రీ.పూ. 4, 5 శతాబ్దాలకు చెందిన కవి అని చాలామంది పండితులు అంగీకరించారు. గొప్ప నాటకకర్తగా భాసుడ్ని కాళిదాసే కాక బాణుడు, దండి, వాక్పతిరాజు, జయదేవుడు, రాజశేఖరుడు మొదలైన కవి పండితులు ప్రశంసించారు. జయదేవుడు సంస్కృత సరస్వతికి "భాసో హాసః కవికులగురుః కాళిదాసో విలాసః" అని ప్రస్తుతించాడు. భాసుడు మొత్తం 24 నుంచి 30 నాటకాలు రచించాడని తెలుస్తోంది. కాని ప్రస్తుతం భాసుని నాటకాలలో 13 మాత్రమే దొరికాయి. అవి దూత వాక్యం, కర్ణభారం, ఘటోత్కచం, ఊరుభంగం, మధ్యమ వ్యాయోగం, పంచరాత్రం, అభిషేకం, బాల చరిత్ర, అవిమారకం, ప్రతిమ, ప్రతిజ్ఞా యౌగంధ రాయణం, స్వప్నవాసవదత్తం, దరిద్ర చారుదత్తం.

ప్రతిమ, అభిషేకం నాటకాలు రామకథాశ్రితమైనవి. పంచరాత్రం, మధ్యమ వ్యాయోగం, ఘటోత్కచం, కర్ణభారం, దూత వాక్యం, ఊరుభంగం మహాభారత కథాశ్రితమైనవి. బాలచరిత్ర భాగవత కథాశ్రితమైంది. ప్రతిజ్ఞ యౌగంధరాయణం, స్వప్న వాసవదత్తం, ఉదయన కథాశ్రితమైనవి. అవికుమారం, దరిద్ర చారుదత్తం లోక కథాశ్రితమైనవి.

రామాయణ మహాభారత కథలను తీసుకొని భాసుడు సొంత కల్పనలు అనేకం చేశాడు. ఒక్కొక్కసారి మూలకథకు పాత్రల నైజాన్ని పూర్తిగా మార్చేశాడు. ప్రతిమ నాటకంలో భాసుడు సూర్యవంశజుల ప్రతిమలను ప్రవేశపెట్టి నాటకానికి ప్రతిమ నాటకం అని పేరు పెట్టాడు. ఈ నాటకంలో ప్రధానపాత్ర భరతుడు. పంచరాత్రంలో ద్రోణుడు పాండవులకు అర్ధ రాజ్యమియ్యమని దుర్యోధనుడ్ని కోరతాడు. అజ్ఞాతవాసంలో ఉన్న పాండవుల జాడఐదు రోజుల్లో తెలిస్తే ఇస్తానని దుర్యోధనుడు అంటాడు. ద్రోణుడు భీష్ముని సలహాతో గోగ్రహణం చేస్తాడు. అప్పుడు ఇచ్చినమాట ప్రకారం దుర్యోధనుడు పాండవులకు అర్ధ రాజ్యమిస్తాడు. పద్దెనిమిది రోజుల యుద్ధం లేకుండానే మహాభారత కథను భాసుడు ముగించడం విశేషమైన కల్పన. ఈ నాటకంలో దుర్యోధనుడు, కర్ణుడు ఉదాత్త పాత్రలుగా కనిపిస్తారు. ఊరుభంగం చక్కని విషాదాంత (ట్రాజెడీ) నాటకం. దుర్యోధనుని మరణం రంగస్థలం మీద చూపబడింది. ప్రతిజ్ఞా యౌగంధరాయణంలో ఉదయనుడు వాసవదత్తను వివాహమాడే వృత్తాంతముంది. స్వప్నవాసవదత్తం లో వాసవదత్త మరణించిందని యౌగంధరాయణుడు రాజ్య లాభం కోసం ఉదయనుడ్ని నమ్మించి మగధ రాజకుమారి పద్మావతిని వివాహమాడేటట్లు చేస్తాడు. ఉదయనుడు వాసవదత్తను చూడడం, స్పర్శించడం అనే ఘట్టాన్ని కవి ఆధునిక మనోవైజ్ఞానిక దృష్టితో కూడా చక్కని కల్పన చేశాడు. అవిమారకం లోక కథల మీద ఆధారపడిన కల్పిత కథ మాయాంగుళీయకం వంటి అద్భుత సంఘటనలతో కూడింది. తరువాత మాలతీ మాధవం వంటివి ఇటువంటి నాటకాలే. దరిద్ర చారుదత్తం లో మృచ్ఛకటికం లోని చారుదత్తుని వృత్తాంతమే ఉంది. ఇది అసంపూర్ణంగా దొరికింది. ఈ నాటకాన్నే విస్తరింపచేసి శూద్రకుడు మృచ్ఛకటికం నాటకంగా రాశాడని కొందరు అభిప్రాయపడ్డారు. ఇవేకాక కిరణావళి, ఉదాత్త రాఘవం, యజ్ఞఫలం, వీణావాసవదత్తం భాసుని నాటకాలని అంటారు. కాని అవేవి భాసుని రచనలు కావని వేరే కవులు రాసిన నాటకాలని తేలింది.

భాసుడు ప్రతిభగల నాటకకర్త. ఇతని ప్రతి నాటకం భరతుని నాటక లక్షణాలకు భిన్నంగా ప్రదర్శనాయోగ్యంగా అతి దీర్ఘంగా ఉంది. చక్కని సన్నివేశ కల్పనలు, పాత్రలు, సంక్షిప్త సంభాషణలు, ఇతని నాటకాల ప్రత్యేకత. ఉత్తర భారతం లో నాటకకళ వెనుక పట్టుపట్టం తరువాత భాసుని నాటకాలు కేరళలో శీక్కియార్ లనే నటుల చేత ప్రదర్శింపబడుతూ ఉన్నాయి. మహాభారతం మీద ఆధారపడిన నాటకాలన్నీ ఏకాంకికలు.

సంస్కృత నాటకాలు మొదట ఒకే అంకంతో ఉండి సంగీతాత్మకంగా, గేయ ప్రధానంగా, ఏక పాత్రాభినయ రూపంగా ఉండేవని తెలుస్తున్నది. తరువాత కాలంలో 2, 3, 4 అంకాలకు పెరిగి పది అంకాలు గల నాటకం అనే ప్రక్రియగా పెంపొందిందని చెప్పవచ్చు. భాసుని రచనల్లో ఐదు ఏకాంకికలు. మూడు నాటకాలు 3, 4 అంకాలు కలవి. అభిషేకం నాటకంలో తొమ్మిది అంకాలున్నాయి. భాసుడు ఏకాంకిలను చాలా నైపుణ్యంతో సంఘటనా ప్రధానంగా చక్కని సంభాషణలతో పాత్రలెక్కువగా లేకుండా రచించాడు. భాసుని నాటకాలు భరతుని రసపోషణ లక్షణంతో లేవు. అవి సంఘటనా ప్రాధాన్యం గల నాటకాలు. భాసుడు రామాయణ, మహాభారత కథలను నాటకరూపంగా మలచాలని ప్రయత్నించినట్లుగా ఇతని నాటకాలను బట్టి తెలుస్తున్నది. తరువాత కవులు కూడా ఈ ప్రయత్నం చేశారు. భరతుని నాటక లక్షణాలకు భిన్నంగా వాలి వధను, దుర్యోధనుని మరణాన్ని రంగస్థలం మీద చూపాడు. మౌలికమైన కల్పనలతో భాసుడు గొప్ప నాటక కళా ప్రావీణ్యాన్ని ప్రదర్శించాడు. ఉదయనుని కథలు గల రెండు నాటకాల్లో భాసుడు కథా సంవిధాన చాతుర్యంతో ప్రౌఢమైన పాత్ర పోషణలతో రచించాడు. భాసుడు అనవసరమైన, దీర్ఘమైన వర్ణనలు ఎక్కడా చేయకుండా ప్రదర్శనలో ఈయన రక్తికట్టేటట్లుగా రచించాడు. నాటకాలు సంగీత ప్రాధాన్యం కన్నా పాత్రల అభినయంతో రక్తి కట్టించేటట్లుగా ఉన్నాయి. ఆధునిక నాటికలకు దగ్గరగా ఉన్నాయి.

భాసుని నాటకకళతోకాళిదాసాది కవులు ప్రభావితులయ్యారు. కాళిదాసు నాటికి భాసుడు ప్రముఖ నాటకకర్తగా గుర్తింపబడినట్లుగా మాళవికాగ్నిమిత్రం ప్రస్తావనను బట్టి తెలుస్తున్నది. కథలో నూతన కల్పనను ప్రవేశపెట్టి దాన్ని ఉత్కర్ష చేస్తూ నాటకానికి పేరును పెట్టడం ప్రతిమ, స్వప్నవాసవదత్తంలో చేశాడు. అదే విధంగా కాళిదాసు అభిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి నాటకానికి అభిజ్ఞాన శాకుంతల మని పేరు పెట్టాడు. తరువాత మృచ్ఛకటికం ఇటువంటిదే. భాసుడు తన అపూర్వ నాటకకళతో, పాత్రచిత్రణ నైపుణ్యంతో కథా కల్పనా సంభాషణ చాతుర్యంతో సంస్కృత నాటకరంగానికి గొప్ప యోగదానం చేశాడు.

ముదిగంటి.

భాస్కరచంద్ర, ఎ (జ.1956) : నాటక రచయిత. స్వస్థలం కృష్ణాజిల్లా, గుడివాడ. సుబ్బారావు, ప్రభావతమ్మ దంపతులకు 1956, అక్టోబర్ 11న జన్మించాడు. ఆంధ్రబ్యాంకు ఉద్యోగిగా మనుగడ సాగిస్తున్నాడు. కథ, నవలా రచయితగా సాహితీరంగంలో పేరు తెచ్చుకున్న భాస్కరచంద్ర నాలుగో కోతి *(1992)* నాటికా రచనతో నాటకరంగంలో ప్రవేశించి, అనతికాలంలోనే నాటక రచయితగా గుర్తింపు పొందాడు. హిమాగ్ని *(1961)*, మాయామృగం *(1997)* కాకిబంగారం, పిపీలికం, కొయ్యగుర్రం, వామన వృక్షం మొదలైనవి ఈయన ప్రసిద్ధ రచనలు. బలమైన ఇతివృత్తం చుట్టూ ఆకట్టుకునే సన్నివేశాలను కూర్చి, హేతుబద్ధమైన సంభాషణలతో సామాజికుల మస్తిష్కంలో ఆలోచనలు రేపే విలక్షణ నాటక శిల్పం భాస్కరచంద్రది. స్త్రీవాదాన్ని ఒక వినూత్న దృష్టి కోణం నుంచి నాటక రచనలో అభివ్యక్తం చేసిన రచయితలలో భాస్కర చంద్ర ప్రథమ గణ్యుడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ నాటక రచయిత పురస్కారం అందుకున్నాడు.



గం.సు.రె.

భాస్కర రావు, ముద్దా వెంకట (జ.1939) : రంగస్థల నటుడు, సంగీత విద్వాంసుడు, దర్శకుడు. ఈయన 1939, జులై 1న జన్మించాడు. తాత ముద్దా వెంకటప్పయ్య కాశి పండితుడు. శుక్ల యజుర్వేదంలో నిష్ణాతుడు. హరికథా రచనలోను, హరికథా కాలక్షేపంలోను వెంకటప్పయ్యది అందెవేసిన చేయి. సంగీతసాహిత్యాల్లో దిట్ట అయిన తాతయ్య దగ్గరే భాస్కరరావు కీర్తనలు, రాగాలు నేర్చుకున్నాడు.

తండ్రి సుబ్బయ్య సుప్రసిద్ధ ప్రయోక్త. ఆయన దగ్గర అభినయకళను అభ్యసించిన భాస్కరరావు తన తొమ్మిదవ ఏట భక్తప్రహ్లాద లో ప్రహ్లాదుని పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం గావించి, తన గాన కళా నైపుణ్యంతో, అభినయ చాతుర్యంతో అందరినీ అలరించాడు. ఆనాటి నాటకంలో హిరణ్యకశ్యపునిగా భాస్కరరావు తండ్రి నటించగా, లీలావతి పాత్రను వేదాంతం రాఘవయ్య ధరించటం ఓ విశేషం.

తన ఇరవైయవఏట 1959లో శ్రీకృష్ణరాయబారంలో అర్జునుడు పాత్రద్వారాతిరిగిరంగస్థలప్రవేశం చేసి రాయబారంలో కర్ణుడు, అశ్వత్థామ, అర్జునుడు, సత్యహరిశ్చంద్ర లో నక్షత్రకుడు, మైరావణ లో ఆంజనేయుడు పాత్రలను ధరించి సహస్రాధిక

ప్రదర్శనల్లో తన అభినయ చాతుర్యంతో రక్తి కట్టించి, ఉత్తమశ్రేణి కళాకారునిగా వేనోళ్ళ కీర్తింపబడ్డాడు.

ఆరోజుల్లో ఈయన మల్లాది, బండారుల సరసన సత్యహరిశ్చంద్రలో నక్షత్రకుడు, వేజండ్ల ఎ. సుబ్బారావు సరసన ఉద్యోగ విజయాలు లో అర్జునుడు, అశ్వత్థామ, కర్ణుడు పాత్రలు ధరించి వారికి దీటుగా రాణించాడు.

కొన్ని కారణాల వల్ల నట జీవితానికి స్వస్తి పలికిన భాస్కరరావు కళారంగంతో తన అనుబంధం వదులుకోలేక హార్మోనిస్టుగా కొత్త పాత్రకు శ్రీకారం చుట్టాడు. తొలుత కసుకుర్తి కోటయ్య దగ్గర హార్మోనియం వాయించటంలో ప్రాథమిక శిక్షణ పొందాడు. అనంతరకాలంలో పలువురు పెద్దల సాంగత్యంతో మరింత పరిణతి సాధించాడు.

హార్మోనిస్టుగా గత రెండు దశాబ్దాలుగా అవిశ్రాంతంగా సేవలు అందిస్తూనే ఉన్నాడు. చెరుకుపల్లి పరిసర ప్రాంతాల్లోని పలు ఔత్సాహిక నాటక సమాజాలకు పర్మినెంటు హార్మోనిస్టుగా వ్యవహరిస్తూ, పలువురు వర్ధమాన కళాకారులకు శిక్షణ ఇస్తూ ఉన్నాడు. ఈయన కొంత కాలం జైహింద్ సుబ్బయ్య కంపెనీకి, బాపట్ల కె.ఎస్.టి. శాయి ఫైన్ ఆర్ట్స్ థియేటర్స్‌కి కూడా హార్మోనిస్టుగా వ్యవహరించాడు. నాగభైరవ పాలెం, సత్తెనపల్లి, తిరుపతి వంటి పలు పరిషత్తులు నిర్వహించి ప్రతిష్మాత్మక పోటీల్లో ఉత్తమ సంగీత దర్శకునిగా బహుమతులు సాధించాడు. ఈయన సంగీత సారథ్యంలోనే మైరావణ, దక్షయజ్ఞం నంది నాటకోత్సవాల్లో ప్రదర్శింపబడ్డాయి. దక్షయజ్ఞం దూరదర్శన్‌లో కూడా ప్రసారమైంది. ఆకాశవాణిలో పలు రంగస్థలికార్యక్రమాలకు హార్మోనిస్టుగా వ్యవహరించాడు.

ఈయనదర్శకత్వంలో బ్రహ్మంగారిచరిత్ర, చింతామణి నాటకాల్ని పలు సమాజాలు ప్రదర్శించాయి. తన సోదరులిరువురికి శిక్షణఇచ్చిఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దారు. వీరిలో ముద్దా లీలా మోహనరావు *గయోపాఖ్యానం*లో అర్జునుడు, కృష్ణుడు, ఆనాడులో పృథ్వీరాజ్ పాత్రలు పోషించి రాణించాడు. మరో సోదరుడు ముద్దా వెంకటప్పయ్య కూడా స్థానికంగా పలు సాంఘిక నాటకాల్లో నటించి రాణించాడు.

తన రంగస్థల జీవితంలో ప్రథమార్థంలో నటునిగా, ద్వితీయార్థంలో హార్మోనిస్టుగా వేయికి మించి ప్రదర్శనల్లో పాల్గన్న భాస్కరరావు తన పదవీ విరమణ అనంతరం రాంభట్ల పాలెంలో స్థిర నివాసం ఏర్పరచుకొని హార్మోనిస్టుగా తన సేవలు పలు సమాజాలకు అలుపెరగక అందిస్తూనే ఉన్నాడు.

మన్నెశ్రీ.

భీమన్న, బోయి (1911-2005) : కవి, నాటకకర్త, నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు. తూర్పు గోదావరి జిల్లా రాజోలు సమీపంలోని మామిడికుదురులో 1911 సెప్టెంబరు 19వ తేదీన జన్మించాడు. తల్లి దండ్రులు నాగమ్మ, పల్లయ్య. భీమన్న మామిడి కుదురు, కాకినాడ పి.ఆర్. కళాశాలలో విద్యనభ్యసించాడు. రాజమండ్రిలో బి.ఎడ్ చేస్తున్నప్పుడు కుసుమ ధర్మన్న సంపాదకత్వంలో వెలువడుతున్న 'జయభేరి' వార పత్రికలో సహాయ సంపాదకుడుగా పనిచేశాడు. జనవాణి, ప్రజామిత్ర, ఆంధ్రప్రభ, పత్రికలలో కొంతకాలం పనిచేశాడు. అధ్యాపకుడుగా కొంతకాలం పనిచేసిన భీమన్న రాజకీయ రంగంలో ప్రవేశించి, ప్రదేశ్ కాంగ్రెస్ ఆర్గనైజర్‌గా, హరిజన సేవక్ సంఘ సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించాడు. మద్రాసు రాష్ట్రంలో అసిస్టెంట్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా, ఆంధ్రరాష్ట్రంలో అనువాద శాఖ, పుస్తకాల నమోదు అధికారిగా పనిచేశాడు. నలభైకి పైగా గ్రంథాలు రచించాడు. వీటిలో పద్య, గద్య కవితా సంపుటాలు, నాటకాలు, నాటికలు, గేయ నాటికలు, వ్యంగ్య రచనలు, జీవిత చరిత్రలు, నృత్య గేయ కావ్యాలు, సెవెంత్ సీజన్ పేరుతో వెలువరించిన ఆంగ్ల కవితా సంపుటాలున్నాయి. పద్య, గద్య కావ్యాలలో *గుడిసెలు కాలిపోతున్నై*, దీపసభ, పిల్లి శతకం ప్రసిద్ధమైనవి. పాలేరు, కూలిరాజు, రాగవాసిష్టం, బాలయోగి, ఆదికవి వాల్మీకి, ప్రగతి మొదలైన నాటకాలు, అసూయ, పడిపోతున్న అడ్డుగోడలు అనే నాటికలను, పైరుపాట, మానవుని మరొక మజిలీ వంటి గేయనాటికలను రచించాడు. చిత్రకళా ప్రదర్శనం, వసంత స్వయంవరం, *గులాబి* ప్రసవించింది, దేవయాని, మెదడులో మెరుపు, శ్రేయసి, పాత ఊరు – కొత్త దారి, సుభాస చంద్రుడు, చండాలిక, అంధకారంపై విజయం అనే పది నాటకాలను రచించాడు. ఈయన 'సుఖేలా నికేతన్' అనే సంస్థను స్థాపించి తన రచనలను ప్రకటించాడు.

పాలేరు, కూలిరాజు ప్రసిద్ధ నాటకాలు. కూలీలంతా ఏకమై కూలిరాజ్యం స్థాపించాలనీ, ధనస్వాముల దౌర్జన్యాలను అరికట్టాలని, కుల నిర్మూలనకు ఉద్యమించాలనే ప్రధాన సందేశంతో రాసిన నాటకాలివి. ఈ నాటకాలు పలుచోట్ల ప్రదర్శింపబడి ప్రేక్షకుల మెప్పును పొందాయి. రాగవాసిష్టం ఆర్యులు, ద్రావిడులు అవర్ణులు, సవర్ణుల మూల జాతి ఒకటేనని చెప్పేనాటకం. పైరుపాట వంటి నృత్యగేయనాటికలలో ప్రతీకవాదం

ప్రకృతి పరిశీలన దృష్టి గోచరిస్తుంది. వేంకటేశ్వర సుప్రభాతాన్ని దృష్టిలో పెట్టుకొని అంబేద్కరు సుప్రభాతం రాశాడు. 1960లో నవ్య సాహితీ సమితి అధ్యక్షుడుగా ఉంటూ, అఖిల భారత ప్రథమ తెలుగు రచయితల మహాసభకు సారథ్యం వహించాడు. భీమన్న సాహితీసేవను గుర్తించిన పలుసంస్థలు మహాకవి సాహితీ వతంస బిరుదులిచ్చాయి. గండపెండేరాలు తొడిగారు. 1971లో ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సత్కరించింది. ఈయన రచించిన గుడిసెలు కాలిపోతున్నైకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1978లో ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు సభ్యుడుగా పనిచేశాడు. భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్‌లతో సత్కరించింది. 'పాలేరు నుంచి పద్మశ్రీ వరకు' అనే గ్రంథం భీమన్న సాహిత్య జీవితాన్ని తెలుపుతుంది. జర్నలిస్టుగా, కవిగా, నాటకకర్తగా పేరు తెచ్చుకొన్న భీమన్న 2005 డిసెంబర్ 16న మరణించాడు.

దాసరి. ఎన్.

భీమారావు, ముప్పవరపు (1909-1969) : రంగస్థల నటుడు. ఈయన 1909, సెప్టెంబరు 27న గుంటూరులో జన్మించాడు. గుంటూరు ఫస్టు కంపెనీలోను, స్టార్ థియేటర్‌లోను, అబ్బూరి కంపెనీలోనూ వైవిధ్యం గల పాత్రలలో నటిస్తూ ప్రేక్షకాదరణ పొందాడు. పద్య నాటకాలే రాజ్యం చేస్తున్న ఆకాలంలో విశ్వామిత్రుడు, నక్షత్రకుడు, దశరథుడు, బిల్వ మంగళుడు, భవాని శంకరుడు, ధర్మారాయుడు, వసుదేవుడు, రాజరాజనరేంద్రుడు తదితర పాత్రలను ప్రతిభావంతంగా పోషించి, తనదైన బాణీలో సామాజికులను మెప్పించాడు. జీవితమంతా నాటక రంగానికే అర్పణ చేసి తరించిన కళామయ హృదయుడు. ఈయన 64వ ఏట గుంటూరులో 1969, జనవరి రెండున భౌతికంగా కనుమరుగయ్యాడు.

గం. సు.రె.

భుజంగ రావు, మంత్రి ప్రగడ (1876-1940) : లక్కవరం జమీందారు, కవి, పండితుడు, వితరణశీలి, శతాధిక గ్రంథకర్త, దర్శనాచార్యుడు, సంస్కృతాంధ్ర భాషా పండితుడు, అష్టావధాని, విమర్శకుడు. వెంకమాంబ, మల్లయామాత్య దంపతులకు 1876లో ఏలూరులో జన్మించాడు. విజయలక్ష్మమ్మ, మల్లికార్జున ప్రసాదరావులకు దత్తుడు. సాహిత్యమందే గాక అనేక విషయాలలో నిష్ణాతుడు. క్రైస్తవ మతాభిమాని. రావు బహదూర్, హేలాపుర ప్రధాని, దర్శనాచార్య బిరుదాంకితుడు.

ఈయన అనేక మంది కవులకు ఆశ్రయమిచ్చాడు. కొత్తపల్లి సుందర రామయ్యను ఆస్థానకవిగా పెట్టుకుని ఆదరించాడు. ఈయన పి. చంచయ్యతో కలిసి ఆంగ్లంలో తెలుగు సాహిత్య చరిత్ర రాశాడు. నాటకాలను సంప్రదాయక పద్ధతిలో, నాందీ ప్రస్తావనలు, భరతవాక్యం ప్రవేశపెట్టాడు.

చారుమతీ పరిణయం (1917), ఆంధ్రీకృత ప్రసన్న రాఘవం, ఆంధ్రీకృత ఉత్తరరామ చరిత (1918), అభిజ్ఞాన శాకుంతలం (1919) వంటి అనువాద నాటకాలు, చిత్ర హరిశ్చంద్ర (1888), నల నాటకం (1894), శశిరేఖ (1902), కృష్ణ నాటకం (1904), పాండవాజ్ఞాత వాసం (1909) వంటి స్వతంత్ర నాటకాలే కాక మహా యోగ రహస్య ప్రహసనం (1900), కలియుగ నటనా మృతపి (1903), విధవా వివాహ ప్రహసనం (1904), నిరసవాద ప్రహసనం (1906)లను రచించిన భుజంగరావు 1940లో స్వర్గస్థుడయ్యాడు.

శ్రీ.చ.

మంజోనీ, అలెస్సాండ్రో (1785-1873) : ఇటాలియన్ నవలాకారుడు, కవి, నాటక రచయిత. ఈయన రాసిన ఇప్రామెస్సి స్పోసి (పెళ్ళి నిశ్చితార్థం 1840-02) నవల ఇటలీ సాహిత్య చరిత్రలో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొంది. ఈయన 1785, మార్చి 7న ఇటలీలో ని మిలాన్ నగరంలో జన్మించాడు.

18వ శతాబ్దంలో ఇటాలియన్ నాటకరంగంలో మార్పులు రావడం ప్రారంభమైంది. నిజమైన విషాదాంత నాటకం ఈ కాలంలోనే మొదలైంది. మంజోనీ నాటక శైలి నవ్య సంప్రదాయ నాటక విధానానికి భిన్నమైంది. సమాజాభ్యుదయానికి అనుకూలించే విధంగా నాటక రచన ఉండాలని మంజోనీ అభిప్రాయం. తన భావజాలం సామాన్య ప్రజలకు చేరువ కావాలనే తలంపుతో తేలికైన భాషను ఎన్నుకొని రచనా వ్యాసంగం సాగించాడు. ఈయన రాసిన అడెల్‌చి (1802), ది కౌంట్ ఆఫ్ కార్‌మగ్‌నోల (1815-19) అనే రెండు విషాదాంత నాటకాలు పి.బి. షెల్లి , బైరన్ రచనల్ని పోలి ఉన్నాయి. వీటిని దృశ్య నాటకాలనడం కంటే శ్రవ్య నాటకాలనవచ్చు. మంజోనీ షేక్స్పియర్ రచనలకు ప్రభావితుడై ఆంగ్ల నాటక రచయితల కీర్తి ప్రతిష్ఠల్ని ఇటలీలో ఇనుమడింప చేయడానికి ప్రయత్నించాడు. 1812లో మార్జో (marzo) వంటి దేశభక్తి ప్రపూరితమైన రచన చేసిన మంజోనీ 1873, మే 23న కన్నుమూశాడు.

ఆనందన్

మందులు, కె (1944-2002): నటుడు, దర్శకుడు, ఆర్.కె. ప్రొడక్షన్ సమాజ స్థాపకుడు. పశ్చిమగోదావరి జిల్లా

రాయకుదురులో 1944, మే 1న జన్మించాడు. తల్లిదండ్రులు ముత్యాలమ్మ, తాతయ్యలు. రాయకుదురులో ప్రాథమిక విద్య, వీరవాసంలో ప్రాథమికోన్నత విద్య, భీమవరంలో పియుసి పూర్తిచేసిన మందులు 1967లో విశాఖ పట్నం పోర్టు ట్రస్టులో గుమస్తాగా చేరాడు. మందులు రాయకుదురులో చదువుతున్న రోజుల్లోనే బి.ఎన్. సూరి రచించిన పని మనిషి నాటకంలో తొలిసారిగా నటించాడు. తరువాతి రోజుల్లో కీలుబమ్మలు, ఆడది, ఎవరినీ నమ్మకు, ఉద్ధరింపు, చిల్లరకొట్టు చిట్టెమ్మ, ఐపిసి *302*, ఛైర్మన్ మొదలైన ప్రదర్శనలలో పాల్గన్నాడు.

మందులు ఉద్యోగంలో చేరిన తరువాత సమర్పణ, పాపం, లాటరీ, కాలం వెనక్కు తిరిగింది, మృత్యుంజయుడు, నటన మొదలైన నాటక, నాటికలలో నటించాడు. మృత్యుంజయుడులో పుండరీకం పాత్ర మందులుకు ఉత్తమ నటుడు అవార్డు తెచ్చి పెట్టింది. 1970 తరువాత కె. వేంకటేశ్వర రావు దర్శకత్వం వహించిన *ఎంతెంత దూరం*, *ఆకాశరామన్న*, *రాగరాగిణి*, రావూజీ దర్శకత్వంలో తరంగాలు, *అరణి*, *మనిషి చావకూడదు*, *కిం కర్తవ్యం*, *వయసు–మనసు*, మరో మొహెంజదారో నాటకాలలో నటించాడు. మరో మొహెంజదారో లోని ప్రొఫెసర్ పాత్ర మందులుకు అఖిల భారతస్థాయి నాటిక పోటీలలో ఉత్తమ నటుడు అవార్డు తెచ్చి పెట్టింది. 1975 తరువాత మిశ్రో దర్శకత్వంలో ప్రదర్శింపబడిన మళ్ళీ మధుమాసం, బట్టా వేణు దర్శకత్వంలో ప్రదర్శింపబడిన క్షీరసాగర మథనం లో నటించి అనేకసార్లు ఉత్తమనటుడు అవార్డును అందుకున్నాడు. 1979లో విశాఖ కళానికేతన్ పక్షాన దాడి వీరభద్రరావు రచించిన పలుకే బంగారమాయె, రాజసూయ యాగం, ఓ అమ్మాయి కథ, అనగనగా ఒకరాజు మొదలైనవాటికి దర్శకత్వపు బాధ్యతలు చేపట్టి ప్రదర్శించాడు. 1984లో ఆర్.కె. ప్రొడక్షన్సు సంస్థను స్థాపించి పలు వేదికలపై ప్రదర్శనలు నిర్వహించాడు. కొర్లపాటి శ్రీరామమూర్తి రచించిన పలనాటి వీర చరిత్ర పలుచోట్ల ప్రదర్శించి కళాభిమానుల అభినందనలకు నోచుకోవడం, ఈ నాటకానికి మద్రాసు కళాసాగర్ సంస్థ ఉత్తమ నాటకం అవార్డు లభించడంతో నాటక రచయితకు, ప్రదర్శించిన ఆర్.కె. సంస్థకు, నిర్వాహకునికి ఎనలేని కీర్తి వచ్చినట్టు కళాకారుల అభిమతం. మందులు కె.జి. వేణుతో కలిసి పంచతంత్రం, అఖండ విప్లవజ్యోతి, అంబేద్కర్ అనే నాటకాలు రచించాడు. సమాజ నిర్వాహకుడిగా, రచయితగా, నటుడుగా, కళారంగానికి సేవ చేసిన మందులును అనేక కళా సంస్థలు 'నటకాగ్రేసర', 'నటవిరాట్', 'నటశేఖరుడు', 'రంగస్థల నటబ్రహ్మ' వంటి బిరుదులనిచ్చి సత్కరించాయి.కళారంగ వికాసం కోసం కృషిచేసిన ఈయన 2002 మే 22న మరణించాడు.

దాసరి. ఎన్.

మధుసూదన్, వనం : నటుడు, నాటక రచయిత, పరిశోధకుడు, స్వస్థలం వరంగల్లు. 1958లో ఎనిమిదవ తరగతి చదివే రోజుల్లో నాటకం అనే నాటికను రచించి తోటి విద్యార్థుల్ని, ఉపాధ్యాయుల్ని అబ్బురపరచిన బాల మేధావి. తండ్రిగారైన వనం రామస్వామి చిన్ననాడే మధుసూదన్‌లో నాటక బీజాన్ని నాటాడు. ఆయనిచ్చిన ప్రోత్సాహం, మధుసూదన్ నటుడుగా, నాటక రచయితగా, తదనంతర కాలంలో పరిశోధకునిగా ఎదగడానికి కారణమైంది. సమకాలీన కాలంలో వినూత్న ప్రయోగాల్ని విశిష్టంగా ప్రయోగించి హృద్యమైన నాటికల్ని మలచిన రచయిత. *అమ్మయ్యో గాంధీ బ్రతికాడు*, *ఋణం తీరిపోయింది*, *భారతి కళ్ళు తెరిచింది*, *అంటరానివాళ్ళు* ఇత్యాది నాటికల్ని రాసి, విశిష్టస్థానాన్ని సంపాదించుకున్నాడు. ఈయన 1986లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు ఏకాంకికా వికాసం పై పరిశోధన చేసి పిహెచ్. డి. పొందాడు. ఇది తెలుగు ఏకాంకికల పై వచ్చిన ప్రప్రథమ పరిశోధన గ్రంథం. మధుసూదన్ ఎన్నో నాటికలకు దర్శకత్వం వహించి రసజ్ఞుల మన్ననలు అందుకొన్నాడు. వరంగల్‌లోని సి.కె.ఎం కళాశాలలో అధ్యాపక వృత్తిని నిర్వహిస్తూనే నాటక వికాసానికి కృషి చేస్తున్నాడు.

గం.సు.రె.

మన శ్రీరంగము: నాటక సిద్ధాంత గ్రంథం. రచయత బిందా/ నారాయణరావు. ఈ గ్రంథప్రథమ ముద్రణ 1963లో జరిగింది. ఇందులో రంగోద్భవం, అంకురం, పూర్వరంగం, అభినయ శిల్పం మనోధర్మం, స్త్రీ వేషాలు స్త్రీలే, స్వగతాలు, పాటలు, పద్యాలు, రంగస్థల సంగీతం, లిటిల్ థియేటర్, మస్తిష్కవాదం, ప్రగతి అనే పదకొండు అధ్యాయాలు ఉన్నాయి. సుప్రసిద్ధ తెలుగు నటుల చిత్రాలతో ఈ గ్రంథం శోభిస్తోంది.

నాటక కళను గురించి ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాల తులనాత్మక పరిశీలన, వివిధ తెలుగు నటుల నటనా వైఖరులు, వివిధ తెలుగు నాటకకర్తల రచనా శిల్ప పరిశీలన ఇందులో ప్రాముఖ్యం వహిస్తున్నాయి. భరతముని రసవాదాన్ని చతుర్విధాభినయ విధానాలను రచయిత ఇందులో బలపరుస్తూ సిద్ధాంతీకరించాడు. ఈయన సంస్కృత లాక్షణిక సిద్ధాంతాలను,

స్టానిస్లవ్‌స్కీ సిద్ధాంతాలను ఇందులో ఒకదానితో ఒకటి పోలుస్తూ వివరించాడు.

శ్రీ.చ

మల్లికార్జున రావు, కప్పగంతుల (1936 - 2006) : నవలా, కథా రచయిత, అధ్యాపకుడు, నటుడు, నాటకకర్త. ఈయన 1936, డిసెంబరు 22న ప్రకాశం జిల్లా ఒంగోలు తాలూకా కారుమంచిలో జన్మించాడు. తల్లిదండ్రులు మల్లికాంబ, ఆంజనేయులు. మల్లికార్జునరావు మొట్టమొదట 1953లో నాటికి నేడు అనే నాటికలో మహాలక్ష్మమ్మ పాత్రలో నటించాడు. చదువుకునే రోజుల్లోనే నాటకం పట్ల మక్కువ పెంచుకున్న మల్లికార్జునరావు దాదాపు 300కు పైగా కథలు, 16 నవలలు, 29 నాటక, నాటికలు రచించాడు. ఈయన రాసిన మొదటి నాటిక సాలెగూడు (1960) భారతి పత్రికలో ముద్రితమైంది. ఈ నాటిక పలు చోట్ల స్వీయదర్శకత్వంలో ప్రదర్శించాడు. ప్రేక్షకుల మెప్పును పొందిన ఈ నాటిక, మరికొన్ని నాటికలు రాయడానికి ప్రేరేపించింది. నీలినీడలు *(1961)*, యాచకులు*(1964)*, దూరపు కొండలు *(1964)*, సప్తపది *(1965)*, మారని మనిషి *(1966)*, రథ చక్రాలు వంటి నాటకాలు రచించాడు. నీలి నీడలు, మారని మనిషి నాటకాలను సత్య కళా నికేతన్ ప్రదర్శించి, ప్రచురించింది. ఉద్ధారకులు, పరిష్కృతి *(1966)* హిందీలోకి అనువదింప బడ్డాయి. దాగుడు మూతలు *(1961)*, సిగరెట్లు త్రాగరాదు *(1962)*, జ్వాల *(1964)*, నయనతార *(1965)*, నూట పదహార్లు *(1966)*, క్షంతవ్యులు *(1970)*, చరిత్ర హీనులు *(1972)*, శిక్ష *(1972)*, ఆశయబద్ధతలోకే (1975), కోహం *(1995)*, బ్రహ్మచారులకు మాత్రమే*(1995)*, నాటికలను రచించగా వివిధ నాటక సమాజాలు ప్రదర్శించాయి. పరిష్కృతి నాటిక హైదరాబాదులో సంచలనం సృష్టించింది. ఈ నాటకంలోని వస్తువును గోరాశాస్త్రి తీవ్రంగా నిరసిస్తూ ఆంధ్రభూమిలో విమర్శనాత్మక వ్యాసం ప్రచురించాడు. తెలుగు నాటక సాహిత్యానికి సంబంధించి నాటక సమీక్ష, వ్యాస మాలిక అనే గ్రంథాలను రచించాడు. విద్యార్థులు, పరిశోధకుల కోసం ప్రపంచ నాటకరంగ ధోరణులు - చారిత్రక నేపథ్యం (2001) అనే గ్రంథం రచించి ప్రచురించాడు. వివిధ పరిషత్తులు నిర్వహించిన నాటక పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించాడు. చరిత్ర ఉపన్యాసకుడుగా పనిచేసిన మల్లికార్జున రావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1992లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డునిచ్చి సత్కరించింది. నాటక సాహిత్యం ఔన్నత్యం కోసం పాటు బడిన మల్లికార్జునరావును ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం, విశ్వసాహితి, భారత సాహిత్య పరిషత్తులు ఘనంగా సత్కరించాయి. ఈయన రచించిన 'మల్లికార్జునరావు నాటికలు' గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం లభించింది. ఈయన 2006లో స్వర్గస్థుడయ్యాడు.

దాసరి. ఎన్

మాటర్‌లింక్, ~~షో~~మారీస్ (1862-1949) : బెల్జియన్ కవి, నాటకకర్త. ఎక్కువగా ఫ్రెంచ్ భాషలో రచనలు చేశాడు.

1890 నాటికే సుప్రసిద్ధుడైన మాటర్‌లింక్, మొదటి ప్రపంచ యుద్ధం ముందు సంవత్సరాలలో మరింత ప్రశస్తి సంపాదించాడు. 1911లో ఈయనకు సాహిత్యరంగంలో నోబెల్ బహుమతి లభించింది.

మార్మికత ప్రస్ఫుటించే కవితా సంకలనం హాట్‌హౌస్ బ్లూమ్స్ 1899లో ప్రచురితమైంది. ఫెల్లియాస్ ఎట్ మెలిసాండే అనే నాటకం ఫ్రెంచ్‌లో 1892లోను, ఇంగ్లీషులో 1894లోను విజయవంతంగా ప్రదర్శింపబడింది. సంగీత నాటకాలలో ఆ శతాబ్దానికి ఇదే మంచి రచన.



చారిత్రక అంశాలను చొప్పించి మాటర్‌లింక్ నాటకాలు రాశాడు. ది బ్లూ బర్డ్ (1909) బాగా ప్రాచుర్యం పొందింది. చిన్నపిల్లలకు ఉద్దేశించిన ఈ నాటకంలో సుఖాన్వేషణ పద్ధతులున్నాయి. 1918లో అనాలోచనపరుడైన ఒక జర్మన్ ఆఫీసర్ పాలనలో ఫ్లాండర్స్ ఎన్ని కష్టాలు అనుభవించిందో తెలుపుతూ మరొక నాటకం రాశాడు.

మాటర్‌లింక్ మంచి వచన రచయిత కూడా. 1930 వరకు ఈయన రచనలలో తత్త్వ నైరాశ్య దృష్టికి, ప్రకృతి ప్రదర్శనోత్సుకతకు ప్రాధాన్యం కనిపిస్తుంది. ఈయన క్రైస్తవ మతాన్ని నిరాకరించాడు. ఆత్మ అమృతత్వాన్ని గురించి, వ్యక్తుల పరస్పర భావ సంపర్కాన్ని గురించి, జీవితంలో కలిగే కష్టనష్టాలకు మనుషులు ఎంతవరకు బాధ్యులనే విషయాన్ని గురించి ఈతని రచనలు చర్చిస్తాయి. ది లైఫ్ ఆఫ్ ది బీ (1901), ది ఇన్‌టెలిజెన్స్ ఆఫ్ ఫ్లవర్స్ (1907) ఈయన ప్రముఖ రచనలు.

పేరును బట్టి ఇవి జంతుశాస్త్రానికి, ప్రకృతి పరిశీలనకు సంబంధించినవని అనుకోకూడదు. అలాగని కేవలం కట్టు కథలుగా కొట్టివేయకూడదు. ఒకరకమైన తత్త్వదర్శనాన్ని ప్రతిపాదిస్తూ, మానవాళి ఏ రకంగా ప్రపంచాన్ని సజావుగా అర్థం చేసుకోడానికి అవకాశం ఉందో ఈ రచనల్లో నిరూపిస్తాడు. వాస్తవ పరిస్థితులు అవగాహన అవటానికి ఈ రచనలు మార్గదర్శకంగా ఉంటాయి.

శ్రీవిరించి

మాణిక్య శర్మ, చక్రావధానుల (19 శ. ఉత్తరార్థం) : స్వస్థలం నరసాపురం, నాటకకర్త, కవి, గ్రంథప్రచురణ కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ముత్తాలపల్లిలోని నరసమాంబ, నరసింహులకు జన్మించాడు. నరసాపురంలోని వై.ఎన్.కె.వి. అనే నాటక సమాజానికి కవి. ఆ సమాజం కోసమేనాటకాలుఎక్కువగా రాశాడు. దేశీయ గ్రంథమాలను స్థాపించి నాటకాలు ప్రచురించాడు. వీరి నాటకాలలో పౌరాణికాలు ఎక్కువ, చారిత్రకాలు బహుకొద్ది.

ఈయన *భూలోకరంభ*, *చంద్రకాంత* (1911), *సంగీత సారంగధర* (1914), *మహారాష్ట్ర విజయం* (1914), *సంగీత సావిత్రి* (1920), *చిత్రనళీయం* (1921), *సంగీత శ్రీకృష్ణ రాయబారం* (1921), *సంగీత శ్రీకృష్ణలీలలు* (1921), *సంగీత సత్య విజయం*, *సంగీత ప్రహ్లాద*, *సంగీత స్త్రీ సాహసం* (1921), *సంగీత శశిరేఖ*, *సంగీత గులేబకావళి* (1921), *సంగీత రావణ* (1921), *సంపూర్ణ రామాయణం* (1921), *సంగీత జయంత జయపాల*, *సంగీత విష్ణులీలలు* (1922), *సంపూర్ణ మహాభారతం* (1923), *నవరత్న చింతామణి*, *పద్మవ్యూహం* (1926), *శ్రీకృష్ణరాయ విజయం*, *లంకాదహనం* (1927), *లవకుశ* (1937) మొదలైన నాటకాలను రచించాడు.

శ్రీ.చ.

మానేపల్లి కంపెనీ (రాజమహేంద్రవరం) : ధరణీ ప్రగడ సూరయ్య రాజమహేంద్రవరంలో 1898లో నేషనల్ థియేటర్ అనే నాటక సమాజాన్ని స్థాపించాడు. సూరయ్య మానేపల్లి నివాసి కావడంతో మానేపల్లి నాటక కంపెనీ అని పేరు వచ్చింది. సూరయ్య రాజమహేంద్రవరంలో ఇన్నీసుపేటలో ఒక నాటకశాలను నిర్మించాడు. నటులకు నెలవారీగా జీతాలివ్వడం ఈ కంపెనీతోనే ప్రారంభమైనట్లుగా తెలుస్తోంది. ఈ కంపెనీ చాలా ఖర్చు పెట్టి, భారీ సెట్టింగులతో ప్రదర్శనలు నిర్వహించింది. వీటికి తోడుగా శ్రావ్యమైన సంగీతం, అద్భుత నటన, ఈ కంపెనీ నాటకాల విశిష్టత. ముఖ్యంగా ఈ కంపెనీ నాటక ప్రదర్శనల వల్ల, ప్రజల్లో నాటకాలన్నా, నటులన్నా, గౌరవం ఏర్పడింది. ఈ కంపెనీలో అంబడిపూడి కొండయ్య, ముప్పిడి జగ్గరాజు, నాయక వేషాల్లో నటించడం వల్ల, నాటకాలకు మంచి పేరు వచ్చింది. కోటయ్య గాత్రం చాలా గంభీరంగా ఉండి, ధీరోదాత్తనాయకునికి సరితూగేది. జగ్గరాజు స్త్రీ పాత్ర పోషణ చాలా సున్నితంగా, ఎంతో హుందాగా సాగిపోయేది. ఈ సమాజం కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించేది. ఈ కంపెనీ నాటకాల్లో కాళ్ళకూరి సాంబశివరావు రంగనాయక సమవకారము నాటకం ప్రజలను బాగా ఆకర్షించింది. వృత్తి నాటక సమాజాలలో మొట్టమొదటిదిగా పేరు తెచ్చుకున్న ఈ సమాజం 1912 నాటికి అంతరించింది.

నే.వ.శ.

మాఫేయీ, ఫ్రాన్సెస్కో సిపియోనీ (1675-1755): ఇటలీకి చెందిన గొప్ప నాటకకర్త, పురావస్తు శాస్త్రవేత్త, మేధావి. ఈయన రచించిన మిరోప్ అనే విషాదాంత పద్య రూపకం ఇటాలియన్ నాటకరంగ చరిత్రలో ఒక గొప్ప మైలురాయి.

1675, జూన్ ఒకటిన ఇటలీలోని వెరోనా నగరంలో జన్మించిన మాఫేయీ పార్మానగరంలో జెసూట్ కళాశాలలో కొంతకాలం విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత స్పానిష్ వారసత్వ యుద్ధంలో పాల్గన్నాడు. 1710లో అపోస్టోలో జెనో అనే ప్రముఖ కవితో కలసి ఈయన స్థాపించిన ఒక సాహిత్య పత్రిక ఆ రోజులలో ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. ఇటాలియన్ నాటకరంగాన్ని సంస్కరించటానికి ఉద్యుక్తులైన ఆనాటి నాటక రచయితల అభిప్రాయ ప్రకటనలకు ఆ పత్రిక చక్కటి వేదికగా ఉపయోగపడింది. 1737వ సంవత్సరంలో ఈయన సొంతంగా మరొక సాహిత్య పత్రికను స్థాపించి, మూడు సంవత్సరాలపాటు దానిని విజయవంతంగా కొనసాగించాడు.

మాఫేయీకి అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టిన మిరోప్ అనే విషాదాంత పద్యనాటకం 1713లో రచించబడి, అదే సంవత్సరం ప్రదర్శింపబడింది. గ్రీక్ పురాణాలలోని కొన్ని గాథలను ఇతివృత్తాలుగా స్వీకరించి, యూరిపిడీస్ నాటకాలలోని కొన్ని సంఘటనలతో, సాంప్రదాయిక ఫ్రెంచి నాటకాలలోని కొన్ని సన్నివేశాలతో సమ్మేళనం చేసి ఒక అద్భుత కళాఖండంగా తీర్చిదిద్దిన ఈ నాటకం ఇటాలియన్ నాటకరంగంలో నూతన చరిత్రను సృష్టించటమేగాక అందులో ఆ తరువాత వచ్చిన మార్పులకు మార్గదర్శమైందని చెప్పవచ్చు.

పై నాటకంతో పాటు మాఫేయీ అనేక ఇతర రచనలు కూడా చేశాడు. వీటిలో కొన్ని పద్యాలు, నాటకాలు, మరెన్నో అనువాదాలు ఉన్నాయి. వర్జిల్ మహాకవి రచించిన ఇలియడ్, ఏనియడ్ వంటి మహా గ్రంథాలకు ఈయన చేసిన అనువాదాలు ప్రశంసనీయమైనవి. వెరోనా నగరంలోని అనేక ప్రాచీన శిల్పకళాఖండాల చరిత్రను అద్భుతంగా వర్ణించిన వెరోనా ఇలస్ట్రేటా అనే గ్రంథం పురావస్తు శాస్త్రంలో ఈయనకు ఉన్న అభినివేశానికి నిదర్శనం. గ్రీక్, ఫ్రెంచ్ భాషలలోని సాంప్రదాయిక నాటకాలలోని గొప్పతనాన్ని, నిరాడంబరతను ఇటాలియన్ నాటకాల్లో ప్రవేశపెట్టి తద్వారా ఇటాలియన్ నాటక రంగంలో అనేక సంస్కరణలకు అవకాశం కల్పించిన మాఫేయీ 1755, ఫిబ్రవరి 11న వెరోనాలో మరణించాడు.

ఉమారాణి

మారుతీ నాట్య మండలి (గుంటూరు) : ఈ సమాజాన్ని 1958లో వేడ్రిపాట నాగకోటేశ్వరరావు స్థాపించాడు. ఈ సమాజం పక్షాన *వరవిక్రయం, కంఠాభరణం, లోభి*, చిత్రనళీయం, కన్యాశుల్కం, శ్రీకృష్ణ తులాభారం నాటకాలు ప్రదర్శించారు.

కందుకూరి చిరంజీవరావు, టి. రామకృష్ణ శాస్త్రి, వంగర వేంకట సుబ్బయ్య, తురగా పుండరీకాక్షయ్య, వంగల శ్రీరామమూర్తి, ఆకుల వెంకయ్య, మావిళ్లపల్లి సీతారామయ్య, మందపాటి రామలింగేశ్వరరావు, ధూళిపాళ సీతారామ శాస్త్రి, ముప్పరపు భీమారావు, పూర్ణిమ, లీలాకుమారి, రంగాకుమారి, సభారంజని, ఆదిలక్ష్మి ఈ సమాజంలోని నటీనటులు.

నే.వ.శ.

మారుతీ రావు, గొల్లపూడి (జ:1939) : నటుడు, నాటక రచయిత, కథా, నవలా రచయిత, వ్యాసకర్త, వక్త. బి.యస్సీ. ఆనర్స్ చదివాడు. రేడియోలో చాలకాలం పని చేశాడు. సినిమా నటుడిగా ప్రముఖ పాత్రలు ధరించి ఖ్యాతిపొందాడు. పాశ్చాత్య సాహిత్యాన్ని కూలంకషంగా అధ్యయనం చేసిన మేధావి. ఈయన అనువదించిన *రాగరాగిణి* నాటకం కె. వేంకటేశ్వర రావు దర్శకత్వంలో ర.స.న సమాఖ్య పలుచోట్ల ప్రదర్శించి అఖండ విజయాన్ని సాధించింది. మారుతీ రావు కళ్ళు నాటికకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.



రాగరాగిణి, మహానటుడు, కరుణించిన దేవతలు, లావాలో ఎర్ర గులాబీ నాటకాలూ, *అనంతం, పతిత, పగ, కళ్ళు, ఆశయాలకు సంకెళ్లు* నాటికలు ఈయన ప్రసిద్ధ రచనలు.

గం.సు.రె.

మార్గ శీర్ష : నాటక రచయిత. అసలు పేరు బి.వి. రమణ మూర్తి. స్వస్థలం అమలాపురం.ఎస్.కె.బి.ఆర్. కళాశాలలో ఉపన్యాసకుడిగా పని చేస్తున్నాడు. 1985 నుంచి నాటక రచయితగా వెలుగులోకి వచ్చాడు. ఈయన రచించిన పసుపు బట్టు పేరంటానికి అనే నాటకానికి తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహించిన నాటక రచన పోటీలలో ప్రథమ బహుమతి లభించింది. ఈ నాటకం వివిధ నాటక సంస్థలతో విస్తృతంగా ప్రదర్శింపబడి ప్రజాదరణ పొందింది. ఈయన రచించిన కుడికాలు పెట్టవమ్మా, అమృతవర్షిణి, శ్వేతపత్రం, సింధూరం, నీలిరాగం మొదలైన నాటకాలు కూడా సామాజికుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ నాటకాలన్నీ స్త్రీ సమస్యాత్మకాలు కావడం గమనార్హం. ఈ నాటకాలలో భాష, శైలి, నుడికారం, జాతీయాలు సంభాషణల్లో అందంగా భాసిస్తాయి. తెలుగుతనం అన్ని రచనల్లోనూ ప్రస్ఫుటమవుతుంది.

బోయిన

మాస్టర్ హిరణ్ణయ్య (జ:1934) : కన్నడ నాటక రచయిత. నటుడు, దర్శకుడు. ఈయన 1934, ఫిబ్రవరి 15న మైసూరులో జన్మించాడు. తల్లితండ్రులు శారదమ్మ, హిరణ్ణయ్యలు. వృత్తి నాటకరంగాన్ని పెంచీ, పోషించి, దీనికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత మాస్టర్ హిరణ్ణయ్యదే. ఈయన అసలు పేరు నరసింహమూర్తి. నలభై ఏళ్ళకి పైగా కర్ణాటక రాష్ట్రంలో వేలాది ప్రదర్శనలిచ్చాడు. ఇప్పటికీ ప్రేక్షకుల ఆదరణలందుకుంటున్న ఈయన నాటకం లంచావతార. కళాకారుల కుటుంబంలో పుట్టి, నాటక రంగాన్ని వారసత్వంగా సంపాదించుకున్న హిరణ్ణయ్యను **living legend**గా అభివర్ణించవచ్చు. నడు బీది నారాయణ, అనాచార, కపిముష్టి, దేవదాసి, సదారమే మొదలైనవి ఈయన ప్రసిద్ధ నాటకాలు.

హిరణ్ణయ్య నాటకాల ఇతివృత్తాలన్నీ సామాజికాలే. సమాజంలోని అవకతవకలు, అన్యాయాల పట్ల ప్రేక్షకులకు అవగాహన కల్పించి, రెచ్చగొట్టేలా ఉంటాయి ఈ నాటకాలు. నాటకరంగం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న సామాజిక

ప్రయోజనమే ఈయన ఆశయం. హాస్యం, వ్యంగ్యం మేళవించి, రాజకీయాలలోని కుళ్ళు ఎత్తి చూపి కొరడాతో కొట్టినట్టుంటాయి ఈయన నాటకాల్లోని సంభాషణలు. ఇతివృత్తాలు పాతవైనా, కొత్త సంఘటనలు జోడించి రక్తి కట్టిస్తాడు. నాలుగైదు పాత్రలున్నా ఈయన నాటకాలు one man show అని చెప్పవచ్చు. ముఖ్య పాత్ర ఎప్పుడూ హిరణ్ణయ్యదే. రెండు గంటలు పాత్రోచితంగా సంభాషణలను రక్తి కట్టించి, ప్రేక్షకులను నవ్వించి, కవ్వించి నాటకాలను జీవింపచేశాడు.

దేశ విదేశాలలో నాటక ప్రదర్శనలిచ్చి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. లంచావతార, సదారమే నాటకాలు సినిమాలుగా వచ్చాయి. వీరి పెద్ద కొడుకు బాబు హిరణ్ణయ్య, ఇంజనీరింగ్ చదివినా తండ్రి వారసత్వాన్నే కొనసాగిస్తున్నాడు.

హిరణ్ణయ్య సమాజంలోని అవినీతిని నాటకాల ద్వారా ఖండించడమే కాకుండా సమాజ శ్రేయస్సుకు ఇతోధికంగా ధనసహాయం చేశాడు. ఎన్నో బిరుదులు, ప్రశంసలు అందుకున్న ఈ విలక్షణ నటునికి కర్ణాటక రాజ్య పురస్కారం, డా. గుబ్బి వీరణ్ణ ప్రశస్తి మొదలైన ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు లభించాయి. అనర్గళంగా సంభాషణలు చెప్పి, ప్రేక్షకులను ఆకట్టుకునే హిరణ్ణయ్య నాటకాలకు ఈ రోజు కూడా మంచి ఆదరణ ఉంది.

భార్గవి

మిడిల్‌టన్, థామస్ (1570-1627) : ఆంగ్ల నాటక రచయిత. కవి, మోదాంత, విషాదాంత నాటకాలను రెంటినీ రచించాడు. మిడిల్‌టన్ లండన్‌లో జన్మించాడు. లండన్‌లోని గ్రేస్ ఇన్ లోను, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోను చదివాడు. న్యాయశాస్త్రంలో శిక్షణ పొందినట్లుగా ఈయన రచనలు రుజువు చేస్తున్నాయి. ఈయనకు రెండుసార్లు వివాహమైందని, ఒక కొడుకు ఉన్నాడని తెలుస్తోంది.

మిడిల్‌టన్ వ్యక్తిగత జీవితంలాగే ఈయన రచనా జీవితం కూడా స్పష్టంగా లేదు. కొన్ని రచనలు ఈయన రాసినవో, కాదో కూడా విమర్శకులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. నాటక రచన పొట్టకూటికి చేసే వృత్తి వంటిదేననే భావన ఆ కాలంలో ప్రబలంగా ఉండేది. రచయిత పేరు లేకుండా నాటకాలను ప్రచురించేవారు. దీనితో నాటకాల రచనా కాలం నిర్ధారించడం కూడా సాధ్యం కాని పరిస్థితి తలెత్తేది. మిడిల్‌టన్ నాటకాలకూ ఇదే దురవస్థ వాటిల్లింది.

విషాదాంత నాటకాలను రోలీ, థామస్ డెకర్‌లతో కలిసి రాశాడు. జాకోబియను యుగనాటకాలలో వలె ఈ నాటకాలలోను మోసాలు, హత్యలు, వ్యభిచారం, వావివరసలు లేని లైంగిక సంబంధాలు ఉన్నాయి. బాలనటుల కంపెనీ చిల్డ్రన్ ఆఫ్ పాల్స్‌కు ఈయన చాలా మోదాంత నాటకాలను రచించాడు. చిల్డ్రన్ ఆఫ్ ది చాపెల్ రాయల్ ఈయన యువర్ ఫైవ్ గాలంట్స్ ను ప్రదర్శించింది. లండన్‌లోని సమకాలిక మధ్యతరగతి జీవితాన్ని ఈ నాటకం వ్యంగ్యంగా ప్రదర్శిస్తుంది. మిడిల్‌టన్ రాసిన మొదటి నాటకం ది ఫోనిక్స్ (1603-04). తరువాత ఎ ట్రిక్ టు క్యాచ్ ది ఓల్డ్ వన్ (1604), మైకేల్ మస్‌టర్మ్ (1605), ఎ మ్యాడ్ వర్ల్డ్, మై మాస్టర్స్ (1605) నాటకాలను రాశాడు.

ఎ గేమ్ ఎట్ ఛాయెస్ (1625) ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. ఇది రాజకీయ వ్యంగ్య నాటకం. దీనిలో స్పెయిన్ దేశీయులను నల్లజాతివారు గానూ, వీరిని జయించినది తెల్లజాతి ఛార్లెస్ రాజకుమారుడుగాను చిత్రించాడు. అయితే స్పెయిన్ దేశ రాయబారి ఈ నాటకం పట్ల నిరసనను ప్రదర్శించడంతో అధికారులు ఈ నాటకాన్ని నిషేధించారు. మైకేల్ మస్ టర్మ్ ఈయన వ్యంగ్య రచనలలో సుప్రసిద్ధమైంది. ఎ ట్రిక్ టు క్యాచ్ ది ఓల్డ్ మన్ లో ఒకరి కంటే ఒకరు అధికులు కావాలనుకొనే ఇద్దరు వడ్డీ వ్యాపారులు, వారి ఆట కట్టించే తెలివైన మేనల్లుడు ఉంటారు. ఈ నాటకంలో మేనల్లుని పాత్ర ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది.

ఎ మ్యాడ్ వరల్డ్, మై మాస్టర్స్ తన దాన గుణాన్ని తానే పొగడుకునే పల్లెటూరి పెద్ద మనిషి, అతని దాతృత్వానికి నోచుకోని సొంత మనుమడి కథ దీనిలోని ఇతివృత్తం. 1630లో ప్రచురింపబడిన ఎ ఛేస్ట్ మే డే ఇన్ చీప్ సైడ్ లో లండన్ నాగరికుల కృత్రిమ స్వభావాన్ని హాస్యరసస్ఫోరకంగా చిత్రించాడు. ఈ నాటకాన్ని 1613లో ప్రదర్శించారు. 1611లో ప్రచురింపబడిన రోరింగ్ గర్ల్‌లో వివాహ వ్యవస్థకు కట్టుబడకుండా ఉండాలనుకునే అమ్మాయి మనస్తత్వాన్ని చిత్రించాడు. ఎ ఫెయిర్ క్వారెల్ (1617) నాటకం సుఖదుఃఖాల మిశ్రమం. కథాబలం లేకపోయినా నాటకీయ సన్నివేశాలతో ప్రేక్షకులను అలరించే నాటకమిది. ఉమెన్ బి వేర్ ఉమెన్ (1625), ది ఛేంజ్ లింగ్ అనే నాటకాలు రెండూ మిడిల్‌టన్ రచనలలో ఉత్తమ రచనలుగా చెప్పవచ్చు. ద వరల్డ్ టాస్‌డ్ ఎట్ టెన్నిస్ (1619) విలక్షణమైన ట్రాజీ కామెడీ. ద రివెంజర్స్ ట్రాజడిని కూడా మిడిల్‌టన్ రాశాడని, టర్నర్ కాదని విమర్శకుల భావన. ది ఆవనెస్ట్‌జర్, రోలీ, మాసింగర్ లతో కలిసి రాసిన ది ఓల్డ్ లా లు కూడా మిడిల్‌టన్ నాటకాలలో ఎన్నదగినవి.

1627, జులై 4న ఇంగ్లండ్‌లో సర్రేలోని న్యూయింగ్ టన్ బట్స్‌లో మరణించాడు.

రమాంజనీ

మిత్ర, దీనబంధు (1830-73) : వంగ సాహిత్యంలో పేరుమోసిన నాటకకర్త. తపాల శాఖలో ఉద్యోగి. నాటి బ్రిటీష్ ప్రభుత్వం 'రావుసాహేబ్' బిరుదుతో మిత్రను సత్కరించింది. దీనబంధు మిత్ర రాసిన *నీలిదర్పణ్* (1860) నాటకం బెంగాల్‌లో అపూర్వమైన సంచలనాన్ని సృష్టించింది. నీలిమందు దొరలు కార్మికులను పీడించడాన్ని యథాతథంగా చిత్రిస్తూ కార్మికులను తిరగబడమని ప్రబోధిస్తూ *నీలిదర్పణ్* రచించాడు. సమాజంలో బలవంతులు, పెత్తందార్లు దుర్బలజాతిని బానిసలుగా చేసి క్రూరంగా హింసించడాన్ని ఇతివృత్తంగా గలిగిన ఈ నాటకం బెంగాల్ సమాజాన్ని ఒక ఊపు ఊపింది. మైకేల్ మధుసూదన్ దత్ దీనిని ఆంగ్లంలోకి అనువదించగా పాద్రిలంగ్ ప్రచురించాడు. మిగిలిన యూరోపియన్ భాషలలోకి కూడా ఇది అనూదితమైంది. దీనితో భారతదేశంలో నీలిమందు వ్యాపారం పేరిట 'ఆంగ్ల దొరలు' సాగిస్తున్న అరాచకత్వం లండన్‌లోని బ్రిటిష్ ప్రభుత్వ దృష్టికి కూడా వచ్చింది. ఈ నాటకాన్ని ప్రచురించిన పాద్రిలంగ్‌కు జైలు శిక్ష పడింది. మధుసూదన్‌దత్ పేరు కానీ, దీనబంధు మిత్ర పేరు కానీ పుస్తకం మీద లేకపోవడంతో వారికేమీ కాలేదు.

నీలిదర్పణ్ కు లభించినంత పేరు ప్రఖ్యాతులు మరే పుస్తకానికి లభించలేదని బంకించంద్ర చటర్జీ వంటివారు ప్రశంసించారు. జనం ఈ నాటకానికి బ్రహ్మరథం పట్టారు.

దీనబంధు రాసిన *సధవార్ ఏకాదశి* లో నాటక లక్షణాలు, ఎత్తుగడ, నిర్వహణ, భరత వాక్యాలు సమగ్రంగా, సలక్షణంగా రూపుదిద్దుకున్నాయి. ఈ నాటకం వంగ నాటక సాహిత్యంలో అత్యుత్తమమైనదిగా పేరు తెచ్చుకొంది. వేషభాషలలో ఇంగ్లీషు వారినే అనుకరిస్తూ, తాగుతూ, తింటూ విలాసాలలో మునిగిపోయి బాధ్యతారహితంగా ప్రవర్తించే ధనికుల పిల్లలను హేళన చేస్తుందీ నాటకం. *సధవార్ ఏకాదశి*లో నాయకుడైన నిమ్‌చంద్ దత్‌ను దీనబంధు చక్కగా తీర్చిదిద్దాడు. రచయిత మైకేల్ మధుసూదన్ దత్‌కు ప్రతిరూపంగా నిమ్‌చంద్ పాత్రను సృష్టించాడని కూడా విమర్శకుల అభిప్రాయం.

జానపద కథను, హాస్యకథను కలిపి *తపస్విని* (1863) నాటకం రాశాడు. *లీలావతి* (1867), *బియే పాగలా బుండో* (1868), *జామామ్ బారిక్* (1872), *కమలే కామినీ* (1873) మొదలైనవి ఆయన రాసిన ప్రధాన నాటకాల్లో కొన్ని. దీనబంధు నాటకాలు ఆ కాలంలో బెంగాల్‌లో విపరీతంగా ప్రదర్శింపబడేవి. కొంతమంది ప్రసిద్ధ వ్యక్తులను వ్యంగ్యంగా హేళన చేయడంతోను, ఒక్కోసారి యథాలాపంగా అన్నట్లుగా ఆ వ్యక్తుల పేర్లు కూడా పాత్రల నోటి వెంట రావడంతోను ప్రజలను బాగా ఆకట్టుకునేవి. హాస్యం, అపహాస్యం, విమర్శ ఆయన నాటకాలలో ఉండే మూల ద్రవ్యం.

దీనబంధు బంకించంద్రచటర్జీకి బాగా సన్నిహితుడు. ఇరువురు గంటల తరబడి సాహిత్యగోష్ఠి జరిపేవారు. బంకించంద్ర మీది అభిమానం కొద్దీ దీనబంధు తన మూడవ కొడుకుకు ఆయన పేరు పెట్టుకున్నాడు. దీనబంధు 1873లో అకాలమరణం చెందడం బంకించంద్రను బాగా కలవరపరిచింది. దీనబంధు మీద బంకించంద్ర రాసిన స్మారక వ్యాసం బెంగాలీ స్మృతి సాహిత్యంలోనే అపూర్వమైనదిగా ప్రశంసలను పొందింది. బంకించంద్ర తన ప్రఖ్యాత నవల ఆనందమఠ్ ను దీనబంధు మిత్రకు అంకితమిచ్చాడు. దీనబంధు రచనల సంకలనానికి బంకించంద్ర సంపాదకత్వం వహించి వెలుగులోకి తెచ్చాడు.

వె.వి.రా.

మిల్లర్, ఆర్థర్ (జ: 1915) : అమెరికా నాటక రచయిత. 1915 అక్టోబర్ 17న న్యూయార్క్‌లో జన్మించాడు. ఇతని రచనలలో సాంఘిక దృష్టి మెండుగా ఉండి అతడు సృష్టించిన పాత్రల అంతర జీవితాలను ప్రకటిస్తూ ఉంటుంది. మిల్లర్ రచన డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మన్ (1949) బహుజనాదరణ పొందింది. మిల్లర్ తండ్రి ఒక చిన్నకర్మాగారానికి అధిపతి. ఆర్థికంగా చితికిపోయిన తండ్రి ద్వారా ఆధునిక జీవనంలోని అభద్రత మిల్లర్‌కు అవగతమైంది. ఇతనిలోని ఆ నిరాశా భావం నుంచే రచయిత మిల్లర్ ఉద్భవించాడు. హైస్కూలు విద్యాభ్యాసం తరువాత మిల్లర్ ఓ గిడ్డంగిలో పనికి కుదిరాడు. తద్వారా ఆర్జించిన డబ్బుతో మిచిగాన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. నాటకాలు రాయడం మొదలు పెట్టాడు. 1945లో ఈయన రాసిన నవల ఫోకస్ (Focus) పాఠకలోకాన్ని ఉర్రూతలూగించింది. 1947లో రాసిన ఆల్ మై సన్స్ మొదటి ప్రముఖ నాటకం. నాణ్యత లేని యుద్ధ సామాగ్రిని ఉత్పత్తి చేసే ఉత్పత్తిదారుని కథ ఈ నాటకంలోని ముఖ్యాంశం. డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మన్ ఆ నాటి అమెరికన్ నాటకాలలో గొప్ప నాటకంగా ప్రఖ్యాతి కెక్కింది. ఈ విషాద నాటకంలో నాటి సమాజపు అసత్యపు విలువల కోసం బలి అయిపోయిన ఒక సామాన్యుని జీవిత చిత్రణ ఉంది.

1953లో రాసిన ది క్రూసిబుల్, 1692లో సేలెం, మసాచుసెట్స్‌లో క్షుద్ర ప్రయోగాల కుట్రలు జరిగిన నాటి పరిస్థితులు 1950 దశకంలో పునరావృతమవుతున్నా యన్న మిల్లర్ భావనకు రూపకల్పన. 1956లో పార్లమెంటు అన్-అమెరికన్ ఆక్టివిటీస్ కమిటీ మిల్లర్‌ను విచారించింది. పదేళ్ళ క్రితం జరిగిన కమ్యూనిస్టు రచయితల సమావేశంలో పాల్గొన్న వారి పేర్లను బయట పెట్టటానికి మిల్లర్ నిరాకరించాడు. తరువాత మిల్లర్ ఉన్నత న్యాయస్థానానికి అప్పీలు చేసుకొని గెలుపొందాడు.

1955లో మిల్లర్ అల్ప వ్యవధి నాటకాలైన ఏ మెమొరీ ఆఫ్ టూ మండేస్, ఏ వ్యూ ఫ్రం ది బ్రిడ్జ్‌లు ఒకే టికెట్టుపై ప్రదర్శింపబడ్డాయి. ఆఫ్టర్ ది ఫాల్ (1964)లో మనుష్యుల మధ్య అనుబంధాల విచ్ఛిన్నతను, తత్పరిణామాలను గూర్చి రచయిత పొందిన ఆవేదన కనిపిస్తుంది. ది ప్రైస్ (1968)లో ఇద్దరు సోదరుల మధ్య ఏర్పడిన మానసిక అగాథాల పరిశీలనం ఉంది. 1969లో లండన్‌లో ప్రదర్శించబడిన ఈ నాటకానికి మిల్లర్ దర్శకత్వం కూడా వహించాడు. వాషింగ్టన్ డి.సి. లో 1977లో ప్రదర్శించబడిన నాటకం ది ఆర్చ్ బిషప్స్ సీలింగ్ లో అసమ్మతి రచయితల పట్ల సోవియట్ ప్రభుత్వ కఠిన ప్రవర్తనను చిత్రించాడు. చార్ల్‌స్టన్ ఎస్.సి.లో 1980లో జరిగిన అమెరికన్ క్లాక్ ఫెస్టివల్ లో ప్రదర్శింపబడిన ది అమెరికన్ క్లాక్ అనే నాటక సంకలనం తన రెండవ భార్య అయిన ప్రముఖ నటి మార్లిన్ మన్రో కోసం ది మిస్ ఫిట్స్ (1961) చిత్రానికి స్క్రీన్ ప్లే రాశాడు. 1967లో ఐ డోంట్ నీడ్ యూ ఎనీ మోర్ అనే పేరుతో మిల్లర్ కథానికల సంకలనం వెలువడింది. 1977లో అతడు రాసిన రంగస్థల వ్యాసాల సంకలనం కూడా ప్రచురించబడింది.

ఎమ్.గు.రా.

మిశ్రో, ఎస్.కె (జ:1945) : నటుడు, నాటక రచయిత, దర్శకుడు. ఎస్.కె. మిశ్రోగా ప్రసిద్ధి చెందిన సుశీల్ కుమార్ మిశ్రో సరోజిని దేవి, శశి భూషణ్ మిశ్రో దంపతులకు 1945 జనవరి 4న జన్మించాడు. చదువుకునే రోజుల్లోనే 1960 నుంచీ నాటకాలలో నటిస్తూ పేరు సంపాదించుకున్నాడు. బి.కామ్ డిగ్రీ పాసయ్యాక పోర్టు ట్రస్టు, విశాఖపట్నంలో ఉద్యోగంలో చేరాడు. ఆ తరువాత ఆంధ్ర యూనివర్సిటీ రంగస్థల కళల శాఖలో నటన, దర్శకత్వంపై పూర్తి అవగాహన పెంచుకొని, డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ పట్టా పొందాడు.

1965లో నవ్య భారతి కళామందిరం 1968లో రసమయ నట సమాఖ్యల సంస్థ స్థాపించి స్వీయ దర్శకత్వంలో నాటకాలు తయారుచేసి పరిషత్తులలో పాల్గొని ఉత్తమ ప్రదర్శనకు, నటనకు, దర్శకత్వానికి బహుమతులు సంపాదించాడు. ఆంధ్ర యూనివర్సిటీ రంగస్థల కళల శాఖకు ప్రథమ దర్శకుడు కె.వేంకటేశ్వరరావు. శిష్యరికంలో మిశ్రో నట జీవితం మరో మలుపు తిరిగింది. కె.వి. దగ్గర వాచికం, నటన దర్శకత్వ పోకడలు పుణికిపుచ్చుకున్నాడు.

1970లో ఢిల్లీలో 26 దేశాలు పాల్గొన్న కామన్ వెల్త్ యువజనోత్సవాల్లో పాల్గొని గణేష్ పాత్రో రచించిన పావలా నాటికను అత్యంత సమర్థవంతంగా ప్రదర్శించాడు. 1972లో ఢిల్లీలోని పూనా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన బహుభాషా నాటకోత్సవాలలో (14భాషల్లో ప్రదర్శనలు ఇచ్చారు) పాల్గొని, తను ప్రదర్శించిన త్రివేణి నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి పొందటమే కాకుండా తను నటించిన నేస్తలింగం పాత్రకు ఉత్తమనటుడి బహుమతి కూడా పొందాడు.

మిశ్రో దర్శకుడిగా వీలునామా, చెరపకురా చెడెదవు, రక్త దానం, అన్నాచెల్లెలు, అసుర సంధ్య, అరణి, వేటకుక్కలు, మళ్లీ మధుమాసం, హెచ్చరిక, భలే పెళ్లి, ఈనాడు, కనక పుష్యరాగం, బుల్విక్ వంటి నాటకాలు, తెరచిరాజు, దొరికితే దొంగలు, కాలధర్మం, కొడుకు పుట్టాల, పావలా, లాభం, ధర, ఎంతెంత దూరం, భజంత్రీలు, నిర్మానుష్యం, తుఫాను , బెత్తం మనిషి, ధర్మ సూక్ష్మం, విషాదం, చెప్పుకింద పూలు, వంశ వృక్షం,యజ్ఞం, నేనూ మనిషినే, కాలక్షేపం మొదలైన నాటికలు పరిషత్తుల్లో ప్రదర్శించి మన్ననలతోపాటు, బహుమతులు పొందాడు.

పరిషత్తు నాటక పోటీలలో మిశ్రో ప్రదర్శన అంటే పోటీకి వచ్చిన మిగతా సమాజాలు కూడా ఆసక్తిగా తిలకిస్తాయి. మిశ్రో వాచికాభినయంతో ప్రేక్షకులను వెర్రెత్తించేవాడు. అవసరం మేరకు దృశ్యబంధ నిర్మాణం, రంగోద్దీపనం, పాత్రల కదలికలు, రంగస్థలం పై నున్న వస్తువులను వాడుకునేపద్ధతి, చాలా పకడ్బందీగా నిర్వహించేవాడు. అతని సమాజంలోని సభ్యులందరు సుశిక్షితులైన సైనికుల్లా ప్రవర్తిస్తారు. తద్వారా మిశ్రోకి, అతని సమాజానికి నాటకరంగంలో మంచి పేరొచ్చింది.

మిశ్రో రచయితగా ప్రేమజీవులు, ద్రౌపది, పితృదేవోభవ నాటకాలను, ఆలోచించండి అనే నాటికను, కొన్ని గేయాలను రచించాడు.

నాటకరంగ వికాసం కోసం కృషిచేసిన మిశ్రోను వివిధ నాటక సమాజాలు కళాసాగర్ అవార్డు (1986) గరికపాటి రాజారావు అవార్డు (1991) కళాజగతి అవార్డు (1995) ఇచ్చి ఘనంగా సన్మానించాయి.

అంతేకాదు తన నటనాపరిధిని విస్తృతి పరుచుకోవటానికి 1973లో ఆడది చిత్రంలో నటుడిగా ప్రవేశించి దాదాపు నలభై చిత్రాల్లో నటించాడు.

డిటెక్టివ్ సుబ్బారావు, మల్లాది రామకృష్ణ శాస్త్రి కథలు, భరాగోకథలు, వండర్‌బాయ్ మొదలైన టీ.వి. సీరియల్స్‌లో కూడా నటించాడు. ఆకాశవాణిలో 'ఏ' గ్రేడ్ ఆర్టిస్టు. కంచికి చేరని కథ,

అతను అడవిని జయించాడు వంటి నాటికలకు మంచి ప్రశంసలు వచ్చాయి. 1982లో బెస్ట్ వాయిస్ ఆఫ్‌ది ఇయర్ అవార్డు, 1996లో నంది బహుమతి కూడా పొందాడు. ఎన్నో రకాల విభాగాల్లో పాల్గన్నా నాటకమంటే అతనికి ప్రాణం.

మిశ్రో వాచికాభినయం, దర్శకత్వం మెరుపులు, ప్రదర్శనల్లో మలుపులు, నాటక రచన స్థాయి నుంచే మొదలు పెట్టి అద్భుతమైన ప్రదర్శనతో ముగిస్తాడు. అదే మిశ్రో ప్రత్యేకత.

అడబాల

ముద్దుకృష్ణ, సామినేని (1899-1979) : కవి, నాటక రచయిత, జ్వాల పత్రిక సారథి. ఈయన 1899, ఫిబ్రవరి ఏడవతేదీన రాజమండ్రిలో జన్మించాడు. విద్యాభ్యాసం కాకినాడ, రాజమండ్రి కళాశాలలలో. వైతాళికులు అనే కవితా సంపుటికి సంకలన కర్తగా ముద్దుకృష్ణ ఆంధ్ర సాహితీలోకానికి సుపరిచితుడు. 1932-33 ప్రాంతాలలో జాతీయోద్యమంలో పాల్గన్నాడు.

1920నుంచీ సుమారు మూడు దశాబ్దాల పాటు సాగిన భావకవితాయుగంలో తన కలానికి పదును పెట్టి ఆనాటి కవులకు దీటుగా భావకవిత్వాన్ని ఆరాదించాడు. ఆ తరువాత భావ కవితా ప్రవాహం నుంచి విడివడి శ్రీశ్రీ కంటే ముందుగా శిష్ట్లా ఉమామహేశ్వరరావుతో కలిసి అభ్యుదయ కవిత్వానికి స్వాగత గీతాలు ఆలపించాడు. 1934లో జ్వాలఅనే సాంస్కృతికపత్రికను నడిపాడు. ఆనాటి యువ రచయితలకు స్ఫూర్తి నిచ్చి ఆశా జ్యోతిని వెలిగించింది ఆ పత్రిక. పత్రిక నడిచింది కొన్ని నెలలే అయినా పత్రికారంగంలో చిరస్థాయిగానిలిచిపోయింది. 1934లో ముద్దుకృష్ణ దృష్టి నాటక కళ మీద పడి అశోకం అనే నాటకాన్ని రచించాడు. వేదపురాణాలఆధిక్యాన్ని, ప్రామాణికతను ఖండిస్తూ, సంప్రదాయాలపై తిరుగుబాటు చేసి, పురాణ పురుషులను కొత్త కోణంలో చూపి నాటక సాహిత్య రంగంలో ప్రత్యేక మార్గాన్ని నెలకొల్పాడు. అశోకం వచన నాటకంలో రావణుడు సౌందర్యోపాసకుడుగా, విశాల హృదయుడుగాను, శ్రీరాముడు కీర్తి కోసం ప్రాకులాడే స్వార్థపరుడుగాను సాక్షాత్కరిస్తారు. త్రిపురనేని రామస్వామి చౌదరి, గుడిపాటి చలంలాగా వేంకట హేతువాద దృక్పథంతో సంప్రదాయాలపై తిరుగుబాటు తత్వం ప్రబోధించినందుకు ముద్దుకృష్ణ విమర్శలకు గురి అయ్యాడు. అయినా లెక్కచేయక ఆ నాటకాన్ని అనేక చోట్ల ప్రదర్శింప చేశాడు. ప్రయోగ పరంగా అశోకం తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోలేకపోయినా రచయిత భావ ప్రచార సాధనంగా మాత్రమే ఆ నాటకం నేటికీ స్మరణీయమైంది.

ముద్దుకృష్ణ *టీ కప్పులో తుఫాను* ***(1940)***, *అడయిక్కప్ప పిళ్ళె* ***(1941)*** వంటి హాస్య నాటకాలు,*అనార్కలి* ***(1934)***, *అపవాదు* ***(1934)***, *ఎత్తుకుపై ఎత్తు****(1944)*** వంటి నాటికలు రచించాడు. 1935 తర్వాత కొన్నాళ్ళు సినిమారంగంలో సంభాషణల రచయితగా పనిచేశాడు. 1979 ఫిబ్రవరి 6 వ తేదీన ముద్దుకృష్ణ తుది శ్వాస విడిచాడు.

గం.సు.రె.

మునిసుందరం,ఎస్ (జ:1937) : అధ్యాపకుడు, కవి. నటుడు, నాటక రచయిత. ప్రయోక్త. చిత్తూరుజిల్లా పొరకాల్వలో 1937, సెప్టెంబరు 14న జన్మించాడు. తల్లిదండ్రులు లక్ష్మమ్మ నాదముని నాయుడు. ముని సుందరం ప్రాథమిక విద్య వీధి బడిలోనూ, మాధ్యమికవిద్య తిరుపతిలో సాగింది. మెట్రిక్ నుండి ఎం.ఏ వరకు ప్రయివేటుగా చదివాడు. హిందీ భాషా బోధకుడుగా పని చేస్తూనే కవిత్వం వెలువరించాడు. చిన్నప్పుడు పల్లెలో జరిగే జానపద కళల ప్రదర్శనలు చూసి కళలపట్ల ఆసక్తి పెంచుకున్నాడు.

నాటకం పట్ల అభిమానాన్ని పెంచుకున్న మునిసుందరం మొట్టమొదట చిలుకూరి నారాయణరావు అచ్చిలో కథానాయికగా నటించాడు. ఆ తరువాత పల్లెపడుచు, *దొంగవీరుడు, ప్రహ్లాద, కీర్తిశేషులు, అమరత్యాగి* నాటకాల్లో నటించి పేరు తెచ్చుకున్నాడు. నాటక రచయితగా దేశం నీ సర్వస్వం రచించి అందులో హుమాయూన్ పాత్రలో నటించి దారి తప్పుతున్న యువతకు చక్కని మార్గం సూచించాడు. చిత్తూరు జిల్లా కళాకారులే కాకుండా విజయవాడ కళాకారులు కూడా ఈ నాటకాన్ని పలుచోట్ల ప్రదర్శించారు, బహుమతులు అందుకున్నారు. ఇదేనా పరిష్కారం అనే నాటిక మునిసుందరంకు పేరు తెచ్చి పెట్టింది. ఆ తరువాత చరిత్రలో చిరిగిన పుట, అహంబ్రహ్మం, ఇది కథ కాదు, ఇచ్చట సన్మానాలు చేయబడును, *సింగారం, పక్షులు, ఊరుమేలుకొంది, నిజం కాటేసింది, యువత మేల్కంది, గుణపాఠం, నింగినేల, శలభాలు, మాతృ దేవోభవ, మహాదాత* వంటి నాటికలను రచించాడు. ఈ నాటికలన్నీ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రసారమయ్యాయి. పలుచోట్ల ప్రదర్శింప బడ్డాయి.

1984లో చారిత్రక నాటక పోటీలలో ఈయన రచించిన ఏ వెలుగులకీ ప్రస్థానంకు మొదటి బహుమతి లభించింది. కవిగా చీకటి దీపాలు, అడవిపూలు, మానవతా మేలుకో, *గుండెల్లో వాన, ఏ గుండె అలసిపోదు,* మునిసుందరాలు వంటి కవితా

సంపుటాలు రచించాడు. వృత్తిరీత్యా అధ్యాపకుడైనా ప్రవృత్తిగా ఎన్నుకొన్న రంగస్థలం కోసం కృషి చేశాడు. నాటక పోటీల గుణ నిర్ణేతగా వ్యవహరించాడు. అధ్యాపకుడిగా ఎనలేని సేవలందించిన మునిసుందరంను 1989లో హిందీ అకాడమీ, 1992 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డులు ఇచ్చి సత్కరించింది.

దాసరి.ఎన్.

మూకాభినయం: భావవ్యక్తీకరణ సమయంలో పదాలు కరువైనపుడు సంజ్ఞలు తప్పవు. మనలో చాలామంది మనకు తెలియని, పరిచయం లేని ప్రదేశాలలో, మన భాష అర్థం కాని మనుషులతో కలిసినపుడు, అవతలి వారి భాష, హావ, భావ ప్రకటనను అర్థం చేసుకోలేక, మన భావాలు వారికి చెప్పలేక నానా అవస్థ పడివుంటాం. అలాంటి స్థితిలో ఏవో మూలుగులు, సైగలతో, శరీర కదలికలతో, ఒకరినొకరు అర్థం చేసుకోవటానికి పడిన శ్రమనంతా జ్ఞాపకం చేసుకుంటే, భాష లేని, భాష రాని కాలంలో ఆదిమానవుల అవస్థ అర్థం చేసుకోవచ్చు. ఈ తంతు అంతా ప్రదర్శనగా మారిస్తే అది మూకాభినయం అనే ప్రక్రియ కిందకే వస్తుంది.

ఇలా మనకి తెలియకుండా మనమే మూకాభినయానికి ఆద్యులమయ్యాం. మానవ పరిణామ రీతిలో సహజమైన తన స్వభావం వల్ల ఏదో ఒక రూపంలో స్త్రీ, పురుషులు ఈ భూమి మీద జీవనం మొదలైనప్పటి నుంచి, మనతో, మనలో ఒక భాగంగా ఈనాడు ఒక ప్రత్యేక ప్రక్రియగా మన మధ్య, తనదైన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ నిలిచి ఉంది మూకాభినయం.

మూకాభినయం ప్రకృతిలో ప్రథమ భాష . ఏ భాష మాట్లాడే మానవులకైనా సులువుగా, సులభంగా అర్థం అయ్యే ప్రక్రియ మూకాభినయం. మూకాభినయం ప్రాపంచిక భాష (యూనివర్శల్ లాంగ్వేజ్). భారతీయ నాటకరంగంలో మూకాభినయం పాశ్చాత్య దేశాల తరహాలో ప్రత్యేకంగా సాగిన దాఖలాలు ఎక్కడా లేవు.

నాటక కళ ప్రారంభం గురించి మనకున్న పాశ్చాత్య సిద్ధాంతాలను, భారతీయ సిద్ధాంతాలను పరిశీలిస్తే మైమ్ మన నాటకరంగంలో అంతర్లీనంగా సాగినతీరులు కన్పిస్తున్నాయి. చాలా ఏళ్ళ క్రితమే భారతీయులు కాలాన్ని, భావాన్ని వ్యక్తీకరించటానికి 'ముద్ర'లను సూచించడాన్ని బట్టి మైమ్ ఉనికిని నిర్ధారించుకోవచ్చు. ఎన్ని రకాల కళారూపాలు ఉన్నా మానవుడి భావవ్యక్తీకరణకు ప్రముఖంగా శరీరమే సాధనం కనుక మూకాభినయం తప్పని పరిస్థితి. అయితే, భారతదేశంలో మూకాభినయం ప్రత్యేక ఉనికితో నిలబడిన చరిత్ర లేదు. ప్రాచీన భారతీయ సాంప్రదాయ కళల్లో సాంప్రదాయ నృత్యాలన్నింటిలో మైమ్ అంతర్లీనంగా ఇమిడి ఉన్నదని మాత్రమే చెప్పగలుగుతున్నాం.

కేరళ సంప్రదాయ నృత్య కళారూపం 'కథాకళి' మూకాభినయ ప్రక్రియకు గొప్ప ఉదాహరణ. ఆంధ్రదేశంలోని 'కూచిపూడి' నృత్య సంప్రదాయం కూడా మూకాభినయాన్ని అనుసరిస్తోంది. భామాకలాపం, దశావతారాలు, మువ్వగోపాల తరంగం అంశాలు 'మైమ్' ద్వారానే ప్రదర్శిస్తారు. నాట్యంలో ఉద్వేగాలను, భావాలను, ఆకృతులను, ముద్రలను శరీరం ద్వారానే వ్యక్తీకరిస్తారు. సంస్కృత నాటకాలు ప్రదర్శించిన ప్రకృతి వర్ణనలు, పాత్రల స్వభావ పరిచయాలు, ఋతువర్ణనలు, వాతావరణ పరిస్థితులు, సన్నివేశ వివరణలు మైమ్ ధోరణిలోనే సాగినవి. మూకాభినయంలో తప్ప, ఇటువంటి విషయాలను ప్రత్యక్షపరిచే విధానం మరోరకంగా లేదు. లేనివి ఉన్నట్లు భ్రమింపచేయటానికి మూకాభినయానికి మించిన ప్రక్రియ మరొకటి లేదు. ఇలాంటి సందర్భాలు, సన్నివేశాలు పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలు అన్నింటికీ సమానమే. శాకుంతలమ్ నాటకంలో దుష్యంతుని రథ విహారం, నదీతీరం, శకుంతల మొక్కలకు నీరు పోయటం మూకాభినయ రీతిలోనే సాగేవి.

మూకాభినయ ప్రక్రియ తెలుగు నాటకరంగంలో ప్రవేశించిన పరిస్థితిని పరిశీలిస్తే సన్నివేశంలోని దృశ్యాలను రంగస్థలంపై చూపించలేనపుడు, జంతువులు మొదలైన వాటి ప్రస్తావనలు వచ్చినపుడు కొన్ని వస్తువులు మొదలైన వాటిని వినియోగించవలసిన సందర్భాలలో అవి సమకూర్చుకోలేనపుడు, నదులు, నిప్పు, నింగి, గాలి, నీరు, తుఫానులు, వరదలు, భీభత్సాలు, భయానక స్థితులు చూపించవలసి వచ్చినపుడు, ఇలాంటివి భౌతికంగా ప్రదర్శించటం వీలుకాని స్థితిలో, అత్యంత సులభంగా, లేని వాటిని ఉన్నట్లుగా భ్రమింపజేస్తూ ప్రేక్షకులకు ఆ అనుభూతి కలిగేలా చేయటానికి మూకాభినయాన్ని ఆశ్రయించటమే మేలని, నటులు, దర్శకులు, ప్రయోక్తలు, రచయితలు భావించటం వలననూ, నటీనటులకు, దర్శకులకు, ప్రయోక్తలకు మైమ్ పట్ల కొంత అవగాహన కలిగి ఉండటం వలననూ, మూకాభినయం తెలుగు నాటకరంగంలోకి ప్రవేశించి ఉంటుంది. ప్రాచీన భారతీయ సాంప్రదాయాలలో మైమ్ ఉన్నప్పటికీ, తెలుగు నాటకరంగంలో ఆధునిక తెలుగు నాటకం ప్రభావంతోనే పరిణామం చెందింది.

ప్రఖ్య శ్రీరామమూర్తి రచించిన దయ్యం నాటకం ద్వారా మైమ్ తెలుగు నాటకరంగంలోకి ప్రవేశించిందని పరిశీలకుల అభిప్రాయం. ఈ నాటకానికి చాట్ల శ్రీరాములు దర్శకత్వం నెరిపి, మూలంలోనే మైమ్‌కి కొంత అవకాశం కలిగించాడు.

1964లో పోలాప్రగడ ప్రసాద్ రచించి, దర్శకత్వం వహించిన ఇదం అహం అనే నాటకంలో పూర్తి స్థాయిలో మైమ్‌ని ఉపయోగించాడు. 1964లోనే ప్రదర్శించబడి తెలుగు నాటకరంగ చరిత్రను మరో కొత్త మలుపు తిప్పిన మరో మొహెంజదారో నాటకంలో ప్రయోగించిన మైమ్ సంపూర్ణ స్థితిని పొందటానికి ప్రయత్నించింది. ఈ నాటకంలో మొదటిసారిగా మైమ్, ఫ్రీజ్ టెక్నిక్‌ను ప్రవేశపెట్టారు. ఈ నాటకం రచయిత ఎన్. ఆర్. నంది మీద *దయ్యం* నాటకం ప్రభావం చాలా ఉందని మరో మొహెంజదారో నాటక దర్శకుడు చాట్ల శ్రీరాములు అభిప్రాయం వ్యక్తం చేశాడు.

వీటికంటే ముందే తెలుగు నాటకరంగంలో మైమ్ ఉన్నదనటానికి కొన్ని సూచనలు కనిపిస్తున్నాయి. 1921-22 ప్రాంతాల్లో మహానటుడు బళ్ళారి రాఘవ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో సైక్లోన్ రిలీఫ్ ఫండ్ కోసం, విజయవాడలో విజయనగర రాజ్య పతనం అన్న నాటకాన్ని ప్రదర్శించాడు. ఆరోజు నాటకశాలకు చాలామంది ఆయన అభిమానులు వెళ్ళారు. అందులో రామరాజుకు సంబంధించిన ఒక బుర్రకథ ఉంది. సరిగ్గా ఆ ఘట్టం జరుగుతున్నప్పుడు, సైడ్ వింగ్స్ నుంచి చూస్తున్న రాఘవ, పఠాన్ వేషంలో రంగస్థలంపైకి వచ్చి అక్కడ ఒక రాతి మీద కూర్చుని, బుర్రకథకు అనుగుణంగా మూకాభినయంతో రొట్టెను తింటున్నట్లు నటిస్తూ కథ జరుగుతున్న ఫోర్స్‌కు అనుగుణంగా రొట్టెను కొరుకుతూ కథకు తగిన విధంగా హావభావ ప్రకటన చేస్తూ ప్రదర్శించిన నటనలో ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆ మూకాభినయ ప్రదర్శన, బుర్రకథతో ముగిసిన తీరు, కథ అయిపోగానే, రొట్టెను నేలకు విసిరికొట్టి గట్టిగా కాళ్లతో నేలను తాటించి నిష్క్రమించబోతూ తిరిగి ఒక్కసారి ప్రేక్షకులను చూసి వెళ్ళిన తీరుకు మైమరచిన ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందించారని మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి పేర్కొన్నాడు.

ఆధునిక తెలుగు నాటకరంగంలో మైమ్‌ని ప్రయోగించిన నాటకాలు *దయ్యం, ఇదం అహం, మరో మొహెంజదారో, శ్రీమాన్ శ్రీపతి, మాకూ శాంతి కావాలి, దారి తప్పిన ఆకలి, ఆర్తి, ఓ బూతు నాటకం, బూచి, ఇరుసు, అడవి దివిటీలు, బాజి, సిద్ధార్థ, త్రిజాకీయమదర్శనం, పలుకే బంగారమాయే, రాజసూయయాగం, అనగనగా ఒకరోజు* పేర్కొనదగినవి. ఇలా ఎన్నో నాటకాలలో మైమ్‌ను ఉపయోగిస్తూనే ఉన్నారు.

కోహినూర్, కొక్కొరోకో, లావొక్కింతయు లేదు, సత్యంవధ, గోగ్రహణం, చీకటింట్లో నల్లపిల్లి, ఈహామృగం, తీర్పు, జంతర్ మంతర్ మామూళ్ళు, హల్లాబోల్, మహానగరం, పెద్దబాలశిక్ష , జంబూద్వీపం నాటికల్లో మైమ్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పుడు ప్రదర్శిస్తున్న నాటకాలలో మైమ్‌కి ఎంతో కొంత ప్రాధాన్యత లేకపోలేదు.

తెలుగు నాటకంలో పాంటోమైమ్‌ని ప్రజా నాట్యమండలి ప్రవేశపెట్టినదని పరిశీలకుల అభిప్రాయం. అనిశెట్టి సుబ్బారావు శాంతి, గిడుతూరి సూర్యం మానవుడు-చిరంజీవి వీటిలో ముఖ్యమైనవి. 1950-51ప్రాంతంలో రష్యన్ కళాకారులు ప్రదర్శించిన పాంటోమైమ్ చూసి ప్రజా నాట్యమండలి తాతినేని చలపతిరావు, అనిశెట్టి సుబ్బారావు, డి. వేణుగోపాల్ ప్రభృతులు ఈ ప్రక్రియను తెలుగు ప్రజలకు చూపించాలనే ఆశతో శాంతి నాటిక ప్రదర్శించారు. శాంతి నాటిక పీఠికలో 'ఇది మనసీమలో వెలసిన తొలి మూకాభినయ నాటిక' అని పేర్కొనబడింది. ఈ నాటికలో మనిషి చేయవలసింది యుద్ధాలు కాదు, మమతను, జాతీయతను చాటి చెప్పాలి అనేది ఇతివృత్తం. ఈ నాటికను అఖిల భారత 'శాంతి' మహాసభ కౌన్సిల్‌లో, సోవియట్ రచయితల ప్రతినిధి వర్గం ఎదుట ప్రదర్శించారు. దీనిని 1200 అడుగుల నిడివి కలిగిన సినిమాగా తీసారు. దీనిని రష్యాలో ప్రదర్శించగా దాదాపు 30 లక్షల మంది చూశారు. దీనికి బాక్ గ్రౌండ్ వ్యాఖ్యానం వాడారు. నృత్యం కూడా చేర్చారు. 'మానవుడు-చిరంజీవి' 1955లో మద్రాసులో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి హాజరైన ప్రతినిధుల ముందు ప్రదర్శించారు. పెట్టుబడిదారుల, దురహంకారుల చేతుల్లో ప్రాణాలు ఆహుతయి పోతున్నాయి. కానీ మానవత్వం, మనసున్న మనిషి ఎప్పుడూ చిరంజీవిగా మిగిలిపోతాడు అనే ఇతివృత్తంతో వెలువడిన ఈ నాటకం అనేక భాషల్లోకి అనువదించబడింది.

రెంటాల గోపాలకృష్ణ ఆటం అనే మూకాభినయ నాటిక ప్రదర్శించాడు. అయితే ఇది షాడోప్లే టెక్నిక్‌తో ప్రదర్శించాడు. ఇందులో ప్రజలందరూ శాంతి రక్షకులుగా ఏర్పడి అణుశక్తిని ఎదిరించి, స్వాధీన పర్చుకుని అత్యుత్తమ జీవనసాధనంగా ఉపయోగించుకోవటం ఇతివృత్తం. అలాగే అనిశెట్టి సుబ్బారావు ఓటెవరికి, రమణారెడ్డి రాజీవం లో పాంటోమైమ్‌కి అవకాశం ఇవ్వబడింది.

డి.ఎస్.ఎన్. మూర్తి రాసి దర్శకత్వం వహించి ప్రదర్శించిన పాంటోమైమ్ ప్లే ద థీవ్స్. ఇది కూడా 'ఆన్ ది హైవే' లాంటి కథే.

ఇక ఆధునిక వీధి నాటకంలో మూకాభినయం విస్తృతంగా వాడబడుతోంది. జనం దగ్గరకు వెళ్ళిన ఈ నాటక ప్రయోగ ప్రక్రియ విశేషంగా ఆదరించబడుతోంది. తక్కువ వ్యవధిలో ముగిసే ఈ నాటక ప్రక్రియలో రంగస్థలం, లైట్స్, సౌండ్, తెరలు ఇత్యాది సాంకేతిక వనరులు సమీకరించుకోవటం, ప్రదర్శించుకోవటంలో సౌలభ్యం లేకపోవటం వల్ల ఆకృతులు,

ఆకారాలు, బళ్ళు, రైళ్ళు, తలుపులు, టేబుల్స్ ఇలా ప్రతిదీ మూకాభినయ ధోరణిలోనే కొనసాగిస్తున్నారు.

మూకాభినయంలోని విధానాలన్నీ ఉపయోగించుకుంటూ, ఒక పాత్ర చిత్రించబడినా, అలా చిత్రించబడిన పాత్రలతో ఒక సన్నివేశం ప్రదర్శించినా లేక ఆ పాత్రలతో ఒక కథను ప్రదర్శించినా, అలాంటి ప్రక్రియను పాంటోమైమ్ అంటారు.

మైమ్‌ని ఈ రకంగా నిర్వచించిన మహానుభావుడు ఎట్టినె డిక్రాక్స్ థియేటర్‌లో అత్యవసరాలు అనే శాస్త్రీయ పరిశోధనలో భాగంగా, మూకాభినయాన్ని సశాస్త్రీయంగా అభ్యసించే పద్ధతిని ప్రవేశపెట్టాడు.

అభినయాన్ని శాస్త్రీయంగా నేర్చుకోవటానికి స్టానిస్లవ్‌స్కీ ఎంతటి కృషి చేసి మెథడ్ ఆఫ్ యాక్టింగ్ ప్రక్రియను సిద్ధాంతీకరించాడో, మూకాభినయం విషయంలో ఎట్టినె డిక్రాక్స్ చేసిన కృషి అంత శ్లాఘనీయమైనది. ప్రతి కళను అభ్యసించటానికి పద్ధతులు ఉన్నట్లుగానే, మైమ్‌ను నేర్చుకోవడానికి ఒక పద్ధతి, క్రమాన్ని ఏర్పరచాడు. ఇంకా ఎందరో మహాకళాకారులు చేసిన కృషి ఫలితంగా ఈ కింది విధంగా మైమ్ నేర్చుకోవడానికి సాధనాభ్యాసాలు చేయాల్సి ఉంటుంది.

1) వార్మ్‌అప్స్, 2) కాజ్ అండ్ ఎఫెక్ట్స్, 3) కండరాల బిగింపులు, సడలింపులు, 4) దేహపు బరువును వివిధ ఆకృతులలో స్థిరంగా నిలిపి ఉంచుకోవటం, 5) శరీర ప్రతికంపనలు, 6) శూన్యంలో కేంద్రీకరించిన స్థానం వద్ద కదలికలు, 7) పాదాల చలనాలు, 8) తటస్థ వైఖరులు, 9) భ్రాంతి కల్గించు సాధనలు, 10) బెండింగ్స్, లీపింగ్స్, 11) జీరో న్యూట్రల్ స్థితి, 12) మ్యూజిక్ కదలికలు, 13) ఐసోలేషన్స్, 14) మానిప్యులేషన్స్, 15) న్యూట్రల్ జీరో పొజిషన్స్, 16) లైన్ బ్యాలెన్సింగ్ (అతి ముఖ్యమైనది), 17) అబ్జెక్టివ్స్, 18) రిఫ్లక్షన్స్, 19) రొటేషన్స్, 20) రిథిమ్స్, 21) స్లో మోషన్స్, 22) రిప్లేస్, 23) స్టోక్కాటో స్టైల్స్, 24) టెన్షన్స్, 25) రిలాక్సేషన్స్, 26) ట్రాన్స్‌లేషన్స్, 27) ఫ్రీజింగ్ టెక్నిక్స్.

ఇత్యాది అభ్యాసాల ద్వారా, గురుముఖతః నేర్చుకోవలసిన కళాప్రక్రియ మైమ్.

సశాస్త్రీయంగా మైమ్ సాధనాభ్యాసాలు: 1) శారీరక అభ్యాసాలు: శరీరస్థితిని క్రమపరచుకోవటానికి, మైమ్ చేయడానికి అనుగుణంగా మలచుకోవటానికి, తల నుంచి కాలి కొసల వరకు కండర సారళ్యత సాధించడానికి ఉద్దేశించబడినవి. ఈ అభ్యాసాల ద్వారా శరీరంలో శక్తిని పొదుపుగా అదుపు చేసుకుంటూ ప్రదర్శనలో ఉపయోగించుకునే విధానాలు అలవరచుకుంటారు. అంతేకాకుండా శరీరాన్ని వివిధ భంగిమలకు అనుగుణంగా అదుపు చేసుకునే బాడీ లైన్ బ్యాలెన్స్‌ను సమకూర్చుకుంటారు.

2) మైమ్ టెక్నిక్ : ఇందులో ఐసోలేషన్స్, సెపరేషన్స్, ఇల్యూషినరీ టెక్నిక్, కదలికల వైవిధ్యాలతో ప్రారంభించి, ట్రాన్స్‌ఫర్‌మేషన్స్ ఆఫ్ టైమ్, స్పేస్‌ను, క్యారక్టర్‌ను సాధించే విధానాలు నేర్చుకుంటారు. విద్యార్థులు తమ మేథస్సుతో ఎంత క్రియేటివిటి చెయ్యగలుగుతారో పరీక్షించబడతారు.

3) క్యారక్టర్ క్లాస్: స్టైలైజ్‌డ్ టెక్నిక్స్ ఆఫ్ మైమ్ అభివృద్ధి చేసుకోవటం, నటనా వ్యాకరణ అభివృద్ధి పద్ధతులు, సహజ ఉద్వేగాలను నిజజీవితంలో పొందేలాగా భావవ్యక్తీకరణ విధానాలు, పాతకాలపు ప్లాస్టిక్ భావ వ్యక్తీకరణ పద్ధతులను విడనాడుతూ, సంపూర్ణ మానవ జీవిత పాత్ర చిత్రీకరణ విధానాలు పెంచుకుంటూ, ఇంకా ఆబ్‌స్ట్రాక్ట్ ఐడెంటిఫికేషన్స్ విధానాలను అభివృద్ధి చేసుకుంటారు.

4) జాజ్ తరగతులు: విభిన్న వాద్యాల నేపథ్యంతో కూర్చబడిన సంగీతానికి జాజ్ సంగీతానికి అనుగుణంగా శరీర కదలికల భాషా పాటవం పెంపొందించబడుతుంది. ప్రదర్శనలో అప్పటికప్పుడు పరిస్థితులకు తగినవిధంగా స్పందిస్తూపోయే సమయస్ఫూర్తి, నేర్పరితనం, అత్యంత త్వరితగతిన కదలికలను అదుపుచేసుకుంటూ పెంపొందించుకుంటూ పోయే ధోరణులు, పద్ధతులు, స్టైలైజ్‌డ్ వైఖరులు పెంపొందించుకుంటారు.

5) కంపోజిషన్స్: విభిన్న శైలిలో మూకాభినయ ప్రదర్శనలను, వివిధ ఆకృతులలో రూపుదిద్దుకునే తీరులను, రచన ఎలా చేసుకోవాలో తెలుసుకుంటారు. మైమ్ కళాకారుడికి వచ్చిన ఊహను అందంగా, అర్థవంతంగా, అద్భుతంగా, రంగస్థలం మీద ఎలా ప్రదర్శించాలో కూర్పు చేసుకోగలుగుతాడు.

మైమ్ ప్రదర్శన స్క్రిప్ట్ రాయటం కష్టతరమైన పని. ప్రతి కదలిక, దాని ప్రాముఖ్యత, ఆ కదలిక ద్వారా జరిగే అనుకదలిక, దాని ఫలితం, భంగిమలు, భావవ్యక్తీకరణ ధోరణులు, కాలం, స్థలం విశిష్టత, లైట్, స్పెషల్ లైట్స్, మేకప్, కాస్ట్యూమ్స్, ఇత్యాది అంశాలన్నిటినీ క్రోడీకరించుకుంటూ, అనేక అంశాలను దృష్టిలో ఉంచుకుని, ప్రేక్షకుల స్పందనలకు అనుగుణంగా, అవసరానికి తగినవిధంగా మార్చుకోవటానికి వీలును కల్పిస్తూ రచన ఉంటుంది. ఇందులో కామెడీ సెట్ అప్స్, ట్రాన్స్ ఫర్‌మేషన్ ఆఫ్ టైమ్, స్పేస్ డెవలప్‌మెంట్ ఆఫ్ డ్రమెటిక్ లైన్ కాన్‌ఫ్లిక్ట్ రిసొల్యూషన్ ప్రయోగ విధానాలు చర్చించబడి తెలియజేయాలి.

6) లాబ్ : విద్యార్థుల ఊహలు రచనల్లో వ్యక్తమయ్యాక వాటిని ప్రదర్శనలోకి ఎలా తీసుకురావాలో, ఎలా వీలవుతుందో, పరిశోధనాత్మకంగా ప్రయోగ విధానంలో తెలుసుకుంటారు. అసాధ్యాలు సుసాధ్యాలు చేయటం అలవరచుకుంటారు. చిన్న చిన్న బిట్స్ ఒక ఫుల్ లెంగ్త్ ప్లేగా ఎలా కూర్చుకోవచ్చో సాధిస్తారు. వారి ప్రాయోగిక ప్రతిభ మీద సద్విమర్శతో 'టీచర్' వారికి

సహకరించాలి. రచన చేయడంలో మెలకువలు, ప్రదర్శనలో సౌందర్యతీరులు టీచర్ ద్వారా తర్ఫీదులో అవగతమవుతాయి.

ఈ క్రమ విధానంలో నేర్చుకున్న మైమ్ విధానాన్ని విద్యార్థులు మొదట ఒక్కొక్కరుగాను, పిదప గ్రూప్స్‌గాను, ఆ పిదప టీచర్స్‌తో కలిసి, అటుపైన స్కిట్‌లను ఇంప్రొవైజ్ చేస్తూ, ఆఖరున విద్యార్థులు తయారుచేసుకున్న స్క్రిప్ట్‌లను, అంతకుముందు ప్రదర్శించబడిన నాటకాలలోని స్కిల్స్ కలుపుకుంటూ వినూత్నపద్ధతిలో ప్రదర్శన తీరులను మెరుగు పరచుకుంటారు.

శరీరం మొత్తం మీద భావ వ్యక్తీకరణకు ముఖ్యమైన భాగం ముఖం. ముఖంలో 135 రకాల భంగిమల విధానాలున్నాయి. మెదడులో 'పోన్స్' అనే ప్రాంతం ఉంది. అందులో "7,000 నుంచి 10,000" నాడీ కణాలు ముఖంలోని వివిధ భాగాలతో అనుసంధానం చేయబడి ఉంటాయి. అందుకనే ముఖ భంగిమలు రకరకాల తీరులలో ప్రదర్శిస్తున్నాం. హెచ్. ఫూట్ (1986) హ్యూమర్ అండ్ లాఫ్టర్ పుస్తకంలో నవ్వులో 9 రకాలున్నాయని సిద్ధాంతీకరించాడు.

మూకాభినయం శారీరకభాష, కాబట్టి దీనిని పోశ్చర్స్, గెశ్చర్స్, బాడీ మూమెంట్స్, ఐ కాంటాక్ట్స్, ఫిజికల్ కాంటాక్ట్స్, ముద్రలు, సైగలు, ముఖ కళవళికల మార్పులు, నాన్ వెర్బల్ వొకలైజేషన్ ఇత్యాది విషయాలను క్షుణ్ణంగా నేర్చుకుని, పరిశీలనలో పెంపొందించుకుని, మూకాభినయాన్ని నేర్చుకోవలసి ఉంటుంది.

నాటకం సామూహిక, సహకార కళ. ఎన్నో విభాగాలు ఎందరో కలిసి పనిచేయవలసిన కళ కానీ మూకాభినయం ఒంటరి పోరాటం. పదిమంది నటులు కలిసి సాధించే ఫలితం, మైమ్ కళాకారుడు ఒక్కడే సాధించాలి. మూకాభినయ కళా ప్రక్రియలో నిపుణుడు తనను తాను తల నుంచి కాలివేళ్ళ కొసల వరకు తెలుసుకొని ఉండటమే కాక, ఎదుటి వారి శరీర భాషను ఇట్టే అర్థం చేసుకోగలగాలి. మానవ జీవన విధానాలను అర్థం చేసుకొని ఔపాసన పట్టగలగాలి.

శేఖర్

మూడలపాయ : జానపద నాటకాల్ని సర్వసాధారణంగా యక్షగాన బయలాట అంటారు. కాని దాని ప్రాంతీయతా వైవిధ్యాన్ని అనుసరించి మూడలపాయ, పడువలపాయ అని స్థూలంగా వర్గీకరించారు. పడువల పాయ సంప్రదాయాన్ని ఉత్తర కర్ణాటక, దక్షిణ కన్నడ జిల్లాలు, షిమొగ, చిక్కమగళూరు జిల్లాల్లో ప్రదర్శిస్తారు. ఈ పడువలపాయ సంప్రదాయాన్ని ప్రదర్శనాశైలికి అనుగుణంగా 'మత్తే', 'తెంకుతిట్టు', 'బడగుతిట్టు' అని విభజించారు. ఉత్తర సంప్రదాయ యక్షగానాల్ని 'దొడ్డాట' అని దక్షిణ కర్ణాటక సంప్రదాయాన్ని 'మూడలపాయ' అని అంటారు. బయలాటకు 'కేళికె', 'అట్టదాట' అనే పేర్లు కూడా ఉన్నాయి. దొడ్డాట సంప్రదాయం బళ్ళారి, ధార్వాడ, బీజాపూర్, గుల్బర్గా, రాయచూరు, బీదరు, బెళగాం జిల్లాల్లోను, మూడలపాయ సంప్రదాయం తుముకూరు, బెంగుళూరు, కోలారు, మండ్యా, మైసూరు, హాసన, చిత్రదుర్గ, బళ్ళారి, ధార్వాడ ప్రదేశాల్లోను ప్రచారంలో ఉన్నాయి.

మూడలపాయ సంప్రదాయంలో జానపద నాటకాలకు ఉండవలసిన అన్ని లక్షణాలున్నాయి. నేపథ్యగానం, నృత్యం, గానం, రంగు రంగుల దుస్తులు, పౌరాణిక ఇతివృత్తం ఇందులో ఉంటాయి. యక్షగాన ప్రదర్శనకు ఏర్పాటు చేసిన రంగస్థలం కంటే మూడలపాయ యక్షగాన రంగస్థలం చాలా విశాలంగా అలంకారప్రాయంగా ఉంటుంది. ప్రదర్శన ఆరంభంలో గణపతి ప్రార్థన ఉంటుంది. వెంటనే గణపతి వేషధారి రంగస్థలం పైకి వచ్చి నాటకాన్ని ఆశీర్వదించి నిష్క్రమిస్తాడు. ఈ పద్ధతి తమిళ తెరుక్కూత్తులో కూడా కనిపిస్తుంది. కన్నడ యక్షగానాల్లో భాగవతుడు వివిధ పాత్రల్ని పరిచయం చేస్తాడు. కాని మూడల పాయ సంప్రదాయంలో 'సారథి' అనే హాస్యగాడే తన హాస్య సంభాషణలతో ప్రతి పాత్రను తను పరిచయం చేసుకొనేలా చేస్తాడు. ఇక్కడ సారథి ప్రేక్షకులకు, నటులకు మధ్య వారదిగా నిలుస్తాడు. ఒక పాత్ర నిష్క్రమించిన తరువాత మరో పాత్ర ప్రవేశించేంతవరకు ఆ లోపాన్ని సారథి తన పాటలతోను, మాటలతోను పూరిస్తూ ఉంటాడు. సారథి నాటకంలోని పాత్రలతోనే కాక ప్రేక్షకులతోను సంభాషిస్తూ ఉంటాడు. ఇతనికి కోడంగి పాత్ర సహాయకారిగా ఉంటాడు. ఇతడు మరో చిరు హాస్యగాడు.

మూడలపాయలో ప్రధాన వేషధారిని 'బణ్ణద వేష' అంటారు. ఈ వేషధారి సర్వసాధారణంగా తన ఇంటి వద్దో, గ్రామ చావడి వద్దో వేషం ధరిస్తాడు. అక్కడి నుంచి రంగస్థలం వరకు అతన్ని ఊరేగింపుగా, అట్టహాసంతో తీసుకొని వస్తారు. దారిలో ఈ వేషధారి ఉధృతంగా ఆడుతూ పాడుతూ ప్రజల్ని రంజింప చేస్తూ ఉంటాడు. ఇలా అట్టహాసంగా వచ్చి రంగస్థలంపై తన కోసం ప్రత్యేకంగా అమర్చిన ఆసనంపై కూర్చుంటాడు. ఆ తరువాత ప్రేక్షకులు అతనికి అనేక బహుమతులు అర్పిస్తుంటారు. ఈ పద్ధతి తెలుగులో చిందు యక్షగానంలో ఉంది.

మూడలపాయ కళాకారులు, చాలావరకు నిరక్షరాస్యులుగా ఉంటారు. అందుకే వారు శారీరకమైన అభినయానికిచ్చే ప్రాధాన్యం, శాస్త్రీయమైన అభినయానికి ఇవ్వరు. సంభాషణలు సంస్కృత పదభూయిష్టంగా ఉంటాయి. మూడలపాయలో నృత్యం వింత గొల్పేలా ఉంటుంది. పాటలు ఏకరీతిగా ఉంటాయి. ఇక వేషభూషణాలు చాలా చిత్ర విచిత్రంగా

ఉంటాయి. పౌరాణిక ఇతివృత్తాలు వాటిలో ఉన్నా యక్షగానాల్లో భక్తి ప్రపత్తులు ఉండవు. మూడలపాయ సంప్రదాయం ఒక్కొక్కసారి యక్షగానం కంటే విశేషంగా ప్రజల్ని ఆకర్షిస్తూ ఉంటుంది.

మూడలపాయ నాటకాలు ఆ తరువాతి కాలంలో వృత్తి నాటక సంప్రదాయాల్ని అనుకరిస్తూ అనుసరిస్తూ వచ్చాయి. నాటకంలో రంగస్థలాంకరణ, దీపాలంకరణ, పాటలు, పద్యాల్లో అనుకరణ ఎక్కువగా చోటు చేసుకొనింది. మూడలపాయ దొడ్డాటను ఈ నాటికీ జనం ఎగబడి చూస్తున్నారు అంటే దానికి కర్ణాటకలో ఎంత ప్రాధాన్యం ఉందో తెలుసుకోవచ్చు.

ఆనందన్

మూన్ థియేటర్ : గుంటూరు నాటక సమాజం (1912-36). ఈ సంస్థను పొత్తూరు హనుమంతరావు, బండారు రామస్వామి, పాదర్తి సోమయ్య, పత్రి సుబ్రహ్మణ్యాంలు స్థాపించారు. ఈ సంస్థలో బండారు రామస్వామి, కడియాల వెంకటరత్నం, నవరం వెంకట్రాయుడు, ఆరణి సత్యనారాయణ, గోవిందరాజుల వెంకట రామయ్య మొదలైనవారు నటులుగా ఉండేవారు. 1916లో గుంటూరులో జరిగిన ప్రసన్నయాదవ నాటక పోటీలలో ఈ సమాజం పాల్గని ప్రదర్శన బహుమతి గెలుచుకుంది. ఈ సమాజం 22 సంవత్సరాలు అమోఘంగా సాగి మంచి పేరుప్రతిష్ఠలు సంపాదించుకుంది.

ప్రసన్నయాదవం, గయోపాఖ్యానం, రసపుత్ర కదనం, బబ్బిలి, సత్యహరిశ్చంద్ర, బిల్హణీయం, పాదుషా పరాభవం, రాణీ సంయుక్త మొదలైన నాటకాలను ప్రదర్శించింది.

శ్రీ.చ.

మూర్తి, డి. ఎస్. ఎన్. (జ. 1944) : పూర్తిపేరు దేశిరాజు శ్రీమన్నారాయణమూర్తి. రంగస్థల నటుడు, దర్శకుడు, అభినయ అధ్యాపకుడు. రామచంద్రరావు, భారతీదేవి దంపతులకు గుంటూరు జిల్లా బాపట్లలో 1944 డిసెంబర్ 1న జన్మించాడు. బాపట్ల ఉన్నత పాఠశాలలోను, చీరాల కళాశాలలోను విద్యాభ్యాసం చేశాడు. హైదరాబాద్‌లో ఎం.ఎ., ఎల్. ఎల్. బి. పూర్తి చేశాడు. రంగస్థల కళలలో పి.జి. డిప్లొమా పొందాడు. జానపద నాటకం - చిందు భాగోతం అనే అంశం మీద పరిశోధన చేసి కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందాడు. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్‌లో కొన్నాళ్ళు పనిచేశాడు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నాటక విభాగంలో ఆచార్యునిగా పనిచేసి పదవీ విరమణ చేశాడు.



ఈయన తన పదవ ఏట (1954) పాఠశాలలో భక్తమహిమ అనే నాటిక ద్వారా రంగస్థల ప్రవేశం చేశాడు. నాటి నుండి నాలుగు దశాబ్దాలకు పైగా నాటకరంగంలో తన అనుబంధాన్ని కొనసాగించాడు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ థియేటర్, తదితర సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నటశిక్షణ శిబిరాలను నిర్వహించి ఔత్సాహిక నటీనటులకు శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ యిచ్చి రంగస్థల వికాసానికి తోడ్పడ్డాడు. నటునిగా అనేక రాష్ట్రస్థాయి నాటక పోటీలలో పాల్గని ఉత్తమ నటునిగా, దర్శకునిగా అనేక బహుమతులు గెల్చుకున్నాడు. 1880 నుండి 1980 వరకు తెలుగు నాటకరంగంలో వచ్చిన పరిణామ దశలను వివరిస్తూ 'నూరేళ్ళ తెలుగు నాటకం - రంగస్థలం' పేరుతో డాక్యుమెంటరీలో రంగస్థల నాటకాన్ని ప్రదర్శింపజేశాడు. 50 మంది కళాకారులతో, 25 మంది సాంకేతిక నిపుణులతో ప్రతిష్ఠాత్మకంగా తయారుచేసిన ఆ నాటకానికి ప్రేక్షకుల నుండి ప్రశంసలు లభించాయి. రాజకీయ వ్యవస్థను దృశ్యమానం చేస్తూ, కూచిపూడి నృత్యాన్ని అందులో పొందుపరచి, ఇంద్ర సింహాసనం పేరుతో ప్రదర్శించిన ఒపేరాకు దర్శకత్వం వహించి విలక్షణ దర్శకుడుగా పేరు తెచ్చుకున్నాడు. అలెక్స్‌హేల్ రాసిన రూట్స్ అనే అమెరికన్ నవలను నాటకీకరించి స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించాడు. ఆఫ్రికన్ అడవుల్లో నీగ్రోలను బందీలుగా పట్టుకుని వారిని బానిసలుగా విక్రయించటం ఈ నాటకం ఇతివృత్తం. బానిసలుగా బ్లాక్ ఆఫ్రికన్స్ (నీగ్రోలు, అనుభవించే దయనీయ జీవితాన్ని ఈ నాటకంలో హృదయంగముంగా చిత్రించటం జరిగింది. కాళీపట్నం రామారావు వ్రాసిన యజ్ఞం, చావు కథల ఆధారంగా వచ్చిన నాటికల ప్రదర్శనకు డి. ఎస్. ఎన్. కొత్తరూపం సంతరించి పెట్టాడు. వర్తులాకారంలో ఉన్న స్థలంలో ఐదు రంగస్థలాలను ఏర్పరచి, ప్రేక్షకుల చుట్టూచేరి ప్రదర్శనను తిలకించు విధంగా చావు నాటిక వినూత్న రీతిలో ప్రదర్శితమైంది. ఎన్. తారక రామారావు రచించిన బకాసుర నాటకాన్ని డి. ఎస్. ఎన్. మూర్తి అభివ్యక్తిశైలి (expressionistic style) లో ప్రదర్శింపజేశాడు. గిరీష్‌కర్నార్డ్ వ్రాసిన నాగమండలమ్, అగ్నివర్షమ్ నాటకాలకు రసరంజని నాటకబృందం తరపున దర్శకత్వం చేపట్టి, వాటి విజయానికి తోడ్పడ్డాడు. విదేశీనాటక శైలులను తెలుగు నాటకరంగానికి పరిచయం చేసిన వారిలో డి. ఎస్. ఎన్. ప్రథమ శ్రేణిలో నిలుస్తాడు. డి. ఎస్. ఎన్. రచించిన మహానగరం వీధి నాటకం నగరవాసుల బాధల్ని గాథల్ని వివరిస్తుంది. అనేక ప్రదర్శనలకు నోచుకొని మంచి ప్రచారం పొందిన ఈ నాటిక నాటక రంగంలో

వివిధాంశాల గురించి అనేకవ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఈయన ప్రచురించిన నాటక దర్పణం నాటకరంగంలో వివిధాంశాలపై డి. ఎస్. ఎన్. కి ఉన్న బహుముఖ ప్రజ్ఞను విస్తృతానుభవసారాన్ని వ్యక్తం చేస్తుంది.

గం.సు.రె.

మెనాండర్ (క్రీ.పూ. 342-291) : ప్రముఖ గ్రీకు నాటకకర్త. మెనాండర్ ఏథెన్స్ నగరంలో క్రీ.పూ.342లో సంపన్న కుటుంబంలో జన్మించాడు. ఈయన రాసినవన్నీ సుఖాంత నాటకాలే. అందులో న్యూ కామెడీలు, సున్నితమైన హాస్యంతో క్రీ.పూ. 4-2 శతాబ్దాల కాలం నాటి సాంఘిక వ్యవస్థ చిత్రీకరణ ఉంటుంది. చెడును దూషించడం ప్రధాన లక్షణంగా ఉంటుంది. న్యూ కామెడీ అరిస్టోఫేన్స్ నాటకాలకు విలక్షణంగా ఉంటుంది. న్యూ కామెడీ రచనలో ప్రసిద్ధుడు మెనాండర్. శతాధిక నాటక కర్త. గ్రేట్ డయాన్సియా నాటక పోటీల్లో ఎనిమిదిసార్లు మొదటి బహుమతి లభించింది. ఈ కవి గొప్పతనాన్ని మరణానంతరమే గుర్తించారు. మెనాండర్ సరళమైన అటిక్ భాషలోనే నాటకాలు రాశారు. డిస్కోలస్ అనే నాటకంలో నెమోన్ అనే మానవద్వేషి పాత్ర పెరికెయిరోమీన్ సైనికుని పాత్రలను నేర్పుతో, సానుభూతితో సృష్టించాడు. ఈయన రచనలను ప్లాటస్, టెరెన్స్ అనుకరించారు.



మెనాండర్ నాటకాలన్నిటిలో బ్యాడ్ టెంపర్డ్ మ్యాన్ మాత్రమే పూర్తి పాఠ్యం లభ్యమైంది. ఈ నాటకాన్ని క్రీ. పూ. 316లో ప్రదర్శించగా క్రీ.శ. 1959లో ప్రచురించారు. హాస్య పాత్రల సృష్టిలో మెనాండర్ దిట్ట. ఈయన సృష్టించిన పాత్రలు దయాళువులైన వేశ్యలు, మతి మంతులైన బానిసలు, మనసున్న పోకిరీలు, దుర్మార్గులైన కుమారులు, కోపిష్టులైన తండ్రులు. పాత్రలన్నీ మూస కట్టుగ ఉంటాయి.

అన్నప్ప

మేకప్ అన్నయ్య (1928-1992) : మేకప్ అన్నయ్యగా ప్రసిద్ధికెక్కిన పూర్ణచంద్రరావు 1928, మార్చి 10న గుంటూరు జిల్లా, రేపల్లె సమీపంలోని రావి అనంతవరం గ్రామంలో కర్రి బ్రహ్మయ్య, కామాక్షమ్మ దంపతులకు జన్మించాడు. తండ్రి కాంగ్రెస్‌వాది అయినా, తాను కమ్యూనిస్టులతో కలసి, ఆ ఉద్యమ ఆశయాల ప్రచారం కోసం వేసే నాటకాల్లో చిన్న చిన్న పాత్రలు వేసి, ఆ క్రమంలోనే అవసరార్థం మేకప్ కళను అభ్యసించి, అనంతరకాలంలో వృత్తి కళాకారునిగా మారి నాటకరంగానికి రూపశిల్పిగా తన సేవలు అందించాడు. మేకప్ కళలో రాణించేందుకు అవసరమైన మెళకువలను భద్రయ్య (పొన్నూరు), భక్తవత్సలం (తెనాలి), పీతాంబరం వంటి ప్రవముఖ రూపశిల్పుల వద్ద శిష్యరికం చేసి నేర్చుకున్నాడు. ఈ అనుభవంతో, సంపాదించిన నైపుణ్యమే పెట్టుబడిగా నాలుగు దశాబ్దాల పాటు రేపల్లె పరిసర ప్రాంతాల్లో రూపశిల్పకళకు పెద్దదిక్కుగా నిల్చాడు. స్థానికంగా పలు ఔత్సాహిక సమాజాలతో పాటు, నవోదయ నాట్యమండలి, ప్రజా నాట్యమండలి వంటి పెద్ద సంస్థలకు కూడా మేకప్‌కళాకారుడిగా వ్యవహరించాడు. ప్రసిద్ధనటుడు వల్లూరి వెంకట్రామయ్య సమాజంలో కూడా దాదాపు రెండు దశాబ్దాలపాటు మేకప్‌కళాకారుడిగా కొనసాగాడు. రూపశిల్పంలో ఎన్నో ప్రయోగాలు చేసి ఔత్సాహిక సమాజాల ఆదరాభిమానాలు చూరగొన్న మేకప్ అన్నయ్య 1992, జనవరి 22న పరమపదించాడు.

మన్నెశ్రీ

మైత్రి రసాలు : సామాజికులకు రసానుభూతి కలిగించే నవరసాలకు తోడ్పాటునిచ్చే పోషక రసాలనే మైత్రి రసాలంటారు. కొన్ని రసాలకు కొన్ని రసాలు తోడైనపుడు రసాభాసకు దారితీస్తాయి. ఉదాహరణకు శృంగార రసానికి కరుణ, భీభత్స, రౌద్ర, భయానక రసాలు విరోధి రసాలు. హాస్య రసానికి భయానక, కరుణ రసాలు విరోధి రసాలు. పోషక రసాలు రసానుభూతిని ఇనుమడింప చేస్తాయి. ఉదాహరణకు రౌద్రరసానికి వీరం, అద్భుతరసానికి శృంగారం, హాస్య రసానికి శృంగారం మైత్రీ రసాలు.

శ్రీ.చ.

మైలవరం కంపెనీ : ఈ నాటక సమాజాన్ని మైలవరం రాజా సూరానేని వెంకట పాపయరావు బహద్దర్ జమిందారు 1913లో బాలభారతి అనే పేరుతో స్థాపించాడు. 1916-17లో విజయవాడలో ఒక నాటకశాలను నిర్మించాడు. మైలవరం జమిందారు నిర్మించినందువల్ల దీనిని మైలవరం థియేటర్ అని పిలిచేవారు. నటులను ఆకర్షించడానికి సమాజంలో చేరిన వారికి ఎక్కువ జీతాలిచ్చాడు. ఇంతకు ముందు అన్ని కంపెనీలలోను, సంగీత వాద్యకారులు రంగస్థలంపై ఒక పక్కగా కూర్చుని సంగీతం అందించేవారు. రంగస్థలం ముందు భాగంలో వాద్యకారులు

కూర్చుని, సంగీతం అందించడం ఈ కంపెనీతోనే ప్రారంభమైంది. అంతేకాదు, వేషధారణలో అనేక ఆధునిక పద్ధతులు అవలంబించింది. ముఖానికి అరదళానికి బదులు, కేకులు, గడ్డాలు, మీసాలు పెట్టుకోవడం వాడకంలోకి తెచ్చింది ఈ కంపెనీయే అని తెలుస్తోంది. సరికొత్త సీనరీలు, అద్భుత మాయాజాల దృశ్యాలు, ఫోకసింగ్ లైట్లు, వీనుల విందైన సంగీతం, పెద్ద నటుల నటనా చాతుర్యం, క్రమ శిక్షణ మొదలైన అన్ని విషయాలలోను ఉన్నత ప్రమాణాలతో నాటక ప్రదర్శనలు నిర్వహించినందువల్ల ఈ కంపెనీకి ఎనలేని ప్రతిష్ఠలు లభించాయి. ఈ కంపెనీ నాటకాలు చూడడానికి వచ్చే దూరప్రాంతాల ప్రేక్షకులు, టెలిగ్రామ్స్ ద్వారా టిక్కెట్లు రిజర్వు చేసుకునే వారు. ఈ కంపెనీ సతీ సావిత్రి, శాకుంతలం, సతీ సక్కుబాయి, ద్రౌపదీ వస్త్రాపహరణం, శ్రీకృష్ణ లీలలు మొదలైన నాటకాలను ప్రదర్శించింది.

అద్దంకి శ్రీరామమూర్తి, జన్నవిత్తుల శేషగిరిరావు, గురజనాయుడు, ధైతాగోపాలం, ఉప్పలూరి సంజీవరావు, పారుపల్లి సుబ్బారావు, యడవల్లి సూర్యనారాయణ, కుంపట్ల సుబ్బారావు, కపిలవాయి రామనాథశాస్త్రి మొదలైన నటులు ఈ కంపెనీ ప్రదర్శనలలో పాల్గొన్నవారే. ప్రఖ్యాత హార్మోనిస్టు పాపట్ల కాంతయ్య, ఎ.టి.రామానుజులు, తబలా వాద్య నిపుణుడు బగ్గన్న ఇందులో పనిచేశారు. కంపెనీ నాటకాలకు మంచి పేరు వచ్చింది కానీ, మితిమీరిన ఖర్చులవల్ల కంపెనీ నష్టాల పాలైంది. 1924 ప్రాంతంలో జమిందారు కంపెనీ నుంచి విరమించుకున్న తరువాత నామ మాత్రంగా కొద్దికాలం నడిచినా, ఆ పిమ్మట కాలగర్భంలో కలిసిపోయింది.

నే.ప.శ

మోతే వారి కంపెనీ, ఏలూరు : జమీందారు మోతే నారాయణరావు సీతారామాంజనేయ నాటకసమాజం అనే పేరుతో 1920-21 ప్రాంతంలో ఈ నాటక సమాజాన్ని స్థాపించాడు. పెద్ద పెద్ద నటులను ఆకర్షించడానికి ఘనంగా జీతాలు చెల్లించాడు. నటుల సామర్థ్యాన్ని బట్టి పది రూపాయల నుంచి వంద రూపాయల వరకు జీతాలు చెల్లించే ఏర్పాటు చేశాడు. విజయవాడ, ఏలూరులో నాటకశాలలు ఏర్పాటు చేశాడు. ప్రత్యేకంగా రచయితలను నియమించి, స్వతంత్రంగా నాటకాలను అనువదింపచేసి ప్రదర్శింపచేశాడు. ఆంధ్రదేశంలో మొదటిసారిగా మృచ్ఛకటికం నాటకాన్ని ప్రదర్శించిన ఘనత ఈ కంపెనీకే దక్కింది. ఈ సమాజం ఆంధ్రదేశమంతటా పర్యటించి కాళిదాసు, శాకుంతలం, మృచ్ఛకటికం, సక్కుబాయి మొదలైన నాటకాలను ప్రదర్శించింది.

యడవల్లిసూర్యనారాయణ, ఉప్పలూరి సంజీవరావు, కడియాల రత్తయ్య, అరణి సత్యనారాయణ , కొచ్చర్లకోట రంగారావు, పంచాంగం వెంకట రామానుజాచార్యులు, కపిలవాయి రామనాథశాస్త్రి, అద్దంకి శ్రీరామమూర్తి, ముంజులూరి కృష్ణారావు, జన్నవిత్తుల శేషగిరిరావు మొదలైన వారు నటులుగా ఉండేవారు. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, శ్రీ రాముల సచ్చిదానంద శాస్త్రి, మల్లాది అచ్యుత రామశాస్త్రి ఈ సమాజానికి నాటకాలు రచించారు. తరువాత కాలంలో ఈ కంపెనీ నష్టాల్లో చిక్కుకున్నందు వల్ల మూసివేశారు.

నే.ప.శ

మోహన్ రాకేష్ (1925-1972) : ప్రసిద్ధ హిందీ నాటక, కథా రచయిత, వ్యాసకర్త. ఈయన 1925లో జనవరిలో అమృత్‌సర్‌లో జన్మించాడు. లాహోర్ ప్రాచ్య కళాశాలలో శాస్త్రి పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. సంస్కృతంలో ఎం.ఎ. పట్టా తీసుకున్నాడు.

ముంబయి, సిమ్లా, జలంధర్, ఢిల్లీలలో అధ్యాపకుడుగా పనిచేశాడు. అనంతరం పత్రికా సంపాదకుడుగా కొంతకాలం పనిచేసి, ఆ వృత్తి నచ్చక వదిలేశాడు. 1962 నుంచి చనిపోయేవరకు అంటే 1972వరకు ఫ్రీ లాన్సర్‌గా రచనా వ్యాసంగం కొనసాగించాడు.

మోహన్ రాకేష్ నాటకాలు, నవలలు, కథలు, వ్యాసాలు, యాత్రా సాహిత్యం, ఆత్మకథ మొదలైనవి గద్య సాహితీ జగత్తును సుసంపన్నం చేశాయి.

ఆషాఢ్ కా ఏక్‌దిన్, లహరోం కే రాజ్‌హంస్, ఆధే అధూరే, అండే కే ఛిల్ కే మొదలైన నాటకాలను రచించాడు. ఆషాఢ్ కా ఏక్‌దిన్ దాదాపు అన్ని భారతీయ భాషల్లో అనువదింపబడి, ప్రదర్శింపబడింది.

అంధేరే బంద్ కమ్‌రే, న ఆనేవాలా కల్, అంతరాల్ మొదలైన నవలలు రచించిన మోహన్ రాకేష్ 1972లో మరణించాడు.

సరోజా

మోహన రావు, ఇసుకపల్లి (జ.1949) : నటుడు, నాటక రచయిత, దర్శకుడు. ప్రకాశం జిల్లా ఒంగోలులో 1949, అక్టోబర్ 28న జన్మించాడు. మనిషి బాహ్యమైన జీవితాన్ని కాకుండా మనసు పొరల్లోకి వెళ్లి ఆలోచనలను వెలికి తీసి, నిక్షిప్తమైపోయిన భావాలను పైకి తెచ్చే ప్రయత్నం చేసిన ఇసుకపల్లి నాటకాలన్నీ మేధావుల మస్తిష్కాలకు పని పెడతాయి. ఈయన నాటకాలు ప్రేక్షకుల ఆలోచనకు పదునుపెట్టే వైద్య పరీక్షశాలలు. ఓ బూతు నాటకం, ది గేమ్, డియర్ ఆడియన్స్ సిన్సియర్లీ యువర్స్, పురుషార్థం, తర్జని, మర్యాదస్తులకో నాటకం, శ్వాస వంటి నాటకాలను రచించాడు.

యవ్వనోద్రేకంలో యువతీయువకులు పరస్పరం ఆకర్షించబడితే సంఘం స్త్రీ వైపే వేలెత్తి చూపిస్తుంది. స్త్రీ పురుష విచక్షణ లేకుండా సాంఘిక న్యాయం ఇద్దరి పట్లా సమంగా

వర్తింపచేయాలనే సందేశంతో రాసిన ఓ బూతు నాటకం పరిషత్తుల ప్రస్థానంలో సంచలన విజయాలను సొంతం చేసుకుంది. ఈ నాటకం ప్రధాన పాత్ర విఠల్‌తో పాటు నాటకానికి దర్శకత్వం వహించిన ఇసుకపల్లి అపూర్వ ప్రతిభకు ప్రేక్షకలోకం నీరాజనాలర్పించింది. క్షణక్షణానికీ మారే ఆలోచనలూ, అతి నీచమైన, హేయమైన ఆలోచనలు మెదడు పొరల్లో కాలసర్పాల్లా ఎలా బుసలు కొడతాయో అద్భుతంగా రచించిన డియర్ ఆడియన్స్ సిన్సియర్లీ యువర్స్ నాటకం ఇసుకపల్లి రచనా ప్రతిభకు దర్పణం పట్టింది. చరిత్ర ప్రారంభమైన నాటి నుంచి వర్తమానం వరకూ కుర్చీ కోసం జరిగిన కొట్లాటలను సింబాలిక్‌గా చెప్పిన ది గేమ్, వరకట్న దురాచారాన్ని కొత్త కోణంలో చెప్పిన తర్జని, అధికార దుర్వినియోగ వికృతరూప విన్యాసాన్ని వివరిస్తూ రాసిన పురుషార్థం నాటకాలు అన్నీ ఆణిముత్యాలే. పరిషత్తుల్లో అన్నీ అఖండ విజయాలను సొంతం చేసుకున్నవే. పాటిబండ్ల ఆనందరావు రచించిన దర్పణం, ఎం.వి.ఎస్. హరనాథరావు రచించిన నైవేద్యం నాటికలకు ఇసుకపల్లి దర్శకత్వం వహించాడు. **ఆమె, ఇల్లాలు ప్రియురాలు** వంటి చిత్రాలకు మాటల రచయితగా వ్యవహరించాడు. చలం ప్రేరణతో రచించిన ఆలోచనామృతమైన నాటకాలు రాశిలో తక్కువైనా వాసిలో అగ్రశ్రేణికి చెందినవి.

కందిమళ్ళ

యంగ్మెన్స్ హేపీ క్లబ్ (1916) : ఆంధ్ర నాటక రంగ వికాసానికి తోడ్పడే నటీ నటులను, రచయితలను, దర్శకులను తయారు చేయాలనే ఆశయంతో 1916లో కాకినాడలో ఈ సమాజం ప్రారంభమైంది. వ్యవస్థాపకులు జానాబ్ కాశిం సాహెబ్, మాదిరెడ్డి రామానుజులురావునాయుడు, గండికోట జోగినాథం, దంటు సూర్యారావులు. వీరు క్లబ్ కార్య క్రమాలను అంకిత భావంతో నిర్వహించేవారు. జోగినాథం రంగస్థల శాస్త్ర విషయాలపై సంపూర్ణ పరిజ్ఞానం గల మేధావి. వృత్తిరీత్యా కార్మికుడైన రామానుజులురావు నాయుడు నాటకాలలో స్పెషల్ ఎఫెక్ట్స్ చూపించడంలో దిట్ట. జానాబ్ కాశిం సాహెబ్ చిన్న పిల్లలను నటీనటులుగా తీర్చిదిద్దడంలో శ్రద్ధ తీసుకొనేవాడు. సుబ్బారావు కార్యనిర్వహణలో సమర్థుడు. ఈ నలుగురి నిరంతర కృషి యంగ్మెన్స్ హేపీ క్లబ్ ఒక ఉన్నత సంస్థగా గుర్తింపు పొందడానికి కారణమయ్యింది. ఈ సంస్థ అనేక పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక, జానపద నాటకాలను దేశంలోని పలుప్రాంతాలలో ప్రదర్శించింది. రంగస్థలంలో రాణించిన మద్దూరి బుచ్చన్న శాస్త్రి, ఏ.వి. సుబ్బారావు, ఎస్.పి. లక్ష్మణస్వామి, చలనచిత్ర పరిశ్రమలో ప్రసిద్ధులైన రేలంగి వెంకట్రామయ్య, ఎస్.వి. రంగారావు, నల్ల రామమూర్తి, రేలంగి నరసింహారావు, సూర్యకాంతం, అంజలిదేవి, సుప్రసిద్ధ దర్శకులు ఆదినారాయణ రావు, బి.ఏ సుబ్బారావు ఈ సంస్థలో శిక్షణ పొందినవారే. యంగ్మెన్స్ హేపీ క్లబ్ ప్రదర్శించిన లేచింది మహిళా లోకం, తులసి పెళ్లి సమాజాన్ని పట్టి పీడిస్తున్న మద్యపాన దుష్ఫలితాల్ని వివరిస్తే, ఈశ్వర్ అల్లా తేరేనామ్, రామభక్తగోపన్న, మహామంత్రి యుగంధరుడు హిందూ ముస్లిం సమైక్యతను ప్రబోధించాయి. పసుపూ బట్టూ పేరంటానికి, వర విక్రయం వరకట్న విషయాలను వివరిస్తే, తులసి తీర్థం హరిజనోద్ధరణను ప్రస్తావించింది. ఇలా సమాజానికి అవసరమైన సాంఘిక ఇతివృత్తాలు గల ప్రదర్శనలను ప్రజలముందుంచి ఆలోచింప చేసింది. ఇవేగాకుండా శ్రీకృష్ణ రాయబారం, దానవీర శూర కర్ణ, సిరిమువ్వ లాంటి నాటకాలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలందుకుంది. 1992లో ప్లాటినం జూబ్లీ జరుపుకొని, ప్రతి ఏటా కళారంగంలో లబ్ధప్రతిష్ఠులైన వ్యక్తులను ఘనంగా సత్కరిస్తోంది. యువకులలో కళలపట్ల ఆసక్తిని పెంచుతూ, నిత్యనూతనంగా విరాజిల్లుతూ త్వరలో శతజయంతి ఉత్సవాలు జరుపుకోవడానికి సిద్ధంగా ఉన్న సంస్థ యంగ్మెన్స్ హేపీక్లబ్.

దాసరి,ఎన్.

యజ్ఞనారాయణ, ఇచ్ఛాపురపు : నాటకకర్త, కవి,పండితుడు, ఉపాధ్యాయుడు, పత్రికా సంపాదకుడు, జాతీయవాది. స్వరాజ్య ఉద్యమ ప్రభావంతో దేశభక్తి పూరితుడై, జాతీయోద్యమానికి నాటకాల ద్వారా దోహదం చేయాలనే సంకల్పంతో కలం పట్టిన దేశ భక్తుడు. అందుకే ఈయన దేశభక్తిని పురికొల్పే ఇతివృత్తాలనే తీసుకొని నాటకాలుగా మలిచాడు. ఈయన రసపుత్ర విజయం నాటకం నాందిలో భరతమాత వందనం, రాజపుత్ర తేజః పుంజంలో ఆంధ్రమాత ప్రశస్తి ఇందుకు తార్కాణాలు.

ఈయన విశాఖపట్నం మిషన్ హైస్కూల్లో తెలుగు పండితుడిగా జీవితం గడిపాడు. కొంతకాలం హితకారిణీ గ్రంథ మాల సంపాదకుడిగా ఉత్తమ గ్రంథాలు వెలువరించాడు.

ఈయన రచించిన *రసపుత్ర విజయం* నాటకం శృంగార, వీరరసాలకు ఆటపట్టు. నాటకీయతను ఎంతగానో పొదుపుకున్న నాటకం. రాజసింహ, విమల ల ప్రేమగాథ ప్రధాన ఇతివృత్తమైనా దుర్గాదాసు వీరవిహారం ప్రాధాన్యం వహిస్తుంది. నాడు ఈ నాటకం ఆడని సమాజం అంటూ ఆంధ్రదేశంలో లేదు. ఈ నాటక ప్రదర్శనానికి 1915లో బందరులో పోటీలు జరిగాయి. నాటి బ్రిటీష్ ప్రభుత్వ ఆగ్రహానికి ఈ నాటకం గురైంది.

రసపుత్ర విజయం (1910), అపూర్వ నాగరికత (1912), భారతమాత (1913), రాజపుత్ర తేజః పుంజం (1920), శ్రీకృష్ణ జననం నాటకాలను రచించాడు.

శ్రీ.చ.

యజ్ఞ నారాయణ శాస్త్రి, పసుమర్తి : నటుడు. నాటకకర్త. విమర్శకుడు. కృష్ణా జిల్లా దివి సమీపంలోని మోసిదేవిలో జన్మించాడు. స్థిర నివాసం మచిలీపట్నం. ప్రదర్శన కళల పట్ల మక్కువ పెంచుకున్న పసుమర్తి 1917లో లంకాదహనం (సీతాన్వేషణం) నాటకం రాసి, ఇందులో ఆంజనేయుడి పాత్రలో నటించాడు. ఈ నాటకం విరివిగా ప్రదర్శింపబడి పసువర్తికి రచయితగా, నటుడుగా మంచి పేరు తెచ్చి పెట్టింది. ఆ తరువాత 1920లో రామరావణ సంగ్రామం అనే నాటకం రచించాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాన్య మానవుడి కనీస బాధ్యతలు, సామాజికంగా అభివృద్ధిచెందడానికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో ఆలోచించి వాటిని గ్రామసేన అనే నాటకంగా 1954లో వెలువరించాడు. ఈ నాటకాన్ని దృశ్యాలుగా విభజించి రాశాడు. నటుడుగా, రచయితగా, ప్రదర్శనాపరమైన విషయాలను రంగస్థల కళల పట్ల అభిరుచి కనబరుస్తున్న వారికి తన ఆలోచనలు పదిమందికి పంచే ప్రయత్నంలో భాగంగా 'ఆంధ్రనట ప్రకాశిక' అనే నాటక విమర్శన గ్రంథాన్ని 1930లో వెలువరించాడు. ఈ గ్రంథంలో నాటకరంగ చరిత్ర గురించి రాయడమే కాకుండా రంగస్థల నటుడు బాధ్యతలు, ప్రసిద్ధ పాత్రల పరిశీలనలతో పాటు తెలుగు నాటకరంగానికి సంబంధించిన 130 మంది నటుల, రచయితల చిత్రపటాలను ప్రచురించాడు. ఆంధ్రనాటక రంగ చరిత్రలో ఆంధ్ర నట ప్రకాశిక గ్రంథానికి ఒక ప్రత్యేక స్థానమున్న విషయం నాటక విమర్శకులకు తెలిసిన విషయమే.

దాసరి.ఎన్

యజ్ఞన్న శాస్త్రి, సోమంచి (జ.1913) : కథ, నవలా, నాటక రచయిత. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో 1913, నవంబర్ 3వ తేదీన జన్మించాడు. తల్లిదండ్రులు వరలక్ష్మి, సీతారామయ్య. ఉన్నత విద్య చదువుకున్న యజ్ఞన్నశాస్త్రి ఉద్యోగరీత్యా బంబాయిలో స్థిరపడ్డాడు. ముంబాయి నగర మునిసిపల్ కార్పోరేషన్ డిప్యూటి కమిషనరుగా పనిచేస్తూనే ఆంధ్రమహాసభ కార్యవర్గ సభ్యుడుగా, విద్యా సంఘ సభ్యుడుగా పనిచేశాడు. ఈయన రచించిన కథలు ఇంగ్లీషులోకి అనువదింపబడి ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియాలో ప్రచురణకు నోచుకున్నాయి. హాస్య రచనలు రచించడానికి కారణం భమిడిపాటి కామేశ్వరరావు రచనలే స్ఫూర్తి అని యజ్ఞన్నశాస్త్రి చెప్పుకున్నాడు. ఈయన రచించిన లంచం పట్టిన ఆఫీసరు, లాభం చేసిన గొల్లది మొదలైనవి సుప్రసిద్ధ కథలు. ప్రముఖ పాశ్చాత్య నాటక రచయితల నాటకాలను తెలుగు పాఠకులకు పరిచయం చేశాడు. మాటర్‌లింక్ మోరిస్ రచించిన మోనావానా నాటకాన్ని పాత్రల పేర్లు మార్చకుండా *కళ్యాణి* పేరుతో ప్రదర్శించాడు. ఈ నాటకం తెలుగు వాతావరణానికి దగ్గరగా లేకపోవడంతో ప్రదర్శనాపరంగా విజయవంతం కాలేదు. ప్రదర్శన యోగ్యతను ఇనుమడింపచేసే ప్రయత్నంలో భాగంగా స్థానిక సంస్కృతిని మిళితం చేసి కళ్యాణి నాటకాన్ని పునః ప్రదర్శించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. గోగోల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (1936) మహానుభావులు (1957), గాల్స్‌వర్దీ జస్టిస్ (1910)ను న్యాయం, బెర్నార్డ్ షా మాన్ అండ్ సూపర్‌మాన్ (1930)ను విశ్వంపెళ్ళి (1949), ప్లాటస్ ఆంఫి ట్రియోన్‌ను పాపం సోకనిపతనం (1970) పేరున తెలుగులోకి అనువదించాడు. *యమునా తీరే ఎవరికి వారే (1954), పెద్దమనుష్యులు (1954), మాయనొప్పులు (1955), పేరయ్య రాజంట, రంగభూమి, ఓ మనిషి నూతిలో పడితే (1982)* వంటి నాటక నాటికలను రచించి నాటకరంగాన్ని సుసంపన్నం చేసిన రచయిత సోమంచి యజ్ఞన్నశాస్త్రి.

దాసరిఎన్.

యవనిక: తెర. యవనిక పదానికి రూపాంతరం. రాజశేఖర కవి ప్రాకృత కర్పూరమంజరి నాటకంలో నాటక పరిచ్ఛేదాలను అంకాలనకుండా జవనికాంతరాలనడం వల్ల జవనిక పదం ప్రాకృత భాషా పదమని కొందరు అభిప్రాయపడుతున్నారు. సంస్కృత "య"కారం ప్రాకృతంలో "జ" కారంగా మారిందని తలిచారు. కాని జవనిక కూడా సంస్కృత పదమే. నాట్యశాస్త్రం బంబాయి ముద్రణలో "జవనికా" అని పాఠాంతరం కనిపిస్తోంది. జవనికా పదం "జు" అనే ధాతువు నుంచి పుట్టింది. జవంతో తోసేది గాన "జవనిక" అని వ్యుత్పత్త్యర్థం. (వివరాలకు "తెర" చూడండి)

శ్రీ.చ.

యాత్ర (జాత్ర): బెంగాల్ రాష్ట్రంలో ప్రాచుర్యం పొందిన జానపద కళారూపం. దీనికే జాత్ర అని కూడా పేరు. యాత్ర (పోవుట, ప్రయాణం) అనేది అభినయం, పాటలు, సంగీతం, నృత్యం

మొదలైన అంశాలను వినూత్నంగా, కొంచెం ఎక్కువ చేసి చూపించే జానపద కళ. ఏదైనా ప్రయాణానికి ముందు ఏర్పాటు చేసే ఉత్సవం. వివిధ దేవతల ఊరేగింపు సందర్భంగా జరిపే తంతు. ఉదాహరణకు రథయాత్ర వంటివి ఇటువంటివాటిలోకి వస్తాయి.

ఇది 16వ శతాబ్దంలో 'చైతన్య భాగవతం'లో మొదలైనట్లు బృందావన్‌దాస్ అంటాడు. చైతన్యుడే స్వయంగా రుక్మిణి పాత్ర ధరించినట్లు భావిస్తారు. కపిల వాత్సాయన్ వంటి తత్వవేత్తలు సైతం కృష్ణయాత్రకు ఇది ప్రారంభం అని నమ్ముతారు. కృష్ణయాత్రలో పాటలు, నృత్యాలతోపాటు మెరుగైన సంభాషణలు, హాస్య సన్నివేశాలు ఉంటాయి. స్త్రీ పాత్రలను కూడా మగవారే ధరించేవారు. ప్రదర్శన ఆరుబయట ఏర్పాటుచేయగా చుట్టూ ప్రేక్షకులు కూర్చుని చూసేవారు. రంగస్థలవేదిక గాని, తెరగాని ఉండేవి కావు. ఒక్కోసారి ప్రేక్షకులు, కళాకారుల మధ్య సంభాషణలు సాగాయి.

కృష్ణయాత్ర ఇతర నాటకాల వలె కాక తొమ్మిది రసాలలో శృంగార రసానికే ప్రాధాన్యం ఉండేది. 17వ శతాబ్దం నాటికి కృష్ణయాత్ర అత్యంత ఆదరణ పొందింది. అద్వైత ఆచార్య శిష్యుడైన చంద్రశేఖరదాస్ కృష్ణయాత్రకు సంబంధించిన కొన్ని అంశాలను తయారుచేయగా వాటిలో మొదటిది హరివిలాస్. చైతన్యుని ప్రభావం ఎంత ఎక్కువ అయ్యిందంటే కొన్ని సందర్భాలలో కృష్ణయాత్రను చైతన్య యాత్ర అని పిలిచారు.

18వ శతాబ్దం నాటికి శక్తియాత్ర, నాధయాత్ర, పాలయాత్ర వంటి ఇతర పద్ధతులు ఏర్పడినా కృష్ణయాత్ర, చైతన్య యాత్రలు మాత్రం ఎక్కువ ప్రాధాన్యత పొందాయి. ఈ సమయంలోనే నారద, వ్యాస వంటి హాస్య పాత్రలు జత చేరాయి. ఇదే సమయంలో వివిధ యాత్రా బృందాలు కూడా ఏర్పడ్డాయి.

'యాత్ర' ప్రదర్శనలను దేవాలయాల ప్రాంగణాల లోను, ఉత్సవాలలోను ప్రదర్శించేవారు. 16వ శతాబ్దంలో చదును నేలపైనే ప్రదర్శనలు సాగి 18వ శతాబ్దం నాటికి ఎత్తైన రంగస్థలం ఏర్పాటు వంటివి చోటుచేసుకున్నాయి. రాత్రిపూట వెలుతురు సరిగా ఉండదు కాబట్టి ప్రదర్శనలను పగలే ఏర్పాటు చేసేవారు. ప్రదర్శనలలో సంగీతం ప్రధానపాత్ర కాగా, ఢోలక్, మందిర, కర్‌తాల్, ఖోల్ వంటి సంగీత వాయిద్యాలను వినియోగించారు. అధికారి అనబడే బృందం నాయకుడు వాచకునిగా ఉండేవాడు. పాటల గురించి, సన్నివేశాల గురించి, సన్నివేశాల మధ్య విరామాన్ని వివరిస్తాడు. 18వ శతాబ్దంలో యాత్ర విష్ణుపూర్, బుర్ద్వానే, బీర్‌భం, నదివా, జస్సోర్ వంటి ప్రాంతాలలో ప్రాచుర్యం పొందింది.

19వ శతాబ్దం ప్రథమార్థం నాటికి యాత్ర బాగా అసభ్యంగా తయారైంది. తరువాతి కాలంలో మదన్‌మోహన్ ఛటోపాధ్యాయ అనేక సంస్కరణలు చేశాడు. అసభ్య పదజాలాన్ని బాగా తగ్గించాడు. పాటల నిడివి తగ్గింది. అలాగే నృత్యాల సంఖ్య, కళాకారులు తగ్గారు. స్త్రీ పాత్రలను మగవారే ధరించేవారు. వాయిద్యాలలో వయోలిన్, హార్మోనియం, క్లారియోనేట్ వంటివి చేరాయి.

19వ శతాబ్దం చివరి వరకూ యాత్రకు కావలసిన కథా వస్తువును అధికారి రాసుకునేవాడు. తరువాత కాలంలో కథను బయటివారితో రాయించడం ప్రారంభమైంది. ఇదే సమయంలో 'వివేక్' (తెలివైనవాడు) అనే పాత్ర వచ్చి చేరింది.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జరిగిన అతి ప్రధానమైన మార్పులతో యాత్రలో దేశభక్తి అంశాలు చేరడం ఓ ప్రత్యేకత. భక్తి, శృంగారభరిత అంశాలు ప్రాధాన్యత కల్గి ఉన్నప్పటికి దేశభక్తి అంశాలు కూడా ప్రదర్శింపబడేవి. ముకుందాస్ (1878-1934) నేతృత్వంలోని స్వదేశీ యాత్ర బృందం విదేశీ పాలనకు వ్యతిరేకంగా ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టింది. దేశభక్తిని రగిల్చే అనేక అంశాలను రూపొందించి ప్రదర్శించసాగారు. విదేశీ పాలన అంతమయ్యే సమయానికి యాత్రలో భక్తి, కరుణ రసాలకంటే దేశభక్తికే ప్రాధాన్యత ఎక్కువైంది. ఇదే సమయంలో చోటుచేసుకున్న అతిపెద్ద మార్పు స్త్రీలు ప్రదర్శనల్లో పాల్గనడం.

1947లో జరిగిన బెంగాల్ విభజన వల్ల యాత్ర కళారూపం తీవ్రంగా నష్టపోయింది. ఒక సమయంలో యాత్రను రచించేవారే కరువయ్యారు. అయితే దక్షిణ బెంగాల్‌లో యాత్ర ప్రదర్శనలు కొనసాగాయి.

ప్రస్తుతం యాత్రను దీర్ఘచతురస్రాకారంలో ఉండే వేదికపై ప్రదర్శిస్తున్నారు. వేదిక చుట్టూ ప్రేక్షకులు కూర్చుంటారు. సంగీత వాద్యకారులు వేదికకు ఇరువైపులా ఎదురెదురుగా కూర్చుంటారు. సాధారణంగా ప్రదర్శనకు రెండు గంటల ముందు ఒక గంట మోగుతుంది (రాత్రి 9-10 ప్రాంతంలో). ఇది ప్రదర్శన సంకేతం. కొంచెంసేపు తరువాత రెండవ గంట మోగడంతో వాయిద్యకారులు సంగీతం మొదలుపెడతారు. ఇంకొంచెం సేపు తరువాత మూడవ గంట మోగడంతో యాత్ర ప్రదర్శన మొదలవుతుంది. మొత్తం సభ్యులందరు కలిసి దేశ భక్తిగేయాన్ని ఆలపిస్తారు. తరువాత దాదాపు ఒక గంటసేపు పాటలు, పద్యాలు, నృత్యాలు, హాస్య సన్నివేశాలుంటాయి. నాల్గవగంట మ్రోగడంతో అసలైన యాత్ర ప్రదర్శన మొదలవుతుంది.

దాదాపు నాలుగు గంటలపాటు సాగే యాత్ర ప్రదర్శనలను ఐదు దఫాలుగా ప్రదర్శిస్తారు. ఒక్కోసారి ఒక్కోగంట మోగుతుంది. ఆ భాగం సమాప్తమైందని దీని అర్థం. మధ్యలో పాటలు, నృత్యాలు, హాస్య సన్నివేశాలు చోటుచేసుకుంటాయి. దీనిలో దాదాపు అరవైమంది వరకు ఉంటారు.

వారిలో నటులు, పాటలు పాడేవారు, వాయిద్యకారులు, నృత్యకారులు, నిర్వాహకులు, వంటవారు, పనివారు మొదలైనవారుంటారు. యాత్ర బృందం ప్రాధాన్యత దానిలో పాల్గనే వ్యక్తులను బట్టి ఉంటుంది.

గతంలో యాత్ర ఎంతో ప్రాచుర్యం పొందినా ప్రేక్షకుల అభిరుచులు మారుతుండడం వల్ల యాత్ర ప్రాధాన్యత బాగా తగ్గిపోయింది. మారుతున్న కాలానికి అనుగుణంగా యాత్ర విధానాలు కూడా బాగా మార్పు చెందాయి. చారిత్రక, పురాణ గాథల బదులు సాంఘిక అంశాలు చేరాయి. మైకులు, దుస్తులు, వాయిద్యాలు, ఆహార్యం, రంగస్థలవేదిక, లైట్లు వంటి ఆధునిక పద్ధతులు ఈ ప్రదర్శనలో వచ్చి చేరాయి. చలనచిత్రాలు, టీ.వి. ధాటికి నిలదొక్కుకుంటూ జాత్ర కళారూపం ఇప్పుడు కూడా తన అస్తిత్వాన్ని కాపాడుకొంటూ వర్థిల్లుతూనే ఉంది. ప్రజల అభిరుచుల్లో ఎన్ని మార్పులచ్చినా 'జాత్ర' నేటికీ ప్రజలను అలరిస్తూ ముందుకు సాగుతూ ఉంది.

సుధాకర్

యురిపిడీస్ (క్రీ.పూ. 480-406) : గ్రీకు విషాద నాటక కర్తలలో చివరివాడు. ఈయన 92 నాటకాలు రాసినట్లు తెలుస్తోంది. వానిలో 17 మాత్రమే లభ్యమవుతున్నాయి. అందులో ఆల్‌సెస్టిస్ *(438)* మోదియా *(431)*, హిప్పోలిటస్ *(428)*, అయాన్ ఎలెక్ట్రా, ది ట్రోజన్ విమెన్, ది బాకే ఉత్తమశ్రేణికి చెందిన నాటకాలుగా ప్రసిద్ధి చెందాయి. చివరి నాటకం అతని మరణానంతరం ప్రదర్శితమైంది. సాటిర్ నాటకాలలో సైక్లోప్స్ అనేది మాత్రమే లభ్యమౌతున్నది. యురిపిడిస్ జీవించిన కాలంలోకంటె మరణానంతరమే అతని నాటకాలకు మంచి ప్రాచుర్యం లభించటం విశేషం. అంతకు పూర్వం నాటకాలలో కోరస్‌కి ఉన్న ప్రాధాన్యాన్ని తగ్గించి నాటకీయతకు పెద్దపీట వేశాడు. నాటక నిర్మాణంలో వాస్తవికతకు ప్రాముఖ్యం ఇచ్చే క్రమంలో దేవుడి అస్థిత్వాన్ని ప్రశ్నించడమే కాక వీలుచిక్కిన సందర్భాలలో దేవుడ్ని చులకన చేయడం, అశక్తుడిగా చిత్రించడం, ఏథెన్స్ గౌరవించే ఆదర్శాలను త్రోసిరాజనడం చేశాడు. మెలోడ్రామాను విడిచి మనస్తత్వ పరిశీలనతో కూడిన పాత్రచిత్రణ నవ్యతను తెచ్చి పెట్టింది. నాటక పోటీలలో యురిపిడీస్‌కు అయిదుసార్లు బహుమతి వచ్చింది. ఇది ఎస్కిలస్, సోఫోక్లిస్ బహుమతుల సంఖ్యతో పోల్చుకుంటే చాలా స్వల్పమే. నాటక నిర్మాణం లోపభూయిష్టంగా ఉందని సమకాలీన విమర్శకుల అభిప్రాయం. యురిపిడీస్ మరణంతో గ్రీకు విషాదాంత నాటకాల మహోజ్వల యుగం ముగిసింది. యురిపిడీస్ మోదియా, ఎలక్ట్రా నాటకాల్ని గోవిందరాజు రామకృష్ణారావు తెలుగులోకి అనువదించాడు.



రమాంజనీ.

యువకళా వాహిని, (హైదరాబాద్): కొందరు ఔత్సాహిక కళాకారుల సంకల్పబలంతో యువకళావాహిని 1975వ సంవత్సరంలో హైదరాబాద్‌లో స్థాపించబడింది. దీని వ్యవస్థాపకుడు వై.కె. నాగేశ్వరరావు. మొదట్లో నాటక ప్రదర్శనలకే పరిమితమైన యువకళావాహిని కాలక్రమాన తన కార్యక్రమాలను సాహిత్య, సినీ, టి.వీ. రంగాలకు కూడా విస్తరింపజేసుకుంది. ప్రతియేటా రంగస్థలానికి విశిష్టసేవ చేసిన పెద్దలకు రంగస్థల పురస్కారాలను బహూకరిస్తున్నది. అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్తు రాష్ట్రస్థాయిలో క్రమం తప్పకుండా నిర్వహించబడటం విశేషం. సంగీత నృత్య రంగాలకు కూడా యధోచితంగా సేవ చేస్తోంది ఈ సమాజం. పి.వి. కృష్ణమూర్తి రచించిన స్వామి వివేకానంద, నేతాజి, సమ్రాట్ అశోక వంటి చారిత్రక నాటకాలను యువకళావాహిని జనరంజకంగా ప్రదర్శించి మన్ననలందుకొంది.

గం.సు.రె.

రంగం : నాటక నిర్మాణ సంబంధి. గీర్వాణ రూపక రచనలో అంకమేగాని రంగం ప్రస్తావన లేదు. సంస్కృత నాటకాలలో ఐదు అంకాలనుండి పది అంకాలవరకూ ఉంటాయి. కథా కథనాన్ని కొందరు అయిదు అంకాలతో రాస్తే కొందరు పది అంకాలుగా రాశారు. దశవిధరూపక లక్షణాను సారం అంకాల సంఖ్య మారుతూ ఉంటుంది. సంస్కృత నాటక వాఙ్మయంలో ఏకాంక పరిమితమైన రూపకాలు కూడా ఉన్నాయి. అంతేకాని అంకవిభజన లేదు. అంటే అంకాలను రంగాలుగా విభజించే సంప్రదాయం లేదు. స్థల, కాల భేదాన్ని సూచించవలసిన చోట సూత్రధారునితో చెప్పించడమో, లేదా పాత్రలతో సూచించబడటమో, అదీ కాకపోతే అర్థోపక్షేపకాల ద్వారా వివరించడమో జరుగుతుంది. రంగం పూర్తిగా అర్వాచీన సంప్రదాయమే. పాశ్చాత్య ప్రభావ జనితమే. పాశ్చాత్య సాహిత్యం భారతీయులకు అందుబాటులోకి వచ్చిన తరువాత, షేక్స్పియర్ వంటి రచయితల నాటకాలలో అంకాలను రంగాలుగా విభజించే పద్ధతిని గ్రహించి, ఆంధ్ర రచయితలు పాశ్చాత్య ప్రభావానికి లోనయ్యారు. ప్రథమాంధ్ర నాటక కర్తలైన ధర్మవరం రామకృష్ణమాచార్యులు తమ నాటకాల్లో అంకాలను రంగాలుగా విభజించి రాశారు. విషాద *సారంగధర*, చిత్రనళీయం నాటకాల్లోనూ, వేదం

వేంకటరాయ శాస్త్రి ప్రతాపరుద్రీయం లోనూ, గురజాడ అప్పారావు కన్యాశుల్కం లోనూ అంకవిభజన కన్పిస్తుంది. ఈ పద్ధతిని పద్య నాటక రచయితలలో అధిక సంఖ్యాకులు పాటించారు. ఇక సాంఘికనాటకాల విషయానికొస్తే, కన్యాశుల్కం నాటకాన్ని అనుసరించి నాటక కర్తలు చాలామంది అంక విభజనను పాటిస్తూ వచ్చారు. అయితే, కాలక్రమేణా ఈ పద్ధతిలోకూడా మార్పొచ్చింది. అంకాలను కేవలం రంగాలుగానే వ్యవహరిస్తూ వచ్చారు. అంకం అనే పేరు పద్య నాటకాలకు, రంగం అనే పేరు సాంఘిక నాటకాలకు పరిమితమవుతూ వచ్చింది. 1950 నుంచి అంకం పేరు సాంఘిక నాటక రచయితలు వాడటం మానేశారు. అంటే నాటకాల్లో రంగ విభజన లేదని కాదు. స్థల, కాలాదులు రంగోద్దీపనం ద్వారా దృగ్గోచరం చేస్తున్నారు. రంగాల సంఖ్య కూడా మారుతూ వచ్చింది. పది పన్నెండు రంగాలతో కూడిన నాటకం నాలుగు, ఐదు రంగాలకూ కుదించడం జరిగింది. ఆచార్య ఆత్రేయ మరీ ముందుకు పోయి రెండు రంగాలతోనే కప్పలు నాటకం రాశాడు. భయం ఒకే రంగంతో నడిచే నాటకమే. మార్పును సూచించడానికి లైట్స్ ఆఫ్ చేసి, లైట్స్ ఆన్ చేసే ప్రక్రియను వాడుకోవడం జరుగుతూ ఉంది. సన్నివేశ స్థలం మార్పును అట్టముక్కల మీద పేర్లురాసి ఎదురుగా ఉన్న తెరకు అంటించడం ద్వారాను, కాలం మార్పును కాంతి ప్రసారం ద్వారా సూచిస్తున్నారు. ఏకాంక నాటిక అయినా దానిలో అనేక రంగాలు అంతర్భాగమై ఉండటం నేటి నాటక రచనలోను, ప్రదర్శనలోను ప్రస్ఫుటమయ్యే పరిణామం, నవ్యత.

గం.సు.రె

రంగ ప్రకాశనం : వస్తువులు స్పష్టంగా కనిపించాలంటే వాటి మీద తగినంత కాంతి ప్రసరించవలసి ఉంటుంది. అలాగే రంగస్థలం మీది నటీనటులు, వారి కార్యకలాపాలు, పరికరాలు మొదలైనవి విస్పష్టం కావాలంటే తగినంత కాంతి రంగస్థలం మీద అవసరం. దీపాల సహాయంతో రంగస్థలం మీదకు వెలుతురును ప్రసరింపచేయడాన్నే రంగ ప్రకాశనం అంటారు.

నటీనటుల ముఖాలు, తదితర వస్తు సామగ్రి పగటి వేళ కనపడినట్లే స్పష్టంగా కనిపించడానికి వివిధ కోణాల నుంచి వెలుతురును ప్రసారం చేసే దీపాలను ఆయా స్థలాలలో అమర్చుకోవాలి. దీనిని రంగప్రకాశన యంత్రాంగం అంటారు. రంగాన్ని బట్టి వెలుతురు తీక్షణత మారుతూంటుంది. చీకటిలో నుంచి మనం వెలుతురులోకి వస్తే కళ్లు జిగేల్ మంటాయి. వెలుతురు నుంచి చీకట్లోకి వెళ్తే కళ్ళు మసమసక లాడతాయి. అందువల్ల రంగస్థలం మీద దీపాలు వెలిగించే ముందు ప్రేక్షక స్థానంలోని దీపాలు ఆర్పి వేస్తే రంగస్థలం ప్రేక్షకులకు ఇంకా ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

ప్రయోజనాలు: రంగస్థలం మీద వెలుతురు ఏడు విధాల ఉపయోగపడుతుంది. 1) నటీనటుల ముఖాలు, వారి కార్య కలాపం, పరికరాలు మొదలైనవి స్పష్టంగా కనిపించటం ముఖ్య ప్రయోజనం; 2) రంగస్థల దృశ్యానికి రమణీయత చేకూర్చడం, 3) రంగుల సహాయంతో శృంగార, వీరాది రసాలను ఆవిష్కరించడం; 4) రంగస్థలం మీది పాత్ర మీదగాని, వస్తువు మీద గాని ప్రేక్షకుల దృష్టిని కేంద్రీకరింప చేయడం; 5) సూర్యరశ్మి మెరుపులు, ఆకాశం, చంద్రుడు, నక్షత్రాలు మొదలైనవి చూపడం; 6) ఆకృతులలో సౌమ్యత కలిగించడం. అంటే భావం వ్యక్తం కాని మొద్దు మొహాల మీద కొన్ని కొన్ని కోణాల నుంచి వెలుతురు ప్రసరింప చేసి కావలసిన భావం ద్యోతకం చేయడం; 7) ఋతువు, వేళ, వాతావరణం మొదలైనవి తెలియచేయడం.

వెలుతురును రంగస్థలం మీద ప్రసరింప చేసేముందు మూడు విషయాలు మనసులో పెట్టుకోవాలి. 1) కథా సందర్భాన్ని బట్టి కాంతికి మూలాధారాన్ని తెలుసుకోవాలి (కథ జరిగే కాలం పగలైతే సూర్యకాంతి, రాత్రి వేళైతే వెన్నెల కాక దీపాల కాంతి). మూలాధారం నిర్ణయించుకొని తదనుగుణమైన కాంతిని ప్రసరింప చేయాలి. 2) కాంతి పై నుంచి దిగువకు ప్రసరిస్తుందనే విషయం జ్ఞప్తిలో ఉంచుకోవాలి. పాదతల దీపాలకంటే ఉపరితల దీపాలు ఎక్కువగా ఉపయోగపడతాయి. 3) సెలోఫేన్ కాగితం వాడి తీరాలి. సహజకాంతి అంటే సూర్యకాంతి తెలుపురంగుకు దగ్గరగా ఉంటుంది. కృత్రిమ కాంతి అంటే దీపాలకాంతిలో ఎరుపు, పసుపుపచ్చ రంగులు ఎక్కువగా ఉంటాయి. ఈ తారతమ్యాన్ని తొలగించి సూర్యకాంతిరంగును స్ఫురింప చేయడానికి సెలోఫేన్ కాగితం వాడవలసి ఉంటుంది.

కాంతి ప్రసరణ సూత్రాలు : 1) నటీనటులు ముఖాలు, వస్తు సామగ్రి స్పష్టంగా కనిపించేందుకు కొన్ని దీపాలు కేటాయించి వాటి వాటి స్థానాలు నిర్ణయించుకోవాలి; 2) కొన్ని దీపాలు నటీనటుల కోసం ప్రత్యేకించాలి; 3) కొన్ని దీపాలు రంగసజ్జ, రంగాలంకరణ స్పష్టంగా కనిపించడానికి కేటాయించాలి; 4) వెనక దృశ్యాన్ని బట్టి తరువాత దృశ్యం వెలుతురు, కాంతి తీక్షణత నిర్ణయించుకోవాలి; 5) రంగస్థలం మీద ఉపయోగించే దీపాలు ప్రేక్షకుల కంటికి కనపడకుండా అమర్చుకోవాలి. దీన్నిబట్టి నటీనటుల స్థానాలు నిర్ణయించాలి; 6) దీపాల సంఖ్య వాటి కాంతి తీక్షణత, రంగస్థల వైశాల్యాన్ని బట్టి నాటక ప్రత్యేక అవసరాలను బట్టి నిర్ణయించాలి.

వెలుతురు కొంత స్థలాన్ని ఆక్రమిస్తుంది. ఒక్కొక్క బిందువు వద్ద ఎక్కువగా కేంద్రీకృతమవుతుంది. ఈ వెలుతురు రూపాన్ని ప్రసారం అంటారు. పరావర్తనం, వక్రీకరణం చెందినపుడు ప్రతి కాంతి కిరణం సరళరేఖలో ప్రయాణిస్తుంది. కాంతి కిరణంలో లోహపు నాణెం ఉంచితే ఒకవైపు ప్రకాశవంతంగా

ఉంటుంది. రెండవవైపు నల్లగా ఉంటుంది. రంగ ప్రకాశనంలో దిక్కు ప్రధానాంశం. అందువల్ల తెలివిగా దిక్కును ఉపయోగించుకోవాలి.

కాంతి సాధనాలు సాధారణంగా శంఖాకార కిరణాలను జనింపచేస్తాయి. శంఖాకారం విస్పష్టంగా ఉంటే ఆ వెలుతురును 'వాడి అంచు' అని, శంఖాకార కాంతి అంచులు మసక మసకగా ఉంటే 'మెత్తని అంచు' అనీ అంటారు. ఈ శంఖాకార కాంతి నుంచి తప్పించుకొని బయటపడ్డ వెలుతురును 'చిందిన వెలుతురు' అంటారు.

వివిధ కాంతి సాధనాలు : రంగ ప్రకాశనానికి ఉపయోగపడే కాంతి ప్రసార సాధనాలు రెండు రకాలు. 1) కాంతిని అవసరమైన ప్రదేశానికి ప్రసారం చేయాలి. ఉదాహరణకు కేంద్రీకరణ దీపం. 2) కాంతిని రంగమంతటా వెదజల్లేవి. ఉదాహరణకు వెల్లువ దీపం.

కేంద్రీకరణ దీపం (స్పాట్ లైట్) : రంగస్థలం మీది పాత్ర ముఖ కవళికను గాని, వస్తువును గాని ప్రేక్షకులకు విస్పష్టంగా కనిపించేటట్టు చేయడానికి ఉపయోగించే దీపం. రంగస్థలం మీదికే గాక ఆ స్థలం వెనక ఉండే మనుషులు, వస్తువులు, జరిగే క్రియలను చూపడానికి, కిటికీలు, దర్వాజాల ద్వారా కాంతిని ప్రసరింపచేయడానికి ఇది ఉపయోగపడుతుంది. దీంట్లో కటకం అమర్చడం వల్ల కాంతి వస్తువు మీద కేంద్రీకృతమవుతుంది. కేంద్రీకరణ దీపాలు మూడు రకాలు. అవి 1) గుండ్రని అద్దం, ఉభయోన్నతోదర లేక సమోత్తాన కటకంతో అమరిఉంటుంది. ఈ రకం దీపం. పెద్దది. అసంతృప్తికరం, కాబట్టి నిరుపయోగకరం. 2) ఇందులో గుండ్రని అద్దం, ఏక కేంద్ర ఉంగరాలతో అమర్చిన సమతల కటకం, అమర్చిన కేంద్రీకృత దీపం. ఇది చిన్నది. నాణ్యమైనది. కటకం వైపుకు దీపం కదిలిస్తే కాంతిపుంజం వెడల్పుగా పడుతుంది. కటకాన్ని దూరంగా తీసుకువెడితే కాంతిపుంజం సన్నగా పడుతుంది. 3) మూడవ రకం కేంద్రీకరణ దీపంలో ముందు మినహా దీపం చుట్టూ అద్దం ఉంటుంది.

వెల్లువ దీపం : ఈ దీపం ద్వారా వచ్చే వెలుతురు నీటి వెల్లువ లాగా ప్రసరిస్తుంది. కాబట్టి ఈ దీపానికి వెల్లువ దీపం అని పేరు వచ్చింది. ఈ రకం దీపంలో ముందుభాగం తప్ప, తక్కిన భాగమంతటా అద్దం అమర్చి ఉంటుంది. వెల్లువ దీపం విశాలంగా, శంఖాకార వెలుగును ప్రసరిస్తుంది. అయితే, ఇందులో వెలుతురు ఎక్కువగా చిందిపోతుంది. కాని, తక్కిన వాటి కంటే వెలుతురు వృథా పోవడం తక్కువ. దీని వెలుతురు ప్రసారం అదుపులో పెట్టలేము.

ఈ రకం దీపాలను రంగస్థలం ఇరువైపుల అమర్చితే వాటిని పక్క వెల్లువ దీపాలంటారు. అటకటి, ఇటకటి అమర్చితే నటుల కుడి ఎడమల మీద మాత్రమే వెలుగు పడుతుంది. నటులు రంగస్థలం మధ్యకు వచ్చినపుడు వారి ముఖాలు వెలవెల పోతాయి. వెనక తెర మీద నటుల నీడలు పడతాయి. ఈ నీడలను పరిహరించి నటుల ముఖాలు బాగా కనిపించేటట్టు చేయడానికి రంగస్థలానికి ముందు భాగంలో దీపాలు అమర్చాలి. 500 వాట్సు గల బల్బులను వాడితే చాలు.

రంగాభిముఖ దీపం : ఈ దీపం ప్రేక్షక స్థానం ముందు నుంచి రంగస్థలం మీద వెలుతురు పడేట్లు అమర్చాలి. ఇలాంటివి కనీసం నాలుగు దీపాలు అమర్చడం మంచిది. రంగస్థలం ముందు భాగంలోని నటులు స్పష్టంగా కనిపించడానికి కావలసినంత మేర ప్రకాశవంతం చేయడానికి ఉపయోగపడతాయి. కొన్ని కొన్ని నాటకశాలల్లో వీటిని బాల్కనికి కూడా కడతారు.

పాదతల దీపాలు : రంగస్థలం ముందుఅంచు వెంబడే అమర్చే దీపాలు. ఇవి రంగస్థలానికి సమతలంలో ఉండాలి. ఎత్తుగా ఉంటే పాత్రను ఆచ్ఛాదిస్తాయి. సమతలంలో ఉంటే వాటి కాంతి సాధారణంగా పైకి ప్రసరిస్తుంది. నటులు దగ్గరగా ఉంటే బాగా ఉపయోగపడతాయి. దూరమైనకొద్దీ కాంతి కిరణాలు నటులను అధిగమించి నిరుపయోగమవుతాయి. అందువల్ల వీటిని ఉపయోగించడం తగ్గించి రంగస్థలం పక్కలకు కేంద్రీకరణ దీపాలు వాడటం మంచిది. ఉపరితల దీపాల వల్ల నటులు ముఖాల మీద పడే నీడలను వీటి వల్ల పోగొట్టవచ్చు.

ఉపరితల ముఖ దీపాలు : ఈ దీపకాంతి ప్రసారం వల్ల నటుల ముఖాలు, ముందు భాగాలు విస్పష్టంగా కనిపిస్తాయి. ఈ దీపాల సంఖ్య రంగస్థలం పొడవు మీద, పక్క దీపాల కాంతి ప్రసరణ వైశాల్యం మీద ఆధారపడి ఉంటుంది. సామాన్యంగా ఈ దీపాలు 500 వాట్సువి మూడు చాలు. నాలుగు బల్బులు ఉపయోగిస్తే 300 వాట్సువి చాలు. పార్శ్వ వెల్లువ దీపాలు, ముందు దీపాలు రంగస్థలం మట్టం నుంచి 9 అడుగుల తక్కువగాని ఎత్తులో 40 డిగ్రీల కోణంలో అమర్చాలి. ఇలా అమరిస్తే కాంతి, నీడలు, వెనక తెర మీద పడవు.

రంగస్థలం ఉపరిభాగంలో లోతును బట్టి దండ దీపాలు కావలసినన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల నటుల నీడలు రంగం మీద పడే ప్రమాదం ఉంది కాబట్టి ఇవి తక్కిన వాటికంటే తక్కువ కాంతివంతమై ఉండాలి.

అధోదీపాలు : 6 నుంచి 8 అడుగులు పొడవు గల కొయ్య బద్దకు గాని, పొడవైన కొయ్యపెట్టెలో గాని వీటిని అమర్చాలి. గగనికను కింద నుంచి ప్రకాశమానం చేయడానికి ఇవి ఉపయోగపడతాయి.

ప్రక్షేపయంత్రాలు : మేఘాలు, మెరుపులు, నీటి అలలు మొదలైన ఫలితాలను వెనకతెర మీద స్లైడ్‌ల ద్వారా చూపడానికి ఈ యంత్రాలు ఉపయోగపడతాయి.

మందకాలు : కాంతి తీక్షణతను ఎక్కువ తక్కువలు చేయడానికి

ఈ యంత్రాలు ఉపయోగపడతాయి. క్రమంగా ఉదయమవుతున్నట్లు, సాయంకాల మవుతున్నట్లు చూపడానికి వీటిని వాడతారు.

అభినయావరణ దీపం : కేంద్రీకరణ దీపం, వెల్లువ దీపం మొదలైన వాటి కాంతి వల్ల రంగస్థలం మూడువైపుల మాత్రమే చూడగలుగుతాం. ఈ అభినయావరణ దీపకాంతి వల్ల రంగస్థలం లోతు తెలుస్తుంది. నటులకు, వెనక తెరకు మధ్య ఉన్న దూరం స్పష్టంగా కనపడుతుంది. ఉపరితల దీపాల వల్ల పడే నీడలు ఈ దీపాల వల్ల సమసిపోతాయి. ముందుభాగంలో ఉపయోగించే బల్బుల శక్తిలో మూడవవంతు శక్తి మాత్రమే గల బల్బులు చాలు. వీటిని రంగస్థలానికి మధ్యగా కట్టిన జాలరుకు ఒక అడుగు దూరంలో 11 అడుగులకు తక్కువ కాని ఎత్తులో కట్టాలి.

ప్రసారం ఖాయిదా : ప్రసారం అదుపులో ఉంచడం, మనం ఉపయోగించే దీపాల సంఖ్య, రకం వాటి మార్పుల మీద ఆధారపడి ఉంటుంది. సీనరీ, దుస్తులు, సమీకరణ కూడా ప్రసారంలో ప్రాధాన్యం వహిస్తాయి.

రంగు ఖాయిదా : మనం ఉపయోగించే దీపం ముందు గాజు లేక తగరు కాగితాలు పెట్టి రంగును అదుపులో పెట్టవచ్చు. ఈ కాగితాలను, గాజు పలకలను సాధనాలు అంటారు. ఇవి 70 రకాలు దొరుకుతాయి.

కాంతి తీక్షణతను అదుపులో పెట్టడానికి వస్తువు, దీపం మధ్య దూరం మార్చడం ఒక పద్ధతి. దీపానికి దగ్గరగా వస్తువును పెట్టి క్రమంగా దూరానికి జరిపితే తీక్షణత గబగబా తగ్గి పోతుంది. వెల్లువ దీపాలు, కేంద్రీకరణ దీపాలు ద్వారాలను అట్టముక్కలతో ఆచ్ఛాదించి కాంతి మందంగా వచ్చేటట్టు చేయవచ్చు.

అభినయావరణను ప్రకాశవంతం చేయడానికి కేంద్రీకరణ దీపం ఉత్తమమైంది. రంగస్థలం మీది నటుని మీద వివిధ కోణాల నుంచి కాంతి ప్రసరింపచేస్తే నీడలను పోగొడుతుంది. ఆకారానికి సరిపోయేటట్లు కత్తిరించిన చదును అట్టముక్క లాగా నటుడు కనిపిస్తాడు. దీపం ఇంకోవైపుకు మరల్చి కాంతి ప్రసరింపచేసినపుడు 45 డిగ్రీల అక్షరేఖలోని కాంతి పుంజం ఎక్కువ కాంతిని ప్రసరింప చేస్తుంది. నటునితో సమ ఎత్తున దీపం పెడితే నీడలను ప్రసరింపచేస్తుంది.

రంగస్థలం దిగువ ప్రదేశాలను ప్రకాశవంతం చేయడానికి ప్రేక్షకాగారంలో కప్పు దగ్గర దీపాలు ఏర్పాటు చేయాలి. ఈ దీపాలను కృత్రిమ దూలంలో దాచి ఉపయోగించవచ్చు లేదా లోకప్పు నుంచి వేలాడదీయవచ్చు.

కాంతి మిశ్రమణం : ప్రతి ప్రదేశం ప్రకాశవంతం కావాలంటే రెండు కేంద్రీకరణ దీపాలు ఉపయోగించాలి.

భూమికా ప్రకాశనం : చాలా రంగాలకు ఇతర కాంతి కావాలన్నా, సెట్టురంగును అదుపులో పెట్టాలన్నా పాదతల దీపాలను ఉపయోగించవలసి ఉంటుంది. పాదతల దీపాల రంగును మార్చి సెట్టు రంగును ఎరుపు నుంచి ఊదాకు మార్చడం కాని, ఎర్ర రంగు నుంచి ఊదాకు కాని మార్చగలుగుతాం. కేంద్రీకరణ దీపాల నుంచి వచ్చే కాంతి ఎక్కువ తేజోవంతమైంది కాబట్టి పాదతల దీపాల నుంచి వచ్చి పడే కాంతి నటుల మీద కాని, వారి దుస్తుల మీద కాని ఫలితాలనివ్వదు. అయితే కాంతి కింద నుంచి పైకి ప్రసరించడం వల్ల నటుల మొహాల కింది భాగం మీది నీడలను పోగొడుతుంది. ఇందుకే పాద దీపాలను వాడతారు.

నేపథ్య తెరలు : సెట్టు మీది కిటికీలకు, దర్వాజాలకు వెనక నేపథ్యంలో అమర్చే తెరను వెల్లువ దీపాలలో తేలికగా ప్రకాశవంతం చేయవచ్చు. ఒక్కొక్కప్పుడు వెల్లువ దీపానికి మంచు రంగు సాధనం అమర్చి నేపథ్య తెరకు సూటిగా కాంతిని ప్రసరింపచేస్తారు. అయితే నటులు నేపథ్యంలోని స్థలాన్ని ఉపయోగిస్తే నీడలు పడతాయి. సెట్టు చివరిభాగం మీద దీపాన్ని గురిపెట్టి పరావర్త కాంతిని నేపథ్య తెరను ప్రకాశింప చేసేటట్టు చేస్తే నీడలు పడవు.

గగనిక : గగనిక లేక ఆకాశతెర పై భాగాన్ని సామాన్యంగా వెల్లువ దీపాలతో ప్రకాశమానం చేస్తారు. ఆకాశ తెరలోని ఏ చిన్న ప్రదేశానికైనా రెండు వెల్లువ దీపాలు కావాలి. ఏ పరిమాణం గల ఆకాశ తెరకైనా కనీసం నాలుగు లేక ఆరు వెల్లువ దీపాలు అవసరం. ఆకాశరంగు మారడం చూపించాలంటే రెండు మూడు జట్ల వెల్లువ దీపాలు వాడాలి. అసలు ఆకాశం కింది భాగం లేత రంగులో ఉంటుంది. ఇది చూపించాలంటే ఆకాశ తెర కింది అంచు నుంచి మూడు లేక నాలుగు అడుగుల దూరంలో వెల్లువ దీపాల వరుసను నెలకొల్పాలి. వీటిని దిఙ్మండల శకలాలు అంటారు. సూర్యాస్తమానం చూపడానికి కూడా ఈ శకలాలు ఉపయోగిస్తారు.

దీపాల ఏర్పాటు : ఒకానొక నిర్దిష్ట ప్రదర్శనానికి దీపాల ఏర్పాటును తెలియచేసే నమూనా పటం స్థలకం నమూనా పటం ట్రేసింగ్ కాగితం మీద గీయాలి. దీపాలను గుర్తు పెట్టాలి. ఈ గుర్తు పక్క దీపం పేరు రాయాలి. దీనివల్ల దీపం ఏయే ప్రదేశాల మీద వెలుతురును ప్రసరింప చేస్తుందో తెలుస్తుంది. కేంద్రీకరణ దీపాల కాంతి ఏయే ప్రదేశాల మీద ప్రసరింపచేయాలో ముందుగా గుర్తు పెట్టుకోవాలి.

సెట్టు ఒకేవైపున లోతుగా లేకపోతే రంగస్థలం ఎగువ భాగాన్ని ప్రకాశవంతం చేయనక్కరలేదు. అలాగే కావలసిన వెల్లువ దీపాల సంఖ్య, స్థలం నిర్ణయించి గుర్తు పెట్టుకోవాలి. గగనిక

పైన వేళ్లాడగట్టవలసిన వెల్లువ దీపాల సంఖ్య నిర్ణయించి రంగస్థలం మీద, వాటి ఎగువ దిగువ దూర భాగాలు, రంగస్థలం భూమి నుంచి ఎత్తును గుర్తించాలి. సీనరీ దృష్టి రేఖలు వీలైనంత దిగువన, సాధ్యమైనంత తక్కువ ఎత్తున వేళ్లాడదీయాలి. ఆ తరువాత దిఙ్మండల శకలాలలో ఎన్ని భాగాలు ఉపయోగించవలసిందీ నిర్ణయించి వాటిని సాధ్యమైనంత దిగువన నెలకొల్పాలి.

కాంతి ఖాయిదా బల్ల : ఒక్కొక్క విద్యుత్ప్రవాహికకు సరఫరా అయ్యే విద్యుత్తును ఖాయిదాలో ఉంచే ఏర్పాటే కాంతి ఖాయిదా బల్ల. ఇందులో స్విచ్చులు, ఫీజులు, మందకాలు, కనెక్టర్లు మొదలైనవి ఉంటాయి.

స్విచ్చులు : ఇవి దీపాలు ఆర్పడానికి, వెలిగించడానికే గాక విద్యుత్ప్రవాహ మార్గం మార్చడానికి కూడా ఉపయోగపడతాయి.

ఫ్యూజులు : సంరక్షక సాధకాలు. ఇవి అగ్ని ప్రమాదం నుంచి రక్షించి, హై ఓల్టేజి నుంచి సాధకాలను సంరక్షిస్తాయి.

మందకాలు : ఇవి విద్యుత్ప్రవాహాన్ని ఖాయిదాలో పెడతాయి.

కనెక్టర్లు : కాంతి సాధనాలను ఖాయిదా బల్లకు కలిపే తీగలు.

శ్రీ.చ.

రంగముని, డి (జ.1953) : నటుడు, సంగీత దర్శకుడు. శ్రీ శ్రీరంగ మాధురి కళాలయం స్థాపకుడు. 1953, జూన్ 1న కర్నూలు జిల్లా కనకవీడులో వెంకమ్మ, రామకృష్ణయ్య దంపతులకు జన్మించాడు. ఈయన తండ్రి సాహిత్యం, కళల పట్ల మక్కువ కనబరచడంతో రంగముని కూడా చిన్నప్పుడే కళల పట్ల అభిమానం పెంచుకున్నాడు. బి.ఎ. చదువుకుని ఆర్.టి.సి.లో కండక్టర్‌గా పని చేస్తున్నా ప్రవృత్తి మాత్రం కళా రంగానికి సేవ చేయడమే. కళల పట్ల మక్కువ పెరగడానికి స్ఫూర్తి, ఆదిగురువు తండ్రే, సంగీత గురువు మద్దికెర లింగన్న. *చింతామణి* లో భవానీశంకరుడు, *చీకటి తెరలు*లో మురళి, *పుటుక్కు జరజర డుబుక్కుమే* లో ప్రసాదం, *బావా ఎప్పుడు వచ్చితీవూ*లో అన్నయ్య, *యక్షగానం* లో సీత, సురేష్, రుక్మిణి పాత్రలు ఈయనకు నటుడుగా పేరు తెచ్చాయి. ఈ నాటకాలన్నీ లలిత కళా సమితి (కర్నూలు) పక్షాన ప్రదర్శించినవే. లలిత కళా సమితి తరపున బబ్బిలి యుద్ధం, యమాంజనేయ యుద్ధం, రసమాధురి పక్షాన సీతా కల్యాణం, శ్రీ శ్రీరంగ మాధురి కళాలయం తరపున ప్రదర్శించిన కళా మధురిమలు ఈయనకు సంగీత దర్శకుడుగా పేరు తెచ్చి పెట్టాయి. ఈ సమాజం పక్షాన 2001లో కర్నూలులో రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహించాడు. 1985లో తెలుగు విజ్ఞాన పీఠం పక్షాన రాజంపేటలో నిర్వహించిన ప్రాంతీయ పౌరాణిక పోటీలలో ఈయన సంగీత దర్శకత్వంలో ప్రదర్శింపబడిన యమాంజనేయ యుద్ధం నాటకం ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. కళారంగం కోసం పనిచేస్తున్న ఈయనను నెహ్రూ యువజన కేంద్రం కళా సంస్థలు నగదు బహుమతులిచ్చి ఘనంగా సత్కరించాయి.

దాసరి,ఎన్.

రంగస్థల వ్యవహారం : రంగస్థలం మీద నటీనటుల చతుర్విధాభినయేతర కార్యకలాపమే రంగస్థల వ్యవహారం. ఉత్తరాలు రాయడం, పుస్తకాలు, పత్రికలు చదవడం, ఫలహారాలు, కాఫీ, టీ మొదలైనవి అందించడం, టెలిఫోన్ చేయడం, వినడం మొదలైనవి రంగస్థల వ్యవహారం కిందకు వస్తాయి.

ఈ రంగస్థల వ్యవహారం ఆకర్షణీయంగా రూపొందిస్తే నాటక ప్రదర్శనకు పుష్టి చేకూరుతుంది. ప్రదర్శన సజీవంగా ఉంటుంది.

ఈ రంగస్థల వ్యవహారాలలో కొన్ని కొన్ని కథా సంవిధానానికి అవసరాలు, అంతర్భాగాలు. కృష్ణరాయబార ఘట్టంలో శ్రీకృష్ణుని బంధించడానికి దుర్యోధనాదులు పగ్గాలు పట్టుకురావడం మొదలైనవి.

వాతావరణ సృష్టికి కూడా రంగస్థల వ్యవహారం ఉపకరిస్తుంది. పాండవ విజయం నాటకం ప్రారంభంలో కృష్ణుడు చక్రం ధరించి భీష్ముని మీదకు ఉరకడం, భీషణ ద్వారా యుద్ధ వాతావరణం ఊహించుకోవడానికి తోడ్పడుతుంది.

పాత్ర సంభాషణలోనే వ్యవహారం ఉల్లేఖితమై ఉంటుంది. *కన్యాశుల్కం* ప్రథమాంకం రెండవ రంగంలో పూటకూళ్లమ్మ 'వెధవ కనపడితే శిగపాయి తీసి చీపురుకట్టతో మొత్తుదును' అనడం వల్ల ఆ పాత్ర చీపురకట్ట పట్టుకురావడం అవసరం.

ఒక్కొక్కప్పుడు ఈ వ్యవహారం మూలంగా నాటక కథాగమనం దెబ్బతినే ప్రమాదం ఉంది. అటువంటప్పుడు కాలవ్యవధిని తగ్గించుకోవాలి. ఉత్తరం పూర్తిగా రాయనవసరం లేదు. మూడు నాలుగు పంక్తులు రాస్తే చాలు. బట్టలు ఒక్కొక్కటి పెట్టెలో పెట్టడం కన్నా దొంతరగా పెట్టి ఆ దొంతర పెట్టెలో పెడితే కాలం కలిసివస్తుంది.

వ్యవహారం ముందే ప్రారంభించడం ఒక్కొక్కప్పుడు మంచిది. *కన్యాశుల్కం* మొదటిరంగంలో గిరీశం వెంకటేశాన్ని 'నోటు బుక్కు తీసి రాయి'' అనే ముందు 'కొత్త పుస్తకాలకి ఒక్క జాబితా రాయి' అన్నప్పుడే నోటు పుస్తకం తీసి సిద్ధంగా ఉంటే కథాగమనం మందగించదు.

ఒక్కొక్కప్పుడు సమయానికి కావలసిన వస్తువును నేపథ్యం నుంచి ఏదో ఒక పాత్ర తీసుకురావలసి ఉంటుంది లేదా ఒక పాత్ర రాక కోసం రంగం మీద మరో పాత్ర నిరీక్షించవలసి ఉంటుంది. అలాంటప్పుడు నాటక కథాగమనం ఆగకుండా ఏదో ఒక రంగస్థల వ్యవహారం పెట్టాలి.

ప్రయోగంలో వచ్చే ఈ చిక్కులను ఊహించకుండా నాటక కర్తలు ఒక పాత్రతో రెండో పాత్రను 'రండి కూర్చోండి', 'కులాసాగా ఉన్నారా' మొదలైన ప్రశ్నలు వేయిస్తారు. వీటివల్ల కథాగమనం ఆగిపోవచ్చు. రెండో పాత్ర కూర్చుంటే సమీకరణలో చిక్కు రావచ్చు. సన్నివేశం మందకొడిగా, నిరుత్సాహంగా సాగుతుంటే రెండో పాత్ర కూర్చోకుండా ఈ పొడి ముక్కలు విస్మరించి సంభాషణలు సాగించడం మంచిది.

కన్యాశుల్కం ప్రథమాంకం రెండవ రంగంలో గిరీశం మంచం కింది నుంచి పైకి వచ్చి రామప్పంతులు నెత్తిమీద చరచి లఘువు వేసి పెరటివైపుకు పరుగెత్తుకుపోతాడు. ఇందులో లఘువు వేయడం సంఘటనకు రంజన చేకూరుస్తుంది.

కాలం, ఋతువు, పాత్ర మనోస్థితి, అంతర్గత భావాలను ఈ వ్యవహారాలు ప్రేక్షకులకు తెలియచేస్తాయి.

కాలం : దీపాలు వెలిగించడం, మంచం వాల్చడం, రాత్రి పడిందని తెలుపుతాయి.

ఋతువు : దుప్పటి కప్పుకోవడం, వణకడం మొదలైనవి శీతాకాలాన్ని సూచిస్తాయి. విసురుకోవడం, ఉస్సురుస్సురనడం వేసవిని తెలుపుతాయి.

స్థల నిర్దేశం : రంగం ఏ స్థలంలో జరుగుతున్నదీ తెలియచేయడానికి కూడా రంగస్థల వ్యవహారం తోడ్పడుతుంది. గదిలో టైపు మిషను కొడుతూంటే అది కార్యాలయం. కూర గాయలు తరుగుతుంటే వంటిల్లు ఇత్యాది.

సంబంధ నిర్దేశం : ఇద్దరు మిత్రులు, విరోధులు, ఒకరు పెద్ద ఒకరు చిన్న మొదలైన పాత్ర సంబంధాలు ఈ వ్యవహారాల వల్ల ద్యోతకమవుతాయి. భుజం మీద చేయి వేసి తట్టితే మిత్రుడు, చూడగానే పళ్లు కొరుక్కుంటే విరోధి; నమస్కరిస్తే అవతలి వాడు పెద్ద ఇత్యాది.

సంభాషణలు ఎంత రమణీయంగా ఉన్నా ఈ వ్యవహారాలు లేనిదే నాటకం రక్తి కట్టదు. స్త్రీ కూరలు తరుగుతూనో, బియ్యంలోని బెడ్డలు ఏరుతూనే, పురుషులు చుట్ట చుట్టుకుంటూనో, తాడు పేనుకుంటూనో మాట్లాడితే రక్తిగా ఉంటుంది.

పాత్రచిత్రణ : రంగస్థల వ్యవహారాల వల్ల పాత్ర స్వభావంలో భేదాలు తెలుస్తాయి. హోల్డర్‌లో సిగరెట్టు పెట్టి కాల్చేవాని స్వభావం వేరు, బటనవేలుకు, చూపుడు వేలుకు మధ్య సిగరెట్టు పెట్టి తక్కిన వేళ్ళు మూసి దమ్ములాగే వాని స్వభావం వేరు. దమ్ము లాగుతూ చిటికె వేసే వాని స్వభావం వేరు.

నాటక గమనంలో ఖాళీలు, విరామాలు ఏర్పడనపుడు, ఒకపాత్ర ఇంకో పాత్ర ప్రవేశానికి నిరీక్షించవలసినపుడు రంగస్థల వ్యవహారాలు సందర్భోచితంగా, పాత్రోచితంగా ప్రవేశపెట్టాలి.

శ్రీ.చ.

రంగస్థల శాస్త్రం: పాఠ్యగ్రంథం రెండు భాగాలు. ఆంధ్ర, వేంకటేశ్వర, ఉస్మానియా విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలలకు ఇంటర్ మీడియట్ తరగతులలకు ఉద్దేశించిన పాఠ్యగ్రంథం.

మొదటి భాగాన్ని శ్రీనివాస చక్రవర్తి, మొదలి నాగభూషణశర్మ వి. రామన్నపంతులు రచించారు. ప్రథమ ముద్రణ 1970. మొదటిభాగం రెండు ఖండాలు. అవి: 1. నాటకం 2. దర్శకత్వం నాటకమనే ప్రథమ ఖండం 1. రూపకోత్పత్తి, 2. రూపక నిర్వచనం, 3. రూపక నిర్మాణం, 4. రూపక భేదాలు, 5. ఆధునిక నాటకరంగం, 6. సంస్కృత రూపక లక్షణాలు, 7. సంస్కృత రూపక రచనా విధానం, 8. దేశి రూపకాలు, 9. సంస్కృత రూపక సంక్షిప్త చరిత్ర 10. తెలుగు నాటక సంక్షిప్త చరిత్రలు అనే పది అధ్యాయాలు.

ద్వితీయ ఖండం 1. దర్శకుడు – దర్శకత్వం, 2. నాటక నిర్ణయం, 3. నాటక విశ్లేషణ, 4. ప్రయోగ ప్రధానోద్దేశం, 5. ప్రేక్షకావధానం, 6. అనురక్తి, 7. సంరచన, 8. రంగస్థలం 9. ప్రయోగప్రతి, 10. రంగస్థల గతి విన్యాసం, 11. రంగస్థల వ్యాపారం, 12. పాత్ర సమ్మేళనం, 13. పాత్ర నిర్ణయం, 14. పాత్ర విశ్లేషణం, 15. పాత్ర చిత్రణం, 16. పూర్వాభ్యాసం – మెరుగులు దిద్దడం, 17.ప్రదర్శన అనే అంశాలతో కూడి విరాజిల్లుతోంది.

రెండవ భాగాన్ని ఎన్. రవీంద్రరెడ్డి, సి. రామలింగశాస్త్రి, మంత్రి శ్రీనివాసరావు రచించారు. ప్రథమ ముద్రణ 1971.

ఇది రెండు ఖండాలు. 1. అభినయం, 2. నటుడు, 3. నటశిక్షణ, 4. శరీరాభినయ శిక్షణ,5. వాచికం, 6. స్వరయంత్ర రచన – వాచికం. 7. వాచిక దోషాలు, 8. పాత్ర పోషణ, 9. అభినయశైలి, 10. పాత్రలు – వైవిధ్యం, 11. అభినయ విధానం, 12. అభ్యాసాలు అనే 12 అధ్యాయాలతో మొదటి ఖండం: 1. రంగస్థల నిర్వహణ, 2. రంగస్థల నిర్వాహకుడు, 3. దృశ్యపరికల్పన, 4. రంగశిల్పం,5. వేషశిల్పం, 6. ముఖాంగ రచన,7. వేషశిల్పం – పరికరాలు, 8. వెలుగు నీడలు, 9. సాధారణ వేష రచన – 10. కృత్రిమ కేశాలంకరణ, 11. వేషభాషలు, 12. రంగదీపనం, 13. వర్ణం, 14. శబ్దం అనే పద్నాలుగు అధ్యాయాలతో ద్వితీయ ఖండం విరాజిల్లు తోంది.

శ్రీ.చ.

రంగస్థల శిల్పం : ఈ గ్రంథాన్ని సి.ఎస్. నారాయణ 2002లో ప్రచురించాడు. ఈ గ్రంథంలో నాటక రచన నుంచి ప్రదర్శన వరకు తీసుకోవలసిన జాగ్రత్తలను, అవలంబించవలసిన పద్ధతులను నిర్మాణాత్మకంగా, శాస్త్రీయ పద్ధతిలో వివరించారు.

నాటకరంగంలో విశేషానుభవం గడించిన నారాయణ నాటకాభిమానుల కోసం సులభ శైలిలో ఈ పుస్తకంలో నాటక విజ్ఞానాన్ని అందించాడు. పన్నెండు అధ్యాయాలు గల ఈ పుస్తకంలో రచన,దర్శకత్వం, నటీనటుల శిక్షణ, నటన, వాచికాభినయం, ఆంగికాభినయం, నిగ్రహం, నిలకడతత్వం, మేకప్, లైటింగ్, సౌండు, రంగస్థల నిర్వహణ, సెట్టింగులు, ప్రచారం, ప్రదర్శనశాలల నిర్వహణ, రిహార్సల్స్ అంశాల మీద కూలంకష వివరణ ఉంది. ప్రాచ్య–పాశ్చాత్య నాటక రీతుల వైవిధ్యాన్ని కూడా ఈ పుస్తకంలో చక్కగా వివరించాడు గ్రంథకర్త.

గం. సు.రె.

రంగస్థలి (నరసరావుపేట) : ఈ సమాజం 1979, నవంబరులో ఏర్పడింది. నరసరావుపేటలోని అభినందన ఆర్ట్సు, కల్పన కళానికేతన్, కోడిరామకృష్ణ కల్చరల్ అసోసియేషన్, నవరస నట సమాఖ్య, నాగార్జున కళా సమితి, విద్యుత్ కళాభారతి వంటి సంస్థల కలయికే 'రంగస్థలి'. ఈ సమాజం పక్షాన మొదట ప్రదర్శింపబడిన నాటకం కృష్ణపక్షం. ఈ నాటకాన్ని సమాజం పక్షాన 1980, జనవరి 30న విజయవాడలో నిర్వహించిన ప్రదర్శనలలో ప్రదర్శించారు. 1980 నుంచి 1995 వరకు ప్రతి నెల ఒక నాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను నాటకరంగం వైపు మళ్లించడానికి ప్రయత్నించడంలో సమాజం తన కర్తవ్యాన్ని నిర్వహించింది. ఈ సమాజం కొంతకాలం గురజాడ కళా మందిరం (మునిసిపల్ హైస్కూల్) లోను, ఎస్.ఎస్.ఎన్. కళాశాల ఆడిటోరియంలోను, ప్రస్తుతం భువనచంద్ర టౌనుహాలులో నాటక ప్రదర్శనలు నిర్వహిస్తోంది.

దాసరి.ఎస్.

రంగస్వామి, సరస్వతుల (1890–1960) : రంగస్థల నటుడు. ఈయన 1890లో జన్మించాడు. ఈయనను అందరూ మాస్టర్ అని పిలిచేవారు. స్త్రీ, పురుష పాత్రలు, ఉత్తమాధమ పాత్రలు నటించడంలో సిద్ధహస్తుడు. ఈయన సుప్రసిద్ధ పండితుడు సేలటూరి రామదాసు అయ్యంగారి సతీర్థుడు.

1901లోఒకటవ ఫారం చదువుతూ వై. గోపాల కృష్ణయ్య వద్ద నాటకాల విషయాలు తెలుసుకున్నాడు. 1903 ప్రాంతంలో మూడవ ఫారం చదువుతూ మొదటిసారిగా వేషం వేశాడు. పెద్దవాడైన తరువాత ఆంధ్రభాషాభిమాన సమాజంలో చేరి వేదం వేంకటరాయశాస్త్రి శిక్షణలో వేషాలు వేశాడు.

ఒకే నాటకంలో రెండు విరుద్ధ పాత్రలను ధరించి సమర్థవంతంగా పోషించాడు. ప్రతాపరుద్రీయంలో ప్రతాపరుద్రుడు, పేరిగాడు, బబ్బిలి లో రంగా రాయుడు, పాపారాయుడు ఇత్యాది. ఈయన ఏ పాత్రలో నటించినా పరిపూర్ణంగా తాదాత్మ్యం చెంది నటించాడు.

గౌరి, ప్రతాపరుద్రుడు, పేరిగాడు, రంగారాయుడు, పాపారాయుడు, చంద్రగుప్తుడు, ముర, సాహెబ్ జనాబ్ (తప్పెవరిది), కావలి జనాన్ (కుంభరాణా), యుగంధరుడు వంటి పాత్రలలో నటించిన రంగస్వామి 1960, ఫిబ్రవరి 24న మరణించాడు.

శ్రీ.చ.

రంగాచార్య, ఆద్య (1904 –84) : కన్నడ రచయిత, నటుడు, దర్శకుడు. నవలా రచయిత, స్వాతంత్ర్య సమర యోధుడు. కర్ణాటకలో సంస్కృత భాష నేర్చు కొన్నాడు. పూనాలో ఉన్నత విద్యను కొనసాగించి లండన్ విశ్వవిద్యాలయంలో భాషా శాస్త్రాన్ని అభ్యసించాడు. 1930లో కన్నడ ఔత్సాహిక నాటక రంగంలో రచయితగా, దర్శకుడిగా చురుకుగా పాల్గొన్నాడు. 70 ఏకాంకికలు, 47 నాటకాలు రచించాడు. ఈయన రచనల్లో విభిన్న కథా వస్తువులు, శైలి, సాంఘిక సమస్యలతో పెనవేసుకొని కనిపిస్తాయి. వ్యంగ్యాత్మక రచనలకు ఆయన పెట్టింది పేరు. వైద్యరాజ, దరిద్రనారాయణ, జనమేజయ, సమగ్రమంథన, అగ్నిశక్తి నాటకాలు ఈయనకు బాగా పేరు తెచ్చిపెట్టాయి. నాట్యశాస్త్ర గ్రంథాన్ని ఇంగ్లీషు, కన్నడ భాషల్లోకి అనువదించాడు.

ప్ర.రె.

రంగాచార్యులు, పరవస్తు వేంకట (1822–1900) : నాటకకర్త. విశాఖపట్టణంలో 1822లో మంగతాయమ్మ, శ్రీనివాసాచార్యుల దంపతులకు జన్మించాడు. రంగాచార్యులు ప్రథమాంధ్ర నాటకకర్తలలో ఒకడు. సంస్కృత ప్రాకృతాంధ్రాది బహు భాషా విజ్ఞానులు, నానాతంత్ర సర్వజ్ఞుడు. మహాకవి, మహామహోపాధ్యాయ బిరుదాంకితుడు.

రంగాచార్యులు నూతన మార్గానుసరణ ప్రియుడు. అందుకని ఈయనను సంస్కరణ పండితుడు అని వావిలాల వాసుదేవశాస్త్రి అవహేళన చేశాడు. ఈయన ఎనిమిదవ ఏటనే *కుంభకర్ణ విజయము* అనే సంస్కృత కావ్యాన్ని రాశాడు. పన్నెండవ ఏడు వచ్చేసరికి వ్యాకరణ న్యాయశాస్త్రాలలో అఖండ పాండిత్యం సంపాదించాడు. అనేక సన్మానాలు పొందాడు.

1872లో కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని సంస్కృతం తత్సమాంధ్రంలోకి, ప్రాకృతం అచ్చ తెలుగులోకి అనువదించిన ప్రప్రథముడు. ఆచార్యులు సంస్కృత విద్యా సర్వస్వం అనదగ్గవాడు. ఈయన శబ్దార్థ సర్వస్వం అనే బృహన్నిఘంటువు రచించి 1877లో స్వయంగా అ, ఆ వరకు ముద్రించాడు. తక్కిన భాగం ఇంతవరకు ప్రచురితం కాలేదు. ఇది ఆచార్యుల సాహిత్యకృషికి పతాక.

ఈయన అభిజ్ఞానశాకుంతలం (అనువాదం), కుములినీ కలహంసం (అనువాదం), మంజుల నైషధం (స్వతంత్ర సంస్కృత నాటకం) లను ప్రచురించాడు. ఆ రోజులలో క్రైస్తవ మత ప్రచారకుల ధోరణిని అరికట్ట కలిగాడు. 1890 ప్రాంతంలో తుని రాజా ఆహ్వానం మీద తుని వెళ్ళి ఆయన ఆదరణతో అక్కడే స్థిర నివాసమేర్పరచుకొని 1900లో మరణించాడు.

శ్రీ.చ.

రంగారామ్, పి.వి. (1900-1947) : నాటకకర్త, నటుడు, నాటక సిద్ధాంతవేత్త, విమర్శకుడు, న్యాయవాది, న్యాయాధికారి. ఈయన 1900, జులైలో జన్మించాడు. విద్యాభ్యాసం విజయనగరం, మదరాసులలో జరిగింది. 1941లో జిల్లా మునసబుగా నియమితుడై 1945లో సబ్-జడ్జి పదవిని అలంకరించాడు. 1927 నుంచి 1930 వరకు మదరాసు ఆంధ్ర మహాసభకు కార్యదర్శిగా వ్యవహరించాడు.

మదరాసులో ఉండగానే ఇబ్సన్ ప్రభావం, రాజ మన్నార్, కూర్మా వేణుగోపాలస్వామిల ప్రభావం ఈయనపై పడింది. విద్యార్థి రోజుల్లోనే కన్యాశుల్కం, ప్రతాపరుద్రీయం, బబ్బిలి వంటి మహానాటకాల్లో నటించాడు. ఈయనకు 1941లో ఆంధ్రనాటక కళాపరిషత్తు ఉత్తమ నటుడు బహుమతి లభించింది.

ఇబ్సన్ పోకడలతో 1931లో ఈయన రచించి ప్రచురించిన దంపతులు నాటకం ఆంధ్రనాటకరంగంలో కొత్త మలుపు తీసుకువచ్చింది. కె.వి. గోపాలస్వామితో కలిసి ఈయన ఇబ్సన్ నాటకం బమ్మరిల్లు పేరుతో (డాల్స్‌హౌస్) అనువదించాడు. యుద్ధకాలంలో ప్రాంతీయ యుద్ధనిధి డైరెక్టర్‌గా పని చేశాడు. 1947లో ఆత్మహత్య చేసుకున్నాడు. స్వతంత్రంగా రచించిన నాటకం ఒకటే అయినా ఆ ఒకటే ఒక ఆణిముత్యం.

శ్రీ.చ.

రంగారావు, బి.వి. (1920-1996) : రంగస్థల నటుడు. 'కళాప్రవీణ' బిరుదాంకితుడు. ఈయన కృష్ణా జిల్లా విజయవాడ సమీపంలోని తెన్నేరులో 1920, సెప్టెంబర్ 24న జన్మించాడు. తల్లిదండ్రులు సీతారామమ్మ, నరసింహారావు. నటరత్నాలు నిండైన విగ్రహం, గంభీరమైన గాత్రం, పాత్రోచిత పద్య పఠనం బి.వి. రంగారావు ప్రత్యేకత. పన్నెండవ ఏట తల్లి మరణించడంతో నాటి నుంచీ మేనమామ తెన్నేటి చలపతిరావు సంరక్షణలో ఉండి ఎస్.ఎస్.సి. పూర్తిచేసి విజయవాడ మున్సిపల్ ఆఫీసులో ఉద్యోగిగా చేరాడు. వెంట్రప్రగడ నారాయణ రావు ప్రోత్సాహంతో మారుతీ సీతారామయ్య (హార్మోనిస్టు) శిక్షణలో పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానం నాటకాలలో అర్జున పాత్రతో రంగస్థల ప్రవేశం చేశాడు. పులిపాటి తరువాత అర్జున పాత్రను పోషించిన వారిలో అగ్రస్థానం బి.వి.రంగారావుదే.

బందా కనకలింగేశ్వరరావు ఆహ్వానం మేరకు ఏలూరు ప్రభాత్ థియేటర్‌లో చేరి బందా సరసన అర్జునపాత్రను, శ్రీ వేంకటేశ్వరమహాత్మ్యంలో భృగుమహర్షి పాత్రను అనితరసాధ్యంగా పోషించాడు.

బందా ఆలిండియా రేడియో విజయవాడ స్టేషన్‌లో చేరిన తరువాత బి.వి. రంగారావు వృత్తి నటుడిగా వెలుగొంది, ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతాలలో నాటి ప్రముఖ నటులు అబ్బూరి, అద్దంకి, మాధవపెద్ది మొదలైన వారితో కలిసి నటించాడు. తదుపరి పీసపాటి సరసన అర్జునుడి పాత్రలో అనేకసార్లు నటించాడు. ఆలిండియా రేడియో విజయవాడ స్టేషను నుంచి అనేక రేడియో నాటకాలలో పాల్గొనేవాడు. ఈయన వివిధ నాటకాలలో విభిన్న పాత్రలలో నటించినా అర్జునుడి పాత్రలోనే ఎక్కువపేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. ఈయన హరిశ్చంద్ర పాత్రలో నటిస్తూ పద్యపఠనం చేస్తూఉంటే బందరు డి.వి సుబ్బారావు శైలి కనబడేది. నెల్లూరులో శివాజీ నాటక ప్రదర్శనంలో శివాజీ పాత్రకు గవర్నరు చేతుల మీదుగా రజత పాత్రను బహుమతిగా పొందాడు.

1975, సెప్టెంబర్ 30న ఉద్యోగ విరమణ చేశాడు. ఆ సందర్భంలో ఈయన సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన జరిగింది. విజయవాడ పట్టణ పౌరులు, కళాకారులు ఈయనను ఘనంగా సన్మానించారు. కళారంగ వికాసం కోసం కృషి చేసిన బి.వి. రంగారావును ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ కళాప్రవీణ బిరుదునిచ్చి సత్కరించింది.

1996లో భౌతిక కాయం వీడి నటరాజులో ఐక్యమయ్యాడు. ఇప్పటికీ ఆయన గాత్రాన్ని ఆలిండియో రేడియో విజయవాడ కేంద్రం నుంచి వినవచ్చు.

జి.ఎస్.ఎన్.

రంగారావు, సాక్షి (1942-2005) : ప్రసిద్ధ రంగస్థల, చలనచిత్ర నటుడు. అసలు పేరు రంగావఝుల రంగారావు. లక్ష్మీనారాయణ, రంగనాయకమ్మ దంపతులకు కృష్ణా జిల్లా కొండపర్రు గ్రామంలో రంగారావు 1942లో జన్మించాడు. విద్యార్థి దశ నుంచీ నాటకాలంటే వల్లమాలిన అభిమానం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో స్టెనోగా పనిచేశాడు. ఆ సమయంలోనే ప్రసిద్ధనటుడు కె. వేంకటేశ్వరరావుతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. అక్కడే రంగస్థల కళల శాఖలో చేరి కె. వేంకటేశ్వర

రావు శిక్షణలో ఉత్తీర్ణుడై డిప్లొమో పొందాడు. వేంకటేశ్వరరావుతో కలిసి విశాఖ పట్టణంలో ఎన్నో నాటకాలు వేశాడు. వాటిలో కొడుకు పుట్టాల, దయ్యం, రాజీవం, పావలా, కన్యా శుల్కం వంటి నాటికా నాటకాలు ముఖ్యమైనవి. వేంకటేశ్వర రావుకు అత్యంత ప్రీతి పాత్రుడైన శిష్యుడు సాక్షి రంగారావు. కె. వేంకటేశ్వర రావు జీవిత చరిత్రను రంగారావు అచ్చు వేయించి తన గురుభక్తిని వెల్లడించుకున్నాడు.

1967లో చలనచిత్ర పరిశ్రమలో అడుగు పెట్టాడు. బాపు దర్శకత్వంలో నిర్మించిన 'సాక్షి' చిత్రంలో ఒక విలక్షణ పాత్ర ధరించి, ఆనాటి నుంచి సాక్షి రంగారావుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. విలన్‌గా, హాస్యనటుడుగా, క్యారెక్టర్ ఏక్టర్‌గా సుమారు 800 చిత్రాల్లో పాత్ర పోషణ చేసి తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని చిత్రరంగంలో సంపాదించుకున్నాడు. అనేక టీవీ సీరియల్స్‌లోనూ పాత్రధారణ చేశాడు. సినీరంగంలో తానెంత ఎత్తుకి ఎదిగినా నాటకరంగాన్ని మరచిపోకుండా తనవంతు సహాయ సహకారాలను అందించిన కళాహృదయుడు. సాక్షిరంగారావు ఈయన 2005, జూన్ 27న చెన్నైలో కన్నుమూశాడు.

గం.సు.రె.

రంగాలంకరణ : నాటక ప్రదర్శనలో సన్నివేశస్థలాన్ని తెలియజేసే ప్రక్రియే రంగాలంకరణ. స్థలాన్ని, కాలాన్ని కూడా రంగాలంకరణ వ్యక్తం చేస్తుంది. అరణ్యంలో జరుగుతున్న సన్నివేశాన్ని సూచించడానికి చెట్లు, కొండలు, దూరాన పారే సెలయేరు మొదలైనవి ఏర్పాటు చేయడం రంగాలంకరణ. ఇవి ఏర్పాటు చేయడం సాధ్యం కాదు కనుక సీనరీలు రాయించి, రంగస్థలం మీద వేలాడ దీయడం పద్య నాటకాల్లో వాడుకలో ఉన్న పద్ధతి. అలాగే రాజ ప్రసాదం, రాజ సభామందిరం వంటివి సీనరీల ద్వారా సూచించడం జరుగుతుంది. సాంఘిక నాటకాల్లో సీనరీలు వాడే అవసరం ఉండదు. గదిలో, గది బయట, వీధిలో, పార్కులో జరిగే సన్నివేశాలకు అనువుగా రంగాలంకరణ చేయడం జరుగుతుంది. రంగాలంకరణ ఆయా పాత్రల అంతస్తును తెలియజేస్తుంది, అంటే శ్రీమంతుని ఇంట్లో సోఫాలు లాంటి విలాస వస్తువులు కన్పిస్తాయి. మధ్యతరగతి ఇంట్లో సామాన్యంగా కనిపించే వస్తువులే చోటు చేసుకొంటాయి. పేదవాడి ఇంట్లో మామూలుగా ఉండే వస్తువులు దర్శనమిస్తాయి. సన్నివేశం ఏ సమయంలో జరుగుతుందో సూచించడానికి లైటింగ్ వాడుకోవడం జరుగుతుంది. అయితే ఇటీవల కాలంలో సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా ఆధునికులు ప్రయోగాత్మక నాటకాల్లో (experimental plays) సన్నివేశం జరిగే స్థలాన్ని సూచన ప్రాయంగా (suggestive) తెలియచేస్తున్నారు. ఇంట్లో గదుల్ని, వాకిళ్లను రిబ్బన్లతో సూచిస్తున్నారు. అట్టముక్కల మీద ఆఫీసు, వీధి, పార్కు, బస్‌స్టాపు అని రాసి సన్నివేశస్థలాన్ని సూచించడం కూడా జరుగుతోంది. రంగస్థల పరికరాలతో (set-properties) పనిలేకుండా మైమ్ తో రంగస్థల వ్యాపారం కొనసాగిస్తున్నారు. నాటక పోటీలలో రెండు పద్ధతులూ అవలంబిస్తున్నారు ప్రదర్శకులు. కొన్ని నాటకాలలో ప్రయోక్త ద్వారా ఘటనా స్థలాన్ని సూచించడమూ జరుగుతూ ఉంది. ఇది పద్య నాటకాల్లో సూత్రధారుడు చేసే పనే!

గం.సు.రె

రక్తి : సామాజికుల రసానుభూతికి పరాకాష్ఠ రక్తి. ఒక ప్రదర్శన హృద్యంగా సాగి ప్రేక్షకులను సంతృప్తి కలిగించే స్థితికి చేర్చడమే రక్తి. రక్తి ఆనందానుభూతికి పరమావధి. ఒక ప్రదర్శన రక్తి కట్టిందంటే ప్రేక్షకుల హృదయంలో చెరగని ముద్ర వేసిందని అర్థం. రక్తి కట్టని ప్రదర్శన నిరర్థకమే. ప్రదర్శనలో సమష్టి కృషిపై రక్తి ఆధారపడి ఉంటుంది. రసం సామాజిక నిష్ఠం అయినట్లే రక్తి కూడా సామాజిక నిష్ఠమే. రక్తి నటుని వైపు నుంచి కాకుండా సామాజికుల దృష్టి కోణం నుంచి పరిగణించవలసిన అంశం. చతుర్విధాభినయాల శక్తి రక్తిలో ఆవిష్కరింపబడుతుంది.

గం.సు.రె.

రఘురామయ్య, కల్యాణం (1901-1975) : ప్రసిద్ధ రంగస్థల, చలనచిత్ర నటుడు. ఈలపాట రఘురామయ్యగా ప్రసిద్ధుడైన ఈయన అసలు పేరు కళ్యాణం వెంకట సుబ్బయ్య.

ఈయన 1901, మార్చి 5న జన్మించాడు. దేశ వ్యాప్తంగా కీర్తిప్రతిష్ఠలు ఆర్జించిన రఘు రామయ్యకు అబ్బిన ప్రాథమిక విద్య అంతంత మాత్రమే. అందమైన ముఖ వర్చస్సు, బంగారుఛాయ, ఆకర్షణీయమైన అంగ సౌష్టవం, అన్నిటికిమించి మధురమైన గాన సంపత్తి రఘురామయ్య నటజీవితానికి బంగారు బాటలు ఏర్పరచాయి.

పదేళ్ళప్రాయంలో పశువులు తోలుతూ, ఒక చెట్టు మీద కూర్చొని వచ్చీరాని పాటలు పాడుతుంటే, ఆ దారిన వెళుతున్న యడవల్లి సూర్యనారాయణ అతని గాన మాధుర్యానికి పరవశించి ఆ పిల్లవాడ్ని అభినందించి అంతర్నిహితమైన గానకళను పైకి తేవాలని సంకల్పించాడు. తల్లిదండ్రులతో చెప్పి రఘురామయ్యను తనతో తీసుకువెళ్ళి శాస్త్రబద్ధమైన సంగీతాన్ని నేర్పించాడు. తొలిసారిగా రామదాసు లో రఘురాముడు పాత్రలో నటించాడు. అదే రఘురామయ్య నట జీవితానికి నాంది పలికింది. రఘురాముని పాత్ర పోషణ చూసి ముచ్చటపడిన కాశీనాథుని నాగేశ్వరరావు "ఇక నుంచి నీ పేరు రఘురామయ్య" అని చెప్పి దీవించాడు. ఆ దీవెన ఫలించింది. రఘురామయ్యగానే నాటకరంగంలో అఖండఖ్యాతిని ఆర్జించాడు.

అందమైన శరీర సౌష్టవం ఉన్న రఘురామయ్య తొలదొలత ఆడవేషాలలో తన నటనా కౌశలాన్ని చూపి ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొన్నాడు. అభిజ్ఞాన శాకుంతలం లో శకుంతల, శ్రీకృష్ణ తులాభారం లో రుక్మిణి, ధరణికోట లో రాణి పాత్ర రఘురామయ్యకు పేరు తెచ్చాయి. అటు తరువాత శ్రీకృష్ణతులాభారం లో శ్రీకృష్ణుడు, చింతామణి లో భవానీ శంకరుడు, శ్రీకృష్ణరాయబారం లో శ్రీకృష్ణుడు, సతీ సక్కుబాయి లో శ్రీకృష్ణుడు ఇలా వైవిధ్యం ఉన్న పాత్రలెన్నో రసరమ్యంగా పోషించి, తన మృదుమధుర గానవాహినిలో ప్రేక్షకులను ఓలలాడించాడు. ప్రదర్శనలు వేల సంఖ్యలో ఉంటాయంటే అత్యుక్తికాదు. పులిపాటి వేంకటేశ్వర్లు, స్థానం నరసింహారావు, మాధవపెద్ది వేంకట్రామయ్య, ధూళిపాళ, ఆచంట వేంకటరత్నం నాయుడు, నిడుముక్కల సుబ్బారావు, పారుపల్లి సుబ్బారావు, పృథ్వీ వేంకటేశ్వరరావు వంటి ఉద్దండ నటకావతంసుల సరసన నటించి పద్య నాటక వైభవాన్ని దశదిశలా చాటిన నటశ్రేష్ఠుడు కళ్యాణం రఘురామయ్య. ఆయన గానంలో పద్యాలు పరవళ్ళు తొక్కుతాయి. పాడిన ప్రతి పద్యానికి 'వన్స్‌మోర్'లే!

క్రమక్రమంగా రఘురామయ్యను సినీరంగం ఆకర్షించింది. 1932లో సి.పుల్లయ్య లవకుశ చిత్రంలో రఘురామునిగా కాలుపెట్టడం జరిగింది. 1934లో భక్త కుచేల, 1937లో రుక్మిణీ కళ్యాణం, 1946లో గొల్లభామ చిత్రాలలో నటించాడు. అదేవరసలో మదాలస, నాగులచవితి, భక్త మార్కండేయ మొదలైన శతాధిక చిత్రాల్లో ప్రధాన పాత్రలు పోషించాడు.

1972లో కౌలాలంపూర్, బాంకాక్, టోక్యో, హాంకాంగ్, సింగపూర్ తదితర ప్రాంతాల్లో పద్య నాటకాలు ప్రదర్శించి తెలుగు బావుటా ఎగురవేశాడు. ఇందిరాగాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ప్రముఖుల సమక్షంలో 'ఈలపాట' వినిపించి వారి ప్రశంసలందుకొన్నాడు. కళ్యాణం రఘురామయ్యను 'పద్మశ్రీ' వరించింది. కేంద్ర సంగీత నాటక అకాడమీ విశిష్ట సభ్యత్వం ఇచ్చి సత్కరించింది. 1975, ఫిబ్రవరి 24న హైదరాబాద్‌లో రఘురామయ్య గుండెపోటుతో మరణించాడు.

అయ్యదేవర

రజనీ నాగరాజు (జ.1955) : సురభి కుటుంబానికి సంబంధించిన ప్రముఖ రంగస్థల నటి. ఆంధ్ర కళాభారతి స్థాపకులలో ముఖ్యురాలు. ఈమె 1955, జనవరి తొమ్మిదిన కర్నూలు జిల్లా, నంద్యాలలో బాలకొండాహాలు శాంతా బాయి, ఆర్. భద్రీ నారాయణ రావులకు జన్మించింది. కళాకారుల కుటుంబంలో జన్మించిన రజనీబాయి నాటక రంగంలోకి నర్తకిగా ప్రవేశించింది. నటనలో ఆది గురువులు తల్లిదండ్రులైనా సంగీతం, నటనలో మెళకువలు నేర్పింది కె.పి. శివారెడ్డి, సీతారామమ్మ, లంకా పిచ్చయ్యశాస్త్రి, జక్కల పురుషోత్తమ్‌సాయి మొదలైనవారు.

చింతామణి లో చింతామణి, సత్యహరిశ్చంద్రలో చంద్రమతి, శ్రీకృష్ణతులాభారం లో సత్యభామ, బాలనాగమ్మ లో సంగు, శ్రీకృష్ణాభిమన్యు లో సుభద్ర, తారాశశాంకం లో తార, నరనారాయణ లో కుంతి పాత్రలు ఈమెకు పేరు తెచ్చాయి. ఈమె *గయోపాఖ్యానం* లో అర్జునుడు, శ్రీకృష్ణరాయబారం లో శ్రీకృష్ణుడు మొదలైన పురుషపాత్రలలో కూడా నటించి ప్రేక్షకుల ప్రశంసలందుకుంది. రాష్ట్రంలోని వివిధ కళాసంస్థల ఆహ్వానం మేరకు పలు నాటకాలలో వివిధ పాత్రలలో సుప్రసిద్ధ నటులు పీసపాటి నరసింహమూర్తి, ఎ.వి. సుబ్బారావు, షణ్ముఖి ఆంజనేయరాజు, వెంకటనర్సునాయుడు, అల్లాబక్ష సరసన నటించింది. 1970లో రంగస్థల కళాకారుడైన నాగరాజుతో వివాహం జరిగింది. వీరిద్దరు కలసి 'ఆంధ్ర కళాభారతి' ని స్థాపించి పలు నాటకాలు ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996, 97, 98లలో నిర్వహించిన పౌరాణిక నంది నాటక పోటీల ప్రదర్శనలో ప్రదర్శింపబడిన నరనారాయణ నాటకంలో కుంతీ పాత్రలో నటించిన రజనీబాయికి ఉత్తమనటి అవార్డు లభించింది. 1999 నవంబరులో శ్రీ గణేశ్ కళానికేతన్ సంస్థ

త్యాగరాయ గానసభ (హైదరాబాద్)లో రజనీబాయి నాటక సప్తాహం నిర్వహించింది. నాటకరంగ వికాసం కోసం కృషిచేస్తున్న రజనీబాయిని 2002 సంవత్సరంలో త్యాగరాజ నందినీ సంస్థ స్థానం నరసింహారావు అవార్డునిచ్చి గౌరవిస్తే, కళారాజ్యం సంస్థ 2003లో 'కళాభినేత్రి' బిరుదునిచ్చి సత్కరించింది. ఇవేకాకుండా పలు కళాసంస్థలు, ప్రముఖులు రజనీబాయిని బంగారు, నగదు బహుమతులిచ్చి ఘనంగా సన్మానించాయి. క్రమశిక్షణతో కళారంగం కోసం పనిచేస్తున్న రంగస్థల నటి రజనీబాయి.

దాసరి.ఎన్

రజితమూర్తి, సి.హెచ్. (జ.1950) : రంగస్థల నటుడు. పశ్చిమ గోదావరి జిల్లా రావిపాడు గ్రామంలో 1950లో జన్మించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ. పట్టా పొందాడు. వృత్తిరీత్యా ప్రొహిబిషన్, ఎక్సైజు ఇన్‌స్పెక్టరుగా జీవిక సాగిస్తున్నాడు. విద్యార్థి దశ నుంచీ నాటకాలపై అభిరుచి ఏర్పడింది. 1966లో ప్రప్రథమంగా రావికొండలరావు పట్టాలు తప్పిన బండి నాటకంతో రంగప్రవేశం చేశాడు. తొలి ప్రదర్శనతోనే ప్రేక్షకుల ప్రశంసలందుకున్న రజితమూర్తి ద్విగుణీకృతోత్సాహంతో నాటకరంగంలో ముందుకు చొచ్చుకుపోయాడు. నాలుగు దశాబ్దాలలో వైవిధ్యభరితమైన ఎన్నో పాత్రల్లో జీవించాడు. పాత్ర నిండుతనాన్ని ప్రోది చేసే రజితమూర్తి నటనా వైదుష్యాన్ని చూసి ప్రశంసించని ప్రేక్షకుడు ఉండడు. స్పష్టమైన ఉచ్చారణతో సంభాషణలు పలికేతీరు రసజ్ఞులను సమ్మోహితుల్ని చేస్తుంది. సహజత్వం ఉట్టిపడే నటన పాత్రకు ప్రాణం పోస్తుంది. అభినయం నిత్యనూతనంగా ఉంటూ ప్రేక్షకుల్ని అలరిస్తుంది.

రజితమూర్తి పాల్గనని నాటక పరిషత్తు మన రాష్ట్రంలో దాదాపు లేదని చెప్పవచ్చు. ఉత్తమ నటుడు, ఉత్తమ ప్రతినాయకుడు, ఉత్తమ క్యారెక్టర్ నటుడు వంటి బహుమతులు అసంఖ్యాకంగా పొందాడు. పాటిబండ్ల ఆనందరావు రచించిన నిషిద్ధాక్షరి, మానస సరోవరం, నీతిచంద్రిక, కాదు సుమా కల, పడమటిగాలి నాటకాల్లోనూ, వల్లూరి శివప్రసాద్ రాసిన వానప్రస్థం నాటకంలోను, హింసధ్వని, యద్భవిష్యం, శ్రీచక్రం, శ్రీముఖ వ్యాఘ్రం, ఎడారి కోయిల నాటికల్లోనూ రజితమూర్తి పోషించిన పాత్రలు ప్రేక్షక హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాయి. నంది నాటకోత్సవాలలో కూడా ఉత్తమ నటనకు అవార్డులు గెలుచుకున్న ప్రతిభామూర్తి రజితమూర్తి.

నాటకరంగంలో రజితమూర్తి సేవలను గుర్తించిన అనేక కళాసంస్థలు పురస్కారాలతో సత్కరించాయి. విశ్వశాంతి కళానికేతన్ నాటక పరిషత్తు (వినుకొండ) వారి 'గుఱ్ఱం జాషువా పురస్కారం', కళావాణి రాజమండ్రి వారి 'విశిష్ట నటుడు' పురస్కారం, కాకతీయ కళాపరిషత్తు (నాగభైరవపాలెం) వారి స్వర్ణకంకణం, సౌజన్య కళామండలి (కడప) వారి నట పురస్కారం, తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల ఐక్యవేదిక నట పురస్కారం మొదలైనవి రజితమూర్తిని వరించిన పురస్కార పరంపరలో కొన్ని మాత్రమే. ఔత్సాహిక నాటకరంగ అభివృద్ధికై అవిశ్రాంతంగా కృషి చేస్తున్న కళాకారుల్లో రజితమూర్తి పాత్ర గణనీయమైంది.

గం.సు.రె.

రతన్ థియ్యామ్ (1948 -) : మణిపురి రంగస్థల దర్శకుడు, పశ్చిమబెంగాల్‌లోని వాడియాజిల్లా నభద్వీప్‌లో 1948లో జన్మించాడు. తండ్రి నృత్యశిక్షకుడు. ఆయన ప్రభావంతో 1971లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో చేరాడు. 1976లో కోరస్ రిపర్టరీ థియేటర్‌ను స్థాపించి ఊరుభంగ, అంధాయుగ్, చక్రవ్యూహ, హిరోషిమా, ఉత్తర ప్రియదర్శి నాటకాలను ప్రదర్శించాడు. క్రమశిక్షణ, శిక్షణపట్ల నిబద్ధత, శ్రద్ధ, నూతనత్వం కోసం ఆరాటం, ఏదో సాధించాలనే కసి రతన్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళాయి. తన స్వంత సంప్రదాయ కళారూపాలకు తన రచనల్లో ప్రత్యేక స్థానాన్నిచ్చి ఆ కళారూపాలను తన నాటక ప్రదర్శనల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప దర్శకుడు. ఒక్క చక్రవ్యూహ నాటకంతోనే ప్రపంచ రంగస్థల ప్రముఖుల సరసన ప్రయోగాత్మక దర్శకుడిగా చోటు సంపాదించుకున్నాడు. జానపద సంగీతం, జానపద కళారూపాలు, దృశ్యీకరణ ఈయన ప్రదర్శనలకు ఆయువుపట్టు. 1987లో తాను శిక్షణ పొందిన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సంస్థకు డైరెక్టర్‌గా నియమించబడటం ఈతని ప్రతిభకు నిదర్శనం. మణిపూర్‌లో తన సమాజ సభ్యులు నివసించడానికి, రంగస్థల కార్యకలాపాలు కొనసాగించడానికి వీలుగా తన కంపెనీ తరపున భవన సముదాయాన్ని నిర్మించడం రతన్ ఆదర్శానికి సంకేతం.

ప్ర.రె.

రత్తయ్య, ఉప్పాల వేంకట (జ.1932) : రంగస్థల నటుడు, అధ్యాపకుడు. ఏడు దశాబ్దాల పైబడిన జీవితంలోని స్వర్ణోత్సవ నట జీవితంలో దాదాపు మూడువేల వరకు ప్రదర్శనలు ఇచ్చినా, అటు అధ్యాపక వృత్తి నుంచి పదవీ విరమణ చేసినా, నాటకరంగం నుంచి విరమించక నేటికీ ప్రాధాన్యత గల

పాత్రలలోనే విశేషంగా రాణిస్తూ తన నట ప్రస్థానం అలుపెరగక కొనసాగిస్తున్న నటుడు ఉప్పాల వేంకట రత్తయ్య. ఈయన ఉప్పాల వీరయ్య, సరస్వతి దంపతులకు గుంటూరు జిల్లా, వేమూరు సమీపంలోని మొసల **పాడులో** 1932, జనవరి 14న జన్మించాడు.

బాల్యంలో తమ ప్రాంతాల్లో ప్రదర్శించిన వీధి భాగవతాలు, హరికథలు, నాటకాలు చూసి ఎంతో ప్రేరణ పొంది పద్యనాటకరంగం మీద మమకారం పెంచుకొన్నాడు. దాంతో ముక్కామల రాఘవయ్య, విష్ణుబట్ల వేంకటేశ్వర్లు, శనగవరపు శ్రీరాంమూర్తి, మద్దెల పంచనాథంల శిక్షణతో గానకళలో ప్రావీణ్యతను సాధించాడు. తొలిసారిగా 1951లో ద్రౌపదీ వస్త్రాపహరణం లో సహదేవునిగా రంగస్థల ప్రవేశం చేశాడు. ఆ నాటకంలో మాధవపెద్ది వేంకట్రామయ్య (విదురుడు), వేమూరి గగ్గయ్య (శిశుపాలుడు), మద్దాల శేషగిరి (భీముడు), వేమూరి రామయ్య (శ్రీకృష్ణుడు) వంటి రంగస్థల దిగ్గజాల సరసన తొలిసారిగా నటించే అవకాశం పొందిన అదృష్టశాలి రత్తయ్య. వేమూరు గగ్గయ్య చివరి నాటకమే ఉప్పాల వేంకట రత్తయ్య తొలి నాటకం కావటం యాదృచ్ఛికమైన సంఘటన. ఈ ప్రదర్శనలో తనతో నటించిన పెద్దలందరి నుంచి ఆశీస్సులు లభించటంతో ఉత్సాహం పెరిగి, దాంతో 25 నాటకాల్లో 45 ప్రధాన పాత్రలు పోషిస్తూ రాష్ట్రంలోనే కాకుండా ఢిల్లీ, మధుర, ముంబై, వారణాసి, లక్నో, జగదల్‌పూర్, మధురైలలో, దేశవ్యాప్తంగా పలు ప్రధాన కేంద్రాలలో నేటివరకు సుమారు 3000 ప్రదర్శనలు ఇచ్చాడు.

ఈయన సుదీర్ఘ రంగస్థల ప్రస్థానంలో సింహభాగం వేమూరి రామయ్య బృందంలో మహారథి కర్ణ లో అర్జునుడు పాత్రను, పీసపాటి బృందం నరసింహమూర్తి ప్రదర్శించిన మోహినీ భస్మాసుర లో శంకరుని పాత్రను, సి. రాంమోహనరావు బృందం ప్రదర్శించిన ఆనాడు లో పృథ్వీరాజ్ పాత్రలను ఉన్నతస్థాయిలో అభినయించటంతోనే సాగిపోయింది. ఇంకా గుమ్మడి వేంకటేశ్వరరావు, వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది, సి. రాంమోహనరావు , నండూరి రాంమోహనరావు, అబ్బూరి వరప్రసాదరావు, పులిపాటి వేంకటేశ్వర్లు, మల్లాది, ఈలపాట రఘురామయ్యల సరసన పలు ప్రాధాన్యత గల పాత్రలు పోషించి పండిత పామరుల ప్రశంసలు పొందాడు.

శ్రీకృష్ణరాయబారం లో అర్జునుడు, ధర్మరాజు, కర్ణుడు, అశ్వత్థామ, రామాంజనేయ యుద్ధం లో యయాతి, గయోపాఖ్యానం లో గయుడు, ధర్మరాజు, సతీ సావిత్రి లో సత్యవంతుడు, బాలనాగమ్మ లో కార్యవర్థి, ఖిల్జీ రాజ్యపతనంలో దేవీదాస్, మహారథి కర్ణలో అర్జునుడు, రోషనారలో రామ్‌సింగ్, మాయాబజార్, వీరాభిమన్యు లలో అభిమన్యుడు, సక్కుబాయి లో కృష్ణుడు, పాదుకా పట్టాభిషేకం లో లక్ష్మణుడు, వశిష్ఠుడు, భక్తశిరియాళ లో భృగు, ఆనాడు లో పృథ్వీరాజ్, వేమన లో శంకరశాస్త్రి పాత్రలు విశేషఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఈ నాటకాలలో ఈయనకు అర్జునుడు, విశ్వామిత్రుడు, ధర్మరాజు, పృథ్వీరాజ్‌లు అభిమానపాత్రలు. తన సుదీర్ఘ రంగస్థల జీవితంలో నటించిన ఏకైక సాంఘిక నాటిక నేటి న్యాయం. ఈ నాటికలో ఆయన జమిందార్ పాత్ర పోషించాడు. తన రంగస్థల జీవనయానంలో శతాధిక సత్కారాలు, పలు అవార్డులు అందుకొన్నాడు. వాటిలో ధర్మరాజు పాత్ర పోషణకు అందుకున్న అద్దంకి శ్రీరాంమూర్తి స్మారక అవార్డు అత్యంత ప్రధానమైనది. ఇంకా భగవాన్ సత్యసాయి, ఆనాటి రాష్ట్రముఖ్యమంత్రి జనార్ధనరెడ్డి, గవర్నర్ చెన్నారెడ్డి, ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు చేతులు మీదుగా అందుకొన్న సత్కారాలు విశిష్టమైనవి. 2004, మే 10వ తేదీన గుంటూరుకు చెందిన భారతీయ ధార్మిక విజ్ఞాన పరిషత్ సన్మానం అందుకున్నాడు.

మన్నెశ్రీ.

రత్తయ్య, కడియాల : కడియాల రత్తయ్య గుంటూరు వాస్తవ్యుడు. చిన్నతనం నుంచి సంగీతం మీద ఆసక్తి ఉండటం వలన 1912లో పొత్తూరి హనుమంతరావు, బండారు రామస్వామి నాయుడు, పొత్తూరి సోమయ్య, పత్రి సుబ్రహ్మణ్యంలు స్థాపించిన గుంటూరు మూన్ థియేటర్ లో బాల పాత్రలతో రంగస్థల ప్రవేశం చేశాడు. తరువాత స్త్రీ పాత్రలను పోషించాడు.

రత్తయ్య స్త్రీ పాత్రలలో నటించడంలో దిట్ట. శ్రావ్యమైన గాత్రం, స్త్రీ పాత్రకు తగిన అవయవ సౌష్ఠవం, గాత్ర ధర్మం కలిగి ఉండటం వలన రత్తయ్య స్త్రీ పాత్రధారణ అనితరసాధ్యంగా ఉండేది.

రాజమండ్రిలో జరిగిన బబ్బిలి యుద్ధం పోటీ నాటకంలో స్త్రీపాత్ర తో ప్రవేశించిన రత్తయ్య ప్రేక్షకులలో చెరగని ముద్ర వేశాడు. ఈ నాటకాన్ని చూచిన సత్యవోలు గున్నేశ్వరరావు తమ చింతామణి నాటక సమాజంలో స్త్రీ పాత్రలు ధరించడానికి రత్తయ్యను అహ్వానించాడు. ఆనాటి నాటక సమాజాలలో చింతామణి నాటక సమాజం అత్యుత్తమమైంది. ఆ సమాజంలో రత్తయ్య స్త్రీ పాత్రలను ధరించి ఎనలేని కీర్తిని సంపాదించాడు.

రత్తయ్య సావిత్రి, రుక్మిణి వంటి పతివ్రత పాత్రలలో నటించాడు. రత్తయ్య స్త్రీ పాత్ర రంగస్థల ప్రవేశం కాగానే

ప్రేక్షకులు ఉప్పొంగిపోయేవారు. ఆయన మృదు మధుర గానానికి తన్మయులయ్యేవారు. అనారోగ్య కారణాల వల్ల 1947 ప్రాంతాలలోనే వేషధారణ మానేశాడు. జీవనభృతికి ఇళ్లకు రంగులు వేసే వృత్తిని స్వీకరించాడు.

ఇంతటి మహనీయుని జన్మస్థలం, పుట్టుక, బాల్యం, పూర్వాపరాలు, ఈయన గురించిన వివరాలు ఎంత ప్రయత్నం చేసినాతెలియడం లేదు. ఇటువంటి మరుగున పడిన మాణిక్యాలు ఎన్నో.

జి.ఎస్.ఎన్.

రత్నాసాగర్ (జ.1953) : రంగస్థల, రేడియో, టీ.వి., సినీ నటి. 1953, సెప్టెంబరు 3న హైదరాబాద్‌లో లక్ష్మీబాయి, నారాయణ స్వామి దంపతులకు జన్మించింది. బి.ఏ.లో తెలుగు లిటరేచర్ చదివిన రత్నాసాగర్ 1969లో వెలుగు నీడలు నాటకం ద్వారా రంగస్థలానికి పరిచయమై, భానుప్రకాష్ గాలివాన నాటకం ద్వారా నటిగా నిలదొక్కుకుంది.

తెగింపు, సంధ్యాఛాయ, గాలివాన, జిందాబాద్, ముగింపులేని కథ ప్రదర్శనలు ఈమెకు నటిగా బాగా పేరు తెచ్చిపెట్టాయి. ఉత్తమ నటిగా బహుమతులు తెచ్చిపెట్టాయి.

1973లో ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు విద్యాసాగర్‌తో వివాహమైంది. వివాహానంతరం కూడా నాటక ప్రదర్శనలివ్వటం రత్న ప్రత్యేకత. 1974 నుంచి పలు టి.వి. నాటికలు, సీరియల్స్‌లలో నటిస్తోంది. జంధ్యాల ప్రోత్సాహంతో సినీరంగంలో ప్రవేశించి దాదాపు 80 సినిమాల్లో నటించింది.

ప్ర.రె.

రమణ్‌జీ, ఎ.వి. (జ.1939) : రంగస్థల, సినీ నటుడు. 1939వ సంవత్సరం విజయవాడలో జన్మించాడు. 1950లో పాఠశాలలో భక్త కుచేల, ఆకలి జీవులు వంటి నాటికలు ప్రదర్శించాడు. నాటకం పట్ల అభిమానం పెంచుకోవడానికి కారణం అన్న ఎ.వి. రఘుబాబు. రూప శిల్పి, దర్శకుడు ఈయన. మాస్టర్జీ, ధన ప్రపంచం, *56వ* బ్రాకెట్, పల్లెపడుచు, అల్లూరి సీతారామరాజు, పేదపిల్ల, పాలేరు, రంగూన్ రౌడీ, బాలనాగమ్మ లలో రమణ్‌జీ నటించాడు.

1955 నుంచి కోడూరుపాటి సరస్వతీ రామారావు స్థాపించిన రాయల్ ఆర్ట్ థియేటర్ సంస్థకు కార్యదర్శిగా పనిచేస్తూ నటనలో మెళకువలను నేర్చుకున్నాడు. జమీన్‌దార్, పాని-సంసారి, రామశాస్త్రి, రంగస్థలం, వీరపాండ్య కట్ట బ్రహ్మన లలో కోడూరుపాటితో పాటు హాస్య పాత్రలలో నటించాడు. బిస్తరకొట్టు రంగయ్య అనే ఏకపాత్రను రాష్ట్రంలోను, రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించి బహుమతులందుకున్నాడు. ప్రముఖ దర్శకుడు అన్నవరపు శివరామిరెడ్డి, జి.ఎస్.ఆర్.మూర్తి, కోకా సంజీవరావు ప్రదర్శించిన ఉలిపికట్టె, కొడుకు పుట్టాల, మరో మొహంజదారోలలో నటించాడు. చిలకలూరిపేట కళాసదస్సు నిర్వహించిన పోటీ ప్రదర్శనలో పాల్గొని ఉత్తమ నటుడు, ఉత్తమ హాస్యనటుడు, కారెక్టర్ యాక్టర్ అవార్డును ఒకవేదిక మీద అందుకోవడం విశేషం. ప్రజా నాట్యమండలి పక్షాన కైలాసం కోర్టు వీధి నాటికను, జంతర్ పెట్టె కళారూపాన్ని విస్తృతంగా ప్రదర్శించి ఆంధ్రా ఛార్లి చాప్లిన్, హాస్య నటరత్న బిరుదులందుకున్నాడు. చలనచిత్ర రంగంలో ప్రవేశించిన రమణ్‌జీ నీడలేని ఆడది, అమ్మాయిలు జాగ్రత్త, ముగ్గురమ్మాయిలు, సోగ్గాడు, అత్తవారిల్లు, కదలివచ్చిన కనకదుర్గ, మావూరు గంగ, రాధాకృష్ణ, స్వర్గం నరకం, ఇల్లాలు ముచ్చట్లు మొదలైన సినిమాలలో నటించాడు. రమణ్‌జీని జయాంధ్ర నాట్యమండలి 2000, జులై 23న ఘనంగా సన్మానించి కనకాభిషేకం చేసింది.

దాసరి.ఎన్.

రమణ, పి.వి. (1939-2004) : రచయిత, పరిశోధకుడు, సమీక్షకుడు, న్యాయ నిర్ణేత, నాటకరంగ అధ్యాపకుడు. పి.వి. రమణ 1939, ఆగస్టు 15న సికిందరాబాద్‌లో జన్మించాడు. ఆధునిక తెలుగు నాటకరంగం గురించి సాధికారికంగా, సమగ్రంగా విశ్లేషించగలిగినవారిలో రమణ ఒకరు. తెలుగు సాంఘిక నాటకం అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి డాక్టరేట్ పొందాడు. 1953లో పల్లెపడుచు నాటకంలో కామేశం పాత్ర ద్వారా నటుడిగా రంగ ప్రవేశం చేసిన రమణ ఆకాశరామన్న, కీర్తిశేషులు, మాస్టర్జీ, దొంగవీరడు, ఇదా ప్రపంచం, బి.ఎ. ఫస్ట్‌క్లాస్, ఎన్.జి.ఓ., మానవుడు వంటి నాటకాలలో ప్రముఖ భూమికలలో నటించాడు. ఆకురాలిన వసంతం, వెంటాడే నీడలు, దేవతలెత్తిన పడగ, చలిచీమలు, మహావీర కర్ణ, ప్రతాపరుద్ర, మహాస్సు, మానవతకూ నిండాయి నూరేళ్లు, లోలకం, మృత్యునీడ, కళ్యాణమే ఒక కానుక, ప్రేమ పోరాటం, గురువుగారూ మన్నించండి వంటి నాటకాలూ, నాటికలను రచించాడు. 'తెలుగు సాంఘిక నాటకం, పాశ్చాత్య నాటక ప్రభావం, ప్రపంచ నాటకరంగం, ద్రవిడ నాటక రచనలు-సారూప్యాలు, తెలుగు నాటకం-వస్తు వైవిధ్యం, ప్రపంచ నాటకరంగం - తెలుగు నాటకం-తులనాత్మక పరిశీలన' అనే అంశాలపై గ్రంథాలను

రచించాడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ప్రచురించిన ప్రత్యేక సంచికలకు పరిశోధనాత్మక వ్యాసాలు రచించాడు. ఆధునిక నాటకరంగ తీరుతెన్నులపై ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసంగాలు చేశాడు. 1991లో మధురైలో జరిగిన దక్షిణ భారతదేశ నాటకరంగ సదస్సులో తెలుగు నాటక ప్రతినిధిగా పాల్గని పత్ర సమర్పణ చేశాడు. 1989లో ఆకాశవాణి, విజయవాడ కేంద్రం నిర్వహించిన అఖిల భారతస్థాయి నాటక రచనల పోటీలకు, ఆటా నిర్వహించిన నాటక రచనల పోటీలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే నంది నాటకాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. వివిధ పత్రికలకు, ప్రత్యేక సంచికలకు 200కు పైగా నాటకరంగంపై వ్యాసాలు రచించాడు.

ఖమ్మం జిల్లా బయ్యారంలో తెలుగు అధ్యాపకుడుగా, ప్రిన్సిపల్‌గా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాటక విభాగం అధిపతిగా ఉద్యోగించాడు. 1991-92లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం, 1993లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నాటక రచయిత పురస్కారం, 1997లో మద్రాస్ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, జవ్వాది కల్చరల్ ట్రస్ట్ (నిడదవోలు) ఉత్తమ నాటక విమర్శకుడు పురస్కారంతోపాటు నాటక శిరోమణి, నాటకరంగ కరదీపిక వంటి బిరుదులను పొందాడు. దాదాపు 50కి పైగా కథలు వివిధ వార, మాసపత్రికలో ప్రచురించిన పి.వి. రమణ 2004, జనవరి 27న మరణించాడు.

కందిమళ్ళ

రమణ ప్రభు జె. (1953) : రంగస్థల నటుడు, దర్శకుడు, ఆదర్శ యువభారతి సంస్థ సభ్యుడు. జమ్మలమడక రమణప్రభు 1953, మార్చి 10న హైదరాబాదులో మహాలక్ష్మమ్మ, సూర్యప్రకాశరావు దంపతులకు జన్మించాడు. బద్రుక కళాశాలలో బి.కాం. చదివాడు. తరువాత ఎం.ఏ., ఎం.కాం. కూడా పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖలో పి.జి.డి.టి.ఎ. చేశాడు.

బాలానంద సంఘంలో పలు నాటకాల్లో నటించి ఉత్తమ బాలనటుడుగా బహుమతులు పొందాడు. ఆదర్శయువ భారతి సంస్థలో సభ్యుడిగా ఉంటూ అనేక పరిషత్తులలో పలు నాటకాల్లో నటించి, దర్శకత్వం వహించి అనేక బహుమతులు గెలుచుకున్నాడు. 1985లో పాండిచ్చేరిలో జరిగిన సౌత్ జోన్ డ్రామా ఫెస్టివల్ లో దొరా నీ సావు మూడింది నాటకాన్ని జనరంజకంగా ప్రదర్శించి ప్రశంసలు పొందాడు. ఈయనకు బాగా పేరు తీసుకొచ్చిన హాస్య నాటకం అందమె ఆనందం, రచయిత ఆదివిష్ణు కూడా ప్రశంసలు పొందాడు. సుడిగుండాలు, వింతకాపురం సినిమాల్లో కూడా బాలనటుడుగా నటించాడు. నటన కన్నా దర్శకత్వం వైపే దృష్టి మళ్ళించి తన సంస్థకే కాక పలు ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థల ఉద్యోగుల నాటికలకు, నాటకాలకు దర్శకత్వం వహించాడు. నలభై ఏళ్ళ నుంచి ఈ రంగంలో ఉంటూ ఇప్పటికీ ఏదో సాధించాలనే తపనతో ముందుకు సాగుతున్నాడు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయ రంగస్థల కళల శాఖలో ఆతిధేయ అధ్యాపకుడుగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు.

ప్ర.రె.

రమణమూర్తి, జె.వి : జన్నలగడ్డ శివరామమూర్తి పుత్రరత్నాలు సోమయాజులు, రమణమూర్తి. రమణమూర్తి సినీ నటుడుగా ఎం. ఎల్. చిత్రంద్వారా ప్రజలకు పరిచయమైనా, నాటక పరిషత్తులలో ఉత్తమ నటుడిగా అనేకసార్లు బహుమతులు అందుకున్నాడు. మొదటిసారి కె.బి.తిలక్ రమణమూర్తిని హీరోగా పరిచయం చేశాడు. చక్కని వాచికం, రూపం, మొహంలో స్వచ్ఛత, భావ ప్రకటనలో సౌలభ్యం నాటక రంగంలో ప్రశంసలందుకున్న లక్షణాలు ఆయన సినీరంగ ప్రవేశానికి సోపానాలుగా నిలిచాయి. 1957లో హీరోగా ప్రవేశించి ఇరవై రెండు సినిమాల్లో నటించాడు.

రమణమూర్తి నేటికీ హీరోగానే నాటకరంగ ప్రియుల దృష్టిలో జీవించి ఉన్నాడు. అందుకు కారణం ఆయన కన్యాశుల్కం నాటకంలో ధరించిన సజీవ పాత్ర గిరీశం కావడమే. గిరీశం రమణమూర్తి అన్నంతగా ప్రాచుర్యం పొందడం ఆ పాత్ర

స్వభావం రమణమూర్తి అర్థం చేసుకొని తనను తాను మలచుకున్న విధానం కారణం.

విజయనగరం మహారాజ కళాశాలలో బి.యస్సీ చదువు పూర్తిచేసి కొంతకాలం ఉపాధ్యాయవృత్తిలో కొనసాగాడు. రమణమూర్తిని 1945లో కవిరాజ మెమెరియల్ యూత్‌క్లబ్, 1954లో శ్రీకాకుళం నటరాజ కళాసమితి రమణమూర్తిని నటుడుగా ఆహ్వానించి, ఉత్తమ నటుడిగా తీర్చిదిద్దాయి. నామాట నెగ్గింది, దొంగాటకం, ప్రగతి, వారసత్వం, వర ప్రసాదం, *ఎన్.జి.వో., కాళరాత్రి, విశ్వశాంతి, నాటకం, పంజరం*, కాటమరాజు కథ నాటకాల్లో ప్రధాన పాత్రలు ధరించి, ఉత్తమ నటుడిగా బహుమతులు అందుకున్నాడు.

ప్రస్తుతం అనేక తెలుగు టీ.వీ. సీరియల్స్, రేడియో నాటకాల్లో పాత్రధారణ, గాత్రధారణ చేస్తోన్న రమణమూర్తి హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాటకశాఖల్లో విజిటింగ్ లెక్చరర్‌గా భావితరాల నటీనటులకు నటశిక్షణ ఇస్తూ తన నటనానుభవాన్ని సార్థకం చేసుకుంటున్నారు.

గం.సు.రె.

రమణమూర్తి, డి.వి. (జ.1930) : హాస్యనాటక రచయిత. ఈయన 1930, ఆగస్టు 23న విజయనగరంలో జన్మించాడు. గృహ సంబంధిత హాస్యోత్పత్తిలో సిద్ధహస్తుడు. కరుణ రసపూరితమైన నాటికలను రచించడం లోనూ ఈయనకు ప్రావీణ్యం ఉంది. *వశీకరణం, ఉత్తరం, వంట మనిషి కావాలి* వంటి హాస్య నాటికలు, లీల, కళ్ళజోడు, క్షణికం వంటి కరుణ రసాత్మక నాటికలు రచించాడు. మాటల కూర్పులో పొందిక, చమత్కారం, సంక్షిప్తత, సున్నిత హాస్యం ప్రేక్షకులను గిలిగింతలు పెడతాయి. కొంతకాలం ఉపాధ్యాయవృత్తిలో ఉండి, 1955లో దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగంలో చేరాడు. నాటక పోటీలలో న్యాయ నిర్ణేతగా వ్యవహరించాడు. రేడియో, టీ.వి.లకు అనేక నాటికలు రాసి ప్రశంసలు అందుకున్నాడు. ఉద్యోగ విరమణ తర్వాత ప్రస్తుతం కాకినాడలో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు.

గం.సు.రె.

రమణ, రేబాల (జ.1939) : ప్రసిద్ధ రంగస్థల నటుడుగా శ్రీరామ నాట్యమండలి కార్యదర్శి. ఆంధ్ర నాటక కళాపరిషత్తు సభ్యుడు. ఈయన నెల్లూరు జిల్లా కోవూరు తాలుకాలోని రేబాల గ్రామంలో 1939, జులై 1న జన్మించాడు. తల్లిదండ్రులు అంకమ్మ, పెంచలయ్యలు. ప్రాథమిక విద్య రేబాల లోను, ప్రాథమికోన్నత విద్య బుచ్చిరెడ్డి పాలెంలో పూర్తి చేసిన రమణకు చిన్నప్పటి నుంచే నాటకకళ పట్ల మక్కువ ఎక్కువ. నటనలో ఈయనకు బండారు రామారావు, బండారు సుశీలాదేవి గురువులు. ఆధునిక కాలంలో స్త్రీ పాత్రలలో నటించి పేరు తెచ్చుకున్న అతికొద్దిమంది నటులలో రమణ ప్రసిద్ధుడు. ఈయన శ్రీకృష్ణ తులాభారం లో సత్యభామ, బాలనాగమ్మ లో సంగు, సత్యహరిశ్చంద్ర లో చంద్రమతి, చింతామణి లో చింతామణి పాత్ర, *తారాశశాంకం* లో తార, సతీ సక్కుబాయి లో సక్కుబాయి, పల్నాటి యుద్ధం లో నాయకురాలు నాగమ్మ పాత్రలతో పాటు రామాంజనేయ యుద్ధం లో రాముడు, *పార్వతీ కల్యాణం*లో నారదుడుగా విభిన్నపాత్రలలో నటించి నాటలోకంలో నటుడుగా ఖ్యాతి గడించాడు. ఈయన ఆంధ్రదేశంలోనేగాక పొరుగు రాష్ట్రంలో ప్రదర్శించిన నాటకాలలో నటించాడు. ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. ప్రసిద్ధ నటుల సరసన స్థానం సంపాదించిన రమణను కళాపోషకులు నగదు బహుమతులిచ్చి సత్కరించారు. 1979లో విజయవాడ పట్టణ పౌరులు 'నటకావతంస' బిరుదునిస్తే 1980లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ తరుపున కూర్మా వేణుగోపాల స్వామి కళా ప్రవీణ ప్రదానం చేసి అభినందించాడు. కేంద్ర సంగీత నాటక అకాడమీ కళాకారులకిచ్చే ఫెలోషిప్పు నిచ్చింది. ఇవేగాక 'నరసింహారావు' స్థానం అవార్డును అందుకున్న రేబాల రమణ బండారు రామారావు స్థాపించిన శ్రీరామ నాట్యమండలికి కార్యదర్శిగా ఉంటూ కళోద్ధరణకు కృషిచేసిన కళాహృదయుడు రేబాల రమణ.

దాసరి.ఎస్

రమణయ్య, బి.టి.వి. (జ.1939) : నటుడు. కళారాజ్యం, బండారు రామారావు కళాస్రవంతి సంస్థల స్థాపకుడు. ఈయన 1939, ఆగస్టు 18న నెల్లూరు జిల్లా, బసినేనిపల్లిలో వెంకటమ్మ, గురవయ్యలకు జన్మించాడు. రమణయ్య రంగస్థలం వైపు మొగ్గు చూపడానికి వీరి తాత, పినతండ్రి ప్రకాశం జిల్లా కళారంగంలో ప్రముఖులు కావడమే. కళారంగానికి సంబంధించిన కుటుంబంలో పుట్టిన ఈయన

పదహారవ యేటనే బాలనాగమ్మ నాటకంలో బాలవర్ధిరాజుగా నటించాడు. తపాలాశాఖలో స్థిరపడిన తరువాత శ్రీకృష్ణరాయ బారం, శ్రీకృష్ణతులాభారంలో కృష్ణుడుగా, రామాంజనేయ యుద్ధం లో శ్రీరాముడు, నారదుడుగా, సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్రుడుగా, తారాశశాంకం లో చంద్రుడుగా ప్రముఖ రంగస్థల నటుల సరసన నటించాడు. తపాలాశాఖ నిర్వహించిన జాతీయ, రాష్ట్రస్థాయి ప్రదర్శనలలో పాల్గని అనేకసార్లు ప్రథమ బహుమతు లందుకున్నాడు. నెల్లూరు నెప్జా పరిషత్తు పోటీలలో సత్యహరిశ్చంద్ర పాత్రలో నటించినందుకు ప్రథమ బహుమతి లభించింది. రమణయ్య పౌరాణిక పాత్రలతో పాటు చింతామణి నాటకంలో భవానీశంకరుడు, బిల్వమంగళుడు, ఒక దీపం వెలిగింది లో గుడ్డివాడు, మారని మనుషులు లో వేణు, రాగరాగిణి లో రఘు మొదలైన సాంఘిక పాత్రలలో నటించి ప్రేక్షకుల మెప్పును పొందాడు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన రమణయ్య యువకళాకారులతో కలసి 'కళారాజ్యం' అనే సంస్థను స్థాపించాడు. ప్రముఖ పౌరాణిక నటుడు బండారు రామారావు అంటే రమణయ్యకు ఎనలేని అభిమానం. అందుకే బండారు రామారావు జ్ఞాపకార్థం 'బండారు రామారావు కళాస్రవంతిని' స్థాపించి రెండున్నర దశాబ్దాలుగా రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తూ కళామతల్లి సేవ చేస్తున్నాడు. 1998లో రమణయ్యను కళాలయ సంస్థ 'కళాతేజోవిరాట్' బిరుదునిచ్చి సత్కరించింది. మహతి కళాస్రవంతి, చైతన్య ఆర్టు థియేటరు, యువకళావాహిని వంటి పలు కళాసంస్థలు ఈయనను ఘనంగా సత్కరించాయి.

దాసరి.ఎస్

రమణా రావు, కోపల్లి వెంకట : (చూ. వేంకట రమణారావు, కోపల్లి)

రమణా రెడ్డి, కె.వి (1928-1998) : కవి, విమర్శకుడు, నాటకకర్త, వ్యాస రచయిత, మార్క్సిస్టు మేధావి, అధ్యాపకుడు. నెల్లూరు జిల్లా, కోవూరు తాలూకా రేబాలలో 1928, మార్చి 26న జన్మించాడు. విశ్వోదయ కళాశాల (కావలి)లో ఉపన్యాసకుడుగా పనిచేశాడు. విద్యార్థి దశ నుంచీ రాజకీయ రంగంలో ప్రముఖ పాత్ర నిర్వహించాడు. అడివి, అంగార వల్లరి, భువనఘోష గేయ సంపుటాలు వెలువరించాడు. కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జీవితం డైరీలు పరిష్కరించి ప్రకటించాడు. మహోదయం, గురజాడ అడుగుజాడ గ్రంథాలు ఈయన సాహిత్య పరిశీలనాశక్తికి నిలువుటద్దాలు. అభ్యుదయ పత్రిక సంపాదకవర్గ సభ్యుడుగా విప్లవ రచయితల సంఘం కార్యదర్శిగా పనిచేశాడు. తుది శ్వాస వరకూ వామపక్ష రాజకీయ సిద్ధాంతాలకు కట్టుబడిన మనీషి, అక్షయ తూణీరం శీర్షికన విశాలాంధ్ర పత్రికలో అసంఖ్యాకంగా సాహితీ మూల్యం కల వ్యాసాలు ప్రకటించాడు. రమణా రెడ్డి నాటక ప్రక్రియను కూడా చేపట్టి పి.వేణుతో కలసి రాజీవం అనే నాటికను రచించాడు. ఇది ప్రయోగాత్మక నాటికగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. అన్నపూర్ణ నాటకం, పద్మవ్యూహం, ఎండమావులు నాటికలు కళాభిమానుల ప్రశంసలను చూరగొన్నాయి. రమణారెడ్డి 1998 మే నెలలో విజయవాడలో కన్నుమూశాడు.

గం. సు.రె

రవి ఆర్టు థియేటర్స్ : సి. నాగభూషణం రంగ స్థలం నుంచి వెళ్లిన సినిమా కళాకారుడు. ఆయన సినిమా నటుడిగా కొనసాగుతూ, రక్త కన్నీరు సాంఘిక నాటకాన్ని,ఆంధ్రదేశంలో పలుమార్లు ప్రదర్శించాడు. అన్ని ప్రదర్శనలలోను, కాంట్రాక్టర్లకు, విపరీతంగా లాభాలు వచ్చాయి. ఒకే ప్రదేశంలో ప్రతి రోజు ఒక్క ప్రదర్శన చొప్పున వరుసగా 10, 15 ప్రదర్శనలు కూడా జరిగేవి. కొన్ని సందర్భాలలో ఒకే చోట, ఒకే రాత్రి, రెండు ప్రదర్శనలు కూడా జరిగిన సందర్భాలు ఉన్నాయి. సాంఘిక నాటకాల చరిత్రలో, రక్తకన్నీరు నాటకం ఒక చరిత్ర సృష్టించింది. ఒక్క నాగ భూషణం పేరుతో ఈ నాటకం ఇంతటి విజయం సాధించింది. ఈ నాటకంలో 30 రంగాలున్నాయి. రెప్పపాటులో సీనులన్నీ చకచకా జరిగిపోతాయి. తమిళంలో రచింపబడిన ఈ నాటకాన్ని పాలగుమ్మి పద్మరాజు తెలుగులోకి అనువదించాడు. బి. గోపాలం సంగీతం అందించాడు. ఈ నాటకంలో ప్రధాన పాత్రల్లో సి. నాగ భూషణం, పెరుమాళ్ళు, రేపల్లె కృష్ణమూర్తి, మోహన్‌దాస్, దుర్గారావు, సత్యనారాయణ, పెద్దన్న, సీత, శారద, సుజాత, మీనాకుమారి, రేవతి, ఆదోని లక్ష్మి, వాణిశ్రీ మొదలైనవారు పాల్గన్నారు. రక్తకన్నీరు నాటకం అయిదువేల సార్లు ప్రదర్శింపబడి నాటక చరిత్రలో రికార్డు సృష్టించింది.

నే.ప.శ

రవీంద్రనాథ్ టాగూరు (1875-1941) : బెంగాలీ నాటకకర్త, మహాకవి, కథాకారుడు, నవలాకారుడు, చిత్రకారుడు, శిల్పి, వాగ్గేయకారుడు, సంగీత ప్రవక్త, విశ్వ మానవుడు, తత్త్వవేత్త, ధర్మ ప్రబోధకుడు, నోబెల్ సాహిత్య బహుమాన గ్రహీత (1913), విశ్వ భారతి విశ్వవిద్యాలయ సంస్థాపకుడు, విశ్వకవి, కవి సామ్రాట్ బిరుదాంకితుడు, నటుడు. ఈయన 1875, మే 7న కలకత్తాలో జన్మించాడు. ఈయన మొదటి నాటక రచన వాల్మీకి ప్రతిభ. అందులో టాగూరు వాల్మీకి పాత్రలో నటించాడు. బలిదానం నాటకంలో జయసింగ్ పాత్రలో నటించాడు.



ఈయన నాటకాలలో మార్మికత, సాంకేతికత ఎక్కువగా గోచరిస్తాయి. ఈయన నాటకాలన్నీ ప్రపంచ భాషలన్నిటిలోకి అనువదితమైనాయి. తెలుగులోకి శ్రీనివాస చక్రవర్తి, బెజవాడ గోపాల్‌రెడ్డి, అబ్బూరి రామకృష్ణారావు, బెల్లంకొండ రామదాసు మొదలైనవారు అనువదించారు.

ఈయన *వాల్మీకి ప్రతిభ, బలిదానం, ముక్తధార, పోస్టాఫీసు, అరూపరత్నం, రాజు-రాణి, ఎర్రగన్నేరు, చిత్ర, ఛండాలిక, సన్యాసి, మాలిని, నటీర్ పూజ, అచలాయతనం, ఋతుచక్రం*, మొదలైన రచనలు చేసిన రవీంద్రనాథ్ టాగూర్ 1941, ఆగస్టు 7న మరణించాడు.

శ్రీ.చ.

రవీంద్రారెడ్డి, ఎస్ (జ.1938) : రంగస్థల, రేడియో నటుడు, రచయిత, దర్శకుడు. ఈయన 1938, నవంబరు 26వ తేదీన చిత్తూరు జిల్లా పంటపల్లె గ్రామంలో జన్మించాడు. విద్యాభ్యాసం చిత్తూరులోను, తిరుపతి, హైదరాబాదులలో సాగింది. 1960లో నాట్య విద్యాలయం డిప్లొమా పూర్తి చేశాడు. బి.ఏ పట్టా పుచ్చుకున్న రవీంద్రారెడ్డి సహకార శాఖలో ఉద్యోగిగా చేరినా, ప్రవృత్తి మాత్రం నాటకరంగమే.

కాలేజీ విద్యార్థిగా, నాట్యవిద్యాలయ రిపర్టరీ, కో ఆపరేటివ్ అసోసియేషన్ పక్షాన అనేక ఇంగ్లీషు, తెలుగు నాటకాలలో నటించాడు. మర్చెంట్ ఆఫ్ వెనీసు లో షైలాక్‌గా, జూలియస్ సీజరు లో మార్క్ ఆంటోనీగా, హాల్లో అవుట్‌డేర్ లో మనిషిగా నటించి ప్రశంసలందుకున్నాడు. తెలుగు నాటకం నేల నాలుగు చెరుగులా వ్యాపింపచేయడానికి విశేషంగా కృషిచేసిన ఎ.ఆర్. కృష్ణ, మంత్రి శ్రీనివాస రావుల శిక్షణలో మంచి నటుడుగా రూపొందాడు. పాత్రలకు అనుగుణమైన శరీరాకృతి, మధుర గంభీర కంఠస్వరం, రవీంద్రా రెడ్డికి సహజంగా లభించిన వరాలయితే, స్పష్టమైన వాచికం, ప్రశస్తమైన అభినయం, అభ్యాసంతో అలవడిన ప్రజ్ఞా విశేషాలు.

అతనికి బాగా పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన పాత్ర కన్యాశుల్కం లోని గిరీశం. గిరీశం పాత్రను కొన్ని నాటక సమాజాలు బఫూన్‌గా రూపకల్పన చేశాయి, అలా కాకుండా అబ్బూరి రామకృష్ణారావు దర్శకత్వంలో రవీంద్రారెడ్డి పోషించిన గిరీశం పాత్రను గురజాడ ఆశించిన మేరకు ఒక ప్రత్యేక పాత్రగా పోషించి ప్రేక్షకుల మన్ననలను అందుకున్నాడు. ప్రతాప రుద్రీయం లో ప్రతాపరుద్రుడు, పేరిగాడు పాత్రలను, రావి శాస్త్రి నిజం లో సోమసుందరం పాత్రను, రవీంద్రనాథ్ టాగూరు బలిదానం లో జైసింగ్ పాత్రను సమర్థవంతంగా పోషించి ప్రేక్షక ప్రశంస లందుకున్నాడు. రాష్ట్రంలోనే కాకుండా మద్రాసు, ఢిల్లీ, బెంగుళూరులో ప్రదర్శించిన నాటకాలలో కూడా పాల్గన్నాడు. రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ కోసం ప్రత్యేక రంగస్థలంపై మృచ్ఛకటిక నాటక ప్రదర్శనలో పాల్గని ఆయన ఆశీస్సులను, అభిమానాన్ని చూరగొన్నాడు.

[redacted]

1960 ప్రాంతంలో హైదరాబాదులో జరిగిన ఎనిమిదవ ప్రపంచ యువజనోత్సవాలలో భాగంగా ప్రదర్శింపబడిన అనంతం నాటికలో రాందాస్ పాత్రలో నటించి రవీంద్ర రెడ్డి ఉత్తమ నటుడు అవార్డును గెలుచుకున్నాడు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన నాటక పోటీలలో పాల్గని ఉత్తమ నటుడు అవార్డును పొందాడు. ప్రసార భారతి కోసం కె. చిరంజీవి రచించిన మహానిష్క్రమణం నాటకంలో ప్రధానపాత్రలో నటించి అఖిల భారతస్థాయిలో ప్రదర్శనకి అవార్డు పొందాడు. ప్రసారభారతిలోను, దూరదర్శన్‌లోని 'ఎ' గ్రేడ్ ఆర్టిస్టుగా వందల నాటకాలలో వివిధ పాత్రలలో నటించాడు.

రంగస్థలంలో ఆయనకున్న అభినివేశం రంగస్థల శాస్త్రంలోని అభినయ విభాగం రచించడానికి దోహద పడింది. ఈ గ్రంథాన్ని తెలుగు అకాడమీ ప్రచురించింది. ఈ గ్రంథమే నేడు రంగస్థల కళల శాఖలున్న విశ్వవిద్యాలయాలకు, రంగస్థల కళాకారులకు ప్రామాణిక గ్రంథంగా ఉపకరిస్తుంది.

నటుడిగా, రచయితగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న రవీంద్రారెడ్డి కొన్ని నాటకాలకు దర్శకత్వ బాధ్యతలు కూడా

చేపట్టాడు, ఎక్కువగా స్టానిస్లవ్‌స్కీ నటనా పద్ధతిని అనుసరిస్తూ నాటకాలు వేయించాడు. ప్రయోగాత్మక నాటకాల పట్ల ఎక్కువ మక్కువ కనబరచాడు. 1960-70 మధ్య కాలంలో సిటీబస్, ఆశ, విదూషకుడి ఆత్మహత్య లాంటి ప్రయోగాత్మక నాటకాలు ప్రదర్శించి, ప్రేక్షకులలో ప్రయోగాత్మక నాటకాల పట్ల అభిరుచిని పెంపొందించడానికి కృషి చేశాడు.

దాసరి.ఎన్.

రసం : రసం అనే పదం మొట్టమొదట ఋగ్వేదంలో కనిపిస్తోంది. అందులో ఈ పదం సోమరసం, జలం, క్షీరం, సారం అనే అర్థాలలో వివిధ మండలాలలో ప్రయోగించారు. అథర్వణ వేదంలో రుచి అనే అర్థంలో వాడారు. ఉపనిషత్కాలంలో దీనికి ప్రధానసారం అనే అర్థం వచ్చింది. ఛాందోగ్యపనిషత్తులో రుచి, ప్రధానసారం అనే రెండర్థాలలో వాడారు. ఈ శృతులను వ్యాఖ్యానిస్తూ తాత్త్వికులు జగత్తునకు సారభూతమైన పరమాత్మయే రసమని సిద్ధాంతీకరించారు. యోగులు పొందే శాశ్వతానందంతో సమమైంది రసం. అందుకే కావ్యానందం బ్రహ్మానంద సహోదరమని ఆలంకారికులు చెప్పారు.

ఈ రసవిషయాలలో సంస్కృత లాక్షణికులు రకరకాల సిద్ధాంతాలు లేవదీశారు. రసం ఎలా జనిస్తుందనే విషయంలో భరతముని రస పదానికి 'ఆస్వాదింపబడేది' అని అర్థం చెప్పాడు. 'విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రస నిష్పత్తిః' (సంపుటం - 1) అంటే విభావం, అనుభావం, వ్యభిచారి భావాల కలయిక వల్ల రసం జనిస్తుందని అర్థం. అయితే భరతముని ఈ సూత్రంలోని 'సంయోగ నిష్పత్తి' పదాలను నిర్వచించకపోవడం వల్ల తరువాత వ్యాఖ్యాతలు, లాక్షణికులు భిన్న భిన్న వాదాలను లేవదీశారు. పై శ్లోకంలోని విభావ, అనుభావ, వ్యభిచారీ భావ శబ్దాలకు కచ్చితమైన అర్థం తెలుసుకున్నపుడే వాటి కలయిక వల్ల రసం ఎలా జనించేది బోధపడుతుంది.

విభావం : ఈ పదానికి గల అర్థం విశిష్ట జ్ఞానానికి హేతువైంది. దేనికి హేతువు? చిత్త వృత్తులు జనించడానికి హేతువైన విషయం. ఆ విషయాలు నాటక నాయికా నాయకులు, వారి భావాలకు దోహదమిచ్చే వస్తువులు. విభావాలు రెండు విధాలు.

1. ఆలంబనం : నాయికా నాయకులు. వీరిని ఆలంబనం (ఆధారం) చేసుకునే భావాలు ఉద్భవిస్తాయి.

2. ఉద్దీపకం : వీరి భావాలకు దోహదం చేసే వస్తువులు. అనుభావం - విభావం హేతువు గదా! ఆహేతువుకుకార్యరూపం అనుభావం. వ్యభిచారీ భావం - వ్యభిచారి పదానికి అర్థం చరించేది. ఇవి చతుర్విధాభినయాలతో రసాన్ని ప్రేక్షకులకు అందివ్వడానికి తోడ్పడతాయి. నాయికా నాయకుల మనస్సులలో పుడుతూ అణగుతూ ఉంటాయి.

నాట్యశాస్త్రానికి ప్రథమంగా వ్యాఖ్యానం రచించిన భట్టలోల్లటుడు 'నాటి కథా పాత్రలుండే రసము నిష్ఠమై ఉంది. నటుడు ఆ పాత్రలను ధరించి నటించేటపుడు వాని నేర్పు వల్ల రసం వారిలో నిష్ఠమయినట్లు గోచరిస్తుంది. అలా గోచరించిన దానిని ప్రేక్షకులు వీక్షించి, భావించి ఆనందిస్తారు' అని వాదించాడు. దీనికి ఉత్పత్తి వాదమని పేరు. ఆ తరువాత శ్రీశంకుడనే ఇంకొక వ్యాఖ్యాత, రసం నటులందే ఉంటుంది. వారు తమ నటనా కౌశల్యం చేత తామే ఆ పాత్రలయినట్లు ప్రేక్షకులకు భ్రాంతి కలిగిస్తున్నారు. వివిధ అవస్థలను ప్రదర్శిస్తున్నారు. అందువల్ల నటులలో రసం నిష్ఠమై ఉంది. నటులు ఆ రసాన్నే ప్రేక్షకుడు అనుభవించి ఆనందిస్తున్నాడు అని చెప్పాడు. దీనికి అనుమితి వాదమని పేరు.

వీరిరువురి వాదనలను ఖండిస్తూ భట్టనాయకుడనే ఇంకో వ్యాఖ్యాత, రసం ప్రేక్షకులలో జనిస్తుంది. నాటక ప్రదర్శనలై చూచే సమయంలో ప్రదర్శనలో నిమగ్నులై, నాటక పాత్రలలో ఐక్యమై ఆ పాత్ర అనుభవించే రసాన్నే అనుభవిస్తున్నారు అని వాదించాడు. దీనికి భుక్తివాదమని పేరు.

వీరందరి వాదనలను ఖండిస్తూ అభినవ గుప్తుడు, రసం ప్రేక్షకులలోనే జనిస్తుంది. ప్రేక్షక హృదయాలలో సకల భావాలు నిద్రాణమై ఉంటాయి. నటులు ప్రదర్శించే విభావాది భావాలు, ప్రేక్షక హృదయాలలో నిద్రాణమై ఉన్న భావాలను మేల్కొల్పుతాయి. అలా మేలుకొన్న భావాలు సాధారణీకరణ చెందుతాయి. అపుడు ప్రేక్షక హృదయాలలో కథా పాత్రలకు ప్రత్యేక నామరూపాలు నశించి వారిలోని మానవత్వమే నిలుస్తుంది. అంటే నాటక కథలోని శకుంతలా దుష్యంతులు సాధారణీకరణం వల్ల ప్రేక్షక భావనలో ప్రకృతి పురుషులుగా మారతారు. పాత్రలో ప్రేక్షకులకు అభేద భావం కలుగుతుంది. అట్టి స్థితిలో ప్రేక్షకుడు సర్వ లౌకికప్రపంచాన్ని మరచి అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తాడు అని సిద్ధాంతీకరించాడు. దీనికి అభివ్యక్తి వాదమని పేరు.

ధనుంజయుడు దశరూపకంలో, రతి, హాస, శోక భయాదియైన స్థాయిభావం రసం అని తెలుపుతున్నాడు. స్థాయి భావమంటే భావం చలించకుండా, ఇతర భావ సంపర్కం వల్ల కలిగే మార్పుకు లోనుకాకుండా, ఆ భావాన్ని కూడా తనలో కలుపుకొన కలిగిన దృఢత్వం కలది.

స్థాయి భావాలు ప్రేక్షక హృదయాలలో అణగి ఉండి, నటులు ప్రదర్శించే విభావానుభావ వ్యభిచారి భావాల వల్ల, ఉద్రిక్తమై తన్మయత్వం కలిగించి, లౌకిక ప్రపంచాన్ని మరిపించి, అలౌకికానందంగా మారుతాయి.

ఈ వాదనలన్నింటినీ సమీక్షిస్తూ రసగంగాధర కర్త పండితరాయలు, 'ప్రేక్షక హృదయాలలోని భావాలను అజ్ఞానం

లేదా విషయాంతరం ఆవరించి ఉంటుంది. నటీనటుల భావ ప్రకటన వల్ల ఈ ఆవరణ భగ్నమై ప్రేక్షక హృదయాలలోని భావాలు విజృంభించి స్థాయినొంది రసంగామారి చిదానందం కలిగిస్తాయి' అని చెప్పాడు.

లౌకిక ప్రపంచంలో నలుగురు నవ్వుతూంటే అయిదవ వానికి కూడా నవ్వు వస్తుంది. ఒకడు గుండె బద్దలయ్యేటట్టు ఏడుస్తుంటే చుట్టూ ఉన్నవారికి కూడా సానుభూతి కలిగి, హృదయం ద్రవించి ఏడుపు వస్తుంది. నాటక ప్రదర్శనం చూసేటపుడు కూడా రంగస్థలం మీద నటుల హాస్యం మనలోనూ నవ్వును జనింపచేస్తుంది. పాత్రధారులు ఏడుస్తూంటే మనకీ ఏడుపు వస్తుంది. అయితే మొదటిది లౌకిక ప్రపంచం. రెండవది కల్పనా ప్రపంచం. మొదటి ప్రపంచంలో వ్యక్తులు నవ్వినా, ఏడ్చినా అది వారికి కలిగిన హాస్యానికి ఆపదకు చిహ్నం. వాటితోపాటు మనం కూడా సంతోషిస్తాం, బాధపడతాం. ఇక నాటక రంగంలో నవ్వు, ఏడ్పు భావనా జగత్తుకు చెందినవి. లౌకిక ప్రపంచంలో ఏడిస్తే అది బాధాకరం. కాని నాటకరంగం కల్పనా జగత్తు కావడం వల్ల ప్రేక్షకుడికి ఏడుపు వల్ల బాధ కలగదు. పైగా అలౌకికానందం కలుగుతుంది.

దీనినే టాల్‌స్టాయ్ భావ పరివర్తిన (Transmmission of feeling) అన్నాడు. కళ అంటే ఏమిటి? (what is art) అనే గ్రంథంలో - "To evoke in oneself a feeling one has once experienced and having evoked it in oneself then by means of movements, lines, colours, sounds or forms expressed in words, so to transmit that feeling that others experience the same feeling - this is the activity of art" (World Classics, P. 123.) (ఒకసారి అనుభూతి చెందిన భావాన్ని తిరిగి తనలో రేకెత్తించుకుని, ఆ భావాన్ని కదలికలు, లేఖలు, వర్ణాలు, ధ్వనులు లేక భాషతో కూడిన రూపాల ద్వారా అనుభూతి చెందేందుకు ఇతరులకు పరివర్తింప జేయడం – ఇదే కళా కార్యకలాపం)

గ్రీకు లక్షణవేత్త అరిస్టాటిల్, కవిత అలంకారిక శాస్త్రం (Poetics) అనే గ్రంథంలో విషాద నాటకం నిర్వచిస్తూ, ఇదే భావాన్ని పొందుపరిచాడు. "Through pity and fear effecting the proper purgation (Catharisis) of the emotions (Tributcher - Dover Publications, P. 23)" " విషాద నాటకంలో ప్రదర్శితమయ్యే భయశోకాలు మానవునిలో సహజంగా ఉండే భయశోకాలను క్షాళనం చేసి ప్రశాంతచిత్తులను చేస్తాయి''. ఇందులో భావ పరివర్తన గోచరిస్తుంది.

రష్యన్ నాటక ప్రయోక్త, లక్షణకారుడు స్టానిస్లవ్‌స్కీ 'Your emotion memory can bring back feelings you have already experienced. They may seem to be beyond recall, when suddenly a suggestion, a thought, a familiar object will bring them back in full force; sometimes the emotions are as strong as ever, sometimes weaker, sometimes the same strong feelings will come back but in a some what different guise' (An Actor Prepares, Theatre Arts Books, P.158) "ఉద్వేగస్మృతి వల్ల నటునిలో తాను పూర్వం అనుభవించిన ఉద్వేగాలను పోలిన ఉద్వేగాలు జనిస్తాయి. వాటిని భావనాశక్తి ద్వారా తీవ్రతరం చేసుకుని రంగస్థలం మీద ప్రదర్శిస్తుంటే అవి ప్రేక్షక హృదయాలకు గాఢంగా హత్తుకుంటాయి''.

స్థాయి భావం : భావ పరాకాష్ఠయే స్థాయి భావం. ఈ స్థాయి భావమే రసం. అభినవగుప్తుడు రసానుభవం అయిదు దశలలో జరుగుతుందని వివరించాడు. మొదటి నాలుగు దశలలో నాలుగు అవస్థలను పొంది అయిదవ దశలో రసానుభూతి కలుగుతుంది.

మొదటి దశ : విభావం అంటే నాయికా నాయకులు, వారి వర్ణనలు ప్రేక్షకుల నయన శ్రవణేంద్రియాలను విప్పార చేస్తుంది.

రెండవ దశ : ఇలా నాయికా నాయకులను రంగస్థలం మీద చూడడం, వినడంతో ప్రేక్షకులభావనాశక్తి పనిచేయ నారంభిస్తుంది. ఈ నాయికా నాయకుల బాహ్య స్వరూపాన్నే గాక వారిలో దాగి ఉండి బాహ్యేంద్రియాలకు గోచరించని విశిష్ఠ ధర్మాన్ని, అనంతత్వాన్ని దర్శించగలుగుతారు. దీనికి నాటక ప్రదర్శనంలో చూపే అనుభవాలు అంటే భావాలను సూచించే వికారాలు సహాయపడతాయి.

మూడవ దశ : ఇలా విశిష్ట ధర్మాలు, అనంతత్వం గోచరించగానే ప్రేక్షకుని స్వభావమే మారిపోతుంది. తాను భావన చేసిన విశిష్ట రూపమే అతని మనసు ఎదుట నిలిచి ఉంటుంది. అంటే లౌకిక లోకం మరచి భావనాలోకంలో విహరిస్తాడు. ఆ అవస్థలో ప్రేక్షకుడు తన భావనకు హేతువైన విభావంతో తాదాత్మ్యం పొంది ఆ నాయికా నాయకుల ఉద్వేగాలను కూడా పొందుతాడు.

నాలుగవ దశ : ఇలా నాయికా నాయకుల ఉద్వేగాలను పొందుతూ వాటి తీవ్రతకు లోనై క్రమంగా తనను తాను మరచిపోతాడు. వ్యక్తిత్వం కోల్పోతాడు. ఈ స్థితినే 'సాధారణీకరణం' అంటారు.

అయిదవ దశ : ఈ దశలో సాధారణీకరణ స్థితిలోని ప్రేక్షకుని బాహ్యేంద్రియాలు పనిచేయడం పూర్తిగా మానివేస్తాయి. స్థాయి భావంతో నిండిన హృదయం, ఆనందంతో కూడిన ఆత్మ పని చేస్తాయి. ఇదే రసానుభూతి. ఆత్మీయకథార్థానికి ఆనంద స్వరూపమైనా, అజ్ఞానమో విషయాంతరమో దానిని ఆవరించి ఉంటుంది. నటీనటుల చతుర్విధాభినయ ప్రదర్శన వల్ల ఆ ఆవరణ భగ్నమవుతుంది.

మూలరసాలు నాలుగే అయినా రసాలు తొమ్మిది అని సామాన్యాభిప్రాయం. కాని భరతముని ఎనిమిది రసాలే చెప్పాడు.

శృంగార–హాస్య–కరుణా–రౌద్ర–వీర–భయానకాః
భీభ–త్సాద్భుత సంజ్ఞౌచేత్యష్టౌ నాట్యే రసాః స్మృతాః

విక్రమోర్వశీయం ద్వితీయాంకంలో 'భరతముని యష్ట రసముల నిరవుకొల్పి' – (పద్యం–35, అను. వేదం వేంకటరాయ శాస్త్రి) అనడాన్ని బట్టి కాళిదాసు కాలం నాటికి అష్టరస సిద్ధాంతామే ప్రచారంలో ఉన్నట్టు తెలుస్తోంది. తరువాత ఉద్భటుడు మొదలైన లాక్షణికులు శాంత రసాన్ని తొమ్మిదో రసంగా అంగీకరించారు. ఆనందవర్ధన అభినవగుప్తులు దీనిని సమర్థించి సిద్ధాంతీకరించారు. ఆ తరువాత విశ్వనాథ కవిరాజు సాహిత్య దర్పణంలో 'అథమునీంద్ర సమ్మతో వత్సలో రసః' (కరుణ వాత్సల్య భయానకేషు అనుదాత్త స్వరిత కంపితైః వర్ణైః పాఠ్యముపపాద యతి – నా.శా.) అని వాత్సల్యరసాన్ని కూడా చేర్చి రసాలు పది అన్నాడు. మరికొందరు లాక్షణికులు భక్తిమాయ రసాలను కూడా ప్రతిపాదించారు. భట్టలోల్లటాదులు భావాలు అనంతాలు, భావాలలో నుంచి జనించే రసాలు కూడా అనంతాలే అన్నారు. అభినవ గుప్తుడు ఈ వాదాలన్నిటినీ ఖండిస్తూ, అనంతభావాల వల్ల కలిగే అనంతరసాలు ఈ తొమ్మిది రసాల ఛాయలని సిద్ధాంతం చేశాడు.

అన్ని రసాల వల్ల కలిగే ఆనందం ఒకటే అవటం వల్ల రసం ఒక్కటే, అదే శాంతరసం, సకల స్థాయీ భావాలు శాంత రసంలో పుట్టి అందులోనే లీనమవుతాయి అన్నారు కొందరు. భవభూతి కరుణ ఒక్కటే రసం అన్నాడు. భోజుడు శృంగారం ఒక్కటే రసమని, మరికొందరు అద్భుతం ఒకటే రసం అని ప్రతిపాదించారు.

శ్రీ.చ.

ర.స.న. సమాఖ్య (విజయవాడ): ఈ సమాజాన్ని 1954లో స్థాపించారు. విజయవాడ కేంద్రంగా ఒక దశాబ్దం పాటు నాటకరంగంలో ఒక వెలుగు వెలిగిన ర.స.న సమాఖ్యకు ఆ పేరుపెట్టింది ప్రఖ్యాత నాటక రచయిత కొప్పరపు సుబ్బారావు. ర.స.న. సమాఖ్య అంటే రసజ్ఞుల, సహృదయుల, నటీనటుల సమాఖ్య అని అర్థం. దీని స్థాపక సభ్యులందరూ ప్రఖ్యాత నటులు కావడం విశేషం. తన అనుపమాన నటనా వైదుష్యంతో, దర్శకత్వపు ప్రతిభతో తెలుగు నాటకరంగంలో అద్వితీయుడిగా ప్రకాశించిన కె. వేంకటేశ్వరరావు ఈ కళాసంస్థకు మూలపురుషుడు, కేంద్ర బిందువు. జి.ఎస్.ఆర్. మూర్తి, పొట్టి ప్రసాద్, కె.కె. నాయుడు, చాట్ల శ్రీరాములు, జి.వి. సుబ్బారావు, అన్నపురెడ్డి శివరామిరెడ్డి, పి. రామచంద్రరావు, పొట్టి చలపతి, యం.వి. రాఘవరావు, సి.ఎస్. మాధవ్ ఈ సంస్థ స్థాపక సభ్యులు. కె. వేంకటేశ్వరరావు సారథ్యంలో ర.స.న. సమాఖ్య నాటక రంగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పింది. ర.స.న సమాఖ్య నాటకం ప్రదర్శిస్తుందంటే అది ఉత్తమ ప్రదర్శనగా ఉంటుందనే నమ్మకం ప్రేక్షకలోకంలో దృఢంగా నాటుకుపోయింది. ర.స.న సమాఖ్య వారి ప్రదర్శన నిరాశ కలిగించిన సందర్భమే లేదంటే ఆశ్చర్యం లేదు. ఎలాంటి అట్టహాసమూ, ఆర్భాటమూ లేకుండా ప్రదర్శన విలువలతో ప్రతి నాటకాన్ని ఒక కళాఖండంగా తీర్చిదిద్దడంలో దిట్ట వేంకటేశ్వరరావు.

ర.స.న సమాఖ్య ప్రదర్శించిన నాటకాలలో అనిసెట్టి సుబ్బారావు రచించిన మావూరు , బెల్లంకొండ రామదాసు ఆకాశరామన్న, కొడాలి గోపాలరావు దొంగవీరడు, కొర్రపాటి గంగాధరరావు నా బాబు, గుడ్డి లోకం, గొల్లపూడి మారుతీరావు రాగరాగిణి, భమిడిపాటి రాధాకృష్ణ కీర్తిశేషులు,భజంత్రీలు, మాస్టర్జీ, ముదిగొండ లింగమూర్తి వెంకన్నకాపురం, పెళ్ళిచూపులు, పులుగుండ్ల రామకృష్ణయ్య తుఫాన్ మొదలైన నాటక నాటికలు బహుళ జనాదరణ పొంది ప్రేక్షక హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయాయి. వాణీబాల, ఉషాబాల, బాలసరస్వతి, అన్నపూర్ణ, లక్ష్మీప్రసాద్, పొట్టి లక్ష్మి, ఆలపాటి లక్ష్మి, సుశీల మొదలైన నటీమణులు ర.స.న సమాఖ్య నాటకాలలో పాల్గని సమాఖ్య ఖ్యాతిని ఇనుమడింపజేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటకశాఖలో దర్శకుడిగా కె. వేంకటేశ్వరరావు విశాఖపట్టణం వెళ్లడంతో ర.స.న సమాఖ్య కార్యకలాపాల జోరు తగ్గింది. క్రమక్రమంగా ఆ సంస్థ నామావశిష్టంగా మిగిలిపోయింది. కాని ఈ సమాఖ్య నెలకొల్పిన ప్రదర్శనా రీతుల ప్రభావం నాటకరంగంలో చెరిగిపోలేదు.

గం.సు.రె.

రసార్ణవ సుధాకరము: ఇది నాటకాలంకార శాస్త్రం. ఈ గ్రంథాన్ని సింగభూపాలుడు (1308–1427) రచించాడు. ఇందులో విలాసాలు మూడు, శ్లోకాలు 1028. దీని ప్రథమ ముద్రణ 1895లో జరిగింది. ఈ గ్రంథాన్ని బులుసు వెంకట రమణయ్య తెలుగులో అనువదించగా ప్రథమ ముద్రణ 1950లో జరిగింది. దీనిలోని భావకోల్లాసమనే మూడవ అధ్యాయం నాటక ప్రకరణం. సంస్కృత మహాకావ్యాలకు వ్యాఖ్యానాలు రచించిన మల్లినాథసూరి రసార్ణవ సుధాకరమును చాలాసార్లు ఉటంకించడం ఈ గ్రంథం ప్రామాణికతకు నిదర్శనం. నాటక లక్షణ గ్రంథాలలో వివరించని సంధ్యంతరంగాలు, భూషణాలు మొదలైనవి ఈ గ్రంథంలో చర్చితమైనాయి. భరతమునినేగాక, దత్తిల, మతంగ, రుద్రట, భోజదేవాది లాక్షణికులను కూడా ఇందులో ఉదహరించాడు.

ఈ గ్రంథానికి సింగభూపాలుడు భరతముని నాట్యశాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొన్నాడు. భోజ, ధనంజయాదుల కొన్ని కొన్ని అభిప్రాయాలను తీవ్రంగా

ఎదుర్కొన్నాడు. ఈ గ్రంథాన్ని సమగ్ర నాటకాలంకార శాస్త్రమని చెప్పవచ్చు.

శ్రీ.చ

రసీన్, జీన్ (1639-99) : సుప్రసిద్ధ ఫ్రెంచి నాటక రచయిత. జాన్సెనిస్ట్ సంప్రదాయానికి చెందిన పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. మోలియర్, లా ఫాంటెన్, బ్వాలో మొదలైన సాహితీ వేత్తలతో మైత్రిని సంపాదించాడు. కొర్నేల్‌తో పోటీ పడటం వల్ల తన నాటక రచనా వ్యాసంగంలో రసీన్ ఎన్నో ఇక్కట్లను ఎదుర్కోవలసి వచ్చింది. ఫీద్రా నాటకం ప్రదర్శింపబడిన తరువాత రసీన్ రంగస్థలానికి వీడ్కోలునిచ్చి ప్రశాంత జీవనాన్ని గడపడానికి నిశ్చయించి పారిస్ నగరాన్ని విడిచి వెళ్ళాడు.

రసీన్ రాసిన నాటకాలలో ఫీద్రా అగ్రగణ్యమైంది. సులభశైలిలో సూటిగా మానసిక సంక్షోభాన్ని, పాత్రల మనస్తత్వాన్ని, ప్రకటించడంలో రసీన్ సిద్ధహస్తుడు. *లాతిబైడ్* (1664), *అలెగ్జాండర్* (1665), *ఆండ్రోమాకీ* (1667), *బ్రిటానికస్* (1669), *బెరెనిసి* (1670), *బజాజెట్* (1672), *మిత్రిదాటి* (1674), *ఇఫిజినీ* (1674), *ఫీద్రా* (1677) మొదలైనవి రసీన్ రచించిన నాటకాలు. రంగస్థలం నుంచి విరమించిన తరువాత *ఎస్తర్* (1688), *అథాలీ* (1690) అనే రెండు నాటకాలను బైబిల్ కథావస్తువుగా రచించాడు. రసీన్ నాటకాలపై యూరిపిడీస్ అనే గ్రీక్ నాటక రచయిత ప్రభావం గాఢంగా కనిపిస్తుంది. చారిత్రకాంశాల ఆధారంగా కూడా కొన్ని నాటకాలను రసీన్ రాశాడు.

శ్రీ.ల.

రాం ప్రసాద్, కె.జి. (జ.1932) : నటుడు, దర్శకుడు, నాటక రచయిత, సాంకేతిక నిపుణుడు. ఈయన 1932, అక్టోబర్ 16న జన్మించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఏ., ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి. పూర్తి చేశాడు. విద్యార్థి దశ నుంచీ నాటకరంగంపై ఏర్పడిన మక్కువ జీవనయానంలోనూ తోడుగా నిలిచింది. కళాశాల సాంస్కృతికోత్సవాలలో ఒథెల్లో నాటకంలో ఒథెల్లో, డెస్డిమోనా పాత్రలను ఏకపాత్రాభినయం ద్వారా అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ఆదరాభిమానాలను, ప్రోత్సాహాన్ని పుష్కలంగా అందుకొన్న రాంప్రసాద్, అప్పటి నుంచీ వందలాది నాటక నాటికలలో తన నటనా వైదుష్యాన్ని ప్రదర్శించాడు. రంగస్థల కళల శాఖలో దర్శకత్వంలో పి.జి.డిప్లొమా పూర్తి చేశాడు. నటుడు సహజంగా ఎంత సమర్థుడైనా శాస్త్రీయపద్ధతిలో శిక్షణ పొందడంవల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందనీ, అది అతని నట జీవితాన్ని తేజోమయం చేస్తుందని విశ్వసించే రాంప్రసాద్, నాటకరంగంలో చేపట్టని శాఖ లేదు. నటన, దర్శకత్వం, రచన, రంగోద్దీపనం వంటి విభాగాలలో ప్రావీణ్యం సంపాదించాడు. జానపద కళారూపాల విషయంలోను ఈయనకు ఎంతో ఆసక్తి ఉంది.

రాతి మనిషి, *అభాగ్యులు*, *దంత వేదాంతం* మొదలైన నాటికలను ప్రదర్శించి ఉత్తమనటుడిగా బహుమతులు అందుకున్నాడు. *ఒక దీపం వెలిగింది*, *మనిషి మీరైతే ఏం చేస్తారు*, *ఆ ఉదయం ఎప్పుడో?*, పెండింగ్ ఫైల్ మొదలైన నాటికలకు దర్శకత్వం వహించి నాటక పోటీలలో ఉత్తమ బహుమతులు గెల్చుకున్న ప్రతిభాశాలి. నాటకరంగంలో ఎన్ని విజయాలు సాధించినా ఇంకా తాను నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని వినమ్రంగా ప్రకటించే వినయశీలి రాంప్రసాద్. *రాగరాగిణి*, *మరో మొహెంజదారో* వంటి నాటకాలను తన నేతృత్వంలో ఆంధ్రేతర ప్రాంతాలలో కూడా ప్రదర్శించి ప్రశంసలందుకొన్నాడు. హైదరాబాద్‌లో చైతన్య ఆర్ట్స్ అనే పేరుతో ఒక సంస్థను స్థాపించి, ఎందరో ఔత్సాహిక నటులకు శిక్షణ ఇచ్చి, వారి నటనా జీవితానికి మెరుగులు దిద్దాడు. అలాంటి నటులలో కోటశ్రీనివాసరావు, ప్రదీప్, కృష్ణమోహన్, శకుంతల పేర్కొనదగినవారు. ఈయన బహుముఖ సేవలను గుర్తించి వంశీ ఆర్ట్ థియేటర్, అభినందన, రసమయి వంటి సాంస్కృతిక సంస్థలు ఘనంగా సన్మానించాయి. రాంప్రసాద్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న *కీచకవధ* నాటకం తానా ఆధ్వర్యంలో అమెరికాలో 60 చోట్ల ప్రదర్శింపబడి ప్రశంసలందుకోవడం గర్వకారణమైన విషయం. నక్సలైట్ ఉద్యమాన్ని నిరసిస్తూ కె.ఎల్. నరసింహారావు రాసిన *అరణ్యకాండ* నాటకం రాంప్రసాద్ సారథ్యంలో పోలీసు శాఖకు చెందిన నటులతో అనేకసార్లు విజయవంతంగా ప్రదర్శింపబడింది. *జీవితనౌక*, *రెండు పువ్వులు*, *జీవనరాగం*,

స్వర్గసీమ వంటి ప్రబోధాత్మక డాక్యుమెంటరీ ఫిలిమ్స్ స్వీయ దర్శకత్వంలో నిర్మించాడు. దూరదర్శన్‌లో వార్షఫలాలు, వరమీని దేవుడు, అమ్మకానికో అబ్బాయి-కొనడానికో కోమలి మొదలైన నాటకాలకు దర్శకత్వం వహించాడు. వరుడు కావాలి, శ్రీమతి, మాఇంటి మహాలక్ష్మి, కోతలరాయుడు మొదలైన చలనచిత్రాలలో నటించి గుర్తింపు పొందాడు. ఏది ఏమైనా రాంప్రసాద్ ప్రధాన వ్యాపకం రంగస్థలమే. ఈనాటికీ అనేక నాటక సమాజాలతో సన్నిహిత సంబంధాలు పెంచుకొని నాటకరంగానికి తన అమూల్య సేవలను అందిస్తూనే ఉన్నాడు.

గం.సు.రె.

రాఘువ కళా సమితి : ఈ సంస్థను రాజారావు, యాసం రెడ్డి వెంకటరావు, మేడూరి వీర వెంకన్నలు రాజమండ్రిలో 1950లో స్థాపించారు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీకి అనుబంధ సంస్థ. ఆనాటి ఆంధ్రదేశంలో కట్టుదిట్టంగా నాటకాలు ఆడడానికి పేరు మోసిన సమాజం. ఏ నాటక పోటీలకు వెళ్ళినా అధికభాగం బహుమతులు ఈ సంస్థకే లభించేవి. *పరివర్తన*, *భయం*, *గుడ్డిలోకం*, *తెరలో తెర*, *భవబంధాలు*, *జైభవానీ*, *ఈనాడు*, *నిజరూపాలు*, *రాగద్వేషాలు*, *ఎన్.జి.ఓ.*, *చిలకా గోరింక* మొదలైన నాటకాలను, *ఎవరుదొంగ*, *తెలుగు కోపం*, *బంగారు సంకెళ్ళు*, *నా బాబు*, *ప్రార్థన*, *డిటెక్టివ్*, *నేటి నటుడు*, *ఆద్యంతాలు* మొదలైన నాటికలను ఈ సంస్థ ప్రదర్శించింది.

న్యూ ఢిల్లీలో జరిగిన అఖిల భారత ప్రజానాట్యమండలి మహోత్సవాలలో ఈ సంస్థ ప్రదర్శించిన *భయం* నాటిక దేశ, విదేశీయుల మెప్పు పొందింది. ప్రేక్షకుల కోరిక మీద మరుసటి రోజు కూడా ఆ నాటికను ప్రదర్శించినపుడు ఢిల్లీ పత్రికలు ఆనాటి ఉత్సవానికి 'భయం డే' అని పేరు పెట్టాయి. ఈ సంస్థలో రాజారావు, అంకరాజు శంకరరావు, శ్రీపాద పట్టాభి, మేడూరి వీరవెంకన్న, భాస్కరరావు, లక్ష్మి మొదలైనవారు ప్రధాన నటులు.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక పోటీలలో ఈ సమితి ప్రదర్శించిన *పరివర్తన*, *గుడ్డి లోకం* మొదలైన నాటకాలకు, నటులకు బహుమతులు లభించాయి. రాజారావు, యాసం రెడ్డి వెంకటరావుల మరణంతో ఈ సంస్థ కార్యకలాపాలు స్తంభించి పోయాయి.

శ్రీ.చ.

రాఘువ, బళ్ళారి (1880-1946) : తెలుగు నాటక ఆవిర్భావం, బళ్ళారి రాఘవ జననం ఒకే సంవత్సరం కావడం యాదృచ్ఛికం. అనంతపురం జిల్లా తాడిపత్రిలో 1880 ఆగస్టు 2న నరసింహాచార్యులు, శేషమ్మ దంపతులకు జన్మించాడు. రాఘవ అసలు పేరు బసప్ప. ఇంటిపేరు తాడిపత్రి. వైష్ణవ కులాచారంగా రాఘవాచార్యుల పేరు, బళ్ళారిలో స్థిరపడినందున బళ్ళారి రాఘవగా గణతికెక్కాడు. బళ్ళారి మున్సిపల్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్, మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో డిగ్రీ చదివాడు. కళాశాల రోజుల్లో ఇంగ్లీషు, తెలుగు, కన్నడ నాటకాలను ప్రదర్శించాడు. *మర్చంట్ ఆఫ్ వెన్నీస్* నాటకంలో షైలాక్, *హామ్లేట్*‌లో హామ్లెట్, *ఒథెల్లో* నాటకంలో ఒథెల్లోపాత్రను పోషించాడు. బళ్ళారి మున్సిపల్ హైస్కూలులో ఉపాధ్యాయునిగా, ఇంజనీరింగ్ శాఖలో గుమస్తాగా కొంతకాలం పని ఆ తరువాత చేశాడు. ఉద్యోగానికి రాజీనామాచేసి, మద్రాసులో న్యాయశాస్త్రాన్ని అభ్యసించాడు. కర్నూలుకు చెందిన వకీలు లక్ష్మణాచార్యులు కుమార్తె కృష్ణమ్మను వివాహమాడాడు. 1906లో మేనమామ ధర్మవరం కృష్ణమాచార్యుల వద్ద జూనియర్‌గా పనిచేశాడు. షేక్స్పియర్ నాటకాలలో రాఘవ నటనా వైదుష్యాన్ని ప్రత్యక్షంగా చూసిన ఆంధ్రచారిత్రక నాటక పితామహుడైన కోలాచలం ఆయనను సుమనోరమ సభ సంస్థలో చేరమని ఆహ్వానించాడు. అప్పటికే ధర్మవరం సరస వినోదిని సభ, కోలాచలం శ్రీనివాసరావు సుమనోరమ సభ పోటాపోటీగా నాటకాలను ప్రదర్శించేవి. సరసవినోదిని సభకు చెందిన తాటాకుల నాటక శాలలో సుమనోరమసభ కూడా నాటకాలను ప్రదర్శించేది. నానాటికీ రెండు సమాజాల మధ్య వైరం ముదరడంతో నాటకశాల అహుతైపోయింది. దీంతో కోలాచలం వాణీ విలాస్, ధర్మవరం రామకృష్ణా విలాస్ పేరుతో నాటకశాలలను నిర్మించుకున్నారు.



మేనమామకు పోటీగా రాఘవ కోలాచలం సమాజం ద్వారా నాటకాలను ప్రదర్శించేవాడు. వృత్తి రీత్యా పగటి సమయంలో మేనమామకు జూనియర్‌గాఉన్నా, ప్రవృత్తిరీత్యారాత్రి సమయంలో మేనమామకు బద్ధ వైరంతో రాఘవ ఉండేవాడు. నాటకం దృష్ట్యా ఎంత శత్రుత్వం ఉన్నా వృత్తి రీత్యాగాని, అనుబంధం విషయంలో గానీ ఏనాడు వారి మధ్య ఎటువంటి పొరపొచ్చాలు ఉండేవి కావు. మేనల్లుడు రాఘవను ఎదుట విమర్శించినా, చాటుగా చెల్లెలి వద్ద ధర్మవరం పొగిడేవాడు. రసవత్తరమైన వాచికం, తదనుగుణమైన హావభావాలను ముఖంలో మూర్తీభవించేటట్టు చేయడం ముఖ్యమని రాఘవ మతం కాగా, దీనికి సంగీతం విధిగాజతకావాలని ధర్మవరం అభిమతం. రాఘవ సుమనోరమ తరపున ప్రదర్శించిన తొలి నాటకం సునందిని

పరిణయం. 27 ఏళ్ల వయస్సున్న రాఘవ ఈ నాటకంలో ఏడు పదుల వయస్సున్న పాత్రను సభూతో నభవిష్యతి అన్నట్టుగా నటించాడు.

తెలుగుతో పాటు అనేక కన్నడ నాటకాలలో నటించడం మూలంగా కన్నడ దేశంలో రాఘవ పేరు ప్రతిష్ఠలు మార్మోగిపోయాయి. పద్మనాభ వెంకోబా చార్య రచించిన శివాజీ నాటకాన్ని పలుమార్లు ప్రదర్శించాడు. కోలాచలం రామరాజు చరిత్రం నాటకం రాఘవ నటజీవితంలో మైలురాయిగా రుస్తుం పాత్రలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ప్రసిద్ధ కన్నడ నటుడు ఎ.వి. వరదాచార్య స్థాపించిన అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్‌లో రాఘవ అనేక సార్లు పాల్గొని కన్నడ నాటకాలను ప్రదర్శించాడు.

ఈ సంస్థ 1919 జనవరిలో బెంగుళూరులో నిర్వహించిన ఫెస్టివల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఉత్సవాలలో రాఘవ ప్రదర్శించిన రామరాజు చరిత్రము నాటకాన్ని చూసిన విశ్వకవి రవీంద్రనాథ టాగూర్ వేయినోళ్ల కొనియాడాడు. యావద్భారత దేశంలో అగ్రస్థానం ఆంధ్ర నటుడైన రాఘవకే దక్కుతుందని ప్రశంసించాడు. రాఘవ ధరించిన పఠాన్ పాత్ర హిందూ ముస్లింల ప్రశంసలందుకొన్నాయి.

1927లో నందికొండలో విశ్రాంతి తీసుకుంటున్న మహాత్మాగాంధీని రాఘవ ప్రదర్శిస్తున్న దీనబంధు కబీర్ నాటకానికి ఆహ్వానిస్తే కేవలం 20 నిమిషాలు మాత్రమే హాజరు కాగలనని చెప్పాడు. నాటక ప్రదర్శనలో లీనమైన గాంధీజీని రాజాజీ ప్రార్థనా సమయం అయినట్టు గుర్తు చేయడంతో ఇది మాత్రం ప్రార్థన కాదా అన్నాడు. నాటక ప్రదర్శన ముగిసిన తర్వాత గాంధీజీ లేచి నిలబడి రాఘవ మహారాజుకీ జై అని నినాదాలు చేశాడు. కోలాచలం చాంద్‌బీబీ, భారతయుద్ధం, హరిశ్చంద్ర, ధర్మవరం సారంగధర, పాదుకాపట్టాభిషేకం, ప్రమీలార్జునీయం, సావిత్రి, ప్రహ్లాద, విరాటపర్వం తదితర నాటకాలలో రాఘవ ప్రదర్శించిన నటన భారతీయ నాటకరంగానికే తలమానికంగా నిలిచింది. మద్రాసులో రాఘవ నాటకం వేస్తున్నాడనే విషయం తెలిస్తే చిత్తూరు, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల నుంచి ప్రేక్షకులు వెళ్ళేవారు.

1920 వరకూ కోస్తా ప్రాంతంలో నాటకాలు ప్రదర్శించిన రాఘవ తన సహాధ్యాయి గూడూరి లక్ష్మణరావు ఆహ్వానంపై విజయవాడలో తొలిసారిగా మోహినీ రుక్మాంగద నాటకాన్ని ప్రదర్శించాడు. పద్య నాటకాల మోజులో ఉన్న బెజవాడ ప్రేక్షకులకు అభినయ ప్రధానమైన రాఘవ నాటకం నచ్చకపోవడంతో అల్లరి చేశారు. చిరకాల మిత్రుడైన కొప్పరపు సుబ్బారావు ప్రోత్సాహంతో తెనాలి, గుంటూరు, బందరు, బెజవాడ, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణంలో రామరాజు చరిత్ర, ప్రహ్లాద, రామదాసు, సారంగధర, ఒథెల్లో, కింగ్ లియర్ నాటకాలను ప్రదర్శించాడు. అభినయ ప్రాధాన్యతను గుర్తించిన అదే కోస్తా ప్రజలు రాఘవకు బ్రహ్మరథం పట్టారు.

1927లో రంగూన్‌లో 15రోజులు పర్యటించి నాటకాలను ప్రదర్శించాడు. పాశ్చాత్య నాటక రంగ ధోరణులను అధ్యయనం చేయడానికి 1928లో రాఘవ విదేశీ పర్యటన చేశాడు. రెండు నెలల కాలం ఇంగ్లాండ్, ఫ్రాన్సు, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లో పర్యటించాడు. లండన్‌లో 57 ఇంగ్లీషు నాటకాలను చూశాడు.

పాశ్చాత్య నాటకప్రభావంతో నాటకాలు సామాజిక సమస్యలను చిత్రిస్తూ, పరిష్కార మార్గాలను సూచించాలనీ, జీవితాన్ని ఉత్తేజింప చేయాలని, నాటక కళలో శిక్షణకేంద్రాలను ఏర్పాటు చేయాలని, నాటక ప్రదర్శనలకు ప్రత్యేకంగా నాటక శాలలు నిర్మించాలనీ, స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలని, రంగస్థల అలంకరణలో పాశ్చాత్య సాంకేతిక పద్ధతులను అవలంబించాలని, అభినయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎలుగెత్తి చాటాడు. ఈ నాట్య ధర్మాలను ఆచరణలో చూపి, నూతన విప్లవానికి శ్రీకారం చుట్టాడు. విదేశీ పర్యటన అనంతరం రాఘవ సాంఘిక నాటకరంగం ప్రాధాన్యతను రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేశాడు.

రాఘవ ప్రచారం కేవలం వేదికలకే పరిమితం కాలేదు. తన భార్య, చెల్లెలి చేత నాటకాలలో వేషాలు వేయించి ఆచరణలో చూపాడు. రాఘవ ప్రోత్సాహంతో మాడపాటి సరోజిని, కొమ్మూరి పద్మావతిదేవి, కొప్పరపు సరోజిని, కాకినాడ అన్నపూర్ణ, మైసూరు వరదాబాయి వంటి నటీమణులు తొలిసారిగా తెలుగు నాటక రంగంలో పాత్రలను పోషించారు.

కొందరు మిత్రుల ప్రోద్బలంతో రాఘవ సినీ రంగ ప్రవేశం చేశాడు. హెచ్. ఎం. రెడ్డి నిర్మించిన ద్రౌపదీ మాన సంరక్షణం చిత్రంలో దుర్యోధన పాత్రను పోషించాడు. గూడవల్లి రామబ్రహ్మం నిర్మించిన రైతుబిడ్డ, రాజరాజేశ్వరీ పిక్చర్స్ నిర్మించిన చండిక చిత్రాలలో ముఖ్య భూమికలను పోషించాడు. చలన చిత్రాలలో నటన యాంత్రికంగా ఉండటంతో తదుపరి చిత్రాలలో నటించడానికి విముఖత చూపాడు.

రాఘవ సంఘసేవాభిలాషి కూడా. ముద్దుతార అనే పాఠశాలలను బళ్ళారిలో స్థాపించి పేద విద్యార్థులకు ఉచిత విద్యను చెప్పించాడు. ఆ పాఠశాలలో హరిజనులకు ఆశ్రయం కల్పించడమే కాకుండా, పండుగ పబ్బాలలో వారితో కలిసి పాఠశాలలో సహపంక్తి భోజనం చేసేవాడు. రాఘవ ఇంట్లో హరిజనులు స్వేచ్ఛగా తిరగడం సహించలేని మైసూరు మఠాధిపతి, పలువురు వైష్ణవ మతం నుండి వెలివేయడానికి ప్రయత్నించినా, నిజమైన వైష్ణవునికి కులమతాలు భేదం ఉండదని ధైర్యంగా ఎదిరించాడు. ఏ నటుడైనా ఆర్థిక సమస్యలతో ఉన్న విషయం తెలిస్తే, రాఘవ ఆ ప్రాంతానికి వెళ్ళి నాటక ప్రదర్శనలు

ఇచ్చి ఆర్థిక సహాయం అందించేవాడు. ఆ సందర్భంగా కేవలం రైలు చార్జీలను మాత్రమే పారితోషికంగా స్వీకరించేవాడు. బళ్ళారి నుండి హైదరాబాదు, శ్రీకాకుళం వరకు రాఘవ సహాయం పొందని నాటక సంస్థలు లేవంటే ఆతిశయోక్తి కాదు. పారుపల్లి సుబ్బారావు, బందా కనకలింగేశ్వర రావు, చిత్తూరి నాగయ్య, స్థానం నరసింహారావు, గండికోట జోగినాథం, శ్రీమతి పూర్ణిమ వంటి మహా నటులు ఏరికోరి రాఘవ నాటకాలలో పాత్రలను పోషించారు.

న్యాయవాదిగా రాఘవ అపార సేవకు గుర్తింపుగా ప్రభుత్వం రావు బహద్దూర్ బిరుదును బహూకరించింది. రాజా విక్రమదేవ వర్మ అధ్యక్షునిగా ఉన్న విజయనగరం ఆంధ్ర రీసర్చి యూనివర్శిటీ నాట్య కళా ప్రపూర్ణ బిరుదును ప్రదానం చేసింది. జస్టిస్ పి.వి. రాజమన్నార్ రచించిన తప్పెవరిది, తెగని సమస్య సాంఘిక నాటకాలను రాఘవ రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించాడు.

తెలుగు నాటకరంగానికి విశేషమైన సేవలందించిన రాఘవ 1946 ఏప్రియల్ 16న పంపాక్షేత్రంలో రథోత్సవం జరుగుతున్న సమయంలో అస్తమించాడు. రంగస్థలం ఒక దేవాలయం వంటిదని, అహాన్ని వదిలి ధరించేపాత్రలో లీనమై తనతో పాటు నటించే సహ నటులకు అన్యాయం జరగకుండా సమర్థంగా నటించాలి, అదే నటన అని నటనకు భాష్యం అని చెప్పిన రాఘవ తెలుగు వాడుగా పుట్టడం ఆంధ్రుల గర్వకారణం.

కందిమళ్ళ

రాఘవయ్య, యార్లగడ్డ (1909-1983) : నటుడు, దర్శకుడు, రచయిత, శ్రీ సీతారామ బాలభారతి స్థాపకుడు. 'రేపల్లె మిల్టన్' అని బిరుదాంకితుడు. రాఘవయ్య గుంటూరు జిల్లా రేపల్లెకు సమీపంలోని సింగుపాలెం గ్రామంలో 1909లో జన్మించాడు. సుందరమ్మ, సీతారామయ్యలు ఈయన తల్లిదండ్రులు. సంస్కృతాంధ్ర భాషల్లో చక్కని ప్రవేశం ఉంది. రచన, దర్శకత్వం, నటన పట్ల మక్కువ పెంచుకొని, ఆ దిశలో కృషిచేశాడు. తన 19వ ఏటనే శ్రీ సీతారామ బాలభారతి నాటక సమాజం స్థాపించాడు. ఈ సంస్థ ప్రదర్శన నిమిత్తం అదే సంవత్సరం 1928లో డెల్టారైతు అనే సాంఘిక నాటకం రచించాడు. రేపల్లె, దిగువ ప్రాంతాల్లో రచించబడిన తొలి సాంఘిక నాటకం ఇదే. తెలుగు నాటకరంగ చరిత్రలో రైతుల జీవితాలు ఇతివృత్తంగా రాయబడ్డ తొలి నాటకమూ ఇదే. రాఘవయ్య తాను రచించిన డెల్టారైతును మిత్రులతో క్షుణ్ణంగా చదివించి, సాధన చేయించి, 1929లో ముక్కోటి ఏకాదశి రోజున తొలిసారిగా ప్రదర్శించాడు. సింగుపాలెం నాటక చరిత్రలో తొలి రచయిత, నటుడు, దర్శకుడు, సమాజ నిర్వాహకుడు ఈయనే. 20 సంవత్సరాలపాటు తన నిర్దేశకత్వంలో నరకాసురవధ, సీతా కళ్యాణం, గయోపాఖ్యానం, కాంతిమతి, వరవిక్రయం, లోభి, పారిజాతాపహరణం, భీష్మ బ్రహ్మచారి, ఒకనాటి కోడలు వంటి నాటకాలు విజయవంతంగా ప్రదర్శించాడు. ఈ నాటకాలలో ఈయన నరకాసురుడు (నరకాసురవధ), క్రూరసేనుడు (కనకతార) లాంటి ప్రతినాయక పాత్రలు, అర్జునుడు (గయోపాఖ్యానం), దశరథుడు (పాదుకా పట్టాభిషేకం) లాంటి అభినయ ప్రాధాన్యం గల పాత్రలు, సింగరాజు లింగరాజు (వరవిక్రయం), లోభి (లోభి) లాంటి సాంఘిక నాటకాలలోని వైవిధ్యమైన పాత్రలను తన అభినయ చాతుర్యంతో రక్తి కట్టించాడు. ఈయన పద్యం పాడేతీరు చాలా విశిష్టంగా ఉండేది. పదాల విరుపులోను, రాగం ఎంపికలోను, ఆలాపనలోను ఈయనది ప్రత్యేక శైలి. నటనలోను, గానంలోను ప్రతి నటునిది సొంత అస్తిత్వం, వ్యక్తిత్వం ప్రతిఫలించాలనేదే రాఘవయ్య అభిమతం. సాధన పరిపూర్ణత చెందినట్లు విశ్వసిస్తేగాని ప్రదర్శనకు అనుమతించేవాడు కాదు. అందుకే ఈయన నాటకాలు రంగస్థల దృశ్య కావ్యాలుగా విరాజిల్లాయి. అభినయ పాఠ్య గ్రంథాలుగా రేపల్లె ప్రాంత ప్రజలకు నిలిచాయి. సమాజ సభ్యుల ఐక్యతను సడలనివ్వకుండా ఏకతాటిపై నడిపాడు. నాయక, ప్రతినాయక పాత్రలు ధరించిన రాఘవయ్యకి క్రమేణ చూపు మందగించటంతో సహాయ పాత్రలకు పరిమితమై, దర్శకత్వ బాధ్యతలు పర్యవేక్షిస్తుండేవాడు. ఈయన నటించిన ఆఖరి నాటకం లోభి. అనంతరం చూపు పూర్తిగా మందగించటంతో పాత్ర పోషణ చేయకపోయినా, నాటకాన్ని విని సలహాలు ఇస్తుండేవాడు. ఈయన రచించిన రామాంజనేయ యుద్ధం, డెల్టారైతు, నాటి కోడలు అముద్రితాలు. ఒక రామాంజనేయ యుద్ధం మాత్రమే ప్రస్తుతం లభ్యం. ఈయన 1983లో మరణించాడు.

మన్నెశ్రీ

రాఘవరావు, కె.వి. (1920-2000) : రంగస్థల నటుడు. వీరు ఖమ్మం జిల్లా దుమ్ముల గూడెంలో 1920, డిసెంబరు 15న జన్మించాడు. తొలిదశలో ఖమ్మంజిల్లాలో నాటక కళా వికాసానికి నిస్వార్థసేవలు అందించిన నటుడు, కళాపోషకుడు. సంపన్న కుటుంబంలో జన్మించిన రాఘవరావు విద్యార్థి దశ నుంచీ నాటకాలపై మక్కువ పెంచుకున్నాడు. ప్రాథమిక విద్య దుమ్ముల గూడెంలోను, హైస్కూలు విద్య భద్రాచలంలోను, ఇంటర్మీడియట్ రాజ



మండ్రి ప్రభుత్వ కళాశాలలోను, డిగ్రీ జాతీయ కళాశాల బందరులోను పూర్తి చేశాడు.

దుమ్ముల గూడెంలో నాటకాలు ప్రదర్శించడానికి 1914లో అంకురార్పణ జరిగినప్పటికి నాటకాలు ప్రదర్శించడానికి అనువైన పరిస్థితులు అప్పటికింకా ఏర్పడలేదనే చెప్పవచ్చు. 1942లో రాఘవరావు పూనికతో నాటక ప్రదర్శనలు ఆరంభమయ్యాయి. ఖిల్జీ రాజ్య పతనం నాటకంలో రాఘవరావు ఖిల్జీ పాత్ర ధరించేవాడు. భారీ విగ్రహం, స్ఫురద్రూపం, హావభావాలను ప్రస్ఫుటం చేసే ముఖ కవళికలతో ఈయన పాత్ర పోషణ ఎంతో హుందాగా ఉండేది. ఎలాంటి పాత్రనైనా అతిసహజంగా చేయగల నటనా సామర్థ్యం ఈయన సొత్తు. నాటక ప్రదర్శనకు అనువైన వాతావరణం గానీ, సౌకర్యాలు గాని లేని ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో నాటకం ప్రదర్శించటం అంటే యజ్ఞం చేయటం వంటిదే. అయినా అన్ని బాధలకు ఓర్చి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయటంలో రాఘవ రావు శ్రద్ధాసక్తులు, దీక్ష ప్రశంసించదగినవి. కొన్ని కారణాల వల్ల సుజన వినోదిని సమాజాన్ని విడిచిపెట్టి 1944 లో 'సోదర కళాసమితి'ని స్థాపించాడు. దేవన రామమూర్తి, లంకా గురుమూర్తి తదితర నటులతో, తరతరాలు గుర్తుండేలా నాటకాలు ప్రదర్శించటం మొదలుపెట్టాడు. ఆ నాటకాలకు దర్శకత్వం వహించేవాడు. ప్రముఖ హార్మోనిస్టు పార్థసారథి, నృత్య దర్శకుడు మల్లికార్జునరావు ఈ సమాజానికి తమ సేవలు అందిస్తూ నాటకాలు జనరంజకంగా సాగేటట్టు తోడ్పడ్డారు. రాఘవరావు అటు పద్య నాటకాలు, ఇటు సాంఘిక నాటకాలు సమప్రతిభతో ప్రదర్శించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. పెట్టమారి మగడు, ఆంధ్రజ్యోతి, గుడ్డిలోకం, పల్లెపడుచు నాటకాల్లో ప్రధానపాత్ర ధరించి ప్రశంసలందుకున్నాడు. దుమ్ములగూడెం లోనే కాక ఖమ్మం చుట్టుపక్కల గ్రామాల్లోనూ ప్రదర్శనలిచ్చి నాటక కళా వికాసానికి జిల్లాలో వెలుగుబాటలు వేశాడు. మురళీ మనోహర నాట్యమండలి ఆహ్వానంపై అక్కడకు వెళ్ళి కొన్ని నాటకాలకు దర్శకత్వం వహించి ఆ సమాజసభ్యుల్ని ప్రోత్సహించాడు. 1958 వరకు రాఘవరావు విరివిగా నాటకాలు ప్రదర్శించాడు. చివరిదశలో ఎన్నో కష్టాలు పడి దీనావస్థలో 2000లో రాఘవరావు కన్నుమూశాడు.

సి.వి.కె.

రాఘవరావున్యాయపతి (-1984): రేడియో అన్నయ్యగా అందరికి పరిచితుడైన న్యాయపతి రాఘవరావు 1950 సంవత్సరంలో అవిభక్త మద్రాసు రాష్ట్రంలోని బరంపురంలో జన్మించాడు. 1921లో జాతీయోద్యమంలో చేరి కొంతకాలం కార్యకర్తగా పనిచేశాడు. 1939లో మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో బాలానంద సంఘ కార్యక్రమాల నిర్వహణను ప్రారంభించారు. 1940లో మద్రాసు బాలానంద సంఘాన్ని స్థాపించాడు. 1948లో మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో బాలల రంగస్థల ప్రదర్శనలకు మహానటి భానుమతి సమక్షంలో నిర్వహించాడు. 1952లో చలనచిత్ర దర్శకుడు, నిర్మాత కె.ఎస్. ప్రకాశ రావుతో బాలల చిత్ర నిర్మాణం ప్రారంభించాడు. 1956 లో హైదరాబాద్‌లో ఆంధ్ర బాలానంద సంఘాన్ని స్థాపించి, ప్రతి ఏటా బాలల రంగస్థల ప్రదర్శనలను వివిధ ప్రక్రియల్లో నిర్వహించాడు. 1971లో ఢిల్లీలో బాలల థియేటర్ ఫెస్టివల్ నిర్వహించాడు. 1975లో హైదరాబాదు దూరదర్శన్ కేంద్రంలో బాలల నాటికల్ని రూపొందించాడు. 1984లో ప్రత్యేకించి బాలల కోసం రాఘవ నట శిక్షణాలయాన్ని స్థాపించాడు. దేశంలో బాలలకు నట శిక్షణాలయం స్థాపించడం ఇదే ప్రథమం.

ఎందరో బాలలకు నటనలో శిక్షణ ఇచ్చి వారిలోని సృజనాత్మక శక్తిని వెలికితీసే ప్రదర్శనలను నిర్వహించాడు. ఆంధ్ర బాలానంద సంఘంలో బాలనటులుగా శిక్షణ పొందిన ఎందరో నాటక, టివి, సినిమా రంగాల్లో ప్రముఖ నటులుగా పేరు పొందారు.

తన జీవితమంతా సహధర్మచారిణి కామేశ్వరి (రేడియో అక్కయ్య)తో కలిసి బాలల భవిష్యత్తు కోసం తపించిన మహనీయుడు రేడియో అన్నయ్య. కీ–మరబమ్మలు వంటి బాలల నాటికల్ని ఎన్నో రచించి ప్రదర్శింపజేశాడు. కమల, విమల, ప్రోగ్రెస్ కార్డు, కాసుల పేరు, పగటి వేషాలు, అశ్వం, పుట్టిన రోజు పండుగ, బుచ్చయ్య పెబ్బా, వెర్రి గారాబం, మంచిరోజులచ్చాయి తదితర నాటికల్ని బాలలతో ఇటు రంగస్థలం, అటు రేడియో, టివీలలో కూడా ప్రదర్శింపజేశాడు.

1984లో ఆయన మరణించినా ఆయన పేరిట ప్రతి సంవత్సరం బాలల నాటికల పోటీలు నిర్వహిస్తున్నారు.

ప్ర.రె.

రాఘవాచారి, టి (1916-1996) : నటుడు, హార్మోనిస్టు. తెలుగు నాటకరంగానికి ఆరు దశాబ్దాల పైబడి నటునిగా, హార్మోనిస్టుగా అవిశ్రాంత సేవలు అందించిన రాఘవాచారికి బాల్యం నుంచి కళలంటే మక్కువ.

ఈయన భారత, రామాయణ, భాగవతాలను క్షుణ్ణంగా ఔపాసనం పట్టాడు. దాంతో ఈయన ధరించిన ప్రతి పాత్ర మనఃస్థితిని, ఔచిత్యాన్నీ సంపూర్ణంగా అవగాహన చేసుకొని, ఆయాపాత్రలనుపోషించేవాడు. గంభీర స్వరం, చురుకైన

కదలికలు, ఆహ్లాదరకమైన హావభావ విన్యాసాలు ఈయన సహజ సంపదలు. పరస్పర విరుద్ధమైన రసాలను అలవోకగా పండించిన ఈ నాటకరంగ కృషీవలుడు ముఖ్యంగా, ఇటు హైదర్‌జంగ్ వంటి ప్రతినాయక పాత్రకు హాస్యరసం జోడించి అభినయించడంలోను, అటు దానికి పూర్తి విరుద్ధమైన విశ్వామిత్రుడు, భీముడు వంటి పాత్రధారణ సమయంలో రౌద్ర రసాభినయంలో ప్రదర్శించిన అభినయ చాతుర్యం చూసి తీరాల్సిందే.

పౌరాణిక నాటకాల్లో ఆయన నటించని పాత్ర లేదు. ఇక ఆయనకి విశేషఖ్యాతి తెచ్చిన వాటిల్లో భీముడు, హైదర్‌జంగ్, విశ్వామిత్రుడు, ధర్మరాజు. ఈ పాత్రల్లో ప్రతి పాత్రను సహస్రాధికంగా పోషించాడు. తన సుదీర్ఘ నటజీవితంలో బండారు, చెంచురామారావు, సి.హెచ్. జగన్నాథరావు, షణ్ముఖి ఆంజనేయరాజు, ఎ.వి. సుబ్బారావు, డి.వి. సుబ్బారావు, రేబాల రమణ, అబ్బూరి వంటి దిగ్గజాల సరసన విభిన్న పాత్రలు ధరించి వారికి దీటుగా రాణించాడు.

బండారు రామారావు, చెంచు రామారావుల సమాజాలకే కాకుండా పలు సమాజాలకు కూడా హార్మోనిస్టుగా వ్యవహరించాడు. తన ఆచార్యత్వంలో సి.హెచ్. జగన్నాథరావు, ఎస్.వి. సుబ్బారావు, చాపల సూర్యనారాయణ వంటి మేటి నటులకు శిక్షణ ఇచ్చాడు. ఈయన వీరందరికి సంగీతంతోపాటు సాహిత్య విలువలు కూడా బోధించాడు.

ఆరు దశాబ్దాలు పైబడి రంగస్థలానికి తన సేవలు అందించిన రాఘవాచారి ఎనభై వసంతాల సంపూర్ణ జీవితం గడిపిన అనంతరం తన జన్మస్థలం రాజమండ్రిలో 1996లో తుదిశ్వాస విడిచాడు.

మన్నెశ్రీ

రాఘవాచారి, బుజ్జా (1883-1963) : రంగస్థల నటుడు. ఆజన్మ బ్రహ్మచారి. నరసింహాచారి, ఆండాలమ్మ దంపతులకు 1883లో బందరులో జన్మించాడు. బందరు రాయల్ థియేటర్ సంస్థాపకుడు, మంచి గాయకుడు, కంచు కంఠం. కలియుగార్జున బిరుదాంకితుడు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ విశిష్ట సభ్యుడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు సన్మానితుడు, దర్శకుడు. పద్యాన్ని, గద్యాన్ని, సంగీతాన్ని సమపాళ్ళలో నడిపి మహానటుడిగా ప్రసిద్ధికెక్కాడు. ఆంధ్రదేశంలోనే గాక రంగూన్, సింగపూర్‌లలో నాటకాలు మెప్పు పొందాడు.

ప్రారంభంలో చిన్న చిన్న పాత్రలు ధరించినా రాయల్ థియేటర్‌లో ప్రధానపాత్రలు ధరిస్తూ ఆ థియేటర్‌కు వన్నె తెచ్చాడు. ఈయన పాటకు ముగ్ధులు కాని ప్రేక్షకులంటూ ఆనాడు లేరు. ఈయన అర్జునుడు, శ్రీకృష్ణుడు, బృహస్పతి, హైదర్‌జంగ్, నలుడు, ప్రతాపరుద్రుడు వంటి పాత్రలు ధరించాడు. వీరికి నిర్యాణ కాలం వరకు సంగీత నాటక అకాడమీ నెలవారీ పారితోషికం ఇచ్చింది. ఖమ్మం మెట్టు నాటకాలకు దర్శకత్వం వహిస్తూ 1963లో పరమపదించాడు.

శ్రీ.చ.

రాఘవాచార్యులు, తాడిపత్రి: (చూ. రాఘవ, బళ్ళారి)

రాఘవాచార్యులు, బి.టి (1882-1938) : కవి, రచయిత, దర్శకుడు, జర్నలిస్టు, జగన్మోహినీ మోహన, నటరాజు సంస్థల నిర్వాహకుడు. భరతముని బృందం నాటక కళాశాల స్థాపకుడు. ఈయన 1882లో కృష్ణా జిల్లా పురుటూరులో అనంతాచార్యులు, శేషమ్మ దంపతులకు జన్మించాడు. నాటక ప్రయోగానికి, నట శిక్షణకు నిరాడంబరంగా, నిస్వార్థంగా జీవితం అంకితం చేసి, అనేక మందిని ఉత్తమ నటులుగా తీర్చిదిద్దిన నాట్యాచార్యులు బి.టి. రాఘవాచార్యులు.

తన కాలంనాటి అపభ్రంశ నాటక ప్రయోగ రీతులను, నటనా రీతులను అవహేళన చేస్తూ ప్రహసనాలు, నటలోకానికి మార్గదర్శకంగా లక్షణ గ్రంథాలు, విమర్శ కావ్యాలను రచించి, ప్రకటించిన నాటక కళావేత్త.

బుక్కపట్నం తిరుమల ఆచార్యులు ఎక్కువగా బందరులో నివసిస్తూండేవాడు. అక్కడే హిందూహైస్కూలులో మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నాడు. సంస్కృతాంధ్ర భాషలలో పాండిత్యం అలవర్చుకున్నాడు. చిన్నతనంలోనే కవిత్వం, నాటక కళ మీద ప్రీతి ఏర్పడింది. ఈయన పెరిగింది బందరులోని గొడుగు పేట నాటకశాల, గొడుగు పేట కంపెనీ పరిసర ప్రాంతాలలోనే.

ఆ రోజులలోనే కందుకూరి వీరేశలింగం వేశ్యాసంస్కరణోద్యమం బందరుకు కూడా వ్యాపించింది. బందరులోని పెద్దలు, సంస్కర్తలు, వేశ్యల చేత పడుపువృత్తి మాన్పించారు. అయితే వారికి జీవనోపాధి ఎలా అనే సమస్య ఎదురైంది. ఆ వేశ్యలంతా సంగీతం, నృత్యం, అభ్యసించిన వారు కావడం వల్ల నాటకాలు ఆడించి, తద్వారా వారికి జీవనోపాధి కల్పించాలని పెద్దలు నిశ్చయించారు. ఆ సమాజానికి జగన్మోహినీ మోహన నాటక సమాజం అనే పేరుపెట్టి, 1904లో తానే స్వయంగా సారంగధర, శకుంతల మొదలైన నాటకాలు రచించి, ఆ సమాజం పక్షాన ఆంధ్రదేశమంతటా ప్రదర్శింప జేసి మెప్పుపొందిన కళాకారుడు. కాని ఆ సమాజం అనేక కారణాల

వల్ల 1910లో అంతరించింది. ఈ కాలంలోనే స్వదేశీ ఉద్యమ ప్రభావంతో 1908లో దేశభక్తి గేయాలను రచించి ప్రకటించాడు.

జగన్మోహినీ మోహన సమాజం ప్రదర్శనలతో ఆచార్యులకు దర్శకుడిగా గుర్తింపు వచ్చింది. ఈయన సహాధ్యాయి తురగా నరసింగరావు ఆ రోజులలో 'రామమోహన్ థియేటర్' అనే నాటక సమాజాన్ని నిర్వహిస్తూ ఆచార్యులకు దర్శకత్వం అప్పగించాడు. ఆ సమాజం పక్షాన గయోపాఖ్యానం, ప్రతాపసింహ మొదలైన నాటకాలు ప్రదర్శించి ప్రశంసలనందుకున్నాడు. ప్రసిద్ధ నటుడు గురజ నాయుడు, ఇందుపల్లి గోవిందరావు ప్రభృతులు ఈయన శిక్షణలో నటనలో మెళకువలు నేర్చుకున్నారు. ఇలానే పామర్రు కంపెనీ ప్రదర్శించిన ప్రదర్శనలలో మహానటుడిగా పేరు పొందిన ఉప్పలూరి సంజీవరావు కూడా బి.టి.ఆర్. శిక్షణలో ఎదిగిన నటుడే.

ఆ తరువాత 1914లో రామమోహన థియేటరు వదిలిపెట్టి కృష్ణా పత్రికలో సహాయ సంపాదకుడిగా చేరాడు. ఇంతలో నాటక పోటీల యుగం ప్రారంభమైంది. బందరులో, చిత్రనళీయం నాటక పోటీలు ప్రకటించారు. ఆచార్యులు దర్శకత్వ సామర్థ్యం గుర్తించి బందరు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ తమ నాటక సమాజానికి దర్శకత్వం వహించమని కోరింది. ఆచార్యులుకు నాటక పోటీలంటే మహా సరదా. సమాజం ఆహ్వానం మేరకు కృష్ణా పత్రికలో ఉద్యోగం మానివేశాడు. అహోరాత్రులు కష్టించి ఇండియన్ డ్రమెటిక్‌కి చిత్రనళీయం నాటకం నేర్పి, పోటీలలో ఉత్తమ ప్రదర్శన బహుమతిగా సరస్వతి విగ్రహాన్ని అందుకున్నాడు. ఈ కంపెనీవారికే 1917లో గుంటూరు సత్యహరిశ్చంద్ర నాటక పోటీలకు తర్ఫీదుఇచ్చాడు. డి.వి. సుబ్బారావుకు హరిశ్చంద్ర పాత్రకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. దాని ఫలితంగానే గుంటూరు పోటీలలో డి.వి.సుబ్బారావుకు హరిశ్చంద్ర పాత్ర వల్ల పతకం, అఖండ కీర్తి లభించింది.

1916లో బందరులో వేణీసంహార నాటక పోటీలు ప్రకటించారు. ఆచార్యులు నటరాజు సభ అనే పేరుతో నాటక సమాజం స్థాపించి, దర్శకత్వం వహించి, ఆ పోటీలలో పాల్గన్నాడు. స్వయంగా అశ్వత్థామ పాత్ర ధరించాడు. ఈ నాటక ప్రదర్శనలో భరతముని నాట్య పద్ధతులను ఎక్కువగా చొప్పించాడు. ముట్నూరి కృష్ణారావు మొదలైన కళావేత్తలు ఆ ప్రదర్శనాన్ని ఉత్తమ కళాఖండమని ప్రశంసించారు.

1920లో బందరు బాలభరత సంఘం తమ సమాజానికి దర్శకత్వం వహించవలసిందిగా ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని అంగీకరించి ఈ సమాజం పక్షాన పాదుక, ఖిల్జీలి, పాండవ విజయం, చింతామణి మొదలైన నాటకాలు ప్రదర్శింపచేశాడు. దీనితో బాలభారత సంఘానికీ, ఆచార్యులుకు పెద్దపేరు వచ్చింది. ఈ సంఘంలో ఈయన దగ్గర శిక్షణ పొంది మహానటులుగా పేరు పొందినవారే అద్దంకి శ్రీరామమూర్తి, పారుపల్లి సుబ్బారావు, పంచాంగం రామానుజాచార్యులు. బి.టి. ఆర్. ప్రదర్శనలను చూసి, మెచ్చుకొని, మైలవరం జమీందారు తమ సమాజానికి దర్శకత్వం వహించవలసినదిగా కోరాడు. వారి కోరిక మీద ఆచార్యులు 1922లో విజయవాడకు మకాం మార్చాడు.

మైలవరం కంపెనీకి ఆచార్యత్వం వహించి సుకన్య, రాధాకృష్ణ నాటకాలు ప్రదర్శింపజేశాడు. రాధాకృష్ణ నాటక ప్రయోగం ఒక మహోత్తమ కళాఖండమని అందరూ కొనియాడారు. అందులో పారుపల్లి సుబ్బారావు రాధ, ఝన్నవిత్తుల శేషగిరిరావు శ్రీకృష్ణుడు. ఆచార్యుల నాటక ప్రయోగ దక్షతకు విజయపతాక ఈ రాధాకృష్ణ నాటక ప్రయోగం. బి.టి.ఆర్. నటశిక్షణకు కీర్తి పతాక పారుపల్లి రాధ వేషం. అనేక కారణాల వల్ల ఆచార్యులు మైలవరం కంపెనీని అంతటితో వదిలివెయ్యవలసి వచ్చింది.

కొత్తతరం నటులనుతయారుచేయాలనే ఉద్దేశంతో 1924లో విజయవాడలో 'భరతముని బృందం' అనే పేరుతో నాటక కళాశాలను స్థాపించాడు. ఇది ఆంధ్రదేశంలోనే గాక భారతదేశంలోనే ప్రప్రథమ నాటక కళాశాల. దీనికి బి.టి.ఆర్. ఆచార్యులు, గూడపల్లి రామబ్రహ్మం అధినేతలు. ఈ నాటక కళాశాలలో నాటకకళకు సంబంధించిన అన్ని శాఖలను బోధించేవాడు. ఆర్థిక స్తోమత లేకపోవటంవల్ల త్వరలోనే ఈ కళా శాలను మూసివేయవలసివచ్చింది.

భరతముని బృందం విద్యార్థుల ఉపయోగార్థం ఈయన రచించిన గ్రంథం, నాటక ప్రయోగానికి సంబంధించి తెలుగులో ప్రప్రథమంగా వెలువడిన ప్రప్రథమ లక్షణ గ్రంథం. నటులు, నాటకసంఘాలు సమాజస్థాపన, రిహార్సల్సు, పాత్రధారణ, నాటక రంగం, అనుభవజ్ఞుల సూత్రాలు, వివిధ నాట్య రంగాలు, నాట్య విద్యావిధానం అనే ఎనిమిది అధ్యాయాలతో విలసిల్లుతూ నేటికీ నాటక విద్యార్థులకు, నటులకు ఎంతో ఉపయుక్తమౌతున్నది.

ఆ రోజులలో ఈయన రచించి ప్రకటించినదే సంగీత ఇంద్రసభ, ఆనాటి నాటక ప్రయోగ వైఖరులను, నటనా వైఖరులను, ప్రతిఫలింపచేసే మూడు అంకాల ప్రహసనం. ఆ నాటి నాటకరంగ స్థితిని తెలుసుకోవడానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది.

ఒక పుష్కరం తరువాత ఆ పుష్కరంలోని నటనారీతులను చిత్రిస్తూ ఈయన రాసినదే పెరుగుముంత ప్రహసనం. ఇది ప్రజామిత్ర పత్రికలో ప్రకటితమైంది.

ఆ తరువాత కొన్ని సమాజాలకు దర్శకత్వం వహించి నాటకాలు ప్రదర్శించినా ఆచార్యులకు సంతృప్తి కలుగలేదు, ఆదరణ కనిపించలేదు. నాటక సమాజాలతో, నటులతో

విసుగెత్తిపోయి, నాటకరంగంతో తెగతెంపులు చేసుకొని స్వగ్రామంలో కొంతకాలం గడిపాడు. తరువాత కుమారుని చదువుకోసం బందరులో మకాంపెట్టాడు. నాటకరంగాన్ని వదిలినా నాటకరంగం ఈయనను వదలలేదు. 1931లో బందరులోని విద్యార్థులు **వేధించగా, వారికి దర్శకత్వం** వహించి, భాసుని **స్వప్నవాసవదత్త నాటకం** తెలుగులో ప్రదర్శించాడు. **ఇటీవల ఇంతటి చక్కటి** ప్రదర్శనం చూడలేదని పురాణం సూరిశాస్త్రి మొదలైన ప్రఖ్యాత నాటకకళా విమర్శకులు ఆ ప్రదర్శనాన్ని కొనియాడారు.

1935లో మదరాసు వేల్ పిక్చర్స్ వారి కృష్ణలీల సినిమాకు మాటలు, పాటలు రాసి, నటులకు శిక్షణ ఇచ్చి, ఆ సినిమా విజయవంతం కావడానికి ఎంతగానో తోడ్పడ్డాడు. ఆనాడు ఇంటింటా మారుమ్రోగిన 'ధిక్కారము సైతునా' అనే పాట ఈయన రచనే. ఆ తరువాత బాలయోగిని సినిమాకు మాటలు, పాటలు రాశాడు. నటీనటులకు శిక్షణ ఇచ్చాడు. గరుడ గర్వభంగ సినిమాకు మాటలు రాస్తూ, 1938 జూన్‌లో మదరాసులో పరమపదించాడు.

తెలుగు నాటక కళాభివృద్ధికి ఎన్నెన్నో కలలు కన్నాడు. భరత నాట్య శాస్త్ర పద్ధతులను అనుసరించినప్పుడే భారత జాతీయ నాటకరంగం అవతరిస్తుందని ప్రబోధించాడు. అందుకే అహర్నిశలు కృషి చేసి జీవితం అంకితం చేశాడు. అనేక మంది నటులకు శిక్షణ ఇచ్చి ఉత్తమ నటులుగా తీర్చిదిద్దాడు. ప్రప్రథమంగా నాటక కళాశాలను నిర్వహించాడు. అనేక నాటకాలు, ప్రహసనాలు, లక్షణ గ్రంథాలు వ్యాసాలు రచించాడు. తెర మరుగున ఉండే 34 సంవత్సరాలు ఆంధ్ర నాటక రంగ పరిణామంలో ప్రముఖ పాత్ర వహించాడు.

సంగీత ఇంద్ర సభ, పెరుగు ముంత (ప్రహసనాలు), చిత్రరథ వీధి, సతీ మారేడు (ఏకాంకికలు), బలే చింతామణి (విమర్శన గ్రంథం), నాటక దీపిక(లక్షణ గ్రంథం) మొదలైనవి అచ్చయిన గ్రంథాలు.

శ్రీ.చ.

రాజకుమారి, ఐతం సత్య (జ.1936) : రంగస్థలనటి. ఈమె విజయనగరంలో 1936లో జన్మించింది. చిన్న వయసులోనే నాటకరంగంలో ప్రవేశించి అయిదు శతాబ్దాలు పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో వైవిధ్యం గల పాత్రలను అసమాన ప్రతిభతో పోషించి రసజ్ఞుల ప్రశంసలందుకున్న నటీమణి. చింతామణి, శ్రీకృష్ణరాయబారం, సత్యహరిశ్చంద్ర, కన్యాశుల్కం ఆమెకు పేరు తెచ్చిన నాటకాలలో కొన్ని. అబ్బూరి రామకృష్ణారావు, పిన్నకోట రామన్నపంతులు, బందా కనకలింగేశ్వరరావు, మాధవపెద్ది వేంకట్రామయ్య, జె.వి. సోమయాజులు, రమణమూర్తి, అద్దంకి శ్రీరామమూర్తి, పీసపాటి నరసింహమూర్తి వంటి ఉద్దండ నటులతో నటించి ఉత్తమనటిగా పేరు గడించింది. 1964లో అబ్బూరి రామకృష్ణారావు నేతృత్వంలో మృచ్ఛకటికం లో వసంతసేనగా నటించి అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ గౌరవ సత్కారాన్ని అందుకుంది. నాటకరంగంలో విశేష కృషి చేసిన ప్రఖ్యాత నటి రాజకుమారిని 1997లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2001వ సంవత్సరంలో చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించాయి.

దాసరి. ఎన్

రాజమన్నార్, పాకాల వెంకట (1901-1979) : నాటక కర్త, పత్రికా సంపాదకుడు, సాహిత్య విమర్శకుడు. న్యాయవాద వృత్తిలో ఉంటూ సాహిత్య వ్యాసంగం కొనసాగిస్తూ వచ్చాడు. ఈయన 1901, జనవరి 10 న రాజమహేంద్రవరంలో జన్మించాడు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసి మద్రాసులో స్థిర పడ్డాడు.

కళ అనే సాంస్కృతిక మాసపత్రికను నడపడం ద్వారా సాహిత్య రంగానికి సన్నిహితుడైనాడు. ఆ పత్రిక ద్వారా అనేకమంది కవులు, విమర్శకులు, నాటకకర్తలు వెలుగులోనికి వచ్చి ప్రసిద్ధులయ్యారు. నాటక సాహిత్యం మీద ప్రత్యేక అభిమానంతో 1920 ప్రాంతంలో కొన్ని ఏకాంకికలు రాశాడు. కాని వరవడి కోసం రాసుకున్న ఆ రచనలకు అప్పట్లో అంతగా గుర్తింపు రాలేదు. 1930లో తప్పెవరిది అనే సాంఘిక నాటకం ద్వారా నాటకకర్తగా తన స్థానాన్ని నిలదొక్కుకోవడమే కాక, ఆ నాటకంతో తెలుగు నాటకరంగంలో ఒక నూతన శకాన్ని ఆరంభించాడు. వాస్తవికతా వాదానికి వాకిళ్లు తెరిచాడు. తప్పెవరిది నాటకంలో వయోవృద్ధుడు అయిన ఒక పెద్ద మనిషి పునర్వివాహం చేసుకుంటాడు. యౌవనంలో ఉన్న అతని భార్య, సవతి కొడుకుని ప్రేమిస్తుంది. ఆ స్థితిలో ఆ వృద్ధుడు అనుభవించే మానసిక క్షోభ, అతని విషాద మరణం ఆ నాటకంలో చిత్రితమైంది. కథ పాతదే అయినా స్త్రీ తిరుగుబాటు చేయడం ద్వారా సామాజిక వాస్తవికతను అభివ్యక్తీకరించడంతో ఈ నాటకం నవ్యతను సంతరించుకొని ప్రేక్షకుల్ని ఆలోచింపజేసింది. అంతకు పూర్వం వచ్చిన నాటకాలలో ఉన్న మోనాటనీ నుంచి ఈ నాటకం పెద్ద రిలీఫ్ ఇచ్చింది. అందుకే ఆ నాటకాన్ని ఆనాటి విమర్శకులు ఎంతగానో ప్రశంసించారు. 1930లో మద్రాసు మ్యూజియం

థియేటర్లో బళ్ళారి రాఘవ దర్శకత్వంలో ప్రతిభావంతులైన నటీనటులు ఈ నాటక ప్రదర్శనల్లో పాల్గన్నారు. ఆ నాటకం ప్రదర్శించబడినపుడు కొమ్మూరి పద్మావతి దేవి నాయిక పాత్ర ధరించింది. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలి అనే బళ్ళారి రాఘవ నినాదం మొట్టమొదట కార్యరూపం ధరించింది తప్పెవరిది నాటకంతోనే.

రాజమన్నార్ స్త్రీ సమస్యల మీదనే ఎక్కువ రచనలు చేశాడు. అలాంటి వాటిలో మనోరమ (1959) నాటిక కూడా ఒకటి. నా అన్నవాళ్ళు ఎవరూ లేని అనాథ స్త్రీ మిన్ను విరిగి మీద పడినా చలించని స్థిరచిత్తంతో పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి ఒంటరి పోరాటం సాగించడానికి సిద్ధపడే యువతిగా మనోరమ ఈ నాటకంలో సాక్షాత్కరిస్తుంది. మారుతున్న సమాజంలో స్త్రీ పరిస్థితులతో రాజీపడి సహనశక్తిని అలవరచుకుంటే చాలదు. అవసరమైనపుడు అపరకాళికలా మారి తన సమస్యలను తానే పరిష్కరించుకోగలగాలి అనే హెచ్చరిక మనోరమ నాటకంలో ద్వారా తెలిపాడు రాజమన్నార్ కథా వస్తువులన్నీ మానవ హృదయపు లోతుల్ని తరచి చూసేవే. ఇబ్సన్, గాల్స్‌వర్థీ రచనల ప్రభావం రాజమన్నార్ పై అధికంగా ఉన్నా తన రచనల్లో పాశ్చాత్య వాతావరణం కనిపించదు. మన చుట్టూ వున్న మనుషుల మనస్తత్వ వివరణే తెలుగు తనంతో నిండుగా వెన్నెల కురిపిస్తూ ఉంటుంది.

రాజమన్నార్ 1946-47 ప్రాంతాలలో రచించిన 15 నాటికలను 1958లో ఒక సంపుటిగా ప్రచురించాడు. వానిలో ఏమి మగవాళ్ళు, నిష్ఫలం, నాగుబాము, పరకీయ అనే నాలుగు నాటికలు ప్రదర్శన సౌలభ్యం ఉన్న రచనలు. మిగిలినవి శ్రవ్య నాటికల కింద పరిగణించతగినవి. నాటికలన్నీ సందేశాత్మకాలే. నాటికకు ఉన్న చిన్న పరిధిలోనే పాత్రలనిండుతనాన్ని ఆవిష్కరించే రచనా నైపుణ్యం రాజమన్నారుది. ముఖ్యంగా నాటికల ముగింపు పఠితలను లేదా ప్రేక్షకుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ప్రేక్షకుల ఊహకు అందకుండా కథను నడిపే నేర్పు అన్ని నాటకాలలోనూ స్పష్టమవుతుంది. మాతృప్రేమ, విముక్తి, నాగుబాము, సంకల్పం, పర్యవసానం అనే నాటికలు దీనికి చక్కని ఉదాహరణలు. రాజమన్నారు నాటికలలో సాహిత్య దృష్ట్యా ఒక మంచి నాటిక నిష్ఫలం. వేశ్యలకు ప్రేమాభిమానాల త్యాగనిరతి ఉండవని నిరసిస్తుందీ సంఘం. కాని అవి వేశ్యలకు నిష్ఫలాలని వివరిస్తుందీ నాటిక. అందంగా నగిషీలు చెక్కిన రమణీయ దృశ్యకావ్యం నాగుబాము. ప్రేమతత్వానికి సంబంధించిన నాటిక పరకీయ. మోహం తాత్కాలికం, ప్రేమ శాశ్వతం అనే తాత్విక పునాదిపై నిర్మితమైన నాటిక. ప్రారంభదశలో నాటికా సాహిత్యానికి స్థిరమైన పునాదులకు ఆద్యుడైన రాజమన్నార్ 1979, అక్టోబర్ 1న దివంగతుడయ్యాడు.

గం.సు.రె.

రాజారామిరెడ్డి, పెల్లేటి. (జ. 1935) : రంగస్థల నటుడు, నాటక సమాజ నిర్వాహకుడు, నెల్లూరు జిల్లా గూడూరులో సుబ్బరామిరెడ్డి, అన్నపూర్ణమ్మ దంపతులకు 1935లో జన్మించాడు. వి. ఆర్. కళాశాలలో చదివే రోజుల్లో సాంస్కృతికోత్సవాల్లో గండవరం సుబ్బరామిరెడ్డి రచించిన పరిష్కారం నాటికలోను, కొప్పాటి గంగాధరరావు రచించిన బంగారు సంకెళ్ళు లోను, కావ్యశ్రీ మహానవుడు నాటికలోను ప్రధాన పాత్రలు పోషించి ప్రశంసలు అందుకొన్నాడు. ఆ తర్వాత మరికొన్ని నాటికలలో వైవిధ్యభరితమైన పాత్రలు ధరించి మెప్పు పొందాడు. న్యాయవాదిగా స్థిరపడిన తర్వాత కాలక్రమంలో నటనకు స్వస్తి చెప్పి నాటకసమాజ నిర్వహణవైపు మొగ్గుచూపాడు. 1954 నాటికే గూడూరులో సంస్కృతీ సమ్మేళనం సమాజం ఏర్పడి నిర్వహిస్తూ ఉండేది. 1960 ప్రాంతంలో సంస్కృతి సమ్మేళనం సంస్థలో చేరి ఒక సాధారణ కార్యకర్తగా, కార్యనిర్వాహక సభ్యుడిగా, ఉపాధ్యక్షుడిగా, కోశాధికారిగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ సంస్థ పురోగతికి నాలుగున్నర దశాబ్దాలు అవిరళ కృషిచేశాడు. కళారంగంలో సంస్కృతీ సమ్మేళనం కీర్తి ప్రతిష్ఠలు రాష్ట్ర వ్యాప్తం కావడానికి రాజారామిరెడ్డి చేసిన కృషి అత్యంత ప్రాధాన్యం వహిస్తుంది. 1980 – 90 మధ్య కాలంలో పరిస్థితుల ప్రాబల్యంతో అంగబలం, ఆర్థికబలం క్షీణించి సంస్కృతీ సమ్మేళనం శృంగాటకంలో నిలబడి దిక్కులు చూస్తున్న దశలో కళాభిరుచిగల పెద్దలను, వదాన్యులను, యువకులను ప్రోత్సహించి వారి సహకారంతో సమ్మేళనాన్ని పునర్జీవింపజేశాడు. అలా దశను మార్చి, దిశానిర్దేశం చేసి శైథిల్యావస్థ నుంచి సంస్థను సంరక్షించిన ఘనతలో సింహభాగం రాజారామిరెడ్డికే దక్కుతుంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో సంగీత నృత్య పాఠశాల విషయంలోను సాహిత్య పంచమి కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించడంలోనూ ఎంతో చొరవ, శ్రద్ధాసక్తులు కనబరచి సంస్థను స్వర్ణోత్సవంవైపు నడిపించాడు. పెల్లేటి రాజారామిరెడ్డి సేవలను కొనియాడుతూ గూడూరు పౌరులు ఈయనకు సాంస్కృతిక బంధు అనే బిరుదు నిచ్చి

తమ కృతజ్ఞతను చాటుకున్నారు. నేటికీ కళాసేవలో నిమగ్నుడై అహరహం కృషిచేస్తున్న పెల్లేటి అభినందనీయుడు.

గం.సు.రె.

రాజశేఖరుడు (880-920): కవి, నాటకకర్త, అలంకారికుడు. అతని భార్య చౌహాణ వంశంలోపుట్టింది. పండితురాలు. ఎన్నో చోట్ల రాజశేఖరుడు తన భార్య అభిప్రాయాలను కావ్యమీమాంసలో పేర్కొన్నాడు. ఈ కవి కనౌజురాజు మహేంద్రపాలుని విద్యాగురువు. కాబట్టి క్రీ.శ. 10వ శతాబ్దం వాడని చెప్పవచ్చు. రాజశేఖరుడు ఆరు రచనలు చేశాడు. వాటిల్లో నాలుగు నాటకాలు. అవి బాల రామాయణం, బాల మహాభారతం, కర్పూర మంజరి, విద్ధశాల భంజిక. ఇవేకాక రత్నమంజరి అనే నాటకాన్ని రాశాడంటారు. అది ఎక్కడా దొరకలేదు. రాజశేఖరుని మొదటి రచన బాల రామాయణం. నిర్భయుడనే రాజు కోరిక మీద దీన్ని రచించాడు. దీనిలో సీతా స్వయంవరం మొదలుకొని రావణ వధానంతరం రాముడు అయోధ్యకు పోయేంతవరకు గల కథ నిబద్ధింపబడింది. ఇది పది అంకాల నాటకం. అందుకే మహా నాటకంగా పిలువబడింది. ఒక్కొక్క అంకానికి పేరు పెట్టాడు. అవి1) ప్రతిజ్ఞా పౌలస్త్యం, 2) రామరావణీయం, 3) విలక్ష లంకేశ్వరం, 4) భార్గవ భంగం, 5) ఉన్మత్త దశాననం, 6) నిర్దోష దశరథం, 7) అసమ పరాక్రమం, 8) వీర విలాసం, 9) రావణ వధ, 10) సానంద రఘునాథం. నాటక అంకాలకు పేరు పెట్టడం ఎవరూ చేయలేదు. సీతా స్వయంవరానికి రావణుడు కూడా వచ్చినట్లు కవి కల్పన చేశాడు. ఇంకా కవి అనేక కల్పనలను చేశాడు. ఈ నాటకంలో రావణ పాత్రకు, అతనికి సీత మీద గల ప్రేమ, విరహానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడింది. రావణుని మీద ప్రేక్షకులకు సానుభూతి కలిగేటట్లుగా కవి చిత్రించాడు. రామాయణ కథకు కవి ఒక కొత్త రూపాన్ని ఇచ్చాడు. కాని నాటక కథ దృష్టితో పెద్ద కథ నాటకంలో ఇమడలేకపోయిందని చెప్పాలి.

రాజశేఖరుని బాలభారత నాటకానికి ప్రచండ పాండవమని కూడా పేరు. ఇప్పుడు రెండు అంకాలు మాత్రమే దొరికాయి. వీటిల్లో ద్రౌపదీ స్వయంవరం, ద్యూతక్రీడ, ద్రౌపదీ వస్త్రాపహరణం ఘట్టాలున్నాయి. మహాభారతం కథలో కూడా మార్పులు చేసి కవి చిత్రించాడేమో చెప్పలేం. రాజశేఖరుని కర్పూర మంజరి లో నాలుగు అంకాలున్నాయి. ఇది ప్రాకృత భాషలో రాయబడింది కాబట్టి సట్టకమనబడుతుంది. మిగతా లక్షణాలన్నీ నాటికకున్న లక్షణాలే ఉన్నాయి. దీన్ని కవి తన భార్య అవంతి సుందరి కోరిక మీద రచించాడు. నాయకుడు చంద్రపాలుడు రాజు. అతని భార్య విభ్రమలేఖ. విదర్భ రాజకుమారి కర్పూరమంజరి. ఆమెను రాజు సిద్ధుడు చూపించగా చూసి ప్రేమిస్తాడు. రాణి చంద్రపాల కర్పూర మంజరుల వివాహానికి అడ్డు వస్తుంది. కాని చివరకు కథ సుఖాంతమవుతుంది. ఈ నాటికలో చక్కని నాటకకళను కవి ప్రదర్శించాడు. అతని నాటకాల్లో ఇది ఉత్తమమైందిగా విమర్శకులు గుర్తించారు. కవి ప్రాకృత భాష మీద మంచి అధికారం చూపిస్తూ ఈ నాటికను రచించాడు. శౌరసేనీ ప్రాకృత భాష ఎన్నుకొని కవి కొత్తదనాన్ని చూపాడు. ఇది సంగీతాత్మకంగా తేలికగా సాగింది. చాలా ప్రసిద్ధమైన లోకప్రియమైన నాటిక. ఇతివృత్తంలో ఇది మాళవికాగ్నిమిత్రంను అనుకరిస్తున్నది.

రాజశేఖరుని విద్ధశాలభంజిక కూడా నాయికానాయకుల ప్రేమవృత్తాంతంతో కూడిన నాటిక. మృగాంకవతి మగవేషంలో రాజు విద్యాధరమల్లుని దగ్గరకు చేర్చబడుతుంది. రాజు స్వప్నంలో మృగాంకవతిని చూసి ప్రేమిస్తాడు. ఆమె బమ్మ (విద్ధశాలభంజిక) ను చేయించి చిత్రశాలలో పెట్టాడు. విదూషకుని ప్రయత్నంతో మృగాంకవర్మ ఆడ వేషంలో వచ్చి రాజును కలుస్తుంది. వారు ఒకరినొకరు ప్రేమించుకుంటారు. కాని మృంగాకవర్మకు రాణి కువలయమాలతో వివాహం జరిపిస్తుంది. చివరకు మృగాంకవతితో పాటు కువలయమాలను రాజు వివాహమాడ్తాడు. నాటిక సుఖాంతమవుతుంది. దీని ఇతివృత్తం మీద మాళవికాగ్నిమిత్రం, రత్నావళిల ప్రభావం ఉంది. రాజశేఖరునితోనే సంస్కృత నాటక రంగం క్షీణదశ వైపు పయనించడం ఆరంభమైందని చెప్పవచ్చు. రాజశేఖరుని నాటకాలు ప్రదర్శనాయోగ్యంగా రక్తి కట్టేటట్లు లేకున్నా చక్కని కవిత్వంతో కూడి ఉన్నాయి. విషయానుకూలమైన ఛందస్సులను కవి నాటకాల్లో ప్రయోగించాడు.కవిత్వం మధురంగా సరసమైన సూక్తులతో కూడి ఉంది. ప్రకృత్యాది వర్ణనలను చిత్రాత్మకంగా వర్ణించాడు. పాత్రలను కళ్ళ ముందు కనిపించేటట్లుగా చిత్రించాడు. రాజశేఖరుని కవిత్వాన్ని ధనపాలాది కవులు ప్రశంసించారు. రాజశేఖరుడు సంస్కృత కవి అయి ఉండి ప్రాకృత, అపభ్రంశ భాషల గొప్పతనాన్ని ప్రశంసించాడు. ప్రాకృతం సంస్కృతానికి జనని అని చెప్పాడు. సామాన్యుల భాషను ప్రశంసించిన గొప్ప కవి, నాటక కర్త రాజశేఖరుడు.

శ్రీ.చ.

రాజారావు, గరికపాటి (1915-1963) : నటుడు, దర్శకుడు, రాఘవ కళాసమితి స్థాపకుడు. ఈయన 1915, ఫిబ్రవరి 5న రాజమండ్రిలో గరికపాటి సోమయ్యదేవర, సోమలింగమ్మ దంపతులకు జన్మించాడు. విద్యార్థిగా ఉన్నప్పుడే ప్రదర్శనలలో పాల్గొని అందరి మెప్పు పొందాడు. ఆదిభట్ల నారాయణదాసు ఆటకీ, పాటకీ తాళంవేసి ఆయన మెప్పు చిన్న వయసులోనే పొందడం విశేషం. సికిందరాబాద్ లాలాగూడా వర్క్‌షాపులో తండ్రి ఉద్యోగం చేస్తున్నప్పుడు సత్యహరిశ్చంద్రలో



మాతంగ కన్య పాత్రలో నటిస్తూ రంగస్థల ప్రవేశం చేశాడు. 15 ఏళ్ళ వయస్సులోనే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి ఉద్యోగం చేసిన లాలాగూడా వర్క్ షాపులోనే ఉద్యోగిగా చేరాడు. కానీ పై ఉద్యోగి దాష్టీకం భరించలేక రాజీనామా చేశాడు. విజయనగరంలోని మేనమామ సుబ్రమణ్యం దగ్గర ఎస్.ఎస్.ఎల్.సి. చదివిన రాజారావు, మద్రాసులో ఎల్.ఐ.ఎమ్. కోర్సులో చేరి, సహ విద్యార్థులతో కలిసి గుళ్లపల్లి నారాయణమూర్తి రచించిన విడాకులు నాటకానికి దర్శకత్వం వహించి అనంతర కాలంలో పలు నాటకాల ద్వారా ఎందరో కొత్త నటులను పరిచయం చేశాడు. మద్రాసులో రాజారావు దర్శకత్వంలో ప్రదర్శించిన షాజహాన్ నాటకం సంచలనాన్ని సృష్టించింది. షాజహాన్ గా ఎస్.వి.ఆర్ సాంబశివరావు, జహనారాగా కొర్రపాటి గంగాధరరావు, ఔరంగజేబుగా రాజారావు అత్యద్భుతంగా నటించి, పలువురి ప్రశంసలు పొందారు. రాజారావుకు ఈనాటకంలో సుప్రసిద్ధ నటుడు, రూపశిల్పి దేవీప్రసాదరాయ్ చౌదరి మేకప్ చేయడం గమనార్హం.

గరికపాటి మద్రాసులో విద్యార్థులను సమీకరించి భమిడిపాటి రచించిన బాగుబాగు, గాలి బాలసుందరరావు అపోహ వంటి నాటకాలను ప్రదర్శించాడు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడైన పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి స్నేహంతో రాజారావు మార్క్సిజం వైపుకు క్రమంగా ఆకర్షితుడయ్యాడు. విజయవాడ సమీపంలోని పెనమలూరులో వైద్యశాలను ప్రారంభించాడు. పరిసర గ్రామాలలోని ఔత్సాహికులను సమీకరించి ఖిల్జీరాజ్య పతనం, రంగూన్ రౌడీ నాటకాలను ప్రదర్శించాడు. ఫాసిస్టు వ్యతిరేకోద్యమంలో భాగంగా విజయవాడ పరిసర ప్రాంతాలలో బాల, యువజన సంఘాలను నెలకొల్పాడు. 1943లో బంబాయిలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘ మహాసభ కారణంగా భారతీయ నాటక రంగంలో విశేషించి తెలుగు నాటకరంగంలో పెనుమార్పులు సంభవించాయి. ఈ సభలో 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ఆవిర్భావం జరిగింది. ఇప్టా రాష్ట్ర కన్వీనర్‌గా రాజారావు ఎన్నుకోబడ్డాడు. ఇప్టా అనుబంధ శాఖగా ఏర్పడిన ప్రజానాట్య మండలి రాష్ట్ర దళం దర్శకుడుగా రాజారావు వ్యవహరించాడు.

రాజారావు ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో పలు జిల్లాలలో 15 శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేశాడు. కళాకారులకు దర్శకుడిగా శిక్షణ ఇవ్వడంతో పాటు క్రమశిక్షణను రంగరించి తీర్చిదిద్దాడు. రాజారావు కృషితో జానపద కళాకారుల నుండి నాటకం వైపుకు ప్రజానాట్యమండలి ప్రయాణించింది. ప్రజానాట్య మండలి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన మాభూమి నాటకం సంచలనాలకు చిరునామాగా నిలిచింది. తెలంగాణా రైతాంగ పోరాట ఇతివృత్తంతో సుంకర – వాసిరెడ్డి రచించిన ఈ నాటకం తెలుగు నేలపైనే కాదు భారతీయ నాటక రంగంలోనూ కొత్త సంప్రదాయాలకు నాందీగీతం పలికింది. రాష్ట్ర దళం ప్రదర్శించిన మాభూమి నాటకానికి రాజారావు దర్శకత్వం వహించడమే కాకుండా పట్వారీ వెంకట్రావు పాత్రను అనితర సాధ్యంగా పోషించాడు. తెలుగు వారి అపురూప జానపద కళాప్రక్రియ పాశ్చాత్య సంస్కృతి పెనుహోరులో కొడిగట్టిన దీపంలాగా రెపరెపలాడుతున్న తరుణంలో ఆ కళాప్రక్రియలను పునరుద్ధరించిన ఘనత ప్రజానాట్యమండలిదే. ఆ కళాప్రక్రియలలో వర్తమాన ఇతివృత్తాలను జోడించి అత్యద్భుతంగా ప్రదర్శించాడు రాజారావు.

ప్రపంచాన్ని తన ఉక్కుపిడికిలితో బంధించాలనే కలలు కనే నియంత హిట్లర్ చరిత్రను హిట్లర్ భాగోతం అనే వీధి భాగవతంగా రాజారావు ప్రదర్శించాడు. ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో అక్షరాలను కంపోజింగ్ చేయడం నుండి ట్రేడిల్ తొక్కడం, ప్రింటింగ్ పేపర్లు తీయడం వరకూ గల పనిక్రమాన్ని ప్రెస్ వర్కర్ నృత్య నాటికగా రూపొందించి వందలాది ప్రదర్శనలిచ్చాడు.

ఆత్రేయ రచించిన పరివర్తన, ఈనాడు, భయం నాటకాలను ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో ప్రదర్శించి బహుమతులను పొందాడు. అల్లూరి సీతారామరాజు నాటకాన్ని ఆంధ్ర దేశంలోనే కాక రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా ప్రదర్శించాడు. ఈ నాటకానికి దర్శకత్వం వహించడమే కాకుండా రూథర్ ఫర్డ్ పాత్రను అనితర సాధ్యంగా పోషించాడు. ఈనాటకాన్ని చలన చిత్రాన్ని మరిపించే రీతిలో టెక్నికల్ విలువలతో ప్రదర్శించి ప్రేక్షకులను ఊర్రూతలూగించాడు. మరాఠీ రచయిత మాయా సావర్కర్ రచించిన జై భవానీ నాటకాన్ని ఎస్. జగన్నాథ్ ఆంధ్రీకరించగా ఆ నాటకాన్ని గరికపాటి దేశభక్తి ప్రబోధాత్మకంగా, జనరంజకంగా ప్రదర్శించాడు. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో పుట్టిల్లు చిత్రాన్ని నిర్మించాడు. ఈ చిత్రం ద్వారా జమున, పెరుమాళ్ళు, కుటుంబ రావు, అల్లురామలింగయ్య వంటి నటులతోపాటు మోహన్‌దాస్, తాతినేని చలపతిరావులు సంగీత దర్శకులుగా తెలుగు తెరకు పరిచయమయ్యారు.

జైభవానీ నాటకాన్ని ప్రదర్శించే సమయంలో గుండెనొప్పి రావడంతో అస్వస్థుడయ్యాడు. ఇదే సమయంలో దేవుడుచేసిన మేలు చిత్రాన్ని నిర్మించినా ఆర్థిక కారణాల వల్ల ఆ చిత్రం విడుదల కాలేదు. మానసికంగా కుంగిపోయిన రాజారావు 1963, సెప్టెంబరు 8న మద్రాసులో మరణించాడు.

రాజారావు తెలుగు సాంఘిక నాటకరంగంలో దర్శకుడు అనే పదానికి ఒక గుర్తింపును, గౌరవాన్ని మొదటిసారిగా కలిగించాడు. నాటక ప్రదర్శనలో పాత్రల కదలికలు, హావభావాల వ్యక్తీకరణకు రంగస్థలంపై సర్క్యులర్ మూవ్‌మెంట్, పారలల్ మూవ్‌మెంట్, యాంగ్యులర్ మూవ్‌మెంట్లను తొలిసారిగా ప్రవేశపెట్టాడు. రాజారావు పరితాపం, వీరనారి అనే నాటికలను రచించాడు. రాజమండ్రిలో రాఘవ కళాసమితి పేరుతో గ్రంథాలయాన్ని నెలకొల్పి, విలువైన నాటక గ్రంథాలను సేకరించాడు. 'నటుడు – సమయస్ఫూర్తి, పాత్రల నిర్ణయం, ప్రదర్శనం' పేరుతో రచించిన నాటక విమర్శ వ్యాసాలు ఇప్పటికీ ప్రామాణికంగా రాణిస్తున్నాయి.

రాజారావు ప్రాచ్య పాశ్చాత్య నాటక ధోరణులను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్న మహామేధావి. తెలుగు నాటకరంగంలో ధృవతారగా వెలిగిన రాజారావు తానేమిటో, తన బాధలేమిటో ఇతరులకు తెలియనివ్వకుండా వందలాది మంది కళాకారులను తీర్చిదిద్దిన వైతాళికుడు. తెలుగు నాటకరంగానికి రాజారావు చేసిన సేవలకు గుర్తుగా రాజమండ్రిలో శిలా ప్రతిమను ఏర్పాటు చేశారు.

కందిమళ్ళ

రాజారావు, రొద్దం (1901-1950) : నటుడు, కళాపోషకుడు. ఉదార చరిత్రుడు, కవిపండిత పక్షపాతి. 1901లో హిందూపురంలో జన్మించాడు. ప్రాథమిక విద్యాభ్యాసం పెనుగొండ లోను బెంగుళూరు, అనంతపురంలో కళాశాల్ల చదువు సాగింది. పెనుగొండలో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. చెన్నపట్నం, తిరవనంతపురంలో చదివి న్యాయశాస్త్ర పట్టా పొందాడు. 1927లో పెనుగొండలో న్యాయవాదిగా తండ్రితో కలిసి పనిచేశాడు. ఆ తరువాత హిందూపురంలో స్థిర నివాసమేర్పరచుకొని న్యాయవాదిగా పనిచేశాడు. 1904లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటకోత్సవాలు హిందూపురంలో వైభవంగా నిర్వహించాడు. పఠాన్ రుస్తుం, సత్యవంతుడు, భరతుడు, నలుడు, అర్జునుడు, శ్రీకృష్ణదేవరాయలు, రాజసింహుడు, రాణాప్రతాప్, సారంగధరుడు, పృథ్వీరాజ్, చంద్రగుప్తుడు వంటి పాత్రలలో నటించాడు. 1946లో ఏలూరులో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు సభలకు అధ్యక్షత వహించాడు. హిందూపురంలో రాయలసీమ కళా పరిషత్తు స్థాపించి గడియారం వేంకట శేష శాస్త్రి, రాజశేఖర శతావధాని వంటి పండితకవులనెందరినో సత్కరించాడు. నాటకరంగ వికాసంకోసం కృషిచేసిన రాజారావు 1950లో మరణించాడు.



శ్రీ.చ.

రాజా శివానంద (జ.1936) : నటుడు, నాటకకర్త, దర్శకుడు, నాటక సమాజ నిర్వాహకుడు, నాటక పోటీల న్యాయనిర్ణేత. ఈయన గుంటూరు జిల్లా తెనాలి తాలుకాలోని వెహాదుకూరులో 1936, నవంబరు 7న జన్మించాడు. తల్లిదండ్రులు చక్రాల కోటేశ్వర రాజు, అనసూయమ్మలు శివానంద సంస్కృత కళాశాల తెనాలిలో భాషా ప్రవీణ, గాంధీ ఆశ్రమం (కొమరవోలు, గుడివాడ తాలుక)లో విశారద పూర్తి చేశాడు. కళాకారుల కుటుంబంలో పుట్టిన శివానంద పాఠశాలలో చదువుతున్న రోజుల్లో ప్రసిద్ధ నటులు పులిపాక వెంకటప్పయ్య, పులిపాటి వెంకటేశ్వర్లు, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన కురుక్షేత్రం నాటకం బాగా ప్రభావితం చేసింది. నాటి నుండి నాటకం పట్ల అభిమానం పెంచుకున్న రాజా శివానంద పదవ యేటనే తెనాలి రామకృష్ణ నాటకంలో శివరామశాస్త్రిగా నటించాడు. ఆ తరువాత రోజుల్లో గొడ్డుకాడ బుడ్డోళ్ళు, అల్లరి సూర్యం నాటికలలో ప్రధానపాత్రలలో నటించాడు. శివానంద 1952వ సంవత్సరంలోనే 'చిత్రకళాథియేటర్' స్థాపించి బాలనాగమ్మ, ఇదా ప్రపంచం, పేదపిల్ల, రైతుబిడ్డలు మొదలైన నాటకాలలో నటించడమే కాకుండా దర్శకత్వం వహించాడు. సరికొత్త సాంకేతిక ప్రయోగాలు చేసి ప్రేక్షకుల మన్ననలను పొందాడు.

తెనాలిలో భాషాప్రవీణ పూర్తి చేసిన తరువాత దివ్య కళారాధన నాటక సమాజం స్థాపించి, బి.ఎ. ఫస్టుక్లాస్ నాటకం రచించి నాగకళామందిరంలో ప్రదర్శించాడు. 1958 తరువాత

మద్రాసులో కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేస్తూ కళత్రం నాటకం రాసి వాణీమహల్‌లో ప్రదర్శించాడు. ఆ తరువాత చెన్నపురి ఆంధ్రమహాసభ నాటక పోటీల్లో, ఆంధ్రక్లబ్ నిర్వహించిన నాటక పోటీల్లో తిక్కశంకరం, పగిలిన హృదయాలు ప్రదర్శించి నాటక రంగంలో ప్రసిద్ధులైన గరికపాటి రాజారావు, లింగమూర్తిల ప్రశంసలందుకున్నాడు. 1964లో ఖమ్మంలో దివ్యకళారాధన అనే నాటక సమాజశాఖను ప్రారంభించి, ఆ ప్రాంతంలో యువ కళాకారులకు నటనలో శిక్షణనిచ్చి కళాజీవితం, కిన్నెర, చల్లనిచూపులు మొదలైన నాటకాలను ప్రదర్శింపచేశాడు. మండే గుండెలు ఎండే పెదవులు (1969) రచించి, అరియా కొళంది (తమిళం) దర్శకత్వం చేసి సుప్రసిద్ధ నటులతో వివిధ కళావేదికలపై ప్రదర్శించి ప్రముఖ నాటక రచయితగా, దర్శకుడుగా పేరు తెచ్చుకున్నాడు. 1985లో మొట్టమొదటి సారి నాటక అకాడమీ, సాంస్కృతిక శాఖ కలసి నిర్వహించిన నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. చలన చిత్రరంగంలో ప్రవేశించి కొన్ని సినిమాలకు పాటలు, మాటలు రాశారు. 'మాంగల్య విజయం' అనే చిత్రంలో 'రామాంజనేయ యుద్ధం' యుద్ధం దృశ్యం చిత్రీకరించి ప్రముఖ రంగస్థల నటుడు షణ్ముఖి ఆంజనేయరాజు, జె. రామమోహన్‌రావులను చిత్రరంగానికి పరిచయం చేశాడు. చిత్రరంగంలో ఇమడలేక హైదరాబాదులో స్థిరపడి భాగ్యనగర్ క్లబ్‌లో కల్చరల్ డైరెకుగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ మొట్టమొదట నిర్వహించిన నంది నాటకోత్సవాలలో తాను రచించిన చంద్రోదయం నాటకంలో నటించి ఉత్తమ హాస్యనటుడు అవార్డుతో పాటు అనేక నాటక పరిషత్తుల నుంచి అవార్డులు, సన్మానాలు పొందాడు.

దాసరి.ఎన్.

రాజేశ్వర రావు, దావులూరి (1927) : నటుడు, నవ్య కళా సమితి స్థాపకుడు. ఈయన 1927, అక్టోబర్ 3న తెనాలిలో శేషాచలం, అన్నపూర్ణ దంపతులకు జన్మించాడు. ఆ రోజుల్లో తండ్రి శేషాచలం స్త్రీ పాత్ర ధారణలో (స్థానం నరసింహారావు కంటే ముందు) ఎంతో పేరు తెచ్చుకున్నాడు. ఆయన నటనా వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాడు రాజేశ్వర రావు. తన పదవ ఏటనే ధృవుడి పాత్రతో నాటక రంగంలోకి అడుగుపెట్టాడు. తెనాలి, నెల్లూరులలో విద్యాభ్యాసం చేసిన రాజేశ్వరరావు రెండవ ప్రపంచ యుద్ధసమయంలో సికింద్రాబాదులోని మిలటరీ ఆయుధ గిడ్డంగిలో చేరాడు. మిలటరీ జవానుల వినోదార్థం రంగస్థలంపై నాటక ప్రదర్శనలు ఇచ్చాడు. సక్కుబాయి అత్తగా నటించి ప్రశంసలు అందుకున్నాడు. 1948లో అప్పటి నైజాం స్టేట్ రైల్వేలో ఉద్యోగిగా చేరి (ఇప్పుడది దక్షిణ మధ్య రైల్వే) 1985న రిటైరయ్యాడు.



1950లో నవ్య కళాసమితి స్థాపించి చిల్లర భావ నారాయణ రావు కళాభిమాని నాటకం ప్రదర్శించాడు. 1952లో ఆంధ్ర రాష్ట్ర శాంతి మహాసభలు ఏలూరులో జరిగినప్పుడు ఉప్పెన నాటకాన్ని ప్రదర్శించాడు. విశ్వశాంతి నాటకంలో అమరయ్య పాత్రకు కె. వేంకటేశ్వరరావుకీ, ఉప్పెనలో డి. రాజేశ్వరరావుకీ కలిపి ఉత్తమ నటుడు బహుమతి ఇచ్చారు.

హాస్యం అంటే రాజేశ్వరావుకి చాలా ఇష్టం. మొదట హాస్య పాత్రలతోనే నాటక జైత్రయాత్ర సాగించి, తరువాతికాలంలో దాదాపు 50 నాటకాల్లో వివిధ పాత్రలలో నటించాడు. దాదాపుగా యాభై నాటకాలకు దర్శకత్వం వహించాడు. సచివాలయ సాంస్కృతిక సంఘం, ఆంధ్ర లలిత కళాసమితి, శ్రీ కళానికేతన్, నవ్య కళాసమితి, విజయ కళాసమితి, ఇండియన్ నేషనల్ థియేటర్, నవ్య సాహితీ సమితి, నవ్య నాటక సమితి అందే ఆర్ట్స్ సంస్థలకు ఆయన దర్శకత్వం వహించాడు.

ఆయా సంస్థల తరపున ఆంధ్ర నాటక కళా పరిషత్తు నుంచీ 1990 వరకూ కొత్తగా వెలిసిన పరిషత్తులలో మనిషిలో మనిషి, సత్యం–సుందరం (ప్రఖ్య శ్రీరామ్మూర్తి), అభాగిని (గోపీచంద్), గృహ ప్రవేశం (మునిమాణిక్యం), ఆత్మవంచన (బుచ్చి బాబు), వెలుగు నీడలు (పాలగుమ్మి పద్మరాజు) క్రీనీడలు (కె.ఎల్. నరసింహారావు), శకుంతల, పదవులు–పెదవులు (చిల్లర భావనారాయణ) లాంటి నాటకాల్లో నటించాడు, దర్శకత్వం వహించాడు. వీటిలో కొన్ని రేడియెాలో కూడా ప్రసారమయ్యాయి.

నాటకరంగ వికాసం కోసం కృషి చేసిన దావులూరిని అందే ఆర్ట్స్, ఆంధ్ర లలిత కళాసమితి, నవ్య నాటక సమితి, సంస్కార భారతి, యువకళావాహిని, విశ్వసాహితి, రైల్వే ఇన్‌స్టిట్యూట్ గుంతకల్లు, శ్రీకళానికేతన్ మొదలైన సమాజాలు సన్మానించాయి.

అడబాల

రాజ్యం, కె. (జ.1956) : రంగస్థల నటి. పశ్చిమ గోదావరి జిల్లా, తణుకులో వేండిశెట్టి సత్యవతి, వీరాస్వామిరాజు దంపతులకు 1956, నవంబరు 2న జన్మించింది. నాలుగు దశాబ్దాలుగా అటు పౌరాణిక నాటకాల్లోనూ, ఇటు సాంఘిక నాటికా, నాటకాల్లోనూ సమర్థవంతంగా పాత్ర పోషణ చేస్తూ ప్రేక్షకులోకాన్ని అలరిస్తున్న అగ్రశ్రేణి నటీమణి కె. రాజ్యం. రంగస్థల

నటి అయిన తల్లి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని, రాజ్యం తన పదవ ఏట పున్నర్జన్మ నాటకంలో పాప వేషంతో రంగప్రవేశం చేసింది.

ఆనాటి నుంచి నేటివరకూ రంగస్థలానికే అంకితమై నటజీవితాన్ని కొనసాగిస్తోంది. తొలిదశలో అభినయంలో అక్షరాభ్యాసం చేయించిన గురువులు ముంగండ నాగేశ్వరరావు, ఈడేపల్లి రామా రావులు. చక్కని రూపం, ఏ భావాన్నయినా అవలీలగా ముఖంలో పలికించగల అభినయ కౌశల్యం, మధురగళం, స్ఫుటమైన వాచిక విన్యాసం ఆమెకు దేవుడిచ్చిన వరాలు. వందలాది ప్రదర్శనల్లో పాల్గన్నా, ఎంతో అనుభవం గడించినా ఇంకా నేర్చుకోవాలన్న తపన, పట్టుదల, క్రమశిక్షణ, నిత్యసాధన రాజ్యంను ఉత్తమశ్రేణి నటిగా తీర్చిదిద్దాయి.

పల్లెపడుచు, దొరకనిదొంగ, కట్నాలు-కాపురాలు, పూజాపుష్పాలు, మంచిరోజులు, పసుపు బట్టు పేరంటానికి, ఇదేమిటి, కీర్తిశేషులు వంటి సాంఘిక నాటకాలు ఆమెకు పేరు తెచ్చాయి. ఆత్రేయ చావకూడదు నాటికను ఎన్నో పరిషత్తులలో ప్రదర్శించి ప్రశంసలతోపాటు బహుమతులు గెల్చుకొంది.

ఇక పద్య నాటకాల విషయానికొస్తే పి.వి. భద్రం శిక్షణలో చంద్రహాస, ప్రమీలార్జునీయం, కచదేవయాని, బభ్రువాహన, తులసీ జలంధర నాటకాల్లో ముఖ్య పాత్రలు ధరించి ప్రశంసలందుకొంది. ఇంకా శకుంతల, శ్రీరామభక్త హనుమాన్, భూకైలాస్, చక్రధారి, లక్ష్మమ్మ కథ, సారంగధర, గులేబకావళి, దుర్గాదేవి కటాక్షం, భక్త చింతామణి, శ్రీకృష్ణరాయబారం మొదలైన నాటకాల్లో రాజ్యం ధరించిన పాత్రలు ఆమెకెంతో కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయి.

అఖిలాంధ్ర కీర్తి గడించిన షణ్ముఖి ఆంజనేయరాజు వంటి ఉద్దండ నటుని మొదలు నేడు పౌరాణిక నాటకరంగంలో లబ్ధప్రతిష్ఠులైన అనేకమంది నటుల సరసన నటించే భాగ్యం కలిగింది. 1990లో ఏలూరు ఆదర్శ కళాభారతి సంస్థ కళాభారతి అవార్డుతోను, 1992లో నటరాజ కళాపీఠం శ్రీరంజని అవార్డుతోను సన్మానించి ప్రోత్సహించాయి. 1998లో తెలుగు విశ్వవిద్యాలయం రాజ్యంను సన్మానించింది. కాలప్రవాహంలో ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొంటూ, సమస్యల వలయాలను భేదించుకొంటూ అటు నిజజీవితంలోనూ, ఇటు నటజీవితంలోనూ తన పాత్రను సమర్థవంతంగా పోషించు కొంటూ ముందుకు సాగుతూంది ఈ నటీమణి.

గం.సు.రె.

రాధాకృష్ణ, భమిడిపాటి : నాటక రచయిత. స్వస్థలం రాజమహేంద్రవరం. ప్రసిద్ధ హాస్యరచయిత భమిడిపాటి కామేశ్వరరావు తనయుడు. వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్ అయినా ప్రవృత్తి రీత్యా కళాకారుడు. 1950-65 సంవత్సరాలలో తెలుగు నాటకరంగంలో సంచలనం సృష్టించిన రచయిత. కీర్తిశేషులు (1960) నాటకం భమిడిపాటి కీర్తి బావుటాను గగనతలంలోకి ఎగరవేసిందని చెప్పవచ్చు. కరుణ, హాస్య రసాలను మేళవించి సందేశాత్మకంగా రూపొందించిన కీర్తిశేషులు నాటకాన్ని నాటక సమాజాలు పోటీపడి ప్రదర్శించాయి. కీర్తిశేషులులో మురారి పాత్ర రావుగోపాలరావు అద్భుతంగా పోషించి ఆ పాత్రను చిరస్మరణీయంగా చేశాడు. కె. వేంకటేశ్వర రావు కూడా మురారి పాత్రలో జీవించాడు.

రాధాకృష్ణ నాటకాలలోనూ, నాటికల్లోనూ సున్నిత హాస్యం పరవళ్లు తొక్కుతూ ఉంటుంది. ఇదేమిటి పూర్తి హాస్య నాటకం. దంతవేదాంతం (1959), మనస్తత్వాలు (1960) నాటికల్లో హాస్యం ప్రేక్షకుల్ని గిలిగింతలు పెడుతుంది. రాధాకృష్ణ రాసిన చివరి నాటకం దైవ శాసనం. ఆ తరువాత పొట్టి ప్లీడరు రచయితగా సినిమా రంగంలో అడుగుపెట్టి కొన్ని చిత్రాలకు కథ, సంభాషణలూ సమకూర్చాడు. నిజానికి సినిమా రంగం కంటే నాటక రంగంలోనే రాధాకృష్ణ కీర్తి ప్రతిష్ఠలు నిలిచి ఉన్నాయని చెప్పవచ్చు.

గం.సు.రె.

రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని (జ.1916) : రంగస్థల, సినీనటుడు, వ్యాస రచయిత. ప్రజా నాట్యమండలి స్థాపకులలో ముఖ్యుడు. విభిన్న పాత్రల్ని విశిష్టంగా పోషించిన నట సిద్ధుడు. తెలుగు నాటక పరిణామాన్నంతా అక్షరబద్ధం చేసిన చరిత్రకారుడు. ప్రాచీన జానపద కళారూపాల నుండి వర్తమాన తెలుగు నాటక తీరుతెన్నులన్నింటినీ పుక్కిట పట్టిన రంగస్థల

అగస్త్యుడు. 1916 లో జన్మించిన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి పాఠశాలలో విద్యాభ్యాసం చేసే రోజుల్లోనే భీముడు, యముడు, అర్జునుడు వంటి పాత్రలను ధరించాడు. అట్టల కిరీటాలు, మసిబగ్గు మీసాలు, అర్ధళం రంగులతోనే రంగస్థలంపై నటించి ఉపాధ్యాయుల ప్రశంసలందుకున్నాడు. ఆ తరువాత కృష్ణా జిల్లాలోని పలు ఉద్యమాలలో ప్రముఖ పాత్ర వహించాడు. కమ్యూనిస్టు పార్టీలో, ప్రజా నాట్యమండలి ఉద్యమ స్థాపనలో కేంద్ర బిందువుగా నిలిచాడు. గరికపాటి రాజారావు, కోగంటిలతో పాటు ప్రజా నాట్యమండలి చేపట్టిన కార్యక్రమాలలో విరివిగా పాల్గన్నాడు. బుర్రకథకునిగా, జముకుల కథకునిగా రాజకీయ వీధి నాటకాలలో హిట్లర్, వేవెల్ దేశ్‌ముఖ్‌గా, డప్పులు, కోలాటాలలో బృంద నృత్యకారునిగా పాల్గని ఆ కళారూపాలను ఉద్యమస్థాయిలోకి తీసుకువెళ్ళాడు.

మాభూమి, ముందడుగు, పోతుగడ్డ, ఈనాడు, ప్రగతి, గాలిమేడలు వంటి ప్రజా నాట్యమండలి నాటకాలలో ప్రధాన పాత్రలలో నటించి, ఆ నాటకాలను చిరస్మరణీయం చేశాడు. సుప్రసిద్ధ సినీ దర్శకుడు కె.ఎస్. ప్రకాశరావు ఆహ్వానం మేరకు 1951లో చలనచిత్ర రంగంలో ప్రవేశించి దాదాపు నాలుగు వందల చిత్రాలలో నటించాడు. పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక చిత్రాలలో వైవిధ్యం గల పాత్రలను ధరించి విశిష్ట నటునిగా పేరు పొందాడు. "సినీరంగం అన్నం పెడితే నాటక రంగానికి అంకిత మనసుతో సేవ చేశాను. సినిమా రంగంలో ధన సంపాదన మినహా మరో జీవితం నాకు కన్పించలేదు. శిథిలమైపోతున్న నాటకరంగాన్ని గూర్చి కాలగర్భంలో కలిసి పోయిన నటీనటులు గురించి తెలియజెయ్యాలనుకొని ఆ కృషిలో మమేకమైపోయాను'' అని రాసుకుంటాడు మిక్కిలినేని. ఈ కృషికి నిదర్శనమే *ఆంధ్ర నాటక రంగ చరిత్ర*. 1954-55 లో తెలుగు భాషా సమితి బహుమతికి ఈ గ్రంథం ఎంపికైంది.

1965 నుంచి ఇరవై అయిదు సంవత్సరాల పాటు ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రికలో నటీనటుల ప్రతిభా విశేషాలను ధారావాహికంగా ప్రచురించిన వ్యాసాలన్నింటినీ నటరత్నాలు పేరిటగ్రంథంగా తెచ్చి, 1981లో మద్రాసులో జరిగిన నాటకరంగ శతజయంత్యుత్సవ సందర్భంలో ఎన్టీఆర్‌కు అంకితమిచ్చాడు. నటరత్నాల ఫోటోలను, రేఖా చిత్రాలను, నాలుగు వందల ఫోటోలను పెద్ద సైజులోకి చేయించి పలు ప్రదేశాలలో ఎగ్జిబిషన్‌గా ప్రదర్శింపచేశాడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1982లో నటరత్నాలు గ్రంథాన్ని ఉత్తమమైనదిగా ఎంపికచేసి అవార్డును ఇచ్చింది.

చరిత్ర గర్భంలోకి చేరిపోతున్న తెలుగువారి జానపద కళారూపాలన్నింటిని పరిశోధించి, పరిష్కరించి గ్రంథంగా ప్రచురింపచేశాడు. ఈ గ్రంథానికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 1995లో ఉత్తమగ్రంథ పురస్కారాన్ని అందజేసింది. శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన ఓరియంటల్ సెమినార్ సందర్భంలో మిక్కిలినేని ఆంధ్రుల నృత్యకళా వికాసం గురించి చేసిన కీలక ప్రసంగం దేవస్థానం సహాయంతో ప్రచురింపబడింది. "ప్రజా పోరాటాల రంగస్థలం ప్రజానాట్యమండలి''పేర ప్రజానాట్య మండలి ఉద్యమ గాథలన్నింటినీ వ్యాఖ్యానిస్తూ, స్మరిస్తూ, ప్రశంసిస్తూ మరో గ్రంథాన్ని ఇటీవలనే రాశాడు. సోవియట్ నాటకరంగం గురించి తమిళ, కన్నడ, కేరళ, మహారాష్ట్ర, బెంగాల్ నాటక రంగాల పూర్వాపరాల గురించి వివిధ పత్రికలలో పలు వ్యాసాలు రాశాడు.

నాటక రంగంలో ఏడు దశాబ్దాలకు పైగా నటునిగా, దర్శకునిగా, గ్రంథకర్తగా మిక్కిలినేని చేస్తున్న కృషిని గుర్తించి 1982లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ కళా ప్రవీణ బిరుదులు ప్రసాదించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆనాటి ముఖ్యమంత్రి అంజయ్య ఆధ్వర్యంలో ఉగాదినాడు 'తెలుగు వెలుగు' బిరుదు, ఎన్టీఆర్ ఆత్మగౌరవ పురస్కారం కూడా మిక్కిలినేనిని వరించడం విశేషం. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌ను అందజేస్తే, శ్రీ రాజాలక్ష్మీఫౌండేషన్ 25వేల రూపాయల లిటరరీ అవార్డునిచ్చి మిక్కిలినేని కృషిని మెచ్చుకుంది. వీటితోపాటు చిత్తూరు వి. నాగయ్య అవార్డు, బళ్ళారి రాఘవ అవార్డు, వై. వెంకన్న చౌదరి రాజ్యలక్ష్మి అవార్డు, టి. సుబ్బరామిరెడ్డి కళాపీఠం అవార్డు, పైడి లక్ష్మయ్య అవార్డు, టి. కృష్ణ అవార్డు, మద్రాసు తెలుగు అకాడమీ అవార్డూ వంటి పురస్కారాలెన్నో మిక్కిలినేనిని వరించాయి. తెలుగు రంగస్థలం, జానపద కళారూపాలు, ప్రజానాట్యమండలి ఈ మూడు ముప్పేటగా అల్లుకుపోయిన మహిత కళారూపమే మిక్కిలినేని.

కందిమళ్ళ

రాధాకృష్ణమూర్తి, వేమూరి (1934-2001) : నటుడు, దర్శకుడు, శ్రీరామభక్త కళా సమితి స్థాపకుడు. సచివాలయం సాంస్కృతిక సంఘ సభ్యుడు. తెనాలి తాలూకా వేమూరులో 1934, సెప్టెంబరు 20న వేమూరి రామమూర్తి, సీతారావమ్మ దంపతులకు రాధాకృష్ణమూర్తి జన్మించాడు.

ఎనిమిదవ ఏట ధృవవిజయం అనే నాటకంలో స్త్రీ పాత్ర ధరించాడు. ప్రాథమికోన్నత పాఠశాల, కళాశాల చదువుతున్న రోజుల్లోనే నాటకాల్లో నటించాడు. 1955లో సచివాలయంలో ఉద్యోగంలో చేరాడు. సచివాలయం సాంస్కృతిక సంఘం నాయకురాలు నాటకంలో కన్నమదాసు పాత్రధరించి అందరి మెప్పు పొందాడు. తరువాత అదే సంస్థ ప్రదర్శించిన అలెగ్జాండర్ నాటకంలో అమర్ పాత్రను ధరించాడు.

1956లో ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పుడు హైదరాబాదులో సచివాలయ సంస్థ నిర్వహించిన పోటీలలో అఖిల భారత స్థాయిలో కప్పలు అనే నాటకానికి దర్శకత్వం వహించి ఐదు ఉత్తమ బహుమతులు పొందాడు. ఈ సంస్థ ప్రదర్శించిన నాయకురాలు, అల్లూరి సీతారామరాజు, లేపాక్షి, విజయయయాంధ్ర, మనిషిలో మనిషి, బంగారు సంకెళ్ళు, విషప్రయోగం, రాజరాజు, శిరోమణి, రాజీనామా, మొదలైన అనేక నాటక, నాటికలకు దర్శకత్వం వహించాడు.

1966లో హైద్రాబాదులో శ్రీరామభక్త కళాసమితి సమాజాన్ని స్థాపించి ఉద్యోగవిజయం, *సత్యహరిశ్చంద్ర*, *బొబ్బిలియుద్ధం*, రామాంజనేయ యుద్ధం, *గయోపాఖ్యానం*, వేమన, కాళిదాసు, *పాదుక*, *వసంతసేన*, *కంఠాభరణం* మొదలైన నాటకాలలో నటిస్తూనే కొన్నింటికి దర్శకత్వం వహించాడు.

1988 నుంచి సంస్కారభారతి హైదరాబాదు శాఖ ప్రదర్శించిన అనేక నాటకాలకు దర్శకత్వం వహించాడు. ఎందరో నటులను తీర్చిదిద్దాడు. ఈయన దుర్యోధనుడు, గయుడు, హరిశ్చంద్రుడు, రంగారాయుడు, భోజరాజు, అనవేమారెడ్డి పాత్రలను ధరించాడు.

2001లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన నంది నాటక పోటీలలో సంస్కార భారతి ప్రదర్శించిన మహాకవి కాళిదాసు నాటకానికి దర్శకత్వం వహించి, ఉత్తమ దర్శకుడుగా నంది బహుమతిని పొందాడు.

సచివాలయంలో డిప్యూటి సెక్రటరీ హోదాలో 30-9-1992న పదవీ విరమణ చేసిన వేమూరి 2001, అక్టోబరు 4న నటరాజులో ఐక్యమయ్యాడు.

జి.ఎస్.ఎన్.

రామకృష్ణ, గుమ్మలూరి (జ.1939) : రంగస్థల నటుడు, దర్శకుడు, రచయిత. కామేశ్వరి, సత్యనారాయణ దంపతులకు 1939, ఆగస్టు 19న ధవళేశ్వరంలో జన్మించాడు. రామకృష్ణ విద్యాభ్యాసం మద్రాసు, హైదరాబాద్‌లలో జరిగింది. ఇంజనీరింగ్ పట్టభద్రుడు. విద్యుత్‌శాఖలో డివిజనల్ ఇంజనీర్‌గా పనిచేశాడు.

మూడవ తరగతిలోనే అసాధారణ సమావేశం అనే నాటికలో పాల్గని ప్రథమ బహుమతి పొందడంతో నాటకరంగంతో పరిచయం జరిగింది. కాలేజీ విద్యార్థిగా అనేక నాటకాల్లో నటించి ప్రశంసలందుకున్నాడు. సాంఘిక నాటకాల్లోనే కాకుండా చారిత్రక నాటకాల్లో కూడా పాత్రధారణ చేశాడు. ఆ తరువాత ఈయన దృష్టి నృత్య రూపకాలపై మళ్ళింది. ద్రామాయణం (1961), నైవేద్యం (1962), అశ్వఘోషుడు (1963), రుధిర తర్పణం (1963), ఆచార్య నాగార్జున (1964), లైలామజ్ను (1965), అనార్కలి (1966), *గుణాఢ్యుడు* (1966), ధర్మచక్రం (1967), ఉమర్ ఖయ్యాం (1969), క్రీస్తు చరిత్ర (1983) మొదలైన సంగీత నృత్య రూపకాలను రచించి, స్వీయ దర్శకత్వంలో ప్రదర్శింప చేశాడు. హైదరాబాద్‌లో 'సెవన్ స్టార్స్ సిండికేట్' కార్యక్రమాలలోను, ఆంధ్రాభ్యుదయోత్సవాలలోనూ క్రియాశీలక పాత్ర నిర్వహించాడు. నాటకరంగం మీద అనేక వ్యాసాలు వివిధ దిన, మాస పత్రికలలో ప్రచురితమయ్యాయి.



రామకృష్ణ ఉత్తమశ్రేణి చిత్రకారుడు, మంచి జ్యోతిష్య శాస్త్రవేత్త కూడా. ఈయనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతికశాఖ 2000 సంవత్సరంలో సన్మానించింది. రాష్ట్రంలో అనేక సాంస్కృతిక సంస్థలు రామకృష్ణ బహుముఖ సేవలను ప్రస్తుతిస్తూ సత్కరించాయి.

గం.సు.రె.

రామకృష్ణమాచార్యులు, ధర్మవరం (1853-1912): నటుడు, నాటక రచయిత, సరసవినోదిని స్థాపకుడు, సంగీతకర్త, న్యాయవాది, ఆంధ్ర నాటక పితామహుడు. తెలుగు నాటకరంగాన్ని సమున్నతం చేసిన కళాతపస్వి, బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈయన 1853 కార్తీక శుద్ధ ఏకాదశినాడు, అనంతపురం జిల్లా, తాడిపత్రి తాలూకా, ధర్మవరం గ్రామంలో జన్మించాడు. ఇంటిపేరు కొమాండూరి అయినా, ఉన్న ఊరిపేరే ఇంటి పేరుగా నిల్చిపోయింది. ఆ కుటుంబంలో పుట్టిన ప్రతి పెద్ద కుమారునకు కృష్ణమాచార్యులు అనే పేరు పెట్టడం సంప్రదాయం. తల్లి లక్ష్మీదేవమ్మ, తండ్రి కృష్ణమాచార్యులు. ధర్మవరం వదలి బళ్లారిలో (నేడు కర్ణాటక రాష్ట్రంలో ఉంది) ఆంధ్రోపాధ్యాయుడుగా స్థిరపడ్డాడు. ఈయన వైద్యంలో కూడా ప్రసిద్ధుడు.

తండ్రే గురువుగా, రామకృష్ణమాచార్యులు సంస్కృతాంధ్ర భాషా పాండితికి చిన్ననాడే దారులు పడ్డాయి. కుశాగ్రబుద్ధి, అచంచల దీక్షతో ఏకసంథాగ్రాహి అనిపించుకున్నాడు.

16 సంవత్సరాలలోనే తండ్రి గతించటంతో ముగ్గురు తమ్ముళ్లు, ముగ్గురు చెల్లెళ్లు గల కుటుంబ భారం ఈయన పైన పడింది. వకీలు వృత్తి చేపట్టి, ఫస్ట్ గ్రేడ్ ప్లీడరు కావడానికి, ఇటు ఎఫ్. ఏ. (నేటి ఇంటర్), అటు వకీలు కోర్సులకు దీక్షతో చదివి 1874లో రెండు పరీక్షలలోనూ ఒకేసారిగా ఉత్తీర్ణుడయ్యాడు. అప్పటి నుంచీ ఆయన న్యాయవృత్తి నిరాఘాటంగా సాగి ప్రతిభావంతుడైన ప్లీడర్‌గా ఖ్యాతి నార్జించాడు. జీవితంలో స్థిరత్వం చేకూరింది.

ఆచార్యులు తననిండైన విగ్రహంతో, శ్రావ్యమైన సంగీతంతో, రంగస్థలం మీద నాయకపాత్రలు ధరించి రాణిస్తూ, క్రమంగా నాటకరంగంతో మమేకమైపోయాడు. సంస్కృత, ఆంగ్ల నాటకాలు క్షుణ్ణంగా పరిశీలించాడు. 1886లో సరస వినోదినీ సభ అనే సమాజం స్థాపించి, నాటకాలు రచిస్తూ, విరివిగా ప్రదర్శనలు నిర్వహించాడు. ఆయన రచించిన కన్నడ నాటకం స్వప్నానిరుద్ధము(1886) ఎంతో జనాదరణ పొందటంతో, తెలుగులో నాటక రచన చేయాలనే ఉత్సాహం రెట్టింపయింది. ఈ ఊపులోనే ఆయన కలం నుంచి జాలువారిన చిత్ర నళీయం నాటకం విజయశంఖం పూరించింది.

1910లో హైదరాబాదులో ఆచార్యుల ప్రదర్శనలు చూసి, ముగ్ధులైన గద్వాల మహారాజా ఆంధ్రనాటకపితామహ బిరుదుతోపాటు, స్వర్ణకంకణాదులు సమర్పించి, సత్కరించాడు. పురప్రముఖులు రత్నఖచిత కిరీటం బహూకరించారు. ఆచార్యులు అనేక సమాజ సేవాకార్యక్రమాల్లో కూడా పాలుపంచుకున్నాడు.

ఆంధ్ర సాహిత్యంలో ధర్మవరం వారికి ఎనలేని కీర్తినార్జించి పెట్టిన నాటకం విషాద సారంగధర. ఇది ఆయన ఆరవ తెలుగు నాటకంగా 1889లో ప్రథమ ప్రదర్శన పొందింది. తెలుగు భాషలో ఇదే మొట్ట మొదటి స్వతంత్ర విషాదనాటకంగా నూతనాధ్యాయం సృష్టించింది. ఈ రచన గురించి చెప్తూ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ పది శోకాంత నాటకాలు చేసినంతపని ఈ విషాద సారంగధరమొక్కటే చేసినది అంటూ ప్రస్తుతించాడు.

ధర్మవరం మొత్తం 29 నాటకాలు రచించినట్లు తెలుస్తున్నది. వీటిలో అచ్చుపడినవి 14కాగా తక్కిన 15 అముద్రితాలు. గొప్ప సాహిత్యవేత్త ప్రఖ్యాత న్యాయవాదిగా ఈయన రంగ ప్రవేశం చేయటంతో సమాజంలో నటులకు గౌరవం హెచ్చింది.

తొలిదశలో ఆచార్యులు సంస్కృతనాటక సంప్రదాయం కచ్చితంగా పాటించాడు. తరువాత కాలంలో స్వతంత్ర ప్రవృత్తితో రచనలు సాగించాడు.

ఆచార్యులు నిర్వహణలో సరసవినోదినీ సభకు స్వంత చిత్రకారుడు, వాద్య కళాకారులు ఉండేవారు. కిరోసిన్ లైట్లు నుంచి గ్యాస్‌లైట్లకు, తంబూరాల నుంచి తబలా, హార్మోనియమ్‌లకు మార్పు కలిగింది. అనేక నాటకాల్లో అప్పటి వరకులేని కొత్తప్రయోగాలతో ప్రేక్షకుల్ని అబ్బురపరిచేవారు (ఆకాశం నుంచి దిగిరావడం, రంగస్థలం మీద పులి సంచారం, నిజమైన పావురాలతో కోర్టు సీనులు మొదలైనవి). పాదుకా పట్టాభిషేకం నాటకంలో ఆయన దశరథపాత్ర ధరించేవాడు. దశరథుని మరణఘట్టంలో ఆ అభినయానికి ప్రేక్షకలోకం శోకతరంగితమైపోయింది. ప్రదర్శన చూసి, కంట తడిపెట్టని వారులేరు. తమిళనాటక ప్రాచుర్యానికి ఆచార్యులు గొప్ప స్ఫూర్తి ప్రదాత.

ఈయన రచనలకు అనువాదాలు, అనుసరణలు లేవు. అన్నీ స్వతంత్ర నాటకాలే. రాజ్యాభిషేకం, రోషనార చారిత్రాత్మకాలు, తక్కిన కథలన్నీ పురాణేతిహాసాల నుంచి గ్రహించి పలు మార్పులు చేర్పులతో రచన సాగించాడు. పాశ్చాత్య సంప్రదాయానుసారం విషాద నాటకానికి తెలుగులో శ్రీకారం చుట్టాడు. దాదాపు అన్ని నాటకాలు షేక్స్పియర్ తరహాలో అయిదు అంకాలకే పరిమితం చేశాడు. మన లాక్షణికులు విధించిన నిషేధాన్ని పాటించలేదు. కొన్ని నాటకాలకు సంప్రదాయకమైన నాందీ ప్రస్తావనలే లేవు. అజామిళ తప్ప తక్కిన నాటకాలన్నీ గద్యపద్యగేయ సమన్వితాలే. పద్యాలను రాగయుక్తంగా పాడటమనే నూతన సంప్రదాయంతో పాటు, పాటలను కూడ ప్రవేశపెట్టిన మొదటి ప్రయోక్త, రచయిత ఈయనే. తెలుగు వారి రంగస్థలానికి సంగీత నాటకం ఒక ప్రత్యేకరూపంగా రూపుదిద్దుకుంది. అయినా అభినయానికి మితిమీరిన సంగీతం ఆటంకం కాకూడదని ఆయన ఆశయం. అంక విభజనమే భారతీయ నాటక సంప్రదాయం. రంగాలు (దృశ్యాలు)గా విభజించటం పాశ్చాత్య పద్ధతి. తన నాటకాల్లో రెంటినీ పాటిస్తూ అంకాల్ని రంగాలుగా విభజించాడు. దీర్ఘ స్వగతాలు, కేవలం హాస్యం కోసం కథతో అతకని సన్నివేశాలు, సభ్యత మీరిన మాటలు కొన్ని పట్టులందు ప్రయోగించాడు. మూకాభినయం, ఉత్తరం ద్వారా కథాకథనం, పాశ్చాత్య మార్గంలో భావ సంఘర్షణ చిత్రించటం ఆయన అనుసరించిన కొత్తదనాలు. ఒక పాత్ర గద్యంలో చెప్పిన విషయాన్నే వెంటనే

పద్యంతో చెప్పటం చాలచోట్ల ఒక పెద్దలోపంగా కనిపిస్తుంది. తరువాత ఎప్పుడో రాసిన పద్యాలను ఆయా చోట్ల జప్పించటం వల్ల బహుశ ఈ లోపానికి కారణమై ఉంటుంది. ఆచార్యుల నాటక పద్యాలలో రసదోహదమైనవి తక్కువే. కేవలం ఛందోపూరణలుగా నిస్తేజమైన పద్యాలు అనేక నాటకాల్లో కనిపిస్తాయి. చాల సందర్భాల్లో పౌరాణిక కథల్లో సైతం, సమకాలీన సమస్యలు జప్పించి కాలవ్యతిక్రమ దోషానికి పాల్పడ్డాడు. బాల్య వివాహ తిరస్కారం, విదేశీ వస్త్ర బహిష్కరణ, ఉప్పు పన్ను లాంటి సమస్యలు, పరిష్కారాలు, పురాణ పాత్రల సంభాషణల్లో ప్రవేశపెట్టాడు.

మొత్తం మీద తెలుగు నాటకం ఇంకా పరిణత రూపం సంతరించుకోని ప్రయోగదశలో నాటి ప్రేక్షకుల సంగీతం మోజును గౌరవిస్తూ, అనేక ఉత్తమ నాటకాలు రచించి, దేశికత్వం, మరోవైపు ఆధునిక తమిళ నాటక వికాసానికి మార్గదర్శకుడై, ప్రాచ్య పాశ్చాత్య ధోరణులను సమన్వయిస్తూ, తెలుగు నాటక రంగ సముద్దీప్తికి అంకితభావంతో కృషి సల్పిన ధర్మవరం రామకృష్ణమాచార్యులు, అక్షరాల ఆంధ్ర నాటక పితామహుడే. ధర్మవరం రచించిన చిత్రనళీయం, సావిత్రీ చిత్రాశ్వం, విషాద *సారంగధర (1887)*, *వరూధిని (1912)*, పాదుకాపట్టాభిషేకం *(1914)*, ప్రమీలార్జునీయం, ప్రహ్లాద నాటకం, ముక్తావళి *(1915)*, బృహన్నల *(1915)*, పాంచాలీ స్వయంవరం *(1918)*, చిరకారి *(1919)*, మోహినీ రుక్మాంగద*(1920)*, *అభిజ్ఞాన మణిమంతం, రోషనారా-శివాజీ (1921)* ముద్రణకు నోచుకోగా, మదన విలాస నాటకం, ఉన్మాద రామ ప్రేక్షణీకం, *ఉపేంద్ర విజయం (కన్నడం)*, స్వప్నానిరుద్ధం, అజామిళ, సుశీలా జయపాలీయం, ఉషాపరిణయం, యుధిష్ఠిర యౌవరాజ్యం, సీతాస్వయంవరం, ఘోషయాత్ర, ఉదసా కల్యాణం, రాజ్యాభిషేకం, సుగ్రీవపట్టాభిషేకం, విభీషణ పట్టాభిషేకం, హరిశ్చంద్ర నాటకాలు అముద్రితాలుగానే మిగిలి పోయాయి.

తనకు మరణం రంగస్థలం మీదనో, న్యాయస్థానంలోనో అసన్నమవుతుందని అంటుండేవారట. అలాగే, 1912, నవంబరు 30న కోర్టులో వాదిస్తూ, కాలుజారి కిందపడి తనువు చాలించాడు. ఆయన కోరిక ప్రకారం తాను ముందే ఏర్పాటు చేసుకున్న స్థలంలో సమాధి నిర్మింపబడింది. దాని పక్కనే ఆయన కుమారులు దానంచేసిన భవనంలో ఆచార్యులవారి పేరిట రామకృష్ణ స్కూలు స్థాపించారు.

సుధాదేవి.

రామకృష్ణమూర్తి, పాతూరి (1920-1992) : తెలుగు పద్య నాటకరంగంలో పాత్ర స్వరూప స్వభావాలను ఆకళింపు చేసుకొని పద్యాన్ని, భావాన్ని సమపాళ్ళలో సమన్వయం చేసుకొని తాము ధరించిన పాత్రలతో ఉన్నత స్థానం అలంకరించిన వారిలో పాతూరి రామకృష్ణమూర్తి ఒకరు. గుంటూరు జిల్లా భట్టిప్రోలు గ్రామంలో పాతూరు సుబ్రమణ్యాం, కనక రత్నాంబలకు 1920, జూన్ 12న రామకృష్ణమూర్తి జన్మించాడు.

ఈయన నాటకరంగం ప్రవేశానికి స్ఫూర్తి ఇతని జ్యేష్ఠ సోదరుడు మధుసూదన రావు, మేనమామ నాథవఝుల కృష్ణయ్యలు. వీరి ప్రోత్సాహంతోనే ధూళి పూడిలో ఉన్నత పాఠ శాలలో విద్యాభ్యాసం చేసే రోజుల్లో నర్తనశాల నాటకంలో ఉత్తరపాత్రద్వారా రంగస్థల ప్రవేశంచేశాడు. స్త్రీ పాత్రాభినయానికి ఇతని రూపు రేఖా విలాసాలు కొత్త అందాలు సమకూర్చటంతో బాల్యమంతా స్త్రీ పాత్రల పోషణతోనే గడిచి పోయింది. కన్యాశుల్కం లో మధురవాణి, ఉత్తర రామాయణం లో సీత పాత్రలు పోషించి ప్రేక్షకులని మెప్పించాడు.



అనంతర కాలంలో తెనాలి కళారంగంతో ఈయనకు అనుబంధం పెరిగింది. వృత్తిరీత్యా తెనాలి బదిలీ కావటంతో ఆ అనుబంధం మరింత బలపడి ఈయన రంగస్థల జీవితం మరింత తేజోవంతంగా ప్రకాశించింది. 1958లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు గుడివాడలో ప్రత్యేకంగా నిర్దేశించిన మయసభ పోటీలలో పాల్గని ఉత్తమ నటుడిగా ప్రథమ బహుమతి సాధించాడు. దీనితో ఆయన పేరు యావదాంధ్రావనిలో మారుమ్రోగింది. ఈ పోటీల నిమిత్తం దుర్యోధన పాత్ర పూర్వ పరాలను, సంభాషణ ఔచిత్యాలను జనస్వామి సుబ్రమణ్యాశాస్త్రి దగ్గర క్షుణ్ణంగా అభ్యసించాడు. ఈ అధ్యయనమే ఈయన దుర్యోధన పాత్రను పీసపాటి, ఎ.వి., షణ్ముఖి వంటి దిగ్గజాల సరసన నటించి రాణించేందుకు దోహదపడింది.

మూడు దశాబ్దాల పాటు పీసపాటి, ఎ.వి. సుబ్బారావు వంటి ప్రముఖులు నిర్వహించే సమాజాల్లోను, ఇంకా వివిధ ఔత్సాహిక సమాజాల నాటకాల్లోను, కాంట్రాక్ట్ నాటకాల్లోను వివిధ పాత్రలు పోషించి నాటకరంగ చరిత్రలో తనకంటూ ఓ విశిష్ట స్థానం సంపాదించుకున్నాడు. ఈయన రంగస్థల జీవితానికి మకుటాయమానంగా నిల్చిన పాత్రల్లో ఉద్యోగవిజయాల్లో దుర్యోధనుడు, గయోపాఖ్యానం లో గయుడు, రామాంజనేయ యుద్ధంలో యయాతి, బబ్బిలి యుద్ధంలో బుస్సీ, వెంగళ రాయుడు, సత్యహరిశ్చంద్రలో విశ్వామిత్రుడు, చింతామణి లో

బిల్వమంగళుడు ప్రధానమైనవిగా నిలుస్తాయి. ఋతుపర్ణుడు, ఘటోత్కచుడు, యముడు వంటి పాత్రలు కూడా పోషించాడు.

తన 72వ ఏట మరణించటానికి కొద్దికాలం ముందు కూడా దుర్యోధన పాత్రను పోషించి రాణించాడు. కళారంగ వికాసం కోసం కృషిచేసిన పాతూరిని, 1991లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం ఘనంగా సత్కరించాయి. *గయోపాఖ్యానం* లో గయుడు, *రాయబారం* లో దుర్యోధనుడు పాత్రల ద్వారా చిరంజీవిత్వం చేకూర్చుకొని, కళామతల్లి సేవకు అంకితమైన పాతూరి 1992, జులై 20న పరమపదించాడు.

మన్నెశ్రీ

రామకృష్ణయ్య, నేలనూతల (1893-1974) : రంగస్థల నటుడు. పిచ్చమ్మ, బంగారయ్య దంపతులకు నెల్లూరులో 1893, అక్టోబర్ 23న జన్మించాడు. అభినవ నారద, అభినవ చాణక్య, ది కస్టోడియన్ ఆఫ్ ఓరియంటల్ ఆర్ట్స్ బిరుదాంకితుడు. రాష్ట్ర ప్రభుత్వ సన్మానితుడు. ఈయనను దృష్టిలో పెట్టుకుని శ్రీకృష్ణ తులాభారంలో నారద పాత్రను ముత్తరాజు సుబ్బారావు సృష్టించినట్టు ప్రతీతి.

ఈయన నెల్లూరులో విద్యాభ్యాసం చేసి 1912 నుంచి పోలీసు, రైల్వే, జిల్లాకోర్టులలో పనిచేసి 1914 నుంచి 48 వరకు ఉపాధ్యాయుడుగా పనిచేసి విరమించుకున్నాడు.

నెల్లూరు లిటరరీ క్లబ్బు వారి బుద్ధిమతి విలాసం (1909)లో మహిమంతుని పాత్రతో ఈయన నటజీవితం ప్రారంభమైంది. నాటి నుంచి మరణించేవరకు కొన్ని వందల నాటక ప్రదర్శనలలో వివిధ పాత్రలు ధరించాడు. ఈయనకు ఆయుర్వేదం, జ్యోతిష్యం, వేదాంతం అభిమాన విషయాలు. సంగీతంలో రాళ్ళపల్లి నటేశయ్య ఈయనకు గురువు. రామకృష్ణయ్యకు భక్తి, వీర అభిమాన రసాలు. నవరస కన్నడ బేగడ, జంఝూటి, శహన, కురంజి, సరస్వతి, అసావేరి, నీలాంబరి, భైరవి అభిమాన రాగాలు.

ఈయనకు నారద, అశ్వత్థామ, రామరాజు, చాణక్య, ఆంజనేయుడు, వాసుదేవుడు పాత్రలు అభిమానపాత్రలై పేరు తెచ్చిపెట్టాయి. ఇంకా శ్రీకృష్ణుడు, రామదాసు, విద్యానాథుడు, భరతుడు, లక్ష్మణుడు, బాహుకుడు, ఉత్తరుడు, కణ్వుడు, కుమ్మరి గండప్ప, విశ్వేశ్వర శంభు, ఆత్రేయ, తాన్‌సేన్ వంటి పాత్రలలో నటించిన రామకృష్ణయ్య 1974, జులై 27న మరణించాడు.

శ్రీ.చ.

రామకృష్ణయ్య, పులుగుండ్ల (జ: 1911) : నాటక రచయిత, అధ్యాపకుడు, నెల్లూరు ఆంధ్రసభ సభ్యుడు. నెల్లూరు

వాస్తవ్యుడు. నెల్లూరు వి.ఆర్.కాలేజి హైస్కూలులో అధ్యాపకుడిగా పని చేశాడు. ఆంధ్ర సభ సభ్యుడిగా నాటక కళాభివృద్ధికి ఎంతో కృషిచేశాడు. 1945 ప్రాంతంలో ఈయన రచించిన తుఫాను నాటికకు ఎక్కువ పేరువచ్చింది. నెల్లూరు యాసలో రాయబడిన మొదటి నాటికగా తుఫానుకు నాటక సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం ఉంది. పులుగుండ్ల సృష్టించిన రాఘవరెడ్డి సామాజికుల గుండెల్లో శాశ్వతంగా విడిది చేసిన ఒక సజీవ పాత్ర. 1946, జనవరి 15వ తేదీన జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో తుఫాను ఉత్తమ రచనగా ఎన్నికైంది. ఆంధ్ర ప్రాంతంలో ఈ నాటిక వందల సార్లు ప్రదర్శింపబడి బహుళ జనాదరణ పొందింది. పులుగుండ్ల ఇతర నాటకాలు తలవనితలంపు శాకుంతలం (అనువాద నాటకం).

గం.సు.రె

రామకృష్ణ శాస్త్రి, త్రిపురారి భట్ల (1914-1998) : రంగస్థల నటుడు, నారద పాత్ర నిర్వహణలో నేర్పరి. ఈయన

1914, ఏప్రిల్ 10న తెనాలి తాలుకా పెద రావూరులో జన్మించాడు. తల్లిదండ్రులు కావేశ్వరమ్మ, రాఘవ దాసులు. మిడిల్ స్కూలు విద్య, చిన్నతనంలో వేద స్మార్తాలు కొంతవరకు అభ్యసించాడు. ఈయన చిన్నతనంలోనే అష్టపదులు, తరంగాలు పాడుతూ బాలకృష్ణునిలాగా నాట్యం చేసేవాడు. స్త్రీ పాత్రలు ధరించాడు.

పదవ ఏటనే తెనాలి రామవిలాస సభ ప్రదర్శించే బొబ్బిలి యుద్ధంలో చినరంగారాయుడు, ప్రతాపరుద్రీయంలో చిన ప్రతాపరుద్రుడుగా అరంగేట్రం చేశాడు.

1926లో త్రిపురారిభట్ల గుంటూరులో దంటు వెంకట కృష్ణయ్య బాలమిత్ర సభ ప్రదర్శించిన నాటకాలలో సూరిబాబు, రఘురామయ్య, పైడిబాబు, నాగలింగం మొదలైన వారితో కలిసి

నటించాడు. ఆ తరువాత తెనాలి రామవిలాస సభలో చేరి, స్థానం నరసింహారావు, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, వంగర వెంకట సుబ్బయ్య మొదలైన వారితో కలసి పలు నాటకాలలో నటించాడు.

రామదాసు నాటకంలో రామదాసుగా, కబీరుగా, శ్రీకృష్ణ తులాభారంలో నారదునిగా , రాధాకృష్ణలో రాధగా, శ్రీకృష్ణ లీలలులో యశోదగా, గంగావతరణంలో పార్వతిగా, సతీ అనసూయలో అనసూయగా, సారంగధరలో చిత్రాంగిగా, రోషనారలో శివాజీగా నటించాడు.

ఈయన విభిన్న నాటకాలలో విభిన్న పాత్రలలో నటించినా, శ్రీకృష్ణ తులాభారం లో నారద పాత్రధారణ అనితరసాధ్యంగా ఉండేది.

త్రిపురారిభట్ల 1930లో సినీ రంగ ప్రవేశం చేసి మైరావణలో శ్రీరాముడు, తారాశశాంకలో చంద్రుడు, సుమతిలో దేవదత్తుడు పాత్రలే కాక భక్త మార్కండేయ, మోహినీ రుక్మాంగద, దక్షయజ్ఞం, భక్తప్రహ్లాద, గరుడ గర్వభంగం, వాల్మీకి మొదలైన చిత్రాలలో నారద పాత్రలలో నటించాడు.

1944లో త్రిపురారిభట్ల దృష్టి తిరిగి నాటక రంగం వైపు మళ్ళింది. రామాంజనేయ యుద్ధం లో, శ్రీకృష్ణతులాభారం లో, గయోపాఖ్యానంలలో నారదునిగాను, చింతామణి లో బిల్వమంగళుని గాను, కురుక్షేత్రం లో అర్జునుడిగా, కర్ణుడిగా నటించాడు.

1952లో ఆనాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూల సమక్షంలో ఢిల్లీలో స్థానం వారు ప్రదర్శించిన శ్రీకృష్ణ తులాభారం నాటకంలో నారదునిగా నటించి, ప్రశంసలందు కున్నాడు. తరువాతి కాలంలో మద్రాసు, మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా మొదలైన రాష్ట్రాలలో కూడా ప్రదర్శనలు ఇచ్చాడు.

1983లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఈయనకు ఫెలోషిప్పుఇచ్చి, కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. 1991లో నట జీవితానికి స్వస్తి చెప్పిన ఈ కలియుగ నారదుడు, నాట్యకళా ప్రపూర్ణుడు, సహస్ర చంద్రమానదర్శనం పూర్తి చేసుకొని, 1998 మేనెల 21వ తేదీన తుదిశ్వాస విడిచాడు.

జి.ఎస్.ఎన్.

రామకృష్ణారావు, అబ్బూరి (1896-1979) : నాటక రచయిత, నటుడు, దర్శకుడు, నటాలీ సమాజ వ్యవస్థాపకుడు. భావ కవితా ప్రవర్తకులలో ప్రముఖుడు. గుంటూరు జిల్లా తెనాలి తాలుకాలోని చెముడుపాడులో 1896, మే 30వ తేదీన జన్మించాడు. బందరులోని నోబెల్ కళాశాల, మైసూరులోని మహారాజ సంస్కృత కళాశాల, శాంతినికేతనం లోనూ విద్యనభ్యసించాడు. 1909లో అయిదవ ఫారం చదువుకొనే రోజుల్లోనే జలాంజలి అనే పద్య కావ్యం రచించి, ఉపాధ్యాయ వర్గాన్ని అబ్బుర పరిచాడు. మైసూరులో ఉన్నప్పుడు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మతో కలసి 'అనంత రామకృష్ణులు' అనే జంటగా ఏర్పడి కవిత్వ రచన సాగించారు. రామకృష్ణారావు ప్రచురించిన తొలి విషాద కావ్యం మల్లికాంబ. 1911-19 మధ్యకాలంలో శాంతినికేతనంలో రవీంద్రనాథ్ టాగూర్, అరవిందఘోషుల సాహచర్యంతో వంగ సాహితీ ధోరణులతోపాటు, రాజకీయ ధోరణులు కూడా రామకృష్ణారావుకు పట్టుపడ్డాయి. 1919లో ఆంధ్రదేశానికి తిరిగొచ్చి, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వద్ద అంతేవాసిగా స్వరాజ్యోద్యమంలో చేరి కృషి చేశాడు. ఉద్యమానికి స్ఫూర్తినిచ్చే జలియన్‌వాలాబాగ్ అనే బుర్రకథను రచించాడు.

ఆధునికాంధ్ర కవితారీతులకు ప్రచార గౌరవాలను సంతరించాలనే లక్ష్యంతో 'ఆంధ్ర పత్రికలో 'సారస్వతానుబంధం' అనే శీర్షిక పెట్టించి దానిలో విలువైన సారస్వత వ్యాసాలు ప్రచురించాడు. వస్త్వాశ్రయరీతిని అనుసరించి ప్రణయ కవిత్వం చెప్పినవారిలో ఈయనకు విశిష్టమైన స్థానం ఉంది. ఇంగ్లీషు, సంస్కృతం, బెంగాలీ భాషలలో ప్రవేశం సంపాదించి నటుడిగా, దర్శకుడిగా ప్రసిద్ధి పొందాడు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడిగా పని చేశాడు. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాలలోని రచనారీతులను మేళవించి కొత్త ప్రయోగాలు చేశాడు. రచనా శిల్పానికి ప్రాధాన్యం ఇచ్చాడు. ప్రేమ్‌చంద్, సజాద్‌జహీర్, హీరేన్ ముఖర్జీలతో కలసి అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం స్థాపించాడు. 'ఇండియన్ లిటరేచర్' పత్రిక సంపాదక వర్గంలో సభ్యులు ఎం.ఎన్. రాయ్, తర్కతీర్థ లక్ష్మణశాస్త్రి, జోషి సచ్చిదానంద వాత్స్యాయన్ ప్రభృతులతో కలసి 'ఇండియన్ రినైజాన్స్ అసోసియేషన్' (1939) స్థాపించాడు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు స్థాపించిన తరువాత తెలుగుశాఖలో మొదటి అధ్యాపకుడు ఈయనే. తరువాత గ్రంథాలయ పాలకుడిగా పని చేశాడు. ఈయన రాజకీయ, సామాజిక భావనలు అనుక్షణం నూతనత్వాన్ని అన్వేషించేవిగా ఉంటాయి. పద్యగేయ కావ్యాలే కాకుండా బుర్రకథలు,

చాటువులు, పేరడీలు, నాటకాలు కూడా రచించాడు. రవీంద్రుని నాటకాలకు అబ్బూరి చేసిన అనువాదాలను 1969లో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. కన్యాశుల్కం, ధాన్యలక్ష్మి నాటకాలను ప్రదర్శనకు అనువుగా సంతరించి ఆంధ్రదేశమంతా పర్యటించి ప్రయోగించాడు. ఈయన నటుడిగా రామప్పంతులు పాత్రకు జీవం పోశాడు. హైదరాబాద్‌లో నాట్య విద్యాలయ స్థాపనలోను, విద్యార్థులకు నటశిక్షణ ఇవ్వడంలోనూ రామకృష్ణారావు ప్రముఖ పాత్ర వహించాడు. ఎ.ఆర్. కృష్ణతోడ్పాటుతో పాశ్చాత్య నాటకాలను తెలుగువారికి పరిచయం చేసినవారిలో అబ్బూరి ఎన్నదగినవాడు. శూద్రకుని మృచ్ఛకటికం నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శింపచేసి, నాటకాభిమానుల ప్రశంసలందుకున్నాడు. అబ్బూరి స్థాపించిన 'నటాలీ' సంస్థ నేటికీ కొనసాగుతూ ప్రదర్శనలో వినూత్న పోకడలకు మార్గం చూపుతూ ఉంది. రామకృష్ణారావు సుకుమార కవితాశిల్పి, సంస్కారి, నటుడు, సరసుడు, చతుర సంభాషణా సమర్థుడు. ఆధునిక యుగపు తెలుగు రచయితలలో సమస్త సాంఘిక, రాజకీయ, సాహిత్యోద్యమాలతో ప్రత్యక్ష సంబంధం కలవాడు అబ్బూరి ఒకరే అనటం అతిశయోక్తి కాదు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈయనను 1974లో 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సన్మానించింది. అబ్బూరి రామకృష్ణారావు 1979, ఏప్రిల్ 30న కన్నుమూశాడు.

బ.రా.

రామచంద్రశాస్త్రి, కోరాడ (1816-1900) : తెలుగులో మొట్టమొదటి నాటక కర్త. ఈయన 1816లో అమలాపురం తాలూకా కేసనకుర్రు గ్రామంలో సుబ్బమాంబ, లక్ష్మణశాస్త్రి దంపతులకు జన్మించాడు. ప్రసిద్ధకవి, పండితుడు శిష్టు కృష్ణమూర్తి ఈయనకు కవితా గురువు. రామచంద్రశాస్త్రికి రామచంద్రకవి అని కూడా పేరు. ఈయన నోబెల్ పాఠశాలలోను, నోబుల్ కళాశాలలోను సుమారు 43సంవత్సరాలు అధ్యాపకత్వం నెరపాడు. 1888లో ఉద్యోగ విరమణ చేసిన కోరాడ 1900లో మరణించాడు. ఈయన రాసిన ప్రథమనాటకం మంజరీ మధుకరీయం. ఇదేగాక సుమారు 30 గ్రంథాలు రచించినట్లు తెలుస్తుంది. వీటిలో స్వతంత్ర నాటకాలు నాలుగు. ఆంధ్రీకృత నాటకాలు ఐదు. వీటిలో ఉన్మత్త రాఘవం (1891), శృంగార సుధార్ణవము (1899), మంజరీ మధుకరీయం (1908) ముద్రితాలు.

రామచంద్రశాస్త్రి రచించిన మంజరీమధుకరీయమే ప్రప్రథమాంధ్ర నాటకం. 1860లో రచితమై 1908లో ప్రకటించబడింది. అంతవరకు తెలుగులో నాటకాలు లేకపోవడం వల్లనే రామచంద్రకవి ఈ నాటకాన్ని రచించినట్లు తెలుస్తుంది. ఇందులో నాలుగు అంకాలున్నాయి మంజరీ మధుకరుల గాంధర్వ వివాహం ఇందులో చక్కగా పొందుపర్చారు. ఈ నాటకం మాయలూ మంత్రాలతో జానపద ఫక్కీలో నడుస్తోంది. ఈ నాటకంలో సంభాషణలు కొన్నిచోట్ల సరళంగా ఉన్నా భాష ప్రాచీన గ్రాంథికం. దీన్ని మనం సంభాషణాత్మక ప్రబంధమన్నా తప్పులేదు. ఈ నాటకం ప్రదర్శింపబడి నట్లు దాఖలాలు లేవు. ఈ నాటకంలో అక్కడక్కడ సంభాషణలు సుదీర్ఘంగా ఉంటాయి. ప్రబంధంలో లాగా వర్ణనలనేకం. దీర్ఘసమాస భూయిష్టమైన నాటకం ఔత్సుక్యస్ఫోరకంగా ఉంటుంది.



మొదటి అంకం 12 పుటలు, రెండు మూడు అంకాలు 45 పుటలు చొప్పున, చివరి నాల్గో అంకంలో 125 పుటలుండడం గమనించవచ్చు. పాశ్చాత్య నాటక ప్రభావమేమీలేని మొట్ట మొదటి నాటకం మంజరీ మధుకరీయమనీ, నాటక పండితుల అభిప్రాయం. అందుకే రామచంద్ర శాస్త్రికి ప్రథమాంధ్ర నాటక రచయితగా పేరు నిలిచింది. ఈయన 1900లో మరణించాడు.

గంగప్ప

రామచంద్ర శాస్త్రి, మారేపల్లి (1874-1951) : కవి, నటుడు, నాటక రచయిత. నాట్య శిక్షకుడు. 1874, నవంబరు 3న కృష్ణా జిల్లా ఉయ్యూరు దగ్గరలోని కనకపల్లి అగ్రహారంలో జన్మించాడు. నాటకం పట్ల అభిమానం పెంచుకున్న మారేపల్లి 1895లో సెట్టి లక్ష్మీనరసింహకవి, ఆకెళ్ళ సత్యనారాయణలతో కలసి 'శ్రీ కళాభిలాషక నాటక సమాజం' స్థాపించాడు. ఈ సమాజం మొట్టమొదట వేణీ సంహారం నాటకాన్ని ప్రదర్శించింది. ఈ సమాజం పక్షాన జయంత జయపాలం, కంస



వధ,సత్య హరిశ్చంద్ర, *బిల్హణీయం, కిరాతార్జునీయం, ద్రౌపదీ స్వయంవరం, భీముని విజయం* మొదలైన నాటకాలను ప్రదర్శించాడు. ఈ నాటకాలలో శ్రీకృష్ణుడు, పాండురాజు, ధర్మరాజు, అర్జునుడు, సూత్రధారుడు వంటి ప్రధాన పాత్రలలో నటించాడు. 'బాల షేక్స్పియర్'గా ప్రశంసింపబడ్డాడు. కళాపోషకుడు ఆరుట్ల రామదాసు నాయుడు ఇచ్చిన ధర్మాశ్రమంలో నటులకు శిక్షణ ఇచ్చేవాడు.

మారేపల్లి సమాజ నిర్వాహకుడే కాదు నాటక రచయిత కూడా. ఈయన *నల నాటకం, కిరాతార్జునీయం, సావిత్రి విజయం, విజయ విలాసం, పాండవ జననం, కుమారాస్త్ర విద్యా సందర్శనం, భీమ విజయం, కంస వధ, ద్రౌపదీ స్వయంవరం, కన్నకాంబికా విజయం, బిల్హణీయం, పారిజాతాపహరణం, సారంగధర విజయం, నాటక రామాయణం* మొదలైన నాటకాలు రచించినట్లు తెలుస్తోంది. వీటిలో *కన్నాంబికా విజయం, బిల్హణీయం, పారిజాతాపహరణం* మాత్రమే ముద్రణకు నోచుకున్నాయి. పూర్వ లాక్షణికులు నాటకాలలో నిషేధించిన పడకగది, భోజనం చేయటం, యుద్ధం వంటి దృశ్యాలను నాటకాలలో ప్రవేశపెట్టాడు. అంతేకాకుండా సంభాషణలు పద్య రూపంలో సాగేటప్పుడు ఒక పాదం మొదటి పాత్రతో, మరొక పాదం రెండో పాత్రతో చెప్పించడం, నాటకాలలో నటులు రాగానికి ప్రాధాన్యతనిస్తున్న రోజుల్లో రాగాన్ని కుదించి అభినయానికి, భావానికి ప్రాముఖ్యతనిచ్చి వచన నాటకాలు ప్రదర్శించవలసిన అవసరాన్ని గుర్తించిన రచయిత మారేపల్లి. శ్రీ కళాభిలాషక సమాజం పక్షాన విజయనగరం, రాజమండ్రి, అనకాపల్లి మొదలైన చోట్ల నాటకాలను విరివిగా ప్రదర్శించాడు. నటుల సంఖ్య రానురాను తగ్గడంలో ఈ సమాజం 1912లో మూతపడింది. కళారంగంలో నిష్ణాతుడైన మారేపల్లి 1916లో రాజా విక్రమదేవ వర్మ అధ్యక్షతన ఏర్పడిన ఆంధ్రనాటక పరిషత్తు (విశాఖపట్నం) కార్యదర్శిగా పనిచేశాడు. ఆంధ్ర నాటక కళా పరీక్షా సమితిలో పనిచేశాడు. విశాఖపట్టణంలో 'కవితా సమితి'ని స్థాపించి ప్రముఖ కవులు శ్రీశ్రీ, ఆరుద్ర వంటి వారిని సాహితీ జగత్తులో కృషి చేయడానికి తనవంతు సహకారాన్ని అందించిన మారేపల్లి 1951, సెప్టెంబరు 9న స్వర్గస్థుడయ్యాడు.

దాసరి.ఎన్.

రామచంద్రారెడ్డి, పర్వతరెడ్డి: నటుడు, సమాజ నిర్వాహకుడు. ఈయన నెల్లూరు జిల్లా అల్లూరు గ్రామంలో జమీందారు కుటుంబంలో జన్మించాడు. నాటకకళ మీద మక్కువతో నాటకాల్లో పాత్రధారణ చేసేవాడు. ఈయనకు రామదాసు నాటకంలో కబీరు వేషం నచ్చిన పాత్ర. కబీరు పాత్ర అంత అద్భుతంగా పోషించినవారు ఆనాటి నాటకరంగంలో లేరని పెద్దలు చెప్తారు. అందువల్లనే ఈయనకు 'కబీరు రామచంద్రారెడ్డి' అనే పేరు వ్యవహారనామంగా స్థిరపడింది. కృష్ణ విలాససభ అనే పేరుతో నాటక సమాజాన్ని స్థాపించి దాని ద్వారా అనేక ప్రదర్శనలు ఇచ్చాడు. నెల్లూరు జిల్లాలోనే కాకుండా మద్రాసు తదితర ప్రాంతాలలో కూడా రామదాసు నాటకాన్ని విస్తృతంగా ప్రదర్శించి నెల్లూరు జిల్లాలో నాటక కళా వికాసానికి తోడ్పడ్డాడు.

గం.సు.రె.

రామదాసు, బెల్లంకొండ (1923-1969) : కవి, నాటక రచయిత. 1923, ఆగస్టు 23వ తేదీన గుంటూరు జిల్లా నరసరావు పేట తాలూకా పమిడిపాడులో జన్మించాడు. విద్యార్థి దశనుంచీ సాహిత్య వీధుల్లో విహరించిన భావుకుడు. శ్రీశ్రీ బాటలో నడిచినా తనదైన ప్రత్యేక బాణీ ఏర్పరచుకుని, ఆకాశంలో విహరించే కవిత్వాన్ని భూమ్మీదికి దారి మళ్ళించిన అభ్యుదయ కవి. భావావేశంలేని కవిత్వం వ్యర్థం అనేది ఈయన తత్వం. కవిగా, నాటకకర్తగా కూడా రాణించడం ఈయన బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం.

నయాగరా కవులలో ఒకరై, 1944 ప్రాంతాలలో ఏల్చూరి, కుందుర్తితో కలిసి వచన కవిత్వోద్యమాన్ని కుండపోత ఆవేశంతో నడిపిన బెల్లంకొండ రామదాసు సాహితీ ప్రపంచానికి చిరపరిచితుడు. అతిథి అనే నాటకం రాయడం ద్వారా 1953లో నాటకరంగానికి పరిచితుడై, పునర్జన్మ (1956) నాటకంతో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. పతితల సమస్యల మీద వచ్చిన నాటకాలలో పునర్జన్మ బహుళ జనామోదం పొందిన ఉత్తమ ప్రమాణాలు గల నాటకం. తన కళ్ళను తన చేతనే పొడిపించే క్రూరత్వాన్ని ఈ ధూర్తలోకం ఎలా అవలంబిస్తుందో అతిథి లో సహజ గాంభీర్యంతో చిత్రించాడు. భూస్వాముల దురాగతాలను ఎదుర్కొంటూ, ప్రజల పక్షాన పాటుపడుతున్న నాయకులకు, ప్రజలకు మధ్య భేదాభిప్రాయాలు సృష్టించి ప్రజల చేతోనే వారి నాయకుణ్ణి చంపించడం అతిథిలో దృగ్గోచరం చేశాడు. నేటి రాజకీయ సాంఘిక పరిస్థితులకు దర్పణం ఈ నాటకం. తండ్రిని మోసగించిన ఒక వ్యాపారిపై కొడుకు పగదీర్చుకోవడం మాస్టర్జీ (1954) అనే నాటకంలోని ఇతి వృత్తం. ఏకపాత్ర ప్రాధాన్యం గల నాటకాలకు మాస్టర్జీ నాంది పలికిందని చెప్పొచ్చు. ఈ రచయిత ఇతర భాషల నుంచి చేసిన అనువాద రచనలు కూడా స్వతంత్ర ప్రతిపత్తి గల నాటకాలుగా రాణించటం ఆయన రచనా వైశిష్ట్యానికి అద్దం పడుతుంది. రష్యన్ నాటక రచయిత నికోలై గోగోల్ (1809-52)రచించిన ది ఇన్స్పెక్టర్ జనరల్ (1836) నాటకాన్ని ఆకాశరామన్న పేరుతో అనువదించాడు. నిజానికిది అనువాదం కాదు. స్వేచ్ఛానుసరణ మాత్రమే. మౌలిక నాటకంలోని సారం (Es-

sence) ఏ మాత్రం జారిపోకుండా, ఆసక్తికరంగా, హాస్య రసస్ఫోరకంగా నాటకాన్ని తీర్చిదిద్దిన తీరు అనన్య సాధ్యం. పురపాలక సంస్థలోని లసుగులను, పాలకుల ముసుగులను ఎత్తిచూపే హాస్య ప్రధానమైన నాటకం ఆకాశ రామన్న. చివరగా బెల్లంకొండ రాసిన నాటకం బలిదానం. విశ్వకవి రవీంద్రుని శాక్రిఫైస్ నాటకానికి ఇది అనువాదం. రామదాసు కీర్తి సౌధానికి ఆయన కూర్చిన కవితలు, పునర్జన్మ వంటి నాటకాలు మూలస్తంభాలుగా నిలిచి కలకాలం సాహితీ లోకాన్ని అలరిస్తూనే ఉంటాయని దృఢంగా విశ్వసించవచ్చు. బెల్లంకొండ 1969, సెప్టెంబర్ 19న తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయాడు.

గం.సు.రె.

రామనాథం, టి.జె (1939-2000) : నటుడు, దర్శకుడు. మెకానికల్ ఇంజనీర్ డిప్లొమో చదివిన తమ్మారెడ్డి జానకీ రామనాథం 1939లో కృష్ణా జిల్లా బల్లిపర్రులో పుట్టాడు. తల్లిదండ్రులు పుష్పావతి జగన్మోహనరావులు. పుట్టింది బల్లిపర్రులో అయినా పెరిగింది కనువమూరులోని మాతామహుల ఇంట.

మొదట నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో కొన్నేళ్ళు పని చేసినా సుదీర్ఘకాలం అంటే దాదాపు 27ఏళ్లు (1970 నుంచి 1997 వరకూ) ధవళేశ్వరం బారేజిలో పనిచేశాడు. చిన్నప్పుడే వామపక్ష భావాలకు ఆకర్షితుడయ్యాడు. అది 'ప్రజానాట్య మండలి' తరపున ఎన్నో ప్రదర్శనలు చేయటానికి దోహదపడింది. కాలేజీరోజుల్లోనే కాళరాత్రి నాటకానికి దృశ్య బంధ నిర్మాణం చేసి, రెండంతస్థులమేడనిర్మించి, ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకునేలా చేశాడు. ఆ తర్వాత కాలేజీలోనే కప్పలు నాటకానికి దర్శకత్వం వహించి మొదటిసారిగా సుచిత్ర ప్రణయం నాటక ప్రదర్శనతో నటుడయ్యాడు.

ఇదేమిటి, కీర్తిశేషులు, నాటకం మొదలైన నాటకాలు ప్రదర్శించి పలువురి మెప్పు పొందాడు. ఎన్నో పరిషత్తులలో నటనకు, దర్శకత్వానికీ, రంగాలంకరణకు బహుమతులు పొందాడు. 1968లోనే ధవళేశ్వరంలో 'గురజాడ కళాసమితి'ని స్థాపించి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాడు.80వ దశకంలో డాక్యుమెంటరీ నాటకాల వైపు మళ్ళాడు. నన్నయ భారతరచన, భారత స్వాతంత్రోద్యమ శంఖారావం, మేడే లాంటివి ప్రదర్శించాడు.

రంగస్థలం మీద నాటకం వేసి ప్రేక్షకులను అక్కడకు రప్పించటం కంటే మనమే ప్రేక్షకుల దగ్గర కెళ్లి ప్రదర్శనలిస్తే ప్రదర్శనలు ఎక్కువ మంది చూడ్డానికి అవకాశం ఉంటుందని నమ్మి వీథినాటకాలు తయారు చేశాడు. ప్రజానాట్యమండలి తరుపున ఎన్నో వీథినాటకాలను తయారు చేసి జిల్లాలలో విస్తృతంగా ప్రదర్శనలు నిర్వహించాడు. అంతేకాదు ప్రొసీనియం థియేటర్లో కూడా అద్భుతమైన ప్రయోగాలు చేశాడు. స్వతంత్ర పోరాటాన్ని అరవై మంది నటీ నటులతో జాతికి ఊపిరి స్వాతంత్రం పేరుతో రంగస్థలం పై కెక్కించాడు. ఈయన ప్రదర్శించిన *నరకం మరెక్కడో లేదు, భయం, నల్లజై ఆరోనిమిషం* ఇతని దర్శక ప్రతిభకు మచ్చుతునకలు. రామనాథానికి రంగస్థలం, వీధి నాటకం రెండూ రెండు కళ్లు.

సఫ్దర్ హాష్మీ చేపట్టిన వీథినాటకాన్ని ఒక ఉద్యమంగా తీసుకొని తెలుగులో రామనాథం రెండు వేల ప్రదర్శనలకు పైగా ఇచ్చాడు. ఢిల్లీ, హైదరాబాదులలో నాటకాలు ప్రదర్శించి ప్రజా నాట్య మండలికి రాష్ట్ర స్థాయి దర్శకుడయ్యాడు. *ఊరేగింపు, గోగ్రహణం, రైతు, మనచరిత్ర, గొర్రెలు తిరగబడతాయి, కూలీ, చదువెందుకు, ఆటబమ్మలు, హలోస్టూడెంట్, అంతం కాదిది ఆరంభం, ప్రశ్నించండి, ఫీజులు-పుస్తకాలు, చదువెందుకు,* వంటి వీథి నాటకాలను ప్రదర్శించి ప్రజలకు దగ్గరయ్యాడు.

నాటక రంగంలో ఈయన సేవలను గుర్తించి 1984 గౌతమీ కల్చరల్ అసోసియేషన్ 'మాన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు, 1985 రోటరీ క్లబ్ 'జేసీస్' అవార్డు, 1990లో అక్షర దీక్షా సారథి సత్కారం, 1994లో గరికపాటి రాజారావు మెమోరియల్ అవార్డు, 1995లో రాష్ట్రసాంస్కృతిక మండలి సత్కారం, 1997 కళావాణి గురు పూజా సత్కారం వంటి ఎన్నో సత్కారాలు, సన్మానాలు పొందాడు. నిత్య నూతన దర్శకత్వ ప్రతిభతో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకొన్న రామనాథం 2000 జనవరి 14న స్వరస్థుడయ్యాడు.

అడబాల

రామనాథశాస్త్రి, కపిలవాయి (1890-1935) : రంగస్థల నటుడు, గాయకుడు. తెలుగు నాటకంలో పద్య పఠనానికి ఒక ఒరవడిని ప్రవేశపెట్టిన ఘనత రామనాథ శాస్త్రికే చెందుతుంది. ఈయన కృష్ణా జిల్లా విజయవాడ తాలూకా మంతెనలో 1890న జన్మించాడు.

తన మధురమైన, గంభీరమైన గాత్రంతో రంగస్థలంపైన పద్యాన్ని భావయుక్తంగా విరిచి సంగీతంలో పొదిగి, ప్రత్యేకమైన పద్య పఠనా విధానాన్ని ప్రవేశపెట్టిన విశిష్ట గాయక నటుడు.

యడవల్లి సూర్యనారాయణ అంతేవాసిత్వంలో శాస్త్రి నటనలోను, పద్యపఠనంలోను మెరుగులు దిద్దుతున్నాడు. ఆనాడు రామనాథ శాస్త్రి పద్యం పాడినట్లు పాడాలని చాలా మంది నటులు, నటీమణులు ఆరాటపడేవారు.

మైలవరం బాలభారతి సమాజంలో సభ్యుడుగా చేరి గయోపాఖ్యానంలో అర్జునుడు, పాదుకలో శ్రీరాముడు, భరతుడు, సావిత్రిలో సత్యవంతుడు, శ్రీకృష్ణ తులాభారంలో నారదుడు, విప్రనారాయణలో విప్రనారాయణుడు, రామదాసులో రామదాసు, చింతామణి లో భవాని శంకరుడు మొదలైన పాత్రలను పోషించి ఆ సమాజానికి ఎనలేని ఖ్యాతిని తెచ్చిపెట్టాడు. రామనాథశాస్త్రి నాటకానికి ప్రేక్షకులు తండోప తండాలుగా వచ్చేవారు. మైలవరం కంపెనీ మూతపడిన తరువాత శాస్త్రి కిరాయి నాటకాల్లో నటించాడు. కపిలవాయి పద్యం పాడితే వన్సుమోరు కొట్టి మళ్ళీ మళ్ళీ పాడించుకునేవారు. ఈయన ఒకే రాత్రి రెండు పట్టణాల్లో ప్రదర్శించే నాటకాలలో పాత్రలు ధరించిన రోజులు కూడా ఉన్నాయి.

కపిలవాయి స్వరంతో వెలువడినన్ని గ్రామఫోను రికార్డులు ఆ రోజుల్లో ఏ నటుడు ఇవ్వలేదు. ఆ రోజులలో శాస్త్రి రికార్డులే వినబడుతుండేవి. పెండ్లిండ్లలోను, శుభకార్యాలలోను కపిలవాయి రికార్డులు విరివిగా పెట్టేవారు. ఆనాడు'కపిలవాయికి ఈనాడు సినిమా తారలకున్నంత అభిమానులు ఉండేవారు. ఆ రోజులలో శాస్త్రి గ్రామఫోను రికార్డులు కొన్ని వేలు అమ్ముడుపోయాయి. ఈయన రికార్డులు తమిళ నాడు, మైసూరు రాష్ట్రాలలో కూడా బహు జనాదరణ పొందాయి. అతి తక్కువ కాలంలో ఆంధ్ర దేశమంతటా శాస్త్రి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. రెండు చేతులా సంపాదించాడు కాని సంపాదనంతా దురభ్యాసాలకు ఖర్చు చేశాడు.

టాకీ చిత్రాలు వచ్చిన కొత్త రోజులలో శ్రీకృష్ణ తులాభారం చిత్రంలో నారద పాత్రను ధరించాడు. అప్పటికే ఆయన ఆరోగ్యం క్షీణించింది. తెలుగు నాటకరంగంలో ధ్రువతారగా వెలిగిన శాస్త్రి ధనార్జన బాగా చేసినా అవసానదశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించాడు. అతి తక్కువ వయస్సులో అజరామరమైన కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన శాస్త్రి 1935 మే నెలలో విజయవాడలో నటరాజులో ఐక్యం అయినాడు.

జి.ఎస్.ఎన్.

రామనాథశాస్త్రి, ధారా (జ: 1932) : నటుడు, నాట్యావధాని, నాటక రచయిత. ధారా రామనాథ శాస్త్రి 1932, జూన్ 11న ఒంగోలులో సత్యవతమ్మ, వేంకటేశ్వరశాస్త్రి దంపతులకు జన్మించాడు.

ఈయన పృథ్వీపతి, ధర్మత్రివేణి, మహాదాత, కోటి దీపాలు, సంభవామి యుగే యుగే మొదలైన నాటకాలు రచించడమే గాక ఉత్తమనటుడుగా నిరూపించుకొన్నాడు. విశ్వవీణ, కోటిదీపాలు, ముక్త నస్య, కృష్ణలహరి, కాహళి, రత్నగర్భ, అస్పృశ్యులు, తపస్సిద్ధి మొదలైన కావ్యగేయ రూపకాలు రచించాడు. కృష్ణకథ, పద్మకోశము మొదలైన విమర్శగ్రంథాలు, ఉదయభాను, భారత కథాలహరి మొదలైన కథా రచనలు చేశాడు. అనేక వ్యాసాలు రచించాడు. వివిధ వేదికలపై సాహిత్య, అధ్యాత్మిక ప్రసంగాలు జనరంజకంగా చేయడం వారికి లభించిన గొప్పవరం. ఒంగోలులో వర్ధమాన సమితి, ఎఱ్ఱన పీఠం, సాహిత్య పీఠాలకు ఆధిపత్యం వహించి చేస్తున్న సాహిత్యసేవ అనన్య సామాన్యం.

వీటన్నిటినీ మించి నాట్యావధానం స్రష్టగా రామనాథశాస్త్రి కున్న ప్రఖ్యాతి ఎనలేనిది. ఒంగోలులోనే కాదు, ఆంధ్ర, ఆంధ్రేతర రాష్ట్రాల్లోను, విదేశాల్లో నూతన నాట్యావధానం వల్ల వారి కీర్తిప్రతిష్ఠలు వ్యాపించాయి. ఒంగోలులో ధారా నాట్యావధాన కళాపీఠం స్థాపించి, విద్యాలయ ప్రధానాచార్యులుగా నాట్యావధాన విద్యావ్యాప్తికి బద్ధకంకణులై కొనసాగిస్తూ ఉండడం నాట్యావధాన కళా ప్రపూర్ణ విశిష్టతకు చక్కటి తార్కాణం.

రామనాథ శాస్త్రి సృష్టించిన నాట్యావధానం అప్పటికప్పుడు పృచ్ఛకుల సూచన మేరకు నాటక సన్నివేశాలను సద్యస్ఫూర్తితో విన్యసించే ఒక నూతన కళారూపం. అవధానం అనే పదానికి అలంకారికులు 'చిత్తము యొక్క ఏకాగ్రత అనే అర్థం చెప్పడంతో పాటు ఆ ఏకాగ్రత ఫలితంగా ఒక విశిష్ట ప్రతిభను అప్పటికప్పుడు ప్రదర్శించే సద్యవిన్యాసాన్ని ఉద్దేశించారు' అని నాట్యావధాన పరిచయంలో వివరించారు నాట్యావధాన శిక్షణ ప్రణాళికలో. నాట్యావధానంలో సద్యస్ఫూర్తితో చతుర్విధాభినయాలతో అభినయించి నాటకంలోలా చూపించడమే దీని క్రమం.

పృచ్ఛకులు ఎలాంటి నాటకీయ సన్నివేశాన్నయినా సూచించవచ్చు. అయితే ఆ సూచనలోని సన్నివేశానికి నాట కీయత, పాత్రల మధ్య సంఘర్షణ, పాత్ర మనస్సులో భావ సంఘర్షణ ముఖ్యంగా ఉండడం అవసరం. సన్నివేశాన్ని సూచించ గానే నాట్యావధాని కొద్ది వ్యవధిలోనే పాత్రోచితమూ, సూచ్య ప్రాయమూ అయిన వేషధారణతో ఆ పాత్రను గూర్చి ఆలోచిస్తూ, సహజమైన

సాహిత్యం కల్పించుకొని, ప్రతిభా పాటవాలు స్పష్టమయ్యే రీతిలో అభినయించి ఆ సన్నివేశాన్ని రక్తి కట్టించడమే నాట్యావధానం. పురాణ పురుషులు, చారిత్రక నాయకులు, రాజు మొదలు రిక్షావాల వరకు వివిధ విధాలైన పాత్రలను నాట్యావధానంలో ప్రదర్శించడానికి వీలవుతుంది. 50 ఏళ్లుగా రామనాథశాస్త్రి ప్రదర్శిస్తున్న ఈ నాట్యావధానం భారతీయ నాటక రంగంలో ఒక నూతనప్రక్రియ, ఒక నూతన ప్రయోగం. తమ్ముడు ధారా రాధా కృష్ణమూర్తి ఈ నాట్యా వధానంలో పలుచోట్ల పాల్గొని ప్రదర్శనకు సహకరిస్తూ వచ్చాడు. నాట్యావధాన చక్రవర్తిగా రామనాథశాస్త్రి విశేష కీర్తి నార్జించాడు.

గంగప్ప.

రామమూర్తి, వి.(జ. 1935) : ప్రఖ్యాత రంగ స్థల దృశ్య బంధ రంగోద్దీపన నిపుణుడు. 1935లో బెంగుళూరులో జన్మించాడు. 1952 నుంచి కన్నడ ఔత్సాహిక నాటకరంగ వికాసం కోసం కృషిచేస్తున్నాడు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో దర్శకత్వం, రంగస్థల నిర్వహణ అంశాల్లో విద్యార్థిగా శిక్షణ పొందాడు. తరువాత హవాయి విశ్వ విద్యాలయంలోను, న్యూయార్కులోని థియేటర్ టెక్నాలజీ ఇనిస్ట్యూట్‌లోను రంగస్థల సాంకేతిక పద్ధతులపై ప్రత్యేక అధ్యయనం చేశాడు. ఇందులో భాగంగా పలు నాటకాలకు దృశ్యబంధ, రంగోద్దీపన సేవల్ని అందించాడు. వీటిలో కొన్ని బ్రాడ్ వేలో ప్రదర్శించిన నాటకాలు ఉన్నాయి. అనంతరం భారతదేశం తిరిగివచ్చి బి.వి. కారంత్ నాటకాలకు సాంకేతిక నిపుణుడిగా వ్యవహరించాడు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో దేశంలో వివిధ ప్రాంతాలలో నిర్వహించబడే నటశిక్షణ శిబిరాలలో రంగోద్దీపన అంశంమీద రామమూర్తి తరగతులు నిర్వహించడం తప్పనిసరి అవుతుది. భారతదేశంలోని పలు విశ్వవిద్యాలయాల రంగస్థల కళల శాఖల్లో అతిథేయ అధ్యాపకుడిగా తన సేవల్ని అందిస్తూ వచ్చాడు. భారత నాటకరంగ చరిత్రలో రంగోద్దీపనకు ఒక ప్రత్యేకతను సంతరించి పెట్టడమే కాకుండా కళాత్మక రంగోద్దీపనంలో దేశ నాటక రంగ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు.

ప్ర.రె.

రామ మోహనరావు, సురభి వనారస (జ.1939) : రంగస్థల నటుడు, సంగీత విద్వాంసుడు, హరి కథకుడు. సురభి కుటుంబానికి చెందిన శారదాదేవి, హనుమంతరావు దంపతులకు 1939 జనవరి 15న నల్గండ జిల్లా ఏదులూరులో జన్మించాడు. తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడే సంగీతంలో శిక్షణ పొందాడు. ఈయనకు మొదటి సంగీత గురువు తండ్రి. 1960 నాటికే హార్మోనియం వాయించడంలో పట్టు సాధించిన రామమోహనరావు నాటి నుంచి అనేక నాటకాలకు సంగీత దర్శకత్వం వహించాడు. ప్రముఖ నటుడిగా గుర్తింపు పొందాడు. అసంఖ్యాక ప్రదర్శనలలో పాల్గన్న రామమోహనరావుకు శ్రీకృష్ణ తులాభారంలో కృష్ణుడు, చింతామణిలో శ్రీహరి, బిల్వమంగళుడు, సతీసావిత్రి లో అశ్వపతి, సత్యహరిశ్చంద్ర లో విశ్వామిత్రుడు పాత్రలంటే అభిమానం. ప్రముఖ నటులు షణ్ముఖి ఆంజనేయ రాజు, డి.వి. సుబ్బారావు, జి.ఎస్.ఎన్. శాస్త్రి, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి నటులు ఈయన సంగీత దర్శకత్వంలో నటించారు. రచయితగా అయిదు వందలకు పైగా గేయాలు రాశాడు. హరికథలు రాసి పలుచోట్ల ప్రదర్శించాడు. సురభి సమాజం ప్రదర్శించిన బ్రహ్మంగారి చరిత్ర, లవకుశ మొదలైన నాటకాలు ఈయన సంగీత దర్శకత్వంలో ప్రదర్శింపబడ్డాయి.

రామమోహనరావు సంగీతం, నటనలోనే కాదు సాహిత్యంలోనూదిట్ట. పద్యపఠనంలోని మెళుకువలు, సాహిత్యంలోని లోతులను తెలుసుకొని మరో వైకుంఠం, సాయి చరిత్ర (షిర్డి సాయిబాబా) వంటి సాహితీ సంగీత విలువలున్న రచనలు చేసి, ప్రదర్శించాడు. సాయికృష్ణ యాచేంద్ర (వెంకటగిరి రాజు)తో కలిసి 'గేయధార' కార్యక్రమాన్ని నిర్వహించాడు.

హరికథకుడుగా పలువురి మన్ననలను పొందిన రామమోహనరావు ప్రముఖ సంగీత దర్శకుడు తాపీ చాణక్య 1964లో 'హరికథ కళా స్రష్ట' బిరుదునిచ్చి సత్కరిస్తే, నెల్లూరిలోని హరికథ గాన విద్యాపరిషత్తు 'హరికథ రత్న' బిరుదునిచ్చి గౌరవించింది. పురాణకథా కళాశిల్పిగా పేరు పొందిన రామమోహనరావుకు సంగీతం ఆరోప్రాణం.

బిట్టు.

రామయ్య, వేమూరి (జ.1927) : నటుడు, దర్శకుడు, లక్ష్మీగణపతి నాట్యమండలి నిర్మాత. ఈయన ప్రసిద్ధ రంగస్థల నటుడు గగ్గయ్య కుమారుడు. గుంటూరు జిల్లా వేమూరులో 1927, జులై 25న రామలక్ష్మమ్మ, వేమూరి గగ్గయ్య దంపతులకు

జన్మించాడు. రంగస్థల నటుడి కుటుంబంలో జన్మించడం వల్ల చిన్నప్పటి నుండి నాటకాల పట్ల అభిరుచిని పెంచుకున్నాడు. చదువు కోసం రేపల్లెకు వచ్చిన రామయ్య సెలవుల్లో వేమూరుకు వెళ్లినపుడు మిత్రులతో కలసి మోహినీ రుక్మాంగదలో యముడు, గయోపాఖ్యానంలో శివుడు, నారదుడు, తెలుగుతల్లిలో శనేశ్వరరావు పాత్రలలో నటించి బాలనటుడుగా పేరు తెచ్చుకున్నాడు. తన కొడుకు నాటకాలలో నటించడం వల్ల చదువు కుంటుపడుతుందని, గగ్గయ్య నటించవద్దని హెచ్చరించాడు. రామయ్య తండ్రిమాటలు పట్టించుకోలేదు. హిందూకాలేజి గుంటూరులో ఇంటరు చదువుతున్న రోజుల్లో వావిలాల సోమయాజులు రచించిన భక్తపోతన లో శ్రీనాథుని పాత్రలో నటించాడు. ఆ తరువాత భమిడిపాటి నామాటే నెగ్గింది లోను ఈనాడు లో పృథ్వీరాజు, నేటి నటుడు లో రామశాస్త్రి వంటి పాత్రలు ధరించాడు. గుంటూరులో బి.కాం. పూర్తిచేసిన తరువాత మద్రాసులో బి.ఎల్. పూర్తిచేశాడు. వేమూరులోని యువకళాకారులతో కలసి లక్ష్మీగణపతి నాట్యమండలి స్థాపించాడు. మద్రాసులో బి.ఎల్. చేస్తున్నప్పుడు చెన్నపురి ఆంధ్రసభ కోసం రాణీరుద్రమ, ఎ.కములా చంద్రబాబు దర్శకత్వంలో తులాభారం నాటకాలలో నటించాడు. ఎ. కముల ప్రసిద్ధ నటి, ఈమె స్త్రీ పాత్రలలోనే కాదు పురుష పాత్రలలో కూడా నటించేది. ఈమె దర్శకత్వంలో **1951**లో గోదావరి వరద బాధితుల సహాయార్థం సావిత్రి నాటకంలో సత్యవంతుడుగా నటించాడు. అదే సంవత్సరంలోనే అద్దంకి శ్రీరామమూర్తితో రేపల్లె లో, భట్టిప్రోలు లో, పాదుకా పట్టాభిషేకం లో భరతుడు పాత్రలో నటించాడు.

1955లో తండ్రి మరణించడంతో కుటుంబ బరువు బాధ్యతలు స్వీకరించక తప్పలేదు. న్యాయవాద వృత్తి కంటే నటన పట్ల మొగ్గు చూపాడు. కళకోసం జీవితం సాగించాలని నిర్ణయించుకున్నాడు. వివిధ నాటక సమాజాలు ప్రదర్శించే నాటకాలలో నటిస్తూ మల్లాది గోవింద శాస్త్రి, మైలవరపు చంద్రమౌళి, విష్ణుభట్ల వేంకటేశ్వర్లు, శృంగవరపు శ్రీరామమూర్తి, మాధవపెద్ది వేంకట్రామయ్య, అద్దంకి శ్రీరామమూర్తి వంటి ప్రసిద్ధ నటుల దగ్గర నటనా మెళుకువలు నేర్చుకున్నాడు. శ్రీకృష్ణరాయబారంలో శ్రీకృష్ణుడు, పాదుకాపట్టాభిషేకం లో భరతుడు, దశరథుడు పాత్రలలో నటించి ప్రేక్షకుల ప్రశంసలను పొందాడు.

ఎ.కములా చంద్రబాబు దగ్గర దర్శకత్వం మెళుకువలను గమనించిన రామయ్య లక్ష్మీగణపతి నాట్యమండలి పక్షాన పౌరాణిక, చారిత్రక నాటకాలను ప్రదర్శించాడు. పెమ్మరాజు వేణుగోపాల కృష్ణమూర్తి రచించిన మహారథి కర్ణ ను ప్రదర్శించి దర్శకుడుగా పేరుతెచ్చుకున్నాడు. దీనితో పాటు భూకైలాస్, నర్తన శాల, సతీ సావిత్రి, శ్రీ కృష్ణమాయ, సత్యహరిశ్చంద్ర, రోషనార, జలంధర నాటకాలను ప్రదర్శించడమే కాకుండా ప్రధాన పాత్రలలో నటించాడు. రంగస్థల చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని అగ్రనటుల సరసన నిలబడ్డాడు. **1982**లో ఎ.ఆర్. కృష్ణఆహ్వానంమేరకురిపర్టరీ తరపున శాకుంతలం (హిందీ, తెలుగు) నాటకంలోకణ్వుడిగా నటించాడు. నాటక పోటీల న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. చలనచిత్రాలలో నటించాడు. **1982**లో బుల్లి తెరపై ప్రదర్శించిన శశాంకంలో బృహస్పతిగా నటించాడు. రామయ్యను నాటి మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య నటశేఖర బిరుదునిచ్చి సత్కరించాడు. **1985**లో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ నాటక కళాప్రపూర్ణ అవార్డు, మద్రాసు తెలుగు అకాడమీ అభినవ కర్ణ బిరుదును బబ్బిలిరాజా వారిచే స్వర్ణ మకరకుండల ప్రదాన్ని **2000**లో ఎన్.టి.ఆర్ రంగస్థల అవార్డును అందుకున్న నాటక రంగ నటరత్నం వేమూరి రామయ్య.

దాసరి.ఎన్.

రామలింగశాస్త్రి, చావలి (జ.1939) : రంగస్థల నటుడు, అధ్యాపకుడు, రచయిత, భార్గవీ డ్రమటిక్ అసోసియేషన్ స్థాపకుడు. ఈయన **1939** ఏప్రిల్ **28**న గుంటూరు జిల్లా తెనాలి కోటమ్మ, రావు కోటేశ్వరరావు దంపతులకు జన్మించాడు. డిగ్రీవరకు చదువుకున్న రామలింగ శాస్త్రి నాటకాల పట్ల అభిమానం పెంచుకొని, **1959**లో తెనాలిలో భార్గవీ డ్రమటిక్ అసోసియేషన్ అనే నాటక సమాజాన్ని స్థాపించాడు. ఈ సమాజం పక్షాన శ్రీ రామమూర్తి రచించిన ఆడది, ముద్దుకృష్ణ రచించిన అనార్కలి, కన్నబిడ్డ వంటి నాటకాలలో నటించాడు. ఆ తరువాత పులిపాటి లక్ష్మీనారాయణ, వంగర సుబ్బయ్యలతో కలసి మాలపల్లి నాటకంలో నటించాడు.

1962లో ఉద్యోగప్రయాణంలోభాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టిన రామలింగశాస్త్రిని ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం ఆకర్షించింది. ఈ సంఘం నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో

శిక్షణపొంది నటుడుగా ఎదగడమే కాకుండా తర్వాత రోజుల్లో ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం విద్యార్థులకు అధ్యాపకుడిగా పనిచేశాడు. రంగస్థల ప్రముఖులు ఎ. ఆర్. కృష్ణ, కె. వి. గోపాలస్వామి, అబ్బూరి రామకృష్ణారావు లతో కలిసి కళారంగవికాసం కోసం కృషిచేశాడు. అబ్బూరి రామకృష్ణా రావు దర్శకత్వంలో నాట్యవిద్యాలయం రిపర్టరీ ప్రదర్శించిన మృచ్ఛకటిక, కన్యాశుల్కం నాటకాల్లో నటించాడు. ఈ నాటకాలు అప్పటి భారత రాష్ట్రపతి కోరిక మేరకు న్యూఢిల్లీ లోని రాష్ట్రపతిభవన్ ప్రదర్శించారు. ప్రముఖ నాటక రచయిత పరిశోధకుడు పి. ఎస్. ఆర్. అప్పారావు శిష్యరికంలో రంగస్థల కళలకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకొని పలు శిక్షణ సంస్థలలో ఆధ్యాపకుడిగా పనిచేసి విద్యార్థులకు రంగస్థల కళలపట్ల అభిమానాన్ని పెంచాడు. వారిని రంగస్థల కళల వికాసం కోసం కృషిచేసే దిశలో పనిచేసేటట్టుగా తీర్చిదిద్దాడు. తెలుగు అకాడమీ ప్రచురించిన *రంగస్థలశాస్త్రం* గ్రంథంలో వాచికాభినయం, ఆహార్యం గురించి పాఠాలు వ్రాశాడు. ఆ తరువాత హైదరాబాదులో సి. నారాయణరెడ్డి అధ్యక్షులుగా నవ్యకళాలయ అనే సమాజాన్ని స్థాపించి చీకటి వెలుగులు, విదూషకుడి ఆత్మహత్య, పెద్దమనుషులు, ప్రియపుత్రుడు, నిజం, గవర్నమెంట్ ఇన్‌స్పెక్టరు, సిటీబస్, రాగశోభిత, పెండింగ్ ఫైల్, పూలదోసిళ్ళు, అబద్ధాల ఊబిలో, పండగొచ్చింది, మంచుతెర, భజంత్రీలు, నోరు జారితే వంటి నాటికా నాటకాలకు దర్శకత్వం వహించడమే కాకుండా వీటిలో ప్రధాన భూమికలలో నటించి ప్రదర్శింపజేశాడు. రేడియో దూరదర్శన్‌లలో ప్రసారమైన పలు నాటికా, నాటకాలలో నటించాడు. రాష్ట్రంలోని పలు నాటక సమాజాలు ప్రదర్శించిన నాటకాలకు దర్శకత్వం వహించి నాటకాలను ప్రదర్శించి ప్రేక్షకుల మెప్పును పొందిన కళాకారుడు రామలింగశాస్త్రి.

దాసరి. ఎన్.

రామలింగస్వామి, మీగడ (జ.1955) : నటుడు, రచయిత, దర్శకుడు, సంగీత విద్వాంసుడు. శ్రీ మీరాకళాజ్యోత్స్న సంస్థ స్థాపకుడు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో 1955, ఫిబ్రవరి 1న జన్మించాడు. తల్లి అప్పల నరసమ్మ, తండ్రి దాలయ్యలింగం. ఉన్నత విద్యను అభ్యసించిన రామలింగస్వామి కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తూ నాటకరంగాన్ని ప్రవృత్తిగా స్వీకరించి కళారంగ ఔన్నత్యం కోసం పట్టుదలతో కృషిచేస్తున్న అతికొద్దిమంది కళాకారులలో ముఖ్యుడు. విశాఖపట్టణంలో శ్రీమీరాకళాజ్యోత్స్న నాటక సమాజాన్ని స్థాపించి, తాను రచించిన నాటకాలను స్వరాష్ట్రంలోనే కాకుండా విదేశాలలోనూ ప్రదర్శించాడు. ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు.



మీగడ రామలింగస్వామి తనపదిహేడవఏట నాటక రంగంలోకి ప్రవేశించి ఆంధ్రదేశంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర కళావేదికలపై ఉత్తమ నటుడు, ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సమాజ నిర్వాహకుడు అవార్డులు అందుకొన్నాడు. ఆంధ్ర నాటకరంగంలో ప్రసిద్ధ కళాకారుడిగా పేరు తెచ్చుకున్నాడు. సంప్రదాయ నాటక ప్రదర్శనలను సుసంపన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న ఆధునిక నటులలో ఈయన ఒకరు. రామలింగస్వామి నాటక రచయితగా శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం (1999), *అశ్వత్థామ* (2001), *గుణనిధి* (2003), చిరుతొండనంబి (2003) నాటకాలను రచించాడు. వాటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాలలో ప్రదర్శించి బహుమతులు అందుకున్నాడు. కళారంగ వికాసం కోసం కృషి చేస్తున్న రామలింగస్వామిని తెలుగు దర్బారు (ఏలూరు) 'సాహిత్యరంగస్థలసార్వభౌమ', నరసన్నపేట కళాకారులు 'తెలుగు నాటక విభూషణ', పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమనటుడు సాహితీపురస్కారం అవార్డులిచ్చి గౌరవించి సత్కరించాయి.

దాసరి.ఎన్.

రామవిలాస సభ (చిత్తూరు) : రావుబహదూర్ టి.వి. రంగాచార్యులు అధ్యక్షులుగా బ్రహ్మాండం నరసింహారావు కార్యదర్శిగా ఈసభ ప్రారంభింపబడింది. ఎమ్. అనంతశయనం అయ్యంగారు, ఆర్.బి.రామకృష్ణంరాజు, బి.మునుస్వామి నాయుడు, చిత్తూరు వి.నాగయ్య ఈ సభలోని నటులు. చిత్తూరు నాగయ్య నటుడే కాక ఈ సమాజంలో గాయకుడు, హార్మోనిష్టు కూడా. సుప్రసిద్ధ నటగాయకుడు రాయప్రోలు సుబ్రహ్మణ్యం చాలాకాలం ఈ సభలో కండక్టరు(నిర్వాహకుడు)గా పనిచేశాడు. ఇంకా కె.రాఘవేంద్రరావు, పి.నరసింహయ్య కూడా ఈ సభకు సంబంధించిన నటులు. ఈ సభ కూడా చాలా ప్రదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చింది.

జి.ఎస్.ఎన్.

రామసుబ్బారెడ్డి, పొన్నాల (జ.1922) : రంగస్థల నటుడు, శ్రీ రామకృష్ణ నాట్యమండలి స్థాపకుడు. ఈయన నెల్లూరు పట్టణానికి సమీపంలో ఉన్న పొట్టెపాళెం గ్రామంలో 1922లో జన్మించాడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన పొన్నాలకు విద్యార్థి దశ నుంచీ నాటకాలపై మక్కువ ఏర్పడింది. సోమవరపు

వెంకటరెడ్డి శిష్యరికంలో రామదాసు నాటకంలో శ్రీరఘురాముడు పాత్రతో రంగప్రవేశం చేశాడు. అప్పటినుంచీ లవుడు, కుశుడు, మార్కండేయుడు, లోహితాస్యుడు మొదలైన బాలపాత్రలతో తొలి పాఠాలు నేర్చుకొన్నాడు. సాంఘిక నాటకాల్లో కూడా నటించసాగాడు. క్రమక్రమంగా పొన్నాల దృష్టి పద్యనాటకాలపై పడింది. తాను మధురంగా పాడగల గాయకుడు కావడమే ఈ పరివర్తనకు కారణం. రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తూ నెల్లూరు పట్టణంలో స్థిరనివాసంఏర్పరచుకొన్నాడు. నెల్లూరులోని నాటి నటులు మజ్జిగ విశ్వనాథరెడ్డి, కణ్వశ్రీ, పెద్ద అబ్బాయి మొదలైన పెద్దల సాహచర్యంతో నాటకాభిరుచి ద్విగుణీకృతమైంది. ఉద్యోగం చేస్తూనే నాటకాలు వేస్తూ వృత్తినీ ప్రవృత్తినీ జోడు గుర్రాలుగా చేసుకుని నడిపిస్తూ వచ్చాడు. పాదుకాపట్టాభిషేకం లో దశరథుడుగా, శ్రీకృష్ణరాయబారం లో అర్జునుడుగా, చిత్రనళీయం లో నలుడుగా, బాహుకుడుగా, చింతామణిలో బిల్వమంగళుడుగా, విషాద సారంగధరలో సారంగధరుడుగా, సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్రుడుగా, రామదాసు లోరామదాసుగా విభిన్న పాత్రలు ధరించి ప్రేక్షకుల ఆదరాభిమానాలను దోచుకున్నాడు. 1972లో గుంటూరులో జరిగిన అఖిలాంధ్ర సత్యహరిశ్చంద్ర నాటక పోటీలలో హరిశ్చంద్ర పాత్ర పోషణకు ప్రథమ బహుమతి పొందాడు. నాటి నుంచి నేటి వరకు పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తూనే ఉన్నాడు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా ప్రదర్శనలిచ్చాడు. ప్రసిద్ధ కళాసంస్థలెన్నో వీరిని ఘనంగా సన్మానించాయి. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఈయన సేవలను ప్రశంసిస్తూ అవార్డులిచ్చాయి. కళాప్రపూర్ణ, నటశిరోమణి, నటరత్న, కళాకోవిద మొదలైన బిరుదులు పొన్నాలను వరించాయి. రెవెన్యూ శాఖలో డిప్యూటీ తాశీల్దారుగా పదవీ విరమణ చేసిన రామసుబ్బారెడ్డి నాటకరంగానికి తన శ్రీరామకృష్ణ నాట్యమండలి, నెల్లూరు సమాజం ద్వారా పద్యనాటకాలను ప్రదర్శిస్తూ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాడు.

గం.సు.రె.

రామస్వామి, ఆర్.వి.ఎస్ (జ.1931) : నటుడు, నాటక రచయిత. కళారాధన స్థాపకులలో ముఖ్యుడు. రామస్వామి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం తాలూకా చిత్రాట గ్రామంలో 1931లో రావు వెంకట రామారావు, వెంకాయమ్మ దంపతులకు జన్మించాడు. విద్యార్థిదశ నుంచీ నాటకాలపైమక్కువ చూపేవాడు. తొలుత నటునిగా 1948లో రంగప్రవేశం చేశాడు. 1954లో ఉస్మానియా యూనివర్సిటీనిర్వహించిన ఆంధ్రాభ్యుదయోత్సవాలలో ఉత్తమ నటనకు బహుమతి అందుకున్నాడు. ఎ.ఆర్.కృష్ణ ఇండియన్ నేషనల్ థియేటర్‌లో మంత్రి శ్రీనివాసరావు, పి.ఎస్. రామారావు, పన్నూరి రామారావులతో సహనటుడిగా నటనలో మెరుగులు దిద్దుకున్నాడు. సచివాలయ సాంస్కృతిక సంఘంతో సాన్నిహిత్యం పెంచుకొని కొన్ని వందల నాటక ప్రదర్శనల్లో పాల్గన్నాడు. అదే సంవత్సరం ఈయన మొదటి రచన చీకటి కోణాలు వెలుగు చూచింది.

హైదరాబాదులో ఐ.ఎన్.టి. తరపున చీకటి కోణాలు నాటకం రిహార్సల్సు జోరుగా సాగుతున్న కాలంలో బి. భానుప్రకాష్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం జీవితాంతం కొనసాగింది. 1966 మార్చి నెలలో వీరిరువురి కలయికతో కళారాధన సంస్థకు అంకురార్పణ జరిగింది. శశాంకరావు, శ్రీధరాచార్య, దేశిరాజు హనుమంతరావు, శ్రీనివాస మూర్తి, నూతన ప్రసాద్, కాశీ, కృష్ణ , మల్లికార్జునరావు మొదలైన నాటి మేటినటులు సభ్యులుగా కళారాధన సంస్థ విరివిగా ప్రదర్శనలు నిర్వహించింది. రామస్వామి రచించిన పరాజితులు, *గాలిపటం*, వలయం, *సుడిగాలి*, *గాలివాన*, కెరటాలు, వెల్లువ, *గుడిగంటలు*, పైడిరాజు మొదలైన నాటక, నాటికలు విస్తృతంగా ప్రదర్శింపబడ్డాయి. బహుమతుల పంట పండించారు. ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతాలలో తిరగని ఊరు, పాల్గనని పరిషత్తు లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతినాటకం 30–40 ప్రదర్శనలకు నోచుకొనేది.

రామస్వామి రచించిన నాటకాలు, నాటికలు అన్నీ ముద్రితాలే. ఈ నాటకాలన్నింటినీ కళారాధన సమితే ప్రదర్శించటం, వాటికి భానుప్రకాషే దర్శకత్వం వహించటం విశేషం!

గం.సు.రె.

రామస్వామి, ఎస్.ఎన్. : పూర్తిపేరు సాదలి నర్సప్ప రామస్వామి. నాటకకర్త, కవి, నాటక సిద్ధాంతవేత్త, ప్రభుత్వ న్యాయవాది, సంగీతజ్ఞుడు, కళాప్రవీణ, కళాకోవిద బిరుదాంకితుడు.

చిన్నతనంలోనే వేదాధ్యయనం చేశాడు. సంగీతం నేర్చుకున్నాడు. పెనుగొండలో బాలవాణి సభను స్థాపించి బాలనటుడుగా, గాయకుడుగా పేరు పొందాడు. 15వ ఏటనే కవిత్వం చెప్పడం మొదలుపెట్టాడు. చంద్రగుప్తుడు, బాహుకుడు, రామదాసు, నారదుడు, శివయోగి వంటి పాత్రలలో నటించాడు. 1927లో తన సోదరుడు స్థాపించిన కృష్ణదేవరాయ నాట్య మండలిలో ప్రవేశించి పెద్ద వేషాలు వేస్తూ పేరు సంపాదించుకున్నాడు.

కొంతకాలం ఆంధ్ర నాటక కళాపరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యుడుగా ఉన్నాడు. ఈయన కవిత్వానికి మెచ్చి చెన్నపురి ఆంధ్రసభ మొదలైన సంస్థలు కళాప్రవీణ, కళా కోవిద బిరుదులిచ్చి సత్కరించాయి.

శ్రీ.చ.

రామస్వామి చౌదరి, త్రిపురనేని (1887-1943) : పండితుడు, కవి, సంఘహితైషి, విమర్శకుడు, మానవతా వాది. కవిరాజు బిరుదాంకితుడు. కృష్ణాజిల్లా అంగలూరు గ్రామంలో చలమయ్య, రామమ్మ దంపతులకు 1887 జనవరి 15న జన్మించాడు. బందరు కళాశాలలో ఎఫ్.ఎ చదివాడు. విద్యార్థి దశలోనే సాహిత్యం మీద అభిరుచి ఏర్పడింది. విద్యార్థిగా ఉన్నప్పుడే పద్యాలు రాసి ఉపాధ్యాయులను అబ్బురపరచేవాడు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రికి ప్రియశిష్యుడై, అవధానాలు చేసి, ప్రశంసలు పొందాడు. చిన్నప్పట్నుంచీ మూఢాచారాలను ఏవగించుకునే వాడు. ఆచారాలు, సంప్రదాయాల తర్కబద్ధత గురించి ఆలోచించేవాడు. ఎందుకు అని ప్రశ్నించడం రామస్వామి జీవితంలో నిత్యకృత్యమైంది. ఇదే క్రమక్రమంగా హేతువాదిగా మారడానికి దారి చూపింది. ఇంగ్లాండు వెళ్ళి బారిష్టరు పరీక్షలో ఉత్తీర్ణుడై స్వదేశానికి తిరిగి వచ్చి కొంతకాలం బందరు లోను, విజయవాడ లోను వకీలుగా పనిచేశాడు. జాతీయోద్యమం ఉధృతంగా సాగుతున్న ఆ రోజుల్లో దేశాభిమానిగా ఉద్యమంలో క్రియాశీల పాత్ర నిర్వహించాడు. "వీరగంధము తెచ్చినారము. వీరులెవరో తెల్పుడి" అని ఈయన రాసిన ప్రబోధ గీతం ఉప్పుసత్యాగ్రహ కాలంలో ప్రతి ఇంటా మార్మోగింది. అస్పృశ్యతా నివారణ కోసం పాటు పడిన వారిలో రామస్వామి ఒకరు. పురాణ కథలకు నూతన వ్యాఖ్యానాలు చేస్తూ హేతువాద దృక్పథంతో వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఎన్నో రచనలు చేశాడు. వాటిలో నాటకాలు కూడా ఉన్నాయి. మహా భారతం పాండవుల పట్ల పక్షపాత వైఖరితో సాగిందనీ, నిజానికి పాండవులకు రాజ్యార్హత లేదనీ, వారు సాధించిన విజయం ధర్మ సమ్మతం కాదనీ, కౌరవులే నీతి పరులని నిరూపిస్తూ, రామస్వామి రాసిన కురుక్షేత్ర సంగ్రామం (1912) సంప్రదాయవాదుల్లో, పండితుల్లో గాలి దుమారం రేపింది. అలాగే శంబుక వధ (1920) అనే నాటకంలో ద్రావిడులపై ఆర్యుల ఈర్ష్యా ద్వేషాలను బట్టబయలు చేశాడు. శ్రీ రామచంద్రుడు స్వయంగా శంబుకుని ఆశ్రమానికి వెళ్ళి శంబుకుని వధించడానికి కారణం కేవలం అతడు అనార్యతాపసి కావడమేనని స్పష్టం చేశాడు. ద్విజులను సంతోషపరచడానికి అటువంటి పాపానికి వడిగట్టడం ధర్మబద్ధంకాదనీ, అది సాంఘిక దురన్యాయమని వ్యక్తం చేశాడు ఈ నాటకంలో. ఈ నాటకం కూడా సనాతన పరుల ఆగ్రహానికి గురైంది. రామస్వామి రచించిన మరొక నాటకం ఖూనీ (1935) కూడా ఇటువంటిదే. స్వతంత్ర భావాలు, సద్వర్తన, విశాల దృక్పథం ఉన్న వేనరాజును అసూయాగ్రస్తులైన ఆర్యఋషులు సంహరించడం అనే ఉదంతాన్ని కథావస్తువుగా తీసుకొని ఖూనీ రాశాడు. భాగవతంలో ఉన్న మూలకథలో వేనరాజు దుష్టుడు, నాస్తికుడు కాగా రామస్వామి చౌదరి పాత్రచిత్రణ ప్రకారం వేనరాజు నాస్తికుడే కాని దుష్టుడు, ప్రజాకంటకుడు కాడు. అసలు సిసలైన మానవతావాది. మానవత్వం మరచి మహాపురుషుల్ని మట్టుపెట్టిన ఋషుల కంటే నాస్తికుడైన మానవతావాది వేనరాజే ఉత్తముడని ఆ నాటకం ద్వారా ఆవిష్కరించాడు నాటకకర్త. ఈ విధంగా పురాణ కథలకు కొత్త భాష్యం చెప్పి ఆలోచింపజేశాడు. సంప్రదాయ పద్ధతిలో సాగుతున్న ప్రజల ఆలోచనా పద్ధతిని హేతువాద మార్గాన నడిపించి, స్వతంత్ర ఆలోచనా శక్తి పెంపొందింపజేయాలని నడుంకట్టి, జీవిత పర్యంతమూ పోరాటం సాగించిన కవిరాజు, ఎందువల్లనో నాటక రచన పద్యగద్య సమన్వితంగా, గ్రాంధిక పద్ధతిలోనే రాయటం వింతగా తోస్తుంది. త్రిపురనేని లేఖిని నుండి వెలువడిన సూత పురాణం, కారెంపూడి కదనం, ధూర్త మానవ శతకం, సూతాశ్రమగీతాలు, కుప్పుస్వామి శతకం, వివాహ విధి అనే గ్రంథాలు ఈయన సునిశిత పరిశీలనా శక్తిని, వ్యంగ్యాత్మక కవితాశైలిని ద్యోతకం చేస్తాయి. జీవిత పర్యంతమూ సంప్ర దాయాలమీద, కాలదోషం పట్టిన ఆచారాల మీద తిరుగుబాటు బావుటా ఎగురవేసి, ఒంటరి పోరాటం సాగించిన రామస్వామి చౌదరి 1943 జనవరి 16న దివంగతుడయ్యాడు.

గం.సు.రె.

రామస్వామి, బండారు (1893-1965) : రంగస్థల నటుడు, నాటక రచయిత, నాటక సిద్ధాంతవేత్త, నాటక చరిత్రకారుడు. సాయిబాబా భక్తుడు, నిరాడంబర జీవి. నటమిత్ర బిరుదాంకితుడు. ఈయన 1893లో గుంటూరులో జన్మించాడు.

ప్రప్రథమంగా గుంటూరు సెకండ్ కంపెనీలో అభిమన్యుని పాత్రలో నటించాడు. ఆ తరువాత వేణీసంహారం, సారంగధర నాటకాలలో ప్రధాన పాత్రలలో నటించాడు.

1912లో గుంటూరు మూన్ థియేటర్‌లో చేరి నాయక పాత్రలు ధరించాడు. ఈయనకు వీరరసం అభిమాన

రసం. నటించడమే కాకుండా రామదాసు బందిఖానా, బాహుక పరితాపం, కర్ణుని స్వామిభక్తి అనే ఏకపాత్రాభినయాలు రచించాడు.

అంతేకాకుండా నాటకరంగ పరిశోధకుల నిమిత్తం *'ఆంధ్ర నాటకరంగం – గుంటూరు పాత్ర – విశిష్టత'* అనే పెద్దవ్యాసం రచించాడు. ఈయన రచనలన్నింటినీ సంపుటీకరించి నటమిత్రమ్ అనే గ్రంథం ప్రచురించాడు. ఈయన గృహం ఒక నాటక విశ్వవిద్యాలయం వంటిది. ఎందరికో నాటక విద్యా ప్రదానం చేశాడు.

ఈయన అభిమన్యుడు, రంగారావు, శ్రీకృష్ణుడు, గయుడు, హరిశ్చంద్రుడు, నరకాసురుడు, భీమసింగ్, రాజసింహ, బిల్హణ, పృథ్వీరాజు, చాణక్యుడు, బాహుకుడు వంటి పాత్రలలో నటించాడు. ఈయన 1965, ఏప్రిల్ 15న విజయవాడ దగ్గర కృష్ణానదిలో సాయిబాబా తెప్పతోపాటు మునిగిపోయి నిర్యాణం చెందాడు.

శ్రీ.చ.

రామాంజనేయులు, తిరునగరి (జ.1922) : ప్రజా కవి, కళాకారుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట యోధుడు. నాటక, హరికథ, గేయ రచయిత. 1922లో సాధారణ కుటుంబీకులైన రామ తులశమ్మ, సమ్మయ్య దంపతులకు పల్నాటిసీమలోని పిన్నెల్లి గ్రామంలో జన్మించాడు. ఈయన తండ్రి హరిదాసు. గురువు పిన్నెల్లి సూరయ్య దగ్గర ఐదవ తరగతి వరకు చదువుకున్నాడు. మేనమామ నారాయణ సంగీత విద్వాంసుడు. తండ్రి, మేనమామల వద్ద భక్తిప్రధానమైన పురాణాలను పఠించటం తిరునగరికి అలవాటై లయ జ్ఞానం పట్టువడింది. పన్నెండవ ఏటనే ఆంజనేయుడి మీద భక్తి పాట రాశాడు. ఇదే ఆయన తొలి రచన. అది ఇప్పటికీ బతికే ఉంది. 1935లో తెనాలి తాలుకా మంచకలపూడిలో ఉన్న మేనమామ దగ్గర సంగీత శిక్షణ పొందాడు. అక్కడ కొండవనేని బలరాంతో ఏర్పడిన పరిచయం వల్ల త్రిపురనేని రామస్వామి చౌదరి రచించిన శంబుక వధ నాటకాన్ని చదివి ప్రభావితుడై హేతువాద దృక్పథాన్ని అలవరచుకున్నాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా రాష్ట్రంలో జరిగిన ఆందోళనలో పాల్గని, లాఠీ దెబ్బలు తిని జైలుపాలయ్యాడు. బాల్యంలోనే వివాహం చేసుకున్న తిరునగరి నల్గండ జిల్లా చిలుకూరుకు ఇల్లరికం వెళ్ళాడు. దొడ్డా నర్సయ్య, మంత్రి ప్రగడ వేంకటేశ్వరరావు స్నేహితులయ్యారు. తెలంగాణా ప్రాంతంలో అధికారుల ఆగడాలు, దోపిడీ విధానాన్ని నిశితంగా పరిశీలించాడు. అప్పటికే తెలంగాణాలో ఏర్పడిన ఆంధ్ర మహాసభ కోదాడ ఫిర్కాకు ఆర్గనైజర్ అయ్యాడు. చిలుకూరులో సంఘం కార్యాలయాన్ని, వయోజన పాఠశాలను తన స్నేహితులతో కలసి నెలకొల్పాడు. వెట్టిచాకిరికి బానిసలైన పన్నెండు రకాల కులాల వారిని సంగంలో సభ్యులుగా చేసి దొరలు, అధికారుల ఇళ్ళలో చేసే వెట్టిచాకిరి నుంచి వాళ్ళను తప్పించాడు. ఈ సందర్భంగానే వెట్టిచాకిరికి వ్యతిరేకంగా వెట్టి చాకిరి అనే వీధి నాటికను రచించి పలుచోట్ల ప్రదర్శించాడు. ఇదే దేశంలో తొలి ఆధునిక వీధి నాటిక. ఇదే సమయంలో సూర్యాపేటలో వైజ్ఞానిక దళంలో చేరి తెలంగాణా నాటకం రచించి ప్రదర్శించాడు. పెండ్లి ఇల్లు అనే కథ రచించి 'మీజాన్' పత్రిక ద్వారా కథా రచయితగా పరిచయం అయ్యాడు. ప్రజా నాట్యమండలి సభ్యుడై ప్రదర్శన మెళకువలు నేర్చుకున్నాడు. నాటి కమ్యూనిస్టు పార్టీలో చేరి తుదివరకు ఎర్ర జెండాను వదలనని ప్రమాణం చేశాడు. 1946, జులై 4న జనగామా తాలుకా కడివెండి గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో దొడ్డి కొమరయ్య హత్య గావింపబడ్డాడు. పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తిరునగరి వీరకుంకుమ నాటికను ప్రదర్శించాడు. 1948లో వల్లభాయ్ –నెహ్రూల వీధి భాగోతం అనే పేరుతో యక్షగానాన్ని రచించి ఎన్నో ప్రదర్శనలిచ్చి, నాటి మద్రాసు కాంగ్రెసు ప్రభుత్వంపై దాడి ప్రకటించాడు.



తెలంగాణా పోరాటంలో నాటకాన్ని, గేయాన్ని, బుర్ర కథని ఆయుధంగా చేసుకొని ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసి ఉద్యమం వైపుకు ఉరకలెత్తించింది తిరునగరి కలం. తెలంగాణా పోరాట చరిత్ర ఉన్నంత వరకు తిరునగరి చిరంజీవిగానే ఉంటాడు.

1982లో పలనాటి ప్రముఖ కవి పులుపుల శివయ్య పేరిట అభ్యుదయ రచయితల సంఘం అవార్డుని అందజేసి తిరునగరిని ఘనంగా సత్కరించింది. ఉద్యమాలే ఊపిరిగా, పోరాటాలే నిత్యకృత్యంగా, సామాజిక స్పందనే రచనలకు ప్రాణప్రదంగా భావిస్తూ ఆదర్శప్రాయమైన సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్న తిరునగరి ప్రస్తుతం మాచర్లలో నివసిస్తున్నాడు.

ప్ర.రె.

రామానుజ రావు, సోమరాజు : దేశముఖ్, దేశపాండ్య. బహునాటకకర్త, నాటక కళా రహస్యవేత్త, కవి, నవలాకారుడు. ప్రయోగానుకూలంగా నాటకాలు రచించడంలో దిట్ట. రోజుకొక నాటకం రాయగలడని ప్రతీతి. ఈయన నాటకాల్ని ఎక్కువగా మైలవరం కంపెనీ ప్రదర్శించేది. ఈయన రచించిన రంగూన్ రౌడీ

నాటకం ఒకనాడు ఆంధ్రనాటక రంగాన్ని పరిపాలించింది. దీనితో అనేకమంది నటులు బాగా వెలుగులోకి వచ్చారు.

స్వరాజ్య రథము, ధరణికోట, రంగూన్‌రౌడి, సతీ సక్కుబాయి, దానవీర కర్ణ, ప్రతాపరుద్రీయము, భోజకాళిదాసు, కాలకేతనము, సతీ అనసూయ, గంగావతరణము, భీష్మ బ్రహ్మచారి, మహాభక్త విజయము, తాజ్‌మహలు, అదృష్టవిజయము, సుగ్రీవ పట్టాభిషేకము, సంగీత శశిరేఖ, ఆలీబాబా, శాకుంతలము, తిలకు రాయబారము, ద్రౌపదీ వస్త్రాపహరణము, పద్మవ్యూహము, ప్రచండ బబ్బిలి యుద్ధము, ప్రహ్లాద, లక్ష్మణమూర్ఛ, సంగీత సావిత్రి మొదలైన నాటకాలను రచించాడు.

శ్రీ.చ.

రామానుజసూరి, వరయూరి (జ. 1939) : రంగస్థల నటుడు, సంగీత దర్శకుడు, రచయిత, సమతా నాటక గురుకుల వ్యవస్థాపకుడు. 1939లో రంగమ్మ, నరసయ్య దంపతులకు గుంటూరు జిల్లా, రాజుపాలెం మండలం, ఇనిమెట్ల గ్రామంలో జన్మించాడు. ఆయుర్వేద వైద్యంలో తనకు చేదోడు వాదోడుగా ఉండాలన్న తండ్రి కోరికకు భిన్నంగా రామానుజసూరి నాటక రంగాన్ని ఎంచుకొని బాల్యదశ నుంచి ఆ మార్గంలో పయనించాడు. ఇనిమెట్ల గ్రామంలో ఉన్న వీధి బడిలోనే సూరి ప్రాథమిక విద్య సాగింది. అంతకు పైన చదువుకోవడానికి అవకాశాలుగాని, ఆర్థిక పరిపుష్టిగాని లేని పరిస్థితుల్లో చదువు కొనసాగలేదు. అయినా స్వయంకృషితో ఆంధ్ర, సంస్కృత భాషల్లో పట్టు సంపాదించాడు. దైవదత్తమయిన మధురగళానికి సంగీత విద్యాపారంగతుడు సరికొండ లక్ష్మణరాజు మెరుగులు దిద్ది సూరిలో ఆత్మస్థైర్యాన్ని ప్రోది చేశాడు.

రామానుజసూరి ఐదవ ఏటనే లవకుశలో కుశుడు పాత్ర ద్వారా రంగప్రవేశం చేశాడు. అనతికాలంలోనే హార్మోనియం నేర్చుకొని స్వరకల్పనలో దిట్ట అనిపించుకున్నాడు. పద్యనాటకాలు ఉధృతంగా సాగుతున్నకాలం గనుక సూరి పద్యనాటకాలవైపు దృష్టి సారించాడు. నటుడు గాను, హార్మోనిస్టు గాను సవ్యసాచిలా నిలిచాడు. పౌరాణిక చారిత్రక నాటకాలలో చిన్న పాత్రలు, పెద్ద పాత్రలు పోషిస్తూ నాటకరంగ ప్రముఖుల ఆశీస్సులు పొందాడు. నెహ్రూ నాట్యమండలి, రామా నాట్య మండలి కళాకారులతో చేరి వైవిధ్యభరితమైన పాత్రలు ధరించి ప్రజాదరణ పొందాడు. హనుమద్రావణ సంగ్రామంలో అంగదుడుగా, మైరావణలో ఆంజనేయుడుగా, తెలుగుతల్లిలో తిక్కన, సెంటు సాహెబ్‌గా, బబ్బిలియుద్ధం లో హైదర్‌జంగ్, రంగారాయుడు, విజయరామరాజుగా నటించి సామాజికుల ప్రశంసలు అందుకున్నాడు. తన నట జీవితంలో మూడువేల ప్రదర్శనల్లో పాల్గని, పద్యనాటక వైభవం తెలుగునాట పదికాలాలపాటు పదిలంగా ఉండేందుకు తనవంతు కృషిచేసి నటజీవితాన్ని సార్థకం చేసుకున్నాడు.

ప్రముఖ కళాకారులు బండారు రామారావు, చెంచు రామారావు, అద్దంకి మాణిక్యాలరావు, బండారు సుశీలల సాహచర్యంలో రామానుజసూరి నటజీవితం కొత్త మలుపు తిరిగింది. బండారు రామారావు నటించిన నాటకాలకు 1958 నుండి హార్మోనిష్టుగా పనిచేశాడు. ఆ సమయంలో కొన్ని పద్యాలకు కొత్త రాగాలను సమకూర్చి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. 1965లో పల్నాటి యుద్ధం పద్య నాటకాన్ని రచించి రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వందలసార్లు ప్రదర్శింపజేశాడు. ఆ ప్రదర్శనలకు సంగీత సారథ్యం తానే వహించాడు. ఈ నాటకం 1999లో నంది నాటకోత్సవాల్లో కూడా ప్రదర్శితమై నాటకాభిమానుల ప్రశంసలందుకొంది.

సూరి నట జీవితంలో అత్యంత ప్రాధాన్యం సంతరించుకొన్న మరొక పార్శ్వం ఉంది. 1969లో సూరి స్థాపించిన సమతా నాటక గురుకులం నాటక రంగానికి అమూల్య సేవలు అందిస్తూ ఉంది. నటనలో రాణించాలని ఉత్సాహం చూపే నటులకు నిష్ణాతులతో ఉచితంగా శిక్షణ ఇప్పించి వారి జీవితాలకు బంగారు బాటలు ఏర్పరచే కార్యక్రమమే ఇది. ఈ సమతా నాటక గురుకులం ప్రసిద్ధ చలనచిత్ర నటుడు అక్కినేని నాగేశ్వరరావు ప్రారంభించాడు. అప్పటినుంచి ఈ శిక్షణాలయం 36 సంవత్సరాలుగా నటులకు సేవలు అందిస్తూ వారిని సుశిక్షితులుగా తయారుచేసి ఉపాధికి మార్గం చూపిస్తూ ఉంది. రేబాల రమణ, జైరాజ్, కుమారబాబు, బండారు పద్మావతి, రత్నకుమార్, జయనిర్మల, ఎం. ఆదిలక్ష్మి వంటి నటీమణులు సమతా నాటక గురుకులంలో నటశిక్షణ పొందినవారే.

నాటకరంగానికి అకుంఠిత సేవలు అందించిన సూరిని ఆంధ్రప్రదేశ్‌లోని అనేక కళాసంస్థలు ఘనంగా సన్మానించి సూరి సేవలను ప్రస్తుతించాయి. నాటకసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన రామానుజసూరి కళాకారుడు.

గం.సు.రె.

రామానుజాచార్యులు, పంచాంగం (1895-1956): రంగస్థల నటుడు. కృష్ణా జిల్లా పిచ్చికలపాడు అగ్రహారంలో పంచాంగం రంగాచార్యులు, తాయారమ్మ దంపతులకు 1895లో జన్మించాడు.

చిన్నతనం నుంచీ నాటక కళ పట్ల మక్కువ ఏర్పడింది. దానికితోడు దైవదత్తమైన మధుర గళం కళాభిరుచిని మరింత పెంపు చేసింది. ఈయన మొదట బందరులో చిట్టూరి వేంకట నరసింహం పంతులు స్థాపించిన 'బాల భారత సంఘం'లో చేరి, సుప్రసిద్ధ నాట్య శాస్త్రాచార్యులు బి.టి. రాఘవాచార్యులు దగ్గర నాట్యశాస్త్రంలో మెళకువలు క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. తదనంతర కాలంలో తెలుగు నాటకరంగంలో లబ్ధప్రతిష్ఠులైన డి.వి. సుబ్బారావు, పారుపల్లి సుబ్బారావు, ఉప్పులూరి సంజీవరావు, కడియాల రత్తయ్య, జన్నవిత్తుల శేషగిరిరావు ప్రభృతులు ఈయనకు ఆ సంఘంలో సహాధ్యాయులుగా ఉండేవారు. బి.టి. రాఘవాచార్యుల శిక్షణ కింద వీరందరు పలు వైవిధ్యభరితమైన నాటక ప్రదర్శనలు చేసి, అపారమైన అనుభవం గడించారు.

రామానుజాచార్యుల ప్రతిభా పాటవాల గురించి విని ఏలూరుకు చెందిన శ్రీరాజామోతే నారాయణరావు జమీందారు తన సీతారామాంజనేయ నాటక సమాజంలోకి ఆహ్వానించాడు. అందివచ్చిన ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాడు. ఆనాటికే తెలుగునాట ఎనలేని కీర్తిప్రతిష్ఠలు ఆర్జించిన ఆ సమాజం కీర్తి కిరీటంలో కలికితురాయిగ నిలిచాడు. ఈ కాలంలోనే ఆచార్యులు యడవల్లి సూర్యనారాయణ, అద్దంకి శ్రీరామమూర్తి, స్థానం నరసింహారావు, బందా కనకలింగేశ్వర రావు, పారుపల్లి సుబ్బారావు వంటి దిగ్గజాల సరసన పలు వైవిధ్య భరితమైన నాటకాలలో కథానాయక, నాయిక పాత్రలను పోషించి ఖ్యాతి గడించాడు.

ఈయన అభినయ పాటవానికి దీటుగా బాహ్య సౌందర్యం ఉండేది. అందువల్ల ఈయన సీత, దమయంతి, రుక్మిణి, చిత్రాంగి, కైక, సత్యభామ, మోహిని, కమల, చింతామణి వంటి విభిన్న మనఃప్రవృత్తులు ఉన్న పలు స్త్రీ పాత్రలను, శ్రీరాముడు, నలుడు, శ్రీకృష్ణుడు, బిల్వమంగళుడు వంటి ఉదాత్త నాయక పాత్రలను నిరుపమాన రీతిలో నిర్వహించి ఆబాలగోపాలాన్ని మెప్పించాడు.

ఈయన అభినయశైలి బళ్ళారి రాఘవ, స్థానం నరసింహారావు అభినయ రీతులలో కన్పించే సహజ ప్రయోగ సౌకుమార్యలకు సన్నిహితంగా ఉండేది. ఏవిధమైన వాగ్దోషాల్ని దొర్లనీయకుండా, సంభాషణల్లోని, పద్యాల్లోని కవిహృదయాన్ని స్పష్టంగా, సక్రమంగా, సరసంగా విన్పించేవాడు.

పిఠాపురం ఆస్థాన సంగీత విద్వాంసుడు కొండూరి నరసింహాచార్యుల వద్ద సంగీత శాస్త్ర మర్మాలను ఔపోసన పట్టాడు. స్వయంగా ఎన్నో శాస్త్రీయ సంగీత కచ్చేరీలు చేసినా, ఆ ధోరణి పొడ సూపకుండా శాస్త్రీయ సంగీతాన్ని రంగస్థల మాధ్యమానికి అనుగుణంగా మలచి ఈయన వినియోగించిన తీరు తరతరాలకు మార్గదర్శకంగా నిల్చే అంశం. ఇక వీణ, ఫిడేలు, హార్మోనియం వంటి సంగీత వాయిద్యాల ప్రయోగంలోను ఆచార్యులది అందెవేసిన చేయి.

పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రి తన నటప్రకాశికలో పంచాంగం గురించి ఇలా పేర్కొన్నాడు. 'సమకాలీనంలో భరతాది వివిధ లాక్షణిక విజ్ఞానాలూ, అనుభవాలూ కలిగి, ఉభయ భాషా ప్రవీణులై నాట్యధర్మాన్ని నిర్వహించెడివారు ఈయన ఒక్కరే. ఇక వీరియందు కన్పించే శాస్త్ర జన్య పరిజ్ఞానాలు ప్రయోగంలో సమర్థవంతంగా సమన్వయింపబడి, సాక్షాత్కరింపబడి ప్రేక్షకావళిని తరింపజేసేవి.'

1920 దశకం చివర్లో గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని ఉల్లిపాలెం జమీందార్ ఆహ్వానం మేరకు ఉల్లిపాలెంకు వలస వచ్చాడు. తదనంతర కాలంలో రేపల్లెలో స్థిరపడి కడవరకు నటరాజ పదార్చన చేస్తూ, 1956లో నటరాజైక్యం చెందాడు.

మన్నెశ్రీ

రామారావు, ఎన్.టి. (1923-1996) : రంగస్థల, చలనచిత్ర నటుడు. నేషనల్ ఆర్ట్ థియేటర్ స్థాపకుడు, పద్మశ్రీ గ్రహీత. 1923, మే 28న బందరుకు సమీపంలో ఉన్న నిమ్మకూరులో వెంకట్రామమ్మ లక్ష్మయ్య చౌదరి, దంపతులకు జన్మించాడు. చిన్నప్పుడే పెదనాన్న షోకు రామయ్య దగ్గర భారత, భాగవత, రామాయణ విశేషాలను తెలుసుకున్నాడు. విజయవాడ (బెజవాడ)లో కళాశాలలో చదువుతున్న రోజుల్లో ప్రముఖ కవి విశ్వనాథ సత్యనారాయణ ప్రోత్సాహంతో రంగస్థల ప్రవేశం చేశాడు. రాచమల్లుని దౌత్యం అనే ప్రదర్శనలో నాగమ్మ పాత్రను మీసాలు తీయకుండా నటించి మీసాల నాగమ్మగా పేరు తెచ్చుకున్నాడు.

గుంటూరు ఎ.సి. కళాశాలలో చదువుతున్న కాలంలో బలిదానం, మల్లమ్మ ఉసురు, కొండవీడు, నాయకురాలు, రాణా

ప్రతాప్ వంటి నాటకాలలో ప్రధాన పాత్రలలో నటించాడు. కళల పట్ల ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులతో కలసి నేషనల్ ఆర్ట్ థియేటర్ స్థాపించాడు. ఈ సమాజం పక్షాన వేనరాజు విప్లవం అనే నాటకాన్ని ప్రదర్శించాడు. ఈ ప్రదర్శనలో నాడు కళాశాలలో చదువుతున్న ముక్కామల కృష్ణమూర్తి, కొంగర జగ్గయ్యలు కూడా ఎన్.టి.ఆర్. తో కలిసి నటించారు. 1948లో విజయవాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలో చేసిన పాపం నాటిక ప్రదర్శించి ఉత్తమ నటుడుగా బహుమతి అందుకున్నాడు. తరువాతి రోజుల్లో ఎన్.టి.ఆర్. సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగంలో చేరి కొంతకాలం పనిచేసి, ఆ ఉద్యోగంలో కొనసాగక మద్రాసుకు వెళ్లి ఎల్.వి. ప్రసాద్, సి.కృష్ణవేణిల సహకారంతో 'మనదేశం' చలన చిత్రంలో ఇనెస్పెక్టర్ పాత్రలో నటించాడు. ఆ తరువాత దాదాపు 300 చలనచిత్రాలలో నటించాడు. వీటిలో 14 తమిళ చిత్రాలు, మూడు హిందీ చిత్రాలు కూడా ఉన్నాయి. జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాలలో నటించి ఎనలేని కీర్తిని సంపాదించాడు. ఈయన నటించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిని చేశాయి. భాష, కళలు, సంఘ సంస్కృతిని, ఔన్నత్యాన్ని పెంపొందిస్తున్నాయని నమ్మిన ఎన్.టి.ఆర్. కళల వికాసం కోసం 1985లో తెలుగు విశ్వ విద్యాలయం స్థాపించాడు. కొంతకాలం కులపతిగా వ్యవహరించాడు. కళారంగంలో ఎనలేని కీర్తిని సంపాదించిన ఎన్.టి.ఆర్. 1996, జనవరి 18న పరమపదించాడు.

దాసరి.ఎన్.

రామారావు, గేదెల (జ.1945) : రంగస్థల నటుడు, రచయిత, సంగీత విద్వాంసుడు, నాటక విమర్శకుడు.



విజయనగరం జిల్లా రామతీర్థం గ్రామంలో 1945లో శ్రీరాములు, అప్పమ్మ దంపతులకు జన్మించాడు. తొమ్మిదేళ్ళ ప్రాయంలో 1954లో సత్యహరిశ్చంద్ర నాటకంలో లోహితాస్యుడు పాత్ర పోషణతో రంగ ప్రవేశం చేశాడు. అప్పటి నుంచి సత్యహరిశ్చంద్ర, పాండవోద్యోగం, గయోపాఖ్యానం పౌరాణిక నాటకాలలో నక్షత్రకుడు, అర్జునుడు, అశ్వత్థామ, ధర్మరాజు పాత్రపోషణలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఆ రోజుల్లోనే హరికథలు కూడా చెప్పేవాడు. శ్రీకృష్ణార్జున యుద్ధం బుర్రకథ స్వయంగా రచించి, బాణీలు కూర్చి గణపతి నగరంలో ఒక బృందాన్ని కొన్నేళ్ళపాటు నడిపాడు.

రామారావు తెలుగు సాహిత్యంలో పట్టభద్రుడు. వృత్తిరీత్యా తపాలశాఖలో అసిస్టెంటు సూపరింటెండెంట్‌గా పని చేసి 2005లో పదవీ విరమణ చేశాడు. రంగస్థల నటనతో పాటు కర్ణాటక, శాస్త్రీయ సంగీతాలలో, హార్మోనియం, ఫ్లూట్, డోలక్ మొదలైన వాయిద్యాలలో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. పద్య, లలిత, సంగీత సాధన, సంప్రదాయ, ఆధునిక సాహితీ అధ్యయనం, రచనా వ్యాసంగం, సంగీత బాణీల కూర్పు, దర్శకత్వం, చిత్రలేఖనం మొదలైన విభాగాల్లో ఆయన కృషి చేశాడు.

తిరుపతిలో శ్రీవేంకటేశ్వర నాట్యకళాపరిషత్తు నిర్వహించిన నాటక పోటీల్లో పోస్టల్ రిక్రియేషన్ క్లబ్ పతాకంపై సహోద్యోగులు, నటులు ఎస్.ఎల్. నరసింహం, పి.ఆర్. నాయుడు తదితర మిత్రులతో కలిసి పాల్గని ఉత్తమ నటుడు, ఉత్తమ వాచికం మొదలైన అంశాలకు బహుమతులు అందుకున్నాడు. తరువాతి కాలంలో ఇదే కళాపరిషత్తు నిర్వహించిన రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు.

పౌరాణిక నాటకాలే కాక సాంఘిక నాటకాల్లో కూడా పాత్రపోషణ చేసిన విశేషానుభవం ఉంది. సమర్పణ, లంకె *బిందెలు, అగ్గి మీద గుగ్గిలం, ఇదం-అహం, చూడుచూడు నీడలు, అడ్రసు లేని మనుషులు, సమాజం చావనివ్వదు, ఏక్ దిన్ కా సుల్తాన్* మొదలైన నాటక, నాటికల్లో ప్రధాన పాత్రలు, హాస్య పాత్రలు పోషించి అనేక బహుమతులు అందుకున్నాడు. రాయలసీమ నాటకరంగంలో రామారావుకు గల అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని పి.వి. సీతారామయ్య రాసిన పరిశోధన గ్రంథంలో రాయలసీమ నటరత్నాలలో రామారావును ప్రధానంగా పేర్కొనడం జరిగింది.

రామారావు కర్ణాటక శాస్త్రీయ సంగీతంలోను, హిందుస్థానీ సంగీతంలోనూ 100కి పైగా రాగాలను పాడగలడు. పౌరాణిక నాటకరంగం తీరు, పద్యం నడక, నటన మొదలైన అంశాలలో 1955 నుంచి నేటి వరకు పరిణామం చెందిన శైలి భేదాలపై మంచి ప్రజ్ఞ కలిగిన రామారావు పద్యాలకు, పాటలకు బాణీలు సమకూరుస్తాడు. నేపథ్య సంగీతమిస్తుంటాడు. లలిత సంగీతం (గాత్రం), నాటక విభాగాలలో ఆలిండియా రేడియోలో ఆర్టిస్టుగా కొనసాగుతున్నాడు. పద్య నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా వెళ్లిన సందర్భాలలో ప్రదర్శనల తీరుతెన్నులు గురించి విశ్లేషణాత్మక వ్యాసాలు వెలువరించి నటీనటులకు, దర్శకులకు, సాంకేతిక నిపుణులకు గుణదోషాలను వివరించటం ఒక సంప్రదాయంగా పెట్టుకున్నాడు. ఆ వ్యాసాలు చదువుతుంటే 1920-30 ప్రాంతాలలో పసుమర్తి యజ్ఞ నారాయణ శాస్త్రి వంటి పెద్దలు చేసిన నాటక విమర్శలు స్ఫురణకు వస్తాయి. నాటక సాహిత్యం, నటీనటుల అభినయ

రీతులు, సంగీతం, రంగాలంకరణ, రంగోద్దీపనం, ఆహార్యం మొదలైన అంశాలను శాస్త్రీయ పద్ధతిలో వివరించడంలో దిట్ట. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నంది నాటకోత్సవాలలో పద్య నాటక విభాగంలో గుణ నిర్ణేతగా కూడా వ్యవహరించాడు.

వాసన్

రామారావు, జవ్వాది (జ.1941) : నటుడు. సమాజ నిర్వాహకుడు. ఆదెమ్మ, హనుమయ్య దంపతులకు 1941లో జన్మించాడు. స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి గ్రామం. నిడదవోలులో స్థిరపడ్డాడు. ఉద్ధరింపు నాటికతో అతి చిన్న వయసులోనే రంగ ప్రవేశం చేశాడు.

1960లో రాఘవ కళానిలయం సంస్థను స్థాపించి వైవిధ్యంతో కూడిన నాటక, నాటికలను ప్రదర్శించి ప్రశంసలూ, బహుమతులు అందుకున్నాడు. పతిత, ప్రశ్న, కళ్ళు, నూటపదహారు, అన్వేషణ మొదలైన నాటికా నాటకాలను జనరంజకంగా ప్రదర్శించాడు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మధ్య ప్రదేశ్ తదితర రాష్ట్రాలలో కూడా తెలుగు నాటకసౌరభాన్ని గుబాళింప చేశాడు. ఎన్నోచోట్ల అవార్డులు, సన్మానాలు అందుకున్నాడు. చిలకలూరి పేట సాంస్కృతిక సంస్థ నుంచి రంగస్థల కృషీవలుడు అవార్డు (1996), 1977లో కళాసాగర్ (మద్రాసు) రంగస్థల అవార్డు, మద్రాసు తెలుగు అకాడమీ నుంచి గరికపాటి రాజారావు అవార్డు, కళాభారతి (మద్రాసు) సత్కారం అందుకున్నాడు.

1976లో పాలకొల్లు లోనూ, భిలాయ్ లోనూ ఘన సన్మానాలు అందుకున్నాడు. 1985లో శ్రీ కళానికేతన్ హైదరాబాదు జూలూరి వీరేశలింగం కల్చరల్ అవార్డు, యువకళావాహిని (హైదరాబాదు) వారి నటరత్న అవార్డు జవ్వాదిని వరించాయి.

1972లో నిడదవోలులో కోడూరి అచ్చయ్య కళామందిరం పేరుతో ఆరుబయలు రంగస్థలం నిర్మించి భావితరాలకు ఒక స్థిరాస్తిని అందించాడు. రాఘవ కళానిలయం వార్షికోత్సవ సందర్భంలో ప్రతియేటా కళాకారులను సత్కరిస్తూ, వారికి నగదు పారితోషికం కూడా ఇచ్చి, ఇతోధికంగా కళాసేవ చేస్తున్న జవ్వాది చిత్తశుద్ధి, దృఢ సంకల్పం ప్రశంసనీయం.

గం.సు.రె.

రామారావు, బండారు (1932-1977): రంగస్థల నటుడు, ఉపాధ్యాయుడు, శ్రీరామ నాట్యమండలి స్థాపకుడు. ప్రకాశం జిల్లా అద్దంకిలో 1932, ఆగస్టు12న జన్మించాడు. తల్లిదండ్రులు సుబ్బమ్మ, సుబ్బయ్యలు. సుబ్బయ్య ప్రముఖ భాగవతుడు కావడంతో రామారావుకు చిన్నప్పుడే కళల పట్ల ఆసక్తి పెరిగి, నాటకాలలో నటించడం ప్రారంభించాడు. 1952 వరకు బాలమిత్ర నాటక సమాజం (దుద్దుకూరు) పక్షాన నాటకాలలో నటించాడు. ఈ తరుణంలోనే రామారావు ఒంగోలులో శ్రీరామ నాట్యమండలిని స్థాపించాడు. ఈ సమాజంలో డాలు బెంజిమన్, గడ్డం రామానుజులు, యాదల రాజశేఖర్, జి.వి. శేషు, జి. ఆదయ్య కమిటీ సభ్యులు. ఈ సమాజం సత్యహరిశ్చంద్ర, బబ్బిలి యుద్ధం, శ్రీకృష్ణరాయబారం నాటకాలను పలుచోట్ల ప్రదర్శించింది. గుంటూరు సమీపంలోని చెరుకుపల్లిలో శ్రీకృష్ణరాయబారంలోని పడకసీనుకు సంబంధించిన శ్రీకృష్ణపాత్రకు నిర్వహించిన పోటీలో బండారు రామారావుకు ప్రథమ బహుమతి లభించింది. ఈ పోటీలకు సుప్రసిద్ధ నటుడు మాధవపెద్ది వేంకట్రామయ్య న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. తరువాతి కాలంలో బండారు రామారావు వేమూరి గగ్గయ్య, రేలంగి, ధూళిపాళ, పులిపాటి, షణ్ముఖి, ఈలపాటి రఘురామయ్య, బందా కనకలింగేశ్వరరావు, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, అద్దంకి మాణిక్యరావు, చెంచు రామారావు, రేబాల రమణలతో కలిసి కురుక్షేత్రం, గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, భీమాంజనేయ యుద్ధం, పల్నాటి యుద్ధం, బాలనాగమ్మ, విముక్తి, అసూయ మొదలైన పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో విభిన్న పాత్రలలో నటించాడు. శ్రీకృష్ణుడు, హరిశ్చంద్ర పాత్రలు రామారావుకు విశేష ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. రామారావు నటించిన సత్యహరిశ్చంద్ర నాటకం అంటే కాంట్రాక్టర్లకు కాసులపంట పండినట్లే. రంగస్థలంపై పద్యాన్ని చదివి కీర్తి సంపాదించినవారు కొందరైతే పద్యాన్ని పాడి పేరు తెచ్చుకొన్నవారు కొందరు, కాని బండారు సంగీతాన్ని, సాహిత్యాన్ని సమపాళ్ళలో మేళవించి ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. ఈయన 1977లో స్వర్గస్థుడయ్యాడు.

దాసరి. ఎన్.

రామారావు, మద్దాలి (జ.1934) : రంగస్థల నటుడు, దర్శకుడు, సమాజ నిర్వాహకుడు. తూర్పుగోదావరి జిల్లా గణపవరం మండలంలోని జల్లికొమ్మర గ్రామంలో 1934, జూన్ 4 వ తేదీన జన్మించాడు. మహంకాళమ్మ, వెంకన్నలు ఈయన తల్లిదండ్రులు. మద్దాలి పదమూడేళ్ల ప్రాయంలోనే లవకుశ నాటకంలో లవుడి పాత్రను పోషించాడు.

తన తండ్రే నటనలో తొలి గురువు అయినప్పటికీ, నటనలో తనకంటూ గుర్తింపు రావడానికి గుడిపాటి పోతరాజు, ఎ.వి. భద్రం, శృంగారకవి భీమేశ్వరరావు, మద్దెల పంచనాదం, ఎస్.వి.ఎల్ నరసింహాచార్యుల వద్ద శిక్షణ పొందాడు.

రామారావు అభిమానించే పాత్రలు తులసీ జలంధరలో జలంధరుడు, భూకైలాస్ లో రావణాసురుడి పాత్రలు. నటుడిగా ఆ రెండు పాత్రల పట్ల అభిమానం కనబరచినప్పటికీ, విభిన్న నాటకాలలో నటించేటప్పుడు విభిన్న మనస్తత్వం గల పాత్రలను పోషించాడు. పౌరాణిక పాత్రలనే కాదు చారిత్రక, సాంఘిక నాటకాలలోని పాత్రలను అతి సమర్థంగా పోషించి పండిత పామరులను ఉర్రూతలూగించిన నటనా దురంధరుడు.

తాడేపల్లి గూడెంలో స్థిరపడిన తరువాత కళాకారులందరిని ఒక చోట చేర్చి, ఉదయభాను కళానిలయం సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ తరపున అనేక నాటకాలను వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందాడు. కృష్ణలీలలులో శ్రీకృష్ణుడుగా, వీరాభిమన్యులో అభిమన్యుడుగా, గయోపాఖ్యానంలో గయుడుగా, భస్మాసురలో వృకాసురుడుగా, బాలనాగమ్మలో మరాఠిగా, రామరావణ యుద్ధంలో యయాతిగా, రావణ బ్రహ్మగా, అశ్వత్థామగా, కర్ణుడుగా, దుర్యోధనుడుగా, భీముడుగా, ధర్మరాజుగా పౌరాణిక నాటకాలలోని ప్రధాన పాత్రలను పోషించి ప్రేక్షకుల అభినందనలను అందుకున్నాడు. ఇవేగాక బబ్బిలి నాటకంలో పాపారాయుడుగా, పల్నాటి యుద్ధంలో నరసింగరాజుగా, చింతామణిలో బిల్వమంగళుడుగా నటించాడు.

ఉదయభాను కళానిలయం తరపున అనేక నాటకాలు ప్రదర్శించడానికి అవసరమైన నటులను తయారు చేసుకోవడానికి ఒక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. ఈ సంస్థ ద్వారా చాల మంది కళాకారులను నాటక రంగానికి పరిచయం చేశాడు. నాటక సమాజం తరపున పలుప్రాంతాలలో ప్రదర్శనలు ఇవ్వడానికి సమాజానికి ఒక వాహనం ఏర్పాటు చేసుకొన్నాడు. ఈ సంస్థ తరుపున పేద కళాకారులకు ఆర్థిక సహాయం చేయడం, పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను కలుగజేయడం, పేదవిద్యార్థులు చదువుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చూడడం లాంటి సామాజిక పనులు చేపట్టి నాటకసమాజాలవారికి ఆదర్శప్రాయంగా నిలిచాడు.

ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో కూడా నాటకాలు ప్రదర్శించి అక్కడి తెలుగు వారి హృదయాల అభిమానాన్ని కూడా చూరగొన్నాడు.

సమకాలీన నటులు, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, రేబాల రమణ, ఎ.వి. సుబ్బారావు, అమరపు సత్యనారాయణ గుప్త, పి.లక్ష్మణ రావు, గుమ్మడి జయరాజ్, ఆచంట వేంకటరత్నం నాయుడులతో కలిసి అనేక నాటకాలలో నటించాడు. గత అయిదు దశాబ్దాలకు పైగా నాటక రంగానికి విశేషంగా సేవ చేస్తున్న నటుడు మద్దాల రామారావుకు లభించిన బిరుదులు, సన్మానాలు, అసంఖ్యాకం. నటరత్న, రంగమార్తాండ లాంటి బిరుదులతో పాటు ఎస్.వి. రంగారావు అవార్డు కూడా అందుకున్నాడు. తెలుగు దర్బారు కళాసంస్థ (ఏలూరు) ఈయనను ఘనంగా సత్కరించి అభినందించింది.

దాసరి.ఎన్

రామిరెడ్డి, దువ్వూరి (1895-1947) : కవి, నాటక కర్త. కవి కోకిల బిరుదాంకితుడు. నెల్లూరు జిల్లా గూడూరులో 1895, నవంబర్ తొమ్మిదిన లక్ష్మీదేవి, సుబ్బారెడ్డి దంపతులకు జన్మించాడు. కోవూరు తాలూకా పెమ్మారెడ్డి పాళెంలో స్థిరనివాసం. చదివింది 5వ తరగతే అయినా స్వయం కృషితో సంస్కృతం, ఆంగ్లం, పర్షియన్, బెంగాలీ భాషలలో ప్రావీణ్యం సంపాదించాడు. రామిరెడ్డి ఇంగ్లీషులో రాసిన వాయిస్ ఆఫ్ ద రీడ్ అనే కవితా సంపుటి పాశ్చాత్య పండితులచే ప్రశంసించ బడింది. పారశీక భాషనుంచి తెలుగులోకి అనువదించిన పానశాలతో ఈయన మృదుమధుర శైలి రసజ్ఞ లోకానికి తేటతెల్లమైంది. అనేక ఖండ కావ్యాలు రాశాడు. నాటక కర్తగా కూడా ఈయన ఖ్యాతి నార్జించాడు. సీతావనవాసం, కుంభరాణా, మాధవ విజయం నాటకాలూ, కాంగ్రెస్ వాలా అనే నాటికను రచించాడు. పద్య నాటక ప్రదర్శనలు దిగజారి పోతున్న స్థితిని చూసి ఆవేదన చెంది, నాటకరంగంలో తీసుకురావలసిన మార్పులను సూచిస్తూ, నాటక కళాసంస్కరణ అనే పేరుతో విలువైన వ్యాసాలను వెలువరించాడు. ఆ సూచనలు నేటికీ శిరోధార్యం. సాహితీరంగానికి ఎనలేని సేవ చేసిన దువ్వూరి 1947, సెప్టెంబర్ పదకొండున మరణించాడు.

గం.సు.రె.

రామ్మూర్తి, ఉయ్యూరు (జ.1920) : రంగస్థల నటుడు. ఈయన 1920, నవంబర్ 21వ తేదీన ఉయ్యూరు రామ్మూర్తి,

సరస్వతి దంపతులకు గుంటూరు జిల్లా చేబ్రోలులో జన్మించాడు. తన గాత్ర మాధుర్యంతో పద్యనాటక సౌరభాలను తెలుగునాట దశదిశల వ్యాప్తిచెందించిన గాయక రత్నాలలో ఉయ్యూరు రామ్మూర్తి ఒకరు. బాల్యంలో ఊరి బయట కాల్వలోకి ఈతలు కొట్టేందుకు అనునిత్యం తన మిత్రులతో వెళ్ళి రామ్మూర్తి పద్యాలు కూనిరాగాలు తీస్తుండే వాడు. ఈ కూనిరాగాలు ఒకనాడు ఆనాటి రంగస్థల దిగ్గజాలైన ఉప్పలూరి సంజీవయ్య, వి.వి. సుబ్బయ్య (యముడు ఫేం) చెవిన పడ్డాయి. రామ్మూర్తి గాత్ర మాధుర్యానికి ముగ్ధులై నాటకరంగంలోకి రమ్మని ఆహ్వానించారు. ఆ అయాచిత వరాన్ని అందిపుచ్చుకొని రామ్మూర్తి తొలిసారిగా వారి శిక్షణలోనే మొట్టమొదటగా 1940లో శ్రీకృష్ణరాయబారం లో సహదేవునిగా రంగస్థల ప్రవేశం చేశాడు.

1958 నుంచి 1960 మధ్య కర్ణుడు, బిల్వ మంగళుడు వంటి పాత్రలలో పలు ప్రదర్శనల్లో అబ్బూరి వరప్రసాదరావు, పులిపాక వెంకటప్పయ్య, అంబటి రామకోటేశ్వరరావుల సరసన నటించి తన గాన మాధుర్యంలో ప్రేక్షకులను అలరించాడు.

బాపట్లలో కె.ఎస్.టి. సాయి నిర్వహించే ఫైన్ ఆర్ట్ థియేటర్స్‌లో చేరి ఆయన దగ్గర వాచికాభినయంలో శిక్షణ పొందాడు. 1963లో గుంటూరులో జరిగిన పాండవోద్యోగ విజయాలు నాటక పోటీలలో కె.ఎస్.టి. శాయి దర్శకత్వంలో కర్ణుడి పాత్రలో నటించి బహుమతితో ప్రేక్షకుల ప్రశంసలకు పాత్రు డయ్యాడు. సి.హెచ్. జగన్నాథరావు, కె. రఘురామయ్య, ఎ.వి. సుబ్బారావు, షణ్ముఖి ఆంజనేయరాజు, ఎన్.వి. సుబ్బారావు వంటి రంగస్థల దిగ్గజాల సరసన వందలాదిసార్లు కర్ణుడి పాత్రను పోషించి పండిత పామరులను రంజింప చేశాడు. అనంతర కాలంలో కె.ఎస్.టి. శాయి దర్శకత్వంలోనే బబ్బిలి యుద్ధంలో తాండ్రపాపారాయుని పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేశాడు. వందలాది ప్రదర్శనలలో పాపారాయుని పాత్ర పోషించాడు.

ఇంకా హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు, మాల్యవంతుడు, యయాతి, భృగు మహర్షి పాత్రలు పోషించి, ఆయా పాత్రలలో తనదైన శైలిలో రాణించాడు. నటజీవితంలో దాదాపు వెయ్యి ప్రదర్శనలు ఇచ్చిన ఈ గాయక నటరత్నం నేటికీ అలుపెరగక అవకాశం వచ్చినప్పుడల్లా నటిస్తూనే కళాసేవ చేస్తున్నాడు. 1942లో పోలీసు శాఖలో చేరిన రామ్మూర్తి 1976లో పదవీవిరమణ చేసి బాపట్లలో స్థిరపడ్డాడు.

మన్నెశ్రీ

రామ్మూర్తి, గరిమెళ్ల (1936-2004) : నటుడు, నాటక సమాజ నిర్మాత. ఈయన 1936లో జూలై 4న విజయనగరంలో మహాత్మాపహుల ఇంట జన్మించాడు. తండ్రి జగన్నాథరావు, తల్లి వెంకటలక్ష్మి. హైస్కూలు రోజుల్లోనే చిలకమర్తి ప్రహసనం బధిర చతుష్టయం లో వేషం వేశాడు. బి.ఏ. చదువుతుండగానే నాబాబు నాటకంలో వేషం వేసి శభాష్ అనిపించుకున్నాడు. రావి కొండల రావు స్థాపించిన యంగ్ మెన్స్ డ్రమెటిక్ అసోషియేషన్‌లో చేరి పరిష్కారం, సుడిగాలి, కుక్కపిల్ల దొరికింది మొదలైన నాటికల్లో నటించాడు. ఆయన మొదటి గురువు రావికొండలరావు.



విజయనగరంలో రాఘవ నాటకోత్సవాలలో కుక్కపిల్ల దొరికింది లో వేషానికి ఉత్తమ నటుడి బహుమతి పొందాడు. సుప్రసిద్ధ రంగస్థల, సినీ నటులు జె.వి. సోమ యాజులు, రమణమూర్తి నటరాజకళా సమితిలో కప్పలు, ఈ ఇల్లు అమ్మ బడును వగైరా ప్రదర్శనల్లో పాల్గన్నాడు.

1957లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలోచేరి కె.వి. గోపాలస్వామికి ఆప్తుడై నాడు. ఆయన దగ్గర రంగస్థల సాంకేతిక పరిజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన అలవాటు చేసుకున్నాడు. ఢిల్లీలో జరిగిన నాల్గవ అంతర్ విశ్వవిద్యాలయాల యువ జనోత్సవాల్లో నటన నాటికలో పాల్గని ప్రశంసలతో పాటు వి.ఎస్.క్రిష్ణ ఉత్తమ నటుని బహుమతి పొందాడు. తరువాత పరివర్తన, హిరణ్యాకశిపుడు మొదలైన నాటకాల్లో పాల్గన్నాడు.

ఉద్యోగ రీత్యా 1960లో హైదరాబాదు చేరుకున్న రామ్మూర్తి అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో సీనియర్ అకౌంట్స్ ఆఫీసరుగా చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ సహాయ సలహాదారుగా పదవీ విరమణ చేశాడు. ఉధృతంగా నాటకాలు వేస్తున్న విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్‌లో చేరి ఇదేమిటి, అరణి, పుణ్యస్థలి, మరోమొహెంజదారో, నిజం, డామిట్! కథ అడ్డం తిరిగింది మొదలైన నాటకాల్లో జె.ఎల్. నరసింహారావు, చాట్ల శ్రీరాములు, డి.వి. సుబ్బారావు, ఓ.రామ్మూర్తి, ఇ.ఎల్. నరసింహారావు, జన్నలగడ్డ సదాశివరావు మొదలైన దిగ్గంతులతో కలిసి నటించాడు. మరో మొహెంజదారో నాటకంలో భిక్షాలు పాత్రకి ఇప్పటికీ రామ్మూర్తి పేరు చెప్పుకుంటారు.

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీలో 1975 నుంచీ మూతపడేవరకూ కార్యవర్గ సభ్యుడిగా చేశాడు. ఆంధ్రప్రదేశ్ నృత్య అకాడమీ, నాటక అకాడమీలలో సభ్యుడిగా ఎన్నో సమాజాలకు చేయూతనిచ్చాడు.

1970లోనూ, 1982లోనూ హైదరాబాదులో జానపద ఉత్సవాలకు కన్వీనరుగా పనిచేశాడు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సాంస్కృతిక సమాఖ్యకు కార్యదర్శిగా 18 సంవత్సరాలు పనిచేసి తెలుగు, తెలుగేతర భాషలలో నాటక పోటీలు నిర్వహించాడు.

మద్రాసు తెలుగు అకాడమీకి ఉపాధ్యక్షుడు. భారత కల్చరల్ ఇంటిగ్రేషన్ కమిటీ నిర్వహించిన ఐక్యతారాగ ఉత్సవాల ప్రోగ్రామ్‌కు ఎగ్జిక్యూటివ్ గా పనిచేశాడు. ఆ సంస్థ దేశవ్యాప్తంగా 30 కార్యక్రమాలు నిర్వహించింది.

ప్రతిష్ఠాత్మకమైన జూలూరి వీరేశలింగం అవార్డు (1986), మద్రాసు తెలుగు అకాడమీ పురస్కారం (1989), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం (1991) మొదలైన ఎన్నో పురస్కారాలు అందుకున్న గరిమెళ్ల రామ్మూర్తి 2004 జూలై 3న పరమపదించాడు.

అడబాల

రాయ్, ద్విజేంద్రలాల్ (1863-1916) : నాటకకర్త. గేయకవి, దేశభక్తుడు. ఈయన 1863లో కలకత్తాలో జన్మించాడు. తండ్రి కార్తిన్ చంద్రరాయ్.

ద్విజేంద్రలాల్ రాయ్ 1884లో కలకత్తా ప్రెసిడెన్సి కాలేజీలో ఎం.ఏ. పట్టం, లండన్‌లోని వ్యవసాయ కళాశాల నుండి వ్యవసాయ పట్టా పొందాడు. ఎఫ్ .ఎఫ్.ఆర్, ఏ.ఎస్, ఎం.ఆర్.ఎస్. పదవులను చేపట్టాడు.

ఈయన నాటకాలలో వీరరసం, దేశభక్తి, జాతీయత ఉప్పొంగుతుంటాయి.వీరి నాటకాల ప్రభావం భారతీయుల మీద,భారతీయ సాహిత్యం మీద ఎంతోగానో పడింది. ఈయన నాటకాలు భారతీయ భాషలనేగాక విదేశీభాషలలో కూడా అనువదితమయ్యాయి. ఈయన చారిత్రాత్మక నాటకాలు ఎక్కువగా రచించాడు.

శ్రీపాద కామేశ్వరరావు, జంధ్యాల శివన్న శాస్త్రి, నందూరి శివరావు, దినవహి సత్యనారాయణ ప్రభృతులు ద్విజేంద్రలాల్ నాటకాలను ఎక్కువగా తెలుగులోకి అనువదించారు.

చంద్రగుప్త, షాజహాన్, మేవాడ పతనం, దుర్గాదాస్, రాణా ప్రతాపసింహ, సోహరాబ్-రుస్తుం, భారత రమణి, సీత, అహల్య, తగిన శాస్తి. మొదలైన నాటకాలు రచించిన రాయ్ 1913లో మరణించాడు.

శ్రీ.చ.

రాయల్ ఆర్ట్ థియేటర్స్ : ఈ సమాజాన్ని 1936లో అర్వపల్లి సుబ్బారావు నరసరావుపేటలో స్థాపించాడు. ఈ సమాజంలో కొప్పరపు పురుషోత్తమరావు, ఆకుల వెంకయ్య, సూరవరపు వేంకటేశ్వర్లు, చీరాల సుబ్బయ్య, కె.రాఘవ రావు, డి. చంద్రం, బి.వి. రాజు, పోలేపెద్ది లక్ష్మీకాంతం, శివకుమారి, ఎం.ఆర్. తిలకం, వసంతకుమారి, గంగారత్నం, లతా లక్ష్మి మొదలైన వారు నటీనటులుగా పనిచేశారు. చింతామణి నాటకాన్ని కొన్నివేల పర్యాయాలు ప్రదర్శించారు. ఆ నాటకాన్ని కమర్షియలైజ్ చేసి, సుబ్బిశెట్టి పాత్ర పోషించి, ఆ నాటకం బహుళ ప్రచారం, ప్రజాదరణ పొందడానికి ముఖ్య కారకుడయ్యాడు. *చింతామణి, కన్యకాపరమేశ్వరి చరిత్ర, రంగూన్ రౌడి, సాని-సంసారి, ప్రేమలీల* నాటకాల్ని ప్రదర్శించాడు.

నే.ప.శ

రాయల్ థియేటర్ : ఈ సమాజాన్ని 1904లో బందరులో స్థాపించారు. ముంజులూరి కృష్ణారావు, బుజ్జా రాఘవాచార్యులు ఈ సమాజానికి వ్యవస్థాపకులు కాగా, పింగళి వెంకటనరసయ్య, పింగళి లక్ష్మీకాంతం, పింగలి వీరయ్య ప్రభృతులు ప్రధాన నటులు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి దర్శకుడు.

ఈ సమాజంలోని నటులంతా విద్యావంతులు. చెళ్లపిళ్ల దర్శకత్వంలో కట్టుదిట్టంగా నాటకాలు ప్రదర్శించేవారు. బందరులో 1915-16లో జరిగిన *రసపుత్ర విజయం, వేణీ సంహారం* నాటక పోటీలలో ఎక్కువ బహుమతులు ఈ థియేటర్ వారికే లభించాయి. పాండవ నాటకాలు ఈ సమాజం ప్రదర్శిస్తే చూడాలనేటంత పేరు ప్రతిష్ఠలు లభించాయి. పింగళి లక్ష్మీకాంతం, ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాలలోని తిరుపతి తెలుగు శాఖలకు అధ్యక్షుడుగా పనిచేశాడు.

ఈయన రచించిన *పాండవ జననం, పాండవ వనవాసం, పాండవ ఉద్యోగం, పాండవ విజయం, అశ్వమేధం, సంపూర్ణ మహాభారతం, పండిత రాజం, అనర్ఘ నారదం, వేణీ సంహారం, రసపుత్ర విజయం, గయోపాఖ్యానం* మొదలైన నాటకాలను రాయల్ థియేటర్ ప్రదర్శించింది.

శ్రీ.చ.

రావు, సి.ఎస్ (జ.1936) : నటుడు, నాటక రచయిత, కథకుడు, నవలా రచయిత. ఈయన పూర్తి పేరు చింతపెంట సత్య నారాయణరావు. నాటకరంగానికి సి.ఎస్. రావుగా



సుపరిచితుడైన ఈయన తూర్పు గోదావరి జిల్లాలోని మాధవరాయుడు పాలెంలో ఫిబ్రవరి 9, 1936లో పుట్టాడు. రాజమహేంద్రవరం, కాకినాడలలో చదువుకున్నాడు. సాగర్ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. పూర్తిచేశాడు. 1973 వరకు నటుడుగా, దర్శకుడుగా పరిచయమైన సి.ఎస్ రావు, 1973లో ఊరుమ్మడి బతుకులు నాటికతో రచయితగా వెలుగులోకి వచ్చాడు. ఆంధ్రదేశంలోని మారుమూల పల్లెల్లో బడాబాబుల పెత్తనం, వారి నీడన జీవనం గడిపే నిరుపేదల పరిస్థితులను చక్కగా ఆవిష్కరించిన ఈ నాటికను 1983లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్తమ రచనగా ఎంపికచేసింది. ఈ పరిషత్తు పక్షాన ఆంధ్రరాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రదర్శింపబడింది. ఈ నాటికకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ రచనగా అవార్డు ఇచ్చింది. ఈ నాటిక సినిమాగా రూపొందించడం వల్ల అఖిల భారతస్థాయిలో గుర్తింపబడింది. 1975లో ప్రాణం ఖరీదు నాటికను రచించాడు. నేటి సమాజంలో ఒక పేద పిల్ల శీలం ఖరీదు పాతిక రూపాయలు, గొప్పింటి స్త్రీ అవినీతి ఖరీదు ఒక పేద వాడి ప్రాణం అనే నగ్న సత్యాన్ని తెలిపిన నాటిక ప్రాణం ఖరీదు. ఈ నాటికకు కళాసాగర్ అవార్డు లభించింది. 2000లో నంది నాటక పోటీలలో మళ్ళీ ఎప్పుడొస్తారు నాటికకు ఉత్తమ రచనకు బహుమతి లభించింది. ఇవేకాకుండా *మానాన్న కావాలి (1980)*, *కళ్లు తెరవండిరా (1980)*, *కోతికి కొబ్బరికాయ (1980)*, *ఇప్పుడు వీస్తున్న గాలి (1984)*, లవ్ పాఠాలు మొదలైన నాటక, నాటికలు నేటికి సామాజికుల స్మృతిపథంలో మెదలుతున్నాయి. ఈయన నాటకాలు ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రసారమయ్యాయి. ఈయన ఆంధ్ర సాహిత్యానికి ఎనభై కథలు, ఎనిమిది నాటికలు, రెండు నాటకాలు, ఇరవై రేడియో నాటకాలే కాకుండా నాలుగు సినిమాలకు కథలు, మాటలు రాశాడు.

ఆంధ్రజ్యోతి నవలా ప్రియదర్శిని పోటీలలో సి.ఎస్.రావు రచించిన రాలిపువ్వు కు ప్రథమ బహుమతి, ప్రశ్న అనే కథకు యువ మాసపత్రిక చక్రపాణి అవార్డు లభించాయి.

దాసరి.ఎన్

రావు సి.వి.కె. (1929): నటుడు, పరిషత్తు నిర్వాహకుడు. పూర్తిపేరు చింతల చెరువు వెంకటకృష్ణారావు. ఖమ్మం జిల్లాలోని చర్లమండలం లంగాపురం గ్రామంలో మే 31, 1929 న జన్మించాడు. తల్లిదండ్రులు చిన్నప్పుడే మరణించడంతో కృష్ణారావు పిన తల్లిదండ్రులైన మహాలక్ష్మమ్మ, వెంకటాద్రిల దగ్గర పెరిగాడు. కృష్ణారావు ఎలిమెంటరీ విద్య చర్ల, తర్వాత ఏలూరుల్లోను, కాలేజి చదువు సి. ఆర్. రెడ్డి కళాశాలలోను పూర్తిచేశాడు. చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన మిత్రులతో కలసి 'సాహితి' అనే రాత పత్రిక నడిపాడు. స్థానిక రాజకీయాల్లో పాల్గన్నాడు. సహకార బ్యాంకు, విద్యాసంస్థల స్థాపనకు కృషి చేశాడు. సి.వి.కె. రావు 1942వ సంవత్సరంలో 'పారిజాతాపహరణం'లో సత్యభామ పాత్రలో నటించారు. ఇదే ఆయన మొదటి ప్రదర్శన ఆ తరువాత 1947 ఆగస్టు 15వ తేదీన చర్లలో వేదాంతకవి రచించిన 'తెలుగుతల్లి'లో శనేశ్వరరావు పాత్ర, 1950వ సంవత్సరంలో ఆత్రేయ రచించిన ఎన్.జి. ఓ. నాటకంలో రంగనాథం పాత్రలో నటించారు. ఆ నాటకాలవల్ల ఆయన అశేషప్రేక్షకుల నీరాజనాలు అందుకున్నాడు. క్రమంగా కృష్ణా రావు మంచి నటుడుగా పేరు తెచ్చుకున్నాడు. తరువాతి కాలంలో కృష్ణారావు 'కులం లేని పిల్ల' పల్లెపడుచు, దొంగవీరడు, బలిదానం, మా ఊరు, ఆంధ్రజ్యోతి, గుడ్డిలోకం, కాబూలీవాలా, మహనీయులు, తెలుగు కోసం మొదలైన నాటకాల్లో విభిన్న పాత్రలలో నటించారు. ఈయనకు 'గుడ్డిలోకం' లోని చంద్రం పాత్ర ఎనలేని కీర్తి తెచ్చిపెట్టింది. మురళీ మనోహర నాట్యమండలి ప్రదర్శించిన నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషంచడమే గాకుండా ఆ నాటకాలకు దర్శకత్వ బాధ్యతలు కూడా ఆయనే నిర్వహించారు.

మిత్రులతో కలిసి 1980లో 'గౌతమీ నవ్యసాహిత్యసమితి' అనే సంస్థను నెలకొల్పాడు. ఈ సంస్థకు అధ్యక్షుడిగా సాహితీ కార్యక్రమాలు నిర్వహించి. సుప్రసిద్ధ కవులను సత్కరించాడు. ఆ తరువాత కళాంజలి అనే సంస్థను స్థాపించి, ఆ సంస్థ తరఫున సుమతి (నాటిక), వలయం, ఒంటెద్దు బండి (నాటకం) మృగమైదానం (నాటిక)లలో ప్రధాన భూమికలను పోషించడమేగాక, దర్శకత్వ బాధ్యతలు గూడా నిర్వహించాడు. ఈ నాటకాల్ని మన రాష్ట్రంలోనే కాక, లక్నో, అలహాబాద్ (ఉత్తర ప్రదేశ్), కటక్ (ఒరిస్సా)లలో కూడా ప్రదర్శించాడు, ఉత్తమ ప్రదర్శన బహుమతులు అందుకున్నాడు.

సి.వి.కె. రావుకు నాటక రంగం పట్ల మక్కువ ఏర్పడడానికి ప్రధాన కారకులు చుక్కబట్ల సత్యనారాయణ శాస్త్రి, నందీ

శ్వరుడు, రాఘవ రావు, పుట్టా నారాయణమూర్తి చౌదరి, స్థానం, మాధవ పెద్ది, గరికపాటి మొదలైనవారు. ఈయనకు నటనలో మెళకువలు నేర్పిన గురువులు కె. వేంకటేశ్వరరావు. నాటకంలేని జీవితంలేదు. జీవితంలేని నాటకం ఉండదు. అందుకే నాటకాలను విరివిగా ప్రదర్శించాలి, ప్రేక్షకులను ఆలోచింపచేయగలిగే నాటకాలను ప్రదర్శించాలి. నాటక రంగానికి దూరమవుతున్న నేటి తరాన్ని మంచి నాటకాల ద్వారా చైతన్యవంతుల్ని చేయాలనే దృక్పథంగల చింతల చెరువు కృష్ణారావు జంగిల్ క్లబ్‌చర్ల ద్వారా రాష్ట్రస్థాయిలో ఏడు నాటక పరిషత్తులు నిర్వహించారు. రంగస్థల శిక్షణా శిబిరం ఏర్పాటు చేసి ఆయన ఎందరో యువ కళాకారులను పరిచయం చేశాడు. 1997 నుండి డాక్టర్ డి. ఎన్. కుమార్ (హైదరాబాద్) సహకారంతో దేవభక్తుని నందీశ్వరుడు స్మారక నాటక కళాపరిషత్తు నిర్వహిస్తున్నాడు. ఈ నాటక పరిషత్తు పక్షాన నాటక పోటీలు ఏర్పాటు చేశాడు. ఒకే వ్యక్తి ఒకేచోట పదకొండు రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహించి నాటకోద్యమానికి కృషిచేసిన కళాకారుడు.

దాసరి ఎన్.

రావూజీ (జ.1938) : నటుడు, దర్శకుడు, ప్రయోక్త, నాటక రచయిత. అసలు పేరు కోట అప్పారావు. ఈయన 1938, నవంబరు 7న విశాఖపట్నం జిల్లా మాడుగులలో జన్మించాడు. వృత్తిపరంగా షిప్పింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నా ప్రవృత్తి మాత్రం నాటక రంగం కోసం పనిచేయడం.

1944 నుండి నటన, దర్శకత్వం, నిర్వహణ, రచన, అనే నాలుగు రంగాల్లో నాటకరంగానికి సేవ చేస్తున్న రావూజీ 1993 నుండి విశాఖపట్నంలో నెలవారి నాటక ప్రదర్శనలు నిరాటంకంగా నిర్వహించడం విశేషం. ఈయన మనోరమ, దొరికితే దొంగలు, ఆరణి, మరో మొహెం జదారో, తరంగాలు మొదలైన నాటకాలలో ఆడది, ఇండియా టుడే, డిటెక్టివ్, దొంగ, వార ఫలితాలు, అపస్వృతులు, ఇంటి దొంగలు, వాన వెలిసింది, మనిషి చావకూడదు, పుణ్యస్థలి, కింకర్తవ్యం, వయసు-మనసు వంటి నాటికలలో నటించాడు. ఆకాశవాణి ప్రసారం చేసిన అనేక నాటకాలలో ప్రధాన భూమికలలో నటించాడు.



మనోరమ నాటకాన్ని, కిం కర్తవ్యం, వయసు-మనసు నాటికలను రచించాడు. చిత్ర పరిశ్రమలో ప్రవేశించి 'సంసారం, పొగరుబోతు, మాపల్లెలోగోపాలుడు, ప్రతిఘటన, అడవి దివిటీలు, లాల్‌సలామ్' మొదలైన సినిమాలలో నటించాడు. సుధాబిందువులు సినిమా నిర్మించాడు. రాష్ట్రంలోని వివిధ పరిషత్తులు నిర్వహించే నాటక పోటీలలో గుణనిర్ణేతగా వ్యవహరించాడు. అప్పాజోస్యుల- విష్ణుభట్ల ఫౌండేషన్ (అమెరికా) రాష్ట్ర స్థాయిలో నిర్వహించే నాటక పరిషత్తు కార్యక్రమాలకు 1998లో కన్వీనరుగా వ్యవహరించాడు. రంగస్థలానికి రావూజీ చేసిన కృషి ప్రశంసనీయం. 2005లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్టపురస్కారం లభించింది.

దాసరి.ఎన్

రువెదా, లోపె(1510-1565) : స్పానిష్ నాటక రచయిత. ఈయన 1510లో సెవిల్ నగరంలో జన్మించాడు. స్పానిష్ నాటకరంగం వికాసానికి గొప్పకృషి చేశాడు. ప్రజాబాహుళ్యానికి నాటక రంగంతో సాన్ని హిత్యాన్ని ఏర్పరచాడు. ఇటాలియన్ నటులు నాటకాలు వేస్తూ స్పెయిన్ దేశంలో నిర్వహించిన ప్రదర్శనలతో ప్రభావితుడై రువెదా తానే ఒక సంచార నాటక సమాజాన్ని ఏర్పరచి దానికి రచయిత, యజమాని గాను బాధ్యతలను చేపట్టాడు. స్పెయిన్ దేశమంతటా ఆబాల గోపాలం ఆనందించే నాటకాలను ప్రదర్శించాడు. రెండవ ఫిలిప్ చక్రవర్తి నుంచి సామాన్య గ్రామీణ ప్రజానీకం దాకా అందరూ రువెదా నాటకాలను చూచి ఆనందించేవారు. సెర్వాంటిస్ వంటి మేధావులు కూడా రువెదా నటనను, పద్యరచనను ప్రశంసించారు. పాసోస్ అనే హాస్య ప్రధానమైన ప్రవేశికలను తన నాటకాలలో పరిచయం చేసి నూతన ప్రయోగం చేశాడు. పాసోస్ నిత్య జీవితంలోని కొన్ని ఘట్టాలను ఆధారంగా తీసుకొని హాస్య ప్రధానంగా ఖండికలు రాశాడు. అందరికీ పరిచితమైన పాత్రలనూ, సహజమైన వ్యావహారిక భాషనూ ప్రవేశపెట్టి, స్పానిష్ నాటకరంగానికి ప్రాణం పోశాడు. కామెడియాస్ మెడోరా, ఐరెర్మలినా, యూఫెమియా, లాస్ ఎంగనాడోస్, కమిలాటింబిరా, పెండస్‌ద అయోర్ మొదలైనవి ఇటాలియన్ నాటకాల ప్రభావంతో రాయబడినవే. కోర్డోబా నగరంలో 1565లో రువెదా మరణించాడు.

శ్రీ.చ.

రూపకం : భరతుడు 'దశ రూపములు' అని పేర్కొన్నదానిని అభినవగుప్తుడు 'దశ రూపకములు' అని పేర్కొన్నాడు. వామనుడు, ధనంజయుడు కూడా ఈ రూపక శబ్దాన్నే పరిగ్రహించారు. ధనంజయుని కాలం నాటికి రూపం అనే పదం మరుగునపడి రూపకమనే పదమే వాడుకలోకి వచ్చింది. అవస్థానుకరణం నాట్యం. అది దృశ్యమానం అయినపుడు రూపకమవుతుంది. శ్రీరాముడు మొదలైన దివ్యపురుషుల రూపాన్నినటునిలోఆరోపించిబడటంవల్ల అది రూపకమవుతుంది.

శ్రీ.చ.

రేకందర్ భోజరాజు, సురభి. (మ.2005): రంగస్థల నటుడు. సురభి సమాజంలో పెద్దదిక్కుగా ఉంటూ అరవై ఏళ్లుగా నాటకాల్లో నటిస్తూ ప్రజల మన్ననలను అందుకున్న సీనియర్ నటుడు. ఆయన ప్రతినాయక పాత్ర పోషణకు పెట్టింది పేరు. మాయలఫకీర్, ఘటోత్కచుడు, కంసుడు, దుర్యోధనుడు, హిరణ్యకశ్యపుడు, యముడు వంటి పాత్రల్లో అద్భుతంగా రాణించి ఆ పాత్రలకు వన్నె చేకూర్చిన నట కేసరి. చింతామణి, *రంగూన్ రౌడి, బస్తీ దేవత యాదమ్మ* వంటి సాంఘిక నాటకాల్లోనూ, చండీప్రియవంటి కాల్పనిక నాటకాల్లోనూ, బబ్బిలి యుద్ధం వంటి చారిత్రక నాటకాల్లోను సమప్రతిభను చూపిన మేటి నటుడు.

2005 సెప్టెంబరులో విశాఖపట్నంలో నాటక ప్రదర్శన కోసం వెళ్ళిన రేకందర్ హఠాత్తుగా జబ్బు పడి అక్కడే కన్నుమూశాడు.

గం.సు.రె.

రైస్, ఎల్మర్ (1892-1967) : అమెరికా నాటక కర్త. 1892లో జన్మించాడు. నగరంలో జరిగే నాటక ప్రదర్శనలను అప్పుడప్పుడు తండ్రితో కలిసి చూసే అలవాటు క్రమక్రమంగా అతనిలో నాటకాభిరుచిని పెంపొందించింది. హైస్కూలు చదువును మధ్యలోనే ఆపి వ్యాపారంలోచేరాడు. కొన్నాళ్లకు వ్యాపారం వదిలేసి న్యాయస్థానంలో గుమాస్తాగా చేరాడు. ఈ అనుభవం నాటక రచయితగా ఈయనకు ఎంతో ఉపకరించింది.



రాత్రి స్కూలులో చదివిన న్యాయశాస్త్రంలో పట్టభద్రుడయ్యాడు. ఆ వృత్తిలో అంతగా రాణించలేక పోయాడు. నాటక రచయితగా జీవనం సాగించాలని నిర్ణయించుకొన్నాడు. నాటక రచనా వ్యాసంగం ఉధృతం చేశాడు. చాలకాలం వరకు ఈయన నాటకాలేవీ బ్రాడ్వేలో ప్రదర్శించబడలేదు. న్యాయస్థానం, న్యాయ నేపథ్యంగా 1914లో ఆన్ ట్రయల్ అనే నాటకాన్ని రాశాడు. ఈ నాటక ప్రదర్శన రైస్ కూడా ఊహించనంత విజయవంతం అయింది. నాటకాభిమానులు ఈయన నాటక ప్రదర్శనా ధోరణిని కొనియాడారు. అమెరికా మొదటి ప్రపంచయుద్ధంలో తలదూర్చటాన్ని రైస్ వ్యతిరేకించాడు. యుద్ధవ్యతిరేక నాటకాలు రెండు రాశాడు. ఐరన్ క్రాస్, ది హూమ్ ఆఫ్ ది ఫ్రీ. ది ఏడింగ్ మిషన్ అనే నాటకం 1923లో వెలువడి, ఈయనకు అంతర్జాతీయ కీర్తి తెచ్చి పెట్టింది. అదే సంవత్సరం ప్రదర్శితమైన ఈ నాటకంలో శిల్పం అపూర్వమైనదనీ, ఎక్కడా అంతకు ముందు రాలేదనీ, నూతన సృష్టి అని విమర్శకులు ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికాలో తొలి అభివ్యక్తివాద (ఎక్స్‌ప్రెషనిస్టు) నాటకం ఏడింగ్ మిషన్ అని కీర్తించారు. సమకాలీన కాలానికన్నా ముందున్న నాటకం అన్నారు. స్ట్రీట్‌సీన్ (1929) అనే నాటకంలో న్యూయార్క్ పట్టణజీవితాన్ని అత్యంత సహజంగా, వాస్తవికతా వాద (రియలిస్టు) ధోరణిలో చిత్రించాడు. 40 పాత్రలున్న ఈ నాటకంలో ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టంగా తీర్చిదిద్దాడు. పారిశ్రామికీకరణ, వ్యాపారీకరణ, యాంత్రికత మొదలైన అంశాలతో, 1931లో రైస్ రాసిన కౌన్సిలర్ ఎట్ లా, ఆర్థికమాంద్య పరిణామాల్ని చిత్రించిన ఉయ్ ద పీపుల్ నాటకాలని ఫ్రెంచి ప్రజలు నిరాకరించారు. అయితే ఎల్మర్ రైస్ తన విమర్శకులను ఎన్నడూ పట్టించుకోలేదు. ఈయన నాటకాలలో పాత్రగత హాస్యం పుష్కలంగా కన్పిస్తుంది. పాత్రల స్వభావాలను చిత్రించటంలో రైస్ ప్రత్యేకంగా సిద్ధహస్తుడు. *ది లివింగ్ థియేటర్* గ్రంథాన్ని రచించాడు.

రైస్ ఒకే ధోరణిలో నాటకాలు రాయలేదు. రంగస్థల మాధ్యమంతో సామాజిక న్యాయం కోసం పోరాటం సలిపాడు. ఆన్ ట్రయల్ నాటకంలో అమెరికాలో తొలిసారిగా ఫ్లాష్ బ్యాక్ టెక్నిక్‌ను ప్రవేశపెట్టాడు. రైస్ 1967లో మరణించాడు.

క.మ.రా.

రౌద్రరసం : రస సంబంధి. నవరసాలలో ఒకటి. ఇది క్రోధమనే స్థాయి భావం నుంచి పుడుతుంది. ఇది రాక్షసుల, దానవుల, ఉద్ధతమనుషుల ప్రకృతులకు సంబంధించి ఉంటుంది. సంగ్రామం వల్ల జనిస్తుంది. క్రోధం, అధర్షణం, అధిక్షేపం, అవమానం, అసత్యవచనం, ఉపఘాతం, వాక్పారుష్యం, అభిద్రోహం, అసూయ మొదలైన విభావాలతో రౌద్రరసం ఉత్పన్నమవుతుంది. కొట్టడం, విరచడం, మర్దించడం, నరకడం,

శస్త్రాలను ఉపయోగించడం, రక్తం స్రవింపచేయడం మొదలైనవి దీని అనుభవాలు.

శ్రీ.చ.

లక్ష్మణస్వామి, ఈవెన (1864-1913): రంగస్థల నటుడు. 1864లో కొత్తపల్లి గ్రామంలో జన్మించాడు. బందరు బుట్టయ్య పేట కంపెనీ అనే నేషనల్ థియేటరులో నాయక పాత్రధారి. హిందీనటుడు.

ఆంగ్లంలో లోయర్ సెకండరీ వరకు చదివాడు. పార్సీ, హిందీ, ఉర్దూ భాషలలో పండితుడు. కొంతకాలం బందరు ముస్లిం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, మరి కొంత కాలం విక్టోరియా పబ్లిక్ లైబ్రరీలో గుమస్తాగా పనిచేశాడు.

సుందర విగ్రహ రూపం, దృఢకాయం, కోర మీసాలు, విశాల ఫాలభాగం, వివిధ భావాలను ద్యోతకం చేయగల, ఒక్క క్షణంలో విస్ఫులింగాలు గక్కి మరుక్షణంలో దుఃఖాశ్రువులను, ఆ మరుక్షణంలో శాంత, భక్తి భావాలను ప్రస్ఫుటితం చేయగల నేత్రబింబం, వీటినన్నింటిని మించి అసమాన కృషి లక్ష్మణస్వామిని మహానటునిగా తీర్చిదిద్దాయి.

ఈయనకు వీర, రౌద్రాలు అభిమాన రసాలు. మహారాష్ట్ర రసపుత్ర గాథలు, వీరులు అంటే అభిమానం. అందుకే మహారాష్ట్ర రసపుత్ర వీరగాథలను నాటకాలుగా ఎక్కువగా ప్రదర్శించాడు. మహారాష్ట్ర రసపుత్రుల ప్రవత్తి, వారి ఆచార వ్యవహారాలు, ఆహార్యం గ్రహించడానికి ఆంగ్లంలోని గ్రంథాలు చదివించుకొని, వాటిని అర్థం చేసుకొని ఆయా పాత్రలను ఎంతో శ్రద్ధతో అధ్యయనం చేసేవాడు. ఆ ఇంగ్లీషు గ్రంథాలలోని చిత్రాలను ఆధారం చేసుకొని వేషం వేసుకొనగలడు. స్వయంగా దుస్తులను కుట్టుకునేవాడు. తెరలు చిత్రించుకొనేవాడు.

లక్ష్మణస్వామి వాచికాభినయం నిరుపమానం. స్ఫుటమైన వాక్కు. గొంతులో వివిధ రసాలు పలికేవి. ముఖంలో వివిధ భావాలు పలికేవి. ఈయన స్వయంగా హిందీలో దేశభక్తి ప్రబోధక ఉపన్యాసాలు రాసుకొని రంగస్థలం మీద పఠిస్తుంటే హాలు దద్దరిల్లి పోయేది. ప్రేక్షకులు దేశభక్తి, వీరరసాలతో ఉడుకెత్తి పోయేవారు. సాత్త్వికాభినయంలో అందెవేసిన చేయి. ప్రేక్షకులను ఆయా రసాలలో ముంచెత్తి ముచ్చిబమ్మలా ఆడించగల సమర్థుడు. శివాజీ, సుమేర్‌సింగ్ వేషాలు ఆనాటి ప్రేక్షకజన హృదయాలలో శాశ్వత ముద్ర వేసుకొన్నాయి. శివాజీ పాత్రకు బిపిన్ చంద్రపాల్ వంటి పొగడ్తలను అందుకొని భారతీయ నాటకరంగలో సుస్థిర స్థానం సంపాదించి పెట్టింది.

సంగీతం లోపమయినా కేవలం నటనతో ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకొని ఆదరాభిమానాలు చూరగొన్న మహానటుడు లక్ష్మణస్వామి. ఈయన రస స్వరూపుడు. 'వేషావేశ కాలమందు మిమ్ముల నెదుర్కొనిన మీరెట్లు ప్రవర్తింతురు''? అని పురాణం సూరిశాస్త్రి ప్రశ్నించగా ''ఆ సమయములో నెవ్వరినైననూ పొడిచివైతును'' అని జవాబిచ్చారు (నాట్యాం బుజం, పేజి 23). అంతటి రసావేశపరుడు లక్ష్మణస్వామి.

ఈయన కృష్ణభక్తుడు. సోమావధూతను ఆశ్రయించి వేదాంతం అభ్యసించాడు. శివాజీ, పఠాన్ రుస్తుం, సుమేర్ సింగ్, భీమసింగ్, మంత్రి రామశాస్త్రి, విక్రమార్కుడు, విశ్వామిత్రుడు (మేనక), హరిశ్చంద్రుడు, హిరణ్యకశ్యపుడు, శ్రీకృష్ణుడు (సుభద్ర), రాణా ప్రతాప్, హైదర్‌జంగ్ వంటి పాత్రలలో నటించిన లక్ష్మణస్వామి 1913, జనవరి 7న నటరాజులో ఐక్యమయ్యాడు.

శ్రీ.చ.

లక్ష్మణ రావు, కొండవలస (జ. 1946) : ప్రసిద్ధ రంగస్థల నటుడు, చలనచిత్ర నటుడు. శ్రీకాకుళం జిల్లా, కొండవలస గ్రామంలో చలపతిరావు, **రాజేశ్వరి దంపతులకు** 1946 సెప్టెంబరు 12న **జన్మించాడు. 1959 నుండి 1966** వరకు విశాఖపట్నంలో విద్యాభ్యాసం చేశాడు. ఎం. కాం. పట్టభద్రుడు. రంగస్థల కళల శాఖలో నటనలోనూ, దర్శకత్వంలోనూ, డిప్లొమా పొందాడు. కుమ్మరి మాష్టారు 1958లో బుర్రకథ చెప్పడం చూసి స్పందించి అలా అనుకరించడానికి ప్రయత్నించి తద్వారా నటనపట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. 1961లో సవతితల్లి అనే నాటికను తన మేనమామ డబ్బీరు రమాకాంత రావు దర్శకత్వంలో ప్రదర్శించిన సందర్భంలో ఆ నాటికలో నౌకరుగా, బిచ్చగాడుగా ద్విపాత్రాభినయం చేసి ఉత్తమ నటుడు బహుమతి పొందటంతో లక్ష్మణరావు నటజీవితానికి పునాది ఏర్పడింది. అప్పటినుండి ఎ.వి. ఎస్. కళాశాలలోను, విశాఖ పోర్టు ట్రస్ట్‌లోను స్వీయ దర్శకత్వంలో అనేక నాటక, నాటికలను ప్రదర్శించాడు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో అత్తిలి కృష్ణారావు, చాట్ల శ్రీరాములు వద్ద పొందిన నటశిక్షణ, అనంతరకాలంలో తన నటజీవితానికి ఉపకరించింది. 1967 నుండి 2000 వరకు విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్‌లో అకౌంట్స్ క్లర్క్‌గా ప్రారంభించి

అకౌంట్స్ సూపరింటెండెంటుగా 2000 సంవత్సరంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేశాడు.

1980లో కళాలహరి నాటక సమాజాన్ని స్థాపించి, ఖరగ్‌పూరు, మద్రాసు, బెర్హాంపూర్, ముంబాయి, ఢిల్లీ వంటి మహానగరాలలో ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు, ఆంధ్రదేశంలో వివిధ ప్రాంతాలలో నిర్వహించబడిన 76 నాటక పరిషత్తులు నిర్వహించిన నాటక, నాటికలలో ప్రధాన పాత్రలు పోషిస్తూ, దర్శకత్వం వహిస్తూ, ఉత్తమ నటుడు, దర్శకుడు, ప్రతినాయకుడు, క్యారెక్టర్ నటుడు, హాస్య నటుడుగా సుమారు 400 బహుమతులు పొంది ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నాడు. ఉత్తమ క్యారక్టర్ నటనకు, ప్రతినాయకుడు నటనకు నంది బహుమతులు కూడ గెల్చు కొన్నాడు. సుమారు 150 నాటక, నాటికలలో 1700 లకు పైగా ప్రదర్శనలిచ్చిన లక్ష్మణరావుకు కన్యాశుల్కం,నిజం, తూర్పురేఖలు,నవరాగం, కేళీవిలాసం వంటి నాటకాలు, అనంతం, యుగసంధ్య, రేపటి శత్రువు, ఇండియన్ గ్యాస్, అమ్మ తీర్పు, జీవనసంధ్య, అల్లదే మావూరండి మొలైన నాటికలు పేరు తెచ్చాయి. 2001లో 'ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు' చిత్రంతో సినీరంగప్రవేశం చేసిన కొండవలస 2007 నాటికి 150 చిత్రాలలో నటించి హాస్యనట పోషణలో సిద్ధహస్తుడుగా ప్రేక్షక హృదయాలలో శాశ్వతస్థానం సంపాదించుకొన్నాడు. కూలీ, కబడ్డీ కబడ్డీ, దొంగరాముడు అండ్ పార్టీ, ఎవడి గోల వాడిది, ఆదివారం ఆడవాళ్ళకు సెలవు మొదలైన చిత్రాలు కొండవలస హాస్యరస పోషణకు గీటురాళ్ళుగా పేర్కొనవచ్చు.

గం.సు.రె.

లక్ష్మయ్య, పైడి (1904-1987) : కళాపోషకుడు, సాహిత్యాభిమాని, రచయిత. 1904, జూన్ 26న అనంతపురం జిల్లాలోని అచ్చంపల్లి గ్రామంలో వెంకమాంబ, ముసలప్ప దంపతులకు జన్మించాడు. అనంతపురం కాలేజి నుంచి బి.ఎ., మద్రాసు లా కాలేజి నుంచి లా డిగ్రీ పొందాడు. 1936లో మద్రాసు హైకోర్టులో అడ్వకేటుగా ప్రాక్టీసు మొదలు పెట్టాడు. 1944-47 మధ్యలో అనంతపురం జిల్లా బోర్డు అధ్యక్షులుగా పనిచేశాడు. 1949లో లోక్‌సభకు ఎన్నికయ్యాడు.

అనంతపురం నాటక సంస్థకు అధ్యక్షులుగా ఉండి నాటక కళావికాసానికి దోహదం చేశాడు. 20 సంవత్సరాల వయస్సులో భక్తమార్కండేయ నాటకం రాశాడు. అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ మొదలైన ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించబడింది. వీరి ఇతర నాటకాలు : మహాత్మ కబీర్, సంసార నౌక, సాయిలీల, శ్రీ శైలమాహాత్మ్యం (వేమారెడ్డి మల్లమ్మ). 1987 ఏప్రియల్ 28న పైడి లక్ష్మయ్య తుది శ్వాస విడిచాడు.

గం.సు.రె.

లక్ష్మి, ఆలపాటి వేంకట (జ. 1952) : ప్రసిద్ధ రంగస్థల నటి. 1952 ఫిబ్రవరి 19న ఏలూరులో జన్మించింది. పదమూడవ ఏటనే రంగస్థల ప్రవేశం చేసి ఆనాటినుంచి ఇప్పటికి రెండు వేల ప్రదర్శనల్లో పాల్గొని నాటకరంగ ప్రియుల అభిమానాన్ని చూరగొంది. విశాఖపట్నంలో నివాసం ఉంటూ ఆంధ్ర రాష్ట్రంలో అన్ని జిల్లాలలో జరిగే నాటక పరిషత్తుల్లో పాల్గొని ఉత్తమనటిగా అసంఖ్యాకంగా బహుమతులు గెల్చుకొంది. మిశ్రో, హరనాథరావు, కె. వేంకటేశ్వర రావు, ఎ. ఆర్. కృష్ణ, కె. ఎస్.టి. సాయి, చాట్ల శ్రీరాములు వంటి ప్రతిభావంతుల దర్శకత్వంలో ఆలపాటి లక్ష్మి తన నటనా కౌశలానికి మెరుగులు దిద్దుకొంది. *జగన్నాథ రథచక్రాలు, ఓ బూతు నాటకం, క్షీరసాగర మథనం, డియర్ ఆడియన్స్, సిన్సియర్లీ యువర్స్, మరో మొహంజదారో, అనగనగా ఒక అమ్మాయి* మొదలైన నాటకాలు, *అమ్మ, లేడి పంజా, ది గేమ్* వంటి నాటికలు లక్ష్మి నటనా వైదుష్యానికి సాక్షీభూతంగా నిలిచే రసగుళికలు. సాంఘిక నాటకాల్లోనే కాక, *రాణాప్రతాప్, జనమేజయం* వంటి పద్యనాటకాలలో కూడా పాత్రధారణచేసి తన అభినయ పాటవానికి హద్దులు లేవని నిరూపించుకొన్న కళాకారిణి. ఈమె ఆకాశవాణిలో 'ఎ' గ్రేడు ఆర్టిస్టుగా అనేక నాటకాల్లో పాల్గొంది. టి.వి. సీరియళ్ళలోను, కొన్ని చలన చిత్రాలలోను ప్రముఖపాత్రలు పోషించి ప్రశంసలు అందుకొంది.

గం.సుం.రె.

లక్ష్మీకాంతం, బలిజేపల్లి (1881-1953) : రచయిత, నటుడు, గాయకుడు, నాటకకర్త, ప్రయోక్త, నాటక సమాజ నిర్వాకుడు, అవధాన విద్యావిశారదుడు. ఉప్పు సత్యాగ్రహంలో

పాల్గని రెండేళ్ళు జైలు శిక్ష అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడు, ముద్రాపకుడు, పుస్తక ప్రకాశకుడు, సినిమా రచనల్లో కరుణరసానికీ, అభినయంలో హాస్యరసానికీ జీవం పోసిన కమనీయ కళామూర్తి.

గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా ఇటికలపాడు గ్రామంలో 1881, డిసెంబరు 23న విద్వత్కుటుంబంలో జన్మించాడు. సంగీత సాహిత్యాలకు నెలవైన తల్లిదండ్రులు ఆదిలక్ష్మమ్మ నరసింహశాస్త్రి.

సంస్కృతాంధ్ర భాషల్లో చిన్ననాడే ప్రావీణ్యం సంపాదించి, బాలకవిగా, బాల నటుడుగా భాసించాడు. ఇంటర్మీడియట్ చదువుతూ, కుటుంబ పరిస్థితులు అనుకూలించక, మధ్యలోనే చదువు చాలించి, కర్నూలులో ప్రభుత్వోద్యోగంలో చేరాడు. తన సాహిత్య వ్యాసంగాలకు ఆటంకంగా తోచి, ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పాడు. గుంటూరు హిందూ కాలేజీలో తెలుగు పండితుడుగా పనిచేశాడు. తన స్వతంత్ర ప్రవృత్తికీ, వ్యాసంగానికీ సరిపడక ఆ ఉద్యోగమూ మాను కున్నాడు.

సకల కళా సమాహారమైన రంగస్థలం సహజంగానే ఇలాంటి బహుముఖ ప్రజ్ఞాశాలికి ఆకర్షణ కేంద్రమైంది. 1901-1906 మధ్యకాలంలో నాటకరంగం కొంత మందగించిన తరుణంలో బుద్ధిమతీ విలాస నాటకం (1905) రచించి, యువ నాటకకారుడుగా రంగప్రవేశం చేసి, నాటకోద్యమానికి ఒక ఊపు నిచ్చినవాడు బలిజేపల్లి. నటులకు సమాజంలో అంతగా గౌరవం లేని ఆ రోజుల్లో బలిజేపల్లి వంటి కవుల రంగప్రవేశంతో ఆ దశమారి, వీరపూజ దాకా వచ్చింది.

బలిజేపల్లి పురాణ గాథలనే నాటకీకరించి, మన వారసత్వ సంపదపై గౌరవం రేకెత్తించే ప్రయత్నం చేశాడు. కొత్త ప్రయోగాల పొంతపోక, ప్రబోధాత్మకమైన మార్గ పద్ధతులనే ఎంచుకున్నాడు. 1880లో స్థాపింపబడి, తన కాలం నాటికి నామమాత్రావశిష్టమై ఉన్న గుంటూరు ఫస్ట్ కంపెనీకి పునర్జన్మ ప్రసాదించి, పట్టుగొమ్మగా నిల్పినాడు. ఆయన తొలి నాటకం బుద్ధిమతీ విలాసం. శివపారమ్యం చాటే సిరియాళుని ఇతివృత్తంతో రాసిన మొదటి నాటకం. దీని అయిదవ కూర్పు 1949లో వెలువడింది.

బలిజేపల్లి రచించిన రెండవ నాటకం ఉత్తర రాఘవం (1910), భవభూతి సంస్కృత నాటకానికి స్వేచ్ఛానువాదం.

ఆ తరువాత 1912లో రచించిన సత్యహరిశ్చంద్రీయము అజరామరమైన కీర్తినార్జించి పెట్టింది. ఇందులోని నాటకీయత అనితరసాధ్యమైంది. తెలుగులో హరిశ్చంద్ర నాటకం రాయని ప్రసిద్ధ రచయిత లేడంటే అతిశయోక్తి కాదు. కాని బలిజేపల్లి రచన ముందు మరే హరిశ్చంద్ర నాటకం నిలబడలేకపోయింది. రసవత్తర సన్నివేశాలు, సజీవ సంభాషణలు, రసగుళికల వంటి పద్యాలు, అమోఘమైన పాత్రచిత్రణలతో నాటక సాహిత్యానికి మకుటాయమైన రచన ఇది. సాత్రాజితీయం (1914) ఆయన చివరి నాటకం.

బలిజేపల్లి నాటక సాహిత్యంలో సామెతలు, సూక్తులు, నుడికారపు సొంపులు,తెలుగు పలుకుబడుల సోయగాలు కోకొల్లలుగా తారసిల్లుతాయి. అన్నింటా ఆయన అభిమానించే హాస్య రస పుష్టి కనిపిస్తుంది.

బలిజేపల్లి వివిధ భూమికలు నిర్వహిస్తూ, తన సాహిత్య సౌరభాలతో, అపూర్వ నటనా కౌశలంతో , సుధామధుర సంగీతంతో, నిర్వహణ సామర్థ్యంతో రంగస్థలం ఏలుకున్నాడు.

ఆయన నాటకాలన్నింటిలోను స్త్రీపాత్రల ప్రాముఖ్యం కన్పిస్తుంది. హరిశ్చంద్ర చరమాంకం (శ్మశానఘట్టం) మకుటాయమానమైంది. నక్షత్రకుని/పాత్ర చిత్రణ అనన్యమైన కళాఖండం. శ్రీ కృష్ణుడు, హరిశ్చంద్రుడు వంటి నాయక పాత్రలు పోషించినా, నక్షత్రక పాత్రలో నిరుపమానంగా ప్రకాశించి, శాశ్వత కీర్తి పొందాడు. తనకు సరిపడేట్లు ఆ పాత్రకు వివిధ రంగాల్లో అనేక పద్యాలు రాసుకున్నాడు. ఆ పాత్రలో జీవించాడు.

1930లో లక్ష్మీకాంత కవి రంగూన్ పర్యటన సాహిత్య ఉపన్యాసాలతో, హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలతో సాగింది. రంగూన్ ఆంధ్రులు, కవితా కళానిధి బిరుదుతో ఘనంగా సన్మానించి, ఆయన బహుముఖ ప్రజ్ఞకు నివాళు లర్పించారు.

నాటకరంగం క్రమంగా వ్యాపార ధోరణులు, కాంట్రాక్టు నాటకాలు, కిరాయి నటులు మొదలైన వెర్రితలలు వేయసాగింది. ఈ పెడపోకడల్లో బలిజేపల్లి ఇమడలేక పోయాడు. ఆయన జీవితయాత్ర కూడ ఇబ్బందుల్లో పడింది. ఆ తరుణంలో 1940లో ఆయన్ని సినిమారంగం ఆహ్వానించింది. ప్రఖ్యాత దర్శకుడు చిత్తజల్లు పుల్లయ్య ఆయనను సాదరంగా పిలిచి పీట వేశాడు. కవితా వేదిక, రంగస్థలం, స్వాతంత్ర్య సమరం తరువాత ఇది ఆయన జీవితంలో మరో పెద్ద మలుపు. రసవత్తరమైన పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలెన్నింటికో కథ, మాటలు, పాటలు, నటన సమకూర్చి ప్రాణ ప్రతిష్టచేశాడు. కాళ్లకూరి నారాయణ రావు వరవిక్రయం నాటకానికి సినిమా స్క్రిప్టు రాసి స్వయంగా సింగరాజు లింగరాజు పాత్ర ధరించి, వెండితెర పై అద్భుతంగా రాణించాడు. 'బ్రహ్మరథం, భూకైలాసం, సతీ అనసూయ, జీవన్ముక్తి, బాలనాగమ్మ, ముగ్గురు మరాటీలు, మళ్ళీ పెళ్లి, తహశీల్దార్'... ఇంకా ఎన్నో సినిమాలకు కథలు,

సంభాషణలు రచించాడు. గుణసుందరి వంటి ఎన్నో సినిమాల్లో నటించాడు.

వయస్సు పైబడుతున్న కొద్దీ ఆయనలో ఆది నుంచీ అంతర్నిహితంగా ఉన్న ఆధ్యాత్మిక చింతన పై కొనసాగింది. అన్ని ప్రాపంచిక వ్యాసంగాలకు దూరంగా దైవధ్యానంలో ప్రశాంత జీవితం కావాలనే ఆకాంక్ష ప్రబలసాగింది. 29-2-1941 నాడు మద్రాసు నాట్య కళా పరిషత్తువారు డి.వి. సుబ్బారావు అధ్యక్షతన బలిజేపల్లి షష్టిపూర్తి మహోత్సవం నిర్వహించి, పుంభావ సరస్వతీ బిరుదంతో ఘనంగా సన్మానించారు. 1942లో సినిమారంగం ఆయనకు వీడ్కోలు పలుకుతూ ఘనంగా సత్కరించింది.

జీవిత సంధ్యాకాలంలో వానప్రస్థం లాంటి ప్రశాంత జీవనం కోసం తపిస్తున్న తరుణంలో కాళహస్తి రాజా వారి ఆహ్వానం అంది, ఆయన ఆకాంక్ష నెరవేరింది. ఆ పుణ్యక్షేత్రంలో, శివసాన్నిధ్యంలో, ఆశ్రమంలాంటి ఇల్లు నిర్మించుకొని, శేషజీవిత మంతా అక్కడే గడిపాడు. ఈ చరమ దశలోనే బలిజేపల్లి 5000 పద్యాలతో సుందరకాండను మహాప్రబంధంగా రచించాడు (1942-52). ఇదే ఆయన మధురకవితా కౌశలానికి నికషోపల మైన కిరీటరచన.

లక్ష్మీకాంతం స్ఫురద్రూపి. వినయశీలి. ఆప్యాయంగా అందరినీ చిరునవ్వుతో పలకిరిస్తూ, కలుపుగోలుగా ఉండేవాడు. మద్రాసు సినీజీవితంలో కూడా అబ్బూరి వారి నటాలీ సంస్థ నిర్వహించిన కన్యాశుల్కం నాటకంలో అగ్నిహోత్రావధానులుగా నటించాడు.

జీవితంలో ఇంత విస్తృతంగా బహుపాత్ర ధారణతో వీర విహారం చేసిన ప్రతిభాశాలి తెలుగునాట మరొకరులేరు. ఉదాత్తమైన మానవీయ విలువలు ప్రతిపాదిస్తూ, మానవుడిలోని మంచితనాన్ని ఆవిష్కరించి చూపటం ఆయన అన్ని నాటకాల్లో తారసిల్లే సారాంశం.

ప్రముఖ నటుడు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి ఈ కింది మాటల్లో బలిజేపల్లికి ప్రశస్తమైన అక్షరనివాళి సమర్పించాడు. "ప్రపంచంలో సత్యం ఉన్నంతవరకు, సత్య హరిశ్చంద్ర నాటకం ఉంటుంది. ఆ నాటకం ఉన్నంత వరకు బలిజేపల్లి పేరు చిరస్థాయిగా ఉంటుంది".

బ్రహ్మరథం, మణిమంజూష (నవలలు), శివానందలహరి (శతక సాహిత్యం), స్వరాజ్య రథము, స్వరాజ్యసమస్య (ఖండకావ్యాలు), బుద్ధిమతీ విలాసము, ఉత్తర రాఘవం, సత్య హరిశ్చంద్రీయము, సాత్రాజితీయము (నాటకాలు), సుందరకాండ (మహాకావ్యం), భారతి, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికల్లో పద్యాలు, వ్యాసాలు వెలువరించిన బలిజేపల్లి 1953, జూన్ 30న కన్నుమూశాడు.

సుధాదేవి.

లక్ష్మీకాంత మోహన్ (జ: 1922): నాటక కర్త, నవలా కారుడు, గాయకుడు, వ్యాసకర్త. స్వాతంత్రోద్యమంలో పాల్గన్నాడు. కొన్నాళ్ళు సైన్యంలో కూడా పనిచేశాడు. శతాధిక గ్రంథకర్త. ఈయన రచించిన సింహగర్జన నవలను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. షేక్స్పియర్ రాసిన నాటకాలలో 23 నాటకాలను ఈయన అనువదించాడు. చదివింది కేవలం ఎనిమిదో తరగతే అయినా వీరి ఆంగ్లభాషా పాండిత్యం అసాధారణమైనది. తెలుగులో వీరు రచించిన నాటకాలలో సమ్మెపిలుపు సుప్రసిద్ధ నాటకం. ఈయన రచించిన 'షేక్స్పియర్ మెన్ అండ్ విమెన్' అనే ఆంగ్ల గ్రంథం మైసూరు విశ్వవిద్యాయలం పాఠ్యగ్రంథంగా నిర్ణయించింది. పండితుల ప్రశంసలను అందుకొంది.

గం.సు.రె.

లక్ష్మీకులశేఖర్, పల్లేటి (జ:1954) : నటుడు, నాటక రచయిత. సంప్రదాయ నాటకరచనలు వెలువడని ఆధునిక కాలంలో సంప్రదాయ నాటక రచనను పునరుజ్జీవింపచేసిన రచయిత. 1954, డిసెంబరు 3న కడప జిల్లా గండికోట గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు మరియమ్మ, విలియమ్స్‌లు. సాహితీ ప్రక్రియలన్నిటిని చేపట్టిన కులశేఖర్‌కు దృశ్య కావ్య రచనల పట్ల మక్కువ ఎక్కువ.

అడుగంటి పోతున్న ఆధ్యాత్మిక విలువలను నేటి సమాజ సభ్యులకు తెలిపే ప్రయత్నంలో భాగంగా శ్రీ మద్రామాయాణాన్ని సతీ అహల్య, శ్రీరామపాదుకలు, శ్రీరామ వనవాసం, శ్రీరామ పట్టాభిషేకం అనే పేరున నాటకాలుగా రచించాడు. శివపురాణం కథా వస్తువుగా దక్షయజ్ఞం, కుమార సంభవం, భూకైలాసం, సర్వం శివమయం అని నాలుగు దృశ్య కావ్యాలుగా రూపొందించాడు. ఇవేకాకుండా కృష్ణాభిమన్యు, నరనారాయణ, భీష్మ, స్వామి అయ్యప్ప, సైరంధ్రి, ఇంద్రజిత్, రావణవిజయం, రావణ ధాన్యమాలి అనే పౌరాణిక నాటకాలు రచించాడు. పద్య నాటక రచనతో ప్రేక్షకలోకాన్ని మెప్పించిన లక్ష్మీ కులశేఖర్ పుణ్యభూమి, తపస్సు, కబంధ హస్తం, దిష్టి, దావాగ్ని, డబ్బోయమ్మ డబ్బు, గురుదేవోభవ, షరామామూలే, సరిలేరు నీ కెవ్వరు, హలో ఎవరు మాట్లాడేది, రేచుక్కలు, కింగ్ మేకర్స్, పుత్రోత్సాహం, ధృతరాష్ట్ర కౌగిలి, మృత్యువుతో ముఖాముఖీ, అసిధారావ్రతం, అశనిపాతం, అణుబంధం, వడ్లగింజలో బియ్యపుగింజ, గుడుగుడు కుంచం,

కర్ణపిశాచి మొదలైన సాంఘిక నాటక, నాటికలు రచించాడు. ఆంధ్రదేశచరిత్రను దృశ్య రూపకాలుగా రచించడం వల్ల చారిత్రక సత్యాలను సామాన్య మానవుడికి తెలిపే ప్రయత్నంలో పల్నాటి యుద్ధం, విశ్వకవి వేమన, వాసవి కన్యక, విప్లవ సింహం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, యోగి వీరబ్రహ్మం, తాళ్ళపాక అన్నమాచార్య మొదలైన చారిత్రక నాటకాలను రచించాడు. ఈయన రచించిన నాటక నాటికలన్నీ సవేరా ఆర్ట్స్ (కడప), లలితకళా సమితి (కర్నూలు), గీతానాటకమండలి (రాజంపేట) లాంటి రాయల సీమలోని వివిధ నాటక సమాజాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించి ప్రేక్షకులను అలరించాయి. రచయితగా పైడి లక్ష్మయ్య, గుర్రం జాషువ, కాళ్ళకూరినారాయణరావు అవార్డులు, నంది అవార్డులు అందుకున్నాడు. రాయలసీమ మాండలికంలో రాసిన తపస్సు నాటిక లక్ష్మీకులశేఖర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అవార్డును తెచ్చి పెట్టింది. తెలుగు నాటక సాహిత్యంలో లక్ష్మీకులశేఖర్ ప్రసిద్ధ నాటక రచయితల సరసన స్థానం సంపాదించాడు.

దాసరి.ఎన్

లక్ష్మీనరసయ్య, కర్నాటి (జ: 1927) : నటుడు, రచయిత, జానపద కళాకారుడు, ఆంధ్రమహాసభ కార్యకర్తలలో ముఖ్యుడు. కృష్ణాజిల్లా తిరువూరు తాలూకా తునికిపాడు గ్రామంలో 1927 అక్టోబరు 5న వెంకయ్య, రాజమ్మల తొలి సంతానంగా జన్మించాడు. ఆర్థిక పరిస్థితుల రీత్యా కుటుంబం మధిర సమీపంలోని దెందుకూరు గ్రామానికి వలస వెళ్ళింది. చిన్నవయస్సు నుండే గ్రామంలో ప్రదర్శించబడే వీధి భాగవతాలు, హరికథలకు తొలిప్రేక్షకుడు, చివరి ప్రేక్షకుడు కూడా కర్నాటే. గొడ్లకాడి బుడ్డోళ్ళ లల్లాయిపదాలను వంటబట్టించుకుని వల్లె వేసేవాడు. కొణత మాత్మకూరు గ్రామంలో మేనమామ ఇంట హిందీ నేర్చుకుంటున్న సమయంలో కనకతార నాటకంలో బాసుని పాత్రలో నాటకరంగంలో ప్రవేశించాడు. గంపలగూడెం గ్రామంలో డి.వి.సుబ్బారావు ప్రదర్శించిన వింధ్యారాణి, హరిశ్చంద్ర నాటకాలను చూసి నాటకరంగం పట్ల వ్యామోహాన్ని పెంచుకున్నాడు. క్షణాల తేడా లేకుండా ప్రదర్శనను ప్రారంభించే డి.వి.సుబ్బారావు క్రమశిక్షణ, తనకు కళాకారుడిగా ఆజన్మాంతం స్ఫూర్తిగా నిలుస్తుందని కర్నాటి పేర్కొన్నాడు. ఆంధ్ర మహాసభలో కార్యకర్తగా, సాంస్కృతిక దళంలో చేరి, తెలంగాణాలోని పలు గ్రామాలలో బుర్రకథలు చెప్పాడు. దెందుకూరు గ్రామంలో ప్రజానాట్యమండలి శాఖను ప్రారంభించి, సుంకర – వాసిరెడ్డి రచించిన ముందడుగు నాటకాన్ని ప్రదర్శించాడు. ఖమ్మంలో జరిగిన ఆంధ్ర మహాసభ ఉత్సవాల్లో ముందడుగు నాటకాన్ని ప్రదర్శిస్తున్న సమయంలో గరికపాటి రాజారావుతో ఏర్పడిన అనుబంధం కర్నాటి నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పింది. కర్నాటి చేత ప్రేక్షకులు కష్టజీవి బుర్రకథను ప్రత్యేకంగా కోరి చెప్పించుకొనేవారు. ఆంధ్ర మహాసభ ద్వారా నీరుకొండ అప్పారావు బుర్రకథ దళంలో ఎక్కువ ప్రదర్శనలిచ్చాడు.



మధిర తాలూకా గోపనీడులో బుర్రకథ చెబుతున్న సమయంలో పోలీసులు దాడిచేసి పదిహేనురోజులు జైలులో నిర్బంధించారు. తెలంగాణా ప్రాంతంలోని కళాకారులపై పోలీసుల దాడులు పెరగడంతో కర్నాటి విజయవాడకు వచ్చి ప్రజానాట్యమండలిలో చేరాడు. కోడూరి అచ్చయ్య దర్శకత్వంలో కృష్ణాజిల్లా దళం మాభూమి నాటకాన్ని ప్రదర్శించగా కర్నాటి మంగలి రాముడు పాత్ర ధరించాడు. ఈ నాటకాన్ని విజయవాడ రామా టాకీసులో ప్రదర్శించారు. 1948లో మద్రాసులో మాభూమి నాటకాన్ని ప్రదర్శించగా ఈ ప్రదర్శనకు హాజరైన నార్ల వేంకటేశ్వరరావు, గోపీచంద్, గ్రామీణ ప్రాంతంలోని పామరజనం ఎలాంటి నికృష్ట జీవితాన్ని అనుభవిస్తున్నారో రాముడి పాత్ర ద్వారా కర్నాటి కళ్లకు కట్టినట్లు చూపాడని ప్రశంసించారు. మాభూమి నాటకంలో తనకు చిన్న పాత్ర మాత్రమే ఇచ్చారనే ఆత్మన్యూనతా భావంతో ఉన్న కర్నాటికి దీనితో కనువిప్పు కలిగింది. పాత్ర చిన్నదా, పెద్దదా అని కాకుండా ఉన్న పాత్రను అవగాహన చేసుకొని నటిస్తే, అది ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతుందనే సత్యాన్ని కర్నాటి గుర్తించాడు.

ప్రజానాట్యమండలిపై నిషేధంవేటుపడిన అనంతరం విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయం కేంద్రంగా నెలకొల్పిన ఆంధ్రా ఆర్టు థియేటరులో కర్నాటి ప్రముఖ పాత్రను పోషించాడు. విశ్వనాథ కవిరాజు రచించిన నేపథ్యం, కొప్పరపు సుబ్బారావు రచించిన అల్లీముఠా, నేటినటుడు, సుంకర జీతగాడు, జీవితపథం నాటకాలలో కర్నాటి ప్రధాన భూమికలను పోషించాడు. ఆంధ్రా ఆర్టు థియేటరులో ప్రముఖ నటుడు కె. వేంకటేశ్వరరావుకు, కర్నాటి నటనలో మెళకువలను నేర్పాడు. లక్ష్మమ్మ చలనచిత్రానికి కొత్తపంథాలో ప్రచారం చేయడానికి ఆ సినిమా కథను బుర్రకథగా మలచి పట్టంశెట్టి, కర్నాటి, మిక్కిలినేని దాదాపు 40 గ్రామాలలో చెప్పారు. ఆంధ్రా ఆర్టుథియేటర్ పక్షాన ఆత్రేయ రచించిన ప్రగతి నాటికలో కర్నాటితో పాటు సి. నాగభూషణం, మిక్కిలినేని ప్రభృతులు నటించారు. కాకినాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో ఈ

నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతి పొందింది. ప్రముఖ హిందీ నటుడు పృథ్వీరాజ్‌కపూర్ ఈ ప్రదర్శనను చూసి కళాకారులను మెచ్చుకొన్నాడు. అనిశెట్టి రచించిన *గాలిమేడలు*, పులుగుండ్ల రచించిన తుఫాను నాటకాలలో కర్నాటి ప్రధానపాత్రలను పోషించి మెప్పు పొందాడు. అనిశెట్టి రచించిన మావూరు నాటకాన్ని కూడా పరిషత్తులలో ప్రదర్శించి బహుమతులు పొందాడు. నాజర్ రచించిన ఆసామి నాటకంలో కర్నాటి ముఖ్యపాత్రను పోషించాడు.

నాజర్, రామకోటితో కలిసి కర్నాటి వంతగా అల్లూరి సీతారామరాజు, కష్టజీవి, పల్నాటి యుద్ధం బుర్రకథలను వేల సంఖ్యలో చెప్పాడు.

ఆంధ్ర నాటక కళాసమితి అంతరించిపోతున్న జానపద కళాసంపదను పునరుజ్జీవింప చేయడానికి భారీఎత్తున రాష్ట్రవ్యాప్తంగా జానపద కళోత్సవాలను నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా అజ్ఞాతంగా ఉన్న దాదాపు 300 కళాకారులు ఎన్నో విలక్షణమైన కళారూపాలను ప్రదర్శించి, ప్రేక్షకులను మెప్పించారు. ఈ సందర్భంగా 300మంది జానపద కళాకారులను సత్కరించడమే కాకుండా అనేకమంది కళాకారులకు ఆర్థిక సహాయం అందించాడు.

భారత సాంస్కృతిక సంఘం తరపున రష్యాలో 15రోజులు పర్యటించాడు. *నీడ, లవ్ మ్యారేజీ, పూల పల్లకి, చలిచీమలు, ఇది కాదు ముగింపు, ఈ చదువులు మాకొద్దు* వంటి చలన చిత్రాలలో నటించాడు.

కందిమళ్ల

లక్ష్మీనరసింహం, చిలకమూర్తి (1867-1946) : కవి, నవలా రచయిత, నాటకకర్త, హిందూ నాటకసమాజం నిర్మాతలలో ముఖ్యుడు. కళాప్రపూర్ణ బిరుదాంకితుడు. చిలకమూర్తి లక్ష్మీనరసింహం ఖండపల్లి గ్రామంలో 1867, సెప్టెంబరు 26న మేనమామ పురాణ పండ వల్లయ్య శాస్త్రి ఇంట్లో జన్మించాడు. తల్లిదండ్రులు రత్తమ్మ, వెంకయ్యలు.

వీరవాసరంలో లక్ష్మీనరసింహం బడిలో చేరాడు. వెలిచేటి రాయప్ప, భద్రాచలం అన్నదమ్ములు పెట్టిన బడి అది. "ఆ అన్నదమ్ములే నాకు ప్రథమ గురువులు" అన్నాడు లక్ష్మీనరసింహం (స్వీయచరిత్ర - 38).

1881లో వీరవాసరం చదువు పూర్తి కావడంతో, లోయర్ కోర్స్ చదవటానికి నరసాపురం వెళ్లాడు. ఆ తరువాత 1885లో మెట్రిక్యులేషన్‌లో చేరటానికి రాజమహేంద్రవరం వెళ్లాడు. రాజమహేంద్రవర విద్యాభ్యాసం చిలకమూర్తి జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. 1880లో తెలుగు దేశానికి ధార్వాడ నాటక సమాజం వచ్చింది. ఆ నాటకాలు చూసిన చిలకమూర్తికి నాటకాలు రాయాలన్న సంకల్పం కలిగి కలం పట్టాడు.

తొలితరం నాటక కర్తలలో ప్రముఖుడు. స్వాతంత్రోద్యమాన్ని ఉద్దీపింప జేసిన కవిగా ప్రసిద్ధుడు కావడానికీ, చిలకమూర్తి నాటకాలు రాయడానికీ ప్రధాన కారకుడు ఇమ్మానేని హనుమంత రావు నాయుడు. చిలకమూర్తి నాటకాలను హిందూ నాటక సమాజం ప్రదర్శించింది. 1889లో నాయుడు కోరికపై చిలకమూర్తి కీచకవధ నాటకం రాసి ఇచ్చాడు. ఈ నాటకంలో హనుమంత రావు నాయుడు భీముని పాత్ర, టంగుటూరి ప్రకాశం ద్రౌపది పాత్ర అభినయించారు. తరువాత రాసిన ద్రౌపదీ పరిణయ నాటకంలో ప్రకాశం అర్జునుని పాత్ర, హనుమంతరావు నాయుడు భీముని పాత్ర ధరించారు. హనుమంతరావు, ప్రకాశం పద్యాలు చదవలేరు కనక ఆ పాత్రలకు వచనాన్ని రాశాడు చిలకమూర్తి.

చిలకమూర్తి నాటకాలు స్వతంత్ర నాటకాలు, అనువాద నాటకాలు అని రెండు విభాగాలుగా కనిపిస్తాయి. స్వతంత్ర నాటకాలు *కీచక వధ, నల నాటకం, శ్రీరామ జననం(1889), సీతా కళ్యాణం, గయోపాఖ్యానం, పారిజాతాపహరణం, ప్రసన్న యాదవం, భక్త ప్రహ్లాద, చతుర చంద్రహాసం, తిలోత్తమ, ద్రౌపదీ పరిణయం*. ఇవికాక ఆంధ్రజ్యోతి పత్రికలో బమ్మెర పోతన, అముద్రితంగా ఉన్న సత్యహరిశ్చంద్ర నాటకం కూడా ఉన్నాయి.

నాటకకర్తగా గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది *గయోపాఖ్యాన* నాటకం (1890). ఈ నాటకం రాసేటప్పటికి చిలకమూర్తి వయసు 22 సంవత్సరాలు. గయుడు పాత్రను హనుమంతరావు నాయుడు, చిత్రలేఖ పాత్రను ప్రకాశం ధరించారు. *గయోపాఖ్యానా*నికి ప్రచండ యాదవం అనే పేరు కూడా ఉంది. సులభశైలితో పద్యరచనతో ఈ నాటకం ప్రసిద్ధి కెక్కింది. *గయోపాఖ్యాన* పద్యాలు ఇంటింటా, వాడవాడలా మారుమోగాయి.

జైమిని భారతంలో చంద్రహాస వృత్తాంతాన్ని వస్తువుగా తీసుకొని రసవత్తరమైన నాటకంగా చతురచంద్రహాసం పేరుతో విషాదాంత నాటకాన్ని రాశాడు.

గొప్ప నాటకకర్తగా తెలుగు సాహితీ చరిత్రలో విశిష్టస్థానాన్ని సంపాదించుకొని, 'ఆంధ్రా మిల్టన్', ' ఆంధ్రా స్కాట్'గా వాసికెక్కిన చిలకమూర్తి 1946, ఏప్రిల్ 17న మరణించాడు.

భారతి

లక్ష్మీనరసింహం, సెట్టి (1879-1938) : రంగస్థల నటుడు. నాటకకర్త. గోపాలపురంలో 1879, అక్టోబరు 18న జన్మించాడు. కవి, పండితుడు, ఆదర్శ ఉపాధ్యాయుడు, ప్రముఖ న్యాయవాది, కవిభూషణ బిరుదాంకితుడు. అసలు పేరు సెట్టి లక్ష్మీనరసింహమే అయినా సెట్టి మాస్టరు అనే పేరే ఎక్కువ వాడుకలోకి వచ్చింది. ఈయన తల్లిదండ్రులు సంస్కృతాంధ్ర భాషల్లో మంచి పండితులు. ఈయన సోదరి గొప్ప కవయిత్రి. ఆ వాతావరణంలో పుట్టి పెరిగిన నరసింహం చిన్న తరగతులు గోపాలపురంలో పూర్తి చేసి, విశాఖపట్టణంలో ఎఫ్.ఏ. చదివి, మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ. చదివి ప్రప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ కాలంలో కందుకూరి వీరేశలింగం ఈయనకు కళాశాలలో గురువు.

ఛత్రపురం కలెక్టరాఫీసులో కొన్నాళ్ళు గుమాస్తాగా, తరువాత విశాఖపట్టణం ఎ.వి.ఎన్. కళాశాలలో మాస్టర్‌గా చేరాడు. 1900లో రాజమండ్రి ట్రైనింగ్ కాలేజీలో చేరి ఎల్.టి. పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. సుప్రసిద్ధ పరిపాలనాదక్షుడు శంఠి రామమూర్తి, నోబెల్ బహుమాన గ్రహీత సర్ సి.వి. రామన్‌లు ఈయన విద్యార్థులే. సుప్రసిద్ధ విద్యావేత్త పి.టి. శ్రీనివాసయ్యంగార్ ఈయన సహాధ్యాయి. ఈ కళాశాల పాలనావర్గాధ్యక్షుడు, జిల్లాకలెక్టర్ వర్నీస్‌తో మాటామాటా వచ్చి ఇద్దరూ తమ పదవులకు రాజీనామా ఇచ్చారు. మాస్టర్ వృత్తికి స్వస్తి చెప్పి మదరాసు వెళ్లి ప్లీడరీ చదివి ప్రథముడిగా ఉత్తీర్ణుడయ్యాడు. 1920 మొదలు 1930 వరకు న్యాయవాదిగా విశాఖపట్టణంలో పని చేశాడు. 1930లో ఈయన స్నేహితుడు విక్రమదేవవర్మ జయపురం సింహాసనం అధిష్టించి లక్ష్మీనరసింహంను తమ ఆంతరంగిక కార్యదర్శిగా నియమించుకున్నాడు.

1895లో మారేపల్లి రామచంద్రశాస్త్రి కవితో కలిసి కళాభిలాషక నాటక సమాజం స్థాపించి ఆ సమాజానికి నాటకాలు రాస్తూ విభిన్న పాత్రలలో నటించే. ఆ తరువాత 1902లో జగన్మిత్ర నాటక సమాజంలో చేరి 'కళాభిలాషక'ను అందులో కలిపివేశాడు. శృంగారరస ప్రదర్శనలో ఈయనది అందెవేసిన చేయి. సంగీతానికి ప్రాధాన్యం ఇవ్వకుండా రసభావ ప్రకటనకే ప్రాధాన్యమిస్తూ సంగీతం జోడించకుండానే పద్యాలు రంజుగా చదివి ప్రేక్షకులను ఆనందింపచేసేవాడు.

రుక్మిణీ కల్యాణం, మాలినీ విజయమనే కీచకవధ, హరిశ్చంద్ర, లుబ్ధాగ్రేశర చక్రవర్తి, అహల్య, చిత్ర, రామచంద్ర దేవ పట్టాభిషేకం, టోపీదాసు వంటి నాటకాలను రచించడమే కాకుండా హరిశ్చంద్రుడు, కీచకుడు, రుక్మాంగదుడు, బాహుకుడు, శ్రీ రాముడు, అశ్వత్థామ, పేరిగాడు, ఒథెల్లో, శ్రీ కృష్ణుడు, జయపాలుడు వంటి పాత్రలలో నటించిన లక్ష్మీనరసింహం 1938 జూన్ 6న మరణించాడు.

శ్రీ.చ.

లక్ష్మీ నరసింహారావు, జాగర్లపూడి (1900-1966) : రంగస్థల నటుడు. 1900లో గుంటూరు జిల్లా పల్నాడు తాలుకా జంగమహేశ్వరపురంలో అగ్రహారిక కుటుంబంలో జన్మించాడు. స్త్రీ పాత్రధారి. రంగపుష్ప బిరుదాంకితుడు. గుంటూరు టౌన్ హైస్కూలులో స్కూల్ ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ఈయన ముఖం ఆడ ముఖం. అంగ సౌష్టవం కూడా ఆడ స్త్రీ పాత్రలకు తగిందే. ఇవన్నీ చూసి మహానటుడు పత్రి శీనప్ప స్త్రీవేషాలు వేయమని ప్రోత్సహించి నాటకరంగంలోకి దింపాడు. 1924లో తెనాలికి మకాం మార్చి మిత్రుడు వి.ఎన్. శాస్త్రితో కలిసి కళ్లజోడు వ్యాపారం చేస్తూనే తెనాలి రామవిలాససభలో స్థానం పక్కన స్త్రీ పాత్రలలో నటించేవాడు. స్థానంతో దీటుగా నటించి పెద్ద పేరు సంపాదించుకున్నాడు.

బందరు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ, ఏలూరు మోతే కంపెనీల ఆహ్వానం మీద ఆయా కంపెనీలలో విభిన్న పాత్రలలో నటించేవాడు. బళ్ళారి రాఘవతో యడవల్లి సూర్యనారాయణలతో కలిసి నటించాడు. 1942 ప్రాంతానికి ఈయన ఆరోగ్యం బాగా దెబ్బతింది. మనస్సు వికలమైంది. గుంటూరు వెల్‌కం ప్రెస్‌లో కొంతకాలం పనిచేశాడు. వైద్యం కోసం సికింద్రాబాద్ వచ్చి అక్కడ కూడా నాటకాలలో నటించాడు. మేక్బెత్ నాటకంలో లాగా చిత్రాంగికి స్వప్న ఘట్టం కల్పించి అతి సమర్థవంతంగా నటించాడు. ఈయన చిత్రాంగి వేషం చూసి ఆచార్య తనికెళ్ళ వీరభద్రుడు ఈయనకు రంగ పుష్ప బిరుదు ప్రసాదించాడు.

1944 నుంచి 47 వరకు హైదరాబాద్‌లోని మీజాన్ ప్రెస్‌లో ప్రూఫ్‌రీడరుగా పనిచేసి 1947లో విజయవాడకు మకాం మార్చి పృథ్వీ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీలో చేరి, 1964లో రిటైరయి గుంటూరులో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. 1961లో గుంటూరులో ఈయనకు కాశీ కృష్ణాచార్యుల అధ్యక్షతన ఘన సన్మానం జరిగింది. ఈయన చంద్రమతి, ధమయంతి, ఆషాబి, విషయ, కమలాంబ, చింతామణి, రాధ, కైక, శకుంతల, ఆనందాబాయి, మల్లమదేవి, దేవకి, యశోద, చిత్రాంగి, రత్నాంగి, కౌసల్య, రుక్మిణి, సత్యభామ, మానసి, సంయుక్త, లీలావతి, భానుమతి, భ్రమరాంబ, భరతమాత పాత్రలలో నటించాడు.

పరస్పర విరుద్ధ పాత్రలలో నటించడంలో ఈయన ప్రజ్ఞావంతుడు. ఒకసారి ప్రదర్శనలో పరస్పర విరుద్ధ పాత్రలు

చింతామణి, రాధ రెండూ నటించి మెప్పు పొందాడు. ఎవరో ఒక నటుడు వీరింటికి వచ్చి నటనలో శిక్షణ పొందుతూనే ఉండే వాడు.

బందరు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీలో వేషాలు వేస్తున్న రోజులలోనే ఈయన కోసమే పింగళి నాగేంద్రరావు వింధ్యరాణి నాటకం రచించాడు. కాని దురదృష్టవశాత్తు ఈయన ఆ పాత్రలలో నటించడానికి వీలుపడలేదు. ఈ అసంతృప్తి ఈయనను జీవితాంతం వెంటాడుతుండేది. జె.ఎల్. నరసింహారావు **1966**, నవంబరులో హైదరాబాదులో మరణించాడు.

శ్రీ.చ.

లక్ష్మీనరసింహారావు, పానుగంటి (1865-1940) :

నాటకకర్త. రాజమండ్రి తాలుకా సీతానగరం గ్రామంలో రత్నమాంబ, వేంకట రమణయ్యలకు **1865**, ఫిబ్రవరి **11**న జన్మించాడు. తండ్రి ఆయుర్వేద వైద్యుడు.

రాజమండ్రిలో బి.ఏ. వరకు చదువుకున్నాడు. బి.ఏ. ఇంగ్లీషులో సర్వోత్తముడిగా ఉత్తీర్ణుడైనందుకు, మెట్కాఫ్ స్వర్ణపతకం లభించింది. మొదట కొంతకాలం ఉపాధ్యాయ వృత్తిలో ఉండి తరువాత లక్ష్మీ నరసాపురం ఎస్టేటు జమిందారిణి రావు చెల్లాయమ్మా రావు దివాణంలో దివానుగా పని చేశాడు. ఆ తరువాత ఆనెగొంది సంస్థానంలోను, ఉల్లావు సంస్థానంలో కొంతకాలం దివానుగా పనిచేశాడు. ఆ తరువాత పిఠాపురం మహారాజు సూర్యారావు బహద్దూర్ పోషణలో స్వతంత్రుడిగా ఉన్నాడు.

పానుగంటి లక్ష్మీనరసింహారావును 'ఆంధ్రా షేక్స్పియర్, ఆంధ్రా కాళిదాసు' అని విమర్శకులు పేర్కొంటారు. 'షేక్స్పియర్ లాగానే పానుగంటి 33 నాటకాలు రాశాడు. వాటిలో పౌరాణికాలు ఏడు, చారిత్రకాలు నాలుగు, కాల్పనికాలు ఎనిమిది, సాంఘికాలు అయిదు. ఇవన్నీ ముద్రితమయ్యాయి. ఇవికాకుండా తొమ్మిదినాటకాలు అముద్రితంగా ఉండిపోయాయని శ్రీనివాస చక్రవర్తి 'ఆంధ్ర నాటకకర్తలు' అనే గ్రంథంలో పేర్కొన్నాడు. పానుగంటి వారి సాహిత్యం మీద పరిశోధన చేసిన ముదిగొండ వీరభద్రశాస్త్రి మొత్తం **30** నాటకాలు రాసినట్లుగా పేర్కొన్నాడు. ఈయన ప్రకారం ఏడు పౌరాణిక నాటకాలు, ఏడు చారిత్రక నాటకాలు, పదకొండు కాల్పనిక కథా నాటకాలు, ఐదు సాంఘిక నాటకాలు రాసినట్లుగా తెలుస్తున్నది. ఈయన మొదటి నాటకం నర్మదా పురుకుత్సీయం. ఈయన నాటకాలలో సర్వోత్తమమైన నాటకంగా మొదట పేర్కొనవలసినది రాధాకృష్ణ నాటకం. తెలుగు నాటకాలలోనే ఇది ఒక ఉత్తమ నాటకం. తర్వాత పేర్కొనవలసిన నాటకాలలో ముఖ్యమైనవి పట్టభంగ రాఘవం (పాదుకా పట్టాభిషేకం), కంఠాభరణం, ప్రచండ చాణక్యం, విప్రనారాయణ చరిత్ర మొదలైనవి.

పానుగంటి నాటకాలలో షేక్స్పియర్ నాటకాల తీరు ననుసరించినది ప్రచండ చాణక్యం అనే నాటకం. కథా సంవిధానంలోను, లౌకికానుభవాలను సూత్రప్రాయంగా చెప్పడంలోను పానుగంటి షేక్స్పియర్‌ను అనుసరించాడు. షేక్స్పియర్ విషాదాంత రూపకాలలో ఎట్లాంటి సంభాషణ రచనా పాటవం కన్పడుతుందో ఈ నాటకంలో కూడా పానుగంటి అటువంటి పాటవాన్నే ప్రదర్శించాడు. రంగస్థలం మీద ఉద్వేగం కలిగించే మృతి, యుద్ధం మొదలైన వాటిని ప్రదర్శించరాదు అనే ఆలంకారిక నియమాన్ని పానుగంటివారు ఉల్లంఘించాడు. నందవధ రంగస్థలం మీద ప్రదర్శించేలా రచింపబడింది. కోకిల నాటకం కూడా షేక్స్పియర్ మిడ్ సమ్మర్స్ నైట్స్ డ్రీమ్ లోని ప్రేమికుల జంటలను జ్ఞాపకం చేస్తున్నది. షేక్స్పియర్ కామెడీలలో నాయక పాత్రల కంటే నాయికా పాత్రలకే అధిక ప్రాధాన్యం. ఈ లక్షణం కోకిల నాటకంలో కూడా కొంతవరకు కనపడుతుంది. సరస్వతి అనే నాటకం మీద షేక్స్పియర్ కామెడీ ఆఫ్ ఎర్రర్స్, ట్వెల్త్ నైట్ నాటకాల ప్రభావముంది. ఈయన గుడ్డిగా షేక్స్పియర్‌ను అనుసరించలేదు. పానుగంటి నాటకాలను పరిశీలిస్తే షేక్స్పియర్ సాహిత్యంతో ప్రభావితమైన మనస్సుతో, కొత్త కథలను ఊహించి నాటకాలు రచించినట్లు లోతుగా పరిశీలిస్తే తెలుస్తుంది. ఈయన నాటకాలలో కంఠాభరణం పూర్తి హాస్యరస ప్రధానమైన సాంఘిక నాటకం.

పానుగంటి నాటకాలను ప్రాచీన సంస్కృత రూపక లక్షణం ప్రకారం ఇతివృత్తాన్ని గాని, పంచసంధులుగాని నిరూపించడానికి వీలైనవి కావు. రస నిర్వహణ పద్ధతిని, సూచ్య, దృశ్యవస్తువిభజనంలో సంస్కృత రూపకమర్యాదలు అనుసరించినా, ఇతివృత్త నిర్మాణంలోను, పాత్రచిత్రణంలో కథకు ఆద్యంతాలను మనసులో పెట్టుకొని వస్తూన్మీలనం చేయడంలోను, పాశ్చాత్య రూపకాలలోని ఆదర్శాలను అనుసరించాడని చెప్పవచ్చు.

పానుగంటి నాటకాలలో సంవాద కౌశలం, పాత్ర మనస్తత్వ నిరూపణం అధికంగా కనిపిస్తుంది. పాత్ర చిత్రణలో ఎంతో శ్రద్ధ తీసుకుంటాడు. పాదుకా పట్టాభిషేకంలో దశరథుని పాత్ర, విప్రనారాయణ చరిత్రలో దేవదేవి పాత్రలు ఎన్నదగినవి.

పానుగంటి పద్యాలలో భావసౌందర్యం, భావగాంభీర్యం ఎక్కువ. పద్యాలు లయాత్మకంగా ఉండవు. వచనం రాసినట్లే వాక్య నిర్మాణ పద్ధతిని పద్య రచనలో చేశాడు. సన్నివేశ కల్పనలో, సంఘటన నైపుణ్యంలో సిద్ధహస్తుడు.

ఈయన నాటకాలలో ప్రదర్శనయోగ్యత కంటే, పఠన యోగ్యతే ఎక్కువనే విమర్శ ఉంది. దానికి కారణం, సంగీతానికి అవకాశం ఉండి, పాడటానికి అనువైన పద్యాలు లేకపోవడం. ఈయన నాటకాలలో జుగుప్సావహములైన విషయాలు, సంభాషణలు ఉండటం, ఛాందస ధోరణిలో పాత్రల ప్రసంగాలు చేయించడం, ప్రదర్శనం రక్తికట్టక విసుగు కలిగిస్తుందని విమర్శకుల అభిప్రాయం. అయితే ఈ విమర్శ అన్ని నాటకాలకు వర్తించదు. అన్నిటిలోను ఈ ధోరణి కనిపించదు.

నాటకానికి ఉక్తి ప్రత్యుక్తి మూలకమైన సంభాషణే జీవమని, సంగీత మూలకమైన పద్య రచన అనావశ్యకమని ఆయన నిశ్చితాభిప్రాయం. నాటకాలలో హాస్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన వ్యక్తి. కేవలం ప్రదర్శనా సౌలభ్యాన్ని, సామాజికుల సంతుష్టినీ ఆశయంగా పెట్టుకొని నాటకాలు రచించలేదు. నాటక రచన పరమార్థంగా సాహిత్యానికి పుష్టిని కలిగించే విధంగా నాటక రచన చేశాడు.

పానుగంటి సాక్షి వ్యాసాలు మొత్తం 140 రాశాడు. ఇవి ధారావాహికంగా పత్రికలో ప్రకటితమైన తరువాత నాలుగు సంపుటాలుగా సంకలితమయ్యాయి. సాక్షి వ్యాసాలు ఎడిసన్ స్పెక్టేటర్‌ను అనుసరించి రాసినవి. అందుకే ఈయనను 'ఆంధ్రాఎడిసన్' అని కూడా వ్యవహరిస్తారు. సాక్షి వ్యాసాలు పానుగంటికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టాయి. నాటకకర్త కంటే సాక్షివ్యాస రచయితగానే ఎక్కువ పేరు వచ్చింది. అయితే పానుగంటి ' ఏనాటికైనను తమ కీర్తి దశదిశల వ్యాపింప చేయుటకు, శాంతి నొసంగుటకు తమ నాటకాలే ప్రథమములని, ఎడమచేతితో రాయబడిన సాక్షి సంపుటాలు కావు' అని అభిప్రాయపడ్డాడు. పానుగంటి ఇవి కాకుండా కొన్ని ప్రహసనాలు, కథలు రాశాడు కాని వాటికంత ప్రశస్తి రాలేదు.

నాటకకర్తగాను, హాస్య వాఙ్మయ నిర్మాతగాను తెలుగు సాహిత్యంలో సుప్రతిష్ఠమైన స్థానాన్ని సంపాదించుకున్న పానుగంటి 1940, జనవరి 1న పరమపదించాడు.

జి.చె.కే.రె.

లక్ష్మీనారాయణ, తైలం (జ:1942) : రంగస్థల నటుడు, దర్శకుడు, నాటక రచయిత. ఈయన 1942, మే 28న ఒంగోలులో నాగమ్మ, సుబ్బారావు దంపతులకు జన్మించాడు. ప్రాథమిక విద్య ఒంగోలు పి.వి.ఆర్ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశాడు. ఇక్కడ చదువుతున్న రోజుల్లోనే స్కూలు టీచరు గట్టుపల్లి రామకృష్ణారావు దర్శకత్వంలో మానవుడు, తుఫాన్ నాటకాలలో నటించి ఉపాధ్యాయుల మెప్పు పొందాడు. సి.ఎస్.ఆర్ కళాశాలలో పాఠ్యాంశాలలోని కట్టబమ్మన్ (హిందీ), మర్చంట్ ఆఫ్ వెన్నీస్, మ్యాక్‌బెత్ (ఇంగ్లీషు)లను ప్రదర్శించి ప్రశంసలందుకొన్నాడు.

1958 నుంచి నవ్య కళాసమితి ఒంగోలు పక్షాన మక్కపాటి కృష్ణమోహన్ దర్శకత్వంలో సుడిగుండాలు, చీకటి తెరలు, ఆశయాలకు సంకెళ్ళు మొదలైన నాటికలు, భలేపెళ్లి నాటకాన్ని పలు చోట్ల ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలందు కున్నాడు. ప్రథమ బహుమతు అందుకున్నాడు. 1961లో అంతర్ విశ్వవిద్యాలయ నాటక పోటీలు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో జరిగాయి. ఈ పోటీలలో ప్రసిద్ధ నాట్యావధాని ధారా రామనాథ శాస్త్రి దర్శకత్వంలో కొర్రపాటి గంగాధరరావు విషకుంభాలు ప్రదర్శించి బహుమతులందుకున్నాడు. ఉద్యోగరీత్యా హైదరాబాదులో స్థిరపడిన లక్ష్మీ నారాయణ, మక్కపాటి కృష్ణమోహన్, ఎర్రంనేని చంద్రమౌళి, కె.ఎస్.టి. శాయి, కృష్ణాజీలతో కలిసి *తస్మాత్ జాగ్రత్త*, *కీర్తి శేషులు*, *కాళ రాత్రి* నాటకాలను ప్రదర్శించాడు. ఈ ప్రదర్శనలు లక్ష్మీ నారాయణకు ప్రదర్శనాపరంగా మరింత అవగాహనను పెంచాయి. ఈ అవగాహనే భారతీయ జీవిత భీమా సంస్థలో ఫైన్ ఆర్ట్స్ సంస్థకు పునాది అయింది. ఈ సంస్థ పక్షాన *లీడర్ల కార్ఖానా*, సాధన, జ్వలితజ్వాల, మంచు తెరలు, *కంచికి చేరని కథ*, మనుషులు – మనస్తత్వాలు, సర్పయాగం, *గారడీ*, ఊరుమ్మడి బతుకులు, తప్పెవరిది అనే నాటికలను, *తస్మాత్ జాగ్రత్త*, మధుమయి, *సింగారి*, ఇది ఆత్మహత్యకాదు, ఎల్లువొచ్చింది, మరో మొహెంజదారో, నిజం, తెరలో కురుక్షేత్రం మొదలైన నాటకాలకు దర్శకత్వం వహించి పలుచోట్ల ప్రదర్శించి, కళాభిమానుల అభిమానాన్ని చూరగొన్నాడు. దర్శకుడుగా ఖ్యాతి గడించాడు.

లక్ష్మీ నారాయణ నాటక రచయితగా నియతి, నేనుసైతం, మనుషులు – తత్వాలు, శ్రావణ మేఘాలు, మధుమయి, ఎల్లువొచ్చింది, సింగారి మొదలైనవి రచించాడు. ఈ నాటిక,నాటకాలు ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రసార మయ్యాయి. లైలా–మజ్ను, వేమన, శ్రీశ్రీ దేశచరిత్రలు, కన్న తల్లికి కోటి దండాలు, జాతి సంపద మొదలైన నృత్య నాటికలలో

నటించి, దర్శకత్వం వహించాడు. కళ కోసం నిరంతరం కృషి చేస్తున్న కళా హృదయుడు లక్ష్మీనారాయణ.

దాసరి.ఎన్

లలిత కళాంజలి నాటక అకాడమీ, పాలకొల్లు : పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లులో ఈ సంస్థ 1983లో స్థాపించబడింది. దీని వ్యవస్థాపకులు ప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు కోడిరామకృష్ణ, మొదట ఈ సమాజం రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక నాటకాలను ప్రదర్శించేందుకు ఉద్దేశించిందే అయినా, క్రమక్రమంగా రాష్ట్రస్థాయి నాటకపోటీలు నిర్వహించే పరిషత్తుగా రూపుదిద్దుకొంది. అప్పటి నుంచీ 24 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నాటక పరిషత్తు నిర్వహిస్తూ, ఉత్తమ ప్రమాణాలు గల నాటికలను వెలుగులోకి తెస్తూ, నాటక రచయితలను, ఔత్సాహిక కళాకారులను, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతూ ఉంది. ప్రతి సంవత్సరం పరిషత్తు సమయంలో ప్రసిద్ధ రంగస్థల నటీనటులను సన్మానించి వారి సేవలను సంస్మరించడం ఆనవాయితీగా పెట్టుకొని నాటక కళా వికాసానికి ఇతోధికంగా కృషి చేస్తూంది.

గం.సు.రె.

లలిత కళా నిలయం (నెల్లూరు) : నెల్లూరు జిల్లాలో సాంఘిక నాటకాలను ప్రారంభించి, ప్రాచుర్యంలోకి తెచ్చిన సంస్థలలో రెండవ సంస్థ లలిత కళా నిలయం. తొలిదశలో సాంఘిక నాటకాల అభివృద్ధికి అకుంఠిత సేవ చేసిన మహనీయుడు మజ్జిగ విశ్వనాథరెడ్డి. ఈ సమాజాన్ని 1940 ప్రాంతంలో స్థాపించి సమాజ సభ్యులతో విరివిగా నాటకాలు ప్రదర్శించాడు. ఆచార్య ఆత్రేయ, పులుగుండ్ల రామకృష్ణయ్యలతో నాటకాలు రాయించి, తొలిదశలో ఆ రచయితల కీర్తిని ఇనుమడింపచేసిన ఖ్యాతి విశ్వనాథరెడ్డికే దక్కుతుంది. కణ్వశ్రీని కూడా వెలుగులోకి తెచ్చింది ఈయనే. కణ్వశ్రీ తో ఇదా ప్రపంచం, బాలనాగమ్మ, ఆనాడు నాటకాలను, పులుగుండ్ల తో తుఫాన్ నాటికను రాయించి విజయవంతంగా ప్రదర్శింపజేశాడు. ఈ సమాజంలో మజ్జిగ విశ్వనాథరెడ్డి, టి.వి. రమణారెడ్డి (సుప్రసిద్ధ చలనచిత్ర నటుడు), రాజనాల కల్లయ్య (సుప్రసిద్ధ సినీనటుడు), కణ్వశ్రీ, ఎన్.వి. సుబ్బారావు (పెద్దబ్బాయి), కొండేటి సుబ్రహ్మణ్యం, సుబ్బరాయులు, అబ్రహాం, సి. నాగభూషణం (సుప్రసిద్ధ సినీ నటుడు), బమ్మాల లక్ష్మీ కుమార రెడ్డి, పొన్నాల రామసుబ్బారెడ్డి మొదలైన ప్రతిభావంతులైన నటులు పద్య, గద్య నాటకాలలో వైవిధ్యంగల పాత్రలు పోషించి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. చంద్రబాల, కామాక్షి, సుబ్రహ్మణ్య కుమారి మొదలైన నటీమణులు స్త్రీ పాత్రలు ధరించేవారు. లలిత కళా నిలయం సమాజం ఒక కుటుంబ సభ్యులతో కలిసి నాటకాలు ప్రదర్శించినట్లుండేది. గాలి బాల సుందరరావు అపోహ నాటకాన్ని, కణ్వశ్రీ ఆనాడు నాటకాన్ని, ఆత్రేయ ఈనాడు నాటకాన్ని జనరంజకంగా ప్రదర్శించి ప్రశంసలందుకుంది. కణ్వశ్రీ ఇదా ప్రపంచం నాటకాన్ని ఆంధ్ర నాటకకళాపరిషత్తు ప్రాథమిక పరిశీలనలో తిరస్కరించినపుడు, పరిషత్తు రేపల్లెలో జరుగుతుండగా రేపల్లె వీధిలో ఇదా ప్రపంచం నాటకం ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నాడు. పులిగుండ్ల తుఫాన్ నాటికను ఆంధ్రనాటక కళాపరిషత్తులో ప్రదర్శించి బహుమతులు పొందాడు. గాడేపల్లి రామయ్య రాఘవ రెడ్డి పాత్ర ధరించి ప్రథమ బహుమతి పొందాడు. ఉత్తమ రచయితగా రామకృష్ణయ్య బహుమతి అందుకున్నాడు. లలిత కళా నిలయం ద్వారా తొలిప్రదర్శన చేయబడిన కణ్వశ్రీ బాలనాగమ్మ ఆంధ్రదేశంలో వేలాది ప్రదర్శనలకు నోచుకొని విశేష ప్రాచుర్యం పొందింది.

1950 నాటికి సాంఘిక నాటకాలలో నటించే టి.వి. రమణారెడ్డి, ఆత్రేయ, సి. నాగభూషణం, రాజనాల, కణ్వశ్రీ మొదలైనవారు సినిమారంగంలోకి వెళ్ళిపోయారు. వృద్ధతరం మిగిలిపోయి, యువతరం ముందుకురాని నేపథ్యంలో లలిత కళా నిలయం క్రమంగా కనుమరుగైపోయింది.

గం.సు.రె.

లలిత కళా పరిషత్తు (అనంతపురం): అనంతపురం జిల్లాలో సాంస్కృతికోద్యమానికి కృషి చేస్తూ, స్వర్ణోత్సవాలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్న సంస్థ. ఈ పరిషత్తుకు 1956, ఫిబ్రవరి 11న నాటి ఆంధ్రప్రదేశ్ గవర్నరు శంకుస్థాపన చేశాడు. ఈ పరిషత్తు వేదిక నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కల్లూరు సుబ్బారావు తనకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఇచ్చాడు. పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు కె. కొండల రావు. మొదట ఆరు బయట స్థలంలో ఆరంభమైన పరిషత్తు 1989 నాటికి పైడి లక్ష్మయ్య పేరున ఆడిటోరియం నిర్మించుకుంది. ఈ కళా వేదికపై ప్రసిద్ధ పౌరాణిక, సాంఘిక నాటకాలతో బాటు రంగస్థల నటుల, సాహితీ ప్రముఖుల సన్మానాలతో పాటు సదస్సులు, జానపద, శాస్త్రీయ సంగీత నృత్యోత్సవాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఈ సంస్థ ప్రతి సంవత్సరం రంగస్థల వికాసం కోసం కృషి చేస్తున్న నటులకు బళ్ళారి రాఘవ అవార్డునిచ్చి సత్కరిస్తుంది. 1978లో రాష్ట్ర స్థాయి నాటక పోటీలను నిర్వహించింది. ప్రముఖ హాస్య నటుడు రొద్దం హనుమంతరావు జ్ఞాపకార్థం సంగీత నృత్య శిక్షణాలయాన్ని నెలకొల్పి ఈ సంస్థ యువకులను, బాలబాలికలను కళాకారులుగా తీర్చిదిద్దింది. లలిత కళా పరిషత్తు 35సంవత్సరాల విశేష సంచిక, కల్లూరు సుబ్బారావు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, శతజయంతి సంచికలను ఈ పరిషత్తు ప్రచురించింది. ఒకప్పుడు విరాళాలు సేకరించి కార్యక్రమాలు

నిర్వహించే కళాపరిషత్తు నేడు సొంతంగా కార్యక్రమాలు నిర్వహించుకునే స్థితికి చేరుకుంది. ఈ పరిషత్తు రాష్ట్రంలోని ఇతర పరిషత్తులకు ఆదర్శప్రాయంగా నిలిచింది.

దాసరి.ఎస్

లింగమూర్తి, ముదిగొండ (1908-1980) : రంగస్థల, చలనచిత్ర నటుడు, రచయిత. ఈయన 1908, అక్టోబర్ 10వ తేదీన తెనాలిలో జన్మించాడు. ఎన్నో రకాల భూమికలను ధరించి బహుముఖ ప్రజ్ఞాన్వితుడైన నటుడన్న సార్థక నామాన్ని సంపాదించిన నటులలో లింగమూర్తి ఒకరు. చిన్నప్పటి నుంచి నాటక కళాభిమాని కావడంవల్ల ఉన్నత విద్యకు పోకుండా తెనాలి శ్రీరామ విలాస సభ నాటకాలలో చిన్న, పెద్ద పాత్రలను పోషించి తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నాడు. కన్యాశుల్కం నాటకంలో రామప్పంతులు పాత్ర లింగమూర్తి కోసమే రచయిత సృష్టించాడా అన్నంతగా అబ్బురపరచేది. 1937లో సెంట్రల్ స్టూడియోస్ వారితో నిర్మింపబడిన తుకారాం చిత్రంతో సినిమా ప్రేక్షక లోకానికి పరిచయమయ్యాడు. తరువాత దేవత, పంతులమ్మ, పోతన, త్యాగయ్య, స్వర్గసీమ, యోగి వేమన, లక్ష్మమ్మ, పేదరైతు, భక్తిమాల, పెద్దమనుషులు, కన్యాశుల్కం, మహామంత్రి తిమ్మరుసు, రామదాసు, దేవదాసు మొదలైన చిత్రాలలో విభిన్న ప్రకృతులతో, ప్రవృత్తులతో కూడిన పాత్రలను పోషించి ప్రేక్షకుల ఆదరాభిమానాలను ఆర్జించాడు. ఆంధ్రనాటక కళాపరిషత్తు, దేశంలోని ఇతర సాంస్కృతిక సంస్థలు ఆయనను సముచితరీతిన సత్కరించాయి. లింగమూర్తి సిద్ధిపొందిన నటుడే కాకుండా సంస్కారం, అనుభవం పుష్కలంగా ఉన్న గొప్ప రచయిత అని ఆయన రచించిన వెంకన్న కాపురం, పెళ్ళిచూపులు నాటికలు రుజువుచేశాయి. వెంకన్నకాపురం నాటికను ప్రసిద్ధ నాటక సమాజాలన్నీ వందలసార్లు ప్రదర్శించి రచయితకు ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టాయి.

పండిత ప్రకాండులతో, నాటకాభిమానులతో, విమర్శకులతో 'నటయోగి' అనిపించుకున్న లింగమూర్తి మద్రాసులో 1980, జనవరి 24న శివసాయుజ్యం చెందాడు.

ఇం.వెం.

లెస్సింగ్ గోట్ హోల్డ్ (1729-81) : జర్మన్ నాటక రచయిత, విమర్శకుడు. జర్మనీలోని కాయెంజ్ అనే ప్రదేశంలో జన్మించాడు. లీప్‌జిగ్ విశ్వవిద్యాలయంలో మతధర్మ శాస్త్రాన్ని, వైద్య శాస్త్రాన్ని అభ్యసించాడు. 1748లో బెర్లిన్‌లోని విటెన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. పట్టా తీసుకున్నాడు. కొద్ది కాలమే ఉన్న హాంబర్గ్ నేషనల్ థియేటర్ ప్రాజెక్టు కాలంలో పత్రికా రచయితగా, విమర్శకుడిగా, నాటక రచయితగా పేరు ప్రతిష్ఠలార్జించాడు. ఫ్రెంచి నాటకాలలోని లోపాలను ఇతని వ్యాసాలు ప్రముఖంగా విమర్శించేవి. ఇటువంటి వ్యాసాలకు జర్మనీలో ఆనాడు బాగా గుర్తింపు లభించేది. షేక్స్పియర్ నాటకాలలోని గుణౌన్నత్యాన్ని, ఆంగ్ల నాటక సంప్రదాయంలో తొణికిసలాడే ఆర్ద్రమైన మానవతను గుర్తించినవారిలో లెస్సింగ్ ప్రథముడు.

1768లో రచించిన 'హాంబర్గ్ డ్రమెటర్జీ' అనే గ్రంథంలో ఫ్రెంచి నాటకరంగంపై జర్మన్ నాటకరంగం ఆధార పడడం పట్ల నిరసన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా, దీనికి అనుకూలంగా జాలి, భయం అనే భావనలకు, అరిస్టాటిల్ చెప్పిన వ్యాఖ్యానానికి భిన్నంగా సరికొత్త వివరణ ఇచ్చాడు. నాటకం సహృదయునిలో సంవేదనను కలుగజేయడం ద్వారా తన సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తుందని, అదే దాని తుది ఫలితమని చెప్పాడు. 1755లో మిస్ సారా శాంప్సన్ అనే డొమెస్టిక్ ట్రాజెడీని రచించాడు. ఈ నాటకాన్ని జార్జెలిలో, శామ్యూల్ రిచర్డ్‌సన్‌ల నవలల ప్రభావంతో రచించాడు.



బైబిల్ క్రిస్టియన్ మతానికి మూలగ్రంథం కాదు అనే అభిప్రాయం వ్యక్తం చేసి దుమారం రేపాడు. ఇది వివాదాస్పదమై చాలాకాలం పాటు అనేక వాగ్వాదాలకు దారితీసింది. 1747లో ఈయన ప్రచురించిన ది యంగ్ స్కాలర్ అనే నాటకం చాలా ప్రసిద్ధి చెందింది. 1749లో ది జ్యూస్ అనే మరొక ప్రసిద్ధ నాటకాన్ని ప్రచురించాడు. మనిషి ఆంతరంగిక స్వభావం, వ్యక్తిత్వాలను బట్టి గౌరవించాలని ఈ నాటక సందేశం. ఇదే ఏడాదిలో ఫ్రీ థింకర్ అనేమరోనాటకాన్ని రచించాడు. ధర్మబద్ధంగా జీవించడమే మతానికి గుండెకాయ అని ఈ నాటకం ద్వారా నొక్కి చెప్పాడు.

1767లో మిన్నావాన్‌బార్న్‌హెల్మ్ అనే హాస్య నాటకాన్ని రచించాడు. జర్మన్ సాహిత్య చరిత్రలోనే ఇది గొప్ప హాస్య నాటకంగా గుర్తింపు పొందింది. ప్రసిద్ధ జర్మన్ మహాకవి గోథే కూడా ఈ నాటకాన్ని చాలా ప్రశంసించాడు. 1772లో ఎమీలియా గేలట్టి అనే నాటకాన్ని రచించాడు. సమకాలీన చిన్న

దేశాల పాలకుల అహంకారాన్ని, అవినీతిని ఎండగట్టే మంచి ఉద్రిక్తమైన, ప్రతిభావంతమైన విషాదాంత నాటకమిది. 1779లో మత సహనాన్ని ప్రోత్సహిస్తూ నాథన్ ది వైజ్ అనే నాటకాన్ని రచించాడు. మతసహన స్ఫూర్తిని సందేశంగా ఈ నాటకం అందించింది.

తాను గొప్ప రచయితను కానని, సృజనాత్మకశక్తి లేదని లెస్సింగ్ వినయంగా చెప్పుకొన్నాడు. కాని ఈయన నాటకాలు నాలుగు బాగా ప్రాచుర్యం పొందాయి. జర్మన్ సాహిత్య చరిత్రలో వీటికి గణనీయమైన స్థానం లభించింది. లెస్సింగ్ జీవితపు చివరి రోజులలో ఒంటరిగా, నిరుపేదగా జీవించాడు. 1781, ఫిబ్రవరి 15న మృతి చెందాడు.

రమాంజనీ.

లోకధర్మి : ధర్మి అంటే అభినయ విధానం. ఇది రెండు రకాలు. ఒకటి లోకధర్మి, రెండవది నాట్యధర్మి. నాట్య లక్షణాలతో శాస్త్ర బద్ధమైన అభినయ రీతిని నాట్యధర్మి అంటారు. (నాట్య ధర్మి చూడండి) లోకానుసారి అయిన అభినయ విధానం లోకధర్మి. సహజంగా లోకంలో జరిగే సంఘటన, వ్యవహారాలు లోకధర్మిలో ప్రస్ఫుటమవుతాయి. దీనికి అనుగుణంగానే అభినయంలో కూడా సహజత్వం ప్రతిఫలిస్తూ ఉంటుంది. స్త్రీ పాత్రలను స్త్రీలు, పురుష పాత్రలను పురుషులు ధరించడం లోకధర్మిలో అంతర్భాగమైన సంప్రదాయం. వీటన్నింటికీ వ్యతిరేకమైనది నాట్యధర్మి. కృత్రిమత్వానికి, అలౌకిక విషయాల ఆవిష్కరణకు లోకధర్మిలో తావుండదు. సంప్రదాయ పద్య నాటకాలు నాట్యధర్మికి, సాంఘిక నాటకాలు లోకధర్మికి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. నాట్యధర్మి లోకధర్మి రెండింటి సమ్మేళనంతో ఉన్నరూపకం ఉత్తమమని లాక్షణికుల అభిప్రాయం.

గం.సు.రె.

లోన్, అలి మహమ్మద్ (జ.1926) : కాశ్మీరీ, ఉర్దూ నాటకకర్త, నవలాకారుడు, కథానికా రచయిత. శ్రీనగర్‌లో జన్మించాడు. తండ్రి వద్ద పర్షియన్ కావ్యాలను చదువుకున్నాడు. పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేట్ పట్టా (1946) పుచ్చుకున్నాడు. దేశవిభజన తరువాత కాశ్మీరీ సేనలో రాజకీయ కమాండర్‌గా పనిచేశాడు. ఖిద్మత్ పత్రికలో ఉపసంపాదకుడిగా పనిచేశాడు. రేడియో కాశ్మీరీలో గుమాస్తా (1948)గా, ఆకాశవాణిలో స్క్రిప్టు రచయిత (1956)గా, అసిస్టెంటు ప్రొడ్యూసర్ (1965)గా పదవీ బాధ్యతలు చేపట్టాడు. అకాడమీ ఉపకార్యదర్శిగా పనిచేశాడు.

కల్చరల్ కాంగ్రెస్ ప్రభావంతో అభ్యుదయపథంలో ఉర్దూలో రచనలు ప్రారంభించాడు. కొంగ్ పోష్ పత్రికలో ఉర్దూ విభాగానికి సంపాదకుడుగా పనిచేశాడు. దివానే కా ఖ్వాబ్(పిచ్చివారి కలలు, 1958), *ఖిలూజాన్ కా ఖ్వాబ్*(1962) నాటకాలు ఈయనకు మంచి పేరు తెచ్చాయి. తరువాత కాశ్మీరీపై మక్కువ పెంచుకొని, కాశ్మీరీలో రాయడం ప్రారంభించాడు. సుమారుగా ఒక డజను కథానికలు, 150కి పైబడి రేడియో నాటకాలు రచించాడు. ఈయన రచించిన నాలుగు నాటకాలు జాతీయ కార్యక్రమంలో ప్రసారమయ్యాయి. గోర్కి రాసిన మదర్‌ను ఈయన కాశ్మీరీలోకి అనువదించగా, రాష్ట్రఅకాడమీ ప్రచురించింది. దీనికి సోవియట్ లాండ్ నెహ్రూ బహుమతి (1972) లభించింది. *కథాసరిత్సాగరాన్ని* ఆధారంగా చేసుకొని ఈయన రచించిన రేడియో నాటకం వైతాల్ పచ్చిసికి శ్రోతల నుంచి మంచి ఆదరణ లభించింది. *రాజతరంగిణి* ని ఆధారంగా చేసుకొని ఈయన రచించిన సుయ్య కు సాహిత్య అకాడమీ బహుమతి (1972) లభించింది. అవంతివర్మ కాలంనాటి ఇంజనీరు సుయ్య ను ఆధారంగా చేసుకొని ఈ నాటకం రచించాడు. రచనలో సంవిధాన శిల్పం, ఉన్నతమైన ఆదర్శాల వల్ల దీనిని ఉత్తమ రచనగా పరిగణించారు. ఇది గత వైభవాన్ని ప్రదర్శించడంతో పాటు, కాశ్మీరీ భాషకు పుష్టినిచ్చింది.

చంద్ర

వరప్రసాదరావు, అబ్బూరి (1923-1966) : రంగస్థల నటుడు. 1923, ఏప్రిల్ 15న తెనాలిలో జన్మించాడు. శ్రుతి పక్వమైన గొంతు, మంచి లయజ్ఞానం అందరికీ అర్థమయ్యేలాగా పద్యం విరుపుగా చదవడం అబ్బూరి లక్షణాలు. నాటక సంగీతంలో సొంత బాణీ కుదుర్చుకున్నాడు. దానికే 'అబ్బూరి బాణీ' అని పేరు. ఈయన గ్రామఫోను రికార్డులు ఇప్పటికీ మారుమోగుతున్నాయి.

స్వస్థలం కృష్ణా జిల్లా అయినా తెనాలిలో స్థిరనివాసం ఏర్పరచుకున్నందువల్ల తెనాలివారుగానే పరిగణితుడయ్యాడు. శ్రీకృష్ణుడు, హరిశ్చంద్రుడు పాత్రలకు జీవంపోశాడు. 1944 వరకు ఔత్సాహిక నటులతో నటించాడు. 1945 నుంచి సోదరులైన వెంకటప్పయ్య, ఆదినారాయణలతో కలసి తెనాలిలో 'ఆంధ్ర డ్రమెటిక్ కంపెనీ' స్థాపించి నిర్విఘ్నంగా, విజయవంతంగా నడిపాడు. ఆంధ్రదేశమంతటా నాటకాలాడి విజయఢంకా మోగించాడు. అశేష కీర్తి, ధనం ఆర్జించాడు. శ్రీ కృష్ణుడు, హరిశ్చంద్రుడు, శ్రీ రాముడు, సారంగధరుడు వంటి పాత్రలలో

నటించిన ఈయన క్షయవ్యాధిగ్రస్తుడయ్యాడు. అయినప్పటికీ నాటకాలాడాడు. చివరకు ఆ వ్యాధితోనే 1966, మే 15న కన్ను మూశాడు.

శ్రీ.చ.

వసు, అమృతలాల్ (1853-1929) : వంగ నాటక రంగాన్ని పునరుజ్జీవింప చేసిన కళాకారుడు. గిరీశ్చంద్ర ఘోష్ ఆధునిక వంగ నాటకరంగంలో పితామహుడు. గిరీశ్చంద్రఘోష్ తరువాత చెప్పదగినవాడు అమృతలాల్ వసు. గిరీశ్చంద్రుని లాగా గాంభీర్యానికి పెద్దపీట వేయకుండా ఇంద్రనాథ్ బెనర్జీలాగా మొరటుదనానికి, అసభ్యతకు తావివ్వకుండా, అమృతలాల్ హాస్యనాటక రచనకు ప్రాధాన్యమిచ్చాడు. ఏదో సందేశాన్నిచ్చి సామాజికులను ఉద్ధరించాలనడం కన్నా వినోదాన్ని కలిగించి వారిని ఊరడించాలన్నదే అమృతలాల్ అభిమతం. సమాజంలో నెలకొన్న అస్తవ్యస్త స్థితులు, ఏదైనా లాభం వస్తుందనుకొన్నప్పుడు మనిషి తనకు అనుకూలంగా ప్రతిదానిని మలచుకోవడం, మిడిమిడి జ్ఞానంతో పాశ్చాత్యుల వేషభాషలను పైమెరుగులను మాత్రమే అనుకరించి, వారిలోని క్రమశిక్షణ, గుణశీలాదులను గాలికి వదిలివేసే అర్ధ విద్యావంతులైన బెంగాలీ యువకిశోరాలను, డబ్బే గమ్యంగా సాగే తండ్రులకు అమృతలాల్ తన నాటకాలలో హాస్యరసపూరితంగా, వ్యంగ్యంగా చిత్రించి చురకలు వేశాడు.

అమృతలాల్ మీద మొదట మోలియర్ మొదలైన పాశ్చాత్య నాటక రచయితల ప్రభావం ఉండేది. తరువాత స్వతంత్రంగా ఆలోచించడం అలవాటు చేసుకొన్నాడు. అమృతలాల్ రచనల్లో ఒకటి రెండు ప్రహసనాలకు మోలియర్ రచనలు మాతృకలుగా కనిపిస్తాయి.

పాశ్చాత్య సంస్కృతిని అనుకరిస్తున్నామని, అభ్యుదయ పంథాలో పయనిస్తున్నామని తలపోసే యువకులను తండ్రులు కట్నాలు, కానుకలు, పెట్టుపోతల కోసం తహతహలాడినపుడు యువకులేమీ అనలేకపోవడాన్నీ, ఇంగ్లండు నుంచి వచ్చిన కొడుకుకు కట్నంగా బాగా డబ్బు గుంజాలని పెళ్ళికూతురు తండ్రితో వాదించే ఒక తండ్రిని వివాహ బిభ్రాట్ అనే ప్రహసనంలో రసవత్తరంగా అమృతలాల్ చిత్రించాడు. కృపణేరథనం అనే ప్రహసనంలో ఒక లోభిని సహజంగా సృష్టించాడు. అధికారం కోసం పానపాత్రలో వజ్రపుపొడిని ఉంచి ఇంగ్లీషు రెసిడెంట్‌ను చంపాలని యత్నించడం ఇతివృత్తంగా హీర క చూర్ణం అనే ప్రహసనాన్ని రచించాడు. తరుబాల, విజయ వసంత, నవయౌవన, ఖాస్ దఖల్, డిస్‌మిస్, యాజ్ఞసేని, హరిశ్చంద్ర, ఆదర్శ బంధ్ మొదలైన రూపకాలను అమృతలాల్ రచించాడు.

వె.వి.రా.

వస్తువు : నాటక నిర్మాణ సంబంధి. అన్ని సాహిత్య ప్రక్రియలకూ మూలవస్తువు కథ. నవల, కవిత, నాటకం మొదలైన సాహిత్య సృష్టికి వస్తువు మూలాధారం కావ్యం ద్వారా కవి ఏం చెప్పదలచుకొన్నాడో ఆ భావనకు, లక్ష్యానికి సూక్ష్మరూపమే వస్తువు. నాటకం రాయదలచుకొన్న రచయిత, ముందు ఆలోచించేది కథావస్తువు గురించే. వస్తువు బీజం కంటే పెద్దది. ఇతివృత్తం కంటే చిన్నది. కాళ్ళకూరి నారాయణరావు చింతామణి నాటకంలో బీజం వేశ్యాలోలత్వం. సాని సంపర్క ఊబిలో చిక్కుకొని ఇల్లూ - వొళ్ళూ గుల్ల చేసుకొని కష్టాల పాలయ్యే వ్యక్తుల ఉదంతం – ఆ నాటకంలో వస్తువు, వరవిక్రయం నాటకంలో వరకట్నాల దురాచారం వల్ల కన్యలూ, వారి తల్లిదండ్రులూ పడే బాధలూ – వస్తువు. త్రాగుడు దుర్వ్యసనం వల్ల సంసారం చిన్నాభిన్నం కావడం, దానివల్ల కలిగే దుష్ఫలితాలు మధుసేవ నాటకంలో వస్తువు. ముత్తరాజు సుబ్బారావు శ్రీకృష్ణతులాభారం నాటకంలో శ్రీకృష్ణుడు భక్తిపాశబద్ధుడే గాని బాహ్యసౌందర్యానికి కట్టుబడడని కలహాశనుడు సత్యాదేవికి కనువిప్పు కలిగించడం – వస్తువు. వస్తు బలం లేని నాటకం ప్రదర్శనలో రాణించదు. ఒకవేళ రాణించినా అది తాత్కాలికమే. ఎక్కువకాలం మనలేదు. వస్తువు తర్వాత నాటకంలో ప్రాముఖ్యం వహించేది ఇతివృత్తం ముఖ్యమైన సంఘటనలను, సన్నివేశాలను ఒక క్రమ పద్ధతిలో అమర్చుకొన్న నాటక నిర్మాణ ప్రణాళికే ఇతివృత్తం. ఇతివృత్తంలో కథ సమగ్రతను సంతరించుకొంటుంది. అందుకే ఇతివృత్తాన్ని నాటక శరీరం అని పేర్కొన్నారు లాక్షణికులు. వస్తువైశిష్ట్యం మీదనే ఇతివృత్త నిర్మాణం ఆధారపడి ఉంటుంది.

గం.సు.రె.

వస్త్వైక్యం : నాటక రచనా సంబంధి. ఐక్యత్రయంలో ఒకటి. మిగిలిన రెండూ కాలైక్యం, స్థలైక్యం (వీటి గురించి వివరాలు వేరొకచోట చూడగలరు). నాటక రచనకు మూలం వస్తువు. కథా వస్తువు లేకుండా నాటకమే కాదు; ఏ సాహిత్య ప్రక్రియా ఒక నిర్దిష్టరూపం ధరించలేదు. ఒక సాహిత్య ప్రక్రియ ఏదో ఒక విషయం తెలియజేయాలి. ఆ విషయమే వస్తువు. లక్ష్య సాధనకు మూలకందమైన అంశం. కల్పనకు హేతువు, తొలిమెట్టు.

ప్రతి నాటకంలోనూ విధిగా వస్తువు నిబిడీకృతమై, ఆధారభూతంగా ఉంటుంది. ప్రధాన వస్తువు నుంచే కథ తీగలు సాగుతుంది. శాఖోపశాఖలుగా విస్తరిస్తుంది. నాటకంలో ప్రతి పాత్ర శ్వాసక్రియకు జీవశక్తిని ప్రసాదించే గుండెకాయ వంటిది వస్తువు. ఉదాహరణకు గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకంలో కన్యలకు ధర కట్టి అమ్ముకోవడమనే దురాచారం వస్తువు. కాళ్లకూరి నారాయణరావు రచించిన చింతామణి లో వేశ్యావృత్తి వస్తువు. బెల్లంకొండ రామదాసు

రచించిన పునర్జన్మ నాటకంలో పడుపువృత్తిలో కష్టాల పాలైన స్త్రీ జీవితాన్ని ఉద్ధరించి వెలుగును ఇవ్వడం కథా వస్తువు. వస్త్వైక్యం గురించి ఒక్కమాటలో చెప్పాలంటే కావ్యసృష్టిలో వస్తువు ఒకటే ఉండాలని అర్థం.

ఒక్కొక్కసారి నాటకంలో ప్రధాన కథతో పాటు అనుషంగికంగా మరో ఉపకథ నడుస్తుంది. అటువంటి సందర్భంలో కూడా ఉపకథ ప్రధాన వస్తువుకు లోబడి ఉండాలేగాని స్వతంత్రించకూడదు. వస్తుపరిధికి దూరంగా జరిగిపోయినపుడు నాటకంలో వస్తువు ఐక్యత కోల్పోతుంది. దీనినే వస్త్వైక్యలోపం అంటారు. నాటకంలో సన్నివేశాలు, పాత్రచిత్రణ వస్తువు చుట్టూ పరిభ్రమించాలని, కావ్యార్థాన్ని అభివ్యక్తం చేసే దిశలో సాగిపోవాలని అనుశాసించారు లాక్షణికులు. గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ కూడా తన కావ్యశాస్త్రంలో ఈ విషయం స్పష్టంగా పేర్కొన్నాడు.

గం.సు.రె.

వాచికాభినయం : అభినయ భేదం. చతుర్విధాభినయాల్లో రెండవది. మాటల ద్వారా భావాలను వ్యక్తీకరిస్తూ నటించడమే వాచికాభినయం. నటనలో వాచికాభినయానికి చాలా ప్రాముఖ్యత ఉంది. పలుకులు చదివినట్టుగా ఉండకూడదు. క్రోధాన్ని ప్రదర్శించాల్సిన సన్నివేశంలో బాణాలు సంధించినట్టుగా నేర్పుతో మాటల్ని ప్రయోగించాలి. ప్రేమతో ప్రియురాలితో పలికే సన్నివేశంలో శృంగారం తొణికిసలాడాలి. కరుణ రసం ఉత్పన్నం కావలసిన ఘట్టంలో హృదయం ద్రవించేటట్టు పలకాలి. వాచికాభినయం సంగీతంతో సమానం. పాటలు పాడడానికి శిక్షణ, ఎంత అవసరమో, వాచికాభినయానికి కూడా అవి అంతే అవసరం. సాధన చేసిన గొంతుతో నైపుణ్యాన్ని పుణికిపుచ్చుకున్న గాత్రంతో మాటలు చెప్పినప్పుడు వినసొంపుగా ఉంటాయి. రససిద్ధి కలుగుతుంది. చెబుతున్న మాటలకున్న అర్థాన్ని స్ఫురింపజేస్తూ, తగిన ధ్వనిని జత కలిపి, భావాల ప్రతిరూపాన్ని సృజనాత్మకంగా ప్రేక్షకుల కళ్లముందుంచగలిగితే వాళ్లు ముగ్ధులవుతారు. మాటలు పలికేటప్పుడు శబ్దాలకి, అక్షర సముదాయానికి తగిన విడుపు కల్పిస్తూ దీర్ఘాలను దీర్ఘాలుగాను, హ్రస్వాలను హ్రస్వాలుగాను, లయ తప్పకుండా, ఉచ్చారణ దోషాలు లేకుండా, సమాసాలకు అర్థవంతంగా విరుపులు ఇస్తూ పాత్ర స్వరూపాన్ని అందించాలి. అప్పుడే చెప్పే మాటలకు విలువ, ధరించే పాత్రకు జీవం చేకూరతాయి.

నాటకంలో ఒక పాత్ర అభినయిస్తూ మాట్లాడ్డంలో అనేక రకాల గమనాలున్నాయి. కాఠిన్యంగా, మృదువుగా, మెల్లగా, వేగంగా, బరువుగా, తేలికగా, పెళుసుగా, నమ్రతగా, అసహ్యంగా సందర్భాన్ని బట్టి రకరకాలుగా మాట్లాడవలసిన అవసరం ఉంటుంది. అయితే ఏ రకమైన గమనానికైనా మాట్లాడేటప్పుడు స్పష్టోచ్చారణ, బలమైన ధ్వని తరంగాలు తప్పనిసరి. ప్రేక్షకులకు వినబడడానికి తగినస్థాయిలో ఆరోహణ అవరోహణాలు పాటిస్తూ, లయబద్ధంగా చెబుతూ, రసోత్పత్తి జరిగేటట్టు స్పష్టంగా చెప్పాలి. వాచికాభినయానికి బాగా దోహదం చేసే వాక్సరణి, స్వరదోళనం, ఆరోహణ, అవరోహణాలు, విరామాలు, ఒత్తి పలకడాలు అనే అంశాల మీద తగినంత జ్ఞానం సంపాదించి అభివృద్ధి చేసుకోవాలి. ఉచ్ఛ్వాస నిశ్వాసాల మీద నియంత్రణ సాధించడంవల్ల మాటలు పటుత్వంతో బయటకు వస్తాయి. అనవసరమైన ఒత్తిడులకు, ఆత్రుతలకు గురికాకుండా మనస్సుని ప్రశాంతంగా ఉంచుకోవడం వల్ల కూడా కంఠ ధ్వని సహజస్థితిలో వెలువడే అవకాశం ఉంది. సాధన ద్వారా కొన్ని వాచిక దోషాలను కూడా సవరించుకోవడానికి అవకాశం ఉంది.

నారాయణ

వాసక సజ్జిక : అష్టవిధ నాయికలలో మొదటిది. రతి సంభోగలాలస అయి రాత్రంతా నాయకునితో కలిసి గడపాలని మధుర ఊహలతో చక్కగా అలంకరించుకొని సంసిద్ధం అయ్యే నాయిక.

గం.సు.రె.

వాసుదేవ శాస్త్రి, వావిలాల (1851-1897) : తెలుగులో మొదటి స్వతంత్ర సాంఘిక నాటక కర్త. మొట్టమొదటి ఆంగ్లానువాద నాటకకర్త. ఈయన రచించిన నందక రాజ్యం మొదటి సాంఘిక నాటకమైతే మొదటి ఆంగ్లానువాద నాటకం జూలియస్ సీజర్.

వావిలాల వాసుదేవ శాస్త్రి గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా కారుమూరులో 1851, జూన్ 1న మహాలక్ష్మమ్మ, అప్పయ్యశాస్త్రిలకు జన్మించాడు. వాసుదేవ శాస్త్రి మొదట కారుమూరులో కొండుభట్ల రామలింగశాస్త్రి వద్ద సంస్కృతాంధ్రాలు, గుంటూరులో ఇంగ్లీషు చదివి, నోబుల్ కళాశాల బందరులో చేరి 1873లో ఎఫ్.ఎ.లో ఉత్తీర్ణుడయ్యాడు.

కోరాడ రామచంద్రశాస్త్రి, వేదుల వెంకటాచార్యుల వద్ద సంస్కృతాంధ్ర కావ్య శాస్త్రాలను నేరుగా చదివాడు. 1873లో ఆంగ్ల కళాశాలలో అధ్యాపక వృత్తి చేపట్టాడు. ఆ సమయంలోనే ప్రవేటుగా బి.ఎ. ఉత్తీర్ణుడై, మద్రాసు విశ్వవిద్యాలయం స్వర్ణ పతకం పొందడం విశేషం. ఈయన సంస్కృతాంధ్ర భాషల్లో నిష్ణాతుడు. రాజమండ్రి కళాశాలలో దేశ భాషాధ్యక్ష పదవి

పొందాడు. వావిలాల, వడ్డాది సుబ్బారాయుడు, కందుకూరిలను ఆనాటి రాజమండ్రి ప్రజలు కవిత్రయం అనేవారట. చిలకమర్తి, పానుగంటి, సుసర్ల దక్షిణామూర్తి ఈయన శిష్యులే.

నందకరాజ్యం 1880లో ప్రచురించబడింది. నాటకమంతా తేటగీతి పద్యాల్లో నడవటం ఒక విశేషం. ఈ నాటక లక్ష్యం నియోగి వైదికులలో సమైక్యానికి చేసిన ప్రయత్నం. వారిలో కక్షలు, కార్పణ్యాలను వెలికితీయడమే దీని లక్ష్యం. ఇది అయిదు అంకాల నాటకం. ఆనాటి ప్రభుత్వ ఉద్యోగులు అందరూ నియోగులు. వారు వైదికులను బాధలు పెట్టి హింసిస్తూండేవారట. విపరీతమైన వైషమ్యాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు పెరిగి పోయాయి. నియోగుల దౌర్జన్యాలను, అన్యాయాలను గమనించి వారిని శిక్షించి వైదికులను రాజు రక్షిస్తాడు. ఇందులో అంతర్నాటకం ప్రవేశపెట్టాడు వావిలాల. సందర్భానుసారంగా నాటకంలో అవధానం, పాత కొత్త నాటకాల ప్రదర్శన పై చర్చ, స్త్రీ విద్యకు సంబంధించిన చర్చ ఈ నాటకంలో ప్రవేశపెట్టాడు. ఇది సాంఘిక సంస్కరణ నాటకం, కాని ప్రదర్శించినట్లు దాఖలాలు లేవు. ఇది ప్రథమాంధ్ర పద్య, సాంఘిక నాటకం కావడం వల్ల ఆంధ్ర నాటక సాహిత్యంలో దీనికి ఒక ప్రత్యేక స్థానం ఉంది.

వావిలాల వాసుదేవ శాస్త్రి రెండు రకాల అనువాదాలు చేశారు. 1. ఆంగ్ల అనువాదం, 2. సంస్కృతానువాదం.

షేక్స్పియర్ జూలియస్ సీజర్ నాటకాన్ని ఆటవెలది పద్యాలలో అనువదించడం విశేషం. ఇది 1875లో రచించగా 1876లో ప్రకటించబడింది. ఇది పూర్తిగా పద్య నాటకం. వచనం లేదు. రచనా శైలి సరళమై మనోహరంగా ఉంది. వీరేశలింగం పంతులు 1876 జూలై నెలలో వెలువరించిన వివేకవర్ధని పత్రికలో దీనిని ప్రశంసించాడు. సంస్కృతం నుంచి రెండు నాటకాలను అనువదించాడు. 1881లో భవభూతి ఉత్తర రామచరితను, 1892లో శూద్రకుని మృచ్ఛకటిక ను అనువదించాడు. ఉత్తర రామచరిత 1890లోను, మృచ్ఛకటికాన్ని 1897లో బి.ఎ. పరీక్షకు పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించబడ్డాయి.

గంగప్ప

వాస్తవికతా వాదం : 19వ శతాబ్దం మధ్యకాలంలో ఐరోపా ఖండంలో అనేక సాహితీ ప్రక్రియల్లో వాస్తవికతావాదం చోటు చేసుకుంది. ఈ వాదం ప్రప్రథమంగా ఫ్రాన్సులో మొదలైంది.

మనిషిబాగోగులను గురించి పట్టించుకునే 'సామాజిక శాస్త్రం' అన్ని శాస్త్రాల కంటే ప్రశస్తమైనదనీ, కనుక సమాజాన్ని బాగుపరచడానికి సర్వమానవ విజ్ఞానాన్ని కేంద్రీకృతం చెయ్యాలని ఆగస్టు కాంప్టే వంటి తాత్వికులు ప్రబోధించారు. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం ఈ వాదానికి మరింత బలాన్నిచ్చింది. ఊహాజగత్తులో విహరించే భావనాత్మక రచనలకూ, సమాజానికి దూరమైన కాల్పనిక సాహిత్యానికి కాలం చెల్లిందని నాటకకర్తలు గ్రహించారు. నూతనత్వం కోసం అన్వేషించసాగారు. వారి అన్వేషణ ఫలితమే వాస్తవికతా వాదానికి నాంది.

అనువంశిక లక్షణాల, పరిసరాల ప్రభావం ప్రతి మనిషి జీవితాన్ని వెంటాడటంతో అతడి ప్రవర్తనను అవి నియంత్రణ చేస్తాయనీ, ఆ విధంగా అతని ప్రవర్తన అతని అదుపులో లేకపోవడానికి అనువంశికత, పరిసరాలే కారణభూతాలు కనుక, ఒక వ్యక్తి చేసే పనికి అతడు బాధ్యుడు కాడని అంటారు వాస్తవికతావాదులు. ఒకవేళ అతడు చేసే పనికి అతడిని తప్పు పట్టాల్సి వస్తే ఆ నేరం అతనిది కాదనీ, అలాంటి పరిస్థితులు కల్పించిన సంఘానిదేనని వీరి వాదన. ఈ నమ్మకాలమీదనే వాస్తవికవాదం బయలుదేరింది. పంచేంద్రియాల ద్వారా వెల్లడి అయ్యే సత్యాన్ని మాత్రమే ఆవిష్కరింపచేయాలన్నది వాస్తవికవాదుల ప్రధాన లక్ష్యం. సత్యాన్వేషణ ఈ వాదానికి మూల సూత్రం. వాస్తవ చిత్రణే దీనికి ప్రాతిపదిక.

ఈ సూత్రాన్ని నాటక రచయితలు కూడా స్వీకరించారు. వాస్తవాన్ని మాత్రమే రచన ద్వారా వ్యక్తీకరించాలనీ, తన చుట్టూ ఉన్న సమాజాన్ని శాస్త్రజ్ఞుడి దృష్టితో అవలోకించి, సమకాలీన సమాజాన్ని చిత్రించాలని వాస్తవికవాదులు ఆకాంక్షించారు. నాటకంలో ఇతివృత్తం, సన్నివేశాలు, పాత్రచిత్రణ, సంభాషణలు, ఆహార్యం, రంగాలంకరణ సహజంగా ఉండాలని వాస్తవికవాదుల ఆదర్శం. ఈ పద్ధతిలో అలెగ్జాండర్ డ్యూమాస్, ఎమిలీ అగియుర్ వంటి ఫ్రెంచి రచయితలు ప్రథములు. 1870లో ఇబ్సన్ ప్రవేశం ప్రపంచ నాటకరంగంలో ఒక నూతన శకానికి నాంది పలికింది. 1877లో ఇబ్సన్ రాసిన ది పిల్లర్స్ ఆఫ్ సొసైటీ, ఎ డాల్స్ హౌస్ (1879), ఘోస్ట్స్ (1881) వంటి నాటకాలు ప్రపంచఖ్యాతి పొందాయి. ముఖ్యంగా ఎ డాల్స్ హౌస్ (బొమ్మరిల్లు) నాటకం ఆనాటి సమాజాన్ని కుదిపివేసింది. నాటకం కేవలం వినోదం కోసమే కాకుండా నూతన భావోద్దీపనకు, ఆత్మావలోకనానికి సాధనంగా ఉండాలని ఇబ్సన్ అభిప్రాయం.

ఇబ్సన్‌చూపిన మార్గం ఇతర దేశాలకు స్ఫూర్తినిచ్చింది. ఇంగ్లాండుకు కూడా వాస్తవికతా వాదం పాకింది. ఆర్థర్ పింగ్ పైనేరో, జార్జి బెర్నార్డ్ షా వంటి నాటక రచయితల చేతుల్లో వాస్తవికతావాదం మంచి ప్రాముఖ్యం పొందింది. అలాగే సోవియట్ రష్యాలో కూడా ఆంటెన్ చెకోవ్, టాల్‌స్టాయ్, గోర్కీ వాస్తవ నాటక రచయితలుగా సుప్రసిద్ధులు. చెకోవ్ రాసిన సీగల్, పవర్ ఆఫ్ డార్క్‌నెస్, చెర్రి ఆర్చర్డ్ ఆ కోవకు చెందిన నాటకాలు. ఈ నాటకాలకు మెరుగులు పెట్టి ఖ్యాతి గడించిన దర్శకుడు స్టానిస్లవస్కీ.

తెలుగు నాటకాల విషయానికొస్తే ఇబ్సన్ ప్రభావంతో నాటక రచనకు పూనుకున్న తొలి నాటకకర్తలలో పి.వి. రాజమన్నార్, చలం, నార్ల వేంకటేశ్వర రావు ప్రభృతులు ముఖ్యులు. తెలుగు నేలపై వాస్తవిక నాటకాలకు ఒక సమగ్రరూపం ఇచ్చిన నాటకకర్తలలో ఆచార్య ఆత్రేయ అగ్రగణ్యుడు. ఆత్రేయ రచించిన ***ఎన్.జి.ఓ నాటకం, ఎవరు దొంగ?, ఒక్క రూపాయి*** నాటికలు వాస్తవికతను నిండుగా ఆవిష్కరించిన దృశ్య కావ్యాలు. వాస్తవికతావాదంలోవస్తోన్నప్రదర్శనలే విజయవంతమవుతున్నాయి.

గం.సు.రె.

విక్రమదేవ వర్మ (1868-1951) : జయపుర సంస్థానాధీశుడు. కవి, నాటకకర్త, బహు భాషా వేత్త, కళా పోషకుడు, వదాన్యుడు, నిరాడంబరజీవి. సాహిత్య సమ్రాట్, డాక్టరు బిరుదాంకితుడు. 1868, జూన్ 28న జయపురంలో జన్మించాడు. 1931లో జయపురం సంస్థాన సింహాసనం అధిష్ఠించేవరకు ఎక్కువగా విశాఖపట్టణంలోనే జీవితం గడిపాడు. అక్కడి జగన్మిత్ర నాటక సమాజం, కవితా సమితులలో సభ్యుడిగా ఆంధ్ర నాటక, కవితా రంగాలకు ఎనలేని సేవ చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సంవత్సరానికి లక్షరూపాయలు విరాళమిచ్చాడు. రాజుగా ఉన్నప్పుడు, లేనపుడు ఒకేరీతిగా నిరాడంబర జీవితం గడిపి, ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలకు అధ్యక్షత వహించాడు. జాతీయోద్యమాన్ని బలపరచాడు. ఈయన నిరంతర ఖద్దరు వస్త్రధారి.

శ్రీనివాస కల్యాణం, మానవతీ చరిత్ర వంటి నాటక రచనలు చేసి రంగస్థలం మీద విజయం పొంది, అశేష ప్రజానీకాన్ని అలరించిన విక్రమదేవ వర్మ 1951, ఏప్రిల్ 12న మరణించాడు.

శ్రీ.చ.

విజయ్ టెండూల్కర్ (1928-2008) : మరాఠీ నాటక రచయిత, మరాఠీ సాంఘిక నాటక రంగంలో ధ్రువతార, ఈయన కొల్హాపూర్ లో 1928లో జన్మించాడు. 28 నాటకాలు, ఒక నవల, ఆరు బాలల నాటికలు, నాలుగు లఘుకథలు, కొన్ని నాటికలు రచించాడు. సమకాలీన ఆలోచనలు, సంఘటనలు, సమస్యలు, ఇతన్ని తీవ్రంగా ప్రభావితం చేసి సంచలన రచయితగా తీర్చి దిద్దాయి.



1955లో *శ్రీమంత్* నాటక రచన ద్వారా అరంగేట్రం చేసిన టెండూల్కర్ 1967లో *శాంతతా ! కోర్టుచాలు ఆహె* రచనతో ప్రపంచ రంగస్థల చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించాడు. ఈ నాటకం పలు భారతీయ భాషల్లో కి అనువదించబడింది. *గిద్దాడే, శఖారాం బైండర్, ఘాసీరాం కొత్వాల్* నాటకాలతో తన ప్రతిష్ఠను మరింత ఇనుమడింప చేసుకున్నాడు. ఈ మూడు నాటకాల పట్ల సమాజంలో తీవ్ర నిరసన వ్యక్తం అయింది. చట్టం, ప్రజలు, ఛాందసవాదులు దాదాపు యుద్ధం చేశారు. అయినప్పటికీ ప్రదర్శనలు నిర్వహించి భారతీయ నాటకరంగ చరిత్రలో సంచలనం సృష్టించాడు. *కన్యాదాన్, కమల* నాటకాలు కూడా మంచిపేరు తెచ్చిపెట్టాయి. మరాఠీ నాటక రంగంలో అప్పటి వరకు ఉన్న సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఛాందసవాదం, కులమత విచక్షణ, బాల్య వివాహాలు, ఉన్నత వర్గాల ఆధిపత్యం, రాజకీయ దురహంకారం, అధికార దుర్వినియోగం, వీటన్నింటికి వ్యతిరేకంగా రచనలు చేస్తూ సమాజాన్ని ఆలోచింపజేసి, వారిలో ప్రశ్నలు రేకెత్తించి, నవ సమాజ స్థాపనకు కారకుడయ్యాడు.

ప్ర.రె.

విజయప్రకాష్, బలివెంల (జ.1946) : నటుడు, దర్శకుడు, ప్రయోక్త. నాలుగు దశాబ్దాలుగా నాటకరంగ పురోభివృద్ధికి వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్న కళోపాసకుల్లో గణనీయుడు బి. విజయప్రకాష్. 1946లో హైదరాబాద్‌లో జన్మించిన విజయప్రకాష్‌కు నాటకం అంటే ప్రాణం.

భగ్నజీవులు, మనిషి చావకూడదు, రఘుపతి రాఘవ రాజారాం, రుద్రవీణ, సుల్తానీ, చీమకుట్టిన నాటకం, వరుడు కావాలి, మీరైతే ఏం చేస్తారు? మొదలైన నాటకనాటికల్లో ప్రధాన పాత్రలు పోషించి ప్రశంసలందుకున్నాడు. రఘుపతి రాఘవ రాజారాం నాటకాన్ని 50 సార్లు, రుద్రవీణ నాటికను 156 సార్లు ప్రదర్శించి నాటకరంగంలో సంచలనం కలిగించాడు. అనేక నాటక పోటీల్లో పాల్గని ఉత్తమ నటనకు, ప్రతినాయక పాత్రకు బహుమతులు పొందాడు. యర్రంనేని చంద్రమౌళి, జె.ఎల్. నరసింహారావు, ఎస్.కె. ఆంజనేయులు, బి. భానుప్రకాష్, డి. ఎస్.ఎన్. మూర్తి, కె.జి. రాంప్రసాద్ వంటి ప్రముఖ దర్శకుల దర్శకత్వంలో వైవిధ్యంతో కూడిన పాత్రలు ధరించి, తన నటనా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకున్నాడు. చీమకుట్టిన నాటకం, సుల్తానీ వంటి నాటికలకు తానే దర్శకత్వం వహించి రసజ్ఞుల మెప్పు పొందాడు. 1968లో స్థాపించిన విజయ కళాసమితి ద్వారా అనేక నాటక నాటికలను ప్రదర్శించి ఔత్సాహిక నటులకు చేయూతనిచ్చి ప్రోత్సహించాడు.

నాటకాల్లో నటన, దర్శకత్వంతోనో తృప్తిపడక నాటకరంగాన్ని అభివృద్ధిపథంలో నడిపించే దిశలో నిర్మాణాత్మకంగా పని చేశాడు. నటీనటులకు శాస్త్రీయ పద్ధతిలో

అభినయరీతులను నేర్పించేందుకు శిక్షణా శిబిరాలు ఏర్పాటుచేసి నటశిక్షణకు వీలు కల్పించాడు. 1991, 1994-95 సంవత్సరాలలో రాష్ట్రసాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అఖిలాంధ్ర నాటకోత్సవాల నిర్వహణలో కీలకపాత్ర వహించాడు. 1999, 2000, 2001 సంవత్సరాలలో జరిగిన నంది నాటకోత్సవాలలో అనుసంధాన కర్తగా వ్యవహరించి వాటి విజయానికి తోడ్పడ్డాడు.

సాంఘిక ప్రయోజనం ఉన్న కొన్ని డాక్యుమెంటరీలను నిర్మించాడు. వాటిలో జీవనరంగం, పల్లెకు పోదాం, పొదరిల్లు ప్రజాదరణపొందాయి. పెళ్ళిచూపులు పేరుతో తీసిన టెలీ సీరియల్ 26 వారాల పాటుదూరదర్శన్‌లో ప్రసారమై ప్రశంసలందుకుంది. ఇవి విజయప్రకాష్ సాంస్కృతిక జీవనయానంలో ఒక పార్శ్వం మాత్రమే. నాటకం అంటే చాలు ఏ నటుడికైనా, ఏ సమాజానికైనా తనకు తానై ముందుకొచ్చి సహకారం అందించి ప్రోత్సహించే తత్వం విజయప్రకాష్‌ది.

నాటకరంగానికి అందించిన సేవలను గుర్తించి రాష్ట్రంలో అనేక కళాసంస్థలు విజయప్రకాష్‌ను సన్మానించాయి. 1993లో యువకళావాహిని వనారస గోవిందరావు రంగస్థల పురస్కారం, కళాస్రవంతి మిలీనియం అవార్డు 2001లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం, 2000లో శ్రీ సాయి విజయప్రకాష్‌కు లభించిన పురస్కార పరంపరలో కొన్ని.

గం.సు.రె.

విజయభాస్కర్, డి (జ.1960) : ప్రముఖ నాటక రచయిత. శ్రీకాకుళం జిల్లా, అంపోలు గ్రామంలో 1960, మే 27న జన్మించాడు. ఎం.ఏ. పట్టభద్రుడు. కొన్నాళ్ళు జూనియర్ కాలేజిలో లెక్చరర్‌గా పనిచేసి తరువాత మునిసిపల్ కమిషనర్‌గా అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఎక్కువ కాలం పనిచేశాడు.

విద్యార్థి దశ నుంచీ సాహిత్యంపై మక్కువ పెంచుకుని మొదట్లో ఒరవడి కోసం గేయాలు, చిన్న చిన్న నాటికలు రాయడం మొదలుపెట్టాడు. ఆ వ్యాపకమే క్రమక్రమంగా ఈయన ప్రథమశ్రేణి నాటక రచయితగా ఎదగడానికి తోడ్పడింది. విశాఖపట్టణంలో పనిచేస్తున్న రోజుల్లో అక్కడి నాటక వ్యక్తులతో పరిచయం, నాటక వాతావరణం ముఖ్యంగా ఎస్. కె. మిశ్రో వంటి ప్రసిద్ధ కళాకారునితో సాన్నిహిత్యం విజయభాస్కర్ నాటక రచయితగా నిలదొక్కుకోవడానికి దోహదం చేశాయి. కాలకూటం, ఋత్విక్, కించిత్ భోగం అనే నాటకాలు మిశ్రో సలహా, సహకారాలతో రచించినవే. ఆ నాటకాలు బహురూప నట సమాఖ్య పక్షాన వివిధ పరిషత్తులలో ప్రదర్శింపబడి రచయితకు కీర్తిప్రతిష్ఠలు ఆర్జించి పెట్టాయి. అప్పటి నుంచి ద్విగుణీకృతోత్సాహంతో విజయభాస్కర్ నాటక రచన కొనసాగిస్తున్నాడు. ఈయన పది నాటకాలు, మూడు నాటికలు వెలుగు చూశాయి. *కించిత్ భోగం* నాటకం 1999 నంది నాటకోత్సవాలలో ఉత్తమ ప్రదర్శనకు స్వర్ణ నంది పురస్కారం అందుకొంది. అదే సంవత్సరం కుర్చీ నాటకానికి ఉత్తమ రచనకు నంది బహుమతి లభించింది. *గాంధీ జయంతి* నాటకం 2002లోను, *జగన్నాటకం* 2003లోను నంది నాటకోత్సవాలలో ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతులు గెలుచుకోవడం విజయభాస్కర్ రచనను, విలక్షణతను అభివ్యక్తం చేస్తుంది. సమస్యను భిన్న కోణాల నుంచి దర్శించి, ఆసక్తికరంగా నిండైన నాటక శిల్పంతో, నవ్యరీతిలో దృశ్యమానం చేసే విజయభాస్కర్ రచనారీతులు తాత్కాలిక ఆనందాన్ని కలిగించడంతో తృప్తిపడేవి కావు. ప్రేక్షకుల గుండె తలుపులు తట్టి ఆలోచింప చేస్తాయి. ఈయన రాసిన పులిస్వారి వంద ప్రదర్శనలకు నోచుకుంది. మబ్బులో బొమ్మ నాటిక తెలుగు నాటకరంగంలో ఇది వరకు ఎవరూ స్పృశించని వినూత్న ప్రయోగం. దేవుడు కావాలి హేతుబద్ధమైన సంవాద నైపుణ్యంతో ప్రేక్షకులను సంస్కారాభిముఖంగా నడిపించే విశ్లేషణాత్మక నాటకం. వస్తు స్వీకరణలోనూ, నాటక నిర్మాణ వైఖరిలోనూ నిత్య నూతనత్వాన్ని ఆవిష్కరించాలన్న లక్ష్యం, ఆరాటం విజయభాస్కర్ రచనల్లో అడుగడుగునా ద్యోతకమవుతాయి.

గం.సు.రె.

విజయరామ డ్రమాటిక్ అకాడమీ, (విజయనగరం): 1910 నుండి పనిచేస్తున్న అమెచ్యూర్ థియేట్రికల్ కంపెనీని విజయనగరం మహారాజా స్వాధీనపరుచుకొని విజయరామ డ్రమాటిక్ అకాడమీ స్థాపించాడు. ఈ కంపెనీలో తాతా ఉమామహేశం నాయకులు (విలన్ పాత్రలకు ప్రసిద్ధి), మద్దెల లక్ష్మీ నారాయణ (స్త్రీ పాత్రధారి) రామాయణం సర్వేశ్వరశాస్త్రి, అనాసపురపు గోపాలరావు మొదలైనవారు నటులు. శాస్త్రి రామదాసు హరిశ్చంద్ర పాత్రకు ప్రసిద్ధుడు. లంక గోపాలరావు, దుర్గాదాస్ ప్రధాన పాత్రలు ధరించేవారు. ఈ కంపెనీ 1935లో ఆగిపోయింది.

జి.ఎస్.ఎన్.

విజయలక్ష్మి కె. (జ.1956) : రంగస్థల నటీ, దర్శకురాలు, నాటక రచయిత్రి. 1956, సెప్టెంబర్4న కంటు రాములు.

సీతారత్నం దంపతులకు విశాఖపట్నంలో జన్మించింది. ఎనిమిదో తరగతికే విద్య పరిమితమైనా, విజయలక్ష్మి జీవితాన్ని బాగా చదివింది. అనుభవం నేర్పిన పాఠాలు భవిష్యత్తుకు బాటలు వేశాయి. చిన్నప్పటి నుంచీ నాటకాలు, సినిమాలు చూడటంవల్ల, అంతర్నిహితంగా ఉన్న అభినయానురక్తి క్రమక్రమంగా వృద్ధి చెందుతూ వచ్చింది. జీవితంలో ఏదో ఒక ప్రత్యేకతను సాధించాలన్న తపన, జిగీష చోదకశక్తులై ఆమెను ముందుకు నడిపించాయి. నాట్యకళను జీవికగా ఎంచుకొంది. 1969లో బి.ఎన్. చర్చిల్ నేతృత్వంలో తొలిసారిగా భమిడిపాటి రాధా కృష్ణ దైవ శాసనం తో రంగప్రవేశం చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో, రంగస్థల శాఖలో కె. వేంకటేశ్వరరావు నటశిక్షణలో థియేటర్ ఆర్ట్స్‌లో డిప్లొమా పొందింది. గురువు వద్ద నటనలో మెళకువలు నేర్చుకొని, ఆయనతో కలిసి అనేక నాటకనాటికల్లో నటించి తన అభినయ పాటవానికి మెరుగులు దిద్దుకుంది. విజయలక్ష్మికి మొదటిసారిగా గుర్తింపు తెచ్చిన నాటిక కొడుకు పుట్టాల(గణేష్ పాత్రో రచన). విశాఖ మాండలికంలో, బెస్తవారి యాసతో నడిచే ఈ నాటిక ఆ రోజుల్లో నాటకరంగంలో సంచలనం కలిగించింది. అప్పటి నుంచీ విజయలక్ష్మిని విజయం వరించింది. ఆంధ్రదేశంలో విజయలక్ష్మి అమ్మ, అనగనగరాజు, *రేపటి శత్రువు*, ఇండియన్ గ్యాస్, అనంత రాగాలు, అసురసంధ్య, వేటకుక్కలు, తర్జని, శ్వేతపత్రం, పల్నాటి వీర చరిత్ర, కన్యాశుల్కం, మరో మొహెంజదారో, తరంగాలు, కనకపుష్యరాగం, డియర్ ఆడియన్స్ సిన్సియర్లీ యువర్స్ మొదలైన నాటకాలు, నాటికల్లోని ప్రధాన పాత్రలు అత్యద్భుతంగా పోషించి ఆ నాటకాలకు, రచయితలకు, నాటక సమాజాలకు కీర్తిప్రతిష్ఠలు ఆర్జించి పెట్టింది. ఆమె ఒక నాటకంలో లేదా ఒక నాటికలో వేషం వేస్తున్నదంటే ఆ ప్రదర్శన బాగా ఉంటుంది అనే భావన, నమ్మకం ప్రజల్లో స్థిరపడిపోయింది. ఇంతకంటే ఏ కళాకారిణికైనా కావలసిన యోగ్యతాపత్రం యింకేముంటుంది? స్టీరియోటైప్ నటనకు ఆమె బద్ధవిరోధి. ప్రతి పాత్రలోనూ ఏదో ప్రత్యేకతను, నూతనత్వాన్ని ఆవిష్కరించడం ఆమె నటనా విధానంలోని విశిష్టత. అర్థవంతమైన కదలికలు, స్ఫూర్తిదాయకమైన భావప్రకటన, వాచికాభినయంలో మార్దవం, సహజ సుందరమైన నటన విజయలక్ష్మికి పెట్టని ఆభరణాలు. నాటక పోటీలలో 200లకు పైగా ఉత్తమనటి బహుమతులు పొందిన నటి.

ఆమె నట జీవితంలో మరో పార్శ్వం కూడా ఉంది. జీహాద్, వైదేహి మొదలైన నాటికలకు దర్శకత్వం వహించి బహుమతులు గెల్చుకోవడం ఆమె బహుముఖ ప్రజ్ఞకు గీటురాయి. అంతేకాదు నాటక రచయిత్రిగా కూడా తన సృజనాత్మకతను చాటుకొంది. తాను రచించిన పొద్దుపొడుపు సూర్యుడు, వైదేహి నాటికలు తన రచనా వైదుష్యానికి నిలువుటద్దాలు.

విజయలక్ష్మి నాటకరంగానికి అందించిన సేవలను ప్రస్తుతిస్తూ అనేక కళాసంస్థలు పురస్కారాలతో సత్కరించాయి. ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, మద్రాసు వారి విశిష్ట నటి బంగారు పతకం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి పైడి లక్ష్మయ్య స్మారక పురస్కారం (2001), మద్రాసు తెలుగు అకాడమీ వారి ఉగాది పురస్కారం, విశాఖపట్నం అక్కినేని నాగార్జున కళాసాగర్ వారి సువర్ణకంకణ పురస్కాం, ఇలా ఎన్నో పురస్కారాలు లభించాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో జరిగిన నంది నాటకోత్సవాలలో మూడుసార్లు 'ఉత్తమనటి' అవార్డు విజయలక్ష్మిని వరించింది. నేటికీ అగ్రశ్రేణి నటీమణిగా విజయలక్ష్మి తన నాటక ప్రస్థానం కొనసాగిస్తూనే ఉంది.

గం.సు.రె.

విజయలక్ష్మి, నర్రా (జ.1953) : రంగస్థల నటి. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రామస్వామి, యశోద దంపతులకు 1953, అక్టోబర్ 24న జన్మించింది. నాట్యం విషయంలో అమ్మాయి ఆసక్తి గుర్తించిన తల్లిదండ్రులు వేదాంతం జగన్నాథ శర్మ వద్ద నాట్యం నేర్పించారు. తదాదిగా చిన్న వయసులోనే అనేక నాట్య ప్రదర్శనలిచ్చి రసజ్ఞుల ప్రశంసలను, అందుకొంది. నాట్య ప్రదర్శనలతో తృప్తి చెందని విజయలక్ష్మి 1966లో నాటకరంగంలో ప్రవేశించింది. ఎ.ఆర్. కృష్ణ, చాట్ల శ్రీరాములు, తాళ్ళూరి శివరామకృష్ణారావు, జి.ఎస్.ఎన్. శాస్త్రి, దేవదాస్ కనకాల వంటి ప్రసిద్ధ దర్శకుల వద్ద అభినయరీతుల్లో శిక్షణ పొంది తన ప్రతిభకు మెరుగులు దిద్దుకొంది. బాలనాగమ్మ, బబ్బిలి యుద్ధం, సుందరకాండ, పాదుకా పట్టాభిషేకం వంటి పద్య నాటకాల్లోనూ కప్పలు, మాస్టర్జీ, దైవ శాసనం, నటనాలయం, పసుపు బట్టు పేరంటానికి వంటి సాంఘిక నాటకాల్లోనూ, అనేక నాటికల్లోను వైవిధ్యంగల పాత్రలు పోషించి పేరు తెచ్చుకొంది. నట జీవితంలో రెండు వేలకు పైగా నాటక ప్రదర్శనల్లో పాల్గొంది. కొన్నాళ్ళు నాగభూషణంతో కలిసి రక్తకన్నీరు నాటక ప్రదర్శనల్లో ప్రముఖ పాత్ర ధరించింది. 1979లో కుమలాదేవి నేతృత్వంలో రామాయణ్ రూపవాణి (లైట్ ఆఫ్ సౌండ్) కార్యక్రమాల్లో ఆరు నెలలపాటు

పాల్గొని ప్రేక్షకులను అలరించింది. మా భూమి, రంగుల కల, మనవూరి కథ, దానవీర శూరకర్ణ, అక్బర్ సలీమ్ అనార్కలి మొదలైన చలనచిత్రాలలో కూడా నటించింది. కొన్ని హిందీ, తమిళ చిత్రాలలోనూ భూమికా ధారణ చేసి మెప్పు పొందింది. విజయలక్ష్మి ఆకాశవాణిలోను, దూరదర్శన్‌లోనూ 'ఎ' గ్రేడు ఆర్టిస్టుగా చాలా నాటకాల్లోనూ, సీరియల్స్‌లోనూ నటించింది. నిశ్శబ్దం ఛేదించు, ప్రజల వద్దకు పాలన మున్నగు వీధి నాటకాల్లో కూడా పాల్గొని తన కీర్తిని ఇనుమడింప జేసుకొంది. నాలుగు దశాబ్దాలుగా నాటకరంగానికి విజయలక్ష్మి అవిశ్రాంతంగా తన సేవలు అందిస్తూంది.

మన్నెశ్రీ.

విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్): ఈ సంస్థ 1954లో స్థాపించబడింది. మొదటి అధ్యక్షుడు ఇ.ఎల్. నరసింహారావు, కార్యదర్శి జె.ఎల్. నరసింహారావు. సాంఘిక ప్రయోజనం కలిగించే విజ్ఞాన, వినోదాత్మకమైన నాటకాలను రచింపచేయటం, ఔత్సాహిక నాటకోద్యమానికి చేయూతనివ్వటం, నాటక ప్రయోగాన్ని ఒక ప్రయోజన సాధనంగా నాటకాలు ప్రదర్శించడం ఈ సంస్థ ఏర్పరచుకున్న ఆశయాలు. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్ళిన వారిలో చాట్ల శ్రీరాములు, గరిమెళ్ళ రామమూర్తి, దుగ్గిరాల సోమేశ్వరరావు ప్రభృతులు ముఖ్యులు. ఈ సంస్థ తరపున మానవుడు, స్వీకారం, శిథిలాలయం, వాన వెలిసింది, పుణ్యస్థలి వంటి నాటికలే కాకుండా జన్మహక్కు, ఇదేమిటి, అరణి, మరో మొహెంజదారో వంటి నాటకాలను ప్రదర్శించారు. 1960, ఏప్రిల్‌లో విజయనగరంలో జరిగిన రాఘవ నాటకోత్సవాలలో ఎన్.ఆర్. నంది రచించిన వాన వెలిసింది నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎన్నికైంది. ఈ నాటికలో నటించిన జె.యల్. నరసింహారావుకు ఉత్తమనటుడు బహుమతి లభించింది. 1963 ఫిబ్రవరిలో జరిగిన ప్రత్యేక ఆంధ్రనాటక కళాపరిషత్తు సందర్భంగా, 1964లో అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన పోటీలలో అరణి నాటకానికి, ఇందులో నటించిన ఓ. శ్రీరామమూర్తి, జె.ఎల్. నరసింహారావుకు ప్రథమ బహుమతి లభించింది. ఇదే సంవత్సరం ఏప్రిల్‌లో అనంతపురంలో ఆంధ్రనాటక పరిషత్తు ఉత్సవాలలో ఎన్.ఆర్. నంది మరో మొహెంజోదారో నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు బహుమతి లభించింది. ఈ నాటకానికి చాట్ల శ్రీరాములు దర్శకత్వం వహించాడు. ఆకెళ్ళ రచించిన కాకి ఎంగిలి, ఎయిర్ ఇండియా, శ్రీనాథుడు మొదలైన నాటకాలు దుగ్గిరాల సోమేశ్వరరావు దర్శకత్వంలో విజయవంతంగా ప్రదర్శించ బడినాయి. నంది నాటకోత్సవాలలో ఉత్తమ ప్రదర్శనకు, నటనకు, దర్శకత్వానికి బహుమతులు లభించాయి. విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ ఉత్తమ ప్రమాణాలు గల నాటకాలను, నాటికలను ప్రదర్శిస్తుందనే విశ్వాసాన్ని ప్రేక్షకలోకంలో కలిగించింది.

దాసరి.ఎన్.

విద్యా వినోదినీ సభ : ఈ సమాజాన్ని నిడమర్తి నరసింహం 1915లో స్థాపించాడు. ఇందులో వి.వి.ఎల్. నరసింహారావు, ముద్దూరి కోదండరామ దీక్షితులు, కల్లూరి సుందరరామయ్య, కొఠీ శేషగిరిరావు, విస్సా వీరన్న, కేశవరపు కామరాజు ప్రధాన నటులుగా ఉండేవారు. ఈ సభలోని వారంతా విద్యావేత్తలు, ఉద్యోగస్థులు. సొంత లాభం కోరకుండా నీతిదాయకమైన ఉత్తమ రచనలను ఆదర్శవంతంగా ప్రదర్శించడమే ఈ సమాజం ఆశయం. బంట్రోతు వేషం కూడా వేయడానికి వకీళ్ళైనా వెను దీసేవారు కాదు. ఈ సభ్యులంతా జాతీయవాదులు. 'కాంగ్రెసు' జాతీయోద్యమం (ఉప్పు సత్యాగ్రహం)లో పాల్గొని కారాగారాలకు వెళ్ళడం వల్ల ఈ సమాజ ప్రదర్శనలు ఆగిపోయాయి. ఈ సమాజం సారంగధర, ప్రతాపరుద్రీయం, సత్యహరిశ్చంద్ర, రసపుత్ర విజయం, శివాజీ విజయం, రాణీ సంయుక్త వంటి నాటకాలను ప్రదర్శించింది.

శ్రీ.వ.

విధి నిషేధాలు : సంస్కృత లాక్షణికులు వారి కాలం నాటి నాటకరంగ పరిస్థితులను బట్టి, భారతీయ సంస్కృతీ నాగరికతా ఆచార వ్యవహారాలను బట్టి, జుగుప్సాది భావాలను బట్టి నాటక విషయంలో విధి నిషేధాలు విధించారు. ఈ లాక్షణికుల కాలంలో మూసుకొని తెరచుకొనే తెర లేదు. అందుకని అంకాంతాన పాత్రలన్నీ నిష్క్రమించాలని అనుశాసించారు. నాటి రంగ పరిస్థితులను బట్టి దూరప్రయాణం, వధ, యుద్ధం, రాజ్యంలో తిరుగుబాటు, కోట ముట్టడి చూపకూడదని చెప్పారు. భోజనం, స్నానం, సురతం, చందనాది చర్చ, వస్త్రధారణ రంగం మీద ప్రత్యక్షంగా చూపకూడదు. దీనికి కారణం ఇవి భారతీయ సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు విరుద్ధమైనవేగాక వీటిలో కొన్ని జుగుప్సాకరాలు. ఇలాగే ఆలింగనం, దరితక్షేదం, నఖక్షేదం, మల విసర్జనం, అధరపానాదులు లజ్జాకరమైనవి. నివాసం, శాపం పవిత్రమైనవిగా భారతీయులు భావించడం వల్ల అవి రంగస్థలం మీద ప్రదర్శిస్తే అవహేళనకు పాత్రమయే ప్రమాదముందని వీటిని కూడా నిషేధించారని భావింపవలసి వస్తోంది.

'మంగళాదీని, మంగళ మధ్యాని, మంగళాంతాని'

అనే సూత్రం ప్రకారం నాటకం సుఖాంతంగా ఉండాలేగాని దుఃఖాంతంగా ఉండకూడదన్నారు. ఇక వధ విషయంలో రంగస్థలం మీద చూపడంలో అనేక చిక్కుల నెదుర్కొని ఆ ప్రక్రియ నవ్వులాటగా తయారవుతుందనే అభిప్రాయంతో

ప్రదర్శించరాదన్నారు. నేడూ వధ సందర్భంలో అనేక అవక తవకలు జరిగి వధ నవ్వులాటగా తయారు కావడం చూస్తున్నాం. కత్తితో పొడిచేసరికి నెత్తురు వెంటనే రాకపోవడం, పాత్ర పిస్తోలు పేల్చే సమయానికి నేపథ్యంలో టపాకాయ మోతరాకపోవడం మూలంగా వధ రసాభాసం గావడం, చచ్చి నేల పడ్డ పాత్ర శవంలా కనిపించడానికి నరాలు బిగపట్టుకోలేక చెయ్యో కాలో కదిలించి ప్రేక్షకుల అవహేళనకు పాల్పడడం నేటికీ తరచు చూస్తున్నాం.

దేవపూజ, పితృశ్రార్థం, మొదలైనవి నాటకంలో తప్పనిసరైతే చూపవచ్చు. ఇక నాయక వధ విషయంలో రెండు మతాలున్నాయి. ధనంజయాదులు నాయకువధను నిషేధించారు. శారదా తనయాదులు నాయకుని నాటకంలో తిరిగి జీవింప చేస్తే ముందుగా వధ చూపవచ్చుని అభిప్రాయం వెలిబుచ్చారు. నాటికీ నేటికీ మన దేశంలో బహిరంగ అశ్లేష చుంబనాదులు అసభ్యం, నిషిద్ధం. లోకవృత్తాను కరణమే రూపకం కాబట్టి సంస్కృత లాక్షణికులు అశ్లేష చుంబనాదులు రూపకాలలో చూపరాదని నిషేధించారు.

అందుకే అభిజ్ఞాన శాకుంతలం తృతీయాంకంలో రాజు శకుంతలను ముద్దిడు సమయానికి కాళిదాసు గౌతమి అనే వృద్ధ తాపస స్త్రీని ప్రవేశపెట్టి ఆ చుంబన క్రియను తప్పించాడు. కన్యాశుల్కం లో రామప్పంతులు మధురవాణిని ముద్దు పెట్టుకొంటున్నట్టు చూపెట్టినా వెను వెంటనే లుబ్ధావధానులను ప్రవేశపెట్టి అతనితో 'ఏవిటి అభావ చేష్టలు' అని ఒక చురక అంటింప చేశాడు గురజాడ.

తెలుగు నాటక కవులు ఈ నిషేధాన్ని పాటించ లేదు సరికదా విచ్చలవిడిగా వాడారు. ఉదాహరణకు చిత్రనళీయంలో నలుడు దమయంతిని వదిలిపెట్టి వెళ్లే ముందు ముద్దు పెట్టుకుంటాడు. చంద్రహాస నాటకంలో విషయునం చంద్రహాసుడు ఆశ్లేషించి ముద్దు పెట్టుకుంటాడు. విషయ తిరిగి చంద్రహాసుని ముద్దు పెట్టుకుంటుంది. యుద్ధం, కోట ముట్టడి, రాజ్య విప్లవాలలో పాత్రలు అసంఖ్యాకం. యుద్ధం అంటే అటూ ఇటూ వేలూ, లక్షల కొలదీ సైన్యం పాల్గనేది. అటువంటప్పుడు జానెడు రంగస్థలం మీద అటు నలుగురినీ, ఇటు నలుగురినీ నిలబెట్టి ఏ కొయ్య కత్తులతోనో యుద్ధం చేస్తుంటే అది యుద్ధ చిత్రణ కాదు, పైగా అపహాస్యం అవుతుంది. అందుకే షేక్స్పియర్ అయిదవ హెన్రీ నాటకం 'ప్రోలోగ్' (ప్రస్తావన)లో ఈ అభిప్రాయాన్నే ఇలా వెలిబుచ్చాడు.

"..... Van this cock hit hold
The arty fields of France" (ఈ జానెడు రంగస్థలంలో ఫ్రాన్స్‌లోని విశాల రణ స్థలాలను చిత్రించగలమా?)

నాయకుని మృతి, పునరుజ్జీవితం చూపిన తెలుగు నాటకం సావిత్రి . ఈ నాటకంలో నాయక వధ కాకపోయినా మరణం రంగం మీదనే ప్రదర్శింపచేశారు. తరువాత సావిత్రి మహాత్మ్యం వల్ల నాయకుడు సత్యవంతుడు బతుకుతాడు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు సావిత్రీ చిత్రాశ్వంలో సంస్కృత లాక్షణికుల 'కోట ముట్టడి, యుద్ధం' ప్రదర్శనానికి విరుద్ధంగా కోటముట్టడి, పోరాటం ప్రథమాంకంలో చూపాడు.

శ్రీ.చ.

విధ్వంసక వాదం : ఐరోపా ఖండంలో 20వ శతాబ్ది ప్రారంభ కాలంలో బయలుదేరిందీ కళావాదం పూర్వ సంప్రదాయాలను, రూపాలను కూలదోసి కొత్త సంప్రదాయాలను నిర్మించాలనేదే ఈ వాద సారాంశం. ఇది అధివాస్తవికతగా, మార్గదర్శిగా పరిణమించింది. విస్మయం, దౌర్జన్యం, అసంభావ్యం, విచ్ఛేదం, సాన్నిహిత్యం విధ్వంసక వాదానికి – అధివాస్తవికతకు గల సామ్యాలు. అయితే అధి వాస్తవికతలో భౌతిక, మానసిక నటనల మీది పట్టు దల ఈ వాదంలో లోపించింది.

ఈ వాదం 1916లో జ్యూరిచ్‌లో ఆవిర్భవించింది. కేబరే రూపాల మీద దీని ప్రభావం ఎక్కువైంది. ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం దీని కేంద్రం పారిస్‌కు మారింది. క్రమక్రమంగా అధివాస్తవికతలో కలిసిపోయింది.

శ్రీ.చ.

వినోదిని దాసి (1863-1941) : బెంగాలీ నాటక రంగంలో తొలితరం అగ్రశ్రేణినటి. కలకత్తాలో 1863లో జన్మించింది. వేశ్యావృత్తిలో ఉన్న వినోదినిదాసిని రంగస్థలం మీద ప్రవేశపెట్టి, ఆమెలో నివురుగప్పిన నిప్పులా అణగారి ఉన్న అభినయ కౌశలాన్ని వెలికి తెచ్చి, నాటకరంగంలో అమూల్య రత్నంగా వెలుగులు వెదజల్లే ఉజ్వల తారగా రాణించేటట్టు చేసిన ఘనత ప్రసిద్ధ దర్శకుడు గిరీష్‌చంద్రఘోష్‌కు దక్కుతుంది. గంగాబాయి దగ్గర సంగీతం నేర్చుకున్న వినోదిని, నాటక విద్యను గిరీష్ ఘోష్‌వద్దనే అభ్యసించింది. నటనలో ఓనమాలు దిద్దుకున్న నాటినుంచి నాటకరంగం నుంచి విష్క్రమించే వరకు వినోదిని నటజీవితం పుష్కరకాలమే అయినా, ఎనభై నాటకాలలో వైవిధ్యభరితమైన తొంభై పాత్రలలో అద్భుతంగా నటించింది. స్త్రీ పాత్రలు పురుషులే ధరించే కాలమది. స్త్రీలు నాటకాల్లో పాత్రధారణ చేయటం వినోదినిదాసి తోనే మొదలైందని చెప్పవచ్చు.

1874లో మొట్టమొదటి సారిగా శత్రుసంహార్ అనే నాటకంలో నటించింది. ఆమె నటించిన దాదాపు అన్ని నాటకాలకు దర్శకడు గిరీష్ చంద్ర ఘోష్, పౌరాణిక, చారిత్రక, కాల్పనిక, నాటకాల్లో వివిధ పాత్రల్లో రాణించింది. సీత, సావిత్రి, దమయంతి వంటి పతివ్రతల పాత్రలు పోషించినపుడు, ఒక వేశ్యాంగన పతివ్రత పాత్రలు ధరించటం కూడదని సంప్రదాయ

వాదులు, ప్రదర్శన జరిగేటప్పుడు ప్రేక్షకుల్లో అల్లరి మూకలు హేళన చేశారు, రాళ్ళు రువ్విన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటన్నిటిని తట్టుకొని, తన అసమాన నటనా వైదుష్యంతో అందరినీ ఆకట్టుకొని నటిగా తన స్థానాన్ని నిలబెట్టుకోగలిగింది. క్రమక్రమంగా వినోదినిదాసి నాటకాలకు జనం విరగబడి వచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. ఆనాటి ప్రసిద్ధ రంగస్థలాల మీద నాటకాలు వేసి ప్రశంసలు అందుకొంది. కరుణ, హాస్య రసాలను సమ ప్రతిభతో పోషించగల ప్రతిభావంతురాలుగా నాటక పండితుల మెప్పు పొందింది. పురుషపాత్రల్లో కూడా రాణించింది. *మేఘనాథ్ వధ్, దుర్గేశనందిని, బిషభిక్ష, సధావర్ ఏకాదశి, బివాహ్ బిబ్రాట్, బిల్వమంగణ్* మొదలైనవి ఆమెకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన నాటకాలలో పేర్కొనదగినవి. చైతన్యలీల అనే నాటకాన్ని ప్రదర్శిస్తున్నపుడు రామకృష్ణ పరమహంస ఆసాంతం నాటకం తిలకించి వినోదినిని దీవించి వెళ్ళడం తన జీవితంలో మరపురాని ఘట్టంగా వినోదిని తన స్వీయచరిత్రలో రాసుకొంది.

కలకత్తాలో తన పేరుతో ఒక నాటకశాలను నిర్మించాలని సంకల్పించి తన సంపదను, శ్రమను ఆ నాటకశాల నిర్మాణానికి ధారబోసింది. కాని ఆమె సహచరులు, ఆమె కోర్కెను వమ్ము చేసి ఆ నాటకశాలకు స్టార్ థియేటర్ అని నామకరణం చేసి వినోదినికి తీవ్రమైన నిరాశను మిగిల్చారు. ఈ సంఘటనతో కలతచెంది నాటకరంగం నుంచి నిష్క్రమించింది. తన నట జీవితాన్ని గురించి అమర్‌కథ పేరుతో స్వీయచరిత్ర రాసింది. ఒక నటి తన జ్ఞాపకాలను పుస్తకరూపంలో వివరించటం బెంగాలీ నాటకరంగంలో అదే మొదటిసారి. ఈమె స్వీయచరిత్రను రిమ్‌లీ భట్టాచార్య ఇంగ్లీషులోకి అనువదించి ఆ పుస్తకానికి విశేష ప్రాచుర్యం కల్పించాడు.

మహానటిగా బెంగాలీ నాటకరంగాన్ని ఏలిన వినోదిని చివరి దశలో దయనీయ స్థితిలో 1941లో మరణించింది.

గం.సు.రె.

విపర్యయం : ఇతివృత్త సంబంధి. విపర్యయమంటే వైరుధ్యం, తారుమారు. సాదృశ్యానికి వ్యతిరేకం విపర్యం. సాదృశ్యంలో రెండు అంశాల సామ్యం గోచరిస్తే విపర్యయంలో రెండు అంశాల వైరుధ్యం గోచరిస్తుంది. నాటకం సంఘర్షణామయం. సంఘర్షణ మంచిచెడ్డలు, కష్టసుఖాలు వంటి రెండు విరుద్ధ శక్తులు, విరుద్ధ భావాల మధ్య జరుగుతుంది. అందువల్ల విపర్యయం నాటక కథాసరళిలో అంతర్భూతమై ఉంటుంది. కాని వేరుగా ఉండదు. కష్టసుఖాలను అనుసరించిన విపర్యయం పలు విధాలు. వీటిలో సుఖంగా ప్రారంభమై కష్టంతో ముగియడం, కష్టంతో ప్రారంభమై సుఖాంతం కావడం కథా సరళి విపర్యయంలో ముఖ్యమైనవి. ఇది నాటకం అంతటికీ వర్తిస్తుంది, అంకానికీ వర్తిస్తుంది. నాటకం ప్రారంభంలో, అంతంలో విపర్యయమే గాక మధ్య విపర్యయం కూడా ఉంటూ ఉంటుంది. అంటే సుఖం-కష్టం, కష్టం-సుఖం-కష్టం ఇత్యాది.

శ్రీ.చ.

విప్రలబ్ధ : అష్టవిధ నాయికలలో ఆరవది. దూతని పంపి సంకేతం చెప్పినప్పటికీ, ఏదో కారణం చేత ప్రియుడు తన దగ్గరకు రాకపోయినప్పుడు తాను వంచనకు గురి అయినట్లు భావించే నాయిక విప్రలబ్ధ.

గం.సు.రె.

విమర్శక పారిజాతం : ఈ విమర్శనాత్మక గ్రంథాన్ని పురాణం సూరి శాస్త్రి రచించాడు. దీనిని ప్రథమంగా 1925 లో ముద్రించారు. యూరప్ చరిత్ర, విమర్శక మహర్షులు, విమర్శన తత్త్వం, వాఙ్మయ స్వరూపం, కావ్య ప్రశంస, కళా రహస్యం, సమన్వయం అనే శీర్షికల కింద లలితకళలకు సంబంధించిన అనేక విషయాలు ఈ గ్రంథంలో చర్చితమైనాయి. అనేక విషయాల మీద పాశ్చాత్య కళావేత్తల అభిప్రాయాలు, నిర్వచనాలు ఇందులో చోటు చేసుకొన్నాయి.

శ్రీ.చ.

విరామం : వాచికాభినయ సంబంధి. విరామం వాచికాభినయంలో అంతర్భాగం. నాటక ప్రదర్శనలో ఒక పాత్ర మరొక పాత్రతో సంభాషించేటప్పుడు కొన్ని పదాల మధ్య విరామం పాటించి, అర్థవంతంగా ఉచ్చరించడంలో విరామం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకొంటుంది. కొన్ని పదాలను సరైన చోట ఆపి పలకకపోతే అర్థం మారిపోయే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాలలో భావం అర్థంకాకుండా అయోమయంలో పడే స్థితి కూడా ఉంది. ఒక్కొక్క సారి మాటల మధ్య విరామం మాటల్లో లేని భావోద్వేగాన్ని, భావ తీవ్రతను ఆవిష్కరిస్తుంది. కనుక నట శిక్షణలో వాచికాభినయంలో విరామం అనే అంశానికి అధిక ప్రాధాన్యమిచ్చి, బోధించడం జరుగుతుంది. విరామం సంభాషణ మధ్యలోనే కాక ఆత్మగత సంభాషణలోనూ, ఏక పాత్రాభినయం లోనూ సామాజికులను విశేషంగా ఆకర్షిస్తుంది. విరామం పాటించకుండా సంభాషించే నటుని అభినయం రంగస్థలం మీద రాణించదు. నిత్యజీవితంలో సంభాషించే టప్పుడు కూడా ఈ విరామం గణనీయమైన పాత్ర నిర్వహిస్తుంది. భావ వ్యక్తీకరణలో నిశ్శబ్దం ప్రముఖ పాత్ర వహిస్తుంది.

గం.సు.రె.

విలియమ్స్, టెన్నెసీ (1911-1983) : అమెరికా నాటకరంగానికి సంబంధించిన ప్రసిద్ధ రచయిత. ఈయన 1945లో రచించిన నాటకం, ది గ్లాస్ మెనేజరీ అద్భుతమైన విజయాన్ని సాధించడంతో ఈయన పేరు అమెరికాలో మారు

మోగింది. కొలంబియాలోని మిస్సోరి యూనివర్సిటీ లోనూ, సెయింట్ లూయిలోనూ, వాషింగ్టన్ యూనివర్శిటీలోనూ విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే విలియమ్స్ నాటకాలను రాయడం ప్రారంభించాడు. అయోవా విశ్వవిద్యాలయంలో నాటక రచన అధ్యయనం చేసి 1938లో బి.ఎ. పట్టా పుచ్చుకున్నాడు. ది గ్లాస్ మెనేజరీ నాటకంలో చితికి పోయిన ఒక కుటుం బాన్ని సహజత్వం వుట్టి పడేలా చిత్రించిన తీరు పలువురి ప్రశంసలనందు కుంది.

తన రచనలలో ఎక్కువగా రతి, లైంగిక సంబంధమైన ఇతివృత్తాలను ఎన్నుకున్నాడు. ఉన్నత ప్రమాణాలలో ఒక మధుర కవిత్వంలాగ పొందుపరచడం అమెరికా నాటకరంగం పై చెరగని ముద్రవేసింది.

లైంగిక సంఘర్షణలను తన పాత్రలు బ్లాంకీ డ్యూబోయ్, స్టాన్లీ కోవాల్ స్కీల ద్వారా, ఎ స్ట్రీట్ కార్ నేమ్డ్ డిసైర్ *(1947)* నాటకంలో నేర్పుతో చూపించడం జరిగింది. బ్లాంకీ పాత్ర భ్రమకీ, యుక్తికీ ప్రతీక. తనలోని కామపు కార్చిచ్చుని బయటకు ప్రకటితం కాకుండా నేర్పుగా పైపై హాయలతో దాచిన ఒక గొప్ప పాత్ర. వీటికి దీటుగా జవాబు చెప్పగల సమర్థుడు స్టాన్లీ పాత్రలో కనిపిస్తాడు. ఇందులోని రచనా శైలి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటకానికి పులిట్జర్ బహుమతి లభించింది. దీనిని చలన చిత్రంగా కూడా తీశారు.

సమ్మర్ అండ్ స్మోక్, ది రోస్ టాట్టూ (1951), బేటిల్ ఆఫ్ ఏంజిల్స్ నాటకాలలో అణచివేతకు, విడుదలకు మధ్య యుద్ధాన్ని చూపరులకు గగుర్పాటు కలిగేలా స్పృశిస్తాడు. యూ టచ్ మి (1945), స్వీట్ బర్డ్ ఆఫ్ యూత్ (1959) నాటకాలలో స్త్రీల అతివ్యామోహపు దీనత్వాన్నుంచి, వారికి ఉత్సాహాన్ని, పునరుజ్జీవనాన్ని పురుష కాముకులు కల్గించడం ప్రధానంగా వుంటుంది. అలాగే నిస్సహాయులైన స్త్రీలను కనికరించకుండా, వారికోర్కెలను పురుషులు నిరాకరించడాన్ని ప్రధాన సంఘర్షణగా, కేట్ ఆన్ ఎ హాట్ టిన్ రూఫ్ (1955)లోనూ, ది మిల్క్ ట్రెయిన్, డసన్ట్ స్టాప్ హియర్ ఎనిమోర్ (1963) నాటకాలలో చూపించాడు విలియమ్స్. తన తల్లిదండ్రులు అన్యోన్య దంపతులు కాని కారణంగా తరచూ తగవులాడు కోవడాన్ని విలియమ్స్ నిశితంగా పరిశీలించేవాడు. తన యీ పరిశీలనే తన నాటకాలలో కామసంబంధ సంఘర్షణలు ప్రధానంగా చోటు చేసుకోవడానికి కారణమైంది.

కొంతకాలం తరువాత విలియమ్స్ వ్యక్తిగత జీవితం దారుణమైన పరిస్థితులకు లోనయ్యింది. తన పై తనకు అదుపు లేకపోగా, సభ్య సమాజంలో విలువ తగ్గినా, తన రచనా శిల్పంలోని ఆ గాంభీర్యం సంభాషణలలో మాధుర్యం మాత్రం తగ్గలేదు. మానవుని కోరికల తీవ్రత, తద్వారా కలిగే ఉద్రిక్తతలు, స్వానుభవాలు అన్నింటినీ కలిపి నటులకు, నటించడానికి కావలసినంత అవకాశాన్నీ సామాగ్రిని తన నాటకాలలో పొందుపరచాడు. ఈయన నాటకాలు ప్రపంచంలోని వివిధ భాషలలోకి అనువదింపబడి ప్రదర్శింపబడ్డాయి. ఉత్తమ నాటక రచయితగా అమెరికా నాటక చరిత్రలో తన స్థానాన్ని పదిలపరచుకున్న విలక్షణ రచయిత విలియమ్స్ టెన్నెసీ 1983లో కన్నుమూశాడు.

రవీంద్ర

విశాఖదత్తుడు (8వ.శ) : నాటక రచయిత. సంస్కృత నాటక సాహిత్యంలో ఈయన రచించిన ముద్రారాక్షసం విలక్షణమైన అపూర్వ నాటకం. ఇతివృత్తం విషయంలో స్వతంత్రమైంది. విశాఖదత్తుడు ఎవరూ రాయనటువంటి ఒక ఇతివృత్తాన్ని ఎన్నుకొని నాటకం రచించాడు. సంప్రదాయ నాటక లక్షణాలను అనుసరిస్తూనే ఒక నూతన సంవిధానం గల నాటకాన్ని రచించాడు. విశాఖదత్తుని ప్రతిభ, మౌలికత అనితర లభ్యం. అతని నాటక కళను అనుకరించడానికి పూనుకున్న కవులెవరూ సఫలీకృతులు కాలేదు. ముద్రారాక్షసం లో నిజంగా ఘటించిన రాజకీయేతివృత్తం ఉంది. విశాఖదత్తుడు గౌడ (బెంగాల్) దేశానికి చెందిన దత్త వంశజుడు. ఈ రాజవంశస్తులు గుప్తులకు సామంతులు. చంద్రగుప్తుని నాయకునిగా చేసి ఈ కవి మొదట దేవీచంద్రగుప్తం అనే నాటకాన్ని రచించాడు. ఈ నాటకం కొంత కాలం వరకు అజ్ఞాతంగానే ఉన్నది. ముద్రారాక్షసం నిజంగా జరిగిన సంఘటన మీద ఆధారపడిన రాజకీయ నాటకం. చాణక్యుడు ఈ నాటకంలో ప్రధాన పాత్ర. నాయిక లేదు. రాజకీయపు ఎత్తుగడలతో నాటకం నడిచింది. చాణక్యుడు చంద్రగుప్తుని రాజుగా చేస్తాడు. నందుల మంత్రి రాక్షసుడు ఇంకా నంద రాజులందు విశ్వాసం కలిగి ఉంటాడు. రాజనీతి కుశలుడు, నమ్మకస్తుడైన రాక్షసున్ని చంద్రగుప్త మౌర్యునికి మంత్రిగా చేసి చాణక్యుడు తాను విశ్రాంతి పొందాలనుకుంటాడు. రాక్షసుడు లంగకపోయేసరికి చాణక్యుడు అతని స్నేహితుడైన వ్యాపారి చందనదాసును, సేవకుడైన భాగురాయణున్ని బాధలు పెడ్తాడు. ప్రతిపక్ష వర్గాలకు చెందినవారిని పాలక పక్షం వారు ఏవిధంగా తప్పుడు అభియోగాలతో శిక్షలు విధించేవారో దీన్ని బట్టి తెలుస్తున్నది. స్నేహితుడు చందనదాసు బాధలు చూడలేక రాక్షసుడు లంగిపోతాడు. చంద్రగుప్త మౌర్యుని మంత్రి కావడంతో నాటకం

మంగళాంతంగా ముగుస్తుంది. ముద్ర అంటే అంగుళీయకం. దాని ద్వారా చాణక్యుడు రాక్షసున్ని లొంగదీసుకున్నాడు కాబట్టి కవి ఈ నాటకానికి ముద్రారాక్షసం అని పేరు పెట్టాడు. అభిజ్ఞాన శాకుంతలం, మృచ్ఛకటికం లాగా ఈ నాటకం పేరు నవీన కల్పనను ప్రతిబింబిస్తూ సార్థకంగా ఉంది. గుప్తచరులు, పాము లవాడు, యమపటం ధరించిన వీధి గాయకుడు మొదలైన సహజ మైన పాత్రలను కవి నాటకంలో ప్రవేశపెట్టాడు. ప్రతి పాత్రను సజీవంగా చిత్రించాడు. మృచ్ఛకటికం తరువాత ఈ నాటకంలోనే ఇటువంటి సజీవపాత్ర చిత్రణ కనిపిస్తున్నది. రాక్షసుని స్వామి భక్తి, స్నేహ పరాయణతలను, చాణక్యుని కుతంత్రాలను కవి చాలా వాస్తవంగా చిత్రించాడు. విషకన్య ప్రయోగం వంటి ఘట్టాలను కవి వర్ణించాడు. ముద్రా రాక్షసం రసప్రధానమైన నాటకం కాక సంఘటనా ప్రధానమైన నాటకం. ఈ నాటకంలో ఎక్కువగా పురుష పాత్రలే ఉన్నాయి. హాస్య సంఘటనలు లేని గంభీర నాటకం. నృత్యగీతాల ప్రసక్తి కూడా లేదు. గంభీరమైన రాజకీయేతివృత్తాన్ని విశాఖదత్తుడు ఉత్కంఠపూరితంగా నడిపాడు. రాజకీయ సంఘర్షణను వాస్తవికంగా చిత్రించాడు. సన్నివేశ కల్పనలో, సంభాషణలను నడపడంలో, పాత్రచిత్రణలో ప్రతిభను చూపి నాటకాన్ని రక్తి కట్టించాడు. విశాఖదత్తుడు స్వయంగా రాజవంశానికి చెందినవాడు కాబట్టి ప్రావీణ్యంతో ఈ నాటకాన్ని రచించాడు. అక్కడక్కడ సంభాషణలు దీర్ఘంగా, శైలి, భాష ప్రౌఢంగా ఉన్నాయి. యుద్ధం అనే మాట లేకుండా కవి ఉత్సాహం స్థాయిగా గల వీర రసాన్ని అభివ్యక్తీకరించాడు. కరుణ, శాంతి రసాలు అంగీరసాలుగా ఉన్నాయి. చాణక్య రాక్షస పాత్రల వ్యక్తిత్వాలకు ఎక్కడా లోపం రాకుండా కథను నడిపాడు.

విశాఖదత్తుని ముద్రారాక్షసం నాటకం ప్రాచీన కాలంలో కన్నా ఆధునిక కాలంలో ఎక్కువ మెప్పును పొందింది. దానికి కారణం ఇతివృత్తం మూసలో పోసినట్లుగా కాక భిన్నంగా ఉండడం. విలక్షణంగా ఉండడం. ఈ నాటకం భారతీయ భాషల్లోనే కాక ఇతర భాషల్లోకి అనువదింపబడి ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో ప్రదర్శింపబడి మన్ననలను పొందింది.

ముదిగంటి

విశ్వనాథ్, కాశీ : రంగస్థల సినీ, టి.వీ. నటుడు. రచయిత, కథకుడు, నవలాకారుడు. విశాఖపట్నంలో బుచ్చెమ్మ, శిలుకోటి అప్పలస్వామి దంపతులకు జన్మించాడు. 1959- 61లలో సి.బి.ఎమ్. హైస్కూల్లో విద్యార్థిగా ఉన్నప్పుడు మూడు నాటికల్లో నటించడంతో రంగస్థల జీవితం ప్రారంభమైంది. వెయిట్ లిఫ్టర్‌గా జాతీయస్థాయి గుర్తింపు తెచ్చుకొని క్రీడారంగంలోనూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఆధునిక కథా, నవలా రచయితగా పేరు తెచ్చుకొని అనేక బహుమతు లందుకున్న విశ్వనాథ్ *ఒక దీపం వెలిగింది, గరీబీహటావో, మీరైతే ఏం చేస్తారు?, ఓటున్న ప్రజలకి కోటి దండాలు, అడ్రస్ లేని మనుషులు, ఇక్కడ ప్రేమ లేఖలు రాయబడును, జారుడుమెట్లు, కొత్త గాలి వీస్తోంది, జీవన సంధ్య, మానవత్వానికి మరో కోణం, రంగువెలసిన బొమ్మలు, ఎందరో సత్యవతులు, నవరాగం, మనసున్న మనిషి, ఇదీ భారతం, రాముడులేని రాజ్యంలో*, భస్మసింహాసనం, వీర పాండ్య కట్ట బ్రహ్మన్న వంటి నాటకాలు, నాటికలు రచించాడు. ఈయన రాసిన ఒక దీపం వెలిగింది నాటిక 1980లో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ రచనగా ఎంపిక చేసింది. ఈయన రాసిన నాటక, నాటికలన్నీ వివిధ పరిషత్తు పోటీలలో ప్రదర్శించబడి అనేకసార్లు ఉత్తమ రచన బహుమతులను తెచ్చిపెట్టాయి. 2004వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన నాటక, నాటిక పోటీలలో మానవత్వానికి మరో కోణం నాటిక ఉత్తమ రచయిత (నంది) బహుమతిని తెచ్చి పెట్టింది. నాటకరంగంలో కృషి చేస్తూనే చలనచిత్రరంగంలో ప్రవేశించి దాదాపు యాభై చిత్రాలలో నటించాడు. నూటముప్పై సినిమాలకు రచయితగా పనిచేశాడు. దూరదర్శన్, రేడియోలకు నాటికలు రచించాడు. కళారంగంలో నిర్విరామంగా పనిచేస్తున్న కాశీవిశ్వనాథ్‌ను 1998లో మనోరంజని (హైదరాబాద్) సంస్థ మహాకవి శ్రీశ్రీ స్మారక అవార్డు అందజేసి గౌరవిస్తే, 2004లో యువకళావాహిని (హైదరాబాద్) మహాకవి గురజాడ అప్పారావు స్మారక అవార్డుకు ఎంపిక చేసింది. కూరెళ్ల సాహితి ట్రస్ట్ (విశాఖపట్నం) ఉత్తమ కథల, నవలా, నాటిక రచయితగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించింది.

దాసరి,ఎన్.

విశ్వనాథరెడ్డి, మజ్జిగ : నటుడు, దర్శకుడు, లలిత కళానిలయం స్థాపకుడు. నెల్లూరుజిల్లాలో సాంఘిక నాటకాలు ప్రదర్శించడానికి ప్రయత్నించిన వారిలో ప్రథముడు. వృత్తిరీత్యా తల్లి దండ్రులు వ్యాపారస్తులైనా విశ్వ నాథ రెడ్డి మాత్రం కళనే వృత్తిగా ఎంచుకున్నాడు. బి.ఎ. వరకు చదువుకున్న విశ్వనాథరెడ్డి కొంతకాలం మద్రాసు రాష్ట్రజైలు సూపరింటెండెంటుగా పనిచేశాడు. ఉద్యోగ నిర్వహణ సంతృప్తి నివ్వక పోవడంతో నాటకరంగలో

కృషి చేయడానికి నెల్లూరు చేరుకున్నాడు. బాల్యంలోనే షేక్స్పియర్ నాటకాలలోని విభిన్న పాత్రలను ఏకపాత్రాభినయంలో ప్రదర్శించి ప్రథమ బహుమతులందుకున్న విశ్వనాథరెడ్డి లలితకాళానిలయం నెలకొల్పి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశాడు. ఈ సంస్థ ద్వారా రవీంద్రుని శాక్రిఫైస్, గాలి బాలసుందరరావు అపోహ (1936), అశోక సామ్రాట్, ఒథెల్లో నాటకాలను ప్రదర్శించాడు.

1944లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిర్వహిస్తున్న నాటక పోటీల ప్రభావంతో విశ్వనాథరెడ్డి ఎంకి-నాయుడు బావా, ఎంకి సరదాలు అనే నాటికలను రచించి ప్రదర్శింప చేశాడు. యువకళాకారులను సమీకరించి పరివర్తన, ఆనాడు, ఇదా ప్రపంచం, బాలనాగమ్మ, తుఫాన్‌లను పలుచోట్ల ప్రదర్శించి, ప్రేక్షకుల మన్నన పొంది ఉత్తమ దర్శకుడుగా కీర్తి గడించాడు. ఈ ప్రదర్శనలు రచన రూపంలో వెలువడడానికి ఆత్రేయ, కణ్వశ్రీ, పులుగుండ్ల రామకృష్ణయ్యలను ప్రేరేపించిన కళాప్రియుడు విశ్వనాథ రెడ్డి. ప్రదర్శనా పరంగా రచనను ప్రేక్షకుల ముందుంచడంలో విశ్వనాథరెడ్డిది అందవేసిన చెయ్యి. ఈయన కవికోకిల దువ్వూరి రామిరెడ్డితో కాంగ్రెసు వాలా, కుంభరాణాలను రచింపజేశాడు. లలిత కళానిలయంలో ఒకేరోజు రెండు ప్రదర్శనలు ఏర్పాటుచేశాడు. నాటి నాటకరంగం కోసం కృషి చేస్తున్న మజ్జిగ విశ్వనాథరెడ్డితో పాటు టి.వి. రమణా రెడ్డి, ఫన్ డాక్టర్ చంద్ర శేఖరం, చంద్రబాల, గాడేపల్లి రామయ్య, నాగభూషణం, ఎం.ఏ ఖాదర్ ఉన్నారు.

విశ్వనాథరెడ్డి కొంతకాలం నాటక రంగానికి దూరంగా మద్రాసులో ఉంటున్న సమయంలో నాగభూషణం రక్తకన్నీరు ప్రదర్శనకు ఏర్పాట్లు గురించి విశ్వనాథరెడ్డితో చర్చించడం జరిగింది. నాగ భూషణం కోరిక మేరకు నెల్లూరు టౌన్‌హాలులో వరుసగా అయిదు రోజులు రక్త కన్నీరు నాటక ప్రదర్శనకు తగిన ఏర్పాట్లు చేశాడు. విశ్వనాథరెడ్డి తన కుమార్తెలకు నృత్యం నేర్పించి వారితో విశ్వనాథ సత్యనారాయణ రచించిన కిన్నెరసానిని సంగీత నృత్యరూపకం మలచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించాడు. నాటకం ప్రదర్శించడానికి బయట ప్రాంతం నుండి వచ్చిన వారికి సకల సదుపాయాలకు విశ్వనాథరెడ్డి ఇల్లే వేదిక. కష్టపడే నటులంటే ఎంత ఇష్టమో, ముఖ ప్రీతి కోసం మాట్లాడే వారంటే అంత అయిష్టం. నాటకం కోసం పరితపించే వినయమూర్తి విశ్వనాథ రెడ్డి.

దాసరి, ఎన్

విశ్వనాథశర్మ, మల్లాది (1893-1946) : నాటకకర్త, నటుడు, సంస్కృతాంధ్ర భాషా పండితుడు, పత్రికా సంపాదకుడు, నాటక కళానిధి, ఆదర్శ అధ్యాపకుడు, కవి, సాహితీవేత్త, కవిరాజు బిరుదాంకితుడు. నారాయణావధాన్లు, గోదావరమ్మ దంపతులకు1893లో శ్రీకాకుళంలో జన్మించాడు. శ్రీకాకుళంలో మెట్రిక్యులేషన్ చదువుతూనే సంస్కృత కావ్యాలు, నాటకాలు, అలంకార శాస్త్రం బళ్లమూడి దక్షిణామూర్తి శాస్త్రి వద్ద అభ్యసించాడు. సురభి రామయ్య నాటకాలు ఉద్దీపనంగా లాక్షాగృహం అనే ఏకాంకిక రచించాడు. అదే ఈయన ప్రథమ రచన.

ఆంధ్రదేశమంతటా ఉప్మాక నారాయణమూర్తితో కలిసి 'హరిహరలు' అనే పేరుతో శతావధానాలు చేశాడు. ఆ తరువాత శ్రీకాకుళం ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు, తరువాత విజయనగరం మహారాజావారి ఆంగ్ల కళాశాలలో తెలుగు పండితుడుగాను పనిచేశాడు. సురభి పాపాబాయి కంపెనీకి చాలా నాటకాలు రాసిచ్చాడు. విజయనగరం నుంచి మొదట 'నాటక కళ' అనే మాసపత్రిక కొంతకాలం నడిపాడు.

శ్రీకాకుళంలో ఉండగానే చట్టి పూర్ణయ్య పంతులుతో కలిసి శ్రీరామా ఎమెచ్యూర్స్ అనే నాటక సంస్థను నెలకొల్పి నాటకాలు స్వయంగా రాసి ఆడాడు. పలాస గ్రామంలో చిన్న ఎత్తున నాటక కళాపరిషత్తు నిర్వహించాడు. ఆ తరువాత 1929లో ఆ పరిషత్తు ప్రాతిపదిక మీద ఆంధ్రనాటక కళాపరిషత్తు స్థాపించాడు.

సంస్కృతాంగ్ల నాటక సాహిత్యాలను క్షుణ్ణంగా చదివి నాటక రచనలో మెలుకువలు గ్రహించి అసంఖ్యాకంగా నాటికలు రచించాడు. ఈయన నాటకాలు, నాటికలు సంఘానికి యదార్థ చిత్రాలు. కొసమెరుపు తీసుకురావడంలో ఈయన సిద్ధహస్తుడు.

1936లో తెలుగు సినిమారంగంలో ప్రవేశించి భక్త మార్కండేయ మొదలైన చిత్రాలకు సంభాషణలు రాశాడు. ఈయన ఏకాంకిలు రాయడంలో సిద్ధహస్తుడు. ఈయన రచించిన గృహస్థ జీవనం నాటిక సాహిత్యానికి ఆలంబనం. గృహజీవన చిత్రణలో ఏకైక వీరుడనిపించుకొని తెలుగు నాటికాకర్తలకు మార్గదర్శకుడయ్యాడు.

మృచ్ఛకటిక, అనర్ఘరాఘవం, నూర్జహాన్, కళాపహడ్, ఉత్తర రామ చరిత, ఆశ్చర్య చూడామణి ఈయన అనువాద అముద్రిత రచనలు కాగా ద్రౌపది, సావిత్రి, శ్రీకృష్ణలీల, సత్యహరిశ్చంద్ర, కబీరు, మహానంద, కుశలవ, పాట్నాటీపెళ్లి, హంస జమీందారీ, కాల దుందుభి, కాళిదాసు, భాగవతం, సౌదామిని, కంస వధ, కృష్ణమాయలు స్వతంత్ర అముద్రిత రచనలు. నాటకాలే

కాకుండా కిర్రుగానుగ, డొంకలో షరాబు, అపశృతి, దొంగాటకం, నేపథ్యం, నాటికే నేడు, ప్రహ్లాద, రాజీ, పునస్సంధానం, విషమభూతం, హంసపాద, వెంట్రుకల పంట నాటికలు రచించాడు. విశ్వనాథశర్మ 1946, జూన్ 2న నిర్యాణం చెందాడు.

శ్రీ.చ.

విశ్వనాథశాస్త్రి రాచకొండ (1922 - 1993) : స్వస్థలం విశాఖపట్నం. వృత్తిరీత్యా న్యాయవాది. ప్రసిద్ధ నవలా రచయిత, నాటక ప్రక్రియలో కూడా ఈయన సిద్ధహస్తుడు. సామాజిక స్వరూపాన్ని ఈయన రచనల్లో నగ్నంగా దృగ్గోచరం చేస్తాడు. న్యాయవ్యవస్థలోని వెలితిని బట్ట బయలు చేసే నిజం నాటకాన్ని సృష్టించి సాహిత్యరంగంలో సంచలనం కలిగించాడు. తిరస్కృతి నాటకం స్త్రీ సమస్యాత్మకం. ఒక విధంగా స్త్రీ వాదానికి నాటకరంగంలో వాకిలి తెరిచిన మొదటి నాటకం ఇది. తాను చెప్పదలచుకున్న విషయాన్ని నిర్భయంగా నిర్మొహమాటంగా వ్యక్తంచేసే రచయితలు తెలుగు సాహిత్య రంగంలో మిక్కిలి అరుదు. ఈయన రచనల్లో వ్యంగ్యం పఠితులను, ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. రావిశాస్త్రి రాసిన ఏకైక నాటిక విషాదం కూడా రంగస్థలంపై రాణించింది.

గం.సు.రె.

విశ్వనాథశాస్త్రి, రొట్టె (జ.1936) : రంగస్థల నటుడు, రచయిత. నటుడిగా, ప్రయోక్తగా, పౌరాణికుడిగా, సంఘసేవా కార్యకర్తగా ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈయన 1936, మార్చి 17న కరీంనగర్ జిల్లా ధర్మపురిలో జన్మించాడు. ధర్మపురి అగ్రహారానికి వెయ్యి సంవత్సరాల పైగా ఉజ్వల సాంస్కృతిక, వైదిక, నాగరిక, తాత్త్విక చరిత్ర ఉంది. విశ్వనాథశాస్త్రికి సాహిత్య సాంస్కృతిక సౌరభాలు అనువంశికంగా అబ్బాయి. తండ్రి చంద్రశేఖర శాస్త్రి సంస్కృత పండితుడు, నటుడు. తెలంగాణా ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం లేక స్తబ్దుగా ఉన్నకాలంలో 'లక్ష్మీనరసింహ నాట్యమండలి' పేరుతో నాటక సంస్థను స్థాపించినవారిలో ముఖ్యుడు. విశ్వనాథ శాస్త్రి పద్నాలుగో ఏట ముఖానికి రంగు వేసుకుని రంగస్థలంపై అనేక నాటకాలలో సత్తా చాటుకున్నాడు. లవకుశ నాటకంలో మునిబాలకుడిగా, భక్తప్రహ్లాదలో విద్యార్థిగా నటజీవితానికి శ్రీకారం చుట్టాడు. ఆ తరువాత కాసర్ల వెంకటరాజయ్య శిక్షణలో నటనలోని మెళకువలు ఒడిసి పట్టుకున్నాడు. తమ నాటక మండలిలో ప్రదర్శించే నాటకాలలో స్త్రీ పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులతో శభాష్ అనిపించుకుని బహుమతులు పొందాడు. తరువాత కాలంలో పౌరాణిక నాటకాలలో ప్రధాన పాత్రలన్నింటినీ పోషించాడు. భావానికి తగినట్లుగా రాగయుక్తమైన పద్య పఠనా చాతుర్యంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. మంచి ఆంగికం, వాచికం ఆయన అభినయానికి రాణింపు తెచ్చాయి.

ఆయనలోని కళాకారుడి వన్నెలు, చిన్నెలు జతచేర్చి మరింత ప్రకాశించడానికి పెద్దపల్లిలోని నటరాజ నాటక కళాసంస్థ దారులు వేసింది. తన తండ్రి పోషించిన శ్రీకృష్ణుడు, బిల్వమంగళుడు పాత్రలు ధరించి తమ ప్రాంత కళాభిమానులను రంజింప చేయడం శాస్త్రి జీవితంలో తీయని జ్ఞాపకం. 1961లో ధర్మపురికి బదిలీపై వెళ్ళినప్పటి నుంచి తన మాతృసంస్థ 'శ్రీలక్ష్మీ నరసింహ నాట్యమండలి' నిర్వహణలో ముఖ్యపాత్ర వహించాడు. నటుడిగా, నిర్వాహకుడిగా నాలుగు దశాబ్దాల పాటు ఆ మండలి అభివృద్ధికి నిరంతరం శ్రమించాడు. 1993లో ఆ సంస్థ స్వర్ణోత్సవాలు జరుపుకుంది. తెలంగాణా ప్రాంతంలో వెలసిన తొలి నాటక సంస్థగా చరిత్రలో అది నిలిచిపోయింది.

విశ్వనాథశాస్త్రి దర్శకత్వంలో అనేక పౌరాణిక, సంస్కృత నాటకాలు ఊపిరి పోసుకున్నాయి. చారిత్రక, సాంఘిక నాటకాలు కూడా ఆయన రూపొందించాడు. చైనా యుద్ధం సందర్భంగా ఆయన రచించి, రూపొందించిన జయం మనదే నాటకం ప్రదర్శించిన ప్రతిచోట ఆదరణ పొందింది. కరీంనగర్‌లో జరిగిన పోటీలలో ఆయనకు ఉత్తమ దర్శకునిగా వెండి పతకం లభించింది. విశ్వనాథశాస్త్రి తులాభారం శ్రీ కృష్ణరాయబారం, గయోపాఖ్యానం నాటకాలలో శ్రీకృష్ణుడిగా, రాయబారం నాటకంలో దుర్యోధనుడు గయుడు పాత్రల్లో రాణించాడు. విక్రమోర్వశీయం సంస్కృత నాటకానికి దర్శకత్వం వహించి పండితుల ప్రశంసలు అందుకున్నాడు. 1959లో చింతామణి నాటకంలో బిల్వమంగళుడిగా శాస్త్రి అభినయాన్ని మెచ్చి పి.వి. నరసింహారావు 'నటరత్న' బిరుదుతో అభినందించాడు. రంగస్థల ప్రముఖులు ఈలపాట రఘురామయ్య, ఎ.ఆర్. కృష్ణలు కూడా శాస్త్రి నటనా వైదుష్యాన్ని మనసారా అభినందించారు. 1999లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉగాది పర్వదినం సందర్భంగా సత్కరించాడు.1955లో ఉద్యోగ విరమణ తరువాత, తాము పెంచి పోషించిన శ్రీలక్ష్మీ నరసింహ నాట్యమండలికి అధ్యక్షుడిగా, దర్శకుడిగా కొనసాగుతున్నాడు. పాండిత్య ప్రకర్ష, సాంస్కృతాభినివేశం, సమాజ సేవా తత్పరత ముప్పేటల అందుకున్న స్వరూపమే విశ్వనాథ శాస్త్రి.

పి.వి.రా.నా.

విషాద రూపకం : కథ దుఃఖాంతంగా ముగిసే నాటకం. ప్రాచీన నాటకవాఙ్మయంలో విషాదాంత రూపకాలు లేవు. కారణం, శుభాంతాన్ని ఆశించడం భారతీయసంస్కృతి. విషాద రూపకాలకు గ్రీకు దేశం మూలస్థానం. డయోనిసస్ ఉత్సవాల

సందర్భంగా జరుపబడే నాటక పోటీలలో విషాద నాటకాలకే అగ్రతాంబూలం లభించేది. ఎస్కిలస్, సోఫోక్లిస్, యురిపిడీస్ గ్రీకు విషాద నాటకకర్తలలో అగ్రగణ్యులు. ఇంగ్లండులో షేక్స్పియర్ విషాదంత, సుఖాంత నాటకాలను సమాన ప్రతిభతో రాసి జగద్విఖ్యాతి పొందిన నాటకకర్త. విషాద రూపకంలో నాయకుని మరణం, పతనం అనేవి అనివార్యం కావు. నాయకుడు మరణిస్తే అది విషాదాంత రూపకమవుతుందనే భావన జనసామాన్యంలో ఉంది. నాయకుడు మరణించకపోయినా ఆశయసాధనలో అపజయం పాలైనా, అది విషాదాంత నాటకమేఅవుతుంది. భారతీయ సంప్రదాయం ప్రకారం నాయకుడు సర్వసద్గుణోపేతుడుగా, ఉదాత్త పురుషుడుగా, ఆదర్శవంతుడుగా ఉండాలి. అతనికి అపజయం కాని, మరణం కాని సంభవించకూడదు. ఈ లక్షణాలు అనివార్యం కావడంతో మన ప్రాచీనులెవ్వరూ విషాదాంత రూపక సృష్టి పట్ల ఉత్సాహం చూపలేదు. గ్రీకు రూపకాలలోను, ఆంగ్లేయ నాటకాలలోను నాయకుడు సర్వసద్గుణోపేతుడు కాడు. ఎన్ని విశిష్టగుణాలున్నా అతనిలో ఏదో ఒక అసాధారణ లోపం ఉంటుంది. ఆ లోపమే అతని పతనానికి దారితీస్తుంది. ఇది మన నాటకాలలో ఉండదు. నాయకునిలో లోపాన్ని మన సంప్రదాయం అంగీకరించకపోవడమే అందుకు కారణం. ఏది ఏమైనా పాశ్చాత్య సాహిత్యం మనకు అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ పరిస్థితిలో మార్పొచ్చింది. తెలుగులో ధర్మవరం రామకృష్ణమాచార్యులు 'విషాద సారంగధర'తో విషాదాంత నాటకాలకు శ్రీకారం చుట్టాడు. అప్పటినుంచీ ఎన్నో విషాదాంత నాటకాలు మన వాఙ్మయంలో చోటు చేసుకున్నాయి. సాంఘిక నాటకాల్లో ఇది సర్వసాధారణమై పోయింది. ఇంకో రకం నాటకాలున్నాయి. అవి సుఖాంత నాటకాలు కావు, దుఃఖాంత నాటకాలు కావు. కానీ నాటకంలో విషాదం అలముకొనిఉంటుంది. సంఘర్షణాత్మకంగా ఉంటుంది. ఇటువంటి నాటకాన్ని 'గంభీర నాటకం' అని వ్యవహరిస్తున్నారు నాటక కళాభిజ్ఞులు.

గం.సు.రె.

విష్కంభం : అర్థోపక్షేపకాలలో ఒకటి. ప్రదర్శనకు నీరసంగా స్ఫురించే అంశాలను, ప్రదర్శనకు వీలుకాని అంశాలను, రంగస్థలం మీద దృశ్యమానం చేయడం, జుగుప్సావహంగా అనిపించే అంశాలనుసూచ్యంగా చెప్పించడమే విష్కంభం ముఖ్యోద్దేశం. విష్కంభంలో పురోహితుడుగాని, అమాత్యుడుగాని, కంచుకిగాని ఉండవచ్చు. అంటే దీనిని మధ్యమ పురుషులే నిర్వహిస్తారు. ముఖసంధిలో మాత్రమే విష్కంభాన్ని వాడుకొంటారు.

గం.సు.రె.

విసెంటీ, గిల్ (1465-1536) : పోర్చుగల్‌కు చెందిన ప్రముఖ నాటక కర్త, కవి. పోర్చుగీస్ భాషలోనే కాక స్పానిష్ భాషలోనూ రచనలు చేశాడు.

ఈయన ప్రారంభదశను గురించి ఇదమిత్థమని చెప్పదగిన వివరాలు లేవు. ఈతని మొదటి రచన ది హెర్డ్స్ మన్స్ మోనోలాగ్. 1502, జూన్ 7వ తేదీని (మూడవ) జాన్ పుట్టినరోజు సందర్భంగా ఈ నాటకం ప్రదర్శింపబడింది.

జీవితాంతం నాటక రచనకే అంకితమై రాజులకు, ప్రజా సామాన్యానికి హృదయ రంజకమైన రచనలు చేశాడు. మొత్తం రాసిన 44 నాటకాలలో 11 స్పానిష్, 14 పోర్చుగీసు, తక్కినవి సంగోప్రవాళ భాషలో ఉన్నాయి. పాత్రోచితంగా ఇటాలియన్, ఫ్రెంచి, లాటిన్ భాషలు ఈయన ప్రవేశపెట్టాడు. ఈయన నాటకాలను మత ప్రాతిపదికతో కూడినవి, సాహసాలుగా జనరంజకమైనవి, వ్యంగ్యంతో, ప్రణయ ధోరణులతో కూడినవని విభజన చేయవచ్చు. 1513-19 నడుమ రాసిన నాటకాలలో హాస్యప్రవృత్తి ఎక్కువ.

శ్రీవిరించి.

వీథి : దశ రూపకాల్లో ఒకటి. దీనిలో ఇతివృత్తం కల్పితం. ఉత్తమ, మధ్యమ, అధమ ప్రకృతులు గల వారిలో ఎవరైనా నాయకుడుగా ఉండవచ్చు. ముఖ నిర్వహణ సంధులు ఉంటాయి. అన్ని రసాలకూ ఆలవాలం వీథి.

గం.సు.రె.

వీర రసం : నవరసాలలో ఒకటి. ఉత్సాహం ఉత్తముల స్వభావం. ఉత్సాహాత్మకమైన వీరం ఉత్తమ ప్రకృతికం. ఉత్సాహం, అధ్యవసాయం, అవిషాదం, అవిస్మయం, అసంమోహం అనే వాని వల్లనూ, ఇటువంటివే అయిన ఇతర అర్థవిశేషాల వల్ల కూడా వీర రసం పుడుతుంది. స్థైర్యం, ధైర్యం, వీరం, గర్వం, ఉత్సాహం, పరాక్రమం, ప్రభావం, ఆక్షేపపూర్వకాలైన వాక్యాలు అనే అనుభావాలతో వీరరసం అభినయించాలి.

శ్రీ.వ.

వీర వేంకటసత్యనారాయణ: (చూ. కాకరాల)

వీరేంద్రనాథ్, యండమూరి (1948-): ప్రసిద్ధ రచయిత. తులసీదళం నవలా రచయితగా పాఠకలోకానికి సుపరిచితుడు. నాటకరచనలో కూడా తన ప్రత్యేకత చాటుకున్నాడు. ఈయన 1948 నవంబరు 14న తూర్పుగోదావరి జిల్లా రాజోలులో జన్మించాడు. తల్లిదండ్రులు నరసమాంబ

చక్రపాణిలు. వీరేంద్రనాథ్ తండ్రి ఇన్‌కంటాక్స్ విభాగంలో పనిచేయడం వల్ల ఈయన విద్యాభ్యాసం పలు ప్రాంతాలలో సాగింది. 1972లో సి.ఎ పూర్తి చేసిన వీరేంద్రనాథ్ అయిదు సంవత్సరాలు స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్‌లోనూ, పది సంవత్సరాలు ఆంధ్రా బ్యాంక్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ విభాగానికి అధికారిగా పనిచేశాడు. ఈయన 1968లోనే ముసురు పట్టిన రాత్రి అనే కథను రాశాడు. ఇదే ఆయన తొలిరచన. ఆంధ్రప్రభ నిర్వహించిన కథలపోటీలలో ఈ కథకు ప్రథమ బహుమతి లభించింది. నాటిక రచయితగా గులకరాళ్ళు గులాబిముళ్ళును రచించాడు. ఇది ఆంధ్రజ్యోతిలో ప్రచురించిబడిన తరువాత ప్రదర్శితమైంది. ఈయన రాసిన శివరంజిని, కుక్క, మనుషులస్తున్నారు జాగ్రత్త, రుద్రవీణ మొదలైన నాటికలు, డామిట్ కథ అడ్డం తిరిగింది నాటకం విరివిగా అనేక ప్రదేశాలలో ప్రదర్శింపబడి ప్రేక్షకుల మన్ననలను పొందాయి. యండమూరి ఒక వైపు ఉద్యోగం చేస్తూనే నాటకాలు నాటికలు రచించాడు. రఘుపతి రాఘవ రాజారాం, పుట్ట, శివరంజని, జలతరంగిణి, డామిట్ కథ అడ్డం తిరిగింది అనే నాటకాలు రుద్రవీణ, ముష్టియుద్ధం, గులకరాళ్లు-గులాబీముళ్ళు, రంగులనీడ, మనీ+షి చీముకుట్టిన నాటకం, సర్పదష్ట, కుక్క మొదలైన నాటక నాటికలు సంపుటిలుగా వెలువడ్డాయి. ఈయన రాసిన రఘుపతి రాఘవ రాజారాం నాటకానికి 1982లో సాహిత్య అకాడమీ అవార్డు లభిస్తే, 'పుట్ట' నాటకానికి, కుక్కనాటికలకు ఖమ్మం కళాపరిషత్తు, లలితకళానికేతన్ ఉత్తమ ప్రదర్శన అవార్డులు లభించాయి. వీటితో బాటు యండమూరి అనేక సంస్థల నుంచి అనేక అవార్డులు అందుకున్నాడు.

గం.ను.రె

వీరేంద్రశర్మ (1937-2001) : ప్రసిద్ధ హిందీ రంగస్థల నటుడు, దర్శకుడు, సమాజ వ్యవస్థాపకుడు. వీరేంద్రశర్మ ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో 1937, డిసెంబర్ 24న జన్మించాడు. అలహాబాద్ విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడయ్యాడు. బాల్యం నుంచీ ఈయనకు కళల పట్ల విశేష ఆరాధనాభావం ఉండేది 'రామ్‌విలాస్' అనే నాటకం ద్వారా తొలిసారిగా రంగస్థల ప్రవేశం చేశాడు. అప్పటినుంచీ అనేక నాటకాల్లో విభిన్న పాత్రలు ధరించి తనలోని నటుడ్ని తీర్చిదిద్దుకున్నాడు. అనంతరకాలంలో 1952 నుంచి 1966 వరకు రంగస్థలంపై నటుడిగా పలు హిందీ నాటకాలలో నటించి పండిత పామరుల ప్రశంసలు అందుకొన్నాడు. ఎన్నో అవార్డులు, సన్మానాలు పొందాడు. ఈయనకు విశేషఖ్యాతి తెచ్చిపెట్టిన నాటికల్లో గబన్ అండ్ యూసీ, మాలూమ్ థా, నయే హాథ్, సబేరా, రోటీ ఔర్ కమల్ కా ఫూల్ , తీన్ యోగి మొదలైనవి ప్రముఖంగా నిలుస్తాయి. కేవలం నాటకాల్లో వేషాలు వెయ్యడంతో ఈయనలోని కళాకారుడు తృప్తి పడలేదు. భిన్న భాషలతో, భిన్న సంస్కృతులతో అలరారే భారతీయ కళా వైభవాన్ని ఒకే వేదికపై ప్రదర్శించి తద్వారా సాంస్కృతికంగా ఆదానప్రదానాలకు వీలు కల్పించాలనే ఆలోచన కలిగింది. దాని ఫలితమే 1966లో అలహాబాద్‌లో నాట్య సంఘ్ ఆవిర్భావం. 1968 జనవరిలో భారతీయ నాటక చరిత్రలోనే తొలిసారిగా 'బహుభాషా నాటక పోటీలు' అనే వినూత్న కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. 'బహుభాషా నాటక పితామహుని'గా వీరేంద్రశర్మ పేరు నాటక చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. తొలిసారిగా నాలుగు రాష్ట్రాల నుంచి, రెండు భాషల నుంచి, ఇరవై సమాజాలు పాల్గన్న ఈ పోటీలు, క్రమక్రమంగా విస్తరించి, ఇరవై రాష్ట్రాల నుంచి ఇరవై భాషల నుంచి 100కి పైగా నాటక సమాజాలు పాల్గనే స్థాయికి ఎదిగింది. ఈ స్ఫూర్తితోనే ఉత్కళ యువ సాంస్కృత సంఘ్ (కటక్), సాయి కళాస్రవంతి (రేపల్లె), సిమ్లా, ఆగ్రా, డెహ్రి ఆన్ సోనే (బీహార్), జగదల్‌పూర్ (చత్తీస్‌గడ్) వంటి పలు ప్రాంతాలలో ఈ తరహా సమాజాలు ఆవిర్భవించాయి. వివిధ భాషల్లోని కళారూపాల వైశిష్ట్యాన్ని, వైవిధ్యాన్ని అభివ్యక్తం చేస్తూ, జాతీయ సమైక్యతను ప్రోదిచేసే దిశలో కొనసాగుతున్నాయి. నాట్యసంఘ్ నిర్వహిస్తున్న బహుభాషా నాటక పోటీలలో ఇప్పటిదాకా 3000కు పైబడిన సమాజాలు, 90,000 వేలమంది కళాకారులు పాల్గనటం గర్వించదగిన విషయం. ఇలా నాటకమే తన ప్రాణంగా జీవితంలో ఆఖరిక్షణం వరకు భారతీయ కళా వికాసానికి కృషి సల్పి భారతీయ కళాకారులందరితో 'పాపాజీ' అని ఆప్యాయంగా పిలిపించుకున్న వీరేంద్రశర్మ 2001 సెప్టెంబర్‌లో భౌతికకాయాన్ని విడిచి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయాడు.

మన్నెశ్రీ.

వీరేశలింగం, కందుకూరి (1848-1919) : ప్రముఖ సంఘ సంస్కర్తగా, అనేక ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలకు

శ్రీకారం చుట్టిన వ్యక్తిగా, ఆధునిక యుగకర్తగా కందుకూరి వీరేశలింగం పంతులు ప్రసిద్ధుడు. ఈయన పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు 1848, ఏప్రిల్ 16న జన్మించాడు. పంతులు తమ స్వీయ చరిత్రలో తెలుగులో తానే తొలి నాటకాన్ని, తొలి ప్రహసనాన్ని, మొట్టమొదటి వచన ప్రబంధాన్ని (నవల), మొదట కవుల చరిత్రను, శాస్త్రీయ గ్రంథరచనను చేపట్టినట్లుగా చెప్పుకున్నాడు. అయితే తదనంతర పరిశోధనలవల్ల నాటకం, నవల విషయంలో వీరేశలింగం పంతులు ఆద్యులు కారని తేలింది. 1860లో కోరాడ రామచంద్ర శాస్త్రి రాసిన మంజరీ మధుకరీయం తొలి నాటకంగా గుర్తించారు. నాటకానికి దగ్గరగా ఉన్న ప్రహసన రచనకు మాత్రం కందుకూరే ఆద్యుడు. 1875లో పంతులు ఆంగ్లానువాదంలో రూపక రచనకు పూనుకొన్నాడు. అయితే ఆ రోజులలో తెలుగులో నాటక రచనకు అంతగా ఆదరణ లేదు. ధార్వాడ నాటక సమాజం ప్రదర్శనలను చూసిన తరువాతే ఆంధ్రదేశంలో తెలుగు నాటకాలు ప్రదర్శించాలనే కోరిక, ప్రయత్నం మొదలైంది. కందుకూరి రాసిన 19 నాటకాలలో కొన్ని అసంపూర్ణాలు. మరికొన్ని ప్రహసనాలుగా చెప్పుకోదగినవి. కందుకూరి సంపూర్ణంగా రాసిన నాటకాలు పన్నెండు.

కందుకూరి నాటకాలను ఇతివృత్తాన్ని బట్టి నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి 1) ఆంగ్ల రూపకానువాదాలు, 2) సంస్కృత రూపకానువాదాలు, 3) స్వతంత్ర పౌరాణిక నాటకాలు, 4) స్వతంత్ర సాంఘిక నాటకాలు.

ది కామెడి ఆఫ్ ఎర్రర్స్, వెనీసు వర్తక చరిత్రం, *చమత్కార రత్నావళి, రాగమంజరి, కళ్యాణ కల్పవల్లి*లు ఆంగ్ల రూపకానువాదాలు కాగా, *అభిజ్ఞాన శాకుంతలం, రత్నావళి, ప్రబోధ చంద్రోదయం, మాళవికాగ్నిమిత్రం* సంస్కృతానువాదాలు. *ప్రహ్లాద, సత్యహరిశ్చంద్ర, దక్షిణ గోగ్రహణం* స్వతంత్ర పౌరాణిక నాటకాలు కాగా, *బ్రాహ్మ వివాహం, వ్యవహార ధర్మబోధిని, మహాపురాధిపత్యం, తిర్యగ్విద్వన్మహాసభ, మూషికాసుర విజయం, స్త్రీ పునర్వివాహ సభానాటకం, వివాహదీపిక*లు స్వతంత్ర సాంఘిక నాటకాలు.

ఆంగ్ల రూపకానువాదాలలో ది కామెడి ఆఫ్ ఎర్రర్స్‌ను మొదట ద్విపదలో రాసినా అసంపూర్తిగా వదలిపెట్టాడు. తరువాత 1880లో షేక్స్పియర్ గద్యపద్యాత్మకంగా రచించిన ఈ నాటకాన్ని పూర్తిగా గద్యాత్మకంగా రచించి *చమత్కార రత్నావళి* అని పేరు పెట్టాడు. ఈ నాటక ఆంగ్లరూపకానువాదాలలో గద్యాత్మకంగా అనువదింపబడిన తొలి నాటకమే కాకుండా, ఆంధ్రదేశంలో నెలకొల్పబడిన తొలి నాటక సమాజం ప్రదర్శించిన నాటకం. ఈ నాటకం చాలా రంగస్థలాలలో చాలాసార్లు ప్రదర్శించబడింది. ఈ నాటకంలో పాత్రలకు తెలుగు పేర్లను పెట్టటం, తెలుగువారి ఆచార వ్యవహారాలకు, సంప్రదాయాలకు దగ్గరగా రచించడం, పూర్తిగా మూలానుసారిగా కాకుండా కొంత స్వేచ్ఛగా ఒకటి రెండు సన్నివేశాలను నూతనంగా కల్పించడం జరిగింది. వెనీసు వర్తక చరిత్రం షేక్స్పియర్ రాసిన మర్చంట్ ఆఫ్ వెనిస్‌కు అనువాదం. దీనిని రెండంకాల వరకు ద్విపదలో అనువదించాడు. *రాగమంజరి*, *కల్యాణ కల్పవల్లి* అను నాటకాలు షెరిడన్ ఆంగ్లంలో రచించిన నాటకాలకు అనువాదాలు. సమకాలీన సాంఘిక దురాచారాలను నాటకాల ద్వారా అవహేళన చేయడంలో షెరిడన్ సుప్రసిద్ధుడు. వీరేశలింగం లక్ష్యం కూడా అదే కాబట్టి షెరిడన్ నాటకాలను రెండింటిని అనువదించాడు. రాగమంజరి నాటకంలో ఇతివృత్తం దేశీయాచారాలకు భిన్నమైనట్టిది. ఈ నాటకంలో కథా సన్నివేశాలను, ఆచారాలను, పాత్రలను మార్చినప్పటికీ, ఆయా సన్నివేశాలు తెలుగువారి జీవితానికి సుపరిచితమైనవి కాకపోవడంవల్ల కొన్ని వింతగా కన్పిస్తాయి. కల్యాణ కల్పవల్లిలో కూడా దేశకాల పాత్రలను మార్చి రచించాడు. ఈ నాటకంలో కథ అంతా పిఠాపురంలో జరిగినట్లు కల్పించాడు. నైలునదిని గోదావరి నదిగా మార్చి ప్రాంతీయతను నిలబెట్టడం ఈ నాటకం ప్రత్యేకత. విచిత్రమైన మనస్తత్వాలతో కూడిన పాత్రలతో ఈ నాటకం హృదయాహ్లాదంగా ఉంటుంది.

వీరేశలింగం సంస్కృత రూపకానువాదాలలో మొట్టమొదట ఆంధ్రీకరించినది కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం. దీనిని మొదట 1875లో రెండంకాలు మాత్రమే అనువదించి, తరువాత 1881లో పూర్తి చేశాడు. శాకుంతలానికి ఎన్నో (30కి పైగా) అనువాదాలు వచ్చినా, వాటిలో కందుకూరి అనువాదమే శ్రేష్ఠమైందని, తెలుగు భాషా సంప్రదాయానుసారంగా అనువదించారని, ఇది అటు పండితులకూ, ఇటు పామరులకూ సులభగ్రాహ్యమయ్యేట్లు సులభ సుందరంగా అనువదించారని విమర్శకుల అభిప్రాయం. వీరి శాకుంతల నాటకం ఆంధ్రదేశంలో అనేకచోట్ల ప్రదర్శింపబడి మన్ననలను పొందింది. కందుకూరి శ్రీహర్షుని *రత్నావళి* నాటకాన్ని అనువదించాడు. శాకుంతలం అనువాదం మొదటిదైనా, మొదట అసంపూర్ణంగా వదిలిపెట్టి, శ్రీహర్షుని *రత్నావళి* నాటకాన్ని సంపూర్ణంగా ఒకేసారి 1880లో అనువదించి ప్రదర్శింపచేశాడు. *రత్నావళి* నాటకాన్ని అనువదించినవారిలో పంతులు ప్రథముడు. అంతేకాదు

మొట్టమొదట ప్రదర్శనా భాగ్యం పొందిన సంస్కృతానువాద రూపకం కూడా రత్నావళియే. మూలంలో వలే గద్యపద్యాత్మకంగాను, అనువాద సరళంగాను సాగింది. పంతులుగారు కాళిదాసు రచించిన మాళవికాగ్నిమిత్రాన్ని కూడా అనువదించాడు. ఈ నాటకాన్ని కూడా సులభశైలిలో రచించాడు. సంస్కృత రూపకానువాదాలలో చివరిది కృష్ణమిశ్రుడు రచించిన ప్రబోధ చంద్రోదయం. ఇది వేదాంత నాటకం. బ్రాహ్మ మతస్థుల నాకర్షించే పరిశుద్ధాస్తిక సిద్ధాంతాలు ఉన్నందువల్ల బ్రహ్మసమాజ అనుయాయులు అయిన వీరేశలింగాన్ని ఈ నాటకం ఆకర్షించిన కారణంగా అనువదించి ఉంటాడని భావించవచ్చు.

వీరేశలింగం పంతులు రాసిన స్వతంత్ర పౌరాణిక నాటకాలలో ప్రహ్లాద మొదటిదే కాదు, తెలుగులో వెలసిన స్వతంత్ర పౌరాణిక నాటకాలలో ఇదే మొదటిదని విమర్శకుల అభిప్రాయం. ప్రహ్లాద నాటకాన్ని గద్య నాటకంగా రచించడానికి సంకల్పించినా, సన్నివేశాల ప్రాబల్యాన్ని బట్టి కొన్ని పద్యాలు కూడా రచించాడు. 1885లో దక్షిణ గోగ్రహణం అనే నాటకం భారతకథాంతర్గమైనది. భారత కథను నాటకీకరించిన వారిలో పంతులు ప్రథములని తెలుగు నాటక వికాసంలో పి.ఎస్.ఆర్. అప్పారావు అభిప్రాయపడ్డాడు. పంతులు తమ స్వీయచరిత్రలో భారతంలో 'నాకత్యంత ప్రియములగు భాగములు విరాటపర్వములోని యుత్తర గోగ్రహణమును, భీష్మద్రోణ కర్ణశల్య పర్వములును' అని రాసుకున్నా, ప్రసిద్ధమైన ఉత్తర గోగ్రహణాన్ని వదిలిపెట్టి, దక్షిణగోగ్రహణం కథను నాటకీకరించడం విశేషం. సత్యహరిశ్చంద్ర నాటకం కూడా పంతులుదే మొదటిదని పి.ఎస్.ఆర్.అప్పారావు అభిప్రాయపడ్డాడు. పాత్రానుగుణంగా, రసానుగుణంగా సంభాషణలను గ్రాంథికంలోనే రచించాడు. శైలి ఒకచోట ప్రౌఢంగాను, మరొకచోట సరళంగాను ఉంటుంది.

వీరేశలింగం పంతులు రచించిన సాంఘిక నాటకాలలో బ్రాహ్మవివాహం మొదటిదే కాదు, తెలుగు సాహిత్యంలోని తొలి సాంఘిక నాటకమని అక్కిరాజు రమాపతిరావు అభిప్రాయం. ఇది ఏడంకాల నాటకం. సంభాషణ రూపంలో ఉండటం తప్ప, దీనిలో నాటకలక్షణాలు లేవని విమర్శకులు అభిప్రాయపడినా, ఆనాడు జనులను చాలా ప్రభావితం చేసిన నాటకం. ప్రజలు గుంపులు గుంపులుగా చేరి, వీధి అరుగుల మీద సమావేశమై ఈ నాటకాన్ని ఒకడు చదువుతుంటే వింటూ, దీనిలోని హాస్యానికి పరవశులై పగలబడి నవ్వేవారట. దీనికి 'పెద్దయ్యగారి పెండ్లి పుస్తకం' అని కూడా నామాంతరం. ఈ నాటకంలో అతి బాల్యవివాహం, వృద్ధవివాహం, కన్యాశుల్కం మొదలైన సాంఘిక దురాచారాలను విమర్శనాత్మకంగా చిత్రించడం జరిగింది. ఈ నాటకంలో ఇతివృత్తం కూడా ప్రధానంగా కన్యాశుల్క నిరూపణమే అయి ఉండటం విశేషం. పంతులు రచించిన వ్యవహార ధర్మబోధిని కూడా సాంఘిక దురాచార నిరసనార్థమే రచించాడు. ఈ నాటకంలో న్యాయవాదుల అక్రమవర్తనాలు, పోలీసు డిపార్టుమెంటు కూట సాక్ష్యాలు సృష్టించి చేసే దురన్యాయాలు, ప్రభుత్వోద్యోగుల లంచగొండితనం, వేశ్యాలోలత్వం, కపట వేషాలు మొదలైన వాటిని వివరంగా విమర్శించడం జరిగింది. ఈ నాటకంలో సంభాషణలు వ్యావహారికంగా ఉండటం గమనార్హం. కందుకూరి రచించిన మరో సాంఘిక నాటకం స్త్రీ పునర్వివాహ సభానాటకం అసంపూర్ణ నాటకం. స్త్రీ పునర్వివాహం వీరేశలింగం పంతులు ఆశయాలలో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఇతివృత్తం. వివేకదీపిక కూడా అసంపూర్ణ నాటకమే. మిగతా సాంఘిక నాటకాలు కొన్ని ప్రహసనాలను పోలి ఉన్నాయి.

వీరేశలింగం పంతులు నాటకరంగానికి ఎనలేని సేవ చేసిన ప్రథములలో ఒకడు. ఈయన ప్రథమాంధ్ర నాటక సమాజాన్ని స్థాపించడం, మొదటిసారిగా నాటక ప్రదర్శనను నిర్వహించడం అనే కీర్తి దక్కాయి. ప్రదర్శన సౌలభ్య విషయంలో ఆయన చాలా శ్రద్ధ వహించాడు. ఆంగ్లరూపక సంప్రదాయాను సారంగా, అంకాలను రంగాలుగా విభజించే పద్ధతిని ప్రవేశపెట్టాడు. వీరేశలింగం రచించిన నాటకాలు, ప్రహసనాలు సమకాలీన సంఘాన్ని చాలా ప్రభావితం చేశాయి. తెలుగులో ప్రభోదాత్మక, ప్రయోజనాత్మక సాహిత్యాన్ని రచించినవారిలో పంతులు ఆద్యులే కాదు అగ్రగణ్యులు కూడా. వీరేశలింగం పంతులు 1919, మే 27న మద్రాసులో స్వర్గస్థుడయ్యాడు.

జి.చె.కే.రె.

వృత్తి : వృత్తి అంటే వ్యాపారం. పని, చేష్ట. నాటకకర్తతో, నటీనటులతో నాటకంలో కావ్యార్థం నాలుగు విధాలుగా అభివ్యక్తం చేయబడుతుంది. వీటికే నాటకవృత్తులని పేరు. అవి, భారతీవృత్తి, కైశికీవృత్తి, సాత్త్వతీవృత్తి, ఆరభటీవృత్తి. భారతీవృత్తి వాగ్వ్యాపారానికి సంబంధించింది. ఇదే వాచికాభినయం. ఆరభటీ వృత్తి చేష్టలకు, కార్యాలకు సంబంధించింది. ఇదే ఆంగికాభినయం. సాత్త్వతి మనో వ్యాపారానికి సంబంధించిన సుకుమారమైన అభివ్యక్తి విశేషం. దీనినే సాత్త్వికాభినయం అంటారు. ఇక కైశికీ వృత్తి అలంకరణకు, ఆహార్యానికి సంబంధించింది. ఇదే ఆహార్యాభినయం. ఈ నాలుగు వృత్తుల గురించిన వివరాలను ఆయా శీర్షికల కింద చూడగలరు.

గం.సు.రె.

వెంకట కృష్ణారావు, చింతల చెరువు: చూ. రావు, సి.వి.కె

వెంకట నర్సునాయుడు, వెల్దుర్తి (జ:1926) : రంగస్థల నటుడు, అభినయ విజయుడు. ఈయన కర్నూలు జిల్లా కోడుమూరులో 1926, జులై 5 న జన్మించాడు. తల్లిదండ్రులు నారాయణమ్మ మాధవయ్యలు. రెండేళ్లు నిండక మునుపే తండ్రి

మరణించడంతో తల్లిగారి పుట్టినిల్లైన వెల్దుర్తిలో మేనమామ దగ్గర పెరిగాడు. నాడు గ్రామంలో జరుగుతున్న నాటకం రిహార్సల్స్ దగ్గరకు వెళ్లి నటుల హావభావాలను గమనించడం మొదలు పెట్టాడు. చిన్నతనంలో వెంకట నర్సు నాయుడు కళపట్ల ఆసక్తి చూపటం, మంఛి గాత్రం ఆయన నాటకరంగం వైపు మొగ్గ చూపడానికి అనుకూలించాయి. పల్లెల్లో పర్వదినాలలో ఔత్సాహిక నటులు సొంత ఖర్చులతో ప్రదర్శించే నాటకాలలో వికర్ణుడు, అభిమన్యుడి పాత్రలు ధరించి బాలనటుడుగా పల్లెప్రజల హృదయాలలో తనకంటూ ఒకస్థానాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

ఆ తరుణంలోనే కర్నూలు జిల్లా రంగస్థల పితామహుడైన కల్లూరు శేషయ్య పరిచయమయ్యాడు. కల్లూరు శేషయ్య చెన్నకేశవ నాట్యమండలి అనే నాటక సమాజాన్ని స్థాపించి, జిల్లాలోని ఔత్సాహిక కళాకారులను రంగస్థలంకు పరిచయం చేస్తున్నాడు. ఈయన ప్రముఖ సంగీత విద్వాంసులైన దుర్గారావును పిలిపించి కళాకారులకు సంగీత శిక్షణ ఇప్పించాడు. ఇలా శిక్షణ పొందినవారిలో వెంకట నర్సునాయుడు ఒకరు. ఆ తరువాత రామకోటి, అరెకెపూడి పెరుమాళ్ళు చౌదరి వంటి వారి దగ్గర శిష్యరికం చేశాడు.

రంగస్థలానికి పుట్టినిల్లైన ఆంధ్ర ప్రాంతం (గుంటూరు, తెనాలి) నాటక సమాజాలు అర్జునిడి పాత్ర కోసం నాయుడుని ఆహ్వానించేవి. ఈయన నాటక ప్రదర్శనల్లో పాల్గంటే కాంట్రాక్టర్లకు కాసుల కనక వర్షమే. నాలుగు దశాబ్దాల పాటు రంగస్థలంపై నటించి ఆంధ్ర దేశంలోనే కాక రాష్ట్రేతర ప్రాంతంలో గూడా ప్రసిద్ధ నటుడుగా పేరు తెచ్చుకున్నాడు. పగలంతా ప్రయాణం, ప్రయాణంలోనే నిద్ర, రాత్రి ప్రదర్శనలు ఇలా కళామతల్లికి సేవ చేసి అనేక మంది యువ కళాకారులకు ఆదర్శ నటుడయ్యాడు. ఆ రోజుల్లో *గయోపాఖ్యానం* లో విజయుడి పాత్రను ధరించిన నాయుడును గుంతకల్ నాటక మండలి, కర్నూలులోని రవీంద్రఆర్ట్స్, లలిత కళా సమితిలు చెన్నకేశవ నాట్యమండలి మొదలైన కళాసంస్థలు ఘనంగా సన్మానించి, గౌరవించాయి. 1945లో ఉండవల్లిలో జరిగిన పౌరాణిక నాటక పోటీలలో వెంకటనర్సునాయుడు ఉత్తమ నటుడు అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంలోనే నాయుడుకి రాయల సీమ నటరత్నం అని బిరుదునిచ్చి ఘనంగా సన్మానించారు. క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదల, సాధన ఉంటే నటుడుగా ఎనలేని కీర్తి సాధించవచ్చుననే సత్యాన్ని తెలిపిన వినయశీలి నాయుడు.

దాసరి.ఎస్

వేంకటరావు, కోవెలకొండ (జ.1945) : రంగస్థల నటుడు, దర్శకుడు. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురంలో 1945, సెప్టెంబర్ 16న జన్మించాడు. రాష్ట్రాల విభజనలో ఒరిస్సాలో మిగిలిపోయినా, మాతృభాషపట్ల మక్కువతో, నాటక కళ పట్ల చిన్ననాటి నుంచి పెంచుకున్న అభిరుచితో తనదైన శైలిలో నాటకరంగానికి నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న కళా హృదయుడు వేంకటరావు. తెలుగు కుటుంబాలు పరిమితంగా ఉన్న ప్రాంతంలో గౌరవ కుటుంబాలకు చెందిన మహిళలను ఔత్సాహిక కళాకారిణులుగా రూపొందించి వారితో అభ్యుదయ నాటక నాటికలు ప్రదర్శింపచేశాడు. 1968లో కరుణశ్రీ కళాసమితిని స్థాపించి ఎన్నో నాటకాలను ఆంధ్ర, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో ప్రదర్శించి ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొన్న నటుడు. ఎండమావులు, చీడపురుగులు, పంజరంలో పక్షులు, వదిన, ఇన్స్‌పెక్టర్ జనరల్, మంగళసూత్రం, మరోమొహంజదారో, గాంధీ మళ్ళీ పుట్టాలా! మొదలైన నాటకాలను, బ్రహ్మచారులు, మనీ+షి, విషాద భారతంలో మరో ఆడపడుచు, పులి మేకలస్తున్నాయి జాగ్రత్త, నారీభేరి, చలిచీమలు మొదలైన నాటికలను జనరంజకంగా ప్రదర్శించి ప్రశంసలందు కున్నాడు. ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం నాటక పోటీలలో మూడుసార్లు వరసగా బహుమతులు అందుకోవటం విశేషం. 1993లో కరుణశ్రీ కళా సమితి రజతోత్సవం జరుపుకొంది. బరంపురంలో తెలుగు నాటకానికి ఉనికినీ, వైభవాన్ని సమకూర్చిన ఖ్యాతి వెంకటరావుకే దక్కుతుంది. తమ సమితి ద్వారా తెలుగు నాటకరంగానికి చెందిన ప్రముఖులెందరినో బరంపురంకు ఆహ్వానించి సన్మానించి పురస్కారాలు అందించి కరుణశ్రీ కళాసమితి ప్రతిష్ఠను ఇనుమడింప చేశాడు. సమస్యల సుడిగుండంలో రగిలిపోయే మహిళల్లో చైతన్యం కలిగించే దిశలో నాటకాలను రూపొందించి ప్రదర్శిస్తూ నేటికీ నాటకరంగానికి అవిశ్రాంతంగా సేవలు అందిస్తున్నాడు వేంకటరావు.



ఎమ్మెస్వీ.

వెంకటస్వామి నాయుడు. పి (జ.1924) : నటుడు, నవజ్యోతి ఆర్టిస్ట్సు అసోసియేషన్ కార్యదర్శి, రచయిత. ఈయన

గుంటూరు జిల్లా కొర్నెపాడులో 1924లో జన్మించాడు. తల్లిదండ్రులు పలుపులేటి కోటమ్మ, వరదయ్యలు. ప్రాథమిక విద్యతోనే చదువు చాలించిన వెంకటస్వామి నాయుడు చిన్నప్పుడే పల్లెల్లో ప్రదర్శించే చెక్కభజన లాంటి జానపద ప్రదర్శనలలో పాల్గన్నాడు. సంగీతంపట్ల మక్కువ పెంచుకొని 1939లో బాలమిత్ర నాట్య మండలిలో చేరాడు. రంగూన్‌రౌడిలో శంకర రావు (రౌడి) పాత్రలో నటించి రంగస్థల జీవితాన్ని ప్రారంభించాడు. నటశిక్షణలో గురువు పులిపాక వెంకటప్పయ్య పంతులు. హరిహర ప్రసాదరాయ నాట్యమండలి, గౌరీశంకర నాట్యమండలి, స్టార్‌థియేటర్, గుంటూరు రిక్రియేషన్‌క్లబ్ నాట్య సమితి, ఆంధ్రా ఆర్టిస్ట్సు అసోసియేషన్‌లలో సభ్యుడుగా చేరి ఈ సమాజాల పక్షాన రాజరాజు, పాండవోద్యోగ విజయం, గయోపాఖ్యానం, పాదుకా పట్టాభిషేకం, చింతామణి, పరశురామ్, నాయకురాలు, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణ తులాభారం నాటకాలలో సుప్రసిద్ధ నటుల సరసన ప్రధాన పాత్రలలో నటించాడు. ఈ నాటకాలు రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా ప్రదర్శించబడ్డాయి. శ్రీకృష్ణ రాయబారంలో అశ్వత్థామ పాత్ర పద్యాలను మద్రాసు హిజ్ మాస్టర్స్ వాయిస్ (HMV) కంపెనీ రికార్డు చేసింది. నాలుగు దశాబ్దాలుగా నాటకరంగానికి సేవ చేసిన వెంకటస్వామిని పలు కళాసంస్థలు నాటక కళాప్రపూర్ణ, నటప్రవీణ బిరుదులనిచ్చి సత్కరించాయి. నవజ్యోతి ఆర్టిస్టు అసోసియేషన్ కార్యదర్శిగా నాటకాలను ప్రదర్శించడమే కాకుండా యువకులను కళాకారులుగా తీర్చిదిద్ది నాటక రంగానికి పరిచయం చేశాడు. నాటకరంగానికి సేవ చేసిన కళాకారుల జీవిత విశేషాలను సేకరించి, రంగస్థలనటులు పేరుతో 1992లో ముద్రించి కళారంగంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్నాడు.

దాసరి, ఎన్

వెంకట సుబ్బయ్య, వంగర (1897-1976) : రంగస్థల, చలనచిత్ర నటుడు. ప్రకాశం జిల్లా రంగశాయపురంలో 1897, నవంబరు 24న జన్మించాడు. వీరి కుటుంబం సంగం జాగర్లమూడిలో స్థిరపడింది. ఆయన బాల్యంలోనే వేదాధ్యయనంతో పాటు సంగీతం కూడ క్షుణ్ణంగా అభ్యసించాడు. నాలుగు సంవత్సరాల ప్రాయంలోనే చేకూరు గ్రామంలో చిత్రనళీయం నాటకంలో ఇంద్రసేనుని పాత్రధరించి ప్రేక్షకులను అబ్బురపరిచాడు. సంగంజాగర్లమూడిలో వంగర శ్రీ వేణుగోపాల్ హిందూ నాటక సమాజం స్థాపించి హనుమద్రామ సంగ్రామం అనే నాటకం అనేక చోట్ల ప్రదర్శించాడు. అందులో ఆయన హనుమంతుని పాత్ర అద్భుతంగా పోషించేవాడు. ఆ తరువాత శ్రీ రామవిలాస సభలో చేరిదేశం నలుమూలలా నాటక ప్రదర్శనలిచ్చాడు. వచన సంభాషణలు పలకడంలో కొత్త ఒరవడి పెట్టాడు.



శ్రీకృష్ణ తులాభారంలో వసంతకుడు, విప్రనారాయణలో శ్రీనివాసులు, రోషనారలో శివాజీ, చంద్రగుప్తలో కాత్యాయనుడు మొదలైన పాత్రలలో వంగర నటన ఉత్తమ ప్రమాణాలను అందుకొంది.

వంగర చలనచిత్ర రంగంలో ప్రవేశించి అనేక చిత్రాలలో విలక్షణమైన పాత్రలు పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందాడు. వంగర హాస్యం ఒక ప్రత్యేక తరహాలో సాగిపోతూ అందరినీ అలరిస్తుంది. రంగస్థలం మీద తనదైన ముద్రను మిగిల్చి 1976, మార్చి 6న వంగర తెనాలిలో మరణించాడు.

గం.సు.రె.

వెంకటాచార్యులు, కొట్టే (జ.1951) : నటుడు, అధ్యాపకుడు, విమర్శకుడు, నాటక రచయిత. 1951, మార్చి 1న ప్రకాశం జిల్లా జంగంరెడ్డి గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు వెంగళమ్మ, శేషయ్యలు. 14వ ఏటనే పల్లెపడుచు నాటకంలో గోపి (బాల) పాత్రద్వారా నాటక రంగంలోకి అడుగు పెట్టాడు. కళాశాల రోజుల్లోనే సాంఘిక నాటకాలలో నటించాడు. నటనలో తొలిగురువు పినతండ్రి ఓబులయ్య నాయుడు. ప్రకాశం జిల్లాలోని ప్రముఖ పౌరాణిక నటులలో ఓబులయ్య నాయుడు ఒకరు.



ఉన్నతవిద్యనభ్యసించిన వెంకటాచార్యులు ఉద్యోగరీత్యా హైదరాబాదులో స్థిరపడ్డాడు. సి.ఎస్.ఆర్ కళా మందిరం, విజ్ఞాన దీపిక (హైదరాబాదు) నిర్వాహకుడు అయ్యదేవర

పురుషోత్తమరావు, వేమూరి సీతారామశాస్త్రి దగ్గర పౌరాణిక నటనకు సంబంధించిన సార్వత్రిక విజ్ఞానాన్ని సముపార్జించుకున్న వెంకటాచార్యులు దుర్యోధనుడు, కర్ణుడు, శిశుపాలుడు, లక్ష్మణుడు, భవానీ శంకరుడు, జలంధరుడు పాత్రలలో నటించి ఖ్యాతి గడించిన నటుల సరసన స్థానం సంపాదించాడు. వృత్తి రీత్యా తెలుగు అధ్యాపకుడైనా, ప్రవృత్తిలో ప్రావీణ్యతను సంపాదించే ప్రయత్నంలో భాగంగా సుప్రసిద్ధ నాటక రచయిత కాళ్లకూరి నారాయణరావు నాటకాలపై పిహెచ్.డి పట్టా చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించాడు. ఇదే విశ్వవిద్యాలయంలోని రంగస్థలకళల శాఖలో పి.జి.డిప్లొమా పూర్తి చేశాడు. సంప్రదాయ నాటక సౌరభాలు అనే గ్రంథాన్ని రచించాడు. మంటల్లో మిడతలు, కలలో వైష్ణవమాయ (2000) నాటికలను రచించిడమే గాకుండా వివిధ విశ్వవిద్యాలయాలలో నిర్వహిస్తున్న సదస్సులలో నాటకరంగానికి సంబంధించిన పరిశోధనాత్మక వ్యాసాలనుసమర్పించాడు. సంప్రదాయ నాటకరంగ వైభవాన్ని పెంపొందించే దిశలో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో పౌరాణిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడమే కాకుండా ఎంతోమంది యువ కళాకారులను సంప్రదాయ నాటక రంగానికి పరిచయం చేస్తున్నాడు. నంది నాటకోత్సవాలకు నాటకాలను ఎంపిక చేయడం కోసం రెండుసార్లు న్యాయనిర్ణేత గా వ్యవహరించాడు. పౌరాణిక నాటకరంగం వికాసం కోసం కృషి చేస్తున్నాడు.

దాసరి, ఎస్.

వెంకటేశ్వర రావు, చల్లపల్లి: చూ. చౌదరి, సి.వి.

వెంకట్రాజు, కాకర్లపూడి (జ. 1913) : నటుడు, రచయిత. గురజాడ కళామందిరం సమాజం స్థాపకుడు. స్వస్థలం ఉలవపాడు. నాటకం పట్ల శాస్త్రీయ అవగాహన కల్గి ప్రయోగ పూర్వకంగా నాటకాన్ని జనరంజకంగా మలిచిన అతికొద్దిమంది నటులలో కాకర్లపూడి వెంకట్రాజు ఎన్నదగినవాడు.



కాకర్లపూడి చంద్రమ్మ శ్రీనంరాజు, దంపతులకు 1913లో జూన్ 23న జన్మించిన వెంకట్రాజు తన 11వ ఏట బబ్బిలి యుద్ధంలో చిన వెంగళ రాయుడుగా నటించడం ద్వారా రంగస్థల ప్రవేశం చేశాడు. 1942లో డిసెంబరు 4న జరిగిన క్విట్ ఇండియా బుర్రకథ చెప్పనారంభించాడు. ఈయన ప్రధాన కథకుడిగా, పర్వతనేని కృష్ణమూర్తి, జాష్ఠి సీతారామయ్యలు వంతలుగా ఉండేవారు. 1950 నుంచి బెజవాడలో స్థిరపడ్డాడు.

1951లో ఇదా ప్రపంచం లో చంద్రయ్య పాత్ర ద్వారా మలి ప్రవేశం చేశాడు. పగలు ప్రెస్‌లో పనిచేస్తూ రాత్రిళ్ళు కళాసేవ కొనసాగించాడు. క్రాంతి కళామండలి థియేటర్స్ ప్రదర్శించిన నాటకాల్లో ఈయనే కథానాయకుడు. షేక్‌నాజర్ రచించిన ఆసామి నాటకాన్ని 1954లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో (బందరులో) ప్రదర్శించినపుడు దాన్లో అమరయ్య పాత్రను అత్యద్భుతంగా పోషించిఉత్తమబహుమతి సాధించాడు. మాచినేని,కర్నాటి, విన్నకోట రామన్నపంతులు ప్రభృతులు ఈ ప్రదర్శనలో పాల్గన్నారు. అనంతరం 1963లో శివరామిరెడ్డితో కలిసి గురజాడ కళామందిరం స్థాపించాడు. ఈ సంస్థ ఈనాటికీ కొనసాగుతూ, ఆంధ్రావనిలో జైత్రయాత్ర సాగిస్తూనే ఉండటం విశేషం.

అన్నాచెల్లెలు లో సత్యం పాత్ర, పరివర్తన లో కవి, చౌదరి, కులంలేని పిల్ల లో శోభనరావు, పల్లెపడుచు లో చంద్రం, ఢిల్లీ కోటలో విక్రమదేవ్, పేదరైతు లో శ్రీనివాసరావు పాత్రలు ఈయనకు పేరు తెచ్చాయి. ఇంకా సంభవామియుగే యుగే, ఇనుప తెరలు, అల్లీముఠా, కొడుకు, మేటి నటుడు, మాచేతి మాత్ర వంటి నాటకాల్లో పలు ప్రాధాన్యంగల భూమికలు ధరించి రాణించాడు.

దాదాపు యాభై హరికథలు రాశాడు. వీటిల్లో అనేకం ఆకాశవాణి ప్రసారం చేసింది. ఈయన రచించిన నాటకాల్లో తాళ్ళపాక అన్నమయ్య జీవిత చరిత్ర (టి.వి. అనుసరణ), బెజవాడ మాధవవర్మ (నాటకం), బుద్ధుడు కోపిస్తే (నాటిక), అల్లూరి సీతారామరాజు (ఏకపాత్ర) లు ఈయన రచనా వైశిష్ట్యాన్ని, భాషా పాటవాన్ని, సంభాషణా మాధుర్యాన్ని, సన్నివేశ కల్పనా చాతుర్యాన్ని ప్రస్ఫుటం చేస్తాయి. పలు పోటీలకు న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించాడు.

మన్నెశ్రీ

వెంకట్రామయ్యచౌదరి, వల్లూరు (1925-1990): రంగస్థల నటుడు. ఆంధ్ర డ్రమెటిక్ అమెచ్యూర్ స్థాపకులలో ముఖ్యుడు. ఈయన 1925, మే 11న గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని కొలకలూరులో జన్మించాడు. తల్లిదండ్రులు సౌభాగ్యమ్మ, అంజయ్య. వీరిది మధ్య తరగతి రైతుకుటుంబం. ప్రాథమిక విద్య సొంత ఊరులోనే సాగింది. పెదనాన్న వెంకటరామయ్య నటుడు, దుగ్గిరాల కంపెనీలో వివిధ పాత్రలను పోషించేవాడు. వెంకటరామయ్య చదువుతున్న పాఠశాలలో పనిచేస్తున్న పంతులు ముకుందరామయ్య సహజ నటుడు, గాయకుడుకూడ. పెదనాన్న, పంతులు ప్రభావంవల్ల వెంకటరామయ్య నాటకంపై అనురక్తిని పెంచుకుని పాఠశాల వార్షికోత్సవాల సందర్భంగా శ్రీ కృష్ణరాయబారం నాటకంలో

దుర్యోధన పాత్రను పోషించి, ప్రథమ బహుమతిని గెలుచుకున్నాడు.

వెంకటరామయ్య ఒకరోజు పాఠశాలకు ఆలస్యంగా వచ్చినందువల్ల పంతులు దండించడంతో స్కూలు విద్యకు స్వస్తిపలికి, నటన వైపు దృష్టి మళ్ళించాడు. ఎమ్. ఎన్. రాయ్ రాడికల్ పార్టీలో చేరి, ఆ పార్టీకి సంబంధించిన గేయాలను శ్రావ్యంగా పాడేవాడు. ప్రముఖ హేతువాది త్రిపురనేని రామస్వామి చౌదరి సంస్కరణల పట్ల ఆకర్షితుడై ఆయన అభిమానాన్ని చూరగొన్నాడు. త్రిపురనేని రామస్వామి చౌదరి రచించిన శ్రీరామ రావణ యుద్ధం నాటకంతో వల్లూరు నటజీవితం ప్రారంభమైంది.

వల్లూరు వెంకటరామయ్య చౌదరి ఆజానుబాహుడు. నిరాడంబరుడు. గంభీరమైన గాత్రం, సరళ స్వభావం, ఇవన్నీ కలబోసిన నిండైన విగ్రహం.

బాలనాగమ్మలో ఫకీరు పాత్ర చూసి, పిల్లలు, పెద్దలు దడుచుకునేవారు. ఈ పాత్ర ఈయనకు బాగా పేరు తెచ్చింది. రామాంజనేయ యుద్ధం లో యయాతిగాను, సక్కుబాయి లో శ్రీకృష్ణుడుగాను, సత్యహరిశ్చంద్ర లో నక్షత్రకుడుగా నటించాడు.

నాటకరంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించాలనే ఆలోచన కంటే నాటకరంగానికి విశేష సేవ చేయాలనే ఆలోచనా దృక్పథం గల నటుడు వల్లూరి వెంకటరామయ్య. అందుకే మిత్రులు డి.వి. సుబ్బారావు, రత్నాకర రావు, పగడాల రామారావు, జానకీదేవి, రాజకుమారి, కృష్ణవేణిలతో కలిసి ఒక సంస్థను నెలకొల్పాడు. ఆ సంస్థ తరపున బాలనాగమ్మ, భక్త శబరి, నటనాలయం, వీరపాండ్య కట్టబ్రహ్మన్న మొదలైన నాటకాలను ప్రదర్శించాడు. బాలనాగమ్మ నాటకం ప్రదర్శించేటప్పుడు ఫకీరు పాత్రలో ఉన్న వల్లూరు వెంకటరామయ్యను చూడటానికి గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు రాకూడదని నిర్వాహకులు ముందుగానే తెలిపేవారు. మాయలఫకీర్ పాత్రలో ఉన్న వల్లూరు 'జై కపాళీ' అనీ గంభీరమైన కంఠంతో అన్నప్పుడు రెండు మూడు కి.మీ.ల దాకా వినపడేది. ఈ పాత్రను ఇంత గంభీరంగా నటించి మెప్పించినవారు ఆంధ్ర నాటకరంగంలో లేరు. ఈ నాటకాన్ని పల్లెపల్లెకు పరిచయం చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది.

ఆంధ్ర నాటకరంగంలో ఉన్నతమైన ప్రమాణాలు సాధించే ఒక నాటక సంస్థను నెలకొల్పాలనే ఆలోచనతో ఆంధ్ర డ్రమెటిక్ అమెచ్యూర్ సంస్థను ములుగు వీరభద్రరావు, వెనిగళ్ల రాజారావు, కాళిదాసు కోటేశ్వరరావు మొదలైన వారితో ప్రారంభించాడు. వల్లూరు కేవలం పౌరాణిక నాటకాలలోని పాత్రలనే కాదు సాంఘిక నాటకాలలోని పాత్రలను కూడా పోషించాడు. మోదుకూరి జాన్సన్ రచించిన నటనాలయం నాటకంలో రాజారావు అనే క్లిష్టపాత్రను సమర్థవంతంగా పోషించి, ప్రేక్షకుల మన్ననలు, బహుమతులు అందుకొన్నాడు.

నాటకమే జీవితంగా భావించి తెలుగు నాటకరంగానికి ఎనలేని సేవ చేసిన వల్లూరు వెంకటరామయ్య తన తుది శ్వాసకు కూడా రంగస్థలాన్ని ఎంచుకున్నాడు. ఆయనకు అత్యంత పేరు ప్రఖ్యాతులను తెచ్చి పెట్టిన బాలనాగమ్మలోని ఫకీరు పాత్రను ఆఖరిసారిగా1990, డిసెంబరు 10న గుడివాడలో ప్రదర్శించి, నాటకానంతరం మేకప్ తుడిచేసుకుంటూ గుండెపోటుతో మరణించి, తెలుగు నాటక రంగంలో చిరస్మరణీయుడైనాడు.

దాసరి, ఎన్

వేంకటరత్నం నాయుడు, ఆచంట (జ.1935) : రంగస్థల నటుడు, షణ్ముఖినాట్యమండలి స్థాపకుడు. స్వయం కృషి, అకుంఠిత దీక్షతో నటలోకంలో సముచిత స్థానాన్ని అందుకొన్న మహానటుల కోవకు చెందినవాడు ఆచంట వేంకటరత్నం నాయుడు.

కృష్ణాజిల్లా కొండ పల్లి గ్రామంలో 1935, మే 28న నరసమ్మ, వేంకటేశ్వర్లకు జన్మించాడు. చిన్ననాటి నుంచి నాటక కళపై మక్కువను పెంచుకున్నాడు. గుంటూరు హిందూకాలేజి హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సి చదువుతూ 1951లో జీవన జ్వాల నాటకం లో తాత పాత్రను ధరించి రంగస్థల ప్రవేశం చేయడమే కాక ఉత్తమ నటనకు బహుమతిని పొందాడు.



ఆ తరువాత ఈయన దృష్టి పద్య నాటకాల వైపు మళ్ళింది. గుంటూరులో ఉంటూ మందపాటి రామలింగేశ్వర రావు, నవరం వీరాస్వామి నాయుడు శిక్షణలో రంగూన్ రౌడి, సక్కుబాయి, తులాభారం, బబ్బిలి యుద్ధం, నారద సంసారం, బాలనాగమ్మ మొదలైన నాటకాలలో వివిధ పాత్రలు పోషించాడు. నాటి ప్రసిద్ధ హార్మోనిస్టు హుళక్కి, భాస్కరరావు వద్ద పద్యపఠన విధానాన్ని అధ్యయనం చేసి, దుర్యోధనుడు, గయుడు, విశ్వామిత్రుడు

మొదలైన పాత్రలను రఘురామయ్య, సూరిబాబు, మల్లాది, అద్దంకి, పులిపాటి, షణ్ముఖి, పీసపాటి మొదలైన ప్రముఖ నటుల సరసన నటించి వారి మెప్పుపొందాడు.

1970లో షణ్ముఖి నాట్య మండలి స్వయంగా స్థాపించి పి.వి. భద్రం దర్శకత్వంలో తులసీ జలంధర నాటకంలో జలంధరుడుగా ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతాలైన మద్రాసు, బెంగుళూరు, కలకత్తా, ఖరగ్‌పూర్, జంషెడ్‌పూర్, ఢిల్లీ మొదలైన ప్రదేశాలలో ప్రదర్శనలు ఇచ్చాడు.

షణ్ముఖి నాట్యమండలి తరపున ప్రయోక్తగా స్వీయ దర్శకత్వంలో సతీ సావిత్రి, రారాజు, నర్తనశాల, భస్మాసుర నాటకాలను సమర్థులైన నటులతో ప్రదర్శించాడు.

హైదారాబాదు దూరదర్శన్‌లో తులసీ జలంధర, దుర్యోధన, సావిత్రి నాటకంలో యమ ధర్మరాజు, గయుడు మొదలైన పాత్రలను ధరించాడు. అనేక రేడియో నాటకాలలో పాల్గన్నాడు. 1975లో హైద్రాబాదులో జరిగిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలలోను, 1990లో బెంగుళూరులో జరిగిన తెలుగు మహాసభలలోను, మారిషస్‌లో జరిగిన తెలుగు మహాసభలలోను పాల్గని, రసజ్ఞులైన ప్రవాసాంధ్రుల మన్ననలు పొందాడు.

'నటసార్వభౌమ, నటబ్రహ్మ, నటరత్న, రంగస్థల రారాజు' బిరుదులను పొందాడు. పుష్పాభిషేకం, కనకాభిషేకం మొదలైన సన్మానాలతో స్వర్ణకిరీటం, స్వర్ణకంకణాలు లెక్కలేనన్ని పొందాడు.

భూమికోసం, కొల్లేటి కాపురం, బ్రతుకే ఒక పండుగ, పండంటి జీవితం, మోహనరాగం, నటన, శ్రీదత్త దర్శనం, సత్యనారాయణ వ్రతం, శ్రీకృష్ణార్జున మొదలైన చిత్రాలలో వివిధ పాత్రలను పోషించాడు.

దృఢమైన అంగ సౌష్ఠవం, గంభీర గాత్రం, భావాను గుణమైన నటన, స్వచ్ఛమైన వాచికం, ఆయనకు నటరాజు ప్రసాదించిన వరాలు. 2002లో నంది నాటకోత్సవాల సందర్భంలో ఎన్.టి.ఆర్ ఆత్మీయ పురుస్కారం పొందాడు.

జి.ఎస్.ఎన్.

వేంకట రత్నం పంతులు, కొక్కొండ (1842-1915): కవి, విమర్శకుడు, నాటక కర్త, ఉద్దండ పండితుడు, గుంటూరు జిల్లా వినుకొండలో 1842, మార్చి 24న జన్మించాడు. తల్లిదండ్రులు రామమ్మ, నరసింగరాయులు. కొక్కొండ మహామహోపాధ్యాయ అని కొనియాడబడిన పండితుడు. కవిబ్రహ్మ,అక్షర సంఖ్యాచార్యులు అనే బిరుదులు పొందాడు. ఆంధ్రా జాన్సన్ అని కూడా వ్యవహరిస్తుంటారు. 1878 నుండి 1899 వరకు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్రోపన్యాసకుడిగా పనిచేశాడు. 1899 నుంచి చనిపోయే వరకు రాజమహేంద్రవరం కళాశాలలో పని చేశాడు. తెలుగు నాటక ప్రారంభదశలో నరకాసుర విజయ వ్యాయోగం అనే రూపకాన్ని సంస్కృతం నుంచి ఆంధ్రీకరించి చరిత్ర సృష్టించాడు. వారణాసి ధర్మసూరి సంస్కృతంలో రచించిన నాటకానికి ఇది అనువాదం. తెలుగులో సంస్కృత నాటకాన్ని అనువదించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిన మొట్టమొదటి నాటకకవి కొక్కొండ వెంకటరత్నం పంతులు. వెండి, బంగారం మొదలైన పేర్లతో కొత్త ఛందస్సులను కల్పించుకొని పద్యరచన చేసిన స్వతంత్ర ప్రవృత్తి గల కవి పండితుడు. అయితే కొక్కొండ పూర్వ సంప్రదాయాలకు బద్ధుడు. భాష విషయంలో శుద్ధగ్రాంథికం. ఇంటా బయట కూడ గ్రాంథిక భాషనే వాడేవాడు. సంఘ సంస్కరణకు వ్యతిరేకి. కందుకూరి వీరేశలింగంపంతులు సమకాలికుడు. ఇరువురి గ్రంథాలపై ఆనాడు పరస్పర విమర్శలు ఘాటుగా సాగేవి. ఆంధ్ర సంజీవిని పేరుతో ఒక తెలుగు పత్రికను కొన్నాళ్ళు నడిపాడు. తెలుగు సాహిత్యరంగంలో కొక్కొండ వంటి వివాదాస్పదుడైన మహాపండితుడు మరెవ్వరూ లేరని చెప్పవచ్చు. పంచతంత్రం, సింహాచల యాత్ర, ధనంజయ విజయ వ్యాయోగం, గోవింద మంజరి మొదలైన గ్రంథాలు రచించిన కొక్కొండ 1915లో కన్నుమూశాడు.

గం.సు.రె.

వేంకటరమణరావు, కోపల్లె (జ.1865): నాటక రచయిత, పత్రికా సంపాదకుడు. కోపల్లె వేంకట రమణరావు 1940 తరువాత నాటక రచన చేసిన కవులలో ఒక ప్రత్యేకమైన పద్ధతిలో రచన చేసి తనదైన ముద్రను నిలబెట్టుకున్నాడు. తమాషా ఏమంటే పాతదంతా చెత్త కొత్తదంతా వింత అని భావించక, గురజాడ అప్పారావు చెప్పిన రీతిగా కొత్త పాతల మేలు కలయికలా రచన సాగించాడు.

వేంకటరమణ రావు తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో 1865లో జన్మించినట్లు తెలుస్తోంది. ఈయన పౌరాణిక నాటకాలేగాక, సాంఘిక నాటకాలూ రచించి ప్రదర్శించాడు. 1885లోనే రుక్మిణీ పరిణయమనే పౌరాణిక నాటకం రచించాడు. ఆ తరువాత శ్రీరామ విజయం, సీతా పరిణయం, శ్రీలక్ష్మి అనే ఇతర పౌరాణిక నాటకాలు రచించాడు. కాలానుగుణంగా సమాజంలో వస్తున్న మార్పును గమనించి, సాంఘిక నాటక రచన చేపట్టాడు. 1943లో పెట్ట మారి మగడు, 1949లో ఓన్లీ డాటర్ సాంఘిక నాటకాలతో పాటు, భాగ్యరేఖ, క్లాసుమేట్స్ అనే నాటకాలను రచించి ప్రదర్శింపచేశాడు. సమాజంలో, యువకుల మనః ప్రవృత్తుల్లో వచ్చిన, వస్తూన్న పరిణామాలను, వాటి దుష్ఫలితాలను ప్రతిబింబించేలా ఈ నాటకాలు రచించినట్లు స్పష్టమవుతుంది. పైగా పురాణ నాటకాల కంటే సాంఘికేతివృత్తాలు గల సమకాలిక సమస్యలను గ్రహించి రాయడంలో, వారికి మారుతున్న సమాజం పై గల నాటక సంబంధం విదితమవుతుంది. వేంకట రమణ రావు మంచి

పండితుడు మాత్రమే కాదు, ఈయన మనుచరిత్రకు ప్రథమ పీఠిక రచించినట్లు తెలుస్తుంది.

ప్రజలకు నీతి బోధ చేసే సంఘసంస్కరణ ధ్యేయంతో నాటకాలు రచించాడు. నాటక రచన విషయంతో పాటు, రస స్ఫూర్తితో పాటు, ప్రదర్శనకు అనుకూలంగా ఉండాలని భావం. ఈయన కాకినాడ నాటక సమాజం సభ్యుడు.

పత్రికా రంగంలోనూ అపారానుభావం గడించాడు. వేంకట రమణరావు ఒంగోలులో 1890లో కల్పవల్లి అనే మాస పత్రికను నడిపాడు. ఆ వెనుక 1899లో కొంతకాలం న్యాయబోధిని అనే మాసపత్రికను సైతం నిర్వహించాడు. ఈ అనుభవంతోనే తదనంతర కాలంలో ఆంధ్రపత్రికకు,ఆంధ్రవారపత్రికకు సహాయ సంపాదక పదవిలో కొనసాగాడు. ఇన్ని అనుభవాలు ఉండబట్టే వేంకట రమణ రావు ఆ నాటి సమాజ నాడిని, వాడిని గుర్తించి సమకాలిక సమస్యలనే ఇతివృత్తంగా గ్రహించి నాటక రచన చేయడం సాధ్యమైంది. 1890లో చంపకమాలతో ప్రారంభమైన రచనా వ్యాసంగం, అంతకుముందుగా కందుకూరి వీరేశలింగం పంతులుతో ప్రారంభమైన అతివృద్ధ, అతి బాల్యవివాహాలు, వితంతువు పునర్వివాహాలు, సమస్యలను తీసుకొని పలు సాంఘిక నాటకాలు రచించాడు. ఈయన రచించిన నాటకాల్లో సమకాలిక సమస్యలను ఇతి వృత్తాలుగా స్వీకరించి ఆ సమస్యలకు పరిష్కారాలను సైతం వెదకడం విశేషాల్లో విశేషం. అందువల్ల ఆ రచనలు ప్రేక్షకులకు సన్నిహితంగా ఉండడం గమనించవచ్చు. ఒకే పెళ్లిళ్లు అనే సాంఘిక నాటకం అతి వృద్ధ, బాల్య వివాహాలను చిత్రించే నాటకం. అందులో పెళ్లి చేసుకున్న ముసలి పెళ్లికొడుకు ఆరాటాలు, ముదుసళ్లను వివాహమాడిన బాలికల దురవస్థలు, బాలవితంతువులకు పునర్వివాహం చేయడం వల్ల తలెత్తే విచిత్ర సమస్యలు ఈ నాటకంలో చిత్రించాడు.

ఈయన రచించిన కొన్ని నాటకాలలో ఉదాత్తత లోపించిందనీ, వెగటు కలిగించే సన్నివేశాలున్నాయనీ, అభాసు పాలయ్యే హాస్యముందనీ విమర్శ ఉంది. సదుద్దేశంతో చేసిన రచనల్లో అలాంటివి దొర్లుండవచ్చు. ప్రదర్శనలు విజయవంతమైన సమకాలిక సాంఘిక నాటక రచయితగా వేంకట రమణరావు మన ప్రశంసకు అర్హుడు.

గంగప్ప.

వేంకటరామయ్య, మాధవపెద్ది (-1957) : ప్రసిద్ధ నటుడు. జన్మస్థలం తెనాలి తాలూకా బ్రాహ్మణ కోడూరు. తెనాలిలో ఎస్.ఎస్.ఎల్.సి వరకు చదివాడు. ఆజానుబాహుడు, విశాలమైన నుదురు, ఒత్తైన కనుబమ్మలు , గంభీరమైన కంఠస్వరం.

1921లో భాగవతుల రాజగోపాలం, త్రిపురారిభట్ల వీర రాఘవస్వామి అధ్వర్యంలో తెనాలిలో 'రామవిలాస సభ' స్థాపించబడింది. ఈ సభ పెద్దిభట్ల చలపతిరావు , స్థానం నరసింహారావు, గోవిందరాజులు సుబ్బారావు, పిల్లల మర్రి సుందరరామయ్య, ఏలేశ్వరపుకుటుంబ శాస్త్రి, పులిపాటి వేంకటేశ్వర్లు వంటి మహా నటులను తెలుగు దేశానికి ప్రసాదించింది. రామవిలాస సభ శిక్షణలో రాటు తేలిన మాధవపెద్ది విభిన్న పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేశాడు. రోషనారలో శివాజీ, శ్రీకృష్ణ తులాభారం లో శ్రీ కృష్ణుడు, బొబ్బిలి యుద్ధంలో రంగా రాయుడు, ప్రతాప రుద్రీయంలో ప్రతాప రుద్రుడు, విద్యానాథుడు, షోరాబ్‌రుస్తుంలో షోరాబ్, పాండవోద్యోగ విజయం లో దుర్యోధనుడు మొదలైన భూమికలను అమోఘంగా పోషించాడు. దుర్యోధనుడు, రంగారాయుడు, శివాజీ పాత్రలు ఈయనకు అఖండ కీర్తిని ఆర్జించిపెట్టాయి. నటన ఒక తపస్సుగా భావించిన మాధవ పెద్ది నట తపస్వి అయ్యాడు.



ఈలపాట రఘురామయ్య, అబ్బూరి వరప్రసాదరావు, పులిపాక వెంకటప్పయ్య, అద్దంకి శ్రీరామ్మూర్తి వంటి వారు పాడి పేరు తెచ్చుకుంటే, మాధవపెద్ది భావయుక్తమైన సంభాషణశైలిలో పద్యం చదువుతూ, అర్థయుక్తమైన విరుపులతో, నేత్రాభినయంతో, సమయోచిత ఆంగిక చలనాలతో ప్రేక్షకులను ఇట్టే ఆకర్షించేవాడు. సంభాషణలలోని భావాన్ని పిండి, భావోద్రేకాన్ని ప్రేక్షకులకు అందించి సన్నివేశాన్ని పండించి ప్రేక్షకులను అచేతనులుగా చేసేవాడు. అంగ, ఉపాంగ, ప్రత్యంగాలను అదుపులో ఉంచుకొని నటించి క్షణంలో భావోద్రేకానికిలోనై ప్రేక్షకులను మాయలోపడవేసి కీలక పాత్రధారిగా కనిపించేవాడు. బొబ్బిలియుద్ధం నాటకంలో రంగారాయుని పాత్ర దీనికి చక్కని ఉదాహరణ.

మాధవపెద్ది దుర్యోధనుడి పాత్ర నిర్వహణలో విశిష్టత కనబడేది ఈయన దుర్యోధన పాత్ర. శౌర్యశాలి, నిరాడంబరుడు, ప్రజాహిత చక్రవర్తి, వినయ సంపన్నుడు, వేద వేదాంగాలు చదివిన జ్ఞాని. కురుసభలో శ్రీకృష్ణుడు రాయబారిగా వచ్చిన సందర్భంలో 'రాధేయుండును నేను తమ్ములను సంగ్రామంబులో నిల్వ...' అనే పద్యాన్ని దుర్యోధన పాత్రలో మాధవపెద్ది చదువుతుంటే మహాబలశాలియైన వస్తాదు మల్లయుద్ధానికి తొడగొట్టి రమ్మని పిలిచినట్లుండేది.

సినిమా రంగంలో కూడా ప్రవేశించి, ద్రౌపదీ మాన సంరక్షణం (శిశుపాలుడు), సతీ తులసి(శివుడు), విజయదశమి

(కీచకుడు), నలదమయంతి (నలుడు), చంద్రహాస (దుష్టబుద్ధి), పార్వతీ కల్యాణంలో (శివుడు)గా నటించాడు.

మాధవపెద్ది తాను నటునిగా ఎదగడమేకాక అనేక మంది నటులను తీర్చిదిద్ది నాటి వర్ధమాననటులకు మార్గదర్శకుడయ్యాడు. మాధవపెద్ది, దుర్యోధన పాత్రకు అనాడు ప్రవేశ పెట్టిన పద్య పఠనా విధానం నేటికీ కొనసాగుతున్నది.

లెక్కలేనన్ని సన్మానాలు, పేరు ప్రతిష్ఠలు పొందాడు. ఇంటి నుంచి బయటకొస్తే ఒక లుంగీ, చేతుల బనీను, పైన చిన్న తుండు మాత్రం ధరించేవాడు. నడక మాత్రం దుర్యోధన చక్రవర్తి నడకే. దేశం పట్టనంతటి మహానటుడు మాధవపెద్ది 1957, మార్చి 19న నటరాజులో ఐక్యం అయినాడు.

జి.ఎస్.ఎన్

వేంకటరాయ శాస్త్రి, వేదం (1853-1929) : కవి, నాటకకర్త, విమర్శకుడు. శతాధిక గ్రంథకర్త. మహామహోపాధ్యాయుడు. వ్యాఖ్యాన మల్లినాథుడు. ఈయన నెల్లూరు జిల్లా, కావలి తాలుకా మల్లయపాళెంలో 1853, డిసెంబర్ 21న జన్మించాడు. తల్లితండ్రులు లక్ష్మమ్మ, వెంకటరమణ శాస్త్రి.



1897లో వెలువరించిన ప్రతాపరుద్రీయం నాటకం ఈయనకు ఎనలేని ఖ్యాతి తెచ్చిపెట్టింది. చారిత్రక నాటకాలలో ప్రతాపరుద్రీయం మొట్టమొదటిది కావడం, అందులో పాత్రోచిత భాషను ప్రయోగించడం, పాశ్చాత్య పద్ధతిలో అంకాలను రంగాలుగా కూడా పొందుపరచడం ప్రతాపరుద్రీయం నాటకానికి ప్రత్యేకతను సంతరించి పెట్టింది. ఈ నాటకంలో యుగంధరుని పాత్ర, పేరిగాని పాత్ర, నాటక వాఙ్మయంలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. నెల్లూరు ఆంధ్ర భాషాభిమాని సమాజం ఈ నాటకం విజయవంతంగా పెక్కుమార్లు ప్రదర్శించింది. వేంకటరాయ శాస్త్రి స్వయంగా తానే నటులకు శిక్షణ యిచ్చి నాటకాన్ని జనరంజకంగా ప్రదర్శింపజేశాడు. నెల్లూరు నగరాజారావు, నటేశన్, దొరస్వామి వంటి మహానటుల సమ్మేళనంతో ఈ నాటకాన్ని ప్రద్రర్శించేవాడు. వేదం వారి ఉష, బబ్బిలి యుద్ధం ప్రజాదరణ పొందలేదు. గ్రాంథిక వాదులైన వేంకటరాయ శాస్త్రి పాత్రోచిత భాష అనే పేరుతో గ్రామ్యాన్ని వాడటంపై జడివాన కురిసింది కూడా! మహా పండితుడైన కొక్కొండ వెంకటరత్నంకు, ఈయనకు పడేదికాదు. కావ్య విమర్శనం పేరుతో వ్యక్తి దూషణకు కూడా దిగజారిన కాలం అది. కందుకూరి వీరేశలింగంతో కూడా వేంకటరాయ శాస్త్రికి సత్సంబంధాలు ఉండేవి కావు. కందుకూరి ఎంత సంస్కరణవాదో ఈయన అంత సంప్రదాయవాది. ఎన్నో సంస్కృత నాటకాలను ఆంధ్రీకరించాడు. అన్వయ క్లిష్టతగల అనేక పద్య కావ్యాలకు వ్యాఖ్యలు రాశాడు. ఆముక్త మాల్యద, శృంగార నైషధ వ్యాఖ్యలు ఈయన అఖండ పాండితికి తార్కాణంగా నిలుస్తాయి. వేదం 1929, జూన్ 18న తుదిశ్వాస విడిచాడు.

గం.సు.రె.

వేంకట శివరామకృష్ణ ప్రసాద్, తంగిరాల (1934-1999) : నటుడు, దర్శకుడు, ప్రయోక్త. ఈయన 1934, అక్టోబరు 2న కృష్ణాజిల్లా కపిలేశ్వరపురంలో జన్మించాడు. తండ్రి ప్రముఖ పౌరాణిక నటుడైన నరసింహశర్మ. ఈయన రంగసింహ బిరుదాంకితుడు. రంగస్థల కళాకారుడుకి వారసుడై జన్మించిన వేంకటరామకృష్ణ ప్రసాద్ నార్ల వేంకటేశ్వరరావు రచించిన ఏకాభిప్రాయం నాటికలో సుబ్బన్న పాత్రతో రంగస్థలం వేదికపైకి వచ్చాడు. అనేక పౌరాణిక, సాంఘిక నాటకాలలలో నటించి పేరు గడించిన నటుడుగా ఎదిగాడు.

మొదట సాంఘికనాటికలో నటించిన తంగిరాల పాండవోద్యోగం లో శ్రీకృష్ణ పాత్రలో నటించాడు. నాటి నాటక బృందాలు తంగిరాల నటనను చూసి అనేక సమాజాలు ఆహ్వానించాయి. డి.వి.సుబ్బారావు బృందంతో కలసి వింధ్యరాణి నాటకంలో పండితరావు, చిత్రనళీయంలో బాహుకుడు, సక్కుబాయిలో కాశీపతి, చింతామణి లో బిళ్వమంగళుడు, సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు, కీర్తిశేషులు లో వాణీనాథం, పునర్జన్మ లో డాక్టరు, భయం లో పర్సనల్ సెక్రటరీగా నటించి పేరు తెచ్చుకున్నాడు. పాశ్చాత్య నాటకరంగ రీతులను పరిశీలించిన తంగిరాల ఆంధ్రప్రదేశ్‌లో ఓపెన్ ఎయిర్ థియేటర్స్ నిర్మాణమవసరమని భావించాడు. ప్రసిద్ధ నాటక రచయితల నాటకాలకు ప్రయోక్తగా వకచవహరించాడు.

కోడూరుపాటి సరస్వతీ రామారావు రచించిన రంగస్థలం నాటకాన్ని 'రాయల్ థియేటర్' (ఏలూరు) పక్షాన స్వీయ దర్శకత్వంలో కళాఖండంగా తీర్చిదిద్దాడు. ఈ నాటకం 1962లో ఆంధ్ర నాటక కళా పరిషత్తులో ప్రదర్శించబడి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ హాస్యనటుడు అవార్డులు అందుకుంది. 1964లో దాదాపు నలభై సాంఘిక, పౌరాణిక నాటకాలకు దర్శకత్వం వహించి, దర్శకుడుగా ఎనలేని కీర్తిని గడించాడు. 1966లో స్వీయ దర్శకత్వంలో కురుక్షేత్రం ప్రదర్శించాడు. ఈ నాటకంలో శ్రీకృష్ణుడుగా తంగిరాల, అర్జునుడుగా పులిపాటి వెంకటేశ్వర్లు నటించారు. నాలుగు దశాబ్దాల పాటు నాటకరంగానికి సేవచేసిన తంగిరాల వేంకట

శివరామకృష్ణ ప్రసాదును రాష్ట్రంలోని ప్రముఖ కళా సంస్థలు దర్శక బ్రహ్మ, నాటక కళాకోవిద, దర్శకరత్న బిరుదుల నిచ్చి ఘనంగా సత్కరించాయి. సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడుగా ఖ్యాతిగాంచిన తంగిరాల 1999, జులై 23న కన్నుమూశాడు.

దాసరి, ఎన్.

వేంకటసుబ్బారావు, తంగిరాల (జ.1925) : రంగస్థల నటుడు. ఈయన 1925, మార్చి 6న పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో జన్మించాడు. తండ్రి హనుమంతరావు ప్రసిద్ధ కళాకారుడు. కళాకారుడి కుటుంబంలో పుట్టిన తంగిరాల వేంకట సుబ్బారావు పాఠశాల స్థాయిలోనే స్త్రీ పాత్రలలో నటించాడు. యుద్ధ నిధి కోసం స్థానిక ఉపాధ్యాయ, న్యాయవాదులతో కలసి అనార్కలి, వరవిక్రయం, ఖిల్జీరాజ్య పతనం, షాజహాన్ నాటకాలను పలు చోట్ల ప్రదర్శించాడు. శ్రీకృష్ణరాయబారం లో ధర్మరాజు, ధృతరాష్ట్రుడు, ద్రోణుడు, సహదేవుడు, నకులుడు, శ్రీకృష్ణార్జున యుద్ధం లో బలరాముడు, అక్రూరుడు, నారదుడు, పాదుకాపట్టాభిషేకం లో వశిష్టుడు, సత్యహరిశ్చంద్రలో సత్యకీర్తి, శ్రీరామాంజనేయయుద్ధం లో భరతుడు, శకుంతలలో మాండవ్యుడు, వరవిక్రయం లో బసవరాజు, చింతామణి లో దామోదరుడు, అనార్కలి లో రుషి, షాజహాన్ లో జోహరత్ మొదలైన పాత్రలను వివిధ కళా వేదికలపైన ప్రముఖ రంగస్థలనటుల సరసన నటించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. రాష్ట్రేతర ప్రాంతాలలో నిర్వహించిన నాటక ప్రదర్శనలలో కూడా నటించాడు. రంగస్థల వేదికపై విభిన్న పాత్రలలో నటించిన తంగిరాలకు ధర్మరాజు, ధృతరాష్ట్రుడు, నారదుడు, దామోదరుడు పాత్రలు నటుడిగా మంచిపేరును తెచ్చిపెట్టాయి. పద్యాలను రాగ, భావయుక్తంగా గానం చేయడంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న తంగిరాలను కళాభిమానులు 1985లో నటమిత్ర బిరుదునిచ్చి ఘనంగా సత్కరించారు. నటనలో ఎంత ఎత్తుకు ఎదిగినా తాను చేసింది కొంతేనని ఒదిగి చెప్పుకొనే వ్యక్తిత్వం తంగిరాలది.

దాసరి, ఎన్.

వేంకటావధాని, దివాకర్ల (1913-1986) : విద్వత్కవులు, విమర్శకులు, పరిశోధకులు, నాటక రచయిత. ప్రాచీన సాహిత్య విజ్ఞాన సర్వస్వం అవధాని. శతాధిక గ్రంథకర్త. పశ్చిమగోదావరి జిల్లా ఎండగండి గ్రామంలో 1913, జూన్ 29న జన్మించాడు. తల్లిదండ్రులువెంకటలక్ష్మి, సుందరరామయ్య. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా అనేక సంవత్సరాలు పని చేశాడు. సంస్కృత వాఙ్మయం, ప్రబంధాలు ఈయనకు కొట్టిన పిండి. ఎంత మేధాసంపన్నులో అంత వినమ్రులు. ఈయనను ఆహ్వానించని, సన్మానించని సాహిత్య సంఘం ఆంధ్రదేశంలో లేదేమో? కళాప్రపూర్ణ బిరుదుతో ఆంధ్ర విశ్వవిద్యాలయం సత్కరించింది. నన్నయ నుండి నారాయణ రెడ్డి వరకు వచ్చిన సాహిత్య పరిణామ చరిత్ర, వివిధ సాహిత్య ప్రక్రియల్లో వస్తున్న విచిత్ర కవిత్వ విన్యాసాలు అవధానికి కరతలామలకం. ఏకసంధాగ్రాహి. అపూర్వ ధారణశక్తి గలవాడు. అనేక చోట్ల అష్టావధానాలు చేశాడు. నాటక వాఙ్మయంలో కూడా వీరు చేసిన కృషి అనల్పమైంది. 'ప్రథమాంధ్ర నాటకకర్తలు, ఆంధ్ర నాటక పితామహుడు' అనే గ్రంథాలు ఈయన నాటక కళాభిజ్ఞతను చాటే గీటురాళ్లు. కౌముదీ మహోత్సవం, నాగానందం (అనువాదం) అనుమానం (నాటికల సంపుటి), సత్యహరిశ్చంద్ర నాటకం ఈయన వెలువరించినవే. 1986, అక్టోబరు 12న బంబాయిలో మరణించాడు.

గం.సు.రె.

వేంకటేశ్వరరావు, ఆత్కూరి (జ.1946) : రంగస్థల నటుడు. కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో 1946, డిసెంబర్ 5న జన్మించాడు. తల్లిదండ్రులు లక్ష్మీకాంతమ్మ, సూర్యప్రకాశరావులు. రాంజీ హైస్కూల్, నేషనల్ కాలేజీలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన వెంకటేశ్వరరావు ఎ.పి. డెయిరీలో ఫీల్డ్ అసిస్టెంటుగా చేరాడు. స్కూల్లో చదువుతున్న కాలంలోనే క్రీడలపట్ల, కళల పట్ల, ఆసక్తి పెంచుకున్నాడు. 1964వ సంవత్సరంలో నేషనల్ కాలేజి స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రదర్శించిన వేదాంతం భామాకలాపం కళల పట్ల ఆసక్తి పెంచుకోవడానికి దోహదపడింది. ఇదే సంవత్సరంలోనే కొడాలి గోపాలరావు రచించిన ఎవరినీ నమ్మకు



నాటికలో తొలిసారిగా నటించాడు. తరువాత కాలంలో ప్రముఖ నటుడు, దర్శకుడు అన్నవరపు శివరామిరెడ్డి శిష్యరికంలో నటనకు సంబంధించిన మెళకువలు నేర్చుకుని, ఉలిపికట్టె నాటికలో పాపయ్య పాత్రలోనటించి నటుడుగా పేరు గడించాడు. ప్రముఖ నటీనటులతో కలసి శవాలపై జీవాలు, విధి, *ఇదే (నా) దారి, గులకరాళ్ళు, గని, వర్తమాన భూతం, పేరంటం, మంచుతెర, ప్రగతి, శుభలేఖ, వాంటెడ్ ఫాదర్స్, తుఫాన్* మొదలైన నాటికలలోను, ఛైర్మన్, పల్లెపడుచు, అన్నాచెల్లెలు, మాస్టర్జీ, *పట్టాలు తప్పిన బండి, పంజరంలో పక్షులు* మొదలైన నాటకాలలో ప్రధాన భూమికలు పోషించాడు. రాష్ట్రంలోని వివిధ పరిషత్తులు నిర్వహించిన నాటకపోటీలలో పాల్గని ఉత్తమ నటుడు అవార్డులు అందుకున్నాడు.

దాసరి.ఎన్.

వేంకటేశ్వరరావు, ఆరాధ్యుల (జ.1954) : రంగస్థల నటుడు. శ్రీ పూర్ణ శ్రీ నాట్య కళాసమితి పునర్వ్యవస్థాపకుడు. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు. 1954, జులై 10న గుంటూరు జిల్లా కొల్లూరు సమీపంలోని అనంత వరంలో స్వరాజ్య లక్ష్మి, ఎ.వి. సుబ్బారావు దంపతులకు జన్మించాడు. ఈయన తండ్రి ప్రసిద్ధ రంగస్థల నటుడు, కళారంగానికి సంబంధించిన వ్యక్తి కావడం వల్ల పాఠశాల విద్యను అభ్యసిస్తున్న కాలంలోనే వార్షికోత్సవాల సందర్భంగా శ్రీకృష్ణుడి పాత్రలో నటించాడు. ఇదే ఈయన మొదటి ప్రదర్శన. ఈయనకు నటనలో ఆదిగురువు తండ్రి. పద్య పఠనం నేర్పిన గురువు విష్ణుబట్ల వేంకటేశ్వర్లు.

వేంకటేశ్వరరావు వృత్తి కళాకారుడుగా స్థిరపడాలని నిర్ణయించుకొని 1960లో ఎ.వి. సుబ్బారావు స్థాపించిన 'శ్రీ పూర్ణ శ్రీ నాట్య కళాసమితి'ని 1980లో పునర్ వ్యవస్థీకరించాడు. ఈ సమాజం పక్షాన చింతామణి, *శ్రీకృష్ణ రాయబారం, గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం* మొదలైన నాటకాలు ప్రదర్శించాడు. ఈ నాటకాలలో భవానీ శంకరుడు, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు పాత్రలలో నటించి ప్రముఖ నటుల సరసన స్థానం సంపాదించుకున్నాడు. ఇంగ్లాండులోని యూరోపియన్ తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు బర్మింగ్‌హామ్‌లోని డెడ్లీ హాలులో శ్రీకృష్ణ రాయబారంలోని శ్రీకృష్ణుని పాత్రను ఏకపాత్రాభినయంగా నటించాడు. అదే సంవత్సరం జులై 3న తానా వారి చికాగో సభలలో శ్రీరామాంజనేయయుద్ధం లో శ్రీరాముని పాత్రలో నటించాడు. ఇవేకాకుండా అమెరికాలోని పలు రాష్ట్రాలలో కళాపోషకుల కోరిక మేరకు వివిధ వేదికల మీద నటించాడు. పలు కళాసంస్థలు, కళాకారులు వేంకటేశ్వరరావు ప్రతిభాపాటవాలను గుర్తించి గానసుధానిధి, గానకళా ప్రవీణ, గానగంధర్వ, గానసుధారత్న, గానకళాకోవిద బిరుదులిచ్చి, బంగారు బహుమానాలిచ్చి ఘనంగా సత్కరించారు. 1982లో ఎ.వి.ఎం. గ్రామఫోను కంపెనీ చింతామణి నాటకంలోని పద్య, సంభాషణలను ఎం.ఆర్. తిలకం చింతామణి, వేంకటేశ్వర రావు భవానీశంకరుడు పాత్రల రికార్డును రూపొందించడం జరిగింది. 1927 నుంచి అయిదు సంవత్సరాల పాటు తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల అధ్యక్షుడిగా పలు కార్యక్రమాలు నిర్వహించాడు.

దాసరి.ఎన్.

వేంకటేశ్వర రావు, కుప్పిలి (1923-1973) : ప్రసిద్ధ నటుడు, దర్శకుడు. తెలుగు సాంఘిక నాటక రచనలో నూతన పద్ధతులు ప్రవేశపెట్టిన ఖ్యాతి ఆత్రేయకు దక్కితే, నటనలో వేగం, ఉచ్ఛారణలో స్పష్టత ప్రత్యేకతను సృష్టించి తెలుగు నాటక దిశానిర్దేశం చేసిన దర్శకుడు వేంకటేశ్వరరావు. పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు గ్రామంలో 1923, నవంబరు 20న సీతయ్యమ్మ, ప్రకాశరావు దంపతులకు జన్మించాడు. ప్రకాశరావు రైల్వేశాఖలో చిరుద్యోగి కావడంతో ఓ మూలగా పడేసిన పాత రైలు పెట్టెల్లోనే కాపురం ఉండేవాడు. వేంకటేశ్వరరావు రాజమండ్రి ఆర్ట్సు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ, కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అర్థాంతరంగా చదువును ఆపివేశాడు. 1945లో శ్రీకాళహస్తిలో దక్షిణ రైల్వేలో గుమాస్తాగా చేరాడు. తదుపరి బెజవాడకు బదిలీపై వచ్చి దాదాపు 15 సంవత్సరాలు పని చేశాడు. 1944లో కృష్ణార్జున రావు అనే మిత్రునితో కలిసి ట్వంటీ యత్ కంపెనీ స్వాన్‌క్లబ్‌ను స్థాపించి విషపాత్ర అనే నాటికను ప్రదర్శించి నటప్రస్థానం ప్రారంభించాడు. రాజమండ్రి కళాశాల వార్షికోత్సవంలో నాటికలను ప్రదర్శించి కళాశాలలో ఒక హీరోగా గుర్తించబడ్డాడు.

కళాశాల అధ్యాపకుడు పింగళి వెంకట్రామయ్య కుప్పిలి నటనాభిలాషను గుర్తించి కరణీకం నాటికలో పాపయ్య శాస్త్రి పాత్రను ఇవ్వగా ఉత్తమనటుడి బహుమతి పొందాడు. మహానటుడు మాధవపెద్ది నాటకాలను చూసిన కె.వి. ఆయన ఏకలవ్య శిష్యుడై నాటకం పట్ల మోజును పెంచుకొన్నాడు. విజయవాడ రైల్వే ఇన్‌స్టిట్యూట్ నాటక విభాగానికి దర్శకుడైన కుప్పిలి నట జీవితం మడమ తిప్పకుండా ముందుకు దూసుకు వెళ్ళింది. రైల్వేశాఖలోనే తన సహోద్యోగి, ప్రముఖ సినీనటుడు సి. నాగభూషణంతో కలిసి పలు నాటకాలను ప్రదర్శించాడు.

మిత్రులైన ప్రఖ్య శ్రీరామమూర్తి, దేశిరాజు జగన్నాథరావు, ఎం.వి. చలపతిరావుతో కలిసి నవ్యకళామండలిని 1948లో స్థాపించాడు. ఈ సమాజం ద్వారా ముద్దుకృష్ణ రచించిన టీ కప్పులో తుఫాన్, కళోపాసన నాటికలను విస్తృతంగా ప్రదర్శించాడు. 1951 ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో డి.వి. నరసరాజు రచించిన నాటకం నాటకానికి బహుమతుల పంట పండించాడు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సినీ దర్శకుడు కె.వి. రెడ్డి వేంకటేశ్వర రావు ప్రతిభను కొనియాడాడు.

1945లో వేంకటేశ్వరరావు విజయవాడలో స్థాపించిన రసన సమాఖ్య (రసజ్ఞుల, సహృదయుల, నటీనటుల సమాఖ్య) తెలుగు నాటకరంగ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని సృష్టించింది. వేంకటేశ్వరరావు ప్రదర్శించిన నాటకాల్లో మణిపూసగా నిలిచిన కొర్రపాటి రచించిన నా బాబు నాటికలో శ్రీనివాసరావు పాత్ర ద్వారా ప్రేక్షకులను కన్నీరుమున్నీరుగా ఏడ్పించాడు. మచిలీపట్టణంలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో ఈ పాత్ర ద్వారా కె.వి. ఉత్తమ నటుడి బహుమతి పొందాడు. ఈ నాటికను చూసిన ప్రముఖ నటుడు డి.వి. సుబ్బారావు కె.వి.ని నటరాజు బిరుదుతో సత్కరించాడు. రసన సమాఖ్య ద్వారా అనిశెట్టి రచించిన మా ఊరు, కొప్పరపు సుబ్బారావు ఇనుపతెరలు, ప్రఖ్య శ్రీరామమూర్తి ఫణి, దయ్యం, బెల్లంకొండ రామదాసు మాష్టర్జీ, ఆకాశ రామన్న, కొడాలి గోపాలరావు లంకెబిందెలు, ఆత్రేయ విశ్వశాంతి, గొల్లపూడి మారుతీరావు రాగరాగిణి, మహానటుడు, గణేష్‌పాత్రో రచించిన పావలా, కొడుకు పుట్టాల, లాభం, త్రివేణి, అనురసంధ్య, రాఘవ రచించిన కనకపుష్యరాగం వంటి నాటకాలూ, నాటికలూ ఆంధ్రదేశంలో మూడు దశాబ్దాల కాలం నాటకాభిమానులను ఉర్రూతలూగించాయి.

1958లో ఇప్పటి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు తొలిదశగా ఉన్న ఏషియన్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందడానికి రాష్ట్రం నుంచి కె. వేంకటేశ్వరరావు, సి. రామ్మోహనరావు, పొట్టి ప్రసాద్ ఎంపికయ్యారు. రాష్ట్రప్రభుత్వం వారి స్కాలర్‌షిప్‌తో ఆరు నెలల శిక్షణ పొందడం వేంకటేశ్వరరావు నటజీవితానికి బలమైన పునాదులు వేసింది. శిక్షణ పొందే సమయంలో వేంకటేశ్వరరావు అప్పటి పార్లమెంటు సభ్యుడు డాక్టర్ కె.ఎల్. రావు, మోతే వేదకుమారి సహకారంతో ఢిల్లీలో దక్షిణ భారత నటీనట సమాఖ్యను స్థాపించాడు. ఢిల్లీలో ఈ సమాఖ్య పక్షాన బెల్లంకొండ రామదాసు రచించిన ఆకాశరామన్న నాటకాన్ని ప్రదర్శించాడు. ఈ ఆకాశరామన్న నాటకంలో స్త్రీ పాత్రను పోషిస్తున్న నటీమణి ప్రదర్శనకు రెండు రోజుల ముందు రాకపోవడంతో వేంకటేశ్వరరావు తన సతీమణి శారదతో ఆ పాత్రను నటింప చేశాడు. ఢిల్లీ ఫైన్‌ఆర్ట్సు థియేటర్‌లో ఢిల్లీ నాట్యసంఘం నిర్వహించిన అఖిల భారత నాటక పోటీలలో 20 భాషలకు చెందిన కళాకారులు పాల్గనగా వేంకటేశ్వరరావు ఉత్తమ నటుడిగా బహుమతి పొందాడు. వేంకటేశ్వర రావును ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టేజి డైరెక్టర్‌గా నియమించమని వైస్ ఛాన్సలర్ కె.వి. గోపాలస్వామికి బి.ఎన్. రెడ్డి సిఫార్సు చేశాడు.

తన ప్రవృత్తే వృత్తి కావడంతో వెంకటేశ్వర రావులోని నటుడు, దర్శకుడు విజృంభించారు. రాజీవం, మహానటుడు, కన్యాశుల్కం, అబ్బూరి రామకృష్ణారావు రచించిన ఎర్రగన్నేరు నాటకాలను అనితరసాధ్యంగా పోషించాడు. ప్రతి సంభాషణను తగిన వేగం, ఒరవడితో వెలువరించడం, ప్రతి మాట వెనుక గొంతులో ఎంత తీవ్రత, నిదానం ఉండాలో గుర్తించి, తదనుగుణంగా ఉదాత్తానుదాత్తాలు చూపడం, స్పష్టంగా మాట్లాడటం, మాట వెనుక భావాన్ని స్ఫురింపచేయడం అనే అంశాలను ఆచరణలో నిరూపించినందునే ఆధునిక తెలుగు నాటకరంగంలో డైలాగ్ డెలివరీకి ఒక ప్రత్యేక బాణిని కుప్పిలి సృష్టించాడు. విశ్వశాంతిలో సైనికుడు, నాటకం లో రామానుజం, రాగరాగిణి లో రఘు, మాష్టర్జీ లో మాష్టర్జీ, మావూరు లో శంకరం మాష్టారు, ఫణిలో ఫణి, ఆకాశరామన్నలో జయశంకర్ గోపీనాథ్, దొంగ వీరడులో రామబ్రహ్మం, దైవశాసనంలో భుజంగం, కీర్తి శేషులు లో మురారి, కన్యాశుల్కంలో గిరీశం, కొడుకు పుట్టాలలో శరభయ్యదిద్ది పాత్రలు కుప్పిలి నటనా కీర్తికిరీటంలో మణిదీపాలుగా ప్రకాశించాయి.

కనక పుష్యరాగం నాటకాన్ని ప్రదర్శించే నిమిత్తం న్యూఢిల్లీకి బయలుదేరిన సందర్భంలో రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి మీ సోదరి చనిపోయిందనే వార్తను తెలియచేశాడు. తాను ఢిల్లీ వెళ్లకపోతే ప్రదర్శన ఆగిపోతుందని నువ్వు నాకు కలవలేదు... నాకు ఈ వార్త తెలియదని ఆ వ్యక్తికి చెప్పి నిబ్బరంగా ప్రయాణించాడు. అక్క అంటే నాకు ఎంతో అభిమానం. కానీ నాటకం అంటే ఇంకా అభిమానం. కానీ ఆ అభిమానం నాటక ప్రదర్శనకు అడ్డు కాకూడదు అని స్థితప్రజ్ఞతో మాట్లాడటం అందరినీ ఆశ్చర్యపరిచింది. 'కన్నె వయసు' చిత్రంలో కీలకమైన పాత్రను ధరించమని నిర్మాత భావన్నారాయణ గుమ్మడిని కోరితే ఈ పాత్రకు తనకన్నా రంగస్థలంపై వెలసిన నటరాజు వేంకటేశ్వరరావే సమర్థుడని

తెలిపాడు. నిర్మాతల కోరికపై ఇదే పాత్రను వేంకటేశ్వరరావు అత్యద్భుతంగా పోషించాడు.

పత్రికల భాష ప్రజల భాషకాదు. మారుమూల పల్లెల్లో ఉన్న ప్రజల నాలుకలపై నాట్యం చేసే అచ్చమైన మాండలికాలు నాటకాలలో చోటుచేసుకోవాలని తపించిన తన కోరికను గణేశ్‌పాత్రో ద్వారా తీర్చుకున్నాడు. పాత్రతో విశాఖ మాండలికంలో రాసిన జాలరుల హృదయ విదారక వ్యథలను చూపే పావలా, కొడుకు పుట్టాల అనే నాటికలు తెలుగు నాటకరంగ చరిత్రలో కెవి ని చిరంజీవిని చేశాయి. చాట్ల శ్రీరాములు, పొట్టి ప్రసాద్, సాక్షి రంగారావు, రాజబాబు, మిశ్రో, కృష్ణచైతన్య, వంకాయల, ధమ్, జగన్నాథరావు, రావూజీ, ఏడిద గోపాలరావు, మద్దూరి విజయలక్ష్మి, పావలా శ్యామల, విజయలక్ష్మి, శివరామిరెడ్డి, కాబూలీవాలా రామచంద్రరావు, కనకాల దేవదాస్, బాబి, డీన్‌బద్రూ గణేశ్‌పాత్రో, రాఘవ వంటి రంగస్థల రత్నాలను తీర్చిదిద్ది తెలుగు రంగస్థలంపై తన వారసులుగా అందించాడు. ఆకాశవాణి ద్వారా వేంకటేశ్వరరావు నటించిన శ్రావ్య నాటకాలు మూడంతస్తుల మేడ, కన్యాశుల్కం, తామరకొలను వంటి నాటకాలను విన్న శ్రోతల మనోవీధుల్లో ఆయన సంభాషణలు మధురంగా ప్రతిధ్వనిస్తూ ఉంటాయి.

పరిషత్తులలో బహుమతి ప్రదాన సమయంలో న్యాయనిర్ణేతలు ఉత్తమ నటుడు అనే బహుమతి పేరు చదవగానే ఆ బహుమతి తనదే అంటూ ఠీవిగా ప్రేక్షకుల నుంచి రంగస్థలంపైకి ధైర్యంగా వెళ్ళేవాడు. అస్వస్థుడై ఆస్పత్రిలో ఉన్న సమయంలో విశాఖ పోర్టుట్రస్టు పోటీలలో కొడుకు పుట్టాల నాటికలో పాత్ర పోషించలేనందుకు తపించిపోయాడు. 1973, మే 25 రాత్రి తనకు ఇష్టమైన కొడుకు పుట్టాల నాటిక ప్రదర్శన పూర్తయి తెరపడిన సమయంలోనే కుప్పిలి జీవితరంగంపై ఆఖరి ఘట్టం ముగిసింది.

కందిమళ్ళ

వేంకటేశ్వరరావు, నార్ల (1908-1985) : ప్రసిద్ధ పత్రికా రచయిత కవి, నాటకకర్త, కథా రచయిత, వ్యాసకర్త, విమర్శకుడు. ప్రాచీన అధునాతన సాహిత్యాలను, పాశ్చాత్య సాహిత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి, వివిధ విజ్ఞాన శాఖల మీద స్పష్టమైన అవగాహన ఉన్న మేధావి. ఈయన కృష్ణా జిల్లా కవుతరంలో 1908, డిసెంబరు 1న మహాలక్ష్మమ్మ, లక్ష్మణరావులకు జన్మించాడు. విద్యార్థి దశలో జాతీయోద్యమంలో పాల్గన్నాడు. మాటా-మంతీ, పిచ్చా-పాటీ వ్యాస సంపుటాలు ఈయన సునిశిత లోక పరిశీలనా శక్తికి నిదర్శనాలు. నార్ల వారి మాట (పద్య కావ్యం) మన సమాజాన్ని ఆవరించిన రుగ్మతలను, దౌర్బల్యాలను వ్యంగ్య ధోరణిలో ప్రస్ఫుటం చేసే మణిదర్పణం.

నాటకరంగంలో నార్ల కృషి గణనీయం. నాటికా రచనలో ఎన్నో కొత్త ప్రయోగాలు చేశాడు. 1947లో ఈయన రచించిన నాటికలన్నిటిని కొత్త గడ్డ పేరుతో సంపుటిగా ప్రకటించాడు. గ్రామీణ వాతావరణం, పల్లెప్రజల భాష, ఆలోచనా సరళి నార్ల నాటికలలోనే చూడాలి. ప్రారబ్ధం, భంగపాటు, ఏకాభిప్రాయం రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శింపబడిన ఉత్తమ నాటికలు. నార్ల నాటికలలో వస్తువైవిధ్యంతో పాటు రచనా శిల్పంలో కూడ వైవిధ్యం కనబడుతుంది. ప్రతి విషయాన్ని కొత్త తరహాలో చెప్పాలనే తహ తహ కనిపిస్తుంది. పల్లె ప్రాంతాలలో సాధారణ రైతు కుటుంబాల ఆర్థిక దుస్థితి, వారి కోర్కెలు, వైఫల్యాలు, భవిష్యత్తు మీద పెనవేసుకొనే ఆశాలతలు, తల్లడిల్లిపోయే రైతు కుటుంబాల దైన్యస్థితిని నార్ల చిత్రించినంత హృదయంగమంగా (నాటికలకు సంబంధించినంతవరకు) ఆనాడు ఏ రచయితా రాయలేదంటే అతిశయోక్తి కాదు.

పై పంట నాటికలో నార్ల చిత్రించిన జీవితకథ ఒక్క తెలుగు ప్రాంతానికే కాదు, ఈ దేశంలో ఏ ప్రాంతానికైనా వర్తిస్తుంది. ప్రాణం మీది కొచ్చినా కర్మసిద్ధాంతాన్ని పట్టుకు దేవులాడే ఛాందసుడు లక్ష్మయ్య (తండ్రి), కూతురు రోగంతో మంచానపడి అటోయిటో అని క్షణాలు లెక్కపెడుతున్న సమయంలో కూడా "వాడొచ్చి (డాక్టరొచ్చి), రోగాన్ని గిల్లేస్తాడేమిటి? ఎవరొచ్చినా చేసేదేమీ లేదు. ఎవరి ప్రారబ్ధాన్ని ఎవరు తప్పిస్తారు" అని మూర్ఖత్వాన్ని ప్రదర్శించే మనుషులున్న సమాజంలో చైతన్యం సులభంగా కలగదనీ, దానికి బలమైన చికిత్స అవసరమని చాటి చెపుతుంది ప్రారబ్ధం. దాంపత్యం నాటికా రచనలో ఒక కొత్త టెక్నిక్ (రచనా శిల్పం) ప్రయోగించబడింది. ఈ నాటికలో రంగస్థలం మీద రెండే పాత్రలు కనిపిస్తాయి. ఒక పాత్రతో మాట్లాడిస్తూ రెండో పాత్రను మౌనంగా ఉంచడం (రియాక్షన్ మాత్రం చూపుతూ ఉంటుందీ పాత్ర) ఆ కొత్త పద్ధతి. ఆగస్ట్ స్ట్రిండ్ బర్గ్ రాసిన ది స్ట్రాంగర్ అనే నాటికలోని టెక్నిక్ మాత్రం అనుసరించినట్లు నార్ల తన గమనికలో చెప్పుకున్నాడు. అయినదానికీ కానిదానికీ ఎప్పుడూ శకునాలు పలికే వ్యక్తుల వింత స్వభావాన్ని శకునపక్షి నాటికలో హాస్య భరితంగా చిత్రించాడు. పాతతరం భావాలకు-కొత్తతరం భావాలకు సంఘర్షణ కొత్తగడ్డ నాటికలో హృద్యంగా చిత్రించబడింది. చిన్న కుటుంబంలో ఎవరికైనా చిన్న ఆపద కలిగినపుడు, తనలో ఉన్న

వైషమ్యాలను పక్కకుపెట్టి ఎలా ఆప్యాయతల వర్షం కురిపిస్తారో ఆ రసాత్మక సన్నివేశానికి రూపకల్పన వెలుగునీడలు నాటిక. ఒళ్ళు ముక్కలు చేసుకుని అరవచాకిరీ చేసి పైసాపైసా కూడబెట్టి పట్నంలో చదువుతున్న కొడుక్కి డబ్బుపంపిస్తే ఆ డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుపెడుతూ తల్లి జీవితంలో చీకటి మిగిల్చిన తనయుని కథ ద్రోహం నాటిక. పల్లెటూరి మామని బుట్టలో వేయబోయి బస్తీ అల్లుడు భంగపడటం భంగపాటు నాటికలో లలిత హాస్యంతో చిత్రించబడింది. మారుమూల పల్లెటూళ్ళకు రోడ్లు వేసి, వంతెనలు కట్టి బస్సులు వేయించి పట్నాలతో సంబంధం కుదర్చడంతో పల్లెటూరి ప్రజల జీవన సరళిలో ఎన్నో మార్పులస్తాయి. పాత కొత్తల సంధికాలంలో గ్రామ ప్రజల మనస్తత్వాన్ని వంతెన నాటికలో మనోజ్ఞంగా చిత్రించాడు నార్ల. ఇంటి గుట్టు, భావకవి, అర్థాంగి, ఆశాపాశం కూడా రసస్ఫూర్తిని కలిగించే మంచి నాటికలు. తెలుగు నుడికారపు ఇంపు సొంపులు నార్ల నాటికలలో పుష్కలంగా కనిపిస్తాయి.

మేధావుల ప్రశంసలందుకున్న సీత జోస్యంకు కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు లభించినా నార్ల తిరస్కరించాడు. హేతువాద దృక్పథంతో రాసిన జాబాలి నార్ల కడపటి నాటిక. నార్ల వెంకటేశ్వరరావు 1985, ఫిబ్రవరి 16 న కన్నుమూశాడు.

గం.సు.రె.

వెంకటేశ్వరరావు, పృథ్వీ (జ.1928-2008) : రంగస్థల నటుడు. సంగీత విద్వాంసుడు. 1928, మే 10న ప్రకాశం జిల్లా చీరాల మండలం దేవాంగపురిలో రత్తమ్మ, కోటి నాగేశ్వరరావు దంపతులకు జన్మించాడు. సంగీత సంప్రదాయ కుటుంబంలో జన్మించడం వల్ల చిన్నప్పుడే నాటకాలలో నటించడం ప్రారంభించాడు. ఈయన మొట్టమొదట గయోపాఖ్యానం లోని నారదుని పాత్రలో నటించాడు. రంగస్థల నటనలో పృథ్వీకి గురువు ఈలపాట రఘురామయ్య.

నాటక రంగం పట్ల అభిమానాన్ని పెంచుకొన్న పృథ్వీ శ్రీ రాజరాజేశ్వరి నాట్య మండలి (విజయవాడ), చింతా సుబ్బారావు ట్రూపు (రాజమండ్రి) ప్రదర్శించిన అనేక నాటకాలలో నటించి ప్రసిద్ధ నటుడిగా పేరు తెచ్చుకున్నాడు. శ్రీకృష్ణరాయబారం, సక్కుబాయి, శ్రీకృష్ణతులాభారం, శ్రీరామాంజనేయ యుద్ధం, పాదుకా పట్టాభిషేకం, సీతా కల్యాణం, తారా శశాంకం, చింతామణి, శ్రీవేంకటేశ్వర మహాత్మ్యంలో ప్రధాన భూమికలలో విభిన్న పాత్రలలో నటించాడు. కళాసంస్థలు, కళాకారుల అభిమానాన్ని చూరగొనడమే కాదు అనేక బహుమతు లందుకున్నాడు. టి. శ్రీరాములుతో కలిసి పృథ్వీ యిచ్చిన రామాంజనేయ యుద్ధం గ్రామఫోన్ రికార్డు ఆనాడు అత్యధిక సంఖ్యలో అమ్ముడు పోవడం విశేషం. ప్రముఖ రంగస్థల నటులు కల్యాణం రఘురామయ్య, పులిపాక వెంకటప్పయ్య, అద్దంకి, పులిపాటి వేంకటేశ్వర్లు, మాధవపెద్ది వెంకట్రామయ్య, పంచాంగం పి.సూరిబాబు, రాజేశ్వరి, పూర్ణిమ, పువ్వుల అనసూయ, వేమూరి గగ్గయ్య, పీసపాటి నరసింహమూర్తి, షణ్ముఖి ఆంజనేయరాజు, నిడుముక్కల సుబ్బారావు వంటి ప్రముఖ నటుల సరసన స్థానం సంపాదించాడు. నాటకరంగ వికాసంకోసం కృషిచేసిన పృథ్వీని నంది నాటకోత్సవాల సందర్భంగా ప్రతిష్ఠాత్మకమైన నందమూరి తారకరామారావు రంగస్థల పురస్కారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్మానించింది. 2008 మార్చి 22న పృథ్వీ నటరాజులో ఐక్యయ్యాడు.

దాసరి.ఎన్.

వెంకటేశ్వరరావు, మాచినేని : రంగస్థల నటుడు. ఈయన కృష్ణాజిల్లా విజయవాడకు సమీపంలోని కొండపల్లి గ్రామంలో అంజయ్య, సీతమ్మలకు జన్మించాడు. దుగ్గిరాలపాడు గ్రామంలో ఆదిరాజు సుందరయ్యవద్ద ఆర్ష విద్యనం, సంగీతాన్ని అభ్యసించాడు. కొండపల్లిలో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా పాఠశాలలో బుర్రకథ చెప్పి జిల్లా కలెక్టర్‌తో బహుమతిని పొందాడు. 1943లో కృష్ణా జిల్లా ప్రజా నాట్యమండలిలో ఎంపికై బుర్రకథ దళంలో చేరాడు. మిక్కిలినేని, మాచినేని, పట్టంశెట్టిల దళం, అల్లూరి సీతారామరాజు, కష్టజీవి, టాన్యా, రుద్రమదేవి వంటి కథలను చెప్పి అలరించింది. మా భూమి నాటకంలో దాదా పాత్రను అనితర సాధ్యంగా పోషించాడు. గురజాడ కన్యక ఖండికను జముకుల కథగా మిక్కిలినేనితో కలసి చెప్పాడు. తెలంగాణా సాయుధ పోరాటం ఇతివృత్తంగా గెరిల్లా అనే నాటకాన్ని రచించాడు. ఆశువుగా పాటలను రచించడం, పాడడం మాచినేనికి వెన్నతో పెట్టిన విద్య. గురజాడ దేశభక్తి గేయానికి అద్భుతమైన బాణీ కట్టాడు. క్రిప్సు రాయబారం లో జిన్నా వేషంలో నటించాడు. ఆత్రేయ రచించిన పరివర్తన నాటకంలో ప్రధాన పాత్రలో నటించి

ఆంధ్రనాటక కళాపరిషత్తుతో పాటు రాష్ట్రంలోని అనేక పరిషత్తుల్లో బహుమతులు పొందాడు. కొప్పరపు సుబ్బారావు రచించిన ఇనుపతెరలు నాటకంలో రమణారావు పాత్ర ధరించి కాకినాడ ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో ఉత్తమ నటుడు బహుమతి పొందాడు. మృచ్ఛకటికం నాటకంలో శకారుని పాత్రను ఏకపాత్రగా మలచిఅనేక ప్రదర్శనలిచ్చాడు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో 'ఏ' గ్రేడ్ కళాకారుడిగా వందలాది నాటకాలలో పాల్గన్నాడు. పాలగుమ్మి పద్మరాజు రచించిన *గాలివాన* కథ నాటకీకరణలో ప్రధాన పాత్రను పోషించి, జాతీయస్థాయిలో ప్రశంసలు పొందాడు. పేరిగాడి రాజ్యం, ఫకీరు, చెంచు వేషం, జంతరుపెట్టె వంటి జానపద కళారూపాల ద్వారా ఆధునిక ఇతివృత్తాలను రాసి ప్రదర్శించాడు.

కందిమళ్ళ

వేంకటేశ్వరరావు, సీతంరాజు (1925-1975) : రంగస్థల నటుడు, శ్రీమారుతీ నాట్యమండలి స్థాపకుడు. గుడివాడ తాలుకా పెదపారుపూడి మండలం మహేశ్వరపురంకు చెందిన సీతంరాజు వేంకటేశ్వరరావు 1925, జనవరి 25న వేంకట సుబ్బమ్మ సీతంరాజు సుబ్రహ్మణ్యం, దంపతులకు జన్మించాడు. 40 సంవత్సరాలు గురుమిదగుంట, మహేశ్వర పురాలకు కరణంగా పనిచేసిన వేంకటేశ్వర రావు తన ఆంజనేయ పాత్ర నటనతో 'ఆంజనేయులు'గా సామాన్యులతో పిలువ బడ్డాడు. శ్రీరామంజనేయయుద్ధంలో ఆంజనేయ పాత్ర ఆయన హృదయంలో చెరగనిముద్ర వేయగా అందులో ఆంజనేయ పాత్రలో రాణించే బేతా వేంకట్రావు నటన పట్ల వీరాభిమానాన్ని పెంచుకుని ఎక్కడ ప్రదర్శన ఉన్నా వెళ్ళి చూసిరావటం, ఆ పాత్రను అభ్యసించటం ఆరంభించాడు. చివరకు తన అన్నగారైన సీతంరాజు వెంకట రామారావు (అడ్డాడ కరణం) శ్రీరామునిగా, తన గ్రామ నౌకరు త్రిపురం వెంకటేశ్వర్లు విశ్వామిత్రునిగా, జాంబవంతునిగా, మరో పొరుగు గ్రామవాసి చిన్న వేంకటేశ్వర్లు అంగదునిగా 'శ్రీ మారుతీ నాట్యమండలి'ని గుడివాడలో స్థాపించి తాను ఆంజనేయునిగా శ్రీరామాంజనేయ యుద్ధం నాటకాన్ని అనేక ప్రదర్శనలిచ్చిన ప్రతిభావంతుడు సీతంరాజు వేంకటేశ్వర్లు. వెంకటాపురం జమీందారులు ఈ 'కలియుగ ఆంజనేయుని'కి తమ సంస్థానంలో బంగారు పతకాలు బహూకరించి ఘనంగా సన్మానించారు. వేషధారణలో ఉపయోగించే పూలదండను సీతంరాజు సతీమణి విశాలాక్షి ఇంటి నుంచే పంపించటం, దానిని ధరించటం ప్రతీ ప్రదర్శనకు ఒక ఆనవాయితీ. 74వ ఏట అనారోగ్యంతో బాధపడుతూనే, వాయిద్య సహకారంతో రామాంజనేయ పద్యాలను రికార్డు చేసి క్యాసెట్టు వెలువరించాడు. 1975, మార్చి 24న మహేశ్వరపురంలో ఈ ఆంజనేయుడు కన్నుమూశాడు.

ఎమ్మెస్వీ

వేంకటేశ్వర్లు, గనిపిశెట్టి (జ.1927) : రంగస్థల నటుడు, దర్శకుడు. 1927లో గుంటూరుజిల్లా దంతలూరులో మాణిక్యమ్మ, వెంకయ్య దంపతులకు జన్మించాడు. ఈయన మొట్టమొదట సత్యహరిశ్చంద్ర నాటకంలోని విశ్వామిత్ర పాత్రతో రంగస్థలానికి పరిచయమయ్యాడు. ఆ తరువాత కనకతారలో క్రూరసేనుడుగా, శ్రీకృష్ణ రాయబారంలో భీముడు, అశ్వత్థామగా నటించిన గనిపిశెట్టి బీదపిల్ల, ద్రోహి, పూలరంగడు మొదలైన సాంఘిక నాటకాలను స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించాడు. బాల నాగమ్మ నాటకంలో మాయలఫకీర్‌గా అనేకచోట్ల ప్రదర్శనలిచ్చాడు.

గనిపిశెట్టి పూర్ణశ్రీ నాట్యకళాసమితి (తెనాలి)లో చేరి, ఎ.వి. సుబ్బారావు, వేమూరి సీతారామశాస్త్రి మొదలైన నటులతో కలసి భీముడు పాత్రలో నటించాడు. రామాంజనేయ యుద్ధంలో పృథ్వీ వేంకటేశ్వరరావు, బేతా రామచంద్రరావులతో కలసి విశ్వామిత్రుడు, సుగ్రీవుడు పాత్రలలో నటించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ సమాజాలు నిర్వహించిన నాటకాలలో ఈయనకు భీముడు, విశ్వామిత్రుల పాత్రలు కీర్తిని తెచ్చిపెట్టాయి.

దాసరి.ఎస్

వేంకటేశ్వర్లు, పులిపాటి (1900-1972) : రంగస్థల, చలనచిత్ర నటుడు. ఆంధ్రనాటక కళాపరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యుడు. ఈయన 1900, సెప్టెంబరు 15న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించాడు. పాఠశాలలో చదువుతున్నప్పుడే 11వ సంవత్సరంలోనే బాలల పాత్రలలో నటించడంతో రంగస్థల ప్రవేశంజరిగింది. పద్య నాటకంపట్ల అభిమానం ఏర్పరచుకున్న పులిపాటి తెనాలి రామ విలాస సభలో సభ్యుడిగా చేరాడు. నటులు రాగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రదర్శనలు జరుగుతున్న రోజుల్లో రాగం కంటే భావానికి ప్రాధాన్యతనివ్వాలని, ఇందులో అభినయం కూడా చోటు చేసుకోవాలని, నటనాపరంగా అభివ్యక్తీకరించిన నటుడు

పులిపాటి. అంతేకాకుండా ప్రేక్షకులకు అర్థమయ్యేరీతిలో ప్రత్యేక పద్యపఠనం ప్రవేశపెట్టింది ఈయనే. కురుక్షేత్రం, గయోపాఖ్యానం, శ్రీకృష్ణ రాయబారంలలో అర్జునుడు, సత్యహరిశ్చంద్రలో నక్షత్రకుడు, చింతామణిలో భవానీశంకరుడు, సారంగధరలో సుబుద్ధి, ప్రతాపరుద్రీయం లో చెకుముకి శాస్త్రి, బొబ్బిలి లో వెంగళరాయుడు, కన్యాశుల్కంలో కరటక శాస్త్రి మొదలైన పాత్రలలో నటించాడు. 1930లో చలనచిత్ర పరిశ్రమ ప్రారంభం కావడంతో అనేకమంది రంగస్థల నటులు సినిమాలలో నటించడానికి వెళ్ళారు. పులిపాటి కూడా చలనచిత్ర పరిశ్రమలో ప్రవేశించి హరిశ్చంద్ర, వీరాభిమన్యు, సతీ తులసి, సారంగధర, రుక్మాంగద, నరనారాయణ, మహానంద, చూడామణి, తల్లిప్రేమ, చంద్రహాసలలో నటించాడు. ఈయన రామవిలాససభ (తెనాలి) ప్రదర్శించిన నాటకాలలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ కళావేదికలు ప్రదర్శించిన నాటకాలలో నాటి ప్రసిద్ధ నటులు స్థానం నరసింహారావు, బందా కనకలింగేశ్వరరావు, బళ్ళారి రాఘవ, గండికోట జోగినాథం, మాధవపెద్ది వెంకట్రామయ్య, గోవిందరాజుల సుబ్బారావు వంటి నటులతో కలిసి నటించాడు. నాటకరంగం కోసం కృషిచేసిన పులిపాటికి నటకిరీటి, నట విశారద బిరుదులిచ్చి సత్కరించడమే కాకుండా గజారోహణ ఉత్సవ సన్మానాలు జరిగాయి. 1960లో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ ఇచ్చి గౌరవించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆస్థాన కవి కాశీ కృష్ణమాచార్యులు పులిపాటిని 'నటశేఖర' బిరుదునిచ్చి గౌరవించాడు. తెలుగు నాటకరంగానికి అయిదు దశాబ్దాలుగా కృషి చేసిన పులిపాటి 1972, జూన్ 6వ తేదీన మరణించాడు.

వెంకటేశ్వర్లు, వెంపటి

దాసరి, ఎన్.

వెడెకిండ్

వేడ్‌కింద్, ఫ్రాంక్ (1864-1918) : జర్మన్ నటుడు, నాటక రచయిత. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో సమకాలీన జర్మన్ కళాకారులను ప్రభావితం చేసిన ప్రతిభాసంపన్నుడు. వేడ్‌కింద్ 'అసంబద్ధ నాటక' (Theatre of the absurd) ఉద్యమంలో అగ్రేసరుడు. ఈయన ప్రాసంగిక దృశ్యాలు, అర్థరహిత సంభాషణాలు, విరూపత, విడంబన మొదలైన లక్షణాలతో తన నాటకాలను విలక్షణంగా రూపొందించాడు. ఈయన రచనలు జర్మనీ నాటక సాహిత్యాన్ని ఫోటోగ్రాఫిక్ వాస్తవికత నుంచి అభివ్యక్తివాదం వైపు మళ్లించి, కొత్త ఒరవడి సృష్టించాయి.

వేడ్‌కింద్ 1872 నుంచి 1884 వరకు స్విట్జర్లాండ్‌లో నివసించి, శేష జీవితాన్ని మ్యూనిచ్‌లో గడిపాడు. ఉదర నిమిత్తం బహుకృత వేషం అన్నట్లు ఈయన రకరకాల వృత్తులు చేపట్టాడు. భోగలాలస సమాజంలో లైంగిక శక్తికి గల ప్రాధాన్యాన్ని వ్యతిరేకించడం ఈయన నాటకాల ప్రధాన ఇతివృత్తం. 1891లో వెలువడిన ఈయన విషాదాంత నాటకం ఫ్రూలింగ్స్ ఎర్వాచెన్ (ద అవేకెనింగ్ ఆఫ్ స్ప్రింగ్, 1909) జర్మన్ సాహిత్య ప్రపంచంలో గొప్ప కలకలం సృష్టించింది. ముగ్గురు తరుణుల్లో జాగృతమైన లైంగిక వాంఛలకు సంబంధించిన ఇతివృత్తాన్ని వేడేకింద్ కళాత్మకంగా నిర్వహించాడు ఈ నాటకంలో. కవితాత్మకంగాను, సుకుమారంగాను, మొరటుగాను, నిర్మొహమాటంగాను రూపొందిన సంక్షిప్త దృశ్యాల మేళవింపు ఈ నాటకం. 'లూలు' నాటక చక్రంలో ఎర్డ్‌గీస్ట్ (1895), డీ బుక్స్ డెర్ పందోరా (1904), అర్త్ స్పిరిట్ *(1914)*, పండోరాస్ బాక్స్, (1918) అనే మూడు నాటకాలున్నాయి. ఈ రెండు విషాదాంత నాటకా లలో అధోజగత్తుకు సంబంధించిన లైంగిక చిత్రణ జరిగింది. లైంగిక స్వేచ్ఛకు, కపట బూర్జువా నైతికతకు మధ్య జరిగిన సంఘర్షణలో రచింపబడ్డ లూలు అనే స్త్రీ పాత్ర శాశ్వతమైన, నీతికి అతీతమైన పాత్ర వేడ్‌కింద్ అమరసృష్టి. ఈ రెండు నాటకాలూ ఎన్నోసార్లు ప్రదర్శింపబడి ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి.

డెర్ మార్క్విస్ ఫాన్ కైత్ కోనిగ్ నికోలో ఓడెర్ సో ఈస్ట్ దస్ లెబన్ (1901), *హిదల్లా* (1904), *ఫ్రాంటిట్‌స్కా* (1912) మొదలైనవి కూడా వేడ్‌కింద్ ప్రసిద్ధ నాటకాలు.

జి.అ.నా.

వేణు, పసుపులేటి (1938-2002) : నటుడు, నాటక రచయిత. వ్యవహార నామం డాక్టర్ వేణు. వృత్తి రీత్యా వైద్యుడు అయినా, ప్రవృత్తి రీత్యా కళాకారుడు. 1938లో నెల్లూరు జిల్లా, వెంకటగిరి పట్టణంలో జన్మించాడు. స్థానిక ఆర్.వి.ఎమ్. హైస్కూలులో విద్యాభ్యాసం చేశాడు. వెంకటగిరిలో అమెచ్యూర్ ఆర్టిస్ట్సు అసోసియేషన్ స్థాపించి ఉన్నత ప్రమాణాలు గల నాటక ప్రదర్శనలతో వెంకటగిరికి పేరు ప్రతిష్ఠలు తెచ్చిన కాలంలో వారి నాటకాలు చూడటం, వారితో కలిసి తిరగటం వల్ల ఆనాటి నుంచీ నాటకాలే ఊపిరిగా చేసుకొని, జీవితంలోని ఆటు పోటులను తట్టుకుంటూ, రేపు అనే విషయం క్షణమైనా ఆలోచించక నాటక కళకే జీవితాన్ని అంకితం చేసుకున్న కళాజీవి. సమర్థుడైన నటుడు, ప్రయోక్త, ప్రతిభావంతుడైన రచయిత.

సుమారు పన్నెండు నాటికలను, నాలుగు నాటకాలను రచించాడు. వాటిలో *నిరాశా ప్రొడక్షన్ నెం.1*, దిష్టి బొమ్మలు,

రాజీవం, వంశవృక్షం, *చీకటి దొంగలు* నాటికలు, నటరాజ్, ఎటల్లాస్ట్ నాటకాలు సుప్రసిద్ధాలు. 1955లో ప్రప్రథమంగా నిరాశా ప్రొడెక్షన్ నెం. 1 అనే హాస్య నాటికతో రచనా వ్యాసంగం ప్రారంభమైంది. అడుగడుగునా ప్రేక్షకుల్ని హాస్యరసంతో ముంచెత్తే ఈ నాటిక ప్రదర్శన పరంగా అఖండ విజయాన్ని సాధించింది.

స్వార్థ ప్రయోజనాలు సాధించడం కోసం తమ వృత్తి ధర్మాన్ని స్వార్థానికి పణంగా పెట్టిన న్యాయవాది, ఎం.ఎల్.ఏ., డాక్టర్, దిష్టిబమ్మలు (1958) నాటికలో దర్శనమిస్తారు. హైదరాబాదులో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు పోటీలలో దిష్టిబమ్మలు నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించింది. న్యాయవాది పాత్రధారి వేణు ఉత్తమ నటుడుగా బహుమతి అందుకున్నాడు.

జయరాం స్మారక కళాసమితి (*గూడూరు*) అయితా బలరామయ్య సారథ్యంలో ఈ నాటికను అనేక నాటక పోటీలలో ప్రదర్శించి, నాటికకు విశేషప్రాచుర్యం తెచ్చిపెట్టారు. ఈనాడు సెటైర్ పేరుతో రాస్తున్న రచయితలు సెటైర్ అంటే ఎలా ఉండాలో అవగాహన చేసుకోవడానికి దిష్టిబమ్మలు నాటిక చదివి తీరాలి. 1958లో వేణు రచించిన *చీకటి దొంగలు* నాటికలో సమాజంలో భక్తులుగా, పెద్ద మనుషులుగా రాజకీయ నాయకులుగా, అధికారులుగా చలామణి అయ్యే కొంత మంది వ్యక్తులు చీకటి పడిన తర్వాత ప్రవర్తించే తీరు వ్యంగ్య ధోరణిలో పరామర్శించబడింది. బాధా సర్పదష్టుడైన నిరుద్యోగి మనోవ్యథ నుంచి జాలు వారిన చిత్తవృత్తికి దర్పణం వంశవృక్షం (1973). నటరాజ్ నాటకంలో ఒక మహా నటుడు ఒక కుటుంబంలో చెలరేగిన సంక్షోభాన్ని తన నటనా ప్రావీణ్యంతో పరిష్కరించడాన్ని హృదయంగమంగా చిత్రించాడు. నిరంతరం సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలను కథావస్తువులుగా తీసుకొని ప్రేక్షకులను మంత్రముగ్ధులుగా చేయగల రచనా వైదగ్ధ్యం వేణులో ఉంది. ప్రతి నాటికలోను ఒక సరికొత్త ప్రదర్శనా విధానాన్ని (టెక్నిక్) ప్రవేశ పెట్టడం కూడా ఈయన రచనా వైఖరిలో ఉన్న ఓ ప్రత్యేకత.

ప్రసిద్ధకవి, విమర్శకులు కె.వి. రమణారెడ్డి తో కలిసి అన్నపూర్ణ (1961) నాటకాన్ని, రాజీవం (1960), పద్మవ్యూహం అనే నాటికలను కూడా రచించాడు. రవీంద్రుని కాబూలీ వాలా కథను నాటకీకరించాడు.

రాజీవం నాటికకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. 1960–65 ప్రాంతాలలో వచ్చిన నాటికలలో ఈ నాటిక అగ్రశ్రేణికి చెందిందని నాటక కళాభిజ్ఞులచేత బహుధా కీర్తించబడింది. చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో డా.వేణు 2002లో దయనీయ పరిస్థితిలో మరణించాడు.

గం.సు.రె.

వేదాంత కవి (జ: 1909) : కవి, నాటక రచయిత. అసలు పేరు వేదాంతం వేంకట సుబ్రహ్మణ్య కవి. ఈయన గుంటూరు జిల్లా మాచవరంలో 1909, ఫిబ్రవరి 10న జన్మించాడు. తెలుగు తల్లి (1940), కష్టకాలం (1944), విశ్వస్వరాజ్యం (1945), ఆకలివంట (1945), మహారథికర్ణ (1946), ఛలో హైదరాబాద్ (1948), మా ఇలవేల్పు (1949), *గండపెండేరం* (1956), తంతులు (1956), యుద్ధ భూమి, సర్వోదయం మొదలైన నాటకాలు రచించాడు. ఆకలివంట, ఛలో హైద్రాబాదు అనేవి రాజకీయ నాటకాలు. కష్టకాలం, తంతులు, తెలుగు తల్లి మొదలైనవి సాంఘిక నాటకాలు. *గండ పెండేరం*, కాల్పనిక నాటకం, మహారథికర్ణ పౌరాణిక నాటకం. ఆకలి వంటలు లో 'ఆకలి' ప్రజలలో ఎలా తిరుగుబాటును రేకెత్తిస్తుందో తెలుపుతుంది. కష్టకాలం నాటకంలో జమీందార్లు మతాధికారులు బీదలను పీడించే తీరు తెన్నులను వివరిస్తుంది. మా ఇలవేల్పు నాటకం శివస్తుతి పరమైంది. ఛలో హైదరాబాదు నాటకంలో తెలంగాణారాజకీయాలు, హైదరాబాదులో రజాకారుల దుండగాలూ, దేశ్‌ముఖ్‌ల దురంతాలు చిత్రితం.

దేశభక్తి పూరితమైన ఈయన నాటకాలన్నీ సామాజిక చైతన్యానికి ఉపకరించేవే! మృదుమధుర శైలితో పద్యాలు గంభీరంగా సాగుతాయి. ప్రజాదరణ పొందిన నాటకాలు తెలుగు తల్లి, విశ్వస్వరాజ్యం. తెలుగు తల్లి నాటకంలో వేదాంత కవి తెలుగుతల్లిని, కవిని ప్రేయసీప్రియులుగా చిత్రించడం వినూత్నం. అంతేగాక ఈ నాటకంలో సంపన్నులు దేశాన్ని దోచుకునే తీరును చిత్రించాడు. తెలుగు ప్రజలను ఉత్తేజపరచి చైతన్య వంతులనుచేయగల సమర్థమైన ఈ నాటకాన్ని ముదినేపల్లి నాటక సమాజం వారు వెలుగులోకి తెచ్చి ప్రాచుర్యం కల్పించారు. ఈ సమాజానికి వెన్నెముక దుక్కిపాటి మధుసూదనరావు. ఈ నాటకంలో సుప్రసిద్ధ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు నటించాడు. ఈ నాటకం ద్వారానే నాగేశ్వర రావు ఆంధ్రదేశానికి పరిచయమయ్యారంటే ఆశ్చర్యపోనక్కర లేదు. ఈ నాటకం వల్ల వేదాంత కవి కూడా కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించుకున్నాడు.

వేదాంతకవి నాటకాలన్నింటిలోను విశిష్ట నాటకం విశ్వస్వరాజ్యం. ఐదంకాల ఈ నాటకం వీరరస ప్రధానమైంది. ప్రజా చైతన్యం ఈ నాటక పరమాశయం. ప్రజలలో జాతీయ చైతన్యాన్ని రగులుకొల్పి, మూఢవిశ్వాసాలతో కర్తవ్యవిమూఢులై మగ్గిపోయిన ప్రజలను వాస్తవజగత్తు లోనికి తెచ్చి కర్తవ్యోన్ముఖు లను చేసి జాతీయ భావ పూరితుల్ని చేయడం ఈ నాటకం ప్రత్యేకత. అన్ని ప్రతీక పాత్రలు. ధ్వని ప్రధానంగా భరతమాత, జనకుడు, భారతీయులను కాపాడేతండ్రి, విద్యానిధి, ధర్మరాజు రాజ్యలక్ష్మి, దరిద్రదేవత మొదలైన పేర్లతో వేదాంత కవి ఈ నాటక పాత్రలకు

రూపకల్పన చేశాడు. సంభాషణలన్నీ కూడ వ్యావహారిక భాషకు దగ్గరగా ఉండి ప్రజల మనస్సులను దోచుకున్నాయి.

వేదాంత కవికి 'మహాకవి, ఆంధ్ర బెర్నార్డుషా' అనే బిరుదులు సార్థకమైనవి. 1957 సంవత్సరం ఏప్రిల్‌లో మద్రాసు వాణీ మహల్లో ఘనసన్మానం జరిగింది. నాటకాలన్నీ గద్య పద్యాలుగా రచించాడు. అవి చాలా వరకు రంగస్థలం పై విజయాన్ని సాధించాయి.

గంగప్ప

వైల్డ్, ఆస్కార్ (1856-1900) : ఐరిష్ నాటకకర్త, నవలాకారుడు, కథకుడు, కవి, నర్మభాషి. ఈయన 1856లో జన్మించాడు. డబ్లిన్‌లో చదువుకున్న తరువాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చేరి ఇంగ్లీషు పద్య రచనకు న్యూడిగేట్ బహుమతి పొందాడు. సాహిత్యంలో మొదటి తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. వినూత్న రసవాదోద్యమానికి నాయకత్వం వహించాడు. 1882లో ఉపన్యాసాలివ్వడానికి అమెరికా వెళ్ళి న్యూయార్క్‌లో వీరా అనే నాటకం ప్రదర్శింప చేశాడు. ఇది విజయవంతం కాలేదు. కొంత కాలంపాటు నవలలు, కథలు, కవిత్వం రాశాడు. పాడువా రాణి అనే నాటకం 1891లో ప్రదర్శింపచేశాడు. చివరకు లలిత ఆహ్లాద నాటకాలతో అతనికి నాటకకర్తగా మంచి కీర్తి వచ్చింది.

ఈయన వీరా, పాడువా రాణి, లేడీ విండర్ మియర్స్ ఫాన్, ఎ ఉమన్ ఆఫ్ ఇంపార్టెన్స్, ఆదర్శ భర్త, ది ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్, సలోమి వంటి నాటకాలు రచించాడు.

ఈయన పద్య నాటకం సలోమిని ఇంగ్లండు లో నిషేధించారుగాని పారిస్‌లో ప్రదర్శించారు. అవినీతికి పాల్పడినందుకు రెండు సంవత్సరాలు కఠిన కారాగారవాసం అనుభవించి తరువాత పారిస్ నగరం వెళ్ళి అనారోగ్యంతో, దారిద్ర్యంతో 1900లో మరణించాడు. లెస్లీ, సెవెర్ ఇతని జీవితాన్ని నాటకీకరించి లండన్‌లో 1936లో ప్రదర్శించారు.

శ్రీ.చ.

వైల్డర్, థార్నటన్ (1897-1975) : అమెరికన్ నాటక, నవలా రచయిత. అగ్రశ్రేణి నాటకకర్తలలో థార్నటన్ ఒకరు. ఈయన రచనలు రాశిలో స్వల్పమే అయినా, వాసిలో అత్యధిక ప్రాచుర్యం పొందాయి. రచనా వ్యాసంగం 1931లో ది లాంగ్ క్రిస్‌మస్ డిన్నర్ (The Long Christmas Dinner) అనే ఏకాంకికతో మొదలైంది. మూడు పూర్తి నిడివి నాటకాలను, ఆరు నాటికలను రచించాడు. అన్నిటికంటే అవర్ టౌన్ (Our town -1938) నాటకం ఈయనకు ప్రపంచఖ్యాతి తెచ్చిపెట్టింది. ప్రతిష్ఠాత్మకమైన పులిట్జర్ బహుమతిని కూడా అందుకొంది. మరో ప్రసిద్ధ నాటకం ది స్కిన్ ఆఫ్ అవర్ టీత్ (The skin of our Teeth) (1942)కు కూడా పులిట్జర్ బహుమతి లభించింది. అమెరికా నాటకరంగంలో వాస్తవిక నాటక ప్రదర్శనా విధానానికి భిన్నమైన శైలిలో, ఆలోచనాత్మకమైన, వినూత్న ప్రయోగానికి నాంది పలికిన మొదటి రచయిత వైల్డర్. అవర్ టౌన్ నాటకం వాస్తవికతా విధానాన్నీ, సంప్రదాయ దృశ్య పరికల్పనను తోసిపుచ్చింది. రంగాలంకరణ హంగులు లేకుండా ప్రేక్షకుల మస్తిష్కానికి పని కల్పించేరీతిలో నాటక నిర్మాణం చేయడంలో రచయిత కృతకృత్యుడయ్యాడు. మానవానుభూతుల సారాన్ని నిశితంగా విశ్లేషించడంలో వైల్డర్ వినూత్న ప్రయోగం చేశాడు. కావ్యార్థాన్ని ప్రయోక్త ద్వారా వివరించే శిల్పం నాటకానికి వన్నె తెచ్చింది. వైల్డర్ నాటక శిల్పం అనేక దేశాలకు స్ఫూర్తిదాయకమైంది. తెలుగులో ఎన్.ఆర్. నంది రాసిన మరో మొహంజదారో (1964) నాటకంలో థార్నటన్ వైల్డర్ శిల్పం ప్రస్ఫుటమవుతుంది.



గం.సు.రె.

వ్యంగ్య రూపకం : సుప్రసిద్ధ సమకాలీన నాటకాలను, నాటక రచనా పద్ధతులను, ప్రయోగాలను వ్యంగ్యంగా అధిక్షేపించడం ఈ రూపక ప్రధాన లక్షణం.

(A satiric play, usually based on some well-known contemporary Drama or Dramatic fashion which offered elements fit for parody.- Oxford companion to the Theatre, P.105)

ఇంగ్లీషులో *రిహార్సల్* (1671), *క్రిటిక్* (1779), తెలుగులో *సంగీత ఇంద్రసభ, అసంపూర్ణ రామాయణం* ఈ రీతి రూపకాలకు ఉదాహరణలు.

శ్రీ.చ.

వ్యాయోగం : దశరూపకాలలో ఒకటి. ఇది ఏకాంత పరిమితమైన రూపకం. దీనిలో వస్తువు ప్రఖ్యాతం. నాయకుడు కూడా ప్రఖ్యాతుడుగా ఉంటాడు. స్త్రీ పాత్రలు తక్కువ. ఇతివృత్తం ఒక రోజులో జరిగినదై ఉండాలి. వ్యాయోగంలో రాజర్షి నాయకుడుగా

ఉంటాడు. వీర రౌద్ర రసాలతో కూడి ఉంటుంది. యుద్ధం, సంఘర్షణలు దీనిలో చోటు చేసుకుంటాయి.

ఉదా : సింగభూపాలుని ధనంజయ విజయము ధర్మసూరి నరకాసుర విజయము మొదలగునవి.

శ్రీ.చ.

శంకర్, చిట్టా (జ.1943) : రంగస్థల, సినీ, టీవి, రేడియో నటుడు, నాటక రచయిత, దర్శకుడు. ఆకాశవాణి 'ఎ' గ్రేడ్ కళాకారుడు. స్వస్థలం కృష్ణాజిల్లా సాతలూరు. కనకమ్మ, వెంకట్రామశాస్త్రులకు 1943, సెప్టెంబర్ 22న సికింద్రాబాదులో జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్య మహబూబ్ కాలేజి (సికింద్రాబాద్)లో, పాలిటెక్నిక్ డిప్లొమా వనపర్తి, హైదరాబాద్‌లో పూర్తిచేసిన శంకర్ ఎ.పి.ఎస్.ఇ.బి. లో ఉద్యోగిగా చేరాడు. సాంకేతిక రంగం వృత్తయితే ప్రవృత్తి మాత్రం నాటకరంగమే. ఈయనకు నాటకరంగంలో తొలిగురువు ఇంకొల్లు సత్యనారాయణ. 1958లోనే భమిడిపాటి కామేశ్వరరావు రచించిన బాగు బాగు నాటికలో శాంతమ్మ పాత్ర ద్వారా రంగస్థలంపై ప్రవేశించాడు. వాపస్, టామీ టామీ లలో నటించాడు. శ్రీహరిమూర్తి దర్శకత్వంలో తూర్పు రేఖలు, సంధ్యాఛాయా, ప్రమోషన్ వచ్చింది, ఎన్.జి.ఓ., మొదలెక్కడ, *చక్ర భ్రమణం* లలో నటించాడు. ఇవేకాకుండా జె.ఎల్. నరసింహారావు, మొదలి నాగభూషణ శర్మ, చాట్ల శ్రీరాములు, జె.వి. రమణమూర్తి, అత్తిలి కృష్ణారావు దర్శకత్వంలో ప్రదర్శింపబడిన లావాక్కింతయు లేదు, కాగితం *పులి, నాలుగో ప్రశ్న, గాంధీ జయంతి, నిజం,* తాళ్ళూరి శివరామకృష్ణారావు దర్శకత్వంలో ప్రదర్శింపబడ్డ మార్తోభవ, తొలకరి, పెద్దలకు మాత్రమే లలో నటించాడు.

స్వీయ దర్శకత్వంలో *గుండెలు మార్చబడును*, మొద*లెక్కడ, పల్లె మేల్కొంది, భజంత్రీలు, త్రివేణి, యథా రాజా తథా ప్రజా* ప్రదర్శనలు రాష్ట్రంలోనే గాక, రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందాడు. నాటక రచయితగా మనోజ, సంత్యాలి, తొలకరి వారం, నియతి, అభిమతం, తార, వినోద వల్లరి, పెద్దలకు మాత్రమే మొదలైన వాటిని స్వేచ్ఛానుకరణ చేశాడు. ఈయన నటించిన సుజి, సంత్యాలి, మనోజ, మార్తోభవ, నారం వారం, మనోవల్మీకం లు ఉత్తమనటుడు, హాస్య నటుడు, రచయిత, సహాయనటుడు, ఉత్తమ దర్శకుడు బహుమతులు తెచ్చిపెట్టాయి. 1999లో రాష్ట్రప్రభుత్వం నంది నాటక, నాటిక పోటీలలో అశ్రుఘోష నాటకంలో నటించినందుకు శంకర్‌కు ఉత్తమ నటుడుగా బంగారు నంది లభించింది.

దాసరి.ఎన్.

శంకర రావు, అంకరాజు (1895-1964) : నటుడు, నాటకకర్త, జాతీయవాది, సంఘ సంస్కరణాభిలాషి, 1895లో నరసాపురంలో జన్మించాడు. శంకరరావు పాత కొత్త మేలు కలయికలకు చిహ్నం. పౌరాణిక, చారిత్రక, సాంఘిక పాత్రలలో నటించాడు. మేటి నటుడని పేరుపొందాడు. తన జీవితాన్ని, తుదకు ప్రాణాలను సైతం తెనుగు నాటక రంగానికి అర్పించిన నటవీరుడు శంకరరావు.



ఇంటర్‌మీడియట్ వరకు చదివి ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ, 1922లో గాంధీజీ పిలుపుతో ఉద్యోగానికి రాజీనామా చేసి జాతీయోద్యమంలోకి ఉరికి ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించాడు. అనేక ఆర్థిక ఇక్కట్లకు గురయ్యాడు. ఆ తరువాత బాపట్లలో 1928 వరకు ఉద్యోగం చేశాడు. 1930లో రాజమండ్రి కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆహ్వానంతో ఆ బ్యాంకు కార్యదర్శిగా, ఆ పదవిని అతి సమర్థవంతంగా నిర్వహించాడు. 1954లో ఈ పదవిని విరమించి 1956 నుంచి మరణించేవరకు రాజమండ్రిలోని వీరేశలింగం హితకారిణీ సమాజం మేనేజర్‌గా, విడోహోంలో ఉపాధ్యాయుడిగా పని చేశాడు.

ప్రసిద్ధ నటుడు, అన్న అయిన అంకరాజు రామారావు ప్రోత్సాహంతో 1908లో ప్రప్రథమంగా రాజమండ్రి ఎమెచ్యూర్స్ వారి చిత్రనళీయం నాటకంలో ఇంద్రసేన పాత్రతో ఈయన నాటక జీవితం ప్రారంభమైంది. ఆనాటి నుంచి మరణించేవరకు ఏకధాటిగా పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో నటిస్తూ ఎంతో కీర్తినార్జించాడు. ఎందరో ఔత్సాహిక నటులను ప్రోత్సహించి తీర్చిదిద్దాడు. చాలా నాటక పోటీలకు గుణనిర్ణేతగా వ్యవహరించి నిష్పక్షపాత గుణనిర్ణేతగా పేరు పొందాడు. ఆంధ్ర దేశమంతటా ఎంతో కీర్తినార్జించిన రాజమండ్రి రాఘవ కళా సమితి సంస్థాపకులలో ఈయన ఒకరు. దానిని కళాత్మకంగా తీర్చిదిద్దడంలో ఈయన నిర్వహించిన పాత్ర చెప్పుకోదగ్గది.

1953లో బందరులోజరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు నాటక పోటీలలో *గుడ్డిలోకం* నాటకంలో వెంకట రామయ్య పాత్రలో నటించి ఉత్తమనటుడిగా ఎన్నికయ్యాడు. 1957లో విజయనగరం నాటక పోటీలలో ఉత్తమ నటుడి

బహుమతి గెలుచుకున్నాడు. 1956లో కొత్త ఢిల్లీలో జరిగిన అఖిల భారత ప్రజానాట్యమండలి సంగీత నృత్య నాటకోత్సవాల మూడవరోజు కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశాడు. ప్రతినిధుల సమావేశానికి అధ్యక్షత వహించాడు.

రాజ్యకాంక్ష, సంఘసేవ, తనదాక వస్తే వంటి నాటకాలను రచించడమే కాకుండా ఇంద్రసేనుడు, బాహుకుడు, విశ్వామిత్రుడు, నక్షత్రకుడు, కర్ణుడు, శ్రీకృష్ణుడు, యుగంధరుడు, శ్రీకృష్ణదేవరాయలు, పృథ్వీరాజు, భవానీశంకరుడు, నందుడు, రాజసింహుడు, వెంకటరామయ్య (గుడ్డిలోకం), పరంధామయ్య (నిజరూపాలు), మేనేజర్ (భయం), మురు (చంద్రగుప్త) వంటి పాత్రలలో నటించాడు.

1964, ఆగస్టు 27న రాజమండ్రి కలప వర్తక సంఘం నిర్మించిన థియేటర్‌కు ప్రారంభోత్సవ సందర్భంలో కాస్మోపాలిటిన్ క్లబ్ ప్రదర్శించిన సరిపడని సంగతులు నాటకంలో శ్రీధర్ పాత్రలో నటిస్తూ ఆఖరి రంగంలో 'ఇదే నా ధర్మపాలన' అంటూ గుండెజబ్బు మూలంగా వెనకకు పడిపోయాడు. అదే ఆయన ఆఖరి ప్రదర్శన. ఆ తరువాత నాలుగురోజులకు హితకారిణి సమాజంలో మరణించాడు.

శ్రీ.చ.

శంకర రావు, అడవి : రూపశిల్పి, ఆంధ్రప్రదేశ్ ఔత్సాహిక రంగస్థల కళాకారుల సమాఖ్య స్థాపకులలో ముఖ్యుడు. అడవి కాశీవిశాలాక్షి అన్నపూర్ణ వెంకటచలపతి రావు, దంపతులకు జన్మించాడు. విజయవాడలో స్థిరపడ్డాడు. 1968లో నాటక రంగంలో ప్రవేశించి, కె.ఎస్. శాస్త్రి దగ్గర మేకప్‌లో ఓనమాలు దిద్దుకుని, అనేక ప్రముఖ మేకప్ కళాకారుల దగ్గర ఆహార్యరంగంలో మెళకువలు నేర్చుకున్నాడు. నాటక రంగంలో తనదంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకొని సహజత్వాన్ని మేళవించి ముఖపత్ర రచన చేస్తూ, అనేక నాటక పరిషత్తులలో అసంఖ్యాకంగా ఉత్తమ ఆహార్యం బహుమతులు పొందాడు. నాటక సమాజాలతో సన్నిహిత సంబంధాలు కలిగి వారికి తగిన సహకారాన్ని అందించే స్వభావం గల శంకరరావును నాటక ప్రియులు కళామిత్ర అనే బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. 1994లో మిత్రుల సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఔత్సాహిక రంగస్థల కళాకారుల సమాఖ్యను స్థాపించి దానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాడు.

గం.సు.రె.

శకుంతల, కడియాల (జ: 1957) : రంగస్థల, సినీ నటి. తెలంగాణా శకుంతలగాపేరు పొందిన కడియాల శకుంతల 1957, మార్చి 27న పూణేలో కమలాబాయి, బాబూరావు దంపతులకు జన్మించింది. మాతృభాష మరాఠీ అయినా తెలుగుభాష నేర్చుకొని తెలుగు నాటక రంగాన్ని రెండు దశాబ్దాల పాటు ఎడతెగని కార్యక్రమాలతో సుసంపన్నం చేసింది. తెలుగు చదవటం, రాయటం రాదు. అయితే ఒక్కసారి సంభాషణలు చదివి వినిపిస్తే చాలు. తిరిగి మనకు కావలసిన మాడ్యులేషన్‌లో అద్భుతంగా చెప్పేది. తెలంగాణా యాసను, ఇతర మాండలీకాల్ని, సునాయాసంగానూ పలకగలదు. తెలుగు, హిందీ భాషలతో పాటు తమిళంలో కూడా ప్రవేశం ఉంది.

ఎర్రమంజిల్‌లోని ఛీఫ్ ఇంజనీర్ కార్యాలయ సిబ్బందితో 1972 ఫిబ్రవరి 22న తన మొదటి తెలుగు నాటకం దిక్కులేని పక్షులు లో జయరామారావు దర్శకత్వంలో రవీంద్రభారతిలో జరిగిన ప్రదర్శనలో పాల్గొంది.

దాదాపు 350 నాటకాల్లో, 600 నాటికల్లో వివిధ వేషాలలో నటించి 6000 పైచిలుకు ప్రదర్శనలిచ్చింది. దాదాపు రెండు దశాబ్దాలపాటు అన్ని నాటక పరిషత్తులలోనూ పాల్గొని, అసంఖ్యాకంగా ఉత్తమ నటి బహుమతులు గెలుచుకుంది. అంతేకాదు కేంద్ర సచివాలయ ఉద్యోగుల నాటక పోటీలలో పాల్గొని (దేశంలోని వివిధ కేంద్రాల్లో ఈ పోటీలు జరిగేవి) నాలుగు సార్లు 1975, 1976, 1978, 1981 సంవత్సరాల్లో ఉత్తమ నటి ఊర్వశి బహుమతి గెలుచుకుంది.

ప్రముఖ రంగస్థల దర్శకుడు పద్మభూషణ్ ఎ.ఆర్. కృష్ణ, డి.రాజేశ్వరరావు, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.ఎస్.ఆర్. ఆర్. ప్రసాద్, టి.ఆర్. అడబాల వంటి దర్శకుల వద్ద నటనలో, వాచికాభినయంలో మెలకువలు నేర్చుకొని ఎంతో పేరు సంపాదించింది.

తెలుగు చదవటం, రాయటం నేర్చుకుని తెలుగు నటీమణులు పలకలేని మాండలికాన్ని కరతలామలకం చేసుకుంది. అప్పట్నుంచీ ఆమె వెనుతిరిగి చూడలేదు. జీవితమనే సాగరాన్ని మథించింది. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది.

గౌతమ్‌ఘోష్ దర్శకత్వం వహించి, బి. నరసింగరావు నిర్మించిన మాభూమి సినిమాలో 1978లో తొలిసారిగా నటించింది. ఆ సినిమా 1979లో విడుదలై ఒక సంవత్సరం పాటు ఆంధ్రదేశమంతా దిగ్విజయ యాత్ర సాగించింది. అది మొదలు చలనచిత్రాలలో విలక్షణమైన పాత్రలు పోషిస్తూ తన ప్రత్యేకతను నిలబెట్టుకొంటూ ఉంది.

అడబాల

శర్మ, జితేంద్ర (జ.1931) : ఆధునిక డోగ్రీ నాటక రచయిత, అనువాదకుడు. ఉర్దూ, హిందీలలో ఆనర్సు డిగ్రీ, 1968లో ఉర్దూ ఎం.ఎ. చేశాడు. 1948-64లో రేడియో కాశ్మీరీలో నాటక నిర్మాతగా పనిచేశాడు. ఆ పిమ్మట జమ్మూ కాశ్మీర్ ఆర్ట్స్ అకాడమీలో అదనపు కార్యదర్శిగా పదవీ విరమణ చేశాడు.

జితేంద్ర శర్మ 19 ఏళ్ళ నుంచే రేడియోలకు ఏకాంకికలు రచించాడు. బుడ్డ్ సుహాగ్ (పెద్ద ముత్తైదువ) అనే ఏకాంకికా సంకలనం, ఖూన్‌షాజాది అనే సంపూర్ణ నాటకాన్ని వెలువరించాడు. ఆషాఢ్ కా ఏక్ దిన్, కాంచన్ రంగ్ నాటకాలను హిందీ నుంచి, దత్త నవలను బెంగాలీ నుంచి అనువదించాడు. అంతేకాక డోగ్రీలో ఏకాంకికల సంపుటాన్ని, కథానికల సంపుటాన్ని సంకలనపరచాడు. దీనితోపాటు అనేక రేడియో నాటకాలు, రంగస్థల నాటకాలను వెలువరించాడు. డోగ్రీ చలనచిత్రరంగానికి సేవలు చేశాడు.

ఈయన రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ రచయిత బహుమతిని, అఖిల భారత రేడియో నాటక బహుమతిని రెండు సార్లు గెలుచుకున్నాడు. బుడ్డ్ సుహాగ్ (1988)కు సాహిత్య అకాడమీ బహుమతి (1994) లభించింది. ఇందులో నాలుగు ఏకాంకికలు ఉన్నాయి. ఇది డోగ్రీ రంగస్థల వికాసాన్ని, శర్మ వైయక్తిక రీతులను వ్యక్తం చేస్తుంది. అంతేకాక సంప్రదాయ మూలాలకు, పాత్ర చిత్రీకరణ కౌశలానికి, మనిషి అచేతన స్థితిలోని భయం, కోరికల వర్ణనకు, బాధల చిత్రణకు, సజీవ నుడికారానికి ఇది ప్రసిద్ధి. అందువల్ల ఇది డోగ్రీ నాటక సాహిత్యంలో అత్యుత్తమ గ్రంథంగా పరిగణింపబడుతోంది.

చంద్ర

శశిమోహన్, జమ్మలమడక : (జ.1950) : రంగస్థల నటుడు, నాటక రచయిత, ఆదర్శ యువభారతి సమాజ స్థాపకుడు. జమ్మలమడక శశిమోహన్ 1950, నవంబర్ 23న మహాలక్ష్మి, సూర్యప్రకాశరావు దంపతులకు హైదరాబాద్‌లో జన్మించాడు. సికింద్రాబాద్ వెస్లీ ఉన్నత పాఠశాలలోనూ, బద్రుక కళాశాలలోనూ విద్యాభ్యాసం చేశాడు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎం.కాం. పూర్తి చేసి రాష్ట్ర సహకార యూనియన్ సహకార శిక్షణా కేంద్రంలో 1976 నుంచి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాడు.

బాల్యంలో బాలానంద సంఘంలో నాటికలను రాసి ప్రధాన పాత్రలలో నటించాడు. కొన్ని రేడియో నాటికల్లో కూడా పాల్గన్నాడు. కళాశాలలో నాటకాలు రాసి, ప్రదర్శించి పలు బహుమతులు పొందాడు. 'ఆదర్శ యువ భారతి' సమాజాన్ని స్థాపించి కోహినూర్, ఫర్ సేల్, ఆర్, మాకు శాంతి కావాలి, మంచితనం మరో సారి చచ్చింది, మాకో నియంత కావాలి నాటికలూ, కాగితం పులి, అశ్వత్థామ హతః, సిరికిన్ చెప్పడు నాటకాల్ని రచించి ప్రదర్శించాడు. ఆంధ్రదేశంలోని దాదాపు అన్ని పరిషత్తులలోనూ ఆదర్శ యువ భారతి ఈ ప్రదర్శనలు ఇచ్చింది. కోహినూర్, ఫర్ సేల్ నాటికలు ఇతర భాషల్లోకి కూడా అనువదించబడ్డాయి.



ఉస్మానియా విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖలో థియేటర్ ఆర్ట్స్ కోర్సుచేసి రెండు బంగారు పతకాలు పొందాడు. సామాజిక స్పృహకి రాజకీయాలు జోడించి కొంత హాస్యం, కొంత వ్యంగ్యం మిళితం చేసి విషయాన్ని సూటిగా చెప్పటం ఈయన రచనల్లోని ప్రత్యేకత. 1970-90 మధ్య కాలంలో సాంఘిక నాటక రచన, ప్రదర్శనల్లో ఒక ఒరవడి సృష్టించి సమకాలీన నాటక రచయితల్లో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు.

ఈయన రచించిన 'తూర్పులో పడమర' టివి సీరియల్‌లో హీరోగా నటించిన ప్రకాశ్ భరద్వాజ్‌కు ఉత్తమ నటుడుగా మొట్టమొదటి నంది బహుమతి లభించింది.

ప్ర.రె.

శాంతరసం : నవ రసాలలో ఒకటి. ఇది శమమనే స్థాయి భావం నుండి జనిస్తుంది. మోక్షంపై ఆసక్తి కలిగిస్తుంది. తత్త్వజ్ఞానం, వైరాగ్యం, ఆశయ సిద్ధి మొదలైన విభావాల వల్ల శాంతరసం జనిస్తుంది.

నాట్యశాస్త్రంలో భరతుడు ఎనిమిది రసాలనే పేర్కొన్నాడు. శాంతరసాన్ని మొదటిసారిగా ఆనంద వర్ధనుడు పేర్కొన్నాడు.

శ్రీ.చ.

శామ్యూల్, బెకెట్ (1906-1989) : ఐరిష్ - ఫ్రెంచి నాటకకర్త, నవలా రచయిత. అసంబద్ధ నాటక విధానం అబ్సర్డిజమ్‌ను ప్రాచుర్యంలోకి తెచ్చిన నాటకకర్త. యాన్ అటెండెంటు గోడో అనే నాటకం 1953వ సంవత్సరంలో రోజర్

బ్లిన్ దర్శకత్వంలో జయప్రదంగా ప్రదర్శించబడింది. దానితో నాటక రచయితగా బెకెట్‌కు మంచి గుర్తింపు వచ్చింది. ఆయన నాటక రచన ఆనాటి నాటక రచనలకు చాలా భిన్నమైంది, ఎంతో మెరుగైంది. ఆయన నాటకాలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. బ్రిటన్‌లో మొట్టమొదటి సారిగా 1955 లో యాన్ అటెండెంటు గోడో, హాల్ దర్శకత్వంలో ప్రదర్శించబడింది. ఆ నాటకం ఆంగ్లేయ నాటక రంగం మీద గొప్ప ప్రభావం చూపింది.



బెకెట్ ఐర్లాండులోని డబ్లిన్‌లో పుట్టి పెరిగి పెద్దయ్యాడు. ట్రినిటీ కాలేజిలో ఫ్రెంచి బోధించే ఉపాధ్యాయుడుగా కొంతకాలం పనిచేశాడు. తరువాత లండన్‌కు చేరి అక్కడ నుంచి 1937వ సంవత్సరంలో పారిస్ వెళ్ళి స్థిరపడ్డాడు. ఫ్రెంచిలో, ఇంగ్లీషులో నాటక రచన చేశాడు. తన నాటకాలను తానే స్వయంగా ఇతర భాషల్లోకి అనువదించుకున్నాడు. బెకెట్ నాటకం (ఎండ్ గేమ్) 1957వ సంవత్సరంలో బ్లిన్ దర్శకత్వంలో లండన్‌లో ప్రదర్శింపబడింది. తరువాత కాలంలో రాసిన నాటకాలు క్రాప్స్ లాస్ట్ డేస్ (1958), హాపీ డేస్ (1961) తాత్వికంగా ఏ సర్దుబాట్లకు లొబడని నీతి నియమాల గ్రంథమాల. రంగస్థల ప్రధానమైన కొత్త కొత్త పోకడలు సంతరించుకున్న నాటకాలివి. డబ్లిన్‌లో ఉండగా తను గడించిన సంగీత అనుభవం ఈ నాటకాల్లో ఎంతగానో ఉపకరించింది. ఆయన నాటకాలలోని పాత్రల సంభాషణా రీతి ఒకరికొకరు హాస్యంగా మాట్లాడుకుంటున్నట్లు ఉంటుంది. బెకెట్ తన నాటకాల కథా వస్తువు ఎన్నికలో, రంగాలంకరణలో, సంప్రదాయ పద్ధతిని అతిక్రమించాడు. నిరంతర నిరీక్షణతో అనంత ఆరాటాల అనుభవాలకు బలమైన రూపం కల్పించి పాత్రల చిత్రీకరణ చేశాడు. ఈయన పాత్రలు తామేమిటో తెలుసుకున్న వేదనాభరితులు, వ్యక్తిత్వ శూన్యులు. వీటితో నాటక కథా గమనాన్ని సాగించడమే ఆయన లక్ష్యం. ఆ పాత్రలు క్షీణిస్తున్న జీవన పరిస్థితులను రంగస్థలం మీద చూపించే వేదన బెకెట్ సాహితీ ప్రజ్ఞకు ప్రతీకలు.

1960వ సంవత్సరం తరువాత బెకెట్ నాటికలు రాశాడు. వాటిల్లో విదూషకుడు అదృశ్యమవడం, దయ్యం రూపంలో సగం కనిపించడం, ఆత్మావలోకనం చేసుకోవడం, ఆవాస స్థలాల గురించి మాట్లాడుకోవడం, వాటిపై తమ పట్టు కలిగి ఉండేందుకు పడేపాట్లు వాటిల్లో ముఖ్యాంశాలు. ఆయన నాటకాలను ఆయనే ప్రదర్శించుకున్నాడు. 1975లో బెర్లిన్‌లో ప్రదర్శింపబడిన వెయిటింగ్ ఫర్ గోడో అనే నాటకం ఆయనకు ప్రపంచఖ్యాతిని తెచ్చి పెట్టింది.

ఓ రోజు రాత్రి మైదానంలోని చెట్టు కింద ఇద్దరు దేశదిమ్మరులుంటారు. వారిలో ఒకతను నిద్రిస్తుంటాడు. మరొకతను కాపలా కాస్తుంటాడు. ఎవరి కోసమో ఎదురు చూస్తూ ఉంటాడు. ఆ వచ్చే అతను ఎవరో తెలియదు. కాని వారి ప్రశ్నలకు సమాధానం చెప్తాడని వారి నమ్మకం. అతనే ఆ గోడో. అతను ఎన్నాళ్ళకూ రాడు. వీరికి సమాధానం దొరకదు. నిరీక్షణ మిగులుతుంది. వెయిటింగ్ ఫర్ గోడో నాటకంలోని కథ ఈవిధంగా సాగుతుంది.

మొదటిసారి పారిస్‌లో ఈ నాటకం ప్రదర్శింపబడినపుడు అర్థంకాక ప్రేక్షకులు ఆందోళన చెందారు. ఈ నాటకాన్ని మళ్ళీ మళ్ళీ ప్రదర్శించారు. లండన్–న్యూయార్క్ నగరాల్లో కూడా ప్రదర్శించారు.

బలమైన కథ, నాటకీయత, ఆసక్తి కలిగించే పాత్రలు లేకున్నా నాటకం ప్రేక్షకుల ఆదరణ పొందింది. కారణం ఆ నాటకం నాటి సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించింది. ఎవరో వచ్చి తమను కాపాడతారనే భ్రమలో ప్రజలు ఉండేవారు. వారి నిరాశకు నిలువటద్దం ఈ నాటకం.

అన్నప్ప

శాయి, కె.ఎస్.టి. (జ: 1936) : నటుడు, దర్శకుడు, నాటక రచయిత. పూర్తి పేరు కొంపెల్ల శేషతల్ప శాయి. స్వస్థలం గుంటూరు జిల్లా బాపట్ల. అన్నపూర్ణ, ఆదినారాయణ దంపతులకు 1936న జన్మించాడు. బాపట్ల హైస్కూల్లోను, చీరాల కళాశాలలోను విద్యాభ్యాసం చేశాడు. బాపట్ల ఆర్ట్సు కాలేజిలో మేనేజరుగా పనిచేసి అక్కడే ఉద్యోగ విరమణ చేశాడు. అన్నవరపు శివరామయ్య ప్రోత్సాహంతో రామదాసు నాటకంలో రఘురాముడి పాత్రతో రంగస్థల ప్రవేశం చేశాడు. మాచిరాజు బాలగంగాధరశర్మ శిక్షణలో బాల పాత్రలు ధరిస్తూ వచ్చిన శాయి, ప్రసిద్ధ నాటక రచయిత కొర్రపాటి గంగాధరరావు సాహచర్యంతో నటనలో మెళకువలు నేర్చుకొని పరిపూర్ణ కళాకారుడయ్యాడు. ఆ తరువాత నటుడుగా, దర్శకుడుగా, రచయితగా నాటకరంగంలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. బబ్బిలియుద్ధంలో బుస్సీ, ఆర్యచాణక్య లో రాక్షసమంత్రి,

ఆనాడు లో మహ్మద్‌ఘోరి మొదలైన పాత్రలలో నటించి శభాష్ అనిపించుకున్నాడు. సాంఘిక విభాగంలో వందలాది నాటక, నాటికల్లో వైవిధ్యం గల పాత్రలు ధరించి ప్రేక్షకుల అభిమానాన్ని, ప్రశంసలను చూరగొన్నాడు. కన్యాశుల్కంలో గిరీశం, ఈనాడులో రహీం, కప్పలు లో శ్రీపతి, ఎన్.జి.ఓ.లో రంగనాథం, గోపి, భయం లో మేనేజర్, ఎవరు దొంగ లో యస్.ఐ, ప్రగతిలో పిచ్చివాడు, పల్లెపడుచులో చంద్రం, నిజంలో సార్వభౌమారావు, సిద్ధార్థలో సత్యం, పడమటిగాలిలో కోడిపెంట అంజయ్య, ఇలా ఎన్నో పాత్రలలో నటించాడు. రచయితగా సుమారు 25 నాటక, నాటికలు రాశాడు. శాయి రచనల్లో సంఘం చెక్కిన శిల్పం, మహనీయులు నాటకాలు, సర్పజాతి, కలి పురుషుడు, జననీ జన్మభూమిశ్చ నాటికలు సుప్రసిద్ధాలు.

తన దర్శకత్వ ప్రతిభతో ఎన్నో నాటకాలకు జీవం పోసి, వాటిని జనరంజకంగా ప్రదర్శింపజేశాడు. శాయి శిక్షణలో ఎందరో శిష్య, ప్రశిష్యులు తయారయ్యారు.

అటు సంప్రదాయ నాటకాల్లోను, ఇటు సాంఘిక నాటకాల్లోను ప్రతిభను చూపి నాటకరంగంలో బంగారు పంటలు పండించిన కృషీవలుడు. నవరస నాట్య కళానిధి, రంగస్థల రత్న, నాటక రంగ కృషీవలుడు, నాటక సర్వజ్ఞ, లలిత కళా రత్నాకర మొదలైన బిరుదులతో పాటు ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎన్నో అవార్డులు ప్రదానం చేశాయి.

కోపం, ఉత్తరం, దొంగపెళ్లి, టులెట్, సుఖం, అసమర్థుని డైరీ, కలిపురుషుడు, సర్పజాతి, పునర్జీవనం, ఈ ఉత్తరం నాది, పరాకాష్ఠ, కావమ్మ మొగుడు, జననీ జన్మ భూమిశ్చ, జైజవాన్, తప్పటడుగులు నాటికలూ, జీవనయాత్ర, నగ్నసత్యం, మమకారం, భోగివంటలు, సంఘం చెక్కిన శిల్పం, మహనీయులు, పులీమేక, పరమ పదం, సంతృప్తులు, గాజు పెంకులు, త్రిశంకులు, విధివిన్యాసాలు, బమ్మలు మొదలైన నాటకాలు శాయి కలం నుంచి వెలువడ్డాయి.

గం.సు.రె.

శారదా మనోవినోదినీ నాటక సభ : ఈ సభను 1895లో వనారస గోవిందరావు స్థాపించాడు. ఈ సభలో వనారస గోవింద రావు, రాప్తాటి సుబ్బదాసు, పాపాబాయి, చిన్నసుబ్బమ్మలు ప్రధాన నటులు.రాప్తాటి సుబ్బదాసు కవి, దర్శకుడు.

నేటి సురభి నాటక సమాజాలకు ఇదే మాతృసంస్థ. ప్రప్రథమ సురభి నాటక సమాజం. కుటుంబ స్త్రీలను రంగస్థలం మీదికి మొట్టమొదటగా ఎక్కించిన గౌరవం ఈ నాటక సభ వారిదే. ప్రాచీన సంప్రదాయం ప్రకారం నటులంతా ఒకే కుటుంబానికి చెందడం వల్ల, వయో గుణానుసారం భూమికా ధారణ ఈ నాటక సభలో కనిపిస్తాయి.

టిక్కెట్లు పద్ధతి మీద నాటకాలాడడం ప్రారంభించింది కూడా ఈ నాటక సభే. ఆ తరువాత అంతఃకలహాల వల్ల ఈ నాటక సభ్యులు విడిపోయి వేరు వేరు నాటక సమాజాలు నెలకొల్పుకొని సురభి నాటక సమాజాలనే పేరుతో నేటికీ దేశ సంచారం చేస్తూ నాటకాలు ప్రదర్శిస్తున్నారు. ఈ సభ హరిశ్చంద్ర, సారంగధర, శాకుంతలం, సుభద్రా పరిణయం, రుక్మాంగద, కాంతామతి, చంద్రకాంత, పారిజాతాపహరణం, బిల్హణీయం మొదలైన నాటకాలను ప్రదర్శించింది

శ్రీ.చ.

శాస్త్రి, జి.ఎస్.ఆర్.కె. (జ.1944) : నటుడు, దర్శకుడు. నాటకరంగంలో గుంటూరు శాస్త్రిగా పిలువబడుతున్న గుడిమెల్ల శివరామకృష్ణ శాస్త్రి 1944, డిసెంబరు 4న గుంటూరులో సావిత్రీ దేవి, వేంకటేశ్వర్లు దంపతులకు జన్మించాడు. శాస్త్రి తండ్రికి గుంటూరులో పబ్లికేషన్ సంస్థే కాకుండా పెద్ద ప్రింటింగ్ ప్రెస్ వుండేది. శాస్త్రి ప్రింటింగ్ ప్రెస్ వ్యవహారాలు చూసేవాడు. పబ్లికేషన్ కూడా వారికి అనుబంధంగా వుండటం వల్ల శాస్త్రి నిరంతరం పుస్తక పఠనం చేసేవాడు.



1962లో భారతదేశం మీదచైనాయుద్ధం ప్రకటించి నప్పుడు శాస్త్రి మిలటరీలో ఐదు సంవత్సరాలు ఫ్రంట్‌లైన్‌లో పనిచేసి తిరిగి వచ్చాడు. అంతకుముందే అంటే 1960 ప్రాంతాల్లో బొబ్బిలియుద్ధంలో మల్లమాంబ పాత్రతో నాటకరంగంలోకి ప్రవేశించాడు. మిలటరీ నుంచి తిరిగి వచ్చాక మళ్లీ నాటకరంగం వైపు మొగ్గాడు. మొదటమానవుడు, అతిథి, రాతిమనిషి, మనీషి లో నటించాడు.

ఆ తరువాత తనే దర్శకత్వం వహిస్తూ సిద్ధార్థ, ఆశ్రయం, వలయం, దేవాలయం, వీరపాండ్య కట్టబ్రహ్మన, జై భారత్ నాటకాలలో నటించాడు. తనే నిర్మాతగా మారి యుగధర్మం, బమ్మా బరుసు, రాగరాగిణి, హరహర మహాదేవ, డియర్ ఆడియన్స్ సిన్సియర్లీ యువర్స్, తర్జని, దహతి మమ మానసం, దిగేమ్, రసరాజ్యం, గుహ, ఆకాశంలో సగం, కౌరవ పాండవీయం నాటకాలకు దర్శకత్వం వహించి, ప్రధాన పాత్రలు పోషించి రక్తి కట్టించాడు.

ప్రదర్శించిన ప్రతి పరిషత్తులోనూ బహుమతులు సొంతం చేసుకున్నాడు. ఉత్తమ ప్రదర్శనకు సమాజానికి (శాస్త్రీయం – గుంటూరు) బహుమతులు సంపాదించడంతోపాటు

దర్శకత్వానికి, నటనకు ఎన్నోసార్లు ఉత్తమబహుమతులు పొందాడు. బహుమతులతో పాటు నటరాజు అనే బిరుదును కూడా సంపాదించుకున్నాడు.

కిన్నెరఆర్ట్ థియేటర్, యువకళావాహిని, కాకతీయ కళాపరిషత్తు వరుసగా ఎమినెంట్ పర్సనాలిటీ ఇన్ థియేటర్, బళ్లారి రాఘవ అవార్డు, విశిష్ట వ్యక్తి అవార్డు ప్రదానం చేశాయి.

ఒక దశాబ్దం చెన్నైలో ఉండి ముప్పయి సినిమాలలో ప్రతి నాయకుడు పాత్రలలో నటించి పేరు సంపాదించాడు. అయితే ఆ వాతావరణంలో ఇమడ్చలేక తిరిగి హైదరాబాదు చేరుకుని నాటక ప్రదర్శనలు మొదలుపెట్టాడు. కొన్ని టి.వి. సీరియల్స్‌లో కూడా పాల్గన్నాడు.

నలభై ఏళ్ల నాటకరంగ జీవితంలో నటుడు, దర్శకుడు, నిర్మాతగానే కాక చాలా పరిషత్తులకు గుణ నిర్ణేతగా వ్యవహరించి మంచి పేరు తెచ్చుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది నాటక పోటీలకు 1999-2000 సంవత్సరాలకు స్క్రూటినీ జడ్జిగా వ్యవహరించాడు. నాటక కళావికాసానికి అహరహరం పాటు పడుతున్న కళాసేవకుడు.

అడబాల

శాస్త్రి, జి.ఎస్.ఎన్. (జ.1934) : ప్రసిద్ధ నటుడు, దర్శకుడు. గరికపాటి లక్ష్మీనరసింహశాస్త్రి, అంజమ్మ దంపతులకు గుంటూరులో 1934, జనవరి 29న జన్మించాడు. చిన్నతనంలో సంస్కృతం తండ్రి దగ్గర అభ్యసించాడు. ఆనాడే పద్యం శ్రావ్యంగా చదివే పద్ధతి అలవడింది. భవిష్యత్తులో శాస్త్రి నట జీవితానికి ఇదే పునాది రాయి అయింది. విద్యార్థి దశలో నాటకకళపై అభిమానం ఏర్పడింది. హైస్కూలు చదివేరోజుల్లో సాంఘిక నాటకాలలో స్త్రీ, పురుషపాత్రలు ధరించి అటు సహాధ్యాయుల, ఇటు అధ్యాపకుల మెప్పు పొందాడు. 1942లో పత్రి శీనప్ప నాట్యమండలిలో హరిశ్చంద్ర నాటకంలో లోహితాస్య పాత్రతో రంగ ప్రవేశం చేశాడు. కొన్నాళ్ళకు తానే 'సాహితీ ఆర్టు థియేటర్' అనే సంస్థను స్థాపించి, ఎదురీత నాటకాన్ని ప్రదర్శింపచేశాడు. ఆ నాటకంలో స్త్రీ పాత్ర ధరించి ప్రేక్షకుల ఆశీస్సులు అందుకున్నాడు. 1955లో అపాండవం అనే పౌరాణిక నాటకంలో అశ్వత్థామ పాత్ర ధరించి తన నటనా చాతుర్యంతో ప్రేక్షకులను రంజింప చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు కూర్మా వేణుగోపాల స్వామి నుంచి సువర్ణ పతకాన్ని గ్రహించడం తన నట జీవితానికి శుభారంభం అనిపించింది. 1956లో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆఫీసులో ఉద్యోగంలో చేరాడు. అక్కడ కూడా ఓ నాటక సంస్థను స్థాపించి సహోద్యోగుల సహకారంతో ప్రతాపరుద్రీయం నాటకాన్ని ప్రదర్శింపచేశాడు. ఆ నాటకంలో పేరిగాడు, ప్రతాపరుద్రుడు, యుగంధరుడు, పిచ్చివాడు మొదలైన పాత్రలను ధరించి ప్రేక్షకులను అబ్బురపరచాడు. అప్పటి నుంచీ ఒకవైపు ఉద్యోగ ధర్మం నిర్వర్తిస్తూనే కాళిదాసులో కాళిదాసుగా, చింతామణి లో బిల్వమంగళుడుగా, శ్రీకృష్ణతులాభారంలో శ్రీకృష్ణుడుగా, సత్య హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడిగా, సక్కుబాయిలో యోగిగా, బబ్బిలియుద్ధంలో రంగారాయుడుగా, నాయకురాలు లో బ్రహ్మన్న పాత్రలలో నటించి తన నటనతో, గాన మాధుర్యంతో ఆ నాటకాల కీర్తిని ఇనుమడింపచేశాడు. ప్రేక్షక హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. ఆనాటి మహానటులు బందా కనకలింగేశ్వరరావు, పీసపాటి నరసింహమూర్తి జి.ఎస్.ఎన్.కు గురుతుల్యులు. అప్పుడప్పుడూ కంఠాభరణం, వెంకన్న కాపురం వంటి సాంఘిక నాటక, నాటికల్లో ప్రధాన పాత్రలు పోషిస్తున్నా, శాస్త్రి దృష్టి ఎక్కువగా పద్య నాటకాలవైపే మొగ్గు చూపింది. మహారథి కర్ణలో కర్ణ, అనార్కలి లో సలీమ్, పాండవోద్యోగం లో శ్రీకృష్ణుడు మొదలైన వైవిధ్యభరితమైన పాత్రలలో నటించాడు. మాధవపెద్ది వెంకట్రామయ్య, అద్దంకి, పులిపాటి, షణ్ముఖి, బందా, టి. రామకృష్ణ శాస్త్రి, ఆచంట వేంకటరత్నం నాయుడు, బుఱ్ఱా సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి ప్రముఖ నటుల సరసన నటించే భాగ్యం కలిగింది.

జి.ఎస్.ఎన్. సాంస్కృతిక శాఖలో సహాయ సంచాలకుడుగా చేరిన తరువాత తన కార్యక్షేత్రం విస్తృతమైంది. జంటనగరాల్లోని సాంస్కృతిక సమాజాలకు తన సహాయ సహకారాలు అందిస్తూ నాటక కళావికాసానికి ఎనలేని సేవ చేశాడు. కళాసంస్థలు ఈయన సేవలను కీర్తిస్తూ 'కళాతపస్వి', 'నటశేఖర' బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించాయి. జి.ఎస్.ఎన్. అమెరికాలో పద్య నాటకాలను ప్రదర్శించి తెలుగు నాటక మాధుర్యాన్ని అక్కడి వారికి రుచి చూపించి విదేశీయుల ప్రశంసలకు పాత్రుడయ్యాడు. 70 ఏళ్ళు పైబడిన వయసులో కూడా జి.ఎస్.ఎన్. తన కళాసేవను నిరంతరాయంగా కొనసాగిస్తూనే ఉన్నాడు.

డి.వి.పా.

శివనాగిరెడ్డి, జి (జ. 1936) : పౌరాణిక, చారిత్రక రంగస్థల నటుడు. కర్నూలు జిల్లా నంద్యాల సమీపంలోని నందవరంలో 1936 జనవరి 12న సామాన్య రైతుకుటుంబంలో జన్మించాడు.

తల్లిదండ్రులు నారమ్మ, సుబ్బారెడ్డి. శివనాగిరెడ్డి 11వ యేటనే లవకుశ నాటకంలో లవుడు పాత్రలో నటించాడు. ఉన్నత పాఠశాలలో చదువు తున్నప్పుడు శ్రీకృష్ణ రాయబారం నాటకంలో శ్రీకృష్ణుడు పాత్రలో నటించాడు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు మెచ్చుకోవడంతో నటన పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. ప్రముఖ రంగస్థల నటులు ఈల పాట రఘు రామయ్య, వెల్లుర్తి వెంకట నర్సునాయుడు, అల్లా బక్ష్‌లతో కలసి వికర్ణుడు, విశ్వామిత్రుడు, కర్ణుడు పాత్రలలో నటించి మంచి నటుడుగా గుర్తింపు తెచ్చు కున్నాడు. సవేరా ఆర్ట్స్ కడప తరుపున సతీ అహల్య, శ్రీరామ పాదుకలు, శ్రీరామ వనవాసం నాటకాలలో ఇంద్రుడు, రావణుడు పాత్రలలో నటించాడు. నాటక రంగంలో సుయోధనుడి పాత్రను పోషించడంలో తను సుప్రసిద్ధుడు కావాలని, ఆ పాత్ర మెళుకువలు నేర్చుకోవడానికి ఎంతో తాపత్రయ పడ్డాడు. సుయోధన పాత్రకు సంబంధించిన నటనా కౌశల్యాన్ని సంపాదించాడు. 1978లో నంది రాజు నారాయణ మూర్తి నేతృత్వంలో నిర్వహించిన అబ్బూరి నాటక కళాపరిషత్తు పోటీలలో సుయోధన పాత్రను పోషించి ప్రథమ బహుమతి పొందాడు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన కోడూరు పాటి సరస్వతీ రామారావు శివనాగిరెడ్డిని అభినందించి ఆశీర్వదించాడు. శివనాగిరెడ్డి వివిధ నాటకాలలో ప్రధాన పాత్రలలో నటించి ఉత్తమ నటుడుగా ఎన్నోసార్లు అవార్డులు అందుకున్నాడు. ఈయనకు 'విప్లవసింహం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' పేరు తెచ్చి పెట్టిన చారిత్రక నాటకం. నటుడుగా ఖ్యాతి గాంచిన శివనాగిరెడ్డిని శ్రీవేంకటేశ్వర నాట్య కళాపరిషత్తు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించాయి. నంది అవార్డు, పైడి లక్ష్మయ్య అవార్డు, బళ్లారి రాఘవ అవార్డు అందుకున్నాడు.



దాసరి, ఎన్.

శివప్రసాద్, వల్లూరు (జ. 1955) : నాటక రచయిత. గుంటూరు జిల్లా , తెనాలి మండలం, కొలకలూరు గ్రామంలో 1955, ఆగస్టు 27న సరోజినీదేవి, వేంకటేశ్వరరావు దంపతులకు జన్మించాడు. బి.ఎస్‌సి., చదివి, వైద్యశాఖలో ఉద్యోగం చేస్తూ, కథా రచయితగా రచనా వ్యాసంగం ప్రారంభించిన శివప్రసాద్ సుమారు యాభై కథలు, ఒక నవల రచించాడు. శివప్రసాద్ పిల్లలకోసం నిన్ను నువ్వు దిద్దికో, గడియారం నాటికలు రాయడంతో నాటక రచనకు అంకురార్పణ చేశాడు.



1970 నుంచి నాటక రచయితగా కలం పట్టి డాక్టరు పరాంకుశం హాస్య నాటిక రాశాడు. గంగోత్రి, పెదకాకాని సమాజ ప్రోద్బలంతో 1993లో యద్భవిష్యం నాటిక రాశాడు. అప్పటి నుంచీ ఈ సమాజానికి వరసగా శ్రీముఖవ్యాఘ్రం (1995), ఏకదిన్ కా గరీబ్(1996) ఆదివారం (1997), శ్రీచక్రం (1997) హింసధ్వని (1998) ఇటు నుంచి అటు (1999), వానప్రస్థం (1999) నాటకాన్ని, భూమిపుత్రుడు (2000) ఎడారి కోయిల (2001) నాటికలను అందించాడు. గంగోత్రి సమాజం ద్వారా శివ ప్రసాద్, శివ ప్రసాద్ ద్వారా గంగోత్రి సమాజం అత్యున్నత శిఖరాన్ని అందుకోవడం జరిగింది. శివప్రసాద్ రాసిన ప్రతి నాటికా, నాటకం బహుమతులు అందుకుని నాటకరంగంలో సంచలనం కలిగించాయి. హింసధ్వని నాటిక, వానప్రస్థం నాటకం, 1998, 2000 సంవత్సరాలలో నంది నాటకోత్సవాలలో ఉత్తమ ప్రదర్శనకు నంది అవార్డులను అందుకున్నాయి. శివప్రసాద్ రచనా సామర్థ్యానికి హింసధ్వని, ఎడారి కోయిల నాటికలు గీటురాళ్లు.

శివప్రసాద్ సమకాలీన సమాజ స్వరూపాన్ని, స్థితిగతులను, సుఖదుఃఖాలను, ఆశనిరాశలను, బలాన్ని బలహీనతల్నీ అన్ని కోణాల నుంచి వీక్షించి, విశ్లేషించి విలువ కట్టగల గొప్ప దార్శనికుడు. నిరంతరం కొత్తదనం కోసం అన్వేషించే తత్వం ఆయనది.

గం.సు.రె.

శివయ్య, జంపాల (జ.1932) : రంగస్థల నటుడు. లలిత కళా సమితి నిర్వహణ మండలిలో ముఖ్యుడు. ఈయన 1932లో కర్నూలు పట్టణంలో సీతమ్మ, వీరన్న దంపతులకు జన్మించాడు. కర్నూలు పట్టణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూసి నాటకరంగం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న శివయ్య 1972లో లలిత కళా సమితిలో శాశ్వత సభ్యుడిగా చేరి, సమితి కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పని చేశాడు. లలిత కళాసమితి సొంత భవనం ఏర్పాటు చేసుకోడానికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించిన క్రియాశీల కార్యకర్త శివయ్య. అనేక పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల్లో

విభిన్న పాత్రలలో నటించాడు. ఈయన నేతృత్వంలో లలిత కళా సమితి పక్షాన యమాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణాభిమన్యు వంటి పౌరాణిక నాటకాలను, ఈ తీర్పుకు బదులేది, అతిధి దేవుళ్ళొస్తున్నారు, ఛైర్మన్, అన్యాయం, సంఘం చెక్కిన శిల్పాలు వంటి సాంఘిక ప్రదర్శనలలో నటించి బహుమతులందుకున్నాడు. 1988లో తెలుగు విశ్వవిద్యాలయం, లలిత కళా సమితి సంయుక్త నిర్వహణలో ప్రాంతీయ నాటక పోటీలను నిర్వహించాడు. కళారంగంలో కృషి చేసిన శివయ్యను స్థానిక కళాకారులు, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షుడు తూమాటి దొణప్పలు సన్మానం చేశారు. కర్నూలు జిల్లా సాంస్కృతిక వ్యవహారాల శాఖా సలహాదారుగా పనిచేస్తూనే కళారంగానికి సేవ చేస్తున్నాడు.

దాసరి,ఎన్.

శివరామకృష్ణ శాస్త్రి, గుడిమెల్ల: చూ. శాస్త్రి, జి. ఎస్. ఆర్.కె.

శివరామకృష్ణారావు, తాళ్లూరి (1929-2007): దర్శకుడు, రచయిత. 1929లో కృష్ణాజిల్లా కొత్తగుంటపాలెంలో జన్మించాడు. దక్షిణ మధ్య రైల్వేలో మెకానికల్ ఇంజనీరుగా పని చేసి 1986లో పదవీ విరమణ చేశాడు. 1954 నుంచి నాటక రంగ అధ్యయనం ప్రారంభించాడు. అదే సంవత్సరం బంగారు సంకెళ్లు నాటికను ప్రదర్శించి సంగీత నాటక అకాడమీ నుండి ఉత్తమ దర్శకుడిగా గౌరవ సత్కారాలు అందుకున్నాడు. నాటక దర్శకుడిగా, స్టేజ్ డిజైనరుగా, లైటింగ్ డిజైనరుగా, రచయితగా ఖ్యాతి గడించాడు. అనేక నాటక పరిషత్తు పోటీలలో న్యాయ నిర్ణేతగా వ్యవహరించాడు. అఖిల భారత బహుభాషా నాటక పోటీలకు కూడా న్యాయ నిర్ణేతగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్నాడు.



ఉస్మానియా, కేంద్రీయ, తెలుగు విశ్వవిద్యాలయాలలోని రంగస్థల కళల శాఖ విద్యార్థులకు సాంకేతిక శిక్షణయిస్తూ తన అనుభవాన్ని పంచుతున్నాడు. నాటక రంగానికి సంబంధించి ఎన్నో వ్యాసాలు రాశాడు. ఈయన రచించిన మార్తోభవ నాటకం ఉత్తమ రచనకు, ఉత్తమ దర్శకత్వానికి, ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు అందుకుంది. ప్రాచ్య-పాశ్చాత్య నాటక రంగ రీతుల పట్ల అవగాహన గల కళాభిజ్ఞుడు. థియేటర్ స్టైల్స్ గురించి సాధికారికంగా వివరించగల మేధావి. హైదరాబాదు యువకళా వాహిని 'నాటకరత్న' అవార్డు తోనూ, శ్రీ కళానికేతన్ జూలూరి వీరేశలింగం కల్చరల్ అవార్డుతోను ఈయనను ఘనంగా సన్మానించాయి. తాళ్లూరి 2007 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో దివంగతులయ్యారు.

గం.సు.రె.

శివరామ శాస్త్రి,వేలూరి (1892-1967) : శతావధాని, బహుభాషా కోవిదుడు, నాటక రచయిత, శతాధిక గ్రంథకర్త. కృష్ణాజిల్లాలోని చిరివాడ అగ్రహారంలో విద్వత్కుటుంబంలో 1892, ఏప్రిల్ 9న విశాలాక్షి వేంకటేశ్వర ధాన్లకు జన్మించాడు. 1919 నుంచి రచనా వ్యాసంగంలో నిమగ్నమయ్యాడు. 'ముక్తాలత (ప్రబంధం) కృతక సూత్రము (ఖండ కావ్యము), మహాత్మగాంధీ జీవితం (2 సంపుటాలు) పరివర్తన చేశాడు. అటు సంప్రదాయ సాహిత్యంలోను, ఇటు ఆధునిక సాహిత్యంలోనూ రచనలు చేశాడు. అసంఖ్యాకమైన సాహిత్య వ్యాసాలు వీరి అసాధారణ మేధా సంపత్తికి నిదర్శనాలు. వేలూరి రచించిన ప్రసిద్ధ నాటకం మాధవవర్మ, నాటిక సుల్తానీ. గుడివాడ ప్రభాకర నాట్య మండలి నిర్వాహకుడు పామర్తి సుబ్బారావు దర్శకత్వంలో సుల్తానీ నాటిక, ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో ప్రదర్శింపబడి ఉత్తమ ప్రదర్శనకు బహుమతినందుకొంది. ఈయన 1967, మార్చి 17న పరమపదించాడు.

గం.సు.రె.

శివరామిరెడ్డి, అన్నపురెడ్డి (జ.1937) : నటుడు, దర్శకుడు.నాటకం కోసం జన్మించి, నాటకం కోసం జీవించే వ్యక్తులలో అన్నపురెడ్డి శివరామిరెడ్డి అగ్రగణ్యుడు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో వీరారెడ్డి, అప్పమ్మ దంపతులకు 1937లో జన్మించాడు.

నూతక్కి గ్రామం శివాలయం పూజారి దక్షిణామూర్తి దర్శకత్వంలో భక్త శిరియాళ నాటకంలో యోగిపాత్ర ద్వారా తొమ్మిదవ సంవత్సరంలోనే రంగస్థల ప్రవేశం చేశాడు. ఆ తరువాత హరిశ్చంద్ర, సక్కుబాయి, చింతామణి నాటకాలలోపలు సహాయ పాత్రలు పోషించి ప్రశంసలందుకున్నాడు.

ఆనాటికి సాంఘిక నాటకోద్యమం ఓ ఊపు అందుకొంటున్న దశలో తనలోని కళాతృష్ణ తీర్చుకొనేందుకు పౌరాణిక నాటకరంగానికి వీడ్కోలు పల్కి సాంఘిక నాటకాలపై దృష్టి సారించాడు. స్వీయ దర్శకత్వంలో పాలేరు నాటకం రూపొందించి ప్రదర్శించాడు. అది విజయవంతం కావటంతో అన్నాచెల్లెలు, కులం లేని పిల్ల, పల్లెపడుచు లాంటి నాటకాల ద్వారా తనలోని దర్శకత్వపు ప్రతిభ, నటనా సామర్థ్యాన్ని లోకానికి చాటాడు.

అనంతరకాలంలో శివరామిరెడ్డికి విజయవాడ నాటక రంగంతో సాన్నిహిత్యం పెరిగింది. ఈయన ప్రదర్శించిన నేటి న్యాయం నాటక ప్రదర్శన చూసిన కె. వేంకటేశ్వరరావు తన సమాజంలోకి ఆహ్వానించాడు. 1951లో స్థాపించబడిన, ర.స.న. (రసజ్ఞులు, సహృదయులు, నటీనటులు) సమాఖ్యలో చేరి, వేంకటేశ్వరరావు శిక్షణలో రాగరాగిణి లో రఘు, దొంగవీరడులో శాస్త్రి, నా బాబు లో కొడుకు, ఆకాశరామన్న లో రఘునాథాచార్య లాంటి పరస్పర విరుద్ధమైన పాత్రలు ధరించాడు. ఈ నాటకాలన్నింటికి ఆనాటి పరిషత్తులలో బహుమతులే కాక సామాన్య ప్రేక్షకుల ప్రశంసలు కూడా లభించాయి.

1963లో కె.వెంకట్రాజు అధ్యక్షతన గురజాడ కళామందిరం స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా స్వీయ దర్శకత్వంలో నటనాలయం (రాజారావు పాత్ర), ఉలిపికట్టె, ఛైర్మన్, లంకెబిందెలు, ప్రెసిడెంటు పట్టయ్య లలో (పలు ప్రాధాన్యతగల పాత్రలు) మా ఊరు (శివశంకర పాత్ర), చిల్లరకొట్టు చిట్టెమ్మ (సీతయ్య) లాంటి పలు నాటకాలు అటు పరిషత్తులలోను, ఇటు గ్రామీణ ప్రాంతాల్లోను ప్రదర్శించి, దర్శకునిగా,నటునిగా ఎనలేని కీర్తిప్రతిష్ఠలు పొందాడు. గ్రామీణ నేపథ్యంతో సాగే నాటకాలను అత్యంత ఆకర్షణీయంగా, రసస్ఫోరకంగా మలచడంలో శివరామిరెడ్డి దిట్ట.

1980 దశకం వరకు వచ్చిన నాటక, నాటికల్లో ఈయన నటించడమో, దర్శకత్వం వహించడమో చేశాడు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు వంద సమాజాల నాటక, నాటికలకు దర్శకత్వం వహించాడు. ఈయన శిక్షణలో రాటుతేలిన ఆణిముత్యాలలో సంజీవి (సినీ, రంగస్థల నటుడు), ఊట్ల బుడ్డయ్యచౌదరి ప్రముఖులు. నాటి రంగస్థల ప్రముఖులు కొప్పరపు సుబ్బారావు, కొడాలి గోపాల రావు, మోదుకూరి జాన్సన్ ప్రభృతులతో అత్యంత సన్నిహిత సంబంధాలు వుండేవి. చాట్ల శ్రీరాములు, జి.ఎస్.ఆర్. మూర్తి , సినీ నటుడు పొట్టి ప్రసాద్, రాజబాబు, సి.హెచ్. కృష్ణ మూర్తి ఈయన సహచరులు.

ఈయన వందలాది ఆకాశవాణి నాటకాల్లో నటించాడు. కొన్ని చలన చిత్రాల్లో కూడా నటించాడు. అయితే ఎక్కువ కాలం చలన చిత్ర రంగంలో ఇమడలేక రంగస్థలానికే అంకితమయ్యాడు.

ఈయన నట జీవితంలో అగ్రతాంబూలం మాత్రం నటనాలయందే. ఈనాటకంలో రాజారావు పాత్రను స్టానిస్లవ్‌స్కీ స్కూల్‌కి అనుగుణంగా మలిచి మహోన్నతంగా పోషించి రాజమండ్రి, మద్రాసు, పాలకొల్లు లాంటి వివిధ పరిషత్తుల్లో పలు బహుమతులు పొందాడు. 1964లో ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ఉత్తమ ప్రదర్శన, ఉత్తమనటుడు బహుమతులు సాధించి సంచలనం సృష్టించాడు.

ఇటు దర్శకత్వం, నటనలోనే కాకపలు పరిషత్తులకు న్యాయనిర్ణేతగ వ్యవహరించాడు. సాధారణ పరిషత్తు దగ్గర నుంచి నంది నాటకోత్సవాల వరకు ఆయన న్యాయనిర్ణేతగ వ్యవహరించి, నిస్పాక్షికమైన నిర్దుష్టమైన నిర్ణయాలతో కళాభిజ్ఞుల, విమర్శకుల ప్రశంసలు పొందాడు. అంతే కాక తన గురువు కె. వేంకటేశ్వరరావు పేరిట నాటకోత్సవాలు నిర్వహిస్తున్నాడు. ఆ వేదికపైనే నాటకరంగం నిష్ణాతులను సత్కరిస్తున్నాడు.

ఇలా ఆరు దశాబ్దాల జీవనయానంలో అనేకసార్లు ప్రదర్శనలతో గడించిన అనుభవ సారాన్ని ఇంకో తరానికి అందించే యత్నాన్ని కొనసాగిస్తున్న నాటక కృషీవలుడు అన్నపురెడ్డి శివరామిరెడ్డి.

మన్నెశ్రీ

శిశిర్ కుమార్ భాదురి (1889-1959) : ప్రసిద్ధ బెంగాలీ నటుడు, దర్శకుడు. బెంగాల్ నాటక రంగంలో 1912లో గిరీష్ చంద్ర ఘోష్ యుగం ముగిసిన తరువాత శిశిర్ కుమార్ యుగం ఆరంభమైంది. పాత పద్ధతులకు మంగళం పాడి, నాటకరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తేవడానికి శిశిర్‌కుమార్ భాదురి చేసిన కృషి అనుపమానం. దర్శకుడు అనే మాటకు సరైన అర్థం చెప్పాడు శిశిర్ కుమార్. బెంగాల్ నాటక రంగానికి ఈయనే తొలి దర్శకుడని పెద్దల అభిప్రాయం.

శిశిర్ కుమార్ శ్రీమంతుల కుటుంబంలో 1889లో జన్మించాడు. తండ్రి ఇంజనీరు. శిశిర్ కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజి నుంచి ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఏ. డిగ్రీ పొందాడు. విజ్ఞానార్జన పై అతనికి అంతులేని దాహం. ఇంగ్లీషులో వాగ్ధాటి అనర్గళం. కాలేజి వక్తృత్వం పోటీలలో ఎప్పుడూ ప్రథమ బహుమతి అతన్నే వరించేది. విద్యార్థి దశనుంచీ నాటకాలంటే ప్రాణం. 1908లో కాలేజీలో జూలియస్ సీజర్ లో బ్రూటస్ పాత్రలో తన నటనా సామర్థ్యం చూపి ప్రేక్షకులను అబ్బురపరిచాడు. 1911లో

డి.ఎల్.రాయ్ రచించిన చంద్రగుప్త నాటకంలో చాణక్యుడుగా నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నాడు. రవీంద్రనాథ్ టాగూర్ 50 వ జన్మదినోత్సవ సందర్భంగా శిశిర్ కుమార్ ప్రదర్శించిన ఒక ఆహ్లాద రూపకాన్ని చూసి రవీంద్రుడు ఎంతో మెచ్చుకొన్నాడు. విద్యాసాగర్ కళాశాలలో 1914లో అధ్యాపక పదవి చేపట్టాడు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే వీలైనపుడల్లా నాటకాల్లో పాల్గనేవాడు. నటుడుగా అప్పటికే మంచి గుర్తింపు వచ్చింది. ఇంతలో భార్య మరణం అతని జీవితంలో విషాదాన్ని నింపింది. కొంత కాలం శిశిర్ నాటకరంగానికి దూరంగా ఉండిపోయాడు. 1921లో మళ్లీ నాటకాలపై ధ్యాస మళ్లింది. నాటక కళా వికాసానికి తన సర్వశక్తులూ ధారబోయాలన్న సంకల్పం కలిగింది. గౌరవప్రదమైన అధ్యాపకుడి ఉద్యోగానికి రాజీనామా చేసి సమాజంలో గౌరవం లేని నటజీవితానికి అంకితమయ్యాడు. నాటకాన్నే వృత్తిగా స్వీకరించాడు. అతని నిర్ణయం సమాజాన్ని విస్మయంలో ముంచెత్తింది. ఆ తొందర పాటు నిర్ణయం వల్ల భవిషత్తులో ఎన్నో వడిదుడుకులను ఎదుర్కోవలసి వస్తుందని శిశిర్ ఆనాడు ఊహించలేదు. నిండా మునిగిన తర్వాత ఇంక చలేముంది అన్న భావంతో ముందుకు సాగిపోయాడు. జె.ఎఫ్.మదన్ అనే పార్సీ వ్యాపారికి కొన్ని సినిమా థియేటర్లుండేవి. వాటిలో ఒక దాన్ని నాటక శాలగా మార్చి శిశిర్ కుమార్‌ను ఆహ్వానించాడు. దాని పేరు కార్న్ వాలీస్ థియేటర్. స్టార్ థియేటర్‌కు నాటక రచయితగా ఉన్న కె.పి. విద్యావినోద్‌ను కార్న్ వాలీస్‌కు ఆహ్వానించాడు శిశిర్. అతనితో ఆలమ్‌గిర్ అనే చరిత్రాత్మక నాటకాన్ని రాయించి, స్వీయ దర్శకత్వంలో ఆ నాటకాన్ని మనోజ్ఞంగా ప్రదర్శింపజేశాడు. ఆ నాటక ప్రదర్శన చూసిన దిలీప్ కుమార్ రాయ్ ఆలమ్‌గిర్ నాటకాన్ని అద్భుత ప్రదర్శనగా అభివర్ణించాడు. నాటక ప్రదర్శన విషయంలో ఎన్నో కొత్త ప్రయోగాలు చేయాలని ఆశపడ్డాడు. అతని ఊహలను సాకారం చేసుకునే స్వేచ్ఛ కార్న్ వాలీస్ థియేటర్ యాజమాన్యం ఇవ్వకపోవడంతో నిరాశ పడి 1922లో కార్న్ వాలీస్ ను వదిలేశాడు. తన సంపూర్ణ ఆధిపత్యం కింద ఒక థియేటర్ ఉంటే గాని తాననుకొన్న లక్ష్యం నేరవేరదని అభిప్రాయ పడి, మన్మోహన్ థియేటర్‌ను 1924లో లీజుకు తీసుకొని తన కార్యకలాపాలు ఉధృతం చేశాడు. డి.ఎల్.రాయ్ రాసిన సీతను రసస్ఫోరకంగా ప్రదర్శించాడు. ఇది నూరు ప్రదర్శనలకు నోచుకుంది. గిరీష్‌చంద్ర నాటకం జనాను కుదించి, చేర్పులు మార్పులు చేసి ప్రదర్శించాడు. కె.పి. విద్యావినోద్, నరనారాయణ్, జోగేష్ చౌదరి, దిగ్విజయి నాటకాలు శిశిర్ కుమార్ దర్శకత్వ ప్రతిభతో అద్భుతంగా ప్రదర్శింపబడ్డాయి. వీటన్నిట్లోనూ శిశిర్‌కుమార్ ప్రధాన పాత్రలలో నటించాడు. నటీనటులకు తగిన శిక్షణ యిచ్చే వాడు. దీనబంధు మిత్ర సధావర్ ఏకాదశి కొత్త కాంతులతో ప్రదర్శించి ప్రేక్షకుల మెప్పుపొందాడు. గిరీష్ చంద్రఘోష్ ప్రఫుల్ల, బలిదాన్ నాటకాలకు కొత్త రూపం ఇచ్చాడు. డి.ఎల్.రాయ్ షాజహాన్ నాటకాన్ని నభూతో నభవిష్యతి అన్న తీరులో ప్రదర్శించి నాటక రంగంలో షాజహాన్‌కు శాశ్వత స్థానం కల్పించాడు. శరత్‌చంద్ర ఛటర్జీ నవలలను నాటకీకరింపచేసి ప్రదర్శించిన ఖ్యాతి శిశిర్ కుమార్ కే దక్కుతుంది. టాగూర్ నాటకాలను కూడా ప్రదర్శించాడు. శిశిర్ నటశిక్షణలో ఎందరో నటీనటులు తమ నటనా సామర్థ్యానికి మెరుగులు దిద్దుకున్న వారిలో నరేష్ మిత్ర, జోగేష్ చౌదరి, మనోరంజన్ భట్టాచార్య, కనకవతి, ప్రభావతి మొదలైన నటీనటులు పేర్కొనదగినవారు.

గం.సు.రె.

శూద్రకుడు : మృచ్ఛకటికం రచయిత శూద్రకుడని నాటకం ప్రస్తావనలో వుంది. అయినా ఆధునిక విమర్శకులు కల్పిత వ్యక్తి ఎవరో రాసి అతని పేరు పెట్టారని అన్నారు. కల్హణుని రాజతరంగిణిలో శూద్రకుడు విక్రమాదిత్యునితో సరితూగగల రాజు అని చెప్పబడింది. క్రీ.పూ. 200 నాటి వాడైన శాతవాహన రాజు సిముకుని ఆస్థాన కవులు రామిల సోమిలురు శూద్రకకథ కావ్యాన్ని రాశారంటారు. అది ఇప్పుడు అలభ్యం. కాని శ్రూదకుడు అనే రాజు పేరు ప్రసిద్ధంగా కనిపిస్తున్నది. అంతే కాక గ్రీకు చరిత్రకారులు శూద్రక జాతిని కూడా పేర్కొన్నాడు. ఒక వేళ మృచ్ఛకటికం కర్త ఆ జాతికి చెందిన వాడు కావటం చేత శూద్రకుడు అనే పేరుతో ప్రసిద్ధి చెందాడేమో. శూద్రకుడు నాటక ప్రస్తావన బట్టి పరాక్రమవంతుడు, యుద్ధ ప్రియుడు, వేద శాస్త్రాలు అభ్యసించిన పండితుడు. భాసుడు రాసిన దరిద్ర చారుదత్తం కథనే శూద్రకుడు చూసుకొని మృచ్ఛకటికం నాటకంగా రచించాడు. శూద్రకుడు క్రీ. శ. మొదటి శతాబ్దం వాడని చెప్పడం సమంజసంగా ఉంటుంది.

మృచ్ఛకటికం పూర్తిగా భరతుని నాటక లక్షణాలను అనుసరిస్తూ రాయబడిన నాటకం కాదనే చెప్పాలి. కథ, పాత్రల విషయంలో ఈ నాటకం ఇతర నాటక సంస్కృత నాటకాల కన్నా భిన్నంగా ఉంది. ఆధునిక ప్రాచ్య, పాశ్చాత్య పండితులను విశేషంగా ఆకర్షించింది. ఈ నాటకంలోవలె వాస్తవికతా చిత్రణ ఇతర ఏ నాటకాలలోనూ జరగలేదు. మృచ్ఛకటికం చక్కని సన్నివేశాలతో ప్రదర్శనయోగ్యంగా ఉంది. ఇతివృత్తం ప్రేక్షకుల ఔత్సుక్యాన్ని నిలుపుతూ రసవంతంగా నడిచింది. ఈ నాటకం రస పోషణాలతో కూడిన నాటకం కాక సంఘటన ప్రధానంగల నాటకం.

మృచ్ఛకటికం అనేక భారతీయ భాషలలోకి, పాశ్చాత్య భాషలలోకి అనువదింపబడింది. భారతీయ, పాశ్చాత్య రంగస్థలం మీద ఈ నాటకం ప్రదర్శింపబడి ప్రేక్షక ప్రశంసలు అందుకుంది.

ముదిగంటి.

శృంగార రసం (మ.1961): నవరసాలలో ఒకటి. రతి అనే స్థాయిభావం నుండి జనిస్తుంది. హృద్యం, ఉజ్జ్వలం అయిన వేషంతో కూడినది కావడం చేత శృంగార రసం అనే పేరు ఆచార సిద్ధమైంది. ఈ శృంగార రసం నిండు యౌవనంలో ఉన్న ఉత్తమ స్త్రీ, పురుష ప్రకృతులకు సంబంధించినదై ఉంటుంది. ఈ శృంగారం సంభోగం, విప్రలంభం అనే భేదాలతో రెండు అవస్థలు కలిగి వుంటుంది.

శ్రీ.చ.

శేఖర్‌బాబు, గర్నేపూడి (జ.1956 -): రచయిత, నటుడు, దర్శకుడు, ప్రయోక్త, మూకాభినయ కళాకారుడు, అభినయ మాధ్యమాల అధ్యాపకుడు.

జ్ఞాన సుందరరావు, సులోచన దంపతులకు కృష్ణాజిల్లా మానికొండ గ్రామంలో 1956 జులై ఆరవ తేదీన జన్మించాడు.

కృష్ణాజిల్లాలో అనేక గ్రామాల్లో అనేక జానపద కళారూపాలు చూడటం, తండ్రి సుందరరావు కూడా నటుడు కావటం వలన ఆయన ప్రోత్సాహంతో నాటకాల పట్ల అభిరుచి కలిగింది.

శేఖర్‌బాబు తన ఆరవ ఏట తండ్రి దర్శకత్వంలో పినిశెట్టి రచించిన అన్నాచెల్లెలు నాటకంలో గోపి పాత్ర ద్వారా నాటకరంగంలో అడుగు పెట్టాడు. కాలేజీ చదువుల్లో మంచం మీద మనిషి నాటికతో ఉత్తమ దర్శకుడిగా, *గుండెలు మార్చబడును* ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలో శేఖర్‌బాబు వెలుగులోకి వచ్చాడు.

డిగ్రీ పూర్తయ్యాక 1981లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎ. ఆర్. కృష్ణ నేతృత్వంలో ప్రారంభించిన నటశిక్షణాలయం రిపర్టరీలో విద్యార్థిగా చేరాడు. కృష్ణ నేతృత్వంలో నాటకాన్ని వినూత్నపథంలో నేర్చుకున్న శేఖర్‌బాబు నటన, నాటకం బోధించే అధ్యాపకుడిగా ఎదిగాడు.

నటశిక్షణకాలంలో కృష్ణ దర్శకత్వంలో శేఖర్ నటించిన కీలు బమ్మలులోని రామారావు పాత్ర విమర్శలతో, పత్రికల ప్రశంసలు తెచ్చి పెట్టింది. 1981 నుండి 1983 వరకు కృష్ణ నేతృత్వంలో *శాకుంతలమ్, మానాన్న కావాలి, ఆశ, 0+0 = 4* అనే మూకాభినయ నాటకాలలో ప్రధానపాత్రల్లో రాష్ట్రంలోనేకాక, మద్రాస్‌లో సినీరంగ ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించాడు. సాంఘిక నాటకాలే కాక *మాయాబజార్, పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానం* లాంటి పద్యనాటకాలలో కూడా నటించి పేరుతెచ్చుకున్నాడు.

ఎ. ఆర్. కృష్ణతో కలసి, మాలపల్లి, ప్రతాప రుద్రీయం నాటకాలలో నటించాడు. 1983 -84 కాలంలో రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావు పిల్లలకోసం ప్రత్యేకంగా స్థాపించిన రాఘవ నటశిక్షణాలయమ్ లో పనిచేసి పిల్లల నాటకాలకు దర్శకత్వం వహించి అనేకమంది బాల కళాకారులను తీర్చిదిద్దాడు. 1985 నుండి ఆంధ్రప్రదేశ్ థియేటర్ సంస్థ రాష్ట్రంలో నిర్వహించిన అనేక వర్క్‌షాప్స్‌లో అధ్యాపకుడిగా యువకళాకారులను తయారుచేశాడు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ కల్చర్ అండ్ రిసోర్స్ ట్రైనింగ్ వారికి ఎమినెంట్ ఫ్యాకల్టీ మెంబర్‌గా మధు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 1998 నుండి 2006 వరకు రంగస్థల కళల శాఖలో, నటన, దర్శకత్వం మూకాభినయంలలో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు.

చాట్ల శ్రీరాములు దర్శకత్వం వహించిన మూడు ప్రశ్నలు, తల్లావఝుల సుందరం దర్శకత్వంలో బుజ్జి మేక బుజ్జి మేక ఏడకెల్తివే, మాధవి నాటకాలకు నేపథ్య సంగీతం అందించాడు. హయవదన నాటకంలో దేవదత్తుడిగా, అశ్వఘోషలో బొమ్మ పాత్రధారిగా, జి. ఎస్. ఎన్. శాస్త్రి దర్శకత్వంలో *గయోపాఖ్యానం*లో అర్జునుడిగా నటించి ప్రశంసలు పొందాడు.

దర్శకుడిగానే కాక రచయితగా *గుణనిధి*, చిత్రపటం వంటి నాటకాలు రచించాడు. ప్రదర్శించాడు. రంగస్థల ప్రదర్శన కళలో అరుదైన మూకాభినయ కళాప్రక్రియలో నిష్ణాతుడు. 1982లో జర్మనీ కళాకారుడు మిలన్‌స్లాదెక్ మూకాభినయ కళా ప్రదర్శనతో స్ఫూర్తి పొందిన శేఖర్‌బాబు ఆ రోజు నుండి ఇప్పటి వరకు దేశంలో అనేక ప్రముఖ పట్టణాలలో మూకాభినయ కళా ప్రదర్శనలు ఇచ్చి పేరున్న అతికొద్ది మంది కళాకారులలో ఒకడుగా గుర్తింపు పొందాడు. హైదరాబాద్ ఆకాశవాణిలో 'బి' గ్రేడ్ కళాకారుడిగా అనేక రేడియో నాటకాలలో పాల్గన్నాడు. దూరదర్శన్ ప్రసారం చేసిన నాటక, సీరియల్స్‌లో కూడా నటించాడు.

జొ

దాసరి, ఎన్.

శేషగిరిరావు, జొన్నవిత్తుల (1905-1937): రంగస్థల నటుడు. ఈయన కృష్ణా జిల్లా, శాయపురం గ్రామంలో 1905లో జన్మించాడు. సంగీత పండితుడు. మైలవరం బాల భారతి సమాజంలో ప్రధాన పాత్రధారి. నాటి తెలుగు నటులలో సంగీతంలో, అకార ఆలాపనలో ఇంతవారు లేరు. శీతాకాలంలో

నడిరాత్రి గొంతులోతు నీళ్లలో నిలబడి చన్నీటి కుండను కౌగిలించుకుని సంగీత సాధన చేశాడు.

బస్తీ చూద్దామని కాలి నడకను శాయపురం నుంచి 25 మైళ్లు నడిచి విజయవాడ వచ్చిన 13 సంవత్సరాల బాల శేషగిరిరావు కూనిరాగాలు విన్న యడవల్లి మైలవరం కంపెనీలో తీసుకున్నాడు. శేషగిరి రావు మొట్టమొదటగా వేసిన వేషం ప్రహ్లాదుడు. ఆ తరువాత పెద్ద వేషం పాదుకలో లక్ష్మణుడు. క్రమేపీ దుష్యంతుడు వంటి పెద్ద వేషం వరకు వేసి ఎంతో ఖ్యాతి గడించాడు.

రామదాసులో కబీరుగా, సక్కుబాయి లో శ్రీ కృష్ణుడుగా ప్రేక్షకులను సంగీతంతో మైమరపించే వాడు. ఈయన నటనకు పతాక రాధాకృష్ణ లో కృష్ణ వేషం.

మైలవరం కంపెనీ సన్నగిల్లిన తరువాత గంధర్వ నాట్యమండలి స్థాపించి రాధాకృష్ణ వంటి నాటకాలను రసవత్తరంగా ప్రదర్శించాడు. ఈ నాట్యమండలి ప్రదర్శనాలలో మకుటాయమానమైంది సక్కుబాయి. తెలుగుదేశంలో నాటకం రోజుల తరబడి ఆడే సంప్రదాయం ఈ సక్కుబాయితోనే ప్రారంభమైంది. ఆ కీర్తి శేషగిరిరావు, దైతా గోపాలందే. బాల గంధర్వ స్వయంగా ఆంధ్ర గంధర్వ బిరుదిచ్చాడు. హెచ్.ఎమ్.వి. సంస్థ ఈయన పాటలు, పద్యాలను రికార్డు చేసింది.

ప్రహ్లాదుడు, లక్ష్మణుడు, సత్యవంతుడు, కబీరుదాసు, శ్రీకృష్ణుడు వంటి పాత్రలలో నటించిన జన్నవిత్తులకు తోడి, బేగడ, శహాన, శంకరాభరణం, కేదారగౌడ, సురటి, గుండక్రియ, శ్రీరాగం అభిమాన రాగాలు. ఈయన 1937లో మరణించాడు.

శ్రీ.చ.

శేషగిరిరావు, మద్దాలి (మ.1961): రంగస్థల నటుడు, నాటక నిర్వాహకుడు, నిస్వార్థ జీవి, నటరాజ బిరుదాంకితుడు. బందరు సమీపంలోని వడ్లమన్నాడు గ్రామంలో జన్మించాడు. అయితే రాజమండ్రిలో ఎక్కువ కాలం ఉండటం వల్ల రాజమండ్రి నివాసిగానే పరిగణితుడయ్యాడు. చిన్నతనంలోనే సంగీత, నాటక కళల మీద ఆసక్తి జనించింది. బందరు నేషనల్ థియేటర్ నాటకాలు ఈయనను ఉత్తేజపరిచాయి. 1903లో ఆ థియేటర్ లోనే చేరి స్త్రీ, పురుష వేషాలు వేశాడు. ఈయన మొట్టమొదటి వేషం వేణీ సంహారం లో జయంధరుడు. ఈయన వడ్లమన్నాడులో సొంత కంపెనీ పెట్టి కొంతకాలం నిర్వహించాడు. కానీ ఆర్థికంగా దెబ్బతిని ఏలూరులో ప్లీడరు గుమాస్తాగా కొంతకాలం పనిచేశాడు. తరువాత రాజమండ్రి మానేపల్లి కంపెనీ, చింతామణి థియేటర్, మైలవరం కంపెనీలలో ప్రధాన పాత్రలలో నటించి పేరు పొందాడు. ఆ తరువాత ఏలూరు ప్రభాత్ థియేటర్స్ దర్శకుడుగా పనిచేశాడు.

1910లో విజయనగర ప్రభువు ఆనంద గజపతి మద్దాలికి నిండు దర్బారులో నటరాజు బిరుదు ప్రదానం చేశాడు. ఈయనతో సమానంగా భీముడి పాత్రలో నటించిన వారికి 1,116/-లు బహుమతిగా ఇస్తానని మైలవరం రాజ ప్రకటించాడు.

హరిశ్చంద్రుడు, బాహుకుడు, ఘటోత్కచుడు, సిరియాలుడు, దశరథుడు, పాపారాయుడు, రాముడు, ధర్మరాజు, కృష్ణుడు, యతి (సిరియాళ) వంటి పాత్రలలో నటించాడు.

మద్దాలి నటనా చాతుర్యానికి మెచ్చి భారత ప్రభుత్వం నెలసరి ఫించను జీవితాంతం ఇచ్చింది. ఈయన రేపల్లె తాలుకా సిరిపూడిలో స్థిర నివాసమేర్పరచుకుని అక్కడే 1961, జూలై 20న మరణించాడు.

శ్రీ.చ.

శేషతల్ప శాయి, కొంపెల్ల: చూ. శాయి కె. ఎస్. టి

శేషయ్య , డి.వి. (- 1995) : నటుడు, నాటక సమాజ నిర్వాహకుడు. స్వస్థలం నెల్లూరు జిల్లా వెంకటగిరి. హైస్కూలుల్లో ఉపాధ్యాయుడుగా ఉద్యోగ విరమణ చేసి గూడూరులో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు.

స్వాతంత్ర్య సమర యోధుడు. సాంఘిక సేవా పరాయణుడిగా సమాజానికి సేవలు అందించాడు. విద్యార్థిగా ఉండగానే తెల్లదొరల పెత్తనం మీద తిరుగుబాటు తత్వంతో తోటి విద్యార్థుల్ని కూడ గట్టుకుని పాఠశాల భవనంపై కాంగ్రెసు జెండా ఎగురవెయ్యడం వంటి సాహస కృత్యాలు చేసి విద్యాధికారుల దండనకు గురి అయ్యాడు. గ్రంథాలయాలు అంతగా లేని ఆ రోజుల్లో వెంకటగిరిలో ఓ చిన్న గ్రంథాలయం ప్రజల సహకారంతో ఏర్పరచి, బెజవాడ గోపాల రెడ్డితో ప్రారంభోత్సవం చేయించిన సంఘ హితైషి. వెంకటగిరి, కందుకూరు, కట్టవపల్లిలలో ఈయన స్థాపించిన గ్రంథాలయాలే వీరి కృషి కి ప్రత్యక్ష నిదర్శనాలు.

1950 ప్రాంతంలో ఉపాధ్యాయుడుగా గూడూరులో స్థిరపడిన శేషయ్య ఆవుల శ్రీనివాసరావు, గండవరం సుబ్బరామిరెడ్డి, సిద్దారెడ్డి జనార్దనరెడ్డి, అల్లూరు రంగారెడ్డి,

సి.హెచ్. కృష్ణమూర్తి ప్రభృతులు స్థాపించిన సాహిత్య సమ్మేళనం సంస్థలో చేరి దాని అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డాడు. 1954లో సాహిత్య సమ్మేళనం సంస్కృతీ సమ్మేళనంగా రూపుదాల్చింది.

శేషయ్య సంస్కృతీ సమ్మేళనానికి మూల స్తంభమై సంస్కృతీ సమ్మేళనం అంటే డి.వి. శేషయ్య, డి.వి. శేషయ్య అంటే సంస్కృతీ సమ్మేళనం అన్నంతగా తాదాత్మ్యం చెందాడు. శేషయ్య అకుంఠిత కళాసేవలను గుర్తించి అనేక కళా సంస్థలు ఈయనను ఘనంగా సన్మానించాయి. మద్రాసు కళాసాగర్, వెంకటగిరి నటీ నట సమాఖ్య, సంస్కృతీ సమ్మేళనం, గూడూరు లయన్స్ క్లబ్ శేషయ్యను సన్మానించిన సంస్థలలో ప్రధానమైనవి. నాటక కళావికాసానికి అహర్నిశలూ శ్రమించిన డి.వి. శేషయ్య 1995లో అస్తమించాడు.

బోయిన

శేషయ్య, పులి (జ.1948) : రంగస్థల నటుడు. శ్రీ త్యాగరాజ నాట్య కళాపరిషత్తు కార్యదర్శి, న్యాయ నిర్ణేత, ఉపాధ్యాయుడు. నల్లగొండ జిల్లా మాధవరంలో అనసూర్యమ్మ, వేంకటేశ్వర్లు దంపతులకు 1948, జూన్ 20న జన్మించాడు. తెలుగు పండిట్‌గా ఉద్యోగం చేస్తూ 1962 నుంచి *శ్రీకృష్ణ రాయబారం, పాండవ విజయం, శ్రీరామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, శ్రీకృష్ణ తులాభారం, రావణ వధ, సీతా కల్యాణం, నల దమయంతి, సత్యహరిశ్చంద్ర, గిరిజా కల్యాణం, సతీ సావిత్రి, శిలువ ధారి, చింతామణి* నాటకాలలో ప్రధానపాత్రలలో నటించాడు. పద్యనాటకంలో మెరుగులు దిద్దిన గురువులు దేవరకొండ పాండురంగారావు, పానుగంటి చంద్రశేఖర్‌లు. కరుణామయి, కొత్తగుడి, రెండు రెళ్ళు ఆరు, పల్లెపడుచు వంటి సాంఘిక నాటకాలలో నటించాడు. బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, జి.ఎస్.ఎన్. శాస్త్రి, అయ్యదేవర పురుషోత్తమ రావు, వేమూరి సీతారామ శాస్త్రి, రామయ్య, వంటి ప్రముఖ నటులతో కలసి నటించాడు. 1974 నుంచి 2002 వరకు శ్రీ త్యాగరాయ నాట్య కళాపరిషత్తు (మిర్యాలగూడ)కు కార్యదర్శిగా ఉన్నప్పుడు వివిధ నాటకాలను శ్రీ నీలగిరి నాటక కళాపరిషత్తు (నల్లగొండ), సి.ఎస్.ఆర్ కళామందిరం (హైదరాబాద్), నటరాజు నాట్య మండలి (మిర్యాలగూడ), వేద సాహిత్య సంగీత నృత్త కళా పరిషత్తు (శిరిగిరిపాడు, గుంటూరు జిల్లా)లలో ప్రదర్శించడమే కాకుండా ప్రముఖ కళాకారులను పరిషత్తు పక్షాన ఘనంగా సన్మానించాడు. పలు కళా సంస్థలు 'అభినయ కళా కౌముది, నాద విభూషణ' వంటి అవార్డులిచ్చి సత్కరించాయి.

దాసరి.ఎన్.

శేషాచార్యులు, తిరుమల (1914-2005) : కవి, నటుడు, తెలంగాణా ప్రాంతంలో నాటక కళావికాసానికి విశేష సేవలు అందించినవారిలో అగ్రగణ్యుడు. ఈయన రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం సమీపంలోని మంచాల గ్రామంలో ఆండాలమ్మ, నరసింహాచార్యుల దంపతులకు 1914, ఫిబ్రవరి 14న శేషాచార్యులు జన్మించాడు. ఆరు దశాబ్దాలపాటు కవిగా, నటుడిగా, దర్శకుడిగా, ప్రయోక్తగా నిరుపమాన సేవ చేశాడు.

వీరిది పండిత వంశం. మాతామహులు మాడభూషి రాఘవాచార్యులు సంస్కృతాంధ్ర, ద్రావిడ భాషా విద్వాంసుడు. ఈయన వద్దనే బాల్యదశలో విద్యాభ్యాసం చేశాడు. ఆంగ్ల విద్యాభ్యాసం కోసం హైదరాబాద్ చేరుకున్నాడు. హైదరాబాద్ ఆయన స్థిర నివాసమైంది. బాల్యదశలో మాతామహుల ప్రభావంతో కవిత్వం రాయటం అబ్బింది. చిన్నచిన్న పద్యాలతో మొదలైన కవితా వ్యాసంగం, నగరంలోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో పెద్దలిచ్చిన ప్రోత్సాహంతో విస్తరించింది. గోల్కొండ పత్రికలో శేషాచార్యులు పద్యాలు విరివిగా ప్రకటింపబడేవి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదివి, బి.ఇడి. పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాడు.

క్రమంగా శేషాచార్యుల వ్యాపకం నాటకరంగంపై మొగ్గ చూపింది. 1946, ఆగస్టు 1న హైదరాబాద్‌లో 'ఆదర్శ నాట్య కళాపరిషత్తు' అనే కళాసంస్థను స్థాపించి, నాటక ప్రదర్శనలకు అంకురార్పణ చేశాడు. నాటకాన్ని ప్రవృత్తిగా కొనసాగించాడు. నాటక ప్రదర్శనకు తగిన సౌకర్యాలు లేని ఆ రోజుల్లో గయోపాఖ్యానం, కాళిదాసు, శ్రీకృష్ణతులాభారం, సత్యహరిశ్చంద్ర, చిత్రనళీయం, వరవిక్రయం, మధుసేవ, చింతామణి, పద్మవ్యూహం, రామాంజనేయయుద్ధం, తులసీదేవి, సావిత్రి మొదలైనవి ప్రదర్శించాడు. స్థానం నరసింహారావు, అద్దంకి శ్రీరామమూర్తి, పులిపాటి వేంకటేశ్వర్లు, బందా కనకలింగేశ్వర రావు మొదలైన ప్రసిద్ధ రంగస్థల నటులు శేషాచార్యుల నటనా వైదుష్యాన్ని ఎంతగానో ప్రశంసించారు. సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, మందుముల నరసింగ రావు వంటి పెద్దల ఆశీస్సులు అందుకొనే భాగ్యం కలిగింది.

శేషాచార్యులు శ్రీకృష్ణుడు, అర్జునుడు, నారదుడు, కాళిదాసు, హరిశ్చంద్రుడు, నక్షత్రకుడు, బాహుకుడు మొదలైన

పాత్రల్లో విశేషంగా రాణించి నాటకరంగంలో చిరయశస్సు గడించాడు. వివిధ కళాసంస్థలతో ఎన్నో సన్మానాలు, సత్కారాలు పొందాడు.

నాట్యశాస్త్రంలోని విశిష్టాంశాలను సాధికారంగా వివరించగల దిట్టనటులకు శాస్త్రబద్ధమైన శిక్షణ అవసరమని ఈయన నిశ్చితాభిప్రాయం. నాటకాలలో నటించడమే కాకుండా, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో కూడా పాల్గొంటూ తనకు చేతనైన సహాయం ఏదో చేయాలన్న తపన ఆయనలో ఉంది, తన సుదీర్ఘ అనుభవాన్ని పురస్కరించుకొని 'తెలంగాణము – నాటకవములు' అనే పుస్తకం రాయాలని శేషాచార్యులు పూనుకున్నారు. తెలంగాణా నాటకరంగాభివృద్ధికి బహుముఖాలుగా తోడ్పడిన శేషాచార్యులు 2005లో మరణించాడు.

అయ్యదేవర

శేషావతారం, పెన్నా (జ.1932) : రంగస్థల నటుడు. పెన్నా సూర్యనారాయణ, రాములమ్మ దంపతులకు నల్లగొండ, రామగిరిలో 1932, జులై 9న జన్మించాడు. బి.ఓ.ఎల్. శిక్షణ పొంది తెలుగు పండితుడిగా వృత్తి స్వీకరించాడు. వృత్తి అధ్యాపకత్వమే అయినా, నాటకరంగాన్ని ప్రవృత్తిగా మార్చుకున్నాడు. డి.వి. పాండురంగారావు, పానుగంటి చంద్రశేఖర్ ఈయనకు గురువులు. వారివద్ద పద్యాలు పాడే పద్ధతిని, అభినయంలోని మెళకువలను ఆకళింపు చేసుకున్నాడు.

నాటక ప్రదర్శనలకు అనువైన వాతావరణంగాని, సౌకర్యాలుగాని, ప్రోత్సాహంగానీ లభించని ఆ ప్రాంతంలో నాటకాలు వెయ్యడంలో శేషావతారంలోని కళాతృష్ణ, కార్యదీక్ష ఎటువంటివో అవగతమవుతుంది.

శ్రీకృష్ణరాయబారం లో ధర్మరాజు, అర్జునుడు, ధృతరాష్ట్రుడు, శ్రీరామాంజనేయ యుద్ధంలో భరతుడు, అంగదుడు, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడుగానూ నటించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. బుఱ్ఱా సుబ్రహ్మణ్య శాస్త్రి, అయ్యదేవర పురుషోత్తమ రావు, డి.వి. పాండురంగారావు, టి. రామకృష్ణ శాస్త్రి, వేమూరి సీతారామ శాస్త్రి వంటి ప్రసిద్ధ నటుల సరసన నటించే భాగ్యం ఈయనకు కలిగింది. నాటకరంగానికి నాలుగు దశాబ్దాలుగా సేవ చేసిన శేషావతారం నేటికీ నాటక కళ పట్ల శ్రద్ధాసక్తులు చూపుతూ యువకుల్ని ప్రోత్సహిస్తున్నాడు.

గం.సు.రె.

శ్రవ్య నాటకం : విని లేదా చదివి ఆనందించే, ఆనందింపచేసే సాహితీ రూపకమే శ్రవ్యనాటకం. ఇటువంటి నాటకాలనే ఇంగ్లీషులో క్లాసెట్ ప్లేస్ (closet plays) అంటారు. ప్రదర్శన యోగ్యం కాని లేదా ప్రదర్శనా సౌలభ్యం లేని నాటకాలన్నీ ఈ కోవకు చెందినవే. ఉదా: కందుకూరి వీరేశలింగం బ్రాహ్మ వివాహం. ఈనాడు మనం రేడియోలో వింటున్న వన్నీ శ్రవ్య నాటకాలే. రంగస్థలం కోసం రాయబడిన నాటకాలు ప్రదర్శనకు అనువుగా లేకపోతే అవి శ్రవ్య నాటకాలుగా మిగిలిపోయి, గ్రంథాలయాల్లో తలదాచుకోవడం వింతేమీ కాదు.

గం.సు.రె.

శ్రీకృష్ణదేవరాయలు, అవేటి (జ.1953): సురభి రంగస్థల కళాకారుడు. గజపతి నాట్యమండలి స్థాపకుడు. ఈయన 1953, ఏప్రిల్ 4న హంపి విజయనగరం సమీపంలోని కంపిలిలో శాంత కుమారి, ప్రసాదరావు దంపతులకు జన్మించాడు. సురభి కుటుంబంలో పుట్టిన రాయలుకు ఆదిగురువు తండ్రి. చిన్నప్పటి నుంచి బాలనటుడి పాత్రలలో నటించాడు. పదవ తరగతి వరకు చదువుకుని తండ్రి సహకారంతో నటనలో మెళకువలు నేర్చుకొని నటనను జీవిత వృత్తిగా కొనసాగిస్తున్నాడు. గజపతి నాట్యమండలి పక్షాన ఆంధ్రదేశంలోను, రాష్ట్రేతర ప్రాంతాలలోను విరివిగా నాటకాలను ప్రదర్శించాడు. ఈయన నటుడే కాదు దర్శకుడు కూడా. రంగోద్దీపనం, దృశ్య పరికల్పన మొదలైన రంగస్థల కళలకు సంబంధించిన పలు అంశాలపై పట్టున్న కళాకారుడు. గజపతి నాట్యమండలి 1986లో మూత పడడంతో ఔత్సాహిక నాటక సమాజాలు ప్రదర్శించే ప్రదర్శనలకు అవసరమైన రీతులలో సహాయ సహకారాలందిస్తూ కళాసేవ చేస్తున్నాడు. 1995, 96లలో శ్రీ వేంకటేశ్వర నాట్య కళాపరిషత్తు నిర్వహించిన పోటీలలో ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ సాంకేతిక నిపుణుడు అవార్డులు అందుకున్నాడు. ఇవే కాకుండా పలు నాటక సమాజాలు ఈయనను ఘనంగా సన్మానించాయి. ప్రముఖ రంగస్థల నటి సురభి జమున ఈయన భార్య. యువకులకు నాటకరంగం పట్ల మక్కువ పెంచే ప్రయత్నంలో భాగంగా జమునతో కలసి 2004లో 'సురభిళ' నాట్య కళామండలి స్థాపించాడు. ఈ మండలి నంది నాటకోత్సవాలలో శశిరేఖా పరిణయం నాటకం ప్రదర్శించి ప్రథమ బహుమతి గెలుచుకొంది.

బిట్టు

శ్రీ కృష్ణ హిందూ థియేటర్ (తెనాలి) : ఈ సమాజాన్ని 1920లో చుండూరు హనుమంతరావు స్థాపించాడు. చుండూరు సాంబయ్య, చుండూరు మాణిక్యం ఈ కంపెనీలో

భాగస్థులుగా, అంబడిపూడి ఆది నారాయణ మేనేజర్‌గా, సలహాదారుగా చల్లా ఆంజనేయులు వున్నారు. ఈ కంపెనీకి సహాయకులుగా చల్లా హనుమయ్య, చింతలపాటి లక్ష్మీ నారాయణ, భైరవ శాస్త్రి, సోమయాజులు వ్యవహరించారు. వివిధ పాత్రలు ధరించడానికి మల్లాది గోవిందశాస్త్రి, ఈమని వీరబ్రహ్మాచారి, గోపాలుని అప్పారావు, కాకుమాను ప్రకాశరావు, చల్లా ప్రకాశ రావు, వేమూరి గగ్గయ్య, తోట వెంకటాచలం, తోట రాఘవయ్య, మోదుకూరి సుబ్బారావు మొదలైనవారు ఉన్నారు. ఆ రోజుల్లో సంగీతంలో పాపట్ల కాంత్యయకు పోటీగా చందాల కేశవదాసు అంగీకరించిపనిచేశాడు. ఆ రోజుల్లో స్త్రీ పాత్ర ధారులకు పెద్ద గిరాకీ వుండేది. కోటంరాజు, లక్ష్మీకాంతం, కడియాల రత్తయ్య, శ్రీ పాద రంగయ్య, స్థానం నరసింహారావు స్త్రీ పాత్రలు ధరించారు. ఈ కంపెనీలో ప్రధాన పురుషపాత్రలు ధరించే మల్లాది గోవిందశాస్త్రికి, స్థానం నరసింహారావుకి ఏ విషయంలోను అంతగా పోసిగేది కాదు, అందువల్ల స్థానం నరసింహా రావు ఈ కంపెనీ వదలి 'రామవిలాస సభ' లో చేరాడు. పైగా అప్పటికే కంపెనీ నష్టాల్లో నడుస్తోంది. నష్టాలు భరించలేక హనుమంత రావు తప్పుకున్నాడు. మిగిలిన భాగస్థులు కూడా విరమించుకున్నారు. కంపెనీ ఆగిపోయింది. ఈ కంపెనీ కృష్ణలీలలు, సతీ సావిత్రి, సత్యహరిశ్చంద్ర మొదలైన నాటకాలను ప్రముఖంగా ప్రదర్శించింది.

నే.ప.శ

శ్రీ చెన్న మల్లేశ్వర కళా పరిషత్తు : ఈ సమాజాన్ని 1958లో అమలాపురంలో స్థాపించారు. వ్యవస్థాపకుడు నల్లా సత్యనారాయణ. ఈ సమాజం పూర్వపు పేరు శ్రీ చెన్న మల్లేశ్వర కళా సమితి. అమలాపురంలో ప్రతి ఏటా చెన్నమల్లేశ్వర స్వామి, భ్రమరాంబిక కళ్యాణోత్సవాలు నిర్వహించే సందర్భంలో కళాకారులంతా కలసి ఒక నాటక ప్రదర్శన ఏర్పాటు చేయాలనే ఆలోచనే ఈ సమితి ఏర్పడటానికి ప్రధాన కారణం. ఈ సమాజం మొట్టమొదటి ప్రదర్శన ఇదే(నా) లోకం అనే సాంఘిక నాటకం. ప్రతి సంవత్సరం కళ్యాణోత్సవం సందర్భంగా నాటికలను ప్రదర్శించడం నియమంగా పెట్టుకొన్న సమితి మనమంతా *ఒక్కటే, కళాజీవులు, అంతా రోజుల మహాత్మ్యం, పంజరంలో పక్షులు, కన్నీటి దీపాలు, ఎవరుదోషి, ఆరని కన్నీరు, ఐ.పి.సి.302, దైవ శాసనం, రూమ్ నం.3, విడాకులు, సుడిగాలి* మొదలైన వాటిని ప్రదర్శించింది. సమాజంలోని సభ్యులు ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలలో స్థిరపడడం కారణంగా కొంతకాలం ప్రదర్శనలు ఏర్పాటు చేయలేకపోయింది. సమితి ప్రారంభించిన ముఖ్యుడు నల్లా సత్యనారాయణ 1976, జనవరిలో శ్రీ చెన్నమల్లేశ్వరా కళాపరిషత్తు పేరుతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ప్రారంభించాడు. పరిషత్తు పక్షాన నాటికలే కాకుండా నాటకాలను కూడా ప్రదర్శించాలనీ, ప్రదర్శించిన ప్రతి నాటిక, నాటకానికి పారితోషికం చెల్లించాలనే నియమాన్ని పాటిస్తూ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్న సంస్థ శ్రీ చెన్నమల్లేశ్వరా కళాపరిషత్తు. ఈ పరిషత్తు కార్యదర్శి పాదం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పంటెద్దు నాగేశ్వరరావు, ముచ్చర్ల వెంకటస్వామి నాయుడు, పాదం రాజా సహాయ కార్యదర్శులు, నల్లాస్వామి కోశాధికారుల నేతృత్వంలో ప్రతి ఏటా రాష్ట్రస్థాయి నాటక, నాటిక పోటీలను నిర్వహిస్తూ కళారంగానికి సేవ చేస్తోంది.

దాసరి.ఎన్.

శ్రీ తారా నాట్యమండలి – వేజండ్ల : కుటుంబపరంగా నడుపుతున్న సురభి నాటక సమాజాలను చూసి, రెండు కుటుంబాల వారు కలిసి, తారా నాట్యమండలిని ఏర్పాటు చేశారు. ఈ సమాజాన్ని తారాబాయి నిర్వహించింది. దీన్ని 1945లో స్థాపించారు. ఇందులో అందరూ కుటుంబ సభ్యులే. రంగస్థలాన్ని నిర్మించుకొనడం, అలంకరించటం, మేకప్, సంగీతం, లైటింగ్, వేషధారణ, అన్ని పనులు వీరే నిర్వహించుకునేవారు. వీరిని చూసి మరి కొన్ని కుటుంబాల వారు సమాజాలు ఏర్పాటుచేసుకున్నారు. ఈ విధంగా కుటుంబ పరమైన సమాజాలు ఏర్పడి కొంత కాలం పని చేసి, కాలగర్భంలో కలిసిపోయాయి. మామిడి వేంకటస్వామి. సి.ఆర్.దాస్, మామిడి కృష్ణమూర్తి, గడ్డం చిన వీరాస్వామి, మామిడి కుటుంబరావు, గడ్డం రామలింగం, చింతల చెరువు రామారావు, చింతల చెరువు భాస్కరరావు, చింతల చెరువు నాగేంద్రం, అత్తోట ప్రభాకర్, మదన మోహనరెడ్డి, కె. నాగయ్య, మామిడి మురహరి, తారాబాయి, కోటేశ్వరి, పుష్పాంజలి మొదలైనవారు ఈ సమాజంలో సభ్యులు.

లవకుశ, బాల నాగమ్మ, కృష్ణ లీలలు, తెలుగుతల్లి మొదలైనవి ప్రదర్శించారు. దర్శకత్వం సి.ఆర్.దాస్, సంగీతం అత్తోట జక్రయ్య నిర్వహించేవారు.

నే.ప.శ

శ్రీనివాస చక్రవర్తి (జ.1911–1976) : అభ్యుదయ రచయిత, నాటక విమర్శకుడు, నాటక విద్యాలయ ప్రధానాచార్యుడు, పత్రికా రచయిత, వ్యాసకర్త, అనువాదకుడు. అసలు పేరు చక్రవర్తుల వేంకట శ్రీనివాస రంగ రాఘవాచార్యులు. ఈయన 1911, మార్చి 13న కృష్ణాజిల్లాలోని గడ్డిపాడు గ్రామంలో జన్మించాడు. చిన్నతనం నుంచీ నాటకాలంటే ప్రాణం. ప్రాచ్య, పాశ్చాత్య నాటక రీతులను అధ్యయనం చేసి ఆ విజ్ఞానాన్ని తెలుగువారికి అందించాలని జీవిత కాలమంతా తపించిన మేధావి, కళాహృదయుడు. ఈయన వెలువరించిన వ్యాసాలు అసంఖ్యాకం. చిన్నవీ పెద్దవీ సుమారు 60 గ్రంథాలు

ప్రచురించాడు. వీరి ప్రసిద్ధ రచనలు నాట్యశాల, అభినయం, నాటక పోటీలు, ఆంధ్ర నాటక సమీక్ష, నాటక దర్శిని. ఇతర భాషల నుంచి నీటి కాకి, పతిత జీవులు, లోభి, జైత్రయాత్ర మొదలైన నాటకాలను ప్రతిభావంతంగా అనువదించాడు. చక్రవర్తి విమర్శనా గ్రంథాలు నటలోకానికి వెలుగుబాటలు, ముందుతరాల వారికి కరదీపికలు. ఈ తెలుగు నాటక విజ్ఞాన సర్వస్వం నిర్మాణానికి శ్రీ కారం చుట్టినవారు శ్రీనివాస చక్రవర్తే. ఈయన 1976, జులై 27న హైదరాబాదులో తుదిశ్వాస విడిచాడు.

గం.సు.రె.

శ్రీనివాస దీక్షిత్: చూ. దీక్షిత్, డి. ఎస్

శ్రీనివాసన్, కందాడై (1874-1923) : నటుడు, సంస్కృతాంధ్ర, తమిళాంగ్ల భాషా నిష్ణాతుడు, అధ్యాపకుడు, జాతీయవాది. వ్యవహారిక నామం దొరసామి. అభినవ దుష్యంత బిరుదాంకితుడైన కందాడై 1874లో నెల్లూరులో జన్మించాడు. విద్యార్థిదశలోనే నాటకరంగం ఆకర్షించడంతో 16వ ఏట అంటే 1890లో షేక్స్పియర్ మర్చంట్ ఆఫ్ వెనీస్ నాటకంలో పోర్షియా పాత్ర (స్త్రీ పాత్ర) ధరించడంతో ఈయన నాటక జీవితం ప్రారంభమైంది. 1894లో దుష్యంతుడు పాత్రలో నటించి ప్రేక్షకుల మెప్పు పొంది మహానటుడని పేరు గడించాడు. తరువాత మదరాసు సుగుణ విలాస సభలో చేరి తెలుగు నాటకాలలో ప్రధాన పాత్రలు ధరించాడు. 1898లో హరిశ్చంద్రుడు పాత్రతో ఈయన కీర్తి ఆంధ్రదేశమంతటా వ్యాపించింది. 1901లో జటాప్రోలు సంస్థానాధీశుల సమక్షంలో దుష్యంత పాత్ర నటించి మెప్పు పొంది సన్మానితుడయ్యాడు.



1910 నుంచి 1918 వరకు శ్రీనివాసన్ మదరాసు పచ్చయప్ప కళాశాలలో ఆచార్యుడిగా పనిచేశాడు. ఆ కాలంలో సుమనోరంజని నాటక సమాజంలో తెలుగు, తమిళ నాటకాలలో నటించాడు. 1915లో నెల్లూరులో వేదం వేంకటరాయశాస్త్రి సమాజంలో చేరి ఆయన ఆచార్యత్వంలో సంస్కృత నాటకానువాదాల్ని ప్రదర్శించాడు. అన్నింటిలోనూ ఈయనే నాయకుడు. ఆ తరువాత వేదం వారికి, ఈయనకు మనస్పర్థలు వచ్చి ఆంధ్రభాషాభిమానం నుంచి వైదొలగి సింహపురి సుగుణ విలాస సభను స్థాపించి, సరస్వతి రంగస్వామిని కలుపుకొని చాలా నాటకాలు ప్రదర్శించారు. ఈయన నటనా కౌశలానికి మెచ్చి నెల్లూరు పౌరులు సువర్ణఘంటా ప్రదానం చేసి అభినవ దుష్యంతుడు బిరుదుతో సన్మానించారు.

ఈయన జాతీయవాది కావడం వల్ల 1921లో సహాయ నిరాకరణోద్యమంలో చేరిరెండు సంవత్సరాలు కారాగార శిక్షను అనుభవించాడు. కారాగారం నుంచి విముక్తుడై అవిరామంగా తిలక్ స్వరాజ్యనిధికి మానవతి నాటకం ప్రదర్శించాడు. శ్రీనివాసన్ కేవలం సంస్కృత భాషలోనే కాక నాటకాలంకార శాస్త్రంలో నిధి. సంస్కృత నాటక ప్రియుడు. ఈయన జాతీయభావం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాలేదు. నాటక రంగానికి కూడా విస్తరించింది. భరతముని నాట్యశాస్త్రంలో ప్రతిపాదించిన చతుర్విధాభినయ రీతులను నేటి పరిమాణ నాటక రంగానికి అన్వయించి ప్రదర్శించాలనే ఉద్యమానికి అండగా నిలిచాడు. ఆ రీతినే అభినయించి కీర్తి పొందాడు.

రాజ పాత్రధారణ ఈయన సొమ్ము. సంగీతంలో మంచి ప్రవేశముండేది. పద్యాలు తాపీగా, రసవంతంగా, రంజకంగా పాడేవాడు. ఈయన ఆహార్యాభినయంలో కూడా నేర్పరి. కోటు వేసుకునే తీరు దగ్గర నుంచి టోపాలు పెట్టడం వరకు అంతా కరతలామలకం. ఈయన రసవాది, ఆదర్శవాది.

దుష్యంతుడు, అనిరుద్ధుడు, వత్సరాజు, జీమూతవాహనుడు, నలుడు, ప్రతాపరుద్రుడు, యమునుడు, హరిశ్చంద్రుడు, రంగారావు, హిరణ్యకశిపుడు, పృథ్వీరాజు, శ్రీనివాసులు, గోపాలరావు (మానవతి), పోర్షియా, శకుంతల వంటి పాత్రలలో నటించిన శ్రీనివాసన్ 1923లో మరణించాడు.

శ్రీ.చ.

శ్రీనివాసరావు, ఆవుల (జ.1931) : నటుడు, నాటక రచయిత, గూడూరు సంస్కృతీ సమ్మేళనం సమాజం స్థాపకులలో ముఖ్యుడు. ఉలిపి కట్టె నాటిక రచయితగా ప్రసిద్ధుడు. ఈయన నెల్లూరులో 1931, మే 4న జన్మించాడు. 1950 నుంచీ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, గూడూరులో స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు.

శ్రీనివాసరావు సహజ నటుడు. తనకున్న రంగస్థల అనుభవంతో మొదటిసారిగ ఉలిపికట్టె అనే చక్కటి హాస్య నాటికను 1964లో రచించాడు.

1965లో హైదరాబాదులో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు పోటీలలో ఉత్తమ ప్రదర్శనకు ఈ నాటిక బహుమతి అందుకుంది. గూడూరు, మద్రాసు పరిషత్తులలో కూడా

ఉలిపికట్టెకు ప్రధాన స్థానం లభించింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కొర్రపాటి గంగాధరరావు సంపాదకత్వంలో ప్రచురించిన నాటికా పంచవింశతి లో ఉలిపి కట్టెకు కూడా స్థానం లభించింది. ప్రసిద్ధ రంగస్థల నటుడు ఎ. శివరామిరెడ్డి బృందం ఈ నాటికను అనేక చోట్ల ప్రదర్శించి బహుళ ప్రశంసలు అందుకుంది.

చైనా దురాక్రమణ మీద ఆవుల రచించిన ప్రతిష్ఠ నాటిక కూడా ప్రేక్షకుల ఆభిమానాన్ని చూరగొన్నది. ఆశాపాశం అనే నాటకం, సైకిలాబ్ నాటిక ఈయన ఇతర రచనలు. ఇవేగాక ప్రత్యేకంగా పిల్లల కోసం ప్రదర్శన యోగ్యమైన కొన్ని గేయ నాటికలను కూడా రచించాడు.

ఔత్సాహిక కళాకారులకు తగిన సలహాలు సూచిస్తూ వారిని ప్రోత్సహిస్తూ నాటక కళాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతున్నాడు.

గం.సు.రె.

శ్రీనివాసరావు, కోలాచలం (1854-1914) : ప్రసిద్ధ నాటక రచయిత. సుమనోరమ సభ స్థాపకుడు. వాణీ విలాస నాటక సంస్థ స్థాపకుడు. పత్రికా సంపాదకుడు. కోలాచలం శ్రీనివాసరావు ఆంధ్ర నాటకవాఙ్మయానికీ, ఆంధ్ర నాటక రంగానికి చేసిన సేవ అనన్య సామాన్యం, అనితరసాధ్యం. స్వతంత్ర నాటకకర్తగా, నాటక సమాజాధిపతిగా, అత్యుత్తమ నాటక నిర్మాతగా, ప్రాచ్య పాశ్చాత్య నాటక ప్రథమ శ్రేణి విమర్శకుడుగా ఒక ఉన్నత స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. బహుళాంధ్ర జనాదరణకు పాత్రమై, ప్రసిద్ధి పొందిన రామరాజు చరిత్రం (The Fall of Vijayanagaram) మొదలుకొని ఇరవై ఎనిమిది నాటకాలు రచించాడు. సుమనోరమ సభ నాటక సమాజాన్ని స్థాపించి, వాణీ విలాస నాటక శాలను నిర్మింపజేసి, తన నాటక పరిజ్ఞానాన్ని తెలియ జేస్తూ ప్రపంచ నాటక చరిత్ర (The Dramatic History of The World) ను ఆంగ్లంలో రచించాడు. నాటికీ ఈ నాటికీ అలాంటి ప్రయత్నంలో ప్రథముడు. ఇతర నాటక కర్తలెవరూ రచించనన్ని అధిక సంఖ్యలో చారిత్రక నాటక రచనలు చేసి ఆంధ్ర చరిత్ర నాటక పితామహుడని ప్రఖ్యాతి గడించాడు.



సంస్కృత కావ్య వ్యాఖ్యాతగా ప్రసిద్ధి పొందిన కోలాచలం మల్లినాథ సూరి వంశీయుడు. విరూపాక్షక్షేత్రంలో కములాపురమనే గ్రామంలో 1854, జూన్ 13న అచ్చమాంబ, సేతుపతులకు జన్మించాడు. తొమ్మిదేళ్ల వయస్సులోనే తండ్రి గతించాడు. తరువాత బావ తిన్న వేలికుమారస్వామి, అన్న వెంకటరావు, శ్రీనివాస రావుల నిద్దరిని బళ్లారికి తీసుకొని వచ్చి చదువు చెప్పించాడు. విద్యాభ్యాసానంతరం కొంతకాలం గుత్తి, అనంతపురంలో ఉద్యోగించి, అది రుచించక, 1892లో బళ్లారిలోనే అన్న వెంకటరావుతో పాటు న్యాయవాద వృత్తి అవలంబించాడు. అదే ఆయన నాటక సాహిత్య వ్యాసంగానికి నాంది అయింది. ఈయన రచనా వ్యాసంగం కేవలం నాటకాలకే పరిమితం కాలేదు. వేదార్థ చంద్రిక పేర మాస పత్రిక 1914 నుంచి ప్రకటించి ప్రారంభించాడు. వేదాలపై పరిశోధనాత్మకంగా 16 ప్రసంగాలు ఇంకా ఇతర అంశాలపై వ్యాసాలు అనేకం రచించాడు. అవి తదనంతర కాలంలో ముద్రించబడ్డాయి. అన్న వెంకటరావు సహాయ సహకారాలతో బళ్లారిలో ప్రప్రథమంగా వాణీ విలాస నాటకశాలను నిర్మింపజేశాడు. ఈ నాటకశాలను బాలగంగాధర తిలక్ 1905లో ప్రారంభించాడు. అగస్త్య బాల భారత కావ్యాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి (పద్య) అనువదించాడు.

సుల్తానా చాందుబీ, రామరాజు చరిత్రం, శిలాదిత్య, మైసూరు రాజ్యాభివృద్ధి, ప్రతాపాక్బరీయం, చంద్రగిర్యభ్యుదయం, కాళిదాసు నాటకాలు ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడుగా ఖ్యాతి తెచ్చి పెట్టాయి. వాస్తవానికి పౌరాణిక నాటకాలే ఎక్కువ. శ్రీ రామజననం, సీతాకల్యాణము, పాదుకా పట్టాభిషేకం, లంకాదహనం, కుశలవ అనే రామాయణ నాటకాలూ; ద్రౌపదీ వస్త్రాపహరణం, కీచక వధ, శిరోమణి, బభ్రువాహన లేక అర్జున గర్వభంగం, చంద్రహాస వంటి భాగవత నాటకాలను రచించటమే కాకుండా, రాక్షసీ మహత్వాకాంక్ష, మానాపమానం, మరాఠీ భాషలో ప్రసిద్ధి పొందిన ఈ రెండు నాటకాలను తెలుగులోకి అనువదించాడు. నాచిపార్టీ, అన్యాయధ్యపురి మహిమ మొదలైన ప్రహసనాలు వెలువరించాడు.

శ్రీనివాసరావు నాటకాలలో ప్రసిద్ధమైనవి రామరాజు చరిత్రం, పాదుకా పట్టాభిషేకం. కుశలవ శిరోమణి, ప్రహ్లాద, సత్యహరిశ్చంద్రీయం, రుక్మాంగద రామరాజు చరిత్రలో ముఖ్యభూమిక పఠాన్ పాత్రలో బళ్లారి రాఘవ జీవించి నాటక కర్తకు, తనకు అత్యంత ఘనకీర్తి సంపాదించాడు. సజీవ పాత్రచిత్రణ, సముచిత సన్నివేశ కల్పన, సంభాషణా చాతుర్యం,

నాటకీయ శిల్పాన్ని పరిరక్షించిన ఘనత శ్రీనవాసరావుది. షేక్స్పియర్ నాటకాల్లోని విషాద నాటక లక్షణాలను ప్రవేశపెట్టడం వల్ల, బళ్లారి రాఘవ సహజ నటనా చాతుర్యంతో ఎంతో ప్రసిద్ధి పొందింది ఈ నాటకం.

శ్రీనివాసరావు ఉత్తమ నాటక కర్తగా, కవిగా, ఆంధ్రాంగ్ల నాటక, వేద భగవద్గీత విమర్శకుడుగా, పరిశోధకుడుగా, బహుభాషా వేత్తగా ప్రసిద్ధి పొంది 1914లో జూన్ 23న పరమపదించాడు. బళ్లారిలో ధర్మవరం రామకృష్ణ మాచార్యుల సరస వినోదిని సభకు పోటీగా సుమనోరమ సభను ఏర్పాటు చేసి జీవితాంతం నిర్వహించి నాటక రచనా ప్రయోగాలకు ఒరవడి పెట్టిన మహనీయుడు కోలాచలం శ్రీనివాసరావు.

గంగప్ప

శ్రీనివాసరావు, మంత్రి (1928-1974) : ప్రసిద్ధ నటుడు, దర్శకుడు, నాటక రంగ వికాసానికి బహుముఖ సేవలు అందించి సంపన్న వంతం చేసిన నాటక కళాసేవకులలో మంత్రి శ్రీనివాస రావు గణనీయుడు. రాజ్యలక్ష్మి, రామచంద్ర రావు దంపతులకు రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలం, బచ్చుపల్లె గ్రామంలో 1928 జనవరి 1న జన్మించాడు. ముఫేదుల్ హైస్కూల్‌లోను, నిజాం కళాశాలలోను విద్యాభ్యాసం సాగింది. రాజనీతి శాస్త్రంలో ఎం.ఏ పట్టాపొందాడు. హైస్కూలు స్థాయిలోనే నాటకరంగం మీద మక్కువ ఏర్పడింది. ఎంతో నేర్చుకోవాలనీ, నాటక రంగానికి మరెంతో చేయాలనే తపన మొదలైంది. మిత్రులు ఎ.ఆర్.కృష్ణ, పన్నూరి రామారావు మొదలైన రంగస్థల ప్రముఖుల సహచర్యంతో తన ఆశలకు రెక్కలచ్చాయి. ఎ.ఆర్. కృష్ణబృందంతో కలిసి బవమ్మరిల్లు, వీలునావమా మొదలైన నాటకాలను హైదరాబాదు, కడప, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాలలో ప్రదర్శించి గుర్తింపు తెచ్చుకొన్నాడు. 1951లో ప్రఖ్యాత కవి, రంగస్థల నిపుణుడైన అబ్బూరి రామకృష్ణారావుతో కలిగిన పరిచయం శ్రీనివాసరావును ఎంతో ప్రభావితం చేసి, మార్గనిర్దేశం చేసింది. అబ్బూరి నిర్వహణలో ముద్రారాక్షసం, కన్యాశుల్కం నాటకాలలో పాల్గన్నాడు. సమాచార శాఖలో పౌరసంబంధాధికారిగా కొంతకాలం పనిచేశాడు. వేతన నష్టం మీద ఒక సంవత్సరం సెలవు పెట్టి, నాటకకళలో ప్రముఖ బ్రిటిష్‌నాటకరంగ నిపుణుడు హెర్బర్ట్ మార్షల్ ఆధ్వర్యంలో బంబాయిలో జరిగిన నట శిక్షణా కార్యక్రమంలో పాల్గని నటనలో మెలకువలు నేర్చుకొన్నాడు.

ఎ.ఆర్. కృష్ణ దర్శకత్వంలో, గోగోల్ రచించిన ఇన్‌స్పెక్టర్ జనరల్‌లో పోస్టుమాస్టర్‌గా తమిళ తెలుగు మిళితమైన యాసలో మాట్లాడి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించాడు. 1956-58లలో తెలంగాణా ప్రాంతాల్లో ఈ నాటకాన్ని ఇరవై సార్లు ప్రదర్శించాడు. గుడివాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలోనూ ఈ నాటకాన్ని హృద్యంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నాడు. 1963లో లండన్ బ్రిటిష్ డ్రామాలీగ్‌లో అసోసియేట్ ఆఫ్ డ్రామా బోర్డు కోర్సు చేశాడు. ఆ సమయంలో నాటక రంగానికి సంబంధించిన అనేక పాశ్చాత్య గ్రంథాలను చదివి నాటక విజ్ఞానాన్ని పెంపొందించుకున్నాడు. తెలుగు నాటకరంగంలో కొత్త పోకడలను ప్రవేశపెట్టడానికి ఆ విజ్ఞానం ఎంతో తోడ్పడింది.

నటశిక్షణ కోసం హైదరాబాద్‌లో ప్రారంభమైన నాట్య విద్యాలయంలో శ్రీనివాసరావు ప్రముఖ పాత్ర వహించాడు. అబ్బూరి రామకృష్ణారావు, ఎ.ఆర్.కృష్ణ వంటి రంగస్థల ప్రముఖులతో కలిసి అధ్యాపకుడుగా పనిచేశాడు. శిక్షణా తరగతులు నిర్వహించాడు. శ్రీశ్రీ రచించిన విదూషకుని ఆత్మహత్య, కుందుర్తి రాసిన ఆశ వంటి నాటక నాటికల విజయం వెనక మంత్రి శ్రీనివాస రావు పాత్ర ఎంతో ఉంది. ఆనాటి నాట్య విద్యాలయంలో శిక్షణ పొందిన విద్యార్థులు తదనంతర కాలంలో నాటక రంగంలో పేరు ప్రతిష్ఠలు ఆర్జించారు. ఇంటర్మీడియట్ విదార్థులకోసం రంగస్థల శాస్త్రం పేరుతో పాఠ్యగ్రంథాల్ని రూపొందించడానికి తనవంతు కృషిచేశాడు. పునర్ముద్రణలు పొందుతూ ఈ నాటికీ ఆ పుస్తకం నట విద్యార్థులకు పెద్ద బాలశిక్షలా ఎంతో ఉపయోగకరంగా ఉంది.

ఆంధ్రవిశ్వవిద్యాలయం రంగస్థల కళలశాఖలో చేరి శాఖాధిపతిగా ఎనిమిదేళ్ళ పాటు పనిచేశాడు. ఆయన పర్యవేక్షణలో వందలాది మంది విద్యార్థులు నటశిక్షణ పొందారు. నాటక రంగంలో నిర్మాణాత్మకంగా సేవలు అందించిన శ్రీనివాస రావు 1974లో అస్వస్థతకులోనై, అక్టోబర్ 9న విశాఖ పట్టణంలో తుది శ్వాస విడిచాడు.

కె.బి.రాజు

శ్రీనివాసాచార్యులు, గోమఠం, సి.వి. (1842-1922): నటుడు, నాటకకర్త, దర్శకుడు, వాగ్గేయకారుడు, సంస్కృతాంధ్రాంగ్ల భాషా పండితుడు. ఆంధ్రా గారిక్, నటచక్రవర్తి బిరుదాంకితుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి.

తమిళనాడులోని చంగల్పట్టు జిల్లా వేలమూరు గ్రామంలో 1842లో జన్మించాడు. చిన్నతనం నుంచి సంగీతం అభ్యసించాడు. సంస్కృతాంధ్ర భాషలలో నేర్పు సంపాదించాడు. క్షేత్రయ్య పదాలను బాగా ప్రచారంలోకి తెచ్చాడు. 1863లో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడై ముత్యాలపేట స్కూలులో ఉపాధ్యాయుడుగా పని చేశాడు. 1875-76లో బంబాయి పార్శీ, విక్టోరియా థియేట్రికల్ కంపెనీ మదరాసులో ప్రదర్శించిన నాటకాలు చూసిన తరువాత ఈయనకు నాటకాలాడాలనే ఉత్సుకత కలిగి, మద్రాసు ఓరియంటల్ డ్రమెటిక్ కంపెనీ స్థాపించి, నాటకాలు ప్రదర్శించాడు. దీనికి ఈయనే దర్శకుడు, ప్రధాన పాత్రధారుడు. 1880లో ఈయన దుష్యంతుడు భూమికను చూసి ముగ్ధులై

మద్రాసు గవర్నర్ బకింగ్ హాం ప్రభువు ఈయనకు 'ఆంధ్రా గారిక్' బిరుదునిచ్చాడు. ఆ ప్రదర్శన చూసిన విజయనగరాధీశుడు ఆనందగజపతి తన నగరానికి తీసుకు వెళ్ళాడు. విజయనగరంలో 1882 నుంచి 1897 వరకు నివసించి 'జగన్నాథ విలాసినీ' నాటక సమాజం పక్షాన సంస్కృత నాటకాలు, ఆంగ్ల హరిశ్చంద్ర నాటకం ప్రదర్శింపచేశాడు. ఆంగ్లగేయాలకు కర్ణాటక సంగీతం మేళవించడం ఆంగ్ల సత్యహరిశ్చంద్రలో ఒక ప్రత్యేకత. దుష్యంత, రామాది నాయక పాత్రలేగాక పెంకి పంతులు మొదలైన ప్రహసనాలలో సామాన్య పాత్రలు కూడా ధరించి మెప్పించాడు. 1898లో తిరిగి మద్రాసు వెళ్ళి ఓరియంటల్ డ్రమెటిక్ కంపెనీ పునరుద్ధరించి ఆంగ్ల సత్యహరిశ్చంద్ర, కమలాపహరణం (1920), పెంకి పంతులు, స్త్రీ చాతుర్యం, స్త్రీ సాహసం ప్రదర్శించాడు.

సూర్యాలోకమనే పత్రికకు కొంత కాలం సంపాదకత్వం వహించిన గోమఠం 1922లో మరణించాడు.

శ్రీ.చ

శ్రీ ప్రభాకర నాట్య మండలి (గుడివాడ) : ఆరు దశాబ్దాలుగా గుడివాడలో నిర్విఘ్నంగా కొనసాగుతున్న శ్రీ ప్రభాకర నాట్యమండలి వ్యవస్థాపకుడు పామర్తి సుబ్బారావు. ప్రారంభ దశలో సూరపనేని ప్రభాకర రావు, హెచ్.వి. చలపతి రావు ఈ సమాజానికి అండగా నిలిచి దీని అభివృద్ధికి బాటలు వేశారు. ఈ సమాజం 1942లో స్థాపించబడింది. 1992లో స్వర్ణోత్సవం చేసుకొంది. మొదట్లో ఈ సంస్థ పద్య నాటకాలను చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలిచ్చింది. బబ్బిలియుద్ధం, మహాకవి కాళిదాసు, తెలుగుతల్లి , రంగూన్ రౌడీ, ప్రేమలీల మొదలైన నాటకాలను జనరంజకంగా ప్రదర్శించి రసజ్ఞుల ప్రశంసలందుకొంది. ప్రభాకర నాట్యమండలి నాటకాలన్నీ పామర్తి సుబ్బారావు దర్శకత్వంలోనే రూపుదిద్దుకొని ప్రదర్శింపబడ్డాయి.

ఆంధ్రదేశంలో పలుచోట్ల నాటక పోటీలు ఉధృతంగా సాగుతున్నందువల్ల ప్రభాకర నాట్యమండలి కూడా ఆ ప్రవాహంలోకి ఉరికింది. ఆంధ్ర నాటక కళా పరిషత్తు శంఖారావం అందుకొని పోటీలలో పాల్గని ఎన్నో బహుమతులు పొందింది. పల్లెపడుచు నాటకానికి ఈ సంస్థే విశేష ఖ్యాతిని ఆర్జించి పెట్టింది. 1948లో ఆంధ్ర నాటకకళా పరిషత్తు పోటీలలో ఆత్రేయ రాసిన ఎవరు దొంగ నాటికను ప్రదర్శించి ప్రదర్శనకు, దర్శకత్వానికి, ఉత్తమ నటనకు బహుమతులు గెలుచుకుంది. 1961లో గుడివాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలలో సుల్తానీ నాటికను అత్యద్భుతంగా ప్రదర్శించి, సంచలనం కలిగించింది. సుల్తానీ నాటికను ప్రదర్శిస్తే ప్రభాకర నాట్య మండలి వారే ప్రదర్శించాలి అనే దృఢాభిప్రాయం ప్రజల్లో నాటుకు పోయింది. గొల్లపూడి మారుతీరావు కళ్ళు నాటిక కూడా పామర్తి దర్శకత్వంలో వెలుగులు వెదజల్లింది. పామర్తి సుబ్బారావు దర్శకత్వంలో రాణించని నాటకం గానీ, నాటిక గానీ లేదని చెప్పడం సత్యదూరం కాదు. దాసరి తిలకం, కొమరిగిరి, రామతిలకం, టేకు అనసూయ, పువ్వుల అనసూయ పామర్తి దర్శకత్వంలో తమ అభినయ కౌశలానికి మెరుగులు దిద్దుకొన్నవారే. చలనచిత్ర రంగంలో ప్రసిద్ధిగాంచిన కైకాల సత్యనారాయణ నటనలో ఓనమాలు దిద్దుకొన్నది శ్రీ ప్రభాకర నాట్య మండలి లోనే. గేయ రచయిత జాలాది, పుష్పకుమారి, రేడియో ఏకాంబరంగా ప్రసిద్ధులైన వి. సత్యనారాయణ ఈ సంస్థ నుంచి ఎదిగినవారే.

ఎన్ని ఆటంకాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభాకర నాట్యమండలి అన్నిటినీ భరిస్తూ, ఏటికి ఎదురీదుతూ ముందుకు నడిచి దక్షతకు, నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది ప్రభాకర నాట్యమండలి.

గం.సు.రె.

శ్రీ భవానీ నాట్య మండలి (తెనాలి) : 1947లో కుప్పా సూర్యనారాయణ, సి.వి.చలపతిరావు ఈ సమాజాన్ని ప్రారంభించారు. ముప్పవరపు భీమారావు, అచ్చిరాజు గణపతి, సి.వి. చలపతిరావు, నెల్లూరు సత్యనారాయణ, మైనేపల్లి శ్రీ రామ మూర్తి, పులిపాటి లక్ష్మీనారాయణ, నందిరాజు రాఘవయ్య, పిల్లలమర్రి రాధాకృష్ణమూర్తి, మద్దెల పంచనాదం, కుప్పా సూర్యనారాయణ, కోమలి, పువ్వుల అనసూయ, మాలతి, ఈ సమాజం ప్రదర్శించే ప్రదర్శనలలో వివిధ పాత్రలు ధరించారు. *శ్రీ కృష్ణ రాయబారం, ప్రేమలీలలు, రంగూన్ రౌడి* నాటకాలు ప్రదర్శించారు. కుప్పా సూర్యనారాయణ గ్రామఫోను రికార్డులు ఇచ్చాడు. నెల్లూరు సత్యనారాయణ *రంగూన్ రౌడి* పాత్రలో నటించి ప్రఖ్యాత నటుడుగా పేరు తెచ్చుకొన్నాడు. ఆ రోజుల్లో *రంగూన్ రౌడి* నాటకాన్ని ప్రజలు బాగా ఆదరించారు.

నే.ప.శ.

శ్రీమన్నారాయణ శర్మ, చింతా (జ.1931) : రంగస్థల నటుడు, ఉపాధ్యాయుడు. శ్రీ రామకృష్ణ నాట్యమండలి స్థాపకుడు. 1931, అక్టోబరు 27వ తేదీన ఈయన రాధాకృష్ణమూర్తి, అన్నపూర్ణమ్మ దంపతులకు కృష్ణాజిల్లా కూచిపూడిలో జన్మించాడు. బాల్యంలోనే తల్లి మరణించడంతో శర్మను రాధా కృష్ణమూర్తి సోదరుడు ఆదినారాయణ శర్మ దత్తతతీసుకున్నాడు. కూచిపూడి భాగవతుల కుటుంబంలో జన్మించడం వల్ల కళల పట్ల అభిమానం పెంచుకున్నాడు. మహాకాళి శ్రీరామవర్మ దర్శకత్వంలో ప్రదర్శింపబడ్డ పాలేరు నాటకంలో కథానాయిక అన్న పాత్ర ద్వారా రంగస్థలంపై అడుగుపెట్టాడు. కుటుంబ సభ్యులు నటనలో రాణించడం కష్టమని వారించడంతో వారి సలహా మేరకు 1950లో బందరులో ఉపాధ్యాయుడిగా చేరాడు.

బందరు పురపాలక సంఘం ఉద్యోగుల సంఘం నాటకాలు ప్రదర్శిస్తున్న విషయం గమనించిన శ్రీమన్నారాయణ శర్మ 'కళాప్రగతి'లో చేరి నటించడం ప్రారం భించాడు. వివిధ పరిషత్తులు నిర్వహించిన ప్రదర్శన లలో పాల్గ న్నాడు, బహుమతులు అందుకున్నాడు. నీలిమబ్బు లోని ఆఫీసర్, కళాకార్ లోని కుంటి పాత్ర, పల్లెపడుచు లోని చంద్రం, వెంకన్న కాపురం లోని వెంకన్న పాత్రలు ఈయనకు నటుడిగా గుర్తింపును తెచ్చాయి. ఇవే కాకుండా అరకులోయ, వాంటెడ్ ఫాదర్స్, తిరుగుటపా లలో నటించాడు. 1970 దాకా సాంఘిక నాటక, నాటికలలో నటించిన శ్రీమన్నారాయణ శర్మ జె.వై. దాసు అనే హార్మోనిస్టు పరిచయంతో పౌరాణిక నాటకాలవైపు మొగ్గు చూపాడు. ఆయన దగ్గర పద్య పఠనంలో శిక్షణ పొంది సత్యహరిశ్చంద్ర లో హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు, శ్రీకృష్ణ రాయబారం లో దుర్యోధనుడు, కాళిదాసు లో భోజరాజు, మోహినీ భస్మాసుర లో భస్మాసురుడు పాత్రలలో నటించాడు. 'అభినవ భస్మాసుర' బిరుదును అందుకున్నాడు. బంగారు, నగదు బహుమతులు గెలుచుకున్నాడు. పౌరాణిక నటులకు శిక్షణ అవసరమని భావించిన శర్మ 1980లో శ్రీరామకృష్ణ నాట్యమండలిని స్థాపించి, యువ కళాకారులను తీర్చిదిద్దుతున్నాడు. కళారంగ వికాసం కోసం కృషిచేస్తున్న శ్రీమన్నారాయణశర్మను 1996, డిసెంబరు 16న కూచిపూడిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఘనంగా సన్మానించింది.



మన్నెశ్రీ

శ్రీమన్నారాయణ, వలివేటి (మ. 1946) : ఔత్సాహిక నటుడు, వృత్తి తెలుగు అధ్యాపకత్వం. స్వస్థలం బ్రాహ్మణ కోడూరు. స్ఫురద్రూపి, రాజవేషాలకు సరిపడే అంగ సౌష్టవం. ప్రతి పాత్రనూ చక్కగా మలచుకొని తనకు సంతృప్తి కలిగేవరకు రంగస్థలం మీద ప్రదర్శించేవాడు కాదు. మొట్ట మొదట గుంటూరు అఫీషియల్ డ్రమెటిక్ కంపెనీలోనూ, తరువాత మాధవపెద్ది వెంకట్రామయ్య స్థాపించిన 'శ్రీకృష్ణనాట్యసభ' లోనూ ప్రధాన పాత్రలలో నటించాడు. అప్పుడప్పుడు డి.వి. సుబ్బారావుతో 'ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ'లో పాండవ విజయంలో అర్జునపాత్ర ధరించియావదాంధ్ర ఖ్యాతి గడించాడు.



సతీ సులోచన సినిమాలో విభీషణ పాత్ర ధరించాడు. ఆంధ్రదేశంలోని మహానటులందరితో కలసి నటించి సెభాష్ అనిపించుకున్నాడు. కర్ణుడు, విజయ రామరాజు, రాజ సింహుడు, ప్రతాపరుద్రుడు, అర్జునుడు, విద్యానాథుడు, దుర్యోధనుడు వంటి పాత్రలలో నటించిన వలివేటి 1946లో మరణించాడు.

శ్రీ.చ.

శ్రీ మహాలక్ష్మి నాట్యమండలి(తెనాలి) : జె. రామమోహన రావు చౌదరి 1958లో ఈ సమాజాన్ని స్థాపించాడు. నాటకాలలో పాత్రధారులకు అవసరమైన దుస్తులను సొంతంగా ఏర్పాటు చేసుకొని, ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా వుండేందుకు ఒక మినీవాన్ ఏర్పాటుచేసుకుని ఆంధ్రదేశమంతా ప్రదర్శనలు ఇస్తూ సంచరించింది. రామాంజనేయ యుద్ధం, చింతామణి, హరిశ్చంద్ర, మోహినీ భస్మాసుర మొదలైన నాటకాలను ప్రదర్శించారు.

జె. రామమోహన్‌రావు చౌదరి, మావిళ్ల పల్లి కోటేశ్వర రావు, ఆకుల వెంకయ్య, టి. రామకృష్ణ శాస్త్రి, నూతక్కి సుబ్బారావు, బి.వి. బ్రహ్మయ్య , టి.వి. యస్.ఆర్. మూర్తి, ఆదిలక్ష్మి, తిరుపతి కుమారి, రాజకుమారి మొదలైనవారు ఈ సమాజ సభ్యులే.

నే.ప.శ.

శ్రీరంజని, మంగళగిరి (1906-1939) : రంగస్థల సినీనటి స్వస్థలం తెనాలి. జననం: 1906. తల్లి వీరలక్ష్మి, తండ్రి వెంకటరామయ్య. ఈమె అసలు పేరు శివరంజని, తరువాత శ్రీరంజనిగా మారింది. ఎలిమెంటరీ స్కూలు విద్య ముగించి మేనత్త దగ్గర సంగీత, భరతనాట్యాదులు అభ్యసించి, నాటక రంగంలో 14వ యేట ప్రవేశించింది. ఈమె సినీ నటి కూడా. ఈమె సినిమాలో సీత వేషం వేసి సీతమ్మ తల్లిగా ప్రఖ్యాతి గడించింది.



సాత్త్వికపాత్రలు ధరించడంలో, శోక రసాభినయంలో మేటి. అసంఖ్యాక నాటక ప్రదర్శనాలలో నటించింది. శ్రీరంజని 1939లో మరణించింది.

శ్రీ.చ.

శ్రీ రాజరాజేశ్వరీ నాట్యమండలి (విజయవాడ) : ఈ సమాజాన్ని 1936లో పువ్వుల సూరిబాబు సత్యన్నారాయణ నాట్యమండలి పేరుతో తెనాలిలో స్థాపించాడు. అయితే సూరిబాబు, విజయవాడ వెళ్లి, రాజేశ్వరితో కలిసి, శ్రీ రాజ రాజేశ్వరీ నాట్యమండలి ఏర్పాటు చేశాడు. పి. సూరిబాబు తన గాన మాధుర్యంతో అశేష ప్రజలను రంజింపచేశాడు. శ్రీరాజరాజేశ్వరీ నాట్యమండలిని కూడా, చాలా సమర్థవంతంగా నడిపాడు. కొన్ని నాటకాలు ప్రత్యేకంగా రాయించుకున్నాడు. సమాజం ప్రదర్శించిన తారాశశాంకం నాటకాన్ని, గ్రామ్ ఫోను కంపెనీ వారు రికార్డులు చేసి అమ్మితే విపరీతంగా కొన్నారు. ఈ సమాజం పక్షాన *తారాశశాంకం, భూకైలాస్, శ్రీకృష్ణ తులాభారం, విప్రనారాయణ, కురుక్షేత్రం* మొదలైన నాటకాలు ప్రదర్శించారు.

పి. సూరిబాబు, మోదుకూరి సుబ్బారావు, బి.వి. బ్రహ్మయ్య, మల్లాది సూర్యనారాయణ, రాజేశ్వరి, పువ్వుల అనసూయ, సరిసీరుహం మొదలైన వారు ఈ సమాజంలోని నటీనటులు. సూరిబాబు మరణంతో ఈ సమాజం కాలగర్భంలో కలిసిపోయింది.

నే.వ.శ.

శ్రీ రాజేశ్వరి నాట్యమండలి (విజయవాడ): గుమ్మడి జయరాజ్ 1980లో ఈ సమాజాన్ని స్థాపించాడు. సమాజ సభ్యులందరూ వృత్తి కళాకారులే.

బాల నాగమ్మ, హరిశ్చంద్ర, భక్తచింతామణి, శ్రీ కృష్ణ తులాభారం, గయోపాఖ్యానం, శ్రీరామాంజనేయ సత్యయుద్ధం నాటకాలను ఈ సమాజం ప్రదర్శించింది. నేటికి దాదాపు 200ల ప్రదర్శనలు నిర్వహించింది. *భక్త చింతామణి, సత్యహరిశ్చంద్ర* గ్రామఫోను రికార్డులుగా రూపొందించింది. ఆల్ ఇండియా రేడియోలోను, దూరదర్శన్‌లోను *భక్తచింతామణి, సత్య హరిశ్చంద్ర* నాటకాలలోని కొన్ని ఘట్టాలు ప్రసారయోగ్యంగా మలచింది. ప్రభుత్వం వారి రంగస్థల నాటకోత్సవాలలో ఈ సమాజ నాటకాలు ప్రదర్శించడం జరిగింది.

నే.వ.శ.

శ్రీరామ అప్పారావు , పోణంగి: (చూ. అప్పారావు పోణంగి శ్రీరామ)

శ్రీ రామకృష్ణనాట్యమండలి (నెల్లూరు) : నెల్లూరు జిల్లా, నెల్లూరు తాలూకాలో పాట్టేపాళెం అనే చిన్నగ్రామంలో కళాభిమానులైన కొందరు పెద్దలు 1932లో శ్రీ రామకృష్ణ నాట్యమండలి కళాసంస్థ స్థాపించారు. వ్యవస్థాపకులు సోమవరపు వెంకటరెడ్డి, పొన్నాల వీరారెడ్డి ప్రభృతులు. సోమవరపు వెంకటరెడ్డి మంచి నటుడు. *శ్రీకృష్ణలీలలు*లో కంసుడు, *రసపుత్రవిజయం* లో ఔరంగజేబు, *లవకుశ*లో రాముడు మున్నగు పాత్రలలో ప్రతిభావంతంగా నటించాడు. గ్రామంలోని యువకులను సమీకరించి, వారికి నటనలో శిక్షణ యిచ్చి, నెల్లూరు జిల్లాలో వివిధ ప్రాంతాలలో నాటకాలు ప్రదర్శించాడు. ఆ తరం గతించాక, 1953 నుండి బాధ్యతలు పొన్నాల రామసుబ్బారెడ్డి స్వీకరించాడు. అప్పటి నుండి శ్రీ రామకృష్ణ నాట్యమండలి కేంద్రం నెల్లూరు అయింది. ఈ నాట్య మండలి మొదట్లో *ఇదా ప్రపంచం, అమర జీవి, పరివర్తన* వంటి సాంఘిక నాటకాలను, *ప్రగతి, ఎవరు దొంగ, తుఫాన్* వంటి నాటికలను ప్రతిభావంతంగా ప్రదర్శించి, నాట్య మండలి కీర్తిని ఇనుమడింపజేసింది. తరువాత పద్యనాటకాలను చేపట్టింది. పొన్నాల సారథ్యంలో ఈ సమాజం *సత్యహరిశ్చంద్ర, రామదాసు, పాదుకా పట్టాభిషేకం, సారంగధర, చిత్రనళీయం* మొదలైన పద్యనాటకాలను అత్యద్భుతంగా ప్రదర్శించి, యావద్భారత కీర్తినార్జించింది. నేటికీ ఈ కళాసంస్థ రంగస్థలం మీద కాంతులు విరజిమ్ముతూ నిత్యనూతనంగా, నవనవోన్మేషంగా నాటక కళా భ్యున్నతికి అహరహం పాటుపడుతూ ఉంది.

గం.సు.రె.

శ్రీరామమూర్తి, అద్దంకి (1898-1968) : రంగస్థల, సినీనటుడు. సంగీత విద్యాంసుడు, సమాజ నిర్వహణ దక్షుడు, నాటక కళా ప్రపూర్ణ బిరుదాంకితుడు. ఈయన విజయవాడలో 1898 సెప్టెంబరు 21న జన్మించాడు.

బాపట్లలో చదువుకునే రోజుల్లోనే బడి పిల్లలు ప్రదర్శించిన *గయోపాఖ్యానం* నాటకంలో ప్రప్రథమంగా సహదేవుడు పాత్రలో నటించాడు. సహదేవుడు పాత్రతో ప్రారంభమైన నట జీవితం దశరథుడి పాత్రతో పరాకాష్ఠ చేరుకుంది. 1913 నుంచి 20 వరకు స్టార్ థియేటర్ సమాజం తరఫున నాటకాలు ప్రదర్శించాడు. ఆ తరువాత వరసగా రాజమండ్రి హిందూనాటక సమాజం, బందరు బాలభారతి సంఘం, మైలవరం మోతే కంపెనీలలో ప్రధాన భూమికలు ధరిస్తూ వచ్చాడు.

కాకినాడలో జరిగిన పాదుకాపట్టాభిషేక నాటకం పోటీలలో ఈయన నటించిన దశరథుడి పాత్రకు సువర్ణ పతకం లభించింది.

10 సంవత్సరాలపాటు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య దగ్గర శాస్త్రీయ సంగీతం అభ్యసించి అనేక పాటకచేరీలు నిర్వహించాడు. పద్యాలు పాడటంలో విశిష్టమైన బాణీ సృష్టించుకున్నాడు. ఎంతటి పద్యమైనా ఇట్టే అర్థమైపోతుంది. నాటకరంగంలో స్వైర విహారం చేసి ప్రేక్షకలోకాన్ని సమ్మోహన పరచిన అద్దంకి అవసాన దశలో పక్షవాతంతో బాధపడి 1968లో నటరాజులో ఐక్యమయ్యాడు.

శ్రీ.చ

శ్రీరామమూర్తి, గురజాడ (1851-1899) : నాటక కర్త. విద్వత్కవి. విజయ నగరం ఆస్థాన విద్వాంసుడు. రాజయోగి, పత్రికాధిపతి. తండ్రి దుర్గా ప్రసాదరావు కాకినాడ నివాసి. ఆ తరువాత విజయనగరం తరలి వెళ్ళాడు. గురజాడ శ్రీరామమూర్తి 1851లో విజయనగరంలో జన్మించాడు.

తెలుగులో ప్రప్రథమంగా 'కవిజీవితములు' 1880లో ప్రచురించాడు. ఆ సంవత్సరమే షేక్స్పియర్ మర్చంట్ ఆఫ్ వెనీస్ నాటకాన్ని వెనీస్ వణిజ నాటకం లేక సుహృత్సుభాషితం అనే పేరఅనుసరించి ప్రచురించాడు. గద్యపద్యాలు రెండూ శక్తివంతంగా ఉండాలనే ఉద్దేశంతో రకరకాల ఛందస్సులు వాడాడు. అశ్లీలాలను పరిహరించాడు. పాత్రల పేర్లు మార్చలేదు. పోర్షియా (నాయిక పాత్ర)ను తెలుగుఆడపడుచుగా రూపొందించడంలో కృతకృత్యుడయ్యాడు. ఈయన బావ పారుపల్లి లక్ష్మీనారాయణతో కలిసి 'రాజయోగి' అనే తెలుగు వార పత్రికను కొంత కాలం నడిపాడు. శ్రీరామమూర్తి 1899లో మరణించాడు.

శ్రీ.చ

శ్రీరామమూర్తి, పినిశెట్టి (1920-1985) : నటుడు, నాటక, కథారచయిత. ఆదర్శ నాట్యమండలి స్థాపకుడు. పల్లె జీవితాన్ని దృశ్యకావ్యాలుగా రచించి ప్రేక్షకుల మన్ననలను పొందిన తెలుగు నాటక కర్తలలో అగ్రగణ్యుడు. తూర్పు గోదావరి జిల్లా పాలకొల్లులో 1920లో జన్మించాడు. శ్రీరామ మూర్తి రచించిన కులం లేని పిల్ల (1948), పల్లె పడుచు (1950), పంజరంలో పక్షులు, ఆడది, రిక్షావాలా (1952), ఆత్మీయులు (1958), చలి జ్వరం, దత్తత, ఆదర్శజ్యోతి వివిధ పరిషత్తులలో ప్రదర్శించబడి పేరు తెచ్చాయి.



కులవ్యవస్థ మీద వచ్చిననాటకాలలో కులంలేని పిల్ల శక్తివంతమైనది. గ్రామాలలో నీతికి, కట్టుబడిన పేదరైతు కుటుంబం ఒక స్వార్థపరుడివల్ల అనేకసమస్యలను ఎదుర్కోవడం, చివరకు బయటపడడం పల్లెపడుచులోని కథావస్తువు. నటుడుగా, ఔత్సాహిక నాటకరంగానికి ఎలాంటి నాటకం నచ్చుతుందో తెలుసుకొన్న పినిశెట్టి పల్లెపడుచును ఎనిమిది రంగాలుగా విభజించి ప్రదర్శించాడు. 1950లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు కాకినాడలో నిర్వహించిన పోటీలలో పల్లెపడుచుకు ప్రథమ బహుమతి లభించింది. ఈ నాటకం ఏడు ముద్రణలకు నోచుకుంది.

పినిశెట్టి రాసిన మరోనాటకం అన్నాచెల్లెలు (1955). సమాజంలోని ఆర్థిక అసమానతల కారణంగా ఆశలు ఒకవైపు, అనుభవాలు ఒకవైపు తిరోగమిస్తుంటే, జీవిత పోరాటంలో పడి నలిగి పోతున్న మధ్య తరగతి కుటుంబ జీవనచిత్రణ అన్నాచెల్లెలు నాటకం. పెద్దలకుదిర్చినపెళ్లిళ్ళ కంటే మనసులు కలిసిన ప్రేమవివాహాలు మంచివని పంజరంలో పక్షులు నాటకం ద్వారా తెలిపాడు. సమాజంలోని సమస్యలను కథావస్తువుగా తీసుకొని ఆదర్శజ్యోతి, ఆత్మీయులు, కన్నకొడుకు (1956) నాటకాలను రచించాడు. ఈయన రాసిన రిక్షావాలా, చలిజ్వరం, ఆడది, దత్తత మొదలైన నాటికలు ప్రసిద్ధమైనవి. పరిషత్తులలో ప్రదర్శింపబడి పేరు తెచ్చిపెట్టాయి. ఆడది లేకపోయినా సంసారం సవ్యంగా సాగిపోతుందనే భావనలో ఉన్న పురుషుడు ఎదుర్కొన్న అగచాట్లను స్త్రీ పాత్రలేని హాస్యనాటికగా ఆడది, పంజరంలో పక్షులు, రిక్షావాలా రచించాడు. ప్రభుత్వం చేపట్టిన భూసంస్కరణల వల్ల భూస్వాముల బుర్రలలో ఎలాంటి ఆలోచనలు అల్లుకుపోతాయో సున్నిత హాస్యాన్ని జోడించి రచించిన నాటిక చలిజ్వరం. 1944లో పాలకొల్లులో స్థాపించిన ఆదర్శనాట్యమండలి పక్షాన స్వీయరచనలో వెలువడిన నాటకాలను ప్రదర్శించాడు.

పినిశెట్టి రచనలలో స్థానికత, సులభశైలితో కూడిన సంభాషణలతో పాటు, నిత్యం మనిషి ఎదుర్కొనే సమస్యలు కథా వస్తువు కావడం వల్ల నాటక సాహిత్యంలో గొప్ప ప్రదర్శనలుగా నిలబడ్డాయి. చలన చిత్ర పరిశ్రమలో ప్రవేశించి సినిమాలకు కథలు, మాటలు సమకూర్చాడు. కళారంగం కోసం అహరహరం కృషి చేసిన పినిశెట్టి 1985, ఏప్రిల్ 10న మరణించాడు.

దాసరి.ఎన్.

శ్రీరామమూర్తి, ప్రఖ్య : నాటక రచయిత. తెలుగు నాటక రంగంలో 1950 తరువాత అంతకు ముందున్న వివిధ సమస్యాత్మక నాటకాల నుంచి విడివడి ఒక నూతన పథంలో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేసే నాటక రచనా ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అపరాధ

పరిశోధక నాటకాల ప్రారంభం జరిగింది. పోలీసులు, కోర్టులు, హత్యలు, వీటికి సంబంధించిన విషయాలు ప్రాముఖ్యం వహించాయి. అలాంటి నాటక రచనకు ఆద్యుడు ప్రఖ్య శ్రీరామమూర్తి.



శ్రీరామమూర్తి అపరాధ పరిశోధక నాటకీయ వృత్తాలతో తెలుగులో నాటకాలు *కాళరాత్రి* (1955), *ఫణి* (1957), మనిషిలో మనిషి (1958), *ముళ్ల గులాబీలు*, *సత్యం* సుందరం, దయ్యం (నాటిక) మొదలైన రచించాడు. వీటన్నింటిలో చాలా ప్రసిద్ధిపొందిన నాటకాలు రెండు. అవి కాళరాత్రి, ఫణి. ఇవి అనువాదాలు. ఇంగ్లీషులో హెవార్డ్ ఇర్వింగ్ యంగ్ రచించిన దహాక్ ఐలండ్ అనే నాటకానికి అనువాదమే కాళరాత్రి. ఫ్రెడరిక్ నాట్ రచించిన *డయల్ ఎమ్ ఫర్ మర్డర్* అనే నాటకానికి అనువాదం ఫణి. హత్య చేసిన హంతకుల మనః ప్రవృత్తులు, హత్యకు దారి తీసిన పరిస్థితులు, అపరాధ పరిశోధక నాటకాల్లో చిత్రితమై ప్రేక్షకుల మనస్సుకు హత్తుకొనేవి. ఔత్సుక్య స్ఫోరకమై ముందేమీ జరుగుతుందోనని ఉత్కంఠతో ఎదురు చూసేలా చేయడంలో నాటకకర్త నైపుణ్యం గోచరిస్తుంది. వీటి ప్రభావంతో అనేక అపరాధ పరిశోధక నాటక, నాటికలు వెలువడ్డాయి. బహుమతులు సైతం అందుకొన్నాయి. కాళరాత్రి నాటకంలో ఇతివృత్తం భార్యను అనుమానించి భర్త చేసే దారుణ కృత్యమే. నాటకాన్ని వేగంగా నడిపించే సమర్థత శ్రీరామమూర్తికి ఉంది. ఫణి నాటకంలోని కథా వస్తువు భర్త భార్య శీలాన్ని అనుమానించి ఆవిడను హత్య చేయించడానికి గావించిన విఫలప్రయత్నం. అపరాధ పరిశోధన నాటకాల్లో ఉండవలసిన ఔత్సుక్య స్ఫోరక గుణం (సస్పెన్స్) కావలసినంత మోతాదులో ఉంటుంది. జె.వి.రమణమూర్తి బృందం శ్రీకాకుళం నటరాజ కళాసమితి పక్షాన కాళరాత్రి నాటకాన్ని పలుసార్లు ప్రదర్శించి ప్రశంసలందుకొన్నది. అలాగే కె. వేంకటేశ్వర రావు ర.స.న. సమాఖ్య బృందం పక్షాన ఫణి నాటకాన్ని అనేక పర్యాయాలు, అనేక ప్రదేశాలలో ప్రదర్శించి, నాటక కర్తకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టింది. అంతేగాక ఫణి నాటక కళా పరిషత్తు పోటీలలో ఉత్తమ ప్రదర్శనకు ప్రథమ బహుమతి పొందిన నాటకం. అయితే ఇక్కడ మరో విషయాన్ని చెప్పుకోవలసిన అవసరముంది. తదనంతరం కాలంలో వచ్చిన ఈ రకం నాటకాల్లో సహజ పాత్రోన్మీలన ముండదు. వక్రమార్గాల్లో నడిపించి పోలీసులు, కోర్టులలో సమస్యలను పరిష్కరించడం ప్రారంభమైంది.

శ్రీరామమూర్తి మరో నాటకం సత్యం సుందరం నాటకమంతా కోర్టులోనే నడుస్తుంది. అయితే నాటకకర్త అంతకుముందు జరిగిన సంఘటనలను (Flashback) చెబుతూ కథను నడపడం విశేషం. ఈ నాటక దృశ్యాలన్ని కంటికి కట్టినట్లు చూపబడడం వల్ల విసుగు పుట్టించక, చివరి ఘట్టం వరకు ఔత్సుక్య స్ఫోరకంగా సాగుతుంది. తెలుగు నాటకరంగానికి అపరాధ పరిశోధక నాటకాలను అందించి, అత్యంత ప్రఖ్యాతి గడించాడు ప్రఖ్య.

గంగప్ప

శ్రీరామ విలాస సభ (తెనాలి): పెద్దిభట్ల రామయ్య గొప్ప కళాభిమాని. ఆయన సంగీత మనోరంజనీ విలాస సభనెలకొల్పి, నాటకాలు ప్రారంభించాడు. నటులందరూ విద్యావంతులు. పైగా దర్శకుడిగా ఉన్న త్రిపురారి భట్ల వీర రాఘవస్వామి ఉక్కు శిక్షణ ఈ కంపెనీ నాటకాలకు దివ్యమైన వరాలుగా లభించి, నాటకాలకు కొద్ది కాలంలోనే గొప్ప పేరుతెచ్చింది. ఆనాటి విమర్శకులు పురాణం సూరి శాస్త్రి, పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రి ఈ కంపెనీ నాటకాలను సద్విమర్శచేస్తూనే అనేక సందర్భాలలో శ్లాఘించారు. అయితే, కంపెనీకి ఆర్థికబలం తక్కువైన సందర్భంలో భాగవతుల రాజగోపాలం స్వాధీనపరచుకొని శ్రీరామ విలాస సభగా పేరు మార్చాడు.

ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం, రోషనార, సతీ అనసూయ, *బబ్బిలియుద్ధం, గయోపాఖ్యానం, సారంగధర, శ్రీకృష్ణ తులాభారం, కురుక్షేత్రం, నరకాసుర వధ, సోహ్రాబ్ రుస్తుం,* చంద్రగుప్త మొదలైన నాటకాలను ఈ సమాజం ప్రదర్శించింది.

గోవింద రాజుల వెంకట సుబ్బారావు, మాధవపెద్ది వెంకట్రామయ్య, స్థానం నరసింహారావు, పెద్దిభట్ల చలపతి, పిల్లలమర్రి సుందర్రామయ్య, ఏలేశ్వరపు కుటుంబ శాస్త్రి, పులిపాటి వెంకటేశ్వర్లు, ముదిగొండ లింగమూర్తి, తంగిరాల ఆంజనేయులు (మాస్టర్ అంజి), భీమవరపు నరసింహారావు (సంగీత దర్శకులు) మరియు బాబూరావు మొదలైన నటులంతా ఈ సమాజం ప్రదర్శించిన నాటకాలలో నటించారు. ఈ కంపెనీ నాటకాల్లో పెద్దపెద్ద సెట్టింగ్స్ పెట్టకుండా తగు మాత్రం దృశ్యాలతోనే నాటకాన్ని ప్రదర్శించి విజయం సాధించారు. పాత్రల నిర్ణయం, ఒద్దికలు (రిహార్సల్స్) జరపడం, కఠినమైన శిక్షణ, పాటలకు ఆకర్షణీయమైన బాణీలు, అన్నీ దర్శకుని నిర్ణయానుసారం అమలు జరగడం మొదలైన అంశాల వల్ల ఈ సమాజం ప్రదర్శించిన నాటకాలకు కొద్ది కాలంలోనే గొప్ప పేరు లభించింది. కానీ ఈ కంపెనీ కూడా నష్టాలతోనే మూసివే

శారు. ఈ సభలో పాల్గన్న నటులు ఎక్కువ మంది సినిమాల్లో కూడా నటించారు.

నే.వ.శ

శ్రీరామశాస్త్రి, గొల్లపూడి (1891-97) : నాటకసిద్ధాంత వేత్త, సంస్కృతాంధ్ర పండితుడు. వృత్తిరీత్యా చిత్తూరు రాజకీయోన్నత పాఠశాలలో ప్రధాన తెలుగు పండితుడు. చిత్తూరు రామ విలాససభ సభ్యుడు. ఈయన 1891లో ప్రకాశం జిల్లా ఒంగోలు తాలుకా బ్రాహ్మణ నిడమానూరులో జన్మించాడు. తల్లితండ్రులు వెంకమ్మ, అయ్యంగారు భట్లు.

నాటక కళను గురించి బృహద్గ్రంథం మూడు భాగాలుగా రచించి ప్రచురించ తలపెట్టి, ఆంధ్ర నాటక రంగం (1924) అనే పేరుతో మొదటి భాగం రామ విలాస సభ సభ్యులకు చదివి వినిపించి వారి మెప్పుపొంది ప్రచురించాడు.

చతుర్విధాభినయాలను, సమకాలీన నాటక సమస్యలను గురించి తెలుగులో ప్రప్రథమంగా పుస్తకం ప్రచురించిన గౌరవం ఈయనకే దక్కుతుంది. కావ్యనాటక మీమాంస, నాటక జిజ్ఞాస వంటి గ్రంథాలతో పాటు క్షేమేంద్రుని సంస్కృత గ్రంథాలు అనువదించాడు.

శ్రీ.చ.

శ్రీరాములు, చాట్ల (జ. 1931) : ప్రసిద్ధ నటుడు, దర్శకుడు. 1931లో విజయవాడలో జన్మించాడు.



నాటకరంగంలో నూతన ప్రయోగాలకు మారు పేరు చాట్ల. ఈయన చేపట్టే ప్రతినాటకంలోనూ ఏదో ప్రత్యేకత ఉండాలన్న తపనే ఈయనను విలక్షణ దర్శకునిగా, ప్రయోక్తగా, ట్రెండ్ సెట్టర్ (ఒక వరవడికి ఆద్యుడు)గా మార్చింది. కీర్తి ప్రతిష్ఠలున్నా, ఎంత గొప్పనటుడికైనా శాస్త్రీయ దృక్పథమూ, సైద్ధాంతిక నేపథ్యం ఉన్నప్పుడే అతని విద్యకు పరిపూర్ణత్వం సిద్ధిస్తుందని భావిస్తాడు చాట్ల. కళాకారుడికి తన పనిపట్ల శ్రద్ధ, పట్టుదల, ఓర్పు అన్నిటికి మించి నిరంతర కృషి అవసరమని ఈయన విశ్వాసం.

రైల్వేశాఖలోని ఉద్యోగానికి రాజీనామా చేసి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాటక విభాగంలో దర్శకుడుగా చేరాడు. శాఖాధిపతిగా పనిచేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ చదివాడు. 1970 లో లండన్ బ్రిటీష్ డ్రామాలీగ్‌లో శిక్షణ పొంది సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాడు. 1984లో ఉస్మానియా విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖలో కొన్నాళ్ళు పనిచేసి, తిరిగి 1986లో ఇదే శాఖలో అధ్యాపకుడిగా చేరి, ఇక్కడే పదవీ విరమణ చేశాడు. సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో విజిటింగ్ ఫేకల్టీగా సేవలందిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ,ఆంధ్ర ప్రదేశ్ సాంస్కృతిక మండలి సభ్యుడుగా వ్యవహరించాడు. టి.వి. నంది అవార్డ్స్ కమిటీ (1992) సభ్యుడుగా వ్యవహరించాడు. నటశిక్షణాచార్యుడిగా సేవలను అందిస్తూ అనేకమంది ఔత్సాహిక నటులకు శిక్షణ యిచ్చాడు. హైదరాబాద్‌లో మధు ఫిల్మ్ అండ్ టి.వి. ఇన్‌స్టిట్యూట్‌లో కొన్ని సంవత్సరాల నుంచి ప్రిన్సిపల్ గా పనిచేస్తున్నాడు.

చాట్ల శ్రీరాములు 1950లో కొర్రపాటి గంగాధర రావు నాటకాలలో వేషం వేసింది మొదలు ఇప్పటి వరకు విభిన్న ఇతి వృత్తాలు గల వందలాది నాటక నాటికలలో పాత్రధారణ చేయటమే గాక వాటికి దర్శకత్వం కూడా వహించి ప్రశంసలందు కున్నాడు. ఎన్.ఆర్. నంది రచించిన మరో మొహెంజదారో ప్రదర్శనలో వినూత్న ప్రయోగాలు చేసి నాటక రంగంలో సంచలనం సృష్టించాడు. ఈ నాటకం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఉత్తర భారతదేశంలో కూడా ప్రదర్శించాడు. యండమూరి వీరేంద్రనాథ్ రచించిన నిశ్శబ్దం నీకూ నాకూ మధ్య, డి. ప్రభాకర్ లావొక్కింతయులేదు, గొల్లపూడి మారుతీరావు రచించిన లావాలో ఎర్రగులాబీ వంటి నాటకాలను కొత్త పోకడలతో రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శించాడు.

ఆంధ్రనాటకకళా పరిషత్తులో ఉత్తమ నటుడుగా రెండుసార్లు బహుమతులందుకున్నాడు. ఎన్నో కళా సంస్థలు శ్రీరాములును సన్మానించాయి. మద్రాసు కళాసాగర్ ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ దర్శకుడు అవార్డు 1972-75, 1979-81 సంవత్సరాలకు లభించటం గర్వకారణమైన విషయం. నాటక రంగంలో దర్శకుడుగా అనుపమ సేవలు అందించినందుకు ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ 1982లో అవార్డుతో పాటు కళాప్రవీణ బిరుదు కూడా ఇచ్చింది. వంశీ గురజాడ స్వర్ణ పతకం, గరికపాటి రాజారావు స్మారక నాటక రత్న అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, మద్రాసు తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, 2002లో నంది నాటకోత్సవాలలో ఆత్మగౌరవ పురస్కారం, వీటితోపాటు ఎన్నో అవార్డులు, సన్మానాలు ఆయనను వరించాయి. ఈయన కళాసేవను గుర్తించి కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ 1996లో ఎమిరిటస్ ఫెలోషిప్‌తో సత్కరించింది.

బోయిన

శ్రీరాములు, దాసు (1846-1908) : కవి, నాటక కర్త, పండితుడు, వాగ్గేయకారుడు, న్యాయవాది, అలంకార శాస్త్రవేత్త,

అభినయ శాస్త్రవేత్త. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా కూరాడలో 1846, ఏప్రిల్ 8న కావమాంబ, కన్నయ్య దంపతులకు జన్మించాడు.

14వ యేటనే సాత్రాజితీ విలాసమనే యక్షగానం రచించాడు. సంస్కృత అభిజ్ఞాన శాకుంతలం, ముద్రారాక్షసాది నాటకాలను అచ్చతెలుగులోకి అనువదించాడు. అనేక కీర్తనలు, జావళీలు రచించాడు. ఈయన రచనలో ఎక్కువ ప్రచారంలోకి వచ్చినవి జావళీలే. ఈయన రచించిన దేవీభాగవత అనువాదం తెలుగు నాట ప్రజాదరణ పొందింది.

శాకుంతలం (1898), మాలతీ మాధవం (1900), మహావీర చరితం (1902), సంగీత రస తరంగిణి, (1907), ముద్రారాక్షసం, రత్నావళి, ఉత్తర రామచరిత (1909), జానకీ పరిణయం, మాళవికాగ్నిమిత్రం మొదలైన నాటకాలను అచ్చతెలుగులోకి అనువదించాడు. వీటితో పాటు కురంగ గౌరీ శంకరీయం, మనోలక్ష్మీవిలాసం అనే స్వతంత్ర నాటకాలు రాసిన శ్రీరాములు 1908, మే 16న మరణించాడు.

శ్రీ.చ.

శ్రీవాత్సవ (1913-1968) : కవి, నాటకకర్త, విమర్శకుడు. మాణిక్యాంబ, రామచంద్రరాజు దంపతులకు 1913, మే 21న జన్మించాడు. అసలు పేరు యండమూరి సత్యనారాయణ రావు. శ్రీవాత్సవ గోత్రికుడు కావడం వల్ల శ్రీవాత్సవగా కలం పేరు పెట్టుకున్నాడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక పోటీలలో ఉత్తమ నాటక రచన బహుమతి గ్రహీత. హిందీ, బెంగాలీ ఇత్యాది బహు భాషా పండితుడు. రాజమండ్రి బోధనా కళాశాలలో బి.ఇడి. డిగ్రీ పొందాడు. మద్రాసు జనవాణి పత్రికలో కొన్నిరోజులు సహాయ సంపాదకుడిగా పనిచేసిన తరువాత ఆకాశవాణిలో 1939లో చేరి అనేక పదవులు అలంకరించాడు. రేడియో కార్యక్రమాలలో పాల్గనే వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాడు. మదరాసు, విజయవాడ, న్యూ ఢిల్లీ మొదలైన ఆకాశవాణి కేంద్రాలలో వివిధ పదవులలో పనిచేశాడు. ఈయన తీరని కోరిక (1952) నాటకానికి ఆంధ్ర నాటక కళా పరిషత్తు ఉత్తమ రచన బహుమతి ప్రదానం చేసింది.

ఈయన రచించిన 'ఉష్ణకిరణాలు, శారదాధ్వజం' అనే గ్రంథాలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతులు లభించాయి. అనేక రేడియో నాటికలను రచించిన శ్రీవాత్సవ 1968, మార్చి 29న పరమపదించాడు.

శ్రీ.చ.

శ్రీ వేంకటేశ్వరనాట్యమండలి (తెనాలి) : వల్లూరి వెంకట్రామయ్య చౌదరి 1952లో ఈ సమాజాన్ని స్థాపించాడు. క్రమశిక్షణగా పనిచేసిన సమాజాలలో ఇదొకటి. నాటకానికి అవసరమైన డ్రెస్, తెరలు, లైటింగ్, ఇతర పరికరాలు అన్నీ స్వంతంగా ఏర్పాటు చేసుకొని ఆంధ్రదేశమంతా పర్యటించాడు.

బాలనాగమ్మ, వీరపాండ్య కట్టబ్రహ్మన్న, భక్త శబరి రామరావణ యుద్ధం, మోహినీ భస్మాసుర నాటకాలను ఈ సమాజం ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలలో విరివిగ ప్రదర్శించింది.

వల్లూరి వెంకట్రామయ్య, ఎ.వి. సుబ్బారావు, డి.వి సుబ్బారావు, నూతక్కి సుబ్బారావు, ఆకుల వెంకయ్య, కాళిదాస కోటేశ్వరరావు, రేబాల రమణ, మావిళ్ల పల్లికోటేశ్వరరావు రామకుమారి, జానకి, లక్ష్మీకాంతం, శకుంతల, కృష్ణవేణి మందలపు ఇందిర, గుమ్మడి కుటుంబరావు మొదలైన నట నటులు ఈ సమాజ సభ్యులే.

ఈ కంపెనీ బాలనాగమ్మ నాటకం ప్రముఖంగా ప్రదర్శించింది. మాయలఫకీరు పాత్రను వల్లూరి వెంకట్రామయ పోషించి ఆంధ్రదేశమంతటా పేరు పొందాడు.

శ్రీ వేంకటేశ్వర నాట్యమండలి, తెనాలి

నే.వ.శ

శ్రీ శంకుక మతం : రస విషయంలో శ్రీ శంకుకుని వాదం రసము నట నిష్ఠమనేదే ఈ వాద సారాంశం. దీనికి అనుమి వాదం అని పేరు.

శ్రీ.చ

శ్రీ శారద నాటక కళాసమితి (పెద్దపాడు) : ఈ సమాజాన్ని కలగ లక్ష్మయ్య 1955లో స్థాపించాడు. ఈ సమాజంలో సభ్యులందరూ వృత్తి నటులే. సమాజాన్ని స్థాపించి నిర్వహించి లక్ష్మయ్య నటశిఖామణి, కళా ప్రపూర్ణ బిరుదులు పొందడమే గాకుండా,అనేక సన్మానాలు అందుకున్నాడు. స్వర్ణకంకణాలు స్వర్ణాభరణాలు బహుమతులుగా పొందాడు. ఈ సమాజ కురుక్షేత్రం, సతీసక్కుబాయి, తాండ్ర పాపారాయుడు, మోహి భస్మాసుర, గయోపాఖ్యానం, చింతామణి, సత్యహరిశ్చంద్ర మొదలైన నాటకాలు ప్రదర్శించింది. లక్ష్మయ్య 200 సంవత్సరంలో నవంబరులో స్వర్గస్థుడయ్యాడు. ఆయన మరణంతో ఈ సమాజం మరుగున పడిపోయింది.

నే.వ.శ

శ్రీ శ్రీనివాస నాట్యమండలి (నెల్లూరు) : ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ నాటక ప్రదర్శనలకు అంకితమైన నాటక సమాజాల నెల్లూరులోని శ్రీనివాస నాట్య మండలి ఒకటి. 1976లో ఈ సమాజం ఆవిర్భవించింది. దీని సారథి తిరుపతి హరగోపా వి.మస్తానయ్య, డి. సామ్యూల్, ఎం.ఎ. ఖాదర్, ఎ. చంద్రమోహన్ టి.రాఘవులు, నేలటూరు శ్రీనివాసమూర్తి, బి. ప్రభుదాస్, ఈ.పి నాగేశ్వరరావు, వి.రామచంద్రారెడ్డి ఈ సమాజ నటులు. ఈ సమాజంలోని నటులు ప్రప్రథమంగా శ్రీరామాంజనేయ యుద్ధ నాటకాన్ని ప్రముఖ హార్మోనిస్టు జి.శ్రీనివాసులు నాయుడ

సంగీత పర్యవేక్షణలో నేర్చుకొని, 1977లో ప్రదర్శించారు. అప్పటినుంచీ క్రమం తప్పకుండా నాటకాలు ప్రదర్శించటం మొదలైంది. *గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణ రాయబారం, భగవద్గీత, సీతాకళ్యాణం, శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం* మొదలైన నాటకాలను నవరస భరితంగా ప్రదర్శించి రసజ్ఞుల ప్రశంసలనందుకున్నారు. 1983లో సిఫ్కా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత పౌరాణిక నాటక పరిషత్తులో *సీతాకళ్యాణం* నాటకాన్ని ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనగా బహుమతిపొందడమే గాక వ్యక్తిగత బహుమతులను కూడా సాధించుకుంది. 1984లో అనంత పద్మనాభరావు రచించిన *అన్నమాచార్య* సంగీత భరితమైన నాటకాన్ని మనోజ్ఞంగా ప్రదర్శించటం శ్రీనివాస నాట్యమండలి ప్రతిష్ఠను మరింత పెంచింది. సింహపురిలోనే కాక రాయలసీమ, తెలంగాణా, కోస్తా ప్రాంతాలలోను, రాష్ట్రేతర ప్రాంతాలలోను *శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి* నాటకాన్ని ఈ సమాజం ప్రదర్శించింది. *శ్రీ గణపతి మహాత్మ్యం, శ్రీకృష్ణ సత్య, మాయాబజార్, శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం, భక్త మీరాబాయ్, శ్రీరామ విజయం, సతీ సావిత్రి* వంటి నాటకాలు కూడా ఈ సమాజం ప్రదర్శించే నాటక పరంపరలో కొన్ని. అంచెలంచెలుగా ఎదిగి 2002 నాటికి రజతోత్సవం చేసుకున్న ఈ సమాజం, పాత నాటకాలనే కాక నిత్యనూతనంగా నాటకాలు రాయించుకొని, ప్రదర్శిస్తూ ఉండటం ప్రశంసనీయమైన విషయం.

గం.సురె

శ్రీహరిరావు, వల్లూరు (జ.1953) : నటుడు, సంగీత విద్యావంతుడు. పరిషత్తు నిర్వాహకుడు. ఈయన 1953, అక్టోబర్ 10న కృష్ణాజిల్లా పమిడి ముక్కల మండలం కృష్ణాపురంలో జన్మించాడు. తల్లిదండ్రులు పూర్ణమ్మ, చలపతిరావు. శ్రీహరిరావు లలిత కళలపట్ల అనురక్తి పెంచుకోవడానికి కారణం తండ్రి మృదంగంలో విద్వాంసుడు కావడం, పెదతండ్రి కుమారుడు వల్లూరు కామేశ్వరరావు మంగళంపల్లి బాలమురళీకృష్ణ శిష్యుడిగా చేరడం. ఈ కారణాల వల్ల శ్రీ హరిరావు సంగీతం నేర్చుకున్నాడు. భక్తిరస ప్రధానమైన కీర్తనలు, తరంగాలు, అష్టపదులు పాడడంలో గుర్తింపు తెచ్చుకున్నాడు. నాడు పల్లెల్లో ప్రదర్శింపబడుతున్న ప్రసిద్ధ పౌరాణిక నాటకాలను చూసి నాటక రంగంలో ప్రవేశించాడు. మొట్టమొదటి సారిగా *కురుక్షేత్రం*లో శ్రీకృష్ణునిగాను, ఆ తరువాత *గయోపాఖ్యానం*లో కూడా శ్రీకృష్ణుని పాత్రలోను నటించాడు. శ్రావ్యమైన గాత్రం, సంగీత జ్ఞానం, చక్కని శారీరక సౌష్టవం శ్రీహరిరావు మంచి నటుడుగా పేరుతెచ్చుకోవడానికి ఉపకరించాయి. గత మూడు దశాబ్దాలుగా *రామాంజనేయ యుద్ధం* లో శ్రీరాముడుగా, *చింతామణి*లో భవానీశంకరుడు, *తులసీజలంధర*లో దేవేంద్రుడు, *సతీ సక్కుబాయి* లో యోగి, *కచదేవయాని* లో నారదుడు, *పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి* లో సిద్ధయ్య పాత్రలలో నటించాడు. శ్రీహరిరావు పద్యాన్ని భావయుక్తంగా పాడటంతో పాటు హిందుస్తానీ, కర్ణాటక, మరాఠి బాణీలను మేళవించి ప్రదర్శనలో ప్రేక్షకుల ప్రశంసలకు పాత్రుడయినాడు. ప్రముఖ రంగస్థల నటుల సరసన నటించి, 'జూనియర్ షణ్ముఖి, గానకోకిల' బిరుదులను పొందాడు. 1999లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన నంది నాటక సప్తాహంలో భాగంగా *తులసీ జలంధర*లో దేవేంద్రుని పాత్రలో నటించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నాడు. శ్రీహరిరావు వివిధ నాటక సమాజాలు నిర్వహించే నాటక ప్రదర్శనలలో పాల్గనడంతోపాటు కళాకారుల సమాఖ్య, అబ్బూరి కళాపరిత్తు ఉపాధ్యక్షుడిగా ఉన్నాడు. పేద కళాకారుల అభ్యున్నతి కోసం తన వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న కళా హృదయుడు శ్రీహరిరావు.



దాసరి.ఎన్.

షడ్దారుకం : రంగస్థల సంబంధి చట్రం. దారుకమంటే కొయ్య దూలం అని అర్థం. షడ్దారుకమంటే ఆరు దారువులు కలది. నేపథ్య గృహ రంగ శీర్షాలకు మధ్య గోడకు నాలుగు స్తంభాలు నెలకొలిపి, వాటి పైభాగాన్ని ఒకటి, కింద భాగాన్ని ఒకటి దూలాలు బిగిస్తే అది షడ్దారుకం. ఈ షడ్దారుకం వద్ద రంగ శీర్షంలో ఎత్తువేదిక మీదకు తప విన్యాసం (జంత్ర సంగీతం) జరుగుతుంది. ఈ షడ్దారుకానికి రెండు పక్కలా రెండు ద్వారాలుండాలి.

ఈ ఆరు స్తంభాలు మండపాకారంలో ఉండాలని, ఇందులో గాయకాదులు ఉండాలని విజ్ఞుల అభిప్రాయం.

షడ్దారుకం ఉపయోగం గురించి భరతముని గాని, అభినవగుప్తుడు గాని ప్రస్తావించలేదు. డి. సుబ్బారావు ఆ షడ్దారుకచట్రం వల్ల నటుల పాదగతుల ధ్వనులు, వాద్యధ్వనులు, సంగీతం, సుశ్రావ్యమవుతాయని అభిప్రాయపడుతున్నాడు.

శ్రీ.చ.

షిర్‌వాడ్‌కర్, విష్ణునామన్ (జ.1912-99) : కుసుమాగ్రజగా ప్రసిద్ధిపొందిన ప్రముఖ మరాఠీ కవి, నాటక రచయిత, నవలాకర్త, జ్ఞానపీఠ బహుమతి గ్రహీత (1987).

అసలు పేరు రంగనాథ్ షిర్ వాడ్‌కర్ అయితే విష్ణువామన్ షిర్‌వాడ్‌కర్‌గా మార్చుకున్నాడు. పూణేలో 1912, ఫిబ్రవరి 27న జన్మించాడు. పిపవగావలో ప్రాథమిక విద్య, నాసిక్‌లోని న్యూ ఇంగ్లీషు స్కూల్ (ప్రస్తుతం జె.ఎస్. రంగనాథ్ హైస్కూల్) లో ఉన్నత విద్యను గడించాడు. బంబాయి విశ్వవిద్యాలయం నుంచి మెట్రిక్యులేషన్ పొందాడు. 1930లో హెచ్.పి.టి. కళాశాలలో చేరాడు. పూణే విశ్వవిద్యాలయం ఈయకు గౌరవ డి.లిట్. 1986లో ప్రదానం చేసింది. 1988లో 'సంగీత నాట్య లేఖన్' అవార్డు పొందాడు. నాసిక్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసిన తరువాత, 1935లో వారపత్రికలలో పాత్రికేయ వృత్తిని ప్రారంభించాడు. 'ధనుర్ధారి', 'సారధి', 'స్వదేశీ' వారపత్రికలలోను 'ప్రభాత్' దినపత్రికలోను కొంతకాలం పనిచేశాడు. తరువాత పత్రికారంగం తన ప్రవృత్తికి తగినది కాదని తలచి రచనా వ్యాసంగం చేపట్టాడు.

పత్రికారంగంలో ప్రవేశించకముందే షిర్‌వాడ్‌కర్ 'కుసుమాగ్రజ్' అనే కలం పేరుతో కవిగా మరాఠీ సాహిత్యంలో గుర్తింపు పొందాడు.



1929లోనే ఆయన రచించిన కవితలు డి.ఎన్. తిలక్ రచించిన బాల్‌బోధ్ మేవ (Balbodh mewa)లో ప్రచురణ పొందాయి. 1930లో హెచ్.పి.టి. కళాశాల మ్యాగజైన్ 'రత్నాకర్'లో అతని కవితలు ముద్రితమయ్యాయి. 1933లో కుసుమాగ్రజ్ మొదటి కవితా సంకలనం 'జీవన లహరి' వెలువడింది. ఈ సంపుటిలోని కవితలన్నీ ప్రేమకు, ప్రేమికులకు సంబంధించినవే. ఆ తరువాత దేశభక్తిపూరితమైన కవితాఖండికలతో కూడిన 'విశాఖ' (1942) సుప్రసిద్ధ నవలాకర్త వి.ఎస్.ఖండేకర్ సంపాదకత్వంలో వెలువడింది. స్వాతంత్ర్య సమరకాలంలో విశాఖలో సంకలితమైన అనేక ఖండికలు దేశభక్తుల నాలుకల మీద నాట్యం చేశాయి. కారాగారంలో కూడా మరాఠీ కార్యకర్తలు విశాఖలోని గీతాలను జాతీయగీతాలన్నంత గౌరవాదరాలతో, ఆవేశంతో గానం చేశారు.

విశాఖ తరువాత వరుసగా 'కినారా (1952), హిమరేశ (1964), వడల్‌వేల్ (1969)' మొదలైన కవితా సంకలనాలను, కాళిదాసు మేఘదూతానికి మరాఠీ అనువాదాన్ని కుసుమాగ్రజ్ ప్రకటించాడు.

కవిగా లబ్ధప్రతిష్ఠుడైన కుసుమాగ్రజ్ 1946లో తన తొలినాటకం దుర్పెదివె ప్రకటించి రంగస్థలం వైపు తన దృష్టిని మరల్చాడు. పౌరాణిక, సాంఘిక, చారిత్రక నాటకాలెన్నిటినో రాసి నాటక కర్తగాను పేరుపొందాడు. ఈయన నాటకాలలో ఏవ్ ఐడియల్ హస్బెండ్, వైజయంతి *(1950)*, మోన్నవన్న, దూరా పేష్వా *(1947)*, కౌంతేయ *(1953)*, యయాతి ఆని దేవయాని *(1968)*, విజ్మ్సానాలీధర్తీల *(1970)*, నటసామ్రాట్ *(1971)* ముఖ్యమైన వాటిలో కొన్ని. వీటిలో ఝాన్సీలక్ష్మీభాయి చరిత్రకు సంబంధించిన నాటకం విజ్మ్సానాలీధర్తీల. నటసామ్రాట్ ఉత్తమ నాటకంగా ఖ్యాతిపొందటమేకాక సాహిత్య అకాడమీ పురస్కారాన్ని (1974) కూడా అందుకుంది. షిర్‌వాడ్‌కర్ నాటకాలు సాంకేతికంగా ఉత్తమశ్రేణి నాటకాలుగా పరిగణన పొందకపోయినా, సంభాషణల్లో ప్రయోగించే భాషాశైలి, పాత్రపోషణల వల్ల మంచినాటకాలనే కీర్తిని గడించాయి. పాశ్చాత్య నాటకాలను ఆధారం చేసుకుని కూడా కుసుమాగ్రజ్ కొన్ని నాటకాలు రాసి పాఠకుల మన్ననలు పొందాడు.

నవలా రచనలోను కుసుమాగ్రజ్ తన ప్రయత్నాలు కొనసాగించినప్పటికీ ఇతడిని ప్రధానంగా కవిగాను, నాటక కర్తగాను పాఠకులు గుర్తించారు. ఇతడి నవలల్లో వైష్ణవ (1946), జాహ్నవి (1952), కల్పనేభ్య తేర్‌వర్' భిన్న ఇతివృత్తాల కారణంగా ఖ్యాతిని పొందాయి. మొదటి నవలలో ఇతివృత్తం అమాయకమైన పల్లెటూరి యువకుడు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గని, తనవంతు కర్తవ్యాన్ని సమర్థంగా నిర్వహించటం రెండవ నవల జాహ్నవిలో వస్తువు మనిషి మనసును గురించిన సాహసవంతమైన వివరణ. ఈ నవలలో కొండలమధ్య సన్యాసిగా కాలం గడిపే వ్యక్తి తాను పెంచిన అనాథ బాలిక ప్రేమించిన వ్యక్తి పట్ల అసూయపడతాడు. కూతురిలా చూస్తున్నానని ఇతడు అంతకాలం భావించిన బాలిక పట్ల అతడి మనసులో ఉన్న భావన వాత్సల్యం కాదని, అది నివురుగప్పిన నిప్పులాంటి ప్రేమ అని వెల్లడించటంలో మనిషి మనసును రచయిత నిర్భయంగా చిత్రించాడు. ఈ సంఘర్షణల మధ్య కథ విషాదాంతంగా ముగుస్తుంది. మూడవ నవల జేమ్స్ హిల్టన్ రాసిన లాస్ట్ హరైజన్‌ను అనుసరించి రాసిన నవల. ఇందులో కథావస్తువుకన్న రచయిత ఊహాకల్పనలు, భావావేశం ప్రధానంగా కనిపిస్తాయి.

కుసుమాగ్రజ్ కొన్ని కథలను, ఏకాంకికలను, స్మృతులను కూడా రాశాడు. రచన ఏదైనప్పటికీ అందులో కవిత్వధోరణి, కవితాశైలి ప్రధానలక్షణాలై ఉండటం ఇతడి ప్రత్యేకత. కుసుమాగ్రజ్ ప్రకటించిన ఛందోమయి (1982), ముక్తాయన్ (1984) అనే కవితా సంకలనాలలో ఆత్మశోధన, అంతర్లోచన, ఆధ్యాత్మిక అన్వేషణ ప్రధానంగా కనిపిస్తాయి.

ఏ ప్రక్రియ చేపట్టినా కుసుమాగ్రజ్ రచనల్లో ప్రకృతి, ప్రేమల ప్రాభవం, సమాజంలోని పరిస్థితులు ప్రతిబింబించటం కన్పిస్తుంది. ఇతడి శైలి ప్రధానంగా

లయాత్మకంగా సాగిపోవటం వల్ల కథగాని, నవలగాని, నాటకంగాని కవిత్వం చదువుతున్న భావననే కలిగిస్తాయి. కుసుమాగ్రజ్ మరాఠీ సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు జ్ఞానపీఠ బహుమతి (1987) అందుకున్నాడు. ఆయన 1999, మార్చి 10న మరణించాడు. మహారాష్ట్ర కవితా సూర్యుడు అస్తమించాడని మన్ననలు పొందాడు. ఆయన పేరిట నెలకొల్పిన 'కుసుమాగ్రజ్ ప్రతిష్ఠాన' విద్య, సామాజిక కృషి రంగాలలో గిరిజనులకు, అణగారిన వర్గానికి ఎనలేని సేవలు చేస్తున్నది.

చంద్ర

షిల్లర్, జోహాన్ క్రిస్టోఫ్ ఫెడరిక్ వాన్ (1750-1805): జర్మన్ నాటకకర్త, కవి. 1750లో జన్మించిన షిల్లర్ తన 22వ యేట మొదటి నాటకం బంది పోటు రచించి ప్రదర్శింపజేశాడు. ఈ నాటకం నాటి యువ తరాన్ని పులకింప జేసింది. మాన్‌హీం నాటక సమాజంలో స్థిర పడ్డాడు. ఈ సమాజానికి నాటక రచయితగా, మేనేజర్‌గా పనిచేశాడు. కబ్లే అండ్ లీబ్ (Kable and Leeb) రచించి విజయవంతంగా ప్రదర్శింప జేశాడు.



ఆ తరువాత వివాహం చేసుకొని జేనాలో గౌరవ చరిత్రాచార్యుడుగా చేరాడు. థైలియా అనే పత్రికకు సంపాదకత్వం వహించాడు. జబ్బుపడి కోలుకొని వీమర్ పట్టణంలో స్థిరపడ్డాడు. అక్కడ గెథేతో స్నేహం ఏర్పడింది. ఇద్దరూ శ్రేయోరాజ్య స్థాపనకు కలిసి పనిచేశారు. నాటకాలు రాయడం షిల్లర్ మానుకోలేదు. విలియం టేల్ ఇతని ఆఖరు నాటకం.

బందిపోటు (1781), *కబాలెఅండ్ లాబ్* (1784), *డాన్ కార్లోస్* (1787), *వాలెన్ స్టీన్* (1799), *మేరీ స్టూఆర్ట్* (1800), *డీజంగ్ ఫ్రో ఆర్లియన్స్* (1801), *డి బ్రాట్ వాన్ మెస్సినా* (1803), *విలియం టేల్* (1804) మొదలైన నాటకాలు రాసిన షిల్లర్ 1805లో మరణించాడు.

శ్రీ.చ.

షెపర్డ్, శామ్ (జ.1943) : అమెరికన్ నాటక రచయిత, నటుడు. పూర్తిపేరు శామ్యూల్ షెపర్డ్ రోజర్స్. తండ్రి సైనికోద్యోగి కావడంవల్ల ఈయన చిన్నతనం చాలావరకు సైనిక స్థావరాలలో గడిచింది. కళాశాల చదువు ముగించకుండానే నటుడుగా షెపర్డ్ న్యూయార్క్ చేరాడు. ఈయన తొలి రచనలైన ఏకాంకికలు ప్రదర్శింపబడి విజయవంతమయ్యాయి. చికాగో, రెడ్‌క్రాస్ మొదలైన నాటికలకు తన 22వ ఏటనే ఓబీ పారితోషికాలు సంపాదించాడు. కొన్నేళ్లపాటు లండన్‌లో నివసిస్తూ టూత్ ఆఫ్ క్రైమ్ మొదలైన నాటకాలు రచించాడు. శాన్ ఫ్రాన్సిస్కోలో మాజిక్ థియేటరుకు 'నిలయ నాటక రచయిత'గా స్థిర పడ్డాడు.

జీవిత సంఘటనలను సింహావలోకనం చేసుకొనే ఏకపాత్ర ఈతని అభిమాన ప్రక్రియ. కిల్లర్స్ హెడ్ అనే నాటికలో మరణశిక్ష విధింపబడిన హంతకుని చివరి రాత్రి, కడపటి ఆలోచనలే వస్తువు. ఏంజెల్ సిటీ లో హాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలోని విధ్వంసక యంత్రాంగం వస్తువు. కర్స్ ఆఫ్ ద స్టార్వింగ్ క్లాస్, బర్రీడ్ చైల్డ్, ట్రూ వెస్ట్ మొదలైన నాటకాలలో చిన్నాభిన్నమైన ఆధునిక కుటుంబాలలోని రక్తసంబంధాల పరిశీలన కనిపిస్తుంది. బర్రీడ్ చైల్డ్ పులిట్జర్ పారితోషికాన్ని గెలుచుకొంది. 'డేస్ ఆఫ్ హెవెన్', 'రిసరెక్షన్' మొదలైన చలనచిత్రాలలో నటించి శామ్ విమర్శకుల ప్రశంసలను పొందాడు. ద అన్‌సీన్ హాండ్, సెడ్యూస్డ్, ఫూల్ ఫర్ లవ్ మొదలైన నాటకాలు రచించాడు.

చ.తి.

షెరిడాన్, రిచర్డ్ బ్రింస్లే (1751-1816) : ఆంగ్ల నాటక కర్త, ఐర్లండు దేశీయుడు. తండ్రి నటుడు, తల్లి నాటక రచయిత్రి. షెరిడాన్ నాటకకర్త. నాటకశాల అధినేత. రాజకీయవేత్త. పార్లమెంటు సభ్యుడు.



డబ్లిన్‌లో 1751లో జన్మించి, హారోలో విద్యనభ్యసించాడు. 23వ యేట ఈయన రాసిన మొదటి నాటకం ది రైవల్స్ 1775లో ప్రదర్శితమైంది. ఆ తరువాత వరసగా నాటకాలు ప్రదర్శితమైనాయి.

1776లో షెరిడాన్ డ్యూరీలేన్ నాటకశాలను కొని, దానిని 1794లో పునర్నిర్మించాడు. 1809లో అది కాలిపోయే వరకు

ఆర్థిక ఇబ్బందులను భరిస్తూ ఆ నాటకశాలను అంటి పెట్టుకుని ఉన్నాడు. 1780లో పార్లమెంటు సభ్యుడయ్యాడు.

ఇతని ప్రసిద్ధ నాటకం *అపవాద తరంగిణి* (The School for Scandal) ఆంగ్ల ఆహ్లాద నాటక సాహిత్యంలో అగ్రగణ్యమైందిగా పరిగణితమవుతున్నది. పునరుజ్జీవన నాటక సాహిత్యంలో నుంచి జనించిన లసుగులు ఈయన నాటకాలలో కనిపించవు.

షిల్లర్ రాసిన నాటకాలను కందుకూరి వీరేశలింగం, భమిడి పాటి కామేశ్వరరావు ప్రభృతులు తెలుగులోకి అనువదించారు. *ప్రత్యర్థులు* (1775), *ది స్కీమింగ్ లెఫ్టినెంట్* (1775), *ది డ్యూయెన్నా* (1775), *అపవాదతరంగిణి* (1777), *ఎ ట్రాజెడీ రిహార్స్‌డ్ లేక విమర్శకుడు* (1779), *స్కార్‌బరో ప్రయాణం* (1777), *పిజారో* (1799) మొదలైనవి ప్రసిద్ధ రచనలు.

శ్రీ.చ.

షేక్స్పియర్, విలియమ్ (1564-1616) : ఆంగ్ల సాహిత్యానికి సంబంధించిన సుప్రసిద్ధ నాటక రచయిత, నటుడు. ఏవన్ నదీ తీరాన స్ట్రాట్‌ఫర్డ్ అనే గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో 1564లో జన్మించాడు. పెద్దగా చదువుకోలేదు. 18వ యేట తన కంటె ఎనిమిదేళ్ళు పెద్దదైన ఏనీహాతవేను పెండ్లి చేసుకున్నాడు. దొంగతనం చేసి శిక్షను తప్పించుకొనటానికి లండన్ పారిపోయాడని ఒక కథ వ్యాప్తిలో ఉంది. లండన్‌లో జీవికకై నాటక రంగాన్నాశ్రయించి చిన్నచిన్న పాత్రలలో నటించాడు. ఎలిజిబెత్ రాణి ఆస్థాన నటబృందంలో చేరాడు. క్రముంగా నాటకరచన ప్రారంభించాడు. మొదట్లో వినోద నాటకాలకు రోమన్ నాటక రచయిత ప్లాటస్‌ను, గంభీర నాటకాలను సెనెకాను ఆదర్శంగా గ్రహించాడు. కాని పోను పోను తన సొంత బాణీని స్థిరపరచుకొని మొత్తం ముప్పై నాటకాలు రాశాడు. ప్రపంచ నాటక రచయిత లందరిలో ప్రముఖుడుగా ఖ్యాతిని సంపాదించుకొన్నాడు. నాటకాలతోపాటు రెండుసుదీర్ఘకావ్యాలు, మూడు లఘు కావ్యాలు, 160 గీతాలు రచించాడు. నాటకాలు రాయక పోయినా, కావ్యాలవల్లనైనా మహాకవులలో ఒకరుగా పరిగణింపబడేవాడే. గ్లోబ్ నాటకశాల యాజమాన్యంలో భాగస్వామిగా చేరి కీర్తి, ధనం బాగా సంపాదించి, చరమ దశలో తాను పుట్టిన స్ట్రాట్‌ఫర్డ్‌లోనే మరణించాడు. అతని సమాధి, స్మృతి మందిరం నేడు సాహితీప్రియులకు ఒక యాత్రా కేంద్రమైంది.



షేక్స్పియర్ మొదటి నుంచి చివరి వరకు వినోద, గంభీర, విషాద, చారిత్రక, తాత్త్విక నాటకాలు రాస్తూనే ఉండేవాడు. ఇతని రచనా జీవితాన్ని చూస్తే తొలిదశలో ఎక్కువగా వినోద ప్రధాన నాటకాలు రాశాడు. *తబ్బిబ్బుల ప్రహసనం*, *గయ్యాళి లంగదీత* ఈ కాలపు రచనలు. రెండవ దశలో ఎక్కువగా చారిత్రకాలు రాశాడు. *జూలియస్ సీజర్*, *రెండవ రిచర్డ్*, *నాల్గవ హెన్రీ*, *ఐదవ హెన్రీ* ఈ కాలపు రచనలు. మూడవ దశలో ఎక్కువగా గంభీర విషాద నాటకాలు రాశాడు. *హామ్లెట్*, *ఒథెల్లో*, *కింగ్ లియర్*, *మెక్బెత్* ఈ దశలో రచించినవే. జీవితం పట్ల నైరాశ్య భావం ఈ రచనల్లో కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. చివరి దశలో ఈ నైరాశ్యభావం తొలగి సత్య ధర్మాల అంతిమ విజయం కనిపిస్తుంది. దీన్ని తాత్త్విక దశ అనవచ్చు. *శిశిర గాథ*, *పెరిక్లీజ్*, *సింబలిన్*, *తుఫాను* ఈ దశలోని రచనలు. తొలిదశలో అంత్యానుప్రాసను ఎక్కువగా పాటించేవాడు. అలాగే తొలి దశలో మాటల గారడీని ఎక్కువగా అభిమానించేవాడు. కాని పరిణతి చెందిన కొద్ది అర్థ గాంభీర్యానికే ప్రాధాన్యం ఇస్తూ వచ్చాడు.

సజీవపాత్ర చిత్రణ షేక్స్పియర్‌లో చెప్పుకోదగిన ప్రత్యేకత. అతని పాత్రలలో మన పరిచిత బంధు మిత్రులను దర్శించవచ్చు. అంతేకాదు, కొంచెం జాగ్రత్తగా గమనిస్తే, షేక్స్పియర్ రచనలలోని ప్రతి పాత్రలోను మన పోలికలను కూడా కొన్నిటిని గుర్తించవచ్చు. ఇతర కవుల కీర్తికి కోత పెట్టే కాల ప్రవాహం, మహా పర్వత సదృశుడైన షేక్స్పియర్ కీర్తికి ఏ మాత్రం క్షతి కలిగించలేక పోయింది అంటాడు జాన్సన్ పండితుడు. షేక్స్పియర్ ఒక కాలానికి చెందినవాడు కాడు, సార్వకాలికుడే కాదు, సార్వ భౌమికుడు కూడా! కనుకనే జాతి, మత, సంస్కృత్యాదుల్లో భిన్నమైన ఏ భాషలోకి అనువదించినా, అతని రచనలలోని జీవశక్తికి భంగం కలగలేదు. ఇతని రెండు దీర్ఘ కావ్యాలు *వీనస్ అండ్ అడొనిస్*, *ది రేప్ ఆఫ్ ల్యూక్రీస్*.

ప్రతి శతాబ్దమూ షేక్స్పియర్‌ను తన విశిష్ట దృక్కోణంతో విమర్శిస్తూనే ఉన్నది. ఏ దృక్కోణం నుండి విమర్శించినా, ఈయన సర్వశ్రేష్ఠుడనే తీర్మానానికే వస్తున్నది. ఒక్క హామ్లెట్ విషయం తీసుకుంటే బైబిల్ తరువాత ఏ ఒక్క గ్రంథాన్ని గురించి అంత విమర్శ జరుగలేదు.

ఇటీవల ఒక విరసపు మాట వినబడుతున్నది. షేక్స్పియర్ పేరుతో నేడు ప్రచారంలో ఉన్న రచనలు అతడు రచించినవి కాదనీ, వాటిని రచించటానికి కావలసిన విద్యాసంస్కారాలు అతనికి లేవనీ, మరెవరో రాసి ఇతని పేరుతో ప్రకాశింప చేశారనీ, ఆ ఎవరో బేకన్ అనీ, క్రిస్టోఫర్ మార్లో అనీ, మరొకరనీ కొందరు

వాదిస్తూ ఉన్నారు. కాని షేక్స్పియర్ సమకాలీనులు ఇట్టి సందేహాలకు తావులేని ప్రశంసలు చేసి ఉండడం వలన ఈ వాదనకు బలం చాలటం లేదు. విశ్వనాటక సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకొన్న షేక్స్పియర్ 1616లో మరణించాడు.

జయలక్ష్మి

షేర్వుడ్, రాబర్ట్ ఇ (1896-1955) : అమెరికన్ నాటక రచయిత. న్యూయార్క్‌లో పుట్టి అక్కడనే మృతి చెందాడు. విద్యార్థిగా చదువులో రాణించక పోయినా, కళాశాల పత్రికలోను, నాటక ప్రదర్శనలలోనూ రచయితగా, నటుడుగా రాణించాడు. పట్టభద్రుడు కాకుండానే సైన్యంలో చేరి విషవాయువు సోకి, ఉద్యోగం నుంచి విడుదల పొంది, పత్రికా పరిశ్రమలో ప్రవేశించాడు. క్రమంగా లైఫ్ అనే హాస్య పత్రికకు సంపాదకుడయ్యాడు. ఈయన తొలి నాటకం ద రోడ్ టు రోమ్ యుద్ధపు నిరర్థకత్వాన్ని నిరూపిస్తుంది. ఈయన చాలా రచనలలో ఇదే ప్రధాన వస్తువు. ద పెట్రిఫైడ్ ఫారెస్ట్, ది ఇడియట్స్ డిలైట్ లలో నాయకులు అనాసక్తులుగా, మానవద్వేషులుగా ప్రారంభమై, తమ నిరర్థకత్వాన్ని గుర్తించి, చివరకు తమ సహచరుల కోసం ఆత్మార్పణం చేస్తారు. ఇల్లినాయిస్ ఏబ్‌లింకన్, దేర్ షెల్ బి నో నైట్ లలో నాయకులు యుద్ధ విరోధులుగా ప్రారంభమై చివరకు యుద్ధం చేసేందుకు నిశ్చయించుకుంటారు. ఇతరులకోసం ఆత్మార్పణం చెయ్యటమే జీవితానికి సార్థక్యం అన్నదే ఈయన రచనలన్నిటిలో ఉన్న సందేశం. లింకన్ నాటకంవల్ల ఈయన అమెరికా అధ్యక్షుడైన రూజ్‌వెల్టుకు సలహాదారుగానూ, ఉపన్యాస రచయితగాను చేరాడు. నౌకాదళ కార్యదర్శి, యుద్ధవార్తా ప్రసార కార్యాలయ నిర్దేశకుడు మొదలైన బాధ్యతగల పదవులు నిర్వహించాడు. ఈవిధంగా సంపాదించిన అనుభవాలతో రూజ్‌వెల్ట్, అండ్ హాప్కిన్స్, ఏన్ ఇంటిమేట్ హిస్టరీ అనే గ్రంథాన్ని రచించాడు. ఈయన ద బెస్ట్ ఇయర్స్ ఇన్ అవర్ లైవ్స్ అనే నాటకం చలనచిత్రంగా రూపొంది అకాడమీ బహుమతిని గెలుచుకొన్నది. *మూర్ఖుని ఆనందం, ఇల్లినాయిస్‌లో, ఏబ్‌లింకన్, రాత్రి ఉండరాదు, రూజ్‌వెల్ట్ అండ్ హాప్కిన్స్* నాలుగూ పులిట్జర్ బహుమతులను గెలుచుకున్నాయి. హాస్య ప్రధానమైన *రాణీ గారి మగడు* ప్రణయ ప్రధానమైన *వియన్నాలో పునర్మిలనం*, ఆదర్శ ప్రధానమైన *వాటర్లూ వంతెన* ఈయన ప్రతిభకు సంకేతాలు.

చ.తి.

షోతుసేన్ (జ. 1902) : రంగస్థల శిల్పాచార్యుడు. రంగప్రదీపన ప్రవీణుడు, నాటక కళావేత్త. ఈయన కలకత్తాలో 1902లో జన్మించాడు.

కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగు చదువుతున్నప్పుడే నాటక కళ మీద అభిరుచి ఏర్పడింది. రంగస్థల సాంకేతిక జ్ఞానసముపార్జనకు మే 1924లో అమెరికా వెళ్లి అక్కడి బోలస్లవస్కీ నాటక కళా శాలలో చేరి సాంకేతిక శిక్షణ పొందాడు. అప్పుడే రాబర్ట్ ఎడ్మండ్ జోన్స్ వంటి దర్శక శిఖామణుల వద్ద దర్శకత్వంలో, కళా దర్శకత్వంలో కూడా శిక్షణ పొందాడు. ఆ తరువాత బోలస్లవస్కీకి సహాయ దర్శకుడుగా పనిచేస్తుండగా సుప్రసిద్ధ వంగ మహానటుడు శిశిర్ కుమార్ భాదురి నాటక సమాజం ఆహ్వానం మీద కలకత్తా తిరిగి వచ్చి రంగమహల్ నాటక శాలలో భ్రమణ వేదిక నిర్మించాడు. ఇదే ఆసియా ఖండంలో ప్రప్రథమ భ్రమణ వేదిక. ఈ వేదిక నిర్మాణం వల్ల బెంగాలీ నాటక రంగంలో ఎంతో మార్పు వచ్చింది. బకింగ్, శరత్‌ల నవలలు నాటకాలుగా రూపొందించి ప్రదర్శించడానికి వీలైంది.

రంగ ప్రదీపనంలో కూడా అనేక మార్పులు తెచ్చి అవస్థానుగుణ రంగ ప్రదీపనం మొట్టమొదటి సారిగా భారతదేశంలో ప్రవేశపెట్టింది కూడా ఈయనే. కేంద్రీకరణ దీపాలను స్వయంగా తయారు చేశాడు.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటక కళాశాలలో రంగస్థల సాంకేతిక విద్యాచార్యుడుగా పనిచేశాడు.

శ్రీ.చ.

ష్నిట్జ్‌లర్, ఆర్థర్ (1862-1931) : ఆస్ట్రియన్ నాటక, నవలా రచయిత. మనస్తత్వ విశ్లేషణాత్మకమైన రచనలకూ, 19వ శతాబ్ది చివరి భాగపు వియన్నీస్ బూర్జువా జీవితాన్ని విశ్లేషించి చూపిన నాటకాల రచనకూ ప్రసిద్ధుడు. సుప్రసిద్ధ యూదు వైద్యుడు ష్నిట్జ్‌లర్ కుమారుడైన ఆర్థర్ వైద్య శాస్త్రంలో పట్టభద్రుడై, జీవితంలో ఎక్కువ భాగం వైద్యుడుగానే గడిపాడు. ముఖ్యంగా ఆయనకు 'సైకియాట్రి' (మనోవ్యాధి చికిత్స)లో



ఎక్కువ ఆసక్తి ఉండేది. ఏడు ఏకాంక నాటికల సంకలనమైన ఆనటోల్ (1893) ప్రచురణతో రచయితగా ఆయనకు గుర్తింపు వచ్చింది. ఈ నాటికలు ఒక సంపన్న వియనీస్ యువకుని ప్రేమ కలాపాలను చిత్రిస్తాయి. ఈ నాటికలలో పాత్రచిత్రణలో ఆర్థర్‌కు గల విశేషమైన ప్రతిభ అభివ్యక్తమైంది.

ష్నిట్జ్‌లర్ రచించిన రైగన్ '1897, (Merry-go-round, 1953) 10 నాటకీయ సంభాషణల సంకలనం. కామోద్రేకంలో చిక్కుకొన్న స్త్రీ పురుషుల హృదయ రాహిత్యాన్ని ఈ సంభాషణలు చిత్రిస్తాయి. 1950లో దానిని మాక్స్ ఓ ఫ్యూల్స్ లా రోండే అనే ఫ్రెంచ్ చలనచిత్రంగా తీశాడు. ప్రేమలోని అహంభావాన్నీ, మృత్యుభీతినీ, శృంగారజీవితంలోని క్లిష్ట పరిస్థితులనూ ష్నిట్జ్‌లర్ శక్తివంతంగా తన రచనలలో చిత్రించాడు. *లీబెలై* (1896, Playing with Love), ఫ్రైవిల్డ్ (1896, Free game), నాటకాలలో ఆస్ట్రియన్ సైనిక వర్గాలలోని అంతస్సార రాహిత్యాన్ని చిత్రించాడు. ఫ్లుక్ట్ ఇన్ డీ ఫిన్‌స్టెర్నిస్ (Flight in to Darkness, 1931) అనే నాటకంలో దశలవారీగా ఉన్మాదం ఎలా వ్యక్తిని ఆవహిస్తుందో చిత్రించాడు. డెర్‌వెగ్ ఇన్స్ ఫ్రీ (1908), ప్రొఫెసర్ బెర్న్‌హార్డీ (1912), ది రోడ్ టు ది ఓపెన్ (*The Road to the Open* (1923) ఆస్ట్రియాలోని యూదుల పరిస్థితిని వర్ణించే రచనలు. ష్నిట్జ్‌లర్ నాటకాలూ, నవలలే కాక కథానికలూ, కొన్ని వైద్య గ్రంథాలు కూడా రచించాడు.

బ.శ్రీ.

సంక్షిప్తి : ఆరభటీ వృత్యంగం. ఈ సంక్షిప్తి మూడు విధాలు 1. వస్తు సంక్షిప్తి, 2. పరివర్తన సంక్షిప్తి, 3. అవస్థాంతర సంక్షిప్తి.

1. వస్తు సంక్షిప్తి : నాటక ప్రయోగానికి కృత్రిమ వస్తునిర్మాణం వస్తు సంక్షిప్తి. ఉదా : ప్రతిజ్ఞా యౌగంధరాయణంలో వత్సరాజును మోసగించడానికి మహాసేనుడు నిర్మింపచేసిన మాయాగజము.

2. పరివర్తన సంక్షిప్తి : నాయకుడి స్థానంలో మరొక నాయకుడు అంటే ఉపనాయకుడు ఆ స్థానం ఆక్రమించడం పరివర్తన సంక్షిప్తి. ఉదా : ప్రతిమ, పాదుకాపట్టాభిషేక నాటకాలలో నాయకుడు రాముడు రాజ్యపాలనను విడిచి వనవాసానికి వెళ్లినప్పుడు, ఉపనాయకుడైన భరతుడు రాముని స్థానంలో ఆ రాజ్య పాలనను చేపట్టడం.

3. అవస్థాంతర సంక్షిప్తి : పాత్ర ఒక అవస్థను విడిచి వేరొక అవస్థను పొందడం అవస్థాంతర సంక్షిప్తి.

ఉదా : మహావీర చరిత్రలో పరశురాముడు తన ధీరోద్ధతావస్థను విడిచి ధీరశాంతావస్థను పొందడం.

శ్రీ.చ.

సంగీత నాటక అకాడమీ : భారతీయ సంగీతం, నృత్యం నాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం సాంస్కృతిక శాఖ నిధులతో స్వతంత్ర సంస్థగా కొత్త ఢిల్లీలో అవతరించింది. సాహిత్య అకాడమీ, లలితకళా అకాడమీ దీనికి అనుబంధ సంస్థలుగా ఉంటూ ప్రదర్శన కళల్ని ప్రోత్స హిస్తున్నాయి. సంప్రదాయ, జానపద, కళా రూపాల్ని పరిరక్షించు దిశగా సంగీత నాటక అకాడమీ పనిచేస్తూ ఉంది. భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే ప్రక్రియలో భాగంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు, సదస్సులు, శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ ఆయా కళా రూపాల్లో కృషిచేస్తున్న వారందరికీ చేదోడుగా ఉంటోంది. వారి వారి కళల్ని పరిరక్షించు కునేందుకు ఉపాధి కల్పించు కునేందుకు, కళాకారులకు ఆర్థిక సహాయం చేస్తూ కళారంగానికి సంబంధించిన గ్రంథాల్ని ముద్రించింది. సంగీత్ నాటక్ పేరుతో పత్రికను కూడా ప్రచురించింది. ప్రదర్శిత కళల్లో దేశంలో నిష్ణాతులైన వారికి వార్షిక అవార్డులను ఇవ్వటం కూడ అకాడమీ విధుల్లో ఒకటి. జీవితకాల గౌరవ భృతిని కూడ పరిపూర్ణమైన కళాకారులకు, పండితులకు అందజేస్తూ ఉంది.

ప్ర.రె.

సంగీత మానినీ సమాజం : ఈ సమాజాన్ని 1902లో మారేపల్లి రామచంద్ర శాస్త్రి విశాఖపట్టణంలో స్థాపించాడు, ఈయన దర్శకుడు కూడా. మద్దెల సూర్యనారాయణ, కొంకిపూడి చిన చిట్టి, కొంకిపూడి పెదబుల్లి, కొంకిపూడి చినబుల్లి మొదలైన నటీనటులు ఈ సమాజం సభ్యులే. ఇది స్త్రీ సమాజం. పడుపు వృత్తి మానిన వేశ్యాంగనలకు జీవనోపాధి కల్పించడానికి స్థాపితమైన సమాజం. ఇందులో స్త్రీ పురుష పాత్రలు రెండూ స్త్రీలు ధరించేవారు. ఈ సమాజం విశాఖపట్నంలోనే గాక పెద్ద పెద్ద పట్టణాలన్నింటా ప్రదర్శనలిచ్చి మెప్పుపొందింది. కాని ఈ సమాజ స్థాపనాశయం సిద్ధించకపోవడం వల్ల ఆర్థికంగా పెద్ద నష్టం వచ్చి అచిరకాలంలోనే మూసివేయక తప్పలేదు. ఈ సమాజం సావిత్రి పారిజాతాపహరణం, గయోపాఖ్యానం, విక్రమార్క సత్యహరిశ్చంద్ర మొదలైన నాటకాలను ప్రదర్శించింది.

శ్రీ.చ

సంగీత రూపకం : రూపక భేదం. వాచికంలోని ప్రతి మాట గానం చేసే సంప్రదాయంతో విలసిల్లే దృశ్య కావ్యం సంగీత రూపకం. దీనిలో జంత్ర, గాత్ర, సంగీతాలకు ప్రాధాన్యం హెచ్చు

ఈ రూపక భేదం సంగీత సంప్రదాయ బద్ధం. అందుచే దీనికి అలవాటు పడని వారికి వింతగా, అసంబద్ధంగా తోస్తుంది ఒక్కొక్కప్పుడు పాడుతున్న పాట పూర్తయే వరకు నాట ప్రక్రియనంతటినీ ఆపివేయడం, మాటలు, చరణాలు తిరి తిరిగి పాడడం, త్వరత్వరగా నిష్క్రమించకుండా రంగస్థల అంచున నిలబడి రాగయుక్తంగా తానింక ఉండకూడదని, వె పోతున్నానని తిరిగి తిరిగి పాడుతూ నిలబడడం ఎంత అసంబద్ధంగా కనిపిస్తుంది. అయితే ఆ గాన మాధుర్యం

తన్మయులైన ప్రేక్షకులకు ఈ అసంబద్ధాలు స్మృతికి రావు. అందువల్లనే శతాబ్దాల తరబడీ ఈ రూపక భేదం ప్రజాదరణ పొందుతూనే ఉంది.

ఈ సంగీత రూపకం రెండురకాలు. మొదటిది నిర్వచన రూపకం. ఈ రూపకం ఆద్యంతమూ సంగీతంతోనే నడుస్తుంది. ఇక రెండవ రకంలో పాటను పాటను అనుసంధించడానికి మాత్రమే వచనం ప్రయుక్త మవుతుంది. సుప్రసిద్ధ నాటకాలను సంగీత రూపకాలుగా రూపొందించడం పరిపాటైపోయింది.

మదాం బటర్ ఫ్లై, ఫాస్ట్, ఆర్ఫ్యూస్ పాశ్చాత్య సంగీత నాటకాలకూ, నౌకా చరితం, ప్రహ్లాద భక్త విజయం తెలుగు సంగీత రూపకాలకు మంచి ఉదాహరణలు. సంగీత ప్రధానమైన ఈ రూపకంలో బృంద గానం ప్రవేశించడం సహజంగానే జరిగిపోయింది. అలాగే క్రమక్రమంగా సీనరీలు మొదలైన హంగామా అంతా ప్రవేశించింది.

అనాది నుంచి సంగీతానికి, నాటకానికి సంబంధం ఉంది. నాటక ప్రాథమిక రూపం దేవతోత్సవాలలోని సంగీత నృత్యాలలో నుంచి పుట్టింది. క్రమంగా సంగీతరూపక లక్షణాలు ఇటలీ గోప (pastoral) రూపకంలోకి, ఇంగ్లండులోని కరాళ (mask) రూపకాలలోకి ప్రవేశించాయి.

ప్రేక్షకులను ఉన్నత ఉద్వేగ ప్రపంచంలోకి తీసుకుని వెళ్లడమే సంగీత రూపకాల పరమాశయం. క్రమేపీ సంగీత రూపకం ఆరు రకాలుగా పరిణామం చెందింది. 1. హాస్య సంగీత రూపకం, 2. ఆటపాట (Ballet), 3. కాల్పనికాలు (Romantic), 4. శ్లావోనిక్ (Slavonic), 5. లలిత (Light), 6. ఆధునిక (Modern).

1. హాస్య సంగీత రూపకం: మొట్ట మొదట అంకం చివర హాస్యరంగాలు పొందుపరచడం జరిగింది. అప్పుడు ప్రధాన ఇతివృత్తానికి, హాస్య రంగాలకు సన్నిహిత సంబంధముండేది. తరువాత తరువాత అవి స్వతంత్ర రంగాలుగా పరిణామం చెంది తుదకు చిన్నచిన్న సంగీత రూపకాలుగా తయారయాయి. గంభీర సంగీత రూపకాల మధ్య మధ్య ఈ చిన్న వాటిని ప్రదర్శించే వారు. ఇవి ప్రజాభిమానాన్ని ఎక్కువగా చూరగొనసాగాయి. చివరకు విడిగా ప్రత్యేక రూపకాలుగా ప్రదర్శించే పరిస్థితి ఏర్పడింది; **2. ఆటపాట సంగీత రూపకం :** ఇది స్థానిక లక్షణాలతో, వచన సంభాషణలు, సమకాలీన స్వరాలతో, పాటలతో విలసిల్లే సంగీత రూపక భేదం; **3. కాల్పనిక సంగీత రూపకం :** యువవీరులు, దుష్టప్రేమికులు, అద్భుత కథలు, క్రూర బంధాల నుంచి విముక్తి, బంది పోటు దొంగ నాయకులు, దయ్యాల కోటలు, పాతాళ కారాగృహాలు మొదలైన వాటిలో విలసిల్లే సంగీత రూపక భేదం; **4. శ్లావోనిక్ సంగీత రూపకం :** తూర్పు, ఐరోపా దేశాలలో విలసిల్లిన దేశీయ సంగీత రూపక విశేషం; **5. లలిత సంగీత రూపకం :** 19వ శతాబ్దిలో వాగ్నర్ సంగీత రూపకానికి వ్యతిరేకంగా ఆవిర్భవించిన సంగీత రూపక భేదం, **6. ఆధునిక సంగీత రూపకం :** సాహిత్యం ప్రాధ్యాన్యం వహించే సంగీత రూపక భేదం.

శ్రీ.చ.

సంఘర్షణ : ఇతివృత్త సంబంధి. మానవ జీవితం సంఘర్షణామయం. మానవుడు అనుక్షణం ప్రకృతితోనో, వ్యక్తులతోనో, వ్యవస్థతోనో, అంతరాత్మతోనో సంఘర్షణ పడుతూనే ఉంటాడు. రూపకం లోకవృత్తానుకరణం, ప్రకృతికి ప్రతిబింబం కాబట్టి సహజంగా రూపకం కూడా సంఘర్షణామయమే. సంఘర్షణ లేనిదే నాటకం లేదు.

సంఘర్షణ ప్రాముఖ్యాన్ని సుప్రసిద్ధ ఆంగ్ల నాటకకర్త, విమర్శకుడు జార్జి బెర్నార్డ్ షా ఇలా చెప్పాడు. "ప్రతి నాటకం ఏదో ఒక సంఘర్షణను చిత్రించి తీరాలి. ముగింపు రాజీయో, వినాశనమో లేక జీవితంలోలాగా ముగింపేలేకపోవడమో జరగవచ్చు కాని సంఘర్షణ మాత్రం తప్పని సరి. సంఘర్షణ లేకుంటే నాటకమే లేదు".

అయితే మానవుడు జీవితంలో అనేక శక్తులతో పోరాడుతూనే ఉంటాడు. కాని ఆ సంఘర్షణలలో చెప్పుకోతగ్గవి, నాటకంగా చిత్రించతగ్గవి కొన్ని మాత్రమే కనిపిస్తాయి. ఆ ప్రధాన సంఘటనలనే నాటకం చిత్రిస్తుంది.

ఈ సంఘర్షణ ప్రధానంగా రెండు విధాలు : 1. బాహ్య సంఘర్షణ, 2. అంతర సంఘర్షణ.

బాహ్య సంఘర్షణ అనేక విధాలు :

ఇద్దరు వ్యక్తుల సంఘర్షణ

రాముడు X పరశురాముడు
నలుడు X కలి

వైషమ్యం వల్ల పుట్టిన ఈ సంఘర్షణ సాధారణంగా ఆ ఇద్దరు వ్యక్తులకే పరిమితమై ఉంటుంది. ఈ సంఘర్షణ వాగ్యుద్ధంగా రూపొందవచ్చు. లేదా ద్వంద్వ యుద్ధంగా పరిణమించవచ్చు. సంస్కృత లాక్షణికులు దీనినే సంఫేటం అన్నారు. మొదటి దానికి హరిశ్చంద్ర నాటకంలో వశిష్ట విశ్వామిత్రుల సంఘర్షణ, రెండో దానికి ఆ నాటకంలోనే హరిశ్చంద్ర భేతాళ సంఘర్షణ ఉదాహరణలు.

రెండు పక్షాల సంఘర్షణ : రెండు పక్షాలు లేక రెండు సైన్యాల మధ్య జరిగే సంఘర్షణ ఇది. ఆయా పక్షాల నాయకుల మధ్య రేగిన సంఘర్షణ రెండు పక్షాల సంఘర్షణగా సామాన్యంగా రూపొందుతుంది. సంఘర్షణ ఫలితాన్ని అనుభవించేది ఆయా పక్షనాయకులే కాబట్టి దీనిని మొదటి దానిలో అంతర్భాగంగా కొందరు భావిస్తారు. బబ్బిలి, విజయ నగరం సైన్యాల మధ్య సంఘర్షణ (బబ్బిలి యుద్ధం), కౌరవ పాండవ యుద్ధం

(పాండవ విజయం). పాండవ విజయం, బబ్బిలి యుద్ధనాటకాల రెండింటిలోనూ ఫలితం మంచిగాని చెడుగాని అనుభవించింది ఆయా పక్షాల నాయకులే.

వ్యక్తికి విధికి సంఘర్షణ : విధి బలీయం, తానొకటి తలచిన దైవ మొకటి తలచు అనే సామెతలు ఈ సంఘర్షణకు వ్యక్తీకరణలు ఉదా. అభిజ్ఞాన మణిమంత, తానొకటి తలచితే.

మతాల సంఘర్షణ : మతానికి మతానికి అంటే రెండు తాత్త్విక సిద్ధాంతాలకు మధ్య సంఘర్షణ.

ఉదా: వేదాంత దేశికుని సంకల్ప సూర్యోదయ నాటకంలో అద్వైత–విశిష్టాద్వైత మతాలకు సంఘర్షణ. ఆ సంఘర్షణలో విశిష్టాద్వైత విజయం చిత్రితమైంది.

రెండు వర్గాల సంఘర్షణ : అనాది నుంచి మానవ కోటిలో ఉన్నవారు, లేనివారు పెట్టుబడిదారులు, కార్మికులు, భూస్వాములు, రైతులు ఇలా విభిన్న వర్గాలుగా చీలి ఒకరితో ఒకరు సంఘర్షణ పడుతూనే ఉన్నారు. అందుచేత నాటకంలో కూడా ఈ విభిన్న వర్గాల సంఘర్షణ చిత్రితమవుతూ వచ్చింది. ఉదా: ముందడుగు. జమిందారు – రైతు సంఘర్షణ, నేత బిడ్డ పెట్టుబడి దారుడు–కార్మికుడు సంఘర్షణ.

రాజకీయ సంఘర్షణ : నానాటికి ప్రజాజీవితంలో రాజకీయాల ప్రాముఖ్యం హెచ్చుతోంది. రాజకీయ పక్షాలకు భావాలకు సంఘర్షణ నిత్య కృత్యమైపోయింది. ఉదా పాంచాలీ పరాభవం, వాస్తవం, ఏకదేశం.

వ్యక్తి, సంప్రదాయ సంఘర్షణ : ఉదా. ఎదురీత, ఆలోకము నుండి ఆహ్వానము, మనోరమ, దీక్షిత దుహిత.

అంతర సంఘర్షణ : ఈ అంతర సంఘర్షణని భావసంఘర్షణని కూడా అంటారు. ఇది ఇద్దరి మధ్య సంఘర్షణ. కాక ఒకే వ్యక్తి మనసులో చెలరేగే రెండు భావాల మధ్య సంఘర్షణ. ఈ సంఘర్షణ మూలంగా జనించే ప్రశ్న కింకర్తవ్యం (ఏం చేయాలి). బాహ్య సంఘర్షణ కంటే ఈ అంతర సంఘర్షణకే విమర్శకులు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఉదా : అభిజ్ఞాన శాకుంతలం ద్వితీయాంకంలో కణ్వాశ్రమ ఋషి కుమారులు వచ్చి దుష్యంతుని ఆశ్రమ రక్షణకు రావలసిందని కోరతారు. సరిగ్గా ఇదే సమయానికి రాజమాత దుష్యంతుని రాజధానికి తిరిగి రమ్మని కబురు పెడుతుంది. ఏం చెయ్యాలి? ఈ రెండు భావాలు దుష్యంతుని మనస్సులో ఘర్షణ పడతాయి.

సంఘర్షణ నాటకానికి జీవగర్ర. నాటకం ఆద్యంతం వ్యాపించి దానికి ప్రాణం పోస్తుంది. సంఘర్షణతో నాటకం ప్రారంభమై, సంఘర్షణ పరిసమాప్తంతో ముగుస్తుంది. ప్రారంభ పరిసమాప్తుల మధ్య సంఘర్షణ పెరుగుతూ, తరుగుతూ క్రమ పద్ధతిలో సాగుతుంది.

శ్రీ.చ.

సంఘ సేవా నాట్యమండలి : ఈ సమాజాన్ని గుంటూరులో 1990లో స్థాపించారు. వ్యవస్థాపకుడు దామరాజు పుండరీ కాక్షుడు. పత్రి శ్రీనివాసరావు, జాగర్లపూడి లక్ష్మీనరసింహా రావు, వింజమూరి శ్రీనివాసాచార్యులు, బసవరాజు సుబ్బారావు ప్రభృతులు ప్రధాన నటులు.

ఈ నాట్య మండలి సభ్యులందరూ జాతీయ వాదులు. నాటకాల ద్వారా జాతీయ భావాలను ప్రజలలో రేకెత్తించి, జాతీయోద్యమాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలనేదే వీరి ప్రధానాశయం. ఈ ఆశయసిద్ధి కోసం ఈ సమాజ సభ్యులు దామరాజు పుండరీకాక్షుడు రచించిన స్వరాజ్య సోపానం అనే నాటకం ప్రదర్శించారు. నాటి బ్రిటిష్ ఇండియా పరిపాలకులను ఈ నాటకం గజగజలాడించింది. ప్రదర్శనలను నిషేధించింది. అయితే సంఘసేవా నాట్యమండలి నటులంతా మహా సాహసికులు కావడం వల్ల ప్రభుత్వం కన్ను కప్పి ఏదోవిధంగా కొంతకాలంపాటు ఆ నాటకం ప్రదర్శించారు. 1934 వరకు అంతరాయం కలిగింది. 1938నుండి 1961 వరకూ నాటకాలు ప్రదర్శిస్తూనే వచ్చారు. స్వరాజ్య సోపానం, *గాంధీ మహోదయం, గాంధీవిజయం, పాంచాల పరాభవం, సంస్కారిణి కలియుగ భారతం, శ్రీనాధ పోతన, రణభేరి,* మీరాబాయి, క్విట్ ఇండియా మొదలైన నాటకాలను ఈ మండలి విరివిగా ప్రదర్శించింది.

శ్రీ.చ.

సంఘాత్యం : కైశికీ వృత్త్యంగం. సంఘాత్యమనగా మిత్రభేదం. మంత్ర, అర్థ, దైవ, పురుష, స్వశక్తిలలో దేనితోనైనా సంఘాన్ని చీల్చడం సంఘాత్యం.

మంత్రశక్తి : మంత్రశక్తి అంటే నీతి ప్రయోగం. ముద్రారాక్షస నాటకంలో కపట లేఖ, దొంగ సాక్ష్య ప్రయోగంతో మలయ కేతువును, చిత్ర వర్మాది రాజులను చాణక్యుడు చీల్చడం.

అర్థశక్తి : ధనం వంటి వస్తువులతో మిత్రభేదం కల్పించడం. ముద్రారాక్షస నాటకం పంచమాంకంలో పర్వతేశుని ఆభరణాల ద్వారా రాక్షస మలయ కేతువుల మధ్య మిత్రభేదం కల్పించడం.

దైవశక్తి : దైవబలం వలన జరిగిన సంఘాత్యం. ముద్రారాక్షస పంచమాంకంలో దైవశక్తి సంఘాత్యం.

పురుష శక్తి : స్వప్నవాసవదత్త నాటకం పంచమాంకం చివర కాంచుకేయుడు వత్సరాజుతో –

"నీ ప్రతాపము ముందు నిలువంగ నోపక బెదిరి నీ శత్రువుల్ భిన్నులైరి" అంటాడు. – అను. చిలకమర్తి లక్ష్మీనరసింహం

ఇక్కడ వత్సరాజు పురుష శక్తి వలన శత్రువుల చెల్లాచెదరైనారని తాత్పర్యం.

స్వశక్తి : స్వశక్తి వలన చీలిక తేవడం : వేణీ సంహారం తృతీయాంకంలో కర్ణునితో కలహించి, అశ్వత్థామ అస్త్ర సన్యాసం చేయడం స్వయంగా కౌరవ పక్షంలో చీలిక తేవడం.

శ్రీ.చ.

సంఘోటనం : పూర్వ రంగ అంతర్యవనికాంగం. దీనినే సంఘట్టన అని కూడా అంటారు. సంఘట్టన మనగా సంయక్ ఘట్టనం.

పాణి విభాగం సంఘట్టనమని కొందరు, వీణాగత సంఘట్టన విధి సంఘట్టనమని కొందరి అభిప్రాయం.

లయానను గుణంగా చర్మ వాద్యాలను సరిచేసుకొని ప్రహరించడం సంఘట్టన. దీని వల్ల గుహ్యకులు సంతోషిస్తారు.

శ్రీ.చ.

సంచారీ భావాలు : రసమును బాగా వెదజల్లేవి సంచారీ భావాలు. భావ గమనాన్ని సంచరింపచేసేవి, నిలకడ లేనివి. వీటికే వ్యభిచారీ భావాలని మరో పేరు.

శ్రీ.చ.

సంచాలనం (Movement) : రంగస్థలం మీద నటీ నటులు ఒక చోట నుంచి ఇంకొక చోటకు కదిలి వెళ్లే ప్రక్రియ సంచాలనం. ఈ సంచాలనం నాటక కథా సరళిలోని ప్రక్రియ కావచ్చు. లేదా రంగం మీది నిశ్చలత్వం మూలంగా జనించే విసుగును పోగొట్టడానికి లేదా భావోద్రేకం వల్ల తీసుకునే సంచాలనం కావచ్చు. కథాసరళిలోని సంచాలనమయితే నాటక కర్త దాని ప్రయోజనాన్ని కలిపి పెడతాడు. అనవసరంగా పిచ్చివానిలాగా రంగస్థలం మీద కదలాడుతున్నారనే భావం కలిగి ప్రేక్షకులకు జుగుప్స పుడుతుంది. సంచాలనం కోసం సంచాలనం ఎన్నటికీ పనికి రాదు. ముందుగానే ప్రయోజనం నిర్ధారించుకొని ఆ తరువాత సంచాలనానికి పూనుకోవడం ఉత్తమం.

ఎపుడు ఎందుకు ఈ సంచాలనానికి పూనుకోవాలో తెలుసుకుందాం. 1. నాటక కర్త నిర్దేశించిన కథా సరళిలోని ప్రక్రియ అయినపుడు, 2. పాత్రచిత్రణకు లేదా పాత్ర మనోస్థితిని వ్యక్తీకరించడానికి, 3. ఒక నిర్దిష్ట విషయం నొక్కి చెప్పడానికి, 4. ఏకాగ్రతా సంయమనానికి, 5.అనిశ్చిత కౌతుకం వెల్లడించడానికి, 6. మూర్తి సృజనకు, 7. లయకు, 8. స్థాయి నిలబెట్టడానికి, 9. స్థానం లేక హోదా నిర్దేశించడానికి, 10 పరిహారం, 11. ఆలోచనా క్రమంలోని మార్పును గాని, సంబంధ బాంధవ్యాలలో వచ్చిన మార్పును గాని సూచించడానికి. రంగస్థలం మీది పాత్రల మేళనం ద్వారా పాత్రల మధ్య సంబంధ బాంధవ్యాలు, సమ్మేళనలో మార్పు ద్వారా పాత్రల సంబంధ బాంధవ్యాలలో మార్పు సూచించడం, 12. విసుగుదల నుంచి, అతిగా మాట్లాడడం నుంచి, అతి ఉద్వేగభారం నుంచి విశ్రాంతి కొరకు.

సంచాలనం సమయంలో ఈ కింది నియమాలను పాటించవలసి ఉంటుంది. 1. ప్రేక్షకుల వేపు తిరిగి వాచికం చెప్పాలి, 2. హాస్య వాక్యాలను, బలీయ వాక్యాలను ప్రేక్షకులకు ఎదురుగా ఉండి చెప్పాలి, 3. సంచాలనం సరళ రేఖలో గాని, వక్రరేఖలో గాని జరగాలి, 4. రంగస్థలం మీదకు వచ్చే పాత్ర సూటిగా, శీఘ్రంగా రావాలే గాని ప్రవేశ ద్వారాలలో తారాడ కూడదు, 5. రెండు పాత్రలు మాట్లాడుకుంటూ రంగస్థలం మీదకు వచ్చేటపుడు మాట్లాడే పాత్ర వెనుక రావాలి. 6. ఒక పాత్ర మాట్లాడుతుండగానే అవసరమైతే తప్ప ఇంకో పాత్ర నిష్క్రమించకూడదు, 7, పరిభ్రమణ (వెనుకకు తిరగడం) ప్రేక్షకుల వేపే జరగాలి.

సంచాలనా రీతులు మూడు : మొదటిది సరళగతి సంచాలనం, రెండవది వక్రగతి సంచాలనం, మూడవది పార్శ్వగతి విన్యాసం.

సరళ గతి సంచాలనం : సంచాలన ఆశయం సరళం, శక్తివంత మైనపుడు సంచాలనం సరళ గతిలో ఉంటుంది. శక్తివంతమైన ఆశయం వల్ల కలిగే సంచాలనం ఎక్కువ నాటకీయతకు సహకారమవుతుంది. నాటకీయత ఎక్కువైన కొద్దీ సహజత్వం తగ్గుతుందనే విషయం జ్ఞప్తిలో పెట్టుకోవాలి.

వక్రగతి సంచాలనం : సరళ గతి సంచాలనం కంటె వక్రగతి సంచాలనం చూడముచ్చటగా ఉంటుంది. పొలాలలోని, మైదానాలలోని కాలిబాటలు సరళ గతిలో ఉండవు. వక్రగతిలోనే ఉంటాయి. సామాన్యంగా మనిషి సరళ గతిలో కంటె వక్రగతిలో నడవడానికి ఎక్కువ ఇష్టపడతాడు.

మనోభావాలు శక్తివంతమైనవీ, స్థిరమైనవీ కానపుడు, ఆలోచనా నిమగ్నుడైనపుడు సంచాలనం వక్రగతిలో ఉంటుంది. బల్లలు, కుర్చీలు మొదలైన వస్తుసామాగ్రిని దాటుకొని వెళ్ళవలసి వచ్చినపుడు వక్రగతి సంచాలనం తప్పనిసరి అవుతుంది.

ఈ వక్రగతి సంచాలనం వల్ల, సంచాలనం రమణీయంగా రూపొందుతుంది. సంచాలనం చివర అవసరమైన కోణంలో ఆగి సంచాలనం పూర్తి చేసే అవకాశం నటునికి లభిస్తుంది. ఈ సంచాలనంతో పాటు నటునికి ఆశయం కూడా ఉంటే వాచికం చివరి భాగం ప్రేక్షకుల కెదురుగా ఉండి చెప్పడం వల్ల స్పష్టంగా వినపడుతుంది. నటుడి ముఖంలోని భావాలు ప్రేక్షకులకు స్పష్టంగా గోచరిస్తాయి.

పార్శ్వగతి సంచాలనం : పాత్రకు పాత్రకు మధ్య సంబంధ బాంధవ్యాలు, ఆకర్షణలను బట్టి పాత్ర రెండో పాత్రకు చేరువగా ఉంటుంది. లేక పోతే దూరంగా ఉంటుంది. సంబంధం అస్పష్టమైతే పాత్ర రెండో పాత్రను చుట్టి వెళ్ళాలి. పూర్తి వర్తులగతి సంచాలనలు రంగస్థలం మీద చాలా తక్కువ. రెండు మూడు అడుగులతో కూడిన చిన్నచిన్న చాపాకృతులలో సంచాలనం ఉండడం ఎక్కువ. ఇలాంటి చాపాకృతి సంచాలనాలు సందేహాన్ని, అనిశ్చితత్వాన్ని తెలియ జేస్తాయి. అంతేగాక సాంకేతికంగా రంగాల వ్యవధి పెరిగి సంచలనా పరిధి తగ్గితే పార్శ్వగతి సంచాలనాల ఉపయోగం ఎక్కువ.

ఉదాహరణకు రంగస్థలం మీద కుర్చీలో ఒక యువతి కూర్చొని ఉంది అనుకుందాం. ఆమె ప్రియుడు ఆమెకు మూడడుగుల దూరంలో ఉన్నాడు. అతను ఆమెను చేరుకుని ప్రేమ సంభాషణ చేయాలని ఆదుర్దాగా ఉంది. ఇంకా సంకోచం అతనిని వదల లేదు. ఒక్కొక్క అడుగు చొప్పున ఆ మూడడుగులూ వేసుకుంటూ వెళితే దృశ్య వైవిధ్య నిర్వహణకు ఆ ప్రక్రియ చాలదు. అందుకని ఒకడుగు మాత్రమే ముందుకు వేసి ఆమె కూర్చున్న కుర్చీని చుట్టి రంగస్థలం దిగువకు ఆమె దగ్గరికి వస్తాడు. ఈ వక్రగతి సంచాలనంలో నాలుగు కదలికలు రూపొందుతాయి. ప్రియుడు ఆ యువతి ముందుకు వస్తాడు అపుడు వాచికం ఏదైనా ఉంటే ఆమె ముఖం మీద ప్రేక్షకుల దృష్టి కేంద్రీకృతమౌతుంది. ఇలాంటి వక్రగతి సంచాలనం వల్ల పాత్ర మనోస్థితి, వైవిధ్యం, వ్యక్తీకరణ, చిన్నచిన్న కదలికలు సాధ్యమవుతాయి.

ప్రాముఖ్యం – శక్తి : సామాన్యంగా ఈ రెండూ మిశ్రమంగానే ఉంటాయి కాని ఇవి వేరు వేరు. ఒకటి లోపించినా రెండో దాని మనుగడకు ఇబ్బంది లేదు. ఒక్కొక్కపుడు ఒకే సంచాలనం విభిన్నంగా ఉండవచ్చు. అంతర్గత కారణాల వల్ల సంచాలన స్వభావం మారి పోయే అవకాశం వుంది.

ప్రతి చలనం పాత్రకు ప్రాముఖ్యం తెచ్చి పెడుతుంది. చిన్న చిన్న చలనాల కన్నా పెద్ద పెద్ద చలనాలు ఈ ప్రాముఖ్యాన్ని ఎక్కువ చేయగలవు. ఉదా: పాత్ర తాను ఉన్న స్థానం కన్న ఎత్తు స్థానానికి వెళ్ళడం. కాంతి తక్కువ స్థానం నుంచి ఎక్కువ కాంతి గల స్థానానికి వెళ్ళడం. రంగస్థలం మీద తక్కువ ప్రాధాన్యం గల స్థానానికి కదలడం. భంగిమలో మార్పు, కోణంలో మార్పు వీటి వల్ల పాత్ర ప్రాముఖ్యం పెరుగుతుంది.

ముందుకు దూకడం శక్తిని, వెనుకకు తిరగడం బలహీనతను సూచిస్తాయి. సరళ చలనాల కన్నా వంపు చలనాలు శక్తి విహీనమైనవి. వంపు ఎక్కువైతే శక్తిహీనత కూడా ఎక్కువవుతుంది. చలనంలోని శక్తి ప్రకటన తగ్గుతుంది.

శక్తి స్వయంసిద్ధంగా మంచిదీ గాదు, చెడ్డదీ కాదు. అది పాత్రశక్తికి అనుగుణంగా ఉండాలి. సంఘర్షణ లేని రంగాలలో పాత్ర అంతర్గత శక్తి బలహీనతలు వ్యక్తీకరించవలసి వస్తే తప్ప శక్తి సమస్య అసలు ఉత్పన్నం కాదు.

సంచాలనం ముగింపు చాలా ముఖ్యం. ముగింపు మీదనే దాని శక్తి ప్రాముఖ్య ప్రకటనలు ఆధారపడి ఉన్నాయి. శక్తివంతమైన ముగింపు సంచాలనాన్ని శక్తివంతం చేస్తుంది. బలహీనమైన ముగింపు బలహీనం చేస్తుంది. కాబట్టి సంచాలనం చివరి అంగ విన్యాసంలో ఒక చెణుకు ఉపయోగించితే దానికి శక్తిని ప్రసాదిస్తుంది. ఉదాహరణకు సంచాలనం చివర మణికట్టును కదిలించడం, అంగవిన్యాసం హఠాత్తుగా ఆపివేయడం, బల్లగుద్దడం లాంటి శబ్దం.

పాత్ర మానసిక శక్తి తీవ్రత, అంగ విక్షేపన శక్తి తీవ్రత సమతూకంలో ఉండాలి. అతిశక్తివంతాలు, అతిశక్తి హీనాలు అయిన అంగవిన్యాసాలు పాత్ర నిజాయితీ విహీనతను సూచిస్తాయి. పాత్ర శక్తికి, అంగ విన్యాసశక్తికి తేడా ఎక్కువయితే హాస్యం జనిస్తుంది.

పొడుగు : ఇంతకీ ఈ సంచాలనం ఎంత పొడుగుండాలి? మూడు నాలుగడుగుల సంచాలనం వల్ల ప్రేక్షకుల ఆసక్తి పెరుగుతుంది. చలనం ఐదు అడుగులకు ఎక్కువయితే ప్రేక్షకులకు విసుగు పుడుతుంది. కాని తప్పని సరి అయినపుడు ఈ కింది పద్ధతులు పాటించాలి.

మూడడుగుల కొకసారి క్షణం ఆగి తిరిగి సంచాలనం సాగించాలి. లేదా మూడడుగుల తరువాత వెనకకు తిరిగి చూడడం, సంభాషణ మొదలు పెట్టడం వంటి రంగస్థల కార్య కలాపాలను ఆచరించాలి. నడక వేగం ఎక్కువగా పెంచడం లేదా ఎక్కువగా తగ్గించడం వల్ల వైవిధ్యం సాధించవచ్చు.

క్రాస్ : స్థలం మార్పుకు చేసే దీర్ఘ సంచాలనాన్ని క్రాస్ అంటారు. చిన్న చిన్న సర్దుబాట్లను ఈజ్ లేదా మూవ్ అంటారు. రంగస్థలంలో ముందుకు, వెనకకు, అడ్డంగాను తీసుకునే సంచాలనాలన్నింటికీ క్రాస్ పదం వర్తిస్తుంది.

ప్రేక్షకులకు అవతల వేపు కాలు కదపడంతో ఈ క్రాస్ లోని సంచాలనం ప్రారంభమవుతుంది. అందువల్ల నటుడు సంచాలనం చివర ప్రేక్షకులకు అభిముఖంగా ఉంటాడు. ప్రేక్షకుల వేపు కాలు కదపడంతో ఈ సంచాలన ప్రారంభమైతే ప్రేక్షకులకు తిరోముఖంగా ఉండేస్థితిలో సంచాలనం ముగుస్తుంది. మొదటి పద్ధతిలో మంచి స్థానంలో అంటే కొంచెం పక్కకు తిరిగిన స్థానంలో ఉంటాడు. సంచాలనంతో పాటు సంభాషణ కూడా ఉంటే ఒకే కోణంలో ఉండడం వల్ల అనుకూలత ఎక్కువ.

సంచాలనానికి స్థిరంగా ఉన్న నటుడు అడ్డువస్తే ముందు వేపు నుంచి దాటుకుపోవాలి. కాని పరిస్థితుల వల్ల వెనకనుంచి దాటి వెళ్ళవలసివస్తే నటుడు మరుగుపడినపుడు సంభాషణ ఆపి, మరుగు నుంచి బయటపడిన తరువాత సంభాషణ కొనసాగించాలి. నటుడు కుర్చీలో కూర్చుని ఉన్నప్పుడు వెనక నుంచి రావడం ఉత్తమం. నిజాయితీ లేని పాత్రలు, ప్రాధాన్యం లేని పాత్రలు రంగస్థలం ఎగువనుంచి సంచాలనం సాగించడం మంచిది. నటుడు రంగస్థలం మీద ఒక స్థలం నుంచి ఇంకొక స్థానానికి మారటానికే గాక దృశ్యం అర్థాన్ని, శైలిని, వాతావరణాన్ని, పాత్రల తత్త్వాలను వ్యక్తీకరించడానికి సంచాలనం ఉపయోగపడుతుంది.

సంచాలనా పరంపరలోనిదే పచార్ల రంగం. పాత్ర అటు ఇటు పచార్లు తిరిగేటపుడు పద్ధతి మార్చకపోతే విసుగు పుడుతుంది. ఆయా పరిస్థితులలో పునరుక్తి అవసరమైతే తప్ప ఒకే మాదిరిగా తిరగడం చేయకూడదు. వాచికం చెప్పేటపుడు దిగువకు అముఖంగా ఉండేటట్టు ఈపద్ధతిని రూపొందించుకోవాలి. రంగస్థలం మీద నిలకడగా ఉన్న నటుడు మాట్లాడుతుంటే పచార్లు చేసే నటుడు ఆగాలి. మాట్లాడే నటుడు ఎగువదిక్కుకు మాట్లాడే పరిస్థితి రానీయకూడదు.

వయోభేదాన్ని బట్టి మానవునకు శరీర కండరాల పటుత్వంలో తేడా ఉంటుంది. ఈ తేడాను బట్టే ఆయా అవయవాల చలనం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు యవ్వన దశలో కండరాల పటుత్వం ఎక్కువగా ఉంటుంది. అపుడు నిలబడడం,ఆడడం, పరుగెత్తడం, తేలికగా జరిగిపోతాయి. వెన్నెముక బలం వల్ల నిటారుగా నడువగలుగుతాడు. వృద్ధాప్యంలో వెన్నెముక బలం తగ్గడం వల్ల వంగిపోతాడు. ఇలాగే తక్కిన అవయవాల సంగతి కూడా గ్రహించి ఆ పాత్ర వయో భేదానికి అనుగుణంగా సంచాలనం చేయవలసి ఉంటుంది.

శ్రీ.చ.

సంజీవం : నేపథ్యజ విధి భేదం. పశుపక్షి మృగాదుల వంటి ప్రాణులు రంగస్థలం మీద తిరుగుతున్నట్లు చూపించడం సంజీవం. ఉదా: అభిజ్ఞాన శాకుంతలం ప్రథమాంక ప్రారంభంలో జింక తిరగాడడం.

శ్రీ.చ.

సంజీవ రావు, ఉప్పులూరు (1889-1957) : నటుడు. మైలవరం బాలభారతీ సమాజంలో నాయికా పాత్రధారి. అపరసావిత్రి, రంగరత్న, రంగరాజహంస బిరుదాంకితుడు. శృంగార, కరుణ రసాభినయంలో దిట్ట. సావిత్రి పాత్రలో రసవత్తరంగా నటించడం వల్ల సావిత్రి సంజీవరావు అనే పేరు వచ్చింది. ఈయన కృష్ణా జిల్లా పామర్రులో 1889 జూన్‌లో జన్మించాడు.



సంజీవ రావు చిన్నతనంలో పదవయాడవ యేటనే బందరు బుట్టయ్య పేట కంపెనీలో చేరి బాల పాత్రలలో నటించాడు. పదహారవ యేట స్త్రీ పాత్రలలో నటించాచడం ప్రారంభించాడు. ఈయనలో నిబిడీకృతమై ఉన్న నటనా నైపుణ్యం నాటక సమాజం పెట్టే పరిస్థితికి దారి తీసింది. దీంతో సంజీవరావు కీర్తి గుబాళించింది. మైలవరం రాజా ఆహ్వానం మేరకు నెల జీతం మీద మైలవరం కంపెనీలో చేరాడు. ఈయన నటించిన సావిత్రి, ద్రౌపది పాత్రలు చూడడానికి దూర ప్రాంతాల నుంచి కూడా జనం వచ్చేవారు. ప్రకృతి సిద్ధంగా అలవడిన స్త్రీ హావభావ విలాస చేష్టలు ఈయన వేషానికి సహజత్వాన్ని సమకూర్చి పెట్టాయి. "సావిత్రి నాటకంలో పోవుచున్నాడె నా విభుని ప్రాణంబులు గొని" అని పాడిన పాట ప్రేక్షక హృదయాలను ద్రవీభూతం చేసేది.

సావిత్రి, ద్రౌపది, శకుంతల, కైక, ఊర్వశి, సత్యభామ, మల్లమ్మదేవి, చిత్రాంగి, మోహిని, దమయంతి, లీలావతి,సీత, చంద్రమతి, చింతామణి పాత్రలలో నటించిన సంజీవరావు 1957, సెప్టెంబరు 11న స్వర్గస్థుడయ్యాడు.

దాసరి.ఎన్.



సంజీవ రావు, కోకా : నటుడు. స్వస్థలం కాకినాడ, పెరిగింది ఒంగోలు తాలూకా కొత్తపట్నంలో. ఒంగోలు సి.ఎస్.ఆర్ శర్మ కళాశాలలో ఇంటర్, గుంటూరు ఎ.సి. కాలేజిలో బి.ఏ చదివాడు. 1951 నుంచి నాటకాల్లో చిన్నాచితకా వేషాలు వేస్తున్నా 1956లో ప్రదర్శించిన ఆత్రేయ కప్పలు నాటకంతో గాని నటుడుగా గుర్తింపు రాలేదు. కళాశాల దశలో సహధ్యాయి శోభన్ బాబుతో కలిసి పునర్జన్మ, కాళరాత్రి వంటి నాటకాలలో ముఖ్యపాత్రలలో నటించి, ఉత్తమ నటుడుగా బహుమతు లందుకున్నాడు. ఆనాటి నుంచీ వేషాలు, బహుమతులు సంజీవ రావును వెదుక్కొంటూ వచ్చాయి. 1957లో ఎ.సి.కాలేజి, 1961లో ఆంధ్రా విశ్వవిద్యాలయం నాటక పోటీలలో, అఖిల భారత (వివిధ భాషా) నాటక పోటీలలోనూ ఉత్తమ నటుడుగా బహుమతులందుకోవడం మరువరాని మధుర స్మృతులుగా మిగిలిన విజయాలు. ఆ తరువాత అన్ని నాటకాలకు స్వీయ దర్శకత్వం వహించడం ఒక ప్రత్యేకత. ఆకాశవాణిలో సీనియర్ గ్రేడ్ అనౌన్సర్‌గా పనిచేస్తూనే ఢిల్లీ, మద్రాసు, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, బాపట్ల, విజయవాడ మొదలైనచోట్ల విరివిగా నాటకాల్లో పాల్గనడం నాటక కళ పట్ల ఈయనకు గల ఆసక్తినీ, నిబద్ధతను, అంకిత భావాన్ని వ్యక్తం చేస్తుంది. సంజీవరావు సాంఘిక నాటకాల్లోనే కాదు పౌరాణిక నాటకాల్లో కూడా సమ ప్రతిభను చూపి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాడు. మధురగళం ఆయనకు

దేవుడిచ్చినవరం. ఆ గళం నేటికీ చెక్కుచెదరకుండా అటు ప్రేక్షకులను యిటు అసంఖ్యాక శ్రోతలను అలరిస్తూనే ఉంది. మద్రాసులో ఖిల్జీరాజ్య పతనం నాటకం చూసిన గరికపాటి రాజారావు ముగ్ధుడై అప్పుడు తన దర్శకత్వంలో ప్రదర్శింపబడే జైభవానీ నాటకంలో ఓ ప్రముఖ పాత్రలో నటించమని సంజీవరావును అహ్వానించడం జరిగింది. కట్టబమ్మన, మహోరుద్రీయం, విజయపురి వికాసం, మరోమొహెంజోదారో, మాస్టర్జీ, నీలినీడలు, నవోదయం నాటకాలు, చేసిన పాపం, దొంగ, ఆడది, *దంత వేదాంతం*, మానవుడు, ప్రగతి, *శిరోమణి*, కళ్ళు, అనంతం, రాజీవం వంటి నాటికలు కోకా నటజీవితాన్ని జ్వాజ్వల్యమానం చేశాయి.

గం.సు.రె.

సంజీవి, ఎ (జ.1953) : రంగస్థల నటుడు, నాటక, సినీ రచయిత. 1953లో విజయవాడలో సీతారత్నం, చిన్నారావు దంపతులకు జన్మించాడు. 1964లో నవోదయ నాట్య మండలిలో చేరి లంకె *బిందెలు* నాటకంలో బాలనటుడుగా రంగస్థలంపై ప్రవేశించాడు. నటనలో తొలిపాఠాలు నేర్పిన గురువు, ప్రముఖ నటుడు, దర్శకుడు అన్నపురెడ్డి శివరామిరెడ్డి. ఆంధ్ర కళాపరిషత్తు నాటక పోటీలలో నటనాలయం లో చిట్టిబాబు పాత్రలో నటించిన సంజీవికి ఉత్తమ బాలనటుడు బహుమతి లభించింది. ఆ తరువాత సంజీవి మాస్టర్జీ, *యాచకులు*, మరోమొహంజదారో, *గాలివాన*, కెరటాలు, నూరు కాకుల్లో మొదలైనవాటిలో నటించి పేరు గడించాడు. 1971లో కలం పట్టిన సంజీవి *పగడం పగిలింది*, *నీరుపాయ్*, *చరమాంకం*, మన కెందుకులే, డెకాయిటీలు, ముష్టోళ్ళు, *కదలిక*, శవాలపై జీవాలు, *వర్తమాన భూతం*, *అయో(వ)ధ్య*, రాజ్యహింస, *మను ధర్మం*, శబ్దం, పథకం మొదలైన నాటికలు, సమాధానం కావాలి, ఈ చరిత్ర ఏ సిరాతో నాటకాలు రచించాడు. దాదాపు 20 సినిమాలకు మాటలు రాశాడు.



దాసరి.ఎన్

సంధి : 1. నిర్వహణ సంధ్యంగం., 2. ఇతివృత్త విభాగం.

1. నిర్వహణ సంధ్యంగం : ఫలప్రాప్తి సమయంలో దానికి అనుగుణంగా ముఖసంధిలోని బీజార్థం పునరుద్ఘాటించడం. అంటే ఫలబీజం తిరిగి వ్యక్తం చేయడం. బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర ముఖసంధిలోని బీజం.

దేవేంద్రుడు ''తన కళత్రసుత ప్రాణ ధనం బడగు సమయమున నిల్చి యున్నదే సత్యనిష్ఠ''.

ఈ బీజార్థాన్నే దేవేంద్రుడు నాటకం చివర నిర్వహణ సంధిలో పునరుద్ఘాటిస్తాడు.

2. ఇతివృత్త విభాగం : బీజ, బిందు, పతాక, ప్రకరి, కార్యాలనే ఐదు అవస్థలలో క్రమంగా ఒక్కొక్క దానికి ఆరంభయత్న, ప్రాప్త్యాశ, నియతాప్తి, ఫలాగమం అనే ఐదు కార్యావస్థలకు ఒక్కొక్క దానికి గల సంబంధం లేక కలయిక సంధి. సంధాన రూపం. ఈ సంధులు ఐదు.

అర్థప్రకృతులు, కార్యావస్థలు ఇతివృత్తానికి సంబంధించినవే. వీటిని సంధాన పరచి ఏకముఖంగా నడిపించడంలో ఏర్పడ్డ ఐదు ఇతివృత్త విభాగాలే పంచ సంధులు.

ఏక సూత్రతగా, క్రమబద్ధంగా కథను మలచడంలో రచయిత ఒక సన్నివేశం నుండి ఇంకొక సన్నివేశం వరకు కథను విభజిస్తే ఏర్పడ్డ విభాగాలే, కథా ఖండాలే సంధులు.

కథానాయకుడు ఏదో ఒక కార్యం సాధించాలని ప్రయత్నించినప్పటి నుంచి ఫలసిద్ధి పొందేవరకు అతని కార్యకలాపంలోని దశలే లేక మెట్లే సంధులని కూడా చెప్పవచ్చు. అయితే కొన్నిచోట్ల పతాక ఉంటుంది. కొన్నిచోట్ల ఉండక పోవచ్చు. అటువంటప్పుడు బీజాన్ని గాని, బిందువును గాని కూర్చవలసి ఉంటుంది.

ఈ ఐదు సంధులను ఐదు అంకాలలో నిబంధించాలని నియమం లేదు. కథ ఐదు అంకాలకు మించవచ్చు. అంటే కథా భాగాలు ఐదుకు మించవచ్చు. సంధికి సంబంధించినవి ఐదు విభాగాలే. అందువల్ల ఒక్కొక్క సంధి ఒక్కొక్క అంకాన్ని దాటి తరువాత అంకంలోకి కూడా కొంతవరకు చొచ్చుకుపోవచ్చు.

పంచసంధులు : 1. ముఖసంధి, 2. ప్రతి ముఖ సంధి, 3. గర్భసంధి, 4. అవమర్శ సంధి, 5. నిర్వహణ లేక ఉపసంహృతి సంధి. (వివరాలకు ఆయా శీర్షికల క్రింద చూడండి)

శ్రీ.చ.

సంధ్యాంతరాలు : ముఖ సంధ్యంగాది సంధ్యంగాలు మధ్యమధ్య శిథిలమైపోకుండా మరికొన్ని సంధులవసరం. ఈ మరికొన్ని సంధులే సంధ్యంతరాలు.

ఈ సంధ్యంతరాలు ఇరవై ఒకటి. సామం, భేదం, దండం, ప్రదానం, వధం, ప్రత్యుత్పన్న మతిత్వం, గోత్రస్ఖలితం, సాహసం, భయం, హ్రీ (సిగ్గు, ధీ అని కాశీ ముద్రణ పాఠము), మాయ, క్రోధం, ఓజస్సు, సంవరణం, భ్రాంతి, హేత్వపధారణం (అవధారణం అని కాశీ ముద్రణ పాఠము), దూత, లేఖ, స్వప్నం, చిత్రం, మదం.

సంవరణాన్నే సింగ భూపాలుడు రసార్ణవ సుధాకరంలో సంవృతి అన్నాడు. హ్రీ శృంగార ప్రకాశంలో కనిపిస్తున్నది గాని

రసార్ణవ సుధాకరం లో కనిపించడం లేదు. దీనికి బదులు ధీని పేర్కొన్నాడు. ఈ సంధ్యంతరాలు చమత్కార హేతువులు. ఇవి ఉపక్షేపాది సంధ్యంగాల విశేషాలనదగిన అవాంతర భేదాలని కొందరి మతం. కాని సింగభూపాలుడు ఈ అభిప్రాయంతో ఏకీభవించ లేదు. సంధ్యంతరాలు కూడా సంధ్యంగాలు లాగానే విభానుభావ సంచారిభావ స్వరూపాలే. ఇవి ప్రయోగానికి ఉజ్వలతను చేకూరుస్తాయి. వీటిలోని సామాది సంధ్యంతరాలు వీర రసానికి ఉజ్వలతను, వధ రౌద్ర రసానికి ఉజ్వలతను చేకూరుస్తాయి. ఇలాగే తక్కినవి కూడా.

శ్రీ.చ.

సంప్రదాయ నాటకం : ప్రాచీన అలంకారికులు నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా రాయబడిన లక్షణ సమన్వితమైన నాటకం. సాధారణంగా పౌరాణిక నాటకాలన్నీ ఈ కోవలోకి చేరుతాయి. నాంది, ప్రస్తావన, విష్కంభం, భరతవాక్యం మొదలైన అంశాలన్నీ సంప్రదాయ నాటకంలో సుప్రతిష్ఠమౌతాయి. సంప్రదాయ నాటకాలు సాధారణంగా పద్యనాటకాలుగా ఉంటాయి. నాట్యశాస్త్రంలో దశరూపకాలలో నిర్దేశింపబడి నట్లుగా పాత్రలను, అంకాలనే కాకుండా, రసాలను కూడా ఎన్నుకొని సంప్రదాయ నాటక రచనకు పూనుకోవడం జరుగుతుంది. తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం *గయోపాఖ్యానం* సంప్రదాయ నాటకాలకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అయితే సంప్రదాయాన్ని గౌరవిస్తూనే కొందరు కవులు తమ నాటకాలలో పాశ్చాత్య ధోరణులను ప్రవేశపెట్టారు. నాట్య శాస్త్రంలో అంకాల గురించే కాని రంగాలను గురించి ప్రస్తావనలేదు. అంకాలను రంగాలుగా విభజించడం పాశ్చాత్యుల పద్ధతి. షేక్స్పియర్ నాటకాలలో అంకాలన్నీ రంగాలుగా విభాజితమై ఉంటాయి. దీని వలన స్థల, కాలాల్లో వచ్చిన మార్పును సూచించడానికి వీలుంటుంది. సంస్కృత నాటకాల్లో స్థల, కాల మార్పుల్ని సూత్రధారుడి ద్వారా, పాత్రల ద్వారా చెప్పించడం ఆనవాయితీ. ఇలా చెప్పించడంలో గల కృత్రిమత్వాన్ని గ్రహించిన కొందరు కవులు స్థల, కాలాల్ని సూచించడానికి పాశ్చాత్యుల అంక విభజనను స్వీకరించారు. వేదం వేంకట రాయ శాస్త్రి ప్రతాపరుద్రీయం లోనూ, ధర్మవరం రామకృష్ణమాచార్యులు చిత్రనళీయం, విషాద సారంగధర మొదలైన నాటకాలలోనూ అంకాలను రంగాలుగా విభజించారు. ఈ పద్ధతి ఆ తరువాతి కవులకు ఆదర్శప్రాయమైంది. కాళ్లకూరి నారాయణ రావు చింతామణి, వరవిక్రయం, మధుసేవ వంటి సాంఘిక నాటకాలను పద్య సమన్వితంగా సంప్రదాయ పద్ధతిలోనే రాశాడు. కాళ్లకూరి చూపిన మార్గం ఆ తరువాతి కవులకు అనుసరణీయం అయింది. ఈ విధంగా సంప్రదాయ నాటకం కాలానుగుణంగా చేర్పులు, మార్పులకు గురి అవుతూ ఉంది. పౌరాణిక, చారిత్రక ఇతి వృత్తం గల వాటిని సంప్రదాయ పద్ధతిలోనే నాటకాలుగా రాయడం ఒక సంప్రదాయంగా వస్తోంది. అయితే వచన నాటకాలు మాత్రం సంప్రదాయబద్ధంగా రూపుదిద్దుకోవడం లేదు.

గం.సు.రె.

సంప్రదాయ వాదం : రష్యాలో అక్టోబర్ విప్లవం తరువాత ప్రబలిన నాటక కళావాదం. మేయర్ హోల్డ్, అకిమోవ్‌లు దీనిని ఆచరణలో పెట్టారు. మానవతకు వ్యతిరిక్తత, నటుని ప్రయోక్త చేతి కీలుబమ్మగా రూపొందించడం, అంతర యదార్థతను త్రోసిరాజని బాహ్య సాంకేతికకు ప్రాధాన్యత దీని ప్రధాన లక్షణాలు.

అక్టోబర్ విప్లవానికి పూర్వం ప్రబలంగా ఉన్న పాత కృత్రిమ ధోరణులను, ఆచారాలను నాటకరంగం నుంచి తొలగించడానికి ఈ వాదం సహాయపడినా చివరకు అతిగా దీనిని ప్రయోగించడం వల్ల రంగస్థలానికి, ప్రేక్షకులకు మధ్య సామరస్యం నశించింది.

శ్రీ.చ.

సంబంధ మొదలియార్, పమ్మల్ (1873-1964) : తమిళ నాటకకర్త, నటుడు, దర్శకుడు, సమాజ వ్యవస్థాపకుడు. ఈయన మద్రాసుకు దగ్గరలో ఉన్న పమ్మల్‌లో 1873, ఫిబ్రవరి ఒకటిన జన్మించాడు. తమిళ నాటకరంగాన్ని ప్రారంభ దశలో అభి వృద్ధిపథంలో నడిపించి దిశానిర్దేశం చేసిన కళామయ హృదయుడు సంబంధ మొదలియార్. తమిళ నాటక అభ్యున్నతికి జీవితపర్యంతం అకుంఠిత సేవ చేసిన మొదలియార్‌ను 'నాటకాచార్య' బిరుదుతో సత్కరించింది నాటకరంగం. నాటకకళను ప్రగతిపథంలో నడిపించే దిశలో మొదలియార్ స్థాపించిన 'సుగుణ విలాససభ' తమిళ నాటకరంగంలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికింది. సుగుణవిలాస సభ కోసమే నాటక రచయితగా రూపుదిద్దుకున్నాడు. నటుడుగా రంగస్థలిపై జీవించాడు. దర్శకుడుగా తన సృజనాత్మక ప్రతిభావ్యుత్పత్తులను సాకారం చేసుకున్నాడు.

సంబంధ మొదలియార్ మద్రాసులో పచ్చయప్ప కళాశాలలోను, న్యాయ కళాశాలలోను విద్యాభ్యాసం చేసి న్యాయవాద వృత్తి చేపట్టాడు. కొన్నాళ్ళు 'స్మాల్ కేసెస్' న్యాయస్థానాల్లో అధిపతిగానూ, చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గానూ పనిచేసి ఖ్యాతి గడించాడు. న్యాయవాద వృత్తిలో ఉన్న మొదలియార్‌ను రంగస్థల కళలు ఆకర్షించాయి. చిన్నప్పటి

నుంచీ అంతర్నిహితంగా ఉన్న నాటకాభిరుచి క్రమక్రమంగా మొలకెత్తి విస్తరించసాగింది. న్యాయస్థానాల్లో తన వృత్తిని కొనసాగిస్తూనే, నాటకరంగంలో ప్రవేశించాడు. తన కృషికి, భవిష్యత్కార్యాచరణకు పునాదిగా, సుగుణవిలాస సభ నాటక సమాజానికి రూపకల్పన చేసి నాటక రచనకు శ్రీకారం చుట్టాడు. నాటకీయత లోపభూయిష్టంగా ఉంటూ, సంగీత కచేరీల పద్ధతిలో సాగుతున్న ఆనాటి నాటక ప్రదర్శనలను సంస్కరించి, ఆధునికుల్ని ఆకర్షించే రీతిలో భాషలోనూ, సన్నివేశ కల్పనలోను, నృత్యాలను సముచితరీతిలో పొందుపరచటంలోనూ, సంభాషణల శైలిలోనూ అపూర్వమైన మార్పులు తెచ్చి ప్రదర్శనా వైఖరిలో కొత్తదనం తెచ్చిపెట్టడంలో కృతకృత్యుడయ్యాడు మొదలియార్. ఈయన ప్రవేశపెట్టిన వినూత్న రీతులకు ప్రేక్షకలోకం స్వాగతం పలికింది. కృష్ణమాచార్యుల సమాజం 1890 జూన్‌లో మద్రాసు 'విక్టోరియా హాలు'లో ఇచ్చిన నాటక ప్రదర్శనలు స్వయంగా చూసిన సంబంధ మొదలియార్‌కు నాటకాల పట్ల ఆసక్తి పెరిగింది. ఆ స్ఫూర్తితో తాను కూడా అలాంటి నాటకాలు రాసి, ప్రదర్శించాలనే దృఢ సంకల్పంతో సుగుణ విలాస సభను 1891, జులై 1న స్థాపించి, తన లక్ష్యసాధనకు ఆనాటి నుంచీ ఉద్యమించాడు. వైవిధ్యభరితమైన 97 నాటకాలను రచించి, నటించి, దర్శకత్వం వహించి ఆరు దశాబ్దాలు నాటక రంగాన్ని అలరించాడు. అందుకే మొదలియార్ పేరు 'ఆధునిక తమిళ నాటక పితామహుడు'గా చరిత్ర పుటల్లో నిలిచిపోయింది.

1893లో తొలిసారిగా రాసిన పుష్పవల్లి నాటకం అత్యంత ప్రజాదరణ పొందటంతో ద్విగుణీకృతోత్సాహంతో ముందుకు సాగిపోయాడు. తాను రచించిన అన్ని నాటకాల్లోనూ ప్రధాన పాత్రల్లో నటించడమే కాకుండా దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వర్తించటం పరిపాటైంది. ప్రజాభిరుచుల్ని దృష్టిలో ఉంచుకొని రచనా వ్యాసంగం సాగించటమే మొదలియార్ నాటకాలను విజయపథంలో నడిపించడానికి ముఖ్య కారణంగా పేర్కొనవచ్చు. మనోరమ, రత్నావళి, సత్తపతి, టు సిస్టర్స్ మొదలైన నాటకాలు మొదలియార్ రచనా జీవితానికి కీర్తి పతాకలుగా భాసించాయి. ఈయన రచించిన మనోరమ నాటకం చలనచిత్రంగా రూపొంది అతని కీర్తిని ఇనుమడింప చేసింది. మొదలియార్ స్వతంత్ర నాటకాలతోపాటు కొన్ని షేక్స్పియర్ నాటకాలను, కొన్ని సంస్కృత నాటకాలను కూడా సరళ సుందరంగా తమిళంలోకి అనువదించి ప్రదర్శింపచేశాడు. ఆయన చేతిలో ఎందరో శిష్యప్రశిష్యులు తయారై, నాటకరంగంలో ప్రసిద్ధులు కావడమే కాకుండా చలనచిత్ర రంగంలోనూ రాణించారు.

సంబంధ మొదలియార్ తమిళ నాటక రంగ వికాసానికి చేసిన విశిష్ట సేవలను గుర్తించి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం 'రావుబహదూర్' బిరుదుతో 1910లో సత్కరించింది. భారత ప్రభుత్వం 1950లో 'పద్మభూషణ్' బిరుదునిచ్చి సన్మానించింది. తమిళ ప్రజల హృదయసీమల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న కళాతపస్వి సంబంధ మొదలియార్‌ను ఎన్నో సన్మానాలు, సత్కారాలు, అవార్డులు వరించాయి. నాటకరంగంలో చిరయశస్సును సంపాదించుకొన్న సంబంధ మొదలియార్ 92వ ఏట 1964, సెప్టెంబర్ 24న కన్ను మూశాడు.

గం.సు.రె.

సంభోగ శృంగారం : ప్రేయసీ ప్రియులు దర్శన, స్పర్శన, ఆలింగన, చుంబనాది రతి క్రియలతో ఆనందించడం సంభోగ శృంగారం.

దీనిలో సప్త ఋతువులు, సూర్య చంద్రులు, ఉదయాస్త మానాలు, జలక్రీడలు, ఉద్యాన విహారం, ప్రభాతం, సురాపానం, రాత్రి, మైపూత, అలంకారాలు వర్ణించవచ్చు. ఈ విభావాల వల్ల సంభోగ శృంగారం జనిస్తుంది.

కనులు, కనుబమ్మలు చాతుర్యంగా తిప్పడం, కడగంటి చూపులు, లలిత అంగహార ప్రదర్శన, మధుర భాషణ మొదలైన అనుభావాలతో సంభోగ శృంగారం అభినయించాలి. అలసత్వం, ఉగ్రత, జుగుప్స తక్క తక్కినవి దీనికి వ్యభిచారీ భావాలు. నాయికా నాయకులు ఆలంబన విభాగాలు.

ఈ సంభోగ శృంగారం నాలుగు విధాలు 1. సంక్షిప్తం, 2. సంకీర్ణం, 3. సంపన్నం, 4. సమృద్ధిమంతం. దీనినే శారదా తనయుడు భావ ప్రకాశంలో 1.మితం, 2. సంకరం, 3. సంపన్నం, 4. సమృద్ధి అని పేర్కొన్నాడు.

శ్రీ.చ.

సంబోధన : మానవుడు సంఘజీవి. సంఘంలోని ఇతరులతో తన సంబంధాన్ని సూచించే పద జాలంతో సంబోధిస్తూంటాడు. ఉదా: అమ్మా, నాన్నా, అక్కా, అన్నా.

ఇతరులను ఆంధ్ర ప్రాంతంలో మాస్టారు అని పిలుస్తారు. కొన్ని ప్రాంతాలలో అయ్యా అని పిలుస్తారు. కింది ఉద్యోగులు పై అధికారిని సార్ అని సంబోధించడం, న్యాయమూర్తిని కోర్టులోని న్యాయవాదులు మిలార్డ్ అనడం పరిపాటి.

లోకవృత్తానుకరణం నాట్యమని నిర్వచించిన భరతముని తన కాలంలో ఎవరు ఎవరిని ఎలా సంబోధించేవారో, ఎలా సంబోధించాలో గ్రంథస్థం చేశాడు. తరువాత వచ్చిన లాక్షణికులు ఆ సంబోధలనే వాడాలని అనుశాసించారు. నాటక కర్తలు వాటిననుసరించి తమ రూపకాలలో ఈ సంబోధనలనే ఉపయోగించారు.

భరతముని ఈ సంబోధనా విధానాన్ని సంబుద్ధి విధానమని పేర్కొని నాట్యశాస్త్రం 17వ అధ్యాయంలో దీనిని వివరించాడు. ఇక సింగభూపాలుడు దీనిని పరిభాష అన్నాడు. ధనంజయుడు ఆమంత్రణ అని చెప్పాడు.

మహర్షులను, దేవతలను, వేద వేదాంగవేత్తలను, లింగస్థులను 'భగవాన్' పదంతోను, వారి భార్యలను 'భగవతి' పదంతోను సంబోధించాలి. బ్రాహ్మణుని 'ఆర్యా' అని, పార్థివుని 'మహారాజా' అని, ఉపాధ్యాయుని 'ఆచార్యా' అని, వృద్ధుని 'తాతా' అని, ఉద్యోగస్థులను, శిల్పకారులను వారి వారి ఉద్యోగ నామాలతోను, గౌరవనీయులను 'బావ' అని, కొంచెం తక్కువ వారిని 'మార్షక', 'మారిష' అని, సమ వయస్కులను 'వయస్య' అని పిలవాలి. ఇంకా తపస్విని, ప్రశాంతుని, సాధువుని, యువరాజును స్వామి అని, ఇతర రాజ కుమారులను భర్తృదారక అని, వారి కంటె తక్కువ వారిని సౌమ్య, భద్రముఖ అని, శాక్య, పాశుపతాదులను వారివారి సాంప్రదాయాలను బట్టి పిలవాలి. ఇక బ్రాహ్మణులు రాజును రాజా అని గాని, పేరుపెట్టిగాని పిలవాలి. రాజు అమాత్యుని సచివా, అమాత్య శబ్దాలతో పిలవాలి. హీనజనులు సచివుని ఆర్య అని, ఉత్తముని చాటు పద్యాలలో పేరు పెట్టి పిలవవచ్చు.

రధికుని సూతుడు ఆయుష్మంతుడా అని, సూతుని రధికుడు ఆర్యా అని పిలవాలి. తండ్రి, గురువు సుతుని లేక శిష్యుని 'వత్సా', 'పుత్రకా', 'తాత' లేక పేరు పెట్టి గాని, గోత్ర నామంతో గాని పిలవాలి. తమ్ముడు అన్నను 'ఆర్యా' అని, అన్న తమ్ముని 'వత్స', 'తాత' అని పిలవాలి. భృత్యులు, ప్రజలు రాజును 'దేవా' అని, ఋషులు రాజును 'రాజ' అనిగాని అపత్య ప్రత్యయాంత శబ్దాలతో పిలవాలి. రాజు విదూషకుని 'వయస్యా' అని గాని, పేరు పెట్టి గాని పిలవాలి. విదూషకుడు రాజును 'రాజా', 'వయస్యా' అనే పదాలతోను, పరిజనులు రాజును 'భట్ట' శబ్దంతో పిలవాలి.

యవ్వన స్త్రీలు పతిని 'ఆర్యపుత్ర' అని, తక్కిన వయస్సులలో వారు 'ఆర్య' అని, పతి రాజయితే 'మహారాజా' అని సంబోధించాలి. ఇక స్త్రీలను, తపస్వినులను 'భగవతి' అని, గురు భార్యను, పూజ్యను 'భవతి' అని, గమ్యను 'భద్ర' అని, వృద్ధురాలిని 'పూజ్యురాలు' 'అంబా' అని పిలవాలి. పరిజనులందరూ రాజపత్నిని 'భట్టిని', 'స్వామి' ని, 'దేవి' అనాలి. రాజు, పరిజనులు పట్టమహిషిని 'దేవి' అని, భోగినులను 'స్వామి'ని అని పిలవాలి. సమానులు, సఖులను ఒకరినొకరు 'హళా' అని సంబోధించాలి. పరిజనులు వేశ్యను 'అజ్జుకా', వేశ్యమాతను 'అత్తా' అని, రాజు గాని, తదితరులు గాని భార్యను శృంగారంలో 'ప్రియ' అని, సార్థవాహులు, పురోహితులు భార్యను 'ఆర్య' అనాలి. అక్కను 'భగిని', చెల్లెలిని 'వత్సా', బ్రాహ్మణిని, లింగస్థను, వ్రతిని, పత్నిని 'ఆర్యా' అని గాని ఆమెతండ్రి పేరుతో గాని, పుత్రుని పేరుతో గాని పిలవాలి. దాసీ జనం రాకుమారిని 'భర్తృదారిక' అనీ, పెద్ద దాసిని స్త్రీలు 'హంజ' అనీ పిలవాలి. రాణిని 'చేటి రాజ్ఞి' అనీ, విదూషకుడు 'భవతీ' అని పిలవాలి. నటీ సూత్రధారులు ఒకరినొకరిని 'ఆర్య' అనీ, పారిపార్శ్వకుడు సూత్రధారుని 'బావ' అనీ, సూత్రధారుడు వారిని 'మారిష' అనీ, అధములు సములను 'హణ్డే' అనీ, ఉత్తములు, సములను 'వయస్యా' అనీ పిలవాలి.

శ్రీ.చ.

సంభ్రమం : గర్భసంధ్యంగం. దీనినే భరతముని, విశ్వనాథ కవిరాజులు విద్రవమన్నారు. సంభ్రమ మంటే తత్తర పాటు, వేగిరపాటు, శంక, భయాలవల్ల కలిగే తొట్రుపాటు. సింగభూపాలుడు ఇంకా స్పష్టంగా శత్రువుల, వ్యాఘ్రాది మృగాల వల్ల కలిగే శంకాత్రాసాలు సంభ్రమమని నిర్వచించాడు. శ్రీ శంకుడు అనే లక్షణ వేత్త అభిప్రాయంలో శంక భయ త్రాసముల సముదాయమేసంభ్రమం. శంకాత్రాసౌ సంభ్రమం. –ద.రూ. 1–42.

శ్రీ.చ.

సంయమన నటన : నటుడు నటించేటప్పుడు ఉద్వేగాలు బయట పడనీయకుండా అణచి పెట్టుకుంటూ నటించడం. సంయమనం ఉద్వేగాల తీవ్రతను సూచిస్తుంది. అందువల్ల ప్రేక్షకుల రసానుభూతి ప్రగాఢమవుతుంది. ఈ సంయంలో నటనలో నటుడు ముఖ్య అంగ విక్షేపాలను ఒడిసి పట్టుకుంటాడు. ఉద్వేగ తరంగం ప్రేక్షకులను ముంచెత్తుతుంది.

శ్రీ.చ.

సంయోగం, విపర్యయం: రంగచిత్రం తాలూకు రేఖలు, ఆకారాలు మొదలైనవి ఒకే విధంగా ఉంటే సంయోగం అంటారు. ఆకు పచ్చరంగు వివిధ ఛాయలలోని దుస్తులు సంయోగం చెందుతాయి. అలాగే ఒకదాని నుంచి ఇంకొకటి విభేదించే వస్తువులు విపర్యయం చెందుతాయి. ఎరుపు, ఆకుపచ్చ, సరళ రేఖలు, వక్రరేఖలు విపర్యయం చెందుతాయి. మూలవస్తువులు సంయోగమన్నా చెందాలి లేదా విపర్యయమన్నా చెందాలి, లేకుంటే ఫలితాలు అర్ధరహితమవుతాయి. రంగచిత్రంలోని విపర్యయ పరిమాణం ఆ నిర్దిష్ట రంగంలోని సంఘర్షణా పరిమాణానికి సమానంగా ఉండాలి.

సమతూకం: సమీకరణ సమతూకంలో లేకపోతే వంకర టింకర పిచ్చిగీతల చిత్రం లాగా సహానుభూతి కలిగించలేదు. మధ్య రేఖ ఆధారంగా కోసే రంపం లాంటిదే రంగస్థలం. ఇరువైపులా సమతూకంలో ఉండాలి. ఒకవైపున కేంద్రానికి దూరంగా ఉన్న తేలిక పదార్థం, రెండవ వైపున కేంద్రానికి దగ్గరగా ఉన్న బరువు పదార్థం సమంగా తూగినట్టుగానే చిన్నా పెద్దా నట సమీకరణలు సమతూకంలో ఉండాలి. దర్శకుడు కదిలించే పదార్థాలు,

నటీనటులు వాటిని తేలికగా కదిలించవచ్చు. కాబట్టి రంగచిత్రాలను సమతూకంలో ఉంచడం కష్టంగాదు. అంతే గాక ఒకటి రెండు ప్రదేశాలను మాత్రమే ఆక్రమించే సమీకరణలు వాటంతటవే సమతూకంలో ఉంటాయి. అటువంటపుడు ప్రేక్షకుల దృష్టి రంగస్థలమంతా ప్రసరింపక సమీకరణ మీదనే కేంద్రీకృతమయి సమతూక కేంద్రాన్ని ఎన్నుకుంటుంది.

స్థిరతత్వం: అయిదు లేక ఆరు పాత్రల సమీకరణ స్థిరంగా ఉండనట్టు కనిపిస్తుంది. దానిని పరిహరించడానికి రంగస్థలం దిగువ మూలలో ఒకటి రెండు పాత్రలను నెలకొలపడం అవసరం. సమీకరణకు స్థిరత్వం కలిపించడానికి అవసరమైన పాత్రల సంఖ్య, దాని పరిమాణం మీద ఆధారపడి ఉంటుంది. పెద్ద గుంపుకు రంగస్థలం దిగువన రెండు మూలలా రెండు మూడు పాత్రలను నెలకొల్పవలసి ఉంటుంది.

స్థలం: వాస్తవికతా దృష్టి మూలంగా రంగ స్థలాన్ని నింపాలనీ, కిక్కిరిసేట్టు చేయాలనీ,ఎక్కడా ఖాళీ ఉంచరాదనీ అనిపిస్తుంది. సంప్రదాయ, కాల్పనిక నాటకాలకు ఖాళీలు కావాలి. రంగ చిత్రంలో ముఖ్యమైనది స్థలనిర్దేశం. ప్రహసనాలు, అద్భుత నాటకాలు మొదలైన వాటికి సమీకరణ లోతు తక్కువగా ఉండాలి. బరువయిన నాటకాలకు లోతు సమీకరణలు కావాలి. సాధారణంగా నటులు రంగస్థలం దిగువ నటించాలని చూస్తారు. దర్శకుడు మెలకువగా లేకుంటే వారంతా పాదతల దీపాలవెంట నెలకొనే ప్రమాదం ఉంది.

రమణీయత: ప్రేక్షకుని మీద సంరచనా ప్రభావం పూర్తిగా వ్యక్తా వ్యక్త చైతన్యానికి సంబంధించినది. ఏదో ఒక సూత్రాన్ని అనుసరించి సంరచన జరిగిందనే పరిజ్ఞానం కలిగినపుడు రంగచిత్రం, భంగిమ, వాచికం, మొత్తం ప్రదర్శన రమణీయంగా ఉందని ప్రేక్షకులు భావిస్తారు. అయితే సంరచన చవకబారుగా కాని, ఆకర్షణీయంగా కాని ఉండనంత స్పష్టంగా ఉండకూడదు. ఫలితాన్ని పాడుచేసే విషయమేదీ చొరబడకుండా చూడాలి. అంటే రంగచిత్ర రమణీయతను పెంపొందించాలంటే విపర్యయాలను, సంక్లిష్టతలను తగ్గించాలి.

అనేక మూల వస్తువులతో కూడిన సంయుక్త రేఖలతో సహా దీర్ఘ రేఖలు నిరాడంబరతను, తద్వారా రమణీయతను సృష్టిస్తాయి. ప్రేక్షకులు అనేక హ్రస్వ రేఖలను కంటితో అనుసరించడం కంటే ఒక దీర్ఘ రేఖను అనుసరించడం తేలిక. దుస్తులు, దృశ్యాలు, వర్ణ చాయలు, రంగ ప్రకాశనంలో ముదురు రంగులు, రమణీయతను చేకూర్చే మూల వస్తువులు.

అన్నివేళలా రమణీయత అభిలషణీయం కాదు. వాస్తవికతలో గాని, నాటకీయ వాస్తవికతలో గాని దీనికి స్థానం లేదు. ప్రహసనం లాంటి రూపకాలలో హానికరం కూడా. ఇటువంటి రూపకాలకు సున్నిత రీతి సంరచన అభిలషణీయం.

శ్రీ.చ.

సంరచన (Composition): ఏదో ఒక సూత్రాన్ననుసరించిన ఎన్నిక, కూర్పు కళలకు అత్యంతావశ్యకం. ఎన్నిక, కూర్పుల విధానాన్ని సంరచన అంటారు. నాటక ప్రయోగ, మేధా ఉద్వేగ విలువలను స్పష్టీకరించడానికి, తీవ్రం చేయడానికి ప్రధాన మార్గం సంరచన. దానికదే ఆనందాన్ని కలిగించినపుడు రస విలువలను సృజిస్తుంది.

సంరచనా సూత్రాలు అనేక రూపాల్లో ఉంటాయి. ఒకే ఒక ఇతివృత్తమైతేనాటకరమ్యంగా ఉంటుంది. అంటే ఇతివృత్తానికి అనుగుణంగా వివిధ భాగాలు ఉండాలనే సూత్రం ప్రకారం ఎన్నిక చేస్తే రమ్యంగా ఉంటుందన్న మాట. నాటక వస్తు సామాగ్రిని ఎన్నిక చేసి కూర్చడంలో మార్గదర్శకత్వం వహించే సంరచన సూత్రాలు భావైక్యత, శైలి ఐక్యత. ప్రధానంగా కూర్పుకు సంబంధించిన సూత్రాలు క్రమ పద్ధతిలో ఉంటాయి. సంగీతం రెండు క్రమ పద్ధతుల మీద ఆధారపడి ఉంటుంది. 1. లయ, 2. స్థాయి.

నాటకరంగంలో లయపద్ధతి సామాన్యంగా వాడతారు. కొప్పరపు సుబ్బారావు అల్లీ ముఠా గేయనాటికలో రంగస్థలం మీద దొంగలగుంపులో మంగలి రంగప్ప, రామప్పల రాకను లయ బద్ధంగా చూస్తే ప్రేక్షకులకు నవ్వు వస్తుంది. కాని దొంగల భయోత్పాతం తెలుస్తుంది.

సంరచనా సూత్రాలలో అధిక భాగం నిర్దిష్ట విధానాలవడం వల్ల సంరచన ఏ విషయంలోనైనా ఒక దానికొకటి అనుగుణంగా ఉండాలి. ఈ సూత్రాలను ఎన్నుకొనేందుకు తగిన అభిరుచి, విచక్షణాజ్ఞానం కావాలి. అంతే కాక సంరచనలో ఉపయోగించే పద్ధతులను అనేక విధాల ప్రయోగించవచ్చు. యాంత్రికత కనిపించకుండా అంతర్గత విధానాన్ని మరుగు పరచవచ్చు. సెట్టుగోడలు సమకోణంలో కలుసుకొన్నా సెట్టును ముందు నుంచి ప్రేక్షకులు చూస్తారు. కాబట్టి కోణాలన్నీ దూర చిత్రణ మూలంగా మారిపోయినట్టు కనిపిస్తాయి.

చిత్ర సంరచన : నాటక ప్రదర్శనంలో క్షణం క్షణం దృశ్యాలు, నటీ నటులు, వస్తుసామాగ్రి, వేషధారణ, దీపాలు కలిసి రంగస్థల చిత్రంగా రూపొందుతాయి.

చిత్రరచన సూత్రాలే రంగస్థల చిత్ర సంరచనకు కూడా వర్తిస్తాయి. అయితే చిత్ర రచనలో లేని సంచాలనం రంగస్థల సంరచనలో ఉండడం గమనార్హం. రంగు మొదలైన చిత్ర సంరచనా విషయాలు రూపకల్పనకు సంబంధించిన విషయాలు. నటుడు, దర్శకుడు, రూపకల్పకుని భావాలను బాగా ఉపయోగించు

కోవాలంటే వర్ణ సిద్ధాంత మూల విషయాలను కొంతవరకు తెలుసుకొని ఉండాలి.

ప్రతి రంగ చిత్రాన్ని ఈవిధంగా విశ్లేషించవచ్చు. వీటిలో ప్రతి దానినీ సంరచనలో ప్రత్యేక పద్ధతులలో ఉపయోగించవచ్చు.

రేఖలు: ఇవి రెండు రకాలు 1. వ్యష్టి రేఖలు, 2. సమష్టిరేఖలు. మేజాబల్ల అంచులాంటిది వ్యష్టిరేఖ. కొండ అంచు లాంటిది సమిష్టిరేఖ. ఈ రెండు రకాలు యధార్థ రేఖలే. ఊహా మాత్రంగా ఉండే రేఖలు ఊహా రేఖలు. ఒక పాత్ర నేత్రాల నుంచి ఇంకొక పాత్ర ముఖం మీదకు వేళ్లే సంబంధ రేఖలే ఊహా రేఖలు.

ఆకారాలు: రంగ చిత్రం కితనార గుడ్డ మీద చిత్రించినట్లుండే చదును చిత్రాలు.

ఘన పదార్థాలు: రంగస్థలం మీది వివిధ వస్తువులు బరువే గాక త్రిపరిమాణాత్మకాలు. ఘనపదార్థాలకు వివిధ రూపాలుంటాయి. రెండు పదార్థాల అకారాలు ఒకటే అయినా వాటి భావం ఒకటి కాదు. ఒక ఘన పదార్థం రసాత్మక బరువుకు, దాని దృగ్గోచర బరువుకు సంబంధముంటుంది. కాని ఇవి రెండూ ఒకటి కావు. ముదురు రంగు వస్తువులు, లేత రంగు వస్తువుల కంటే ఎక్కువ రసాత్మక బరువు కలిగి ఉంటాయి. అంతే కాదు దాని ఆకారం, వస్తువు వ్యవహారం కూడా కొంత పాత్ర వహిస్తాయి. ఘన పదార్థాలతో వ్యవహరించడానికి ఉత్తమ మార్గం మన భావాల మార్గం అనుసరించడమే. మనకు భారంగా తోచింది ప్రేక్షకులకు కూడా భారంగా ఉంటుంది.

వర్ణ రీతులు: నలుపు, తెలుపు, లేత ముదురు రంగులు వర్ణ రీతులు. వర్ణ రీతికి లక్షణాలు మూడు. 1. వర్గం– అంటే వర్ణ సంచయంలో దాని స్థానం. 2. విలువ – లేత లేక ముదురు , 3. తీక్షణత – ప్రకాశమానం లేక బూడిదరంగు. ఈ లక్షణాలు వర్గ శక్తిని సూచిస్తాయి.

ఖాళీ స్థలాలు: సంరచనలో ఘన పదార్థాలంత ప్రాధాన్యం వహించేవి వివిధ మూల పదార్థాల మధ్య ఖాళీ స్థలాలు.

అమేయ మూల పదార్థాలు : సంరచనలోని అమేయ (Abstract) మూల పదార్థాలు బలీయమైన ఉద్వేగ ఫలితాలను సూచిస్తాయి. అడ్డగీతలు పూర్తి విశ్రాంతి భావం కలిగిస్తాయి. అడ్డ గీతలు ప్రాముఖ్యం వహించే రంగం ప్రేక్షకులలో విశ్రాంతి భావం రగులుకొలుపుతుంది.

రంగులు: ప్రేక్షకుల జ్ఞాపకశక్తి కూడా ఇందులో పాత్ర వహిస్తుంది. ఎరుపు రంగు రక్తానికి, విప్లవాలకు, అపాయానికి చిహ్నం. అందుచేత ఈ రంగు వాడి ప్రేక్షకులలో ఆయా భావాలను రేకెత్తించవచ్చు. అయితే ఎర్రరంగు భోగాలకు, క్రిస్మస్ పండుగకు కూడా ప్రతీక. పసుపు, నారింజ, ఎర్ర రంగులు వేడి రంగులు. ఉద్రికతను జనింపజేసేరంగులు. ఇంకా ఆకుపచ్చ, ఊదా, వంకాయ రంగులు శీతల రంగులు జడత్వాన్ని సూచిస్తాయి.

బరువు ఉద్వేగ భారాన్ని సూచిస్తుంది. మనిషి రాతి గుట్ట మీద నిలబడినపుడు ఆ రాతి గుట్ట అతని పాదాల కింద ఆధారంగా ఉండి భద్రతను సూచిస్తుంది. అదే కొండ గుహలో మనిషి శిరస్సు మీద ఉంటే భయాన్ని రగులుకొలుపుతుంది. మనిషిని కుంగదీస్తుంది.

సంరచనకు సంబంధించిన ప్రతి మూల వస్తువు ఉద్వేగ ఫలితాన్నిస్తుంది. అందుకని స్వరంలోని హెచ్చు తగ్గులు, రంగులోని లేత ముదురులు మొదలైన వాటిని అధ్యయనం చేయాలి. సరైన ఉద్వేగాలను పుట్టించాలి. సంరచన కారుడు ఎలాంటి ప్రతిస్పందన పొందుతాడో అలాంటి ప్రతిస్పందనే, ప్రేక్షకుడు కూడా పొందుతాడని భావించవచ్చు. సంరచన పద్ధతులను పరిశీలన ద్వారా, అనుభవం ద్వారా గ్రహించి సంరచన చేయాలి. నాటకం ప్రదర్శించినపుడల్లా దానిలోని ఉద్వేగ విలువలను మనసులో పెట్టుకుని రేఖలు, వర్ణరీతులు మొదలైన వాటిని గురించి ఆలోచించవలసి ఉంటుంది.

సంలాపకం: 1. సంస్కృత ఉపరూపకం, 2. సాత్త్వతీ వృత్త్యంగం.

1. సంస్కృత ఉపరూపకం: మూడుగాని, నాలుగుగాని అంకాలు. మూడంకాలయితే రెండో అంకంలో నిండుగా తాళం, మూడవ అంకంలో కపటం ఉండాలి. శృంగార, కరుణ రసాలుండరాదు. భారతీ, కైశికీ వృత్తులుండవు. కథ ప్రఖ్యాతమో, కల్పితమో, ఏదైనా కావచ్చు. వీర రౌద్ర రసమిశ్రమం ఉండవచ్చు.

నాయకుడు కఠినాత్ముడై ఉండాలని సాహిత్య దర్పణాదులు, నాయకుడు కుపితుడు, ధూర్తుడు, కపట యుద్ధాలను ప్రతి ఘటించే శక్తి కలిగి ఉండాలని, శత్రువువల్ల గాని, దురదృష్టం వల్ల గాని కపటయుద్ధం వల్ల గాని, సాత్త్వతీ వృత్తి ఉండాలని భావ ప్రకాశనం చెపుతోంది. ఉదా. మాయా కాపాలికం.

2. సాత్త్వతీ వృత్త్యంగం: దీనినే సంలాపం, సల్లాపం అని కూడా అంటారు.

ఇద్దరి మధ్య వీరాద్భుతాది రసాలతో, ఈర్ష్యా, క్రోధాది భావాలతో కూడిన గంభీర సంవాదం సంలాపకం.

సంవరణం: సంధ్యంతరం. దీనికే సంవృతి అని కూడా పేరు. సంవరణం అంటే కప్పిపుచ్చడం. మొదట చెప్పిన దానిని తానే కప్పిపుచ్చడం సంవరణం లేక సంవృతి.

ఉదా॥ కన్యాశుల్కం ద్వితీయాంకం ఒకటవ స్థలంలో

అగ్ని : (ధుమధుమ లాడుతూ) ఈ శషభిషలు నాకేం పనికి రావు. యితడి వైఖరి చూస్తే యిక్కడే బసవేసేటట్టు బలపడుతూంది. ఇంట్లో భోజనం యెంతమాత్రం వీలుపడదు.

అగ్ని : చూశారా. కొంచెం నాకు ప్రథమ కోపం. ఎవరో

తెలియకుండా అన్నమాటలు గణించకండేం. (ప్రథమ కోపం అనే మాటతో అంతకు ముందు తాననిన మాటలు అగ్నిహోత్రావధానులు కప్పి పుచ్చడం వల్ల ఇది సంవరణం.)

శ్రీ.చ.

సంస్కృతీ సమ్మేళనం: నెల్లూరు జిల్లా, గూడూరులో కొందరు ఔత్సాహిక కళాకారులు 1954లో సాహిత్య, సమ్మేళనం అనే పేరుతో ఈ సమాజం స్థాపించారు. తరువాత దీని పేరు సంస్కృతీ సమ్మేళనంగా మార్చబడింది. ఈ సంస్థ స్థాపక సభ్యులు ఆవుల శ్రీనివాసరావు, గండవరం సుబ్బరామిరెడ్డి, చెన్నూరు కృష్ణమూర్తి, వై.ఎస్. రామమూర్తి, కొండూరు వెంకటసుబ్బయ్య, డి.వి. శేషయ్య, అల్లూరు రంగారెడ్డి, సిద్ధారెడ్డి, జనార్ధనరెడ్డి ప్రభృతులు.

రాష్ట్రస్థాయిలో ప్రతి సంవత్సరం నాటక పోటీలు వైభవోపేతంగా నిర్వహిస్తూ 1978లో రజతోత్సవం జరుపుకొంది. ఈ సంస్థకు ప్రారంభ దశలో పసుపులేటి సిద్ధయ్య నాయుడు, డి.ఎస్. రెడ్డి, అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి, ఎస్. రామచంద్రరావు, కోడూరు సుబ్బరామిరెడ్డి మొదలైనవారు అండగా నిలబడి, సంస్థ అభివృద్ధికి చేయూతనిచ్చారు.

ఆర్థిక పునాదులు ఎంత పటిష్ఠంగా ఉన్నా, నిస్వార్థంగా, నిర్విరామంగా కృషి చేసే నిర్వాహకులు, కార్యకర్తలు ఉన్నపుడే ఏ కళాసంస్థ అయినా ముందుకు వెళ్లగలుగుతుంది. అయితా బలరామయ్య, డి.వి.శేషయ్య, రామచంద్రయ్య, కె.వి. రమణా రెడ్డి, పెళ్లేటి రాజారాం రెడ్డి, ఓ. జనార్ధన్, గుద్దేటి అబ్బయ్య, సి.ఎస్. రాయలు, వై. జె. ప్రభాకరరెడ్డి వంటి కళా హృదయుల నిస్వార్థసేవలు లభించినందువల్లనే సంస్కృతీ సమ్మేళనం తన కార్యక్రమాలను గత అయిదు దశాబ్దాలుగా నిర్విఘ్నంగా నడపగలిగింది.

శ్రీశ్రీ, తాపీ ధర్మారావు, ఆచార్య ఆత్రేయ, గరికపాటి రాజారావు, అక్కినేని నాగేశ్వరరావు, సి.హెచ్. నారాయణ రావు, శ్రీనివాస చక్రవర్తి, కె.వి. గోపాలస్వామి, చిత్తూరు నాగయ్య, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి , వేణు మాధవ్, సంపత్ కుమార్, రమణారెడ్డి, శారద మొదలైనవారు నాటకోత్సవాలలో పాల్గని ఆశీస్సులు అందించారు.

ఈ సమాజం గండవరం రచించిన ఏది మార్గం, వేణు రచించిన నిరాశా ప్రొడక్షన్స్ నెం.*1*, దిష్టి బమ్మలు, చీకటి దొంగలు, పద్మవ్యూహం, రాజీవం అనే నాటికలు, కొడాలి గోపాలరావు దొంగవీరడు, చేసిన పాపం, కాశీకి వెళ్లినా, పినిశెట్టి శ్రీరామమూర్తి అన్నాచెల్లెలు, బెల్లంకొండ రామదాసు పునర్జన్మ మొదలైన నాటకాలు వివిధ పరిషత్తుల్లో విజయవంతంగా ప్రదర్శించి బహుమతులు గెల్చుకుంది.

నలభై సంవత్సరాలు నాటక పోటీలు నిర్వహించి ఆంధ్ర నాటక కళా పరిషత్తుకు సమాన స్థాయిలో నిల్చి యావద్భారత కీర్తినార్జించిన సంస్కృతీ సమ్మేళనం నేటికీ తన కార్యక్రమాలు యథావిధిగా నిర్వహిస్తూ కళారంగానికి సేవలు అందిస్తూనే ఉంది.

గం.సు.రె.

సచ్చిదానంద శాస్త్రి, శ్రీరాములు (1888-1954) : నాటకకర్త, సంస్కృతాంధ్ర పండితుడు. అలంకార శాస్త్రవేత్త, సనాతనధర్మ నిష్టాగరిష్ఠుడు. ఈయన 1888లో విజయవాడలో జన్మించాడు.

మొదట మైలవరం బాల భారతీ సమాజానికి నాటకకర్తగా, దర్శకుడుగా వ్యవహరించాడు. సావిత్రి నాటకం మైలవరం నాటక సమాజానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టడానికి, ఈయన కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింపచేయడానికి, అన్యోన్యం సహకరించుకున్నాయి. తరువాత మోతే వారి సీతారామాంజనేయ సమాజంలో చేరి, వారికి ఇంకో సావిత్రి నాటకం రాసిచ్చాడు. ఇపుడు అచ్చులో లభ్యమవుతుంది ఈ రెండో ప్రతే. ఈ నాటకంలో పద్యాలు మంచి పాకంలో పడ్డాయి. లలిత, బృంద నాటకాలు ఈయన సనాతన ధర్మ నిష్ఠను ద్యోతకం చేస్తాయి.

ఈయన రచించిన *సావిత్రి (1921)*, *లలిత (1939)*, *బృంద(1941)*, *దివోదాసు (1950)* ముద్రితాలు. పీష్వానారాయణ రావు, భక్త కబీరు, కంస వధ, సత్యహరిశ్చంద్ర, ద్రౌపది, రామాయణం అముద్రితాలుగానే ఉండిపోయాయి: తెలుగు నాటకరంగ వికాసం కోసం కృషి చేసిన సచ్చిదానంద శాస్త్రి 1954లో మరణించాడు.

సట్టకం: సంస్కృత ఉపరూపకం. ప్రాకృత భాషా రూపకం. ఇందులోని అంకాలకు జవనికలని పేరు. అందువల్లనే ఇది ప్రాకృత నాటకమని తోస్తుంది. అద్భుతరస ప్రధానం, నాలుగంకాలు. విష్కంభ ప్రవేశకాలుండరాదు, తక్కిన లక్షణాలు నాటిక లాగానే. కొందరు దీనిని జన్య రూపకంగా పేర్కొన్నారు.

భావప్రకాశంలో ఇది నాటకభేదంగా నృత్యాశ్రయంగా కైశికీ, భారతీ వృత్తులతో విలసిల్లాలని చెప్పాడు. అంతేకాదు. రాజు ప్రాకృతంలో మాట్లాడరాదని, రౌద్రాదులుండకూడదని శారదా తనయుడి అభిప్రాయం.

ప్రాకృత భాషలలో శౌరసేని, మహారాష్ట్రి ప్రాకృతాలను సట్టకంలో ప్రయోగించవచ్చని కొందరు లాక్షణికులు, మాగధీ, శౌరసేనులను ప్రయోగించవచ్చని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇలా భాషా విషయంలో లాక్షణికులలో ఏకాభిప్రాయం లేక పోవడం వల్ల దీనికి తగిన వ్యవస్థ లేదనిపిస్తుంది. ప్రాకృత నాటకం కావడం వల్ల ఇది జనరంజకమని భావించవచ్చు.

ఉదా: ఆనంద సుందరి, శృంగార మంజరి, కర్పూరమంజరి. సాధారణంగా సట్టకానికి నాయిక పేరు పెట్టడం పరిపాటి.

శ్రీ.చ

సత్యదేవ్ దూబె (1936 -) : ప్రముఖ నటుడు, దర్శకుడు, మరాఠీ, గుజరాతీ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో నాటకాలు ప్రదర్శించాడు. మధ్యప్రదేశ్‌లోని భిలాస్‌పూర్‌లో 1936లో జన్మించాడు. బంబాయిలో ఎం. ఏ. ఇంగ్లీషు చేశాడు. అల్‌టేకర్ వంటి రంగస్థల ప్రముఖుల ప్రదర్శనలకు ప్రభావితుడై థియేటర్ యూనిట్ స్కూల్ ఆఫ్ డ్రమటిక ఆర్ట్స్‌లో రెండు సంవత్సరాల పాటు శిక్షణపొంది, 1956నుండి దర్శకత్వం చేయటం మొదలు పెట్టాడు. నటుడు, దర్శకుడుగా పేరు తెచ్చుకున్నాడు. శక్తివంతమైన రచనలు, సమర్థులైన నటుల ఎంపిక దూబె విజయానికి సోపానాలు. అమ్రిష్‌పురి, సునీలా ప్రధాన్, సులభాదేశ్ పాండే వంటి నటీనటులు ఈయన దర్శకత్వంలోనే రాణించినవారే. సమకాలీన భారతీయ నాటకీయతకు ప్రతీక దూబె. హిందీ నాటక రంగంలో ప్రఖ్యాతుడిగా పేరుతెచ్చుకున్న దూబె అంధాయుగ్, ఆషాఢ్‌కా ఏక్ దిన్, ఆధే ఆధూరె, యయాతి, హయవదన, ఏవమ్ ఇంద్రజిత్, పగలా ఘోడా, అరక్షణ్, విరాసత్, ప్రతిబింబ్, రక్తపుష్ప, శకారమ్ బైండర్, సంభోగ్‌సే సన్యాస్‌తక్ తదితర నాటకాలను మరాఠీ, హిందీ, ఇంగ్లీషు, గుజరాతీ భాషల్లో ప్రదర్శించాడు.

ప్ర.రె.

సత్యనారాయణ, ఆర్.జి. (జ. 1938) : నటుడు. శ్రీ కాళిదాస కళానికేతన్ వ్యవస్థాపకులలో ముఖ్యుడు. పూర్తి పేరు రాయకోట గోవిందరాజుల సత్యనారాయణ. తల్లిదండ్రులు లలితమ్మ, గోవిందరాజులు నాయుడు. నెల్లూరు జిల్లా గూడూరులో 1938లో జన్మించాడు. గూడూరు బోర్డు హైస్కూల్, నెల్లూరు వి.ఆర్. కళాశాలలో విద్యాభ్యాసం చేశాడు. బి.ఏ పట్టభద్రుడు. బాల్యదశ నుంచీ నాటకాలంటే మక్కువ. చిన్ననాటి మిత్రుడు గండవరం సుబ్బరామిరెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో అమరజీవి నాటకంలో కథా నాయకుని పాత్రలో నటించి రంగస్థల ప్రవేశం చేశాడు. నిరుద్యోగులు, నగ్న సత్యం నాటికలలో విలక్షణమైన పాత్రధారణ చేసి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. కళాశాల సాంస్కృతికోత్సవాలలో వెలుగుబాట నాటికను ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనకు బహుమతి పొందడమే కాక ఉత్తమ నటుడుగా ఎన్నికయ్యాడు. పెళ్లిచూపులు, వెంకన్న కాపురం, పంజరం, నటనాలయం నాటక, నాటికలలో ప్రముఖ పాత్రలలో నటించి శభాష్ అనిపించుకున్నాడు. నాటక పోటీలలో దూరపు కొండలు నాటికను గూడూరు సావిత్రితో కలిసి ప్రదర్శించాడు. చిరంజీవి నాటకాన్ని గరికపాటి రాజారావు సమక్షంలో ప్రదర్శించి ప్రశంసలందుకున్నాడు. మూడు దశాబ్దాల పాటు వివిధ ప్రదేశాల్లో 50 నాటక, నాటికలు ప్రదర్శించి నాటక కళావికాసానికి తన వంతు సహకారాన్ని అందించాడు. గూడూరు శ్రీ కాళిదాస కళానికేతన్ స్థాపక సభ్యుడు. ఆ సంస్థ గత నాలుగు దశాబ్దాలుగా లలిత సంగీత పోటీలు రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తూ వుంది. చెన్నైలో తెలుగు నాటకం ఎక్కడవేసినా ఆర్.జి. సత్యనారాయణ అక్కడ ప్రత్యక్షమవుతూ నేటికీ నాటకాల పట్ల అనుబంధాన్ని చాటుతున్న కళా హృదయుడు.



గం. సు.రె.

సత్యనారాయణ, ఆరణి (1898-1969) : స్త్రీ పురుష వేషాలు రెండూ సమర్థంగా నటించి పేరు గాంచిన మేటి నటుడు, సంగీతజ్ఞుడు. ఈయన 1898, నవంబరు 11న గుంటూరులో జన్మించాడు. చిన్నతనంలోనే నాటకాలలో నటించాలనే బుద్ధి పుట్టింది. బెల్లంకొండ సుబ్బారావు ప్రోత్సాహంతో *గయోపాఖ్యానం*లో సత్యభామ పాత్రలో నటించాడు. ఇదే ఆయన మొదటి వేషం. ఈయన జుట్టు పెద్దది, పొడవైంది కావడం వల్ల విగ్గు అక్కరలేకపోయింది.

తరువాత కొంతకాలం మూన్ థియేటర్‌లోను, ప్లీడర్ గుమాస్తాల సంఘంలోను నటించాడు. అదే తరుణంలో హరిప్రసాదరావు పక్కన చంద్రమతి వేషం వేసి మెప్పు పొందాడు.

1917లో గుంటూరులో, విజయవాడలో వరసగా జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పోటీలలో చంద్రమతి పాత్రకు పతకం గెలుచుకున్నాడు. 1918లో ఏలూరులో జరిగిన ప్రసన్న యాదవ నాటక పోటీలలో ఊర్వశి పాత్రలో నటించి బహుమతి గెలుచుకొన్నాడు.

ఆ తరువాత మోతే వారి కంపెనీలో చేరి మృచ్ఛకటిక నాటకంలో వసంతసేన పాత్ర ధరించి అఖండ కీర్తి నార్జించాడు. తరువాత కొంత కాలం పురుష పాత్రలు వేశాడు. రామదాసు పాత్ర నిర్వహణ ఈయన ప్రత్యేకత.

ఈయన నాటకాలలోనే గాక చలనచిత్రాలలో కూడా నటించాడు. కొంతకాలం సరస్వతీ టాకీస్ డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. భారత ప్రొడక్షన్స్ అనే సినిమా కంపెనీ స్థాపించి చిత్రాలను తీయాలని యత్నించాడు గాని కలసి రాలేదు.

సత్యభామ, ఊర్వశి, యామిని, మల్లమ్మ, పద్మిని, ఇందిర, చంద్రమతి, దమయంతి, వసంతసేన వంటి స్త్రీ పాత్రలు, రామదాసు, సారంగధర, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సత్యవంతుడు, విశ్వనాథుడు, విదురుడు, నారదుడు, భరతుడు వంటి పురుష పాత్రలలో నటించాడు.

దశావతారాలు, ద్రౌపది, రామదాసు, కనకతార, బాలయోగిని, రత్నమాల, లైలామజ్నూ, ధర్మాంగద, శాంతి, దేవదాసు సినిమాలలో నటించిన ఆరణి 1969, జులై 2న కన్నుమూశాడు.

శ్రీ.చ.

సత్యనారాయణ, కావూరి (జ. 1945) : నటుడు, నాటక రచయిత, దర్శకుడు. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా కావూరం గ్రామంలో 1954లో జన్మించాడు. బి.కాం. పట్టభద్రుడు. కుందేటి కొమ్ము, ఆత్మ వత్సర్వభూతాని సాంఘిక నాటికల్లోనూ, కొన్ని పౌరాణిక నాటకాలలోను విభిన్న పాత్రలలో నటించి అభినయానికి మెరుగులు దిద్దుకొని నటుడుగా, దర్శకుడుగా నిలదొక్కుకున్న అనుభవంతో రచనా రంగంలోకి అడుగుపెట్టి అందులో కూడా ప్రతిభను చాటుకున్నాడు. కుబుసం వీడింది, శ్వేతపత్రం, ముఖచిత్రం, రివర్స్ మార్చ్ నాటికలు అనేక పరిషత్తుల్లో దిగ్విజయంగా ప్రదర్శింపబడి కావూరికి రచయితగా కీర్తిప్రతిష్ఠలు తెచ్చి పెట్టాయి. ఉత్తమ ప్రదర్శన, దర్శకత్వం, ఉత్తమ రచన బహుమతులు తెచ్చిపెట్టాయి. సమకాలీన సమస్యల్ని కథా వస్తువుగా తీసుకొని రచనలు చేయటం, వాటిని జనరంజకంగా ప్రదర్శించటం కావూరి ప్రత్యేకత.



ఆత్మీయతాబంధం క్రమక్రమంగా దూరమైపోతూ ఆర్థిక బంధమే మానవుల్ని శాసిస్తున్న పరిస్థితిని కావూరి జారుడు మెట్లు అనే నాటికలో హృదయంగమంగా చిత్రించాడు. ఈ నాటికకు నంది బహుమతి లభించింది. దేశభక్తి పై ఈయన రచించిన రావణ కాష్ఠం నాటిక నంది నాటకోత్సవాలలో స్వర్ణ నంది గెల్చుకుని కావూరి ఖ్యాతిని ఇనుమడింపజేసింది.

గం.సు.రె.

సత్యనారాయణ, నల్లా : నటుడు, సమాజ నిర్వాహకుడు. స్వస్థలం అమలాపురం. కళాభిమాని, కళా పోషకుడు. ఇదే (నా) లోకం అనే నాటకంలో ఒక చిన్న పాత్ర ధరించటంతో రంగ ప్రవేశం చేసిన నల్లా సత్యనారాయణకు తరువాత కాలంలో నాటకం విడలేని బంధం అయింది. 'శ్రీ చెన్నమల్లేశ్వరా సమితి' పేరుతో నాటక సమాజాన్ని 1958లో స్థాపించాడు. ఇదే 1976లో శ్రీ చెన్న మల్లేశ్వర కళాపరిషత్తుగా రూపుదిద్దుకుంది. కళాభిరుచిగల మిత్రులను కూడగట్టుకొని పరిషత్తు ప్రారంభించాడు. మొదట్లో నాటికలకే పరిమితమైన పోటీలు 1981లో నాటకాలకు కూడా విస్తరించి, ఏకపాత్రాభినయ పోటీలు కూడా నిర్వహించడం ఆరంభమైంది. గుణ నిర్ణయంలోను, బహుమతి ప్రదానంలోనూ, సమాజాలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడంలో వినూత్న పోకడలు ప్రవేశపెట్టిన పరిషత్తు ఇదే కావడం విశేషం. క్రమం తప్పకుండా మూడు దశాబ్దాలుగా రాష్ట్రస్థాయి నాటక, నాటికల పోటీలు నిరాఘాటంగా, అవిచ్ఛిన్నంగా, అనేక వ్యయప్రయాసలకోర్చి నిర్వహిస్తున్న ఘనత నల్లా సత్యనారాయణకు దక్కుతుంది. సమయపాలనలోను, కార్యక్రమ నిర్వహణలోను, అన్నిటికంటే ముఖ్యంగా గుణనిర్ణయంలోను ఉన్నత ప్రమాణాలు నెలకొల్పిన ఆదర్శ కళాసంస్థగా కళాకారుల, ప్రజల ప్రశంసలకు పాత్రమైంది. ప్రతిఫలాపేక్ష లేకుండా ఈ కళాయజ్ఞాన్ని నిర్వహిస్తున్న సోమయాజి నల్లా సత్యనారాయణ. ఈ యజ్ఞంలో పాలుపంచుకొన్న నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, నాటక రచయితలు అధికసంఖ్యలో ఉంటారనటం అతిశయోక్తి కాదు.

గం.సు.రె.

సత్యనారాయణ, మానాపురం (జ.1964) : నటుడు, నాటక పరిషత్తు నిర్వాహకుడు. మానాపురం వెంకటనారాయణ, అమ్మాజి దంపతులకు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో 1964, ఆగస్టు 25న జన్మించాడు. బి.కామ్. వరకు పాలకొల్లులోనే విద్యాభ్యాసం సాగింది. విద్యార్థి దశలోనే దారితప్పిన ఆకలి, కోహినూర్ వంటి నాటికల్లో నటించి ప్రశంసలందుకున్నాడు.

సత్యనారాయణకు నాటకాలంటే ప్రాణం. నాటక సమాజ నిర్వహణ పట్ల శ్రద్ధాశక్తులు కనబరిచేవాడు. తదనంతర కాలంలో నటుని కన్నా ప్రయోక్తగానే ఎక్కువ పేరు ప్రతిష్ఠలు ఆర్జించాడు. ప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు కోడిరామకృష్ణ తన స్వస్థలమైన పాలకొల్లులో 1983లో స్థాపించిన లలిత కళాంజలి సంస్థ సత్యనారాయణ లక్ష్యసాధనకు ఆసరా అయింది. అప్పటినుంచీ ఆ సంస్థ కార్యకలాపాలతో మమేకమై 24 ఏళ్లుగా లలిత కళాంజలి ఆధ్వర్యంలో నిర్వహించబడే నాటకపోటీలను విజయవంతంగా నడిపించడంలో మానాపురం కీలకపాత్ర వహిస్తున్నాడు. రాష్ట్రమంతా తిరిగి నాటకపోటీలకు అనువైన నాటకాలను తానొక్కడే ఎంపిక చేసి ఉత్తమ ప్రమాణాలు గల

నాటకాలను, నాటికలను వెలుగులోకి తెస్తూ నాటకరంగానికి ఎనలేని సేవ చేస్తున్న కళాహృదయుడు. ఈయన ఎంపిక చేసిన నాటకాలు రాష్ట్రంలో విస్తృతంగా ప్రదర్శింపబడి బహుళ జనాదరణ పొందుతాయని నాటకాభిమానుల విశ్వాసం.

గం.సు.రె.

సత్యనారాయణ, విశ్వనాథ (1895-1976) : సుప్రసిద్ధకవి, నవలాకారుడు. నాటకకర్త. సుప్రసిద్ధ కవి. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత. కవి సమ్రాట్, కళాప్రపూర్ణ బిరుదాంకితుడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవి. ఈయన కృష్ణాజిల్లా నందమూరులో 1895, సెప్టెంబరు 10న జన్మించాడు. వేయి పడగలు నవలాకర్తగా, రామాయణ కల్పవృక్షం కర్తగా సాహిత్య లోకానికి సుపరిచితుడు. 1934 నాటికే "దేశం పట్టనంత కవి"గా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. చేపట్టిన ప్రతి సాహిత్య ప్రక్రియలోనను పేరుతెచ్చుకున్న ప్రతిభాశాలి. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. ఆంధ్ర దేశంలో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు పొందాడు. సాహిత్య రంగంలో జాతీయ స్థాయిలో అత్యున్నత బహుమతిగా పరిగణింపబడే 'జ్ఞానపీఠ్' అవార్డు అందుకున్న ప్రజ్ఞాశాలి. నాటకకర్తగా విశ్వనాథకు సుస్థిర స్థానం ఉంది. నర్తనశాల విశ్వనాథ నాటక రచనా ప్రావీణ్యతకు ఒక మచ్చుతునక.



అనార్కలి, వేనరాజు, త్రిశూలం, సౌప్తిక ప్రళయము, తల్లిలేని పిల్ల, అంతా నాటకమే మొదలైన నాటకాలు వెలువరించిన విశ్వనాథ, 1976, అక్టోబరు 18న అస్తమించాడు.

గం.సు.రె.

సత్యనారాయణమూర్తి, ఆకెళ్ళ (1946-1992) : నటుడు, రచయిత, ఆకాశవాణి వ్యాఖ్యాత. ఈయన 1946, జూన్ 30న వెంకటలక్ష్మి, వెంకట సూర్యారావు దంపతులకు రాజమండ్రిలో జన్మించాడు. ఎం.ఏ. ఇంగ్లీషు, పిజి డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ చేశాడు. ఇరవై సంవత్సరాలు అనౌన్సర్‌గా విజయవాడ, హైదరాబాదు ఆకాశవాణి కేంద్రాల్లో పనిచేశాడు. 1980లో పెద్దబాలశిక్ష రంగస్థల ఆధునిక వీధి నాటిక రాశాడు. ఆంధ్రదేశంలో ఆధునిక వీధి నాటక ఉద్యమం ప్రారంభదశలో ఈ నాటిక విస్తృతంగా ప్రదర్శించబడి ఎందరో వీధి నాటక ప్రదర్శనలివ్వడానికి దోహదపడింది. అటు రంగస్థలంపై కూడా ఈ నాటిక అద్భుత విజయాన్ని చవిచూసింది. 1994లో రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నిర్వహించిన అఖిలాంధ్ర నాటకోత్సవాలలో ఈ నాటిక ప్రసాదరెడ్డి దర్శకత్వంలో ఏడు జిల్లా కేంద్రాల్లో వీధి నాటికగా ప్రదర్శించ బడి ప్రఖ్యాతి పొందింది. ఆ తరువాత 1987లో మందిరాజ్యం, 1989లో సత్యకామేష్టి అనే నాటకాలను రచించాడు. సత్యకామేష్టి చాట్ల శ్రీరాములు దర్శకత్వంలో పలు ప్రదర్శనలిచ్చారు. కల్యాణ వైభోగం, రైలు కదిలింది, అలవల కలబుల, రహస్యం, కల్పన తదితర రేడియో నాటికల్ని కూడా రచించాడు. సమకాలీన సమస్యల్ని ప్రతిబింబిస్తూ, సమాజంలోని అవకతవకలను ధైర్యంగా, సూటిగా ఎత్తి చూపుతూ, సమాధానం కోసం ఎదురుచూసేలా ఉంటాయి ఈయన రచనలు. రంగస్థల, రేడియో, దూరదర్శన్ నాటకాల నటుడిగా పలు వైవిధ్యభరితమైన పాత్రలు పోషించిన సత్యనారాయణమూర్తి 1992, మార్చి 17న మరణించాడు.

భా

ప్ర.రె.

సత్యనారాయణమూర్తి, చుక్కఖట్ల (1909-1953): నాటకకర్త, ప్రయోక్త, నటుడు, స్వాతంత్ర్యోద్యమ కార్యకర్త. చెన్నకేశ్వర నాట్యమండలి స్థాపకుడు. చుక్క భట్ల సుబ్బారావు, సీతమ్మ దంపతులకు జన్మించాడు. 1928-29 ప్రాంతంలో రాజ మహేంద్ర వరంలో దువ్వూరి సుబ్బమ్మ నేతృత్వంలో విదేశీ వస్తు బహిష్కరణ వంటి స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో నూనుగు మీసాల నూత్న యవ్వనంతో స్వాతంత్ర్యోద్యమ సమయంలో చేరిన కొడుకుని చూసి పిల్లవాడు పాడై పోతున్నాడని కాశీరాజు ఇంట్లో పిల్లలకు పాఠాలు చెప్పడానికి చర్ల గ్రామానికి పంపించింది. చర్లలో కూడా ఉద్యమస్ఫూర్తితో పనిచేసే పెద్దలుండటంతో సత్యనారాయణ మూర్తికి తన లక్ష్యసాధనకు చర్ల అనుకూలంగా ఉందని సంతోషించాడు. సంగీతం, కవిత్వం సహజంగా పట్టుబడ్డ సత్యనారాయణ తన కార్యక్షేత్రంగా నాటకరంగాన్ని ఎంచుకున్నాడు. కొంతమంది మిత్రులతో కలిసి 'చెన్నకేశ్వరనాట్యమండలి'ని స్థాపించాడు. నాటక ప్రదర్శనకు అనువైన పరిస్థితులు గానీ, సౌకర్యాలు గాని ఏ మాత్రం లేని ఆ గ్రామంలో నాటకానికి అంకురార్పణ చేయటం సాహసమే. ఏలూరి హనుమంతరావు, గాలి లక్ష్మణస్వామి, బుయ్యవరపు తిరువెంగళయ్య, విశ్వన్మయాచారి, చింతలపూడి వెంకన్న, ముదపాక వెంకటరత్నం, చీమకుర్తి సుబ్బారావు, కామాడ

జగ్గారావు, తోటపల్లి ఆది నారాయణ వంటి ఎంతో మంది నటుల్ని తీర్చిదిద్దాడు. సామాజిక చైతన్యానికి, స్వతంత్ర ప్రవృత్తికి ప్రేరణ కలిగించే *చింతామణి, వరవిక్రయం, సత్యహరిశ్చంద్ర, భక్త రామదాసు, గయోపాఖ్యానం, మధుసేవ* నాటకాలను చర్లలోనే కాక చుట్టుపక్క గ్రామాల్లో కూడా, అనేక వ్యయప్రయాసల కోర్చి ప్రదర్శింపజేశాడు. సత్యనారాయణ మూర్తి స్వయంగా ఝాన్సీలక్ష్మీబాయి అనే ఉద్యమ నాటకాన్ని రచించి ఆంగ్ల ప్రభుత్వం మీద తిరుగుబాటు ప్రకటించాడు. తిరుగుబాటు అణచివేతలో నాటకరంగాన్ని కూడా విడిచిపెట్టని బ్రిటిష్ ప్రభుత్వం 8-6-1931 నాటి ఉత్తర్వుల ద్వారా ఆ నాటకాన్ని నిషేధించింది. ముద్రించిన నాటక ప్రతుల్ని తగల బెట్టింది, అయినా పట్టువిడవని సత్యనారాయణ *వీరతానాజీ* నాటకాన్ని రచించి విజయశంఖం పూరించాడు. ఈ దిశలో మరి కొన్ని నాటకాలను కూడా రచించి చర్ల ప్రాంతంలో నాటక కళావికాసానికి అనుపమాన సేవ చేశాడు. సురభి సమాజం కోసం *గొల్లభామ* నాటకాన్ని రాసిచ్చాడు. ఆంధ్ర దేశమంతా ప్రదర్శింపబడిన ఈ నాటకం తెలుగు ప్రజలందరికీ సుపరిచితమే.

వమూర్తి నిరంతర కృషి ఫలితమే చర్లలో నాటకం నిలదొక్కుకోవడానికి గట్టి పునాదిని ఏర్పరచింది. బేతు కృష్ణార్జునరావు, కె.కె.రావు, సి.వి.కె రావు, లంక గురుమూర్తి, ఇమామ్, వెంకయ్య పంతులు, ఏలూరి మధుసూదనరావు, రామారావు మొదలైన అనేక మంది రెండవతరం నటుల్ని తయారు చేసింది. జంగిల్ క్లబ్, కళాంజలి వంటి నాటక సంస్థలు వెలుగులోకి వచ్చి చర్ల పేరును నాటకరంగ చరిత్రలో సుస్థిరం చేశాయి. 1953లో ఆగస్టు 21న సత్యనారాయణమూర్తి మరణించాడు.

గం.సు.రె.

సత్యనారాయణ రావు, ఊటుకూరు (1905-1981): ప్రసిద్ధ కవి, నాటక, చలనచిత్ర రచయిత. కృష్ణాజిల్లా గంపలగూడెం సమీపంలో ఆర్లపాడు గ్రామంలో అచ్యుతరావు, రంగనాయకమ్మ దంపతులకు 1905, మార్చి 14న జన్మించాడు. స్వయం కృషితో సంస్కృతాంధ్రాంగ్ల భాషల్లో పాండిత్యం సంపాదించాడు. 1921లో సత్యాగ్రహ సమరంలో పాల్గొన్న దేశభక్తుడు.

తొలుత పద్య రచనవైపు దృష్టి సారించి '*గుహుడు, బాష్పాంజలి, ఉదయరేఖలు*' మొదలైన పద్యకావ్యాలు రచించి సాహితీ లోకంలో ఖ్యాతి గడించాడు. బందా కనకలింగేశ్వరరావు ప్రోత్సాహంతో నాటక రచనకు పూనుకొని *పాషాణి* (1937), *ఛత్రపతి శివాజీ* (1940), *వీరాభిమన్యు* (1940), *వసంతసేన, అనార్కలి* (1941), *ద్రౌపది* (1943), *ఫిరదౌసి* (1955), *కర్ణధారి* (1957) వంటి ప్రదర్శనార్హమైన పన్నెండు నాటకాలు రంగస్థలానికి అందించాడు. ఈ నాటకాలన్నీ రంగస్థలం మీద ప్రసిద్ధ నటులతో ప్రదర్శితమై రచయిత కీర్తిని ఇనుమడింప జేశాయి. ఈ నాటికీ ఆ నాటకాలు ప్రదర్శించబడుతూ ప్రేక్షకుల ప్రశంసలకు పాత్రమవుతున్నాయి. 2005లో విజయవాడలో జరిగిన నంది నాటకోత్సవాలలో ఊటుకూరి రచించిన *వీరాభిమన్యు* నాటకానికి ఉత్తమ రచన బహుమతి లభించడం ఈయన నాటకాలు నేటికీ ప్రజాదరణ పాత్రమై నిలిచి ఉన్నాయని స్పష్టమౌతుంది.

సత్యనారాయణ రావు చలనచిత్ర రంగంలో ప్రవేశించి *మాయా మచ్ఛీంద్ర* (1943) మొదలైన చిత్రాలకు మాటలు, పాటలు రాశాడు. ఊటుకూరి కలం నుంచి రేడియో నాటికలు కూడా వెలువడ్డాయి. ఈయన 1981 ప్రాంతంలో గంపలగూడెంలో పరమపదించాడు.

అయ్యదేవర.

సత్యనారాయణ రావు, చింతపెంట: చూ. రావు, సి. ఎస్.

సత్యనారాయణ రావు, యండమూరి: చూ. శ్రీవాత్సవ

సత్యవీరం : దీనిని వీరరస భేదమని కొందరు, ధర్మవీరంలోని ప్రభేదమని కొందరు లాక్షణికులు అభిప్రాయ పడుతున్నారు. సత్యవ్రతం నిలబెట్టుకోవడానికి ఎంత త్యాగమైనా చేయడం సత్యవీరం. ఇందులో నాయకుడు సత్యవీరుడు.

ఉదా: బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన *సత్యహరిశ్చంద్ర* నాటకం తృతీయాంకంలో సత్యనిష్ఠ నిలుపు కోవడానికి హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి రాజ్యం దానం చేయడం.

శ్రీ.చ.

సన్నాట : దొడ్డాట నుంచి కృష్ణపారిజాతం, దాని నుంచి సన్నాట వేరు చేయబడిన రూపం. సన్నాట వృత్తి నాటకాల నుంచి రంగస్థల నిర్మాణం, అలంకరణ, సంభాషణల్ని పుణికి పుచ్చుకొని, జానపద బాణీలో ప్రదర్శింపబడే ఓ కళారూపం. ఈ సన్నాట బెల్గాం, ధార్వాడ జిల్లాల్లోని నరేంద్ర, కెల్‌గిరి గ్రామాలకు చెందినవారు ప్రదర్శిస్తూ ఉంటారు. సన్నాట ప్రాచీన సంప్రదాయాన్ని అనుసరిస్తూనే వ్యాపార దృష్టితో దీన్ని ప్రదర్శించేవారు. వీటి వస్తువులో నీతి, వేదాంతం, కల్పితగాథలు ఉన్నాయి.

సన్నాట ప్రదర్శన దాదాపు ఆరు గంటలు కొనసాగుతుంది. గణపతి, ఈశ్వర, సరస్వతి ప్రార్థనలతో ప్రదర్శన ప్రారంభమవుతుంది. ప్రదర్శనలో ప్రధాన గాయకుడు పాటలోని

తుది చరణం పాడిన తరువాత నేపథ్య గాయకులు పాటను అందుకొని పాడుతారు. సన్నాటలోని హాస్యగాని పేరు 'లాలు'. ఇతడు దొడ్డాటలో లాగా ప్రతి పాత్రను హాస్య సంభాషణలతో పరిచయం చేస్తాడు. రంగస్థలం పైకి వచ్చిన నటుడు అప్పుడప్పుడు నృత్యం చేస్తుంటాడు. కాని దొడ్డాటలాగా అది ఉధృతంగా ఉండదు. 'చర్తి' అనే ఆ నృత్యాన్ని మూడుసార్లు ప్రదర్శిస్తాడు. భాగవతుడు త్రితాళ, ఏకతాళ, జంపెతాళ వంటి తాళాలతో పాటు పాడితే దీనికి తాళాలు, తబల, హార్మోనియం, వయోలిన్ వంటి వాయిద్య సహకారం ఉంటుంది. అల్లమ ప్రభు, సత్యశీల, కబీర్‌దాస్, గోదానా వంటి నాటకాల్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఇవి నీతి వేదాంత ప్రతిపాదకంగా ఉంటాయి.

ఆనందన్

సన్యాసి రాజు, చాగంటి (1898-1961) : నటుడు. నాటక దర్శకుడు, నాటకకర్త, నాటక సిద్ధాంత వేత్త, అలోపతీ వైద్యుడు, నటరాజ బిరుదాంకితుడు. ఈయన 1898లో జన్మించాడు. చిన్ననాటి చదువంతా విజయనగరంలో జరిగింది. విశాఖపట్టణం వైద్య కళాశాలలో విద్య పూర్తి చేసిన తరువాత 1922లో సామర్లకోటలో వైద్య వృత్తి ప్రారంభించాడు.



నాట్యాచార్య కిళాంబి కృష్ణమాచార్యులతో పరిచయం లభించి 1937లో వాణీ నాట్యమండలి స్థాపనకు దారితీసింది.

సన్యాసిరాజు మొట్ట మొదట మధుసేవ నాటకంలో కాశిం, ఆ తరువాత ఖిల్జీరాజ్య పతనంలో ఖిజిల్‌ఖాన్ పాత్రలలో నటించాడు. ఈ నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మీద దావా నడిపి నిషేధం తొలగింపచేశాడు.

ఆ తరువాత ఆంధ్రశ్రీ నాటకంలో బ్రహ్మనాయనిగా పేరు సంపాదించుకొన్నాడు. 1942 ఆంధ్రనాటక కళాపరిషత్తులో ఆంధ్రశ్రీకే ప్రథమ బహుమతి లభించింది. ఆ తరువాత విశ్వనాథవేనరాజుగా సన్యాసిరాజు నటన పతాక స్థాయినందుకుంది. ఈ పాత్ర ధారణలో ఈయనకు నటరాజ బిరుదును, కవి సార్వభౌమ శ్రీ పాద కృష్ణ మూర్తి శాస్త్రి బహూకరించాడు. కాలం కలిసిరాక వాణీ నాట్యమండలి అంతరించింది. జానకీ కళా థియేటర్‌గా అవతరించింది.

చాగంటి ఏకపాత్రాభినయంలో కూడా దిట్ట. మయసభలో దుర్యోధనుడు, కర్ణ భ్రాతృప్రేమ, ఒథెల్లో పాత్రలు నటించి పెద్దల ప్రశంసలందుకున్నాడు. నండూరి రామకృష్ణమాచార్యుల భ్రాతృ ప్రేమ పద్యాలు వచన గీతికలుగా చదివి రక్తి కట్టించాడు.

బ్రహ్మనాయుడు, దుర్యోధనుడు, చాణక్యుడు, రాణా ప్రతాప్, శివాజి, శివదేవ్, అశోకుడు, దుష్యంతుడు, కాశిం, ఖిజిల్ ఖాన్, రాజగురువు (రాజనర్తకి) పాత్రలలో వివిధ కళావేదికలపై చాగంటి నటించాడు.

అశోక నాటకం - 1954, రస ప్రదర్శనం- సంగీతం (1958), భారతీయ నాటకం (1960), భారతీయ నాటకరంగ చరిత్ర (అసంపూర్ణము) రచించిన చాగంటి 1961, ఫిబ్రవరి 22న మరణించాడు.

శ్రీ.చ.

సన్యాసిరావు, పిళ్ళా (జ.1944) : రంగస్థల నటుడు, దర్శకుడు, ప్రయోక్త, గుణ నిర్ణేత. బి.హెచ్.పి.వి. శాఖ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు. 1944, మార్చి 6న అనకాపల్లి సమీపంలోని తుమ్మపాలలో గంగాయమ్మ, అప్పారావు దంపతులకు జన్మించాడు. అప్పారావు విశాఖపట్టణం జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి స్థాపకుడు. తండ్రి నిర్వహిస్తున్న కార్యక్రమాలను చూసిన సన్యాసిరావు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న రోజుల్లోనే ఎలుకలు నాటికలో మొట్టమొదటిసారిగా నటించాడు. నటనా రంగంలో తండ్రిని ఆదిగురువుగా చెప్పుకున్నాడు. నటుడుగా నాటకరంగంలో అడుగుపెట్టిన సన్యాసిరావు 1963లో మా భూమి ప్రదర్శించటానికి అనేక ఇబ్బందులు పడ్డాడు. ప్రభుత్వం ఈ నాటకాన్ని నిషేధించడంతో నాన్న మరికొంత మంది కార్మిక నాయకుల సహకారంతో ప్రదర్శించాడు. నాటక ప్రదర్శనను పవిత్ర కార్యక్రమంగా ఎంచుకున్న సన్యాసిరావు 68 నాటికలు, 19 నాటకాలు, 13 ఏక పాత్రాభినయాలు, 10 రేడియో కార్యక్రమాలు నిర్వహించాడు. వీటికి దర్శకుడుగానే కాకుండా నటుడుగా నటించాడు. కళాభిమానుల సహకారంతో ఫైన్ ఆర్ట్సు బి.హెచ్.పి.వి. శాఖను స్థాపించి, ఈ సమాజం పక్షాన రాష్ట్రంలోని పలు కళావేదికలపైనే కాకుండా భారత దేశం లోని అనేక ప్రధాన నగరాలలో ప్రదర్శనలు నిర్వహించాడు. అనేకసార్లు ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకున్నాడు. పులి మేకల స్టున్నాయ్ జాగ్రత్త, ప్రాణం ఖరీదు, యక్షగానం, సమాధానం కావాలి, ఉప్పెనొచ్చింది, కాలజ్ఞానం, తపస్సు, జేసు బరబ్బాసు, ముఖచిత్రం, రేపటి శత్రువు మొదలైన నాటక నాటికలు, మహారథికర్ణ, వీరపాండ్య కట్టబమ్మన, చాణక్య, షైలాక్ మార్క్ ఎంటోనీ (ఇంగ్లీషు), ఖడ్గతిక్కన, సిద్ధన (సంస్కృతం) మొదలైన ఏకపాత్రలు పేరు తెచ్చిపెట్టాయి.

1980లో అలహాబాదులో జరిగిన బహుభాషా నాటకోత్సవాలలో క్యారెక్టరు నటుడుగా రాష్ట్రపతితో అవార్డును,

1983 బంబాయిలో జరిగిన పోటీలలో ఉత్తమ దర్శకుడు అవార్డు, 1987లో నైవేలి మద్రాసులో జరిగిన అఖిల భారత బహుభాషా నాటక పోటీలలో బీబీ నాంచారి లో విశమభట్టు వజీరు పాత్రకు ఉత్తమ నటుడు అవార్డు లభించింది. నాటక రంగ వికాసం కోసం విశేషంగా కృషి చేసిన సన్యాసిరాజును పలు కళా సంస్థలు దర్శక కళానిధి, నవరస నట సార్వభౌమ, అభినయ సార్వభౌమ, కళాజగతి రంగస్థల విశిష్టవ్యక్తి అవార్డులిచ్చి ఘనంగా సన్మానించాయి.

దాసరి,ఎన్

సఫ్దర్ హష్మి (1954-1989) : ప్రసిద్ధ హిందీ నాటక రచయిత, నటుడు, దర్శకుడు, సిద్ధాంతవేత్త. రాజకీయ ఆధునిక వీధి నాటక ప్రక్రియకు ప్రాణం పోసి ప్రాచుర్యంలోకి తెచ్చిన ప్రజా కళాకారుడు. 1954, ఏప్రిల్ 12న జన్మించాడు. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. ప్రజల పక్షాన నిలచి ప్రజా సమస్యలకు ప్రాధాన్యమిచ్చే రచనల వైపే మొగ్గు చూపాడు. జన నాట్యమంచ్ కళాసంస్థ వ్యవస్థాపకుడు. 1973లో రూపుదిద్దుకొన్న ఈ సంస్థ 'ఇండియన్ పీపుల్స్ థియేటర్' అసోసియేషన్ (ఇప్టా) స్ఫూర్తితో ఆవిర్భవించిందే. మొదట్లో సామాన్య ప్రజానీకం కోసం ఆరుబయట 'ప్రొసీనియం నాటకాలు' ప్రదర్శించినప్పటికీ, 1978 నాటికి ప్రొసీనియం నాటకాలకు స్వస్తి చెప్పి జనమ్, (జననాట్యమంచ్) ఆధ్వర్యంలో వీధి నాటకాలను చేపట్టడం జరిగింది. వీధి నాటక రూపంలో సఫ్దర్ రచించిన మెషీన్ *(యంత్రం)* అనే నాటకం అత్యంత ప్రజాదరణ పొందింది. మెషీన్ పద్ధతిలో మరెన్నో వీధి నాటకాలను రచించి జననాట్యమంచ్ ద్వారా స్వీయ దర్శకత్వంలో ప్రదర్శింపచేశాడు. ప్రజా సమస్యలు ప్రతిబింబించే 24 నాటకాలకు దర్శకత్వం వహించి, సుమారు 4000 ప్రదర్శనలు ఇవ్వడంలో సఫ్దర్ హష్మి నిర్వహించిన పాత్ర అనుపమానమైంది. 1989, జనవరి 1న ఢిల్లీ సమీపంలో సాహిబాబాద్ పారిశ్రామిక ప్రాంతంలో హల్లాబోల్ అనే వీధి నాటకం జన నాట్యమంచ్ కళాకారులు ప్రదర్శిస్తుండగా హఠాత్తుగా కొందరు రాజకీయ దుండగులు విరుచుకుపడి దాడి చేశారు. సఫ్దర్ హష్మిని పట్టపగలు నడివీధిలో హత్య చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన హష్మి ఆ మర్నాడు మరణించాడు. హష్మి మరణంతో జన నాట్యమంచ్ కళాకారులు మరింత శక్తిని కూడగట్టుకొని ప్రదర్శనలిస్తూ తమ ఉద్యమాన్ని కొనసాగించారు. హష్మి మరణించిన చోటనే అదే నాటకాన్ని రెండు రోజుల వ్యవధిలో హష్మి సతీమణి మలయశ్రీ స్వయంగా నటిస్తూ ప్రదర్శన ఇచ్చి అందరినీ అబ్బుర పరచింది.

ఆనందన్

సభాపతి : నాటకశాలలో ప్రేక్షక లోకానికి అగ్రాసనాధిపత్యం వహించే వ్యక్తి. ఇతనికే సభానాయకుడని, అగ్రాసనాధిపతి అని, అధ్యక్షుడని, ముఖ్య అతిథి అని విభిన్న పేర్లు.

ప్రాచీనకాలంలో గ్రీకునాటక ప్రదర్శనానికి అధ్యక్షత వహించే వ్యక్తి బేకస్ దేవతా పూజారి. భారత దేశంలో రాజు. తరువాత పాశ్చాత్య దేశాలలోని నాటకశాలల్లో సభాపతి పాద దీపాలముందు ప్రేక్షకులకు అభిముఖంగా బల్లముందు కూర్చునేవాడు. అద్దం ముందు పెట్టుకుని దానితో రంగస్థలం చూసేవాడు. ఈ సభాపతి రంగస్థలం మీద జరుగుతున్న మార్పులను ప్రకటిస్తూ ప్రేక్షకులలోని అల్లరి మూకను అదుపులో పెడుతుండేవాడు. ఈయన పక్కనే కూర్చుని ఈయనకు మద్యం బహూకరించడం గౌరవ ప్రదంగా భావించేవారు.

మనదేశంలో కళాప్రవీణులు సభాపతిగా వ్యవహరించే వారు. నందికేశ్వరుడు అభినయ దర్పణంలో సభాపతి లక్షణాలను ఇలా వివరించాడు. భాగ్యవంతుడు, బుద్ధిమంతుడు, యుక్తా యుక్తా విచక్షణాదక్షుడు, దాత, గాన విద్యావంతుడు, సర్వజ్ఞుడు, కీర్తివంతుడు, సరసుడు, హావభావ విజ్ఞాని, మాత్సర్యాది దుర్గుణ రహితుడు, సద్గుణవంతుడు, దయాశాలి, ధీరోదాత్తుడు, విద్వాంసుడు, రాజనీతిజ్ఞుడు.

శ్రీ.చ.

సమగ్ర నాటకం (Total Play): నాటక భేదం. సర్వ వృత్తులతోను, సర్వ లక్షణాలతోను విలసిల్లే నాటకం సమగ్ర నాటకం.

ఉదా: మహానాటకం. ఆధునిక కాలంలో సమగ్ర నాటకం ఆట, మాట, పాటల సమ్మేళనంతో ప్రదర్శించే నాటకం అనే అర్థంతో వ్యవహరింపబడుతూ ఉంది. తెలుగులో పౌరాణిక, చారిత్రక నాటకాలు ఈ జాతికి చెందినవే. పినిశెట్టి శ్రీరామమూర్తి రాసిన 'పల్లెపడుచు' సాంఘిక నాటకాన్ని కూడా సమగ్ర నాటకం కింద పరిగణించవచ్చు. పాశ్చాత్య దేశాలలో కూడ సమగ్ర నాటకం ప్రాచుర్యంలో ఉంది.

గం.సు.రె.

సమవకారం : సంస్కృత దశ విధ రూపకాలలో ఏడవది. అనేక ప్రయోజనాలు (ఫలములు) వెదజల్లుతుంది కాబట్టి సమవకారం.

సం అనగా నాతి సంబద్ధం. అవ అనగా కించిత్ సంబంధం అనగా సమవకారంలో ఇతివృత్తానికి ఏకత ఉండదని సారాంశం. అనేక ఫలాలు పొందుపరచి, ఏకత పొసగదు. అందుకని లాక్షణికులు ఈ రూపకం పెరిగి పోకుండా ఉండడానికి కాల నిర్ణయం చేశారు.

దేవాసుర సంబంధి ఫల సంపాదనోపాయం బీజం. ప్రఖ్యాతులు, ఉదాత్తులయిన 12 మంది దేవాసురులు నాయకులు. మూడంకాలు. ఒక్కొక్క అంకంలో ఒక్కొక్క కపటం, ఒక విద్రవం (అపాయం), ఒక్కొక్క శృంగారం ఉండాలి. అంటే ఈ రూపకంలో మొత్తం మీద మూడు కపటాలు, మూడు విద్రవాలు, మూడు శృంగారాలు ఉండాలి. ప్రయోగ కాలం 18 నాడికలు (నాడిక = 24నిమిషాలు). మొదటి అంకం పన్నెండు నాడికలు, ద్వితీయాంకం నాలుగు నాడికలు, తృతీయాంకం రెండు నాడికలు. తృతీయాంకంలో ఇతివృత్తం సమాప్తం కావాలి. ప్రథమాంకంలో ప్రహసన (కామ శృంగారం) విద్రువ, కపట, వీథ్యంగం నిబంధించాలి. ప్రథమాంకంలోనే మూడంకాల అర్థం నిక్షేపించాలి. మొదటి రెండంకాలలో అవాంతర వాక్యార్థాలు రెండు ముగుస్తాయి. ఇక తృతీయాంకంలో మహా కావ్యార్థం నిర్వహించాలి. ఈ మూడంకాలలో ప్రతి అంకంలో వస్తు పరిసమాప్తి జరుగుతుంది.

ప్రఖ్యాత ఇతివృత్తం. వీర రసం ప్రధానరసం. అవమర్శసంధి గాక తక్కిన సంధులు నిబంధించాలి. వృత్తులన్నీ వుండాలి. బిందు ప్రవేశకాలు ఉండరాదు. వీథ్యంగాలు ప్రవేశ పెట్టవచ్చు. కామ శృంగారం మొదటి అంకంలో మాత్రమే నిబంధించాలి.

ఇతివృత్తం ప్రసిద్ధమూ కావచ్చు. కల్పితమూ కావచ్చని కావ్యానుశాసన మతం. వీర, రౌద్ర రసాలుండాలని నాట్య దర్పణ మతం. శారదా తనయుడు ప్రథమాంకంలో మొదటి రెండు సంధులు, ద్వితీయాంకంలో మొదటి మూడు సంధులు, తృతీయాంకంలో మొదటి నాలుగు సంధులుండాలని అభిప్రాయ పడ్డాడు. ఉదా. సముద్ర మథనం (సంస్కృతం), రంగరాయ కదన సమవకారం (తెలుగు).

శ్రీ.చ.

సమీకరణ : రంగస్థలం మీది నటీనటులను ఆయా పరిస్థితులకనుగుణంగా, ఆయా స్థలాలలో ఉంచడం సమీకరణ. సాధన సాగుతున్న కొద్దీ ఈ సమీకరణలు సంచాలనంతో సమిశ్రమై కథాప్రవాహంలో భాగమైపోతాయి. ప్రేక్షకుడు మాటలను సరిగా వినకపోయినా, కథాంశాన్ని అర్థం చేసుకోగలిగేటట్లు ఈ సమీకరణలుండాలి.

కథలో నాయికా నాయకుల మధ్య ఇంకొక వ్యక్తి వారి ప్రేమకు అడ్డు వచ్చినట్టుంటే ప్రదర్శనలో కూడా ఆ వ్యక్తిని వారి మధ్య నిలబెట్టి అడ్డం సూచించాలి. ఒక విషయంలో ఇద్దరు వ్యక్తులు భేదాభిప్రాయం కలిగివుంటే ఆ విషయానికి సాంకేతికతను సమకూర్చి దానికిరువైపులా వారిద్దరినీ నిలబట్టాలి. రాజ్యం కోసం ఇద్దరు వ్యక్తులు వివాదపడుతున్నపుడు రాజ్యానికి సంకేతంగా సింహాసనం, దానికిరువైపులా వారిద్దరినీ నిలబెట్టాలి.

క్రియకు సమీకరణ అనుకూలంగా ఉండాలనేది సమీకరణలో ముఖ్యాంశం. యువతీ యువకు లిద్దరూ ముద్దిడుకోవాలి. అదీ ఆ సమయంలోని క్రియ. అలాంటపుడు వారిద్దరినీ రంగస్థలానికి చెరొక వైపున గాక ఒకే వైపున దగ్గరగా సమీకరించాలి.

పాత్ర సంభాషణలోని ఆఖరిమాట మీద నిష్క్రమించవలసి ఉంటే ఆ మాట మాట్లాడే సమయానికి ఆ పాత్రను ద్వారం వద్దకు సమీకరించాలి.

సంబంధాలు: పాత్రకు పాత్రకు సంబంధం, రంగస్థలం మీది ప్రతీక వస్తువులకు, పాత్రకు సంబంధం సమీకరణ వ్యక్తీకరించాలి. ప్రేక్షకుల దృష్టి దానంతటదే ఆసక్తి కేంద్రం మీదకు ప్రసరించేటట్లుగా వివిధ సూచికలను కేంద్రీకరింపచేయాలి. చిన్న చిన్న సమీకరణల ద్వారా మాటలు లేని పాత్రలు, మాట్లాడే పాత్ర వంక గాని, ఆ సమయంలో ప్రాధాన్యం వహించే విషయం వంకగాని తేరిపార చూడడం ద్వారా నిర్వహించవచ్చు. అయితే పెద్ద పెద్ద సమీకరణాలలో విధానం విసుగెత్తుతుంది. అందుకని ఒకటి రెండు పాత్రలు ఆసక్తి కేంద్రం వైపు చూడకుండా వేరు వేపు చూడాలి. కాని పెద్ద సమీకరణలోని ఒకే ఒక పాత్ర తక్కిన వారి కంటే వేరే దిక్కుకూ చూడడం మంచిది గాదు.

ఆసక్తి కేంద్రం నేపథ్యంలో ఉంటే పాత్ర ఆ నేపథ్య కేంద్రం వైపు చూస్తున్నట్లు చూపి ఆ ఆసక్తి కేంద్రాన్ని రంగ పటంలోకి తీసుకురావచ్చు. ఇందుకు నేపథ్యం వైపు చూస్తున్న పాత్ర వంకే తక్కిన పాత్రలు తమ దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది. లేకపోతే ఆ సమీకరణలోని అసలు ఆసక్తి కేంద్రాన్ని లోపింపచేయవచ్చు. ఒకే సమయంలో రెండు మూడు ఆసక్తి కేంద్రాలను నెలకొల్పడం మంచిది కాదు. ప్రేక్షకులు రెండు మూడు ఆసక్తి కేంద్రాల మీద దృష్టిని కేంద్రీకరించలేరు.

సమీకరణ సందర్భంలో ప్రాధాన్యత, విభజన ఎంతో ముఖ్యమైనవి. రంగానికి సంబంధించి అనేక రకాల ప్రాధాన్య రూపాలున్నాయి. ఈ రూపాలు ఒకదానినొకటి బలపరచుకుంటాయి. కొన్ని సంఘర్షించుకుంటాయి. దర్శకుడు వీటిని సమతూకంలో కూర్చాలి. అపుడే కోరిన ఫలితం లభిస్తుంది.

ఎగువ, ఎడమ కక్ష్యలోని పాత్రకు ప్రాధాన్యం అతి తక్కువ. ఎగువ, కుడి కక్ష్యలోని పాత్రకు ప్రాధాన్యం ఎక్కువ. ఆ తరువాత ప్రాధాన్యం దిగువ, ఎడమ కక్ష్య,ఎగువ మధ్య, ఎగువ కుడి సమప్రాధాన్యాలు. దిగువ మధ్య కక్ష్యకు అత్యధిక ప్రాధాన్యం.

ప్రేక్షకులు – పాత్రలు: ప్రేక్షకులతో పాత్ర సంబంధం ఎక్కువైన కొద్దీ పాత్రకు ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ సంబంధం రెండు రకాలు. 1. ప్రేక్షకులకు సమీపంలో ఉండడం, 2. ప్రేక్షకుల వైపు తిరగడం. ప్రేక్షకులకు సమీపంలో ఉండడం కంటే ప్రేక్షకులకు అభిముఖంగా తిరగడం వల్ల ఫలితం ఎక్కువగా ఉంటుంది. ప్రేక్షకులతో సంబంధం తగ్గించుకోవాలంటే నటుడు రంగస్థలం లోపలికి తిరగాలి, లేక తల పైకెత్తాలి లేక కిందికి దించాలి. బాల్కనీ కేసి సూటిగా చూడడం లేక ఆఖరి వరస ప్రేక్షకుల తలల మీద మూడు అడుగులు పై ఎత్తున చూస్తే స్థానం బలీయమవుతుంది. పాత్ర తలపైకెత్తిన కొద్దీ ప్రాధాన్యం పెరుగుతుంది.

వేర్పాటు: పాత్రను చుట్టు పక్కలకు దూరంగా ఉంచడం వల్ల విపర్యయం ఎక్కువ శక్తి మంతమవుతుంది. దిగువ మధ్య కక్ష్య ప్రాధాన్యతకు కారణం అది సెట్టుగోడలకు దూరంగా ఉండడమే. ఒక పాత్రను ప్రత్యేకంగా ఏకాకిగా ఉంచి తక్కిన పాత్రలను రెండు మూడు బృందాలుగా సమీకరించడం వల్ల వేర్పాటు సాధించవచ్చు. అయితే ఇది పాత్రల సంబంధాల చిత్రీకరణకే ఉపయోగించాలి. సెట్టు వెనుక గోడలోని ద్వారం లాంటి పరిసరాలనుంచి పాత్రను వేరు చేయడం వల్ల కూడా వేర్పాటు సాధించవచ్చు.

ఆచ్ఛాదన: ఒక నటునికి గాని, ఒక వస్తువునకు గాని, ఒక నటుడు అడ్డం వచ్చి మరుగు పరచడం ఆచ్ఛాదన. సాధారణంగా మరుగున పడిన నటుడు కాని, వస్తువు గాని ఆచ్ఛాదన మూలంగా ప్రాధాన్యం కోల్పోవడం జరుగుతుంది. రంగస్థలం మీద హత్య చూపించవలసి వచ్చినపుడు ఆ హత్య కృత్రిమత్వాన్ని మరుగు పరచడానికి, బీభత్సాన్ని తగ్గించడానికి కత్తిని మరుగుపరచాలి.

నటుడు మాట్లాడేటపుడు అతని పెదవులు ఆసక్తి కేంద్రం. అందువల్ల నటుడు భోజనం చేస్తున్నా, తాగుతున్నా, నిట్టూర్పు విడుస్తున్నా, కౌగిలించుకుంటున్నా పెదవులు కనిపించాలి. అటువంటపుడు విరామ సమయంలో నోటిని ఆచ్ఛాదించుకుని మాట్లాడేటపుడు ఆచ్ఛాదన తొలగించుకోవచ్చు.

ప్రేక్షకుల నుంచి సమకోణంలో తిరిగితే నటుని ముఖం దానంతటదే మరుగున పడుతుంది. ఈ స్థానంలో నటుడు మాట్లాడితే ఎగువ నుంచి మాట్లాడినట్టు,ఇంకే స్థానంలో నుంచి మాట్లాడినా దిగువనుంచి మాట్లాడినట్లు అనిపిస్తుంది.

ఎగువ నుంచి మాట్లాడడం వల్ల అనర్థకాలు చాలా ఉన్నాయి. 1. గొంతు మూసుకొని పోతుంది. 2ప్రేక్షకులకు పెదవుల కదలిక కనిపించకపోతే ఎవరు మాట్లాడుతున్నదీ తెలియదు. 3. ప్రేక్షకుల వైపు వీపు పెడితే నటుడు ప్రాధాన్యం కోల్పోతాడు.

మాటతో పాటు క్రియను కూడా చూపితే ఈ అనర్థకాల వల్ల ఎక్కువ నష్టం ఉండదు. ప్రేక్షకులకు మాటలు అర్థం కాకపోయినా పరవాలేదు. వాటిలో వారికి ఆసక్తి ఉండదు. ఉదాహరణకు జనం కేకలు, కోపంతో పాత్ర నోటికి వచ్చినట్లు మాట్లాడడం, చెప్పిందే చెప్పడం వగైరా.

సమీకరణ ఏర్పరచేటపుడు సాధ్యమైనంత వరకు ప్రయోజనాన్ని మనసులో పెట్టుకోవాలి. వాచికం చెప్పేటపుడు వినే నటుడికి సాధ్యమైనంత ఎగువ ఉండేటట్టు చూడాలి. వాచికం ఎక్కువగా ఉన్న నటుడికి ఎగువ స్థానం కేటాయించాలి. ఇద్దరు నటులకు సమానంగా వాచికం ఉంటే ఇద్దరినీ ఒకే అడ్డరేఖ మీద నిలపాలి.

ఒక బృందంతో కాని, బృందంలోని ఏ ఒక నటుడిని కాని సంబోధించవలసి వచ్చినపుడు బాగా దిగువ ఉన్న నటుడి వంక తిరిగి మాట్లాడాలి. నేపథ్యంలోని ఒకానొక కల్పిత వస్తువు దిక్కే మాట్లాడవలసి వచ్చినపుడు అది బాగా దిగువన ఉన్నట్లుగా భావించుకోవాలి. పొడుగుబల్ల చుట్టూ ఎక్కువ మంది నటీ నటులను సమీకరించవలసి వచ్చినపుడు 1. నటుల సంఖ్య బేసి అయినపుడు, సరిపోగా మిగిలిన పాత్రను ఎగువ వేపున నిలపాలి. 2. అతి ప్రధాన పాత్రను కుడి వేపు చివర కూర్చోపెట్టాలి. తరువాత ప్రాధాన్యంగల పాత్రను ఎడమ చివర కూర్చోపెట్టాలి. తక్కిన పాత్రలను వారి వారి ప్రాధాన్యాన్ని బట్టి, పరిమాణాలను బట్టి కూర్చోబెట్టాలి. అప్రధాన పాత్రలను దిగువ భాగంలో కూర్చోబెట్టాలి. పెద్ద పాత్రలను, ముఖ్య పాత్రలను ఎగువన కూర్చోబెట్టాలి. ఎత్తుగా ఉన్నట్లు చూపించడానికి వారి వారి ఆసనాల మీద మెత్తలు వేయాలి. 3. దిగువ భాగంలోని ఆసనాలను ఖాళీగా ఉంచడం మంచిది. ముఖ్యంగా ఎగువ నుంచి మాట్లాడే నటుడి ఎదుట ఆసనం ఖాళీగా ఉంచాలి.

ఎగువ దిగువల్లో నున్న పాత్రలు మాట్లాడవలసి వచ్చినపుడు లేచి మాట్లాడాలి. దిగువలో ఉన్న పాత్రలు వారి లాగానే దిగువలో ఉన్న పాత్రలను గాని, బల్ల చివరి పాత్రను గాని సంబోధించాలి.

ఎగువన ఉన్న పాత్ర దిగువన ఉన్న పాత్రతో మాట్లాడ వలసినపుడు వంగి మాట్లాడాలి. వాచికం ఎక్కువగా లేక పోయినా పాత్రవంగడం ప్రాధాన్యం వహిస్తే ఆ పాత్రను బృందం మధ్యలో నిలపాలి. తక్కిన వారు చూపులతో, అంగవిన్యాసంతో ఎగువ ఉన్న పాత్ర మీద కేంద్రీకరించాలి.

గుంపురంగాలను ప్రదర్శించేటపుడు ప్రధాన పాత్రధారిని రంగస్థలానికి ఒక వైపున, గుంపుకు ఎదురు వైపున ఉంచాలి. ఒక గుంపులోని ముఖ్య పాత్రలను గుంపు ముందు గాని, దిగువ వైపున గాని నిలపాలి. గుంపు ప్రధానపాత్రను చుట్టుముట్టవలసి

ఉంటే ఆ ప్రధాన పాత్రను ఎత్తుగా కుర్చీ మీదనో, బల్ల మీదనో నిలబెట్టాలి.

రంగస్థలం మీది గుంపు పెద్దదిగా కనిపించాలంటే ఈ కింది విధానాలు అవలంబించాలి. నటీనటులు ఒకరి నుంచి ఒకరు సాధ్యమైనంత దూరంలో ఉండాలి. ఒక చోటనే గుమికూడకూడదు. గుంపు రంగస్థలం అవతల కూడా ఉన్నదని సూచించడానికి ప్రవేశకాలలో కొంతమంది నటీనటులను నిలబెట్టాలి. జనాన్ని సంబోధించే నటుడు నేపథ్యంలోని గుంపును సంబోధిస్తున్నట్లుగా సంబోధించాలి. దిగువను నటీ నటులను అడ్డంగా పెట్టి ఖాళీలు లేకుండా చూడాలి. తక్కిన వారిని అక్కడక్కడ నిలబెట్టాలి. దుస్తులు కూడా దీనికి కొంత వరకు ఉపకరిస్తాయి.

సమీకరణ భేదాలు: సమీకరణలో భేదాలు అవసరం. బృందం లోని నటీనటుల భంగిమలు విభిన్నంగా ఉండాలి. విభిన్న పాత్రలను ఒకే పద్ధతిలో నిలబెట్టకూడదు. అయితే రంగ సాదృశ్యం చూపించనక్కర లేనపుడు మాత్రం ఒకే పద్ధతి అనుసరించవచ్చు. అందుకే నాటకానికి 100, 200 సమీకరణలు అవసరమవుతాయి. కక్ష్యల మార్పు వల్ల వైవిధ్యం సాధించవచ్చు. ఒకేసెట్టు నాటకం ప్రదర్శించేటపుడు ఎగువ కుడిని గాని, దిగువ ఎడమను గాని, ఆఖరి అంకానికి కేటాయించడం మంచిది.

నటీనటులను సరళ రేఖలో నిలపకూడదనేది సమీకరణలో ప్రధానసూత్రం. రంగంమీద మూడు పాత్రలే ఉంటే వారిని త్రిభుజాకృతిలో ఏర్పాటు చేయాలి. అయితే ఒకేరకం త్రిభుజాకృతిలో నెలకొలిపితే విసుగెత్తుతుంది. అందుకని త్రిభుజ స్థలాన్ని మార్చడం పరిమాణం మార్చడం, శీర్షకోణం పైకి కిందికి మార్చడం, త్రిభుజాకారం మార్చడం తలకిందులు చేయడం, పాత్రలు వివిధ దిక్కులు చూడడం, త్రిభుజాకృతిని మరుగుపరిచే భంగిమలను పట్టడం, పాత్రల శిరోత్రిభుజాకృతి వంపు తిరిగేటట్టు పాత్ర ఎత్తు మార్చడం ఇందుకు ఉపాయాలు.

శ్రీ.చ.

సరసవినోదిని సభ : ఈ నాటక సమాజాన్ని 1886లో ప్రసిద్ధ రంగస్థల ప్రముఖుడు ఆంధ్ర నాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు బళ్లారిలో స్థాపించాడు.

ధర్మవరం గోపాలాచార్యులు, కొరివి శేషశాస్త్రి, హనుమంత గౌడ్, ధర్మవరం వెంకట కృష్ణమాచార్యులు, పడసార శ్రీరాములు, రాయచూరు భీమారావు, హళగుంద రామచంద్రరావు మొదలైనవారు ఈ సమాజంలోని నటులు.

1871-73 లలో వచ్చిన కరువు సమయంలో బాధితుల సహాయార్థం ఏర్పడ్డ ఈ సంఘం తరువాత డిబేటింగ్ సొసైటీగా మారింది. ఈ సొసైటీ ఆధ్వర్యాన రెండు చిన్న నాటకాలు ప్రదర్శించారు. ఈ సొసైటీ 1886లో సరస వినోదినీ సభగా అవతరించింది.

కేవలం నాటక ప్రదర్శనలే కాక, పతనమైన నాటక రంగం నైతిక ప్రమాణాలను పెంపొందించడం, నిత్య జీవితంలోని కష్టనష్టాలను మరిచే పోయేట్టు చేయడం, నీతి బోధ, దేశభాషలో నాటక సాహిత్యం పెంపొందించడం, నాటక ప్రదర్శనల వల్ల వచ్చిన ధనంలో కొంత భాగం బీద విద్యార్థులకు, ధర్మ కార్యాలకు వినియోగించడం ఈ సభ లక్ష్యాలు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు, ఈ సభ సభ్యులను దృష్టిలో పెట్టుకుని నాటకాలు రాసి స్వయంగా శిక్షణ యిచ్చి ప్రదర్శింపచేసేవాడు. ఈ సభవారి ప్రదర్శనలు ఆంధ్ర, తమిళ, కర్ణాటక నాటక సమాజాలకు మార్గదర్శకమైనాయి. ఈ సమాజం ప్రదర్శించిన చిరకారి నాటక ప్రదర్శన చూసిన పిమ్మటనే సంబంధ మొదలియార్ తమిళ నాటక రంగంలో ప్రవేశించాడు. ధర్మవరం నాటకాలను ప్రప్రథమంగా ప్రదర్శించిన గౌరవం ఈ సభవారిదే. 1907లో ఈ సభ బళ్ళారిలో స్వంత నాటక శాలను నిర్మింపచేసుకుంది.

ఐకమత్యంతో, క్రమశిక్షణతో వర్ధిల్లిన ఈ సభ, కొందరి సభ్యుల అనుచిత ప్రవర్తన వల్ల రెండుగా చీలిపోయింది. ఆ పరిస్థితులలో ఆచార్యులు చీలిపోయిన జట్టులో చేరవలసి వచ్చింది.

ఈ సభ వారి పాదుకా పట్టాభిషేక నాటక ప్రదర్శనంలో కరుణ రసం తారాస్థాయికి చేరుకునేది. అందుకని ప్రదర్శన కరపత్రంలో ఈ నాటకం చూసి కన్నీటితో తడియని కన్నేవుండదు అని ప్రచురించే వారు. 1912, నవంబరు 30న రామకృష్ణమాచార్యులు అస్తమించడంతో ఈ సభ కూడా అంతరించింది.

శ్రీ.చ.

సరస్వతి, చెముడూరు (జ.1937) : రంగస్థల, సినీ నటి. ఈమె 1937లో కడప జిల్లా కలసపాడులో కృష్ణవేణి, వీరయ్య దంపతులకు జన్మించింది. ప్రతిభాపాటవానికి ఎల్లలు లేవన్నది లోకోక్తి. కానీ అభినయానికి మాత్రం ఎల్లలున్నాయనేది అనుభవజ్ఞుడైన ప్రతి కళాకారుడు ఎరిగిన సత్యం. స్టేజీ నాటకాలకు, సినిమాలకు, టీ.వీ.కి పరిమితులు, అవసరాలు వేరు వేరుగా ఉంటాయి. అవసరానికి అనుగుణంగా, ఆంగికాభినయాన్ని, వాచికధారను నటీనటులు ప్రదర్శించవలసి ఉంటుంది. సరస్వతి

ఆవిధంగా మూడు మాధ్యమాల్లో నటించి తన ప్రతిభను నిరూపించుకుంది.

సరస్వతి చదువుకునే రోజుల్లో ప్రధానోపాధ్యాయుడు కృష్ణమాచార్యుల ప్రోత్సాహంతో తొలిసారిగా నాటకరంగంలో ప్రవేశించింది. హైస్కూలు వరకు చదివిన సరస్వతి నాటకాల మీద ఆసక్తితో కర్నూలుకు మకాం మార్చి, అభ్యుదయ కళాసమితితో కలసి నాటకాలలో నటించింది. కళ ప్రజల కోసమే, వారిని చైతన్యవంతం చేయడం కోసమేనని నమ్మిన ఈ నటీమణి సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలకు సంబంధించిన నాటకాలను ఊరూరా ప్రదర్శించింది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో సరస్వతి హైదరాబాద్‌లోని శ్రీ కళానికేతన్ సంస్థలో నటిగా చేరి దాదాపు రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలలో నాటకాలు ప్రదర్శించింది.

ఈ సంస్థ ప్రదర్శించిన మహాప్రస్థానం, నాలిచరామి, సత్యం-సుందరం మొదలైన నాటకాలలో నటించి ప్రశంసాపరంపరలు అందుకుంది. సత్యం-సుందరం నాటకంలో సినీనటి నిర్మలమ్మ సరసన తాను నటించడం గర్వకారణంగా భావిస్తున్న నిగర్వ నటీమణి సరస్వతి. ఆ నాటకంలో ఉత్తమనటిగా బహుమతి అందుకొంది. పౌరాణిక నాటకాల్లో నారదుడు, సుభద్ర, రాధగా కూడా నటించి మెప్పించింది. ఏ పాత్ర ధరించినా ఆంగిక, వాచిక, సాత్త్విక అభినయాల్లో తనదంటూ ఒక విశిష్టమైన శైలిని ఏర్పాటు చేసుకున్న నటి.

రంగస్థలంపై ప్రదర్శించిన నాటకాల్లో అపారమైన అనుభవాన్ని గడించిన సరస్వతి రేడియో నాటకాల్లో ఎన్నో పాత్రలకు తన వాచికంతో ప్రాణ ప్రతిష్ఠ చేసింది. అక్కడ నుంచి సినిమారంగం కూడా ఈ నటీమణిని ఆహ్వానించడంతో ఆత్మీయులు, కన్నకొడుకు, జమీందారు, బీదలపాట్లు సినిమాల్లో నటించింది. బీదలపాట్లు సినిమాలో ఈమె తొంభై ఏళ్ళ ముదుసలి పాత్రలో నటించినప్పుడు ఆమె వయసు 30 సంవత్సరాలకు మించలేదు.

'స్టూవర్టుపురం దొంగలు, అశ్వని, రక్షణ, తీర్పు, పెళ్లి, జాబిలమ్మ, ఎర్రసూర్యుడు, యుగళగీతం, కొంగుచాటు కృష్ణుడు, రక్తతిలకం, అంబేడ్కర్, సూర్యచంద్రులు' మొదలైన సినిమాల్లో నటించి స్టేజీ పతాకాన్ని సినీ వీధుల్లో విహారం చేయించింది. రావికొండలరావు సీరియల్ ద్వారా టెలివిజన్‌లో తన అభినయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సరస్వతి మిస్టర్ బ్రహ్మానందం మొదలైన సీరియల్స్‌లో నటించింది. బాపు రూపొందించిన ఒక సీరియల్‌లో శబరిగా నటించింది.

నాటకాల నుంచి నటిగా ఎదిగిన తన జీవితం నటిస్తూనే పోవాలనే గాఢమైన నిబద్ధతతో జీవితాన్ని గడుపుతున్న సరస్వతిని 1989 శ్రీ కళా నికేతన్ శ్రీ జూలూరి వీరేశలింగం వజ్రమ్మ కల్చరల్ అవార్డుతో ఘనంగా సత్కరించింది.

గం.సు.రె

సరస్వతీ రామారావు, కోడూరుపాటి (1909-1982) : ప్రసిద్ధ నటుడు, రచయిత, దర్శకుడు, ప్రయోక్త. రాయల్ థియేటర్ స్థాపకుడు. ప్రతినాయకుడి పాత్రను పోషించడంలో దిట్ట. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా శనివారప్పేటలో 1909వ సంవత్సరంలో జన్మించాడు. తల్లిదండ్రులు మాణిక్యాంబ, చిన్నికృష్ణయ్యలు. కోడూరుపాటి గురుకుల పాఠశాలో విద్యతోపాటు తీర్థాల వెంకట శేష మాణిక్య శాస్త్రులు దగ్గర సంగీతం, నటనలను అభ్యసించాడు. భక్తప్రహ్లాదలో హిరణ్యకశిపుడు, శ్రీకృష్ణలీలలులో కంసుడు, న్యాయపతిలో న్యాయపతిగా, కాలకేతుడుగా దుష్టపాత్రలలో నటించి మెప్పించాడు. నటుడుగా పేరు తెచ్చుకున్నాడు.

సరస్వతీ బుక్ డిపో అధినేత కరుకూరి సుబ్బారావు సారథ్యంలో విజయవాడ దుర్గా కళామందిరంలో పద్మశ్రీ స్థానం నరసింహారావు, కోడూరుపాటి కలసి నటించిన రంగూన్ మెయిల్ నాటకంలో 'రౌడీల కెల్ల రౌడి, వీడే రంగూన్ రౌడి, కోడూరుపాటి రౌడి' అంటూ రంగస్థలిని దద్దరిల్లజేసి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న నటశేఖరుడు కోడూరుపాటి. ఈయన 1932లో రాయల్ థియేటర్‌ను స్థాపించి పద్య నాటకాలకు దీటుగా సాంఘిక నాటకాలను ప్రదర్శించడంలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించడంలో కృతకృత్యుడయ్యాడు. పద్య నాటక ప్రదర్శనల ప్రభంజన కాలంలో రాయల్ థియేటర్ పక్షాన స్వీయ రచనలో వెలువడిన సాని-సంసారి లో కథానాయకుడు మధుబాబు పాత్రలో నటించడమే కాకుండా దర్శకుడుగా వ్యవహరించాడు. ఈ నాటకాన్ని గేరిజిన్ థియేటర్ విశాఖపట్టణంలోను, ఆ తరువాత రాజమండ్రిలలో ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. 1955లో కోడూరుపాటి ఏలూరు నుంచి విజయవాడకు వచ్చి రూపశిల్పి ఎ.వి. రఘుబాబు నేతృత్వంలోని విజయాంధ్ర నాట్యమండలి పక్షాన జానపద కళారూపాలను ప్రదర్శించాడు. పల్లెపడుచు, అల్లూరి సీతారామరాజు, అహింసా విజయం, ధన ప్రపంచం, అన్నాచెల్లెలు మొదలైన నాటకాలను రాష్ట్రంలోని పలుప్రాంతాలలో విరివిగా ప్రదర్శించాడు. ఈయన నటనను చూసిన నాటి యువకులు

రమణ్‌జీ, సూరాత్రి కొండలరావు, మహమ్మద్ సఫీ, జగడం చంద్రరావు, నల్లా అప్పారావు, బి. నారాయణ, ఏ. సాగర్‌రావు మొదలైనవారు రాయల్ థియేటర్ సభ్యులుగా చేరి నటులుగా ఎదిగారు. లక్ష్మీ ప్రసాద్, బెజవాడ చంద్రకళ, సీతాలత, కోటేశ్వరి, అబ్బూరి కమలాదేవి మొదలైన వారిని నటీమణులుగా తీర్చిదిద్దడంలో కోడూరుపాటి కృషి మరువలేనిది. ఈయన ప్రదర్శించిన జమీన్‌దార్, మనం మారేదెప్పుడు, వీరపాండ్య కట్టబమ్మన, న్యాయపతి, రంగస్థలం కోడూరుపాటి రంగస్థల జీవితంలో మైలురాళ్లు. 1962లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిర్వహించిన పోటీలలో కోడూరుపాటి రంగస్థలం ప్రదర్శించి బహుమతులు అందుకున్నాడు. ఈ రంగస్థలం నాటకం తంగిరాల శివరామ కృష్ణప్రసాద్ దర్శకత్వంలో పలుచోట్ల ప్రదర్శింపబడి ప్రేక్షకుల మెప్పు పొందటంతో పాటు రచయిత కోడూరుపాటి కూడా మన్ననలను పొందాడు.

కళారంగ వికాసం కోసం కృషి చేసిన కోడూరుపాటిని మహాత్మ ఆర్ట్సు థియేటర్స్ (ఏలూరు), జ్యోతిర్మయి కళాసమితి (నూజివీడు), బబ్బిలి బాలకృష్ణ సాంస్కృతిక కళాక్షేత్రం (తాడేపల్లి గూడెం), వాణి పబ్లికేషన్స్ (విజయవాడ), శ్రీ ఎల్లోరా (మద్రాసు), రవీంద్రా ఆర్ట్సు థియేటర్స్ (మంగళగిరి), మోడరన్ యూత్ సెంటర్ (గుంటూరు) మొదలైన సంస్థలు ఘనంగా సన్మానించాయి. ప్రజా సాహిత్య పీఠాధిపతి మాధవపురి వేంకట రత్నకవి, బసవరాజు సుబ్బారావులు కోడూరుపాటి సరస్వతీ రామారావును అక్షరకిరీటం, నటరాజు బిరుదునిచ్చి సత్కరించాడు. నిరక్షరాస్యులకు, విద్యాధికులకు, ఔత్సాహిక కళాకారులకు తన హావభావ నిగూఢ నటనా విధానాలను నేర్పి ఎంతోమందిని నటులుగా తీర్చిదిద్దిన కోడూరుపాటి సరస్వతీరామారావు 1982, జనవరి 28న మరణించాడు.

దాసరి, ఎన్.

సర్వజ్ఞ సింగభూపాలుడు (1381-1405): సంస్కృత నాటక కర్త, అలంకారికుడు, రాచకొండ రాజధానిగా ఆంధ్రదేశం పరిపాలించిన ప్రభువు. రేచర్ల గోత్రీకుడు. అన్నమాంబ, అనపోతుల కుమారుడు. సర్వజ్ఞ బిరుదాంకితుడు. సంగీత సాహిత్యనిధి. విద్వత్కవి, పోషకుడు.

ఇతని రచనలలో ప్రధానమైనవి రసార్ణవ సుధాకరం, (అలంకార శాస్త్రం), సంగీత సుధాకరము (వ్యాఖ్యానము), రత్నపాంచాలిక లేక కువలయావళి (నాటిక). ఈ భూపాలుని మీద శ్రీనాథుడు చెప్పిన దీనారటంకాల... సర్వజ్ఞ నామధేయము... అనే పద్యాలు విఖ్యాతికెక్కినవి.

రసార్ణవ సుధాకరాన్ని బులుసు వేంకటరమణయ్య తెలుగులోకి అనువదించాడు. రత్న పాంచాలికను పిసుపాటి విశ్వేశ్వర శాస్త్రి తెలుగులోకి అనువదించాడు. గిడుగు సీతాపతి మొదట రూపకంలో తెలిగించి, ఆ తరువాత నృత్య రూపకంగా రూపొందించాడు.

శ్రీ.చ.

సర్వారాయుడు, శృంగారకవి (1864-1939) : నాటక కర్త, పండితుడు. జ్యోతిశ్శాస్త్రవేత్త. నాటక లక్షణవేత్త. ఈయన తిల రామాంబ, పల్లంరాజు దంపతులకు 1864లో ఇంజరంలో జన్మించాడు.

ఈ కుటుంబం వారి అసలు ఇంటి పేరు విస్సా ప్రగడ. వీరి పూర్వీకులలో ఒకరైన వెంకయ్య శృంగార పద్యాలు రసవత్తరంగా చెప్పడం వల్ల ఇంటి పేరు శృంగార కవిగా మారింది. సర్వారాయుడు తండ్రి వద్దనే సంస్కృతాంధ్రాలు చదువుకొని, 1880 మొదలు నరసాపురం, కిర్లంపూడి, రాజమండ్రి, పెద్దాపురం, ఆంగ్ల పాఠశాలలలో ఉపాధ్యాయుడుగా పని చేశాడు. ఆ తరువాత 1894 నుంచి 1929 వరకు కాకినాడ పిఠాపురం రాజా వారి కళాశాలలో పనిచేశాడు.

దాదాపు 71 కావ్యాలు రచించాడు. వీటిలో పిల్లల పుస్తకాలు, స్తోత్రాలు ఎక్కువ. 1907లో నాటక లక్షణమనే లక్షణ గ్రంథం రచించాడు.

సావిత్రి (1911), స్నుషా విజయం, వినాయక విలాసం, సివిక్స్ డ్రామాలు (1912), ప్రహసనమాల మొదలైన నాటకాలు రచించాడు.

ప్రతాపరుద్రీయం (అను-1906), నాటక లక్షణం (1907) అనే గ్రంథాలు రచించిన సర్వారాయుడు 1939, మార్చి 13న మరణించాడు.

శ్రీ.చ.

సర్వేశ్వరశాస్త్రి, రామాయణం (1889-1962) : ఈయన 1889లో విజయనగరం సమీపంలోని భీమసింగిలో జన్మించాడు. తల్లి వెంకట సుబ్బమ్మ, తండ్రి లక్ష్మీ నరసింహశాస్త్రి. ఈయన పూర్వులు రామాయణాది పురాణ కాలక్షేపంలో ఆరితేరిన వారవడం వల్ల రామాయణం అనే ఇంటి పేరు వచ్చింది.

విజయనగరం రిప్పన్ స్కూలులో మెట్రిక్ చదివాడు. కొంతకాలం విజయనగరం బ్రాంచి కాలేజిలో టీచరుగా, తరువాత పెద్ద కాలేజీలో రైటరుగా పనిచేసి 1947లో రిటైరైనాడు. వీరి తాత ఉమామహేశంతో కలిసి 1919లో విజయరామ డ్రమెటిక్ ఎకాడమీ స్థాపించి 1936 వరకు వివిధ నాటకాలు ప్రదర్శిస్తూ ఎంతో పేరు సంపాదించాడు. ఆయనకి సాత్త్విక పాత్రల మీద, సాత్త్వికాభినయం మీద అభిమానం ఎక్కువ.

రామసింహుడు, రామదాసు, శ్రీకృష్ణుడు, గయుడు, పఠాన్ రుస్తుం, హరిశ్చంద్రుడు, సిరియాళుడు, అర్జునుడు, నలుడు, బిల్వ మంగళుడు, చెకుముకి శాస్త్రి, హిరణ్యకశిపుడుగా నటించి

పెద్దల మెప్పును పొందిన సర్వేశ్వరశాస్త్రి 1962 అక్టోబరు ఒకటిన మరణించాడు.

శ్రీ.చ.

సవేరా ఆర్ట్సు : పౌరాణిక నాటకాల పట్ల ప్రేక్షకులకు ఆసక్తి కలిగించాలని, సంప్రదాయబద్ధమైన నాటకాలను పునరుద్ధరించాలనే ధ్యేయంతో 1981నుంచీ పనిచేస్తున్న సంస్థ సవేరా ఆర్ట్సు (కడప). ఈ సంస్థ శ్రీ మద్రామాయణ కథను నాలుగు నాటకాలుగా రూపొందించి, ఆంధ్రదేశంలోనే కాక, రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా ప్రదర్శించి, కళాభిమానుల మెప్పును పొందింది. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, శ్రీ వేంకటేశ్వర నాట్య కళాపరిషత్తు తిరుపతి నిర్వహించిన పోటీలలో ప్రదర్శించి, ప్రథమ బహుమతులను సంపాదించింది. 1991లో దశమ వార్షికోత్సవం జరుపుకున్న సవేరా ఆర్ట్సు 1997లో శ్రీ మద్రామాయణ నాటక యజ్ఞం కడపలో ఆయిదు రోజుల పాటు నిర్వహించింది.

శ్రీ మద్రామాయణ నాటక యజ్ఞ విజయోత్సవాలను హైదరాబాదు రవీంద్రభారతిలో కూడ నిర్వహించింది. కళాభిమానుల కోరిక మేరకు వాసవి కన్యక నాటకాన్ని రూపొందించి పలుచోట్ల ప్రదర్శించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతియేటా నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలలో భాగంగా 2003లో శ్రీరామపాదుకల ను ప్రదర్శించింది. అడుగంటి పోతున్న ఆధ్యాత్మిక విలువలను, ఆదర్శాలను, సంప్రదాయ నాటకాల ద్వారా ప్రేక్షకలోకానికి అందించే సంస్థలలో సవేరా ఆర్ట్సు కృషి ప్రశంసనీయం. ఈ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆళ్లూరి వెంకటయ్య.

దాసరి.ఎన్.

సాంఖ్యాయన శర్మ, ఆచంట (1864-1933) : నాటక సిద్ధాంత వేత్త, నాటక కర్త, కవి, సంస్కృతాంధ్రాంగ్ల భాషా పండితుడు, వక్త, న్యాయవాది, మొరంగి జమీ దివాన్, ప్రముఖ పత్రికా సంపాదకుడు, శతావధాని, విమర్శకుడు, సంభాషణా చతురుడు, ఆంధ్ర నాటక కళాపరిషత్తు సంస్థాపక సభ్యుడు, సంఘ సంస్కర్త, ఆంధ్ర భీష్మ, మహోపాధ్యాయ బిరుదాంకితుడు. ఈయన 1864 అక్టోబరు 19న పార్వతీపురంలో జన్మించాడు.



నరసమాంబ, బాపిరాజు దంపతులకు జన్మించిన సాంఖ్యాయన శర్మ 14వ యేటనే తమిళనాడు రాష్ట్రమంతటికీ ప్రప్రథముడిగా మిడిల్ స్కూల్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. 1881లో విశాఖ పట్నం నుంచి సుజన ప్రమోదిని అనే పత్రికకు సంపాదకత్వం వహించి, రెండు సంవత్సరాలు నడిపాడు. 1884లో శతావధానం చేయడం ప్రారంభించాడు. 1903లో కల్పలత పత్రిక స్థాపించాడు. నాటక కళకు, ఆంధ్ర నాటక రంగానికి చేసిన సేవ చిరస్మరణీయం.

విక్రమోర్వశీయం (అసంపూర్ణం 1970), ఉత్తరరామచరిత (అసంపూర్ణం 1970), అనువదించి, మనోరమ (1895), పార్థ పరాజయం (1970) అనే నాటకాలు రచించిన సాంఖ్యాయన శర్మ 1933 జులై 3న మరణించాడు.

శ్రీ.చ.

సాంగ నాటకం : సాంగమునగా నాటక భేదం. సర్వ అంగాలతో కూడినది. అంగములు నాట్య శాస్త్రోక్త నాందీ ప్రస్తావనాది పూర్వరంగాలు. వీటితో విలసిల్లే నాటకం సాంగ నాటకం.

భరతముని పేర్కొన్న తొమ్మిది అంతర్య వనికాంగాలు, పది బహిర్యవనికాంగాలు కలసి పంతొమ్మిది అంగాలతో నిర్వహించే నాటకం సాంగ నాటకం.

ఈ సాంగపదాన్ని మొట్ట మొదటగా పాల్కురికి సోమనాథుడు ప్రయోగించాడు. (నటుగాక సాంగ భాషాంగ క్రియాంగ పట నాటకముల నటియించు వారు - బసవ పురాణం, పుట 124)

శ్రీ.చ.

సాంబయ్య, నూతలపాటి (జ.1939) : నటుడు, దర్శకుడు, సమాజ నిర్వాహకుడు. గుంటూరు జిల్లా, దాచేపల్లి మండలం, నడికూడి గ్రామంలో కోటమ్మ కోటయ్య దంపతులకు 1939, జూన్ 19న జన్మించాడు. నడికూడి, దాచేపల్లి, గుంటూరు, మచిలీపట్నంలో విద్యాభ్యాసం. బియస్సీ, బి.ఇడి. పూర్తి చేసి అధ్యాపకవృత్తిలో ప్రవేశించాడు. ఉద్యోగరీత్యా సత్తెనపల్లికి చేరుకొని అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు.

విద్యార్థి దశ నుంచీ నాటకాలంటే ప్రాణం. కళాశాలలో చదివేటప్పుడు మనస్తత్వాలు, పెండింగ్ ఫైల్, దంతవేదాంతం, *శిరోమణి*, రెండు రెళ్ళు ఆరు మొదలైన నాటికల్లో నటించి పేరు తెచ్చుకున్నాడు. 1966లో సత్తెనపల్లి శ్రీ శరభయ్య గుప్త పాఠశాలలో ఉపాధ్యాయునిగా ప్రవేశించి ప్రగతి కళామండలి వ్యవస్థాపకుడు పత్రి జగన్నాథరావు దర్శకత్వంలో మాస్టర్జీ నాటకాన్ని పలు పట్టణాల్లో టిక్కెట్ నాటకంగా ప్రదర్శించటం జరిగింది. సమాజం మారాలి నాటకాన్ని అనేక నాటక కళాపరిషత్తుల్లో ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనకు, దర్శకత్వానికి, నటనకు బహుమతులు అందుకున్నాడు. 1975లో స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించిన *రాగరాగిణి*, *గాలివాన*, *పునర్జన్మ*,

సమాధి కడుతున్నాం చందాలివ్వండి మొదలైన నాటకాలు మనీ+షి , శిరోమణి, ఆగండి కొంచెం ఆలోచించండి వంటి నాటికలను ప్రదర్శించి బహుమతులు అందుకున్నాడు. 1949లో పత్రి జగన్నాథరావు స్థాపించిన ప్రగతి కళామండలికి 1990 నుంచి అధ్యక్షుడిగా కొనసాగుతూ తన కార్యవర్గ సహకారంతో 57 వార్షికోత్సవాలను, 32 కళాపరిషత్తులను దిగ్విజయంగా జరిపించి నాటక కళా వికాసానికి తోడ్పడ్డాడు. సరస్వతీ నమస్తుభ్యం, గీతోపదేశం వంటి నాటికలకు తొలి దర్శకుడిగా వ్యవహరించి వాటి ప్రాచుర్యానికి కారకుడయ్యాడు. క్రమం తప్పకుండా ప్రగతి కళామండలి ఆధ్వర్యంలో ప్రతి యేటా నాటక పోటీలు నిర్వహిస్తూ నటీనటులకు, రచయితలకు, సాంకేతిక నిపుణులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ, అలుపెరుగని కళాసేవలో నిమగ్నుడై నట జీవితాన్ని సార్థకం చేసుకొంటున్న సాంబయ్యను ఆంధ్రప్రదేశ్‌లోని అనేక కళాసంస్థలు సన్మానించాయి. 'దర్శకబ్రహ్మ, కళాసారథి, నాటకబంధు' వంటి బిరుదులిచ్చి తమ ఆత్మీయతను చాటుకున్నాయి.

గం.సు.రె.

సాంబశివరావు, కందిమళ్ళ (జ.1959) : నటుడు, అధ్యాపకుడు, రచయిత. కాకతీయ కళాపరిషత్తు కార్యదర్శి. ప్రకాశం జిల్లా కోలలపూడిలో 1959, జులై 1న తిరుపతమ్మ, బలరామయ్య చౌదరి దంపతులకు జన్మించాడు. కళారంగంపట్ల ఆసక్తి పెంచుకున్న కందిమళ్ళ నటుడుగా రాజీనామా, ధర్మ సంరక్షణార్థం, కల్పాంతం, వాళ్లిద్దరితో వీళ్లు ముగ్గురు, కుందేటి కొమ్ము, దండమయా విశ్వంభర, జగన్నాథ రథచక్రాలు, సారా సంహారం, ముద్రారాక్షసం, నల్ల సముద్రం, ప్రార్థన, ఖడ్గ సృష్టి మొదలైన నాటికలలో నటించాడు. ఉప్పుకప్పురంబు, సారా సంహారం, భూమిక, ముద్రారాక్షసం, నల్లసముద్రం, వఱడు, చైతన్యరథం, ఖడ్గసృష్టి నాటికలను రచించాడు. ఈయన రచించిన నాటికలన్నీ పలుచోట్ల ప్రదర్శింపబడి ప్రజల మన్ననలను పొందాయి.

సాంబశివరావు చిలకలూరిపేట కళాశాలలో పనిచేస్తూనే కళారంగ వికాసం కోసం కృషి చేస్తున్నాడు. నాటక సాహిత్యానికి సంబంధించిన పలు విషయాలను ఆకళింపు చేసుకొన్న సాంబశివరావు తెలుగు నాటకరంగం - నూతన ధోరణులు, ప్రయోగాలు అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించి పిహెచ్.డి పట్టా పొందాడు. ఆధునిక నాటక సాహిత్యంపై పరిశోధన చేసే రంగస్థల విద్యార్థులకు ఈ గ్రంథం ఆచూకి గ్రంథంగా ఉపకరిస్తుందనడం అతిశయోక్తి కాదు. నిరంతరం నాటకరంగాన్ని పరిశీలిస్తున్న సాంబశివరావు నాటకరంగానికి సంబంధించిన పలు అంశాలపై విశ్వవిద్యాలయాలు నిర్వహించిన సదస్సులలో పత్రాలు సమర్పించాడు. పత్రికలలో వ్యాసాలు ప్రచురించాడు. ఎన్.జి. రంగా ఫౌండేషన్ సంస్థ, అప్పాజోస్యుల ఫౌండేషన్, ప్రజానాట్య మండలి వంటి సంస్థలు సాంబశివరావును ఉత్తమ నాటక రచయితగా గుర్తించాయి. 1998లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నాటక రచనా పురస్కారం ప్రదానం చేసి గౌరవించింది. పలు కళా సంస్థలకు కార్యదర్శిగా, గౌరవ సలహాదారుగా, నాటక పోటీల న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తూ కళారంగం కోసం కృషి చేస్తున్న కళాహృదయుడు కందిమళ్ళ.

దాసరి,ఎన్.

సాంబశివరావు, కాళ్లకూరి (1870-1916) : కవి, నాటక కర్త, నటుడు, సంఘసంస్కరణాభిలాషి, పిఠాపురం రాజా కాలేజీలో అధ్యాపకుడు. తల్లి పాపాంబ, తండ్రి భోగరాజు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని బండాడలో 1870లో జన్మించాడు. సాంబశివరావు ప్రప్రథమంగా బబ్బిలియుద్ధగాథను 1899లో నాటకంగా మలచిన నాటకకర్త. దశ రూపకాలలోని సమవకార లక్షణ యుక్తంగా రాసి, దానికి రంగరాయ కదన సమవకారం అని పేరు పెట్టాడు. శ్రీపాద, వేదం వేంకటరాయ శాస్త్రి, బబ్బిలియుద్ధం నాటకాలు వెలువడక పూర్వం ఆంధ్రలో దీన్నే ప్రదర్శించేవారు.

వైశ్య పురాణ గాథను కన్యకాపరమేశ్వర విలాసం నాటకంగా మలచిన సాంబశివరావు 1916లో మరణించాడు.

సాంబశివ రావు, [illegible]

శ్రీ.చ.

సాంబశివరావు, వేజండ్ల (1925-2005) : నాటక రచయిత, నటుడు. బాల సాహిత్య నిర్మాత. 1925 మే 25న గుంటూరు జిల్లా వేజండ్లలో వెంకట సుబ్బారావు, మంగమ్మ దంపతులకు జన్మించాడు. ఈయన 5వ ఫారమ్ వరకు చదివి 1956 నుంచి హయ్యర్ గ్రేడ్ టీచర్‌గా పనిచేశాడు. ఉపాధ్యాయ వృత్తి స్వీకరించిన నాటినుంచి సాంబశివరావుకు బాల, నాటక సాహిత్యాలలో కృషి కొనసాగించడ మొదలుపెట్టాడు.

1956లో రచించిన బ్రహ్మంగారి చరిత్ర మొదటి నాటకం. అనంతరం మైరావణ, దక్షయజ్ఞం, పార్వతీ కళ్యాణం, స్వామి అయ్యప్ప, సీతాన్వేషణ, తారకాసుర వధ, షిర్డీ సాయిబాబా, అర్జున విజయం, కన్యకాపరమేశ్వరీ మాహాత్మ్యం, బండాసుర, సుందరకాండ మొదలైన నాటకాలు రచించాడు. వీటిలో మైరావణ, దక్షయజ్ఞం నంది నాటకోత్సవాలలో ప్రదర్శింపబడ్డాయి. ఈయన నటుడిగా మైరావణుడు, దక్షుడు, విభీషణుడు, పీర్‌సాహిబ్ పాత్రలలో నటించాడు. తన వజ్రోత్సవ జీవనయానంలో కూడా నాటక రంగాభ్యున్నతికి అలుపెరుగక సేవలందిస్తూ పెద్దపల్లి సమీపంలోని చిలకవమ్మవారిపాలెంలో స్థిరపడి గ్రామీణ ప్రాంతాల్లో కళావికాసానికి, నవతరంలో ఈ అభిరుచి పెంపొందించేందుకు కృషి చేశాడు. ఈయన2005, మార్చి 18న హైదరాబాదులో ఒక రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించాడు.

మన్నెశ్రీ

సాటిర్ : గ్రీసు నాటక భేదం. గ్రీసు నాటక పోటీలలో ప్రదర్శించే విషాద నాటకత్రయానికి అనుబంధ నాటకం సాటిర్. సాటిర్‌లు అశ్వముఖం, మానవ శరీరం, వాలం కలిగి అతిమానుష శక్తి గల అరణ్య దేవతలు. బృంద గాయకులు తోళ్లు కప్పుకొని, తోకలు పెట్టుకొని ఆడుతూ పాడుతూ ఈ తరహా నాటకం ప్రదర్శించేవారు. వీటిలోని కథ సామాన్యంగా సాహస కృత్యాలకు సంబంధించినదై ఉంటుంది. ఒక్కొక్కప్పుడు విషాద నాటకత్రయంలోని నాయకులుగాని, పురాణ కథా నాయకులుగాని హాస్యాస్పదమైన పరిస్థితిలో సాటిర్‌ల మధ్య చిక్కుకొన్న ఘట్టం ఈ నాటకంలో చిత్రితమయ్యేది.

సాటిర్ నాటకానికి, గ్రీకు విషాద రూపకానికి రూపంలో సామ్యం ఎక్కువ. సాటిర్ నాటకాల ఛందస్సు విషాద రూపక ఛందస్సే. అసభ్యక్రియలు, అతివేగ నృత్యం, కడుపు చెక్కలయ్యే హాస్యం, అసభ్య భాషణం, అసభ్య అవయవ విన్యాసం సాటిర్ నాటక లక్షణాలు. ఈ సాటిర్ గీతాలను ఛందోబద్ధం చేసింది ఏరియన్. ఒక శతాబ్దం తరువాత ప్రాటినాస్ ప్రప్రథమంగా సాటిర్ నాటకం రచించాడు. 'సైక్లాప్స్', 'ట్రాకర్స్' సాటిర్ లలోని ఖండాలు మాత్రమే ఇప్పుడు లభ్యమవుతున్నాయి.

శ్రీ.చ.

సాత్త్వికం : భావ భేదం. సత్త్వమనగా చిత్తైగ్రత, మనో వ్యాపారం. మనస్సులోంచి జనించిన ఒక విశేష స్థితి. కావ్య పఠనం వల్ల గాని, నాటక ప్రయోగ వీక్షణం వల్ల గాని, పరుల సుఖదుఃఖాదుల భావన వల్ల గాని నాటికకు అనుగుణంగా పరిణమించిన అంతఃకరణ ప్రవృత్తి. అలాంటి మనసులోంచి జనించిన భావాలు సాత్త్వికభావాలు. ఈ సాత్త్వికం నుంచి పుట్టే అశ్రురోమాంచాదులు భావవికారాలు అవడం చేత వీటిని అనుభావాలుగానే తీసుకోవచ్చు. అందువల్ల సాత్త్వికభావాలకు ద్విరూపత ప్రాప్తిస్తున్నది.

చిత్తవృత్తి రూపమైన ఈ సాత్త్వికం అభ్యంతరం, బాహ్యం అని రెండు విధాలు. మనసులో వాయు ప్రసరణ మార్గంలో సంక్రమించి ఉండేది అభ్యంతరం. దేహంలో సంక్రమించి ఉండేది బాహ్యం. ఈ బాహ్యం ఘర్మ రోమాంచాదుల రూపంలో ఉంటుంది. ఇది అభ్యంతర ఫలమే. అవ్యక్తచిత్తవృత్తి దేహమంతా వ్యాపించినపుడు రోమాంచాదులు జనిస్తాయి. ఈ రోమాంచాదులను బట్టి అభ్యంతర సత్త్వం ఊహకందుతుంది. అంటే మనసుకు దేహం మీద గల ప్రభావం వల్ల ఈ వికారాలు దేహంలో పొడగడతాయి. సాత్త్వికం సమస్త భావాలకు మూలం.

శ్రీ.చ.

సాత్త్వతి : నాట్యవృత్తి భేదం. శ్రీ మహావిష్ణువుకు, మధుకైటభులకు జరిగిన యుద్ధంలో జనించిన ఈ వృత్తికి శ్రీ మహావిష్ణువే ప్రవక్తకుడు. సత్ అంటే జ్ఞానం, లేక ప్రకాశం. సత్ గలది సత్వం అంటే ప్రకాశవంతమైన మనస్సు. సత్వమంటే మనోవ్యాపారం. సత్వ ప్రధానంగా అంటే సావధానమైన మనసుతో చేసిన కార్యకలాపం కాబట్టి దీనికి సాత్త్వతీ వృత్తి అని పేరు వచ్చింది. సాత్త్వతి వీరాద్భుత, శాంతరసాలలో ప్రయోగించ తగింది.

శోకరసం లేకుండా త్యాగ, శౌర్య, దాన,దయాది లక్షణ విలసితమైన నాయక కార్యకలాపం సాత్త్వతి. ఇందులో హర్షం ప్రధానం. సాత్త్వతీ వృత్తిభేదాలు. సల్లాపకం, ఉత్థాపకం, సంఘాత్యం, పరివర్తకం.

శ్రీ.చ.

సాత్త్వికములు : సాత్త్వికభావాలు ఎనిమిది. 1. స్తంభం లేక నివ్వెరపాటు.అంగములన్నీ ఏ పనీ చేయకుండా వుండటమే స్తంభం. హర్షభయశోక విస్మయ విషాదాదులను ప్రదర్శించడానికి ఇది ఉపయుక్తమవుతుంది. 2. ప్రళయమనగా స్మృతి తప్పడం. నిద్ర, అభిఘాత, మోదాదులందు స్మృతి తప్పడం సంభవిస్తుంది. నిశ్చేష్ట, నిష్కంపత, శూన్య జడాకృతి దాల్చడంవల్ల దీనిని అభినయించాలి. 3. వైస్వర్యం లేక గాద్గదికం. భయం, హర్షం. స్పర్శ, జ్వర రోగాదులలో స్వరం కంపిస్తుంది. వీటిని ప్రదర్శించవలసి వచ్చినపుడు నటుడు కంఠస్వరంలో భేదం చూపెట్టాలి. మాట పెగలక పోవడం ద్యోతకం చేయాలి. 4. రోమాంచం లేక గగుర్పాటు. స్పర్శ, భయ, స్వేద, హర్ష, క్రోధ రోగాలప్పుడు శరీరం గగుర్పొడుస్తుంది. ఈ భావాలను గగుర్పాటు ద్వారా ప్రకటించాలి. 5. అశ్రువు లేక కన్నీరు. శోకం, రెప్ప వాల్చక చూడడం, ఆనందం, కోపం వచ్చినపుడు కన్నీరు వస్తుంది. కన్నీరు చూపడంతో పాత్ర ఆయా భావాలను అనుభవిస్తున్నాడని ప్రేక్షకులు భావిస్తారు. 6. కంపం. భయ,

హర్ష, రోష, స్పర్శ, జరాదులలో శరీరం కంపిస్తుంది. శరీర కంపం, ధ్వని కంపం, కోపం, బెదిరింపు మొదలైనవాటితో ఇది ప్రదర్శించాలి. 7. వైవర్ణ్యం లేక వెల్లదనం. సేవ, క్రోధ, భయ, శ్రమ రోగాదులలో వైవర్ణ్యం పుడుతుంది. ముఖ కవళికలు మార్చడం, నాడులను బిగపట్టడం వల్ల వైవర్ణ్యం గోచరింపచేయాలి. 8. స్వేదం లేక చెమట. క్రోధం, భయం, హర్షం, లజ్జ, దుఃఖం, శ్రమ, రోగం,తాపం, వ్యాయామ సమయాలలో శ్వేదం పుడుతుంది. చెమట తుడుచుకోవడం, విసనకర్రతో విసురుకోవడం మొదలైన ప్రక్రియలతో స్వేదం ప్రదర్శించాలి.

వ్యభిచారీ భావాలు: నిలకడ లేని భావాలు వ్యభిచారీ భావాలు. సాత్త్విక భావాలు శృంగార, వీరాది రసాలు స్థూల దృష్టితో స్వీకరించాలి. అభినయించవలసింది ఒకటే రసమైనా పాత్రల గుణ గణాలు, పరిస్థితులను బట్టి అభినయంలో తేడా ఉంటుంది. ఆకారంలోను, శీలంలోను, పరిస్థితులలోను వ్యక్తికీ వ్యక్తికీ భేదం ఉంటుంది. ఆయా పాత్రల శీలాదులను బట్టి అభినయించాలి. ఉదా: దుఃఖం కలిగినపుడు ధీరుడు దిగమింగుకోవడానికి యత్నిస్తాడు. భీరుడు బావురు మని ఏడుస్తాడు. కారణాన్ని బట్టి కూడా దుఃఖంలో స్థాయి భేదముంటుంది. ధీరుడు ప్రేమను గంభీరంగా వెల్లడిస్తాడు. నీచుడు వెకిలి చేష్టలు చేస్తాడు. ఇటువంటి భేదాలను నటులు పాటించినపుడే పాత్రచిత్రణ సవ్యంగా ఉంటుంది. మనిషికి చిరాగ్గా ఉన్నపుడు స్వల్ప విషయాలకే కోపం వస్తుంది. అదే సంతోషంగా ఉన్నపుడు చిరునవ్వు నవ్వి ఊరుకుంటాడు. కొందరికి వేళా కోళం గిట్టదు. ప్రాణ మిత్రులు వేళాకోళంగా ఏమన్నా మనసుకు పట్టించుకోడు. ఈ భేదాలు సూక్ష్మంగా పరిశీలించి నటించాలి.

భావాలను స్పష్టంగా వెల్లడించడానికి ముఖం అద్దంలాంటిది. ఎక్కువ అనువయినది. నటుని ముఖం విశాలంగానూ, భావం వెంటనే స్ఫుటంగా గోచరించేది గానూ ఉంటే భావం వెంటనే గోచరిస్తుంది. దుష్టబుద్ధి మాదిరి పాత్రల అభినయంలో ఒక చెంప ఏడుపు,ఒక చెంప నవ్వు ప్రకటించాలి.

నేత్రాలు భావ ప్రకటనకు బాగా దోహదపడతాయి. ఆనందంలో అర్ధనిమీలిత లోచనాలు వగైరా అన్నింటినీ నటుడు శ్రద్ధగా అభ్యసించాలి. అయితే పాత్రలు తన్మయీ భావాన్ని పొందినపుడు నేత్రాలు ఆయా ఆకారాలను వాటంతటవే రూపు దాలుస్తుంటాయి. అయితే పంచేంద్రియాలు నటుని స్వాధీనంలో ఉన్నపుడే ఇది సాధ్యమవుతుంది. అందుకే పరిశీలన, అభ్యాసం అవసరం.

శ్రీ.చ.

సాత్త్వికాభినయం : చతుర్విధాభినయాలలో ఒకటి. సత్త్వ మనగా హృదయంలో ఆవిర్భవించిన భావం. ఇది మానవుల హృదయాలలో అవ్యక్తంగా ఉంటుంది. దీనిని ద్యోతకం చేయడమే సాత్త్వికాభినయం. భావ ప్రకటన అనేది ఈ సాత్త్వికాభినయమే.

చిత్తవృత్తి రూపమైన సత్త్వం రెండు విధాలుగా ఉంటుంది. 1. అంతరం, 2. బాహ్యం. మనస్సును ఆశ్రయించుకొని ఉండేది అంతరం. దేహాన్ని ఆశ్రయించుకొని ఉండేది బాహ్యం. అంటే ఘర్మ రోమాంచాది గుణ రూపమైంది. అయితే ఇది భావ రూపమైన అంతర సత్త్వ ఫలమే. భావం మనస్సులో ప్రబలమైనపుడు దేహంలో వచ్చే వికారాలు. ఈ మార్పులు తిలకించి మనం అంతర సత్త్వాన్ని ఊహించుకుంటాం. ముఖం కంద గడ్డయి, కళ్ళు ఎర్రబడి, నాసికాపుటాలు విశాలమైనపుడు ఆ మనిషి మనసులో కోపం ప్రబలిందని ఊహించుకుంటాం.

విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః అని భరతుడు చెప్పడం వల్ల ప్రేక్షకులలో అణగివున్న రసాలను విభావాను భావ వ్యభిచారీ భావాల సంయోగం వల్ల నటుడు రసానుభూతి పొందగలుగుతాడు. ఇలా ప్రేక్షకులలో రసానుభూతిని కలిగించడమే సాత్త్వికాభినయం.

విభావం : భావ పోషకం విభావం అంటే నాయక, నాయికాది పాత్రల వర్ణన. ఇది రెండు విధాలు. 1. ఆలంబనం. శృంగారంలో ప్రేయసీ ప్రియులు, రౌద్రంలో శత్రువు, భయానకంలో పులి, హాస్యంలో వికృత వేషచేష్టాదులు, కరుణంలో బంధునాశాదులు, రౌద్రంలో అపరాధులు, వీరంలో ధిక్కరించిన వారు, భీభత్సంలో శవాదులు, అద్భుతంలో ఆశ్చర్యజనకాలు, శాంతంలో సర్వప్రపంచం. 2. ఉద్దీపన : ఆయా భావాలను రెచ్చ గొట్టేవి ఉద్దీపనాలు. శృంగారంలో ఉద్యాన మలయానల చంద్రాదులు. ఈ ఉద్దీపన విభావం నాలుగు విధాలు 1. గుణాలు, 2. చేష్టలు, 3.అలంకారాలు, 4. తటస్థాలు.

1.గుణాలు – యవ్వనం, రూపం, లావణ్యం, సౌందర్యం, అభిరూపత, మృదుత్వం, సౌకుమార్యం.

2.చేష్టలు – హావభావాదులు

3. అలంకారాలు – హార నూపురాదులు

4. తటస్థాలు – చంద్రిక, కోకిల, మలయానిలాదులు.

అనుభావం : భావ సంసూచనాత్మకముగు వికారం అనుభావం. మనసులో భావం ప్రబలం కాగా దేహంలో వచ్చే వికారం. అనుభావాన్ని రతి, హాసం మొదలైన స్థాయీ భావాలను (భావ పరాకాష్ఠ) ముఖ వికాసం, భ్రూవిక్షేపం, రోమాంచం మొదలైన వికారాలను ద్యోతకం చేయడం. వీటన్నింటికి లోకమే ప్రమాణం.

భావం : సుఖ దుఃఖాది జనిత వాసనా రూప మనోవికారం భావం. పాత్రల సుఖ దుఃఖాదులను అనుభూతికి తెచ్చుకోవడం వలన ఉద్భవించే మనోవికారమే భావం. ఈ మనో వికారాలను ప్రేక్షకులలో జనింప జేయడమే నటధర్మం.

సాత్త్వికాలంకారాలు : ఆభరణాది అలంకారాలు మానవుని అందచందాలను ఇనుమడింపచేసినట్టే సాత్త్వికాలంకారాలు నాటక పాత్రల రమణీయతను, నాటక రమణీయతను ఇనుమడింప చేస్తాయి. అందుకే పాత్రలకు సాత్త్వికాలంకారాలను అనుసంధించడం జరుగుతుంది.

ఈ సాత్త్వికాలంకారాలు రెండు విధాలు. 1. నాయకాలంకారాలు, 2. నాయికాలంకారాలు. శోభ, విలాసం, మాధుర్యం, గాంభీర్యం, స్థైర్యం, తేజస్సు, లలితం, ఔదార్యం నాయక సాత్త్వికాలంకారాలు.

భావం, హావం, హేల, శోభ, కాంతి, దీప్తి, ప్రాగల్భ్యం, మాధుర్యం, ధైర్యం, ఔదార్యం, లీల, విలాసం, విచ్ఛిత్తి, విభ్రమం, కిలికించితం, మోట్టాయితం, కుట్టమితం, బిబ్బోకం, లలితం, విహృతం నాయికాలంకారాలు.

శ్రీ.చ.

సాదృశ్యం : సాదృశ్యమంటే పోలిక. ఒక దానితో ఒకటి పోలికగల రెండు కథలను గాని, రెండు భావాలను గాని, రెండు సన్నివేశాలను గాని, రెండు పాత్రలను గాని నాటకంలో ప్రవేశపెట్టడం సాదృశ్యం.

నాటక క్రియలోని ఒక భాగంలోని కేంద్ర భావం ఇంకొక భాగంలో పునరావృతమైతే ఒక దాని కొకటి దృష్టాంతంగా పని చేస్తూ, బలం చేకూర్చుకుంటూ మంచి ఫలితాన్నిస్తాయి. ఈ సాదృశ్యం ఆధారంగా కథలోని నాటకీయ కౌతుకాన్ని క్లిష్ట పరచవచ్చు. మొత్తం నాటకాన్నే రమణీయంగా రూపొందించవచ్చు.

ఈ సాదృశ్యం నాలుగు రకాలు. 1. కథా సాదృశ్యం, 2. సన్నివేశ సాదృశ్యం, 3. పాత్ర సాదృశ్యం, 4. భావ సాదృశ్యం.

1. కథా సాదృశ్యం: ప్రధానకథకు, ఉపకథకు లేదా రెండు ఉపకథలకు పోలికలు ఎక్కువగా ఉండడం కథా సాదృశ్యం.

ఉదా॥ ధర్మవరం రామకృష్ణమాచార్యుల చంద్రహాస నాటకంలో చంద్రహాసుడు చంపకమాలిని ప్రేమగాథ ఒక ఉపకథ. చంద్రహాసుడు విషయ ప్రేమగాథ ఇంకొక ఉపకథ. ఈ రెండు ఉపకథలకు సామ్యం ఎక్కువ. చంపకమాలిని, విషయ ఇద్దరూ చంద్రహాసుడినే ప్రేమిస్తారు. చివరకు ఇద్దరినీ చంద్రహాసుడు వివాహమాడతాడు.

2. సన్నివేశ సాదృశ్యం: ఒకే విధంగా రెండు సన్నివేశాల చిత్రణ సన్నివేశ సాదృశ్యం. తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగం షష్ఠాంకంలో ధర్మరాజు భీష్మద్రోణులను విడివిడిగా కలుసుకొని యుద్ధానికి అనుమతి కోరిన రెండు సన్నివేశాలు సన్నివేశ సాదృశ్యానికి ఉదాహరణలు. ఈ రెండు సన్నివేశాలు ఒకే నడక నడుస్తాయి. పద్యాలు పునరావృతమవుతాయి.

3. పాత్ర సాదృశ్యం: ఒకే విధంగా రెండు పాత్రల చిత్రణ పాత్ర సాదృశ్యం. ఈ పాత్ర సాదృశ్యం నాలుగు రకాలు. 1. రూప సాదృశ్యం, 2. అవస్థా సాదృశ్యం, 3. శీల సాదృశ్యం, 4. స్వర సాదృశ్యం

1. రూప సాదృశ్యం – రెండు పాత్రలకు రూపంలో ఎక్కువగా పోలికలుండడం రూప సాదృశ్యం. ఉదాహరణకు ప్రతిమ నాటకంలో లక్ష్మణుడు భరతునిలో శ్రీరాముని పోలికలు చూసి రాముడని భ్రమించడం.

2. అవస్థా సాదృశ్యం – రామాయణంలో శ్రీరాముని భార్యను రావణుడు అపహరించాడు. సుగ్రీవుని భార్యను వాలి అపహరించాడు. శ్రీరామ సుగ్రీవులిద్దరూ భార్యా వియోగ దుఃఖితులే. ఇద్దరిదీ ఒకటే అవస్థ. ఇదే అవస్థా సాదృశ్యం.

3. శీల సాదృశ్యం – కాళ్లకూరి నారాయణ రావు వరవిక్రయం నాటకంలో పురుషోత్తమరావు, బసవరాజు, భ్రమరాంబ, కమల, ఒక బ్రాహ్మణుడు, ఒక కమ్మ, ఒక శెట్టి, లింగరాజు వరకట్నాల వల్ల చిక్కులపాలై వరకట్నాలను దూషించడం శీల సాదృశ్యానికి ఉదాహరణలు.

4. స్వర సాదృశ్యం : ఒకే విధమైన స్వరం కలిగి ఉండడం స్వర సాదృశ్యం. ఉదాహరణకు భాసుని ప్రతిమ నాటకం తృతీయాంకంలో భరతుడు తేరుకుని ఆర్యా అనే సరికి సుమంతుడు దశరథ మహారాజు తన్ను సంబోధించాడని తలచి
సుమంతుడు : జయము మహారాజా (సవిషాదముగా)
అహో ఏమి స్వర సాదృశ్యం అనుకొంటాడు

5. భావ సాదృశ్యం – ధర్మవరం రామకృష్ణమాచార్యుల చంద్రహాస నాటకంలో 'తానొకటి తలచిన దైవ మొకటి తలచు' అనే భావం నాలుగుసార్లు పునరావృతమౌతుంది. కుంభానస మంత్రి చంద్రహాసుని 1. బాల్యంలోనే చంపించడానికి యత్నించి విఫలుడవడం. 2. చంద్రావతిలో బాణంవేసి స్వయంగా చంపాలని యత్నించి విఫలం కావడం. 3. 'విషమునిమ్ము' అని లేఖ రాసి కొడుకుచేత చంపించాలని యత్నించి విఫలుడు కావడం. 4. దేవాలయంలో పాములతో కరిపించి చంపాలని యత్నించి విఫలుడు కావడం. ఇది భావ సాదృశ్యానికి ఉదాహరణ. ఈ నాలుగు యత్నాలు తానొకటి తలచిన దైవ మొకటి తలచు అన్న భావాన్ని రూఢి పరుస్తూ ప్రధాన కథకు బలం చేకూరుస్తాయి.

ఈ సాదృశ్యాన్ని వ్యక్తీకరించడానికే నాటకం చివర కుంభానసుని ద్విపదలో నాలుగుసార్లు "దైవయత్నము గాని తలపోయమనదు భావంబు నిష్ఫల ప్రాయంబుసుండీ" అని కవి అనిపిస్తాడు.

శ్రీ.చ.

సాధన : నాటక ప్రదర్శనకు నటీనటుల సన్నద్ధ కృషే సాధన (రిహార్సలు). పూర్వం తెలుగులో దీనిని ఒద్దికలు అనేవారు కాని ఈ పదం ఇపుడు వాడుకలో లేకుండా పోయింది. ఇపుడు

సాధన, పూర్వాభ్యాసం మొదలైన పదాలను రాతలో వాడినా వ్యవహారంలో మాత్రం రిహార్సలు, ప్రాక్టీసు అనే ఇంగ్లీషు పదాలే ఎక్కువ వాడుకలో ఉన్నాయి.

ఈ సాధన నాటక నిర్ణయం తరువాత ఇంచుమించు నాటకం ప్రదర్శించే వరకూ కొనసాగుతుంది. ఈ సాధనే నాటక ప్రదర్శనకు గుండెకాయ. సాధన ఎంత క్రమబద్ధంగా జరిగితే నాటక ప్రదర్శన అంతగా విజయ వంతమయే అవకాశం ఉంది.

ప్రదర్శన ప్రతి – నాటకం, పాత్రలు ఎన్నికైన తరువాత నాటక ప్రదర్శనను తానూహించిన విధంగా దర్శకుడు లేక ప్రయోక్త ప్రదర్శనప్రతి తయారుచేసుకోవాలి. ఇందులో గ్రౌండు ప్లాను మొదలుకొని ఆయా ఘట్టాలలో పాత్రల అభినయాదుల వరకు రాసి పెట్టుకొని ఉంచాలి.

ప్రదర్శనప్రతి తయారు చేసుకొన్న తరువాత సాధన విషయంలో ప్రయోక్త ఒక నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించుకొని దానిని నటీ నటులకు , సాంకేతిక నిపుణులకు అందచేయాలి.

ప్రథమ పఠనం : ప్రదర్శన ప్రతి రూపొందించుకున్న తరువాత దర్శకుడు, నటీనటులు, సాంకేతిజ్ఞులు మొదలైన వారందరినీ సమావేశ పరచి నాటకమంతా వారికి చదివి వినిపించాలి. పాత్రల పరస్పర బాంధవ్యాలు, వారి వారి స్వభావాలు, ప్రవేశనిష్క్రమణాలు, ఆహార్యం, రంగోద్దీపనం మొదలైన సకల విషయాలు వారికి విశదీకరించాలి. ఈ కార్యక్రమంలో వచ్చిన కొత్త భావాలను, మార్పులను ప్రదర్శన ప్రతిలో చేర్చాలి. దీనితో నాటకం అందరికీ సుబోధకమై అసలు సాధనా కార్యక్రమానికి భూమిక తయారవుతుంది.

మొదటి దశ : ఈ మొదటిదశలో ప్రయోక్త నటీనటులను సమావేశపరచి ఎవరి పాఠ్యం వారితో భావయుక్తంగా నాటక ప్రతి చూసి చదివించాలి. ఆశ్చర్యార్థకాలు, ప్రశ్నార్థకాలు, కాకువులు మొదలైన వాటిని సక్రమంగా చెప్పేట్టు చూడాలి. అలాగే మాటలు తడబడడం, తారుమారు కావడం జరగకుండా చూడాలి. అపుడే ఏ మాట ఏ వాక్యం ఏ స్థాయిలో పలకాలో నిర్ణయించాలి. ఇందులోనే ముఖ కవళికలు, చలన ప్రతిచలనాలు, సమష్టి మేళవింపు చూసుకోవాలి. అక్కడే నటీనటులకు వారి వారి పాఠ్యం కంఠస్థమయ్యే వరకు చదివించాలి. వ్యవధి తక్కువగా ఉంటే ఇంటి దగ్గర నటీ నటులు ఈ క్రమ పద్ధతిలోనే కంఠస్థం చేయవలసిందిగా ఆదేశించాలి.

నటీనటులందరితో నాటకం మొదటి నుంచి వరసగా చదివించాలి. అలాగాక కొందరే వచ్చి ఉంటే నాటకాన్ని భాగాలుగా విడగొట్టి ఆ నటీనటులుండే ఖండికలను చదివించాలి.

ఆ తరువాత అసలు సాధన ప్రారంభమవుతుంది. ఈ సాధన ప్రారంభానికి ముందు రంగస్థలం నిర్వాహకుడు (Stage Manager), అతని సహచరులు సాధనగదిలో గ్రౌండుప్లాను, సెట్టునమూనా, సుద్ద ముక్కతో గీయాలి. ఆ నమూనాలో, ఆ సెట్టులోని ద్వారాలు గుర్తు పెట్టాలి. కుర్చీలు, సోఫాలు, బీరువాలు, బల్లలు, మొదలైన వాటిని వాటి వాటి స్థానాలలో ఉంచాలి. కనీసం ఆ స్థానాలలో గుర్తులైనా పెట్టాలి. నటీ నటులు రిహార్సలు సమయంలో తమ పాఠ్యంలో సూచనలు రాసుకోవాలి. అలాగే ప్రాంప్టుచేసే వారు కూడా ప్రతి రిహార్సలుకు వస్తూ, నటీనటుల కదలికలను, సంభాషణా స్వరాలు, సంగీతం, రంగోద్దీపనం మొదలైన విషయాలు నాటక ప్రయోగ ప్రతిలో రాసుకోవాలి. ఆ తరువాత రిహార్సలు జరిపే రోజు, కాలం, రంగాలు, నటీనటుల పేర్లు తెలిపే పట్టికను తయారుచేసి సాధన గదిలో కట్టి అవసరమైన వారికి పంపాలి.

మొదటి రిహార్సలు : నిర్ణయించుకున్న రంగాలను సాధన చేయడానికి కావలసిన నటీ నటులు రాగానే ప్రయోక్త గ్రౌండు ప్లాను సహాయంతో రంగదృశ్య చిత్రీకరణను నటీనటులకు విశదీకరించాలి. ఆ తరువాత ఒక్కొక్కరిని వరుస క్రమంలో ప్రవేశ నిష్క్రమణాలు అభ్యాసం చేయించాలి. ప్రవేశించి ఎక్కడ కూర్చోవాలో, ఎక్కడ నిలబడాలో నిర్ణయించి, ఆయా ప్రదేశాలకు గుర్తు పెట్టాలి. ఈ కార్య కలాపంతో పాటే సంభాషణా స్థాయిని కూడా నిర్ణయించి చెప్పించాలి. అవసరమైన చోట్ల సంభాషణలతో పాటు ప్రక్రియ కూడా జరిపించాలి. వాటిలో అవసరాన్ని బట్టి ప్రయోక్త మార్పులు చేసి వాటిని స్టేజి మేనేజరు, ప్రాంప్టరు తమ తమ ప్రదర్శన ప్రతులలో రాసుకునేట్టు చూడాలి.

ఈ దశలోనే ప్రవేశనిష్క్రమణాలు, కదలికల మీద ప్రయోక్త దృష్టికేంద్రీకరించాలి. ఇవి నటీ నటులలో స్థిరపడేవరకు సాధన చేయించాలి.

ఈ మొదటి ఒద్దికల నుంచి కూడా పాత్రలు ఉపయోగించే కర్ర, గొడుగు వంటి చేతి వస్తు (Hand props) సముదాయం తోను, తలుపులు తీయడం, మూయడం వంటి ప్రక్రియలతోనూ సాధన చేయించాలి. నటీ నటులకు వారి వారి పాఠ్యభాగాలు కంఠస్థమైన తరువాత ఫలహారం చేయడం, కాఫీ తాగడం లాంటి చిన్న చిన్న ప్రక్రియలను సాధన చేయించాలి.

ప్రదర్శన సమయంలో ఏ స్థాయిలో సంభాషణలు చెప్పవలసి ఉంటుందో రిహార్సులులో కూడా ఆ స్థాయిలోనే చెప్పించాలి. ఒక పాత్ర ఇంకొక పాత్రను ఆచ్ఛాదించకుండా, రంగం మీది వస్తుసముదాయం అడ్డు కాకుండా, పాత్ర కదలికలు అడ్డు కాకుండా కదలికలు నిర్ణయించి ప్రదర్శన ప్రతిలో రేఖలతో గుర్తించాలి. దీపకాంతి ఛాయలు నటుల మీద పడకుండా కదలికలు నిర్ణయించాలి.

రెండవ దశ : ఈ దశలో పాత్ర రంగస్థలం మీది ఏ అనుకూల స్థలంలో నుంచి పాఠ్యం చెపితే పాత్ర పోషణకు, ప్రేక్షకుల మనసుల మీద ముద్రవేయడానికి ఎక్కువ వీలవుతుందో ఆ

స్థలాలను నిర్ణయించాలి. ఈ సందర్భం తరువాత కదలికలు,స్థానాలు దృష్టిలో ఉంచుకోవాలి. దీనికి గాను కొందరు ప్రయోక్తలు రంగస్థలాన్ని 15 గడుల కింద విభజించుకొని నట స్థానాన్ని అంటే నటుడు ఉన్న గడిని గుర్తుపెట్టుకోవాలంటారు.

ఆ తరువాత సమీకరణను దృష్టిలో పెట్టుకొని కదలికలు, స్థానాలు నిర్ణయించాలి. ఈ కదలికలను, స్థానాలను ప్రదర్శనప్రతిలో రాసుకోవాలి. ఈ దశలో అందరు నటీ నటులతో సాధన చేయించాలి. కదలికలు సహజత్వం ఉట్టి పడే లాగుండాలే గాని, కృత్రిమత్వంగా ఉండకూడదు.

ఈ దశలో సమష్టికృషి అవసరం. ఎవరికి వారే అనే పద్ధతిలో ఉంటే నాటక ప్రదర్శన రక్తి కట్టదు. అలాగే రంగానికి రంగానికి, సంభాషణకు సంభాషణకు పొందిక ఉండాలి. పాత్రధారులకు వారి వారి పాత్యం బాగా కంఠస్థం కావాలి. కదలికలకు, ప్రవేశ నిష్క్రమణలకు సంబంధం యాంత్రికంగా ఏర్పడాలి. ఒక కదలికతో సంభాషణ ముడి వేసుకొని ఉంటుందని మరచి పోకూడదు.

ఈ దశలో నాటక ప్రదర్శన ఒక రూపం ధరిస్తుంది. ఈ రూపానికి, ప్రయోక్త ఊహించిన రూపానికి సారూప్యత ఉన్నదీ లేనిదీ గ్రహించి తగు మార్పులు చేసుకోవాలి. చివరకు ప్రయోక్త నటీ నటులు చెప్పవలసినదంతా చెప్పిన తరువాత రోజు సాధన చేయించాలి.

మూడవ దశ : ఈ మూడవ దశ నిర్ణాయక దశ. ఈ దశలో కదలికలను, ఉద్వేగ స్వభావాలను నిర్ణయం చేయాలి. నటీ నటుల అభినయానికి మెరుగులు దిద్దాలి. రసవిహీనంగా ఉన్న రంగాలను రసవంతం కావడానికి ప్రత్యేక కృషి చేయాలి. రంగస్థల ఏర్పాట్లు, రంగోద్దీపన మొదలైన వాటి విషయంలో తుదినిర్ణయాలు తీసుకోవాలి. ఏ వస్తువును ఎలా ఉపయోగించాలో తెలిపి వాటితో సాధన చేయించాలి.

నాలుగవ దశ: ఇలా నటనలో, ప్రయోగంలోని వివిధ శాఖలలో నిర్దుష్టత సాధించామనే ధైర్యం వచ్చిన తరువాత దుస్తులు మొదలైన వాటితో ఆఖరిసారిగా సాధన చేయాలి. దీనినే 'డ్రెస్ రిహోర్సలు' అంటారు. నటీ నటులు కోటా వేసుకోవాలి. వారి వారి పాత్రల కనుగుణమైన దుస్తులు ధరించాలి, సెట్టు వేసుకోవాలి. రంగం మీద ఉంచవలసిన కుర్చీలు మొదలైన సామాగ్రి ఆయా స్థానాలలో పెట్టాలి. అలాగే పరికరాలు, లైట్లు మొదలైన వాటిలో నిజ నాటక ప్రదర్శన లాగానే ప్రదర్శన ఇవ్వాలి. అయితే ప్రేక్షకులు ఉండరనే సంకోచం లేకుండా ప్రదర్శనం ఇవ్వాలి. సహృదయులను, విమర్శకులను ఆహ్వానించి, వారి అభిప్రాయాలను తెలుసుకొని, వాటిని సాధ్యమైనంత వరకు ఆచరణలో పెట్టడానికి యత్నించాలి. అలాగే ప్రయోక్త తానూహించిన విధంగా ప్రదర్శన రూపొందుతున్నదో లేదో పరీక్షగా చూసుకొని పర్యాలోకన చేసుకొని తగు చర్య తీసుకోవాలి. దీనితో నాటక ప్రదర్శనకు రంగం సిద్ధమవుతుంది.

అయితే, ప్రయోక్త తాను ప్రయోక్తగా వ్యవహరించే నాటకాలలో పాత్ర ధరించ కూడదు. నటీ నటులను ప్రోత్సహించాలే గాని నిరుత్సాహ పరచకూడదు. తనలోని విసుగును, అసంతృప్తిని పైకి వెల్లడించకూడదు. సాధన సమయంలో క్రమశిక్షణను కచ్చితంగా పాటించాలి. నటీనటులకు తానిచ్చే శిక్షణ సహేతుకంగా నిరూపిస్తూ చెప్పాలే గాని నిర్బంధంగా రుద్దకూడదు. నియంతగా వ్యవహరించకూడదు. నటీనటులలో అణగి ఉన్న ప్రతిభను పైకి లాగడానికి యత్నించాలి.

ప్రయోక్త ప్రేక్షకాగారంలో కూర్చుండి వివిధ దూరాల నుంచి ప్రయోగాన్ని వీక్షించి ఫలితాలను సరిచూసుకోవాలి. దృశ్యానికి దృశ్యానికి పరిణామం సాఫీగా నడుస్తున్నదీ లేనిదీ పరీక్షించుకోవాలి. నటనలో, ప్రయోగంలో కృత్రిమత్వం ఉంటే దానిని మరుగుపరచాలి. ప్రదర్శన ప్రేక్షకులలో సానుభూతిని, ఉత్సుకతను కలిగించేటట్టు చూసుకోవాలి. అనవసరమైన వివరాలను తగ్గించి ప్రదర్శన విసుగు కలిగించకుండా చకచకా సాగేట్టు చూడాలి. నాటక ప్రదర్శనోద్దేశం వ్యక్తమయేటట్లు చేయాలి. సంభాషణలకు, రంగవ్యాపారానికి పొందిక ఉండేటట్టు చూసుకోవాలి.

సంభాషణలు ప్రేక్షకులకు అర్థపూరితంగా వినిపించేటట్లు జాగ్రత్తపడాలి. ప్రేక్షకులకు నటీనటులు చక్కగా కనిపించే లాగా కదలికలు, సమ్మేళనం తీర్చి దిద్దాలి. అభినయావరణను పూర్తిగా వినియోగపడేటట్టు ప్రయోగ విధానం ఏర్పరచుకోవాలి. ఉద్వేగ ప్రకటనలో నటీనటులు కొట్టుకుపోకుండా అరికట్టాలి. ప్రేక్షకులున్నారనే జ్ఞానం పోగొట్టి, ప్రేక్షకుల కోసం నటించే మనస్తత్వం రాకుండా చూడాలి. నాటక గమనం సన్నగిల్లకుండా జాగ్రత్తపడాలి. ప్రేక్షకుల చప్పట్లకు పొంగిపోయి పెదవి విరుపులకు నిరుత్సాహపడే మనస్తత్వం నటీనటులలో పోగొట్టాలి. సమిష్టి ప్రయోగానికి ప్రాముఖ్య మీయకుండా వ్యక్తిత్వాన్ని స్థాపించుకొనే యత్నం సాగనీయకూడదు. ప్రేక్షకాభిరుచులను మనసులో ఉంచుకోవాలే కాని వాటిని అనుసరించి నటించకూడదు. అన్నింటి కంటె ముఖ్యం వేళకు సరిగా రిహోర్సల్సుకు రావడం. గైరుహాజరు కాకుండా ఉండడం. నటన, ప్రదర్శనను ఏదో తమాషాగా తీసుకోకుండా సీరియస్‌గా తీసుకొనేటట్టు చేయాలి. నటులిచ్చే సూచనలను స్వీకరించి వాటి గురించి ఆలోచించి, వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి. నటీ నటులు పాత్ర పోషణలో దృష్టినంతా నిగిడించాలి. పక్క పాత్రల నటనను మనసులో సమీక్షించుకుంటూ తన మనఃస్థితిని చెడగొట్టుకోకూడదు. ప్రదర్శన

సాఫీగా నడుస్తుందనే తృప్తి, ధైర్యం కలిగేటంతవరకు విసుగులేకుండా సాధన చేస్తూనే ఉండాలి.

సైనికుల్లాగానే నటుడికి క్రమశిక్షణ అవసరమనే విషయం నటులంతా జ్ఞప్తిలో ఉంచుకోవాలి. ప్రదర్శన సమయంలో బాగా చేస్తాననే ధీమాతో సాధన సరిగా చేయకుండా బద్ధకించకూడదు. ఇలాసాధన చేస్తే నాటక ప్రదర్శన విజయవంతమయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

శ్రీ.చ.

సామ్యవాద వాస్తవికత : సోవియట్ యూనియన్‌లో ఆవిర్భవించి ప్రవర్థమానమవుతున్న కళావాదం. చప్పగా, ఆచార బద్ధంగా నడుస్తున్న నాటక ప్రదర్శనల మీద తిరుగుబాటుగా ఈ వాదం బయలుదేరింది. దీనికి ప్రవక్తలు లెనిన్, గోర్కీలు. ఈ వాదం ప్రబలడంతో ప్రపంచ నాటక కళాకారుల దృక్పథమే మారిపోయింది. ఈ వాదం మూలంగా ప్రపంచంలో సామాన్య మానవునికి కళలో ముఖ్యంగా నాటకంలో నాయకత్వం లభించింది.

జీవితసత్యంలో విశ్వాసం, సామ్యవాద సిద్ధాంతంలో శ్రద్ధాసక్తులు, ప్రజాసేవ, చారిత్రక ఆశావాదం, కార్మిక పోరాటాలతో సన్నిహితత్వం, సోషలిస్టు మానవత, విశ్వజనీనత, సామ్యవాద వాస్తవికత ఈ వాదం ప్రధాన లక్షణాలు.

శ్రీ.చ.

సాళ్వాచారి, మంతోజు (జ.1951) : ప్రసిద్ధ రంగస్థల నటుడు. ఈయన 1951, జనవరి 9న జన్మించాడు. జడ్చర్ల ప్రభుత్వ కళాశాలలో బి.యస్సీ., చదివాడు. విద్యార్థి దశ నుంచీ నాటకాలపై మక్కువ ఎక్కువ. విద్యార్థిగా ఉన్నప్పుడు సాంఘిక నాటకాల్లో వేషాలు వేస్తూ నటనానుభవం గడించాడు. పుట్టుకతో వచ్చిన మధుర కంఠం పౌరాణిక నాటకాల వైపు నడిపించింది. ఏ నాటకంలో ఏ చిన్న పాత్ర ధరించినా, ఆ ప్రదర్శనకు సాళ్వాచారి గళం వన్నె తెచ్చేది. ప్రతి పద్యానికి 'వన్స్‌మోర్'లు అతనిని వెంటాడేవి. సాళ్వాచారి ఉన్నాడంటే ఆ నాటకం బాగుంటుందనే విశ్వాసం ప్రేక్షకుల్లో తిష్ట వేసుకొంది. ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.లో ఉద్యోగం చేస్తూనే వీలు కల్పించుకొని పౌరాణిక నాటకాల్లో ప్రధాన పాత్రలు ధరించటం సాళ్వాచారి ప్రవృత్తిగా మారింది. గత మూడు దశాబ్దాలుగా సుమారు 500 ప్రదర్శనల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాడు.

పాండవోద్యోగంలో దుర్యోధనుడు, భీముడు, కర్ణుడు, పార్వతీ కళ్యాణంలో శంకరుడు, యముడు, మహాకవి కాళిదాసులో భోజుడు, సీతారామ కళ్యాణంలో రావణాసురుడు, తులసీ జలంధరలో దేవేంద్రుడు, రామాంజనేయ యుద్ధంలో రాముడు, యయాతి, ద్రౌపదీ వస్త్రాపహరణంలో దుర్యోధనుడు, భీముడు, స్వామివివేకానందలో వివేకానందుడు, బబ్బిలి యుద్ధంలో తాండ్రపాపారాయుడు మొదలైన పాత్రలలో నటించాడు.

ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా కలకత్తా, బెంగుళూరు, ముంబై, ఢిల్లీ, హరిద్వార్ తదితర నగరాలలో కూడా పద్య నాటకాలలో పాల్గని తెలుగు కీర్తిబావుటాను ఎగురవేశాడు. 1989లో విజయవాడలో పాండవోద్యోగంలో శ్రీకృష్ణుడుగా ఉత్తమ నటనకు అవార్డు లభించింది. రాజమండ్రి, నెల్లూరు, హైదరాబాద్, గుంటూరు నగరాల్లో మయసభలో దుర్యోధనుని పాత్ర పోషణకు ప్రథమ బహుమతి అందుకొన్నాడు. 2000 సంవత్సరంలో కాళిదాసు నాటకానికి నంది నాటకోత్సవాలలో ఉత్తమ ప్రదర్శనకు అవార్డు, 2002లో దావీదు విజయంలో గోలియత్ పాత్ర పోషణకు ఉత్తమ ప్రతినాయకుడుగా నంది అవార్డు లభించాయి. సాళ్వాచారిని ఆంధ్రప్రదేశ్‌లో అనేక నాటక సంస్థలు ఘనంగా సత్కరించి తమఅభిమానాన్ని చాటుకొన్నాయి.

గం.సు.రె.

సావిత్రి, గూడూరు (జ.1943) : ప్రముఖ రంగస్థల నటి. పౌరాణిక, సాంఘిక నాటకాలలో నాలుగు దశాబ్దాలకు పైగా ముఖ్య పాత్రలలో నటిస్తూ కళాప్రపంచంలో వినుతికెక్కిన నటీమణి. నెల్లూరు జిల్లా గూడూరులో స్థిరనివాసం ఏర్పరచుకొన్న కారణంగా సావిత్రికి గూడూరు ఇంటిపేరుగా నిలిచిపోయింది. సురభి సమాజంలో పుట్టి పెరిగి ఆ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొన్న నటి. ఈమె 1950లో నాటకరంగంలోకి అడుగుపెట్టింది. మొదట్లో సాంఘిక నాటకాలలో నటించేది. గూడూరు ఆంధ్రాభ్యుదయ నాట్యమండలి ప్రదర్శించిన ఎదురీత, పల్లెపడుచు, కమల, పునర్జన్మ నాటకాలలోను, జయరాం స్మారక కళాసమితి ప్రదర్శించిన రాజీవం వంటి నాటికలలోను ప్రధాన పాత్రలలో నటించి బహుమతులు గెలుచుకొని, ఆ సంస్థల ఖ్యాతిని ఇనుమడింప చేసింది. 1960 నుంచి సంప్రదాయ నాటకాలకే పరిమితమయ్యింది. చక్కని రూపం, మంత్రముగ్ధుల్ని చేయగల నటనా ప్రావీణ్యం ఆమెను మొదటి శ్రేణి నటీమణిగా తీర్చిదిద్దాయి. కడప సవేరా ఆర్ట్సు ప్రదర్శించిన శ్రీరామ పాదుకలు, పాండవ వనవాసం వంటి పౌరాణిక నాటకాలలో అద్భుతమైన పాత్ర పోషణతో ఆ నాటకాలకు ప్రాణ ప్రతిష్ఠ

చేసింది. శూర్పణఖ పాత్రను నభూతో నభవిష్యతిగా పోషించి సామాజికుల ప్రశంసాపరంపరలను అందుకున్న నటి. నంది నాటకోత్సవాలలో ఉత్తమ నటి బహుమతి అందుకుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం అందుకొన్న ఉత్తమ కళాకారిణి. సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, చింతామణిమున్నగు నాటకాలలో ఆమె పాత్రధారణ ప్రేక్షకుల స్మృతిపథంలో మరపురాని అనుభూతిని మిగిలించిందనడం అతిశయోక్తి కాదు. వందల కొద్దీ నాటకాలు వేసినా, ఇంకా ఏదో నేర్చుకోవాలనే తపన ఈ నటీమణిలో ఉండటం ఆమె కళాభిజ్ఞతను, వినయశీలాన్ని ప్రస్ఫుటం చేస్తుంది.

గం.సు.రె.

సాహిత్య దర్పణం : సంస్కృత నాటకాలంకార గ్రంథం. రచయిత విశ్వనాథ కవిరాజు. వాక్యం రసాత్మకం కావ్యం అనే సూత్రం ఈ గ్రంథం లోనిదే. ఈ గ్రంథాన్ని ప్రామాణిక లక్షణగ్రంథంగా పరిగణిస్తున్నారు. ఇందులో అల్లావుద్దీన్ ఖిల్జీ ప్రసక్తి ఉంది. ఇది పది పరిచ్ఛేదాల గ్రంథం. వీటిలో షష్ఠమ పరిచ్ఛేదం నాటక పరిచ్ఛేదం.

ఇందులో వత్సల రసాన్ని పదవ రసంగా విశ్వనాథ కవిరాజు పరిగణిస్తూ అథమునీంద్ర సమ్మతో వత్సల రసః అన్నాడు. దీనిని వేదం వేంకట రాయ శాస్త్రి అనువదించి 1935లో ప్రచురించాడు.

శ్రీ.చ.

సింజ్, జాన్ మిల్లింగ్టన్ (1871–1909) : ఐరిష్ నాటకకర్త. సింజ్ కేవలం నాటకకర్తే కాదు, ఐరిష్ నాటకోద్యమనాయకులలో ప్రముఖుడు. ఈయన ఆరు నాటకాలు రచించాడు. ప్రపంచ మహా నాటకకర్తలలో ఒకడు. ఈయన నాటకాలు కవితా వైభవంతో అలరారుతూండడమే గాక ఐరిష్ జాతీయ జీవనాన్ని, స్వభావాన్ని ప్రతిబింబిస్తుంటాయి. నాటకీయత ఎక్కువ.



ఐరిష్ నాటకోద్యమ నాయకుడు ఈట్స్ ప్రోద్బలంతో నాటక రచన ఆరంభించాడు. అకాల మృత్యువాత పడకుండా ఉంటే ఇంకా ఎన్ని గొప్ప నాటకాలు రాసే వాడేమో అని విమర్శకుల అభిప్రాయం. ప్లేబాయ్ ఆఫ్ ది వెస్టరన్ వరల్డ్ ఆఖరి నాటకం. 'ఆబీ' నాటకశాలలో ప్రదర్శనకు నిరసనగా గందరగోళం జరిగింది. కాని తరువాత దీనికి మహానాటక గౌరవం రావడమే గాక పలు సార్లు ప్రదర్శితమైంది. సింజ్ భాష పాత్రోచితమై మెప్పుపొందింది.

షాడో ఆఫ్ ది గ్లెన్(1903), రైడర్స్ టు ది సి (1904), వెల్ ఆఫ్ ది సెయింట్స్ (1905), టింకర్స్ వెడ్డింగ్ (1907), ప్లేబాయ్ ఆఫ్ ది వెస్టరన్ వరల్డ్ (1907) మొదలైన నాటకాలు రాసిన సింజ్ 1909లో మరణించాడు.

శ్రీ.చ.

సి.ఎస్.ఆర్. కళామందిరం: ఈ సమాజాన్ని 1973, జులై 11న ప్రముఖ హాస్యనటుడు, రామవిలాస సభ(తెనాలి) సభ్యుడు వంగర వెంకట సుబ్బయ్య ప్రోత్సాహంతో హైదరాబాద్‌లో స్థాపించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యదేవర పురుషోత్తమ రావు. పద్య నాటకాలను విరివిగా ప్రదర్శించాలనే తపనతో ప్రారంభించిన ఈ సమాజం 1973 నుంచి అనేక నాటకాలను ప్రదర్శించింది, ప్రదర్శిస్తోంది. *సతీసావిత్రి, కర్ణ, కురుక్షేత్రం, గయోపాఖ్యానం, భక్త కాళిదాసు, భక్త తుకారాం, చింతామణి, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణకుచేల, శ్రీరామాంజనేయ యుద్ధం, శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం, రాధాకృష్ణ, పాదుకా పట్టాభిషేకం, వీరాభిమన్యు, బబ్బిలి యుద్ధం, కన్యాశుల్కం* నాటకాలను హైదరాబాదులోనే కాకుండా రాష్ట్రంలోను, రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించింది.

1981–84 మధ్యకాలంలో ప్రతి నెల రెండవ శనివారం నాటక ప్రదర్శన నిర్వహించింది. రాష్ట్రంలోని ప్రసిద్ధ నటులను, నాటకసమాజాలను ఆహ్వానించి ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. పీసపాటి నరసింహమూర్తి, బుర్రా సుబ్రహ్మణ్యా శాస్త్రి, బి.వి. రంగారావు, సూరపనేని వెంకటేశ్వర్లు, జి.ఎస్.ఎన్. శాస్త్రి వంటి ప్రసిద్ధులను సన్మానించింది. బంబాయిలో స్థిరపడిన తెలుగు ప్రజల కోరికమేరకు *పాండవోద్యోగం, చింతామణి, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ రాయబారం* నాటకాలను ప్రదర్శించింది. కొట్టె వెంకటాచార్యులు, అక్కిరాజు సుందర రామకృష్ణ, తంగిరాల వెంకట సుబ్బారావు, బి. నాగిరెడ్డి ఈ సమాజం సభ్యులే.

దాసరి, ఎస్.

సిద్దప్ప నాయుడు. జె (జ.1923) : రంగస్థల నటుడు, దర్శకుడు. ఈయన 1923, డిసెంబరు 7న చిత్తూరు జిల్లా మదనపల్లె సమీపంలోని బండమీదకమ్మపల్లెలో పుట్టాడు. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబీకులైన లక్ష్మమ్మ జోళెపాళం సుబ్బయ్య నాయుడులకు జన్మించాడు. సురభి సమాజం

ప్రదర్శించిన నాటకాలు చూసి, ప్రభావితుడై పిల్లలతో కలిసి భక్తరామదాసు నాటకం ప్రదర్శించాడు. ఈ నాటకంలో రామదాసుగా నటించాడు. ఆ తరువాత ప్రహ్లాదుడు గా నటించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. కళాశాలలో చదువుతున్న రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, జాతీయోద్యమంలో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గని 17సార్లు అరెస్టు అయ్యాడు.

చదువు పూర్తి చేసిన తర్వాత సిద్ధప్ప నాయుడు 1946లో ఉద్యోగంలో చేరి 1957 నుంచి సచివాలయ సాంస్కృతిక సంఘం తరపున పలు నాటిక, నాటకాలలో నటించి రాష్ట్రస్థాయి, అఖిల భారత స్థాయిలో అనేక సార్లు ఉత్తమనటుడు, దర్శకుడు అవార్డులు అందుకున్నాడు. ప్రతాపరుద్రీయం, అలెగ్జాండర్, వసంతసేన, ఖిల్జీరాజ్య పతనం, బబ్బిలి యుద్ధం, చాణక్య చంద్రగుప్త, నాయకురాలు, శాకుంతలం, శ్రీ కృష్ణ తులాభారం, వేమన, మాలపల్లి, తరంగాలు, గాలివాన, కప్పలు, లేపాక్షి డామిట్ కథ అడ్డం తిరిగింది మొదలైన నాటకాలకు దర్శకత్వం వహించడమే కాక ప్రధాన భూమికలు పోషించి ప్రశంస లందుకున్నాడు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పక్షాన జరిగిన నాటక పోటీలలో వరుసగా మూడుసార్లు జాతీయ ఉత్తమనటుడు అవార్డు పొందడం నాటక రంగ చరిత్రలో అరుదైన విషయం. దాదాపు 50 నాటకాలు, 30 నాటికలు ప్రదర్శించడమే కాకుండా 16 చలన చిత్రాలలో పలు టీ.వి నాటకాలలో నటించాడు. సాంస్కృతిక సంఘ సభ్యునిగా మలేషియా, హాంగ్‌కాంగ్, జపాన్ దేశాల్లో పర్యటించాడు. సంప్రదాయ, సాంఘిక నాటకాలలో విభిన్న పాత్రలను పోషించి పాతతరం వారిని, కొత్తతరంవారిని మెప్పించిన సిద్ధప్ప నాయుడును పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ కళానికేతన్, కళా సాగర్ వంటి సంస్థలు ఘనంగా సత్కరించాయి. నవరస నట బృందం నట ప్రసిద్ధ బిరుదునిచ్చింది. రంగస్థల కళల వికాసానికి కృషి చేసిన సిద్ధప్పనాయుడును ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2000 లో ఎన్.టి.రామారావు రంగస్థల పురస్కారంతో ఘనంగా సన్మానించింది.

దాసరి, ఎన్.

సిద్ధి : 1. నాటక లక్షణం, 2. నాటక విజయం.

నాటక లక్షణం - నాట్యశాస్త్ర అనుష్టుప్ వృత్త పాఠంలోనిది. ఉపజాతి వృత్త పాఠంలోని సిద్ధి, ప్రసిద్ధులతో సమన్వయం పొందింది.తలవని తలంపుగా అభీష్టార్థం సిద్ధించటమే సిద్ధి.

''తాను కోరిన అర్థము సిద్ధించుట కొరకు స్పృహనీయములును, అతర్కితోపలబ్ధములును అయిన ప్రయోజనాంతరములను కీర్తించుట సిద్ధి'' అని భరతముని నిర్వచనం. - నా.శా. అను: *పోణంగి అప్పారావు*, పుట *446.*

2. నాటక విజయం : నాటక ప్రదర్శనం విజయవంతమైంది, ఈ నాటకం రక్తి కట్టింది అని మనకు బాగానచ్చి, కదలించిన నాటక ప్రదర్శన గురించి అంటుంటాం. దీనినే లాక్షణికులు సిద్ధి అన్నారు. సిద్ధి అంటే సిద్ధించడం.

శ్రీ.చ.



సీతాపతి, గిడుగు (1885-1969) : ఈయన పూర్తిపేరు గిడుగు వేంకట సీతాపతి. గిడుగు పిడుగుగా ప్రసిద్ధిగాంచిన గిడుగు వేంకట రామమూర్తి వీరి తండ్రి. ఈయన వ్యావహారికాంధ్ర భాషకు చేసిన సేవ గొప్పది. తండ్రి బాటలోనే భాషోద్యోగం కొనసాగించాడు. వృత్తిరీత్యా చరిత్రోపన్యాసకుడైన వాఙ్మయ పరిశోధకుడు. పద ప్రయోగ పరిశీలన, లిపి పఠనం, నిఘంటు రచన, సవర భాషా పరిశోధన, నటన ఈయన అభిమానించే అంశాలు. సంస్కృతం, గ్రీకు, లాటిన్, ఇంగ్లీషు భాషల్లో పండితుడు.

సీతాపతి 1885 జనవరి 28న జన్మించాడు. విశాఖ జిల్లా భీముని పట్నం జన్మస్థలం. నివాసం పర్లాకిమిడి. నటనా వైదుష్యం గల నటుడు, ప్రయోక్త. రత్న పాంచాలి కను 1946లో సంస్కృతం నుంచి తెలిగించాడు. వీరరస ప్రధానమూ, విషాదాంతమూ అయిన ఈయన కట్టబమ్మన నాటకం 1964లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి పొందింది. భారతీ శతకము, కవితోదయ చంద్రిక (సంస్కృతం), సవర సాంగ్స్ (ఇంగ్లీషు), రాయల నీతి కథలు (1949), హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్ (ఇంగ్లీషు 1962), బైబిల్ (సవర భాషలో), సరస్వతీ విలాసము, షేక్స్పియర్ రచనలు (వచనం 1968) మొదలైనవి ఇతని రచనలు. భాషను గురించి ముప్పై వ్యాసాలు రచించాడు. తెలుగు భాషా సమితి విజ్ఞాన సర్వస్వం, సూర్యరాయాంధ్ర నిఘంటువుల పునర్ముద్రణలకు సంపాదకుడు. సవర జీవనమూ, ఆచారవ్యవహారాలపై అనేక వ్యాసాలు రాయడమే కాక ఇంగ్లీషులో సవర పాటలు రచించాడు. ఈ పాటలన్నీ మెచ్చి ఇంటర్నేషనల్ అకాడమీ (వాషింగ్టన్) సీతాపతికి డాక్టర్ ఆఫ్ లెటర్స్ ఇచ్చి గౌరవించింది. అలాగే క్షేత్రయ్య పదాలు అంతకు ముందు లేనివెన్నో సేకరించి సీతాపతి తన సంపాదకత్వంలో ప్రకటించాడు. డాక్టరేట్‌తో పాటు కళాప్రపూర్ణ బిరుదు కూడా పొందాడు.

పర్లాకిమిడిలో తన తొమ్మిదోయేట చూసిన పీష్వా నారాయణరావు హిందీ నాటకంతో నాటకాలపై, నటనపై కోరిక కలిగిందనీ, ఆ తరువాత 1896-97లో బాపట్ బలవంతరావు సర్కస్ ఆకర్షించిందనీ, తదనంతరం నాటకం వేయాలన్న ప్రగాఢమైన ఆకాంక్ష కలిగిందనీ సీతాపతి చెప్పుకున్నాడు. తాను, బుర్రా శేషగిరిరావు కలిసి చిన్న చిన్న నాటకాలు తయారు చేసి పండగపబ్బాల్లో ప్రదర్శించేవారట. *రాజశేఖరచరిత్ర*లోని సన్నివేశాలను ప్రదర్శించేవారట. చిత్తూరు రాణిపద్మిని, రాణీ సంయుక్త, కృష్ణకుమారి మొదలైన కథా సన్నివేశాలను బుర్రా శేషగిరిరావుతో కలిసి నాటికలుగా రాసుకొని నటించేవారట.

1903లో మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో బి.ఏ చదివే రోజుల్లో కళాశాల వార్షికోత్సవాలలో తన నటనా సామర్థ్యాన్ని ప్రకటించుచున్నాడు. అంతకుముందే 1898లో పర్లాకిమిడిలో గురజాడ వేంకట అప్పారావు రచించిన కన్యాశుల్కంలో వెంకటేశం పాత్రతో పెద్దల మెప్పు పొందాడు. 1908-1910లో పర్లాకిమిడి కాలేజి హైస్కూలులో చరిత్రాధ్యాపకులుగా పనిచేస్తున్న ఘంటం కృష్ణారావు దర్శకత్వంలో ప్రతాపరుద్రీయం నాటకంలో పేరిగాడు, యుగంధరుడు పాత్రలలో నటించి ప్రశంసలందుకున్నాడు.

సీతాపతి ప్రతిభా పాటవం, నటనా వైదుష్యం గమనించిన గూడవల్లి రామబ్రహ్మం 1939లో తన దర్శకత్వంలో రైతు బిడ్డ సినిమాలో బళ్లారి రాఘవతో పాటు సీతాపతికి జమీందారు పాత్రనిచ్చాడు. ఆ పాత్రలో మమేకమై ప్రేక్షకలోకం ప్రశంసలకు పాత్రుడయ్యాడు. మద్రాసులో రామదాసు నాటకంలో బళ్లారి రాఘవతో పాటు తానీషా పాత్ర ధరించాడు. రాఘవ ఈయన నటనా సామర్థ్యాన్ని ఎంతో మెచ్చుకున్నాడు.

బళ్లారి రాఘవతో సీతాపతి నాలుగైదు నాటకాల్లో నటించి నటనలోని మెళుకువలను నేర్చుకొని తదనంతరం రాణించాడు. బళ్లారి రాఘవతో నటించిన చివరి నాటకం పిఠాపురంరాజా రచించిన *తీరని కోరికలు*. 1939-41ల మధ్య ఏడెనిమిది నాటకాల్లో నటించి నటనా సామర్థ్యాన్ని ప్రదర్శించాడు.

అనేక భాషారీతుల్లో విశిష్టతను సాధించి, సాహితీవేత్తగా, వ్యావహారిక భాషావేత్తగా, పరిశోధకుడుగా, రంగస్థల, సినీనటుడుగా,అన్ని రంగాల్లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా జీవితం పండించుకొన్న సీతాపతి 1969, ఏప్రిల్ 19న మరణించాడు.

గంగప్ప

సీతారామయ్య, కారుమూరి (జ.1936) : నటుడు, దర్శకుడు. అభినయ కళ పట్ల చక్కని అవగాహన, ప్రదర్శన గుణదోషాలను శాస్త్రీయంగా విశ్లేషించే ప్రతిభ గల అతి కొద్దిమంది ప్రతిభావంతులలో కారుమూరి ఒకరు. ప్రకాశం జిల్లా పర్చూరుకు చెందిన వెంకయ్య, వెంకటమ్మ దంపతులకు 1936 ఏప్రిల్ 19న జన్మించాడు. పాఠశాల వార్షికోత్సవాల్లో ప్రదర్శించే నాటకాలతో స్ఫూర్తి పొంది తొలిసారిగా 1953లో వాపస్ లో నటించడం ద్వారా నాటకరంగ ప్రవేశంచేశాడు. చిన్నపాత్రే అయినా అది ప్రముఖ హరికథాభాగవతార్ సీతారామయ్య మనస్సును హత్తుకొన్నది. దాంతో ఆయన తనకు బహుమానంగా వచ్చిన వెండి కప్పును సీతారామయ్యకు బహూకరించాడు. అనుకోని ఈ గౌరవంతో కారుమూరి లోని అభినయ కాంక్ష మరింత పెరిగింది.

స్థానికంగా ఎస్ఎస్ఎల్సి పూర్తి చేసి చీరాలలో ఇంటర్ చదివాడు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ యువజన సంఘంలో క్రియాశీలక పాత్ర నిర్వహిస్తున్న సందర్భంలో ప్రజానాట్య మండలి కార్యక్రమాలు చూడటం తటస్థించింది. ఆ ప్రదర్శనల స్ఫూర్తితో పర్చూరులో 1954లో 'అభ్యుదయ నాటక సమితి' సమాజం స్థాపించాడు. పౌరాణిక నాటకాలకు బాగా అలవాటు పడిన పర్చూరు, పరిసర ప్రాంతాలకు చాలాకాలం తరువాత సాంఘిక నాటకాలను రుచి చూపించాడు. ఈయన సారథ్యంలోనే పర్చూరులో సాంఘిక నాటకోద్యమం ఉధృతంగా ప్రారంభమైంది. రెండు సంవత్సరాల కాలంలోనే దాదాపు 50 నాటకాలు ప్రదర్శించాడు. ప్రతి ప్రదర్శనను ప్రకటించిన సమయానికే ప్రారంభించి సమయపాలనకు పెద్దపీట వేసి సంచలనం సృష్టించిన కార్యనిర్వహణాదక్షుడు కారుమూరి.

అభ్యుదయ నాటిక సమితి తరపున ప్రదర్శించిన నాటకాలన్నింటికీ ఈయనే దర్శకత్వం వహించేవాడు. ఇక నటునిగా ఆ రోజుల్లో ఈయనకు పేరు తెచ్చిన పాత్రలలో పల్లెపడుచులో గోపి, అన్నాచెల్లెలులో సత్యం, ఎన్.జి.ఓ లో గోపి, బంగారు సంకెళ్ళు లో రాము, విధివశంలో రాము, పెళ్ళిచూపులు లో రాము ప్రధానమైనవి. అనంతరకాలంలో గరికపాటి రాజారావు ఆధ్వర్యంలో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ థియేటర్స్ ఫెడరేషన్‌కి తన సమితిని అనుబంధ సంస్థగా చేశాడు. అంతే కాక 1955లో గరికపాటి రాజారావు ఆధ్వర్యంలో జరిగిన రిపర్టరీకి హాజరై క్షుణ్ణంగా శిక్షణ పొందాడు. ఈ శిక్షణే కారుమూరి రంగస్థల జీవితం ఫలవంతంగా శోభించటానికి దోహదపడింది.

బాపట్లలో బి.ఏ. చదువుతున్న రోజుల్లో ప్రముఖ నాటక రచయిత, ప్రయోక్త కొర్రపాటి గంగాధరరావు నిర్వహించే కళావనిలో చేరాడు. తొలిసారిగ ఈ సంస్థ తరపున నిజరూపాలులో కనకం పాత్రలో నటించాడు. తెరలో

తెర నాటికలో సింగరాజు నాగభూషణం, కొట్టిపాటి గంగాధర రావుల సరసన నటించి తనలోని నటుడ్ని తీర్చిదిద్దుకున్నాడు.

1954 నుంచి కొల్లూరు రిజిస్ట్రారు ఆఫీసులో పనిచేసిన కారుమూరి 1964లో తెనాలి బదిలీ అయి ఎక్కువ కాలం జనతా ఆర్ట్ థియేటర్స్‌లో పని చేశాడు. ఆ కాలంలో ఈయన ప్రదర్శించిన *ధర్మకాటా, ఉలిపి కట్టె, భయం* మొదలైనవి అవార్డులు, ప్రేక్షకుల ప్రశంసలు సంపాదించి పెట్టాయి. 1967లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు ప్రత్యేకించి నిర్వహించిన లేపాక్షి నాటక పోటీలలో కొల్లూరు సమాజం తరఫున పొల్గని ఉత్తమ ప్రదర్శన, తాను పోషించిన పాత్రకు ఉత్తమనటుడు బహుమతులు లభించాయి.

నటుడిగా, దర్శకుడిగా, న్యాయ నిర్ణేతగా నాటక రంగానికి దాదాపు నాలుగు దశాబ్దాల పైబడి విశిష్ట సేవలు అందిస్తున్న కారుమూరిని చిలకలూరిపేట కళాకారులు 'నాటక కృషీవలుడు' బిరుదునిచ్చి సత్కరించారు.

మన్నెశ్రీ

సీతారామయ్య, కొంగర (1894-1978) : నటుడు, సంగీత విద్వాంసుడు. గుంటూరు జిల్లా తెనాలి తాలూకా మోరంపూడి గ్రామంలో 1894 మార్చి 3న కొంగర జగ్గయ్య, రత్తమ్మ దంపతులకు జన్మించాడు. పండిత వంశంలో పుట్టిన కొంగర నాట్య కళా సంస్కృతాంధ్ర భాషల్లో విశేష పాండిత్యం సంపాదించాడు. స్వయం సాధనతో నాట్యకళలో పరిపూర్ణ అభినయ పాటవాన్ని తన సొంతం చేసుకొన్న ప్రతిభా శాలి. కర్నాటక సంగీతంలో నిష్ణాతుడు. దాదాపు 116 రాగాలు అద్భుతంగా ఆలపించటంలో దిట్ట. హార్మోనియం, సితార, వయొలిన్ వంటి సంగీత వాద్యాల వినియోగంలో నిష్ణాతుడు.

నాటకం రసరంజకంగా, సర్వహంగులతో ప్రదర్శించేందుకు నాట్యశాల అవసరమని 1918-19లో దుగ్గిరాలలో శ్రీకృష్ణ సౌందర్యసభ పేరుతో నిర్మించాడు. ఈ నాట్యశాలలో తన కృష్ణ విలాస సభ సమాజంతో లంకాదహనం, చిత్రనళీయం వంటి నాటకాలు ప్రదర్శించాడు. తరువాతి కాలంలో సంభవించిన గాలివానకు ఆ నాట్యశాల కూలిపోవటంతో అన్ని హంగులతో తిరిగి అదే పేరుతో తెనాలిలో ఓ శాశ్వత నాట్యశాల నిర్మించాడు. సురభి, ధార్వాడ, మైలవరం కంపెనీల తరువాత సర్వహంగులతో, అత్యున్నత సాంకేతిక విలువలతో నాటకాలను ప్రదర్శింపచేసిన ఘనత సీతారామయ్యకే దక్కుతుంది. విజయవాడలోని కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు నిర్మించిన దుర్గాకళామందిర్ తరువాత బాల్కనీతో నిర్మింపబడ్డ రెండోనాట్యశాల సీతారామయ్యదే. నాట్యశాల ప్రారంభ ప్రదర్శనగా డి.వి. సుబ్బారావు (బందరు) సమాజం శకుంతల నాటకాన్ని ప్రదర్శింప చేయటం జరిగింది. బళ్ళారి రాఘవ తన రామదాసు నాటక ప్రదర్శనను గుంటూరు జిల్లాలో మొదటిసారిగా ఈ వేదిక మీదనే ప్రదర్శించటం మరోవిశేషం. ఈ విధంగా రాష్ట్రంలో పేరెన్నికగన్న సమాజాలు ఈ నాట్యశాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేయటమే కాక, తన సమాజం పేరును సీతారామ విలాస సభగా మార్చి నాటి మేటి కళాకారులకు నెలసరి జీతాలిచ్చి పోషిస్తూ, శ్రీకృష్ణ తులాభారం, సత్యహరిశ్చంద్ర మొదలైన నాటకాలలో కథా నాయకుని పాత్రలో నటించాడు. పర్వతనేని వీరయ్య చౌదరి, పెద్దిభట్ల చలపతిరావు, రాళ్ళబండి కుటుంబరావు, శివరామ కృష్ణయ్య, స్థానం నరసింహారావు, ముదిగొండ లింగమూర్తి, గోవిందరాజుల సుబ్బారావు, పువ్వుల సూరిబాబు, కొచ్చర్లకోట వంటి మేటి నటులు సీతారామ విలాససభలో తమ నటనావైదుష్యానికి మెరుగులు దిద్దుకున్నవారే. ప్రసిద్ధ రంగస్థల చలన చిత్ర నటుడు, సాహితీవేత్త కొంగర జగ్గయ్య ఈయన కుమారుడే.

మలికాలంలో ఆర్థికపరమైన ఇబ్బందులకు వెరవక, మొక్కవోని ఆత్మవిశ్వాసంతో చెరగని చిరునవ్వుతో నాటకరంగాన్ని వీడని స్థితప్రజ్ఞుడు. సీతారామయ్య! నాట్యకళావికాసానికి జీవితాంతం ఆదర్శవంతమైన సేవలందించిన సీతారామయ్య 1978లో శ్రీరామనవమి పర్వదినాన నటరాజులో ఐక్యమైనాడు.

మన్నెశ్రీ.

సీతారామశాస్త్రి, ధూళిపాళ (1921-2007): రంగస్థల, చలన చిత్ర నటుడు. గుంటూరు జిల్లా. పల్నాడు తాలూకా, దాచేపల్లి గ్రామంలో ధూళిపాళ శంకరయ్య, రత్నమ్మ దంపతులకు రెండవ సంతానంగా సీతారామశాస్త్ర 1921 సెప్టెంబర్ 24న జన్మించాడు. దాచేపల్లిలో ప్రాథమిక మాధ్యమిక పాఠశాల వరకే ఉన్నందువల్ల 8వ తరగతితోనే ధూళిపాళ చదువు ఆగిపోయింది. పట్టణాలకు పంపించి చదివించే స్తోమత లేక తండ్రి సీతారామ శాస్త్రిని బాపట్ల వేదపాఠశాలలో చేర్పించారు. వేదాధ్యయనం వారి వంశాచారం కూడా. తండ్రి వ్యవసాయ వృత్తిలో స్థిరపడి, కష్ట జీవనం, ధర్మజీవనం సాగిస్తూ వచ్చారు.

సీతారామశాస్త్రి 1935లో వేదపాఠశాలలో విద్య, సంస్కృత భాషపై అభిమానాన్ని పెంచింది. తదనంతర కాలంలో నాటకాల్లో నటించేటప్పుడు, సంస్కృత పద భూయిష్టంగా ఉండే

తెలుగు పద్యాలను అర్థం చేసుకొని, భావస్ఫోరకంగా పద్యాలు అనడానికి దోహదం చేసింది ఆ సంస్కృత అధ్యయనం. దాచేపల్లి గ్రామంలో వీధి భాగవతాలు, తోలుబొమ్మలాటలు మొదలైన జానపద కళారూపాల ప్రదర్శనలు విరివిగా జరిగేవి. ఆనాటి జానపద కళాప్రదర్శనలే ధూళిపాళలో అంతర్లీనంగా ప్రవహించే అభినయాంశకు పదునుపెట్టి బయటకు తెచ్చాయి. రంగస్థలంపై తాను కూడా నటించాలన్న కోర్కెకు బలాన్నిచ్చి ప్రేరణ కలిగించాయి. ఏదో ఉద్యోగం చేస్తూ తన లక్ష్యాన్ని సాధించుకోవాలని నిశ్చయించుకొని గురజాలలో ఓ వకీలు దగ్గర గుమాస్తాగా చేరాడు. అయితే అది జీతం బత్తెం లేని ఉద్యోగం. అక్కడి పని రుచించక గుంటూరులో ఒక న్యాయవాది వద్ద గుమాస్తాగా చేరాడు. న్యాయవాది వెంట కట్టలు పట్టుకుని కోర్టుకు పోవడం, మళ్ళీ రావడం మినహా తాను నేర్చుకున్న పని శూన్యం. ఇక్కడ కూడా నిరాశ ఎదురైంది.

గుంటూరులో నాటకాల్లో నటించడానికి అనుకూల వాతావరణం కనిపించింది. అప్పట్లో గుంటూరు వకీలు గుమాస్తాల నాటక సంస్థ ఆధ్వర్యంలో తరచూ నాటక ప్రదర్శనలు జరుగుతుండేవి. ఆ సంస్థలో బండారు రామస్వామి, కుర్చేటి నాగేశ్వరరావు మొదలైన వారు మంచి నటులుగా ఖ్యాతినార్జించారు. ఆ సంస్థ తరఫున 1935లో గుంటూరు ప్రక్కన శిరంగిపాలెం అనే గ్రామంలో 'శ్రీకృష్ణతులాభారం' నాటకం ఏర్పాటు చేశారు. ఆ నాటకంలో సత్యభామ దాసి నళిని పాత్రలో ధూళిపాళ నటించాడు. ఆ పాత్రలో ధూళిపాళ చక్కగా రాణించాడు. ఇదే నాటకం మరొక ఊళ్ళో ప్రదర్శించినపుడు ధూళిపాళ రుక్మిణి వేషంలో నటించాడు. శ్రుతిలయలు లేకుండా రుక్మిణి పాడిన పాట అవహేళనకు గురి అయింది. అయినా ధూళిపాళ నిరాశపడలేదు. ఆ తర్వాత 'భక్తతుకారం', 'పతిత పావన' నాటకాల్లో అప్రధానమైన స్త్రీ పాత్రలు ధరించడం జరిగింది. అలా చిన్న చిన్న ఆడవేషాలతో దాదాపు మూడు సంవత్సరాలు గడిచాయి. వచ్చిన ఆదాయమూ లేదు. పేరూ లేదు.

1938లో రేపల్లెలో 'బొబ్బిలి' నాటకంలో మల్లమాంబ వేషానికి ఒక కంట్రాక్టరు ధూళిపాళను ఆహ్వానించాడు. ఇక్కడ కూడా పాట సరిగా పాడలేక అపహాస్యం పాలయ్యాడు. ఇకమీదట నాటకాల జోలికి వెళ్ళకూడదని దృఢనిశ్చయం చేసుకున్నాడు. కాని, మాధవపెద్ది వెంకట్రామయ్య ధూళిపాళను పిలిచి నిరాశపడవద్దని ధైర్యం చెప్పాడు. అంతేకాదు "అబ్బాయ్! నీలో మంచి స్పార్క్ ఉంది. ఒకనాటికి నువ్వు గొప్ప నటుడుగా రాణిస్తావు... నువ్విక స్త్రీ పాత్రలకు స్వస్తి చెప్పి పురుష పాత్రలు చేపట్టు" అని సలహా ఇచ్చాడు. అప్పటి నుండి ధూళిపాళ మాధవపెద్ది ఏకలవ్య శిష్యుడయ్యాడు. 1940 నుంచి 1960 వరకు రెండు దశాబ్దాలపాటు వందలాది ప్రదర్శనల్లో వివిధ పాత్రలలో నటించాడు. శ్రీకృష్ణరాయబారంలో దుర్యోధనుడు, గయోపాఖ్యానంలో గయుడు, మైరావణలో మైరావణుడు, పల్నాటియుద్ధంలో బ్రహ్మనాయుడు, చింతామణిలో బిల్వమంగళుడు, భవానీశంకరుడు, బొబ్బిలియుద్ధంలో రంగారాయుడు, సత్యహరిశ్చంద్రలో విశ్వామిత్రుడు, రోషనారలో రామసింహుడు, విప్రనారాయణలో విప్రనారాయణుడు, నర్తనశాలలో కీచకుడు - ఇలా ఎన్నో పాత్రలకు రంగస్థలం మీద జీవం పోసి పేరు ప్రఖ్యాతులు గడించారు. 1949లో అఖిలాంధ్ర పాండవోద్యోగ నాటక పోటీలలో సుయోధన పాత్రకు ప్రథమ బహుమతిగా సువర్ణ నటరాజ విగ్రహం లభించింది. గుంటూరులో స్టార్ థియేటర్ స్థాపించి ఆ సంస్థ పక్షాన ఎన్నో నాటకాలను స్వంత ట్రూపుతో నటించడం జరిగింది.

1960 సంవత్సరం ధూళిపాళ జీవితాన్ని మరోమలుపు తిప్పింది. మద్రాసులో 'రోషనార' నాటకంలో రామసింహుడు పాత్ర అద్భుతంగా పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందాడు. ఆ ప్రదర్శన చూసి సినిమా దర్శకుడు, నిర్మాత బి. ఎ. సుబ్బారావు ధూళిపాళను తాను తీస్తున్న 'భీష్మ' చిత్రంలో దుర్యోధన పాత్రకు ఎంపిక చేసుకున్నాడు. ఆ చిత్రం దిగ్విజయంగా నడవడంతో ధూళిపాళ స్థానం చిత్రసీమలో స్థిరంగా నిలబడిపోయింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. సుమారు 300 చలన చిత్రాలలో రెండు దశాబ్దాల పాటు పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక చిత్రాలలో నటించి పేరు తెచ్చుకున్నారు. ఎన్.టి. ఆర్. నిర్మించిన 'శ్రీకృష్ణపాండవీయం'లో శకుని పాత్ర ధూళిపాళను వరించింది. శకుని పాత్రను ప్రతిభావంతంగా పోషించి శకునిమామగా ప్రేక్షక హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు.

1980లో ధూళిపాళ దృష్టి ఆధ్యాత్మిక చింతనలో పడింది. సినిమా రంగానికి వీడ్కోలు పలికి గుంటూరుకు మకాం మార్చాడు. అప్పటి నుంచి యతిగా ఆధ్యాత్మిక జీవనం సాగించిన ధూళిపాళ సీతారామశాస్త్రి 2007 ఏప్రిల్ 13న గుంటూరులో కన్నుమూశారు.

గం.సు.రె.

సీతారామారావు, ద్రోణంరాజు: నాటకకర్త, కవి, పండితుడు,ఆదర్శోపాధ్యాయుడు, తిరుపతివేంకటకవుల శిష్యుడు. బందరు నాటక సమాజాల కోసం, రాజమండ్రి గున్నేశ్వరరావు నాటకసమాజం కోసం చాలా నాటకాలు రాశాడు. గురువులయిన తిరుపతివేంకటకవులు భారత కథను నాటకాలుగా రాసినట్టే రామాయణకథను అయిదు నాటకాలుగా రాశాడు.

సుశీల (1910), అభినవ రాఘవం (1911), ఉషాపరిణయం (1911), హస్తినా పురం (1911), చతుర చంద్రహాసం (1912), జయంత జయపాలం (1912), సిరియాళ నాటకం (బుద్ధివంతీ విలాసము), పీష్వా నారాయణరావు వధ (1912), విజయ బబ్బిలి (1912), పాండవాజ్ఞాతవాసం (1913), వీర బ్రహ్మయోగి, సతీ సాహసం (1913), గయోపాఖ్యానం (1913), సారంగధర (1914), సంపూర్ణ రామాయణం, శ్రీరామ జననం, శ్రీరామ ప్రవాసం (1914), ప్రసన్న యాదవము/నరకాసుర సంహారము (1914), శ్రీరామ పాదుక, శ్రీరామోద్యోగము, శ్రీరామ విజయం, శ్రీరామాశ్వమేధం, హనుమద్రామ సంగ్రామం (1915), సతీ తులసి, కనక తార, పలనాటి వీరచరిత్రం (1915), ద్రౌపదీ పరిణయం (1916), శ్రీనివాస కల్యాణం (1916), సామ్రాజ్యోదయం (1916), గరుడ గర్వ భంగం (1917), లంకాదహనం (1917), శ్రీకృష్ణతులాభారం, కృష్ణ లీలలు (1917), రుక్మిణీ పరిణయం (1918), రసపుత్ర విజయం (విమల) (1918), ప్రమీలార్జునీయం (1921), శతకంఠ రామాయణం/సీతావిజయం (1926), పురూరవ (1927) మొదలైన నాటకాలను, కలికాల చర్య (1921), కాశీకావిడి (1921), పడుచు పెండ్లాం – ముసలి మగడు (1921), నాటకపు ఫార్సులు (1936) వంటి ప్రహసనాలను రచించిన కళారాధకుడు ద్రోణంరాజు సీతారామారావు.

శ్రీ.చ

సీతారామశాస్త్రి, వేమూరి (జ.1921) : ప్రసిద్ధ నటుడు. సాంబయ్య, కౌసల్యమ్మ దంపతులకు గుంటూరుజిల్లా, తెనాలి తాలుకా, దంతలూరు గ్రామంలో సీతారామశాస్త్రి 1921, మే 25న జన్మించాడు. పాఠశాలలు తక్కువగా ఉన్న ఆ రోజుల్లో సామాన్య కుటుంబీకులకు ఉన్నత విద్య గగనకుసుమం. కనుక దగ్గరలో ఉన్న పాఠశాలలోనే ప్రాథమిక విద్య అభ్యసించడంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఆ తరువాతి కాలంలో స్వయంశక్తితో నేర్చుకున్న చదువుకి మరింత మెరుగు పెట్టుకున్నాడు. స్పష్టమైన వాచికం, తియ్యని గాత్రం పుట్టుకతో అబ్బిన అభినయ కౌశలం శాస్త్రిని నాటకరంగం వైపు మళ్లించింది. విజయవాడలో బళ్లారి రాఘవ చంద్రగుప్త నాటక ప్రదర్శనలో రాఘవ నటనావైదుష్యాన్ని కళ్లారా చూసిన శాస్త్రికి తాను కూడా నాటకాల్లో నటించి తన ప్రతిభను చూపాలన్న దృఢసంకల్పం కలిగింది. తెనాలిలో నాటకోపాధ్యాయుడైన శనగవరపు శ్రీరామమూర్తిని ఆశ్రయించి, ఆయన వద్ద శిక్షణపొంది, ఆత్మవిశ్వాసం పెంచుకున్నాడు. పులిపాక వెంకటప్పయ్య సహాయంతో తొలిసారిగా అశ్వత్థామ పాత్రతో రంగస్థల ప్రవేశం చేశాడు. ఆ ప్రదర్శన చూసిన కళాభిమానులు శాస్త్రిని ఎంతగానో ప్రశంసించి, భుజం తట్టి ప్రోత్సహించారు. పాండవోద్యోగంలో అర్జునుడుగా, దుర్యోధనుడుగా చాలా నాటకాల్లో పాల్గన్నాడు. అనతికాలంలోనే తెనాలి నాటకరంగంలో అగ్రశ్రేణి నటుడిగా పేరు తెచ్చుకున్నాడు. నాటకాల్లో పాత్ర ధరించడమే కాకుండా, క్రమంగా కాంట్రాక్టు నాటకాలను ప్రదర్శించే స్థాయికి ఎదిగాడు. సీతారామశాస్త్రికి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు వచ్చింది. నటునిగా తాను ఎదగడమే కాకుండా ఎ.వి. సుబ్బారావు వంటి ఎందరో నటుల్ని వెలుగులోకి తెచ్చిన ఘనత ఈయనకే చెందుతుంది. 1970 ప్రాంతంలో పెద్దకుమారుని ఆకస్మిక మరణం శాస్త్రిని కలచివేసింది. తెనాలిలో ఉండలేక అదే సంవత్సరం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. ఒక టైపు ఇన్‌స్టిట్యూట్‌ని నడుపుతూ మళ్ళీ తన నాటకరంగ కార్యక్రమాలు కొనసాగించాడు. అయ్యదేవర పురుషోత్తమరావు సారథ్యంలో నడుస్తున్న సి.ఎస్.ఆర్. కళామందిరంలో సభ్యుడుగా చేరి పద్య నాటకాలలో విరివిగా పాల్గన్నాడు. దుర్యోధనుడుగా, యయాతిగా, గయుడుగా, భవానీశంకరుడుగా, హరిశ్చంద్రుడుగా అనేక నాటక ప్రదర్శనల్లో పాల్గన్నాడు. ఆ ప్రసిద్ధ పాత్రల విశిష్టతను ఇనుమడింపజేయడంలో సఫలీకృతుడయ్యాడు. నటుడుగా, దర్శకుడుగా, నటశిక్షకుడుగా ఎన్నో మైలురాళ్ళు దాటుకొంటూ వచ్చిన సీతారామశాస్త్రి ఎనభై ఏళ్లు పైబడ్డ ఈ వయసులో కూడా నాటకరంగంతో అనుబంధాన్ని వదలుకోకుండా ఔత్సాహిక నటులకు విలువైన సూచనలను, సలహాలను అందిస్తూ, నాటక కళా వికాసానికి తనవంతు సేవ చేస్తూ తృప్తి చెందుతున్నాడు.

డి.వి.పా.

సీమీ (1363–1444) : జపాన్ దేశపు నటుడు. సిద్ధాంత వేత్త. దర్శకుడు, నాటక కర్త, స్టేజి మేనేజరు, సంగీత దర్శకుడు, స్వరకర్త. ఈయన 'నో' అనే నృత్య రూపకాలలో ఎక్కువగా నటిస్తూండేవాడు. ఇతని కుమారుడు మోటోయోషికోసం నటన మీద పదహారు పుస్తకాలు రచించాడు. ఇవి చాలా కాలం

నామావశిష్టంగా ఉండి, 1908లో వెలుగులోకి వచ్చాయి. ప్రేక్షకుల ముందు నటించి మెప్పుపొందిన వాడే ఉత్తమ నటుడని సిమీ అభిప్రాయం.

ప్రేక్షకులను రంజింపచేసి, వారి మెప్పు పొంది, వారిని నటుడు తన అదుపులో ఉంచుకోవడానికి మార్గాలను సిమీ తన గ్రంథాల్లో విశదీకరించాడు. విమర్శ అనే గ్రంథంలో 'రంగస్థలాన్ని మరచిపోయి నాటకం చూడు, నాటకం మరచి పోయి నటుని చూడు, నటుని మరచిపోయి ఆశయం చూడు, ఆశయాన్ని మరచిపో నాటకం అర్థమవుతుంది' అని ప్రేక్షకులకు హితబోధన చేసిన సిమీ 1444లో మరణించాడు.

శ్రీ.చ.

సుంకర వాసిరెడ్డి (1909-1975) (1914-1957)

: సామాన్య జనుల గాథలు, బాధలు, పాలకుల దోపిడీలను ఇతివృత్తంగా మలచిన తెలుగు నాటక తొలి జంటకవులు. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు అనే వీరు ప్రజానాట్యమండలి రచయితలుగా సంచలనాలను సృష్టించారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న రాజకీయ మార్పులతో పాటు దేశంలో సమకాలీనంగా నెలకొన్న సాంఘిక దురాగతాలను ఎప్పటికప్పుడు తమ రచనల ద్వారా ప్రజలకు తెలియ జెప్పి, మరుగునపడిన దేశభక్తుల చరిత్రలను, కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు అద్దంపట్టే సాహిత్యాన్ని, నైజాం నవాబు దురాగతాలను కళ్లకు కట్టినట్టు నాటకాలను సృష్టించి విరామ మెరుగక శ్రమించిన కలం యోధులు సుంకర, వాసిరెడ్డి. సుంకర సత్యనారాయణ కృష్ణా జిల్లా ఈడ్పుగల్లు గ్రామంలో 1909, మార్చి 23న రామచంద్రయ్య, కోటమ్మ దంపతులకు జన్మించాడు. వాసిరెడ్డి భాస్కరరావు కృష్ణాజిల్లా పెంచికలదిన్నెగ్రామంలో 1914, సెప్టెంబర్ 2న వీరయ్య, భ్రమరాంబలకు జన్మించాడు.



చిన్నతనం నుండి సుంకర బుర్రకథలు, హరికథల పట్ల ఆకర్షితుడయ్యాడు. కోలవెన్నుకు చెందిన జంగం రామలింగం బుర్రకథలు విని ప్రభావితుడయ్యాడు. సోదరుడు వీరభద్రరావుతో కలిసి కమ్యూనిస్టు పార్టీ ప్రజాకళారూపాల ఆవశ్యకతను వివరించాడు. రష్యా-జర్మనీ యుద్ధాన్ని ఇతివృత్తంగా స్వీకరించి స్టాలిన్ గ్రాడ్ అనే బుర్రకథను రాశాడు. తాను ప్రధాన కథకుడిగా వీరభద్రరావు, భద్రయ్యలు వంతలుగా కంచికచర్ల సమీపంలోని మున్నలూరులో కథను చెప్పాడు. తరువాత కష్టజీవి బుర్రకథ ఎన్నో వేల కాపీలు అమ్ముడుపోయింది. రాష్ట్రంలో ఎన్నో దళాలు ఈ కథను చెప్పిన సంఘటనలు ఉన్నాయి. సుంకర రచించిన అల్లూరి సీతారామరాజు బుర్రకథను సుబ్బారావు పాణిగ్రాహి 1967లో జముకుల కథగా మార్చి శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలిచ్చాడు.

అల్లూరి సీతారామరాజు బుర్రకథను ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం నిషేధించింది. సుంకర భూమికోసం, కోతల రాయుడు, నూరు కాకుల్లో *గెరిల్లా*, *గిత్తల బేరం* మొదలైన నాటకాలను *వీరకుంకుమ*, *కనువిప్పు*, *జీతగాడు*, *భూదేవి*, *రాబందులు*, *ప్రతిఫలం*, *ఆగస్టు 15 కాంగ్రెసా? ఆంగ్రేజా? శ్మశాన శాంతి* నాటికలను రచించాడు.

1948-50 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ పై ప్రభుత్వం దమనకాండ సాగించినప్పుడు నాయకుల స్థావర రహస్యాలను చెప్పమని పోలీసులు సుంకరను చిత్రహింసలకు గురిచేశారు. ప్రజానాట్యమండలిని రద్దుచేయగానే మద్రాసు వెళ్ళి 'పల్లెటూరు, జ్యోతి, పుట్టిల్లు, ఏది నిజం, నమ్మినబంటు, భూమి కోసం' చిత్రాలకు కథలు, సంభాషణలు, పాటలను రాశాడు. సిద్ధాంతాలకు కట్టుబడిన సుంకరను మృత్యువు ఎన్నోసార్లు కౌగలించుకొన్నా రాజీపడక ఆజన్మాంతం ప్రజారచయితగా బ్రతికిన ఈయన 1975, సెప్టెంబర్ 5న అస్తమించాడు.

వీరులపాడు గ్రామంలో జంగా హనుమయ్య చౌదరి వద్ద సాహిత్యాన్ని అధ్యయనం చేసిన వాసిరెడ్డి భాస్కరరావు మద్రాసు విశ్వవిద్యాలయం నుండి హిందీ విద్వాన్ పట్టా పొందాడు. 1936లో నందిగామ బోర్డుహైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. ఫాసిస్టు వ్యతిరేకోద్యమంలో పాల్గని ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కమ్యూనిస్టు పార్టీ పత్రిక ప్రజాశక్తి నిర్వహణ బాధ్యతను స్వీకరించాడు. ఆ సమయంలో ఎన్నో ఉద్యమ గీతాలను, విశేషించి తెలంగాణా పోరాట పాటలను రచించాడు. 1946, జూన్ 1వ తేదీన వాసిరెడ్డి గృహంపై దాడి చేసిన పోలీసులు ఆయన ఎంతో కష్టపడి రచించిన 'భారతీయ సాహిత్య విమర్శ' అనే పుస్తక రాతప్రతిని దగ్ధం చేశారు. వాసిరెడ్డిని 20రోజులు జైలులో నిర్బంధించి చిత్రహింసలు పెట్టారు. అనంతరం బంబాయి, ఇతర ప్రదేశాల్లో అజ్ఞాత వాసం చేశాడు. ఈ సమయంలో జనత పత్రికకు సంపాదకునిగా పనిచేశాడు. ఉదరకోశ వ్యాధితో ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో స్వగ్రామం

వీరులపాడు చేరుకుని పోతుగడ్డ నాటకాన్ని రచించాడు. ఈ నాటకం మునగాల పరగణాలో అనేక సార్లు ప్రదర్శించబడింది. సుంకరతో కలిసి అనేక చలన చిత్రాలకు జంట రచయితగా పని చేశాడు. 1957 నవంబర్ ఒకటో తేదీన నందిగామలో వాసిరెడ్డి మృతి చెందాడు.

కొణతమాతుకూరులో సుంకర హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నప్పుడు ఏర్పడిన స్నేహం వీరిని జంటరచయితలుగా మార్చింది. జంట రచయితలుగా వీరి కలం నుంచి జాలువారిన ముందడుగు,అపనింద, మాభూమి నాటకాలు తెలుగు నాటకరంగంలో సంచలనం కలిగించాయి. ముందడుగు నాటకాన్ని ప్రజానాట్యమండలి కృష్ణా జిల్లా దళం అద్భుతంగా ప్రదర్శించింది. ఈ నాటకంలో కోడూరి అచ్చయ్య, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, చదలవాడ, వల్లం నరసింహారావు, పెరుమాళ్లు వంటి మహామహులు నటించారు. ఈ నాటకానికి సంగీతం తాతినేని చలపతిరావు అందించగా, కోడూరి అచ్చయ్య దర్శకునిగా, గరికపాటి రాజారావు ఆర్గనైజర్‌గా వ్యవహరించారు. ఆంధ్రదేశంలో జంఝూమారుత ప్రభంజనంగా సంచలనాన్ని సృష్టించిన ముందడుగు నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది.

నల్గండజిల్లాలో దేశముఖ్‌ల దారుణ మారణకాండను ప్రతిబింబిస్తూ సుంకర, వాసిరెడ్డి రచించిన మాభూమి నాటకం ద్వారా దున్నేవాడిదే భూమి అనే సందేశాన్ని ఇచ్చారు. తెలుగు నాటకరంగంలో ఇంత ఉద్యమస్ఫూర్తిని రగిలించిన నాటకం లేదు. ఈ నాటకం సృష్టించిన ప్రభంజనాన్ని చూసిన ప్రభుత్వం 1948లో నిషేధించింది. ప్రజా కవిత్వానికి, ప్రజా కళలకూ అసలు సిసలైన నిర్వచనం చెప్పిన సుంకర, వాసిరెడ్డి జంటకవుల కవిత్వం ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది. ఎన్నో పోరాటాలకు దిక్సూచిగా నిలిచింది.

కందిమళ్ల

సుందరం, తల్లావఝ్ఝల (జ.1950) : రంగస్థల నటుడు, దర్శకుడు, ప్రయోక్త, కథ, నవలా రచయిత. 1950, అక్టోబరు 29న మహాలక్ష్మి, కృత్తివాస తీర్థులకు ఒంగోలులో జన్మించాడు. బియస్సీ పూర్తి చేసిన తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖలో పిజి డిప్లొమా కోర్సు చేశాడు. 1957లో బాల నటుడుగా రంగస్థల ప్రవేశం చేసి ఇప్పటివరకు దాదాపు రెండువందల నాటికలలో నటించడమే కాకుండా దర్శకుడిగా, ప్రయోక్తగా వ్యవహరించాడు. గార్ధభాండం, అమీబా, కొక్కొరోకో, గోగ్రహణం, జంబూద్వీపం, చీకటింట్లో నల్లపిల్లి, పోస్టరు వంటి నాటికలూ, ఈహామృగం వంటి నాటకాన్ని నూతన ప్రయోగాలతో ప్రదర్శించి ప్రయోగాత్మక దర్శకుడిగా పేరు పొందాడు. దొంగలబండి, ప్రసన్నకు ప్రేమతో వంటి హాస్య నాటకాలు, జనమేజయం, మాధవి వంటి పౌరాణిక, ఇతి హాసిక నాటకాలూ, చలువ గుర్రం (చంద్రశేఖర్ కంబార్) వంటి వ్యంగ్య నాటకాలూ, హళ్ళికి-హళ్ళి, కేటు-డూప్లికేట్, సైలెన్స్ ప్లీజ్ వంటి హాస్య నాటికలకు దర్శకత్వం వహించాడు. పెద్దబాలశిక్ష, ఈ బస్సు మనదిరో, వెలుగొచ్చింది, ఎయిడ్స్ అవగాహన వంటి వీధి నాటికలకు కూడా దర్శకత్వం వహించాడు. ఈ ప్రదర్శనలన్నీ రాష్ట్రంలోని పలు కళాసంస్థలు నిర్వహించిన పోటీలలో ప్రదర్శింపబడ్డాయి.

గోగ్రహణం నాటకాన్ని 1985లో ఎర్నాకులంలో జరిగిన సౌత్ జోన్ థియేటర్ ఫెస్టివల్‌లో ప్రయోగాత్మకంగా ప్రయోగించాడు. రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగిన నాటిక, నాటక పోటీలలో ఉత్తమ దర్శకుడిగా అనేక బహుమతులు గెలుచుకున్నాడు. మద్రాసు కళాసాగర్ నాలుగు సంవత్సరాలకోసారి ఇచ్చే థియేటర్ టెర్నియల్ అవార్డు, 1985లో ఇదే సంస్థ ఉత్తమ దర్శకుడి అవార్డు, 1992లో హైదరాబాదు లయన్స్ క్లబ్ ఉత్తమ రంగస్థల దర్శకుడి అవార్డు, 1994లో పినిశెట్టి శ్రీరామమూర్తి స్మారక గోల్డ్ మెడల్, తెలుగు విశ్వవిద్యాలయం 1993లో ధర్మనిధి పురస్కారం వంటి ఎన్నో అవార్డులు అందుకొని తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి, చైతన్య భారతి, వంశీ కళా కేంద్రం, యువ కళావాహిని, సుమధుర కళానికేతన్ వంటి పలు సంస్థలు అవార్డులిచ్చి ఘనంగా సత్కరించాయి.1979 నుంచి దూరదర్శన్‌లో దాదాపు 200 నాటకాలు, నాటికల్లో నటించాడు. వర్చస్వి, మూడు ముళ్ళాట, అభిషేకన్ టివీ సీరియళ్ళకి దర్శకత్వం వహించాడు. 1999లో వర్చస్వికి ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు అందుకున్నాడు.

'నటన' అంటే ఏమిటో పూర్తిగా తెలియని వారితో కూడా నటింపజేసి ఉత్తమ నటులుగా తీర్చిదిద్దటంలో సుందరాన్ని మించినవారు ఎవ్వరు లేరు. శ్రీ మురళి కళా నిలయం తరపున ఎందరో నటుల్ని, రచయితల్ని తెలుగు నాటక రంగానికి అందిస్తూ, ఆధునిక తెలుగు నాటకరంగంలో తనదంటూ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్న దర్శకుడు సుందరం. ఇప్పటికీ కొత్త ప్రయోగాలతో నాటకాన్ని ప్రదర్శించాలనే ఉత్సాహంతో ముందుకెళ్తున్న సుందరం ఓ వ్యక్తి కాదు... ఓ సంస్థ.

ప్ర.రె.

సుందరరామయ్య, పిల్లలమర్రి (1895-1933) : ప్రముఖ రంగస్థల నటుడు. తెనాలి రామవిలాస సభలో ప్రధాన

పాత్రధారి, మూల స్తంభం. రాజపాత్రలకు ఉచితమైన గాత్రం. ప్రేక్షకుల మెప్పును అంచనా వేయడంలో నేర్పరి. బీభత్స, భయానక, శోక రసాలను సమర్థవంతంగా ఒప్పించగల మేటి నటుడు. ఈయన 1895లో తెనాలిలో శేషమాంబ, కుమారస్వామి దంపతులకు జన్మించాడు.

శ్రీకృష్ణతులాభారంలో నారదుడుగా భక్తి రసం, పాపా రాయుడుగా రౌద్రరసం, సత్యహరిశ్చంద్రుడుగా శోకం ఒలికించి అభినవ పాపా రాయుడుగా, కలియుగ నారదుడుగా బిరుదులను పొందాడు.

జనార్దనమంత్రి, నారదుడు, రాంసింగ్, హరిశ్చంద్రుడు, పాపారాయుడు, భీముడు, నరకాసురుడు, రుక్మాంగదుడు, బిల్వమంగళ, రాజరాజ నరేంద్రుడు, విశ్వామిత్రుడు, సుదేవ,అశ్వత్థామ మొదలైన పాత్రలలో నటించిన పిల్లలమర్రి **1933లో మరణించాడు.**

శ్రీ.చ.

సుగుణ విలాససభ : ఈ సమాజాన్ని 1891 జులై ఒకటిన మదరాసులో స్థాపించారు. దీని వ్యవస్థాపకుడు, ప్రధాన నటుడు, పి. సంబంధ మొదలియార్. నాటకాది లలిత కళల పఠనం, భారతీయ నాటకరంగ స్థాయి పెంచడం, దేశభాషా నాటక సాహిత్యం పెంపుదల, నిధులను బట్టి ధార్మిక సంస్థలకు ఆర్థిక సహాయం చేయడం సంస్థ ప్రధానాశయాలు.

బళ్ళారి సరస వినోదినీ సభ నమూనాలో స్థాపితమైన ఈ నాటక సమాజం, తెలుగులోనే గాక తమిళం, సంస్కృతం, కన్నడం, ఇంగ్లీషు భాషల్లో కూడా నాటకాలు ప్రదర్శించింది. వీరి రంగస్థలం విక్టోరియా పబ్లిక్‌హాల్‌లో షేక్స్పియర్ వారోత్సవాలలో, పండుగ దినాల్లో, దేవీ నవరాత్రులలో సుగుణ విలాససభ సభ్యులు తప్పకుండా నాటకాలను ప్రదర్శించేవారు.

తమిళ నాటకరంగం పామర జన స్థాయి నుంచి నాగరిక స్థాయికి అందుకోవడానికి ఈ సభే కారణం. ప్రదర్శనంలో సాత్త్విక వాతావరణం ప్రవేశ పెట్టింది కూడా ఈ సభవారే. నాందీ ప్రస్తావనలకు బదులుగా తెర వెనుక ప్రార్థనా గీతాన్ని ప్రారంభించింది కూడా ఈ సభే. వీరికి నాటక గ్రంథాలయం ఉండేది. 'ఇండియన్ స్టేజి' అనే పత్రిక కొంతకాలం నడిపారు. గ్రంథాలయంలో అనేక తెలుగు నాటకాల ప్రథమ ముద్రణలు దొరుకుతాయి.

శ్రీ.చ.

సుబ్బదాసు, రాప్తాటి : నాటకకర్త, నటుడు, ప్రయోక్త, వాగ్గేయకారుడు, హరికథకుడు. ఈయన ధర్మవరంలో ఒక నాటక సమాజంలో కొంతకాలం పాల్గని, ఆ తరువాత హరికథలు చెపుతూ దేశమంతా పర్యటించాడు. ఈ సందర్భంలో వనారస గోవిందరావు సమాజానికి నాటకాలు నేర్పవలసిందిగా ఆహ్వానం వచ్చినందువల్ల వారికి నాటకాలు రాసి తర్ఫీదిచ్చి ప్రయోగింపచేశాడు. ఈయన రాసిన 'శ్రీ శైలజసుత రజత మధుర సాధన' అనే వినాయక స్తుతి ప్రార్థనా గేయం నేటికీ సురభి నాటక సమాజాల వారు పాడుతూనే ఉన్నారు. సత్యహరిశ్చంద్రుడు, సారంగధర, శకుంతల, జయదేవ (1936) అనే నాటకాలు రచించాడు. హరిశ్చంద్రుడు, సారంగధరుడు, దుష్యంతుడు, అర్జునుడు మొదలైన పాత్రలలో నటించాడు.

శ్రీ.చ.

సుబ్బరామిరెడ్డి, గండవరం (జ.1937) : నటుడు, శతాధిక నాటిక, నాటకాల రచయిత, పరిశోధకుడు. కాళిదాస కళానికేతన్, సంస్కృతీ సమ్మేళనం (గూడూరు) సమాజాల స్థాపకులలో ముఖ్యుడు. ఈయన 1937 జులై 1న నెల్లూరు జిల్లా గూడూరులో బద్వేలి బలరామి రెడ్డి, జానకమ్మ దంపతులకు జన్మించాడు. బి. ఎ. వరకు చదువుకున్న గండవరం విద్యాభ్యాసం గూడూరు లోనూ, వి. ఆర్. కళాశాల నెల్లూరులోను సాగింది. పాఠశాలలో చదువుతున్న రోజుల్లో చలన చిత్రాలను విరివిగా చూసే అలవాటున్న గండవరం కళారంగంపట్ల ఆకర్షితు డయ్యాడు. సినిమాలలో చూసిన పలు సన్నివేశాలను మిత్రులతో కలిసి నటించడం, బూడిద, బగ్గును ఆహార్యంగాను, ఇంట్లోని దుప్పట్లను తెరలుగా వినియోగించుకొని ఊరుబయట పాడుబడ్డ చావిడిలో స్వీయ రచనలో రూపుదిద్దుకున్న నాటికలను ప్రదర్శించాడు. అమరజీవి, భక్తప్రహ్లాద ప్రాథమిక దశలో ప్రదర్శించి నాటకరంగం పట్ల అభిమానాన్ని పెంచుకొన్న గండవరం సాహిత్యానికి సంబంధించిన పలు గ్రంథాలు చదివాడు. మిత్రులు ఎ. శ్రీనివాసరావు, సి.హెచ్. కృష్ణమూర్తి, సిద్ధారెడ్డి, జనార్థనరెడ్డిలతో కలిసి గూడూరులో సాహిత్య సమ్మేళనం అనే సమాజాన్ని స్థాపించి, సాహిత్య కళారంగాలలో నిష్ణాతులైన ప్రముఖులతో ఉపన్యాసాలు ఏర్పాటు చేశాడు. తరువాతి కాలంలో ఈ సంస్థ సంస్కృతీ సమ్మేళనంగా రూపుదిద్దుకొని

అర్ధశతాబ్దానికిపైగా కళారంగానికి సేవచేస్తున్న ఘన చరిత్రగల సంస్థగా ఎదిగింది. నెల్లూరు జిల్లాలో విశేషంగా సాంస్కృతిక రంగవికాసానికి కృషిచేస్తున్న అతికొద్ది సంస్థలలో అగ్రగామిగా నిలిచింది. (వివరాలకు సంస్కృతి సమ్మేళనం చూడండి)

1962లో ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డ గండవరం వృత్తితో పాటు, నాటక ప్రవృత్తిని కూడా కొనసాగించాడు. ఆకాశవాణికోసం అనేక నాటకాలు రాశాడు. సికింద్రాబాదులోని అమృతవాణి కోసం అనేక నాటికా, నాటకాలు రాశాడు. సికింద్రాబాదులోని అమృతవాణి నిర్వాహకులు అభ్యర్థనమేరకు, దాదాపు అయిదు పదుల నాటికా నాటకాలు రచించాడు. ఈ రచనలన్నీ వెనితాన్ (మనీలా – ఫిలిఫ్ఫీన్)లలో ధారావాహికంగా ప్రసారమయ్యాయి. *మన ఊరు, చిరంజీవి, నీరుపల్లమెరుగు, వెంటాడే నీడలు* మొదలైన నాటకాలు, *ఏది మార్గం ?* (1954) *పెండ్లిచూపులు* (1959), *శిఖరం కూలింది* (1981), *ఇల్లు కావాలి* (1985), *ఆగండి నేను వస్తున్నా* (1990), *అబద్ధాల ఊబిలో* (1990), *రథం కదిలింది.* (2000) *రాదిక వసంతం* (2001) మొదలైన నాటికలు వివిధ పరిషత్తు పోటీలలో ప్రదర్శింపబడి బహుమతులతో పాటు రచయితకి ఖ్యాతిని తెచ్చి పెట్టాయి. తెలుగు నాటక రంగ చరిత్రను తెలుసుకోడానికి ఉపయోగించే గ్రంథాల సంఖ్య ఎక్కువగా లేని విషయాన్ని గమనించిన గండవరం ఆధునిక తెలుగు నాటకం పేరుతో రెండు సంపుటాలను వెలువరించాడు. ఈ గ్రంథాలు తెలుగు నాటక రంగం గురించి పరిశోధన చేసే విద్యార్థులకు బాగా ఉపకరిస్తాయి. అదే విధంగా తెలుగు నాటక రంగం గురించి తెలుగేతరులు తెలుసుకొనేందుకు ***The glimpses of Telugu Drama*** ఆంగ్ల గ్రంథాన్ని రచించి ప్రచురించాడు. నాటక రంగానికి సంబంధించిన పలు అంశాల గురించి వివిధ పత్రికలలో శతాధిక వ్యాసాలు రచించాడు. రాష్ట్రంలోని వివిధ ఔత్సాహిక నాటక సమాజాలు నిర్వహించే నాటక పోటీలకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే నంది నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. పాశ్చాత్య భారతీయనాటక సాహిత్యం అధ్యయనం చేసిన గండవరంను అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఘనంగా సన్మానించాయి.

నిరంతరం నాటకరంగంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ, విశ్వవిద్యాలయాలలోని రంగస్థల కళలశాఖలు నిర్వహిస్తున్న సదస్సులో విలువైన పత్రాలను సమర్పించి, పరిశోధకులకు అవసరమైన సూచనలిస్తూ, కళారంగ వికాసం కోసం కృషి చేస్తున్న కళా హృదయుడు గండవరం సుబ్బరామి రెడ్డి.

దాసరి ఎన్.

సుబ్బారాయుడు, వడ్డాది (1855-1938) : విద్వత్కవి, నటుడు, దర్శకుడు, నాటక సమాజ స్థాపకుడు. సమర్థుడైన ఉపాధ్యాయుడుగా, మంచి అనువాదకుడుగా ప్రసిద్ధుడైన వడ్డాది సుబ్బారాయుడు తూర్పు గోదావరి జిల్లా నగరం సమీపంలోని పాకర్లపూడి లంకలో 1885, జులై 30న జన్మించాడు. నివాసం రాజమండ్రి. పండితుడైన సూరపరాజు తండ్రి, లక్ష్మమ్మ తల్లి. రాజమహేంద్రవరం కవిత్రయంలో వసురాయకవి ఒకడు (వీరేశలింగం, వావిలాల, వడ్డాది). ఈయన రచనల్లో ప్రధానంగా భక్తి, ఆర్తి కనిపిస్తాయి. ఈయన 14వ ఏటనే భజగోవిందం శ్లోకాలు తెనిగించాడు. రచించిన నాటకాలన్నీ సంస్కృతానువాదాలే. ఆ నాటకాలన్నీ పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించబడడం విశేషం.

[redacted]

సుబ్బారాయుడు రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలో ఆంధ్రపండితుడుగా (1874) చాలాకాలం పనిచేశాడు. ఆయనకు ఐదు సార్లు భార్యా వియోగం కల్గడం విధి నియోగం. ఒక్క కుమారుడు సైతం 1907లో మరణించాడు. కలిగిన సుఖదుఃఖానుభూతులు హృదయాన్ని స్పందింప చేస్తాయి. నాటి భగవత్కీర్తనలు, భక్త చింతామణి, సుతస్మృతి మొదలైన గ్రంథాలు రచించాడు.

ఏడు సంస్కృత నాటకాలను తెలుగులోనికి అనువదించిన విద్వాంసుడు. వేణీసంహారం *(1883-86)*, విక్రమోర్వశీయం *(1884-89)*, ప్రబోధచంద్రోదయం *(1891-93)*, చండకౌశికం *(1900)*, అభిజ్ఞాన శాకుంతలం *(1906)*, మల్లికామారుత ప్రకరణం *(1903-1921)*, ఆంధ్ర కుందమాల *(1931-1932)*.

వసురాయ కవి పద్య గద్య కృతులు కూడా రచించాడు. వివిధ పత్రికల్లో వ్యాసాలు, ఇతరమైన రచనలు 50 వరకు (1893-1937) ప్రచురితమైనాయి. రాజమండ్రి ప్రజలు 1937లో ఈయనకు సహస్రమాస జీవితోత్సవం జరిపి కవిశేఖర బిరుదుతో సన్మానించారు.

వడ్డాది వెలువరించిన వేణీసంహారం ప్రౌఢ రీతిని సంతరింపబడి, దాదాపు 50 సంవత్సరాలు రంగస్థలంపై విజయవంతంగా ప్రదర్శింపబడి, ఆనాటి నటులకు నికషోపలంగా నిలిచిన నాటక రాజం. ముఖ్యంగా ఈ నాటకంలోని పద్యాలు పొందికగా, పొంకంగా కుదిరాయి. ఈ పద్యాలు చూసి చిలకమర్తి లక్ష్మీనరసింహం "ప్రాణంబులు లేచివచ్చు పద్యము విన్నన్" అని స్వీయచరిత్రలో రాసుకున్నాడు. సంభాషణలు కూడా హుందాగా ఉన్నాయి.

1932లో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన షష్టిపూర్తి ఉత్సవం ఘనంగా జరిగింది. తెలుగు నాటకరంగం వికాసం కోసం కృషి చేసిన వడ్డాది 1938, మార్చి 2న పరమపదించాడు.

నాగిరెడ్డి

సుబ్బారావు, అనిసెట్టి (1922-1979): నటుడు, నవ్య కళా పరిషత్తు స్థాపకుడు, పత్రికా సంపాదకుడు. అభ్యుదయ కవిగా లబ్ధప్రతిష్ఠుడైన అనిసెట్టి గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో అంతర్భాగమైన పురుషోత్తమపట్నంలో 1922, అక్టోబర్ 23న జన్మించాడు. 1926లో పురుషోత్తమ పట్నంలో ప్రాథమిక విద్య అభ్యసించి, 1932లో నర్సరావుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చేరాడు. అనిశెట్టి ఆ పాఠశాల చరిత్రోపన్యాసకులు నాయని సుబ్బారావుకు ప్రియశిష్యుడు.



1939లో గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్, 1941లో ఎ.సి. కళాశాలలో బి.ఎ డిగ్రీ పొందాడు. 1942 ఆగష్టు 8న క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గని అరెస్టు అయ్యాడు.

1947లో ఎం.ఏ. ఇంగ్లీషు లిటరేచర్ చదువుతున్నప్పుడు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో కె.వి. రమణారెడ్డి, అజంతా, ఇస్మాయిల్, ప్రయాగ వంటి కవులు సహాధ్యాయులుగా ఉండేవారు. హైస్కూల్ స్థాయిలోనే నాయని సుబ్బారావు ప్రోత్సాహంతో ఛందోబద్ధమైన పద్యాలను రాయడం ప్రారంభించిన అనిసెట్టి 1942లో నర్సరావుపేటలో నవ్యకళా పరిషత్తును స్థాపించాడు. ప్రతిభ సాహిత్య పత్రికకు సంపాదకుడుగా, ప్రజాశక్తి పత్రికలో సభ్యుడుగా పనిచేశాడు. 1948లో 'అభ్యుదయ' పత్రికకు సంపాదకుడుగా వ్యవహరించాడు. అభ్యుదయ, ఉదయిని పత్రికలలో కాంతులు – కత్తులు అనే శీర్షిక ద్వారా అద్భుతమైన వ్యాసాలను రచించాడు. పాట, పద్యం, గేయం, వ్యాసం, కథ, నవల వంటి ప్రక్రియల్లో విశేషంగా కృషి చేసినా, నాటక రచనలో అనిసెట్టి ప్రతిభ అద్వితీయంగా నిలిచింది. *గాలిమేడలు, యుగజ్వాల, మాపూరు* నాటకాలతోపాటు *జీవన సంగీతం, చరమాంకం* వంటి నాటికలను రచించాడు. దీనితో పాటు 12 రేడియో నాటకాలను రాశాడు.

ఫ్రాయిడ్ మనోవిశ్లేణ సిద్ధాంతం ఆధారంగా అనిసెట్టి *గాలిమేడలు* నాటకాన్ని 1950లో రచించాడు. మధ్య తరగతి మానవుడి విఫలమనోరథాలను, చుట్టూ ఉన్న సమస్యల పద్మ వ్యూహంలో చిక్కి ఉక్కిరి బిక్కిరైపోతూ ఆ బాధలను మరచి పోవడానికి స్వాప్నికజగత్తులో విహరించే దైన్యాన్ని ఇతివృత్తంగా రచించిన *గాలిమేడలు* నాటకం ఎంతో ప్రజాదరణను పొందింది. నటులు, ప్రేక్షకులు అనే గీతను చెరిపివేస్తూ తాదాత్మ్య విచ్ఛిత్తి కలిగించే ధోరణిలో నాటకం జరుగుతున్న సమయంలో ప్రేక్షకుల నుండి రంగస్థలం పైకి పాత్రలు ప్రవేశించే విధానానికి ఆధునిక నాటకరంగంలో *గాలిమేడలు* నాటకం ద్వారా అనిసెట్టి శ్రీకారం చుట్టాడు. *గాలిమేడలు* నాటకాన్ని ప్రజానాట్యమండలి నిషేధ సమయంలో 'ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ' సంస్థ పక్షాన విజయవాడలో ప్రదర్శించారు. ఈ నాటకంలో మిక్కిలినేని, నాగభూషణం, కర్నాటి లక్ష్మీ నరసయ్య, కారెపు అప్పల స్వామి ప్రభృతులు నటించారు. ఈ నాటకం సృష్టించిన సంచలనానికి భీతిల్లిన ప్రభుత్వం దీన్ని నిషేధించింది.

చెప్పుకింది పూలు నాటిక నిరుద్యోగ భూత వికృత వికటాట్టహాసాలకు, మధ్యతరగతి మనుషుల నిరాశా నిస్పృహలకు దర్పణం పడుతుంది. ఈ నాటికను 'గురజాడ కళామందిర్' విజయవాడ సంస్థ పలు పరిషత్తులలో ప్రదర్శించి బహుమతులను పొందింది. 1955లో జరిగిన ఎన్నికల ప్రచారం కోసం అనిసెట్టి ఓటెవరికి నాటికను కూడా మూకాభినయ ధోరణిలో రచించాడు.

1955లో ప్రముఖ సినీ దర్శకుడు గిడుతూరి సూర్యం ప్రోత్సాహంతో అనిసెట్టి సినీరంగ ప్రవేశం చేశాడు. 48 చిత్రాలకు మాటలు, పాటలు రాశాడు. 300 డబ్బింగ్ చిత్రాలకు అనువాద రచయితగా పనిచేశాడు.

అనిసెట్టి అఖిల భారత రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా, దక్షిణ భారత చలనచిత్ర రచయితల సంఘ కార్యదర్శిగా, దక్షిణ భారత చలన చిత్ర మండలి ఉపాధ్యక్షుడుగా వ్యవహరించాడు. 1977లో రాజమండ్రి 'రాజ్యలక్ష్మి కళాసమితి' అనిసెట్టిని అభ్యుదయ కవి భాస్కర బిరుదుతో సత్కరించింది.

సామ్యవాదం, వర్గదోపిడి, మధ్య తరగతి మందహాసం వంటి ఇతి వృత్తాలతో విభిన్న ప్రక్రియలతో సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు. 1979 డిశంబర్ 27న నర్సరావుపేటలో అనిశెట్టి కవితా అగ్నివీణ మూగబోయింది.

కందిమళ్ళ

సుబ్బారావు, ఎ.వి. (జ. 1928) : ప్రసిద్ధ రంగస్థల నటుడు. పూర్ణశ్రీ నాట్య కళాసమితి స్థాపకుడు. పౌరాణిక సాహిత్యంలో వర్ణించిన శ్రీకృష్ణుని రూపురేఖ విలాసాలకు రంగస్థలంపై కమనీయ సజీవరూపం ఆరాధ్యుల వేంకట సుబ్బారావు. తన విశాల నేత్రాలతో, అమరగానంతో, రసరంజకమ్మైన అభినయ చాతుర్యంతో శ్రీకృష్ణుని పాత్రలో నాలుగు దశాబ్దాల పాటు రంగస్థల వేల్పుగా కీర్తించబడ్డ ఘనత ఈయనకే చెందుతుంది. ఎ.వి.గా వాసికెక్కిన ఈయన తెనాలి సమీపంలోని అనంతవరంకు చెందిన ఆరాధ్యుల యానాదయ్య, ఆదిలక్ష్మి దంపతులకు 1928, జులై 1న జన్మించాడు.

నిరుపేద కుటుంబం కావటంతో విద్యాభ్యాసం మూడవ తరగతితోనే ముగిసింది. కుటుంబ పోషణార్థం 10వ సంవత్సరం నుంచి వ్యవసాయపనుల్లోనే గడపాల్సి వచ్చింది. ఆ రోజుల్లో ప్రముఖ నటగాయకునిగ వాసికెక్కిన కుప్పా సూర్యనారాయణది, ఎ.వి. స్వగ్రామమే కావటంతో వారి కృష్ణ పాత్ర పోషణ, గాన మాధుర్యం సుబ్బారావులో చెరగని ముద్ర వేసింది.

కుప్పా తన దార్శనికతతో ఎ.వి.లో దాగి ఉన్న మధుర గాయకుని గుర్తించి,అతనిని రంగస్థలానికి ఆహ్వానించాడు. ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తల్లి ప్రోత్సాహంతో ఎ.వి. సుబ్బారావు తన నటనను రంగస్థలం వైపు మరలించాడు. దాంతో ఆయన అభినయ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగింది.

తొలిసారిగా శ్రీరాముని పాత్ర ద్వారా 1948లో పాదుకా పట్టాభిషేకంలో రంగస్థల ప్రవేశం చేశాడు. అప్పటినుంచి సుబ్బారావు పలు ప్రదర్శనల్లో నటిస్తూ తన ఉనికిని చాటుకొంటుండగా ప్రముఖ నటుడు వల్లూరి వెంకట్రామయ్య తను నటించే బాలనాగమ్మ నాటకంలో కార్యవర్ధి వేయమని ఆహ్వానించాడు. ఈ అయాచితావకాశాన్ని సుబ్బారావు సద్వినియోగం చేసుకొని, రెండు సంవత్సరాలపాటు వల్లూరి సమాజంలో ఆంధ్రావని అంతటా పలు ప్రదర్శనల్లో కార్యవర్ధి పాత్రలో నటించాడు.

అనంతరకాలంలో శ్రేయోభిలాషుల సలహా మేరకు శ్రీకృష్ణ పాత్ర పోషణకు సంబంధించిన సాహిత్య విలువలను, అభినయ రీతులను కుప్పా వెంకటకృష్ణయ్య, వేమూరి సీతారామశాస్త్రిల దగ్గర, పద్యపఠనాన్ని వుద్దెల పంచనాథం, విష్ణుబట్ల వేంకటేశ్వరరావుల దగ్గర క్షుణ్ణంగా అభ్యసించాడు. వీరి శిక్షణలో పండించుకున్న అనుభవంతో తొలిసారిగా 1958లో పాండవోద్యోగ విజయాలలో శ్రీకృష్ణుని పాత్రలో నటించాడు. తన సహచర మిత్రులను సమీకరించుకొని పెద్దల ఆశీస్సులతో 1960లో పూర్ణ శ్రీ నాట్య కళాసమితి స్థాపించాడు. ఈ సంస్థ తరపున వేమూరి ప్రోత్సాహంతో అదే సంవత్సరం గుంటూరులో జరిగిన పాండవ ఉద్యోగ విజయాలు పోటీలలో పాల్గన్నాడు. ఈ పాత్రపోషణ శైలికి ముగ్ధుడైన గుళ్ళపల్లి ఆదిశేషయ్య వెండి కిరీటం బహుకరించాడు. ఈయన ప్రతిభ ఆంధ్ర నాటక రంగానికి తేటతెల్లమవటంతో నాటి నుంచి విరామం లేకుండా దశాబ్దాల పాటు ప్రదర్శనలు ఇస్తూనే వచ్చాడు.

రంగస్థల జీవితంలో సింహభాగం శ్రీ కృష్ణపాత్ర పోషణతోనే సాగిపోయింది. ఈయన సుదీర్ఘ రంగస్థల జీవనయానంలో శ్రీకృష్ణ పాత్రలో పి.సూరిబాబు, బుర్రా సుబ్రమణ్యా శాస్త్రి, పీసపాటి, అద్దంకి శ్రీరామమూర్తి, సత్యవతి, ధూళిపాళ, వేమూరి, ఆచంట లాంటి ఉద్దండుల సరసన నటించి వీరికి దీటుగా రాణించాడు. సతీ సక్కుబాయిలో శ్రీకృష్ణునిగా కూడా నటించాడు.

ముఖ్యంగా సంగీత శాస్త్రాన్ని ఔపాసన పట్టిన షణ్ముఖి సరసన గాయకునిగా రాణించటమంటే ఆషామాషీ కాదు. గయోపాఖ్యానంలో కృష్ణునిగా కూడా ఈయన సహస్రాధిక ప్రదర్శనల్లో రాణించాడు.

శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరాముని పాత్ర, శ్రీకృష్ణరాయబారం, గయోపాఖ్యానం లలో శ్రీకృష్ణుని పాత్రలను హెచ్.ఎమ్.వి. వారు గ్రాంఫోన్ రికార్డ్సుగా విడుదల చేశారు. ఈ గ్రాంఫోన్ రికార్డ్సు తెలుగునాట నాల్గుదిశల ఈ నాటికీ మారు మ్రోగుతునే ఉన్నాయి.

మద్రాసు, బెంగుళూరు, ఒరిస్సా, భిలాయ్ లాంటి రాష్ట్రేతర ప్రాంతాల్లోను, యావదాంధ్రావనిలోను 1995 వరకు విస్తృతంగాను, ఆ తరువాత అడపాదడపా ప్రదర్శనలు ఇస్తూ జీవితాన్ని అర్థవంతంగా సాగించిన ఎ.వి. ప్రస్తుతం విశ్రాంతి తీసుకొంటూ, పలు నాటక రంగ సదస్సులలో నాటక కళ అభివృద్ధికి విలువైన సూచనలు చేస్తూ, వర్తమాన తరానికి పద్యపఠనంలో మెళకువలను బోధిస్తూ, తన శేషజీవితాన్ని తన కిష్టమైన వ్యాసంగంలోనే ఆనందమయంగా సాగిస్తున్నాడు. ఈయన కళా వారసత్వాన్ని

ముగ్గురు పుత్రులు వేంకటేశ్వర రావు, కోటేశ్వర రావు, ఆదినారాయణలు ప్రతిభావంతంగా కొనసాగించటం ముదావహం.

మన్నెశ్రీ

సుబ్బారావు, ఎస్.వి. (జ.1935) : పౌరాణిక రంగస్థల నటుడు. ఈయన 1935, నవంబర్ 12న నరాల శెట్టి మస్తాన్, అన్నపూర్ణమ్మ దంపతులకు బాపట్ల సమీపంలోని నరాలశెట్టి పాలెం గ్రామంలో జన్మించాడు. బాల్యంలో చూచిన నాటకాలు, తను చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింగరాజు, మరొక నటుడు చింతాబత్తి జగన్నాథరావుల నటనా వైదుష్యం ఎస్.వి. నాటకరంగం పట్ల ఆకర్షితుడు కావడానికి ప్రధాన కారణాలు. రేటూరి సమాజం ప్రదర్శించిన బ్రహ్మంగారి చరిత్ర లో మునసబు పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేశాడు.

అనంతరం సుప్రసిద్ధ రంగస్థల నటుడు, హార్మోనిస్టు టి. రాఘవాచారి దగ్గర పద్యపఠనంలో ఏడాదిపాటు శిక్షణ పొందాడు. రామాంజనేయ యుద్ధంలో చింతాబత్తిన జగన్నాథరావు సరసన 1957లో శత్రుఘ్నుడు పాత్రలో నటించాడు. ఆనాటి నాటకంచూసి శ్రీకృష్ణుడు పాత్ర సాధన చేయమని నాటి రంగస్థల ప్రముఖులు మాచిరాజు, సింగరాజులు ఎస్.వి.కి సూచించారు. ఆయన సలహా మేరకే 1959లో తొలిసారిగా పడకదృశ్యంలో శ్రీకృష్ణుడుగా నటించాడు. తరువాత వెంకట్రామ నాట్యకళాసమితిలో చేరి కె.ఎస్.టి. సాయి దర్శకత్వంలో 1963లో గుంటూరులో జరిగిన పాండవోద్యోగ విజయాలు పోటీలలో పాల్గని శ్రీకృష్ణ పాత్ర నిర్వహణకు 'బంగారు కిరీటం' పొందాడు. నాటి నుంచి ఎస్.వి. సుబ్బారావు శ్రీకృష్ణ పాత్రలో అనేకసార్లు అభినయించాడు. పడకదృశ్యం నుంచి మడుగుదృశ్యం వరకు ఏ దృశ్యంనైనా అలవోకగా నటించగల సామర్థ్యం సంతరించుకున్నాడు. దాంతో నాటి మేటి రంగస్థల నటులైన షణ్ముఖి, పీసపాటి, బండారు, రఘురామయ్య, చెంచు రామారావు, 'రాయలసీమ రత్నం' వెంకట నరసనాయుడు, పులిపాటి వెంకటేశ్వర్లు, అద్దంకి శ్రీరామమూర్తి, పి. సూరిబాబుల సరసన శ్రీకృష్ణునిగా నటించి రాణించాడు. కె.ఎస్.టి. సాయి దర్శకత్వంలోనే బబ్బిలి యుద్ధంలో వెంగళరాయుని పాత్రను నాటకరంగ విమర్శకులు కొనియాడే రీతిలో పోషించాడు. అలాగే డి.వి. సుబ్బారావు (వేటపాలెం), సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్ర పాత్రను పోషించాడు. దీపావళి నాటకంలో ఈయన ఇంద్రుని పాత్ర నిర్వహణ చూసి 1979లో ఆచంట వెంకటరత్నం నాయుడు 'షణ్ముఖి నాట్యమండలి'లోకి ఆహ్వానించాడు.1979 నుండి 93 వరకు ఈ సంస్థలో ఉంటూ తులసీ జలంధర లో విష్ణువు, ఇంద్రుడు పాత్రలను సహస్రాధిక ప్రదర్శనల్లో అభినయించాడు. రామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడు, పల్నాటి యుద్ధంలో బాలచంద్రుడు, చింతామణిలో బిల్వమంగళుడు, మోహినీ భస్మాసురలో నారదుడు, బాలనాగమ్మలో కార్యవర్ధి పాత్రలలో నటించాడు. దాదాపు ఏడు దశాబ్దాల జీవనయానంలో ఐదు దశాబ్దాలు రంగస్థల ప్రదర్శనల్లో పాల్గని సన్మానాలు, సత్కారాలు అందుకొన్నాడు. ఏడు పదుల వయస్సులో కూడా ఈయన గాత్రం చెడలేదు. వాచికం సడలలేదు. స్ఫూర్తి కొరవడలేదు. అవిశ్రాంతంగా అవకాశం లభించిన ప్రదర్శనల్లో ఈనాటికి నటిస్తూ నటరాజు సేవ చేస్తున్న కళాకారుడు ఎస్.వి. సుబ్బారావు.

మన్నెశ్రీ

సుబ్బారావు, కృత్తివెంటి (1886-1958) : నటుడు, నాటక కళా వేత్త, ప్రయోక్త, ప్రప్రథమ తెలుగు హార్మోనిస్టు బందరు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ, ఏలూరు ప్రభాత్ కంపెనీ మొదలైన నాటక సమాజాలలో నటించాడు. ఈయన 1886లో బందరులో జన్మించాడు.

నాటకాలలో నటించే వారిని సంఘం నీచంగా చూచే రోజులలో సంఘాన్ని లెక్క చేయ కుండా నాటక కళా సేవకు నడుం కట్టిన ధీరుడు. తెలుగు, హిందీ నాటకాలలో స్త్రీ, పురుషవేషాలలో నటించి సుమారు అర్థశతాబ్దం పాటు నాటక కళా సేవ చేశాడు. జీవితంలో అనేక అష్టకష్టాలు ఎదురైనా నాటకాలలో వేషాలు నటించడం మానలేదు. ఆలీబాబా, విశ్వామిత్రుడు, కంసుడు, వీరనాయకుడు మొదలైన పాత్రలలో నటించిన కృత్తివెంటి 1958లో ఏలూరులో మరణించాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, కొప్పరపు (1896-1959) : నాటకకర్త, ప్రయోక్త, కవి. ఈయన 1896లో ఏప్రిల్ 29న గుంటూరు జిల్లా అన్నవరంలో జన్మించాడు. తల్లిదండ్రులు రామమ్మ, కామయ్య.

స్కూలు ఫైనలు చదువుతున్నప్పుడు చదువు మీద విరక్తి కలిగి, నాటక కళ మీద మోజు పుట్టింది. సాధన సంపత్తిని చేకూర్చుకోవడానికి కలకత్తా ప్రయాణం కట్టాడు. అక్కడ సంగీతం, హార్మోనియం, నాటక ప్రయోగం అభ్యసించాడు. తరువాత బంబాయి వెళ్లి మరాఠీ సంగీతం నేర్చుకున్నాడు. మరాఠీ నాటక ప్రయోగ విధానాలను పరిశీలించాడు. మరాఠీ భాషనేర్చుకున్నాడు.

ఇంతలో మొదటి ప్రపంచయుద్ధం వచ్చింది. సుబ్బారావు సివిల్ శాఖలో చేరాడు. వీరి దళం ఇరాక్‌లోని బస్రాలో ఉండగా యుద్ధం ముగిసింది. ముందుగా బస్రా నుంచి ఆంగ్ల సైనికులు వెళ్లిపోయారు. వారి కోసం నిర్మించిన నాటకశాల ఖాళీగా ఉంది. సుబ్బారావు హిందీలో నాటకం రచించి భారతీయులతో ప్రదర్శింపజేశాడు. ఇదే వారి ప్రథమ రచన. ఆ నాటక ప్రతి ఎక్కడో పోవడం దురదృష్టకరం.

ఇరాక్ నుంచి ఇంటికి తిరిగి రాగానే వనారస గోవిందరావు సురభి నాటక సమాజంతో పరిచయం ఏర్పడింది. వారికి చాలా నాటకాలు రాసి ఇచ్చాడు. ముఖ్యంగా చెప్పుకోతగ్గది స్త్రీ సామ్రాజ్యం. స్త్రీ పాత్రలను ఎక్కువగా పెట్టి రచించిన ఈ నాటకం ఆంధ్ర నాటక రంగం మీద కొంతకాలం రాజ్యం చేసింది.

ఆ తరువాత గుంటూరు స్టాక్ గరల్స్ ట్రైనింగ్ స్కూలులో తెలుగు పండితుడిగా చేరాడు. అక్కడ ఉండగానే అఫిషియల్ డ్రమెటిక్ క్లబ్ సభ్యులకు రోషనార రాసి ఇవ్వడమే గాక, తనే దర్శకత్వం వహించాడు. రోషనార నాటకంతో సుబ్బారావు పేరు దేశమంతా మారుమ్రోగింది. ఆ తరువాత 'బాలమిత్ర సభ' ప్రదర్శించే నాటకాలకు దర్శకత్వం వహించాడు. ఆంధ్రదేశమంతటా పేరుప్రతిష్ఠలు గడించిన సూరిబాబు ప్రభృతులు ఆనాడు సుబ్బారావు శిక్షణలో మెళుకువలు నేర్చుకున్నవారే.

అనంతరం మదరాసు హిజ్ మాస్టర్స్ వారికి రికార్డు నాటక రచయితగా, ప్రయోక్తగా కుదిరి అనేక మంది కళాకారులను వెలుగులోనికి తీసుకు వచ్చాడు. సినిమారంగంలో ప్రవేశించి పేరు గడించుకున్నాడు. చండికకు పాటలు రాశాడు. సంగీతం సమకూర్చాడు. తొలిసారిగా తెలుగు సినిమాలలో ఇంగ్లీషు బాణీ సంగీతం ప్రవేశపెట్టింది ఈయనే. 'భక్తిమాల, తారాశశాంకం, బారిష్టరు పార్వతీశం, పత్ని' సినిమాలకు మాటలు, పాటలు రచించాడు. మదరాసులో ఉండగానే ప్రాచీన భారత భూగోళం మీద పరిశోధన చేస్తుంటే మెచ్చుకుని, కాశీనాథుని నాగేశ్వరరావు గజెట్ ఆఫ్ ఇండియా సంపుటాలు కొన్ని ఈయనకు బహూకరించాడు.

ఆ తరువాత మదరాసు వదలి తెనాలిలో కొంతకాలం నివసించాడు. అక్కడ ఉండగానే ఎం. ఎన్. రాయ్ రాడికల్ డెమాక్రటిక్ పార్టీతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఎం.ఎన్. రాయ్ సిద్ధాంతాల వైపు మొగ్గు చూపాడు. ఆ ప్రభావంతోనే శాస్త్రాలను తు.చ తప్పకుండా అనుసరించడాన్ని అవహేళన చేస్తూ శాస్త్ర దాస్యం అనే గ్రంథం ప్రకటించాడు. ఇక్కడ ఉండగానే నటుడు ఉపయోగార్థం సరికొత్త రీతులలో ప్రదర్శనానుకూలంగా అల్లీముఠా మొదలైన నాటికలను రచించాడు. ఈ నాటికలకు అనుబంధంగా ఈయన చేర్చిన సూచనలు, వ్యాఖ్యలు అమూల్యమైనవి.

1946లో తెనాలి వదలి, విజయవాడలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. నాటి నుండీ విజయవాడను తన కార్యకలాపాలకు కేంద్రంగా చేసుకొని ఎన్నో విజయాలను సాధించాడు. *లిటిల్ థియేటర్* ఉద్యమం నడిపాడు. నాటక గ్రంథాలయం స్థాపించాడు. 'రాఘవ కళా సమితి'ని స్థాపించి, నాటకాలు, నాటికలు ప్రదర్శించాడు. ఇనపతెరలు అనే నాటకం రచించి, ప్రయోగింపజేసి ఆధునిక ప్రయోగ వైఖరిలో కూడా దిట్ట అని పేరు పొందాడు.

ఆంధ్రదేశంలోని ఔత్సాహిక నాటక సమాజాలను, నటులను సమీకరించి ఔత్సాహిక నాటక రంగోద్యమాన్ని, నాటక కళను నిర్దుష్టమైన రీతులలో నడిపించాలనే సంకల్పంతో **1954**లో 'ఆంధ్ర నాటక సంఘ సమాఖ్య'ను స్థాపించాడు. రాజమండ్రిలో జరిగిన ప్రారంభ సభలో అధ్యక్ష పదవి చేపట్టాడు. నాటి నుంచి నాటక సంఘ సమాఖ్య పురోభివృద్ధి కోసం ఎంతో కృషిచేశాడు. **1956** డిసెంబరు ఆఖరు వారంలో నాటక సంఘ సమాఖ్య పక్షాన విజయవాడలో నాటక పాఠశాలను విజయవంతంగా ప్రారంభించి అనేక మంది నటవిద్యార్థులకు నాటక కళను అవగాహన చేసుకోవడంలో తోడ్పడ్డాడు.

కొంతకాలం ఆంధ్రనాటక కళాపరిషత్తుకు కార్యదర్శిగా పనిచేశాడు. నాటక పోటీలు నిర్వహించే విధానం 'మార్కుల షీటు' బహుమతీ నిర్ణయవిధానం ఈయన రూపొందించిందే.

తెలుగుదేశాన్ని గురించి తెలుసుకోవలసిన సమస్త విషయాలను క్రోడీకరించి సీసపద్యాలలో 'తెలుగు దేశం' అనే గ్రంథం రచించాడు. ఇది అముద్రితం.

నిర్యాణానికి ముందు ఈయన ఆంధ్ర నాటక చరిత్రను *ఆంధ్ర నాటక రంగ ప్రవేశిక* అనే పేరుతో రాయనారంభించాడు. అది పూర్తి కాక ముందే కీర్తి శేషులు కావడం ఆంధ్రుల

దురదృష్టం. విభిన్న విషయాలలో ఈయనకు ప్రజ్ఞ ఉన్నా అహోరాత్రులు శ్రమించి జీవితం ధారపోసింది నాటకకళకే. సలహాల కోసం వచ్చే కళాకారులతో కొప్పరపు గృహం కళకళ లాడుతూండేది.

భారత ప్రభుత్వం రూపొందించిన పంచవర్ష ప్రణాళికలను ప్రచారం చేయడానికి సంకల్పించాడు. నాటకాన్ని పరికరంగా ఉపయోగించుకోవాలని మన వూరు, అయిదు చక్రాల బండి అనే నాటకాలు రచించి, ఆంధ్రదేశంలో గ్రామ గ్రామాన ప్రదర్శించాడు.

రోషనార: జాతీయ భావాల ప్రేరణతో 1920 ప్రాంతంలో రచించిన గద్య పద్య గేయాత్మక చారిత్రక నాటకం రోషనార. ఒడలు పులకరింప జేసే కథతో, నెత్తురును ఉడుకెత్తించి దేశభక్తిని ప్రబోధింపజేసే పద్యాలతో విలసిల్లుతూ ఈ నాటకం అశేషఆంధ్ర ప్రజానీకాన్ని కదిలించి లేపింది. ప్రథమ ప్రచురణ 1921. మొట్ట మొదటిగా కొప్పరపు సుబ్బారావు దర్శకత్వంలో గుంటూరు అఫిషియల్ డ్రమెటిక్ క్లబ్బువారు ప్రదర్శించారు. దీనితో కొప్పరపు సుబ్బారావుకు రోషనార సుబ్బారావు అని పేరు వచ్చింది. పద్మశ్రీ స్థానం నరసింహారావుకి అఖండ కీర్తి తెచ్చిపెట్టింది. అలాగే మాధవపెద్ది పేరు శివాజీగా దేశమంతటా మారు మోగింది. దేశభక్తిని ఉద్దీపింపజేసే ఈ నాటకం బ్రిటీష్ ప్రభుత్వాన్ని వణికించింది. ముస్లిం రాకుమారి హిందూ రాజును ప్రేమించినట్టు చూపటం ముస్లింలకు కోపకారణమైంది. ఈ నాటకం బ్రిటిష్ ప్రభుత్వ ఆగ్రహానికీ, నిషేధానికీ గురైంది. తరువాత ఈ నాటకాన్నే జవహారీబాయి అనే పేరుతో కొంతకాలం ప్రదర్శించారు. కాని దానినీ బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది.

రోషనార పాత్రను కొప్పరపు అద్వితీయంగా చిత్రించాడు. తెలుగువారి హృదయసీమలో పీఠం వేసుకున్న పాత్ర రోషనార, రజాక్, దావూద్ పాత్రలు సుబ్బారావు అపూర్వ సృష్టి. శివాజీ పద్యాలు వీరరసంతో కదం తొక్కుతూ దేశభక్తిని ఉద్దీపింపజేస్తాయి. రోషనార పద్యాలు శృంగార రసగుళికలు. నాటి ఆంధ్ర ప్రేక్షక హృదయాలలో నాటుకుపోయాయి.

తారాశశాంకం : శేషం వేంకటపతి శశాంక విజయం శృంగార ప్రబంధం, బూతు ప్రబంధం అనీ, రంకు పురాణం అనీ అప్రతిష్ఠపాలైంది కాని సుబ్బారావు ఆ కథనే తీసుకొని మంచి రంజైన పద్యాలతో రచించి, కీర్తి గడించాడు. ఇది ఆయన దర్శకత్వంలోనే మొదటిసారిగా విజయవాడ శ్రీ రాజ రాజేశ్వరీ నాటక మండలి అద్వితీయంగా ప్రదర్శించింది. నాటి నుండి ఈ సమాజమే అనేక పర్యాయాలు ప్రదర్శించిందంటే ఈ నాటకం గొప్పదనానికి, ఆకర్షణ శక్తికి నిదర్శనం. ఇందులోని సున్నిత హాస్యం, చురుకైన సంభాషణలు, క్లిష్ట సన్నివేశాలు సుబ్బారావు రచనా సామర్థ్యానికి నిదర్శనాలు.

అల్లీముతా : తెలుగులో ప్రజాదరణను ఎక్కువగా చూరగొన్న ప్రప్రథమ గేయ నాటిక, గిల్బర్ట్ సల్లివాన్ ఇంగ్లీషులో రచించిన సంగీత నాటిక పైలెట్స్ ఆఫ్ వెంజెన్స్ ప్రేరణలో 1944లో రచించిన నాటిక. అవినీతిని వెక్కిరిస్తూ బట్ట బయలుచేసే అవహేళన నాటిక. తొలిగా దీనిని 1945లో విజయవాడ ఆంధ్ర ఆర్ట్ థియేటర్ ప్రదర్శించింది. ఔత్సాహిక, విద్యార్థినాటక సంఘాలు దీనిని ఇప్పటికివేయిసార్లు ప్రదర్శించారని తెలుస్తోంది.

నేటి నటుడు చేసిన పాపం : తెలుగు దేశంలోని కుహనా నటులను, నటనను అవహేళన చేస్తూ,అసలైన సిసలైన నటన కుద్దీపనం చేసే వచన నాటిక నేటి నటుడు.

చేసిన పాపం చెపితే పోతుందనే సామెతను ఆధారం చేసుకొని, తమ పాపాలకు హృదయ పరివర్తన పొందకుండా, నిజంగా పశ్చాత్తాపపడకుండా ఉంటూ, పాపపరిహారం పొందాలని యత్నించే వారి గాథ.

లిటిల్ థియేటర్ ఉద్యమం : ఇంగ్లండు, అమెరికా దేశాలలోని లిటిల్ థియేటర్ ఉద్యమ ఆదర్శాలతో సుబ్బారావు 1947లో విజయవాడలో 'తెలుగు లిటిల్ థియేటర్' ఉద్యమం ప్రారంభించాడు. సుప్రసిద్ధ నాటక కళాకోవిదుడు కూర్మా వేణుగోపాల స్వామి ప్రభృతులతో సంప్రదించి ఉద్యమానికి రూపు రేఖలు తీర్చిదిద్దాడు. ఈ ఉద్యమంలో భాగంగా నాటక గ్రంథాలయం స్థాపించి, నాటక రంగానికి సంబంధించిన సాంకేతిక విషయగ్రంథాలు, లక్షణ విమర్శన గ్రంథాలు, తెలుగు,ఇంగ్లీషు భాషల్లోని నాటకాలు అనేకం సేకరించి, నటులు, విమర్శకులు, పరిశోధకులు తమ విజ్ఞానాన్ని పెంపొందించు కోడానికి ఎంత గానో తోడ్పడ్డాడు. అలాగే ఫ్లాష్‌లైట్లు మొదలైన ఖరీదైన సామాగ్రిని తెప్పించి, నాటక సమాజాలకు ఇచ్చి వారి ప్రదర్శనలు విజయవంతం కావడానికి సహకరించాడు. ఈ లిటిల్ థియేటర్ కార్యాలయం ఆయన గృహంలో ఉండడం వల్ల ఆ గృహం ఒక కళాపీఠంగా విలసిల్లింది. ఆ కళాపీఠానికే కాదు, ఆంధ్రనాటక కళాపీఠానికే ఆచార్యులు సుబ్బారావు.

ప్రయోక్త : తెర కట్టడం దగ్గర నుంచి నాటక కళలోని వివిధ శాఖలలో సమర్థులవడం, ఉత్తమ ప్రయోక్తగా బాగా రాణించడానికి అవకాశం కలిగింది, ఆధునిక పద్ధతులతో నాటకాలను ప్రయోగింపజేసే దక్షత కలిగింది.

రోషనార(1921), నూర్జహాన్ (1948), తారాశశాంకం (1948), వసంతసేన (1954), స్త్రీ సామ్రాజ్యం (అముద్రితం), రాణా ప్రతాప్ (అముద్రితం), ఇనప తెరలు వంటి నాటకాలు; అల్లీముతా(1944), చేసిన పాపం(1946), నేటి నటుడు (1946) ఇంకా పలు రేడియో నాటకాలు,

నాటికలు రచించారు. 1957 మే 11 వ తేదీన విజయవాడ రేడియోలో 'నాటక ప్రయోగం - నటుడు' అనే విషయం ప్రసంగించాల్సి ఉంది. ఆ రోజున ఆరోగ్యం ఎలా ఉంటుందోనని మే2న రేడియో స్టేషన్‌కు వెళ్ళి ప్రసంగం రికార్డు చేసి వచ్చాడు. ఆ మరునాడు ఉదయం మన ఊరు నాటకం ప్రదర్శించడానికి ఫిరంగిపురం వెళ్ళి స్టేజీ మీద కూర్చుని తెరను కట్టేస్తూ గుండె ఆగి హఠాత్తుగా కాలధర్మం చెందాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, గుండిమెడ వేంకట (1901-1970) : నటుడు, నాటకకర్త, సద్విమర్శకుడు, కవి, చిత్రకారుడు, ఆదర్శోపాధ్యాయుడు, నవలా రచయిత. ఈయన 1901 జులై 25న విజయనగరం జిల్లా గంజాంలోని ఛత్రపురంలో జన్మించాడు. 'హిందూ' థియేట్రికల్ క్లబ్' కార్య దర్శిగా పనిచేశాడు.

ఛత్రపతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేశాడు. ప్రయోగసౌలభ్యం, సాహిత్య విలువలను మేళవించి నాటకాలు రాసి నటించాడు. నటింప చేశాడు. ఈయన దేశభక్తే నాటక రచనకు ప్రేరకం.

ఈయన నాటకాలన్నింటిలో బహుళ ప్రచారం పొందిన నాటకం ఖిల్జీ రాజ్యపతనం. దీన్ని గురించి 1934లో కృష్ణా పత్రికలో వచ్చిన ఖండన విమర్శలను స్వయంగా ఢీకొని విజయం సాధించాడు.

ఈయనకు ఛత్రపురంలో 1961, ఆగస్టు 20న షష్టిపూర్తి మహోత్సవం బ్రహ్మాండంగా జరిగింది. ఆ సందర్భంలో ఈయన చిత్రాల ప్రదర్శన కూడా జరిగింది. ఆ తరువాత 1969-70లో ఈయన చిత్రించిన నటపితామహ హరి ప్రసాదరావు వర్ణ చిత్రం ఎంతో ప్రశంస పొందింది.

రాణాప్రతాప్ (1927), *మేవాడు పతనం (1930)*, *ఖిల్జీ రాజ్యపతనం (1933)*, *పృథ్వీపుత్రి (1946)*, *దుర్గాదాస్ (1949)* వంటి నాటకాలు రచించిన గుండిమెడ 1970, మార్చి 30న కన్నుమూశాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, గోవిందరాజుల వెంకటు (1895-1959) : రంగస్థల, సినీ నటుడు, నాటక కళావేత్త, నాటక రచయిత. అలోపతీ, హోమియోపతీ వైద్యుడు. తెనాలి రామవిలాస సభ ప్రధాన భూమికాధారి. ఈయన 1895లో జన్మించాడు.

గయోపాఖ్యానంలో సాత్యకిగా కళాయాత్ర ప్రారంభించిన సుబ్బారావు కీర్తిపతాక యుగంధర పాత్రాభినయంతో నింగిని తాకింది. వచనానికి 'వన్స్ మోర్' కొట్టించుకున్న ఏకైక నటవీరుడు గోవిందరాజుల సుబ్బారావు.

తెనాలి టౌన్ హైస్కూల్‌లో 5వ ఫారం చదువుతూండగా పాఠశాల వార్షికోత్సవంలో మర్చెంట్ ఆఫ్ వెనీస్ ఆంగ్ల నాటకంలో నటించాడు. పాత విద్యార్థి సంఘ వార్షికోత్సవ సందర్భంలో *గయోపాఖ్యానంలో* సాత్యకి, భీముడు పాత్రలతో ఈయన నటజీవితం ప్రారంభమైంది.

మద్రాసు వెళ్ళి వైద్యం చదివాడు. శస్త్ర చికిత్సలో ప్రావీణ్యం సంపాదించాడు. ఆఖరి పరీక్షలు పూర్తయిన తరువాత పేరిగాడు, యుగంధరుడు వేషం అతి చాకచక్యంగా నిర్వహించి, ప్రతాపరుద్రీయం నాటకకర్త వేదం వేంకటరాయ శాస్త్రి మెప్పు పొందాడు.

తెనాలిలో వైద్య వృత్తి ప్రారంభించి, 'రామ విలాస సభ'లో ప్రధాన భూమికలలో నటిస్తూ సవ్యసాచిలా వ్యవహరించాడు. కృష్ణా, గోదావరీ మండలంలో మొట్టమొదటిసారిగా ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం నాటకాలు ప్రదర్శించి వాటికి ఎంతో ప్రచారం గావించాడు. ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం నాటకాలకు సుబ్బారావు వల్ల పేరు వచ్చిందా లేక ఈ నాటకాల వల్ల ఈయనకు పేరు వచ్చిందా అనేది నేటికీ తీరని సమస్యగా మిగిలిపోయింది.

ఆ తరువాత తెలుగు సినిమారంగంలో ప్రవేశించి 'మాలపిల్ల, బాలనాగమ్మ, లక్ష్మమ్మ, షావుకారు' మొదలైన చిత్రాలలో నటించి అఖండ కీర్తి నార్జించాడు. సుబ్బారావు విజ్ఞానశాస్త్రం అధ్యయనం చేసి 'ఇనార్గానిక్ ఎవల్యూషన్' అనే గ్రంథం రచించి సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు.

చాటువు, గిరీశం మొదలయిన నాటకాలు రచించాడు. వాల్మీకి రామాయణం మీద పరిశోధన వ్యాసాలు రాశాడు. ఈయన ఆంధ్ర నాటక కళా పరిషత్తు నాల్గవ మహాసభలకు అధ్యక్షత వహిస్తూ ప్రసంగించిన గంభీరోపన్యాసం నేటికీ కళాభిమానులు అధ్యయనం చేయదగ్గ ప్రసంగ వ్యాసం.

సుబ్బారావును ఆంధ్ర నాటక కళా పరిషత్తు సన్మానించింది. రంగస్థల, సినీ రంగాలలో 40 సంవత్సరాలకు పైగా పనిచేశాడు. సాత్యకి, భీముడు, యుగంధరుడు, పేరిగాడు, గిరీశం, బంట్రోతు, కరటక శాస్త్రి, అసిరిగాడు, లుబ్ధావధానులు, పోలిశెట్టి,

బుస్సీ, రాజరాజనరేంద్రుడు, లక్ష్మణుడు,అంగరాజు (వేనరాజు) మొదలైన పాత్రలలో నటించిన సుబ్బారావు 1959, అక్టోబరు 9న మరణించాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, డి.వి (1894-1960) : ప్రముఖ నటుడు. ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ అధినేత. ప్రధాన పాత్రధారి. నటరాజశేఖర బిరు దాంకితుడు. ఈయన కృష్ణాజిల్లా గూడూరులో 1894లో జన్మించాడు. పెరిగింది మచిలీ పట్టణంలో.

గుంటూరులో నిర్వహించిన సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన పోటీలలో సత్యహరిశ్చంద్ర పాత్ర స్వర్ణ పతకం గెలుచుకున్న నటుడు. నవరసాలను ఒప్పించగల కళావేత్త. గుంటూరు పట్టణ పౌరసత్వం పొందిన ప్రప్రథమ నటుడు.

ఆజానుబాహువు కాకపోయినా రాజవేషానికి తగిన కాయం, భావం ద్యోతకం చేయడానికి అనువైన విశాలనేత్రాలు, కమ్మని కంఠం, కళాభినివేశం, ఉత్సాహం, పట్టుదల, సద్గుణ సంపత్తి ఈయనకు మహానట గౌరవం తెచ్చిపెట్టాయి.

తొలిసారిగా నాటక రంగం ప్రవేశం బందరు భువన రంజనీ థియేటర్‌లో ధనాభిరాయ నాటకంలో సామాన్య చెలికత్తె వేషంతో ప్రారంభమై, వింధ్య రాజు వేషంతో పరాకాష్టకు చేరుకుంది డి.వి. కళా జీవితం.

భువనరంజనీలో 1905 ప్రాంతంలో ప్రవేశించాడు. నాడు నటన ద్వారా జీవనోపాధి గడిపే కాలం కాదు. పోనీ ప్లీడరు గుమాస్తాగా చేరుదామని ఓ ప్లీడరు దగ్గరికి వెళితే, నువ్వు నాటకాల్లో వేషాలు వేస్తున్నావు గనుక గుమాస్తాగా పెట్టుకోనన్నారట. కాలం మారింది. ఆదిలో ప్లీడరు గుమాస్తా పనికి అర్రులు చాచిన డి.వి. సుబ్బారావు ఒక పేరున్న నాటక సమాజానికి అధిపతి అయ్యాడు.

ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ అధినేత బ్రహ్మానందం ఈ నటుని శక్తి సామర్థ్యాలు, మహా నట లక్షణాలు కనిపెట్టి సంస్థలోకి ఆహ్వానించాడు. దాంతో తన నటనా కౌశల్యం చూపి, ఆంధ్ర నాటక రంగంలో వీరవిహారం చేసే మహదావకాశం లభించింది.

1914లో బందరులో చిత్రనళీయం నాటక పోటీలలో ఇండియన్ డ్రమెటిక్ కంపెనీకి ఉత్తమ ప్రదర్శన బహుమానం, సరస్వతీ విగ్రహం లభించింది. దానితో ఇండియన్ డ్రమెటిక్ విజయ పతాక రెపరెపలాడి, డి.వి. జైత్రయాత్రకు నాందీ గీతం పాడింది.

1917 గుంటూరులో సత్యహరిశ్చంద్ర నాటకాల పోటీ భేరి మోగింది. బి.టి రాఘవాచార్యులు శిక్షణ కింద డి.వి. సుబ్బారావు సానతీరి కత్తిలా, గుంటూరు నాటక స్థలిలో హరిశ్చంద్ర వేషంలో ప్రత్యక్ష మయాడు. చిత్రమేమంటే మొదట్లో సుబ్బారావు చంద్రమతి వేద్దామనుకున్నారట. ఆచార్యులు ఆ వేషం మాన్పించి హరిశ్చంద్ర వేషం కట్టించాడు. హరిశ్చంద్ర వేషానికి పెద్దపేరు సంపాదించుకుని ఆంధ్రనట పితామహుడు బిరుదు పొంది కాలికి గండపెండేరం వేయించుకున్నాడు. నాటి నుంచి ఇంచుమించు మరణించే వరకు అపజయమంటూ ఎరుగడు. పెద్ద పెద్ద సమాజాలు ఎక్కువ జీతం ఇస్తాం రమ్మని ఎన్నో విధాల ప్రలోభ పెట్టినా చివరి క్షణం వరకు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీని వదలలేదు. అది ఆయన నియమం. నటుడు, నాటక సమాజం ఈ రెంటికీ విడదీయరాని సంబంధం ఉందని ఆయన నమ్మకం. నటుడు సమాజాన్ని, సమాజం నటుడిని నమ్ముకుని ఉంటే ఉభయ తారకంగానూ ఉంటుంది. నాటక ప్రదర్శనలు కడు రమ్యంగా ఉంటాయి. తాత్కాలిక లాభం చూసుకొని నటుడు నాలుగు రోజులకో సమాజం మారిస్తే ఆ నటుడుకీ, సమాజానికీ భవిష్యత్తు ఉండదు. ఇంకో సమాజంలో వేషం వేయనని డి.వి. కఠిన నియమం పెట్టుకున్నాడు.

అలాంటి నియమాలు వారికి ఇంకా ఉన్నాయి. ప్రకటించిన వేళకు సరిగా తెర ఎత్తవలసిందే. అలాగే జీవితాంతం సాగించాడు. నాటకం కాంట్రాక్టుకు ఈయగానే అచ్చువేయించవలసిన కరపత్రం రెండు కాపీలు రాసి ఒక కాపీ కాంట్రాక్టరు కిచ్చి, తన కాపీ మీద అతని చేత సంతకం చేయించుకునే వారట. ఆ రాసిన దానికంటే ఒక్క అక్షరమైనా అచ్చు కరపత్రంలో కనపడడానికి వీల్లేదు. ఒకమారు కాకినాడలో నాటకం కంట్రాక్టరు సంతకం చేసి, డి.వి. సుబ్బారావు వింధ్యారాణి సినిమాకి వెళ్ళిపోతున్నాడు, ఇదే ఆఖరి ప్రదర్శన అని అచ్చు వేయించాడట. బందరులో ఉన్నవారికి ఈ గొడవేం తెలుసు. కాకినాడ వెళ్ళి తెర ఎత్తబోయే ముందు ఆ హాల్లో కరపత్రం కంటపడింది. అంతే తెర ఎత్తనీయలేదు. నాటకం ఆపుచేశాడు. చివరికి కంట్రాక్టరు డి.వి.కి, ప్రేక్షకులకు క్షమాపణ చెప్పుకున్న తరువాత రాత్రి 12గంటలకు నాటకం ఆడారట. వేళకు తెర ఎత్తక పోవడం అదే మొదటి సారి, అదే ఆఖరిసారి.

1925 నాటికే డి.వి. సుబ్బారావుకు పింగళి నాగేంద్రరావు సాహచర్యం లభించింది. నాగేంద్రరావు నాటక రచనలో సిద్ధహస్తుడు. పైగా వ్యవహారదక్షుడు. డి.వి. నాగేంద్రరావుని సమాజానికి కార్యదర్శిని చేశాడు. నాగేంద్రరావు కుడిభుజంగా

డి.వి. నాయకత్వాన ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ 1946 వరకు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది.

నాగేంద్రరావు రచన, సుబ్బారావు నటన, పరస్పరం వన్నె తెచ్చి, ప్రేక్షకుల మనసులను చూరగొన్నాయి.

పావురాయి పల్టీలు లేకుండా పద్యం సుబోధకంగా విడమర్చి, భావయుక్తంగా చదవడానికి ఒరవడి పెట్టింది కూడా డి.వి. సుబ్బారావే. ఎంత దీర్ఘ సమాసంతో కూడిన పద్యమైనా చదువుతూంటే వేమన పద్యంగా తయారయేది. సత్యహరిశ్చంద్ర, చంద్రహాసం, నారాజు, చిత్రనళీయం లో వారి పద్య పఠన రీతి ఎక్కువగా గోచరిస్తుంది.

పఠాన్ వేషంలో అభినయించి, కరుణ రసమే కాదు, రౌద్ర బీభత్సరసాలను కూడా అభినయించగల జగజ్జెట్టి అనిపించుకున్నాడు.

నాటకసమాజ పాలనలో ఈయన చూపెట్టిన చాకచక్యం ఆదర్శప్రాయం. లక్షలాది పెట్టబడితో ప్రారంభమైన నాటక సమాజాలు దిక్కుమొక్కు లేకుండా పోయాయి. కాని సుబ్బారావు, నాగేంద్రరావుల వ్యవహారదక్షత మూలంగా ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ ఒడుదుడుకులు లేకుండా అవిచ్ఛిన్నంగా 40 సంవత్సరాల పాటు ఆంధ్ర నాటకరంగం మీద రాజ్యం చేసింది. ఆంధ్ర దేశం మొత్తంలో ఇంతకాలం నిలబడ్డ నాటక సమాజం ఇదొక్కటే.

చంద్రమతి, చెలికత్తె (ధనాభిరామం), పార్వతి (చంద్రకాంత), భానుమతి, సుగుణమణి, బుద్ధిమతి వంటి స్త్రీ పాత్రలతో బాటు హరిశ్చంద్రుడు, నలుడు, బాహుకుడు, పట్టాభి, దుష్ట బుద్ధి, గోవింద సింగ్, వింధ్య రాజు, విశ్వపతి, తిమ్మరసు (నారాజు), శకారుడు, అర్జునుడు (గయోపాఖ్యానం), శ్రీకృష్ణుడు (పాండవోద్యోగవిజయాలు), చాణక్యుడు, పృథ్వీరాజు, చిన చంద్రకాంతుడు (చంద్రకాంత), అక్షయ కుమారుడు, మణిభద్రుడు, భగదత్తుడు, శ్రీకృష్ణుడు (ప్రసన్నయాదవం), జయద్రథుడు (గులేబకావళి), విజయరామరాజు, చెలికాని వెంకయ్య, దుర్గాదాసు (రసపుత్ర విజయం), గోపీచంద్, నందుడు, శ్రీకృష్ణుడు (సాత్రాజితీయం), శ్రీరాముడు-లక్ష్మణుడు (లవకుశ), కంసుడు, వసుదేవుడు,సోమశేఖరుడు, సత్యవంతుడు, సారంగధరుడు, రాజరాజు, బుద్ధి సాగరుడు, భవానీ శంకరుడు, మదనుడు (మదనవిజయం) మొదలైన పురుష పాత్రలలో నటించిన డి.వి. 1960 జనవరి 7న కన్నుమూశాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, తోలేటి వెంకట (1875-1940): తెలుగు నాటకకర్త, పండితుడు. రాజమండ్రి హిందూ నాటక సమాజాధినేత. ఈయన రాజమండ్రిలో 1875లో జన్మించాడు. ఇమ్మానేని హనుమంతరావు నాయుడు కోరిక మీద సత్యహరిశ్చంద్ర (1899) నాటకం కేవలం వచనంలో రాసిచ్చాడు.

1912లో ఆంధ్ర శాకుంతల విమర్శనము, చిత్రనళీయం నాటక ప్రదర్శనలకు సంబంధించి రెండు విమర్శక వ్యాసాలు రచించి ప్రచురించాడు. ఈయన 1940లో మరణించాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, దొప్పలపూడి (జ. 1934): రంగస్థల నటుడు. తెలుగు నాటకరంగంలో అటు స్త్రీ పాత్రలలోను, ఇటు పురుష పాత్రలలోను అభినయ పటిమను సమానస్థాయిలో ప్రదర్శించి పేరు తెచ్చుకున్న కళాకారుడు. గుంటూరు జిల్లా, వేమూరు మండలం, పెనమర్రు గ్రామంలో వియ్యన్న, వెంకట్రావమ్మ దంపతులకు 1934, నవంబరు 1న జన్మించాడు.

బాల్యంలో పండుగల సందర్భంలో ప్రదర్శించే వీధి భాగవతాలను, నాటకాలను చూసి ప్రేరణ పొందిన సుబ్బారావు తన 15వ ఏట గుంటూరు ప్రభుత్వ కళాశాలలో టీచర్ ట్రైనింగ్ పొందుతున్న సమయంలో ప్రిన్సిపాల్ లక్ష్మీపతి ప్రోత్సాహంతో ఒక సాంఘిక నాటికలో సిఐడి పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేశాడు. తొలిప్రదర్శన అందించిన మధురానుభూతి, ప్రశంసలు ఆలంబనగా అటు ఉపాధ్యాయ వృత్తి చేస్తూ, ఇటు నటనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ కళారంగంలో తన స్థానాన్ని స్థిరపరచుకున్నాడు. రూపంలో సౌకుమార్యం, స్వరంలో లాలిత్యం సుబ్బారావు స్త్రీ పాత్ర పోషణకు జీవధాతువులుగా నిలవడంతో ఈయన రంగస్థల జీవిత ప్రథమార్థమంతా దాదాపు స్త్రీ పాత్ర ధారణతోనే సాగిపోయింది. ప్రముఖ రంగస్థల దర్శకుడు ముక్కామల రాఘవయ్య దగ్గర అభినయంలో శిక్షణ, ప్రముఖ హార్మోనిస్టు శనగవరపు శ్రీరామమూర్తి వద్ద పద్య పఠనంలో పాఠాలు నేర్చుకున్నాడు.

ఐదారు దశాబ్దాల నటజీవితంలో అనేక పద్య నాటకాల్లో నటించాడు. సమ్రాట్ పృథ్వీరాజ్ లో రాణీ సంయుక్తగా, వేమూరి గగ్గయ్య మహారథి కర్ణ లో కుంతి, పరశురాముడుగాను, నర్తనశాల లో బృహన్నల గాను, నారద సంసారం లో గంగు గాను నటించి సామాజికుల అభిమానాన్ని చూరగొన్నాడు. వేంకటేశ్వర మహాత్మ్యం, రామాంజనేయ యుద్ధం, వేమన యోగి, మహామంత్రి తిమ్మరుసు, పాండవోద్యో

విజయాలు, బుద్ధం–అశోకం మొదలైన నాటకాల్లో వైవిధ్యమున్న పాత్రలలో నటించాడు. పీసపాటి, రఘురామయ్య, షణ్ముఖి, ధూళిపాళ, తుర్లపాటి, ఎ.వి. సుబ్బారావు, టి. రామకృష్ణ శాస్త్రి వంటి రంగస్థల దిగ్గజాల సరసన నటించిన అనుభవాన్ని పండించుకున్నాడు. డెబ్బయేళ్ళు పైబడినా నటరాజు సేవలో నిమగ్నమై ఉండటం విశేషం.

మన్నెశ్రీ

సుబ్బారావు, నిడుముక్కల (1896-1968) : రంగస్థల నటుడు. మైలవరం బాలభారతి నాటక సమాజంలో ప్రధాన పురుష పాత్రధారి. రంగ భూషణ, నాట్య విశారద బిరుదాంకితుడు. ఈయన 1896 మార్చి 10న విజయవాడలో జన్మించాడు.



మొట్టమొదట బందరు 'చిత్రకళాభివర్ధని' సమాజంలో బాలవేషాలలో నటించి తరువాత మైలవరం కంపెనీలో చేరి అఖండ ఖ్యాతి గడించాడు.

శ్రీకృష్ణుడు, గయోపాఖ్యానంలో అర్జునుడు, శిశుపాలుడు, అశ్వనీ దేవత (సుకన్య), భీష్మ, బబ్బిలి రంగారావు, జలంధరుడు, బిల్వమంగళుడు, ఖడ్గ నారాయణుడు, మన్మథుడు (అనసూయ), శ్రీ రాముడు, భరతుడు, నారదుడు, గిరిరాజు (చండిక), క్రూరసేనుడు మొదలైన పాత్రలలో నటించి పేరు తెచ్చుకున్నాడు. చివరి దశలో ఏలూరులో లారీ నడిపిస్తూ 1968, ఏప్రిల్ 17న కాలధర్మం చెందాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, నూతలపాటి (జ. 1943) : నటుడు, దర్శకుడు, రసమయి సంస్థ స్థాపకుడు. నటనను పవిత్ర యజ్ఞంగా భావించిన అతి కొద్దిమంది నటులలో ప్రముఖుడొకడు. ఈయన 1943 జనవరిలో బాపట్ల సమీపంలోని చెర్వు జమ్ముల పాలెంలో జన్మించాడు. తల్లి దండ్రులు సావిత్ర్యమ్మ, ఆదిశేషయ్యలు. హైస్కూలు విద్యతో ఆగిపోయిన సుబ్బారావు పల్లెల్లో ప్రదర్శించే నాటకాలను చూసి నటన పట్ల అభిమానాన్ని పెంచుకున్నాడు. ఆ అభిమానం తరువాత కాలంలో వృత్తిగా మారింది. సుబ్బారావు 20వ ఏటనే కొడాలి గోపాలరావు రచించిన ఛైర్మన్ నాటకంలో ఛైర్మన్ పాత్ర ద్వారా రంగస్థలానికి పరిచయమయ్యాడు. శ్రీకృష్ణ రాయబారంలో శ్రీకృష్ణుడు, బబ్బిలి యుద్ధంలో విజయరామరాజు పాత్రలు సుబ్బారావుకు కీర్తిని తెచ్చిపెట్టాయి.



నటనను వృత్తిగా స్వీకరించాలనే తపనతో నటనలోని మెళుకువలు నేర్చుకోవడానికి నాటకరంగంలో లబ్ధప్రతిష్ఠులైన ఎ.శివ రామిరెడ్డిని ఆశ్రయించాడు. నటనాలయంలో నాగభూషణం పాత్రలో నటించి, అవార్డును అందుకున్నాడు. రాజీనామా, సుడిగాలి, వలయం, ఉలిపికట్టె లలో నటించాడు. సుబ్బారావు నటించిన ప్రదర్శనలను చూసిన కొర్రపాటి గంగాధరరావు కళావనిలో సభ్యత్వమిచ్చాడు. తను రచించిన నాటకాలలో ప్రధానపాత్రలిచ్చి పరిణతి నటుడుగా తీర్చిదిద్దాడు. కొర్రపాటి గంగాధరరావు రచించిన ఆరని పారాణిలో మధుసూధనం, కొత్తచిగురులో గోపి, బాయి భజరంగ్‌లో భజరంగ్, లోక సంగ్రహంలో షావుకారు, ఆఫీసర్, యథాప్రజా తథారాజాలో దండధరం పాత్రలలో రాష్ట్రంలోను, రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలతో పాటు అవార్డులు అందుకున్నాడు.

సుబ్బారావు స్వగ్రామంలో 'రసమయి' సంస్థను స్థాపించి స్వీయ దర్శకత్వంలో ఆ ఉదయం ఎప్పుడో లో విలన్, ఆడది కోరే మగాడులో విలన్, పులీ! మేక లస్తున్నాయి జాగ్రత్తలో రాజశేఖరం, ఫణి భూషణరావు పాత్రలలో నటించాడు. దర్శకుడుగా పేరు తెచ్చుకున్నాడు. వివిధ నాటక సమాజాలు నిర్వహించిన నాటక పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించాడు. చలన చిత్రరంగంలో ప్రవేశించి కొన్ని చిత్రాలలో విలన్ పాత్రలను ప్రతిభావంతంగా నటించాడు. ప్రతినాయకుని పాత్ర నటనలో విలక్షణ శైలి చూపి ఎందరికో అభిమాన నటునిగా మారిన సుబ్బారావుకు ఇటీవల దురదృష్టవశాత్తు ఒకకాలు పోయింది. నటించాలనే తపన ఉన్న సుబ్బారావుకు అంగవైకల్యం అడ్డురాలేదు. కృత్రిమ కాలును అమర్చుకుని రంగస్థలంపై నటించి నటనకు అంగవైకల్యం అడ్డుకాదని చెప్పిన కళారాధకుడు సుబ్బారావు.

మన్నె శ్రీ.

సుబ్బారావు, పామర్తి (1922-2004): నటుడు, దర్శకుడు, ప్రయోక్త. స్వస్థలం గుడివాడ. శ్రీరాములు, మాణిక్యాంబ దంపతులకు 1922 సెప్టెంబర్ 8న జన్మించాడు. కష్టాలు కన్నీళ్ళు జీవన యానంలో అంతర్భాగమై వెంటాడినా, పామర్తి నటజీవితానకి అవి ఎన్నడూ అడ్డుగోడలు కాలేక పోయాయి. చదవిన చదువు అంతంత మాత్రమే అయినా,

మున్సిపాలిటీలో దొరికిన చిరుద్యోగం జీవనాధారంగా నిలిచి కొసవరకూ కాపాడింది.

పామర్తి సుబ్బారావుకు చిన్నప్పటి నుంచి నాటక ప్రదర్శనల పట్ల ఆసక్తి ఎక్కువ. ఈ అభిమానమే తరువాతి కాలంలో నటుడ్ని చేసింది. గుడివాడ పట్టణం సాంస్కృతిక కార్యక్రమాలకు నెలవు. జాతీయోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులలో అనేకమంది కళాకారులు సాంస్కృతిక రంగం ద్వారా దేశసేవ చేయడానికి సమాయత్తమయ్యారు. ఈ విధంగా స్ఫూర్తిపొందిన కళాకారులలో పామర్తి ఒకరు. కళారంగం పట్ల ఆసక్తి చూపుతున్న ఔత్సాహిక కళాకారులైన సూరపనేని ప్రభాకరరావు, హెచ్.వి. చలపతిరావు, దాసరి తిలకం, పువ్వుల అనసూయ మొదలైన వారితో కలిసి నాటకాలు ఆడటం మొదలుపెట్టారు. 'తెలుగుతల్లి' నాటకాన్ని చేపట్టి విస్తృతంగా ప్రదర్శించారు. 1939లో తెలుగుతల్లి నాటకాన్ని విజయవాడలో ప్రదర్శించినప్పుడు తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి ముగ్ధులై పామర్తికి 'హాస్యరత్న' బిరుదు ప్రదానం చేసి ఆశీర్వదించారు. తొలినాళ్లలో పామర్తి హాస్యపాత్రలవైపు మొగ్గు చూపినప్పటికీ ఆయన హాస్యపాత్రలకే పరిమితం కాలేదు. తదనంతర కాలంలో 'సీరియస్ రోల్స్' వైపు దృష్టిసారించాడు. గంభీర పాత్రలలోనూ కృతకృత్యులయ్యాడు అనడానికి ఆయన ధరించిన 'పల్లెపడుచు'లో గంగులు పాత్ర 'సుల్తానీ'లో పరమానందం, 'ఎవరు దొంగ'లో దొంగ వంటి పాత్రలే సాక్ష్యం. పామర్తి హాస్యరసంతో గిలిగింతలు పెట్టడమే కాదు, కరుణరసాన్ని చూపి ప్రేక్షకులకంట తడిపెట్టించడంలోనూ సమర్థుడనే సత్యాన్ని ధృవపరుస్తాయి.

ప్రారంభదశలో బబ్బిలియుద్ధం, సత్యహరిశ్చంద్రీయం, మహాకవి కాళిదాసు, చంద్రగుప్త రంగూన్ రౌడీ మొదలైన పద్య నాటకాలనే ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాడు. పామర్తితో కలిసి పలు నాటకాలలో నటించిన సహనటుడు సూరపనేని ప్రభాకరరావు హఠాన్మరణం పామర్తిని బాధకు గురిచేసింది. తన నాటక సమాజానికి 192లో శ్రీ ప్రభాకర నాట్యమండలి అని నామకరణం చేశాడు. ఆ సమాజం నేటికీ వర్ధిల్లుతూ నాటక ప్రదర్శనలు ఇస్తూ వుంది. పామర్తి కాలానుగుణంగా 1944 నుంచి సాంఘిక నాటకాలవైపు దృష్టి నిలిపాడు. పినిశెట్టి శ్రీరామమూర్తి రచించిన 'పల్లెపడుచు' నాటకంలో గంగులు పాత్ర అద్భుతంగా పోషించాడు. కొన్నాళ్ళు పినిశెట్టి బృందంతో కలిసి నాటకాలలో నటించాడు. శ్రీరామమూర్తి సినిమా రంగానికి వెళ్ళిపోవడంతో పల్లెపడుచు నాటకాన్ని విస్తృతంగా ప్రదర్శించి ఆ నాటకానికి విశేష ప్రాచుర్యం తెచ్చిపెట్టిన ఘనత పామర్తికే దక్కుతుంది. పల్లెపడుచు నాటకాన్ని మద్రాసులో ప్రదర్శించినపుడు అప్పటి మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.వి. రాజమన్నార్ పామర్తిని ఘనగా సన్మానించాడు.

క్రమంగా ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలపై ఆసక్తి కలిగింది. 1951లో తెనాలిలో జరిగిన పోటీలలో ఆత్రేయ రచించిన ఎవరు దొంగ నాటికను ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనకు, నటనకు బహుమతులందుకున్నాడు. ఆ రోజుల్లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీలకు ఒక నాటకం లేదా ఒక నాటిక ఎంపిక కావడం అంటే ప్రతిష్ఠాత్మకమైన విషయం. అలాంటిది వరుసగా మూడు నాటికలు ఎంపిక కావడం విశేషం. పామర్తి ఇల్లు నటీనటులకు శిక్షణశిబిరంగా ఉండేది. పామర్తి చేపట్టిన ఏ నాటకానికైనా నెలల తరబడి రిహార్సల్స్ జరిగేవి. కైకాల సత్యనారాయణ, పుష్పకుమారి, రేడియో ఏకాంబరం, జాలాది రాజారావు, జి.వి. ప్రసాదరావు, నిర్మల, హేమలత, అమ్ముల పార్వతి వంట నటీనటులు పామర్తి శిక్షణలో తొలి పాఠాలు నేర్చుకొని తమ ప్రతిభా పాటవాలకు మెరుగులు దిద్దుకున్నవారే! ఆరు స్త్రీ పాత్రలున్న 'చావకూడదు' నాటికను ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ప్రదర్శించి ఉత్తమ నటి, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతులకు ఎంపికయ్యాయి. పామర్తి సాహసానికి ఎంతో ఆశ్చర్యపోతూ గరికపాటి రాజారావు ప్రశంసల వర్షం కురిపించాడు.

ఈ నాటికలన్నీ ఒక ఎత్తయితే సుబ్బారావు సారథ్యంలో ప్రదర్శితమైన 'సుల్తానీ' నాటిక ఒక ఎత్తు. వేలూరి శివరామశాస్త్రి రచించిన రేడియో నాటికను రంగస్థలానికి అనుగుణంగా మలిచి పామర్తి తిరగతోడి రాశాడు. 1961లో నాటక కళాపరిషత్తులో 'సుల్తానీ' నాటికను మనోజ్ఞంగా ప్రదర్శించడం, దానికి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ దర్శకత్వం బహుమతులు గెలుచుకోవడం జరిగింది. సుల్తానీ పామర్తి నట జీవితంలో ఒక మైలురాయి.

నాటక రంగ వికాసం కోసం అహర్నిశలూ శ్రమించిన పామర్తిని ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్ఠాత్మక కళాసంస్థలెన్నో సన్మానించాయి. 1991లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసాంస్కృతికశాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్తంగా సన్మానించి 'గౌరవ పురస్కారం' అందించాయి. 1993లో

అక్కినేని కళాపీఠం, 1994లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు, 1997లో అంబేద్కర్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు, కళాజగతి రంగస్థల అవార్డు, 1999లో శ్రీకళానికేతన్ (హైదరాబాద్) జూలూరి వీరేశలింగం కల్చరల్ అవార్డు వంటి ఎన్నో అవార్డులు పామర్తిని వరించాయి.

నాటకాన్ని ఒక పవిత్ర యజ్ఞంగా భావించి దానికోసం ఒక జీవిత కాలాన్ని వెచ్చించిన ఋషితుల్యుడు పామర్తి. గుడివాడ పౌరులు సుబ్బారావు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. పురపాలక సంఘం, పామర్తి నివసించిన వీధికి 'పామర్తి సుబ్బారావుగారి వీధి' అని నామకరణం చేయడం పామర్తి కీర్తి సౌధానికి మరింత వన్నె తెచ్చే మహాత్కార్యం. కళారంగానికి అత్యుత్తమ సేవలు అందించిన 'నటప్రభాకరుడు' 2004 జనవరి 28న నటరాజులో ఐక్యమయ్యాడు.

గం.సు.రె

సుబ్బారావు, పారుపల్లి (జ. 1897) : స్త్రీ పాత్రధారి. సంగీత విద్వాంసుడు, ఈయన 1897లో విజయవాడలో జన్మించాడు. 1908లో మొట్టమొదటగా బందరు బాల భారతి సంఘం రసపుత్ర విజయం నాటకంలో విమల పాత్రలో నటించాడు. ఆ తరువాత మద్రాసు 'సుగుణ విలాస సభ'లోను, విజయవాడ మైలవరం కంపెనీలోనూ, ఏలూరు వెూతే వారి కంపెనీలోనూ నటించి ఎంతో ఖ్యాతి గడించాడు.

సాత్త్వికాభినయంలో మేటి. శ్రావ్యమైన గొంతు. అన్నగారు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య వద్ద సంగీతం అభ్యసించాడు. బాలగంధర్వ గానాన్ని గ్రామఫోన్ రికార్డుల ద్వారా విని నేర్చుకున్నాడు. పానుగంటి లక్ష్మీనరసింహా రావు రచించిన రాధాకృష్ణ లో రాధ వేషం వీరి నటనా వైదుష్యానికి పరాకాష్ట.

రాధ, సుకన్య, కైక, సావిత్రి, చంద్రమతి, రుక్మిణి, రత్నాంగి, లీలావతి, కమలాంబ, దుర్యోధనుడు, రామదాసు మొదలైన పాత్రలలో నటించాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, పుట్టగంటి (జ.1942) : పౌరాణిక రంగస్థల నటుడు. గాయకుడు. లక్ష్మీగణపతి నాట్యమండలి సభ్యుడు. ఈయన 1942 జూన్‌లో గుంటూరు జిల్లా వేమూరులో జన్మించాడు. తల్లిదండ్రులు వెంకట లక్ష్మమ్మ, రాఘవయ్య.

విద్యాభ్యాసం ఎస్.ఎస్.ఎల్.సి. వరకు సాగింది. విద్యార్థి దశలో సమకాలీన నాటకరంగాన్ని అధ్యయనం చేస్తూ, సురభినాటక ప్రదర్శనల వలన అంకురించిన అభినయ కాంక్షకి 1962లో తుమ్మల ఆంజనేయులు శిక్షణలో తెలుగుతల్లి లో నాగేశ్వరరావు పాత్రద్వారా ఓ రూపునిచ్చాడు. అనంతరం సీతారామకల్యాణంలో నారదుని పాత్ర, రాజయోగిలో సిద్ధయ్యపాత్ర పోషించాడు. ఈయన గాత్ర మాధుర్యానికి పరవశించిన వేమూరి రామయ్య తన లక్ష్మీగణపతి నాట్యమండలిలోకి ఆహ్వానించాడు. వేమూరి రామయ్య దగ్గర వాచికాభినయంలో శిక్షణ పొందాడు. రాగాల ఎంపికలో పద్యాలాపనలో స్వయంగానే రూపకల్పన చేసుకొని రాణించాడు. భూకైలాస్‌లో నారదుడు, మహారథి కర్ణలో శల్యుడు, కురుక్షేత్రంలో ధృతరాష్ట్రుడు, నారద సంసారంలో గురవయ్య శెట్టి, జలంధరలో శుక్రాచార్యులు, వాసవీ కన్యకా పరమేశ్వరిలో మంత్రి, గయోపాఖ్యానంలో నారదుడు, అక్రూరుడు, హరిశ్చంద్రలో నక్షత్రకుడు, బుద్ధం–అశోకంలో అజీవికుడు పాత్రలు పోషించి రాణించాడు. ధృతరాష్ట్ర పాత్రకు వీరు పెట్టింది పేరు. షణ్ముఖి, బండారు, పీసపాటి, ఆచంట, ఎ.వి, పృథ్వీ, కె. రఘురామయ్య, వేమూరి రామయ్య వంటి రంగస్థల దిగ్గజాల నుంచి నేటి తరం వరకు ఈ పాత్రను శతాధికంగా పోషించాడు. శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, అశ్వత్థామ, కర్ణుడు వంటి ప్రధాన పాత్రలకు దీటుగా ధృతరాష్ట్రుని పాత్రను తన గాత్ర మాధుర్యంతో నిలిపిన ఘనత వీరిది.

పంచాయితీరాజ్‌లో పదవీ విరమణ చేసినా నాటకరంగంలో విశ్రమించక, నేటి తరానికి సంప్రదాయ పౌరాణిక నాటకాల్లో పద్య పఠనంలో శిక్షణ ఇస్తూ, వేరొక వంక ప్రదర్శనలు ఇస్తూ, తన రంగస్థల జీవితాన్ని ఫలవంతంగా కొనసాగిస్తున్న మేటి నట గాయకుడు పుట్టగంటి.

మన్నెశ్రీ

సుబ్బారావు, బెల్లంకొండ (1902–1952) : నటుడు. న్యాయవాది. పుట్టింది కారంపూడిలో అయినా పెరిగింది నరసారావుపేట లోనే. మొట్టమొదటి వేషం గయోపాఖ్యానం లో శ్రీకృష్ణుడు. పాండవోద్యోగ విజయాలు లో శ్రీకృష్ణ పాత్రధారణలో ఈయన నటన తారాస్థాయినందుకుంది.

చక్కగా పద్యం విడమరచి పాడడం, నాభి దగ్గర నుంచి నాదాన్ని తీసుకురావడం, పద్యంలోని ముఖ్య పాదాన్ని తిరిగి తిరిగి చదవడం ఈయన ప్రత్యేకత.

కృష్ణుడు వేషం మీద మీసాలు పెట్టుకొన్నది ఈయనొక్కడే. అందుకనే ఈయనను మీసాల కృష్ణుడు అనేవారు. శ్రీకృష్ణుని పాత్రకు మీసాలు పెట్టవచ్చా పెట్టకూడదా అనే సమస్యపై

ఆంధ్రదేశంలో తర్జన భర్జనలకు గురి కావడానికి ఈయన మీసాలే కారణం. కృష్ణపాత్ర ఈయనకు అంకితమై పోయింది.

శ్రీ కృష్ణుడు, రాజరాజు, నలబాహుకులు, హరిశ్చంద్రుడు, విజయరామరాజు, పఠాన్ రుస్తుం పాత్రలలో నటించిన బెల్లంకొండ 1952, నవంబరు 21న పరమపదించాడు.

శ్రీ.చ.

సుబ్బారావు, భావరాజు (జ. 1947) : రచయిత, దర్శకుడు, ప్రచార నాటక రంగ విశారదుడు. ఈయన 1947 జులై ఒకటవ తేదీన జన్మించాడు.

నాటక కళా వికాసానికి తన వంతు సహకారాన్ని ఒక విభిన్న మార్గంలో, ప్రత్యేక శైలిలో అందించిన కళారాధకుడు. ప్రచార నాటకాలను ప్రాచుర్యంలోనికి తెచ్చిన ముఖ్యుడు. ప్రభుత్వం అందించే సేవల గురించి, ప్రణాళికల గురించి ప్రజలకు తెలియ చెప్పడమే ఈ ప్రచార నాటికల ధ్యేయం. కేంద్ర ప్రభుత్వం Song & Drama Division (గేయ నాటక విభాగం) లో మేనేజర్‌గా సుబ్బారావు 30 ఏళ్ళు పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాక అనేక రాష్ట్రాలలో సాంగ్ అండ్ డ్రామా డివిజన్‌లో ప్రచార సారథిగా పనిచేసి అటు ప్రభుత్వం నుంచి ఇటు ప్రజలనుంచీ ప్రశంసలందుకున్నాడు.

ప్రచార నాటకాలను జనరంజకంగా ప్రదర్శింప జేయటం కేవలం ఉద్యోగధర్మంగా కాక ప్రజాసేవగా, కళాసేవగా భావించి అంకిత భావంతో కృషి చేశాడు. సామాజిక స్పృహతో ప్రజలలో సామాజికచైతన్యం కలిగించే లక్ష్యంతో కథలు, నాటకాలు, నాటికలు, నృత్య నాటికలు 200 వరకు రాశాడు. కుటుంబ సంక్షేమం, బాల కార్మికులు, గ్రామీణాభివృద్ధి, వయోజన విద్య, మత సామరస్యం మొదలైన పెక్కు సామాజిక సమస్యలను నాటికలుగా, నృత్య నాటికలుగా మలచి దృశ్య మానం చేసి ఆ సమస్యల పట్ల సామాన్య ప్రజలకు సదవగాహన కలిగేటట్టు ప్రచారం చేశాడు. కార్యక్రమంలో పసందైన పాటలను, ఆహ్లాదకరమైన నృత్యాలను మేళవించి కళాత్మకంగా ప్రదర్శించాడు. సుబ్బారావు రచించి స్వీయదర్శకత్వం వహించిన తంగమునిక్కి పరిసు అనే నృత్య రూపకానికి 1992లో జాతీయ పురస్కారం లభించింది.

భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా స్వాతంత్ర్యోద్యమం ఆధారంగా రాసి, స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించిన స్వర్ణోత్సవ భారతి అనే నృత్య నాటిక ప్రముఖుల ప్రశంసలను చూరగొంది. మత సామరస్యంపై రాసిన సద్భావన అనే బాలే ఆరు భారతీయ భాషల్లోకి అనువదింపబడి విస్తృతంగా ప్రదర్శింపబడింది.

ఇవన్నీ ఒక ఎత్తయితే 12 రంగస్థలాలతో ఏర్పాటు చేసిన రూపవాణి కార్య క్రమాలు నాటక ప్రదర్శనలో ఒక కొత్త మలుపు. శ్రీకృష్ణదేవరాయలు, జాతికి ఊపిరి స్వాతంత్ర్యం అనే రూపకాలు ఈయన ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన నూతన ప్రయోగాలు కావటం ప్రశంసార్హమైన విషయం.

సుబ్బారావు 2001లో స్వచ్ఛంద విరమణ చేశాడు. కాని నాటక రంగం నుంచి కాదు.

గం.సు.రె.

సుబ్బారావు, ముత్తరాజు (1888-1922) : ప్రసిద్ధ నాటక కర్త, నాటక సిద్ధాంతవేత్త, చిత్రకళాభివర్ధని స్థాపకుడు. కవి, చారిత్రకుడు. అధ్యాపకుడు. ఈయన 1888 జనవరి 14న నెల్లూరుజిల్లా రాపూరు సమీపంలోని పోతేగుంట గ్రామంలో జన్మించాడు. తండ్రి సుబ్బరామయ్య మూడవ ఏటనే చనిపోయినందువల్ల నెల్లూరు చేరాడు. వి.ఆర్. స్కూలులో మెట్రిక్యులేషన్, చెన్నపురిలో ఎఫ్.ఏ, బి.ఏ, ఎమ్.ఏ పరీక్షలలో ఉత్తీర్ణుడయాడు. ఇంటర్నేషనల్ లా అమాంగ్ ఇండియన్ స్టేట్స్ అనే విషయం మీద ఈయన రాసిన పరిశోధన వ్యాసాలకు మెచ్చి బందరు నోబుల్ కళాశాల ప్రధానాచార్యులు పెన్‌దొర ఆ కళాశాలలో చరిత్రాధ్యాపక పదవి ఇచ్చాడు.

బందరు చేరిన తరువాత చిత్రకళాభివర్ధని సమాజానికి అధ్యక్షుడయ్యాడు. ఈయన చనిపోయిన తరువాత ఈ సమాజమే ముత్తరాజు మెమోరియల్‌గా మారి, నాటకాలాడి ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం చేసింది.

రాజశ్రీ అనే నాటక రచనకు చెన్నపురి సుగుణ విలాస సభ పోటీలలో ప్రథమ బహుమతి లభించింది. లవకుశ నాటకం కూడా అప్పుడు రచించిందే.

నెల్లూరు ఆంధ్రసభ ఉపాధ్యక్షుడిగా ఉన్నాడు. ఈయన నాటకాలలో చాలా భాగం ఈ సభ కోసం రాసినవే. చంద్రగుప్త నాటకం ప్రబంధంగా రాయాలని తలపెట్టి నాటకంగా రాశాడు. బందరు నాటకరంగానికి, నాటక విమర్శకు సూత్రధారుడు సుబ్బారావు. కోలాచలం శ్రీనివాసరావు ప్రకటించిన "నటులకు,

నాటక రచయితలకు విజ్ఞప్తి'' అనే రచన మీద వీరు రాసిన వ్యాఖ్య నాటికీ, నేటికీ నటీనటులు అధ్యయనం చేయదగ్గది.

ముత్తరాజు నాటకాలలో అధిక ప్రచారం, ప్రశస్తి పొందిన నాటకం శ్రీ కృష్ణ తులాభారం (1915). దీనిని ప్రప్రథమంగా నెల్లూరు ఆంధ్ర సభ ప్రదర్శించింది. పద్మశ్రీ స్థానం నరసింహారావు దీనిని చేపట్టడంతో సుబ్బారావుకు అఖండ కీర్తి లభించింది. ఇందులోని పాత్రోల్మీలనం ప్రశస్తమైంది. పద్యాలు మంచి పాకానపడి ఇంటింటా మారుమోగాయి. ఇందులోని ప్రతి పంక్తి రసస్ఫూర్తితో అలరారుతుంటుంది.

శ్రీ కృష్ణ తులాభారం (1922), రాజశ్రీ, కచదేవయాని (1938), రణతిక్కన (1938), చంద్రగుప్త (1972), భక్త మార్కండేయ (1940), లవకుశ, అనసూయ, గిరిజా కల్యాణం (అముద్రితం) నాటకాలు ముత్తరాజు కలం నుండి వెలువడినవే. ముత్తరాజు క్షయవ్యాధితో 1922, సెప్టెంబరు 10న నెల్లూరులో అస్తమించాడు. ఈయన నివసించిన వీధికి పురపాలక సంఘం ముత్తరాజు వారి వీధి అని పేరు పెట్టింది.

శ్రీ.చ.

సుబ్రహ్మణ్యం. జి.వి. (జ. 1935 – 2006) : నటుడు, అధ్యాపకుడు, నాటకకర్త, కవి, విమర్శకుడు, ఈయన 1935 జనవరి 1న ప్రకాశం జిల్లా ఆదిపూడి గ్రామంలో జన్మించాడు. తండ్రి వీరరాఘవయ్య. ప్రాథమిక విద్యను ఆదిపూడిలో, స్కూలు విద్యను పరుచూరులోను పూర్తిచేసి, హైదరాబాదు నిజాం కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి, ఉస్మానియా ఆర్ట్స కళాశాలలో బి.ఏ, ఎం.ఏ., పిహెచ్.డి పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చిరకాలం అధ్యాపక వృత్తిలో ఉండి , హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగాను, డీన్‌గాను, ఎమిరిటస్ ప్రొఫెసర్‌గాను పనిచేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షుడిగా పనిచేశాడు. విమర్శనా రంగంలో అనేక గ్రంథాలు రచించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నాడు. విమర్శకుడిగా నిర్విరామ కృషిచేస్తున్నా నవల, నాటకం, కథలు, కవిత్వం వంటి సృజనాత్మక రంగంలో కూడా కృషిచేసి తనదైన ముద్రను వేసుకున్న వ్యక్తి.



నాటకాలు, నాటికలు, ఏకాంకికలు, శ్రవ్య నాటికలు రచించి జి.వి.ఎస్ రూపకాలు అనే పేరుతో ప్రచురించాడు.

మొత్తం 21 రూపకాలు రచించాడు. వీటిలో పగిలిన గోడలు అనే నాటకం ప్రసిద్ధమైనది. జాతీయ సమైక్య భావం ఇందులో ఇతివృత్తం. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు నాటకోత్సవం పోటీలలో ఉత్తమ నాటకంగా ఎంపికైంది. ఉత్తమ నటుడికి, ఉత్తమ సహాయ నటుడికి బహుమతులు కూడా వచ్చాయి. మానవత్వం అనే ఏకాంకిక విద్యార్థి దశలో రాసినది. మానవత్వమే గొప్పదనీ, అది పశుత్వాన్ని కూడా జయించగలదని ఇందులోని ఇతివృత్తం. కొత్త పిలుపు కేంద్ర ప్రభుత్వ పౌర సంబంధాల శాఖ, దక్షి భారత సంగీత నాటక విభాగం కోసం రూపొందించిన సంగీతరూపకం. ప్రథమాంధ్ర మహాపురాణం, తీరని వాంఛితం, యోగి వేమన, కవి సార్వభౌముడు, భువన విజయం వంటి రూపకాలు సాహిత్య విషయాలను, కవుల ఇతివృత్తాలను రూపకంగా మలిచినట్టివి. సత్యమేవ జయతే నృత్య నాటిక. ఈయన రచించిన రూపక రచనలు ప్రధానంగా ఆదర్శం, సందేశం అందిస్తాయి. ఈ రూపకాలన్నిటిలో కేంద్ర బిందువు మానవుడూ, మానవతే.

సుబ్రహ్మణ్యం నాటక రచయితే కాక, నటుడు కూడా. ముఖ్యంగా భువన విజయం సాహిత్యరూపకంలో తిమ్మరుసు, అయ్యలరాజు రామభద్రుడు, అల్లసాని పెద్దన పాత్రలు వేసినా, తెనాలి రామకృష్ణుడిగా ఆయనకెంతో పేరు వచ్చింది. కవిసార్వభౌముడు రూపకంలో డిండిమభట్టు పాత్ర, ఆంధ్ర మహాభారతావతరణంలో నారాయణ భట్టు పాత్రను, ప్రకాశం పంతులు నాటకంలో వ్యాఖ్యాతగాను వ్యవహరించాడు.

జి.చె.కే.రె.

సుబ్రహ్మణ్యం, తాంగ్రడ : నాటక రచయిత. నివాసం విజయవాడ. పురాణేతి వృత్తాలు గ్రహించి వీర రసాత్మకమైన, ప్రదర్శనయోగ్యమైన నాటకాలు ఎన్నో రచించాడు. 1936లో పతితపావన అనే పేరుతో సంఘ సంస్కరణాత్మకమైన సాంఘిక పద్యనాటకం కూడా రచించాడు. కలియుగవైకుంఠం (వేంకటేశ్వర మహాత్మ్యం), భీమాంజనేయ యుద్ధం (జెండా పై కపిరాజు) 1949లో శ్రీ రామాంజనేయ యుద్ధం, భీమార్జున గర్వభంగం, శ్రీరామరావణ (మహాసాధ్వి మండోదరి), బృందావనం, 1955లో శ్రీ కృష్ణ గారడి,యమాంజనేయ యుద్ధం, 1965లో శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం (హరేరామ హరేకృష్ణ), మొదలైన పద్యనాటకాలు రచించాడు. సి.ఎస్.ఆర్. ఆంజనేయులు ప్రేరణతో సమకాలిక సమాజాభిరుచి శృంగార, కరుణ రసాల నుంచి యుద్ధగాథలకు మారిందని, అందుకే తదనుగుణంగా ఆయా గాధలను నాటకీకరించానని చెప్పుకున్నాడు. వ్యాసభారతంలోనూ, వాల్మీకి రామాయణంలోనూ లేని కొన్ని కల్పనలు ఇతర భాషా సారస్వతాల ఆధారంగా రచించాడు. శ్రీకృష్ణాంజనేయ యుద్ధంలోని గరుడ గర్వభంగం కథకు మూలం మహారాష్ట్ర భారతం ప్రాచీన కవుల పద్యాలు వాడుకోవడం,

సమకాలిక సమాజాన్ని రచనలో చిత్రించి సమస్యలను చర్చించడం తాంఢ్ర ప్రత్యేకత. సంభాషణలు పాత్రోచితంగా వాడుక భాషలో రాశాడు. బద్దిరెడ్డి కోటేశ్వరరావు రచించిన హనుమ ద్రామసంగ్రామానికి ప్రతిగా తాంఢ్ర శ్రీరామాంజనేయ యుద్ధం రచించాడు. అంతేగాక చిలకమర్తి లక్ష్మీనరసింహం గయోపాఖ్యానం నాటకానికి ఛాయగా వెలసిన ఈ నాటకం గయోపాఖ్యాన ప్రభను కొంత తగ్గించిందనడంలో అతిశయోక్తి లేదు. శ్రీరామాంజనేయ యుద్ధానికి సంబంధించిన గ్రామఫోను రికార్డు (పృథ్వీ వెంకటేశ్వర్లు, టి.శ్రీరాములు) కూడా బహుళ జనాదరణ పొందిన విషయం మనకు తెలిసిందే. తాంఢ్ర సుబ్రహ్మణ్యం సినీ రచయితగా కూడా ప్రసిద్ధుడు.

నాగిరెడ్డి.

సుబ్రహ్మణ్యం, వేందాంతం వేంకట: చూ. వేదాంతకవి

సుబ్రహ్మణ్యం, రాయప్రోలు (1894-1960) : నటుడు, దర్శకుడు, ఆంధ్రసభ స్థాపకుడు. 1894లో నెల్లూరులో జన్మించాడు. నెల్లూరు ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్‌లో పనిచేస్తూ ఉండగా నాటక కళమీద అభిరుచి ఏర్పడి, ఉద్యోగానికి స్వస్తిచెప్పి బళ్ళారిలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు స్థాపించిన సరస వినోదినీ సభలో చేరి నటశిక్షణ పొంది, ప్రధాన పాత్రలలో నటించాడు. బళ్ళారి నుంచి నెల్లూరు తిరిగి వచ్చి, 1918లో ఆంధ్ర సభను స్థాపించి యువకులకు నటనలో శిక్షణ యిచ్చాడు. ఆ తరువాత చిత్తూరులో 1922లో రామ విలాససభ వారికి శిక్షణ యిస్తూ, దర్శకత్వం వహించడమే గాక ప్రధాన భూమికలలో నటించాడు. కొంత కాలం తరువాత నెల్లూరు తిరిగి వచ్చి 1960 సెప్టెంబరు 10న మరణించాడు.

నలుడు, బాహుకుడు, హిరణ్యకశిపుడు, అర్జునుడు (ప్రమీల), సారంగధరుడు, ప్రతాపరుద్రుడు, దుష్యంతుడు, రామదాసు, దుర్యోధనుడు, విశ్వామిత్రుడు, బృహన్నల పాత్రలలో నటించాడు.

శ్రీ.చ.

సుబ్రహ్మణ్య శాస్త్రి, కొండుభొట్ల (1852-1897): ప్రథమాంధ్ర నాటకకర్త. కవి, సంస్కృతాంధ్ర పండితుడు. తల్లి వీరమ్మ, తండ్రి గోపాల కృష్ణ శాస్త్రి. ఈయన గుంటూరులో 1852లో జన్మించాడు.

తండ్రి గోపాలకృష్ణశాస్త్రి తెలంగాణాలోని విప్పల మడక అగ్రహారంలో కొంతకాలం ఉన్నాడు. తరువాత ఈయన గుంటూరు జిల్లా కారుమూరు గ్రామంలో స్థిరపడడంతో సుబ్రహ్మణ్య శాస్త్రి మెట్రిక్యులేషన్ వరకు ఇక్కడే చదివాడు. గుంటూరులోని అమెరికన్ ఎవాంజెలికల్ లూథరన్ మిషన్ స్కూల్లో 1884 వరకు, గవర్నమెంట్ హైస్కూల్‌లో 1889 వరకు తెలుగు పండితుడిగా పనిచేశాడు. ఆ తరువాత మదరాసు పచ్చయప్ప కళాశాలలో ప్రధానాంధ్రోపాధ్యాయుడిగా పనిచేశాడు.

1881లో గుంటూరులో తెలుగు పండితులుగా పనిచేస్తున్న కాలంలో ధార్వాడ వారి నాటకాలు చూసి తను కూడా వచనంలోనే నాటకాలు రచించి ప్రదర్శింప చేశాడు. ఆత్మానందం కోసం గుంటూరు హిందూ నాటక సమాజం స్థాపించాడు. ఈ సమాజం ఆంధ్రదేశంలో స్థాపించబడ్డ సమాజాలలో రెండవది అని పరిశోధకుల అభిప్రాయం.

నాటకాలలో నటించడం అగౌరవంగా ఉన్న ఆ రోజులలో శాస్త్రి తన విద్యార్థులతోనే గాక, అన్న కుమారుడు గోపాలకృష్ణయ్యతో కూడా నాటకాలలో నటింపచేసి ఇతరులకు మార్గ దర్శకుడయ్యాడు.

ఈయన రచించిన నాటకాలేవీ అచ్చుకాలేదు. క్రమంగా రాతప్రతులు కూడా అంతరించి పోయాయి. ఈనాడు నాటకరంగంలో ప్రసిద్ధిగాంచిన నాటక కథలలో చాలా భాగం శాస్త్రి ఆనాడే నాటకాలుగా రాసి మార్గదర్శకుడయ్యాడు.

ఈయన నాటకాలలో ద్రౌపదీ వస్త్రాపహరణం తప్ప అన్నీ వచన నాటకాలే. ప్రదర్శనీయత, సౌలభ్యాలను దృష్టిలో పెట్టుకొనే నాటకాలు రచించాడు. ఒక దృశ్యం నడుస్తుంటే ఇంకో దృశ్య సజ్జీవకరణకు వీలుగా రంగాలను కూర్చడం ఈయన నాటకాలలోని విశేషం.

ద్రౌపదీ వస్త్రాపహరణ నాటకం ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటకాల బాణీలో నడిచింది. పద్యాలు, పాటలే గాక పాత్రల గుణగణాలను, నాటక రీతిని తెలిపే ఉత్తరరంగం, ఒకే భావం గల గద్య, పద్య, గేయ రచన, కొత్త కొత్త ఛందస్సులు వాడడం ఇందుకు నిదర్శనలు. అయితే సంస్కృత నాటక రచనా విధానాలను పాటించక పోలేదు. ప్రళయ భైరవం అనే నవల, దుర్గపూజ అనే పాటల పుస్తకం, కొక్కొండ రచించిన నరకాసుర విజయ వ్యాయోగ రూపకానికి టిప్పణి రాశాడు.

ఈయన రచించిన 31 నాటకాలలో 13 నాటకాలు మాత్రమే ఇప్పుడు లభ్యమవుతున్నాయి. వీటిలో గయోపాఖ్యానం, సిరియాళ చరిత్ర, వజ్ర దంష్ట్రోపాఖ్యానం, శుకరంభాసంవాదం, శశిరేఖా పరిణయం, సుభద్రాపరిణయం, శ్రీరామ జననం, కీచకవధ, సత్యహరిశ్చంద్ర, సుగ్రీవపట్టాభిషేకం, సీతాన్వేషణం, సీతాపహరణం అముద్రితాలు; ద్రౌపదీ వస్త్రాపహరణం. (1882) ముద్రితం. నాటక కర్తగా, నాటక సమాజ నిర్వాహకుడుగా, దర్శకుడుగా పేరు తెచ్చుకొన్న ఈయన 1897 జూన్ ఆరవ తేదీన స్వర్గస్థుడయ్యాడు.

శ్రీ.చ.

సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత.కె (1881-1934) : నాటక కర్త, సంస్కృతాంధ్ర పండితుడు, కవి, బళ్ళారి నాటక సమాజాలకు అతి సన్నిహితుడు. ఇంటి పేరు కోలాచలం. పండితుడు కావడంవల్ల పండిత కె. సుబ్రహ్మణ్య శాస్త్రి అనే పేరే

ఎక్కువగా ప్రచారంలోకి వచ్చింది. ఈయన 1881లో బళ్ళారిలో జన్మించాడు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు ఫక్కీలోనే గద్య, పద్య, గేయాత్మకంగా నాటకాలు రచించాడు. ఈయన రచించిన నాటకాల లోని దీర్ఘ స్వగతాలు, దీర్ఘ వచనాలు నటుల సామర్థ్యానికి గీటు రాళ్ళు. లవకుశ, శ్రీకృష్ణ లీలలు మొదలైన నాటకాలలోని పద్యాలు రస గుళికలు, ఈ నాటకాలు ఆంధ్రదేశంలో వందల పర్యాయాలు ప్రదర్శించడమే గాక తమిళ, కన్నడ భాషలలోకి అనూదితమైనాయి.

1905లో జ్ఞాన కృష్ణ లీలలు, 1914లో శ్రీకృష్ణలీలలు, 1915లో ప్రౌఢకృష్ణ లీలలు, లవకుశ, 1918లో విభీషణ పట్టాభిషేకం, 1926లో సంపూర్ణ మహాభారతం, 1927లో మేవాడు శౌర్యాగ్ని, ప్రతాప చరిత్ర, భోజకాళిదాసీయం, పద్మిని, పన్నాబాయి, 1933లో భక్తకుచేల మొదలైన నాటకాలను రచించాడు. పన్నెండు నాటకాలు రాసిన పండిత సుబ్రహ్మణ్యశాస్త్రి 1934లో మరణించాడు.

శ్రీ.చ.

సుబ్రహ్మణ్య శాస్త్రి, బుర్రా(1938) : రంగస్థల నటుడు. స్త్రీ పాత్రపోషణలోదిట్ట. 'నాట్యాచార్య, నాట్య మయూరి' బిరుదాంకితుడు.గుంటూరు జిల్లా విశ్వనాథపల్లెలో జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్యచదువుకొన్న సుబ్రహ్మణ్య శాస్త్రి మేనమామ కూచిభట్ల కోటేశ్వరరావు, తదనంతరం వానపాముల సత్యనారాయణ దగ్గర సంగీతంలో శిక్షణ పొందాడు. బి.వి. నరసింహారావు శిక్షణలో మహాభారతాన్ని క్షుణ్ణంగా చదువుకొని నాట్యశాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించాడు. సంస్కృతాంధ్ర సాహిత్యంతోపాటు సాత్త్వికాభినయంలో పట్టు సాధించిన శాస్త్రి స్త్రీ పాత్ర నిర్వహణలో ఆయనకు ఆయనే సాటి. స్త్రీ పాత్ర ధరించి రంగస్థలం మీదికి ప్రవేశిస్తే ఈయనను పురుషుడని ఎవరు అనుకోరు. కట్టుబట్టులో, స్త్రీ సహజమైన ఒంపుసొంపులు రంగస్థలంపై ప్రదర్శించడంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాడు.

పద్యాన్ని రసస్ఫూర్తితో చదవడమే కాదు హావభావాలను మిళితం చేసి ప్రదర్శించిన చింతామణి, చంద్రమతి, సత్యభామ, ద్రౌపది, వేమనలో వేశ్య, సక్కుబాయి లో సక్కుబాయి, నాయకురాలు లో నాగమ్మ పాత్రలు ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టాయి. పాత్ర స్వరూప స్వభావాలను ఆకళింపు చేసుకొని ఆ పాత్రకు తగిన శాంత, కరుణ, రౌద్ర, శృంగార రసాలను ప్రదర్శించే శాస్త్రి తెలుగు రంగస్థలానికి అనేకమంది శిష్యులను పరిచయం చేశాడు. దాదాపు అయిదు దశాబ్దాలపాటు రంగస్థల వికాసం కోసం కృషి చేసిన బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రిని ప్రసిద్ధ కవి విశ్వనాథ సత్యనారాయణ 'నాట్యాచార్య', కొండవీటి వెంకట కవి 'నాట్య మయూరి', రాయలసీమ కళాకారులు 'అభినయ సరస్వతి' బిరుదులిచ్చి సత్కరించారు. ఈయన రచించిన భూయో భూయే నమామ్యహం నాటకం నంది నాటకోత్సవాలలో ప్రదర్శింపబడి ప్రశంసలందుకుంది. నందమూరి తారకరామారావు రంగస్థల పురస్కారంతో 2006లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈయనను సన్మానించింది.

దాసరి.ఎన్.

సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద (1891-1961) : నటుడు, నాటక కర్త, కథకుడు, పత్రికా సంపాదకుడు, సాహిత్యవేత్త, విమర్శకుడు, మహాపండితుడు. ఈయన 1891, ఏప్రిల్ 23న తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా పొలమూరులో జన్మించాడు. తల్లిదండ్రులు మహాలక్ష్మి సోదెమ్మ లక్ష్మీపతి సోమయాజులు.

శ్రీపాద మొదట గ్రాంథిక వాది. తరువాత వ్యవహారిక వాది. వచన రచనలో సిద్ధహస్తుడు. ప్రత్యేక శైలిని అలవరచుకొన్న రచయిత. 1916లో కళాభివర్ధనీ పరిషత్తు నెలకొల్పి నాలుగేళ్ళు నిర్వహించాడు. అందులో స్త్రీ, పురుష పాత్రలలో నటించాడు. గురుముఖంగా సుమారు నూరు కీర్తనలు నేర్చుకున్నాడు. హిందీ భాషా ప్రచారం ఆంధ్రత్వం మీద దెబ్బతీస్తున్నదనే దృఢ విశ్వాసంతో ఆ దాడి నెదుర్కొనేందుకు ప్రబుద్ధాంధ్ర పక్షపత్రికను 1921లో నెలకొల్పి కొంతకాలం నడిపాడు.

రాజరాజు (1944) శ్రీపాద నాటకాలలోనే గాక రచనలన్నింటిలో తలమానికం. సారంగధర కథే. పాత్ర చిత్రణ తీరు, భాషాప్రయోగం సరికొత్తవి, ఎనలేనివి. అందుకే రాజరాజు నాటకాన్ని ఆధునిక సాహిత్యంలో అనర్ఘరత్నంగా పరిగణిస్తున్నారు.

ఈ నాటకంలో చిత్రాంగి కాముకురాలు కాదు. ప్రబంధ కన్య కాదు. ప్రేమైక మూర్తి మాత్రమే కాదు. పౌరుషం తొణికిసలాడే క్షత్రియ కన్య. తన కిష్టం లేనిదే తనను పొంద వచ్చిన రాజరాజు మీద కత్తి దూస్తుంది. చివరకు ఆ కత్తికి తానే బలైపోతుంది. రాజ రాజు చేసిన ఈ ఘోరానికి కినిసి నన్నయ భట్టు భారత రచన కట్టి పెట్టినట్లు చిత్రించడం అద్భుతావహంగా ఉంది.

1908లో వారకాంత, 1913లో సాహస రాజపుత్రం, కుశలవ (అముద్రితం), రామదేవ జయం, 1935లో నిగళ

బంధనం, ప్రేమపాశం, కర్ణవధ, ఊరు భంగం, 1936లో కలంపోటు, 1937లో పునాదిరాయి, 1939లో లక్ష్యసిద్ధి, 1944 బబ్బిలి యుద్ధం, రాజరాజు వంటి నాటక నాటికలు రచించాడు. ఈయన 1961, ఫిబ్రవరి 25న కన్నుమూశాడు.

శ్రీ.చ.

సుభాని, డి.ఎం (జ.1936) : నటుడు, సమాజ నిర్వాహకుడు, దర్శకుడు. కడప జిల్లా కలసపాడు గ్రామంలో 1936 జులై 1న జన్మించాడు. తల్లిదండ్రులు జమాలమ్మ, ఫకృద్దీన్ సాహెబ్‌లు. అయిదు దశాబ్దాలుగా నాటకరంగ వికాసం కోసం కృషిచేస్తున్న సుభాని మొట్ట మొదట చిలకమర్తి లక్ష్మీ నరసింహం గయోపాఖ్యానంలో ధర్మరాజుగా నటించాడు. 1964లో రాయల కళాపరిషత్తు, ప్రొద్దుటూరు రాష్ట్రస్థాయి నాటక పోటీలలో కొడాలి గోపాలరావు రచించిన లంకెబిందెలు ప్రదర్శించడంతో పాటు వెంకడు పాత్రలో నటించాడు. ఈ ప్రదర్శన సుభానికి ఉత్తమ దర్శకుడి అవార్డును తెచ్చి పెట్టింది. 1966లో శ్రీనివాస కళాపరిషత్తు కడపలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీలలో అవసరాల సూర్యారావు పంజరం ప్రదర్శించిన సుభానికి ఉత్తమ ప్రదర్శన, నటన, దర్శకత్వం అవార్డులు తెచ్చి పెట్టింది.

వివిధ నాటక సమాజాలు ప్రదర్శించిన నాటకాలలో సుభాని మాయల ఫకీర్, దుర్యోధనుడు, హరిశ్చంద్రుడు, భవానీ శంకరుడు, రావణాసురుడు, బాస్టియన్, యమధర్మరాజు మొదలైన పాత్రలలో నటించాడు. ఆంధ్ర నాటక రంగ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. 1996లో వెంకటగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి నాటక పోటీలలోను, మరుసటి సంవత్సరం నందమూరి తారక రామారావు స్మారక సంస్థ విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో యమధర్మరాజు నాటకాన్ని ప్రదర్శించి ఉత్తమ నటుడు అవార్డును అందుకున్నాడు. సుభాని ఈ నాటకంలో యమధర్మరాజుగా నటించాడు.

ఆంధ్ర నాటకరంగ వికాసానికి కృషి చేసిన సుభానికి 1989లో కళాజగత్తు పత్రిక విశిష్ట వ్యక్తి పురస్కారం ప్రదానం చేసి సత్కరించింది. మరుసటి సంవత్సరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నగదు బహుమతినిచ్చి అభినందించింది. కళలపట్ల ఆసక్తి కనబరిచే యువకులకు నటనలో శిక్షణనిచ్చి, నటులుగా తీర్చుదిద్దుతూ, నాటక రంగానికి యువనటులను అందించటంలో సుభాని తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాడు. గీతా నాటక మండలి పక్షాన ప్రతి సంవత్సరం రాజంపేటలో రాష్ట్ర స్థాయి నాటక పోటీలు నిర్వహిస్తున్నాడు. ఒకసారి సీతారామరాజు నాటకంలో బాస్టియన్‌గా నటిస్తున్న సందర్భంలో ఆ పాత్ర ప్రదర్శిస్తున్న హింసను సహించలేని ప్రేక్షకులు కత్తితో పొడవటానికి వచ్చారట. ఇలాంటి సంఘటనలు అక్కడక్కడ చోటు చేసుకొనేవట. వినయశీలి, నిబద్ధత గల కళాకారుడు డి.ఎం. సుభాని.

దాసరి, ఎన్.

సుమనోరమ సభ : ఈ సమాజాన్ని 1896-97లో బళ్ళారిలో స్థాపించారు. వ్యవస్థాపకుడు పద్మనాభ వెంకోబాచార్యులు. అధ్యక్షుడు కోలాచలం శ్రీనివాసరావు. ప్రధాన నటులు బళ్ళారి రాఘవ ప్రభృతులు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు సరస వినోదిని సభ నుంచి చీలివచ్చిన కొంతమంది నటులు ఏర్పరచుకొన్న నాటక సమాజం. దీని మొదటి పేరు మనోరమ సభ. తరువాత దీని పేరు సుమనోరమ సభగా మారింది.

మహానటుడు బళ్ళారి రాఘవను ఆంధ్ర నాటక రంగానికి సమర్పించిన ఖ్యాతి ఈ సభకే దక్కింది. ఈ సభ నాటకాలలో సంగీతానికి కాక, నటనకు ప్రాధాన్యమివ్వడంతో రాఘవ మేనమామ ధర్మవరం రామకృష్ణమాచార్యుల సరసవినోదిని సభలో చేరక ఈ సభలో చేరాడు. ఈ సమాజానికి పక్కా నాటక శాల (వాణీ విలాస్) ఉండేది, దీనిని లోకమాన్య బాలగంగాధర తిలక్ 1905లో ప్రారంభోత్సవం చేశాడు. ఈ సభ కోలాచలం శ్రీనివాసరావు నాటకాలనే ఎక్కువగా ప్రదర్శించింది.

శ్రీ.చ.

సుశీల్ కుమార్ మిశ్రో: చూ. మిశ్రో ఎస్.కె.

సూచ్యం : నాటక రచనలో రచయిత వస్తువివరణ కోసం రెండు పద్ధతుల్ని పాటిస్తాడు. ఒకటి దృశ్యం, రెండోది సూచ్యం. కథాగమనంలో కొన్ని సంఘటనల్ని దృశ్యరూపంలో చూపడం మొదటి పద్ధతి. ఉదాహరణకు హరిశ్చంద్రుడు విశ్వామిత్రుని ఋణం తీర్చడం కోసం తన అర్ధాంగిని కాశికాపురం విపణి వీథిలో విక్రయించే ఘట్టం. కన్యాశుల్కం లో మధురవాణి ఉత్తరం చదువుతూ విరగబడి నవ్వుతూ రామప్పంతుల్ని ఆటపట్టించే సన్నివేశం. ప్రతాపరుద్రీయంలో పేరిగాడ్ని సింహాసనం మీద కూర్చోబెట్టి కవితా గోష్ఠి నిర్వహించడం, విషాద సారంగధరలో పావురం కోసం అంతఃపురంలో అడుగు పెట్టిన సారంగధరుడ్ని చిత్రాంగి కవ్విస్తూ తన వలపు వ్యక్తం చేసే సన్నివేశం. అయితే రచయిత సంకల్పించిన అన్ని అంశాలను దృశ్యమానం చేయడం సాధ్యంకాదు. యుద్ధం, వన్యమృగాలతో పోరాటం, పర్వతారోహణం, సముద్రయానం, మైథునం, హింస మొదలైన అంశాలను దృశ్య రూపంలో ప్రదర్శించడానికి అవకాశం ఉండదు.

కొన్ని దుర్లభం, కొన్ని అనౌచిత్యాలు, మరికొన్ని జుగుప్సావహంగా ఉంటాయి. సభ్యతాపరిధిని దాటిపోయిన దృశ్యాలు సామాజికుల అయిష్టతకు, ప్రతిఘటనకు దారితీస్తాయి. కనుక రచయితలు అలాంటి విషయాలను నటీనటులతో వ్యాచ్యంగా చెప్పిస్తారు. ఇలా సూచనప్రాయంగా చెప్పే విషయాలనే సూచ్యాలు అంటారు లాక్షణికులు. సూచ్యాలు లేకుండా నాటకం రాయడం దుర్లభమేకాక నిండుతనం కూడా ఉండదు. అందువల్ల దృశ్య సూచ్యాలు రెండూ నాటకానికి రెండు కళ్ళు.

గం.సు.రె.

సూత్రధారుడు : సూత్రమంటే నాట్యానుష్ఠానం (ప్రయోగం). దీన్ని ప్రవర్తింపచేసేవాడు సూత్రధారుడు. నటబృందానికి నాయకుడు, నాటక కళాకోవిదుడు, ప్రయోక్త, దర్శకుడనే పేర్లు కూడా ఉన్నాయి. ఈ సూత్రధారులిద్దరు అని కొందరు, ఒకడే అని భిన్నాభిప్రాయాలున్నాయి.

పూర్వరంగం నివర్తించి,నాంది పఠించి, ప్రథమ సూత్రధారుడు నిష్క్రమించగా, ఆకార వేషభాషాదులలో మొదటి సూత్రధారుడిని పోలిన ద్వితీయ సూత్రధారుడు ప్రవేశించి కథను గాని, పాత్రను గాని, బీజముగాని సూచిస్తాడు. ఆ తరువాతనే అసలు నాటక ప్రదర్శన ప్రారంభమవుతుంది. ఈ ద్వితీయ సూత్రధారుడ్ని నటుడు, స్థాపకుడని కూడా అంటారు. ప్రతి సంస్కృత నాటకంలోను ప్రథమ సూత్రధారుడు పూర్వరంగ ప్రవర్తకుడు. ద్వితీయ సూత్రధారుడు ప్రస్తావనా ప్రవర్తకుడు. ఈ ద్వితీయ సూత్రధారుడు "దివ్య మర్త్య వస్తువులను తత్త్వద్రూపుడై మిశ్రమును ఆ యిరువురలో నొకడై సూచించును" – ఆం.సా.ద. *6–283.*

అహీన వాక్య సంస్కారం, తాళ – గీత –కాల– విధానజ్ఞత, స్వర – వాది విజ్ఞానం సూత్రధార గుణాలు. స్మృతి, మతి, ధైర్యం, ఔదార్యం, స్మిత వాక్కు, శుచిత్వం, ఆరోగ్యం, మాధుర్యం, క్రాంతి, దాంతి , ప్రియ వాక్కు, కోపరాహిత్యం, సత్యవచనం, దాక్షిణ్యము, అలుబ్ధత, ప్రత్యుత్పన్నమతి అనేవి సూత్రధారుని స్వాభావిక గుణములు. – నా.శా. *35*వ అధ్యాయం, పుట, *854.* అను: పోణంగి

శ్రీ.చ.

సూరి, తెన్నేటి (1911–1959) : నాటకకర్త. నాటక సిద్ధాంతవేత్త, సినీ కళావేత్త. అభ్యుదయ కవి, కథకుడు, పత్రికా సంపాదకుడు, దర్శకుడు. ఈయన కృష్ణాజిల్లా తెన్నేరులో 1911లో జన్మించాడు. అసలు పేరు సూర్య ప్రకాశరావు.

గుడివాడ బోర్డు హైస్కూలులో, బందరు నోబుల్ కళాశాలలో విద్యాభ్యాసం. తరువాత బందరు హిందూ ప్రెస్‌లో కొంతకాలం మేనేజర్‌గా పని చేసి, స్వంతప్రెస్ పెట్టి ప్రభాత అనే పత్రికను నడిపాడు.

పింగళి రచించిన నా రాజు నాటకానికి పోటీగా 1946లో నా రాణి (1946) నాటకం రచించి ప్రదర్శింపజేసి అందరి మెప్పు పొందాడు. సాహిత్య సమవకారం నాటికలో సమకాలీన కవుల ధోరణులను పేరడీగా చిత్రించాడు. ఆంధ్రదేశంలోని బాల సంఘాలు ఈయన రాసిన గొడ్లకాపరి నాటికను విస్తృతంగా ప్రదర్శించాయి.

ఆ తరువాత భారతి పత్రికలో సహాయ సంపాదకుడుగా వ్యవహరిస్తూ, మద్రాసులో 1959లో మరణించాడు.

శ్రీ.చ.

సూరి, బి.ఎస్. (1935–1995): రంగస్థల నటుడు, రచయిత, సమాజ వ్యవస్థాపకుడు. రామయ్య సూరి, రంగనాయకమ్మ దంపతులకు కృష్ణా జిల్లా బేతవోలు గుడివాడలో 1935లో జన్మించాడు. బి.ఎస్. సూరిగా ప్రసిద్ధుడైన ఈయన పూర్తి పేరు భావన నారాయణ సూరి. పోలీస్ వైర్‌లెస్ సెట్ ఆపరేటర్‌గా పని చేస్తూ నాటకరంగంపై మక్కువ పెంచుకొని ఉద్యోగాన్ని వదలి సమాజాన్ని స్థాపించి, నాటకమే జీవికగా ఎన్నుకొని నాటకాలు రాయటం, ప్రదర్శించడం ప్రారంభించాడు. సహజత్వం ఉట్టిపడేలా దృశ్యబంధ నిర్మాణం చేయడం సూరి ప్రదర్శనల్లోని ప్రత్యేకత.



తాండ్ర వేంకట సుబ్రహ్మణ్యం రచించిన 'మహిషాసుర మర్ధని' నాటకాన్ని ప్రదర్శనకు ఎంపిక చేసుకొని, టి. పూర్ణచంద్రరావు, దేవీ వరప్రసాద్ తదితర మిత్రులతోను, తన శ్రీమతి బి.ఎస్. సీతాకుమారితో రాష్ట్రంలో పలుచోట్ల నాటక ప్రదర్శనలిచ్చి నాటక కళా వికాసానికి తనవంతు సహకారాన్ని, సేవలను అందించాడు. రాజ్యం థియేటర్స్ ప్రదర్శించిన నాటకాల్లో సాయిబాబా మహాత్మ్యం కూడా అత్యంత ప్రజాదరణకు నోచుకొంది. గుడివాడ ప్రాంతంలో ఒక వటవృక్షంగా ఎదిగిన సూరి ఎందరో కళాకారులకు, సాంకేతిక నిపుణులకు చల్లని నీడనిచ్చి ఉపాధిని కల్పించిన కళా హృదయుడు. 1995లో ఒక నాటకం వేస్తూ రంగస్థలం మీదనే తుదిశ్వాస విడిచాడు. ఆ సంఘటన కళారంగంలో పెద్ద సంచలనం కలిగించింది.

ఎమ్మెస్వీ

సూరిబాబు, పువ్వుల (1915-1968) : నటుడు. దర్శకుడు. బాలమిత్ర సభ సభ్యుడు. బాలకృష్ణ సమాజం, సత్యనారాయణ, రాజరాజేశ్వరి నాట్యమండళ్ల స్థాపకుడు. కృష్ణాజిల్లా బమ్మలూరులో 1915, ఫిబ్రవరి 22న జన్మించాడు. చిన్ననాటి నుండి కళల పట్ల ఆసక్తి చూపుతూ, చదువు పట్ల అశ్రద్ధ కనబరచాడు. కళాభిరుచి ఉన్న సూరిబాబుకు సీతా రామాంజనేయ నాటక సమాజం నిర్వాహకుడు లింగం అంజయ్య తొలిసారిగా అవకాశమిచ్చాడు. బబ్బిలి నాటకంలో చిన రంగారావు పాత్ర పోషించాడు. నాటకాలలో నటించాలనే కోరికతో సూరిబాబు మిత్రులు డి.వి.ఎల్ నరసింహారావు, పి.చంద్రమౌళి, హేమాంబర దాసులతో కలిసి గద్వాలకు పారిపోయాడు. అక్కడ ఒక నాటక సమాజంలో చేరి రామదాసు నాటకంలో రఘురాముడు, బాలకృష్ణపాత్రలను పోషించాడు.

గుంటూరుకు తిరిగి వచ్చిన తరువాత దంటు వెంకట కృష్ణయ్య నేతృత్వంలో నిర్వహింపబడుతున్న బాలమిత్ర సభలో చేరి, కొప్పరపు సుబ్బారావు దర్శకత్వం వహించిన నాటకాలలో ప్రధాన పాత్రలలో నటించాడు. కంసుడు, వసుదేవుడు, రాంసింగ్, నారదుడు, కుచేలుడు మొదలైన పాత్రలలో నటించి, ఉత్తమ నటుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఆ సందర్భంలో వివిధ నాటక సమాజాలు సూరిబాబును ఆహ్వానించడంలో పోటీపడ్డాయి. కొంతకాలం కురుకూరి సుబ్బారావు నిర్వహణలో ఉన్న నాటక సమాజంలో చేరి భక్తవిజయం, మాయా మధుసూదన నాటకాలలో నటించాడు. ఆ తరువాత 1931లో తన స్వంత ఆస్తి, బంగారం అమ్మగా వచ్చిన సొమ్ముతో బాలకృష్ణ సమాజం స్థాపించాడు. నాటక ప్రదర్శనకు అవసరమైన దృశ్యాలు చిత్రించాడు. ఈ సమాజం పక్షాన భారీవ్యయంతో నాటకాలు ప్రదర్శించడంలో ఆర్థికంగా నష్టపోయాడు. కొంత కాలానికి సంస్థ మూత పడింది. ఆ తరువాత తెనాలిలో స్థిరపడి సత్యనారాయణ నాట్యమండలి స్థాపించి కొన్ని నాటకాలను ప్రదర్శించాడు.

1949లో నటి రాజేశ్వరిని వివాహం చేసుకొన్న తరువాత రాజరాజేశ్వరి నాట్యమండలిని నెలకొల్పాడు. ఈ సమాజం తరపున నాటకాలను ప్రదర్శించడానికి కొప్పరపు సుబ్బారావుతో తారాశశాంకం నాటకం రాయించుకున్నాడు. ఈ నాటక ప్రదర్శన రంగస్థల చరిత్రలో ఒక మైలురాయి. ఈ నాటకంలో రాజేశ్వరి తారగా, సూరిబాబు బృహస్పతిగా నటించారు. ఇది రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా ప్రదర్శింపబడి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నది. ఈ నాటకం ప్రదర్శించిన తరువాత సూరిబాబు సమాజం ప్రదర్శన ఎక్కడ జరుగుతున్నా ప్రేక్షకులు విశేషంగా హాజరయ్యేవారు. సూరిబాబు నాటక సమాజ సభ్యులను తన స్వంత కుటుంబ సభ్యులుగా భావించి వారి బాగోగులను చూసేవాడు. ఒక క్రమశిక్షణ గల నాటక సమాజంగా ఇతర నాటక సమాజాలకు ఆదర్శంగా ఉండేటట్టు తీర్చిదిద్దాడు.

సూరిబాబు రాజరాజేశ్వరి నాట్యమండలి పక్షాన కురుక్షేత్రం, బబ్బిలి, భక్తవిజయం, భూకైలాసం, విప్రనారాయణ, రాధాకృష్ణ, ద్రౌపది, సారంగధర, అనసూయ, గయోపాఖ్యానం, సావిత్రి, సక్కుబాయి, శ్రీకృష్ణ లీలలు, శ్రీకృష్ణ తులాభారం, రంగూన్ రౌడీ, వీరాభిమన్యు, రోషనార, సత్యహరిశ్చంద్ర, శకుంతల, ధరణికోట, చింతామణినాటకాలను పలుప్రాంతాలలో ప్రదర్శించాడు. ఈ నాటకాలలో ప్రధాన భూమికలలో నటించడమే కాకుండా దర్శకత్వబాధ్యతలు కూడా నిర్వహించాడు.

ఉత్తమ నటుడుగా పేరు తెచ్చుకోవడానికి నిరంతరం సాధన చేశాడు. పాత్రలలోని స్వరూప స్వభావాలను ఆకళింపు చేసుకున్నాడు. చతుర్విధాభినయాలను నటనలో ఇముడ్చుకోగలిగాడు. అంతేగాకుండా శ్రోతలను మైమరిపించే గాత్రం ఆయన సొంతం కావడం వల్ల సూరిబాబు గొప్ప నటుడయ్యాడు. నటుడుగా తాను ఎదుర్కొన్న సమస్యలను నాటక సమాజంలోని సభ్యులు ఎదుర్కొనకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. తద్వారా మంచి సమాజ నిర్వాహకుడిగా పేరు తెచ్చుకున్నాడు. ప్రేక్షకులు ఎలాంటి నాటకాలను స్వీకరిస్తారో తెలుసుకొని, అలాంటి నాటకాలను చేపట్టి మంచి దర్శకుడుగా గుర్తింపబడ్డాడు.

నాటక రంగంలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న సూరిబాబును 1946లో మైసూరు మహారాజు నాటకాలు ప్రదర్శించమని ఆహ్వానించాడు. రాజు కోరిక మేరకు దర్బారులో నాటకాలు ప్రదర్శించాడు. మహారాజు చేతుల మీదుగా ఘనసత్కారాలు అందుకున్నాడు. ఆ తరువాత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ కోరిక మేరకు రవీంద్రభారతి (హైదరాబాదు)లో విప్రనారాయణ నాటకం ప్రదర్శన జరిగింది. సూరిబాబు గాత్రం విన్న రాధాకృష్ణన్ భగవద్గీత శ్లోకాలను పాడించుకొని టేపు చేయించుకున్నాడు. సుప్రసిద్ధ హిందీ నటుడు పృథ్వీరాజ్ కపూర్ సూరిబాబు నటనను చూసి ముగ్ధుడయినాడు. ఆ తరువాత వెండి తెరమీద దాదాపు ఇరవై పౌరాణిక, చారిత్రక, సాంఘిక చిత్రాలలో ప్రధాన భూమికలలో నటించి ప్రేక్షకుల మెప్పు పొందాడు.

నాటక రంగానికి అపారమైన సేవలందించిన సూరిబాబు లెక్కలేనన్ని బహుమతులు అందుకున్నాడు. ఈ ప్రసిద్ధ నటుడికి 1957లో తెనాలిలో ఘనమైన సత్కారం జరిగింది. నాటి సభలో సూరిబాబును గజారోహణం చేయించి, గండపెండేరం, కనకాభిషేకాలతోపాటు కళావిశారద, గానగంధర్వ బిరుదులిచ్చి సత్కరించారు. పాతిక సంవత్సరాల పాటు ఒక నాటక సమాజాన్ని ఆంధ్రదేశంలో నిర్వహించిన అరుదైన కళాకారుడు పువ్వుల సూరిబాబు. కళామతల్లికి ఇంతటి విశేషసేవ చేసిన సూరిబాబు 1968 ఫిబ్రవరి 12న తుది శ్వాస విడిచాడు.

దాసరి. ఎన్.

సూరిశాస్త్రి, పురాణం (1888-1941) : నాటకసిద్ధాంత వేత్త, లలితకళా మర్మజ్ఞుడు, విమర్శక శిరోమణి బిరుదాంకితుడు, ఆగర్భ శ్రీమంతుడు, బి.ఏ పట్టభద్రుడు, మేధావి, రామభక్తుడు. ఈయన 1888లో బందరులో జన్మించాడు. తల్లిదండ్రులు గోపి సుందరమ్మ, వెంకటప్పయ్యలు.



ఆగర్భ శ్రీమంతుడు కావడంవల్ల ఎక్కడెక్కడి నాటకాలు, లక్షణగ్రంథాలు తెప్పించి చదివి జీర్ణించుకున్నాడు. భారతదేశంలోని వివిధ భాషా నాటక ప్రదర్శనలను తిలకించాడు.

మద్రాసులో చదువు పూర్తి చేసిన తరువాత బందరులో స్థిరపడి గ్రంథాలయోద్యమంలో, కాంగ్రెస్ రైతుఉద్యమాలలో పని చేశాడు. బందరు నాటక పోటీల నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించాడు. పోటీలు ద్వేషానికి దారి తీస్తున్నాయని గ్రహించి, విరమించి, నట సాహిత్య సభలు జరిపాడు. ఎపుడూ ఏదో ఒక నాటక సమాజంతో సంబంధం పెట్టుకుంటూ ఆంధ్ర నాటక కళాపరిణామాన్ని అధ్యయనం చేసుకుంటూ వచ్చాడు.

1916లో ఆంధ్ర నాటక నావావళి, 1923లో నాట్యాంబుజం, 1924లో నాట్యోత్పలం, 1927లో నాట్యశోకం, విమర్శక పారిజాతం, ఆంధ్ర నాటక సంస్కరణలు మొదలైన రచనలు చేసిన పురాణం 1941లో స్వర్గస్థుడయ్యాడు.

శ్రీ.చ.

సూర్య చంద్రరావు, వసల (జ.1909) : నటుడు, పత్రికా సంపాదకుడు. ఆంధ్ర రాష్ట్రశాసనసభ డిప్యూటీ స్పీకరు. ప్రేమ విలాసినీ నాట్యమండలి స్థాపకుడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు ప్రధాన కార్యదర్శి. ఈయన 1909లో జన్మించాడు. మెకానికల్ ఇంజనీరింగ్ చదివినా ప్రధాన వ్యాపకం లలిత కళారాధనే. సంగీతం, నృత్యం, నాటకం మీదనే అభిమానం. విద్యార్థి దశలోనే ప్రేమవిలాసినీ నాట్యమండలిని స్థాపించి జయప్రదంగా కొంత కాలం నిర్వహించాడు. అనేక హిందీ, తెలుగు నాటకాలను దేశమంతటా ప్రదర్శించాడు. చంద్రగుప్త, తానీషా, ఔరంగజేబు అక్బరు మొదలైనవి అభిమాన పాత్రలు.



క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించాడు. అప్పటినుండి రాజకీయాలలో ప్రవేశించి రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థలో వివిధ హోదాలు నిర్వహించాడు. కొన్నాళ్ళు ఆంధ్ర రాష్ట్ర శాసన సభ డిప్యూటి స్పీకరు పదవిని నిర్వహించాడు. రాజకీయ రంగంలో ఉన్నా సాహిత్య, లలిత కళాసేవలను విస్మరించలేదు. కొన్ని ప్రముఖ హిందీ రచనలను తెలుగులోనికి అనువదించాడు. సాహిత్య వ్యాసాలు రచించాడు. 1945 నుంచి మరణించే వరకు ఆంధ్ర నాటక కళాపరిషత్తు ప్రధాన కార్యదర్శిగా నిర్మాణాత్మక పాత్ర వహించాడు. 1961 నుంచి ఒక దశాబ్దం పాటు ఆంధ్ర ప్రదేశ్ సంగీతనాటకఅకాడమీ గౌరవ కార్యదర్శిగాను, అధ్యక్షుడుగానూ ఉంటూ సంగీత, నాట్య, నాటక కళల పురోభివృద్ధికి ఎనలేని సేవ చేశాడు. ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ పక్షాన నిర్వహింపబడే నాట్యకళ పత్రిక సంపాదవర్గ సభ్యుడుగా కూడా వ్యవహరించాడు.

గం.సు.రె.

సూర్యనారాయణ, యడవల్లి (1888-1939) : మైలవరం బాలభారతీ సమాజంలో నాయక పాత్రధారి. నాటక లక్షణ పండితుడు. దాక్షిణాత్య ఔత్తరాహిక సంగీత బాణీలలో నిష్ణాతుడు. అనేక మంది యువనటులను తీర్చి దిద్దిన నాట్యాచార్యుడు. నాట్యాచార్య బిరుదాంకితుడు. ఈయన 1888లో గుంటూరులో జన్మించాడు. నటనే జీవితంగా భావించడమే గాక వృత్తిగా స్వీకరించి, నటులకు అసమాన గౌరవం తెచ్చి పెట్టిన కళారాధకుడు.



రాజఠీవి ఒలికే శరీరం, పాండిత్యం, కళారహస్య నేతృత్వం ఆంధ్ర నాటకరంగంలో మహానటుడుగా ప్రకాశింపజేసి, ఏకచ్ఛత్రంగా పాలింపచేశాయి. పట్టు తలపాగా, మల్లెపూవులాంటి వస్త్రాలు ధరించి చేతిలో కొంకె కర్ర పట్టుకుని వీధి వెంట వెడుతుంటే ఆబాలగోపాలం ఆయన చుట్టూ మూగేవారు. నిత్య వ్యవహారంలో ఆ ఠీవి, ఆ నడక, ఆ భంగిమ, నాటకీయభాషలో మాట్లాడడం మహా రాజులను తలపుకు తెచ్చేవి. రాజు వేషంవేయడంలో ఆ తరంలోనే కాదు ఆ తరువాత కూడా అంతటివాడు లేడని కీర్తి గడించాడు.

సంస్కృత నాటక అనువాదాలు ప్రదర్శించేటపుడు తెలుగు పద్యంతో పాటు మూల సంస్కృతశ్లోకం కూడా పాడడానికి ఒరవడి పెట్టింది ఈయనే.

మెట్రిక్యులేషన్ వరకు గుంటూరులోనే చదువుకోవటం వల్ల ఇంగ్లీషులో అభినివేశం ఏర్పడింది. పండితవంశంలో జన్మించడంతో సంస్కృతాంధ్ర విషయాలలో పట్టు సాధించగలిగాడు.

విద్యార్థి దశలోనే మృదుమధురంగా పాడుతూ, విద్యార్థి సోదరులను ఆకర్షింపగలిగాడు. హరిప్రసాదరావు, బలిజేపల్లి లక్ష్మీకాంతం ల నట, సాహిత్య, సంగీత ప్రభావం ఈయన మీద పడింది. గుంటూరులోనే 1912లో అమెచ్యూర్ అనే నాటక సమాజం స్థాపించి 1915 వరకు నడిపాడు. హరిప్రసాదరావు ధరించిన పాత్రలనే ఎక్కువగా నటించి పేరు పొందాడు.

1913లో విజయవాడలో *గయోపాఖ్యానం* పంచమాంకం ప్రదర్శన పోటీలలో అర్జునుడు పాత్రకు ద్వితీయ బహుమతి గెల్చుకోవడంతో ఈయన కీర్తి గుంటూరు సరిహద్దులు దాటి మైలవరం రాజా దృష్టిలో పడింది. రాజా ఆహ్వానం మేరకు మైలవరం కంపెనీలో చేరి వివిధ భూమికలలో నటించడంతో ఈయన కీర్తి ఆంధ్రదేశమంతటా గుబాళించింది.

సూర్యనారాయణ సత్యవంతుడు, దుష్యంతుడు, దుర్యోధనుడు పాత్రలు నటిస్తున్నాడంటే నాలుగు రోజులు ముందుగానే టిక్కెట్లు అమ్ముడు పోయేవి. నటుడి సామర్థ్యానికి గీటురాయిగా పరిణమించిన మయసభలో దుర్యోధనుని దృశ్యం ఈయన రాయించుకొన్నదే. ఈయన సత్యవంతుడుగా 'పోయేనయ్యో ననుబాసి...' మొదలయిన పాటలు ఆనాటి శ్రోతల చెవులలో నేటికీ గింగురు మంటూంటాయి. మైలవరం కంపెనీ దెబ్బతిన్న తరువాత ఏలూరు మోతే కంపెనీలో చేరి కొంతకాలం నటించాడు.

ఆ తరువాత విజయవాడలో స్వంతంగా దుర్గా ఎమెచ్యూర్స్ నాటక సమాజం స్థాపించి, పాత నాటకాలతోపాటు రత్నావళి, సంయుక్త, రామదాసు నాటకాలు ప్రదర్శించాడు. విజయవాడ నుంచి కలకత్తా వరకు పర్యటించి బెంగాలీల మెప్పు కూడా పొందాడు.

పృథ్వీరాజు వేషంలో నిజం గుర్రం ఎక్కి దౌడుతీయిస్తూ రంగస్థలం మీదకు వచ్చి, సంయుక్తవేషధారిని గుర్రం మీద కూర్చోపెట్టుకుని నిష్క్రమించే వాడు. ఇదంతా క్షణంలో జరిగిపోయేది. ఈయన సత్యవంతుని వేషానికి వెండి గొడ్డలి, వెండితాడు బహుమతిగా లభించాయి. విజయనగరంలో రత్నఖచిత కిరీటం, వెండికత్తి బహూకరించారు. ఇక సువర్ణ పతకాలు, సన్మానాలు కోకొల్లలు. నటనను వృత్తిగా పెట్టుకోవడం వల్ల ప్రేక్షకులను వ్యామోహపరచి మెప్పుపొందవలసిన అవసరం ఏర్పడింది. అందుకే ఈయన సత్యవంతుని వేషం మీద వెండిగొడ్డలి, వెండితాడు ధరించిరావడం, ఎంతమంది విమర్శించినా మానలేదు. ఈయన నటించిన రామదాసు పాత్ర పండితుల, పామరుల ప్రశంసలకు నోచుకుంది.

తెలుగు పద్యాలతో పాటు మూల సంస్కృత శ్లోకాలు పాడడమేగాక ప్రక్రియలు పునరుక్తింపచేయడం మానలేదు. యడవల్లి గొప్పతనం వాచికాభినయంలో గోచరిస్తుంది. సంభాషణ ఎంతటి కఠినపద సమాస భూయిష్టమైనా చక్కగా విడదీసి అరటిపండు ఒలిచి పెట్టినట్టు అందరికీ అర్థమయేటట్టు చదవడం ఈయన ప్రత్యేకత.

1932 ప్రాంతంలో సినిమారంగంలో ప్రవేశించి దుష్యంతుడు, రావణుడు పాత్రలలో నటించి మెప్పుపొందాడు.

సత్యవంతుడు, యముడు, అర్జునుడు (*గయోపాఖ్యానం*), శ్రీకృష్ణుడు (తులాభారం), దుర్యోధనుడు, సారంగధరుడు, దుష్యంతుడు, వత్సరాజు, పృథ్వీరాజు, నలుడు, విజయరామరాజు, శ్రీరాముడు, రామదాసు మొదలైన పాత్రలలో నటించి మెప్పించిన యడవల్లి 1939లో నటరాజులో ఐక్యమయ్యాడు.

శ్రీ.చ.

సూర్యనారాయణ శాస్త్రి, మల్లాది (1880-1962) : నాటక లక్షణ వేత్త, సంస్కృతాంధ్ర పండితుడు, కవి, వ్యాకరణ శాస్త్రవేత్త, అభినవ వాగనుశాసన బిరుదాంకితుడు. ఈయన గోదావరి జిల్లా కడియం సమీపంలోని బర్లెంక గ్రామంలో 1880, ఫిబ్రవరి 20న వెంకమాంబ, రామావధానులు దంపతులకు జన్మించాడు. చర్ల బ్రహ్మయ్య శాస్త్రి శిష్యుడు.

అమలాపురం, రాజమండ్రి, అనంతపురం, వాల్తేరులలో దాదాపు నలభై సంవత్సరాలు తెలుగు పండితుడుగా పని చేశాడు. తెలుగులో నాటక రచన నిర్దేశిత లక్షణ పథంలో సాగడం లేదని, సంస్కృత నాటక లక్షణాలను తెలుగు వారికి పరిచయం చేయడం మంచిదని భావించి సంస్కృత దశరూపకం తెలిగించాడు.

ఉత్తర రామచరిత (1909), మహావీరచరిత్ర (1948), ఊరు భంగం (1954), మాలతీ మాధవం (1958) నాటకా

లతో పాటు సత్యకీర్తి (1907), భీష్మ ప్రతిజ్ఞ (1923), విశ్రుతోర్వశీయం (1949) అనే అనువాద నాటకాలు, సుమేధ అనే స్వతంత్ర నాటకం రచించాడు. ఇవే కాకుండా ఆంధ్ర భాషానుశాసనం, సంస్కృత వాఙ్మయ చరిత్ర , భవభూతి, భాసకవులు, నాటక కథలు రచించిన ఈయన 1962, జూన్ 19న విశాఖపట్టణంలో పరమపదించాడు.

శ్రీ.చ.

సూర్యప్రకాశరావు, ఆలపాటి (జ.1930) : పౌరాణిక నటుడు. గుంటూరు జిల్లా చెరుకుపల్లిలో ఆలపాటి భూషయ్య, శేషారత్నమ్మ దంపతులకు 1930, ఏప్రిల్ 30న జన్మించాడు.

బాల్యమిత్రుడు కొర్ర పాటి శేషగిరిరావు ప్రోత్సా హంతో, మరో స్థానిక కళా కారుడు ఒడుగు రాధా కృష్ణ మూర్తి దర్శకత్వంలో రామాంజనేయయుద్ధంలో యయాతిపాత్రలో మొట్ట మొదటి సారి రంగస్థల వేదికపై నటించాడు. ఈ పాత్ర పోషణకు అభినందనలు అందటంతో ప్రముఖ హార్మోనిస్టు పల్లెకోన సుబ్బరాజు దగ్గర పద్య పఠనంలో ప్రాథమికంగా శిక్షణపొంది ఉద్యోగ విజయాల్లో కర్ణుని పాత్రలో నటించాడు.

రేపల్లెలో శ్రీకృష్ణనాట్యమండలిలో చేరి చల్లా సత్యన్నారాయణ శర్మ, తాడిగడప సుబ్రమణ్యాశర్మ వంటి స్థానిక రంగస్థల ప్రముఖుల సరసన కర్ణుడు, యయాతి పాత్రలలో నటించి, ఆయా పాత్రల పోషణలో మెలకువల్ని పెంపొందించుకున్నాడు.అదే సమయంలో రేపల్లెలో ఉన్న షణ్ముఖి చంద్రశేఖర రాజు (షణ్ముఖి సోదరుడు) దగ్గర పద్య పఠనంలోను, సంగీతంలోను శిక్షణ పొంది తన పద్యపఠన శైలికి మెరుగులుదిద్దుకొన్నాడు.

హార్మోనిస్టు దార్లఅప్పారావుద్వారా ప్రముఖ రంగస్థల నటుడు ఎ.వి. సుబ్బారావు నిర్వహించే పూర్ణశ్రీ నాట్య కళాసమితిలో చేరి ఎ.వి. సుబ్బారావు, కుప్పాసూర్య నారాయణ శర్మ, గోనుగుంట్ల రామయ్య దగ్గర పద్యపఠనంతో పాటు వాచికాభినయంలో చక్కని శిక్షణ పొంది, మలిదశలో పరిపూర్ణ నట గాయకునిగా రూపొందాడు.

ఇలా వాచికాభినయం , పద్య పఠనంలో మెరుగైన ప్రతిభను ప్రదర్శిస్తూ యయాతి, గయుడు, కర్ణుడు, బిళ్వమంగళుడు పాత్రలు సహస్రాధికంగా రచించడంతో ఈయనకు పీసపాటి నరసింహమూర్తి, షణ్ముఖి ఆంజనేయరాజు వంటి ప్రముఖ నటుల సరసన కూడా శతాధిక ప్రదర్శనల్లో నటించే అవకాశం కలిగింది. ఇలా 42సంవత్సరాలు రంగస్థల జీవితంతో మమేకమైన ప్రకాశరావు 2001 నుంచి అనారోగ్య కారణాల వల్ల విశ్రాంతి తీసుకుంటున్నాడు.

మన్నెశ్రీ

సూర్యప్రకాశరావు, కంచర్ల (జ.1947) : నాటక రచయిత, నటుడు, దర్శకుడు. సమకాలీన నాటకరంగంలో ఎన్నదగిన నాటకకర్త సూర్యప్రకాశరావు. కృష్ణా జిల్లా కాటూరు గ్రామంలో వెంకటేశ్వరరావు, వెంకాయమ్మ దంపతులకు 1947, నవంబరు 17న జన్మించాడు. 1960లో ప్రెసిడెంటు పట్టయ్య నాటకంలో బాలనటుడుగా రంగప్రవేశం చేశాడు. అప్పటి నుంచీ అనేక నాటక, నాటికల్లో వైవిధ్యం గల పాత్రలు ధరించి నటుడుగా అనుభవం సంపాదించాడు. ఆ అనుభవం తనలో అంతర్లీనంగా ఉన్న సృజనాశక్తిని వెలికితీసింది. *కులం* అనే నాటికతో కంచర్ల రచనా వ్యాసంగం మొదలైంది. *భేతాళ ప్రశ్న, తాళి తెగితే, వీసా* వంటి నాటికలు, *మయాసృష్టం, మార్చి 21, జాతీయగీతం* నాటకాలు రచించాడు. *తారాచంద్రుల ప్రణయగాథ* అనే పౌరాణిక నాటకం కూడా కంచర్ల రచనా పరంపరలోనిదే. బేతాళ అనేక పోటీలలో ప్రదర్శింపబడి ప్రశంసలందుకొంది. వృత్తిరీత్యా కంచర్ల రాష్ట్రరోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్నా నాటకమే ప్రధాన వ్యాపకంగా జీవనయాత్ర సాగిస్తూ నాటకరంగ వికాసానికి తనవంతు కృషి చేస్తూ తోడ్పడుతున్నాడు.

మన్నెశ్రీ

సూర్యప్రకాశరావు, పోలవరపు (1912-2006): నటుడు, సమాజ నిర్వాహకుడు. ఈయన 1912 అక్టోబరు 16న కృష్ణాజిల్లా డోకిపర్రులో జన్మించాడు. తల్లిదండ్రులు కౌసల్య, వెంకట్రామయ్య.

బందరు హిందూ హైస్కూలు, గుడివాడ మునిసిపల్ హైస్కూలులోను విద్యాభ్యాసం, హిందీ విశారద పాసయ్యాడు. విద్యార్థి దశనుంచే నాటకాలంటే మక్కువ. బాలనటుడుగా రంగప్రవేశం చేశాడు. హార్మోనియం నేర్చుకున్నాడు. 1942లో కృష్ణాజిల్లా ముదినేపల్లిలో ఎక్సల్షియర్ నాట్యమండలిలో కోడూరు అచ్చయ్య దర్శకత్వంలో అక్కినేని నాగేశ్వరరావు, దుక్కిపాటి మధుసూదన రావు, సూరపనేని ప్రభాకరరావు సహనటులుగా ఆశాజ్యోతి, సత్యాన్వేషణ, తెలుగు తల్లి నాటకాలలో నటించాడు.

నాటకోద్ధరణ లక్ష్యంతో 1929లో ఏర్పడిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు 1944లో పునర్వ్యవస్థీకరింపబడటంతో సూర్యప్రకాశరావు పరిషత్తు కార్యక్రమాలలో క్రియాశీల పాత్ర నిర్వహించ సాగాడు. పరిషత్తు పోటీలకు వచ్చిన నాటకాలను ప్రాథమిక పరిశీలనలో ఎంపిక చేసే గురుతర బాధ్యత పోలవరపుకు అప్పగించింది. 1955లో 110 నాటకాలకు, 150 నాటికలకు పోటీలకు దరఖాస్తులు అందాయి. తుదిపోటీలకు కావలసినవి 7 నాటకాలు, 12 నాటికలు మాత్రమే. ఆరు రాష్ట్రాలు తిరిగి అన్ని నాటకాలూ తానొక్కడే చూసి 7 నాటకాలను, 12 నాటికలను ఎంపిక చేశాడు. ఇది ఎంత బృహత్ కార్యమో, రెండు నెలల పాటు దేశమంతా పర్యటించడం ఎంత శ్రమతో కూడుకున్న కార్యమో ఊహించుకుంటే భయమూ, ఆశ్చర్యమూ కలుగుతాయి. అలాంటి బాధ్యతలు నెత్తిన వేసుకొని ఎన్నో సంవత్సరాలు నాటకరంగానికి ఎనలేని సేవ చేసిన కళాకారుడు సూర్యప్రకాశరావు. బళ్ళారి రాఘవ, డి.వి. సుబ్బారావు, గోవిందరాజుల సుబ్బారావు, స్థానం నరసింహారావు, బెల్లంకొండ రామదాసు, బందా కనకలింగేశ్వరరావు, మాధవపెద్ది వెంకట్రామయ్య, వేమూరి గగ్గయ్య, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు వంటి మహానటుల పరిచయభాగ్యంతో నాటకరంగాన్ని గురించిన సంపూర్ణ అవగాహన కలిగింది. అది ఆంధ్ర నాటక కళాపరిషత్తును ప్రగతిపథంలో నడిపించడానికి తోడ్పడింది. నాటకరంగంలో చరిత్ర సృష్టించిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు అస్తిత్వం నేడు ప్రశ్నార్థకంగా ఉంటున్న తరుణంలో పరిషత్తు పునరుద్ధరించబడాలన్న కోరిక తొంభైయేళ్ల వయస్సులో కూడా సూర్యప్రకాశరావును వేధించడం, నాటక రంగంపై ఆయనకుగల తపన, అంకితభావం, నిబద్ధతను అభివ్యక్తం చేస్తుంది. పోలవరపు 2006 నవంబరు 19న పరమపదించాడు.

గం.సు.రె.

సూర్యారావు, అంగర : నాటక రచయిత. స్వస్థలం విశాఖపట్టణం. హాస్యప్రధానమైన నాటికలు పదిహేను వరకూ రాశాడు. భారతి మాసపత్రికలో ప్రచురించిన వెంటనే ఔత్సాహిక నాటక సమాజాలు, కళాశాల విద్యార్థి బృందాలు సూర్యారావు నాటికలను విరివిగా ప్రదర్శించాయి. హాస్య ప్రధానంగా ఉంటూనే సందేశాన్నిచ్చే నాటికలు అన్నీ. *నీలి తెరలు*, *రణరంగం* నాటకాలూ, అసమర్థులు, కళోద్ధారకులు, ఇల్లు కూలింది, రాత్రించరులు, సరిహద్దులు, పురపాలకులు నాటికలు ఈయన ప్రసిద్ధ రచనలు.

గం.సు.రె.

సూర్యారావు, అవసరాల (1923-1964) : నాటకకర్త, కవి, సాహిత్యతత్త్వవేత్త, కథకుడు, జర్నలిస్టు. ఈయన తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం సమీపంలోని పండూరులో 1923లో జన్మించాడు.

విద్యాభ్యాసం విజయనగరంలో సాగింది. ఈ కాలంలోనే గురజాడ రచనలు మీద అభిమానం, ఆసక్తి, గౌరవం కలిగాయి. విద్యార్థి ఉద్యమంలో పాల్గన్నందుకు కడలూరు కారాగారంలో సంవత్సరం పైగా శిక్షననుభవించాడు.

జైలునుంచి తిరిగి వచ్చిన తరువాత విశాలాంధ్ర దినపత్రికలో ఉపసంపాదకుడుగా పనిచేశాడు. ఆ కాలంలోనే గురజాడ రచనలను సంకలించాడు, అనువదించాడు, పీఠికలు రాశాడు. ఆ తరువాత ఆంధ్రప్రభ దినపత్రికలో కొంతకాలం పనిచేశాడు.

అనుమాన పిశాచ వికటాట్ట హాసం, స్త్రీ జీవితాన్ని భగ్నం చేయడం, డాంబిక వ్యక్తుల మోసాలు బట్టబయలు చేస్తూ ఈయన రాసిన నాటకం పంజరం (1958) ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక పోటీలలో రచనకు, ప్రయోగానికి బహుమతులు పొందింది. మరో నాటిక నల్లబూట్లు (1951) రాజకీయ నాటిక. ఈయన అనారోగ్య కారణాల వల్ల 42వ ఏటనే అంటే 1964లో మరణించాడు.

శ్రీ.చ.

సెనెకా, లూసియస్ అవియస్ (క్రీ.పూ.4-65) : రోమన్ నాటకకర్త. స్పెయిన్ దేశస్థుడు. లాటిన్ చదువుకొని ఆ భాషలో తొమ్మిది విషాదనాటకాలు రచించి ఆ తరువాత పునరుజ్జీవన కాలంలోని నాటకకర్తలకు మార్గదర్శకుడుగా రూపొందాడు. ఈయన రచనల ప్రభావం షేక్స్పియర్ మొదలైన మహా నాటక కర్తల మీద కూడా ఎక్కువగా పడిందని స్పష్టమవుతోంది.



సెనెకా గ్రీకు నాటక అనువాదాలకు పూనుకోకుండా వాటి ఇతి వృత్తాలనే తీసుకొని ఆ బాణీలోనే స్వతంత్రంగా నాటకాలు రచించాడు. నిరాశానిస్పృహలు, భీతావహం, కుట్రలు, ద్రోహచింత, పాశవత్వం, మంత్రతంత్ర ప్రభావం ఈయన నాటకాల్లో ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ఈ లక్షణాలు గల గ్రీకు నాటక

గాథలనే ఈయనే ఎన్నుకున్నాడు. అయితే ఈయన నాటకాలు పరిశీలిస్తే ప్రదర్శించడానికి ఉద్దేశించినవి కావని, చదువుకోవడానికి మాత్రమే ఉద్దేశించినవని తెలుస్తోంది. అసలు రంగస్థలం మీద ప్రదర్శించడానికి వీలు లేని రంగాలు ఈయన నాటకాలలో కనిపిస్తున్నాయి. నాటక వాతావరణమంతా శ్రవ్యనాటక లక్షణాలనే సూచిస్తోంది. పాత్ర చిత్రణ విశ్వసనీయంగా ఉండదు. శబ్దాలంకార ప్రయోగం కథా విన్యాస పాత్ర చిత్రణలను మింగి వేసింది. శైలి బడబడ శబ్దాలతో, అతిశయోక్తులతో నిండి పాఠకులను చకితులను చేయడమే రచయిత ప్రధానాశయ మైనట్టు స్ఫురింపజేస్తుంది. ఉద్వేగాలు, విపత్పరంపర ఈయన నాటకాలలో తారాస్థాయిని అందుకుంటాయి. బృంద గాయకులు, ప్రజాపీడకులు, దయ్యాలు, మాంత్రికులు, రంగస్థలం మీద శవపరంపర ఎలిజబెత్ నాటకరంగం మీద తిరిగి ప్రత్యక్ష మైనాయి.

సెనెకా నాటకకర్త మాత్రమే కాదు. రాజకీయవేత్త, తత్త్వవేత్త, వ్యంగ్య రచయిత. ఈయన నీరో రాజుకు గురువు. చివరకు అతని ఆజ్ఞ మేరకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను రచించిన నాటకాలు : హెర్క్యూల్స్ ఫ్యూరెన్స్, మీడియా, ట్రోడ్స్, ఫెద్రా, అగమెమ్నన్, ఈడీపస్, హెర్క్యూల్స్, ఓటియస్, ఫొనిస్, దీస్టీస్ ఒక రోమన్ గాథను ఆధారంచేసుకొని ఆక్టోవియా అనే నాటకాన్ని కూడా సెనెకా రచించాడని అంటారు గాని అందుకు నిర్దిష్టమైన సాక్ష్యాధారాలు లేవు.

శ్రీ.చ.

సోఫోక్లీస్ (క్రీ.పూ.496-406) : గ్రీకు విషాద నాటకకర్త. ఎస్కిలస్ సృష్టించిన విషాద నాటక సాహిత్య ప్రక్రియలో పరాకాష్ఠను సాధించిన గ్రీకు రచయిత. ఈ రచయితలిద్దరూ సమకాలీనులు. సోఫోక్లీస్ క్రీ.పూ. 496లో ఏథెన్స్ నగర సమీపంలోని కొలోనస్ అనే గ్రామంలో జన్మించాడు. పేరు ప్రతిష్ఠలున్న వంశం. తండ్రి పేరు సోఫిలస్. సోఫోక్లీస్ సౌందర్యవంతుడు. సౌందర్యానికి తగిన గాత్రం పుట్టుకతోనే సిద్ధించింది. 480లో అంటే అతని 16వ యేట పారసీకులను గ్రీకులు సాలమిస్ దగ్గర జయించిన సందర్భంలో జరిగిన మహోత్సవాలలో ఈయన విజయగీతి పాడటమే కాకుండా నృత్యాలలో కూడా పాల్గన్నాడు. నాటి నుంచి నాటక రచనా వ్యాసంగంలో తలమునకలై పెరికిల్స్ చక్రవర్తి పోషణలో సుమారు 130 నాటకాలు రచించాడు.

ఏథెన్స్ నగర ప్రజాస్వామ్యంలో వీరపురుష యుగానికి ఎస్కిలస్ ప్రతినిధి. ఇక సోఫోక్లీస్ ఆ యుగ విజయానికి ప్రతినిధి. ఎస్కిలస్ సృష్టించిన విషాద నాటక రీతులకు వన్నె బెట్టి విశ్వ విఖ్యాతమైన ఆదర్శ విషాద నాటకాలను రచించి నాటక కళామతల్లికి నీరాజనాలర్పించిన మేటి రచయిత సోఫోక్లీస్. విషాద నాటకాలలో ఎస్కిలస్ ఇద్దరు ముగ్గురు నటులను ప్రవేశపెడితే, సోఫోక్లీస్ ఇంకో అడుగు ముందుకు వేసి నలుగురు నటులను ప్రవేశపెట్టాడు. బృందగానాన్ని సంస్కరించాడు. కొత్త తరహా దుస్తులను, రంగాలంకరణలను ప్రవేశపెట్టి ప్రేక్షకులకు కనుల పండుగ చేశాడు.

మొట్టమొదటిసారిగా క్రీస్తు పూర్వం 468లో గ్రీకు నాటక స్రష్ట ఎస్కిలస్‌తో పోటీచేసి గెలిచాడు. జీవితకాలంలో పద్దెనిమిది పర్యాయాలు నాటక పోటీలలో విజయలక్ష్మిని చేపట్టి అఖండకీర్తి నార్జించాడు. అనేక సార్లు ద్వితీయ బహుమతి నార్జించాడు. ఏథెన్స్ నగర వాసుల ఆదరాభిమానాలను సోఫోక్లీస్ ఎంతగానో చూరగొన్నాడు.

సోఫోక్లీస్ శాంత స్వభావుడని, అమిత ప్రతిభావంతుడని, ప్రజల ప్రేమను, ఆదరాభిమానాలను చూరగొన్న వ్యక్తి అని, సుందర రూప మధుర గాత్ర సంపన్నుడని తెలుస్తుంది.

గ్రీకు నాటక లక్షణ కర్త అరిస్టాటిల్ సోఫోక్లీస్ నాటకాలను ఆదర్శప్రాయమైనవిగా పరిగణించి, వాటిని ఆధారం చేసుకుని విషాద నాటక లక్షణాలను రూపొందించడమే అతని ప్రతిభకు, కళావైదగ్ధ్యానికి తార్కాణం. అరిస్టోఫేన్స్ అనే గ్రీకు వ్యంగ్య నాటకకర్త ఆ యుగంలోని రచయితలనందరినీ వ్యంగ్యంగా పరిహసించాడే గాని సోఫోక్లీస్ జోలికి పోలేదు. అతనికి సోఫోక్లీస్ రచనలలో ఎలాంటి దోషమూ కనిపించలేదు.

సోఫోక్లీస్‌లోని శాంత స్వభావమే ఇతని నాటకాలలో కూడా విస్తరించుకున్నది. అయితే ఈ శాంతస్వభావం బాధలను అధిగమించడంలో పుట్టిందే కాని, బాధల నుంచి వైదొలగడంవల్ల పుట్టింది కాదు. సోఫోక్లీస్ సృష్టించిన విషాద పరాకాష్ఠ తీవ్రతతో తులతూగేవి నాటక ప్రపంచంలో అరుదు.

నాటక పాత్రలు, బృందగానం మధ్య ఎస్కిలస్ సంబంధాలను మార్చివేసి, సోఫోక్లీస్ సృష్టించిన నూతన సంబంధాలను నెలకొల్పాడు. అందువల్ల నాటక రూపంలో, ప్రయోగంలో, ఎంతో మార్పు వచ్చింది. వివిధపాత్రల మధ్య విషాద సంఘర్షణ, పాత్రలో పరిస్థితులకు సంఘర్షణ, ఒకే ఒక పాత్రలోని విభిన్న దృక్పథాల మధ్య సంఘర్షణ నాటకాల కంటె ప్రశాంతమైన నాటకాలు, తక్కువ విపత్తుగల నాటకాలు రాయడంలో సోఫోక్లీస్‌కు ఆసక్తి ఎక్కువ.

కథావిన్యాసంలో సోఫోక్లీస్ నాటకాలు పరిపూర్ణతను సాధించాయి. కథ సంక్లిష్టమైనా, రమణీయ సంయమనంతో నాటక ప్రధానేతివృత్తానికి ప్రతి చిన్న విషయంలో కూడా అతని ప్రతిభ గోచరిస్తుంది. సున్నితంగా, బలీయంగా, అలంకార రహితంగా పాత్రలను చిత్రించడంలో నేర్పరి.

సోఫోక్లీస్ నాటకాలలోని బృందగాయకులు నాటక క్రియలలో ఎక్కువగా పాల్గనరు. కాని వారు మధ్య మధ్య జోక్యం కలుగజేసుకుంటూ సంబంధం కలిగి ఉంటారు. అతని నాటకాలలోని బృందగాన కార్యకలాపం గానానికి మాత్రమే పరిమితమైంది. రంగాలమధ్య, నాటకలయను కొనసాగించడానికి, పరాకాష్ఠ ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేటట్లు చేయడానికి, ఆకస్మిక మనోధర్మ పరివర్తనకు మార్గం సుగమం చేయడానికి, సోఫోక్లీస్ బృందగానాలను తన నాటకాలలో ఉపయోగించాడు. బృందగాయకుల సంఖ్యను పన్నెండు నుంచి పదిహేనుకు పెంచాడు. ఈ మార్పు నాటక శిల్ప పరిణతికి సంబంధించినది.

తొలిసారిగా రంగాలంకరణం ప్రవేశ పెట్టింది కూడా సోఫోక్లీస్ అని అరిస్టాటిల్ రచనల వల్ల తెలుస్తోంది. సోఫోక్లీస్ నాటక రచనా విధానానికి, ఆశయాలకు సహజ పరిణామమే ఈ రంగాలంకరణం. ప్రకృతి దృశ్య చిత్రాలను పరిభ్రమణ యవనికల మీద రంగముఖ ద్వారానికి ఇరువైపులా వేలాడగట్టేవారు. నాటకానికీ, నాటకానికీ మధ్యనే కాక రంగానికీ, రంగానికీ మధ్య కూడా వీటిని మార్చడానికి వీలుండేది.

సోఫోక్లీస్ కవితా శైలి రమణీయంగా, మృదుమధురంగా భాసిల్లుతూ ఉంటుంది. ఆ శైలి పాత్రల శీలాన్ని, ఉద్వేగాలను ప్రతిబింబిస్తూ ఉంటుంది. బహుసున్నితంగా ఉంటుంది. ఇలాంటి శైలి గ్రీసు దేశంలో ఒక్క ప్లేటో రచనలలో మాత్రమే కనబడుతుంది. ప్రపంచంలో ఇటువంటి శైలి మరెవ్వరికీ పట్టుబడలేదని పాశ్చాత్య విమర్శకుల అభిప్రాయం. నూతన సంక్లిష్టతలను, సున్నితాలను సోఫోక్లీస్ హేతుబద్ధంగా పొదుపుగా ఉపయోగించుకున్నాడు. అందువల్లనే ఇతని నాటకాలు శక్తివంతంగా రూపొందినాయి. సోఫోక్లీస్ విషాద నాటకాలలో కరుణ రసానికే ప్రాధాన్యత. పఠిత ప్రేక్షక హృదయాలను ద్రవీభూతం చేస్తుంది. కథను మలచడంలో, కమ్మెచ్చులాగా సంభాషణలను నడపడంలో, పాత్రచిత్రణలోను ఈయన సిద్ధహస్తుడు.

ఎస్కిలస్ అతని కాలం నాటి గ్రీకుల మూఢ విశ్వాసాలను విస్మరించలేదు. ఆ మూఢ విశ్వాసాలలోనే ఈయన పెరిగాడు. మానవ జీవితం కర్మబద్ధమని, మానవులు దేవతల చేతిలోని కీలుబమ్మలని ఈయన విశ్వాసం.

మానవ జీవితాలతో దేవతలు చెలగాట మాడతారనే నమ్మకం ఇతనికి లేదు. అందువల్ల తన నాటకాలలో దేవతా వ్యవహారాలు చాలా వరకు తగ్గించాడు. మానవుని అహంకారం, స్వార్థం, సద్వర్తనం, ఆత్మ నిగ్రహం, దృఢ సంకల్పం మొదలైన గుణదోషాలే అతని పతనానికి, విజయానికి కారణమని అభిప్రాయం. ఈయన నాటకాలలో కనిపిస్తుంది. సోఫోక్లీస్ కేవలం మానవ సంకల్పానికి మాత్రమే ప్రాధాన్యమీయలేదు. మానవ సంకల్పాన్ని శాసించే ఈశ్వర శక్తి ఒకటి ఉందని తన నాటకాలలో సూచించాడు.

సోఫోక్లీస్ రచించిన 132 నాటకాలలో ప్రస్తుతం ఏడు నాటకాలు మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి. ఈడిపస్ రాజు (425బి.సి), ఈడీపస్ కొలోనియస్ (406 బి.సి), ఆంటిగొని (442 బి.సి), ఆజాక్స్, ట్రాచిమీ (425 బి.సి.), ఎలక్ట్రా (409 బి.సి.) 7. ఫిలిక్టిటాస్ (409బి.సి).

ఈ ఏడింటిలో మొదటి మూడు ఈడీపస్ రాజు కుటుంబ చరిత్రకు సంబంధించినవి. ఈడీపస్ నాటకం కల్పనా చాతుర్యంలో, రసపాత్రచిత్రణలో మేటి నాటకంగా, ప్రపంచ ఉత్తమోత్తమ విషాద నాటకాలలో ఒకటిగా కళావేత్తలు పరిగణిస్తున్నారు. 24 శతాబ్దాల అనంతరం కూడా ఈ నాటకం దేశదేశాల పాఠకులను, నాటక విద్యార్థులను ప్రేక్షకులను ఆనందింపచేయడమే దీని గొప్పతనానికి నిదర్శనం.

శ్రీ.చ.

సోమయాజులు, జె.వి. (1928 - 2004) : ప్రముఖ రంగస్థల, చలనచిత్ర నటుడు. పూర్తి పేరు జన్నలగడ్డ వెంకట సుబ్రహ్మణ్య సోమయాజులు. ఈయన విజయ నగరంలో 1928, జులై 30న శారదాంబ, శివరామమూర్తి దంపతులకు జన్మించాడు. కళారంగం పట్ల అభిరుచి కనబరచే కుటుంబంలో జన్మించడం వల్ల విజయ నగరం మహారాజు కళాశాలలో బి.ఏ. పూర్తి చేసిన తరువాత రెవిన్యూ ఉద్యోగిగా చేరినా నటన పట్ల మక్కువ పెంచుకున్నాడు. 1945లో ప్రారంభమైన నట జీవితం తుదిశ్వాస వరకు వదలలేదు. ప్రముఖ రంగస్థల నటుడు, సోదరుడు జె.వి. రమణమూర్తితో కలసి కన్యాశుల్కం నాటకాన్ని వందలసార్లు రాష్ట్రంలోను, రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించి, ప్రముఖ నటుడిగా గుర్తింపు పొందాడు. ఆంధ్రజ్యోతి, ఎన్.జి.ఓ., కాళరాత్రి, కీర్తిశేషులు, కప్పలు, పంజరం మొదలైన నాటకాలలో,



దొంగాటకం, ఆడది, ప్రగతి, కుక్కపిల్ల దొరికింది, భలే పెళ్లి, దొంగలస్తున్నారు స్వాగతం చెప్పండి, నామకరణం మొదలైన నాటికలలో నటించాడు. నటుడుగా ప్రజల మన్ననలను పొందిన జె.వి. సోమయాజులను 1960వ సంవత్సరంలో రాఘవ నాటక కళాపరిషత్తు ఘనంగా సన్మానించింది. 1979లో చలనచిత్ర రంగం ప్రవేశించి విభిన్న పాత్రలలో నటించాడు. శంకరాభరణం సినిమాలోని 'శంకరశాస్త్రి' పాత్ర తెలుగు చలనచిత్రరంగంలో ఎనలేని కీర్తి తెచ్చి పెట్టింది. తెలుగు సినిమాలతోపాటు తమిళ, కన్నడ, హిందీ భాషా చిత్రాలలో నటించాడు. సినిమా, టీవీలలో నటించినా నాటకరంగంపైనే అభిమానం ఎక్కువ. తెలుగువిశ్వ విద్యాలయం నటనా కళ, రంగస్థల కళల శాఖాధిపతిగా కొంత కాలం పనిచేశాడు. రసరంజని వ్యవస్థాపకుల్లో ప్రముఖుడు. ఈ సంస్థ ఆయనకో రంగుల కల. నాటకరంగం కోసం అయిదు దశాబ్దాలపాటు పనిచేసిన సోమయాజులు అనారోగ్యంతో 2004, ఏప్రిల్ 27న మరణించాడు.

దాసరి, ఎన్.

సోమేశ్వరరావు, దుగ్గిరాల (జ. 1932) : నటుడు దర్శకుడు, విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్, రసరంజని సంస్థలలో ముఖ్యుడు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు సమీపంలోని నందమూరు గ్రామంలో 1932 అక్టోబర్ 7వ తేదీన గౌరీపతి శాస్త్రి, సత్యవతి దంపతులకు జన్మించాడు. ఈయనది పండిత వంశం. తమ గ్రామంలో దేవీ నవరాత్రులు, శ్రీ రామ నవమి వంటి పర్వదినాలలో ప్రదర్శించబడే నాటకాలను చిన్ననాటి నుంచీ చూస్తున్న ఫలితంగా నాటకాల పట్ల అభిమానం పెంచుకున్నాడు. మంచికంఠస్వరం, సంగీతజ్ఞానం నటజీవితానికి కట్టని కోటలయ్యాయి. కాళ్ళకూరి నారాయణరావు రచించిన *చింతామణి* నాటకంలో శ్రీహరి పాత్రలో రంగస్థలం మీద తొలిసారిగా కన్పించిన సోమేశ్వర రావుకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఆనాటి నుంచి నిరాఘాటంగా ముందుకు సాగిపోయాడు. కొంత మంది మిత్రుల్ని పోగుచేసుకొని ఆత్రేయ రచించిన *ఎవరుదొంగ*, కొర్రపాటి గంగాధరరావు రచించిన *డిటెక్టివ్, తెలుగు కోపం, బంగారు సంకెళ్ళు* నాటికలను జనరంజకంగా ప్రదర్శించాడు. కాకినాడలో ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు ఆత్రేయ రచించిన *విశ్వశాంతి, ప్రగతి* లను ప్రదర్శించాడు. 1954లో టెలికమ్యూనికేషన్ల శాఖలో ఉద్యోగం రావడంతో విశాఖలో స్థిరపడ్డాడు. అక్కడ గణపతిరాజు అచ్యుత రామరాజు, చాగంటి సన్యాసి రాజు వంటి ప్రసిద్ధ నటులు, దర్శకులతో పరిచయం ఏర్పడి, రాచకొండ విశ్వనాథశాస్త్రి రచించిన *తిరస్కృతి* నాటకం, *పోతుకూచి దొంగ* నాటికను, *పద్మవ్యూహం* అనే మరో నాటికను ప్రదర్శించి ప్రశంసలందుకున్నాడు. 1960లో హైదరాబాద్‌కు బదిలీ అయింది. అబ్బూరి రామకృష్ణారావు, మంత్రి శ్రీనివాసరావు, ఎ.ఆర్. కృష్ణ, జె.ఎల్. నరసింహారావు, చాట్ల శ్రీరాములు వంటి అగ్రశ్రేణి కళాకారుల పరిచయమైంది. ఎ.ఆర్. కృష్ణ దర్శకత్వంలో కొన్ని నాటకాల్లో, విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ నాటకాల్లోనూ పాత్ర ధారణ చేశాడు. *డామిట్! కథ అడ్డం తిరిగింది, జగన్నాటకం, నిజం* వంటి నాటకాలలో వైవిధ్యం గల పాత్రలు పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందాడు. *కన్యాశుల్కం*లో కరటక శాస్త్రిగా, *మృచ్ఛకటిక*లో శకారుడుగా దుగ్గిరాల అద్భుత నటనా కౌశలం చూపి సామాజికుల్ని సమ్మోహితుల్ని చేశాడు. ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చిన ప్రత్యేక ప్రదర్శనలో మృచ్ఛకటికలో శకారుని పాత్ర పోషణకు ముగ్ధుడైన రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ సోమేశ్వరరావును వెతుక్కొంటూ వచ్చి అభినందించాడు.

విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన ఎన్.ఆర్. నంది *మరో మొహెంజదారో* నాటకంలో విప్లవకారుడు భూషణ్ పాత్రలో దుగ్గిరాల మరపురాని అభినయ పాటవం అభివ్యక్తం చేశాడు. ఎ.ఆర్. కృష్ణ దర్శకత్వంలో *ప్రతాపరుద్రీయం* నాటకంలో యుగంధరుడు గాను, పిచ్చివాడు గాను, *మాలపల్లి* లో జగ్గడుగాను సోమేశ్వరరావు అభినయం జీవితంలో మైలురాళ్ళుగా పేర్కొనవచ్చు.

రసరంజని సంస్థ వ్యవస్థాపక సభ్యుడుగా నాటకరంగానికి ఎనలేని సేవ చేశాడు. ఈయన దర్శకత్వంలో ప్రదర్శితమైన ఆకెళ్ళ రచించిన *కాకి ఎంగిలి, క్రాస్ రోడ్స్, శ్రీనాథుడు*, నాటకాలు ప్రతిష్ఠాత్మక నంది బహుమతులును గెల్చుకున్నాయి. పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం పైడిలక్ష్మయ్య పురస్కారంతో సోమేశ్వరరావును సన్మానించింది. ఎన్నో కళాసంస్థలు ఈయన కళాసేవను అభినందిస్తూ ఆత్మీయంగా సన్మానించి ప్రోత్సహించాయి. 2006, జనవరిలో నంది నాటకోత్సవాలలో ఎన్.టి.ఆర్. రంగస్థల పురస్కారం దుగ్గిరాలను వరించింది.

గం.సు.రె.



సోయింకా, వోలే (జ.1934) : ప్రముఖ నైజీరియన్ నాటకకర్త, కవి, నవలా రచయిత, సాహిత్య విమర్శకుడు. మానవజాతి తిరోగతికి కారణమైన సమకాలీన రాజకీయ వ్యవస్థను వ్యంగ్యంగా చిత్రించిన వోలె సోయింకా నాటకాలు న్యూయార్క్,

లండన్ నగరాలలో కూడా ప్రదర్శించబడ్డాయి. వోలే సోయింకా నైజీరియాలోని అబెయెకూటలో 1934, జులై 13న జన్మించాడు. ఇబడాన్‌లోని యూనివర్శిటీ కళాశాల నుంచి పట్టా పొందాడు. సోయింకా ఇంగ్లండులోని లీడ్స్ విశ్వవిద్యాలయంలో పైచదువులు చదువుకున్నాడు. అక్కడి ఉపాధ్యాయుడు, ప్రఖ్యాత ఆంగ్ల కవి, విమర్శకుడు అయిన జి. విల్సన్ నైట్ వల్ల ప్రభావితుడై, చదువు ముగించుకొని తిరిగి వచ్చిన తరువాత నైజీరియాలో 'మాస్క్' అనే పేరుతో ఒక జాతీయ నాటక సంస్థను నెలకొల్పాడు. (కొన్నేళ్ల తరువాత ఇదే ఒరిసన్‌గా వ్యవహరించబడింది)

ఈయన రచించిన ది డాన్స్ ఆఫ్ ది ఫారెస్ట్ (అడవి చేసిన నృత్యం) అనే మొదటి నాటకం నైజీరియా స్వాతంత్ర్య దినం సందర్భంగా ప్రదర్శించబడి అందరి మెప్పును పొందింది. స్వర్ణయుగంగా పేరు పొందిన చరిత్రాత్మకమైన సంస్కృతిని కాదనుకొని, ఆధునీకీకరణ పేరుతో అవ్యవస్థను సృష్టించిన రాజకీయాలను ఇతివృత్తంగా తీసుకొని రాసిన వ్యంగ్య రచన ఇది. పాశ్చాత్య అనుకరణను హేళన చేస్తూ రాసిన హాస్య నాటిక ది లయన్ అండ్ ది జ్యూయెల్ (1959). చర్చ్‌ని ఆధారంగా చేసుకొని బతుకుతున్న మత గురువుల ప్రలోభాలను ఎత్తిచూపుతూ రాసిన రెండు నాటకాలు ది ట్రయల్ ఆఫ్ బ్రదర్ జీరో (1960), జీరోస్ మెటామోర్ఫసస్ (1972) గంభీరమైన ఇతివృత్తాలతో రాసిన నాటికలు. ది స్ట్రాంగ్ బీడ్ (1963), కొంగీస్ హార్‌వెస్ట్ (1965), ది రోడ్ (1965), అనే నాటకాలలో సమాజంలోని అమానుషమైన ఆచారాలను, నరబలిని ఖండించాడు. ఆధునిక సామాజిక వ్యవస్థను విమర్శించేటప్పుడు సంప్రదాయాల ముసుగులోని అవకతవకలను కూడా ఎత్తి చూపడం ఈయన మరచిపోలేదు.

యెరుబా సంప్రదాయానికి చెందిన వోలే సోయింకా పాశ్చాత్య ధోరణి మేళవించి సంప్రదాయబద్ధంగా రాసినా, ప్రదర్శన విధానాలలో నూతన ప్రయోగాలు చేశాడు. సునిశితమైన హాస్యం, చురకలు పెట్టే వ్యంగ్యం, చక్కని కవితాశైలి కలబోసిన ఈయన నాటకాలలో ఆంగ్లభాష ఎంతో పటిష్ఠంగా రూపొందింది.

1964లో బ్లాక్ ఆర్ఫియన్ అనే ఒక ప్రసిద్ధ సాహితీ పత్రికకు ఎడిటరుగా పనిచేశాడు. అతని దేశం వారైన నీగ్రోలు తమ జాతి విశిష్టతను ప్రపంచానికి తెలియచేయడానికి 'నెగ్రిట్యూడ్' (నీగ్రో జాతీయత) అనే ఒక సామాజిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించినపుడు దానిని సోయింకా ఒక సంకుచిత తత్త్వమని ఖండించాడు. అసాధ్యమైన ఆదర్శాల కన్నా ఆచరణయోగ్యమైన నీతి సూత్రాలను, సామాజిక విలువలను ప్రజలకు తన రచనల ద్వారా చెప్పగలిగిన వాడే ఈయన దృష్టిలో నిజమైన రచయిత. అలా చేయడం ఒక కళాకారుని బాధ్యతని కూడా ఆయన అన్నాడు.

ది ఇంటర్‌ప్రెటర్స్ (1965), సీసన్స్ ఆఫ్ అనోమి (1973) అనే రెండు నవలలను ఈయన ప్రచురించాడు. జేమ్స్ జాయ్స్ వంటి గొప్ప రచయితల శైలిలో, సున్నితమైన పాత్ర పోషణ ద్వారా చక్కగా రాసిన నవలలు విమర్శకులు వాటిని మెచ్చుకొన్నారు. వోలె సోయింకా రాసిన ఇతర నాటకాలు మాడ్‌మెన్ అండ్ ద స్పెషలిస్ట్స్ (1970), డెత్ అండ్ ద కింగ్స్ హార్స్‌మాన్ (1975). ఇఫె, లాగోస్ నగరాలలో (1969) ఆచార్యుడుగా పనిచేసిన సోయింకా 1966లో జయఫ్రాలో జరిగిన స్వదేశీ ఉద్యమంలో రెండేళ్లు కారాగారవాసం అనుభవించాడు. కారాగారంలోని అనుభవాలను ది మాన్ డైడ్ అనే పుస్తకంలో వివరించాడు. ఆకెడ్ ది ఇయర్స్ ఆఫ్ చైల్డ్ హుడ్ (1981) అనే పుస్తకం ఈయన ఆత్మకథకు సంబంధించింది. ఈయనకు 1987లో ప్రతిష్ఠాత్మకమైన నోబుల్ బహుమతి లభించింది. ఈ సాహితీ పురస్కారం అందుకున్న మొదటి నీగ్రో రచయిత ఈయనే.

భార్గవి

సోవియట్ నాటకరంగం : చరిత్ర గ్రంథం. యూరీ రిబాకోల్ రచనకు అనువాదం. అనువాదం : శ్రీనివాసచక్రవర్తి. ప్రథమ ముద్రణ, 1968, పుటలు. 56.

రష్యాలో సోవియట్ రాజ్య సంస్థాపన నుంచి 1968 వరకు రష్యా నాటక రంగ ప్రగతిని వ్యక్తీకరించే గ్రంథం. తొలి సోవియట్ నాటక ప్రదర్శనలు, నాట్య విద్యాబోధన, యుద్ధానంతరం అనే మూడు అధ్యాయాలతో, 36 చిత్రాలతో ఈ గ్రంథం విలసిల్లుతోంది. ఆధునిక రష్యన్ నాటకరంగాన్ని సర్వతో ముఖంగా కళ్లకు కట్టినట్లు చేసే గ్రంథం.

శ్రీ.చ.

సౌభికులు : మూకాభినయం ద్వారా కథను ప్రదర్శించే వారు సౌభికులు. పూర్వం వీరు కంసవధ, బలిబంధనం ప్రదర్శించారని పతంజలి మహా భాష్యం వల్ల తెలుస్తున్నది. సౌభికులు రెండు విధాలు 1. నటులు, 2. భరతులు. కేవలం ఆంగికాభినయం చేసేవారు నటులు, ఆంగికాభినయంతో పాటు వాచికాభినయం కూడా ప్రయోగించే వారు భరతులు. అయితే కాలక్రమేణా నట, భరత పదాలు పర్యాయపదాలుగా పరిణమించాయి. కేవలం ఆంగికాభినయం చేసే వారికి నర్తక పదం స్థిరపడింది.

శ్రీ.చ.

సౌమిత్రి (జ.1944) : నటుడు, ప్రయోక్త, దర్శకుడు, కళాకేంద్ర సంస్థ స్థాపకుడు. 1944వ సంవత్సరంలో తెనాలి సమీపంలోని కొల్లూరులో జన్మించాడు. 18 సంవత్సరాలు హెచ్. ఎమ్.టిలో ఇంజనీరుగా పని చేశాడు. కళాసేవకు పూర్తి సమయం కేటాయించాలనే ఉద్దేశంతో సౌమిత్రి ఉద్యోగానికి రాజీనామా చేశాడు. సౌమిత్రి స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ స్థాపించి అనేకమంది యువతీ యువకులను కళాకారులుగా తీర్చిదిద్దాడు. 1962 నుండి 1992 వరకు నటుడుగా, అనేక నాటకాలలో నటించినా, ఆయనకు బాగా పేరు తెచ్చి పెట్టిన నాటక నాటికలు *తారాశశాంకం, దంత వేదాంతం, చరిత్ర, మధుమయి, మనసులు, తత్వాలు, సింగారి, వేమన యోగి, భాగ్యనగరం, మరోభారతం, కొడుకు పుట్టాల, అల్లూరి సీతారామరాజు* మొదలైనవి.



1988 నుండి సంగీత ప్రధానమైన నృత్య నాటకాలను రూపొందించడం ప్రారంభించాడు. *శివగంగ, గీతగోవిందం, హరికీర్తనాచార్య అన్నమయ్య, కళ్యాణ శ్రీనివాసమ్, అంబేద్కర్, స్వర్ణాంధ్ర భారతి, మహర్షి, స్వామి శరణమ్, గౌతమబుద్ధ* మొదలైనవి భారతదేశంలోనే గాక విదేశాలలో ప్రదర్శించి మెప్పుపొందాడు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు నిర్వహించిన నాటకపోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. కళారంగాభివృద్ధి కోసం తనవంతు కృషిని నిర్విరామంగా సాగిస్తున్న కళా హృదయుడు సౌమిత్రి.

దాసరి. ఎన్.

సౌమిల్లుడు : సంస్కృత నాటక కర్త. భాస సౌమిల్ల కవి పుత్రాదీనాం అంటూ కాళిదాసు మాళవికాగ్నిమిత్రలో సౌమిల్లుని పేరు పేర్కొనడం వల్లఇతనుకాళిదాసు కంటే పూర్వుడనీ, లబ్ధప్రతిష్ఠుడని నిశ్చయంగా తెలుస్తోంది. రాజశేఖర కవి కూడా భాసునితో పాటు సౌమిల్లుని పేరు కూడా ప్రస్తావించడమే గాక సౌమిల్లుడు రామిలా అనే అతనితో కలసి శూద్రక కథ అనే గ్రంథం వీర శృంగార రసాలు రెంటికీ ప్రాధాన్యమిస్తూ రచించాడని తెల్పాడు. పేరును బట్టి సౌమిల్లుడు మహారాష్ట్రుడని భావింప వలసి వస్తోంది. ఇతని నాటకాలేవీ ఇపుడు లభ్యం కావడం లేదు.

శ్రీ.చ.

స్కేని: గ్రీసుదేశంలో డయొనిసిస్ దేవత ఆరాధనోత్సవాలలో భాగంగా నాటక ప్రదర్శనలు నిర్వహించారు. డయొనిసిస్ దేవాలయం ముందుభాగంలో వృత్తాకారంలో నాట్యస్థలం ఉండేది. దీనిని ఆరెస్ట్రా అని పిలిచేవారు. ఆర్కెస్ట్రా వెనక భాగంలో కొండ సానువుల్లో అర్థ చంద్రాకారంలో ప్రేక్షకులు కూర్చొనే మెట్లు ఉండేవి. దాదాపు 20, 30 వేల మంది నాటకాలు చూడడానికి అనువుగా ఉండేవి. కొన్నాళ్లకు దేవాలయానికీ ఆర్కెస్ట్రాకీ మధ్య ఒక చిన్న గది నిర్మించబడింది. అదే కాలక్రమేణా రెండంతస్థుల మేడ కూడా అయింది. ఈ గదినే స్కేని (Skene)ని పిలిచేవారు. ఆర్కెస్ట్రాకి వెనుక భాగంలో ఉండటంచేత అది నటీనటులకు గ్రీన్ రూమ్‌గాను, నాటకానికి నేపథ్య తెరగాను ఉపకరించింది. మరి కొన్నాళ్లకు స్కేనికి ఇరు పక్కల రెండు గదులు నిర్మించబడటంతో పాత్రల ప్రవేశ నిష్క్రమణలకు, ప్రేక్షకుల ప్రవేశానికి కూడా స్కేని ప్రయోజనకారి అయింది. ఈ స్కేని అన్న పదం నుంచే సీన్ అనే పదం వాడుకలోకి వచ్చిందని విమర్శకుల అభిప్రాయం.

గం.సు.రె.

స్టానిస్లవ్‌స్కీ (1863-1938) : నాటక సిద్ధాంత వేత్త, ప్రయోక్త, మహానటుడు, రచయిత. చైతన్యం ద్వారా ప్రత్యక్ చైతన్యావస్థలోకి ప్రవేశించి ఆవేశంతో నటించడానికి క్రమబద్ధమైన విధానాన్ని రూపొందించిన వాడు. ఈయన 1863లో మాస్కోలో జన్మించాడు.

స్టానిసవ్‌స్కీ అసలు పేరు కాన్‌స్టాన్‌టిన్ సెర్జియెవిచ్ అలెగ్జెయేవ్. నాటకరంగంలో పెట్టుకున్న పేరు స్టానిస్లవ్‌స్కీ. తండ్రి సెర్జీ వ్లాడిమిరో విశ్ అలెగ్జెయేవ్, తల్లి యెలిజలెటా వాసిల్యేవ్నా అలెగ్జెయేవ్. వీరికి లలిత కళలంటే అభిమానం ఎక్కువ. స్టానిస్లవ్‌స్కీ తల్లినటి. ఫ్రెంచి దేశస్థురాలు, ఆమెనుంచే నటనాచాతుర్యం స్టానిస్లవ్‌స్కీకి సంక్రమించి ఉంటుంది.

స్టానిస్లవ్‌స్కీ మూడవ ఏట రంగస్థలం ఎక్కాడు, ఋతువులు అనే మూక నాటికలో హేమంతం తాతయ్య పాత్రలో నటించాడు. ఆ తరువాత ఊరి గ్రామీణ భవనం ఆవరణలో స్టానిస్లవ్‌స్కీ తండ్రి చిన్న నాటకశాల కట్టించి ఇచ్చి కుమారుని నాటకాభిలాషకు దోహదం చేశాడు. స్లానిస్లవ్‌స్కీ తన సోదర సోదరీమణులతో ఆ చిన్న నాటకశాలలోనే చిన్నచిన్న నాటకాలు ప్రదర్శించ సాగాడు. ఈ దశలోనే కళాకారుడు ప్రజలతో సన్నిహిత సంబంధం ఏర్పరుచుకొని వారి నుంచి ఆవేశం పొందాలనే సత్యాన్ని స్టానిస్లవ్‌స్కీ గ్రహించాడు.

ప్రయోక్తగా, ప్రధాన నటుడుగా నాటికలు, నృత్య నాటికలు ప్రదర్శించి స్టానిస్లవ్‌స్కీ కొంత అనుభవం గడించిన దృష్ట్యా నటనలో సరైన విధానం కోసం అన్వేషణ సాగించాడు. అన్వేషణ సాగిన కొద్దీ గందర గోళం అధికమైంది. మాలే నాటక సంఘం ప్రదర్శించిన ప్రదర్శనలను ఎక్కువగా చూస్తూ, వాటిలో నుంచి నేర్చుకోవాలని చూశాడు. జీవిక నటులను తన ప్రదర్శనలలో పాల్గనడానికి ఆహ్వానించాడు. కాని వారు తమ విధానాలను రహస్యంగా ఉంచుకోసాగారు. నాటక కళాశాలకు స్వస్తి చెప్పి స్వయంగా నిరంతర సాధనకు పూనుకున్నాడు. అప్పటికే స్టానిస్లవ్‌స్కీ పేరు మాస్కో లోని ఔత్సాహిక నాటక సమాజాలలో మోగిపో సాగింది.

1888లో స్టానిస్లవ్‌స్కీకి సుప్రసిద్ధ దర్శకుడు, నాటక రచయిత, నటుడు అలెగ్జాండర్ ఫెడొటోవ్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి 'సొసైటీ ఆఫ్ ఆర్ట్ అండ్ లిటరేచర్' అనే పేరుతో ఒక సమాజం నెలకొల్పారు. దీని స్థాపనకు, నిర్వహణకు కావలసిన ధనం స్టానిస్లవ్‌స్కీ ఇచ్చాడు. పుష్కిన్, మాల్యేరు, షిల్లర్, ఆస్ట్రోవస్కీ, టాల్‌స్టాయ్, షేక్స్పియర్ మొదలైన విశ్వవిఖ్యాత నాటకకర్తల నాటకాలలో స్టానిస్లవ్‌స్కీ ప్రధాన పాత్రలలో నటించి మన్ననలు పొందాడు. ఈ దశలో స్టానిసవ్‌స్కీ నటుడికి కావలసిన చిట్కాలు సమకూర్చుకున్నాడు. కాని సంతృప్తి కలుగలేదు. ఆ చిట్కాలంటే అసహ్యం ఏర్పడింది. పాత్రల అంతర జీవితాన్ని ద్యోతకం చేయడమే కళ లక్ష్యమనే సిద్ధాంతానికి వచ్చాడు.

1897 జూన్ నెలలో సుప్రసిద్ధ దర్శకుడు, నాటక రచయిత, వాల్డిమిర్ ఇవనోవిచ్ నెమిరోవిచ్ డాన్ చెంకోతో కలిసి ఒక నాటక సమాజం నిర్వహించాలని నిశ్చయించు కున్నాడు. ఆ నిశ్చయ ఫలితంగా అవతరించినదే మాస్కో ఆర్ట్ థియేటర్.

స్టానిస్లవ్‌స్కీ నాటక అంతరార్థాన్ని బహిర్గతం చేస్తూ నూత్నప్రయోగ విధానం రూపొందించాడు. డాన్‌చెంకో చెఖోవ్ *సీగల్* నాటకానికి దర్శకత్వం వహించాడు. ప్రదర్శన అద్భుతంగా రక్తి కట్టింది. మాస్కో ఆర్ట్ థియేటర్ పేరు మారుమోగింది.

కాని మాస్కో ఆర్ట్ థియేటర్‌తో సన్నిహిత సంబంధం గల చెఖోవ్, మొరొజోవ్‌లు చనిపోవడం, తన నటన తనకే అసంతృప్తి కలిగించడం, భవిష్యత్తు ఆశాజనకంగా లేకపోవడం స్టానిస్లమ్‌స్కీకి ఆందోళన కలిగించాయి. ఆ పనిలో అతనికే నమ్మకం సన్నగిల్లసాగింది. నటన నిర్జీవంగా కొనసాగింది. విశ్రాంతి కోసం ఫిన్లండు వెళ్లి, తన నాటకానుభవాన్ని నెమరు వేసుకున్నాడు, విశ్లేషించి చూచుకున్నాడు. ఎపుడు పడితే అపుడు ఆవేశం పొందడానికి కావలసిన పరిస్థితులను కల్పించే విధానమేమిటా అని తీవ్రంగా ఆలోచించాడు. ఈ ఆలోచనలు, ప్రత్యక్ చైతన్యానికి దారితీశాయి. ప్రత్యక్ చైతన్య విధానం రూపొందింది.

అటు జీవిక నటులుగాని, ఇటు ఔత్సాహిక నటులుగాని స్టానిస్లవ్‌స్కీ విధానాన్ని ఆమోదించలేదు. అనుసరించలేదు. స్టానిస్లవ్‌స్కీ రిహార్సలు గదులలో, క్లబ్బులలో, చివరకు వీధులలో ఎక్కడ నటులు కనబడితే అక్కడ తన విధానాన్ని విశదీకరించి చెప్పగలిగాడు. ఎవరూ పట్టించుకోలేదు. ఇదొక పిచ్చి అన్నారు. కాని నిస్పృహ చెందలేదు. మాస్కో ఆర్ట్ థియేటర్‌కు అనుబంధంగా ఫస్టు స్టూడియో అనే పాఠశాల ఏర్పాటు చేసి యువ నటులను చేర దీసి, వారికి తన విధానం ప్రయోగాత్మకంగా బోధించి నాటకాలు విజయవంతంగా ప్రదర్శింపజేశాడు. ఒక నూత్న ప్రపంచాన్ని చూపించాడు. జీవిక నటులు, ఔత్సాహిక నటులు స్టానిస్లవ్‌స్కీ విధానంలోని విశిష్టతను గ్రహించి తాముా ఆ విధానాన్నే అనుసరించసాగారు.

1922 నుంచి 1924 వరకు స్టానిస్లవ్‌స్కీ పశ్చిమ యూరప్, అమెరికాల లో ప్రదర్శనలిచ్చాడు. ప్రపంచం మాస్కో ఆర్ట్ థియేటర్‌కు, స్టానిస్లవ్‌స్కీ విధానానికి నీరాజనాలర్పించింది. అమెరికాలో ఉండగానే స్టానిస్లవ్‌స్కీ తన నాటక రంగ జీవితాన్ని, అనుభవాలను వివరిస్తూ, '*నా కళా జీవితం* (My life in Art)' అనే గ్రంథం రచించాడు. రష్యాకు తిరిగి వచ్చిన తరువాత నటులకు, ప్రయోక్తలకు ఉపయుక్తంగా *యాన్ యాక్టర్ ప్రిపేర్స్* (An Actor Prepares) (1936), *బిల్డింగ్ ఎ కారెక్టర్* (Building a character) (1949), '*క్రియేటింగ్ ఎ రోల్*' (Creating a role) అనే గ్రంథాలను రచించాడు. స్టానిస్లవ్‌స్కీ నటనా విధానం నటుల పాలిటి కల్పవృక్షం.

స్టానిస్లమ్‌స్కీ రచించిన యాన్ యాక్టర్ ప్రిపేర్స్ సిద్ధాంత గ్రంథం మాత్రమే గాకుండా స్వయం బోధిని. సాధన చేయడానికి కావలసిన అభ్యాసాలు కూడా ఇందులో ఉన్నాయి. అందుకే యాన్ యాక్టర్ ప్రిపేర్స్ ని ప్రపంచ కళాకారులు యాక్టర్స్ బైబిల్ అని, స్టానిస్లవ్‌స్కీని ఆచార్య శిరోమణిగా పిలిచారు. ఈయన 1938లో మరణించాడు.

శ్రీ.చ.

స్టానిస్లవ్‌స్కీ విధానం : నటనా విధాన భేదం. కళాసృష్టికి సృజనాత్మక చిత్తవృత్తి అంటే ఆవేశం ఎంతైనా అవసరం. ఆవేశం లేనిదే కళాసృష్టిసవ్యంగా జరగదు. జీవకళతో రాణించదు. ఆవేశం ప్రత్యక్ చైతన్యావస్థ (sub conscious) లో పుట్టి, అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తుంది. అపుడు కళాసృష్టి జీవంతో వెలుగొందుతుంది. కళాకారులంతా ఆవేశంలో కళాసృష్టి సాగిస్తారు. ఎపుడు ఆవేశం కొరవడితే అపుడు కవి, చిత్రకారుడు, శిల్పి కళా సృష్టిని నిలిపి వేసి తిరిగి ఆవేశం పుట్టినపుడు, కళాసృష్టి కొనసాగించవచ్చు. కానీ నటునికి అటువంటి అవకాశం లేదు. నిర్దేశించిన ప్రదేశంలో నిర్దేశించిన సమయానికి నాటక ప్రదర్శన ఉంటుందని ముందుగానే ప్రకటిస్తారు. సరిగ్గా అదే రోజున అదే సమయానికి

నటుడు రంగస్థలంపై రెండు మూడు గంటలు నటించాలి. చిత్త వృత్తి సృజనోన్ముఖంగా లేదనటానికి వీలు లేదు. ఆవేశం లేకుండా నటిస్తే నటనలో జీవం ఉండదు. ఎపుడు కావాలంటే అపుడు, నటుడు ఆవేశంతో నటించాలి. అందుకు ఆవేశాన్ని నటుడు గుప్పిట్లో పెట్టుకోవాలి. కావాలంటే అపుడు నటుడు ప్రత్యక్ చైతన్యావస్థను చేరుకోగలిగి ఉండాలి. చైతన్యం ద్వారా ప్రత్యక్ చైతన్యానికి చేరుకొని ఆ ప్రత్యక్ చైతన్యావస్థలోనే ఆవేశంతో నటించడానికి క్రమబద్ధమైన విధానాన్ని రూపొందించిన నట సిద్ధాంతవేత్త స్టానిస్లవ్‌స్కీ.

ఈ విధానాన్నే నేడు స్టానిస్లవ్‌స్కీవిధానం, స్టానిస్లవ్‌స్కీ సిద్ధాంతం అంటున్నాం. స్టానిస్లవ్‌స్కీ 'యాన్ యాక్టర్ ప్రిపేర్స్' అనే గ్రంథంలో ఈ విధానాన్ని వివరించాడు.

ఇంతకీ స్టానిస్లవ్‌స్కీ దృష్టిలో అభినయం అంటే ఏమిటి? ఎపుడు పడితే అపుడు ఆవేశంతో అభినయించే విధానం ఏమిటి?

స్టానిస్లవ్‌స్కీ దృష్టి లో పాత్రగా జీవించడమే అభినయం. పాత్రగా జీవించడమంటే నటుడు తన మానవ స్వభావాలను ఆ పాత్ర **జీవితంలో పొందుపరిచి** తన ఆత్మను, ఆపాత్రలో ప్రతిష్ఠించి **పాత్ర అంతర్జీవితాన్ని** సృజించి, రమణీయంగా, కళాత్మకంగా వ్యక్తీకరించడమే.

చైతన్యం ద్వారా ప్రత్యక్ చైతన్య ద్వారానికి చేరుకోవడానికి మొదటి మెట్టు ఏకాగ్రత.

ఏకాగ్రత : మానవుడు ఏ పని చేయాలని సంకల్పించినా ఆ పని మీదనే మనసంతా కేంద్రీకరించినపుడే సవ్యంగా నిర్వహించగలుగుతాడు. ఇలా మనసును ఒకే పనిమీద కేంద్రీకరించడమే ఏకాగ్రత. దీనినే సంస్కృత లాక్షణికులు సమాధి అన్నారు. ఏకాగ్రతను అలవర్చుకోలేని నటులు రంగస్థలం మీద రాణించరు. ఇటువంటి నటులు నాటకరంగం నుంచి నిష్క్రమించడం మంచి దంటాడు స్టానిస్లవ్‌స్కీ.

అయితే : నటుడు పాత్రగా జీవించడానికి తారక మంత్రం **అయితే (if)** అనేది. అయితే అనే ప్రశ్నను వేసుకుంటూ పాత్రను సాధన చేయాలి. ఉదాహరణకు. హిరణ్యాకశ్యపుడు పాత్రధారి నేనే హిరణ్యాకశ్యపుడను 'అయితే' నాకుమారుడు నామాట వినకపోతే? నాశత్రువును అహర్నిశలు స్మరిస్తూ భట్టువలే పొగడ్తాంటే? నేను శత్రుస్తోత్రం మానవలసిందని చెప్పినా వినకపోతే? ఏంచేయాలి? ఇలా ప్రతి ప్రక్రియను 'అయితే' అని ప్రశ్నించుకొంటూ వెళ్ళితే నటుడు తనలోని మానవ స్వభావాలను, ఆత్మను, ఆపాత్రలో ప్రతిష్ఠించ గలుగుతాడు. అపుడు ప్రక్రియలు, భావాలు ప్రదర్శించడానికి సవ్యమైన మార్గం గోచరిస్తుంది.

భావనాశక్తి : నాటక రచయిత పాత్రల పరిస్థితులను మనోభావాలను, ఆలోచనలను, చేష్టలను స్థూలంగా తెలియచేస్తాడేగాని, నవలా కారుడిలాగా వివరించి చెప్పడు.

రంగానికీ రంగానికీ మధ్య ఏమి జరిగిందీ? పాత్ర మనోభావాలు ఆ కాలంలో ఎలా ఉన్నాయి? మొదలైన అనేక విషయాలు నాటక రచయిత అసలు తెలియజేయడు. నటుడు నాటకాన్ని అధ్యయనం చేసి వీటన్నింటిని ఊహించుకొవలసిందే. ఇలా ఊహించుకోగల శక్తినే భావనాశక్తి అంటారు. ఈ భావనా శక్తిని పెంపొందించడానికి సాధన చేయవలసి ఉంటుంది.

ప్రక్రియ : నటుడు రంగస్థలం మీద చేసే భౌతిక అంతర ప్రక్రియలకు ప్రయోజనమంటూ ఉండాలి. హేతుబద్ధంగా ఉండాలి. ప్రక్రియకోసం ప్రక్రియ అనుకుంటే అందులో జీవకళ ఉండదు. ప్రక్రియలు సమర్థనీయంగా, హేతుబద్దంగా, సందర్భోచితంగా, యదార్థంగా ఉండాలి. ఇలా ఉండడానికి నటుడు 'అయితే' సూత్రాన్ని ఆశ్రయించాలి.

కండర సారళ్యం : పాత్రల మనోభావాలను, ఉద్వేగాలను, చేష్టలను ద్యోతకం చేయడానికి శరీరమే సాధనం. అందుచేత శరీరం సరైన స్థితిలో ఉంటేనే వాటిని ఖచ్చితంగా, సవ్యంగా నటుడు వెలువరించగలుగుతాడు. కాబట్టి నటుడు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడమే గాకుండా, అదుపులో ఉంచుకోవాలి. కండరాలు సరళంగా లేకపోతే భావాలను ఖచ్చితంగా, సవ్యంగా వ్యక్తీకరించడం సాధ్యం కాదు. ఒక్కొక్కపుడు వ్యక్తీకరించవలసిన వాటికి, విరుద్ధమైనవి గోచరించే అవకాశముంది. కండర సారళ్యం అభ్యాసం ద్వారానే సాధ్యమవుతుంది.

ఘట్టాలు, ఆశయాలు : నాటకాన్ని అధ్యయనం చేసి పాత్రను రూపొందించుకొని, సాధన చేయడానికి ముందుగా నాటకాన్ని ఘట్టాలకింద విభజించుకోవాలి. ప్రతి ఘట్టానికి, ఆ ఘట్టంలోని ప్రతి ప్రక్రియకు ఆశయమేమిటో నిర్ణయించుకోవాలి. ఆ ఘట్టాలకు ప్రత్యేకమైన పేర్లు పెట్టాలి. ప్రతి ఆశయంలోను ప్రక్రియ బీజరూపంలో ఉంటుంది. ఆ ప్రక్రియను తెలుసుకోవాలి. రంగస్థలం మీద అనేక ఆశయాలు తటస్థపడతాయి, వాటిలో నటుడికి అవసరమైన వాటిని ఎంచుకొని వాటి గుణాలను గుర్తించాలి. ఆశయాలకు జీవం పోస్తే పాత్రపోషణకు పరిస్థితులు అనుకూలిస్తాయి. ఏ ఘట్టంలో ఏది ప్రధానాశయమో గ్రహించి, దానిని ప్రేక్షకులకు ప్రస్ఫుటీకరించవచ్చు.

విశ్వాసం, యదార్థతా పరిజ్ఞానం : రంగస్థలం మీది దృశ్యాలు, పాత్రలు, వారి హావభావ విలాస చేష్టాదులు వాస్తవం కావని నటులకూ తెలుసు, ప్రేక్షకులకూ తెలుసు. కాని ప్రేక్షకులను ఆకట్టుకోవాలంటే వారు ఇదంతా వాస్తవం కాదనే విషయం విస్మరించేటట్టు చేసి, రంగస్థలం మీద జరిగేదంతా యదార్థం అనే భావం కలిగించాలి. కాబట్టి నటుడు రంగస్థలం మీద జరిగేదంతా యదార్థమని ముందుగా తాను విశ్వసించాలి.

ఉద్వేగస్మృతి : నటుడు, నిత్య జీవితంలో సుఖదుఃఖాలు అనుభవిస్తూనే ఉంటాడు. అందులోను కళాకారుని హృదయం సున్నితంగా ఉంటుంది. ఈ సుఖ దుఃఖాది ఉద్వేగాలు నిత్య జీవితంలో అనుభవించిన తరువాత అవి ఎప్పటికీ సమసిపోవు. సమసిపోయినట్లు తాత్కాలికంగా అనిపిస్తుంది. అవి కళాకారుని హృదయకుహరంలో హత్తుకుని నిద్రావస్థలో ఉంటాయి. ఆయా ఘటనల సూచనలు తటస్థించినపుడు ఆ ఉద్వేగాలు మేలు కొంటాయి. స్మృతిపథంలో తళుక్కుమంటాయి. అలాంటపుడు నటుడు ఉద్వేగాలను పూర్వమంత బలంగానో, బలహీనంగానో తిరిగి అనుభవిస్తాడు. దీనిని ఉద్వేగ స్మృతి అంటారు.

"సాదృశ జ్ఞాన చింతాదుల వలన పూర్వాను భూతార్థ విషయ జ్ఞానము స్మృతి" అని సంస్కృత లాక్షణికులు నిర్వచించారు – ఆం.సా.ద. ***3-191***

నటుడు తాను నటించే పాత్ర అనుభూతులకు, సాదృశ్యమైన అనుభూతులను తన నిత్య జీవిత భాండారంలో నుంచి స్మరణకు తెచ్చుకొని స్వీకరించి తిరిగి సాదృశ్య ఉద్వేగాలను పొంది రంగస్థలం మీద రసవత్తరంగా ఆవిష్కరించవచ్చు. ఈ ఉద్వేగాలు సాదృశ్య ఉద్వేగాలు మాత్రమే కావడం వల్ల పాత్రలో నటుడు లీనమైతే (అంటే అనుభూతివల్ల) కలిగే దుష్ఫలితాలను కలిగించవు. అదీగాక స్టానిస్లవ్స్కీ విధానంలో సాధనచేస్తే నటుడి పంచేంద్రియాలు అతని స్వాధీనంలో ఉండి దుష్ఫలితాలకు అవకాశముండదు.

సంసర్గం : సాధారణంగా రంగస్థలం మీద ఒకరికంటే ఎక్కువమంది నటులే నటిస్తూంటారు. వారు నటించిన పాత్రల మనోభావాలను, ఆలోచనలను, ఉద్వేగాలను, వాచికంలోని దాని అర్థాన్ని గ్రహించి, తదనుగుణంగా నటించినపుడే ప్రేక్షకులకు ఆ నాటకం, ఆ పాత్ర అర్థమవుతుంది. తనకు వాచికం లేనపుడు పక్కనటుడు నటిస్తుంటే బొమ్మలా నిలబడకూడదు. ప్రతి ప్రక్రియను చూపాలి. ఇలాంటి భావ పరివర్తనాన్నే సంసర్గం అంటారు.

నటుడు తనలో తాను ఆత్మసంసర్గం పొందాలి. అలాగే ప్రేక్షకులలో అప్రత్యక్ష సంసర్గం ఉంటుంది. ఈ సంసర్గాన్ని అలవర్చుకోవడానికి ఏకాగ్రత ప్రధాన సాధనం. ఈ సంసర్గం అవిచ్ఛిన్నంగా ప్రవహించాలి. అందుకు రకరకాల ప్రక్రియలు ఎంచుకోవాలి. సంసర్గం మూడు విధాలు.

1. రంగస్థలం మీది ప్రమేయంతో (పాత్రలు, వస్తువులు) ప్రత్యక్ష సంసర్గం, ప్రేక్షకులతో అప్రత్యక్ష సంసర్గం, 2. ఆత్మ సంసర్గం, 3. కల్పనా ప్రమేయంతోగాని, పరోక్ష ప్రమేయంతో గాని సంసర్గం.

ఈ మూడు విధాల సంసర్గాలను అభ్యాసం ద్వారా అలవర్చుకొని అవిచ్ఛిన్నంగా నెలకొనేటట్లు చూసుకోవాలి.

అనువర్తన : సృజనాత్మక కార్యకలాపాలలో అతి ప్రధానమైన అంశం. నటులు వివిధ సంబంధాలలో ఒకరితో ఒకరు సర్దుకోవడానికి ఆశయసిద్ధికి సహకారిగా చేసుకోవడానికి ఉపయోగించే బాహ్య, అంతర భావాల, ఆలోచనల విస్పష్ట ప్రకటన, సంసర్గం పెట్టుకోదలచిన నటుల ధ్యానను తమ (యితర నటులు) మీద కేంద్రీకరింప జేయడం ప్రతి ప్రక్రియకు పూనుకునే చిత్తవృత్తిని సహనటులలో తీసుకురావడం, మాటల కందకుండా అనుభూతి ద్వారా మాత్రమే తెలుసుకోదగిన, అగోచరమైన సందేశాలను ప్రసరించడం, స్థూలంగా చెప్పాలంటే సహనటుల నటనకు అనువుగా వర్తించడం. అనువర్తన జ్ఞాతంగాను, అజ్ఞాతంగాను జరుగుతుంది. పాత్రగా జీవించే విధానాన్ని ప్రేరేపించే వివిధ ఉద్దీపనలను ఉపయోగిస్తే అవి అన్యోన్య సంసర్గాన్ని జ్ఞాతాజ్ఞాత అనువర్తనలను సృజిస్తాయి. ఈ విధంగా ప్రత్యక్ చైతన్యావస్థను చేరుకోవచ్చు.

అంతర సంచాలక శక్తులు : మనోజీవితంలో మూడు సంచాలిక శక్తులున్నాయి. ఇవి హృదయాన్ని స్పందింప చేస్తాయి. అవి. ఒకటి మనసు, రెండు భావం, మూడు సంకల్పం. సృజనాత్మక కార్యకలాపంలో మనసు అంతర జీవితానికి సంచాలక జీవిగా పనిచేస్తుంది. అన్యోన్య క్రియల వల్ల ఈ సంచాలక శక్తి ఇనుమడిస్తుంది. ఒక దానికొకటి బాసటగా నిలిచి, ఒక దాని కొకటి ప్రేరేపించుకోవడం వల్ల అవి ఒకే సమయంలో అతి సున్నితంగా పనిచేస్తాయి. మనసు పని చేయడం మొదలు పెట్టగానే, భావాలు, సంకల్పం, రేకెత్తుతాయి. ఈ శక్తులు మూడూ సామరస్యంతో సహకరించుకొన్నపుడు స్వేచ్ఛగా సృజించగలుగుతాం. అందువల్ల ఈ మూడు శక్తులు ఒకదాన్ని ఇంకొకటి అణచి వేసుకొని, సామరస్యాన్ని చెడగొట్టకుండా జాగ్రత్తపడాలి.

అవిచ్ఛిన్నరేఖ : పాత్ర ప్రక్రియలను గుర్తించి వాటిని కలుపుతూ గీసిన రేఖ అవిచ్ఛిన్నరేఖ. పాత్ర లోతుపాతులను, భావాలను, ఆలోచనలను, ఉద్వేగాలను అర్థం చేసుకొని ప్రధానాశయాన్ని గుర్తించినపుడే ఈ రేఖ రూపొందుతుంది. అపుడు సృజనాత్మక కార్యకలాపం ప్రారంభమవుతుంది. అంతర సంచలనమార్గాలను చిత్రీకరించడానికి ఒకటి కంటె ఎక్కువ రేఖలు కావలసి ఉంటాయి. నటుడు ధరించే పాత్ర ఆ అవిచ్ఛిన్న రేఖలలోనే జీవిస్తుంది. ఇలా జీవించడం వల్లనే నటునికి జీవం, చలనం కలుగుతుంది. ప్రతి నటునికీ ఈ అవిచ్ఛిన్న రేఖ ఎంతో అవసరం. ఈ అవిచ్ఛిన్నరేఖ రంగస్థలం మీద నిలిచి ఉండాలే కాని దానిని దాటి ప్రేక్షకలోకంలోకి విస్తరించుకోకూడదు.

అంతర సృజనాత్మక స్థితి : నటులు రంగస్థలం మీద కలిసి మెలసి పురోగమించిన కొద్దీ వారి పురోగమన రేఖ ఐక్యతను సాధించుకొంటుంది. మూల వస్తు సమ్మేళనం వల్ల అతి ముఖ్యమైన అంతరస్థితి నిష్పన్న మవుతుంది. దీనినే అంతర

సృజనాత్మకస్థితి అంటారు. నటుడు ప్రేక్షకుల ముందు నటించాలి, అందువల్ల అతని సృజనాత్మక చిత్తవృత్తికి నాటకీయ, ఆత్మ ప్రదర్శనా లక్షణాలబ్బుతాయి. అటువంటి సమయంలో ప్రేక్షకులను రంజింపజేయడం మీద, ఆత్మ ప్రదర్శనం మీద ధ్యాస ఎక్కువ అవుతుంది. అపుడు కృత్రిమత్వం పాలు గాకుండా తప్పించుకొని యదార్థ, అంతర, సృజనాత్మ స్థితిని సాధించాలి. అందుకు పాత్రోచిత వేషమే కాకుండా అంతర సన్నాహం అవసరం.

పరమాశయం: నాటకంలోని వైయక్తిక ప్రమేయాలు, కల్పనా యోచనలు, భావాలు, ప్రక్రియలు ఏకముఖంగా పురోగమించి ఒక కేంద్రానికి చేరుకుంటాయి. ఆ కేంద్రాన్నే పరమాశయ మంటారు. పరమాశయాన్ని ఉద్దీపింపజేసే ఉద్దీపకం నాటకం మొదటి నుంచి చివరి వరకు అవిచ్ఛిన్నంగా పనిజేస్తే, నాటకాన్ని సరైన మార్గాన్నే నడుపుతుంది. రచన ఉత్తమ స్థాయి చేరుకున్న కొద్దీ దాని పరమాశయ ఆకర్షణ కూడా పెరుగుతుంది. రచనలో ప్రతిభ లోపించి అసలే బాగుండక పోతే నటుడే పరమాశయాన్ని వెదకి పట్టుకొని బలం చేకూర్చి పదును బెట్టాలి. ఈ పరమాశయానికి క్రియా రూపంలో పదును పెడితే ప్రక్రియ ఉద్దీపిస్తుంది. నాటకంలోని ప్రధాన అంతర్ వాహిని అంతస్స్రోధికి శక్తి కలిగిన ఒకానొక స్థితిని ఉత్పన్నం చేస్తుంది. అలా ఉత్పన్నమైన స్థితిలో చిక్కులన్నిటిని తీర్చిదిద్దుకొని అంతర ప్రయోజనాన్ని విస్పష్టంగా నిర్ణయించుకోగలుగుతాం. నాటకారంభం నుంచి తుదివరకు నటులను నడిపించే అంతర యత్న రేఖను అవిచ్ఛిన్నత లేక అవిచ్ఛిన్న ప్రక్రియా పరంపర అంటాం. అవిచ్ఛిన్న రేఖ నాటకంలోని ఘట్టాలను, ఆశయాలను ఉద్దీపింపజేసి, పరమాశయం వైపుకు నడుపుతుంది. అక్కడి నుంచి అవి సమిష్టి ప్రయోజనం కోసం పాటు పడతాయి.

ప్రత్యక్ చైతన్యావస్థ : ఏకాగ్రత అయితే భావనాశక్తి, ప్రక్రియ కండర సారళ్యం, ఘట్టాలు, ఆశయాలు, విశ్వాసం, యదార్థతా పరిజ్ఞానం, ఉద్వేగ స్మృతి, సంసర్గం, అనువర్తన, అంతర సంచాలక శక్తులు, విచ్ఛిన్న రేఖ, అంతర సృజనాత్మక స్థితి పరమాశయం.

ఈ సాధనసంపత్తిని సాధన చేసి పరాకాష్ఠ చేరుకుంటే ఇవి నటుడిని ప్రత్యేక చైతన్యావస్థకు చేరుస్తాయి. ఆ అవస్థలో ఆవేశం అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తుంది. సృజనాత్మక కార్యకలాపం సవ్యంగా సాగుతుంది. ప్రత్యక్ చైతన్యావస్థలో నటుడు పాత్రకు సన్నిహితుడవుతాడు. పాత్ర జీవితంలో తన జీవితం అనుభవిస్తాడు. పాత్ర జీవితం తన వైయక్తిక జీవితం అవిచ్ఛిన్నమైనవనే భావం నటుడికి కలుగుతుంది. ఈ భావమే పాత్రగా జీవించడం.

శ్రీ.చ.

స్ట్రిండ్ బెర్గ్, (యోహాన్) ఆగస్ట్ (1849-1912) :



స్వీడిష్ నాటకకర్త, నవలా రచయిత, కథానిక రచయిత. మన స్తత్త్వశాస్త్రాన్ని, స్వాభావిక వాదాలను రంగరించి యూరప్ నాటక రంగంలో అభివ్యక్తి వాద (Expressionist) నాటకాలను సృష్టించాడు. ది ఫాదర్ (1887), మిస్ జూలీ (1888), క్రెడిటర్స్ (1888), ది డ్రీమ్ ప్లే (1902), ది ఘోస్ట్ సొనటా (1907)లు ఈయన రచనలలో ముఖ్యమైనవి.

బాల్యంలో అనుభవించిన దారిద్ర్యం, ఉద్వేగం, సంరక్షణా రాహిత్యం, అవ్వగారి మతమౌఢ్యం, తృణీకారాలను తన ఆత్మకథ జన్ స్టెక్విన్నాన్స్ సన్ (సేవకుని కుమారుడు 1866-87)లో అభివర్ణించాడు. ఈయన ఉప్సా విశ్వవిద్యాలయంలో చదివి జీవనోపాధికై స్టాక్ హోంలో స్వచ్ఛంద పాత్రికేయుడుగా చేరాడు. ఈ కాలంలో తన మొదటి ప్రధాన రచన అయిన చారిత్రక నాటకం మాస్టర్ బలోఫ్ (1872) పూర్తి చేయడానికి ప్రయత్నించాడు. ఇది స్వీడెన్ సంస్కరణలపై ఆధారపడిన రచన. దీనిమీద షేక్స్పియర్ హెన్రిక్ ఇబ్సన్‌ల ప్రభావం అధికంగా ఉంది. ఈ నాటకాన్ని 'రాయల్ థియేటర్' తిరస్కరించినందువల్ల నిరాశతోపాటు, అధికారిక వ్యవస్థ పట్ల, సంప్రదాయాలపట్ల తిరస్కారం ఎక్కువైంది. తరువాత దీనిని స్వీడెన్‌లో మొదటి ఆధునిక నాటకంగా గుర్తించారు. ఆ విధంగా ఈయనకు నాటకకర్తగా గుర్తింపు రావడానికి కొంత జాప్యం జరిగింది.

1874లో రాయల్ లైబ్రరీకి లైబ్రేరియన్ అయ్యాడు. స్టాక్‌హోం సమాజంలోని అవకతవకలను వ్యంగ్యంగా చిత్రిస్తూ తన తొలి నవల ది రెడ్ రూమ్ రచించాడు. ఇది స్వీడెన్ నవలా రంగానికి ప్రథమం కావడంవల్ల ఆయనకు ఎక్కువ ప్రచారం లభించింది. సమాజాన్ని విమర్శిస్తూ 1881లో లక్కీ పీటర్స్ ట్రావెల్ ను రచించాడు. 1883లో డెట్ న్యా రికెట్ (నవ్య సామ్రాజ్యం)ను రాశాడు. ఇందులో కూడా నాటి స్వీడెన్ సమాజాన్ని వ్యంగ్యంగా వర్ణించాడు. ఇదే కాలంలో ది ఫాదర్, మిస్ జూలీ, ది క్రెడిటర్స్ ను సమకాలిక సమాజాచారాలపై తిరుగుబాటు చేస్తూ రచించాడు. నాటకాలలో కొత్త ధోరణులను, సంభాషణా శైలిని, రంగస్థల అలంకరణను ప్రవేశపెట్టాడు. ఇవి యూరోపియన్ నాటకరంగంలో కొత్త ఉద్యమానికి దారితీశాయి. ఈ దశలోనే పీపుల్స్ ఆఫ్ హెమ్సో కూడా వెలువడింది.

1889లో స్వీడెన్ తిరిగి వచ్చిన తరువాత ఏకాకిగా దుఃఖమయ జీవితం గడిపాడు. అయినప్పటికీ ఆధునిక స్వీడెన్ సాహిత్యానికి పట్టుగొమ్మ అయ్యాడు. తాగుడుకు బానిస కావడంవల్ల స్థిరమైన ఉద్యోగం సంపాదించలేక పోయాడు. మానసిక, శారీరక ఒత్తిడుల వల్ల, మానసిక చాంచల్యం వల్ల ఆయన తన మనస్సును ఆధ్యాత్మికత వైపు మళ్లించాడు. ఈ కాలంలో ఆధ్యాత్మికతమీద, రసవాదం పైన ప్రయోగాలు జరిపాడు.

మార్మికవాదంపై గల కొత్త నమ్మకం ఈతనిని తిరిగి రచయితగా మలచింది. తత్ఫలితంగా డమాస్కస్ నాటకాన్ని మూడు భాగాలలో రచించాడు. అందులో తనను తను ఆధ్యాత్మిక ప్రశాంతి కోసం అన్వేషించే అపరిచిత వ్యక్తిగా వర్ణించుకొన్నాడు.

స్ట్రిండ్‌బెర్గ్ స్వీడెన్‌కు తిరిగి వచ్చిన తరువాత మరణించేవరకు స్టాక్‌హోంలో నివసించాడు. ఈ కాలంలోని రచనలలో గుస్తవ్ వాసా అనే చారిత్రక నాటకం పాత్ర పోషణకు, సంభాషణా వైచిత్రికి పేరుపొందింది.

స్ట్రిండ్‌బెర్గ్ తన మూడవ వివాహాన్ని 'చలికాలంలో వసంతం' అని వర్ణించుకున్నాడు. ఈ వివాహం ది డాన్స్ ఆఫ్ డెత్, ఏ డ్రీం ప్లే నాటకాలకు, ఎన్సా (ఒంటరి) అనే ఆత్మకథకు ప్రేరణ ఇచ్చింది. స్వర్త ఫానొర్ (నల్ల బ్యాంకర్)ను 1907లో రచించాడు. చివరి నాటకాలలో తన జీవితాన్ని సంకేత ప్రాయంగా చిత్రించుకున్నాడు.

స్ట్రిండ్‌బెర్గ్ 1877 ప్రాంతంలో సిరిషాన్ ఎస్సెన్‌ను వివాహమాడి 1891లో విడాకులిచ్చాడు. ఆపైన 1892 ప్రాంతాలలో ఆస్ట్రేలియన్ పత్రికలో పనిచేసే ఫ్రిడాఉహ్లో అనే ఆమెను వివాహం చేసుకొని 1895లో విడిపోయాడు. 1901లో నార్వే చలనచిత్ర తారను పెళ్లి చేసుకుని 1904లో విడాకులు తీసుకున్నాడు. తన జీవితంలో ఎక్కువ కాలం విదేశాలలోనే గడిపాడు.

పి.ల.నా.

స్థలైక్యం : ఐక్యత్రయంలో ఒకటి. నాటకంలో స్థలాన్ని గురించిన ఐక్యత. నాటకమంతా ఒకే ఒక స్థలంలో జరిగినట్టు నిబంధించాలా లేక వివిధ స్థలాలలో జరిగినట్టు నిబంధించాలా అనే ప్రశ్న ఈ ఐక్యతకు సంబంధించిందే.

కాలైక్య, వస్త్వైక్యాలను ప్రస్తావించిన అరిస్టాటిల్ స్థలైక్యం విషయంలో మౌనం వహించాడు. అరిస్టాటిల్ పొయటిక్స్ గ్రంథం అనువాదంతో ఈ చర్చ ప్రారంభమైంది. విమర్శకుడు కాలైక్యం నుంచి స్థలైక్యాన్ని ఉత్పన్నం చేసుకొన్నాడు.

అయితే గ్రీకు నాటకకర్తలు దీనిని కూడా ఆచారంగా పరిగణించారే గాని తప్పని సరి నియమంగా పాటించలేదు. గ్రీకు నాటకాలలో ముఖ్యంగా ఆహ్లాద నాటకాలు కొన్నింటిలో ఈ ఐక్యత పాటించలేదు.

సోఫోక్లిస్ ఆజాక్స్ నాటకంలో, ఎస్కిలస్ ఎమెనాడ్స్ నాటకం లోనూ అరిస్టోఫేన్స్ శాంతి నాటకంలోను స్థలం మార్పు కనిపిస్తుంది.

గ్రీకు నాటకరంగంలో తెరలు లేవు. అంక విభజన లేదు. ఆది నుండి అంతం వరకు బృందగాయకులు రంగస్థలం మీదనే ఉంటారు. అన్నిటికంటె ముఖ్యమైంది సెటింగ్ లేకపోవడం. బృందగాయకులు మూడు గంటలలో అనేక స్థలాలలో కనిపించినట్టు చూపడం వాస్తవంగా ఉండదని స్థలైక్యాన్ని పాటించనట్టు తోస్తుంది.

పునరుజ్జీవనకాలంలో స్థలైక్య ఆచారం నియమంగా పరిణమించింది. గ్రీస్ దేశంలో రాజులు బహిరంగ ప్రదేశాలకు వచ్చి నలుగురితోను మాట్లాడవచ్చు కాని ఫ్రెంచి దేశంలో అది సాధ్యం కాదు. ఇతర పాత్రలు కూడా రహస్యాలు తమతమ గృహాలలో మాట్లాడుకున్నట్టు చూపవలసిందే గాని బహిరంగ ప్రదేశాల్లో మాట్లాడుకున్నట్లు చూపించకూడదు. ఈ విషయాలను పురస్కరించుకొని కార్నిలీ అనే ఫ్రెంచి నాటకకర్త నాటక కార్యకలాపమంతా ఒకే పట్టణంలో జరిగినట్టు, ఒకే అంకంలో రంగం మారినట్టు చిత్రిస్తే స్థలం మార్చవచ్చని అంగీకరించాడు. అంతే గాక పట్టణం పేరు మాత్రమే పేర్కొనాలి గాని పేటలు మొదలైనవి పేర్కొనరాదని, స్థానిక ప్రదేశానికి సంబంధించినంత వరకు రంగాలంకరణ మార్చరాదని అనుశాసించాడు.

మరి కొందరు విమర్శకులు ప్రేక్షకుని కనుచూపు మేరలోని స్థలంలోనే నాటకమంతా నడపాలని అభిప్రాయం.

స్థలం మార్చకుండా నటులు తమ తమ స్థానాలను మార్చుకోవడం ద్వారా స్థలాలను సూచించే పద్ధతిని కార్నిలీ ప్రతిపాదించాడు. ఫ్రెంచి నాటక కర్తలు ఈ విధానాన్ని అనుసరించారు. ప్రసిద్ధ ఆంగ్ల నాటకకర్త షేక్స్పియర్ టెంపెస్ట్, కామెడీ ఆఫ్ ఎర్రర్స్ నాటకాలలో మాత్రమే కొంతవరకు స్థలైక్యాన్ని పాటించాడు. టెంపెస్ట్ కథా స్థలం మాయా ద్వీపానికి పరిమితం. ఆ కాలం నాటి నాటకకర్తలు ఇంకో విధంగా ఈ సమస్య నెదుర్కొన్నారు. భ్రాంతిని కల్పించాలనే ఆలోచన వదులుకోవడం వీరి విధానం. ప్రేక్షకులను, శ్రోతలను వారి భావనాశక్తిని ప్రజ్వలింపజేసి కాలాన్ని, స్థలాన్ని ప్రయాణింపజేశారు. ఊహాశక్తిని పనిచేయనీ అనేదే వీరి సిద్ధాంతానికి మూలసూత్రం.

సంస్కృత నాటక కవులు స్థలైక్యతను తప్పనిసరి నియమంగా పెట్టుకోలేదు. మృచ్ఛకటికంలో స్థలాలు పన్నెండు. ఉత్తర రామచరితంలో ఎనిమిది. వాస్తవికతకు నేడు ప్రాధాన్యత పెరగడంతో నాటకరంగ పరిస్థితులలో పెద్ద మార్పు వచ్చింది.

అందువల్ల రంగసజ్జ సెటింగ్, రంగాలంకరణ అవసరమయ్యాయి. అయితే పదే పదే స్థలం మార్చితే, మార్చడానికీ ఎక్కువకాలం పడుతుంది. ప్రేక్షకులకు విసుగు పుడుతుంది. ఏకాగ్రత భంగమవుతుంది. అదీ గాక స్థలాలు ఎక్కువైన కొద్దీ వ్యయం కూడా పెరుగుతుంది. ఏక బిగిన నాటకం ఆడడం సాధ్యం కాదు. అందుకని నేటి నాటక కర్తలు ఒకే స్థలంలో నాటక మంతా నడుపుతున్నారు. ఉదాహరణకు విశ్వంతర, దొంగ వీరడు.

శ్రీ.చ.

స్థానం వారి స్థానం : ఈ వ్యాస సంకలనం కర్త నటన రామాచారి. పద్మశ్రీ, నటకావతంస స్థానం నరసింహారావు నటనా వైభవం చిత్రిస్తూ వేలూరి శివరామశాస్త్రి, పి.వి. రాజమన్నారు, ముదిగొండ లింగమూర్తి, పోణంగి శ్రీరామ అప్పారావు ప్రభృతులు రచించిన వ్యాసాల సంపుటి 1973లో ముద్రించ బడింది.

శ్రీ.చ.

స్థాపకుడు : రెండవ సూత్రధారుడు. రూపక వృత్తి సమస్తం స్థాపించేది రెండవ సూత్రధారే కాబట్టి ఇతనికి స్థాపకుడని పేరు వచ్చింది. కావ్యవస్తు నిరూపణమే అంటే స్థాపనమే ఇతని కార్యకలాపం.

ఇతనికి నటుడు అని మరో పేరు. ఇతను ఆకార గుణాలలో ప్రథమ సూత్రధారుని పోలి ఉంటాడు. పద విన్యాసం కూడా ప్రథమ సూత్రధారుని విన్యాసం లాంటిదే.

నాట్య శాస్త్రంలో ఈ ద్వితీయ సూత్రధారుడు ఒక్కడే ప్రస్తావన నిర్వర్తిస్తాడని ఉందికానీ అభినవగుప్తుడు మాత్రం నటీ, విదూషక, పారిపార్శ్వకులతో నిర్వర్తిస్తాడని వ్యాఖ్యానించాడు. ప్రథమ సూత్రధారుడు నాంది నిర్వహించి, నిష్క్రమించి తిరిగి ప్రవేశించి, ప్రస్థావన నిర్వహిస్తాడని అభినవ గుప్తుని అభిప్రాయం.

కథ దివ్యమైనది అయినట్లయితే దివ్యుడుగా, మానుషమైనది అయినట్లయితే మానవుడుగా, దివ్యమానుషమైతే దివ్యుడు లేక మనుషుడుగా, కావ్యార్థ సూచన చేయాలి.

శ్రీ.చ.

స్థాయి భావం : స్థాయి అనగా నిలకడ, స్థిరత్వం. నీటి బుడగలులాగా పుట్టగానే సమసిపోకుండా, ఎన్ని అవాంతరాలచ్చినా తట్టుకొని స్థిరంగా నిలబడే భావం స్థాయిభావం. ఈ స్థాయి భావమే రసమని ధనంజయాదుల మతం.

స్థాయి భావాలు తొమ్మిది. రతి, హాసం, శోకం, క్రోధం, ఉత్సాహం, భయం, జుగుప్స, విస్మయం, శమం. ఒక్కొక్క రసానికి ఒక్కో స్థాయి భావం ఉంటుంది. పట్టిక చూడండి.

రసం		స్థాయిభావం
శృంగారం	-	రతి
హాస్యం	-	హాసం
కరుణ	-	శోకం
రౌద్రం	-	క్రోధం
వీరం	-	ఉత్సాహం
భయానకం	-	భయం
బీభత్సం	-	జుగుప్స
అద్భుతం	-	విస్మయం
శాంతం	-	శమం

శ్రీ.చ.

స్వగతం : నాట్యోక్తి. అశ్రావ్యం. వాచిక భేదం. ఇతర పాత్రలు తనలో తాను మాట్లాడుకోవడం స్వగతం. దీనినే ఆత్మగతం, తనలో, మనసులో, లోలోపల అని కూడా అంటారు. పాత్ర మనసులోని భావాలను, అభిప్రాయాలను, చలన ప్రతిచలనాలను, తర్క వితర్కాలను, పాత్ర నిజస్వరూపం, సంఘర్షణలను ప్రేక్షకులకు మాత్రమే తెలియడానికి నాటకకర్త అవలంబించే ప్రక్రియ స్వగతం. పాత్ర మనోగత భావాలను రచయిత స్వగతం వాచికంగా రూపొందిస్తాడు. రంగస్థలం మీద పాత్ర స్వగతం చెప్పవలసి వచ్చినపుడు తల పక్కకు పెట్టి లేక పై కెత్తి లేదా ఒక అడుగు ముందుకు వేసి ఇది మీకోసమే అన్నట్లు ప్రేక్షకుల వైపు తిరిగి సూటిగా వారిని ఉద్దేశించి నట్టుగా గాకుండా స్వగతం చెప్పడం ఆచారం. ఇలా చెప్పడంతో ఇది 'స్వగతం' అని ప్రేక్షకులు అర్థం చేసుకుంటారు.

స్వగతంవల్ల హృదయాంతరాళంలోని రహస్యాలు, రహస్యాలోచనలు అభివ్యక్తమవుతాయి. పాత్ర నిజస్వరూపం గోచరిస్తుంది. నాటక రచయితను బట్టి స్వగతం అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఈ స్వగతం మధ్యస్థ స్వగతం, ఏకాంత స్వగతం అని రెండు విధాలు. మధ్యస్థ స్వగతమంటే పలు పాత్రలు మధ్యలో ఒక పాత్ర స్వగతం. ఇంగ్లీషులో దీనిని Aside అంటారు.

అభిజ్ఞాన శాకుంతలం ప్రథమాంకంలో రంగస్థలం మీద దుష్యంతుడు, శకుంతల, అనసూయ, ప్రియంవద ఉంటారు. దుష్యంతుని చూసి శకుంతల వికారం పొందింది. ఈ మనోవికారం తక్కిన వారికి తెలియకూడదు. ప్రేక్షకులకు మాత్రమే తెలియాలి. అందుకని కాళిదాసు మధ్యస్థ స్వగతం వాడాడు.

శకుంతల : (ఆలోచించి మనసులో) ఇది ఏమోకాని ఈయనం జూచి తపోవనంబులంగానరాని ఒక వికారంబునకు లోనయినదానను – అను: *కందుకూరి వీరేశలింగం*

పైన తెలిపిన స్వగతం ద్వారా శకుంతల మనోస్థితి తెలుస్తుంది.

ఏకాంత స్వగత మంటే రంగస్థలం మీది ఏకైక పాత్ర స్వగతం. ఇది సామాన్యంగా అంకారంభంలోనో, అంకాంతంలోనో ఉంటుంది.

సంస్కృత, గ్రీకు, రోమన్ నాటకకర్తలు స్వగతాన్ని స్వేచ్ఛగా వాడారు. కాని ఆ తరువాత వచ్చిన ఫ్రెంచి నాటక కర్తలు స్వగతాలను పరిహరించారు. అయితే పాత్ర హృదయాంతరాళం లోని భావాలను ప్రేక్షకులకు తెలియచేయాలి గదా! లేకుంటే కథా గమనం అర్థం కాకపోవచ్చు. అందుకని విదూషకుని వంటి పాత్రలను సృష్టించారు వారు. ఈ పాత్రల సంభాషణలతో ఆయా పాత్రల మనోభావాలను వెల్లడించేవారు. కాని ఈ పద్ధతి పేలవంగా ఉండడం వల్ల షేక్స్పియర్ మొదలైన పాశ్చాత్య నాటకకర్తలు తిరిగి స్వగతాలను చేపట్టారు. ఆధునిక నాటకకర్తలు స్వగతాలను నర్మ సచివులను పరిహరించారు. దీనికి ప్రత్యామ్నాయంగా కొందరు స్వగత భావాలను గేయంలో పొందుపరచి, ఆ గేయం తెరలో పాడుతూంటే రంగస్థలం మీది పాత్ర ఆ గేయ భావానికి అనుగుణంగా నటించే సంప్రదాయం నెలకొల్పారు. మరికొందరు అంతరాత్మ, కంఠస్వరం, ధ్వని, ఆకాశవాణి అనే పేర్లతో పాత్ర హృదయ సంఘర్షణకు వాచిక రూపం ఇచ్చారు.

తన హృదయాన్నో, తననో, ఇతరులనో సంబోధిస్తూ తనలో తాను మాట్లాడుకోవడం ఒక రకం స్వగతం.

గురజాడ వేంకట అప్పారావు రచించిన కన్యాశుల్కం పంచమాంకం ప్రథమ రంగంలో లుబ్ధావధానులు తనను తాను సంబోధించుకోవడం.

లుబ్ధావధానులు : అయ్యో! వెధవని పెళ్ళి చేసుకొన్న తురకవెధవా! నీ బుద్ధి ఎక్కడికి పోయిందిరా?

శ్రీ.చ.

స్వాధీన భర్తృక : అష్టవిధ నాయిక. ఈమెనే స్వాధీన భర్తృక అని కూడా అంటారు. ప్రియురాలి కనుసన్నల మెలగుతూ నిరంతరం ఆమె దగ్గరే ఉండడం ఆనందంగా భావించే భర్తగలది స్వాధీన భర్తృక.

శ్రీ.చ.

స్వాభావికావాదం : ఇది వాస్తవికతా వాదానికి తీవ్రరూపం. కృత్రిమత్వాన్ని నామరూపాలు లేకుండా నాశనం చేసి నాటక రంగాన్ని జీవిత ప్రతిబింబంగా రూపొందించాలనేదే ఈ వాదం లక్ష్యం. అలౌకిక విషయాలను తిరస్కరించడం, ప్రకృతిని ఆదర్శవంతంగా పరిగణించకుండా ఉండడం దీని ఆశయం. అత్యవసరమైన, లోతైన వాస్తవికతా విధానాన్ని తరచి చూడనక్కర లేకుండా వస్తువుల బాహ్య రూపాన్ని మాత్రమే చిత్రించాలనే వాదం. జీవిత, భౌతిక రూపం మీద కేంద్రీకరణ, రసరాగ గర్భితమైన నాటకీయత నేటి స్వాభావిక కళ లక్షణాలు. దీనికి ప్రవర్తకుడు ఫ్రెంచి రచయిత ఎమెలి జోలా.

శ్రీ.చ.

స్వామి, కె.కె.ఎల్ : నాటక రచయిత, నటుడు, దర్శకుడు. స్వస్థలం విజయనగరం జిల్లా, శ్రీరామనగర్. నాటక ప్రదర్శనకు అనుకూలాలవైన పరిస్థితులుగాని, సౌకర్యాలుగాని లేని మారుమూల ప్రాంతాల నుంచి, ఏ మాత్రం నటనానుభవం లేని నటీనటులను సమీకరించి, వారికి నటశిక్షణ ఇచ్చి వారితో వివిధ ప్రాంతాలలో నాటకాలు ఆడించటం కె.కె.యల్. స్వామిలోని సామర్థ్యాన్ని, కళాభిజ్ఞతను ద్యోతకం చేస్తాయి. అంతేకాదు ఆ నాటకాలన్నిటినీ తానే రచించటం మరో ప్రత్యేకత. ఈయన రాసిన నాటిక, నాటకాలు రాశిలో పదికి మించకపోయినా వాసిలో పేరెన్నికగన్నవి. స్వామి రచించిన జీవన సూత్రం, తేనెటీగలు పగబడతాయ్, అగ్నిపథం, స్వేచ్ఛ, భయం, క్రిమి, ఎనిమిదో అడుగు, అభిమన్యుడి (ఆత్మ) హత్య వంటి నాటికలు, కరిమింగిన వెలగపండు, గమనిక వంటి నాటకాలు రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శింపబడి, పోటీలలో అసంఖ్యాకంగా బహుమతులు అందుకున్నాయి. ధనమదాంధుల ఉక్కుపాదాల కింద నలిగిపోతూ, దోపిడికి, దౌర్జన్యానికి బలైపోతున్న బాధాసర్పదష్టులైన అమాయక గిరిజనుల అశ్రుఘోషకు, ఆర్తనాదానికీ స్వామి రచనలన్నీ అక్షరసాక్ష్యాలు. గిరిజనుల కష్టాలను, కన్నీళ్ళను అంత బలంగా చిత్రించిన నాటకాలు తెలుగులో దాదాపు లేవనడం సత్యదూరం కాదు. ప్రభుత్వాలు మారినా గిరిజనుల జీవితాల్లో కించెత్తు వెలుగైనా చొచ్చుకు రావటం లేదనే చేదు నిజానికి స్వామి రచనలు అద్దం పడతాయి. సమస్యలను వాచ్యంగా పాత్రలతో చెప్పించటం కాక శక్తివంతమైన సన్నివేశ కల్పనతో మనసుకు హత్తుకొనేట్లుగా చెప్పటంలో ఈయన సిద్ధహస్తుడు. శారీరక విన్యాస ప్రధానమైన ప్రదర్శనా విధానాన్ని బాగా అనుసరించాడు. సామాజిక స్పృహతో, ప్రజల్లో చైతన్యస్ఫూర్తి కలిగించాలన్న ధ్యేయంతో మూడు దశాబ్దాలుగా నాటకాన్ని యజ్ఞతుల్యమైన క్రతువుగా భావించి అహరహం కృషిసల్పుతున్న కె.కె.యల్. స్వామి ఒక ఆదర్శ రచయిత, నటుడు, దర్శకుడు.

గం.సు.రె.

హంగామా నటన : నటనా భేదం. అవధులు దాటి పోయిన నటన. ప్రతిభ ఉంటే కొద్ది క్షణాలు రసవత్తరంగా నటించినా, కళాత్మకంగా నిలబెట్టుకోలేక హంగామాకి దిగుతారు. ఔచిత్యం పాటించకుండా, సాధన చేయకుండా మనసుకు తట్టిన భావాలను వ్యక్తీకరించడానికి పూనుకొని, అడ్డగోలుగా నటించడం ఈ విధాన లక్షణాలు.

శ్రీ.చ.

హనుమంత రావు, ఎరగుడిపాటి (1898-1959) : రంగస్థల నటుడు, ఉపాధ్యాయుడు, న్యాయవాది. ఈయన నెల్లూరు జిల్లా గూడూరులో 1898 సెప్టెంబరు 24న భూదేవమ్మ

గోపాలకృష్ణయ్య దంపతులకు జన్మించాడు. ఎస్.ఎస్.ఎల్.సి వరకు నెల్లూరు సి.ఏ.ఎమ్. హైస్కూల్‌లో చదివి, ఇంగ్లీషులో బంగారు పతకం సంపాదించాడు. ఇంటర్ మద్రాసు క్రిష్టియన్ కాలేజీలో, బి.ఏ పచ్చయప్ప కాలేజీలో చదివాడు. కొంతకాలం కొలంబోలోని సచివాలయంలో పనిచేశాడు. తరువాత సిమ్లాలోని సచివాలయంలో చేరాడు. ఆ తరువాత గూడూరు హైస్కూల్‌లో 1925 ప్రాంతంలో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. ఉపాధ్యాయ వృత్తికి స్వస్తిచెప్పి మద్రాసు 'లా' కాలేజీలో ప్లీడరు పరీక్షలో ఉత్తీర్ణుడై, గూడూరులో న్యాయవాదిగా పనిచేశాడు. అపుడే ఆంగ్లభాషలో న్యాయ శాస్త్రం మీద పుస్తకాలు రాశాడు.



ఎరగుడిపాటి వేదం వేంకటరాయ శాస్త్రికి శిష్యుడు. ఆంధ్రసభ ప్రదర్శించిన నాటకాలలో నటించడం మొదలు పెట్టాడు. దువ్వూరి రామిరెడ్డికి సన్నిహితుడు. దువ్వూరి రచించిన కుంభరాణా నాటకంలో కుంభరాణా పాత్ర ధరించి మహానటుడని పేరు సంపాదించుకున్నాడు. జ్యోతిష శాస్త్రంలో పరిచయం ఎక్కువ. హనుమంతరావును రామిరెడ్డి ట్రాజిక్ ఏక్టర్ అని వర్ణించాడు. (రామిరెడ్డి డైరీలు పుటలు 5,7)

పఠాన్‌రుస్తుం, హిరణ్యకశిపుడు, యుగంధరుడు, కుంభరాణా పాత్రలలో నటించిన హనుమంతరావు 1959 మార్చి 20న తుది శ్వాస విడిచాడు.

శ్రీ.చ.

హనుమంత రావు, కోపల్లె (1880-1922) : రంగస్థల నటుడు. ధార్వాడ నాటక సమాజాలు ఆంధ్ర దేశంలోని ముఖ్య పట్టణాల్లో నాటకాలు ప్రదర్శించి వెళ్ళిన తరువాత ఆ ఉత్సాహంతో ఎంతో మంది డాక్టర్లు, లాయర్లు, గుమాస్తాలు, ఉపాధ్యాయులు మొదలైనవారు సమాజాలు ఏర్పరచుకొని నాటకాలు ప్రదర్శించారు. ఆవిధంగా ఏర్పడి ప్రదర్శించిన సమాజాలలో గుంటూరు ఫస్టుకంపెనీ ప్రప్రథమమైంది.

గుంటూరు ఫస్టుకంపెనీ ప్రదర్శించిన నాటకాల్లో బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర ఆంధ్ర దేశమంతటా ఖ్యాతి గాంచి ఎందరోనటులకు, ఎన్నో సమాజాలకు స్ఫూర్తినిచ్చింది. ఆ నాటకంలో హరిప్రసాదరావు హరిశ్చంద్రుడు గాను, కోపల్లె హనుమంతరావు చంద్రమతి, పరిమి రామచంద్ర రావు విశ్వామిత్రుడు, పత్రి శీనప్ప నక్షత్రకుడుగాను నటించారు. ముఖ్యంగా చంద్రమతి, హరిశ్చంద్ర పాత్రధారుల అభినయం అందరినీ కంట తడిపెట్టించేదట.

మహానటుడైన హరిప్రసాదరావు సరసన కోపల్లె హనుమంతరావు దమయంతి, శకుంతల మొదలైన స్త్రీ పాత్రలను అద్భుతంగా నటించాడు. నటనను అదుపులో పెట్టుకుని ఔచితీమంతంగా స్త్రీ పాత్రలను పోషించి ఆంధ్ర నాటకరంగంలో అసమాన స్త్రీ పాత్రధారిగా పేరెన్నికగన్నాడు. ఉదాత్తత, గాంభీర్యం సడలకుండ కరుణ రస భావాలను తన సాత్త్వికాభినయ గరిమతో చంద్రమతిగా కోపల్లె అభినయం నాటికీ,నేటికీ మైలురాయిగా నిలిచిపోయింది. చంద్రమతి పాత్రపోషణ హనుమంతరావుకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠల నార్జించి పెట్టింది.



ఆయన ఆంగిక, సాత్త్వికాభినయాలు స్థానం నరసింహారావు వంటి ప్రసిద్ధ స్త్రీ పాత్రలో నటించిన నటుడ్ని కూడా ఉత్తేజితుణ్ని చేశాయంటే కోపల్లె అభినయకౌశలాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

హరిప్రసాద రావు సత్యహరిశ్చంద్ర పాత్ర, కోపల్లె చంద్రమతి పాత్ర ఈ నాటికీ ఆంధ్రనాటకరంగ చరిత్రలో సజీవంగా నిలిచి పోయాయి.

నాగిరెడ్డి

హనుమంత రావు నాయుడు, ఇమ్మానేని : ప్రయోక్త, అధ్యాపకుడు, నటుడు, హిందూ నాటక సమాజం స్థాపకుడు. ధార్వాడ నాటక సమాజం ఒంగోలుకు వచ్చి పీష్వా నారాయణ రావు, ఉషాపరిణయం, ప్రమీలా స్వయంవరం, కీచకవధ మొదలైన నాటకాలు ప్రదర్శించిన నాడే ఇమ్మానేని హనుమంత రావుకు నాటకాల మీద వ్యామోహం పెరిగింది. ఒంగోలులోని మిషన్ స్కూల్లో ఉంటూనే విద్యార్థులతో పాటు నాటకాల్లో పాత్రలు ధరించాడు. అపుడే అక్కడ విద్యార్థిగా ఉన్న టంగుటూరి ప్రకాశాన్ని నాటకాల్లో ప్రవేశపెట్టాడు. ప్రకాశం జీవితానికి మార్గదర్శకుడు, అతని అభివృద్ధికి మూలకారకుడు ఇమ్మానేని అని స్వీయచరిత్రలో ప్రకాశం రాసుకున్నాడు.

ఇమ్మానేని స్వగ్రామం ఒంగోలుకు సమీపంలో ఉన్న కొత్తపట్నం. మెట్రిక్యులేషన్ పాసై 25 సంవత్సరాల ప్రాయంలో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించాడు. గణితంలో దిట్ట. డిగ్రీ విద్యార్థులు కూడా ఈయన వద్ద లెక్కలు చెప్పించుకునేవారు. దేశభక్త కొండావెంకటప్పయ్య కూడా ఇమ్మానేని శిష్యుడే. 30 రూపాయల నెలజీతం శిష్యుల సహాయానికే సంతర్పణ

చేసేవాడు. ఇమ్మానేని భార్య మహాలక్ష్మమ్మ తాళిబట్టుతో సరిపెట్టుకునే దొడ్డ యిల్లాలు.



రాజమండ్రిలో ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించుకున్న నాయుడు ప్రియశిష్యుడు ప్రకాశాన్ని కూడా రాజమండ్రిలో చదివించాడు. ఆ కాలంలో రాజ మహేంద్రవరంలో నాటకోత్సాహం వెల్లివిరిసింది. రాజమండ్రిలో కందుకూరి వెంకటరత్నం, దాసు మాధవరావు మొదలైన వారు షేక్స్పియర్ నాటకాలు ఆంగ్లభాషలో ప్రదర్శిస్తూ ఉండేవారు. అంతులేని నాటకోత్సాహంతో ఇమ్మానేని 1889లో హిందూ నాటక సమాజం స్థాపించి, చిలకమర్తి లక్ష్మీనరసింహంతో *కీచకవధ, పారిజాతాపహరణం*, *ద్రౌపదీపరిణయం, గయోపాఖ్యానం* మొదలైన వచన నాటకాలు రచింపజేసి ప్రదర్శించాడు.

ఈ సమాజం ప్రదర్శించిన నాటకాలలో నాయుడు ముఖ్యపాత్రధారి. ప్రకాశం నాయికా, నాయక పాత్రలలో కూడా నటించాడు. సూత్రధారిగా సాతాని రామానుజయ్య, హాస్య పాత్రధారిగా వల్లూరి సూర్యప్రకాశరావు, దుర్యోధనుడు, నలుడు, శ్రీకృష్ణుడు పాత్రల్లో ప్రసిద్ధులైన దుర్గి గోపాలకృష్ణరావు, పద్యాలు శ్రావ్యంగా పాడగలిగిన మద్దూరి నాగభూషణం కూడా ఈ సమాజంలోని సభ్యులే.

ఒక పక్క ఉపాధ్యాయవృత్తిని నిర్వహిస్తూ, మరో పక్క నాటకాలు తయారు చేసుకొని స్వంత సమాజంతో అమలాపురం, కాకినాడ మొదలైన పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహించాడు. ఈయన కార్యదీక్ష, కళాదీక్ష, కళాతృష్ణ అలాంటివి. రాజమండ్రి టౌన్‌హాలుకు తూర్పున ఉన్న పెద్ద ఖాళీస్థలంలో తాత్కాలికంగా ఒక పెద్ద నాటకశాలను నిర్మించి, నాటకాలు ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందిన కళాజీవి హనుమంతరావు. 1894 నుంచి 1901 వరకు ప్రదర్శనలు జరకగపోయినా, తర్వాత నాటక సమాజాన్ని పునరుద్ధరించి, ప్రదర్శనలు పునః ప్రారంభించాడు.

ఇమ్మానేని ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన అభిజ్ఞాన శాకుంతలం, రత్నావళి, చమత్కార రత్నావళి, సత్యహరిశ్చంద్ర, వడ్డాది సుబ్బరాయకవి రచించిన వేణీ సంహారం, విక్రమోర్వశీయం, ధర్మవరం రామకృష్ణమాచార్యులు రచించిన చిత్రనళీయాది నాటకాలు, చిలకమర్తి లక్ష్మీనరసింహం రచించిన *గయోపాఖ్యానం, పారిజాతాపహరణం*, శ్రీరామ జననం, ద్రౌపదీ పరిణయం, సీతా కల్యాణం మొదలైన నాటకాలను ఈ సమాజం ప్రదర్శించడంలో ఇమ్మానేని కృషి మరువలేనిది.

ప్రతి నాటకంలో ఇమ్మానేని ప్రముఖ పాత్రలో నటించాడు. వాచికాభినయంలో, సాత్త్వికాభినయంలో బహుప్రజ్ఞావంతుడు. దుర్గి గోపాలకృష్ణా రావు, అయినవోలు తాతయ్యా నాయుడు, నేతి సుబ్బయ్య, సరిపల్లె కామేశ్వరరావు, ధరణి ప్రగడ వెంకటశివరావు, సత్యవోలు గున్నేశ్వర రావు, బంగార్రాజు మొదలైనవారంత ఇమ్మానేనితో నటించిన సహనటులు. ఇమ్మానేని హిందూనాటక సమాజం పక్షాన ప్రసిద్ధ కళాకారులైన అనంత రాయ భాగవతార్‌ని, గరిపర్తి కోటయ్య దేవర మొదలైన వారిని సత్కరించాడు. తన సమాజంలోని నటులెందరికో వివాహాలు జరిపించి సహాయపడ్డాడు.

1902 వరకు నిర్విరామంగా నటుడుగా, ప్రయోక్తగా, నాటక సమాజ నిర్వాహకుడుగా, ఆదర్శ ఉపాధ్యాయుడుగా, వితరణశీలిగా, అభ్యుదయవాదిగా ఎన్నోరంగాలలో ఎనలేని సేవలు చేసిన నాయుడుకి పక్షవాతంతో కాళ్ళు పడిపోయాయి. ప్రకాశం మొదలైన మిత్రుల సహాయ సహకారంతో చికిత్సచేయించుకొని తిరిగి యథావిధిగా ఉద్యోగంలో ప్రవేశించాడు.

నటులందరూ నాటక శాలే స్వర్గంగా భావించే ఆ రోజుల్లో జబ్బుపడిన నాయుడు హాలుకు రాకపోతే సింహంలేని అడవిలా శోభావిహీనంగా ఉండేదట. ప్రతిసాయంకాలం నటులకు సలహాలిస్తూ, ఆనంద పరుస్తూ ఉండేవాడట. ఆవిధంగా ఎందరికో వెలుగుబాట అయి, ఎన్నో జీవితాలను తీర్చిదిద్దిన, నిస్వార్థ కళాసేవకుడు ఇమ్మానేని హనుమంతరావు నాయుడు.

నాగిరెడ్డి

హనుమంత రావు, రొద్దం (1906-1986) : న్యాయవాది. రంగస్థల నటుడు. శ్రీకృష్ణదేవరాయ నాట్యమండలి స్థాపకుడు. 1906 ఫిబ్రవరి 23వ తేదీన అనంతపురం జిల్లా పెనుగొండ గ్రామంలో జన్మించాడు. తండ్రి పేరు వెంకోబరావు. ప్రసిద్ధ న్యాయవాద కుటుంబం. కళలకు కూడ వీరి కుటుంబం పేరెన్నిక గన్నది. వీరి పినతండ్రి రంగారావు, అన్న రాజారావు ప్రముఖ నటులు.

రొద్దం హనుమంతరావు 16వ ఏటనే అనంతపురం కళాశాలలో విజయనగర పతనం నాటకంలో తిరుమలాంబగా

రంగప్రవేశం చేసి తొలి ప్రదర్శనలోనే సమర్థుడైన నటుడనిపించుకున్నాడు. పెనుగొండలో శ్రీకృష్ణదేవరాయ నాట్యమండలి స్థాపించి ఎన్నో ఉత్తమ నాటకాలు ప్రదర్శించాడు. న్యాయవాదిగా అనంతపురంలో స్థిరపడిన మీదట లలిత కళాపోషణ సమితిని స్థాపించాడు.

సావిత్రిలో సావిత్రిగా, పాదుకాపట్టాభిషేకంలో కైకేయిగా, ప్రమీలార్జునీయం లో ప్రమీలగా, శ్రీకృష్ణ దేవరాయ విజయంలో అన్నపూర్ణగా, ఉత్తర గోగ్రహణంలో ఊర్వశిగా, ఉత్తరకుమారుడుగా, నటచరిత్రలో బాహుకుడుగా, రాణీ సంయుక్తలో అహుళ రాయుడుగా రౌద్రం తన నటనా వైభవం చూపాడు. బళ్ళారి రాఘవ, స్థానం, రఘు రామయ్య వంటి అగ్రశ్రేణి నటులతో నటించి వారికి దీటనిపించుకున్న నటశేఖరుడాయన. రాయలసీమలో నాటక కళా వికాసానికి అకుంఠిత సేవచేసిన హనుమంతరావు 1986లో హైదరాబాదులో కన్నుమూశాడు.

గం.సు.రె.

హబీబ్ తన్వీర్ (1923 -) : హిందీ, ఉర్దూ భాషల నాటక రచయిత, దర్శకుడు, నటుడు, నిర్వాహకుడు, కవి, స్వాతంత్ర్యానంతరం భారతదేశ రంగస్థల ప్రముఖుల్లో ముఖ్యుడు. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో 1923లో జన్మించాడు. నాగపూర్ కళాశాలలో డిగ్రీ చదివాడు. 1948లో ఇప్టా (**IPTA**)లో నటుడిగా, దర్శకుడిగా చేరి శాంతదూత, కామ్‌గార్ అనే వీధి నాటికలను రచించి ప్రదర్శించాడు. ప్రేమ్‌చంద్ కథ షత్రంజ్‌కే మొహరేను నాటకీకరించాడు. 1954లో ఢిల్లీలో జామియా, మిలియా విద్యార్థులతోనూ, దఖ్‌లా గ్రామ ప్రజల తోనూ, ఆగ్రాబజార్ నాటకాన్ని సంగీతంతో మేళవించి అత్యద్భుతంగా ప్రదర్శించాడు.1958లో భారత ప్రభుత్వ ఉపకార వేతనంతో ఇంగ్లాండ్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్, బ్రిటిష్ డ్రామా లీగ్‌లో శిక్షణపొంది పాశ్చాత్య ప్రదర్శన రీతులను అధ్యయనం చేశాడు.

ఢిల్లీకి తిరిగి వచ్చిన తరువాత 1958లో ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలోని జానపద కళాకారులను పరిచయం చేస్తూ మృచ్ఛకటిక నాటకాన్ని ప్రదర్శించాడు. 1959లో నయా థియేటర్‌ను స్థాపించి ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషల్లో పలు నాటకాల్ని ప్రయోగాత్మకంగా ప్రదర్శించాడు. ముద్రారాక్షస, చరణ్‌దాస్‌చోర్ నాటకాలు కూడా ఈయనకు బాగా పేరు తెచ్చిపెట్టాయి. చరణ్‌దాస్‌చోర్ నాటకం ఈయనకు అంతర్జాతీయ స్థాయిని తెచ్చిపెట్టిన కళాఖండం. దాదాపు 30 సంవత్సరాల పాటు భారతదేశం, యూరప్ అంతటా ఈ నాటకాన్ని విస్తృతంగా ప్రదర్శించాడు. 1972లో రాజ్యసభ సభ్యుడిగా ఉంటూ కూడా తన్వీర్ రంగస్థలం సంస్కృతి పై పలు వ్యాసాలు రాశాడు, ప్రచురించాడు.

ప్ర.రె.

హరనాథ రావు, ఎం.వి.ఎస్. (1948): నటుడు, నాటక, చలన చిత్ర రచయిత. హరనాథ రావు ప్రకాశం జిల్లా, ఒంగోలులో 1948 జులై 27న సత్యవతీ దేవి మరుధూరి రంగాచార్యులకు జన్మించాడు ఈయన జగన్నాథం ఛక్రాలు, క్షీరసాగర మథనం నాటకకర్తగా ఆంధ్ర నాటక రంగానికి చిరపరిచితుడు. సొంత ట్రూపుతో తన నాటకాలను ఆంధ్ర దేశంలో పలు ప్రాంతాలలో ప్రదర్శించి, బహుమతులు గెల్చుకొని ఉత్తమ నటుడు, ఉత్తమ రచయితగా పేరు ప్రఖ్యాతులు గడించాడు. 1982లో క్షీరసాగర మథనం నాటకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ప్రతీకాత్మక ధోరణిలో రాసిన బూచి అనే నాటకం, జనారణ్యాం నాటకం, అంతంకాదిది ఆరంభం, లేడీపంజా, యక్షగానం వంటి నాటికలు ఈయన కీర్తిని ఇనుమడింపజేశాయి. ప్రకాశంజిల్లాలో నాటక కళాభివృద్ధికి దోహదం చేసిన వారిలో హరినాథరావు పేర్కొనదగినవాడు. సినీ రచయితగా అనేక చిత్రాలకు సంభాషణలు రాసి ప్రశంసలందుకున్నాడు.



దాసరి. ఎన్.

హరికథ : యక్షగాన రూపాంతరం, ప్రప్రథమంగా తెలుగులో హరికథలు రచించి, కథ చెబుతూ ఈ ప్రక్రియను వ్యాప్తిలోనికి తీసుకువచ్చింది ఆదిభట్ల నారాయణదాసు. హరికథ పితామహుడిగా పేరుగాంచాడు. ప్రహ్లాద చరిత్ర హరికథ అవతారికలో నారాయణ దాసు స్వకృత మృదు యక్షగాన సరణి అని అంబరీష చరిత్ర హరికథ ఉపోద్ఘాతంలో ఈ 'అంబరీషోపాఖ్యానము దొట్టి మరికొన్ని యక్షగానములను వ్రాసి యుంటిని' అని యక్షగానానికి హరికథకు అవినాభావం చెప్పాడు. భమిడిపర్తి రామమూర్తి సతీ సక్కుబాయి హరికథ పీఠికలో కాకరపర్తి కృష్ణశాస్త్రి దానిని యక్షగానమని చెబుతూ పక్కనే కుండలీకరణంలో హరికథ అని పేర్కొన్నాడు.

ఈ హరికథా ప్రక్రియ తెలుగులో 19వ శతాబ్ది ఉత్తరార్థంలో వెలువడింది. ప్రాచీన తెలుగు కావ్యాలలో హరికథ అనే పదం ప్రయుక్తమైనా అది హరికి సంబంధించిన కథ అనే సామాన్యార్థంలో ప్రయుక్తమైందేకాని ప్రక్రియ అనే అర్థంలో ప్రయుక్తం కాలేదు. అలా అయితే సిద్ధేంద్రుని భామాకలాపం హరికథ

అవుతుంది. కాని భామాకలాపం హరికథ కాదు గదా. అలాగే లవకుశల రామాయణ కథా గానం కావ్య పఠనం గానే పరిగణించాలి గాని, హరికథా కళా రూపంగా పరిగణించలేం.

ఆదిలో విష్ణు కథలనే హరికథగా చెప్పే వారు. తరువాత తరువాత శివకథలు, చారిత్రక మహాపురుషుల జీవితాలు, తుదకు సమకాలీన రాజకీయ విషయాలు హరికథలుగా చెబుతున్నారు. దీనితో హరికథ వ్యుత్పత్త్యర్థం నశించి ఒకానొక ప్రత్యేక కళా రూపానికి పేరుగా పరిణమించింది.

హరికథకు మహారాష్ట్ర దేశం పుట్టిల్లు. అక్కడ నుంచి తంజావూరు మహారాష్ట్రరాజుల కాలంలో తమిళదేశానికి, అక్కడ నుంచి తెలుగు దేశానికి వ్యాపించిందని కొందరి అభిప్రాయం. మహారాష్ట్ర ప్రభావం తెలుగు హరికథల మీద పడింది అనడానికి తెలుగు హరికథలలో ప్రయుక్తమైన తొహరాలు, మట్లు దీనికి ప్రబల సాక్ష్యం.

మునిపల్లి సుబ్రహ్మణ్యకవి ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు, తాళ్ళూరి నారాయణ కవి మోక్షగుండ రామాయణం నేటి మన హరికథలకు తొలి రేఖలు. హరికథలకు గౌరవ ప్రప్రత్తులు, బహుళవ్యాప్తి కలిగించింది ఆదిభట్లే. ఆ తరువాత బాలాజీదాసు. నేటి హరికథలు చెప్పే వారిలో వీరిరువురి శిష్యులే అధికం.

నేటి మన హరికథలకు ప్రేరణ కుప్పుస్వామి మొదలియార్ అనే తమిళ హరికథకుడు. ఈయన విజయనగరంలో హరికథలు చెప్పగా విని, నారాయణ దాసు అన్ని కళలలో హరికథే గొప్పదని భావించి ధ్రువచరిత్రను హరికథగా రూపొందించాడు. ఈ ధ్రువచరిత్రే నేటి హరికథలకు ధ్రువతార.

ఒకే ఒక వ్యక్తి యక్షగానంలో లాగా ఆడుతూ పాడుతూ కథ వినిపించే కళారూపమే హరికథ. కొందరు వంతలను కూడా పెట్టుకోవడం కద్దు. ఇందులోని కథకుని హరిదాసు అంటారు. కథకుని పేరుతో దాసు శబ్దం కలిపి పలకడం సర్వసాధారణమై పోయింది. ఉదాహరణకు నారాయణ దాసు, బాలాజీ దాసు. మొదటలో పురుషులే హరికథలు చెప్పేవారు. కాని ఇపుడు స్త్రీలు కూడ విరివిగా చెపుతున్నారు. సాధారణంగా హరిదాసు పట్టు బట్టకట్టి, పట్టుబట్ట నడుముకు బిగించుకొని, చేతితో తాళం గాని చిరుతలు గాని వాయించుతూ, పాడుతూ, నృత్యం చేస్తూ కథ చెబుతాడు. ఫిడేలు, హార్మొనీ, మద్దెల లేక తబలా సహకార వాద్యాలు.కథ చెబుతూ మధ్య మధ్య నీతిబోధకమైన పిట్టకథలు హాస్య ధోరణిలో చెప్పి రంజింప చేస్తుంటాడు. ప్రజలను సన్మార్గ ప్రవర్తకులుగా, దైవభక్తులుగా చేయడానికి హరికథలు మంచి సాధనంగా భావించారు. భగవంతుని లీలలు, భక్తి ప్రభావాలను వర్ణించడమేగాక సమకాలీన ప్రజాజీవనంలోని దురాచారాలను, దుష్టకృత్యాలను, అన్యాయ ప్రవర్తనలను దుయ్యపడతుంటాడు.

ఇది ఆరు బయలు ప్రదర్శన. నాలుగు వైపులా లేక కనీసం మూడు వైపులా ప్రేక్షక లోకం. వారికి కనిపించేందుకు, వినిపించేందుకు హరిదాసు నాలుగు వైపులా తిరుగుతూ కథ చెపుతాడు. కథలోని పాత్రలన్నింటినీ, నవరసాలను ఒక్కడే ఒప్పించవలసి ఉన్నందువల్ల హరిదాసు సర్వతోముఖ నటుడై, సాహిత్యంలో, సంగీతంలో ప్రజ్ఞావంతుడై, మాటకారి, హాస్యచతురుడై ఉండాలి.

శ్రీ.చ.

హరిజనాభ్యుదయం – తెలుగు నాటకం : ఈ గ్రంథాన్ని వి. పోతన్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టా కోసం సమర్పించి 1944లో ప్రచురించాడు. నేటి సమాజంలో హరిజనులకు జరుగుతున్న అన్యాయాలను నాటక వస్తువుగా స్వీకరించి, బహుముఖంగా ఉన్న హరిజనుల కష్టాలు చెప్పి పరిష్కార మార్గాలు సూచించిన నాటకాలను తన పరిశోధనా పరిధిలోకి తీసుకొని రాసిన సిద్ధాంతగ్రంథం. అయిదు అధ్యాయాలుగా ఉన్న ఈ పుస్తకంలో తెలుగు నాటక పరిణామం, హరిజనాభ్యుదయ నాటకం, హరిజన జీవితం, హరిజన జీవిత సమస్య, హరిజనాభ్యుదయం అనే శీర్షికలతో కూలంకషవివరణ ఉంది. హరిజన సమస్యతో వచ్చిన నాటకాలపై పరిశోధన చేసి వెలువరించిన పుస్తకాలలో ఇదే మొదటిది.

గం.సు.రె.

హరితాలం : అంగరచన (కోటా)లో ఉపయోగించే వస్తువిశేషం. హరితాల మనగా గరికగడ్డి. వీధి నాటకాలలో నటులు ముఖానికి పూసుకునే పసుపురంగు విశేషం. దీనినే తెలుగులో అరదళము, హరిదళము అంటారు.

శ్రీ.చ.

హర్షవర్ధనుడు : ప్రియదర్శిక, రత్నావళి, నాగానందం నాటకాల్లో హర్షదేవునిగా పేర్కొనబడింది. హర్షవర్ధనుడు స్థాణీశ్వరం రాజధానిగా ఉత్తర భారతాన్ని పాలించిన చక్రవర్తి (క్రీ.శ. 606-648). ఇతని ఆస్థానకవి బాణుడు. కవి పండితుల పట్ల అభిమానం గల రాజు స్వయంగా కవిత్వం చెప్పడంతో పాటు, నాటకాలంటె అభిమానం గలవాడు. రత్నావళి నాటకం ప్రస్తావనను బట్టి సామంతరాజుల ముందు అతని నాటకాలు ప్రదర్శింపబడినట్లు, హర్షవర్ధనుని నాటకాల గొప్పతనాన్ని గురించి విన్న ఆ రాజులు ఆ నాటకాన్ని చూడ డానికి కుతూహల పడుతున్నట్లుగా తెలుస్తున్నది. హర్షుడు సూర్యారాధకుడు. తరువాత కాలంలో బౌద్ధమతాభిమానిగా మారాడు. అందుకే నాగానందం నాటకం నాందిలో బుద్ధభగవానుని ప్రస్తుతించాడు. హర్షవర్ధనుడు శివాభిమాని కూడా. నాగా నందంలో గౌరీదేవిని ప్రవేశపెట్టినాడు. నాయిక గౌరీ దేవిభక్తురాలు.

ప్రియదర్శిక, రత్నావళి రెండింటిలో ఉదయనుడు నాయకుడు, ధీర లలితుడు. ప్రియదర్శిక లో నాలుగు అంకాలున్నాయి. ఉదయనుడు కళింగరాజు పుత్రిక ప్రియదర్శికను వివాహమాడే వృత్తాంతం దీనిలో ఉంది. ఇతివృత్తం పూర్తిగా మాళవికాగ్నిమిత్రాన్ని పోలి ఉంది. శాకుంతలం లోని సన్నివేశాల సామ్యం కూడా ఈ నాటికలో కనిపిస్తుంది. రత్నావళిలో ఉదయనుడు సింహళ రాకుమారి రత్నావళిని వివాహమాడే వృత్తాంతముంది. రత్నావళికే సాగరిక అని మారుపేరు. ఈ నాటిక ప్రియదర్శిక కన్నా నాటక కళ దృష్ట్యా ప్రౌఢంగా వుంది. రత్నావళిలో ఇంద్రజాలికుని వృత్తాంతం చమత్కారంగా ఉంది. దీనిలోని కథ ప్రేక్షకుల కుతూహలాన్ని నిలుపుతూ ఉత్కంఠ పూరితంగా నడిచింది. దీని మీద మాళవికాగ్ని మిత్రం ప్రభావమే కాక స్వప్నవాసవదత్త ప్రభావం కూడా కన్పిస్తుంది. ద్వితీయాంకంలోని వృత్తాంతం ఔత్సుక్య భరితంగా వుంది. ప్రియదర్శిక, రత్నావళి నాటికలు ఒక్కలాంటి వృత్తాంతంతో వున్నా హర్షుడు వైవిధ్యభరితంగా రచించాడు. సంఘటనలను పూర్తిగా భిన్నంగా కూర్చాడు. మౌలిక కల్పనలతో సరసంగా ఉన్నాయి. అంతఃపురంతో కవికి బాగా పరిచయముంది కాబట్టి అక్కడి వేడుకలను, వాతావరణాన్ని చక్కగా వర్ణించాడు. ప్రియదర్శిక, రత్నావళి, వాసవదత్తాది పాత్రలను ఒక్కొక్క వ్యక్తిత్వంతో బమ్మలు గీసినట్లుగా స్పష్టరేఖలతో చిత్రించాడు. హర్షుడు చిత్రలేఖనంలో కూడా అందేవేసిన చేయి. ఈ రెండు నాటకాల్లో భరతుడు చెప్పిన నాటక లక్షణాలు సంపూర్ణంగా ఉన్నాయి. కాబట్టే దశరూపక కర్తలు ధనంజయుడు, విశ్వనాథాదులు రత్నావళి నుంచి చాలా ఉదాహరణలిచ్చారు. ఇవి రమ్యమైన సంగీతాత్మకమైన నాటకాలు. హర్షునికి సంగీతంలో మంచి ప్రవేశమున్నట్లు తెలుపుతున్నాయి.

హర్షుని చివరి రచన నాగానందం. ఇది ప్రౌఢమైంది. మహాభారతంలో వున్న జాతక కథలో ప్రసిద్ధమైన జీమూత వాహనుని కథను తీసుకొని హర్షుడు నాటకంగా మలిచాడు. నాటకంగా రాయడానికి కష్టమైన కథను తీసుకొని హర్షుడు సఫలవంతమైన నాటకంగా మలిచాడు. ఇతివృత్తాన్ని సన్నివేశాలుగా చక్కగా విభజించుకున్నాడు. ఈ నాటకం వీర రస ప్రధానమైంది. మొదట శృంగార, హాస్య రసాలూ తరువాత కరుణ, శాంతరసాలు పోషింపబడినవి. నాయకుడు ధీరోదాత్తుడు. శంఖచూడునికి బదులుగా జీమూత వాహనుడు గరుత్మంతునికి తన శరీరాన్ని అర్పించే ఘట్టాన్ని హర్షుడు చాల చక్కగా చిత్రించాడు. పాత్రలచిత్రణ సహజంగా వైవిధ్యంతో జరిగింది. సంభాషణలు సముచితం. హర్షునికి అభిమాన నాటకకర్త కాళిదాసు. ఎన్నోచోట్ల సన్నివేశ విభజనలో కాళిదాసును అనుకరించాడు.

హర్షుడు రసిక హృదయుడు. అందుకే అతడు శృంగార ప్రధానమైన నాటికలను రచించాడు. నాగానందంలో నాయకుడు పర్వతం మీద సంచరిస్తూ నాయిక గానం చేత ఆకర్షింపబడి అటువైపుగా పోయి నాయికను చూసి ప్రేమించినట్లుగా సంగీతాభిమాని హర్షుడు కల్పన చేసారు. తర్వాత సంగీత పారిభాషిక పదాలతో నాయిక గానాన్ని నాయకుని చేత ప్రశంసింపజేశాడు. అన్ని నాటకాల్లో హర్షుడు విదూషకున్ని ప్రవేశపెట్టి తన హస్యప్రియతను చాటుకున్నాడు. అంతే సామర్థ్యంతో యుద్ధవర్ణనలను వీరరస స్ఫోరకంగా రచించాడు. భరతుని నాట్య శాస్త్ర లక్షణాలను పూర్తిగా అనుసరిస్తూ ఎక్కడా కృత్రిమతను చూపలేదు. అతని నాటకాలు తర్వాతి కాలంలో రాజశేఖరాది కవుల రచనలకు ఆదర్శమయ్యాయి.

సుజాత

హల్లీసకం : సంస్కృత ఉప రూపకం. ఒకటి గాని రెండు గాని అంకాలు. ఏకాంకమైతే గర్భ నిర్వహణసంధులు, ద్వయాంకమైతే ముఖ అవమర్శ సంధులు, 7,8,9, 10 మంది నాయికలు; ఒకరు గాని 5, 6గురు కాని లలితులు, దక్షిణులు, విఖ్యాతులు, విప్ర అమాత్య క్షత్ర వణిక్‌లు నాయకులు. తాళ, లయ భూయిష్టం. కైశికీవృత్తి. ఉదాహరణకు కేళీ దైవతకం.

శ్రీ.చ.

హాప్ట్‌మన్, గెర్ హార్ట్ (1862–1946) : జర్మన్ నాటక కర్త. నవలా రచయిత. ఈయన 1862లో జన్మించాడు.



ఈయన సైలీషియాలో జన్మించడం మూలంగా ఆ మాండలిక భాషలోనే నాటకాలు రాశాడు. శిల్పిగా రూపొందాలని జర్మనీ, ఇటలీలలోని లలిత కళాశాలలో శిల్ప విద్య అభ్యసించాడు. కాని నాటక రంగం ఆకర్షించింది. ఇతని మొదటి నాటకం సూర్యోదయాత్పూర్వం (Before Dawn) విజయవంతంగా ప్రదర్శితమైంది. ఇది స్వభావాను వాద నాటకం. తరువాత 1892లో రాసిన చేనేత కార్మికులు *(The weavers)* సైలీషియా చేనేత కార్మికుల తిరుగుబాటును చిత్రించే చరిత్రాత్మక నాటకం ప్రపంచ ఖ్యాతి గాంచింది. జర్మన్ నాటక సాహిత్యం మీద ఎంతో ప్రభావం నెరపింది. 1912లో ఈ నాటకానికి నోబెల్ బహుమతి లభించింది. ఆ తరువాత హాప్ట్‌మన్ వివిధ రీతులలోను, మిశ్రమరీతులలోను చాలా నాటకాలు రచించి

ప్రపంచ ఖ్యాతిగాంచాడు. 1889లో సూర్యోదయాత్పూర్వం, 1892లో చేనేత కార్మికులు, 1893లో బీవేర్ కోటు, 1896లో ది సంకెన్ బెల్, 1899లో హెలీనా, 1901లో ది రెడ్ కాక్, 1903లో రోజ్ బెర్న్, 1911లో ది రాట్స్ నాటకాలు రచించి వెలువరించిన హాప్ట్‌మన్ 1946లో మరణించాడు.

శ్రీ.చ.

హామర్షియా : గ్రీకు నాటక లక్షణ సంబంధి. గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ సూత్రీకరించిన నాటక లక్షణాలలో హామర్షియా ఒకటి. హామర్షియా అంటే కథానాయకునిలో కనిపించే ఒక నిర్దిష్టలోపం. నాయకుడు ప్రేక్షకుల సానుభూతి పొందే ఎన్ని విశిష్ట లక్షణాలు కలవాడైనా, అతనిలో వున్న ఏదో చిన్న లోపం విషాదానికి, అతని పతనానికి దారి తీస్తుందని ఈ సిద్ధాంత సారాంశం. భారతీయ నాటక లక్షణాలకు ముఖ్యంగా కథానాయకుని లక్షణాలకు గ్రీకు హామర్షియా భిన్నమైన తత్త్వాన్ని ప్రతిపాదిస్తుంది. భారతీయ నాటక సంప్రదాయ ప్రకారం నాయకుడు సర్వగుణ సంపన్నుడై ఉండాలి. నటుడిలో లోపాలు చూపడానికి, అతని వ్యక్తిత్వంలో, మనుగడలో, ప్రవర్తనలో, చివరికి ఆలోచనా విధానంలో గాని ఏ లోపమూ కనబడకూడదు. అందుచేత నాయకునికి పతనం ఉండదు. ఒక వేళ పతనం సంభవించినా అది బాహ్యపరిస్థితుల ఫలితంగా ఉంటుందే గాని, వ్యక్తి శీలాన్ని మలినపరిచేదిగా ఉండదు. గ్రీకు నాటకాల్లో నాయకులు, వారిలో ఉన్న ఏదో లోపం కారణంగా పతనమైనట్లు చిత్రితం కావడం సర్వసాధారణంగా జరుగుతుంది. దీన్నే హామర్షియా అన్నారు.

గం.సు.రె

హెరాల్డ్ పింటర్ (జ.1930) : బ్రిటిష్ నాటక ప్రయోక్త, నాటక రచయిత. సాహిత్యంలో 2005 సంవత్సర నోబెల్ బహుమతి గ్రహీత. క్రికెట్ అభిమాని.

పింటర్ 1930, అక్టోబర్ 10న లండన్‌లో హాక్నీబరీలో జన్మించాడు. జాతిరీత్యా యూదుడు. ఆయన తండ్రి దర్జీ. యూదుడు కావడంతో ఆయన జాతి వివక్షను ఎదుర్కోవలసి వచ్చింది. రెండవ ప్రపంచయుద్ధం ప్రబలినపుడు అంటే తన 9వ ఏట లండన్‌ను వదలి వెళ్ళి తిరిగి 12వ ఏట లండన్ చేరుకున్నాడు. ఆయన హాక్నీగ్రామర్ స్కూల్‌లో చదువుకున్నాడు. పాఠశాలలో ప్రదర్శించిన నాటకాలలో మ్యాక్బెత్, రోమియో వంటి పాత్రలను పోషించాడు. ఇదే తన జీవితాన్ని నటుడు మలచుకోవడానికి తొలిమెట్టు అయింది. 1948లో రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్స్‌లో చేరాడు. 1950లో తన తొలి పద్యాలను ప్రచురించాడు. ఆయన నట జీవితం నాటకరచన వైపు మళ్ళించింది. రేడియో నాటికలు రచించాడు. అంతేకాక సినిమాలకు, టీవీలకు స్క్రీన్‌ప్లే రచించాడు. వాటిలో ‘ది యాక్సిడెంట్ (1967), ది గో బిట్వీన్ (1971), ది సర్వెంట్ (1973), ది ఫ్రెంచ్ లెఫ్టినెంట్స్ విమన్ (1981 జాన్ పౌల్ నవల ఆధారంగా) వంటివి ముఖ్యమైనవి. ఆయన సుమారు 30 నాటకాలు రచించాడు. ది రూం (1957) అనే నాటకం రచించి నాటక రచనకు శ్రీకారం చుట్టాడు. దీనిని బ్రిస్టల్‌లో ప్రదర్శించారు. బర్త్ డే పార్టీ (1957), ది కేర్ టేకర్ (1959), హోం కమింగ్ (1964) మొదలైన నాటకాలు ఆయన కాలం నుంచి జాలువారినవే. ఆయన రచనాశైలి, ఒక తరహా నాటక సన్నివేశాలు, కాలచిత్రీకరణ, నిశ్శబ్దాన్ని ప్రేమించే తత్త్వాలకు పిటరెస్క్ భావనగా, ప్రయోగంగా పేరు వచ్చింది.

ఆయన మొదట వివిఎన్ మర్చంట్‌ను వివాహం చేసుకున్నాడు. తరువాత 1980లో ఆంటోనియో ఫ్రేసర్ అనే రచయిత్రిని అర్ధాంగిగా చేసుకున్నాడు.

1973 నుంచి తన రచనల్లో మానవహక్కుల పోరాటానికి శ్రీకారం చుట్టాడు. మానవ హక్కుల పోరాటంలో పాలుపంచుకున్నాడు. సమాజంలో వేళ్ళూనుకున్న పెత్తందారీతనం, బానిసత్వం, సామాన్యులకు జరిగే అన్యాయం, వారు పడే అష్టకష్టాలు పింటర్ నాటకాల్లోని ఇతివృత్తాలు. అనునిత్యం మాట్లాడుకునే పిచ్చాపాటి మాటలతో ప్రమాదకరమైన కోణాలను పింటర్ ఆవిష్కరించాడు. అణచివేతను కళ్లకు కట్టినట్లు పింటర్ సాహిత్యం చూపెడుతుంది. మానవుల దైనందిన జీవితాలను నిర్వీర్యం చేస్తున్న మూలశక్తులను అన్వేషించి, వాటిని తన నాటకాలలో కన్నులకు కట్టినట్లు పింటర్ చూపాడు. మనుషుల మధ్య అంతరించిపోతున్న అనేక సుహృద్భావాత్మకమైన మౌలికాంశాలను తన రచనల్లో అభివ్యక్తం చేసి నాటకరంగం పునర్నిర్మాణం కావించాడని నోబెల్ పురస్కార కమిటీ ప్రశంసించింది.

చంద్ర

హాసం : హాస్యరస స్థాయి భావం. వికృతాకారచేష్ట, భాషణ వల్ల గాని, వాటి అనుకరణవల్ల గాని జనించే మనోవికాసం హాసం. ఈ హాసం పరిపుష్టమై, అనుభవయోగ్యమైన రసంగా పరిణమిస్తుంది.

శ్రీ.చ.

హాస్యనర్మం : నర్మ భేదం. కేవలం హాస్యంతో కూడిన పరిహాసం హాస్యనర్మం. ఈ హాస్య నర్మం మూడు విధాలు. 1. వాచికనర్మ, 2. చేష్టానర్మ, 3. వేషనర్మ

1. వాచిక నర్మ : మాటల ద్వారా హాస్య నర్మం.
2. చేష్టా నర్మ : చేష్ట ద్వారా హాస్య నర్మం జనింపచేయడం.
3. వేషనర్మ : వేషం మూలంగా హాస్య నర్మం. ప్రతాపరుద్రీయ నాటకంలో చినిగి పోయిన గోనె పట్టాలు, బమికలు మొదలైన వాటితో యుగంధరుని పిచ్చి వేషం నవ్వు జనింపచేస్తుంది కాబట్టి వేషనర్మ.

శ్రీ.చ.

హాస్యరసం : నవ రసాలలో ఒకటి. శృంగార రస జన్యం. వికృతాంగులను చూసినా, వికృత వేషధారులను చూసినా, అసంబద్ధమైన మాటలు విన్నా, అతిగా భోజనం చేసే వారిని చూసినా, అకారణంగా భయపడడం చూసినా, చక్కలిగింతలు పెట్టినా వీటన్నింటినీ వర్ణించినపుడు, వినినపుడు నవ్వు వస్తుంది. ఈ నవ్వే స్థాయి భావంగా గల రసం హాస్య రసం. వికృతాంగం, వికృత వేషం మొదలైనవి విభావాలు. పెదవులను, చెక్కిళ్లను, ముక్కులను కదిలించడం, కన్నులు మూయడం, విప్పడం మొదలైనవి అనుభావాలు. హర్షం, అవహిత్థ, చాపల్యం, ఆవేగం వ్యభిచారీ భావాలు.

దీని వర్ణం తెలుపు. అధిదేవత ప్రమథుడు (గణనాథుడని నరస భూపాలీయం). దీనికి కరుణ, భయానక రసాలు విరోధి రసాలు, శృంగార రసం మైత్రీ రసం. ఈ హాస్యరసం ప్రధానంగా రెండు విధాలు. మొదటిది ఆత్మస్థం, రెండవది పరస్థం.
ఆత్మస్థం: తన వికారాలకు తానే స్వయంగా నవ్వుకోవడం ఆత్మస్థం.
పరస్థం : వికృత రూపంలో ఇతరులను నవ్వించడం.

శారదాతనయుడు భావప్రకాశనంలోమరి మూడు విధాల హాస్యం చెప్పాడు.
1. వాచిక హాస్యం, 2. నేపథ్య హాస్యం, 3. ఆంగిక హాస్యం.
వాచిక హాస్యం : నవ్వును పుట్టించే వాక్యం వాచిక హాస్యం.
నేపథ్య హాస్యం : మృచ్ఛకటిక ప్రథమాంకంలో శకారుడు కత్తి తల కిందుగా పట్టుకొని నిష్క్రమించడం.
ఆంగిక హాస్యం : స్వభావం వల్ల గాని, కపటం వల్ల గాని, అంగ వికటాభినయం ఆంగిక హాస్యం.

హాస్యరసం అనుభావ భేదాన్ని పట్టి స్మితం, హసితం, విహసితం, అవహసితం, అపహసితం, అతి హసితం అని ఆరు విధాలు.

1. స్మితం : స్మితమనగా చిరునవ్వు. కొద్దిగా చెక్కిళ్లు వికసింపజేసే మృదు కటాక్షం చూపుతూ దంతాలు పైకి కాన రాకుండా నవ్వితే అది స్మితం.
2. హసితం : ముఖం, కళ్లు, చెక్కిళ్లు వికసింప జేసి కొద్దిగా దంతాలు కనిపించేటట్లు నవ్వడం హసితం.
3. విహసితం : ధ్వని వినిపించకుండా మధుర స్వరంతో ముఖరాగాన్ని చూపుతూ, ఓరకంట చూస్తూ మంద్రంగా నవ్వడం విహసితం.
4. అవహసితం : భుజం, శిరస్సు కదిలేటట్లు ఓర చూపు చూస్తూ ముక్కుపుటాలను బాగా వికసింప జేస్తూ నవ్విన అది అవహసితం.
5. అపహసితం : అపహసితమంటే పరిహాసం, ఎగతాళి. తగినంత కారణం లేకుండా నవ్వడం. కన్నీరు వెలువరిస్తూ, భుజాలు, శిరోజాలు అదిరి పోయేటట్లు నవ్వడం అపహసితం.
6. అతిహసితం : స్థూలమయింది, కర్ణ కఠోరధ్వని గలది, బాష్పాలను ప్రవహింపజేసేది. డొక్క అదిరేట్లు చేసేది అతిహసితం. ఉదాహరణకు కన్యాశుల్కం చతుర్థాంకం ఒకటో రంగంలో మధురవాణి నవ్వొచ్చి ఆపుకోలేక విరగబడినవ్వడం.

శ్రీ.చ.

హాస్యాభాసం : లోక మర్యాదకు విరుద్ధంగా పూజింప వలసిన వారిని పరిహసించడం హాస్యాభాసం. ఉదాహరణకు ఉత్తర రామచరిత చతుర్థాంక ప్రారంభ విష్కంభంలో మునిశిష్యుడు పూజింపతగిన వశిష్ఠ మహర్షిని పరిహసించడం.

శ్రీ.చ.

[illegible]

హిందూ థియేట్రికల్ సొసైటీ (పిఠాపురం) : శ్రీ రావు చెల్లాయమ్మరావు జమిందారు 1900లో ఈ సభను స్థాపించాడు. ఈ సభకు పానుగంటి లక్ష్మీనరసింహారావు కవి. వేదురు మూడి శేషగిరి రావు, దేవరకొండ కృష్ణమూర్తి (నాయక పాత్రలలో నటించేవాడు) ఆలమూరి పట్టాభిరామయ్య, కంగాని రామయ్య మొదలైనవారు కూడా ఈ సమాజ సభ్యులే. వేదురు మూడి శేషగిరిరావు సుభద్రా పరిణయం, కన్యకా విజయం సుయోధన ఘోషయాత్ర మొదలైన తెలుగు నాటకాలను, శివాజీ చరిత్ర, పీష్వా నారాయణరావు మొదలైన హిందీ నాటకాలను రాయడమేకాక హైదరుజంగు పాత్రలో నటించాడు.

జి.ఎస్.ఎన్.

హిందూ నాటక సమాజాలు : 1. గుంటూరు, 2. కాకినాడ, 3. రాజమండ్రి.

1. గుంటూరు హిందూ నాటక సమాజం : ఈ సమాజానికే ఫస్టుకంపెనీ అనే పేరు. కొండుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి 1882లో స్థాపించాడు. ఈయనతోపాటు పాతూరి శ్రీరాములు, పోలూరి హనుమంతరావు మొదలైనవారు ముఖ్యులు.

కొండుభట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, బలిజేపల్లి లక్ష్మీకాంతం, వంగీపురం కృష్ణమాచార్యులు, యడవల్లి వెంకట కృష్ణశాస్త్రి మొదలైన కవులు రచించిన నాటకాలను ఈ సమాజం ప్రదర్శించింది.

హరిప్రసాదరావు, కోపల్లె హనుమంతరావు, కొండా వెంకటప్పయ్య పంతులు, బలిజేపల్లి లక్ష్మీకాంతం, కలపటపు నరసింహారావు, పత్రి గోపాలరావు, పత్రి శ్రీనివాసరావు,

కోటంరాజు లక్ష్మీకాంతం మొదలైనవారు నటబృందంగా ఉండేవారు.

గులేబకావళి, రామదాసు, పద్మవ్యూహం, సత్యహరిశ్చంద్ర, చిత్రనళీయం, సునందినీ పరిణయం, శాకుంతలం, జనకజానందం, వేణీసంహారం, బుద్ధిమతీ విలాసం, విషాద సారంగధర, సత్యహరిశ్చంద్రీయం, సాత్రాజితీయం, ఉత్తర రాఘవం వంటి నాటకాలను ఈ సమాజం పక్షాన ప్రదర్శించారు.

ఈ సమాజంలో రెండు శాఖలు, రెండు దశలు. ఒక శాఖ తెలుగు నాటక శాఖ. రెండవది ఇంగ్లీషు నాటక శాఖ. వచన నాటకదశ మొదటిది. గద్య పద్య నాటక దశ రెండవది.

మొదటి దశలో కొండుభట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యాన వచన నాటకాలు ప్రదర్శించారు. దేశభక్త కొండా వెంకటప్పయ్య నాయిక వేషాలలో నటించాడు.

తరువాత ఈ కంపెనీ పాతూరి శ్రీరాములు ఆధ్వర్యంలో గుంటూరు ఏడుగొందుల సందు దగ్గర స్వంత నాటకశాల నిర్మించుకున్నారు. ఆ తరువాత డేరాహాల్ స్థలంలో నాటక శాలను నిర్మించుకున్నారు. దీనినే ఫస్టుకంపెనీ హాలని, సీనియర్ హిందూ థియేటర్ హాలని పిలిచారు.

ఇక రెండవ దశ గద్య పద్య నాటక దశ, ఈ దశలో నాటక కంపెనీ ఖ్యాతి ఆంధ్రదేశమంతటా మారుమోగింది. ఆంధ్ర నట పితామహ హరిప్రసాదరావు, కోపల్లె హనుమంతరావులు నాయక నాయిక వేషాలలో నటించారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులు గద్య పద్య గేయ నాటకాలను మొట్ట మొదటగా సర్కారు జిల్లాలలో ప్రదర్శించగా, ఆ రీతి నాటకాలకు బహుళ వ్యాప్తిలోకి తెచ్చిన ఘనత ఈ సమాజానిది, హరిప్రసాదరావుది. దీనితోనే ఆంధ్ర నాటకరంగ చరిత్రలో ఒక నూతన యుగానికి ఈ సమాజం నాంది పలికినట్లైంది. నటనలో, ప్రయోగంలో నాటక పద్య పఠనంలో మార్గదర్శకంగా నిలిచింది ఈ నాటక సమాజమే.

గుంటూరు సెకండ్ కంపెనీ: ఈ నాటక సమాజం అసలు పేరు విబుధ రంజనీ శృంగార హిందూ నాటక సమాజం. దీన్ని చేగు కనక రత్నం 1885లో స్థాపించాడు.

నేతి సుబ్బరాయశాస్త్రి, చల్ల యల్లమంద, పోరల నరసయ్య మొదలైన కవులు రచించిన నాటకాలను ప్రదర్శించింది.

ద్రౌపదీ స్వయంవరం, సత్యహరిశ్చంద్ర, చిత్రనళీయం, విషాద సారంగధర, పాండవ జననం, పాండవ విజయం, వేణీసంహారం నాటకాలను విరివిగా ప్రదర్శించింది.

మల్లాది గోవింద శాస్త్రి, పత్రి వెంకట రమణారావు, కోటం రాజు, లక్ష్మీకాంతం ప్రభృతులు ఈ సమాజానికి చెందిన నటులే. వీరు కూడా సొంత నాటకశాలలను నిర్మించుకున్నారు.

2. *హిందూ నాటక సమాజం, కాకినాడ:* 1885లో ఈ సమాజాన్ని దనవహి హనుమంతరావు స్థాపించాడు. సింగీతం అబ్బాయి ఈ సమాజానికి మేనేజర్‌గా వ్యవహరించాడు.

జయంతి భావనారాయణ, కోపల్లె వెంకట రమణారావు ఈ సమాజానికి సంబంధించిన కవులు.

పైజర్సు అప్పారావు, జయంతి భావనారాయణ, కోపల్లె రమణారావు, వెదురుమూడి శేషగిరిరావు, ఆలమూరు పట్టాభిరామయ్య, ముప్పిడి జగ్గరాజు మొదలైనవారు ఈ సమాజం నటవర్గం. వేణీ సంహారం, బొబ్బిలి నాటకాలను ఈ సమాజం విరివిగా ప్రదర్శించింది.

3. *హిందూ నాటక సమాజం, రాజమండ్రి :* ఈ సమాజాన్ని 1889లో ఇమ్మనేని హనుమంతరావు రాజమండ్రిలో స్థాపించాడు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం తోలేటి వెంకటసుబ్బారావు, ముడుంబ రామానుజాచార్యులు వంటి కవులు ఈ సమాజం కోసం నాటకాలు రాశారు.

ఇమ్మానేని హనుమంతరావు నాయుడు, టంగుటూరి ప్రకాశం, దుర్గి గోపాల కృష్ణయ్య, ముప్పిడి జగ్గరాజు ప్రధాన పాత్రలలో నటించారు. సూత్రధారుడుగా సాతాని రామానుజయ్య, హాస్య పాత్రలో వల్లూరు పూర్యప్రకాశరావు నటించారు.

సత్యహరిశ్చంద్ర, కీచక వధ, శ్రీరామ జననం, ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, పారిజాతాపహరణం, నలనాటకం, సీతాకల్యాణం, సిరియాళరాజు చరిత్ర, పాండవాశ్వమేధం, సారంగధర, చమత్కార రత్నావళి వంటి ప్రసిద్ధ నాటకాలను ఈ సమాజం పలుమార్లు ప్రదర్శించి ప్రేక్షకుల మెప్పును పొందింది.

ఇమ్మానేని, టంగుటూరి, చిలకమర్తి ఈ సమాజం మొదటి దశలో త్రిమూర్తులు. మంచి కట్టుబాటుతో ఈ సమాజాన్ని నిర్వహించారు. 1901లో హనుమంతరావు ఈ సమాజాన్ని పునరుద్ధరించి చిలకమర్తిని అధ్యక్షుల్ని చేశాడు. ఇది మొదటి దశ. ఈ దశలో ఈసమాజం ఎక్కువగా వచన నాటకాలే ప్రదర్శించింది. ఇన్నీసు పేటలోని కుమ్మరిగుంట (నేటి ట్రైనింగ్ కళాశాల ఆవరణ)లో నాటక పాకలో నాటకాలు ప్రదర్శించారు. తరువాత 1907లో ఇన్నీసుపేటలోని వాగుల చెరువు వీధిలో పెంకుటి నాటక శాల నిర్మించుకున్నారు.

ఈ సమాజం ప్రదర్శించిన నాటకాలు రసవంతంగా, జనాకర్షణీయంగా ఉండేవి. చిలకమర్తి లక్ష్మీనరసింహం నాటకాలు మొట్టమొదటిసారి ప్రదర్శించిందిఈ సమాజమే. ఈ సమాజం సభ్యులలో నాయకులు ఎక్కువగా ఉండడంవల్ల దీనిని నాయకుల కంపెనీగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

రెండవ దశ 1908లో గున్నేశ్వరరావు, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ప్రారంభమై, వీరి సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు సంవత్సరాలు మాత్రమే సాగింది. తరువాత వీరిద్దరి మధ్య అభిప్రాయభేదాలు చోటు చేసుకోవడం వల్ల నాగేశ్వరరావు విడిపోయి వేరే సమాజం స్థాపించాడు.

నాగేశ్వరరావు 1912 నుంచి దీనిని నడపసాగాడు. ఏలూరులో ఈయన నాటకం ప్రదర్శిస్తున్నప్పుడు అగ్నిప్రమాదం కారణంగా వస్తు సామాగ్రి చాల నష్టమైంది. నాగేశ్వరరావు పుంజుకుని మరి కొద్ది కాలం మాత్రమే నడపగలిగాడు.

ఇక గున్నేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ సమాజం మూడు పూవులు ఆరు కాయలుగా వెలిగింది. ఆంధ్ర నాటకరంగ చరిత్రలో ఒక నూతనాధ్యాయానికి నాంది పలికింది. గున్నేశ్వరరావు కట్టుదిట్టంగా వ్యాపార ధోరణిలో ఈ నాటక సమాజాన్ని నిర్వహించాడు. రాష్ట్రంలో పేరెన్నికగన్న నటులను ఆహ్వానించి నెలజీతాల మీద చేర్చుకున్నాడు. తన యాజమాన్యంలో సక్రమంగా రిహార్సల్సు చేయించాడు. ప్రదర్శనలిప్పించాడు.

అంతేకాదు, బొంబాయి నుంచి రామ్ అనే చిత్రకారుని పిలిపించి నెలజీతం మీద నియమించి సీనరీలు రూపొందించాడు. పాపట్ల కాంతయ్య అనే వాగ్గేయ కారుని రప్పించి సంగీత దర్శకుడుగా నియమించాడు. కాంతయ్య పార్శీ సంగీత ఫణుతులతో తెలుగు పాటలు రాసి నటులకు నేర్పాడు. ఆట సమయంలో హార్మోనియం వాయించే పద్ధతి ప్రవేశపెట్టాడు. తరువాత నాటక ప్రదర్శనంలో నృత్యాలు చేసే పద్ధతి ప్రవేశపెట్టింది కూడా ఈయనే. సామాన్యంగా దర్బారు దృశ్యంలో బాల బాలికలతో బృంద నృత్యాలు చేసి ప్రేక్షకులను ఆకర్షించబడటం ఆనవాయితి. రామ్ నాటకం మధ్య హాస్య సంభాషణాలు చెప్పి ప్రేక్షకులను రంజింపచేయడం పరిపాటి.

అంతేకాక క్షణంలో రంగాలను అద్భుతంగా మార్చడం ఈ సమాజం విశిష్టత. దర్బారు దృశ్యం అద్భుతంగా ఉండేది. రంగస్థలం పెద్దది. పూలతో దృశ్యం ఇంకో ప్రత్యేకత. మెట్లవలె ఒకదాని పైన ఒకటి కట్టేవారు. వాటికి రంధ్రాలు ఉండేవి. పలుచని కాగితం అంటించి వెనుక పెద్ద దీపం పెట్టగానే అంతు లేని దీపాలు అనిపించేవి. ఈ దీపాల సంఖ్య చెప్పిన వారికి రూ. 116 లు బహుమతిగా ఇచ్చేవారు.

ఈ సమాజం నాటకాలను జనరంజకంగా ప్రదర్శించడం వల్ల స్థానికులేగాక దూరప్రాంతాల వారు కూడా ముందుగా టిక్కెట్‌లు కొని ప్రదర్శనలు చూసేవారు.

శ్రీ.చ.

హేమచంద్ కోన (జ 1943) : రంగస్థల నటుడు, నాటక పరిషత్తు నిర్వాహకుడు, న్యాయనిర్ణేత. 1943 సెప్టెంబరు 1న కోన ప్రభాకరరావు, పద్మావతి దంపతులకు గుంటూరు జిల్లా, బాపట్లలో జన్మించాడు. తండ్రి ప్రభాకర రావు రంగస్థల, సినీ నటుడు, దర్శకుడు, ఆంధ్రశాసనసభ స్పీకరుగాను, మహారాష్ట్ర గవర్నరుగానూ పనిచేశాడు. తండ్రి ఇచ్చిన ప్రోత్సాహం వల్ల హేమచంద్ బాల్య దశ నుంచి కళారంగంపట్ల మక్కువ పెంచుకోవడానికి ఆలంబన అయింది.

మద్రాసు (నేటి చెన్నై) కేసరి హైస్కూలు, బాపట్ల, మున్సిపల్ హైస్కూలు, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీ, బాపట్ల, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలల్లోను విద్యాభ్యాసం సాగింది. వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో డాక్టరేటు పట్టా పొందాడు. 1964 నుండి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అధ్యా పకుడిగా చేరాడు. 2003 సెప్టెంబరులో ప్రొఫెసరుగా ఉద్యోగ విరమణ చేశాడు.

విద్యార్థి దశలో ప్రోగ్రెస్ కార్డ్, ఇంక్విలాబ్, కోపం, ఉత్తరం వంటి నాటికల్లో ఒరవడి కోసం ప్రయత్నించినా, అభినయాన్ని మెరుగు పరుచుకొన్న తర్వాత కొర్రపాటి గంగాధరరావు రచించిన బంగారు సంకెళ్ళు, డిటెక్టివ్‌నాటికల లోను, కమల నాటకంలోను నటించి, ప్రశంసలు పొందాడు. కోన గోవిందరావు రచించిన మట్టి బొమ్మలు నాటకంలో సంస్కృతి సమ్మేళనం, నెప్జా, పంతం పద్మనాభ నాటక పరిషత్తు తదితర పోటీలలో పాల్గని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాడు. ప్రసిద్ధ నటుడు, దర్శకుడు, కె. ఎస్.టి. సాయి ప్రోత్సాహం, శిక్షణతో హేమచంద్ నటుడుగా నిలదొక్కుకొని రాణించడానికి అవకాశం కలిగింది. వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సాంస్కృతిక వారోత్సవాలను ప్రతి ఏటా సమర్థవంతంగా నిర్వహించి పేరు తెచ్చుకున్నాడు. జాతీయ

స్థాయిలో జరిగే వ్యవసాయ సదస్సులలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో అధ్యక్షుడుగా వ్యవహరించి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధుల మన్ననలు పొందాడు. గత పది సంవత్సరాలుగా బాపట్లలో కోన ప్రభాకరరావు నాటక పరిషత్తుకు ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర స్థాయి నాటకపోటీలు నిర్వహిస్తూ నాటకరంగానికి సేవచేస్తున్నాడు. 2005 సంవత్సరంలో ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాలలో నాటిక విభాగానికి ప్రాథమిక న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు.

గం.సుం.రె.

హ్యూగో, విక్టర్ (1802-1885) : ఫ్రెంచి నాటకకర్త. నవలాకారుడు. కాల్పనిక నాటక సాహిత్యానికి దారి తీసిన నాటకకర్త. ఈయన నాటకాలలో ఎక్కువభాగం పద్య నాటకాలే. ఈయన రాసిన మొదటి నాటకం క్రాంవెల్(1827)కు రాసిన పీఠిక కాల్పనిక నాటక సాహిత్య సమర్థనకు ఢంకా లాంటింది. ఆ తరువాత రాసిన నాటకం హెర్నానీ (1830), ఫ్రెంచి నాటక సాహిత్యం లో నూతన శకానికి నాంది పలికింది. మేరియన్ డిలోర్మీ నాటకం ఫ్రెంచి ప్రభుత్వం నిషేధించింది. అందువల్ల 1831లోగా ఈ నాటకాన్ని ప్రదర్శించడానికి వీలు లేకుండా పోయింది. 1802లో జన్మించిన విక్టర్ 1805లో మరణించాడు.



హ్యూగో వచన నాటకాలలో పదాడంబరం ఎక్కువ. ఉద్వేగభాగం తక్కువ. 1827లో క్రాంవెల్, 1830లో హెర్నానీ, 1838లో మేరియన్ డెలోర్మి , రైబ్లాస్, 1833లో బోర్జియా, మేరీ ట్యూడర్, 1835లో ఏంజెలో, టైరన్ డిపాడో, 1943లో లెబర్గ్రేన్స్ నాటకాలను విక్టర్ రచించాడు. ఇవన్నీ ప్రసిద్ధ నాటకాలే.

శ్రీ.చ.

694

అనుబంధం

నందమూరి తారక రామారావు రంగస్థల పురస్కార గ్రహీతలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టి. వి. నాటకరంగ అభివృద్ధి సంస్థ ప్రతి సంవత్సరం జనవరి నెలలో నంది నాటకోత్సవాలను రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తూ నాటక రంగంలో కృషిచేస్తున్న కళాకారులను, సాంకేతిక నిపుణులను, నాటక రచయితలను ప్రోత్సహిస్తూ ఉంది. నాటకరంగ వికాసం కోసం అంకిత భావంతో అకుంఠిత కృషిచేసిన విశిష్ఠ నటుని లేదా నటిని ఎంపికచేసి నంది నాటకోత్సవాల సందర్భంలో, నందమూరి తారక రామారావు రంగస్థల పురస్కారంతో సన్మానించే సంప్రదాయం 1998 సంవత్సరం నుండి కొనసాగుతుంది. ఎన్. టి. ఆర్. రంగస్థల పురస్కారంతో పాటు 50,000 రూ. నగదు, శాలువా, సన్మానపత్రం, బంగారుపతకం సమర్పించడం జరుగుతూ వుంది. 1998 నుండి 2007 వరకు ఈ క్రింది నాటకకళా నిష్ణాతులు ఎన్. టి. ఆర్. పురస్కారం అందుకున్నారు.

సంవత్సరం		**గ్రహీత**
1998	–	అబ్బూరి కమలాదేవి
1999	–	వేమూరి రామయ్య
2000	–	ఆచంట వెంకటరత్నం నాయుడు
2001	–	జె. సిద్ధప్ప నాయుడు.
2002	–	పృధ్వి వేంకటేశ్వరరావు
2003	–	రావి వెంకటాచలం
2004	–	టి. కనకం
2005	–	దుగ్గిరాల సోమేశ్వరరావు
2006	–	బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి
2007	–	బి. భానుప్రకాశ్

★★★★

నంది నాటకోత్సవాలు – బహుమతి గ్రహీతలు

నాటక రంగంలో నటీనటులుగా, రచయితలుగా, దర్శకులుగా, సాంకేతిక నిపుణులుగా వివిధ విభాగాల్లో కృషిచేస్తున్న కళాకారులను ప్రభుత్వపరంగా ప్రోత్సహించే లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర చలనచిత్ర, టి. వి. నాటకరంగ అభివృద్ధి సంస్థ 1998 సంవత్సరం నుండి నంది నాటకోత్సవాలను ప్రారంభించింది. పద్యనాటకాలు, సాంఘికనాటకాలు, సాంఘిక నాటికలు అనే మూడు విభాగాలలో ప్రాథమిక పరిశీలకులు ఎంపిక చేసిన నాటకాలను, నాటికలను తుదిపోటీలకు స్వీకరించి రాష్ట్రస్థాయిలో నాటక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చే విధానాన్ని రూపొందించింది. ఆ ప్రకారంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో నంది నాటకోత్సవాల పేరుతో నాటక పోటీలు నిర్వహిస్తూ ఉంది. ప్రతి విభాగం లోనూ ఈ క్రింది విధంగా విజేతలకు బహుమతి ప్రదానం చేస్తుంది ఈ సంస్థ.

ఉత్తమ ప్రదర్శన, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ ప్రతినాయకుడు, ఉత్తమ క్యారెక్టర్ నటుడు, ఉత్తమ హాస్య నటుడు, ఉత్తమ బాలనటుడు, ఉత్తమ సంగీతం, ఉత్తమ ఆహార్యం, ఉత్తమ రంగాలంకరణ, ఉత్తమ నాటక రచయిత, జ్యూరీ బహుమతి.

ప్రతి సంవత్సరం నంది నాటకోత్సవాలను రాజధాని నగరంలోనే కాకుండా, ఒక్కొక్క జిల్లా కేంద్రంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తూ స్థానికులకు ఆ నాటకాలను చూసే అవకాశం కల్పిస్తోంది ప్రభుత్వం. 1998 నుండి 2007 వరకు నంది నాటకోత్సవాలలోబహుమతులు పొందిన కళాకారుల పేర్లను ఈ క్రింది పట్టికలలో చూడగలరు. ప్రాథమిక న్యాయనిర్ణేతల పేర్లను కూడా ఈ పట్టికలో పొందుపరచడం జరిగింది.

మొదటి నంది నాటకోత్సవం - 1998

(మే 23 నుండి 31 వరకు హైదరాబాద్)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన - శ్రీ శ్రీనివాస కళ్యాణం, శ్రీ శ్రీనివాస కళాభారతి, నృత్య కళాశాల, తిరుపతి.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - శ్రీ షిరిడి సాయిబాబా మహాత్మ్యం, శ్రీసాయి విజయనాట్య మండలి (సురభి) హైదరాబాద్.
ఉత్తమ దర్శకుడు - సింహం లక్ష్మీనారాయణ (నర- నారాయణ)
ఉత్తమ నటుడు - మీగడ రామలింగస్వామి (శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం)
ఉత్తమ నటి - రజనీ నాగరాజు (నర-నారయణ)
ఉత్తమ ప్రతినాయకుడు - బి.వి.ఎ. నాయుడు (శ్రీకృష్ణ రాయబారం)
ఉత్తమ క్యారక్టర్ నటుడు - వన్నెం బలరామ్ (నర - నారాయణ)
ఉత్తమ హాస్యనటుడు - ర్యాలి మోహనరావు (చంద్రో దయం)
ఉత్తమ బాలనటుడు - మాస్టర్ అవినాష్ (అన్నమాచార్య)
ఉత్తమ సంగీతం - మీగడ రామలింగస్వామి (శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం)
ఉత్తమ ఆహార్యం - షరీఫ్ (శ్రీ శ్రీనివాస కళ్యాణం)
ఉత్తమ రంగాలంకరణ - ఎస్. సుందరబాబు (శ్రీ శ్రీనివాస కళ్యాణం)
ఉత్తమ నాటక రచయిత - పల్లేటి లక్ష్మీ కులశేఖర్ (నర - నారాయణ)
జ్యూరీ బహుమతి - నర -నారాయణ

ప్రాథమిక స్థాయి న్యాయ నిర్ణేతలు : ఎం. అల్లా బక్ష్, జి.ఎస్.ఎన్. శాస్త్రి, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి

తుదిపోటీల న్యాయ నిర్ణేతలు : అచ్యుత రామరాజు గణపతిరాజు, అట్లూరి పుండరీకాక్షయ్య, ధూళిపాళ సీతారామ శాస్త్రి

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన - కించిత్ భోగం, బహురూప నట సమాఖ్య, విశాఖపట్నం
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - చరణదాసు, భూమిక, హైదరాబాద్.
ఉత్తమ దర్శకుడు - జి. ఉదయభాను (చరణదాసు)
ఉత్తమ నటుడు - పి. ఆర్. జె. పంతులు, (కించిత్ భోగం)
ఉత్తమ నటి - జగదీశ్వరి, (కించిత్ భోగం)
ఉత్తమ క్యారక్టర్ నటుడు - కొండవలస లక్ష్మణరావు (నవరాగం)
ఉత్తమ క్యారక్టర్ నటి - రత్నకుమారి (నరవాహనం)
ఉత్తమ హాస్యనటుడు - సుత్తివేలు (అనగా అనగా ఒక అమ్మాయి)
ఉత్తమ ప్రతినాయకుడు - వెంకటరామిరెడ్డి (కుర్చీ)
ఉత్తమ సంగీతం - జి. ఉదయభాను, కుమార్ (చరణ దాసు)
ఉత్తమ బాలనటుడు/నటి - ఎవరూలేరు
ఉత్తమ రంగాలంకరణ - బస్వర్ గోపాల్, (బస్తీ దేవత యాదమ్మ)

ఉత్తమ ఆహార్యం - జి. నాగేశ్వరరావు ,(బస్తీ దేవత యాదమ్మ)
ఉత్తమ రచన - డి. విజయభాస్కర్ (కుర్చీ)
జ్యూరీ బహుమతి - కె. వి. శాస్త్రి (కాకి ఎంగిలి)

ప్రాథమిక స్థాయి న్యాయ నిర్ణేతలు : ఎ. శివరామిరెడ్డి, గండవరం సుబ్బరామిరెడ్డి, యు. సుబ్బరాయశర్మ

తుదిపోటీల న్యాయ నిర్ణేతలు : జంధ్యాల, జె. వి. రమణమూర్తి, నూతన్‌ప్రసాద్

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - హింసధ్వని, గంగోత్రి, పెదకాకాని
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - మనుధర్మం, గురజాడ కళామందిర్, విజయవాడ.
ఉత్తమ దర్శకుడు - ఎస్.జె. భిక్షు (ఒక ఒరలో నాలుగు నిజాలు)
ఉత్తమ నటుడు - నాయుడు గోపి (హింసధ్వని)
ఉత్తమ నటి - ఎ. నాగమణి (నాలుగో సింహం)
ఉత్తమ ప్రతినాయకుడు - వై. హర్షవర్ధన్ (ఒక ఒరలో నాలుగు నిజాలు)
ఉత్తమ క్యారక్టర్ నటుడు - కె. శంకరరావు (జీవన సంధ్య)
ఉత్తమ హాస్యనటుడు - విశ్వమోహన్ (అబ్బే- ఏం లేదు)
ఉత్తమ సంగీతం - ఎం. సైదారావు (పృధ్వీసూక్తం)
ఉత్తమ బాలనటుడు/ నటి - ఎవరూలేరు
ఉత్తమ రంగాలంకరణ - పి. శేషగిరిరావు (పృధ్వీసూక్తం)
ఉత్తమ ఆహార్యం - మల్లాది గోపాలకృష్ణ ,(ఒక ఒరలో నాలుగు నిజాలు)
ఉత్తమ రచన - ఎ. భాస్కరచంద్ర (కొయ్యగుర్రం)
జ్యూరీ బహుమతి - కొయ్యగుర్రం (నాటిక)

ప్రాథమిక స్థాయి న్యాయ నిర్ణేతలు : ఎ.ఎల్. గురప్ప చౌదరి, కోకా సంజీవరావు, బి. విజయప్రకాష్

తుదిపోటీల న్యాయ నిర్ణేతలు : అరవేటి శ్రీనివాసులు, కె.ఎస్.టి. శాయి, దీన్‌బద్రు,

రెండో నంది నాటకోత్సవం – 1999

(మే 22 నుండి 28 వరకు హైదరాబాద్)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన - శ్రీకృష్ణ తులాభారం, శ్రీ సత్యసాయి కళానికేతన్, హైదరాబాద్
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - శ్రీరామవనవాసం, సవేరా ఆర్ట్స్, కడప.
ఉత్తమ దర్శకుడు - డి.ఎస్. దీక్షిత్ (శ్రీకృష్ణ తులాభారం)
ఉత్తమ నటుడు - గుమ్మడి గోపాలకృష్ణ (శ్రీకృష్ణ తులాభారం)
ఉత్తమ నటి - గూడూరు సావిత్రి (శ్రీరామవన వాసం)
ఉత్తమ ప్రతినాయకుడు - జి. శివనాగిరెడ్డి (శ్రీరామవన వాసం)
ఉత్తమ క్యారక్టర్ నటుడు - ఆచంట బాలాజీనాయుడు (తులసీ జలంధర)
ఉత్తమ హాస్యనటుడు/ నటి - అరుణకుమారి (తారా శశాంకం)

ఉత్తమ రచన – ఎవరికీ ఇవ్వలేదు.
ఉత్తమ బాలనటుడు/నటి – మాస్టర్ ఎస్. విక్రమ్ (శ్రీరామ వనవాసం)
ఉత్తమ సంగీతం – టి. రాజబాబు (బొబ్బిలియుద్ధం)
ఉత్తమ ఆహార్యం – శ్రీ సాయి డ్రామా డ్రస్ కంపెనీ, (బొబ్బిలియుద్ధం)
ఉత్తమ రంగాలంకరణ – బి.వి. రావు, ఎల్.వి. భూషణ్ (శ్రీకృష్ణ తులాభారం)
జ్యూరీ బహుమతి – బి.వి. ఆర్. సిహెచ్. నాయుడు (దీపావళి)

ప్రాథమిక స్థాయి న్యాయ నిర్ణేతలు

విశాఖపట్నం జోన్ : వై. రాఘవులు, గుంటూరు జోన్ : కొట్టే వెంకటాచార్యులు
కర్నూల్ జోన్ : రాజా శివానంద, వరంగల్ జోన్ : ఎం. పూర్ణచంద్రరావు

జోనల్ స్థాయి న్యాయ నిర్ణేతలు

విశాఖపట్నం జోన్ : సి.హెచ్. నాంచారయ్య, సౌమిత్రి. గుంటూరు జోన్ : అయ్యదేవర పురుషోత్తమరావు, వేదవ్యాస్
కర్నూల్ జోన్ : ఆచంట వెంకటరత్నం నాయుడు, వేమూరి రామయ్య. వరంగల్ జోన్ : తుర్లపాటి రాధాకృష్ణమూర్తి

తుదిపోటీల (రాష్ట్రస్థాయి) న్యాయనిర్ణేతలు :

అమరపు సత్యనారాయణ, గుమ్మడి వేంకటేశ్వరరావు, పృధ్వీ వేంకటేశ్వరరావు

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన – వానప్రస్థం, గంగోత్రి, పెదకాకాని.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన – కలల రాజ్యం, బహురూప నట సమాఖ్య, విశాఖపట్టణం.
ఉత్తమ దర్శకుడు – నాయుడు గోపి (వానప్రస్థం)
ఉత్తమ నటుడు – చిట్టా శంకర్ (అశ్వఘోష)
ఉత్తమ నటి – ఎమ్. రత్నకుమారి (వానప్రస్థం)
ఉత్తమ ప్రతినాయకుడు – గోపిశెట్టి వేంకటేశ్వర్లు (పులిస్వారి)
ఉత్తమ క్యారక్టర్ నటుడు – కె.పి.వి. ప్రసాదరావు (కలల రాజ్యం)
ఉత్తమ హాస్యనటుడు – ఎస్.కె. మిశ్రో (కలల రాజ్యం)
ఉత్తమ బాలనటుడు/నటి – చి. నుసుము అభినందన (ఉత్తమ పంచాయితీ)
ఉత్తమ సంగీతం – శ్రీధర్, మురళి (సహజీవనం)
ఉత్తమ ఆహార్యం – పాండురంగయ్య, శ్రీనివాసులు. (పులిస్వారీ)
ఉత్తమ రంగాలంకరణ – సురభి వి. నాగేంద్రప్రసాద్ (క్రాస్‌రోడ్స్)
జ్యూరీ బహుమతి – బి.హెచ్. పద్మప్రియ (క్రాస్‌రోడ్స్)

ప్రాథమిక స్థాయి న్యాయ నిర్ణేతలు

విశాఖపట్నం జోన్ : కప్పగంతుల మల్లికార్జునరావు, గుంటూరు జోన్ : గండవరం సుబ్బరామిరెడ్డి
కర్నూల్ జోన్ : గుంటూరు శాస్త్రి, వరంగల్ జోన్ : తాళ్ళూరి శివరామకృష్ణారావు

జోనల్ స్థాయి న్యాయ నిర్ణేతలు

విశాఖపట్నం జోన్ : ఎన్. రవీంద్రారెడ్డి, సి.ఎస్. రావు. గుంటూరు జోన్ : జీడిగుంట రామచంద్రమూర్తి, దేవదాస్ కనకాల.
కర్నూల్ జోన్ : ఎ. శివరామిరెడ్డి, జవ్వాది రామారావు. వరంగల్ జోన్ : ఎల్. జయప్రకాష్, కన్నేశ్వరరావు

తుదిపోటీల (రాష్ట్రస్థాయి) న్యాయనిర్ణేతలు

ఓలేటి పార్వతీశం, నూతన్‌ప్రసాద్, నెమలికంటి తారక రామారావు

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన – రావణ కాష్టం, సంగం డైరీ క్రియేషన్స్, వడ్లమూడి.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన – జారుడుమెట్లు, ఎల్.వి.ఆర్. క్రియేషన్స్, గుంటూరు.
ఉత్తమ దర్శకుడు – కావూరి సత్యనారాయణ (రావణ కాష్టం)
ఉత్తమ నటుడు – కావూరి సత్యనారాయణ (రావణ కాష్టం)
ఉత్తమ నటి – ఆలపాటి లక్ష్మి (సూదిలోంచి ఏనుగు)
ఉత్తమ ప్రతినాయకుడు – ఎ.జె.సి. రాజు (ధృతరాష్ట్ర కౌగిలి)
ఉత్తమ క్యారక్టర్ నటుడు/నటి – డి. నారాయణ (సాగర మథనం)
ఉత్తమ హాస్యనటుడు లేక నటి – ఎస్. మోహన్ (సాగరమథనం)
ఉత్తమ బాలనటుడు/నటి – ఎవరూలేరు
ఉత్తమ ఆహార్యం – కె. భరణి (కర్మణ్యే వాధికారస్తే)
ఉత్తమ రంగాలంకరణ – కె.ఎస్.వై. సత్యప్రసాద్ (కర్మసాక్షి)
ఉత్తమ సంగీతం – సైదారావు (రావణకాష్టం)
ఉత్తమ రచన – డి. విజయభాస్కర్ (మబ్బుల్లో బొమ్మ)
జ్యూరీ బహుమతి – కె. మందులు (కర్మసాక్షి)

జోనల్ స్థాయి (ప్రాథమిక పరిశీలన) న్యాయనిర్ణేతలు

గుంటూరు జోన్ : గండవరం సుబ్బరామిరెడ్డి, విశాఖపట్నం జోన్ : వై. సదాశివరావు
కర్నూల్ జోన్ : గుంటూరు శాస్త్రి, వరంగల్ జోన్ : కారుమూరి సీతారామయ్య

జోనల్ స్థాయి (తుది పోటీల) న్యాయ నిర్ణేతలు

గుంటూరు జోన్ : జీడిగుంట రామచంద్రమూర్తి, దేవదాస్ కనకాల
విశాఖపట్నం జోన్ : ఎస్.కె. ఆంజనేయులు, పూసల వేంకటేశ్వరరావు.
కర్నూల్ జోన్ : ఎ. శివరామిరెడ్డి, జవ్వాది రామారావు.
వరంగల్ జోన్ : బొమ్మిడి నారాయణరావు, మునిరత్నం రెడ్డి.

తుది పోటీల (రాష్ట్రస్థాయి) న్యాయనిర్ణేతలు : కె.కె. విశ్వనాథం, జి. రామారావు, పి.వి. రమణ, రావూజీ.

మూడో నంది నాటకోత్సవం – 2000

(2001 మే 28నుండి జూన్ 4 హైదరాబాద్)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన – మహాకవి కాళిదాసు, సంస్కార భారతి, హైదరాబాద్
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన – తిరుపతమ్మ కథ, శ్రీ విజయలక్ష్మి శ్రీనివాస నాట్య మండలి, తెనాలి.
ఉత్తమ దర్శకుడు – వేమూరి రాధాకృష్ణమూర్తి (మహాకవి కాళిదాసు)
ఉత్తమ నటుడు – భాగి శివశంకర శాస్త్రి (మహాకవి కాళిదాసు)
ఉత్తమ నటి – రమణ కుమారి (తిరుపతమ్మ కథ)
ఉత్తమ ప్రతినాయకుడు – తడకమళ్ళ రామచంద్రరావు (ఉషాపరిణయం)
ఉత్తమ క్యారక్టర్ నటుడు/నటి – బి.వి.ఎ. నాయుడు (శశిరేఖాపరిణయం)
ఉత్తమ హాస్యనటుడు – వి. బాబూరావు (శ్రీకృష్ణ నారదీయం)

ఉత్తమ నాటక రచయిత - పల్లేటి లక్ష్మీకులశేఖర్ (శ్రీరామ పాదుకలు)
ఉత్తమ బాలనటుడు/నటి - బి. పి. యోగిబాబు (శ్రీకృష్ణ నారదీయం)
ఉత్తమ సంగీతం - ఆళ్ళగడ్డ శ్రీనివాసరావు (శ్రీరామ పాదుకలు)
ఉత్తమ ఆహార్యం - ఎం. రామలింగమూర్తి (శ్రీకృష్ణాభిమన్యు)
ఉత్తమ రంగాలంకరణ - సురభి లీలా పాపారావు అండ్ సన్స్ (ఉషా పరిణయం)
జ్యూరీ బహుమతి - సిహెచ్. నాంచారయ్య (శ్రీకృష్ణ నారదీయం)

ప్రాథమిక స్థాయి న్యాయ నిర్ణేతలు : కొట్టె వెంకటాచార్యులు, బి. నాగిరెడ్డి, మున్నంగి భాస్కర్

తుది పోటీల న్యాయ నిర్ణేతలు : వేమూరి రామయ్య, వేదవ్యాస్‌రంగ భట్టార్, వై. రాఘవులు

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన - ప్రతిస్పందన, వంశీ నిరంజన్, కళాకేంద్రం, హైదరాబాద్.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - ప్రేమసామ్రాజ్యం, కళాదర్శిని, విజయవాడ.
ఉత్తమ దర్శకుడు - బి. పి. ప్రసాదరావు (ప్రతిస్పందన)
ఉత్తమ నటుడు - బి. పి. ప్రసాదరావు (ప్రతిస్పందన)
ఉత్తమ నటి - బి. విజయరాణి, (నాన్నా బొమ్మ కావాలి)
ఉత్తమ క్యారక్టర్ నటి - ఎ. కళ్యాణి (ప్రతిస్పందన)
ఉత్తమ హాస్యనటుడు - కె.వి. శాస్త్రి (ఎయిర్ ఇండియా)
ఉత్తమ ప్రతినాయకుడు - కొండవలస లక్ష్మణరావు, (కేళీ విలాసం)
ఉత్తమ బాలనటుడు/నటి - ఎవరూ లేరు.
ఉత్తమ సంగీతం - కె. జేసుదాసు (ప్రేమసామ్రాజ్యం)
ఉత్తమ రంగాలంకరణ - పి. శేషగిరి, వెంకట్, శ్యామ్ (నాన్నా బొమ్మ కావాలి)
ఉత్తమ ఆహార్యం - సురభి గణేష్ (క్రాస్‌రోడ్స్)
ఉత్తమ రచయిత - ఎం.పి. మూర్తి (ప్రతిస్పందన)
జ్యూరీ బహుమతి - పిళ్ళా ప్రసాద్ (ప్రేమసామ్రాజ్యం)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : ఎస్.కె. ఆంజనేయులు, గండవరం సుబ్బరామిరెడ్డి, సత్యం యాబి

తుదిపోటీల న్యాయనిర్ణేతలు : ఎ. శివరామిరెడ్డి, దేవదాస్ కనకాల, బి. భానుప్రకాశ్

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - మేలుకొలుపు, ఎల్.వి. ఆర్. క్రియేషన్స్, గుంటూరు.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - వఱడు, సాగరి, చిలకలూరిపేట
ఉత్తమ దర్శకుడు - నాయుడు గోపి, (ఎడారి కోయిల)
ఉత్తమ నటుడు - కె.పి.వి. ప్రసాదరావు (ఆకలికాలం)
ఉత్తమ నటి - వై. జగదీశ్వరి (దోషైచవప్పా)
ఉత్తమ క్యారక్టర్ నటుడు/నటి - పి.వి. రామ్‌కుమార్ (ఇప్పుడు)
ఉత్తమ ప్రతినాయకుడు - ఎం. ప్రసాదమూర్తి (అలరాస పుట్టిళ్ళు)
ఉత్తమ హాస్యనటుడు లేక నటి - సాంబశివ (కాకి సందేశం)

ఉత్తమ బాలనటుడు/నటి - చి. కె. సాయితేజ (మేలుకొలుపు)
ఉత్తమ నాటిక రచయిత - సి. ఎస్. రావు (మళ్ళీ ఎప్పుడొస్తారు)
ఉత్తమ సంగీతం - అంబటి విజయరాఘవన్, ఈశ్వరరావు (కరప్షన్)
ఉత్తమ ఆహార్యం - కె. భరణి (అలరాస పుట్టిళ్ళు)
ఉత్తమ రంగాలంకరణ - ఎల్.వి. భూషణ్ అండ్ పార్టీ (మళ్ళీ ఎప్పుడొస్తారు)
జ్యూరీ బహుమతి - ఎ. సంజీవి (నిజాయితీ)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : ఎన్. తారక రామారావు, జి.ఎస్.ఆర్.కె. శాస్త్రి, జీడిగుంట రామచంద్రమూర్తి,
తుది పోటీల న్యాయ నిర్ణేతలు : కప్పగంతుల మల్లికార్జునరావు, కర్నాటి లక్ష్మీనరసయ్య, బొమ్మిడి నారాయణరావు

నాలుగవ నంది నాటకోత్సవం - 2001

(2002 మే 28 నుండి జూన్ 3 హైదరాబాద్)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన - అశ్వత్థామ, శ్రీమీరా కళాజ్యోత్స్న, విశాఖపట్నం.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - శ్రీనాథుడు, విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్.
ఉత్తమ దర్శకుడు - దుగ్గిరాల సోమేశ్వరరావు (శ్రీనాథుడు)
ఉత్తమ నటుడు - గుమ్మడి గోపాలకృష్ణ (శ్రీనాథుడు)
ఉత్తమ నటి - సరస్వతుల రత్న శాస్త్రి.
ఉత్తమ ప్రతినాయకుడు - ఎస్. యేసుదాసు (భక్తయోబు)
ఉత్తమ క్యారక్టర్ నటుడు/నటి - వి.బి.కె. శర్మ (భక్తయోబు)
ఉత్తమ బాలనటుడు/నటి - చి. పి. సాయితేజ (కుమార సంభవం)
ఉత్తమ రచయిత - మీగడ రామలింగస్వామి
ఉత్తమ సంగీతం - శ్రీమద్విరాట్‌పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి
ఉత్తమ ఆహార్యం - కె. వరహాలు అండ్ పార్టీ (అశ్వత్థామ)
ఉత్తమ రంగాలంకరణ - బాలనాగమ్మ
జ్యూరీ బహుమతి - శ్రీమద్విరాట్‌పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి (నాటకం)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, రాజా శివానంద, సి.హెచ్. నాంచారయ్య
తుది పోటీల న్యాయనిర్ణేతలు : అట్లూరి పుండరీకాక్షయ్య, జి.ఎస్. ఎన్. శాస్త్రి, బిట్టు వెంకటేశ్వర్లు.

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన - అమరజీవి, కళావాణి, ఉభయ గోదావరులు.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - గాంధీజయంతి, రమణీయరంగం - హైదరాబాద్.
ఉత్తమ దర్శకుడు - ఎం. ప్రసాదమూర్తి (అమరజీవి)
ఉత్తమ నటుడు - జె.వి. రమణమూర్తి (గాంధీ జయంతి)
ఉత్తమ నటి - నిర్మల (గాంధీ జయంతి)
ఉత్తమ ప్రతినాయకుడు - గంగోత్రి సాయి (సారీ బ్రదర్ ఇది నీ కథే)
ఉత్తమ క్యారక్టర్ నటుడు - కాకరాల (గాంధీ జయంతి)

ఉత్తమ హాస్యనటుడు - రఘుబాబు (గాంధీ జయంతి)
ఉత్తమ రచయిత - వాడ్రేవు సుందరరావు (అమరజీవి)
ఉత్తమ బాలనటుడు/ నటి - నుసుమ అభినందన (ఉత్తమ పంచాయతీ)
ఉత్తమ సంగీతం - కె. నాగేశ్వరరావు (అమరజీవి)
ఉత్తమ రంగాలంకరణ - బాబూరావు (అమరజీవి)
ఉత్తమ ఆహార్యం - భరణి (అమరజీవి)
జ్యూరీ బహుమతి - బి. సుధాకర్ (అమృతం తాగిన రాక్షసులు)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : ఎన్. రవీంద్రారెడ్డి, డి.వి. రమణమూర్తి, డీన్ బద్రు
తుదిపోటీల న్యాయనిర్ణేతలు : కందిమళ్ళ సాంబశివరావు, చాట్ల శ్రీరాములు, డి.ఎస్.ఎన్. మూర్తి

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - బహురూపి, శ్రీ సద్గురు కళానియం, గుంటూరు.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - పోనీ పోనీ పోతే పోనీయ్ , అభ్యుదయ కళాసమితి, ఒంగోలు.
ఉత్తమ నటుడు - బసవరాజు జయశంకర్ (బహురూపి)
ఉత్తమ నటి - వాణిబాల (నిశ్శబ్ద విప్లవం)
ఉత్తమ దర్శకుడు - కె. హనుమంతరావు (కాశ్మీర్ టు కన్యాకుమారి)
ఉత్తమ ప్రతినాయకుడు - బి. పి. ప్రసాదరావు (గుప్పెడు వెన్నెల)
ఉత్తమ క్యారక్టర్ నటుడు/ నటి - కె.బి. నాగేశ్వరరావు (కృష్ణపక్షం)
ఉత్తమ రచయిత - గోళ్ళపాటి నాగేశ్వరరావు (పుట్టలో వేలెడితే కుట్టనా)
ఉత్తమ హాస్యనటుడు లేక నటి - ప్రభ ('టివి'లాసం)
ఉత్తమ బాలనటుడు/ నటి - బేబి గోళ్ళపాటి సత్యహారిక (పుట్టలో వేలెడితే కుట్టనా)
ఉత్తమ సంగీతం - సి. మధుసూదనాచారి (కాశ్మీర్ టు కన్యాకుమారి)
ఉత్తమ ఆహార్యం - టి. మురళి, పి. రాము (బహురూపి)
ఉత్తమ రంగాలంకరణ - కృష్ణ (కృష్ణపక్షం)
జ్యూరీ బహుమతి - ఎ. శ్రీనివాసరావు (పోనీ పోనీ పోతే పోనీయ్)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : కబీర్‌దాస్, వై.ఎస్.ఎన్. పాత్రో, వై.కె. నాగేశ్వరరావు,
తుది పోటీల న్యాయ నిర్ణేతలు : ఆదివిష్ణు, జి.ఎస్. ప్రసాదరెడ్డి, పి.వి. రమణ,

ఐయిదో నంది నాటకోత్సవం – 2002

(2003 మే 28 నుండి జూన్ 6, హైదరాబాద్)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన - శ్రీకృష్ణాంజనేయ యుద్ధం,
- కళా తరంగిణి, విశాఖపట్నం.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - గుణనిధి, శ్రీ మీరా కళాజ్యోత్స్న, విశాఖపట్నం.
ఉత్తమ దర్శకుడు - మీగడ రామలింగస్వామి (గుణనిధి)
ఉత్తమ నటుడు - మీగడ రామలింగస్వామి (గుణనిధి)

ఉత్తమ నటి - కె. విజయలక్ష్మి (శ్రీకృష్ణాంజనేయ యుద్ధం)
ఉత్తమ ప్రతినాయకుడు - ఎం. సాళ్వాచారి (దావీదు విజయం)
ఉత్తమ క్యారక్టర్ నటుడు/నటి - సమ్మెట గాంధి (అల్లసాని పెద్దన)
ఉత్తమ బాలనటుడు/నటి - చి. చిలకా జ్యోత్స్న (చంద్రహాస)
ఉత్తమ రచన - మీగడ రామలింగస్వామి (గుణనిధి)
ఉత్తమ సంగీతం - ముదపాక వెంకటేశ్వరరావు (భక్తనంద)
ఉత్తమ ఆహార్యం - బి.ఎల్. పరమేష్ (దావీదు విజయం)
ఉత్తమ రంగాలంకరణ - మోహనరెడ్డి (పాండవోద్యోగం)
జ్యూరీ బహుమతి - కె. సుందరీశ్వరరావు (గణపతి మహాత్మ్యం)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : డి.ఎస్. దీక్షిత్, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి.
తుది పోటీల న్యాయనిర్ణేతలు : ఆచంట వేంకటరత్నం నాయుడు, ఎం. పురుషోత్తమాచార్యులు

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన - ఇదిగో దేవుడు చేసిన బొమ్మ, విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - జీవన్నాటకం, కళారాధన - హైదరాబాద్.
ఉత్తమ దర్శకుడు - ఎస్. మోహన్ (ఇదిగో దేవుడు చేసిన బొమ్మ)
ఉత్తమ నటుడు - మధు (ఇదిగో దేవుడు చేసిన బొమ్మ)
ఉత్తమ నటి - ఎం. రత్నకుమారి (ఏడుగుడిసెల పల్లె)
ఉత్తమ ప్రతినాయకుడు - రజితమూర్తి (ఏడుగుడిసెల పల్లె)
ఉత్తమ క్యారక్టర్ నటుడు - వై. జితేంద్ర (జీవన్నాటకం)
ఉత్తమ హాస్యనటుడు - చలపతి (అమ్మాయి పెళ్ళయింది)
ఉత్తమ బాలనటుడు/నటి - చి. సయ్యద్ షరీఫ్ (నిశ్శబ్ద గాయం)
ఉత్తమ రచయిత - డి. విజయభాస్కర్ (జీవన్నాటకం)
ఉత్తమ సంగీతం - పి. మధుసూదనాచారి (అమ్మాయి పెళ్ళయ్యింది)
ఉత్తమ రంగాలంకరణ - సురభి వి. నాగేంద్రబాబు (ఇదిగో దేవుడు చేసిన బొమ్మ)
ఉత్తమ ఆహార్యం - అంజిబాబు (జీవన్నాటకం)
జ్యూరీ బహుమతి - ఎ. కళ్యాణి (కొనగోటమీటిన చాలు)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : సి.ఎస్. విజయకుమార్
తుదిపోటీల న్యాయనిర్ణేతలు : పత్తివాడ సూర్యనారాయణ, బి. విజయప్రకాష్, భాస్కర్ శివాల్కర్

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - మూడోపాదం, ఎస్.ఎన్.ఎమ్. రిక్రియేషన్ క్లబ్, వరంగల్.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - సంపద, రసఝరి, పొన్నూరు.
ఉత్తమ దర్శకుడు - బి.ఎం. రెడ్డి (మూడోపాదం)
ఉత్తమ నటుడు - పి. ఆర్. శరణ్ (రిక్త సంబంధాలు)
ఉత్తమ నటి - కె. విజయలక్ష్మి (మూడోపాదం)
ఉత్తమ ప్రతినాయకుడు - మేకా రామకృష్ణ (బొమ్మ)

ఉత్తమ హాస్యనటుడు - జి. విజయకుమార్ (ఇచ్చుటలో ఉన్నహాయి)
ఉత్తమ క్యారక్టర్ నటుడు/నటి - జి. భరద్వాజ (ఎలకల బోను)
ఉత్తమ రచయిత - ఎస్. కృష్ణేశ్వరరావు (సంపద)
ద్వితీయ ఉత్తమ రచయిత - మేకా రామకృష్ణ (బొమ్మ)
తృతీయ ఉత్తమ రచయిత - ఆకెళ్ల (మూడోపాదం)
ఉత్తమ బాల నటి - బేబి గోళ్ళపాటి సత్యహారిక (సేవ్ ది ట్రూత్)
ఉత్తమ సంగీతం - టి. సాంబశివరావు (సంపద)
ఉత్తమ ఆహార్యం - కె. భరణి (విజన్ 3 కె)
ఉత్తమ రంగాలంకరణ - పిఠాపురం బాబూరావు (*స్త్రీ గుణింతం*)
జ్యూరీ బహుమతి - టి. సీతాలత (సంపద)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : పి.ఎస్. విజయ్‌కుమార్
తుది పోటీల న్యాయ నిర్ణేతలు : టి. ఆర్ . అడబాల, వనం లక్ష్మీకాంతరావు, సి.ఎస్. రావు.

ఆరో నంది నాటకోత్సవం – 2003

(2004 జూన్ 19 నుంచి 26, హైదరాబాద్)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన - చిరుతొండనంబి, శ్రీ మీరాకళా జ్యోత్స్న, విశాఖపట్నం.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - రాణాప్రతాప్, యువకళావాహిని, హైదరాబాద్.
ఉత్తమ దర్శకుడు - మీగడ రామలింగస్వామి (చిరుతొండనంబి)
ఉత్తమ నటుడు - ఆర్. ఎస్. భార్గవాచారి (*ఆండాళ్ కళ్యాణం*)
ఉత్తమ నటి - సరస్వతుల రత్నశాస్త్రి, (*చిరు తొండ నంబి*)
ఉత్తమ బాలనటుడు - చి. షణ్ముకి
ఉత్తమ సంగీతం - టి. సూర్యనారాయణ శాస్త్రి (*రాణా ప్రతాప్*)
ఉత్తమ రచన - ఆకెళ్ళ (*రాణాప్రతాప్*)
ఉత్తమ ఆహార్యం - బి. ఎల్. పరమేష్ (*పాండవోద్యోగం*)
ఉత్తమ రంగాలంకరణ - ఎం. శ్రీనివాసరావు
ఉత్తమ ప్రతినాయకుడు - జి.వి.ఎస్. శాస్త్రి (*శ్రీరామ సుగ్రీవమైత్రి*)
ఉత్తమ సహాయ నటుడు - ఎం. జగన్‌కుమార్ (*కలియుగవైకుంఠం*)
ఉత్తమ సహాయ నటి - బి. లక్ష్మి (*అండాళ్ కళ్యాణం*)
జ్యూరీ బహుమతి - తిరుమలాంబ (*శ్రీరామ సుగ్రీవ మైత్రి*)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, యార్లగడ్డ సౌమిత్రి
తుది పోటీల న్యాయనిర్ణేతలు : అమరపు సత్యనారాయణ, డి.వి. పాండురంగారావు, నేతి పరమేశ్వరశర్మ

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - ఎక్కడ ఉన్నా ఏమైనా, కళాలయ, కొలకలూరు.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - టామీ, అమృత వర్షిణి కల్చరల్ అసోసియేషన్ - హైదరాబాద్.
ఉత్తమ దర్శకుడు - కరణం సురేష్ (*ఎక్కడ ఉన్నా ఏమైనా*)

ఉత్తమ నటుడు - ఎం.వి. రాజర్షి (వైతాళికుడు)
ఉత్తమ నటి - కె. విజయలక్ష్మి, (పిల్లికాదు మార్జాలం)
ఉత్తమ నాటక రచయిత - అశ్విని (ఆఖరి ఉత్తరం)
ద్వితీయ ఉత్తమ నాటక రచయిత - డి. విజయ భాస్కర్ (మినిష్టర్)
ఉత్తమ ప్రతినాయకుడు - ఆర్. పి. గంథం (టామీ)
ఉత్తమ సంగీతం - సైదారావు, పి. రాజు, (ఎక్కడ ఉన్నా ఏమైనా)
ఉత్తమ సహాయ నటుడు - సి.ఎన్. మూర్తి (ఆఖరి ఉత్తరం)
ఉత్తమ హాస్యనటుడు - ఎస్. కబీర్‌దాస్ (మినిష్టర్)
ఉత్తమ బాలనటుడు - చి. ఎల్. శ్రీవత్స (ఓ తండ్రి ప్రశ్న)
ఉత్తమ ఆహార్యం - భరణి (వైతాళికుడు)
ఉత్తమ రంగాలంకరణ - పచ్చల శేషగిరిరావు బృందం (ఎక్కడ ఉన్నా ఏమైనా)
ప్రత్యేక జ్యూరీ అవార్డు - వైతాళికుడు (నాటకం)
ప్రత్యేక జ్యూరీ అవార్డు - సుజాత (వైతాళికుడు)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : జీడిగుంట రామచంద్రమూర్తి, మొక్కపాటి కృష్ణమోహన్
తుదిపోటీల న్యాయనిర్ణేతలు : ఏడిద గోపాలరావు, నూతన్ ప్రసాద్, బి.వి. రమణమూర్తి

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - ఆశల'పల్లె'కి, స్వర్ణ భారతి కల్చరల్ క్లబ్, గుంటూరు.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - అల్బం , కళాప్రియ రాజమండ్రి
ఉత్తమ దర్శకుడు - గొంది రమేష్‌బాబు (ఆశల'పల్లె'కి)
ఉత్తమ నటుడు - నెమలికంటి వెంకట రమణ (ఆశల'పల్లె'కి)
ఉత్తమ నటి - విజయరాణి (మలిసంధ్య)
ఉత్తమ సంగీతం - పి. రాజు (ఆడపులి)
ఉత్తమ ఆహార్యం - కొత్తకోట భరణి (మరణమే నా చిరునామా)
ఉత్తమ హాస్యనటుడు - విశ్వమోహన్ (అయిందేదో అయింది)
ఉత్తమ సహాయ నటుడు - సి.ఎన్. మూర్తి (పెద్దలకు మాత్రమే)
ఉత్తమ సహాయ నటి - ఎం. రత్నకుమారి (నాటకాంతం హి జీవితం)
ఉత్తమ ప్రతినాయకుడు - ఎం. రవికుమార్
ఉత్తమ నాటిక రచయిత - నెమలికంటి వెంకట రమణ(ఆశల పల్లెకి)
ద్వితీయ ఉత్తమ నాటక రచయిత -
తృతీయ ఉత్తమ నాటక రచయిత - భారతుల రామకృష్ణ (అల్బం)
ఉత్తమ రంగాలంకరణ - కె. అగస్టీన్ రాజు (ఆశల పల్లెకి)
ఉత్తమ బాలనటుడు - కె. ఈశ్వరతేజ (ఆశల పల్లెకి)
ప్రత్యేక జ్యూరీ బహుమతి - భారతుల రామకృష్ణ

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : జి.ఎస్. ఆర్. కె. శాస్త్రి, తైలం లక్ష్మీనారాయణ
తుదిపోటీల న్యాయనిర్ణేతలు : ఎం. రమణమూర్తి, కోకా సంజీవరావు, బి. వేదయ్య

ఏడో నంది నాటకోత్సవం – 2004

(2005 జనవరి 16 నుండి 23, విజయవాడ)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన – శశిరేఖా పరిణయం, సురభి కళానాట్యమండలి, హైదరాబాద్.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన – భూయో భూయో నమామ్య హమ్, శ్రీ విజేత ఆర్ట్స్, రాజంపేట.
ఉత్తమ దర్శకుడు – డి.ఎస్. దీక్షిత్ (భూయో భూయో నమామ్య హమ్)
ఉత్తమ నాటక రచయిత – ఊటుకూరి సత్యనారాయణ (వీరాభిమన్యు)
ఉత్తమ నటుడు – మీగడ రామలింగస్వామి (నిగమ శర్మ)
ఉత్తమ సంగీత దర్శకుడు – నెల్లూరి శ్యామలరావు
ఉత్తమ సహాయ నటుడు – ఎస్. ఎ. జయరాం (శశిరేఖా పరిణయం)
ఉత్తమ హాస్యనటుడు – ఇ. ఎన్. ఆర్. మూర్తి (సుభద్రా విజయం)
ఉత్తమ బాలనటుడు – టి.ఎస్. డి. ఫణీంద్ర (నిగమశర్మ)
ఉత్తమ ప్రతినాయకుడు – గోపిశెట్టి వెంకటేశ్వర్లు (భక్తమాధవ దాసు)
ఉత్తమ రంగాలంకరణ – (భూయో భూయో నమామ్య హమ్)
ఉత్తమ రంగోద్దీపనం – ఎస్. పూర్ణచంద్రరావు (శశిరేఖా పరిణయం)
ఉత్తమ ఆహార్యం – టి. ఆర్. అడబాల, మల్లాది గోపాలకృష్ణ (భూయో భూయో నమామ్య హమ్)
ప్రత్యేక జ్యూరీ అవార్డు – అశ్వత్థామ (నాటకం)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : అక్కిరాజు సుందరరామకృష్ణ, అయ్యదేవర పురుషోత్తమరావు, తుర్లపాటి రాధాకృష్ణమూర్తి

తుది పోటీల న్యాయనిర్ణేతలు : ఎం. అల్లా బక్ష్, పొన్నాల రామసుబ్బారెడ్డి, వేదవ్యాసరంగ బట్టార్,

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన – ఎలా బతకాలి , బహురూప నాటక సమాఖ్య, విశాఖపట్నం.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన – ఓం, మంజు ఆర్ట్ థియేటర్, వరంగల్
ఉత్తమ దర్శకుడు – ఎస్. కె. మిశ్రో (ఎలా బ్రతకాలి)
ఉత్తమ నాటక రచయిత – ఎ.వి. మల్లేశ్వరరావు (ధర్మ సూత్రం)
ద్వితీయ ఉత్తమ నాటక రచయిత – ఆకెళ్ళ (ఓం)
ఉత్తమ నటుడు – ఐ.కె. త్రినాధ్‌రావు (ఎలాబ్రతకాలి)
ఉత్తమ నటి – సి. హెచ్. పద్మప్రియ (వలయం)
ఉత్తమ సంగీతం – రాజు బృందం (వలయం)
ఉత్తమ సహాయ నటుడు – పి. ఆర్. కె. పంతులు (ఎలా బతకాలి)
ఉత్తమ హాస్యనటుడు – శ్రీనివాసరావు (ధగధగ రాజ్యం)
ఉత్తమ బాలనటుడు – చి. సాయితేజ (మృత్యువుతో ముఖాముఖి)
ఉత్తమ ప్రతినాయకుడు – పి. రాజబాబు (ధర్మసూత్రం)
ఉత్తమ రంగాలంకరణ – పి. శేషగిరిరావు (వలయం)
ఉత్తమ రంగోద్దీపనం – మురళి (ఎలా బ్రతకాలి)

ఉత్తమ ఆహార్యం - సారథి (*భగ భగ రాజ్యం*)
ప్రత్యేక జ్యూరీ అవార్డు - పల్లేటి లక్ష్మీకులశేఖర్ (మృత్యువుతో ముఖాముఖి), చిట్టాశంకర్ (*ఓం*)

ప్రాథమికస్థాయి న్యాయనిర్ణేతలు : ఎ. శివరామిరెడ్డి, కె.జి. రాంప్రసాద్, డి.వి. రమణమూర్తి

తుదిపోటీ న్యాయనిర్ణేతలు : కందిమళ్ళ సాంబశివరావు, తాళ్ళూరి శివరామకృష్ణారావు, దుగ్గిరాల సోమేశ్వరరావు

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - *ఆంబోతు*, గంగోత్రి, పెద కాకాని.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - *మానవత్వానికి మరోకోణం*,
భాగ్యశ్రీ ఫైనార్ట్స్ కల్చరల్ అసోసియేషన్, విశాఖపట్నం.
ఉత్తమ దర్శకుడు - నాయుడు గోపి (*ఆంబోతు*)
ఉత్తమ రచయిత - కాశీవిశ్వనాథ్, (*మానవత్వానికి మరోకోణం*)
ద్వితీయ ఉత్తమ రచయిత - కె. శివరామ్ (*గ్రహణం*)
తృతీయ ఉత్తమ రచయిత - ఆర్. సత్యనారాయణ (*సముద్రమన్నాక కెరటాలుండాలి*)
ఉత్తమ నటుడు - ఎన్. పట్టాభి రామారావు (*మానవత్వానికి మరోకోణం*)
ఉత్తమ నటి - ఎం. రత్నకుమారి (*ఐదోగది*)
ఉత్తమ సంగీతం - కె. నాగేశ్వరరావు (*మిథునం*)
ఉత్తమ సహాయ నటుడు - పిళ్ళా నటరాజ్ (*దేవుడి రూపం*)
ఉత్తమ హాస్యనటి - జె. విజయరాణి, (*పానకంలో పుడక*)
ఉత్తమ బాలనటుడు - చి. ఈశ్వరతేజ (*గ్రహణం*)
ఉత్తమ ప్రతినాయకుడు - గంగోత్రి సాయి (*ఆంబోతు*)
ఉత్తమ రంగాలంకరణ - ఎ. శ్రీనివాస్, జి. ప్రసాద్ (*బీజమంత్రం*)
ఉత్తమ రంగోద్దీపనం - వై. భాస్కరరావు (*ఐదోగది*)
ఉత్తమ ఆహార్యం - ఎస్. సోమప్ప (*రాక్షసుడు*)
ప్రత్యేక జ్యూరీ అవార్డు - *గ్రహణం* (*నాటిక*)) ఆర్. బదరీనారాయణ (*రాక్షసుడు*)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : పి. పాండురంగారావు, బి. విజయప్రకాష్, వనం లక్ష్మీకాంతరావు

తుదిపోటీల న్యాయనిర్ణేతలు : ఊట్ల బుడ్డయ్య చౌదరి, నాంపల్లి మధుబాబు, సామంతపూడి నరసరాజు

ఎనిమిదో నంది నాటకోత్సవం – 2005

(2006 జనవరి 16 నుండి 23, తిరుపతి)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన - *పల్నాటి భారతం*, గంగోత్రి, పెదకాకాని.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - *వాసవీ కన్యక*, సవేరా ఆర్ట్స్, కడప.
ఉత్తమ దర్శకుడు - నాయుడుగోపి (*పల్నాటి భారతం*)
ఉత్తమ నాటక రచయిత - ఆకెళ్ళ (*రాణి రుద్రమ*)
ఉత్తమ నటి - ఎం. లక్ష్మీతులసి (*పల్నాటి భారతం*)
ఉత్తమ సంగీత దర్శకుడు - వై. కృష్ణమూర్తి, ఎస్. నవ కాంత్ (*వాసవీ కన్యక*)
ఉత్తమ సహాయ నటుడు - బి. ఎ. నాయుడు (*వర విక్రయం*)

ఉత్తమ హాస్యనటుడు - ధవళ సన్యాసిరావు (వర విక్రయం)
ఉత్తమ బాలనటుడు - చి. జె. శివప్రసాద్ (వాసవీకన్యక)
ఉత్తమ ప్రతినాయకుడు - టి.వి. జయప్రకాష్‌రెడ్డి (రాణి రుద్రమ)
ఉత్తమ రంగాలంకరణ - **హరిబాబు (వాసవీ కన్యక)**
ఉత్తమ రంగోద్దీపనం - పి. భాస్కరశర్మ (ఉషాపరిణయం)
ఉత్తమ ఆహార్యం - ఎం. మదన్, పార్థ సారథి, (పల్నాటి భారతం)
ప్రత్యేక జ్యూరీ అవార్డు - శ్రీ సీతా కళ్యాణం

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : జి.ఎస్.ఎన్. శాస్త్రి, పురుషోత్తమాచార్యులు, బి.సి. కృష్ణ
తుది పోటీల న్యాయనిర్ణేతలు : కె. ఎస్. వీరరాఘవులు, గేదెల రామారావు, బుఱ్ఱా సుబ్రహ్మణ్య శాస్త్రి

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన - పరమాత్మా వ్యవస్థితః, వి.టి.పి. ఎస్. కల్చరల్ అసోసియేషన్, ఇబ్రహీం పట్నం.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - నిశ్శబ్దం, వంశీ నిరంజన్ కళాకేంద్రం, హైదరాబాద్.
ఉత్తమ దర్శకుడు - రాజ్‌కుమార్ (నరావతారం)
ఉత్తమ నాటక రచయిత - కాశీవిశ్వనాథ్ (ట్రెండ్‌మారింది)
ద్వితీయ ఉత్తమ నాటక రచయిత - నందగిరి నరసింహారావు (పరమాత్మా వ్యవస్థితః)
ఉత్తమ నటుడు - నందగిరి నరసింహారావు (పరమాత్మా వ్యవస్థితః)
ఉత్తమ నటి - ఎస్. జయశ్రీ (మేధావులకో నాటకం)
ఉత్తమ సంగీతం - టి. సాంబశివరావు, కె. చందు (మూడో పురుషార్థం)
ఉత్తమ సహాయ నటుడు - భవానీ ప్రసాద్ (నిశ్శబ్దం)
ఉత్తమ హాస్యనటుడు - గంగోత్రి సాయి (రైలాగని స్టేషను)
ఉత్తమ బాలనటుడు - కె. శివనాగఫణి (నరావతారం)
ఉత్తమ ప్రతినాయకుడు - వై. హర్షవర్ధన్ (అజమాయిషీ)
ఉత్తమ రంగాలంకరణ - శేషగిరిరావు (రైలాగని స్టేషను)
ఉత్తమ రంగోద్దీపనం - (నరావతారం)
ఉత్తమ ఆహార్యం - అడివి శంకరరావు (పరమాత్మా వ్యవస్థితః)
ప్రత్యేక జ్యూరీ అవార్డు - నరావతారం (నాటకం)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : కె.ఎస్.టి. సాయి, డీన్ బద్రు, తైలం లక్ష్మీనారాయణ,
తుదిపోటీ న్యాయనిర్ణేతలు : కారుమూరి సీతారామయ్య, జీడిగుంట రామచంద్రమూర్తి, సి.ఎస్. రావు

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - 'న' కు దీర్ఘమిస్తే, వంశీ నిరంజన్ కళాకేంద్రం, హైదరాబాద్.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - మృగం, కళాభారతి, తిరుమాలి, కాకినాడ.
ఉత్తమ దర్శకుడు - వి. రాంబాబు (మృగం)
ఉత్తమ రచయిత - ఎస్.కె. హుస్సేన్ (పుట్టింది ఎందుకో)
ద్వితీయ ఉత్తమ నాటికా రచయిత - వల్లూరి శివప్రసాద్ (మిస్స్‌డ్‌కాల్)

ఉత్తమ నటుడు - బి.పి. ప్రసాదరావు ('న'కు దీర్ఘ మిస్తే)
ఉత్తమ నటి - కేశిరెడ్డి రాజేశ్వరి (మృగం)
ఉత్తమ సంగీతం - థామస్ (మృగం)
ఉత్తమ సహాయ నటుడు - ఎం.వి. రమణ (మృగం)
ఉత్తమ హాస్యనటుడు - టి.వి. జయప్రకాష్‌రెడ్డి (వేట)
ఉత్తమ బాలనటుడు - చి. మునీర్ (నోట్ దిస్ పాయింట్)
ఉత్తమ ప్రతినాయకుడు - బండికట్ల వరప్రసాద్ (అభయారణ్యం)
ఉత్తమ రంగాలంకరణ - పి. శేషగిరి (అభయారణ్యం)
ఉత్తమ రంగోద్దీపనం - కె. జి. రాంప్రసాద్, సురభి శంకర్ (వేట)
ఉత్తమ ఆహార్యం - సిహెచ్. గణపతి (అని తెలుస్తుంది)
ప్రత్యేక జ్యూరీ అవార్డు - పుట్టింది ఎందుకో (నాటిక)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : ఎల్. జయప్రకాష్, కోన హేమచంద్, గండవరం సుబ్బరామిరెడ్డి

తుదిపోటీల న్యాయనిర్ణేతలు : పి. బాలకోటయ్య, బి. భానుప్రకాష్, రాఘవాచారి

తొమ్మిదో నంది నాటకోత్సవం – 2006

(2007 జనవరి 18 నుండి 24, నిజామాబాద్)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన - సతీ అహల్య, సవేరా ఆర్ట్స్, కడప.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - శ్రీవేమన యోగి , శ్రీపూర్ణశ్రీ నాట్యకళాసమితి, తెనాలి.
ఉత్తమ దర్శకుడు - డి.ఎస్. దీక్షిత్ (అన్నసూక్తమ్)
ఉత్తమ రచయిత - పల్లేటి లక్ష్మీకులశేఖర్ (సతీ అహల్య)
ఉత్తమ నటుడు - ఎ. వేంకటేశ్వరరావు (శ్రీ వేమనయోగి)
ఉత్తమ నటి - ఎస్. సులోచన (సతీ అహల్య)
ఉత్తమ సంగీతం - సి.హెచ్. చంద్రశేఖర్ (శ్రీ వేమన యోగి)
ఉత్తమ సహాయ నటుడు - చీకటి రామారావు (కుంతీకర్ణ)
ఉత్తమ బాలనటి - బేబి హైందవి (భక్తరామదాసు)
ఉత్తమ ప్రతినాయకుడు - ముళ్లపూడి రామచంద్రరావు(కుంతీ కర్ణ)
ఉత్తమ రంగాలంకరణ - ఎస్. హరిబాబు (సతీ అహల్య)
ఉత్తమ రంగోద్దీపనం - సురభి పూర్ణచంద్రశేఖర్ (అన్న సూక్తమ్)
ఉత్తమ ఆహార్యం - సి.హెచ్. హిమకుమార్ (భక్త రామదాసు)
ప్రత్యేక జ్యూరీ బహుమతి - ఎం. వేంకట సుబ్బయ్య (భూకైలాస్), సుమాంజలి (శ్రీకృష్ణతులాభారం).

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : ఉప్పలపాటి సైదులు, శివనాగిరెడ్డి

తుది పోటీల న్యాయనిర్ణేతలు : అమరపు సత్యనారాయణ, జమ్మలమడక కృష్ణమూర్తి, తిరుపతి హరగోపాల్

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన - శాపగ్రస్తులు, ఫరెవర్ ఆర్ట్ థియేటర్స్, సూర్యాపేట.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - రాచపుండు, ప్రగతి నగర్ కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్.

ఉత్తమ దర్శకుడు - ఎస్.కె. ఖాజాపాషా (శాపగ్రస్తులు)
ఉత్తమ రచయిత - ఎస్.కె. ఖాజాపాషా (శాపగ్రస్తులు)
ఉత్తమ నటుడు - మల్లాది శివన్నారాయణ (రాచపుండు)
ఉత్తమ నటి - టి. శ్రీలక్ష్మి (రాచపుండు)
ఉత్తమ సంగీతం - ఎం. సైదారావు (పుణ్యభూమి నాదేశం)
ఉత్తమ సహాయ నటుడు - ఎం. ఎస్. కె. ప్రభు (శతమానం భవతి)
ఉత్తమ హాస్యనటుడు - మండేపూడి పూర్ణ (రాచపుండు)
ఉత్తమ బాలనటుడు - ఎ. శ్రీకాంత్ (చందమామరావె)
ఉత్తమ ప్రతినాయకుడు - టి. మల్లేష్ బలాష్ట్ (శాపగ్రస్తులు)
ఉత్తమ రంగాలంకరణ - ఎం.వి. రమణ, బాబూరావు (పుణ్యభూమి నాదేశం)
ఉత్తమ రంగోద్దీపనం - మహేష్, ఎన్. వెంకట్రావు (పుణ్యభూమి నాదేశం)
ఉత్తమ ఆహార్యం - ఎ.వి. నాగేశ్వరరావు (శాపగ్రస్తులు)
ప్రత్యేక జ్యూరీ బహుమతి - ఎ.కె. శ్రీదేవి (శిఖరాల వెనక)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : సాయన్న, సుఖమంచి కోటేశ్వరరావు, రాయపాటి ఆశీర్వాదం
తుదిపోటీ న్యాయనిర్ణేతలు : డి.ఎస్.ఎన్. మూర్తి, పరుచూరి గోపాలకృష్ణ, బి. ఎమ్. రెడ్డి

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన - సత్యాగ్రహి, రంగయాత్ర, గుంటూరు.
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - తల్లీ క్షమించు, క్రియేటర్స్, పాలకొల్లు
ఉత్తమ దర్శకుడు - పి. ఎన్. విజయకుమార్ (పరివర్తన)
ఉత్తమ రచయిత - వీరపోతన (తల్లీ క్షమించు)
ద్వితీయ ఉత్తమ నాటిక రచయిత - కె.కె.ఎల్. స్వామి (కాటు)
ఉత్తమ నటుడు - బి.మోహనరావు (కాటు)
ఉత్తమ నటి - ఎం. రత్నకుమారి (జో అచ్యుతానంద)
ఉత్తమ సంగీతం - ఎం. సైదారావు (జో అచ్యుతానంద)
ఉత్తమ సహాయ నటుడు - వరికూటి శివప్రసాద్ (సత్యాగ్రహి)
ఉత్తమ హాస్యనటుడు - వి. సంగమేశ్వరరావు (పునఃజన్మ)
ఉత్తమ బాలనటుడు - పొన్నపల్లి రుషీంద్ర (తల్లీ క్షమించు)
ఉత్తమ ప్రతినాయకుడు - జె. రవీంద్రబాబు (సత్యాగ్రహి)
ఉత్తమ రంగాలంకరణ - సురభి పూర్ణ చంద్రశేఖర్ (రాళ్ళకి నోళ్ళొస్తే)
ఉత్తమ రంగోద్దీపనం - ఎస్. నాగేంద్రప్రసాద్, సి.హెచ్. దామోదర్ (పరివర్తన)
ఉత్తమ ఆహార్యం - భరణి (తల్లీ క్షమించు)
ప్రత్యేక జ్యూరీ బహుమతి - కాటు

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : నూతలపాటి సాంబయ్య, రాజేంద్రప్రసాద్, శనగల కబీర్‌దాస్
తుదిపోటీ న్యాయనిర్ణేతలు : కళాధర్, జంగం ధర్మారావు, యు. సుబ్బరాయశర్మ

పదో నంది నాటకోత్సవం – 2007

(2008 జనవరి 18 నుండి 24, రాజమండ్రి)

పద్యనాటకాలు

ఉత్తమ ప్రదర్శన - భక్తపోతన, కల్చరల్ అసోసియేషన్, కాకినాడ
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - భీష్మ, పల్లవి ఆర్ట్స్
ఉత్తమ దర్శకుడు - కె. కనకరాజు (భక్తపోతన)
ఉత్తమ రచయిత - పల్లేటి లక్ష్మీకులశేఖర్ (భీష్మ)
ఉత్తమ నటుడు - కె. కనకరాజు (భక్తపోతన)
ఉత్తమ నటి - కె. ఇందిరాదేవి(ద్రౌపది / పాంచాలి)
ఉత్తమ సంగీతం - యడవల్లి కృష్ణమూర్తి (భీష్మ)
ఉత్తమ సహాయ నటుడు - సి. వేంకటేశ్వర్లు (భీష్మ)
ఉత్తమ హాస్యనటుడు - ఎస్. వేంకటేశ్వరరావు (ఖడ్గ తిక్కన)
ఉత్తమ బాలనటుడు - పి.వి.ఎన్. ప్రేమ్ సాయి (పరశురామ ప్రతిజ్ఞ)
ఉత్తమ ప్రతినాయకుడు - యస్. మహమ్మద్ మియా (శ్రీకృష్ణాభిమన్యు)
ఉత్తమ రంగాలంకరణ - పిఠాపురం బాబూరావు, అప్పారావు, (శ్రీకాంత కృష్ణమాచార్య)
ఉత్తమ రంగోద్దీపనం - వై. వేంకటేశ్వర్లు, ఎం. వేంకటేశ్వర్లు
ఉత్తమ ఆహార్యం - శ్రీనివాసులు (కృష్ణాభిమన్యు)
ప్రత్యేక జ్యూరీ బహుమతి - ఎన్. జానకీరామ్ (భీష్మ)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : పి. శేఖర్‌బాబు, బి.వి.ఎ. నాయుడు, సింహం లక్ష్మీనారాయణ

తుదిపోటీ న్యాయనిర్ణేతలు : ఆళ్ళూరి వెంకటయ్య, ఎ.వి. సుబ్బారావు, గుమ్మడి గోపాలకృష్ణ

సాంఘిక నాటకాలు

ఉత్తమ ప్రదర్శన - పునాది, వంశీ నిరంజన్ కళాక్షేత్రం, హైదరాబాద్
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన - మృత సంజీవని , ఆర్ట్స్ కో, ఎ.పి.ఎస్. ఆర్. టి. సి. హైద్రాబాద్.
ఉత్తమ దర్శకుడు - ఎం. ఎస్. చౌదరి (గిలి గిలి గిలి గిలి గుంతనక)
ఉత్తమ రచయిత - బి. పి. ప్రసాదరావు (పునాది)
ద్వితీయ ఉత్తమ రచయిత - ఆకురాతి భాస్కర్ చంద్ర (మృత సంజీవని)
ఉత్తమ నటుడు - బి. సుధాకర్ (మృత సంజీవని)
ఉత్తమ నటి - విజయరాణి (పునాది)
ఉత్తమ సంగీతం - రత్నాకర్ బృందం (గిలి గిలి గిలి గిలి గుంతనక)
ఉత్తమ సహాయ నటుడు - ఎం. జానకీనాథ్ (శాంతియాత్ర)
ఉత్తమ హాస్య నటుడు - ఎం. రవికుమార్ (గిలి గిలి గిలి గిలి గుంతనక)
ఉత్తమ బాలనటుడు - మాస్టర్ పూజిత్ (అమృతవర్షిణి)
ఉత్తమ ప్రతినాయకుడు - జొన్నా రామలింగేశ్వరరావు (బహుజనహితాయ)
ఉత్తమ రంగాలంకరణ - మధు మాదల (గిలి గిలి గిలి గిలి గుంతనక)

ఉత్తమ రంగోద్దీపనం – గణేష్, ప్రసాద్, విజయ్ (మృతసంజీవని)
ఉత్తమ ఆహార్యం – కె. భరణి (నిర్లక్ష్యం)
ప్రత్యేక జ్యూరీ బహుమతి – జయకళానికేతనం, విశాఖపట్నం (రక్షాబంధనం)

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : ఎస్.వి. సత్యనారాయణ, రాసాని వెంకటరామయ్య, వి. గంగాశివప్రసాద్

తుదిపోటీ న్యాయనిర్ణేతలు : ఎన్. జె. భిక్షు, కుమారశర్మ, పంతం సీతారామమూర్తి

సాంఘిక నాటికలు

ఉత్తమ ప్రదర్శన – ధ్వంసరచన, అరవింద ఆర్ట్స్, తాడేపల్లి
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన – రెండోభర్త, మయూరి ఆర్ట్స్ క్రియేషన్స్, వరంగల్
ఉత్తమ దర్శకుడు – గంగోత్రి సాయి (*ధ్వంసరచన*)
ఉత్తమ రచయిత – వల్లూరు శివప్రసాద్ (*ధ్వంసరచన*)
ద్వితీయ ఉత్తమ రచయిత – ఆకెళ్ళ (*కొత్త సైన్యం*)
తృతీయ ఉత్తమ రచయిత – వి.వి.ఎస్. ప్రకాశ్ (*ఔను నిజం, ఔను నిజం*)
ఉత్తమ నటుడు – పి. చలపతిరావు (*రేల*)
ఉత్తమ నటి – దాసరి రమాదేవి(*ధ్వంసరచన*)
ఉత్తమ సంగీతం – సైదారావ్ (*వందేమాతరం*)
ఉత్తమ సహాయ నటుడు – ఎస్. ఎం. భాషా (*శేషార్థం*)
ఉత్తమ హాస్య నటి – జి. సుగుణ (*రాలిపోని ఆకు*)
ఉత్తమ బాలనటుడు – మాస్టర్ ఆర్. సేతు మాధవ్ (*గబ్బిలం*)
ఉత్తమ ప్రతినాయకుడు – టి. మధుకుమార్ (*గబ్బిలం*)
ఉత్తమ రంగాలంకరణ – సి.హెచ్. రాజశేఖర్ అండ్ పార్టీ (*శేషార్థం*)
ఉత్తమ రంగోద్దీపనం – పిళ్ళా నటరాజ్ (*ధ్వంసరచన*)
ఉత్తమ ఆహార్యం – సిహెచ్. గణపతి, ఆర్. వీర్రాజు (*గబ్బిలం*)
ప్రత్యేక జ్యూరీ బహుమతి – *కొత్తసైన్యం*, జె.పి. థియేటర్స్, నల్లగొండ

ప్రాథమిక స్థాయి న్యాయనిర్ణేతలు : పిన్ని వేంకటేశ్వర్లు, మస్తాన్ సాహెబ్, సిద్ధార్థ

తుదిపోటీ న్యాయనిర్ణేతలు : ఎస్. ఎన్. చారి, వి. ఎన్. చారి, రాళ్ళపల్లి

సేకరణ : గద్దె శ్రీనివాసరావు

నాటక సాహిత్యంలో నోబెల్ బహుమతి గ్రహీతల పట్టిక

(1903 - 2006)

సంవత్సరం	రచయిత పేరు	దేశం	వివరణ
1903	బ్యోర్న్‌సన్, బి	నార్వే	నాటకరచయిత
1904	ఎచెగరాయ్‌యి ఐజాగ్వైరెహోసె	స్పెయిన్	నాటకరచయిత
1911	మాటర్‌లింక్, మోరిస్	బెల్జియం	నాటకరచయిత
1912	హాప్ట్‌మన్, గెర్హార్ట్	జర్మన్	నాటకరచయిత
1922	బెనావెంతీ, జాసింతో	స్పెయిన్	నాటకరచయిత
1923	ఈట్స్ విలియం బట్లర్,	ఐర్లండ్	కవి, నాటకరచయిత
1925	బెర్నార్డ్ షా, జార్జ్	ఐర్లండ్	నాటకరచయిత
1932	గాల్స్‌వర్దీ, జాన్	బ్రిటన్	నవలా నాటకరచయిత
1934	పిరాండిలో, ల్విగీ	ఇటలీ	నాటకరచయిత
1936	ఓనీల్, యూజీన్	అమెరికా	నాటకరచయిత
1952	మోరియాన్, ఫ్రాన్ స్వా	ఫ్రాన్స్	నాటకరచయిత
1957	కమూ, ఆల్బెర్ట్	ఫ్రాన్స్	నాటకరచయిత
1964	సార్త్ర్, జీన్ పాల్	ఫ్రాన్స్	తత్త్వవేత్త, నాటకరచయిత
1969	బెకెట్ శ్యామ్యూల్	ఐర్లండ్	నాటకరచయిత
1986	సోయింకా, వోలే	నైజీరియా	కవి, నాటక రచయిత, నవలా రచయిత
1989	సేల, కమిలోహోసె	స్పెయిన్	నవలా నాటక కథా రచయిత
1990	పాజ్, ఆక్టావియో	మెక్సికో	కవి, నాటక రచయిత
1992	వాల్‌కాట్, డెరెక్	వెస్ట్ ఇండీస్	కవి, నాటక రచయిత
2000	గోగింగ్ రియాంగ్	చైనా	నాటకకర్త
2006	హెరాల్డ్ పింటర్	బ్రిటన్	నాటకకర్త

****

ఉపయుక్త గ్రంథసూచి

(BIBLIOGRAPHY)

అనంత కృష్ణశర్మ, రాళ్ళపల్లి (1968), - *నాటకోపన్యాసములు*, త్రివేణీ పబ్లికేషన్స్, మచిలీపట్నం.

అప్పారావు, పోణంగి శ్రీరామ (1968), - *తెలుగు నాటక వికాసం*, నాట్యమాలా ప్రచురణలు, హైదరాబాద్.

———————— (1983) - *నాట్యశాస్త్రము*, నాట్యమాలా ప్రచురణలు, హైదరాబాద్.

———————— (1995) - *శారీరాభినయం*, ఆంధ్రప్రదేశ్ థియేటర్, హైదరాబాద్.

ఆనందన్, కొళ్ళాగుంట (1989) - *దాక్షిణాత్య నాటకాల్లో హాస్యగాడు*, లావణ్య శిల్ప పబ్లికేషన్స్, ఎల్. బి.నగర్, తిరుపతి.

———————— (1999) - *జానపదకళారూపాలు - సాహిత్యం*, లావణ్య శిల్ప పబ్లికేషన్స్, ఎల్. బి. నగర్, తిరుపతి.

ఈశ్వరరావు, సెట్టి (1992) - *కన్యాశుల్కం ఒక అపూర్వసృష్టి* , విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

కృతివాసతీర్థులు తల్లావఝ్ఝల (1965) - *భారతీయ సాహిత్యము* (అనువాదం), సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ.

గంగప్ప ఎస్. (1977), కోలాచలం శ్రీనివాసరావు - *నాటక సాహిత్య సమాలోచనము*, శశి ప్రచురణలు, కర్నూలు.

———————— (1986) - *తెలుగునాటకం (నాటక సాహిత్య వ్యాసాలు)* శశి ప్రచురణలు, కర్నూలు.

గోపాలరెడ్డి, ముదిగంటి , ముదిగంటి సుజాతా రెడ్డి (1986) - *సంస్కృత సాహిత్య చరిత్ర*, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

జోగారావు, ఎస్వీ - *యక్షగాన వాఙ్మయము* , ఆంధ్ర విశ్వ విద్యాలయం, విశాఖపట్నం.

తారక రామారావు, ఎన్. (1994) - *సాక్షి - తెలుగు నాటకరంగం* శ్రీ కళానికేతన్, హైదరాబాద్.

నరసింహశాస్త్రి, నోరి (1979) - *సారస్వత వ్యాసములు* (ఆరవ సంపుటము), ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

నరసింహారావు, స్థానం (1974) - *నటస్థానం* , స్థానం హనుమాయమ్మ, తెనాలి.

నాగభూషణశర్మ, మొదలి (1980) - *నూరేళ్ళ తెలుగు నాటక రంగం*, ఆం. ప్ర. సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

————————(1986), - *ఆధునిక తెలుగు నాటకరంగం - ఆచార్య ఆత్రేయ వ్యాస సంకలనం* , పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

నారాయణ, సి. ఎస్. (2000) - *నటనాశిల్పం*, జీవితభీమా ఉద్యోగుల లలిత కళాసమితి, మచిలీపట్నం.

పరమేశ్వర శర్మ, నేతి (1998) - *నూరేళ్ల తెనాలి రంగస్థలి* , సప్తసింధు ప్రచురణలు, తెనాలి.

పోతన్న, వి. (1994), *హరిజనాభ్యుదయం - తెలుగు నాటకం* , తేజో ప్రచురణలు, కర్నూలు.

పైడిపాల (1985) - *ఆత్రేయ నాటకాలు - పూర్వాపరాలు*, శ్రీమహాలక్ష్మి బుక్ ఎంటర్ప్రైజెస్, విజయవాడ.

ప్రభాకరరావు, తోటకూర (1989) - *తెలుగు పౌరాణిక నాటకాలు, హేతువాద దృక్పథం*, థింకర్స్ పబ్లికేషన్స్, చిలకలూరిపేట.

మల్లికార్జునరావు, కప్పగంతుల (1979) - *నాటక సమీక్ష*, క.గా.కా.కీ. ప్రచురణలు, రాజమండ్రి.

————————(1988) - *వ్యాసమాలిక* క.గా.కా.కీ. ప్రచురణలు, రాజమండ్రి

————————(2001) - *ప్రపంచ నాటక రంగ ధోరణులు చారిత్రక నేపథ్యం* క.గా.కా.కీ. ప్రచురణలు

మాధవరాయ శర్మ, జమ్మలమడక (1965) - *నాట్యవేదం* , అభినవ భారతి, గుంటూరు.

మారుతీరావు, గొల్లపూడి (1979) - *తెలుగు ఏకాంకికా వికాసం*, అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

రమణ, పి.వి. (1988) - *తెలుగు సాంఘిక నాటకం,* వెంకట రమణ బ్రదర్స్, హైదరాబాద్.

రమణారెడ్డి, కె.వి. (1969) - *మహోదయం,* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

రమాపతిరావు, అక్కిరాజు (1986) - *వీరేశలింగం రచనలు,* విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ.

రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని (1967) - *ఆంధ్ర నాటక రంగ చరిత్ర,* రేణుకా గ్రంథమాల, చెన్నై.

______(1980) - *నటరత్నాలు ,* రేణుకా గ్రంథమాల, చెన్నై.

______(1992) - *తెలుగువారి జానపదకళారూపాలు,* పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వ విద్యాలయం,హైదరాబాద్.

______(1999)- *ప్రజా పోరాటాల రంగస్థలం,* ఆంధ్ర ప్రజానాట్యమండలి రేణుకా ప్రచురణలు, విజయవాడ.

రామన్న పంతులు, విన్నకోట (1964) - *నాటక ప్రయోగం,* దేశికవితామండలి, విజయవాడ.

లక్ష్మీకాంతం, పింగళి (1975) - *ఆంధ్ర సాహిత్య చరిత్ర,* ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

లక్ష్మీనరసయ్య, కర్నాటి (2000) - *కర్నాటి వ్యాస విపంచిక,* కళాసాహితీ మిత్రులు, విజయవాడ.

లక్ష్మీనరసింహం, చిలకమర్తి (1968) - *చిలకమర్తి స్వీయచరిత్ర,* కాలచక్రం ప్రచురణలు.

విద్యానాథుడు (1972) - *ప్రతాపరుద్ర యశోభూషణం,* శ్రీనివాస పబ్లికేషన్స్, హైదరాబాద్.

వెంకటరామశాస్త్రి, పి. (1997) - *రసపుత్రవీరుల చారిత్రక నాటకాలు,* జాతీయ సాహిత్య పరిషత్, హైదరాబాద్.

______(1996) - *తెలుగులో చారిత్రక నాటకాలు,* జాతీయ సాహిత్య పరిషత్, హైదరాబాద్.

వెంకటస్వామినాయడు, పసుపులేటి (1992) - *రంగస్థల నటులు,* నవజ్యోతి గ్రంథమాల, గుంటూరు - 1.

వెంకటచలం, రావి (2000) - *77 ఏళ్ళ నాటకానుభవం,* అశోక్ పబ్లికేషన్స్, జమ్‌షెడ్‌పూర్.

వెంకటాచార్యులు, కొట్టే (1995) - *కాళ్ళకూరి నారాయణరావు రచనలు,* విజ్ఞానదీపిక ప్రచురణలు, హైదరాబాద్.

______(2001) - *సంప్రదాయ నాటకసౌరభాలు,* విజ్ఞానదీపిక ప్రచురణలు, నాగోలు, హైదరాబాద్.

వేంకటేశ్వరరావు, బోయిన (1998) - *ఆధునిక నాటకరంగం ఈ దశాబ్ది ప్రయోగాలు,* ఆంధ్ర సారస్వత సమితి,
బచ్చుపేట, మచిలీపట్నం 521 001

సత్యనారాయణ రావు, యండమూరి (1960) - *ఉషఃకిరణాలు,* ఉత్తమ సాహితి, విజయవాడ.

సాంబశివరావు, కందిమళ్ళ (1995) - *తెలుగు నాటకరంగం - నూతన ధోరణులు - ప్రయోగాలు,* కాకతీయ ప్రచురణ,
చిలకలూరిపేట.

సుధాదేవి, తెన్నేటి (1999)- *బలిజేపల్లి లక్ష్మీకాంతకవి నాటక కళా వైదుష్యం,* లక్ష్మీ కనకదుర్గ పబ్లికేషన్స్, హైదరాబాద్ - 4

సుబ్బరామిరెడ్డి, గండవరం (1989) - *ఆధునిక తెలుగు నాటకం,* ప్రవీణ్ పబ్లికేషన్స్, సికింద్రాబాద్.

______(1991) - *ఆధునిక తెలుగు నాటకం (రెండవభాగం),* ప్రవీణ్ పబ్లికేషన్స్, సికింద్రాబాద్.

______(1995) - *మూడు ప్రసిద్ధ నాటకాలు,* సాహిత్యవిమర్శ, నవోదయ పబ్లికేషన్స్, హైదరాబాద్.

సుబ్రహ్మణ్య, జి.వి. (1980) - *సమాలోచనం,* ఆం. ప్ర. సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

సూరిశాస్త్రి, పురాణం (1923) - *నాట్యాంబుజం ,* విద్యానిలయం, బందరు.

సోమయాజి, గంటిజోగి (1955) - *యక్షగానములు,* (పరిష్కర్త) ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు, విశాఖపట్నం.

శ్రీనివాస చక్రవర్తి (1960) - నాటక పోటీలు - చరిత్ర , జయంతి పబ్లికేషన్స్, విజయవాడ.

————————(1960) అభినయం, నవజ్యోతి ప్రచురణలు, గుంటూరు.

————————(1963) - ఆంధ్ర నాటక దర్శిని, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ.

————————(1963) - ఆంధ్రనాటక సమీక్ష, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ.

————————(-) నాట్యశాల, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ.

ఉత్తరభారత సాహిత్యాలు (1965),-(వివిధ రచయితలు) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

తెలుగు సాహిత్య కోశం (ఆధునిక సాహిత్యం) సంకలనం (1986), తెలుగు అకాడమీ, హైదరాబాద్

తెలుగు సాహిత్య వికాసం (2001), (వివిధ రచయితలు), ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం.

దక్షిణ భారత సాహిత్యాలు (1962),వివిధ రచయితలు, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్

నడుస్తున్న నాటకం రామనాథం జీవితం (1999) -- గురజాడ కళాసమితి, రాజమండ్రి

భారత భారతి - (విజ్ఞాన సర్వస్వం సంపుటం) (1999) పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వ విద్యాలయం, హైదరాబాద్.

రంగస్థల శాస్త్రం (మొదటి భాగం) (1970), తెలుగు అకాడమీ, హైదరాబాద్.

విశ్వసాహితి (విజ్ఞాన సర్వస్వం, సంపుటం -5)(1994) పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వ విద్యాలయం, హైదరాబాద్.

ENGLISH

Anand Lal (ed). 2004. Indian Theatre (The Oxford companion to Indian Theatre, Oxford University Press, Oxford.

Awasthi, Suresh 2001. Performance Tradition in India. National Book Trust, New Delhi.

Banham, Martin (ed.) 1995. Theatre (The Cambridge guide to theatre) Cambridge University Press, Cambridge.

Brown, John Russel (ed.)19995 - Theatre (The Oxford Illustrated history of Theatre) Oxford University Press, Oxford.

Hochman, Stanley 1972, Encyclopaedia of World Drama (5 Vol.), McGraw - Hill, Newyork.

Rangacharya, Adya 1984. Indian Theatre, National Book Trust, New Delhi.

Mukhopadhyay, Durgadas 1975, Lasser Known Forms of Performing Arts in India, Sterling, New Delhi.

Sinha Biswajit, 2000, Encyclopaedia of Indian Theatre, 3 Vol., Raj, Delhi.

Stanton, Sarah and Banham Martin (ed.) 1996 - Theatre (The Cambridge guide to theatre). Cambridge University Press, Cambridge.

Yarrow, Ralph. 2001. Indian Theatre : Theatre of Origin, Theatre of Freedom, Curzon Richmond.

తెలుగు - ఇంగ్లీషు, వర్ణక్రమ సూచిక
(Glossary)

అగథాన్ - Agathan
అజిట్ - ప్రాప్ - Agit - Prop
అటెల్లా ఫార్స్ - Atella farce
అడెల్ఫీ డ్రామా - Adelphi Drama
అప్పియా, అడాల్ఫీ - Appia, Adalphi
అబ్సర్డ్ ప్లే - Absurd play
అబ్సర్డిజం - Absurdism
అరిస్టాటిల్ - Aristotle
అరిస్టోఫెనిస్ - Aristophanes
అలిగారికల్ డ్రామా - Allegorical Drama
అల్బీ, ఎడ్వర్డ్ - Albee, Edward
అయొనెస్కో, యూజీన్ - Ionesco, Eugene
అఫినొజెనోవ్, అలెగ్జాండర్, నికొలెవిచ్ - Afinogenov, Alexandar, Nikolaevich
అల్కాజి, ఇబ్రహీమ్ - Alkaji, Ibrahim
ఆగియర్, ఎమిలీ - Augier, Emile
ఆండ్రియేవ్, లివోనిడ్- Andreev, Leonid
ఆండర్సన్ మాక్స్‌వెల్ - Anderson, Maxwell
ఆడిట్స్, క్లిఫోర్డ్ - Odits, Clifford
ఆర్చర్, విలియం- Archer, William
ఆర్టన్, జో - Orton, Joe
ఆర్డెన్, జాన్ - Arden, John
ఆర్టోడ్, ఆంటోనిన్ - Artaud Antonine
ఆలఫిర్, విటోరియో అమెడో - Alfiere, Vittorio Amedo
ఆసియస్, లూసియస్ - Accius, Lucius
ఆస్బోర్న్, జాన్ - Osborne, John
ఆస్ట్రోవ్‌స్కీ, అలెగ్జాండర్ - Ostrovsky, Aleksandar
ఇంటర్ ల్యూడ్స్ - Interludes
ఇఫ్‌లాండ్, ఆగస్ట్ విల్‌హెమ్ - Iffland, August willhem
ఇబ్సన్, హెన్రిక్ - Ibsen, Henrik
ఇలియట్, థామస్ స్టీరన్స్ - Eliot, Thomas Stearns
ఈట్స్, డబ్ల్యు. బి.- Yeats, W.B.
ఉడాల్, నికోలస్ - Udall, Nicholas
ఎక్స్‌ప్రెషనిజమ్ - Expressionism
ఎగ్జిస్టెన్షియలిజమ్ - Existentialism
ఎ డాల్స్ హౌస్ - A Doll's House
ఎడిసన్, జోసెఫ్ - Addison, Joseph
ఎడ్గార్, డేవిడ్ - Edgar, David
ఎన్ ఏక్టర్ ప్రిపేర్స్ - An Actor Prepares
ఎన్ ఎనిమీ ఆఫ్ ద పీపుల్ - An enemy of the people
ఎన్నియస్, క్వింటస్ - Ennius, Quintus
ఎపిక్ థియేటర్ - Epic Theatre
ఎపిటా - Epitaph
ఎపిలోగ్ - Epilogue
ఎస్కిలస్ - Aeschylus
ఏగ్నెస్ డి మిలి - Agnes De Mille
ఒకాసీ, సీన్ - O'casey, Sean
ఓనీల్, యూజినీ- O' Neill, Eugene
కబారెట్ - Cabaret
కబూకీ - Kabuki
కమూ, ఆల్బర్ట్- Camus, Albert
కర్టెన్ రైజర్ - Curtain Raiser
కవర్డ్, నోయల్ - Coward, Noel
కాంగ్రేవ్, విలియం - Congrave, William
కాగూర - Kagura
కాజన్, ఎలియా - Kazan, Elia
కాఫ్‌మేన్, జార్జ్ సైమన్ - Kaufman, George Simon
కామిడి - Comedy
కార్నియల్, పియరీ - Corneille, Pierre
కార్పెంటర్ జె. బి.- Carpenter, J.B.
కిడ్, థామస్ - Kyd, Thomas
కీట్స్- Keats
కోపిట్, ఆర్థర్ - Kopit, Arthur
కైజర్, జార్జ్ - Kaiser, George
క్రిస్టీ, అగథా - Christie, Agatha
క్రేగ్, గోర్డన్ - Craig, Gordon
ఖోరిలస్ - Khorilus
గాల్స్ వర్తీ, జాన్ - Galsworthy, John
గావో జింగ్ జియాన్- Gao Xing Jian
గిల్బర్ట్, డబ్ల్యు. యస్ - Gilbert, W.S.
గే, జాన్ - Gay, John

గోగోల్, నికోలైయ్ - Gogol, Nikolai
గోథే - Gothe
గోర్కీ, మాగ్జిమ్ - Gorky, Maksim
గోల్డ్ స్మిత్, ఆలీవర్ - Goldsmith, Oliver
గోల్డనీ, కార్లో - Goldani, Carlo
గ్రాండ్ గయినాల్ - Grand - Guinol
గ్రిఫిత్స్, ట్రెవర్ - Griffiths, Trevor
గ్రిబొయ్‌డోవ్, అలెగ్జాండర్ - Griboyedov, Alexandar
గ్రిల్ పార్జర్, ఫ్రాంజ్ - Grillparzer, Franz
గ్రే, సైమన్ - *Gray, Simon*
గ్రోటవ్‌స్కీ, జార్జి- Grotowsky, George
చాప్‌మెన్, జార్జ్ - Chapman, George
చికమట్సు మోన్జాయె మోన్ - Chikatsu Monzaimon
చీచున్ షియాంగ్ - Chichun shiang
చెకోవ్, ఆంటన్ - *Chekhov, Anton*
జాన్ గ్రీస్ - John Grece
జాన్సన్, బెన్ - Jonson, Ben (jamin)
జాన్సన్, శామ్యూల్ - Johnson, Samuel
జారి, ఆల్ఫ్రెడ్ - Jorry, Alfred
జెరోల్డ్, డగ్లస్ - *Jerrold, Douglas*
జోన్స్, రాబర్ట్ ఎడ్మండ్ - Jones, Robert Edmand
జోన్స్, హెన్రీ ఆర్థర్ - Jones, Henry Arthur
జోలా, ఎమిలీ - Zola, Emili
టాంబుర్లేన్ - Tamburlaine
టాలర్, ఎర్నెస్ట్ - Taller, Ernest
టాల్‌స్టాయ్, లెవ్ (నికోలవిచ్) - Tolstoi, (Nikolaivich)
టిర్సోడి మొలీనా - Tirsodemolina
టూర్నియర్, సిరిల్ - Tourneaur, Cyril
టెన్నిసన్ - Tennyson
టెరెన్స్ - Terence
టేలర్, టామ్ - Taylor, Tom
టోరెస్‌నహారో, బార్టోలోవెండి - Torres Naharro, Bartolomede
ట్రాజడీ - Tragedy
ట్రిలజి - Trilogy
డాన్ జువాన్ - Danjuon
డిడెరాట్, డెనిస్- Dederot, Dennis

డుర్రేన్‌మట్, ఫ్రెడ్రిచ్ - Durrenmatt, Friedrich
డెక్కర్, థామస్- Dekker, Thomas
డ్రింక్ వాటర్, జాన్ - Drinkwater, John
డ్యూమస్, అలెగ్జాండర్ - Dumas, Alexandre
డ్రయిడన్, జాన్ - Dryden, John
డ్రేమ్ - Drame
ణో - Noh
తమాయా బవూస్, మానుయేల్ - Tamayoy Baus, Manuel
తుర్జినేవ్, ఇవాన్ - Turgenev, Ivan
థెస్పిస్ - *Thespis*
నషే, థామస్ - Nashe, Thomas
నెమిరోవిచ్, డన్‌చెన్కో - Nemirovich - Danchenko
నేచురలిజమ్ - Naturalism
పాక్యూవియస్- Pacuvius
పింటర్, హెరాల్డ్ - *Pinter, Harold*
పినేరో, ఆర్థర్‌వింగ్ - Pinero, Arthur wing
పిరాండిల్లో, లూగి- Pirandello, Luigi
పిస్కేటర్, ఎర్విన్ - Piscator, Erwin
పుష్కిన్, అలెగ్జాండర్ - Pushkin, Aleksandar
పాస్టోరల్ డ్రామా - *Pastoral Drama*
ప్లాటస్ - Plautus
ప్రీస్ట్లీ, జె. బి. - Priestley, J.B.
ప్రాసీనియం ఆర్చ్ - Proscenium Arch
ఫర్‌ఖుహార్, జార్జ్ - Farquhar, George
ఫార్స్ - Farce
ఫాల్‌స్టాఫ్ - Falstaff
ఫీల్డింగ్, హెన్రి - Fielding, Henry
ఫోర్డ్, జాన్ - Ford, John
ఫ్రినికస్ - Frinicus
ఫ్లెచర్, జాన్ - Fletcher, John
బక్‌స్టన్ జాన్ - Buckstone, John
బాండ్, ఎడ్వర్డ్ - Bond, Edward
బార్కర్, జేమ్స్ నెల్సన్ - Barker, James Nelson
బార్కర్, హోవార్డ్ - Barker, Howard
బాలె - Ballet
బున్రాకుకెన్ - Bunrakuken
బుష్నర్, జార్జ్ - Buchner, Georg
బెకెట్, శామ్యూల్ - Beckett, Samuel

బెహాన్ బ్రెండన్ - Behan, Brendan
బైరన్ - Byron
బొమాంట్, ఫ్రాన్సిస్ - Beaumont, Francis
బ్రహ్మ్, అట్టో - Brahm, Otto
బ్యాంకో - Banquo
బ్యూఖ్నర్, జార్జ్ - Buchner Georg.
బ్యూయేరోవలేజో, ఆంటోనియో - Buero -Vallejo, Antonio,
బ్రెష్ట్, బెర్టోల్డ్ - Brecht Bertolt
బ్రెంటన్, హోవార్డ్ - Brenton, Howard
బ్రౌన్, రాబర్ట్ - Brown Robert
బ్రౌనింగ్ - Browning
మంజోని, అలెసాంద్రో- Manzoni, Alessandro
మాఫేయా, ఫ్రాన్సెస్కోపియోని - Maffei, Francesco Scipione.
మామ్, సోమర్‌సెట్ - Maugham, Somerset
మార్‌స్టన్, జాన్ - Marston, John
మార్లో, క్రిస్టోఫర్ - Marlowe, Christopher
మాస్క్ - Mask
మిడిల్‌టన్, థామస్ - Middleton, Thomas
మిరకిల్ ప్లేస్ - Miracle Plays
మిల్లర్, ఆర్థర్ - Miller, Arthur
మీనాండర్ - Menander
మిస్టరీ సైకిల్ - Mystery Cycle
మెసింజర్, ఫిలిప్ - Messenger, Philip
మేటర్‌లింక్, మారిస్ - Maeterlinck, Maurice
మోల్నార్, ఫెరెన్స్ - Molnar, Ference
మోలియర్ - Moliere
యురిపిడీస్ - Euripides
రబీ, డేవిడ్ - Rabe, David
రాబర్ట్‌సన్, టి. డబ్ల్యు - Robertson, T(homas) W(illianm)
రాటిగన్, టెరెన్స్ - Rattigan, Terence
రాయిస్టర్, రాల్ఫ్ - Roister, Ralph
రిచర్డ్ బర్బేజ్- Richard Burbage
రియలిజమ్ - Realism
రుయేదా, లోప్‌డి - Rueda, Lope De
రూయిజ్ డి అలార్కాన్, జువాన్ - Ruiz de Alarcon, Juan
రూసో- Rousseau
రేసిన్, జీన్ - Racine, Jean
రైస్, ఎల్మర్ - Rice, Elmer
రోలండ్, రోమా - Rolland, Romain
లారెన్స్, డి.హెచ్ - Lawrence, D H
లిటుర్జికల్ డ్రామా - Liturgical Drama
లిన్డ్సె, హోవర్డ్ - Lindsay, Howard
లీయు - Liyu
లీవిస్, లియోపాల్డ్ - Lewi's, Leopold
లెస్సింగ్, జి. ఇ - Lessing, G.E.
లైలీ, జాన్ - Lyly, John
లోప్ డి వేగా - Lope de Vega
వర్డ్స్‌వర్త్ - Wordsworth
వాంగ్ షిఫూ - Wang Shiafue
వాన్ బ్రూ - Vanbrugh
వాల్టేర్ - Valtaire
విలియమ్స్, టెన్నిస్సె - Williams, Tennessee
విసెంటీ, గిల్ - Vicente, Gil
వెబ్‌స్టర్, జాన్ - Webster, John
వెస్కర్, ఆర్నాల్డ్ - Wesker, Arnold
వేడ్‌కైండ్, ఫ్రాంక్ - Wedekind, Frank
వైల్డ్, ఆస్కార్ - Wild, Oscar
వైల్డర్, థారన్‌టన్ - Wilder Thornton
షా, జార్జ్ బెర్నార్డ్ - Shaw, George Bernard
షాఫర్, పీటర్ - Shaffer, Peter
షిర్లీ, జేమ్స్ - Shirley, James
షిల్లర్, జోహన్ క్రిస్టాఫ్ ఫెడరిక్‌నాన్ - Shiller, Johan Christaf Fredarichnan
షిల్లర్, ఫ్రెడ్రిచ్ - Schiller, Fridrich
షెపర్డ్, శామ్ - Shepard, Sam
షెరిడాన్, రిచర్డ్ బ్రిన్‌స్లే - Sheridan, Richard Brinsley
షెల్లీ - Shelly
షేక్స్పియర్, విలియం - Shakespeare, William
షేర్వుడ్, రాబర్ట్ ఇ. - Sherwood, Robert. E
షైలాక్ - Shylock
షోతుసేన్ - Shothu Sen
సంగాకు - Sangaku
సర్ నెథానియల్ - Sir Nethaniel
సరోయన్, విలియం - Saroyan William

సర్రియలిజమ్ - Surrealism
సల్లివాన్, ఆర్థర్ - Sullivan, Arthur
సాక్‌విల్, థామస్ - Sackville, Thomas
సాటిర్ ప్లే - Satyr Play
సాత్రే, జీన్‌పాల్ - Sartre, Jean - Paul
సింజ్, జాన్‌మిల్లింగ్టన్ - Synge, John Millington
సింబలిజమ్ - Symbolism
సుడర్‌మన్, హెర్‌మన్ - Sudermann, Hermann
సెనెకా - Seneca
సైక్లోరమ - Cyclorama
సైమన్, నీల్ - Simon, Neil
సైమన్‌సన్, లీ - Simonson, Lee
సోఫాక్లిస్ - Sophocles
స్టానిస్లవ్‌స్కీ, కాన్‌స్టాన్‌టిన్ - Stanislavsky, Konstantin
స్టాపర్డ్, టామ్ - Stoppard, Tom
స్టీల్, సర్ రిచర్డ్ - Steele , Sir Richard
స్ట్రిన్డ్ బర్గ్ , ఆగస్ట్ - Strindberg, August
స్పెన్సెర్, జాన్ - Spencer, John
హడ్సన్ - Hudson
హల్లమ్, లెవీస్ - Hallam, Lewis
హప్ట్‌మన్, గెర్ హార్ట్ - Hauptmann, Gerhart
హాల్‌ఫోర్డ్, థామస్ - Hallford, Thomas
హెబల్, ఫ్రెడ్‌రిచ్ - Hebbel, Friedrich
హేమన్, రోనాల్డ్ - Heyman, Ronald
హేర్, డేవిడ్ - Hare, David
హేవుడ్, జాన్ - Heywood, John
హ్యూగో, విక్టర్ - Hugo, Victor

* * *

ఇంగ్లీషు - తెలుగు వర్ణక్రమ సూచిక
(Glossary)

A Doll's House - ఎ డాల్స్ హౌస్
Absurd play - అబ్సర్డ్ ప్లే
Absurdism - అబ్సర్డిజం
Accius, Lucius - ఆసియస్, లూసియస్
Addison, Joseph - ఎడిసన్, జోసెఫ్
Adelphi Drama - అడెల్ఫీ డ్రామా
Aeschylus - ఎస్కిలస్
Afinogenov, Alexandar, Nikolaevich - అఫినొజెనోవ్, అలెగ్జాండర్, నికొలెవిచ్
Agathan - అగథాన్
Agit - prop - అజిట్ - ప్రాప్
Agnes De Mille - ఏగ్నెస్ డి మిలి
Albee, Edward - అల్బీ, ఎడ్వర్డ్
Alfiere, Vittorio Amedo - ఆలఫీర్, విటోరియో అమెడో
Alkaji, Ibrahim - అల్కాజి, ఇబ్రహీమ్
Allegorical Drama - అలిగారికల్ డ్రామా
An Actor Prepares - ఎన్ ఏక్టర్ ప్రిపేర్స్
An enemy of the people - ఎన్ ఎనిమీ ఆఫ్ ద పీపుల్
Anderson, Maxwell - ఆండర్సన్ మాక్స్‌వెల్
Andreev, Leonid - ఆండ్రియేవ్, లివోనిడ్
Appia, Adalphi - అప్పియా, అడాల్ఫీ
Archer, William - ఆర్చర్, విలియం
Arden, John - ఆర్డెన్, జాన్
Aristotle - అరిస్టాటిల్
Aristophanes - అరిస్టోఫెనిస్
Artaud, Antonine - ఆర్టోడ్, ఆంటోనిన్
Atella farce - అటెల్లా ఫార్స్
Augier, Emile - ఆగియర్, ఎమిలీ
Ballet - బాలె
Banquo - బ్యాంకో
Barker, Howard - బార్కర్, హోవార్డ్
Barker, James Nelson - బార్కర్, జేమ్స్ నెల్సన్
Beaumont, Francis - బొమాంట్, ఫ్రాన్సిస్
Beckett, Samuel - బెకెట్, శామ్యూల్
Behan, Brendan - బెహాన్ బ్రెండన్
Bond, Edward - బాండ్, ఎడ్వర్డ్
Brahm, Otto - బ్రహ్మ్, అట్టో
Brecht Bertolt - బ్రెష్ట్, బెర్టోల్డ్
Brenton, Howard - బ్రెంటన్, హోవార్డ్
Brown Robert - బ్రౌన్, రాబర్ట్
Browning - బ్రౌనింగ్
Buchner, Georg - బుష్నర్, జార్జ్
Buchner Georg. - బ్యూఖ్నర్, జార్జ్
Buckstone, John - బక్‌స్టన్ జాన్
Buero -Vallejo, Antonio - బ్యూయేరోవలేజొ ఆంటోనియో
Bunrakuken - బున్రాకుకెన్
Byron - బైరన్
Cabaret - కబారెట్
Camus, Albert - కమూ, ఆల్బర్ట్
Carpenter, J.B. - కార్పెంటర్ జె. బి.
Chapman, George - చాప్‌మెన్, జార్జ్
Chichun shiang - చీచున్ షియాంగ్
Chikatsu Monzaimon - చికమట్సు మోన్జాయె మోన్
Chekhov, Anton - చెకోవ్, ఆంటన్
Christie, Agatha - క్రిస్టీ, అగథా
Comedy - కామిడి
Congrave, William - కాంగ్రేవ్, విలియం
Corneille, Pierre - కార్నియల్, పియరీ
Coward, Noel - కవర్డ్, నోయల్
Craig, Gordon - క్రేగ్, గోర్డన్
Curtain Raiser - కర్టెన్ రైజర్
Cyclorama - సైక్లోరమ
Danjuon - డాన్ జువాన్
Dederot, Dennis - డిడెరాట్, డెనిస్
Dekker, Thomas - డెక్కర్, థామస్
Drame - డ్రేమ్
Drinkwater, John - డ్రింక్ వాటర్, జాన్

Dryden, John - డ్రయిడన్, జాన్
Dumas, Alexandre - డ్యూమస్, అలెగ్జాండర్
Durrenmatt, Friedrich - డుర్రేన్మట్, ఫ్రెడ్రిచ్
Edgar, David - ఎడ్గార్, డేవిడ్
Eliot, Thomas Stearns - ఇలియట్, థామస్ స్టీరన్స్
Ennius, Quintus - ఎన్నియస్, క్వింటస్
Epic Theatre - ఎపిక్ థియేటర్
Epilogue - ఎపిలోగ్
Epitaph - ఎపిటా
Euripides - యురిపిడీస్
Existentialiasm - ఎగ్జిస్టెన్షియలిజమ్
Expressionism - ఎక్స్ప్రెషనిజమ్
Falstaff - ఫాల్స్టాప్
Farce - ఫార్స్
Farquhar, George - ఫర్ఖుహార్, జార్జ్
Fielding, Henry - ఫీల్డింగ్, హెన్రి
Fletcher, John - ఫ్లెచర్, జాన్
Ford, John - ఫోర్డ్, జాన్
Frinicus - ఫ్రినికస్
Galsworthy, John - గాల్స్ వర్తీ, జాన్
Gao Xing jian - గావో జింగ్ జియాన్
Gay, John - గే, జాన్
Gilbert, W.S. - గిల్బర్ట్, డబ్ల్యు. యస్
Gogol, Nikolai - గోగోల్, నికోలైయ్
Goldani, Carlo - గోల్డనీ, కార్లో
Goldsmith, Oliver - గోల్డ్ స్మిత్, ఆలీవర్
Gorky, Maksim - గోర్కీ, మాగ్జిమ్
Gothe - గోథే
Grand - Guinol - గ్రాండ్ గయినాల్
Gray, Simon - గ్రే, సైమన్
Griboyedov, Alexandar - గ్రిబొయ్డోవ్, అలెగ్జాండర్
Griffiths, Trevor - గ్రిఫిత్స్, ట్రెవర్
Grillparzer, Franz - గ్రిల్ పార్జర్, ఫ్రాంజ్
Grotowsky, George - గ్రోటవ్స్కీ, జార్జి
Hallam, Lewis - హల్లమ్, లెవీస్ –
Hallford, Thomas - హాల్ఫోర్డ్, థామస్
Hauptmann, Gerhart - హప్ట్మన్, గెర్ హార్ట్
Hare, David - హేర్, డేవిడ్
Hebbel, Friedrich - హెబల్, ఫ్రెడ్రిచ్
Heyman, Ronald - హేమన్, రోనాల్డ్
Heywood, John - హేవుడ్, జాన్
Hudson - హడ్సన్
Hugo, Victor - హ్యూగో, విక్టర్
Ibsen, Henrik - ఇబ్సన్, హెన్రిక్
Iffland, August willhem - ఇఫ్లాండ్, ఆగస్ట్ విల్ హెమ్
Interludes - ఇంటర్ ల్యూడ్స్
Ionesco, Eugene - అయొనెస్కో, యూజిన్
Jerrold, Douglas - జెరోల్డ్, డగ్లస్
John Grece - జాన్ గ్రీస్
Johnson, Samuel - జాన్సన్, శామ్యూల్
Jones, Henry Arthur - జోన్స్, హెన్రీ ఆర్థర్
Jones, Robert Edmand - జోన్స్, రాబర్ట్ ఎడ్మండ్
Jonson, Ben (jamin) - జాన్సన్, బెన్
Jorry, Alfred - జారి, ఆల్ఫ్రెడ్ –
Kabuki - కబూకీ
Kagura - కాగూర
Kaiser, George - కైజర్, జార్జ్
Kaufman, George Simon- కాఫ్ మేన్, జార్జ్ సైమన్
Kazan, Elia - కాజన్, ఎలియా
Keats - కీట్స్
Khorilus - ఖోరిలస్
Kopit, Arthur - కోపిట్, ఆర్థర్
Kyd, Thomas - కిడ్, థామస్
Lawrence, D. H - లారెన్స్, డి. హెచ్
Lessing, G.E. - లెస్సింగ్, జి. ఇ
Lewi's, Leopold - లీవీస్, లియోపాల్డ్
Liyu - లీయు
Lindsay, Howard - లిన్డ్సె, హోవర్డ్
Liturgical Drama - లిటుర్జికల్ డ్రామా
Lope de Vega - లోప్ డి వేగా
Lyly, John - లైలీ, జాన్
Maeterlinck, Maurice - మేటర్లింక్, మారిస్
Maffei, Francesco Scipione - మాఫేయీ,
ఫ్రాన్సెస్కోపియోని

Manzoni, Alessandro - మంజోని, అలెసాంద్రో
Marlowe, Christopher - మార్లో, క్రిస్టోఫర్
Marston, John - మార్‌స్టన్, జాన్
Mask - మాస్క్
Maugham, Somerset - మామ్, సోమర్‌సెట్
Menander - మీనాండర్
Messenger, Philip - మెసింజర్, ఫిలిప్
Middleton, Thomas - మిడిల్‌టన్, థామస్
Miller, Arthur - మిల్లర్, ఆర్థర్
Miracle Plays - మిరకిల్ ప్లేస్
Moliere - మోలియర్
Molnar, Ference - మోల్నార్, ఫెరెన్స్
Mystery Cycle - మిస్టరీ సైకిల్
Nashe, Thomas - నషే, థామస్
Naturalism - నేచురలిజమ్
Nemirovich - Danchenko - నెమిరోవిచ్, డన్‌చెన్కో
Noh - ణో
O' Neill, Eugene - ఓనీల్, యూజినీ
O'casey, Sean - ఒకాసీ, సీన్
Odits, Clifford - ఆడిట్స్, క్లిఫోర్డ్
Orton, Joe - ఆర్టన్, జో
Osborne, John - ఆస్బోర్న్, జాన్
Ostrovsky, Aleksandar - ఆస్ట్రోవ్‌స్కీ, అలెగ్జాండర్
Pacuvius - పాక్యూవియస్–
Pastoral Drama - పాస్టోరల్ డ్రామా
Pinero, Arthurwing - పినేరో, ఆర్థర్‌వింగ్
Pinter, Harold - పింటర్, హెరాల్డ్
Pirandello, Luigi - పిరాండిల్లో, లూగీ
Piscator, Ervin - పిస్కేటర్, ఎర్విన్
Plautus - ప్లాటస్
Priestley, J.B. - ప్రీస్ట్లీ, జె. బి.
Proscenium Arch - ప్రొసీనియం ఆర్చ్
Pushkin, Aleksndar - పుష్కిన్, అలెగ్జాండర్
Rabe, David - రబీ, డేవిడ్
Racine, Jean - రేసిన్, జీన్
Rattigan, Terrence - రాటిగన్, టెరెన్స్
Realism - రియలిజమ్
Rice, Elmer - రైస్, ఎల్మర్
Richard Burbage - రిచర్డ్ బర్బేజ్
Robertson, T(homas) W(illianm) - రాబర్ట్‌సన్, టి. డబ్ల్యు
Roister, Ralph - రాయిస్టర్, రాల్ఫ్
Rolland, Romain - రోలండ్, రోమా
Rousseau - రూసో
Rueda, Lope De - రుయేదా, లోప్‌డి
Ruiz de Alarcon, Juan - రూయిజ్ డి అలార్కాన్, జువాన్
Sackville, Thomas - సాక్‌విల్, థామస్
Sangaku - సంగాకు
Saroyan William - సరోయన్, విలియం
Sartre, Jean - Paul - సాత్రే, జీన్‌పాల్
Satyr Play - సాటిర్ ప్లే
Schiller, Freidrich - షిల్లర్, ఫ్రెడ్రిచ్
Seneca - సెనెకా
Shaffer, Peter - షాఫర్, పీటర్
Shakespeare, William - షేక్స్పియర్, విలియం
Shaw, George Bernard - షా, జార్జ్ బెర్నార్డ్
Shelly - షెల్లీ
Shepard, Sam - షెపర్డ్, శామ్
Sheridan, Richard Brinsley - షెరిడాన్, రిచర్డ్ బ్రిన్‌స్లే
Sherwood, Robert. E - షేర్వుడ్, రాబర్ట్ ఇ.
Shiller, Johan Christaf Fredarichnan - షిల్లర్, జోహన్ క్రిస్టాప్ ఫెడరిక్ నాన్
Shirley, James - షిర్లీ, జేమ్స్
Shothu Sen - షోతుసేన్
Shylock - షైలాక్
Simon, Neil - సైమన్, నీల్
Simonson, Lee - సైమన్‌సన్, లీ
Sir Nethaniel - సర్ నెథానియల్
Sophocles - సోఫాక్లిస్
Spencer, John - స్పెన్సెర్, జాన్
Stanislavsky, Konstantin - స్టానిస్లవ్‌స్కీ, కాన్‌స్టాన్‌టిన్
Steele , Sir Richard - స్టీల్, సర్ రిచర్డ్
Stoppard, Tom - స్టాపర్డ్, టామ్
Strindberg, August - స్ట్రిండ్ బర్గ్ , ఆగస్ట్
Sudermann, Hermann - సుడర్‌మన్, హెర్‌మన్

Sullivan, Arthur - సల్లివాన్, ఆర్థర్
Surrealism - సర్రియలిజమ్
Symbolism - సింబాలిజమ్
Synge, John Millington - సింజ్, జాన్‌మిల్లింగ్టన్
Taller, Ernest - టాలర్, ఎర్నెస్ట్
Tamburlaine - టాంబుర్లేన్
Tamay Baus, Manuel - తమాయా బవూస్, మానుయేల్
Taylor, Tom - టేలర్, టామ్
Tennyson - టెన్నిసన్
Terence - టెరెన్స్
Thespis - థెస్పిస్
Tirsodemolina - టిర్సో డి మొలీనా
Tolstoi, (Nikolaivich) - టాల్‌స్టాయ్, లెవ్ (నికోలవిచ్)
Torres Naharro, Bartolomede - టోరెన్‌నహారో, బార్టోలోమెడి
Tourneur, Cyril - టూర్నియర్, సిరిల్
Tragedy - ట్రాజడీ
Trilogy - ట్రిలజి
Turgenev, Ivan - తుర్జినేవ్, ఇవాన్
Udall, Nicholas - ఉడాల్, నికోలస్
Valtaire - వాల్టేర్
Vanbrugh - వాన్ బ్రూ
Vicente, Gil - విసెంటీ, గిల్
Wang Shiafue - వాంగ్ షిఫూ
Webster, John - వెబ్‌స్టర్, జాన్
Wedkind, Frank - వేడ్కైండ్, ఫ్రాంక్
Wesker, Arnold - వెస్కర్, ఆర్నాల్డ్
Wilder Thornton - వైల్డర్, థారన్‌టన్
Wild, Oscar - వైల్డ్, ఆస్కార్
Williams, Tennessee - విలియమ్స్, టెన్నిస్సె
Wordsworth - వర్డ్స్‌వర్త్
Yeats, W.B. - ఈట్స్, డబ్ల్యు. బి.
Zola, Emili - జోలా, ఎమిలీ

* * *

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రిపర్టరీ కంపెనీ : 1964–65

సంవత్సరం	నాటకం	రచయిత	దర్శకుడు
1964	కింగ్‌లియర్	షేక్స్పియర్	అల్కాజి
	ది ఫాదర్	స్ట్రిండ్‌బర్గ్	అల్కాజి
1965	సునోజన మేజయ్	ఆద్య రంగాచార్య	మోహన్ మహర్షి
	కంజూస్	మోలియర్	అల్కాజి
1966	ట్రోజన్ ఉమెన్	యురిపిడస్	అల్కాజి
	తుగ్లక్	గిరీష్ కర్నాడ్	ఓం శివపురి
	లహెరోం కె రాజ్‌హంస్	మోహన్ రాకేష్	ఓం శివపురి
	మధ్యను వ్యాయోగ	భాస	శాంతా గాంధీ
1967	వెయిటింగ్ ఫర్ గోడో	శామ్యూల్ బెకెట్	అల్కాజీ
	యాంటిగని	జీన్ అనూయి	అల్కాజీ
	హోరి	ప్రేమ్‌చంద్	జి.కె. వర్మ
	అంధాయుగ్	ధర్మవీర్ భారతి	అల్కాజీ
1968	జాస్మా ఓడాన్	శాంతాగాంధి	శాంతాగాంధి
	కకేషియన్ చాక్ సర్కిల్	బ్రెక్ట్	కార్ల్ వెబర్
1970	తీన్ తకేకా స్వాంగ్	బ్రెక్ట్	ఫ్రిజ్ బెన్నెవిజ్
1971	బందియోంకీ ఏక్ ఝులర్	అమృత్‌రాయ్	నందీరా జహీర్
1972	ఆత్మహత్యా కే విరుద్ధ్	రఘువీర్ సహాయ్	మనోహర్‌సింగ్
	కవితాయేం	దయాల్ సక్సేనా	బల్‌రాజ్ పండిట్
	సుల్తాన్ రజియా	బల్వంత్‌గార్గి	అల్కాజీ
	సూర్యముఖ్	యల్.యన్.లాల్	అల్కాజీ
	మార్జీవ	ముద్రారాక్షస్	స్వామినాథన్
1973	డ్యాంటన్స్ డెల్	జార్జ్ బుష్నర్	అల్కాజీ
	తుగ్లక్	గిరీష్‌కర్నాడ్	అల్కాజీ
	పంచ్‌వాన్ సవార్		బల్‌రాజ్ పండిట్
	ది లెసన్	అయనెస్కో	భాను భారతి
	బక్రీ	సర్వేశ్వర్ దయాళ్	జ్యోతి డి సక్సేనా
1974	లుక్ బ్యాక్ ఇన్ ఏంగర్	జాన్ ఆస్‌బార్న్	అల్కాజీ
	సూర్య్‌కి అంతిమ్ కిరణ్ – సే సూర్యకి పెహ్‌లే కిరణ్ తక్	సురేంద్ర వర్మ	రామ్‌గోపాల్ బజాజ్
	రస గంధర్వ	మణి మధుకర్	భానుభారతి
	తిచట	ముద్రారాక్షస్	రంజన్ శభర్వాల్
1975	ఏక్ ఔర్ తథాగల్		బలరాజ్ పండిట్
	లుక్ బ్యాక్ ఇన్ ఏంగర్	జాన్ ఆస్‌బార్న్	అల్కాజి
	మేరే హాకర్	ఎస్. బంధోపాధ్యాయ	రతన్ థియ్యాం
	తీన్ ఏకాంత్	నిర్మల్ వర్మ	డి.ఆర్. అంకుర్
1976	ఆధ్ అధూరే	మోహన్‌రాకేష్	అమల్ అల్లానా
	అధ్వాన్ సర్గ్	సురేంద్రవర్మ	ఎస్. వర్మ, ఆర్.గుప్త
	బీవియెంకా మదారస	మోలియర్	అల్కాజీ
	జనానే దంత్ కా అస్పతాల్		బలరాజ్ పండిట్
	చార్ సాయి	రామేశ్వర్ ప్రేమ్	యం. సింగ్

1977	బేగంకా తకియా	నంద్ కామూర్	రంజిత్ కపూర్
	అంధాయుగ్	ధర్మవీర్ భారతి	ఎం.కె. రైనా
	స్కంద్ గుప్త	జై శంకర్ ప్రసాద్	బజాజ్
	జాగ్ ఉఠా హై రామ్ గఢ్	వసంత్ కనేత్కర్	అల్కాజీ
1978	బీవియోంకా మదారస్	మోలియర్	అల్కాజీ
	ఖామోష్ అదాలత్ జోరీ హై	విజయ్	యస్. టెండూల్కర్
	ముక్లీ మంత్రి	చాణక్యసేన్	రంజిత్ కపూర్
	సంధ్య–ఛాయ	జయవంత్ దాల్వి	బావోకర్
1979	అంకుల్ వాన్యా	చెకోవ్	యం. సింగ్
	చోప్రా కమల్ నౌకర్ జమాల్	బ్రెక్ట్	బెనెవిజ్
	బర్నం వాన్	షేక్స్పియర్	కారంత్
	సయ్యా భమే కోత్వాల్	వసంత్ సబ్నిస్	బెనర్జీ
1980	ఛోటే సయ్యద్ బడే సయ్యద్	సురేంద్రవర్మ	కారంత్
	ది ఫూల్	ఎడ్వర్డ్ బాండ్	బారీ జాన్
	మేనా గూర్జరి	ఆర్.యల్. ఫారీఖ్	భరత్ దాపె
1981	సిక్స్ క్యారెక్టర్స్ ఇన్ సెర్చ్ ఆఫ్ యాన్ ఆథర్	పిరాండెల్లో	సేన్‌గుప్తా
1982	మహాభోజ్	మన్నూ భండారి	అమల్ అల్లాన్
	తుగ్లక్	గిరీష్ కర్నాడ్	ప్రసన్న
1983	చెర్రీ ఆర్చార్డ్	చెకోవ్	షెకనర్
	ప్రియతమ్ తోతే	ఆర్కసీ	మనోహర్‌సింగ్
	సూర్య కి అంతిమ్ కిరణ్	యస్. వర్మ	బజాజ్
	ఒథెల్లో	షేక్స్పియర్	బెన్‌విజ్
1984	అఫ్తాబ్ ఫైజాబాదీ	రోస్టండ్	కిప్‌స్తే
	కభీ నా ఛోడే ఖేత్	జగదీష్ చందర్	రైనా
	కథ కీ గాడీ	త్రిపురారి శర్మ	త్రిపురారి శర్మ, సుభాష్ ఉద్‌గాట, రాతి బార్తొలో మ్యూ
	మత్త విలాస్	మహేంద్ర విక్రం	కె.యన్. ఫణిక్కర్
1985	చంద్రమాసింగ్	మహేంద్ర విక్రం	కె.యన్. ఫణిక్కర్
	ఉర్ఫ్ చమ్‌కు విరాసత్	మహేష్ఎత్కింబ్‌వార్	సత్యదేవ్ దూబే
	నౌకర్ సైతాన్	కార్లో గోల్డోని	బి.యం.షా మాలిక్ హైరాన్
1986	అంధాయుగ్	ధర్మవీర్ భారతి	రైనా
1987	మష్రీకీ హూర్ కథా వాచ్కీ	రాధేశ్యాం	బి.యం. షా
	హమ్ కౌన్ తే	శరణ్ గుప్త్	హేమా సాహే
1988	అజ్‌ర్ కా ఖ్వాబ్	జి.బి. షా	బి. భారతి
	మై లడ్లీ మైనా తేరీ	మిరాస్‌దార్	ఉషా బెనర్జీ
	మిత్రో మార్జానీ	కృష్ణసోబ్తీ	బి.యం. షా
	పగ్లా ఘోడా	బాదల్ సర్కార్	యస్.డి. దూబే
	పనాఘడ్	విలియం సరోయన్	జె.యన్. కౌశల్
	కరోరీ మార్కో	యూజిన్ ఓనీల్	మారియట్
1989	జోసఫ్ కాముకద్దమా	ఫ్రాంజ్‌కాఫ్కా	మోహన్ మహర్షి
	సూర్య కి అంతిమ్ కిరణ్	యస్. వర్మ	బజాజ్
	శర్విలక్	ఆర్. పారీజీ	బస్సికేల్

	దుష్మన్	మాక్సింగోర్కీ	హబీబ్ తన్వీర్
	ఖైద్ ఎ హయత్	యస్. వర్మ	బజాజ్
	అప్నే అప్నే అజ్‌నబి సుభా కి షైర్	వాత్స్యాయన్	అంకుర్
	జిందగీ యహా వహా	నిర్మల్ వర్మ	దినేష్ ఖన్నా
1990	మహాశాంతి	వోకర్ బ్రౌన్	బెనెవిజ్
	కర్మనేవాలి	కె.యల్. జకీర్	రైనా
	యమ్ గాధ	డి.యస్.సింగ్	భాను భారతి
1991	ఏక్ ముసాఫిర్ బే అస్‌బాబ్	జీన్ అనూయి	రంజిత్ కపూర్
	ఫ్యూజియామా	కె. మొహమ్మజనోవ్	ప్రసన్న అతిమటోవ్
	ఏక్ పురుష్ డెడ్ పురుష్	ప్రసన్న	బజాజ్
1992	రక్త్ కల్యాణ్	గిరీష్ కర్నాడ్	అల్కాజీ
	జూలియస్ సీజర్	షేక్స్పియర్	అల్కాజీ
	దిన్ కే అంధేరే	లోర్కా	అల్కాజీ
	భాబ్ సూరత్ బహూ	నాగ్‌బోదాస్	రంజిత్ కపూర్
	మువాజే	భీష్మ సహానీ	రైనా
	ఆషాఢ్ కా ఏక్ దిన్	మోహన్ రాకేష్	బజాజ్
	కహానియా	మోహన్ రాకేష్	అంకుర్
	ఆధ్ అధూరే	మోహన్ రాకేష్	రంజిత్ కపూర్
	లెహరోం కే రాజహంస్	మోహన్ రాకేష్	కీర్తిజైన్
1993	ఘాసీరాం కొత్వాల్	విజయ్ టెండూల్కర్	రాజేంద్రనాథ్
	నటి బినోదిని	చిత్తరంజన్ ఘోష్	బిపి బోస్
	మస్కారే	మోలియర్ బుల్గాకోవ్	అబెల్‌రాయ్
1994	కానుప్రియ	ధర్మవీర్ భారతి	నిఖిలేష్ శర్మ
	ఐన్‌స్టీన్		మోహన్ మహర్షి
	ప్రతిబింబ్	ఎల్కుంబ్‌వార్	చిత్తరంజన్ హక్సర్
1995	అంత్–అనంత్	ఉన్నిక్రిష్ణన్	అభిలాష పిళ్ళై
	తమంచా ఖాన్ కీ గజ్ దాస్తావ్	బ్రెక్ట్	బన్సీకౌల్
	కలాం కుంబి	ఆర్. త్రిపాఠి	సీతారాం పాంచాల్
	రాస్తే	జి.పి. దేశ్‌పాండే	సత్యదేవ్ దూబే
	పరిణతి	రాబిన్ మాఘమ్	చిత్తరంజన్ గిరి
1996	తాంకుబాబా లోచన్ దాస్	నాగ్ బో దాస్	బి.యం. షా
	బడే న ఖేల్ ఛోటే ఖేల్	డారియోఫో	రాబిన్‌దాస్
	బంద్ గలీకా ఆఖరీ మకాన్	ధర్మవీర్ భారతి	అంకుర్
	అగ్ని ఔర్ బార్ ఖా	గిరీష్ కర్నాడ్	ప్రసన్న
	ఇందర్ సభ	అమానత్ లఖ్‌వాలి	మోహన్ ఉప్రేటి
	అక్స్ తమాషా	సి.యస్. కంబార్	భాను భారతి,
		ఈశన్ షా అల్లా	సత్యదేవ్ దూబే
1997	ఏక్ సప్నా		స్వానంద్ కిర్ కిరే
	ఢిల్లీ ఛలో	ఉత్పల్‌దత్	బి.పి. బోస్
1998	భాండ్ దుహాయ్	మోతీలాల్	రైనా
	అజీజున్నిసా సాన్		త్రిపురారి శర్మ
	సాత్వాన్ కా కిస్సా		

ప్ర.రె.

పదసూచి

అంకం-**179,**180,447
అంక ముఖం-179,**180,**198
అంక యవనిక-**180**
అంక విభజన-179,180
అంకావ తరణం-**180**
అంకావతారం-**180,**198
అంకాస్యం-180
అంకీయ గీత్-72
అంకీయనాట్-72,**180,**181
అంకుల్ టామ్స్ కేబిన్ నాటకం-148
అంకూర్, కల్లోల్-228
అంగ రచన-312
అంగారక్ వికార్ విలాసిత్-116
అంగి రసం-**181**
అంజలిదేవి-60,470
అంటరానివాళ్ళు-455
అంతర్నాటకం-**181**
అంతర్యవనికాంగాలు-**181,**632
అంథాయుగ్-124,483,621
అంబాసిడర్ థియేటర్-156
అంబికా వరప్రసాదరావు, కందుకూరి -182
అంబేద్కర్-455
అకాడమీ ఫ్రాన్సాయిజ్-325
అక్కినేని నాగార్జున కళాసాగర్-550
అక్కినేని నాగేశ్వరరావు నాటక కళా పరిషత్తు -449,65
అక్కినేని నాగేశ్వరరావు నాటక కళా పరిషత్తు- 449,473
అక్షర సంఘాతం-182
అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం -503,512
అఖిలభారత అభ్యుదయ రచయితల మహాసభ-55
అఖిల భారత ప్రజానాట్యమండలి-579
అఖిల భారతనాటకపోటీలు-571
అఖిలాంధ్ర నాటక కళాపరిషత్తు-64
అఖిలాంధ్ర నాటకోత్సవాలు-71
అగథా క్రిస్టీ-156
అగథాన్-182
అగ్నివర్షమ్-467
అఘు మహ్మద్ షా-76
అచ్చయ్య, కోడూరు-40,57,58,67, **182,** 537
అచ్యుతమీనన్ టి.సి. -118
అచ్యుత రామశాస్త్రి, మల్లాది -23,50, **183,** 230,267, 469
అచ్యుతరామరాజు, గణపతిరాజు -67,**182,**183,267
అచ్యుత రావు, టేకుమళ్ళ -**183,**208
అజామిళ-32
అటెల్లానా ప్రహసనం-**184**
అడబాల, టి. ఆర్-67,**184**
అడవి దివిటీలు-464
అడెల్ఫీ రూపకం-**184**
అతిశయం-184
అధమ ప్రకతి-558
అద్వైత చరణ్ మహంతి-81
అద్భుతం-201
అద్భుత నాటకాలు-152
అద్భుత రసం-**184**
అద్భుత రూపక చక్రం-**185**
అధృతి-186
అధమ ప్రకృతి-**185**
అధముడు-**185**
అధర్వణ వేదం-1
అధి దేవతలు-**185**
అధిబలం-186,280
అధివాస్తవికతా వాదం-**186**
అనంత్ నాగ్-87
అనంతకష్ణశర్మ, రాళ్ళపల్లి -60,378, 509,542
అనంతపద్మనాభరావు-603
అనర్ఘ రాఘవం-4,556
అనసూయ, పువ్వుల -**186**, 573, 596,
అనార్కలి-76,104,623,624
అనిబద్ధ రూపకం-168
అనుకరణ-**186**
అనుకరణ నటన-**187**
అనుకూలుడు-**187**
అనురక్త-187
అనువిల్, జాన్-**187,**188
అన్నపూర్ణయ్య, మద్దూరి -37
అన్నపూర్ణా థియేటర్స్-82,83
అన్నమాచార్యుడు తాళ్ళపాక - 13
అన్నాచెల్లెలు-214,461,630
అన్నాదురై-97
అన్యాపదేశం-188
అన్యాపదేశ నాటకాలు-4
అన్యాపదేశ రూపకం-188
అన్యోఢ-188
అపటీక్షేపం-188,334
అపనింద-57
అపరాధ పరిశోధక నాటకాలు-599
అపవారితం-188,315
అపోహ-60,503,542,556
అప్పలస్వామి, కారెపు -41,43,59, 206
అప్పాజోస్యుల -విష్ణుభట్ల ఫౌండేషన్-531
అప్పారాయ నాట్య మండలి-61
అప్పారావు ఎం. ఆర్. -32,60, 61,62,**189,**215
అప్పారావు, పోణంగి శ్రీరామ -31, **190,**207 , 209, 315, 372,519
అప్పారావు, గురజాడ -26,38,53,

55, 56,59,64,**189,**313,474, 545, 555, 566, 573
అప్పారావు, బసవరాజు -241
అప్సరసలు-1,190
అబీ థియేటర్-227
అబ్దుల్ హసన్ తానీషా-10
అబ్బాస్, కె. ఎ. -126,127
అబ్బీ థియేటర్-238
అబ్బులు, పోలవరపు-**191**
అబ్బూరి నాటక కళాపరిషత్తు-584
అబ్రహం నాడగం-306
అబ్రహాం లింకన్-326
అబ్సర్డిజమ్-44
అబ్సర్డ్ థియేటర్-45
అభిజ్ఞానం-**191**
అభిజ్ఞాన శాకుంతలం -4,18,21, 107, 182,188,195,257, 258, 289,452,479,480,552,555,560, 602,610,613
అభినందన ఆర్ట్సు-479
అభినయం-1,8,191,353,478,593
అభినయ దర్పణం-17,**192,**327, 427, 626
అభినయావరణ-192,476
అభినవ గుప్తుడు-88,**192**,230,393, 444,492
అభినవ భారతి-88,193,230
అభినవ సరసవినోదిని-295
అభిమన్యు వధ-108
అభివ్యక్తి ధోరణి-43
అభివ్యక్తి వాదం-146,**193**,490,575
అభివ్యక్తి శైలి-156,177,467
అభిషేకం-450,451
అభిసారిక-193
అభూత హరణం-194280
అభ్యంతర పరివారం-194
అభ్యుదయ-488
అభ్యుదయ నట సమాఖ్య-435
అభ్యుదయ రచయితల సంఘం-127
అమంటా-287
అమర్ కథ-553
అమరజీవి-621
అమరత్యాగి-462
అమరేంద్ర, బి-194
అమిన్ కమిల్-89,90
అమృత మథనం-1,3
అమృతలాల్ బసు-109
అమెచ్యూర్ అర్టిస్ట్సు అసోసియేషన్ -194,40
అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ -25,495
అమెచ్యూర్ థియేటర్-108
అమెచ్యూర్ థియేట్రికల్ కంపెనీ-549
అమెచ్యూర్ నాటక సభ-**194**
అమెరికా నాటక రంగం-147
అమోల్ పాలేకర్-**195**
అమ్మ-46
అమ్రిక్ సింగ్-101
అయనెస్కో, యూజీన్-136,140, **195,**201
అయోగ శృంగారం-195
అయోనా విశ్వవిద్యాలయం-554
అరిస్టాటిల్-129,131,187,191, **195,** 223,229,236,403,546
అరిస్టోఫెన్స్-132,**196**,197,468
అరిస్ట్రాక్రిట్స్-168
అరుణా పబ్లిషింగ్ హౌస్-197
అరుణా బాబూరావు-**197**
అరుణోదయ సంగీత నాట్యమండలి -**197**
అర్చనా నాటకం-197
అర్జున భంజనం-73
అర్థ ప్రకృతులు-**198**,614
అర్థోపక్షేపకం-180
అర్థోపక్షేపకాలు-179,**198**,473
అల్ఫ్రెడ్ కంపెనీ-104
అలంకరణ-221
అలంకార సంగ్రహం-19,**198**
అలంకారిక శాస్త్రం-491
అలహాబాద్ నాట్యసంఘ్-559
అలహాబాద్ విశ్వవిద్యాలయం-559
అలార్టిస్ నికాల్-326
అలి మహమ్మద్ లోన్-90
అలీన నటన-199
అలీన నాటక రంగం-199
అలెగ్జాండర్-196
అలెగ్జాండర్ పుష్కిన్-166,290
అలెగ్జాండ్రియా కంపెనీ-123
అలెగ్జే మాక్సిమోవిచ్ ప్యెష్కోల్-296
అల్కాజి, ఇబ్రహిం-**199**
అల్బర్ట్‌కమూ-140
అల్లాబక్ష్, ఎం-199,482
అల్లీముతా-618
అల్లూరి సీతారామరాజు-31,62,630
అవతారాంకం-179
అవతారిక-19
అవధాని, మల్లాది -34,39,**200**
అవమర్శ సంధి-200,614
అవమర్శ సంధ్యంగం-312
అవర్ టౌన్-150
అవరోహణగతి-200
అవస్థా సాదశ్యం-636
అవస్థాంతర సంక్షిప్తి-608
అవాన్‌గార్డే-172,174
అశోకం-462
అశోక సామ్రాట్-30,40
అశ్రుఘోష-578
అశ్వఘోషుడు-41,3,**200**,508
అశ్వనీ కుమార్ ఘోష్-79,80,**201**
అష్ట పదులు-9
అష్ట రసాలు-201

అసంగత వాదం-188
అసంపూర్ణ రామాయణం-39
అసంబద్ధ నాటకం-575
అసంబద్ధ నాటక విధానం-580
అసంబద్ధ నాటక రంగం-195
అసంబద్ధ నాటక శైలి-150
అసంబద్ధ నాటకాలు-440
అసంబద్ధ రూపకం-**201**
అసంబద్ధ వాదం-140
అసత్ప్రలాపం-202
అసమ పరాక్రమం-502
అసినొజెనోవ్, అలెగ్జాండర్ మైకోలెవిచ్ -202
అసుమితి వాదం-187
అసుర పరాజయము-1
అసుర సంధ్య-461
అసూచ్యం-202
అస్తిత్వ వాదం-140,202
అస్సామీ నాటక రంగం-72
అహల్యా సంక్రందనం-407
ఆంగికం-303
ఆంగికాభినయం-2,6,173,192,**203**, 479, 561
ఆంజనేయరాజు, షణ్ముఖి -**203**,245, 274,316,482,498,506,510,517, 583,526,528,566,573
ఆంజనేయశర్మ, వేమూరి-60
ఆంజనేయులు, ఎస్. కె. -45,46,67, **204**
ఆంజనేయులు, కుందుర్తి-**204**,514
ఆంజనేయులు, తంగిరాల -600
ఆంజనేయులు, సి. ఎస్. ఆర్.-**205**, 512
ఆండర్సన్, మాక్స్‌వెల్-149,**205**
ఆంద్రియన్సీ కెనడీ-151
ఆంద్రీ గ్రెగోరి-173
ఆంద్రీయేవ్, లివోనిడ్-**206**
ఆంధ్ర నాటక కళా పరిషత్తు-212,299
ఆంధ్ర ఆర్టిస్ట్ అసోసియేషన్-206
ఆంధ్ర ఆర్ట్సు థియేటర్-59,**206**,537
ఆంధ్ర ఎమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్- 292
ఆంధ్ర కళాభారతి-482
ఆంధ్ర క్లబ్-505
ఆంధ్ర గారిక్-313
ఆంధ్ర చరిత్ర నాటక పితామహుడు -28,594
ఆంధ్ర జ్యోతి-497
ఆంధ్ర డ్రమెటిక్ అమెచ్యూర్-564
ఆంధ్ర డ్రమెటిక్ కంపెనీ-544
ఆంధ్రతేజం-34
ఆంధ్ర డ్రమెటిక్ అమెచ్యూర్ సంస్థ-565
ఆంధ్ర డ్రమెటిక్ కంపెనీ-206
ఆంధ్ర దశరూపకం-419
ఆంధ్ర నట ప్రకాశిక-207,471
ఆంధ్ర నాటక కర్తలు-207,540
ఆంధ్ర నాటక కళ-207
ఆంధ్ర నాటక కళాపరిణామం-207
ఆంధ్ర నాటక కళాపరిషత్తు-40,49, **59**, 60, 61,62,63,64,65,186, 189,194, 213, 232, 243,246, 250,251, 263, 266, 272, 278, 290, 292, 293, 299,304, 314, 315, 319, 437,480,487, 494, 503, 510,511, 521,525, 537, 543,551, 556, 564, 571, 574, 576, 578, 585, 593, 595, 596, 601,602,620,625,631
ఆంధ్ర నాటక కళాశాల-241
ఆంధ్ర నాటక కళాసమితి-199,538
ఆంధ్ర నాటక కళోద్ధారకుడు-299
ఆంధ్ర నాటక దర్శిని-207
ఆంధ్ర నాటక నామావళి-207
ఆంధ్ర నాటక పద్యపఠనం-**207**,252
ఆంధ్ర నాటక పరిషత్తు-514,568
ఆంధ్ర నాటక పితామహుడు -**208**, 508,510,629
ఆంధ్ర నాటక రంగం-208
ఆంధ్ర నాటక సంస్కరణం-208
ఆంధ్ర నాటక సమాఖ్య-208,298
ఆంధ్ర నాటక సమీక్ష-209
ఆంధ్ర నాటకం - నాటక రంగం-211

ఆంధ్ర నాటకకళా పరీక్షా సమితి-514
ఆంధ్ర నాటకములు- రంగస్థలములు -183
ఆంధ్ర నాటక రంగ చరిత్ర-208
ఆంధ్ర నాటక రంగం-601
ఆంధ్ర నాటక సమాఖ్య-208
ఆంధ్ర నాటక సమీక్ష-209
ఆంధ్ర పత్రిక-512
ఆంధ్ర ప్రజా నాట్యమండలి-54,56, 58,61,70
ఆంధ్రప్రదేశ్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రిపర్టరీ-289
ఆంధ్రప్రదేశ్ థియేటర్-70
ఆంధ్రప్రదేశ్ థియేటర్ ఫెస్టివల్-209
ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ -261, 467,480,486,518,601
ఆంధ్రప్రదేశ్ నాటక సమాజం-278
ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం-42,43, **209**, 210, 211,246,261, 262, 304,519
ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి-128
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ -467
ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ-292
ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు-454
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ -43,197,209,211,242,277,450,

487,494,498,507,521,529,574,
ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి -520,601
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ-278, 309, 486,530,555,594, 602
ఆంధ్ర మహాసభ-505,522,537
ఆంధ్ర ప్రదేశ్ సంగీత అకాడమీ-243
ఆంధ్ర బాల గంధర్వ-204
ఆంధ్ర భాషాభిమాన సమాజం- 25, 26, **211**,479
ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం-562
ఆంధ్ర మహిళా సభ (చెన్నై) -314
ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర-211
ఆంధ్ర యూనివర్శిటీ డ్రమెటిక్ అసోసియేషన్-294
ఆంధ్ర రీసర్చి యూనివర్సిటీ-496
ఆంధ్ర లలిత కళాసమితి-65,505
ఆంధ్రలో నాటకం-నాటకరంగం-211
ఆంధ్ర విజయం-34
ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు-
ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు)- 30,40,51, 52, 64, 69,182, 189,190,208, 211, 267, 294,324, 454,461, 480, 483,507,512, 528,541, 548, 571, 583, 595,601,613, 314, 492, 513, 533, 550,569
ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగ నాటక సమితి - 40,53,54,214
ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగాత్మక నాటకాలు -47
ఆంధ్ర సారస్వత పరిషత్తు-292,548
ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్- 550
ఆంధ్ర శ్రీ-625
ఆంధ్ర సభ -511
ఆంధ్ర యూనివర్సిటీ డ్రమెటిక్ అసోసియేషన్-51
ఆంధ్రాభ్యుదయ నాట్యమండలి-639
ఆంధ్రాభ్యుదయోత్సవాలు-508,520
ఆ ఉదయం ఎప్పుడో!-44
ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం -282,294, 459,577
ఆకాశ భాషితాలు-20
ఆకాశ రామన్న-485,492,514,571
ఆకెళ్ల-**211**,281
ఆగండి కొంచెం ఆలోచించండి-280, 44
ఆగండి నేనూ వస్తున్నా!-45
ఆగస్ట్ కాంప్టే-139
ఆగస్ట్ ఫ్రెడెరిక్ వాన్ కోట్జెబ్యూ-143
ఆగస్ట్ విల్‌హెమ్ ఇఫ్‌లాండ్-143
ఆగియర్, ఎమిలి-139,**211**,547
ఆగ్రా బజార్-76
ఆచార్. పి.వి-212
ఆచార్య డి.వి. ఎ. - 211
ఆటం-290,464
ఆటపాట సంగీత రూపకం-609
ఆత్రేయ-26,30,40, 53,57,59, 61,62,64, 194,206, 208, 286, **212**,304, 437, 474, 506,511, 530,537,542,573,596, 613, 620
ఆత్రేయ ప్రజా నాట్యమండలి-291
ఆదమోవ్, ఆర్థర్-213
ఆదర్శ కళా భారతి-506
ఆదర్శ నాట్య కళాపరిషత్తు-590
ఆదర్శ నాట్య మండలి- 184,**213**
ఆదర్శ యువ భారతి-194,486,580
ఆదర్శ శిఖరాలు-268
ఆది శేషయ్య, కొడాలి -231
ఆదినారాయణ రావు-470
ఆదివిష్ణు-43,**214**,243,293
ఆధికారికం-214
ఆధునిక తమిళ నాటక పితామహుడు-616
ఆధునిక తెలుగు నాటకం-214
ఆధునిక నాటక రంగం - ఈ దశాబ్ది ప్రయోగాలు-214
ఆధునిక వీధి నాటకం-47,68
ఆన్ ట్రయల్-150,532
ఆనంద్, ఎ.బి.-215
ఆనందక్కుట్టన్-119
ఆనందమఠ్-460
ఆనందరావు, పాటిబండ్ల -45,46, **215**, 273, 470,483
ఆఫ్టర్ ది ఫాల్-461
ఆబీ థియేటర్-175,177,178, 227,238
ఆముఖం-216
ఆర్. కె. ప్రొడక్షన్స్-455
ఆరంభం-**216**,614
ఆరభటీ వృత్తి-2,**216**,449
ఆరియాన్ కూత్తు-94
ఆరుద్ర-514
ఆరె మారాటీలు-47
ఆర్కెస్ట్రా-133
ఆర్చర్, విలియం-216
ఆర్యక్రీడ-18
ఆర్యభవన్ థియేటర్-328
ఆల్ మై సన్స్-149,460
ఆల్ఫర్ లవ్-325
ఆలంబన విభావం-217
ఆల్ఫీర్, విటోరియో ఆమెడో - 217
ఆల్బర్ట్ కామూ-136,140,202
ఆవిద్ధ రూపకం-217
ఆశ-205
ఆశీర్వాదం, రాయపాటి-217
ఆశు నాటకం-218
ఆశ్చర్య చూడామణి-419
ఆశ్విక రూపకం-218
ఆషాఢ్ కా ఏక్‌దిన్-129, 469,580, 621

ఆసక్తి-218
ఆసాన్-305
ఆసామి-42,58
ఆసియస్, లూసియస్-219
ఆస్ట్రేలియా టూరింగ్ కంపెనీ-104
ఆస్ట్రోవస్కీ, అలెగ్జాండర్-166,**219**
ఆస్బోర్న్, జాన్-155,156,**220**
ఆహార్యం-208,**221**,303,526,547
ఆహార్యాభినయం-6,192,**222**,561, 593
ఆహ్లాద నాటకం-223
ఆహ్లాద రూపకం-**222**,223,326
ఇంజ్ , విలియమ్ (మోటర్)-224
ఇంటర్ లూడ్స్-152
ఇండియన్ ఎంపరర్-325
ఇండియన్ గ్యాస్-211,534,550
ఇండియన్ డ్రమటిక్ కంపెనీ-25, 63, 242, **224**, 298, 367,436, 499, 539,540,597
ఇండియన్ డ్రామా-294
ఇండియన్ నేషనల్ థియేటర్-251, 252, 304,505,520
ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా)-55, 68,76, 110, 124, 125,228,626, 111, 126, 434
ఇండియన్ రినైజాన్స్ అసోసియేషన్-512
ఇందిర, మందలపు -225
ఇందిరా పార్థసారథి-98
ఇంద్ర సభ-74
ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్-155
ఇంపీరియల్ థియేటర్-164,219
ఇగ్గప్ప హెగ్గడెయ వివాహ ప్రహసన-85
ఇదా ప్రపంచం-485
ఇన్ ది బర్నింగ్ డార్క్‌నెస్-442
ఇన్ ది షాడో ఆఫ్ ది గ్లెన్-176
ఇన్‌స్పెక్టర్ జనరల్-45,293, 471,595,562
ఇనప తెరలు-45
ఇనాక్, కొలకలూరి-24,225
ఇఫ్‌లాండ్-144
ఇబ్సన్, హెన్రిక్-**225**,226,76, 91, 100,114, 116, 120,124,139, 144,151, 160, 164,167,262, 281, 440,470, 480,548
ఇర్విన్, ఏక్సర్-172
ఇర్విన్, జి. -41
ఇలియట్ టి. ఎస్. -155,156,**227**
ఇల్లలికిన ఈగ-46
ఈ రోజు బ్రాకెట్-43
ఈట్స్, విలియం బట్లర్-175,177, 227,640
ఈడిపస్-46,131,365
ఈనాడు-212,437,494
ఈశ్వర్ చందర్ నందా-100
ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్-107
ఈహామృగం-217,**227**,447,464
ఉంగరాల జుట్టు విగ్గు-323
ఉండవల్లీ సాహెబు-25
ఉచ్ఛల విషాదం - 29
ఉత్కళ గౌరవ్-80
ఉత్కళ యువ సాంస్కృత సంఘ్ -559
ఉత్తర రాఘవం-535
ఉత్తర రామ చరిత-18,216,247, 280,295,313, 446,547, 602, 632
ఉత్తర రంగం-227
ఉత్తేజక్ మండలి-104
ఉత్పల్ దత్-110,111,228
ఉదయ నాథ మిశ్ర-81
ఉదయ సూర్యన్-97
ఉదయం మోటూరు -56,58
ఉదయభాను-46,47
ఉదయభాను కళానిలయం-527
ఉదాహరణం-280
ఉద్దీపన విభావం-**229**
ఉద్వేగం-229,280
ఉద్వేగస్మృతి-**491**
ఉన్మత్త దశాననం-502
ఉన్మత్తగతి-229
ఉన్మాదం-**229**
ఉప కథ-**229**,546
ఉపరితల దీపాలు-476
ఉప రూపకాలు-13,**230**
ఉపవేశన విధి-**230**
ఉపసంహాతి సంధి-**231**
ఉపేంద్రనాథ్ అష్క్-124
ఉమర్, ఆలీషా-**231**
ఉర్దూ నాటక రంగం-74
ఉలిపికట్టె-43, 438,485,570, 586, 593,
ఉల్లాప్యం-**231**
ఉషా పరిణయం-9,12,259, 317, 510
ఉషాబాల, రాచకొండ-**231**
ఉసురు-292
ఉస్మానియా విశ్వవిద్యాయం-70,289, 444, 447,478, 485,489,486, 520, 564,569,580,590
ఊబి-368
ఊరుభంగం-3,450,451
ఊరుమ్మడి బతుకులు-45,541
ఊరేగింపు-45,69,515
ఋగ్వేదం-1,2
ఋతుగానం-**232**
ఋత్విక్-461
ఎ ఉమన్ ఆఫ్ నో ఇంపార్టెన్స్-155
ఎ డెలికేట్ బ్యాలెన్స్-150
ఎంపరర్ జోన్స్-148,239
ఎక్సపెరిమెంటల్ థియేటర్-294

ఎక్సెప్షన్ అండ్ ది రూల్-288
ఎడారి కోయిల-46
ఎ డాల్స్ హౌస్-226
ఎడ్వర్డ్ అల్బీ - 150
ఎత్నిక్ ఆర్ట్స్ సెంటర్-69
ఎదురీత-583,610
ఎన్నిక-**232**
ఎన్నియస్, క్వింటస్-134,**233**
ఎన్విరాన్‌మెంట్ థియేటర్-434
ఎన్. జి. ఓ -40,61,311,485, 530,548,578, 212,494,582
ఎన్.టి.ఆర్, ఎలిమినేటి మాధవరెడ్డి స్మారక నాటక పరిషత్తు -312
ఎన్.టి. ఆర్. రంగస్థల పురస్కారం -245
ఎన్.టి. ఆర్. కళాపరిషత్తు-65
ఎపిక్-45
ఎపిక్ థియేటర్-43,146,193,220
ఎపిలోగ్-227
ఎప్పుడూ ఇంతే-39, 252
ఎమరాల్డ్ థియేటర్-109
ఎమిలీ జోలా-136, 139
ఎర్నెస్ట్‌టాలర్-193
ఎర్విన్ పిస్కేటర్-146
ఎర్‌స్క్వైన్ స్క్వేర్-53
ఎఱుకల కొరవంజి-8
ఎలిజబెత్ ది క్వీన్-206
ఎలిఫిన్‌స్టన్ డ్రమెటిక్ క్లబ్-92
ఎల్లమ్మ, చిందు-307,308
ఎల్.వి. ఆర్. ఆర్ట్ క్రియేషన్స్-273
ఎవరు దొంగ- 40,62,212,494
ఎవ్వనిచే జనించు-45
ఎస్.వి. రంగారావు కళాపరిషత్తు-65
ఎస్‌స్టేట్ గెట్రీబెన్-325
ఎస్కిలస్-63,130,131,132,**233**, 234, 236,323, 473
ఎ స్ట్రీట్‌కార్ నేమ్డ్ డిజైర్-149
ఏ వెలుగులకీ ప్రస్థానం-462
ఏక పాత్రాభినయం-**234**
ఏకాంకిక-**235**
ఏన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్-156
ఏన్ ఐడియల్ హజ్బెండ్-114,155, 604
ఏన్ యాక్టర్ ప్రిపేర్స్-192
ఏమి మగవాళ్ళు-39,501
ఏలూరు అమెచ్యూర్-298
ఏలూరు ప్రభాత్ థియేటర్స్-589
ఏలూరు మోతే కంపెనీ-539
ఏవం ఇంద్రజిత్-111,434
ఏషియో పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ -309
ఐక్యత్రయం-136,**236**
ఐరిష్ జాతీయ నాటకరంగ సంస్థ-175
ఐర్లాండ్ నాటక రంగం-175
ఐర్లాండ్ సాహిత్య రంగస్థలం-175
ఐవర్ నాటకం-**237**,238
ఐ హేవ్ బీన్ హియర్ బిఫోర్-426
ఒంటికాలి పరుగు-448
ఒంటెద్దుబండి-46
ఒకాసీ, సీన్-175,177, 178, 262,**238**
ఒథెల్లో-75, 104,112,116, 153, 269,436, 493,494,495,556
ఒపేరా-74
ఒరియా నాటక రంగం-77
ఒరియా నాటక సమ్రాట్-201
ఒరిస్సా థియేటర్-80,81,82,83
ఓజేసిక్ బోగస్ లావ్‌స్కీ-169
ఓట్టో బ్రహ్మ-144
ఓనీల్, యూజిని-43,148,149,151, 193,**239**
ఓపెరా-305
ఓబులయ్య, పత్తి-**239**
ఓరు ఇరవు-97
ఓల్డ్ పార్శీ థియేట్రికల్ కంపెనీ-123
ఓల్డ్ బాచలర్-250
ఓల్డ్‌విక్ బ్రిటీష్ థియేటర్ ట్రూప్-210
ఔత్సాహిక రంగభూమి-83
కంచుకి-**240**
కంచి కావేరి-78
కంచుకీయుడు-240
కంఠాభరణం-22,181,230,458
శ్రీనివాసన్, కందాడై -194
కంపోజిషన్స్-465
కకేషియన్ చాక్ సర్కిల్-116
కక్ష్య-**240**
కచటతపలు-39
కజూరామో ణో-162
కట్టి యంగారన్-335
కట్టియకారన్-98
కణ్వశ్రీ -24,42,**240**,542,556
కత్తి, ముసుగురూపకం-**241**
కథక్ శైలి-447
కథకళి-17,61,118,173,241,463
కథా సరిత్సాగర కథలు-450
కనకం టి. -316
కనక పుష్యరాగం-571
కనకతార-23
కనకలింగేశ్వర రావు, బందా-10, 52, 67, 231,**241**,245,274, 289, 480, 496,500,524, 526, 575, 583,590,624
కనియలాల్ మున్షీ-93
కన్నడ నాటక రంగం-83
కన్నడ భారతి-254
కన్నాంబ, పసుపులేటి - **242**,436
కన్యకాపరమేశ్వరి చరిత్ర-529
కన్యాశుల్కం-58, 32,38,85, 189, 190,210,251, 290, 313,437, 458,474, 477, 478,480, 486, 489,500, 513,519,534, 536, 543, 545,550,552, 561,571,

572,575,582, 595, 600, 640,
కప్పగంతుల మల్లికార్జున రావు-265
కప్పులు-41,212,231,310,508, 515,528, 582,613
కబీరు రామచంద్రారెడ్డి-514
కబీర్‌దాస్, చింతా-**243**
కబీర్‌దాస్, శనగల -**243**
కబూకీ-162,163, 326, **244**
కమలా నాట్యమండలి-245
కమలాదేవి ఛటోపాధ్యాయ-209,210
కమలాదేవి, అబ్బూరి -**244**,316,631
కమలాబాయి, సురభి -**245**
కమలాబాయి-50
కమాల్ సాహెబ్, కొండపేట -**246**
కరజియోన్ ఆల్ పాలజోడి గస్టిజియా -439
కరాళం -**246**
కరాళ రూపకం-**247**
కరాళరూపకం-247
కరాళాలు-130,244
కరుణ రసం-247
కరుణ విప్రలంభం-247
కరుణం-201
కరుణశ్రీ కళాసమితి-562
కరుణా భాసం-**247**
కరుణానిధి-97
కర్టన్ రైజర్-235
కర్ణభారం-450,451
కర్ణోక్తి-**247**
కర్నాడ్, గిరీష్ -86,87,**248**,283, 467
కర్పూర మంజరి-471
కర్ర బమ్మలాట-**247**
కలకత్తా థియేటర్ -106
కలాపం-**248**
కలికాళ -78
కలియుగ భారతం-406
కలైనర్ సూర్యనారాయణ శాస్త్రి అయార్-96
కలైక్యం-545
కల్పన కళానికేతన్-479
కల్హణుడు-88
కళత్రం-505
కళా కౌస్తుభ-273
కళా ప్రపూర్ణ రాఘవ కళాసమితి-293
కళాంజలి-624
కళాజగతి-194,266,281,597
కళాభిలాషక నాటక సమాజం-25, **249**, 539
కళారాజ్యం-487,488
కళారాధన, (హైదరాబాదు)-**249**, 448
కళావని-278
కళావాచస్పతి-314
కళావాణి-483
కళాసదస్సు-65
కళాసాగర్ (మద్రాసు)-601
కళాసాగర్ సంస్థ-304,455
కళాసాగర్-526,530
కళింగ రాధాకృష్ణ థియేటర్స్-82
కళ్యాణం రఘురామయ్య కళాపరిషత్తు -66
కళ్యాణ్‌సింగ్-300
కళ్ళు-43,458,596
కవాలమ్ నారాయణ ఫణిక్కర్-121, **249**
కవితా సమితి-514
కాంగ్రెస్‌వాలా-556
కాంగ్రేవ్, విలియమ్-**250**
కాంచన-302
కాంచనమాల-30,77,
కాంతయ్య, పాపట్ల-65,**250**, 270, 592
కాంతి ఫలితా-429
కాంతిమిశ్రమణం-476
కాకతీయ కళాపరిషత్తు-483,583, 633,
కాకరాల-31,67,**250**
కాకి ఎంగిలి-46
కాకినాడ ఎమెచ్యూర్స్ -**251**
కాకినాడ యంగమెన్స్ హాపీ క్లబ్-320
కాకువు -**251**
కాకేషియన్ చాక్ సర్కిల్-146
కాగూర-161
కాన్‌టెంపరరీ థియేటర్-174
కాబూలీ వాలా-576
కామపాల మిశ్ర-79
కామావస్థలు-**251**
కామెడి-322
కామెడీ ఆఫ్ ఎర్రర్స్-75,134, 256, 540
కామెడీలు-129,132
కామేశ్వర రావు, కవివరపు-**251**
కామేశ్వర రావు, భమిడిపాటి -39, 137,207,**252**,471,578
కామేశ్వర రావు, వి. ఎస్. -45,265
కామేశ్వర రావు, శ్రీపాద -26,29,34, 67,110,**253**,529
కామేశ్వరి-497
కారంత్, బి.వి.-86,87,**253**,517
కారల్‌మాన్ నాడగం-306
కారోలినా న్యూబెర్-141
కార్నీలా, పీర్ -136,137,**255**,169
కార్యం-614
కార్యజం-417
కార్యము-198
కార్యావస్థలు-**255**,614
కార్న్ వాలీస్ థియేటర్-587
కాలచక్రం-426
కాలజ్ఞానం-625
కాలైక్యం -255,545
కాల్డెరోన్ డె లా బార్కా, పెడ్రో -**256**

కాల్పనిక సంగీత రూపకం-609
కాల్పనిక్ సాంగ్ బాదల్-105,106
కాళరాత్రి-40,42,541,613
కాళిదాస కళారాధన సమితి-65,66 **257**,269
కాళిదాసు -4,5,19,21,25,73,107, **257**, 446, 452,469,479, 508, 560
కాళిదాస్ సమ్మాన్ అవార్డ్-255
కాళీచరణ్ పట్టనాయక్-80,81
కాళీపట్నం రామారావు-467
కాళీబాబు -80,81
కాళీయ మర్దనం-9
కాళీయదమన-73
కాళ్ళకూరి నారాయణరావు, రచనలు-258
కావ్యశాస్త్రం-195,546
కావ్యశ్రీ-43,258,501
కావ్యాలంకార శాస్త్రం-187
కాశీ కృష్ణమాచార్యులు-575
కాశీ విశ్వనాథ్-44
కాశీవిశ్వనాథ్-44,45
కాశ్మీరీ సుధర్ సమితి-89
కాశ్మీర్ నాటక రంగం-88,89
కింగ్ లియర్-144,153,254, 284,495
కిడ్, థామస్-141,152,228,**258**
కిన్నెర ఆర్ట్ థియేటర్-583
కిరాతార్జునీయం-9
కిర్పాసాగర్-100
కిర్లోస్కర్, అన్నాసాహెబ్ (బల్వంత్ పాండురంగ) -112,113,114,259, **258**,435
కిర్లోస్కర్ నాటక మండలి-112
కీచకవధ-9,113,259,538
కీర్తిశేషులు-40,43,62,269,462, 485,492, 506,515, 541, 568, 571
కుంభరాణా-24,29,35,556
కుక్క-45
కుక్కపిల్ల దొరికింది-43,271
కుత్రాల కురవంజి-8,94
కున్వార్జీ సొరాబ్జీనాజిర్-92
కుప్పుస్వామి, తడకలూరి -49
కుమరన్ ఆశాన్, కె. ఎన్. -118
కుమార శ్రీకంఠుడు-18
కుమార సంభవం-19
కుమార్ వి.-208
కురవంజి-20,94,207
కురుక్షేత్రం-79,85,207,245,274, 301,316, 504, 526,575,598, 600,603
కురుక్షేత్ర సంగ్రామం-24
కుర్చీ-46
కులంలేని పిల్ల-42,214
కులియమో ణో-162
కులీన్ కులసర్వస్య-107
కుల్గోడ్ తిమ్మన్న-263
కువాన్ హాన్ చింగ్-158
కూచిపూడి-192,463
కూచిపూడి భాగవతం-**259**
కూచిపూడి వీధి నాటకాలు-9
కూచిపూడి వీధి భాగవతులు-10
కూడియాట్టం-118,**260**,261
కూత్తనూల్-94
కూత్తు పట్టరై-98
కూరెళ్ల సోమేశ్వరరావు ట్రస్ట్ అవార్డు-288
కూలిరాజు-453
కృష్ణ ,ఎ. ఆర్. -209,210,252,**262,** 489,518,519,520, 534,557, 588,59545,184,209,231, 251, 263,288,289,293,513
కృష్ణవిలాస సభ, (అల్లూరు)-266
కృష్ణ పారిజాత నాటకం -263
కృష్ణ పారిజాతం-10
కృష్ణ విలాస సభ-295,514
కృష్ణ శర్మ, వెంకట మల్లాది -266
కృష్ణంరాజు, బి- **261**
కృష్ణకొల్హాట్కర్ శ్రీపాద -113
కృష్ణదేవరాయ నాట్యమండలి-520
కృష్ణన్, కె. ఎస్. -119
కృష్ణన్ పిళ్లై-119
కృష్ణ పక్షం-479
కృష్ణ పారిజాతం-624
కృష్ణమాచార్యులు, కిళాంబి -**263**,625
కృష్ణమాచార్యులు, శిరోభూషణం వెంకట -**264**
కృష్ణమిశ్రుడు -21,264,561
కృష్ణమూర్తి, చింతా -10
కృష్ణమూర్తి, చెన్నూరు -62,**264**,620
కృష్ణమూర్తి, పి.వి. -31
కష్ణమూర్తి శాస్త్రి, శ్రీపాద -22,24,28, 29,34,37,**265**, 281,625
కృష్ణమోహన్, మక్కాపాటి-**265**,493, 525, 541
కృష్ణ యాత్ర-472
కృష్ణవిలాస సభ-**266**
కృష్ణ లీలలు-12
కృష్ణశర్మ, మల్లాది వేంకట-**266**
కృష్ణశాస్త్రి, దేవులపల్లి-56,236,
కృష్ణాజీ-49
కృష్ణానంద హిందూనాటక సమాజం -266
కృష్ణాభిమన్యు-536
కృష్ణారావు, అత్తిలి-**267**,533
కృష్ణారెడ్డి ఎల్.వి-**257**
కృష్ణారావు జి.వి.-39,52,**267**
కృష్ణారావు, ముంజులూరి-63,**268**, 182,242,469,529
కృష్ణారావు, ముట్నూరి-208,**268**, 499

కృష్ణార్జున కాళగ-85
కృష్ణార్జున యుద్ధ్-123
కృష్ణ, పిళ్లైఎన్.-120,121
కృష్ణేశ్వరరావు, వై. ఎస్.-46,**269**
కెంజి సేతునాథ్-119
కెథారసిస్ -131,**270**,276
కేంద్ర సంగీత నాటక అకాడమీ-197, 575
కేంద్ర సాహిత్య అకాడమీ-190,195, 292,294,302,454,623
కేంద్రీకరణ దీపాలు-476
కేంద్రీయ విశ్వవిద్యాలయం -467,487
కేరళ వర్మ-118
కేర్ టేకర్-262
కేశవ దాసు, చందాల-23,270,592
కేశవ పిళ్లై, ఎమ్. డి.-119
కేశవ పిళ్లై, కె.సి.-118
కేశవ దేవ్, పి. -120
కైకస్రు నవరోజిక బ్రాజీ-91
కైజర్, జార్జ్-193
కైలాసం, టి.పి.-52,87,**270**
కైశికీ వృత్తి-2,15,363,620, **270**, 447,449
కొండమాచార్యులు, దూపాటి-34
కొండల రావు, కె. -542
కొండల రావు, నిడసనమెట్టు-**271**, 307
కొండల రావు, రావి-40,41,44, 43, 53,64,67,251,265,**271**,483,528
కొండుభట్టీయం-189
కొక్కొరోకో-44,438,464
కొచ్చిప్పన్ తరకన్-118
కొడుంగల్లూర్, కునుకుట్టన్‌తంపురాన్ -118
కొడుకు పుట్టాల-44,280,461,485, 550,571
కొత్తగడ్డ-39
కొయ్యగుర్రం-46,452
కొరవంజి -8,15,**271**
కొరిఫెకస్-130
కొఅత్త యాట్టమ్-8
కొట్టపాటి గంగాధరరావు నాటక పరిషత్తు-65
కోటయ్య, ఎడ్లపల్లి-281
కోటిరత్నం, దాసరి-**272**
కోటిశివ, నుసుము -**272**
కోటేశ్వర రావు, కాళిదాసు-565,602
కోటేశ్వర రావు, పి.ఎల్.వి -**273**
కోటేశ్వర రావు, సుఖమంచి -45,46,274
కోటేశ్వరి, ఆర్-**274**
కోటేశ్వరి దేవి, ఎ -**274**
కోడి రామకృష్ణ కల్చరల్ అసోసియేషన్ -479
కోన ప్రభాకరరావు కళాపరిషత్తు-66
కోన్రాడ్ స్వినర్స్కీ-172
కోపిట్, ఆర్థర్ -150,151,**275**
కోమల్ స్వామి నాడార్-98
కోమోస్-222
కోమోస్‌సాంగ్స్-130
కోయవేషం-55
కోరస్-84,130,164,181,473
కోరస్ రిపర్టరీ థియేటర్-483
కోరినెల్-165
కోలవెన్ను స్టార్ థియేటర్-61
కోలాటం-126
కోహలుడు-230,**275**,309,371,445
కోహినూర్-464,622
క్రమం-280
క్రాంతి కళామండలి థియేటర్స్-564
క్రాంతి థియేటర్-225, 400
క్రియేటింగ్ ఏ రోల్-167
క్రిస్టఫర్ మార్లో-125,141,606
క్రీడాభిరామం-13,18,19,438
క్రీనీడలు-42
క్రీప్ హెయిర్-323,435
క్రూర రూపకం-**275**
క్రూరతా నాటకరంగం-213
క్రేటినస్-132
క్రోధం-**275**
క్రోధరసం-276
క్లైస్ట్ బహుమతి-320
క్వింటస్ ఎన్నియస్-134
క్షాళన-**276**
క్షిప్తి -276,280
క్షీరసాగర మథనం-45,534
క్షేత్రయ్య-15
క్షేమేంద్రుడు-444,601
క్షేమేశ్వరుడు -**276**
ఖండ చూళిక-309
ఖండితగతి నాటకం-**276**
ఖజూరియా, విశ్వనాథ -**276**
ఖలూజాన్ కా ఖ్వాబ్-544
ఖాదర్, ఎం. ఎ. -556,602
ఖాదిల్కర్, కష్ణాజీ ప్రభాకర్-113, 114,116,**277**
ఖల్జీ రాజ్యపతనం-29,183,197, 303, 484,569,614,625
ఖూనీ-24
ఖోరిలస్ -**277**
ఖోరేవ్-165
ఖోర్షద్-92
గంగప్ప, ఎస్ -**277**
గంగాధర రావు, కొర్రపాటి -40,41, 53,67, 209,250,**277**, 492, 501, 503, 541, 571,581,594,601
గంగోత్రి-216
గంగోత్రి-584
గండం-**279**
గంధర్వ నాటక మండలి-287,435, 589

గంధర్వులు-13
గంభీర నాటకం-558
గణిక- 145,**279**,476
గగ్గయ్య, వేమూరి -274,**279**, 484, 518,526,573,592
గజపతి నాట్యమండలి- 316
గణపతి శాస్త్రి, టి. -3
గణపతి శాస్త్రి, పి. -450,451
గణేశ్ పాత్రో-44,**280**,461, 550, 572
గతి ప్రచారం-280
గయ సుకుమార్ రాస్-122
గయోపాఖ్యానం-11,21,22,63, 200,206, 207,224,251, 266, 284, 289, 303, 307,316,317, 437, 453,467,480, 482,484, 496, 499, 508,510,511, 512, 516, 518,525,526,527,529, 557,562,563,570,573,575,588, 590,598,600,602,603,608,615, 621,624
గర్భ సంధి -**280**,614
గర్భ సంధ్యంగం-186,229,337
గర్భాంకం-181,**280**
గర్ల్ స్కూలు-80
గవర్నమెంట్ ఇన్‌స్పెక్టర్-286
గృహస్థ రూపకం-286
గాంధీ జయంతి-549
గాంధీ నాటకాలు-**280**
గాంధీ మహోదయం-406
గాంధీ విజయం-23,29,281,406
గాంధీ విజయధ్వజం-24,26,29, 265, 281,
గాంధీ, సమ్మెట -**281**
గాంధీజీ-36
గాంధీ మహోదయం-23
గాన గంధర్వ-289
గార్గి, బల్వంత్-100,101,102,**281**
గాల్స్‌వర్దీ, జాన్ -114,155,**282**,501
గాలిగోపురం-448
గాలివాన-44,100,101,485, 501, 614,632
గావో జింగ్జియాన్ -160,**282**
గిరజాల టోపా-322
గిరిజా కల్యాణం-9,259
గిరీశ్ కర్నాడ్ (చూ. కర్నాడ్ గిరీశ్)
గిరీష్ చంద్ర ఘోష్-110,108, 109, **283**,545
గీతగోవిందం-105
గీర్వాణ రూపకం -**284**
గుంటూరు అఫీషియల్ డ్రమెటిక్ కంపెనీ-597
గుంటూరు ఫస్టు కంపెనీ - 23,24,25, 454
గుంటూరు మూన్ థియేటర్-484
గుంటూరు సెకండ్ కంపెనీ- **284**, 299, 521
గుంటూరు హిందూ నాటక సమాజం-24
గుజరాతీ నాటక మండలి-93
గుజరాతీ నాటక రంగం-91
గుడిసెలు కాలిపోతున్నై-453
గుడ్డిలోకం-62,492,494,497
గున్నేశ్వర రావు కంపెనీ-23, 285
గున్నేశ్వర రావు సత్యవోలు -250,**285**, 302, 307, 319, 484
గుబ్బి కంపెనీ-86,285
గుబ్బి వీరణ్ణ, హెచ్ -285,459
గుబ్బి వీరణ్ణ నాటక కంపెనీ-253
గురజ నాయుడు-285,469,499
గురజాడ కళామందిరం-564
గురజాడ కళాసమితి-65,515
గురవయ్య, బురక -11
గురుగోవింద్ సింగ్-99
గురు దక్షిణ-82
గురుదయాళ్ సింగ్ ఫూల్-100
గూడూరు కంపెనీ-25
గెటే-143
గెయిటీ థియేటర్-103,178
గేయ రూపకం -**286**
గేరిజిన్ థియేటర్-630
గొగోల్, నికోలాయ్ -165,166, **286,** 290, 514,595
గొట్హోల్డ్ ఎఫ్రయిమ్ లెస్సింగ్-142
గొడుగు పేట కంపెనీ-498
గొర్లు బోయినయ్-69
గొల్లకలాపం-9,10,11,249
గొల్లసుద్దులు-310
గోంధళే వీధి భాగవతం -**286**
గోగ్రహణం-46,70,71,444, 464, 515
గోడ్కరీ-116
గోథె-138,165,**287**,320,543
గోదావరీశ మిశ్ర-79
గోప రూపకం -**287**
గోపనాటకం-224
గోపరూపకం-609
గోపాలం, ద్వైతా-**287**,469,589
గోపాలకృష్ణ, అబ్బూరి -**288**
గోపాలకృష్ణ, కోగంటి-55,56,58,59, 68, **290**, 507
గోపాలకృష్ణ, గుమ్మడి -**288**,316,386
గోపాలకృష్ణ, దాసం -43,62
గోపాలకృష్ణ, రెంటాల -41,206,286, **290**, 464,
గోపాలకృష్ణ, మల్లాది -**289**
గోపాల కృష్ణమూర్తి, శ్రీపాద -236
గోపాలకృష్ణయ్య, నై. -479
గోపాలకృష్ణారావు,ఎరగుడిపాటి -194
గోపాలకృష్ణారావు, దొల్తాబాద-32
గోపాలఛెటర్‌రా స్-82
గోపాలరాయ ర్మ, కొండమ ి -26,

53,61,64,194,**291**
గోపాలరావు, ఆమంచర్ల -26,37,39, 52, 53, 256, **292**, 294
గోపాలరావు, కొడాలి - 26,31,40,41, 62, 67,235,**293**,492,569,592
గోపాలరావు, ఎ.జె -**292**
గోపాలరావు, ఏడిద -**292**,572
గోపాలస్వామి, కె.వి. -30,40,52,54, 63,208,210,267, **294**,480,519, 528,571,620
గోపాలాచార్యులు, ధర్మవరం-23,28, 32,33, 35,48, 234,**295**,629
గోపాల్, చిందు-308
గోపాల్ ఛోట్రం (గోపాల్ ఛోటరాయ్) -82,**291**
గోపాల్‌రాజ్‌భట్-435
గోపాల్‌రెడ్డి, బెజవాడ -489
గోపీచంద్, త్రిపురనేని -**295**,314, 505, 537
గోపీనాథన్ నాయర్, టి. ఎస్. -119
గోపీనాథ్, ఆమళ్ళదిన్నె -**295**
గోప్యార్థ గోపనం-**296**
గోరాశాస్త్రి-456
గోర్కీ, మాక్షిం -125,139,167,168, 290, **296**,544,639
గోల్డోనీ, కార్లో-165,167,297
గోల్డ్‌స్మిత్, ఆలివియర్-52,154,**297**
గోవింద బల్లాల్ డియోల్-112
గోవిందరావు, కోన-46
గోవింద విద్యాధర్-80
గోవిందపిళ్లై, ఎ. -118
గోవిందరాజులు, దాడి-297
గోవిందరావు, వనారస -47,49,50, 59, 60,**298**,549
గోవిందరావు, ఇందుపల్లి -**298**,499
గోవిందశాస్త్రి, మల్లాది -284,**299**, 518, 592
గౌతమబుద్ధ-40,292,435
గౌతమీ కల్చరల్ అసోసియేషన్-515
గౌతమీ నవ్య సాహిత్య సమితి-530
గౌరీశంకర నాట్యమండలి-563
గ్రాంట్ రోడ్ థియేటర్-102
గ్రాండ్ గయినాల్ -**300**
గ్రామవెలుగు నాట్యమండలి-359
గ్రామీణ నాటకం -**300**
గ్రిల్ పార్జర్, ఫ్రాంజ్ -**300**
గ్రీకు నాటక రంగం-90,129
గ్రీన్ గాడేస్-217
గ్రీన్ రూమ్-57
గ్రేట్ నేషనల్ థియేటర్-108
గ్రోటోవ్‌స్కీ, జెర్జీ-74,111,171, 172173,434
ఘృణాశుద్ధ జుగుప్స-320
ఘురామో ణో-162
ఘాశీరాం కొత్వాల్-117,254
ఘుమన్, కపూర్‌సింగ్ -**301**
చండాలిక-110
చండీప్రియ-255
చంద్రగుప్త-26,29,34,253,529
చంద్రన్న, హెచ్ -**301**
చంద్రశేఖర్, కంబార్-87,254,302
చంద్రశేఖర్, పానుగంటి -590,591
చంద్ర శేఖరం, కొల్లూరి -**301**
చంద్ర శేఖరం వి. -60
చంద్ర శేఖరం వేలూరి -30,**302**
చంద్ర శేఖర దాస్-472
చంద్ర శేఖరన్ నాయర్-120
చంద్ర శేఖర రావు ముద్దూరి -55
చంద్ర శేఖర రావు, మద్దుకూరి -68, 290
చంద్రశేఖర రావు, విడియాల -**302**
చంద్రహాస-552,636
చంద్రోదయం-505
చకితం-**303**
చక్రవ్యూహా-483
చతురస్ర నాట్యమండపం-18
చతురుడు-**303**
చతుర్విధ నాయకులు-**303**
చతుర్విధాభినయాలు-**303**
చరణదాస్-46
చరణ్‌సింగ్-99
చలం ఆర్. వి. -44,64,294,232, 235, **303**,470
చలం, గుడిపాటి వెంకట-**304**,462
చలపతి రావు, వేంకట శేషా అంబటి పూడి -**305**
చలపతి, హెచ్.వి. -596
చలపతి రావు టి. -59
చలపతి రావు, తుంగల -287
చలపతి రావు, నందిరాజు-**304**
చలపతి రావు, పెద్దిభట్ల-567,600
చలపతి రావు, సి.వి. -596
చవిట్టు నాటకమ్-118
చవిట్టు నాడగం-**305**
చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్-360
చాపల్యం-**306**
చావకూడదు-41,212,506
చింతామణి-23,32,64,181,200, 207, 225, 240,245, 246,258, 301, 316,317, 387, 437,482, 487, 488, 499,500,511, 516, 517,520, 527, 529,532,545, 563,568, 569, 570,573,575, 583, 585, 590, 597,602, 603, 615, 624, 640
చింతామణి థియేటర్-285,301
చింతామణ్ గణేశ్ కొల్హాట్కర్ -**114**, 272
చింతామణి నాటక సమాజం-250, 271,**307**,484
చింతామణి నాటకమండలి-319

చిందు భాగవతం-11,**307**
చిందు మాదిగలు-11
చికమాట్సు మోన్జామోన్-163,**308**
చిచ్చర పిడుగు-37
చిత్ర నళీయం-224
చిత్రకళా థియేటర్-504
చిత్రనళీయం-21,251,307,458, 473,499, 510,563,568,578, 590,615
చిత్రాభినయం -**308**
చినసత్యం, వెంపటి -10
చిన్నరామయ్య, వనారస -49,50,**308**
చిరంజీవరావు, కందుకూరి -458
చిరంజీవి, కె. -46,69,193, **308**, 489
చిరంజీవి, నార్ల -26,31,**309**
చిరుతొండనంబి-519
చిలకలూరి పేట సాంస్కృతిక సంస్థ-526
చిల్డ్రన్ ఆఫ్ పాల్స్-459
చిల్లరకొట్టు చిట్టెమ్మ-455
చీకటి తెరలు-40
చీమకుట్టిన నాటకం-548,559
చూళిక -198,309
చూళికాంకం-179
చూషింగీ యూరా-163
చెఖోవ్-124,139,147,160,164, 165, 166,167, 226,280,286, 296, **309**
చెన్న బసవేశ్వర నాటకసంఘం-285
చెన్నకేశ్వర నాట్యమండలి-562,623
చెన్నమల్లేశ్వర నాటక కళాపరిషత్తు-65, 66
చెన్నారెడ్డి, గుర్రం -29,**310**
చెర్రీ ఆర్చర్డ్-310
చెర్విరాల భాగయ-16
చెల్దేరోడె, మిషెల్ డి -**311**
చైతన్య ఆర్ట్స్-493
చైతన్య ఆర్టు థియేటర్-488
చైతన్య కళాస్రవంతి-310
చైతన్య తరంగం-44
చైతన్య లీల-77,553
చైనా నాటక రంగం-157
చో రామస్వామి, ఎస్-98,243,**311**
చోర్ ధారా ఝుమారా-73
చౌదరి, సి.వి -**311**
ఛత్రపతి శివాజీ-35,624
ఛల్‌ఛల్ గుర్రం-444
ఛాందోగ్యపనిషత్తు-490
ఛాదనం -**312**
ఛాయా రూపకం-**312**
ఛైర్మన్-41,293
ఛౌ-**312**
జంగం కథలు-20,208
జంగిల్ క్లబ్ - 624
జంఝూటి వెంకటి సమాజం-49
జంఝూటి వెంకుబాయి-50
జంతర్ పెట్టె-56,290,485
జక్కుల పురంధ్రి-13
జక్కుల కథ-13
జగధర్మ్-77
జగన్నాథ్, ఎస్. -503
జగన్నాథ్ ప్రసాద్, ద్వివేది-123
జగన్నాథ విలాసినీ సభ-25,**313**,595
జగన్నాథం, బంతలకోటి -11
జగన్నాథగిరి కళాపరిషత్తు-65
జగన్నాథరావు, ముక్కామల -34
జగన్నాథరావు, పత్రి -632
జగన్మిత్ర సమాజం-24,**313**,548
జగన్మోహన మోహినీ సమాజం-**313**, 498, 499,
జగన్మోహినీ నాటక సమాజం-183
జగమోహన్ లాల్ -77
జగ్గయ్య, కొంగర -31,40,**313**,525
జగ్గరాజు, ముప్పడి -25,63,263, 307, **314**
జన నాట్యమంచ్ కళాసంస్థ-626
జన నాట్యమండలి-69
జనతా ఆర్ట్ థియేటర్-82,83,225, 390
జనలీ ఘాట్ -12
జనాంతికం-**315**,412
జనార్ధన రెడ్డి, సిద్ధారెడ్డి-589,620
జన్య రూపకం-315
జన్‌కోషానోవ్స్కీ-169
జపాన్ నాటక రంగం-161
జబ్బార్ పటేల్-116,117
జమున-503
జమునారాయలు, ఆవేటి -**315**
జములకుల కథ-59,127,573
జమ్మూ కాశ్మీర్ ఆర్ట్స్ అకాడమీ-580
జయదేవుడు -4,105,**316**,451
జయరాం స్మారక కళాసమితి-576
జయరాజ్, గుమ్మడి -**316**,523, 527,598
జయవంత్, దాల్వీ-115
జయశంకర్ ప్రసాద్-124
జయశంకర్ ప్రసాద్ యుగం-123
జయా టాకీసు-285
జయాంధ్ర నాట్యమండలి-485
జరాసంధన కాళగ-85
జర్జర-**317**
జర్మన్ నాటక రంగం-141
జలయుద్ధ రూపకం -**317**
జవనిక (చూ. యవనిక)-**317**
జవ్వాది కల్చరల్ ట్రస్ట్-486
జస్టిస్-155,282
జాంబపురాణం-307
జాగీర్దార్ సిద్ధాంతం -2
జాతీయ నాటక మండలి-199
జాతీయ నాటకశాల-142
జాత్ర-105
జానకీ [illegible] థియేటర్-625

జానకీ రామశర్మ, వీరసూరి -**317**
జానపద కళారూపాలు-56
జానపద నాటకం-157,467
జానపద నాటకరంగం-8, 6
జానపద రంగభూమి-83
జానపద సంప్రదాయం-88
జానపద బ్రహ్మ-291
జానాబ్ కాశిం సాహెబ్-470
జాన్సన్, బెన్ -154,246,**317**
జాన్సన్, మోదుకూరి -43,44,52, 62,64, **318**,606
జాన్ గ్రీన్-141
జాయపసేనాని-433
జారీ, ఆల్ఫ్రెడ్ -318
జారుడు మెట్లు-46,622
జాషువా, గుర్రం -246,**319**,537
జి. ఎస్. ఆర్. మూర్తి నాటక కళాపరిషత్తు - 65
జితేంద్ర శర్మ (చూ. శర్మ, జితేంద్ర)-319
జీ జపాలి-72
జీన్ పాల్ సాత్రే-136,140,202
జీన్ రసీన్-136
జీమీ-162
జీవ కొరవంజి-8
జీవనశ్రీ -42,**319**
జీవపరిణామ సిద్ధాంతం-139
జుగుప్స-**320**
జుతియాన్ దాజరా-101
జువెనైల్ హిందూ థియేటర్-24
జూక్‌మేయర్, కార్ల్ -**320**
జూనో అండ్ ది పికాక్-238
జూరాస్ట్రియన్ నాటక మండలి-92
జూలియర్ సీజర్-37,153,314, 489, 546,547,586
జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్-292
జై భవానీ-494,503
జైమిని భారతం-538
జోకుమారస్వామి-87
జోగారావు, ఎస్వీ-7,211
జోగినాథం, గండికోట -52,**320**,470, 496, 575
జోరూరి-**321**
జోషి, ఎన్. ఎమ్. -126
జోషిపి.సి. -55
జోహన్ గాట్‌షెడ్-141
జ్ఞాన కొరవంజి-8
జ్యోతిర్మయి కళాసమితి-631
జ్యోతి సుబ్బయ్య కంపెనీ-49,298
జ్యోతీంద్రనాథ్ టాగూర్-107,109
జ్యోత్స్నాభిసారిక-194
ఝాన్సీలక్ష్మీబాయి-624
టప్పాలు-21
టాంబుర్లేన్ ది గ్రేట్-152
టాన్యా-55,56
టార్‌టఫ్-137
టాల్‌స్టాయ్, లియోకొలయవిచ్ -166, 290,**321**
టిర్సో డి మొలీనా -**321**
టీ కప్పులో తుఫాను-462
టీచర్స్ డ్రమెటిక్ అసోసియేషన్-191
టెన్నిస్సె విలియమ్స్-149
టెరెన్స్-135,137,142,152,155, 156, **322**,468
టోటల్ థియేటర్-288,311
టోపా-**322**
టోరెస్ నహారో, బార్టోలోమెడి -**323**
టౌన్ హాల్-106
ట్రాగోస్ సాంగ్స్-130
ట్రాజీ-కామిక్-324
ట్రాజెడి-322
ట్రాజెడీ నాటకాలు-132
ట్రిలజి-**323**
ట్వంటీ యత్‌కంపెనీ స్వాన్‌క్లబ్-570
ట్వెల్త్ నైట్-153,540
డమ్ డమ్ థియేటర్-106
డయొనిసస్ -63,130,132, 129,221, 234,323,557
డాక్టర్ చంద్ర శేఖరం-556
డాక్టర్ ఫాస్ట్-143
డాక్టర్స్ డైలమా-441
డాక్ ఘర్-111
డాన్ షెంకో-166
డార్విన్-139
డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం-547
డాల్స్ హౌస్-114
డిడెరాట్, డెనిస్ -138,**324**
డిథారాంబ్స్-129,130
డిమం -18,179,217,324,447
డియర్ ఆడియన్స్ సిన్సియర్లీ యువర్స్-469
డియోల్ జుంగర్‌రాల్-116
డిస్‌కంటిన్యూయిటీ-213
డీన్‌బద్రు -44,47,**324**
డెంగాకు ణో-161
డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మన్-460
డెనిస్‌ఫోక్ వినిజిన్-165,166
డెల్టారైతు-496
డైమెట్రీ ది ప్రిటెండర్-165
డ్యురెన్‌మట్, ఫ్రీడ్రిష్ -**324**,325
డ్యూమాస్, అలెగ్జాండర్ -138,**325**, 547
డ్రయిడన్, జాన్ -325
డ్రింక్ వాటర్, జాన్ -**326**
డ్రేమ్-138,**326**
ఢిల్లీ ఆర్ట్ థియేటర్-102
ఢిల్లీ నాట్యసంఘం-571
ఢోలక్ వాలా-328
ణో-161,**326**
తంజావూరు సరస్వతి మహల్ గ్రంథాలయం-379

తండువు-**327**
తందాన పాట-438
తపన సేన్-110
తపస్విని-108
తపస్సు-46,625
తప్పెవరిది-39,311,541
తమాయా యి బవ్రూస్, మానుయేల్
-**327**
తమాషా -116,**327**,328,329
తమిళ నాటక రంగగం-94
తమోభిసారిక-194
తమ్మన్న, అపరాల-263
తరంగాలు-44
తరుణ్ రాయ్ థియేటర్-111
తర్జని-469
తల్లిదండ్రులు-470
తాంత్రిక కామెడీ-223
తాజమహల్-80
తాదాత్మ్యం-**329**,590
తాదాత్మ్యవిచ్ఛిత్తి-199
తాయికొండ నాటక సమాజం-7,16
తారకరామారావు, నెమలికంటి - **330**
తారాబాయి-592
తారాశశాంకం-16,24,298,482,
487, 488, 512,573,598
తాలీబ్ బనారసీ-75
తాళమర్దళ-16
తిత్తి-333
తిరుపతి వేంకటకవులు-22,32,33,
280, 284,299,324,**330**,615,
636
తిరుపతి హరగోపాల్-602
తిర్యగ్విద్వన్మహాసభ-31
తిలకం, ఎం. ఆర్. -529
తిలకం-40
తిలకమహారాజు నాటకం-22,24,37,
265
తిలకురాయబారం-26
తిష్యరక్షిత-30,437,438
తీర్పు-464
తుగ్లక్-248
తుఫాను-40,538,541,556, 598
తులసీజలంధర-603
తూర్పు భాగవతం -10,**332**
తూర్పు వీధి భాగవతం-10
తెర -**333**
తెర నాటకం-7,**334**
తెరలో తెర-494
తెరుకూత్తు-95,98,99,**334**,466
తెలగ దాసరులు-11
తెలుగు ఏకాంకికా వికాసం-**335**
తెలుగు అకాడమీ-489,550,529
తెలుగు కోపం-41,278,494
తెలుగుతల్లి-530,592
తెలుగువారి జానపద కళారూపాలు
-337
తెలుగు దర్బారు కళాసంస్థ-527
తెలుగు నాటక కవులు-**335**
తెలుగు నాటక వికాసం-190,**336**
తెలుగు భాషాసమితి-212,507
తెలుగు లిటిల్ థియేటర్-**336**
తెలుగు వారి జానపద కళారూపాలు-
337
తెలుగు విజ్ఞాన పీఠం-216,477
తెలుగు సాంఘిక నాటకం-485
తొగలుగొంచె-85
తొల్కాప్పియమ్-94
తోటకం (త్రోటకం)-**337**
తోడ్డై మంగళం-16
తోలుబమ్మలు-**337**
తోలుబమ్మలాట-48,162,207,
208,308,311,321,
తోలుబమ్మలాట సిద్ధాంతం-2
త్యాగరాజ నాట్య కళాపరిషత్తు-590
త్యాగరాజు-15
త్యాగరాయ గానసభ -65,128
త్ర్యశ్ర నాట్యమండపం-**338**
త్రాసం-**338**
త్రిగతం-**338**
త్రిగూఢకం-339
త్రిజాకీయము దర్శనం-288,464
త్రిపుర దాహం-1,3
త్రిపురారి శర్మ -**339**
త్రిపురాంతకుడు రావిపాటి -18
త్రిమూఢకం-**339**
త్రివిధ నాయికలు-**339**
త్రిశూలం-4,30,258,280
థండర్ స్టార్-160
థామస్ డెక్కర్-154,459
థామస్ హేవుడ్-154
థియేటర్ ఆఫ్ ది అబ్సర్డ్-318
థియేటర్ గ్రూప్-199
థియేట్రికల్ సిండికేట్-148
థెమిల్-133
థెస్పిస్ -**339**
ద బెస్ట్ ఇయర్స్ ఇన్ అవర్ లైవ్స్-607
దంటు సూర్యారావు-470
దండం-**340**
దండకాష్ఠం-**340**
దండి-451
దక్ష యజ్ఞం-453
దక్షిణ నాయకుడు-**340**
దక్షిణ భారత ఆర్టిస్ట్
అసోసియేషన్-246
దక్షిణ భారత నటీనట సమాఖ్య-571
దక్షిణ భారత నాటక సభ-98
దత్తాత్రేయ శర్మ, అడుసుమిల్లి -**340**
దయావీరం-**340**
దయ్యం-463
దరిద్ర చారుదత్తం-450
దరిద్ర చారుదత్తం-451

దర్శకుడు-**341**
దర్శకుని అర్హతలు-342
దర్శకుని విధులు-342
దశ రూపకం-**343**
దశ రూపకాలు-**344**
దశరూపములు-532
దశావతారాలు-86,463
దృశ్య బంధ రూప కల్పన-**347**
దృశ్యకావ్యం-347,501
దృశ్యపరికల్పన-478,591
దృశ్యబంధం-461
దాదాబాయ్ సోరాబ్ పటేల్-103
దానవీరం-344
దామోదరన్, కె. -120
దారి తప్పిన ఆకలి-464
దారినపోయే దానయ్య-314,437
దాసరాట-**344**
దాస్, మనోరంజన్-**344**
దాస్-125
ది ఇన్స్‌పెక్టర్ జనరల్-514
ది ఎయిత్ డే-171
ది అదర్ ఫోర్-160
ది ఆర్ఫన్ ఆఫ్ చైనా-158
ది ఇండియన్ థియేటర్-86
ది ఇన్ క్రెడిబుల్-440
ది ఇన్‌స్పెక్టర్ జనరల్-166
ది ఎండ్ ఆఫ్ ది వరల్డ్-151
ది ఏడింగ్ మెషీన్-149,150,532
ది కాకేషియన్ సర్కిల్-443
ది కామెడీ ఆఫ్ ఎర్రర్స్-560
ది కేర్ టేకర్-156
ది కేస్ ఆఫ్ ఏ స్టైయిర్ కేస్-442
ది క్రూసిబుల్-149,461
ది గుడ్ ఉమన్ ఆఫ్ షెజ్వాన్-443
ది గుడ్ వుమన్ ఆఫ్ సెట్జువాన్-146
ది గ్రేట్ ఇండియన్ థియేటర్-182,
268
ది గ్లాస్ మేనేజరి-149
ది ఘోస్ట్-91
ది జూ స్టోరీ-150
ది డెత్ ఆఫ్ ఎ సేల్స్ మన్-149
ది త్రీ పెన్నీ ఒపెరా-116,442
ది త్రీ సిస్టర్స్-147
ది త్రీపెన్నీ ఆపెరా-146
ది థియేటర్ ఆఫ్ ది ఎయిత్ డే-171
ది థియేటర్ ఆఫ్ ది హండ్రెడ్-171
ది థియేటర్ ఫర్ అవర్‌సెల్ఫ్-168
ది పవర్ ఆఫ్ డార్క్‌నెస్-166,321
ది పిల్లర్స్ ఆఫ్ సొసైటీ-547
ది ప్లే బాయ్ ఆఫ్ ది వెస్టెన్ వరల్డ్-176
ది ఫస్ట్ థింగ్స్ ఆఫ్ పల్లాస్-323
ది బ్రిడ్జ్-160
ది బ్లూ బర్డ్-456
ది మూడీ లవర్-143
ది యంగ్ స్కాలర్-543
ది రిక్రూటింగ్ ఆఫీసర్-154
ది రూమ్-156
ది లివింగ్ థియేటర్-532
ది వీవర్స్-145
ది వే ఆఫ్ ది వరల్డ్-250
ది వేవ్స్ ఆఫ్ సీ అండ్ లవ్-300
ది షాడో ఆఫ్ ఎ గన్‌మాన్-238
ది సప్లయంట్-131
ది సర్వెంట్ ఆఫ్ టు అస్టర్స్-297
ది సిడ్-136
ది సిల్వర్ టస్సీ-177
ది సెవెన్ హూవర్ హాంగ్డ్-206
ది స్కూల్ ఫర్ వైఫ్స్-137
ది స్కూల్ ఫర్ స్కాండల్స్-154
ది స్కూల్ ఫర్ హజ్బండ్స్-134
ది స్టోరీ ఆఫ్ ది చాక్ సర్కిల్-158
ది హీథర్ ఫీల్డ్-175
ది హెర్డ్స్ మన్స్ మోనోలాగ్-558
దిజ్నాగ-**345**
దివాకరబాబు, ఎం-45,46
దివాభిసారిక-194
దివాళాకోరు-219
దివ్య ప్రకాశం-403
దివ్యలీలా రూపకాలు -**345**
దిష్టం-**346**
దిష్టిబమ్మలు-40,42
దీక్షితులు, ఎం.కె. ఆర్ -303
దీక్షితులు, చింతా -**346**
దీక్షిత్, డి.ఎస్-**346**
దీనబంధు కబీర్-495
దుఃఖాంత నాటకాలు-5
దుర్గా కళామందిరం-630
దుర్మల్లిక-**347**
దూత ఘటోత్కచం-450
దూతవాక్యం-450,451
దూరపుకొండలు-456
దృశ్యకావ్యం-**347**
దృశ్యబంధ రూపకల్పన-**347**
దేవదాస్, కనకాల-550,572
దేవభక్తుని నందీశ్వరుడు
కళాపరిషత్తు-66
దేవాంగ పిల్లులు-319
దేవీ ప్రసాదరాయ్ చౌదరి-503
దేవీవరప్రసాద్, సమ్మెట -**349**
దేశ్‌పాండే, పి. ఎల్-115
దేశభక్త కొండా వెంకటప్పయ్య-24
దేశీయ గ్రంథమాల-457
దైన్యం -**350**
దైవకతం-417
దైవ శాసనం-550,592
దైవా వతరణం-350
దొంగవీరడు-41,62, 293,310,
462,485, 586
దొంగాటకం-39
దొడ్డాట-85,263,466,624
దొణప్ప, తూమాటి -585

దొరా నీ సాపు మూడింది-486
దోష హాసం-**350**
ద్రావిడ మున్నేట్ర కజగం-97
ద్రౌపదీ స్వయంవరం-85
ద్రౌపదీ మాన సంరక్షణం-33
ద్రౌపదీ వస్త్రాపహరణం-23,33,469, 484
ద్వంద్వాభినయం-**350**
ద్వేష చాపల్యం-307
ధృతరాష్ట్ర కౌగిలి-46
ధృతి-351
ధనంజయ విజయము-578
ధనంజయుడు-229,251,312,320, **351**, 490,532,617
ధనికుడు-351
ధర్మరాజు గుళ్ళు-12
ధర్మవీరం-**351**
ధర్మసూరి, వారణాసి-21,578
ధర్మారావు, తాపీ-620
ధృతి-**351**
ధృవాగానం-**352**
ధృష్టుడు-**352**
ధాత్రీసభ-182
ధారానాట్యావధాన కళాపీఠం-516
ధార్వాడ నాటక కంపెనీ-96
ధార్వాడ నాటక సమాజం-21,24,25, 538
ధీర లలితుడు -**351**, 187,303
ధీర శాంతుడు-187,303,**351**
ధీరోదాత్తుడు-187,303,**351**
ధీరోద్ధత నాయకుడు-247
ధీరోద్ధతుడు-187,303,**351**
ధూలియా-72
ధ్వని ఫలితాలు-428
నందకరాజ్యం-31,38
నందన -**352**
నందనార్-96
నందమూరి తారకరామారావు రంగస్థల పురస్కారం-573
నందలాల్ కౌల్-89
నంది-**352**
నంది, ఎన్. ఆర్.-41,42,43,44,64, **352**,353,464,551,577
నందికేశ్వరుడు-1,327,393,427, 464, 626
నందినాటకోత్సవాలు-47,65,483, 526,549, 573,584,591, 601, 634,639,
నంబూద్రిపాద్, ఇ.ఎమ్.ఎస్. -127
నగరాజారావు, నెల్లూరు -60, 353, 381
నజర్ వాంజిమెహర్ వాంజి ఆరమ్-74
నట మిత్రమ్-354
నగరాజారావు, నెల్లూరు-**353**
నటన-**353**
నటమిత్రమ్-**334**
నట రత్నాలు-**354**
నట శిక్షణ-354
నట శిక్షణాలయాలు-111
నట సమాఖ్య-65
నటనాచార్య-243
నటనాలయం-62,438,550,565, 586, 621
నట ప్రకాశిక-524
నటరాజ కళాపీఠం-506
నటరాజ కళాసమితి-528,600
నటరాజ రామకష్ణ-10, 52
నటరాజు నాట్యమండలి-590
నటాలీ నాటక సంస్థ (తెనాలి)-**354**
నటాలీ సమాజం-512
నటాలీ సంస్థ-**536**
నటి -8,**354**,451
నటుడు-8,**354**
నటుడు-శిల్పం-**355**
నటేశయ్య, రాళ్ళపల్లి-**355**
నట్టువాంగం-17
నడుబీది నారాయణ-86,458
నతం-**356**
నతి-**356**
నృత్త రత్నావళి-433
నృత్తం-393
నృత్య రూపకం-394
నృత్యం-393
నృత్యరూపకం-556
నథింగ్ బట్ట్రూత్-214
నదీం, డి. ఎస్. -90
నన్నయ -19
నన్నెచోడుడు-19
నరకం మరెక్కడో లేదు-46,274
నరకాసుర విజయ వ్యాయోగం- 19,21, 566
నరకాసుర విజయము-578
నరనారాయణ-482,536
నరసరాజు డి.వి. -40,41,42,53, 67,231,269,571,293,**356**
నరసింగ రావు, బి. -580
నరసింగ రావు, మందుముల-590
నరసింహం, కూచి-**357**
నరసింహం, నిడమర్తి -551
నరసింహమూర్తి, ఆదోని-**357**
నరసింహమూర్తి, పీసపాటి -52,206, 245,316,**357**,480,482,484, 500, 510,566, 573,640,
నరసింహశాస్త్రి, నోరి-24
నరసింహ శాస్త్రి, మొక్కపాటి -**358**
నరసింహాచార్యులు, బి.టి.-63,**358**
నరసింహారావు, ఇ. ఎల్. -528,551
నరసింహారావు, కె. ఎల్. -41,42, 67,252, **359**,360,493,505
నరసింహారావు, జె. ఎల్. -67, **360**,528,540,578

నరసింహారావు, రేలంగి -470
నరసింహారావు, వల్లం -40,58, 59, **360**
నరసింహారావు, వి. వి. ఎల్. -60,251, **360**
నరసింహారావు, స్థానం -35,52,60, 62, 30, 274,304, 316, **361**, 482, 496, 512, 524,531, 575, 590,592, 600,630
నరసింహా రెడ్డి, ఉయ్యాలవాడ -537
నర్తకి-8
నర్తనకం-**362**
నర్తనశాల-24,510,623
నర్మం-**363**
నర్మ గర్భం -**363**
నర్మ ద్యుతి -**363**
నర్మ స్ఫింజం -**363**
నర్మ స్ఫోటం -**363**
నల్ల సముద్రం-633
నవకళావని-61
నవ జ్యోతి ఆర్టిస్టు్స అసోసియేషన్స్ -562
నవ నాటక్-107
నవ భారతి-290
నవ యుగం-36
నవ యుగారంభం-36,281
నవరస నటసమాఖ్య-479
నవ రసాలు -**363**
నవలా నాటక సమాజం -**363**
నవశక్తి-308
నవీన కామెడీ-132,223
నవోదయ ఆర్ట్స్ అకాడమీ-70
నవోదయ నాట్యమండలి-614
నవోదయ సంస్థ-69
నవ్య కళాసమితి-61,265,505
నవ్య సంప్రదాయవాదం-136
నవ్యాంధ్ర థియేటర్-311
నవ్వని పువ్వు-388
నా బాబు-41
నాంచారయ్య సి.హెచ్ -**363**
నాంది -3,8,15,113,364,454
నాగభూషణరావు, సింగరాజు -**365**
నాగభూషణం సి. -42,61,210, **364**, 488, 537,542,550, 556, 570
నాగభూషణ శర్మ, మొదలి -46,193, **365**,578
నాగమండలమ్-87,467,248
నాగమణి -**366**
నాగమ్మ-29
నాగయ్య, చిత్తూరు-**366**,496, 507, 519, 620
నాగానందం-4,22,569
నాగార్జున కళాసమితి-479
నాగార్జున కొండ-18
నాగార్జున విశ్వవిద్యాలయం-277
నాగేంద్ర రావు, పింగళి -34,224, **366,** 540
నాగేశ్వర రావు, అక్కినేని -63,182, 484, 523,576,620
నాగేశ్వర రావు, ఆవేటి -274,315, **367**
నాగేశ్వరరావు పంతులు, కాశీనాథుని -25,60, 235,482
నాగేశ్వరరావు, కృత్తివెంటి -285,**367**
నాగేశ్వరరావు, గొట్టిముక్కల-**368**
నాగేశ్వరరావు, చీమకుర్తి -**368**
నాగేశ్వరరావు, తేలప్రోలు -**368**
నాగేశ్వరరావు, వంటెద్దు-592
నాగోటౌకి-158
నాచి-329
నాచ్యపార్య-327
నాజర్-55,56,58,**369**,538
నాజర్ కరన్గే-93
నాటక్ త్రుచె-90
నాటకం-4,40,42,45,61,181,231, **370,** 447,478,571
నాటక కళ-**371**,556
నాటక కళాధురీణ-246
నాటక కవిత-325
నాటక దర్శిని-593
నాటక దీపిక-**371**,500
నాటక నిర్ణయం-637
నాటక పరిభాష-19
నాటక పరిషత్తులు-63
నాటక ప్రయోగం (1963)-**371**(గ్ర)
నాటక ప్రయోగం(1964)-**371**(గ్ర)
నాటక భేదం-337
నాటక లక్షణాలు-**372**
నాటక విద్యాలయం-**372**
నాటక విమర్శ-**372**
నాటక వ్యాఖ్యానం-**373**
నాటక శాల-**376**
నాటక శాస్త్రం-500
నాటక శిల్పం-**377**
నాటక సమీక్ష-**377**
నాటక సర్వస్వం-**377**
నాటకీయ వ్యంగ్యం -**377**
నాటకోపన్యాసాలు-**378**
నాటిక-4,18,378
నాట్యం -**378**
నాట్యకళ (నాటకకళ) -60,**379**
నాట్య అశోకం-**379**
నాట్య ధర్మి -**379**
నాట్యగోష్ఠి-298
నాట్య రాసకం-**380**
నాట్యభారతి-267
నాట్యరసాశ్రయమ్-353
నాట్య విద్యాలయం-489,513
నాట్య శాల-**380**
నాట్యకళావిశారద-243

నాట్యదర్పణం-412
నాట్య శాలలు-18
నాట్య శాస్త్రం-1,5,7,9,18,20, 88, 190, 192, 201,227,260, 315, 329,**380**, 479, 580, 591, 593, 617
నాట్యాంబుజం-**381**
నాట్యాలంకారాలు-**382**
నాట్యాలోచన-88
నాట్యావధానం-**382**
నాట్యోత్పలం-**382**
నాదశుద్ధి-**382**
నాబన్న-110,111
నాబాబు-62,492,494
నామకరణం-**382**
నాయకుడు -**383**
నాయకురాలు-24,26,29,34,35
నాయర్, ఎస్.కె. -118
నాయర్, ఎమ్. ఆర్.-119
నాయికాలంకారాలు -**384**
నాయుడు గోపి -46,**384**
నారాయణ, పి. ఎల్. -64,67, 269, **388**, 389, 478
నారాయణ, సి. ఎల్-**389**
నారాయణ, సి.ఎస్ -390
నారాయణ, మాచినేని -55,59
నారాయణ నంబియార్,కె.సి. -118
నారాయణ నాయుడు, వై-**385**
నారాయణ దాసు, ఆదిభట్ల -10,14, **385**,502
నారాయణ మీనన్ వల్లత్తోళ్ -118
నారాయణ రావు, కాళ్ళకూరి -23,32, 38, 181, 188,258,**386**, 535, 537, 545, 615
నారాయణ రావు, చిలుకూరి -**387**, 462
నారాయణ మూర్తి, నందిరాజు -**386**,584
నారాయణ రావు, బిందా-455
నారాయణ రావు, రూపనగుడి -**388**
నారాయణరావు, మోతే-469,524
నారాయణ రెడ్డి, సి -26,236,437, 519,**388**
నారాయణ శాస్త్రి, యజ్ఞ -525
నార్‌కాలిక్కారన్-98
నార్త్‌డకోటా విశ్వవిద్యాలయం-206
నాలుగిళ్ళ చావిడి-44
నాలుగో గోడ -**390**
నాసరయ్య, కన్నెగంటి-**390**
నికలోయో ఎవరినోవ్-168
నికలోవ్ పొడిగిన్-168
నికోలస్ నాడగం-306
నిజోంబమ్ ఇబోబీసింహ-**390**
నిజం-43,534
నియతాప్తి-200,218,255,**391**,614
నియోక్లాసిజమ్-138
నిరంజన రావు, తోట -**391**
నిర్దోష దశరథం-502
నిర్మల-62,64,213
నిర్లిప్త వైఖరి -**391**
నిర్వహణ సంధి-231,**392**,614
నిర్వహణ సంధ్యంగం-351,614
నిశాభిసారిక-194
నిశ్శబ్దం కోర్టు నడుస్తోంది-262
నిషిద్ధాక్షరి-483
నిష్ఫలం-39
నీ బ్రతుకెంత-319
నీటి కాకి-309
నీతి రూపకాలు -392
నీరు పాయ్-614
నీలి దర్పణ్-108,460
నీలి దీపాలు-46,309
నీల్ సైమన్-150,151
నూట పదహార్లు-456
నూతన ప్రసాద్ - 67,232,249, **392**, 448,520
నూరేళ్ల తెనాలి రంగస్థలి -**392**
నూరేళ్ల తెలుగు నాటకరంగం-**393**
నూర్జహాన్-110
నృత్తం-**393**
నృత్యం-**393**
నృత్యరూపకం-**394**
నెపోలియన్ నాడగం-306
నెఫ్జా నాటక కళాపరిషత్తు-290
నెప్జా పరిషత్తు (నెల్లూరు) -488
నెల్లూరు నాటక కళ-**394**
నెహ్రూ నాట్య మండలి-523
నేను మరణించాను-46
నేపథ్య గృహం -**394**
నేపథ్య జవిధి -**394**
నేపథ్యం-39
నేపథ్యగానం-466
నేవియస్ -134,**395**
నేషనల్ ఆర్ట్ థియేటర్-284,432, 457,525
నేషనల్ థియేట్రికల్ సొసైటీ-**395**
నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా-90,124, 125, 199,254,288, 290,302, 517
నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా - రీజనల్ రిసోర్స్ సెంటర్స్ -**396**
నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా అండ్ ఏషియన్ థియేటర్ ఇనిస్టిట్యూట్ -**395**
నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రిపర్టరీ కంపెనీ -**396**
నో ఎక్జిట్-202
నోబెల్ బహుమతి-456
నోయల్, కోవార్డ్ -155,**397**
నౌకా చరితం-609
నౌటాంకీ-125
న్యూ ఆల్‌ఫ్రెడ్ కంపెనీ-123
న్యూ కామెడీలు-468

న్యూ థియేటర్స్-124
న్యూ పూర్ణా డ్రమెటిక్ థియేటర్- 49, 266,315
న్యూ పూర్ణానంద థియేటర్స్-367
పరివర్తనం -401
పంచనాదం, మద్దెల -289,**397**
పంజరం-42
పంజాబీ నాటక రంగం-99
పంజాబ్ విశ్వ విద్యాలయం-282,301
పండగొచ్చింది-214
పండితారాధ్య చరిత్ర-7,12,276
పంతం పద్మనాభం నాటక కళాపరిషత్తు-65
పకీరప్ప-48,298
పక్క పాపాడి విగ్గు-323
పక్కింట్లో పుట్టండి-46,269
పగటి వేషాలు-20,207,208,**398**
పగడందీయన్-276
పటాక్షేపం-334,**398**
పట్టాభిరామయ్య, బుద్ధవరపు -32,35
పట్టాలు తప్పిన బండి-271
పడమటి గాలి-46,215
పతంజలి-3
పతాక -198,**398**
పతాకాస్థానకం-**399**
పతిత పావన-35
పత్నీ ప్రసాదం-73
పథ్ నాట్యసారోహ్-70
పద్మనాభ రంగాలయ-78
పద్మభూషణ్-314
పద్మరాజు, పాలగుమ్మి-42,**399**
పద్మలోచన-79
పద్మవ్యూహం-32,34
పద్మాబాయి నాట్యమండలి -**399**
పద్మావతి, అత్తిలి -45
పద్మావతీదేవి, కొమ్మూరి -**400**
పరబ్రహ్మ పరమేశ్వర-270
పరమేశ్వర శర్మ, నేతి -**400**
పరావర్తం-**400**
పరాశక్తి-97
పరిక్రమం-**400**
పరిక్రమణ-6
పరిఖండ-312
పరిఘట్టన-**401**
పరిచారికలు-**401**
పరివర్తనం-**401**
పరిష్కృతి-456
పర్యుపాస్తి -**401**
పల్నాటి యుద్ధం-274,310,316
పల్నాటి వీరచరిత్ర-26,29
పల్లథోల్-241
పల్లెపడుచు-40,61,191,213,225, 267,311
పసడేనా ప్లే హౌస్-104
పసుపు బట్టు పేరంటానికి-458
పాంచాల్ గోవర్ధన్ ప్రేమ్‌చంద్ -**401**
పాంచాల పరాభవం-23,29,36,281, 406,
పాండవ విజయం-22,224,251, 266,284,299,324
పాండవాజ్ఞాత వాసం-454
పాండవోద్యోగం-199,203,224,324
పాండు రంగయ్య, ఎ-**401**
పాండురంగా రావు, దేవరకొండ వేంకట -**402**
పాండురంగా రావు, పి -**402**
పాక్యూవియస్ -**402**
పాణిని నట సూత్రాలు-3
పాణినీ-4
పాత కామెడీ-132
పాత్ర చిత్రణ-**402**
పాత్ర భంగిమ-**404**
పాత్రోన్మీలనం-**404**
పాదుకా పట్టాభిషేకం-63,203,232
పామర్రు కంపెనీ -**404**
పారి పార్శ్వకుడు-216,**404**
పారిజాతాపహరణం-9,11,73,259
పార్వతీశం, వోలేటి -**404**
పార్థసారథి, వై.జి-311
పార్శీథియేటర్-96,123,276
పార్శీ నాటక కంపెనీ-102,103
పార్శీ నాటక మండలి-91,102
పార్శీ నాటక రంగం-102
పార్శీ నాటక సమాజాలు-75
పాలేరు-453
పింటర్, హారల్డ్ (చూ. హారల్డ్ పింటర్)-**404**
పింపరాగుచ్ఛం-73
పిగ్మేలియన్-101,155,441
పిరాండిల్లో, లూగీ-**404**
పిలకటోపా-322
పిల్లర్స్ ఆఫ్ ది సొసైటీ-226
పిస్కేటర్-146
పీటర్ ది గ్రేట్-164
పీటర్‌బ్రూక్-173
పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయం-206
పీఠమర్ధుడు-**405**
పుండరీకాక్షుడు, దామరాజు -23,29,35,36,37,280,**405**
పుట్టస్వామయ్య, బి. -85,86
పుణ్యస్థలి-62,40,42
పున్నయ్య, కోనూరి -55,56,58, 291, **406**
పురాణ కాలక్షేప సిద్ధాంతం-2
పురిసై కన్నపు తంబిరాన్-95
పురుషోత్తం దార్వేకర్-115
పురుషోత్తమకవి, నాదెళ్ళ-20,21, 24, 27, 79,**407**
పురుషోత్తమ రావు, అయ్యదేవర-**408**, 563,640
పురుషోత్తమ శాస్త్రి, నాదెళ్ల -67,**408**
పులిడ్జర్-149,150,239

పులీ మేకలస్తున్నాయి జాగ్రత్త-44, 324
పుష్కరభాన్-90
పుస్తం -**409**
పూర్ణ, సురభి -**409**
పూర్ణచంద్ర రావు-409
పూర్ణచూళిక-309
పూర్ణయ్య పంతులు, చట్టిచిన-60, **409**
పూర్ణశ్రీ నాట్యమండలి (తెనాలి) -**410**
పూర్ణిమ, ఆవేటి -49,50,60, 67, 186, **410**
పూర్వ కామెడీ-223
పూర్వ రంగం-411
పూర్ టర్-173
పృథ్వీ థియేటర్-76
పృథ్వీ రాజ్‌కపూర్-52,55, 61,76, 124, 210,240, **411**
పెండింగ్ ఫైల్-41,278
పెండ్లి చూపులు-42
పెకింగ్ ఒపేరా-159,160
పెద్దన, అల్లసాని -211
పెద్ద బాలశిక్ష-46,69,71
పెద్ద రామయ్య-50
పెరుమాళ్ళు, సూరపనేని లక్ష్మీ -64, 55,**411**
పెస్తోంజి ఫ్రెంజి నాటకకంపెనీ-74
పాటాఫిజిక్-318
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం -70,200,211, 214, 225,270, 271, 288,289, 296, 304, 305, 310, 314,317,444, 506, 511, 525, 685, 601
పోతుగడ్డ-58
పోలాండ్ అండ్ అత్నెన్యూమ్ థియేటర్-174
పోలాండ్ జ్యూయిష్ స్టేట్ థియేటర్-171
పోలాండ్ నాటక రంగం-169
పోలాండ్ పబ్లిక్ థియేటర్-169
పోలిష్ లేబరోటరీ థియేటర్-172
పోస్టర్ థియేటర్-111
పౌరాణిక (పద్య) నాటక రంగం-20
పౌరాణిక నాటక చక్రవర్తి-204
ప్రకరణం-**412**
ప్రకరణి-**412**
ప్రకరి-198,**412**
ప్రకాశం-**412**
ప్రకాశం పంతులు, టంగుటూరి -25, 412, **413**
ప్రగతి-40,212
ప్రగతి కళామండలి-65
ప్రజా నాట్యమండలి-40,55, 57,59, 63,127, 206,208, 214,225, 250,251, 274,278, 290,310,314,360
ప్రతాపరుద్ర యశోభూషణం-18,19, **413**
ప్రతాపరుద్రీయం-23,26,42,43, 181,182, 210,229, 262,268
ప్రతాప రెడ్డి, సురవరం -29,**414**
ప్రతి కరాళ రూపకం -**414**
ప్రతి ముఖ సంధి-**414**
ప్రతిభా పురస్కారం-87
ప్రతిశోధ్-80
ప్రతిస్పందన-46
ప్రతీకవాద ధోరణి--145
ప్రతీకవాదం-139,**415**
ప్రతీకాత్మక ధోరణి-43
ప్రతీకాత్మక నాటకాలు-176
ప్రతీకారం-**415**
ప్రత్యక్ చైతన్యావస్థ-201
ప్రత్యభినయం-**415**
ప్రదీప్ కుమార్ -**415**
ప్రపంచ నాటక చరిత్ర -22,28
ప్రపంచ నాటకరంగ ధోరణులు చారిత్రక నేపథ్యం-**415**, 456
ప్రబూలాల్ దివేది-93
ప్రబోధ చంద్రోదయం-20
ప్రబోధ చంద్రోదయం-3,4,21,264
ప్రభాకర నాట్యమండలి-62
ప్రభాకరశాస్త్రి, వేటూరి-14
ప్రభాకర్, గొల్లాపిన్ని -**416**
ప్రభాత్ థియేటర్ ఏలూరు-241,242, 268
ప్రయత్నం -255, **416**
ప్రయోక్త-1,**416**
ప్రయోగాత్మకాలు-177
ప్రయోజనం -**417**
ప్రవాసం -**417**
ప్రవాస స్మర దశలు -229,418
ప్రవృత్తి-**418**
ప్రవేశకం-198,324,**419**
ప్రవేశాదులు-5
ప్రశస్తి-**419**
ప్రసన్న-87
ప్రసన్నరాఘవం-20,316
ప్రసన్న రాఘవ నాట్యప్రబంధం-20
ప్రసాద్,చిల్కా -**419**
ప్రసాద్, జయశంకర్ -**420**
ప్రసాద్, బి.పి. -46
ప్రసాద మూర్తి, ఎం. -47,**420**
ప్రసాద రావు, హరి -420
ప్రసాద రెడ్డి, జి. ఎస్.-47,67,70,422
ప్రస్తావన -8,6,15,216,**423**,509
ప్రస్థానకం -**423**
ప్రహసనం-**424**
ప్రాంప్టర్ - ప్రాంప్టింగ్-**424**
ప్రాచీన పాశ్చాత్య నాటక రంగం -**424**
ప్రాచీన రీతి ఆహ్లాద నాటకాలు-196
ప్రాణబంధుకరొ-81

ప్రాప్త్యాశ-255,**425**
ప్రాప్తి -**425**
ప్రారంభం-255
ప్రార్థన-280
ప్రాసంగికం-**425**
ప్రియోక్తి-**425**
ప్రీతి సుధాకర-80
ప్రీస్ట్లీ, జె.బి -155,156, 262,**425**
ప్రెస్ వర్కర్-128
ప్రేంఖణం -**426**
ప్రేక్షకులు-**427**
ప్రేక్షణకం-**427**
ప్రేమ్‌చంద్-75,76,126
ప్రేమకారంత్-87
ప్రేమానంద్ గజ్వీ-117
ప్రేయో రసం -**427**
ప్రొద్దుటూరు నాటక కళాపరిషత్తు-66
ప్రోషిత భర్తృక -**427**
ప్లాటస్ -134,135,137,142,152,
322,**427**
ప్లీడర్ గుమాస్తాల కంపెనీ-395
ఫణి-42,45,184,232
ఫణిక్కర్, కె. ఎమ్. -118,120
ఫర్ బ్రాడ్‌కాస్ట్ డెవెలప్‌మెంట్-309
ఫలయోగం -231,255,**428**
ఫలాగమం-**428**
ఫలితాలు-428
ఫాంటోమైమ్-133
ఫాంటోమైమ్ థియేటర్-172
ఫార్సు-**430**
ఫార్కుహార్, జార్జ్ -**429**
ఫియర్-202
ఫెడ్రా-136
ఫెల్లియాస్ ఎటీ మెలిసాండే-139
ఫోర్త్‌వాల్-138
ఫ్రాంజీ-102,104
ఫ్రాయిడ్-149
ఫ్రినికస్-**430**
ఫ్రీ థియేటర్ సొసైటీ-164
ఫ్రీజ్-44,150
ఫ్రీడ్రిష్ షిల్లర్-327
ఫ్రెంచి నాటకరంగం-136
ఫ్రెడరిచ్, లుడ్విగ్ ఫ్రోడర్-142
ఫ్రెడరిచ్, హెబ్బెల్-144
ఫ్రెడ్‌రిచ్, షిల్లర్-143
ఫ్లెచర్, జాన్ -154, **430**
బంకించంద్ర చటర్జీ-105,460
బంగారయ్య, నండూరి -34,**430**
బంగారరాజు, కొత్తపల్లి -**430**
బంగారు సంకెళ్ళు-40,41,278
బందరు నేషనల్ థియేటర్-298
బందరు రామమోహన్ థియే టర్-
285
బట్టతలటోపా-322
బడలోకాలు-77
బయలాట-431
బయలాటలు-12
బయలు నాటకాలు-12
బర్గ్ థియేటర్-144,146
బలరాజ్ సహాని-55,102, 124,231,
290
బలరామకృష్ణయ్య, అట్లూరి -**432**
బలరామమూర్తి, కె.వి -46,**432**
బలరామయ్య, అయితా -**432**
బల్సారే, కె.బి. -116
బళ్ళారి రాఘవ కళాపరిషత్తు-66
బస్ స్టాప్-282
బసవపురాణం-19
బసవయ్య, తుపాకుల -55
బస్తీదేవత యాదమ్మ-46,255
బహుభాషా నాటక పోటీలు-274
బహురూపం-**433**
బహురూపాలు-7
బహురూపి-111,**434**
బాంక్రప్ట్-166
బాంబే టాకీస్-124
బాగు బాగు-39,252
బాజీరావు-11-327
బాణాసుర వధ-88
బాణుడు-112
బాదల్ సర్కార్-45,69,71,111,
173, **434**
బానిస నాటక రంగం-171
బాపిరాజు, అడివి -52
బాబాజీ-77
బాబు సాహెబ్ -**434**
బాబురావ్, ఎస్. ఎ. -50
బాబూరావ్ పావర్ -**434**
బాల్ కొల్హట్కర్-115
బాలకృష్ణ, తులసి -**435**
బాల గంధర్వ-112,**435**
బాల గంధర్వ నాట్యమండలి-61
బాలగంగాధర తిలక్-112,113
బాల చందర్ కైలాసమ్-**436**
బాల నాగమ్మ-24,240,242,245,
308,316
బాల మిత్ర నాటక సమాజం- గుంటూరు
-**436**
బాలమిత్ర సమాజం-319
బాల సుందరరావు, గాలి -60
బాల సుందరశాస్త్రి, గబ్బిట -224,**436**
బాలాత్రిపుర సుందరి నాట్యమండలి
-204
బాలీవాలా నాటకమండలి-92
బాలె -164,**436**
బిందువు-198
బిపిన్ చంద్రపాల్-188,395
బిబిలియోటికా నేషనల్-327
బియాండ్ ది హొరైజన్-148,239
బిల్వమంగళ్-104
బిల్డింగ్ ఏ క్యారెక్టర్-167
బీజం -198,**437**

బీజపాలి-72
బీభత్స రసం-**437**
బుచర్-187
బుచ్చిబాబు -26,30,42,53,**437**
బుచ్చిశాస్త్రి కంపెనీ-313
బుట్టయ్యపేట హాలు-241
బుడ్డయ్య చౌదరి, ఊట్ల -67,**438**
బున్రా కుకెన్-163
బున్‌రాకు-308
బుర్ర కథ -20,55,56,58,59, 126, 127,207, **438**
బుష్‌నర్ జార్జి -144
బురోసాలికర్ ఘరేరోన్-108
బెంగాలీ నాటకరంగం-105
బెంజమిన్ వేడ్కైండ్-145
బెటీ, ఊగో -**439**
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం -71,253
బెనావెంతే-యి-మార్తినెజ్, జాసింతో -**439**
బెర్నార్డ్, జీన్-జేక్విస్ -**440**
బెర్నాడ్ షా, జార్జి-52,76, 101,124, 121,139,151,155, 160, 164, 226, 228 ,239, **440**,547
బెహాన్, బ్రెండన్-**441**
బబ్బిలి యుద్ధం-22,34,181
బమ్మరిల్లు-42,43
బోల్షోయ్ నాటకసంస్థ-165
బ్యూక్నర్, జార్జ్ -**441**
బ్యూయేరో వలేజో, ఆంటోనియో -**442**
బ్రహ్మయ్య శాస్త్రి, కాశీభట్ట-26
బ్రాడ్ వే-110,150,151
బ్రాహ్మవివాహం-38
బ్రిజ్‌లాల్ శాస్త్రి-100
బ్రిటన్ నాటకరంగం-152
బ్రెష్ట్ బెర్టోల్డ్ - 116,146,151,158, 160,164, 168,193,199,220, 228,262, 320,325,324,**442**
బ్లాక్ ట్రాజడీ-116
బ్లాక్ థియేటర్-151
భక్తతుకారామ్-29
భట్ట నారాయణుడు-4,19,21, 107, **444**
భట్టతౌతుడు-**444**
భట్టిమ-72,73
భయం-40,41,212
భయానక రసం-**444**
భయానకం-201,**444**
భరణి, తనికెళ్ల -45,70,46,**444**
భరత్ చంద్ర-107
భరత పుత్రులు-1,**445**
భరత వాక్యం -2,3,6,15,113,**445**
భరతముని (భరతుడు) -1,2,5, 7,9,18,88,193,195,221, 227, 229,275, 308,312,317,327, 329,370
భరతముని సిద్ధాంతం -1
భరతార్ణవం-192,327
భవభూతి -4,19,179,**446**
భవై -91,**447**
భస్మాసురన కాళగ-85
భాగ్‌బజార్-283
భాగత్ మహమ్మద్ సుభన-89
భరతమేల నాటకములమేలత్తూరు-15
భాగ్యనగరం-31,309
భాణం -3,18,**447**
భాణిక-**447**
భాతొ-81
భానుప్రకాశ్, బి.-44,47,67, 249,**447**
భానుమతి-62
భామాకలాపం-9,10,11,249,333
భారతి దాసన్ -**448**
భారతి, ధర్మవీర-124,258
భారతీ థియేటర్స్-82
భారతీ నాట్యమండలి-61
భారతీ దాసన్-97
భారతీదుర్దశ-122
భారతీయ నాటక కళాసమితి -**449**
భారతీయ నాటక పరిషత్తు-66
భారతీయ నాటక రంగం-87
భారతీయ నాట్య సంఘం-43,210
భారతీ వృత్తి -2,180,**449**
భారతేందు హరిశ్చంద్ర -77,**449**, 450
భారత్ నాట్యమందిర్-117
భావ ప్రకాశనం -1,17,230, 412,**450**
భాస నాటక చక్రం-4,253,**450**
భాసుడు -3,4,118,253,296,**451**
భాస్కరచంద్ర, ఎ-46,**452**
భాస్కర రావు, ముద్దా వెంకట -**452**
భాస్కర రావు, వాసిరెడ్డి -360
భాస్కర్, శివాల్కర్-47
భికారీ చరణ్ పట్నాయక్ -79
భిక్షాపాత్ర-268
భీభత్సం-201
భీముఖండం-12
భీమన్న, బోయి -41,42,**453**
భీమసేన విలాసం-16
భీమా రావు, ముప్పవరపు-**454**
భీష్మ-80
భీష్మసహానీ-125
భుజంగ రావు, మంత్రి ప్రగడ -**454**
భూమిలూటీ-73
భేతాళ ప్రశ్న-46
భోజ్‌పూర్-122
భోనా-72
భ్రమణ రంగ స్థలం-163
మంజరీ మధుకరీయం-20,37

మంజుఖమర్-76
మంజోనీ, అలెస్సాంద్రో-**454**
మంత్రి శ్రీనివాసరావు ఎస్. ఆర్. -210
మందులు, కె-47,**454**
మృచ్ఛకటిక-4,18, 42,43,112, 193, 216,230, 253,262,292, 412
మృణాల్‌సేన్-127
మణిమాల-231
మణిమేఖలై-94
మణిలాల్ త్రిభువన దాస్-93
మణిలాల్-93
మదర్ కరేజ్-146,199,443
మదువెహెణ్ణు-87
మద్రాసు మ్యూజియం థియేటర్-62
మద్రాసు విశ్వవిద్యాలయం-182
మధుసూదన్, వనం -**455**
మధుసూదన దత్-77,105,107, 108,109,283
మధుసూదనరావు, చుండూరు -386
మధుసూదనరావు, దుక్కిపాటి -61
మధుసేవ-23,181,258,387
మధ్య కామెడీ-132
మధ్యకాలరీతి ఆహ్లాద నాటకాలు-196
మన భంజనోపాయం-340
మన శ్రీరంగం-**455**
మనసు - వయసు - 212
మనిషి చావకూడదు-455
మనోహర్, ఆర్. ఎస్.-97
మయకవోస్కీ-168
మరాఠీ నాటకం-117
మరాఠీ నాటక రంగం-112,115
మరో మొహెంజుదారో-43,44,62, 455
మర్చంట్ ఆఫ్ వెనీస్-75,106,153, 264,314
మల్లమ్మదేవి, ఉసురు-39,292
మల్లికార్జున రావు, కప్పగంతుల -67,265,**456**
మళయాళ నాటకరంగం-118
మహమ్మద్ బిన్‌తుగ్లక్-98
మహమ్మద్ ముజీబ్-76
మహాత్మాగాంధీ-35
మహాభారతం-2,3,6,104
మహారాష్ట్ర నాటక మండలి-112
మహావీర చరిత్ర-303
మా సమాధులే మీ పునాదులు-274
మాక్బెత్-153
మాక్స్ రీన్‌హార్ట్-145
మాక్స్‌ఫిష్కీ-324
మాక్స్‌వెల్ ఆండర్సన్-149
మాట తప్పకు-44,304
మాణిక్యం, దుర్వాసుల -11
మాణిక్యశర్మ, చక్రావధానుల -33,35, 50, **457**
మాతంగ చూడామణి-96
మాతృదాస్య విమోచనం-32
మాతృపూజ-82
మాత్సర్య చాపల్యం-307
మానవుడు-43,258
మానేపల్లి కంపెనీ -315,**457**
మాన్ - అప్‌మాన్-113
మాఫేయీ, ఫ్రాన్సెస్కో సిపియోనీ -**457**
మాభూమి -35,40,57,58, 59,62, 128, 182,201
మాయాబజారు-240
మారని మనిషి-456
మారుతీ నాట్య మండలి -**458**
మారుతీ రావు, గొల్లపూడి -43,62, 64, 239,293,360,**458**
మార్కస్ పాక్యూలియస్-134
మార్గం-280
మార్గశీర్ష -**458**
మార్తోభవ-46
మార్వాడీ విద్యాలయాలు-126
మాలతీ మాధవం-320
మాలపల్లి-36,45,262
మాలీ థియేటర్-220
మాళవికాగ్ని మిత్రం-4,22,25, 257, 258
మాస్కో ఆర్ట్ థియేటర్-167,296, 310
మాస్కో వర్తక వర్గ బాల్జాక్-219
మాస్కో విశ్వవిద్యాలయం-219,309
మాస్టర్జీ-310
మాస్టర్ హిరణ్ణయ్య -**458**
మాస్తి వెంకటేశయ్యంగార్-86
మాస్క్-313
మింగ్ హువాంగ్-157
మిడిల్ కామెడీ-133
మిడిల్‌టన్, థామస్ -43,108,154, 155,**459**
మిత్తర్ పియారా సాహిత్య అకాడమీ-101
మిత్ర, దీనబంధు -108,**460**,587
మిలిటరీ నాటకాలు-159
మిల్లింగ్టన్ సింజ్, జాన్ -176
మిల్లర్, ఆర్థర్ -149, 150, 151,262,**460**
మిశ్రమ చూళిక-309
మిశ్రో, ఎస్.కె -**461**
మిసెస్ వారెన్స్ ప్రొఫెషన్-155
మీరైతే ఏం చేస్తారు?-45
మీర్‌ఖాసిమ్-82
ముందడుగు-35,40,57,59,62,182
ముంబాయి నాటక మండలి-92
ముంబాయ్ విద్యాపీఠం-112
ముఖాంగరచన-221
ముత్తుస్వామి, ఎన్ -98,99
ముద్దుకృష్ణ, సామినేని-52,236,294, **462**

ముద్రారాక్షసం-4,18,25,46
ముని వాహనుడు-225
మునిసుందరం, ఎస్ -31,**462**
మురయప్పెణ్-98
మురళీ మోహన్-289
మురారి-4,19
మూకాభినయం-17,53,150,**463**
మూడలపాయ-**466**
మూడో నాటక రంగం-111
మూన్ థియేటర్ -**467**
మూర్తి, డి. ఎస్. ఎన్-47,70,**467**
మ్యూనిచ్ ఆర్ట్ థియేటర్-145,146
మెథడ్ ఆఫ్ ఎక్టింగ్-167
మెనాండర్-132,133,**468**
మెర్సి డేరియన్ ఆర్డర్-321
మెలోడ్రామా-155,168
మెసీంజన్ కోర్టు థియేటర్-144
మేకప్ అన్నయ్య -**468**
మేకప్ కిట్-221
మేక్బత్-106,112,116,284
మేఘనాథ్ వధ్-109
మేఘూట్-12
మేటర్‌లింక్ మోరీస్-136, 139, 167,253,**456**
మేయర్ హోల్డ్-167,173
మేరీ ఆఫ్ స్కాట్‌లండ్-206
మేలత్తూరు భాగవతమేళ నాటకాలు -17
మేలత్తూరు భాగవతులు-17
మేలుకొలుపు-273
మేవాడు రాజ్యపతనం -29,34,225
మై డ్రీడ్ గోస్ టు వాషింగ్టన్-97
మై లైఫ్ ఇన్ ఆర్ట్-167
మైత్రి రసాలు-**468**
మైమ్ థియేటర్-111,133
మైలవరం కంపెనీ-23,183,250, 287, **468**
మొబైల్ థియేటర్-71
మోతీలాల్ రే-105
మోతేవారికంపెనీ, ఏలూరు-25,**469**
మోర్బీ ఆర్యసుబోధ నాటకమండలి-93
మోలియర్-39,99,112,132,136, 137, 138,142,165,169,253
మోలోడ్రామా-98
మోహన్ రాకేష్ -124, 396,**469**
మోహనరావు, ఇసుకపల్లి -45,46, 273,**469**
మోహన్‌సింగ్ దివానా-100
మోహినీ రుక్మాంగద-11, 307
మౌస్ ట్రాప్-156
మ్రోజెక్ సాల్వమెర్ -171,172,173
యంగ్ ఆర్టిస్టుల అసోసియేషన్ నెల్లూరు -319
యంగ్‌మెన్స్ హేపీ క్లబ్-25,65,**470**
యక్ష గానం-6,7,11,12,14,17,20, 45,84, 85, 207, 263,
యజుర్వేదం-1,2
యజ్ఞం-467
రంగాలంకరణ-**481**
యజ్ఞ నారాయణ శాస్త్రి, ఇచ్ఛాపురపు -23, 28,34,63,**470**
యజ్ఞనారాయణ శాస్త్రి, పసుమర్తి -28, 207,208,**471**
యజ్ఞన్న శాస్త్రి, సోమంచి -42,282, 286,**471**
యథాప్రజా తథారాజ-41,278
యయాతి-248
యవనిక-**471**
యాగ్నిక్, ఆర్.కె. -86
యాచకులు-456
యాత్ర (జాత్ర)-**471**
యానాదుల భాగవతాలు-12
యాన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్-426
యాన్ ఎనిమీ ఆఫ్ ది పీపుల్-226
యాన్ యాక్టర్ ప్రిపేర్స్-167
యుగసంధ్య-69
యుపోలిస్-132
యురిపిడీస్-63,99,130,131,132, 136,196,228,233,237,302,323, **473**
యువ కళాభారతి-243
యువ కళావాహిని-46,304, 316, **473**
యూనియన్ ఆఫ్ పోలాండ్ స్టేజ్ ఆర్టిస్ట్స్ -170
రంగం-180,**473**
రంగ ప్రకాశనం-**474**
రంగముల్లు-301
రంగముని, డి-**477**
రంగస్థల వ్యవహారం-**477**
రంగస్థల శాస్త్రం-263
రంగస్థలి (నర్సారావుపేట)-66,**479**
రంగస్వామి, సరస్వతుల-**479**
రంగాచార్య, ఆద్య-**479**
రంగాచార్యులు పరవస్తు, వేంకట -20,21,**479**
రంగారామ్, పి.వి-**480**
రంగారావు, కొచ్చర్లకోట -469
రంగారావు, బి.వి.-**480**
రంగారావు, సాక్షి-**480**
రంగాలయ-79
రంగూన్ రౌడీ-23,264,292,303
రంగ్నేకర్, ఎం.జి. -114
రక్త కన్నీరు-42,365
రక్తి-**481**
రఘునాథ థియేటర్-78
రఘునాథ నాయకుడు-7
రఘునాథ బ్రహ్మభట్-93
రఘునాథ రాయలు-14
రఘునాథవిలాసం-18
రఘునాథపండా-81

రఘుబాబు, పరుచూరి -65
రఘురామయ్య, కళ్యాణం(ఈలపాటి) -232, 245,274,316,**481**
రజనీకాంతరావు, బాలాంత్రపు -52, 215, 236,402,**482**
రజనీనాగరాజు-**482**
రజితమూర్తి, సి.హెచ్-**483**
రణబోధ్ భాయ్-93
రతన్ థియ్యామ్-**483**
రత్తయ్య, ఉప్పాల వేంకట-**483**
రత్తయ్య, కడియాల -469,**484**
రత్నమాల-79
రత్నావళి-21,107,179
రత్నాసాగర్-**485**
రమణ్‌జీ, ఎ.వి-**485**
రమణ, పి.వి. -44,67,**485**
రమణ, రేబాల -316,**487**
రమణ ప్రభు, జె-**486**
రమణ మూర్తి, జె.వి. -42,64, 67, 251, 290,**486**
రమణ మూర్తి, డి.వి. -40, 45,46, 67, 458,**487**
రమణయ్య, బి.టి.వి-**487**
రమణారావు, కోపల్లి వేంకట-**488**
రమణారెడ్డి, కె.వి.-43,265, 464,**488**
రవి ఆర్ట్ థియేటర్స్-42,314,**488**
రవీంద్రనాథ టాగూర్-91,107, 109,125, 227,266,**488**
రవీంద్రారెడ్డి, ఎన్-**489**
ర.స.న సమాఖ్య-42,243, 231, 289,293, 458,**492**
రష్యా నాటక రంగం-164
రస నిష్పత్తి-381
రసం-1,490
రసఝురి-269
రసపుత్ర విజయం-23,28,470
రస మంజరి-17
రస మాధురి-239
రసాభరణం-19
రసార్ణవ సుధాకరం-19,384, 418,**492**
రసీన్, జీన్-136
రాంప్రసాద్, కె.జి. -47,**493**
రామ్‌గణేశ్, గడ్కారీ-113,114
రామ్ జోషి-327
రామ్ లీలా-101
రాగ చాపల్యం-307
రాగ రాగిణి-43,62,184,239,458
రాగ వాసిష్టం-453
రాఘవ బళ్ళారి -28, 39, 52,67, 246,295,298,**494**
రాఘవ కళాసమితి-62,**494**,504
రాఘవ తంబిరాన్ కంపెనీ-95
రాఘవ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ -357
రాఘవన్-5
రాఘవయ్య, యార్లగడ్డ-**496**
రాఘవయ్య, వేదాంతం-10
రాఘవరావు, కె.వి-**496**
రాఘవరావు, న్యాయపతి -**497**
రాఘవాచారి, టి-**497**
రాఘవాచారి, బుల్లి-**498**
రాఘవ స్మారక నాటక కళాసమితి-303
రాఘవాచార్యులు, బి.టి. -224, 313, **498**
రాఘవాభ్యుదయం-18
రాజకుమారి, ఐతంసత్య-**500**
రాజ ప్రాసాద నాటక రంగం-169
రాజ రాజ కులోత్తుంగుడు-18
రాజకీయ నాటకరంగం-111
రాజకీయ వీధి భాగోతం-69
రాజగోపాల్-55
రాజగోపాల విలాసం-16
రాజతరంగిణి-88
రాజపుత్ర తేజఃపుంజం-34
రాజమండ్రి అమెచ్యూర్స్-253
రాజమన్నార్, పి.వి. -39,42,52,53, 61,183, 236,**500**
రాజరాజ వర్మ, ఎ. ఆర్. -118
రాజరాజేశ్వరి-94
రాజశేఖరుడు-4,19,**502**
రాజా ఈడిపస్-46,365
రాజారామిరెడ్డి, పెల్లేటి-**501**
రాజారావ్ మెమోరియల్ ఆర్ట్స్ అకాడమీ-70
రాజారావు, గరికపాటి -40,52,56, 57, 58, 59,63,64,68,126,127, 208, 209,250, 265,278,360, **502**,515, 531
రాజారావు, రొద్దం- 61,**504**
రాజావిక్రమదేవవర్మ-22,64
రాజా శివానంద-**504**
రాజీవం-43,464
రాజేశ్వరరావు, దాపులూరి-**505**
రాజేశ్వరి-186
రాజ్యం, కె-**506**
రాణాప్రతాప్-30,253
రాణాప్రతాపసింహుడు-26,34
రాణీ సంయుక్త-34
రాధా, ఎం. ఆర్. -42,96
రాధాకృష్ణ, భమిడిపాటి -41,43,64, 67,243,293,**506**
రాధాకృష్ణ, సర్వేపల్లి-22,64
రాధాకృష్ణ థియేటర్స్-77
రాధాకృష్ణ నాటకం-186
రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని-40, 55, 56,58, 59, 206,208,291, 337, **506**
రాధాకృష్ణమూర్తి, వేమూరి-**507**
రాబర్ట్ ఎడ్మండ్ జోన్స్-148
రాబర్ట్ బ్రౌన్-141

రాబర్ట్‌సన్, టి. డబ్ల్యూ. -155

రామకృష్ణ, గుమ్మలూరి-**508**

రామకృష్ణమాచార్యులు ధర్మవరం- 21, 23, 27,33,34,35,32,63, 96, 186, 191,194,207,208,217, 227, 234, 284,295,296,421, 494, 495

రామకృష్ణమాచార్యులు, నండూరి -35, 208,236

రామకృష్ణమూర్తి, పాతూరి-**510**

రామకృష్ణయ్య, పులుగుండ్ల -64,**511**

రామకృష్ణయ్య, నేలనూతల-**511**

రామకృష్ణశాస్త్రి, త్రిపురారిభట్ల-**511**

రామకృష్ణ శాస్త్రి, మల్లాది -236

రామకృష్ణారావు, అబ్బూరి -24,42, 43, 210,**512**

రామకృష్ణారావు, గోవిందరాజుల -473

రామచంద్రన్, ఎమ్.జి. -96

రామచంద్ర మహాపాత్రో-81

రామచంద్రారెడ్డి, పర్వతరెడ్డి -28,266, **514**

రామచంద్ర శాస్త్రి, కోరాడ -20,37, 183, **513**

రామచంద్ర శాస్త్రి, మారేపల్లి -48, 49, 249,**513**

రామచరణ్ ఠాకూర్-72

రామకోటయ్య, భాగవతుల-10

రామదాసు చరిత్ర-27

రామదాసు, బెల్లంకొండ -23,41, 42, 64, 251,286,293,295,**515**

రామన్ పిళ్లై, సి.వి. -119,120

రామన్న పంతులు, విన్నకోట -289

రామనాటకం-9

రామనాడగ కీర్తనై-95

రామనాథం, టి.జె. -46,**515**

రామనాథ శాస్త్రి, కపిలవాయి -303, 469,**515**

రామనాథశాస్త్రి, ధారా -235,265, **516**

రామనారాయణ్, తారకరత్న-107

రామ నాటకం-9

రామ నాడగ కీర్తనై-95

రామమూర్తి, గరిమెళ్ల -67,360

రామమూర్తి, బంతలకోటి -11

రామమోహన్ థియేటర్-298

రామమోహన కొరవంజి-8

రామమోహన రావు, మహీధర -202, 215

రామమోహనరావు, సురభి వనారస- **517**

రామయ్య, వేమూరి -386,**517**

రామరాజు చరిత్రం-22,27,28

రామిలింగయ్య, అల్లు-503

రామలింగశాస్త్రి, చావలి-**518**

రామలింగస్వామి, మీగడ-24,**519**

రామలింగేశ్వర రావు, మందపాటి -67

రామలీల-312

రామవిలాస సభ -25,246,361,**519**

రామశంకర రాయ్-77,78,80

రామశాస్త్రి, భాగవతుల -9

రామసుబ్బా రెడ్డి, పొన్నాల -28, 275, 519

రామస్వామి, ఆర్.వి. ఎస్. -43,44, 249,**520**

రామస్వామి, ఎస్. ఎన్-**520**

రామస్వామి, ఎమ్. -98

రామస్వామి, బండారు-**521**

రామస్వామి చౌదరి, త్రిపురనేని -24, 52, 294,462,**521**,522,565

రామస్వామి నాయకర్ ఇ.వి. -97

రామాంజనేయులు, తిరునగరి -68, 69,310,**522**

రామానుజరావు, సోమరాజు -23,26, 28, 29,32, 33,34,35, 36, 281, **522**

రామానుజసూరి, వరయూరి-**523**

రామానుజాచార్యులు, పంచాంగం వేంకట-469,**523**

రామాబాయి సమాజం-49

రామాభిషేకో-77

రామాయణ్-104

రామారావు, ఎన్.టి. -40,45, 200, 252,257,269,291,314, 467, 507,518,**524**

రామారావు, గేదెల-**525**

రామారావు, చెంచు -498

రామారావు, జవ్వాది-**526**

రామారావు, బండారు -265, 316,**526**

రామారావు, మద్దాలి-**527**

రామారావు, సబ్నవీసు -35

రామిరెడ్డి, దువ్వూరి -24,29,35,39, **527**,556

రామ్మూర్తి, ఉయ్యూరు-527

రామ్మూర్తి, గరిమెళ్ల-528

రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్స్-199

రాయ్, ద్విజేంద్రలాల్ -29,35,109, 110, 123, 253,350,**529**

రాయల్ కోర్ట్ థియేటర్-220

రాయల్ థియేటర్-63,143, 268, 298,**529**

రాయల్ ఆర్ట్ థియేటర్స్-529

రాల్ఫ్ ఫాక్స్-125

రావణవధ-108

రావు, సి.ఎస్. -44,45,67

రావు సి.వి.కె-530

రావుగోపాలరావు-191

రాసకీడ-73

రాసజాత్ర-105
రాసలీల-74
రికార్డ్స్ ఆఫ్ ఏన్షియంట్ థింగ్స్-161
రిచెర్డ్ వెస్లే-151
రివాల్వింగ్ సెట్-252
రుక్మాంగధ-9,313
రుక్మిణీ హరణం-73
రుక్మిణీ కల్యాణం-319
రుద్రవీణ-45
రువెదా, లోపె-531
రూపం-280
రూపకం-1,532
రూపక కర్త-1
రూప్ నారాయణ్‌పాండే-123
రూల్స్ ఒప్పుకోవు-46
రూసో-136
రెసిన్-165
రేడియో అన్నయ్య (చూ॥ రాఘవరావు, న్యాయపతి)
కేకందర్ బోజరాజు, సురభి-532
రేపటి శత్రువు-46
రేలంగి-52
రేసిన్-137
రైతు విజయం-16
రైతుబిడ్డ-35
రైస్ ఎల్మర్ -149,150,**532**
రోక్లా థియేటర్ ఆఫ్ ది ఫాంటో మైమ్-174
రోమన్ నాటకరంగం-133,134
రోలింగ్ పీల్డ్-257
రోషన్‌లాల్ అహూజా-101
రోషనార-30,34
రోస్ట్ వోరోవ్స్కీ-171
రౌద్రం-201,324
రౌద్రరసం-**532**
లంకె బిందెలు-41
లంకేశ్-87
లక్ష్మసార సంగ్రహం-19
లక్ష్మణస్వామి, ఈవెని -24,381,**533**
లక్ష్మణరావు, కొండవలస-47,**533**
లక్ష్మయ్య, కొత్తపల్లి -59,60
లక్ష్మయ్య, పైడి-**534**
లక్ష్మి, ఆలపాటి -290
లక్ష్మీ కులశేఖర్, పల్లేటి -24,46,**536**
లక్ష్మీకాంతం, పింగళి -60,63,67
లక్ష్మీకాంత మోహన్-370,**536**
లక్ష్మీకాంతం, బలిజేపల్లి -23,63, 207,279, 404,469,**534**
లక్ష్మీదేవి కనకాల-210
లక్ష్మీనరసయ్య, కర్నాటి -59, 206,**537**
లక్ష్మీ నరసింహం, చిలకమర్తి -21,22, 25, 31,48, 50,188,207,236, 285,**538**
లక్ష్మీనరసింహం,సెట్టి -249,313
లక్ష్మీ నరసింహారావు, జాగర్లపూడి-**539**
లక్ష్మీ నరసింహారావు, పానుగంటి -22, 27, 32,36,186,207,228, 230, 236, 235,**540**
లక్ష్మీ నారాయణ, తైలం -265,**541**
లక్ష్మీ ప్రసన్న నాట్యమండలి-49
లక్ష్మీ విలాస నాటక సభ-25
లక్ష్మీనారాయణ, ఉన్నవ -29,35
లక్ష్మీనారాయణ, గంగిశెట్టి -24
లక్ష్మీనారాయణ, వేదాంతం-10
లలిత కళా సమితి-302
లలిత కళాంజలి నాటక అకాడమీ (పాలకొల్లు)-65,**542**
లలిత కళానికేతన్-65,390
లలితకళానిలయం (నెల్లూరు)-**542**
లలిత కళాపరిషత్తు(అనంతపురం) -66, **542**
లలిత కళాసమితి (కర్నూలు) 67,239
లలిత కళా పరిషత్తు-296,357
లలితా సమాజం-263
లవకుశ-9
లింగమూర్తి, ముదిగొండ -43, 64, 67, **543**
లిక్విడ్ బాడీమేకప్ -222
లిటిల్ థియేటర్ గ్రూప్-40,65,111, 160, 214
లిటిల్ థియేటర్స్-63,148
లియో టాల్‌స్టాయ్-166
లివియస్ ఆండ్రోనికస్-134
లీ రాయ్ జోన్స్-151
లీ సైమన్-148
లీలావతి-77
లుక్ బ్యాక్ ఇన్‌యాంగర్ - 156,220
లుడ్‌విగ్ డెవ్‌రియంచ్-144
లెబెడెఫ్ జి. ఎస్.-106,107
లెవీస్ హల్లమ్-148
లెస్సింగ్ గోట్‌హోల్డ్-142,**543**
లేడిఅగస్టాగ్రెగరీ-175
లేడీ గ్రిగరీ-175,227
లేఫిల్స్ నేచురల్-325
లేబరోటరీ థియేటర్ వ్రోక్లా-172
లైఫ్ ఆఫ్ మాన్-206
లోకధర్మి-**544**
లోచన-193
లోన్, అలి మహమ్మద్-**544**
లోప్ డి వేగా-167,168,256, 296, 322
వఖ్తంఘోవ్-167,173
వృత్తి నాటకరంగం-86
వృత్తి నాటకాలు-86
వృత్తి రంగభూమి-83
వరప్రసాదం-62
వరప్రసాదరావు, అబ్బూరి -245,536, **544**
వరల్డ్ థియేటర్-209
వరవిక్రయం-23,32,258,387
వరహాలు, పేరూరు -11

వరుడు కావాలి-45
వర్తన కామెడీ-223
వర్డ్స్వర్త్-154
వల్లభరాయుడు, వినుకొండ -18,19
వశీకరణం-46
వసంత, కనేట్కర్-115,116
వసంతసేన-225,308
వసు, అమృతలాల్-**545**
వస్తువు-**545**
వస్తైక్యం-**545**
వాగ్జీ ఆచారాం-93
వాచికం-1,303
వాచికాభినయం-2,6,192,251,**546**
వాణిశ్రీ-40
వాణీ విలాస సభ-25,292
వామన వక్షం-452
వారేర్కర్, బి.వి. -114
వాల్టేర్-136,138,256
వాల్మీకి-453
వాల్మీకి ప్రతిభ-109
వాసక సజ్జిక-**546**
వాసుదేవశాస్త్రి, వావిలాల -20,31,37, **546**
వాస్తవం-212
వాస్తవికతావాదం-85,139,149,**547**
వింటర్స్ టేల్ -75
వింధ్య రాణి-367
వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్-297
విక్టోరియా థియేట్రికల్ కంపెనీ-103, 104
విక్టోరియా నాటకమండలి-92
విక్రమదేవవర్మ రాజా -313
విక్రమ థియేటర్స్-78
విక్రమోర్వశీయం-4,5,22,184,229, 257, 258,313
విగ్-322
విజయ్ టెండూల్కర్-115,117,**548**
విజయ నగరం నాట్య అకాడమీ-301
విజయ రాఘవ నాయకుడు-7
విజయ రామ డ్రమెటిక్ అకాడమీ-25
విజయదుర్గ నాట్యమండలి-231
విజయప్రకాష్, బలిమెల-**548**
విజయభాస్కర్, డి. -46,240,243, 446,**549**
విజయమెహతా-116
విజయమేరి నాటకమండలి-310
విజయరాఘవ నాయకుడు-7,14,15
విజయరామ డ్రమటిక్ అకాడమీ-**549**
విజయరామ నాటక కళాపరిషత్తు-65
విజయ లక్ష్మి, కె-**549**
విజయ లక్ష్మి, నర్రా-**550**
విడోయర్స్ హౌస్సెస్-155,441
విదూషకుడు-8
విదూషకుని ఆత్మహత్య -288
విద్ధసాల భంజిక-19
విద్యాధర్ గోఖలే-115
విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ -360,**551**
విద్యానాథుడు-19,312
విద్యావినోదినీ సభ-**551**
విద్యాసుందర్-107,122
విద్రవం-280
విధినిషేధాలు-**551**
విధ్వంసక వాదం-186,**552**
వినోదిని దాసి - 109,284,**552**
విన్స్లోబాయ్-156
విపర్యయం-**553**
విప్రనారాయణ చరిత్ర-13
విప్రనారాయణ-22
విప్రలబ్ధ-**553**
విమర్శక పారిజాతం-**553**
విరామం-**553**
వియెన్నా విశ్వవిద్యాలయం-300
విలియమ్, టెన్నిస్సీ-151,**553**
వివేక ఫైన్ ఆర్ట్స్ క్లబ్-311
వివేకానంద స్వామి-31
విశాఖ కళాఘమండలి-267
విశాఖ నాటకమండలి-183
విశాఖదత్తుడు-4,**554**
విశ్రుతీ నాట్యమండలి-204
విశ్వంతర-292
విశ్వనాథ్, కాశీ-**555**
విశ్వనాథ రెడ్డి, మజ్జిగ-240,**555**
విశ్వనాథ విజయం-31
విశ్వనాథ శర్మ, మల్లాది-39,50, 60,64, 195,200, 230, 236,276, 308,312, 382,384,**556**
విశ్వనాథశాస్త్రి, రాచకొండ -41,42, 43,267,**557**
విశ్వనాథశాస్త్రి, రొట్టె-**557**
విశ్వశాంతి-41,181,212,231
విషాద నాటకాలు-129
విషాదరూపకం-**557**
విషాద సారంగధర-21,186, 266, 313
విష్కంభం-5,198,324,**558**
విష్ణుదాస్భావే-112
విసెంటీ, గిల్-**558**
వీథి-**558**
వీథి నాటకం-6,7,20,69
వీథ్యంగం-186
వీరం-201
వీర రసం-**558**
వీరభద్రరావు, దాడి -45
వీరయ్య సమాజం-49
వీరయ్య, సున్నం -398
వీరేంద్రనాథ్,యండమూరి -44,45, 293,**558**
వీరేంద్ర శర్మ-**559**
వీరేశలింగం పంతులు, కందుకూరి -20, 21,23,26,31,38,59, 236,

250, 297, 457,498, **559,** 560, 566, 578, 591
వీలునామా-42
వృత్తి-**561**
వెంకటకృష్ణారావు, మండలి-303
వెంకటగిరి అమెచ్యూర్-194
వెంకటగిరి అమెచ్యూర్ అసోసియేషన్ -61, 212
వెంకట నర్సునాయుడు, వెల్దుర్తి-**561**
వెంకట నారాయణ, వెంపటి -9
వెంకట రమణయ్య, నేలటూరి -14
వెంకటరమణశాస్త్రి సూరి, కర్కి -85
వెంకటరత్నం నాయుడు, ఆచంట -386
వెంకయ్య, పిల్లిట్ల-307
వెంకటరామశాస్త్రి, మేలట్టూరు-15
వెంకటసుబ్బయ్య, వంగర-**563**
వెంకటస్వామి నాయుడు, పి-206
వెంకటాచార్యులు, కొట్టే -258
వెంకట్రాజు, కాకర్లపూడి-**564**
వెంకట్రామయ్య, కాజ -61,64
వెంకట్రామయ్య చౌదరి, వల్లూరి-316, **564**
వెంకన్న కాపురం-40,43,365
వెంటాడే నీడలు-44
వెట్టిచాకిరి-69
వెద్యాచెఘర్ అన్వాట్-115
వెబ్స్టర్ జాన్ -154
వెయిటింగ్ ఫర్ ఘోడో-140,172, 202, 283
వెరియాట్టం-99
వెస్టెండ్ థియేటర్-155
వేంకట కృష్ణ శర్మ, మల్లాది -50
వేంకట కృష్ణా రావు, కోటగిరి -22
వేంకట సుబ్రహ్మణ్యం, ధూళిపాళ-37
వేంకటనరసయ్య, జాస్తి -37
వేంకటరత్నం పంతులు, కొక్కొండ -20,21,316,**566**
వేంకటరత్నం, మక్కపాటి-33
వేంకటరమణ రావు, కోపల్లె-**566**
వేంకటరామయ్య, మాధవపెద్ది -30, 35, 62,63,67, 206,245, 302, **567**
వేంకటరావు, కోవెలకొండ-**562**
వేంకటరావు, గబ్బిట -31
వేంకటరాయ శాస్త్రి, వేదం -22,26, 34, 181, 182, 194,207, 211, 229,268,**568**
వేంకటశివరామకష్ణప్రసాద్, తంగిరాల-**568**
వేంకటశేషయ్య, నీలంరాజు -60,61
వేంకట శేషశాస్త్రి గడియారం -504
వేంకట సుబ్బారావు, తంగిరాల-**569**
వేంకటావధాని, దివాకర్ల -207,208
వేంకటేశ్వర నాట్యమండలి-200
వేంకటేశ్వర రావు, ఆత్మూరి-**569**
వేంకటేశ్వర రావు, ఆరాధ్యుల-**570**
వేంకటేశ్వర రావు, కుప్పిలి-40,42, 62, 64, 67, 184,206, 267, 231, 243, 266, 278, 293,324, 458, **570**
వేంకటేశ్వర రావు, గన్పిశెట్టి-41,43,64
వేంకటేశ్వర రావు, నార్ల -39,236, **572**
వేంకటేశ్వర రావు, పరుచూరి -45,69
వేంకటేశ్వర రావు, పూసల -44
వేంకటేశ్వర రావు, పృథ్వీ-**573**
వేంకటేశ్వర రావు, బోయిన -**214**
వేంకటేశ్వర రావు, మాచినేని-**573**
వేంకటేశ్వర రావు, సీతంరాజు-**574**
వేంకటేశ్వర్లు, గనిపిశెట్టి-**574**
వేంకటేశ్వర్లు, వెంపటి -63
వేంకటేశ్వర్లు, పులిపాటి -52,266, 504,**574**
వేడ్కింద్, ఫ్రాంక్-145,**575**
వేణీ సంహారం-4,18,21,63,107, 179,216, 266,268,313,444
వేణు, పి. -41,42,43,64,293,**5**
వేదసంవాద సిద్ధాంతం-1
వేదాంత కవి-**576**
వేనరాజు-24
వేమన-29,35
వేలార్ ప్లేస్ థియేటర్-106
వేలైక్కారి-97
వైల్డ్, ఆస్కార్ -52,114,155,223 262,**577**
వైల్డర్, థార్న్టన్-52,150,**577**
వైటోల్డ్ గోంబ్రోవిజ్-170
వైష్ణవ దాసరాట-85
వోల్టేయిర్-158
వోల్టేర్-165
వ్యంగ్యరూపకం-**577**
వ్యభిచారీభావం-229,352
వ్యవహార ధర్మబోధిని-31,38
వ్యాయోగం-217,**577**
శంకర్, చిట్టా-**578**
శంకర నాగ్-87
శంకర పిళ్లై, జి. -121
శంకర రావు, అంకరాజు -64,**578**
శంకరదాస్ స్వామిగళ్-96
శంకరదేవ్-71,73
శంకరయ్య, దూడల -11
శంకరరావు, అడవి -289,**579**
శృంగార శాకుంతలము-20
శృంగారం-201
శంబుకవధ-24
శంభాజీ -22
శంభుచంద్ర ముఖర్జీ-189
శంభుమిత్ర-110,111,127
శకుంతల, కడియాల-80,**579**
శక్తిభద్రుడు-419

శర ఛంద్ర భూపాల కురవంజి-94
శరత్ ఛటర్జీ-126
శర్మ, జితేంద్ర-**580**
శర్మిష్ఠ-107,283
శశికపూర్-52
శశిమోహన్, జమ్మలమడక-**580**
శశిరేఖా పరిణయం-9,11,12, 259, 296, 307
శహాజీ-15
శాంతతా కోర్టు చాలూ ఆహే-116, 117
శాంత రసం-**580**
శాంతారాం, వి-61,127
శాంతి-464
శాఖారామ్, బైండర్-113,117
శాపజం-418
శామ్యూల్ బెకెట్-136,140,160, 172,188,201,262,283,**580**
శాయి కె. ఎస్.టి. -45,47,269, **453**, **581**
శారదా తనయుడు-1,13,230,380, 381, 393
శారదాతనయ సిద్ధాంతం-1
శారదా మనోవినోదినీ నాటకసభ-**582**
శాస్త్రి, జి. ఎస్. ఆర్. కె. -47,289,**582**
శాస్త్రి, జి. ఎస్. ఎన్. -46,**583**
శిలప్పధికారం-15,94,260
శివనాగి రెడ్డి, జి-**583**
శివప్రసాద్ మిశ్ర-83
శివప్రసాద్, వల్లూరు-46,**584**
శివయ్య, జంపాల-**584**
శివరామకృష్ణారావు, తాళ్ళూరి-46, **585**
శివరామకారంత్-85,87
శివరామశాస్త్రి, వేలూరి -43,64,32, **585**
శివరామిరెడ్డి, అన్నపురెడ్డి -44,47, 64,67, 215, 232,289,438,**585**
శివశంకరస్వామి, తల్లావఝుల -60, 265
శివాజీ గణేశన్-96,97
శిశిర్ కుమార్ భాదురి-109,110, 125,**586**
శీనప్ప, పత్రి-36
శూద్రకుడు-4,230,383,**587**
శృంగార రసం-**588**
శేఖర్‌బాబు, గర్నేపూడి-**588**
శేషగిరిరావు, జన్నవిత్తుల -287, 469,**588**
శేషగిరిరావు, మద్దాలి -307,**589**
శేషగిరి రావు, వెదురుమూడి -263
శేషయ్య, చాగంటి -34
శేషయ్య, డి.వి-**589**
శేషయ్య, పులి-**590**
శేషాచార్యులు, తిరుమల-**590**
శేషావతారం, పెన్నా-**590**
శ్రవ్య నాటకం-**591**
శ్రవ్య నాటకాలు-134
శ్రీకంఠయ్య బి. ఎం.-86
శ్రీకంఠశాస్త్రి-85
శ్రీ కళానికేతన్-66
శ్రీకాంతన్, సి. ఎస్. -121
శ్రీకృష్ణ జాత్ర-105
శ్రీకృష్ణ తులాభారం-23,200,203, 206225,270, 272,289,303, 316, 317,557
శ్రీకృష్ణదేవరాయలు, ఆవేటి -316,**591**
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం -225
శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం -251
శ్రీకృష్ణరాయబారం-19,240, 289, 301,317
శ్రీకృష్ణ లీలలు-80,469
శ్రీకృష్ణ విలాస్-28
శ్రీ కృష్ణా హిందూ థియేటర్-25,299, **591**
శ్రీ గోవర్ధన నాట్యమండలి-49
శ్రీ గోవిందరాయ సురభి నాట్యమండలి -49
శ్రీనాథుడు-211,281
శ్రీనివాస చక్రవర్తి- (చక్రవర్తుల వేంకట శ్రీనివాసరంగ రాఘవాచార్యులు) 60,67,130,192, 207, 208,209, 210,232,235, 296, 310, 380, **592**
శ్రీనివాస దీక్షితులు-18
శ్రీనివాసన్, కందాడై -194,211,**593**
శ్రీనివాసరావు, ఆవుల-43,**593**
శ్రీనివాసరావు, కోట -493
శ్రీనివాసరావు, కోలాచలం -22,27,28, 32,34, 207,208,228,234,235, 277, 381,**594**
శ్రీనివాసరావు, మంత్రి-288,**595**
శ్రీనివాసరావు, మన్నె -26,31,46
శ్రీనివాసాచార్యులు, గోమఠం-313
శ్రీనివాసాచార్యులు, పనప్పాకం -26
శ్రీప్రభాకర నాట్యమండలి-**596**
శ్రీ పూర్ణిమా నాటక మండలి-49
శ్రీభవానీ నాట్యమండలి-**596**
శ్రీమన్నారాయణ, వలివేటి-**597**
శ్రీమన్నారాయణ శర్మ, చింతా- 596, 597,598
శ్రీమహాలక్ష్మి నాట్యమండలి-**597**
శ్రీమురళీ కళానిలయం-305,422
శ్రీరంగం శ్రీనివాసరావు-288,310
శ్రీరంజని(మంగళగిరి)-**597**
శ్రీరాజేశ్వరి నాట్యమండలి-**598**
శ్రీరాజరాజేశ్వరి నాట్యమండలి-**598**
శ్రీ రాధాకృష్ణ విలాససభ-319
శ్రీరాం ఎల్.బి. -46

శ్రీరాంలీలా నాటక మండలి-123
శ్రీరామ అప్పారావు, పోణంగి
(చూ॥అప్పారావు, పోణంగి శ్రీరామ)
శ్రీరామకృష్ణ పరమహంస-109
శ్రీరామకృష్ణనాట్యమండలి-28, 274, **598**
శ్రీరామ పాదుకా పట్టాభిషేక-85
శ్రీరామ వనవాసం-46
శ్రీరామ విలాససభ-25,30,61
శ్రీరామ శాస్త్రి, పాతూరి -210
శ్రీరామమూర్తి అద్దంకి -245, 469,**598**
శ్రీరామమూర్తి, గురజాడ-**599**
శ్రీరామమూర్తి, కొర్లపాటి -29, 455,**598**
శ్రీరామమూర్తి, గొల్లపూడి-67
శ్రీరామమూర్తి, పినిశెట్టి -40,41,53, 61, 64,67,184,213,243,**599**
శ్రీరామమూర్తి, ప్రఖ్య -41,42,43, 67,**599**
శ్రీరామమూర్తి ఓ. -551
శ్రీరామవిజయం-73
శ్రీరామ విలాస సభ-**600**
శ్రీరామశర్మ, కోడూరి -26
శ్రీరామశాస్త్రి, గొల్లపూడి -60,208, **601**
శ్రీరామాంజనేయ యుద్ధం-24,203, 240,289, 316, 317
శ్రీ రాములసచ్చిదానంద శాస్త్రి-469
శ్రీరాములు, చాట్ల -44,45,46, 62, 64, 67,215,278, 288,290, 360,463,464,**601**
శ్రీరాములు, దాసు-**601**
శ్రీరాయలకళాపరిషత్తు-301
శ్రీ లక్ష్మీనాథ్ బెజ్ బారువా-73
శ్రీ వసుంధరా నాట్యమండలి-49
శ్రీవాణీ నాట్యమండలి-61
శ్రీవాత్సవ-**602**
శ్రీ వేంకటేశ్వర నాటక కళాపరిషత్తు-66, 243,
శ్రీ వేంకటేశ్వర నాట్యమండలి-49,**602**
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం-62, 183,225,262,**602**
శ్రీ శంకుక మతం-**602**
శ్రీ శారదా నాటక కళాసమితి-**602**
శ్రీ శారదా మనోవినోదిని-410
శ్రీ శారదా మనో వినోదినీ సభ-298
శ్రీ శారదా మనోవినోదినీ నాటక సభ-308
శ్రీ శారదా మనోవినోదినీ సంగీత నాటక సభ-47,49
శ్రీ శారదా విజయ నాట్యమండలి-49
శ్రీ శ్రీనివాస నాట్యమండలి-**602**
శ్రీసాయి కళాస్రవంతి-289
శ్రీహరి రావు, వల్లూరు-**603**
శ్రీహర్షుడు -4,107,179
శ్వేతపత్రం-46
షడ్డారుకం-**603**
షామ్ షెపార్డ్-150
షి స్టూప్స్ టు కాంకర్-106
షిర్ వాడ్కర్, విష్ణునామన్- **603**
షిల్లార్, జోహన్ క్రిస్టాఫ్ ఫెడరిక్ వాన్-143,**605**
షిల్లర్ థియేటర్-147
షిస్టూప్స్ టు కాంకర్-106,297
షెరిడాన్, రిచర్డ్ బ్రింస్లే-39,52,112, 154,228,605
షేక్స్పియర్ ఆమెచ్యూర్స్-298
షేక్స్పియర్, విలియమ్-22,24,37, 52,75, 92, 96, 104, 109,100, 112,116, 118,132, 135,137, 141, 142, 143, 151, 152,153, 154,160, 164,165,167,228, 230, 235, 237,256,258, 284, 287, 303,317,325,**606**
షేక్ నాజర్-42
షెఫర్డ్, శామ్-**605**
షేర్వుడ్, రాబర్ట్, ఇ -**607**
షోతుసేన్-**607**
ష్నిట్జ్లర్, ఆర్థర్-144,145,**607**
సంక్షిప్తి-**608**
సంగాకు-161
సంగీతం-1
సంగీత నాటక అకాడమీ-10,25, 62,98,294,303,**608**
సంగీత మానినీ సమాజం-**608**
సంగీత రూపకం-**608**
సంగ్రహం-280
సంఘం చెక్కిన శిల్పం-45,389
సంఘర్షణ-**609**
సంఘసేవా నాట్యమండలి-**610**
సంఘాత్యం-**610**
సంఘోటనం-**611**
సంచారీభావాలు-**611**
సంచాలనం-**611**
సంజీవం-**613**
సంజీవరావు, ఉప్పలూరు- 404, 469,**613**
సంజీవరావు, కోకా -48,67,289,**613**
సంజీవరావు, వనారస -47
సంజీవి, ఎ. -44,46,289,**614**

సంతొసింగ్ఖాన్-100,101
సంధి-**614**
సంధ్యంతరం-340
సంధ్యంతరాలు-**614**
సంధ్యాఛాయ-45,115,252
సంపద-269
సంపూర్ణ భారతం-32
సంపూర్ణ మహాభారతం -32
సంప్రదాయ నాటకం-**615**

సంప్రదాయ వాదం-**615**
సంబంద మొదలియార్, పమ్మల్-96, 284,**615**
సంబంద్ ప్రభాకర్-105
సంబోధన-**616**
సంభోగ శృంగారం-**616**
సంభ్రమం-417,**617**
సంయమన నటన-**617**
సంయోగం, విపర్యయం-**617**
సంరక్షకుడు-42,43
సంరచన-**618**
సంలాపకం-**619**
సంస్కృత అకాడమీ-313
సంస్కృత నాటక రంగం -1,6
సంస్కృతీ సమ్మేళనం-65
సక్కుబాయి-23,181,469
సచ్చిదానందశాస్త్రి, శ్రీరాములు -23, **620**
సట్టకం-**620**
సతీ సావిత్రి-469
సతీష్ అనేకర్ మహానిర్వాణ్-116
సత్యజిత్ రే-127
సత్యదేవ్ దూబె-195
సత్యనారాయణ, అరణి -469,**621**
సత్యనారాయాణ, ఆర్.జి-**621**
సత్యనారాయణ, కావూరి -46,47, **622**
సత్యనారాయణ, గిరజాల -11
సత్యనారాయణ, జన్నలగడ్డ -30, 34,110
సత్యనారాయణ, నల్లా-**622**
సత్యనారాయణ, మానాపురం-**622**
సత్యనారాయణ, విశ్వనాథ-24,29,30
సత్యనారాయణ, సుంకర -56,58, 312
సత్యనారాయణ మూర్తి, ఆకెళ్ళ -46, 69, 249
సత్యనారాయణ మూర్తి, చుక్కభట్ల-**623**
సత్యనారాయణ రావు, ఊటుకూరి -30,35,**624**
సత్యనారాయణ శర్మ, వేదాంతం -10
సత్యవీరం-**624**
సత్యభామ కొరవంజి-8
సత్యహరిశ్చంద్ర-23,63,264,266,275, 276,295,299,301,308,313,316, 317
సత్యహరిశ్చంద్రీయం-23
సద్యకల్ప ఆహ్లాద రూపకం-223
సధావర్ ఏకాదశి-108
సన్నాట-85,**624**
సన్యాసిరాజు, చాగంటి -209,**625**
సన్యాసిరావు, పిళ్ళా-**625**
సన్‌రైజ్-160
సప్లయంట్స్-237
సఫ్దర్ హాష్మీ-70,71,**626**
సభాపతి-**626**
సమగ్రనాటకం-**626**
సమవకారం-1, 217,**627**
సమస్యాగర్భిత నాటకం-325
సమాచార్ దర్పణ్-105
సమాదికడుతున్నాం-చందాలివ్వండి-45
సమీకరణ-**627**
సమ్రాట్ అశోక -31,46
సరస వినోదినీ సభ-25,**629**
సరస్వతి, చెముడూరు-**629**
సరస్వతీ కంఠాభరణం-384
సరస్వతీ రామారావు, కోడూరిపాటి -67,**630**
సరుగాకుణో-161
సరోజిని, కొప్పరపు -64
సరోయన్-151
సర్ ఆర్థర్ జోన్స్-258
సర్ ఎలిజీ ఇంపె ప్రైవేట్ థియేటర్-106
సర్ చార్లెస్ మన్రో-104
సర్వజ్ఞ సింగభూపాలుడు-229,312, 384,418,**631**
సర్వారాయుడు, శృంగారకవి-**631**
సర్వేశ్వర శాస్త్రి, రామాయణం-**631**
సవేరా ఆర్ట్స్-**632**
సాంగ నాటకం-**632**
సాంఖ్యాయన శర్మ, ఆచంట వేంకట -22, 60
సాంబమూర్తి, కుందుం -11
సాంబయ్య, నూతలపాటి-**632**
సాంబశివరావు, ఆవుల -295
సాంబశివరావు, కందిమళ్ళ -46,**633**
సాంబశివరావు, కాళ్ళకూరి -457,**633**
సాంబశివరావు, పోతుకూచి -43
సాంబశివరావు, వేజండ్ల-**633**
సాటిర్-**634**
సాటిర్ నాటకాలు-132
సాటిర్ సాంగ్స్-130
సాత్త్వికం-303,**634**
సాత్త్వికములు-**634**
సాత్త్వికాభినయం-2,6,192,**635**
సాత్త్వికాలంకారాలు-**636**
సాత్త్వతీ వృత్తి-2,**634**
సాదృశ్యం-**636**
సాధన-**636**
సామవేదం-1
సామ్యవాద వాస్తవికత-**639**
సాయిబాబా, వై. ఎస్. -46
సారంగధర-11,23,204,225,242, 264,268,307
సారిపుత్ర ప్రకరణం-3,201
సాళ్వాచారి, మంతోజు-**639**
సావిత్రి, గూడూరు -316,**639**
సాహిత్య అకాడమీ-120
సాహిత్య దర్పణం-304,384,**640**
సింగారం-462

సింగ్‌సభ-99
సింజ్, జాన్‌మిల్లింగ్‌టన్-176,**640**
సి. ఎస్. ఆర్. కళామందిర్ -408,**640**
సిగ్మండ్ ఫ్రాయిడ్-124
సిద్ధప్ప నాయుడు, జె. -46,67,231, 288,**640**
సిద్ధి-**641**
సిద్ధేంద్రయోగి-7,17
సిద్ధేంద్రయోగి-9,14,259
సిమ్లా భాగవతం-69,290
సియట్రో చైరీ-297
సిరిసంపెంగ-302
సివిల్ నాటకాలు-159
సీగల్ -310
సీజరు చరిత్ర-37
సీతా వనవాస్-104,108,284
సీతాపతి, గిడుగు -209,**641**
సీతాబెంగా గుహ-3
సీతారత్నం, మిక్కిలినేని-58
సీతారామయ్య, కారుమూరి -67,**642**
సీతారామయ్య, కొంగర -313,**643**
సీతారామశాస్త్రి, ధూళిపాళ-52,**643**
సీతారామశాస్త్రి, వేమూరి-**645**
సీతారామారావు, ద్రోణంరాజు -23, 29,**645**
సీతారామారావు, వడ్లమూడి -64,67
సీమీ-**645**
సుంకర - వాసిరెడ్డి-35,57, 59,64
సుంకర కనకారావు-314
సుందరం పిళ్ళై-96
సుందరం, తల్లావఝుల-46,**647**
సుందరరామయ్య, పిల్లలమర్రి-**647**
సుందరాచారి, శంకరంబాడి-56
సుఖమంజరీ పరిణయం-228
సుఖాంత నాటకాలు-136
సుఖాంతాలే-5
సుగుణ విలాస సభ-25,96,381, **648**
సుగ్రీవ విజయం-13,14
సుజాత-98
సుధాకర్, జలదంకి -45,46
సుబ్బణ్ణ కె.వి. -87
సుబ్బదాసు, రాప్తాటి -47,49
సుబ్బయ్య సమాజం-49
సుబ్బరామిరెడ్డి, గండవరం -42, 45,67,214,**648**
సుబ్బారాయుడు, వడ్డాది -20,21,25, 63,276,647,**649**
సుబ్బారావు, అనిసెట్టి-42,53,59, 206,464, 538,**650**
సుబ్బారావు, ఎ.వి. -316, 386,**651**
సుబ్బారావు, ఎన్.వి.-240,**652**
సుబ్బారావు, కుంపట్ల -469
సుబ్బారావు, కృత్తివెంటి -59, 224,**652**
సుబ్బారావు, కొప్పరపు -24,30,34, 35,40,50,52, 67,63,64,208, 209, 231,236,319,495, 618, **652**
సుబ్బారావు, గుండిమెడ వేంకట-26, 29,**655**
సుబ్బారావు, గోవిందరాజుల వేంకట -60, 245, 303,**655**
సుబ్బారావు, డి.వి. -52,60,62,63, 67,224,242,245,313, 316,**656**
సుబ్బారావు, కొడాలి -64
సుబ్బారావు, తోలేటి, వేంకట -319, **657**
సుబ్బారావు, దొప్పలపూడి-**657**
సుబ్బారావు, నండూరి -289
సుబ్బారావు, నిడుముక్కల-**658**
సుబ్బారావు, నూతలపాటి-**658**
సుబ్బారావు, పామర్తి -62,64, 213,469,**658**
సుబ్బారావు, పొరుపల్లి-**660**
సుబ్బారావు, పుట్టగంటి-**660**
సుబ్బారావు, బసవరాజు -60
సుబ్బారావు, బెల్లంకొండ -60, 232, **660**
సుబ్బారావు, బావరాజు-**661**
సుబ్బారావు, ముత్తరాజు -23,29, 445, **661**
సుబ్బారావు, రాయప్రోలు-56
సుబ్రహ్మణ్య భారతి-97
సుబ్రహ్మణ్యం, ఆకుల - 31
సుబ్రహ్మణ్యం, జి.వి-**662**
సుబ్రహ్మణ్యం, రాయప్రోలు-**663**
సుబ్రహ్మణ్యశాస్త్రి, కొండుభట్ల -20, 21, 24,**663**
సుబ్రహ్మణ్యశాస్త్రి, తాండ్ర -24,33, 35,50,205,234,**662**
సుబ్రహ్మణ్యశాస్త్రి, పండిత కె.-**663**
సుబ్రహ్మణ్య శాస్త్రి, బుర్రా -316, 386, **664**
సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద-**664**
సుభాని, డి. ఎం-**665**
సుమనోరమసభ-25,**665**
సురభి నాటకరంగం-47
సురభిళ నాట్యకళామండలి-316
సూచ్యం-**665**
సుల్తానీ-40,43,62
సూక్ష్మాభినయం-192
సూడర్‌మన్-144,145
సూత్రధారుడు-2,4,6,8,72,73,216, **666**
సూరన, పింగళి -18,19
సూరయ్య, ధరణీప్రగడ-457
సూరి, తెన్నేటి-**666**
సూరి, బి. ఎన్. - 42,386,**666**
సూరి,మద్దిపట్ల -110
సూరిబాబు, పువ్వుల-232,245,**667**
సూరిశాస్త్రి, పురాణం -28,67,207, 208,**668**

సూర్యం, గిడుతూరి -286
సూర్యకిరీటం-307
సూర్యచంద్రరావు, పసల -60,62, **64**,**668**
సూర్యనారాయణ, యడవల్లి -469, **668**
సూర్యనారాయణ శాస్త్రి, మల్లాది -245, 419,**669**
సూర్యప్రకాశరావు, ఆలపాటి-**670**
సూర్యప్రకాశరావు, కంచర్ల -46,**670**
సూర్యప్రకాశరావు, పోలవరపు -63, **670**
సూర్యారావు, అంగర -41,267,**671**
సూర్యారావు, అవసరాల-42,**671**
సూర్యారావు, దంటు-58,470
సెనెకా లూసియస్ అవియస్-135, **671**
సోక్రటీస్-129
సోఫోక్లిస్ - 131,**672**
సోమనాథుడు, పాల్కురికి -7,12,398
సోమయాజులు, జె.వి. -310,**673**
సోమయాజులు, వావిలాల -24
సోమర్‌సెట్ మామ్-155
సోమేశ్వరరావు, దుగ్గిరాల -47, 360, **674**
సోయింకా, వోలే-**674**
సోవియట్ నాటక రంగం-**675**
సౌభరి చరిత-13
సౌభికులు-**675**
సౌమిత్రి-**676**
సౌమిల్లుడు-**676**
స్కిల్లర్-138
స్కినీ-133,333
స్థలైక్యం-**681**
స్పెన్సర్ జాన్ -141
స్టానిస్లవ్స్కి-146,166,192,404,**676**
స్టానిస్లవ్స్కి, విధానం-**677**
స్టార్ థియేటర్-109,454
స్థానం వారి స్థానం-**682**
స్థాపకుడు-**682**
స్థాయి భావం-**682**
స్ట్రింట్ బెర్గ్, ఆగస్ట్-213,572,**680**
స్వగతం-**682**
స్వాధీన భర్తృక-**683**
స్వాభావికవాదం-139,188,**683**
స్వామి, ఆర్.వి.ఎస్. -44
స్వామి, కె.కె.ఎల్. -45,**683**
హంగామా నటన-**683**
హంతకులు-43
హనుమంతరావు, ఎరగుడిపాటి-**683**
హనుమంతరావు, కోపల్లె-23,**684**
హనుమంతరావు, దేశిరాజు-69
హనుమంతరావు నాయుడు, ఇమ్మానేని -25,538,**684**
హనుమంతరావు, రొద్దం-**685**
హబీబ్ తన్వీర్-**686**
హరనాథరావు, ఎం.వి. ఎస్-44, 45, **686**
హర్షవర్ధనుడు-**687**
హరికథ- **686**
హరిజనాభ్యుదయం-తెలుగు నాటకం-**687**
హరితాలం-**687**
హరిశ్చంద్ర-122
హరిశ్చంద్రప్రసాద్, ముళ్ళపూడి-62
హర్ చరణ్‌సింగ్-100
హల్గి-328
హల్గివాలా-328
హల్లీసకం-**688**
హాఫ్ట్‌మన్, గెర్హార్ట్-139,144, 145, **688**
హామర్షియా-131,**689**
హారాల్డ్ పింటర్-155,156,262,**689**
హాసం-**689**
హాస్యనర్మం-**689**
హాస్యరసం-**690**
హాస్యాభాసం-**690**
హిందీ నాటక రంగం-122
హిందూ థియేట్రికల్ సొసైటీ (పిఠాపురం) -**690**
హిందూ నాటక సమాజం-315
హిందూ నాటక సమాజాలు-**690**
హిందూ నాటకోజ్జీవక సమాజం-21, 25
హింస ధ్వని-46
హిట్లర్ పరాభవం-201
హిమాగ్ని-46,452
హిరణ్ణయ్య, మిత్రమండల-86
హెన్రీ ఆర్థర్ జోన్స్-155
హేమ్‌చంద్, కోన-**692**
హేమ్లెట్-153
హోమర్-129
హోరాషి-329
హ్యూగో విక్టర్ -112, 290,**693**

BLANK PAGE